# మార్క్స్
# 'కాపిటల్'
# పరిచయం

[ మొత్తం 2 సంపుటాలలో.

ఇది మొదటి సంపుటం ]

## రంగనాయకమ్మ


**స్వీట్ హోమ్ పబ్లికేషన్స్**

76, లేక్-సైడ్ కాలనీ

(దుర్గం చెరువు దగ్గిర)

జూబ్లీ హిల్స్ పోస్టు

**హైదరాబాదు - 500 033**

‘కాపిటల్’ పరిచయం
[ మొత్తం 2 సంపుటాలలో.
ఇది మొదటి సంపుటం ]

పేజీలు : 640
[ రాయల్ సైజులో
హార్డ్ బౌండ్ తో ]
ధర : 180 రూ.లు

ఈ సంపుటం, 2004 నించీ
2017 వరకూ 5 ముద్రణలు వచ్చింది.
ఇది, **6**వ ముద్రణ : 2019 ఏప్రిల్

కంపోజింగ్ & పేజ్ మేకప్:
**ఎమ్.శారద, ఎమ్.ఆనంద్ కుమార్;**
**ఎన్.రఘురామయ్య, ఎన్.ధనలక్ష్మి**

**ముద్రణ:**
చరితా ఇంప్రెషన్స్,
1-19-1126/బి,
ఆజామాబాదు ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 500 020.

**బైండింగ్:**
**వై.వి. రెడ్డి బైండింగ్ వర్క్స్**
మూసారాం బాగ్
**హైదరాబాదు - 36**

ప్రతులకు :
**అరుణా పబ్లిషింగ్ హౌస్**
ఏలూరు రోడ్డు
**విజయవాడ - 520 002.**
(ఫోన్: 9440630378)

రంగనాయకమ్మ అడ్రసు :
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# విషయ సూచిక


## ముందు మాట - పేజీ 13

## ‘కాపిటల్’ పరిచయం - 24

## ప్రకృతీ, సమాజమూ - 27

# 1 వ భాగం

## సరుకులూ - డబ్బూ

**1. సరుకుకి గల 2 లక్షణాలు ............................................ 31**

1) ఉపయోగపు విలువ – 31

2) మారకం విలువ – 33

★ శ్రమని కొలిచే సాధనం – 37

3) ఒక వస్తువు కోసం ఖర్చయిన మొత్తం శ్రమ – 37

4) ‘సామాజిక’ శ్రమ కాలం, లేదా ‘సగటు’ శ్రమ కాలం – 40

★ ‘శ్రమ’ ఎక్కడ ఉంటుంది? – 42

**2. ‘సరుకు’ని తయారుచేసే ‘శ్రమ’ కు గల 2 లక్షణాలు ......... 46**

1) రూపం ఉన్న శ్రమ – 46

2) రూపం లేని శ్రమ – 48

★ వేరు వేరు శ్రమలకు వున్న సమాన లక్షణం – 49

★ వస్తువుల ఉత్పత్తికీ, దాని వాడకానికీ, ‘ఉపయోగపు విలువ కొలతలే’ గానీ, ‘విలువ కొలతలు’ అవసరం లేదు – 49

★ ‘విలువ అంటే శ్రమే’; కానీ ‘శ్రమ అంటే విలువ’ కాదు – 51

3) వస్తువూ, సరుకూ – 51

4) ‘ఉత్పాదక శక్తి’ అంటే ఏమిటి? – 52

★ ఉత్పాదక శక్తికి, ‘ఉపయోగపు విలువ’తో ఉండే సంబంధమూ ; ‘మారకం విలువ’తో ఉండే సంబంధమూ – 53

★ ఒక శ్రమలో 'ఉత్పత్తి శక్తి' మారినప్పుడు – 54
★ ' సామాజిక శ్రమ' కాలానికీ, ఉత్పత్తి శక్తికీ గల సంబంధం – 55
5) 'శ్రమ విభజన' అంటే ఏమిటి? దాని ఉపయోగం ఏమిటి? – 55

**3.** ' విలువ'కి రూపం ........................................ 62
★ ' విలువ పరిమాణం' అంటే ? – 65

**4.** ప్రాథమిక విలువ రూపం ........................................ 67
1) దీనికి సంబంధించిన విషయాలు – 68
★ శ్రమల ' గుణాత్మక ' సమానత్వం – 69
★ శ్రమల ' పరిమాణాత్మక ' కొలత – 69
2) ' ప్రాథమిక విలువ రూపం'లో వున్న లోపం – 70

**5.** విస్తృత విలువ రూపం ........................................ 71
1) దీనికి సంబంధించిన విషయాలు – 71
2) ' విస్తృత విలువ రూపం'లో లోపాలు – 74

**6.** జనరల్ విలువ రూపం ........................................ 77
1) దీనికి సంబంధించిన విషయాలు – 78
2) ' విస్తృత విలువ రూపం'లో ఉండే లోపాలు,
' జనరల్ విలువ రూపం'లో ఎలా పోయాయి? – 82

**7.** ' విలువ రూపం అభివృద్ధి'లో
రెలెటివ్ కోణం అభివృద్ధీ, ఈక్వివలెంట్ కోణం అభివృద్ధీ .. 87

**8.** డబ్బు రూపం ........................................ 89
1) 'డబ్బు' కి సంబంధించిన విషయాలు – 90
2) ' విలువ' గురించి పరిశోధన – 98

**9.** సరుకుల మాయ! ........................................ 102

## 10. సరుకుల చలామణీ ............................................ 112

1) డబ్బు చేసే పనులు – 112 :

★ ‘విలువ కొలత’గా – 112, ★ ‘ధర ప్రమాణం’ గా – 112

2) సరుకుల ‘చలామణీ’, లేదా సరుకుల ‘మారకం’ – 113

3) ‘డబ్బు’ చలామణీ – 116

4) ‘చలామణీ సాధనం’ పరిమాణం – 117

(1) సరుకుల పరిమాణం – 119,

(2) విలువల పరిస్థితి – 119, (3) డబ్బు చలామణీ వేగం – 119.

5) నాణాలూ, విలువ చిహ్నాలూ ; కాయితం డబ్బు – 122

6) డబ్బుని కూడబెట్టడం – 125

7) డబ్బు, ‘ చెల్లింపు సాధనం’ గా పనిచెయ్యడం – 127

8) ప్రపంచ ధనం – 129

# 2వ భాగం
# పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం

## 1. లాభం ............................................................ 135

1) లాభానికి నిజమైన కారణం ఏమిటి? – 141

★ ముడి పదార్థాలు, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలవా? – 146 ★ శ్రమ పరికరాలు గానీ, ఆగ్జిలరీ పదార్థాలు గానీ, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలవా? – 148 ★ శ్రామికులు, తమ ‘జీతాల’ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలరా? – 148 ★ శ్రమ సాధనాలు చెయ్యలేని పని జీతాలు ఎలా చేస్తాయి? – 156 ★ ‘శ్రమ సాధనాలు’ శ్రమ చేస్తాయా? – 160 ★ పెట్టుబడిదారుడు ‘శ్రమ చేస్తాడా, చెయ్యడా?’ – 162 ★ సజీవ శ్రమ నిర్వహించే 3 పాత్రలు – 164 ★ పెట్టుబడిదారుడి లెక్కలు – 166 ★ లాభం ఏ దశ నించి వస్తుంది? – 167 ★ విలువ, ‘ చలామణీ దశ ’లో పెరుగుతుందా? – 169 ★ ‘ ప్రధాన’ లాభమూ, ‘ సెకండరీ’ లాభమూ – 170 ★ శ్రమ దోపిడీ – 173.

2) స్వతంత్ర ఉత్పత్తిదారులు – 174

3) లాభం కాదు, అదనపు విలువ – 174
4) అదనపు విలువా, అదనపు ఉత్పత్తీ – 175
5) ' అదనపు విలువ' ఏ యే భాగాలుగా చీలుతుంది? – 176
(1) వర్తక కమిషన్ – 176 (2) వడ్డీ – 181
(3) ' భూమి'కి 'అద్దె' ('కౌలు') – 186 (4) 'ప్రభుత్వా'నికి చెల్లించే 'పన్నులు' – 190 (5) ఉత్పాదక లాభం, చివరికి! – 195
6) ' సరుకు విలువ గురించి మళ్ళీ ఒక సారి – 197
7) గ్రాస్ & నెట్ – 199
8) రెండు బృందాలు – 200
9) వేరు వేరు శాఖలు – 202
10) 'ఆస్తి' అంటే ఏమిటి? – 204
11) 'లాభం' గురించి పెట్టుబడిదారీ ఆర్థికవేత్త ఏమంటాడు? – 206
12) మార్క్స్ ప్రవేశం! – 209
13) 7 జేబుల పెట్టుబడిదారుడు! – 210
14) 'అదనపు విలువ సిద్ధాంతం' కన్నా ముందూ, తర్వాతా – 213

**2. 'శ్రమ శక్తి' విలువ ........................................................ 219**

1) ' శ్రమ శక్తి' అంటే ఏమిటి? – 219
2) ' అదనపు శ్రమ' రహస్యం – 221
3) ఒక ' శ్రమ' కు ' విలువ' ఎలా ఏర్పడుతుంది? – 223
4) ' నిత్య జీవితావసర వస్తువుల్ని' లెక్క గట్టడం ఎలాగ? – 230
5) శ్రమ శక్తీ, శ్రమా – 231
6) ' డబ్బు'ని ఉత్పత్తి చేసే శ్రమ విలువ – 233
7) ' మేధాశ్రమ' నించి గానీ, ' నైపుణ్యంగల శ్రమ' నించి గానీ అదనపు విలువ – 236
8) ' జీతం' సృష్టించే భ్రమ – 238
9) పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు 'జీతం' గురించి ఏమంటారు? – 238
10) ' జీతం' కాదు, శ్రమ శక్తి విలువ! – 242
11) వైరుధ్యం కాదా? – 243
12) యజమానులూ × శ్రామికులూ – 243

13) జీతం ఎవరి కోసం? – 247
14) 'శ్రమశక్తి'ని కొంటే తప్పేమిటి? – 248
15) పెట్టుబడిదారుడికీ, కార్మికులకూ మధ్య అసలు 'మారకమే' లేదు! – 249
16) కార్మికులు కూడా, ఒక సారి 'అమ్మే వారి' గానూ, ఇంకో సారి 'కొనే వారి'గానూ ఉంటారా? – 252
17) పెట్టుబడిదారులూ, కార్మికులూ సమానులా? – 253
18) 'శ్రమ విలువ'కు గానీ, 'శ్రమశక్తి విలువ'కు గానీ బాహ్యకారణం – 254
19) శ్రమ నిధీ, అదనపు శ్రమ నిధీ – 257
20) జీతాలన్నీ 'అదనపు విలువ'ని ఇచ్చేవేనా? – 258
21) అందరూ శ్రమ చేసినా అసమానత్వం సమస్య పరిష్కారం కాదు! – 258

## 3. శ్రమ క్రమం - ఉత్పత్తి క్రమం ...................................... 267

1) పెట్టుబడిదారీ శ్రమ క్రమం — పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం – 271
2) పెట్టుబడిదారీ విధానం సరుకుల ఉత్పత్తి విధానం! – 273
3) ' టైము స్పృహ' పెట్టుబడిదారీ విధానంలోనే ప్రారంభం – 275
4) ' శ్రమ సాధనాల'తో కార్మికుల ' పరాయితనం' – 276
5) ' నిర్ణయాల'తో కార్మికుల ' పరాయితనం' – 277
6) పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ప్రధాన లక్షణాలు – 278
7) డబ్బు — 'డబ్బు'గా మాత్రమే పని చెయ్యడం;
డబ్బు — 'డబ్బు'గానూ, ' పెట్టుబడి'గానూ కూడా పనిచెయ్యడం – 278

## 4. స్థిర పెట్టుబడీ - అస్థిర పెట్టుబడీ ఫిక్సెడ్ పెట్టుబడీ - చలామణీ పెట్టుబడీ........................ 286

1) స్థిర పెట్టుబడి – 286
2) అస్థిర పెట్టుబడి – 287
3) ఫిక్సెడ్ పెట్టుబడి – 288
4) చలామణీ పెట్టుబడి – 290
5) 'డబ్బు' పెట్టుబడి – 291
6) 'ఉత్పాదక' పెట్టుబడి – 291

7) 'సరుకు' పెట్టుబడి – 291
8) మొదట పెట్టిన పెట్టుబడి – 292
9) ' ఫిక్సెడ్ పెట్టుబడి'కి సంబంధించి ఇంకా కొన్ని విషయాలు – 293: ★ వేరు వేరు ఫిక్సెడ్ సాధనాల ఖర్చులు – 294 ★ ఫిక్సెడ్ సాధనాల మన్నిక – 294 ★ ఫిక్సెడ్ సాధనాల సంరక్షణ – 295 ★ పబ్లిక్ ఫిక్సెడ్ సాధనాలు – 296 ★ ఫిక్సెడ్ సాధనాల అద్దె – 296
10) అంతస్తులపై అంతస్తులు పెట్టుబడిదారీ పద్ధతే – 299
11) ' పెట్టుబడి విభజన' గురించి ఆర్థిక వేత్తలు – 300
12) సామాజిక పెట్టుబడి – 301
13) సామాజిక సంపద – 302
14) ధనిక — పేద తేడాలు, మనుషులకే గానీ, ప్రాంతాలకూ, దేశాలకూ వర్తించవు – 303

**5. అదనపు విలువ రేటు (దోపిడీ స్థాయి) ........................... 307**

**6. ఉత్పత్తి సాధనాల విలువ బదిలీ : ఉత్పత్తి సాధనాలు ఎవరివి? ........................................ 315**

**7. సరుకు 'విలువ' భాగాల్ని సరుకు ' పరిమాణం' భాగాలుగా చూడడం ...................... 321**

1) 'ఉత్పత్తి' విలువా, 'విలువ' ఉత్పత్తీ – 326
2) ఉత్పత్తి సాధనాల విలువ ఎప్పుడూ ఖర్చయిపోదా? ఎప్పుడూ బదిలీ అవుతూనే వుంటుందా? – 328

**8. పని దినం ............................................................. 333**

1) షిప్టు పద్ధతి – 334
2) 'ఎబ్సల్యూట్ ' అదనపువిలువా, ' రెలెటివ్ ' అదనపు విలువా – 340
3) ' ఉత్పత్తి శక్తుల' కోసం పోరాటం – 343, ★ శ్రమ తీవ్రత – 345
4) ఉత్పత్తి శక్తి పెరిగితే, అవసర - అదనపు శ్రమ కాలాలు మారతాయి – 346

5) ఉత్పత్తి శక్తి పెరిగితే, దాని ఫలితాలు, వేరు వేరు వర్గాల మీద ఎలా ఉంటాయి? – 348
6) 'ఉత్పత్తి శక్తి' గురించి పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త ఏమంటాడు? – 354
7) 'ఉత్పత్తి శక్తి' పెరగడం మంచిదా, చెడ్డదా? – 355
8) 'నూతన సమాజం'లో ఉత్పత్తి శక్తి – 356
9) పోటీ! ఒక అసహ్య మైన మాట! – 358
10) అదనపు విలువ రేటుని పాలించే సూత్రాలు – 359
11) జీతాలు ఇవ్వడంలో వేరు వేరు పద్ధతులు – 361 :
★ టైమ్ వేజ్ – 361, ★ పీస్ వేజ్ – 364.
12) పనిదినం పొడవు ఎంత వుంటే 'సహజంగా' వుంటుంది? – 371
★ అందరూ శ్రమ చెయ్యాలి, దోపిడీ ఉండకూడదు – 372
★ సోషల్ ప్లాన్ – 373 ★ అమ్మకాలూ, కొనుగోళ్ళూ ఉండకూడదు – 374 ★ అనవసరపు ఉత్పత్తులు ఉండకూడదు – 374
★ కృత్రిమమూ, ఆడం బరమూ, అనారోగ్యకరమూ అయిన ఉత్పత్తులు ఉండకూడదు – 374 ★ శుభ్రతకీ, విశ్రాంతికీ అవసరమయ్యే ఉత్పత్తులు ఉండాలి – 378.
13) నూతన సమాజంలో కూడా పని దినం, 2 భాగాలుగా ఉంటుందా? – 379

# 3వ భాగం

# పెట్టుబడిదారీ పునరుత్పత్తి క్రమం

**1. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ, దాని రూపాలూ......... 386**
1) గిల్డు – 386
2) సహకారం – 388

**2. మాన్యుఫాక్చర్ ఉత్పత్తి ................................................ 394**
★ స్పెషలైజేషన్‌లో వైరుధ్యాలు – 396 ★ అంతస్థుల భేదం – 396
★ నూతన శ్రమ విభజనకు మార్గం – 398
1) పెట్టుబడిదారీ శ్రమ విభజన పట్ల కొందరు ఆర్థిక వేత్తలు – 399
2) మాన్యుఫాక్టర్ ఇచ్చిన మంచి అంశాలు – 400

## 3. యంత్రాలూ, భారీ పరిశ్రమా ........................................ 403

★ ‘ ఉత్పాదక శక్తుల చరిత్ర ’లోకి, ‘ యంత్రం’ ఎలా వచ్చింది?– 404

1) ‘యంత్రం’ గురించి తెలుసుకోవలసిన విషయాలు – 405
2) ‘యంత్రం’ నించి సరుకుకి చేరే విలువ – 408
3) పెట్టుబడిదారుడి దృష్టిలో ఉత్పాదక శక్తి – 414
4) నిరుద్యోగానికి కారణం – 417
5) కొత్త యంత్రం వస్తే నిజానికి ఏం జరగాలి? – 419
6) యంత్రంతో కార్మికుల సంబంధం – 422
7) యంత్రాలు వచ్చిన కొత్తలో – 424
8) ‘ నిరుద్యోగ సమస్య’ గురించి పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు ఏమంటారు? – 426
9) యంత్రాల వాడకమూ, దాని ఫలితాలూ – 427
10) ఆధునిక గృహ పరిశ్రమా, ఆధునిక మాన్యుఫాక్చరూ – 433
11) ‘ వ్యవసాయం’లో భారీ పరిశ్రమ – 436

## 4. శ్రమ, పెట్టుబడికి లోబడడం ........................................ 442

1) పెట్టుబడి, ఒక చారిత్రక ఉత్పత్తి సంబంధం – 443
2) ‘ పెట్టుబడిదారీ సమాజం’లో, పెట్టుబడి ; ‘ నూతన సమాజం’లో-పెట్టుబడి కాదు, ఉత్పత్తి సాధనాలు! – 446

## 5. ఉత్పాదక శ్రమా - అనుత్పాదక శ్రమా ........................... 450

1) పెట్టుబడిదారుడి ‘ఉత్పత్తి స్థలం’లో జరిగే శ్రమలు – 451
2) పెట్టుబడిదారుడి ఇంటి దగ్గిర శ్రమలు – 453
3) ఉత్పాదక — అనుత్పాదక శ్రమల సంబంధం – 458
4) కార్మికుల ఇళ్ళల్లో శ్రమలు – 460

   ★ ఉత్పాదక శ్రామికుల ఇళ్ళల్లో అనుత్పాదక శ్రామికులు – 460

5) ఉత్పాదక, అనుత్పాదక విభజన, యజమానులకే గానీ శ్రామికులకు వర్తించదు – 461

6) ‘ఉత్పాదక శ్రమల’ విముక్తే, ‘అనుత్పాదక శ్రమల’ విముక్తి! – 462
7) పిల్ల పెట్టుబడిదారుడికి, వాడి ఆర్థిక వేత్త నీతి బోధ! – 464
8) ‘ ఉత్పత్తి స్థలం’లో అనుత్పాదక శ్రమలు – 466
★ నిర్వహణ శ్రమ – 466
★ అజమాయిషీ శ్రమ, లేదా పెత్తనం శ్రమ – 466
★ సూపర్‌వైజరు – 467 ★ మేనేజరు – 468 ★ డైరెక్టరు – 469
9) ఇంకా కొన్ని అనుత్పాదక శ్రమలు – 470
★ కాపలా శ్రమ – 470 ★ ఫ్యాక్టరీ లాయరు శ్రమ – 471
★ ఆడిటర్లు – 471.
10) స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమలు – 473
11) చిన్నపెట్టుబడిదారుడి పని స్థలంలో శ్రమలు – 476
12) ‘ ప్రభుత్వాధీనం’లో ఉండే శ్రమలు – 477
★ ప్రభుత్వం నడిపే ‘ఉత్పాదక సంస్థలు’ – 477
★ ప్రభుత్వం నడిపే ‘ అనుత్పాదక ’ సంస్థలు – 478
★ సైనిక విధి – 478 ★ ‘ నేరవిచారణ’ శ్రమలు – 480
★ ఇతర అనుత్పాదక శ్రమలు – 481.
13) మత సంస్థల్లో జరిగే శ్రమలు – 482
14) కొన్ని ప్రత్యేక ఉదాహరణలు – 483
(1) ‘ కుటుంబ శ్రమ’ ఏ కోవకు చెందుతుంది? – 483
★ ఇంటా బయటా కూడా శ్రమచేసే స్త్రీలు – 488
★ కుటుంబ శ్రమ, సమాజానికి అవసరమయ్యే ‘ మొత్తం శ్రమ’లో భాగమేనా, కాదా? – 489, ★ స్త్రీలు ఏ వర్గం? – 490.
(2) బస్సు డ్రైవరు శ్రమ – 492 (3) డాక్టర్ శ్రమ – 494
(4) రచయిత శ్రమ – 495 (5) సినిమా నటుల శ్రమ – 496
(6) ‘బ్యాంకు’ ఉద్యోగుల శ్రమలు – 502
(7) వేశ్యల విషయం?– 504 (8) ‘నిరుద్యోగుల’ విషయం– 508
★ బిచ్చగాళ్ళు – 508 ★ జైళ్ళల్లో మనుషులు – 508.
15) ఉత్పాదక – అనుత్పాదక విషయాలపై పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల అవగాహన – 509
★ ఫిజియోక్రాట్లు – 511
★ అనుత్పాదక పెట్టుబడిదారుల గుండె కోత! – 514
★ ఉత్పాదక రంగానికి పునాది ఎవరు? – 514

16) 'సమాజ ఉత్పత్తుల రాసి' పంపకం – 516
★ ఉత్పత్తి రాసిలో ఉన్న 'ఉత్పత్తి సాధనాలు' – 517
★ ఉత్పత్తి రాసిలో ఉన్న 'ఉత్పాదక శ్రామికుల జీతాల' భాగం – 518
★ ఉత్పత్తి రాసిలో ఉన్న 'అదనపు విలువ' భాగం – 519
17) 'ప్రభుత్వ ఆదాయం'లో పన్నులూ, ఇతరములూ – 519
18) అదనపు విలువని తినే ఇతరులు – 521
★ 'లంచాలు' తినే అధికారులు – 521
19) శ్రామికుల్ని సప్లయ్ చేసే బిజినెస్ – 523
20) వస్తువుల్లో ధనిక పేద తేడాలు – 524
21) దోపిడీ విలాసాలు – 526
22) దోపిడీదారుల్లో స్థాయీ భేదాలు – 527
23) స్తితిని బట్టి చైతన్యం! – 528
24) 'శ్రమ సంబంధాల' సూత్రీకరణలు – 530
25) ఉత్పాదక, అనుత్పాదక శ్రమల గురించి ఒక వివరణ – 531
26) పోలీసులూ సైనికులూ కార్మికులేనా? – 537
27) ఉత్పాదక - అనుత్పాదక విభజన,
'పెట్టుబడిదారీ సమాజానికి' మాత్రమే ప్రత్యేకం – 539
28) 'నూతన సమాజం'లో,
ఉత్పాదక - అనుత్పాదక విభజన ఉంటుందా? – 540
29) ఉమ్మడి వంటిల్లు (సమిష్టి వంటశాల) – 542
30) నూతన సమాజంలో 'సైనిక' శ్రమ – 546
31) నూతన సమాజంలో 'నేర విచారణ' శ్రమలు – 546
32) నూతన సమాజంలో 'కళలు' – 548
33) నూతన సమాజంలో 'వ్యభిచార సమస్య' – 548

**6. పెట్టుబడి విస్తరణ ........................................ 554**
1) పెట్టుబడి ఎక్కడిది – 555
2) పేద - ధనిక తేడాలకు దోపిడీదారులు చెప్పే కారణం! – 557
3) పెట్టుబడి కూడిక – 560
4) సింపుల్ పునరుత్పత్తిలో – 562

5) విస్తృత పునరుత్పత్తిలో – 563
6) పెట్టుబడి ఎవరిది? – 567
7) పెట్టుబడి కేంద్రీకరణ – 568
8) 'పెట్టుబడి విస్తరణ'లో స్థిర పెరిగి, అస్థిర తగ్గుతుంది – 571
9) 'ఉత్పత్తి సంబంధాల' పునరుత్పత్తి! – 574
10) పెట్టుబడి విస్తరణా — అదనపు జనాభా – 576
11) పెట్టుబడి విస్తరణా, ఇళ్ళ సమస్యా – 583
12) సమస్తమైన పరిశ్రమలూ పట్టణాలలోనే! – 586
13) విలాస వస్తువుల ఉత్పత్తి – 587
14) నూతన సమాజంలో విలాస ఉత్పత్తి! – 589
15) పెట్టుబడి విస్తరణ, 'ఉత్పత్తి సాధనాల' విస్తరణే! – 590
16) పెట్టుబడిదారీ విధానం 'సర్క్యులర్' కాదు; స్పైరల్! – 591
★ పెట్టుబడి విస్తరణ, కార్మికుల విస్తరణ కూడా! – 592
17) నూతన ఉత్పత్తి విధానం స్పైరల్ కాదు; సర్క్యులర్! – 592
18) నూతన సమాజంలో జనాభా – 598
★ జనాభా, పెరిగిపోతూనే ఉంటుందా? – 599
★ కొత్త ఉపయోగపు విలువలు – 600
19) 'సమిష్టి ప్లాను'కి జనరల్ సూత్రాలు – 601
★ సింపుల్ పునరుత్పత్తి సూత్రాలు – 602
★ విస్తృత పునరుత్పత్తి సూత్రాలు – 603
20) 'నూతన సమాజం'లో పునరుత్పత్తి – 605
21) S లో ఇంత వరకూ చూడని ఇంకో భాగం! – 606
22) పునరుత్పత్తిలో, డబ్బు- రాసి సమస్య! – 607
23) 'నూతన సమాజం' గురించి ఒక స్పష్టత – 617

**7. ఇంత వరకూ చదివిన దాని సారాంశం ........................... 622**

**2 వ సంపుటంలో చాప్టర్లు – 629**

**గత ముద్రణలకు ఆర్థిక 'సహాయం' గురించి – 630**

**పదాల సూచిక (ఇండెక్స్) – 631**

★

# ముందు మాట

**కార్ల్ మార్క్స్** రాసిన 'కాపిటల్' (పెట్టుబడి) పుస్తకం, ఆర్థిక, రాజకీయ విషయాలనే గాక, మానవ సమాజ అభివృద్ధి క్రమాన్ని శాస్త్రీయంగా చర్చించిన పుస్తకం.

'కాపిటల్' — మొత్తం 6 పుస్తకాలు. (4 సంపుటాలు).

మొదటి పుస్తకం పేరు:
" పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం."
ఇందులో 8 భాగాలు వున్నాయి. 33 చాప్టర్లు.

**2** వ పుస్తకం పేరు :
"పెట్టుబడిదారీ చలామణీ క్రమం."
ఇందులో 3 భాగాలు వున్నాయి. 21 చాప్టర్లు.

**3** వ పుస్తకం పేరు :
" పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం మొత్తంగా."
ఇందులో 7 భాగాలు వున్నాయి. 52 చాప్టర్లు.

**4** వ, **5** వ, **6** వ పుస్తకాలకు ఒకటే పేరు.
"అదనపు విలువ సిద్ధాంతాలు" అనే పేరు.
ఈ చివరి **3** పుస్తకాలూ, 3 భాగాలు. మొత్తం ఈ మూడూ కలిసి 24 చాప్టర్లు. వీటిలో ప్రతి భాగానికీ "అనుబంధం"గా ఒక్కో చాప్టర్ వుంది.

" **కాపిటల్** " రచన మొత్తంగా ఇదీ!

ఈ **4** సంపుటాలకూ, 'కాపిటల్' అనేది— మెయిన్ హెడ్డింగు. దాని కింద— 'ఎ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' అనేది, సబ్ హెడ్డింగు.

**'పెట్టుబడి**
రాజకీయార్థిక శాస్త్రంపై ఒక విమర్శ'
ఇదీ పుస్తకం పేరు.

## 'రాజకీయార్థిక శాస్త్రం' అంటే,

'పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం. దాన్ని పరిశీలించడం అంటే, అందులో వున్న తప్పొప్పులు తెలుసుకుంటున్నామని అర్థం. 'తప్పుల్ని' తెలుసుకోవడం అంటే, సరైనదాన్ని కూడా తెలుసుకోవడమే.

1867 ఆగస్టు 16 రాత్రి 2 గంటలకు 'కాపిటల్' మొదటి పుస్తకం రచన పూర్తి అయింది. మరుసటి నెల సెప్టెంబర్ 14 న, 'కాపిటల్', అచ్చు పని ముగిసి బయటకు వచ్చింది. 'కాపిటల్' ఆవిర్భావం మానవ సమాజ చరిత్రలో అత్యద్భుతమైన ఘటన. గత లక్షలాది సంవత్సరాలలో జరిగిన ఘటనల కన్నా ఇది భిన్నమైనది. ఎందుకంటే— మానవ ప్రపంచానికి దాస్య శృంఖలాల నించీ; 'శ్రమ దోపిడీ' అనే అమానుషత్వం నించీ; జుగుప్సాకరమైన వర్గ భేదాల నించీ; క్రూరాతి క్రూరమైన యుద్ధాల నించీ, సంక్షోభాల నించీ; యుగ యుగాల దుఃఖాల నించీ, కన్నీళ్ళ నించీ; జంతు స్థాయి హింస నించీ, అజ్ఞానం నించీ— శాశ్వతంగా విముక్తి నిచ్చే మార్గాన్ని 'కాపిటల్' అనే జ్యోతి విస్పష్టంగా చూపించింది.

'దోపిడీ! దోపిడీ!' అనే మాటలు తరుచుగా వింటూ వుంటాం. వాటి నిజమైన అర్థాలు, వినే వాళ్ళకీ చెప్పే వాళ్ళకీ కూడా సరైన అర్థంలో తెలియక, అవి ఉత్త రోకటి పాట లాగ తయారవుతాయి. శ్రమ దోపిడీ అంటే ఏమిటి? వర్గ భేదాలు అంటే ఏమిటి? అవి ఎందుచేత ఏర్పడుతున్నాయి? వర్గ భేదాలు నిజంగా వున్నాయా? కార్మికులంతా ఒక వర్గంగా, పెట్టుబడిదారులంతా ఒక వర్గంగా, ఎందుచేత వున్నారు? మంచి పెట్టుబడిదారులే వుండరా? మంచి పెట్టుబడిదారులు కూడా 'శ్రమ దోపిడీ' చేస్తారా? ఒక వర్గం నానాటికీ దరిద్రమవుతూ వుంటే, ఒక వర్గం నానాటికీ ధనవంతమవుతూ వుండటం అంటే ఏమిటి? 'ప్రపంచ కార్మికులారా! ఏకం కండి' అనే నినాదానికి అర్థం ఏమిటి? ప్రపంచ కార్మికులంతా ఎందుకు ఏకం కావాలి? ప్రపంచ కార్మికులందరికీ వున్న సంబంధం ఏమిటి? ప్రపంచ కార్మికులందర్నీ ఏకం చేసే లక్షణం ఏమిటి?

'డబ్బు' అనేది ఏమిటి? 'పేదతనం' ఏమిటి? 'భాగ్యం' ఏమిటి? ప్రకృతిలో జన్మించిన మానవులు తమ అవయవాలతో ఏం చెయ్యాలో అది చేసినా, ఎన్ని పదార్థాలు ఉత్పత్తి చేసినా, వారి కడుపులు నిండకపోవడానికి కారణం ఏమిటి? మనిషి కడుపు నిండకపోవడం అనేది ప్రకృతి సహజ లక్షణమా? పేదతనం ప్రకృతి సత్యమా? అయితే ఆ సత్యం ప్రతి మనిషికీ ఎందుకు వర్తించదు?

'యజమాని' అంటే ఏమిటి? 'శ్రామికులు' అంటే ఏమిటి? ఒక మనిషి యజమానీ, ఒక మనిషి శ్రామికుడూ ఎందుకు అవుతున్నారు? — ఇటువంటి

అసంఖ్యాక మైన ప్రశ్నలకూ, మానవ సమాజం వేలాది సంవత్సరాలుగా జ్ఞాన పిపాసతో చేసే చీకటి తడుము ళ్ళాటలకూ — జవాబు 'కాపిటల్' ఒక్కటే.

**మానవులకు, 'మానవ సమాజం' గురించి తెలుసుకో డానికి మించిన జ్ఞానం వుండదు. ఆ జ్ఞానాన్ని ఇచ్చే శాస్త్రీయ మైన గ్రంథం 'కాపిటల్' ఒక్కటే.**

మానవ సమాజం సృష్టించుకున్న విజ్ఞాన సంప దల్లో – 19వ శతాబ్దపు జర్మన్ తత్వ శాస్త్రమూ, ఇంగ్లీషు ఆర్థిక శాస్త్రమూ, ఫ్రెంచి సోషలిస్టు సిద్ధాం తమూ, అత్యంత ప్రధానమైనవి. ఈ మూడింటిలోనూ వున్న అశాస్త్రీయ, భావ వాద లక్షణాలను తొలగించి, వాటిని పూర్తిగా శాస్త్రీయమైన పునాదుల మీద నిలబెట్టినదాని ఫలితమే – 'మార్క్స్ సిద్ధాంతం'! ఆ సిద్ధాంత జ్ఞానంతో మార్క్సు, 'ఇంగ్లండు పెట్టుబడి దారీ ఆర్థిక వ్యవస్థ' గురించి చేసిన విమర్శనాత్మక పరిశీలనే — 'కాపిటల్' (పెట్టుబడి) పుస్తకం.

మార్క్స్, 'కాపిటల్'కి రాసిన మొదటి 'ముందు మాట'లో, 'కాపిటల్' రాయడంలో తన అభి ప్రాయం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని పరిశీ లించడం గనక, అటువంటి ఆర్థిక విధానానికి పునాది అయిన ఇంగ్లండ్‌ని ముఖ్యమైన ఉదాహరణగా తీసుకున్నానని అన్నాడు.

పెట్టుబడిదారీ ఆర్థిక విధానంపై పరిశీలన చేసిన ఈ క్రమంలో, కాపిటల్, మానవ సమాజ గమన సూత్రాల్నీ, వర్గ వైరుధ్యాల్నీ, దోపిడీ రహస్యాల్నీ, దోపిడీ వ్యతిరేక నూతన సమాజాన్నీ — విస్పష్టం చేసింది. 'కాపిటల్' రాకముందు — అప్పటి వరకూ వున్న రాజకీయ ఆర్థిక శాస్త్రం (పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం) అత్యంత ప్రధానమైన విషయాలలో అజ్ఞాన దశలోనే వుంది. ముఖ్యంగా, 'విలువ' అనేది ఏమిటో దానికి తెలీదు. అందుకే, 'డబ్బు' అనేది ఏమిటో దానికి అర్థం కాలేదు. పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్ర సూత్రాల నన్నిటినీ తోసివేసే విధంగా, 'కాపిటల్', తన శాస్త్రీయ సిద్ధాంతాలు ప్రతిపాదించింది.

'కాపిటల్' రాయడానికి 20 సంవత్సరాలముందే, మార్క్సు — "రాజకీయార్థిక శాస్త్రంపై ఒక విమర్శ" అనే పేరుతో, పాత ఆర్థిక శాస్త్రం గురించి ఒక విమర్శ రాశాడు. అటువంటి విమర్శనాత్మక రచన ఒకటి బయటికి వచ్చిందనే సంగతే తనకు తెలియనట్టు పెట్టుబడిదారీ వర్గం, తన మౌనంతో, మార్క్స్ విమ ర్శని చంపెయ్యాలని చూసింది. ఆ రచన విష యంలో అది కొంత విజయం సాధించగలిగినా, 'కాపిటల్' విషయంలో మాత్రం అది మళ్ళీ ఉపయో గించిన ఆ పాత ఎత్తుగడ సాగలేదు.

కాపిటల్ — మిట్ట మధ్యాన్నపు సూర్యుడి లాగ, పెట్టుబడిదారీ వర్గం మీద నిప్పులు జిమ్ముతూ వచ్చిపడింది! దానితో మానవ సమాజ చరిత్రలో కొత్త యుగం ప్రారంభమైంది! 'ఇంత వరకూ జరిగిన మానవ చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే' అని గ్రహించిన మార్క్స్, కార్మిక వర్గానికీ, పెట్టుబడిదారీ వర్గానికీ జరిగే పోరాటం కోసమూ, వర్గ భేదాల శాశ్వత నిర్మూలన కోసమూ, 'కాపిటల్'ని, కార్మిక వర్గం చేతికి సిద్ధాంతాయుధంగా సమకూర్చి ఇచ్చాడు. కార్మిక వర్గం దానిని శ్రద్ధాసక్తుల తోటీ, కృతజ్ఞతల తోటీ, అందుకుంది.

"ఆర్థిక శాస్త్రం" అంటే, అందులో చాలా లెక్కలు వుంటాయనీ, లెక్కలు బాగా తెలిసినవాళ్ళు తప్ప దాన్ని చదవలేరనీ, సాధారణంగా మనందరికీ ఒక అభిప్రాయం వుంటుంది. అది చాలా పొరపాటు అభిప్రాయం. ఆర్థిక శాస్త్రం అంటే, సమాజపు ఉత్పత్తి విధానాన్నీ, పంపిణీ విధానాన్నీ వివరించే శాస్త్రం. అందులో పెద్ద పెద్ద లెక్కలు వుండవలసిన అవసరం లేదు. 'కాపిటల్'లో వున్న లెక్కలన్నిటిలోకీ పెద్ద లెక్కలు, 'శాతాలు' కట్టడమే. మిగతావన్నీ చిన్న చిన్న కూడికలూ, తీసివేతలూ, గుణకారాలూ, భాగా హారాలూ వంటివే. శాతాలు కట్టడం కూడా ఎంత తేలికో, దాన్ని గురించి తెలిసినవాళ్ళకి వేరే చెప్పక్క ర్లేదు. ఆ లెక్కలు రాని వాళ్ళు వాటిని ఒక్క అర గంట సేపట్లో నేర్చుకోవచ్చు. కాబట్టి, 'కాపిటల్' చదివే ముందు, 'ఇందులో ఎంతో పెద్ద పెద్ద లెక్కలు వుంటాయి' అనే అపోహలేమైనా వుంటే, అవన్నీ పూర్తిగా వదిలెయ్యాలి.

ఇందులో ఉన్నదంతా లెక్కలు కాదు, తర్కం. లెక్కలంత ఖచ్చితమైన తర్కం. అంటే, హేతుబద్ధ మైన చర్చ. దీన్ని 'తర్కం' అనొచ్చు, 'చర్చ' అనొచ్చు, 'విమర్శ' అనొచ్చు, 'పరిశీలన' అనొచ్చు, 'విశ్లేషణ' అనొచ్చు, ఈ రకమైన మాట ఇంకేదైనా కూడా అనొచ్చు. ఈ పుస్తకం చదవడానికి, పెద్ద పెద్ద డిగ్రీలూ, పాండిత్యాలూ అక్కర లేదు. అవి వుంటే నష్టం లేదు గానీ, లేకపోతే కూడా నష్టం లేదు.

**ఈ** పుస్తకం చదివే వ్యక్తికి ఒక లక్షణం తప్పనిసరిగా వుండాలి. ఏమిటంటే, 'ఆలోచించే' లక్షణం. చాలా పుస్తకాల విషయంలో, చదివే వాళ్ళకి ఆలోచన అక్కర్లేదు. తల కాయని తీసి ఎక్కడన్నా

తగిలించి, విశ్రాంతిగా పడుకొని పుస్తకం చదువుకోవచ్చు. కానీ, ఇక్కడ అది పనికిరాదు. ఇక్కడ అడుగడుగునా తర్కమే. పాఠకులు పాల్గొనకుండా, రచయిత, తర్కం చేయలేడు. ఆలోచించని పాఠకులకు రచయిత ఏమీ బోధించలేడు. రచయిత బాధ్యత రచయిత నిర్వహిస్తే, పాఠకుల బాధ్యత పాఠకులు నిర్వహించాలి.

'కాపిటల్'లో మార్క్స్, 'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, దాని పంపిణీ విధానాన్నీ పరిశీలించే పనిచేస్తాడు. ఆ పరిశీలనా క్రమంలోనే, ఐరోపా దేశాల బానిస, ఫ్యూడల్ ఉత్పత్తి విధానాల్ని కూడా క్లుప్తంగా వివరిస్తాడు. అంతే గాక, ఈ 3 రకాల సమాజాలకూ పూర్తిగా భిన్నమైన ఒక నూతన సమాజాన్ని కూడా ఎక్కడి కక్కడ సూచిస్తూ వుంటాడు. 'కాపిటల్' పుస్తకంలో వున్న ప్రధానమైన విషయం అంతా ఇదే.

మార్క్సుకి ముందే 'ఆర్థిక శాస్త్రం' వుంది. ప్రకృతినీ, సమాజాన్నీ రక రకాలుగా వివరించే 'తత్వ శాస్త్రం' వుంది. మానవులంతా సమానులుగా జీవించాలని కలలు కనే కమ్యూనిస్టు భావనలు వున్నాయి. అయితే, అప్పటికి అవన్నీ రక రకాల తప్పుల తోటీ, పొరపాట్ల తోటీ, వైరుధ్యాల తోటీ నిండివున్నాయి. మార్క్సు, వాటన్నిటినీ ఒక హేతుబద్ధ దృక్పథంతో పరిశీలిస్తాడు. అలా పరిశీలించడానికి కావలసిన జ్ఞానాన్ని, ఆ విషయాలలో వున్న వైరుధ్యాల నించే తీసుకుంటాడు.

మార్క్స్, తన పరిశీలనలో 'శ్రమ దోపిడీ' అనే 'వికృత క్రిమి'ని కనిపెట్టగలిగాడు. దీనితో, 'కలిమి లేముల రహస్యం' అంతా బయటపడింది. సమస్త సమాజ రుగ్మతల మూలం అంతా తేటతెల్ల మయింది. ఇది సమాజానికి సరికొత్త జ్ఞానం. వందల, వేల సంవత్సరాల నించీ ఇది సమాజానికి అందని విషయం. ఇది మార్క్స్ పరిశీలనతోనే సమాజానికి అందింది.

మార్క్స్, 'శ్రమ దోపిడీ'ని గ్రహించి, అంతటితో వూరుకోలేదు. దాన్ని నిర్మూలించ గల మార్గం కూడా వివరించాడు. ఆ మార్గం కూడా ఆ జ్ఞానంలో భాగమే. దోపిడీని గ్రహించడం వేరూ, దాన్ని నిర్మూలించే మార్గాన్ని వివరించడం వేరూ కాదు. రెండూ ఒకటే. మొదటి దాన్ని గ్రహించడం, రెండో దాన్ని కూడా గ్రహించడమే.

దోపిడీని గ్రహించడానికీ, దోపిడీని నిర్మూలించే నూతన సమాజాన్ని నిర్మించడానికీ, మార్క్స్ ఇచ్చిన సిద్ధాంతమే 'మార్క్సిజం'. మార్క్సిజం, సమాజ పరిశీలనా సిద్ధాంతం.

'మార్క్సిజం' గురించి మాట్లాడే వాళ్ళలో రెండు రకాల వాళ్ళు వుంటారు. దాన్ని అంగీకరించే వాళ్ళూ, వ్యతిరేకించే వాళ్ళూ. వ్యతిరేకించే వాళ్ళల్లో దాని గురించి సరిగా తెలియక వ్యతిరేకించే వాళ్ళూ, తెలిసే వ్యతిరేకించే వాళ్ళూ; దాన్ని అంగీకరించే వాళ్ళల్లో కూడా, ఆ సిద్ధాంతాన్ని సరిగా తెలిసి అంగీకరించే వాళ్ళూ, తెలియకుండానే అంగీకరించే వాళ్ళూ! ఇలా, దాని వ్యతిరేకులూ, సమర్థకులూ కూడా రక రకాలుగా వుంటారు.

మార్క్సిజాన్ని తెలిసి అంగీకరించడమూ, తెలిసి వ్యతిరేకించడమూ, ఆ సిద్ధాంతానికి చాలా సహజంగా ఎదురయ్యే ఫలితాలు. అది తప్పనిసరి. కానీ, దాన్ని తెలియకుండానే అంగీకరించడమూ, తెలియకుండానే వ్యతిరేకించడమూ అనే లక్షణాలు రెండూ ఆ సిద్ధాంతానికి హాని చేసేవే. తెలియకుండా వ్యతిరేకించడం ఎలాంటిదో, తెలియకుండా అంగీకరించడం కూడా అలాంటిదే. ఒక మనిషి ఒక సిద్ధాంతాన్ని 'తెలియకుండా అంగీకరించడం' కాదు కావలసింది; 'తెలిసి అంగీకరించడమో, తెలిసి వ్యతిరేకించడమో' — కావాలి.

మార్క్సిజం అంటే, 'అది కేవలం డబ్బుని ప్రధానం చేసే సిద్ధాంతం' అనీ, అది 'హింస సిద్ధాంతం' అనీ, అది 'స్వేచ్ఛని హరించే సిద్ధాంతం' అనీ, మొదటి నించీ దాని మీద ప్రపంచ మంతటా రక రకాల వ్యతిరేకాభిప్రాయాలు వున్నాయి. మార్క్సిజానికి కాలం చెల్లిందనీ, అది ఇక పనికిరాదనీ, తర్వాత కాలం నించీ బైల్దేరిన అభిప్రాయాలూ కొన్ని వున్నాయి.

మార్క్సిజం అంటే, డబ్బుని ప్రధానంచేసే సిద్ధాంతమా, డబ్బుని నిర్మూలించే సిద్ధాంతమా? అది హింస సిద్ధాంతమా, హింసని అంతం చేసే సిద్ధాంతమా? అది స్వేచ్ఛని హరించే సిద్ధాంతమా, స్వేచ్ఛకి దారి తీసే సిద్ధాంతమా? మార్క్సిజానికి కాలం చెల్లిందా, దాని వ్యతిరేక సిద్ధాంతాలకే కాలం చెల్లిందా? — ఈ ప్రశ్నలన్నిటికీ జవాబులు కావాలంటే మార్క్సిజాన్ని వివరించ గల 'కాపిటల్' రచన చదవాలి.

మార్క్సిజం మీద దుష్ప్రచారం, ఈ నాటిదీ నిన్నటిదీ కాదు. ఇది రేపో మాపో అంతమయ్యేది కూడా కాదు. భవిష్యత్తులో అది, ఇంకా ఇంకా కొత్త మార్గాలు కూడా వెతుక్కుంటుంది. ప్రస్తుతానికైతే కొత్త

మార్గాలు వెతుక్కునే శ్రమ దానికి అక్కరలేదు. పాత మార్గాలు ఇంకా దానికి సత్ఫలితాలనిచ్చే మార్గాలు గానే వున్నాయి.

మార్క్సిజం, ప్రపంచానికి అంది నూట పాతిక సంవత్సరాలు గడిచినా, అది ఈ నాటికీ కూడా ప్రపంచానికి చాలా తక్కువగానే తెలుసు. అది ఇంకా ప్రపంచానికి నిజమైన అర్థంలో 'అందలేదు'. అది ఇంకా శ్రామిక చైతన్యంలో ఒక శక్తిగా మారలేదు. దానికి కారణం, అది ఇంకా ప్రపంచానికి 'అర్థం కాని' సిద్ధాంతంగా వుండిపోవడమే. ఒక సిద్ధాంతం, ఎంత సత్యమైనదైనా, ఎంత వాస్తవమైనదైనా, అది కోట్ల కోట్ల జనాలకు అర్థమై వారి ఆలోచనలలోకి చొచ్చుకు పోకపోతే, దానికి 'సిద్ధాంతం'గా నిలబడ గల స్వతంత్ర శక్తి వుండదు. అందుకే, ఈ నాటికీ, మార్క్సిజం, చాలా మొరటు దుష్ప్రచారానికీ, ఏమీ రూపం మార్చని, ఒకే రకపు పాత కాలపు నిందలకూ పదే పదే లోనవుతోంది. ఈ దుష్ప్రచారాన్నీ, ఈ నిందల్నీ, ఏ జనాల చైతన్య మైతే క్షణాల మీద ప్రతిఘటించ గలదో, ఆ జనాలు ఇంకా నిశ్శబ్దంగా, నిరాసక్తంగా వున్నారు. ఆ జనాల చైతన్యం ఇంకా నూతనత్వం లేని ప్రాచీన స్థితిలోనే వుంది. వారి మేధస్సుకి, ఇంకా అందవలసినదంతా అందలేదు.

'కాపిటల్'లో విషయాల్ని చెప్పిన వరస ఎంత కరెక్టుగా ఉంటుందంటే, అది, ఆ విషయాల్ని అర్థం చేసుకుంటేగానీ తెలీదు. 'ఆస్తి హక్కు' అంటే ఏమిటో తెలియాలంటే, అంత కన్నా ముందు 'పెట్టుబడి' గురించీ, 'భూమి' గురించీ, తెలియాలి. 'పెట్టుబడి' గురించి తెలియాలంటే, అప్పటికే 'డబ్బు' గురించి తెలిసి వుండాలి. 'డబ్బు' గురించి తెలియాలంటే, అప్పటికే 'మారకాల' గురించీ 'విలువ' గురించీ తెలిసి ఉండాలి. 'విలువ' గురించి తెలియాలంటే, అప్పటికే 'వస్తువుల' గురించీ, 'సరుకుల' గురించీ తెలిసి ఉండాలి. అంటే మొట్ట మొదట 'వస్తువు' తోటీ, 'సరుకు' తోటీ, మొదలు పెట్టాలి. ఉపయోగపు విలువా, మారకం విలువా, విలువ రూపంగా డబ్బు అవతరించడమూ, ఈ అంశాల మీద ఉత్పాదక శక్తి చూపే ప్రభావాలూ— వగైరా అంశాలన్నీ, ఉత్పత్తి విధానానికి వుండే స్వభా వంతో సంబంధం లేకుండా అర్థం చేసుకోవలసినవి. మొదట ఈ విషయాలన్నీ అర్థం చేసుకోకుండా, ఉత్పత్తి విధానానికి ఉండే వేరు వేరు స్వభావాల్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అందుకే, ఈ అంశాలన్నిటినీ వివరించే 'సరుకులూ– డబ్బూ' చాప్టరే, 'కాపిటల్'లో మొట్ట మొదటి చాప్టరుగా ఉంటుంది.

మొత్తం 'కాపిటల్' రచనని, ఒక మానవ దేహంతో పోలిస్తే, అందులో మొట్ట మొదట వున్న 'సరు కులూ–డబ్బూ' భాగం, 'శిరస్సు' లాంటిది. అంత ప్రధానమైన విషయాలు ఉన్నాయి అందులో. తర్వాత చాప్టర్లన్నీ కూడా దేని తర్వాత ఏది రావాలో ఆ క్రమం లోనే సాగుతాయి.

కానీ, 'కాపిటల్'ని చదవడం గురించి, 'కాపిటల్'ని ఇష్టపడే వాళ్ళలో, చాలా రకాల పొరపాటు అభిప్రాయాలున్నాయి. ముందు మూడో సంపుటంలో వున్న 'భూమి కౌలు' చాప్టరు మొదట చదవాలని కొందరూ, రెండో సంపుటంలో వున్న ఫలానా చాప్టరు ముందు చదవాలని కొందరూ, మొదటి సంపుటంలో మొదటి భాగం ముందు చదవకూడదని కొందరూ, చదివినా అందులో 'సరు కుల మాయ' చాప్టరుని తప్పనిసరిగా వొదిలెయ్యా లని కొందరూ, 'కాపిటల్' చదవాలనుకున్నప్పుడు ముందు ఇంకేవో పుస్తకాలు చదివి ఆ తర్వాత 'కాపిటల్'ని మొదలెట్టాలని కొందరూ — ఇలా, రక రకాలుగా అభిప్రాయపడుతూ వుంటారు. ఈ అభిప్రాయాలన్నీ 'కాపిటల్' రచయితని నిర్లక్ష్యం చేసేవే. రచయిత ఏది మొదట రాశాడో దాన్ని మొదట చదవకుండా, ఇంకేదో చాప్టరుని మొదట చదవ వలసి వుంటే, రచయిత దాన్నే మొదట చెప్పేవాడు కదా? మొట్ట మొదటి భాగంలోవున్న 'విలువ రూపం' గురించిన విషయాలే మొత్తం పుస్తకాని కంతటికీ నిర్ణయాత్మకమైనవని రచయిత చెబుతున్నప్పుడు, మొదట ఆ భాగం చదవకుండా ఇంకెక్కడి నించో ప్రారంభించాలనడంలో ఏమైనా అర్థం ఉంటుందా? మొదట 'డబ్బు' అంటే ఏమిటో తెలీకుండా, కౌలు నో వడ్డీ నో లాభాన్నో ఎలా అర్థం చేసుకోగలుగుతాము? ఇలాంటి తెలివి తక్కువ అభిప్రాయాలన్నీ వదిలేసి, మార్క్స్ ఏ వరసలో రాశాడో ఆ వరసలోనే 'కాపిటల్'ని చదవడం సరైన పని. 'భూమి కౌలు'నో, 'వడ్డీ'నో, ఇంకేదో చాప్టరునో మొదలు చదవాలనడం అంటే, 'కాపిటల్'లో ఉన్న విషయాల్ని ఏ మాత్రమూ అర్థం చేసుకోకపోవడం అన్నమాట!

'కాపిటల్' గురించి వెలువడిన అభి ప్రాయా లలో, 'కాపిటల్ అర్థం కాదు' అనే అభి ప్రాయం ఒకటి

వుంటుంది. అది చాలా 'న్యాయమైన' అభిప్రాయమే. ఎందుకంటే, ' కాపిటల్ ' తేలిగ్గా అర్థం కాదు గనక. 'కాపిటల్'లో కొన్ని అంశాలు, వాటిని మొదట చదివి నప్పుడు, తలలు బద్దలు కొట్టుకున్నా అర్థం కాని విధంగా వుంటాయి. చెప్పే విషయం కఠినమైనది కావడమే దానికి కారణం అనిపిస్తుంది. నిజానికి, అర్థం చేసుకోలేకపోవడం అనే పరిస్థితి, భౌతిక విష యాల్లో వుండకూడదు. ఎందుకంటే, భౌతికమైన విషయాలు ఎప్పుడూ ఒక క్రమంలో వుంటాయి. వాటికి సహజమైన నడకా, సహజమైన కారణాలూ వుంటాయి. అవి ఎలా పడితే అలా అస్తవ్యస్తంగా నడవవు. ఒకరికి ఒక విధంగా కనపడి, ఇంకొకరికి ఇంకో విధంగా కనపడవు.— ఈ విధంగా ఒక క్రమ బద్ధతకు లోబడే భౌతిక విషయాన్ని అర్థం చేసు కోవడం, కొంత కఠినంగా వుంటే వుండవచ్చు గానీ, అసాధ్యంగా మాత్రం వుండదు. అలాగే ' కాపి టల్ ' లో వున్నదంతా భౌతిక విషయాల మీద పరి శీలనే కాబట్టి, అది, గ్రహించడానికి అసాధ్యంగా వుండకూడదు. అది అసాధ్యంగా వుండదు గానీ, కొన్ని చోట్ల కొంచెం కఠినంగా మాత్రం వుంటుంది. దానికి కారణం— కాపిటల్ లో చెప్పినదంతా 'సామాజిక శాస్త్రం'. అది 'కొత్త శాస్త్రం'. దాన్ని చెప్పిన పద్ధతి కూడా ఒక 'తార్కిక పద్ధతి'. దాన్ని ఎంత సరళంగా చెప్పాలో అంత సరళంగా చెప్పడానికి కావలసినంత టైము రచయిత వెచ్చించలేక పోయాడు. మొత్తం మీద, కారణం ఏదైనా గానీ, పుస్తకంలో విషయాలు మొదటి సారి చదివినప్పుడు, కొంత కఠినంగా వుంటాయి.

ఆర్థిక, రాజకీయ, సాంఘిక విషయాలలో సరైన దృక్పథాన్ని ఇచ్చే 'సామాజిక శాస్త్రం'గా, ' కాపిటల్ ' ఆవిర్భవించింది. అందులోని పద జాలమూ, విషయాలూ, సూత్రీకరణలూ అన్నీ సమాజానికి కొత్త! ఉదాహరణకి— 'రూపం లేని శ్రమ' (యాబ్‌స్ట్రాక్ట్ లేబర్) అనే మాటని సమాజం అంత వరకూ ఎరగదు. అలాగే, 'అదనపు విలువ' అనే మాటని కూడా సమాజం అప్పటి వరకూ ఎరగదు. ఇంకా వందల కొద్దీ మాటల్నీ, వాటి అర్థాల్నీ, మానవ చరిత్రాభివృద్ధి ఒక నియమం ప్రకారం జరుగుతోందనే వాస్తవాన్ని, సమాజం, శాస్త్రీయమైన వివరణలతో ఎరగదు. ఇన్ని రకాల కొత్త విషయాల్నీ, కొత్త పదాల్నీ, కొత్త అర్థాల్నీ, ఇలా మానవ సమాజాన్ని విస్మయంలో ముంచేసే కొత్త శాస్త్రాన్ని అర్థం చేసుకునేటట్టు ఒక్క సారిగా చెప్పగలగడమూ, ఒక్క సారిగా అర్థం చేసుకోగల గడమూ; కూడా— కఠినమైన విషయాలే.

'ప్రతీ శాస్త్రం, దాని ప్రారంభ సమయంలో కఠినంగా వుంటుంది' అంటాడు మార్క్సు, ఒక ముందు మాటలో. ఆ కఠినత్వం వినే వాళ్ళకే కాదు, చెప్పే వాళ్ళకి కూడా! "ఏమీ తెలియని వాళ్ళకి, ఒక దానితో ఒకటి పోటీపడే ఆర్థిక శాస్త్ర సమస్యల్ని చెప్పడం తేలిక పని కాదు" అంటాడు మార్క్స్, ఎంగెల్స్‌కి రాసిన ఒక వుత్తరంలో. ఇంకో చోట, ఒక విషయం గురించి చర్చిస్తూ, "... ఈ చాప్టరుకి సంబంధించిన వాటిలో అసలు విషయాల్నీ, వాటి సంబంధాల్నీ, స్పష్టం చేసుకోవడంలో నేను చాలా ఎక్కువ శ్రమపడాల్సి వచ్చేటట్టుంది" అంటాడు. ఇలాంటి ఉదాహరణలు కొల్లలు. మొదట కఠినంగా రాసినట్టు కనిపించిన చాలా విషయాల్ని, తర్వాత సరళంగా రాయడానికి ప్రయత్నిస్తూనే వున్నాడు మార్క్సు. ఒక సారి రాసిన విషయాన్ని మళ్ళీ మళ్ళీ రాసి మెరుగులు పెడుతూనే వుండేవాడు.

ఒక నూతన శాస్త్రం విషయంలో, క్రమంగా కాలం జరుగుతోన్న కొద్దీ, దాన్ని అనేక కోణాలలో అర్థం చేసుకునే ప్రయత్నాలు జరుగుతూ వున్న కొద్దీ, దాన్ని పూర్వం కన్నా తేలిగ్గా చెప్పడమూ, వినడమూ సాధ్య మవుతాయి.

కాపిటల్ రచనలో ఉపయోగించిన పరిశీలన పద్ధతి ( మెథడ్ ఆఫ్ ఇంక్వయిరీ ) గురించి మార్క్సు ఒక 'ముందు మాట'లో ఇలా చెప్పాడు :

"................ (దేన్ని పరిశీలిస్తున్నామో దానికి సంబంధించిన) అన్ని విషయాలనీ సంపూర్ణంగా ఆకళింపు చేసుకోవాలి. ఆ విషయాలు ఏమిటో, అవి ఎలాంటి రూపాల్లో వుంటాయో, వాటి మధ్య అంత ర్గతంగా వున్న సంబంధం ఏమిటో, గమనించాలి. అలా చేసినప్పుడు మాత్రమే మనం దేన్నయితే పరిశీ లిస్తున్నామో దాన్ని స్పష్టంగా వివరించగలం."

అంటే, ఒక కొత్త శాస్త్రాన్ని ( సైన్సు ని ) చెప్పా లంటే, మొదట, అందులో విషయాల్నీ, వాటి సంబంధాల్నీ పూర్తిగా అర్థం చేసుకోవాలి - అని. 'శాస్త్రం' అయిన దాంట్లో ఒక తర్కం వుంటుంది. ఒక అంశం మీద ఇంకో అంశం ఆధారపడి వుండే లాగ చేసే హేతుబద్ధ క్రమం వుంటుంది.

మార్క్సు చెప్పదల్చుకున్నది ' శ్రమ దోపిడీ' అనే విషయాన్నే కాబట్టి, మొట్ట మొదటి చాప్టరుకే ' శ్రమ దోపిడీ' అనే శీర్షిక పెట్టేసి, " సమాజంలో, బానిస యజమానుల కాలం నించీ కూడా శ్రమ దోపిడీ జరుగుతోంది, ఈ నాటికీ అదే జరుగుతోంది" అని చెప్తే, అందులో అసత్యం ఏమీ వుండదు. కానీ, దాన్ని

పాఠకులు ఎందుకు నమ్మాలి? - మనకు అర్థం కాని విషయాల్ని మనం నమ్మక్కర లేదు. 'శ్రమ దోపిడీ' అంటే ఏమిటో చదివే వాళ్ళకు అర్థం కావాలంటే, ఏ అంశంతో మొదలుపెట్టాలో అలా మొదలుపెట్టి, ఏ క్రమంలో వెళ్ళాలో అలా వెళ్ళాలి. ఆ శాస్త్రంలో వున్న అంశాల్ని బోధించడంలో ఒక క్రమాన్ని పాటించాలి. ఆ పద్ధతి వల్లనే ఆ శాస్త్రాన్ని వివరించ గలుగుతారు. మార్క్సు అదే పద్ధతిని పాటించాడు.

ఏ సైన్సు అయినా, సునాయాసంగా చదువుకు పోయే కథ లాంటిది కాదు. కథ లాగ, సైన్సు, 'అరిటి పండు వొలిచి చేతిలో పెట్టినట్టు' వుండదు. ఒక దానితో ఒకటి అల్లుకుపోతూ, పరస్పర సంబంధాలు కలిగిన అసంఖ్యాకమైన నిజాల కూడికే — సైన్సు. ఒక సైన్సుని నేర్చుకోవాలంటే, దానిలో వున్న ప్రతీ అంశాన్నీ ముందు విడి విడిగా నేర్చుకోవాలి. తర్వాత అన్నిటినీ కలిపి మొత్తంగా నేర్చుకోవాలి. అన్ని అంశాల జ్ఞానాన్నీ కలుపుకునేటప్పుడు, అంతకు ముందు నేర్చుకున్న విడి విడి అంశాలు ఒక దానితో ఒకటి సర్దుబాటు చేసుకుంటాయి. అలా సర్దుబాట్లు చేసుకునేటప్పుడు, అంతకు ముందు నేర్చుకున్న అంశాలలో అవసరమైన మార్పులు జరుగుతాయి. అటువంటి మార్పులన్నీ జరిగి, సర్దుబాట్లు పూర్త యిన తర్వాత చివరికి నేర్చుకోవలసిన విషయం మొత్తం జ్ఞానంతో సాక్షాత్కరిస్తుంది. విడి విడి విష యాల్ని నేర్చుకోవలసిన ప్రారంభ సమయంలోనే, చిట్టచివరికి వెల్లడయ్యే మొత్తం జ్ఞానం తెలిసిపోవా లని ఆరాటపడి, అది మొదటే తెలియ లేదని అసంతృప్తి చెందడం 'మంచి' పాఠకుల లక్షణం కాదు.

అయితే, రచయిత ఏ విషయాన్ని ఎంత వరకూ నేర్పదల్చుకున్నాడో అంత వరకే నేర్చుకోదలిచినా కూడా, అది కూడా అర్థం కాని నిస్సహాయ స్థితిలో పడిపోతూ వుంటారు — 'కాపిటల్' పాఠకులు అనేక సార్లు. ఇంకా బాట లేర్పడని కీకారణ్యంలో నడవాల్సి వచ్చినప్పుడు దారి చూపించే నాయకుడు వున్నా కూడా, ఆయన వెంట నడిచే వాళ్ళకి, వాళ్ళ పాదాలతో వాళ్ళు, ఆ కీకారణ్యంలో నడవడం చెప్పలేనంత కష్టంగా వుంటుంది. అనుచరుల్ని ఇబ్బంది లేకుండా తన వెంట తీసుకెళ్ళడానికి ఆ నాయకుడు ఏమీ చెయ్యలేడు. పది మందీ అదే దారిన నడిచి, ఆ కష్ట భూయిష్టమైన దారుల్ని నునుపు చేస్తే తప్ప, నాయకు డొక్కడూ ఒక్క సారి నడిచి ఒక్క ప్రయత్నంతో ఆ మార్గాన్ని తీర్చిదిద్దలేడు.

మార్క్సు ప్రధానంగా తన దృష్టినంతా పెట్టుబడి దారీ ఆర్థిక వేత్తలతో చేసే సిద్ధాంత పోరాటం పైనే పెట్టుకున్నట్టు కనపడుతుంది. అందుకే అది, ఆర్థిక శాస్త్రంతో పరిచయం లేని వాళ్ళకి అర్థమయ్యే విషయం కానట్టు వుంటుంది.

ఆయన 'రాత ప్రతి' తయారుచేసిన తర్వాత, ఆయన మిత్రులు, దాన్ని చూసి, 'ఇంకా తేలిగ్గా వుండాల'ని సలహాలిస్తూ వుండేవారు. ప్రెస్ నించి వచ్చిన ప్రూఫులు దిద్దేటప్పుడు కూడా ఆయన విషయాల్ని ఇంకా తేలిక చెయ్యడానికి ప్రయత్నిస్తూ వుండేవాడు.

మార్క్సు జీవించి వుండగా, కాపిటల్ మొదటి సంపుటం, జర్మన్ భాషలో 2 ముద్రణలూ, ఫ్రెంచిలో ఒక ముద్రణా, వచ్చాయి. రష్యన్ భాషలోకి అనువాదం వచ్చింది. ఎంగెల్స్ వుండగా, జర్మన్‌లో 3 వ ముద్రణా, ఇంగ్లీషులో మొదటి ముద్రణా వచ్చాయి. వీటిలో ఏ రెండు ముద్రణలూ ఒక దానిలా ఒకటి లేవు. ఎంగెల్స్ వున్న కాలం లోనే 'కాపిటల్'లో 2 వ సంపుటం 1885 లోనూ, 3 వ సంపుటం 1894 లోనూ, జర్మన్‌లో, వచ్చాయి. చివరి భాగం అయిన 'అదనపు విలువ సిద్ధాంతాలు' సంపుటం, ఎంగెల్స్ వున్నప్పుడు అయినా రాలేదు. తర్వాత కాలంలో వచ్చింది.

జర్మన్ భాషలో కాపిటల్ మొదటి సారి రాగానే, అది స్పష్టంగా అర్థంకావడం లేదనే అభిప్రాయాలు రావడం వల్ల మార్క్సు దాన్ని రెండో ముద్రణ నాటికి కొన్ని మార్పులు చేశాడు. తర్వాత రెండో ముద్రణలో కూడా కొన్ని మార్పులుచేసి ఫ్రెంచి ముద్రణ కోసం ఇచ్చాడు. 1870 లో కాపిటల్‌ని రష్యన్ లోకి అనువాదం చెయ్యడానికి 'హెర్మెన్ లోపాతిన్' అనే ఆయన మార్క్స్‌తో మాట్లాడినప్పుడు మార్క్సు, 'సరుకులూ, డబ్బూ' అనే మొదటి భాగం ఇంకా సరళంగా రాయాలనుకుంటున్నానని చెప్పాడు. రష్యన్ అనువాదకుడు, ఆ మొదటి భాగం వొదిలేసి, రెండో భాగం నించీ అనువాదం ప్రారంభించాడు. కానీ, మార్క్సు అనుకున్న ప్రకారం మొదటి భాగాన్ని తిరిగి మార్చి ఇవ్వలేకపోయాడు. చిన్న చిన్న మార్పులు మాత్రమే కొన్ని చేశాడు.

'కాపిటల్'లో ఏ యే అంశాల్ని కొత్తగా చేర్చాలీ, ఏ యే అంశాల్ని సరళం చెయ్యాలీ — అనే విషయాలతో మార్క్సు రాసి వుంచుకున్న నోట్సుని ఆధారం చేసుకుని, మార్క్సు మరణించిన తర్వాత, ఎంగెల్స్ 'కాపిటల్'ని జర్మన్‌లో 3 వ ముద్రణకు సిద్ధం చేసినప్పుడు, కొన్ని మార్పులు చేశాడు.

జర్మన్‌లో వచ్చిన 3 వ ముద్రణని బట్టే ఇంగ్లీషు అనువాదం జరిగింది. అంటే, దీని సారాంశమంతా ఏమిటంటే, ఎన్నో మార్పులు చేసి, ఎన్నో విషయాలలో సరళం చేసిన ఆ ఇంగ్లీషు ముద్రణ కూడా తలలు బద్దలు కొట్టుకోవలసినంత కఠినంగా ఉందన్నమాట! అది, 'విషయం'లో కఠినత్వం కాదు. దాన్ని చెప్పడంలోనే తేలిగ్గా చెప్పలేక పోవడం.

మార్క్సు జీవించివుండగా మొదటి సంపుటం మాత్రమే ప్రింటు అయింది. మిగిలిన వాటిని చిత్తు ప్రతులుగా మాత్రమే రాసి వుంచాడు. ఒక వేపు తీవ్రమైన అనారోగ్యం, ఇంకో వేపు రాత్రింబవళ్ళూ పనిచేసినా తరగనంత ఎక్కువ పనీ! అంత పని పెట్టుకుని, ఆ చెప్పే విషయాన్ని ఇంకా ఇంకా సరళంగా రాయడం అంటే, అది సాధ్యమయ్యే విషయం కాదు. ఆయనకి వున్న టైము చాలా తక్కువ. మొదటి సంపుటం కూడా పూర్తి చెయ్యకుండా చచ్చిపోతానేమోనని ఆయన చాలా భయపడేవాడు. సరళంగా రాసే పనితో ఆయన కొన్ని విషయాల మీదే ఎక్కువ సమయం ఖర్చు చేస్తే, ఆయన చెప్పవలసిందంతా చెప్పలేకపోయేవాడే.

ఒక శాస్త్రజ్ఞుడు తను చెప్పే విషయం ఎంత కఠినంగా చెప్పినా ఫర్వాలేదు. అందులో నిజంగా, 'నిజం' అనేది వుంటే, తర్వాత, దాన్ని తేలిక చేసుకునే మార్గాలు వుంటాయి. ఆ శాస్త్రం మీద కృషి చెయ్యగలవాళ్ళు ఆ పని తర్వాత చేస్తారు. అసలా శాస్త్రం కఠినమైన రూపంలో అయినా సమాజానికి అందకపోతే, సమాజం చాలా నష్టపోతుంది. చెప్పే విషయాలలో కఠినత్వం వల్ల అంత నష్టం లేదు.

ప్రతీ చిన్న విషయం లోనూ సహేతుకమైన విమర్శతో జరిగే మార్క్సు పరిశీలనా పద్ధతి, పాఠకుల్ని ముగ్ధుల్ని చేస్తుంది. కొన్ని వ్యక్తీకరణలు అర్థం కానప్పుడు ఆయన మీద 'కోపం' వచ్చినా, కొంత శ్రమ పడి వాటిని అర్థం చేసుకున్న తర్వాత, అవి ఎంతో అందంగా, గొప్ప స్థాయిగా కనపడతాయి. 'మార్క్సిజం' నేర్చుకోదలిచిన ప్రతీ వ్యక్తీ, ముందు 'కాపిటలే' చదవాలి. ఎందుకంటే, నేర్చుకోవలసిన విషయాల్ని 'అ ఆ'ల నించీ అందులోనే నేర్చుకోవాలి గనక.

**'కాపిటల్' మొదటి సంపుటానికి,**
**7 ముందు మాటలున్నాయి.**

వాటి నించి కొన్ని భాగాలు :

★ 1867 లో మొదటి జర్మన్ ముద్రణకు మార్క్సు రాసిన 'ముందు మాట' నించీ: "1859 లో వెలువడిన 'రాజకీయ ఆర్థిక శాస్త్రంపై ఒక విమర్శ' అనే నా రచన నకు కొనసాగింపే, ఈ కాపిటల్."

"ఆ రచనలో చెప్పిన విషయాలన్నిటినీ, ఈ పుస్తకంలో మొదటి మూడు చాప్టర్లలోనూ సారాంశంగా చెప్పాను. చెప్పిన పద్ధతిలో మెరుగుదల వుంది. ఆ పుస్తకంలో వివరంగా చెప్పని వాటిని ఇక్కడ వివరంగా చెప్పడమూ చేశాను."

"విలువ సారాంశాన్నీ, విలువ పరిణామాన్నీ పరిశీలించే సెక్షన్‌ని కూడా ఈ పుస్తకంలో సాధ్యమైనంత తేలిగ్గా చేశాను."

"నే నీ పుస్తకంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, ఆ ఉత్పత్తి జరిగే పరిస్థితుల్నీ, దానికి సంబంధించిన మారకాన్నీ పరిశీలించాల్సి వుంది. వాటికి పునాది వేళ్ళు ఇంగ్లాండులో వున్నాయి. ఆ కారణం చేతనే, నా సిద్ధాంత భావాల అభివృద్ధిలో, ఇంగ్లాండుని ఉదాహరణగా తీసుకున్నాను."

"సైన్సెస్‌లో, ప్రతీ సైన్సులోనూ, అసలు ప్రారంభమనేది కష్టమైన వ్యవహారం. ఈ సంపుటిలో మొదటి చాప్టరు — అందులోనూ సరుకుల పరిశీలన గురించిన సెక్షన్ వుందే — అది, కష్టంగా వుంటుంది."

"'విలువ రూపం' మీద వున్న సెక్షన్‌ని మినహాయించి, ఈ సంపుటిలో కష్టమైన దంటూ నన్ను నిందించడానికి ఏమీ లేదు. అయినా, <u>ఒక కొత్త విషయాన్ని నేర్చుకోవడం కోసం, తనకు తను కూడా ఆలోచించడానికి ఇష్టపడే పాఠకుణ్ణి, నేను ఆశిస్తాను.</u> (ఐ ఎక్స్‌పెక్ట్)."

★ 1872 లో ఫ్రెంచి ముద్రణకి మార్క్సు రాసిన 'ముందు మాట' నించీ: ('కాపిటల్'ని ఫ్రాన్స్‌లో సీరియల్‌గా వేశారు. సీరియల్‌గా వెయ్యడం వల్ల అది కార్మిక వర్గానికి ఎక్కువ సన్నిహితం అవుతుంది కాబట్టి అది తనకు సంతోషమేననీ; కానీ, ఒక్కొక్క విషయాన్నీ పరిశీలిస్తూ విషయాల మధ్య అంతర్గత సంబంధాల్ని చూపిస్తూ వెళ్ళే తన పరిశీలనా పద్ధతి వల్ల, చివరి సారాంశం తొందరగా తెలీక, సీరియల్ వల్ల విషయాలు త్వర త్వరగా కదలక, పాఠకులు అసంతృప్తి చెందుతారనీ, అంటాడు మార్క్సు).

"ఈ పరిశీలనా పద్ధతి వల్ల అననుకూలత ఇదే. కానీ, దీన్ని నేను అధిగమించలేను. సత్యాన్వేషకులైన పాఠకుల్ని ముందుగా హెచ్చరించడమూ, వారిని సాయుధుల్ని చెయ్యడమూ తప్ప, నే నేమీ చెయ్యలేను. సైన్సుకి రాజ మార్గం లేదు. ఎగుడు దిగుళ్ళుగా,

అలవగొట్టే కఠినమైన దారుల గుండా ప్రయాణించ డానికి సాహసించే వారికే, వెలుగు నిచ్చే శిఖరాలను చూసే అవకాశం ఉంటుంది."

★ 1873 లో రెండో జర్మన్ ముద్రణకు మార్క్స్ రాసిన 'ముందు మాట' నించీ: " మొదటి ముద్రణ చదివిన పాఠకులకు, రెండో ముద్రణలో చాలా మార్పులు చేశానని చెప్పవలసి వుంది."

"1867 లో నా మిత్రుడు కుగల్‌మన్, 'విలువ రూపాన్ని అర్థం చేసుకోవాలంటే చాలా మంది పాఠకు లకు ఇంకా ఎక్కువ తేలికైన వివరణలు అవసరం' అన్నాడు."

" 'సరుకుల చలామణీ' చాప్టరులో, విలువ కొలత గురించి జాగ్రత్తగా తిరిగి రాశాను. ఎందుకంటే, మొదటి ముద్రణలో దాని మీద తగినంత శ్రద్ధ పెట్టకుండా రాశాను."

" 'సరుకుల మాయ' — చాప్టర్‌ని, చాలా మార్చాను."

"జర్మన్ కార్మిక వర్గంలో విశాలమైన పరిధిలో 'కాపిటల్' మెప్పు పొందడం, నేను పడ్డ శ్రమకు గొప్ప బహుమానం."

"జర్మన్ పెట్టుబడిదారీ వర్గానికి భావ ప్రతి నిధులుగా వున్న మేధావులూ, సామాన్యులూ 'కాపిటల్' ని తమ మౌనంతో, నిశ్శబ్దంతో చంపాలని మొదట ప్రయత్నం చేశారు. గతంలో, నా తొలి రచనల విషయంలో అలా చెయ్యగలిగారు గానీ, ఈ మారిన కాలానికి ఆ ఎత్తులు సరిపోవని, నా పుస్తకాన్ని విమర్శించే పేరుతో, దాని మీద రాతలు మొదలు పెట్టారు."

★ 1883 లో 3 వ జర్మన్ ముద్రణకు ఎంగెల్స్ రాసిన 'ముందు మాట' నించీ: " మార్క్స్, మొదటి సంపుటంలో వున్న విషయాల్ని ఎన్నింటినో తిరిగి మరింత స్పష్టంగా సరళంగా రాయాలనీ, కొత్త చారి త్రక విషయాల్నీ, స్టాటిస్టికల్ విషయాల్నీ జతపర్చాలనీ, అనుకున్నాడు. కానీ, అతని అనారోగ్యమూ, రెండో సంపుటాన్ని తయారుచేసే పనీ, ఈ పనిని మాను కునేలా చేశాయి."

★ 1886 లో ఇంగ్లీషు ముద్రణకు ఎంగెల్స్ రాసిన 'ముందు మాట' నించీ: " కాపిటల్ లో వున్న సిద్ధాం తాన్ని గత కొన్నేళ్ళుగా ఎంత గానో చర్చించారు; ఖండించారు; సమర్థించారు; సరిగా అర్థం చేసు కున్నారు; తప్పుగా అర్థం చేసుకున్నారు. ఇంగ్లండు లోనూ, అమెరికా లోనూ పత్రికలూ, పుస్తకాలూ, ఈ పని చేశాయి."

"ఇంగ్లండు పరిస్థితినీ, ఆర్థిక చరిత్రనీ, జీవి తాంతం అధ్యయనం చేసిన దాని ఫలితమే మార్క్స్ సిద్ధాంతం."

★ 30–4–1867 న మార్క్స్, సిగ్‌ఫ్రెడ్ మేయర్ అనే మిత్రుడికి రాస్తూ, " ఇప్పటి వరకూ నీ కెందుకు జవాబు రాయలేదంటే, నేను నిరంతరం సమాధికి దగ్గరౌతూ దాని అంచున వేళ్ళాడుతున్నాను. నా పుస్తకాన్ని పూర్తి చెయ్యాలంటే ప్రతీ క్షణాన్నీ వినియోగించుకోవాలి. ఈ పుస్తకం రాయడం కోసం నా ఆరోగ్యాన్నీ, కుటుంబాన్నీ, అన్నిటినీ వొదులు కున్నాను. ఈ పుస్తకాన్ని కనీసం రాత ప్రతిగానైనా పూర్తి చెయ్యకుండా చచ్చిపోతే, నిజంగా నేను చాలా పనికిమాలిన వాడినవుతాను."

★ 'కాపిటల్' కి రష్యాలో అనువాదాన్ని ప్రచురిస్తున్నప్పుడు, దాన్ని అనుమతించాలా లేదా అనే విషయంపై జారు ప్రభుత్వంలోని ఒక సెన్సారు అధికారి: " రష్యాలో ఈ పుస్తకం చదవగల వాళ్ళే తక్కువ; దాన్ని అర్థం చేసుకునే మాట దేవుడెరుగు."

★ మార్క్స్ గురించి స్మృతులు రాస్తూ పాల్ లాఫార్గ్: " మార్క్స్ అప్పుడు అనారోగ్యంగా వుండి నాడు (1865 లో). 'పెట్టుబడి' మొదటి భాగం కోసం కృషిచేస్తూ వుండినాడు. తన కృషిని పూర్తి చేయలేనని భయం వుండింది ఆయనకు. ............ భౌతికమైన వస్తువుగా వుండే 'సరుకు', పెట్టుబడిదారీ సంపద యొక్క లక్షణం. మార్క్స్ ఇప్పుడు సరుకుని తీసికొని, దాన్ని ఇటు తిప్పీ అటు తిప్పీ, లోపలిది పైకీ, పైది లోపలికీ తిప్పీ, దాని రహస్యాలు ఒక్కొక్కటే బయటికి లాగుతాడు. ఆ రహస్యాలు 'అధికారిక అర్థ శాస్త్రవేత్తలకు' బొత్తిగా తెలియనివి. ఆ సరుకు యొక్క సకల పార్శ్వాలనూ పరిశీలించిన తర్వాత, మార్క్స్, మారకంలో ఆ సరుకుకి, దాని తోటి సరుకులతో గల సంబంధాలను పరిశీలిస్తాడు. తరువాత ఆయన, దాని ఉత్పత్తినీ, దాని ఉత్పత్తికి కావలసిన చారిత్రక పూర్వాపరాలనూ, పరిశీలించడానికి పోతాడు. సరు కులు ధరించే రూపాలను ఆయన పరిశీలించి, అవి ఒక రూపం నుండి మరొక రూపానికి ఎలా మారేదీ, ఒక రూపం నుండి మరొక రూపం ఎలా విధిగా వుత్పన్న మయ్యేదీ, వెల్లడిస్తాడు. ఘటనల అభివృద్ధిలోని తార్కిక గతిని ఆయన ఎంత సర్వ సమగ్రమైన నేర్పుతో వివరిస్తాడంటే, అదంతా ఆయన స్వ కపోల

కల్పన అని ఎవరైనా అనుకోవచ్చు. కానీ, అది వాస్తవం నుండి పుట్టింది" ("మార్క్స్, ఎంగెల్స్‌ల గురించిన స్మృతులు" నించీ ).

★ విల్ హెల్మ్ లీబ్‌క్నెష్ట్ మార్క్సు 'శైలి' గురించి రాస్తూ: " 'శైలి అంటే వ్యక్తి' అనే సూక్తి ఎవరి విషయంలోనైనా నిజమైతే అది మార్క్సు విషయంలోనే. మార్క్సు శైలి, నిజంగా మార్క్సే!.... తక్కువ స్థలంలో వీలైనంత ఎక్కువ విషయాల్ని ఇరికించడానికి ప్రయత్నిస్తాడని ఆయన మీద నింద వుంది. మరి సరిగ్గా అదే మార్క్సు తత్వం. ....... 'పెట్టుబడి' పుస్తకం శైలిని అర్థం చేసుకోవటం కష్టమని ఒప్పుకోవాలి. కానీ అందులోని విషయం అర్థం చేసుకోవడం మాత్రం సులభమా? శైలి, మనిషి మాత్రమే కాదు; శైలి అనేది 'విషయం' కూడా! శైలి, విషయానికి అనుగుణంగా మారాలి. శాస్త్ర విజ్ఞానానికి రాచబాట లేదు. ప్రతి ఒక్కడూ శ్రమపడి ఎక్కవలసిందే, అత్యుత్తమమైన నాయకుడు వున్నప్పటికీ. 'పెట్టుబడి శైలి - కష్టమని గానీ, దుర్గ్రాహ్యమని గానీ, చివరికి బరువని గానీ, ఫిర్యాదు చేయడమంటే, మన మానసిక సోమరితనాన్నీ, ఆలోచించడం చేతగాక పోవడాన్నీ, ఒప్పుకోవడమే."

మార్క్సు ఎప్పుడూ, " దుష్టుడి దురాలోచనకు కూడా స్వర్గం లోని అద్భుతాలను మించిన ఔన్నత్యం ఉంది" అనే హెగెల్ మాటల్ని ఇష్టంగా అంటూ ఉండేవాడట. ఆలోచన అనేది, అసలు లేకపోవడం కన్నా, అది ఉండి, అది 'దురాలోచన'గా ఉన్నా మంచిదేనట! మానవులు ఆలోచించడంలో అంత ఔన్నత్యం ఉందన్నమాట!

# మార్క్సు జీవిత చరిత్ర

పుట్టింది 1818 మే 5న, ట్రియర్‌లో (జర్మనీ). బెర్లిన్ విశ్వ విద్యాలయంలో చరిత్రా, తత్వ శాస్త్రం, న్యాయ శాస్త్రం చదివాడు. నిరీశ్వరవాది అయిన గ్రీకు తత్వవేత్త ఎపిక్యూరస్ మీద పిహెచ్.డి. చేశాడు. 1841లో చదువు ముగిసేటప్పటికి మార్క్స్, హెగెలియన్ భావ వాది. బోన్ నగరపు విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచెయ్యాలని వెళ్ళి, అక్కడ ప్రగతి వ్యతిరేక కార్యకలాపాలు చూసి ఆ విశ్వ విద్యాలయంలో ఉద్యోగం చేసే అభిప్రాయం మార్చుకున్నాడు.

1841 తర్వాత, లుడ్విగ్ ఫోయెర్‌బాఖ్ అనే భౌతిక వాది రచనల ప్రభావంతో, మార్క్స్, భౌతిక వాది అయ్యాడు.

1842లో మార్క్స్ ఒక 'తీవ్ర వాద' పత్రికకు సంపాదకుడిగా పని చేశాడు. మార్క్సు సంపాదకత్వంలో, ఆ పత్రిక విప్లవ ధోరణి, అంత కంతకూ తీవ్రమైంది. జర్మన్ ప్రభుత్వం, దాని మీద కఠినమైన నిబంధనలు విధించింది. దానికి నిరసనగా మార్క్సు ఆ పత్రిక సంపాదకత్వానికి రాజీనామా చేశాడు. అయినా, ప్రభుత్వం ఆ పత్రికని నిషేధించింది. ఆ పత్రికలో పని చేసిన కాలంలో — తనకు 'ఆర్థిక శాస్త్రం'తో తగినంత పరిచయం లేదనే విషయాన్ని గ్రహించుకుని, మార్క్సు, ఆర్థిక శాస్త్రం చదవడం ప్రారంభించాడు.

1843 లో, జెన్నీతో మార్క్స్‌కి ప్రేమ వివాహం.

తర్వాత — దేశం బయటి నుంచి ఒక తీవ్ర వాద పత్రిక నడపాలని రూగే అనే హెగెలియన్‌తో కలిసి పారిస్ నగరానికి (ఫ్రాన్స్ దేశం) వెళ్ళి ఒక పత్రిక ప్రారంభించాడు. దాన్ని జర్మనీలో రహస్యంగా పంపకం చేయడం సాధ్యం కాకపోవడం వల్లా, రూగేతో అభిప్రాయ భేదాల వల్లా, ఆ పత్రిక ఆగిపోయింది.

1844 సెప్టెంబరులో ఎంగెల్సు పారిస్ వచ్చి మొట్ట మొదటి సారిగా మార్క్సుని కలిశాడు. ఎంగెల్స్ కూడా హెగెలియన్ భావ వాదం మీదుగా భౌతిక వాదం వేపు వచ్చిన వ్యక్తే. అనేక విషయాలలో మార్క్సుకీ, ఎంగెల్స్‌కీ అభిప్రాయాలు కలిశాయి. వాటి తీవ్రత్వం కూడా సరిపడింది. ఆ విధంగా మిత్రులైన ఆ ఇద్దరూ జీవితాంతం మిత్రులుగా, విప్లవకర రచయితలుగా, కార్మిక వర్గ ఉద్యమ నాయకులుగా వున్నారు. వాళ్ళిద్దరూ పారిస్ లోని విప్లవ బృందాల ఉద్యమాలలో అతి చురుగ్గా పాల్గొన్నారు. తప్పుడు అవగాహన నిచ్చే తప్పుడు సోషలిస్టు సిద్ధాంతాలతో పోరాడుతూ, 'విప్లవ కార్మిక వర్గ సోషలిజం' సిద్ధాంతాన్నీ, కార్యక్రమాన్నీ తయారుచేశారు.

'ప్రమాదకర' విప్లవకారుడైన మార్క్సుని దేశం నించి బహిష్కరించమని, జర్మనీ ప్రభుత్వం, ఫ్రాన్సు ప్రభుత్వాన్ని అడిగింది. 1845 లో ఫ్రాన్సు ప్రభుత్వం మార్క్సుని దేశం నించి బహిష్కరించింది. మార్క్సు ఫ్రాన్సు దేశానికి సరిహద్దు దేశమైన 'బెల్జియం'లో

బ్రస్సెల్స్ నగరానికి వెళ్ళాడు. ఎంగెల్స్ కూడా అక్కడికి చేరాడు. అక్కడ వాళ్ళిద్దరూ "కమ్యూనిస్టు కరస్పాండెన్సు కమిటీ" అనే సంస్థ స్థాపించి, ఇతర దేశాల సోషలిస్టులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం ప్రారంభించారు. అప్పటికే ఇంగ్లండులోనూ, ఫ్రాన్సులోనూ, 'లీగ్ ఆఫ్ జస్ట్' అనే పేరుతో అశాస్త్రీయ సోషలిస్టు భావాలు గల సభ్యుల సంస్థ ఒకటి వుంది. క్రమంగా, ఊహాజనిత సోషలిస్టులెందరో మార్క్సు ప్రతిపాదించే శాస్త్రీయ సోషలిజం వేపు ఆకర్షితులయ్యారు. 1847 లో 'కమ్యూనిస్టు లీగ్' అనే పేరుతో పాత సోషలిస్టు సంస్థలు ఏకమయ్యాయి. ఈ కొత్త సంస్థకు మార్గ దర్శకత్వాన్నిచ్చేది శాస్త్రీయ సోషలిజమే. శ్రామిక వర్గ దృక్పథమే, దాని దృక్పథం. ఈ సంస్థ, 'కమ్యూనిస్టు ప్రణాళిక'ని తయారుచేసే బాధ్యత మార్క్సు, ఎంగెల్సుల మీద పెట్టింది.

ఆ ప్రణాళిక 1848 ఫిబ్రవరిలో వెలువడింది. అది — భౌతిక వాదాన్ని సమగ్రం చేసి, ఎటువంటి మినహాయింపులూ లేని భౌతిక వాదాన్ని, (గతితార్కిక భౌతిక వాదాన్ని) వెల్లడి చేసింది. అదే దృక్పథాన్ని సమాజ జీవితానికి కూడా అన్వయింపజేసే 'చారిత్రక భౌతిక వాదాన్ని' కూడా ఆ ప్రణాళిక వెల్లడించింది. నూతన ప్రపంచ దృక్పథాన్ని అది చిత్రించింది.

1848 లో ఫ్రాన్స్‌లో బూర్జువా రాచరికం మీదా, జర్మనీలో ఫ్యూడల్ రాచరికం మీదా, ప్రజలు తిరుగుబాట్లు చేసి తాత్కాలిక విజయాలు సాధించారు. ఆ సందర్భంలో మార్క్సుని బెల్జియం ప్రభుత్వం, దేశం నించి బహిష్కరించింది. ఫ్రాన్స్‌లో తాత్కాలికంగా గెలుపొందిన రిపబ్లిక్ ప్రభుత్వం, మార్క్సుని ఫ్రాన్సుకి ఆహ్వానించింది. మార్క్సు మొదట ఫ్రాన్సు వెళ్ళి, తర్వాత జర్మనీకి వెళ్ళి, అక్కడ ప్రజల పోరాటాలకు సహాయంగా ఒక పత్రిక నడిపాడు కొన్ని నెలలు.

జర్మనీలో ఫ్యూడల్ రాచరికంపై జరిగిన విప్లవం ఓడిపోయిన తర్వాత, జర్మనీ ప్రభుత్వం, మార్క్సుని జర్మనీ నించి బహిష్కరించింది. మార్క్సు ఫ్రాన్స్ వెళ్ళాడు. అక్కడ కూడా తాత్కాలిక విప్లవ ప్రభుత్వం ఓడిపోయి ఫ్రాన్స్ ప్రభుత్వం మార్క్సుని ఫ్రాన్స్ నించి బహిష్కరించింది. మార్క్సు లండన్ వెళ్ళాడు. అప్పటి నించీ, జీవితమంతా అక్కడే వున్నాడు. లండన్‌లో మార్క్సు ఆర్థిక శాస్త్ర అధ్యయనం చేస్తూ, 1859 లో 'ఆర్థిక శాస్త్ర విమర్శ' రాసి, తర్వాత 'పెట్టుబడి' పనిలో చివరి వరకూ కృషి చేశాడు.

1864 లో — అంతర్జాతీయ కార్మిక సంస్థ (మొదటి ఇంటర్ నేషనల్) స్థాపనలో ముఖ్య పాత్ర వహించాడు. అది సమస్త దేశాలలోనూ కార్మికోద్యమాలు పెంపొందడానికి తోడ్పడింది. నిరంతరం ఇంటర్నేషనల్ పనుల తోనూ, 'కాపిటల్' పని తోనూ, ఆయన ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. 64 సంవత్సరాల వయసులో — 1883 లో మార్చి 14 న, ఆయన మరణించాడు.

★ "మార్చి 14 వ తేదీ నాడు, సాయంత్రం రెండు ముప్పావు గంటలకు, ఈ నాటి అత్యంత గొప్ప ఆలోచనాపరుడు, ఆలోచించడం మానుకున్నాడు. ఆయన్ను ఒంటరిగా వదిలిపెట్టి రెండు నిమిషాలు కూడా సరిగా కాలేదు, మేము తిరిగివచ్చి చూసే టప్పటికి ఆయన కుర్చీలో ప్రశాంతంగా నిద్ర పోతున్నాడు, కానీ శాశ్వత నిద్ర! ఈ వ్యక్తి మరణంతో యూరప్, అమెరికాల సమర శీల కార్మిక వర్గమూ, చారిత్రక శాస్త్రమూ, అగణితమైన నష్టం పొందినాయి. యూరప్ అమెరికాలలోని సకల భాగాలలోనూ వున్న లక్షోప లక్షల సహ కార్మికుల చేత ప్రేమించబడి, పూజించబడి, వాళ్ళకు దుఃఖం కలిగిస్తూ ఆయన మరణించినాడు." —ఎంగెల్స్ (...... స్మృతులు)

★ "'పెట్టుబడి' సకల దేశాలలోనూ సోషలిస్టులకు చేతి పుస్తకం అయింది. సకల సోషలిస్టు, కార్మిక వర్గ పత్రికలూ, దాని శాస్త్రీయ సిద్ధాంతాలను ప్రచారం చేసినాయి. న్యూయార్క్‌లో జరిగిన ఒక పెద్ద సమ్మెలో కార్మికులలో ఓర్పు కల్గించడానికీ, వాళ్ళ కోరికలు ఎంత న్యాయమైనవో వాళ్ళకు చూపించడానికీ, 'పెట్టుబడి'లో నుంచి కొన్ని భాగాలు కర పత్రాల రూపంలో ప్రచురించ బడినాయి."

— ఫాల్ లా ఫార్గ్ (...... స్మృతులు)

**' కాపిటల్ ' చదవడం అంటే, ఏదో కాలక్షేపంగా, అర కొరగా చదవడం కాదు.**

**కార్మిక ప్రజలు, తమ విముక్తి మార్గాన్ని తెలుసుకోవాలనే బాధ్యతతో చదవాలి.**

**మార్క్సిజాన్ని తెలుసుకోవడానికి ప్రధాన మార్గం, ' కాపిటల్ ' చదవడమే.** ★

# 'కాపిటల్ - పరిచయం' గురించి

[ ఈ మొదటి సంపుటానికి, మొదటి ముద్రణ సమయంలో రాసిన దానిలోనే, చిన్న చిన్న మార్పులూ చేర్పులూ చేసినది ఇది ]

ఇది, 'అనువాదం' కాదు, పరిచయం.

'అనువాదం' అంటే, ఒక భాషలో ఉన్న వాక్యాన్ని ఇంకో భాషలోకి మార్చడం. అనువాదం చేసే వ్యక్తి, ఆ పనిలో, ఏ మాత్రమూ స్వతంత్రత తీసుకోకూడదు. ఒరిజినల్ రచనని యధాతథంగా అదే వరసలో ఉంచాలి. ఎక్కడా ఒక్క వాక్యాన్ని గానీ, ఒక్క మాటని గానీ మార్చకూడదు. ఒరిజినల్ వాక్యంలో పది మాటలు ఉంటే అనువాద వాక్యంలో కూడా ఆ పది మాటలూ ఉండితీరాలి. (కొన్ని సందర్భాల్లో చిన్న చిన్న మార్పులు వుంటే వుండవచ్చు.) ఒరిజినల్ శైలిని అనువాదంలో ఏ మాత్రమూ మార్చకూడదు.

కానీ, 'పరిచయం' అంటే, ఆ నిబంధనలన్నీ అక్కరలేదు. మొదట ఒరిజినల్‌ని చదివి, అర్థం చేసుకుని, అందులో ఉన్న విషయాల్ని మన మాటలతో 'కొంచెం స్వతంత్రంగా' చెప్పవచ్చు. అవసరమైతే కొన్ని చోట్ల ఇంకా వివరంగా పెంచవచ్చు; కొన్ని చోట్ల చాలా తగ్గించవచ్చు. వాక్యాల్నీ పేరాల్నీ ఇటూ అటూ మార్చవచ్చు. దీని లక్ష్యం అంతా ఒరిజినల్‌లో ఉన్న విషయాల్ని, వీలైనంత వరకూ ఒరిజినల్ పద్ధతిలోనే ఉంచుతూ, పాఠకులకు క్లుప్తంగా పరిచయం చెయ్యడమే.

'కాపిటల్—పరిచయం' అనేది, ఈ రెండో పద్ధతిలో జరిగిన పరిచయమే. ఇది ఒరిజినల్‌కి 'యధాతథమైన' అనువాదం కాదు.

అలా అని ఇది ఒరిజినల్ నించి ఎక్కడా భిన్నమైనది కాదు. ఇందులో వున్న చాప్టర్లూ, ఆ చాప్టర్లలో వున్న విషయాలూ అన్నీ, ఒరిజినల్‌లో వున్నవే. అంతే కాదు, అవి ఒరిజినల్‌లో ఏ వరసలో వున్నాయో ఇందులో కూడా ఆ వరసలోనే వున్నాయి. ఒరిజినల్‌ని తేలికగా అర్థమయ్యే లాగ చెయ్యడానికే ఈ ప్రయత్నం.

'పరిచయం'లో 'సరుకులూ—డబ్బూ' అనే మొట్ట మొదటి భాగం, 1978లో వచ్చింది. తర్వాత, 2 వ, 3 వ, 4 వ భాగాలు, 1987లో ఒకే సారి వచ్చాయి. తర్వాత, 1993లో 5వ భాగం వచ్చింది. దానితో, 'కాపిటల్—పరిచయం' పని, అప్పటికి ముగిసింది.

కానీ, నిజానికి ఈ పని ఇంకా ఇంకా సాగుతూనే వుంది. ప్రతీ భాగాన్నీ ప్రతీ రీప్రింటు సమయంలోనూ మళ్ళీ మళ్ళీ మారుస్తూనే, అక్కడక్కడా సవరిస్తూనే ఉన్నాను ఇప్పటి దాకా.

ఈ పరిచయం పని నే నెలా చెయ్యగలిగానంటే, మార్క్స్ ఒరిజినల్‌కి నేనూ గాంధీ కలిసి మొదట తెలుగులోకి చాలా క్లుప్తంగా అనువాదం చేసుకున్నాం. అది, 100 పేజీల 60 నోట్ బుక్స్‌లోకి వచ్చింది. ఆ అనువాదాన్ని నేను మళ్ళీ మళ్ళీ చదువుతూ పరిచయం పని మొదలుపెట్టాను. అనువాదంలో ఎక్కడైనా స్పష్టత లేదనిపించినప్పుడల్లా, మళ్ళీ ఒరిజినల్‌ని చూస్తూ, అనువాదాన్ని సరిచేస్తూ. అనువాదం పనే అనేక సంవత్సరాలు పట్టింది. 'పరిచయం' పని ఈ నాటి దాకా కూడా జరిగింది.

ప్రారంభంలో 5 పుస్తకాలుగా వున్న ఈ పరిచయం, తర్వాత 2 సంపుటాలుగా అయింది ( 1 వ, 2 వ, 3 వ పుస్తకాలు, మొదటి సంపుటంగానూ ; 4 వ, 5 వ పుస్తకాలు, 2 వ సంపుటంగానూ ).

మొదటి సంపుటం, 2004 మార్చిలోనూ ; 2 వ సంపుటం 2006 డిసెంబరులోనూ వచ్చాయి.

మొదటి సంపుటానికి ఇది 2 వ ముద్రణ. ఈ ముద్రణలో చేసిన మార్పులతో, ఈ సంపుటం పని పూర్తిగా ముగిసింది. 2 వ సంపుటం పని, దాని మొదటి ముద్రణ సమయంలోనే ముగిసింది. ఇప్పటికి ఈ 2 సంపుటాల గురించీ సంతృప్తిగా వున్నాను.

విషయాల్ని చెప్పడానికి మార్క్స్, ఒరిజినల్‌లో, ఎలాంటి చర్చనీ, తార్కిక క్రమాన్నీ పాటించాడో వాటిని నేను పరిచయంలో కూడా అలాగే పాటించడానికి ప్రయత్నించాను. 'కాపిటల్' రచన, మొదట ఉపయోగపు విలువా, మారకం విలువా అనే అంశాలతో ప్రారంభమై, చివరికి 'వర్గాల'తో ముగుస్తుంది. ఇది పూర్తిగా సరైన వరస. కాబట్టి, 'పరిచయం'లో కూడా అదే వరసని పాటించాను. అక్కడక్కడా కొన్ని తేడాలు వున్నా, అవి, విషయాల్ని తేలిగ్గా చెప్పడం

కోసం చేసిన మార్పులే.

ఈ పరిచయం పని ప్రారంభించే ముందు, 'ఇది ఎవరి కోసం' అని ఆలోచించినప్పుడు, తక్కువగా చదువుకున్నవారినీ, అసలు చదువే లేని వారినీ, నా దృష్టిలో పెట్టుకున్నాను. అలాంటి కార్మికుల కోసమే దీన్ని తయారుచెయ్యాలి — అనుకున్నాను.

పుస్తకాలు కొంచెం చదవడం తెలిసిన స్త్రీ గానీ, పురుషుడు గానీ, పెద్దవాళ్ళు గానీ, విద్యార్థులు గానీ, ఈ పుస్తకం చదవడం 'మొదలు పెడితే' వారికి తేలిగ్గా అర్థమయ్యేలా ఇది వుండాలన్నదే నా అభిప్రాయం.

అలాగే, ఎవరన్నా ఒక చదువుకున్న వ్యక్తి, చదువు రాని పది మంది కార్మికుల్ని కూర్చోబెట్టి ఈ పుస్తకం చదివి వినిపిస్తూ వుంటే, వినే వాళ్ళకి, ఈ విషయాలన్నీ తేలిగ్గా అర్థమవుతూ వుండాలి.

'కాపిటల్' మొదటి భాగాన్ని మార్క్స్ తయారు చేసినప్పుడు ఆ రాత ప్రతి చదివిన స్నేహితులు గానీ, ప్రింటయిన తర్వాత చదివినవాళ్ళు గానీ, మార్క్సుని అనేక సార్లు హెచ్చరించారు — ఇంకా తేలిగ్గా అర్థ మయ్యే లాగ మళ్ళీ మళ్ళీ మార్చి రాయమని. ఆ సలహాల ప్రకారం మార్క్సు, అనేక చాప్టర్లు మళ్ళీ మళ్ళీ మార్చాడు కూడా. అయినప్పటికీ, ఆ చాప్టర్లని తగినంత తేలిగ్గా చెయ్యలేక పోయాడు, అది వేరే సంగతి.

ఈ 'పరిచయం' చదివే వ్యక్తి, దీన్ని అర్థం చేసుకోవ డానికి ఒక టీచరు దగ్గిరికో, బాగా చదువుకున్న వ్యక్తి దగ్గిరికో వెళ్ళవలసిన అవసరం లేకుండా, తనే స్వయంగా అర్థం చేసుకోగలిగేవిధంగా దీన్ని తయారు చెయ్యాలన్నదే మొదటి నించీ నా ఆలోచన. చదివిన భాగాలు అర్థమవుతూ వుండకపోతే, అలాంటి పుస్త కాన్ని ఎవరైనా ఆసక్తిగా ఎలా చదవగలుగుతారు?

చిన్న పిల్లల కోసం 'బాల సాహిత్యం' వుంటుందే, అలాగే ఇది, తక్కువ చదువుకున్న కార్మికుల కోసం!

కానీ, నిజానికి, ఒక కొత్త సైన్సుని నేర్చుకునే విషయంలో ఎంత మేధావులైనా, వాళ్ళు కూడా, మొదట సాధారణ పాఠకులతో సమానమే. ఎంత పెద్ద వాళ్ళయినా, వాళ్ళు కూడా చిన్న పిల్లలతో సమానమే. నేర్చుకోవలసిన కొత్త విషయాలు తేలిగ్గా వుంటే దాని వల్ల, మేధావులకు కూడా సుఖమే గానీ కష్టం ఏమీ వుండదు; తేలిగ్గా అర్థమయ్యే పుస్తకాలు చదవడం వల్ల, 'మేధావులకు' అవమానం ఏమీ జరగదు. కష్టంగా అర్థమయ్యేదాన్ని నేర్చుకోవడం కన్నా, తేలిగ్గా అర్థమయ్యేదాన్ని నేర్చుకోవడం, మేధావులు కూడా తక్కువ కాలంలోనే, తక్కువ శ్రమతోనే, చెయ్య గలరు. ఇది ఇష్టం లేని వారి కోసం, మార్క్సు ఒరిజినల్ రచన వుండనే వుంది.

**మార్క్సు 'కాపిటల్'కి 2 రకాల తెలుగు అనువాదాలు, ఈ నాడు అందుబాటులో వున్నాయి.**

(1) విజ్ఞాన వికాస సమితి వారూ, అరవిందా పబ్లిషర్స్‌వారూ (విజయవాడ) ప్రచురించిన 3 అను వాద సంపుటాలు.

(2) విశాలాంధ్ర విజ్ఞాన సమితి వారు (విజయవాడ) ప్రచురించిన 3 సంపుటాలు.

'కాపిటల్'కి ఎంత మంచి అనువాదం వున్నా, ఈ 'పరిచయం' లాంటి పని చాలా అవసరం. ఎందు కంటే, ఒరిజినల్ రచన తేలిగ్గా లేదు కాబట్టి, దానికి ఎంత మంచి అనువాదం వున్నా, ఆ అనువాదం కూడా తేలిగ్గా వుండదు. మొదట ఈ 'పరిచయం' చదివి, ఆ విషయాలతో పరిచయం చేసుకుని, అప్పుడు ఒరిజినల్ చదువుకోవచ్చు.

'పరిచయం' చదివినప్పుడు, అది ఎంత తేలిగ్గా అర్థమైనప్పటికీ, ఆ తర్వాత నలుగురైదుగురు కలిసి చదువుకుని, చర్చించుకోవడం వల్ల, విషయాలు ఇంకా స్పష్టంగా అర్థమవుతాయి.

ఈ పరిచయం, ఒరిజినల్ లాగ అంత ఇబ్బంది పెట్టదు. అయినప్పటికీ ఇది ఒక సైన్సు కాబట్టి, దీని సాంకేతిక పదాల తోటీ, దీని తర్కం తోటీ, దీని ఇబ్బందులు దీనికీ వుంటాయి. పాఠకులు, ఈ కష్టాన్ని ఓపిగ్గా, ఆనందంగా భరించవలిసిందే.

ఈ పరిచయం భాగాలన్నీ ఇప్పటికే కొన్ని ముద్ర ణలు పడ్డాయి. పాఠకులు చదువుతూనే వున్నారు. ఎన్ని సార్లు సర్దుళ్ళూ దిద్దుళ్ళూ చేస్తూ మార్చినా, ప్రతీ సారీ చదువుతూనే వున్నారు.

ఈ భాగాలన్నిటిలోనూ, ప్రతీ చాప్టరు చివరా 'ప్రశ్నలు' వున్నాయని పాఠకులకు తెలుసు.

**ఈ ముద్రణ నించీ, ఆ ప్రశ్నల దగ్గిర 'జవాబులు' కూడా వుంటాయి.**

ఒక చాప్టర్‌ని, శ్రద్ధగా చదివి అర్థం చేసుకుంటే, అందులో విషయాల మీద ఏ ప్రశ్నకైనా జవాబు తేలిగ్గా చెప్పకోవచ్చు. అది కష్టం కాదు. అవసరమైతే, ఆ చాప్టర్‌ని మళ్ళీ ఒక సారి చదివితే జవాబుని పట్టుకోవచ్చు. నిజానికి, ప్రశ్నలకు జవాబులు చెప్పకోవడం గానీ, రాసుకోవడం గానీ, చెయ్యవలసిన బాధ్యత పాఠకులదే. కాని, ఆ పాఠకులే 'జవాబులు కూడా కావాల'ని పదే పదే అడిగారు. అందుకే జవాబులు కూడా ఇవ్వడం గురించి ఆలోచించవలసి వచ్చింది.

చాప్టరు చివర, మొదట ప్రశ్నలన్నీ వరసగా ఇచ్చి, ఆ తర్వాత జవాబులన్నీ కూడా వరసగా ఇవ్వడమా; లేకపోతే, అన్ని చాప్టర్లకూ సంబంధించిన ప్రశ్నల్నీ జవాబుల్నీ కలిపి వేరే పుస్తకంగా ఇవ్వడమా? — ఇలా రక రకాల మార్గాలు కనపడ్డాయి. చివరికి, ప్రశ్న కిందే జవాబు వుండాలనే అభిప్రాయానికి వచ్చాను.

ఒక చాప్టర్‌ని చదివితే, అందులో విషయాల్ని మొదట ఒక సారి చదివినట్టు అవుతుంది. తర్వాత, ఆ చాప్టరు కింద వున్న 'ప్రశ్నలూ — జవాబులూ' కూడా చదివితే చాప్టరులో చదివిన విషయాలనే మళ్ళీ ఇంకో సారి క్లుప్తంగా చదివినట్టు అవుతుంది. దీని వల్ల ఉపయోగమే గానీ నష్టం ఏమీ వుండదు. ఇది పరీక్షా పత్రం కాదు. ప్రశ్న దగ్గిర జవాబు వుండరాదనే షరతు ఇక్కడ అక్కరలేదు.

అయితే, పాఠకులు ఒక జాగ్రత్త పాటించాలి. ఏమిటంటే — ఒక ప్రశ్నని చదవగానే దాని కింద వున్న జవాబుని చూడకూడదు. ఆ జవాబుని తామే స్వయంగా చెప్పకోవడానికి ప్రయత్నించాలి. అలా చెప్పకున్న జవాబు పుస్తకంలో ఇచ్చిన జవాబులాగే వుందో లేదో చూసుకోవాలి. ఏదైనా పొరపాటు వుంటే, తమ జవాబుని సవరించుకోవాలి.

**ఈ 'కాపిటల్ పరిచయా'నికి ఇప్పుడు ఇంగ్లీషులో కూడా యధాతథమైన అనువాదం వుంది. ఈ పరిచయానికి ఇంగ్లీషు అనువాదం, 1999 డిసెంబర్‌లో వచ్చింది. మార్క్స్ 'కాపిటల్' ఇంగ్లీషులోనే వున్నప్పటికీ, అది తేలిగ్గా అర్థమయ్యే పద్ధతిలో వుండదు కాబట్టి, ఇంగ్లీషు కార్మికులకు కూడా ఈ పరిచయం అవసరమని నా అభిప్రాయం. అన్ని భాషల కార్మికులకూ 'కాపిటల్' అత్య వసరమని వేరే చెప్పనక్కర లేదు.**

**ఈ 'పరిచయం' చదవడం పూర్తి అయ్యాక గానీ, మధ్యలోనే గానీ, మార్క్స్ రాసిన ఒరిజినల్‌ని తప్పకుండా చూడాలి. అది కష్టంగా వుండే మాట నిజమే గానీ, అన్ని చోట్లా అలాగే వుండదు. తేలిగ్గా అర్థమయ్యే భాగాలు కూడా చాలా వున్నాయి. అర్థం కాని చోట్ల వదిలేసి, అర్థమైన చోటల్లా చదువుకుంటూ వెళ్ళవచ్చు. దాని వల్ల కూడా అనేక విషయాలు తెలుస్తాయి. కార్మికులు 'కాపిటల్'లో విషయాలు తెలుసుకోవడం అంటే, తమ జీవితాల గురించి తెలుసుకోవడమే.**

18-5-2003

## ఇది, ఈ సంపుటానికి, 2 వ ముద్రణ సమయంలో రాసినది :

ఈ 2 వ ముద్రణ సమయంలో, 2 చోట్ల కొత్త మార్పులు జరిగాయి.

**1)** 1 వ భాగంలో, "ఉత్పత్తి సాధనాలు ఎవరివి?" అనే పేరుతో, ఒక కొత్త చాప్టరు చేరింది. దీని వల్ల, దాని తర్వాత చాప్టరులో కొన్ని మార్పులు జరిగాయి.

**2)** ఈ సంపుటంలో చిట్ట చివర, "ఇంత వరకూ చదివిన దాని సారాంశం" అనే పేరుతో ఒక చిన్న భాగం కొత్తగా చేరింది.

11-5-2008

# ప్రకృతీ, సమాజమూ

మనిషి, 2 కోణాలకు సంబంధించిన 'జ్ఞానం' నేర్చుకోవాలి.

1. 'ప్రకృతి'కి సంబంధించిన జ్ఞానం.

2. 'మానవ సమాజా'నికి సంబంధించిన జ్ఞానం.

**'ప్రకృతి'కి సంబంధించి నేర్చుకోవలిసింది :**

ఈ 'ప్రకృతి'కి ఒక 'సృష్టి కర్త' అనేవాడు, అంటే 'దేవుడు' అనే వాడు, వున్నాడా లేడా? ఈ 'ప్రకృతి' ఏమిటి? — అనే విషయం! దేవుడు వుండడమే నిజమైతే, అదే నేర్చుకుంటాం. దేవుడు ఈ ప్రకృతినంతా ఎలా సృష్టించాడో, అందులో మార్పులు ఎలా చేస్తున్నాడో, ఆ నిజాలన్నీ నేర్చుకుంటాం. లేదా, దేవుడు లేక పోవడమే నిజమైతే, అది నేర్చుకుంటాం. ఎవరూ సృష్టించకుండానే 'ప్రకృతి' ఎలా వచ్చిందో, అందులో మార్పులు ఎలా జరుగుతున్నాయో, ఆ నిజాలు నేర్చుకుంటాం. 'ప్రకృతి'కి సంబంధించిన నిజానిజాలు తెలుసుకోవాలంటే, 'దీనికి సృష్టి కర్త వున్నాడా లేడా' అనేదే ప్రధానమైన ప్రశ్న.

**'మానవ సమాజానికి' సంబంధించి నేర్చుకోవల సింది :** మానవులందరూ 'సమానులు'గా, 'ఒకే స్థితి'లో ఎందుకు లేరు? అంటే, మానవుల్లో కొందరు 'ధనికులు'గా, కొందరు 'పేదలు'గా, ఎందుకు వున్నారు? కొందరు 'యజమానులు'గా, కొందరు 'సేవకులు'గా ఎందుకు వున్నారు? ఈ రకంగా, మానవులు 'అసమానులు'గా ఎందుకు వున్నారు? — సమాజానికి సంబంధించిన నిజానిజాలు తెలుసుకోవాలంటే, 'ధనిక – పేద తేడా లెందుకు వున్నాయి' అనేదే ప్రధానమైన ప్రశ్న.

ప్రకృతి గురించీ, సమాజం గురించీ, ఏది సత్యమైతే అదే తెలుసుకోవాలి. ఆ సత్యాన్నే అనుసరించి జీవించాలి. సత్యమైన దాన్ని తెలుసుకోవడమే 'జ్ఞానం'. అసత్యమైనది అజ్ఞానం. అసత్యమైన దాన్నే సత్యమను కుంటూ వుంటే, ఆ మనిషి అజ్ఞానంలో వున్నాడని అర్థం. అజ్ఞానం, మనుషులకు అనేక సమస్యలు తెచ్చిపెడితే, జ్ఞానం ఆ సమస్యల్ని పరిష్కరిస్తుంది. మనుషులకు, తమ జీవిత మార్గాన్ని సుఖ శాంతులతో నిర్మించుకోవడం కోసమే 'సత్యం మీద ఆధారపడిన జ్ఞానం' అవసరం.

మానవ సమాజంలో పుట్టి పెరిగే ప్రతి మనిషికీ (స్త్రీ అయినా, పురుషుడైనా) కొంత వయసు వచ్చేటప్పటికి 'ప్రకృతి' గురించీ, 'సమాజం' గురించీ, ఏదో ఒక అభిప్రాయం ఏర్పడిపోతుంది. ఏ అభిప్రాయమూ లేని మనిషి ఎవరూ వుండరు.

ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా ఈ నాడు వున్న మనుషులనే తీసుకుంటే, ఈ మనుషుల్లో అత్యధికులు 'ప్రకృతి' విషయంలో, "దేవుడు వున్నాడ"ని భావిస్తారు. ప్రకృతిని దేవుడు సృష్టించాడనీ, ప్రకృతిలో మార్పులన్నీ దేవుడి ఇష్టాయిష్టాల ప్రకారమే జరుగుతూ వుంటా యనీ, భావిస్తారు.

అలాగే, ఈ మనుషుల్లో అనేక మంది, 'మనుషుల ధనిక – పేద తేడాల' గురించి ఇలా భావిస్తారు: "ధనవంతులందరికీ, ఆ ధనం వారి పెద్దల నించి సంక్రమించింది. లేదా, వారు 'స్వయంకృషి'తో సంపాదించారు. అలాంటి వారే 'ధనికులు' అవుతారు. వారు ధనికులు కాబట్టి, సేవకుల్ని పెట్టుకుని, వారు 'యజమానులు'గా వుంటారు. పెద్దల నించి ధనం పొందని వారూ, స్వయం కృషి లేని వారూ, పేదలు అవుతారు. పేదలు, 'సేవకులు'గా వుంటారు. అంతే గాక, 'అదృష్ట దురదృష్టాల' వల్ల కూడా మనుషులు ధనికులుగానో, పేదలుగానో అవుతూ వుంటారు." – ఇలా భావించేది, ధనికులు మాత్రమే కాదు, పేదలు కూడా!

ఒక విషయం గురించి మనుషులు ఏది 'అనుకుంటే' అదే సత్యం అవదు. మనుషులు రక రకాలుగా అనుకుంటే, సత్యం రక రకాలుగా వుండదు. సత్యం ఎప్పుడూ ఒకటే. మనుషులు అనుకుంటున్న దంతా సత్యమా, కాదా అనేది కావాలి. 'అనుకోవడమే' సత్యానికి రుజువు కాదు. సత్యం అనేది, వాస్తవ పరిస్థితులపై ఆధారపడిన, హేతుబద్ధమైన తర్కం తోటీ, పరిశోధన తోటీ రుజువవుతుంది. అలాంటి తార్కికమైన పరిశోధన లేకుండా, ఏ సత్యాన్నీ ఎవరూ

గ్రహించలేరు. కాబట్టి మన జ్ఞానాన్ని ఎప్పుడూ, 'తర్కమ'నే గీటు రాయి ముందు పరిశీలనకు పెట్టాలి.

'ప్రకృతి'కి సంబంధించిన ప్రశ్నలో, ఇక్కడ మనం చాలా క్లుప్తమైన జవాబు మాత్రమే చెప్పుకుంటాం. 'సృష్టి కర్త వున్నాడా, లేడా' అనే ప్రశ్నకి ఇక్కడ క్లుప్తమైన జవాబు — అలాంటి సృష్టి కర్త లెవ్వరూ లేరు – అనే. 'ప్రకృతి' అనేది, అనేక రకాల పదార్థాలతో కూడిన 'భౌతిక ప్రపంచం.' పదార్థానికి ఆదీ అంతమూ వుండవు. నాశనం వుండదు. అది, రక రకాల స్థితుల లోకి పరిణామం చెందుతూ, రూపాలు మారుతూ మాత్రమే వుంటుంది. పదార్థానికి పదార్థ ధర్మాలే గానీ, దాని 'అతీత ధర్మా లేవీ' వుండవు. కాబట్టి పదార్థంతో ఏర్పడిన ప్రకృతికి, ఆదీ అంతమూ వుండవు. అది ఎప్పుడూ వుంది! ఎప్పుడూ వుంటుంది! దానిని ఎవరూ సృష్టించలేదు!

'ప్రకృతి'కి అర్థం — 'సహజమైనది' అని. అంటే, మానవ ప్రమేయం లేకుండా ఏర్పడినది – అని. సహజమైన దాని ధర్మాలన్నీ సహజమైనవే. 'ప్రకృతి'కి సంబంధించిన విషయాల్ని పదార్థ శాస్త్రం, ఖగోళ శాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం, రసాయనిక శాస్త్రం, భూగర్భ శాస్త్రం – వంటి అనేక ప్రకృతి శాస్త్రాల ద్వారా (నేచురల్ సైన్సెస్ ద్వారా) తెలుసుకోగలం. ఆ శాస్త్రాలన్నిటి సారాంశమూ ఒకటే – దేవుడు లేడని. ఏ ప్రకృతి శాస్త్రం లోనూ 'దేవుడి పాత్ర' వుండదు.

సృష్టించే వాడు లేకుండా (సృష్టి కర్త లేకుండా) ప్రకృతి వుండడం అసాధ్యమైతే, ఆ సూత్రం ప్రకారం, ఆ 'సృష్టి కర్త'కి కూడా ఇంకో సృష్టి కర్త వుండవలసి వుంటుంది. అంతే కాదు, ఆ 'ఇంకో సృష్టి కర్త'ని సృష్టించడానికి కూడా ఇంకో సృష్టి కర్త! — ఇలా, ఎంత వెనక్కి పోయి ఏ సృష్టి కర్తని పట్టుకున్నా, ఆ సృష్టి కర్తకి కూడా ఇంకో సృష్టి కర్త వుండవలసిందే. ఈ పద్ధతిలో 'మొట్ట మొదటి సృష్టి కర్త'ని ఎప్పటికీ పట్టుకోలేం.

పోనీ, సృష్టి కర్తని గురించి ఇంకో రకంగా చెప్పుకుందామా? — "సృష్టి కర్త స్వయంభవుడు. అంటే, స్వయంగా ఉద్భవించగలవాడు. అతన్ని ఎవరూ సృష్టించనక్కరలేదు. ఒకప్పుడు 'ప్రకృతి' అనేదే లేదు. అలాంటప్పుడు, మహా మహిమాన్వితుడైన సృష్టి కర్త మొదట శూన్యం నించి తనని తను స్వయంగా సృష్టించుకున్నాడు. తర్వాత, శూన్యం నించే ప్రకృతి నంతా సృష్టించాడు. ఆ రకంగా సృష్టి కర్త సృష్టించడం వల్లనే ప్రకృతి అంతా వచ్చింది. లేకపోతే సృష్టించే వాడు లేకుండా ప్రకృతి ఎలా రాగలదు?" — ఎలా వుంది ఈ జవాబు?

ఈ పద్ధతిలో జవాబు చెప్పుకుంటే, అందులో ఏ మాత్రమూ 'హేతుబద్ధత' వుండదు. మొదట ఎక్కడా లేనివాడు, తనని తను సృష్టించుకోవడమూ, 'శూన్యం' నించి అన్ని రకాల పదార్థాల్నీ సృష్టించడమూ, హేతువుకి సరిపోని విషయాలు. అంటే, జరగడానికి సాధ్యం కాని విషయాలు. తనని సృష్టించే ఇంకో సృష్టి కర్తతో అవసరం లేకుండానే సృష్టి కర్త సృష్టి అవుతాడనీ, అప్పుడు శూన్యం నించి అన్ని రకాల పదార్థాలనూ సృష్టిస్తాడనీ భావించే వారికి, "సృష్టి కర్త లేకుండా ప్రకృతి ఎలా వచ్చింది?" అని ప్రశ్నించడానికి ఏ అర్హతా వుండదు. సృష్టించేవాడు లేకుండానే సృష్టి కర్త రావడం సాధ్యమైతే, సృష్టి కర్త లేకుండానే ప్రకృతి రావడం సాధ్యం కాకూడదా? సృష్టి కర్త స్వయంభవుడైతే, ప్రకృతే 'స్వయం భవు' కాకూడదా? అప్పుడు సృష్టి కర్త లేకుండానే ప్రకృతి రాగలదు కదా? కాబట్టి, 'సృష్టి కర్త స్వయంభవుడై, శూన్యం నించి ప్రకృతిని సృషించాడు' అనే వాదంతో, మనకేమీ సంతృప్తికరమైన జవాబు దొరకదు. అంతే కాదు.

'దేవుడు' అనే శక్తి నిజంగా ఉన్నట్టయితే, అది మనకు ఏదో ఒక విధంగా కనపడాలి. అది జరగడం లేదు.

"'ప్రకృతి' అనేది భౌతిక ప్రపంచం. అది ఎప్పుడూ వుంది. దాన్ని సృష్టించిన సృష్టి కర్త లెవరూ లేరు" అనే జవాబుతో మాత్రమే ఈ సమస్యలో సరైన పరిష్కారం చూడగలం. కానీ, "ప్రకృతి ఎప్పుడూ వుంది" అనే జవాబుతో మనం సంతృప్తిపడలేక, "దాన్ని దేవుడు సృష్టించాడు" అని, ఎంతో కాలం నించి 'అలవాటై పోయిన' జవాబునే ఆశ్రయిస్తే, పోనీ ఆ జవాబుతోనైనా సంతృప్తి పడగలమా? అది అసలే సాధ్యం కాదు. ఎందుకంటే, 'దేవుడు వున్నాడనే' విషయం ఏ రకం గానూ రుజువు కాదు. 'ఉన్నది' ఏదైనా ఎప్పుడూ రుజువులకు దొరకాలి. అందులో కొన్ని అంశాలైనా రుజువు కావాలి. దేవుడికి సంబంధించి ఏ అంశమూ

రుజువు కాదు. కానీ, ప్రకృతి అనేది, అనేక రకాలుగా రుజువవుతుంది. 'పదార్థం నశించదు' అనే సంగతి రుజువవుతుంది. 'పదార్థం పరిణామ క్రమంలో రూపాలు మారుతూ వుంటుంది' అనే సంగతి కూడా రుజువవుతుంది. ఈ విషయాలు రుజువైతే, 'ప్రకృతి ఎప్పుడూ వుంది, వుంటుంది, అది భౌతిక తత్వం కలది' – అని గ్రహించవచ్చు. ప్రకృతి శాస్త్రాల ద్వారా, ప్రకృతికి వున్న క్రమత్వమూ, దాని పరిణామ క్రమమూ, దాని భౌతిక తత్వమూ, అనేక రకాలుగా రుజువవు తాయి.

దేవుడు ఎప్పుడూ ఏ రకంగానూ రుజువు కాక పోవడమూ, ప్రకృతిలో భౌతిక తత్వం అనేక రకాలుగా రుజువు కావడమూ — ఈ వాస్తవ పరిస్థితుల మీద ఆధారపడిన హేతుబద్ధతతో మనం, 'ప్రకృతికి సృష్టి కర్త లేడు' అనే జవాబుకి నిరభ్యంతరంగా రావచ్చును. 'సృష్టి కర్త వున్నాడా, లేడా' అనే ప్రశ్నకి క్లుప్తంగా జవాబు ఇదే.

మనిషి కూడా ప్రకృతిలో భాగమే. కాబట్టి, మనిషి 'దేహానికి' సంబంధించిన విషయాలన్నీ ప్రకృతి విషయాల కిందకే వస్తాయి. స్త్రీ పురుషుల శరీర భేదాలు ప్రకృతి విషయాల కిందకే వస్తాయి.

కానీ, మనుషుల మధ్య ధనిక – పేద తేడాలూ, యజమానీ – సేవకుల తేడాలూ, అలాగే స్త్రీ పురుషుల మధ్య ఎక్కువ తక్కువ తేడాలూ —వంటి విషయాలు, ప్రకృతికి సంబంధించిన సహజ విషయాలు కావు. వాటికి కారణాలూ, పరిష్కారాలూ, ప్రకృతి శాస్త్రాలలో దొరకవు. అవి, సామాజిక జీవితానికి సంబంధించిన విషయాలు. వాటిని గ్రహించడానికి 'సామాజిక శాస్త్రం' (సోషల్ సైన్స్) కావాలి. మనుషుల మధ్య సామాజిక తేడాల మూల కారణాన్ని చర్చించే శాస్త్రాన్నే, ఈ 'కాపిటల్' ( పెట్టుబడి ) పుస్తకంలో చూడడం ప్రారం భిస్తున్నాము. ఇది చాలా దీర్ఘమైన పరిశీలన.

★ ★ ★

మానవులు జీవించడానికి కొన్ని పదార్థాలూ, కొన్ని వస్తువులూ తప్పనిసరిగా కావాలి. ఆహార పదార్థాలు కావాలి, బట్టలు కావాలి, ఇళ్ళు కావాలి, మందులు కావాలి, ఇంకా ఇతర వస్తువులెన్నో కావాలి. ఏవేవి తప్పనిసరిగా కావాలనే విషయం, మానవులు ఎటువంటి ప్రకృతి వాతావరణంలో, ఏ కాలంలో జీవిస్తున్నారనే దాన్ని బట్టి వుంటుంది.

చలి ప్రాంతాల్లో జీవించే మానవులకూ, వేడి ప్రాం తాల్లో జీవించే మానవులకూ, దుస్తుల విషయంలో ఒకే రకమైన అవసరాలు వుండవు. మళ్ళీ ఆ చలి ప్రాంతా ల్లోనూ వేడి ప్రాంతాల్లోనూ కూడా, వెయ్యేళ్ళ కిందటి మానవులకూ, తర్వాత కాలం మానవులకూ దుస్తుల అవసరాలు ఒకే రకంగా వుండవు.

పూర్వ కాలంలో అవసరాలుగా వున్న విల్లులూ, బాణాలూ ఇప్పుడు అవసరం లేదు. వాటి బదులు తుపాకులూ, పిస్తోళ్ళూ, కావాలి. పాత వస్తువుల రూపం మారింది. కొంత కాలానికి తుపాకులే అవసరం లేని కాలం వస్తే, ఆయుధాల అవసరం పూర్తిగా నశించి పోతుంది.

ఇప్పుడు నిత్య జీవితావసరాలుగా వున్న కలాలూ, వాచీలూ ఒకప్పుడు మానవ సమాజంలో లేనే లేవు. ఇప్పుడు మానవులు ఎరగని ఎన్నో వస్తువులు ఇంకా ముందు కాలంలో నిత్య జీవితావసర వస్తువులుగా తయారు కావచ్చును. సమాజం అభివృద్ధి చెందుతూ వున్న కొద్దీ మానవుల అవసరాలు ఎక్కువౌతూ వుంటాయి. పాత అవసరాలు మారుతూ, కొత్త అవసరాలు పుట్టుకొస్తూ వుంటాయి. కొన్ని పాత అవసరాలు నశించిపోతూ వుంటాయి.

'మానవులు ప్రాణాలతో జీవిస్తున్నారు' అంటే, కొన్ని పదార్థాల్నీ, కొన్ని వస్తువుల్నీ ఉపయోగిస్తున్నారన్నమాటే. ఒక వ్యక్తికి కావలసిన వస్తువులన్నిటినీ ఆ వ్యక్తే తయారుచేసుకోవడం అయినా జరగాలి; లేకపోతే, ఇతరులు తయారుచేసిన వాటిలో కొన్నిటిని తను వాడుకోవడం అయినా జరగాలి. ఈ విధంగా — తను స్వయంగా తయారు చేసుకోవడమూ, ఇతరులు తయారుచేసిన వాటిలో కొన్నిటిని తన అవసరాలకు వాడుకోవడమూ — అనే రెండు పద్ధతుల వల్లనే మానవులకు నిత్య జీవితావసర వస్తువులు లభిస్తూ వుంటాయి.

ప్రతీ మనిషీ తనకు కావలసిన వస్తువులన్నీ తనే తయారుచేసుకోవడం సాధ్యం కాదు. చేసుకోవడానికి కూడా ప్రకృతిలో అవకాశాలు దొరకవు. అడవిలో జీవించే వ్యక్తులు, సముద్రపు చేపల్ని సంపాదించుకో

లేరు. సముద్ర తీరంలో జీవించే వ్యక్తులు, అడవి దుంపలూ, తేనే సంపాదించుకోలేరు. ఒకే ప్రాంతంలో నివసించే వాళ్ళు కూడా, ఒకే రకం పనికి అలవాటు పడివుండరు. బట్టలు నేసే వ్యక్తులు, కుండలు చెయ్యరు. కుండలు చేసే వ్యక్తులు, బట్టలు నెయ్యరు. బట్టలు నేసే వ్యక్తులకు కుండలు కావాలన్నా, కుండలు చేసే వ్యక్తులకు బట్టలు కావాలన్నా, ఒకరి వస్తువులు ఒకరికి మార్చుకోవలిసిందే. తను తయారు చేసిన వస్తువుల్లో కొన్నిటిని రెండో వ్యక్తి అవసరానికి ఇచ్చి, రెండో వ్యక్తి తయారుచేసిన వస్తువుల్లో కొన్నిటిని తన అవసరానికి తీసుకోవాలి.

మనిషి జంతు దశలో వున్నప్పుడే ఈ వస్తువుల్ని తయారు చేసుకోవడాలూ, మార్చుకోవడాలూ, పుట్ట లేదు. మనుషులు ఎన్నో వేల, లక్షల సంవత్సరాలు జంతు దశలో గడిపి, జంతువుల్లాగే ప్రకృతిలో ఏది దొరికితే అది తిని, క్రమంగా తమ సొంత అవయవా లతో పని చెయ్యడం నేర్చుకుని, తమకు అత్యవసర మైన పనిముట్లని రాళ్ళతో, కర్రలతో ఒక్కొక్కటీ చేసుకోవడం ప్రారంభించి, క్రమంగా జంతు దశ నుంచి మనుషులుగా అభివృద్ధి చెందుతూ అనేక రకాల వస్తువులు తయారుచెయ్యడం తెలుసుకున్నారు. తాము తయారుచేసిన వస్తువులలో కొన్నిటిని తాము వుపయోగించుకుంటూ, కొన్నిటిని ఇతరులకు ఇచ్చి వాటికి బదులుగా ఇతరులు తయారుచేసిన వస్తువులు తెచ్చుకుంటూ, తమ అవసరాలను తీర్చుకోవడం ప్రారంభించారు.

మానవ సమాజం అభివృద్ధిచెందే క్రమంలోనే వస్తువుల "మారకం" అనేది ప్రారంభమైంది. మారకాలు అనేవి లేకుండా ప్రతీ వ్యక్తీ తనకు కావలసినవన్నీ తనే తయారుచేసుకోవడం జరగదు. ఒక వ్యక్తి, ఇంకో వ్యక్తితో మారకం చేసుకుంటాడు. ఒక ప్రాంతం, ఇంకో ప్రాంతంతో మారకం చేసుకుంటుంది. ఒక దేశం, ఇంకో దేశంతో మారకం చేసుకుంటుంది. ఈ మారకాలు, ఈ నాటికీ జరుగుతూనే వున్నాయి. ప్రపంచం అంతా మారకాలు చేసుకుంటూనే వుంది.

ఈ నాడు మారకాలు 'వస్తువుని ఇచ్చి వస్తువుని తీసుకొనే' పద్ధతిలో జరగటం లేదు. 'డబ్బు' ఇచ్చి వస్తువులు తీసుకుంటున్నాం. 'డబ్బు'తోనే నిత్య జీవితా వసర వస్తువులు కొనుక్కుంటున్నాం. మరి, 'ఈ నాటికీ మారకాలు జరుగుతూనే వున్నాయి' అనడంలో అర్థం ఏమిటి?

'డబ్బు' ద్వారా జరిగే పని కూడా వస్తువుల మారకమే. అయితే, డబ్బు అనేది ఏమిటి? డబ్బు ఎలా పుట్టింది? డబ్బు ఇస్తే వస్తువులు ఎందుకు వస్తాయి? — ఇలాంటి ప్రశ్నలకు జవాబులు కావా లన్నా, ఈ నాటి మారకాలెలా జరుగుతున్నాయో తెలుసుకోవాలన్నా, 'రెండు వస్తువుల మధ్య జరిగే మారకం' దగ్గిర నించి తెలుసుకోవలసిందే.

రెండు వస్తువుల మధ్య జరిగే మారకం పద్ధతిని 'బార్టరు పద్ధతి' అంటాము. మారకం చేసుకునే ప్రతి వస్తువునీ 'సరుకు' (కమాడిటీ) అంటాము. ఒక వ్యక్తి ఒక వస్తువుని తయారుచేసి దాన్ని తనే వాడుకుంటే అది 'సరుకు' అవదు. దాన్ని ఎవరికైనా వూరికే ఇస్తే అది కూడా సరుకు అవదు. తన వస్తువుని ఇచ్చి ఇంకో వస్తువుని తీసుకొంటే, ఆ మారకంలో వున్న 2 వస్తు వులూ 'సరుకులు' అవుతాయి.

ఈ 'సరుకు' అయిన వస్తువు లక్షణాలను పరిశీలన చెయ్యడం తోనే కార్ల్ మార్క్స్ రాసిన 'కాపిటల్' (పెట్టుబడి) పుస్తకం ప్రారంభ మవుతుంది.

మానవ సంబంధాల రహస్యాలన్నిటినీ ఇది బయటపెడుతుంది.

వర్తమాన, భూత, భవిష్యత్ కాలాలలో మానవ సమాజపు రూపు రేఖల్ని ఇది వివరిస్తుంది.

'సామాజిక శాస్త్రాన్ని' నేర్చుకునే ప్రయత్నం, ఈ రకంగా, ఇప్పుడు ప్రారంభిస్తున్నాము.

★

# 1 వ భాగం
# సరుకులూ - డబ్బూ
## [ఈ భాగంలో 10 చాప్టర్లు ఉన్నాయి]
# 1. 'సరుకు'కి గల 2 లక్షణాలు

' వస్తువు అంటే ఏమిటో మనకు తెలుసు. వస్తువు ఏదో ఒక అవసరానికి ఉపయోగపడుతుంది. అది వస్తువుకి వుండే సహజ లక్షణం. అయితే, వస్తువు, ' సరుకు'గా మారితే, దానికి ఇంకో లక్షణం కూడా ఏర్పడుతుంది.

' సరుకు' అయిన వస్తువుకి 2 లక్షణాలు ఉంటాయి.

**1. ఉపయోగపు విలువ ; 2. మారకం విలువ**

## 1. ఉపయోగపు విలువ (యూజ్ వాల్యూ)

ఒక వస్తువు, మనిషికి ఏ అవసరం కోసం ఉపయోగ పడుతుందో, అదే ఆ వస్తువు 'ఉపయోగపు విలువ'.

బియ్యం — ఆహారంగా తినడానికి ఉపయోగ పడతాయి.

నీళ్ళు — తాగడానికి ఉపయోగపడతాయి.

దుప్పటి — కప్పుకోవడానికి.

చెప్పులు — పాదాల్ని రక్షించడానికి.

కుర్చీ — కూర్చోవడానికి.

కలం — రాసుకోవడానికి.

ఇలా, ఒక్కో వస్తువూ ఒక్కో అవసరాన్ని తీరుస్తాయి. 'వస్తువు'కి వున్న ఈ లక్షణమే దాని 'ఉపయోగపు విలువ'. ఈ వస్తువులన్నీ, వేరు వేరు ఉపయోగపు విలువలు. ప్రతీ వస్తువూ ఒక ఉపయోగపు విలువ.

### 'ఉపయోగపు విలువ' కు సంబంధించిన కొన్ని విషయాలు :

**1) ఉపయోగపు విలువ సహజమైనది** : ఒక వస్తువు ఉపయోగపు విలువ ఎప్పుడూ ఆ వస్తువులో ఇమిడివున్న లక్షణాలలోనే వుంటుంది. ఉపయోగపు విలువ, వస్తువుతో సంబంధం లేకుండా దాని బయట వుండదు. మామిడిపండుకి తియ్యగావుండే గుణం వుందంటే, ఆ గుణం ఆ పండు శరీర ధర్మాలలోనే వుంటుందిగానీ, పండుతో సంబంధం లేకుండా బయట ఎక్కడో వుండదు. ఆ మామిడి చెట్టుని ఎవరు పెంచారో, దాని కోసం ఎంత మంది శ్రమపడ్డారో, ఎంతెంత కాలం శ్రమపడ్డారో, ఆ మామిడి పండుని ఏ ప్రాంతం నించి ఏ ప్రాంతానికి తీసుకువచ్చారో — ఇలాంటి బయట వ్యవహారాలతో ఆ పండులో వున్న ఉపయోగపు విలువకేమీ సంబంధం వుండదు. వస్తువుకి సహజంగా ఏర్పడిన అంతర్గత లక్షణాల మీద మాత్రమే ఉపయోగపు విలువ ఆధారపడి వుంటుంది. ఆ లక్షణాలు చెడిపోయినప్పుడో, తరిగిపోయినప్పుడో, ఆ వస్తువులు ఇక ఉపయోగపడవు. ఉపయోగపు విలువ నశించిపోతుంది. కుళ్ళిపోయిన పండుకి ఉపయోగపు విలువ లేనట్టే తెగిపోయిన చెప్పులకీ, పాతబడి చిరిగి పీలికలైపోయిన దుప్పటికీ కూడా ఉపయోగపు విలువలు పోయినట్టే. ఉపయోగపు విలువలు వుండడం గానీ, పోవడంగానీ వస్తువుల స్వంత శరీర ధర్మాల మీదే ఆధారపడి వుంటాయి.

**2) వస్తువుని ఉపయోగించాలి** : ఒక వస్తువుకి ఉండే ఉపయోగపు విలువను అనుభవించాలంటే ఆ వస్తువుని ఉపయోగించి తీరాలి. వస్తువుని దూరంగా పెట్టి, వస్తువుతో సంబంధం లేకుండా, దాని ఉపయోగపు విలువని తీసుకోవడం సాధ్యంకాదు. ఎందుకంటే, అది, వస్తువు నించి దూరంగా వుండదు గనక.

**3) వస్తువుని విడిగానే ఉపయోగించవచ్చు :** చెప్పుల్ని ఉపయోగించాలంటే (చెప్పుల 'ఉపయోగపు విలువ'ని పొందాలంటే), వాటిని తొడుక్కుంటే చాలు. చెప్పులతోపాటు ఏ గొడుగునో, సంచినో, ఏదో ఇంకో వస్తువుని కూడా ఉపయోగించాలనే నియమం వుండదు. రెండో వస్తువుని ఉపయోగించకపోతే మొదటి వస్తువు ఉపయోగపడక పోవడం వుండదు. ఏ వస్తువు కావాలంటే, ఆ వస్తువుని ఒక్కదాన్నే, విడిగా, వాడవచ్చు. ఒక ఉపయోగపు విలువ, విడిగానైనా ఉపయోగపడుతుంది, ఇతర వస్తువులతో కలిసి అయినా ఉపయోగపడుతుంది.

**4) ఉపయోగపు విలువ, ఒక 'యజమాని స్వంత హక్కు' గా ఉండదు :** ఒక వస్తువు ఎవరికో ఒకరికే ఉపయోగ పడటం, ఇతరులకైతే ఉపయోగపడక పోవటం అనేది వుండదు. ఒక దుప్పటి, ఎవరు కప్పుకున్నా ఒక్కలాగే ఉపయోగపడుతుంది. ఒక మంచం, ఎవరు పడుకున్నా ఒక్కలాగే ఉపయోగపడుతుంది. ఒక చెప్పుల జత, ఒకే వయసువాళ్ళు ఎవరు వేసుకున్నా ఒక్కలాగే ఉపయోగ పడుతుంది. ఈ రకంగా, ఒక ఉపయోగపు విలువ, దాన్ని వాడుకునే వాళ్ళ కెవరికైనా, ఒక్కలాగే ఉపయోగపడుతుంది.

**5) ఉపయోగపు విలువల్లో ఎక్కువ తక్కువలు ఉండవు:** చెప్పుల ఉపయోగపు విలువ కన్నా, దుప్పటి ఉపయోగపు విలువ 'గొప్పది' కాదు. అలాగే, దుప్పటి ఉపయోగపు విలువ కన్నా, చెప్పుల ఉపయోగపు విలువ కూడా గొప్పది కాదు. దేని ఉపయోగం దానిదే. ఒక ఉపయోగంతో ఇంకో ఉపయోగాన్ని పోల్చడానికి వీలు లేదు. చెప్పులు చేసే పని, దుప్పటి చెయ్యదు. దుప్పటి చేసే పని, చెప్పులు చెయ్యవు. రేగుపండు కన్నా పనసపండు ఎక్కువది కాదు. చిన్న చెంచా కన్నా ఏడంతస్తుల భవనం గొప్పది కాదు. చెంచాతో అవసరం కలిగినప్పుడు, చెంచా లేకుండా దానికి బదులుగా ఏడంతస్తుల భవనం వుంటే, ప్రయోజనం వుండదు. చెంచాతో జరిగే పని భవనంతో జరగదు. కాయితాలకు గుచ్చడానికి చిన్న గుండుసూది అవసరమైనప్పుడు, అది లేకుండా ఎన్ని కోట్ల వస్తువులు వున్నా, గుండుసూది తీర్చే అవసరాన్ని తీర్చలేవు. ఒక చెప్పుల జత కావలసి వచ్చినప్పుడు, గొప్ప పుస్తకం వుంటే, పని జరగదు. ఒక పెన్సిల్ కావలసి వచ్చినప్పుడు, ధగ ధగా మెరిసే సిల్కు కోటు వుంటే, ప్రయోజనం వుండదు. ఒక అవసరానికి, ఆ అవసరాన్ని తీర్చగల వస్తువే వుండాలి. కాబట్టి, ఉపయోగపు విలువలుగా చూస్తే దేని ప్రత్యేకత దానిదే. కాబట్టి వేరు వేరు ఉపయోగపు విలువల్ని పోల్చలేము.

**6) చిన్న చిన్న తేడాల వల్ల కూడా ఉపయోగపు విలువలు మారతాయి :** రెండు వస్తువులలో దాదాపు అన్నీ ఒకే రకమైన లక్షణాలు వుండి, ఒకటి రెండు లక్షణాలలో అతి చిన్న తేడాలుండడం వల్ల కూడా వాటి ప్రత్యేకతలు వేరవుతాయి. రెండు దుప్పట్లు — ఒకే కొలతలు, ఒకే రంగు, ఒకే రకం నూలు, ఒకే రకం నేత, అంతా ఒకే రకం. కానీ ఒక దుప్పటికి సన్నని అంచు వుంది. రెండోదానికి లేదు. అప్పుడు వాటి ప్రత్యేకతలు వేరవుతాయి. దానివల్ల వాటి ఉపయోగపు విలువలు కూడా వేరవుతాయి. దుప్పటికి అంచు వుండడం ఇష్టంలేని వాళ్ళకి, అంచు వున్న దుప్పటివల్ల అవసరం తీరదు. వాళ్ళకి అంచులేని దుప్పటి కావాలి. అంచులేని దుప్పటి అయితేనే వాళ్ళకు ఉపయోగపు విలువగా వుంటుంది. అలాగే అంచులేని దుప్పటిని ఇష్టపడని వాళ్ళకి, అంచువున్న దుప్పటే కావాలి. ఈ రకంగా, చిన్న అంచు వల్ల దుప్పట్ల ఉపయోగపు విలువలు వేరవుతాయి. కానీ, ఇక్కడ మనం ఉదాహరణలు తేలిగ్గా వుండడం కోసం, ఒకే రకం వస్తువులలో వుండే ఈ రకం చిన్న చిన్న తేడాల్ని లెక్కలోకి తీసుకోనక్కరలేదు. ఇక్కడ అంచు వున్న దుప్పటినీ, అంచులేని దుప్పటినీ ఒకే రకమైన ఉపయోగపు విలువలుగా భావించవచ్చు.

**7) పోల్చి చూడవచ్చు :** ఉపయోగపు విలువల్లో తేడా ఏమీలేక, కేవలం 'పరిమాణా'ల్లో (సైజుల్లో) తేడా వున్నవాటిని మాత్రం 'ఏది ఎక్కువ – ఏది తక్కువ' అని పోల్చి చూడ వచ్చును. ఒకే గుణం గలిగిన పదార్థాలలో, తక్కువ పదార్థాని కన్నా, ఎక్కువ పదార్థానికి, ఎక్కువ ఉపయోగపు విలువ వుంటుంది. అంటే, అది ఎక్కువ ఉపయోగం ఇస్తుంది. ఒకే రకం బియ్యాన్ని తీసుకుంటే, 1 కిలో బియ్యం ఉపయోగపు విలువ కన్నా, 2 కిలోల బియ్యం ఉపయోగపు విలువ ఎక్కువ. 3 కిలోల బియ్యం ఉపయోగపు విలువ ఇంకా ఎక్కువ. బియ్యం పరిమాణం ఎక్కువైనకొద్దీ, వాటితో ఎక్కువ మందికి తిండి అవసరం తీరుతుంది. లేదా, ఒక వ్యక్తికి ఎక్కువ పూటల అవసరం తీరుతుంది. ఒకే రకమైన 2 పెన్సిళ్ళలో ఒకటి 6 అంగుళాలదీ, ఒకటి 7 అంగుళాలదీ అయితే, వాటిని పోల్చి చూడవచ్చు. దేని ఉపయోగం ఎక్కువ? చిన్న పెన్సిల్ ఉపయోగంకన్నా పెద్ద పెన్సిల్ ఉపయోగం ఎక్కువ. అలా అని, చిన్న కుర్చీ ఉపయోగం కన్నా పెద్ద కుర్చీ ఉపయోగం ఎక్కువ కాదు. చిన్న చెప్పుల జత ఉపయోగం కన్నా, పెద్ద చెప్పులజత ఉపయోగం ఎక్కువ కాదు. చిన్న చొక్కాకన్నా, పెద్ద చొక్కా ఎక్కువ కాదు. ఎందుకంటే — కుర్చీ, చొక్కా, చెప్పుల జతా — లాంటి వస్తువులు, ఒక్కొక్క వ్యక్తి ఉపయోగానికి మాత్రమే సంబంధించినవి. ఆ వస్తువులు ఎంత పెద్దవి అయినా, వాటిని ఒకరి కన్నా ఎక్కువ మంది ఉపయోగించలేరు. ఇలాంటి వస్తువుల విషయంలో, సైజుని బట్టి వుపయోగపు విలువ వుండదు.

ఒకరి కన్నా ఎక్కువ మంది ఉపయోగించ డానికి వీలైన వస్తువుల విషయంలో మాత్రమే, ఒకే రకమైన వాటిలో పరిమాణాలు తేడాగా వుంటే, ఎక్కువ తక్కువ తేడాలు చూడవచ్చును. 'గుణాల' విషయంలో వేరు వేరుగా వుండే ఉపయోగపు విలువల్లో మాత్రం, ఎక్కువ తక్కువలు వుండవు. దేని ప్రత్యేకత దానిది. — ఇవీ, 'ఉపయోగపు విలువ' కి సంబంధించిన లక్షణాలు.

ప్రకృతిలో దొరికే అనేక కోట్ల పదార్థాల్లో ఏ పదార్థం ఏ విధంగా ఉపయోగపడుతుందీ—అనే విషయాన్ని కనిపెట్టే పని చరిత్రలో ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది. పదార్థానికి కొత్త కొత్త ఉపయోగాల్ని కనిపెట్టి కొత్త కొత్త వస్తువుల్ని తయారుచేసుకున్న కొద్దీ, మానవుల నిత్య జీవితంలో అవసరమయ్యే ఉపయోగపు విలువలు పెరుగుతూ వుంటాయి.

# 2. మారకం విలువ (ఎక్స్ఛేంజ్ వాల్యూ)

'సరుకు'కి వున్న రెండో లక్షణం 'మారకం విలువ'. 'మారకం' వల్ల సరుకుకి ఏర్పడే విలువే 'మారకం విలువ'. 'మారకం విలువ'కు పొట్టి పేరు 'విలువ'. ('విలువ' అనే మాట ఎక్కడ వచ్చినా దాన్ని 'మారకం విలువ' అనే అనుకోవాలిగానీ, 'ఉపయోగపు విలువ' అనుకోకూడదు).

## 'మారకం విలువ' కు సంబంధించిన కొన్ని విషయాలు :

**1) 'మారకం' అంటే, 2 వస్తువులు ఉండితీరాలి :** 'మారకం' అంటే, ఒక 'వస్తువు'ని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసుకోవడం. కాబట్టి, 'మారకం' అనగానే 2 వస్తువులు వుండితీరాలి. 'ఉపయోగపు విలువ'ని పొందే విషయంలో అయితే, ఒకేసారి 2 వస్తువులు వుండనక్కరలేదు కదా? కానీ, 'మారకం విలువ'ని పొందే విషయంలో, ఒకే సారి 2 వస్తువులు వుండితీరాలి.

**2) వేరు వేరు ఉపయోగపు విలువలకే మారకం జరుగుతుంది :** ఒక వస్తువుని ఇచ్చి ఇంకో వస్తువుని తీసు కోవడం అంటే, ఇచ్చే వస్తువు లాంటి దాన్నే తీసుకోవడమా? ఒక చెప్పుల జతని ఇచ్చి, మళ్ళీ అలాంటి చెప్పుల జతనే తీసుకోవడమా? ఒక దుప్పటిని ఇచ్చి, మళ్ళీ అలాంటి దుప్పటినే తీసుకోవడమా? ఇచ్చే వస్తువూ, తీసుకునే వస్తువూ ఒక్క లాంటివే అయితే, వాటిని మార్చుకోవడం ఎందుకు? ఇచ్చే వస్తువులాంటిది గాక ఇంకోరకం వస్తువు కావలసి వచ్చినప్పుడే, మారకం అనేది జరుగుతుంది. ఒకే రకం వస్తువుల మధ్య, అంటే ఒకే రకం ఉపయోగపు విలువల మధ్య, మారకం ఎన్నడూ జరగదు. ఒక మారకం జరిగిందంటే, అందులో వుండే 2 వస్తువులూ వేరు వేరు రకాల వస్తువులై వుంటాయి.

**3) 'మారకం' లో వస్తువులు వేరు వేరు వ్యక్తులవి :** 'మారకం'లో వుండే 2 వస్తువులూ ఒకే వ్యక్తికి సంబంధించినవిగా గాక, వేరు వేరు వ్యక్తులకు సంబంధించినవిగా వుంటాయి. ఒక వ్యక్తి, తన వస్తువుల మధ్యనే మారకం చేసుకోడు. అలా చేసుకోవలసిన అవసరం వుండదు. ఒక వ్యక్తి, తన వస్తువుల్లో దేనితో అవసరం వుంటే దాన్ని స్వేచ్ఛగానే ఉపయోగించుకోవచ్చును. ఒక వ్యక్తికి, ఇంకోవ్యక్తి దగ్గరవున్న వస్తువు కావలసి వచ్చినప్పుడే, తన వస్తువుని ఇచ్చి ఇంకో వస్తువుని తెచ్చుకోవాలి. ఈ రకంగా, మారకంలో వుండే రెండు వస్తువులూ వేరు వేరు వ్యక్తులకు సంబంధించినవై వుంటాయి. అలా వుంటేనే మారకం జరుగుతుంది.

ఇవి, ' మారకానికి' అవసరమైన కొన్ని పరిస్థితులు!

## ఒక 'మారకం' :

ఒక వడ్రంగి, చెక్కతో 'కుర్చీ' చేసి దాన్ని తీసుకుపోయి నేత పని మనిషికి ఇచ్చి, దానికి బదులుగా ఒక 'దుప్పటి' తెచ్చుకున్నా డనుకుందాం. అంటే, ఇక్కడ ఒక కుర్చీకీ, ఒక దుప్పటికీ 'మారకం' జరిగింది. ఈ మారకానికి ఇరు పక్షాల వ్యక్తులూ అంగీకరించారు. కుర్చీ మనిషి "నా కుర్చీకీ, దుప్పటికీ సరిపోయింది. రెండూ సమానంగానే వున్నాయి" అను కుంటాడు. అలా అనుకోవడం వల్లనే తన కుర్చీని ఇచ్చి దుప్పటిని తీసుకున్నాడు. దుప్పటి మనిషి కూడా అలా అనుకోవడం వల్లనే తన దుప్పటిని ఇచ్చి కుర్చీని తీసుకున్నాడు. ఈ ఇద్దరిలో ఎవరూ కూడా 'ఎక్కువ' వస్తువుని ఇచ్చి, 'తక్కువ' వస్తువుని తీసుకుంటున్నామని అనుకోలేదు. ఇద్దరి దృష్టిలోనూ ఆ 2 వస్తువులూ 'సమానంగా' వున్నాయి. అందుకే వాటిని మార్చుకోవడానికి ఆ ఇద్దరిలో ఎవరికీ అభ్యంతరం లేకపోయింది. అంటే 2 వస్తువుల మధ్య 'మారకం' జరగడం అంటే, ఆ వస్తువులు రెండూ 'సమానంగా' వున్నట్టు అర్థం. అలా వుండడం వల్లనే వాటి 'మారకం' సాధ్యం అవుతుంది. అయితే, ఇక్కడ ప్రశ్న, అవి సమానంగా వున్నది, ' ఏ విషయంలో?'

'మారకం' అనేది ఎప్పుడూ ఒకే రకం వస్తువుల మధ్య జరగదనీ, వేరు వేరు రకాల వస్తువుల మధ్యనే జరుగుతుందనీ ఇంతకుముందే చూశాం. వేరు వేరు రకాల

వస్తువులు (వేరు వేరు ఉపయోగపు విలువలు) 'సమానంగా' వుండడం అంటే ఏమిటి? అవి ఏ విషయంలో సమానంగా వున్నట్టు? కుర్చీకీ, దుప్పటికీ మారకం జరిగిందంటే, ఆ వస్తువులు రెండూ ఏ విషయంలో సమానంగా వున్నట్టు? కుర్చీ బరువూ, దుప్పటి బరువూ సమానంగా వున్నాయా? కుర్చీ పొడుగూ, దుప్పటి పొడుగూ సమానంగా వున్నాయా? కుర్చీ వుపయోగమూ, దుప్పటి వుపయోగమూ సమానంగా వున్నాయా? కుర్చీ శరీరంలో ఏ అంశం, దుప్పటి శరీరంలో ఏ అంశంతో, సమానంగా వున్నట్టు?

అలాంటి సమానత్వం ఏదీ వాటి మధ్య వుండదు. కుర్చీ లక్షణాలన్నీ వేరూ, దుప్పటి లక్షణాలన్నీ వేరూ. కుర్చీ కొలతలు వేరూ, దుప్పటి కొలతలు వేరూ. కుర్చీ ఉపయోగం వేరూ, దుప్పటి ఉపయోగం వేరూ.

దుప్పటీ, కుర్చీ — వేరు వేరు ఉపయోగపు విలువలు కాబట్టి, వాటి శరీరాలకు సంబంధించిన ఏ లక్షణంలోనూ సమానత్వం వుండదు. మరి, వాటి మధ్య మారకం ఏ అంశాల సమానత్వాన్నిబట్టి జరిగినట్టు? కుర్చీకీ దుప్పటికీ మారకం జరగడం వాస్తవమే కదా? ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసుకోవడం సాధ్యమైందంటే, ఆ 2 వస్తువులూ 'ఏదో విషయం'లో 'సమానం'గా వున్నాయని అర్థమే కదా? ఏమిటా 'ఏదో విషయం'? అది, ఆ వస్తువుల శారీరక లక్షణాలతో సంబంధం లేనిది! ఆ శరీరాలకు బయట వుండేది! కానీ ఆ వస్తువులకే సంబంధించినది! ఆ రకంగానే ఆ రెంటినీ సమానం చెయ్యగలిగేది! — అలా వుండే ఆ 'బయటి విషయం' ఏమిటి?

మన నిత్యజీవితంలో అనేక పదార్థాల్నీ వస్తువుల్నీ చూస్తూ వుంటాం. మట్టివి, చెక్కవి, రాగివి, ఇత్తడివి, బంగారానివి; పత్తివి, ఉన్నివి, సిల్కువి ; బియ్యంతో, జొన్నలతో, గోధుమలతో, పాలతో, పెరుగుతో, నెయ్యితో తయారైనవి, — ఈ రకంగా, అనేక రకాలైన వస్తువుల్ని చూస్తాం. గుప్పెడు బియ్యానికీ, చారెడు కరివేపాకుకీ మారకం జరగడం అందరూ చూసివుంటారుగానీ, ఒక మట్టి కుండకీ బంగారు గొలుసుకీ మారకం జరగడం ఎవ్వరూ చూసివుండరు. మట్టి కుండ గురించీ, బంగారం గొలుసు గురించీ వినీ వినగానే, మట్టి కుండ 'విలువ' చాలా తక్కువనీ, బంగారు గొలుసు 'విలువ' యెంతో ఎక్కువనీ, లోకజ్ఞానం వున్న వాళ్ళందరికీ తెలుస్తుంది.

మనం ఇంతసేపూ వెతుకుతున్నది ఈ 'విలువ' అనే విషయం గురించే. ప్రతీ సరుక్కీ ఎంతోకొంత 'విలువ' వుంటుందని అందరికీ తెలుసు. కొన్ని సరుకుల విలువలు తక్కువగానూ, కొన్ని సరుకుల విలువలు ఎక్కువగానూ వుంటాయని కూడా అందరికీ తెలుసు. మట్టికుండ 'విలువ' చాలా తక్కువగానూ, బంగారం గొలుసు 'విలువ' చాలా ఎక్కువగానూ వుంటుంది. కాబట్టే, బంగారం గొలుసు మనిషి తన వస్తువుకి బదులుగా మట్టికుండని తీసుకోవడానికి వొప్పుకోడు. విలువ విషయంలో మట్టికుండా, బంగారం గొలుసూ సమానంగా వుండవు. కాబట్టే ఆ రెండింటికీ ఎన్నడూ మారకం జరగదు.

2 వస్తువుల మధ్య మారకం జరిగిందంటే, ఆ 2 వస్తువులూ ఏ విషయంలో సమానంగా వున్నాయి – అని పరిశీలిస్తున్నాం కదా? 'మారకం విలువ' అనేదే ఆ విషయం. మారకం జరగడానికి సంబంధించిన విలువే 'మారకం విలువ'. ఏ 'విలువ' మీద ఆధారపడి 'మారకం' జరుగుతుందో అదే 'మారకం విలువ'. దాని పొట్టిపేరు- 'విలువ'. 2 వస్తువుల మధ్య మారకం జరిగిందంటే, ఆ 2 వస్తువులూ 'విలువ' విషయంలో సమానంగా వున్నాయన్నమాట!

కుర్చీకీ, దుప్పటికీ, 'మారకం' జరిగిందంటే — కుర్చీకి కొంత 'విలువ' వుంది; దుప్పటికీ కొంత 'విలువ' వుంది; ఆ 2 విలువలూ సమానంగా వున్నాయి — అని అర్థం.

కుర్చీని ఇచ్చి, దుప్పటిని తీసుకున్న మనిషికి, ఇచ్చినంత విలువే తిరిగి వస్తుంది.

అలాగే, దుప్పటిని ఇచ్చి కుర్చీని తీసుకున్న మనిషికి కూడా, ఇచ్చినంత విలువే తిరిగి వస్తుంది.

కుర్చీ విలువా, దుప్పటి విలువా 'సమానంగా' వుండడం వల్లనే, కుర్చీ మనిషీ, దుప్పటి మనిషీ, తమ వస్తువుల్ని మార్చుకోవడానికి సంకోచించలేదు. అంటే, మారకాలు అనేవి, 'విలువల సమానత్వం' వల్లనే జరుగుతాయని అర్థం.

## 'మారకం విలువ' అంటే ఏమిటి? అది సరుకుకి ఎలా వస్తుంది?

ఒక సరుకుకి, ఉపయోగపు విలువ వచ్చిందంటే దానికి కారణం స్పష్టంగానే కనపడుతుంది. ఆ సరుకు, తన శరీర ధర్మాల వల్ల మనిషి అవసరాలలో ఏదో ఒక అవసరానికి ఉపయోగపడే విధంగా వుంటుంది కాబట్టి, దానికి ఉపయోగపు విలువ వచ్చింది.

కానీ, సరుకు శరీర ధర్మాలతో ఏమీ సంబంధం లేకుండానే సరుకుకి మారకం విలువ ఎలా వస్తుంది? అది ఎలా ఏర్పడుతుంది? అసలు మారకం విలువ అంటే ఏమిటి?

మారకం విలువ అంటే ఏమిటో, అది ఎలా ఏర్పడుతుందో చూడాలంటే, ఒక 'మారక సంబంధం'లో వున్న రెండు సరుకుల్ని గురించీ చూడాలి.

ఇంతకుముందు మనం చూసిన ఉదాహరణలలో, కుర్చీకీ దుప్పటికీ మారకం జరిగింది కదా? అసలు ఆ రెండు వస్తువులూ ఎక్కడి నుంచి వచ్చాయి? చెట్లకి వంకాయలూ, బీరకాయలూ కాసినట్టుగా ఒక చెట్టుకి కుర్చీలూ, ఒక చెట్టుకి

దుప్పట్లూ కాశాయా? లేకపోతే, మేఘాల్లోంచి వాన చినుకులు పడ్డట్టుగా ఈ దుప్పటీ, కుర్చీ ఆకాశంలోంచి కింద పడ్డాయా? — ఈ వస్తువులు రెండూ ఎలా వచ్చాయి ప్రపంచంలోకి? ఎలా వచ్చాయంటే, ఈ వస్తువుల్ని మనుషులే తయారుచేశారు. మనుషులు తయారు చెయ్యకపోతే కుర్చీలూ, దుప్పట్లూ ప్రపంచంలోకి రావు. వస్తువు లన్నిటినీ మనుషులే తయారుచేస్తారు. దీన్నే వేరే మాటల్లో చెప్తే, మనుషులు తయారుచేసేవి — 'వస్తువులు'. మనుషులతో సంబంధం లేకుండా ప్రకృతి సహజంగా తయారయ్యేవి — 'వస్తువులు' కావు. అవి, 'ప్రకృతి సహజ పదార్థాలు'. గాలి, ప్రకృతి సహజ పదార్థం. వాననీరు, ప్రకృతి సహజ పదార్థం. కొండలూ, కోనలూ, సాగు చెయ్యని భూములూ, ప్రకృతి సహజ పదార్థాలు. వీటిని మనుషులు చెయ్యలేదు. కాబట్టి ఇవి 'వస్తువులు' కావు.

అయితే, మనుషులు, 'వస్తువుల్ని' ఎలా చేస్తారు?

**కుర్చీ విషయం చూస్తే :**

కుర్చీ తయారవ్వాలంటే మొదట 'చెక్క' కావాలి.

ప్రకృతి సహజంగా పెరిగిన ఒక 'అడవి' వుందను కుందాం. అంటే, ఆ అడవిలో చెట్లన్నీ, వాటికవే, వాటి కోసం మనుషులెవ్వరూ ఏ శ్రమలూ చెయ్యకుండా, పెరిగాయని అర్థం. ఆ చెట్లన్నీ ప్రకృతి సహజ పదార్థాలు. అవి 'వస్తువులు' కావు. అలాంటి అడవిలోకి, వెంకయ్య అనే ఒక వ్యక్తి వెళ్ళి, ఒక చెట్టుని కొట్టి, దాని కొమ్మలన్నీ నరికి, దాన్ని చెక్క పలకలుగా(కట్టెలుగా) తయారు చేశాడను కుందాం. చెట్టు వుండే స్థానంలో ఇప్పుడు చెక్క పలకలు వున్నాయి. చెట్టుని ఈ చెక్క పలకలుగా తయారుచెయ్యడానికి వెంకయ్య చాలా కష్టపడ్డాడు. కొన్ని పనులు చేశాడు. 'కష్టపడడం', 'పని చెయ్యడం' అనేవాటిని ఆర్థిక శాస్త్ర భాషలో 'శ్రమ చెయ్యడం' అనాలి. పని చెయ్యడమే — శ్రమ చెయ్యడం. ప్రకృతి సహజంగా వున్న 'అడవి చెట్టు' మీద వెంకయ్య తన 'శ్రమ'ని వెచ్చించి, ఈ చెక్కల్ని తయారుచేశాడు. ఈ చెక్కలన్నీ 'వస్తువులు'. ఈ వస్తువులన్నీ వెంకయ్యవి. ఇవి వెంకయ్య 'ఆస్తి'. వాటిని అతడు వాడుకోవచ్చు. అంటే, ఈ చెక్కలకు వెంకయ్య 'స్వంతదారు' (ఓనరు) అయ్యాడు. ఈ చెక్కలన్నీ చెట్టుగా వున్నప్పుడు, ఆ చెట్టుకి వెంకయ్య స్వంతదారు కాడు. వెంకయ్యే కాదు, ఆ చెట్టుకి ఇంకెవ్వరూ కూడా స్వంతదారులు కారు. ఎందుకంటే, ఆ చెట్టు పెరగడానికి వెంకయ్యగానీ, ఇంకొకరు గానీ ఏ పనులూ చెయ్యలేదు. ఆ చెట్టు 'మానవ శ్రమ' లేకుండానే పెరిగింది. కాబట్టి, "ఈ చెట్టు నాది, దీన్ని నా శ్రమతో పెంచాను" అని దాన్ని స్వంతపరుచుకోవడానికి ఎవరికీ 'న్యాయమైన హక్కు' వుండదు. కానీ, ఆ చెట్టుకి స్వంతదారు కాని వెంకయ్య, చెక్క పలకలకు స్వంతదారు అయ్యాడు. చెట్టుని కొట్టి చెక్క పలకలుగా చేసుకున్నది అతనే కాబట్టి, అతను చెక్క పలకలకు న్యాయంగానే స్వంతదారు అయ్యాడు.

వెంకయ్య అడవిలోకి వచ్చినప్పుడు, అతనితోపాటే రామయ్య అనే ఇంకో వ్యక్తి కూడా అడవిలోకి వచ్చాడను కుందాం. వెంకయ్య, చెట్టుని కొడుతూ వుండగా రామయ్య ఇంకో చెట్టు కింద విశ్రాంతిగా కూర్చుని వుండి, వెంకయ్య చెట్టుని కొట్టి చెక్క పలకల్ని తయారుచెయ్యడం పూర్తి కాగానే, వాటిని రామయ్య తీసుకుపోవచ్చునా? అలా తీసుకుపోవ డానికి వీల్లేదు. వాటిని వెంకయ్య తయారు చేసుకున్నాడు కాబట్టి అవి వెంకయ్యవే. వాటిని ఇతరులెవరైనా తీసుకో దలిస్తే, వాటిని ఎవరు తయారుచేశారో ఆ వ్యక్తికి, అంటే వెంకయ్యకి, ఇంకేదైనా వస్తువు ఇచ్చి అప్పుడు మాత్రమే వాటిని తీసుకోవాలి. అంటే, ఆ చెక్కలకు కొంత 'విలువ'ని చెల్లించాలి. <u>ఇంకో వస్తువుని ఇవ్వడమే 'విలువ'ని చెల్లిం చడం.</u> ఇంకో వస్తువుని ఇచ్చి చెక్కల్ని తీసుకోవడం అంటే, అది చెక్కలకూ, ఇంకో వస్తువుకీ, 'మారకం' జరగడమే.

ఒకవేళ, రెండో వ్యక్తి, వెంకయ్య చెక్కల్నిగాక అడవిలో వున్న ఇంకో చెట్టుని తీసుకోదలిస్తే, దానికోసం అతను ఎవరికీ ఏ వస్తువూ ఇవ్వకుండానే ఆ చెట్టుని తీసుకోవచ్చు. వెంకయ్య కూడా, అడవిలోకి వచ్చి ఒక చెట్టుని కొట్టడం మొదలుపెట్టే ముందు, ఆ చెట్టు కోసం ఎవరికీ ఏ వస్తువూ ఇవ్వలేదు. అంటే, ఆ చెట్టుని ఎవరితోటీ 'మారకం' చేసుకోలేదు. ఎందుచేత? ఆ 'చెట్టు' విషయంలో లేనిదీ, తర్వాత 'చెక్కల' విషయంలో వున్నదీ ఏమిటి? — మానవ శ్రమ! అదే ఆ రెండు విషయాలకీ వున్న తేడా. ఆ 'చెట్టు' విషయంలో, తమ శ్రమని వెచ్చించిన స్వంతదారు లెవరూ లేరు కాబట్టి, దానికోసం ఎవరికీ ఏ వస్తువూ ఇవ్వనక్కరలేదు. ఒకవేళ, ఆ చెట్టు అడవిలో చెట్టుగాక, ఎవరైనా పెంచిన తోటలో చెట్టు అయితే? 'తోట చెట్టు' విషయంలో ఎవరో కొంత శ్రమ చేసి వుంటారు కాబట్టి, దానికి స్వంతదారు వుంటాడు. కానీ, ఇక్కడ మన ఉదాహరణలోకి, అడవి చెట్టుని తీసుకున్నాం కాబట్టి, ఈ చెట్టుకి స్వంతదారు వుండడు. ఇలాంటి చెట్టుని వాడుకోవాలంటే, ఎవరైనా 'స్వేచ్ఛగా' వాడుకోవచ్చు. అయితే, అడవిలో చెట్టుని స్వేచ్ఛగా వాడుకున్నట్టుగా, ఒక మనిషి తయారుచేసిన చెక్కల్ని ఇతరులు స్వేచ్ఛగా వాడుకోవడానికి వీలు వుండదు. ఒక పదార్థాన్ని, ప్రకృతి, ఏ రూపంతో ఇస్తుందో ఆ రూపంతో ఉన్నప్పుడు మాత్రమే దాన్ని ఎవరైనా స్వేచ్ఛగా తీసుకోవచ్చు. ఆ పదార్థం, 'వస్తువు' అవదు కాబట్టి.

'అడవిలో చెట్టు' వస్తువు కాదు. కానీ, 'చెక్క పలకలు' వస్తువులే. ప్రకృతి, అడవిలో చెట్టుని ఇచ్చిందిగానీ చెక్క పలకల్ని ఇవ్వలేదు.

'అడవి' అనేది వస్తువు కాదు. కానీ, 'తోట' అనేది వస్తువే. ప్రకృతి, అడవిని ఇచ్చిందిగానీ, తోటని ఇవ్వలేదు — ఈ అర్థాలతో చూస్తే, మనుషులు పెంచే జంతువులు కూడా వస్తువులే అవుతాయి. ఇది విచిత్రంగా కనపడుతుంది. కానీ, ఇందులో విచిత్రం ఏమీ లేదు. ఇక్కడ మనం చూసేది 'జీవ శాస్త్ర' అర్థాలతో కాదు, 'ఆర్థిక శాస్త్ర' అర్థాలతో! జీవశాస్త్ర అర్థాలతో చూస్తే, జంతువులూ, చెట్లూ కూడా ప్రాణులే గానీ, ప్రాణం లేని వస్తువులు కావు. కానీ ఆర్థికశాస్త్ర అర్థాలతో చూసినప్పుడు, 'ప్రాణం' వుందా, లేదా అనే విషయంగాక, అది మానవశ్రమ ద్వారా తయారైనదా, కాదా అనే విషయం చూస్తాం. 'జీవశాస్త్రం' ప్రకృతి సహజ విషయాలను వివరిస్తే, 'ఆర్థికశాస్త్రం' సామాజిక విషయాలను వివరిస్తుంది. ఇవి పూర్తిగా వేరు వేరు కోణాలు. జీవశాస్త్రం ప్రకారం 'వస్తువులు కానివి' కూడా, ఆర్థిక శాస్త్రం ప్రకారం 'వస్తువులు' కావచ్చు.

[ సరైన ఆర్థిక శాస్త్రం ప్రకారం, సాగు చెయ్యని భూములకూ, అడవులకూ, స్వంతదారులు వుండరు. కానీ, మన నిత్య జీవితంలో సాగు చెయ్యని భూములూ, అడవులూ కూడా ఎవరికో ఒకరికి 'స్వంత ఆస్తులు'గా వుండడం చూస్తున్నాం. అంతే కాదు, సాగుచేస్తున్న భూముల విషయంలో కూడా, ఆ భూముల్లో శ్రమ చేసే మనుషులకు వాటి మీద ఏ హక్కూ లేకపోవడమూ, ఆ భూముల్లో ఏ శ్రమా చెయ్యని మనుషులే వాటికి 'యజమానులు'గా వుండడమూ కూడా చూస్తున్నాం. ఇదంతా ఎందువల్ల జరుగుతోందో, ఈ 'యాజమాన్యపు విధానం'లో వున్న 'దోషం' ఏమిటో, ఇంకా ముందు ముందుకు పోయేకొద్దీ అర్థం చేసుకోగలం. మనం, మన నిత్య జీవితంలో ఒక విషయం 'ఎలా వుందో' చూడడం మాత్రమే కాదు, అది అలా వుండడం 'సరైందా, కాదా' అని కూడా చూడాలి. అది అలా వుండడం సరైందే అయితే, అంటే హేతుబద్ధమైనదే అయితే, దాన్ని అలాగే ఎల్లకాలమూ అంగీకరించవచ్చు. లేదా, అది అలా వుండడం సరైనది కాదని తేలితే, అది ఎలా వుండడం సరైనదో కూడా తెలుసుకుని, దాన్ని తర్వాత మార్చుకుంటాం. నిత్యజీవితంలో కనపడే ఏ ఒక్క విషయాన్ని అయినా, ఎలా కనపడేదాన్ని అలాగే, ఎలా వున్నదాన్ని అలాగే, అది సరైనదే అన్నట్టు భావించ కూడదు. నిత్యం మనం చూసే వాటిలో కొన్ని విషయాలు సరైనవిగానే వుండవచ్చు. కొన్ని విషయాలు సరైనవిగా లేకపోవచ్చు. అందుకే ఏ విషయాన్ని అయినా, పరిశీలనతో చూసి, దాని 'మంచి చెడ్డలు' తెలుసుకోవాలి. ]

మనుషులు, వస్తువుల్ని ఎలా తయారుచేస్తారో, మారకం విలువ అంటే ఏమిటో గ్రహించడానికి కావలసిన ఉదాహరణలు చూస్తున్నాం.

'అడవిలో చెట్టు'ని మనుషులు తయారు చెయ్యనట్టే, 'సముద్రంలో చేపల్ని' కూడా మనుషులు తయారు చెయ్య లేదు. ప్రకృతే వాటిని అలా ఇచ్చింది. వాటికి స్వంతదారు లేదు. అవి ఎవరికీ స్వంత ఆస్తి అవవు. వాటి మీద మనుషుల్లో ఎవరికీ ప్రత్యేక హక్కులు వుండవు. సముద్రంలోకి ఎవరు పోగలిగితే వాళ్ళు, ఆ చేపల్ని స్వేచ్ఛగా, ఎవరికీ 'విలువ'ని చెల్లించకుండా, తీసుకోవచ్చు.

ఎవరైనా ఒక వ్యక్తి పడవ మీద సముద్రంలోకి పోయి, వలతో చేపలుపట్టి, ఒడ్డు మీదకి తీసుకొచ్చాడనుకుందాం. సముద్రంలో వుండవలసిన చేపలు ఇప్పుడు ఒడ్డు మీద వున్నాయి. చేపల్ని సముద్రంలో వుండేలాగ ప్రకృతి ఇచ్చింది గానీ ఒడ్డు మీద వుండేలాగ ఇవ్వలేదు. ఆ పని, ఒక మనిషి చేశాడు. అంటే, ఆ మనిషి కొంత 'శ్రమ' చేశాడు. ఆ చేపలు, సముద్రంలో వున్నప్పుడు 'వస్తువులు' కాదు. ఒడ్డు మీద వున్నప్పుడు వస్తువులే. సముద్రంలో వుండే చేపల మీద కొంత శ్రమ ఖర్చయితే, ఆ వస్తువులు తయారయ్యాయి. ఆ శ్రమ ఏ వ్యక్తి చేశాడో ఆ వ్యక్తివే ఆ చేపలు. ఆ వ్యక్తే ఆ చేపలకు స్వంతదారు. వాటిని ఆ మనిషే వాడుకోవాలంటే, ఆ మనిషి తనకి తనే ఏమీ చెల్లించుకోనక్కరలేదు. ఆ చేపల్ని ఇతరులెవరైనా తీసుకోవాలంటే, వాటికి బదులుగా ఆ మనిషికి ఇంకేదైనా వస్తువు ఇవ్వాలి. అంటే, ఆ చేపల 'విలువ'ని ఆ మనిషికి చెల్లించాలి. ఆ చేపల 'విలువ' ఏమిటి? ఆ చేపలు సముద్రంలో నించి ఒడ్డు మీదకి రావడానికి ఎంత శ్రమైతే ఖర్చయిందో ఆ శ్రమే వాటి 'విలువ'. అంత శ్రమతో తయారైన ఇంకో వస్తువుని ఇస్తే, ఆ చేపల్ని తీసుకోవచ్చు.

ఇంతవరకూ చూసిన ఉదాహరణల ద్వారా 'వస్తువులు' ఎలా తయారవుతాయని చూశాం? — "మనుషుల శ్రమతో" అనవచ్చునా? అది, పూర్తి జవాబు అవదు. 'శ్రమ' అనే ఒక్క అంశంతోనే వస్తువులు తయారు అవవు. ప్రకృతి ఇచ్చే సహజ పదార్థం కూడా వుండాలి.

'చెక్కల' ఉదాహరణలో : మొదట 'అడవి చెట్టు' వుంది. అది, ప్రకృతి సహజ పదార్థం. దాని మీదే 'శ్రమ' జరిగింది. చెక్కలు తయారయ్యాయి. అడవి చెట్టే లేకపోతే? శ్రమ ఎక్కడ జరుగుతుంది? దేని మీద జరుగుతుంది?

'చేపల' ఉదాహరణలో : మొదట 'సముద్రంలో చేపలు' వున్నాయి. అది, ప్రకృతి సహజ పదార్థం. దాని మీద 'శ్రమ' జరిగింది. అప్పుడు 'ఒడ్డు మీద చేపలు' తయారయ్యాయి. మొదట సముద్రంలో చేపలే లేకపోతే? శ్రమ ఎక్కడ జరుగుతుంది? దేని మీద జరుగుతుంది?

'ప్రకృతి సహజ పదార్థం'మీద 'శ్రమ' జరిగితే 'వస్తువు' తయారవుతుంది. ఆ వస్తువు మీద ఇంకో శ్రమ జరిగితే, మొదటి వస్తువు ఇంకో వస్తువుగా మారుతుంది. ఏ వస్తువు సంగతైనా ఇలాగే.

'చెక్కల' ఉదాహరణలో : మొదటి చెట్టు 'తోటలో

చెట్టు' అయితే, అలాంటి ఉదాహరణలో, ప్రకృతి సహజ పదార్థం — భూమి! ముడిభూమి మీద కొంత మానవశ్రమ జరిగితే, చెట్టు (వస్తువు) పెరుగుతుంది. ఆ చెట్టు మీద (ఆ వస్తువు మీద) ఇంకా కొంత మానవశ్రమ జరిగితే, చెక్కలు (ఇంకో వస్తువు) తయారవుతాయి. ఆ చెక్కల మీద (ఆ వస్తువు మీద) ఇంకా కొంత శ్రమ జరిగితే కుర్చీ గానీ, బల్ల గానీ (ఇంకో వస్తువు) తయారవుతుంది.

**'దుప్పటి' సంగతి చూస్తే :**

అది కూడా ఇంతే. ప్రకృతి సహజ పదార్థం అయిన 'ముడిభూమి' మీద కొంత శ్రమ జరిగితే, పత్తి (వస్తువు) పండుతుంది. పత్తి మీద (ఆ వస్తువుమీద) ఇంకా కొంత శ్రమ జరిగితే, 'దారం' (ఇంకో వస్తువు) తయారవుతుంది. దారం మీద (ఆ వస్తువు మీద) ఇంకా కొంత శ్రమ జరిగితే, 'దుప్పటి' (ఇంకో వస్తువు) తయారవుతుంది. ఏ రకం వస్తువు విషయం అయినా ఇంతే!

**ఈ క్రమాన్ని ఇలా చూడవచ్చు :**

ప్రకృతి సహజ పదార్థమూ + శ్రమా = వస్తువు
( మేటర్ + లేబర్ = థింగ్ )
అడవి చెట్టూ + శ్రమా = చెక్క పలకలు
సముద్రంలో చేపలూ + శ్రమా = ఒడ్డు మీద చేపలు
వస్తువూ + శ్రమా = ఇంకో వస్తువు
చెక్క పలకలు అనే వస్తువూ + శ్రమా = కుర్చీ అనే వస్తువు
పత్తి అనే వస్తువూ + శ్రమా = దారం అనే వస్తువు
దారం అనే వస్తువూ + శ్రమా = బట్ట అనే వస్తువు
బట్ట అనే వస్తువూ + శ్రమా = చొక్కా అనే వస్తువు

ఈ రకంగా మనుషులు, ప్రకృతి సహజ పదార్థాల మీద, అంచెలంచెలుగా శ్రమలు చేస్తూ 'వస్తువులు' తయారు చేస్తారు. కుర్చీ అనే వస్తువు తయారైందంటే, దాని కోసం ఎన్ని శ్రమలు చెయ్యాలో అన్ని శ్రమలూ మనుషులు చేశారని అర్థం. అలాగే దుప్పటి విషయం కూడా. అలాగే ఏ వస్తువు విషయం అయినా కూడా.

ఇప్పటి వరకూ, 'వస్తువులు' అంటే ఏమిటో చూశాం.

ప్రకృతి సహజ పదార్థమూ + శ్రమా = వస్తువు — అని చూశాం. వస్తువులు ఆకాశంలో నించి వూడిపడవనీ, వాటిని మనుషులే చేస్తారనీ, చూశాం.

అలా తయారుచేసుకున్న వస్తువుల్ని మనుషులు 'మారకాలు' చేసుకుంటారు. ఇచ్చే వస్తువు విలువా, తీసుకునే వస్తువు విలువా 'సమానంగా' వుంటేనే 2 వస్తువులకు మారకం జరుగుతుంది. అయితే, విలువ అంటే ఏమిటి? — శ్రమే. వస్తువు కోసం ఖర్చయిన శ్రమే — వస్తువు విలువ.

విలువలు సమానంగా వుంటేనే మారకం జరుగుతుంది కాబట్టి, 2 వస్తువులకు 'మారకం' జరగాలంటే, ఆ వస్తువుల కోసం ఖర్చయిన శ్రమలు సమానంగా వున్నాయో లేవో తెలియాలి. అంటే, మారకాలు జరగాలంటే వస్తువుల కోసం ఖర్చయిన శ్రమల్ని కొలిచే మార్గం వుండాలి.

## 'శ్రమ'ని కొలిచే సాధనం :

'శ్రమ' ని కొలవడానికి కూడా ఒక సాధనం వుంది. 'కాలమే' — ఆ సాధనం.

ఒక మనిషి ఒక పని చేశాడంటే, ఆ పని 'ఎంత కాలం' చేశాడన్నదే శ్రమని కొలిచే మార్గం. ఎన్ని గంటలు చేశాడు? ఎన్ని రోజులు చేశాడు? ఎన్ని వారాలు చేశాడు? అదే శ్రమ కొలత. కాలమే — శ్రమని కొలిచే సాధనం.

'విలువ' అనేది — శ్రమ కాలమే. ఒక వస్తువు విలువ ఆ వస్తువు తయారవడానికి అవసరమైన 'మొత్తం శ్రమ కాలం'.

# ఒక వస్తువు కోసం 'ఖర్చయిన మొత్తం శ్రమ' అంటే ?

అడవిలో చెట్టుని చెక్కలుగా చెయ్యడానికి వెంకయ్య ఒక రోజు (పగలు 10 గంటలు) పని చేశాడనుకుందాం. వెంకయ్య, 1 రోజులో ఆ పని చేశాడు కాబట్టి, ఆ చెక్కల కోసం అవసరమైన శ్రమకాలం 'ఒక రోజు' (10 గంటలు) — అని అర్థమా? — కాదు. ఆ చెక్కలు తయారవడానికి అవసరమైన కాలం, వెంకయ్య పని చేసిన కాలం మాత్రమే కాదు. ఆ పనిలో వెంకయ్య కొన్ని 'పనిముట్లు' కూడా వాడి వుంటాడు. పనిముట్లు లేకుండా చెట్టుని కొట్టే పని వొట్టి చేతులతో ఎవరూ చెయ్యలేరు. వెంకయ్య తన పనిలో ఒక గొడ్డలీ, ఒక రంపమూ, ఒక తాడూ, ఉపయోగించాడనుకుందాం. ఆ పనిముట్లన్నీ అంతకుముందే తయారైవున్న 'వస్తువులు'. ఆ వస్తువులన్నీ కూడా మనుషులు చేసినవే. అంటే, శ్రమలతో తయారైనవే. ఆ పనిముట్లని వెంకయ్యా చేశాడా లేదా అనేది ఇక్కడ అనవసరం. వెంకయ్య, తన పనిలో (చెట్టుని కొట్టే పనిలో) వాడే పనిముట్లన్నీ ఆ పని పూర్తయ్యేటప్పటికి కొంత కొంత పాతబడిపోతాయి. అంటే, కొంత కొంత ఖర్చయి పోతాయి. పనిముట్లు ఖర్చవకుండా ఏ పనీ జరగదు. పనిముట్లు ఖర్చవడం అంటే, వాటిని తయారు చేసిన శ్రమ ఖర్చవడమే. కాబట్టి, వెంకయ్య వాడిన పని ముట్లకు సంబంధించి కూడా కొంత శ్రమకాలాన్ని, వెంకయ్య

పనిచేసిన కాలానికి కలపవలసి వుంటుంది. వెంకయ్య, తన పనిలో ఎక్కువ పనిముట్లే ఉపయోగించినా, ఇక్కడ మన ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, గొడ్డలి మాత్రమే ఉపయోగించాడనుకుందాం. అంటే, చెట్టుని కొట్టే పనిలో వెంకయ్య శ్రమే గాక, గొడ్డలి కూడా అవసరమైందని అర్థం. కాబట్టి, గొడ్డలి తయారవడానికి సంబంధించిన శ్రమని కూడా వెంకయ్య శ్రమకి కలపాలి.

**'గొడ్డలి' కి సంబంధించిన శ్రమ ఎలా వుంటుందో చూద్దాం:**

గొడ్డలి అనేది ఒక వస్తువు. అది అంతకుముందే తయారైవుంది. అది 'మొత్తం కొంత శ్రమ'తో తయారై వుంది. అది 'మొత్తం 2 రోజుల శ్రమ'తో (అంటే 20 గంటల శ్రమతో) తయారైందనుకుందాం. అది తన జీవితంలో (తన జీవిత కాలంలో) మొత్తం 20 చెట్లని కొట్టడానికి ఉపయోగపడుతుం దనుకుందాం. అంటే, ఆ గొడ్డలితో 20 చెట్లని కొట్టేటప్పటికి అది ఇక పనికిరాకుండా పాడై పోతుందనుకుందాం. అంటే, 20 చెట్లని కొట్టడానికి 1 గొడ్డలి ఖర్చవుతుందని (20 గంటల శ్రమ ఖర్చవుతుందని) అర్థం. కాబట్టి, ఆ గొడ్డలితో 1 చెట్టుని కొట్టినప్పుడు, ఆ పని కోసం, ఆ గొడ్డలికి సంబంధించి, 1 గంట శ్రమ ఖర్చవుతుంది. వెంకయ్య పని చేసిన 10 గంటల శ్రమకి, గొడ్డలికి సంబంధించిన '1 గంట శ్రమ' కూడా కలిస్తే, మొత్తం 11 గంటల శ్రమ. అంటే, ఆ చెక్కలు తయారవడానికి మొత్తం '11 గంటల శ్రమ' అవసరమైందన్నమాట! అంతేగానీ, ఆ చెక్కలు తయారవడానికి వెంకయ్య పనిచేసిన 10 గంటల శ్రమ మాత్రమే అవసరమైందని అర్థం కాదు.

ఈ విషయాన్ని అర్థం చేసుకోవడంలో ఒక పొరపాటులో పడే ప్రమాదం వుంది. ఏమిటంటే, "ఈ ఉదాహరణలో, వెంకయ్య పని చేసినంతసేపూ గొడ్డలి కూడా పని చేస్తుంది కదా? వెంకయ్య పని చేసినకాలం 10 గంటలూ, గొడ్డలి పని చేసినకాలం కూడా 10 గంటలూ, మొత్తం 20 గంటలు కదా?" — ఈ పద్ధతిలో ఈ శ్రమకాలం లెక్క వుండకూడదు. ఎందుకంటే, <u>పని చేసింది వెంకయ్యే గానీ గొడ్డలి కాదు.</u> గొడ్డలి — ఒక పనిముట్టు. అది, 'వస్తువు' కాబట్టి అది స్వయంగా పనిచెయ్యదు. మనిషే పనిముట్టుని పట్టుకుని పనిచేస్తాడు. వెంకయ్య, గొడ్డలితో 10 గంటలు పని చేశాడంటే, ఆ శ్రమ అంతా వెంకయ్య పడ్డ శ్రమే గానీ, గొడ్డలి పడ్డ శ్రమ కాదు. వెంకయ్యలాగే గొడ్డలి కూడా పనిచేసిందని అర్థం కాదు. వెంకయ్య శ్రమ చేసిన 10 గంటల కాలంలో, గొడ్డలి భాగం ఏమీ వుండదు.

అయితే, గొడ్డలి ఒక వస్తువు. అది తయారవడానికి కొంత శ్రమ అవసరమై వుంటుంది. ఆ వస్తువుని వెంకయ్య ఇప్పుడు ఒక పనిముట్టుగా వాడుకున్నాడు. వెంకయ్య చేసే పనిలో గొడ్డలి కొంత అరిగి ఖర్చవుతుంది కాబట్టి, ఆ పనిలో, గొడ్డలికి సంబంధించి కూడా కొంత శ్రమ ఖర్చవుతుందని అర్థం. గొడ్డలికి సంబంధించిన శ్రమని ఎలా లెక్క కట్టవలసి వుంటుందో ఇంతకుముందు చూసినదాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

వెంకయ్య తన పనిలో, గొడ్డలిని మాత్రమే గాక, ఇంకా 2, 3 రకాల పనిముట్లని కూడా ఉపయోగించి వుంటే, ఆ పనిముట్లకు సంబంధించిన శ్రమలు కూడా గొడ్డలి విషయంలో చూసిన పద్ధతిలోనే లెక్కకు వస్తాయి. కానీ, వెంకయ్య, గొడ్డలి అనే ఒక పనిముట్టుని మాత్రమే ఉపయోగించాడనుకున్నాం. కాబట్టి, ఈ ఉదాహరణలో, చెక్కలు తయారవడం కోసం అవసరమైన మొత్తం శ్రమకాలం 11 గంటలు మాత్రమే. (వెంకయ్య పని చేసినకాలం 10 గంటలూ + గొడ్డలికి సంబంధించిన కాలం 1 గంటా = 11 గంటలు).

ఒక వస్తువు తయారవడానికి నాలుగైదు దశలలో పనులు జరగాలనుకుంటే, ప్రతీ ఒక్క దశ సంగతీ ఇంతే. (1) ఆ దశలో అవసరమైన పనిముట్లకు సంబంధించిన శ్రమ కాలమూ, (2) ఆ పనిముట్లతో మనుషులు పని చేసే శ్రమ కాలమూ, ఈ రెండూ కలిసి, ఆ దశకు అవసరమయ్యే 'మొత్తం శ్రమ కాలం' అవుతుంది.

ఒక వస్తువు కోసం 5 దశలలో పనులు జరగాలనుకుంటే, ఆ 5 దశలలోనూ అవసరమయ్యే పనిముట్లకు సంబంధించిన శ్రమకాలాలూ, 5 దశలలోనూ మనుషులు పనిచేసిన శ్రమకాలాలూ కలిసి, ఆ వస్తువుకి అవసరమైన మొత్తం శ్రమ కాలం అవుతుంది.

ఇప్పుడు, 'కుర్చీ' కోసం అవసరమయ్యే 'మొత్తం శ్రమకాలాన్ని' చూద్దాం. కుర్చీని తయారు చెయ్యడానికి, 'చెక్క' కావాలి. చెట్టుని, చెక్క పలకలుగా మార్చే దశని ఇంతకుముందు చూశాం. ఇప్పుడు చెక్కని కుర్చీగా మార్చే దశని చూడాలి. ఒక కుర్చీని తయారుచెయ్యాలంటే, చెట్టుని కొట్టిన చెక్క పలకలన్నీ అక్కరలేదు. వాటిలో కొన్ని మాత్రమే చాలు. కుర్చీ కోసం ఎంత చెక్క కావాలో అంత చెక్కని మాత్రమే ఇక్కడ లెక్కలోకి తీసుకోవాలి. ఈ చెక్క, కుర్చీకి 'ముడి పదార్థం'గా వుంటుంది. చెక్కని కుర్చీగా తయారు చెయ్యడానికి, ఒక మనిషి, కొంత కాలం పనిచేస్తాడు. ఆ పనిలో కొన్ని పనిముట్లు వాడతాడు. కాబట్టి, కుర్చీకి అవసర మయిన మొత్తం శ్రమ ఎలా వుంటుందంటే, ముడి పదార్థంగా వున్న చెక్కకు సంబంధించిన శ్రమా, పనిముట్లకు సంబంధించిన శ్రమా, కుర్చీని చేసిన మనిషి శ్రమా — ఇవన్నీ కలిసి, కుర్చీ తయారవడానికి అవసరమైన 'మొత్తం శ్రమ' అవుతుంది.

కుర్చీకి ముడి పదార్థం 'చెక్క' ఒక్కటే కాదు. మేకులూ, రంగులూ, వార్నిష్ లాంటివి కూడా ముడి పదార్థాల కిందకే వస్తాయి. రంపమూ, బ్రష్షులూ లాంటివి — పనిముట్లు.

( ' ముడి పదార్థం' అంటే ఏమిటీ, ' పనిముట్లు' అంటే ఏమిటీ——అనే విషయాల గురించి ఈ సంపుటంలోనే 2 వ భాగంలో, 'లాభం' చాప్టర్‌లో చాలా వివరంగా చూస్తాము.)

కుర్చీకి అవసరమైన మొత్తం శ్రమ ఎలా వుందో ఒక ఉదాహరణ చూద్దాం:

| | | గం-ని |
|---|---|---|
| (1) | చెక్కా, మేకులూ, వార్నిష్ వంటి ముడి పదార్థాలకు సంబంధించిన శ్రమ కాలాలు | 0. 45 |
| (2) | రంపం వంటి పనిముట్లు ........................ | 0. 15 |
| (3) | చెక్కని కుర్చీగా చేసి, వార్నిష్ వేసే వరకూ, మనిషి పని చేసిన కాలం ........................ | 2. 00 |
| | కుర్చీకి అవసరమైన మొత్తం శ్రమ ........... | 3. 00 |

ఈ మొత్తం 3 గంటల శ్రమే కుర్చీ — 'విలువ'.

ఇప్పుడు, '**దుప్పటి**' సంగతి :

దారమే దుప్పటిగా మారుతుంది కాబట్టి, 'దారం' దగ్గిర్నించే తీసుకుందాం. ఆ దారాన్ని తయారుచేసిన 'పత్తి'నీ, ఆ పత్తిని తయారుచేసిన 'వ్యవసాయ శ్రమ'నీ — ఇలా వెనక్కి వెనక్కి వెళ్ళనక్కరలేదు. ఆ శ్రమలన్నీ కలిసి 'దారం'లోనే వుంటాయి. కాబట్టి, 'దారం' నించి చూద్దాం. ఇది సాదా దుప్పటి. రంగులు లేవనుకుందాం. రంగులు వుంటే, ఆ శ్రమ కూడా కలుస్తుంది. అంతే తేడా!

| | గం-ని |
|---|---|
| (1) 'దారం' శ్రమ కాలం .......................... | 1. 30 |
| (2) 'మగ్గం' లాంటి పనిముట్లు ................ | 0. 30 |
| (3) దారాన్ని దుప్పటిగా నెయ్యడానికి మనిషి పనిచేసిన కాలం | 1. 00 |
| దుప్పటికి మొత్తం శ్రమ | 3. 00 |

ఈ మొత్తం 3 గంటల శ్రమే — దుప్పటి 'విలువ'.

ఈ కుర్చీకీ, దుప్పటికీ 'మారకం' జరగవలసి వుంటే, కుర్చీ కోసం అవసరమైన మొత్తం శ్రమ — కుర్చీ 'విలువ'గానూ, దుప్పటి కోసం అవసరమైన మొత్తం శ్రమ — దుప్పటి 'విలువ'గానూ, లెక్కకు వస్తాయి. ఈ ఉదాహరణలో, కుర్చీ శ్రమ కాలమూ, దుప్పటి శ్రమ కాలమూ సమానంగా వున్నాయి కాబట్టి, ఈ 2 వస్తువులకూ మారకం సాధ్యమవు తుంది.

' విలువ' అనేది శ్రమే! ఒక ' వస్తువు'కి వున్న ' విలువ' ఆ వస్తువు కోసం అవసరమైన మొత్తం శ్రమ!

'వస్తువు' తయారవడానికి 'శ్రమ' మాత్రమేగాక, 'ప్రకృతి సహజ పదార్థం' కూడా కావాలని చూశాం. 'విలువ' అనేది, 'శ్రమ' మాత్రమే అయితే, మరి ఆ 'పదార్థం' మాటేమిటి? దానికేమీ 'విలువ' లేదా? —లేదు. అడవిలో చెట్టుకి విలువ ఎందుకు వుండదో వివరంగానే చూశాం. ఏ వస్తువుని తీసుకున్నా, దాని కోసం అవసరమయ్యే ముడి పదార్థానికీ, పనిముట్లకీ సంబంధించిన శ్రమల్ని తీసివేస్తూ వెనక్కి వెనక్కిపోతే, చివరికి, ఒక చోటకి, 'శ్రమ లేకుండా తయారై వున్న సహజ పదార్థం' దగ్గిరికి, వెళ్తాం. ఆ సహజ పదార్థానికి విలువ వుండదు. ఆ పదార్థం మీద, తర్వాత జరుగుతూ వచ్చిన శ్రమలన్నిటివల్లా, మన వస్తువు (కుర్చీ గానీ, దుప్పటి గానీ) తయారవుతుంది. సహజ పదార్థం మీద శ్రమలన్నీ కలిసిన మొత్తమే, ఆ వస్తువుకి విలువ అవుతుంది. అంటే, వస్తువు కోసం ఏ సహజ పదార్థం అవసరమైనా, ఆ పదార్థానికి 'విలువ' వుండదు.

ఉపయోగపు విలువ = సహజ పదార్థమూ + శ్రమ

విలువ = O + శ్రమ

ఈ విషయాలకు సంబంధించి, ఇంకా ముందు ముందు అనేక వివరాలు చూస్తాము.

ఇక్కడ మన ఉదాహరణకి తిరిగి వద్దాం.

కుర్చీ విలువ — కుర్చీ కోసం అవసరమైన శ్రమ.

దుప్పటి విలువ— దుప్పటి కోసం అవసరమైన శ్రమ.

ఏ వస్తువు సంగతైనా ఇంతే! నూట పాతిక అంతస్తుల మహా భవనం అయినా, బ్రహ్మాండమైన ఓడ అయినా, చంద్రమండలానికి పోయే రాకెట్టు అయినా, ఇంకెంత పెద్ద వస్తువు అయినా, దాని విలువ అంతా దాన్ని తయారు చెయ్యడానికి అవసరమైన మొత్తం శ్రమదే!

1 కిలో పత్తికి కొంత విలువుందనుకుంటే, ఆ పత్తితో తయారైన దారానికి ఇంకా కొంత ఎక్కువ విలువ వుంటుంది. ఎందుకంటే, పత్తి విలువకి, ఆ పత్తిని దారంగా మార్చే శ్రమ కూడా కలిసి, అది దారం విలువ అవుతుంది. అంటే, పత్తి విలువ కన్నా దారం విలువ ఇంకా పెరుగుతుంది. ఆ దారం విలువకన్నా ఆ దారంతో తయారైన బట్ట విలువ ఇంకా పెరుగుతుంది. ఆ బట్ట విలువకన్నా ఆ బట్టతో తయారైన దుస్తుల విలువ మరీ పెరుగుతుంది. ఈ రకంగా, మొదటి పదార్థానికి కొత్త కొత్త శ్రమలు చేరుతూవున్న కొద్దీ ఆ వస్తువు 'విలువ' ఎక్కువవుతూ వుంటుంది. ఎందుకంటే, ఆ వస్తువు కోసం ఖర్చయ్యే శ్రమకాలం ఎక్కువవుతూ వుంటుంది గనక.

విలువ అనేది శ్రమే కాబట్టి, 'విలువ పరిమాణాన్ని' నిర్ణయించడంలో శ్రమ పరిమాణం, 'ప్రకృతి నియమం' అంత సహజమైన నియమంగా వుంటుంది. అంటే, ఎక్కువ శ్రమతో తయారైన సరుకుకి ఎక్కువ విలువా, తక్కువ శ్రమతో తయారైన సరుకుకి తక్కువ విలువా — వుంటాయి. ఈ రకంగా, 'శ్రమ పరిమాణం' అనేది, విలువ పరిమాణాన్ని నిర్ణయించే 'ప్రకృతి నియమమే'!

# ' సామాజిక' శ్రమ కాలం, లేదా ' సగటు' శ్రమ కాలం

వస్తువు తయారవడానికి పట్టే శ్రమ కాలం ఎక్కువైతే వస్తువు విలువ ఎక్కువవుతుంది. శ్రమ కాలం తగ్గితే వస్తువు విలువ తగ్గుతుంది.

ఇక్కడ ఒక ప్రశ్న వచ్చే అవకాశం వుంది. సోమరిగా పనిచేసే వ్యక్తి, ఒక వస్తువుని ఎక్కువకాలం పాటు చేస్తాడు కాబట్టి, ఆ వస్తువు విలువ ఎక్కువవుతుందా? చురుగ్గా పనిచేసే మనిషి తక్కువ కాలంలోనే ఆ పని ముగిస్తాడు కాబట్టి, అతని వస్తువుకి విలువ తగ్గుతుందా? — ఇలా జరిగితే, ఇది సరైనదేనా?—ఇదీ ప్రశ్న.

మొదట, వెంటనే దీనికి జవాబు — "అలా జరగదు" అని. అలా ఎందుకు జరగదో ఇప్పుడు వివరంగా చూద్దాం.

ఒక వస్తువు కోసం అవసరమయ్యే శ్రమ కాలం అనేది, ఒక వ్యక్తి 'చురుకుదనం'మీదో, 'సోమరితనం'మీదో ఆధారపడి వుండదు. ఒక పని జరగడానికి అవసరమయ్యే కాలం, ఆ పనిచేసే మనుషుల సగటు నైపుణ్యాన్ని బట్టీ, ఆ పనికి సంబంధించి ఆ నాడు వున్న పనిముట్ల కనీస సామర్థ్యాల్నిబట్టీ, వుంటుంది. ఒకే రకం పనిచేసే మనుషుల్లో కొందరు చురుగ్గా చెయ్యవచ్చు, కొందరు కొంత మందగొడిగా చెయ్యవచ్చు. కొందరు మధ్యరకంగా చెయ్యవచ్చు. మనుషుల శక్తిసామర్థ్యాలలో ఆ రకం తేడాలు తప్పనిసరిగా వుంటాయి గనక, ఒక పని కోసం అవసరమయ్యే కాలం, ఎవరో ఒక్క వ్యక్తి శక్తి సామర్థ్యాల్ని బట్టి వుండదు. 'సగటు' పరిస్థితుల్నిబట్టి మాత్రమే వుంటుంది. ఒకే రకం పనిచేసే మనుషుల్లో ఎక్కువ మంది మనుషులు, ఆ పనిని, సాధారణంగా ఎంత కాలంలో చెయ్యగలరో ఆ కాలమే ఆ పనికి అవసరమయ్యే 'సగటు' శ్రమకాలం, లేదా 'సామాజిక శ్రమకాలం'. (సోషల్లీ నెససరీ లేబర్ టైమ్). 'సామాజిక' అంటే 'సమాజానికి సంబంధించిన' అని అర్థం. అంటే, 'ఒక విడి వ్యక్తికి సంబంధించినది' గాక, 'అందరికీ సంబంధించినది' అని అర్థం. ఇక్కడ 'అందరికీ' అంటే, 'ఆ శ్రమ చేసే వారందరికీ' అని. 'సామాజిక శ్రమకాలం' అన్నా, 'సగటు శ్రమకాలం' అన్నా ఒకటే.

ఒక వస్తువు తయారవడానికి, కొన్ని దశల్లో కొన్ని రకాల శ్రమలు కావాలనుకుంటే, వాటిలో ఏ దశలో కావలసిన శ్రమ విషయం అయినా ఇంతే. ఆ శ్రమకు సంబంధించిన సగటు పరిస్థితుల్నిబట్టే, ఆ దశలో కావల సిన శ్రమకాలం వుంటుంది.

'1 గజం బట్ట సామాజిక శ్రమకాలం 1 గంట' అన్నప్పుడు, ఆ బట్టని ఉత్పత్తి చేసిన మనుషులు, ఏ దశలో ఎలాంటి పనిముట్లతో పని చేశారో ఆ వివరాలేవీ తెలియ నక్కరలేదు. అంటే, పత్తిని పండించడం కోసం భూమిని దున్నేపని నాగళ్ళతో చేశారా, ట్రాక్టర్లతో చేశారా? దారాన్ని బట్టగా చేసే నేతపని, చేతి మగ్గంతో చేశారా, కరెంటు మగ్గంతో చేశారా? — ఇలాంటి వివరాలేవీ అక్కడ తెలియ నక్కరలేదు. అప్పుడు సమాజంలో, ఏ రకం పనిముట్లు వున్నాయో ఆ రకం పనిముట్లతోనే ఆ పనులు జరిగాయనీ, అప్పుడు వున్న పనిముట్లతోనే అంత బట్టకి, మొత్తం అంత శ్రమకాలం అవసరమయిందనీ అర్థం.

విద్యుచ్ఛక్తి ని కనిపెట్టని కాలంలో, కరెంటుతో నడిచే మిల్లులు లేని కాలంలో, చేనేత మగ్గాల మీదే బట్టలు నేసే కాలంలో, 100 గజాల బట్ట నెయ్యడానికి ఎంతకాలం పట్టేదో, కరెంటు మిల్లులు వున్న రోజుల్లో అంత కాలం పట్టదు. అంటే, చేనేత మగ్గాల మీదే పూర్తిగా బట్టలు నేసే సమాజమూ, కరెంటు మిల్లులతో బట్టని తయారుచేసే సమాజమూ, ఒక్కలాంటివి కావు.

చేనేత మగ్గాల సమాజంలో 1 గజం బట్ట తయారీకి అవసరమయ్యేకాలం ఆ బట్టకు సంబంధించిన 'సామాజిక (సగటు) శ్రమ కాలం' అయితే, కరెంట్ మిల్లుల సమాజంలో 1 గజం బట్ట తయారీకి అవసరమయ్యే కాలం, రెండో సమాజపు 'సామాజిక (సగటు) శ్రమకాలం' అవుతుంది.

ఒక సమాజ పరిస్థితుల్లో ఒక పని జరగడానికి ఇంతకాలం అవసరం — అనే సగటు స్థాయి ఒకటి వుండగా, ఆ సగటు స్థాయికన్నా చురుగ్గానో, మందగొడిగానో పనిచేసే మనుషులు, తమ చురుకుదనాల, మందగొడితనాల ఫలితాల్ని తమ వ్యక్తిగత స్థాయిలోనే పొందుతారు. ఎలాగంటే : దుప్పటి విషయం తీసుకుందాం. దుప్పటి కోసం అవసరమయ్యే మొత్తం శ్రమకాలం 3 గంటలు అనుకుందాం. అందులో, నేత మనిషి చెయ్యవలసిన శ్రమకాలం 1 గంట అనుకుందాం. (మిగిలిన శ్రమంతా కలిసి 2 గంటలు). ఒక నేతమనిషి, ఆ దుప్పటిని 1 గంటలోనే నెయ్యగలిగితే, ఆ పనిని అతను ఎంతసేపట్లో చెయ్యాలో అంత సేపట్లోనే చేసినట్టు లెక్క. అలా జరిగితే, అతని దుప్పటికి మొత్తం 3 గంటల శ్రమకాలం మాత్రమే ఖర్చవుతుంది. అతను దాన్ని ఇంకో వస్తువుతో మార్చుకున్నప్పుడు, ఆ దుప్పటికి బదులుగా అతనికి 3 గంటల శ్రమకాలం గల ఇంకో వస్తువు (కుర్చీ) వస్తుంది. ఆ 2 వస్తువులకూ సరిపోతుంది. కానీ, ఒక మందగొడి నేతమనిషి, 1 గంటలో చెయ్యవలసిన పనిని

2 గంటలసేపు చేశాడనుకుందాం. ఈ లెక్కన చూస్తే అతని దుప్పటి కోసం మొత్తం 4 గంటల శ్రమ జరిగినట్టు అవుతుంది. ఆ దుప్పటిని కుర్చీతో మార్చుకుంటే, ఆ దుప్పటిలో 4 గంటల శ్రమ వుంది కాబట్టి, ఆ దుప్పటికి బదులుగా అతనికి 1 కుర్చీ వచ్చి, ఇంకో చిన్న పీట కూడా వస్తుందా? — అలా జరగదు. 1 దుప్పటికి బదులుగా 1 కుర్చీ రావాలన్నదే అప్పటి నియమం కాబట్టి, తన నేత పనిని 1 గంట లోనే పూర్తి చేసిన మనిషికైనా 2 గంటల్లో పూర్తి చేసిన మనిషికైనా ఒకే రకంగా, 1 దుప్పటికి బదులుగా 1 కుర్చీయే వస్తుంది. అంటే, మందగొడి మనిషి చేసిన 2 గంటల నేత శ్రమ, 1 గంట నేత శ్రమగా మాత్రమే లెక్కకు వస్తుందన్న మాట. 1 గంటలో చెయ్యవలసిన పనిని 2 గంటల్లో చేసినందువల్ల, ఆ మనిషి, 1 గంట శ్రమకి ఏ ఫలితమూ లేకుండా ఆ కాలాన్ని పోగొట్టుకుంటాడు. మందగొడిగా పనిచేసే మనిషికి వచ్చే ఫలితం అలా వుంటుంది.

ఇప్పుడు చురుకైన నేత మనిషి సంగతి చూద్దాం. ఇతను దుప్పటినేత పని అరగంటలోనే చేశాడనుకుందాం. ఈ లెక్కన చూస్తే, ఇతని దుప్పటి కోసం $2\frac{1}{2}$ గంటల శ్రమ మాత్రమే జరిగినట్టు తేలుతుంది. ఈ దుప్పటిని కుర్చీతో మార్చుకోదలిస్తే, కుర్చీలో 3 గంటల శ్రమ వుంది కాబట్టి, ఈ దుప్పటికి బదులుగా కుర్చీ రాదా? — అలా జరగదు. ఈ దుప్పటికి కూడా కుర్చీ వస్తుంది. అంటే, ఇతని దుప్పటి కూడా 3 గంటల శ్రమగల వస్తువులాగే లెక్కకు వస్తుంది. అంటే, అందులో వున్న అరగంట నేత శ్రమే, గంట శ్రమగా లెక్కకు వస్తుందన్న మాట. నేతమనిషి చురుగ్గా పనిచేయడంవల్ల, ఒక అరగంట శ్రమ చెయ్యకుండానే దాని ఫలితం పొందాడు.

ఈ రకంగా, ఒక పని జరగడానికి 1 గంట కాలం పట్టడం అనేది సగటు శ్రమకాలంగా వుండగా, ఒక మనిషి ఆ పనిని ఆ సగటు కాలంకన్నా ఎక్కువసేపు చేసినా, ఆ కాలం ఎక్కువ కాలంగా లెక్కకు రావడంగానీ, ఆ పని విలువ పెరగడంగానీ జరగదు. అలాగే, ఆ పనిని, సగటు కన్నా తక్కువ కాలంలోనే పూర్తిచేస్తే, అది తక్కువ కాలంగా లెక్కకు రావడంగానీ, దాని విలువ తగ్గడంగానీ జరగదు. చెయ్యవలసిన పనిని త్వరగా చేశారా, ఆలస్యంగా చేశారా అనేది, చేసే మనిషి వ్యక్తిగత సామర్థ్యం. దాని ఫలితాల్ని ఆ వ్యక్తే పొందుతాడు.

'శ్రమకాలం ఎక్కువ అయితే ఎక్కువ విలువా, తక్కువ అయితే తక్కువ విలువా' — అన్నప్పుడు, ఆ ఎక్కువ తక్కువలు 'సగటు'ని బట్టే వుండాలి. 'సగటు' కన్నా ఎక్కువ శ్రమ వుంటే ఎక్కువ విలువా, తక్కువ శ్రమ వుంటే తక్కువ విలువా. అంతేగానీ, 'సగటు' కన్నా — ఆలస్యంగా చేస్తే ఎక్కువ విలువా, తొందరగా చేస్తే తక్కువ విలువా — అని అర్థం కాదు. పని ఆలస్యంగా చేస్తే, అందులో కొంత కాలం విలువ రాకుండా వృథా అవుతుంది. తొందరగా చేస్తే, తక్కువకాలమే ఎక్కువ విలువగా అవుతుంది. ఈ రకంగా, చురుకుదనానికి మంచి ఫలితమూ, మందగొడితనానికి చెడ్డ ఫలితమూ సహజంగానే అందుతాయి.

'ఒక వస్తువు' కోసం అవసరమయ్యే సగటు శ్రమకాలం అనేది, అదే రకం పనిచేసే వారిలో ఎక్కువ మంది దాన్ని ఎంత కాలంలో చేస్తారో దాన్ని బట్టి వుంటుంది.

ఈ 2 ఉదాహరణలకూ తేడా ఏమిటి?

1) 1 గజం బట్టకి, సగటు శ్రమకాలం 1 గంట.

2) 1 గజం బట్ట 'నేత'కి, సగటు శ్రమకాలం 40 ని॥

మొదటి ఉదాహరణలో — బట్ట కోసం అవసరమయ్యే 'మొత్తం శ్రమ' గురించి చూస్తున్నాం. అందులో — ముడి పదార్థం శ్రమా, పనిముట్ల శ్రమా — అన్నీ కలిసి వుంటాయి. అది, సగటున 1 గంట.

రెండో ఉదాహరణలో — దారాన్ని బట్టగా నేసే – మనిషి శ్రమని మాత్రమే చూస్తున్నాం. ఇక్కడ, దారంలో శ్రమనీ, పనిముట్లలో శ్రమనీ కలపడం లేదు. ఈ నేత శ్రమకాలం 40 నిమిషాలు. ఇది కూడా సగటే.

ఉదాహరణలో ఏ అంశాన్ని తీసుకున్నా, దానికి ఒక 'సగటు శ్రమకాలం' వుంటుంది.

'శ్రమకాలం' అనే మాటని ప్రతిసారీ 'సగటు శ్రమకాలం' అనో, 'సామాజిక శ్రమకాలం' అనో అనక్కరలేదు. 'శ్రమ కాలం' అన్నప్పుడల్లా, దానికి ఏ విశేషణాలూ లేకపోయినా, దాన్ని 'సగటు శ్రమకాలం' అనే అర్థంతోనే తీసుకోవాలి.

'విలువ'ని నిర్ణయించేది, 'మొత్తం శ్రమకాలమే' అని చూశాం. ఎక్కువ శ్రమతో తయారయ్యే వస్తువు విలువ— ఎక్కువ. తక్కువ శ్రమతో తయారయ్యే వస్తువు విలువ — తక్కువ.

ఇతర వస్తువులతో పోల్చినప్పుడు, బంగారం విలువ చాలా ఎక్కువగా వుండడానికి కారణం, ఇతర వస్తువుల కోసం కన్నా బంగారం కోసం ఎక్కువ శ్రమకాలం పట్టడమే.

వజ్రాల విలువ, బంగారం విలువకన్నా కూడా ఇంకా చాలా ఎక్కువగా వుంటుంది. ఎందుచేత? — వజ్రాల ఉత్పత్తికి ఇంకా చాలా ఎక్కువ కాలం పడుతుంది గనక. వజ్రాలు కూడా బొగ్గుల్లాగ కుప్పలు కుప్పలుగా దొరికేవి అయితే, వాటి విలువ కూడా బొగ్గుల విలువలా మాత్రమే వుండేది. అపారమైన శ్రమకాలాన్ని ఖర్చుచేసి గనులలో తవ్వకం పనిచేస్తే చాలా తక్కువ వజ్రాలు దొరుకుతాయి. ఆ శ్రమకాలం అంతా ఆ తక్కువ వజ్రాలకే అవసరమైన శ్రమ కాలంగా వుండి, ఒక్కొక్క వజ్రం విలువ చాలా ఎక్కువగా వుంటుంది.

'వజ్రాల విలువ చాలా ఎక్కువగా ఎందుకు వుంటుంది?' అనే ప్రశ్నకి జవాబు — 'వజ్రాలు చాలా తక్కువగా దొరుకుతాయి కాబట్టి' అనా?— కాదు. ఈ

జవాబు అసలు కారణాన్ని చెప్పదు. 'అసలు కారణం' ఏమిటి? విలువ ఎక్కువో తక్కువో అయ్యేది శ్రమకాలాన్ని బట్టే కాబట్టి, 'శ్రమ'ని చూపించే కారణాన్నే సూటిగా చెప్పాలి. "వజ్రానికి ఎక్కువ శ్రమ పడుతుంది కాబట్టి, ఎక్కువ విలువ" అని చెప్పాలి. "వజ్రాలు తక్కువగా దొరుకుతాయి కాబట్టి" అని చెప్తే, ఆ జవాబులో శ్రమ ప్రసక్తి లేదు. ఆ జవాబు వల్ల, "తక్కువగా దొరికితే మాత్రం విలువ ఎక్కువగా ఎందుకు వుండాలి?" అని మళ్ళీ ఒక ప్రశ్న వస్తుంది. అప్పుడైనా, "ప్రతీ వజ్రానికీ ఎక్కువ శ్రమ పడుతుంది" అనే కారణం దగ్గిరికే రావలసివస్తుంది. కాబట్టి, "వజ్రాల విలువ ఎక్కువగా ఎందుకు వుంటుంది?" అనే ప్రశ్నకి, "ఎక్కువ శ్రమ పడుతుంది కాబట్టి" అనేది సరియైన జవాబు. ఇతర వస్తువుల సంగతి కూడా ఇలాగే. వస్తువుల్ని తయారు చెయ్యడానికి అవసరమయ్యే శ్రమల్లో తేడాలే ఆ వస్తువుల విలువల్లో తేడాలకు కారణం.

## 'శ్రమ' ఎక్కడ ఉంటుంది?

'ఒక వస్తువు కోసం కొంత శ్రమ ఖర్చయింది' అన్నప్పుడు ఆ శ్రమ, ఆ వస్తువు శరీరంలోకి చేరిందని అర్థమా? వస్తువుని చీల్చి చూస్తే అందులో 'శ్రమ' కనపడుతుందా? ఒక ప్రాణి శరీరంలో 'రక్తం' వున్నట్టు, ఒక వస్తువు శరీరంలో శ్రమ వుంటుందా? — అలా వుండదు. ఒక వస్తువు కోసం కొంత శ్రమ పట్టింది — అన్నప్పుడు, ఆ వస్తువుని తయారు చెయ్యడానికి మొత్తం అంత సేపు శ్రమ చెయ్యవలసి వచ్చిందని అర్థమే గానీ, శ్రమ ఆ వస్తువులోకి చేరిందని అర్థం కాదు. వస్తువుని తయారు చెయ్యడానికి జరిగిన శ్రమ, వస్తువు శరీరంతో సహజ సంబంధం లేని బయట విషయం. అలా అని వస్తువుకీ, శ్రమకీ ఏ రకమైన సంబంధమూ లేదని అర్థం కాదు. శ్రమ అనేది వస్తువు శరీరంలోకి చేరే అంశం కాకపోయినా, ఆ శ్రమ ఆ వస్తువుని తయారు చెయ్యడం కోసమే జరిగింది కాబట్టి, ఆ రకంగా ఆ వస్తువుకి ఆ శ్రమతో తప్పనిసరి సంబంధం వున్నట్టే అర్థం. అంటే, శ్రమ అనేది, వస్తువుతో ఒక కోణంలో సంబంధంలేని విషయం గానూ, ఇంకో కోణంలో సంబంధంవున్న విషయంగానూ వుంటుంది. శ్రమ, వస్తువు శరీరంలో వుండదు కాబట్టి, ఆ కోణంలో అది వస్తువుతో సంబంధంలేని విషయం. కానీ, ఆ శ్రమ ఆ వస్తువు కోసమే జరిగింది కాబట్టి ఆ కోణంలో అది వస్తువుతో సంబంధంగల విషయం.

కుర్చీని తయారు చెయ్యడానికి మొత్తం 3 గంటల శ్రమ అవసరమైంది — అన్నప్పుడు, ఈ '3 గంటల శ్రమ' అనేది కుర్చీ శరీరానికి బయటి విషయం. ఈ 3 గంటల శ్రమనే 'విలువ' అన్నప్పుడు, ఆ 'విలువ' కుర్చీ శరీరానికి బయటి విషయం. అంటే, 'విలువ' అనేది వస్తువు శరీరానిది కాదు, దాని కోసం జరిగిన శ్రమది! ఎంత పెద్ద వస్తువు విషయం అయినా ఇంతే. బంగారాన్ని తీసుకున్నా, వజ్రాన్ని తీసుకున్నా వాటి విలువలు వాటి శరీరాలవి కావు. వాటి కోసం జరిగిన శ్రమలవే!

వస్తువుల్ని మారకాలు లేకుండానే వాడుకుంటా మనుకుందాం. అప్పుడైతే ఆ వస్తువులు తయారవడానికి శ్రమ అక్కరలేదా? ముందు, వస్తువు తయారవుతుంది. ఆ తర్వాతే మారకం సంగతి. మారకం జరిగినా, జరగకపోయినా, వస్తువు తయారవ్వాలంటే, అది శ్రమతోటే జరుగుతుంది. మారకం జరిగితే ఆ శ్రమే— విలువగా లెక్కకు వస్తుంది.

ఒక వ్యక్తి ఒక వస్తువుని తయారుచేసి దాన్ని తనే వాడుకున్నా, లేదా ఎవరికైనా వూరికే ఇచ్చినా, దాని 'విలువ' ప్రసక్తి వుండదు. ఆ వస్తువుని ఇంకో వస్తువుతో మారకం చేసుకోదల్చినప్పుడు మాత్రమే, లేదా ఆ వస్తువు విలువ ఎంత వుంటుందో తెల్సుకోదల్చినప్పుడు మాత్రమే, దాని 'విలువ' ప్రసక్తి వస్తుంది.

విలువ అంటే శ్రమే కాబట్టి, శ్రమతో తయారైన పదార్థానికీ, శ్రమలేని పదార్థానికీ మధ్య మారక సంబంధం ఏర్పడదు. ఉదా॥ రామయ్యా, సోమయ్యా నదిలో స్నానం చేస్తున్నారు. రామయ్య చేతికి ఒక బంగారపు ఉంగరం వుంది; ఆ ఉంగరాన్ని తన కివ్వమని దానికి బదులు ఏదైనా ఇస్తాననీ సోమయ్య అన్నాడు. దానికి రామయ్యా ఒప్పుకున్నాడు. ఇప్పుడు సోమయ్య, రామయ్యకు ఏం ఇవ్వాలి?

"నీ ఉంగరానికి బదులు ఈ నదిలో నీళ్ళు తీసుకో. ఆ ఉంగరం నా కియ్యి," అంటాడా సోమయ్య? ఆ నదిలో నీళ్ళు సోమయ్యవా రామయ్య కివ్వడానికి? నదిలో నీళ్ళు తీసుకోవాలంటే రామయ్య తన ఉంగరం ఇవ్వకుండానే తీసుకోవచ్చు కదా?

నదిలో నీళ్ళు మానవ శ్రమతో తయారైనవి కావు. కాబట్టి, వాటికి విలువ వుండదు. విలువలేని నది నీళ్ళకీ, విలువ ఉన్న ఉంగరానికీ, మారకం జరగదు. ఆ నదిలో నీళ్ళే రామయ్య ఇంటిలోకి వస్తే, వాటికి కొంత విలువ ఏర్పడుతుంది.

రామయ్య ఆ నదికి దూరంగా ఒక ఇల్లు కట్టుకున్నా డనుకుందాం. ఇల్లు కట్టడానికి కావలసిన నీళ్ళన్నీ సోమయ్య ఈ నది నించి రామయ్య ఇంటికి మోసి పెట్టాడనుకుందాం. అలా కొంత కాలం నీళ్ళు మోస్తే, ఆ నీళ్ళకీ, రామయ్య ఉంగరానికీ, మారకం జరగవచ్చు.

సోమయ్య, ఒక్క బిందెడు నీళ్ళు మాత్రమే రామయ్య ఇంటికి తెచ్చి పెట్టాడనుకుందాం. ఆ నీళ్ళ కోసం రామయ్య సోమయ్యకి కొంచెం అన్నమో, బియ్యమో, కాసిన్ని పాలో, కూరగాయలో ఏదో ఒక తక్కువ విలువగల సరుకు ఇచ్చి ఆ నీళ్ళ విలువని చెల్లిస్తాడు. అంతేగానీ, ఒక బిందెడు నీళ్ళ కోసం

రామయ్య, సోమయ్యకు తన బంగారపు ఉంగరం ఇస్తాడా? ఒక బిందెడు నీళ్ళ విలువ బంగారపు ఉంగరం విలువకు సరిపోదు. అందుచేత, ఒక మారకం జరిగిందంటే, అందులో రెండు ముఖ్య విషయాలు వుంటాయి. (1) 2 వస్తువులూ 'విలువ' గలవిగానే, అంటే శ్రమతో తయారైనవిగానే వుంటాయి. (2) 2 వస్తువులూ, 'సమాన విలువలు' గలవి గానే, అంటే 'సమాన శ్రమలు' గలవిగానే వుంటాయి.

ఒక వ్యక్తి తను తయారు చేసుకున్న వస్తువుని తనే వాడుకుంటే, తన శ్రమని తనే వాడుకున్నాడని అర్థం. లేదా, తన వస్తువుని ఇంకొకరికి ఇచ్చి ఇంకొకరి వస్తువుని తను తీసుకుంటే తన 'శ్రమ'ని ఇంకొకరికి ఇచ్చి ఇంకొకరి 'శ్రమ'ని తను తీసుకున్నాడని అర్థం.

ఒక 'మారకం' జరిగినప్పుడల్లా, ఇటు శ్రమ అటూ, అటు శ్రమ ఇటూ మారాయని అర్థం.

# ఈ చాప్టరుకి సంబంధించిన కొన్ని ప్రశ్నలూ – జవాబులూ

[ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పగలిగితేనే ఇంత వరకూ చదివిన విషయాలు అర్థం చేసుకున్నట్టు అవుతుంది. జవాబులు చెప్పలేకపోతే ఈ పాఠంలో విషయాలు అర్థం కాలేదన్నమాటే. పాఠం మళ్ళీ చదువుకోవాలి.

'ప్రశ్నల' కింద 'జవాబులు' కూడా వున్నాయి. కానీ, ఒక ప్రశ్నని చదివాక, దాని కిందవున్న జవాబుని చదవకుండా, జవాబుని మీరే చెప్పుకోడానికి ఆలోచించండి! ఆ తర్వాత, మీ జవాబు సరిగా వుందో లేదో తెలుసుకోవడానికి, ప్రశ్న కింద వున్న జవాబుని చూడండి! చాప్టరులో వున్న పాఠాన్ని సరిగా అర్థం చేసుకుని, కావలసినచోట పాఠంలో మళ్ళీ ఒకసారి చూస్తే, జవాబులు చెప్పుకోవడం ఎంతో తేలిక!]

**1. 'మారకం' అంటే ఏమిటి? దాని అవసరం ఏమిటి?**

**జ:** 'మారకం' అంటే, ఒక వస్తువుని ఇచ్చి, దానికి బదులుగా ఇంకో వస్తువుని తీసుకోవడం. అప్పుడు, ఆ 2 వస్తువులకూ మారకం జరిగిందని అర్థం. 'మారకం'తో అవసరం ఏమిటంటే—జీవించడానికి కావలసిన అన్ని రకాల వస్తువుల్నీ ఎవరికివాళ్ళే తయారు చేసుకోలేరు. కానీ, ప్రతీ వ్యక్తికీ, అనేక రకాల వస్తువులు కావాలి. 'కుండలు' చేసే వ్యక్తికి 'చెప్పులు' కావాలంటే, కుండలు ఇచ్చి చెప్పులు తీసుకోవాలి. అలాగే చెప్పుల మనిషి కూడా చెప్పులు ఇచ్చి కుండలు తీసుకోవాలి. అప్పుడు ఇద్దరి అవసరాలూ తీరతాయి. కుండల మనిషికి, చెప్పులేగాక, ధాన్యమూ, బెల్లమూ, బట్టలూ, ఇలా ఇంకా ఏ వస్తువు కావాలన్నా, తను తయారుచేసే కుండలే ఇచ్చి ఆ వస్తువులన్నీ కూడా తీసుకోవాలి. ఒక వ్యక్తి, తనకు కావలసిన వస్తువులన్నీ తనే తయారుచేసుకోలేడు కాబట్టే తన వస్తువులకూ ఇతరుల వస్తువులకూ మారకాలు చేసుకోవడం అవసరం.

**2. 'వస్తువు' అంటే ఏమిటి? 'సరుకు' అంటే ఏమిటి? వస్తువు — సరుకా, కాదా? సరుకు —వస్తువా, కాదా?**

**జ:** 'సరుకు' అనేది కూడా మొదట 'వస్తువే'. వస్తువుని తయారుచేశాక, దాన్ని స్వంత వాడకం కోసమే వుంచుకుంటే అది సరుకు కాదు. దాన్ని మారకం కోసమే వుంచితే, ఆ మారకం జరిగేవరకూ అది 'సరుకు'. మారకం జరిగి పోయాక అది మళ్ళీ 'వస్తువే'. మారకం కోసమే తయారై, మారకం కోసం ఎదురుచూస్తూ వున్న వస్తువులకే 'సరుకులు' అని ప్రత్యేకమైన పేరు. —'సరుకు' అంటే అది కూడా వస్తువే. కానీ, 'వస్తువు' అంటే, అది సరుకు కానూ వచ్చు, కాకపోనూ వచ్చు.

**3. కొన్ని 'వస్తువుల్ని' చెప్పండి!**

**జ:** కుండ, చెప్పులు, కుర్చీ, చొక్కా, ధాన్యం, మగ్గం, కలం, పుస్తకం, నావ, నాగలి.

**4. సూర్యబింబం, సముద్రం, నావ, పుస్తకం, నీళ్ళు, బొగ్గు, చేపలు — వీటిలో, ఏవి వస్తువులు? ఏవి కావు?**

**జ:** మనుషులు తయారుచేసేవే వస్తువులు. మనుషులతో సంబంధం లేకుండా ప్రకృతిలో వున్నవి వస్తువులు కావు.

సూర్యబింబం —వస్తువు కాదు. ఇది ప్రకృతి సహజ పదార్థం.

సముద్రం — వస్తువు కాదు. సహజ పదార్థం.

నావ — వస్తువే. దీన్ని మనుషులే చేస్తారు.

పుస్తకం — వస్తువే.

నీళ్ళు — నదుల్లోనూ, సముద్రాల్లోనూ వున్న నీళ్ళు 'వస్తువు' కాదు. మనుషులు తవ్వే నూతుల్లోనూ, చెరువుల్లోనూ, కాలవల్లోనూ వున్న నీళ్ళు– వస్తువే.

బొగ్గూ, చేపలూ —ఇవి కూడా ఆ సందర్భాల్ని బట్టి!

**5. 'ఉపయోగపు విలువ' అంటే ఏమిటి? అది ఏ వస్తువులో వుంటుంది? 'ఉపయోగపు విలువ'కు సంబంధించిన అంశాలేమిటి?**

**జ:** 'ఉపయోగపు విలువ' అంటే, ఉపయోగపడే లక్షణం. ఒక వస్తువు, దేని కోసం ఉపయోగ పడుతుందో అది

దాని ఉపయోగపు విలువ. ప్రతీ వస్తువూ ఏదో ఒక అవసరానికి ఉపయోగ పడుతుంది కాబట్టి, ప్రతీ వస్తువుకి ఏదో ఒక ఉపయోగపు విలువ వుంటుంది. వస్తువు పాడైపోతే దాని ఉపయోగపు విలువ పోతుంది.

దీని అంశాలు : (1) ఉపయోగపు విలువ, వస్తువుకి సహజ లక్షణం. (2) 'స్వంతదారుకే ఉపయోగపడడం' అనే లక్షణం ఉపయోగపు విలువకు వుండదు. వస్తువుని ఎవరు వాడినా వాళ్ళకి అది ఉపయోగపడుతుంది. (3) వేరు వేరు ఉప యోగపు విలువలమధ్య ఎక్కువ తక్కువ పోలికలు వుండవు. దేని ప్రత్యేకత దానిదే! — ఇలాంటివే ఇంకా కొన్ని అంశాలు పాఠంలో చూడండి!

**6. మనుషులు బట్టలు నెయ్యడం నేర్చుకోని కాలంలో అడవుల్లో పండే పత్తికి ఉపయోగపు విలువ వుందా, లేదా?**

**జ:** మనుషులు ఉపయోగించకపోయినా 'పత్తి' లక్షణాలన్నీ పత్తికి వుంటాయి. కానీ దాన్ని మనుషులు ఉపయోగించకపోతే, అది వారికి ఉపయోగపడే పదార్థం కాదు. అంటే, ఉపయోగపు విలువ కాదు.

**7. ఒక ప్రాంతంలో మనుషులు ములక్కాయలు వాడరనుకుందాం. ములక్కాయలకు ఉపయోగపు విలువ వుందా, లేదా?**

**జ:** ఇది, 6 వ జవాబు లాంటిదే.

**8. 1 కిలో పంచదార ఉపయోగపు విలువ ఎక్కువా, 2 కిలోల బియ్యం ఉపయోగపు విలువ ఎక్కువా?**

**జ:** వేరు వేరు ఉపయోగపు విలువల మధ్య పోలిక వుండదు కదా? దేని అవసరం దానిదే. బియ్యంతో తీరవలసిన అవసరం, పంచదారతో తీరదు. పంచదారతో తీరవలసిన అవసరం, బియ్యంతో తీరదు. ఏదీ ఎక్కువా కాదు; తక్కువా కాదు. వాటిని పోల్చకూడదు.

**9. 1 బస్తా ధాన్యం ఉపయోగపు విలువ ఎక్కువా, 2 బస్తాల ధాన్యం ఉపయోగపు విలువ ఎక్కువా?**

**జ:** ఇక్కడ వున్నది 2 చోట్లా ఒక్క రకం వస్తువులే కాబట్టి వాటిని పోల్చవచ్చు. 1 బస్తా ధాన్యం కన్నా 2 బస్తాల ధాన్యం రెట్టింపు అవసరాన్ని తీరుస్తుంది. ఆ అర్థంతో చూస్తే, 2 బస్తాల ధాన్యం ఇచ్చే ఉపయోగపు విలువే ఎక్కువ.

**10. కాయితాలకు గుచ్చడానికి మీకో గుండు సూది కావాలి. గుండు సూది లేకపోవడంవల్ల తుమ్మ ముల్లు తెచ్చి కాయితాలకు గుచ్చారు. మీ అవసరం తీరింది. గుండుసూదీ తుమ్మముల్లూ ఒకటి అయినట్టేనా? రెండిటి ఉపయోగపు విలువా ఒకటేనా?**

**జ:** అవి రెండూ ఒకే రకంగా ఉపయోగపడితే రెండూ ఒకే రకం అయినట్టే. అవి ఇచ్చే ఉపయోగపు విలువ ఒకటే.

**11. గ్లాసుడు నీళ్ళ కన్నా గ్లాసుడు పాలు ఎక్కువా, కాదా?**

**జ:** నీళ్ళూ, పాలూ వేరు వేరు ఉపయోగపు విలువలు కాబట్టి, వాటి మధ్య పోలిక వుండదు. ఒకటి ఎక్కువా కాదు, ఇంకోటి తక్కువా కాదు. దేని ఉపయోగం దానిది!

**12. 'మారకం విలువ' అంటే ఏమిటి? మారకం జరగాలంటే తప్పనిసరిగా వుండవలసిన పరిస్థితులేమిటి?**

**జ:** 2 వస్తువుల (సరుకుల) మారకం ఏ 'విలువ'ని బట్టి జరుగుతుందో అదే 'మారకం విలువ'. ఒక వస్తువుని తయారు చెయ్యడానికి అవసరమయ్యే 'మొత్తం శ్రమ కాలమే' దాని మారకం విలువ. 'మారకం' జరగాలంటే, (1) ఆ 2 వస్తువులూ వేరు వేరు ఉపయోగపు విలువలై వుండాలి. (2) అవి వేరు వేరు స్వంతదారులకు చెందినవై వుండాలి. (3) వాటిని తయారు చెయ్యడానికి అవసరమైన శ్రమ మొత్తాలు సమానంగా వుండాలి. — ఇంకా, కొన్ని అంశాల కోసం అసలు పాఠంలో చూడండి!

**13. రెండు భిన్నమైన సరుకుల మధ్య మారకం జరగడం అంటే, ఏ లక్షణం ఆధారంతో జరుగుతుంది?**

**జ :** 'శ్రమ' అనే లక్షణం ఆధారంతో. 2 సరుకులూ ఒకే విలువ పరిమాణంతో వుంటే, ఒక సరుకుని ఇచ్చి ఇంకో సరుకుని తీసుకోవడంవల్ల, ఆ మారకం ద్వారా, ఏ పక్షానికీ 'లాభం'గానీ 'నష్టం'గానీ వుండవు. ఒక ఉపయోగపు విలువకు బదులు ఇంకో ఉపయోగపు విలువ దొరుకుతుంది.

**14. 'విలువ ఎక్కువ సరుకు', 'విలువ తక్కువ సరుకు' — అంటే అర్థాలు ఏమిటి?**

**జ :** 'విలువ అంటే — 'శ్రమ'. కాబట్టి, 'విలువ ఎక్కువ సరుకు' అంటే, ఎక్కువ శ్రమతో తయారైన సరుకు. 'విలువ తక్కువ సరుకు' అంటే, తక్కువ శ్రమతో తయారైన సరుకు.

**15. ఒక వస్తువుకి 'మారకం విలువ' ఎలా ఏర్పడుతుంది?**

**జ :** ప్రతీ వస్తువూ మనుషుల శ్రమలతోనే తయారవుతుంది. అలా తయారైన వస్తువులకు మారకం జరిగితే, దానికోసం అవసరమైన మొత్తం శ్రమే దాని విలువగా లెక్కకు వస్తుంది. అంటే, విలువ అనేది శ్రమే.

**16. ఒక వ్యక్తి పడవ మీద సముద్రంలోకి పోయి, 1 గంట శ్రమ చేసి ఒక బుట్టెడు చేపలు తెచ్చాడు. ఆ బుట్టెడు చేపల విలువ 1 గంట శ్రమ' అవుతుందా?**

**జ :** కాదు. చేపల్ని పట్టాలంటే, సముద్రంలోకి వెళ్ళడానికి పడవా, వలా, గంపా, ఇంకా కొన్ని ఇతర పరికరాలు కూడా కావాలి. ఆ పరికరాలన్నిటికీ సంబంధించిన శ్రమ కాలాల్లో కొంత కొంత భాగాలు కూడా ఆ 'గంట కాలానికి'

కలుస్తాయి. అదంతా కలిసే ఆ చేపల్ని పట్టడం కోసం అవసరమైన మొత్తం శ్రమ అవుతుంది.

**17. 500 పేజీల పుస్తకానికి అవసరమైన 'మొత్తం శ్రమ' పట్టిక ఎలా వుంటుందో ఉదాహరణ రాయండి. ఆ పుస్తకాన్ని మారకం చేస్తే దాని విలువ ఏమిటి?**

**జ :** 500 పేజీల పుస్తకం విలువ:

| | గం. ని. |
|---|---|
| (1) కాయితమూ ఇంకూ, దారమూ ............. | 3. 00 |
| (2) అచ్చు మిషనూ, ఇతర పనిముట్లూ ....... | 1. 30 |
| (3) అచ్చు పనీ, కుట్టు పనీ వంటి పనులు ... | 0. 30 |
| మొత్తం శ్రమ. | 5. 00 |

ఇదే దీని విలువ.

**18. ' సామాజిక శ్రమకాలం' అంటే ఏమిటి?**

**జ :** ఒక కాలంలో, అప్పుడు వున్న పరిస్థితుల్లో, ఒక వస్తువుని తయారు చెయ్యడానికి సగటున అవసరమయ్యే మొత్తం శ్రమ కాలమే —దాని 'సామాజిక శ్రమకాలం'.

**19. ఒక చెప్పుల జత 'సామాజిక శ్రమ కాలం' 1 గంట — అన్నప్పుడు, అది ఏ సమాజంలో తయారయ్యే చెప్పుల జతని గురించి మాట్లాడినట్టు అర్థం? 'ఫలానా సమాజం' అనే అర్థం ఏమైనా ఆ మాటల్లో వుందా?**

**జ :** లేదు. అది ఏ కాలంలో తయారైందో ఆ కాలంలో వున్న పరిస్థితుల్నిబట్టి ఆ చెప్పుల జతకి సగటున అంత శ్రమ అవసరమైందని అర్థం.

**20. బంగారం విలువ ఎక్కువ. బంగారం విలువ తక్కువ — ఈ రెండు విషయాల్నీ సమర్థించే ఉదాహరణలు చెప్పండి!**

**జ :** బంగారం విలువ ఎక్కువ —అంటే, 'ఒకే బరువు గల' బంగారాన్నీ రాగినీ తీసుకుంటే, ఆ రాగి విలువకన్నా ఆ బంగారం విలువ ఎక్కువ. అలాగే, 'ఒకే బరువు గల' బంగారాన్నీ వజ్రాన్నీ తీసుకుంటే, ఆ వజ్రం విలువకన్నా ఆ బంగారం విలువ తక్కువ.

**21. చాలా తక్కువగా దొరికే పదార్థం విలువ చాలా ఎక్కువగా వుంటుంది — ఇలా అనడం సరైందా, కాదా? ఎందుచేత?**

**జ :** అలా అనడం సరైంది కాదు. ఎందుకంటే, విలువ అంటే శ్రమే కాబట్టి, 'విలువలో ఎక్కువ తక్కువలకు కారణం 'శ్రమ' ద్వారానే చెప్పాలి. ఒక వస్తువు కోసం ఎక్కువ శ్రమ అవసరమైతే అది ఎక్కువ విలువ. తక్కువ శ్రమ అవసరమైతే అది తక్కువ విలువ. ప్రకృతిలో, ఒక పదార్థం తక్కువగా దొరికేది అవడంవల్లనే దానికోసం ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. అయినప్పటికీ, 'అది తక్కువగా దొరుకు తుంది కాబట్టి దాని విలువ ఎక్కువ' అనకూడదు. అలా అంటే, విలువకి వుండే అసలు కారణాన్ని చెప్పినట్టు కాదు. ఆ కారణాన్ని 'శ్రమ' ద్వారానే చూడాలి. 'తక్కువగా దొరికే పదార్థానికి ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. ఎక్కువ శ్రమ అవసరమవుతుంది కాబట్టే, దానికి ఎక్కువ విలువ వుంటుంది' అని చెప్పాలి. 'విలువ'కి కారణం చెప్పేటప్పుడు, 'శ్రమ' అనే మాట లేకుండా చెప్తే, అది సరైంది కాదు.

**22. 'విలువ అంటే శ్రమే' అని ఎలా రుజువు చెయ్యగలము?**

**జ :** ఎలా రుజువు చెయ్యగలమంటే, శ్రమ లేని పదార్థాలకు విలువ వుండదు కాబట్టి. ఆరుబయట దొరికే గాలికి విలువ వుండదు. అలాగే, నదిలో దొరికే నీటికి విలువ వుండదు. వాటిని ఉచితంగా తీసుకోవచ్చు. కానీ, మనుషుల శ్రమలతో తయారయ్యే వస్తువుల్ని ఒకరి నించి ఒకరు ఉచితంగా తీసుకోవడం సాధ్యం కాదు. వాటి కోసం శ్రమతో తయారైన ఇతర వస్తువుల్ని చెల్లించాలి. శ్రమతో తయారైన వస్తువుకే విలువ వుంటుంది కాబట్టి, దీన్నిబట్టి, 'విలువ అంటే శ్రమే' అని చెప్పగలం.

**23. ఈ పదార్థానికి విలువ లేదు — అంటే అర్థం ఏమిటి?**

**జ :** ఆ పదార్థం శ్రమతో తయారైనది కాదనీ, అది ప్రకృతి సహజంగా తయారైవున్న పదార్థం అనీ అర్థం.

**24. కింద వున్న వాక్యాలలో ఖాళీలను పూరించండి!**

| | **జవాబులు :** |
|---|---|
| (1) మనుషులు తయారుచేసేవి........... | (వస్తువులు) |
| (2) ప్రకృతి సహజ పదార్థాలు.............. | (మనుషులు తయారు చెయ్యనివి) |
| (3) చెక్కా + ......................... = కుర్చీ | (వడ్రంగం పని) |
| (4) ................+ కుట్టు శ్రమా = చొక్కా | (బట్టా) |
| (5) చంద్రబింబం, వస్తువు.................... | (కాదు) |

**25. సరుకు నించి మారకం విలువని తీసివెయ్యడం సాధ్యమా, అసాధ్యమా? సాధ్యమైతే ఎందుచేత? అసాధ్యమైతే ఎందుచేత?**

**జ :** 'విలువ ని తీసివెయ్యడం' సాధ్యమే. మారకాలు లేకుండానే వస్తువుల్ని వాడుకోగలిగితే, అది విలువని తీసివేసినట్టే. విలువ ని తీసివెయ్యడం ఎందుకు సాధ్యమంటే, విలువ అనేది, వస్తువు శరీరంలో వుండే సహజ లక్షణం కాదు కాబట్టే. రంగూ, బరువూ— లాంటి సహజ లక్షణాల్ని తీసివెయ్యడం సాధ్యం కాదు. కానీ, 'శ్రమ' అనేది, వస్తువులో వుండే లక్షణం కాదు. కాబట్టి, విలువ ప్రసక్తి లేకుండా వస్తువుల్ని వాడుకోవడం అసాధ్యమైన విషయం కాదు. కానీ, అలా జరగాలంటే, మానవ సంబంధాల్లో అనేకమైన మార్పులు జరగాలి. అది వేరే విషయం. ★

# 2. 'సరుకు'ని తయారుచేసే 'శ్రమ'కు గల 2 లక్షణాలు

ప్రకృతి ఇచ్చే పదార్థం మీద — కొంత మానవ శ్రమ జరగడం చేతనే వస్తువులు తయారవుతాయనీ, ఒక వస్తువుని ఇంకో వస్తువుతో మార్చుకునేటప్పుడు వాటి శ్రమలే వాటి విలువలుగా లెక్కకు వస్తాయనీ చూశాం. ఒక వస్తువు, 'మారకం-సరుకు'గా అయినప్పుడు దానిని తయారుచేసిన శ్రమకు **2** లక్షణాలు ఏర్పడతాయి.

**1. రూపం వున్న శ్రమ; 2. రూపం లేని శ్రమ**

## 1. రూపం వున్న శ్రమ (కాంక్రీట్ లేబర్)

ప్రతీ వస్తువూ శ్రమ వల్లనే తయారవుతుంది. కుర్చీ, శ్రమ వల్లనే తయారవుతుంది. మట్టికుండ, శ్రమ వల్లనే తయారవుతుంది. చొక్కా, శ్రమ వల్లనే తయారవుతుంది. ప్రతీ ఒక్క వస్తువూ, ప్రతీ ఒక్క పదార్థమూ, శ్రమ వల్లనే తయారవుతాయి.

అయితే, ఈ శ్రమలన్నీ ఎటువంటి శ్రమలు? అన్నీ ఒక్కలాంటి శ్రమలేనా? కుర్చీ ఏ రకం శ్రమవల్ల తయారైందో, దుప్పటి కూడా ఆ రకం శ్రమవల్లనే తయారైందా? మట్టి కుండా, చొక్కా, ఒకే రకం శ్రమవల్లనే తయా రయ్యాయా? ఒక వస్తువు ఏ రకం శ్రమవల్ల తయారవుతుందో మిగతా వస్తువులన్నీ కూడా ఆ రకం శ్రమ వల్లనే తయారవుతాయా? — కాదు. అన్ని వస్తువులూ ఒకే రకం శ్రమ వల్ల తయారుకావు. ఒక్కో రకం వస్తువు, ఒక్కో రకం శ్రమ వల్ల తయారవుతుంది.

చొక్కా ఏ శ్రమతో తయారవుతుంది? — కుట్టు శ్రమతో. అయితే, చొక్కా కోసం, కుట్టు శ్రమ తప్ప ఇంకే శ్రమా అక్కర లేదా? పత్తిని పండించే శ్రమ దగ్గిర్నించీ చాలా శ్రమలు కావాలి. కానీ, ఆ అన్ని శ్రమలూ ఒకే చోట జరగవు. ఒకే సమయంలో జరగవు. పత్తి పండిన తర్వాత, దానితో దారం, దారంతో బట్ట, బట్టతో చొక్కా — కాబట్టి, 'చొక్కా కోసం ఏ శ్రమ కావాలి' అన్నప్పుడు, బట్టని చొక్కాగా తయారుచేసే కుట్టు శ్రమని మాత్రమే చెప్పుకోవాలి. వ్యవసాయ శ్రమ దగ్గిర్నించీ కాదు.

ఇక్కడ వున్న 4 వస్తువులూ 4 రకాల శ్రమల వల్ల తయారవుతాయి. కుర్చీ — వడ్రంగం శ్రమవల్లా, దుప్పటి — నేత శ్రమ వల్లా, మట్టికుండ — కుమ్మరి శ్రమవల్లా, చొక్కా — కుట్టు శ్రమ వల్లా. ఈ రకంగా ప్రతీ వస్తువూ, ప్రతీ పదార్థమూ ఏదో ఒక 'ప్రత్యేక' శ్రమ వల్లనే తయారవుతాయి.

ఒక వడ్రంగి, చెక్కముక్కల్ని అస్తవ్యస్తంగా కోసి, ఆ ముక్కల్ని అడ్డదిడ్డంగా బిగించి అక్కడ పడేస్తే అది కుర్చీ అవుతుందా? పోనీ నిచ్చెన అవుతుందా?

ఒక కుట్టు మనిషి బట్టని పీలికలు పీలికలుగా కత్తిరించి వాటన్నిటీ మళ్ళీ ఎలాగో ఒకలాగ అతుకులేసి, అతుకుల బొంతకి ఎక్కడో అక్కడ ఒకటో నాలుగో గుండీలు కుడితే, అది చొక్కా అవుతుందా? పోనీ జాకెట్టు అవుతుందా?

ఏ పదార్థంతో ఏ వస్తువుని తయారు చెయ్యాలన్నా దాని పద్ధతేదో దానికి వుంటుంది. ఒక స్పష్టమైన ప్లానుతో, స్పష్టమైన లక్ష్యంతో పని జరగకపోతే ఏ ఒక్క వస్తువూ తయారుకాదు.

వేరు వేరు రకాల వస్తువుల్ని తయారు చెయ్యాలంటే వేరు వేరు రకాల లక్ష్యాలు వుండాలి. మనుషులు వేరు వేరు అవసరాలు తీర్చుకోవడం కోసం వేరు వేరు లక్ష్యాలతో చేసుకునే వేరు వేరు శ్రమలవల్లనే వేరు వేరు వస్తువులు తయారవుతాయి. మనిషి తాను ఏం చేస్తున్నాడో, ఎందుకు చేస్తున్నాడో, ఏ లక్ష్యంతో చేస్తున్నాడో తెలిసి చేసే శ్రమ 'ఉపయోగపు శ్రమ' (యూజ్‌ఫుల్ లేబర్). ఉపయోగపు శ్రమవల్లనే ఉపయోగపడే వస్తువులు (ఉపయోగపు విలువలు) తయారవుతాయి. ఒక స్పష్టత లేకుండా, ఒక లక్ష్యం లేకుండా, అస్తవ్యస్తపు పనులు చేస్తే ఆ పనులు కూడా శ్రమతో కూడినవే. ఆ పనులకు కూడా కొంత శ్రమ ఖర్చవుతుంది. కానీ ఆ శ్రమ 'నిరుపయోగపు శ్రమ' (యూజ్‌లెస్ లేబర్) అయిపోతుంది. అలాంటి శ్రమ ఏ ఉపయోగపు విలువనీ తయారుచెయ్యదు.

కుర్చీ, దుప్పటీ, కుండా, చొక్కా — ఈ 4 వస్తువులూ

4 రకాల ఉపయోగపు శ్రమల వల్ల తయారైనవి.

చెక్కా + కుర్చీని చెయ్యాలనే ప్రత్యేక లక్ష్యంతో సాగిన వడ్రంగం పనీ = కుర్చీ.

దారం + దుప్పటిని నెయ్యాలనే ప్రత్యేక లక్ష్యంతో సాగిన నేత పనీ = దుప్పటి.

మట్టీ + కుండని చెయ్యాలనే ప్రత్యేక లక్ష్యంతో సాగిన కుమ్మరి పనీ = కుండ.

బట్టా + చొక్కాని చెయ్యాలనే ప్రత్యేక లక్ష్యంతో సాగిన కుట్టు పనీ = చొక్కా.

ఇలాగే, ప్రతీ వస్తువూ ఏదో ఒక ప్రత్యేక లక్ష్యంతో సాగే శ్రమవల్ల తయారైనదిగా వుంటుంది.

'కుట్టుపని చొక్కాని తయారుచేసింది' అన్నామంటే, చొక్కా తయారవడానికి ఇంకే పనులూ అవసరంలేదని అర్థమా? —కాదు. చొక్కా తయారవ్వాలంటే, పత్తిని పండించే శ్రమ దగ్గిరనించీ చాలా రకాల శ్రమలు కావాలి. పత్తిని పండించే శ్రమా, పత్తిని దారంగా వడికే శ్రమా, దారాన్ని బట్టగా నేసే శ్రమా, బట్టని చొక్కాగా కుట్టే శ్రమా —ఇలా అనేక రకాల శ్రమలు కావాలి. అయితే, ఆ పనులన్నీ ఒకే సమయంలో, ఒకే చోట జరగవు. ఇక్కడ, 'చొక్కా' అన్నప్పుడు, బట్ట, చొక్కాగా మారే దశనే మాట్లాడుతున్నామని అర్థం. ఈ దశలో కుట్టుపనే కావాలి కాబట్టి, 'చొక్కా తయారవడానికి కుట్టుపని కావాలి' అంటాం. దీని అర్థం, చొక్కా తయారవడానికి ఇతర పనులేవీ అక్కరలేదని కాదు. బట్ట, చొక్కాగా మారే దశలో, ఆ ఇతర పనుల సంగతి అనవసరం.

'దుప్పటి' సంగతి కూడా అంతే. దారం, దుప్పటిగా తయారవడానికి నేతపని కావాలి. కాబట్టి, ఈ దశ గురించి మాట్లాడేటప్పుడు, 'దుప్పటి తయారవడానికి నేత పని కావాలి' అంటాం. అంటే, దుప్పటి తయారవడానికి ఇతర పనులేవీ అక్కరలేదని కాదు.

ఒక వస్తువుకోసం అవసరమయ్యే పనులన్నీ ఒకేసారి జరగవు. ఏ దశలో వున్న వస్తువుని తీసుకుంటామో, ఆ దశలో జరగవలసిన శ్రమనే చూస్తాము. 'పత్తి' అన్నప్పుడు, భూమిని సాగుచేసి పత్తిని పండించే వ్యవసాయ శ్రమని చూస్తాం. 'దారం' అన్నప్పుడు పత్తిని దారంగా వడికే శ్రమని చూస్తాం. 'బట్ట' అన్నప్పుడు, దారాన్ని బట్టగా మార్చే నేత శ్రమని చూస్తాం. 'చొక్కా' అన్నప్పుడు బట్టని చొక్కాగా మార్చే కుట్టు శ్రమని చూస్తాం —ఇలాగే ఏ వస్తువు విషయంలో అయినా.

వస్తువుల్నీ, పదార్థాల్నీ తయారుచేసే ప్రతీ ఒక్క శ్రమా నేత పనిగానో, కుట్టు పనిగానో, వడ్రంగం పనిగానో, వ్యవసాయం పనిగానో, ఇంకో స్పష్టమైన పనిగానో, 'ఇది ఫలానా పని' అని తెలిసే ప్రత్యేక తరహా పనిగానే వుంటుంది. ప్రతీ ప్రత్యేకమైన పనీ కళ్ళకు స్పష్టంగా కనపడుతుంది. ఒక వడ్రంగి కుర్చీ చేస్తూ వుంటే, ఆ పనిని ఆ వడ్రంగిగానీ ఇతరులుగానీ కళ్ళతో స్పష్టంగా చూడవచ్చు. అలా చూసే వ్యక్తిని ఎవరైనా —'ఏం చూస్తున్నావు?' అని అడిగితే, ఆ వ్యక్తి — 'కుర్చీ చెయ్యడం చూస్తున్నాను' అని జవాబు చెప్పవచ్చు. అలాగే దుప్పటి నేసే పనీ కళ్ళకు కనపడుతుంది, భూమి దున్నేపనీ కళ్ళకు కనపడుతుంది, చొక్కా కుట్టేపనీ కళ్ళకు కనపడుతుంది. అందుకే ఏ పని అయినా 'రూపం వున్న శ్రమ' అవుతుంది.

నేత — ఒక రూపం వున్న శ్రమ. అంటే, ఒక 'ప్రత్యేక' శ్రమ. అయితే, నేతలో కూడా అనేక రకాలున్నాయి. చీరలూ, దుప్పట్లూ, తువ్వాళ్ళూ అన్నీ ఒకే రకంగా తయారుకావు. నేతలో ఎన్ని రకాలువున్నా, ఇక్కడ విషయం తేలిగ్గా వుండడం కోసం, నేత నంతటినీ ఒకే శ్రమగా తీసుకుంటాం.

అలాగే, వడ్రంగం వల్ల ఎన్ని వేరు వేరు ఉపయోగపు విలువలు తయారైనా, వడ్రంగం అంతా ఒకే శ్రమ అనుకుందాం. అలాగే మిగిలిన అన్ని రకాల శ్రమలూ కూడా.

నేత — రూపం వున్న శ్రమ
(ఒక ప్రత్యేక శ్రమ)
కుట్టు — రూపం వున్న శ్రమ
వడ్రంగం — రూపం వున్న శ్రమ
వ్యవసాయం — రూపం వున్న శ్రమ
వైద్యం — రూపం వున్న శ్రమ

ఈ రూపం వున్న శ్రమల వల్లనే వస్తువులు తయారవుతాయి. అవసరాలు తీరతాయి.

రూపం వున్న శ్రమలన్నీ కళ్ళకు కనపడతాయి. కుర్చీని చూస్తే, అది వడ్రంగం శ్రమతో తయారైనట్టు తెలిసిపోతుంది. అది రంగువేసిన కుర్చీ అయితే, దానికోసం 'రంగువేసే శ్రమ' కూడా జరిగిందని తెలిసిపోతుంది. చొక్కాని చూస్తే, బట్టని నేశారనీ, దాన్ని కుట్టారనీ, దాన్ని తయారుచేసిన శ్రమలన్నీ తెలుస్తాయి. పుస్తకాన్ని చూస్తే, దాన్ని ఎవరో రాశారనీ, దాన్ని అచ్చు వేశారనీ, తెలుస్తుంది. ఏ వస్తువుని చూసినా, దాన్ని తయారుచేసిన శ్రమలన్నీ తెలుస్తాయి. అంటే, వస్తువుకి రంగూ, రుచీ, వాసనా, బరువూ, ఎత్తూ లాంటి సహజ లక్షణాల లాగానే దాన్ని తయారుచేసిన ప్రత్యేక శ్రమల లక్షణాలు కూడా వస్తువు శరీరంలో కనపడతాయి.

## వస్తువుల్ని తయారుచెయ్యని శ్రమలు :

కుట్టూ, నేతా, వడ్రంగమూ, వ్యవ సాయమూ —లాంటి శ్రమలు, 'వస్తువుల్ని' తయారుచేస్తాయి.

కానీ, బండి తోలడమూ, చదువు చెప్పడమూ, వైద్యం చెయ్యడమూ — లాంటి శ్రమలు, ఏ వస్తువుల్నీ తయారు చెయ్యవు. ఈ శ్రమలు కూడా 'రూపం వున్న' శ్రమలే.

వస్తువుల్ని తయారుచేసే శ్రమలు, కొన్ని రకాల అవసరాల్ని తీరిస్తే, వస్తువుల్ని తయారుచెయ్యని శ్రమలు కూడా, మరి కొన్ని రకాల అవసరాల్ని తీరుస్తాయి.

అవసరాలు తేడాగా వుండడం వల్ల శ్రమలు కూడా తేడాగా వుంటాయి.

వస్తువుల్ని తయారుచేసే శ్రమల విషయంలో, 'శ్రమ జరగడం' ఆగిపోయిన తర్వాతే ఆ వస్తువుల్ని వాడుకుంటాం. నేతపని ఆగిన తర్వాతే ఆ బట్టని వాడుకుంటాం. కుట్టుపని ఆగిన తర్వాతే ఆ దుస్తుల్ని వాడుకుంటాం. ఈ రకం శ్రమల విషయంలో శ్రమ జరగడం ఆగిన తర్వాతే ఆ శ్రమల్ని వాడుకుంటాం. కానీ, బండి తోలడం లాంటి శ్రమల విషయంలో, ఆ శ్రమలు 'జరుగుతూ వుండగానే' వాటిని వుపయోగిస్తాం. బండి తోలే పని జరుగుతూ వుండగానే బండిలో ప్రయాణం చేసే మనుషులకు ఆ శ్రమ ఉపయోగ పడుతూ వుంటుంది. అలాగే, చదువు చెప్పేపనీ, వైద్యంచేసే పనీ — లాంటి పనులు కూడా. శ్రమల ప్రత్యేకతల్లో ఇలాంటి సహజమైన తేడాలు వున్నా, శ్రమల గురించి మనం చూసే విషయాలు, అన్ని రకాల శ్రమలకూ ఒకే విధంగా వర్తిస్తాయి. కానీ, ఇక్కడ మన ఉదాహరణలు తేలిగ్గా వుండడం కోసం, 'వస్తువుల్ని తయారుచేసే' శ్రమల్ని మాత్రమే మన పరిశీలన లోకి తీసుకుంటున్నాము. ఈ శ్రమలకు వర్తించే సూత్రాలన్నీ, రెండోరకం శ్రమలకు కూడా, అంటే వస్తువుల్ని తయారు చెయ్యని శ్రమలకు కూడా, యథాతథంగా వర్తిస్తాయి.

'శ్రమ' అన్నప్పుడు, అది 'కుట్టు'గానో, 'నేత'గానో, 'వడ్రంగం'గానో, ఇలా ఏదో ఒక 'ప్రత్యేక రూపం వున్న శ్రమ'గా ('కాంక్రీట్ శ్రమ'గా) వుండి తీరుతుంది. రూపం లేకుండా, అంటే ఒక 'ప్రత్యేకత' లేకుండా, శ్రమ అనేది వుండదు. ఇది, శ్రమకు వుండే సహజ లక్షణం. అంతేకాదు, శ్రమకు 'పరిమాణం' (కొలత) కూడా వుంటుంది. '**2** గంటల కుట్టు' అన్నప్పుడు, 'కుట్టు' అనేది ఆ శ్రమకి రూపం. (ఆ శ్రమ ప్రత్యేకత). '**2** గంటలు' అనేది దాని 'పరిమాణం' (కొలత). '**3** రోజుల నేత' అన్నప్పుడు, 'నేత' అనేది ఆ శ్రమకి 'రూపం'. '**3** రోజులు', దాని 'పరిమాణం'. ఇలా, ఏ శ్రమకైనా, రూపమూ, పరిమాణమూ కూడా వుంటాయి.

'కుర్చీ' అనే వస్తువుని తయారుచెయ్యడంలో, ఏదో ఒక దశని గాక, చెట్టుని పెంచడం దగ్గిరనించి, కుర్చీకి రంగులు వేసే దశ వరకూ వుండే అన్ని దశల్నీ తీసుకుంటే, కుర్చీ తయారీకి అనేక రకాలైన, 'రూపం వున్న శ్రమలు' కావాలి. అలాగే, దుప్పటికి కూడా అనేక రకాలైన రూపం వున్న శ్రమలు కావాలి. అలాగే ఏ వస్తువుకైనా.

# 2. రూపంలేని శ్రమ ( యాబ్‌స్ట్రాక్ట్ లేబర్ )

'రూపం వున్న శ్రమ'లో నించి, దాని రూపాన్ని వదిలేసి, దాని పరిమాణాన్ని మాత్రమే తీసుకుంటే, అదే 'రూపంలేని శ్రమ'. '1 గంట కుట్టు శ్రమ'ని, '1 గంట శ్రమ' అన్నామంటే, ఆ శ్రమకు వున్న రూపాన్ని వదిలేసి ( ప్రత్యేకతని వదిలేసి ) దాని పరిమాణాన్ని మాత్రమే తీసుకుంటున్నామని అర్థం. '1 గంట కుట్టు' అన్నప్పుడు, ఆ శ్రమకి రూపమూ, పరి మాణమూ రెండూ వున్నాయి. కానీ, '1 గంట శ్రమ' అన్న ప్పుడు, ఆ శ్రమకి పరిమాణం మాత్రమే వుంది. రూపం లేదు. '1 గంట శ్రమ' అన్నప్పుడు, ఆ శ్రమ, 'ఎంత శ్రమో' తెలుస్తుందిగానీ, అది 'ఏ శ్రమో' తెలియదు. '1 గంట కుట్టు శ్రమ'ని '1 గంట శ్రమ' అన్నప్పుడు, ఒక రూపం వున్న శ్రమని రూపం లేని శ్రమగా చూస్తున్నామని అర్థం. '2 రోజుల నేత శ్రమ'ని '2 రోజుల శ్రమ' అంటే, అది కూడా అంతే. అది, ఒక రూపం వున్న శ్రమని రూపంలేని శ్రమగా చూడడమే.

'1 గంట కుట్టు'నీ, '2 గంటల నేత'నీ కలిపి 'మొత్తం 3 గంటల శ్రమ' అన్నామంటే ఇక్కడ ఏం చేసినట్టు అర్థం? 2 వేరు వేరు రకాల శ్రమల నించి వాటి ప్రత్యేకతల్ని వదిలేసి, వాటి పరిమాణాల్ని మాత్రమే తీసుకున్నట్టు అర్థం.

ఒక గిన్నెలో 2 గ్లాసుల పాలూ, 1 గ్లాసు నీళ్ళూ పోసి, 'ఈ గిన్నెలో మొత్తం 3 గ్లాసుల ద్రవం వుంది' అన్నామంటే, ఆ ద్రవం పరిమాణాన్నే చెపుతున్నాంగానీ, అందులో ఏ యే ప్రత్యేక ద్రవాలు వున్నాయో ఆ వివరాలు చెప్పడంలేదు. ఒక బుట్టలో, 2 కిలోల బెల్లమూ, 3 కిలోల మైదా పిండీ పెట్టి, 'ఈ బుట్టలో మొత్తం 5 కిలోల బరువు వుంది' అంటే, ఆ పదార్థం బరువునే చెపుతున్నాంగానీ, ఆ పదార్థంలో వున్న ప్రత్యేకతల్ని చెప్పటం లేదు. అలాగే, వేరు వేరు శ్రమల్ని కలిపేసి 'మొత్తం శ్రమ'గా మాట్లాడినప్పుడు, ఆ శ్రమల పరిమాణాన్నే లెక్కలోకి తీసుకుంటున్నట్టు అర్థం.

'రూపం వున్న శ్రమ'కు — గుణమూ వుంటుంది. పరిమాణమూ వుంటుంది. ('గుణం' అంటే ఆ శ్రమకువున్న ప్రత్యేకత).

'రూపం లేని శ్రమ'కు, పరిమాణం మాత్రమే వుంటుంది.

| రూపం వున్న శ్రమ | రూపం లేని శ్రమ |
|---|---|
| 1 గంట కుట్టు | 1 గంట శ్రమ |
| 2 గంటల నేత | 2 గంటల శ్రమ |
| 3 రోజుల వడ్రంగం | 3 రోజుల శ్రమ |
| 4 రోజుల గని తవ్వకం | 4 రోజుల శ్రమ |
| 3 రోజుల భూమి దున్నుడు | 3 రోజుల శ్రమ |

ఈ రకంగా, 'రూపం వున్న శ్రమ'లో నించీ దాని ప్రత్యేకతని తీసేస్తే, అది, రూపంలేని శ్రమ.

## వేరు వేరు శ్రమలకు ఉన్న సమాన లక్షణం :

1 గంట కుట్టూ, 2 గంటల నేతా అన్నప్పుడు, కుట్టు శ్రమనీ, నేత శ్రమనీ కూడా, గంటల లెక్కన కొలుస్తున్నాం. అంటే, 'కుట్టు'నీ 'నేత'నీ 'గంట' అనే ఒకే సాధనంతో (' కాలం' అనే ఒకే సాధనంతో ) కొలుస్తున్నాం. నిజానికి, కుట్టు ఒక రకం శ్రమైతే, నేత ఇంకోరకం శ్రమ. వేరు వేరు రకాల శ్రమల్ని ఒకే సాధనంతో కొలవడం ఎలా సాధ్యమవు తుంది? — ఎలా సాధ్యమవుతుందంటే, ఆ రెండు రకాల లోనూ వున్న 'శ్రమ' అనే సమాన లక్షణం ద్వారా సాధ్యమవు తుంది. వాటి రూపాలు వేరైనా అవి రెండూ 'శ్రమలే'. కుట్టూ — శ్రమే, నేతా — శ్రమే. 'శ్రమగా వుండడం' అనే లక్షణం రెండింటికీ వుంది కాబట్టి, ఆ రెండు శ్రమల్ని ఒకే రకంగా ఒకే సాధనంతో ('కాలం' అనే సాధనంతో) కొలవడం సాధ్యమవుతుంది.

పాలూ, నీళ్ళూ —వేరు వేరు ప్రత్యేకతలుగల పదార్థాలైనా వాటిని కొలవాలంటే 'గ్లాసు'లాంటి ఒకే సాధనంతో కొలవడం సాధ్యమవుతుంది. ఎందుచేత? రెండూ ద్రవ పదార్థాలే కాబట్టి. 'ద్రవంగా వుండడం' అనే లక్షణం రెండింటికీ వుంది కాబట్టి. అలాగే, బెల్లమూ, మైదాపిండీ వేరు వేరు ప్రత్యేకతలు గల పదార్థాలైనా రెండూ ఘన పదార్థాలే. 'ఘన పదార్థంగా వుండడం' అనే లక్షణం రెండింటికీ వుంది. కాబట్టి, వాటిని కొలవాలంటే, ఘన పదార్థాల్ని కొలిచే 'బరువు రాయి' లాంటి ఒకే సాధనంతో రెండింటినీ ఒకే రకంగా కొలవడం సాధ్యమవుతుంది. అలాగే, వేరు వేరు రకాల శ్రమల విషయం కూడా. నేతా, కుట్టూ, వడ్రంగమూ, రాత పనీ, కోత పనీ, గని తవ్వే పనీ, పొలం దున్నే పనీ, బండి తోలే పనీ — అన్నీ, ఏ రూపం గల పని అయినా 'శ్రమే'! సమస్త శ్రమలూ 'మానవ దేహం'తో చేసేవే! ఏ శ్రమ చెయ్యడానికైనా మానవ దేహంలో మెదడూ, నరాలూ, కండరాలూ శ్రమించవలసిందే. కాబట్టి, 'శ్రమ' అనే దాన్ని దేన్నయినా ఒకే రకంగా 'కాలం' అనే సాధనంతో కొలవడం సాధ్యమవుతుంది.

కుర్చీకీ, దుప్పటికీ మారకం జరిగిందనుకుందాం. మన ఉదాహరణ ప్రకారం— కుర్చీలో మొత్తం శ్రమ కాలం 3 గంటలు. దుప్పటిలో కూడా మొత్తం శ్రమ కాలం 3 గంటలు. కుర్చీని కొన్ని రూపం వున్న శ్రమలూ, దుప్పటిని కూడా కొన్ని రూపం వున్న శ్రమలూ తయారుచేస్తాయి. కుర్చీలో శ్రమలన్నిటినీ 'వడ్రంగం' అనే ఒకే పేరుతోటీ, దుప్పటిలో శ్రమలన్నిటినీ 'నేత' అనే ఒకే పేరుతోటీ ప్రస్తావిద్దాం. కుర్చీకీ, దుప్పటికీ మారకం జరిగిందంటే, వడ్రంగానికీ, నేతకీ మారకం జరిగిందని అర్థం. నిజానికి ఇక్కడ జరిగిన మారకం వడ్రంగానికీ, నేతకీ మాత్రమే కాదు, కుర్చీని తయారుచేసిన కొన్ని రకాల శ్రమలకీ, దుప్పటిని తయారుచేసిన కొన్ని రకాల శ్రమలకీ మారకం జరిగింది. అయినా, దీన్ని క్లుప్తంగా చెప్పుకోవడానికే ఇక్కడ వడ్రంగానికీ, నేతకీ మారకం జరిగిందని అంటున్నాము.

వడ్రంగమూ, నేతా, వేరు వేరు రకాల శ్రమలైనా, అవి రెండూ 'శ్రమ' అనే సమాన లక్షణంతో వున్నాయి కాబట్టి, వాటిని 'కాలం' అనే సాధనంతో కొలవడం ద్వారా వాటి మారకం సాధ్యమైంది.

## వస్తువుల ఉత్పత్తికీ, వాటి వాడకానికీ, 'ఉపయోగపు విలువ కొలతలే' గానీ, 'విలువ కొలతలు' అవసరం లేదు :

వస్తువుల్ని తయారు చెయ్యడానికి ముడి పదార్థాలూ, పనిముట్లూ, రూపం వున్న శ్రమలూ — కావాలి. కాబట్టి, వస్తువుల్ని తయారు చెయ్యాలంటే, వాటి కోసం, కావలసిన ముడి పదార్థాల్నీ, కావలసిన పనిముట్లనీ, కావలసిన శ్రమల్నీ కొలవడం సహజమైన అవసరం. కుర్చీని తయారు చెయ్యా లంటే, కొంత చెక్కా, కొన్ని రకాల పనిముట్లూ, వడ్రంగం శ్రమచేసే మనుషులూ కావాలి. ఎంత సైజు కుర్చీ కావాలో దాన్నిబట్టి చెక్కని కొలిచి తీసుకోవాలి. (మన ఉదాహరణలో వున్న కుర్చీకి 1 ఘనపుటడుగు చెక్క కావాలనుకుందాం). కుర్చీని చెయ్యడానికి ఏ యే రకాల పనిముట్లు కావాలో వాటిని తీసుకోవాలి. (వస్తువుల్ని తయారుచేసే మనుషులకు, వారు ఉపయోగించే పనిముట్ల జీవిత కాలాల గురించి అవగాహన వుంటుంది.) చెక్కని కుర్చీగా చెయ్యడానికి ఎన్ని గంటల వడ్రంగం శ్రమ కావాలో దానికి కూడా లెక్క వుండాలి. (ఈ ఉదాహరణలో, '2 గంటల వడ్రంగం శ్రమ' కావాలను కుందాం.) ఈ రకంగా, కుర్చీని తయారుచెయ్యాలంటే, ఆ పని కోసం కావలసిన ముడి పదార్థాల్నీ, పనిముట్లనీ, 'ఉపయోగపు విలువలు'గానే పరిగణిస్తూ, వాటి శారీరకమైన కొలతల్నీ, ప్రత్యేకతల్నీ చూడవలసి వుంటుంది. అలాగే, కుర్చీని తయారుచేసే శ్రమని కూడా 'రూపం వున్న శ్రమ'గానే చూస్తూ 'ఇన్ని గంటల వడ్రంగం శ్రమ కావాలి' అని ఆ శ్రమని కూడా దాని ప్రత్యేకతతోనే లెక్కకట్టవలసి వుంటుంది.

కుర్చీ తయారైందనుకుందాం. దానికి వార్నిష్ వెయ్యా లనుకుందాం. ఇది కుర్చీకి 'వార్నిష్ వేసే' దశ. ఇక్కడ, వార్నిష్‌లేని కుర్చీని, వార్నిష్ వేసిన కుర్చీగా తయారు చెయ్యాలి. ఈ పని జరగడానికి ఏమేం కావాలి? మొదట వార్నిష్‌లేని కుర్చీ కావాలి. కొంత వార్నిష్ కావాలి. బ్రష్ లాంటి పనిముట్లు కావాలి. 'వార్నిష్ వేసే శ్రమ' (ఆ పనిచేసే మనిషి) కావాలి. (ఈ ఉదాహరణలో వార్నిష్‌లేని కుర్చీ, వార్నిష్హా—

ముడి పదార్థాల కిందకు వస్తాయి. బ్రష్ లాంటివి పనిముట్ల కిందకి వస్తాయి. — ఈ రకంగా, ఒక వస్తువుని తయారు చెయ్యడంలో ఏ దశని తీసుకున్నా ఆ దశలో ఒక ముడి పదార్థమూ (లేదా, కొన్ని ముడి పదార్థాలూ), ఆ దశలో అవసరమయ్యే కొన్ని పనిముట్లూ, ఆ దశలో అవసరమయ్యే శ్రమలు చేసే మనుషులూ కావాలి.

దుప్పటి — అనే వస్తువుని తీసుకుంటే దాని తయారీకి మొత్తం 3 దశలు కావాలి. పత్తిని పండించే దశా, పత్తిని దారంగా వడికే దశా, దారాన్ని దుప్పటిగా నేసే దశా కావాలి. అది పూల దుప్పటి అయితే, పూలు అద్దే ఇంకో దశ కూడా వుండవచ్చు. ఈ దశల్లో, ప్రతీ దశలోనూ ముడి పదార్థాన్నీ, పనిముట్లనీ, రూపం వున్న శ్రమల్నీ (అంటే, ఆ శ్రమలు చేసే మనుషుల్ని) కొలవవలసి వుంటుంది. మొత్తం ఈ దశలన్నిటి లోనూ కలిసి, ఎన్ని పనిముట్లూ, ఎంతెంత పరిమాణం గల ఎన్ని రూపం వున్న శ్రమలూ ఖర్చయ్యాయో, అవే దుప్పటిని ఉత్పత్తి చెయ్యడానికి కావలసిన మొత్తం పనిముట్లూ, కావలసిన మొత్తం శ్రమలూ.

ఏ వస్తువుని తయారు చెయ్యడానికైనా ఈ రకమైన కొలతలే అవసరం. కావలసిన ముడి పదార్థాల్నీ, పనిముట్లనీ కొలవడమూ; కావలసిన శ్రమల్ని రూపం వున్న శ్రమలుగానే కొలవడమూ — జరిగితే చాలు. అంటే, అన్నిటినీ 'ఉపయోగపు విలువలు'గా చూస్తే చాలు. ఈ రకంగా, వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యడానికి, 'ఉపయోగపు విలువ దృష్టి' కన్నా వేరే దృష్టి అవసరం లేదు. అంతకన్నా వేరే రకం లెక్కలూ, వేరే రకం కొలతలూ అవసరం లేదు. అంటే, వస్తువుల వుత్పత్తికి 'విలువ' లెక్కలూ, 'విలువ' కొలతలూ, అవసరం లేదని అర్థం. (ఈ అంశానికి వున్న ప్రాధాన్యత ఏమిటో ఇంకా ముందు ముందు భాగాలలోకి పోయినకొద్దీ బాగా అర్థ మవుతుంది).

అయితే, వస్తువులు 'సరుకులు'గా మారడం తప్పనిసరి అయినప్పుడు, అంటే 'మారకాలు' అనేవి జరుగుతూ వున్నప్పుడు, 'విలువ లెక్కలు' లేకుండా వుండడం సాధ్యం కాదు. వస్తువులకు మారకాలు జరగాలంటే, ఏ వస్తువు విలువ ఎంత వుందో తెలిస్తేనేగానీ మారకాలు సాధ్యంకావు. కాబట్టి, మారకాల కోసం, వస్తువుల విలువ కొలతలూ లెక్కలూ తప్పనిసరిగా కావాలి. 'విలువ'ని కొలవడం అంటే వస్తువు కోసం ఖర్చయిన 'మొత్తం శ్రమ'ని కొలవడమేనని మనకు తెలుసు. వస్తువు 'విలువ'ని లెక్క కట్టాలంటే (ఆ వస్తువు కోసం 'ఖర్చయిన మొత్తం శ్రమ'ని లెక్కకట్టాలంటే), ఆ వస్తువు కోసం 'ఖర్చయిన' ముడి పదార్థాల, పనిముట్ల, రూపం వున్న శ్రమల ప్రత్యేకతలన్నీ పోయి, అన్నిటిలోనూ వున్న శ్రమ పరిమాణాలే లెక్కకు వస్తాయి.

'కుర్చీ'ని తీసుకుని, దాన్ని 'మారకం'లోకి వెళ్ళే సరుకుగా చూద్దాం. అంటే, ఇప్పుడు కుర్చీ 'విలువ'ని లెక్కకట్టాలి. కుర్చీని తయారు చెయ్యడానికి కొంత చెక్కా, కొన్ని పనిముట్లూ, 2 గంటల వడ్రంగం శ్రమా కావాలి — అనుకున్నాం కదా? కుర్చీ కోసం కావలసిన చెక్కా, పనిముట్లూ కూడా శ్రమలతో తయారైన వస్తువులే. ఆ చెక్కకు సంబంధించిన శ్రమా, పనిముట్లకు సంబంధించిన శ్రమా కలిసి 1 గంట శ్రమ అనుకుందాం. ఈ గంట శ్రమకి, చెక్కని కుర్చీగా చేసిన 2 గంటల వడ్రంగం శ్రమ కూడా కలిస్తే, మొత్తం 3 గంటల శ్రమ అవుతుంది. ఇది కుర్చీ కోసం ఖర్చయిన మొత్తం శ్రమ. ఇదే కుర్చీ 'విలువ'.

విలువని చూడడం అంటే 'మొత్తం శ్రమ'ని చూడడమే కాబట్టి, విలువని చూసేటప్పుడు, ఒక వస్తువు కోసం ఏ యే రకాల శ్రమలు పని చేశాయో, ఆ శ్రమలు ఏ రకం పనిముట్లని వుపయోగించాయో, ఆ వివరాలేమీ కనపడవు.

'విలువ' అనేది — రూపంలేని శ్రమ. నిజానికి, రూపం లేని శ్రమ ఎక్కడా వుండదు. శ్రమ అనేది ఎక్కడ వున్నా, అది ఏదో ఒక రూపం గల శ్రమగానే వుంటుంది. కానీ, 'విలువ' లెక్కల కోసమే, 'రూపం లేని శ్రమ' అనే అసహజత్వాన్ని అర్థం చేసుకోవాలి.

వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యాలంటే, దానికి కావలసిన అంశాలన్నిటినీ 'ఉపయోగపు విలువ' లెక్కలతో చూడడం సాధ్యమే. కుర్చీని తయారు చెయ్యడానికి, ఇంత చెక్కా, ఈ రకం పనిముట్లూ, ఇంతమంది వడ్రంగం మనుషులూ కావాలి — అనడం సహజ విషయం. విషయాన్ని ఇలా చూడడం 'ఉపయోగపు విలువ' దృష్టితో చూడడం. అలాగాక, కుర్చీని తయారు చెయ్యడానికి 'మొత్తం ఇంత విలువ కావాలి' అనడం అసహజ విషయం. ఇది, విషయాన్ని 'విలువ దృష్టి'తో చూడడం.

అలాగే, వస్తువుని 'వాడుకునే' విషయంలో కూడా. తయారైవున్న వస్తువుని 'వాడుకోవడానికి', దాని ఉపయోగపు విలువ కొలతలేగానీ, విలువ కొలతలు అవసరంలేదు. వస్తువుని, విలువ కొలతలు లేకుండానే వాడుకుంటే (అంటే, మారకం లేకుండా వాడుకుంటే,) అది వుపయోగపడకుండా వుండదు. తన విలువని లెక్క కట్టినా లెక్క కట్టకపోయినా వస్తువు ఒక్కలాగే వుపయోగపడుతుంది. తన విలువని లెక్క కట్టారా లేదా అనే దానితో సంబంధం లేకుండానే వస్తువు తన ఉపయోగపు విలువని ఇస్తుంది.

కాబట్టి, విలువని (మొత్తం శ్రమని) కొలవడం అనే పని, 'వస్తువు ఉత్పత్తికి'గానీ, 'దాని వాడకానికి'గానీ, సహజమైన అవసరం కాదు. అంటే, విలువ కొలత అనేది సహజ విషయం కాదు. అసహజ విషయం.

('రూపం లేని శ్రమ' గురించి, తర్వాత ఇంకా కొన్ని విషయాలు చూస్తాము)

## 'విలువ అంటే శ్రమే' ; కానీ, 'శ్రమ అంటే విలువ' కాదు :

వస్తువులన్నీ శ్రమలతోనే తయారవుతాయి. శ్రమ లేకుండా ఏ వస్తువూ తయారు కాదు. అయితే, వస్తువు కోసం ఖర్చయిన శ్రమ, 'విలువ'గా అవడం తప్పనిసరి కాదు. ఆ వస్తువుని ఇంకో వస్తువుతో 'మారకం' చేసుకుంటేనే, ఆ వస్తువులో శ్రమ 'విలువ'గా లెక్కకు వస్తుంది (విలువ అవుతుంది). ఆ వస్తువుని, మారకం లేకుండానే వాడుకుంటే, ఆ వస్తువుకి 'విలువ' లెక్కలు వుండవు. అంటే, ఆ వస్తువు కోసం ఖర్చయిన శ్రమ, విలువ అవదు. అప్పుడు, ఆ వస్తువు, 'ఉపయోగపు విలువ'గా మాత్రమే వుంటుంది.

ఒక మనిషి (లేదా ఒక కుటుంబం), కొంత ధాన్యం పండించుకొని దాన్ని తనే వాడుకుంటే (లేదా, ఇతరులకు వూరికే ఇస్తే), ఆ ధాన్యానికి విలువ వుండదు. 'విలువ లేదు' అంటే, ఆ వస్తువు తయారవడానికి శ్రమ ఖర్చవలేదని అర్థమా? —కాదు. శ్రమ ఖర్చవకపోతే వస్తువే తయారు కాదు. ఆ వస్తువుకి మారకం జరగలేదు కాబట్టి, దానికోసం ఖర్చయిన శ్రమ, విలువగా అవలేదని మాత్రమే ఇక్కడ అర్థం.

విలువగా అయ్యేది శ్రమే. కానీ, శ్రమ అనేది తప్పనిసరిగా విలువగా అవ్వాలనే నియమం లేదు. దీన్నే క్లుప్తంగా చెప్తే : 'విలువ' అంటే శ్రమే, కానీ శ్రమ అంటే విలువ కాదు. ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే, వస్తువులకు విలువ వుండడం చాలా సహజ విషయంలాగ కనపడుతుంది. ఎలాగంటే, శ్రమ లేకుండా వస్తువు వుండదు కాబట్టి, 'శ్రమ అంటే విలువే' అనుకున్నప్పుడు, విలువ లేకుండా వస్తువు వుండదు —అన్నట్టు కనపడుతుంది.

'శ్రమ లేకుండా వస్తువు వుండదు' —అన్నది కరక్టే.

కానీ, 'శ్రమ అంటే విలువే' అన్నది తప్పు. శ్రమంటే తప్పనిసరిగా విలువ కాదు. వస్తువుని మారకం చేస్తేనే ఆ శ్రమ విలువగా లెక్కకు వస్తుంది. మారకం లేకపోతే ఆ శ్రమ విలువ కాదు. వస్తువు, శ్రమతో తయారై కూడా విలువ లేకుండా వుండవచ్చు.

శ్రమ అనేది, 'మారకం' అనే 'అసహజ విషయం' వల్లనే విలువగా అవుతుందిగానీ, మారకం లేకపోతే శ్రమ, దానికై అదే సహజంగానే విలువ కాదు.

శ్రమ అనేది తప్పనిసరిగా విలువగా మారడమే సహజ నియమం అయితే, ఒక వస్తువుకి విలువ చెల్లించకుండా (వస్తువుని మారకం చేసుకోకుండా) వాడుకోవడం సాధ్యమే అవదు. అంటే, ఏ మనిషి తయారుచేసుకున్న వస్తువుని ఆ మనిషే వాడుకోవడం సాధ్యమే అవదు. దాన్ని మారకం చేసి, దానికి బదులుగా వచ్చే రెండో వస్తువునే వాడుకోవలసి వస్తుంది. కానీ, ఎవరు తయారుచేసుకున్న వస్తువుల్ని వాళ్ళే, విలువ ప్రసక్తి లేకుండానే వాడుకోగలుగుతున్నారంటే, శ్రమ, విలువగా మారడం తప్పనిసరి నియమం కాదని అర్థం.

అయితే, మన నిజ జీవితంలో, వస్తువుల విలువల్ని కొలిచే అసహజమైన పని ఎందుకు జరుగుతోంది? ఎందుకంటే, వస్తువుల మధ్య 'మారకాలు' జరుగుతున్నాయి గనక. వస్తువులకు మారకాలు జరగాలంటే, ఏ వస్తువు విలువ ఎంతో తెలియాలి. మారకాల కోసం వస్తువుల విలువల్ని కొలిచి తీరాలి. కాబట్టి, మారకాలు జరిగినంత కాలమూ విలువ కొలతలు వుండి తీరతాయి.

'అసహజమైన విలువ కొలతలు ఎందుకు వున్నాయి'— అనే ప్రశ్నకి, 'మారకాలు వున్నాయి కాబట్టి' అనేది జవాబు. అయితే, 'మారకాలు ఎందుకు వున్నాయి'— అనే ప్రశ్నకి జవాబేమిటి? —స్వంత ఆస్తి విధానం. అంటే, ఎవరి ఆస్తిపై వారికి వ్యక్తిగత యాజమాన్యం అనేదే మారకాలకు కారణం. ఈ విషయం గురించి ఇంకా ముందు ముందు చాలా వివరాలు చూడాలి. ప్రస్తుతానికి ఇక్కడ, విషయాలు క్లుప్తంగానే నేర్చుకుంటాం.

అసహజమైన విలువ కొలతలు ఆగిపోవాలంటే, మారకాలు ఆగిపోవాలి. అంటే, సమాజం అంతా మారకాలు లేకుండానే వస్తువుల్ని వాడుకోవడం జరగాలి. ఇది సాధ్యమవ్వాలంటే, దానికన్నా ముందు సమాజంలో కొన్ని మార్పులు జరగాలి. సమాజంలో వున్న మనుషులందరూ, జీవించడానికి కావలసిన వస్తువుల్ని 'సమిష్టి'గా ఉత్పత్తి చేసుకోవడమూ, వాటిని అవసరాల్ని బట్టి వాడుకోవడమూ అనే మార్పులు జరగాలి. ఈ పద్ధతిలోనే మారకాల్ని తీసి వెయ్యగలము. దీనికి సంబంధించి మనం ఇంకా ఎంతో సుదీర్ఘంగా అనేక విషయాలు నేర్చుకోవాలి. ప్రస్తుతానికి ఇక్కడ గుర్తుపెట్టుకోవలసిందేమిటంటే — 'విలువ అంటే శ్రమే. కానీ, శ్రమ అంటే విలువ కాదు' అని! శ్రమ తప్పనిసరిగా విలువగా మారనక్కరలేదు —అని.

# వస్తువూ, సరుకూ

కుర్చీ— ఒక వస్తువు. కొన్ని పదార్థాలతోటీ, కొన్ని పని ముట్లతోటీ, కొన్ని రూపం వున్న శ్రమలతోటీ తయారైన వస్తువు. అది, కూర్చోవడానికి ఉపయోగపడే ఒక ఉపయోగపు విలువ.

దుప్పటి — ఒక వస్తువు. కొన్ని పదార్థాలతోటీ, కొన్ని పనిముట్లతోటీ, కొన్ని రూపం వున్న శ్రమలతోటీ తయారైన

వస్తువు. అది, కప్పుకోవడానికి పనికివచ్చే ఒక ఉపయోగపు విలువ.

ఈ 2 వస్తువులకూ మారకం జరిగితే, ఆ 'మారక సంబంధం'లో వున్నంతసేపూ అవి 'సరుకులు'. వాటి 'శ్రమ మొత్తాలే' వాటి 'మారకం విలువలు'.

కుర్చీ తయారవడానికి అవసరమైన శ్రమ మొత్తం — కుర్చీ 'మారకం విలువ'. దుప్పటికి అవసరమైన శ్రమ మొత్తం — దుప్పటి 'మారకం విలువ'.

కుర్చీని (లేదా, ఇంకో వస్తువుని) 'మారక సంబంధం'లో పెట్టకుండా వాడుకుంటే, అది వస్తువు మాత్రమే, 'సరుకు' కాదు.


ఆ కుర్చీనే (లేదా, ఇంకో వస్తువుని) మారక సంబంధంలో పెడితే, అది ' వస్తువు' మాత్రమే కాదు, ' సరుకు' కూడా.

మారక సంబంధంలో వున్న కుర్చీ, కుర్చీ కాకుండా పోదు. అప్పుడు దాని శరీర లక్షణాలన్నీ మాయమైపోవు. అప్పుడు కూడా అది కుర్చీగానే వుంటుంది. అయితే, అప్పుడు దానికి 'సరుకు' లక్షణాలు కూడా సంక్రమిస్తాయి. అంటే మారక సంబంధంలో వున్న వస్తువు, ఒక ఉపయోగపు విలువ గల వస్తువుగా వుంటూనే, కొంత మారకం విలువగల సరుకుగా కూడా వుంటుంది. అంటే, ఆ సమయంలో దానికి వస్తువు లక్షణాలూ, సరుకు లక్షణాలూ కూడా వుంటాయి. అయితే, ఆ 2 లక్షణాలూ దానికి ఏకకాలంలోనే వుండవు. అది, వస్తువుగా వున్న క్షణాలలో సరుకుగా వుండదు. సరుకుగా వున్న క్షణాలలో వస్తువుగా వుండదు. అంటే, దాని శరీర లక్షణాలను చూసినప్పుడే అది ఒక ఉపయోగపు విలువ గల వస్తువు. దాని విలువనే చూసినప్పుడు, అది కొంత విలువగల సరుకు. దాన్ని, ఒక ఉపయోగపు విలువగల వస్తువుగా చూసినప్పుడు, దాని శ్రమ, రూపం వున్న శ్రమ. దాన్ని కొంత విలువగల సరుకుగా చూసినప్పుడు దాని శ్రమ, రూపం లేని శ్రమ.

| | | |
|---|---|---|
| వస్తువు | — | సహజమైనది |
| సరుకు | — | అసహజమైనది |
| ఉపయోగపు విలువ | — | సహజమైనది |
| మారకం విలువ | — | అసహజమైనది |
| రూపం వున్న శ్రమ | — | సహజమైనది |
| రూపం లేని శ్రమ | — | అసహజమైనది |

సరుకుకి ఈ సహజ లక్షణాలూ అసహజ లక్షణాలూ కూడా వుంటాయి కాబట్టి, సరుకు అనేది పరస్పర విరుద్ధ లక్షణాలతో వుంటుంది. సరుకుగా అవని వస్తువుకి, ఈ విరుద్ధతలేమీ వుండవు.

'వస్తువు'ని, సరుకు అని ఎప్పుడూ అనకూడదు. కానీ, 'సరుకు'ని, వస్తువు అని కూడా అనవచ్చు — అది సరుకూ, వస్తువూ కూడా గనక.




ఇలాగే, ఏ సరుకు విషయం అయినా కూడా.

ఆర్థిక శాస్త్ర పాఠకులు, మొట్టమొదట తెలుసుకో వలసింది 'సరుకు'కి వస్తువుగానూ, సరుకుగానూ విరుద్ధ లక్షణాలున్నాయనే విషయాన్ని. ఈ విషయం తెలుసుకోక పోతే, సామాజిక విషయాల్లో ఏది సహజత్వమో, ఏది అసహజత్వమో, తెలుసుకోవడం సాధ్యం కాదు. ఉపయోగపు విలువ తోటీ, విలువతోటీ కలిసి వున్న వస్తువుని (సరుకుని), సరైన అవగాహన లేకుండా చూసినప్పుడు, వస్తువులో ఆ 2 లక్షణాలూ ' సహజమైనవిగానే' కనపడతాయి. అంటే, 'వస్తువు'కి ఉపయోగపు విలువ వున్నట్టుగానే, విలువ వుండడం కూడా సహజ విషయమే అయినట్టూ, విలువ లేకుండా వస్తువులు వుండడం సాధ్యమే కానట్టూ కనపడుతుంది. కానీ సరుకులోని విరుద్ధతల్ని పరిశీలిస్తే వస్తువులన్నీ శ్రమలతో తయారై కూడా విలువలు లేకుండా వుండడం సాధ్యమేనని (అంటే, వస్తువులు సరుకులుగా మారకుండా ఉపయోగపడడం సాధ్యమేనని) గ్రహించవచ్చు.

# 'ఉత్పాదక శక్తి' అంటే ఏమిటి?

ఉత్పాదకశక్తి అంటే వస్తువుల్ని 'ఉత్పత్తి చేసే శక్తి.' కుట్టుపని చేసే వ్యక్తి, చేతికుట్టు ద్వారా 1 గంటలో 1 చొక్కా కుట్టగలడనుకుందాం. కుట్టుమిషను రావడంవల్ల అతను 1 గంటలోనే 2 చొక్కాలు కుట్టగలిగితే (1 చొక్కా కన్నా కొంచెం ఎక్కువ కుట్టగలిగినా కూడా) అది కుట్టు శ్రమలో ఉత్పాదకశక్తి పెరగడం. (ఉత్పాదకశక్తి పెరగడానికి కారణం కొత్త యంత్రాలు రావడం ఒక్కటే కాదు. ఇంకా ఇతర పద్ధతులు కూడా వుంటాయి. తర్వాత అన్నీ వివరంగా చూస్తాం.)

పూర్వం పని జరిగే కాలంలోనే, పూర్వం కన్నా ఎక్కువపని జరిగితే, అది ఉత్పాదకశక్తి పెరగడం. పూర్వం కన్నా తక్కువపని జరిగితే, అది ఉత్పాదకశక్తి తగ్గడం.

ఒక సుదీర్ఘకాలాన్ని తీసుకుని చూస్తే, ఆ కాలంలో ఉత్పాదక శక్తి తప్పనిసరిగా పెరిగి వుంటుంది. అది ఇక మళ్ళీ తగ్గదు.

నేతపని చేతిమగ్గాల మీద జరిగే పద్ధతి పోయి కరెంట్ మగ్గాలమీద జరిగే పద్ధతి వచ్చిందంటే, అది సుదీర్ఘమైన కాలంలో జరిగిన అభివృద్ధే. మళ్ళీ కరెంట్ మగ్గాలు పోయి పూర్వంలాగ నేతపని చేతిమగ్గాలమీదే జరగడమూ, ఉత్పాదక శక్తి పూర్వంలాగే అయిపోవడమూ ఎన్నటికీ జరగదు. పదేసి సంవత్సరాలకో, ఇరవయ్యేసి సంవత్సరాలకో ఒకసారి ఉత్పాదక శక్తిని పరిశీలించి చూస్తే, అది గతంకన్నా అభివృద్ధి చెంది వుంటుందేగానీ గతం కన్నా తగ్గి వుండదు.

అంత దీర్ఘకాలం తర్వాతగాక ఆర్నెల్ల వ్యవధిలోనో, సంవత్సరం వ్యవధిలోనో, అలా చాలా తక్కువ కాల పరిమితుల్లో ఎప్పటికప్పుడు ఒక శ్రమ ఉత్పాదకశక్తిని పరిశీలించి చూస్తే, అది పెరుగుతూ తరుగుతూ వుంటుంది. ఒకసారి పెరిగి వుండవచ్చు. ఒకసారి తరిగి వుండవచ్చు. ధాన్యాన్ని ఉత్పత్తిచేసే శక్తి ఒక సంవత్సరం వున్నట్టు మరుసటి సంవత్సరం వుండకపోవచ్చు. బట్టని ఉత్పత్తి చేసే శక్తి ఒక దఫా వున్నట్టు తర్వాత దఫా వుండకపోవచ్చు. ('ఉత్పత్తిశక్తి' అన్నా, 'ఉత్పాదకశక్తి' అన్నా ఒకటే. ఏ మాటనైనా వాడవచ్చును.)

## ఉత్పాదక శక్తికి, 'ఉపయోగపు విలువ'తో వుండే సంబంధమూ; 'మారకం విలువ'తో వుండే సంబంధమూ :

ఉత్పాదకశక్తి పెరిగిందంటే అర్థం, ఏ శ్రమ ఉత్పాదకశక్తి పెరిగిందని? నేత శ్రమ ఉత్పాదకశక్తి పెరిగిందనా? కుట్టు శ్రమ ఉత్పాదకశక్తి పెరిగిందనా? ఏ శ్రమ ఉత్పాదకశక్తి పెరిగిందని? ఒక కొత్త యంత్రం వచ్చిందంటే, అది ఏదో ఒక ప్రత్యేక శ్రమలో పనిచేసే యంత్రంగానే వుంటుంది. కుట్టుపని చెయ్యడానికి కొత్త యంత్రం వస్తే కుట్టు శ్రమలో వుత్పాదకశక్తి పెరుగుతుంది. వడ్రంగం పనికి కొత్త యంత్రం వస్తే వడ్రంగంలో వుత్పాదకశక్తి పెరుగుతుంది. కుట్టు శ్రమలో కొత్త యంత్రం వచ్చి ఇతర శ్రమల్లో రాకపోతే, కుట్టు శ్రమ ఉత్పాదకశక్తి మాత్రమే పెరుగుతుంది గానీ ఇతర శ్రమల్లో పెరగదు.

'ఉత్పాదక శక్తి' అన్నప్పుడు ఏదో ఒక శ్రమని తీసుకోవాలి. కుర్చీలు చేసే శ్రమని తీసుకుందాం. అంటే, వడ్రంగం శ్రమని. ఈ శ్రమలో, ఉత్పాదకశక్తి పెరగకముందు, 1 గంటకి 1 కుర్చీ తయారయ్యేదనుకుందాం. ఉత్పత్తి శక్తి పెరిగిన తర్వాత, 1 గంటకి 4 కుర్చీలు తయారవుతున్నాయి —అనుకుందాం. ఈ మార్పువల్ల 'ఉపయోగపు విలువ' విషయంలో వచ్చే ఫలితం ఏమిటి? 'విలువ' విషయంలో వచ్చే ఫలితం ఏమిటి?

ఉత్పత్తిశక్తి పెరగకముందు, 1 గంట శ్రమతో 1 కుర్చీ తయారయ్యేది. ఇప్పుడు అదే శ్రమతో (1 గంట శ్రమతో) 4 కుర్చీలు తయారవుతున్నాయి. కాబట్టి, ఉత్పత్తిశక్తి పెరగడం వల్ల 'ఉపయోగపు విలువలు' పెరుగుతాయి. ('ఉపయోగపు విలువ పరిమాణం' పెరుగుతుంది). అంటే, అదే కాలంలో ఎక్కువ వస్తువులు తయారవుతాయి. అయితే. 1 వస్తువుకి (1 కుర్చీకి) వుండే ఉపయోగపు విలువలో మార్పేమీ వుండదు. 1 వస్తువుకి వుండే ఉపయోగపు విలువ, వుత్పత్తి శక్తి పెరగకముందూ పెరిగిన తర్వాతా కూడా ఒకే రకంగా వుంటుంది.— ఇది, 'ఉపయోగపు విలువ' విషయంలో ఏర్పడే ఫలితం.

'విలువ' విషయంలో ఏర్పడే ఫలితం, దానికి విరుద్ధంగా వుంటుంది. ఉత్పత్తిశక్తి పెరగక ముందు 1 గంట శ్రమ ఎంత విలువగా వుంటుందో, ఉత్పత్తిశక్తి పెరిగిన తర్వాత కూడా 1 గంట శ్రమ అంతే విలువగా వుంటుంది. <u>గంట శ్రమ అనేది, ఎప్పుడైనా గంట శ్రమే.</u> ఉత్పత్తిశక్తి పెరగడంవల్ల, 1 గంట శ్రమ, 1 గంట శ్రమ కన్నా ఎక్కువ శ్రమగా అవడమో తక్కువ శ్రమగా అవడమో జరగదు. అయితే, ఉత్పత్తిశక్తి పెరిగాక, 1 వస్తువు విలువ మాత్రం తగ్గుతుంది. ఎందుకంటే, 1 వస్తువుకి పట్టే శ్రమ తగ్గుతుంది గనక. ఎలాగంటే: కుర్చీకి విలువ ఏర్పడాలంటే దాని ముడిపదార్థం శ్రమా, పనిముట్ల శ్రమా, వడ్రంగం శ్రమా కలుస్తాయి కదా? ఇప్పుడు వడ్రంగంలో ఉత్పత్తిశక్తి పెరిగింది కాబట్టి, ఇప్పుడు 1 కుర్చీకి అవసరమయ్యే వడ్రంగం శ్రమలో మార్పు జరుగుతుంది. ఈ ఉత్పత్తిశక్తి పెరగకముందు, 1 గంట వడ్రంగం శ్రమతో 1 కుర్చీ తయారయ్యేది కాబట్టి, అప్పుడు ఆ గంట శ్రమ, 1 కుర్చీకి అవసరమైన శ్రమ మొత్తంలోకి చేరేది. కానీ, వడ్రంగం ఉత్పత్తిశక్తి పెరిగిన తర్వాత, 1 గంట శ్రమతో 4 కుర్చీలు తయారవుతాయి కాబట్టి, ఇప్పుడు ఆ గంట శ్రమ 4 కుర్చీలకు అవసరమయ్యే శ్రమగా వుంటుంది. అంటే, ఇప్పుడు 1 కుర్చీకి, 'పావు గంట వడ్రంగం శ్రమ' మాత్రమే అవసరం అవుతుంది. ఈ రకంగా, ఇప్పుడు, 1 కుర్చీకి అవసరమయ్యే వడ్రంగం శ్రమలో కొంత భాగం తగ్గి, దానివల్ల కుర్చీకి అవసరమయ్యే మొత్తం శ్రమ తగ్గి, కుర్చీ విలువ తగ్గుతుంది. అంటే, ఒక శ్రమలో ఉత్పత్తిశక్తి పెరిగినప్పుడు, '1 గంట శ్రమ'కు వుండే విలువ ఏమీ మారకుండా, ఆ 1 గంటలో గతంకన్నా ఎక్కువ వస్తువులు తయారవుతాయి గనక, ఆ వస్తువుల్లో ప్రతీ వస్తువుకీ పట్టే శ్రమ కాలం తగ్గి, దాని

విలువ తగ్గుతుంది.

ఒకవేళ, కుర్చీని తయారుచెయ్యడానికి ఏ ముడిపదార్థం కావాలో ఆ ముడి పదార్థాన్ని (చెక్కని) ఉత్పత్తిచేసే వ్యవసాయ శ్రమల్లో ఉత్పత్తిశక్తి పెరిగితే, అప్పుడు, చెక్క కోసం అవసరమయ్యే శ్రమకాలం తగ్గి, చెక్క విలువ తగ్గి, దానితో తయారయ్యే కుర్చీ విలువ కూడా తగ్గుతుంది.

అలాగే, కుర్చీని తయారుచెయ్యడానికి ఏయే పనిముట్లు కావాలో వాటిని ఉత్పత్తిచేసే శ్రమల ఉత్పత్తి శక్తులు పెరిగితే, ఆ పనిముట్ల విలువలు తగ్గి, వాటితో తయారయ్యే కుర్చీ విలువ కూడా తగ్గుతుంది. ఈ రకంగా, కుర్చీ కోసం అవసరమైన ఏ అంశంలో ఉత్పత్తిశక్తి పెరిగినా, కుర్చీ విలువ తగ్గుతుంది. — ఉత్పత్తిశక్తి పెరగడంవల్ల, ఇది 'విలువ' విషయంలో జరిగే ఫలితం.

మొదట ఒక ఉదాహరణలో, 1 కుర్చీకీ ఒక దుప్పటికీ మారకం జరిగేదనుకుందాం. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, 2 వస్తువుల విషయంలోనూ ముడిపదార్థాల్నీ పనిముట్లనీ తీసుకోవద్దు. వడ్రంగం శ్రమనీ, నేత శ్రమనీ మాత్రమే తీసుకుందాం. తర్వాత, ఉత్పత్తిశక్తుల్లో మార్పుల వల్ల, ఆ వస్తువులకు పట్టే శ్రమల్లో మార్పులు ఎలా జరుగుతాయో ఉదాహరణలు చూడాలి.

కుర్చీకి వడ్రంగం శ్రమ 1 గంటా, దుప్పటికి నేత శ్రమ 1 గంటా అనుకుందాం. అంటే, కుర్చీ విలువా, దుప్పటి విలువా సమానం. కాబట్టి, 1 కుర్చీకీ, 1 దుప్పటికీ మారకం జరుగుతుంది.

1 దుప్పటి = 1 కుర్చీ
( 1 గంట నేత = 1 గంట వడ్రంగం)

ఇలా వుండగా, వడ్రంగం ఉత్పత్తిశక్తి పెరిగి, 1 గంటలో, 4 కుర్చీలు తయారవుతాయి అనుకుందాం. అంటే, ఇప్పుడు, 1 కుర్చీకి వడ్రంగం శ్రమ 1 గంట కాదు, 15 నిమిషాలే. అంటే, గతంలో 1 కుర్చీకి వుండే విలువ, ఇప్పుడు 4 కుర్చీలకు కలిసి వుంటుంది.

దుప్పటి ఉత్పత్తిశక్తిలో అలాంటి మార్పేమీ జరగలేదనీ, దుప్పటిలో శ్రమ ఇప్పుడు కూడా గతంలోలాగే 1 గంటగానే వుందనీ అనుకుందాం.

అయితే, ఇప్పుడు కూడా గతంలోలాగే 1 దుప్పటికీ 1 కుర్చీకీ మారకం జరుగుతుందా? —జరగదు. ఎందుకు? ఎందుకంటే, ఇప్పుడు ఆ వస్తువుల్లో శ్రమ కాలాలు గతంలోలాగే లేవు గనక. అంటే, వాటి విలువలు గతంలో లాగ లేవు గనక. ఇప్పుడు, దుప్పటిలో శ్రమ 60 నిమిషాలైతే, కుర్చీలో శ్రమ 15 నిమిషాలే. దుప్పటి విలువ, గతంలోలాగే వుంది. కానీ, కుర్చీ విలువ చాలా తగ్గిపోయింది. కాబట్టి, ఇప్పుడు కుర్చీల మనిషికి దుప్పటి కావాలంటే, 1 కుర్చీ ఇస్తే చాలదు. 4 కుర్చీలు ఇస్తేనే 1 దుప్పటి వస్తుంది.

ఇప్పుడు, 1 దుప్పటి = 4 కుర్చీలు
(60 ని॥ నేత = 60 ని॥ వడ్రంగం)

1 దుప్పటికి బదులుగా 4 కుర్చీలు. అంటే, ఇప్పుడు తక్కువ విలువకీ, ఎక్కువ విలువకీ మారకం జరిగినట్టు అర్థమా? — కాదు. ఇప్పుడు కూడా గతంలోలాగే, సమాన విలువల మధ్యనే మారకం జరిగినట్టు అర్థం.

ఇప్పుడు మళ్ళీ మొదటి ఉదాహరణకి వెళ్దాం. కుర్చీలో శ్రమ 1 గంటా, దుప్పటిలో శ్రమ 1 గంటా— అనే ఉదాహరణకి. ఇలా వుండగా, కుర్చీల ఉత్పత్తిశక్తి పెరగడం గాక, సగానికి తగ్గిపోయిందనుకుందాం. అంటే, ఇప్పుడు, 1 కుర్చీకి 1 గంట కాదు, 2 గంటలు పడుతుంది. దుప్పటిలో మార్పు లేదనీ, దాని శ్రమ 1 గంటగానే వుందనీ అనుకుందాం. అయితే ఇప్పుడు, ఆ వస్తువుల మారకం ఎలా వుంటుంది? ఇప్పుడు కూడా 1 కుర్చీకీ 1 దుప్పటికీ మారకం జరుగుతుందా? — జరగదు. ఎందుకంటే, ఆ వస్తువుల్లో శ్రమలు గతంలో లాగ లేవు గనక.

ఇప్పుడు, 1 కుర్చీ = 2 దుప్పట్లు
(2 గం.ల వడ్రంగం = 2 గం.ల నేత)

ఇలాగే, దుప్పటి ఉత్పత్తిశక్తిలో కూడా మార్పులు జరగవచ్చు. అప్పుడు కూడా ఫలితాలు ఇలాగే వుంటాయి.

ఏ శ్రమకి సంబంధించిన ఉత్పత్తిశక్తి ఎలా మారినా, (పెరిగినా, తగ్గినా, ఎలా జరిగినా), 2 వస్తువులకు మారకం జరిగినప్పుడు, ఇచ్చే శ్రమా, తీసుకునే శ్రమా, సమానంగానే వుంటాయి. దానికి తగిన విధంగానే వస్తువుల పరిమాణాలు మారతాయి.

పొలాలలో పండే పంటల ఉత్పత్తిశక్తులు ఎప్పుడూ ఒకే రకంగా వుండవు. ఒక సంవత్సరం పత్తి బాగా పండి, ధాన్యం పాడైపోవచ్చు. లేదా అన్ని పంటలూ గతంకన్నా బాగా పండవచ్చు. లేదా, అన్ని పంటలూ తగ్గిపోవచ్చు. ఈ రకంగా, ఉత్పత్తిశక్తుల్లో ఎప్పుడూ మార్పులు జరుగుతూనే వుంటాయి. కొత్త కొత్త సైన్సు విషయాల్ని గ్రహించగలిగి నప్పుడు ఉత్పత్తిశక్తులు గతం కన్నా పెరుగుతాయి.

ఉత్పత్తిశక్తి మారినప్పుడు, దాని ఫలితాలు 'ఉపయోగపు విలువ' విషయంలోనూ 'విలువ' విషయంలోనూ, క్లుప్తంగా చూస్తే ఇలా వుంటాయి :

## ఒక శ్రమలో 'ఉత్పత్తి శక్తి' మారినప్పుడు :

**1. 'ఉపయోగపు విలువ' విషయంలో** : 1 గంటని గానీ, 1 రోజునిగానీ, 1 సంవత్సరాన్ని గానీ, ఎంతో కొంత

కాలాన్ని తీసుకుంటే, ఆ కాలంలో వుత్పత్తి అయ్యే 'వస్తువుల రాసి' (అంటే, ఉపయోగపు విలువ పరిమాణం) పెరగడమో, తరగడమో జరుగుతుంది. కానీ, 1 వస్తువులో వుండే (1 యూనిట్‌లో వుండే) 'ఉపయోగపు విలువ పరిమాణం' మారదు.

**2. 'విలువ' విషయంలో** : ఎంతో కొంత కాలాన్ని తీసుకుంటే, ఆ కాలంలో ఉత్పత్తి అయ్యే 'విలువ పరిమాణం' ఏమీ మారదు. కానీ, 1 వస్తువుకి (1 యూనిట్‌కి) పట్టే శ్రమకాలం పెరగడమో తరగడమో జరిగి, 1 వస్తువు విలువ పెరగడమో, తరగడమో జరుగుతుంది.

## 'సామాజిక శ్రమ' కాలానికీ, ఉత్పత్తి శక్తికీ గల సంబంధం :

'సామాజిక శ్రమకాలం' అంటే, ఒక పని కోసం అవసరమయ్యే 'సగటు శ్రమకాలం'. ఒక పనిలో అప్పుడు వున్న ఉత్పత్తిశక్తిని బట్టే ఆ పనికోసం అవసరమయ్యే సగటు శ్రమకాలం వుంటుంది.

నేత పని, చేతిమగ్గాలమీద జరిగేది ఒక దశా, కరెంటు మగ్గాలమీద జరిగేది ఇంకో దశా — అనుకుందాం. ఈ 2 దశలకూ మధ్య 20 సం.ల దూరం వుందనుకుందాం.

మొదటిదశలో (చేతి మగ్గాల దశలో), 1 దుప్పటికి నేత శ్రమ సగటున 1 గంట అనుకుందాం. ఈ సగటు ప్రతీసారీ ఖచ్చితంగా ఒకే రకంగా వుండదు. 1 గంట కన్నా కొంత ఎక్కువో తక్కువో అవుతూ వుండవచ్చు. అయినప్పటికీ, ఈ సగటు, 1 గంటకన్నా మరీ దూరంగా వుండదని అర్థం.

రెండో దశలో (కరెంటు మగ్గాల దశలో), 1 దుప్పటికి నేత శ్రమ సగటున అరగంట అనుకుందాం. ఈ సగటు కూడా ప్రతీసారీ ఒకే రకంగా వుండదు. కొంత ఎక్కువో తక్కువో అవుతూ వుండవచ్చు. అయినప్పటికీ ఈ సగటు, 'అరగంట' కన్నా మరీ దూరంగా వుండదని అర్థం.

కొత్త యంత్రాలు రావడం, నేత పనిలోనే గాక, భూమిని దున్నే పనిలోనూ, పత్తిని దారంగా వడికే పనిలోనూ కూడా జరిగి, ఆ పనుల్లో కూడా ఉత్పత్తిశక్తులు పెరిగాయను కుందాం. అప్పుడు, దుప్పటి కోసం అవసరమయ్యే ముడి పదార్థమూ, పనిముట్లూ కూడా తక్కువ శ్రమతోనే తయారవు తాయి. అప్పుడు దుప్పటిలో శ్రమ మొత్తం, గతంకన్నా తగ్గుతుంది.

ఈ రకంగా, ఒక వస్తువు కోసం అవసరమయ్యే అంశా లన్నిటిలోనూ ఉత్పత్తిశక్తులు పెరుగుతూ వున్నకొద్దీ ఆ వస్తువుకి పట్టే సగటు శ్రమకాలం తగ్గిపోతూ వుంటుంది.

'నేత పని'లో కరెంటు మగ్గాలు వచ్చాయంటే అర్థం, అప్పుడు చేతిమగ్గాలు పూర్తిగా లేకుండా పోయాయనీ, చేతిమగ్గాలమీద ఎవ్వరూ నేత నెయ్యడం లేదనీ కాదు. సమాజానికంతటికీ కలిసి మొత్తం ఎంత నేతపని (నేత శ్రమ) కావాలో అందులో ఎక్కువ భాగం పని కరెంటు మగ్గాలమీదే జరుగుతూ, తక్కువ భాగం పని చేతి మగ్గాలమీద జరుగుతూ వుంటే, అది 'కరెంటు మగ్గాల దశ'గానే వుంటుంది. అప్పుడు, 1 మీటరు బట్ట నేతకి కరెంటు మగ్గంమీద ఎంతకాలం పడుతుందో ఆ కాలమే ఆ పనికి సంబంధించిన సగటు శ్రమకాలంగా వుంటుంది. చేతిమగ్గాల మీద పనిచేసే మనుషులు కూడా ఈ కొత్త సగటు శ్రమకాలానికే కట్టుబడ వలసి వుంటుంది. అంటే, ఆ పనికి చేతిమగ్గం మీద ఎక్కువ కాలమే పట్టినా అది తక్కువ కాలంగానే (కరెంటు మగ్గాల మీద పట్టినంత కాలంగానే) లెక్కకు వస్తుంది. ఈ రకంగా, ఒక పనికి సంబంధించిన సామాజిక శ్రమకాలం (సగటు శ్రమకాలం), ఆ శ్రమలో అప్పుడు వున్న ప్రధానమైన ఉత్పత్తి శక్తిని బట్టి వుంటుంది. — ఇదే సామాజిక శ్రమ కాలానికీ, ఉత్పత్తిశక్తికీ వున్న సంబంధం.

# 'శ్రమ విభజన' అంటే ఏమిటి ? దాని ఉపయోగం ఏమిటి ?

ప్రతీ వ్యక్తీ తనకు నిత్య జీవితంలో కావలసిన వస్తువులన్నిటినీ తనే తయారుచేసుకోడని చూశాం. కొందరు ఒక రకం వస్తువులు తయారుచేస్తే, కొందరు వేరొక రకం వస్తువులు తయారుచేస్తారు. కొన్ని కుటుంబాల మనుషులు ధాన్యం పండిస్తే, కొన్ని కుటుంబాల మనుషులు చెక్కపని (వడ్రంగం పని) మాత్రమేనూ, మరికొన్ని కుటుంబాల మనుషులు మట్టిపని (కుమ్మరి పని) మాత్రమేనూ చేస్తారను కుందాం. ఈ విధంగా కొందరు ఒక రకం పనిచేస్తూ వుంటే, మరికొందరు ఇంకొక రకం పని చేస్తూ వుండడమే 'శ్రమ విభజన'. శ్రమలలో విభజన జరగడమే 'శ్రమ విభజన'. ఈ వుదాహరణ ప్రకారం, వడ్రంగం శ్రమ అనేది ఒక 'స్వతంత్ర శాఖ'. కుమ్మరి శ్రమ అనేది ఇంకో స్వతంత్ర శాఖ.

సమాజానికంతటికీ (సమాజంలో వున్న మనుషు లందరికీ) కావలసిన అన్ని రకాల శ్రమల మొత్తాన్నీ ఒక 'సామాజిక శ్రమవృక్షం'గా అనుకుంటే, ఆ వృక్షంలో, వడ్రంగం శ్రమ అనేది ఒక శాఖగానూ, కుమ్మరి శ్రమ అనేది ఇంకో

శాఖగానూ వున్నాయి అన్నమాట. మనం ఏనాటి సమాజాన్ని ఉదాహరణగా తీసుకుంటామో, ఆ సమాజంలో వున్న స్వతంత్ర శ్రమలు ఆ సామాజిక శ్రమ వృక్షానికి వుండే వేరు వేరు కొమ్మల్లాంటివి. 'స్వతంత్ర శ్రమ' చేసే పని ఏమిటంటే, సమాజానికంతటికీ అవసరమైన వుపయోగపు విలువల్ని (ఆ శ్రమతో చేసే వుపయోగపు విలువల్ని) ఉత్పత్తి చెయ్యడం.

ఈనాడు స్వతంత్ర శ్రమలుగా వున్న ఒకటి రెండు శ్రమల గురించి ఇప్పుడు కొంచెం వివరంగా చూస్తాం. ఇప్పుడు ఎవరికైనా బట్టలు (దుస్తులు) కావాలంటే, ఎవరి బట్టలు వాళ్ళే కుట్టుకోరు. కుట్టే పని చెయ్యడానికి ప్రత్యేకంగా వున్న దర్జీతో (టైలరుతో) ఆ పని చేయించుకుంటారు.

కానీ కొంతకాలం కిందట, బట్టలు కుట్టే దర్జీలంటూ ఎవ్వరూ వుండేవారు కాదు. అంటే, అప్పటికి ఇంకా మానవులు బట్టలు కట్టుకునేవారు కారని అర్థం కాదు. పత్తిని పండించడం, బట్టలు నెయ్యడం, బట్టలు కుట్టడం, కట్టుకోవడం — అన్నీ అప్పటికి సాగుతూనే వున్నాయి. కుట్టు పనిచేసే దర్జీ లనేవారు ప్రత్యేకంగా లేకపోయినా, అందరూ, కుట్టిన బట్టలు కట్టుకుంటూనే వుండేవారు. అంటే, ఎవరి బట్టలు వాళ్ళే కుట్టుకునే వారన్న మాట!

ఒక రైతు కుటుంబంలో వాళ్ళకు కావలసిన బట్టలు వాళ్ళే కుట్టుకునేవారు. ఒక వడ్రంగి కుటుంబంలో, వాళ్ళ బట్టలు వాళ్ళే కుట్టుకునేవారు. ఒక కుమ్మరి కుటుంబంలో, వాళ్ళ బట్టలు వాళ్ళే కుట్టుకునేవారు — ఈ విధంగా, ఎవరికి అవసరమైన బట్టలు వాళ్ళు కుట్టుకునేవారుగానీ ఇంకో వ్యక్తికి ఇచ్చి కుట్టించుకునే పద్ధతి ఒకనాడు సమాజంలో లేనేలేదు. అంటే అప్పుడు, 'దర్జీ వృత్తి' చేసే వ్యక్తిగా ఒక్క వ్యక్తి కూడా లేడు. సమాజంలో కుట్టుపని అనేది ఉన్నప్పటికీ, అది ఇంకా అప్పటికి సమాజంలో వున్న శ్రమ విభజనలో 'స్వతంత్రమైన శ్రమ శాఖ'గా ఏర్పడలేదు. అంటే అది, అప్పటికి స్వతంత్ర శాఖలుగా ఏర్పడివున్న శ్రమలతోనే కలిసిపోయి వుందని అర్థం.

ఒక రైతు కుటుంబంలో వ్యక్తులు, వ్యవసాయం పనితోపాటు కుట్టుపని కూడా చేసుకుంటున్నారంటే — కుట్టుపని, వ్యవసాయం పనితో కలిసిపోయి వుందని అర్థం. ఇంకో కుటుంబంలో, వడ్రంగం పనితోపాటు కుట్టుపని కూడా చేసుకుంటున్నారంటే, అక్కడ కుట్టుపని వడ్రంగం పనితో కలిసిపోయి వుంది. అలాగే, కుట్టుపని కమ్మరం తోటీ, కుమ్మరం తోటీ, అలా అప్పటికి స్వతంత్ర శ్రమలుగా వున్న అన్ని శ్రమలతోటీ కలిసిపోయి వుంది.

తర్వాత కొంత కాలానికి, అందరికీ కుట్టుపని చేసిపెట్టే దర్జీ అవతరించాడు. ఈ దర్జీ తన బట్టలు మాత్రమే కుట్టుకుని వూరుకోడు. ఇతరులకు కూడా బట్టలు కుట్టి పెడతాడు. అలా కుట్టిపెట్టినందుకు ఇతరుల నించి తనకు కావలసిన జీవితావసర వస్తువులు తీసుకుంటాడు. దర్జీ అవతరించిన తర్వాత ఎవరి బట్టలు వాళ్ళే కుట్టుకోనక్కరలేదు.

ఒక రైతు కుటుంబంలో వాళ్ళు తమ బట్టలు దర్జీతో కుట్టించుకుని దర్జీకి కొంత ధాన్యం ఇస్తారు. ఒక కుమ్మరి కుటుంబంలో వాళ్ళు, తమ బట్టలు దర్జీతో కుట్టించుకుని, కొన్ని కుండలు ఇస్తారు. ఒక వడ్రంగి కుటుంబంలో వాళ్ళు, దర్జీకి చెక్క సామాన్లు చేసి పెడతారు — ఈ రకంగా ఇతర శ్రమలు చేసే వ్యక్తులందరూ, ఎవరి బట్టలు వాళ్ళు కుట్టుకోవడం మానేసి, కుట్టుపని చేయడం కోసమే ప్రత్యేకంగా వున్న వ్యక్తులతో ఆ పని చేయించుకుని, తమ శ్రమ వల్ల తయారయ్యే వస్తువులు ఆ వ్యక్తులకు ఇస్తారు.

ఇదివరకు అన్ని శ్రమలతోటీ కలిసిపోయివున్న కుట్టుపని ఇప్పుడు అన్ని శ్రమల నించీ విడిపోయిందన్నమాట! ఇతర శ్రమలకూ, కుట్టు శ్రమకూ మధ్య 'విభజన' జరిగిందన్న మాట! ఇప్పుడు కుట్టుశ్రమ, తనూ ఒక స్వతంత్ర శ్రమగా, తన స్వంత వ్యక్తిత్వంతో, ఇతర స్వతంత్ర శ్రమల సరసన నిలబడుతోంది.

అంతకు పూర్వమే సమాజంలో — వ్యవసాయం, వడ్రంగం, కమ్మరం, కుమ్మరం — అనే 4 స్వతంత్ర శ్రమలు వున్నాయనుకుందాం. అప్పుడు కుట్టుశ్రమ వాటి నించి విడిపోయి స్వతంత్ర శ్రమ అయిందంటే, అప్పుడు సమాజంలో 5 స్వతంత్ర శ్రమలు వున్నాయని అర్థం.

ఒక శ్రమ, స్వతంత్ర శ్రమ కాక ముందు, దానివల్ల ఉత్పత్తి అయ్యే వస్తువులు ఆ శ్రమ ఎవరు చేసుకుంటారో వాళ్ళకి మాత్రమే అందుబాటులో వుంటాయి. ఆ శ్రమవల్ల వాళ్ళ అవసరాలు మాత్రమే తీరతాయి. ఆ శ్రమే స్వతంత్ర శ్రమగా ఏర్పడితే, ఇతరులకోసం కూడా ఆ శ్రమ చేసే వ్యక్తులు వుంటారు. ఆ శ్రమవల్ల ఉత్పత్తి అయ్యే వస్తువులు సమాజంలో అందరికీ అందుబాటులో వుంటాయి. అంటే, ఒక శ్రమ స్వతంత్ర శ్రమగా అవడం అంటే, అందరికోసమూ ఆ శ్రమని చేసే ప్రత్యేక వ్యక్తులు ఏర్పడడం అన్నమాట.

సమాజంలో 5 స్వతంత్ర శ్రమలు వున్నాయంటే వాటి ద్వారా 5 రకాల వుపయోగపు విలువలు తయారవుతూ వుంటాయి. ప్రతీ శ్రమ వల్లా తయారయ్యే వస్తువుల్ని సమాజంలో అంతా వుపయోగించుకుంటూ వుంటారు. ఈ 5 శ్రమల్లో ఏ శ్రమా చెయ్యని వ్యక్తులు ఆ సమాజంలో ఎవ్వరూ వుండరు. ఉంటే, వాళ్ళకు నిత్యజీవితావసర వస్తువులు లభించవు.

సమాజంలో, ఒక దశలో, 5 స్వతంత్ర శ్రమలూ, ఇంకా స్వతంత్రంగా విడిపోని 10 ఇతర శ్రమలూ వున్నాయి — అనుకుందాం. మొత్తం ఈ 15 శ్రమలూ కలిసి వుత్పత్తిచేసే వస్తువులరాసే ఆ సమాజంలో తయారయ్యే మొత్తం వస్తువుల రాసి. ఈ రాసిలో, ' వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యని

శ్రమలు' ఇచ్చే (బండి తోలడం, చదువు చెప్పడం —లాంటి శ్రమలు ఇచ్చే) వుపయోగపు విలువలు కూడా వున్నాయని అర్థం. ఈ మొత్తం రాసే సమాజపు 'భౌతిక సంపద'. ఈ వస్తువుల రాసి తోనే సమాజం జీవిస్తూ వుంటుంది.

ఒక శ్రమ, ఇతర శ్రమల నించి విడిపోయి స్వతంత్ర శ్రమగా అవడం అనేది, ఒక రోజులోనో ఒక నెలలోనో హఠాత్తుగా జరగదు. దాని కోసం ఎంతోకాలం పడుతుంది. ఒక శ్రమ, ఇతర శ్రమలనించి విడిపోవడం ఎప్పుడు ప్రారంభిస్తుందో అప్పుడే ఆ శ్రమ పుట్టిందని అర్థం కాదు. అంతకు పూర్వం ఎంతోకాలం నించి అది సమాజంలో వుంటూనే, వుపయోగపు విలువల్ని ఉత్పత్తి చేస్తూనే వుంటుంది. ఆ తర్వాత, కొంతకాలానికి అది 'స్వతంత్ర శ్రమ'గా విడిపోతుంది. ఒక శ్రమ అలా ఇతర శ్రమల నించీ విడిపోవడం (అంటే, ఆ శ్రమని చెయ్యడానికి ప్రత్యేక వ్యక్తులు ఏర్పడడం) సమాజానికి తప్పనిసరిగా అవసరం.

సమాజంలో 'మారకాలు' అనేవి ఇంకా ప్రారంభం కాని ప్రాచీన కాలంలో కూడా 'శ్రమ విభజన' వుంది. భారతదేశపు ఆదిమ సమాజంలో, 'మారకాలు' ప్రారంభం కాకముందే శ్రమ విభజన వుంది. అప్పుడు కొందరు మనుషులు సమిష్టిగా జీవిస్తున్నట్టు వూహిద్దాం. వారిలో కొందరు వేట పని చేస్తే, కొందరు పశువుల్ని పెంచే పని చేస్తారు. (ఈ పనుల్ని సూచించడం కేవలం వుదాహరణ కోసమే). కొందరు వేటాడి తెచ్చిన మాంసాన్ని అందరూ తీసుకుంటారు. అలాగే కొందరు పశువుల పెంపకంవల్ల ఉత్పత్తి చేసిన పదార్థాలను కూడా అందరూ తీసుకుంటారు. వీటిలో ఏ ఉత్పత్తికీ కూడా విలువ కొలతలూ, మారకాలూ వుండవు. అంటే, <u>'విలువ' ప్రసక్తి లేకుండా 'శ్రమ విభజన' సాధ్యమేనని దీని అర్థం.</u> దీనికి ఆదిమ భారత సమాజం ఒక రుజువుగా వుంది.

ఈనాటి సమాజంలో వున్న వందలాది స్వతంత్ర శ్రమల్లో అసంఖ్యాకమైన శ్రమలు, సమాజంలో 'మారకాలు' ఏర్పడిపోయిన తర్వాత ప్రారంభమైనవే. మారకాలూ, విలువ కొలతలూ ఏర్పడిపోయిన తర్వాత, ఇక ఆ సమాజంలో ఒక శ్రమ స్వతంత్ర శ్రమగా ఏర్పడడం అనేది 'విలువ పునాది' మీదే జరుగుతుంది. అంటే, మారకాలు ప్రారంభమైన తర్వాతే 'కుట్టుశ్రమ' స్వతంత్ర శాఖగా ఏర్పడిందనుకుందాం. అప్పటి నించీ 1 గంట కుట్టు శ్రమ కూడా, ఇతర శ్రమల లాగానే 'విలువ' గలది అవుతుంది.

కుట్టుశ్రమ ఒక స్వతంత్ర శ్రమగా ఏర్పడకముందు ఒక వ్యక్తి ఇంకో వ్యక్తికి ఒక చొక్కా కుట్టిపెడితే ఆ పనికి ఒక లెక్క ప్రకారం 'విలువ' చెల్లించడం అనేది వుండదు. ఆ పని, 'సహాయం చేసిపెట్టడం'గా, అంటే — ఒక వుపయోగపు విలువగా, వుంటుంది. (చొక్కా కుట్టించుకున్న మనిషి, చొక్కా కుట్టి పెట్టిన మనిషికి తన కృతజ్ఞతని ఇంకో సమయంలో ఏదో వస్తువు ఇచ్చి, లేదా ఏదో పని చేసిపెట్టి, తెల్పుకుంటాడు). కానీ, ఇప్పుడు (అంటే ఒక వ్యక్తి దర్జీగా ఇతరుల కోసం కుట్టు పని చెయ్యడం ప్రారంభించిన తర్వాత) ఆ పనికి కొంత ఖచ్చితమైన 'విలువ' వుందనే విషయం కుట్టుపని చేసే వ్యక్తికీ, చేయించుకున్న వ్యక్తికీ కూడా స్పష్టంగా తెలిసి వుంటుంది. దుస్తులు కుట్టించుకున్న వ్యక్తి, విలువ లెక్కల ప్రకారం, ఆ పనికి విలువ చెల్లిస్తాడు.

కుట్టుపని స్వతంత్ర శ్రమగా ఏర్పడిన తర్వాత కూడా (దుస్తులు కుట్టిపెట్టే దర్జీలు వున్న తర్వాత కూడా) ఒక మనిషి తన బట్టలు తనే కుట్టుకుంటాడనుకుందాం. ఆ మనిషి శ్రమ, అతనికి, వుపయోగపు విలువగానే వుంటుందిగానీ విలువగా వుండదు. అయితే ఆ మనిషి, తన శ్రమ ఎంత విలువ కలదో లెక్క కట్టుకోవడం మాత్రం ఇప్పుడు సాధ్యమవుతుంది. "ఈ బట్టలు దర్జీతో కుట్టించుకుంటే దానికోసం 'ఇంత విలువ' చెల్లించవలసి వచ్చేది కదా? కాబట్టి, నేను చేసుకున్న పని విలువ 'ఇంత' అన్నమాట" అని ఆ మనిషి, తన పని విలువ ఏమిటో లెక్కకట్టుకోవచ్చు.

'శ్రమ విభజన' వల్ల కొందరు వ్యక్తులు, ఆ శ్రమలో ప్రత్యేక నైపుణ్యం సాధించడానికి అవకాశం వుంటుంది. కుట్టు పనిలో ఆసక్తి వున్న వ్యక్తి, ఆ పనినే తన ప్రధాన వృత్తిగా చేసుకుంటాడు. ఇతరులకోసం అనేక రకాల బట్టలు కుడుతూ వుండడంవల్ల, ఆ పనినే తిరిగి తిరిగి చేయడంలో అనేక అనుభవాలు పొంది దానిలో నైపుణ్యం సంపాదిస్తాడు. ఎవరి బట్టలు వాళ్ళు కుట్టుకునే పరిస్థితిలో అయితే, ఇంత నైపుణ్యం సంపాదించే అవకాశం ఏ ఒక్క వ్యక్తికీ వుండదు.

'చెప్పులు కుట్టే శ్రమ' గురించి చూస్తే — అది ఒక స్వతంత్ర శ్రమగా ఏర్పడక ముందు కూడా మనుషులు చెప్పులు తొడుక్కోవడం వుంటుంది. అయితే అప్పుడు చెప్పులు తొడుక్కోదలచినవాళ్ళు ఎవరి చెప్పులు వాళ్ళు కుట్టుకోవలసిందే గానీ, 'మారకం'లో ఒక చెప్పుల జతని సంపాదించడానికి వీలు వుండదు. ఎందుచేతనంటే, ఇతరుల కోసం (మారకాల కోసం) చెప్పుల జతల్ని తయారు చేసే వాళ్ళెవరూ అప్పుడు వుండరు గనక. చెప్పుల జతల్ని 'మారకం'లో సంపాదించాలీ అంటే, చెప్పులు కుట్టే పని ఇతర శ్రమల నించి విడిపోవాలి. అంటే చెప్పులు కుట్టే పనికి కూడా విలువ ఏర్పడాలి.

ఇతర పనుల విషయంలో 'విలువ'ని చెల్లించడం అనేది జరుగుతూ వుండగా, చెప్పులు కుట్టే పనికి 'విలువ'ని చెల్లించడం జరగకపోతే, ఒక వ్యక్తి ఇతరులకోసం చెప్పులు కుట్టే పనిని ప్రారంభించడు. 'చెప్పులు' అనేవి మనుషులకు 'నిత్యావసరం' అవుతూ వుండి, ఇంకో వస్తువుని ఇచ్చి చెప్పుల్ని తీసుకోవడానికి మనుషులు అంగీకరిస్తూ వుంటే, చెప్పులు కుట్టే పనికి కూడా 'విలువ' కొలతలు ఏర్పడుతున్నాయని

అర్థం. చెప్పులు కూడా విలువగల సరుకుగా అవుతున్నప్పుడు, కొందరు వ్యక్తులు మారకాల కోసం (ఇతరుల కోసం) చెప్పులుకుట్టే శ్రమని చేపడతారు. అప్పటి నించి చెప్పులు కుట్టే శ్రమ ఇతర శ్రమల నించి విడిపోతుంది. అది ఒక 'విలువ'గల శ్రమగా, ఇతర స్వతంత్ర శ్రమల సరసన సమాన హోదాతో నిలబడుతుంది.

శ్రమలు, విలువలుగా మారే పద్ధతి వుంటేనే, సమాజంలో 'శ్రమ విభజన' వుంటుందని దీని అర్థం కాదు. సమాజంలో మారకం విలువ పద్ధతి లేకపోయినా 'శ్రమ విభజన' సాధ్యమే. కానీ, మారకం విలువ మీదే ఆధారపడి సాగే సమాజంలో, అంటే వుపయోగపు విలువలు కావాలంటే, వాటిని 'మారకం' ద్వారా మాత్రమే సంపాదించ వలసి వున్న సమాజంలో — ఒక శ్రమ, స్వతంత్ర శ్రమగా ఏర్పడడం అనేది, దానికి విలువ ఏర్పడినప్పుడే జరుగుతుంది.

ప్రతీ శ్రమా ఏదో ఒక ఉపయోగపు విలువని ఇస్తుంది. ఆ రకంగా చూస్తే, అన్ని శ్రమలూ సమానమే. కానీ, ఉపయోగపు విలువలు వేరు వేరు రకాలుగా వుంటాయి కాబట్టి, వేరు వేరు వుపయోగపు విలువల్ని చూసినప్పుడు, 'అన్ని శ్రమలూ సమానమే' అనే విషయం రుజువు కాదు. వైద్యం చేసే శ్రమా, చెప్పులు కుట్టే శ్రమా సమానమే — అనే సంగతి, ఆ వేరు వేరు ఉపయోగపు విలువల ద్వారా రుజువు కాదు. అయితే, 'ఏ రెండు శ్రమలైనా సమానమే' అనే సంగతి ఎలా రుజువవుతుందంటే, అవి, విలువలుగా మారడం ద్వారా రుజువవుతుంది.

చెప్పులు కుట్టే మనిషి దగ్గిర చెప్పులు తీసుకుని, దానికి విలువని చెల్లించడం (ఇంకో వస్తువుని ఇవ్వడం) జరుగుతుం దనుకుందాం. అప్పుడు — 'ఇతర శ్రమలకు విలువ వున్నట్టే చెప్పులు కుట్టే శ్రమకు కూడా విలువ వుంది. ఇతర శ్రమలకు వున్న లక్షణమే చెప్పులు కుట్టే శ్రమకు కూడా వుంది. కాబట్టి, చెప్పులు కుట్టే శ్రమ కూడా ఇతర శ్రమల లాంటిదే' — అని రుజువవుతుంది.

ఈ రకంగా వేరు వేరు శ్రమలు, వస్తువుల్ని, మారకాల కోసమే తయారుచెయ్యడం ద్వారా, అన్నిటికీ 'విలువ' అనే ఒకే లక్షణం వుంటుంది కాబట్టి, 'శ్రమల సమానత్వం' రుజువవుతుంది.

చెప్పులు కుట్టే శ్రమ స్వతంత్ర శ్రమగా వుండాలంటే, ఆ శ్రమచేసే వ్యక్తి, ఇతర శ్రమలేవీ చెయ్యకుండా ఆ ఒక్క శ్రమ మాత్రమే చేస్తూ వుండాలని కాదు. చెప్పులు కుట్టే వ్యక్తి కొంతసేపు వ్యవసాయం పని చేసుకోవచ్చు. కొంతసేపు పశువుల్ని మేపుకోవచ్చు. ఎన్ని పనులైనా చేసుకోవచ్చు. కానీ చెప్పులు కుట్టే పనిని ఇతరుల అవసరాల కోసం తప్పనిసరిగా చేస్తూ వుండాలి. ఇతరులకోసం చెప్పులు కుట్టే వ్యక్తి ఒక్కడు కూడా లేకపోతే ఆ శ్రమ స్వతంత్ర శ్రమగా ఏర్పడినట్టు కాదు.

ఒక వ్యక్తి, ఇతరుల కోసం చెప్పులు కుట్టే పనీ, బట్టలు కుట్టేపనీ కూడా చేస్తున్నాడనుకుందాం. అంటే ఆ వ్యక్తి 2 స్వతంత్ర శ్రమలు చేస్తున్నాడన్నమాట. ఆ 2 శ్రమలవల్లా అతను 2 రకాల వుపయోగపు విలువలు ఉత్పత్తి చేస్తున్నాడు. 2 శ్రమలూ చేసే వ్యక్తి ఒకడే అయినా ఆ శ్రమలు వేరు వేరు శ్రమలుగానే వుంటాయి.

సమాజంలో 10 రకాల శ్రమలు వున్నాయి — అను కుందాం. అంటే, అప్పుడు మనుషులు, ఆ శ్రమలతో ఉత్పత్తి అయ్యే 10 రకాల వుపయోగపు విలువల్ని వాడుతున్నారని అర్థం. అప్పుడు, ఇంకో కొత్త శ్రమ తెలిసిందనుకుందాం. (ఉదా॥ వాచీలు తయారుచెయ్యడం, లేదా రేడియోలు తయారుచెయ్యడం). అప్పటినించీ మనుషులు 11 రకాల వుపయోగపు విలువల్ని వాడుతూ వుంటారు. ఈ రకంగానే మనుషులు వాడే వస్తువుల రకాలు పెరుగుతూ వుంటాయి.

శ్రమ విభజన ఎంత ఎక్కువైతే ఉపయోగపు విలువలలో భిన్నత్వం అంత ఎక్కువవుతుంది. ఉపయోగపు విలువలలో భిన్నత్వం ఎక్కువైతే సరుకులలో భిన్నత్వం ఎక్కువైనట్టే. సరుకులలో ఎంత భిన్నత్వం వుంటే అన్ని రకాల మారకాలు జరుగుతాయి. మారకాలెక్కువగా జరగాలంటే, శ్రమ విభజన ఎక్కువగా జరుగుతూ కొత్త కొత్త శ్రమలు తలలెత్తుతూ, కొత్త కొత్త రకాల సరుకుల వుత్పత్తి జరగాలి. ఎన్నివేల శ్రమలు వుంటే అన్ని వేల సరుకులు వుంటాయి.

కొత్త కొత్త రకాల సరుకులు ఉత్పత్తి అవ్వాలంటే, కొత్త కొత్త శ్రమలు కావాలి. అంటే, 'సరుకు ఉత్పత్తి'కి శ్రమ విభజన చాలా అవసరం. కానీ, శ్రమ విభజనకు సరుకు ఉత్పత్తి అవసరం లేదు. అంటే, వస్తువుల్ని సరుకులుగా మార్చే మారకాల పద్ధతి లేకపోయినా శ్రమ విభజన ఆగిపోదు. కొత్త వుపయోగపు విలువల కోసం శ్రమ విభజన ఎప్పుడూ వుంటుంది.

వస్తువులు సరుకులుగా మారకపోయినా శ్రమ విభజన అవసరమే ననడానికి ఒక ఉదాహరణ చూద్దాం.

ఒక ఫ్యాక్టరీలో (ఆ ఫ్యాక్టరీ అంతా ఒక యజమానిదే) అనేక రకాల సెక్షన్లు వుంటాయి. వాటిలో వేరు వేరు రకాల శ్రమలవల్ల వేరు వేరు రకాల వస్తువులు తయారవుతూ వుంటాయి. ఒక సెక్షన్‌లో వస్తువుల్ని, ఇంకో సెక్షన్‌లోకి తీసు కునేటప్పుడు ఆ సెక్షన్‌కీ, ఈ సెక్షన్‌కీ మధ్య మారకాలేమీ జరగవు. ఏ సెక్షన్‌లోంచి ఏ వస్తువు కావాలన్నా, ఎన్ని వస్తు వులు కావాలన్నా, 'విలువ' ప్రసక్తి లేకుండానే వస్తువుల్ని వాడు కోవచ్చును. ఈ ఫ్యాక్టరీలో అనేక శ్రమలు వున్నాయి కాబట్టి, వాటివల్ల తయారయ్యే వస్తువులు సరుకులుగా మారవలసి వస్తున్నదా? –లేదు. ఒక సెక్షన్‌లో వస్తువులు ఇంకో సెక్షన్‌కి సరుకులు కాకపోయినా, ఫ్యాక్టరీలో రక రకాల వస్తువులు ఉత్పత్తి కావాలంటే 'శ్రమ విభజన' వుండవలసిందే.

మానవ సమాజంలో మారకం విలువ లేకుండా పోయినా, వుపయోగపు విలువల ఉత్పత్తికైనా 'శ్రమ' వుండాలి; 'శ్రమ విభజనా' వుండాలి. శ్రమా, శ్రమ విభజనా లేకపోతే వుపయోగపు విలువలే వుండవు. ఉపయోగపు విలువల్ని ఉత్పత్తి చేసుకోకుండా మానవ సమాజం ఏ నాటికీ వుండలేదు.

జంతువులు, ప్రకృతిలో సిద్ధంగా దొరికే పదార్థాలమీద మాత్రమే ఆధారపడి జీవిస్తాయి. మానవులు అలా కాదు. ప్రకృతిలో దొరికే పదార్థాల్ని, తమ శ్రమలతో, తమకు ఉపయోగపడే విధంగా మార్చుకుంటారు. అలా మార్చుకోవడానికి మానవులకు ప్రకృతేమీ సహాయం చెయ్యదు. ఆ పనులు, వారి అనుభవాల వల్లా, తెలివితేటల వల్లా, నైపుణ్యాల వల్లా జరగవలసిందే.

మానవులు, శ్రమలు చెయ్యడం ఎప్పుడు మానేస్తే అప్పుడే వారి నిత్య జీవితావసర వస్తువులు తరిగిపోతాయి. మళ్ళీ వారు కొత్త శ్రమలు చేసి కొత్త వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోకపోతే, మళ్ళీ ప్రకృతిమీదే ఆధారపడి ప్రకృతిలో ఏది దొరికితే అది మాత్రమే తిని బతికే జంతు స్థాయికి వెళ్ళిపోతారు. అప్పుడు, వారు మానవులుగా వుండలేరు. మానవుల్ని మానవులుగా వుంచేది వారు చేసే వుపయోగకరమైన శ్రమే. మానవ సమాజం ఏ దశలో వున్నా (విలువ లెక్కలు వున్నా, లేకపోయినా) శ్రమ అనేది మానవజాతికి తప్పనిసరి అవసరం. ప్రకృతి, మానవులకు నిర్దేశించిన శాశ్వతావసరం అది.

సమాజంలో వుండే సిరి – సంపదలు అంటే ఏమిటి? — వస్తువుల రాసే. ఉపయోగపు విలువల రాసే. సంపద అంటే అదే.

మానవుల అవసరాల్ని తీర్చే భౌతిక సంపదకంతటికీ మూలం మానవుల శ్రమ ఒక్కటే కాదు. 'ప్రకృతి ఇచ్చే మూల పదార్థాన్ని' మర్చిపోకూడదు. పదార్థాల మీద శ్రమలు జరిగినప్పుడే మానవ సమాజపు వస్తువుల రాసి (మెటీరియల్ వెల్త్) ఏర్పడుతుంది.

# ప్రశ్నలూ – జవాబులూ

**1. 'ఉపయోగపు శ్రమ' అంటే ఏమిటి?**

**జ:** ఉపయోగపు శ్రమ అంటే ఒక వస్తువుని తయారు చేసే శ్రమే —ఉపయోగపు శ్రమ. వస్తువుల్ని తయారు చెయ్యక పోయినా, బండి తోలడం, వైద్యం చెయ్యడం, చదువు చెప్పడం —లాంటి పనులన్నీ కూడా ఉపయోగపు శ్రమలే. ఉపయోగపడే శ్రమలు.

**2. కొన్ని శ్రమల్నీ, వాటివల్ల తయారయ్యే వస్తువుల్నీ చెప్పండి! ఉదా॥: కుట్టుశ్రమ —— దుస్తుల్ని తయారు చేస్తుంది.**

**జ:** నేత శ్రమ —'బట్ట'నీ; వడ్రంగం శ్రమ —చెక్క వస్తువుల్నీ; వ్యవసాయ శ్రమ —ఆహారధాన్యాల్నీ; —ఇలా.

**3. చొక్కా —— పత్తిని పండించే శ్రమవల్ల తయారవుతుంది —— ఇలా అనడం సరైనదేనా?**

**జ:** కాదు. ఎందుకంటే —చొక్కా తయారవ్వాలంటే, పత్తిని పండించే శ్రమ ఒక్కటే గాక ఇంకా చాలా శ్రమలు కావాలి. 'పత్తి' దగ్గిర్నించీ చెప్పుకోవాలంటే, పనిముట్లని తయారుచేసే శ్రమలన్నిటినీ కూడా చెప్పుకోవాలి. పనిముట్లని తయారుచెయ్యడానికి వేరే పనిముట్లు కావాలి కాబట్టి, ఆ శ్రమల్ని కూడా చెప్పుకోవాలి. దీనికి అంతం వుండదు. కాబట్టి, చొక్కా గురించి చెప్పుకోవాలంటే, ఆ వెనకటి శ్రమలన్నిటినీ చెప్పుకోనక్కరలేదు. ఏ ముడి పదార్థం అయితే చొక్కాగా మారుతుందో అక్కడినించే మొదలు పెట్టాలి. బట్టే —చొక్కాగా మారుతుంది కదా? కాబట్టి, 'బట్ట' దగ్గిర్నించే మొదలుపెట్టాలి. ఆ దశలో అవసరమయ్యే పనిముట్లనీ, అవసరమయ్యే శ్రమనీ మాత్రమే చెప్పుకోవాలి. అంటే, 'చొక్కా – పత్తిని పండించే శ్రమ వల్ల తయారవుతుంది' అని గాక, 'చొక్కా –బట్టని చొక్కాగా చేసే కుట్టుశ్రమ వల్ల తయారవుతుంది' — అని చెప్పుకోవాలి.

**4. దుప్పటి తయారవడానికి పత్తి పండడం దగ్గిర్నించీ తీసుకుంటే, ఏ యే రకాల శ్రమలు కావాలి?**

**జ:** మొదట వ్యవసాయ శ్రమ జరగాలి. దానివల్ల పత్తి పండుతుంది. తర్వాత, ఆ పత్తిని దారంగా వడికే శ్రమా, ఆ దారాన్ని దుప్పటిగా నేసే శ్రమా జరగాలి. ఆ దుప్పటి మీద రంగులు అద్దే శ్రమ కూడా జరిగితే జరగవచ్చు.

**5. బట్టని చొక్కాగా కుట్టాలంటే, ఏ యే అంశాలు కావాలో చెప్పే 2 రకాల జవాబులు ఇక్కడ వున్నాయి. వీటిలో ఏది సరైనది? 'తప్పు జవాబు'లో వున్న తప్పు ఏమిటి?**

**(1) బట్టని చొక్కాగా కుట్టాలంటే —కొంత బట్టా, సూదీ దారం లాంటి కొన్ని పనిముట్లూ, కొంత కుట్టు శ్రమా — కావాలి.**

**(2) బట్టని చొక్కాగా కుట్టాలంటే —బట్టని ఉత్పత్తిచేసే శ్రమా, ఆ శ్రమ జరగడానికి కావలసిన పనిముట్లని ఉత్పత్తిచేసే శ్రమలూ; సూదీ దారంలాంటి పనిముట్లని ఉత్పత్తిచేసే శ్రమలూ; కొంత కుట్టు శ్రమా — కావాలి.**

**జ:** 1వ జవాబు సరైనది. 2 వ జవాబులో వున్న తప్పేమిటంటే — 3 వ ప్రశ్నకి వున్న జవాబు దీనికి కూడా సరిపోతుంది. చొక్కా కావాలంటే, దానికన్నా ముందు బట్ట

కావాలి. బట్టే చొక్కాగా మారుతుంది. కాబట్టి, బట్ట దగ్గిర్నించే చూస్తాం. ఆ బట్టని తయారుచేసే శ్రమలతోటీ, దాని పనిముట్లతోటీ ఇక్కడ సంబంధం లేదు. ఇక్కడ కావలసిన శ్రమా, పనిముట్లూ వేరు.

**6.'వస్తువుల్ని' తయారుచేసే శ్రమల్ని కొన్నిటినీ, కేవలం 'పని' రూపంలో వుండే శ్రమల్ని కొన్నిటినీ — చెప్పండి!**

జ: 

| 'వస్తువుల్ని' చేసే శ్రమలు: | వస్తువుల్ని చెయ్యని శ్రమలు: |
|---|---|
| పత్తిని – వ్యవసాయ శ్రమ | బండి తోలడం |
| దుప్పటిని – నేత శ్రమ | వైద్యం చెయ్యడం |
| పుస్తకం – అచ్చు శ్రమ | చదువు చెప్పడం |

**7.నాట్యం నేర్పే శ్రమ — ఏ వస్తువుల్ని తయారుచేస్తుంది?**

జ: ఏ వస్తువుల్నీ తయారుచెయ్యదు. అది, 'కళలు నేర్పడం' అనే శ్రమల కోవలోకి వస్తుంది.

**8.'అన్నం' అనే పదార్థాన్ని తయారు చెయ్యాలంటే, బియ్యమూ, నీళ్ళూ, ఒకటి రెండు గిన్నెలూ, ఒక గరిటె, కొన్ని కట్టెలూ, వంట చేసే శ్రమా — కావాలి. ఈ విధంగా, చెప్పులూ, మంచమూ — అనే వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యడానికి కావలసిన అంశాల్ని చెప్పండి!**

జ: 'చెప్పుల' కోసం :

(1) తోలూ, మేకులూ, దారం జిగురూ —ఇవి, చెప్పుల్లో వుండిపోతాయి.

(2) సుత్తీ, కత్తెరా లాంటి పనిముట్లు — ఇవి చెప్పుల్లో వుండవు.

(3) చెప్పుల్ని కుట్టే శ్రమ —ఇది చెప్పుల్లో వుండదు.

'మంచం' కోసం :

(1) చెక్కా, మేకులూ, జిగురూ — ఇవి, మంచంలో వుండిపోతాయి.

(2) వడ్రంగం పనిముట్లు — ఇవి మంచంలో వుండవు.

(3) మంచాల్ని చేసే శ్రమ — ఇది మంచంలో వుండదు.

**9.నదిలో నీళ్ళకీ, ఇంట్లో నీళ్ళకీ తేడా ఏమైనా వుందా? ఉంటే ఏమిటి?**

జ: నదిలో నీళ్ళు —ప్రకృతి సహజ పదార్థం. ఇంట్లో నీళ్ళు — మనిషి శ్రమతో బయటి నించి ఇంట్లోకి వచ్చినవి.

**10. కుర్చీ —'వడ్రంగం శ్రమవల్ల తయారైంది' —అనడం సరైందా, 'శ్రమవల్ల తయారైంది' అనడం సరైందా?**

జ: 'కుర్చీ' అని ఒక ప్రత్యేకమైన వస్తువుని చెప్పుకుంటున్నాం కాబట్టి, ఇక్కడ 'వడ్రంగం శ్రమ వల్ల' అని, ఆ శ్రమ ప్రత్యేకతని కూడా చెప్పడమే సరైంది. 'కుర్చీ — శ్రమ వల్ల తయారైంది' అనడంలో తప్పేమిటంటే —ప్రతీ వస్తువూ శ్రమ వల్లే తయారవుతుంది కదా? అలాంటప్పుడు, కుర్చీ గురించే అలా చెప్పడం ఎందుకు? అదీగాక, 'కుర్చీ — శ్రమ వల్ల తయారైంది' అన్నప్పుడు, 'ఏ శ్రమ వల్ల?' అనే ప్రశ్న మళ్ళీ వస్తుంది. ఒక ప్రశ్నకి జవాబు చెప్పుకున్న తర్వాత, దానిమీద ఇంకో ప్రశ్న రాకుండా వుంటేనే అది సరైన జవాబు. కాబట్టి, 'కుర్చీ —వడ్రంగం శ్రమ వల్ల తయారైంది' అనడమే సరైనది.

**11. వస్తువులు మానవ శ్రమవల్ల తయారవుతాయి — అనడం సరైందా, కాదా?**

జ: సరైనదే. ఎలాగంటే: ఇక్కడ 'వస్తువులు' అంటున్నాం గానీ, అవి ఏ రకం వస్తువులో ఆ వివరాలు చెప్పడం లేదు. కాబట్టి, వాటిని తయారుచేసే శ్రమల రకాల్ని కూడా చెప్పనక్కరలేదు. కాబట్టి, 'వస్తువులు —మానవ శ్రమ వల్ల తయారవుతాయి' అనడం సరైనదే.

**12. (1) నేతినీ, పాలనీ గ్లాసుతో కొలుస్తున్నప్పుడు, అవి 'ద్రవ పదార్థాలు'గా వున్నాయా, 'ఘన పదార్థాలు'గా వున్నాయా?**

జ : ద్రవ పదార్థాలుగా.

(2) నేతినీ, మైదాపిండినీ గ్లాసుతో కొలుస్తున్నప్పుడు?

జ : ఘన పదార్థాలుగా.

(3) నేతినీ, గోధుమల్నీ త్రాసుతో తూస్తున్నప్పుడు?

జ : ఘన పదార్థాలుగా.

**13. 'అరటిపళ్ళు' అనడానికీ, '2 అరటిపళ్ళు' అనడానికీ తేడా ఏమిటి?**

జ: 'అరటిపళ్ళు' — అంటే, అది, ఆ వస్తువుల గుణాన్ని (రకాన్ని) మాత్రమే చెప్పడం. '2 అరటిపళ్ళు' అంటే, వాటి గుణాన్నీ, పరిమాణాన్నీ కూడా చెప్పడం.

**14. 10 కిలోల ధాన్యం రూపమూ, 11 కిలోల ధాన్యం రూపమూ, ఒకటేనా?**

జ : ఒకటి కాదు. 10 కిలోల ధాన్యం రాసి కన్నా, 11 కిలోల ధాన్యం రాసి కొంచెం పెద్దదిగా వుంటుంది. రెండు రూపాలూ ఒకటి కాదు.

**15. 'ఈ దుప్పటి 3 గంటల శ్రమవల్ల తయారైంది' అనడానికీ, 'ఈ దుప్పటి 3 రకాల శ్రమల వల్ల తయారైంది' అనడానికీ తేడా ఏమిటి?**

జ: '3 గంటల శ్రమవల్ల తయారైంది' అంటే, దుప్పటికోసం అవసరమైన మొత్తం శ్రమ పరిమాణాన్ని చెప్పడం. '3 రకాల శ్రమలవల్ల'— అంటే, అది శ్రమ పరిమాణాన్ని గాక, ఆ శ్రమ ఎన్ని రకాలుగా వుందో చెప్పడం.

**16. కొన్ని రూపం వున్న శ్రమల్నీ, వాటిపక్కనే రూపంలేని శ్రమల్నీ చెప్పండి.**

**జ :**

| రూపం వున్న శ్రమ | రూపం లేని శ్రమ |
|---|---|
| 2 గంటల వడ్రంగం | 2 గంటల శ్రమ |
| 5 రోజుల నేత | 5 రోజుల శ్రమ |
| 3 నెలల విద్యాబోధన | 3 నెలల శ్రమ |

**17. రూపం వున్న శ్రమ, రూపం లేని శ్రమగా ఎప్పుడు అవుతుంది?**

**జ :** రూపం వున్న శ్రమలతో తయారైన వస్తువుని, మారకంలో పెట్టి, ఆ వస్తువు కోసం అవసరమైన శ్రమ భాగాలన్నిటినీ 'మొత్తం శ్రమ'గా లెక్క కట్టినప్పుడు, ఆ శ్రమలన్నీ రూపం లేని శ్రమలు అవుతాయి.

**18. ఒక శ్రమ, 'రూపం గల శ్రమ'గానూ, 'రూపం లేని శ్రమ' గానూ కూడా వుండడం ఎలా సాధ్యం?**

**జ :** ఎలా సాధ్యమంటే, —ఏ శ్రమకి అయినా ఒక ప్రత్యేకత వుంటుంది కాబట్టి, దానివల్ల అది 'రూపం గల శ్రమ'గా వుంటుంది. కానీ, ఏ రకం శ్రమ అయినా మనుషులు చేసేదే కాబట్టి, ఏ శ్రమని అయినా 'మానవ శ్రమ' అనవచ్చు. 'శ్రమగా వుండడం' అనే కారణంవల్ల అది 'రూపం లేని శ్రమ' అవుతుంది. ఈ రకంగా, ఒక శ్రమ, 'రూపం గల శ్రమ'గానూ, 'రూపం లేని శ్రమ'గానూ కూడా వుండడం సాధ్యమే.

**19. 'విలువల సమానత్వాన్ని' చూస్తున్నప్పుడు, వాస్తవంగా మనం చేస్తోన్న పని ఏమిటి?**

**జ :** 'విలువలు' అంటే, శ్రమలు. కాబట్టి, 'విలువల సమానత్వాన్ని' చూడడం అంటే, 'శ్రమల సమానత్వాన్ని' చూస్తున్నామని అర్థం.

**20. దుప్పటి, సరుకుగా అయినప్పుడు, దానిలో వున్న ' నేత శ్రమ' మాత్రమే రూపాన్ని కోల్పోతుందా? పత్తి పండించే శ్రమా, దారం వడికే శ్రమా కూడా రూపాన్ని కోల్పోతాయా?**

**జ :** దుప్పటిని తయారుచేసిన అన్ని రకాల శ్రమలూ వాటి రూపాల్ని కోల్పోతాయి. ఆ శ్రమలన్నీ కలిసిన మొత్తం పరిమాణం మాత్రమే అక్కడ లెక్కకువస్తుంది.

**21. ఈ విషయాలలో 2 విషయాలే సరైనవి. అవి ఏవి?**

| **'ఉత్పత్తి శక్తి పెరిగితే:'** | **జవాబులు** |
|---|---|
| 1) ఒక వస్తువులో శ్రమకాలం పెరుగుతుంది. | ✘ |
| 2) ఒక సరుకులో శ్రమకాలం పెరుగుతుంది. | ✘ |
| 3) కొంత కాలంలో ఉత్పత్తి అయ్యే ఉపయోగపు విలువల పరిమాణం పెరిగి, విలువ పరిమాణం మారకుండా వుంటుంది. | ✔ |
| 4) రూపం వున్న శ్రమ పెరిగి, రూపంలేని శ్రమ తగ్గుతుంది. | ✘ |
| 5) ఒక వస్తువులో ఉపయోగపు విలువ అలాగే వుండి, దాని విలువ తగ్గుతుంది. | ✔ |

**22. 'శ్రమ విభజన' జరగడం అంటే ఏమిటి?**

**జ:** అప్పటికే స్వతంత్ర శ్రమలుగా వున్న శ్రమలన్నిటితోనూ కలిసిపోయి వున్న శ్రమ, తను కూడా ఒక స్వతంత్ర శ్రమగా మారితే, అదే 'శ్రమ విభజన' జరగడం. ఒక శ్రమ చేసే వ్యక్తి, తను చేసే వస్తువుల్ని తన స్వంత అవసరాలకోసమే చేసుకోవడం గాక, ఇతరుల కోసం కూడా చేసి ఇచ్చి, దానికి బదులుగా కొంత విలువని తీసుకోవడం ప్రారంభిస్తే, అప్పుడు, అలాంటి ఇతర శ్రమలకూ ఈ శ్రమకూ మధ్య విభజన జరిగిందని అర్థం.

**23. భారత దేశంలో 'వంట పని' స్వతంత్ర శ్రమగా ఏర్పడివుందా?**

**జ:** ఏ నాటి నించో ఏర్పడి వుంది. స్వంత అవసరాలకోసమే గాక, ఇతరుల అవసరాల కోసం వంట పని చెయ్యడం గానీ, ఆ శ్రమతో తయారైన వస్తువులతో మారకాలు జరగడం గానీ, భారత దేశంలో చాలా పూర్వకాలం నించీ జరుగుతోంది.

**24. మారకాలకోసం చెప్పులు కుట్టే వ్యక్తి ఒక్కడు కూడా లేకపోతే ఆ శ్రమ ఇతర శ్రమలనించి విడిపోయినట్టు కాదు — అనడం సరైందా, కాదా?**

**జ:** పూర్తిగా సరైనదే.

**25. కుట్టుశ్రమ, స్వతంత్ర శ్రమగా ఏర్పడక ముందు కూడా అది 'శ్రమ'గా వుందా, లేదా?**

**జ:** అప్పుడు కూడా అది శ్రమే.

**26. 'సంపద' అంటే ఏమిటి? అది ఎలా ఏర్పడుతుంది?**

**జ:** సంపద అంటే వస్తువుల రాసి. రక రకాల ప్రకృతి పదార్థాలమీద, రక రకాల మానవశ్రమలు జరగడం వల్లనే వస్తువుల రాసి తయారవుతుంది. అదే సమాజంలో వుండే భౌతిక సంపద.

**27. మానవ సమాజానికి ఉన్నత దశ, శ్రమ లేని సమాజమే. — ఇలా అనడం సరైందేనా?**

**జ:** కాదు. శ్రమే లేనప్పుడు ఏ వస్తువులూ వుండవు. అప్పుడు మనుషులు, మనుషులుగా జీవించడమే సాధ్యం కాదు. కాబట్టి, 'మానవ సమాజం' అనేది వుండాలంటే, శ్రమలు ఎప్పుడూ జరుగుతూ వుండవలసిందే. ఉన్నత దశ అయినా, మరే దశ అయినా, మనుషులు శ్రమలు చెయ్యకుండా జీవించడం ఎప్పటికీ జరగదు. ★

# 3. 'విలువ' కి రూపం

ఒక వస్తువుకి (సరుకుకి) వుండే విలువ, ఆ వస్తువు కోసం ఖర్చయిన 'మొత్తం శ్రమ' — అని చూశాం. అయితే, వస్తువుని చూసినప్పుడు దాని ఆకారమూ, దాని రంగూ వంటి లక్షణాలు కనపడినట్టుగా దాని 'విలువ' కూడా కనపడుతుందా? — కనపడదు. ఎందుకంటే, శ్రమ అనేది వస్తువు శరీరంలో వుండదు గనక.

కుర్చీని చూసినప్పుడు, దాని విలువ కనపడదు. దుప్పటిని చూస్తే, దాని విలువ కూడా కనపడదు. ఏ వస్తువుని చూసినా, అందులో, దాని విలువ కనపడదు.

మరి, ఒక వస్తువు విలువని ఎలా చూడగలం? వస్తువుకి శరీర లక్షణంకాని విలువని ఎలా తెలుసుకోగలం? 'విలువ' అనేది ఎప్పుడు కనపడుతుంది? — వస్తువు విలువ ఎప్పుడు కనపడుతుందంటే, ఆ వస్తువుని, 'మారకం'లో పెట్టినప్పుడే!

ఒక వస్తువుని మారకంలో పెట్టినప్పుడు, ఆ వస్తువుకి బదులుగా ఏం వస్తుందో అదే ఆ వస్తువు విలువ. ఆ వచ్చిన దాన్ని చూస్తే, ఇచ్చిన వస్తువు విలువని చూసినట్టే. ఆ రకంగా మాత్రమే విలువని చూడగలం.

ఒక కుర్చీకీ, ఒక దుప్పటికీ, 'మారకం' జరిగిందనుకుందాం, 'మారకం జరగడం' అంటే, ఆ కుర్చీకీ దుప్పటికీ ఏం జరిగిందని అర్థం? కుర్చీ మనిషికి దుప్పటీ, దుప్పటి మనిషికి కుర్చీ, మారాయని అర్థం. ఒకరి వస్తువు ఒకరికి మారింది. వస్తువులు ఇటూ అటూ మారడమే 'మారకం'. అదే, 'మారకం జరగడం' అంటే. ఒకరి వస్తువు ఒకరికి మారడంతో మారకం పూర్తి అవుతుంది. 'మారకం' అంటే, అక్కడ, ఒక్క వస్తువు మాత్రమే గాక, 2 వస్తువులు తప్పనిసరిగా వుంటాయి. 2 వస్తువులు వుంటేనే ఇటు వస్తువు అటూ, అటు వస్తువు ఇటూ, మారతాయి. 2 వస్తువులకూ 'మారక సంబంధం' ఏర్పడుతుంది.

ఇక్కడ కుర్చీనీ దుప్పటినీ తీసుకుందాం.

ఒక మారకం జరిగినప్పుడు, అక్కడ 2 వస్తువులు వుంటాయి కాబట్టి, అక్కడ ఒక్క వస్తువు విలువేగాక, ఆ 2 వస్తువుల విలువలూ కనపడాలి. కుర్చీకీ దుప్పటికీ జరిగిన మారకంలో కుర్చీ విలువా, దుప్పటి విలువా కూడా కనపడాలి. ఆ 2 వస్తువుల మారకంలో, కుర్చీ విలువా దుప్పటి విలువా కూడా కనపడుతున్నాయనే సంగతి గమనించారా?

కుర్చీకి బదులుగా వచ్చింది — కుర్చీ విలువ!

దుప్పటికి బదులుగా వచ్చింది — దుప్పటి విలువ!

అంటే, కుర్చీ విలువ — దుప్పటి.

దుప్పటి విలువ — కుర్చీ.

ఒక వస్తువు విలువ — ఇంకో వస్తువు.

ఇప్పుడు, 'విలువ' అనే దాన్ని చూడగలుగుతున్నాం. కుర్చీ విలువ, కుర్చీ శరీరంలో లేదు. కుర్చీకి బైట వుంది. దుప్పటిగా వుంది. దుప్పటి రూపంతో వుంది. అలాగే, దుప్పటి విలువ, దుప్పటి శరీరంలో లేదు. దుప్పటికి బైట వుంది. కుర్చీగా. కుర్చీ రూపంతో.

ఈ 'విలువ రూపం' గురించి ఇంత వివరంగా ఎందుకు తెలుసుకోవాలంటే, 'డబ్బు' అంటే ఏమిటో తెలుసుకోవడానికి ఇది ఎంతో అవసరం. 'డబ్బు' అంటే ఏమిటో తెలిస్తేనే, శ్రమ సంబంధాల గురించి తెలుస్తుంది. అందుకే ఈ క్రమాన్ని సరిగా అర్థం చేసుకోవాలి.

కుర్చీని గానీ, దుప్పటిని గానీ 'మారకంలో' పెట్టకపోతే, అంటే ఆ వస్తువుల మనుషులు వాటిని మారకం చేసుకోకుండా ఎవరి వస్తువుని వారే వుంచుకుంటే, వాటి విలువల్ని చూడలేము.

కుర్చీని, దుప్పటితో గాక, ఒక చెప్పుల జతతో మారకంచేస్తే, అప్పుడు ఆ చెప్పుల జతే — కుర్చీ విలువ అవుతుంది. అప్పుడు కుర్చీ విలువ, చెప్పుల జతగా కనపడుతోందన్నమాట! చెప్పుల జత రూపమే, కుర్చీ విలువకి రూపం. కుర్చీని 1 బస్తా ధాన్యంతో మారకం చేస్తే, అప్పుడు కుర్చీ విలువ — 1 బస్తా ధాన్యం. ఆ బస్తా ధాన్యం రూపమే కుర్చీ విలువకి రూపం. ఈ విధంగా, ఒక వస్తువుని ఇచ్చి ఇంకో వస్తువుని తీసుకునేటప్పుడు, ఆ రెండో వస్తువే, మొదటి వస్తువుకి విలువగా అవుతుంది. అంటే, ఒక వస్తువు విలువ ఆ వస్తువుతో మారిన ఇంకో వస్తువే. ఒక వస్తువు విలువ, ఇంకో వస్తువు రూపం ద్వారానే కనపడవలసి వుంటుంది.

'విలువ రూపం' గురించి చూడవలసిన అంశాల్ని ఇప్పుడు కొంచెం వివరంగా చూద్దాం. ఇక నించీ 'కుర్చీ', 'దుప్పటీ' అనే వస్తువుల్ని వదిలేసి, 20 మీటర్ల బట్టా, 1 కోటూ — అనే వస్తువులతో ఉదాహరణ చూద్దాం.

[ విలువ రూపాన్ని వివరించేటప్పుడు మార్క్సు, 20 మీ. బట్ట = 1 కోటు అనే ఉదాహరణనే ఎక్కువగా ఉపయోగించాడు. ఆ వస్తువులనే తీసుకుందాం.]

'20 మీటర్ల బట్ట' ని ఒక 'సరుకు'గా తీసుకుందాం. బట్ట మనిషి, తన సరుకుని, 1 కోటుతో మారకం చేసుకున్నాడనుకుందాం. అంటే ఈ మారకంలో 2 సరుకులు (2 వస్తువులు) వున్నాయి. బట్టా, కోటూ అనే సరుకులు అవి. వాటికి 'మారకం' జరిగింది. బట్ట మనిషికి కోటూ, కోటు మనిషికి బట్టా వచ్చాయి.

బట్ట మనిషి, కోటుని తీసుకున్నాడంటే, దాన్ని వూరికే తీసుకున్నాడా? అలాగే, కోటు మనిషి బట్టని తీసుకున్నాడంటే, ఆ మనిషి బట్టని వూరికే తీసుకున్నాడా? — లేదు. బట్ట మనిషిగానీ, కోటు మనిషిగానీ రెండో వస్తువుని వూరికే తీసుకోలేదు. ఆ ఇద్దరూ కూడా ఒక వస్తువుని ఇచ్చి, దానికి బదులుగా మాత్రమే ఇంకో వస్తువుని తీసుకున్నారు.

బట్టకీ కోటుకీ జరిగిన 'మారకం'లో:

బట్ట విలువ — కోటు
బట్ట విలువకి రూపం — కోటు రూపం
కోటు విలువ — బట్ట
కోటు విలువకి రూపం — బట్ట రూపం

ఇప్పుడు 20 మీ. బట్టనీ, 1 కోటునీ, ఒక 'మారకం జత'గా తీసుకుని, దీని ద్వారా కొన్ని విషయాలు చూద్దాం. ఈ విషయాలన్నీ సరిగా అర్థం చేసుకుంటేనే, 'ఉపయోగపు విలువ'నీ, 'విలువ'నీ, 'విలువ రూపాన్నీ', అర్థం చేసుకోగలుగుతాము. ( తర్వాత ' డబ్బు' ని కూడా. )

**1)** 20 మీటర్ల బట్ట = 1 కోటు

ఈ 2 సరుకులకూ మారకం జరుగుతోందంటే 20 మీ. బట్టకి ఎంత విలువ వుందో 1 కోటుకి కూడా అంత విలువ వుందని అర్థం. వాటి విలువలు సమానంగా లేకపోతే ఆ మారకం జరగదు. అంటే, ఈ 2 సరుకుల విలువా ఒకటే. కానీ, ఈ 2 సరుకుల విలువకీ 'రూపం' ఒకటి కాదు. బట్ట విలువ — కోటు అయితే, కోటు విలువ — బట్ట అవుతోంది. ఈ రకంగా, ఒక 'మారకం'లో వున్న 2 సరుకులూ ఒకే విలువ గలవి అయినా, వాటి విలువ రూపాలు వేరు వేరుగా వున్నాయి. దేని 'విలువ రూపం' దానికి వేరుగా వుంది.

**2)** 20 మీ. బట్ట = 1 కోటు అంటే, 'బట్టా కోటూ సమానం' అని అర్థం. ఈ 'సమానత్వం', వాటి శరీర లక్షణాలకు సంబంధించింది కాదు. వాటి 'విలువలకు' సంబంధించింది. 'విలువ' విషయంలో ఈ 2 సరుకులూ సమానం. ఈ సంబంధం, విలువ సంబంధం. అంతేగానీ, బట్ట = కోటు అన్నప్పుడు, 'బట్ట శరీర లక్షణాలూ, కోటు శరీర లక్షణాలూ ఒకటే' — అని అర్థం కాదు.

**3)** 20 మీ. బట్ట = 1 కోటు అంటే, మనం 'బట్ట' వేపు నించి చూస్తున్నాం. బట్టతో మొదలుపెట్టి, బట్ట సంగతి చూస్తున్నాం. బట్ట, కోటుతో మారుతోందని అర్థం. బట్ట కోటుతో మారుతోందంటే, ఆ కోటు కూడా బట్టతో మారుతోందని అర్థమే. బట్ట విలువ కోటు అయితే, కోటు విలువ బట్ట అవుతుందని కూడా అర్థమే. అయినా, 'బట్ట = కోటు' అనే సూత్రంలో, బట్ట విలువనే చూస్తున్నాము గానీ, అదే సూత్రంలో కోటు విలువని కూడా చూడడంలేదు. అయితే, కోటు విలువని ఎప్పుడు చూస్తామంటే, 'కోటు'తో మొదలుపెట్టి, కోటు వేపు నించి చూసినప్పుడు. కోటు = బట్ట అన్నప్పుడు! దీని అర్థం, కోటు విలువ = బట్ట అని. ఈ రెండో సూత్రంలో కోటు విలువని మాత్రమే చూస్తాము గానీ, ఇదే సూత్రంలో బట్ట విలువని చూడడం లేదు.

బట్ట = కోటు — అన్నప్పుడు, బట్ట విలువ ప్రత్యక్షంగానూ (డైరెక్టుగా), కోటు విలువ పరోక్షంగానూ (ఇన్‌డైరెక్టుగా) కనపడతాయి. అలాగే, కోటు = బట్ట అన్నప్పుడు కూడా.

**4)** 2 వస్తువులకు మారకం జరిగినప్పుడు, ఒక వస్తువుని ఇచ్చిన మనిషి, ఇంకో వస్తువుని తీసుకుంటాడు. బట్టకీ, కోటుకీ మారకం జరిగితే, బట్ట విలువగా కోటు వస్తే, కోటు విలువగా బట్ట వస్తుంది. అంటే, ఒక వస్తువు విలువగా ఇంకో వస్తువు వుంటుంది.

బట్ట విలువ = కోటు (లేదా, ఇంకో వస్తువు)- అనడం సరైనది.

బట్ట విలువ = కోటు విలువ — అనడం తప్పు.

ఎందుకంటే, 'బట్ట విలువ = కోటు విలువ' — అన్నట్టయితే, బట్ట విలువ ఏమిటో తెలుసుకోవాలంటే, మొదట కోటు విలువ ఏమిటో తెలుసుకోవాలి. కోటు విలువ ఏమిటో తెలుసుకోవాలంటే, దానికన్నా ముందు బట్ట విలువ ఏమిటో తెలియాలి. అంటే, బట్ట విలువ తెలియాలంటే కోటు విలువా, కోటు విలువ తెలియాలంటే బట్ట విలువా — తెలియాలి! ఇది అర్థంలేని వ్యవహారం. ఈ పద్ధతిలో ఒక వస్తువు విలువ ఎప్పటికీ కనపడదు. వాస్తవంలో, ఒక వస్తువు విలువ, 'ఇంకో వస్తువు'గా వుంటుంది గానీ, 'ఇంకో వస్తువు విలువ'గా వుండదు. కాబట్టి, బట్ట విలువ=కోటు విలువ అని గాక, బట్ట విలువ=కోటు (లేదా, ఇంకో వస్తువు) అన్నామంటే, బట్ట విలువని ఒక వస్తువుగా వెంటనే చూడగలుగుతాము. ఒక్క జవాబుతో సమస్య పరిష్కారమవుతుంది.

**5)** బట్ట విలువ = కోటు (లేదా, ఇంకో వస్తువు) అవుతుంది గానీ, బట్ట విలువ = బట్టే అవుతుందా? — అలా అవదు. ఎందుకంటే, బట్ట, బట్టతోనే మారదు గనక. ఏ వస్తువూ అదే రకపు వస్తువుతో మారదు. వేరే రకపు వస్తువులతోనే మారుతుంది. కాబట్టి, ఒక వస్తువు విలువ, అదే రకపు వస్తువుగా గాక, వేరే రకపు వస్తువుగా వుంటుంది.

**6)** బట్ట విలువ — కోటు గా వుందంటే, బట్ట విలువ

బట్ట నించి విడిగా, దూరంగా, బట్టకు బైట వుందన్నమాట! బట్ట ఉపయోగపు విలువ అయితే, బట్ట నించి విడిగా, బయట వుండదు. వస్తువు శరీర లక్షణాలైన రంగూ, బరువూ, ఆకారమూ వంటివి, వస్తువు నించీ విడిగా వుండవు. వస్తువులోనే ఐక్యమై వుంటాయి. కానీ విలువ అనేది, సహజ శరీర లక్షణం కాదు కాబట్టి, అది, వస్తువు నించి విడిగా, బయటే వుంటుంది. —కోటు విషయం కూడా ఇలాగే.

కోటు విలువ బట్టగా వుందంటే, కోటు విలువ, కోటు నించి విడిగా దూరంగా వుంది.

బట్ట మనిషి, బట్టని ఇచ్చి కోటుని తీసుకున్నాడంటే, కోటునే ఉపయోగించుకుంటాడు. బట్ట 'ఉపయోగపు విలువ'ని వదులుకుని, కోటు 'ఉపయోగపు విలువ'ని తీసుకున్నాడన్నమాట! అంటే, బట్ట విలువ = కోటు ఉపయోగపు విలువ. కోటు మనిషి కూడా కోటు ఉపయోగపు విలువని వదులుకుని, బట్ట ఉపయోగపు విలువని తీసుకున్నాడని అర్థం.

బట్ట విలువ = కోటు విలువ — అనకూడదని చూశాం. కానీ, బట్ట విలువ = కోటు ఉపయోగపు విలువ — అనవచ్చు. 'కోటు' అన్నా, 'కోటు ఉపయోగపు విలువ' అన్నా ఒకటే.

**7)** 'విలువ'కు సహజ రూపం వుండదు కాబట్టి, అది కనపడాలంటే, ఏదైనా సహజ రూపం వున్న వస్తువు ద్వారా కనపడవలసిందే. రూపం లేని విషయాలు, రూపంతో కనపడాలంటే, రూపం వున్న వాటి రూపాల్ని ధరించడం ద్వారా ('రూపధారణ' ద్వారా) కనపడడం ఒక్కటే మార్గం. 'విలువ' కనపడాలంటే, అదే జరుగుతుంది. బట్ట విలువ, కోటుగా కనపడుతోందంటే, స్వంత రూపం లేని బట్ట విలువ, కోటు రూపం ద్వారా కనపడుతోంది కదా? ఇక్కడ 'శ్రమ' విషయంలో ఏం జరుగుతోందంటే, 'రూపం లేని శ్రమ' అయిన బట్ట విలువ, 'కోటు'లో వున్న 'కుట్టు అనే రూపం వున్న శ్రమ' ద్వారా కనపడుతోంది. ఈ రకంగా, ఒక వస్తువు విలువ, ఇంకో వస్తువు శరీర రూపంతో కనపడుతుంది.

**8)** బట్ట, కోటుతో మారితే, బట్ట విలువ — కోటు.
బట్ట, కుర్చీతో మారితే, బట్ట విలువ — కుర్చీ.
బట్ట, చెప్పుల జతతో మారితే,
బట్ట విలువ — చెప్పుల జత.

బట్ట, ఏ వస్తువుతో మారితే, బట్ట విలువ – ఆ వస్తువు.
ఆ వస్తువు రూపమే — బట్ట 'విలువ'కి రూపం.
ఏ వస్తువు విలువ సంగతైనా ఇంతే.

ఒక వస్తువుకి, ఏ వస్తువుతో మారక సంబంధం వుంటుందో ఆ సంబంధాన్నిబట్టే, (ఆ 'రెలేషన్'ని బట్టి) ఆ వస్తువు 'విలువ రూపం' వుంటుంది కాబట్టి, 'విలువ రూపం' అనేది ఎప్పుడూ 'రెలెటివ్' రూపమే (రెండో వస్తువుతో సంబంధాన్నిబట్టి ఏర్పడే రూపం).

'విలువ'కి పూర్తి పేరు — 'మారకం విలువ'.
'విలువ రూపం' అంటే — 'మారకం విలువ రూపం'.

ఈ రూపం, 2 వ వస్తువుని బట్టి ఏర్పడేది కాబట్టి, దీని పూర్తిపేరు — 'రెలెటివ్ మారకం విలువ రూపం'.

దీనినే పొట్టిగా — 'విలువ రూపం' అంటాం.

**9)** బట్ట = కోటు అన్నప్పుడు, బట్టా, కోటూ ఒకే రకం స్థానాల్లో లేవు. అవి, ఒకే రకం పాత్రలు నిర్వహించడం లేదు. బట్ట, "నా విలువ ఏమిటంటే...." అని తన విలువని చెప్పుకునే వస్తువుగా వుంది. కానీ, కోటు 'నా విలువ ఏమిటంటే'— అని తన విలువని చెప్పుకోవడం గాక 'నేను బట్ట విలువని' అని, తను, 'బట్టకి విలువ'గా నిలబడే స్థానంలో వుంది. అలాగే, కోటు = బట్ట అన్నప్పుడు కూడా! ఇప్పుడు వాటి పాత్రలు మారిపోతాయి. ఇప్పుడు కోటు, తన విలువని చెప్పుకునే స్థానంలోనూ, ఇప్పుడు బట్ట, 'కోటుకి విలువ'గా నిలబడే స్థానంలోనూ వున్నాయి. అంటే, బట్ట = కోటు అన్నప్పుడుగానీ, కోటు = బట్ట అన్నప్పుడుగానీ, బట్ట వుండే స్థానమూ, కోటు వుండే స్థానమూ, ఒకే రకం స్థానాలు కావు. అవి, వేరు వేరు స్థానాలు.

ఒక రొట్టె బరువుని కొలవాలనుకుందాం. రొట్టెని చేతితో ఎత్తితే దాని బరువు తక్కువగా వుందో, ఎక్కువగా వుందో తెలుస్తుంది. కానీ, ఆ 'బరువు'ని ఖచ్చితంగా కొలవాలంటే, రొట్టెని తరాజులో పెట్టి చూడాలి. తరాజులో ఒక వేపు రొట్టీ, ఇంకో వేపు అరకిలో బరువురాయీ వున్నాయి అనుకుందాం. ఇక్కడ బరువుని చెప్పుకునే వస్తువు ఏదీ? రొట్టా, బరువు రాయా? — రొట్టేగానీ, బరువు రాయి కాదు.

రొట్టికీ, బరువు రాయికీ వున్న సంబంధం, 'బరువు సంబంధం'. రొట్టి — తన బరువుని చెప్పుకునే స్థానంలో వుంది. ఇది, రెలెటివ్ స్థానం. ఈ స్థానంలో వున్న వస్తువు, తన బరువుని, బరువు రాయితో సంబంధం ద్వారా చూపిస్తుంది.

బరువు రాయి — తన బరువుని చెప్పుకోదు. రొట్టికి వున్న బరువుని చెపుతుంది. రొట్టి బరువుకి బదులుగా తను నిలబడుతుంది. ఇది 'ఈక్వివలెంట్' స్థానం. ('ఈక్వివలెంట్' అంటే, 'కొలతలో సమానమైనది' అని అర్థం. ఇక్కడ బరువు రాయి, రొట్టె బరువుతో సమానమైనది.)

బరువు సంబంధంలో వున్న ఈ 2 వస్తువులూ వేరు వేరు స్థానాల్లో వుండి, వేరు వేరు పాత్రలు నిర్వహిస్తాయి.

అలాగే, ఒక 'తాడు' నీ, 'మీటరు బద్ద'నీ, 'పొడుగు సంబంధం'లో పెడితే:

తాడు — రెలెటివ్ స్థానంలోనూ,
మీటరు బద్ద — ఈక్వివలెంటు స్థానంలోనూ వుంటాయి.

అలాగే 2 సరుకుల 'విలువ సంబంధాన్ని' తీసుకుంటే,
ఒక సరుకు ' రెలెటివ్ స్థానం'లోనూ;
ఇంకో సరుకు ' ఈక్వివలెంట్ స్థానం'లోనూ
వుంటాయి.

20 మీ. బట్ట = 1 కోటు
↑ ↑
రెలెటివ్ స్థానం ఈక్వివలెంట్ స్థానం

1 కోటు = 20 మీ. బట్ట
↑ ↑
రెలెటివ్ స్థానం ఈక్వివలెంట్ స్థానం

(ఈ ' రెలెటివ్' 'ఈక్వివలెంట్' —అనే మాటల్ని ఇంగ్లీషు మాటలుగానే అలవాటు చేసుకోవడం మంచిది. తెలుగు అనువాదాలలో, సాధారణంగా ' రెలెటివ్' అనే మాటకి 'సాపేక్ష' అనే సంస్కృత పదం వాడుతూ వుంటారు. తెలుగు పాఠకులకు సంస్కృత పదాలైనా ఒకటే, ఇంగ్లీషు పదాలైనా ఒకటే. రెండూ పరాయి భాషలే. సైన్సులో కొన్ని ముఖ్యమైన సాంకేతిక పదాల్ని ఒక్కో భాష వాళ్ళు ఒక్కో రకంగా వాడడం కంటే, అన్ని భాషల వాళ్ళూ ఒకే భాష పదాల్ని వాడడం మంచిది. ఆ శాస్త్రం ఏ భాషద్వారా అందుబాటులో వుందో ఆ భాష పదాలనే. వేరు వేరు భాషల మనుషులు కూడా, ఒకే సైన్సు పదాల్ని ఉపయోగిస్తూ మాట్లాడుకోవచ్చు. ఈ అభిప్రాయం తోనే నేను ' రెలెటివ్', 'ఈక్వివలెంట్' అనే మాటల్ని అలాగే ఉపయోగిస్తున్నాను. మొదట్లో వాటి అర్థాల్ని ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూవుంటే, క్రమంగా అవే అలవాటు అవుతాయి.)

ఇంతవరకూ మనం 'విలువ రూపం' గురించి కొన్ని విషయాలు చూశాం. ఒక వస్తువు, రెండో వస్తువుతో మారినప్పుడు, ఆ రెండో వస్తువే, మొదటి వస్తువు విలువ. ఆ రెండో వస్తువు రూపమే మొదటి వస్తువు విలువకి రూపం. — ఈ రకంగా, ఇప్పుడు మనకు, 'విలువ రూపం' అంటే ఏమిటో తెలుసు.

## 'విలువ పరిమాణం' అంటే ?

'విలువ'కు వున్న పరిమాణమే విలువ పరిమాణం. 'విలువ'గా ఏదో ఒక వస్తువు వుంటుంది కాబట్టి, ఆ వస్తువు ఎంత పరిమాణంతో (ఎంత సైజుతో) వుంటుందో అదే 'విలువ పరిమాణం'. 1 కుర్చీ, 10 కిలోల ధాన్యంతో మారితే, ఆ ధాన్యమే —కుర్చీ విలువ. ఆ ధాన్యం పరిమాణమే, అంటే '10 కిలోలు' అనే పరిమాణం, ఆ విలువకి పరిమాణం. ఆ 10 కిలోల ధాన్యం రూపమే — ఇక్కడ, విలువ రూపం. ఆ కుర్చీ, 8 కిలోల ధాన్యంతో మారితే, కుర్చీ విలువకి రూపమూ, పరిమాణమూ కూడా మారినట్టే.

ఫలానా రకపు 1 కుర్చీని ఇస్తే, 10 కిలోల ధాన్యం వస్తుందనుకుందాం. ఆ రకం కుర్చీలకూ, ఆ రకపు ధాన్యానికీ ఎప్పుడు మారకాలు జరిగినా ఆ సరుకుల కొలతలు ఎప్పుడూ అలాగే వుంటాయని అర్థమా? — కాదు. ఆ కుర్చీల్ని తయారుచేసే 'ఉత్పత్తిశక్తి' మారినా, ధాన్యాన్ని తయారుచేసే ఉత్పత్తిశక్తి మారినా, ఆ సరుకుల మారకాల పాళ్ళు మారిపోతాయి. ఆ పాళ్ళు రకరకాలుగా ఏర్పడవచ్చు.

**(1)** కుర్చీ ఉత్పత్తిశక్తి ఏమీ మారకుండా, ధాన్యం ఉత్పత్తిశక్తి పెరిగిందనుకుందాం. అప్పుడు, 1 కుర్చీలో వుండే శ్రమ మొత్తం ఏమీ మారకుండా, 1 కిలో ధాన్యంలో వుండే శ్రమ మొత్తం తగ్గుతుంది (అంటే, కుర్చీ విలువ ఏమీ మారకుండా ధాన్యం విలువ తగ్గిందని అర్థం) కాబట్టి, అప్పుడు, 1 కుర్చీకి బదులుగా 10 కిలోలకన్నా ఎక్కువ ధాన్యం వస్తుంది.

**(2)** కుర్చీ ఉత్పత్తిశక్తి ఏమీ మారకుండా, ధాన్యం ఉత్పత్తిశక్తి తగ్గిందనుకుందాం. అప్పుడు, 1 కుర్చీకి, 10 కిలోల ధాన్యంకన్నా తక్కువ ధాన్యం వస్తుంది.

**(3)** ధాన్యం ఉత్పత్తిశక్తి ఏమీ మారకుండా, కుర్చీ ఉత్పత్తిశక్తి పెరిగిందనుకుందాం. అప్పుడు ఒక కుర్చీలో వుండే శ్రమ మొత్తం తగ్గుతుంది. కాబట్టి, అప్పుడు 1 కుర్చీకి 10 కిలోల కన్నా తక్కువ ధాన్యం వస్తుంది. అలాగే, ధాన్యం ఉత్పత్తిశక్తి ఏమీ మారకుండా కుర్చీ ఉత్పత్తిశక్తి తగ్గితే, అప్పుడు 1 కుర్చీలో వుండే శ్రమ మొత్తం పెరుగుతుంది కాబట్టి, అప్పుడు 1 కుర్చీకి 10 కిలోలకన్నా ఎక్కువ ధాన్యం వస్తుంది.

**(4)** కుర్చీ ఉత్పత్తిశక్తీ, ధాన్యం ఉత్పత్తిశక్తీ కూడా ఒకే రకంగా పెరిగాయనుకుందాం. అప్పుడు 2 సరుకుల లోనూ శ్రమలు ఒకే స్థాయిలో తగ్గుతాయి. కానీ, 2 సరుకుల లోనూ వున్న శ్రమ మొత్తాలు ఇప్పుడు కూడా ఒకదానికొకటి సమానంగానే వుంటాయి. కాబట్టి ఇప్పుడు కూడా 1 కుర్చీకి 10 కిలోల ధాన్యం వస్తుంది. అయితే, ఇక్కడ 2 సరుకుల ఉత్పత్తి శక్తులూ మారి, ఆ సరుకుల విలువలు కూడా మారినప్పటికీ, ఆ సంగతి, ఆ సరుకుల సంబంధం ద్వారా కనపడదు. ఎందుకంటే, విలువలు మారిన తర్వాత కూడా ఆ సరుకుల విలువ పాళ్ళు గతంలోలాగే, 1 కుర్చీ = 10 కి. ధాన్యంగానే వున్నాయి కాబట్టి. ఇప్పుడు కుర్చీని ధాన్యంతో గాక, ఉత్పత్తిశక్తి మారని ఇతర సరుకులతో మారకంలో పెట్టి చూస్తే, కుర్చీ విలువలో మార్పు తెలుస్తుంది. విలువ మారిన కుర్చీని, విలువ మారని సరుకులతో సంబంధంలో పెట్టి చూస్తే, కుర్చీకి బదులుగా వచ్చే ఆ సరుకుల పరిమాణాలు తప్పనిసరిగా మారతాయి కాబట్టి, ఆ రకంగా కుర్చీ విలువ మారిందో లేదో, ఎంత మారిందో, తెలుస్తుంది. అలాగే ధాన్యం సంగతి కూడా.

**(5)** సమాజంలో వున్న మొత్తం అన్ని సరుకుల ఉత్పత్తి శక్తులూ ఒకే రకంగా పెరిగాయనుకుందాం. ఇప్పుడు, 1 కుర్చీ విలువ పరిమాణం ఎలా వుంటుంది? — ఏమీ మారదు. ఇప్పుడు కూడా 1 కుర్చీకి, 10 కిలోల ధాన్యం వస్తుంది. ఇలాంటి సందర్భంలో, కుర్చీలో శ్రమ మొత్తం మారిందా లేదా అనేది (కుర్చీ విలువ మారిందా లేదా అనేది) దాని ఉత్పత్తిశక్తి ద్వారానే తెలియాలి. గతంలో, 1 కుర్చీని చెయ్యడానికి ఎంత కాలం పట్టేదీ, ఇప్పుడు ఎంత కాలం పడుతోందీ అనే తేడాని చూడడం ద్వారానే అది తెలియాలి.

ఈ ఉదాహరణలన్నిటి వల్లా తెలుసుకోవలసిందేమిటంటే, — ఒక సరుకుని మారకం లో పెట్టినప్పుడు, ఆ సరుకుకి బదులుగా వచ్చే రెండో సరుకు పరిమాణం ఎప్పుడూ ఒకే రకంగా వుండదు అని. ఏ సరుకుని మారకంలో పెడుతున్నామో ఆ సరుకులో శ్రమకాలం మారినా, లేదా దాని ఎదటి సరుకులో శ్రమకాలం మారినా, ఈ రెంటిలో ఏది జరిగినా, మొదటి సరుకుకి బదులుగా రావలసిన రెండో సరుకు పరిమాణం ఎక్కువో, తక్కువో అవుతుంది.

ఒక మారకం జరిగేటప్పుడు, ఆ సరుకుల శరీర పరిమాణాలు ఫలానా ఫలానా విధంగా వుండడం అనేది, కేవలం 'యాక్సిడెంటల్' విషయం. అంటే, 1 కుర్చీకీ, 10 కిలోల ధాన్యానికీ మారకం జరిగిందంటే, ఆ కుర్చీ ఫలానా సైజుగల 1 కుర్చీగానూ, ఆ ధాన్యం '10 కిలోలు' గానూ, ఆ సరుకుల కొలతలు అలా వుండడం అనేది, ఆ సరుకుల విలువల్నిబట్టి జరుగుతుంది. 1 కుర్చీలో ఎంత విలువ వుందో, 10 కిలోల ధాన్యంలో కూడా అంత విలువ వుంది కాబట్టే, ఆ 2 కొలతలకూ అలా కలిసింది. ఆ కొలతలు అప్పటికి అలా ఏర్పడిన 'యాక్సిడెంటల్ ప్రపోర్షన్స్'. ఆ కొలతలు ఎప్పుడూ అలాగే ఉండాలని రూలేమీ లేదు. ఏ సరుకు విలువ మారినా, వాటి కొలతలు మారిపోతాయి. దీని సారాంశం ఏమిటంటే — సరుకుల మధ్య మారకాలు జరిగేటప్పుడు, ఆ సరుకుల పరిమాణాలు, వాటి విలువల్ని బట్టే వుంటాయి అని.

# ప్రశ్నలూ -- జవాబులూ

**1. ఒక సరుకు విలువ, ఇంకో సరుకే— అనే సూత్రానికి 2 ఉదాహరణ లివ్వండి!**

జ: 1 కోటు = 20 మీ. బట్ట
1 బస్తా ధాన్యం = 4 బస్తాల జొన్నలు

**2. ఒక సరుకు విలువ, ఏ రూపంతో వుంటుంది?**

జ: ఆ సరుకు, ఏ సరుకుతో మారుతుందో ఆ సరుకు రూపంతో.

**3. గంపలో 100 బత్తాయిపళ్ళు వున్నాయి. వాటి విలువ ఏమిటి?**

జ: వాటిని ఏదైనా ఇంకో వస్తువుతో మారకం చేస్తే తప్ప, వాటి విలువ తెలియదు.

**4. 12 అరటి పళ్ళు=20 నిమ్మకాయలు. తర్వాత అరటి పళ్ళ విలువ తగ్గి సగం అయింది. ఇప్పుడు 12 అరటి పళ్ళ విలువ ఎన్ని నిమ్మకాయలు? ఇప్పుడు, 20 నిమ్మకాయల విలువ ఎన్ని అరటిపళ్ళు?**

జ: అరిటి పళ్ళ విలువ సగమే అయింది కాబట్టి, ఇప్పుడు — 12 అరటి పళ్లు = 10 నిమ్మకాయలు.
20 నిమ్మకాయలు = 24 అరటి పళ్ళు.

**5. 1 కలం = 2 పెన్సిళ్ళు. ఒక సంవత్సరం తర్వాత, వాటి శ్రమ కాలాలు రెండూ, నాలుగో వంతు తగ్గిపోయాయి. అప్పుడు 1 కలం విలువ ఎన్ని పెన్సిళ్ళు?**

జ: 2 వస్తువులకూ శ్రమ కాలాలు ఒకే రకంగా మారాయి కాబట్టి అప్పుడు కూడా, 1 కలం = 2 పెన్సిళ్ళే.

**6. ఇందులో ఒకటే కరెక్టు. అది ఏది?**

| | జ: |
|---|---|
| 1) బట్ట విలువ = కోటు విలువ | ✘ |
| 2) బట్ట = కోటు విలువ | ✘ |
| 3) బట్ట విలువ = కోటు ఉపయోగపు విలువ | ✔ |
| 4) బట్ట ఉపయోగపు విలువ = కోటు ఉపయోగపు విలువ | ✘ |

**7. వీటిలో ఏది రైటు? ఏది తప్పు?**

| | జ: |
|---|---|
| 1) మారకం జరిగినప్పుడే సరుకుల విలువలు కనపడతాయి. | ✔ |
| 2) ఒక సరుకు విలువ ఇంకో సరుకు విలువే. | ✘ |
| 3) ఒక సరుకు విలువ ఏ రూపంతో కనపడుతుందంటే, ఆ సరుకు ఏ సరుకుతో మారుతుందో ఆ సరుకు రూపంతో. | ✔ |
| 4) 'విలువ' అన్నా, 'విలువ రూపం' అన్నా ఒకటే. | ✘ |
| 5) ఒక సరుకు విలువని, రెండో సరుకుతో సంబంధం లేకుండా చెప్పలేము. | ✔ |
| 6) కిలో రాయీ, మీటరు బద్దా రెలెటివ్ స్థానంలో వుంటాయి. | ✘ |

**8. వస్తువుకి, విలువ, సహజ లక్షణం కాదని ఎలా చెప్పగలం?**

జ: విలువ, సహజ లక్షణమే అయితే అది వస్తువు శరీరంలోనే ఉండాలి. రంగూ, బరువూ వంటి లక్షణాల లాగే. కానీ, అలా వుండదు. విలువ, వస్తువు బయటే ఉంటుంది. మారకం జరిగితేనే అది కనపడుతుంది. అందుకే అది, వస్తువుకి సహజ లక్షణం కాదని చెప్పవచ్చు. ★

# 4. ప్రాథమిక విలువ రూపం

మానవ సమాజంలో మారకాలే ప్రారంభంకాని కాలంలో వస్తువులకు ఇంకా 'విలువ' లేదు.

మానవులు గుంపులు గుంపులుగా జీవించిన ప్రాచీన తెగల సమాజంలో, ఏ తెగలో తయారుచేసుకున్న వస్తువులు ఆ తెగ వారికి ఉపయోగపు విలువలుగా మాత్రమే వుండేవి. వారు తయారుచేసుకునే వస్తువులు ఏ యే అవసరాల్ని తీర్చగలవో అవే వారి నిత్య జీవితావసరాలుగా వుంటాయి. అంతకు మించిన అవసరాలు వారెరుగరు. వస్తువుల్ని మారకాలు చేసుకోవడం (తమ దగ్గర లేని వస్తువుల్ని ఇతర ప్రాంతాల నించి సంపాదించుకోవడం) — అనే విషయం లేకుండానే మానవ సమాజానికి ఎన్నో వేల సంవత్సరాల కాలం గడిచింది.

సమాజాభివృద్ధి క్రమంలో, ఒక దశలో, 'వస్తువుల మారకం' అనేది పుట్టింది. సమాజానికి 'మారకం' ఎప్పుడు అవసరమయిందో అప్పుడు అది పుట్టింది. ఒక తెగ వారు ఇంకో తెగవారికి తమ వస్తువులు ఇచ్చి, వాటికి బదులుగా వేరే వస్తువులు తీసుకోవడం ప్రారంభమైంది. 'మారకం' అంటే, వస్తువుల్ని మార్చుకోవడమే. ఒక వస్తువుని ఇచ్చి దానికి బదులుగా ఇంకో వస్తువుని తీసుకోవడం అంటే, ఇచ్చిన వస్తువు 'విలువ'ని తీసు కోవడమే. అంటే, మారకం అనే చర్య ఏ క్షణంలో ప్రారంభమైందో ఆ క్షణంలోనే 'మారకం విలువ' ప్రారంభమైంది. మారకం ప్రారంభం కావడంతోనే, అంత వరకూ ఉపయోగపు విలువలుగా మాత్రమే వుంటూవచ్చిన వస్తువులకు 'విలువ' అనే ఒక 'బాహ్యగుణం' సంక్రమించడం ప్రారంభమైంది. మారకంలో వున్న రెండు వస్తువులూ మానవ శ్రమతో తయారైనవిగానే వుంటాయి కాబట్టి (లేకపోతే మారకం జరగనే జరగదు కాబట్టి), మారకం ప్రారంభం కావటం అంటే — ఆ వస్తువుల్ని తయారుచేసిన 'శ్రమలు' ఆ వస్తువుల 'విలువలు'గా అవడం ప్రారంభం కావడమే. అంత వరకూ 'విలువ' లేని వస్తువులు ఇప్పుడు విలువగల వస్తువులుగా (సరుకులుగా) అవుతున్నాయి.

మారకాలు ప్రారంభమైన నాడే మనుషులకు, 'శ్రమ' సంగతీ, 'విలువ కొలతల' సంగతీ, తెలుసునని అర్థం కాదు. మనుషులు వాళ్ళ అవసరాల కోసమే వస్తువుల్ని మార్చుకోవడాలు ప్రారంభించారు. మొదట్లో వాళ్ళకి విలువ కొలతలేమీ తెలియవు. తమ దగ్గర వున్న వస్తువుల్లో నించి అవతలవాళ్ళకి కావలసిన వాటిని ఇవ్వడమూ, తమకు కావలసిన వాటిని తెచ్చుకోవడమూ మాత్రమే వాళ్ళకి తెలుసు. ఇచ్చే వస్తువుకీ, తీసుకునే వస్తువుకీ 'విలువ సరిపోవడం' అనే ప్రశ్నే ఆ నాడు లేదు. 'విలువ' అనే భావం, మనుషుల్లో చాలా కాలం వరకూ లేదు. అంటే, మారకాలు ప్రారంభమైన కొత్తల్లో, ఎక్కువ శ్రమతో తయారయ్యే వస్తువుల్ని ఇచ్చి, తక్కువ శ్రమతో తయారయ్యే వస్తువుల్ని తీసుకోవడం కూడా జరుగుతూ వుండేదని ఊహించవచ్చు. అంటే అప్పటి మారకాలన్నీ 'విలువ సమానత్వం' అనే నిబంధనతో గాక, ఎలాబడితే అలాగ (ఆర్బిట్రరీగా, బై ఛాన్స్‌గా) వుండేవన్న మాట.

మారకాలు ప్రారంభం కావడానికి, ఆ మారకాలు దేని ఆధారంతో జరుగుతున్నాయో తెలియవలసిన అవసరం లేదు. ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసుకుంటే మారకం జరిగిపోయినట్టే. అలా వస్తువుల్ని మార్చుకునే వాళ్ళకి 'విలువ' గురించి తెలియకపోయినా, మారకాలు ప్రారంభమయ్యాయీ అంటే 'విలువ' ప్రారంభమైపోయినట్టే.

మారకాలు ప్రారంభమైన దశలో, ఏ వస్తువు ఏ వస్తువుకి సమానంగా వుంటుందో తెలియదు. క్రమంగా, వస్తువుల్ని తయారుచేసే అనుభవాల్నిబట్టి, ఏ వస్తువు తయారు చెయ్యడం తేలికో, ఏ వస్తువు తయారు చెయ్యడం కష్టమో, దేనిని దేనితో మార్చుకో వచ్చునో, ఒక అవగాహన ప్రారంభమవుతుంది. ఒక సమాజంలో ఉత్పత్తి అయ్యే సరుకులకు సంబంధించిన 'విలువ జ్ఞానం', ఆ సమాజంలో మానవులకు అనుభవాల ద్వారానే ఏర్పడుతుంది. దాన్ని బట్టి సరుకుల మారకాల కొలతలు ఇంచుమించుగా ఏర్పడుతూ వుంటాయి.

మనుషులకు, 'విలువ గురించిన జ్ఞానం' ఏర్పడడం అంటే, 'విలువ అంటే శ్రమే, వస్తువులలో వున్న శ్రమ మొత్తమే దాని విలువగా వుంటుంది' అనే సంగతి ఆ నాడే తెలిసిపోయిందని అర్థం కాదు. 'విలువ' అంటే ఏమిటో తెలియకపోయినా, ('విలువ అంటే శ్రమే' అని తెలియకపోయినా), వస్తువుల్ని మారకాలు చేసుకునేటప్పుడు, ఆ వస్తువులకు 'విలువ' అనేదేదో వుంటుందనే స్పృహ మాత్రం ప్రారంభమైంది. మట్టి కుండకి విలువ తక్కువనీ, చెక్క వస్తువుకి విలువ కొంచెం ఎక్కువనీ, ధాన్యానికి విలువ ఇంకా కొంచెం ఎక్కువనీ, ఇలా, ఏ వస్తువు తక్కువ విలువగలదో, ఏ వస్తువు ఎక్కువ విలువ గలదో, తెలుస్తూ వుంటుంది.

'ఈ వస్తువు విలువ ఎక్కువ, ఆ వస్తువు విలువ తక్కువ' అని మనుషులు అనుకుంటున్నారంటే, ఆ మనుషులు తమకు తెలియకుండానే వస్తువుల శ్రమల గురించే మాట్లాడుతున్నారని అర్థం. మనుషుల 'విలువ స్పృహ',

మారకాలు ప్రారంభమైనాక, అనేక వేల సంవత్సరాల వరకూ కూడా చాలా అస్పష్ట స్థితిలోనే వుండిపోయింది.

ఒక సరుకు, ఇంకో సరుకుతో మారినప్పుడు, మొదటి సరుకు విలువ, రెండో సరుకు రూపంతో వుంటుందని చూశాం కదా? అలా ప్రారంభమైన 'విలువ రూపం', క్రమంగా 'డబ్బు'గా అభివృద్ధి చెందింది. 'డబ్బు' అనేదాన్ని ఇప్పటి వరకూ మనం ఇంకా చూడలేదు. సీతాకోకచిలక 'క్రిమి' దశ నించి కొన్ని దశలు దాటుకుని, 'సీతాకోకచిలక' అయినట్టుగా, 'విలువ రూపం' అనేది, తన పుటక నించి కొన్ని దశలు దాటుకుంటూ 'డబ్బు రూపం'గా అభివృద్ధి చెందింది. అంటే, సరుకు 'విలువ' అనేది, 'డబ్బు రూపం'లో కనబడే విధంగా మారింది. అప్పటి నించీ డబ్బు రూపమే విలువ రూపంగా స్థిరపడిపోయింది, కాబట్టి, 'డబ్బు' అంటే ఏమిటో చూడడం కోసం, 'విలువ రూపానికి' సంబంధించిన పరిణామ క్రమాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ వెళ్ళాలి. ఇక, ఇప్పటి నించీ మనం, 'విలువ రూపం' ఎలా మారుతూ, ఎలా అభివృద్ధి చెందుతూ, చివరికి 'డబ్బు'గా ఎలా స్థిర పడిందో చూడాలి.

మారకాలు ప్రారంభమైన కాలంలో, రెండేసి సరుకులు ఒక్కో 'మారకం జత'గా ఏర్పడ్డాయని ఊహిద్దాం. ఉదా:

విల్లు = ఎద్దు చర్మం — ఒక మారకం జత.

కుండ = చెప్పులు — ఒక మారకం జత. ఇలా.

ఒక జతలో వున్న 2 వస్తువులూ, వాటిలో అవి మాత్రమే మారతాయి. అంటే ఒక జతలో వస్తువులు, ఇంకే జతలో వస్తువులతోటీ మారవు. విల్లూ ఎద్దు చర్మమూ ఒక మారకం జత కాబట్టి, విల్లు, ఎద్దు చర్మంతో మాత్రమే మారుతుంది గానీ, అది కుండతో గానీ, చెప్పుల జతతో గానీ ఇంకో వస్తువుతో గానీ, మారదు. అలాగే, ఎద్దు చర్మం కూడా విల్లుతో మాత్రమే మారుతుందిగానీ, కుండతో గానీ, చెప్పులతో గానీ, ఇంకో వస్తువుతోగానీ మారదు. అలాగే, 2వ జతలో వున్న వస్తువుల సంగతి కూడా. అప్పటి సమాజంలో మొత్తం 100 రకాల వస్తువులు వున్నాయి అనుకుంటే, అవి 50 మారకం జతలుగా వున్నట్టు అర్థం. ఒక జతలో వస్తువు, మిగిలిన ఏ జతలో వస్తువుతోటీ మారదు. మారకాలు ప్రారంభమైన కొత్తలో ఇలాగే జరిగినట్టుగా ఊహించాలి.

ఆ సమాజంలో 100 రకాల వస్తువులు వుంటే, వాటిలో కొన్ని రకాలు ఏ నాడూ మారకాలలోకి వెళ్ళవు. వాటిని, తయారు చేసుకోవడమూ వాడేసుకోవడమే జరుగుతూ వుంటుంది. కొన్ని రకాల వస్తువుల్ని మాత్రమే ఇతర తెగలకు ఇచ్చి, అటు నించి వాళ్ళ వస్తువుల్ని తెచ్చుకోవడం జరుగుతుంది. కాబట్టి, సమాజంలో ఎన్ని వస్తువులు వుంటే అన్ని వస్తువులూ తప్పనిసరిగా మారక సంబంధాల్లో వుంటాయని అర్థం కాదు. కానీ, మారక సంబంధాల్ని అర్థం చేసుకోవడం కోసమే, 100 వస్తువుల్ని 50 జతలుగా ఊహిస్తున్నాము.

విల్లు గల వ్యక్తికి ఎద్దు చర్మం కావాలంటే విల్లుని ఇచ్చి ఎద్దు చర్మం తీసుకోగలడు. విల్లు ద్వారా ఎద్దు చర్మాన్ని తప్ప ఇంకో వస్తువుని సంపాదించలేడు. అతనికి కుండో, చెప్పులజతో అవసరమైతే విల్లుద్వారా వాటిని సంపాదించ లేడు. ఎందుకంటే, విల్లుకి ఎద్దుచర్మంతోటి మాత్రమే మారక సంబంధం వుందిగానీ, ఇంకే వస్తువుతోటీ లేదు.

ఒక వ్యక్తికి చెప్పుల జత కావాలంటే, చెప్పులు ఏ సరుకు ద్వారా దొరుకుతాయో ఆ సరుకుని ఇచ్చి, చెప్పులు సంపాదించుకోవలిసిందే గానీ, తన దగ్గిర వున్న ఏదో ఒక సరుకు ద్వారా చెప్పుల జతని సంపాదించుకోడానికి వీలు వుండదు.

ఈ రకంగా, ఒక సరుకు ఇంకొక్క సరుకుతో మాత్రమే మారినప్పుడు కనబడే విలువ రూపం 'ప్రథమ' విలువ రూపం. (ప్రాథమిక విలువ రూపం). అంటే, మొదటి విలువ రూపం. 'విలువ' కొత్తగా పుట్టిన దశలో వున్న రూపం ఇది.

# 'ప్రాథమిక విలువ రూపానికి' సంబంధించిన కొన్ని విషయాలు

**1)** కుండ = చెప్పుల జత — ఇది ఒక మారకం జత. ఈ రెండిటికీ ఒక సారి మారకం జరగగానే వాటి మారకం ఆగిపోతుంది. కుండని ఇచ్చి చెప్పుల జతని తీసుకున్న వ్యక్తి ఆ చెప్పుల జతని వుపయోగించుకోవలసిందే గానీ, మళ్ళీ దాన్ని ఇంకెవరికైనా ఇచ్చి ఇంకో సరుకుని సంపాదించుకోవడానికి వీలు వుండదు. అది కుండతో తప్ప ఇంక దేని తోనూ మారదు. అది మారాలంటే మళ్ళీ దాన్ని ఇచ్చి కుండని తెచ్చుకోవలిసిందే. అందుచేత — ఒక మారకం జతలో సరుకులకు ఒక్కసారి మారకం జరగగానే వాటి మారక జీవితం సమాప్తమైపోతుంది. తర్వాత అవి వుపయోగపు విలువలుగా వుండిపోతాయి.

**2)** ఒక సరుకు, ఇంకొక్క సరుకుతో మాత్రమే మారే దశలో, ఒక సరుకుకి, ఒక్క ఈక్వివలెంటే వుంటుంది. కుండ = చెప్పుల జత — అనే 'మారకం జత'లో, కుండకు ఈక్వివలెంటు, చెప్పులజత ఒక్కటే. అలాగే, చెప్పుల జతకు ఈక్వివలెంటు కుండ ఒక్కటే. అంటే, కుండ విలువ, చెప్పుల

రూపంతో మాత్రమేనూ, అలాగే చెప్పుల విలువ కుండ రూపంతో మాత్రమేనూ, కనపడతాయి.

కుండ విలువ — చెప్పుల జత ఒక్కటే.

చెప్పుల జత విలువ — కుండ ఒక్కటే.

ఇతర జతల్లో వున్న సరుకుల విషయం కూడా ఇంతే.

ఇలా 'విలువ' అనేది, ఒకే ఒక్క రూపంతో కనపడితే, ఆ రూపం 'ప్రాథమిక విలువ రూపం' (ఎలిమెంటరీ ఫామ్ ఆఫ్ వాల్యూ). మారకాలు ఈ పద్ధతిలో వున్నప్పుడు, 'విలువ రూపం' అనేది, ప్రథమ దశలో వుందన్నమాట.

'ఇలా ప్రథమ దశలో వున్నది, ఏ సరుకు విలువ రూపం?' — అనే ప్రశ్న లేదు. ఏ సరుకు విషయం అయినా ఒకటే. ఏ సరుకు అయినా ఒకే ఒక్క సరుకుతో మాత్రమే మారుతుంది కాబట్టి, ఏ సరుకుకి అయినా ఒక్క ఈక్వివలెంటే వుంటుంది. కాబట్టి, ఏ సరుకుకి అయినా ఒక్క విలువ రూపమే వుంటుంది. అంటే ఏ సరుకు విలువ రూపం అయినా ప్రథమ దశలో వున్నట్టే అర్థం.

సమాజంలో ఇంకా మారకాలే ప్రారంభం కానినాడు, 'విలువ' అనేదే వుండదు కాబట్టి, ఆ నాడు 'విలువ రూపం' అనేది వుండదు. అలాంటి సమాజంలో, రెండేసి సరుకుల మారకాలు ప్రారంభమై, విలువా, విలువ రూపమూ, ప్రారంభమయ్యాయి. ఒక 'మారకం జత'లో, ఒక వస్తువు విలువ — రెండో వస్తువే. ఒక వస్తువు విలువ రూపం, రెండో వస్తువు రూపమే. ఈ రకంగా, ప్రాథమిక దశలో వున్న విలువ రూపం, 'పసి దశలో' వున్న విలువ రూపం.

తల్లి కడుపులోంచి అప్పుడే పుట్టిన బిడ్డ కూడా మనిషే. కానీ, ఆ బిడ్డ ఇంకా చిన్ని మనిషి, పసి దశలో వున్న మనిషి. ఆ బిడ్డ ఇంకా పెరిగి పెద్దదై సంపూర్ణమైన శారీరక రూపంలోకి ఎదగాలి .

అలాగే, పసి దశలో వున్న ఈ 'ప్రాథమిక విలువ రూపం' ఇంకా సంపూర్ణ రూపంలోకి ఎదగాలి.

**3)** కుండ = చెప్పుల జత. ఇలా అన్నప్పుడు, కుండ విలువ చెప్పుల జతగా వుంటే, చెప్పులజత విలువ కుండగా వుంటుంది. అంటే, ఈ 'ప్రాథమిక దశ'లో ఒక సరుకు విలువ రూపం వున్నట్టు, ఇంకో సరుకు విలువ రూపం వుండదు. దేని విలువ రూపం దానికి వేరుగా వుంటుంది.

**4)** విలువ రూపం ప్రాథమిక దశలో వున్నప్పుడు, రెండేసి సరుకులకు మాత్రమే గుణాత్మక సమానత్వమూ, పరిమాణాత్మక కొలతలూ, ఏర్పడతాయి.

## శ్రమల 'గుణాత్మక' సమానత్వం
### (క్వాలిటేటివ్ ఈక్వాలిటీ)

సమాజంలో మొత్తం 100 రకాల వస్తువులు వున్నాయనీ, అవి 50 జతలుగా వున్నాయనీ — అనుకుందాం. అప్పుడు, ఒక జతలో వున్న 2 వస్తువులకే మారక సంబంధం ('విలువ సంబంధం') వుంటుందిగానీ, వాటికి మిగతా 98 వస్తువులతో మారక సంబంధాలు వుండవు. కుండా, చెప్పులూ ఒక మారకం జత అనుకుందాం. ఈ వస్తువులు రెండూ ఒక దానితో ఒకటి మారడం వల్ల, కుండల్ని తయారుచేసే పనీ, చెప్పుల్ని తయారుచేసే పనీ కూడా 'విలువ గల పనులు' గా రుజువవు తాయి. ఈ రెండు పనులకూ ఒక 'సమాన లక్షణం' వున్నట్టుగా రుజువవుతుంది. ఇక్కడ 'సమాన లక్షణం' అంటే, 'విలువగా అవడం' అనే లక్షణం.

ఇదే, ఈ శ్రమల 'గుణాత్మక సమానత్వం', 'గుణం' విషయంలో సమానత్వం. ఇక్కడ గుణం అంటే, 'విలువ అవడం' అనేదే. 'కుండల్ని చేసే శ్రమా, చెప్పులు కుట్టే శ్రమా సమానమైనవే' అనే విషయం, ఆ శ్రమలతో తయారైన కుండలూ చెప్పులూ ఒక దానితో ఒకటి మారినప్పుడే రుజువవుతుంది. (ఆ వస్తువులు ఒకదానితో ఒకటి మారక పోతే, ఆ శ్రమల సమానత్వం రుజువు కాదు.) 'కుండని ఇచ్చి చెప్పులు తీసుకోవచ్చు, చెప్పులు ఇచ్చి కుండని తీసుకోవచ్చు. ఈ 2 వస్తువులూ సమానమే' అని మనుషులు అనుకుంటే, వాళ్ళు ఆ వస్తువుల విలువల్ని చూస్తున్నా రన్నమాట. అంటే, వాళ్ళు తమకు తెలియకుండానే, ఆ 2 శ్రమల్నీ సమానంగా చూస్తున్నారని అర్థం.

అయితే, ఒక మారకం జతలో వున్న 2 వస్తువులు ఇతర 98 వస్తువులతో మారవు కాబట్టి, అప్పుడు పరిస్థితి ఎలా వుంటుం దంటే — ఆ 2 శ్రమలూ ఇతర 98 శ్రమలూ కూడా సమానమే ( సమస్త శ్రమలూ సమానమే) అనే విషయం అప్పటికి ఇంకా రుజువు కాదు.

ఏ మారకం జతని చూసినా, ఆ జతలో వున్న 2 రకాల శ్రమలే సమానమైనవిగా కనపడతాయి. 'అన్ని శ్రమలూ సమానమైనవే' అనే విషయం ఇంకా ఇక్కడ కనపడదు.

నిజానికి అప్పుడు వున్న 100 సరుకులూ శ్రమలవల్ల ఏర్పడ్డవే. అన్నిటికీ 'శ్రమ అనే గుణం' వుంది. ప్రతీ సరుకూ ఇతర సరుకుల వంటిదే. 'విలువ'గా వుండడంలో (విలువ అనే గుణాన్ని కలిగివుండడంలో) అన్నీ సమానమే. అయినప్పటికీ, అన్నిటి మధ్యా మారకాలు జరగక పోవడం వల్ల, 'శ్రమలన్నీ సమానమే' అనే విషయం పైకి వ్యక్తం అవదు. అంటే 'శ్రమల సమానత్వం' ఇంకా కనపడదు.

## శ్రమల 'పరిమాణాత్మక' కొలతలు
### (క్వాంటిటేటివ్ ప్రపోర్షనాలిటీ)

2 సరుకులకు మారకం జరిగేటప్పుడు, ఆ 2 సరుకులకూ కొలతలు వుండాలి. బట్టకీ, ధాన్యానికీ మారకం జరగాలనుకుందాం. ఎంత బట్టకి, ఎంత ధాన్యం రావాలి? 1 మీటరు బట్టకి — 2 కిలోల ధాన్యమా, 3 కిలోల ధాన్యమా? ఎంత ధాన్యం రావాలి? — అలాగే, ధాన్యం వేపు నించి చూస్తే, 1 కిలో ధాన్యానికి ఎంత బట్ట రావాలి? 1 మీటరా, 2 మీట

ర్లా? — ఈ రకంగా, బట్టకీ ధాన్యానికీ మారకం జరగాలంటే, ఆ 2 వస్తువులకూ కూడా కొలతలు వుండాలి. ఇదే, మారకంలో వుండే వస్తువుల 'పరిమాణాత్మక కొలత'. అంటే, వాటి పరిమాణాలు ఫలానా ఫలానా కొలతల్లో వుంటాయని అర్థం.

ఒక వస్తువు, ఇంకొక్క వస్తువుతో మాత్రమే మారే దశలో, ఆ 2 వస్తువులకు మాత్రమే 'పరిమాణాత్మక కొలతలు' ఏర్పడతాయి. వాటికి, ఇతర 98 వస్తువులతో అలాంటి కొలతలు ఏర్పడవు. ఎందుకంటే, అవి అప్పటికి ఇతర వస్తువులతో మారడంలేదు గనక. అంటే, రెండేసి వస్తువులు ఒక మారకం జతగా వున్నప్పుడు, ఆ 2 వస్తువులకు మాత్రమే గుణాత్మక సమానత్వమూ, పరిమాణాత్మక కొలతలూ ఏర్పడతాయి.

ఈ దశలో జరిగే మారకాలు బార్టరు పద్ధతి మారకాలే.

## 'ప్రాథమిక విలువ రూపం'లో వున్నలోపం

కుండ = చెప్పులు. ఇది ఒక మారకం జత. కుండని ఇచ్చి చెప్పులు తీసుకోవచ్చు. చెప్పులు ఇచ్చి కుండని తీసుకోవచ్చు. అంతే. ఆ 2 వస్తువులకే మారక సంబంధం.

మరి, ఈ పరిస్థితుల్లో, కుండలు చేసే మనిషికి ధాన్యం కావాలంటే? బెల్లం కావాలంటే? — కుండ ద్వారా వాటిని సంపాదించడం సాధ్యం కాదు. కుండకి చెప్పులతో తప్ప, ఇంకే వస్తువుతోటీ మారక సంబంధాలు వుండవు.

చెప్పుల పరిస్థితి కూడా అంతే. చెప్పుల ద్వారా కుండని తప్ప ఇంకే వస్తువునీ సంపాదించడం సాధ్యం కాదు.

అంటే, ఒక వస్తువు, ఇంకొక్క వస్తువుతో మాత్రమే మారే పరిస్థితుల్లో, ఒక వస్తువుతో, ఏ వస్తువు కావాలంటే ఆ వస్తువుని సంపాదించడానికి అవకాశం వుండదు. ఇది, ప్రాథమిక విలువ రూపంలోవున్న లోపం (ఆ దశలో వున్న లోపం). ఈ లోపం, తర్వాత దశల్లో ఎలా మారుతుందో తర్వాత చూస్తాం.

## ప్రశ్నలూ — జవాబులూ

**1. మారకం విలువ, ఏ పరిస్థితుల్లో ప్రారంభమై వుండవచ్చు?**

**జ:** వేరు వేరు తెగల మధ్య 'మారకాలు' ఎప్పుడు ప్రారంభమయ్యాయో, అప్పుడే 'మారకం విలువ' ప్రారంభమైందని అర్థం.

**2. సరుకుకి ఏర్పడే 'బాహ్యగుణం' ఏమిటి?**

**జ:** మారకం విలువే. అదే బాహ్యగుణం.

**3. మారకం ప్రారంభమైన క్షణంలోనే శ్రమకు విలువ ప్రారంభమైంది —— అనడం సరైందేనా?**

**జ:** సరైనదే. విలువ అంటే శ్రమే కాబట్టి.

**4. 'విలువ రూపా'నికి 'క్రిమి దశ' ఏమిటి?**

**జ:** విలువ రూపానికి క్రిమి దశ, ప్రాథమిక విలువ రూపమే.

**5. 'ప్రాథమిక విలువ' రూపం అంటే ఏమిటి?**

**జ:** ఒక సరుకు, ఇంకొక్క సరుకుతో మాత్రమే మారేదశలో కనపడే విలువరూపమే — 'ప్రాథమిక విలువ రూపం'.

**6. 'విలువ రూపం' ప్రాథమిక దశలో వున్నప్పుడు ఒక్కొక్క సరుక్కీ ఎన్నేసి మారకాలు జరుగుతాయి?**

**జ:** ఒక్క మారకమే జరుగుతుంది.

**7. 'ప్రాథమిక విలువ రూపం'లో ఒక్కొక్క సరుక్కీ ఎన్నేసి ఈక్వివలెంట్లు వుంటాయి?**

**జ:** ఒక్క ఈక్వివలెంటే వుంటుంది.

**8. విలువ రూపం, ప్రాథమిక దశలో వున్నప్పుడు, ప్రతీ వస్తువూ సరుకు అవుతుందా?**

**జ:** అలా జరగదు. తెగలో తయారైన ప్రతీ ఒక్క వస్తువూ మారకంలోకి వెళ్ళదు. దాన్ని ఆ తెగలోనే వాడేసుకుంటే, అది సరుకు అవదు.

**9. 'శ్రమల గుణాత్మక సమానత్వం' అంటే ఏమిటి?**

**జ:** ఆ శ్రమలు — 'శ్రమగా వుండడం' అనే విషయంలో గానీ, 'విలువగా వుండడం' అనే విషయంలో గానీ, సమానమైనవి — అని అర్థం. ఇదే, ఆ శ్రమల గుణాల సమానత్వం.

**10. మారక సంబంధం, శ్రమ సంబంధం, గుణాత్మక సంబంధం, విలువ సంబంధం- వీటి అర్థాలేమిటి?**

**జ:** వేరు వేరు వస్తువులకు మారకం జరిగితే, ఆ సంబంధం, ఇన్ని పేర్లతోనూ వుంటుంది. అది, వస్తువుల (సరుకుల) మారక సంబంధం. అదే, శ్రమల సంబంధం. ఏ వస్తువు అయినా శ్రమతోటే తయారవుతుంది కాబట్టి, అది శ్రమల గుణాల సంబంధం. ఏ శ్రమ అయినా విలువగా అవుతుంది కాబట్టి, అదే 'విలువ సంబంధం'. — ఆ సంబంధాన్ని, ఇన్ని రకాలుగానూ చూడవచ్చు.

**11. 1 విల్లు = 2 కుండలు. ఈ సరుకుల మధ్య వున్న 'గుణాత్మక సమానత్వం' ఏమిటి? 'పరిమాణాత్మక కొలత' ఏమిటి?**

**జ:** విల్లుని తయారుచేసేదీ శ్రమే. కుండల్ని తయారుచేసేదీ శ్రమే. ఆ 2 వస్తువులూ శ్రమలతో తయారైనవిగా వుండడమే వాటి గుణాత్మక సమానత్వం. '1 విల్లుకి, 2 కుండలు' అనేది – వాటి పరిమాణాల కొలత.

**12. 20 మీ. బట్టకి, కోటుతో గుణాత్మక సమానత్వం వుంది - అంటే అర్థం ఏమిటి?**

**జ:** ఆ బట్టని తయారుచేసినదీ శ్రమే, ఆ కోటుని తయారుచేసినదీ శ్రమే — అని. 'శ్రమ' అనే గుణం ఆ 2 వస్తువులకూ వుంది — అని.

★

# 5. విస్తృత విలువ రూపం

'ప్రాథమిక విలువ రూపం'లో, రెండే రెండు సరుకుల విలువ సంబంధాన్ని చూశాం. ఒక సరుకు, ఇంకొక్క సరుకుతో మాత్రమే మారే సంబంధం అది. ఇప్పుడు, ఒక సరుకు అనేక సరుకులతో మారే సంబంధాన్ని చూస్తాం.

20 మీ బట్ట, కోటుతో మాత్రమే గాక, ఇంకా చాలా సరుకులతో మారితే?

(1) 20 మీ. బట్ట = 1 కోటు.
(2) 20 మీ. బట్ట = 8 చెప్పుల జతలు.
(3) 20 మీ. బట్ట = 10 కలాలు.
(4) 20 మీ. బట్ట = 25 కిలోల ధాన్యం.
(5) 20 మీ. బట్ట = 2 గ్రాముల బంగారం.

మారక సంబంధాలు ఇలా వున్నాయంటే, దీని అర్థం ఏమిటి? 20 మీ. బట్ట ఇప్పుడు కోటుతో మాత్రమేగాక, చెప్పులతో అయినా, కలాలతో అయినా, ధాన్యంతో అయినా, బంగారంతో అయినా, మారుతుందని అర్థం. అంటే, ఇప్పుడు 20 మీ. బట్ట విలువ, 1 కోటు రూపం ద్వారా మాత్రమే గాక, 8 చెప్పుల జతల రూపంతో అయినా, 10 కలాల రూపంతో అయినా, 25 కి. ధాన్యం రూపంతో అయినా, 2 గ్రా. బంగారం రూపంతో అయినా, కనపడు తుంది. అంటే, బట్ట, ఏ సరుకుతో మారితే ఆ రూపంతో. ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, బట్ట ముందు 5 రకాల సరుకుల్ని మాత్రమే తీసుకున్నాం. కానీ, బట్ట, 5 రకాల సరుకులతో మాత్రమే మారుతుందని అర్థం కాదు. ఆ సమాజంలో బట్ట గాక, ఇంకా ఎన్ని రకాల సరుకులు వున్నాయో ఆ సరుకు లన్నిటితోటీ, (అంటే ఆ సరుకుల్లో దేనితోనైనా) మారు తుందని అర్థం.

సమాజంలో మొత్తం 100 రకాల సరుకులు వున్నాయి అనుకుంటే, బట్ట, ఇప్పుడు మిగిలిన 99 రకాల సరుకులతోటీ మారుతుంది. బట్టకి ఇప్పుడు, మిగిలిన సరుకులన్నీ ఈక్వివలెంట్లే. అంటే, బట్టకి ఇప్పుడు 99 ఈక్వివలెంట్లు వుంటాయి. 99 విలువ రూపాలు వుంటాయి. బట్ట విలువ ఇప్పుడు అనేక రూపాలతో కనపడుతూ వుంటుంది. బట్ట ఏ సరుకుతో మారినప్పుడు ఆ సరుకు రూపంతో.

బట్టని తయారుచేసిన మనుషుల్లో ఒకరు తన బట్టని కోటుతో మార్చుకుంటే, ఇంకొకరు తన బట్టని ధాన్యంతోనూ, మూడో వ్యక్తి తన బట్టని బెల్లంతోనూ, నాలుగో వ్యక్తి తన బట్టని చెప్పులతోనూ, ఇలా మార్చుకోవచ్చు. ఈ విధంగా, మొత్తం బట్టలో వేరు వేరు భాగాలు, వేరు వేరు రకాల సరుకులతో మారుతూ వుంటాయి.

ఈ పరిస్థితి బట్టకే కాదు, సమాజంలో వున్న ఏ సరుకుకైనా వుంటుంది. ప్రతి ఒక్క సరుకూ మిగిలిన 99 సరుకులతోటీ మారుతుంది. ప్రతి ఒక్క సరుకికీ 99 ఈక్వివలెంట్లు, అంటే 99 విలువ రూపాలు, వుంటాయి.

అంటే, ఇప్పుడు జరిగిన మార్పు ఏమిటి?

ఒక సరుకు ఇంకొక్క సరుకుతో మాత్రమే మారడం అనే పరిస్థితి పోయి, ఇప్పుడు ఒక సరుకు, ఎన్ని సరుకులతోనైనా మారే పరిస్థితి ఏర్పడింది.

అంటే, ఏ సరుకు ఏ సరుకుతోనైనా, మారుతుంది.

ఇప్పుడు 'విలువ' అనేది (ఏ సరుకు విలువ అయినా) ఒక్క రూపంతోనే గాక, అనేక రూపాలతో కనపడుతుంది. కాబట్టి, ఇప్పుడు విలువ రూపం 'విస్తరించింద'ని అర్థం. ఇది, విస్తరించిన విలువ రూపం. విస్తృత విలువ రూపం. (ఎక్స్‌పాండెడ్ ఫామ్ ఆఫ్ వాల్యూ).

## 'విస్తృత విలువ రూపానికి' సంబంధించిన కొన్ని విషయాలు

**1)** ఒక సరుకు ఇంకొక్క సరుకుతో మాత్రమే మారే పరిస్థితిపోయి, ఒక సరుకు ఏ సరుకుతోనైనా మారే పరిస్థితి ఏర్పడడం అంటే, ఇది మారకాల ప్రపంచంలో అభివృద్ధి కరమైన విషయం. ఈ మార్పు, క్రమంగా జరిగిందని ఊహించాలి. ఎలాగంటే: కుండలు ఒకప్పుడు ధాన్యంతో మాత్రమే మారేవనీ, క్రమంగా అవి బట్టతో కూడా మారడం ప్రారంభమైందనీ అనుకుందాం. అప్పటి నించి, కుండని ఇచ్చి ధాన్యాన్నయినా తీసుకోవచ్చు; లేదా, బట్ట ని అయినా

తీసు కోవచ్చు. అంటే అప్పుడు కుండకి 2 ఈక్వివలెంట్లు వుండడం మొదలవుతుంది. ఇలా కొంత కాలం జరుగుతుంది. అప్పుడు, కుండ, చెప్పులతో కూడా మారడం ప్రారంభమైం దనుకుందాం. అప్పటి నించి కుండకి 3 ఈక్వివలెంట్లు వుంటాయి. ఇలా ఒక సరుకు, క్రమక్రమంగా, 2 రకాల సరుకులతోటీ, 3 రకాల సరుకులతోటీ, 4 రకాల సరుకుల తోటీ, చివరికి ఏ రకం సరుకుతోనైనా, మారే పద్ధతి ఏర్పడిం దన్నమాట. ఇప్పుడు, 2 సరుకులే ఒక మారకం జతగా వుండడం అనే పరిస్థితి పోయింది. ఏ సరుకు ఏ సరుకుతో నైనా మారే ఈ పద్ధతి సమాజంలో క్రమక్రమంగా ఏర్పడిందని వూహించాలి. 'ప్రాథమిక విలువ రూపం' అభివృద్ధే 'విస్తృత విలువ రూపం' అయింది.

**2)** 'ప్రాథమిక విలువ రూపం' కన్నా 'విస్తృత విలువ రూపం' ఎందుచేత అభివృద్ధి కరమైనది? — కుండలు, ధాన్యంతో మాత్రమే మారే పరిస్థితిలో అయితే, కుండతో ధాన్యాన్ని మాత్రమే సంపాదించగలరు. ధాన్యాన్ని తప్ప ఏ సరుకునీ సంపాదించలేరు. అలాగాక కుండ ఏ సరుకుతో నైనా మారే పరిస్థితిలో అయితే, కుండతో ఏ సరుకు కావాలంటే ఆ సరుకుని సంపాదించడానికి అవకాశం వుంటుంది. కాబట్టి 'ప్రాథమిక' విలువ రూపం కన్నా, 'విస్తృత' విలువ రూపం అభివృద్ధికరమైనది.

**3)** ప్రాథమిక విలువ రూపంలో ఒక లోపం వుందని చూశాం. ఒక సరుకు, ఇంకొక్కరకం సరుకుతో కన్నా ఎక్కువ రకాల సరుకులతో మారకపోవడం అనేది— ఆ లోపం. ఆ లోపం, విస్తృత విలువ రూపంలో పోయింది. అయితే, ప్రాథమిక విలువ రూపంలో వుండే లోపం పోయి, అది విస్తృత విలువ రూపంగా అభివృద్ధి చెందిందంటే, అప్పుడు ప్రాథమిక విలువ రూపం పూర్తిగా నశించిపోయిందని అర్థం కాదు. ప్రాథమిక విలువరూపంలో ఒక 'ప్రధాన లక్షణం' వుంది. అది విస్తృత విలువ రూపంలో కూడా నిలిచి వుంటుంది. ఆ లక్షణం ఏమిటంటే— ఒక మారకం జరిగేటప్పుడు, అది '2 సరుకుల సంబంధం'గా మాత్రమే వుండడం. ఇది, మారకానికి అవసరమైన, సహజమైన లక్షణం. ఈ లక్షణం, విస్తృత విలువ రూపంలో కూడా వుంటుంది. ఎలాగంటే, విస్తృత విలువ రూపంలో ఒక సరుకుకి ఎక్కువ సరుకులతో మారే అవకాశం ఏర్పడినా, అందులో ఏ మారకాన్ని తీసుకున్నా, అది '2 సరుకుల సంబంధం'గా మాత్రమే వుంటుంది. అంతేగానీ అది ఒకే కాలంలో అనేక సరుకుల సంబంధంగా వుండదు. కుండలు చేసే ఒక మనిషి, కుండని ఇచ్చి ధాన్యం తెచ్చుకుని, దాన్ని వాడకముందే బట్టతో అవసరం వచ్చి ఆ ధాన్యం ఇచ్చి బట్టని తెచ్చుకున్నాడనుకుందాం. అంటే, ఇక్కడ ధాన్యానికి 2 మారకాలు జరిగాయి. ఒకసారి కుండతోటీ, రెండోసారి బట్టతోటీ. ఒక సరుకు ఎక్కువ సరుకులతో మారే అవకాశం ఏర్పడడంవల్లనే ధాన్యం 2 సార్లు 2 రకాల సరుకులతో మారడం సాధ్యమయింది. అయితే, ధాన్యానికి జరిగిన ఈ 2 మారకాలూ ఒకే సమయంలో జరగలేదు. ధాన్యం, మొదట ఒక సరుకుతో మారి, తర్వాతే ఇంకో సరుకుతో మారింది. ఆ ధాన్యం అప్పటికి కూడా ఉపయోగపు విలువగా ఖర్చయి పోకుండా ఇంకా 4 రకాల సరుకులతో 4 సార్లు మారితే, ఆ మారకాలు కూడా ఒకదాని తర్వాత ఒకటి జరుగుతాయి. అంటే ఒక సరుకు ఎన్నిసార్లు ఎన్ని సరుకులతో మారినా, ఆ మారకాలన్నీ ఒకే కాలంలో జరగవు. ఒక సరుకు, అన్ని సరుకులతోటీ ఒకే సారి మారదు. దాని ప్రతీ మారకమూ '2 సరుకుల మారకం'గా మాత్రమే వుంటుంది. ప్రాథమిక విలువ రూపానికి చెందిన ఈ లక్షణం, విస్తృత విలువ రూపంలో కూడా నిలిచిపోయింది. విస్తృత విలువ రూపంలో జరిగిన మారకాలన్నీ కూడా బార్టరు మారకాలే.

విస్తృత విలువ రూపం ఎక్కడి నించో కొత్తగా రాలేదు. ప్రాథమిక విలువ రూపంలో లోపం పోయి, అదే విస్తృత విలువ రూపం అయింది. అందుచేత, 'విలువ రూపం' విస్తృత దశకు అభివృద్ధి చెందిన తరవాత కూడా ప్రాథమిక దశకు సంబంధించిన లక్షణాలన్నీ పూర్తిగా నశించిపోలేదని అర్థం.

**4)** ప్రాథమిక విలువ రూపంలో, ఒక సరుకుకి, ఒకే ఈక్వివలెంట్ వుంటే, విస్తృత విలువ రూపంలో ఒక సరుకుకి అనేక ఈక్వివలెంట్లు వుంటాయని చూశాం. అవి ఇలా వుంటాయి :

ప్రాథమిక విలువ రూపంలో:

20. మీ. బట్ట = 1 కోటు

↑ ↑

రెలెటివ్ స్థానం ఈక్వివలెంట్ స్థానం

ఇక్కడ బట్టకి ఒక్క ఈక్వివలెంటే వుంది కాబట్టి, బట్ట విలువ, ఒక్క రూపంతోనే వుంది.

విస్తృత విలువ రూపంలో:

20. మీ. బట్ట = 1 కోటు
= 8 చెప్పుల జతలు
= 10 కలాలు
= 25 కి. ధాన్యం
= 2 గ్రా. బంగారం

↑ ↑

రెలెటివ్ స్థానం ఈక్వివలెంట్ స్థానం

ఇక్కడ బట్టకి అనేక ఈక్వివలెంట్లు వున్నాయి. ఇప్పుడు బట్ట, తన విలువని, ఒక్క సరుకు రూపంతోనే గాక, ఏ సరుకు

రూపంతోనైనా చూపించగలదు. అంటే, ఇప్పుడు బట్ట విలువ, అనేక రకాల రూపాలతో విస్తరించి కనపడుతుంది. కాబట్టి, బట్ట ఎదురుగా వున్న 'ఈక్వివలెంట్ల రూపాలన్నీ కలిసిన రూపమే' విస్తృత రూపం.

**5)** ప్రాథమిక దశలో, ప్రతి సరుక్కీ, దేని విలువరూపం దానికి వేరు వేరుగా వుంటుందని చూశాం. ఈ విస్తృత దశలో కూడా ఏ సరుకు విలువ రూపం ఆ సరుక్కి వేరువేరుగానే వుంటుందా? 20 మీ. బట్టా, 1 కోటూ, 2 గ్రా. బంగారం – అనే 3 సరుకుల్ని తీసుకుని, వీటిలో ఒక్కొక్క సరుకుకీ ఈక్వివలెంట్లు ఎలా వుంటాయో చూద్దాం.

| | | | |
|---|---|---|---|
| **(1)** | 20 మీ బట్ట ........ | = | 1 కోటు |
| | | = | 2 గ్రా. బంగారం |
| **(2)** | 1 కోటు ............. | = | 20 మీ. బట్ట |
| | | = | 2 గ్రా. బంగారం |
| **(3)** | 2 గ్రా. బంగారం.. | = | 20 మీ. బట్ట |
| | | = | 1 కోటు |

ఒక సరుకుకి వున్న ఈక్వివలెంట్లకీ, ఇంకో సరుకుకి వున్న ఈక్వివలెంట్లకీ ఏం తేడా వుందో గమనించండి! ఒక సరుకుకివున్న ఈక్వివలెంట్ల లాగ, ఇంకో సరుకుకి వున్న ఈక్వివలెంట్లు లేవు. వాటిలో తేడా వుంది.

బట్ట ఎదురుగా వున్న ఈక్వివలెంట్లలో, బట్ట లేదు; కోటూ, బంగారమూ వున్నాయి.

కోటు ఎదురుగా వున్న ఈక్వివలెంట్లలో, కోటు లేదు; బట్టా, బంగారమూ వున్నాయి.

బంగారం ఎదురుగా వున్న ఈక్వివలెంట్లలో, బంగారం లేదు; బట్టా, కోటూ వున్నాయి.

ఈక్వివలెంట్ల మొత్తాన్నే విస్తృత విలువ రూపం అనుకుంటే, ఒక సరుకు విలువ రూపం వున్నట్టుగా ఇంకో సరుకు విలువ రూపం లేదు.

సమాజంలో మొత్తం వంద సరుకులు ఉన్నాయనుకుందాం. వాటిలో ఏ సరుకుని తీసుకున్నా దాని ఈక్వివలెంట్లు, ఆ సరుకు మాత్రం లేని మిగిలిన సరుకుల మొత్తంగా వుంటాయి. కాబట్టి ఒక సరుకు ఈక్వివలెంట్ల మొత్తం వున్నట్టుగా, ఇంకో సరుకు ఈక్వివలెంట్ల మొత్తం వుండదు. అంటే, ఒక సరుకు 'విలువ రూపం' వున్నట్టుగా, ఇంకో సరుకు 'విలువ రూపం' వుండదు. అంటే, ప్రాథమిక దశలో —ఏ సరుకు విలువ రూపం ఆ సరుకుకి వేరు వేరుగా వున్నట్టుగానే, విస్తృత దశలో కూడా — ఏ సరుకు విలువ రూపం ఆ సరుకుకి వేరు వేరుగా వుంటుంది.

**6)** ప్రాథమిక విలువ రూపంలో, ఒక సరుకుకి ఇంకొక్క సరుకుతో మాత్రమే మారక సంబంధం వుండడంవల్ల, ఒక జతలోవున్న రెండు శ్రమలకే గుణాత్మక సమానత్వమూ, ఆ సరుకుల శరీరాలకు పరిమాణాత్మక కొలతలూ ఏర్పడతాయని చూశాం. విస్తృత విలువ రూపంలో, ఒక సరుకు సమస్తమైన సరుకులతోటీ మారుతుంది కాబట్టి, ఆ సరుకుని చేసిన శ్రమకీ, ఇతర సమస్తమైన శ్రమలతోటీ గుణాత్మక సమానత్వమూ, పరిమాణాత్మక కొలతలూ ఏర్పడతాయి.

బట్ట, కోటుతో మాత్రమే మారినప్పుడు, నేత శ్రమకి, కుట్టుతో మాత్రమే సమానత్వం ఏర్పడుతుంది. బట్ట, సమస్తమైన సరుకులతోటీ మారినప్పుడు, నేతకి, సమస్తమైన శ్రమలతోటీ సమానత్వం ఏర్పడుతుంది.

ఈ పరిస్థితి, నేత శ్రమకు మాత్రమే కాదు. ప్రతీ ఒక్క శ్రమకీ వర్తిస్తుంది.

విస్తృత విలువ రూపంలో:

నేత – ఇతర అన్ని శ్రమలతోటీ సమానంగా వుంటుంది.

కుట్టు – ఇతర అన్ని శ్రమలతోటీ సమానంగా వుంటుంది.

వడ్రంగం– ఇతర అన్ని శ్రమలతోటీ సమానంగా వుంటుంది.

ఇలాగ, ప్రతీ శ్రమా ఇతర శ్రమలతో సమానం అవుతుంది.

ఒక సరుకుకి అన్ని సరుకులతోటీ సంబంధాలేర్పడడం అంటే, ఆ సరుకుకి మొత్తం సరుకుల ప్రపంచంతో సంబంధాలేర్పడడమే. ఇప్పుడు సరుకుల ప్రపంచంలో ప్రతీ సరుకూ ఒక పౌరుడు. అంటే ప్రతీ శ్రమా ఒక పౌరుడు.

నేత శ్రమ — ఒక పౌరుడు (పౌరురాలు)
కుట్టు శ్రమ — ఒక పౌరుడు
గని తవ్వకం — ఒక పౌరుడు—ఇలా!

ఒక పౌరుడికి ఇతర పౌరులతో సమానంగా నిలిచే హక్కు వున్నట్టే, ఒక శ్రమకి ఇతర శ్రమలతో సమానంగా నిలిచే హక్కు వుంది ఇప్పుడు.

ఒక శ్రమ, ఇతర శ్రమలతో సమానంగా వుంది — అంటే, 'శ్రమలన్నీ ఒక దానితో ఒకటి సమానంగా వున్నాయి' అని అర్థమే. అయితే, ఈ విషయం ('శ్రమలన్నీ సమానంగా వున్నాయి' అనే విషయం) ఈ దశలో స్పష్టంగా కనపడదు. తర్వాత 'జనరల్ విలువ రూపం' చాప్టర్‌ని కూడా చూసినప్పుడు, ఈ విషయం సరిగా అర్థమవుతుంది.

# 'విస్తృత విలువ రూపం'లో లోపాలు

విలువ రూపం, ప్రాథమిక దశలో వున్నప్పుడు, ఒక సరుకు ఇంకొక్క సరుకుతో మాత్రమే మారేది. అది ప్రాథమిక దశలో వుండే లోపం. ఆ లోపం పోయి, విస్తృత విలువ రూపం ఏర్పడింది. కానీ, ఈ దశలో కూడా కొన్ని లోపాలు వున్నాయి. అవి ఏమిటంటే:

**1)** విస్తృత విలువ రూపంలో, ఒక సరుకు ' విలువ వ్యక్తీకరణ', సమగ్రమైనది కాదు. అంటే, ఈ దశలో ఒక సరుకు విలువని 'సంపూర్ణ రూపం' తో చూడడం సాధ్యం కాదు. ఎందుకంటే, సమాజంలో మొత్తం 100 రకాల సరుకులు వున్నాయి అనుకుందాం. అందులో బట్ట ఒక సరుకు. అప్పుడు బట్టకి 99 ఈక్వివలెంట్లు వుంటాయి. అంటే బట్ట విలువ 99 రూపాలలో కనపడుతుంది. అయితే 'బట్ట విలువ ఈ 99 రూపాలతోనే వుంటుంది. ఇంకే రూపంతోనూ వుండదు' అనడానికి వీలుందా? సమాజంలో 100 రకాల సరుకులు మాత్రమే వున్నప్పుడైతే బట్ట విలువ, 99 రూపాలతో మాత్రమే వుంటుందని చెప్పవచ్చు. కానీ, సరుకుల ప్రపంచంలో ఎప్పుడూ 100 రకాల సరుకులే వుండవు. కొంతకాలానికి ఇంకో కొత్త రకం సరుకు ( కొత్త ఉపయోగపు విలువ ) వచ్చిందనుకుందాం. అప్పుడేమవుతుంది? అప్పుడు బట్టకి 100 ఈక్వివలెంట్లు వుంటాయి. అప్పుడు బట్ట విలువ, 100 రూపాలతో కనపడుతుంది. అంటే బట్ట విలువకి ఇప్పుడు ఇంకో కొత్త రూపం వచ్చింది. అలాగే, సమాజంలోకి కొత్త రకాల సరుకులు వచ్చినప్పుడల్లా బట్ట విలువ రూపాలు పెరుగుతూ వుంటాయి. 'బట్ట విలువ, ఈ 100 రూపాలతో మాత్రమే వుంటుంది, ఈ 200 రూపాలతో మాత్రమే వుంటుంది, ఇంకే రూపంతోనూ వుండదు' అని — బట్ట విలువ రూపాల మొత్తానికి ఒక ఖచ్చితమైన హద్దు చెప్పలేము. 'బట్టకి విలువ రూపం ఇదే, ఇంకేదీ లేదు' అని చెప్పగలిగే వరకూ బట్ట విలువ రూపం సంపూర్ణంగా వ్యక్తమైనట్టు అవదు. ఆ పరిస్థితి ఈ 'విస్తృత దశ'లో లేదు. అందుకే, ఈ దశలో ఒక సరుకు విలువ వ్యక్తీకరణ అసంపూర్ణమైనది ( ఇన్‌కంప్లీట్ ). ఇది విస్తృత విలువ రూపంలో వుండే ఒక లోపం.

**2)** విస్తృత విలువ రూపంలో, ఒక సరుకుకి, ఇతర అన్ని సరుకులతోటీ మారక సంబంధాలు ఉండడం కనపడుతుంది. కానీ, ఆ ఇతర సరుకులకు కూడా వాటిలో వాటికి ఆ సంబంధాలు వున్నట్టు కనపడదు. —ఇది రెండో లోపం. దీన్ని ఉదాహరణ ద్వారా చూద్దాం. బట్టకి ఎదురుగా 2 ఈక్వివలెంట్లని తీసుకుందాం. ( ఈ 2 ఈక్వివలెంట్లనే అనేక ఈక్వివలెంట్లుగా అనుకుందాం ).

20 మీ. బట్ట =1 కోటు
=2 గ్రా. బంగారం.

ఇక్కడ బట్ట, రెలెటివ్ స్థానంలో వుంది. కోటూ బంగారమూ బట్టకి ఈక్వివలెంట్లుగా వున్నాయి. ఇక్కడ, బట్ట విలువని చూస్తున్నాం. దాని ఈక్వివలెంట్ల విలువని కాదు (అంటే, కోటు విలువనీ, బంగారం విలువనీ కాదు).

ఈ ఉదాహరణలో ఏం కనపడుతోంది?

బట్ట — కోటుతో మారుతుంది. అంటే, బట్టకీ, కోటుకీ మారక సంబంధం వుందని తెలుస్తోంది.

బట్ట — బంగారంతో మారుతుంది. అంటే, బట్టకీ బంగారానికీ సంబంధం కూడా తెలుస్తోంది.

అయితే, ఈ ఉదాహరణలోనే, కోటుకీ బంగారానికీ మారక సంబంధం వున్నట్టు తెలుస్తోందా? — లేదు. అది తెలియడం లేదు. ఎందుచేత?

ఇదే ఉదాహరణని గీతల ద్వారా చూద్దాం.

బట్ట ——→——→—— కోటు
విలువ సంబంధం

బట్ట ——→——→—— బంగారం
విలువ సంబంధం

ఇక్కడ, బట్ట వేపు నించే, బట్ట విలువనే చూస్తున్నాం.

బట్టకీ, కోటుకీ సంబంధం తెలుస్తోంది.

బట్టకీ, బంగారానికీ సంబంధం కూడా తెలుస్తోంది.

కానీ, కోటుకీ బంగారానికీ సంబంధం తెలియడంలేదు.

నిజానికి, బట్టకి — కోటుతోనూ, బంగారంతోనూ మారక సంబంధాలు వున్నాయి అంటే, కోటుకీ, బంగారానికీ కూడా ఆ సంబంధం వుందని అర్థమే. కానీ, ఆ విషయం ఇక్కడ తెలియదు. ఎందుకంటే, మనం, బట్ట వేపు నించి దాని

సంబంధాల్ని చూస్తున్నాం. ఆ సంబంధాలు, దేనికి అది, విడి విడిగా వున్నాయి.

బట్టకి, కోటుతో వున్నది — ఒక విడి సంబంధం.
బట్టకి, బంగారంతో వున్నది — ఇంకో విడి సంబంధం.

బట్ట సంబంధాల్ని విడి విడిగా చూడడంవల్ల, కోటుకీ బంగారానికీ కూడా సంబంధం వుంటుందనే సంగతి కనపడడం లేదు.

అయితే, ఆ సంబంధం కూడా కనపడాలంటే, విషయాన్ని ఎలా చూడాలి? — ఎలాగంటే:

బట్టకి — కోటుతో వున్న సంబంధమూ,

బట్టకి — బంగారంతో వున్న సంబంధమూ, ఒకచోట కలుస్తున్నాయి. ఎక్కడ? — బట్ట దగ్గిర. అంటే, 'బట్ట'నే ఈక్వివలెంటుగా చేసిచూస్తే, అన్ని సంబంధాలూ కనపడతాయి. అంటే, 'బట్ట'వేపు నించి గాక (ఒక వస్తువు వేపు నించి గాక), కోటూ బంగారాల వేపు నించి చూస్తే, (అనేక వస్తువుల వేపు నించి చూస్తే), అప్పుడు అన్ని వస్తువుల సంబంధాలూ ఎటు నించి ఎటైనా కనపడతాయి. కానీ అలా చూస్తే, అది 'విస్తృత విలువ రూపం' కాదు. అది, 'జనరల్ విలువ రూపం' అవుతుంది. దాన్ని తర్వాత చూస్తాము.

విస్తృత విలువ రూపం — అంటే, ఒక వస్తువు, అన్ని వస్తువులతోటీ మారడం. అంతేగానీ, అన్ని వస్తువులూ ఒక వస్తువుతో మారడం కాదు. కాబట్టి, 'విస్తృత విలువ రూపం'లో ఏ విషయాలు కనపడతాయో వాటిని మాత్రమే ఇక్కడ చూడాలి.

ఇక్కడ, ఒక వస్తువు — అన్ని వస్తువులతోనూ మారుతుంది. అంటే, ఒక శ్రమ — అన్ని శ్రమలతోనూ సమానం – అని మాత్రమే ఇక్కడ కనపడుతుంది. 'అన్ని శ్రమలూ ఒకదానితో ఒకటి సమానం' (శ్రమలన్నీ సమానం) – అనే సంగతి, ఇక్కడ కనపడదు.

విస్తృత విలువ రూపంలో 'అన్ని సరుకులకూ మధ్య సంబంధాలు' కనపడవు గనక, అన్ని శ్రమలకూ మధ్య సంబంధాలు కనపడవు. అంటే, 'విలువగా వుండడంలో అన్ని శ్రమలూ సమానమే' అనే విషయం ఇక్కడ రుజువు కాదు. ఇది, విస్తృత విలువ రూపంలో వుండే రెండో లోపం. ( ఈ విషయం 'జనరల్ విలువ రూపం' చాప్టర్‌లో ఇంకా వివరంగా అర్థమవుతుంది.)

**3)** సమాజంలో విస్తృత విలువ రూపం వున్నప్పుడు, నిత్యజీవితంలో మారకాలు ఎలా వుంటాయో చూద్దాం. విస్తృత విలువ రూపం అంటే, ఒక సరుకు ఏ సరుకుతోనైనా మారడానికి అవకాశం వుంటుంది. బట్టలు నేసే మనిషి దగ్గిర కొంత బట్ట వుందనుకుందాం. అతనికి జొన్నలు కావాలి. అతను తన బట్టని పట్టుకుని జొన్నల మనిషి దగ్గిరికి వెళ్తాడు. జొన్నల మనిషికి బట్ట అవసరమైతే సరే, ఆ మారకం జరుగుతుంది. అప్పుడు బట్ట మనిషి, కాసిన్ని జొన్నలు తీసుకుని ఇంటికి వెళ్ళిపోతాడు. కానీ, జొన్నల మనిషికి బట్ట అక్కరలేకపోతే? అప్పుడు బట్ట మనిషికి జొన్నలు ఎలా దొరకాలి? బట్ట మనిషి, జొన్నల మనిషితో, "నీకు ఏ సరుకు కావాలో చెప్పు! నీకు కావలసిన సరుకు తెచ్చి ఇచ్చి, నేను నీ జొన్నలు తీసుకుంటాను" అంటాడు.

జొన్నల మనిషి, 'చెప్పులు కావాలి' అని చెప్పాడనుకుందాం. బట్ట మనిషి, తన బట్టని పట్టుకుని దానితో చెప్పులు సంపాదించడానికి బయల్దేరుతాడు. బట్ట మనిషి, చెప్పుల మనిషి దగ్గిరికి వెళ్ళి, "నా బట్టని తీసుకుని ఒక చెప్పుల జత ఇయ్యి! ఈ చెప్పులు తీసుకుపోయి జొన్నల మనిషికి ఇచ్చి నేను జొన్నలు తీసుకోవాలి" అంటాడు. చెప్పుల మనిషికి బట్ట కావలసివస్తే సరే, ఆ మారకం జరుగుతుంది. కానీ, చెప్పుల మనిషికి కూడా బట్ట అక్కర్లే దనుకుందాం. అప్పుడు బట్ట మనిషికి చెప్పులు ఎలా దొరకాలి? చెప్పులు దొరకకపోతే అతనికి జొన్నలు దొరకవు కదా? కాబట్టి, అప్పుడు బట్ట మనిషి, చెప్పుల మనిషితో " నీకు ఏ సరుకు కావాలో చెప్పు! నీకు కావలసిన సరుకు తెచ్చి ఇచ్చి, నేను చెప్పులు తీసుకుంటాను. వాటితో తర్వాత జొన్నలు తెచ్చుకోవాలి" అంటాడు.

చెప్పుల మనిషి— "నాకు బెల్లం కావాలి" అంటాడనుకుందాం. బట్ట మనిషి, తన బట్టని చంకన పెట్టుకుని బెల్లం మనిషి దగ్గిరికి బయల్దేరతాడు. బెల్లం తెచ్చి చెప్పుల మనిషికి ఇచ్చి, చెప్పులు తెచ్చి జొన్నల మనిషికి ఇచ్చి, ఆ జొన్నలు తను తీసుకోవాలి. కానీ, బెల్లం మనిషికి కూడా బట్ట అక్కరలేకపోతే? — ఈ రకంగా అయితే, బట్ట మనిషికి కావలసిన జొన్నలు ఎప్పటికి దొరికేను? అతను మొదట, తన బట్ట ఎవరికి కావాలో వాళ్ళని పట్టుకోవాలి. వాళ్ళ దగ్గర తీసుకున్న సరుకు ఎవరికి కావాలో వాళ్ళని తర్వాత పట్టుకోవాలి. మళ్ళీ ఆ సరుకు ఎవరికి కావాలో వాళ్ళని పట్టుకోవాలి. ఆ రకంగా తిప్పలు పడుతూ తిరిగితే, అప్పటికైనా అతనికి కావలసిన సరుకు దొరికితే దొరుకుతుంది, లేకపోతే లేదు.

ఒక సరుకు, ఏ సరుకుతోనైనా మారుతుంది — అన్నప్పుడు, 'మారడానికి అవకాశం వుంది' అనే గానీ, 'మారి తీరుతుంది' అని కాదు.

విస్తృత విలువ రూపంలో, ఒక సరుకు ద్వారా ఏ సరుకు కావాలన్నా దొరకడానికి వీలైతే వుంది. ఆ వీలే లేకపోతే అసలు ప్రయత్నించడానికే కుదరదు. కానీ, దొరకడానికి వీలు వున్నంత మాత్రాన, ఒక సరుకుగల వ్యక్తికి ఇంకో సరుకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా దొరికే మార్గం మాత్రం లేదు. ఇదే అసలైన లోపం.

విస్తృత విలువ రూపంలో 3 లోపాలు వున్నట్టు కనపడినా అన్నిటి సారాంశమూ ఒకటే.

# ప్రశ్నలూ – జవాబులూ

**1. ప్రాథమిక విలువ రూపం, విస్తృత విలువ రూపం గా ఎందుచేత మారింది?**

**జ:** ఒక వస్తువు, ఇంకొక్క వస్తువుతో మాత్రమే మారే పరిస్థితిలో, ఒక వస్తువుతో ఏ వస్తువు కావాలంటే ఆ వస్తు వుని సంపాదించుకోవడం సాధ్యం కాదు. దాని వల్ల అవసరాలు తీరవు. కాబట్టి ప్రాథమిక విలువ రూపం, విస్తృత విలువ రూపంగా మారవలసి వచ్చింది.

**2. 1 కోటు = 20 మీ॥ బట్ట**
**= 2 గ్రా॥ బంగారం.**
**ఇది ఏ విలువ రూపం? ఎందుచేత?**

**జ:** ఇది విస్తృత విలువ రూపం. ఎందుకంటే, కోటు అనే వస్తువు, బట్టతోనూ, బంగారంతోనూ కూడా (అంటే, ఒకటి కన్నా ఎక్కువ వస్తువులతో) మారగలదు కాబట్టి.

**3. ఒక సరుకుకి 49 ఈక్వివలెంట్లు వున్నాయి. అంటే ఆ సమాజంలో మొత్తం ఎన్ని సరుకులు వున్నట్టు?**

**జ:** మొత్తం 50 సరుకులు వున్నట్టు.

**4. విస్తృత విలువ రూపంలో ప్రాథమిక విలువ రూపం కూడా ఒక భాగంగా వుంది — అంటే ఏమిటి?**

**జ:** ఒక వస్తువు, అనేక వస్తువులతో మారే పద్ధతిలో కూడా, ఒక మారకం జరిగేటప్పుడు, అది 2 వస్తువుల మధ్య మాత్రమే జరుగుతుంది. ఆ రకంగా, విస్తృత విలువ రూపంలో, ప్రాథమిక విలువ రూపం కూడా ఒక భాగంగా వున్నట్టు అర్థం.

**5. 1 కలం, 1 కుర్చీ, 1 గొడుగు, 1 దుప్పటి -- ఈ నాలుగు సరుకులూ సమాన విలువలు గలవిగా వున్నాయి. వీటి మధ్య మారకాలు జరిగినప్పుడు ఒక్కొక్క సరుకు విలువ రూపం ఎలా వుంటుంది?**

**జ:**

| | |
|---|---|
| 1 కలం = 1 కుర్చీ | ఇలాగే, మిగిలిన |
| = 1 గొడుగు | వస్తువులకు కూడా |
| = 1 దుప్పటి | జరుగుతుంది. |

**6. ఒక శ్రమకు, మిగిలిన అన్ని శ్రమలతోటీ గుణాత్మక సమానత్వం వుందనే విషయం, విస్తృత విలువ రూపంలో కనబడుతుంది. ఎందుచేత?**

**జ:** ఎందుకంటే, ఒక వస్తువు, అన్ని రకాల వస్తువులతోటీ మారడం విస్తృత విలువ రూపంలోనే జరుగుతుంది కాబట్టి. ఒక వస్తువు, అన్ని వస్తువుల తోటీ మారడం వల్లనే, ఒక శ్రమ అన్ని శ్రమల లాంటిదే — అని రుజువవుతుంది.

**7. బట్ట మనిషికి కుండ కావాలి. కుండ మనిషికి చెప్పులూ, చెప్పుల మనిషికి జొన్నలూ, జొన్నల మనిషికి బట్టా కావాలి. బట్ట మనిషికి కుండ ఎలా దొరుకుతుంది?**

**జ:** బట్ట మనిషి, బట్టని ఇచ్చి జొన్నలు తీసుకుని, ఆ జొన్నలు ఇచ్చి చెప్పులు తీసుకుని, ఆ చెప్పులు ఇచ్చి కుండని తీసుకోవాలి.

**8. 'విస్తృత విలువ రూపం' లో లోపం ఏమిటి?**

**జ:** ఈ దశలో, ఒక వస్తువుతో, ఏ వస్తువు కావాలంటే ఆ వస్తువుని సంపాదించడం తేలిగ్గా సాధ్యం కాదు. ఒక వ్యక్తి ఇచ్చే వస్తువు, ఇంకో వ్యక్తికి అవసరమైనప్పుడే ఆ మారకం జరుగుతుంది. లేకపోతే, మొదటి వ్యక్తికి కావలసిన వస్తువు చాలా కాలం దాకా దొరకదు. ఇదే ఈ దశలో లోపం.

★

# 6. జనరల్ విలువ రూపం

'ప్రాథమిక విలువ రూపం'లో ఒక సరుకు, ఇంకొక్క సరుకుతో మాత్రమే మారేది. ఆ లోపం పోయి, ఒక సరుకు ఏ సరుకుతోనైనా మారే 'విస్తృత విలువ రూపం' ఏర్పడింది. కానీ విస్తృత విలువ రూపంలో కొన్ని లోపాలు వున్నాయని చూశాం. ఆ లోపాలు కూడా పోయే విధంగా విలువ రూపం ఇంకా అభివృద్ధి చెంది, 'జనరల్ విలువ రూపం' అయింది. ఆ చివరి మార్పు ఎలా జరిగిందో ఇప్పుడు చూస్తాం.

బట్ట, కోటుతో మారుతుంది — అంటే, కోటు కూడా బట్టతో మారుతుంది — అని అర్థమే కదా? అలాగే, బట్ట, అనేక సరుకులతో మారుతుంది అంటే, ఆ అనేక సరుకులు కూడా బట్టతో మారుతాయని అర్థం. ఒక సూత్రం, తన వ్యతిరేక సూత్రాన్ని కూడా తనలో కలిగి వుంటుంది.

**ప్రాథమిక విలువ రూపంలో:**

20 మీ. బట్ట = 1 కోటు

ఇక్కడ, బట్ట —తన విలువని చెప్పుకునే సరుకు.

కోటు, బట్టకి ఈక్వివలెంటు.

దీని వ్యతిరేక సూత్రం :

1 కోటు = 20 మీ. బట్ట

ఇప్పుడు, కోటు —తన విలువని చెప్పుకునే సరుకు.

బట్ట, కోటుకి ఈక్వివలెంటు.

**విస్తృత విలువ రూపంలో:**

20 మీ. బట్ట = 1 కోటు
20 మీ. బట్ట = 8 చెప్పుల జతలు
20 మీ. బట్ట = 10 కలాలు
20 మీ. బట్ట = 25 కి. ధాన్యం
20 మీ. బట్ట = 2 గ్రా. బంగారం

ఇక్కడ బట్ట, తన విలువని చెప్పుకునే సరుకు. దాని ఎదురుగా వున్న 5 సరుకులూ దానికి ఈక్వివలెంట్లు. (ఈ 5 సరుకులనే సమస్తమైన సరుకులుగా అనుకుంటాం.) దీని అర్థం, బట్ట సమస్తమైన సరుకులతోటీ మారుతుంది —అని.

దీనికి వ్యతిరేక సూత్రం :

సమస్తమైన సరుకులూ బట్టతో మారతాయి — అని.

ఆ వ్యతిరేక సూత్రం ఇలా వుంటుంది :

కోటు = 20 మీ. బట్ట
8 చెప్పుల జతలు = 20 మీ. బట్ట
10 కలాలు = 20 మీ. బట్ట
25 కి. ధాన్యం = 20 మీ. బట్ట
2 గ్రా. బంగారం = 20 మీ. బట్ట

ఇప్పుడు, అన్ని సరుకులూ, తమ విలువని చెప్పుకునే సరుకులు. ఇప్పుడు బట్ట, అన్ని సరుకులకూ ఈక్వివలెంటు.

ఈ విషయాన్ని ఇలా కూడా చూడవచ్చు.

| | | |
|---|---|---|
| 1 కోటు | = | 20 మీ. బట్ట |
| 8 చెప్పుల జతలు | = | |
| 10 కలాలు | = | |
| 25 కి. ధాన్యం | = | |
| 2 గ్రా. బంగారం | = | |

అన్ని సరుకులకూ ఒకే ఈక్వివలెంటు వుంది. అంటే, అన్ని సరుకులకూ ఒకే విలువ రూపం. ఏ సరుకు విలువ అయినా ఇప్పుడు, ఒకే రూపంతో కనబడుతుంది. ఇప్పుడు, సరుకుల ప్రపంచంలో వున్న సమస్తమైన సరుకులూ (ఈక్వివలెంట్‌గా వున్న బట్ట తప్ప) రెలెటివ్ స్థానంలో వుంటే, ఒకే ఒక్క సరుకు మాత్రం (బట్ట మాత్రం) ఈక్వివలెంటు స్థానంలో వుంది.

ఇప్పుడు సరుకుల ప్రపంచంలో వున్న ఏ సరుకునైనా అడగండి— " నువ్వు ఏ యే సరుకులతో మారతావు? నీ విలువ రూపాలు ఏమిటి?" అని అడగండి. ప్రతీ ఒక్క సరుకూ— "నేను బట్టతో మాత్రమే మారతాను. ఇంకే సరుకుతోటీ మారను. బట్ట రూపం ఒక్కటే నా విలువ రూపం" అని చెపుతుంది. అన్ని సరుకులూ (బట్ట తప్ప) ఆ మాటే చెపుతాయి. అన్ని సరుకులూ 'ఒకే ఈక్వివలెంటుని' చెపుతాయి.

అన్ని సరుకులకూ ఒకే ఈక్వివలెంటు వుండడం అంటే, దాని రూపం, అన్ని సరుకులకూ సంబంధించిన 'సమిష్టి విలువ రూపం'. అదే 'జనరల్ విలువ రూపం'. ('జనరల్' అంటే 'అన్నిటికీ సంబంధించిన' అని అర్థం.) జనరల్ ఈక్వివలెంటుగా వుండే సరుకు రూపమే —జనరల్ విలువ రూపం (జనరల్ ఫామ్ ఆఫ్ వాల్యూ). ఆ జనరల్ విలువ రూపంగా మన ఉదాహరణలో 'బట్ట'ని పెట్టుకున్నాం కాబట్టి, బట్ట అనే సరుకు, ఇప్పుడు అన్ని సరుకులతోటీ, మారే అర్హతగల 'జనరల్ ఈక్వివలెంటు.'

ఒక సరుకు, అనేక సరుకులతో మారడం అనే పరిస్థితి నించే 'జనరల్ ఈక్వివలెంటు' ఏర్పడింది. ఒక సరుకు అనేక సరుకులతో మారడం —అనే పరిస్థితిని, 'ఒక సరుకు' వేపు నించి చూస్తే విస్తృత విలువ రూపమూ; 'అనేక సరుకుల' వేపు నించి చూస్తే 'జనరల్ విలువ రూపమూ' కనపడతాయి.

'ప్రాథమిక దశ'లో — ఏ సరుకు విలువ రూపం ఆ సరుకుకి వేరుగా వుంది.

'విస్తృత దశ'లో కూడా — ఏ సరుకు విలువ రూపం ఆ సరుకుకి వేరుగానే వుంది.

కానీ, జనరల్ దశలో — ఏ సరుకు విలువ రూపం, ఆ సరుకుకి వేరుగా లేదు. అన్ని సరుకులకూ ఒక్కటే విలువ రూపం. (ఒక్క సరుక్కి తప్ప — ఏ సరుకైతే, 'జనరల్ ఈక్వివలెంట్'గా వుంటుందో ఆ సరుక్కి తప్ప). ఇప్పుడు, అన్ని సరుకులూ, 'జనరల్ ఈక్వివలెంట్'తో మాత్రమే మారతాయి. ఆ సరుకుతో తప్ప ఇక ఏ సరుకు తోటీ మారవు.

'జనరల్ ఈక్వివలెంటు'కి ఒక ప్రత్యేకమైన పేరు వుంది. ఆ పేరు, సరుకుల ప్రపంచానికంతటికీ తెలిసిన పేరే. ఆ పేరు — 'డబ్బు'! అంటే, సరుకుల ప్రపంచంలో 'డబ్బు'గా కనపడేది — 'జనరల్ ఈక్వివలెంటే.' జనరల్ ఈక్వివలెంటు గురించి తెలుసుకోవడం అంటే, 'డబ్బు' గురించి తెలుసు కోవడమే. అయినా, ఇక్కడ మనం 'డబ్బు' అనే మాటని గాక, 'జనరల్ ఈక్వివలెంటు' అనే మాటనే ప్రధానంగా వాడతాము.

జనరల్ ఈక్వివలెంటు రూపమే, జనరల్ విలువ రూపం.

# 'జనరల్ విలువ రూపానికి' సంబంధించిన విషయాలు

**1)** ఏ సరుకు, ఏ సరుకుతోనైనా మారే పద్ధతి పోయి, అన్ని సరుకులూ ఏదో ఒకే ఒక్క సరుకుతోనే మారే పద్ధతి వస్తే, దాని వల్ల అవసరాలెలా తీరతాయి? అందరికీ ఆ ఒక్క సరుకే అవసరమవుతుందా?

జనరల్ ఈక్వివలెంట్‌గా బట్ట వుందనుకుందాం. జొన్నల మనిషికి చెప్పులు కావాలనుకుందాం. జొన్నలు, చెప్పులతో మారకుండా బట్టతో మాత్రమే మారితే, జొన్నల మనిషికి కావలసింది బట్ట కాదు గదా? అతనికి బట్టతో అవసరం లేకపోయినా దాన్ని తెచ్చి ఏం చేసుకుంటాడు? అన్ని సరుకులూ ఒకే సరుకుతో మారే పద్ధతి వల్ల ప్రయోజన మేమిటి?

జనరల్ ఈక్వివలెంట్ ఏర్పడడంవల్ల ప్రయోజనం ఏమిటంటే, దాని ద్వారా మారకాలు చాలా తేలిగ్గా జరుగు తాయి. అది ఎలా సాధ్యమవుతుందో ఇప్పుడు చూద్దాం. జొన్నల మనిషికి చెప్పులు కావాలి కదా? బట్ట, 'జనరల్ ఈక్వివలెంట్'గా వుంది. ఇప్పుడు జొన్నల మనిషి మొదట తిన్నగా చెప్పుల దగ్గరకే వెళ్ళడు. మొదట 'జనరల్ ఈక్వివలెంట్' దగ్గరికి వెళ్తాడు. తన జొన్నలు ఇచ్చి, దానికి బదులుగా కొంత జనరల్ ఈక్వివలెంట్‌ని తీసుకుంటాడు. ఆ తర్వాత, ఆ జనరల్ ఈక్వివలెంట్‌ని పట్టుకుని, చెప్పుల దగ్గరికి వెళ్తాడు. చెప్పుల మనిషికి, జనరల్ ఈక్వివలెంట్‌ని ఇచ్చి, దానికి బదులుగా చెప్పులు తీసుకుంటాడు. ఇప్పుడు జొన్నల మనిషికి చెప్పులు దొరికాయి!

అయితే, చెప్పుల మనిషి, బట్టని ( జనరల్ ఈక్వివ లెంట్‌ని ) తీసుకుంటాడా? "నాకు బట్ట అక్కర్లేదు." అంటే? — అలా అనడు. ఎందుకంటే, ఈ 'బట్ట' ఎలాంటి సరుకు? జనరల్ ఈక్వివలెంట్‌గా వున్న సరుకు. చెప్పుల మనిషి కూడా, తను తయారుచేసే చెప్పుల జతల్ని ఇతరులకు మారకాలు చేస్తూ, వాటికి బదులుగా తనకు కావలసిన సరుకుల్ని తెచ్చుకోవలసి వుంటుంది. అతనికి ఏ సరుకు కావలసినా అతని చేతిలో జనరల్ ఈక్వివలెంట్ ఉండ వలసిందే. జనరల్ ఈక్వివలెంట్‌ని పట్టుకుని వెళ్తే, దానితో ఇంకో సరుకు మారకపోవడం అనే సమస్య వుండదు. కాబట్టి, చెప్పుల మనిషి జనరల్ ఈక్వివలెంట్‌గా వున్న బట్టని తీసుకోవడానికి ఏమీ సంకోచించడు. అతనికి ప్రస్తుతం ఏ సరుకూ అక్కరలేకపోయినా, తర్వాతైనా బోలెడు సరుకులు కావలసి వుంటాయి. కాబట్టి అందు కోసమైనా అతను జనరల్ ఈక్వివలెంట్‌ని తీసుకుని దానికి బదులుగా తన సరుకుని ఇవ్వడానికి అభ్యంతరం చెప్పడు. పైగా మహా సంతోషంగా అంగీకరిస్తాడు.

చెప్పుల మనిషి, జనరల్ ఈక్వివలెంట్‌ని తీసుకుని చెప్పులు ఇవ్వగానే, జనరల్ ఈక్వివలెంట్‌ని తెచ్చిన మనిషి, చెప్పులు తీసుకుని వెళ్ళిపోతాడు. జొన్నల మనిషికి చెప్పులు దొరికాయి కాబట్టి అతన్ని వదిలేద్దాం.

ఇప్పుడు, జనరల్ ఈక్వివలెంటు, చెప్పుల మనిషి చేతిలో వుంది. ఇతనికి బెల్లం కావాలనుకుందాం. ఇతను తన జనరల్ ఈక్వివలెంట్‌ని బెల్లం మనిషికి ఇచ్చి, బెల్లం తెచ్చుకుంటాడు. బెల్లం మనిషి కూడా, జనరల్ ఈక్వివ లెంటుని ఇంకొకరికి ఇచ్చి, తనకు కావలసిన సరుకు తెచ్చుకుంటాడు. ఈ రకంగా ఎవరికి కావలసిన సరుకు వాళ్ళకి దొరుకుతుంది.

ఏ సరుకుని తయారుచేసే మనిషి అయినా, తన సరుకు ఎవరికి కావాలో వాళ్ళకి ఇచ్చి, మొదట జనరల్ ఈక్వివ లెంట్‌ని తీసుకుంటాడు. తర్వాత ఆ జనరల్ ఈక్వివలెంట్‌ని ఇచ్చి తనకు కావలసిన సరుకుని తీసుకుంటాడు. ఈ

2 మారకాలతోటే ఒక మనిషి చేతిలోకి ఒక సరుకుకి బదులు ఇంకో సరుకు వస్తుంది.

**జొన్నల మనిషికి చెప్పులు దొరికిన క్రమం:**

తన జొన్నలు ఇచ్చి జనరల్ ఈక్వివలెంట్‌ని తీసుకోవడం. ఇది 1వ మారకం. తర్వాత, జనరల్ ఈక్వివలెంట్‌ని ఇచ్చి చెప్పులు తీసుకోవడం. ఇది 2వ మారకం. దీని సారాంశం, జొన్నలు ఇచ్చి చెప్పులు తీసుకోవడమే.

అయితే, జొన్నలు, చెప్పుల మనిషి చేతిలోకే వెళ్ళాయని అర్థం కాదు. కానీ, జొన్నల మనిషి వేపు నించి చూస్తే, జొన్నలు వెళ్ళిపోయి, చెప్పులు వచ్చాయి. అంటే, జొన్నలు = చెప్పులు. అయితే ఈ మారకం, ఈ 2 సరుకులూ ఒకదానితో ఒకటి సూటిగా మారడం ద్వారా గాక, ఈ సరుకుల మధ్య జనరల్ ఈక్వివలెంట్ వుండడం ద్వారా జరిగింది.

**చెప్పుల మనిషికి బెల్లం దొరికిన క్రమం:**

తన చెప్పులు ఇచ్చి,జనరల్ ఈక్వివలెంటుని తీసుకోవడం. ఇది 1 వ మారకం. తర్వాత, జనరల్ ఈక్వివలెంట్‌ని ఇచ్చి బెల్లం తీసుకోవడం. ఇది 2 వ మారకం. సారాంశం, చెప్పులు = బెల్లం

ఈ 2 సరుకులకూ మధ్య జనరల్ ఈక్వివలెంటు వుండడం ద్వారా ఈ మారకం జరిగింది.

అంటే, జనరల్ ఈక్వివలెంట్ అనేది, 2 సరుకుల మారకానికి 'మధ్యవర్తి'గా పనిచేస్తుందన్నమాట. ఒక సరుకు గల మనిషికి ఇంకో సరుకు దొరికేలాగ జనరల్ ఈక్వివలెంట్ చేస్తుంది.

ఈ "మధ్యవర్తి"గారు అవతరించడం అనేది సరుకుల ప్రపంచంలో ఎంత అభివృద్ధి అంటే — ఒక సరుకు మనిషి తన సరుకుని చంకలో పెట్టుకుని, తనకు కావలసిన సరుకు ఎప్పుడు దొరుకుతుందా అని, గడప గడపా ఎక్కి దిగక్కర్లేదు. సరుకు మనిషి మొట్టమొదట తన సరుకుతో జనరల్ ఈక్వివలెంట్ దగ్గిరికీ, తర్వాత తనకు కావలసిన సరుకు దగ్గిరికీ పోతాడు. రెండే రెండు మారకాలతో అతనికి కావలసిన సరుకు తప్పనిసరిగా దొరికి తీరుతుంది.

అసంఖ్యాకమైన సరుకులు వున్న సరుకుల ప్రపంచంలో, ఎక్కడే మారకం జరిగినా, ఎన్ని వేల మారకాలు జరిగినా, అన్నీ, ప్రతీ ఒక్కటీ జనరల్ ఈక్వివలెంట్ ద్వారా జరగవలసిందే. దాని మధ్యవర్తిత్వం వల్లనే సరుకులు చకచకా మారతాయి. జనరల్ ఈక్వివలెంట్ అవతరించడం వల్ల మారకాలలో అంత సౌకర్యం!

**2)** 'జనరల్ ఈక్వివలెంట్' ఏర్పడడం అనేది ఎందుచేత జరిగింది? ఎలాంటి పరిస్థితుల్లో జరిగింది? —సమాజంలో శ్రమ విభజన ఎక్కువై, కొత్త కొత్త రకాల శ్రమలు పుట్టుకొచ్చి, వేరు వేరు రకాల సరుకుల వుత్పత్తి ఎక్కువైనకొద్దీ, ఎక్కువ సంఖ్యలో మారకాలు జరగవలసి వుంటుంది. సరుకుల ప్రపంచం పెరుగుతున్నకొద్దీ, తక్కువ సరుకులు వున్నప్పుడు పనికివచ్చిన మారకం పద్ధతులు పనికిరావు.

ఏదో ఒక సరుకు తరుచుగా అందరికీ కావలసిన సరుకుగా వుంటుందనుకొందాం. కొన్ని సరుకులు, ఒకరికి కావలసినవి ఒకరికి అక్కర్లేకపోవచ్చు. కానీ, కొన్ని సరుకులు మాత్రం దాదాపు అందరికీ కావలసినవిగా వుంటాయి. ఉదాహరణకి — 'ఆవు' ఎక్కువ మందికి కావలసిన సరుకుగా ఉందనుకుందాం. ఒక మనిషి, ఆవుల మందల్ని పెంచుతున్నాడను కుందాం. ఆవుని పెంచడానికి కొంత శ్రమ పడాలి కాబట్టి, ఆవుకి కొంత విలువ వుంటుంది. అందరూ తమ సరుకులు ఇచ్చి ఆవుల్ని తీసుకుంటూ వుంటారు. (ఆవుకి ఎంత విలువ వుంటుందో అంత విలువగల సరుకుల్ని ఆవు కోసం ఇవ్వాలి). ఎక్కువ మందికి అవసరమైన సరుకుకి (ఆవుకి) అనేక ఈక్వివలెంట్లు ఏర్పడతాయి. ఆ అనేక ఈక్వివలెంట్లకి, ఈ ఒక్క సరుకే (ఆవు) జనరల్ ఈక్వివలెంట్‌గా అవుతుంది. ఈ రకంగా, ఎక్కువ మందికి కావలసిన ఒకే రకం సరుకు, జనరల్ ఈక్వివ లెంట్‌గా వుండే పద్ధతి ప్రారంభమవు తుంది.

అన్ని సరుకులకూ ఒకే ఈక్వివలెంటు వుండే పద్ధతి ఏదో ఒక రోజున హఠాత్తుగా ప్రారంభం కాలేదు. మొదట్లో ఐదారు సరుకులకు ఒక్కో జనరల్ ఈక్వివలెంట్ చొప్పున ఏర్పడవచ్చు. తర్వాత కాలంలో ఇంకా ఎక్కువ సరుకులకు ఒక్కో జనరల్ ఈక్వివలెంట్ చొప్పున ఏర్పడవచ్చు. క్రమంగా చివరికి, సరుకుల ప్రపంచంలో వున్న అన్ని సరుకులకూ ఒకే ఈక్వివలెంట్ ఏర్పడింది. ఇక అప్పటి నించీ సరుకుల ప్రపంచంలో ఒకే ఒక్క ఈక్వివలెంట్ తప్ప రెండో ఈక్వివలెంట్ వుండదు.

జనరల్ ఈక్వివలెంట్ ఏర్పడడం అంటే, సరుకులన్నీ కలిసి తమలో ఒకే ఒక్క సరుక్కి ఈక్వివలెంట్‌గా వుండే హక్కు ఇస్తున్నాయన్నమాట. "నువ్వు ఒక్కదానివే మా కందరికీ ఈక్వివలెంట్‌గా వుండు! మాలో ఇంకెవ్వరం ఈక్వివలెంట్లుగా వుండం. మేమందరం నీతో మాత్రమే మారతాం. ఇంకే సరుకుతోటీ మారం" అని చెపుతున్నాయన్న మాట.

అందరూ కలిసి ఒకే పని చేస్తే అది 'సమిష్టి చర్య' అవుతుంది. సరుకుల ప్రపంచంలో అన్ని సరుకులూ కలిసి, 'ఒకే ఈక్వివలెంట్‌తో మారడం' అనే సమిష్టి చర్య చేస్తున్నాయి. ఈ సమిష్టి చర్య వల్లనే జనరల్ ఈక్వివలెంట్ పుట్టుకువచ్చింది. ఈ రకంగా, మారకాల ప్రపంచంలో ఎంతో దీర్ఘకాలంపాటు జరిగిన పరిణామక్రమంలో నించే జనరల్ ఈక్వివలెంట్ ఏర్పడింది. అంతేగానీ, ఈ పని, కొందరు 'ఆర్థికవేత్తలు' బాగా ఆలోచించి, "సరుకులన్నిటికీ ఒకే

ఈక్వివలెంట్‌ని పెడదాం" అని నిర్ణయించడం వల్ల జరిగింది కాదు.

'జనరల్ ఈక్వివలెంటు' అంటే మొత్తం ప్రపంచంలో ఎక్కడైనా వున్న సరుకులన్నిటికీ సంబంధించిన ఈక్వివలెంటు కాబట్టి, దీన్ని 'యూనివర్సల్ ఈక్వివలెంటు' (ప్రపంచ ఈక్వివలెంటు) అని కూడా అంటాము.

**3)** జనరల్ ఈక్వివలెంట్ చేసే పని— సరుకుల మారకాలకు 'మధ్యవర్తిత్వం' నెరపడమే కదా? ఆ బాధ్యత నిర్వహించే వస్తువుగా ఏ రాయినో, రప్పనో పెట్టుకోకూడదా? సమాజం అంతా దానినే జనరల్ ఈక్వివలెంట్‌గా గుర్తిస్తే, అదే ఆ పాత్ర నిర్వహించదా? — ఇలాంటి ప్రశ్న ఎవరికైనా వచ్చిందంటే, వాళ్ళకి, 'విలువ' గురించి ఇంత వరకూ చదివిన విషయాలు అర్థంకాలేదని అర్థం. 'జనరల్ ఈక్వివలెంటు' పాత్రని నిర్వహించడానికి, శ్రమతో తయారైన వస్తువే వుండాలిగానీ రాళ్ళూ రప్పలూ పనికిరావు. ఎందుకంటే, జనరల్ ఈక్వివలెంటు శ్రమతో తయారైనది కాకపోతే, దానితో ఇతర సరుకులు మారడం సాధ్యం కాదు.

2 కిలోల జొన్నలు, 1 కిలో ధాన్యంతో సమానం— అనుకుందాం. అంటే, వాటి విలువలు సమానం. ఇటు సరుకులోనూ, అటు సరుకులోనూ కూడా 10 నిమిషాల శ్రమ ఉందనుకుందాం.

అయితే, ఈ సరుకులు ఒక దానితో ఒకటి మారాలంటే సూటిగా మారవు. జనరల్–ఈక్వివలెంటు ద్వారానే మారతాయి.

జనరల్ ఈక్వివలెంటుగా బట్ట వుందనీ, 1 మీటరు బట్టలో 5 నిమిషాల శ్రమ వుందనీ—అనుకుందాం.

జొన్నల మనిషి, మొదట, జొన్నల్ని ఇచ్చి జనరల్ ఈక్వివలెంటుని తీసుకోవాలి కదా? జనరల్ ఈక్వివలెంటుకి కూడా విలువ వుంటుంది కాబట్టి, 2 కి. జొన్నలకు బదులుగా ఎంత ఈక్వివలెంటు రావాలో ఒక లెక్క వుంటుంది. ఈ ఉదాహరణలో 2 కి. జొన్నలకు బదులుగా, 2 మీ. బట్ట వస్తుంది. ఆ బట్టని తీసుకున్న మనిషి, తర్వాత, దాన్ని ఇచ్చి ధాన్యం తీసుకోవాలి. 2 మీ. బట్టని ఇస్తే, 1 కి. ధాన్యం వస్తుంది. లేదా, 1 మీ. బట్టని మాత్రమే ఇస్తే, అర్థ కిలో ధాన్యం వస్తుంది. ఈ రకంగా, ధాన్యంతో మారేటప్పుడు కూడా, జనరల్ ఈక్వివలెంటు ఒక లెక్కప్రకారమే వెళ్తుంది.

జనరల్ ఈక్వివలెంట్ అనేది విలువ గల (శ్రమతో తయారైన) వస్తువు కాకపోతే, అది ఇతర సరుకులతో మారేటప్పుడు ఏ కొలతల ప్రకారం మారగలుగుతుంది? జనరల్ ఈక్వివలెంటు, సరుకుల మారకాలకు 'మధ్యవర్తి'గా పనిచేసేది, తనలో వున్న 'విలువ' అనే లక్షణంతోనేగానీ, కేవలం 'మధ్యవర్తి' అనే 'పేరు'తో కాదు.

శ్రమతో తయారుకాని ఏ రాతినో రప్పనో సరుకుల ప్రపంచం అంతా జనరల్ ఈక్వివ లెంట్‌గా వుంచుకోడానికి అంగీకరించిందనే అనుకుందాం. ఇప్పుడు ఆ రాతి ముక్కలతో మారకానికి 4 రకాల సరుకులు వచ్చాయను కుందాం. ఆ సరుకులు – 2 కి. జొన్నలూ, 1 గ్రా. బంగారం, 1 లీటరు పాలూ, 4 చెప్పుల జతలూ — అనుకుందాం. వీటన్నిటితో మారాలంటే ఆ జనరల్ ఈక్వివలెంటు ఏయే కొలతల్లో వెళ్ళాలి? ఆ ఈక్వివలెంటు, శ్రమతో తయారైనది అయితే, అది ఒక సరుకుతో మారేటప్పుడు ఆ సరుకు విలువకు సరిపోయేటంత విలువగల ఈక్వివలెంటు భాగమే ఆ సరుకుకి బదులుగా వెళ్తుంది.

ఈక్వివలెంటు ముందు వున్న కొన్ని సరుకుల విలువలు ఇలా వున్నాయి అనుకుందాం.

| | |
|---|---|
| 2 కి. జొన్నల్లో | —10 నిముషాల శ్రమ. |
| 1 గ్రా. బంగారంలో | —30 నిముషాల శ్రమ. |
| 1 లీ. పాలలో | —15 నిముషాల శ్రమ. |
| 1 చెప్పుల జతలో | —60 నిముషాల శ్రమ. |

ఈ 4 సరుకులతో, జనరల్ ఈక్వివలెంటు మారాలంటే— అన్నిటితోటీ ఒకే కొలతతో మారుతుందా? 10 నిమిషాల శ్రమతో తయారైన సరుకుకి బదులుగా ఎంత ఈక్వివలెంటు వెళ్తుందో, 30 నిముషాల శ్రమతో తయారైన సరుక్కి కూడా అంతే వెళ్తుందా?

జనరల్ ఈక్వివలెంటుగా వున్న బట్ట శ్రమకాలం, 1 మీటరుకి 5 నిముషాలు —అనుకుందాం. ఈ విలువ లెక్క ప్రకారమే అది తన ఎదుట వున్న సరుకులతో మారుతుంది.

| | | |
|---|---|---|
| 2 కి. జొన్నలు (10ని.ల శ్రమ) | = | 2 మీ. బట్ట (10 ని.ల శ్రమ) |
| 1 గ్రా. బంగారం (30 ని.ల శ్రమ) | = | 6 మీ. బట్ట (30 ని.ల శ్రమ) |
| 1 లీ. పాలు (15 ని.ల శ్రమ) | = | 3 మీ. బట్ట (15 ని.ల శ్రమ) |
| 4 చెప్పుల జతలు (60 ని.ల శ్రమ) | = | 12 మీ. బట్ట (60 ని.ల శ్రమ) |

జనరల్ ఈక్వివలెంటు, శ్రమతో తయారైనదిగా వుండబట్టే, అది ఇతర సరుకులతో మారవలసినప్పుడు, ఏ సరుకుకి బదులు అది ఎంత భాగం వెళ్ళాలో నిర్ణయమవడానికి వీలుగా దానికి విలువ కొలతలు వుంటాయి. అది శ్రమతో తయారైనది కాకపోతే, దానితో మారకానికి వచ్చిన సరుకులతో అది ఏ లెక్కప్రకారమూ మారడం సాధ్యం కాదు.

ఒక వస్తువులో వున్న బరువుని కొలవాలంటే ఆ వస్తువుని ఇంకో బరువుగల వస్తువు ద్వారానే కొలవాలి. బరువులేని వస్తువు, ఇతర వస్తువుల బరువుల్ని కొలవడానికి పనికిరాదు.

అలాగే, పొడుగులేని వస్తువు, ఇతర వస్తువుల పొడుగుల్ని కొలవడానికి పనికిరాదు. అలాగే, 'విలువ లేని' (శ్రమలేని) వస్తువు, ఇతర వస్తువుల విలువల్ని కొలవడానికి పనికిరాదు. శ్రమకు శ్రమతోనే సంబంధం సాధ్యమౌతుంది గనక, సరుకుల విలువల్ని తన ద్వారా చెప్పడానికి నిలబడ్డ జనరల్ ఈక్వివలెంటు, తప్పనిసరిగా శ్రమవల్ల తయారైన సరుకుగానే వుండాలి. అలా లేకపోతే దానికి విలువ కొలతలు వుండక దానితో మారకాలు సాధ్యం కావు.

**4)** సరుకుల ప్రపంచంలో, జనరల్ ఈక్వివలెంట్‌గా వున్న సరుకు ఒక్కటే 'ఈక్వివలెంట్ స్థానం'లో వుండి, మిగిలిన సమస్తమైన సరుకులూ 'రెలెటివ్ స్థానం'లో వుంటాయి కదా? జనరల్ ఈక్వివలెంటు ఏర్పడిపోయిన తర్వాత సరుకుల ప్రపంచంలోకి వచ్చే కొత్త కొత్త రకాల సరుకులన్నీ కూడా రెలెటివ్ స్థానం వేపే చేరుతూ వుంటాయి. అంటే, ఆ కొత్త సరుకులు కూడా జనరల్ ఈక్వివలెంటుతో మాత్రమే మారుతూ వుంటాయి. అంతకు ముందు జనరల్ ఈక్వివలెంటుగా వున్నదే, ఆ కొత్త సరుకులకు కూడా ఈక్వివలెంటుగా వుంటుంది.

**5)** ఈ ఉదాహరణలో తప్పేమిటో గమనించండి!

| | | |
|---|---|---|
| 1 కోటు | = | 20 మీ. బట్ట |
| 1 గ్రా. బంగారం | = | |
| 20 మీ. బట్ట | = | |

20 మీ. బట్ట రెలెటివ్ స్థానంలోనూ వుంది, ఈక్వివలెంటు స్థానంలోనూ వుంది. అలా వుంటే, బట్టకు బట్టతోనే మారకం జరిగినట్టు అవుతుంది. అది తప్పు. అందుచేత జనరల్ ఈక్వివలెంటుగా వున్న సరుకు మిగిలిన సరుకుల నించి ఎప్పుడూ విడిగానే, ఎప్పుడూ ఈక్వివలెంటు స్థానంలోనే వుంటుంది.

**6)** 'జనరల్ ఈక్వివలెంటు' కూడా ఒక సరుకే కదా? అది ఎప్పుడూ ఈక్వివలెంటు స్థానంలోనే వుండి, తన ద్వారా ఇతర సరుకుల విలువల్ని చెప్పేదిగానే వుంటే, మరి అది తన విలువని ఎలా చెప్పుకుంటుంది? దాని విలువ ఎప్పుడు, ఎలా, తెలుస్తుంది? ఏ సరుకు ద్వారా తెలుస్తుంది? జనరల్ ఈక్వివలెంట్‌కి 'విలువ రూపం'గా వుండే సరుకు ఏది?

జనరల్ ఈక్వివలెంట్‌కి ఎదురుగా ఏ యే సరుకులైతే వున్నాయో అవన్నీ దాని విలువని చెప్పే సరుకులే. అవన్నీ దాని విలువకి రూపాలే.

ఏ సరుకు విలువని తెలుసుకోవాలన్నా దాన్ని రెలెటివ్ స్థానంలోకి తేవలసిందే. జనరల్ ఈక్వివలెంటుగా వున్న బట్ట విలువని తెలుసుకోవాలంటే, దాన్ని రెలెటివ్ స్థానంలోకి తేవాలి. అప్పుడు సమస్తమైన సరుకులూ ఈక్వివలెంట్ స్థానంలోకి వెళ్తాయి. అంటే, 'విస్తృత విలువ రూపం' వస్తుంది. అంటే జనరల్ ఈక్వివలెంటుగా వున్న బట్ట విలువ, అనేక సరుకుల రూపాలతో కనపడుతుంది. 20 మీ. బట్టకి ఎన్ని కోట్లు వస్తాయో, ఎన్ని కలాలు వస్తాయో, ఎంత బంగారం వస్తుందో — ఇలా, బట్ట విలువ, దాని ఎదురుగా ఎన్ని సరుకులైతే వున్నాయో (సమస్త సరుకులూ వున్నాయి), అన్ని రూపాలతో కనపడుతుంది. దాని ఎదురుగా వున్న సరుకులన్నీ దాని విలువని చెప్పే సరుకులే. అవన్నీ దాని విలువ రూపాలే. అంటే, జనరల్ ఈక్వివలెంటు, తన విలువని చెప్పుకునే సరుకుగా వున్నప్పుడు, దానికి అనేక ఈక్వివలెంట్లు (అనేక విలువ రూపాలు) వుంటాయి గానీ, ఏదో ఒకే ఒక్క ఈక్వివలెంటు ( ఒకే ఒక్క విలువ రూపం) వుండదు. అంటే, సమస్త సరుకులకూ జనరల్ విలువ రూపం వుంటే, జనరల్ ఈక్వివలెంటుగా వున్న సరుకుకి మాత్రం విస్తృత విలువ రూపమే వుంటుంది. దానికి జనరల్ విలువ రూపం వుండదు.

**7)** 'జనరల్ ఈక్వివలెంట్'తో సంబంధం లేకుండా ఒక మనిషి తన సరుకుని ఇచ్చి ఇంకో సరుకుని తీసుకుంటే అది 'బార్టరు పద్ధతి'లో జరిగిన మారకం. ప్రాథమిక విలువ రూపంలోనూ, విస్తృత విలువ రూపంలోనూ కూడా, మారకాలన్నీ బార్టరు పద్ధతిలోనే వుంటాయి. జనరల్ విలువ రూపంలో బార్టరు పద్ధతిపోయి, మారవలసిన సరుకుల మధ్య జనరల్ ఈక్వివలెంటు ప్రవేశిస్తుంది. అయితే, జనరల్ ఈక్వివలెంటు ఏర్పడిన తర్వాత కూడా సమాజంలో అక్కడక్కడా కొన్ని మారకాలు ఇంకా బార్టరు పద్ధతిలోనే జరుగుతూ వుంటాయి. బార్టరు పద్ధతి పూర్తిగా నశించి పోవడం, క్రమ క్రమంగా మాత్రమే జరుగుతుంది.

**8)** ఒక మారకం జరిగేటప్పుడు, అది రెండే రెండు సరుకుల సంబంధంగా వుండడం ప్రాథమిక విలువ రూపం లక్షణం — అని చూశాం. ఈ లక్షణం విస్తృత విలువ రూపంలో కూడా నిలిచి వుండడం చూశాం. అంతే కాదు, ఈ లక్షణం, జనరల్ విలువ రూపంలో కూడా నిలిచివుంటుంది. ఎలాగంటే : జొన్నల మనిషికి ధాన్యం కావాలంటే, మొదట జొన్నలకూ జనరల్ ఈక్వివలెంటుకూ మారకం జరుగుతుంది. ఇది 2 సరుకుల సంబంధమే. తర్వాత, జనరల్ ఈక్వివలెంటుకీ ధాన్యానికీ మారకం జరుగు తుంది. ఇది కూడా 2 సరుకుల సంబంధమే. ఈ రకంగా, జనరల్ ఈక్వివలెంటుతో ఏ సరుకు మారినా అది 2 సరుకుల సంబంధంగా మాత్రమే వుంటుంది. ఇది, 'ప్రాథమిక విలువ రూపం' లక్షణం.

అంతేగాక, 'జనరల్ విలువ రూపం'లో, విస్తృత విలువ రూపం లక్షణం కూడా నిలిచి వుంటుంది. ఎలాగంటే:

జనరల్ ఈక్వివలెంటుగా వున్న సరుకుకి 'విలువ రూపం'గా, విస్తృత విలువ రూపమే వుండటంవల్ల, జనరల్ దశలో కూడా విస్తృత దశ లక్షణం మిగిలివున్నట్టే.

ఈ రకంగా, జనరల్ దశలో, ప్రాథమిక దశ లక్షణాలూ, విస్తృత దశ లక్షణాలూ పూర్తిగా నశించిపోలేదు. అంటే, జనరల్ విలువ రూపం ఎక్కడినించో కొత్తగా రాలేదు. ప్రాథమిక దశలోనూ, విస్తృత దశలోనూ వుండే లోపాల్ని (మారకానికి సంబంధించిన లోపాల్ని) వొదిలేసి, ఆ దశలలో వుండే మంచి లక్షణాల్ని కూడగట్టుకుని అది వొచ్చింది.

# 'విస్తృత విలువ రూపం' లో ఉండే లోపాలు 'జనరల్ విలువ రూపం' లో ఎలా పోయాయి?

**1)** 'విస్తృత విలువ రూపం'లో ఒక సరుకు 'విలువ వ్యక్తీకరణ అసంపూర్ణం (ఇన్‌కంప్లీట్)' — అని చూశాం కదా? ఇప్పుడు, జనరల్ విలువ రూపంలో సరుకు విలువ వ్యక్తీకరణ 'సంపూర్ణం (కంప్లీట్)' ఎలా అయిందో చూద్దాం.

విస్తృత విలువ రూపంలో ఒక సరుకు తన 'విలువ'ని చెప్పాలంటే — "ఇదుగో, ఇదే నా విలువ రూపం. ఈ రూపంతో తప్ప, నా విలువ ఇంకే రూపంతోనూ వుండదు" అని చెప్పడానికి వీలు వుండదు. కాబట్టి, అక్కడ విలువ వ్యక్తీకరణ అసంపూర్ణం.

కానీ, జనరల్ విలువ రూపంలో, ఒక సరుకు, తన విలువని చెప్పాలంటే — "నా విలువ రూపం ఇదే. ఈ రూపంతో తప్ప నా విలువ ఇక ఏ రూపంలోనూ కనపడదు" అని ఒక స్పష్టమైన సమాధానం ఇవ్వగలుగుతుంది. జనరల్ ఈక్వివలెంట్‌గా ఏ సరుకువుంటే ఆ సరుకు రూపాన్నే తన విలువ రూపంగా చెప్పగలుగుతుంది.

జనరల్ విలువ రూపంలో, ఒక సరుక్కి ఒక్కటే విలువ రూపం వుంటుంది గానీ రెండో రూపం వుండదు, ఎప్పటికీ వుండదు. సరుకుల ప్రపంచంలోకి ఎన్ని కొత్త సరుకులు వచ్చినా, సరుకుల 'విలువ రూపం' మారదు. అందుకే, జనరల్ విలువ రూపంలో ఒక సరుకు విలువ వ్యక్తీకరణ — సంపూర్ణమైనది.

**2)** విస్తృత విలువ రూపంలో, ఒక సరుకుకి అనేక సరుకులతో విలువ సంబంధాలుండడం కనపడుతుంది. అదే సమయంలో, ఆ ఇతర సరుకులకు వాటిలో వాటికి కూడా సంబంధాలువున్న విషయం కనపడదు — అని చూశాం. ఆ విషయం, జనరల్ రూపంలో ఎలా వుంటుందో చూద్దాం.

**విస్తృత విలువ రూపంలో:**

| | | |
|---|---|---|
| 20 మీ. బట్ట | = | 1 కోటు |
| | = | 2 గ్రా. బంగారం |
| రెలెటివ్ స్థానం | | ఈక్వివలెంట్ స్థానం |

దీన్నే బొమ్మగా ఇలా చూశాం :

బట్ట ——→——→—— కోటు
విలువ సంబంధం

బట్ట ——→——→—— బంగారం
విలువ సంబంధం

ఇందులో, బట్టకీ కోటుకీ సంబంధం కనపడుతోంది. బట్టకీ, బంగారానికీ కూడా సంబంధం కనపడుతోంది. కానీ, కోటుకీ బంగారానికీ సంబంధం కనపడడంలేదు.

దాన్నే 'జనరల్ విలువ రూపం'గా మారిస్తే:

ఇప్పుడు, విలువ సంబంధాల్ని బట్ట వేపునించి గాక, దాని ఈక్వివలెంట్ల వేపునించీ చూడాలి. అన్ని సరుకుల్నీ 'రెలెటివ్ స్థానం'లో వుంచి, బట్టని 'ఈక్వివలెంట్ స్థానం'లో వుంచాలి.


1 కోటు = 20 మీ. బట్ట
2 గ్రా. బంగారం = 20 మీ. బట్ట

దీన్ని బొమ్మగా చూస్తే:

కోటు ——→——→—— బట్ట

బంగారం ——→——→—— బట్ట

అన్ని సరుకులకూ బట్టే ఈక్వివలెంట్‌గా వుంది. కాబట్టి, ఈ వేరు వేరు సంబంధాలు బట్ట దగ్గిర కలుస్తాయి — ఇలా :




ఇక్కడ, కోటుకీ, బట్టకీ సంబంధం తెలుస్తోంది.
బంగారానికీ, బట్టకీ సంబంధం తెలుస్తోంది.

అంతే కాదు, ఇక్కడ, కోటుకీ బంగారానికీ కూడా

సంబంధం వున్నట్టు తెలుస్తోంది. ఎలాగంటే : ఆ 2 సరుకులూ ఒకే ఈక్వివ లెంటుతో మారుతున్నాయి. ఆ ఈక్వివలెంటు ద్వారానే వాటికి సంబంధం సాధ్యమవుతుంది.


'విస్తృత విలువ రూపం'లో, కోటుకీ బంగారానికీ సంబంధం కనపడదు. అది, ఇక్కడ కనపడుతుంది.

కోటుకీ బంగారానికీ మారక – సంబంధం, ( అంటే, కోటు బంగారంతోగానీ, బంగారం కోటుతోగానీ మారడం ), జనరల్ ఈక్వివలెంటు ద్వారానే జరుగుతుంది.


ఇప్పుడు, కోటు, బంగారంతో మారాలనుకుందాం. కోటు మనిషి మొదట కోటుని ఇచ్చి జనరల్ ఈక్వివ లెంటుగా వున్న బట్టని తీసుకుంటాడు. తర్వాత ఆ బట్టని ఇచ్చి బంగారం తీసుకుంటాడు. ఇలా జరిగితే కోటు బంగారంతో మారినట్టు అర్థం.

బంగారం, కోటుతో మారాలన్నా ఇదే పద్ధతి. బంగారం మనిషి, తన సరుకుని మొదట జనరల్ ఈక్వివలెంటుతో మార్చుకొని, తర్వాత దాన్ని ఇచ్చి కోటుని తీసుకుంటాడు. ఇలా జరిగితే, బంగారం కోటుతో మారినట్టు అర్థం.

కోటు, బంగారంతో మారే మార్గం ఇదీ :




బంగారం, కోటుతో మారే మార్గం ఇది :




ఈ 2 బొమ్మల్లోనూ — (1) కోటుకీ, బట్టకీ (2) బంగారానికీ, బట్టకీ — సంబంధాలు కనపడుతూనే, (3) కోటుకీ, బంగారానికీ కూడా సంబంధం కనపడుతుంది.

విస్తృత దశలో అయితే, 3 వ సంబంధం కనపడదు.

**3)** 3 సరుకుల ఉదాహరణనిగాక, ఇంకా ఎక్కువ సరుకుల ఉదాహరణని చూస్తే, విస్తృత విలువ రూపానికీ, జనరల్ విలువ రూపానికీ తేడా ఇంకా స్పష్టంగా తెలుస్తుంది.

**విస్తృత విలువ రూపం :**

ఇక్కడ, ఒక సరుకు వేపు నించి దాని ఈక్వివలెంటు వేపు చూస్తాం.

| | | |
|---|---|---|
| 20 మీ. బట్ట | = | 1 కోటు |
| | = | 8 చె. జతలు |
| | = | 10 కలాలు |
| | = | 2 గ్రా. బంగారం |
| | = | 25 కి. ధాన్యం |
| రెలెటివ్ స్థానం | | ఈక్వివలెంట్ స్థానం |

దీన్ని బొమ్మగా చూస్తే :

బట్ట ———→——— కోటు

బట్ట ———→——— చెప్పులు

బట్ట ———→——— కలాలు

బట్ట ———→——— బంగారం

బట్ట ———→——— ధాన్యం

రెలెటివ్ స్థానం ఈక్వివలెంట్ స్థానం

ఒకే సరుకు వేపు నించి ( బట్ట వేపు నించి ) దాని ఈక్వివలెంట్ల వేపు చూస్తున్నాం. దాని సంబంధాలన్నీ విడి విడిగా కనపడుతున్నాయి.


బట్ట ఎదట, 5 ఈక్వివలెంట్లు వున్నాయి. ఈ బొమ్మ వల్ల — బట్టకీ, దాని ఈక్వివలెంట్లకీ సంబంధాలు వున్నట్టు తెలుస్తోంది. అయితే, ఆ ఈక్వివలెంట్లలో, ఒక దానితో ఇంకో దానికి కూడా సంబంధాలు వున్నట్టు తెలుస్తోందా? — కోటు, చెప్పులతో మారుతుందా? చెప్పులు, కలాలతో మారతాయా? బంగారం కోటుతో మారు తుందా? — ఈ సంబంధాలు కనపడడం లేదు.

ఆ అన్ని సరుకుల వేపు నించి, బట్ట వేపు చూస్తే, అన్ని సంబంధాలూ బట్ట దగ్గిర కలుస్తున్నాయని తెలుస్తుంది. అంటే, అన్ని సరుకులకూ ఒకే ఈక్వివలెంటు వుందని తెలుస్తుంది. దాని ద్వారా అన్నిటి మధ్యా సంబంధాలు తెలుస్తాయి.

## జనరల్ విలువ రూపం :

| | | |
|---|---|---|
| 1 కోటు | = | 20 మీ. బట్ట |
| 8 చె. జతలు | = | 20 మీ. బట్ట |
| 10 కలాలు | = | 20 మీ. బట్ట |
| 2 గ్రా. బంగారం | = | 20 మీ. బట్ట |
| 25 కి. ధాన్యం | = | 20 మీ. బట్ట |

దీన్ని బొమ్మగా చూస్తే:




ఇక్కడ, అన్ని సరుకులకూ — ఒకే ఈక్వివలెంటు. అందుకే అది — జనరల్ ఈక్వివలెంటు. దాని ద్వారా అన్ని సరుకులూ ఒక దానితో ఒకటి మారగలవు. ఈ ఉదాహరణలో, ఏ సరుకు నించి ఏ సరుకు దగ్గిరికైనా వెళ్ళవచ్చు. అంటే, ఏ సరుకుని ఇచ్చి ఏ సరుకునైనా తీసుకోవచ్చు. అయితే, ఆ పని జనరల్ ఈక్వివలెంట్ ద్వారానే జరగాలి. కోటుని మొదట బట్టతో మార్చి, తరవాత బట్టని కలాలతో మార్చవచ్చు. లేదా, ఆ బట్టతో చెప్పులదగ్గిరికి వెళ్ళవచ్చు. లేదా, బంగారం దగ్గిరికి వెళ్ళవచ్చు. ఇంకే సరుకు దగ్గిరికైనా వెళ్ళవచ్చు. బంగారం నించి బయల్దేరిన సంబంధం చెప్పుల దగ్గిరికి పోవచ్చు. ఇంకెక్కడికైనా పోవచ్చు. సరుకుల ప్రపంచంలో వున్న ఏ సరుకుకి ఏ సరుకుతోనైనా సంబంధం ఏర్పడుతుంది — జనరల్ ఈక్వివలెంట్ ద్వారా.

ఇప్పుడు ఏ సరుకునైనా, 'నీ విలువ రూపం ఏమిటీ' అని అడిగితే, ఆ సరుకు — "నా విలువ రూపం అనేది నాకు ప్రత్యేకంగాలేదు. సరుకు లన్నింటికీ ఏదైతే విలువ రూపమో నాకు కూడా అదే విలువ రూపం" అంటుంది.

ఒకే దేశస్తులైన వాళ్ళలో ఒక్కొక్కరినీ, "నీ దేశం ఏది? నీ దేశం ఏది?" అని విడి విడిగా అడిగితే, ప్రతి వ్యక్తీ ఒకే జవాబు చెపుతారు — "నా కోసం విడిగా ఒక దేశం లేదు. మనందరిదీ ఏ దేశమో అదే నా దేశం" అని చెపుతాడు. అలా అనడం వల్ల ఆ వ్యక్తికి, మిగిలిన వ్యక్తులతో దేశీయమైన సంబంధం వుందనే సంగతి స్పష్టమవుతుంది.

అలాగే, ఒక సరుకు — " నా విలువ రూపం విడిగా లేదు. సరుకులన్నిటికీ ఏది విలువ రూపమో నాకూ అదే" అన్నదంటే, సరుకులన్నిటి మధ్యా 'విలువ సంబంధం' వుందనే సంగతి స్పష్టమవుతుంది.

'సరుకులన్నీ సమానం' అంటే, వాటిని వుత్పత్తిచేసే శ్రమలన్నీ సమానం — అని అర్థం. కానీ, శ్రమలన్నీ ఒకే రకం కాదు. వేరు వేరు రకాలు. 'వేరు వేరు శ్రమలన్నీ సమానం' అంటే, ఏ విషయంలో సమానం? — 'శ్రమగా వుండడం' అనే విషయంలో. 'నేత' అయినా శ్రమే. 'కుట్టు' అయినా శ్రమే. 'రాత' అయినా శ్రమే. ఏ పేరుగల శ్రమ అయినా శ్రమే. ఆ రకంగా, శ్రమలన్నీ సమానం.

ఏ శ్రమ అయినా ఒక 'ఉపయోగపు విలువ'ని ఇస్తుంది. అంటే, ఉపయోగపు విలువని ఇవ్వడం' అనే కోణంలో చూస్తే, శ్రమలన్నీ సమానమే.

ఏ శ్రమ అయినా 'విలువ'గా అవుతుంది. అంటే, 'విలువగా అవడం' అనే కోణంలో చూస్తే, ఆ రకంగా కూడా శ్రమలన్నీ సమానమే.

అయితే, 'శ్రమలన్నీ సమానం' అనే విషయం, ఉపయోగపు విలువ కోణం ద్వారా గాక, 'విలువ' కోణం ద్వారానే కనపడుతుందని ఇంతకుముందు కూడా ఒక చోట చూశాం.

'శ్రమలన్నీ సమానం' అనే సంగతి ఎప్పుడు స్పష్టంగా కనపడుతుందంటే — 'ఒక శ్రమ, ఇతర శ్రమలతో సమానం' అన్నప్పుడు కాదు. 'ఒక శ్రమ' వేపు నించి చూసినప్పుడు కాదు. 'అన్ని శ్రమలూ, ఒక శ్రమతో సమానం' అన్నప్పుడే. అన్ని శ్రమల వేపు నించీ, ఒక శ్రమ వేపు చూసినప్పుడే.

'జనరల్ ఈక్వివలెంటు' ఏర్పడడం వల్ల, సరుకులన్నిటి మధ్యా మారక సంబంధాలు ఏర్పడి (అంటే, విలువ సంబంధాలు ఏర్పడి) సరుకుల సమానత్వమూ, దాని వల్ల శ్రమల సమానత్వమూ స్పష్టం అవుతాయి.

జనరల్ ఈక్వివలెంటు ఏర్పడకుండా సరుకులన్నీ బార్టరు పద్ధతిలో దేనికది విడి విడి సంబంధాలతో మారకాలు జరిపే పరిస్థితిలో, సరుకుల సమానత్వం రుజువు కాదు కాబట్టి, శ్రమల సమానత్వం కూడా రుజువు కాదు.

'జనరల్ ఈక్వివలెంట్' ఏర్పడిన తర్వాత శ్రమల సమానత్వం రుజువవుతుంది' అన్నప్పుడు, జనరల్ ఈక్వివలెంట్ ఏర్పడిన వెంటనే ఆ పని జరుగుతుందని అర్థం కాదు. అసలు 'శ్రమ' అనే అంశం, మనుషులకు అర్థం కావడానికి జనరల్ ఈక్వివలెంట్ ఏర్పడిన తర్వాత కూడా అనేక వందల, వేల సంవత్సరాలు పట్టింది. 'శ్రమ' అనే అంశం మనుషుల గ్రహింపుకి అందాలన్నా, 'శ్రమల సమానత్వం' అనే అంశం బోధ పడాలన్నా, సమాజంలో

ఉత్పత్తి అయ్యే రక రకాల ఉత్పత్తుల్లో అత్యధిక భాగం ఉత్పత్తులు 'సరుకులు'గా మారి, అవి మొదట జనరల్ ఈక్వివలెంట్‌తో మారకానికి వచ్చే పరిస్థితులు కూడా ఏర్పడాలి. ఇదంతా జరిగితే గానీ 'శ్రమ'నీ, 'శ్రమల సమానత్వాన్నీ' గ్రహించడం సాధ్యం కాదు. ఇదంతా ఇంకా ఎంతో దీర్ఘకాలం తర్వాత జరిగే విషయం. ప్రస్తుతం ఇక్కడ, మారకాలు, బార్టరు పద్ధతి నించి అభివృద్ధిచెంది జనరల్ ఈక్వివలెంటు ఏర్పడడం గురించే చూస్తున్నాము.

**ఇప్పటి వరకూ చూసిన విషయాల సారాంశం ఏమిటంటే**: ఒకప్పుడు అసలు మారకాలే లేని సమాజంలో మొదట రెండేసి సరుకుల మారకాలు ప్రారంభమయ్యాయి. క్రమంగా సరుకుల రకాలు పెరుగుతోన్నకొద్దీ ఒక సరుకు, ఏ సరుకుతోనైనా మారే పద్ధతి ఏర్పడింది. ఇంకా తర్వాత కాలంలో, అన్ని సరుకులూ ఒకే సరుకుతో మారే పద్ధతి ఏర్పడింది. ఆ రకంగా, **జనరల్ ఈక్వివలెంటు** ఏర్పడింది. ఈ విషయాలనే —ప్రాథమిక, విస్తృత, జనరల్ విలువ రూపాల ద్వారా చూశాం.

'జనరల్ విలువ రూపం' అనేది, లోపాలు లేని విధంగా, సంపూర్ణంగా అభివృద్ధిచెందిన విలువ రూపం. ఇక్కడ, 'అభివృద్ధి' అంటే, మారకాలు సౌకర్యంగా జరగడానికి అవసరమైన అభివృద్ధి — అని అర్థం.

# ప్రశ్నలూ – జవాబులూ

**1. ' జనరల్ విలువ రూపం' అంటే ఏమిటి?**

జ: సరుకుల ప్రపంచంలో వున్న అన్ని సరుకులూ, ఏ ఒక్క సరుకుతో మాత్రమే మారతాయో ఆ సరుకు రూపమే 'జనరల్ విలువ రూపం.'

**2. 10 లీ. పాలు = 2 కి. నెయ్యి. దీని వ్యతిరేక సూత్రం ఏమిటి?**

జ: 2 కి. నెయ్యి = 10 లీ. పాలు.

**3. 3 గ్రా. వెండికి — 11 కి. ధాన్యం, 1 దుప్పటి, 1 బీరువా కూడా ఈక్వివలెంట్లే. దీన్ని సూత్రంగా రాయండి.**

జ: 3 గ్రా. వెండి = 11 కి. ధాన్యం.
= 1 దుప్పటి
= 1 బీరువా

**4. మొత్తం 10 సరుకుల్ని తీసుకుని, జనరల్ విలువ రూపాన్ని తెలిపేవిధంగా వాటిని రాయండి.**

జ:

| | | |
|---|---|---|
| 2 కి. ధాన్యం | = | |
| 1 కి. పంచదార | = | |
| 12 నారింజలు | = | |
| 2 కలాలు | = | |
| 3 లీ. పాలు | = | 1 మీటరు బట్ట |
| .................. | = | |
| .................. | = | |
| .................. | = | |

**5. 'సమిష్టి చర్య' అంటే ఏమిటి? సరుకులు చేసే సమిష్టి చర్య ఏమిటి?**

జ: అందరూ కలిసి ఒకే పనిని చేస్తే, అది సమిష్టి చర్య. సరుకులు చేసే సమిష్టి చర్య— అవి అన్నీ ఒకే సరుకుతో మారడం. ఒకే సరుకుని తమ ఈక్వివలెంటుగా అంగీకరించడం.

**6. జనరల్ ఈక్వివలెంటు, ఏ లక్షణం ద్వారా సరుకుల మధ్య, 'మధ్యవర్తిత్వం' చేస్తుంది?**

జ: తనలో వున్న 'విలువ' అనే లక్షణం ద్వారా. ఇతర అన్ని సరుకుల లాగే, జనరల్ ఈక్వివలెంటుగా వుండే సరుకు కూడా శ్రమతో తయారైనదే. అందుకే, అది ఆ లక్షణంతో మధ్యవర్తిత్వం చెయ్యగలుగుతుంది.

**7. జనరల్ విలువ రూపంలో అందరూ తమ సరుకుల్ని ఒకే సరుకుతో మార్చుకోవాలి కదా? అందరికీ ఒకే సరుకుతో అవసరం వుంటుందా?**

జ: ఆ సరుకు మామూలు సరుకు కాదు. అది జనరల్ ఈక్వివలెంటుగా వున్న సరుకు. ఒక మనిషి, తన సరుకుని ఇచ్చి, మొదట ఆ సరుకుని తీసుకుంటే, దానితో తర్వాత తనకు కావలసిన ఏ సరుకుని అయినా తీసుకో వచ్చు. కాబట్టి, మొదట జనరల్ ఈక్వివలెంటుగా వున్న సరుకుని తీసుకోవడానికి ఎవరికీ అభ్యంతరం వుండదు.

**8. 'జనరల్ విలువ రూపం'లో, ఒక సరుకు విలువ రూపం ఏమిటి?**

జ: 'ఒక సరుకు'కి కాదు, అన్ని సరుకులకూ ఒకటే విలువ

రూపం. అదే జనరల్ విలువ రూపం.

**9. సరుకులన్నీ ఒకే సరుకుతో మారే పద్ధతి ఏర్పడడం వల్ల ఫలితం ఏమిటి?**

జ : ఈ పద్ధతి వల్ల, ఏ సరుకు మనిషికి అయినా రెండే రెండు మారకాలతో, కావలసిన సరుకు దొరికి తీరుతుంది. సరుకులన్నీ ఒకే సరుకుతో మారే పద్ధతి వల్లనే ఇది సాధ్యమవుతుంది.

**10. ఎక్కువ మందికి కావలసిన సరుకుకి ఎక్కువ ఈక్వివలెంట్లు ఏర్పడతాయి — దీన్ని వివరించండి.**

జ: ఎక్కువ మందికి కావలసిన సరుకు 'ధాన్యం' అనుకుందాం. జనం, తాము తయారుచేసిన వేరు వేరు రకాల సరుకులు ఇచ్చి, అందరూ ధాన్యాన్నే తీసుకుంటారు. ఆ రకంగా ధాన్యానికి, అనేక రకాల సరుకులు ఈక్వివలెంట్లుగా అవుతాయి.

**11. ఒక సరుకు, తన విలువ రూపంగా జనరల్ ఈక్వివలెంట్‌ని ఎప్పుడు అంగీకరిస్తుంది?**

జ: మిగిలిన సరుకులన్నీ కూడా అలాగే చేసినప్పుడు!

అంటే, జనరల్ ఈక్వివలెంటు అనేది ఏర్పడిపోయినప్పుడు, ఏ సరుకు అయినా, దానినే అంగీకరించి, మొదట దానితోనే మారవలసి వుంటుంది.

**12. ఒక సరుకుకి - ప్రాథమిక దశలోనూ ఒకటే ఈక్వివలెంటు, జనరల్ దశలోనూ ఒకటే ఈక్వివలెంటు. మరి, ప్రాథమిక విలువ రూపానికీ, జనరల్ విలువ రూపానికీ, తేడా ఏమిటి?**

జ: ప్రాథమిక దశలోనూ, జనరల్ దశలోనూ కూడా ఒక సరుకుకి ఒక్క ఈక్వివలెంటే వుంటుంది. కానీ, ప్రాథమిక దశలో, ఏ సరుకు ఈక్వివలెంటు ఆ సరుకుకి వేరు వేరుగా వుంటే, జనరల్ దశలో అన్ని సరుకులకూ కలిసి ఒకే సమిష్టి ఈక్వివలెంటు వుంటుంది. ఇదే ఆ దశల మధ్య తేడా.

**13. ప్రాథమిక విలువ రూపానికి వ్యతిరేక సూత్రం, విస్తృత విలువ రూపమా, జనరల్ విలువ రూపమా, రెండూ కాదా?**

జ: రెండూ కాదు. ప్రాథమిక విలువ రూపానికి వ్యతిరేక సూత్రం కూడా ప్రాథమిక విలువ రూపమే.

**14. జనరల్ విలువ రూపంలో ఒక సరుకు విలువ వ్యక్తీకరణ సంపూర్ణం-- అని ఎలా చెప్పగలం?**

జ: ఎలా చెప్పగలమంటే, ఒక సరుకు విలువ, జనరల్ విలువ రూపంతో తప్ప, ఇంకే రూపంతోనూ కనపడదు. కాబట్టి, జనరల్ రూపాన్ని, 'విలువని సంపూర్ణంగా చూపించే రూపం' అని చెప్పవచ్చు.

**15. జనరల్ ఈక్వివలెంటుగా వున్న బట్ట శ్రమ కాలం ఒక గజానికి 5 ని. అనుకోండి. ఈ కింద వున్న సరుకులకు బదులుగా ఎంతెంత జనరల్ ఈక్వివలెంటు వస్తుంది?**

జవాబులు :

| | |
|---|---|
| డజను బత్తాయిలు (20 ని॥) = ? | 4 గ. బట్ట |
| 1 బస్తా ధాన్యం (30 ని॥) = ? | 6 గ. బట్ట |
| 2 బస్తాల సిమ్మెంటు (10 ని॥) = ? | 2 గ. బట్ట |
| 1 పుస్తకం (15 ని॥) = ? | 3 గ. బట్ట |

**16. బట్ట మనిషికి కుండ కావాలి. కుండ మనిషికి చెప్పులూ, చెప్పుల మనిషికి జొన్నలూ, జొన్నల మనిషికి బట్టా కావాలి. ఈ సరుకులన్నీ వున్న సమాజంలో, బంగారం, జనరల్ ఈక్వివలెంటుగా ఏర్పడిపోయి వుందనుకుందాం. ఇప్పుడు బట్ట మనిషికి కుండ ఎలా దొరుకుతుంది?**

జ: బట్ట మనిషికి కుండ కావాలి కదా? అతను, తన సరుకుని తీసుకుని మొదటే కుండల దగ్గిరికి వెళ్ళడు. మొదట జనరల్ ఈక్వివలెంటు వున్న మనిషి దగ్గిరికి వెళ్తాడు. తన బట్టని ఇచ్చి, దాని విలువకు తగ్గ జనరల్ ఈక్వివలెంటుని, అంటే కొంత బంగారాన్ని, తీసుకుంటాడు. ఇది మొదటి మారకం. ఆ జనరల్ ఈక్వివలెంటుతో, తనకు కావలసిన కుండల దగ్గిరికి వెళ్ళి దాన్ని తీసుకుంటాడు. ఇది రెండో మారకం. అతని చేతిలో, కొంత జనరల్ ఈక్వివలెంటు మిగిలితే మిగలవచ్చు — ఈ రకంగా, బట్ట మనిషికి, కుండ దొరుకుతుంది.

**17. ఇది ఏ విలువ రూపం?**

| | | |
|---|---|---|
| **1 కోటు** | = | **2 గ్రా. బంగారం.** |
| **2. మీ. బట్ట** | = | **1 గ్రా. బంగారం.** |
| **బస్తా ధాన్యం** | = | **3 గ్రా. బంగారం.** |

జ: అన్ని సరుకులూ, బంగారంతోనే మారుతున్నాయి. బంగారం జనరల్ ఈక్వివలెంటుగా వుంది. కాబట్టి, ఇది జనరల్ విలువ రూపం.

| **18. ఖాళీలు పూరించండి** | **జవాబులు :** |
|---|---|
| (1) 'మారకం' అంటే, ........ సంబంధం. | 2 సరుకుల |
| (2) 'జనరల్ ఈక్వివలెంటు'ని .............. 'ఈక్వివలెంటు' అని కూడా అంటాము. | యూనివర్సల్ |
| (3) 'డబ్బు' అనేది ఏమిటి? ................ కి వున్న పేరు. | జనరల్ ఈక్వివలెంటు |

★

# 7. 'విలువ రూపం అభివృద్ధి'లో- రెలెటివ్ కోణం అభివృద్ధీ, ఈక్వివలెంట్ కోణం అభివృద్ధీ

ఒకనాడు వస్తువులకు 'విలువ' అనేదే లేని సమాజంలో విలువ ప్రారంభమై 'విలువ రూపం' క్రమంగా అభివృద్ధి చెందింది. విలువ రూపం అనేది ఒక్కసారే హఠాత్తుగా సమగ్ర రూపంతో పుట్టుకు రాలేదనీ; అది అతి చిన్న ప్రాధమిక రూపంతో ప్రారంభమై, కొన్ని దశల మీదుగా అభివృద్ధి చెందుతూ సమగ్రమైన జనరల్ రూపానికి చేరిందనీ — చూశాం.

'మారకం' అనేది ఎప్పుడూ 2 సరుకుల మధ్య సంబంధమే. ఆ 2 సరుకులూ 2 రకాల స్థానాలలో వుంటూ 2 రకాల పాత్రల్ని నిర్వహిస్తాయి. కాబట్టి, విలువ రూపం అభివృద్ధి చెందుతోందంటే దానిలోవున్న రెలెటివ్ కోణమూ, ఈక్వివలెంట్ కోణమూ అభివృద్ధి చెందు తున్నాయని అర్థం.

ఇప్పుడు రెలెటివ్, ఈక్వివలెంట్ కోణాల అభివృద్ధి క్రమాన్ని వరసగా చూస్తాము.

## 1) ప్రాధమిక విలువ రూపం లో :

| | | |
|---|---|---|
| 20 మీ. బట్ట | = | 1 కోటు |
| ↑ | | ↑ |
| రెలెటివ్ కోణం | | ఈక్వివలెంట్ కోణం |

ఇక్కడ ఒక సరుకు, ఒక సరుకుతోనే మారుతుంది.

'రెలెటివ్ స్థానం'లో వున్న సరుక్కి ఒక్క ఈక్వివలెంటే వుంటుంది. అంటే రెలెటివ్ స్థానంలోవున్న సరుకు, తన విలువని, ఒక్క రూపంతో మాత్రమే చూపిస్తుంది. ఆ విలువకి రెండో రూపం వుండదు.

'ఈక్వివలెంట్ స్థానం'లోవున్న సరుకు, తన రూపాన్ని, ఒక్క సరుకు విలువకే ఇస్తుంది. ఒక్క సరుకుకే తను ఈక్వివలెంట్‌గా వుంటుంది.

## 2) విస్తృత విలువ రూపం లో :

| | | |
|---|---|---|
| 20 మీ. బట్ట | = | 1 కోటు |
| | = | 8 చె. జతలు |
| | = | 2 గ్రా. బంగారం |
| | = | 25 కి. ధాన్యం |
| | = | 10 కలాలు |
| ↑ | | ↑ |
| రెలెటివ్ కోణం | | ఈక్వివలెంటు కోణం |

ఇక్కడ, ఒక సరుకు, అనేక సరుకులతో మారుతుంది.

రెలెటివ్ స్థానంలో వున్న సరుక్కి, ఎక్కువ ఈక్వివలెంట్లు వుంటాయి. అది తన విలువని ఎక్కువ రూపాలతో చూపించగలుగుతుంది. —ఇది రెలెటివ్ కోణంలో అభివృద్ధి.

ఈక్వివలెంట్ స్థానంలో వుండే సరుకు— ఒకే ఒక్క సరుకు కోసం మాత్రమే తను ఈక్వివలెంటుగా వుండడంగాక, ఏ సరుకుకైనా తను ఈక్వివలెంటుగా వుండగలుగుతుంది. ఇది, ఈక్వివలెంట్ కోణంలో అభివృద్ధి.

## 3) జనరల్ విలువ రూపం లో :

| | | |
|---|---|---|
| 1 కోటు | = | |
| 8 చె. జతలు | = | |
| 2 గ్రా. బంగారం | = | 20 మీ. బట్ట |
| 25 కి. ధాన్యం | = | |
| 10 కలాలు | = | |
| ↑ | | ↑ |
| రెలెటివ్ కోణం | | ఈక్వివలెంట్ కోణం |

ఇక్కడ అన్ని సరుకులూ ఒకే సరుకుతో మారతాయి.

ఇప్పుడు, రెలెటివ్ స్థానంలో వుండే సరుకుల్లో ఒక్కో సరుకుకి ఒక్కో విలువ రూపం వుండదు. అన్ని సరుకులూ 'సమిష్టిగా' ఒకే విలువ రూపం ద్వారా తమ విలువల్ని వ్యక్తం చేస్తాయి. రెలెటివ్ స్థానంలో వున్న సరుకులన్నీ ఒక

సమిష్టితనంతో ప్రవర్తించడమే ఈ కోణంలో జరిగిన అభివృద్ధి.

ఈక్వివలెంట్ స్థానంలో వున్న సరుకు, సమస్తమైన సరుకులకూ తను ఒక్కటే ఈక్వివలెంట్‌గా వుంటుంది. ప్రాథమిక దశలో వున్న లోపాన్నీ, విస్తృత దశలో వున్న లోపాన్నీ కూడా, జనరల్ ఈక్వివలెంటు అధిగమిస్తుంది. ప్రాథమిక దశలో లాగ, ఇది, ఒకే సరుకు కోసం వుండే ఈక్వివలెంటు కాదు. విస్తృత దశలో లాగ, ఇది, ఒక సరుకుకోసం వుండే అనేక ఈక్వివలెంట్లలో ఒక ఈక్వివలెంటు కాదు. ఇది, అనేక సరుకుల కోసం వుండే ఏకైక ఈక్వివలెంటు. సమస్తమైన సరుకులకూ తను ఒక్కటే ఈక్వివలెంట్‌గా నిలిచే హక్కుతో ఇది వుంటుంది. — ఇది ఈక్వివలెంట్ కోణంలో జరిగిన అభివృద్ధి. ఈ రకంగా, ప్రాథమిక దశకు సంబంధించిన రెలెటివ్, ఈక్వివలెంట్ కోణాలలో జరిగిన అభివృద్ధే, (విరుద్ధ కోణాలలో జరిగిన అభివృద్ధే) విస్తృత దశకు దారి తీసింది. మళ్ళీ విస్తృత దశకు సంబంధించిన విరుద్ధ కోణాలలో జరిగిన అభివృద్ధే జనరల్ దశకు దారితీసింది.

## రెలెటివ్, ఈక్వివలెంట్ కోణాల మధ్య 'తేడా' లో అభివృద్ధి :

ఒక విలువ సూత్రంలో వున్న రెండు కోణాలు (రెలెటివ్, ఈక్వివలెంట్ కోణాలు) ఎప్పుడూ ఒక దాని కొకటి విరుద్ధ మైనవే. ఆ కోణాలు రెండూ ఒకే రకమైనవి కావనే విషయం (వాటి మధ్య తేడా వుందనే విషయం) విలువ రూపం అభివృద్ధి చెందుతోన్నకొద్దీ స్పష్టంగా కనపడుతుంది. విలువ రూపం ఒక దశ నించి ఇంకో దశకు అభివృద్ధి చెందుతోన్న కొద్దీ, రెలెటివ్, ఈక్వివలెంట్ కోణాల మధ్యవున్న తేడా ఎక్కువవుతూ వుంటుంది.

ప్రాథమిక విలువ రూపంలో:

రెలెటివ్ స్థానంలో సరుకునీ, ఈక్వివలెంట్ స్థానంలో సరుకునీ, వాటి వాటి స్థానాల్లోంచి మార్చి చూడండి!

20 మీ. బట్ట = 1 కోటు

ఇది ప్రాథమిక విలువ రూపం.

దీన్ని తారుమారు చేసి, దీని వ్యతిరేక సూత్రాన్ని చూస్తే?

1 కోటు = 20 మీ. బట్ట

ఇది కూడా ప్రాథమిక విలువ రూపమే.

సరుకుల్ని ఒక స్థానం లోంచి ఇంకో స్థానం లోకి మార్చడం వల్ల ఏ స్థానం స్వభావం ఏమిటో, రెండు స్థానాల మధ్య వున్న 'తేడా' ఏమిటో, కనపడుతుంది. అయినా ప్రాథమిక విలువ సూత్రంలో వున్న వ్యతిరేక సూత్రం కూడా ప్రాథమిక విలువ సూత్రంగానే వుంది. ఈ సూత్రంలో విరుద్ధ కోణాల మధ్య వున్న తేడా, ఆ సూత్రాన్నే మార్చివేసేదిగా లేదు. అంటే ప్రాథమిక దశలో రెలెటివ్ ఈక్వివలెంట్ కోణాల మధ్య తేడా, తగినంత స్పష్టంగా కనపడదు.

కానీ విలువ రూపం — ప్రాథమిక దశ నించి విస్తృత దశకు పెరిగినప్పుడు, దాని రెలెటివ్, ఈక్వివలెంట్ కోణాల మధ్య తేడా ఎలా ఎక్కువైందో చూడండి!

విస్తృత విలువ రూపంలో :

| | |
|---|---|
| 20 మీ. బట్ట = | 1 కోటు |
| = | 8 చె. జతలు |
| = | 2 గ్రా. బంగారం |
| ↑ | ↑ |
| రెలెటివ్ కోణం | ఈక్వివలెంట్ కోణం |

ఈ సూత్రాన్ని తారుమారుచేసి, దీని వ్యతిరేక సూత్రాన్ని చూస్తే?

| | |
|---|---|
| 1 కోటు = | |
| 8 చె. జతలు = | 20 మీ. బట్ట |
| 2 గ్రా. బంగారం = | |

ఇది 'జనరల్ రూపం'.

'విస్తృత రూపాన్ని' తారుమారు చేస్తే, 'జనరల్ రూపం' అయింది. అంటే విస్తృత రూపంలో —రెలెటివ్, ఈక్వివలెంట్ కోణాల మధ్య ఎంత పెద్ద తేడా ఏర్పడిందంటే, ఆ రెండు కోణాలనూ ఒకదాని కొకటి పూర్తి విరుద్ధంగా చెయ్యగలిగే టంత పెద్ద తేడా ఏర్పడింది. ఆ కోణాల్ని తారుమారు చేసినప్పుడు (సరుకుల స్థానాల్ని మార్చినప్పుడు) విలువ రూపాన్నే మార్చేసేటంత ఎక్కువ తేడా ఏర్పడింది.

'విస్తృత రూపాని'కి వ్యతిరేక రూపమే 'జనరల్ రూపం'. ఈ రకంగా, 'ప్రాథమిక' విలువ రూపం. క్రమంగా 'జనరల్ విలువ రూపంగా మారేటప్పటికి, 'విలువరూపం'లో వుండే లోపాలు పోయి, విలువ రూపం 'కంప్లీటు' అయింది.

మారకాలు అనేవి, ప్రాథమిక దశలో కొంత కాలం జరిగిన తర్వాతే, విస్తృత దశలోకి వెళ్ళాయి. మారకం కావలసిన సరుకులు చాలా తక్కువ రకాలే వున్నప్పుడు, 'ఒక రకం సరుకు ఇంకొక్క రకం సరుకుతోటే మారే విధానం' సరిపోయింది. రాను రాను ఎక్కువ రకాల వస్తువులు (ఎక్కువ ఉపయోగపు విలువలు) ఉత్పత్తి అవుతూ, పూర్వం కన్నా ఎక్కువ రకం మారకాలు అవసరమవుతూ వున్నప్పుడు, ఒక సరుకు ద్వారా ఏ రకం సరుకునైనా సంపాదించుకో వలసిన అవసరం కలిగి, విస్తృత రూపం ఏర్పడింది. అయితే దానిలో కూడా లోపాలు వుండడంవల్ల, సరుకుల మారకాలు ఆటంకాలు లేకుండా జరగడం కోసం, 'జనరల్ విలువ రూపం' ఏర్పడింది. విలువ రూపం, జనరల్ దశకు చేరేటప్పటికి లోపాలు లేని రూపంగా అభివృద్ధి చెందింది.

[గమనిక : ఈ చాప్టరు కి ప్రశ్నలు ఇవ్వడం లేదు.]

# 8. 'డబ్బు' రూపం

**సరుకుల** ప్రపంచంలో ఏ సరుకైతే 'జనరల్ ఈక్వివలెంటు' పాత్రని నిర్వహిస్తుందో, ఆ సరుకు — 'డబ్బు సరుకు'. అంటే, ఆ సరుకే 'డబ్బు'! (మనీ కమాడిటీ, లేదా మనీ).

'జనరల్ ఈక్వివలెంటు'గా,

బట్ట వుంటే, బట్టే — డబ్బు.
వెండి వుంటే, వెండే — డబ్బు.
బంగారం వుంటే బంగారమే — డబ్బు.

ఒక వస్తువు, డబ్బుగా వుండడం అనేది, దాని సహజ లక్షణం కాదు. అది, 'సామాజిక' లక్షణం. డబ్బుగా వుండే సరుకు, సమస్తమైన సరుకులతోటీ విలువ సంబంధాలతో వుండే సామాజిక బాధ్యతని నిర్వహిస్తోందని అర్థం.

ఈ నాడు, సరుకుల ప్రపంచంలో, 'జనరల్ ఈక్వివ లెంట్ ' గా వున్న సరుకు — బంగారం!

చాలా సందర్భాల్లో వెండి కూడా.

బంగారం జనరల్ ఈక్వివలెంటుగా వుండడం అనేది, సరుకుల ప్రపంచంలో జనరల్ ఈక్వివలెంటు ఏర్పడిన ప్రారంభ కాలం నించీనే జరగలేదు. బంగారం కన్నా ముందు, అనేక రకాల వస్తువులు జనరల్ ఈక్వివలెంట్ స్థానంలోకి వచ్చి పోయాయి. అయితే, అవి ఆ నాడు చాలా తక్కువ సరుకులకే జనరల్ ఈక్వివలెంట్లుగా పనిచేశాయి. ధాన్యమూ, పశువులూ, ఇత్తడీ, రాగీ, ఇంకా చాలా రకాల వస్తువులు, కొంత కొంత కాలం పాటు జనరల్ ఈక్వివ లెంట్లుగా పనిచేశాయి. బానిసలు కూడా కొన్ని సందర్భాల్లో డబ్బు సరుకుగా వున్నారు.

కొన్ని సరుకులు తాత్కాలికంగా చేసే 'సమిష్టి చర్య' ద్వారా ఒక్కోసారి ఒక్కో సరుకు, 'డబ్బు' అవుతూ వుంటుంది. కొంత కాలం తర్వాత అది ఆ స్థానం నించి పోతూ వుంటుంది.

సరుకుల రకాలూ, మారకాలూ పెరుగుతూ వున్న కొద్దీ, డబ్బుగా పనిచేసే వస్తువు కూడా మారుతూ వచ్చింది.

డబ్బు అనేది విలువ తక్కువగల సరుకులతోటీ, విలువ ఎక్కువ గల సరుకులతోటీ కూడా మారాలి కాబట్టి, దానికి ప్రధానంగా కొన్ని లక్షణాలు వుండాలి. (1) డబ్బుగా వుండే సరుకు అవసరమైతే చిన్న చిన్న భాగాలుగా విడిపోయేది గానూ, మళ్ళీ ఆ భాగాల్ని కలిపితే కలిసిపోయేదిగానూ కూడా వుండాలి. (2) ఎక్కువ విలువని, తక్కువ శరీర పరిమాణంలో వ్యక్తపరిచేదిగా వుండాలి. అంటే, ఎక్కువ విలువ వున్నా తక్కువ బరువు గలదిగా వుండాలి. (3) తక్కువ స్థలంలో ఇమిడేదిగా వుండాలి. (4) నిల్వవుంచితే ఎంత కాలమైనా చెడిపోకుండా వుండేదిగా వుండాలి. — ఇలాంటి లక్షణాలన్నీ వుండాలంటే, డబ్బు సరుకుగా పని చెయ్యడానికి, ధాన్యమూ పశువులూ వంటి సరుకుల కన్నా, ఇత్తడీ రాగీ వెండీ బంగారమూ లాంటి లోహాలు ఎక్కువ తగినవిగా వుంటాయి. ఈ లోహాలలో కూడా ఇతర లోహాల కన్నా వెండి బంగారాల్లాంటి లోహాలే ఎక్కువ తగినవిగా వుంటాయి.

ఇత్తడి కన్నా రాగి ఎక్కువ విలువ గల లోహం. (ఒకే బరువుగల ఇత్తడిని తయారుచెయ్యడం కోసం కన్నా రాగి కోసం ఎక్కువ శ్రమ ఖర్చవుతుంది). రాగి కన్నా వెండి ఇంకా ఎక్కువ విలువగల లోహం. వెండి కన్నా బంగారం ఇంకా ఎక్కువ విలువగల లోహం.

ఒక సరుకుని డబ్బుతో మారకం చేసినప్పుడు, ఆ సరుకుకి బదులుగా వచ్చే 'ఇత్తడి – డబ్బు' కన్నా 'రాగి – డబ్బు' అయితే తక్కువ సైజులో వుంటుంది. రాగి డబ్బు కన్నా 'వెండి డబ్బు' అయితే ఇంకా తక్కువ సైజులో వుంటుంది. 'వెండి డబ్బు' కన్నా 'బంగారం డబ్బు' అయితే మరీ తక్కువ సైజులో వుంటుంది.

సమాజంలో ఉత్పత్తి అయ్యే సరుకుల రకాల్నిబట్టీ, వాటి విలువల స్థాయిల్నిబట్టీ, ఏ పరిస్థితుల్లో ఏ లోహం, 'డబ్బు'గా పనిచెయ్యగలుగుతుందో ఆ కాలంలో ఆ లోహమే డబ్బుగా పనిచేసింది. రానురానూ మారకాల సౌకర్యం కోసం, ఎక్కువ విలువగల లోహం, తక్కువ విలువగల లోహాన్ని 'డబ్బు స్థానం' నించి తోసివేస్తూ వచ్చింది.

'డబ్బు – సరుకు' గా పనిచెయ్యడానికి కావలసిన లక్షణాలు ఎక్కువగా వెండి బంగారాలకే వున్నాయి. వాటిలో బంగారానికి మరీ ఎక్కువగా వున్నాయి. అందుకే మారకాల చరిత్రలో అనేక సరుకులు డబ్బు రూపాలెత్తినప్పటికీ, మారకాల అభివృద్ధికి సరిపోయే విధంగా బంగారమే డబ్బు సరుకుగా స్థిరపడింది. బంగారం అనేది కేవలం ఒక సరుకుగా వుంటే, అది డబ్బు కాదు. 'జనరల్ ఈక్వివలెంటు'గా వున్నప్పుడు మాత్రమే అది డబ్బు.

ఆదిలో డబ్బు రూపాన్ని అభివృద్ధి పరిచింది సంచార తెగలవారు. సంచార తెగలంటే, స్థిరమైన నివాస ప్రాంతాలు లేకుండా అనేక ప్రాంతాలకు తిరిగే జీవిత విధానం గల తెగలు. ఆ నాటి తెగలకు వున్న ఉత్పత్తులన్నీ చరాస్థులే (చరాస్థులంటే పశువుల మందల వంటి కదిలే ఉత్పత్తులు). ఈ తెగలకు మారకాలు అవసరమైనప్పుడు, పశువులనో ఇతర ఉత్పత్తులనో డబ్బుగా వాడుకునేవారు. డబ్బు అలా ప్రారంభమై, చివరికి బంగారమే డబ్బుగా స్థిరపడింది.

ఇంతకుముందు వరకూ మనం జనరల్ ఈక్వివలెంటు స్థానంలో బట్టని ఉదాహరణగా పెట్టుకున్నాం. ఇక ఇప్పటి నించి, ఆ స్థానంలో, బట్టని తీసేసి, 'బంగారాన్ని' పెట్టాలి. ( బంగారం అనే వస్తువుని. )

ఇక నించి బంగారమే — జనరల్ ఈక్వివలెంటు.

బంగారమే — డబ్బు. బంగారం తప్ప మిగిలిన సరుకు లన్నీ మామూలు సరుకులు. అంటే, 'డబ్బు కాని' సరుకులు.

జనరల్ ఈక్వివలెంటు స్థానంలోకి ఒక సరుకుకి బదులుగా ఇంకో సరుకు వస్తే, ఆ మార్పువల్ల, జనరల్ ఈక్వివలెంటు స్వభావం ఏమీ మారదు.

జనరల్ ఈక్వివలెంట్‌గా ఏ సరుకు వుంటుందో ఆ సరుకు రూపమే 'జనరల్ విలువ రూపం'. అదే 'డబ్బు రూపం'.

'జనరల్ ఈక్వివలెంటు రూపం' అన్నా, 'జనరల్ విలువ రూపం' అన్నా, 'డబ్బు రూపం' అన్నా— ఈ మూడూ ఒకటే.

'డబ్బు' అన్నప్పుడల్లా, 'జనరల్ ఈక్వివలెంటు'నే గుర్తు చేసుకుంటూ వుండాలి.

# 'డబ్బు'కి సంబంధించిన విషయాలు

**1)** ఇప్పుడు, జనరల్ ఈక్వివలెంటు స్థానంలోకి బంగారం వచ్చింది కాబట్టి ఇప్పటి వరకూ ఆ స్థానంలో వున్న బట్ట రెలెటివ్ స్థానంలోకి వెళ్ళిపోతుంది. అంటే అది అప్పటి నించి మామూలు వస్తువుగానే వుంటుంది. ఇప్పుడు బట్ట కూడా తన విలువని బంగారం ద్వారానే వ్యక్తం చేస్తుంది. ఇప్పుడు బంగారం రెలెటివ్ స్థానంలోగాక ఈక్వివలెంట్ స్థానంలో వుంటుంది. అది సరుకులతో మారేటప్పుడు ఎక్కువ విలువగల సరుకుకి బదులుగా ఎక్కువ ముక్క గానూ, తక్కువ విలువగల సరుకుకి బదులుగా తక్కువ ముక్కగానూ వెళ్తూ వుంటుంది.

**2)** సరుకుల ప్రపంచంలోకి డబ్బు వచ్చేవరకూ జరిగిన మారకాలన్నీ బార్టరు పద్ధతి మారకాలే. జనరల్ ఈక్వివలెంటు స్థిరపడినప్పటి నించి అన్ని సరుకుల విషయంలోనూ బార్టరు పద్ధతి పోయింది. కానీ జనరల్ ఈక్వివలెంట్‌గా వున్న బంగారం విషయంలో మాత్రం బార్టరు పద్ధతే వుండి పోయింది. బంగారానికి విలువ రూపం – విస్తృత విలువ రూపమే కాబట్టి, బంగారం విలువ, బార్టరు పద్ధతి మారకాల ద్వారానే తెలుస్తుంది.

**3)** కుర్చీని ఇచ్చి దుప్పటిని తీసుకుంటే ఆ దుప్పటి, కుర్చీకి విలువ అవుతుందనీ, ఆ దుప్పటి రూపం కుర్చీ విలువకి రూపం అవుతుందనీ, గతంలోనే చూశాం కదా? అయితే, కుర్చీని ఇచ్చి కొంత డబ్బుని (బంగారం ముక్కని) తీసుకుంటే? ఆ డబ్బే, కుర్చీకి విలువ అవుతుంది. ఆ డబ్బు రూపం, కుర్చీ విలువకి రూపం అవుతుంది. అయితే డబ్బు ద్వారా కనపడే విలువకి ఒక ప్రత్యేకమైన పేరు వుంది. ఆ పేరు — **ధర!** ఏదైనా ఒక సరుకు, డబ్బుతో మారినప్పుడు ఆ సరుకుకి బదులుగా ఎంత డబ్బు వస్తుందో, ఆ డబ్బు, ఆ సరుకుకి 'ధర' అవుతుంది. బట్ట, బంగారంతో మారితే, బట్టకి బదులు ఎంత బంగారం వొస్తుందో ఆ బంగారం ముక్కే ఆ బట్టకి — ధర.

20 మీ. బట్టలో 1 గంట శ్రమ వుండి, 2 గ్రాముల బంగారంలో కూడా 1 గంట శ్రమ వుందనుకుందాం. 20 మీ. బట్టని బంగారంతో మార్చుకున్నప్పుడు, బట్టకు బదులుగా 2 గ్రా. బంగారం వస్తుంది. 20 మీ. బట్ట ధర – 2 గ్రా. బంగారం.

**4)** 20 మీ. బట్టని, బంగారంతో మారిస్తే 2 గ్రాముల బంగారం వస్తుందనుకుందాం. ఆ 2 గ్రాముల బంగారాన్ని 2 బిళ్ళలుగా చేసి, 1 బిళ్ళకి, 'రూపాయి' అని పేరు పెట్టాం – అనుకుందాం. 2 బిళ్ళలు – 2 రూ.లు అవుతాయి. ఇప్పుడు బట్ట ధర 2 రూపాయలు (బంగారం రూపాయలు). ఈ 2 రూ.లూ, 2 గ్రా. బంగారంతో తయారయ్యాయి. ఈ 2 రూ.లలో వున్న మొత్తం శ్రమా, బట్టలో వున్న మొత్తం శ్రమా ఒకే పరిమాణంలో వున్నాయన్నమాట! అందుకే బట్టకు బదులు, 2 గ్రా. బంగారం వచ్చింది. ఆ బంగారం ఎన్ని బిళ్ళలుగా వుంటే అన్ని బిళ్ళలు వచ్చాయి.

ఈ 2 గ్రా. బంగారం, 2 బిళ్ళలుగా గాక, ఒక్క బిళ్ళగానే వుంటే, అది '2 రూ.ల బిళ్ళ' అవుతుంది. అప్పుడు కూడా బట్ట ధర 2 రూ.లే.

'రూపాయి' అనేది భారత దేశపు డబ్బు పేరు.
'పౌండు' — ఇంగ్లాండు దేశపు డబ్బు పేరు.
'డాలరు' — అమెరికా దేశపు డబ్బు పేరు.
ఒక్కో దేశపు డబ్బుకి ఒక్కో పేరు వుంటుంది.

రూపాయల పేరుతో కొన్ని సరుకుల ధరలు ఇలా వుండవచ్చు :

| | | | |
|---|---|---|---|
| 20 | మీ. బట్ట | ధర | = 2 రూ.లు |
| 12 | కి. ధాన్యం | ధర | = 3 రూ.లు |
| 9 | కలాల | ధర | = 5 రూ.లు |
| 1 | రొట్టె | ధర | = అర్ధ రూపాయి — ఇలా! |

**5)** బంగారం, జనరల్ ఈక్వివలెంటుగా ఇంకా

ఏర్పడలేదనుకుందాం. మారకాలన్నీ బార్టరు పద్ధతిలోనే జరుగుతున్నాయి. అప్పుడు, ఒక బట్టని బంగారంతో మారకం చేస్తే 2 గ్రా. బంగారం వచ్చిందనుకుందాం. ఆ బంగారం, బట్టకి, ధర అవదు. ఎందుకంటే, అప్పుడు బంగారం, డబ్బు కాదు గనక. ( జనరల్ ఈక్వివలెంట్ కాదు గనక. )

ఒక కుర్చీకీ ఒక దుప్పటికీ బార్టరు పద్ధతిలోనే మారకం జరిగిందనుకుందాం. ఒక వస్తువు 'విలువ', రెండో వస్తువే — అని మనకు తెలుసు. అయితే, ఆ 'విలువ'ని, 'ధర' అనవచ్చునా?

కుర్చీకి దుప్పటి — 'ధర' అవుతుందా?

దుప్పటికి కుర్చీ — 'ధర' అవుతుందా?

అలా అవవు. ఇక్కడ, 'ధర', అనే మాట వాడకూడదు. ఎందుకంటే, విలువ, 'డబ్బు' ద్వారా కనపడినప్పుడే, అది 'ధర'. 'డబ్బు' ద్వారా జరిగే విలువ వ్యక్తీకరణే 'ధర'. కాబట్టి, ఒక వస్తువుకి బదులుగా ఇంకో మామూలు వస్తువు (డబ్బు కాని వస్తువు) వస్తే, దాని పేరు విలువే! అది ధర కాదు. 'డబ్బు' వచ్చినప్పుడే, దాని పేరు — 'ధర'.

**6)** ఇప్పటి వరకూ మనం, 'అమ్మడం, కొనడం' అనే మాటలు వాడలేదు. 'మారకం' అనే మాటని మాత్రమే వాడుతున్నాము. వస్తువుల్ని డబ్బుతో మారకం చేసినప్పుడే, 'అమ్మడమూ, కొనడమూ' అనే మాటలు ప్రారంభ మవుతాయి. 'డబ్బు'ని ఇప్పుడే చూస్తున్నాం కాబట్టి, ఇప్పటి వరకూ ఆ మాటలు వాడవలసిన అవసరం రాలేదు.

కుర్చీకీ, 5 రూ.లకీ, మారకం జరిగిందనుకుందాం.

'కుర్చీ' వేపు నించి చూస్తే, అది, కుర్చీని 'అమ్మడం'.

'డబ్బు' వేపు నించీ చూస్తే, అది, కుర్చీని 'కొనడం'.

అంటే, 'అమ్మడం, కొనడం' అనే 2 మాటలూ, వస్తువు గురించే గానీ, 'డబ్బు' గురించి కాదు.

అమ్మేదీ, కొనేదీ — వస్తువునే. 'డబ్బు'ని కాదు.

డబ్బుని అమ్మరు; డబ్బుని కొనరు.

(డబ్బుని కూడా అమ్మడమూ, కొనడమూ వుంటుంది. కానీ, దాని సంగతి ఇక్కడ కాదు. అది 'విదేశీ వర్తకం' దగ్గర వస్తుంది. చాలా దూరం తర్వాత.)

కుర్చీని ఇచ్చి డబ్బుని తీసుకునే మనిషి, కుర్చీని అమ్ముతున్నాడని అర్థమా, 'డబ్బు'ని కొంటున్నాడని అర్థమా? — కుర్చీని అమ్ముతున్నాడనే అర్థం. రెండో అర్థం కాదు.

అలాగే, డబ్బు ఇచ్చి కుర్చీని తీసుకునే మనిషి, కుర్చీని కొంటున్నాడని అర్థమా, డబ్బుని అమ్ముతున్నాడని అర్థమా?— కుర్చీని కొంటున్నాడని మాత్రమే అర్థం. రెండో అర్థం కాదు.

కాబట్టి, 'అమ్మడం' అన్నా, 'కొనడం' అన్నా, వస్తువుని అమ్మడమే, వస్తువుని కొనడమే. అంతే గానీ, డబ్బుని అమ్మడం గానీ, డబ్బుని కొనడం గానీ కాదు.

**7)** 'అమ్మడం' అన్నా, 'కొనడం' అన్నా వస్తువుకీ డబ్బుకీ మారకం జరగడమే కదా? కాబట్టి, 'అమ్మడమూ – కొనడమూ' అనే మాటలు, మారకాలు డబ్బు ద్వారా జరిగే కాలం నించి మాత్రమే ప్రారంభమవుతాయి. బార్టరు కాలంలో, ఈ మాటలు వుండవు.

కుర్చీకీ దుప్పటికీ బార్టరు పద్ధతిలో మారకం జరిగిందనుకుందాం. దీన్ని కుర్చీ వేపు నించి చూస్తే, కుర్చీని ఇచ్చి, దుప్పటిని తీసుకోవడం. అంతే. అంతే గానీ, ఇది దుప్పటిని అమ్మి, కుర్చీని కొనడం కాదు. ఆ మాటలు ఇంకా అప్పటికి లేవు. అలాగే దుప్పటి వేపునించి చూసినా కూడా.

**8)** ప్రస్తుతం 'రూపాయిలు' అన్నప్పుడల్లా 'బంగారం రూపాయలు' అనుకోవాలేగానీ 'కాయితం నోట్లు' అనుకో కూడదు. కాయితం నోట్లు పుట్టడానికి ఇంకా కొంత చరిత్ర జరగాలి.

బంగారం రూపాయలు మొదట ఎవరి చేతుల్లో వుంటాయి? — బంగారాన్ని ఎవరు ఉత్పత్తి చేస్తారో వాళ్ళ చేతుల్లో!

ధాన్యాన్ని పండించే వ్యక్తుల చేతుల్లోనే అది మొదట వుంటుంది కదా? అక్కడి నించే అది మారకాల ద్వారా ఇతరుల చేతుల్లోకి వెళ్తుంది.

కుండలు తయారుచేసే వాళ్ళ చేతుల్లోనే అవి మొదట వుంటాయి కదా? అక్కడి నించే అవి ఇతరుల చేతుల్లోకి వెళ్తాయి.

అలాగే, బంగారం కూడా మొదట దాన్ని తయారు చేసేవాళ్ళ చేతుల్లోనే వుంటుంది. వాళ్ళు ఆ బంగారాన్ని ఇచ్చి ఇతర వస్తువులు కొనుక్కుంటారు. వాళ్ళకి కూడా ఇతర వస్తువులు కావాలి కదా? ఆ రకంగా ఆ బంగారం ఇతర్ల చేతుల్లోకి వెళ్తుంది. ఆ ఇతర్లు కూడా ఆ బంగారంతో తమకు కావలసిన, వస్తువులు కొనుక్కుంటారు. ఆ బంగారం ఇంకొకళ్ళ చేతుల్లోకి వెళ్తుంది.

అయితే, మొదట బంగారాన్ని తయారుచెయ్యడం అంటే, అది నేత పని లాగో, కుట్టు పని లాగో ఒకరిద్దరు వ్యక్తులతో అయ్యే పని కాదు. గనుల్ని తవ్వి ముడి లోహాన్ని బైటికి తియ్యాలి. దాని మీద ఎన్నో పనులు చేసి దాన్ని బంగారం ముద్దలుగా తయారుచెయ్యాలి. దాన్ని, తర్వాత బిళ్ళలుగా తయారుచెయ్యాలి. ఇదంతా జరిగితేనే గానీ బంగారం రూపాయల్ని ఊహించలేము.

ఇప్పుడు ఆ క్రమం అంతా మనకి అనవసరం. జనం చేతుల్లో ధాన్యం వున్నట్టే, కుండలు వున్నట్టే, కొంత మంది చేతుల్లో బంగారం ముక్కలు వున్నాయని ఊహిద్దాం.

డబ్బుకి సంబంధించి, అవసరమైన ఏర్పాట్లు, ఆ సమాజంలో వున్న ప్రభుత్వమే చేస్తుంది.

ఎంత బరువుగల బంగారాన్ని కనీసపు కొలతగా ( ఒక యూనిట్‌గా ) వుంచాలో, దాన్ని ఎన్ని భాగాలుగా విభజించాలో, — ఇలాంటి విషయాలు ప్రభుత్వం ద్వారానే అధికారికంగా జరుగుతాయి.

**9)** ఔన్సులు, పౌనులు, తులాలు, వీశెలు, మణుగులు — అనేవి బరువులకు వుండే పేర్లు. రాగి, వెండి, బంగారం — వంటి లోహాలు, డబ్బు సరుకుగా లేనప్పుడు కూడా వాటి బరువులకు పేర్లు వున్నాయి. ఇంగ్లండులో, వెండి, 'డబ్బు సరుకు'గా అయినప్పుడు, ఒక పౌను బరువుగల వెండిని ఒక నాణెంగా చేసి ఆ నాణానికి 'పౌను' అని పేరుపెట్టారు. 1 పౌను బరువు గల వెండికి పెట్టిన డబ్బు పేరే — పౌను, లేదా పౌండు. కాబట్టి, ఇంగ్లీషు దేశపు డబ్బు పేరు — పౌను, లేదా పౌండు.

1 కోటు ధర 2 పౌండ్లు — అంటే అర్థం, 2 పౌనుల బరువుగల వెండి అని.

'డబ్బు – సరుకు'గా వెండికి బదులు బంగారం వుండడం ప్రారంభమైనప్పుడు, బంగారం నాణానికి కూడా పౌను అన్న పేరే వచ్చింది. అయితే, అప్పుడు పౌను బరువుని తగ్గించారు. బంగారం, వెండి కన్నా చాలా విలువైన లోహం కాబట్టి, వెనకటి పౌను బరువులో 15 వ భాగం బరువుగల బంగారాన్నే పౌను అన్నారు. ఒక బంగారం పౌనూ, ఒక వెండి పౌనూ, విలువలో సమానమే. కానీ, బరువుల్లో సమానం కాదు. బంగారం నాణెం కన్నా వెండి నాణెం 15 రెట్ల బరువుతో వుంటుంది.

ఒక వస్తువుని అమ్మి, దానికి బదులుగా 1 బంగారం పౌనుని తీసుకున్నా, దానికన్నా 15 రెట్ల బరువు గల వెండి పౌనుని తీసుకున్నా, రెండూ ఒకటే.

ఒక వస్తువుకి వుండే పేరునిబట్టి వస్తువుల లక్షణాల్ని గ్రహించలేము. 'రామయ్య' అనే పేరునిబట్టి ఆ వ్యక్తికి సంబంధించిన శారీరక లక్షణాల్ని గ్రహించలేము. అలాగే, 'రూపాయి', 'పౌండు', 'డాలరు' అనే పేర్లని బట్టి, ఆ డబ్బు విలువల్నీ, బరువుల్నీ, ఇతర లక్షణాల్నీ గ్రహించలేము. అవి కేవలం 'పేర్లు' మాత్రమే. వాటి వివరాల్ని ప్రత్యేకంగా తెలుసుకోవలసిందే.

**10)** ఒక సరుకు విలువని డబ్బుద్వారా చెప్పేదే 'ధర' కాబట్టి, మామూలు సరుకులకు ధరలు వున్నట్టుగా 'డబ్బు'కి ధర వుండదు; విలువ మాత్రమే వుంటుంది. 1 రూపాయి ధర ఎంత ? — 'ధర'ని రూపాయల ద్వారానే చూడాలి కాబట్టి, 1 రూపాయి ధర — 1 రూపాయే. 2 రూ.ల ధర — 2 రూ.లే. రూపాయి ధరని రూపాయి ద్వారానే చూడాలి కాబట్టి, 'డబ్బు'కి ధరని చూడడం అర్థరహితమైన విషయం. '1 రూపాయికి విలువ ఎంత' — అనవచ్చు. ఆ విలువ అనేక సరుకుల ద్వారా కనపడుతుంది. 1 రూపాయికి ఎంత ధాన్యం వస్తుందో, అది రూపాయి విలువ. లేదా, ఎంత బట్ట వస్తుందో అది రూపాయి విలువ. అలా, రూపాయి విలువ అనేక సరుకుల ద్వారా కనపడుతుంది.

'రూపాయి' అనేది, నాణెంగా వున్న బంగారం. 'డబ్బు సరుకు' అనేది ముద్దగా వున్న బంగారం. రూపాయి నాణెంలో 1 గ్రాము బంగారం వుందనుకుందాం. ముద్దగా వున్న 1 గ్రాము బంగారాన్ని తీసుకుని 'దీని ధర ఎంత?' అని చూసినప్పుడు, 1 గ్రాము బంగారం ధర = 1 రూపాయి అనవచ్చు. అయితే, 1 రూపాయి నాణెంలో వున్నది కూడా 1 గ్రాము బంగారమే కాబట్టి, 1 గ్రాము బంగారం ధర = 1 గ్రాము బంగారమే అవుతుంది. కాబట్టి, ముద్దగా వున్న బంగారానికి ( డబ్బు – సరుకుకి ) ధరని చూడడం కూడా అర్థరహితంగానే వుంటుంది. కాబట్టి, బంగారానికి గానీ, బంగారంతో తయారైన రూపాయి నాణాలకు గానీ, ధర వుండదు; విలువే వుంటుంది.

1. గ్రా. బంగారానికి 10 మీ. బట్టవస్తే, 1 గ్రా. బంగారం విలువ (లేదా 1 రూపాయి విలువ) = 10 మీ. బట్ట. ఆ బంగారం విలువని ధాన్యం ద్వారా చూస్తే, కొంత ధాన్యం. పంచదార ద్వారా చూస్తే, కొంత పంచదార — ఇలా.

సరుకుల ప్రపంచంలో ఎన్ని సరుకులు వుంటే అన్ని సరుకులద్వారానూ డబ్బు విలువ (బంగారం విలువ) కనపడుతుంది.

ఒక ధరల లిస్టు ఇలా ఉందనుకుందాం :

| | | |
|---|---|---|
| 20 మీ. బట్ట | = | 2 రూ.లు |
| 12 కి. ధాన్యం | = | 1 రూ. |
| 9 కలాలు | = | 3 రూ.లు |
| 1 చెప్పుల జత | = | అర్థ రూపాయి |
| ...................... | = | ...................... |
| ...................... | = | ...................... |

ఈ లిస్టుని తారుమారుగా చదివితే, అంటే, రూ.ల వేపు మొదలుపెట్టి మామూలు సరుకుల వేపు చదివితే, డబ్బు విలువ ఎలా వుందో కనపడుతుంది.

| | | |
|---|---|---|
| 2 రూ.లకు | = | 20 మీ. బట్ట |
| 1 రూ. కి | = | 12 కి. ధాన్యం |
| 3 రూ. లకు | = | 9 కలాలు |
| అర్థ రూపాయికి | = | 1 చెప్పుల జత |

దీన్ని బట్టి, 1 రూపాయి విలువ ఇలా వుంటుంది.

| | | |
|---|---|---|
| 1 రూ. | = | 10 మీ. బట్ట |
| 1 రూ. | = | 12 కి. ధాన్యం |
| 1 రూ. | = | 3 కలాలు |
| 1 రూ. | = | 2 చెప్పుల జతలు |

ఇలా డబ్బు విలువ, ఇతర సరుకుల ద్వారా కనపడుతుంది. ఏ సరుకు విలువ, ఆ సరుకు ద్వారా కనపడదని

మనకు తెలుసు. అలాగే, డబ్బు విలువ కూడా డబ్బు ద్వారా కనపడదు. కాబట్టి, దాన్ని ఇతర సరుకుల ద్వారానే చూడాలి.

**11)** బంగారం ఉత్పత్తిశక్తి మారి, 1 గ్రాము బంగారానికి పట్టే శ్రమకాలం మారితే, బంగారం విలువ కూడా మారుతుంది. అప్పుడు సరుకులకు బదులుగా వెళ్ళవలసిన బంగారం బిళ్ళల సంఖ్య కూడా మారుతుంది. బంగారం విలువ 'రెట్టింపు' అయితే, 1 గ్రాము బిళ్ళ వెళ్ళవలసిన ప్రతిచోటా అర్ధగ్రాము బిళ్ళ వెళ్తే సరిపోతుంది. లేదా, బంగారం విలువ సగం తగ్గితే, 1 గ్రాము బిళ్ళ వెళ్ళవలసిన ప్రతిచోటా 2 బిళ్ళలు వెళ్ళవలసి వుంటుంది. అంటే, బంగారం విలువ మారినప్పుడు అన్ని సరుకుల ధరలూ మారతాయని అర్థం.

మనం చూసిన ధరల లిస్టులో, అన్ని సరుకుల ధరలూ సగం సగం తగ్గిపోయి వుంటే, బంగారం విలువ రెట్టింపైనట్టు అర్థం. అన్ని సరుకుల ధరలూ రెట్టింపై వుంటే, బంగారం విలువ సగానికి తగ్గినట్టు అర్థం. సరుకుల ధరలు రక రకాలుగా మారివుంటే, ఆ మార్పులకు కారణాలు, ఆ సరుకుల విలువలలో జరిగిన మార్పులే అయివుంటాయి. అంతేగానీ, అవి బంగారంవల్ల జరిగిన మార్పులు అవవు. ఎందుకంటే, బంగారం విలువలోనే మార్పు జరిగివుంటే, ఆ ప్రభావం అన్ని సరుకుల ధరలమీదా ఒకేరకంగా వుంటుంది. ధరలన్నీ దాదాపు ఒకేలెక్కన పెరగడంగానీ, లేదా ఒకేలెక్కన తరగడంగానీ జరుగుతుంది. ధరలు రకరకాలుగా మారాయి అంటే, అది బంగారం వేపునించి జరిగిన విషయం అవదు.

బంగారం విలువ మారడం వల్ల సరుకుల ధరలు మారినట్టయితే, ధరల్లో ఆ మార్పు అసలు మార్పుకింద లెక్కలోకి రాదు. ఎందుకంటే, ఆ మార్పు అన్ని సరుకులకూ ఒకేరకంగా వర్తిస్తుంది కాబట్టి. ఆ మార్పు, ఒక సరుకుకి వర్తించి, ఇంకో సరుకుకి వర్తించకుండా వుండదు. అన్ని సరుకుల ధరలూ ఒకే రకంగా మారితే, ఆ మార్పు అసలు మార్పు కానిదానితోనే సమానం.

ఇక్కడ, 'బంగారం విలువ మారడంవల్ల, సరుకుల ధరలు మారడం' గురించి సరిగా అర్థం చేసుకోవాలి. సమాజంలో, కొత్త బంగారం గనుల్ని కనిపెట్టడంవల్ల, ఆ గనుల్లో బంగారం బాగా దొరికి, గతంలో తక్కువ బంగారాన్ని తయారుచేసినంత కాలంలోనే ఇప్పుడు రెట్టింపు బంగారం ఉత్పత్తి అవుతోందనుకుందాం. ఆ రకంగా, బంగారం ఉత్పత్తి రెట్టింపై, 1 యూనిట్ బంగారం విలువ సగానికి తగ్గిందనుకుందాం. దానివల్ల, 1 బంగారం బిళ్ళ వెళ్ళవలసినచోట 2 బిళ్ళలు వెళ్తాయి కాబట్టి, సరుకుల ధరలు పెరుగుతాయని చూశాం. ఈ ఉదాహరణలో, ధరలు పెరగడానికి కారణం ఏమిటి? బంగారం విలువ తగ్గడం — అనేది సరైన జవాబా; లేకపోతే, 'బంగారం ఉత్పత్తి పెరగడం' అనేది సరైన జవాబా? —— ఈ పుస్తకంలోనే మొదటి చాప్టరులో, 'వజ్రాల విలువ ఎక్కువగా ఎందుకు వుంటుంది?' అనే ప్రశ్నకి ఏం జవాబు చెప్పుకున్నాం? 'వజ్రాలకు ఎక్కువ శ్రమ పడుతుంది కాబట్టి' అని చెప్పుకున్నాం. 'వజ్రాలు తక్కువగా దొరుకుతాయి కాబట్టి' అని కాదు. 'శ్రమ'నే కారణంగా చెప్పుకున్నాం. అలాగే, ఇక్కడ, బంగారం విషయంలో కూడా జవాబుని 'శ్రమ' వేపునించే చెప్పుకోవాలి. 'సరుకుల ధరలు ఎందుకు పెరిగాయి?' అనే ప్రశ్నకి జవాబు, '1 యూనిట్ బంగారానికి పట్టే శ్రమ కాలం గతంకన్నా తగ్గింది కాబట్టి' అని! అంతే గానీ, 'బంగారం ఎక్కువగా వుత్పత్తి అయింది కాబట్టి' అని కాదు. 'డబ్బు' అనేది తన 'విలువ' ద్వారానే, డబ్బుగా పనిచేస్తుంది — అని గ్రహించడానికి, ఇది ఎంతో అవసరమైన అంశం.

**12)** రూపం వుండని 'విలువ'ని, ఏదో ఒక 'రూపం'తో చూస్తూ 'డబ్బు రూపం' దాకా వచ్చాం. డబ్బు అనేది, 'నాణెం రూపం'లోకి వచ్చేదాకా విలువకి 'స్వంత రూపం' ఏర్పడినట్టు కాదు. నాణాలు ఎప్పటి నించైతే ప్రారంభమయ్యాయో అప్పటి నించే విలువకి స్వంత రూపం ఏర్పడినట్టు అర్థం. 'విలువ'కి స్వంత రూపం అంటే, ఏ 'ఉపయోగపు విలువ' తోటీ సంబంధం లేని రూపం. నాణెం రూపం అలాంటిదే.

ఒక సరుకు, ఇంకో మామూలు సరుకుతో మారడానికీ, నాణెంతో మారడానికీ తేడా ఏమిటో చూస్తే, నాణెం రూపానికి వుండే ప్రత్యేకత ఏమిటో అర్థమవుతుంది. కుర్చీ, దుప్పటితో మారిందనుకుందాం. కుర్చీ విలువ, దుప్పటి అవుతుంది. ఆ 'దుప్పటి'కి ఒక ఉపయోగపు విలువా, ఒక విలువా వుంటాయి. ఆ ఉపయోగపు విలువ దుప్పటిదీ, ఆ విలువ కుర్చీదీ. అంటే ఇక్కడ, కుర్చీ విలువ, దుప్పటి ఉపయోగపు విలువతో కలిసి వుందని అర్థం. కుర్చీని ఇచ్చి దుప్పటిని తీసుకున్న మనిషి, ఆ దుప్పటికి వున్న 'ఉపయోగపు విలువ'ని వాడుకుంటాడు.

అలాగే, కుర్చీ, ఒక ఇత్తడి పాత్రతో మారితే, కుర్చీ విలువ, ఆ ఇత్తడి పాత్ర అవుతుంది. ఆ పాత్రకి, ఒక 'ఉపయోగపు విలువ' వుంటుంది (విలువే గాక).

కుర్చీ, ఒక చొక్కాతో మారితే, కుర్చీ విలువ, ఆ చొక్కా అవుతుంది. ఆ చొక్కాకి ఒక 'ఉపయోగపు విలువ' వుంటుంది.

అలాగే, కుర్చీ ఏ మామూలు వస్తువుతో మారినా, కుర్చీ విలువ, ఆ వస్తువుకి వుండే 'ఉపయోగపు విలువ'తో లంకెపడి వుంటుంది.

కానీ కుర్చీ, మామూలు వస్తువులతో గాక, ఒక 'డబ్బు నాణెం'తో మారిందనుకుందాం. ఆ 'నాణానికి' ఏం ఉపయోగపు విలువ వుంటుంది? — ఏ ఉపయోగపు విలువా వుండదు. చేతిలోకి వచ్చిన 'నాణెం'తో ఏం చేస్తాం? అది

దేని కోసం ఉపయోగపడుతుంది?

నాణాన్ని ఇచ్చి ఏదైనా సరుకుని తీసుకోవచ్చు. నాణాన్ని ఉపయోగించడం అంటే, దాన్ని ఇచ్చి మళ్ళీ ఇంకో సరుకుని తీసుకోవడమే. నాణాన్ని ఎన్ని సార్లు ఉపయోగించినా, సరుకులతో మారడానికి మాత్రమే అది ఉపయోగపడుతుంది.

కుర్చీని కూర్చోడానికి ఉపయోగించినట్టూ, దుప్పటిని కప్పుకోడానికి వుపయోగించినట్టూ, నాణాన్ని ఒక 'ఉపయోగపు విలువ'గా వుపయోగించడం సాధ్యం కాదు. నాణానికి ఏదైనా 'ఉపయోగపు విలువ' వుందనుకుంటే, 'విలువగా వుపయోగపడడం' అనేదే ఆ ఉపయోగపు విలువ. అంటే, నాణానికి వున్న 'ఉపయోగపు విలువ' అయినా, 'విలువ' అయినా ఒకటే. అది 'విలువగా వుండడమే'.

'విలువగా వుండడం' అనే లక్షణం, నాణానికే కాదు, ప్రతీ సరుకుకీ వుంటుంది. అయితే, సాధారణ సరుకులకు 'విలువ' అనే లక్షణంతోపాటు ఒక 'ఉపయోగపు విలువ' కూడా వుంటుంది. నాణానికి, అది వుండదు. ఒకవేళ, నాణాన్ని, కరిగించేసి ఆ బంగారంతో ఒక నగ చేయించుకుంటే, అది బంగారానికి వుండే ఉపయోగపు విలువ అవుతుందిగానీ, నాణానికి వుండే ఉపయోగపు విలువ అవదు. నాణెం, నాణెం గానే వుంటే, దానికి విలువే గానీ ఉపయోగపు విలువ ఉండదు.

నాణెం కూడా ఒక వస్తువే. అయితే, ఈ 'వస్తువు', 'విలువకి రూపం'గా వుండడంకోసం మాత్రమే తయారైన వస్తువు. అంతే గానీ, ఒక ఉపయోగపు విలువగా వుండడం కోసం తయారైన వస్తువు కాదు. నాణెం చెయ్యవలసిన పని సరుకులతో మారడమే కాబట్టి, అలా మారేటప్పుడు, అది ఏ సరుకుతో మారుతుందో ఆ 'సరుకు – విలువకి' రూపంగా వుంటుంది. అంటే, నాణెం ఎప్పుడూ విలువ రూపంగానే వుంటుంది. విలువ రూపంగా వుండకపోతే, నాణెంలో వున్న బంగారం, అలా నాణెం రూపంలో వుండనే అక్కరలేదు. తన మీద రాజుల తలకాయల్తో, అంకెల్తో, గుర్తుల్తో, తన చుట్టూ నొక్కుల్తో, అలా పలచని గుండ్రని చిన్న బిళ్ళ ఆకారంతో వుండదు. అది 'విలువ రూపం' కాకపోతే, మామూలు బంగారపు ముద్దగానో, ఏదో ఒక నగ గానో అయిపోతుంది.

దుప్పటి లాంటి ఏదైనా ఒక సాధారణమైన వస్తువు (నాణెం కాని వస్తువు), ఇంకో సరుకుకి విలువ రూపంగా ఉండకపోయినా ఒక ఉపయోగపు విలువగా తప్పనిసరిగా వుంటుంది. ఎందుకంటే, ఆ వస్తువు తయారైంది ఒక ఉపయోగపు విలువగా వుండడానికే కాబట్టి. కానీ, నాణెం సంగతి అలా కాదు. అది, తయారైంది విలువకి రూపంగా వుండడానికే. అది, అలా వుండకపోతే, ఆ రూపానికి ఇంకో ప్రయోజనం వుండదు. అంటే, నాణెం రూపం, ఏ ఉపయోగపు విలువా లేని రూపం. అందుకే, అది 'విలువ'కు స్వంత రూపం. 'నాణెం రూపం' తప్ప, ఉపయోగపు విలువతో కలిసి వున్న ఏ రూపమూ విలువకి స్వంత రూపం అవదు.

ఒక వస్తువు (ఉదా॥ దుప్పటి), ఉపయోగపు విలువగా వున్నప్పుడు విలువగా వుండదనీ, విలువగా వున్నప్పుడు ఉపయోగపు విలువగా వుండదనీ, గతంలోనే చూశాం. అంటే, ఒక సహజమైన ఉపయోగపు విలువని కలిగిన వస్తువు కూడా, విలువగా వున్నప్పుడు ఉపయోగపు విలువ లేని సరుకుగానే వుంటుంది. కాబట్టి, 'విలువగా వున్నప్పుడు ఉపయోగపు విలువగా ఉండకపోవడం' అనే లక్షణం నించే, నాణానికి ఏ ఉపయోగపు విలువా అవసరంలేని రూపం సంక్రమించింది.

'డబ్బు సరుకు'గా వున్నది బంగారమే అయినా, ఆ బంగారం ఏ రూపంలో వుంటే ఆ రూపమే (నగ రూపమో, బంగారపు కడ్డీ రూపమో) విలువకి స్వంత రూపం అవదు. ఇతర అవసరాల కోసం తయారైన ఏ వస్తువు రూపమూ కాకుండా, కేవలం విలువని చూపించడం కోసం తయారైన రూపం మాత్రమే, అంటే నాణెం రూపం మాత్రమే, విలువకి స్వంత రూపం.

విలువ అనేది పుట్టగానే దానికి స్వంత రూపం లేదు. అది డబ్బు రూపంలోకి వచ్చిన ప్రారంభంలో కూడా దానికి స్వంత రూపం లేదు. అంటే ధాన్యం, కొంత కాలంపాటు డబ్బుగా (జనరల్ ఈక్వివలెంట్‌గా) వుందనుకుందాం. అప్పుడు, ధాన్యం రూపమే 'డబ్బు రూపం'గా వుంటుంది కదా? కానీ, ఆ డబ్బు రూపం, విలువకి స్వంత రూపం కాదు. అలాగే, ఇంకేదైనా సరుకు, డబ్బుగా వుంటే, ఆ సరుకు రూపం కూడా విలువకి స్వంత రూపం కాదు. డబ్బు అనేది, నాణెం రూపంతో ఏర్పడిన తర్వాత, ఆ నాణెం రూపం మాత్రమే, విలువకి స్వంత రూపం — ఆ నాణెం ఏ లోహంతో చేసినదైనా.

విలువకు 'స్వంత రూపం' ఏర్పడిందంటే ప్రకృతి సహజంగా కనపడని విలువ ఇప్పుడు ప్రకృతి సహజంగా కనపడుతోందని అర్థమా? — కాదు. విలువ ఎప్పుడూ సహజమైనది కాదు. అది ఎప్పుడూ వస్తువు శరీరంలో కనపడదు. అది కనపడాలంటే, వస్తువుకి బయట, ఇంకో వస్తువు ద్వారా, కనపడవలసిందే. ఇప్పుడు కూడా విలువ ఆ పనే చేస్తోంది. నాణెం ద్వారా కనపడడం అంటే, విలువ, నాణెం అనే వస్తువు ద్వారా, దాని రూపంతో కనపడడమే. నాణెం అనేది, విలువని చూపించడానికే ఏర్పడిన వస్తువే అయినా; విలువ, తన కోసమే ఏర్పడిన వస్తువు ద్వారానే కనపడుతోన్నా, ఇప్పుడు కూడా విలువ ప్రకృతి సహజ విషయం అవదు. విలువ, సహజ విషయమే అయితే,

నాణెం సహాయం లేకుండానే, ఏ వస్తువు విలువ ఆ వస్తువు శరీరంలోనే కనపడాలి. కానీ, విలువ సహజమైనది కాదు గనక, అలా జరగదు.

ఇంకా 'నాణెం' లేని కాలంలో, ఏదో ఒక ఉపయోగపు విలువగల వస్తువు ద్వారా కనపడే విలువ, నాణెం ఏర్పడిన తర్వాత, స్వతంత్రంగా వుందని అర్థం. దేని నించి స్వతం త్రంగా? 'ఉపయోగపు విలువ' నించి స్వతంత్రంగా. 'ఉపయోగపు విలువ'నించి విడిపోయిన రూపమే 'నాణెం రూపం'.

ఇక నించి మనం 'డబ్బు' అని మాట్లాడినప్పుడల్లా, నాణాల రూపంతో వున్న డబ్బు గురించే మాట్లాడుతున్నామని అర్థం. 'డబ్బు రూపం' అంటే 'నాణెం రూపమే.'

**13)** ఒక సరుకు విలువ, ఆ సరుకు రూపంతో గాక, ఎప్పుడూ దానికి భిన్నంగానే వుంటుందని చూశాం కదా? నాణెం రూపమే సరుకులన్నిటికీ విలువ రూపంగా అయి నప్పుడు కూడా అదే జరుగుతుంది. సరుకుల ప్రపంచంలో 100 రకాల సరుకులు వున్నాయనీ, అవన్నీ నాణాలతో మార తాయనీ అనుకుంటే, ఈ నాణెం రూపం తను మారే సరుకు లన్నిటి రూపాలకూ భిన్నమైనదే. కుర్చీ ధర = 5 రూ.లు. అయితే, కుర్చీ రూపం వేరూ, దాని విలువ రూపం వేరూ. అలాగే ఏ సరుకు విషయంలో అయినా. విలువని చూపించేది ధరే కాబట్టి 'ధర రూపం' అనేది (అంటే డబ్బు రూపం అనేది) సరుకు శరీర రూపం నించీ భిన్నంగా వుంటుంది.

**14)** సరుకులో వుండే ఉపయోగపు విలువా, విలువా విరుద్ధాంశాలు. ఇవి ఒకటి వున్న చోట ఒకటి వుండవు. ఇది, 'సరుకు'లో వున్న వైరుధ్యం. ఈ వైరుధ్యం బార్టరు పద్ధతిలో కన్నా, డబ్బు ద్వారా జరిగే మారకాలలో స్పష్టంగా కనపడు తుంది.

బార్టరు పద్ధతిలో కొన్ని మారకాలు ఇలా వున్నాయి అనుకుందాం :

| | | |
|---|---|---|
| 1 కుండ | = | 1 చెప్పుల జత |
| 1 విల్లు | = | 1 ఎద్దు చర్మం |
| 1 కుర్చీ | = | 1 దుప్పటి |
| 2 శేర్ల ధాన్యం | = | 5 శేర్ల కందులు |

ఇందులో, కుండ వేపున వున్నవన్నీ ఉపయోగపు విలువలు. వాటి ఎదురుగా వున్నవన్నీ వాటి విలువలు. అంటే, ప్రతీ మారకం జతలోనూ, ఉపయోగపు విలువా విలువా విడిపోయి వున్నాయి. అయితే, విలువగా వున్న ప్రతీ సరుకూ ఏదో ఒక ఉపయోగపు విలువతో కలిసిపోయి వుంది. కాబట్టి, అది విలువగా వున్నట్టు కనపడదు. కుండ, చెప్పుల జతతో మారినప్పుడు, ఒక వస్తువుకి బదులుగా ఇంకో వస్తువు వచ్చినట్టు మాత్రమే కనపడుతుందిగానీ, ఆ రెండో వస్తువే, మొదటి వస్తువుకి విలువ అయినట్టు కనపడదు.

ఇప్పుడు, ఆ సరుకులకే డబ్బుతో మారకాలు జరిగినట్టు చూద్దాం.

| | | |
|---|---|---|
| కుండ | = | అర్థ రూపాయి |
| విల్లు | = | 1 రూపాయి |
| కుర్చీ | = | 5 రూ.లు |
| 2 శేర్ల ధాన్యం | = | 3 రూ.లు |

ఇలా వున్నప్పుడు, కుండకి బదులుగా వచ్చిన అర్థ రూపాయి కుండ విలువ అయినట్టూ, విల్లుకి బదులుగా వచ్చిన రూపాయి విల్లు విలువ అయినట్టూ, అలాగే మిగతా సరుకుల విషయంలో కూడా — విలువలు ప్రత్యేకంగా కనపడతాయి. అంటే, సరుకులో ఉపయోగపు విలువా, విలువా వేరు వేరుగా వుండడం — అనే విషయం, బార్టరు పద్ధతిలో కన్నా, డబ్బు ద్వారా జరిగే మారకాలలో ఎక్కువ అభివృద్ధి చెందిన రూపంలో కనపడుతుంది. సరుకులో వైరుధ్యం వుందనే సంగతిని ( సరుకులో, ఉపయోగపు విలువా, విలువా – అనే విరుద్ధాంశాలు వున్నాయనే సంగతిని ) గ్రహించడానికి, డబ్బు రూపం ఏర్పడిన తర్వాతే అవకాశం ఏర్పడుతుంది.

ఈ రకంగా, 'మారకాల చరిత్ర', సరుకులో వైరుధ్యాన్ని క్రమక్రమంగా అభివృద్ధి చేసింది.

సరుకులో వైరుధ్యం వుందని గ్రహించినంత మాత్రాన్నే ఆ వైరుధ్యం పరిష్కారం అవదు. వస్తువులు సరుకులుగా మారడం ఆగిపోయినప్పుడు మాత్రమే (మారకాలు లేనప్పుడు మాత్రమే) ఆ వైరుధ్యం పరిష్కారమవుతుంది. అంటే, అప్పుడు ఉపయోగపు విలువే వుంటుందిగానీ 'విలువ' వుండదు. ఆ పద్ధతిలోనే అది పరిష్కారమవుతుంది!

**15)** బార్టరు పద్ధతిలో ఒక వస్తువుని ఇచ్చి ఇంకో వస్తువుని తీసుకోవాలంటే, ఆ మారకం జరగనూ వచ్చు; జరగకపోనూ వచ్చు. కుండ మనిషికి, చెప్పులు కావాలి. చెప్పుల మనిషి, తన సరుకుని అమ్మెయ్యడానికి సిద్ధంగానే వున్నాడు. కానీ అతనికి కుండ అక్కరలేదు. చెప్పులు ఇచ్చి కుండని తీసుకోవడం వల్ల, 'విలువ' విషయంలో అతనికి పోయేదేమీ వుండదు. ఇచ్చినంత విలువా తిరిగివస్తుంది. కానీ, ఆ విలువతోపాటు ఒక ఉపయోగపు విలువ కూడా లంకెపడి వుంది కాబట్టి, అది అతనికి అక్కరలేదు. అదే, చెప్పుల్ని ఇచ్చి 'డబ్బు'ని తీసుకోవడం అయితే, అతను వెంటనే అంగీకరిస్తాడు. 'కుండ'ని తీసుకోవడానికీ, 'డబ్బు'ని తీసుకోవడానికీ తేడా ఏమిటి? — డబ్బు అనేది, ఏ ఉప యోగపు విలువతోటీ లంకె లేని విలువ. అలాంటి విలువని ఏ ఉపయోగపు విలువగానైనా క్షణాలలో మార్చవచ్చు.

అంటే, డబ్బుతో ఏ సరుకునైనా క్షణాలలో కొనవచ్చు. మామూలు వస్తువుల ద్వారా అది సాధ్యం కాదు. డబ్బుతో మారడానికి ఏ సరుకు అయినా సిద్ధంగా వుంటుంది. అంటే, డబ్బుకి ఏ ఉపయోగపు విలువా లేకపోయినా, అది ఏ ఉపయోగపు విలువగానైనా మారగలదు కాబట్టి, దానికి సమస్తమైన ఉపయోగపు విలువలూ వున్నట్టే అర్థం.

**16)** బార్టరు పద్ధతిలో మారకాలు చేసుకునే మనుషులు, తమకు కావలసిన వస్తువులతోనే మారకాలు చేసుకుంటారు. కుర్చీకీ దుప్పటికీ మారకం జరిగిందంటే, కుర్చీ మనిషికి దుప్పటీ, దుప్పటి మనిషికి కుర్చీ కావాలి గనకే ఆ మారకం జరుగుతుంది. కుర్చీకీ, దుప్పటికీ చెరొక ఉపయోగపు విలువా, చెరి కొంత విలువా వుంటాయి. ఇలాంటి వస్తువులకు మారకం జరిగిందంటే, ఆ మారకం ఒక వేపు 'వుపయోగపు విలువల సంబంధం' గానూ ( ఒక ఉపయోగపు విలువని ఇచ్చి ఇంకో ఉపయోగపు విలువని తీసుకోవడం గా), ఇంకోవేపు 'విలువల సంబంధం'గానూ (కొంత విలువని ఇచ్చి కొంత విలువని తీసుకోవడంగా) వుంటుంది. కానీ, ఒక వస్తువుకి కొంత డబ్బుతో మారకం జరిగితే, అది 'ఏ అంశాల సంబంధం'గా వుంటుంది? కుర్చీకి, 5 రూ.లతో మారకం జరిగితే, అది ఏ అంశాల సంబంధం? కుర్చీకి, ఒక ఉపయోగపు విలువా, కొంత విలువా వున్నాయి. 5 రూ.లకు మాత్రం ఏ ఉపయోగపు విలువా లేకుండా కొంత విలువ మాత్రమే వుంది. అలాంటి డబ్బుకీ, కుర్చీకీ సంబంధం ఏర్పడిందంటే, డబ్బులో వున్న విలువ అంశానికీ, కుర్చీలో వున్న విలువ అంశానికీ మాత్రమే సంబంధం ఏర్పడిందని అర్థం. అంటే, వస్తువుకీ డబ్బుకీ ఏర్పడే సంబంధం, కేవలం 'విలువ సంబంధం'గా మాత్రమే వుంటుంది. బార్టరు పద్ధతిలో అయితే, 2 వస్తువుల సంబంధం విలువల సంబంధంగా మాత్రమే గాక, ఉపయోగపు విలువల సంబంధంగా కూడా వుంటుంది. అంటే, డబ్బు ఏర్పడిన తర్వాత డబ్బుతో వస్తువుల సంబంధాలన్నీ కేవలం 'విలువ సంబంధాలు'గా మాత్రమే సాగడం ప్రారంభమవుతుంది.

**17)** కుర్చీకి దుప్పటితో మారకం జరిగిందంటే, కుర్చీలో శ్రమకి, దుప్పటిలో శ్రమతో మారకం జరిగిందని అర్థం. అంటే ఇది శ్రమల మారకం. (నిజానికి, ఇది శ్రమల మారకం మాత్రమే కాదు. కుర్చీలోవున్న ప్రకృతి సహజ పదార్థానికీ, దుప్పటిలో వున్న ప్రకృతి సహజ పదార్థానికీ జరిగిన మారకం కూడా. కానీ, 'విలువ' గురించి చూసేటప్పుడు శ్రమల సంగతేగానీ, ప్రకృతి సహజ పదార్థాల సంగతి అనవసరం). కుర్చీకి, కొన్ని రూపాయి నాణాలతో మారకం జరిగిందంటే, అప్పుడు కూడా కొంత శ్రమకి, కొంత శ్రమతో మారకం జరిగిందని అర్థం. డబ్బు ఏర్పడక పూర్వంగానీ, ఏర్పడిన తర్వాత గానీ సరుకుల మధ్య మారకం అంటే, కొంత కొంత శ్రమ రాసుల మధ్య మారకమే.

**18)** డబ్బు అంటే విలువ. విలువ అంటే శ్రమ. కాబట్టి, డబ్బు అంటే శ్రమ. ఒక చిన్నపిల్ల చేతిలో ఒక 'పైస' వుందంటే అది కొంత 'శ్రమ'. ఆ పైసని ఇస్తే, దానికి బదులుగా చాలా తక్కువ విలువగల వస్తువు వస్తుంది. '1 రూపాయి' అంటే, అది కొంచెం ఎక్కువ శ్రమ. దానికి కొంచెం ఎక్కువ విలువగల వస్తువు వస్తుంది. '10 రూ.లు' అయితే, అది ఇంకా ఎక్కువ శ్రమ. 100 రూ.లు అయితే, అది ఇంకా ఇంకా ఎక్కువ శ్రమ. ఇలా, తక్కువ డబ్బు తక్కువ శ్రమ అయితే ఎక్కువ డబ్బు ఎక్కువ శ్రమ. తక్కువ డబ్బుకి, తక్కువ శ్రమతో తయారైన వస్తువులు వస్తే, ఎక్కువ డబ్బుకి ఎక్కువ శ్రమతో తయారైన వస్తువులు వస్తాయి.

ఒక మనిషి దగ్గిర కొంత డబ్బు వుందంటే, ఆ వ్యక్తి దగ్గిర కొంత శ్రమ వుందనీ, అది 'డబ్బు రూపం'లో వుందనీ అర్థం. ఆ డబ్బుకి ఎన్ని వస్తువులు వస్తాయో ఆ మనిషికి అన్ని వస్తువులు వున్నట్టు అర్థం.

**19)** 1 రూపాయి విలువగల కలమూ, 1 రూపాయి నాణెమూ పక్కపక్కనే వున్నాయి అనుకుందాం. అవి రెండూ సమానమైన విలువగల వస్తువులే. అయినా, వాటిలో కలానికి లేని 'మహిమ' ఏదో రూపాయికి వున్నట్టు కన పడుతుంది. ఏ వస్తువుకీ లేని మహిమ 'డబ్బు'కి వున్నట్టు కనపడుతుంది. ఇతర వస్తువులతో పోలిస్తే, డబ్బు, 'మహిమ' గలదే. ప్రపంచంలోవున్న ఏ సరుకునైనా కొనగల (ఏ సరుకుతోనైనా మారగల) దాని ప్రత్యేకతే — దాని మహిమ. 'జనరల్ ఈక్వివలెంటు'గా వుండే దాని హక్కే — దాని మహిమ. ఈ అర్థంలో, డబ్బు అనేది 'మహిమగల' వస్తువే. అయితే, నిజమైన అర్థంలో, డబ్బుకి మహిమ లేవీ లేవు. <u>డబ్బు అంటే 'శ్రమ' మాత్రమే. డబ్బు అంటే, శ్రమలన్నింటినీ కొలిచే 'కొలత పాత్ర' మాత్రమే.</u>

**20)** 2 సరుకులకు మారకం జరిగేటప్పుడు ఆ సరుకులకు 'గుణాత్మక సమానత్వమూ', 'పరిమాణాత్మక కొలతలూ' వుంటాయని చూశాం. సరుకులకు, డబ్బుతో మారకాలు జరిగేటప్పుడు సరుకుకీ డబ్బుకీ మధ్య కూడా గుణాత్మక సమానత్వమూ, పరిమాణాత్మక కొలతలూ వుంటాయి. కుర్చీకి, 5 రూ.లతో మారకం జరిగితే, కుర్చీని తయారుచేసిన శ్రమా, ఆ డబ్బుని (బంగారాన్ని) తయారు చేసిన శ్రమా, రెండూ 'విలువ'గా అవడమే— వాటి 'గుణాత్మక సమానత్వం'. ఆ కుర్చీ, ఫలానా సైజుగల 1 కుర్చీగానూ, ఆ డబ్బు, 5 రూ.లు గానూ వుండడం —వాటి 'పరిమాణాత్మక కొలతలు'. ఈ రకంగా, ఏ సరుకుని డబ్బుతో మార్చినా, వాటి మధ్య ఈ గుణాత్మక – పరిమాణాత్మక సంబంధాలు వుంటాయి.

**21)** 'సంపద' అంటే ఏమిటి? 'సంపద' అన్నా, 'డబ్బు'

అన్నా ఒకటేనా? — 'సంపద' అంటే, వస్తువుల రాసి. ప్రతీ వస్తువూ సంపదే. కానీ, ప్రతీ వస్తువూ డబ్బు కాదు.

దీన్ని వేరే మాటల్లో చెప్తే, డబ్బు కూడా ( బంగారం కూడా ) సంపదే. కానీ సంపద అంతా డబ్బు కాదు.

మొత్తం సమాజంలో, ఒక సమయంలో, 10 బస్తాల ధాన్యమూ, 2 కుర్చీలూ, 3 దుప్పట్లూ, 10 బంగారు రూపాయి నాణాలూ వున్నాయి అనుకుందాం. ఈ వస్తువు లన్నీ కలిసిన మొత్తం ( రూపాయి నాణాలతోసహా ) సమాజానికి వున్న సంపద. అందులో 'డబ్బు'ని విడిగా చూస్తే, అది, 10 రూపాయి నాణాలు మాత్రమే.

ఈ వస్తువులన్నిటినీ విలువలుగా చూస్తే వాటి విలువలు ఇలా వున్నాయి అనుకుందాం :

| | | |
|---|---|---|
| 10 బస్తాల ధాన్యం | = | 100 రూ.లు |
| 2 కుర్చీలు | = | 10 రూ.లు |
| 3 దుప్పట్లు | = | 15 రూ.లు |
| 10 నాణాలు | = | 10 రూ.లు |
| సమాజంలో ఉత్పత్తి అయిన మొత్తం సంపద | = | 135 రూ.లు |

ఈ లిస్టు ప్రకారం 'సంపద' ఏది? ధాన్యమూ, కుర్చీలూ, దుప్పట్లూ, బంగారం నాణాలూ — అన్నీ కలిసే, సంపద. ఇది, మొత్తం 'వస్తువుల రాసి'. లేదా, 'ఉత్పత్తుల రాసి'. ఆ రాసి విలువ 135 రూ.లు. అందులో, 10 నాణాలు మాత్రమే 'డబ్బు'. దాని విలువ, 10 రూ.లు.

**22)** కుర్చీలను ఉత్పత్తిచేసే మనిషి దగ్గిర మొత్తం 2 కుర్చీలు వున్నాయి అనుకుందాం. ఒక్కో కుర్చీ విలువ 5 రూ.లు. కుర్చీల మనిషి సంపదని — 3 రకాలుగా చూడవచ్చు. ఆ సంపద 2 కుర్చీలుగానైనా వుంటుంది, లేదా మొత్తం డబ్బుగా చూస్తే 10 రూపాయలుగానైనా వుంటుంది. లేదా, 1 కుర్చీ + 5 రూ.లుగానైనా వుంటుంది. 2 కుర్చీలూ + 10 రూ.లుగా గానీ; 2 కుర్చీలూ + 5 రూ.లుగా గానీ; 1 కుర్చీ+ 10 రూ.లుగా గానీ వుండదు. అంటే, 2 కుర్చీలూ, వాటి డబ్బూ ఒకే చోట వుండవు.

**23)** ఒక స్త్రీ చేతిలో 2 రూ. నాణాలు వున్నాయి — అనుకుందాం. ఆమె, ఆ డబ్బుతో ఆహార పదార్థాలు కొనుక్కుని తినేసిందనుకుందాం. ఆమె 2 రూ.ల్ని ఖర్చు పెట్టేసినట్టుగా కనపడుతుంది. కానీ, నిజానికి ఆమె ఖర్చు పెట్టింది '2 రూ.ల నాణాల్ని' కాదు, కొన్ని ఆహార పదార్థాల్ని. 2 రూపాయి నాణాలు ఆమె చేతిలోనించీ వెళ్ళిపోవడమే అవి ఖర్చయిపోవడంగా కనపడుతుంది. కానీ, ఆ నాణాలు ఇంకొకరి చేతిలో భద్రంగానే వుంటాయి. ఒక వ్యక్తి తిండి తినడం వల్ల కొన్ని ఆహార పదార్థాలు మాత్రమే ఖర్చయి పోతాయి. అంటే, ఆ ఆహార పదార్థాల్ని తయారు చెయ్య డానికి పట్టిన శ్రమ అంతా (2 రూ.ల విలువగల శ్రమ) ఖర్చయిపోయింది. మళ్ళీ అంత శ్రమ జరిగితేనే ఆ పదార్థాలు తయారవుతాయి. అంటే, <u>డబ్బు ఖర్చయిపోయినట్టు కనపడి నప్పుడల్లా, నిజంగా ఖర్చయ్యేది కొన్ని వస్తువులే. అంటే, కొంత శ్రమే.</u>

**24)** ఒక వ్యక్తి 10 రూ.లతో ఒక చొక్కా కొన్నాడు. అతని చేతి నించి డబ్బు వెళ్ళిపోయింది. అతను కొన్న చొక్కా తక్షణం ఖర్చయిపోలేదు. ఒక సంవత్సరంపాటు వాడిన తర్వాత అది చిరిగింది. అంటే, ఆ వస్తువు అప్పటికి ఖర్చయింది. అదే ఒక కుర్చీ అయితే, పది పదిహేను సంవత్సరాలలో ఖర్చవుతుంది. అదే ఇల్లు అయితే, దాదాపు 100 సం.లకు ఖర్చవుతుంది. ఈ రకంగా, కొన్ని రకాల వస్తువులు త్వరగానూ, కొన్ని రకాలు మరీ త్వరగానూ, కొన్ని రకాలు ఆలస్యంగానూ, కొన్ని రకాలు మరీ ఆలస్యంగానూ ఖర్చవుతాయి. మొత్తంమీద, సమాజంలో తయారయ్యే ఉత్పత్తి అంతా త్వరగానో, ఆలస్యంగానో ఖర్చయిపోతూనే వుంటుంది. 'వస్తువు' అనేది, ఖర్చు కాకుండా ఎప్పటికీ శాశ్వితంగా వుండదు.

**25)** ఒక సరుకు విలువని డబ్బు ద్వారా చూస్తే, అది ఆ సరుకు 'ధర' అని చూశాం. అంటే, విలువా ధరా ఒకటే — అని దీని అర్థం. కానీ, నిత్యజీవితంలో మనకు, ఒకే సరుకుకి, 2, 3 రకాల ధరలు వుండడం కూడా కొన్ని సందర్భాల్లో కనపడుతుంది.

ఉదాహరణకి, రాజారావు ఒక చొక్కా బట్ట కొనడానికి బట్టల కొట్లోకి వెళ్ళి ఒక బట్టని ఎంచుకుని — "గజం ధర ఎంత?" అని అడిగాడు.

"5 రూ.లు" అన్నాడు. కొట్టు మనిషి.

రాజారావు తనకు కావలసినంత బట్ట తీసుకుని వెళ్ళిపోయాడు.

చంద్రం వచ్చి ఆ బట్టనే ఎంచుకుని — "గజం ఎంత?" అన్నాడు.

"5 రూ.లు" అన్నాడు కొట్టు మనిషి.

"ఏమీ తగ్గించరా?" అన్నాడు చంద్రం.

"బేరాల్లేవు" అన్నాడు కొట్టు మనిషి.

"సరే, అయితే" అని వెళ్ళిపోబోయాడు చంద్రం.

కొట్టు మనిషి చంద్రాన్ని వెళ్ళనివ్వకుండా, 'బేరా లున్నాయిలే' అన్నట్టు — "ఒక పావలా తగ్గించి ఇస్తాను, తీసుకోండి' అన్నాడు. చంద్రం ఒప్పుకోలేదు. చివరికి $4\frac{1}{2}$ రూ.లకి బేరం కుదిరింది. చంద్రం ఆ రేటుతోనే తనకు కావలసినంత బట్ట తీసుకున్నాడు.

ఒకే బట్ట కొన్ని నిముషాల తేడాతో ఒక సారి గజం 5 రూ.లూ., ఒక సారి గజం $4\frac{1}{2}$ రూ.లూ వుంది. ఇందులో ఏది నిజమైన ధర? — రెండూ బట్ట ధరలే. అయితే, ధర

అంటే విలువే కాబట్టి, ఒకే బట్టకి రెండు విలువలు ఎలా వుంటాయి?

ఈ బట్ట మనిషి, ఒక రోజున 20 గజాల బట్టని అమ్మా డనుకుందాం. బేరాలు చెయ్యనివాళ్ళకి కొంచెం ఎక్కువ ధరకీ, బేరాలు చేసేవాళ్ళకి కొంచెం తక్కువ ధరకీ, అలా చిన్న చిన్న తేడాలతో అమ్మాడనుకుందాం. మొత్తంమీద 20 గజాల్ని అమ్మగా 100 రూ.లు వచ్చాయనుకుందాం. ఒక గజం ధర సగటున 5 రూ.లు. ధర అన్నప్పుడు, 'సగటు ధర' గురించే చెప్పుకుంటున్నామని అర్థం. అమ్మకాలు జరిగేటప్పుడు, కొనే మనిషి వేపు నించీనూ, అమ్మే మనిషి వేపు నించీనూ వుండే అనేక పరిస్థితుల వల్ల, ఒకే సరుకు ధర, చిన్న చిన్న తేడాలతో వుండవచ్చు. అంతమాత్రాన సరుకు విలువ రక రకాలుగా వున్నట్టు అర్థం కాదు. ఈ బట్ట ఉదాహరణలో, 1 గజం బట్ట విలువ 5 రూ.లే. ఆ విలువ, ధరగా వ్యక్తమయ్యేటప్పుడు, (అమ్మకం జరిగేటప్పుడు) ఒక సారి 5 కన్నా కొంచెం ఎక్కువ వుండవచ్చు; ఒక సారి 5 కన్నా కొంచెం తక్కువ వుండవచ్చు. ఒక సారి ఐదే వుండవచ్చు. అంటే, ఒకే విలువ, వేరు వేరు ధర రూపాలలో వుండవచ్చు. ఒకే సరుకుకి వేరు వేరు ధరలు వున్నాయంటే, వేరు వేరు విలువలు వున్నాయని అర్థం కాదు. ఒకే విలువ వేరు వేరు సందర్భాల్నిబట్టి, వేరు వేరు ధర రూపాలలో వుందని మాత్రమే అర్థం.

ఒకే విలువ, వేరు వేరు ధరల్లో కనపడవచ్చు — అనే విషయాన్ని ఇక్కడితో వొదిలేద్దాం. విషయాలు తేలిగ్గా వుండడం కోసం, విలువా ధరా ఎప్పుడూ ఒకే రకంగా వుంటాయనే అర్థంతోనే ముందుకు సాగుదాం. విలువకీ, ధరకీ వుండే సంబంధంలో ఇంకా చాలా విషయాలు ముందు ముందు చాలా వివరంగా చూడవలసి వుంది. ఆ వివరాలన్నీ ఇక్కడే, ఇప్పుడే, అవసరం లేదు. ఆ అవసరం కలిగే వరకూ 'విలువా ధరా ఒకటే' అనే అవగాహనతోనే వుందాం. విలువా ధరా ఒకటే కాబట్టి 'ధర' అనే మాటని వదిలేసి 'విలువ' అనే మాటనే వుపయోగిస్తూ వుందాం.

ఇంత వరకూ, మనం సరుకుల మారకాలలో క్రమ క్రమంగా జరిగిన అభివృద్ధి దశలు చూశాం. మారకాలే లేని సమాజంలో మారకాలు ప్రారంభమై, అవి చాలా కాలం వరకూ బార్టరు పద్ధతిలోనే సాగాయి. తర్వాత, 'బంగారం' అనే సరుకు (వెండి కూడా) 'జనరల్ ఈక్వివలెంట్'గా స్థిరపడింది. అంటే, డబ్బు పుట్టుకొచ్చింది. డబ్బు రూపమే విలువ రూపం అయింది. — విషయాలు ఇంతవరకూ చూశాం.

# 'విలువ' గురించి పరిశోధన

'విలువ'నీ, దానికి 'రూపం'గా వున్న డబ్బునీ, సరిగా గ్రహించకపోతే, 'ఆర్థిక శాస్త్రం'లో ఇంకే విషయాన్నీ సరిగా గ్రహించడం సాధ్యం కాదు.

'ఆర్థిక శాస్త్ర చరిత్ర'లో 'విలువ' గురించీ, 'డబ్బు' గురించీ, పూర్తిగా సరిగా గ్రహించిన మొదటి వ్యక్తి — **మార్క్స్**. మార్క్సు కన్నా వెనకటి ఆర్థికవేత్తల్లో ఎవరికీ 'విలువ' గురించి సరైన అవగాహన లేదు. వాళ్ళంతా విలువని 'సహజమైన' విషయంగా భావించారు. అంటే, ఒక వస్తువుకి రంగూ, రుచీ, వాసనా, బరువూ, ఎత్తూ లాంటి లక్షణాలు వుండడం ఎలాంటి విషయమో, 'విలువ' వుండడం కూడా అలాంటి విషయమేనని భావించారు. కొన్ని శరీర ధర్మాలు లేకుండా వస్తువు వుండనట్టే, విలువ లేకుండా వస్తువు వుండదని భావించారు. వాళ్ళు అలా ఎందుకు భావించారంటే, 'విలువ'గా ఏదైతే అవుతుందో దాన్ని, అంటే 'శ్రమ'ని, వాళ్ళు సరిగా అర్థం చేసుకోలేక పోవడం వల్ల.

'విలువ' గురించి పరిశోధన, అంటే విలువ ఎలా ఏర్పడుతోందో తెలుసుకోవాలనే ఆలోచన, ఏ నాడో క్రీస్తుపూర్వం నించే ప్రారంభమైంది. ప్రకృతికీ, సమాజానికీ సంబంధించిన అనేక విషయాల గురించి పరిశీలించిన మేధావి **అరిస్టాటిల్** (క్రీ.పూ. 384 – 322) — సరుకుల విలువ గురించి మొట్టమొదట పరిశీలన చేసిన వ్యక్తి. సరుకులో వున్న విలువే డబ్బుగా కనపడుతోందనే సంగతి అరిస్టాటిలే మొదట చెప్పాడు.

2 మంచాలు = 1 ఇల్లు — అనడానికీ

2 మంచాలు = కొంత డబ్బు — అనడానికీ తేడా ఏమీ లేదు — అన్నాడు అరిస్టాటిల్. ఈ అవగాహన పూర్తిగా కరెక్టే, మొదటి ఉదాహరణలో, మంచాల విలువ — ఇల్లుగా వుంటే, రెండో ఉదాహరణలో, మంచాల విలువ — డబ్బుగా వుంది. అంటే, 'డబ్బు అనేది విలువకి రూపం' — అనే సంగతి అరిస్టాటిల్ సరిగ్గానే గ్రహించాడు.

2 సరుకులకు మారకం జరుగుతోందంటే వాటిలో 'విలువ' అనే సమాన లక్షణం వుందనీ, ఆ లక్షణం ద్వారానే వాటి మారకం సాధ్యమవుతుందనీ కూడా అరిస్టాటిల్ గ్రహించాడు. అయితే, ఆ 'విలువ' అనేది ఏమిటో మాత్రం (విలువ అంటే శ్రమే — అని) ఆయన గ్రహించలేకపోయాడు. ఆ వ్యక్తి ఎంత మేధావి అయినా, 'విలువ అనేది శ్రమే' అనే విషయాన్ని గ్రహించలేక పోవడానికి కారణం, ఆయన జీవించిన కాలం నాటి సామాజిక పరిస్థితులే.

క్రీస్తుపూర్వం అరిస్టాటిల్ జీవించిన గ్రీకు సమాజం

'భయంకరమైన అసమానత్వం'మీద ఆధారపడివున్న బానిస సమాజం. 'మానవులందరూ సమానులే' అనే భావం మానవులందరికీ వుదయించే వరకూ 'మానవ శ్రమ' అనే అంశాన్ని గ్రహించడం మానవులెవ్వరికీ సాధ్యం కాదు.

'మానవులందరూ సమానులే' అనే విషయం మానవుల గ్రహింపుకి ఎప్పుడు అందుతుందంటే, ఆ మానవులు ఉత్పత్తిచేసే 'సరుకులన్నీ సమానమే' అనే సంగతి రుజువైనప్పుడు! మానవులు ఉత్పత్తిచేసే ఉత్పత్తుల్లో అత్యధిక భాగం ఉత్పత్తులు, మారక సంబంధాలలోకి వెళ్ళే సామాజిక పరిస్థితులు ఏర్పడినప్పుడు, 'సరుకుల' సమానత్వమూ, ఆ సరుకుల్ని ఉత్పత్తిచేసే 'శ్రమల' సమానత్వమూ, ఆ శ్రమలను ఇచ్చే 'మానవుల' సమానత్వమూ, మానవుల గ్రహింపుకి అందడానికి 'అవకాశం' కలుగుతుంది. ఇదంతా జరగాలంటే, అది అరిస్టాటిల్ కాలానికి ఇంకా అనేక వందల సంవత్సరాల దూరం. 'విలువ' మీద ఈ పరిశోధన ప్రారంభించిన అరిస్టాటిల్, 'విలువ అంటే శ్రమ' అని గ్రహించలేక, తన పరిశోధనలో రెండో అడుగులోనే ఆగిపోయాడు. ఆయన వేసిన మొదటి అడుగు ఏమిటంటే, విలువ మీద కనీసమైన ఆలోచన కూడా లేని కాలంలో, '2 సరుకుల మధ్య ఏదో సమానమైన లక్షణం వుంది. దాని ద్వారానే మారకాలు సాధ్యమవుతున్నాయి' అని గ్రహించడం. అదే ఆ కాలంలో అరిస్టాటిల్ ప్రత్యేకత.

అరిస్టాటిల్ గ్రహించలేకపోయిన విషయాన్ని, అంటే 'విలువ అంటే శ్రమ' అనే విషయాన్ని, అరిస్టాటిల్ తర్వాత కూడా ఇంకా 2 వేల సంవత్సరాల వరకూ ఎవ్వరూ కనిపెట్టలేదు. చివరికి ఆ విషయాన్ని 1739 లో, ఒక (పేరు మనకు దొరకని) ఆర్థికవేత్త కనుక్కున్నాడని మార్క్సు ఒక ఫుట్‌నోట్‌లో చెప్పాడు. ఆ పేరులేని ఆర్థికవేత్త రాసిన పుస్తకం పేరు : "Some thoughts on the interest of money in general and particularly in the public funds & C". పుస్తకం మీద రచయిత పేరుగానీ, అది ఏ సంవత్సరంలో అచ్చయిందో తెలిపే రచనా కాలంగానీ లేవు, దాని లోపల వున్న ఆధారాల్ని బట్టి, అది 1739 ప్రాంతాల్లో అచ్చయి వుంటుందని మార్క్సు అభిప్రాయపడ్డాడు.

ఆ పేరు లేని ఆర్థికవేత్త కనిపెట్టిన విషయం ఇదీ: "వాటి విలువ (వస్తువుల విలువ), అవి మారకం అయినప్పుడు, వాటిని తయారు చెయ్యడానికి తప్పనిసరి గానూ, సర్వ సాధారణంగానూ అవసరమయ్యే శ్రమ పరిమాణంచేత నిర్ణయమవుతూ వుంటుంది" (కాపిటల్-1 మాస్కో ఎడిషన్, 1974, పేజీ 47) — ఇదే, అరిస్టాటిల్ గానీ, ఈ పేరులేని ఆర్థికవేత్త కన్నా వెనకటి ఆర్థికవేత్తలు గానీ, కనిపెట్టలేక పోయిన విషయం.

'2 సరుకుల మధ్య ఏదో సమాన లక్షణం వుంది' అని అరిస్టాటిల్ కనిపెడితే, 'ఆ లక్షణం శ్రమే' అని ఈ పేరులేని రచయిత కనిపెట్టాడు. ఈ రచయిత తర్వాత వున్న ఆర్థిక వేత్తలకు, 'విలువ అంటే శ్రమే' అని తెలుసు.

అయితే, 'విలువ అంటే శ్రమే' అని తెలియడం అంటే, 'శ్రమ'కి సంబంధించిన వివరాలన్నీ తెలిసినట్టు కాదు. ఏ శ్రమ అయినా 'రూపం వున్న శ్రమ' గానే వుంటుంది. కానీ, అన్ని శ్రమలూ ఒకే విలువతో వుండవు. ఉదాహరణకి, 1 గంట నేతా, 1 గంట వైద్యమూ, ఒకే విలువతో వుండవు. నేత — శారీరక శ్రమ. వైద్యం — మేధా శ్రమ. ఈ శ్రమల్ని ఒకే పరిమాణంతో తీసుకుంటే, శారీరక శ్రమ కన్నా మేధాశ్రమ ఎక్కువ విలువతో వుంటుంది. అంతేగాక, 'శ్రమ'లో నిర్జీవ శ్రమా, సజీవ శ్రమా అనే తేడాలు కూడా వుంటాయి. 'విలువ'ని ఇవ్వడంలో ఇవి వేరు వేరు పాత్రలు నిర్వహిస్తాయి. మనం ఇంకా ఈ విషయాలేవీ చూడలేదు. ( తర్వాత భాగాల్లో ఈ విషయాలన్నీ వివరంగా చూస్తాము. ) ఇక్కడ, గ్రహించవలసిందేమిటంటే — 'విలువ అంటే శ్రమే' అని గ్రహించినా, 'విలువ' గురించీ, 'శ్రమ' గురించీ, తెలియవలసిన విషయాలన్నీ తెలిసినట్టు అర్థం కాదు.

ఇంకో ముఖ్య విషయం — 'విలువ అంటే శ్రమే' అని తెలిస్తే చాలదు. 'శ్రమ అంటే విలువ కాదు' అని కూడా తెలియాలి. ఈ రెండో అంశం కూడా తెలియకపోతే ఏమవుతుందంటే — 'శ్రమ, తప్పనిసరిగా విలువగా వుంటుంది' అనే తప్పు అవగాహన ఏర్పడుతుంది. ఎందుకంటే, ఆ వ్యక్తి ఇలా ఆలోచిస్తాడు — "విలువ అంటే శ్రమే. శ్రమ లేకుండా వస్తువు వుండదు. కాబట్టి, విలువ లేకుండా వస్తువు వుండదు" అనుకుంటాడు. ఈ అవగాహన ఎందుకు తప్పో గతంలోనే చూశాం.

<u>వస్తువు, శ్రమతో తయారై కూడా విలువ లేకుండా వుండవచ్చు.</u> మారకాలే ప్రారంభంకాని కాలంలో, 'విలువ' ప్రసక్తి లేకుండానే వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోవడమూ వాడుకోవడమూ జరిగింది. ఆనాటి ఉత్పత్తులన్నీ శ్రమలతో తయారై కూడా విలువలు లేకుండానే వున్నాయి.

ఆ నాడే కాదు, మారకాలు ప్రారంభమైన తర్వాత కూడా నిన్న మొన్నటి వరకూ 'ఉత్పత్తుల రాసి'లో అత్యధిక భాగం, మారకాలలోకి వెళ్ళకుండానే (అంటే, విలువ ప్రసక్తి లేకుండానే) వాడకం అయ్యేది.

ఈ నాటికీ, ప్రతి ఒక్కవస్తువూ మారకంలోకి వెళ్ళదు. ముఖ్యంగా, ఇళ్ళల్లో తయారయ్యే పదార్థాలకు విలువ ప్రసక్తి వుండదు.

<u>మారకాలలోకి వెళ్ళని వస్తువులు, శ్రమలతో తయారై కూడా విలువలు లేకుండానే వుంటాయి.</u>

అంటే, వస్తువు తయారవడానికి శ్రమ తప్పనిసరేగానీ, ఆ శ్రమ, విలువగా మారడం తప్పనిసరి కాదన్న మాట. శ్రమ, విలువగా మారడం, మారకాలు (అమ్మకాలూ, కొనడాలూ) వుండడం వల్లనే జరుగుతుంది. దీన్ని గ్రహించకపోతే, శ్రమ — 'విలువ'గా మారడం తప్పనిసరి విషయంగా కనపడుతుంది. అంటే, వస్తువుకి విలువ వుండడం తప్పనిసరిగానూ, సహజంగానూ, కనపడుతుంది. ఆర్థికవేత్తకి ఇలాంటి అవగాహన వుందంటే, 'విలువ' గురించి అతని అవగాహన ఇంకా అస్పష్టంగానే, అరకొరగానే వుందని అర్థం.

'విలువ' గురించి ఎంతో కొంత ఆలోచన ప్రారంభం కావడానికి పూర్వం ఎన్నో వందల, వేల సంవత్సరాలనించే వస్తువుల్ని డబ్బుతో కొనటమూ అమ్మటమూ జరుగుతూనే వుంది. 'విలువ' గురించి ఆలోచన ప్రారంభించిన మనుషుల్ని 'ఆర్థికవేత్తలు' అనుకుంటే, ఆ ఆర్థికవేత్తలు లేని కాలం నించీ కూడా మారకాలూ, డబ్బు లెక్కలూ వున్నాయి.

సమాజంలో 'విలువ వుండడం' చూసిన ఆర్థికవేత్త, 'విలువ వుండడం సహజం' అనుకున్నాడు.

విలువని సహజ లక్షణంగా భావించే ఆర్థికవేత్తకి కనీసం ఒక ప్రశ్న వచ్చి వుండవలసింది — "వస్తువుకి వుండే సహజ లక్షణాలన్నీ వస్తువు శరీరంలోనే వుంటున్నాయి కదా, విలువ కూడా సహజ లక్షణమైతే అది కూడా వస్తువు శరీరంలోనే ఎందుకు వుండడం లేదు? వస్తువు విలువ, డబ్బు రూపంతో వస్తువుకి బయట ఎందుకు వుంటోంది?" ఈ ప్రశ్న వచ్చి వుండవలసింది. అంతే కాదు. ఇంకో ప్రశ్న కూడా రావాలి. "వస్తువులు, వెనకటికాలంలో విలువ లేకుండానే వున్నాయి కదా? ఇప్పుడు కూడా కొన్ని వస్తువులు విలువ లేకుండానే వుంటున్నాయి కదా? విలువ, కొన్ని వస్తువులకే వుండడమూ, కొన్ని వస్తువులకు లేకపోవడమూ ఎందుకు జరుగుతోంది? విలువ, తప్పనిసరిగా ఏర్పడే సహజ లక్షణం కాదా?" అనే ప్రశ్నలు కూడా రావాలి. ఈ రకం ప్రశ్నలు రాకపోవడం అంటే, ఆర్థికవేత్త అనే మనిషి, ఆర్థిక శాస్త్రానికంతటికీ అతి ప్రధానమైన ప్రశ్ననే గ్రహించలేకపోయాడని అర్థం.

ఈ ప్రశ్నలు ఆ నాడే కాదు, అనేక మంది ఆర్థికవేత్తలకు ఈ నాటికీ లేవు. 'ఈ నాటికి' అంటే — 'విలువ'కీ, 'డబ్బు'కీ సంబంధించిన సమస్తమైన విషయాల్నీ మార్క్సు ఎంతో వివరంగా చర్చించిన తర్వాత కూడా! ఈ నాటికీ ఇంకా అనేక మంది ఆర్థికవేత్తలు, 'వస్తువుకి విలువ సహజ లక్షణం' అనే దృష్టితోనే వున్నారు.

విలువని సహజ లక్షణంగా భావించే ఆర్థికవేత్త లెవ్వరికీ, దాన్ని గురించి 'హేతుబద్ధమైన' ప్రశ్నలూ, పరిశీలనా లేవని అర్థం. అలాంటి ఆర్థికవేత్తకి ప్రతీ వస్తువూ, 'కొంత విలువగల సరుకు'లా మాత్రమే కనపడుతుంది.

ఒక కుర్చీని "నువ్వు ఎవరివి? నీ పని ఏమిటి?" అని అడిగితే, అది — "నేను కుర్చీని. మనుషులు కూర్చోడానికి నేను పనికివస్తాను" అని చెపుతుంది.

కానీ, కుర్చీని ఒక ఆర్థికవేత్తకి చూపించి "అదేమిటి? దాని పనేమిటి?" అని అడిగితే, ఆ ఆర్థికవేత్త — "అది 5 రూ.ల సరుకు. అది మనుషులు కూర్చోడానికి పనికివస్తే వొస్తుందేమో, అది ఆ తర్వాత సంగతి" అంటాడు. అంటే, ఈ ఆర్థికవేత్త కుర్చీని 'కొంత విలువతో నిండిన సరుకు'లా మాత్రమే మొదట చూస్తాడన్నమాట. దాని ఉపయోగం సంగతి ఆ తర్వాత! — ఇలాంటి ఆర్థికవేత్త కన్నా కుర్చీయే ఎంతో తెలివైంది కదా?

'విలువ' గురించీ, 'డబ్బు' గురించీ, చాలా స్పష్టంగా గ్రహించిన మొదటి ఆర్థికవేత్త — మార్క్సే. శ్రమ అనేది, దానికై అది విలువ కాదనీ; వస్తువు, 'మారకం'లోకి వెళ్ళినప్పుడు వస్తువుని తయారుచేసిన శ్రమ అంతా 'రూపంలేని శ్రమ'గా మారడమే విలువ అనీ — మార్క్సు గ్రహించాడు. శ్రమనీ, డబ్బునీ సరిగా అర్థం చేసుకున్నప్పుడే, విలువకి సంబంధించిన గ్రహింపు సమగ్రం అవుతుంది. ఈ పని, మార్క్సు ద్వారా 'కాపిటల్' పుస్తకంలో జరిగింది. ('కాపిటల్' మొదటి ప్రచురణ కాలం 1867). మార్క్సు, 'కాపిటల్'లో, "సరుకుని తయారుచేసే శ్రమకు గల రెండు లక్షణాలు" చాప్టరులో ఒకచోట "సరుకులను తయారుచేసే శ్రమకు వుండే 2 లక్షణాల్ని ఎత్తి చూపిందీ, వాటిని సమగ్రంగా పరిశీలించిందీ మొదట నేనే" అని చెప్పాడు. 24-8-1867 న ఎంగెల్సుకి రాసిన ఉత్తరంలో కూడా మార్క్సు — "నా పుస్తకంలో చాలా మంచి పాయింట్లలో ఒకటి 'శ్రమకు గల 2 లక్షణాలు' అనేది. వాస్తవాన్ని అర్థం చేసుకోవడం అంతా ఈ విషయం మీదే ఆధారపడి వుంటుంది" అన్నాడు.

('ఇది పరిశీలించింది మొదట నేనే' అని మార్క్సు చెప్పిన మాటల్ని బడాయిగా చెప్పుకున్నట్టుగా అనుకోకూడదు. ఇది సైన్సు విషయం కాబట్టి, ఆ వివరాలు ఇవ్వడం కోసమే అలా చెప్పాడని అనుకోవాలి.)

'విలువ'ని సహజమైన అంశంగానూ, వస్తువులతో పాటు శాశ్వతంగా వుండి తీరే అంశంగానూ ఆర్థికశాస్త్రం భావిస్తూ వున్న కాలంలో, విలువకి సంబంధించిన సరైన అవగాహన మార్క్సు ద్వారానే ఆర్థికశాస్త్రానికి అందింది. క్రీస్తు పూర్వం 300 సంవత్సరాల క్రితం అరిస్టాటిల్ ద్వారా ప్రారంభమైన 'విలువ పరిశోధన' క్రీస్తు తర్వాత 1867 నాటికి మార్క్సు ద్వారా సమగ్రం అయింది. అంటే, ఆ పరిశోధన ప్రారంభమైన తర్వాత దాదాపు 2,200 సం.లకు విలువ గురించి సరైన అవగాహన ప్రపంచానికి అందిందన్నమాట!

'కాపిటల్'కి రాసిన ఒక 'ముందుమాట'లో మార్క్సు — "విలువ అంతు తేల్చుకోవడానికి మానవ మేధస్సుకి 2 వేల సంవత్సరాలు పట్టింది!" అన్నాడు.

'విలువ పరిశోధన' మార్క్స్ ద్వారా సమగ్రం అయింది' అన్నప్పుడు, ఆర్థికవేత్తలంతా మార్క్స్ వివరించిన అంశాలన్నిటినీ పరిశీలించి అందులో వున్న నిజానిజాలు గ్రహించారనీ, విలువ గురించి గత కాలం నించి వున్న పొరపాటు అభిప్రాయాలనన్నిటినీ అందరూ వదిలివేశారనీ, అర్థం కాదు. మార్క్స్ తర్వాత కూడా 'విలువ' గురించి ఏమీ తెలియని ఆర్థికవేత్తలూ, విలువని సహజ లక్షణంగా భావించే ఆర్థికవేత్తలూ, కొల్లలుగానే వున్నారు.

మార్క్స్, 'విలువ'ని సరిగా గ్రహించడం వల్ల, దాని ఆధారంతో ఆర్థికశాస్త్రంలో ఇంకా ఏ యే విషయాల్ని కూడా సరిగా గ్రహించగలిగాడో ఈ ' కాపిటల్ ' పుస్తకంలోనే ఇంకా ముందు ముందు భాగాల్లో చూస్తాం.

# ప్రశ్నలూ — జవాబులూ

**1. డబ్బుకి వున్న 'మహిమ' ఏమిటి?**

**జ:** 'డబ్బు' అనేది, ప్రపంచంలో వున్న ఏ సరుకుతోనైనా మారగలదు. అంటే, ఏ సరుకునైనా కొనగలదు. అదే డబ్బుకి వున్న మహిమ. డబ్బుగా లేని సరుకులకు ఈ మహిమ ఉండదు. అవి, అన్ని సరుకులతోనూ మారలేవు.

**2. 1 శేరు జొన్నల విలువ --1 రూపాయి.**
**1 శేరు రేగు పళ్ళ విలువ --1 రూపాయి.**
**ఈ సంగతి జొన్నల మనిషికీ, రేగుపళ్ళ మనిషికీ కూడా తెలుసు. జొన్నల మనిషి దగ్గిర డబ్బులు లేవు. జొన్నల మనిషి, శేరు జొన్నలు ఇచ్చి, శేరు రేగుపళ్ళు తీసుకున్నాడనుకుందాం. ఇది బార్టరు పద్ధతిలో జరిగిన మారకమేనా?**

**జ:** కాదు. ఇది డబ్బు లెక్కల ద్వారా జరిగిన మారకమే.

**3. విలువ లెక్కలు లేకుండా ఉత్పత్తిని వాడుకునే సందర్భాల్ని కొన్నిటిని చెప్పండి!**

**జ:** ఇంట్లో తయారుచేసి వాడుకునే వస్తువుల్లో దేనికీ విలువ లెక్కలు చూడం. బహుమతులు ఇచ్చేటప్పుడూ, దాన ధర్మాలు చేసేటప్పుడూ కూడా విలువ లెక్కలు చూడం.

**4. బియ్యం, బట్ట, కుర్చీ, బెల్లం, దుప్పటీ, చెప్పులు — అనే 6 సరుకులకు వరస నెంబర్లు ఇవ్వండి. 1 వ సరుకుని అమ్మగా వచ్చిన డబ్బుతో 2 వ సరుకునీ, 2 వ సరుకుని అమ్మగా వచ్చిన డబ్బుతో 3 వ సరుకునీ — ఇలా కొన్నారని — ఉదాహరణ తీసుకోండి. ప్రతీ సరుకు మనిషీ, తన సరుకుని ఏ నంబరు మనిషికి ఇచ్చి, తను ఏ నంబరు సరుకుని తీసుకున్నాడో వరసగా రాయండి!**

**జ:** 1 వ నంబరు సరుకు మనిషి, తన సరుకుని ఏ నంబరు మనిషికి అమ్మాడో ఇక్కడ చెప్పలేము. కానీ, తను మాత్రం 2వ నంబరు సరుకుని కొన్నాడు.

2 వ నంబరు మనిషి, తన సరుకుని 1 వ నంబరు మనిషికి అమ్మి, తను 3 వ నంబరు సరుకుని కొన్నాడు. —ఇలాగే, అన్నీ జరుగుతాయి. 6 వ నంబరు సరుకు మనిషి 7 వ నంబరు సరుకుని కొంటాడు. దీని అర్థం ఏమిటంటే — ఒక మనిషి, ఒక సరుకుని అమ్మి, ఇంకో సరుకుని కొన్నాడంటే, ఆ 2 సరుకులే ఒకదానితో ఒకటి మారాయని అర్థం కాదు. బార్టరులో అయితేనే అలా జరుగుతుంది. మారక సాధనంగా డబ్బు వచ్చిన తర్వాత, ప్రతీ సరుకూ డబ్బుతోనే మారుతుంది.

**5. బియ్యం, బట్ట, కుర్చీ — ఈ 3 సరుకుల్నే తీసుకుందాం. బట్ట మనిషి, తన సరుకుని బియ్యం మనిషికి అమ్మి, ఆ డబ్బుతో కుర్చీ కొన్నాడనుకుందాం. అయితే, 'బట్ట'కి, బియ్యంతో మారకం జరిగినట్టా, 'కుర్చీ'తో మారకం జరిగినట్టా?**

**జ:** 'బట్ట'ని అమ్మినప్పుడు — బట్టకీ – డబ్బుకీ మారకం.

ఆ డబ్బుతో 'కుర్చీ'ని కొంటే — అప్పుడు, డబ్బుకీ కుర్చీకీ మారకం. బట్టకి, కుర్చీతో సూటిగా మారకం జరగలేదు. కానీ, 'బట్ట' మనిషిని తీసుకుందాం. అతను, తన బట్టని అమ్మి కుర్చీని కొన్నాడు. అతని వేపు నించి చూస్తే, బట్టకీ కుర్చీకీ మారకం జరిగినట్టు అర్థం. అలాగే, ఇతర సరుకుల విషయం కూడా.

**6. మీరు డబ్బు ఇచ్చి చొక్కా కొన్నారు. మీరు చొక్కాకి బదులుగా ఏ సరుకుని ఇచ్చినట్టు అర్థం?**

**జ:** డబ్బుని ఇచ్చినట్టే తెలుస్తుంది. ఈ ఉదాహరణ ప్రకారం, అంతకన్నా వివరంగా తెలియదు.

| **7. ఖాళీలను పూర్తి చెయ్యండి.** | జవాబులు : |
|---|---|
| 1) ఏ సరుకైతే 'జనరల్ ఈక్వివలెంటు'గా వుంటుందో, ఆ సరుకే .................. | డబ్బు |
| 2) డబ్బు ద్వారా కనపడే విలువ పేరు ...... | ధర. |
| 3) డబ్బు అంటే ............... | శ్రమే. |
| 3) డబ్బుతో సంబంధం .............. సంబంధమే. | శ్రమతో |
| 5) సామాజిక సంపద ...................... | ఉపయోగపు విలువల రాసి. |
| 6) డబ్బుకి ........................ ఉంటుంది. ..................................... ఉండదు. | విలువే ఉపయోగపు విలువ |

★

# 9. సరుకుల మాయ !

సరుకుల్ని డబ్బుకి అమ్మడమూ, డబ్బు ఇచ్చి సరుకుల్ని కొనడమూ — ఈ వ్యవహారం పైపైన చూడగానే చాలా తేలిగ్గా, సింపుల్‌గా అర్థమైపోయే విషయంలాగ కనిపిస్తుంది. కానీ, సరుకుల అంతర్గత విషయాల్ని పరిశీలించడం ప్రారంభిస్తే, అది 'మహా నిగూఢమైన రహస్యం'లాగా, 'మాయ'లాగా అయిపోతుంది.

ఒక వస్తువుని, ఉపయోగపు విలువగా చూస్తే, అందులో, మనుషులకు అర్థం గాని నిగూఢత్వం ఏమీ వుండదు. ఏ వస్తువుని చూసినా, దాన్ని మనుషులు, ప్రకృతిలో దొరికే పదార్థాల్ని ఉపయోగించి, తమ అనుభవ జ్ఞానంతో తమకు అవసరమైన విధంగా తయారు చేసుకుని, ఉపయోగించు కుంటున్నారనే సంగతి, స్పష్టంగా కనపడుతూనే వుంటుంది. కుర్చీని చూస్తే దాన్ని మనుషులు చెక్కతో తయారు చేసుకున్నారనీ, దాన్ని కూర్చోవడానికి ఉపయోగించు కుంటున్నారనీ తెలిసిపోతూ వుంటుంది. అందులో ఇంకా లోతుగా పరిశోధించి అర్థం చేసుకోవలసిన అంశం ఏమీ వుండదు. కానీ, వస్తువు, 'సరుకు'గా మారి, దానికి 'విలువ' కొలతలు ప్రారంభమయ్యాయీ అంటే, ఇక దాని 'నిగూఢత్వ మంతా' ప్రారంభమవుతుంది.

వస్తువుని వస్తువుగానే చూసినప్పుడు, ఎంతో సహజంగా, స్పష్టంగా, తేటతెల్లంగా కనపడే, అర్థమయ్యే విషయాలన్నీ, వస్తువుని, సరుకుగా చూడగానే చాలా అసహజత్వంలోకీ, అయోమయంలోకీ, పెద్ద గందరగోళంలోకీ వెళ్ళిపోతాయి. అమ్మడమూ, కొనడమూ లేకుండా వస్తువు వస్తువుగానే వుంటే, అందులో రహస్యంగా, మర్మంగా, మనుషుల గ్రహింపుకి అందనిదిగా వుండే విషయం ఒక్కటి కూడా వుండదు. వస్తువు, సరుకుగా మారడంతో అది మహా విచిత్రమైన మార్మిక విషయంగా తయారవుతుంది. 'సరుకులు' అనగానే, అమ్మడాలూ, కొనడాలూ, విలువ కొలతలూ, డబ్బు లెక్కలూ, ధరలూ, ఇప్పటి దాకా మనం ఇంకా చూడని లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ, జీతాలూ, సప్లయి డిమాండ్లూ, జనరల్ లాభం రేటూ, ప్రత్యేక లాభం రేట్లూ, చలామణీ సాధనాలూ, చలామణీ సాధనం పరిమాణాలూ — ఇలా ఇంకా ఎన్నెన్నో విషయాలు సరుకుల చుట్టూ చేరిపోతాయి. వీటన్నిటి మధ్యా 'వస్తువులకు' సంబంధించిన సహజ విషయాలు మరుగున పడి కనపడకుండా, అర్థం కాకుండా పోతాయి.

వస్తువు వస్తువుగా వుంటే ఎంతో స్పష్టంగా అర్థమయ్యే విషయాలు, వస్తువు సరుకుగా మారినప్పుడు అర్థం కాకుండా పోవడమే — 'సరుకుల మాయ'! వస్తువు, సరుకు అవతారం ఎత్తితే, ఇక క్రమంగా ఆ అవతారం సృష్టించే 'మర్మమే', అయోమయమే, మానవ సమాజంలో అన్ని రంగాల్నీ ఏలుతుంది.

'సరుకు' సృష్టించే మాయనీ, మర్మాన్నీ కనిపెట్టడానికి, దాన్ని తయారుచేసే మనుషులకే అనేక వేల సంవత్సరాలకు పైగా పట్టింది. ఆ లోగా అది, అనేక మంది ఆర్థికవేత్తల్ని అనేక తప్పు దారులు పట్టించింది. అందులో <u>అతి ముఖ్యమైన తప్పు దారి — 'విలువ'ని, 'ప్రకృతి సహజ విషయం'గా భావించడం!</u>

ఆర్థిక శాస్త్రంలోకి మార్క్సు వచ్చిన తర్వాతే అసలు విషయం బయటపడింది. వస్తువుకి విలువ వుండడం సహజ విషయం కాదనీ, అది వస్తువుకి శరీర ధర్మం కాదనీ, 'ఉత్పత్తి సంబంధాల'లో వున్న కొన్ని ప్రత్యేక పరిస్థితుల వల్లనే అది ఏర్పడిందనీ, భవిష్యత్తులో ఏర్పడబోయే 'ఫలానా రకపు' ఉత్పత్తి సంబంధాలలో అది తొలగిపోతుందనీ — ఇలా, మార్క్సు ద్వారా, ఒక హేతుబద్ధమైన వివరణ దొరికింది. దానితో, అంత వరకూ ఆర్థిక శాస్త్రంలో వుంటూ వచ్చిన అనేక పొరపాటు అర్థాలు తల్లకిందులుగా మారి, 'సరుకుల మాయ' విచ్చిపోయింది. ఆర్థిక శాస్త్రంలో అంత వరకూ అర్థం కాకుండా వుండిపోయిన సమస్యలన్నిటికీ పరిష్కారాలు అందాయి.

## సరుకులు, 'మాయ'ని ఎలా సృష్టిస్తాయి?

**1)** 'మారకాలు' వున్నా లేకపోయినా, మనుషుల మధ్య వుండే సంబంధాలు — 'శ్రమ సంబంధాలే'. అయితే, ఈ విషయం, మనుషులకు, మారకాలు లేనప్పుడు అర్థమైనట్టుగా, మారకాలు వున్నప్పుడు అర్థం కాదు. 'మారకాలు లేనప్పుడు' అంటే, 'మారకాలే ప్రారంభం కాని ప్రాచీన కాలంలో' అని అర్థం కాదు. ఆ కాలంలో 'శ్రమ' అనే ఆలోచనే లేదు. ఆ ఆలోచన ప్రారంభమై ఆ అంశాన్ని ( శ్రమ అనే అంశాన్ని ) గ్రహించిందంతా మారకాలు వున్న

సమాజంలోనే. 'శ్రమని గ్రహించారు' అంటే, ఆ విషయం మనుషులందరూ గ్రహించారని కాదు. ఆర్థిక శాస్త్ర రంగానికి సంబంధించిన కొందరు 'ఆలోచనాపరులు' మాత్రమే దాన్ని గ్రహించారు. అది కూడా చాలా 'అరకొరగా' మాత్రమే గ్రహించారు. కాబట్టి, 'శ్రమ'నీ, 'శ్రమ సంబంధాల్నీ' ఎవరో కొందరు ఆర్థికవేత్తలు గ్రహించడం మాత్రమేగాక మనుష లందరూ గ్రహించాలన్నా, ఆ గ్రహించే దాన్ని కూడా అరకొరగా గాక సరిగ్గా గ్రహించాలన్నా — ఆ పని, మారకాలు లేనప్పుడు సాధ్యమైనట్టుగా మారకాలు వున్నప్పుడు సాధ్యం కాదు.

సమాజంలో వున్న మనుషులందరూ, స్త్రీ – పురుషు లందరూ, ఉపయోగకరమైన శ్రమలు చేస్తూ, అందరూ జీవించడానికి కావలసిన రక రకాల వస్తువుల్ని సమిష్టిగా ఉత్పత్తి చేస్తూ, ఆ 'ఉత్పత్తుల రాసి'ని మారకాల ప్రసక్తి లేకుండానే వాడుకుంటూ వుంటారనుకుందాం. అలా జరిగితే, మనుషుల సంబంధాలు మనుషులకు స్పష్టంగా తెలియడానికి మార్గం ఏర్పడుతుంది. అప్పుడు, ప్రతీ మనిషీ ఇలా అనుకుంటాడు — "నేను ఫలానా పనులు చేస్తున్నాను. ఇతరులు కూడా ఫలానా ఫలానా పనులు చేస్తున్నారు. అందరి పనుల వల్లా, రక రకాల ఉత్పత్తులు తయారవు తున్నాయి. ఆ ఉత్పత్తుల్ని అందరం వాడుకుంటున్నాం. అంటే, మనుషులందరం ఒకరి శ్రమల్ని ఒకరం ఉపయో గించుకుంటున్నాం" అనుకుంటాడు. మనుషులు ఇలా గ్రహించడం అంటే, మనుషుల మధ్య వున్న 'నిజమైన సంబంధాల్ని' (శ్రమ సంబంధాల్ని), మనుషులు తెలుసుకో గలుగుతున్నారని అర్థం.

కానీ, మనుషులు ఉత్పత్తిచేసే వస్తువు లన్నిటి మధ్యా మారకాలు జరుగుతూ వుంటాయనుకుందాం. అంటే ప్రతీ మనిషి, తన ఉత్పత్తుల్ని అమ్మి, దానికి బదులుగా వచ్చిన డబ్బుతో తనకు కావలసిన ఉత్పత్తుల్ని కొంటూ ఉంటా డనుకుందాం. అప్పుడు, మనుషుల సంబంధాలు మనుష లకు ఎలా కనపడతాయి? దీన్ని 2 వ పాయింటులో చూద్దాం.

**2)** కుర్చీకీ దుప్పటికీ మారకం జరిగిందను కుందాం. మారకం కూడా 'శ్రమల సంబంధమే'. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం కుర్చీలో శ్రమ అంతటినీ 'వడ్రంగం' అనీ, అది అంతా కుర్చీ మనిషి శ్రమ అనీ; దుప్పటిలో శ్రమ అంతటినీ 'నేత' అనీ, అది అంతా దుప్పటి మనిషి శ్రమ అనీ — అనుకుందాం. అంటే, ఈ వస్తువుల మారకం, నేత శ్రమకీ, వడ్రంగం శ్రమకీ సంబంధం. కుర్చీమనిషి — "నా వడ్రంగం శ్రమని, ఇంకో మనిషి వాడుతోంటే, అతని నేత శ్రమని నేను వాడుతున్నాను" అని గ్రహించాలి. దుప్పటి మనిషి కూడా ఆ పద్ధతిలోనే గ్రహించాలి. కానీ, అలా జరగదు. అంటే, ఆ ఇద్దరూ కూడా — "ఇది మన శ్రమల సంబంధం" అని గ్రహించరు. ఎలా గ్రహిస్తారంటే, తమ సంబంధాన్ని, 'సరుకుల' ద్వారా ఏర్పడే సంబంధంగా గ్రహిస్తారు. ఎందుకంటే, తమ సంబంధం, తమ సరుకుల మారకం ద్వారా ఏర్పడడమే చూస్తారు గనక.

కుర్చీ మనిషి అవగాహన ఇలా వుంటుంది — "కుర్చీని నేను చేశాను. కాబట్టి కుర్చీ నాది. నేను కుర్చీ యజమానిని. ప్రతీ వస్తువుకీ విలువ వుండడం సహజం. నా కుర్చీకి కూడా కొంత విలువ వుంటుంది. విలువ, కుర్చీదే. కానీ, ఆ కుర్చీ నాది కాబట్టి, దాని విలువ కూడా నాదే. (బరువు — కుర్చీదే, రంగు — కుర్చీదే అన్నట్టు, 'విలువ' కూడా కుర్చీదే అనుకుంటాడు. విలువ కుర్చీది అయినా, ఆ కుర్చీ తనదే కాబట్టి, ఆ కారణంవల్లే ఆ విలువ తనది అవుతుంది — అనుకుంటాడు. అంతేగానీ, ఆ శ్రమ తను చేసిందే కాబట్టి, 'విలువ' అనేది తనదే — అని గ్రహించలేడు.) కుర్చీ విలువ నాది అయినట్టే, దుప్పటి విలువ దుప్పటి మనిషిది. కుర్చీ విలువకీ, దుప్పటి విలువకీ సరిపోయింది కాబట్టి, కుర్చీని ఇచ్చి దుప్పటిని తీసుకున్నాను. దుప్పటి మనిషి కూడా అందుకే దుప్పటిని ఇచ్చి కుర్చీని తీసుకున్నాడు. నా దగ్గిర ఒక సరుకు వుంది. అతని దగ్గిర ఒక సరుకు వుంది. నేను ఒక సరుకు యజమానిని. అతను ఇంకో సరుకు యజమాని. నా సరుకుకీ అతని సరుకుకీ సంబంధం ఏర్పడింది. (తన శ్రమకీ, అతని శ్రమకీ సంబంధం — అని కాకుండా.) నాకూ అతనికీ వుండే సంబంధం — ఒక సరుకు యజమానికీ, ఇంకో సరుకు యజమానికీ వుండే సంబంధమే" — ఇదీ కుర్చీ మనిషి అవగాహన.

ఇందులో పొరపాటేమిటంటే: బరువూ, రంగూ — కుర్చీవే. అవి కుర్చీ మనిషివి కావు. కానీ, విలువ — కుర్చీది కాదు. అది కుర్చీని చేసిన మనిషి శ్రమే. కాబట్టి అది ఆ మనిషిదే. కానీ, ఆ మనిషి, కుర్చీ విలువని కూడా కుర్చీ శరీర లక్షణం లాగే భావిస్తాడు.

కుర్చీ మనిషి, తనకీ, తన శ్రమతో తయారైన వస్తువుకీ వుండే సంబంధాన్ని సరిగా గ్రహించడు.

దుప్పటి మనిషి అవగాహన కూడా ఇంతే.

సరుకుల మనుషులు, 'విలువ' అంటే ఏమిటో తెలియకపోయినా, సరుకులకు విలువలు ఉండడం చూస్తారు. 'విలువల' ద్వారానే సరుకులకు సంబంధా లేర్పడడం (మారకాలు జరగడం) చూస్తారు. తమ సరుకుల ద్వారానే తమ మధ్య సంబంధాలేర్పడడం చూస్తారు.

అంటే, రక రకాల శ్రమలతో రక రకాల వస్తువుల్ని ఉత్పత్తి చేస్తూ, ఆ వస్తువుల్ని మారకాలు చేసుకుంటూ

జీవించే మనుషుల సంబంధాలు, ఆ మనుషులకే ఎలా కనపడతాయంటే, 'శ్రమ సంబంధాలు'గా గాక, 'సరుకు యజమానుల సంబంధాలు'గా కనపడతాయి. అంటే, మారకాలు, నిజ సంబంధాల్ని మరుగు పరుస్తాయి.

**3)** 'మానవ సంబంధాలు' అంటే, 'శ్రమ సంబంధాలే' గానీ, ' రక్త సంబంధాలు' కావు. 'రక్త సంబంధం' అనేది, ప్రకృతి సహజ సంబంధం. రక్త సంబంధాలు, మానవుల విషయంలోనే కాక, పక్షులకూ, జంతువులకూ కూడా వుంటాయి. ఈ విషయంలో మానవుల ప్రత్యేకతేమీ లేదు. ఇతర జంతు జాలాలకూ, మానవులకూ వుండే తేడా 'శ్రమ చెయ్యడం' అనే విషయంలోనే —అని గతంలోనే చూశాం. శ్రమ చేసి వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోవడమూ, వస్తువుల్ని ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా శ్రమల్ని ఇచ్చి పుచ్చుకోవడమూ— అనేది మానవుల ప్రత్యేకత. కాబట్టి 'మానవ' సంబంధాలు అంటే, 'శ్రమ' సంబంధాలే. రక్త సంబంధాలనేవి — ప్రకృతి సహజ సంబంధాలైతే, శ్రమ సంబంధాలనేవి —'సామాజిక సంబంధాలు'.

'సమాజం' అంటే మానవుల 'సమూహం'. ఈ సమూహం, ఇతర ప్రాణుల సమూహాల వంటి సమూహం కాదు. ఇది శ్రమ సంబంధాలు గల సమూహం. మనుషుల మధ్య వుండే శ్రమ సంబంధాలే, వారి సమాజ సంబంధాలు. ('సమాజం' అనే విషయాన్ని అర్థం చేసుకోవాలంటే, దానికి సంబంధించి ఇంకా చాలా లక్షణాలు చూడాలి. ప్రస్తుతం ఇక్కడ ఇంత వరకూ చాలు.)

ఒక మనిషి ఒంటరిగా అడవిలో వుంటూ, ఆకో అలమో తింటూ కాలం గడుపుతున్నా డనుకుందాం. ఆ మనిషి, ప్రకృతి సహజంగా దొరికే పదార్థాల్ని సేకరించే శ్రమ చేస్తున్నాడని అర్థం. ఇంకో మనిషి, అడవిలో వుంటూనే తనకు కావలసిన వస్తువుల్నీ పదార్థాల్నీ తయారుచేసుకుని వాడుకుంటున్నా డనుకుందాం. ఈ రెండో మనిషి, మొదటి మనిషి కన్నా ఎక్కువ రకాల శ్రమలు చేస్తున్నాడని అర్థం. ఈ 2 ఉదాహరణల్లోనూ వున్న మనుషులు, తమ శ్రమల్ని ఇతరులకు ఇవ్వడంగానీ, ఇతరుల శ్రమల్ని తాము తీసుకోవడం గానీ, చెయ్యడం లేదు. ఈ మనుషులకు ఇతర మనుషులతో శ్రమ సంబంధాలు లేవు కాబట్టి, ఈ మనుషులకు ఇతరులతో సమాజ సంబంధాలు లేవని అర్థం.

**4)** మారకాలు, నిజ సంబంధాల్ని మరుగు పరుస్తాయని చూశాం. 'నిజ సంబంధాలు మరుగున పడడం' అనే విషయం, బార్టరు పద్ధతి మారకాలలో కన్నా, డబ్బు ద్వారా జరిగే మారకాలలోనే ఎక్కువగా జరుగుతుంది. కుర్చీకీ దుప్పటికీ బార్టరు పద్ధతిలో మారకం జరిగిందనుకుందాం. ఈ మారకంలో, ఇద్దరు మనుషులు మాత్రమే వుంటారు. 1వ మనిషి వస్తువు 2వ మనిషికీ, 2వ మనిషి వస్తువు 1వ మనిషికీ— ఎదురు బొదురుగా మారతాయి. బార్టరు మారకం, 'విలువల' మారకంగానే గాక, 'ఉపయోగపు విలువల' మారకంగా కూడా వుంటుందని గతంలోనే చూశాం. కుర్చీమనిషి గానీ, దుప్పటిమనిషి గానీ — "ఒకరి వస్తువుతో ఒకరికి అవసరం వుంది. ఒకరి వస్తువుని ఒకరం తీసుకుంటున్నాము" అని గ్రహించడానికి మార్గం వుంది. ఈ మనుషులు, తమ సంబంధాన్ని 'శ్రమల సంబంధం'గా గ్రహించకపోయినా, "ఒక మనిషి అవసరం ఇంకో మనిషి వల్ల తీరుతుంది" అని గ్రహించగలుగుతారు.

కానీ, ఇదే మారకం 'డబ్బు' ద్వారా జరిగితే, వస్తువుల మనుషులు, ఆ కనీసపు విషయం కూడా గ్రహించలేరు.

కుర్చీని అమ్మి, ఆ డబ్బుతో దుప్పటిని కొనడం — అనే విషయాన్ని కుర్చీ వేపు నించి చూద్దాం. మొదట కుర్చీని అమ్మాలి. ఇది, కుర్చీకీ డబ్బుకీ మారకం. తర్వాత, దుప్పటిని కొనాలి. ఇది, డబ్బుకీ దుప్పటికీ మారకం. అప్పటికి, కుర్చీ మనిషికి, దుప్పటి వస్తుంది. కానీ, దుప్పటి మనిషికి కుర్చీ రాదు. కుర్చీ, ఇంకో మనిషికి వెళ్తుంది.

ఈ సంఘటనలో, కుర్చీ దుప్పటీ అనే వస్తువులు ఎదురు బొదురుగా మారవు. ఒకదాన్ని ఒకటి చూడవు. బార్టరులో లాగ ఇక్కడ ఇద్దరు మనుషులు గాక, ముగ్గురు మనుషులు వుంటారు.

ఒక ఉదాహరణని ఇలా చూద్దాం :

కుర్చీ మనిషి —1వ మనిషి
జొన్నల మనిషి —2 వ మనిషి
దుప్పటి మనిషి —3 వ మనిషి
ధాన్యం మనిషి —4 వ మనిషి
ఈ 4 గురు మనుషులూ 4 వస్తువులు చేస్తారు.
ఆ సరుకుల్ని అమ్మితేనే వాళ్ళకి డబ్బు వస్తుంది.

కుర్చీ మనిషి తన సరుకుని జొన్నల మనిషికి అమ్మి, ఆ డబ్బుతో దుప్పటి కొన్నాడనుకుందాం. దుప్పటి మనిషి తన దుప్పటిని అమ్మగా వచ్చిన డబ్బుతో ధాన్యం కొన్నాడనుకుందాం.

ఈ మొత్తం సంఘటనలో కుర్చీని అమ్మిన మనిషి వేపు నించి చూస్తే, అతను కుర్చీని అమ్మి దుప్పటిని కొన్నాడు కాబట్టి, కుర్చీకీ దుప్పటికీ మారకం జరిగినట్టు కనపడుతుంది. కానీ, కుర్చీని కొన్న మనిషి వేపు నించీ చూస్తే, అతను తన జొన్నలు అమ్మగా వచ్చిన డబ్బుతో కుర్చీని కొన్నాడు కాబట్టి, జొన్నలకీ కుర్చీకి మారకం జరిగినట్టు కనపడుతుంది. నిజానికి, ఇక్కడ కుర్చీకీ జొన్నలకూ గానీ, కుర్చీకీ దుప్పటికీ

గానీ ఎదురు బొదురు మారకాలు జరగలేదు. ప్రతీ సరుకుకీ డబ్బుతోనే మారకం జరిగింది. జొన్నలకీ డబ్బుతోనే, కుర్చీకీ డబ్బుతోనే, దుప్పటికీ డబ్బుతోనే, ధాన్యానికీ డబ్బుతోనే. ఇలా ప్రతీ సరుకూ డబ్బుతోనే మారుతుందిగానీ ఇంకో సరుకుతో కాదు. ఈ 4 వస్తువుల ఉదాహరణలో మారకాలు ఎలా జరిగాయి?— జొన్నల మనిషికి కుర్చీ, కుర్చీ మనిషికి దుప్పటీ, దుప్పటి మనిషికి ధాన్యమూ, ధాన్యం మనిషికి ఇంకో సరుకూ —ఇలా మారాయి. 1 వ మనిషి తన సరుకుని 2 వ మనిషికి ఇచ్చి, తను 3 వ మనిషి సరుకుని తీసు కున్నాడు. 3 వ మనిషి తన సరుకుని 1 వ మనిషికి ఇచ్చి తను 4 వ మనిషి సరుకుని తీసుకున్నాడు. అంటే, ఇక్కడ ఏ రెండు వస్తువులూ ఎదురుబొదురుగా మారలేదు. అయినప్పటికీ ఇవి కూడా వస్తువుల మారకాలే. అంటే, ఇది కూడా వస్తువుని ఇచ్చి వస్తువుని తీసుకోవడమే. కానీ, ఈ మారకాలలో, వస్తువుల మనుషులకు ఈ వస్తువుల సంబంధాలు స్పష్టంగా కనపడవు.

కుర్చీ, దుప్పటీ — వీటి విషయంలో ఏం జరిగింది? కుర్చీ మనిషికి, దుప్పటి అందిందిగానీ, దుప్పటి మనిషికి కుర్చీ అందలేదు. కుర్చీ జొన్నల మనిషికి అందింది. కుర్చీ మనిషి కుర్చీని అమ్మి డబ్బు తీసుకున్నప్పుడు, ఆ డబ్బుని చూసి, ఆ డబ్బు ఇచ్చిన మనిషి అంతకు ముందు ఏ వస్తువుని అమ్మి ఆ డబ్బు సంపాదించాడో (జొన్నల్ని అమ్మి ఆ డబ్బు సంపాదించాడని) తెలుసుకోగలడా?— తెలుసు కోలేడు. ఆ సంగతి 'డబ్బు'లో కనపడదు. ఇక్కడ కుర్చీ మనిషి, ఏ విషయాలు మాత్రమే చూస్తాడంటే, కుర్చీని అమ్మడమూ, దానికి బదులుగా డబ్బు రావడమూ మాత్రమే చూస్తాడు. "నా కుర్చీని అమ్ముకున్నాను, డబ్బు వచ్చింది" అనుకుంటాడు. అంతేగానీ "నా కుర్చీకీ జొన్నలకీ (లేదా, ఇంకో వస్తువుకీ) మారకం జరిగింది" అనుకోడు. ఎందుకంటే, కుర్చీని అమ్మినప్పుడు అతని చేతిలోకి 'డబ్బు' వచ్చిందేగానీ, ఏ వస్తువూ రాలేదు గనక.

తర్వాత, కుర్చీ మనిషి, ఆ డబ్బుతో దుప్పటిని కొన్నా డనుకుందాం. ఇక్కడ మళ్ళీ తన డబ్బుకీ దుప్పటికీ మారకం చూస్తాడు. "నా డబ్బుతో నేను దుప్పటిని కొనుక్కున్నాను" అనుకుంటాడు. అంతేగానీ, "నా కుర్చీకీ దుప్పటికీ మారకం జరిగింది" అనుకోడు. ఎందుకంటే, తన కుర్చీ, దుప్పటి మనిషి దగ్గిరికి వెళ్ళలేదు గనక. పోనీ కుర్చీ మనిషి ఇంకో రకంగా ఇలా అనుకుంటాడా? — "నా కుర్చీ ఎవరికో వెళ్ళింది. ఎవరో తయారుచేసిన దుప్పటి నాకు వచ్చింది. ఆ దుప్పటి మనిషికి కూడా ఇంకేదో వస్తువు అందుతుంది. ఈ రకంగా, డబ్బు ద్వారా జరిగే పని కూడా వస్తువుల మారకాలే. మనుషు లందరమూ ఒకరు తయారు చేసిన వస్తువుల్ని ఒకరం ఉపయోగించుకుంటున్నాము"— అనుకుంటాడా? కుర్చీ మనిషి గానీ, మరో సరుకు మనిషి గానీ, విషయాల్ని ఇంత స్పష్టంగా గ్రహించరు. ఏ సరుకు మనిషికీ ఈ విషయాలేవీ పట్టవు. ఒక వ్యక్తి గ్రహింపు అంతా —తను అమ్మడమూ, తను కొనడమూ అనే విషయా లకే పరిమితమైపోయి వుంటుంది. "నా వస్తువుని అమ్ము కున్నాను. నా డబ్బుతో నేను కొనుక్కున్నాను" — అంతే! ఇదే ఒక వ్యక్తికి కనపడేదీ, అర్థమయ్యేదీనూ!

కుర్చీ మనిషికి, తనకీ ఇతరులకీ వుండే సంబంధాలు ఎలా కనపడతాయి? — తన వస్తువుని అమ్మినప్పుడు తను — అమ్మే మనిషీ; అవతలివాడు — కొనే మనిషీ! తర్వాత, తన డబ్బుతో ఇంకో వస్తువుని కొనేటప్పుడు, తను — కొనే మనిషీ; అవతలి వాడు —అమ్మే మనిషీ! అంతే. అంటే, కుర్చీ మనిషికి, తనకీ ఇతరులకూ వుండే సంబంధాలు, కేవలం సరుకుల్ని అమ్మే కొనే పనుల కోసం ఏర్పడే సంబం ధాలుగా మాత్రమే కనపడతాయి.

బార్టరు మారకాలలో కనపడ్డ సంబంధాలు (ఒకరివల్ల ఒకరి అవసరాలు తీరడం — అక్కడ కనపడింది) 'డబ్బు' ద్వారా జరిగే మారకాలలో మరుగున పడిపోతాయి.

వస్తువుల్ని ఉత్పత్తి చేసే మనుషులు, ఆ వస్తువుల్ని వాడుకోవడం, అమ్మే – కొనే సంబంధాల ద్వారానే జరుగుతూ వున్నప్పుడు, మనుషుల సంబంధాలు ఆ మనుషులందరికీ 'అమ్మే – కొనే సంబంధాలు'గా మాత్రమే కనపడతాయి. ఏ మనిషి అయినా, తనకు ఇతరులతో వుండే సంబంధాల్ని అంత వరకే గ్రహించగలుగుతాడు.

కానీ, అమ్మే – కొనే సంబంధాలు కూడా వస్తువుల సంబంధాలే. వస్తువుల సంబంధాలన్నీ శ్రమ సంబంధాలే. అంటే, 'మానవ సంబంధాలు' అనేవి, శ్రమ సంబంధాలే.

కానీ, అమ్మే – కొనే సంబంధాలలో వున్న మనుషులు, ఆ కారణం వల్లనే (అంటే, వారు ఏ సంబంధాలలో వున్నారో అలా వుండడం వల్ల), ఆ సంబంధాల్ని దాటి, నిజ సంబం ధాల్ని గ్రహించలేరు.

**5)** 'మానవ సంబంధాలు' అనేవి — మారకాలు వున్నా 'శ్రమ సంబంధాలే', మారకాలు లేకపోయినా 'శ్రమ సంబంధాలే'. అయితే, ఆ శ్రమ సంబంధాలు, మారకాలు వున్నప్పు డైతే 'విలువ దృష్టి'తో ఏర్పడే సంబంధాలు గానూ, మారకాలు లేనప్పుడైతే 'ఉపయోగపు విలువ దృష్టి'తో ఏర్పడే సంబంధాలుగానూ అవుతాయి. మారకాలు వున్నప్పుడు, మనుషులు ఎప్పుడూ సరుకులకూ డబ్బుకీ ఏర్పడే సంబంధా లనే చూస్తారు. "మనుషుల సంబంధాలనేవి 'డబ్బు సంబం ధాలే'. అవి ఎప్పుడూ అమ్మకాల ద్వారానూ కొనుగోళ్ళ ద్వారానూ ఏర్పడే సంబంధాలే" అనే పొరపాటు అభిప్రాయమే

కలుగుతుంది. కాబట్టి, సమాజంలో, మారకాలనేవి ఎంత కాలం వరకూ వుంటాయో, అంత కాలం వరకూ మానవుల సంబంధాలు మానవులకు స్పష్టంగా అర్థం కాకుండా మరుగున పడివుంటాయి.

**6)** 'మారకాలు' వున్న సమాజంలో, వస్తువుల్ని ఉత్పత్తి చేసే ప్రతీ మనిషీ తను ఉత్పత్తి చేసిన వస్తువుల్లో కొన్నిటిని అమ్మి, వాటికి బదులుగా వచ్చిన డబ్బుతో తనకు కావలసిన ఇతర వస్తువుల్ని కొనుక్కుని వాడుకుంటాడు. కాబట్టి, మారకాలు వున్న సమాజంలో, ఒక వ్యక్తి ఉత్పత్తి చేసే వస్తువులు 'అమ్ముడు పోతేనే', ఆ వ్యక్తి శ్రమని ఇతరులు వాడుకోవడానికీ, ఇతరుల శ్రమల్ని ఆ వ్యక్తి వాడుకోవడానికీ మార్గం వుంటుంది. సమాజంలో, మొత్తం 10 మంది నేత మనుషులు ఎవరికి వారు విడి విడిగా కొంత కొంత బట్టని (ఒకే రకం ఉపయోగపు విలువని) ఉత్పత్తి చేసి అమ్మకానికి తెచ్చారనుకుందాం. అందులో కొంత బట్ట అమ్ముడు కాకుండా వుండిపోయిందనుకుందాం. అమ్ముడుగాని బట్ట అంతా ఒక మనిషిదే అనుకుందాం. (లేదా, అందరి సరుకుల లోనూ కొంత కొంత భాగం అమ్ముడు కాలేదనుకుందాం. ఎలా అనుకున్నా సారాంశం ఒకటే.) తన సరుకుని అమ్మలేకపోయిన వ్యక్తి, తనకు కావలసిన ఇతర సరుకుల్ని 'కొనే పని' కూడా చెయ్యలేడు. అంటే, ఒక మనిషి సరుకు అమ్ముడుగాక పోవడంవల్ల ఆ మనిషికి ఇతర మనుషులతో వుండే శ్రమ సంబంధాలన్నీ ఆగిపోతాయి. ఈ రకంగా, మారకాల ద్వారానే వస్తువుల్ని వాడుకునే సమాజంలో, ప్రతీ వుత్పత్తిదారుడూ 'మారకం' అనే 'అగాధాన్ని' దాటవలసి వుంటుంది. ఆ అగాధాన్ని దాటితేనే ఒకరి శ్రమలు ఒకరికి అందుతాయి. లేకపోతే తయారైన వస్తువులు సిద్ధంగా వున్నప్పటికీ, మనుషులు వాటిని వాడుకునే పరిస్థితి వుండదు.

**7)** ఒక మనిషి చేసే శ్రమ, ఆ మనిషికేగాక ఇతరుల కెవరికైనా కూడా ఉపయోగపడడం అనేది, ఒక వ్యక్తి శ్రమకు వుండే 'సామాజిక స్వభావం'. ఒక మనిషి ఉత్పత్తి చేసిన వస్తువులు, ఇతరులకు ఉపయోగపడడం అనే విషయం, ఆ వస్తువులకు జరిగే మారకం మీదే ఆధారపడి వున్నప్పుడు, ఒక మనిషి శ్రమ తన 'సామాజిక స్వభావాన్ని' వ్యక్తం చెయ్యడానికి, 'మారకం' అనే చర్య పెద్ద అవరోధంగా వుంటుంది. మారకాలు లేకుండానే వస్తువుల్ని వాడుకోగలిగే సమాజాన్ని ఊహిస్తే, ఆ సమాజంలో, ఒక మనిషి శ్రమ, ఇతరులకు కూడా ఉపయోగపడే తన సామాజిక స్వభావాన్ని కోల్పోయే పరిస్థితి ఎన్నడూ వుండదు. అంటే ఒక మనిషి, తన శ్రమని ఇతరులకు ఇవ్వలేక పోవడమూ, ఇతరుల శ్రమల్ని తను తీసుకోలేక పోవడమూ, ఆ రకంగా మానవ సంబంధాలు ఎంతో కొంత స్థాయిలో ఆగిపోతూ వుండడమూ అనే పరిస్థితి ఎన్నడూ వుండదు.

'మారకాలు' వున్న సమాజంలో సరుకుల్ని అమ్మడమూ, కొనడమూ చెయ్యగలిగితేనే వ్యక్తుల సంబంధాలు కొనసాగుతాయి కాబట్టి, ఇక్కడ 'సరుకుల సంబంధాలే ప్రధాన సంబంధాలు' అవుతాయి. ఈ రకంగా, సమాజంలో విలువ కొలతలూ, మారకాలూ వున్నంత కాలమూ విలువ సంబంధాలే (డబ్బు సంబంధాలే) ప్రధాన సంబంధాలుగా వుంటాయి.

**8)** 'వస్తువుకి విలువ వుండడం సహజ లక్షణం కాదు' అని శాస్త్రం (సైన్సు) కనిపెట్టిన తర్వాత కూడా, వస్తువుకి విలువ వుండడం సహజ లక్షణంలాగే మనుషులకు కనిపిస్తుంది. ఎందుకంటే, మనుషులు తమ నిత్య జీవితంలో 'విలువని చెల్లించకుండా' వస్తువుల్ని సంపాదించడం లేదు గనక! <u>ఒక సత్యాన్ని, కేవలం 'సిద్ధాంతం ద్వారా' మాత్రమే గాక, 'ఆచరణ ద్వారా' కూడా చూడగలిగితేనే అది 'సత్యం'గా సమాజంలో మనుషులందరి ముందూ సంపూర్ణంగా రుజువవుతుంది.</u> 'వస్తువుకి విలువ వుండడం సహజ లక్షణం కాదు' అనడం, ఒక సత్యాన్ని సిద్ధాంతపరంగా (తార్కికంగా) చూడడం మాత్రమే. ఆ సిద్ధాంతాన్ని 'ఆచరణ'లో కూడా చూడగలగాలి. అంటే, వస్తువుల్ని నిత్యజీవితంలో విలువ చెల్లించకుండానే (అమ్మడాలూ, కొనడాలూ లేకుండానే) వాడుకోగలగాలి. అది, ఆ సిద్ధాంతాన్ని ఆచరణలో కూడా చూడడం! అప్పుడే అది సంపూర్ణంగా రుజువు అవుతుంది.

**9)** 'వస్తువు'కి విలువ వుండడం సహజ లక్షణం కాదని తార్కికంగా తెలిసిన మనుషులకు కూడా నిత్యజీవితంలో విలువ వుండడం సహజ లక్షణంగానే కనిపిస్తుంది. ఇది ఎలాంటిదంటే, 'భూమి చుట్టూ సూర్యుడు తిరగడం లేదు, భూమే సూర్యుడి చుట్టూ తిరుగుతోంది' అని తెలిసిన తర్వాత కూడా, సూర్యుడే భూమి చుట్టూ తిరుగుతున్నట్టు కనపడుతుందే, అలాంటిది. సూర్యుడు తిరగడంలేదనీ, భూమే తిరుగుతోందనీ, మనం మన ఇంద్రియాలతో (ఆలోచనాశక్తితో) తెలుసుకోగలిగినా కూడా, నిత్యజీవితంలో సూర్యుడినీ భూమినీ చూస్తే, మళ్ళీ ఎప్పటిలాగే సూర్యుడే భూమిచుట్టూ తిరుగుతున్నట్టు భ్రమ పడతాము. అంటే, మన ఇంద్రియాలతో 'తార్కికంగా' తెలుసుకోగలిగిన విషయాన్ని కూడా ఆ ఇంద్రియాలతోనే నిత్యజీవితంలో తెలుసుకోలేము. అంటే అనేక విశేషాల కూడికగా, సంక్లిష్టమైన విషయంగా వున్న ఒక ప్రకృతి వాస్తవాన్ని ఇంద్రియాలచేత తెలుసుకోనూ గలము, తెలుసుకోనూ లేము. అలాగే, ఏ సైన్సుకి సంబంధించిన అంశాన్ని అయినా కూడా! అలాగే 'విలువ' విషయం

కూడా! విలువ అసహజమని తార్కికంగా గ్రహించినా, నిత్యజీవితంలో దాన్ని సహజ విషయంగానే భ్రమపడతాము.

అయితే, ఒక 'ప్రకృతి విషయం'లో కలిగే భ్రమకీ, ఒక 'సామాజిక విషయం'లో కలిగే భ్రమకీ తేడా వుంది. ప్రకృతి విషయంలో కలిగే భ్రమ ఎన్నటికీ పోదు. కానీ, సామాజిక విషయంలో కలిగే భ్రమని వదిలివెయ్యడం, దానికి తగిన పరిస్థితులు ఏర్పడితే, తప్పనిసరిగా సాధ్యమవుతుంది.

**10)** ఒక ప్రశ్న: మనుషులు జీవించడానికి అనేక రకాల వస్తువులు కావాలి. కానీ, ఒక మనిషి, ఆ రకాలన్నిటినీ తయారుచేసుకోలేడు. కొన్ని రకాలు మాత్రమే చేసుకోగలుగు తాడు. మిగిలినవాటిని ఇతరుల నించి తీసుకోవలిసిందే. అలాగే, తన వస్తువుల్లో కొన్నిటిని ఇతరులకు ఇవ్వాలి. అంటే, 'మారకాలు' చేసుకోవాలి. దానివల్ల, వస్తువులు, సరుకులు అవుతాయి. అమ్మడాలూ కొనడాలూ ప్రవేశిస్తాయి. మానవ సంబంధాలలో ఇది తప్పనిసరి అవసరమే కదా? మారకాలు లేకుండా మనుషుల అవసరాలు తీరడం ఎలా సాధ్యమవు తుంది? — ఇదీ ప్రశ్న! — దీనికి జవాబు పూర్తిగానూ, సరిగానూ తెలుసుకోవాలంటే, ఈ 'కాపిటల్' పుస్తకంలో చర్చించిన విషయాలన్నిటినీ చివరి వరకూ చూడాలి. ఆ విషయాలన్నీ చూడకుండా జవాబుని ఇప్పుడే తెలుసుకోవడం సాధ్యం కాదు. కానీ ప్రస్తుతానికి, చాలా క్లుప్తంగా ఇక్కడ చెప్పుకునేదేమిటంటే — 'మారకాలు లేని సమాజం' అని దేనినైతే వూహిస్తున్నామో అక్కడ, మనుషుల మధ్య 'శ్రమ విభజన' ఈ నాడు వున్న విధంగానే వుంటుందని అర్థం కాదు. మారకాలు లేకుండా వుండాలంటే, ఈ నాటి శ్రమ విభజన, 'నూతన శ్రమ విభజన'గా మారవలసి వుంటుంది. దాని లక్షణాలన్నీ ఇంకా ముందు ముందు చూస్తాం. అలాంటి కొత్త శ్రమ విభజన గల సంబంధాలలో మారకాలు లేకుండానే అవసరాలన్నీ తీరడం సాధ్యమే.

ప్రస్తుతానికి ఇక్కడ, మారకాలే ప్రారంభం కాని 'ప్రాచీన సమాజాన్ని' ఒక సారి గుర్తు చేసుకుందాం. ఆ నాడు 'మారకాలు' లేవంటే, వస్తువులే లేవని అర్థమా? — కాదు. వస్తువులు వున్నా మారకాలు లేకుండానే వాటిని వాడుకోవడం జరిగింది. ఒక తెగలో మనుషులంతా ఒక 'సమిష్టితనం'తో వుండడం వల్లనే అది సాధ్యమయింది. కొందరు, వేట పని చేస్తారు; కొందరు, పశువుల పని చేస్తారు; కొందరు, అడవి పదార్థాల్ని సేకరిస్తారు. అందరూ అన్ని వస్తువుల్నీ సమిష్టిగా వాడుకుంటారు. వస్తువులు, సరుకులు కాకుండా వుండే విధానానికి ఇది బీజ రూపం. బీజ రూపంలో వున్న ఈ విధానాన్ని, 'ఆర్థిక శాస్త్రానికి' సంబంధించిన అనేక సూత్రాల్ని గ్రహించడం ద్వారా ఎంతో అభివృద్ధి పరుచుకోవాలి. దానికి తగిన పరిస్థితులన్నీ ఏర్పడినప్పుడు, అది సాధ్యమవుతుంది.

మనుషులు, ఎవరికి వారుగా ఉత్పత్తి చేసుకోవడమూ, ఎవరి వస్తువులకు వారు స్వంతదారులుగా వుండడమూ గాక, మనుషులంతా, అందరికీ కావలసిన (మొత్తం సమాజానికి కావలసిన) అన్ని రకాల ఉత్పత్తుల్నీ ఒక ప్లాన్ ప్రకారం 'సమిష్టి'గా ఉత్పత్తి చేసుకోవడమూ, ఆ ఉత్పత్తుల్ని సమిష్టిగా వాడుకోవడమూ జరిగితే, వస్తువులు సరుకులు కాకుండా వుండడం సాధ్యమవుతుంది. అంటే, ఉత్పత్తి దారులంతా సమిష్టితనంతో వుత్పత్తి చేసిన 'ఉత్పత్తుల రాసి'కి ఉత్పత్తిదారులంతా 'సమిష్టి స్వంతదారు'గా వుండడం జరగాలి. ఈ అంశానికి సంబంధించి, ఆర్థికవేత్తలందర్నీ ఆకర్షించే 'రాబిన్‌సన్ క్రూసో' అనే కథని చూద్దాం.

**" రాబిన్‌సన్ క్రూసో "** అనేది ఒక ఇంగ్లీషు నవల. 1719 లో డేనియల్ డీ ఫో అనే రచయిత రాసినది. ఆ కథేమిటంటే: రాబిన్‌సన్ క్రూసో అనే యువకుడికి సముద్ర ప్రయాణాలంటే చాలా ఇష్టం. ఒక సారి అతను ఓడలో ప్రయాణం చేస్తూ వుండగా, తుఫాను లేచి ఓడ బద్దలై అతను ఒక దీవికి కొట్టుకుపోతాడు. మర్నాడు విరిగిపోయిన ఓడ కూడా ఆ దీవి ఒడ్డుకి కొట్టుకువస్తుంది. రాబిన్‌సన్, ఆ ఓడలోకి పోయి, అందులో మిగిలివున్న తిండి పదార్థాలూ, వడ్రంగం పనిముట్లూ, కొన్ని కత్తులూ, ఒక తుపాకీ, మందుగుండు సామానూ, ఇంకా చాలా వస్తువులూ ఒక తెప్ప మీద పెట్టి తెచ్చుకుంటాడు. — రాబిన్‌సన్ ఆ దీవిలో ఒంటరిగా చాలా కాలం గడిపి ఎప్పటికో ఆ దీవి నించి బయటపడతాడు. దీవిలో వున్న కాలంలో అతను ఎన్నో వస్తువులు తయారు చేసుకున్నాడు. రాబిన్‌సన్ ఆ దీవిలో చేసిన 'శ్రమ'ల గురించి ఆర్థికవేత్తలందరూ ఎవరి దృక్పథంతో వారు పరిశీలిస్తూ వుంటారు.

దీవిలోవున్న రాబిన్‌సన్, తన కనీసావసరాలు తీరడానికి అనేక రకాల పనులు చేసుకుంటాడు. జంతువుల్ని వేటాడ్డం, చేపలు పట్టడం, ఇల్లు కట్టుకోవడం, వంట చేసుకోవడం, మేకల్ని పెంచడం — ఇలా అనేక రకాల ఉపయోగపు శ్రమలు చేస్తాడు. ప్రార్థనలు చెయ్యడం లాంటి పనులు కూడా చేస్తాడుగానీ, ఆ ప్రార్థనలు అతనికి ఏ వుపయోగపు విలువల్నీ ఇవ్వవు గనక ఆ పనుల గురించి పట్టించుకో వలసిన అవసరం లేదు. రాబిన్‌సన్ ఎన్ని రకాల వేరు వేరు శ్రమలు చేసినప్పటికీ, ఆ శ్రమలు ఎన్ని వేరు వేరు రూపాలలో వున్నప్పటికీ, ఆ శ్రమంతా ఒక్క వ్యక్తి చేసిన శ్రమే. అతను ఏదో ఒక్క శ్రమ చేసి వూరుకోవడానికి వీల్లేదు — అతనికి ఏదో ఒక్క అవసరమే లేదు గనక. ఇల్లు మాత్రం కట్టుకుని ఇంకేమీ చెయ్యకుండా వూరుకోలేడు. లేదా, చేపలు మాత్రం పట్టుకొని

ఇంకేమీ చెయ్యకుండా వూరుకోలేడు. కనీసావసరాలు తీరడానికి ఎన్ని పనులు అవసరమో అన్ని పనులూ చేసుకోవాలి. అవసరాలు వేరు వేరుగా వున్నాయి గనక, 'శ్రమ'ని వేరు వేరు రూపాలతో వేరు వేరు రకాలుగా విభజించుకోవాలి.

రాబిన్‌సన్ 10 రకాల శ్రమలు చేస్తున్నాడంటే, వాటిలో ఒక్కొక్క శ్రమనీ ఒక్కొక్క గంటసేపో, ఒక్కొక్క అరగంట సేపో, అలా సమానమైన టైము ప్రకారం చెయ్యడు. ఒక పనికి ఎక్కువ సమయం అవసరం కావచ్చు, ఒక పనికి తక్కువ సమయమే సరిపోవచ్చు. అది ఆ పని స్వభావాన్ని బట్టీ, ఆ పనికి దీవిలోవున్న అనుకూలతల్ని బట్టీ వుంటుంది. ఏ పనికి ఎంత కాలం పడుతుందనే విషయం, అతను తన అనుభవం ద్వారా తెలుసుకుంటాడు.

బద్దలైన ఓడలో నించి సామాను తెచ్చుకునేటప్పుడు రాబిన్‌సన్ ఒక వాచీ, ఒక నోట్‌బుక్కూ, పెన్నూ, సిరాబుడ్డీ కూడా తెచ్చుకుంటాడు. దీవిలో జీవితం ప్రారంభించినప్పుడు ఏ యే వస్తువులు కావాలో లిస్టు రాసుకుంటాడు. ఆ వస్తువులు కావాలంటే వాటి కోసం ఏమేం పనులు చెయ్యాలో కూడా రాసుకుంటాడు. ఆ ప్రకారం రాబిన్‌సన్ ఆ వస్తువులు చేసుకోగలుగుతాడు. రాబిన్‌సన్‌కీ, అతను తయారు చేసుకున్న సంపదకీ (వస్తువుల రాసికి) మధ్య వున్న సంబంధం, ఎటువంటి ఇబ్బందీ లేకుండా సునాయాసంగా అర్థం చేసుకోగలిగేటంత స్పష్టంగా వుంది. రక రకాల అవసరాల కోసం, రక రకాల పనులుచేసి, రక రకాల వస్తువులు తయారు చేసుకున్నాడు. ఆ వస్తువులన్నీ అతనికి వుపయోగపు విలువలే. ఈ విషయం అర్థం చేసుకోవడంలో గందరగోళం ఏమీ లేదు.

ఆ దీవిలోకి రాబిన్‌సన్ ఒక్కడేగాక ఆ పగిలిపోయిన ఓడ నించి ఇంకా కొంత మంది మనుషులు కూడా వచ్చారనుకుందాం. వాళ్ళందరూ సమిష్టిగా వుండి, అందరూ తలో శ్రమ చేసి, తయారుచేసుకున్న వస్తువుల్నీ పదార్థాల్నీ అందరూ సమిష్టిగా వుపయోగించుకుంటారనుకుందాం. అప్పుడు కూడా గందరగోళమేమీ వుండదు. అప్పుడు కూడా ఆ వస్తువులన్నీ ఉపయోగపు విలువలే. ఆ మనుషుల మధ్య వున్న సంబంధాలు ఎలాంటివో ఆ మనుషులందరికీ స్పష్టంగా తెలుస్తూ వుంటాయి.

అలాగాక, ఆ మనుషులు ఎవరికి వాళ్ళే వేరు వేరుగా వస్తువులు తయారుచేసుకుని, ఎవరి వస్తువులకు వాళ్ళే స్వంతదారులుగా వుండి, ఒకరి వస్తువుని ఇంకొకరికి ఇచ్చినందుకు వెంటనే ఇంకొక వస్తువుని తీసుకోవడం లాంటి 'మారకాలు' చేసుకుంటూ వుంటారనుకుందాం. ఇక, వాళ్ళంతా 'విలువల గందరగోళం'లో పడిపోయారన్న మాటే! రాబిన్‌సన్ తయారుచేసిన వస్తువులే వేరు వేరు స్వంతదారులకు చెందినవై వుండి, ఆ వస్తువుల మధ్య మారకాలు జరిగితే, ఆ వస్తువుల్లో శ్రమ కాలాలు రక రకాలుగా వున్నాయి గనక, వాటికి రక రకాలుగా విలువలు ఏర్పడి, ఆ దీవిలో కావలసినంత గందరగోళం తయారయ్యేది. చివరికి కొట్లాటల వరకూ, నరుక్కోవడాల వరకూ, యుద్ధాల వరకూ కూడా వెళ్ళేంత గందరగోళం! రాబిన్‌సన్ ఉత్పత్తి చేసిన వస్తువుల్లో, విలువల్ని నిర్ణయించడానికి అవసరమైనదంతా వుంది. కానీ, ఆ వస్తువులన్నింటికీ స్వంతదారు అతనొక్కడే కాబట్టీ, అతని వస్తువులు అతనికి 'విలువలు' కావు కాబట్టీ, అతనా దీవిలో విలువల ప్రమాదంలో చిక్కుకోకుండా తప్పుకోగలిగాడు.

అంటే, మానవులు విలువల ప్రమాదంలో చిక్కుకోకుండా తప్పుకోవాలంటే, మానవులంతా సమిష్టి ప్లానుతో ఉత్పత్తి చెయ్యడమూ, ఆ ఉత్పత్తుల్ని సమిష్టిగా వాడుకోవడమూ — అనే విధానం మాత్రమే పూర్తిగా సరియైన, శాస్త్రీయమైన, ఉన్నతమైన మార్గం!

'సమిష్టి జీవితం' అన్నప్పుడు, అది ఏ కాలంలోనైనా సాధ్యమేనని అర్థం కాదు. బార్టరు మారకాల దశలోనో, తర్వాత దశలోనో, దాన్ని ప్రారంభించి వుండవలసిందనీ, అలా ప్రారంభించకపోవడం వల్లనే మానవ సమాజం ఇంత కాలమూ విలువల గందరగోళంలో పడివుందనీ — చెప్తున్నట్టు కాదు.

అంతేగాక, 'సమిష్టి జీవితం అంటే ప్రాచీన కాలపు మానవుల సమిష్టి జీవితానికి తిరిగివెళ్ళడమే'— అని కూడా అర్థం కాదు. ప్రాచీన కాలపు సమిష్టి జీవితానికీ, ఇప్పుడు మనం చర్చిస్తోన్న సమిష్టి జీవితానికీ, చాలా విషయాల్లో చాలా తేడాలు వున్నాయి. ప్రాచీనకాలంలో 'శ్రమలకు' సంబంధించిన విషయాలు కనీసంగా కూడా తెలియవు. ఆ మానవుల సమిష్టి జీవితం, దాదాపు జంతు స్థాయిలో వున్న మానవుల సమిష్టి జీవితం. కానీ, ఇప్పుడు మనం చర్చిస్తోన్న సమిష్టి జీవితం, ఆ ప్రాచీన స్థాయిలో వుండేది కాదు. ఇక్కడ మనకు, శ్రమలకు సంబంధించిన వాస్తవాలన్నీ తెలుసు. 'ఆర్థిక శాస్త్ర సూత్రాలన్నీ' తెలుసు. ఇక్కడ ఉత్పత్తి శక్తులు సమిష్టి జీవితానికి తగిన విధంగా అభివృద్ధి చెంది వుంటాయి. కాబట్టి, ఈ సమిష్టి జీవితం, మానవులు స్పష్టమైన గ్రహింపుతో (కాన్షియస్‌గా) ఏర్పరచుకొనే సమిష్టి జీవితం అవుతుంది.

సమిష్టి జీవితం — అనేది ఎలాంటి పరిస్థితుల్లో సాధ్యమవుతుందీ, మానవుల మధ్య ఏ యే వైరుధ్యాలు పోయి

నప్పుడు సాధ్యమవుతుందీ — అనే విషయాలన్నీ తర్వాత భాగాలలో చాలా వివరంగా చూస్తాము.

'విలువ వున్న' సమాజం, 'విలువ లేని' సమాజంగా మారడానికి జరిగే 'పరిణామ క్రమం', అనేక దశల ద్వారా సుదీర్ఘంగా సాగవలసి వుంటుంది. సమాజంలో వుండే 'ఉత్పత్తి సాధనాలన్నీ' సమాజానికంతటికీ సంబంధించిన 'ఉమ్మడి ఆస్తులు'గా మారడంతో ప్రారంభమయ్యే ఆ క్రమం, కొందరు మానవులు 'యజమానులు'గానూ కొందరు మానవులు 'సేవకులు'గానూ వుండడంగాక, మానవు లందరూ ఒకే సామాజిక స్థితిలో 'స్వేచ్ఛామానవులు'గానూ 'సమానులైన ఉత్పత్తిదారులు'గానూ వుండే స్థితి వరకూ సాగవలసి వుంటుంది. ఆ స్థితే మానవుల మధ్య నిజమైన సమిష్టి జీవితం అవుతుంది. సమాజం ఆ స్థితికి చేరినప్పుడే, వస్తువులు సరుకులుగా మారడం పూర్తిగా ఆగుతుంది. ఈ విషయాలకు సంబంధించి, ఇంకా ముందు ముందు ఎన్నో హేతుబద్ధమైన అంశాలు చూడవలసి వుంటుంది. అప్పటి వరకూ ఈ విషయాలు సరిగా అర్థం కావు.

**11)** మనుషుల 'భౌతిక సంబంధాలు' 2 రకాలు.

(1) మనుషులకూ ప్రకృతికీ వుండే సంబంధాలు.

(2) మనిషికీ మనిషికీ వుండే సంబంధాలు. అంటే, మనుషుల మధ్య వుండే సంబంధాలు.

మనిషి, వేటాడుతున్నాడనుకుందాం. అది, మనిషికీ ప్రకృతికీ సంబంధం. మనిషి, భూమి దున్నుతున్నా డను కుందాం. అది మనిషికీ ప్రకృతికీ సంబంధం. అంటే ప్రతీ 'శ్రమ కార్యం'లోనూ మనిషికీ ప్రకృతికీ సంబంధం వుంటుంది. మనుషులు ఆ శ్రమని ఎలాంటి పరికరాలతో చేస్తున్నారూ, వారి వుత్పత్తి శక్తి ఏ స్థాయిలో వుందీ — వంటి విషయాలు ఈ అంశంలోకి వస్తాయి.

ఆ 'శ్రమ కార్యం'లోనే ఇంకో పక్క, మనిషికీ మనిషికీ వుండే సంబంధాలు కూడా వుంటాయి. మనుషులు ఎవరికి వారుగా విడి విడిగా శ్రమ చేస్తున్నారా, సమిష్టిగా శ్రమ చేస్తున్నారా? మనుషులందరూ శ్రమ చేస్తున్నారా, కొందరే శ్రమ చేస్తూ కొందరు శ్రమ చెయ్యకుండా వుంటున్నారా? శ్రమతో తయారైన ఉత్పత్తుల్ని మనుషులు ఏ రకంగా వాడుకుంటున్నారు; మారకాల ద్వారా వాడుతున్నారా, మారకాలు లేకుండా వాడుతున్నారా? కొందరు ఎక్కువ ఉత్పత్తులు వాడుతూ, కొందరు తక్కువ ఉత్పత్తులు వాడుతున్నారా? మనుషులందరూ సమానులుగా వున్నారా, అసమానులుగా వున్నారా?— ఈ విషయాలు 'మనిషికీ మనిషికీ సంబంధం' అనే అంశంలోకి వస్తాయి.

అంటే, 'శ్రమ కార్యం' అనేది — ఒక వేపు, మనుషులకూ ప్రకృతికీ వుండే సంబంధాల్నీ; ఇంకోవేపు — మనుషుల మధ్య సంబంధాల్నీ వ్యక్తపరిచే కార్యంగా వుంటుంది.

ఉత్పత్తి శక్తులు అతి తక్కువ స్థాయిలో వున్న ప్రాచీన కాలాల్లో, మనుషుల సంబంధాలు చాలా స్వల్పమైన, పరిమితమైన సంబంధాలుగా వుండేవి.

ప్రాచీన మానవులకు ప్రకృతి గురించి ఇంకా ఏమీ తెలీదు. 'ప్రకృతి' గురించి మనిషి జ్ఞానం క్రమ క్రమంగా మాత్రమే పెరుగుతూ వచ్చింది. ప్రకృతి జ్ఞానం పెరుగుతూ వున్నకొద్దీ ఉత్పత్తి శక్తులు పెరిగాయి. ఉత్పత్తి శక్తులు పెరుగుతూ వున్న కొద్దీ, మనిషి, ప్రకృతి విషయాలలోకి చొచ్చుకుపోయే ప్రయత్నం మరింత అధికమైంది. ప్రకృతికి సంబంధించిన అనేక సూత్రాలను గ్రహించడం ద్వారానూ, ఆ సూత్రాలను అనేక అవసరాలలో వినియోగించుకోవడం ద్వారానూ ఈ నాడు మనిషికి ప్రకృతితో వున్న సంబంధం గాఢమైనదిగానూ, విశాలమైనదిగానూ విస్తరించింది. మనుషులకు, ప్రకృతితో ఈ రకమైన సంబంధం ప్రాచీన కాలాల్లో లేదు.

అలాగే, ప్రాచీన కాలాల్లో, మనుషుల మధ్య వుండే సంబంధాలు కూడా పరిమితమైనవే. 'మానవ సంబంధాలు' అంటే 'శ్రమ సంబంధాలే — అని చూశాం. ఉత్పత్తి శక్తులు అతి తక్కువ స్థాయిలో వుండే ఆదిమ – ఆటవిక సమాజాల్లో, అతి తక్కువ రకాల వస్తువుల్ని మాత్రమే ఉత్పత్తి చేసుకునే వారు. ఆ వస్తువుల్లో కూడా చాలా కాలం వరకూ మారకాలు లేవు. ఇంకా మారకాలు ప్రారంభం కాని కాలంలో, ఒక తెగలో మనుషులకు ఆ తెగలో వున్న ఇతర మనుషులతో మాత్రమే శ్రమ సంబంధాలు వుంటాయి గానీ, ఇతర తెగల మనుషులతో ఆ రకం సంబంధాలు వుండవు. మారకాలు ప్రారంభమైన తర్వాత కూడా ఆ మారకాల సంఖ్య చాలా తక్కువగానే వుంటుంది కాబట్టి, ఆ మారకాల ద్వారా ఏర్పడే సంబంధాలు కూడా చాలా తక్కువగానే వుంటాయి. ఈ రకంగా, ఉత్పత్తి శక్తులు చాలా తక్కువ స్థాయిలో వున్న కాలంలో, మనుషుల సంబంధాలన్నీ అతి స్వల్పమైనవిగా మాత్రమే వుండేవి.

ప్రాచీన మానవులు ప్రకృతిని పూజించడం లోనూ, వారి మత విశ్వాసాలలోనూ, ఆ మానవులకు ప్రకృతితో వున్న 'స్వల్ప సంబంధమే' ప్రతిబింబిస్తుంది. అంటే, ప్రాచీన మానవులకు ప్రకృతి గురించి అతి స్వల్పంగా తప్ప ఏమీ తెలియదని వారి మత విశ్వాసాల ద్వారా కనపడుతుంది.

మానవుల మధ్య సంబంధాలు ఏర్పడడం, సహజమైన ఉపయోగపు విలువల ద్వారా గాక, సహజం కాని సరుకు విలువల ద్వారా జరగడమూ; వ్యక్తుల ప్రత్యేక శ్రమ లన్నిటినీ ఒకే రకమైన 'రూపం లేని శ్రమ'గా దిగజార్చడం ద్వారా మానవులు ఒకరితో ఒకరు సామాజిక సంబంధాలలోకి రావడమూ — ఈ లక్షణాలు ఏ సమాజానికైతే వున్నాయో ఆ సమాజానికి, సహజం కాని, వాస్తవంలో లేని, 'రూపం లేని మానవుణ్ణి (యాబ్‌స్ట్రాక్ట్ మాన్‌ని, అంటే దేవుణ్ణి)' ఆరాధించే లక్షణం గల 'మతాలు' — ఎంతో సహజమైనవి! ఆ రకం సమాజానికి, ఆ మతాలు నూటికి నూరు పాళ్ళూ తగినవి!

ఈ నాటి మానవుడు, ప్రకృతి గురించి చాలా తెలిసిన వాడైనా, ఈ మానవుడు కూడా ఇంకా అసహజమైన 'సరుకు సంబంధాల'లోనే పడివున్నాడు గనక, ప్రకృతి గురించి ఈ మానవుడి జ్ఞానం కూడా 'రూపంలేని అసహజ మానవుణ్ణి' తోసిపుచ్చే స్థాయికి ఇంకా చేరలేదు.

"నిజ ప్రపంచపు ప్రతిబింబమే మత ప్రపంచం!" మార్క్స్ (కాపిటల్–1, మాస్కో ఎడిషన్ 1974, పేజీ –83)

మానవులకు — ఒక వేపు ప్రకృతి తోటీ, ఇంకో వేపు — తోటి మానవుల తోటీ వుండే సంబంధాలు, ఎటువంటి అస్పష్టతా లేకుండా పూర్తిగా అర్థమయ్యే విధంగానూ, వైరుధ్యాలకు తావులేని విధంగానూ వున్నప్పుడు, వారి అవగాహనలో, వాస్తవ ప్రపంచపు ప్రతిబింబం కూడా వాస్తవమైనదిగానే ఏర్పడి, వాస్తవ ప్రపంచం గురించి అంత కాలమూ వారి అవగాహనలో వున్న అబద్ధపు ప్రతిబింబం మాయమవుతుంది. మనిషికి — తోటి మనుషుల తోటీ, ప్రకృతి తోటీ వుండే సంబంధాలు, ఎంత కాలమైతే అర్థం కాకుండా అస్పష్టంగానూ, అయోమయం గానూ వుంటాయో అంత కాలమూ, ఆ సంబంధాల్ని ప్రతిబింబించే ప్రతీ విషయమూ అస్పష్టంగానే, అయోమయంగానే వుంటుంది.

'నిజ ప్రపంచం' గురించి మానవుల అవగాహనలోవున్న అస్పష్టతకీ, అయోమయానికీ కారణం — 'సరుకులే'. అంటే, 'సరుకు సంబంధాలే'. కానీ, ఈ అయోమయం అంతా 'డబ్బు' అనే అంశం వల్లనే కలుగుతున్నట్టు పైకి కనపడు తుంది. డబ్బే 'మాయ'ని సృష్టిస్తోన్నట్టు కనపడుతుంది. కానీ, అది నిజం కాదు. డబ్బు ద్వారా కనపడే మాయ, నిజానికి సరుకుల మాయే. సరుకుల మారకాల్ని తేలిగ్గా జరపడానికే డబ్బు పుట్టింది. అంతకన్నా డబ్బుకి ప్రత్యేకతేమీ లేదు. కాకపోతే, డబ్బువల్ల సరుకుల మాయ మరింత తళతళల్తో మెరుస్తుందనడానికి సందేహం లేదు. డబ్బుని తీసివేసి (జనరల్ ఈక్వివలెంట్‌ని తీసివేసి), సరుకుల మారకాల్ని బార్టరు పద్ధతిలోనే వుంచితే, సరుకుల మాయకి డబ్బు వల్ల వచ్చే తళతళలు పోయే మాట నిజమే. కానీ సరుకుల సంఖ్య పెరుగుతూ వున్నప్పుడు, మారకాలు తేలిగ్గా జరగాలంటే, జనరల్ ఈక్వివలెంట్ చాలా అవసరం. సరుకు ఉత్పత్తి వుండగా డబ్బుని తీసివెయ్యడం సాధ్యం కాదు. సరుకుల ఉత్పత్తి, జనరల్ ఈక్వివలెంట్‌ని (డబ్బుని) తప్పనిసరి చేసి తీరుతుంది. సరుకుల మారకాలనేవి వున్నప్పుడు, వాటికి డబ్బు సహచర్యం తప్పదు. ఆ రెండూ కలవడం వల్ల సరుకుల మాయ మరింత గందరగోళాన్ని సృష్టించక తప్పదు. కాబట్టి, దీనికంతటికీ మూల కారణం 'సరుకే'గానీ, డబ్బు కాదు.

కాబట్టి, మానవులు ఎప్పుడైతే సరుకు సంబంధాల నించీ బయటపడే ప్రయత్నాలు ప్రారంభిస్తారో, ఎప్పుడైతే ఉపయోగపు విలువ దృష్టితో మానవ సంబంధాల్ని నిర్మించుకోవడం ప్రారంభిస్తారో, అప్పుడు వస్తువుల్ని అల్లుకున్న 'విలువ అనే మాయాజాలం' విచ్చిపోతుంది. మానవ సమాజం మీద విలువ కప్పే 'మాయ తెర' తొలగిపోతుంది.

వస్తువు నించీ దాని విలువ విడదియ్యలేని భాగమేమీ కాదు. సరుకు సృష్టించే మాయ ఛేదించలేని అంశమేమీ కాదు. అయితే, ఈ మార్పు, మానవ సంబంధాల గురించి నూతన జ్ఞానంతో సాగే అభివృద్ధి క్రమాల ఫలితంగా మాత్రమే జరగవలసి వుంటుంది.

# ప్రశ్నలూ — జవాబులూ

**1. 'సరుకుల మాయ' అంటే ఏమిటి?**

**జ:** వస్తువు, వస్తువుగా వుంటే స్పష్టంగా అర్థమయ్యే విషయాలు, వస్తువు సరుకుగా మారితే అర్థం కాకుండా పోతాయి. అదే సరుకుల మాయ.

**2. 'వస్తువు'కి లేని గందరగోళం 'సరుకు'కి ఎందుచేత వుంటుంది?**

**జ:** 'వస్తువు' అంటే — అమ్మడాలూ, కొనడాలూ లేని పరిస్తితి. అప్పుడు, ఉత్పత్తికీ, వాడకానికీ అవసరమయ్యే

విషయాలు తప్ప ఇంకేమీ వుండవు. 'సరుకు' అంటే — అమ్మడాలూ కొనడాలూ వున్న పరిస్థితి. అప్పుడు, మారకాల సాధనంగా డబ్బూ, దాని విలువా, దాని పరిమాణమూ, సరుకు విలువా, సరుకు ధరా —ఇలా, అనేక విషయాలు పెనవేసుకుపోతాయి. 'వస్తువు' విషయంలో వుండని అమ్మడాలూ కొనడాలూ, సరుకు విషయంలో వుంటాయి కాబట్టే, వస్తువు విషయంలో వుండని గందరగోళం సరుకు విషయంలో వుంటుంది.

**3. ఒక మనిషి, తమ ఇంటి పెరటిలో పండించిన కూరగాయల్ని అప్పుడప్పుడూ ఒక వైద్యుడి కుటుంబానికి ఇస్తూ వుంటాడు. ఆ వైద్యుడు, మొదటి కుటుంబంవాళ్ళకి ఎప్పుడైనా అవసరమైతే వైద్యం చేస్తూ వుంటాడు. అది ఉపయోగపు విలువల సంబంధమా, సరుకుల సంబంధమా ? తమ మధ్య ఎలాంటి సంబంధాలు వున్నాయో ఇరు పక్షాలకూ తెలుస్తుందా?**

**జ:** అక్కడ విలువ లెక్కలు చూసుకోవడం జరగదు కాబట్టి, అవి ఉపయోగపు విలువల సంబంధాలే. ఒకరికి ఒకరు వస్తువులూ సహాయాలూ ఇచ్చి పుచ్చుకుంటున్నామనీ, ఒకరి పనులు ఒకరికి అందుతున్నాయనీ ఇరు పక్షాలకూ తెలుస్తుంది. —'ఇది శ్రమల సంబంధమే' అనే సాంకేతికమైన పద్ధతిలో తెలియకపోయినా.

**4. ఒక వైద్యుడు, బజార్లో అన్ని వస్తువులూ కొనుక్కున్నట్టే కూరగాయలు కూడా కొంటూ వుంటాడు. ఆ కూరగాయలు పండించే వాళ్ళల్లో ఒక వ్యక్తి, ఈ వైద్యుడి దగ్గిర వైద్యం చేయించుకుని డబ్బు ఇచ్చి వెళ్తూ వుంటాడు. అది ఉపయోగపు విలువల సంబంధమా, సరుకుల సంబంధమా? తమ మధ్య శ్రమ సంబంధాలు వున్నట్టుగా ఆ ఇద్దరు వ్యక్తులకూ తెలుస్తుందా?**

**జ:** తెలియదు. "నేను నా డబ్బు పెట్టి కూరగాయలు కొనుక్కుంటున్నాను" అని వైద్యుడు అనుకుంటాడు. "నేను నా డబ్బు ఇచ్చి వైద్యం చేయించుకుంటు న్నాను" అని కూరగాయల మనిషి అనుకుంటాడు. 'డబ్బు' అనేది మధ్యలో వుండడం వల్ల, అసలు సంబంధాలు కనపడకుండా పోతాయి.

**5. ఒక మనిషి, తను పండించిన ధాన్యాన్ని అమ్మితే కొంత డబ్బు వచ్చింది. ఆ డబ్బుతో తన కుటుంబం కోసం కొన్ని బట్టలు కొన్నాడు. అది, తన శ్రమకూ, బట్టల్ని తయారు చేసిన మనుషుల శ్రమలకూ సంబంధం —అని ఆ మనిషికి తెలుస్తుందా?**

**జ:** తెలియదు. 'నా సరుకుని నేను అమ్ముకున్నాను. నా డబ్బుతో నేను కొనుక్కున్నాను' అని మాత్రమే ఆ మనిషి అనుకుంటాడు. ఆ చర్యల్లో శ్రమ సంబంధాలు వున్నాయని ఆ మనిషికి అర్థం కాదు.

**6. మనిషికీ, ప్రకృతికీ వున్న సంబంధాల్ని తెలిపే కొన్ని ఉదాహరణలు చెప్పండి.**

**జ:** మనిషి కూడా ప్రకృతిలో భాగమే. మనిషి, ప్రకృతి నించి వేరు కాదు. కానీ, మనుషులు అనేక రకాల శ్రమలు చేసేటప్పుడు, ప్రకృతిలో దొరికే సహజ పదార్థాలనే ఉపయోగించుకుంటారు. అదే, మనిషికి ప్రకృతితో వుండే సంబంధం. ప్రకృతిలో చెట్లూ వాటికి పళ్ళూ వుంటేనే, మనిషి వాటిని కోసుకుంటాడు. ప్రకృతిలో జంతువులు వుంటేనే, మనిషి వాటిని వేటాడతాడు. శ్రమ పరికరాలన్నిటినీ ప్రకృతిలో దొరికే పదార్థాలతోనే తయారుచేసుకుంటారు. ఏ శ్రమ చెయ్యాలన్నా అది మనిషికి ప్రకృతితో సంబంధమే. భూమిని దున్నితే, అది ప్రకృతితో సంబంధమే. బండి తోలితే, బండి భూమి మీదే నడుస్తుంది కాబట్టి, అది ప్రకృతితో సంబంధమే. బండిని తయారుచేసిన పదార్థాలన్నీ ప్రకృతి ఇచ్చినవే.

**7. మానవ సమాజం సరుకుల మాయ నించి బైట పడడం సాధ్యమేనా ? ఎలాగ ?**

**జ:** సాధ్యమే. అమ్మకాలూ కొనుగోళ్ళూ లేకుండా వస్తువుల్ని ఉత్పత్తి చేసుకుని వాడుకోగలిగితే, అది సరుకుల సంబంధాల నించీ, సరుకుల మాయ నించీ బైట పడ్డట్టే. అయితే, అలా జరగాలంటే, శ్రమ సంబంధాల్లో ఎన్నో రకాల మార్పులు జరగాలి.

| **8. ఖాళీలు పూర్తి చెయ్యండి.** | **జవాబులు:** |
|---|---|
| 1) 'విలువ సంబంధం' అంటే, ....... సంబంధం. | శ్రమ |
| 2) సరుకుల మనుషులకు, వారి సంబంధాలు వారికి, ............. సంబంధాలు'గా గాక, ............ సంబంధాలు'గా కనపడతాయి. | 'శ్రమ<br>'సరుకుల |
| 3) రక్త సంబంధం అనేది ........ సంబంధం. | ప్రకృతి |
| 4) మారకాలు వున్నా లేకపోయినా, మనుషుల సంబంధాలు ... సంబంధాలే. | శ్రమ |
| 5) మానవ సమాజం అంటే, ........ సంబంధాలు గల సమూహం. | శ్రమ |

★

# 10. సరుకుల చలామణీ

**ఈ చాప్టరులో 8 విషయాలు చూస్తాము.**

**1. డబ్బు చేసే పనులు. 2. సరుకుల చలామణీ. 3. డబ్బు చలామణీ.**
**4. చలామణీ సాధనం పరిమాణం. 5. నాణాలూ, విలువ చిహ్నాలూ.**
**6. డబ్బుని కూడ బెట్టడం. 7. చెల్లింపు సాధనం. 8. ప్రపంచ ధనం.**

బార్టరు మారకాల వల్ల ఏర్పడని పరిస్థితులు, డబ్బుతో మారకాల వల్ల ఎలా ఏర్పడతాయో ఈ చాప్టరులో తెలుస్తుంది. సరుకుకీ, డబ్బుకీ వుండే సంబంధాల్ని సరిగా అర్థం చేసుకుంటే, తర్వాత భాగాల్లో చూసే విషయాలు ఎంతో తేలిగ్గా అర్థమవుతాయి.

## 1. డబ్బు చేసే పనులు

డబ్బు, ప్రధానంగా 2 పనులు చేస్తుంది.

(1) 'విలువ కొలత'గా (2) 'ధర ప్రమాణం'గా.

### (1) డబ్బు, 'విలువ కొలత' గా :

'రూపాయి' అనేది, విలువల్ని కొలిచే కొలత బద్ద. డబ్బుగా ఏ లోహం వుంటే ఆ లోహంతోనే ఈ కొలత బద్ద తయారవుతుంది. ఇప్పుడు డబ్బుగా బంగారం వుంది కాబట్టి, 1 గ్రాము బరువుగల బంగారాన్ని 1 రూపాయిగా (ఒక యూనిట్‌గా) మనం ఉదాహరణగా తీసుకున్నాం. ఈ కొలత బద్దని ఇంకా చిన్న సమ భాగాలు చెయ్యడానికీ వీలైన కొలతలు దానికి వుంటాయి. ఆ సమ భాగాలు ఏర్పడిన తర్వాత, రూపాయి, విలువల్ని కొలిచే కొలత బద్దగా (స్కేలుగా) వుండిపోతుంది. అన్ని సరుకుల విలువల్నీ ఈ స్కేలుతో కొలవవచ్చు.

ఒక నేత మనిషి, 20 మీ. బట్టని ఉత్పత్తి చేశాడనుకుందాం. దానికి అయిన ఖర్చులన్నిటినీ లెక్క కట్టుకుని దాని 'విలువ' ఎంత వుండవచ్చో అంచనా వేసుకుంటున్నాడనుకుందాం. అతను, బట్ట విలువని రూపాయిల్లో ఊహిస్తాడు. 'ఈ 20 మీ. బట్ట విలువ, 40 రూ.లు. 1 మీ. విలువ, 2 రూ.లు' అని లెక్క వేశాడనుకుందాం. బట్ట విలువని ఇలా లెక్క కట్టేటప్పుడు, ఆ బట్ట దగ్గిర డబ్బు వుండాలా? అంటే, ఆ బట్ట దగ్గిర 40 రూ.లు వుండాలా? — అక్కరలేదు. 40 రూ.లు కాదు గదా, ఒక్క పైసా కూడా అక్కడ వుండనక్కరలేదు. ఎందుకంటే, అక్కడ జరుగుతున్న పని, బట్ట విలువ ఎంత వుండవచ్చో లెక్కకట్టే పని మాత్రమే. కాబట్టి అక్కడ 'నిజం డబ్బు' వుండనక్కరలేదు. ఆ డబ్బు, ఆ విలువని లెక్క కట్టే మనిషి ఊహలో మాత్రమే వుంటుంది. లేదా ఆ లెక్కలు రాసిన కాయితాల మీద మాత్రమే వుంటుంది.

సరుకు విలువని లెక్కకట్టేటప్పుడు, డబ్బు, 'విలువ కొలత'గా మాత్రమే ('విలువని కొలిచే సాధనం'గా మాత్రమే) పని చేస్తుంది. కాబట్టి, అప్పుడు డబ్బు, నిజమైన డబ్బుగా గాక 'ఊహాత్మకమైన డబ్బు'గా మాత్రమే వుంటుంది.

### (2) డబ్బు, 'ధర ప్రమాణం' గా : ( చలామణీ సాధనంగా )

డబ్బు చేసే రెండో పని 'ధర ప్రమాణం'గా వుండడం. ('విలువ' అన్నా, 'ధర' అన్నా ఒక్కటే — అనే అర్థంతోనే తీసుకోవాలి. ఇది కేవలం 'మాట భేదం' మాత్రమే అనుకోవాలి.) 'ప్రమాణం'గా వుండడం అంటే, 'రుజువు'గా వుండడం. 'ధర ప్రమాణం'గా వుండడం అంటే, 'ధరకి రుజువు'గా వుండడం.

బట్టని ఉత్పత్తి చేసిన మనిషి, 'నా బట్ట ధర, 1 మీ.కి 2 రూ.లు' అనుకున్నాడనుకుందాం. అలా అనగానే ఆ బట్ట ధర 2 రూ.లు అని రుజువైనట్టేనా? — కాదు. బట్టకి, ఆ ధర వున్నట్టు రుజువు కావాలంటే, ఎవరైనా ఆ బట్టని తీసుకుని 2 రూ.లు ఇవ్వాలి. అంటే, ఆ బట్టకి 'అమ్మకం' జరగాలి.

అంటే, బట్ట ధర రుజువు అవ్వాలంటే, 'ఊహలో డబ్బు' గాక, బట్ట దగ్గిరికి నిజం డబ్బు రావాలి.

'విలువ కొలత'గా పని చేసేటప్పుడు, డబ్బు ఊహలో వుండే రూపాయలుగా, ఊహలో వుండే పరిమాణంగా వుంటుంది. 'ధర ప్రమాణం' గా పని చేసేటప్పుడు, డబ్బు, నిజమైన రూపాయలుగా, ప్రత్యక్షంగా కనపడే డబ్బుగా వుంటుంది.

డబ్బుగా వుండే బంగారం కూడా శ్రమతో ఉత్పత్తి అయ్యే వస్తువే కాబట్టి, దానికి పట్టే శ్రమకాలం కూడా ఎక్కువ తక్కువలవుతూ వుంటుందని గతంలోనే చూశాం. అంటే, 'బంగారం – విలువ' కూడా ('డబ్బు విలువ' కూడా) మారుతూ వుంటుంది. అయితే, ఈ రకంగా విలువ మారే వస్తువు, 'విలువ కొలత'గానూ, 'ధర ప్రమాణం'గానూ పని చెయ్యడానికి పనికి వస్తుందా? — నిక్షేపంగా పనికి వస్తుంది. డబ్బుకి, ఎప్పుడే విలువ వుంటే ఆ విలువతోనే అది తన పనులు చెయ్యగలుగుతుంది.

ధాన్యాన్ని కొలిచే గిన్నె పెద్దదైనా చిన్నదైనా ధాన్యాన్ని కొలవడానికి పనికివస్తుందా, లేదా? — పనికి వస్తుంది. కొంత ధాన్యాన్ని చిన్న గిన్నెతో కొలిస్తే ఎక్కువ గిన్నెలూ, పెద్ద గిన్నెతో కొలిస్తే తక్కువ గిన్నెలూ అవుతుంది. గిన్నె సైజు ఎలాగైనా వుండవచ్చు. అలాగే, రూపాయి విలువసైజు కూడా.

'రూపాయిబిళ్ళ'గా వున్న బంగారానికి విలువ ఎక్కువైతే, ఒక సరుకుకి బదులుగా రూపాయలు వెళ్ళేటప్పుడు, తక్కువ రూపాయలు (తక్కువ బిళ్ళలు) వెళ్తాయి. లేదా, రూపాయి విలువ తగ్గితే, ఎక్కువ రూపాయలు వెళ్తాయి.

రూపాయి విలువ తగ్గితే, దాని భాగాల విలువలు కూడా తగ్గుతాయి. లేదా, రూపాయి విలువ పెరిగితే, దాని భాగాల విలువలు కూడా పెరుగుతాయి. రూపాయి విలువ తగ్గినా పెరిగినా, రూపాయికీ అర్ధ రూపాయికీ, తేడా, ఒకే రకంగా వుంటుంది. విలువ ఎలా మారినా రూపాయికీ, దాని భాగాలకీ వుండే పాళ్ళు, మారవు. కాబట్టి, సారాంశం ఏమిటంటే, డబ్బు విలువ ఎలా మారినా, డబ్బు, 'విలువల్ని కొలిచే సాధనం'గా ఎప్పటిలాగే పని చెయ్యగలుగుతుంది.

అయితే, విలువ మారే డబ్బు, 'ధర ప్రమాణం'గా కూడా ఎప్పటిలాగే పని చెయ్యగలుగుతుందా? — తప్పకుండా పని చెయ్యగలుగుతుంది. ధర ప్రమాణంగా పని చెయ్యడం అంటే సరుకుకి బదులుగా డబ్బు వెళ్ళడమే. వెళ్ళవలసిన డబ్బు పరిమాణం తగ్గాలో పెరగాలో మొదట విలువ కొలత ద్వారా నిర్ణయమవుతుంది. డబ్బుకి విలువ తగ్గి, సరుకుకి బదులుగా గతం కన్నా ఎక్కువ డబ్బు వెళ్ళవలసి వుంటే, ఎక్కువ డబ్బు వెళ్తుంది. లేదా, తక్కువ డబ్బు వెళ్ళవలసి వుంటే, తక్కువ డబ్బు వెళ్తుంది. ఎంత వెళ్ళాలని నిర్ణయమైతే అంతే డబ్బు వెళ్తుంది.

ఈ రకంగా, డబ్బు విలువ ఎలా మారినా, అది 'విలువ కొలత'గానూ, 'ధర ప్రమాణం'గానూ పని చెయ్యడంలో దాని విధుల్ని అది ఎప్పటిలాగే నిర్వర్తించగలుగుతుంది.

'ధర ప్రమాణంగా' అనే దాన్ని— 'కొనుగోలు సాధనంగా' అనీ, 'మారకాల సాధనంగా' అనీ కూడా అనవచ్చు.

# 2. సరుకుల 'చలామణీ', లేదా సరుకుల 'మారకం'

'చలామణీ' అంటే 'మారకమే'. బార్టరు పద్ధతి మారకాలలో లేని కొన్ని సమస్యాత్మకమైన పరిస్థితులు, డబ్బు ద్వారా జరిగే మారకాలలో ప్రారంభమవుతాయి.

కొంత బట్టకీ, కొంత ధాన్యానికీ, బార్టరు పద్ధతిలో మారకం జరిగిందనుకుందాం. బట్ట మనిషి — బట్టని ఇవ్వడమూ, ధాన్యం తీసుకోవడమూ, ఒకే సమయంలో జరుగుతాయి. అలాగే, ధాన్యం మనిషి కూడా — ధాన్యం ఇవ్వడమూ, బట్టని తీసుకోవడమూ, ఒకే సమయంలో చేస్తాడు. ఈ రకంగా, బార్టరులో, ఒక ఉపయోగపు విలువని ఇవ్వడమూ, ఇంకో ఉపయోగపు విలువని తీసుకోవడమూ (2 సరుకుల మారకమూ కూడా) ఒకే సమయంలో పూర్తి అవుతుంది.

కానీ, 'డబ్బు' ద్వారా జరిగే మారకాలలో పరిస్థితి, కొంత తేడాగా వుంటుంది. వెంకయ్య అనే నేత మనిషి, కొంత బట్టని ఇచ్చి 2 రూ.లు తీసుకున్నాడనుకుందాం. బట్ట మారకం పూర్తి అయిపోయిందా? — ఇంకా లేదు. ఒక 'ఉపయోగపు విలువ' వెళ్ళిపోయి దానికి బదులుగా ఇంకో ఉపయోగపు విలువ వచ్చేదాకా మొదటి వస్తువు మారకం పూర్తి అయినట్టు కాదు. బట్టకి బదులుగా వచ్చిన రూపాయలు ఏ ఉపయోగపు విలువా కాదు కాబట్టి, బట్టకి బదులుగా డబ్బు రాగానే బట్ట మారకం పూర్తి అయినట్టు కాదు. వెంకయ్య, తన చేతిలోకి వచ్చిన 2 రూ.లతో కొంత ధాన్యం కొన్నాడనుకుందాం. ఇప్పుడు, బట్ట మారకం పూర్తి అయింది.

మొదట — బట్ట, 2 రూ.లతో మారినప్పుడు, బట్ట వెళ్ళిపోయి రూ.లు వచ్చి బట్ట విలువ, 2 రూ.లుగా వుంది.

తర్వాత — 2 రూ.లు వెళ్ళిపోయి, ధాన్యం వచ్చినప్పుడు, బట్ట విలువ, ధాన్యంగా వుంది.

బట్ట విలువ — మొదట 'డబ్బు రూపం'లోకీ, తర్వాత 'ధాన్యం రూపం'లోకీ మారింది కాబట్టి, "బట్ట విలువ, 2 రూపాలలోకి మారింది : లేదా, 2 రూపాంతరాలు చేసింది" అంటాం.

ఈ 2 రూపాంతరాలూ కలిసి ఒక 'చక్రం'. ఒక 'సర్క్యూట్'. ఒక సరుకు, ఒక సర్క్యూట్‌ని పూర్తి చేస్తేనే దాని మారకం పూర్తి అయినట్టు అర్థం. దీన్నే తేలికైన మాటల్లో చెప్తే, ఒక సరుకుకి బదులుగా ఇంకో సరుకు వస్తేనే, మొదటి సరుకుకి మారకం పూర్తి అయినట్టు అర్థం.

ఈ విషయాలు ఇంత వివరంగా ఎందుకు తెలుసుకోవాలంటే —సరుకుల అమ్మకాలు ఆగిపోయే పరిస్థితులు కూడా ఒక్కోసారి వస్తూ వుంటాయి. ఆలా ఎందుకు జరుగుతుందో అర్థంచేసుకోవాలంటే, మొదట ఈ విషయాలు అర్థం చేసుకోవాలి.

ఒక సరుకు మారకంలో, 2 దశలు వుంటాయి.

| (1) సరుకు, డబ్బుగా మారడం. | (2) ఆ డబ్బు, ఇంకో సరుకుగా మారడం. |
|---|---|
| సరుకూ —డబ్బూ | డబ్బు —సరుకూ |
| (కమాడిటీ —మనీ) | (మనీ —కమాడిటీ) |
| **C —M** | **M — C** |
| ఇది మొదటి రూపాంతరం | ఇది రెండో రూపాంతరం |

ఈ 2 దశలూ, వెంకయ్యకి 2 భిన్న వ్యవహారాలు.

(1) తన సరుకుని వదిలెయ్యడం.
అంటే, అమ్మకం (సేల్).

(2) ఇంకో సరుకుని తెచ్చుకోవడం.
అంటే, కొనుగోలు (పర్చేజ్.)

ఒక సరుకు మారకాన్ని మొత్తంగా చూస్తే,
అది ఇలా వుంటుంది :

సరుకూ — డబ్బూ — సరుకూ

**C — M — C**

మొత్తంగా దీని సారాంశం — సరుకుకి బదులు సరుకు రావడమే.

అంటే, సరుకూ — సరుకూ.

**C — C.**

ఇది ' సింపుల్ చలామణీ'.

ఒక సరుకుకి బదులు ఇంకో సరుకు వచ్చిందంటే, మారకం పూర్తి అయినట్టే.

అమ్మకందారు, తన సరుకుని అమ్మగా వచ్చిన డబ్బుతో ఇంకో సరుకుని కొనకుండా, డబ్బుని తన దగ్గిరే పెట్టుకుని కూర్చుంటే, అతని సరుకు, దాని రూపాంతరాల్లో మొదటి రూపాంతరాన్ని మాత్రమే పూర్తి చేసినట్టు అర్థం. ఆ డబ్బుతో రెండో సరుకుని కొంటే, అతని సరుకు రెండో రూపాంతరాన్ని కూడా పూర్తి చేసినట్టే. బట్టని అమ్మగా వచ్చిన 2 రూ.ల్లో ఒక రూపాయి పెట్టి ఏదో సరుకు కొని, ఇంకో రూపాయిని జేబులో వుంచుకుంటే —అప్పుడు కూడా బట్ట మారకం పూర్తి అయినట్టు కాదు. రెండో రూపాంతరంలో కొంచెం భాగమే జరిగినట్టు అవుతుంది. ఒక సరుకుని అమ్మగా వచ్చిన డబ్బు నంతటినీ ఇంకో సరుకుగా (లేదా, సరుకులుగా) మార్చినప్పుడే మొదటి సరుకు మారకం పూర్తి అయినట్టు అర్థం.

| | | |
|---|---|---|
| సరుకుతో ప్రారంభించే పని | — | అమ్మకం |
| సరుకు ఇచ్చి డబ్బు తీసుకుంటే | — | అమ్మకం |
| 'సరుకూ —డబ్బూ' అనేది — | — | అమ్మకం |
| **C — M** — | — | అమ్మకం |
| మొదటి రూపాంతరం అంటే — | — | అమ్మకం |

| | | |
|---|---|---|
| డబ్బుతో ప్రారంభించే పని | — | కొనుగోలు |
| డబ్బు ఇచ్చి సరుకు తీసుకుంటే | — | కొనుగోలు |
| 'డబ్బూ —సరుకూ' అనేది — | — | కొనుగోలు |
| **M — C** — | — | కొనుగోలు |
| చివరి రూపాంతరం అంటే — | — | కొనుగోలు |

వెంకయ్య మొదట అమ్మకం చేసి, తర్వాత కొనుగోలు చేశాడు. ఆ 2 చర్యలూ అతనికి 2 రకాల స్వభావాల్ని ఇస్తున్నాయి. 'అమ్మకం' చేస్తున్నప్పుడు అతను 'అమ్మకం దారుడు'. 'కొనుగోలు' చేస్తున్నప్పుడు 'కొనుగోలుదారుడు'. అంటే, ఒక సరుకుని మారకం చేసే మనిషి, ఎప్పుడూ 'అమ్మకందారుడిగానే' వుండడంగానీ, ఎప్పుడూ 'కొనుగోలు దారుడిగానే' వుండడంగానీ, జరగదు. ఆ మనిషి ఒకసారి అమ్మేవాడిగా వుంటే, ఇంకో సారి కొనేవాడిగా వుంటాడు. ప్రతీ సరుకు మనిషీ ఈ 2 రకాల పాత్రలూ ధరిస్తూ వుంటాడు.

బట్టని అమ్మడమూ, ఇంకో సరుకుని కొనడమూ —అనే చర్యల్లో, వెంకయ్యతోపాటు ఇంకో ఇద్దరు వ్యక్తులు కూడా వున్నారు. వెంకయ్య తన బట్టని 2రూ.లకు అమ్మాడు కదా? ఆ 2 రూ.లు ఎవరివి? అవి రాజన్నవి అనుకుందాం. రాజన్న, వెంకయ్యకి 2 రూ.లు ఇచ్చి, ఆ బట్టని కొన్నాడంటే,

రాజన్నకి ఆ రూపాయలు ఎలా వచ్చాయి? తను ఉత్పత్తి చేసిన కొన్ని గోధుమల్ని అమ్మి, రాజన్న ఆ 2 రూ.లు సంపాదించా డనుకుందాం. తర్వాత ఆ 2 రూ.ల తోనే అతను ఇప్పుడు వెంకయ్య దగ్గిర బట్ట కొన్నాడనుకుందాం. డబ్బు, వెంకయ్య దగ్గిరికి వచ్చింది. అప్పుడు వెంకయ్య, ఆ 2 రూ. లతో, పుల్లయ్య దగ్గిర ధాన్యం కొన్నాడనుకుందాం. తర్వాత పుల్లయ్య, ఆ డబ్బుతో సీతమ్మ దగ్గిర జొన్నలు కొన్నా డనుకుందాం. ఇక్కడ వెంకయ్యని మాత్రమే తీసుకుంటే ( 'బట్ట' విషయం మాత్రమే తీసుకుంటే ), వెంకయ్యకి ఒక వేపు రాజన్నతోటీ, ఇంకో వేపు పుల్లయ్య తోటీ 'మారక సంబంధాలు' వున్నాయి.

ఇంత వరకూ చూపిన మొత్తం సంఘటనలో 4 రకాల

సరుకులు వున్నాయి.

(1) గోధుమలు. (2) బట్ట. (3) ధాన్యం. (4) జొన్నలు.

ఈ 4 సరుకుల మారకాలకీ ఒక దానితో ఇంకో దానికి లంకె వుంది. గోధుమల మనిషి గోధుమల్ని అమ్మగా వచ్చిన డబ్బుతో బట్ట కొన్నాడు. డబ్బు, బట్ట మనిషి చేతిలోకి వెళ్ళింది. బట్ట మనిషి, బట్టని అమ్మగా వచ్చిన ఆ డబ్బుతోటే ధాన్యం కొన్నాడు. డబ్బు, ధాన్యం మనిషి చేతిలోకి వెళ్ళింది. ధాన్యం మనిషి, ధాన్యం అమ్మగా వచ్చిన ఆ డబ్బుతోటే జొన్నలు కొన్నాడు. డబ్బు, జొన్నల మనిషి చేతిలోకి వెళ్ళింది. ఈ విధంగా ఆ 4 సరుకుల మారకాలూ ఒక దానితో ఒకటి కలిసిపోయి, గొలుసులాగ అయ్యాయి.

ఒక సరుకు తాలూకు 'మొదటి రూపాంతరం' జరుగు తోందంటే అదే సమయంలో ఇంకో సరుకు తాలూకు 'చివరి రూపాంతరం' జరుగుతోందని అర్థం. అంటే, ఒక సరుకు తాలూకు 'చివరి రూపాంతరం' పూర్తి అవుతూ వుంటే, ఇంకో సరుకు తాలూకు 'మొదటి రూపాంతరం' ప్రారంభమవుతూ వుంటుంది. అంటే, ఒక సరుకు, 'చలామణీ'లో నించి వెళ్ళిపోతూ వుంటే, ఇంకో సరుకు చలామణిలోకి ప్రవేశిస్తూ వుంటుంది.

ఇక్కడ 4 సరుకుల మారకాలూ ఇలా లంకెలు పడివున్నాయి.

గోధు. డబ్బు బట్ట డబ్బు ధాన్యం డబ్బు జొన్నలు
**C M C M C M C** ఇలా.

ఒక 2 రూ.ల నాణెం మొదట కొన్ని గోధుమలతో, తర్వాత కొంత బట్టతో, తర్వాత కొంత ధాన్యంతో, తర్వాత కొన్ని జొన్నలతో, ఇలా మారుతూ, ఆ మారకాల్ని ఒక గొలుసుగా చేసింది. ఆ గొలుసు ఇంకా ఎంత దూరమైనా పెరుగుతుంది.

ఒకే నాణెం అనేక సరుకులతో మారుతుంది కదా? అది ఏ సరుకుతో మారినప్పుడు, ఆ సరుకుకి విలువ రూపం. నాణెం, బట్టతో మారినప్పుడు, అది బట్ట విలువ. ఇంకో సరుకుతో మారేదాకా అది, బట్ట విలువే. తర్వాత ఆ నాణెంతో ధాన్యాన్ని కొంటే, అప్పటినించీ అది ధాన్యం విలువ. ఈ రకంగా అది, ఏ సరుకుతో మారినప్పుడు, ఆ సరుకుకి విలువ రూపంగా వుంటుంది.

ఇక్కడ మనం చూసిన 4 రకాల సరుకులేగాక, బజార్లో ప్రతి నిత్యం అనేక వందల, వేల రకాల సరుకుల అమ్మకాలూ, కొనుగోళ్ళూ (మారకాలు) జరుగుతూ వుంటాయి. ఒక రూపాయి నాణెం ఒక సరుకుతో మారుతూ వున్న సమయంలోనే, దాని పక్కనే ఇంకో రూపాయి ఇంకో సరుకుతో మారుతూ వుంటుంది. లేదా, కొన్ని రూపాయలు (1 కన్నా ఎక్కువ రూపాయలు) ఒక సరుకుతో మారుతూ వున్న సమయంలోనే, ఇంకో కొన్ని రూపాయలు ఇంకో సరుకుతో మారుతూ వుంటాయి. ఈ రకంగా, ఒకే సమ యంలో జరిగే వేరు వేరు సరుకుల మారకాల మొత్తమే " సరుకుల చలామణీ" ( సర్క్యులేషన్ ఆఫ్ కమాడిటీస్ ).

ఒకే సరుకు విషయం తీసుకుంటే, దాని మారకం పూర్తి అవడమే దాని చలామణీ పూర్తి అవడం.

**'సరుకుల చలామణీ'లో వివరంగా చూడవలసిన విషయాలు కొన్ని వున్నాయి.**

ఇంకా చాలా దూరం వెళ్ళాక, చాలా భాగాల్ని చూశాక, ' సరుకుల అమ్మకాలు ఆగిపోయే సంక్షోభాల' గురించి చూస్తాం. అలాంటి పరిస్థితులు ఏర్పడడానికి, డబ్బు ద్వారా వుండే అవకాశాలేమిటో తెలుసుకోవడానికి, డబ్బుకి సంబంధించిన ఈ విషయాలన్నీ సరిగా అర్థం చేసుకోవాలి.

## (1) అమ్మడమే కొనడం :

బట్టకీ, ధాన్యానికీ బార్టరు పద్ధతిలో మారకం జరిగిందనుకుందాం.

(బార్టరు పద్ధతిలో, అమ్మడమూ కొనడమూ అనే మాటలు వుండవని గతంలో చూశాం. కానీ, ఉదాహరణని తేలిగ్గా అర్థం చేసుకోవడం కోసమే, ఇక్కడ కూడా ఆ మాటలు వాడుతున్నాము.)

ఈ మారకాన్ని బట్ట వేపు నించి చూస్తే, అది బట్టని అమ్మడమూ, ధాన్యాన్ని కొనడమూ కూడా. అలాగే, దీన్ని ధాన్యం వేపు నించి చూస్తే, అది ధాన్యాన్ని అమ్మడమూ, బట్టని కొనడమూ కూడా. అంటే, బార్టరు మారకంలో అమ్మడమూ కొనడమూ ఒకే చర్యగా కలిసిపోయి వుంటాయి. ఒక వస్తువుని అమ్మడం అంటే, ఇంకో వస్తువుని కొనేసినట్టే అర్థం. అంటే, ఇక్కడ, అమ్మడమే కొనడం. కొనడమే అమ్మడం.

## (2) అమ్మడమే కొనడం కాదు :

'డబ్బు' ద్వారా జరిగే మారకాలలో, అమ్మడమూ కొనడమూ వేరు వేరు విషయాలుగా విడిపోతాయి. వెంకయ్య, బట్టని అమ్మి, ఆ డబ్బుతో ధాన్యం కొన్నాడనుకుందాం. ఈ మారకంలో ఏం జరిగింది? మొదట బట్టని ఇచ్చి డబ్బు తీసుకున్నప్పుడు, అది, బట్టని అమ్మడం మాత్రమే. తర్వాత, డబ్బుని ఇచ్చి ధాన్యం తీసుకున్నప్పుడు, అది, ధాన్యాన్ని కొనడం మాత్రమే. ఇక్కడ బట్టని అమ్మడమూ, ధాన్యాన్ని కొనడమూ వేరు వేరు పనులుగా విడిపోయాయి. అంటే, డబ్బు ద్వారా జరిగే మారకాలలో, ఒక సరుకుని అమ్మడమూ, ఇంకో సరుకుని కొనడమూ ఒకే చర్యగా వుండవు. ఇక్కడ, అమ్మడమే కొనడం కాదు. అవి రెండూ వేరు వేరు పనులుగా విడిపోతాయి.

### (3) ఒక అమ్మకం — అనేక కొనుగోళ్ళు అనేక అమ్మకాలు — ఒక కొనుగోలు :

వెంకయ్య బట్టని అమ్మి 2 రూ.లు సంపాదించాడు. ఆ 2 రూ. లతో ఏదో ఒక్క సరుకే కొనాలా? — అక్కర్లేదు. ఒక రూపాయితో ఒక సరుకూ, ఇంకో రూపాయితో ఇంకో సరుకూ కొనవచ్చు. లేదా, అర్ధ రూపాయితో ఒక సరుకూ, రూపాయి న్నరతో ఇంకో సరుకూ కొనవచ్చు. ఇలా, ఒక అమ్మకాన్ని ఎన్ని కొనుగోళ్ళుగా అయినా చీల్చవచ్చు. అలాగే, అనేక అమ్మకాల్ని కలిపి ఒక కొనుగోలు చెయ్యవచ్చు. అంటే, అనేక అమ్మకాల వల్ల వచ్చిన డబ్బంతా కలిపి ఒకే సరుకుని కొనవచ్చు. ఒక అమ్మకం అనేక కొనుగోళ్ళుగా చీలితే, అనేక అమ్మకాలు ఒక కొనుగోలుగా కలుస్తాయి.

### (4) అమ్మకమూ, కొనుగోలూ పరస్పర విరుద్ధమైనవి :

అయస్కాంతానికి వుండే పరస్పర విరుద్ధమైన 'పాజిటివ్', 'నెగెటివ్' ధృవాల్లాగ, ఒక మారకంలో అమ్మకమూ, కొనుగోలూ పరస్పర విరుద్ధ చర్యలుగా వుంటాయి.

ఉపయోగపు విలువ

వెళ్ళిపోయే చర్య — నెగెటివ్ కోణం
వచ్చే చర్య — పాజిటివ్ కోణం
అమ్మకం (C — M)— నెగెటివ్ కోణం
కొనుగోలు (M— C)— పాజిటివ్ కోణం

అమ్మకమూ, కొనుగోలూ విరుద్ధ విషయాలుగా వుండడం అనేది, 'బార్టరు' పద్ధతి మారకాలలో ఎటువంటి ప్రభావాన్నీ చూపదు. ఆ పద్ధతిలో అమ్మకం మాత్రమే చేసి, కొనడం చెయ్యకుండా వుండడానికి అవకాశం లేదు. ఆ పద్ధతిలో, ఒక మనిషి ఒక సరుకుని అమ్మాడంటే, ఆ మనిషే, అదే సమయంలో, అంత విలువాగల ఇంకో సరుకుని కొనేశాడని కూడా అర్థం. కాబట్టి, ఆ పద్ధతి మారకాలలో అమ్మకాలకూ, కొనుగోళ్ళకూ మధ్య 'సమతూకం కుదరని పరిస్థితికి' అవకాశం వుండదు. కానీ, డబ్బు ద్వారా జరిగే మారకాలలో అలాంటి పరిస్థితికి అవకాశం బీజ రూపంలో ప్రారంభమవుతుంది.

డబ్బు ద్వారా జరిగే మారకాలలో ఒక మనిషి, తన సరుకుని అమ్మాడంటే, ఇంకో సరుకుని కొనేశాడని అర్థం కాదు. ఆ మనిషి ఇంకో సరుకుని కొనకుండా డబ్బునే కొంతసేపు దాచుకున్నాడనుకుందాం. అంటే, ఆ మనిషి తన సరుకుని అమ్మాడే గానీ ఇంకో సరుకుని కొనలేదనుకుందాం. దాని వల్ల, సరుకుల చలామణీ ప్రవాహం తాత్కాలికంగా ఆగుతుంది. ఒక సరుకుని అమ్మిన మనిషి, ఆ డబ్బుని ఎప్పుడూ ఉపయోగించకుండా వుంటే, ఆ మనిషికి ఇతర సరుకులు రావు కాబట్టి, డబ్బుని పూర్తిగా దాచెయ్యడం ఎప్పుడూ సాధ్యం కాదు. డబ్బులో కొంత భాగాన్ని ఎక్కువ కాలం వరకూ దాచడం గానీ, లేదా ఎక్కువ భాగాన్ని కొంత కాలం వరకూ దాచడం గానీ, సాధ్యమవుతాయి. అంటే, బార్టరు పద్ధతిలో లేని కొంత విలువని దాచి వుంచే పరిస్థితి, డబ్బు ద్వారా జరిగే మారకాలలో ప్రారంభమవుతుంది.

డబ్బు ద్వారా జరిగే 'చలామణీ', బార్టరు పరిమితు లన్నింటినీ ఛేదిస్తుంది. ఎలాగంటే: డబ్బు ద్వారా జరిగే మారకాలలో —అమ్మకమూ, కొనుగోలూ విడిపోవడం వల్ల, అవి జరిగే స్థలాలూ కాలాలూ కూడా విడిపోతాయి. బార్టరు పద్ధతిలో —అమ్మకమూ, కొనుగోలూ ఒకేసారి ఒకే స్థలంలో ఒకే కాలంలో జరిగితే, డబ్బు ద్వారా జరిగే మారకంలో — అమ్మకం ఒక చోటా, కొనుగోలు ఇంకో చోటా జరుగుతాయి. అమ్మకం ఒక సమయంలోనూ, కొనుగోలు ఇంకో సమయం లోనూ జరుగుతాయి. ఈ రకంగా, డబ్బు ద్వారా జరిగే మారకాలలో, అమ్మకాలకూ, కొనుగోళ్ళకూ మధ్య, 'సమ తూకం కుదరని పరిస్థితి'కి అవకాశం ఏర్పడుతుంది. డబ్బు ద్వారా జరిగే లక్షల, కోట్ల మారకాల క్రమంలో అమ్మకాలకూ కొనుగోళ్ళకూ ఏకత్వం కుదరని స్థితి, చలామణీ ప్రవాహాన్ని ఆపివేసే తీవ్ర పరిణామానికి కూడా దారితీస్తుంది.

# 3. 'డబ్బు' చలామణీ

బార్టరు పద్ధతి మారకాలలో డబ్బు అనేది వుండదు కాబట్టి, అక్కడ రెండు వేపులా సరుకుల కదలికలు మాత్రమే వుంటాయి. అంటే, మారకం అయ్యే సరుకులు మాత్రమే ఇటూ అటూ కదులుతాయి. కానీ, డబ్బు ద్వారా జరిగే మారకాలలో, సరుకుల కదలికలూ, డబ్బు కదలికలూ కూడా వుంటాయి.

వెంకయ్య కొంత బట్టని 2 రూ.లకి అమ్మి, తర్వాత ఆ డబ్బుతో ధాన్యం కొన్నాడనుకుందాం. ఈ మొత్తం సంఘటనలో, బట్టా ధాన్యమూ అనే 2 సరుకులూ ఇటూ అటూ కదలడమే గాక, డబ్బు కూడా 2 సార్లు కదులుతుంది. డబ్బు, మొదటి సారి, బట్టని కొన్న మనిషి దగ్గిర నించి వెంకయ్య దగ్గిరికి వస్తుంది. రెండో సారి, వెంకయ్య దగ్గిర నించి ధాన్యం అమ్మిన మనిషి దగ్గిరికి వెళ్తుంది. ఈ రకంగా, ఒక సరుకుని అమ్మి ఇంకో సరుకుని కొనే సంఘటనలో, డబ్బు 2 సార్లు కదులుతుంది.

ఈ మారకాలలో సరుకులూ డబ్బూ కూడా కదులు

తాయి కాబట్టి, ఈ కదలికలకు సంబంధించి ఒక ప్రశ్న తలెత్తుతుంది. సరుకుల కదలికల్ని బట్టి డబ్బు కదలికలు వుంటాయా, డబ్బు కదలికల్ని బట్టి సరుకుల కదలికలు వుంటాయా? — అనే ప్రశ్న. దేన్నిబట్టి ఏది వుంటుంది? ఏది దేనికి మూలం? — సరుకులే మూలం. డబ్బు లేకపోయినా సరుకులు కదులుతాయి గానీ (డబ్బు లేకపోయినా 'బార్టరు' పద్ధతిలో సరుకులు కదలవచ్చు), సరుకులు లేకపోతే డబ్బు కదలదు. సరుకులు కదిలితేనే డబ్బు కదులుతుంది.

బట్టని అమ్మి, ధాన్యాన్ని కొన్న ఉదాహరణలో, మొదట బట్టే అమ్మకానికి సిద్ధంగా లేకపోతే, డబ్బు మొదటిసారి కూడా కదలదు. మొదట బట్ట — అమ్మకం జరిగినా, తర్వాత, ధాన్యం సిద్ధంగా లేకపోతే, డబ్బు రెండోసారి కదలదు. సరుకులు, అమ్మకాలకు సిద్ధంగా లేకపోవచ్చు. లేదా, సిద్ధంగా వున్న సరుకులు కూడా వాడడానికి అవసరం లేకపోవచ్చు. ఇలా 'సరుకు' వేపునించీ ఏర్పడే ఏదో ఒక కారణం వల్ల, సరుకు కదలకపోతే, డబ్బు కూడా కదలదు. సరుకు నడక ఆగిపోతే, డబ్బు నడక కూడా ఆగిపోతుంది. అంటే, సరుకుల కదలికల్ని బట్టి డబ్బు కదలికలు గానీ, డబ్బు కదలికల్ని బట్టి సరుకుల కదలికలు కాదు. ఎప్పుడైనా సరుకుల చలామణీ ఆగిపోతే, దానికి కారణం సరుకుల వేపు నించే వుంటుంది గానీ, డబ్బు వేపు నించి కాదు.

ఇక్కడ మనం, 'డబ్బు' వేపు నించి సంభవించే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్ని కూడా అర్థం చేసుకోవాలి. చలామణీలో ఎంత డబ్బు వుండాలో అంత డబ్బు లేకపోవడం అనే పరిస్థితి కూడా కొన్ని సార్లు ఏర్పడుతూ వుంటుంది. అలాంటి పరిస్థితుల్లో కూడా 'సరుకుల చలామణీ'కి ఆటంకాలు ఏర్పడతాయి. అయితే, ఈ ఆటంకాలు, డబ్బు వేపు నించే ఏర్పడినట్టు పైకి కనపడినా, ఈ పరిస్థితిని ఇంకా లోతుగా పరిశీలిస్తే, దీని మూల కారణం కూడా సరుకుల వేపు నించే వుండడం కనపడుతుంది.

అమ్మకాల తర్వాత ఆ డబ్బుతో తప్పనిసరిగా కొనుగోళ్ళు జరుగుతూ, సరుకుల మారకాలు ఆటంకాలు లేకుండా జరుగుతూ వుండడం — సరుకులలో 'నిరంతర చలనం'. ఈ చలనానికి ఆటంకం కలిగిన ఏ సందర్భంలోనైనా, దాని మూల కారణం, సరుకుల వేపు నించే వుంటుంది.

డబ్బుతో సరుకుని కొన్నప్పుడు, ఆ డబ్బు, 'ధర ప్రమాణం' గా పనిచేస్తుందని చూశాం. ఈ పనినే వేరే మాటల్లో చెప్తే, డబ్బు 'కొనుగోలు సాధనం'గా (కొనే సాధనం గా) పని చేస్తుంది — అని కూడా అనవచ్చు. 'ధర ప్రమాణం' అన్నా, 'కొనుగోలు సాధనం' అన్నా, 'చలామణీ సాధనం' అన్నా, 'మారకాల సాధనం' అన్నా — అన్నీ ఒకటే. సరుకుల మారకాలకు సాధనంగా డబ్బు కదలడమే — 'డబ్బు చలామణీ'.

డబ్బు, ఒక సారి కదిలిందంటే, ఒక సరుకుకి అమ్మకం జరిగిందన్నమాట. డబ్బు 10 సార్లు కదిలిందంటే, 10 సరుకుల అమ్మకాలు జరిగాయన్నమాట. ఒక డబ్బు నాణెం నిరంతరంగా కదులుతోందంటే, సరుకులు నిరంతరంగా కదులుతున్నాయన్నమాట. అంటే, డబ్బు కదలిక అనేది, సరుకుల కదలికే. కానీ, ఈ వాస్తవం, పైకి తారుమారుగా కనపడుతుంది. సరుకులు కదలడం వల్లనే డబ్బు కదులుతున్నట్టుగాక, డబ్బు కదలడం వల్లనే సరుకులు కదులుతున్నట్టు కనపడుతుంది. అంటే, సరుకుల చలామణీకి డబ్బే మూలం అయినట్టు — కనపడుతుంది. కానీ అది నిజం కాదు. సరుకుల చలామణీ నిరాటంకంగా సాగినప్పుడైనా, ఆగినప్పుడైనా, ఎప్పుడైనా, దానికి కారణం సరుకులకు సంబంధించిన పరిస్థితులే గానీ డబ్బు కాదు.

# 4. 'చలామణీ సాధనం' పరిమాణం

'చలామణీ సాధనం' అంటే, చలామణీకి తోడ్పడే సాధనం. దేని చలామణీకి? సరుకుల చలామణీ కి. దానికి తోడ్పడే సాధనం ఏమిటి? — 'డబ్బు'. 'చలామణీ సాధనం పరిమాణం' అంటే — 'డబ్బు పరిమాణం'.

బార్టరు పద్ధతి మారకాలలో డబ్బు అనేదే వుండదు కాబట్టి, అక్కడ డబ్బుకి సంబంధించి ఏ ప్రశ్నలూ వుండవు. కానీ, సరుకుల్ని చలామణీ చేసే సాధనంగా డబ్బు ప్రవేశించిన తర్వాత డబ్బుకి సంబంధించి అనేక విషయాలు పరిశీలించవలసి వుంటుంది.

సమాజంలో ఒకటి రెండు సరుకులు మాత్రమే వుండవు. అనేక వందల, వేల సరుకులు వుంటాయి. ప్రతి నిత్యమూ వందల, వేల సరుకుల అమ్మకాలూ, కొనుగోళ్ళూ జరుగుతూ వుంటాయి. ఆ సరుకులన్నిటితోటీ మారాలంటే, సమాజంలో మొత్తం ఎంత డబ్బు వుండాలి? — ఇది, డబ్బుకి సంబంధించిన ప్రశ్నల్లో ఒకటి.

'సమాజంలో డబ్బు వుండడం' అంటే, అసలు డబ్బు ఎక్కడ వుంటుంది? సమాజంలో వున్న మనుషుల దగ్గిరే వుంటుంది. మనుషులందరి దగ్గిరా డబ్బు వుంటుంది. కొందరి దగ్గిర ఎక్కువా, కొందరి దగ్గిర తక్కువా, వుండవచ్చు. కొందరి దగ్గర అస్సలు లేకపోవచ్చు. ఆ తేడాల్ని వొదిలేస్తే, మొత్తం సమాజంలో వున్న మనుషులందరి దగ్గిరా కలిసి ఎంత డబ్బు వుంటుందో అదే సమాజంలో వున్న డబ్బు. ఆ డబ్బుతోనే

మనుషులు, సరుకుల్ని కొనుక్కుంటూ వుంటారు. ఆ డబ్బే సరుకులతో మారుతూ వుంటుంది. సమాజంలో వున్న అన్ని సరుకులతోటీ మారడానికి ఒక్క నాణెమో, 2 నాణాలో వుంటే చాలవు. కాబట్టి, 'మొత్తం ఎంత డబ్బు వుండాలి' అనే ప్రశ్నని ఇప్పుడు చూడాలి.

సరుకు అనేది, ఒక్కసారి డబ్బుతో మారిన తర్వాత చలామణీలో నించి వాడకంలోకి వెళ్ళిపోతుంది. కానీ, డబ్బు సంగతి అలా కాదు. అది ఒక సరుకుతో మారిన తర్వాత చలామణీలో నించి వెళ్ళిపోదు. ఆ నాణెమే తర్వాత మళ్ళీ ఇంకో సరుకుతో కూడా మారుతుంది. అదే ఒక సరుకు తర్వాత ఒక సరుకుతో మారుతూ, అంటే ఒక మనిషి చేతిలో నించి ఇంకో మనిషి చేతిలోకి మారుతూ ఎప్పుడూ చలామణీలోనే తిరుగుతూ వుంటుంది. డబ్బు నాణాల పని అదే. ఒకే నాణెం, ఒకే రోజున, అనేక సరుకులతో మారగలుగుతుంది. అనేక మంది దగ్గిరికి మారుతుంది. ఇంతకు ముందు మనం చూసిన 4 సరుకుల ఉదాహరణలో, ఒక 2 రూ.ల నాణెం, మొదట గోధుమలతో, తర్వాత బట్టతో, తర్వాత ధాన్యంతో, తర్వాత జొన్నలతో — మారింది. తర్వాత కూడా అది ఇంకా అలాగే ఎన్ని సరుకులతోనైనా మారగలుగుతుంది.

ఒక సరుకుకి అమ్మకం జరిగి, దాని విలువ డబ్బుగా చేతికి వచ్చిందంటే, 'సరుకు విలువ రియలైజ్ అయింది' అంటాము. 'రియలైజ్ అవడం' అంటే, నిజం అవడం. ఆ సరుకుకి అంత విలువ వుందనే సంగతి రుజువై, ఆ విలువ, చేతికి వచ్చిందని అర్థం. చలామణీలో తిరగడానికి మొత్తం ఎంత డబ్బు వుండాలీ అనేది — 'ఒకే సమయంలో రియలైజ్ అవవలసిన విలువల మొత్తాన్ని బట్టి' వుంటుంది.

'ఒకే సమయంలో' అన్నప్పుడు, ఒక వారాన్నో, ఒక రోజునో, ఎంతో కొంత కాలాన్ని ఉదాహరణగా తీసుకోవాలి. ఇక్కడ 'ఒక రోజు'ని ఉదాహరణగా తీసుకుందాం. ఒక రోజులో, 100 రూ.ల విలువగల సరుకులు రియలైజ్ కావాలనీ, చలామణీలో వున్న ప్రతీ నాణెమూ రోజుకి ఒక్క సారి మాత్రమే కదులుతుందనీ, అనుకుందాం. అప్పుడు చలామణీలో తిరగడానికి ఎంత డబ్బు వుండాలి? 100 రూ.లు వుండాలి. లేదా, ప్రతీ నాణెమూ రోజుకి 2 సార్లు కదులుతుం దనుకుంటే, చలామణీలో తిరగడానికి 50 రూ.లు సరిపోతాయి. ఈ 50 రూ.లు, మొదటి కదలికలో ఒక 50 విలువ గల సరుకులతోనూ, రెండో కదలికలో ఇంకో 50 విలువగల సరుకులతోనూ మారుతూ, మొత్తం ఒక రోజులో 100 విలువ గల సరుకుల్ని రియలైజ్ చేస్తాయి. కాబట్టి, చలామణీలో వుండవలసిన డబ్బు పరిమాణం — ఫలానా కొంత కాలంలో రియలైజ్ అవవలసిన విలువల మొత్తాన్ని బట్టీ, ఆ కాలంలో నాణాలు చేసే సగటు కదలికల సంఖ్యని బట్టీ — వుంటుంది.

నిజానికి చలామణీలో, రక రకాల విలువలు గల నాణాలు వుంటాయి. 1 రూ. నాణాలూ, 2 రూ.ల నాణాలూ, 5 రూ.లవీ, 10 రూ.లవీ ఇలా. ఈ నాణాల్లో కొన్ని నాణాలు ఎక్కువ సార్లూ, కొన్ని నాణాలు తక్కువ సార్లూ కదులుతూ వుంటాయి. కాబట్టి, నాణాల కదలికలకు ఏదో ఒక సగటు పరిస్థితినే తీసుకోవాలి. చలామణీలో వున్న నాణాలన్నీ ఒకే విలువ గలవి అనుకుందాం. అంటే, నాణాలన్నీ 2 రూ.లవే అనుకుందాం. ప్రతీ నాణెమూ రోజుకి సగటున 2 సార్లు కదులుతుంది — అనుకుందాం. అంటే, ప్రతీ నాణెమూ, రోజుకి 4 రూ.ల విలువని రియలైజ్ చేస్తుంది. అలాంటప్పుడు, 1 రోజులో 100 రూ.ల విలువని రియలైజ్ చెయ్యాలంటే, 100 ÷ 4 = 25 నాణాలు చలామణీలో వుండాలి. ప్రతీ నాణెమూ 2 రూ.ల విలువ కలది కాబట్టి, ఆ 25 నాణాల మొత్తం విలువ 50 రూ.లు. అవే రోజుకి 2 సార్లు కదిలి, 100 విలువ గల సరుకులతో మారతాయి. అంటే, మనం తీసుకున్న ఉదాహరణ ప్రకారం, చలామణిలో తిరగడానికి 50 రూ.లు వుండాలి. ఆ నాణాలే ప్రతీ రోజూ మళ్ళీ మళ్ళీ చలామణీలో తిరుగుతూ, ప్రతీ రోజూ 100 విలువగల సరుకులతో మారుతూ వుంటాయి.

ఇదే ఉదాహరణని ఇంకో రకంగా కూడా చూద్దాం. చలామణీలో వున్న నాణాలన్నీ 5 రూ.ల నాణాలే అనుకుందాం. ప్రతీ నాణెమూ రోజుకి 2 సార్లు కదులుతుంది — అనుకుందాం. ప్రతీ రోజూ 100 విలువగల సరుకులు రియలైజ్ అవుతూ వుండాలి కదా? ఇప్పుడు, చలామణీలో ఎంత డబ్బు వుండాలి? — ప్రతీ నాణెమూ రోజుకి 2 సార్లు కదులుతూవుంటే, ప్రతీ నాణెమూ రోజుకి 2 × 5 = 10 విలువని రియలైజ్ చేస్తుంది. మొత్తం రియలైజ్ కావలసింది 100 విలువ కాబట్టి, 100 ÷ 10 = 10 నాణాలు చలామణీలో వుండాలి. 1 నాణెం విలువ 5 రూ.లు కాబట్టి, 10 నాణాల విలువ 50 రూ.లు. ఇప్పుడు కూడా ఆ మొత్తమే వచ్చింది. చలామణిలో వున్నది 2 రూ.ల నాణాలు అయినా, 5రూ.ల నాణాలు అయినా, చలామణిలో తిరగడానికి అవసరమయ్యే డబ్బు మొత్తం ఒకటే. ఎక్కువ విలువగల నాణాలే చలామణీలో వుంటే, నాణాల సంఖ్య తగ్గుతుంది. తక్కువ విలువ గల నాణాలు వుంటే, నాణాల సంఖ్య పెరుగుతుంది. అంతే తేడా. ఎలా చూసినా విషయం ఒకటే.

వాస్తవానికి, చలామణీలో వుండే నాణాలు రక రకాల విలువలతో వుంటాయి. నాణాలు ఏ యే విలువలతో వున్నా ఫరవాలేదు. అన్ని నాణాల విలువల్నీ కలిపితే, ఆ మొత్తం, సరుకులతో మారడానికి సరిపోతాయి.

చలామణీలో ఎంత డబ్బు వుండాలో తెలియాలంటే, రియలైజ్ కావలసిన విలువల మొత్తమూ, నాణాల సగటు కదలికల సంఖ్యా, తెలియాలి. ఒక నిర్ణీత కాలంలో రియలైజ్

కావలసిన విలువల మొత్తాన్ని, నాణాలు చేసే సగటు కదలికల సంఖ్యచేత భాగించగా వచ్చేదే — చలామణీలో వుండవలసిన 'డబ్బు పరిమాణం'. 'చలామణీలో ఇంత డబ్బు వుండాలి' అనే విషయం, ఒక నిర్ణీత కాలానికంతటికీ వర్తిస్తుంది.

చలామణీలో వుండవలసిన డబ్బు పరిమాణం, ప్రధానంగా 3 విషయాల మీద ఆధారపడి వుంటుంది. (1) సరుకుల పరిమాణం, (2) విలువల పరిస్థితి, (3) డబ్బు చలామణీ వేగం.

## (1) సరుకుల పరిమాణం :

'సరుకులు' అన్నప్పుడు, వాటిలో ధాన్యమూ బట్టలూ మందులూ ఇనుమూ బొగ్గూ — వంటి అనేక రకాలు వుంటాయి. ఏ రకాన్ని తీసుకున్నా దాని పరిమాణం ప్రతి ఏటా ఒకే విధంగా వుండదు. ఒక సంవత్సరం, ధాన్యం, గతం కన్నా ఎక్కువగా పండితే, అప్పుడు ఒక బస్తా ధాన్యం విలువ, గతం కన్నా తక్కువగా వుంటుంది. ఇంకో సంవత్సరం ధాన్యం తక్కువగా పండితే, బస్తా విలువ గతం కన్నా ఎక్కువగా వుంటుంది. అలాగే, ఇతర సరుకుల విషయం కూడా. సరుకుల పరిమాణాల్లో వచ్చే మార్పుల్ని బట్టి వాటి యూనిట్ల విలువలు మారతాయి. వేరు వేరు సరుకుల యూనిట్ల విలువలు మారితే, ఆ విలువల్ని కలిపినప్పుడు, వాటి 'మొత్తం' మారుతుంది. రియలైజ్ కావలిసిన 'విలువల మొత్తం' మారాలంటే, అన్ని రకాల సరుకుల పరిమాణాలూ మారనక్కరలేదు. నిత్యం తప్పనిసరిగా అవసరమయ్యే ధాన్యమూ, పత్తీ, బొగ్గూ, చమురూ వంటి ప్రధానమైన సరుకుల (లీడింగ్ ఆర్టికల్స్) పరిమాణాలు మారితే చాలు. వాటి యూనిట్ల శ్రమ కాలాలు మారి, విలువలు మారి, ఆ విలువల మొత్తం మారుతుంది.

ఒక ఎకరం భూమిలో పండే ధాన్యం పరిమాణం మారకుండా, గతం కన్నా ఎక్కువ ఎకరాల్ని సాగుచేస్తే, ధాన్యం మొత్తం పెరుగుతుంది. కానీ, బస్తా విలువ మారదు. ఈ రకంగా, అక్కడ వున్న ఉదాహరణని బట్టే యూనిట్ విలువ వుంటుంది.

అమ్మకం అవవలసిన వేరు వేరు సరుకుల మొత్తాల్ని బట్టి, వాటితో మారడానికి ఎంత డబ్బు కావాలీ — అనేది వుంటుంది. ఈ రకంగా, డబ్బు పరిమాణాన్ని నిర్ణయించ డంలో సరుకుల పరిమాణం ప్రధాన కారణంగా వుంటుంది.

## (2) విలువల పరిస్థితి :

సరుకుల విలువలు పెరగడమో తరగడమో జరుగుతూ వుండవచ్చు. దాన్ని బట్టి రియలైజ్ అవవలసిన విలువల మొత్తం మారవచ్చు. ఆ మొత్తాన్ని బట్టి, చలామణీలోకి అవసరమయ్యే డబ్బు పరిమాణం వుంటుంది. ఇది మొదటి అంశంతో సంబంధం వున్న విషయమే.

## (3) డబ్బు చలామణీ వేగం :

సరుకు కదిలితేనే డబ్బు కదులుతుందని చూశాం. కాబట్టి, సరుకు చలామణీయే డబ్బు చలామణీ. అయితే ఇప్పుడు, మొదట, 'చలామణీ వేగం' అంటే ఏమిటో చూద్దాం. ప్రతి రోజూ 100 విలువ గల సరుకులు అమ్మకం అవుతాయను కుందాం. ఆ సరుకులన్నీ 'ఒకే సమయంలో' అమ్మకం అవుతాయని కూడా అనుకుందాం. అలాంటప్పుడు, ఆ సరుకులతో మారడానికి 100 రూ.లు కావాలి. అంటే చలా మణీలో 100 రూ.లు వుండాలి. ఆ డబ్బు రోజూ ఒక సారి కదులుతూ వుంటుంది.

అలాగాక, సరుకుల అమ్మకం రోజూ గాక వారానికి సరిపోయే సరుకులన్నీ వారానికి ఒక్కరోజు మాత్రమే, సంతల్లాంటి చోట్ల, అమ్మకం అవుతాయనుకుందాం. అంటే, వారానికి 700 విలువ గల సరుకులు, ఒకే సమయంలో అమ్మకం అవుతాయి. అలాంటప్పుడు, చలామణీలో తిరగ డానికి 700 రూ.లు వుండాలి. ఈ డబ్బు వారానికి ఒక్కసారి మాత్రమే కదులుతుంది.

ఈ ఉదాహరణలో, సరుకుల వేపు నించి చూస్తే — రోజుకి 100 విలువ గల సరుకులు, ప్రతి రోజూ అమ్ముడవడం గానీ; లేదా వారానికి ఒక్కసారే 700 విలువ గల సరుకులు అమ్ముడవడం గానీ — రెండూ ఒకటే. ఎలా జరిగినా, సరుకుల పరిమాణం గానీ, వాటి విలువ గానీ మారదు.

కానీ, డబ్బు వేపు నించి చూస్తే — సరుకులు ప్రతి రోజూ అమ్ముడయితే, చలామణీలో తిరగడానికి 100 డబ్బే సరి పోతుంది. ఆ 100 డబ్బే ప్రతిరోజూ మళ్ళీ మళ్ళీ తిరుగుతూ వుంటుంది. అలా గాక, సరుకులు వారానికి ఒక్క సారే అమ్ముడయితే, చలామణీలో తిరగడానికి 700 డబ్బు అవసరమవుతుంది. ఆ నాణాలన్నీ వారానికి ఒక్క సారే కదిలి, మిగిలిన 6 రోజులూ కదలకుండా వుండిపోతాయి. ఈ రకంగా, సరుకుల కదలిక ఏ పద్ధతిలో వుందో దాన్నిబట్టే, చలామణీ కోసం అవసరమయ్యే డబ్బు పరిమాణం వుంటుంది.

ఈ ఉదాహరణలో, సరుకులు ప్రతిరోజూ 100 చొప్పున అమ్ముడైతే, 'సరుకుల చలామణీ వేగం — ఎక్కువ' అని అర్థం. లేదా, వారానికి ఒక్కసారే 700 చొప్పున అమ్ముడైతే, సరుకుల చలామణీ వేగం — తక్కువ. 'సరుకుల వేగం ఎక్కువ' అంటే — ఎక్కువ సరుకులు ఖర్చవుతున్నాయనీ, 'వేగం తక్కువ' అంటే — తక్కువ సరుకులు ఖర్చవు తున్నాయనీ అర్థం కాదు. 'సరుకుల వేగం' ఎలా వున్నా, రోజూ

ఖర్చయ్యే సరుకులు 100 విలువ గలవే. వారానికి ఖర్చయ్యే సరుకులు 700 విలువ గలవే. సరుకుల వేగం ఎలా వున్నా సరుకుల ఖర్చులో తేడా రాదు.

సరుకుల చలామణీ వేగాన్ని బట్టే, డబ్బు చలామణీ వేగం వుంటుంది. మొదటిది ఎక్కువైతే, రెండోది కూడా ఎక్కువ. మొదటిది తక్కువైతే, రెండోది కూడా తక్కువ.

అయితే, 'చలామణీ వేగం' ఎలా వున్నా 'సరుకుల పరిమాణం' మారదు. డబ్బు పరిమాణమే మారుతుంది. కాబట్టి, 'చలామణీ వేగం' అనే మాటని, 'సరుకుల' విషయంలో గాక, 'డబ్బు' విషయంలోనే ఉపయోగిస్తాము. 100 డబ్బు రోజూ కదిలితే, ఒక డబ్బు నాణెం వారానికి 7 సార్లు కదలుతుంది కాబట్టి, ఇక్కడ డబ్బు చలామణీ వేగం ఎక్కువ. రోజూగాక, వారానికి 700 డబ్బు ఒక్కసారే కదిలితే, ఒక డబ్బు నాణెం వారానికి ఒక్కసారే కదులుతుంది కాబట్టి, ఇక్కడ డబ్బు చలామణీ వేగం తక్కువ. 'డబ్బు చలామణీ వేగం' ఎక్కువ అయితే, చలామణీలో తిరగడానికి తక్కువ డబ్బే సరిపోతుంది. లేదా, చలామణీ వేగం తక్కువైతే, చలామణీ లోకి ఎక్కువ డబ్బు అవసరమవుతుంది. కాబట్టి, చలామణీ వేగం, డబ్బు పరిమాణాన్ని మారుస్తుంది.

ఇంకో ఉదాహరణ: రోజుకి ఒకసారి 100 విలువ గల సరుకులు అమ్ముడవుతూ వున్నాయి. వాటితో మారడానికి 100 డబ్బు చలామణీలో వుంది. ఇలా వుండగా, ఆ సరుకులన్నీ ఒకే సమయంలో అమ్ముడవడం గాక, ఉదయం 50 సరుకులూ, సాయంత్రం 50 సరుకులూ అమ్ముడయ్యే విధంగా పరిస్థితి మారిందనుకుందాం. అంటే, ఒకే సమయంలో కదిలే సరుకుల రాసి తగ్గి, కదిలే సమయాలు పెరిగాయి. ఇలా జరిగితే, సరుకుల చలామణీ వేగం పెరిగిందని అర్థం. అంటే, గతం కన్నా ఎక్కువ సరుకులు అమ్ముడవుతున్నాయనీ, ఎక్కువ సరుకులు ఖర్చవుతున్నాయనీ కాదు. 1 రోజుకి అవసరమయ్యే సరుకుల మొత్తం మారలేదు. అది ఎప్పటిలాగే వుంది. కానీ డబ్బు విషయం చూస్తే, ఇప్పుడు చలామణీలో తిరగడానికి 100 డబ్బు గాక, 50 డబ్బే సరిపోతుంది. ఆ 50 డబ్బే రోజుకి రెండు సార్లు తిరుగుతుంది. ఇలా జరిగితే, 'డబ్బు చలామణీ వేగం' రెట్టింపు అయిందని అర్థం. సరుకుల వేగం పెరగడం వల్ల, డబ్బు వేగం పెరిగి, చలామణీలో తిరిగే డబ్బు పరిమాణం తగ్గింది.

100 డబ్బు, రోజుకి 1 సారి కదలడాన్ని మొదట ఒక ఉదాహరణగా తీసుకుంటే, 200 డబ్బు 2 రోజులకు 1 సారి కదిలితే, అది, సరుకుల చలామణీ వేగం తగ్గిందనీ, సగమే అయిందనీ అర్థం.

ఇంకో ఉదాహరణ: రోజూ 100 సరుకులు ఒకే సమయంలో అమ్ముడవుతాయి. దాని కోసం చలామణీలో 100 డబ్బు వుంది. ఇది జనరల్ పరిస్థితి. ఇలా వుండగా, ఈ పరిస్థితి హఠాత్తుగా ఒక రోజున మారిందనుకుందాం. ఒక 'పండగ' రోజున, 200 సరుకులు అమ్ముడవ్వాలి. దాని కోసం, చలామణీలో తిరిగే డబ్బు ఎలా మారాలి? — ఈ మార్పు, 2 రకాలుగా వుండవచ్చు. (1) మొదట 100 సరుకులూ, తర్వాత ఇంకో 100 సరుకులూ అమ్ముడవుతాయి. ఇలా జరిగితే, చలామణీలోకి 100 డబ్బే సరిపోతుంది. డబ్బు పరిమాణం పెరగనక్కరలేదు. (2) మొదటి పద్ధతిలోగాక ఇంకో పద్ధతిలో చూద్దాం. 200 సరుకులూ ఒకే సమయంలో అమ్ముడవాలి. ఇలా జరగాలంటే, చలామణీలో వున్న 100 డబ్బు చాలదు. ఇంకో 100 డబ్బు చలామణీలోకి దిగాలి. సరుకుల్ని కొనేవాళ్ళు దాచుకున్నదాంట్లో నించి 100 డబ్బు బైటికి వస్తేనే, అమ్మకాలు ఈ రెండో పద్ధతిలో జరుగుతాయి. — కానీ, ఎప్పుడైనా ఒకరోజున హఠాత్తుగా అమ్మకాలు పెరగాలంటే, మొదటి పద్ధతిలోనే, అంటే 'చలామణీ వేగం' పెరగడం ద్వారానే, ఉన్న డబ్బుతోనే సమస్య పరిష్కారమవుతూ వుంటుంది. లేదా, చలామణీ వేగం మారకుండానే అమ్మకాలు పెరగాలంటే, డబ్బు రాసి పెరగవలసిందే.

రోజూ వుండే జనరల్ పరిస్థితిని తీసుకున్నా, లేదా అప్పుడప్పుడూ హఠాత్తుగా ఎదురయ్యే ప్రత్యేక పరిస్థితుల్ని తీసుకున్నా, ఎలా చూసినా, సరుకుల చలామణీ వేగాన్ని బట్టే— డబ్బు చలామణీ వేగం. దాన్ని బట్టే, డబ్బు పరిమాణం.

**డబ్బు నాణాలు, పరస్పరం బాధ్యులుగా వుంటాయి :**

చలామణీలో ' 100 డబ్బు వుంది' అన్నప్పుడు, ఆ డబ్బు అంతా ఒకే విలువగల నాణాలుగా వుండదు. 1 రూ. నాణాలూ, 2 రూ.ల నాణాలూ, 5 రూ.ల నాణాలూ, 10 రూ.ల నాణాలూ ఇలా వేరు వేరు విలువగల నాణాలుగా వుంటుంది. ఆ నాణాలన్నీ ఒకే రకంగా కదలవు. కొన్ని నాణాలు ఎక్కువ సార్లు కదిలితే, కొన్ని నాణాలు తక్కువసార్లు కదులుతాయి. ఒకే విలువగల నాణాల సంగతే తీసుకున్నా వాటిలో కూడా అన్ని నాణాలూ ఒకే రకంగా కదలవు.

అయినప్పటికీ, ఏ నాణెం ఎలా కదలినప్పటికీ, చలామణీలో తిరిగే నాణాలు ఒక దాని కొకటి బాధ్యులుగా వుంటాయి. అంటే, వాటి కదలికల మధ్య ఒక సామరస్యం వుంటుంది.

ఒక స్త్రీ, 10 రూ.ల విలువగల వస్తువు కొన్నదనుకుందాం. ఆమె దగ్గిర 10 రూ.ల నాణెం లేదు. 5 రూ.లవీ, 2 రూ.వీ

వున్నాయి. వస్తువుని కొన్న తర్వాత ఆమె, 5 రూ.ల నాణాలు 2 ఇచ్చింది. అంటే 10 రూ. ల నాణెం ఒకసారి కదలడానికి బదులు, 5 రూ. ల నాణాలు 2, ఒక్కోసారి కదిలాయి. 10 రూ.ల నాణెం చెయ్యవలసిన పనిని, 5 రూ.ల నాణాలు 2 కలిసి చేశాయి. ఎలా జరిగినా ఒకటే. లేదా, ఆమె, 2 రూ.ల నాణాల్ని 5 నాణాల్ని ఇచ్చి వుంటే, అది కూడా, 10 రూ.ల నాణెం, ఒక సారి కదలడంతో సమానమే.

ఒక నాణెం కదలకపోతే ఇతర నాణాలు కదులుతాయి. ఒక నాణెం తన కదలికల్ని తగ్గిస్తే, దానికి బదులుగా, ఆ విలువతో సమానం అయ్యేలాగ ఇతర నాణాలు, తమ కదలికల్ని ఎక్కువ చేస్తాయి. ఒక చోట ఒక నాణెం వేగం పెరిగితే, ఎక్కడో ఇంకో చోట ఇంకో నాణెం వేగం తగ్గుతుంది. నాణాలన్నిటి కదలికలూ పెరిగితే చలామణీలో తిరిగే నాణాల సంఖ్య తగ్గుతుంది. నాణాల కదలికలు తగ్గితే నాణాల సంఖ్య పెరుగుతుంది.

ఈ రకంగా, చలామణీలో వుండే డబ్బు పరిమాణం — సరుకుల పరిమాణం మీదా, ధరల పరిస్థితి మీదా, డబ్బు చలామణీ వేగం మీదా — ఆధారపడి వుంటుంది. ఈ 3 విష యాలూ ఎప్పుడూ స్థిరంగా వుండవు. అన్నీ ఎంతో కొంత మారుతూ వుంటాయి. అయినప్పటికీ, ఈ మార్పులు ఒక దాన్ని ఒకటి సరిపుచ్చుకుంటూనే వుంటాయి. కాబట్టి. మార్పులు ఎలా జరిగినా, రియలైజ్ కావలసిన 'విలువల మొత్తం' ప్రతి రోజూ మారిపోతూ వుండదు. అది, కొంత కాలం పాటు స్థిరంగానే వుంటుంది.

ఒక దేశంలో, ఒక కాలాన్ని తీసుకుంటే, అక్కడ చలామణీలో తిరగడానికి ఎంత డబ్బు వుండాలీ అనేది, అక్కడ చలామణీకి సంబంధించిన 'అవసరాల' ద్వారానే తెలుస్తుంది. అక్కడ అవసరమయ్యే డబ్బు పరిమాణానికి ఏదో ఒక సగటు స్థాయి వుంటుంది. ఆ సగటుని 100 అనుకుంటే, ఆ రాసిలో ఏ నాణెం ఎలా కదిలినా, ఆ 100 డబ్బే ఇటూ అటూ మళ్ళీ మళ్ళీ తిరుగుతూ సరుకుల్ని రియలైజ్ చేస్తూ వుంటుంది. ఆ దేశంలోనే ఇంకో కాలాన్ని తీసుకుంటే, ఆ కాలంలో సగటున 200 డబ్బు అవసరం కావచ్చు. ఆ కాలమంతా ఆ 200 డబ్బే మళ్ళీ మళ్ళీ తిరుగుతూ వుంటుంది. ఈ రకంగా, ఏ కాలంలో అయినా చలామణీలో తిరగవలసిన డబ్బు రాసికి ఒక సగటు స్థాయి వుంటుంది. ఆ కాలంలోనే కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఆ రాసి చాలకపోవచ్చు. లేదా, కొన్ని సార్లు, ఆ రాసి అంతా అవసరం కాకపోవచ్చు. అవి ప్రత్యేక పరిస్థితులు. డబ్బుని విడుదల చెయ్యడానికి సంబంధించిన సూత్రాలన్నిటినీ సరిగా పాటిస్తే, ఏ దేశంలో అయినా చలామణీలోకి హఠాత్తుగా ఎక్కువ డబ్బు కావలసి రావడమూ, లేదా హఠాత్తుగా డబ్బు అవసరం తగ్గిపోవడమూ జరగవు.

సరుకుల్ని ఉత్పత్తి చెయ్యడమూ, అమ్మడమూ చాలా వరకు తగ్గిపోయే 'సంక్షోభ' సమయాల్లో, డబ్బురాసి సరిపోని పరిస్థితి హఠాత్తుగా సంభవిస్తుంది. (దీన్ని, 2 వ సంపుటంలో 'సంక్షోభాల' చాప్టరులో చూస్తాము.) కానీ సాధారణ పరిస్థితుల్లో ఇలా జరగదు.

'డబ్బు పరిమాణానికి' సంబంధించి, సాధారణంగా ఏర్పడే కొన్ని పరిస్థితుల్ని ఇలా చూడవచ్చు :

**1)** సరుకుల విలువలు మారకపోయినా, డబ్బు పరిమాణం పెరగడానికి కారణాలు: సరుకుల పరిమాణం పెరగడం గానీ, డబ్బు చలామణీ వేగం తగ్గడం గానీ, ఆ రెండూ కొంత కొంత గానీ.

**2)** సరుకుల విలువలు మారకపోయినా, డబ్బు పరిమాణం తగ్గడానికి కారణాలు: సరుకుల పరిమాణం తగ్గడం గానీ, డబ్బు చలామణీ వేగం పెరగడం గానీ, రెండూ కొంత కొంత గానీ.

**3)** సరుకుల విలువలు పెరిగినా, డబ్బు పరిమాణం మారకుండా వుండడానికి కారణాలు: విలువలు ఏ శాతంలో పెరిగాయో దానికి అనుగుణంగా సరుకు పరిమాణం తగ్గడం గానీ, లేదా పెరిగిన విలువలకు సరిపోయేలాగ డబ్బు చలామణీ వేగం పెరగడంగానీ, ఆ రెండూ కొంత కొంత గానీ.

**4)** సరుకుల విలువలు పెరిగినా, డబ్బు పరిమాణం తగ్గడానికి కారణాలు: సరుకుల పరిమాణం తగ్గడం గానీ; డబ్బు చలామణీ వేగం, విలువల పెరుగుదల శాతాన్ని మించి పెరగడం గానీ; ఆ రెండూ కొంత కొంత గానీ.

**5)** సరుకుల విలువలు తగ్గినా, డబ్బు పరిమాణం మారకుండా వుండడానికి కారణాలు: విలువల తగ్గుదలకు సరిపోయే పాళ్ళలో సరుకుల పరిమాణం పెరగడం గానీ, విలువల తగ్గుదలకు సరిపోయే పాళ్ళలో డబ్బు చలామణీ వేగం తగ్గడం గానీ, ఆ రెండూ కొంత కొంత గానీ.

**6)** సరుకుల విలువలు తగ్గినా, డబ్బు పరిమాణం పెరగడానికి కారణాలు: సరుకుల పరిమాణం చాలా ఎక్కువగా పెరగడం గానీ, డబ్బు చలామణీ వేగం చాలా తగ్గడం గానీ, ఆ రెండూ గానీ.

— ఈ రకంగా, డబ్బు పరిమాణాన్ని నిర్ణయించే అనేక పరిస్థితుల్ని బట్టి, అది వుంటుంది.

# 5. నాణాలూ, విలువ చిహ్నాలూ కాయితం డబ్బు

డబ్బు అంటే ఇప్పటి వరకూ మన దృష్టిలో వున్నది — 'బంగారం డబ్బే'. నాణాలు అంటే — 'బంగారం నాణాలే'. ఇప్పుడు కూడా మనం బంగారం నాణాలనే దృష్టిలో పెట్టుకోవాలి. సరుకుల మారకాలు జరుగుతూ వుంటే, నాణాలు కూడా కదులుతూ వుంటాయి. ప్రతీ నాణెమూ, అప్పుడప్పుడూ చిన్న చిన్న విశ్రాంతులు తీసుకుంటూ, ఎప్పుడూ చలామణీలో తిరుగుతూనే వుంటుంది. నాణాలు ఎప్పుడూ మనుషుల చేతుల్లోనూ, సంచుల్లోనూ, పెట్టెల్లోనూ పడుతూ లేస్తూ వుంటాయి. ఈ రకంగా తిరగడం వల్ల నాణాలు కొంచెం కొంచెంగా 'అరిగిపోతూ' వుంటాయి. ఒక కొత్త నాణెం, టంకశాల నించి బయటపడ్డ క్షణం నించి కొంచెం కొంచెం అరగడం మొదలు పెడుతుంది. చలామణీలో తిరుగుతూ వున్న ఒక 100 నాణాల్ని తీసుకుని వాటి బరువులు తూస్తే, అవన్నీ తప్పనిసరిగా కొంత కొంత అరిగి వుంటాయి. అన్నీ ఒకే రకంగా గాక, కొన్ని నాణాలు ఎక్కువగా అరిగితే, కొన్ని నాణాలు తక్కువగా అరిగి వుంటాయి. మొత్తం మీద, చలామణీలో తిరుగుతోన్న నాణాలన్నీ ఎంతో కొంత అరిగిపోయి వుంటాయి.

'సరికొత్త రూపాయి నాణెం, ఫలానా కొంత బరువుతో ఉండాలనుకుందాం. దానికి 2 కిలోల ధాన్యం వస్తుం దనుకుందాం. ఒక రూపాయి నాణెం కొత్తగా చలామణీలోకి వచ్చినప్పుడైతే పూర్తి బరువుతోనే వుంటుంది. కొన్నాళ్ళు చలామణీలో తిరిగేటప్పటికి అది సగం అరిగి పోయిందను కుందాం. అంటే, అప్పుడు ఆ రూపాయి శరీరంలో సగం బంగారమే వుంటుంది. అయితే అలా అరిగిపోయిన రూపాయి కూడా చలామణీలో తిరుగుతూ, తను కొత్త రూపాయిగా వున్నప్పటిలాగే, సరుకులతో మారుతూ వుంటుంది. అంటే, కొత్త రూపాయికి ఎంత సరుకు వస్తుందో, ఈ అరిగిపోయిన రూపాయికి కూడా అంత సరుకూ వస్తూ వుంటుంది. నిజానికి, కొత్త నాణానికి వచ్చినంత సరుకు అరిగిపోయిన నాణానికి రాకూడదు కదా? కానీ, చలామణీలో తిరిగే నాణాల విషయంలో ఆ తేడాలేమీ వుండవు.

సరుకు మనిషి, తన సరుకుని ఇచ్చి (అమ్మి) దానికి బదులుగా అరిగిన నాణాన్ని తీసుకోడానికి ఏమీ సంకోచించ కుండా, దాన్ని పూర్తి విలువ గల నాణెం లాగానే తీసు కుంటాడు. ఎందుకంటే, ఆ మనిషి ఆ నాణెంతో ఇంకో సరుకుని కొన్నప్పుడు, ఆ నాణెం కొత్త నాణెం లాగే పని చేస్తుంది గనక. అంటే, కొత్త నాణానికి ఎంత సరుకు వస్తుందో, ఈ అరిగిన నాణానికి కూడా అంత సరుకూ వస్తుంది గనక. ఆ అరిగిన నాణాన్ని తీసుకొని తమ సరుకు ఇవ్వడానికి ఎవ్వరూ వ్యతిరేకించరు.

సరుకు మనిషి, తన సరుకుని అమ్మి, అరగని నాణాన్ని తీసుకున్నా, అరిగిన నాణాన్ని తీసుకున్నా, దాన్ని ఇంకో సరుకుని కొనడం కోసమే ఉపయోగిస్తాడు గానీ, ఆ నాణాన్నే కరిగించి ముద్ద చేసి ఆ బంగారాన్ని వాడుకోడు. నాణెంలో వున్న బంగారాన్నే వాడుకునేటట్లయితే, బరువు తగ్గిన నాణాన్ని తీసుకోవటానికి సరుకు మనిషి అంగీకరించడు. కానీ, నాణాన్ని తీసుకునేది, దానితో ఇంకో సరుకుని కొనడానికే గానీ, దాన్నే కరిగించి వాడుకోవటానికి కాదు. కాబట్టి సరుకు మనిషి అరిగిపోయిన నాణాన్ని తీసుకోవడానికి సంకోచించడు.

అరిగిపోయిన రూపాయి, తన శరీరానికి పూర్తి విలువ లేకుండానే పూర్తి విలువ గల రూపాయిలాగ చలామణీ అవుతోందంటే, దాని అర్థం ఏమిటి? అరిగిపోయిన రూపాయి, తన శరీరానికి వున్న విలువతో గాక, తన 'పేరుకి వున్న విలువ'తో, అంటే 'రూపాయి' అనే పేరుకి వున్న విలువతో, (లేదా, ఆ నాణానికి ఏ పేరు వుంటే ఆ పేరుకి వున్న విలువతో), చలామణీ అవుతోందన్నమాట! అంటే, ఆ నాణెం నిజమైన విలువ గా గాక, ఆ 'విలువని సూచించే చిహ్నం'గా పనిచేస్తోందన్న మాట!

సరుకులు చలామణీ అవ్వాలంటే, వాటితో పాటు డబ్బు నాణాలు కూడా నిరంతరం తిరుగుతూ వుండవలసిందే. అలా తిరిగే నాణాలు తప్పనిసరిగా అరిగిపోతూ కూడా వుండవలసిందే. అరిగిపోయిన నాణాల్ని కూడా పూర్తి విలువ గల నాణాలు గానే గుర్తిస్తూ వాటితో మారకాలు చేసుకో వలసిందే. కాబట్టి నాణెం అనేది మొదట పూర్తి విలువ తోనే చలామణీకి దిగినా, క్రమంగా అది బరువు తగ్గిపోతూ, పూర్తి విలువ లేకుండానే పూర్తి విలువకి బదులుగా పనిచేసే చిహ్నంగా తయారై తీరుతుంది. అంటే, ఒకప్పటి తన విలువకి తను చిహ్నంగా (తనకి తనే చిహ్నంగా) తయారవుతుంది. ఇదంతా సరుకుల చలామణీ ద్వారా తప్పనిసరిగా ఏర్పడే పరిస్థితి.

ఈ 'తప్పనిసరి పరిస్థితి'ని ఆధునిక శాసనాలు గుర్తిం చాయి. ఈ శాసనాల ప్రకారం, మరీ ఎక్కువగా అరిగి పోయిన నాణాల్ని మాత్రమే చలామణీ నించి రద్దు చెయ్యాలి. అరుగుదల తక్కువగా వున్న వాటిని చలామణీ లోనే వుంచవచ్చు. ఒక నాణాన్ని చలామణీ నించి రద్దు చెయ్యాలంటే, దాని బరువులో ఎంత తరుగుదల జరిగి

ఉండాలో ఆ హద్దుని శాసనాలు నిర్ణయించాయి. ఆ హద్దు కన్నా ఎక్కువగా అరిగిపోయిన నాణాలకు చట్టపరమైన గుర్తింపు వుండదు. ఆ హద్దు కన్నా తక్కువగా అరిగిన నాణాల్ని, కొత్త నాణాలతో సమానంగా గుర్తించవచ్చు.

తక్కువగా అరిగిన నాణానికి చట్టాల ప్రకారం చలామణీలో తిరిగే హక్కు వుంటే వుండవచ్చు కానీ, అది కూడా అరిగిన నాణెమే. చట్టం ఇచ్చిన హక్కుల సంగతి వదిలేసి, నాణాలు 'విలువ చిహ్నాలు'గా తయారైన పరిస్థితినే తీసుకుంటే, నాణెం చేసే పని, దాని విలువతో సంబంధం లేనిదిగా అయిపోయిందన్న మాట! 'రూపాయి'గా పని చేసే నాణానికి, ఎంత విలువ వుండాలో అంత విలువ లేకపోయినప్పటికీ అది రూపాయిగా పనిచెయ్యడం సాధ్యమే నన్నమాట! ఈ రకంగా, నాణానికి వున్న నిజమైన విలువకీ, అది చేసే పనికీ సంబంధం లేకుండాపోవడం అనే పరిస్థితి నించీ 'కాయితం డబ్బు' పుట్టుకొచ్చింది. విలువ తగ్గిన 'బంగారం — రూపాయి', పూర్తి విలువకి బదులుగా పని చెయ్యడం సాధ్యమైనట్టే, విలువ లేని 'కాయితం రూపాయి' కూడా ఒక 'బంగారం రూపాయి'కి బదులుగా, కేవలం విలువ చిహ్నంగా, పని చెయ్యడం సాధ్యమవుతుంది.

బంగారం నాణాలే స్వయంగా చలామణీలో తిరిగితే, అవి అరిగిపోయి, బంగారం వృధా అవుతూ వుంటుంది కాబట్టి, బంగారం నాణాల్ని చలామణీలో తిప్పకుండా, వాటిని ఒక చోట జాగ్రత్తచేసి, వాటికి బదులుగా కాయితం రూపాయల్ని చలామణీలో తిప్పవచ్చు. ఈ కాయితం డబ్బు విడుదల బాధ్యత అంతా ప్రభుత్వానిదే. సమాజంలో వున్న ప్రభుత్వమే కాయితం డబ్బుని విడుదల చేసే బాధ్యత నిర్వహిస్తుంది. కాయితం ముక్కల మీద, 1 రూ, 2 రూ, 10 రూ, 100 రూ.లు — అని అచ్చు వేసి, ఆ కాయితం నోట్లని తిప్పవచ్చు. కేవలం కాయితం డబ్బునే గాక, చాలా తక్కువ విలువ గల లోహాలతో తయారైన నాణాలను కూడా 'చిల్లర నాణాలు'గా వుంచవచ్చు.

'డబ్బు' అనేది, జనాల దగ్గిరే వుంటుంది కదా? చలామణీలో బంగారం నాణాలే వుంటే, అవి జనాల దగ్గిరే వుంటాయి.

ప్రభుత్వం, బంగారం డబ్బుకి బదులు కాయితం డబ్బుని ప్రవేశపెట్టాలి — అనుకుందనుకుందాం. ప్రభుత్వం ప్రజలకు ఇలా చెపుతుంది — "బంగారం నాణాల్ని చలామణీలో తిప్పితే అరిగిపోతున్నాయి కదా? వాటిని ఒక చోట దాచి, కాయితం నోట్లనే డబ్బుగా వాడుకోవచ్చు. మీ బంగారం నాణాల్ని తెచ్చి ప్రభుత్వానికి అప్పగించి వాటికి బదులుగా ప్రభుత్వం ఇచ్చే కాయితం నోట్లని తీసుకోండి. వాటిని కూడా డబ్బుగానే వాడుకోవచ్చు. మీ డబ్బు మీ చేతిలో వున్నట్టే అర్థం. మీకు ఎప్పుడైనా మీ బంగారమే కావాలంటే, కాయితం నోట్లు ప్రభుత్వానికి అప్పజెప్పి, మీ బంగారం నాణాలు మీరు తీసుకోవచ్చు."

ప్రభుత్వాలు కాయితం డబ్బుని ప్రారంభించిన కొత్తలో ప్రజలందరూ దాన్ని వెంటనే నమ్మారని కాదు. ఈ మార్పుకి కొంత కాలం పడుతుంది. ఒక మనిషి దగ్గిర 10 బంగారం రూపాయలు వున్నాయి అనుకుందాం, ఆ మనిషి, ఆ నాణాల్ని ప్రభుత్వానికి అప్ప జెప్పి, వాటికి బదులుగా 10 కాయితం రూపాయిల్ని ఇంటికి తెచ్చుకున్నా డనుకుందాం. ఇక అప్పటి నించీ ఆ మనిషి, ఆ కాయితం డబ్బుతోనే సరుకుల్ని కొనుక్కుంటాడు.

తమ బంగారం డబ్బుని ప్రభుత్వానికి ఇవ్వడం ఇష్టంలేని వాళ్ళు, అలా ఇవ్వకుండా బంగారం డబ్బుతోనే సరుకుల్ని కొనుక్కుంటారు. మొదట్లో ఈ రెండు రకాలుగానూ జరుగుతుంది. క్రమక్రమంగా, బంగారం డబ్బు అంతా ప్రభుత్వానికి చేరి, ప్రజల చేతుల్లోకి కాయితం డబ్బు వస్తుంది. ఆ కొత్త డబ్బుతోనే మారకాలు జరుగుతూ వుంటాయి.

బంగారం డబ్బుని ప్రభుత్వానికి అప్పజెప్పని వాళ్ళకి కూడా ప్రభుత్వం కాయితం డబ్బుని పంచి పెడుతుందా? — అలా జరగదు. ఒక బంగారం రూపాయిని ఇచ్చిన వాళ్ళకే, ప్రభుత్వం ముద్రించే ఒక కాయితం రూపాయి అందుతుంది. ఆ మనిషి చేతిలో, ఏ డబ్బు వున్నా ఒకటే అవుతుంది.

'బంగారం డబ్బు' అంతా 'ప్రభుత్వ ఖజానా'లో (ప్రభుత్వ బ్యాంకు'లో) విశ్రాంతి తీసుకుంటూ వుండగా, దానికి బదులుగా కాయితం డబ్బు చలామణీలో తిరుగుతూ వుంటుంది. ప్రభుత్వాధీనంలో వున్న 1 బంగారం రూపాయికి బదులుగా, బయట జనాల చేతుల్లో 1 కాయితం రూపాయి వుంటుంది.

కాయితం రూపాయికి స్వంత విలువ వుండదు. దాని వెనక బంగారం రూపాయి వుండడమే దాని విలువ. బంగారం నాణెం, చలామణీలో తిరిగితే అరిగిపోతూ వుంటుంది కాబట్టి, ఆ తిరిగే పనిని కాయితం నోటు చేసిపెడుతోందన్నమాట! కాయితం డబ్బు పని అంతవరకే.

ఒక ధాన్యం మనిషి, ఇంకో మనిషికి, 1 రూపాయి విలువ గల ధాన్యం అమ్మాడనుకుందాం. ధాన్యం కొన్న మనిషి, ధాన్యం అమ్మిన మనిషికి, '1 కాయితం రూపాయి' ఇచ్చాడనుకుందాం. ధాన్యం మనిషి, ఆ కాయితం నోటుని తీసుకుంటాడా, తీసుకోడా? "నేను ధాన్యం ఇస్తే, నువ్వు నాకు అరిచెయ్యంత కాయితం ముక్క ఇచ్చావేమిటి? దీన్ని నేను తీసుకోను. నాకు బంగారం రూపాయే ఇయ్యి" అంటాడా? 'కాయితం డబ్బు' కొత్తగా చలామణీలోకి వచ్చిన కాలంలో మనుషులు అలాగే అనేవారు. బంగారం నాణాలకు వుండే

విలువ, కాయితం ముక్కలకు వుండదు కాబట్టి, సరుకుల్ని అమ్మే మనుషులు, వాటికి బదులుగా కాయితం నోట్లని తీసుకోవడానికి భయపడేవారు.

కానీ సరుకుని అమ్మే మనిషి, దానికి బదులుగా వచ్చే డబ్బుతో ఏం చేస్తాడు? దానితో తను కూడా ఇంకో సరుకుని కొంటాడు. అంతే కదా? ఈ కాయితం ముక్కలతో కూడా సరుకుల్ని కొనడం సాధ్యమేనని గ్రహించిన కొద్దీ, కాయితం డబ్బు గురించి భయం తగ్గిపోయింది. సరుకు మనిషి, తన సరుకుకి బదులుగా కాయితం నోట్లు తీసుకోవడానికి సంకోచించడం మానేశాడు. ఆ మనిషి ఆ కాయితం నోట్లతో ఇతరుల సరుకుల్ని కొనబోయినప్పుడు, ఆ నోట్లని తీసుకోవడానికి ఇతరులు కూడా సంకోచించడం మానేశారు. అందరూ కాయితం డబ్బుని అంగీకరించినప్పుడు, కాయితం డబ్బుతోనే సరుకుల్ని కొనడాలూ అమ్మడాలూ చెయ్యవచ్చు. సరుకు మనిషి, బంగారం నాణాల్ని ఏ పనికైతే ఉపయోగిస్తాడో, కాయితం నోట్లని కూడా ఆ పనికి ఉపయోగించవచ్చు. ఆ మనిషికి బంగారం డబ్బు అయినా ఒకటే, కాయితం డబ్బు అయినా ఒకటే.

ఒకవేళ ఆ మనిషికి బంగారం ముద్ద కావలసివుంటే, కాయితం రూపాయలతో ఇతర సరుకుల్ని కొన్నట్టే బంగారాన్ని కూడా కొనవచ్చు. 1 కాయితం రూపాయితో బంగారాన్ని కొన్నప్పుడు, ఎంత బంగారం వొస్తుందంటే, 1 బంగారం రూపాయిలో ఎంత బంగారం వుంటుందో అంత బంగారం వస్తుంది. అంటే, ఒక మనిషి చేతిలో 1 కాయితం రూపాయి వుందంటే, 1 బంగారం రూపాయి వున్నట్టే అర్థం. కాబట్టి, సరుకు మనిషి, తన సరుకుకి బదులుగా వచ్చేది బంగారం రూపాయా, కాయితం రూపాయా అనే తేడాని పట్టించుకోనక్కరలేదు. సరుకుని అమ్మి, దానికి బదులుగా కాయితం డబ్బుని నిస్సంకోచంగా తీసుకోవచ్చు.

కాయితం రూపాయి నోట్లే చలామణీలో తిరిగినప్పుడు, అవి కూడా త్వరత్వరగా పాతబడి చిరిగిపోతాయి. అలా చిరిగిపోయిన వాటిని తీసివేసి, కొత్త నోట్లని పెట్టాలి. కానీ అరిగిపోయిన బంగారం నాణాల్ని తీసివేసి కొత్త నాణాల్ని పెట్టడానికి అయ్యే ఖర్చుకన్నా, చిరిగిపోయిన కాయితం నోట్లని మార్చడానికి అయ్యే ఖర్చు చాలా తక్కువగా వుంటుంది. కాబట్టి కాయితం నోట్లు ఎప్పటికప్పుడు చిరిగిపోవడం అనేది పెద్ద సమస్య కాదు. ఈ రకంగా, బంగారం డబ్బుకి బదులుగా, కాయితం డబ్బు చలామణీలోకి వచ్చింది.

'బంగారం డబ్బు'కి బదులుగా, 'కాయితం డబ్బు' చలామణీలోకి వచ్చిందంటే, ఇప్పుడు 'జనరల్ ఈక్వివలెంట్' స్థానంలోకి బంగారానికి బదులు 'కాయితం' వచ్చిందని అర్థమా? — ఎంత మాత్రమూ కాదు. ఇప్పుడు కూడా 'జనరల్ ఈక్వివలెంటు'గా వున్నది బంగారమే. ఇప్పుడు కూడా సరుకుల విలువల్ని కొలిచే కొలత పాత్రగా వున్నది బంగారమే. అంటే, ఇప్పుడు కూడా 'డబ్బు'గా వున్నది బంగారమే.

డబ్బు అనేది, 'విలువ కొలత'గా వుండే పనే గాక, చలామణీలో తిరిగే పని కూడా చెయ్యాలని మనకి తెలుసు. బంగారం డబ్బే చలామణీలో తిరిగితే అరిగిపోతుంది కాబట్టి, ఈ రెండో పనినే, బంగారం డబ్బు, కాయితానికి అప్పగించింది. నిజమైన డబ్బు చెయ్యవలసిన పనుల్లో ఒక పనిని (చలామణీలో తిరిగే పనిని) కాయితం నోటు చేస్తోంది కాబట్టి, కాయితం నోటుకి కూడా 'డబ్బు' అనే పేరు వచ్చింది. అంత మాత్రాన కాయితమే, జనరల్ ఈక్వివలెంట్ స్థానంలోకి వచ్చిందని అర్థం కాదు. 'డబ్బు స్థానం'లో వున్నది ఎప్పుడూ బంగారమే.

కాయితం డబ్బు ప్రారంభమైన తర్వాత, బంగారం నాణాలన్నీ 'నాణెం రూపాన్ని' వొదిలివేస్తాయి. బంగారం అంతా, మామూలు ముద్ద రూపంతోనే ప్రభుత్వ బ్యాంకులో వుంటుంది.

ఇప్పుడు ఏ సరుకైనా కాయితం రూపాయలతోనే మారుతుంది కాబట్టి, ఇప్పుడు 'కాయితం డబ్బు' రూపమే విలువకు స్వంత రూపం. అంటే, 1 కిలో ధాన్యాన్ని అమ్మినప్పుడు, దానికి బదులుగా 1 కాయితం రూపాయి వస్తే, ఆ ధాన్యం విలువ, 1 కాయితం రూపాయిగా కనపడుతోందన్నమాట. కాబట్టి, కాయితం డబ్బు ప్రారంభమైన దగ్గిర్నించి, కాయితం డబ్బు రూపమే 'విలువ'కి స్వంత రూపం. <u>'చలామణీ సాధనానికి' వాడుక భాషలో వుండే పేరు — 'కరెన్సీ', చలామణీలో వున్నది బంగారం నాణాలు అయినా, కాయితం నోట్లు అయినా.</u>

కాయితం డబ్బు ప్రారంభమైన తర్వాత, చలామణీలో వుండవలసిన 'డబ్బు పరిమాణం' విషయంలో ఒక కొత్త నిబంధన అవసరమవుతుంది. చలామణీలో తిరగడానికి ఎంత డబ్బు వుండాలీ — అనే విషయం గురించి ఇంతకు ముందు చూశాం. ఈ విషయం, బంగారం డబ్బుకీ, కాయితం డబ్బుకీ పూర్తిగా ఒకే రకంగా వర్తించదు.

రియలైజ్ కావలసిన విలువల మొత్తం 100 రూ.లు అనుకుందాం. అంటే, చలామణీలో 100 రూ.లు వుండాలి. 'చలామణీలో 100 రూ.లు వుండాలి' అంటే, డబ్బు రాసి 100 రూ.ల కన్నా తక్కువగానీ ఎక్కువగానీ కాకూడదు — అని అర్థం. అంటే, డబ్బు రాసికి ఒక కనీసపు హద్దూ, ఒక గరిష్టపు హద్దూ వుండాలి.

డబ్బు రాసి 100 రూ.ల కన్నా తక్కువ కాకూడదు — అనే నిబంధన (కనీసపు హద్దు నిబంధన) బంగారం డబ్బుకైనా,

కాయితం డబ్బుకైనా ఒకే రకంగా వర్తిస్తుంది. రియలైజ్ కావలసిన విలువల మొత్తం 100 రూ.లు అయినప్పుడు, అంత డబ్బు రాసి చలామణీలో వుండకపోతే సరుకుల అమ్మకాలు తేలిగ్గా జరగవు. కాబట్టి, కనీసపు హద్దు నిబంధన ఏ డబ్బు విషయంలోనైనా ఒకే రకంగా వుండవలసిందే. కానీ 'గరిష్టపు హద్దు' విషయంలో బంగారం డబ్బుకీ, కాయితం డబ్బుకీ ఒక తేడా వస్తుంది. రియలైజ్ కావలసిన విలువల మొత్తం 100 రూ.లు అయినప్పుడు, చలామణీలో వున్న డబ్బు, బంగారం డబ్బు అయితే, అది 100 కన్నా ఎంత ఎక్కువగా వున్నా ఫరవాలేదు. దాని వల్ల ఏ సమస్యా రాదు. ఎలాగంటే: బంగారానికి స్వంత విలువ వుంటుంది. 1 ధాన్యం బస్తా = 1 బంగారం నాణెం —అనుకుందాం. జనం దగ్గిర బంగారం నాణాలు ఎంత ఎక్కువగా వున్నా, ధాన్యం బస్తా విలువ 1 బంగారం నాణెం కన్నా ఎక్కువ అవదు. బంగారం నాణాలు ఎక్కువగా వుండడం వల్ల, దాని ప్రభావం సరుకుల 'ధరల' మీద ఏమీ వుండదు. కానీ, కాయితం డబ్బు విషయంలో, ఇది తేడాగా వుంటుంది. ఎందుకంటే, కాయితం డబ్బుకి స్వంత విలువ వుండదు కాబట్టి. కాయితం డబ్బు అయితే, అది వుండవలసిన దానికన్నా ఎక్కువగా వుంటే, దాని ఫలితం ధరలు పెరగడం గానూ, ఇంకా ఇతర రకాలు గానూ వుంటుంది. (ఈ విషయాలు, 2 వ సంపుటంలో, 'పెట్టుబడిదారీ ధర' చాప్టరులో వివరంగా చూస్తాము) ఇక్కడ క్లుప్తంగా గ్రహించవలసినదేమిటంటే —సమాజం, కాయితం డబ్బు పద్ధతిని ప్రారంభించిన తర్వాత, దాని పరిమాణం విషయంలో, బంగారం డబ్బు విషయంలో లేని ఒక కొత్త నిబంధనని పాటించవలసి వుంటుంది.

# 6. డబ్బుని కూడబెట్టడం

ఒక సరుకుని అమ్మగా వచ్చిన డబ్బుతో ఇంకో సరుకుని కొనకుండా వుంటే, ఆ డబ్బు, చలామణీలోకి పోవడం ఆగిపోతుంది. ఒక నేత మనిషికి, తన సరుకుని అమ్మగా 4 రూ.లు వచ్చాయి అనుకుందాం. ఆ రూపాయిలన్నిటినీ వాడకుండా దాచేస్తే, అతనికి కావలసిన సరుకులేవీ రావు. కాబట్టి, ఆ డబ్బునంతా దాచెయ్యడం సాధ్యం కాదు. అతను, 3 రూ.లతో మాత్రమే తనకు కావలసిన సరుకులు కొనుక్కుని, 1 రూపాయిని తన దగ్గిరే దాచుకున్నాడనుకుందాం. అంటే, తను వాడుకోవలసిన సరుకుల్లో కొంత భాగాన్ని తగ్గించుకుని, కొంత డబ్బుని పొదుపు చేశాడనుకుందాం. ఇలా, ఒక డబ్బు ముక్కని చలామణీలోకి వదలకుండా (దానితో ఏమీ కొనకుండా) నిరోధించడమే— డబ్బుని కూడబెట్టడం (హోర్డింగ్ ఆఫ్ మనీ).

డబ్బు కూడా ఒక సరుకే. కానీ, అది మామూలు సరుకు కాదు. ఏ ఉపయోగపు విలువగానైనా క్షణాలలో మారగల (ఏ సరుకునైనా కొనగల) ప్రత్యేక శక్తి వున్న సరుకు అది. అలాంటి సరుకు ఎక్కువ రాసిగా ఒక మనిషి చేతిలో పోగుపడిందంటే, అది ఆ మనిషికి ఒక ప్రత్యేక శక్తిని ఇస్తుంది. ఆ రాసి ఎంత ఎక్కువగా వుంటే అంత ఎక్కువ శక్తిని!

సరుకుల్ని 'స్వయంగా ఉత్పత్తి చేసి అమ్ముకునే' నేత మనిషీ, కుట్టు మనిషీ, కమ్మరం మనిషీ, కుమ్మరం మనిషీ, వడ్రంగం మనిషీ, ఇంకా ఆ రకం మనుషులు, కేవలం తమ చిన్న చిన్న 'పొదుపుల' ద్వారానే ఎక్కువ డబ్బుని కూడబెట్టడం సాధ్యం కాదు. అలాంటి మనిషి, మరీ ఎక్కువగా పొదుపు చెయ్యాలంటే, జీవించడానికి కావలసిన కనీసపు వస్తువుల్ని కూడా కొనకుండా డబ్బుని దాచవలసి వస్తుంది. అలా చేస్తే ఆ మనిషి జీవించడమే సాధ్యం కాదు. కాబట్టి, కేవలం 'పొదుపు' ద్వారానే ఎక్కువ డబ్బుని కూడబెట్టడం ఎవ్వరికీ సాధ్యం కాదు. దానికి వేరే మార్గం వుంది. ( ఆ మార్గం ఏమిటో ఈ సంపుటంలోనే, 2 వ భాగం నించి చూడడం ప్రారంభిస్తాము. )

ధాన్యమూ, పత్తీ, పంచదారా— లాంటి సాధారణ వస్తువుల్ని (డబ్బు కాని వస్తువుల్ని) పెద్ద ఎత్తున నిల్వ చెయ్యడం సాధ్యం కాదు, దాని వల్ల ప్రయోజనమూ వుండదు. కొన్ని వారాలో నెలలో గడిచేటప్పటికే ఆ వస్తువులు పాడైపోతాయి. కానీ, డబ్బు సంగతి అలా కాదు. అది వెండి బంగారాల రూపంలోనో, కాయితం నోట్ల రూపంలోనో వుంటుంది కాబట్టి, అది పాడైపోయే దేమీ వుండదు. ఈ రకంగా, డబ్బుని నిల్వ చెయ్యడానికి వున్న అవకాశమే, డబ్బుని నిల్వచేసేటట్టుగా ప్రోత్సహిస్తుంది.

ధాన్యమూ, పత్తీ, బొగ్గూ లాంటి వస్తువులకు ఒక్కొక్క ఉపయోగపు విలువే వుంటుంది. ధాన్యానికి, ఆహారంగా ఉపయోగపడే గుణం మాత్రమే వుంటుంది. పత్తికి దుస్తులుగా ఉపయోగపడే గుణం మాత్రమే. అలాగే, ఇతర వస్తువులకు కూడా ఏదో ఒకటి రెండు రకాలుగా ఉపయోగపడే గుణాలు మాత్రమే వుంటాయి. అంటే, ఈ రకం వస్తువుల గుణాలకు ఒక 'పరిమితి' వుంటుంది. 'గుణాత్మకమైన పరిమితి' గల ఇలాంటి వస్తువుల్ని, కొంత పరి

మాణంలో కన్నా ఎక్కువగా కావాలని కోరుకోవలసిన అవసరం వుండదు. ఒక మనిషి దగ్గిర కొంత ధాన్యంకన్నా ఎక్కువ ధాన్యం వుంటే, ఆ ఎక్కువైన భాగం ఆ మనిషికి ఉపయోగపడదు. ఆ ఎక్కువైన ధాన్యాన్ని అమ్మేసి దానికి బదులుగా ఇంకో రకం వస్తువుని సంపాదించుకోవలసి వుంటుంది. ఆ ఇంకో రకం వస్తువుని కూడా అపరిమితంగా సంపాదిస్తే దానివల్ల కూడా ప్రయోజనం వుండదు. ఒక మనిషి, ఏ వస్తువునైనా, అపరిమితంగా వాడుకోవడం సాధ్యం కాదు. కాబట్టి, ఒక మనిషి తన దగ్గిర 'అపరిమితమైన ధాన్యం రాసి' వుండాలనో, 'అపరిమితమైన పత్తి రాసి' వుండాలనో, 'అపరిమితమైన చెప్పుల రాసి' వుండాలనో, 'అపరిమితమైన ఇటుకల రాసి' వుండాలనో, ఇలా ఏ వస్తువునీ 'అపరిమితంగా' కోరుకోవలసిన అవసరం వుండదు. 'పరిమితమైన గుణం గల' వస్తువులు, 'పరిమితమైన పరిమాణం'తో మాత్రమే వుండవలసి వుంటుంది. దీనినే వేరే మాటల్లో చెప్తే, "గుణాత్మక పరిమితి" గల వస్తువులు, "పరిమాణాత్మక పరిమితి"తో మాత్రమే ఉపయోగ పడతాయి. ఇలాంటి వస్తువుల విషయంలో 'గుణానికీ', 'పరిమాణానికీ' వైరుధ్యం వుండదు.

కానీ, 'డబ్బు' సంగతి అలా కాదు, డబ్బులో గుణానికీ, పరిమాణానికీ, వైరుధ్యం ఏర్పడుతుంది. కొంత డబ్బుని తీసుకుని దాని గుణాన్నీ, దాని పరిమాణాన్నీ చూస్తే, ఆ వైరుధ్యం ఏమిటో తెలుస్తుంది. '1 రూపాయి'ని తీసుకుని, మొదట దాని 'గుణాన్ని' చూద్దాం. 'డబ్బు' అంటే 'విలువ'. దానికి ఏ ఉపయోగపు విలువా వుండదు. కానీ, అది ఏ ఉపయోగపు విలువగానైనా క్షణాలలో మారగలదు ఏ సరుకునైనా క్షణాలలో కొనగలదు. కాబట్టి డబ్బుకి సమస్తమైన ఉపయోగపు విలువలూ వున్నట్టు అర్థం. అదే డబ్బుకి వున్న గుణం. అంటే, అది, 1 రూపాయికి వున్న గుణం. ఆ గుణానికి పరిమితి లేదు.

ఇప్పుడు, '1 రూపాయి'కి వున్న పరిమాణాన్ని చూస్తే, ఆ పరిమాణానికి ఒక పరిమితి వుంది. ఆ పరిమాణంతో, ఏ సరుకుని కావాలంటే ఆ సరుకుని కొనటం సాధ్యం కాదు. ఆ పరిమాణంతో, '1 రూపాయి విలువ గల' సరుకుల్ని కొనడం మాత్రమే సాధ్యం. అంతకన్నా ఎక్కువ విలువ గల సరుకుల్ని కొనడం సాధ్యం కాదు. 1 రూపాయితో, 2 రూ.ల విలువ గల సరుకులనో, 10 రూ.ల విలువ గల సరుకులనో కొనడం సాధ్యం కాదు.

పోనీ, '10 రూ.ల్ని' తీసుకుని చూద్దాం. ఈ పరిమాణం కొంచెం పెద్దదే. కానీ, ఈ పరిమాణానికి కూడా ఒక పరిమితి వుంటుంది. ఈ పరిమాణంతో, 10 విలువ కన్నా ఎక్కువ విలువ గల సరుకుని కొనడం సాధ్యం కాదు. పోనీ '100 రూపాయల్ని' తీసుకుంటే అప్పుడు కూడా అదే పరిస్థితి. 1,000 రూపాయల్ని తీసుకున్నా అదే పరిస్థితి! ఎంత పెద్ద పరిమాణాన్ని తీసుకున్నా, ఆ పరిమాణానికి కూడా ఒక పరిమితి వుంటూనే వుంటుంది. అంటే, 'డబ్బు'కి వున్న గుణంతో, 'సరుకుల ప్రపంచం'లో వున్న ఏ సరుకునైనా కొనడం సాధ్యమే గానీ, దాని పరిమాణంతో ఏ సరుకునైనా కొనడం సాధ్యం కాదు. డబ్బుకి వున్న గుణం అపరిమితమైనదిగా వుంటే, దాని పరిమాణం పరిమితమైనదిగా వుంటుంది. ఇదే, డబ్బులో వున్న వైరుధ్యం. ఈ వైరుధ్యమే, డబ్బుని కూడబెట్టే మనుషులకు ప్రోత్సాహక శక్తిగా వుంటుంది. ఏ రకమైన సరుకునైనా కొనగలిగే గుణం గలిగి, కొన్ని రకాల సరుకుల్ని మాత్రమే కొనగలిగే పరిమాణం గల డబ్బుని, ఇంకా ఇంకా కూడబెట్టాలనీ, దాని పరిమాణాన్ని మరింతగా పెంచాలనీ, డబ్బుని కూడబెట్టే మనిషికి, దురాశ పట్టుకుంటుంది. డబ్బుని కూడబెట్టడం ప్రారంభించిన మనుషులకు, ఏ పరిమాణమూ సంతృప్తిని ఇవ్వదు. ఎంత ఎత్తుగా పెరిగిన ధన రాసి అయినా, డబ్బు నిల్వదారులకు, ఇంకా ఒక పరిమితిలోనే కనపడుతుంది. డబ్బులో, 'గుణాత్మక అపరిమితి'కీ, 'పరిమాణాత్మక పరిమితి'కీ వున్న వైరుధ్యం, డబ్బు నిల్వదారుల్ని నిత్యం అసంతృప్తిలోనే పడేసి వుంచుతుంది. ఈ రకంగా, నిల్వదారుల్ని అసంతృప్తితో విలవిల్లాడించే లక్షణం, ఆ మనిషి దేనినైతే నిల్వ చేస్తున్నాడో ఆ పదార్థంలోనే వుంది.

వెండి బంగారాల్ని నిల్వ చెయ్యడం, డబ్బుని నిల్వ చెయ్యడమే. డబ్బుని, వెండి బంగారాలుగా మార్చి నిల్వ చెయ్యడంతో పాటే, దాని 'కళారూపం' కూడా అభివృద్ధి చెందింది. వెండి బంగారాల్ని కడ్డీలుగానో ముద్దలుగానో నిల్వ చెయ్యడం గాక, వాటిని ఆభరణాలు గానూ, పాత్రలు గానూ, ఇంకా విచిత్రమైన వస్తువులుగానూ మార్చి నిల్వ చెయ్యడమే, డబ్బుని 'కళారూపం'తో నిల్వ చెయ్యడం.

డబ్బుని కూడబెట్టే మనుషులు, డబ్బున్న మనుషులుగా వుండాలని మాత్రమే గాక, 'డబ్బున్న మనుషులుగా కనపడాలని కూడా' ఆరాట పడతారు. ఆ ఆరాటంతోనే వెండి బంగారాల్ని ఉపయోగించే విధానాల్ని వృద్ధిచేసి, ఆ చిత్ర విచిత్ర వస్తు సముదాయాన్ని తమ చుట్టూ ప్రదర్శిస్తారు.

వెండి బంగారాల్ని కళారూపాలతో ఉపయోగించడం అభివృద్ధి చెందిన కొద్దీ ఆ లోహాలు 'కళాత్మక వస్తువుల్ని తయారుచేసే పదార్థాలు'గా కూడా స్థిరపడ్డాయి.

# 7. డబ్బు, 'చెల్లింపు సాధనం'గా పని చెయ్యడం

డబ్బు, ప్రధానంగా 2 పనులు చేస్తుందని చూశాం. ఇప్పుడు, డబ్బు చేసే 'మూడో పని'ని కూడా చూస్తాం.

డబ్బు చేసే పనుల్లో, మొదటి పని — 'విలువ కొలత'గా పని చెయ్యడం. రెండో పని, ' ధర ప్రమాణం' గా. అంటే, 'చలామణీ సాధనం'గా. ఇప్పుడు మూడో పని — 'చెల్లింపు సాధనం'గా పనిచెయ్యడం.

వెంకయ్య, బట్టని అమ్మి 2 రూ.లు తీసుకున్నా డనుకుందాం. ఇక్కడ, డబ్బు, 'చలామణీ సాధనం'గా పని చేసిందని మనకు తెలుసు. కానీ, వెంకయ్య బట్టని అమ్మి నప్పుడు, బట్టని కొన్న మనిషి దగ్గిర డబ్బులేక, అతను, వెంకయ్యకి వెంటనే డబ్బు ఇవ్వలేదనుకుందాం. "ఇప్పుడు నా దగ్గిర డబ్బు లేదు. బట్ట మాత్రం నాకు ఇప్పుడే కావాలి. డబ్బు, వారం రోజుల తర్వాత ఇస్తాను" అన్నాడనుకుందాం. ఆ షరతుకి అంగీకరించి, వెంకయ్య బట్టని ఇచ్చాడను కుందాం. అంటే, బట్ట చలామణీ (అమ్మకం) జరిగిపోయింది గానీ, డబ్బు ఇంకా రాలేదు. అంటే, బట్ట అమ్మకం 'అప్పు పద్ధతి' మీద జరిగిందన్న మాట!

బట్ట మనిషికి డబ్బు ఇంకా చేతికి రాకపోయినా, బట్ట విలువ నిర్ణయమైపోయి, బట్ట అమ్మకం కూడా జరిగి పోయింది. బట్ట మనిషికి ఆ డబ్బు వచ్చేసిన దానితో సమానమే. అయితే అది ఇంకా నిజంగా గాక, ఊహలో మాత్రమే వచ్చింది. బట్ట మనిషి, తన సరుకుకి 2 రూ.లు వచ్చేసినట్టు ఊహిస్తాడు. అక్కడ నిజం డబ్బు అక్కరలేదు.

డబ్బు, 'విలువ కొలత'గా చేసే మొదటి పనిని ఎప్పుడూ ఊహలోనే చేస్తుందని ఇంతకుముందు చూశాం. అయితే, సరుకుని అప్పు పద్ధతి మీద అమ్మినప్పుడు, డబ్బు, 'చలామణీ సాధనం'గా చేసే రెండో పనిని కూడా ఊహలోనే చేస్తుంది. వారం రోజులు గడిచాక, బట్టని కొన్న మనిషి, వెంకయ్యకి ఇవ్వవలసిన డబ్బు ఇచ్చేశాడనుకుందాం. ఆ డబ్బు ఇప్పుడు 'చలామణీ సాధనం'గా పనిచేసినట్టా? — కాదు. బట్ట చలామణీ అంతకుముందే జరిగిపోయింది కాబట్టి, డబ్బు ఇప్పుడు, బట్టని చలామణీ చెయ్యడానికి పని చెయ్యలేదు. డబ్బుని ఇప్పుడు 'అప్పు కోసం' చెల్లిస్తున్నారు. కాబట్టి డబ్బు ఇప్పుడు 'చెల్లింపు సాధనం'గా పనిచేసిందని అర్థం. అంటే, సరుకుల్ని 'అప్పు పద్ధతి మీద అమ్మడం' అనే విధానం వల్ల, డబ్బుకి 'చెల్లింపు సాధనం'గా పనిచేసే ఇంకో విధి పుట్టుకొచ్చింది.

సరుకులు అప్పు పద్ధతి మీద చలామణీ అయినప్పుడు, డబ్బు, 'విలువ కొలత' గానూ, 'చలామణీ సాధనం'గానూ కూడా ఊహలోనే పనిచేస్తూ, అప్పు తీర్చే సమయంలో మాత్రమే నిజమైన డబ్బుగా వుంటుంది.

సరుకుల మారకాలలో 'అప్పు పద్ధతి' (క్రెడిట్ విధానం) ప్రవేశించడానికి కారణం, సరుకుల ఉత్పత్తికీ, మారకాలకూ సంబంధించిన అనేక రకాల పరిస్థితులే. వేరు వేరు సరుకుల ఉత్పత్తి వేరు వేరు రుతువుల మీద ఆధారపడి వుంటుంది. కొన్ని రకాల సరుకులు రోజూ ఉత్పత్తి అవుతూ వుంటే, కొన్ని రకాల సరుకులు వారాని కోసారీ, కొన్ని రకాలు సంవత్సరాని కోసారీ ఉత్పత్తి అవుతూ వుంటాయి. సంవత్సరానికి ఒక్కసారే ధాన్యం పండించి అమ్మే మనుషులు, ఆ సంవత్సర కాలంలో అనేక సరుకులు కొంటారు. వాటిలో కొన్నిటిని డబ్బు ఇచ్చి కొంటే, కొన్నిటిని అప్పు పద్ధతి మీద కొంటారు.

వేరు వేరు రకాల సరుకుల ఉత్పత్తికి వేరు వేరు రకాలుగా కాలం పడుతుంది. అవి అమ్ముడు పోవడంలో కూడా రక రకాల జాప్యాలు జరుగుతాయి. తమ సరుకుల్ని అమ్ముకోక ముందే ఇతరుల సరుకుల్ని కొనవలసి వస్తుంది. — ఇలాంటి కొన్ని కారణాల వల్ల, సరుకుల్ని 'అప్పు పద్ధతి' మీద కొనడాలూ, అమ్మడాలూ తప్పనిసరి అవుతాయి.

'అప్పు'ని బార్టరు కాలం నించీ కూడా ఊహించవచ్చు నని చూశాం. కుండని ఇచ్చి చెప్పుల జతని తీసుకోవా లనుకుందాం. కుండని ఇవ్వకముందే చెప్పుల జతని తీసుకుంటే, చెప్పుల జతని అప్పు పద్ధతి మీదే తీసుకున్నట్టు అర్థం. కుండ తయారైన తర్వాత, దాన్ని ఇచ్చేస్తే అప్పు తీరిపోతుంది. ఈ రకంగా, బార్టరులో, ఎన్ని మారకాలు అప్పు పద్ధతి మీద జరిగినా, అది ఏ సమస్యనీ సృష్టించదు. కానీ, డబ్బు ద్వారా జరిగే మారకాలలో, అప్పు పద్ధతి, కొన్ని పరిస్థితుల్లో, సమస్యల్ని సృష్టించేదిగా అవుతుంది.

సరుకులకు వెంటనే డబ్బు చెల్లించే పద్ధతిలో :
సరుకు అమ్మకందారు = సెల్లరు
సరుకు కొనుగోలుదారు = బైయరు

సరుకులకు వెంటనే డబ్బు చెల్లించని పద్ధతిలో :
సరుకుని అప్పుగా అమ్మే మనిషి = క్రెడిటారు
సరుకుని అప్పుగా కొనే మనిషి = డెటారు

సరుకుల చలామణీ గురించి చూసినప్పుడు, ఒక సరుకు మనిషి, ఎప్పుడూ అమ్మకందారుగానే, లేదా, ఎప్పుడూ కొనుగోలుదారుగానే వుండడని చూశాం. ప్రతీ సరుకు మనిషీ, తన సరుకుల్ని అమ్మడమే గాక, ఇతరుల సరుకుల్ని కొనడం కూడా చేస్తాడు. అలాగే, సరుకుల చలామణీ, 'అప్పు

పద్ధతి'లో జరిగేటప్పుడు కూడా, ఒక సరుకు మనిషి, ఎప్పుడూ అప్పు పెట్టే వాడిగానే వుండడం గానీ, ఎప్పుడూ అప్పు తీసుకునే వాడిగానే వుండడం గానీ, జరగదు. ప్రతీ సరుకు మనిషీ ఒక సారి అప్పు పెట్టే వాడిగా వుంటే, ఒక సారి అప్పు తీసుకునేవాడిగా కూడా వుంటాడు. కాబట్టి, సరుకుల మారకాలు ఏ పద్ధతిలో జరిగినా, దాని ఫలితాలు, ఇరు పక్షాల మీదా (అమ్మకందార్ల మీదా, కొనుగోలుదార్ల మీదా) ఒకే రకంగా వుంటాయి.

డబ్బు, 'చెల్లింపు సాధనం'గా పనిచెయ్యడం అనేది (అప్పు పద్ధతి అనేది), మారకాలలో ఒక అనుకూల పరిస్థితినీ, ఒక అననుకూల పరిస్థితినీ కూడా సృష్టిస్తుంది.

మారకాలలో ఎక్కువ భాగం అప్పు పద్ధతిలోనే జరిగితే చలామణీలో తిరగడానికి చాలా తక్కువ డబ్బే సరిపోతుంది. డబ్బు, 'చలామణీ సాధనం'గా పనిచేసే ఉదాహరణ ఒకటీ, చెల్లింపు సాధనంగా పనిచేసే ఉదాహరణ ఒకటీ చూద్దాం.

**డబ్బు,'చలామణీ సాధనం'గా పనిచేసినప్పుడు :** వెంకయ్య, తన బట్టని రాజన్నకి అమ్మి, వెంటనే 2 రూ.లు తీసుకున్నాడు. తర్వాత, వెంకయ్య, వెంటనే రాజన్న దగ్గిర ధాన్యం కొని 3 రూ.లు ఇచ్చాడు. ఇక్కడ 2 రూ.ల బట్ట అమ్మకమూ, 3 రూ.ల ధాన్యం అమ్మకమూ, మొత్తం 5 రూ.ల సరుకుల అమ్మకాలు జరిగాయి. ఈ సరుకులతో మారడానికి ఇక్కడ 5 రూ.లు వుండాలా?—అవసరం లేదు. 3 రూ.లు వుంటే సరిపోతాయి. మొదట, బట్టని కొన్న రాజన్న వెంకయ్యకి 2 రూ.లు ఇచ్చాడు. తర్వాత వెంకయ్య ఆ 2 రూ.లకే ఇంకో రూపాయి కలిపి, 3 రూ.లు రాజన్నకి ధాన్యం కోసం ఇచ్చాడు. అంటే, ఇక్కడ 2 రూ.ల నాణెం 2 సార్లూ, 1 రూపాయి నాణెం ఒకసారీ కదిలి మొత్తం 5 రూ.ల విలువని రియలైజ్ చేశాయి. కొన్న వెంటనే డబ్బు చెల్లించే పద్ధతిలో కూడా, 2 మారకాలలో 5 రూ.ల విలువని రియలైజ్ చెయ్యడానికి, చలామణీలో 5 రూ.లు వుండనక్కరలేక పోయింది. 3 రూ.లు వుంటే సరిపోయింది. ఈ అమ్మకాలే అప్పు పద్ధతిలో జరిగివుంటే, చలామణీలోకి 3 రూ.లు కూడా అవసరం లేకుండా ఇంకా తక్కువ డబ్బుతోనే సరిపోతుంది.

**డబ్బు, 'చెల్లింపు సాధనం'గా పని చేసినప్పుడు :** మొదట, వెంకయ్య తన బట్టని అప్పు పద్ధతి మీద, రాజన్నకి, 2 రూ.లకి ఇచ్చాడనుకుందాం. రాజన్న అప్పు చెల్లించేలోగానే, వెంకయ్య రాజన్న దగ్గిర 3 రూ.ల విలువ గల ధాన్యం అప్పు పద్ధతి మీద కొన్నాడు. అంటే ఇద్దరూ ఒకరి కొకరు అప్పుపడ్డారు. ఈ అప్పుల్లో కొంత భాగాన్ని డబ్బు లేకుండానే చెల్లించుకోవచ్చు. రాజన్న నించీ వెంకయ్యకి 2 రూ.లు రావాలి కాబట్టి, వెంకయ్య రాజన్నకి ఇవ్వవలసిన 3 రూ.ల్లో 2 రూ.లు, ఇవ్వకుండానే చెల్లిపోతాయి. ఇక 1 రూ. మాత్రమే ఇవ్వాలి. చెల్లింపులు ఒకదాని నొకటి సరిపెట్టుకున్నప్పుడు, ఆ డబ్బు, కేవలం లెక్కల్లో మాత్రమే వుండే డబ్బుగా ('ఎకౌంట్ డబ్బు'గా) వుంటుంది. వెంకయ్య ఇవ్వవలసిన 3 రూ.ల్లో 2 రూ.లు ఎక్కౌంటు డబ్బుగా పోగా, ఇక ఒక్క రూపాయి ఇస్తే, ఇరు పక్షాల అప్పులూ సెటిలైపోతాయి. ఇక్కడ 5 రూ.ల విలువ గల 2 సరుకుల్ని అప్పు పద్ధతి మీద అమ్మడం వల్ల చలామణీలో 1 రూపాయి వుంటే సరిపోయింది. ఈ 1 రూపాయి, ఒక్క కదలికే చేసింది.

ఇంకో ఉదాహరణ.

ముగ్గురు వ్యక్తుల లెక్కలు ఇలా ఉన్నాయి :

| | | | | |
|---|---|---|---|---|
| 1 వ వ్యక్తి | 2 వ వ్యక్తికి ఇవ్వాల్సింది | — | 90 | రూ.లు |
| 2 వ వ్యక్తి | 3 వ వ్యక్తికి ఇవ్వాల్సింది | — | 50 | రూ.లు |
| 3 వ వ్యక్తి | 1 వ వ్యక్తికి ఇవ్వాల్సింది | — | 80 | రూ.లు |
| | లావాదేవీల మొత్తం | — | 220 | రూ.లు |

ఈ లెక్కలన్నీ సెటిలవ్వాలంటే చలామణీలో 220 రూ.లు వుండాలా? — అవసరం లేదు. చాలా తక్కువ డబ్బే చాలు. అది ఎంత వుండాలో తెలియాలంటే ఇలా చూడాలి.

1 వ వ్యక్తికి —రావలసింది 80;
పోవలసింది 90. ఫలితం –10.
2 వ వ్యక్తికి —రావలసింది 90;
పోవలసింది 50. ఫలితం + 40.
3 వ వ్యక్తికి —రావలసింది 50;
పోవలసింది 80. ఫలితం –30.

అంటే, 1 వ వ్యక్తి నించి 10 రూ.లూ, 3వ వ్యక్తి నించి 30 రూ.లూ కలిసి మొత్తం 40 రూ.లు, 2 వ వ్యక్తికి వస్తే, మొత్తం లావాదేవీలు సెటిలైపోతాయి. అంటే, ఈ ఉదాహరణలో, మొత్తం 220 రూ.ల లెక్కలు తీరడానికి, అందులో చాలా భాగం ఒక దానికొకటి ఎక్కౌంటు డబ్బుగా చెల్లిపోయి, చివరికి 40 రూ.లు మాత్రమే నిజం డబ్బు కావలసి వచ్చింది. ఈ సరుకుల అమ్మకాలు, ఈ పద్ధతి మీద గాక, వెంటనే డబ్బుని చెల్లించే పద్ధతిలో జరగాలంటే, చలామణీలో తిరగడానికి 40 కన్నా ఎక్కువ డబ్బు అవసరమవుతుంది. కాబట్టి సరుకుల అమ్మకాలూ కొనుగోళ్ళూ, ఒకరితో ఒకరు లెక్కలు చూసుకునే పద్ధతి మీదే ఎక్కువగా జరుగుతూ వుంటే, చలామణీలో వుండే డబ్బుని చాలా తగ్గించడం సాధ్యమవుతుంది. దీన్ని 'అప్పు పద్ధతి' అందాం.

'అప్పు' — అన్నప్పుడు, 'సరుకు'ని అప్పుగా ఇవ్వడమే గాక, 'డబ్బు'ని అప్పుగా ఇవ్వడం కూడా వుంటుంది. సరుకుని ఇచ్చిన వెంటనే డబ్బు తీసుకోకపోతే, అది సరుకుని అప్పు పద్ధతి మీద ఇవ్వడం. డబ్బుని ఇచ్చిన వెంటనే సరుకుని

తీసుకోకపోతే, అది డబ్బుని అప్పు పద్ధతి మీద ఇవ్వడం. 'అప్పు' అన్నప్పుడు, 2 పద్ధతులూ నడుస్తూ వుంటాయి.

'చలామణీలో తిరగడానికి ఎంత డబ్బు వుండాలి' అనే విషయాల్ని చూసినప్పుడు, 'ఒకే సమయంలో రియలైజ్ అవవలసిన విలువల మొత్తానికి సరిపోయేటంత డబ్బు వుండాలి' — అని ఇంతకుముందు చూశాం. ఆ సూత్రానికి ఈ అప్పుల విషయాన్ని కూడా చేర్చి, దాన్ని ఇంకా వివరణతో చూడాలి. ఒక నిర్ణీత కాలాన్ని తీసుకుంటే, ఆ కాలంలో అమ్ముడుపోయే సరుకుల్లో కొన్ని సరుకులు అప్పు పద్ధతి మీదే అమ్ముడవుతాయి కాబట్టి, వాటికి సంబంధించిన డబ్బు ఆ సమయంలో చలామణీలో వుండనక్కర్లేదు. అయితే, ఆనాడే గడువు తీరిన పాత అప్పులకు చెల్లించడం కోసం కూడా కొంత డబ్బు కావాలి. కాబట్టి, చలామణీలో వుండవలసిన డబ్బు మొత్తం, ఈ అంశాలన్నిటి మీదా కూడా ఆధారపడి వుంటుంది.

సరుకుల్ని ఉత్పత్తి చెయ్యడమూ, ఉత్పత్తి అయిన సరుకునంతటినీ ఎప్పటికప్పుడు వాడుకోవడమూ — అనే 2 కార్యక్రమాలూ సవ్యంగా జరిగిపోతూ వుంటే, అప్పుల పద్ధతి మీద అమ్మకాలు కూడా సవ్యంగా జరిగిపోతూ వుంటాయి. అప్పుడు చలామణీలో తిరగడానికి తక్కువ డబ్బే సరిపోతూ వుంటుంది. అంటే, అప్పు పద్ధతి అనేది, చలామణీ సాధనాన్ని పొదుపు చెయ్యడానికి ఒక మార్గంగా, 'చక్కగానే' ఉపయోగపడుతుంది.

అయితే, 'తక్కువ డబ్బుతోనే చలామణీ కార్యక్రమాలు జరిగిపోతూ వుండడం' అనే పరిస్థితే, ఒక్కొక్కసారి, 'చలామణీలో డబ్బు చాలకపోవడం' అనే సమస్యకి దారి తీస్తూ వుంటుంది. 'డబ్బు సంక్షోభం' అని పిలవ దగ్గంత సమస్యగా అది పరిణమిస్తుంది.

అప్పు పద్ధతి వల్ల, మారకాలలో ఒక గందరగోళపు పరిస్థితి ఏర్పడుతూ వుంటుంది. ఒక ఉదాహరణ: జొన్నల మనిషి దగ్గిర జొన్నలు అమ్మడానికి సిద్ధంగానే వున్నాయి. కానీ వాటి అమ్మకం ఇంకా జరగలేదు. కానీ, ఆ జొన్నల మనిషి, అప్పు పద్ధతి మీద బట్టని కొన్నాడు. తన సరుకుని అమ్మిన తర్వాత డబ్బు ఇస్తానని బట్ట మనిషికి చెప్పాడు. అంటే, జొన్నలకు ఇంకా అమ్మకం జరగక ముందే, వాటిని అమ్మినప్పుడు వచ్చే డబ్బుతో అప్పుడే ఇంకో సరుకుని కొనేశాడు. అంటే, జొన్నలకు మొదటి రూపాంతరం జరగక ముందే, రెండో రూపాంతరం జరిగిపోయింది.

ఇంకో ఉదాహరణ : ఒక నేత మనిషి, తన సరుకుని తర్వాత ఇస్తానని చెప్పి, డబ్బుని అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బుతో ఏం చేస్తాడు? ఇంకేదో సరుకుని కొంటాడు. తర్వాత ఆ అప్పుని ఎలా తీరుస్తాడు? తన సరుకు తయారైన తర్వాత, దాన్ని ఇచ్చి అప్పు తీరుస్తాడు. అంటే, ఆ సరుకు తయారు కాకముందే, దాన్ని అమ్మడమూ, ఆ అమ్మిన డబ్బుతో ఇంకో సరుకుని కొనడమూ కూడా జరిగిపోయాయి! అంటే, సరుకు తయారు కాకముందే, దాని 2 రూపాంతరాలూ జరిగి పోయాయి.

ఈ రకంగా, అప్పు పద్ధతి ద్వారా జరిగే మారకాలలో, కొన్ని సరుకులకు మొదటి రూపాంతరం జరగక ముందే రెండో రూపాంతరం జరగడమూ; కొన్ని సరుకులకు, అవి తయారు కాకముందే 2 రూపాంతరాలూ జరిగి పోవడమూ — అనే పరిస్థితులు ఏర్పడుతూ వుంటాయి. ఈ రకంగా, మొత్తం సరుకుల చలామణీలో, సరుకుల మనుషులకు రావలసిన అప్పులూ, పోవలసిన అప్పులూ ఒక దానితో ఒకటి అల్లుకు పోతూ వుంటాయి. కొంత కాలానికోసారి, మొత్తం సమాజంలో ఒక దానితో ఒకటి చెల్లిపోయే అప్పుల్ని తీసివెయ్యగా, చివరికి ఒక 'శేషం' మిగులుతుంది. ఆ శేషానికి చెల్లించడానికే 'నిజమైన డబ్బు' అవసరమవుతుంది. చలామణీలో వున్న డబ్బు పరిమాణం, ఆ శేషానికి చెల్లించడానికి సరిపోయేలాగ లేకపోతే, 'డబ్బు చాలక పోవడం' అనే సమస్య తలెత్తుతుంది.

డబ్బు, 'చెల్లింపు సాధనం'గా పనిచెయ్యడంలో (అప్పు పద్ధతిలో) ఒక వైరుధ్యం వుంది. ఈ పద్ధతి, డబ్బు పరిమాణాన్ని పొదుపు చెయ్య గలుగుతుంది. కానీ ఈ పరిస్థితే, ఒక్కోసారి డబ్బు చాలని తీవ్ర సమస్యని సృష్టిస్తుంది.

'డబ్బు చాలకపోవడం' సమస్య, 'డబ్బు' వేపు నించి పుట్టుకొచ్చే సమస్యలాగ పైకి కనిపిస్తుంది. కానీ, నిజానికి ఇది సరుకుల వేపు నించి పుట్టుకొచ్చే సమస్యే. ( దీన్ని 2 వ సంపుటంలో, ''సంక్షోభాలు'' చాప్టరులో చూస్తాము.)

# 8. ప్రపంచ ధనం

ఏ దేశాన్ని తీసుకున్నా దాని బంగారం డబ్బు 'ప్రభుత్వ బ్యాంకు'లోనూ, దాని కాయితం డబ్బు చలామణీలోనూ వుంటాయి. ఒక దేశంలో డబ్బు పేరు 'రూపాయి' అయితే, ఇంకో దేశంలో డబ్బు పేరు 'పౌండు' కావచ్చు, మూడో దేశంలో డబ్బు పేరు 'డాలరు' కావచ్చు. అలాగే, ఒక్కో దేశంలో డబ్బుకి ఒక్కో పేరు వుంటుంది, ఆ దేశపు భాషని బట్టి.

ఒక దేశపు కాయితం డబ్బు, ఆ దేశపు హద్దుల లోపలే

డబ్బుగా చలామణీ అవుతుంది. ఆ హద్దులు దాటితే, అది, కాయితం ముక్కలతో సమానమే. దేశం బయట దానికి డబ్బుగా గుర్తింపు వుండదు. ఎందుకంటే, అన్ని దేశాలకూ ఒకే ప్రభుత్వమూ, ఒకే ఖజానా, ఒకే డబ్బు లెక్కలూ వుండవు. ఏ దేశపు డబ్బు లెక్కలు ఆ దేశానికి వేరు వేరుగా వుంటాయి. ఏ దేశంలోనైనా, కాయితం డబ్బుకి స్వంత విలువ వుండదు. కాయితం డబ్బు వెనక బంగారం వున్నప్పుడే కాయితం డబ్బుకి విలువ వుంటుందని ఇంతకు ముందే చూశాం. కాబట్టి, ఒక దేశంలో వుండే కాయితం డబ్బు ఇంకో దేశానికి వెళ్తే, అక్కడ దానికి డబ్బుగా గుర్తింపు వుండదు.

ఒక దేశంలో, ఒకరి సరుకుల్ని ఒకరు కొనడం జరుగుతూ వున్నట్టుగానే, ఒక దేశపు సరుకుల్ని ఇంకో దేశపు మనుషులు కొనడం కూడా జరుగుతూ వుంటుంది. రూపాయి దేశపు ఒక మనిషి, డాలరు దేశపు ఒక మనిషి నించి కొంత బట్ట కొన్నాడనుకుందాం. రూపాయి దేశపు మనిషి, బట్టని అమ్మిన మనిషికి, తన దేశపు కాయితం రూపాయి ఇవ్వడానికి వీలు లేదు. ఆ విలువకి తగినట్టు బంగారమే ఇవ్వాలి. బంగారం తీసుకున్నప్పుడే, విదేశీ మనిషికి, తన బట్టకి బదులు డబ్బు అందినట్టు అర్థం.

రూపాయి దేశం, డాలరు దేశం నించి సరుకుల్ని కొన్నదనుకుందాం. రూపాయి దేశంలో బంగారం నాణాలే చలామణీలో వున్నాయి — అనుకుందాం. రూపాయి దేశం, తన బంగారం నాణాల్ని డాలరు దేశానికి ఇవ్వవచ్చా? — ఇవ్వవచ్చు. అది బంగారమే కాబట్టి. కానీ, ఆ నాణాలు, డాలరు దేశానికి వెళ్ళిన తర్వాత, ముద్దగా మారిపోవాలి. ఎందుకంటే, అవి, డాలరు దేశంలో కూడా రూపాయి నాణాలుగానే వుంటే, వాటి పేరూ, వాటి రూపమూ, ఆ విదేశీ చలామణీలో తిరగడానికి పనికిరావు. కాబట్టి, ఒక దేశం ఇంకో దేశానికి తన బంగారం నాణాలనే ఇస్తే, వాటిని రెండో దేశం ముద్దగా కరిగించేసుకుంటుంది. అవసరమైతే ఆ బంగారాన్ని తన డబ్బు నాణాలుగా చేసుకుంటుంది.

రూపాయి దేశపు మనుషులు, డాలర్ దేశం నించి కొంటే, డాలర్ దేశపు మనుషులు కూడా రూపాయి దేశం నించి కొంటారు. రెండు వేపుల నించీ కూడా అమ్మకాలూ కొనుగోళ్ళూ జరుగుతాయి. కొంతకాలాని కొకసారి ఒకదాని కొకటి చెల్లిపోయే అప్పుల్ని తీసివెయ్యగా, ఇంకా ఎంతో కొంత మొత్తం ఒక దేశం ఇంకో దేశానికి ఇవ్వవలసి వస్తుంది. దాన్ని బంగారం గానే ఇవ్వాలి.

అన్ని దేశాలలోనూ బంగారం నాణాలే చలామణీలో వున్నాయి అనుకుంటే, ఆ నాణాలు ఒక్కో దేశంలో ఒక్కో రూపంతో వుంటాయి. లేదా, అన్ని దేశాలలోనూ కాయితం డబ్బే వుందనుకుంటే, ఆ డబ్బు కూడా ఒక్కో దేశంలో ఒక్కో రూపంతో వుంటుంది.

ఒక దేశంలో డబ్బుకి ఏ రూపం వుంటుందో, ఆ రూపమే ఆ దేశపు సరుకులకు విలువ రూపం. రూపాయి దేశంలో ఏ సరుకు విలువ అయినా 'రూపాయిల రూపం'తో వుంటుంది. డాలర్ దేశంలో ఏ సరుకు విలువ అయినా 'డాలర్ల రూపం'తో. అలాగే, ఏ దేశంలో సరుకుల విలువ, ఆ దేశపు డబ్బు రూపంతో వుంటుంది. అంటే, ఒక దేశంలో విలువ రూపం వున్నట్టుగా ఇంకో దేశంలో విలువ రూపం వుండదు. అంటే విలువ, ఒక్కో దేశంలో ఒక్కో రూపంతో కనపడుతుంది.

అయితే, ఒక దేశపు సరుకు, తన దేశాన్ని వదలి, తన దేశపు హద్దులు దాటి, బయటికి అడుగు పెడుతుం దనుకుందాం. అప్పుడు, ఆ సరుకుకి బదులుగా 'బంగారం ముద్ద' రావడం అంటే, దాని అర్థం ఏమిటి? ఆ సరుకు, తన దేశపు హద్దుల్ని దాటింది కాబట్టి, దాని విలువ కూడా తన దేశంలో వున్నప్పుడు ధరించే రూపాన్ని వదిలి, సరుకుల ప్రపంచానికంతటికీ విలువ రూపం అయిన 'జనరల్ ఈక్వివలెంటు' రూపాన్ని, అంటే బంగారం రూపాన్ని, ధరిస్తుందని అర్థం.

ప్రపంచానికంతటికీ సంబంధించిన డబ్బే, ప్రపంచ ధనం. ఏ నాణెం రూపంలోనూ వుండని బంగారం ముద్దే — ప్రపంచ ధనం.

ప్రపంచ ధనం — అంటే బంగారమే కాదు, వెండి కూడా.

ప్రపంచ ధనం — ప్రపంచానికంతటికీ సంబంధించిన 'విలువ కొలత' గానూ, సరుకులన్నిటికీ ప్రపంచ వ్యాప్తంగా వుండే 'విలువ రూపం'గానూ వుంటుంది!

## ప్రశ్నలూ — జవాబులూ

**1. 2 రకాల ధాన్యం రాసుల్ని శేరు పాత్రతో కొలిస్తే మొదటి రాసి 6 పాత్రలూ, రెండో రాసి 8 పాత్రలూ అయింది. ఆ రాసుల్ని అర్థ శేరు పాత్రతో కొలిస్తే ఆ రాసులు ఎన్నేసి పాత్రలు అవుతాయి? లేదా, ఆ రాసుల్ని 2 శేర్ల పాత్రతో కొలిస్తే, ఎన్నేసి పాత్రలు?**

జ: 2 రాసుల్ని శేరు పాత్రతో కొలిస్తే, 6 — 8
అదే రాసుల్ని అర్థ శేరు పాత్రతో కొలిస్తే, 12 — 16
" 2 శేర్ల పాత్రతో కొలిస్తే, 3 — 4

సరుకుల విలువల్ని కొలిచే 'డబ్బు---- యూనిట్' కూడా శేరు పాత్ర లాంటిదే.

**2. ఒక సమయంలో ఒక సరుకు విలువ — 2 రూ.లు. రూపాయి విలువ సగం అయితే ఆ సరుకు విలువ ఎన్ని**

**రూపాయలు కావచ్చు?**

**జ:** 4 రూ.లు.

**3. ఒక సరుకు, డబ్బుతో మారిన తర్వాత ఇక అది (ఆ సరుకు) చలామణీలో వుండకుండా వాడకంలోకి వెళ్ళిపోతుంది. కానీ, ఒక డబ్బు నాణెం, ఒక సరుకుతో మారిన తర్వాత కూడా చలామణీలోనే వుంటుంది. ఎందుచేత?**

**జ:** 'డబ్బు' అనేది, వాడకానికి ఉపయోగపడే వస్తువుల లాంటిది కాదు. అది చెయ్యవలసిన పని సరుకుల్ని చలామణీ చేసే సాధనంగా వుండడమే. అందుకే అది ఎప్పుడూ సరుకులతో మారుతూ చలామణీలోనే వుంటుంది. దాని పనే అది.

**4. డబ్బు — 'విలువ కొలత' గా ఊహాత్మకంగా పని చేసింది. ఒక ఉదాహరణ చెప్పండి!**

**జ:** ఒక చొక్కా విలువ (ధర) —20 రూ.లు. ఇలా అన్నప్పుడు, అక్కడ ఆ రూపాయలు ప్రత్యక్షంగా వుండ నక్కరలేదు. చొక్కా విలువ ఎంత వుంటుందో డబ్బు లెక్కతో చెప్పుకుంటున్నాం. కాబట్టి, ఇక్కడ డబ్బు 'విలువ – కొలత'గా వుంది. ఊహలోనే.

**5. డబ్బు, 'ధర ప్రమాణం' గా పని చేసింది. ఒక ఉదాహరణ చెప్పండి.**

**జ:** 'చొక్కా ధర — 20 రూ.లు'. ఇలా అనగానే ఆ ధర రుజువైనట్టు కాదు. 'ఆ చొక్కాని వెంకయ్య 20 రూ.లు ఇచ్చి కొన్నాడు'. ఇప్పుడు, ఆ వస్తువుకి అంత ధర వున్నట్టు రుజువైంది. ఆ డబ్బు, చొక్కాని అమ్మిన మనిషి చేతిలోకి వెళ్తుంది. ఇక్కడ, డబ్బు, 'ధర ప్రమాణం'గా (ధరకి రుజువుగా) పనిచేసింది.

**6. (1) అమ్మడమే కొనడం — ఎప్పుడు?**

**జ:** బార్టరు పద్ధతిలో.

**(2) అమ్మడమే కొనడం కాదు — ఎప్పుడు?**

**జ:** అమ్మకం, డబ్బు ద్వారా జరిగినప్పుడు. చొక్కాని అమ్మి 20 రూ.లు. తీసుకుంటే, చొక్కా మనిషి వేపు నించి చూస్తే, అది అమ్మకమే. కొనడం కాదు.

**7. 'పొదుపు' అంటే ఏమిటి? ఒక నేత మనిషి, ప్రతి రోజూ కొంత బట్టని నేసి, దాన్ని అమ్మి 10 రూ.లు సంపాదిస్తాడనుకుందాం. ఆ మనిషి ఆ డబ్బునంతా పొదుపు చెయ్యగలడా? పొదుపుకి ఏదైనా సహజమైన హద్దు ఉందా?**

**జ:** 'పొదుపు' అంటే, అవసరాలన్నీ తీరగా మిగిలిన డబ్బుని దాచడం. 10 రూ.లు సంపాదించే వ్యక్తి, అదంతా దాచెయ్యడం సాధ్యం కాదు. కనీసావసరా లన్నీ తీరడానికి 8 రూ.లు అవసరమైతే, ఆ హద్దు దాటిన తర్వాత మిగిలినదాన్నే దాచడం సాధ్యం.

**8. 5 రూ.లతో, 6 రూ.ల విలువగల సరుకుని కొనలేము. ఎందుచేత?**

**జ:** 'మారకం' అనేది, సమాన విలువల మధ్యనే జరగాలి కాబట్టి. 6 రూ.ల విలువ గల సరుకుని కొనాలంటే, 6 రూ.ల డబ్బు వుండి తీరాలి. లేకపోతే ఆ మారకం జరగదు. ఆ సరుకు మనిషి, ఆ సరుకుని ఇవ్వడు.

**9. ఆకలి వేసే మనిషికి కడుపు నిండా తినడంతో తృప్తి కలుగుతుంది. ఇంకా తినడానికి నిరాకరిస్తాడు. ఆ మనిషే డబ్బు సంపాదించడం మొదలుపెడితే, 'డబ్బు ఇక చాలు' అని ఎప్పటికి అనగలడు?**

**జ:** ఎప్పటికీ అనలేడు. ఎందుకంటే, డబ్బు, సహజ అవసరాల్ని తీర్చే వస్తువు కాదు. డబ్బులో, దాని గుణానికీ, పరిమాణానికీ మధ్య వైరుధ్యం వుంది. దాని గుణం ఏమిటంటే —అది ఏ వస్తువునైనా కొనగలదు. దాని పరిమాణం ఎలాంటిదంటే — ఉన్న పరిమాణం కన్నా ఎక్కువ విలువ గల వస్తువుల్ని కొనడానికి అది చాలనిదిగా వుంటుంది. ఒక వ్యక్తి చేతిలో కోటి రూపాయలు వున్నాయి. కానీ అతను, 2 కోట్ల విలువ గల పరిశ్రమ పెట్టాలనుకున్నాడు. అతని దగ్గిర వున్న డబ్బు పరిమాణం, అతను కోరుకునే దానికి చాలదు. కాబట్టి, ఆ పరిమాణం ఇంకా పెరగాలి. లేదా, అతని చేతిలో 10 కోట్లు ఉన్నాయనుకుందాం. అతను, 11 కోట్లు అవసరమయ్యే పరిశ్రమ నడపాలనుకున్నాడు. అప్పుడు కూడా వున్న డబ్బు చాలదు. డబ్బు విషయంలో 'ఇంత డబ్బు చాలు' అనే హద్దు వుండదు. ఆ హద్దుని విలువ దృష్టితో గాక, ఉపయోగపు విలువ దృష్టితో ఏర్పర్చుకుంటే ఈ సమస్య రాదు.

**10. డబ్బుని కళాత్మకంగా నిల్వ చెయ్యడం అంటే ఏమిటి?**

**జ:** డబ్బుని, వెండి బంగారాల బిళ్ళలు గానూ, డబ్బు నోట్లు గానూ నిల్వ చెయ్యకుండా, కొన్ని వస్తువులుగా వుంచడం. ఆ వస్తువులు ఎలాంటి వంటే — వెండి బంగారాల పాత్రలూ, నగలూ, శిల్పాలూ వంటి వస్తువులు. ఇంకా 'కళాత్మకమైన వస్తువులు' అని వేటినైతే అంటామో అవన్నీ డబ్బుకి మారు రూపాలే.

**11.** 4 గురు మనుషుల డబ్బు సంబంధాలు ఇలా వున్నాయి. **1** వ మనిషి **2** వ మనిషికి **20** రూ.లూ, **4** వ మనిషికి **90** రూ.లూ ఇవ్వాలి. **2** వ మనిషి **3** వ మనిషికి **30** రూ.లు ఇవ్వాలి. **4** వ మనిషి **1** వ మనిషికి **50** రూ.లూ, **2** వ మనిషికి **40** రూ.లూ ఇవ్వాలి. **3** వ మనిషి **1** వ మనిషికి **10** రూ.లు ఇవ్వాలి. ఈ లావాదేవీలన్నీ

**సెటిల్ కావాలంటే, చివరికి ఎవరు ఎవరికి ఎంత ఇవ్వాలి?**

**జ:** ఈ లెక్కలన్నీ పాఠంలో చెప్పిన విధంగా రాసి చూస్తే, చివరికి, 1 వ వ్యక్తి 2 వ వ్యక్తికి 30 ; 3 వ వ్యక్తికి 20 ఇస్తే, అందరి లెక్కలూ సెటిలవుతాయి.

**12. ఈ వాక్యం పూరించండి!**

డబ్బు,................................. గా పని చేసేటప్పుడు, .................. డబ్బుగా మాత్రమే వుండి, .................... గా పని చేసేటప్పుడు,...................... డబ్బుగా వుంటుంది.

**జ:** (ఆ వాక్యంలో 4 చోట్ల ఖాళీలు వున్నాయి.

ఈ కింద ఇచ్చే మాటల్ని ఆ 4 చోట్లా పెట్టి ఆ వాక్యాల్ని మళ్ళీ చదవండి!)

(1) విలువ కొలత
(2) ఊహాత్మకమైన
(3) ధర ప్రమాణం
(4) నిజమైన

**13. వీటిలో ఏది రైటు? ఏది తప్పు?**

**జ:** (1) ఒక కాయితం రూపాయికి కొంత ధాన్యం వస్తుంది. ఆ కాయితం రూపాయికి వున్న విలువ, ఆ కాయితం ముక్కది కాదు. దాని వెనక వున్న బంగారానిది. ✔

(2) డబ్బు కదలికల్ని బట్టే, సరుకుల కదలికలు. ✘

(3) డబ్బు నాణెం 2 సార్లు కదిలిందంటే, 2 సరుకుల అమ్మకాలు జరిగాయని అర్థం. ✔

**14. వెండి రూపాయిని గానీ, బంగారం రూపాయిని గానీ ఎప్పుడైనా చూశారా? పోనీ, వాటి గురించి విన్నారా?**

**జ:** చూడలేదు. విన్నాం —కథల్లో.

**15. డబ్బు కూడబెట్టాలనే కోరిక మీకు వుందా? ఎందుకు?**

జ : కూడబెట్టాలని లేదు. కొంచెం పొదుపు చేసుకోవాలని వుంటుంది. ఎందుకంటే, ఎప్పుడైనా 'జబ్బుల' లాంటి పెద్ద అవసరాలేమైనా వస్తే అది ఉపయోగపడు తుందని.

★

# గమనిక :

"పెట్టుబడి" పుస్తకం చదవడం ప్రారంభమై ఇప్పటికి 10 చాప్టర్లు గడిచినా, ఇంకా 'పెట్టుబడిదారులూ, కార్మికులూ' అనే మాటలు మన చెవులబడలేదు. ఆ పాత్రలన్నీ 2 వ భాగం నించి రంగం మీదకి వస్తాయి. ఆ పాత్రల్నీ, వాటి సంబంధాల్నీ అర్థం చేసుకోవాలంటే, మొదట ఈ 10 చాప్టర్లలో చూసిన విషయాలన్నీ ఎంతో అవసరం. ఉపయోగపు విలువా, మారకం విలువా, ఉత్పత్తి శక్తీ, విలువ రూపమూ, డబ్బూ— వగైరా విషయాలే 'ఆర్థిక శాస్త్రం'లో పునాది విషయాలు. ఈ పునాది విషయాల్ని అర్థం చేసుకున్న తర్వాతే, 'పెట్టుబడి' అనే విషయం దగ్గిరికి వెళ్ళగలం. 'విలువ' అంటే ఏమిటో, 'డబ్బు' అంటే ఏమిటో తెలియకపోతే, 'పెట్టుబడి'ని పరిశీలించలేము. ఈ సంపుటం లోనే తర్వాత 2 వ భాగం నించీ కార్మికుల్నీ, పెట్టుబడుదారుణ్ణీ చూస్తాం.

★

# 2వ భాగం
# పెట్టుబడిదారీ ఉత్పత్తిక్రమం
## [ఈ భాగంలో 8 చాప్టర్లు ఉన్నాయి]

## ముందు మాట

**మొదటి** భాగంలో, కార్మికులూ పెట్టుబడిదారులూ, ఇంకా రాలేదు. వాళ్ళు ఈ భాగం నించే రంగంలోకి వస్తారు. వాళ్ళం దర్నీ ఒక 'పని స్తలం' లోనే చూస్తాం. పని స్తలం లోకి వెళ్ళేటప్పటికే మనకు కొన్ని విష యాలు తెలిసి వుండాలి. ఉపయోగపు విలువా, మారకం విలువా, డబ్బూ, ఉత్పత్తి శక్తీ — ఈ విషయాలన్నీ తెలిసి వుంటేనే, పని స్తలంలో జరిగే కార్యక్రమాన్నీ, అక్కడ వున్న మనుషుల సంబంధాల్నీ అర్థం చేసుకో గలుగుతాము. అందుకే ఆ విషయాలన్నిటినీ వివరించడం మొదటి భాగంలో జరిగింది.

'మానవ సమాజం' అంటే, మనుషుల సమూహం. ఈ సమూహం, పక్షుల సమూహం లాగా, జంతువుల సమూహం లాగా, ప్రకృతిలో ఏది దొరికితే అది మాత్రమే తిని బతికే సమూహం కాదు. ప్రకృతిలో ఏ జీవ రాసులకూ లేని ఒక ప్రత్యేక లక్షణం, ఏ లక్షణ మైతే మానవ జంతువుల్ని 'మానవులు'గా మార్చిందో ఆ ప్రత్యేక లక్షణం, అదే 'పని చెయ్యడం' అనే ప్రత్యేక లక్షణం, మానవ సమాజానికి ఉంటుంది. కాబట్టి, మానవ సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే, 'పని' దగ్గిరికి వెళ్ళాలి. అంటే, 'పని స్తలాల' దగ్గిరికి !

మనుషులందరూ జీవించడానికి కావలసిన ఉత్పత్తులు ఇచ్చేవి — పని స్తలాలే.

మనుషుల్లో — స్త్రీలూ, పురుషులూ అనే తేడా, ప్రకృతి సహజమైనది. అది, సమస్త జీవ రాసుల్లోనూ వుండే తేడా లాంటిదే. దాని సంగతి ఇక్కడ అనవసరం. 'సామాజికంగా' ఏర్పడే తేడాల సంగతే ఇక్కడ పరిశీలనకు అవసరం.

మనకు ప్రత్యక్షంగా తెలిసిన 'సమాజం'లో, మన నిత్య జీవితంలో, స్త్రీ పురుషులు, అనేక పరిస్తితుల్లో కనపడతారు. పని స్తలాల్లో మనుషులూ; ఇళ్ళల్లో మనుషులూ; పని స్తలాల్లో యజమానులూ, సేవకులూ; ఇళ్ళల్లో యజమానులూ, సేవకులూ; స్త్రీలలో యజమానులూ, సేవకులూ; పురుషుల్లో యజమానులూ, సేవకులూ; విద్యార్థులూ, టీచర్లూ; పోలీసులూ, సైనికులూ; మతాలయాల్లో మనుషులూ, సన్యాసి మఠాల్లో మనుషులూ; కోర్టుల్లో మనుషులూ, జైళ్ళల్లో మనుషులూ; అనాధ శరణాలయాల్లో మనుషులూ, బిచ్చమెత్తే మనుషులూ; వేశ్యలూ, రౌడీలూ — ఇలా, ఇన్ని రకాలుగా కనపడతారు. ఈ మొత్తం మనుషులందరి గురించీ, ఒక్క రకాన్ని కూడా వదిలి పెట్టకుండా,

మొత్తం మనుషులందరి గురించీ తెలుసుకోవాలంటే మార్గం ఏమిటీ? ఏది 'మొదలు?' ఏది 'చివర?' ఈ మనుషులందరి మధ్యా సంబంధాలేమిటి? ఆ సంబంధాలకు కారణాలేమిటి? లేదా, ఈ మనుషులందరూ ఏ సంబంధాలూ లేని విడి విడి వ్యక్తులా?— ఈ విషయాలన్నీ తెలుసుకునే మార్గం 'పని స్థలం' దగ్గిరికి వెళ్ళడమే.

'మానవ సమాజం' గురించి తెలుసుకునే క్రమాన్ని, ఏదో ఒక పని స్థలం నించి ప్రారంభించవలసిందే. ఒక 'పని స్థలం'లో జరిగేదే, అన్ని పని స్థలాలలోనూ జరుగుతుంది.

అన్ని పని స్థలాల సారాంశాన్నీ, సంబంధాల్నీ కలిపిచూస్తే, 'సమాజం' అర్థం అవుతుంది.

'పని స్థలం' అనేది — మన నిత్య జీవితపు లోక జ్ఞానానికి అందని ఆశ్చర్యకరమైన విషయాలెన్నో చూపిస్తుంది. చిన్నతనం నించీ మన కెంతో సహజ సత్యాలుగా కనపడుతూ వున్న విషయాలెన్నిటినో పని స్థలం, తారుమారు గానూ, తల్ల కిందులుగానూ చేసేస్తుంది.

పని స్థలం ఇచ్చే 'కొత్త జ్ఞానం'తో, మనం జీవిస్తోన్న సమాజాన్నే గాక, మన కన్నా పూర్వం గడిచిపోయిన వందల, వేల ఏళ్ళ నాటి గత సమాజాల్నీ, మన తర్వాత గడవబోయే వందల, వేల ఏళ్ళ భవిష్యత్ సమాజాన్నీ కూడా అర్థం చేసుకోగలుగుతాము.

మనుషులకు, ప్రకృతి తోటీ; మనిషికి, తోటి మనుషుల తోటీ వున్న సంబంధాల్ని, అంటే 'మానవ సమాజ చరిత్ర'ని అర్థం చేసుకునే క్రమం— 'పని స్థలం' నించి ప్రారంభం కావలసిందే!

ఈ 2 వ భాగం, ఒక 'పని స్థలం' నించే ప్రారంభమవుతుంది. అక్కడ కొందరు మనుషులు ఒకరితో ఒకరు సంబంధాలలోకి వస్తారు. అక్కడ ఏం జరుగుతుందో, అది ఇంకా ఎక్కడెక్కడికి దారితీస్తుందో క్రమంగా తెలుస్తుంది.

ఈ 2 వ భాగం, 'పని స్థలం'తో ప్రారంభమై, 'పని దినం'తో ముగుస్తుంది. ఇంకా తర్వాత భాగాలు కూడా పూర్తి చేస్తేనే గానీ, తెలుసుకోవలిసిన విషయాలన్నీ దొరకవు. అప్పటికి, భూత – వర్తమాన – భవిష్యత్ సమాజాల స్వభావ స్వరూపాలు అర్థమవుతాయి. మనుషులకు కావలసిన జ్ఞానం మనుషులకు అందుతుంది.

ఏ పుస్తకం అయినా, పాఠకులు ఇలా చదువుతూ వుంటే, అలా అర్థమైపోతూ ఉండాలి. సైన్సు విషయాల్లో ఇది మరీ ముఖ్యం. ఒక పుస్తకాన్ని ఒకరు చదివి వినిపిస్తూవుంటే, వినే వారికి కూడా, వారు ఎంత చదువులేని వారయినా, చదివే మనిషి అక్కడక్కడా చేసే చిన్న చిన్న వివరణలతో, వినే వారికి తేలిగ్గా అర్థమవుతూ ఉండాలి. ఈ ఉద్దేశ్యం తోనే నేను, ఈ 'కాపిటల్– పరిచయం' విషయంలో మరీ ప్రత్యేకంగా మళ్ళీ మళ్ళీ నాకు చేతనైన జాగ్రత్తలన్నీ తీసుకుంటూనే వున్నాను.

పుస్తకాలు తేలిగ్గా అర్థమవ్వాలంటే, రచయితలు తేలిగ్గా రాయాలి. సైన్సు పుస్తకాలకు ఇది మరీ అవసరం. కానీ పుస్తకం ఎంత తేలిగ్గా వున్నా, పాఠకులు దాని మీద శ్రద్ధ పట్టకపోతే, అది రచయిత తప్పు కాదు. పాఠకులు కూడా వారి బాధ్యత వారు నిర్వహించాలి. అన్ని సందర్భాల్లోనూ పొరపాటు రచయితలది గానే ఉండదు. పాఠకుల వేపు నించి కూడా అనేక పొరపాట్లు ఉంటాయి. కాబట్టి, పుస్తకాల్ని అర్థం చేసుకోవడంలో, పాఠకులు కూడా వారి కృషి వారు చెయ్యాలి!

27-9-2003

# 1. లాభం

**ఒక** వ్యక్తి, ఒక 'సరుకు'ని తయారు చేయించి అమ్మే ఉద్దేశ్యంతో, మొట్టమొదట కొంత 'డబ్బు' పట్టుకుని, ముడి పదార్థాలూ వగైరాల కోసం మార్కెట్‌కి బయల్దేరతాడు. కావలసిన వాటన్నిటినీ మార్కెట్లో కొంటాడు. కావలసిన పని వాళ్ళని కూడా కుదుర్చుకుంటాడు.

తర్వాత, ఒక 'పని స్తలం'లో ఆ 'పని వాళ్ళ'తో పని చేయించడం మొదలుపెడతాడు. ('పని వాళ్ళు' అన్నప్పుడు, అందులో మొగవాళ్ళే గాక, ఆడవాళ్ళూ, పిల్లలూ కూడా ఉన్నారనుకోవాలి.) ఆ వ్యక్తి వారానికోసారో, నెలకోసారో ఏదో ఒక లెక్కన పనివారికి జీతాలు ఇస్తూ వుంటాడు.

కొన్నాళ్ళకు, 'సరుకు' తయారవుతుంది. అది ఇప్పుడు 'అమ్మకానికి' సిద్ధంగా వుంది. ఆ వ్యక్తి, సరుకంతా మార్కెట్‌కి తీసుకుపోయి పూర్తిగా అమ్మేశాడనుకుందాం. అప్పుడు, వాడి చేతిలోకి వచ్చే డబ్బు, మొదట ఖర్చుచేసిన డబ్బు కన్నా ఎక్కువ వుంటుందా, తక్కువ వుంటుందా, అంతే వుంటుందా?

'సరుకు' కోసం మొదట ఖర్చయినదాన్ని,

'పెట్టు బడి' (కాపిటల్) అందాం.

'పెట్టుబడి' పెట్టిన వ్యక్తి — 'పెట్టుబడిదారుడు' (కాపిటలిస్ట్. లేదా, ఈ వ్యక్తికి ఇంకో పేరు 'బూర్జువా').

'పనివారు'— శ్రామికులు (వర్కర్స్).

సరుకుని తయారుచేసే పనులన్నీ శ్రామికులే చేస్తారనీ, పెట్టుబడిదారుడు చెయ్యడనీ కూడా అనుకుందాం. (ఇప్పుడు ఇలాగే అనుకుందాం.)

ఆ సరుకుని తయారు చేయించడంలో, పెట్టుబడిదారుడు ఖర్చు చేసింది 100 రూ.లు అనుకుందాం (ముడి పదార్థాలూ వగైరాల మీద 80. పనివారి జీతాలమీద 20). తయారైన సరుకుని అమ్మిన తర్వాత పెట్టుబడిదారుడికి వచ్చేది, 100 రూ.లే వుంటుందా, అంత కన్నా ఎక్కువ వుంటుందా?

ఎంత ఖర్చు చేశాడో అంతే తిరిగి వచ్చేటట్టయితే పెట్టుబడిదారుడు అసలీ వ్యవహారం అంతా పెట్టుకోవడం ఎందుకు? 100 రూ.లు ఖర్చు చేసింది, తిరిగి 100 రూ.లు సంపాయించడానికేనా? అందుకే అయితే, వాడు ఈ వ్యవహారంలోకి దిగకుండానే, ఆ 100 రూ.లే దగ్గిర పెట్టుకుని కూర్చోవచ్చు కదా? కానీ, ఏ పెట్టుబడిదారుడూ అలా చెయ్యడు. ఒక సరుకుని తయారు చేయించి అమ్మితే, మొదట ఖర్చయిన దానికన్నా 'ఎక్కువ' డబ్బు వస్తుందని ప్రతీ పెట్టుబడిదారుడికీ చాలా బాగా తెలుసు.

'డబ్బు'ని ఖర్చు పెట్టి మళ్ళీ 'డబ్బు'నే సంపాయించడం అంటే, ఖర్చయిన దాని సైజు కన్నా తిరిగి వచ్చే దాని సైజు ఎక్కువగా వుంటేనే ఆ పనికి అర్థం వుంటుంది. 'డబ్బు'తో 'డబ్బు'ని సంపాయించేటప్పుడు, మొదటి డబ్బు కన్నా రెండో డబ్బు 'ఎక్కువ'గా వుండకపోతే, 'సరుకు'ని తయారుచేయించి అమ్మే పని అసలు ప్రపంచంలో పుట్టేదే కాదు. తయారుచేయించిన సరుకుని అమ్మినప్పుడు, దాని కోసం 'ఖర్చు' చేసిన దాని కన్నా ఎక్కువ డబ్బే వస్తుందనే విషయం మీద ఇక్కడ ఎక్కువ చర్చ అవసరం లేదు. ఎందుకంటే, పెట్టుబడిదారుడూ వాడి ఆర్థికవేత్తలూ కూడా ఈ విషయం ఒప్పుకుంటారు. ఆ 'ఎక్కువ' ఎక్కణ్ణించి వస్తుందో చెప్పేటప్పుడే వాళ్ళు వంకర టింకర కారణాలు చెపుతారు గానీ, 'సరుకు'ని తయారుచేయించి అమ్మినప్పుడు, పెట్టుబడిదారుడికి దాని ఖర్చుల కన్నా ఎక్కువ డబ్బు వస్తుందనే విషయం మాత్రం వాళ్ళు కాదనరు.

సరుకు అమ్మకం వల్ల, మొదట పెట్టిన 'పెట్టుబడి' కన్నా ఎక్కువ డబ్బు వస్తుందనే విషయం మీద వివాదం లేదు. అంటే సరుకుని అమ్మినప్పుడు, దానికోసం పెట్టిన 'పెట్టుబడి' అంతా వెనక్కి వచ్చేసి, దాని మీద, ఇంకా కొంత 'ఎక్కువ కూడా' వస్తుంది. <u>ఈ 'ఎక్కువ'ని 'లాభం' అందాం. ఇప్పుడు మన ప్రధానమైన ప్రశ్న, ఈ "లాభం ఎలా వస్తుంది" అనేది.</u>

మన పెట్టుబడిదారుడు 100 రూ.లు ఖర్చుచేసి తయారు చేయించిన సరుకు, '100 మీటర్ల సైను బట్ట' అనుకుందాం. ఆ బట్టని అమ్మితే 100 రూ.లు కన్నా ఎక్కువ రావాలి కాబట్టి 120 రూ.లు వచ్చాయి — అనుకుందాం. అంటే, 20 రూ.లు ఎక్కువ వచ్చాయి. ఈ 'ఎక్కువ' ఎలా వచ్చింది? — అదీ ప్రశ్న.

'డబ్బు' అంటే — — — విలువ.

'ఎక్కువ డబ్బు' అంటే — ఎక్కువ విలువ.

100 రూ.ల డబ్బుతో తయారైన బట్టని అమ్మినప్పుడు 120 రూ.లు డబ్బు వచ్చింది అంటే, ఈ 'ఎక్కువ' డబ్బు ఎలా వచ్చింది? — ఈ ప్రశ్నకి, "బట్టని అమ్మితే వచ్చింది" అని వెంటనే జవాబు వస్తుంది.

'అమ్మితే వచ్చింది' అనే మాట నిజమే. అమ్మకపోతే

బట్ట వెళ్ళిపోయి, దానికి బదులుగా డబ్బు రావడమే జరగదు. అమ్మకపోతే, తయారైన సరుకంతా పెట్టుబడి దారుడి దగ్గిరే వుండిపోతుంది. ఏ పెట్టుబడిదారుడూ తన సరుకుని అమ్మకుండా తన దగ్గిరే వుంచుకోడు. అసలు, పెట్టుబడిదారుడనేవాడు సరుకుని తయారు చేయించేది ప్రధానంగా 'అమ్మకానికే' గానీ, దాన్నంతా తన స్వంతానికే వాడుకోడానికి కాదు. అందులో కొంత భాగాన్ని పెట్టుబడి దారుడు తన ఇంటి అవసరాలకు వాడుకుంటే వాడు కోవచ్చు. అంత మాత్రాన దాని 'విలువ'లో మార్పేమీ జరగదు. సరుకుని, దాని స్వంత పెట్టుబడిదారుడి ఇంట్లోకే వాడినా, ఇతర పెట్టుబడిదారుల ఇళ్ళల్లో వాడినా, శ్రామికుల ఇళ్ళల్లో వాడినా, ఎక్కడ వాడినా, దానికి 'విలువ ఏర్పడే విధం' ఒక్కలాగే వుంటుంది. ఒక మీటరు సైను బట్ట తయారవడానికి 'మొత్తం 2 గంటల శ్రమ' పట్టింది అనుకుంటే, ఆ మీటరు బట్టని బైటకి అమ్మినా, ఇంట్లోకే వాడినా, దానికోసం ఖర్చయిన శ్రమ కాలం ఒక్కలాగే వుంటుంది. పెట్టుబడిదారుడు తన సరుకులో కొంత భాగం తనే వాడుకుంటే ఆ భాగంలో శ్రమ తగ్గిపోవడమో, అందులో అసలు శ్రమే లేకుండా పోవడమో, జరగదు. ఆ భాగం కూడా కొంత శ్రమతో తయారైనదిగానే వుంటుంది. కాకపోతే, పెట్టుబడిదారుడు తన సరుకుని తనే వాడు కున్నప్పుడు, దాని కోసం తనకి తనే డబ్బు చెల్లించుకోడు. చెల్లించుకోక పోయినా అది కూడా శ్రమతో తయారైనదే. ఆ సరుకుని బైటకి అమ్మితే ఎంత విలువ వుంటుందో అంత విలువగల సరుకుని పెట్టుబడిదారుడు స్వంతానికి వాడుకున్నట్టు అర్థం. — 'తయారైన సరుకు లోకి ఎక్కువ విలువ ఎలా వచ్చింది' అని పరిశీలిస్తున్న ఈ సందర్భంలో, 'ఆ సరుకులో ఎంత భాగం పెట్టుబడి దారుడు వాడాడు, అసలు వాడాడా లేదా' అనే రకం ప్రశ్నలు అనవసరం. ఆ విషయాలకీ, విలువ ఏర్పడే విధానానికీ సంబంధం ఉండదు.

ఇక్కడ ఉదాహరణ గజిబిజిగా లేకుండా తేలిగ్గా వుండడం కోసం, పెట్టుబడిదారుడు, తయారుచేయించిన బట్టనంతా బైటికి అమ్మేశాడనే అనుకుందాం. బట్ట అంతా అమ్ముడుపోయి దానికి 120 రూ.లు వచ్చాయి – అనుకుందాం. ఇక్కడ అతి ముఖ్యమైన ప్రశ్న — ఆ బట్టకి 120 రూ.లు ఎందుకు వచ్చాయి? — అనేదే. ఆ సరుకుకి 120 రూ.ల విలువ ఉండడం వల్లనే దానికి 120 రూ.లు వచ్చాయా, లేకపోతే ఆ సరుకుకి అంత విలువ లేకుండానే 120 రూ.లు వచ్చాయా? — ఇదీ తేలాలి.

ఈ ప్రశ్న, ఏదో కాలక్షేపానికి వేసుకునే ప్రశ్న కాదు. ఇది, 'ఆర్థిక శాస్త్రాని కంతటికీ మూలం' అయిన ప్రశ్న! 'విలువ సమస్య'ని ఎలా అర్థం చేసుకోవాలో, ఈ ప్రశ్నకి వచ్చే జవాబు మీదే ఆధారపడి వుంటుంది. అంతే కాదు, 'సమాజాన్ని' ఎలా అర్థం చేసుకోవాలో కూడా ఈ జవాబు మీదే ఆధారపడి వుంటుంది.

ఆ బట్టకి 120 రూ.ల విలువ వుండడం వల్లనే దానికి 120 రూ.లు వచ్చాయి — అనేటట్టయితే, అప్పుడు ఇంకో ప్రశ్న వస్తుంది. పెట్టుబడిదారుడు మొదట ఖర్చు పెట్టింది 100 మాత్రమే కదా, 100 ఖర్చుతో తయారైన సరుకుకి 100 కన్నా ఎక్కువ విలువ ఎలా వచ్చింది — అనే ప్రశ్న! దీనికి జవాబు కావాలి. లేదా, 'ఆ బట్టకి 100 కన్నా ఎక్కువ విలువ లేదు, అయినా దానికి 120 వచ్చింది' అనే టట్టయితే, 'అంత విలువ లేకుండానే అంత డబ్బు ఎలా వచ్చింది?' అనే ప్రశ్న వస్తుంది. అప్పుడు దానికైనా జవాబు కావాలి.

సరుకుని అమ్మడం ద్వారా పెట్టుబడిదారుడి చేతిలోకి వచ్చే 'ఎక్కువ విలువ'ని 'లాభం' అనుకున్నాం. ఈ 'లాభం' గురించే ఈ 'పరిశోధన!'

'లాభం' గురించి పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు ఎన్నడూ లోతుగా పరిశీలించలేదు. విషయాన్ని చీల్చుకుంటూ లోపలికి వెళ్ళిన కొద్దీ, ఏం నిజాలు చూడవలసి వస్తుందోనని భయం వాళ్ళకి! ప్రతీ విషయాన్నీ పైపై పరిశీలనతో సరిపెట్టినట్టే, ఈ 'లాభం' సమస్యని కూడా వాళ్ళంతా పైపై పరిశీలనతోనే వదిలేశారు. 'లాభం' ప్రశ్న, వాళ్ళకసలు ప్రత్యేకంగా పరిశీలించవలసిన ప్రశ్న లాగే కనపడలేదు. ఎందుకంటే : "ఒక మనిషి కొంత డబ్బు ఖర్చు పెట్టి ఒక సరుకుని తయారుచేయించి అమ్మినప్పుడు, దాని వల్ల అతనికి ఎంతో కొంత 'లాభం' రావొద్దా? ఎంత ఖర్చుపెడితే అంతే తిరిగి వచ్చేలాగైతే ఎవరైనా 'పెట్టుబడి' పెడతారా? ఎందుకు పెడతారు? సరుకు కోసం ఖర్చు చేసిన దానికన్నా, సరుకుని అమ్మినప్పుడు, తప్పనిసరిగా ఎక్కువ డబ్బు రావలసిందే. ఇందులో చర్చించడాని కేముంది?" అనే దృష్టి వాళ్ళది. 'లాభం సంపాయించడం' అనేది, పెట్టుబడిదారుడి 'న్యాయమైన హక్కు'గా వాళ్ళ దృష్టిలో స్థిరపడిపోయి వుంది. కాబట్టి 'లాభానికి మూలం ఏమిటి?' అనే అంశం వాళ్ళకి అసలు చర్చించవలసిన విషయంలాగే కనపడదు. కానీ, 'ప్రశ్న' అనేది ఒకటి వున్నంత కాలమూ అది సమాధానాలు అడుగుతూనే వుంటుంది. కాబట్టి, 'ఆర్థికవేత్త' అన్నవాడు, ఆర్థిక శాస్త్ర రంగానికి సంబంధించిన ఈ 'లాభం' సమస్యకి, ఏదో ఒక సమాధానం చెప్పకుండా తప్పుకోలేడు. అందుకే వాళ్ళు అసలు సమాధానాలే చెప్పకుండా వూరుకోలేదు. చాలా రకాల సమాధానాలు చెప్పారు, అస్తవ్యస్తంగా.

సమస్యని ప్రత్యేక శ్రద్ధతో పట్టించుకోకుండా వదిలేస్తే, అది కూడా ఒక సమాధానమే. ఆ సమస్యని చర్చించనక్కర

లేదనీ, అసలు అక్కడ సమస్యే లేదనీ, మౌనంతో చెప్పే సమాధానం అది. సమస్యని కొంత పట్టించుకున్న ఆర్థిక వేత్తలు కూడా చెప్పిందేమీ లేదు. వాళ్ళ సమాధానాలన్నీ పెట్టుబడిదారుడు చెప్పే సమాధానాలే, "సరుకుని అమ్మితే లాభం వచ్చింది" అని!

అమ్మితే వచ్చింది, సరే. కాని, సరుకుని అమ్మితే 'లాభం' ఎందుకు రావాలి? 'అమ్మడం' అంటే ఏమిటి? — 'సరుకు'ని ఇచ్చి డబ్బు తీసుకోవడం. అంటే, 'సరుకు'కీ 'డబ్బు'కీ మారకం. ఒక 'మారకం' జరిగేటప్పుడు, 2 పక్షాలూ సమాన విలువలతో వుంటాయి — అనేది 'విలువ సూత్రం'. ఈ సూత్రం ప్రకారం మారకం అనేది సమానమైన విలువల మధ్యే జరుగుతుంది కదా? మనం అమ్మే సరుకులో ఎంత విలువ వుందో, దానికి బదులుగా ఎదర పక్షం నించి అంత డబ్బే రావాలి కదా? అంత కన్నా 'ఎక్కువ' డబ్బు ఎలా వస్తుంది? అమ్మకం నించి 'లాభం' ఎందుకు వస్తుంది? — ఈ ప్రశ్నల్ని పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు చెవినబెట్టరు. "సమాన విలువలే మారకం అవుతాయి" అంటూ విలువ సూత్రాన్ని వల్లిస్తారే గానీ దాని నియమాలకు కట్టుబడి మాట్లాడరు.

ఈ 'లాభం' సమస్య మీద పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెప్పే జవాబులు ప్రధానంగా 3 రకాలుగా వుంటాయి — ఇలా :

**1.** పెట్టుబడిదారుడు, తను కొనే ముడిపదార్థాలూ వగైరాలన్నిటినీ 'చవగ్గా' కొని, వాటితో తయారైన తన సరుకుని మాత్రం 'ప్రియంగా' అమ్ముతాడు. ఈ రకంగా పెట్టుబడిదారుడి 'తెలివి' వల్లా, 'చాకచక్యం' వల్లా, 'లాభం' వస్తుంది.

**2.** సరుకుని కొనే వాడు, దానితో చాలా 'అవసరం' వుండి కొంటాడు కాబట్టి, దాని విలువ కన్నా ఎక్కువ డబ్బు చెల్లిస్తాడు. సరుకుని అమ్మిన వాడికి, కొన్నవాడి నించి ఎక్కువ డబ్బు రావడం అంటే, ఆ రకంగా 'లాభం' వస్తుంది.

**3.** పెట్టుబడిదారుడు, తనకు ఖర్చయిన దాని మీద ఇంకా కొంత ఎక్కువగా 'వేసుకుని' సరుకుని ఎక్కువకి అమ్ముతాడు. దాని వల్ల 'లాభం' వస్తుంది.

ఇవీ లాభానికి పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెప్పే కారణాలు! వీరు, లాభానికి, ఏదో ఒకే ఒక్క కారణం చెప్పరు. రక రకాల కారణాలు చెపుతారు. నిజానికి, లాభానికి ఏదైనా ఒక్క కారణమే వుంటుంది కదా? ఆర్థిక విషయాలు తెలిసిన వాళ్ళందరూ ఒకే రకంగా ఆ ఒక్క కారణమే చెప్పాలి కదా? కానీ, అలా చెయ్యరు. తలో ఆర్థిక వేత్తా తలో కారణం చెపుతాడు. ఎందుకంటే, లాభం ఎలా వస్తుందో వాళ్ళకి కూడా తెలీదు గనక. వాళ్ళు చేసేదంతా ఏమిటంటే — పెట్టుబడిదారులు ఏం చెపుతారో అది వినడం! అదే తిరిగి వల్లించడం!

పెట్టుబడిదారులు సరుకుల్ని అమ్ముతారు. 'లాభాలు' సంపాదిస్తారు. దీన్ని మామూలు జనం చూసినట్టే ఆర్థిక వేత్తలు కూడా చూస్తారు. 'పెట్టుబడి పెడితే లాభం వచ్చింది. మరి లాభం రావలసిందే కదా?' అనుకుంటారు. ఎప్పుడైనా కొంచెం ఆలోచిస్తే, ఎవరి తెలివికి తోచినట్టు వాళ్ళు ఊహిస్తారు. 'లాభానికి కారణం చెప్పగలుగు తున్నాం' అనుకుంటూ, ఆ 3 రకాల కారణాలూ చెపు తారు. అంతే ఆర్థికవేత్తలు చెప్పేదంతా! ఆ జవాబులు తార్కికంగా వున్నాయో లేదో ఇప్పుడు మనం వరసగా చూద్దాం.

**1.** పెట్టుబడిదారుడు ముడి పదార్థాలూ వగైరాల్ని కొనేటప్పుడు చవగ్గా కొనడం గానీ, తయారైన తన సరుకుని అమ్మేటప్పుడు ప్రియంగా అమ్మడం గానీ, ఏది వీలైతే అది చేస్తూ, వీలైతే రెండూ చేస్తూ, చాలా "తెలివి"గా "చాకచక్యం"గా వ్యవహరిస్తాడు, దాని వల్లనే పెట్టుబడి దారుడికి లాభం వస్తుంది — అనే వాదం గురించి : ఇదేదో మామూలు తెలివిమాలిన వర్తకుడు చెప్పే మాట కాదు. 'ఆర్థికవేత్త'లైన మేధావులు చెప్పే మాటే! వాళ్ళ దృష్టిలో, ఇది లాభానికి గొప్ప 'శాస్త్రీయమైన' సమాధానం! చవగ్గా కొనడాలూ, ప్రియంగా అమ్మడాలూ చాలా సందర్భాల్లో మార్కెట్లో కనపడుతూ వుంటాయి కాబట్టి, వాటిని చూసి, 'లాభాన్ని తెచ్చే సూత్రం చవగ్గా కొని ప్రియంగా అమ్మ డమే' — అని భావిస్తారు.

ఈ సూత్రం ప్రకారం, మన బట్ట పెట్టుబడిదారుడు, మొదట తను కొన్న ముడి పదార్థాలూ వగైరాల్ని చవగ్గా కొన్నాడన్నమాట. వాడు, వాటి కోసం 80 ఖర్చు పెట్టాడనుకున్నాం కదా? నిజానికి వాటి విలువ 80 గాక, 100 అన్నమాట. అదీగాక, పనివాళ్ళకు ఇచ్చిన జీతాలు 20 కదా? మొత్తం బట్ట పెట్టుబడిదారుడు 100 ఖర్చు పెట్టాడు. అంటే, నిజంగా 120 విలువగల వాటిని పెట్టుబడిదారుడు 100 తోనే సంపాదించా డనుకోవాలన్న మాట. తయారైన తన బట్టని అమ్మేటప్పుడు మాత్రం దాన్ని 120 కే అమ్మాడు. అంటే, 120 విలువగల దాన్ని 120 కే అమ్మాడు. అయినా, దానివల్ల 20 లాభం వచ్చింది. ఆ ఎక్కువ ఎలా వచ్చిందంటే, 100 విలువ గల ముడి పదార్థాల్ని చాకచక్యంగా 80 కే, కొనడం వల్లనే '20 లాభం' వచ్చింది. ఇదీ లాభ సూత్రం, వాళ్ళ ప్రకారం.

బట్ట పెట్టుబడిదారుడు, ముడిపదార్థాల్ని కొనేటప్పుడు మాత్రమే గాక, తన సరుకుని అమ్మేటప్పుడు కూడా

'చాకచక్యం' ప్రదర్శిస్తే, దాన్ని 120 కన్నా ఎక్కువకే అమ్మ వచ్చు కదా? ఎదటి వాడి సరుకుని చవగ్గా కొనడమూ, తన సరుకుని ప్రియంగా అమ్మడమూ అనే చాకచక్యాల తోటే 'లాభం' సంపాయించడం సాధ్యమైతే 20 లాభంతోటే ఆగడం ఎందుకూ? 20 వందలో, 20 వేలో సంపాయించ కూడదూ? మన వాడి 'చాకచక్యం శక్తి' 20 సంపాయించే వరకే వుంది అనుకోవాలా? అప్పుడు, సరుకుల 'విలువల' కోసం, 'శ్రమ కాలాల' పరిశోధనని వదిలేసి, పెట్టుబడి దార్లకి చాకచక్యాలు ఎలా పుడతాయీ, ఎలా వృద్ధి చెందు తాయీ, ఒకడి చాకచక్యం కన్నా ఒకడి చాకచక్యం ఎందుకు ఎక్కువగా వుంటుందీ — ఇలా, పెట్టుబడిదార్ల చాక చక్యాల వెంటపడి, వాటి పరిశోధన ప్రారంభించాలి! అంతే కదా?

'చవగ్గా కొని, ప్రియంగా అమ్మడం వల్ల లాభం వస్తుంది' — అనే వాదనలో వున్న అవక తవకేమిటో గ్రహించాలంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ ఒక సారి 'కొనే వాడి' గానూ, ఒక సారి 'అమ్మేవాడి' గానూ కూడా ఉంటాడనే సంగతి గ్రహిస్తే చాలు.

'సరుకు'ని ఉత్పత్తి చేయించే ప్రతీ పెట్టుబడి దారుడూ, దాని కోసం మొదట ముడిపదార్థాలూ వగైరాల్ని ఇతర పెట్టుబడిదారుల నించే కొనాలి. అప్పుడు ఆ పెట్టుబడిదారుడు 'కొనే వాడి'గా వుంటాడు. అలాగే, తన సరుకు తయారైన తర్వాత దాన్ని ఇతర పెట్టుబడిదార్లకు అమ్మాలి. అప్పుడు ఆ పెట్టుబడిదారుడు 'అమ్మేవాడి'గా వుంటాడు (కొన్ని రకాల సరుకుల్ని 'శ్రామికుల'కు కూడా అమ్ముతారు కానీ, ఇక్కడ పెట్టుబడిదారుల్ని మాత్రమే తీసుకుందాం. వాళ్ళు ఒకరి సరుకుల్ని ఒకరికి అమ్ము కోవాలి. అంటే, ఒకరి సరుకుల్ని ఒకరు కొనాలి.) అంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ 'అమ్మడమే' గాక, 'కొనడం' కూడా చేస్తూ వుంటాడు.

'లాభాన్ని' తెచ్చే సూత్రం, ఏదో ఒక్క పెట్టుబడి దారుడికి లాభం ఎలా వస్తుందో చెప్పడం కాదు; పెట్టుబడి దారులందరికీ కూడా 'లాభం' ఎలా వస్తుందో చెప్ప గలగాలి. లాభ సూత్రం పెట్టుబడిదారు లందరికీ ఒకే రకంగా వర్తించాలి.

ఒక పెట్టుబడిదారుడు తనకు కావలసిన ముడి పదార్థాల్ని 'చవగ్గా కొని' లాభపడుతున్నాడంటే, వాటిని అమ్మే పెట్టుబడిదారుడు వాటిని 'చవగ్గా అమ్మి' నష్ట పోతున్నాడని అర్థం కాదా? అలాగే, ఒక పెట్టుబడిదారుడు, తన సరుకుని ఇంకో పెట్టుబడి దారుడికి ప్రియంగా అమ్మి లాభ పడడం అంటే, రెండోవాడు దాన్ని 'ప్రియంగా కొని' నష్టపోవడం కాదా? ఒక పెట్టుబడిదారుడి 'లాభ సూత్రమే' ఇంకో పెట్టుబడిదారుడి 'నష్ట సూత్రం' అయితే, అది లాభాన్ని వివరించగల 'జనరల్ సూత్రం' (అందరికీ వర్తించే సూత్రం) ఎలా అవుతుంది?

ఒక పెట్టుబడిదారుడు, అమ్మడాలూ — కొనడాలూ తన ఇష్ట ప్రకారమే చెయ్యగలడా? తన సరుకుని 'ప్రియం'గా అమ్మాలనుకుంటే, అది వాడి ఇష్టమేనా? అలాగే అమ్మగలడా? వీడు ప్రియంగా అమ్మాలంటే వీడి దగ్గిర ఇతర పెట్టుబడిదారులు అలాగే కొంటారా? — అలాగే, ఒక పెట్టుబడిదారుడు, ఇతర పెట్టుబడిదారుల సరుకుల్ని 'చవగ్గా' కొనాలనుకుంటే, అలాగే కొనగలడా? ఇతర పెట్టుబడిదారులందరూ, తమ సరుకుల్ని వీడికి చవగ్గానే అమ్ముతారా?

ఒక పెట్టుబడిదారుడు, చవగ్గా కొనడమూ — ప్రియంగా అమ్మడమూ చెయ్యగలిగితే, ఆ సూత్రం, పెట్టుబడిదారు లందరికీ వర్తించదా? అందరూ అలాగే చెయ్యలేరా? — ఆ సూత్రం ఒకడికే కాదు, అందరికీ వర్తిస్తే అప్పుడేమవుతుంది?

ఒక పెట్టుబడిదారుడికి ఇతరుల నించి చవగ్గా కొని లాభపడే హక్కు వుంటే, ఆ ఇతరులకు కూడా వీడి నించి చవగ్గా కొని లాభపడే హక్కు వుంటుంది. కాబట్టి, అందరూ తమ సరుకుల్ని అసలు విలువ కన్నా ప్రియంగా అమ్మడమో, లేదా ఇతరుల సరుకుల్ని అసలు విలువ కన్నా చవగ్గా కొనడమో, చేస్తున్నారనుకుందాం. అప్పుడే మవుతుంది? ఒకడు తన సరుకుని అమ్మేటప్పుడు అసలు విలువ కన్నా నూటికి 10 ఎక్కువ చేసి 'ప్రియంగా' అమ్మితే, వాడు ఇతరుల సరుకుల్ని కొనేటప్పుడు కూడా నూటికి 10 ఎక్కువచేసి ప్రియంగానే కొనాలి. తన 100 విలువ గల సరుకుని 110 కి అమ్మి, ఇతరుల 100 విలువ గల సరుకుని కూడా 110 కి కొంటే, దీని ఫలితం ఏమిటీ? ఇది, తన 100 విలువ గల సరుకుని 100 కే అమ్మి, ఇతరుల 100 విలువ గల సరుకుని కూడా 100 కే కొనడం లాంటిదే.

లేదా, ఇంకో ఉదాహరణ: ఇతరుల 100 విలువ గల సరుకుని 90కే 'చవగ్గా' కొని, తన 100 విలువ గల సరుకుని కూడా 90కే చవగ్గా అమ్మితే, దీని ఫలితం కూడా ఎలాంటిదంటే, 100 విలువ గల తన సరుకుని 100 కే అమ్మి, 100 విలువ గల ఇతరుల సరుకుని 100 కే కొనడం లాంటిదే. ఈ రకంగా, ఒక పెట్టుబడిదారుడు, తను ప్రియంగా అమ్మాలంటే, తను కూడా ప్రియంగానే కొనాలి. తను చవగ్గా కొనాలంటే, తను కూడా చవగ్గానే అమ్మాలి.

అలాగాక, ఏ పెట్టుబడిదారుడైనా, ఇతర పెట్టుబడి దారులతో — "నేను మీకు ప్రియంగా అమ్ముతాను. మీరు మాత్రం నాకు చవగ్గా అమ్మండి!" అంటే, ఆ సూత్రం ఎక్కడా చెల్లదు.

పెట్టుబడిదారులందరూ ఒకరికొకరు ఒకే లెక్కన

నష్టానికి అమ్మినా, లాభానికి అమ్మినా, ఆ ఫలితం అందరికీ సమానంగా వర్తిస్తుంది. కాబట్టి, ప్రతీ ఒక్కడికీ కొన్నప్పటి లాభమూ, అమ్మినప్పటి నష్టమూ; లేదా, కొన్నప్పటి నష్టమూ, అమ్మినప్పటి లాభమూ, ఒకదాని కొకటి సరిపోతాయి. చివరికి, ఎంత విలువగల సరుకుని అంత విలువకే కొన్నట్టూ, ఎంత విలువగల సరుకుని అంత విలువకే అమ్మినట్టూ, అవుతుంది. అంటే, పెట్టుబడి దారు లందరూ ఒకరికొకరు సరుకుల్ని అమ్ముకున్నప్పుడూ, కొనుక్కున్నప్పుడూ 'సమాన విలువల మధ్యనే' మారకాలు చేసుకుంటారని అర్థం. ఎంత విలువ గల సరుకుని ఇస్తారో అంత విలువ గల డబ్బే తీసుకుంటారు. ఇచ్చే విలువా, తీసుకునే విలువా సమానంగానే వుంటాయి. అంటే, పెట్టుబడిదారుడికి 'లాభం' వచ్చేది, సరుకుల్ని అమ్మే టప్పుడో, కొనేటప్పుడో కాదన్నమాట! సరుకులు, వాటి అసలు విలువలకే అమ్ముడుపోతాయి — అనేది జనరల్ సూత్రం. సరుకుకి ఎంత విలువ వుంటే అంత విలువే తిరిగి వస్తుంది గానీ, వాటిని కొనే వ్యక్తి నించి గానీ, అమ్మే వ్యక్తి నించి గానీ, అంత కన్నా ఎక్కువ విలువ రాదు. అంటే, కొనే అమ్మే వ్యక్తుల నించి 'లాభం' రాదు.

అయితే, పెట్టుబడిదారులు చవగ్గా కొనడాలూ, ప్రియంగా అమ్మడాలూ ఎన్నడూ చెయ్యనే చెయ్యరని దీని అర్థం కాదు. సరుకుల అమ్మకాలలో అలాంటి 'ప్రత్యేక' సందర్భాలు కూడా చాలా వుంటాయి. తను కొనేదాన్ని చవగ్గా కొనాలనీ, తను అమ్మేదాన్ని ప్రియంగా అమ్మాలనీ, ప్రతీ పెట్టుబడిదారుడూ ఉవ్విళ్ళూరుతూనే వుంటాడు. దానికోసం మోసాలూ, దగాలూ చేస్తోనే వుంటాడు. అవి ఎంతవరకూ ఫలిస్తే అంతవరకూ లాభపడుతూ కూడా వుంటాడు. కానీ, ఇలాంటివన్నీ 'ప్రత్యేక' సందర్భాలు. ఇలాంటి ప్రత్యేక సందర్భాల ద్వారా వచ్చే లాభాలు ప్రత్యేక లాభాలు (సెకండరీ లాభాలు). అసలు 'ప్రధానంగా వచ్చే లాభం' మీద ఈ సెకండరీ లాభం కూడా కలిస్తే, ఆ పెట్టుబడిదారుడికి వచ్చే లాభం ఇంకా ఎక్కువవుతుంది.

ఇక్కడ మనం, 'ప్రధాన లాభానికే' కారణం చూడాలి. అంతేగాని, సెకండరీ లాభాలు వచ్చే మార్గాన్నే ప్రధాన లాభానికి మార్గంగా అనుకోకూడదు.

ప్రధాన లాభాన్ని 'జనరల్ లాభం' అనీ, 'మౌలిక లాభం' అనీ కూడా అనవచ్చు.

బేర సారాల్లో ఆరితేరి, వంచనా శిల్పంలో ఉన్నత స్థాయికి చేరిన పెట్టుబడిదారుడికి, 'జనరల్ లాభం'తో పాటు సెకండరీ లాభం కూడా కొంత రావచ్చు. అంత 'చాకచక్యం' లేని వాడికి ఆ సెకండరీ లాభం కొంత తగ్గవచ్చు. లేదా, అది బొత్తిగా రాకపోవచ్చు. కానీ, ఆ 'చాకచక్యం లేని' పెట్టుబడిదారుడికి కూడా 'ప్రధాన లాభం' మాత్రం వచ్చి తీరుతుంది.

సెకండరీ లాభం, పూర్తిగా సరుకు అమ్మకాలలోనూ, కొనడాలలోనూ జరిగే మోసాల మీదే ఆధారపడి వుంటుంది. (ఆ మోసపు పద్ధతులేమిటో తర్వాత చూస్తాం.) కానీ, 'ప్రధాన లాభం' సంగతి అలా కాదు. అది సరుకుని అమ్మేటప్పుడూ, కొనేటప్పుడూ ఎదటి మనుషుల నించి రావడానికి మార్గం లేదు. సమాన విలువల మధ్యనే మారకాలు జరిగినప్పుడు కూడా అది రావాలి.

'సరుకు'ని అమ్మినప్పుడు 2 షరతులు నెరవేరాలి.

(1) సమాన విలువల మధ్యనే మారకం జరగాలి.

(2) ఆ మారకంలో నించే 'లాభం' రావాలి.

ఇది ఎలా సాధ్యమో కనిపెడితే, 'లాభానికి' నిజమైన మార్గం ఏమిటో గ్రహించినట్టే.

ఒక బట్ట అసలు విలువ — 5 రూ.లు అనుకుందాం. ఆ బట్టని అమ్మి, 5 రూ.లు తీసుకుంటే, అది 'సమాన విలువల' మారకం. బట్టని అసలు విలువకే అమ్మినా అందులోనించే ప్రధాన లాభం వస్తుంది. దాన్ని 2 అను కుందాం. బట్టని, 5 కి అమ్మితే — ప్రధాన లాభం 2. సెకం డరీ లాభం లేదు. బట్టని, ఏ మోసం ద్వారానైనా 6 కి అమ్మితే, ప్రధాన లాభం 2, సెకండరీ లాభం 1. బట్టని ఏ కారణం వల్లనో 4 కి అమ్మితే, ప్రధాన లాభం కూడా తగ్గింది. అది ఇప్పుడు 1. సెకండరీ లాభం లేదు.

'ప్రధాన లాభం' రావాలన్నా, 'సెకండరీ లాభం' రావాలన్నా, అసలు మొదట 'కొంత విలువ' గల సరుకు అనేది వుండాలి. ప్రతీ సరుకుకీ ఎంతో కొంత 'అసలు విలువ' వుంటుంది. సరుకుని ఆ 'అసలు విలువ'కే అమ్మినా కూడా లాభం రావడం ఏ కారణం వల్ల జరుగు తుందో, అదే ప్రధాన లాభానికి కారణం. అది ఒక పెట్టుబడిదారుడికి వర్తించి, ఇంకో పెట్టుబడిదారుడికి వర్తించకుండా వుండదు. అందుకే అది లాభానికి 'జనరల్ సూత్రం'. (ఆ జనరల్ సూత్రాన్ని మనం ఇంకా చూడలేదు.)

ప్రతీ పెట్టుబడిదారుడూ, ఒక వేపు — 'కొనేవాడి' గానూ, ఇంకో వేపు — 'అమ్మేవాడి'గానూ కూడా వుంటాడు. కాబట్టి, తన సరుకుల్ని ప్రియంగా అమ్మి, ఇతరుల సరుకుల్ని చవగ్గా కొని, లాభం గడించడం — అనే మొదటి వాదం అర్థం లేనిదైపోతుంది.

**2.** సరుకుని కొనేవాడు, దాన్ని తన 'అవసరం' కోసమే కొంటాడు కాబట్టి, దానికోసం ఆ వ్యక్తి, 'అసలు విలువ' కన్నా 'ఎక్కువ'ని చెల్లిస్తాడు; ఆ ఎక్కువే, సరుకుని అమ్మే మనిషికి 'లాభం'గా వుంటుంది — అనే రెండో వాదం గురించి :

'అవసరం కోసం ఎక్కువ చెల్లించడం' అనేది 'కొత్త' వాదంలాగ కనపడుతుంది గానీ, ఇది కూడా ఇంతకు

ముందు చూసిన మొదటి వాదం లాంటిదే. ప్రతీ పెట్టుబడిదారుడూ ఒక వేపు 'అమ్మేవాడి'గానూ, ఇంకో వేపు 'కొనేవాడి'గానూ కూడా వుంటాడు — అనే సంగతి మరిచి పోకుండా వుంటే, ఆ జవాబే దీనికి కూడా సరి పోతుందని తెలుసుకోవచ్చు. ప్రతీ పెట్టుబడిదారుడికీ తన సరుకుల్ని ఇతరులకు అమ్మే అవసరమూ వుంటుంది; ఇతరుల సరుకుల్ని తను కొనే అవసరమూ వుంటుంది.

ఒక పెట్టుబడిదారుడు తన సరుకుల్ని ఇతరులకు అమ్మేటప్పుడు, అది ఒక్కడి అవసరమే కాదు. అది, ఒకవేపు —అమ్మేవాడి అవసరమూ, ఇంకోవేపు —కొనేవాడి అవసరమూ కూడా. తన సరుకుని అమ్మేవాడు, ఇతరుల 'అవసరం' కోసం వారి నించి ఎక్కువ విలువని వసూలు చేస్తే ; తనే ఇతరుల సరుకులు కొనేటప్పుడు, తన 'అవసరం' కోసం, ఇతరులకు ఎక్కువ విలువని చెల్లించ నక్కరలేదా? అమ్మినప్పుడు వచ్చే లాభానికీ, కొన్నప్పుడు వచ్చే నష్టానికీ చెల్లు అయిపోదా? ఈ పద్ధతిలో పెట్టుబడి దారుడు 'లాభం' ఎలా సంపాదించ గలుగుతాడు?

అంతేగాక, ఒక సరుకు అమ్మకం జరిగేటప్పుడు, కొనే మనిషికి 'సరుకుతో' అవసరం అయితే, అమ్మే మనిషికి 'డబ్బుతో' అవసరం. కొనేవాడు, సరుకు కోసం డబ్బుని వదులుకుంటే, అమ్మేవాడు డబ్బు కోసం సరుకుని వదులు కుంటాడు. ఎవరి అవసరం వాళ్ళది. కొనేవాడు కొంత సరుకు కోసం అసలు విలువ కన్నా ఎక్కువ డబ్బుని ఇవ్వడానికి సిద్ధపడితే, అమ్మేవాడు కొంత డబ్బు కోసం అసలు సరుకు కన్నా ఎక్కువ సరుకుని ఇవ్వడానికి సిద్ధపడాలి. ఒకడు ఎక్కువ డబ్బు ఇస్తే, ఒకడు ఎక్కువ సరుకు ఇస్తాడు. ఎక్కువ డబ్బుకీ ఎక్కువ సరుకుకీ మారకం జరగడం అంటే, సరుకు, దాని అసలు విలువకి అమ్ముడవడమే. సరుకులు, అసలు విలువలకే అమ్ముడు పోతూవుంటే, సరుకుని అమ్మే మనిషికి, కొనే మనిషి నించి లాభం రావడం జరగదు.

అయితే, సరుకుల్ని కొనేవాళ్ళు అవసరం కొద్దీ అసలు విలువ కన్నా ఎక్కువ చెల్లించడమూ; సరుకుల్ని అమ్మేవాళ్ళు కూడా తమ అవసరం కొద్దీ అసలు విలువ కన్నా తక్కువకి అమ్మేసుకోవడమూ — అనే విషయాలు కూడా సరుకుల మారకాలలో చాలా సార్లు జరుగుతూ వుంటాయి. అవసరం వల్ల ఎక్కువ చెల్లించి కొనడం అంటే 'ప్రియంగా' కొనడమే. అవసరం వల్ల తక్కువకి అమ్మెయ్యడం అంటే 'చవగ్గా' అమ్మెయ్యడమే. ఇలాంటి సందర్భాలన్నీ 'ప్రత్యేక' సందర్భాలు. మొదటి జవాబులో చూసిన విషయాలే ఇవి. ఇవి ఎప్పుడూ జరిగే విషయాలు కావు. సరుకుని కొనే మనిషి, ఎప్పుడూ ఎక్కువకే కొంటా డనేది విలువ సూత్రానికే విరుద్ధం. అలాంటి సూత్రమే వుంటే, అది పెట్టుబడిదారులందరి సరుకులకూ వర్తిస్తుంది గానీ, ఒక్క పెట్టుబడిదారుడి సరుకుకే వర్తించి వూరుకోదు. కొనేవాడు తప్పనిసరిగా ఎక్కువ చెల్లించడమే జరగవలసి వుంటే, అందరూ అలాగే కొనాలి. దాని ఫలితం — సరుకు లన్నీ అసలు విలువలతో మారకం అవడమే. కాబట్టి, అవసరాన్ని బట్టి ఎక్కువో, తక్కువో చెల్లించడం అనే విషయాల్ని, అంటే చవగ్గానో ప్రియంగానో కొనడం అనే విషయాల్ని, ప్రత్యేక సందర్భాలుగా మాత్రమే చూడాలి. ప్రత్యేక సందర్భాల వల్ల వచ్చే లాభాలు సెకండరీ లాభాలు. ప్రధాన లాభాన్ని వివరించడానికి ఈ 'అవసరం' అనే అంశం కూడా పనికిరాదు. — 'అవసరాలు' ఇరు పక్షాలకూ వుంటాయి కాబట్టి.

**3.** పెట్టుబడిదారుడు, సరుకుని తయారు చేయించ డానికి ఎంత ఖర్చు చేస్తాడో ఆ ఖర్చు మీద ఇంకా కొంత ఎక్కువని "వేసుకుని" ఆ మొత్తానికి సరుకుని అమ్ము తాడు. ఆ మొత్తంలోనించి, మొదటి ఖర్చుని తీసివెయ్యగా ఆ ఎక్కువ వేసుకున్నదే 'లాభం'గా మిగులుతుంది — అనే వాదం గురించి : ఇది "ఎక్కువ మేధావులం" అను కునేవాళ్ళు చెప్పేది. ఈ వాదం ప్రకారం, ఒక సరుకుని తయారు చేయించడానికి పెట్టుబడిదారుడికి ఎంత ఖర్చవు తుందో అదే ఆ సరుకుకి వుండే 'అసలు విలువ.' అయితే, పెట్టుబడిదారుడికి కొంత లాభం కూడా రావాలి కాబట్టి, వాడు, కొంత ఎక్కువ విలువని అసలు విలువ మీద 'ఊరికే వేసుకుంటాడు.' ఆ 'వేసుకున్న' భాగం, సరుకు విలువతో సంబంధం లేనిదే. ఆ భాగం కూడా ఆ సరుకుని కొనే మనిషి దగ్గర్నించే వస్తుంది. అదే 'లాభం'గా వుంటుంది.— ఇదీ ఈ వాదం!

ఈ విషయాన్ని బట్ట ఉదాహరణ ద్వారా చూద్దాం. కొంత బట్టని తయారు చేయించడానికి, పెట్టుబడి దారుడికి అయిన ఖర్చు 100 అనుకున్నాం. 100 ఖర్చుతో బట్టని తయారు చేయిస్తే, తయారైన బట్ట విలువ కూడా 100 మాత్రమే అన్నమాట. కానీ, ఆ బట్ట ద్వారా 'లాభం' రావాలి కాబట్టి, పెట్టుబడిదారుడు, దాన్ని అమ్మేటప్పుడు, దాని, విలువకి ఇంకో 20 ని ఊరికే కలుపుతాడన్నమాట. ఆ బట్టని కొనేవాళ్ళు, 100 విలువ మాత్రమే వున్న బట్టకి, 120 ని ఇచ్చి కొంటారన్నమాట. అలా వాళ్ళు 20 ఎక్కువ ఎందుకు ఇస్తారంటే, "పాపం పెట్టుబడిదారుడికి లాభం రావాలి కదా?" అని అలా ఇస్తారు! ఆ విధంగా, ఆ 'లాభం', కొనేవాళ్ళ దగ్గర్నించి వస్తుంది! — చక్కగానే వుంది ఈ సూత్రం! మరి, ఈ 'చక్కని సూత్రం' మన బట్ట పెట్టుబడిదారుడు, ఇతరుల సరుకుల్ని కొనేటప్పుడు, వాళ్ళకి కూడా వర్తించాలి కదా? — ప్రతీ పెట్టుబడిదారుడూ అమ్మేవాడిగానే గాక, కొనేవాడిగా కూడా వుంటాడు

కదా?— ఈ విషయం మరిచిపోకుండా వుంటే, ఒక తప్పుడు వాదం ఎన్ని వేషాలు మార్చుకుని వచ్చినా దాన్ని తేలిగ్గా కనిపెట్టెయ్యవచ్చు.

ఒక పెట్టుబడిదారుడు తన సరుకుని అమ్మేటప్పుడు, దాని విలువ మీద ఇంకా కొంత ఎక్కువని వూరికే 'వేసుకుని' అమ్మితే, వీడు ఇతరుల సరుకుల్ని కొనేటప్పుడు ఆ సరుకుల్ని అమ్మేవాళ్ళు కూడా, వాటి మీద ఎక్కువ విలువని వూరికే 'వేసుకోవద్దా?' అప్పుడు వీడు దాన్ని చెల్లించవద్దా? సరుకుల్ని అమ్మేవాళ్ళంతా, తమ సరుకులకు వున్న అసలు విలువల మీద నూటికి 10 చొప్పునో, 20 చొప్పునో ఊరికే వేసుకుని వాటి విలువల్ని పెంచి అమ్ముతూవుంటే, దాని ఫలితం ఏమిటి? తను అమ్మేటప్పుడు 100 విలువ గల సరుకుని 110 కి అమ్మి, తను కొనేటప్పుడు కూడా 100 విలువ గల సరుకుని 110 కి కొంటే, దాని ఫలితం, 100 విలువ గల సరుకుని 100 కే అమ్మినట్టూ, 100 విలువ గల సరుకుని 100 కే కొన్నట్టూ అవడమే కదా? ఇక లాభం ఎక్కణ్ణించి మిగులుతుంది?

కాబట్టి, సరుకుకి వున్న 'అసలు విలువ' మీద ఊరికే కొంత వేసుకోవడం ద్వారా లాభం వస్తుంది — అని చెప్పే ఈ జవాబు కూడా లాభాన్ని వివరించడానికి పనికిరాదు. లాభ సూత్రాన్ని చెప్పడానికి ప్రయత్నించిన ఈ 3 వాదాలలోనూ మాటల తేడాలే గానీ అన్నిటి సారాంశమూ ఒకటే. ఈ వాదాలన్నీ కూడా, 'లాభాన్ని', కొనే మనిషి దగ్గిర్నించి వచ్చే విషయం లాగ చెపుతాయి. అంటే, దీని అర్థం — ఒక పెట్టుబడిదారుడికి, ఇతర పెట్టుబడిదారుల నించి లాభం వస్తుంది అనడమే. ఇదే సూత్రం ప్రతీ పెట్టుబడిదారుడికీ వర్తించాలి కాబట్టి, ప్రతీ పెట్టుబడి దారుడూ ఇతర పెట్టుబడిదారుల నించి లాభం సంపాదిస్తూ, తన దగ్గిర నించి ఇతర్లకు లాభం ఇస్తూ ఉంటాడన్నమాట! అంటే, దీని అర్థం, ఎవడికీ ఎవడి నించీ లాభం రావడం లేదన్నమాట! అందరూ కలిసి 'ఇంకెక్కడి నించో' లాభాలు సంపాదిస్తున్నారన్న మాట!

అసలు, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, 'లాభం ఫలానా రకంగా వస్తుంది' అని ఏదో నోటికొచ్చిన మాటలు అనడమే గానీ, లాభం గురించి వాళ్ళకు ఏమీ తెలీదు. ఆ విషయంలో వాళ్ళకి ఏమీ స్పష్టత లేదు. ఆ విషయం మీద వాళ్ళకు ఏమీ శ్రద్ధ కూడా లేదు.

"సరుకుని అమ్మినప్పుడు లాభం వస్తుంది" అనే పొడి పొడి మాటలతో తమ పరిశోధన అంతా సరిపెట్టేస్తారు, ఇక అందులో తెలుసుకో వలసిందేమీ లేదన్నట్టు!

లాభానికి కారణం ఏమిటో చెప్పడానికి ఈ వాదాలేవీ పనికి రావని వేరే చెప్పనక్కరలేదు.

# లాభానికి నిజమైన కారణం ఏమిటి?

అయితే, లాభానికి అసలైన, నిజమైన కారణం ఏమిటి? పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు <u>గ్రహించని</u> ఆ సరియైన కారణం ఏమిటి? బట్ట పెట్టుబడిదారుడు, 100 రూ.ల ఖర్చుతో కొంత బట్టని తయారుచేయించి, దాన్ని 120 కి అమ్మి, లాభంగా 20 సంపాయించాడు కదా? అక్కడ మనకి ఒక ప్రశ్న వచ్చింది. ఆ బట్టకి అంత విలువ వుండడం వల్లనే అంత డబ్బు వచ్చిందా, అంత విలువ లేకుండానే అంత డబ్బు వచ్చిందా — అని!

సరుకులన్నీ వాటి విలువలకే మారాలి. అదే విలువ సూత్రం. ఈ సూత్రం మీదే మనం 'లాభాన్ని' వివరించగలగాలి. అంటే, 'సరుకుని' అమ్మినప్పుడు, దాని విలువకి తగిన డబ్బే రావాలి. ఆ 'విలువ'లో నించే 'లాభం' రావాలి. ఈ సూత్రం ప్రతీ పెట్టుబడిదారుడికీ ఒకే రకంగా వర్తించాలి.

'బట్ట' ఉదాహరణలో, బట్టకి బదులుగా వచ్చిన 120 డబ్బు, బట్ట విలువని బట్టే వచ్చిందన్నమాట! బట్టకి 'అంత విలువ' వుండడం వల్లనే ( అంత విలువ ఎలా వచ్చిందనేది వేరే ప్రశ్న ), 'అంత డబ్బు' వచ్చిందన్నమాట! అంతేగానీ, అంత విలువ లేకుండానే అంత డబ్బు వచ్చిందని అర్థం కాదు. బట్టకి బదులుగా వచ్చిన 120 లో నించి, బట్ట కోసం పెట్టుబడిదారుడు ఖర్చుచేసిన 100 ని తీసివేస్తే, ఇంకా 20 మిగులుతుంది. ఈ 20, పెట్టుబడిదారుడికి 'లాభం'గా వుంది. ఇక్కడ జరిగిందేమిటంటే — బట్ట, తన 'అసలు విలువ'కే (120 కి) మారకం అయింది. ఆ 'అసలు విలువ' లో నించే పెట్టుబడిదారుడికి 'లాభం' (20) వచ్చింది. ఆ లాభం, 'అసలు విలువ' కన్నా ఎక్కువగా వేసుకున్నది కాదు.

ఇలాగే, ప్రతీ పెట్టుబడిదారుడికీ, వాడి సరుకుకి వున్న 'అసలు విలువ' లో నించే కొంత భాగం లాభంగా వస్తుంది.

అయితే ఇక్కడ మనకి చాలా ముఖ్యమైన ప్రశ్న ఎదురవుతుంది. ఏమిటంటే: బట్ట పెట్టుబడిదారుడు, ఆ బట్టని తయారు చేయించడానికి 100 మాత్రమే ఖర్చు పెట్టాడు కదా? 100 ఖర్చుతో తయారైన సరుకుకి 120 విలువ ఎలా వచ్చింది? —ఇదీ ఆ ప్రశ్న! దీనికి జవాబు కావాలి. ఈ జవాబు కోసం ఈ పరిశోధనలో ఇంకా కొంచెం దూరం వెళ్ళాలి. కానీ, ఈ లోగా చెప్పుకునే జవాబేమి

టంటే— పెట్టుబడిదారుడు, తక్కువ ఖర్చుతోనే తన సరుకుకి ఎక్కువ విలువ వచ్చేలాగ చేశాడు. ఈ 'అద్భుత కార్యం' వాడు ఎలా సాధించాడన్నది వేరే సంగతి. వాడా 'అద్భుతం' సాధించాడు గనకే, ఆ బట్టకి ఎక్కువ విలువ (పెట్టుబడిదారుడు ఖర్చుపెట్టిన దాని కన్నా ఎక్కువ విలువ) ఏర్పడి, దాన్ని అమ్మినప్పుడు, ఆ ఎక్కువ విలువే లాభంగా వచ్చింది. అలాగాక, పెట్టుబడిదారుడు మొదట ఖర్చు పెట్టినంత విలువ మాత్రమే ఆ తయారైన సరుకుకి వుంటే, దాన్ని అమ్మినప్పుడు ఆ ఖర్చు మాత్రమే తిరిగి వచ్చేది. అప్పుడు 'లాభం' అన్న ప్రశ్నే వుండదు. పెట్టుబడిదారుడు, తను ఖర్చు పెట్టిన దాని కన్నా ఎక్కువ విలువ గల సరుకుని తయారు చేయించలేకపోతే వాడి కార్యక్రమం అంతా అర్థం లేనిదైపోతుంది. కాబట్టి, పెట్టుబడిదారుడి దగ్గిర అమ్మకానికి తయారైన సరుకులో, దానికోసం ఖర్చయిన విలువ కన్నా ఎక్కువ విలువ వుండి తీరాలి. అలా వుంటుంది కాబట్టే, దాన్ని అమ్మినప్పుడు విలువ సూత్రం ప్రకారం సహజంగానే దానికి ఎక్కువ డబ్బు వస్తుంది. సరుకులో ఎంత విలువ వుందో, ఆ విలువకి తగ్గ డబ్బు రావడమే అది. సమాన విలువల మారకమే అది. ఆ మారకం వల్ల వచ్చిన డబ్బులోంచి, ఖర్చుల్ని తీసివెయ్యగా మిగిలింది 'లాభం'గా వుంటుంది.

100 మీటర్ల బట్టలో వున్న మొత్తం విలువని ఒకసారి ఇలా చూడొచ్చు. ఆ బట్ట తయారవడానికి మొత్తం 3 అంశాలు అవసరమవుతాయని చూస్తాం. అంటే, ఈ 3 అంశాలలోనూ మొత్తం ఎంత 'సామాజిక శ్రమ కాలం' వుందో, ఎంత శ్రమ కాలంతో ఆ బట్ట తయారైందో, ఆ శ్రమ కాలమే దాని 'విలువ'గా వుంటుంది.

<u>100 మీటర్ల బట్ట విలువ :</u>

1) ముడి పదార్థాలూ వగైరాలు ..... 80

2) శ్రామికుల జీతాలు .................. 20

3) ఇంకా ఎక్కువగా వున్న విలువ . 20

(పెట్టుబడిదారుడికి ఏమీ ఖర్చు కాకుండా వచ్చేది ఈ 3 వ భాగం. పెట్టుబడిదారుడు తయారు చేయించిన సరుకులో ఈ భాగం తప్పకుండా ఎంతో కొంత వుండి తీరుతుంది. ఇదే 'లాభం'గా వచ్చే భాగం. ఈ భాగాన్ని ఇక్కడ మనం 20 గా పెట్టుకున్నాం)

---

సరుకులో వున్న మొత్తం విలువ...... 120

ఈ సరుకు తయారీ కోసం
పెట్టుబడిదారుడికి ఖర్చయిన <u>విలువ</u>...... <u>100</u>

<u>లాభం</u> ....... <u>20</u>

పెట్టుబడిదారుడు బట్టని, దాని 'అసలు విలువ'కే అమ్మాడు. అయినా లాభం వచ్చింది. ఈ వివరాలు చూస్తే, లాభం అనేది బయట నించి రాదనీ, సరుకుకి వున్న 'అసలు విలువ'లో నించే వస్తుందనీ, తెలుస్తుంది. ఆ బట్టకీ, 120 రూ.లకీ జరిగిన మారకం, రెండు సమాన విలువల మధ్య జరిగిన మారకమే. సమాన విలువల మారకం నించే లాభం వచ్చింది. అంతేగానీ, ఆ సరుకుని, దానిలో లేని విలువకి 'ప్రియంగా' అమ్మడం వల్ల వచ్చింది కాదు అది. ఆ సరుకుని కొనే వ్యక్తి, తన 'అవసరం' కోసం ఎక్కువ విలువని చెల్లించడం వల్ల వచ్చింది కాదు అది. సరుకులో లేని విలువని ఊరికే 'వేసుకుని' సరుకు విలువని నిష్కారణంగా పెంచేసి అమ్మడం వల్ల వచ్చింది కూడా కాదు అది. సరుకుని, దాని విలువకే దాన్ని అమ్మినప్పటికీ, పెట్టుబడిదారుడి ఖర్చు, ఆ విలువ కన్నా తక్కువే వుంటుంది కాబట్టి, ఆ 'అసలు విలువ'లో నించే కొంత భాగం 'లాభం'గా వచ్చింది. అంటే, ఇక్కడ మనకి లాభానికి 'జనరల్ సూత్రం' దొరికింది. <u>సరుకుకి వున్న 'అసలు విలువ'లో నించి, దానికోసం పెట్టుబడిదారుడు పెట్టిన ఖర్చుని తీసేస్తే, మిగిలిందే లాభం.</u>

సరుకు అన్నప్పుడు, 100 మీటర్ల బట్టనీ ఒక సరుకుగా తీసుకోవచ్చు; 1 మీటరు బట్టనే ఒక సరుకుగా తీసుకోవచ్చు. ఎంత సరుకుని తీసుకుంటే, అంత ఖర్చునే తీసుకోవాలి.

మార్కెట్‌కి (అమ్మకానికి) వచ్చే ఏ సరుకు అయినా, ఎంతో కొంత శ్రమతో తయారై, తనలో కొంత విలువని పెట్టుకుని మార్కెట్‌కి వస్తుంది. (మార్కెట్ అంటే, పెద్ద పెద్ద దుకాణాలున్న స్థలం అని కాదు. వస్తువుల్ని ఎక్కడ అమ్మితే అదే మార్కెట్టు. మార్కెట్‌కి సరుకు వెళ్ళడం అంటే అమ్మకానికి వెళ్ళడమే.) సరుకు, మార్కెట్‌లోకి ఎందుకు వస్తుందంటే, 'డబ్బు'తో మారడానికి. మార్కెట్లో జరిగే పని, కేవలం సరుకుకి బదులు డబ్బూ, డబ్బుకి బదులు సరుకూ మారడం మాత్రమే. అలా మారేటప్పుడు ఏ పక్షానికీ కూడా, ఇచ్చిన విలువ కన్నా ఎక్కువ విలువ రాదు. ఒక మనిషి, ఒక 5 రూ.ల నోటుని ఇంకో మనిషికి ఇచ్చి అతని నించి 5 విడి నోట్లు తీసుకుంటే, ఆ నోట్ల మారకంలో ఏ పక్షానికీ కూడా ఎక్కువ విలువ రాదు కదా? అలాగే సరుకుకీ డబ్బుకీ జరిగే మారకంలో కూడా ఏ పక్షానికీ ఎక్కువ విలువ రాదు.

"సరుకుని 'అమ్మితే' లాభం వస్తుంది. అమ్మినప్పుడే ఎక్కువ విలువ వస్తుంది" అనే భావాలన్నీ ఉత్త మూఢ నమ్మకాలు. 'అమ్మడం' అంటే సరుకుని ఇచ్చి దాని విలువకు తగ్గ డబ్బుని తీసుకోవడమే. 'కొనడం' అంటే, డబ్బుని ఇచ్చి దాని విలువకు తగ్గ సరుకుని తీసుకోవడమే.

కొనేవాళ్ళు అమ్మేవాళ్ళకి గానీ, అమ్మేవాళ్ళు కొనేవాళ్ళకి గానీ, తాము తీసుకునే విలువల కన్నా ఎక్కువ విలువలు ఇవ్వరు. కాబట్టి, పెట్టుబడిదారుడికి లాభం వచ్చేది, అమ్మడం వల్లో, కొనడం వల్లో కాదు. ఒక పెట్టుబడి దారుడికి లాభం, ఇంకో పెట్టుబడిదారుడికి నష్టం అవడం ద్వారా రాదు.

సరుకుకి వున్న అసలు విలువలో నించే లాభం వస్తుంది. ఇదే, లాభానికి జనరల్ సూత్రం. అంటే, పెట్టు బడి దారులందరికీ వర్తించే సూత్రం.

పెట్టుబడిదారుడు అమ్మే సరుకులో, వాడికి ఖర్చయిన దాని కన్నా ఎక్కువ విలువ ఉండడం వల్లనే, 'లాభం' వస్తుంది గనక, సరుకు లోకి, ఆ 'ఎక్కువ' విలువ ( పెట్టు బడి దారుడి ద్వారా ఖర్చయిన దానికన్నా ఎక్కువ విలువ) చేరడం ఎలా సాధ్యమవుతుందో ఇప్పుడు చూడాలి.

మన పెట్టుబడిదారుడి దగ్గిర అమ్మకానికి తయారైన సరుకు 100 మీటర్ల సైను బట్ట. దీన్ని తయారు చెయ్యా డానికి పెట్టుబడిదారుడు, ముడి పదార్థాలూ వగైరాల మీదా, జీతాల మీదా కొంత డబ్బు ఖర్చు పెట్టాడు కదా? 'ముడి పదార్థాలూ వగైరాలు' అంటే ఏమిటి? వాటిలో 'ముడి పదార్థాలు' ఏమిటి? 'వగైరాలు' ఏమిటి?

ఒక కొత్త వస్తువుని తయారు చెయ్యాలంటే, దానికి సంబంధించిన శ్రమ జరగడం కోసం, అప్పటికే తయారై సిద్ధంగా వున్న కొన్ని వస్తువులు కావాలి. కావలసిన వస్తువు లన్నీ వుంటేనే కొత్త శ్రమ జరుగుతుంది. ఆ వస్తువులన్నీ కలిసి ఆ శ్రమ జరగడానికి అవసరమైన 'సాధనాలు' అవుతాయి. అంటే ఇక్కడ మనం 'శ్రమ సాధనాలు' అనే మాటల్ని పరిచయం చేసుకుంటున్నాము. ఈ మాటల్ని మొదటి భాగంలో కూడా చెప్పుకున్నాం. కానీ, అక్కడ ఎక్కువ వివరంగా చెప్పుకోలేదు.

'శ్రమ సాధనాల్ని' 3 రకాలుగా విభజించవచ్చు.

(1) ముడి పదార్థాలు (2) శ్రమ పరికరాలు

(3) ఆగ్జిలరీ (సహాయక) పదార్థాలు.

**(1) 'ముడి పదార్థం' అంటే** : 'బట్ట'కి, దారం, ముడి పదార్థం. 'బట్ట' తయారవ్వాలంటే, మొదట దారం వుండాలి. అది, నేత పని ద్వారా బట్టగా మారుతుంది. మొదట దారంగా వున్న వస్తువే నేత క్రమంలో రూపం మారి, బట్ట రూపంలోకి మారుతుంది. అందుకే బట్టకి ముడి పదార్థం — దారం. ఆ బట్ట మీద పువ్వులో గళ్ళో వెయ్యవలసి వుంటే, దాని కోసం అవసరమయ్యే రంగులు కూడా బట్టకి ముడిపదార్థాలే అవుతాయి. అయితే, ఇక్కడ, దారమే ప్రధానమైన ముడి పదార్థం. 'కుర్చీ'ని తయారు చెయ్యాలంటే, ప్రధానమైన ముడి పదార్థం — చెక్క. ఆ చెక్కతోపాటు మేకులూ రంగులూ కూడా ముడి పదార్థాలే. కానీ, ఇక్కడ చెక్కే ప్రధానమైన ముడి పదార్థం. ఈ రకంగా, ఒక కొత్త వస్తువుని తయారుచేసే పనిలో, ఏ యే వస్తువులైతే, తమ శరీరాలతో సహా కొత్త వస్తువులోకి చేరి, కొత్త వస్తువు రూపంలోకి మారతాయో, ఆ మొదటి వస్తువులన్నీ కొత్త వస్తువుకి 'ముడి పదార్థాలే'.

**(2) 'శ్రమ పరికరాలు' అంటే** : శ్రమ జరగడానికి అవసరమయ్యే పరికరాలే — శ్రమ పరికరాలు. 'పరిక రాలు' అన్నా, 'పనిముట్లు' అన్నా ఒకటే. దారం 'బట్ట'గా తయారవడం కోసం నేత పని జరగాలంటే, దానికి దారం ఒక్కటే వుంటే చాలదు. 'మగ్గం' కూడా కావాలి. ఇంకా ఇతర పనిముట్లు కూడా కొన్ని కావాలి. నేత మనుషులు పని చెయ్యడానికి, ఒక 'పని స్థలం' కూడా కావాలి. అది చిన్న పాక కావచ్చు; బిల్డింగు కావచ్చు; ఎలాంటి నిర్మాణం అయినా కావచ్చు. ముడి పదార్థాన్ని ఇటూ అటూ మొయ్యా డానికి తట్టలూ బుట్టలూ వంటి ఇతర వస్తువులు కూడా కావాలి. (నేత పని జరగడానికి ఏ యే రకాల పనిముట్లు కావాలో వాటినన్నిటినీ ఇక్కడ ఊహించాలి.) — భూమిని దున్నే పని జరగాలంటే, నాగలి కావాలి. దానికన్నా ముందు 'భూమి' కావాలి. నాగలి — ఒక శ్రమ పరికరం అయితే, భూమి కూడా ఒక శ్రమ పరికరమే. నాగలి — మనుషులు తయారుచేసిన శ్రమ పరికరం అయితే, భూమి — ప్రకృతి లోనే సహజంగా ఉన్న శ్రమ పరికరం. చెక్కని కోసే పని జరగాలంటే, 'రంపం' కావాలి. వేరే రకాల పనుల కోసం అయితే, సుత్తీ, కత్తీ, కత్తెరా, కొడవలీ, బల్లలూ వంటి రకరకాల పనిముట్లు కావాలి. ఇలాంటివన్నీ 'శ్రమ పరి కరాలు' లేదా, 'శ్రమ పనిముట్లు'. వీటికీ, ముడి పదార్థాలకీ తేడా ఏమిటంటే — ముడి పదార్థాలు అయితే, తమ పాత రూపాలు పోయి, 'కొత్త వస్తువుగా' మారిపోతాయి. కానీ, శ్రమ పరికరాల విషయంలో అలా జరగదు. ఇవి, కొత్త వస్తువుగా మారవు. వాటి శరీరాలు, కొత్త వస్తువులోకి వెళ్ళవు. ఉదా: మగ్గం మీద బట్ట తయారవుతూ వున్నప్పుడు గానీ, తయారైన తర్వాత గానీ, మగ్గం ఆకారం మారదు. అది, బట్ట లోకి వెళ్ళదు. పూర్తిగా పనికిరానంత పాతబడి పోయినప్పుడు కూడా మగ్గం ఆకారం అలాగే వుంటుంది గానీ మారదు. కత్తీ, సుత్తీ, నాగలీ, రంపమూ వంటి ఇతర శ్రమ పరికరాల విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. ఇదే, ముడి పదార్థానికీ, శ్రమ పరికరానికీ తేడా.

**(3) 'ఆగ్జిలరీ (సహాయక) పదార్థాలు' అంటే** : నేత పని జరిగేటప్పుడు, మగ్గం లాంటి శ్రమ పరికరం సవ్యంగా కదలడానికి ఏదో ఒక నూనె పదార్థాన్ని పూయవలసి వుంటుందనుకుందాం. అంటే, ఇక్కడ నూనె కూడా

అవసరమవుతుంది. కానీ ఇక్కడ నూనె ముడి పదార్థం గానీ, శ్రమ పరికరం గానీ అవదు. ఎందుకంటే, ఇది ముడి పదార్థంలాగా కొత్త వస్తువులోకి తన శరీరంతో సహా చేరడంగానీ; శ్రమ పరికరంలాగ చివరికి తన ఆకారంతోనే నిలిచి వుండడంగానీ, చెయ్యదు. మగ్గం నడుస్తూ వుండగా దానికి పూసిన నూనె, కరిగి ఆవిరై పోతుంది. అలాగే, బొగ్గుని నిప్పు కోసం ఉపయోగించినప్పుడు అది కాలి బూడిదై పోతుంది. ఇలాంటి సందర్భాలలో ఈ పదార్థాలు, ముడి పదార్థాలు గానీ, శ్రమ పరికరాలు గానీ అవవు. ఒకవేళ, 'నూనె'ని, ఆహార పదార్థాల తయారీలో ఉపయోగించి నట్టయితే, అప్పుడు అది ముడి పదార్థం అవుతుంది. అలాగే, చమురూ బొగ్గూ నీళ్ళూ వంటివి, వాటిని వుపయోగించే సందర్భాన్ని బట్టి, ముడి పదార్థాలుగా గానీ, ఆగ్జిలరీ పదార్థాలుగా గానీ వుంటాయి.

ఏ రకం శ్రమ జరగాలన్నా, ఈ 3 రకాల వస్తువులూ కావాలి. వీటిలో ఏ వస్తువు లేకపోయినా ఆ శ్రమ జరగదు. కొత్త వస్తువుని తయారు చెయ్యడం సాధ్యం కాదు. అందుకే ఈ 3 రకాల వస్తువుల్నీ కలిపేసి, ఒకే పేరుతో 'శ్రమ సాధనాలు' అంటాం. శ్రమ జరగాలంటే, ఈ సాధనా లన్నీ కావాలి. 'నేత' శ్రమ జరగాలంటే, దారం ఒక శ్రమ సాధనం. మగ్గం ఒక శ్రమ సాధనం. గంప ఒక శ్రమ సాధనం. పని స్థలంగా వుండే కట్టడం ఒక శ్రమ సాధనం. ఈ పనిలో, నూనే, బొగ్గూ అవసరమైతే, అవీ శ్రమ సాధనాలే. ఈ పని కోసం, చిన్న గుండు సూది అవసరమైతే అది కూడా ఒక శ్రమ సాధనమే.

తయారయ్యే వస్తువుకి వుండే ప్రత్యేకతని బట్టి దేని ముడి పదార్థాలు దానికి వుంటాయి. దేని శ్రమ పరికరాలు దానికి వుంటాయి. 'బట్ట'కి ముడి పదార్థం వేరూ, 'చెప్పుల'కు ముడి పదార్థం వేరూ. అలాగే, ఆ పనికి కావలసిన శ్రమ పరికరాలు వేరూ, ఈ పనికి కావలసిన శ్రమ పరికరాలు వేరూ. ఏ రెండు వేరు వేరు వస్తువుల్ని తీసుకున్నా, దేని ముడిపదార్థాలు దానికీ, దేని శ్రమ పరికరాలు దానికీ, దేని ఆగ్జిలరీ పదార్థాలు దానికి, వేరు వేరుగా వుంటాయి. కానీ ఆ తేడాల సంగతి ఇక్కడ అనవసరం. ఏ వస్తువు తయారవ్వాలన్నా దానికి తగ్గ కొన్ని ముడి పదార్థాలూ, కొన్ని శ్రమ పరికరాలూ, కొన్ని ఆగ్జిలరీ పదార్థాలూ కావాలన్నదే — ఇక్కడ ప్రధాన విషయం.

శ్రమ సాధనాల్ని, 'ఉత్పత్తి సాధనాలు' అని కూడా అనవచ్చు. ఎలా అన్నా అర్థం ఒకటే. 'శ్రమ చెయ్యడం' అన్నా, 'ఉత్పత్తిని తయారుచెయ్యడం' అన్నా రెండు ఒకటే. దారాన్ని, 'శ్రమ సాధనం' అన్నా, 'ఉత్పత్తి సాధనం' అన్నా ఒకటే. అలాగే మగ్గాన్నీ, అలాగే నాగలినీ, అలాగే రంపాన్నీ, ఏ పేరుతో అన్నా ఒకటే.

ముడిపదార్థాలూ, ఇతర శ్రమ సాధనాలూ వున్నంత మాత్రానే వస్తువు తయారు కాదు. ఆ వస్తువుని తయారు చెయ్యడం తెలిసిన 'మనుషులు' కూడా కావాలి. అంటే, ఆ మనుషులు చేసే ఒక ప్రత్యేక రకం 'పని' (శ్రమ) కావాలి. ఆ మనుషులు, ఆ శ్రమ పరికరాల సహాయంతో ఆ ముడి పదార్థాల్ని చేతిలోకి తీసుకుని, కావలసిన కొత్త వస్తువులు తయారుచేస్తారు. 'తోలు'తో చెప్పులు కుడతారు. 'దారం'తో బట్ట నేస్తారు. 'పిండి'తో రొట్టెలు చేస్తారు — ఇలా.

**'ముడి పదార్థాలకు' సంబంధించి ఒక వివరణ :**

కొన్ని రకాల పనుల్లో ముడి పదార్థాలు వుండవు. చెట్ల నించి పళ్ళని కోసే పనిలోనూ, గనుల్లోంచి బొగ్గూ లోహాలూ తవ్వే పనిలోనూ, నీటిలోంచి చేపల్ని పట్టే పని లోనూ, అడవిలో జంతువుల్ని వేటాడే పనిలోనూ — ఇలాంటి పనుల్లో, ముడి పదార్థాలు వుండవు. ఇలాంటి వన్నీ 'వెలికితీత' శ్రమలు. ప్రకృతే సిద్ధం చేసి ఇచ్చిన పదార్థాల్ని 'బయటికి తీసే' పనులు ఇవి. ఇలాంటి పనుల్లో, ముడి పదార్థాల ప్రసక్తి లేకపోయినా, శ్రమ పరికరాలు అవసర మవుతాయి. 'శ్రమ చేసే మనుషులు ప్రతీ చోటా కావాల'నే సంగతి ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

**'శ్రమ పరికరాల' విషయంలో కూడా ఒక వివరణ :**

బట్ట ఉదాహరణలో, 100 మీ. బట్టని ఒక వస్తువుగా తీసుకున్నాం. దాని కోసం కావలసిన శ్రమ పరికరాల్లో 'మగ్గం' వుంటుంది. 'బిల్డింగు' వుంటుంది. ఇంకా ఇతర వస్తువులెన్నో వుంటాయి. వాటి విలువలన్నీ ఈ 100 మీటర్ల బట్ట విలువలోకే పూర్తిగా వచ్చేసినట్టా?— కాదు. (ఈ విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో మొదటి భాగంలో, 'సరుకుకి గల 2 లక్షణాలు' చాప్టర్‌లో కొంతవరకూ చూశాం. దీన్ని మళ్ళీ ఈ పుస్తకంలోనే "స్థిర పెట్టుబడీ – అస్థిర పెట్టుబడీ, ఫిక్సెడ్ పెట్టుబడీ – చలామణీ పెట్టుబడీ" చాప్టర్‌లో ఇంకా వివరంగా చూస్తాం.) 100 మీటర్ల బట్టని నేసేటప్పటికే మగ్గం అంతా పాతబడి పనికి రాకుండా అయిపోదు. అలాగే 100 మీటర్ల బట్టని నేసే టప్పటికే బిల్డింగు అంతా పాతబడిపోదు. ఇతర పరికరాల విషయం కూడా ఇంతే. వాటి విలువల మొత్తమంతా వచ్చి ఈ 100 మీటర్ల బట్టకే చేరదు. వాటి విలువలు ఇంకా ఎన్నో సంవత్సరాలపాటు, ఎన్నో వేల, లక్షల మీటర్ల బట్టలోకి చేరాలి. ప్రస్తుతం మనం ఉదాహరణగా తీసుకున్న 100 మీటర్ల బట్టలోకి, శ్రమ పరికరాల విలువగా ఎంత మాత్రమే చేరిందో ఇప్పుడు చూడాలి.

బట్ట – పెట్టుబడిదారుడు, బట్టకి కావలసిన 'ముడి పదార్థాలూ వగైరాల' మీద 80 పెట్టాడని గతంలో చెప్పుకున్నాం. అందులో ముడి పదార్థాలకు ఎంత పెట్టాడో ఇతర శ్రమ సాధనాలకు ఎంత పెట్టాడో ఇంతకుముందు

విడిగా చెప్పుకోలేదు. ముడి పదార్థాలకు పెట్టింది 30 అనీ, ఇతర శ్రమ సాధనాలకు పెట్టింది (శ్రమ పరికరాలకూ, ఆగ్జిలరీ పదార్థాలకూ కలిసి పెట్టింది) 50 అనీ, ఇప్పుడు అనుకుందాం. ఆ వివరాలు ఇక్కడ కావాలి.

శ్రమ పరికరాల్లో ఇంకా మిగిలివున్న విలువ సంగతి ఇక్కడ అవసరం లేదు. అది ఈ బట్ట లోకి రాలేదు గనక. అది ఇంకా ఖర్చు కాకుండా ఆ పరికరాలలోనే మిగిలి వుంటుంది.

ముడి పదార్థాల్నీ, శ్రమ పరికరాల్నీ, ఆగ్జిలరీల్నీ కలిపేసి, ఒకే పేరుతో 'శ్రమ సాధనాలు' అనవచ్చనే సంగతి మరిచిపోకూడదు. ఆ శ్రమ సాధనాల్లో, ముడి పదార్థం వున్నా, లేకపోయినా. సారాంశం ఏమిటంటే, ఏ వస్తువు కోసం ఏ శ్రమ జరగాలన్నా— (1) శ్రమ సాధనాలూ (2) శ్రమ చేసే మనుషులూ — ఈ 2 అంశాలూ తప్ప, ఇక ఏ అంశమూ అక్కరలేదు.

ఆ తయారయ్యే వస్తువు, తర్వాత అమ్మకానికి పోయేది అయినా, లేదా స్వంత వాడకానికే వుండేది అయినా, అది తయారవడానికి ఈ 2 అంశాలూ చాలు. ఈ విషయాన్ని చాలా ప్రత్యేకంగా దృష్టిలో వుంచుకోవాలి. ఎందుకంటే, ఒక వస్తువుకి 'విలువ'ని ఏర్పర్చడానికి ఏ యే అంశాలు మాత్రమే పని చేస్తాయో గ్రహించడానికి అవసరమయ్యే విషయం ఇది. శ్రమ సాధనాలూ, శ్రమ చేసే మనుషులూ వుంటే, ఎంత భారీ వస్తువైనా తయారవుతుంది. బ్రహ్మాండ మైన భవనాలూ, నౌకలూ, వంతెనలూ, విమానాలూ, అన్నీ తయారవుతాయి. ఆ కావలిసిన అంశాలు లేకపోతే, సూది కూడా తయారు కాదు. చిన్న నల్లపూస కూడా తయారు కాదు.

శ్రమ సాధనాల్ని ఉపయోగిస్తూ మనుషులు, తమ శ్రమలతో కొత్త వస్తువుల్నీ, కొత్త పదార్థాల్నీ, తయారు చేస్తారు. ఆ కొత్త 'ఉత్పత్తుల్ని' అమ్మవలసివుంటే, వాటి 'విలువల్ని' లెక్క కట్టాలి.

పెట్టుబడిదారుడు తయారు చేయించే సరుకు, 'అమ్మకం' కోసమే కాబట్టి, దానికి విలువ లెక్కలన్నీ ఉండవలసి వుంటుంది.

100 మీటర్ల బట్టకి, ఎంత దారమైతే పట్టిందో, ఆ దారం విలువ ఎంత? ఆ బట్టని తయారు చెయ్యడంలో ఎన్ని ఇతర శ్రమ సాధనాలైతే ఖర్చయ్యాయో, వాటి విలువ ఎంత? ఆ బట్టని నెయ్యడానికి పట్టిన 'నేత శ్రమ' విలువ ఎంత? — ఈ విలువలన్నీ కలిసిన మొత్తమే — బట్ట విలువ. ఈ అంశాల మొత్తం కన్నా బట్ట విలువ ఎక్కువ గానూ వుండదు, తక్కువగానూ వుండదు.

బట్టలో వున్న మొత్తం విలువని 120 రూ.లు అనుకున్నాం. ఈ 120 విలువ బట్టకి ఏయే అంశాల నించి వచ్చింది? బట్టని తయారు చెయ్యడంలో ఏయే అంశాలైతే ఖర్చయ్యాయో ఆ అంశాల నించే. అంటే, కొంత భాగం 'ముడి పదార్థాల' నించీ, కొంత భాగం ఇతర శ్రమ సాధనాల నించీ, కొంత భాగం నేత శ్రామికులు చేసిన 'శ్రమ' నించీ. ఈ అంశాల విలువలన్నీ కలిసిందే బట్టలో వున్న 120 విలువ.

'విలువ' అంటే శ్రమే కాబట్టి, '120 విలువ' అంటే బట్ట కోసం అంత విలువచేసే మొత్తం శ్రమ ఖర్చయిందన్న మాట!

అయితే ఈ బట్ట కోసం పెట్టుబడిదారుడు 100 విలువని మాత్రమే ఖర్చుపెట్టాడు. పెట్టుబడి దారుడు ఖర్చు పెట్టిందంతా బట్టకి విలువే. అది శ్రమే. అంతే కాదు, ఇంకా 20 విలువ ఎక్కువగా కూడా బట్ట కోసం జరగాలి. అది కూడా శ్రమే. మొదటి 100 విలువకి కారణం శ్రమ అయినట్టే, ఆ ఎక్కువగా వున్న 20 విలువకి కూడా కారణం శ్రమే అవుతుంది. బట్టలోకి ఆ 100 కన్నా ఎక్కువగా వున్న 20 విలువ ఎలా వచ్చిందో మనకు ఇంకా తెలియక పోయినా, 'విలువ అన్నది ప్రతీదీ శ్రమే' అని అర్థం చేసుకోడానికి, మనకు ఇప్పటి వరకూ తెలిసిన విషయాలు చాలు. ఒక సరుకుకి వున్న మొత్తం విలువని 10 భాగాలు చేస్తే, అందులో 9 భాగాల వెనక శ్రమ వుండి, 1 భాగం వెనక శ్రమ లేకుండా పోదు. సరుకుకి వున్న మొత్తం విలువని 10 భాగాలు చేశామంటే, ఆ సరుకుకి పట్టిన మొత్తం శ్రమని 10 భాగాలు చేసినట్టు అర్థం. అందులో ప్రతీ భాగం వెనకా కొంత శ్రమ వుందని అర్థం. కాబట్టి, బట్టకి వున్న మొత్తం 120 విలువలో ప్రతీ అణువూ శ్రమ వల్ల వచ్చిందేనని గ్రహించడం కష్టం కాదు.

పెట్టుబడిదారుడు బట్ట కోసం 100 విలువని మాత్రమే ఖర్చు పెడితే, తీరా బట్ట తయారైన తర్వాత దాని విలువ 120 అయింది. "ఈ ఎక్కువ విలువ బట్టలోది కాదు, బయటిదే" అనే జవాబు, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తకి సరిపోతుంది గానీ, విషయాల్ని హేతుబద్ధంగా పరిశీలించే వాళ్ళకి సరిపోదు. ఆ ఎక్కువగా వున్న 20 విలువ కూడా బట్టలో వున్నదే కాబట్టి, 'ఇది ఎలా వచ్చింది? ఎలా వచ్చింది?' అని దాని కారణం కోసం బట్టకు బైట మార్కెట్లో వెతికితే ప్రయోజనం వుండదు. <u>బట్టలో వున్న విలువకి కారణం కోసం, బట్టలోనే వెతకాలి. అంటే, దాన్ని తయారు చేసిన అంశాలలోనే.</u> ఏ యే అంశాల కోసమైతే పెట్టుబడిదారుడు 100 ని ఖర్చు పెట్టాడో, ఆ అంశాలే ఆ 100 విలువని 120 గా పెంచి వుంటాయి.

100 ఖర్చుతో తయారైన బట్టలోకి 100 కన్నా ఎక్కువ విలువ చేరిందనేది సందేహం లేని విషయం. ఆ పని, దాన్ని తయారుచేసిన అంశాల వల్లనే జరిగిందనేది కూడా

సందేహం లేని విషయం. ఆ పని ఎలా జరిగిందో మాత్రమే ఇప్పుడు మనం తెలుసుకోవాలి. ఆ వేరు వేరు అంశా లన్నిటి లోనూ మొదట వున్న విలువలే కొంత కొంత పెరిగాయా? లేక, వాటిల్లో ఏ 2 అంశాల విలువలైనా పెరి గాయా? లేక ఏదో ఒక్క అంశం విలువే బాగా పెరిగిందా? ఏం జరిగింది? ఏదో మాత్రం జరిగింది. ఏదీ జరగక పోతే 100 విలువ 120 గా ఎలా పెరుగుతుంది? ఏం జరిగిందో తెలుసుకోవాలంటే, విలువల్ని ఇవ్వడంలో ఆ అంశాల స్వభావాలు ఎలాంటివో, అవి తమ విలువల్ని పెంచ డమూ, తగ్గించడమూ చెయ్యగలవో లేవో, ఒక్కొక్కదాన్నీ విడి విడిగా పరిశీలించి చూడాలి. అలా చేస్తే, బట్ట విలువ ఎలా పెరిగిందో, ఏ అంశం వల్ల పెరిగిందో, తెలియవచ్చు.

'బట్ట – విలువ'ని పరిశీలించడం ప్రారంభించిన మనం, దాని తయారీకి అవసరమైన అంశాల స్వభావాల్ని పరిశీలించే పనిలోకి దిగుతున్నా మన్నమాట. బట్టలో పెరిగిన విలువకి కారణం ఏమిటో చూడడం కోసం, దాని అంశాల్ని చీల్చి చూడడం తప్ప ఇంకో మార్గం లేదు. అదే సరైన మార్గం. అదే ఏకైక మార్గం.

# ముడి పదార్థాలు, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలవా?

ఒక వస్తువు తయారయ్యేటప్పుడు అది తన శరీరం లోకి ఏ యే పదార్థాల్ని తీసుకుంటుందో, అవే దానికి ముడి పదార్థాలు.

మన ఉదాహరణలో ఉన్నది సైను బట్ట. దానికి ముడి పదార్థం — దారం ఒక్కటే. ఆ దారం విలువ, బట్టకి విలువగా చేరుతుంది. అయితే, ఆ దారం విలువ ఏమిటి? పత్తిని దారంగా చేసే పనిలో ఎన్ని శ్రమ సాధనాలు ఖర్చయ్యాయో, ఆ పత్తిని దారంగా వడకటానికి ఎంత మంది మనుషులు పని చేశారో, ఆ లెక్కలన్నీ కట్టు కుంటూ, మనం వెనక్కి వెనక్కి వెళ్ళనక్కరలేదు. పెట్టు బడిదారుడు, ఆ దారాన్ని 30 కి కొనుక్కు వచ్చాడు కాబట్టి, దాని విలువ స్పష్టంగా కనపడుతూనే వుంది. అయితే ఆ దారాన్ని కొన్నప్పుడు, దాన్ని అమ్మినవాడు మన వాణ్ణి మోసంచేసి, 30 విలువలేని దారాన్ని 30 కి అంటకట్టడానికీ అవకాశం వుంది; లేదా, మన వాడే, దారం అమ్మినవాణ్ణి మోసంచేసి 30 కన్నా ఎక్కువ విలువ గలదాన్ని 30 కి సంపాయించడానికీ అవకాశం వుంది. కానీ, అలాంటివి 'ప్రత్యేక' సందర్భాలని చెప్పుకున్నాం కదా? ఆ దారాన్ని మన వాడు సరిగ్గా అసలు విలువకే కొన్నాడా, ఎక్కువకి కొన్నాడా, తక్కువకి కొన్నాడా — అనే ప్రత్యేక సందర్భాల చర్చ ఇక్కడ అవసరం లేదు. విషయాల్ని జనరల్‌గా చూసేటప్పుడు, ప్రతీ చోటా జనరల్ సూత్రాల ప్రకారమే వ్యవహరిస్తాం. అంటే, ఆ దారాన్ని పెట్టుబడిదారుడు అసలు విలువకే కొన్నాడనీ, ఆ అసలు విలువ 30 అనీ, భావిస్తాం.

100 మీటర్ల బట్ట తయారవడానికి పట్టిన దారం (ముడి పదార్థం) విలువ — 30 కదా? ఈ 30 విలువ గల దారంతో బట్ట తయారైంది కదా? ఈ దారం విలువ కూడా ఆ బట్టకి విలువగా చేరుతుంది కదా? ఈ దారం వల్ల బట్టకి చేరే విలువ 30 గానే వుంటుందా, అంతకన్నా ఎక్కువగానో తక్కువగానో వుంటుందా? ఈ ప్రశ్ననే వేరే మాటల్లో చూస్తే, ఆ దారం బట్టగా మారిపోయాక, ఆ బట్టలో వున్న దారం విలువని చూస్తే, ఆ విలువ 30 గానే వుంటుందా, ఇంకా ఎక్కువ అవుతుందా? — జవాబు చాలా తేలికే. బట్టగా మారకముందు దారం విలువ ఎంత వుందో, బట్టగా మారిన తర్వాత కూడా దారం విలువ అంతే వుంటుంది. అందులో మార్పేమీ వుండదు.

దారం అనేది 'నిర్జీవ వస్తువు'. అది కొంత శ్రమతో తయారై వుంది. ఆ శ్రమ 'జరిగిపోయిన' శ్రమ. అలాంటి శ్రమని 'గత శ్రమ' అనీ, 'నిర్జీవ శ్రమ' అనీ, 'వస్తు రూపం దాల్చిన శ్రమ' అనీ అనవచ్చు. అలాంటి శ్రమ ఇక ఎక్కువో తక్కువో అవదు. ఆ దారాన్ని ఏ పని కోసం ఉపయో గించినా, దారం రూపాన్ని ఎలా మార్చినా, దారం కోసం పట్టిన గత శ్రమలో మార్పు జరగదు. ఆ దారంతో బట్టని నేసినప్పుడు, ఆ దారం తన ద్వారా ఆ బట్టకి ఎంత శ్రమని చేర్చగలదంటే, తనలో ఎంత శ్రమ వుందో అంత శ్రమని మాత్రమే. తను ఎంత శ్రమతో తయారైందో అంత శ్రమని మాత్రమే. ఆ దారం, తన శ్రమని ఎక్కువచేసి బట్టకి ఇవ్వలేదు. 30 విలువగల దారం, తన ద్వారా తయారయ్యే బట్టకి, తన ద్వారా 30 విలువనే ఇవ్వగలదు గానీ, దాన్ని పెంచి ఇవ్వలేదు.

దీన్ని తేలిగ్గా అర్థం చేసుకోవడానికి ఒక ఉదాహరణ చూద్దాం. 3 అడుగుల ఎత్తుగల ఒక బల్ల వుంది. అది తన ద్వారా ఎంత ఎత్తుని ఇవ్వగలదు? 3 అడుగుల ఎత్తుని మాత్రమే ఇవ్వగలదు. అది, అంతకన్నా ఎక్కువ ఎత్తుని

ఎందుకు ఇవ్వలేదు? ఎందుకంటే, అది, నిర్జీవ వస్తువు. అది, ‘ మొక్క’ లాగా పైకి పెరగదు. ఆ బల్ల, ఎంత కాలమైనా 3 అడుగుల ఎత్తుతో మాత్రమే వుంటుంది. అయితే, మనకి ఇంకా ఎత్తు కావాలంటే, ఏం చెయ్యాలి? ఆ బల్ల మీద ఇంకో బల్ల పెట్టాలి. అప్పుడు 2 బల్లలూ కలిసి ఇంకా ఎత్తుని ఇస్తాయి. అయితే, అప్పుడు కూడా ఏ బల్లా, తన ఎత్తు కన్నా ఎక్కువ ఎత్తుని ఇవ్వదు.

విలువని ఇచ్చే విషయం కూడా అంతే. దారం విలువ 30. అది తయారైపోయివున్న వస్తువు. దాని మీద మళ్ళీ కొత్త శ్రమ కలిసినప్పుడే దాని విలువ పెరుగుతుంది. కానీ అప్పుడు కూడా ఆ దారం వరకే చూస్తే, అది, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వదు. అయితే, ఒక రకం పరిస్థితిలో అయితే, ఆ తయారై పోయివున్న దారం విలువ కూడా కొంత తగ్గడమో పెరగడమో జరగగలదు. ఆ పరిస్థితిని కూడా ఈ సందర్భంలోనే అర్థం చేసుకోవాలి.

బట్ట పెట్టుబడిదారుడు, తన దగ్గిర ఒక టన్ను బరువు గల దారాన్ని కొని నిలవచేసి వుంచుకున్నాడనుకుందాం. దాన్ని పూర్తిగా వాడకముందే కొత్త పత్తి పంట వచ్చింది. వాతావరణ పరిస్థితులు బాగా లేక పోవడంవల్ల కొత్త పత్తి పంట తగ్గి, పత్తి విలువ పెరిగింది. దానివల్ల ఆ పత్తితో తయారయ్యే కొత్త దారం విలువ కూడా పెరగవలసి వుంటుంది. అయితే, పాత దారమూ కొత్త దారమూ పూర్తిగా ఒకే నాణ్యతతో వున్నాయి అనుకుందాం. అప్పుడు, పాత దారం ఒక విలువ తోటీ, కొత్త దారం ఇంకో విలువ తోటీ వుంటాయా? అలా వుండవు. ఒకే రకం సరుకులు వేరు వేరు విలువలతో వుండడం సాధ్యం కాదు. ఎందుకంటే, ఒకే రకం సరుకులు వేరు వేరు విలువలతో (వేరు వేరు ధరలతో) వుంటే, అందులో తక్కువ విలువ గల సరుకునే జనం కొంటారు. ఎక్కువ విలువ గల సరుకుని ఎవరూ కొనరు. కాబట్టి, ఒకే రకం సరుకులు, ఒకే విలువతోనే (ఒకే ధర తో) వుండవలసి వుంటుంది. ఏ సరుకు విషయం తీసుకున్నా, అంతే. సమాజంలో సాధారణంగా కొత్త సరుకు వచ్చే సమయానికి, పాత సరుకు కూడా ఎంతో కొంత మిగిలి వుంటుంది. ఆ రెండూ కలిసి మొత్తం ఎంత రాసి వుందో, అందులో మొదటిది ఎక్కువగా వుందా, రెండోది ఎక్కువగా వుందా— అనే పరిస్థితిని బట్టి, మొత్తం ఆ సరుకు అంతటికీ ఏదో ఒకే విలువ ఏర్పడుతుంది. అది పాత విలువ అయినా కావచ్చు, కొత్త విలువ అయినా కావచ్చు, మధ్య రకం విలువ అయినా కావచ్చు. సరుకుకంతటికీ ఒకే విలువ అంటే, కొత్త సరుకు వచ్చాక పాత సరుకు విలువ, ఎంతో కొంత మారితే మారవచ్చు. అప్పటి నించి మొత్తం ఆ సరుకు అంతా ఆ మారిన కొత్త విలువతోనే వుంటుంది. పాత సరుకు కూడా కొత్త విలువతోనే.

ఇప్పుడు మనం మన దారం ఉదాహరణకి తిరిగి వద్దాం. బట్ట పెట్టుబడిదారుడు గతంలోనే కొంత దారాన్ని కొని వుంటాడు అనుకున్నాం. 100 మీటర్ల బట్ట కోసం అవసరమయ్యే దారం విలువ 30— అని కూడా అను కున్నాం. ఆ దారాన్ని ఉపయోగించే సమయానికి, దాని విలువ 30 కన్నా ఎక్కువో తక్కువో అవడానికి అవకాశం వుంది. నిజానికి ఆ దారం గతంలో తయారైపోయి వున్నదే. అది ఇప్పుడు కొత్తగా తయారవడంలేదు. అయినప్పటికీ, ఆ రకం సరుకే ఇప్పుడు కొత్తగా తయారైతే, దానికి ఏ విలువ వుంటుందో ఆ విలువే ఈ పాత సరుకుకి కూడా వుంటుంది. గతంలో కొని వుంచిన పాత సరుకునే తర్వాత ఉపయో గించినప్పుడు (అది ఏ మాత్రమూ చెడిపోనట్టు అయితే) దాని విలువ పాత పరిస్థితుల్ని బట్టి గాక కొత్త పరిస్థితుల్ని బట్టే వుంటుంది. అంటే, గతంలో కొని వుంచిన ‘ముడి పదార్థం’ విలువ, దాన్ని ఉపయోగించే సమయానికి ఎంతో కొంత మారితే మారవచ్చన్న మాట! అయితే, దాని విలువ మారడం వల్ల సమస్యేమీ రాదు. విలువ మారితే, ఆ మారిన విలువే ముడి పదార్థం విలువగా లెక్కకి వస్తుంది. మారితే— మారిన విలువే. మారకపోతే— మారని పాత విలువే. ఏ విలువని లెక్కలోకి తీసుకుంటే, ఆ విలువ మీదే మన ప్రశ్న వుంటుంది. “ముడి పదార్థం, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇస్తుందా?” అనే ప్రశ్న.

బట్ట తయారయ్యే సమయానికి, దానికి సంబంధించిన దారం విలువ, మార్కెట్లో 40 గా అయిందనుకుందాం. ఇప్పుడు, మన బట్టలోవున్న దారం విలువ కూడా 40 గానే లెక్కకు వస్తుంది. ఇంతకు ముందు 30 మీద వేసుకున్న ప్రశ్న ఇప్పుడు 40 మీద వేసుకుంటాం. దారం విలువ 30 గా వున్నప్పుడు — “ దారం, తన ద్వారా బట్టకి 30 విలువనే ఇస్తుందా, అంత కన్నా ఎక్కువ విలువని ఇస్తుందా?” అని ప్రశ్నించుకున్నట్టే, దారం విలువ 40 అయినప్పుడు, “దారం, తన ద్వారా బట్టకి 40 విలువనే ఇస్తుందా, అంత కన్నా ఎక్కువ విలువని ఇస్తుందా?” అని ప్రశ్నించుకుంటాం. ముడి పదార్థానికి ఏ విలువ వుంటే ఆ విలువ మీదే ఆ ప్రశ్న వస్తుంది.

ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ముడి పదార్థాల్ని పెట్టుబడిదారుడు ఏ విలువకి కొంటాడో ఆ విలువ, ఆ ముడి పదార్థాలతో తయారైన సరుకుని అమ్మేవరకూ మారలేదనే అనుకోవాలి. (మారితే, ఆ ముడి పదార్థంతో తయారయ్యే సరుకు విలువ కూడా మారు తుంది. అంతే తేడా.)

సైను బట్ట కోసం పెట్టుబడిదారుడు దారం కొన్నప్పుడు దాని విలువ 30. బట్ట తయారయ్యేదాకా ఆ విలువ

మారలేదు. 30 విలువ గల దారం, తన ద్వారా ఆ బట్టకి 30 విలువని మాత్రమే ఇవ్వగలుగుతుంది. అంటే, ముడి పదార్థాలు, 'కొత్త సరుకు'కి తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వలేవు.

సైను బట్ట ద్వారా పెట్టుబడిదారుడికి లాభంగా మిగిలిన '20 విలువ' ఏ అంశం నించి వచ్చిందో చూస్తున్నాం కదా? అది, దారం నించి మాత్రం రాలేదు. బట్టకి వున్న మొత్తం 120 విలువలో, దారం ద్వారా చేరింది 30 విలువే. అది పోగా ఇంకా 90 విలువ వుంటుంది. ఈ 90 తో దారానికేమీ సంబంధం లేదు.

## శ్రమ పరికరాలు గానీ, ఆగ్జిలరీ పదార్థాలు గానీ, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలవా ?

తయారయ్యే కొత్త సరుకుకి విలువని ఇచ్చే విషయంలో, ముడి పదార్థాలకు వర్తించే కారణమే ఇతర శ్రమ సాధనాలన్నిటికీ కూడా వర్తిస్తుంది. ఎందుకంటే, అవి కూడా నిర్జీవ వస్తువులే. అవి, అప్పటికే తయారైపోయివున్న వస్తువులు. అలాంటి వస్తువుని ఒక పనిలో వాడినప్పుడు, అది, తనలో ఎంత విలువ వుందో అంత విలువని మాత్రమే ఇవ్వగలదు.

కొంత బట్టని నేసే పనిలో, ఒక కొత్త మగ్గం, పూర్తిగా పాతబడి ఖర్చయిపోయిందనుకుందాం. ఆ మగ్గం విలువ 10 అనుకుందాం. ఆ మగ్గం, తన ద్వారా కొత్త బట్టకి ఎంత విలువని మాత్రమే చేర్చగలదంటే, తన విలువ ఎంత వుంటుందో అంత విలువని మాత్రమే. ఈ ఉదాహరణలో మగ్గం తన ద్వారా బట్టకి 10 విలువని మాత్రమే చేర్చ గలదు. మగ్గం ద్వారా చేరే విలువ, అంతకన్నా ఎక్కువా వుండదు, తక్కువా వుండదు. శ్రమ సాధనాల్లో, దేని విషయం అయినా ఇంతే. అంటే, 'ముడి పదార్థాల' లాగే శ్రమ పరికరాలు కూడా తమ విలువ కన్నా ఎక్కువ విలువని సరుకుకి ఇవ్వవు. ఇవ్వలేవు.

శ్రమ పరికరాల్లో ప్రతీ ఒక్కదానికీ దేని 'జీవిత కాలం' దానికి వుంటుంది. ఆ కాలాన్ని బట్టి అది రోజూ పనిలో ఎంత భాగం విలువని ఇస్తుందీ అనేది వుంటుంది. శ్రమ పరికరాలు, ఒక కొత్త సరుకుని తయారుచేసేటప్పుడు, తమలో నించి ఎంత విలువని పోగొట్టుకుంటాయో ఆ విలువ కన్నా ఎక్కువ విలువని సరుకుకి ఇవ్వలేవు.

ఆగ్జిలరీ పదార్థాల సంగతి కూడా ఇంతే. ఇవి కూడా తమ విలువ కన్నా ఎక్కువ విలువని కొత్త వస్తువుకి ఇవ్వలేవు.

ఒక వస్తువు, 'ముడి పదార్థం' అయినా, 'ఆగ్జిలరీ పదార్థం' అయినా, 'శ్రమ పరికరం' అయినా, దాన్ని ఒక పనిలో వాడినప్పుడు, అది తన విలువ కన్నా ఒక్క అణు వంత కూడా ఎక్కువ విలువని కొత్త సరుకుకి చేర్చదు. ఈ విషయంలో శ్రమ సాధనాలన్నీ ఒకే స్వభావంతో వుంటాయి.

బట్ట పెట్టుబడిదారుడికి బట్ట ద్వారా వచ్చిన '20 లాభానికి' ఏ అంశం కారణమో — చూస్తున్నాం కదా? ముడి పదార్థం కారణం కాదని మొదట తేలింది. ఇప్పుడు, ఇతర శ్రమ సాధనాలు కూడా కారణం కాదని తేలింది. పెట్టుబడిదారుడు, ముడి పదార్థం మీద 30 పెడితే, దాని ద్వారా బట్టకి 30 విలువ మాత్రమే చేరుతుంది. అలాగే, ఇతర శ్రమ సాధనాలన్నిటి మీదా 50 పెడితే వాటి ద్వారా బట్టకి 50 మాత్రమే చేరుతుంది. అంటే ఇప్పటికి బట్టకి చేరింది $30 + 50 = 80$ విలువ. కానీ, బట్టలో మొత్తం 120 విలువ వుంది. అంటే, ముడి పదార్థానికీ, ఇతర శ్రమ సాధనాలకూ సంబంధం లేకుండా చేరిన విలువ ఇంకా 40 వుంది. ఇక మనకు మిగిలిన అంశం ఆ బట్టని తయారు చెయ్యడంలో పనిచేసిన 'శ్రామికులు'. ఈ శ్రామికులకూ, బట్టలో వున్న ఆ 40 విలువకీ ఏం సంబంధమో ఇప్పుడు చూద్దాం.

## శ్రామికులు, తమ 'జీతాల' విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలరా ?

పెట్టుబడిదారుడు, శ్రామికుల మీద ఎంత ఖర్చు పెడితే వారి ద్వారా అంతే తిరిగి వస్తుందా, ఎక్కువో తక్కువో వస్తుందా?— ఈ విషయమే ఇప్పుడు చూడాలి.

100 మీటర్ల బట్టని తయారుచెయ్యడానికి పెట్టుబడి దారుడు శ్రామికుల జీతాల మీద, 20 రూ.లు ఖర్చు పెట్టాడు. ఈ ఖర్చుతో వాడు, ఆ శ్రామికుల నించి 20 కన్నా ఎక్కువ విలువని తీసుకోగలడని గనక తేలితే, 'లాభ రహస్యం' బయటపడి పోయినట్టే! నిజానికి ఇందులో

తేలవలసిందేమీ లేదు. బట్టని తయారు చెయ్యడంలో పాల్గొన్న 3 అంశాలలోనూ, మొదటి 2 అంశాలూ తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వలేవని తేలిపోయినప్పుడు, ఇక ఆ పని ఈ 3 వ అంశం ద్వారానే జరుగుతుందని తేలిపోయినట్టే కదా? అయితే, ఆ పని 'ఎలా' జరుగుతుందో మాత్రమే ఇక్కడ తెలుసుకోవాలి. అది తెలుసుకుంటే, ఆ పని ఈ అంశం ద్వారానే జరిగిందని నిర్వివాదంగా రుజువు చెయ్యవచ్చు.

పెట్టుబడిదారుడు, శ్రామికులకు జీతాలుగా 'కొంత డబ్బు' ఇస్తాడు. ఆ డబ్బుతో శ్రామికులు, ఆహార పదార్థాలూ, బట్టలూ, అద్దె ఇల్లూ, మందులూ వంటివన్నీ కొనుక్కుంటారు. ఆ వస్తువుల్ని శ్రామికులు తమ ఇళ్ళ దగ్గిరే, తమ జీవనం కోసం వాడుకుంటారు. ఒకవేళ పెట్టుబడిదారుడు, శ్రామికులకు ఇచ్చే జీతాల్ని డబ్బు రూపంలో గాక, వారికి కావలసిన సరుకుల రూపంలోనే ఇచ్చినా (పెట్టుబడిదారుడే ఒక సరుకుల దుకాణం పెట్టి అందులోంచి బియ్యమూ, బట్టలూ, మందులూ వగైరాలన్నీ శ్రామికులు తీసుకునేలాగ ఏర్పాటు చేస్తే), ఆ సరుకుల్ని కూడా శ్రామికులు తమ ఇళ్ళకు తీసుకుపోయి ఇళ్ళ దగ్గిరే వాడుకుంటారు. 'జీతాల్ని' ఏ రూపంలో ఇచ్చినా ఒకటే. సరుకులే ఇస్తే ఆ సరుకులే వాడు కుంటారు. 'డబ్బు' ఇస్తే, దానితో వేరు వేరు పెట్టుబడి దారుల నించి తమకు కావలసిన సరుకులు కొనుక్కుని వాడుకుంటారు. ఎలాగైనా, జరిగే విషయం ఒకటే.

మొదట ఇక్కడ 2 విషయాలు గ్రహించాలి. (1) పెట్టుబడిదారుడు శ్రామికులకు 'జీతాలు' ఇవ్వడం అంటే, వారు జీవించడానికి కావలసిన 'కొన్ని వస్తువులు' ఇస్తున్నాడని అర్థం. 'జీతాలు' అంటే 'కొన్ని వస్తువులు' అని అర్థం. (2) జీతాలుగా వుండే ఆ వస్తువులు, పెట్టుబడిదారుడి 'పని స్థలానికి' బయట, శ్రామికుల ఇళ్ళల్లో, వారు జీవించడం కోసం ఖర్చవుతాయి. అంతేగాని, అవి శ్రామికులు పనిచేసే 'పని స్థలం'లోకి రావు. ఇక్కడ తయారయ్యే కొత్త సరుకు కోసం ముడి పదార్థాలూ అవీ ఖర్చయినట్టుగా, అవి ఇక్కడ ఖర్చు కావు. — ఈ 2 విషయాలూ సరిగా అర్థం చేసుకుని ముందుకు సాగితే, తర్వాత చూసే విషయాలు చాలా తేలిగ్గా వుంటాయి.

పెట్టుబడిదారుడు ఖర్చుచేసే 'మొత్తం పెట్టుబడి'లో ఒక భాగం — 'శ్రమ సాధనాలు'. 2 వ భాగం శ్రామికులకు ఇచ్చే 'జీతాలు'. 'జీతాలు' అంటే, శ్రామికులు వాడుకునే వస్తువులే కాబట్టి, పెట్టుబడిలో 2 వ భాగం, శ్రామికులు వాడే వస్తువులే. ఈ 2 భాగాలే 'పెట్టుబడి'. ఈ 2 భాగాలకూ సంబంధించిన వస్తువులు మార్కెట్లో సిద్ధంగా తయారై లేకపోతే, పెట్టుబడిదారుడి 'పని స్థలం'లో పనే ప్రారంభం కాదు.

పెట్టుబడిదారుడు శ్రామికులకు 'జీతాలు' ఇస్తే (డబ్బు రూపంలో గానీ, సరుకుల రూపంలో గానీ), మరి శ్రామికులు పెట్టుబడిదారుడికి తిరిగి ఏమిస్తారు? ఒక వ్యక్తి ఇంకో వ్యక్తి దగ్గిర బియ్యం అప్పు తీసుకుని మళ్ళీ బియ్యమే తెచ్చి ఇచ్చినట్టూ ; డబ్బు అప్పు తీసుకుని మళ్ళీ డబ్బే తెచ్చి ఇచ్చినట్టూ — పెట్టుబడిదారుడికీ శ్రామికులకూ మధ్య కూడా అలాగే జరుగుతుందా? శ్రామికులు పెట్టుబడిదారుడి నించి వస్తువులో డబ్బో తీసుకుంటారు కాబట్టి, వారు ఏం తీసుకుంటారో అవే మళ్ళీ పెట్టుబడిదారుడికి తెచ్చి ఇస్తారా? అలా ఇవ్వడానికి వారి దగ్గిర ఆ వస్తువులు గానీ, ఆ డబ్బు గానీ, ఎక్కడ వుంటాయి? వాటిని శ్రామికులు ఖర్చు పెట్టేసుకుంటారు కదా? కాబట్టి, పెట్టుబడిదారుడు ఇచ్చిన వస్తువులకు బదులుగా వారు పెట్టుబడిదారుడికి తిరిగి ఏమి ఇస్తారంటే — తమ 'శ్రమని' ఇస్తారు. అంటే, పెట్టుబడి దారుడి 'పని స్థలంలోకి వచ్చి, వాడు చెయ్యమన్న 'పని' చేస్తారు.

పెట్టుబడిదారుడు, తన 'పెట్టుబడి'లో కొంత భాగాన్ని 'శ్రమ సాధనాల' మీద ఖర్చు చేస్తే, ఆ ఖర్చుతో 'నిర్జీవమైన' వస్తువులే పని స్థలంలోకి వస్తాయి. కానీ ఇంకో భాగాన్ని శ్రామికుల 'జీతాల' మీద ఖర్చుచేస్తే, ఈ భాగంతో నిర్జీవమైన వస్తువులు కాదు, 'సజీవమైన మనుషులు' పని స్థలంలోకి వస్తారు.

శ్రమ సాధనాలూ, పనిచేసే మనుషులూ — కలిస్తేనే 'కొత్త పని' జరుగుతుంది. 'కొత్త వస్తువు' తయారవుతుంది. పెట్టుబడిదారుడికి కావలసిన 'సరుకు' తయారవుతుంది.

సరే, శ్రామికులు 'పని స్థలం'లోకి వస్తారు. 'వచ్చాక ఏం జరుగుతుంది? శ్రామికులు పని స్థలంలోకి వచ్చాక ముడి పదార్థాల్ని చేతుల్లోకి తీసుకుని, శ్రమ పరికరాల సహాయంతో, కొత్త వస్తువుని తయారుచేసే పని మొదలు పెడతారు. పని చెయ్యడమే, శ్రమ చెయ్యడం.

శ్రామికులు, పనిచేస్తూ వుంటే వారి శరీరాల్లో శక్తి ఖర్చయిపోతూ వుంటుంది. శరీరాలు అలిసిపోతూ వుంటాయి.

ఈ రకంగా, ఒక వేపు —శ్రామికులు శ్రమ చేస్తూవుంటే, ఇంకో వేపు— శ్రమ సాధనాలు కూడా ఖర్చవుతూ వుంటాయి. అది, బట్టని నేసే పని అయితే, దారం బేళ్ళు, బట్టగా మారిపోతూ వుంటాయి. నేత పరికరాలు అరిగిపోతూ వుంటాయి. ఒకవేపు — నిర్జీవ వస్తువుల ఖర్చుతోటీ, ఇంకో వేపు— సజీవ మానవుల శ్రమతోటీ, ముడి పదార్థాలు కొత్త రూపంలోకి మారిపోతూ వుంటాయి.

పని స్థలంలో ఖర్చయ్యే నిర్జీవ వస్తువులన్నిటినీ కలిపి, ముడి పదార్థంతో సహా, 'శ్రమ సాధనాలు' అనవచ్చని చూశాం. ప్రతీ శ్రమ సాధనమూ కొంత శ్రమతో తయారై వున్న వస్తువే. అలాంటి వస్తువులు కొన్ని, ఈ పని స్థలం లోకి వచ్చి, ఈ 'కొత్త వస్తువు కోసం' ఖర్చవుతున్నాయి. శ్రమ సాధనాలు ఖర్చవడం అంటే, వాటికి సంబంధించిన శ్రమ అంతా కొత్త వస్తువు కోసం అవసరమవుతోందని అర్థం. అయితే, శ్రమ సాధనాలకు సంబంధించిన శ్రమ అంతా 'గత శ్రమ'. అంటే, గతంలో జరిగిన శ్రమ. ఇది, వస్తువుల రూపంలో వున్న శ్రమ. దీన్ని 'నిర్జీవ శ్రమ' అని కూడా అంటాము.

( గత శ్రమ = పాస్ట్ లేబర్
నిర్జీవ శ్రమ = డెడ్ లేబర్
వస్తురూపంలో వున్న శ్రమ = ఆబ్జెక్టిఫైడ్ లేబర్.
ఈ మాటలన్నిటికీ అర్థం ఒకటే)

కానీ, 'పని స్థలం'లో, శ్రామికులు చేసే పని, 'గత శ్రమ' కాదు. ఇది, ఇప్పుడే కొత్తగా జరుగుతూ వున్న ప్రస్తుత శ్రమ. లేదా, సజీవ శ్రమ.

( ప్రస్తుత శ్రమ = ప్రెజెంట్ లేబర్
సజీవ శ్రమ = లివింగ్ లేబర్
కొత్త శ్రమ = న్యూ లేబర్
ఈ మాటలన్నిటికీ అర్థం ఒకటే)

ఇక్కడ సారాంశం ఏమిటంటే— శ్రమ సాధనాలకు సంబంధించిన శ్రమ — నిర్జీవ శ్రమ అయితే, శ్రామికులు ఇచ్చే శ్రమ — సజీవ శ్రమ.

'పని స్థలం'లో, సజీవ శ్రమా, నిర్జీవ శ్రమా ఒకదానితో ఒకటి సంబంధంలోకి వస్తాయి. శ్రమ చేసే మనుషులు లేకపోతే, శ్రమ సాధనాలు కదలవు. శ్రమ సాధనాలు లేకపోతే, ఆ మనుషులూ కదలరు. రెండు అంశాలూ కలిస్తేనే పని ప్రారంభమవుతుంది. గత శ్రమా, ప్రస్తుత శ్రమా రెండూ ఖర్చవుతూ, కొత్త వస్తువు తయారవుతూ వుంటుంది. శ్రమ సాధనాలు ఖర్చు కాకుండా, శ్రామికులు చేసే సజీవ శ్రమ మాత్రమే ఖర్చవడం గానీ, సజీవ శ్రమ ఖర్చుకాకుండా శ్రమ సాధనాలు మాత్రమే ఖర్చవడం గానీ, జరగదు. శ్రమ సాధనాలూ, సజీవ శ్రమా కలిసికట్టుగా ఖర్చవుతూ వుంటేనే కొత్త ఉత్పత్తి తయారవుతూ వుంటుంది.

దీన్ని ఒక ఉదాహరణ ద్వారా చూద్దాం: కొందరు శ్రామికులు పనిలోకి దిగి 1 గంట సేపటికి 10 మీటర్ల బట్ట తయారు చేశారనుకుందాం. అప్పటికి కొంత ముడి పదార్థమూ, శ్రమ పరికరాల్లో కొంత భాగమూ ఖర్చవుతాయి. అప్పటికి శ్రామికులు కూడా ప్రతీ ఒక్కరూ 1 గంట సేపు 'శ్రమ' చేసివుంటారు. ఇంకో గంట సేపటికి ఇంకో 10 మీటర్ల బట్ట తయారైందనుకుందాం. మళ్ళీ కొంత ముడి పదార్థమూ, మళ్ళీ శ్రమ పరికరాల్లో ఇంకా కొంత భాగమూ ఖర్చవుతాయి. అప్పటికి శ్రామికుల్లో ప్రతీ ఒక్కరూ 2 గంటల సేపు శ్రమ చేసి వుంటారు. ఇలా ప్రతీ గంటకీ 10 మీటర్ల బట్ట తయారవుతూవుంటే, ఆ తయారవుతోన్న సరుకు కోసం, శ్రమ సాధనాలూ — సజీవ శ్రమా కూడా ఖర్చవుతూనే వుంటాయి.

శ్రామికులు, పెట్టుబడిదారుడి పని స్థలంలోకి వచ్చి, కొత్త సరుకు కోసం పని చెయ్యడం మొదలు పెట్టారనుకుందాం. అలా ఎంత సేపు పని చెయ్యాలి వారు? దానికేమైనా ఒక 'హద్దు' వుంటుందా? తప్పకుండా హద్దు వుంటుంది. శ్రామికులు ఎంత సేపు పని చెయ్యాలంటే, వారు — పెట్టుబడిదారుడి నించి 'జీతాలు'గా ఎంత విలువని తీసుకుంటారో అంత విలువని పెట్టుబడిదారుడికి తిరిగి ఇచ్చేవరకూ పని చెయ్యాలి. శ్రామికులు పనిలోకి దిగకముందే పెట్టుబడిదారుడు 'జీతాలు' ఇచ్చేస్తాడని దీని అర్థంకాదు. జీతాలు ఎప్పుడూ పని పూర్తి అయిన తర్వాతే అందుతాయి. ఇక్కడ చూడవలసిన విషయం, జీతాల్ని ముందు తీసుకుంటారా, తర్వాత తీసుకుంటారా — అని కాదు. ఎప్పుడు తీసుకున్నా, వాటికి బదులుగా శ్రామికులు ఏమి ఇస్తారు — అని! తమ శ్రమని ఇస్తారు. అంటే, పెట్టుబడిదారుడు చెప్పిన పని చేస్తారు.

పెట్టుబడిదారుడు, శ్రామికులకు ఇచ్చేది — కొన్ని వస్తువులు. లేదా, కొంత డబ్బు. అంటే, కొంత 'విలువ'.

శ్రామికులు, పెట్టుబడిదారుడికి ఇచ్చేది — కొంత శ్రమ. అంటే, కొంత 'విలువ.'

ఆ వస్తువులకూ, ఈ శ్రమకూ మారకం జరగాలన్న మాట!

శ్రామికులు పెట్టుబడిదారుడికి ఇవ్వవలసిన విలువని తమ శ్రమ ద్వారానే ఇవ్వాలి. పెట్టుబడిదారుడి నించి తీసుకున్న విలువని తిరిగి ఇవ్వకుండా వుండడానికి శ్రామికులకు హక్కు లేదు. కాబట్టి, పెట్టుబడిదారుడు శ్రామికులకు జీతాలుగా ఎంత విలువని ఇస్తాడో, అంత విలువగల పని చెయ్యడమే శ్రామికులు చెయ్యవలసిన పనికి న్యాయమైన హద్దు. ఆ హద్దు వరకూ పనిచేస్తే, పెట్టుబడిదారుడు ఇచ్చే విలువా, శ్రామికులు పెట్టుబడిదారుడికి తిరిగి ఇచ్చే విలువా, ఒకదాని కొకటి సరిపోతాయి. అప్పుడు, ఆ మారకం, సమాన విలువల మధ్య జరిగే మారకంగానే వుంటుంది.

అయితే, పెట్టుబడిదారుడికీ, శ్రామికులకూ మధ్య అలాంటి మారకమే జరుగుతూ వుంటుందా? అసలు ఏం జరుగుతూ వుంటుంది? — ఈ విషయాల్ని ఇక్కడి నించీ

చాలా వివరంగా చూడాలి. ఇది, నిర్జీవ, సజీవ శ్రమల సంబంధాన్ని చూడడం.

ఒక వస్తువు తయారయ్యేటప్పుడు, దాని కోసం, నిర్జీవ శ్రమ ఖర్చయ్యే విధానానికీ, సజీవ శ్రమ ఖర్చయ్యే విధానానికీ చాలా పెద్ద తేడా వుంటుంది. ఈ తేడాని, ఎంత సరిగా అర్థం చేసుకుంటే, తర్వాత విషయాలన్నిటినీ అంత సరిగా అర్థం చేసుకోగలుగుతాము. ఈ విషయం, ఆర్థిక శాస్త్రానికంతటికీ మౌలికమైనది. గత కాలపు ఆర్థికవేత్త లంతా ఈ విషయాన్ని ఎంతో అవక తవకగా అర్థం చేసుకున్నారు. దాని వల్ల, 'సరుకుకి విలువ ఎలా ఏర్పడు తుంది' అనే విషయం అనేక గందరగోళాల మధ్య ఇరుక్కు పోయింది. శ్రామికులు, పని స్థలంలోకి వచ్చాక ఊరికే కూర్చోరనీ, 'పని' చేస్తారనీ, ఆర్థికవేత్తలందరికీ తెలుసు. కానీ, ఆ 'పని' ద్వారా వారు ఎంత విలువని ఇస్తారో ; వారు తీసుకునే జీతాలకూ, వారు చేసే పనికీ సంబంధం ఏమిటో ; సరుకు తయారీలో జీతాలు ఎలాంటి పాత్ర నిర్వహిస్తాయో — ఈ విషయాలేవీ ఆ ఆర్థికవేత్తలకు తెలీవు. ( **స్మిత్తూ, రికార్డో** వంటి ఆర్థికవేత్తలకు కూడా ఈ విషయాలు తెలీవు.)

అసలు, 'ఏది ముడి పదార్థం, ఏది శ్రమ పరికరం' — అనే విషయాల్ని గ్రహించే చోట కూడా ఆర్థికవేత్తలు చాలా గందరగోళ పడ్డారు. కాబట్టి, ఈ విషయాల గురించి మనం చాలా జాగ్రత్తగా, శ్రద్ధగా అర్థం చేసుకోవాలి.

ఇప్పుడు, శ్రామికులు, 'బట్ట'ని తయారుచేసే పనిలోకి దిగబోతున్నారు.

ఇక్కడ మొదట, 'నిర్వహణ శ్రమ' (లేదా, 'పర్యవేక్షణ శ్రమ') అనే శ్రమ గురించి కొంత చూడాలి. కొంత మంది మనుషులు, ఒక చోట చేరి, ఒక పని చెయ్యవలసి నప్పుడు, అక్కడ 'నిర్వహణ శ్రమ' కూడా అవసర మవుతుంది. వస్తువుల్ని ఉత్పత్తి చేసే కార్యక్రమంలో, నిర్వహణ శ్రమ కూడా తప్పనిసరే. ఈ శ్రమకు కూడా ఒక జీతం వుంటుంది. ఈ శ్రమని పెట్టుబడిదారుడే చేస్తే, దాని జీతాన్ని పెట్టుబడిదారుడే తీసుకోవచ్చు. అప్పుడు, పెట్టుబడి దారుడు కూడా శ్రామికులతోపాటు ఒక శ్రమ చేసే వ్యక్తి అవుతాడు. లేదా, పెట్టుబడిదారుడు, నిర్వహణ శ్రమ కూడా చెయ్యకుండా, ఆ శ్రమని ఒక ఉద్యోగి చేస్తాడనుకుందాం. ఆ ఉద్యోగి కూడా శ్రామికుడే. ఆ శ్రమకి సంబంధించిన జీతం ఆ ఉద్యోగికే వెళ్తుంది. నిర్వహణ శ్రమని ఎవరు చేసినా, ఆ జీతం కూడా, మొత్తం జీతాలలో భాగంగా వుంటుంది.

'బట్ట' ఉదాహరణలో, 'జీతాల — కోసం 20' అని చూశాం. అంటే, నిర్వహణ–శ్రమ జీతం కూడా ఆ 20 లోనే వుందని అర్థం.

ఇక్కడ, 'బట్ట' ఉదాహరణలో, 'నిర్వహణ శ్రమ'ని పెట్టుబడిదారుడే చేస్తాడనుకుందాం. పెట్టుబడిదారుడు కూడా ఒక శ్రమ చేసి, ఒక జీతం తీసుకుంటే, దాన్ని గురించి సమస్య లేదు. ఆ జీతం కాకుండానే, పెట్టుబడిదారుడికి, 'లాభం' వస్తుంది. ఆ 'లాభం' గురించే ఈ పరిశోధన అంతా!

'శ్రామికులు, తమ జీతాల కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలరా?' అనే ప్రశ్నకి జవాబు కోసం ఇదంతా చూస్తు న్నాము. ఆ జవాబు కోసం ఇంకా చాలా వివరాలు చూడాలి. అప్పుడుగానీ మనకు జవాబు దొరకదు.

ఇప్పుడు, శ్రామికులు, పనిలోకి దిగడంతో ప్రారంభిస్తు న్నాము. జీతాల్ని, పని ప్రారంభించక ముందే గానీ, ప్రారంభించిన వెంటనే గానీ, ఇవ్వరు. పని పూర్తి అయిన తర్వాతే ఇస్తారు. కానీ, జీతాలుగా ఎంత ఇస్తారో పని కన్నా ముందే నిర్ణయమై వుంటుంది. ఈ ఉదాహరణలో, జీతాల విలువ — 20.

శ్రామికులు పొద్దున్నే బట్టని తయారుచేసే పనిలోకి దిగారనుకుందాం. ఈ పనిలో రక రకాల శ్రామికులు కావాలి. అందరూ మగ్గం మీద కూర్చుని నేత నేసే వారిగానే వుండరు. బట్ట తయారవడానికి అనేక రకాల పనులు జరగాలి. వేరు వేరు పనులు చేసే శ్రామికులంతా ఎవరి స్థానాల్లో వాళ్ళు నిలబడి పని చేశారు. అందరూ కలిసి 20 విలువ గల పని చేసేటప్పటికి మధ్యాన్నం అయింది. అప్పటికి, జీతాల విలువకి తగ్గ పని చేసినట్టే. వాళ్ళు చెయ్యవలసిన పని అయిపోయింది.

అప్పటికి 50 మీటర్ల బట్ట తయారైందనుకుందాం. ఆ బట్ట తయారవడానికి 15 విలువ గల ముడి పదార్థమూ (దారం), 25 విలువ గల మిగతా శ్రమ సాధనాలూ, ఖర్చయ్యాయనుకుందాం. అంటే, 50 మీటర్ల బట్ట కోసం అయిన మొత్తం ఖర్చు = ముడిపదార్థం 15 + శ్రమ సాధనాలు 25 + శ్రామికుల పని విలువ 20 = 60 అవు తుంది. అంటే, ఆ 50 మీ. బట్టకి 60 విలువ వుంది. ఎందుకంటే, దాని కోసం మొత్తం 60 విలువ గల శ్రమ ఖర్చు అయింది కాబట్టి.

మధ్యాన్నం అయ్యేటప్పటికి, శ్రామికులు, పని ఆపేశా రనుకుందాం. తర్వాత, వారు పెట్టుబడిదారుడితో "నువ్వు ఇచ్చే జీతాలు 20. మేము చేసిన పని విలువ 20. మా జీతాల విలువకి తగ్గ పని చేసేశాం. పని అయిపోయింది. జీతాలు ఇయ్యి! వెళ్ళిపోతాం" అంటారనుకుందాం. నిజా నికి, శ్రామికులకు, 'జీతాలకు తగ్గ పని' అనీ, 'జీతాల కన్నా ఎక్కువ పని' అనీ — ఇదేమీ తెలీదు. శ్రామికులు ఆ రకపు లెక్కలతో మాట్లాడలేరు. కానీ ఇక్కడ విషయాలు తేలిగ్గా అర్థం కావడం కోసం, ఆ తర్వాత జరిగేదంతా ఇలా

ఉంటుందని ఊహిద్దాం.

పెట్టుబడిదారుడు, అప్పటికి తయారైన ఆ 50 మీటర్ల బట్టని చూసి, దానికి అయిన ఖర్చులన్నీ గబగబా లెక్క కట్టుకుంటాడు. 60 ఖర్చు అయింది. అదే రకం బట్టకి మార్కెట్లో, 50 మీటర్లకి 60 విలువే వుంది. అంటే, 1 మీటరుకి 1 రూ. 20 పై.ల విలువ. ఈ రకం బట్టని అమ్మే వాళ్ళంతా అలాగే అమ్ముతున్నారు. తను కూడా ఆ 50 మీటర్లనీ అమ్మాలంటే, 60 కే అమ్మాలి. కానీ, దాని ఖర్చే 60 అయిందే! దానిమీద 'ఎక్కువ వేసుకోవడం' ఎలా సాధ్యం? మరి ఇతర పెట్టుబడిదారులందరూ అదే విలువకి అమ్మినా, లాభం ఎలా తీసుకుంటున్నారు? వాళ్ళకి, 60 కన్నా తక్కువ ఖర్చే అయి వుంటుంది. తన దగ్గిర కూడా దీని ఖర్చు 60 కన్నా కొంత తక్కువై వుంటే, దీని మీద ఆ కొంతా వేసుకుని 60 కి అమ్మడానికి వీలయ్యేది. ఇప్పుడు దీని మీద ఒక్క పైసా వేసుకోడానికి కూడా వీలులేదే! దీన్ని 60 కి అమ్మితే లాభం ఏం వస్తుంది? ఇంత మాత్రానికే ఈ వ్యవహారం అంతా పెట్టుకోడం ఎందుకు?

"పనివాళ్ళు ఇంకా కొంతసేపు పని చెయ్యకూడదూ? ఇప్పుడు మధ్యాన్నమే కదా అయింది? ఇళ్ళకుపోయి రాత్రి దాకా ఏం చేస్తారు? వాళ్ళ చేతిలో పని. మళ్ళీ జీతాలు తీసుకోకుండా ఇంకా కాస్త పనిచేస్తే వాళ్ళ సొమ్మేం పోతుంది? దానికేమన్నా వాళ్ళ సిరి సంపదలు ఖర్చయిపోతాయా? వాళ్ళ కండలేం కరిగిపోతాయా?" — ఆలోచనలు ఇలా సాగుతోన్న కొద్దీ పెట్టుబడిదారుడి మొహం నెమ్మది నెమ్మదిగా విప్పారడం మొదలు పెడుతుంది. కానీ, లోపల్లోపల కొంచెం జంకు — 'జీతాలకు తగ్గ పనిచేసేశారు కదా? జీతాలు లేకుండా ఇంకా పని చెయ్యమంటే చేస్తారా? ఏమంటారో!' అని. కాస్సేపటికి ఆ ముఖ మండలం మరింత విప్పారింది. ఎవరో గుర్తొచ్చారు దానికి. 'అవును! ఆయన సాధించగలడు' అని తల తాటించుకుంది అది.

"ఏమిటి? పని ఆపేశారేం? కానివ్వండీ!" అన్నాడు పెట్టుబడిదారుడు నిదానంగా — శ్రామికులు అన్నది తను విననే విననట్టు.

"పని అయిపోయిందని చెప్పాంగా?"

"అయిపోయిందా! అప్పుడే అయిపోతే ఎలాగ? లెక్కలన్నీ చూశాను. ఏమీ మిగల్లేదు. అప్పుడే పని ఆపేస్తే, దీని వల్ల నాకేం వచ్చినట్టు?"

శ్రామికులు ఆశ్చర్యపోయారు. "ఏమీ రాలేదా! మరి ఈ బట్ట ఎవరి కొచ్చింది? చక్కగా ఇంత ముద్దొచ్చే బట్ట వస్తే ఏమీ రాలేదా?"

"బట్టేం ముద్దొస్తుందీ, దాని మీద ఏమన్నా మిగిలితే ముద్దొస్తుంది గానీ? నా డబ్బంతా ఖర్చు పెట్టేశాను. ఈ గుడ్డ కోసమా?"

"దీన్ని అమ్మేసుకుంటావుగా? నీ డబ్బంతా నీకు తిరిగి వచ్చేస్తుంది. ఎక్కడికీ పోదు నీ డబ్బు. నువ్వు ఎంత పెట్టావో అంతా వచ్చేస్తుంది"

"హేవిటీ! నా డబ్బు నాకు తిరిగి రావడానికేనా, ఈ ఏర్పాట్లన్నీ? ఈ మగ్గాలూ, ఈ పత్తి బేళ్ళూ, ఈ గోడౌనులూ, ఈ తతంగం అంతా, ఖర్చు పెట్టిందాన్ని సంపాయించడానికేనా? అసలు నేనీ ఉత్పత్తి అంతా దేని కోసం చేయిస్తున్నాను? దేశం కోసం చేయిస్తున్నాను. నేను బట్ట నేయించకపోతే, మనుషులంతా బట్టలెలా కట్టుకుంటారు? ఇంత సేవకి నా కేమీ రావొద్దా? నా 'సేవ'ని మీరేమీ గుర్తించినట్టు లేదే!"

"నేయించిన వాడిదే అంత 'సేవ' అయితే, నేసినవాళ్ళదెంత సేవ అవ్వాలి! దారాన్ని బట్టగా నేసి మేము సేవ చెయ్యలేదూ? మా సేవని నువ్వేం గుర్తించావు?"

"ఊరికే చేశారా మీరు? జీతాలు తీసుకోరూ?"

"నువ్వు మాత్రం వూరికే చేశావా? నీ పనికి నువ్వూ జీతం తీసుకుంటావుగా? పనివాడి జీతం కన్నా పది రెట్లు ఎక్కువ జీతం తీసుకుంటావుగా?"

"అంతేనా? జీతం వస్తే మాత్రం, 'జీతం రాళ్ళ' తోటే సంతృప్తి పడాలా నేను?"

"ఏం, మేము సంతృప్తి పడడం లేదూ 'జీతం రాళ్ళ' తో?"

"మీరు పడితే పడతారు. అలా సంతృప్తి పడడానికి నాకేం అవసరం? నాకు బోలెడు శ్రమ సాధనాలున్నాయి. నా శ్రమ సాధనాల వల్ల గాదూ మీరు పని చేసింది? నా శ్రమ సాధనాలే లేకపోతే మీరు కాళ్ళతో, చేతుల్తో పని చేస్తారా? శ్రమ సాధనాలు వున్న వాణ్ణి, నాకు ఇంకా ఎక్కువ రావొద్దూ?"

"మా కాళ్ళూ చేతులూ లేకపోతే, నీ శ్రమ సాధనాలే పని చేస్తాయా? పోనీ నీ శ్రమ సాధనాలే గొప్పవి అనుకో. నీ శ్రమ సాధనాల్ని మేం తిన్నామా? వాటి ఖర్చులన్నీ నీ సరుకులోకే చేరతాయి కదా? ఆ సరుకుని అమ్ముకుంటే అవన్నీ నీకే తిరిగొస్తాయి కదా?"

"అంతేనా? నా ఖర్చులేనా నాకు తిరిగొచ్చేది? అయితే ఇదంతా పెట్టుకున్నందుకు నాకేం లాభం?"

"నీకు 'లాభం' రావాలంటే మమ్మల్నేం చెయ్యమంటావు?"

"అలా అడిగారు, బాగుంది. ఇంకా కొంచెంసేపు పని చెయ్యరాదూ? మీ చేతిలో పని. ఇప్పట్నించీ ఇళ్ళకి పోయి ఏం చేస్తారు?"

"చెయ్యమంటే ఎందుకు చెయ్యం? మళ్ళీ జీతాలిస్తే ఎందుకు చెయ్యం?"

"మళ్ళీ జీతాలా? అయ్యో! నన్నర్థం చేసుకోరేం? మళ్ళీ

జీతాలిస్తే అప్పుడు కూడా మళ్ళీ ఇలాగే జరుగుతుంది కదా? దాని వల్ల నాకేం ‘ లాభం?’ అప్పుడు మాత్రం నాకేం మిగులుతుంది?”

“నీ లాభం కోసం మేం జీతాలు లేకుండా పని చెయ్యాలా? నీకు లాభం వస్తే మాకేం లాభం?”

“మిమ్మల్ని పోషిస్తున్నాననే విశ్వాసం లేదూ మీకు?”

“అదేం మాట? పిచ్చి మాట! నువ్వు పోషించడం ఏమిటి మమ్మల్ని? పనిచేస్తే జీతాలిస్తున్నావు. మా శ్రమతో మేం బతుకుతున్నాం. మమ్మల్ని మేం పోషించు కుంటు న్నాం. మమ్మల్ని పోషించమని నిన్నడుగు తున్నామా?”

“మీ కందరికీ నేను పని చూపించానా లేదా?”

“చూపించావు. మేం కాదన్నామా? దాని వల్ల నీకేం నష్టం చేశాం? మా వల్ల నువ్వేమన్నా నష్టపోతున్నావా? నీ జీతాలకు తగ్గ పని చేశామా, లేదా?”

“అయ్యో! అంతేనా? దీని వల్ల నాకేం మిగిలింది? లాభం రాకపోవడం నష్టం కాదూ? ఒక్కోసారి పెట్టుబడికి ఎంతెంత నష్టాలొస్తాయో మీకేం తెలుసు? ఆ లెక్కలన్నీ మీకు తెలియవు. ఆ నష్టాలెలా పూడ్చుకోవాలి నేను?”

“నీ కైతే ‘ఒక్కోసారి’ నష్టాలొస్తాయేమో గానీ మా కైతే ప్రతి రోజూ, ప్రతి పూటా నష్టాలొస్తాయి. మా ఆరోగ్యాలు ప్రతీ గంటా క్షీణించి పోతాయి. పనిలో మా శరీరాలన్నీ గాయాలవుతాయి. మా కాళ్ళూ చేతులూ తెగిపోతూ వుంటాయి. కొన్ని పనుల్లో మా ప్రాణాలే పోతూ వుంటాయి. మా నష్టాల మాటేమిటి? నీకు ఎప్పుడో ఒక సారి డబ్బు నష్టం వస్తుందని వాపోతున్నావు!”

“అంతేనా! అంతేనా! ఇంత పెట్టుబడి పెట్టి, ఇంత సేవ చేసినందుకు ప్రతిఫలం రాదా? అంతేనా!”

“సేవ చేసేవాడికీ గోలెందుకయ్యా? బట్ట తయారు చేయించి అమ్మితే ‘ సేవ’ ఏమిటి? మనం బట్ట తయారు చేస్తే, ఇంకొకళ్ళు ఇంకోటి తయారుచేస్తారు. నువ్వు అన్నం తినడానికి బియ్యం అక్కరలేదా? ఆ పని ఇంకోళ్ళు చెయ్యడంలేదా? అందరం ఏదో ఒక పని చెయ్యాలి, చేస్తున్నాం. చెయ్యకపోతే మనం వాడుకోడానికి వస్తువు లెక్కణ్ణించి వస్తాయి? నీకు మాత్రం వస్తువు లక్కరలేదూ? ఇందులో ‘ సేవ’ ఏమిటి?”

“హేవిటీ? ఇంత పెట్టుబడి పెట్టి, ఇంత మంది పని వాళ్ళకి ఉద్యోగాలిచ్చి, ఇంత చేస్తోంటే, నాది ‘ సేవ’ కాదా? మీ పనీ, నా పనీ ఒకటేనా?”

“ఎన్ని సార్లు చెప్పినా నీ పాట నీదే! సరేలే. నువ్వు చాలా సేవలు చేస్తున్నావు. త్యాగాలు చేస్తున్నావు. ఇంకా చాలా చేస్తున్నావు. సద్గుణాల పుట్టవి నువ్వు! సరేనా? నీకు చాలా కీర్తి వస్తుంది. ‘ఎంత మంచివాడో ఈయన’ అని లోకం అంతా నిన్ను మెచ్చుకుంటారు. మమ్మల్నెవ్వరూ మెచ్చుకోరు. నీ సేవకి అంత కీర్తి వస్తుంది, సరేనా?”

“ఆఁ, కీర్తి కూడా రావలిసిందే. నా సేవకి కీర్తి రాకపోతే అర్థమే లేదు. కీర్తి మాట సరే. ఉత్త కీర్తి అయితే నేనేం చేసుకోను? నేనేం దేవుణ్ణా కీర్తనలతో మురిసిపోటానికి?”

“కీర్తి కూడా చాలదా నీకు? దాని వల్ల కూడా డబ్బే రావాలా? నీతో మాట్లాడి మాట్లాడి విసుగొస్తోంది. మా జీతాలు మాకు పడెయ్యి, పోవాలి. నువ్విచ్చే జీతాలకు తగ్గ పని చేసేశాం. అంతకన్న మాకేం తెలీదు.”

పనివాళ్ళు ఇంత మాట్లాడగలరని పెట్టుబడిదారుడు ఊహించలేక పోతున్నాడు. ఏ మాటంటే ఆ మాటకే వాళ్ళు ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. వాళ్ళకి ఇంకా ఎలా చెప్పాలో తోచడం లేదు, వాడికి. వీళ్ళు పని చెయ్యకుండా వెళ్ళిపోతే తనేం చెయ్యాలి? — బిత్తరపోయి దిక్కులు చూస్తున్నాడా దేశ సేవకుడు.

ఘర్షణ అలా సాగుతూ వుండగా, సరిగ్గా ఆ సమయంలో ఒకాయన ఉరుకుల్తో పరుగుల్తో వచ్చి, హఠాత్తుగా గడప అవతల శాంతం పులుముకుని లోపలికి వచ్చిన వాడి లాగ, నెమ్మదిగా మంద గమనంతో ప్రవేశించాడు. మిస మిసలాడే ఇస్త్రీ బట్టలూ, కళ్ళద్దాలూ, చేతిలో ఏవో గ్రంథాలూ!

వాణ్ణి చూడగానే శ్రామికులకు రెండేసి రకాల ఆలోచనలు వచ్చాయి. “ఈయనెవరో కాస్త తెలిసినవాడిలా వున్నాడు” అనీ అనిపించింది; “వీడెవడో కాస్త చదువు వెలగబెట్టినట్టున్నాడు” అనీ అనిపించింది.

ఆ పెద్ద మనిషి పెట్టుబడిదారుడి ఆర్థికవేత్త. పెట్టుబడిదారుడికి ఏం ఇబ్బంది వచ్చినా ఈయన సలహాలిస్తూ వుంటాడు. అతగాడు వచ్చి కాస్సేపు అక్కడ ఘర్షణంతా విన్నాడు.

రెండు పక్షాల వాళ్ళూ ఎవరి వాదం వాళ్ళు చెప్పారు.

అంతా విని చిరునవ్వుతో వాడు నాలుగు ముక్కలే అన్నాడు — “ ‘పెట్టుబడి’ పెట్టిన వాడికి ‘లాభం’ రావద్దా? మీ శ్రమతోటే మీరు బతకవచ్చుగాక, ఈయన పెట్టుబడి పెట్టకపోతే మీకు పనులెక్కణ్ణించి వస్తాయి? పెట్టుబడికి లాభం రాదంటే, పెట్టుబడెవడు పెడతాడు? ‘ లాభం’ రాకపోతే, ఈయన ఈ వ్యవహారాలన్నీ ఇవ్వాళే కట్టి పెట్టేస్తాడు, సరేనా? మీ కిష్టమేనా? మీ దారిన మీరు వెళ్తారా? చెప్పండి!.... సేవ అయితే మాత్రం ‘లాభం’ లేకుండా చెయ్యగలరా ఎవరైనా?”

శ్రామికులు నిశ్చేష్టులయ్యారు. పెట్టుబడిదారుడు తమకు పనులు ఇచ్చాడనే మాట కాదనలేరు. దాని కోసం ఆయన కొంత పెట్టుబడి పెట్టాడనే మాట కూడా కాదనలేరు. తమకు పనులు దొరకాలంటే, పెట్టుబడి పెట్టేవాడు వుండాలి. పెట్టుబడి పెట్టేవాడు వుండాలంటే, పెట్టుబడికి

లాభం రావాలి! పెట్టుబడికి లాభం రాకపోతే, తమకు పనులు దొరికే మార్గం వుండదు. పనులు దొరకక పోతే, తాము బతికే మార్గం వుండదు. పెట్టుబడిదారుడి లాభానికీ, తమ బతుకుదెరువుకీ వున్న సంబంధాన్ని అంత స్పష్టంగా చూసినందుకే నిశ్చేష్టులయ్యారు శ్రామికులు.

పెట్టుబడిదారుడితో వాదించినప్పుడు చాలా ఎదురు ప్రశ్నలు వేశారుగానీ, ఇప్పుడు మౌనం వహించారు. ఈ వచ్చినవాడి ప్రశ్నలకు కూడా అద్భుతమైన జవాబులు ఉన్నాయని శ్రామికులు ఎరగరు. శ్రమ చేసేవారు జీవించడానికి పెట్టుబడి పెట్టేవాడు అక్కరలేదనీ, శ్రమ సాధనాలు, లాభాన్ని లాగే పెట్టుబడి పాత్రని నిర్వహించకుండానే అందరికీ పనులు కల్పించుకోవడం సాధ్యమేననీ — వాళ్ళు ఎరగరు.

"లాభం రాకపోతే పెట్టుబడిదారుడు ఈ వ్యవహారమంతా కట్టి పెట్టేస్తాడంటున్నావు కదా? మా పనులూ, ఈ వస్తువులూ లేకపోతే అప్పుడు వాడు మాత్రం ఏం తింటాడు? మేము మా జీతాలతో బతుకుతున్నట్టే అతను కూడా తన జీతంతో బతకవచ్చుకదా? లాభం కూడా ఎందుకూ?" అని వాళ్ళు ఆ వచ్చిన వాణ్ణి అడగలేదు. అలా అడగాలని వాళ్ళకి తెలీదు.

'లాభం రాకపోతే పెట్టుబడి ఎవడు పెడతాడు? పెట్టుబడి పెట్టేవాడు లేకపోతే మీకు పనులెక్కణ్ణించి వస్తాయి? పనులు మానేసి వెళ్ళిపోతారా, చెప్పండి?' — చాలు! ఈ నాలుగు ముక్కలూ చాలు శ్రామికుల్ని లొంగదియ్యడానికి. ఆ ఆఖరి అస్త్రం, పెట్టుబడిదారుడు వెయ్యని అస్త్రం.

వచ్చిన పెద్ద మనిషి అక్షర లక్షలు చేసే మాటలు మాట్లాడాడు. శ్రామికులు దేనికి లొంగుతారో పూర్తిగా తెలిసి మాట్లాడాడు. 'పెట్టుబడే' మాట్లాడితే ఏం మాట్లాడుతుందో సరిగ్గా అలా మాట్లాడాడు. లాభం లేకుండా ఎవరైనా ఏదైనా చెయ్యగలరనీ, సేవ అయినా చెయ్యగలరనీ, పెట్టుబడి ఊహించగలదా?

మౌనంగా నిలబడ్డ శ్రామికులు నెమ్మదిగా కదిలారు — పని స్థలం వేపు! పొద్దుటి నుంచీ పనిచేసి అలిసిన వాళ్ళు, ఇళ్ళకు పోయి విశ్రాంతి తీసుకోవాలని బైల్దేరినవాళ్ళు, మళ్ళీ పనిలోకి దిగారు. ఎవరి స్థలంలో వాళ్ళు ఒక మానవ యంత్రంలా క్రమశిక్షణతో నిలబడ్డారు.— ఇప్పుడు జీతాలు లేకుండా పని చెయ్యడానికి!

మళ్ళీ మగ్గాలు కదలడం ప్రారంభమైంది. మళ్ళీ ముడి పదార్థం కదలడం ప్రారంభమైంది.

ఇప్పుడు పెట్టుబడి, జీతాలు ఇవ్వక్కరలేదనే సంతోషంతో ఉత్సాహంగా 'శ్రమ'ని పీల్చడం ప్రారంభమైంది.

పెట్టుబడిదారుడూ, వాడి ఆర్థికవేత్తా, నెమ్మదిగా అక్కడి నించి తప్పుకున్నారు. విశాలంగా వున్న ఒక గదిలోకి ప్రవేశించేవరకూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. ఆర్థికవేత్త, కిటికీ దగ్గర మెత్త మీద కూర్చుని చెమటలు పట్టని మొహాన్ని రుమాలుతో తుడుచుకుంటూ, చూపులు కిటికీ బైట చెట్లలోకి సారించాడు. జేబులోకి పెద్ద కట్ట ఏదో దిగబడ్డ సంగతి గమనించనే గమనించనట్టు, అలాగే కిటికీలోంచి వన సౌందర్యాస్వాదనలో మునిగిపోయాడు.

పెట్టుబడిదారుడికి ఇంకా కొంచెం ఆందోళనగానే వుంది. పని వాళ్ళు మళ్ళీ పనిలోకి వెళ్ళారుగానీ నిజంగా పని చేస్తారా, లేచి వెనక్కి వచ్చేస్తారా — అని. ఆర్థికవేత్తతో చాలా మాట్లాడాలని వుంది గానీ ఆయన సౌందర్యాన్వేషణలో మునిగివున్నాడు. 'ఆ మొక్కల్లో ఏం వుంది అంత సేపు చూడ్డానికి' అని పెట్టుబడిదారుడికి కొంచెం విసుగనిపించింది.

"మీకు పువ్వులంటే చాలా ఇష్టమనుకుంటాను" అని వినయంగా పలకరించాడు.

ఆర్థిక శాస్త్రవేత్త, జేబు బరువుతో ఇటు తిరిగాడు. "అవును. నేను ప్రకృతిని ప్రేమిస్తాను. పూలతోటని చూస్తూ ఎన్ని గంటలైనా కూర్చోగలను" అని చిరునవ్వు నవ్వాడు.

అవును మరి! ఎన్ని గంటలైనా కూర్చోడానికి వాడికి తీరిక వుంటుంది! వాడికి కిటికీల అవతల తోటలుంటాయి! కిటికీల ఇవతల మెత్తలుంటాయి! కిటికీలూ, తోటలూ, మెత్తలూ గల ఎన్నెన్నో గదులూ, గదులు గల భవనాలూ, ఇంకా చాలా చాలా వుంటాయి వాడికి. పై కప్పులేని చింపిరి పూరి గుడిసె జీవితం కాదు వాడిది. రాట్నం ముందో, మగ్గం ముందో, నాగలి ముందో, గనుల్లోనో, మరల్లోనో, రోజంతా పడివుండవలసిన అగత్యం లేదు వాడికి. అందుకే వాడు ప్రకృతిని ప్రేమిస్తాడు! పూలతోటల్లోకి ఎంత సేపైనా చూస్తూ కూర్చుంటాడు!

పెట్టుబడిదారుడు కొంచెం కంఠం తగ్గించి, వినయంగా — "వాళ్ళు ఎక్కువ సేపు పని చేస్తారంటారా? ఎంత సేపు చేస్తారంటారు?" అని గుండెల్ని తొలుస్తోన్న సందేహం బైట పెట్టేశాడు.

ఆర్థికవేత్త నిర్లక్ష్యంగా తల ఎగరేసి — "వాళ్ళ మొహం! చెయ్యకేం చేస్తారు? ఎంత సేపైనా చేస్తారు. మీరు చెయ్యమన్నంత సేపు చేస్తారు. చెయ్యకపోతే వాళ్ళని మీరు పనుల్లోంచి తీసేస్తారు. వాళ్ళకి బతుకుతెరువేదీ?" అన్నాడు.

పెట్టుబడిదారుడి మొహంలోకి కళ తొంగి చూసింది. ఆర్థికవేత్త నోట ఇంకేవేవో సుభాషితాలు వినాలని వినయంగా తలవాల్చాడు.

"ఆర్థిక శాస్త్ర విషయాల మీద నేనో పుస్తకం

ప్రారంభించాను" అన్నాడు వేత్త 'గంభీరం'గా.

"చాలా సంతోషం! చాలా సంతోషం! ఆ విషయాలు మీరే రాయాలి. ఇందాక మీరు వాళ్ళతో అన్నారే! ఆ వాక్కులు ఎంత గొప్పగా వున్నాయో! ఆ మాటలు నాకు తోచనేలేదు. 'నువ్వు కూడా జీతం తీసుకోవడం లేదా? ఇంకా లాభం ఏమిటి?' అని వాళ్ళనగానే నేను కంగారు పడిపోయాను. మీరు వస్తారనే ధైర్యంతోటే అలా నిల బడ్డాను."

"మీరు కూడా జీతం తీసుకుంటే, అది మీరు చేసే పనికి. అది కాకుండానే, మీ 'పెట్టుబడి'కి లాభం రావొద్దూ? ఇదే చిక్కు, పని వాళ్ళతో! ఆర్థిక శాస్త్ర విషయాలు అందరికీ తెలిస్తే ఈ చిక్కులు వుండవండీ. పెట్టిన పెట్టుబడికి లాభం వచ్చి తీరాలని పనివాళ్ళకి సరిగా తెలిస్తే ఈ వాద వివాదాలే వుండవు."

"ఆ పుస్తకం ఏదో తొందరగా రాయండి. నేనే అచ్చు వేయిస్తాను."

"పెట్టుబడి పెట్టే మనిషికి లాభం రావడం ఎంత అవసరమో అందరూ తెలుసుకోవాలని నా ఆరాటం. లాభం ఎలా వస్తుందని నేను రాస్తున్నానంటే..."

ఇద్దరూ గొప్ప 'ఆర్థిక శాస్త్ర' సంభాషణలో మునిగి పోయారు.

పని స్థలంలో, శ్రామికులు చీకటిపడే దాకా పని చేశారు. మళ్ళీ 50 మీటర్ల బట్ట తయారుచేశారు. ఆ పనిలో కూడా మళ్ళీ కొన్ని ముడి పదార్థాలూ, కొన్ని శ్రమ పరికరాలూ వుపయోగించారు. అవి ఖర్చు కాకుండా పని జరగదు కదా? అంటే ఈ 50 మీటర్లకి కూడా మొదటిసారి లాగానే 15 విలువ గల ముడి పదార్థమూ, 25 విలువ గల ఇతర శ్రమ సాధనాలూ, 20 విలువగల సజీవ శ్రమా ఖర్చయ్యాయి. మొత్తం 15 + 25 + 20 = 60. మొదటి 50 మీటర్ల బట్టకి ఎంత విలువ గల ఏ యే అంశాలు కావలసి వచ్చాయో దీనికీ అంతే.

అయితే, ఈసారి పెట్టుబడిదారుడు సజీవ శ్రమ కోసం ఏమీ ఖర్చు పెట్టడు. అంటే ఈ సారి జీతాలు ఇవ్వడు. ఈ సారి శ్రామికుల కోసం తప్ప మిగిలిన అంశాల కోసం మాత్రమే ఖర్చు పెడతాడు. అంటే, 15 + 25 కోసం మాత్రమే. ఆ శ్రమ సాధనాల్ని సప్లయ్ చెయ్యకపోతే శ్రామి కులు పనిచెయ్యలేరు కాబట్టి ఆ ఖర్చుని వాడు తప్పించు కోలేడు. ఎటొచ్చీ వాడు తప్పించుకోగలిగేది శ్రామికులకు ఇచ్చే దగ్గరే.

వాళ్ళకి మళ్ళీ జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఏం జరిగింది? పెట్టుబడిదారుడికి ఏం కలిసొచ్చింది? — మళ్ళీ జీతాలు ఇవ్వకుండా ఎగ్గొట్టినదంతా కలిసొచ్చింది కదా? పెట్టుబడిదారుడు జీతాల కోసం మళ్ళీ 20 విలువని ఖర్చు పెట్టకుండా తప్పించుకున్నాడు కదా?

పెట్టుబడిదారుడు శ్రామికులకు మళ్ళీ 20 ఇవ్వక పోయినా, ఆ బట్ట కోసం, ఆ 20 శ్రమ కూడా ఖర్చయినట్టు అర్థమే కదా? బట్టకైతే ఆ 20 విలువ కూడా చేరుతుంది. అదే పెట్టుబడిదారుడికి కావలసింది.

ఇప్పుడు మొత్తం 100 మీటర్లనీ కలిపి చూస్తే, దానికి మొత్తం ఎంత విలువ వుంది? దానికంతటికీ పట్టిన మొత్తం ముడి పదార్థం విలువ 30. మొత్తం శ్రమ పరికరాల విలువ 50. మొత్తం సజీవ శ్రమ విలువ 40. ఈ 3 అంశాలూ కలిసి 30 + 50 + 40 = 120. ఇది ఆ బట్టకి వున్న నిజమైన విలువ. అసలు విలువ.

అయితే, ఆ బట్టని తయారు చేయించడానికి పెట్టుబడిదారుడు ఎంత ఖర్చు పెట్టాడు? ముడి పదార్థాల 30 + శ్రమ పరికరాల 50 + జీతాల 20 = 100 మాత్రమే. అంటే, పెట్టుబడిదారుడు, ముడి పదార్థం కోసమూ, ఇతర శ్రమ సాధనాల కోసమూ ఎంత పెట్టాలో అంతా పెట్టాడు. శ్రామికులకు ఇవ్వవలసిన దాన్ని మాత్రం సగం ఎగ్గొట్టేశాడు.

పెట్టుబడిదారుడు జీతాల మీద 20 మాత్రమే పెట్టాడు కాబట్టి, శ్రామికులు, 20 విలువ గల శ్రమ మాత్రమే చేశారని అర్థమా? — కాదు. 40 విలువ గల శ్రమ చేశారు. అంటే, పెట్టుబడిదారుడు, శ్రామికులతో 40 విలువ గల శ్రమ చేయించి, జీతాలుగా 20 మాత్రమే ఇచ్చాడు.

పెట్టుబడిదారుడు, బట్ట కోసం, 100 మాత్రమే ఖర్చు పెట్టాడు కాబట్టి, ఆ బట్ట తయారవడానికి నిజంగా 100 విలువ మాత్రమే (100 శ్రమ మాత్రమే) ఖర్చయిందని అర్థమా? — కాదు, 120 ఖర్చయింది.

ఇదే రకం బట్టకి, మార్కెట్లో, 50 మీటర్లకి 60 విలువ వుందని చూశాం. అంటే, 100 మీటర్లకి అయితే 120 విలువ. ఇప్పుడు, మన బట్ట పెట్టుబడిదారుడు తన 100 మీ. బట్టని అమ్మితే 120 వస్తుంది. అందులో నించి తను ఖర్చుపెట్టిన 100ని వెనక్కి తీసుకుంటే, ఆ పైన 20 లాభం!

పెట్టుబడిదారుడు, శ్రామికులకు జీతాలుగా 20 గాక, 40 ఇచ్చేస్తే ఏమవుతుంది? — 'లాభం' అంతర్ధాన మవుతుంది. 'పెట్టుబడి' కథే అంతమవుతుంది. జీతాల కోసం 40 ఇచ్చేస్తే, ఆ బట్ట కోసం పెట్టుబడిదారుడు పెట్టే ఖర్చూ, బట్ట విలువా సమానం అవుతాయి. బట్టని అమ్మగా వచ్చే 120, ఖర్చులకే సరిపోతుంది. 'లాభం' కోసం ఏమీ మిగలదు. అంటే, శ్రామికులు చేసిన శ్రమ కోసం ఎంత ఇవ్వాలో అంతా ఇచ్చేస్తే 'లాభం' కథే వుండదన్నమాట!

ఈ ఉదాహరణలో, జీతాలు 20 అంటే, శ్రామికులు 20 శ్రమ మాత్రమే చేశారని అర్థం కాదు. ఒకవేళ, పెట్టుబడిదారుడు జీతాలుగా 20 కూడా ఇవ్వకుండా 10 మాత్రమే ఇస్తే, శ్రామికుల శ్రమ విలువ పదే అయిపోదు. పెట్టుబడిదారుడు అసలు, జీతాలే ఇవ్వకుండా ఎగ్గొడితే, శ్రామికులు చేసిన పనికి విలువ లేనట్టో, అసలు శ్రామికులు పనే చెయ్యనట్టో, ఎవరూ పని చెయ్యకుండానే బట్ట తయారైనట్టో — అయిపోదు. అంటే, పెట్టుబడిదారుడు జీతాలుగా ఎంత ఇస్తాడో అదే శ్రామికులు చేసే 'శ్రమ విలువ' కాదు.

జీతమే — 'శ్రమ విలువ' కాదు.

'జీతం' వేరూ, 'శ్రమ విలువ' వేరూ.

ఇవి రెండూ ఒకే 'పరిమాణం'తో వుండడానికి వీలు లేదు. శ్రామికులు ఇచ్చిన 'శ్రమ విలువ' కన్నా, వారికి పెట్టుబడిదారుడు ఇచ్చే 'జీతాల విలువ' తప్పనిసరిగా తక్కువగా వుండి తీరుతుంది. లేదా, దీన్ని వేరే మాటల్లో చెప్తే, జీతాల విలువ కన్నా, శ్రామికుల శ్రమ విలువ తప్పనిసరిగా ఎక్కువగా వుండి తీరుతుంది. ఎందుకంటే, ఆ రెంటికీ వుండే తేడాయే లాభంగా అందాలి గనక.

పెట్టుబడిదారుడు ఇచ్చే జీతమూ, శ్రామికులు ఇచ్చే శ్రమ విలువా 'సమానంగా' వుంటే, ఒక సరుకు కోసం పెట్టుబడిదారుడు ఖర్చుపెట్టే పెట్టుబడి కన్నా ఎక్కువ విలువని సరుకుకి చేర్చే మార్గమే వుండదు. ఆ మార్గం లేకపోతే, 'లాభం' అనే ప్రశ్నే వుండదు. కాబట్టి జీతమూ, శ్రమ విలువా ఒకటి కాదు. 'జీతం'గా వచ్చేదే — శ్రమ విలువ కాదు. వేరే మాటల్లో చెప్తే — 'శ్రమ విలువ అంతా జీతం'గా వుండదు. అందులో కొంత భాగమే 'జీతం'గా వుంటుంది. 'జీతం' అనేది 'శ్రమ విలువ' కన్నా తప్పనిసరిగా తక్కువగా వుంటేనే 'లాభం' అనేది సాధ్యం. 'లాభ రహస్యం' అంతా ఇదే!

బట్ట ఉదాహరణలో, శ్రామికులు, జీతాల విలువకి తగ్గ పని, అంటే 20 విలువ గల పని, మధ్యాన్నానికే చేసేశారు. కానీ, వాళ్ళు అప్పుడే పని మానెయ్యడానికి వీలు లేకపోయింది. పెట్టుబడిదారుడికి 'లాభపడే హక్కు' వుంది. వాడి హక్కుని శ్రామికులు 'అపహరిస్తే' వాడు వూరుకోడు. అందుకే శ్రామికులు ఇంకా పని చెయ్యవలసి వచ్చింది.

అంటే, శ్రామికులు 'అదనంగా' కూడా పని చేశారన్న మాట! దేని కన్నా అదనంగా? జీతాల విలువ కన్నా అదనంగా. ఈ బట్ట ఉదాహరణలో, శ్రామికులు జీతాలతో ఎంత పని చేశారో, జీతాలు లేకుండా కూడా మళ్ళీ అంత పని చేశారు. జీతాలు లేకుండా చేసిన శ్రమ — 'అదనపు శ్రమ'. 'అదనపు శ్రమ'కి వున్న విలువ — 'అదనపు విలువ'.

శ్రామికులు, ఆ రోజు చేసిన మొత్తం పనికంతటికీ న్యాయంగా జీతాలు వస్తే, వారికి 20 గాక, 40 రావాలి. కానీ, వారికి పెట్టుబడిదారుడు 20 మాత్రమే ఇచ్చాడు. మిగిలింది 'అదనపు విలువ'. అది 20. ఈ రకంగా, జీతాలతో పనిచేసే శ్రామికులు తప్పనిసరిగా ఎంతో కొంత 'అదనపు విలువ'ని ఇవ్వాలి. అంటే తప్పనిసరిగా 'అదనపు శ్రమ' చెయ్యాలి. అంటే, తక్కువ జీతం తీసుకుని దానికన్నా ఎక్కువ శ్రమ చెయ్యాలి.

పెట్టుబడిదారుడి దగ్గిర, జీతం తీసుకుంటూ పనిచేసే ప్రతీ శ్రామికుడూ, ఆ జీతం విలువ కన్నా ఎక్కువ విలువ గల శ్రమ చేస్తున్నాడన్న మాట. అలా అయితేనే పెట్టుబడిదారుడు అమ్మబోయే సరుకులోకి, వాడు దానికోసం ఖర్చు పెట్టే దాని కన్నా ఎక్కువ విలువ చేరడానికి అవకాశం వుంటుంది.

పెట్టుబడిదారుడు, ముడి పదార్థాల మీదా, శ్రమ పరికరాల మీదా, జీతాల మీదా పెట్టిన ఖర్చులన్నిటినీ కలిపినంత మాత్రాన్నే ఎక్కువ విలువ రాదు. వాడు ఖర్చు చెయ్యకుండానే కొంత విలువని ఆ సరుకులోకి చేర్చే మార్గం ఏదన్నా వుంటేనే ఎక్కువ విలువ వస్తుంది.

పెట్టుబడిదారుడు, బట్టలోకి తన ఖర్చుతో 100 విలువనీ, తనకు ఏమీ ఖర్చు కాకుండా 20 విలువనీ చేర్చగలిగాడు. అంటే, 100 ఖర్చుతో 120 విలువ బట్టకి ఏర్పడేలాగ చెయ్యగలిగాడు. అంటే, తక్కువ శ్రమని ఖర్చు పెట్టి, ఎక్కువ శ్రమని తీసుకోగలిగాడు. ఈ 'అద్భుతం' వాడు ఎలా సాధించాడో ఇప్పుడు మనకు తెలుసు. ఎలా సాధించాడు? — ఆ ఎక్కువ శ్రమని, 'శ్రమ సాధనాల' మీద పెట్టిన ఖర్చు ద్వారా గాక, 'జీతాల' మీద పెట్టిన ఖర్చు ద్వారా సాధించాడు.

## శ్రమ సాధనాలు చెయ్యలేని పని జీతాలు ఎలా చేస్తాయి?

శ్రమ సాధనాలు నిర్జీవ వస్తువులు కాబట్టి, అవి, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వలేవని చూశాం. అయితే 'జీతాలు' కూడా నిర్జీవ వస్తువులే కదా? జీతాలు అంటే, శ్రామికుల పోషణ వస్తువులే కదా? ఈ పోషణ వస్తువులు మాత్రం తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఎలా ఇవ్వగలుగుతాయి? శ్రమ సాధనాలు చెయ్యలేని పని, జీతాలు ఎలా చేస్తాయి? — దీనికి జవాబేమిటంటే, ఆ పని చేసేది, జీతాలు కాదు; జీతాల్ని తీసుకునే 'మనుషులు'. వస్తువుకీ మనిషికీ వున్న తేడా వల్లనే ఇది సాధ్యమవుతుంది.

శ్రమ సాధనాల లాగే జీతాలు కూడా నిర్జీవ వస్తువులే. అయితే పని స్థలంలోకి వచ్చేది ఆ నిర్జీవ వస్తువులే అయితే, అప్పుడు జీతాలు కూడా తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వలేవు. కానీ జీతాలు, పని స్థలంలోకి రావు. కొత్త సరుకు తయారయ్యే క్రమంలో, దాని కోసం, శ్రమ సాధనాలు పనిస్థలంలో ఖర్చయినట్టుగా, జీతాలు పనిస్థలంలో ఖర్చవవు. అవి, పని స్థలానికి బయట, శ్రామికుల ఇళ్ళ దగ్గిర, శ్రామికుల పోషణ కోసం ఖర్చవుతాయి. ఆ పోషణ వల్ల శ్రామికులకు పనిచేసే శక్తి వస్తుంది. ఆ శక్తితో శ్రామికులు పనిస్థలంలోకి వచ్చి పని చేస్తారు. అలా పని చేసేటప్పుడు వారు తాము వాడుకునే జీతాల విలువ కన్నా ఎక్కువ విలువ గల శ్రమ చెయ్యడం సాధ్యమవుతుంది. (ఈ అంశాన్ని ఈ సంపుటంలోనే 'శ్రమశక్తి విలువ' చాప్టరులో ఇంకా వివరంగా చూస్తాము.)

'కొత్త ఉత్పత్తిని' తయారు చెయ్యడానికి, శ్రమ సాధనాలూ, శ్రామికుల పోషణ వస్తువులూ (జీతాలు) కలిసి, పని స్థలంలోకి వస్తే, వాటితో ఏ పనీ జరగదు. కాబట్టి, పని స్థలంలో వుండే అంశాలు శ్రమ సాధనాలూ జీతాలూ కాదు. శ్రమ సాధనాలూ, మనుషులూ! మనుషులు, తాము తీసుకునే జీతాల విలువ కన్నా ఎక్కువ విలువ గల శ్రమ చేస్తారు. ఆ శ్రమ అంతా ఆ సరుకు కోసం జరిగిందే. అంటే, శ్రామికులు, జీతాల విలువ కన్నా ఎక్కువ విలువని కొత్త సరుకుకి చేరుస్తారు. ఈ రకంగా, శ్రమ సాధనాలు చెయ్యలేని పని, శ్రామికులు చేస్తారు. పెట్టుబడిదారుడు, తను శ్రామికులకు ఇచ్చే విలువ కన్నా వారి నించి ఎక్కువ విలువని తీసుకుని, ఆ రకంగా, తక్కువ ఖర్చుతో ఎక్కువ విలువని సంపాదించే 'అద్భుతాన్ని' సాధిస్తాడు.

కొత్త ఉత్పత్తి తయారైంది. అది, 100 మీ. బట్ట. దానికి 120 విలువ వుందని మనం ఉదాహరణ కోసం మొదటే చెప్పేసుకున్నాం. కానీ, సరుకుని చూస్తే, దానికి ఎంత విలువ వుందో తెలీదు. దాని కోసం అయిన ఖర్చులు మాత్రమే తెలుస్తాయి.

సరుకు తయారైన తర్వాత, పెట్టుబడిదారుడు, దానికి మొదట విలువని నిర్ణయించాలి. తర్వాతే, దాన్ని అమ్మాలి. విలువని నిర్ణయించాలంటే, మొదట సరుకు కోసం అయిన ఖర్చులన్నిటినీ కలపాలి. బట్ట ఉదాహరణలో, శ్రమ సాధనాలకీ జీతాలకీ అయిన ఖర్చులన్నిటినీ కలిపితే, అది 100. అంత వరకూ స్పష్టంగా తెలుస్తూనే వుంటుంది. ఆ బట్టని 100 కే అమ్మితే, పెట్టుబడిదారుడికి, ఖర్చయిన పెట్టుబడి మాత్రమే వెనక్కి వస్తుంది. లాభం ఏమీ రాదు.

కాబట్టి, పెట్టుబడిదారుడు ఏం చేస్తాడంటే, మొదట ఖర్చులన్నీ కలుపుతాడు. (అది 100). అదే రకం బట్ట, మార్కెట్లో ఎలా అమ్ముడు పోతోందో చూస్తాడు. (120 కి అమ్ముడు పోతోందని.) అప్పటి పరిస్తితుల్లో ఆ రకం బట్ట పెట్టుబడిదారులందరూ సాధారణంగా నూటికి ఎంత లాభం కలుపుకుంటున్నారో మన వాడూ అదే కలుపుకుంటాడు. అలా కలుపుకునే లాభాన్ని 'నూటికి 20' (20%) అనుకుందాం. 100 పెట్టుబడి మీద 20 లాభం కలిస్తే, మొత్తం 120. ఈ రకంగా, ఆ బట్ట విలువ 120 గా నిర్ణయమవుతుంది. పెట్టుబడిదారుడు ఆ విలువకి బట్టని అమ్ముతాడు.

120 విలువతో బట్ట ఇబ్బంది లేకుండానే అమ్ముడు పోతుంది.

ఎందుకంటే, ఆ బట్టలో నిజంగానే 120 విలువ వుంది గనక. ఆ బట్ట 120 కన్నా ఇంకా ఎక్కువకి అయితే అమ్ముడు పోదు. ఎందుకంటే, అందులో 120 కన్నా ఎక్కువ విలువ లేదు గనక. ఇదంతా పెట్టుబడిదారుడికి రెగ్యులర్‌గా వుండే 'మార్కెట్ అనుభవం'తో తెలుస్తుంది.

'ఖర్చుల మీద లాభం వేసుకోవడం' అనే పద్ధతిని పెట్టుబడిదారుడు, అలవాటు గానూ, సాంప్రదాయం గానూ చేసేస్తాడు. అంతేగానీ, అందులో వున్న ఆర్థిక శాస్త్ర విషయాలేవో తెలిసి కాదు.

బట్ట విలువ 120 కదా? దాన్ని కొన్న మనిషి (ఇంకో పెట్టుబడిదారుడు గానీ, శ్రామికులు గానీ,) దాన్ని తీసుకొని, 120 డబ్బు ఇస్తాడు. ఇక్కడ, బట్టని కొన్న వ్యక్తి, ఎక్కువ విలువని ఇచ్చిందేమీ లేదు. 120 విలువ గల బట్టని తీసుకున్నాడు కాబట్టే, 120 డబ్బు ఇచ్చాడు. 'బట్ట'కీ, 'డబ్బు'కీ 'మారకం' జరిగింది. ఇది 'సమాన విలువల' మారకమే. అయితే, ఈ విషయాలన్నీ బట్టని అమ్మే వ్యక్తికి గానీ, కొనే వ్యక్తికి గానీ, తెలీవు.

బట్ట పెట్టుబడిదారుడికి, బట్టని అమ్మడం వల్ల, దాన్ని కొన్న మనిషి నించి 120 డబ్బు వస్తుంది కదా? ఆ డబ్బులో నించి 100 పెట్టుబడి వెనక్కి వచ్చి, దాని మీద 20 లాభం కూడా వస్తుంది. దీన్ని చూసి, సరుకుని అమ్మిన వాడు ఏమనుకుంటాడంటే, తనకు వచ్చిన లాభం, 'కొన్న మనిషి నించే వచ్చింది' అనుకుంటాడు.

నిజానికి, సరుకుని అమ్మే పెట్టుబడిదారుడు, సరుకుకి 'విలువ' ఏర్పడే కారణాల గురించి, ఏ మాత్రమూ ఆలోచించడు. "నా బట్టని కొన్న వ్యక్తి 120 డబ్బుని ఎందుకు ఇచ్చాడు? బట్టకి అంత విలువ వుంటే ఇచ్చాడా, లేకుండా ఇచ్చాడా? అసలు ఈ లాభం ఎలా వచ్చింది?" అనే ప్రశ్నలతో పెట్టుబడిదారుడు తల బద్దలు కొట్టుకోడు. లాభాన్ని జేబులో పెట్టేసుకుంటూ— "అదీ తెలీదా? బట్టని

అమ్మేశాగా? అమ్మితే లాభం వచ్చింది" అంటాడు.

"నువ్వు బట్ట కోసం 100 మాత్రమే ఖర్చు పెట్టావు కదా? దాని విలువని 120 గా ఎందుకు నిర్ణయించావు?" అంటే,

"మరి నా లాభం? నాకు 'లాభం' రావొద్దా?" అంటాడు — "బట్ట కోసం నేను ఎంత ఖర్చు పెట్టానో అది నా 'పెట్టుబడి'. దాని మీద ఇంకో 20 ని వూరికే వేసు కున్నాను. 'లాభం' రావాలి గనక అలా చేశాను. అదే నా లాభం" అంటాడు. అంతే తెలుసు వాడికి!

కానీ, అసలు విషయం ఏమిటి? పెట్టుబడిదారుడు తన ఖర్చుల మీద (పెట్టిన 'పెట్టుబడి' మీద) 'లాభం' పేరుతో 'ఊరికే వేసుకుంటున్నట్టుగా' కనపడే విలువ కూడా సరుకుకి 'ఉన్న విలువే'. 'లేని విలువని' ఎవరూ సరుకుకి కలపలేరు. ఎందుకంటే — 'లేని విలువ'ని కలిపే సూత్రం, ఒక పెట్టుబడిదారుడికి వర్తిస్తే, అది అందరు పెట్టుబడిదారులకూ వర్తిస్తుంది గనక.

బట్టకి నిజంగా 120 విలువ లేకపోతే (100 విలువ మాత్రమే వుంటే), దానికి పెట్టుబడిదారుడు ఇంకా 20 విలువని కలపగలిగే వాడు కాదు. అలా కలిపితే, అది 'లేని' విలువని కలపడం. 'లేని విలువ'ని కలిపితే ఏమవుతుంది?: 'లేని విలువ'ని కలపడం అంటే 'సరుకు విలువ'ని 'నిష్కారణంగా' పెంచడం. అలాంటి పని ఒక్క పెట్టుబడిదారుడు మాత్రమే చేసి, మిగతా వాళ్ళు చెయ్యకపోతే, ఆ పని చేసిన వాడికి, లాభం ఎక్కువగానే వుంటుంది. కానీ, ఆ పని ఒక్క పెట్టుబడిదారుడు మాత్రమే చెయ్యగలిగే పరిస్తితి వుండదు. ఒకడికి వున్న హక్కు అందరికీ వుంటుంది. ఒకడు చేసే పని అందరూ చేస్తారు.

పెట్టుబడిదారులందరూ, తమ సరుకుల మీద, 20% లేని విలువని కలిపారనుకుందాం. అప్పుడేమవుతుంది? అన్ని సరుకుల విలువలూ నిష్కారణంగా 20% పెరుగు తాయి. ప్రతీ పెట్టుబడిదారుడూ, అలా పెరిగిన విలువకే తన సరుకుని అమ్మడమూ, అలా పెరిగిన విలువలతోనే ఇతరుల సరుకులు కొనడమూ చేస్తాడన్నమాట.

అప్పుడు, ఆ పెరిగిన విలువలే సరుకులకు 'అసలు విలువలు' అవుతాయి. అప్పుడు ప్రతీ పెట్టుబడిదారుడూ, 'ఊరికే వేసుకున్న' విలువ, 'అసలు విలువ'లోనే భాగం అవుతుంది. 'లేని' విలువ కాన్సిల్ అవుతుంది.

'లాభం వేసుకోవడం' అనే విషయాన్ని ఇంకా 2, 3 రకాలుగా మార్చి మార్చి చూద్దాం. అలా చూడడం వల్ల, విషయం ఎలా మారినా అర్థం చేసుకోవడం సాధ్య మవుతుంది.

ఇప్పుడు, బట్ట పెట్టుబడిదారుడు వేసుకునే లాభాన్ని ఇంకా కొంచెం పెంచి చూద్దాం: పెట్టుబడి 100. బట్టకి వున్న నిజం విలువ 120. ఇక్కడ 20% లాభం వేసుకోవడానికి మాత్రమే అవకాశం వుంటుంది. కానీ, ఆ పెట్టుబడి దారుడు 50% లాభం వేసుకుని, బట్ట విలువని 150 గా నిర్ణయించాడనుకుందాం. ఇందులో 20% లాభం వరకూ అయితే, ఆ విలువ కూడా బట్టకి వున్నదే. ఆ పైన వున్న 30% విలువ, బట్టకి లేనిది. అంటే, ఈ ఉదాహరణలో, బట్ట పెట్టుబడిదారుడు, 30% లేని విలువని కూడా వేసుకున్నాడన్నమాట! అప్పుడేం జరుగుతుంది? ఆ బట్ట, '150 విలువ'తో అమ్ముడు పోతుందా? — ఒక 'షరతు' మీద అయితే అమ్ముడు పోతుంది. ఇతర పెట్టుబడిదారు లందరూ కూడా, తమ సరుకుల మీద, 30% లేని విలువని వేసుకోవడం — అనే షరతు మీద! తన సరుకుని 30% లేని విలువతో అమ్మితే, ఇతర్ల సరుకుల్ని కూడా 30% లేని విలువతో కొనవలసిందే. సారాంశం ఏమిటంటే, విలువలన్నీ ఎప్పటిలాగ వుండడమే.

ఈ విషయాన్నే ఇంకో రకంగా చూద్దాం:

కొంత బట్టకి నిజం విలువ 120. కొంత ధాన్యానికి నిజం విలువ 120. ఈ బట్టకీ, ఈ ధాన్యానికీ మారకం జరిగితే, అది 'సమాన విలువల' మారకం. ఈ పెట్టుబడి దారులిద్దరూ, తమ సరుకుల విలువల్ని ఇంకా 30 చొప్పున పెంచేశారనుకుందాం.

ఇప్పుడు, బట్ట విలువ 150. ధాన్యం విలువ కూడా 150. ఇప్పుడు కూడా ఆ బట్టకీ, ఆ ధాన్యానికీ గతంలో లాగే మారకం జరుగుతుంది. ఆ బట్టకి గతం కన్నా ఎక్కువ ధాన్యం రాదు. ఆ ధాన్యానికి కూడా గతం కన్నా ఎక్కువ బట్ట రాదు.

2 సరుకుల విలువలు గతంలో 120 చొప్పున వుండడం ఎలాంటిదో, ఇప్పుడు 150 చొప్పున వుండడం కూడా అలాంటిదే. దాని వల్ల ఆ సరుకుల 'విలువ సంబం ధం'లో ఏమీ మార్పు రాదు. విలువల్ని నిష్కారణంగా పెంచడం వల్ల, బట్టవాడికి గానీ, ధాన్యం వాడికి గానీ, గతంలో కన్నా ఎక్కువగా వచ్చే విలువ ఏమీ వుండదు.

ఈ సరుకులకు ఇప్పటి 150 విలువ, గతంలో వున్న 120 విలువతోనే సమానం. అంటే, ఈ ఇద్దరిలో ఏ పెట్టుబడిదారుడూ తన సరుకుకి 'లేని విలువ'ని కలపలేక పోయా డన్న మాట. ఎందుకంటే, రెండో పెట్టుబడిదారుడు కూడా అదే పని చెయ్యగలడు కాబట్టి. చేస్తాడు కాబట్టి.

మళ్ళీ ఈ విషయాన్నే మూడో రకంగా కూడా చూద్దాం. దీన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. చాలా ముఖ్యం.

బట్ట ఉదాహరణలో, శ్రామికుల శ్రమ విలువ 40.

జీతాలు 20. పెట్టుబడిదారుడికి లాభం 20 — కదా? పెట్టుబడిదారుడు, శ్రామికులకు జీతాలుగా 20 గాక, 40 ఇచ్చేసి, ఆపైన ఇంకో 20 ని పూరికే వేసుకుని, బట్ట విలువని 140 గా పెడతాడనుకుందాం. అప్పుడు కూడా పెట్టుబడిదారుడికి, శ్రామికుల నించి '20 లాభం' వచ్చినట్టే అవుతుందా?— అవును, అప్పుడు కూడా అలాగే అవుతుంది. ఎందుకంటే : అప్పుడు కూడా పెట్టుబడి దారుడికి ఆ సరుకు ద్వారా 20 ఎక్కువగా వస్తుంది గనక.

ఈ సరుకు లెక్కల్ని మారిన ఉదాహరణ ప్రకారమే చూడాలి. జీతాలుగా 40 ఇచ్చినట్టయితే, ఇప్పుడు, పెట్టుబడిదారుడు పెట్టిన ఖర్చు ఎంత?— 120. సరుకుని అమ్మిన విలువ ఎంత? — 140. తేడా ఎంత? — 20. అదే, పెట్టుబడిదారుడికి లాభం. సరుకు కోసం మొదట పెట్టిన ఖర్చు కన్నా దాన్ని అమ్మినప్పుడు ఏ మాత్రం ఎక్కువ వచ్చినా, "ఈ ఎక్కువ ఎలా వచ్చింది?" అనే ప్రశ్న అప్పుడు కూడా వుంటుంది. ముడిపదార్థం గానీ, ఇతర శ్రమ సాధనాలు గానీ, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఎప్పుడూ ఇవ్వలేవు. ఆ పని చెయ్యగలిగేది శ్రామికులు మాత్రమే. కాబట్టి, ఇప్పుడు కూడా లాభం అనేది, శ్రామికుల ద్వారా వచ్చే సజీవ శ్రమతో సంబంధించే విషయమే. ఉదాహరణని మారిన లెక్కల ప్రకారం అర్థం చేసుకోవాలి.

"పెట్టుబడిదారుడు, శ్రామికులకు ఇవ్వవలసిన 40 నీ ఇచ్చేశాడు కదా? వాళ్ళకు ఇవ్వవలసింది — 40 యే కదా? అది ఇచ్చేశాకే, ఆ పైనే, కొంచెం కలుపుకున్నాడు కదా?" అంటే కుదరదు. ఎందుకంటే, ఈ మారిన ఉదాహరణ ప్రకారం చూస్తే, శ్రామికులు ఇచ్చిన విలువ — 40 కాదన్న మాట! ఇంకా ఎక్కువ అన్నమాట! అది 60 అవుతుంది. 60 శ్రమ చేసిన కార్మికులకు జీతాలుగా 40 యే ఇస్తే, ఆ ఇవ్వని 20 యే, పెట్టుబడిదారుడికి లాభం!

ఒక విషయం బాగా గ్రహించాలి. మొదట పెట్టిన ఖర్చుకీ, సరుకుని అమ్మగా వచ్చిన దానికీ తేడా వుందంటే, ఆ తేడాయే — లాభం. అది, శ్రామికుల ద్వారా వచ్చేదే. ఉదాహరణ ఎలా మారినా ఈ సూత్రం మారదు.

అంటే, జీతాల్ని 20 గా గాక, 40 గా చేసినా, 60 గా చేసినా, 80 గా చేసినా, ఆ ఖర్చు మీద మళ్ళీ 'కొంత ఎక్కువని ( ఖర్చు పెట్టకుండానే ) కలపడం' జరిగితే, లాభం సమస్య, ఎప్పటిలాగే వుంటుంది.

అయితే, అప్పుడు లెక్కలన్నీ గతం కన్నా కొంత మారతాయి. బట్ట విలువని 120 నించి నిష్కారణంగా 140 గా పెంచినప్పుడు (ఆ సరుకు కోసం ఎక్కువ శ్రమ పెట్టకుండానే విలువని పెంచినప్పుడు) అదే సూత్రం ఇతర సరుకులన్నిటికీ కూడా వర్తిస్తుంది. కాబట్టి, బట్ట కోసం అవసరమయ్యే 'శ్రమ – సాధనాల' విలువలు కూడా అదే స్థాయిలో పెరుగుతాయి.

బట్ట విలువ 120 గా వుంటే, అదే దాని అసలు విలువ అవుతుంది. ఆ విలువలోనే లాభం వుంటుంది. పెట్టుబడిగా ఖర్చయినది, ఆ 120 కన్నా తక్కువగానే వుంటుంది.

లేదా, ఆ 120 విలువనే నిష్కారణంగా 140 గా పెంచితే, అప్పుడు, అదే దాని అసలు విలువ. ఆ 140 లో కూడా లాభం వుంటుంది. పెట్టుబడి ఖర్చు, ఆ 140 కన్నా తక్కువగానే వుంటుంది.

లేదా, ఆ 140 విలువనే నిష్కారణంగా 160 గా పెంచితే, అప్పుడు ఆ 160 య్యే అసలు విలువ. అందులో కూడా లాభం వుంటుంది. పెట్టుబడిదారుడి ఖర్చు, 160 కన్నా తక్కువగానే వుంటుంది.

ఇన్ని ఉదాహరణలు అక్కరలేదు. విషయాన్ని ఎన్ని రకాలుగా చూసినా, అన్నిటి సారాంశమూ ఒకటే. సరుకుని అమ్మే సమయానికి పెట్టుబడిదారుడు దానికి ఎంత విలువని నిర్ణయిస్తాడో, అది ఎంత అయినా సరే, అదే దాని 'అసలు విలువ'. ఆ విలువ — (1) శ్రమ సాధనాలూ, (2) సజీవ శ్రమా — అనే 2 అంశాల వల్ల మాత్రమే చేరుతుంది. వీటిలో 1 వ అంశాలు, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వలేవు. 2 వ అంశం (అంటే, సజీవ శ్రమ), 'జీతాల' విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలదు.

కాబట్టి, ప్రతీ పెట్టుబడిదారుడూ 'లాభం' కోసం, 'లేని' విలువని ఊరికే కలిపినా, దానితో కూడా కలిసినదే, 'అసలు విలువ' అయిపోతుంది. మొత్తంమీద దీని అర్థం — 'లాభం' కోసం, 'లేని విలువని కలపడం' పెట్టుబడిదారులకు సాధ్యం కాదు. 'ఊరికే వేసుకుంటు న్నట్టు' కనపడే విలువ కూడా 'నిజం విలువ'లో భాగమే.

'పెట్టుబడి' మీద, 'లేని' విలువని చేర్చడం సాధ్యమైతే, ఆ చేరే దానికి 20 అనో, 40 అనో, 60 అనో, ఒక పరిమితి ఉండనక్కరలేదు. ఎంత ఎక్కువ విలువనైనా చేర్చడం సాధ్యం అవ్వాలి. కానీ, బట్ట ఉదాహరణలో, పెట్టుబడిదారుడు, '100 పెట్టుబడి' మీద, 20 కన్నా ఎక్కువగా ఎందుకు చేర్చలేకపోతాడు? 100 మీద, 400 లాభం చేర్చి బట్ట విలువని 500 గా ఎందుకు పెట్టలేడు? 800 గా ఎందుకు పెట్టలేడు? పెట్టుబడిదారుడికి అంత లాభం అక్కరలేదా? వాడు 20 లాభంతో మాత్రమే సంతృప్తి పడదలిచాడా? ఇంకా ఎక్కువ లాభం ఎందుకు వేసుకోడు?

ఆ మాటే బట్ట వాణ్ణి అడిగితే, వాడే మంటాడంటే —

"ఈ బట్ట విలువ మార్కెట్లో 120 య్యే వుంది కదా? అంత కన్నా ఎక్కువగా లేదు కదా?" అంటాడు.

"ఎక్కువగా ఎందుకు లేదు?" అని అడిగితే,

"ఏమో, అంత కన్నా లేదు మరి" అంటాడు నిరుత్సాహంగా. వాడికి అంత కన్నా తెలీదు. వాడికి తెలియని విషయం ఏమిటంటే — 'ఆ బట్టకి పట్టిన శ్రమ 120 కన్నా ఎక్కువగా లేదు కాబట్టే దాని విలువ 120 కన్నా ఎక్కువగా లేదు' అని. ('లాభం వేసుకోవడం' గురించి, పెట్టుబడిదారుడితో సంభాషణ ఎలా సాగుతుందో ఇంకో చోట వివరంగా చూస్తాం.)

ఇక్కడ, ' విలువ హద్దులకు' సంబంధించి, 3 విషయాలు సరిగా అర్థం చేసుకోవాలి.

**(1)** ఒక సరుకు కోసం ఖర్చయ్యే 'మొత్తం శ్రమ'కి ఒక హద్దు వుంటుంది గానీ, అది ఏ హద్దూ లేకుండా అనంతంగా వుండదు. ఆ మొత్తం శ్రమే ఆ సరుకుకి అసలు విలువ. అది, బట్ట ఉదాహరణలో — 120.

**(2)** సరుకుని తయారు చేయించడం కోసం ఖర్చయ్యే 'పెట్టుబడి'కి కూడా ఒక హద్దు వుంటుంది. పెట్టుబడిదారుడు, ఎప్పుడూ వీలైనంత తక్కువ ఖర్చు పెట్టడానికే ప్రయత్నిస్తాడు. ఖర్చుల్ని ఎంత తగ్గించాలని ప్రయత్నించినా ఆ 'తక్కువ'కి కూడా ఒక హద్దు వుంటుంది. అదే, సరుకు కోసం ఖర్చయ్యే 'పెట్టుబడి'. బట్ట ఉదాహరణలో అది — 100.

**(3)** ఆ 2 హద్దుల మధ్యా తప్పనిసరిగా కొంత తేడా వుంటుంది. 'పెట్టుబడి' ఖర్చు కన్నా, సరుకు కోసం నిజంగా అయ్యే ఖర్చు, తప్పనిసరిగా ఎక్కువగా వుంటుంది. ఆ తేడా లేకపోతే పెట్టుబడిదారుడి కథే వుండదు. బట్ట ఉదాహరణలో అది — 20. అందుకే పెట్టుబడిదారుడు, తన 'లాభం'గా 20 ని మాత్రమే కలపగలుగుతాడు. అంత కన్నా ఎక్కువని కలపలేడు. అంటే, 'లాభం'గా కలపగలిగే దానికి కూడా ఒక హద్దు వుంటుందన్న మాట! కాబట్టి, లాభాన్ని ఎంత కావాలంటే అంత కలపడం సాధ్యం కాదు.

పెట్టుబడిదారుడికి రెగ్యులర్‌గా మార్కెట్ పరిస్థితుల్లో వచ్చే అనుభవం ద్వారా, తన సరుకుకి ఎంత విలువని నిర్ణయించవచ్చో, తన 'ఖర్చుల' మీద ఎంత లాభం వేసుకోవచ్చో, ఒక అవగాహన వుంటుంది.

'ఖర్చుల'కు 'లాభాన్ని' కలపగా వచ్చే విలువతో సరుకుని అమ్మడం అంటే, సరుకుని దాని 'అసలు విలువ'కి అమ్మడమే. అలా 'అసలు విలువ'కే అమ్మి, ఖర్చుల్ని వెనక్కి తీసుకుంటే, ఆపైన వున్నదే 'లాభం'! అది, అసలు విలువలోదే గానీ, ఆ విలువతో సంబంధం లేనిది కాదు.

ఈ విషయాలన్నీ సరిగా అర్థం చేసుకుంటే, 'నిజమైన ఆర్థిక శాస్త్రాన్నంతా' అర్థం చేసుకున్నట్టే. తర్వాత చూడబోయే విషయాలన్నీ, ఈ పునాది మీద ఆధారపడి వుండేవే.

ఇక్కడ మహా తేలిగ్గా కనపడుతోన్న 'లాభ రహస్యం', వందల వేల సంవత్సరాల నించీ సమాజానికి అందకుండా వుండిపోయింది!

'లాభం' గురించి పెట్టుబడిదారుడూ, శ్రామికులూ కూడా పూర్తిగా తప్పు అభిప్రాయంతోనే వుంటారు. లాభం అనే దానికి, 'సరుకు విలువ'తో సంబంధం వుండదనీ, అది 'ఖర్చుల' మీద ఊరికే వేసుకుంటే, బయటి నించి (ఎక్కడి నించి?) వస్తుందనీ — అనుకుంటారు. 'పైకి కనపడుతున్నదే పూర్తి నిజం' అనుకోవడం వల్ల ఏర్పడే అభిప్రాయం ఇది. ఈ అభిప్రాయం, పెట్టుబడిదారుడికి చాలా లాభకరమైనదే. శ్రామికులకు మాత్రం మహా హానికరమైనది. వారికి అసలు నిజం తెలియకుండా పోతుంది.

# 'శ్రమ సాధనాలు' శ్రమ చేస్తాయా?

"లాభం ఎలా వస్తుంది?" అని చూస్తూవున్న ఈ సందర్భంలోనే, 'ఉపయోగపు విలువ'ని ఉత్పత్తి చెయ్యడానికీ, 'విలువ'ని ఉత్పత్తి చెయ్యడానికీ వుండే తేడాని సరిగా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు సరిగా అర్థం చేసుకోలేక పోయిన విషయాల్లో ఇది కూడా ఒకటి. 'లాభాన్ని — శ్రమ సాధనాలే ఇస్తాయి' అని వాళ్ళు గాఢంగా నమ్మి, శ్రామికుల్ని కూడా నమ్మమంటారు. అందుకే, ఈ విషయం సరిగా అర్థం చేసుకోవాలి.

బట్ట — అన్నప్పుడు, అది ఒక ఉపయోగపు విలువ. ఇక్కడ, బట్ట శరీర లక్షణాల్ని చూస్తాం. 'బట్ట'ని ఉత్పత్తి చెయ్యడంలో, శ్రమ చేసే మనుషులకూ, శ్రమ సాధనాలకూ కూడా సమాన పాత్ర వుంటుంది.

బట్ట విలువ — అన్నప్పుడు, అది బట్ట కోసం ఖర్చయిన 'మొత్తం శ్రమ'. అది 120. అందులో, శ్రమ సాధనాలకు సంబంధించిన నిర్జీవ శ్రమ 80. దారాన్ని బట్టగా నేసిన మనుషుల సజీవ శ్రమ 40. నిర్జీవ శ్రమ, శ్రమ సాధనాలకు సంబంధించినదే అయినప్పటికీ, అది

కూడా వెనకటి కాలాల్లో మనుషులు చేసినదే. సజీవ శ్రమ ఎలాగైతే మనుషులు చేసినదో, అలాగే నిర్జీవ శ్రమ కూడా, గతంలో మనుషులు చేసినదే.

శ్రమ సాధనాలన్నీ — 'వస్తువులే.' ఏ వస్తువూ దానికై అదే స్వయంగా పని చెయ్యదు.

మనుషులే, స్వయంగా పనిచేస్తారు. ఆ పనే 'విలువ' గా వుంటుంది. అంటే, మనుషులు, 'విలువ'ని ఉత్పత్తి చేస్తారు.

శ్రమ సాధనాలు స్వయంగా పని చెయ్యవు కాబట్టి, అవి విలువని కొత్తగా ఉత్పత్తి చెయ్యవు. వాటికి ఎంత విలువ వుంటే అంత విలువని మాత్రమే ఇస్తాయి.

బట్టకి వున్న మొత్తం 120 శ్రమా మనుషుల ద్వారా ఉత్పత్తి అయ్యిందే. 80 శ్రమ గతంలోనూ, 40 శ్రమ కొత్తగానూ. విలువ అంటే శ్రమే కాబట్టి, 'విలువ'ని ఉత్పత్తి చెయ్యడంలో మనుషుల పాత్రే గానీ, శ్రమ సాధనాల పాత్ర ఏమీ వుండదు. 'ఉపయోగపు విలువ' విషయంలో అయితే శ్రమ సాధనాల పాత్ర కూడా వుంటుంది.

ఇప్పుడు, ఈ ప్రశ్నలకు తేలిగ్గా జవాబులు చెప్పు కోవచ్చు.

శ్రమ సాధనాలు, శ్రమ చేస్తాయా? — చెయ్యవు. ఎందుకంటే అవి 'వస్తువులు' గనక.

శ్రమ సాధనాలు కూడా 'విలువ'ని ఇస్తాయా? — ఇస్తాయి. కానీ, అవి విలువని స్వయంగా శ్రమ చేసి ఇవ్వవు. అవి కొత్త సరుకు కోసం ఖర్చయిపోతాయి గనక, వాటి విలువే సరుకుకి చేరుతుంది. ఆ రకంగా, అవి విలువని ఇచ్చినట్టు అవుతుంది. అవి, తమలో ఎంత విలువ వుంటే అంత విలువని మాత్రమే ఇస్తాయి.

శ్రమ సాధనాలు, ఉపయోగపు విలువని ఇస్తాయా? — ఇస్తాయి. శ్రమ సాధనాలు లేకపోతే ఏ ఉత్పత్తీ తయారవదు.

ఉపయోగపు విలువ = ప్రకృతి పదార్థమూ +
మనుషుల శ్రమలూ

మారకం విలువ = మనుషుల శ్రమలు మాత్రమే

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు గ్రహించలేకపోయిన అతి ప్రధానమైన అంశాల్లో ఇది ఒకటి. ఈ 'విలువ'కీ, 'ఉపయోగపు విలువ'కీ వున్న తేడా విషయం వాళ్ళు గ్రహించలేదు.

'విలువ అంటే శ్రమ' అని పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు కూడా అంటారు. అయితే, 'శ్రమ అంటే ఏమిటి' అనే చోట వాళ్ళు రక రకాల పొరపాటు అభిప్రాయాలతో వుంటారు. వాళ్ళ దృష్టిలో మనుషులు చేసేదీ శ్రమే; శ్రమ సాధనాలు చేసేదీ శ్రమే. శ్రామికులు పని చేసేటప్పుడు శ్రమ సాధనాలు కూడా కదులుతూ వుంటాయి కాబట్టి, శ్రమ సాధనాలు కూడా 'పని' చేస్తాయని వాళ్ళు భావిస్తారు.

అంతే కాదు, లాభాన్ని శ్రమ సాధనాలే ఇస్తాయని వాళ్ళ అర్థం. ఈ విషయంలో, వాళ్ళ అభిప్రాయం ఇలా వుంటుంది : శ్రామికులూ శ్రమ చేస్తారు. శ్రమ సాధనాలూ శ్రమ చేస్తాయి. ఆ శ్రమ అంతా కలిసే సరుకుకి 'విలువ' అవుతుంది. అయితే, శ్రామికులు, తమ శ్రమకి బదులుగా జీతాలు తీసేసుకుంటారు. ఆ జీతాలతో వాళ్ళకు వెళ్ళ వలసిందంతా వెళ్తుంది. ఇక మిగిలిన విలువ అంతా శ్రమ సాధనాలు ఇచ్చేదే. శ్రమ సాధనాలు పెట్టుబడిదారుడివే కాబట్టి, అవి ఇచ్చే విలువ అంతా పెట్టుబడిదారుడిదే. ఆ విలువలో నించి శ్రమ సాధనాల ఖర్చుని తీసివేస్తే, మిగిలినది లాభం. అంటే, లాభాన్ని ఇచ్చేది శ్రమ సాధనాలే! —ఇదీ పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల అభిప్రాయం.

దీన్ని ఒక ఉదాహరణ ద్వారా చూద్దాం :

బట్ట కోసం ఖర్చయిన శ్రమ సాధనాల విలువ 80. జీతాలు 20. పెట్టుబడిదారుడు లాభం కోసం వేసుకున్నది 20. బట్టని అమ్మిన విలువ 120. పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల ప్రకారం : 20 జీతాలతో పనిచేసిన శ్రామికులు ఇచ్చే విలువ 20 మాత్రమే. అది వాళ్ళకే జీతాలుగా వెళ్ళిపోతుంది. ఇంకా మిగిలిన 100 విలువ, శ్రమ సాధనాల ద్వారా వచ్చినదే. అందులో నించి శ్రమ సాధనాల ఖర్చుగా 80 ని తీసివేస్తే, ఇంకా మిగిలినదే లాభం. అది 20. అంటే, ఆ లాభం, శ్రమ సాధనాల ద్వారా వచ్చినదే. శ్రమ సాధనాలు పెట్టుబడి దారుడివే కాబట్టి, లాభం పెట్టుబడిదారుడిదే. — ఇదే ఆర్థికవేత్తల అభిప్రాయం.

ఈ ఆర్థికవేత్తలు, మనుషులు పని చెయ్యడానికీ వస్తువులు పని చెయ్యడానికీ వుండే తేడాని పట్టించుకోరు. ఉపయోగపు విలువకీ, విలువకీ వుండే తేడాని పట్టించు కోరు. ఈ విషయాలేవీ పట్టించుకోక పోవడంవల్ల, 'లాభం' అనేది ఎలా, ఏ అంశం ద్వారా ఉత్పత్తి అవుతుందో అర్థం చేసుకోలేరు. అర్థం చేసుకోవడానికి కూడా ప్రయత్నించరు.

లాభాన్ని శ్రమ సాధనాలు ఇస్తాయా, శ్రామికులు ఇస్తారా? – ఈ విషయం మనకు ఇప్పటికి కనీసంగా అయినా తెలుసు.

పెట్టుబడిదారుడికి బట్ట ద్వారా వచ్చిన 20 లాభం ఎక్కణ్ణించి వచ్చింది — అనే విషయం చూడడం కోసం, ఇప్పటి వరకూ ముడి పదార్థాన్నీ, శ్రమ సాధనాల్నీ, శ్రామికుల్నీ పరిశీలించాం. చివరికి, లాభం అనేది శ్రామికుల నించే వస్తుందని తేలింది.

100 మీటర్ల బట్ట విలువ — 120. దాని కోసం పెట్టుబడిదారుడికి అయిన ఖర్చు — 100. 'ఖర్చు' అంటే, ఖర్చు అయిన పెట్టుబడి. సరుకు విలువలో నించి పెట్టుబడిని తీసేస్తే, మిగిలేది — లాభం.

'సరుకు' అన్నప్పుడు, అది ఎంత పెద్దదైనా కావచ్చు, ఎంత చిన్నదైనా కావచ్చు.

100 మీ. బట్టని తీసుకుంటే :

దాని విలువ 120. పెట్టుబడి 100, లాభం 20.

10 మీ. బట్టని తీసుకుంటే:

దాని విలువ 12. పెట్టుబడి 10, లాభం 2.

1 మీ. బట్టని తీసుకుంటే :

దాని విలువ 1.20. పెట్టుబడి 1, లాభం 0.20 పై.

ఎలా చూసినా విషయం ఒకటే. 'సరుకు' అన్నప్పుడు, అది ఎంత పరిమాణం గలది — అనే ప్రశ్న అక్కరలేదు. ఎంత అయితే, అంతకి వుండే విలువే, అంత కోసం ఖర్చయిన పెట్టుబడే, లెక్కలోకి వస్తాయి. ఎంత చిన్న సరుకుని తీసుకున్నా, ఆ సరుకుకి వున్న చిన్న విలువలోనే కొంత భాగం పెట్టుబడిగానూ, కొంత భాగం 'లాభం'గానూ వుంటాయి. పెట్టుబడి అనగానే, అది, వందల మీదో వేల మీదో వుండాలని కాదు. 1 మీటరు బట్టకి పెట్టుబడి ఒక్క రూపాయే. దాని లాభం 20 పైసలే. అర్థ మీటరు బట్టని తీసుకుంటే, దాని పెట్టుబడి అర్థ రూపాయే, దాని లాభం 10 పైసలే.

బట్ట పెట్టుబడిదారుడు, తన 100 మీటర్ల బట్టని అమ్మేటప్పుడు, దాన్నంతా ఒకే మొత్తంగా అమ్మినా; ఒక్కొక్క మీటరు చొప్పునే అమ్మినా; ఐదేసి మీటర్ల చొప్పున అమ్మినా; ఒక సారి మూడూ, ఒక సారి ఏడూ, ఒక సారి పదిహేడూ అమ్మినా; ఇంకెలా అమ్మినా — మొత్తంగా 100 మీటర్లూ అమ్ముడు పోగానే దాని వల్ల '20 లాభం' వస్తుంది.

ఆ లాభం ఆ 'బట్ట'ని తయారుచేసిన శ్రామికుల 'శ్రమలోని భాగం' తప్ప ఇంకేమీ కాదు. శ్రామికులు, 'జీతాల విలువ' కన్నా 'అదనంగా' ఇచ్చిన విలువ అది. అందుకే, 'లాభం' అనేది శ్రామికుల — 'అదనపు విలువే'.

# పెట్టుబడిదారుడు 'శ్రమ' చేస్తాడా, చెయ్యడా?

'సరుకు'ని తయారు చెయ్యడం కోసం, పని స్థలంలో పెట్టుబడిదారుడు కూడా ఏదైనా శ్రమ చేస్తాడా, ఏ శ్రమా చెయ్యడా? — దీన్ని బట్టి లాభాన్ని అర్థం చేసుకోవడంలో చిన్న మార్పు చేసుకోవాలి. పెట్టుబడిదారుడు కూడా శ్రమ చేస్తే, వాడు తినే లాభం కొంత తగ్గుతుంది. లేకపోతే లాభం కొంత పెరుగుతుంది. దాన్ని ఇప్పుడు బట్ట ఉదాహరణ ద్వారా చూద్దాం.

పెట్టుబడిదారుడు, 'నిర్వహణ శ్రమ' చేస్తాడనుకుందాం. అది కూడా బట్ట తయారీకి అవసరమే. ఆ పని గాక ఇంకా మిగిలిన పనులు చెయ్యడానికి, పెట్టుబడిదారుడి దగ్గిర 9 మంది శ్రామికులు ఉన్నారనుకుందాం. పెట్టుబడిదారుడితో సహా మొత్తం 10 మందీ కలిసి, బట్టని తయారు చేశారు. ఖర్చయిన పెట్టుబడి 100. అందులో, జీతాలు 20. సరుకు విలువ 120. అదనపు విలువ 20.

జీతాల 20 లో పెట్టుబడిదారుడి జీతం కూడా వుంటుంది. దాన్ని 2 అనుకుందాం.

'అదనపు విలువ 20' లో కూడా, పెట్టుబడిదారుడి భాగం కూడా వుంటుంది. దాన్ని కూడా 2 అనుకుందాం. శ్రమ చేసే ఈ పెట్టుబడిదారుడు '2 జీతం' తీసుకుంటే, దానితో సమస్య లేదు. శ్రమ చేసినందుకు ఎవ్వరైనా జీతం తీసుకోవలసిందే. అంతే కాదు, ఆ వ్యక్తి '2 అదనపు విలువ'ని కూడా తీసుకుంటే దానితో కూడా సమస్య లేదు. అది, అతని శ్రమే. అతని శ్రమనంతా అతను తీసుకోవలసిందే. కాబట్టి, శ్రమచేసే ఈ పెట్టుబడిదారుడికి, 2 జీతమూ + 2 అదనపు విలువ = 4 ని తీసుకోవడం వరకే నిజమైన హక్కు వుంటుంది. కానీ పెట్టుబడిదారుడు దానితో సరిపెట్టడు. తన 2 జీతమూ, మొత్తం 20 అదనపు విలువా కూడా తనే తీసుకుంటాడు. ఆ '20 అదనపు విలువ'లో పెట్టుబడిదారుడి భాగం, 2 మాత్రమే. మిగిలినదంతా 9 మంది శ్రామికులది. అది 18. ఈ ఉదాహరణలో, ఈ 18 ని, పెట్టుబడిదారుడు 'లాభం' పేరుతో 'అక్రమంగా' తీసుకుంటాడన్నమాట!

ఇప్పుడు, పెట్టుబడిదారుడు, 'నిర్వహణ శ్రమ' కూడా చెయ్యకపోతే ఏం జరుగుతుందో చూద్దాం. పెట్టుబడిదారుడు, ఆ శ్రమ కూడా మానేసినప్పుడు, వాడు 'పని స్థలం'లో కూడా వుండడు. అప్పుడు, ఆ 'నిర్వహణ శ్రమ' చెయ్యడానికి ఇంకో ఉద్యోగి పని స్థలంలోకి రావాలి. ఆ ఉద్యోగి కూడా, పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేసే శ్రామికుడే అవుతాడు. ఇక తర్వాత శ్రమ లెక్కలన్నీ ఎప్పటిలాగే వుంటాయి. ఇప్పుడు మొత్తం 10 మంది శ్రామికులూ కలిసి,

'బట్ట'ని తయారు చేస్తారు. పెట్టుబడి 100. అందులో జీతాలు 20. బట్ట విలువ 120. అదనపు విలువ 20.

'నిర్వహణ శ్రమ' చేసే ఉద్యోగి విషయం విడిగా చూస్తే, ఇతని జీతం 2. ఇతని అదనపు విలువ 2. అయితే, ఈ ఉద్యోగికి కూడా, ఇతర శ్రామికులకులాగే, 'జీతం' మాత్రమే వెళ్తుంది. అదనపు విలువ వెళ్ళదు.

ఇప్పుడు 10 మంది శ్రామికుల అదనపు విలువ అంతా పెట్టుబడిదారుడికే అందుతుంది. అది 20.

పెట్టుబడిదారుడు కూడా శ్రమ చేస్తే వాడికి అందే ఇతరుల అదనపు విలువ 18 అయితే, శ్రమ మానేసిన తర్వాత వాడికి అందే అదనపు విలువ 20. — ఈ రకంగా, పెట్టుబడిదారుడు శ్రమ చేస్తున్నాడా, లేదా — అనేదాన్ని బట్టి, వాడికి అందే లాభంలో చిన్న తేడా వుంటుంది.

ఎవరికి అందే విలువ వారికి 'ఆదాయం.'

10 మంది శ్రామికులకూ అందే విలువ — 20 జీతం. ఒక్కొక్కరికీ 2 జీతం. అదే వారి ఆదాయం.

ఇక, పెట్టుబడిదారుడి ఆదాయం సంగతి : శ్రమ చేసే పెట్టుబడిదారుడి ఆదాయం — వాడి స్వంత శ్రమ విలువ 4 (జీతం 2 + అదనపు విలువ 2). అంతేగాక, 9 మంది శ్రామికుల ద్వారా వచ్చే అదనపు విలువ 18. మొత్తం 22. అంటే, వాడి స్వంత శ్రమ విలువ వాడికే అంది, ఇతరుల నించి కూడా బోలెడు విలువ అందుతుంది. పైగా, స్వంత శ్రమ ద్వారా వచ్చిన ఆదాయం కన్నా, ఇతరుల శ్రమ ద్వారా వచ్చిన ఆదాయమే అనేక రెట్లు ఎక్కువగా వుంటుంది. శ్రామికులందరూ శ్రమ చేసేవారే అయినా, వారిలో ప్రతీ ఒక్కరికీ ఆదాయం 2 మాత్రమే అయితే, శ్రమ చేసే పెట్టుబడిదారుడి ఆదాయం మాత్రం 22.

శ్రమ చెయ్యని పెట్టుబడిదారుడి సంగతి చూస్తే : వీడికి జీతం వుండదు. అయినా, వీడి ఆదాయానికేమీ లోటు వుండదు. వీడు 9 మంది శ్రామికుల నించే గాక, 10 మంది శ్రామికుల నించి అదనపు విలువని తీసుకో గలుగుతాడు. అది 20.

పెట్టుబడిదారుడు కూడా శ్రమ చేసే వాడైతే, అంత కన్నా కష్టించే శ్రామికులకు జీతం మాత్రమే వస్తూవుండగా, పెట్టుబడిదారుడికైతే, జీతంతో పాటు, లాభం కూడా వస్తుంది.

శ్రమ చెయ్యని పెట్టుబడిదారుడి లాభం 20 అయితే, అది వాడికి, శ్రమ చెయ్యకుండా వచ్చిందే. అలాగే, శ్రమ చేసే పెట్టుబడిదారుడి లాభం 18 అయితే, అది కూడా వాడికి శ్రమ చెయ్యకుండా వచ్చిందే. — 'లాభం' ఎంత అయితే అంత మీదే, ఆ భాగం మీదే, మన ప్రశ్న వుంటుంది. "లాభం ఎలా వచ్చింది?" అనే ప్రశ్న. అది 20 అయితే, "20 లాభం ఎలా వచ్చింది?" అనీ, అది 18 అయితే — "18 లాభం ఎలా వచ్చింది" అనీ.

శ్రమ చెయ్యని పెట్టుబడిదారుడు మాత్రమే లాభం తింటాడనీ, శ్రమ చేసే పెట్టుబడిదారుడు, లాభం తిన కుండా స్వంత శ్రమతోనే జీవిస్తాడనీ — అనడానికి వీలు లేదు. శ్రమ చేసే పెట్టుబడిదారుడు కూడా తన శ్రామికుల నించి 'లాభం' తింటాడు. కాబట్టి, ఈ 'లాభం' విష యంలో, శ్రమ చేసే పెట్టుబడిదారుడు కూడా శ్రమ చెయ్యని వాడితో సమానమే. కాబట్టి పెట్టుబడిదారుడు శ్రమ చేస్తున్నాడా లేదా — అనే తేడా అర్థరహితం. శ్రమ చెయ్యనివాడూ చేసేవాడూ కూడా, ఒకే విధంగా, తమ దగ్గిర పనిచేసే శ్రామికుల శ్రమని 'లాభం'గా తీసు కుంటారు.

'విలువ' విషయాలు ఏ మాత్రమూ తెలియని సాధా రణ దృష్టికి, పెట్టుబడిదారుడు చాలా కష్టిస్తాడనీ, ఆ కష్టం కోసమే లాభం తీసుకుంటాడనీ, అనిపిస్తుంది. కానీ, లాభం వచ్చేది పెట్టుబడిదారుడి స్వంత శ్రమ కోసం కాదు.

ఎవరైనా శ్రమ చేస్తే, ఆ శ్రమకి బదులుగా వచ్చేది — 'జీతం' అవుతుంది; 'లాభం' అవదు. కష్టించే పెట్టుబడి దారుడికి 'జీతం' కాకుండానే, ఆపైన లాభం కూడా వస్తుంది. అది శ్రామికుల శ్రమే గానీ, పెట్టుబడిదారుడి శ్రమ కాదు.

ఇప్పుడు మళ్ళీ మన బట్ట పెట్టుబడిదారుడి పని స్థలం లోకి వెళ్ళాలి. ఇక్కడ, శ్రామికులు మధ్యాన్నం తర్వాత కూడా మళ్ళీ పనిలోకి వెళ్ళారనీ, మళ్ళీ 50 మీటర్ల బట్ట తయారుచేశారనీ — ఇంతకుముందే చూశాం కదా? ఆ పని కూడా అయిన తర్వాత, శ్రామికులు పని ఆపేశారు.

పెట్టుబడిదారుడు ఆతృతగా మళ్ళీ మళ్ళీ లెక్కలన్నీ చూసుకున్నాడు. మధ్యాన్నం వున్నట్టుగా 50 మీటర్ల బట్ట గాక, ఇప్పుడు మొత్తం 100 మీటర్ల బట్ట తయారై వుంది. దీన్ని మార్కెట్లో 120 కి అమ్మవచ్చు. తనకు అయిన ఖర్చు 100 మాత్రమే. లాభం 20. ఆశ్చర్యం!

బట్టలో మధ్యాన్నానికి కనపడని లాభం రాత్రయ్యే టప్పటికి కనపడింది! అంతా సరిగానే జరిగింది! 'లాభం' మిగిలింది! 100 పెట్టుబడికి — 20 లాభం!

పెట్టుబడిదారుడు లెక్కలన్నీ చూసుకున్నాక, శ్రామికు లకు జీతాలు ఇచ్చాడు. వారు, ఆ జీతాలు తీసుకుని, పొద్దున్న నించి పనిచేసి అలిసిపోయిన దేహాలతో నిరుత్సా హంగా, మౌనంగా, చీకట్లో, ఇళ్ళవేపు సాగిపోయారు.

పెట్టుబడిదారుడికి ఇప్పుడు ఆందోళన తగ్గింది. 100 పెట్టుబడి పెడితే 20 లాభం! పెట్టుబడిలో 5 వ వంతు

లాభం! చాలా సహజం ఇది! లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు? పెట్టుబడి పెట్టే వాళ్ళేమన్నా పిచ్చి వాళ్ళా? — సాలోచనగా కిటికీ దగ్గిరికి నడిచి తోటలోకి చూశాడు. ఇప్పుడు 'ఆయనకి' చాలా విచిత్రంగా ఆ మొక్కల నిండా సౌందర్యం కనపడిందే! పువ్వుల్లోనూ, పిట్ట ల్లోనూ, నీలాకాశంలోనూ, ఎటుచూస్తే అటు 'సౌందర్యం'! తన సరుకులో 'లాభం' కనపడకముందు ఎక్కడా కన పడని సౌందర్యం! సరుకులో లాభం లేనప్పుడు ఎక్కడా లేని సౌందర్యం!

సంతోషపు పొంగుతో ఒకచోట కాలు నిలవక, మెత్తని తివాచీ మీద పచార్లు చేస్తున్నాడు. ఇప్పుడు ఆయన నడకలో తడబాటు లేదు. ఆయన కాళ్ళకు కూడా గాంభీర్యం వచ్చింది. తూచి తూచి అడుగులు వేస్తున్నాయి అవి. ఆ సమయంలో ఆయన్ని ఎవరైనా ఒక 'కవి బంటు' చూస్తే, ఆయన ముఖారవిందాన్నీ, ఆయన మంద గమనాన్నీ, ఆయన దరహాసాల్నీ, ఆయనకే విభ్రమం కలిగేటట్టు వర్ణించకుండా వుండలేడు. తన కళానురక్తినీ, శక్తినీ, ఆయన పాదసేవకు అర్పించకుండా వుండలేడు.

# సజీవ శ్రమ నిర్వహించే 3 పాత్రలు

'సజీవ శ్రమ' అంటే — శ్రామికులే. శ్రామికులు 'శ్రమ చెయ్యడం' ద్వారా, 3 రకాల పాత్రలు నిర్వహిస్తారు.

(1) 'జీతాల' విలువని పునరుత్పత్తి చెయ్యడం.

(2) 'అద నపు విలువ'ని కొత్తగా ఉత్పత్తి చెయ్యడం.

(3) శ్రమ సాధనాల విలువని సరుకుకి బదిలీ చెయ్యడం.

వీటిని ఇప్పుడు వరసగా చూస్తాం.

**(1) శ్రామికులు, 'జీతాల విలువ'ని పునరుత్పత్తి చేస్తారు:**, 'పునరుత్పత్తి చెయ్యడం' అంటే, మళ్ళీ ఉత్పత్తి చెయ్యడం. అంతకు ముందే వున్న విలువని తాము వాడుతూ (ఖర్చు చేస్తూ), అదే కాలంలో, దాన్ని తిరిగి ఉత్పత్తి చెయ్యడం. రోజుకి 1 కిలో బియ్యాన్ని ఖర్చుచేస్తూ, అదే కాలంలో (అంటే 1 రోజులో) 1 కిలో బియ్యాన్ని ఉత్పత్తి చేస్తే, అది బియ్యాన్ని పునరుత్పత్తి చెయ్యడం. 'పునరుత్పత్తి'ద్వారా వచ్చిన బియ్యం కొత్తవే అయినా, అవి, పాత బియ్యానికి బదులుగా వచ్చినవే. అంటే పాత బియ్యమే తిరిగి ఉత్పత్తి అయినట్టు అర్థం. అలాగే 'జీతాల పునరుత్పత్తి' విషయం కూడా. బట్ట ఉదాహరణలో జీతాలు 20 కదా? ఆ డబ్బుతో ఎన్ని వస్తువులు వస్తాయో ఆ వస్తువులే — జీతాలు. జీతాలు, పెట్టుబడిలో భాగమే.

జీతాల్ని, పని ప్రారంభించకముందే ఇవ్వరు. పని పూర్తి అయ్యాకే ఇస్తారు. కాబట్టి శ్రామికులు ఏ రోజు జీతాన్ని ఆ రోజే వాడలేరు. నిన్నటి జీతాన్ని ఇవ్వాళా, ఇవ్వాల్టి జీతాన్ని రేపూ, ఇలా వాడతారు. అయినప్పటికీ, ఇది ఏరోజు జీతాన్ని ఆ రోజు వాడటంతోటే సమానం. ఎందుకంటే, చెయ్య వలసిన పనీ, దాని జీతమూ, ఏ రోజుకారోజు మారిపోతూ వుండవు. రోజూ అదే పనీ, అదే జీతమూ, వుంటాయి. కాబట్టి నిన్నటి జీతాన్ని ఇవ్వాళ వాడినా, అది, ఇవ్వాల్టి జీతాల్ని ఇవ్వాళ వాడినట్టే అర్థం. శ్రామికులు, ఇంకా 'పనిస్థలం'లో పని ప్రారంభించక ముందే వారి పోషణ వస్తువులన్నీ వారి దగ్గర వుంటాయి. శ్రామికులు — ఒక వేపు ఆ పోషణ వస్తువుల్ని వాడుతూ (ఖర్చుచేస్తూ) అదే కాలంలో ఇంకోవేపు — పెట్టుబడిదారుడి 'పని స్థలం'లో పని చేస్తూ వుంటారు. అక్కడ ఏదో ఒక రకం వస్తువుల్ని తయారు చేస్తారు. ఆ వస్తువులు, శ్రామికుల పోషణ వస్తువులైనా కావచ్చు, వేరే రకం అయినా కావచ్చు.

శ్రామికులు పనిలోకి దిగిన తర్వాత మొట్టమొదట, జీతాల విలువకి తగినంత పని చెయ్యాలి. ఇక్కడ జీతాల విలువని 20 అనుకున్నాం. శ్రామికులు మధ్యాన్నం అయ్యేటప్పటికి, 20 విలువ గల శ్రమ చేశారనుకుందాం. అప్పటికి ఏం జరిగినట్టు అర్థం? అప్పటికి శ్రామికులు, జీతాల విలువకి సరిపోయినంత పనిచేసినట్టు అర్థం. అంటే, శ్రామికులు, ఒక వేపు 20 విలువ గల 'పాత శ్రమ'ని తమ పోషణ కోసం ఖర్చుచేస్తూ, అదే సమయంలో ఇంకో వేపు — 20 విలువ గల 'కొత్త శ్రమ' చేశారన్నమాట. ఇదే జీతాల విలువని 'పునరుత్పత్తి' చెయ్యడం. దీనివల్ల, గతంలో లేని కొత్త విలువ ఏమీ రాదు. గతంలో వున్నదే ఖర్చయిపోయి, అదే మళ్ళీ వస్తుంది. ఇప్పటి వరకూ జరిగింది, పెట్టుబడిదారుడు జీతాల కోసం ఖర్చుచేసిన 20 విలువ, వాడికి మళ్ళీ రావడం మాత్రమే.

'లాభం' వచ్చే క్రమం ఇంకా ప్రారంభం కాలేదు. శ్రామికుల వేపు నించి చూస్తే 'జీతాల విలువ'కి తగిన పని చేసేస్తే, (ఈ ఉదాహరణ ప్రకారం 20 విలువ గల శ్రమ చేస్తే) శ్రామికులు చెయ్యవలసిన పని అయిపోయినట్టే.

**(2) శ్రామికులు, 'అదనపు విలువని' కొత్తగా ఉత్పత్తి చేస్తారు** : శ్రామికులు నిజానికి, 'జీతాల పునరుత్పత్తి'తోనే పని ఆపేస్తే చాలు. కానీ అలా ఆపేస్తే పెట్టుబడిదారుడికి ఆ సరుకు ద్వారా లాభం రాదు. కాబట్టి, శ్రామికులు జీతాల పునరుత్పత్తి తోనే పని ఆపరు. (ఇదంతా వారికి తెలిసి కాదు.) ఆ తర్వాత కూడా తప్పనిసరిగా ఇంకా కొంత పని చేస్తారు. 20 జీతాలు తీసుకునే శ్రామికులు, దానికి

బదులుగా 40 విలువ గల శ్రమ చేశారనుకుంటే, ఈ ఉదాహరణలో 20 అదనపు శ్రమ జరిగినట్టు అర్థం. ఈ అదనపు శ్రమే అదనపు విలువ. ఈ 'అదనపు శ్రమ' కోసం పెట్టుబడిదారుడు ఏమీ చెల్లించడు. అంటే ఈ శ్రమని కొనడానికి పెట్టుబడి ఖర్చు అవదు. అంతకుముందు వున్న ఏ వస్తువూ ఖర్చు కాకుండా పూర్తిగా కొత్తగా జరిగే శ్రమ ఇది. అందుకే ఇది పునరుత్పత్తి అయిన విలువ కాదు. పూర్తిగా కొత్త విలువ. అంతకుముందు లేని విలువ. పెట్టుబడిదారుడు, జీతాల ఖర్చుతో జీతాల కన్నా ఎక్కువ విలువని సరుకుకి చేర్చడం, ఈ 'అదనపు విలువ' వల్లనే సాధ్యమవుతుంది.

**(3)** శ్రామికులు, **'శ్రమ సాధనాల విలువని సరుకుకి బదిలీ' చేస్తారు** : 'శ్రమ సాధనాలు' అంటే ఏమిటో ఇక్కడ ఒకసారి జ్ఞాపకం చేసుకోవాలి. ముడి పదార్థాలూ, శ్రమ పరికరాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ కలిసిన మొత్తమే— శ్రమ సాధనాలు. ఒక 'కొత్త వస్తువు' తయారయ్యేటప్పుడు, దానికి సంబంధించిన శ్రమ సాధనాలన్నీ అంతకుముందే అనేక చోట్ల తయారై, అవన్నీ ఈ పని స్థలంలోకి వచ్చి సిద్ధంగా వుంటాయి. శ్రమ సాధనాలు సిద్ధంగా వుంటేనే కొత్త పని ప్రారంభమవుతుంది. శ్రమ సాధనాలు లేకపోతే పని జరిగే మార్గమే వుండదు. ఏ పనీ శూన్యంలో జరగదు. శ్రామికులు 'పని'లోకి దిగిన తర్వాత శ్రమ సాధనాల్ని వుపయోగిస్తూనే పని చేస్తారు. పని జరుగుతూవుంటే, శ్రమ సాధనాలు ఖర్చవుతూ వుంటాయి. ఆ శ్రమసాధనాలు ఖర్చయ్యేది కొత్త సరుకు కోసమే కాబట్టి, ఆ ఖర్చు అంతా, కొత్త వస్తువుకి సంబంధించిన ఖర్చుగా లెక్కకు వస్తుంది. అంటే ఆ ఖర్చు, కొత్త వస్తువుకి చేరుతుంది. ఈ ఖర్చుని 'విలువ' అని చెప్పుకుంటే, శ్రమ సాధనాల విలువ, కొత్త వస్తువుకి బదిలీ అవుతుంది. అంటే, ఈ విషయం (శ్రమ సాధనాల విలువ కొత్త వస్తువుకి బదిలీ అవడం— అనే విషయం) శ్రామికులు పని చేస్తూ వుంటేనే జరుగుతుంది. శ్రామికులు పని చెయ్యకపోతే, శ్రమ సాధనాలు కదలవు. అవి ఖర్చు అవవు. వాటి విలువ కొత్త వస్తువుకి బదిలీ అవడం— అనే మాటే వుండదు. అసలు కొత్త వస్తువే వుండదు. అంటే, శ్రామికులు 'పని' చెయ్యడం ద్వారా ఏం జరుగుతుందంటే, ఇంతకుముందు చూసిన 2 విషయాలే గాక, ఈ మూడో విషయం కూడా జరుగుతుందన్నమాట! అంటే, శ్రమ సాధనాల విలువ కొత్త సరుకుకి బదిలీ అవడం— అనే విషయం. అయితే, దీని కోసం, శ్రామికులు ప్రత్యేకంగా చేసేదేమీ వుండదు. ఏ పని అయినా శ్రమ సాధనాలు లేకుండా శూన్యంలో జరగదు కాబట్టి, శ్రామికులు వాళ్ళ పని వాళ్ళు చేస్తూవుంటే, శ్రమ సాధనాలు ఖర్చవడం కూడా దానికదే జరిగిపోతూ వుంటుంది. అయినప్పటికీ, శ్రామికులు 'పని చెయ్యకపోతే శ్రమ సాధనాలు కదలడమే జరగదు' కాబట్టి, శ్రమ సాధనాలు ఖర్చవడానికీ, వాటి విలువ బదిలీ అవడానికీ శ్రామికులే కారణం.

ఈ విషయం చిన్న ఉదాహరణ ద్వారా చూద్దాం : వడ్రంగం శ్రమ విలువ, 1 గం॥కి 2 రూ.లు. రవి అనే శ్రామికుడు, 4 గంటలసేపు పని చేసి ఒక బల్ల తయారు చేశాడు. అంటే, మొత్తం సజీవ శ్రమ విలువ 8 రూ.లు. ఆ బల్ల కోసం 10 రూ.ల విలువ గల శ్రమ సాధనాలు ఖర్చయ్యాయి— అనుకుందాం. ఆ ఖర్చయిన శ్రమ సాధనాల్లో 5 గంటల నిర్జీవ శ్రమ వుంది. (1 గంట శ్రమ విలువ 2 రూ.ల చొప్పున, ఆ 10 రూ.ల్లో 5 గంటల శ్రమ వుందని అర్థం.) అంటే బల్ల కోసం సజీవ, నిర్జీవ శ్రమలు రెండూ ఖర్చయ్యాయి. బల్ల విలువ 8 + 10 = 18 రూ.లు.

ఈ విలువని, 'శ్రమ కాలం'గా చూస్తే, సజీవ శ్రమ 4 గంటలూ, నిర్జీవ శ్రమ 5 గంటలూ. మొత్తం 9 గంటలు.

ఇప్పుడు మనం ఒక విషయం స్పష్టం చేసుకోవాలి. బల్లని తయారుచేసిన రవి, బల్ల కోసం పని చేసిన కాలం 4 గంటలా, 9 గంటలా? బల్ల కోసం ఖర్చయిన 9 గంటలూ రవి శ్రమేనా?— కాదు. రవి శ్రమ కాలం 4 గంటలే. 9 గంటలు కాదు. శ్రమ సాధనాలకు సంబంధించిన 5 గంటల నిర్జీవ శ్రమతో రవికి సంబంధం లేదు. అది రవి చేసిన శ్రమ కాదు. అసలు ఆ నిర్జీవ శ్రమ, ఈ బల్ల తయారైన కాలంలో జరగలేదు. ఆ శ్రమ సాధనాలన్నీ అంతకుముందే తయారై వున్నాయి. గతంలో వాటిని తయారుచేసినప్పుడు, వాటిని ఈ రవే చేశాడా, ఇంకెవరైనా చేశారా— అనేది వేరే విషయం. ఇక్కడ 'బల్ల' సంగతి చూస్తూ వున్నప్పుడు, దీని కోసం రవి శ్రమ చేసిన కాలం 4 గంటలే. మిగిలిన 5 గంటలూ 'శ్రమ సాధనాలకు' సంబంధించినది. ఆ శ్రమ మళ్ళీ ఇక్కడ కొత్తగా జరగదు. గత శ్రమే ఇక్కడ లెక్కలోకి వస్తుంది.

ఈ విషయాన్నే 'విలువ'గా కూడా చూద్దాం. బల్ల విలువ 18 రూ.లు అని చూశాం. అది అంతా బల్లని తయారుచేసిన రవి శ్రమ విలువేనా?— కాదు. అందులో 8 మాత్రమే రవి శ్రమ విలువ. మిగిలిన 10, శ్రమ సాధనాలకు సంబంధించినది. ఆ 10 విలువ, గతంలోనే ఉత్పత్తి అయి వుంది. దానిని, రవి, ఇక్కడ మళ్ళీ ఉత్పత్తి చెయ్యలేదు. అది బల్లకి బదిలీ మాత్రమే అవుతుంది.

శ్రమ సాధనాల విలువ కొత్త సరుకుకి బదిలీ అవడం అంటే, ఆ విలువ 'పునరుత్పత్తి' అవడమూ కాదు; కొత్తగా ఉత్పత్తి అవడమూ కాదు. అది, విలువ— ఒక చోట నించి ఇంకో చోటకి మారడం మాత్రమే. అంటే 'శ్రమ సాధనాల'

నించి కొత్త వస్తువులోకి. అందుకే అది కేవలం 'బదిలీ' అవడం మాత్రమే.

విలువ బదిలీ అవడం— అనే విషయాన్ని సరిగా అర్థం చేసుకుంటే, శ్రమ సాధనాల విలువ ఎప్పటికీ ఖర్చయి పోదు —అని తెలుస్తుంది. బట్ట ఉదాహరణలో, 80 డబ్బుతో మొదటిసారి కొన్ని శ్రమ సాధనాల్ని కొని 'ఉత్పత్తి క్రమం'లోకి తెస్తే, ఆ విలువ, బట్టని అమ్మి నప్పుడు మళ్ళీ వెనక్కి వస్తుంది. వెనక్కి వచ్చిన 80 తో, మళ్ళీ కొత్త శ్రమ సాధనాలు వస్తాయి. వాటితో మళ్ళీ కొత్త ఉత్పత్తి క్రమం నడిచి, మళ్ళీ కొత్త బట్ట తయారవుతుంది. ఈ రకంగా, శ్రమ సాధనాల విలువ, ఒక ఉత్పత్తి క్రమం నించీ ఇంకో ఉత్పత్తి క్రమానికి అందుతూనే వుంటుంది. శ్రమ సాధనాల శరీరాలు ఖర్చవుతూనే వుంటాయి. కానీ వాటి విలువ ఖర్చయిపోవడం జరగదు. 'శ్రమ సాధనాల విలువ' గురించి గ్రహించవలసిన అంశాల్లో ఇది ఎంతో ముఖ్య మైన అంశం.

'శ్రమ సాధనాల విలువ— బదిలీ అవడం' అనే విషయం, శ్రామికుల వల్లనే జరుగుతుంది. దీన్ని వేరే మాటల్లో చెప్తే, నిర్జీవ శ్రమ కొత్త సరుకుకి బదిలీ అవడానికి కారణం — సజీవ శ్రమే.

ఈ రకంగా శ్రామికులు— 'జీతాల్ని' పునరుత్పత్తి చెయ్యడమూ, 'అదనపు విలువ'ని కొత్తగా ఉత్పత్తి చెయ్యడమూ, 'శ్రమ సాధనాల విలువ'ని బదిలీ చెయ్యడమూ — అనే 3 విషయాలు జరగడానికి కారణం అవుతారు.

ఈ విషయాలు ఇంత వివరంగా ఎందుకు చూశామంటే, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలకు ఈ విషయాలు ఏ మాత్రమూ సరిగా తెలియవు. వాళ్ళంతా రక రకాల తప్పు అభిప్రాయాలు ప్రకటించారు. శ్రామికులు తమ పని ద్వారా తమ జీతాల విలువని పునరుత్పత్తి చెయ్యడమే గాక, శ్రమ సాధనాల విలువని కూడా పునరుత్పత్తి చేస్తారని కొందరు ఆర్థికవేత్తలు భావించారు. దానికి భిన్నంగా మరికొందరు ఆర్థికవేత్తలు, శ్రమ సాధనాల విలువ కొత్త సరుకుకి బదిలీ అయినట్టుగానే, జీతాల విలువ కూడా కొత్త సరుకుకి బదిలీ అయిపోతుందని భావించారు. అంతేగాక, శ్రామికులలాగే శ్రమ సాధనాలు కూడా శ్రమ చేస్తాయనీ, అసలు శ్రమ సాధనాలే ఎక్కువ శ్రమ చేస్తాయనీ, అవే లాభాన్ని ఇస్తాయనీ — ఇలా, ఆ ఆర్థికవేత్తలు రక రకాల తప్పు అభిప్రాయాలెన్నో ప్రకటించారు.

ఒక సరుకు తయారయ్యేటప్పుడు, అక్కడ ఏ విలువలు పునరుత్పత్తి అవుతాయీ, ఏవి కొత్తగా ఉత్పత్తి అవుతాయీ, ఏవి కేవలం బదిలీ అవుతాయీ — ఈ విషయాలు, స్పష్టంగా తెలియకపోతే, 'లాభం' అనేది ఎక్కడి నించి, ఎలా ఉత్పత్తి అవుతుందో గ్రహించడం సాధ్యం కాదు. పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు 'లాభ మూలాన్ని' గ్రహించలేకపోయింది, ఈ ప్రధానమైన విషయాలు తెలుసుకోలేకపోవడం వల్లనే. ఈ విషయాలు ఇంత ప్రధానమైనవి కాబట్టే వీటిని ఇంత వివరంగా చూడవలసి వచ్చింది.

'సరుకు' కోసం పెట్టుబడిదారుడు పెట్టిన ఖర్చులన్నీ కలిసి 'పెట్టుబడి' అని మొదటే చూశాం. సరుకు తయారై అమ్మకం అయినప్పుడు, పెట్టుబడిదారుడు పెట్టిన పెట్టుబడి అంతా వెనక్కి వచ్చి 'లాభం' కూడా వస్తుంది కదా? ఈ లాభం రావడమూ, పెట్టుబడి వెనక్కి రావడమూ — అనే విషయాలకు కారణం— శ్రామికులే. శ్రామికులు పని చెయ్యకపోతే, సరుకు తయారవడమూ వుండదు; పెట్టుబడి, సరుకుకి చేరడమూ వుండదు; లాభమూ వుండదు.

కానీ, పెట్టుబడిదారుడికి ఈ సంగతులేవీ తెలియవు. అంటే, తన శ్రమ సాధనాలు, వాటి విలువకన్నా ఎక్కువ విలువని తెచ్చి తనకు ఇవ్వలేవు —అని తెలియదు. వాడు, తన 'పెట్టుబడి' మైకంలో పడి, 'సజీవ శ్రమ' పాత్రని (శ్రామికుల పాత్రని) ఏ మాత్రమూ గుర్తించడు. తన పెట్టుబడే 'అద్భుత శక్తులు గలది' అనుకుంటాడు. పెట్టుబడే 'సరుకు' ని ఉత్పత్తి చేస్తుందనీ, పెట్టుబడే 'లాభాన్ని' ఎక్కడి నించో తెచ్చి ఇస్తుందనీ, అనుకుంటాడు.

# పెట్టుబడిదారుడి లెక్కలు

పెట్టిన పెట్టుబడి ఎలా తిరిగి వస్తుందో, దాని ద్వారా లాభం ఎలా వస్తుందో, ఏ మాత్రమూ గ్రహించకుండానే, పెట్టుబడిదారుడు కేవలం ఒక సాంప్రదాయంగా తన లెక్కలన్నీ ఇలా రాసుకుంటాడు.

**తయారైన సరుకు — 100 మీటర్ల బట్ట**

1) ముడి పదార్థం ఖర్చు — 30 రూ.లు
2) శ్రమ పరికరాలూ+ఆగ్జిలరీ — 50
3) జీతాలు — — — — 20
4) నేను వేసుకున్న లాభం — 20

తయారైన సరుకు విలువ — 120
ఖర్చు — 100
లాభం — 20

పెట్టుబడిదారుడు రాసిన ఈ లెక్కలు చూడగానే మనకు ఒక విషయం అర్థమైపోవాలి. 'నేను వేసుకున్న

లాభం – 20' అని రాశాడే, దాన్ని చూసి మనం, 'శ్రామికులు, జీతాలు లేకుండా ఇచ్చిన విలువ — 20' అని అర్థం చేసుకోవాలి. పెట్టుబడిదారుడు, దాన్ని శ్రామికుల నించి జీతాలు లేకుండా తీసుకున్నానని ఒప్పుకోడు. నిజానికి, వాడి కాసంగతి తెలియదు కూడా. తన ఖర్చుల మీద అలా 'వేసుకున్నాన'నే అనుకుంటాడు. నిజానికి, వాడు నూటికి ఎంత లాభం వేసుకుంటాడో, నిజాయితీగా చెప్పడు. ఒకవేళ '20 వేసుకున్నాను' అని చెప్పాడే అనుకుందాం.

"ఇరవయ్యే ఎందుకు వేసుకున్నావు? నీ చేతిలో పనేగా? 50 ఎందుకు వేసుకోలేదూ?" అని అడిగితే, "అంత వేసుకుంటే సరుకు అమ్ముడు పోవద్దూ?" అంటాడు. అంతేగానీ, "అంత వేసుకుంటే తప్పు కాదూ? సరుకులో అంత విలువ లేదు కదా?" అనడు. అమ్ముడు పోదనే భయం లేకపోతే 100 కి 50 అయినా, ఎంత అయినా, వేసుకుంటాడన్నమాట!

"ఎందుకు అమ్ముడుపోదూ? 20 వేసుకుంటే అమ్ముడుపోయి, 50 వేసుకుంటే ఎందుకు అమ్ముడు పోదూ?" అంటే, వాడు ఇంకో బట్టల పెట్టుబడిదారుణ్ణి చూపించి — "ఆయన్ని చూడండి. నేను చేయించే సరుకే ఆయనా చేయిస్తున్నాడు. ఆయన 120 కే అమ్ముతున్నాడు. ఆయన కన్నా నేను ఎక్కువ వేసుకుని, ఆయన చవగ్గా, నేను పిరింగా అమ్మితే, నా దగ్గిర ఎవరు కొంటారు? ఆయన వేసుకున్నట్టే నేనూ వేసుకోవాలి కదా?" అంటాడు.

"అతనూ నిన్ను చూపించి ఈ మాటే అంటాడేమో! మీ రిద్దరూ కూడా 50 చొప్పునే వేసుకోరాదూ?"

వాడి కళ్ళు జిగేల్మని మెరుస్తాయి. 50 శాతం లాభం! ఎంత డబ్బు రాసి! నిజమే! కానీ, "అబ్బే కుదరదు అలా వేసుకోడం" అని అంతలోనే నిరుత్సాహపడతాడు.

"ఎందుకు కుదరదో చెప్పు. మాకు తెలుసుకోవాలని వుంది."

"కుదరదన్నాగా? అలా వేసుకుంటే కుదరదు."

వాడు అలా "కుదరదు, కుదరదు" అనకుండా "నాకు తెలీదు" అంటే బాగుంటుంది. వాడా మాట చెప్పడు గానీ, నిజంగానే వాడికి అంత కన్నా తెలీదు. వాడికేమిటి, వాడి ఆర్థికవేత్తలకే అంతకన్నా తెలీదు.

సరుకుని తయారు చేయించినప్పుడు తనకు అయిన ఖర్చులన్నిటినీ కూడడమూ, దాని మీద ఎంత ఎక్కువ వేసుకుంటే సరుకు అమ్ముడు పోతుందో మార్కెట్ అనుభవం ద్వారా గ్రహించి, ఆ ఎక్కువని వేసుకుని, సరుకుని అమ్మి ఆ లాభం జేబులో వేసుకోవడమూ, అది తప్పు, వాడికి రెండో విషయం తెలీదు.

ఖర్చుల మీద లాభం వేసుకునేటప్పుడు, ఎవడికి ఇష్టమైనట్టు వాడు వేసుకోలేడనీ; లాభ శాతాన్ని కంట్రోల్ చేసే విలువ సూత్రానికి సంబంధించిన రూల్స్ కొన్ని వున్నాయనీ; ఎవడి కిష్టమైనంత లాభం వాడు లాగడానికి వీలు కాకుండా పెట్టుబడిదారుల మధ్యా, పెట్టుబడి 'శాఖల' మధ్యా పోటీ వుంటుందనీ; ఈ పరిస్థితులన్నీ లాభ శాతానికి ఒక హద్దుని నిర్ణయిస్తాయనీ; అందుకే ఏ పెట్టుబడిదారుడూ తన 'మనసు'లో వున్నంత లాభం తన సరుకు మీద వేసుకోలేడనీ — ఈ విషయాలన్నీ ఏ పెట్టుబడిదారుడికీ, ఏ పెట్టుబడిదారీ ఆర్థికవేత్తకీ తెలీవు. (ఈ విషయాలన్నీ 2 వ సంపుటంలో "జనరల్ లాభం రేటు" గురించీ, "ధరల" గురించీ చర్చించేటప్పుడు వివరంగా చూస్తాం.)

పెట్టుబడిదారుడు 100 పెట్టుబడి మీద, 50 లాభం వేసుకున్నాడా, 5 లాభం వేసుకున్నాడా — అన్నది ప్రశ్న కాదు. ఎంత వేసుకున్నా, ఆ లాభం శ్రామికుల నించి జీతాలు ఇవ్వకుండా లాగేదే. అదీ అసలు గ్రహించవలసిన విషయం.

# లాభం ఏ దశ నించి వస్తుంది?

పెట్టుబడిదారుడు సరుకుని ఉత్పత్తి చేయిస్తాడు. అది ఒక దశ. తర్వాత దాన్ని అమ్మిస్తాడు. అది ఇంకో దశ. ఈ రెండు దశల్లోనూ 'లాభం' ఏ దశ నించి వచ్చినట్టు? 'ఉత్పత్తి దశ' నించి వచ్చినట్టా, 'అమ్మకం దశ' నించి వచ్చినట్టా?

ఒక 'పెట్టుబడి' నడక నంతటినీ ఇక్కడ ఒక సారి క్లుప్తంగా చూద్దాం. లాభం ఏ దశ నించి వస్తుందో తెలుస్తుంది.

**(1)** పెట్టుబడిదారుడు, మొదట 'కొంత డబ్బు'తో తన కార్యక్రమం ప్రారంభిస్తాడు. అంటే, పెట్టుబడి, మొదట కొంత 'డబ్బుగా' వుంటుంది. దీనికి గుర్తు — **M** (మనీ). బట్ట ఉదాహరణలో ఇది 100.

**(2)** ' పెట్టుబడి'గా వుండే ఆ 100 లో నించి 80 తో, పెట్టుబడిదారుడు, ఇతర పెట్టుబడిదారుల దగ్గిర తయారయ్యే ముడి పదార్థాలూ, ఇతర శ్రమ సాధనాలూ కొంటాడు. ఒక సరుకుని కొనడం గానీ, అమ్మడం గానీ

చేసే దశ చలామణీ దశ. 'చలామణీ' అన్నా, 'మారకం' అన్నా, 'అమ్మడమూ – కొనడమూ' అన్నా, ఇవన్నీ ఒకటే. పెట్టుబడిదారుడు మొదట ఇతర పెట్టుబడిదారుల సరుకుల్ని తను కొనడం — అనే ఒక చలామణీ చర్యతో తన క్రమం ప్రారంభిస్తాడు. ఇప్పుడు బట్ట పెట్టుబడిదారుడు, 'కొనేవాడి'గా వుంటాడు. 'సరుకులు అసలు విలువకే అమ్ముడుపోతాయి' అనే జనరల్ సూత్రం ప్రకారమే విషయాలు చూడాలి. బట్ట పెట్టుబడిదారుడికి, 80 డబ్బుకి బదులుగా ఇతర పెట్టుబడిదారుల నించి 80 విలువ గల సరుకులే వస్తాయి. అంతకన్నా ఎక్కువ విలువ రాదు కాబట్టి, బట్ట పెట్టుబడిదారుడికి, ఈ చర్యలో 'లాభం' ఏమీ రాదు.

'100 పెట్టుబడి'లో ఇంకా మిగిలిన 20 తో, పెట్టుబడి దారుడు, 'శ్రామికుల్ని' కొన్ని గంటల కోసం కొంటాడు. శ్రామికులు కూడా 'సరుకులే'. శ్రామికుల్ని 20 తో కుదుర్చుకోగానే, వాళ్ళు ఇంకా పని ప్రారంభించక ముందే, వాళ్ళ ద్వారా కూడా 'లాభం' ఏమీ రాదు. శ్రామికులకు జీతాలు అప్పుడే ఇవ్వకపోయినా, అవి శ్రామికులకు వెళ్ళేవే కాబట్టి, అవి వెళ్ళి పోయినట్టుగానే ఉహిద్దాం. ఇప్పటి వరకూ ఏం జరిగిందంటే: పెట్టుబడిదారుడి నించి 100 డబ్బు వెళ్ళి పోయి, ఆ 'పని స్థలం'లోకి శ్రమ సాధనాలూ, శ్రామికులూ వచ్చారు. అంటే, 100 డబ్బు, అంతే విలువ గల 'సరుకు'గా (శ్రమ సాధనాలు 80 + జీతాలు 20) మారడం మాత్రమే జరిగింది.

ఈ దశ కి గుర్తు: డబ్బూ — సరుకూ
మనీ — కమాడిటీ
**M — C**
100 — 100
లాభం, ఇంకా లేదు.

**(3)** ఇప్పుడు 'కొత్త సరుకు' తయారవుతుంది. ఇది 'ఉత్పత్తి క్రమం' జరిగే దశ. ఈ దశలో, 80 విలువ గల 'శ్రమ సాధనాలు' ఖర్చయిపోతాయి. 20 విలువ గల 'జీతాలు' ఖర్చయిపోతాయి. అంతేగాక, శ్రామికుల నించి 20 'అదనపు శ్రమ' కూడా ఖర్చవుతుంది. బట్ట ఉదాహరణలో, ఈ ఖర్చులు వరసగా — 80+20+20. ఈ ఖర్చులన్నీ జరిగి, కొత్త సరుకు ఉత్పత్తి (ప్రొడక్షన్).
ఈ దశకి గుర్తు — **P**

**(4)** 'కొత్త సరుకు' తయారైంది. అది 100 మీ. బట్ట. దీనికోసం 100 పెట్టుబడి ఖర్చయింది కాబట్టి 'పెట్టుబడి విలువ' అంతా, దీనికి చేరుతుంది. అంతేకాదు, పెట్టుబడి కన్నా ఎక్కువగా '20 అదనపు విలువ' కూడా ఖర్చయింది కాబట్టి, ఆ విలువ కూడా సరుకుకి చేరుతుంది. కొత్త సరుకు — 120 విలువతో వుంది. అమ్మకానికి సిద్ధంగా తయారై వున్న కొత్త సరుకు ఇది. దీనికి గుర్తు — $\mathbf{C^1}$. (దీన్ని, 'సి— వన్' అని చదవాలి. (అంటే, కమాడిటీ వన్). $\mathbf{C^1}$ అంటే, ఖర్చయిన పెట్టుబడి విలువ కన్నా ఎక్కువ విలువతో వున్న కొత్త సరుకు — అని అర్థం.

**(5)** తయారైన కొత్త సరుకు పెట్టుబడిదారుడి స్వంత అవసరం కోసం కాదు. దీన్నంతా పెట్టుబడిదారుడే వుంచేసుకోడు. ( ఒకవేళ, పెట్టుబడిదారుడు, స్వంత కుటుంబ అవసరం కోసం ఆ సరుకులో నించి ఏమైనా వాడినా, దాని వల్ల, దాని విలువ లెక్కలేమీ మారవు. కాబట్టి, కొత్త సరుకులో నించి పెట్టుబడిదారుడు ఎంత వాడతాడు — అనే వివరాలు అనవసరం. ) తయారైవున్న బట్టని పెట్టుబడిదారుడు ఇప్పుడు అమ్మాలి. అంటే, ఆ బట్టని ఇచ్చేసి, దాని విలువకి సమానమైన 'డబ్బు' తీసుకోవాలి. సరుకుని అమ్మకపోతే, అందులో ఎంత 'లాభం' వున్నా అది పెట్టుబడిదారుడి చేతికి రాదు. అంతే కాదు, దాన్ని అమ్మకపోతే, దాని కోసం పెట్టిన 'పెట్టుబడి' కూడా వెనక్కి రాదు. పెట్టుబడి వెనక్కి వస్తేనే దాన్ని మళ్ళీ ఉపయోగించడానికి వీలవుతుంది. కాబట్టి, ఖర్చయిపోయిన పెట్టుబడి వెనక్కి రావాలన్నా, సరుకులో వున్న 'లాభం' చేతికి అందాలన్నా, ఆ సరుకుని అమ్మేసి, 'డబ్బు' తీసుకోవాలి. అంటే, మళ్ళీ 'చలామణీ' దశ (మారకం దశ) అవసరం. మొదటేమో, ఈ పెట్టుబడి దారుడే 'కొనేవాడి'గా వుండి, ఇతర పెట్టుబడిదారుల నించి ముడి పదార్థాలూ అవీ కొన్నాడు. ఇప్పుడేమో, ఈ పెట్టుబడిదారుడు 'అమ్మేవాడి'గా వుండి, తను తయారుచేయించిన బట్టని, ఇతరులకు (ఇతర పెట్టుబడిదారులకూ, శ్రామికులకూ కూడా) అమ్ముతాడు. ఈ పెట్టుబడిదారుడు ఇతరుల సరుకుల్ని కొన్నప్పుడు, వాటిని 'అసలు విలువలకే' కొన్నట్టుగానే, ఇప్పుడు తన సరుకుని అమ్మేటప్పుడు కూడా దాన్ని అసలు విలువకే అమ్ముతాడని చూస్తాం. 'సరుకు, అసలు విలువకే అమ్ముడు పోతుంది' అనే జనరల్ సూత్రమే ఇక్కడ కూడా వర్తిస్తుంది. అంటే, ఈ బట్టని కొనేవాళ్ళు, దాని విలువకి తగ్గ డబ్బు మాత్రమే ఇస్తారు. అంత కన్నా ఎక్కువ ఇవ్వరు.

ఈ బట్టకి ఎంత డబ్బు వస్తుంది? 120 డబ్బు వస్తుంది. బట్ట వెళ్ళిపోతుంది. 120 డబ్బు వస్తే, బట్ట కోసం ఖర్చయిన 100 పెట్టుబడి వెనక్కి వచ్చేసిందని అర్థం. దానిమీద 20 లాభం! — ఈ లాభం ఎలా వచ్చింది? బట్టని కొన్న వ్యక్తి, బట్ట విలువ కన్నా ఎక్కువ డబ్బు ఇచ్చాడా? — కాదు. బట్టకి ఎంత విలువ వుందో అంత డబ్బే ఇచ్చాడు. తను

ఇచ్చిన డబ్బుకి సమానమైన విలువ గల సరుకునే తీసు కున్నాడు. అంటే, బట్ట — 'అసలు విలువ' కే మారింది. మరి 'లాభం' ఎలా వచ్చింది? — బట్టకి వున్న విలువలో నించే వచ్చింది. అంటే, 120 లో నించే. ఆ లాభం, బట్ట విలువతో సంబంధం లేకుండా బయటి నించి వచ్చింది కాదు.

'బట్ట'కీ, 'డబ్బు'కీ, 'సమాన విలువల' మారకమే జరిగింది. అయినా, బట్ట ద్వారా 'లాభం' వచ్చింది!

'సరుకు'కీ 'డబ్బు'కీ మారకం జరిగినప్పుడు, సరుకుని కొన్న పెట్టుబడిదారుడికి లాభం ఏమీ వుండదు. సరుకుని అమ్మిన పెట్టుబడిదారుడికే లాభం వుంటుంది. అంటే, ఏ పెట్టుబడిదారుడికైనా లాభం, తను ఉత్పత్తి చేయించిన సరుకుని అమ్మినప్పుడే అందుతుంది. ఆ ఉత్పత్తిలో నించే.

ఇది — బట్ట, డబ్బుగా మారే దశ.

దీనికి గుర్తు: కొత్త సరుకూ — పెరిగిన డబ్బూ

120 — 120

**C¹ — M¹**

( దీన్ని, ' సీ వన్ డాష్ ఎమ్ వన్ ' అని చదవాలి )

ఈ దశ పూర్తయినప్పుడు, పెట్టుబడిదారుడి చేతుల్లోకి 'లాభం' దూకుతుంది. పెట్టుబడేమో, పెట్టుబడిదారుడితో సగర్వంగా, "లాభం తెచ్చాను, చూసుకో" అంటుంది. పెట్టుబడిదారుడు, 'పెట్టుబడి' ని భుజంతట్టి, "సెభాష్! నువ్వు అంతటి దానివే!" అని మెచ్చుకుని, లాభాన్ని చంకనెత్తుకుంటాడు.

మొదటి డబ్బు, పెరిగిన డబ్బుగా మారి పెట్టుబడి దారుడి చేతికి వచ్చేటప్పటికి 'పెట్టుబడి నడక' పూర్తి అవుతుంది. ఈ నడక మొత్తాన్ని ఒకసారి పూర్తిగా ఇలా చూడవచ్చు.

| మొదటి డబ్బు | సరుకు | ఉత్పత్తి క్రమం | కొత్త సరుకు | పెరిగిన డబ్బు |
|---|---|---|---|---|
| **M** | **C** | **P** | **C¹** | **M¹** |
| 100 | 100 | ...... | 120 | 120 |

ఈ పెట్టుబడి నడక నంతటినీ చూస్తే, లాభం ఏ దశ నించి వచ్చినట్టు అర్థం? ఉత్పత్తి దశ నించా, చలామణీ దశ నించా? — లాభం రావడానికి ఈ 2 దశలూ అవసరమే. ఎలాగంటే, అది 'ఉత్పత్తి దశ'లో సరుకుకి చేరి, 'చలామణీ దశ'లో చేతికి అందుతుంది. శ్రామికులతో పనిచేయించే 'ఉత్పత్తి దశ' లేకపోతే, అసలు లాభాన్ని నింపుకున్న సరుకే వుండదు. ఆ సరుకుని అమ్మే 'చలామణీ దశ' లేకపోతే ఆ 'లాభం' పెట్టుబడిదారుడి చేతికి అందే మార్గం వుండదు. ఆ రకంగా, 2 దశలూ కలిసే, లాభం వచ్చేలా చేస్తాయి. అయితే, లాభం ఉత్పత్తి అయ్యేది మాత్రం — సరుకు తయారయ్యే దశలోనే, సరుకుని అమ్మే దశలో కాదు.

తయారై సిద్ధంగా వున్న సరుకుని చూసినప్పుడు, దాని 'విలువ' గానీ, అందులో వున్న 'లాభం' గానీ, కనపడవు. సరుకుని చూస్తే, 'ఇందులో లాభం వుంది' అని తెలియదు. సరుకుని అమ్మినప్పుడే అది బయట పడుతుంది. కాబట్టి, లాభం అనేది 'అమ్మకం' వల్లనే వచ్చే విషయం లాగ కనపడుతుంది. లాభానికి, సరుకు విలువతో సంబంధమే లేనట్టూ, అది 'చలామణీ' నించే, అంటే 'కొనే వ్యక్తి' నించే, ఆ వ్యక్తి ఎక్కువ విలువని ఇవ్వడం వల్లనే, వచ్చినట్టూ — కనపడుతుంది.

పెట్టుబడిదారులంతా ఇలాగే, లాభం 'ఎక్కడి నించో బయటి నించి' వస్తుందని భావిస్తారు. అదే మాట్లాడతారు. పెట్టుబడిదారులు మాట్లాడేది చూసి, వాళ్ళ ఆర్థికవేత్తలు కూడా "లాభం ఎలా వస్తుందా? సరుకుని అమ్మితే వస్తుంది" అని అదే వల్లిస్తారు. పెట్టుబడిదారుల కన్నా వాళ్ళ ఆర్థికవేత్తలు కొత్తగా చెప్పేదేమీ వుండదు.

# విలువ, 'చలామణీ దశ' లో పెరుగుతుందా?

ఈ విషయంలో ఇంకొక్క ఉదాహరణ చూస్తే, 'చలామణీ నించి లాభం వస్తుంద'నే వాదాన్ని ఎన్ని రకాలుగా మార్చినా పొరపడనంత స్పష్టంగా దీన్ని అర్థం చేసుకోగలుగుతాం. విలువని పెంచే పని, చలామణీ దశలో జరుగుతుందా — అని చూడాలి.

చలామణీ అంటే, 2 సరుకులు గానీ, 'సరుకూ – డబ్బూ' గానీ, ఒక దానితో ఒకటి మారడం. 2 సరుకులు ఒక దానితో ఒకటి మారడానికి వచ్చాయి — అనుకుందాం. ఇంకా ఆ మారకం ప్రారంభం కాకముందు ఆ 2 సరుకుల లోనూ కలిసి మొత్తం ఎంత విలువ వుంటుందో, 'మారకం' జరిగిన తర్వాత కూడా ఆ 2 సరుకులలోనూ కలిసి అంతే విలువ వుంటుందా, ఆ విలువ ఏమైనా పెరిగి వుంటుందా? — అదే ఇప్పుడు చూడాలి.

ఒక మనిషి చేతిలో 10 విలువ గల ధాన్యం, ఇంకో మనిషి చేతిలో 10 విలువ గల బట్టా వున్నాయి. ఎవరి సరుకు వాళ్ళ దగ్గిరే వుంది. వాటి విలువల్ని కలిపి లెక్క

చూస్తే, 2 సరుకుల్లోనూ కలిసి 10 + 10 = 20 విలువ వుంది. బట్ట మనిషి తన 10 విలువతో ధాన్యం కొనదల్చు కున్నాడు. ఇప్పుడు ఆ 2 వస్తువులకూ మారకం జరిగిందను కుందాం. మారకం పూర్తి అయిన తర్వాత ఆ 2 వస్తువు లకూ వున్న విలువల్ని మళ్ళీ లెక్కచూస్తే, ఆ మొత్తం ఎంత వుంటుంది? అది ఇప్పుడు కూడా గతంలో లాగే వుంటుందా, ఇంకా ఏమైనా పెరిగి వుంటుందా? అంటే, మారకం పూర్తి అయ్యేసరికి బట్ట విలువ 10 కన్నా ఎక్కువ అయ్యి, ధాన్యం విలువ కూడా 10 కన్నా ఎక్కువ అయ్యి వుంటాయా? — అలా జరగదు. మారకం వల్ల సరుకుల విలువల్లో అలాంటి మార్పులేమీ జరగవు. మారకం అంటే, అంతకుముందే ఉత్పత్తి అయి వున్న విలువలు, ఇటూ అటూ మారడం మాత్రమే. ఒక సరుకు 'విలువ', మారకానికి ముందు ఎంత వుంటుందో మారకం తర్వాత కూడా అంతే వుంటుంది. అంటే, 'మారకం' వల్ల విలువ కొంత పెరగడం గానీ, కొంత తరగడం గానీ, జరగదని అర్థం. 10 బట్టకీ, 10 ధాన్యానికీ మారకం పూర్తి అయిన తర్వాత, ఆ ఇద్దరు వ్యక్తుల దగ్గిరా వున్న మొత్తం విలువని లెక్కచూస్తే, అది, గతంలోలాగే, 20 గానే, వుంటుంది.

'మారకం' వల్ల, సరుకుల విలువలు పెరగడం జరిగి నట్టయితే, ఆ విషయం ఎలా రుజువు కావాలంటే: 10 విలువ గల బట్టకీ, 10 విలువ గల ధాన్యానికీ, మారకం జరిగింది కదా? మారకం తర్వాత ఆ సరుకులలో నించీ ఏ సరుకుని తీసుకున్నా దాని విలువ 10 కన్నా ఎక్కువై వుండాలి. బట్ట విలువ 11 గానూ, ధాన్యం విలువ కూడా 11 గానూ పెరిగి వున్నాయనే అనుకుందాం. ఆ సంగతి ఎలా తెలియాలి?

మళ్ళీ ఆ 2 సరుకులనే మారకం చేస్తే తెలియదు. కాబట్టి ఇప్పుడు ఆ సరుకుల్ని వేరే సరుకులతో మారకం చేసి చూడాలి. ఇప్పుడు బట్టని పంచదారతో మారకం చేస్తే, ఆ బట్టకి బదులుగా 11 విలువ గల పంచదార వస్తుందా? అలాగే ధాన్యాన్ని కూడా పంచదారతో మారకం చేస్తే, ఆ ధాన్యానికి కూడా 11 విలువ గల పంచదార వస్తుందా? — అలా జరిగితేనే ఆ సరుకులకు మొదటి మారకాల వల్ల విలువలు పెరిగాయని రుజువు అవుతుంది. అంతేకాదు, ఈ రెండో మారకం వల్ల, ఆ సరుకుల విలువలు ఇంకా పెరగాలి. అంటే, ఆ బట్టనీ, ఆ ధాన్యాన్నీ, ఆ పంచదారనీ, మళ్ళీ వేరే సరుకులతో మారకాలు చేసి చూస్తే, ఈ సారి వాటి విలువలు 11 కన్నా కూడా పెరిగి వుండాలి. ఈ రకంగా ఒక సరుకుకి, ఒక మారకం తర్వాత ఇంకో మారకం చేస్తూ పోతే, దాని విలువ పెరిగిపోతూ కనపడాలి. కానీ, ఈ రకంగా ఎంత మాత్రమూ జరగదు. 10 విలువ గల బట్టని, ఎన్ని సరుకులతో మళ్ళీ మళ్ళీ మారకాలు చేసి చూసినా బట్ట విలువ 10 గానే వుంటుంది. బట్టకి, బదులుగా 10 కన్నా ఎక్కువ విలువ గల సరుకు, ఏ మారకం లోనూ రాదు. అంటే 'మారకం' వల్ల సరుకు విలువ పెరగదనీ, మారకంలో కొత్త విలువ చేరదనీ, అర్థం.

కాబట్టి, పెట్టిన పెట్టుబడి కన్నా ఎక్కువ విలువ (లాభం) రావడం అనేది, 'అమ్మకం' వల్ల జరగదు. ఆ 'లాభం' కూడా సరుకు తయారయ్యేటప్పుడే సరుకుకి చేరి వుంటుంది. అలా చేరి వున్న విలువే 'అమ్మకం' దశలో చేతికి అందుతుంది. — కానీ ఈ విషయాలు, ఇలా అర్థం చేసుకోవడం, పెట్టుబడిదారుడికి చాలా అయిష్టం. ఎందు కంటే, దీన్ని ఒప్పుకుంటే — "లాభం అనేది పెట్టుబడి మీద వూరికే వేసుకోవడం వల్ల వస్తుంది. 'అమ్మకం' వల్ల వస్తుంది" అనే వాదాల్ని వదులుకోవలసి వస్తుంది కాబట్టి. అందుకే వాడు దేనినీ తార్కికంగా పరిశీలించడానికి ఇష్టపడడు. వాడి లాగే వాడి ఆర్థికవేత్త కూడా.

# 'ప్రధాన' లాభమూ, 'సెకండరీ' లాభమూ

'లాభం' గురించి చూస్తున్న ఇక్కడ, ప్రధాన లాభమూ, సెకండరీ లాభమూ — అనే విషయాలకు వున్న తేడాని సరిగా అర్థం చేసుకోవాలి.

'బట్ట'నీ, ధాన్యాన్నీ, తీసుకుందాం. బట్ట పెట్టుబడి దారుడు తన శ్రామికులతో బట్టనీ; ధాన్యం పెట్టుబడి దారుడు, తన శ్రామికులతో ధాన్యాన్నీ — ఉత్పత్తి చేయించారు.

బట్టకి పెట్టుబడి 100, లాభం 20. బట్ట విలువ 120. ధాన్యానికి పెట్టుబడి 100. లాభం 20. ధాన్యం విలువ 120. ఈ బట్టకీ, ఈ ధాన్యానికీ, మారకం జరిగింది. అది, 'సమాన విలువల' మారకం.

బట్ట పెట్టుబడిదారుడి వేపు నించి చూస్తే: వీడు 100 పెట్టుబడి ఖర్చుతోనే బట్టని ఉత్పత్తి చేయించాడు. కానీ, దాన్ని అమ్మితే 120 విలువ గల ధాన్యం వచ్చింది. అంటే, 100 పెట్టుబడి తిరిగివచ్చి, ఇంకా 20 లాభం వచ్చింది.

అలాగే, ధాన్యం పెట్టుబడిదారుడి వేపు నించి చూస్తే: వీడు కూడా 100 పెట్టుబడి ఖర్చుతోనే ధాన్యాన్ని ఉత్పత్తి

చేయించాడు. కానీ, దాన్ని అమ్మితే, 120 విలువ గల బట్ట వచ్చింది. అంటే 100 పెట్టుబడి తిరిగి వచ్చి, '20 లాభం' వచ్చింది.

బట్ట పెట్టుబడిదారుడికి వచ్చిన లాభం, బట్టని కొన్నవాడి నించి వచ్చిందా? — కాదు. ధాన్యం పెట్టుబడి దారుడికి వచ్చిన లాభం, ధాన్యాన్ని కొన్నవాడి నించి వచ్చిందా? — కాదు.

ఎవరి సరుకులో నించే, వాళ్ళకి లాభం వచ్చింది.

బట్ట పెట్టుబడిదారుడికి వచ్చిన లాభం, 'బట్ట విలువ' లో నించే, అంటే, బట్టని ఉత్పత్తి చేసిన శ్రామికుల నించి వచ్చింది. అలాగే, ధాన్యం పెట్టుబడిదారుడికి వచ్చిన లాభం — ధాన్యం విలువలో నించే, అంటే, ధాన్యాన్ని ఉత్పత్తి చేసిన శ్రామికుల నించి వచ్చింది.

బట్టనీ, ధాన్యాన్నీ కలిపి చూస్తే, ఆ సరుకుల కోసం ఖర్చయిన మొత్తం పెట్టుబడి ఎంత? ఆ పెట్టుబడి, ఉత్పత్తి చేసిన మొత్తం విలువ ఎంత? అందులో వున్న మొత్తం లాభం ఎంత? — మొత్తం పెట్టుబడి 200. అది ఉత్పత్తి చేసిన మొత్తం విలువ 240. అందులో వున్న మొత్తం లాభం 40.

ఇద్దరు పెట్టుబడిదారులకూ కలిసి అందే లాభం మొత్తం, 40 గా మాత్రమే వుంటుంది. అంతకన్నా ఎక్కువ లాభం రావడం సాధ్యం కాదు. ఎందుకంటే, 40 కన్నా ఎక్కువ లాభం, ఆ సరుకుల్లోనే లేదు కాబట్టి. ఈ పెట్టుబడిదారులిద్దరూ ఈ 40 లాభాన్నే లాక్కోగలగాలి. అలా లాక్కోవడంలో ఏ మోసమూ జరగకుండా, సరుకుల మధ్య 'సమాన విలువల' మారకమే జరిగితే, లాభాల పరిస్తితి ఎలా వుంటుంది? లేదా, కొంత మోసం జరిగితే, లాభాల పరిస్తితి ఎలా వుంటుంది? — ఈ విషయాలు ఇప్పుడు చూద్దాం.

బట్టకి పెట్టుబడి 100. లాభం 20. బట్ట విలువ 120. ధాన్యానికి పెట్టుబడి 100. లాభం 20. ధాన్యం విలువ 120.

ఈ 2 సరుకులకూ 'సమాన విలువల' మారకం జరిగితే, ఇద్దరు పెట్టుబడిదారులకూ ఎవరి పెట్టుబడి వాళ్ళకి తిరిగి వస్తుంది. ఆ పైన చెరో 20 లాభం అందుతుంది. ఎవరికి అందిన లాభం వాళ్ళకి 'ప్రధాన లాభమే'. ఎవరికీ 'సెకండరీ లాభం' వుండదు.

కానీ, ఈ మారకం సమాన విలువల మారకంగా జరగలేదనుకుందాం. బట్ట వాడు, రెండో వాణ్ణి కొంత మోసం చేశాడనుకుందాం. ఎలాగంటే: బట్టవాడు, ధాన్యం వాడి నించి 120 విలువగల ధాన్యం తీసుకుని, దానికి బదులుగా తన 120 విలువ గల బట్టనంతా ఇవ్వకుండా, కొలతలో మోసంచేసి, 118 విలువ గల బట్టని మాత్రమే ఇచ్చి, 2 విలువ గల బట్టని తనే ఉంచేసుకున్నాడనుకుందాం. అప్పుడేం జరిగినట్టు అర్థం?

బట్టవాణ్ణి చూస్తే: వీడికి 120 విలువ గల ధాన్యం వచ్చింది. కానీ, వీడు ఖర్చుపెట్టిన పెట్టుబడి 100 మాత్రమే. 100 పెట్టుబడికి బదులుగా 120 వచ్చిందంటే, ఆ రకంగా '20 లాభం' వచ్చింది. ఇది బట్టవాడికి వచ్చిన 'ప్రధాన' లాభం. అంతే కాదు; వీడు, ధాన్యం వాడి నించి 120 ని తీసుకుని, వాడికి 118 ని మాత్రమే ఇచ్చి, '2 విలువ గల బట్ట'ని తనే ఉంచేసు కున్నాడు. ఈ మోసం ద్వారా బట్టవాడికి '2 లాభం' వచ్చింది. ఇది, కేవలం 'అమ్మకం'లో చేసిన మోసం ద్వారా ఎదటివాడి నించి లాక్కున్న లాభం. ఇది 'సెకండరీ లాభం'. బట్టవాడికి వచ్చిన మొత్తం లాభం = ప్రధాన లాభం 20 + సెకండరీ లాభం 2 = 22.

ధాన్యం వాణ్ణి చూస్తే: వీడి నించి 120 విలువ గల ధాన్యం వెళ్ళిపోయి, దానికి బదులుగా 118 విలువ గల బట్ట వచ్చింది. అంటే వీడికి 2 నష్టం. ఎందులో నించి 2 నష్టం? 'పెట్టుబడి'లో నించా? కాదు. పెట్టుబడి అంతా (100 పెట్టుబడి) తిరిగి వచ్చేసింది. పెట్టుబడి అంతా వెనక్కి రాకపోతే, మళ్ళీ కొత్త సరుకుని ఉత్పత్తి చేయించడం సాధ్యమే కాదు. కాబట్టి పెట్టుబడి అంతా వెనక్కి వచ్చి తీరాలి. అది తగ్గడానికి వీలులేదు. దానిమీద రావలసిన '20 లాభం'లో నించే 2 తగ్గింది. 18 మాత్రమే వచ్చింది. ఈ 18 మాత్రమే వీడికి — 'ప్రధానలాభం'. అంటే, ప్రధాన లాభంలోనించి 2 తగ్గింది. వీడికి, 'సెకండరీ లాభం' లేదు. ప్రధాన లాభమే పూర్తిగా రానప్పుడు, సెకండరీ లాభం ఎలాగూ వుండదు.

ధాన్యంవాడికి రాకుండా పోయిన 2 ప్రధాన లాభమే, బట్టవాడికి సెకండరీ లాభంగా అందింది. ఒక చోట అందనిదే, ఇంకో చోట అందింది.

ఇప్పుడు, ఇద్దరి లాభాల్నీ కలిపితే :

| | |
|---|---|
| బట్ట వాడికి లాభం | — 22 |
| ధాన్యం వాడికి లాభం | — 18 |
| ఇద్దరికీ కలిసి మొత్తం లాభం | — 40 |

మొత్తం '40 లాభం'లో, సెకండరీ లాభం 2. అంటే, 'సెకండరీ లాభం' అనేది కూడా ప్రధాన లాభంలో భాగమే.

ఈ ఉదాహరణలో, బట్ట వాడు 2 మోసం గాక, 4 మోసం చెయ్యగలిగితే, వాడి సెకండరీ లాభం 4 అవుతుంది. అప్పుడు, ధాన్యం వాడి ప్రధాన లాభం ఇంకా తగ్గి అది 16 మాత్రమే అవుతుంది. కానీ అప్పుడు కూడా ఇద్దరికీ వచ్చిన లాభాల మొత్తం 40 గానే వుంటుంది.

'మోసం' ఉదాహరణని ఇంకో రకంగా చూద్దాం. ఇద్దరూ ఒకర్ని ఒకరు ఒకే స్థాయిలో మోసం చేసుకున్నా

రనుకుందాం. అప్పుడేం జరుగుతుంది? బట్టవాడు, ధాన్యం వాడికి 120 బట్టని గాక, 118 బట్టనే ఇచ్చి, 2 బట్టని తానే మిగుల్చుకున్నాడు. అలాగే, ధాన్యంవాడు కూడా, బట్ట వాడికి, 120 ధాన్యాన్ని గాక, 118 ధాన్యాన్నే ఇచ్చి, 2 ధాన్యాన్ని తనే మిగుల్చుకున్నాడు.

బట్టవాడి వేపు నుంచి చూస్తే: వీడి నించి 118 విలువ వెళ్ళి, దానికి బదులుగా 118 విలువే వచ్చింది. అందులో నించి పెట్టుబడి 100 ని తీసేస్తే ప్రధాన లాభం 18. అంతేగాక, ధాన్యంవాడికి ఇవ్వకుండా మోసం ద్వారా మిగుల్చుకున్న సెకండరీ లాభం 2. మొత్తం లాభం 20.

ధాన్యంవాడి వేపు నించీ చూస్తే: వీడి నించి కూడా 118 విలువ వెళ్ళి, 118 విలువే వచ్చింది. అందులో పెట్టుబడి 100. ప్రధాన లాభం 18. అంతేగాక బట్టవాడికి ఇవ్వకుండా మోసం ద్వారా మిగుల్చుకున్న సెకండరీ లాభం 2. మొత్తం లాభం 20.

ఇద్దరి లాభాలూ కలిసి 40.

ఇద్దరూ, ఒకర్ని ఒకరు ఒకే స్థాయిలో మోసం చేసుకుంటే ఏం జరిగింది? — ఇద్దరి లాభాలూ సమానం అయ్యాయి. అంటే ఎవరికీ రెండో వాడి కన్నా ఎక్కువ లాభం లేదు. ఇద్దరికీ సెకండరీ లాభాలు మాయ మయ్యాయి.

ఈ ఉదాహరణలో, ఎవరి 100 పెట్టుబడి వాళ్ళకే అందింది. ఒకరి పెట్టుబడిని ఇంకొకరు లాక్కోవడం జరగలేదు. 'లాభం'లో నించే ఎంత ఎక్కువగా వీలైతే అంత ఎక్కువగా లాక్కోవడానికి పెట్టుబడిదారులు ప్రయత్నిస్తారు. దాని కోసం రక రకాల మార్కెట్ చాతుర్యాలు ప్రదర్శిస్తారు. ఇద్దరి చాతుర్యాలూ ఒక దాన్ని ఒకటి ఢీకొంటాయి. రెండు శక్తులూ సమానంగా వుంటే, దాని ఫలితం — 'సమాన విలువల' మారకమే. ఒకడి శక్తి సన్నగిల్లి ఇంకోడి శక్తి పెచ్చరిల్లితే, దాని ఫలితం — 'అసమాన విలువల' మారకం. అప్పుడు, ఒకడి లాభం కొంత తగ్గి, ఇంకోడి లాభం కొంత పెరుగుతుంది.

ప్రధాన లాభం — అంటే, సరుకుల మధ్య 'సమాన విలువల' మారకమే జరుగుతూ వున్నప్పుడు కూడా వచ్చే లాభం. ప్రధాన లాభం విషయంలో — ఒక పెట్టుబడి దారుడికి లాభం రావాలంటే, ఇంకో పెట్టుబడిదారుడికి నష్టం జరగనక్కరలేదు. ఏ పెట్టుబడిదారుడూ నష్టపోకుండానే ఎవరి సరుకులో లాభాన్ని వాళ్ళు తీసుకోగలుగుతారు.

కానీ, 'సెకండరీ లాభం' విషయంలో, అలా జరగదు. ఒక పెట్టుబడిదారుడికి అందకుండా లాక్కోగలిగే భాగమే ఇంకో పెట్టుబడిదారుడికి 'సెకండరీ లాభం'గా వుంటుంది. ఒకడు కొంత నష్టపోతేనే, ఇంకొకడు కొంత లాభబడతాడు. ఒకడి నష్టమే ఇంకోడి లాభం.

అయితే, ఈ 'సెకండరీ' లాభాల విషయంలో, ఎప్పుడూ ఒక్క పెట్టుబడిదారుడే ఇతర్లని మోసాలు చేసి సెకండరీ లాభాలు సంపాదిస్తూ వుండడం సాధ్యం కాదు. ఒక మారకంలో బట్టవాడు ధాన్యంవాణ్ణి మోసం చేస్తే, ఇంకో మారకంలో ధాన్యంవాడే బట్టవాణ్ణి మోసం చెయ్యవచ్చు. లేదా, దారంవాడు బట్టవాణ్ణి మోసం చెయ్యవచ్చు. ప్రతీ పెట్టుబడిదారుడూ, 'అమ్మేవాడి' గానూ, 'కొనేవాడి'గానూ కూడా వుంటాడు కాబట్టి, 'అమ్మకాల్లో మోసం' సూత్రం, ఒక్కడికే గాక, అందరికీ వర్తిస్తుంది. 'సెకండరీ లాభం' అనేది ఒకడికి ఒకసారి వస్తే, ఇంకోడికి ఇంకోసారి వస్తుంది. కాబట్టి, సెకండరీ లాభాల సంగతి అనవసరం. అసలు చూడవలసింది 'ప్రధాన లాభం' గురించి. అమ్మకం అనేది, ఏ మోసమూ లేకుండా జరిగి నప్పుడు కూడా ఇది తప్పనిసరిగా వస్తుంది. సెకండరీ లాభం అనేది కూడా మొత్తం లాభంలో భాగమే కాబట్టి, అసలు 'లాభం అనేది ఏమిటి?' అనేదే అసలు ప్రశ్న.

'లాభం' అనేది, సరుకుని 'అమ్మినప్పుడే' అందుతుంది కాబట్టీ, అది ఒక పెట్టుబడిదారుడుకి ఎక్కువగానూ ఒక పెట్టుబడిదారుడికి తక్కువగానూ అందుతుంది కాబట్టీ, ఈ పై పై విషయాలు చూసి, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, 'లాభం అనేది అమ్మకంవల్లనే ('చలామణీ దశ' నించే) వస్తుంది' — అని భావిస్తారు.

కానీ, 'లాభానికి' జన్మస్థలం — సరుకుల చలామణీ దశ కాదు. ఉత్పత్తి దశే. 'ఉత్పత్తి దశ'లో, శ్రామికులు, తమ 'జీతాల' విలువ కన్నా ఎక్కువ విలువని ఇచ్చితీరాలి. ఆ ఎక్కువే లాభంగా వుంటుంది.

'ఉత్పత్తి దశ'లో — కొన్నిసార్లు లాభమూ, కొన్నిసార్లు నష్టమూ ఉత్పత్తి అవడం జరగదు. ఎందుకంటే, పెట్టుబడి దారుడు సరుకుల విలువని నిర్ణయించే టప్పుడు, తన ఖర్చుల్ని మాత్రమే విలువగా నిర్ణయించడు. దానిమీద తప్పనిసరిగా కొంత ఎక్కువని కలిపే విలువని నిర్ణయిస్తాడు. ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా, పెట్టిన పెట్టుబడి కన్నా ఎక్కువ విలువే సరుకుకి చేరుతుంది. కాబట్టి, ఆ రకంగా ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా లాభమే ఉత్పత్తి అవుతుంది. అయితే, ఎవరి సరుకులో లాభాన్ని వాళ్ళు సవ్యంగా తీసుకోగలుగుతారా లేదా — అనేది, 'చలామణీ దశ'లో వుండే అనేక పరిస్థితుల మీద ఆధారపడి వుంటుంది. ఎప్పుడూ మోసాల వల్లనే గాక, ఇంకా ఇతర కారణాల వల్ల కూడా, ఒకరి సరుకులో లాభం ఇంకొకరికి పెద్ద ఎత్తున తోసుకుపోయే పరిస్థితులు కూడా వుంటాయి. (ఈ విషయాలు ఇంకో చోట వివరంగా చూస్తాం.)

# శ్రమ దోపిడీ

పెట్టుబడిదారుడు, 'సరుకు'ని అమ్మి లాభం సంపాదిస్తున్నాడంటే, అది వాడి 'హక్కు'లాగ కనిపిస్తుంది. కానీ, అది శ్రామికుల శ్రమ. పెట్టుబడిదారుడు, శ్రామికులు ఇచ్చే శ్రమలో కొంత భాగానికి మాత్రమే చెల్లించి, కొంత భాగానికి చెల్లించకుండా వుంటాడు. ఆ రకంగా పెట్టుబడి దారుడు, శ్రామికుల శ్రమలో నించి కొంత భాగాన్ని అక్రమంగా లాక్కుంటాడు. కాబట్టి, అది 'శ్రమ దోపిడీ' (శ్రమని దోచడం) అవుతుంది.

<u>లాభానికి అసలు కారణం — శ్రమ దోపిడీయే.</u>

ఏ రోజు సరుకు ద్వారా ఆ రోజు లాభం — వస్తుంది.

శ్రామికులు, తమ శ్రమ ఫలితాన్నంతా తామే తీసుకోలేరు. శ్రమలో కొంత భాగాన్ని పోగొట్టుకుంటూ, రోజూ దోపిడీకి గురి అవుతూనే వుంటారు.

'శ్రమ దోపిడీ' అనేది, 'దొంగతనం' లాంటి పైపై విషయం కాదు. 'దొంగతనం'లో, ఒక మనిషి, ఇంకో మనిషి దగ్గిర నించి వస్తువులో, డబ్బో, లాక్కుంటాడు. వస్తువులూ, డబ్బూ, కళ్ళకి స్పష్టంగా కనపడుతూ వుంటాయి కాబట్టి, ఒకరివి ఒకరు లాక్కున్నట్టు స్పష్టంగా తెలిసిపోతుంది. దాన్ని చాలా చెడ్డ విషయంలాగ గ్రహించడం సాధ్యమవుతుంది. కానీ 'శ్రమ దోపిడీ'లో 'శ్రమని లాక్కోవడం' అలా కనపడదు. ఇక్కడ శ్రామికులు, తమ దగ్గిర నించి పెట్టుబడిదారుడు ఏం దొంగతనం చేస్తున్నాడో, మామూలు దొంగతనంలో గ్రహించినట్టుగా గ్రహించలేరు. 'శ్రమ దోపిడీ'ని గ్రహించడానికి, విషయాల్ని కేవలం పైపైనే చూసే పద్ధతి సరిపోదు.

ఒక శ్రామిక కుటుంబంలో మామూలు దొంగతనం జరిగితే, అది ఒక పూటతో పోతుంది. అదే ప్రతి పూటా జరుగుతూ వుండదు. కానీ శ్రమ దోపిడీ అనేది, ఒక పూటతోనో, ఒక రోజుతోనో పోదు. అది జీవితకాలమంతా శ్రామికులతో కలిసివుంటుంది. అది, శ్రామికుల సంపూర్ణ జీవితాన్నే దొంగతనం చేస్తుంది.

పెట్టుబడి, శ్రమ దోపిడీని 'సవ్యంగా' చేస్తూ, లాభాన్ని పెట్టుబడిదారుడికి అందిస్తూ వుండాలంటే, దానికి ఎప్పటికప్పుడు ముడిపదార్థాలూ వగైరాలూ, పనిచేసే శ్రామికులూ, సవ్యంగా దొరుకుతూ వుండాలి. తర్వాత, తయారైన సరుకు అంతా సవ్యంగా అమ్ముడుపోతూ వుండాలి. అంటే, ఉత్పత్తి క్రమమూ, చలామణీ క్రమమూ కూడా ఆటంకాలు లేకుండా సవ్యంగా జరుగుతూ వుండాలి. అప్పుడు, పెట్టుబడి, శ్రామికుల్ని అతి 'చాకచక్యంగా' దోచగలుగుతుంది. 'లాభ రహస్యం' అంతా ఇదే. <u>శ్రమ దోపిడీయే లాభ రహస్యం! ఇది ఒక్క పెట్టుబడిదారుడి లాభ రహస్యం కాదు. మొత్తం పెట్టుబడిదారులందరి లాభాల రహస్యం!</u>

పెట్టుబడిదారుల లాభాలకే కాదు; ఇంకా వెనకటి చరిత్రలో బానిస యజమానుల, తర్వాత కాలంలో భూస్వాముల సిరిసంపదల రహస్యం అంతా కూడా ఇదే!

'శ్రమ' చేసే వ్యక్తులు — శ్రామికులు అయితే,
'దోపిడీ' చేసే వ్యక్తులు — దోపిడీదారులు.
శ్రామికులు — సేవకులు అయితే,
దోపిడీదారులు — యజమానులు!

**'శ్రామికులు' అంటే, ఈ నాడు పెట్టుబడిదారుల దగ్గిర 'సరుకుల్ని' ఉత్పత్తి చేస్తూ దోపిడీకి గురి అవుతోన్నవారే కాదు. గత కాలాల్లో బానిస యజమానుల కోసం శ్రమ చేసిన బానిసలూ, భూస్వాముల కోసం శ్రమ చేసిన కౌలు రైతులూ కూడా దోపిడీకి గురి అయిన శ్రామికులే.**

అలాగే, దోపిడీదారులు అంటే — ఈ నాటి పెట్టుబడిదారులే కాదు. వెనకటి కాలపు బానిస యజమానులూ, భూస్వాములూ, ఈ నాటి భూస్వాములూ అంతా దోపిడీదారులే.

బానిసలకూ, బానిస యజమానులకూ మధ్యా —
కౌలు రైతులకూ, భూస్వాములకూ మధ్యా — వందల, వేల తరాల నించీ జరిగినదంతా శ్రమ దోపిడీయే.

'సమాజం'లో,
ఒకవేపు – పేదతనానికీ,
ఇంకోవేపు – సిరిసంపదలకూ కారణం, శ్రమ దోపిడీయే.
కలిమి లేములకు కారణం, శ్రమ దోపిడీయే.
సామాజిక సుఖదుఃఖాలకు కారణం, శ్రమ దోపిడీయే.
సామాజిక అసమానతలకు కారణం, శ్రమ దోపిడీయే.
యజమానితనాల్నీ, సేవకత్వాల్నీ సృష్టించేది — శ్రమ దోపిడీయే.

శ్రమ దోపిడీ — ఈ నాటిదీ, నిన్నటిదీ కాదు. 'చరిత్ర'లో వేల వేల సంవత్సరాల కిందటే ప్రారంభమైన సత్యం ఇది. ఆ నాటి నించీ అది, భూమి మీద ప్రతీ చోటా, ప్రతీ దినమూ నిత్యకృత్యంగా సాగిపోతూనే వుంది.

# స్వతంత్ర ఉత్పత్తిదారులు

పెట్టుబడిదారుల్నీ, పెట్టుబడిదారుల దగ్గిర పనిచేసే శ్రామికుల్నీ చూడడం ప్రారంభించిన ఈ సందర్భంలోనే 'స్వతంత్ర ఉత్పత్తిదారుల్ని' కూడా పరిచయం చేసుకోవాలి.

స్వతంత్ర ఉత్పత్తిదారులు (స్త్రీలు గానీ, పురుషులు గానీ) స్వయంగా శ్రమ చేస్తారు. కానీ, శ్రామికుల లాగా ఏ పెట్టుబడిదారుడి దగ్గిరా కాదు. స్వతంత్ర ఉత్పత్తి దారులు — అంటే, తమకు 'యజమాని' లేని, తాము యజమానులుగా లేని, ఉత్పత్తిదారులు.

పెట్టుబడిదారులూ, శ్రామికులూ — అనే ప్రధాన భాగాలు గల సమాజంలో కూడా, చిన్న చిన్న స్వంత భూముల మీద స్వంత శ్రమతో జీవించే రైతు కుటుంబాలూ, స్వంత శ్రమ పరికరాలతో చేతి వృత్తుల ద్వారా జీవించే కుటుంబాలూ కూడా వుంటాయి. వీరు స్వతంత్ర ఉత్పత్తిదారులే.

అయితే, పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేసే శ్రామికుల పరిస్తితికీ, స్వతంత్ర ఉత్పత్తిదారుల పరిస్తితికీ తేడా ఏమిటో చూద్దాం.

నేత శ్రమని తీసుకుందాం. బట్ట పెట్టుబడిదారుడి దగ్గిరా, నేత పని చేసే స్వతంత్ర ఉత్పత్తిదారుల దగ్గిరా, 'ఉత్పత్తి శక్తి' ఒకే రకంగా వుందనుకుందాం. 'ఉత్పత్తి శక్తి' ఒకే రకంగా వున్నప్పుడు, బట్ట కోసం అవసరమయ్యే ఖర్చు, పెట్టుబడిదారుడి దగ్గిర ఎలా వుంటుందో, స్వతంత్ర ఉత్పత్తిదారుల దగ్గిర కూడా అలాగే వుంటుంది.

ఒక నేత కుటుంబం, 100 మీ. బట్టని, పెట్టుబడి దారుడి దగ్గిరలాగే, తయారు చేసిందనుకుందాం. దానికి కూడా 30 విలువగల ముడిపదార్థమూ, 50 విలువగల శ్రమ సాధనాలూ, 40 విలువగల సజీవ శ్రమా ఖర్చవు తాయి. ఈ బట్ట విలువ కూడా 120 గానే వుంటుంది. దీన్ని అమ్మితే, 120 డబ్బు వస్తుంది. శ్రమ సాధనాల మీద పెట్టిన 80 ఖర్చు వెనక్కి వచ్చేసి, ఇంకా ఆ పైన 40 వస్తుంది. ఈ 40, ఆ కుటుంబ సభ్యుల 'శ్రమ విలువ'. దాన్నంతా ఆ కుటుంబం, తన స్వంతానికే వాడుకోగలుగుతుంది. — దీని అర్థం ఏమిటి? ఇక్కడ, 'శ్రమ దోపిడీ' లేదు. అంటే, ఇక్కడ లాభాన్ని తీసుకునే యజమాని లేడు. కాబట్టి, ఆ కుటుంబ సభ్యులు చేసిన శ్రమ విలువ అంతా వారికే అందింది.

ఈ కుటుంబ సభ్యులే, ఒక బట్ట పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేసే శ్రామికులుగా వుంటారనుకుందాం. వారు, 1రోజులో 40 విలువ గల శ్రమ చేస్తారనుకుందాం. ఆ శ్రమకి బదులుగా వారికేం వస్తుంది? జీతాలుగా 20 విలువ మాత్రమే వస్తుంది. ఇంకో 20 విలువ, పెట్టుబడిదారుడికి పోతుంది. అంటే, ఒక 'యజమాని' దగ్గిర పనిచేసినప్పుడు, శ్రామికుల శ్రమ అంతా శ్రామికులకు దక్కదు. అందులో నించి చాలా భాగం 'యజమాని'కే పోతుంది.

పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేసే 'శ్రామికులు'గా వుండడానికీ, 'స్వతంత్ర ఉత్పత్తిదారులు'గా వుండడానికీ తేడాని ప్రతీ సందర్భంలోనూ సరిగా అర్థం చేసుకుంటూ వుండాలి.

ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుడు తన దగ్గిర ఒకరిద్దరు శ్రామికుల్ని పెట్టుకుని వారికి జీతాలు ఇస్తూ, వారితో పనిచేయిస్తూ, తను కూడా ఎప్పటిలాగే పనిచేస్తూ వుంటా డనుకుందాం. అతను ఇంకా స్వతంత్ర ఉత్పత్తిదారు డేనా? — కాదు. అతను ఇప్పుడు శ్రామికుల మీద యజమాని అవుతాడు. ఆ శ్రామికుల అదనపు విలువని తను స్వంతం చేసుకుంటూ వుంటాడు. కాబట్టి అతను ఇప్పుడు చిన్న పెట్టుబడిదారుడు (పెటీ బూర్జువా) అవుతాడు. తనకు యజమాని లేని, తను యజమానిగా వుండని ఉత్పత్తిదారుడే స్వతంత్ర ఉత్పత్తిదారుడు.

ఇప్పటి నించి, ప్రధానంగా 'పెట్టుబడిదారుడి' గురించీ, వాడి 'శ్రామికుల' గురించీ చూస్తూ, ఎక్కడైనా అవసరమైనప్పుడు, 'స్వతంత్ర ఉత్పత్తిదారుల' గురించి కూడా చూస్తూ వుంటాము.

# లాభం కాదు, అదనపు విలువ

పెట్టుబడిదారుడి 'ఉత్పత్తి క్రమం'లో పనిచేసే శ్రామికులు, తమ జీతాల విలువ కన్నా 'అదనంగా' ఉత్పత్తి చేసే విలువని 'లాభం' అంటున్నాం. కానీ, ఇక నించీ 'లాభం' అనే మాటకి బదులు 'అదనపు విలువ' అనే మాటనే వాడదాం. ఎందుకంటే, 2 కారణాలున్నాయి.

**(1)** లాభం — అన్నప్పుడు, అది పెట్టుబడిలోని అన్ని అంశాల నించీ వస్తుందనే తప్పు అభిప్రాయం కలిగిస్తుంది. 'అదనపు విలువ' అన్నప్పుడు, అది కేవలం శ్రామికులు 'అదనంగా' ఇచ్చే శ్రమ ద్వారా మాత్రమే వస్తుందనే నిజమైన అర్థాన్ని చూపిస్తుంది. 'లాభం' అనే మాట,

'పెట్టుబడికి లాభం రావడం న్యాయమే' అనే భావాన్ని కలిగిస్తే, 'అదనపు విలువ' అనే మాట, 'పెట్టుబడి చేసే పని శ్రమని దోచడం తప్పు ఏమీ కాదు' అనే నిజాన్ని బట్టబయలు చేస్తుంది. అందుచేత, 'లాభం' అనే మాటకు బదులుగా 'అదనపు విలువ' అనే మాటనే వాడాలి.

**(2)** 'అదనపు విలువ'నంతా సరుకుని ఉత్పత్తి చేయించే పెట్టుబడిదారుడు ఒక్కడే తీసుకోడు. అది, కొన్ని భాగాలుగా విడిపోయి ఇంకా కొందరు దోపిడీ దొంగల మధ్య పంపకం అవుతుంది. ఆ పంపకాలన్నీ ముగిసి చివరికి మిగిలేదే సరుకుని ఉత్పత్తి చేయించిన పెట్టుబడిదారుడికి అందే 'లాభం'గా వుంటుంది. అంటే, వాడి 'లాభం' ఎప్పుడూ 'అదనపు విలువ' కన్నా చిన్నదిగా వుంటుంది. బట్ట ఉదాహరణలో, అదనపు విలువ 20. కానీ అందులో నించి, బట్ట పెట్టుబడిదారుడికి చివరికి అందే లాభం 8 అనుకుందాం. అంటే— అదనపు విలువా, లాభమూ ఒకటి కాదు. 'లాభం' అంటే— అదనపు విలువలో ఒక భాగం. 20 కీ, 8 కీ ఏం తేడా వుందో అదే — 'అదనపు విలువ'కీ లాభానికీ తేడా. మనం మొదట, శ్రామికులకు దక్కకుండా పోయే విలువ అంతటి గురించీ చూడాలి గానీ, అందులో ఒక భాగం గురించే కాదు. (20 గురించి చూడాలి గానీ 8 గురించే కాదు.) 'లాభం' అన్నప్పుడు, 8 గురించే మాట్లాడుతున్నట్టు అవుతుంది. — కాబట్టి, ఈ 2 కారణాల్నీ అర్థం చేసుకుని, శ్రామికులు, తమ జీతాల కన్నా ఎక్కువగా ఇచ్చే విలువని, 'లాభం' అని గాక, 'అదనపు విలువ' అనే అనాలి.

# అదనపు విలువా, అదనపు ఉత్పత్తీ

100 మీ. బట్ట విలువ — 120 రూ.లు. ఈ 'విలువ'కి కారణం — ముడిపదార్థాలు 30. ఇతర శ్రమ సాధనాలు 50. జీతాలు 20. అదనపు విలువ 20. ఈ అంశాలన్నీ కలిసి ఈ బట్టకి 120 విలువని ఇచ్చాయి.

ఈ సరుకుని, 'డబ్బు'గా చూస్తే, 120 రూ.లు.

'ఉత్పత్తి'గా చూస్తే, '100 మీటర్ల' బట్ట.

ఇలాగే, ఈ సరుకుకి 'విలువ'ని ఇచ్చిన ప్రతీ అంశాన్నీ, డబ్బుగానూ, ఉత్పత్తిగానూ కూడా చూడవచ్చు.

100 మీటర్ల విలువ — 120 రూ.లు.

1 మీటరు విలువ — 1 రూ. 20 పైసలు.

ఈ లెక్కన ఏ అంశానికి ఎంత ఉత్పత్తి వస్తుందో లెక్క చూడవచ్చు. ప్రతీ అంశానికీ కొన్ని కొన్ని మీటర్ల బట్ట వస్తుంది.

| 'డబ్బు'గా చూస్తే: | | | 'ఉత్పత్తి'గా చూస్తే: | |
|---|---|---|---|---|
| శ్రమ సాధనాలు | — 80 | రూ. | 67 | మీ. బట్ట |
| జీతాలు | — 20 | రూ. | 16 2/3 | మీ. బట్ట |
| అదనపు విలువ | — 20 | రూ. | 16 2/3 | మీ. బట్ట |
| మొత్తం | 120 | రూ. | 100 | మీ. బట్ట |

ఇక్కడ 'అదనపు విలువ' సంగతే మనకు ముఖ్యం. దాన్ని 'డబ్బు'గా చూస్తే 20 రూ.లు. బట్టగా చూస్తే దాదాపు 17 మీటర్లు. అంటే, పెట్టుబడిదారుడు, 100 మీ. బట్టని ఉత్పత్తి చేయించి అమ్మిన కార్యక్రమం ద్వారా, '20 రూ.ల్ని అదనపు విలువగా తీసుకుంటాడు' అన్నా, '17 మీ. బట్టని, అదనపు ఉత్పత్తిగా తీసుకుంటాడు' అన్నా, రెండూ ఒకటే.

'అదనపు ఉత్పత్తి 17 మీ. బట్ట' అన్నప్పుడు, ఈ విషయాన్ని సరిగా అర్థం చేసుకోకపోతే, "ఈ 17 మీ. బట్టలో వున్న శ్రమ సాధనాల విలువ, శ్రామికులది కాదు కదా? అది కూడా శ్రామికులది ఎలా అవుతుంది?" అనే ప్రశ్న వస్తుంది.

మొత్తం బట్టని, దానిలో వున్న విలువల ప్రకారం, 3 భాగాలుగా విభజించినప్పుడు, ఒక భాగానికి వచ్చిన బట్టలో, ఇతర భాగాల విలువ లేవీ వుండవు.

'శ్రమ సాధనాల' భాగానికి వచ్చిన బట్టలో, ఆ విలువే గానీ, ఇతర విలువలు వుండవు. అలాగే, ఇతర భాగాల విషయం కూడా. 'అదనపు విలువ' భాగానికి వచ్చిన 17 మీ. బట్టలో, ఇతర విలువలేవీ వుండవు. అదంతా అదనపు విలువే.

పెట్టుబడిదారుడు, శ్రామికులు చేసిన శ్రమకంతటికీ జీతాలు ఇచ్చేసి వుంటే, ఈ 'అదనపు ఉత్పత్తి' కూడా శ్రామికులకే వెళ్ళేది. అ ఉత్పత్తిని కూడా శ్రామికులే వాడుకుంటే, వారికి ఏ పేదతనమూ ఉండదు. కానీ దీన్నే పెట్టుబడిదారుడు శ్రామికులకు ఇవ్వకుండా లాగుతాడు. ఇలా లాగిన అదనపు విలువలో నించే (అదనపు ఉత్పత్తిలో నించే) ఆ సరుకుని ఉత్పత్తి చేయించినవాడికీ, ఇంకా కొందరికీ కూడా భాగాలు అందుతాయి.

శ్రామికులకు అందకుండాపోయే 'అదనపు విలువ'ని ఎవరెవరు పంచుకుంటారో ఇప్పుడు చూద్దాం.

# 'అదనపు విలువ' ఏ యే భాగాలుగా చీలుతుంది?

శ్రమ సాధనాల్నీ, శ్రామికుల్నీ పెట్టి, ఒక 'సరుకు'ని (అది ఏ సరుకు అయినా) ఉత్పత్తి చేయించేవాడు — 'ఉత్పాదక పెట్టుబడిదారుడు' (ప్రొడక్టివ్ కేపిటలిస్ట్). ఈ ఉత్పత్తి రంగాల్లోనే వ్యవసాయ రంగమూ, పారిశ్రామిక రంగమూ — అనే తేడాలు వుంటాయి. ధాన్యం — వ్యవ సాయ ఉత్పత్తి అయితే, సబ్బులు — పారిశ్రామిక ఉత్పత్తి. కానీ, శ్రామికులతో ఏ రకం సరుకుని ఉత్పత్తి చేయించినా అది ఒక పరిశ్రమే. అందులోనే అనేక తేడాలు. ఏ రంగంలో ఉత్పత్తి చేయించే పెట్టుబడిదారుడైనా ఉత్పాదక పెట్టుబడిదారుడే.

'సరుకు' తయారైనప్పుడే దానికి 'విలువ' ఏర్పడు తుంది. కాబట్టి, 'అదనపు విలువ' అనేది ఉత్పాదక (ఉత్పత్తి చేయించే) పెట్టుబడిదారుడి పని స్థలంలోనే ఉత్పత్తి అవుతుంది. అయితే, దాన్నంతా ఆ పెట్టుబడి దారుడు ఒక్కడే తీసుకోవడానికి వీలువుండదు. అది ఇంకా వర్తక కమిషనూ, వడ్డీ, భూమి అద్దే, పన్నులూ — వంటి పేర్లతో ఇతరులకు కూడా పంపకం అవుతుంది. ఈ పంపకా లన్నీ ముగిసిన తర్వాత మిగిలేది — ఉత్పాదక పెట్టుబడి దారుడి 'లాభం'. ఈ విషయాల్ని ఇప్పుడు క్లుప్తంగా చూసి, తర్వాత చాప్టర్లలో (ఇతర భాగాల్లో), వీటికి సంబంధించిన ఇతర వివరాలు కూడా చూస్తాము.

'అదనపు విలువతో నిండిన సరుకు' తయారయిన తర్వాత దాన్ని అమ్మాలి. ఆ అమ్మే పని కూడా ఉత్పాదక పెట్టుబడిదారుడే చేయించినా, లేదా ఆ పనిని, ఇంకెవరి కైనా అప్పగించినా, అదంతా వేరే దశ. చలామణీ దశ. ఇప్పుడు, 'వర్తక పెట్టుబడిదారుడు' రంగంలోకి వస్తాడు. సరుకుల్ని అమ్మించే పని కూడా ఉత్పాదక పెట్టుబడి దారుడే చేయిస్తే, ఈ అమ్మకాల విషయానికి సంబంధించి నంత వరకూ వాడు 'వర్తక పెట్టుబడిదారుడు' అవుతాడు. ఇక్కడ విషయం తేలిగ్గా వుండడం కోసం, వర్తక పెట్టుబడి దారుడిగా ఇంకొకణ్ణి పెట్టుకుందాం. అంటే, ఉత్పాదక పెట్టుబడిదారుడు తన సరుకుని వర్తక పెట్టుబడిదారుడికి ఇచ్చేస్తాడన్న మాట. వర్తక పెట్టుబడిదారుడు, దాన్ని తీసుకుపోయి మార్కెట్లో తన శ్రామికుల ద్వారా అమ్మిస్తాడు.

'వర్తకుడి'తోపాటు 'వర్తక కమిషన్' అనేది, రంగంలోకి వస్తుంది. అదేమిటో ఇప్పుడు చూద్దాం.

## 1) వర్తక కమిషన్ :

వర్తకుడు, మొదట, సరుకుని ఉత్పత్తి చేయించిన పెట్టుబడిదారుడి నించి సరుకుని కొంటాడు. దానికోసం కొంత 'పెట్టుబడి' పెడతాడు. తర్వాత ఆ సరుకుని అక్కడి నించి 'రవాణా'లో తీసుకు వెళ్తాడు. తర్వాత దాన్ని ఒక స్టోరులో పెడతాడు. తర్వాత అక్కడ ఒక దుకాణంలో దాన్ని అమ్ముతారు (అమ్మిస్తాడు). ఈ పనులన్నీ జరగడానికి వర్తకుడు ఇంకా కొంత పెట్టుబడి పెట్టవలసి వుంటుంది. 'అమ్మకం' పనులు చేసే శ్రామికులకు 'జీతాలు' కూడా ఇవ్వవలసి వుంటుంది.

పెట్టిన ఖర్చులన్నీ వర్తకుడికి తిరిగి రావాలి. అంతేగాక, దాని మీద 'లాభం' కూడా రావాలి!

వర్తకుడు పెట్టే ఖర్చుల్లో, మొదట సరుకుని కొనడానికి పెట్టే ఖర్చు తప్పనిసరే. మిగతా ఖర్చుల్లో, స్టోరూ, రవాణా ఖర్చులు కూడా తప్పనిసరి ఖర్చులే. స్టోరూ, రవాణాలు లేకపోతే, వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యడం గానీ, వాటిని తర్వాత వాడడం గానీ, సాధ్యం కావు. కాబట్టి, సహజంగా అవసరమయ్యే ఈ ఖర్చులు, 'సరుకు విలువ'కి చేరి, ఆ విలువ ఇంకా కొంత పెరుగుతుంది.

సరుకు విలువని పెంచే ప్రతీ దశా — ఒక 'ఉత్పత్తి దశే'. ('విలువ'ని ఉత్పత్తి చేసే దశ). స్టోరు — ఒక 'ఉత్పత్తి దశ'. రవాణా — ఒక ఉత్పత్తి దశ. ఈ ప్రతీ దశలోనూ — కొందరు శ్రామికులు పని చేస్తారు. ఏ దశలో ఖర్చులు ఆ దశలో వుంటాయి. ఏ ఉత్పత్తి దశని తీసుకున్నా, అంటే స్టోరు దశలోనూ, రవాణా దశలోనూ కూడా, అక్కడ ఎలాంటి పనులు కావాలో ఆ పనులు జరగడానికి కొన్ని రకాల శ్రమ సాధనాలు కూడా కావాలి. కాబట్టి, ఇక్కడ కూడా శ్రమ సాధనాల ఖర్చు, జీతాల ఖర్చు, శ్రామికుల అదనపు విలువా — ఈ అంశాలన్నీ వుంటాయి. ఈ ఖర్చులన్నీ కలిస్తే, ఆ దశకి సంబంధించిన ఖర్చులుగా, అవి కూడా సరుకు విలువకి చేరి, ఆ విలువ ఇంకా పెరుగుతుంది. (ఈ విషయాల్ని 2 వ సంపుటంలో, 'చలామణీ ఖర్చులు' చాప్టర్లో, వివరంగా చూస్తాము.)

ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, స్టోరూ — రవాణా విషయాల్ని పూర్తిగా వదిలి వేస్తున్నాము. సరుకుకి చేరవలసిన ఆ విలువల్ని పట్టించుకోకుండా, సరుకుని 120 విలువతో మాత్రమే (ఆ సరుకు తయారైనప్పుడు దానికి ఎంత విలువ వుందో అంత విలువతో మాత్రమే) చూస్తాము.

తర్వాత 'అమ్మకం' ఖర్చు సంగతి: వర్తకుడు 'బట్ట'ని కొని తీసుకు వెళ్ళిన తర్వాత దాన్ని అమ్మాలి. ఆ పని జరగాలంటే అమ్మడానికి ఒక దుకాణమూ, అందులో కొన్ని వస్తువులూ, అమ్మకం పని చేసే శ్రామికులకు జీతాలూ — ఇటు వంటి ఖర్చులన్నీ అవుతాయి. కానీ ఈ ఖర్చులన్నీ 'అసహజమైన' ఖర్చులు. ఎందుకంటే, 'కొనడమూ –అమ్మడమూ' లేకుండానే వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోవడమూ, వాడుకోవడమూ సాధ్యమే. మారకం అనేది వస్తువులకు 'సహజ అవసరం' కాదు. మారకం పనులకు సంబంధించిన ఖర్చులేవీ సహజంగా అవసరమయ్యే ఖర్చులు కావు. కాబట్టి ఈ ఖర్చులేవీ 'సరుకు విలువ'లోకి చేరవు. ఇవి, సరుకు విలువని పెంచవు. (ఈ విషయాలు — "ఉత్పాదక శ్రమా– అనుత్పాదక శ్రమా", "చలామణీ ఖర్చులు", "వర్తక పెట్టుబడి" చాప్టర్లలో వివరంగా చూస్తాము.)

అమ్మకం కోసం అయ్యే ఖర్చులు, వస్తువుకి సంబంధించిన 'శ్రమ సాధనాల' ఖర్చులోకి గానీ, 'సజీవ శ్రమ' ఖర్చులోకి గానీ, చేరవు. అమ్మకం ఖర్చుల వల్ల, వస్తువు విలువ పెరగదు. కానీ అమ్మడాలూ కొనడాలూ వున్న సమాజంలో, ఈ పనులు జరగడానికి కొన్ని ఖర్చులు తప్పని సరిగా అవుతాయి. మరి ఈ ఖర్చుల్ని ఎక్కణ్ణించి తెచ్చి పెట్టాలి? వాటిని ఎలా వెనక్కి తీసుకోవాలి? — ఆ వస్తువులో నించే తీసుకోవాలి. అంటే, అమ్మకం ఖర్చులు, ఆ వస్తువు విలువలోకి చేరకపోయినా, ఆ వస్తువుకి ఏ విలువ వుంటే ఆ విలువలో నించే కొంత భాగాన్ని తీసి దాన్ని అమ్మకం పనుల కోసం ఖర్చుపెట్టాలన్నమాట!

సరుకుని తయారు చేయించిన ఉత్పాదక పెట్టుబడిదారుడు, దాన్ని వర్తకుడికి ఇచ్చేటప్పుడు కొంత తక్కువ విలువకే ఇస్తాడు. అలా తగ్గించిన భాగమే — 'వర్తక కమిషన్' (వర్తకుడికి ఇచ్చే కమిషన్). ఆ కమిషన్‌లో నించే వర్తకుడు ఆ సరుకుకి సంబంధించిన అమ్మకం ఖర్చులన్నీ పెట్టి, తను కొంత లాభం కూడా తీసుకుంటాడు. అమ్మకం ఖర్చులన్నీ కూడా సరుకు విలువకి చేరే ఖర్చులే అయితే, వర్తకుడికి సరుకుని ఇచ్చేటప్పుడు, దాన్ని తగ్గింపు విలువతో ఇవ్వవలసిన అవసరమే వుండదు. అంటే, 'కమిషన్' ఇవ్వవలసిన అవసరమే వుండదు. కానీ, అమ్మకం ఖర్చులు సరుకుకి చేరవు కాబట్టే వాటికోసం సరుకు విలువలో భాగాన్నే ఖర్చు పెట్టవలసి వుంటుంది. అందుకే 'వర్తక కమిషన్' ఇవ్వడం తప్పనిసరి అవుతుంది.

వర్తకుడు, బట్ట పెట్టుబడిదారుడి దగ్గిర కొంత బట్టని కొనే సమయానికి దాని విలువ 120 అనుకున్నాం. వర్తకుడు, ఆ బట్టని కొనడానికి 120 ని చెల్లిస్తాడా? — అలా అక్కరలేదు.

బట్ట పెట్టుబడిదారుడు, వర్తకుడితో ఇలా అంటాడు – "బట్ట సిద్ధంగా వుంది. దీన్ని ఉత్పత్తి చేయించే పని నేను పూర్తి చేశాను. అమ్మించే పని నువ్వు చెయ్యి! దీని మీద వచ్చే లాభంలో నీకు కూడా కొంత భాగం ఇస్తాను. ఈ బట్ట విలువ 120. దీన్ని నీకు 115 కే ఇస్తాను. ఆ 5 లో నించే నువ్వు 'అమ్మకం' ఖర్చులు పెట్టుకో! లాభం కూడా తీసుకో!" అంటాడు. అంటే, ఈ ఉదాహరణలో వర్తక కమిషన్ — 5 అన్నమాట.

వర్తకుడు ఈ బట్టని కొనడానికి మొదట 115 పెట్టుబడి పెడితే చాలు, బట్టకోసం 120 ఇవ్వక్కరలేదు. బట్టని అలా కొన్న తర్వాత దాన్ని అమ్మించడం కోసం అయ్యే ఖర్చుల్ని 2 అనుకుంటే, వర్తకుడు ఆ '2 పెట్టుబడి'ని కూడా పెట్టాలి. అంటే, వర్తకుడు, ఆ బట్ట కోసం 115 + 2 = 117 పెట్టుబడి పెట్టాలన్నమాట! అయితే, దాన్ని ఎంతకి అమ్ముతాడు? — అమ్మవలసింది 120 కే. ఎందుకంటే, ఆ బట్టకి 120 విలువే వుంది కాబట్టి. అంత కన్నా ఎక్కువకి అమ్మితే అది అమ్ముడు పోదు.

వర్తకుడు, ఆ బట్టని 115 కి కొన్నాడు కదా? దాన్ని తనకు ఇచ్చిన వాడు, 5 కమిషన్‌తో ఇచ్చాడని వర్తకుడికి తెలుసు కదా? కాబట్టి, వాడేం చేస్తాడంటే, 115 + 5 = 120 కి బట్టని అమ్మాలని తెలుసుకుంటాడు. దాని అసలు విలువ అయిన 120 కే చివరికి దాన్ని అమ్ముతాడు. ఆ 120 లో నించే, దాన్ని కొనడానికి తను పెట్టిన 115 నీ, దాని అమ్మకం ఖర్చుల కోసం పెట్టిన 2 నీ కూడా వెనక్కి తీసుకుంటాడు. ఇంకా ఆ పైన వున్న 3, వర్తకుడికి 'లాభం'గా మిగులుతుంది.

ఈ రకంగా, వర్తక కమిషన్ అనేది — అమ్మకం ఖర్చునీ, వర్తకుడి లాభాన్నీ కూడా ఇచ్చేదిగా వుంటుంది.

అయితే, ఈ వర్తక కమిషన్ ఏమిటి? దీన్ని, బట్ట పెట్టుబడిదారుడు వర్తకుడికి ఎలా ఇవ్వగలిగాడు? — 120 విలువ గల సరుకుని బట్టవాడు, వర్తకుడికి 115 కే ఇచ్చాడంటే, ఆ 5 ని, ఏ అంశంలో నించి తగ్గించుకున్నాడు? '100 పెట్టుబడి'లో నించి తగ్గించుకున్నాడా? — కాదు. 'పెట్టుబడి అంతా, ఒక్క అణువు కూడా తగ్గకుండా పూర్తిగా వెనక్కిరావాలి. పెట్టుబడి అంతా వెనక్కి రాకపోతే, మర్నాడు మళ్ళీ కొత్త బట్టని ఉత్పత్తి చేయించడం సాధ్యమే కాదు. కాబట్టి 'పెట్టుబడి'లో నించి 5 ని పోగొట్టుకునే ప్రశ్నే లేదు. కాబట్టి, 'బట్ట విలువ' లో, పెట్టుబడి కాకుండా

ఇంకా ఏం వుందో చూడాలి. బట్టకి వున్న 120 విలువలో నించి '100 పెట్టుబడి' ని ముట్టుకోకుండా ఒక పక్కన పెడితే, బట్ట విలువలో ఇంకా వున్న భాగం ఏమిటి? — ఇంకా వున్నది '20 అదనపు విలువ.' ఇందులో నించే 'వర్తక కమిషన్'ని ఇవ్వడం సాధ్యమవుతుంది. ఈ 20 లో నించి, వర్తక కమిషన్ – 5. ఈ కమిషన్‌లో నించే ఆ సరుకు అమ్మకం ఖర్చు 2, వర్తకుడికి లాభం 3. అంటే, బట్టని ఉత్పత్తి చేసిన శ్రామికుల 'ఆదనపు విలువ'లో నించే వర్తకుడు తన లాభం — అందుకున్నాడన్నమాట.

(ఈ విషయాలు చూసేటప్పుడు, ఎక్కడ ఏ సందేహాలు వచ్చినా, వాటికి, తర్వాత భాగాల్లో జవాబులు దొరుకు తాయి. అన్నిటినీ మొదటే ఇక్కడే వివరించడం సాధ్యం కాదు.)

'విలువ'కి సంబంధించిన ఈ 'అంతర్గత' విషయ మంతా పైకి కనపడదు. పైకి, ఏం కనపడుతుంది?— వర్తకుడు, ఒక సరుకుని 115 కి కొని, దానిమీద 5 వేసుకొని, దాన్ని తర్వాత 120 కి అమ్మి, 'కొంత లాభం' సంపాదించడం మాత్రమే పైకి కనపడుతుంది. ఈ పై పై విషయాల్ని మాత్రమే చూసినప్పుడు, 'లాభం' అనేది — సరుకుల్ని 'చవగ్గా' కొని దాని మీద కొంత 'వేసుకుని', 'ప్రియంగా' అమ్మడం వల్లనే వస్తుంది — అనే భ్రమ (పొరపాటు అభిప్రాయం) కలుగుతుంది.

చవగ్గా కొని, ప్రియంగా అమ్మడం వల్ల లాభం వస్తుందనే అభిప్రాయం సమాజంలో ఏర్పడడానికి కారణం — 'వర్తక' కార్యకలాపాలే.

ఏ విషయంలోనైనా పైకి ఎలా కనపడితే అలాగే చూడడానికి ఏ పరిశోధనా అక్కరలేదు. లోపల ఏం జరుగుతుందో తెలుసుకోడానికే పరిశోధన కావాలి.

నిజానికి ఇక్కడ, 'చవగ్గా కొనడం' గానీ, 'ప్రియంగా అమ్మడం' గానీ, లేవు. వర్తకుడు, సరుకుని, మార్కెట్లో అమ్మే విలువే (120) దాని అసలు విలువ. సరుకుని, దాని అసలు విలువకే అమ్మినా, అందులోనించే వర్తకుడికి లాభం రావాలంటే, వాడు దాన్ని 'అసలు విలువ' కన్నా తక్కువకే తీసుకోవాలి. ఎంత తక్కువకి తీసుకుంటాడో దానినే మళ్ళీ కలిపి, దాన్ని తర్వాత అసలు విలువకే అమ్ముతాడు.

'కొన్న సరుకుని మళ్ళీ అమ్మివేయడం' కోసమే సరుకుని కొనే వర్తకుడు, ఆ సరుకుకి నిజమైన కొనుగోలు దారుడు కాదు. అంటే, వర్తకుడు ఆ సరుకుని తన స్వంత వాడకానికి గానీ, తన 'పని స్థలం'లో శ్రమ సాధనంగా వాడుకోడానికి గానీ, తీసుకోవడంలేదు. ఈ రెండింటిలో ఏ అవసరానికైనా తీసుకుంటే, అప్పుడు ఆ వ్యక్తి ఆ సరుకుకి నిజమైన కొనుగోలు దారుడవుతాడు. అలా తీసుకునే వ్యక్తి, ఆ సరుకుకి 'పూర్తి విలువ'ని చెల్లించవలసి వుంటుంది. కానీ వర్తకుడు, ఆ రకం కొనుగోలుదారుడు కాడు. వర్తకుడు పెట్టుబడిదారుడి దగ్గిర సరుకుని 'కొనడమూ', పెట్టుబడి దారుడు వర్తకుడికి సరుకుని 'అమ్మడమూ'— అనే చర్యల్లో, ఈ కొనడమూ, అమ్మడమూ, రెండూ అబద్ధాలే. ఇవి నిజమైన కొనడమూ, నిజమైన అమ్మడమూ కావు. వీళ్ళిద్దరి మధ్యా వున్నది, ఇంకా నిజమైన మార్కెట్ కాదు. వర్తకుడు మార్కెట్లోకి తీసుకువెళ్ళిన సరుకు అక్కడ అమ్ముడు పోకపోతే దాన్ని తిరిగి పెట్టుబడిదారుడికి ఇచ్చేసే ఒప్పందం కూడా వాళ్ళ మధ్య వుంటుంది. ఒకవేళ, అలాంటి ఒప్పందం లేకపోయినా, వాళ్ళిద్దరిలో, వర్తకుడు పెట్టుబడిదారుడి దగ్గిర నిజమైన కొనుగోలుదారుడు గానీ, పెట్టుబడిదారుడు వర్తకుడి దగ్గిర నిజమైన అమ్మకం దారుడు గానీ, కారు. వాళ్ళిద్దరూ కలిసి ఒకటే. ఇద్దరూ కలిసి ఒకే 'అమ్మకందారు'. ఎక్కడా? మార్కెట్లో. సరుకుని తయారు చేయించి అమ్మడం వరకూ సాగవలసిన మొత్తం దశల్లో, ఒకడు మొదటి దశని నిర్వహిస్తే, ఇంకోడు రెండో దశని నిర్వహిస్తున్నాడు. ఇద్దరూ కలిసి ఐక్యంగా మార్కెట్‌కి ఒక సరుకుని అమ్మకానికి తెస్తున్నారు. అలా తెచ్చేటప్పుడు, వర్తకుడనేవాడు, పెట్టుబడిదారుడి నించి ప్రతీ సరుకునీ, ప్రతిసారీ అసలు విలువ కన్నా తక్కువకే తీసుకోవాలి. అది వాళ్ళిద్దరి మధ్యా ఒక వ్యాపార ఒప్పందం. వర్తకుడి కోసం, మొదటి పెట్టుబడిదారుడు ఆ సరుకు తాలూకు 'అదనపు విలువ'లో కొంత భాగాన్ని వదులుకుని తీరాలి. కాబట్టి, వర్తకుడు పెట్టుబడిదారుడి నించి 120 విలువ గల సరుకుని 115 కే తీసుకుంటే, అది చవగ్గా తీసుకోవడం కాదు. దాన్ని తర్వాత 120 కి అమ్మితే, అది ప్రియంగా అమ్మడమూ కాదు. ఈ 'చవకా, ప్రియమూ' అనే విషయాలు 'వర్తకుడి'కి వర్తించవు. సరుకుని తయారు చేయించే పని ఉత్పాదక పెట్టుబడిదారుడు చేస్తే, దాన్ని అమ్మించే పని వర్తకుడు చేసి, దాని వల్ల వచ్చే అదనపు విలువలో నించి ఇద్దరూ వాటాలు తీసుకుంటారు. ఇదే ఈ కార్యక్రమానికి అర్థం. ఇది ఇద్దరు భాగస్తులు, ఒక పని పూర్తి చేసి, దాని ఫలితాన్ని పంచుకోవడమే. అదనపు విలువని పంచుకోవడంలో వాళ్ళకి కొన్నిసార్లు పోట్లాటలు కూడా వస్తూ వుంటాయి. వర్తకుడు, సరుకువాడి నించి ఎక్కువ 'కమిషన్' తీసుకోవాలని ఆశిస్తే, సరుకువాడు తక్కువ కమిషన్ ఇవ్వడానికే చూస్తాడు. ఈ రకంగా వాళ్ళ మధ్య ఘర్షణలు వుంటూనే వుంటాయి.

ఇప్పుడు, వర్తక కమిషన్ — అనేది, లెక్కలోకి వచ్చింది కాబట్టి, బట్ట పెట్టుబడిదారుడు బట్ట విలువని లెక్కకట్టే విధానంలోకి ఈ అంశాన్ని కూడా చేర్చి అర్థం చేసుకోవాలి.

బట్ట పెట్టుబడిదారుడు, 'బట్ట విలువ'ని లెక్క కట్టే

టప్పుడు ఏ యే అంశాలు కలుపుతాడని మొదట చూశాం? — 100 పెట్టుబడినీ, ఆ పైన '20 లాభాన్నీ' కలుపుతాడని చూశాం కదా? — ఆ లెక్కలోకే ఇప్పుడు '5 వర్తక కమిషన్'ని కూడా చేర్చి, దానికి తగిన విధంగా 'లాభం' భాగాన్ని సవరించాలి.

బట్ట తయారైన తర్వాత, దానికి విలువని నిర్ణయించే టప్పుడు, దాని 'అమ్మకం ఖర్చుల' కోసం '5 కమిషన్'ని ఇవ్వవలసి వుంటుందని, బట్ట పెట్టుబడిదారుడికి మొదటే తెలుసు. కాబట్టి, ఆ '5 కమిషన్'ని కూడా బట్టకి సంబంధించిన ఖర్చుగానే వాడు లెక్క వేసుకుంటాడు. నిజానికి అది బట్ట తయారీకి సంబంధించిన 'సహజమైన' ఖర్చు కాదు. కానీ, ఈ 'సహజా సహజాలు' పెట్టుబడి దారుడికి అనవసరం. వాడు, 'వర్తక కమిషన్' ఇవ్వక తప్పదు కాబట్టి దాన్ని కూడా వాడు తన ఖర్చుగానే భావిస్తాడు.

ఆ ఖర్చులన్నీ లెక్క కట్టిన తర్వాతే, దాని మీద తన లాభం వేసుకుంటాడు. అంటే, 'వర్తక కమీషన్'ని కూడా దృష్టిలోకి తీసుకున్నప్పుడు, బట్ట పెట్టుబడిదారుడి లెక్క ఇలా వుంటుంది: శ్రమ సాధనాల కోసం 80; జీతాల కోసం 20; వర్తక కమిషన్ కోసం 5; ఈ 3 ఖర్చులూ కలిసి 105. దీనిమీద బట్ట పెట్టుబడి దారుడు వేసుకునే లాభం 15. చివరికి బట్ట విలువ 120.

ఇంతకుముందు లెక్క చూసినప్పుడు, పెట్టుబడి దారుడు 20 లాభం వేసుకున్నట్టు చూశాం. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం అప్పుడు అలా చూశాం. వాడు 'అదనపు విలువ'ని ఇతర్లకు పంచేస్తోన్న కొద్దీ వాడి స్వంత లాభం లెక్క మారుతూ వుంటుంది. వాడి లాభం ఎలా మారినా బట్ట విలువ మాత్రం 120 గానే వుంటుంది. అందులో మార్పేమీ వుండదు.

బట్టలో వున్న 20 అదనపు విలువలో వర్తక కమిషన్ 5 కదా? ఒకవేళ పెట్టుబడిదారుడు వర్తక కమిషన్‌గా 6 ఇవ్వవలసివస్తే, బట్ట విలువ 120 గా గాక, 121 అవు తుందా?— అవదు. వర్తక కమిషన్ పెరగడం వల్ల బట్ట పెట్టుబడిదారుడికి మిగిలే లాభం తగ్గుతుంది. అలా మాత్రమే జరుగుతుంది. అంటే, అప్పుడు వాడి వాటా 15 గాక, 14 అవుతుంది. అంతేగానీ బట్ట విలువ 120 కన్నా పెరగదు. ఎందుకంటే, బట్టలో వున్న 'అదనపు విలువ' 20 మాత్రమే. దాన్ని పంచుకోవడంలో ఒకళ్ళ భాగం పెరిగితే ఇంకోళ్ళ భాగం తగ్గుతుంది. లేదా, ఒక భాగం తగ్గితే ఇంకో భాగం పెరుగుతుంది. దాన్ని ఎలా పంచు కున్నా దాని మొత్తం 20 మాత్రమే. కాబట్టి 'వర్తక కమిషన్' పెరిగినా, తగ్గినా, సరుకు విలువ మారదు.

ఇప్పుడు 'వర్తక కమిషన్'ని 'డబ్బు' గానూ, 'ఉత్పత్తి'గానూ కూడా చూద్దాం:

డబ్బుగా చూస్తే అది 5 రూ. లు. బట్టగా చూస్తే, (1 మీటరు — 1 రూ. 20 పై లెక్కన), 4 మీటర్ల కన్నా కొంచెం ఎక్కువ. అంటే 'అదనపు విలువ'లో నించి (లేదా 'అదనపు ఉత్పత్తి'లో నించి) కొంత భాగం 'అమ్మకం' ఖర్చుల కోసమూ, కొంత భాగం 'వర్తకుడి లాభం' కోసమూ వెళ్లాయన్నమాట!

వర్తకుడు, సరుకుల్ని 'కమిషన్'తో ('తగ్గింపు విలువ'తో) తీసుకునేది పెట్టుబడిదారుడి నించే కాదు. స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకుల్ని అమ్మిపెట్టవలసివస్తే, అప్పుడు కూడా వర్తకుడు కమీషన్‌తోనే తీసుకుంటాడు. ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుల కుటుంబ సభ్యులు, 100 మీ. బట్టని ఉత్పత్తిచేసి, దాని అమ్మకం పనిని ఒక వర్తకుడికి అప్పగిస్తే, ఆ బట్టని '5 కమిషన్'తో ఇవ్వ వలసిందే. లేదా, ఆ కుటుంబ సభ్యులే అమ్మకం పని కూడా స్వయంగా చేసుకుంటే, ఆ పని కోసం '2 ఖర్చు' అవుతుంది. అయితే, ఆ 2 లో వున్న 'జీతాల' భాగం (అమ్మకం పనులు చేసే శ్రామికులకు ఇచ్చే జీతాల భాగం) ఆ కుటుంబ సభ్యులకే వుండిపోతుంది. అంతేగాక, వర్తకుడికి 'లాభం'గా మిగిలే 3 కూడా ఆ కుటుంబానికే వుంటుంది. లేదా, ఆ స్వతంత్ర ఉత్పత్తిదారులు తమ సరుకు అమ్మకం పనుల్ని ఒక వర్తకుడికి అప్పగిస్తే మాత్రం 'కమిషన్' ఇచ్చితీరాలి. — 'వర్తక కమిషన్'కి సంబంధించి ఇంకా ఒకటి రెండు విషయాలు చూడాలి.

బట్ట పెట్టుబడిదారుడి దగ్గిర, ఒక రెడీమేడ్ దుస్తుల్ని ఉత్పత్తి చేయించే పెట్టుబడిదారుడు ఎప్పుడూ బట్టని కొంటూ వుంటాడనుకుందాం. ఇద్దరి మధ్యా 'వర్తకుడు' అనేవాడు వుండడనుకుందాం. బట్టవాడు, 120 విలువ గల తన సరుకుని, రెడీమేడ్ దుస్తులవాడికి 3 తగ్గింపుతో, 117 కే ఇచ్చాడనుకుందాం. దీని అర్థం ఏమిటి? ఆ బట్ట, రెడీమేడ్ దుస్తుల వాడికి, కొంత చవగ్గా దొరికిందన్నమాట, అంటే, ఆ బట్ట ద్వారా, రెడీమేడ్ దుస్తుల పెట్టుబడి దారుడికి కూడా '3 లాభం' దొరికిందన్నమాట. ఎలాగంటే: రెడీమేడ్ దుస్తులవాడు, ఆ బట్టని, తను ఉత్పత్తి చేయించే దుస్తులకు 'ముడి పదార్థం'గా వాడతాడు కదా? 'దుస్తుల విలువని లెక్కకట్టేటప్పుడు, ఆ ముడిపదార్థాన్ని తను 117 కే కొన్నప్పటికీ, దాని విలువని 120 గానే లెక్కకడతాడు. ఆ 120 విలువ కూడా దుస్తుల అమ్మకం ద్వారా వెనక్కి వచ్చేస్తుంది. అందులో నించి, దుస్తులవాడికి 3 లాభం. ఈ లాభం ఎలా వచ్చింది? 120 కి కొనవలసిన ముడి పదార్థాన్ని 117 కే కొన్నాడు కాబట్టే వచ్చింది. అంటే, ఈ ఉదాహరణలో, 'బట్టని' ఉత్పత్తి చేసిన శ్రామికులు ఇచ్చిన '20 అదనపు విలువ'లో నించి, ఆ బట్టని కొన్న రెడీమేడ్

దుస్తులవాడు కూడా 3 లాభాన్ని తీసుకోగలిగాడు.

పెట్టుబడిదారులు 'పని స్థలాల్లోకి' కావలసిన ముడి పదార్థాల్నీ, ఇతర శ్రమ సాధనాల్నీ ఇతర పెట్టుబడిదారుల నించి కొంత కొంత కమీషన్లతో కొనగలిగితే, అలా కొన్నవాళ్ళు, ఆ సరుకులలో వున్న అదనపు విలువలలో నించి కొంత కొంత భాగాల్ని లాక్కోగలుగుతారు.

అయితే, పెట్టుబడిదారులు, ఇతర పెట్టుబడి దారుల దగ్గిర సరుకుల్ని ఈ రకంగా తగ్గింపులతో కొనడం ద్వారా సంపాదించే లాభాల్ని లెక్కలోకి తీసుకోకూడదు. ఎందుకంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ 'కొనేవాడి'గానే గాక 'అమ్మేవాడి'గా కూడా వుంటాడు కాబట్టి. ఒక పెట్టుబడి దారుడు తను ఇతరులనించి పుచ్చుకునే కమిషన్లకీ, తను ఇతరులకు ఇచ్చే కమిషన్లకీ చెల్లు అవుతుంది. కాబట్టి, పెట్టుబడిదారులు ఒకరికొకరు ఇచ్చుకునే కమిషన్ల సంగతీ, ఆ రకంగా సంపాదించే లాభాల సంగతీ, పూర్తిగా అనవసరం. అవి, వున్నా లేనివాటితో సమానం.

వర్తక కమిషన్ — అన్నప్పుడు, అది, సరుకు పెట్టుబడి దారుడు, 'వర్తకుడికి' ఇచ్చే కమిషన్‌కి మాత్రమే వర్తిస్తుంది.

మళ్ళీ, 'వర్తకుణ్ణి' తీసుకుంటే, వర్తకుడు సరుకుని అమ్మేటప్పుడు, ఏ మోసమూ చెయ్యకుండా వున్నా కూడా ఆ సరుకు ద్వారా వర్తకుడికి తప్పనిసరిగా కొంత లాభం వస్తుంది. మోసం చేస్తే, ఆ లాభం ఇంకా పెరుగుతుంది. బట్ట ఉదాహరణలో, బట్టని మోసం లేకుండా అమ్మితే వర్తకుడికి మిగిలే లాభం — 3. ఇది, ప్రధాన లాభం. ఆ అమ్మకంలోనే వర్తకుడు 1 రూ. విలువ గల మోసం చేస్తే, అది సెకండరీ లాభం. ఈ సెకండరీ లాభం వర్తకుడికి ఎవరి నించి వస్తుందంటే, ఆ సరుకుని ఎవరు కొన్నారో వాళ్ళ నించి. వాళ్ళ నష్టమే వర్తకుడి సెకండరీ లాభం.

'వర్తకం'తో పాటే వర్తక మోసాలు కూడా పుట్టాయి. ఈ మోసాలు — రక రకాలు. కొనేవాళ్ళకి 'సరుకు విలువ' గురించి సరిగా తెలియనప్పుడు వర్తకుడు సరుకుని 'అసలు విలువ' కన్నా ఎక్కువకి అమ్మడానికి ప్రయత్నిస్తాడు. తప్పుడు కొలతలూ, తప్పుడు తూకాలూ, కల్తీలూ — వగైరాలన్నీ ఈ మోసాల్లో భాగమే. ఈ వ్యాపార జిత్తుల్లో ఏ సందర్భానికి ఏది వీలైతే అది ప్రయోగిస్తారు.

జిత్తుల ద్వారా, మోసాల ద్వారా సెకండరీ లాభాలు గడించడం, ప్రతీ సందర్భంలోనూ సాధ్యం కాదు. అయినప్పటికీ ఇవన్నీ కూడా వ్యాపార ప్రపంచంలో సర్వ సామాన్యమైన విషయాలు.

అమ్మకాల్లో జరిగే మోసాల ఫలితాలు పెట్టుబడి దారుల మీద ఏమీ వుండవు. ఎందుకంటే, కారణం — మన ఎప్పటి సూత్రమే. వాళ్ళల్లో ప్రతీ వాడూ అమ్మేవాడి గానూ, కొనేవాడి గానూ కూడా వుంటాడు — అనే సూత్రమే. ఒక పెట్టుబడిదారుడు ఇతర పెట్టుబడిదారుల్ని చేసే మోసాలకీ, ఇతరులద్వారా వాడికి జరిగే మోసాలకీ, చెల్లు అయిపోతుంది. తన సరుకుని అమ్మేటప్పుడు, ఎన్నడూ మోసం చెయ్యని మహా ఉత్తమ పెట్టుబడిదారు డెవడైనా వుంటే, ఆ వ్యక్తి, ఇతరుల సరుకుల్ని కొనేటప్పుడు ఎంతో కొంత మోసపోతాడు కాబట్టి, అలాంటి వాడికి లాభం కొంచెం తగ్గితే తగ్గవచ్చు. కానీ, అంత ఉత్తమ పెట్టుబడిదారుడు వుండడం అబద్ధం.

వర్తకంలో మోసాల వల్ల నిజంగా నష్టపోయేది శ్రామికులే. శ్రామికులు, పెట్టుబడిదారుడి దగ్గిర, సరుకుని ఉత్పత్తిచేసే దశలో 'అదనపు శ్రమ' చేస్తూ దోపిడీకి గురి అవుతారు కదా? అంతేగాక, 'పని స్థలం'లో నించి బయటపడిన తర్వాత, తమ చేతుల్లోకి వచ్చిన 'జీతాల'తో సరుకుల్ని కొనడానికి పోయినప్పుడు, అక్కడ కూడా అనేక మోసాలకు గురి అవుతారు. ఆ 'జీతాల' విలువకి తగిన ఉత్పత్తులు వారి చేతికి రానే రావు. ఈ రకంగా, శ్రామికులు, 'సరుకుల ఉత్పత్తి దశ'లోనూ, 'సరుకుల చలామణీ దశ'లోనూ కూడా నష్టపోతూ వుంటారు.

'చలామణీ దశ'లో జరిగే మోసాలకు పునాది 'ఉత్పత్తి దశ'లో జరిగే మోసమే. 'సరుకు వల్ల కొంత లాభం' రావడం అనే పరిస్థితే, ఆ లాభాన్ని ఇంకా ఎక్కువగా లాక్కునే మార్గాల్ని వెతుక్కుంటుంది. ప్రధాన లాభానికే అవకాశం లేకపోతే సెకండరీ లాభం అనేది వుండనే వుండదు. ఉత్పత్తి రంగంలో జరిగే శ్రమ దోపిడీ, ప్రధాన లాభాలు రావడానికి డైరెక్టుగా కారణమైతే, సెకండరీ లాభాలు రావడానికి ఇన్‌డైరెక్టుగా కారణం. శ్రమ దోపిడీని అరికట్టకుండా, వర్తక మోసాల్ని అరికట్టడం అసాధ్యమూ, అవాస్తవమూ కూడా. లాభం మీద ఆధారపడి నడిచే వర్తక ప్రపంచంలో, మోసం లేని వర్తక కార్యకలాపాల్ని ఆశించడం పూర్తిగా అర్థ రహితం.

వర్తకుడు, అమ్మకం పనుల్ని తను స్వయంగా చెయ్యకుండా శ్రామికులతో చేయిస్తే, వాడు — 'వర్తక పెట్టుబడి దారుడు' అవుతాడు. ఆ వర్తకం పనులు స్వయంగా చేస్తే, ఆ వ్యక్తి — 'స్వతంత్ర వర్తకుడు'. వర్తకుల్లో తేడాల్ని గురించీ, 'వర్తక శ్రామికుల్ని' గురించీ, ''వర్తక పెట్టుబడి'' చాప్టరులో (2 వ సంపుటంలో) వివరంగా చూస్తాము.

ఇప్పటివరకూ బట్టలో వున్న '20 అదనపు విలువ'ని పంచుకునే అంశాల్ని చూస్తూ, ఇప్పటికి 'వర్తక కమిషన్'ని చూశాం. అది 5. ఇంకా మిగిలిన అదనపు విలువ 15. ఇప్పుడు, 'అదనపు విలువ'ని తినే ఇంకో అంశం గురించి చూద్దాం.

# 2) వడ్డీ

'అదనపు విలువ'లో ఇంకో భాగాన్ని లాక్కునేది — వడ్డీ. సరుకుని తయారు చేయించే పెట్టుబడిదారుడికి ఆ కార్యక్రమం కోసం కొంత 'పెట్టుబడి' కావాలి కదా? ఆ 'పెట్టుబడి'ని వాడు ఇంకొకడి నించి 'అప్పు'గా తెచ్చాడనుకుందాం. ఆ అప్పు ఇచ్చినవాడికి కొంత 'వడ్డీ' ఇవ్వాలి. ఆ పెట్టుబడి అప్పు తెచ్చింది కాకుండా, సరుకుని తయారు చేయించే పెట్టుబడిదారుడి స్వంతమే అయితే, వాడు కూడా తన పెట్టుబడి మీద వడ్డీ చూసుకుంటాడు. అంటే, పెట్టుబడి — బైట నించి అప్పు తెచ్చింది అయినా, అప్పు తెచ్చింది కాకపోయినా, దానికి వడ్డీని లెక్కకట్టు కోవడం వుంటుంది. ఆ వడ్డీ బైటికి పోతుందా, సరుకుని తయారుచేయించే వాడికే వుంటుందా — అనే దానితో మనకు సంబంధం లేదు. సరుకుని తయారు చేయించడం కోసం కొంత డబ్బుని ఉపయోగిస్తే చాలు, ఆ డబ్బుకి, 'వడ్డీ' పేరుతో కూడా కొంత డబ్బు రావాలి.

ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, బట్ట పెట్టుబడిదారుడు, తన '100 పెట్టుబడి'ని బైట నించి అప్పు తెచ్చాడనుకుందాం. ఆ 100 ని తిరిగి ఇచ్చేటప్పుడు, '3 వడ్డీ' ఇవ్వాలనుకుందాం.

అప్పు ఇచ్చినవాడు –వడ్డీ పెట్టుబడిదారుడు.

అప్పు తీసుకున్నవాడు –ఉత్పాదక పెట్టుబడిదారుడు.

బట్ట పెట్టుబడిదారుడు, బట్టని అమ్మిన తర్వాత, అప్పు తీర్చేటప్పుడు, వడ్డీ పెట్టుబడిదారుడికి — అసలు 100 + వడ్డీకి 3 = 103 ఇవ్వాలి. అప్పు మళ్ళీ కావాలంటే, ఆ 100 ని మళ్ళీ తీసుకుంటాడు. లేదా, ఆ 100 ని తన దగ్గిరే వుంచుకుని, ప్రతీసారీ 3 వడ్డీ ఇస్తూ వుంటాడు.

బట్ట పెట్టుబడిదారుడు, బట్టని అమ్మినప్పుడు, దాని 120 విలువలో నించి 100 పెట్టుబడిని వెనక్కి తీసుకుని, దానితో, అప్పులో 'అసలు'ని తీర్చెయ్య గలుగుతాడు. ఇది తేలిగ్గా తెలిసే విషయమే. కానీ, 'వడ్డీ'ని ఎక్కడి నించి తెచ్చి ఇవ్వగలుగుతాడు? — ఇదీ ఇక్కడ చూడవలసిన ప్రశ్న.

పెట్టుబడిని అప్పుగా తెచ్చేది బట్టని తయారు చెయ్యడం కోసమే కాబట్టి, ఆ పెట్టుబడి మీద చెల్లించవలసిన 'వడ్డీ' కూడా బట్ట తయారీ కోసం అవసరమయ్యే అంశంగానే కనపడుతుంది. బట్ట పెట్టుబడిదారుడు, 100 పెట్టుబడిని, బట్ట కోసం అయిన ఖర్చుగా లెక్క వేసినట్టే, 'వడ్డీ'ని కూడా ఇంకో ఖర్చుగా లెక్కవేస్తాడు.

కానీ, సరుకు తయారవడానికి వడ్డీ అవసరమా?

అసలు వడ్డీ అంటే ఏమిటి? — వడ్డీ అంటే కొంత డబ్బు. డబ్బు అంటే శ్రమ. కాబట్టి వడ్డీ అంటే కొంత శ్రమ. వడ్డీ పేరుతో కొంత డబ్బుని తీసుకునే మనిషి, కొంత శ్రమని తీసుకుంటున్నా డన్నమాట. ఆ శ్రమని తీసుకున్నందుకు బదులుగా ఆ మనిషి తిరిగి తన శ్రమని 'బట్ట' కోసం ఇస్తాడా? ఆ వడ్డీ తీసుకునే మనిషి, బట్టని తయారుచేసే స్తలంలోకి వచ్చి దానికి సంబంధించి ఏ పని అయినా చేస్తాడా? పోనీ, ఆ వడ్డీతో ఏదైనా ఒక వస్తువు పని స్తలంలోకి వచ్చి బట్ట కోసం ఖర్చవుతుందా? అలాంటిదేదీ జరగదు. వడ్డీ పేరుతో సరుకు తయారీలోకి ఏ వస్తువూ రాదు; ఏ శ్రమా రాదు.

ఒక వస్తువు తయారవడానికి శ్రమ సాధనాలూ, సజీవ శ్రమా మాత్రమే కావాలి. ఈ 2 అంశాలకూ సంబంధించని ఏ ఖర్చూ, ఆ వస్తువు కోసం అయ్యే ఖర్చు కాదు.

బట్టని తయారుచెయ్యాలంటే, దారం కావాలి, మగ్గం కావాలి, సుత్తి కావాలి, కత్తి కావాలి, మనిషి కావాలి. బట్ట కోసం దారం ఖర్చయితే, దారం ఖర్చు బట్టకి చేరుతుంది. మగ్గం ఖర్చయితే, మగ్గం ఖర్చు కూడా బట్టకి చేరుతుంది. ఆ పని చేసే మనిషి పోషణ కోసం ఏదైనా ఖర్చయితే, మనిషి ఖర్చు కూడా బట్టకి చేరుతుంది. ఈ ఖర్చులలాగే, బట్టని తయారు చెయ్యడానికి 'వడ్డీ' కావాలా? — ఏ మాత్రమూ అక్కరలేదు. దారమూ మగ్గమూ శ్రామికులూ, తమ ద్వారా కొంత కొంత విలువల్ని బట్టకి చేర్చినట్టుగా, వడ్డీ తన ద్వారా ఏ విలువనీ బట్టకి చేర్చదు. అంటే, వడ్డీ ఖర్చు, 'శ్రమ సాధనాల' భాగంలోకి గానీ, 'సజీవ శ్రమ' భాగంలోకి గానీ, చేరదు.

దారం లేకపోతే బట్ట తయారీ ఆగిపోతుంది. మగ్గం లేకపోతే కూడా బట్ట తయారీ ఆగిపోతుంది. వడ్డీ లేకపోతే బట్ట తయారీ ఆగిపోతుందా? బట్ట పెట్టుబడిదారుడు, వడ్డీలేని అప్పు సంపాదించాడనుకుందాం. పెట్టుబడి మీద వడ్డీ లేకపోతే, అవసరమైన పరికరం ఏదో లేనట్టు సరుకు తయారీ ఆగిపోతుందా? అలా జరగదు. సరుకు తయారీకి వడ్డీతో సంబంధమే ఉండదు. వడ్డీ పూర్తిగా బయటి విషయం. అందుకే వడ్డీతో సంబంధం లేకుండా వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోవడమూ, వాడుకోవడమూ సాధ్యమే.

వడ్డీ ఖర్చు అసహజమైన ఖర్చు. 'అసహజమైన' ఏ ఖర్చూ సరుకు విలువలోకి చేరదు. కాబట్టి వడ్డీ ఖర్చు సరుకు విలువలోకి చేరదు. ఆ ఖర్చు వల్ల సరుకు విలువ పెరగదు. కాబట్టి, ఒక వస్తువు తయారీ కోసం అయ్యే ఖర్చుల్లో, వడ్డీ కూడా తప్పనిసరి ఖర్చుగా వుంటుందని భావించడం పూర్తిగా తప్పు.

కానీ సమాజంలో అందరి దృష్టిలోనూ వడ్డీ కూడా ఒక

తప్పనిసరి అంశంగా వుంటుంది. ఒక వస్తువుని తయారు చెయ్యడం కోసం కొంత డబ్బు ఖర్చుపెడితే (అంటే కొన్ని ఉత్పత్తి సాధనాల్ని ఖర్చుపెడితే), ఆ అసలు ఖర్చుతో పాటు, దాని వడ్డీ కూడా, ఆ వస్తువు విలువలోకి చేరుతుందని సాధారణంగా అందరికీ వుండే అభిప్రాయం.

పెట్టుబడిదారుడు, సరుకు కోసం అయిన ఖర్చు లన్నిటినీ కలిపేటప్పుడు, వడ్డీ పేరుతో కూడా కొంత ఖర్చుని కలుపుతాడు. ఆ పెట్టుబడి అప్పు తెచ్చింది అయినా, కాకపోయినా, వడ్డీ ఖర్చుని కలుపుతాడు. అలా ఖర్చు లన్నిటినీ కలిపిన తర్వాతే, అప్పుడు దాని మీద 'తన లాభం' వేసుకుంటాడు. పెట్టుబడిదారుడి లెక్కల్లోకి ఇప్పుడు 'వడ్డీ'ని కూడా చేర్చాలి కాబట్టి, దీనికి తగ్గట్టుగా, గతంలో చూసిన లెక్కలో ఇప్పుడు మళ్ళీ ఒక మార్పు చేసుకోవాలి.

బట్ట విలువని లెక్కకట్టేటప్పుడు పెట్టుబడిదారుడి లెక్క ఇలా వుంటుంది : శ్రమ సాధనాలకు 80. జీతాలకు 20. వర్తక కమిషన్ 5. వడ్డీ 3. మొత్తం ఖర్చు 108. ఈ ఖర్చుల మీద పెట్టుబడి దారుడు తన లాభం కోసం 12 వేసు కుంటాడు. అప్పుడు బట్ట విలువ 120 అవుతుంది. అది మార్కెట్‌లో 120 కి అమ్ముడు పోయి ఆ డబ్బు చేతిలోకి వస్తుంది. ఆ సరుకుని, వర్తకుడు అమ్మించాడా, బట్ట పెట్టుబడిదారుడే అమ్మించాడా అనేది ఇక్కడ అనవసరం. సరుకుని ఎవరు అమ్మించినా దానికి సంబంధించిన లెక్కలన్నీ ఒక్కలాగే వుంటాయి.

బట్టని అమ్మిన తర్వాత వచ్చిన 120 లో నించి పెట్టుబడిదారుడు 3 వడ్డీ చెల్లించాడనుకుందాం. ఆ 3 విలువ ఎక్కణ్ణించి వచ్చింది? బట్టకి వున్న 120 విలు వలో నించే వచ్చింది. బట్టలోకి వడ్డీ ద్వారా ఏ విలువా చేరలేదు కదా, అది బట్టలోకి ఎలా వచ్చింది? — అది బట్టలోకి, వడ్డీ ద్వారా రాలేదు. ఇంకో అంశం ద్వారా వచ్చినదాన్ని తీసి పెట్టుబడిదారుడు వడ్డీగా చెల్లించాడు. అయితే, అది బట్టలోకి 'ఏ అంశం' ద్వారా వచ్చింది?

బట్టకి వున్న '120 విలువ'లో పెట్టుబడి 100, అదనపు విలువ 20 కదా? పెట్టుబడిదారుడు, వడ్డీ కోసం 3 విలు వని, '100 పెట్టుబడి'లో నించి తీస్తాడా? — కాదు. ఆ పెట్టుబడి, 80 శ్రమ సాధనాలకూ, 20 జీతాలకూ సంబంధించిన విలువ. ఆ విలువని మళ్ళీ ఆ అంశాల కోసమే ఉపయోగించాలి తప్ప, ఇతర అంశాల కోసం వాడడం సాధ్యం కాదు. ఇక మిగిలింది — 20 అదనపు విలువే. అది జీతాల ఖర్చు లేకుండా సరుకులోకి చేరిన విలువ. సరుకులోకి చేరని ఏ అంశం కోసం ఖర్చు పెట్టాలన్నా, ఈ భాగంలో నించి తియ్యవలసిందే. అంటే పెట్టుబడిదారుడు సరుకులో వున్న 'అదనపు విలువ'లో నించే 3 ని తీసి, వడ్డీ కోసం చెల్లిస్తాడన్నమాట!

అంటే, వడ్డీ అనేది, 'అదనపు విలువ'లో భాగమే తప్ప ఇంకేమీ కాదు. కానీ, ఈ అసలు సంగతి పైకి కనపడదు. పైకి కనపడేదంతా ఒక తప్పు అభిప్రాయం కలిగిస్తుంది. "వడ్డీని సరుకు విలువలో నించే తీసుకోవడం సాధ్యమవు తోందంటే, వడ్డీ ఖర్చు సరుకు విలువలోకి చేరుతుందన్న మాట! ఆ ఖర్చు, సరుకు తయారీకి అవసరం అన్న మాట!" అనే తప్పు అభిప్రాయాన్ని.

పెట్టుబడిదారుడు, 'వడ్డీ'ని సమర్థిస్తూ ఇలా వాదిస్తాడు — "సరుకు తయారీకి 'శ్రమ సాధనాలు' ఎంత అవసరమో 'వడ్డీ' కూడా అంత అవసరం. నేను బట్ట ఉదాహరణలో, శ్రమ సాధనాల కోసం 80 పెడతాను. సరుకుని అమ్మిన తర్వాత ఆ 80 ని వెనక్కి తీసు కుంటాను. అలాగే, వడ్డీని చెల్లించడం కోసం 3 పెడతాను. దాన్ని కూడా సరుకు ద్వారానే వెనక్కి తీసుకుంటాను. ఈ రకంగా, సరుకుని తయారు చెయ్యడానికి, శ్రమ సాధనాలూ, వడ్డీ, రెండూ అవసరమే" అంటాడు.

ఈ వాదన మీద మన జవాబు ఇలా వుంటుంది — "సరే, నువ్వు శ్రమ సాధనాల కోసం 80 ఖర్చు పెడతావు. ఆ ఖర్చుతో దారమూ మగ్గమూ తట్టా బుట్టా అన్నీ పని స్థలంలోకి వస్తాయి. 'వాటిని' ఉపయోగిస్తూ శ్రామికులు పని చేస్తారు. బట్ట తయారయ్యేటప్పటికి ఆ శ్రమ సాధనాలన్నీ ఖర్చయిపోతాయి. శ్రమ సాధనాలు లేక పోతే, బట్ట పనిని ప్రారంభించడమే జరగదు. బట్ట తయారై, దాన్ని అమ్మిన తర్వాత, శ్రమ సాధనాల విలువని వెనక్కి తీసుకుంటావు. అది సరిగానే వుంది. మరి 'వడ్డీ' కోసం 3 ఖర్చు పెడతానంటున్నావు కదా? ఆ ఖర్చు వల్ల, 'పని స్థలం'లోకి ఏ వస్తువులు వస్తాయి? నువ్వు వడ్డీని దేని కోసం ఖర్చు చేశావు?"

దీనికి పెట్టుబడిదారుడి జవాబు ఏమిటి? 'వడ్డీ ఖర్చు'ని ఏ వస్తువు కోసం పెట్టినట్టు పెట్టుబడిదారుడు చెప్ప గలడు? — ఏ వస్తువునీ చెప్పలేడు. కానీ, పెట్టుబడి దారుడు, వడ్డీని శ్రమ సాధనాలతో సమానమైన అంశంగా చెప్పడానికి ప్రయత్నిస్తాడు. ఇందులో వున్న తప్పేమిటో గ్రహించాలంటే, శ్రమ సాధనాలకీ, వడ్డీకీ తేడా ఏమిటో గ్రహించాలి.

బట్ట తయారై, అమ్ముడై, శ్రమ సాధనాల 80 వెనక్కి వచ్చినప్పుడు, దాన్ని పెట్టుబడిదారుడు తన స్వంతానికి వాడేస్తాడా? అలా వాడేస్తే, మళ్ళీ కొత్త బట్టని ఉత్పత్తి చేయించడం సాధ్యమే కాదు.

కానీ, వడ్డీ సంగతి అలా కాదు. దాన్ని సంపాదించే వాడు, దాన్ని తన పోషణకి ఖర్చు పెట్టెయ్యవచ్చు. ఎందుకంటే, అది ఏ శ్రమ సాధనమూ కాదు గనక. అది, ఉత్పత్తి జరగడానికి అవసరమైన అంశం కాదు గనక.

ఒక ఉత్పత్తి విషయంలో, శ్రమ సాధనాల కోసం కొంత డబ్బుని ఒకసారి పెడితే ఆ విలువే ఒక ఉత్పత్తి క్రమం నించి ఇంకో ఉత్పత్తి క్రమానికి అందుతూ వుంటుంది. కొత్త ఉత్పత్తి క్రమంలో, కొత్త శ్రమ సాధనాల కోసం కొత్త విలువని పెట్టనక్కరలేదు.

కానీ వడ్డీ సంగతి అలా కాదు. అది ప్రతీసారీ కొత్త విలువే. బట్ట ఉదాహరణలో, 'వడ్డీ' కోసం ఒకసారి 3 చెల్లిస్తే, ఆ విలువే వెనక్కి రావడమూ, ఆ విలువతోనే మళ్ళీ ఇంకోసారి కొత్త వడ్డీని చెల్లించడమూ జరగదు. వడ్డీ ఎప్పటికప్పుడు స్వంత పోషణకు ఖర్చయి పోతూనే వుంటుంది. మళ్ళీ కొత్త సరుకు తయారైనప్పుడు, అందులో వున్న కొత్త విలువే ('కొత్త అదనపు విలువ' లో భాగం) మళ్ళీ కొత్త వడ్డీగా వెళ్తుంది. అది మళ్ళీ ఖర్చయి పోతుంది. ప్రతీసారీ ఇదే జరుగుతుంది. అంటే, వడ్డీ అనేది, శ్రమ సాధనాల లాంటి అంశం కాదన్నమాట!

కానీ ఈ విషయాలేవీ పెట్టుబడిదారుడికి పట్టవు. వాడు, శ్రమ సాధనాల్ని ఎంత సహజ అవసరాలుగా భావిస్తాడో వడ్డీని కూడా అలాగే భావిస్తాడు. వడ్డీ ఖర్చు సరుకులోకి చేరుతుందా, లేదా; వడ్డీ అనేది సరుకులో నించి ఎలా వస్తుందీ — అని వాడు తర్కించుకోడు. ఒక పని కోసం కొంత డబ్బుని ఖర్చు పెడితే, దాని మీద తప్పనిసరిగా వడ్డీ చూసుకోవడం లోకంలో ఒక పద్ధతిగా వెనకటి కాలం నించీ వుందని వాడికి తెలుసు. కాబట్టి, వాడు కూడా వడ్డీని కలిపే సరుకు విలువని నిర్ణయిస్తాడు. విచిత్రంగా ఆ సరుకు, ఆ విలువకే (వడ్డీని కూడా కలిపిన విలువకే) అమ్ముడు పోతుంది! దాన్ని చూస్తే, పెట్టుబడిదారుడికి వడ్డీ గురించి ఎలాంటి సందేహమూ వుండదు.

పెట్టుబడిదారుడికి లాగే శ్రామికులకు కూడా వడ్డీ గురించి ఎలాంటి సందేహాలూ వుండవు. ఎవరి అదనపు శ్రమ అయితే వడ్డీలుగా యజమానులకు వెళ్ళిపోతూ వుంటుందో ఆ శ్రామికులందరూ కూడా వడ్డీని 'సహజ అవసరం'గానే భావిస్తూ, వడ్డీ గురించి పొరపాటు అభిప్రాయంతోనే వుంటారు.

కానీ, అసలు నిజం ఏమిటంటే — ఒక సరుకు ద్వారా 'వడ్డీ'ని సంపాదించే పెట్టుబడిదారుడు, ఆ సరుకు తయారవడం కోసం ఒక శ్రమని గానీ ఒక వస్తువుని గానీ ఇవ్వకుండానే ఆ డబ్బు తీసుకుంటాడు. ఆ డబ్బుతో వాడు సరుకుల ప్రపంచంలో వున్న ఏ సరుకునైనా స్వాధీనం చేసుకుని (ఏ సరుకునైనా కొనుక్కుని), తనకు రావల సిందే వచ్చినట్టూ, తన కష్టార్జితమే తను అనుభవిస్తో న్నట్టూ, దాన్ని వాడుకుంటాడు.

ఈ ఉదాహరణలో, వడ్డీని, 'డబ్బు'గా చూస్తే — 3 రూ.లు. 'ఉత్పత్తి'గా చూస్తే, అది రెండున్నర మీటర్ల బట్టకన్నా కొంచెం ఎక్కువ. అంటే, ఆ 100 మీ. బట్టని తయారు చెయ్యడంలో ఏమీ శ్రమ పడని వడ్డీ పెట్టుబడి దారుడుకి, ఆ బట్టలో నించి (ఆ ఉత్పత్తిలోనించి) కొంత భాగం 'ఊరికే' వచ్చిందన్న మాట! అంటే, తన శ్రమని ఇవ్వకుండా ఇతరుల శ్రమని లాగడమే, శ్రమ దోపిడీయే, వడ్డీలో వున్న రహస్యం అంతా! ఈ రహస్యం 'వడ్డీ' గురించి మాత్రమే కాదు; 'అదనపు విలువ' ఎన్ని భాగాలుగా అయితే పంపకం అవుతుందో ఆ భాగా లన్నిటికీ ఈ రహస్యమే వర్తిస్తుంది.

'వడ్డీ' అనేది, దాన్ని సంపాదించేవాడి స్వంత శ్రమ కాదు — అని చూశాం. అంతే కాదు, వడ్డీని చెల్లించేవాడు ఏదో ఒక పెట్టుబడిదారుడు అయితే, అప్పుడు అది, చెల్లించే వాడి స్వంత శ్రమ కూడా కాదు. బట్ట పెట్టుబడిదారుడు 100 పెట్టుబడిని అప్పు తెచ్చి దాని మీద 3 వడ్డీని చెల్లిస్తే, ఆ 3 డబ్బు, ఇచ్చేవాడి శ్రమా కాదు, పుచ్చుకునే వాడి శ్రమా కాదు. అది 'బట్ట'ని ఉత్పత్తి చేసిన శ్రామికుల శ్రమ. కానీ, ఈ సంగతి ఆ శ్రామికులకు తెలీదు.

**'స్వంత పెట్టుబడి' మీద కూడా వడ్డీ :** బట్టని ఉత్పత్తి చేయించే పెట్టుబడిదారుడికి స్వంత డబ్బే వుందను కుందాం. అప్పు కోసం వాడు ఎవడి దగ్గిరికీ పోనక్కర లేదనుకుందాం. పెట్టుబడి, వాడి స్వంతమే కాబట్టి, వాడు దానిమీద వడ్డీ చూసుకోకుండా వుండవచ్చు కదా? చివరికి అది కూడా 'లాభం'గా మిగులుతుంది కదా? వాడి పెట్టుబడి మీదే వాడు 'వడ్డీ'ని లెక్క కట్టుకోవడం ఎందుకు? — కానీ వాడు చాలా 'గొప్ప' వాదం తీసు కొస్తాడు. ఎలాగంటే: "నా డబ్బుని ఇంకెవరికైనా అప్పుగా ఇస్తే నాకు వడ్డీ వస్తుందా, లేదా? నా డబ్బుని నేనే పెట్టుబడిగా వాడుకుంటే మాత్రం, దానికి రావలిసిన వడ్డీ రావద్దా? లాభం మిగలడంతో సంబంధం లేకుండానే వడ్డీ రావాలి! లాభం వేరూ, వడ్డీ వేరూ!" అంటాడు.

ఇతరుల శ్రమని లాగడానికి వాడి సిద్ధాంత శాస్త్రంలో అన్ని రకాల మార్గాలూ, అన్ని రకాల వాదాలూ, వున్నాయి. వాడి వాదాలకు వాడి ఆర్థికవేత్తలు ముగ్ధులైపోతారు. అన్ని వాదాల్నీ మించినంత సౌందర్యం ఈ వడ్డీ వాదంలో చూస్తారు వాళ్ళు. దాన్ని 'బారు వడ్డీ, చక్ర వడ్డీ'— వగైరా పేర్లతో రక రకాలుగా అభివృద్ధి పరచడానికి శాయశక్తులా కృషి చేస్తారు.

స్వంత పెట్టుబడి వున్న పెట్టుబడిదారుడు, తన వడ్డీ సిద్ధాంతంతో, తన డబ్బు తనకే అప్పు ఇచ్చుకుంటాడు. అప్పు ఇచ్చిన మనిషి, అప్పు పుచ్చుకున్న మనిషి నించి వడ్డీని వసూలు చేసినట్టు, తన నించి తనే వడ్డీని వసూలు

చేసుకుంటాడు. పెట్టుబడిదారుడు ఎలాంటి వాడంటే, వాడు వడ్డీ లేకుండా ఇతర్లకు అప్పు ఇవ్వడనే సంగతి అలా వుంచండి, అది సరే, వడ్డీ లేకుండా వాడు తనకు తను కూడా అప్పు ఇచ్చుకోడన్నమాట! బంధువుల నించీ, స్నేహితుల నించీ, వడ్డీలు వసూలుచేసే వాళ్ళని చూస్తేనే ఆశ్చర్యం కలుగుతుంది కదా? తన దగ్గిర్నించి తనే వడ్డీ వసూలు చేసుకునే వీణ్ణి చూసి ఏం కలగాలి? ఏమో మరి! — కానీ, చెప్పాలంటే వాడి దృష్టిలో వాడు కరెక్టే. డబ్బుకి వడ్డీ తీసుకోవడం అనే పద్ధతి వున్న తర్వాత, ఆ డబ్బు ఎవడిదైతే వాడు వడ్డీ తీసుకోగలుగుతాడు కదా?

బట్ట పెట్టుబడిదారుడికి, స్వంత పెట్టుబడి లేకపోతే, వడ్డీ 3, లాభం 12 — అనుకుందాం. స్వంత పెట్టుబడి వుంటే ఇప్పుడు వడ్డీని బైటికి ఇవ్వక్కరలేదు కాబట్టి, ఇప్పుడు వాడికి మిగిలేది 15. ఇప్పుడు వడ్డీ 'బెడద' లేదు కాబట్టి ఆ 3 కూడా లాభంతోనే కలిసిపోయి అంతా కలిసి జేబులో పడుతుంది. అయితే బట్టవాడు దాన్ని చూసి "లాభం 15" అనుకోడు. "వడ్డీ 3. లాభం 12" అని దాన్ని తప్పనిసరిగా విభజిస్తాడు. ఎందుకంటే, వడ్డీని విడిగా చూసుకోకపోతే, తన పెట్టుబడిని వడ్డీ లేకుండా ఉప యోగించినట్టు అవుతుందని వాడి బాధ. వడ్డీ అనే పేరుతో ఒక రాసి విడిగా లేకపోతే, అది 'సిద్ధాంతపరంగా' చాలా తప్పు అవుతుందని వాడి అభిప్రాయం. ఆయన, సిద్ధాంత పరంగా చాలా 'నిక్కచ్చిగా' 'హేతుబద్ధంగా' వుండదల్చు కుంటాడు. కాబట్టి ఆ 15 లో నించి 3 ని తీసి, ఇంకో జేబులో పెట్టి, దాని వేపు నిరాసక్తంగా చూసి, గంభీరంగా — "పెట్టుబడికి వడ్డీ – 3" అని రాస్తాడు. అది తనకు 'ఖర్చు' అయినట్టు! అది వడ్డీ కోసం వెళ్ళిపోయినట్టు! ఆ వడ్డీ జేబు ఇంకెవడిదో అయినట్టు! అలా వడ్డీని ఇంకో జేబులో పెట్టుకుని — "15 మిగిలినట్టు కనపడింది గానీ అదంతా లాభం కాదు గదా? అందులో 3 వడ్డీకే పోయిందిగదా? మిగిలింది 12 యే కదా?" అని తనకి తను చెప్పుకుంటాడు. లాభాన్ని 15 గా గాక 12 గా తక్కువ చేసి చూసుకున్నప్పుడు పెట్టుబడిదారుడు ఎలా భావిస్తాడంటే — తను చాలా తక్కువ లాభంతోనే సంతృప్తి పడగలననీ, ఎక్కువ లాభాలు సంపాదించాలనే దురాశ తనకు లేదనీ, భావిస్తాడు. తనని చూసుకుని తను చాలా గర్వపడతాడు. తన 'ఆత్మవంచన'ని సచ్ఛీలంగా లెక్క కట్టుకుంటాడు.

వడ్డీని ఉత్పాదక పెట్టుబడిదారుడే తీసుకోనీ, లేదా ఇంకోడికే ఇవ్వనీ, దాన్ని ఎవడు తీసుకుంటే వాడే 'వడ్డీ పెట్టుబడిదారుడు' అవుతాడు. ఉత్పాదక పెట్టుబడి దారుడు తన స్వంత పెట్టుబడి ద్వారా 3 వడ్డీ, 12 లాభం సంపాదిస్తే, 3 కి సంబంధించినంతవరకూ వాడు, 'వడ్డీ పెట్టుబడిదారుడి'గానూ, 12 కి సంబంధించినంతవరకూ ఉత్పాదక పెట్టుబడిదారుడిగానూ, అవుతాడు.

'పెట్టుబడి' ద్వారా వడ్డీ సంపాదించేవాడిని, 'వడ్డీని తెచ్చే డబ్బు గల పెట్టుబడిదారుడు' అనాలి. కానీ, వాణ్ణి కుదించి మనం 'వడ్డీ పెట్టుబడిదారుడు' అని క్లుప్తంగా అంటున్నాం.

ఈ వడ్డీ విషయాలు మనకు బాగా అర్థమయ్యాయో లేదో తెలుసుకోడానికి ఒకటి, రెండు ఉదాహరణలు చూద్దాం.

పెట్టుబడిదారుడు స్వంత పెట్టుబడినే వాడుతున్నా డనుకుందాం. కానీ, దాని మీద వడ్డీని లెక్క కట్టుకోడను కుందాం. అప్పుడు బట్ట విలువ ఎలా వుంటుంది? 3 వడ్డీని లెక్క కట్టుకోకపోతే, బట్ట విలువ తగ్గుతుందా? అది 120 గా గాక, 117 గా అవుతుందా? కాదు. అసలు ఆ 120 లో 80 విలువ శ్రమ సాధనాలదీ, 40 విలువ సజీవ శ్రమదీ. ఆ 2 అంశాలతోనే బట్ట తయారైంది కాబట్టి, ఆ అంశాల వల్లనే ఆ విలువ ఏర్పడుతుంది. వడ్డీని లెక్క కట్టినా కట్టక పోయినా, వడ్డీని బైటికి ఇచ్చినా ఇవ్వకపోయినా, బట్ట విలువకీ, వడ్డీ లెక్కలకీ సంబంధం వుండదు. ఆ 120 లోకి వడ్డీ ద్వారా వచ్చిన భాగం ఏదీ లేదు కాబట్టి, వడ్డీ లేకపోయినా ఆ విలువలో నించి తగ్గిపోయే భాగం ఏదీ వుండదు. వడ్డీకి సంబంధించిన మార్పుల్ని బట్టి బట్ట విలువలో మార్పులు జరగవు. పెట్టుబడి, అప్పు తెచ్చింది అయితే, బట్ట విలువలోదే కొంత భాగం వడ్డీగా బైట మనిషికి పోతుంది. లేకపోతే, ఆ భాగం పెట్టుబడిదారుడికే వుండి పోతుంది. అంతే తేడా!

ఇంకో ఉదాహరణ: పెట్టుబడిదారుడికి, ఒక స్నేహి తుడు వడ్డీలేని అప్పు ఇచ్చాడనుకుందాం. అప్పుడు, పెట్టుబడిదారుడు, వడ్డీ కోసం, 3 ఖర్చు పెట్టనక్కరలేదు కదా? పెట్టుబడిదారుడు, తన బట్ట విలువని 120 గా గాక, 117 గా పెడతాడా? — అలా పెట్టడు. మిగతా పెట్టుబడి దారులందరూ ఆ బట్టని 120 కి అమ్ముతారు. అంటే, ఆ బట్ట 120 విలువతో అమ్ముడుపోయే పరిస్థితి మార్కెట్‌లో వుంది. కాబట్టి, వీడూ తన బట్టకి ఆ విలువనే నిర్ణయిస్తాడు. ఆ విలువని నిర్ణయించేటప్పుడు, 'వడ్డీ – 3' అని తన ఖర్చుల్లో రాసుకుంటాడు, దాన్ని బైటికి ఇవ్వకపోయినా.

పెట్టుబడిదారుడికి ఇంకో స్నేహితుడు 30 విలువ గల దారం ఊరికే ఇచ్చేశాడనుకుందాం. ఆ స్నేహితుడు దారం కోసం డబ్బు తీసుకున్నా, తీసుకోకపోయినా, ఆ 30 దారం విలువ బట్టకి చేరుతుంది కదా? అలాగే, 'పెట్టుబడి'ని అప్పు ఇచ్చిన స్నేహితుడు వడ్డీ తీసుకోకపోయినా, ఆ 3 విలువ కూడా సరుకుకి చేరుతుందనే పెట్టుబడిదారుడు అనుకుంటాడు. ఆ వడ్డీని స్నేహితుడు తీసుకోకపోతే ఆ

3 ని తనే తీసుకుంటాడు. అంటే, పెట్టుబడిదారుడి దృష్టిలో, దారం ఎంత సహజ విషయమో, వడ్డీ కూడా అంత సహజ విషయం.

ఇప్పటివరకూ వడ్డీ అంటే ఏమిటో చూశాం. అయితే, వడ్డీ అనేదాని కొలత దేనిమీద ఆధారపడి వుంటుంది? ఉత్పాదక పెట్టుబడిదారుడు, వడ్డీ పెట్టుబడిదారుడికి 'అదనపు విలువ'లో నించి కొంత భాగాన్ని వడ్డీగా ఇస్తాడు కదా? ఆ భాగం దేన్ని బట్టి వుంటుంది? ఆ భాగం, 'అదనపు విలువ'లో సగం వుంటుందా, మూడో వంతు వుంటుందా? అది ఏ కారణంతో ఎలా నిర్ణయమవు తుంది? 'అదనపు విలువ'లో నించి 'వడ్డీ'ని పంచడానికి ఏమైనా షరతులు వున్నాయా? — ఈ విషయాలు ఇక్కడ చూడలేము. 'వడ్డీ రేటు ఏ విషయాల మీద ఆధారపడి వుంటుంది' అనే విషయాన్ని, "వడ్డీ పెట్టుబడి" చాప్టర్లో (2 వ సంపుటంలో) చూస్తాం. ప్రస్తుతానికి, ఇక్కడ 'వడ్డీ అనేది, అదనపు విలువలో కొంత భాగం' అనే విషయం వరకూ అర్థం చేసుకోవాలి.

'అదనపు విలువ'ని పంచుకోవడంలో ఎన్ని షరతులు వున్నా, ఆ షరతులన్నీ, శ్రమ పడకుండా వచ్చే దాన్ని పంచుకునే షరతులే. అందులోంచి ఎవడి మట్టుకు వాడికి ఎక్కువ వాటాని లాగాలనే వుంటుంది. ఉత్పాదక పెట్టుబడిదారుడికీ వర్తక పెట్టుబడిదారుడికీ పోట్లాటలు వున్నట్టే, ఉత్పాదక పెట్టుబడిదారుడికీ వడ్డీ పెట్టుబడి దారుడికీ కూడా పోట్లాటలు వుంటాయి.

వడ్డీ పెట్టుబడిదారుడు అప్పు ఇచ్చేది ఉత్పాదక పెట్టుబడిదారుడికే కాదు, వర్తక పెట్టుబడిదారుడికి కూడా. స్వంత పెట్టుబడి లేకపోతే, వర్తక పెట్టుబడిదారుడు కూడా అప్పు తీసుకుని దాని మీద వడ్డీ ఇవ్వవలసిందే. వర్తకుడు, వడ్డీని, ఎక్కడి నించి చెల్లిస్తాడు? — ఆ అప్పుని, ఏ సరుకుని కొనడం కోసం తెస్తాడో, ఆ సరుకు ద్వారా వచ్చే 'వర్తక కమిషన్'లో నించే చెల్లిస్తాడు.

ఉత్పాదక పెట్టుబడిదారుడు చెల్లించే వడ్డీ అయినా, వర్తక పెట్టుబడిదారుడు చెల్లించే వడ్డీ అయినా, వాళ్ళు ఏ సరుకునైతే అమ్ముతారో ఆ సరుకులో వున్న 'అదనపు విలువ'లో భాగాలే. అంటే వాళ్ళు చెల్లించే వడ్డీలు, వాళ్ళ స్వంత శ్రమలలో నించి చెల్లించేవి కావు.

వడ్డీ పెట్టుబడిదారుణ్ణి చూస్తే: వాడు ఉత్పాదక పెట్టుబడిదారుడి నించి తీసుకునే వడ్డీ అయినా, వర్తక పెట్టుబడిదారుడి నించి తీసుకునే వడ్డీ అయినా, వాళ్ళు ఏ సరుకునైతే అమ్ముతారో ఆ సరుకుని ఉత్పత్తి చేసిన శ్రామికుల అదనపు విలువలో భాగాలే.

100 మీ. బట్ట ఉదాహరణలో ఉత్పాదక పెట్టుబడి దారుడు చెల్లించే వడ్డీని 3 అనీ, వర్తక పెట్టుబడిదారుడు చెల్లించే వడ్డీని 1 అనీ అనుకుందాం. మొత్తం ఈ 4 వడ్డీ, బట్టని ఉత్పత్తి చేసిన శ్రామికులు ఇచ్చిన '20 అదనపు విలువ' లోదే.

స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా, తమ సరుకుని ఉత్పత్తి చెయ్యడంకోసం కొంత డబ్బుని అప్పు తీసుకుంటే, దాని మీద వడ్డీ చెల్లించవలసిందే. అలా చెల్లించే వడ్డీ, వారి స్వంత శ్రమలో భాగమే.

ఏదో ఒక పెట్టుబడిదారుడి దగ్గిర పని చేసే శ్రామికులు, తమ కుటుంబ అవసరాల కోసం వడ్డీ పెట్టుబడి దారుడి నించి, అప్పులు తీసుకుంటే? వీరు వడ్డీలు ఎలా చెల్లిస్తారు? తమ జీతాలలో నించే చెల్లిస్తారు. అంటే, తమ స్వంత శ్రమలో నించి! స్వంత అవసరాల కోసం 'అప్పు' తెచ్చుకోవలసిన పరిస్తితి ఏర్పడడం వల్ల, వారు తమ జీతాలలో కొంత భాగాన్ని వడ్డీ పెట్టుబడిదార్లకు అప్ప జెప్పేస్తారు.

**శ్రామికుడే అప్పు ఇస్తే** : ఒక శ్రామికుడు, తన కష్టార్జితాన్నే కొంత పొదుపుచేసి, దాన్ని ఇతర శ్రామికులకు అప్పులిచ్చి, వారి నించీ వడ్డీలు సంపాదిస్తాడనుకుందాం. ఇలాంటి ఉదాహరణలో, అప్పులిచ్చే శ్రామికుడు వడ్డీల రూపంలో సంపాదించేది, ఇతర శ్రామికుల జీతాలలో భాగాలే. అప్పులిచ్చే శ్రామికుడు, వడ్డీల రూపంలో సంపా దించేది శ్రమ చెయ్యకుండా సంపాదించేదే. కానీ, మొత్తం సమాజంలో చూసినప్పుడు, వడ్డీల ద్వారా సంపా దించే వాళ్ళంతా వడ్డీ పెట్టుబడిదారులే గానీ, శ్రామికులు కాదు. వడ్డీల ద్వారా సంపాదించే శ్రామికులు చాలా తక్కువ.

వడ్డీ అంటే, ఇతరుల శ్రమని లాగడమే కాబట్టి, వడ్డీ తీసుకోవడానికి ఎవడికీ నిజమైన హక్కు వుండదు. 100 డబ్బుని అప్పుగా ఇచ్చినవాడు, అప్పుని తిరిగి తీసు కునేటప్పుడు, ఆ 100 నే తిరిగి తీసుకోవాలిగానీ, అంతకన్నా ఎక్కువ డబ్బు తీసుకోడానికి హక్కు వుండదు.

100 ని అప్పు ఇచ్చే నాటికీ, దాన్ని తిరిగి తీసుకునే నాటికీ, 'డబ్బు విలువ' ఏమీ మారలేదనే అనుకోవాలి. అప్పు ఇచ్చే నాటికి 100 డబ్బుకి 1 బస్తా ధాన్యం వస్తున్న దనుకుందాం. అప్పు తీర్చేనాటికి కూడా అదే పరిస్థితి వుంటే, డబ్బు విలువ ఏమీ మారనట్టే అర్థం. అప్పు ఇచ్చే నాటికీ, తిరిగి తీసుకునే నాటికీ, డబ్బు విలువ ఏమీ మారకపోతే, ఇచ్చినంత డబ్బునే తిరిగి తీసుకోవడం వల్ల, అప్పు ఇచ్చిన మనిషికి ఏమీ నష్టం జరగదు.

ఒకవేళ, ఆ కాలంలో 'డబ్బు విలువ' కొంత తగ్గితే, అప్పు మీద కొంత వడ్డీ ఉండడం సమంజసమే — అయినట్టు కనపడుతుంది. కానీ, అప్పుడు కూడా అది సమంజసం అవదు. ఎందుకంటే, అసలు డబ్బుకి 'విలువ తగ్గిపోతూ వుండడం' అనేది దోపిడీ సమాజంలో వుండే

అనేక అస్తవ్యస్తపు పరిస్థితుల్ని బట్టే జరుగుతూ వుంటుంది. (ఈ విషయాలు, తర్వాత భాగాల్లో చూస్తాము.) చలామణీలో తిరిగే డబ్బు పరిమాణాన్నీ, డబ్బుకి సంబంధించిన ఇతర విషయాల్నీ, ఎలా నిర్వహించాలో అలాగే ఖచ్చితంగా నిర్వహించినట్టయితే, డబ్బు విలువ తరచుగా తగ్గిపోయే సమస్యే ఏర్పడదు.

ఇక్కడ దోపిడీ సమాజాన్నే తీసుకుందాం. అక్కడ డబ్బు చలామణీకి సంబంధించి వుండే అస్తవ్యస్తపు పరిస్థితులనే తీసుకుందాం. అలాంటి పరిస్థితుల్లో కూడా 'వడ్డీ' అనేది డబ్బు విలువలో తగ్గుదలని పూడ్చడానికి సరిపడే పరిమాణంతో మాత్రమే వుండదు. 'వడ్డీ' పేరుతో తీసుకునే విలువ, ఆ కారణంతో, అంత అల్పంగా మాత్రమే వుంటే, అది వడ్డీ అవదు. ఇచ్చిన డబ్బు విలువనే తిరిగి తీసుకున్నట్టు అవుతుంది. కానీ, వడ్డీ లక్ష్యం, ఇచ్చిన విలువనే తిరిగి తీసుకోవడం కాదు. ఇచ్చిన విలువకన్నా అధికమైన విలువని తీసుకోవడమే — వడ్డీ లక్ష్యం. అందుకే అది ఇతరుల శ్రమని నిష్కారణంగా లాగడం అవుతుంది.

అసలు, సమాజంలో అప్పు అనేదే లేని నూతన పరిస్థితుల్ని ఊహిస్తే, అప్పుడు వడ్డీ అనే ప్రశ్నే వుండదు.

'శ్రమ దోపిడీ' సాగే సమాజాలలో, 'అప్పు' వున్నా లేకపోయినా, వడ్డీ వుంటుంది. అంటే, 'స్వంత పెట్టుబడి' మీద కూడా వడ్డీ వుంటుందని చూశాం. అంటే 'వడ్డీ'ని సంపాదించడానికి, అప్పు, తప్పనిసరి కారణం కాదు. శ్రమ సాధనాలు, ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో వారి స్వంత ఆస్తులుగా వుండడమే — 'వడ్డీ'కి మూల కారణం. (ఈ కారణం వడ్డీకి మాత్రమే కాదు. ఇతర దోపిడీ అంశాలన్నిటికీ కూడా.) కాబట్టి 'శ్రమ దోపిడీ'ని తీసివెయ్యగలిగే నూతన సామాజిక సంబంధాల్ని ఊహిస్తే, అప్పుడు, అప్పుకీ, వడ్డీకీ, అదే రకపు ఇతర దోపిడీ అంశాలకూ స్థానమే వుండదు.

సమాజంలో సాగే వివిధ ఉత్పత్తి శాఖల మధ్య వడ్డీ లేని అప్పుల్నీ, అప్పులే లేని సమాజాన్నీ అర్థం చేసుకోవడం, ఈ దశలో సాధ్యం కాదు. ఇంకా అనేక భాగాల్లో అనేక విషయాలు చూసిన తర్వాత మాత్రమే ఆ విషయాలు అర్థం చేసుకోగలుగుతాము.

'వడ్డీ లేని అప్పు'ని, వడ్డీ చెల్లించవలసిన వాడు కూడా ఊహించలేడు. ఇక, వడ్డీని తీసుకునే వాడి సంగతి సరే సరి.

'డబ్బు'లో నించి 'వడ్డీ' దానికదే పుట్టుకు వస్తుందని తర తరాల గుడ్డి నమ్మకం. మూఢ నమ్మకం. శ్రమ దోపిడీకి అనుకూలించే నమ్మకం.

కాబట్టి, వడ్డీ లేని అప్పూ, అప్పు లేని సమాజమూ — పెట్టుబడిదారీ సంబంధాలలో గానీ, శ్రామికుల నించి 'అదనపు శ్రమ'ని లాగే ఏ ఇతర సామాజిక సంబంధాలలో గానీ, వుండవు.

ఇక్కడ మళ్ళీ మన బట్ట ఉదాహరణకి తిరిగి వెళ్దాం. బట్ట ఉదాహరణలో వున్న '20 అదనపు విలువ', ఏ యే అంశాలుగా పంపకమవుతుందో చూస్తూ, ఇప్పటి వరకూ — 5 వర్తక కమిషన్‌నీ, 3 వడ్డీనీ — చూశాం. ఇప్పుడు ఇంకో అంశాన్ని చూస్తాం.

# 3) 'భూమి' కి 'అద్దె' (లేదా, 'కౌలు')

'అదనపు విలువ'లో ఇంకో అంశం — భూమి అద్దె. దీన్ని లాక్కునేవాడు భూమిని తన స్వంత ఆస్తిగా ఆక్రమించి వున్నవాడు. భూమి మీద 'యాజమాన్యపు' హక్కు వున్నవాడు. వాడే 'భూస్వామి'. భూమికి స్వామి!

ఏ 'ఉత్పత్తి కార్యక్రమం' జరగాలన్నా, దానికి ఒక 'పని స్థలం' కావాలి. అది భూమి మీదే వుంటుంది. ఉత్పాదక పెట్టుబడిదారుడు భూమి మీద కొంత 'చోటు' సంపాదించి, అక్కడ తన పని స్థలం ఏర్పాటు చేస్తాడు. ఆ 'చోటు' వాడి స్వంతం అయినా, ఇంకొకడి స్వంతం అయినా, ఆ చోటుకి 'అద్దె' వుంటుంది.

ఒక బిల్డింగుని అద్దెకి తీసుకున్నప్పుడు, ఆ బిల్డింగు ఏ స్థలం మీద నిలబడివుందో ఆ స్థలానికి వుండే అద్దె కూడా, ఆ బిల్డింగు అద్దెలో కలిసి వుంటుంది. ఒక బిల్డింగు అద్దె, 1 రోజుకి 6 అనుకుందాం. ఆ బిల్డింగు ఏ స్థలం మీద వుందో ఆ స్థలం అద్దెని విడిగా చూస్తే, అది 2 అనుకుందాం. ఈ స్థలం అద్దెని విడిగా తీసేస్తే బిల్డింగుకి వున్న అద్దె 4. ఈ 4 గురించి కాదు మనం ఇక్కడ మాట్లాడుతున్నది. స్థలానికి వెళ్ళే 2 అద్దె గురించే మాట్లాడుతున్నాం.

బిల్డింగుకి అద్దె వుండడంలో 'శ్రమ సిద్ధాంతం' ప్రకారం పొరపాటేమీ లేదు. బిల్డింగు అనేది శ్రమతో తయారయ్యే, కొంత కాలానికి పాతబడిపోయే వస్తువు. ఒక పని కోసం దాన్ని ఉపయోగించినప్పుడు, అక్కడ తయారయ్యే సరుకు విలువలోకి, బిల్డింగు తాలూకు విలువ కూడా చేరవలసే వుంటుంది. అంటే సరుకు విలువలోకి బిల్డింగు ద్వారా కొంత విలువ చేరినట్టుగా లెక్క కట్టడంలో పొరపాటేమీ లేదు. అది సహజ అవసరమే. కానీ, ఆ బిల్డింగు ఏ స్థలం మీద వుంటుందో, ఆ స్థలానికి ఇచ్చే అద్దె సంగతే ఇక్కడ చూడాలి. అంటే, 'భూమి'కి వుండే అద్దె సంగతి. 'భూమి

అద్దె' అన్నా, 'భూమి కౌలు' అన్నా ఒకటే.

'భూమి' ప్రకృతిలో భాగం. అది మనుషుల శ్రమతో తయారైనది కాదు. దాన్ని స్వంత ఆస్తిగా ఆక్రమించడానికి ఎవరికీ సహజమైన హక్కు (న్యాయమైన హక్కు) వుండదు. కానీ, ఆ పని (భూమిని స్వంత ఆస్తిగా ఆక్రమించడం) ప్రపంచమంతటా ఎన్నో వేల సంవత్సరాల కిందటే అసహజంగా (అన్యాయంగా) జరిగిపోయింది.

భూమి మీద ఆస్తి హక్కు ఎందుకు ప్రారంభమైందీ, ఎలా ప్రారంభమైందీ — అనే విషయాలు ఇక్కడ చూడ లేము. భూమిని స్వంత ఆస్తిగా ఆక్రమించే పద్ధతి సమాజంలో ఎప్పుడో ప్రారంభమైపోయి ప్రపంచమంతటా సాగుతోనే వుంది. ఈ పద్ధతి వల్ల ఒక మనిషి, భూమి మీద కొంత భాగానికి 'స్వంతదారు' (ఓనరు) కాగలడు, ఆ భాగం ఎంత చిన్నదైనా, ఎంత పెద్దదైనా! ఒక మనిషి కొన్ని వేల ఎకరాల భూమిని 'సంపాయించుకుని' దానికి 'యజమాని' అవగలడు. ఇంకో మనిషి, భూమి మీద కాలు మోపడానికి కూడా హక్కులేని, భూమి లేనివాడిగా వుండగలడు. ఈ రెండు పరిస్థితులకూ కూడా ఈ 'భూమి ఆస్తి విధానం' వీలు కలిగిస్తుంది.

భూమి మీద హక్కులేని మనిషి కూడా (జానెడు స్వంత భూమి అయినా లేని మనిషి కూడా) భూమి మీదే నివసించాలి. ఆ మనిషి భూమిని వదిలి ఆకాశంలో నివసించడు. భూమికీ, మనిషికీ సహజ సంబంధం వుంది. నిజానికి, ప్రతీ మనిషీ భూమి మీద 'సహజమైన హక్కు' కలిగి వుండవచ్చు. భూమిని తన 'నివాసం'గా ఉపయోగించుకోవడానికీ, తన 'పోషణ'కు కావలసిన ఆహార పదార్థాలు పండించుకోవడానికీ, ఇంకా ఆ రకమైన సహజమైన అవసరాల కోసం, భూమిని ఉపయోగించుకునే హక్కు ప్రతీ మనిషికీ వుంటుంది. మనుషులకే కాదు, ఈ హక్కు ప్రకృతిలో సమస్త ప్రాణులకూ ఉంటుంది. ఉండాలి.

కానీ, ఇంత సహజమైన హక్కుని మానవ సమాజం ఎప్పుడో పోగొట్టుకుంది. మనుషులు తమ 'అవసరాల' కోసం భూమిని ఉపయోగించుకోగలిగే సహజమైన హక్కుని, 'భూమి ఆస్తి విధానం' తీసివేసింది. సహజ హక్కు పోయిన తర్వాత ఏర్పడేది అసహజ హక్కే. అప్పటి నుంచి మనిషికి భూమి మీద హక్కు ఏర్పడ్డది, 'ఉపయోగపు విలువ' దృష్టితో కాదు, 'విలువ' దృష్టితోనే!

భూమి మీద పంటలు పండుతాయి, భూమి లోపల గనుల్లో బొగ్గూ, లోహాలూ, చమురూ వంటివి ఎన్నో సహజ పదార్థాలు వుంటాయి. నదుల్లో, సరస్సుల్లో, సముద్రాల్లో చేపలు వుంటాయి. అడవుల్లో కాయలూ, పళ్ళూ, దుంపలూ, ఔషధాలూ, పక్షులూ, జంతువులూ, రకరకాల కలపలూ వుంటాయి. ఇవన్నీ కూడా మానవ జీవితానికి ఎంతో అవసరం. అయితే — నేలా, అడవీ, సముద్రమూ, తమ పదార్థాల్ని స్వయంగా తెచ్చి మనుషుల చేతుల్లో పెట్టవు. మనుషులు, వాటిని తీసుకుని తమ శ్రమలతో కొత్త ఉత్పత్తులుగా తయారు చేసుకోవాలి. పంటలు పండించాలన్నా, చేపలు పట్టాలన్నా, గనులు తవ్వాలన్నా, అడవి పదార్థాలు సేకరించాలన్నా, ప్రతీ పనికీ మనుషులు, కొన్ని శ్రమ సాధనాల సహాయంతో పనులు చేసుకోవాలి.

భూమి కూడా ఒక శ్రమ సాధనమే. ప్రతీ పనికి ఈ శ్రమ సాధనం అవసరమవుతుంది. దీని పాత్ర లేకుండా ఏ ఉత్పత్తి క్రమమూ జరగదు. అయితే, ఈ శ్రమ సాధనం, ఇతర శ్రమ సాధనాల లాంటిది కాదు. ఇతర శ్రమ సాధనాలన్నీ మనుషులు తయారుచేసిన 'వస్తువులు'. భూమి మాత్రం అలాంటి వస్తువు కాదు. ఇది మనుషులు తయారు చెయ్యని సహజ శ్రమ సాధనం. ఇది ఎన్నటికీ ఖర్చయిపోని శ్రమ సాధనం. శ్రమ సాధనాలు ఖర్చయిపోతూ వుంటే, వాటిని ఎప్పటికప్పుడు నిర్మించుకోవలసి వున్నట్టుగా భూమిని ఎప్పటికప్పుడు నిర్మించుకోనక్కర లేదు. అందుకే అది సహజ శ్రమ సాధనం. ప్రకృతి పదార్థం అయిన భూమిని, మనుషులు తమ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించు కుంటారు.

భూమి మీద ఏ శ్రమ జరిగినా, భూమి ఆ శ్రమకు సహకరిస్తుంది. భూమిని దున్ని సాగు చేస్తే, పంటలు ఇస్తుంది. భూమి మీద ఇల్లు కడితే ఇల్లు నిలబడడానికి వీలునిస్తుంది. కొండల్లో, జలపాతాల్లో, నదుల్లో, సముద్రాల్లో, గనుల్లో, అడవుల్లో, ఎక్కడే శ్రమ జరిగినా దానికి ఆ భూమి కూడా కారణమవుతుంది. కానీ, భూమి, మగ్గం లాగా, నాగలి లాగా, దారం లాగా, బిల్డింగు లాగా, శ్రమతో తయారైనది కాదు గనక, అది తన ద్వారా వస్తువుకి ఏ శ్రమనీ చేర్చదు. మగ్గాన్ని ఉపయోగిస్తే, మగ్గం శ్రమ, ఆ వస్తువుకి చేరినట్టు, భూమిని ఉపయోగిస్తే, భూమినించి ఏ శ్రమా వస్తువుకి చేరదు. ఎందుకంటే, భూమిలో అసలు శ్రమే లేదు కాబట్టి. భూమి అసలు శ్రమతో తయారైనది కాదు కాబట్టి. ఇది ప్రకృతి సహజ పదార్థం. ఇది శ్రమ సాధనంగా ఉపయోగపడుతుంది. కానీ, ఉచితంగా!

భూమి మీద పంట పండితే, అలా పంట పండడానికి భూమి కూడా కారణమే. కానీ, ఆ పంటకి విలువ ఏర్పడడానికి, భూమి కారణం కాదు. భూమి వల్ల, ఏ విలువా చేరదు.

భూమి మీద ఒక ఇల్లు కడితే, ఆ ఇల్లు ఏర్పడడానికి భూమి కూడా కారణమే. కానీ, ఆ ఇంటి విలువలో ఏ భాగానికీ భూమి కారణం కాదు.

అంటే 'ఉపయోగపు విలువ' ఏర్పడడానికైతే భూమి కూడా కారణమే. 'విలువ' ఏర్పడడానికైతే భూమి కారణం కాదు.

శ్రమతో తయారైన శ్రమ సాధనం మాత్రమే, తన ద్వారా ఉపయోగపు విలువనీ, విలువనీ కూడా ఇవ్వ గలదు. కానీ భూమి ఆ 2 పనులూ చెయ్యదు. 'విలువ'ని ఇచ్చే విషయంలో భూమి పాత్ర ఏమీ వుండదు.

అంటే దీని అర్థం ఏమిటంటే — భూమి, 'ఉత్పత్తి'కి తన ద్వారా ఏ విలువనీ ఇవ్వదు కాబట్టి, ఆ ఉత్పత్తి లో నించి ఒక భాగాన్ని తీసుకునే హక్కు భూమికి వుండదు. అంటే, మనుషులు భూమిని వుపయోగించుకున్నప్పటికీ, ఆ భూమికి 'అద్దె'గా ఏమీ ఇవ్వనక్కరలేదు.

అంటే 'భూమి అద్దె' అసహజమైన (అన్యాయమైన) విషయం. అది, 'శ్రమ సాధనాల ఖర్చు'లోకి గానీ, 'సజీవ శ్రమ ఖర్చు'లోకి గానీ, రాదు. 'భూమి అద్దె'గా కొంత విలువని ఇవ్వడం అంటే, భూమి, సరుకు కోసం కొంత విలువని ఇచ్చినట్టూ, దాన్నే తిరిగి ఇస్తున్నట్టూ కాదు. ఇంకేదో అంశానికి చెందిన విలువని తెచ్చి 'భూమి అద్దె'గా ఇవ్వడమే. 'వర్తక కమిషన్' ఎలాంటిదో, 'వడ్డీ' ఎలాంటిదో, 'భూమి అద్దె' కూడా అలాంటిదే.

మన బట్ట పెట్టుబడిదారుడికి 'స్వంత' భూమి లేదనుకుందాం, తన 'పని స్థలం'గా కావలసిన భూమిని ఒక భూస్వామి నించి అద్దెకు తీసుకుని వాడికి కొంత అద్దె చెల్లిస్తున్నాడనుకుందాం. 100 మీటర్ల బట్టని తయారు చెయ్యడానికి ఒక రోజు పడుతుందనుకుందాం. ఆ ఒక రోజుకి భూమి అద్దె 2 అనుకుందాం. పెట్టుబడిదారుడు ఈ భూమి అద్దెని ఎక్కడి నించి తెచ్చి చెల్లిస్తాడు? — 'వర్తక కమిషన్' నీ, ' వడ్డీ' నీ, ఎలా చెల్లించాడు? సరిగ్గా దీన్ని కూడా అలాగే.

బట్ట పెట్టుబడిదారుడు ఈ భూమి అద్దెని కూడా బట్ట తయారవడానికి అయ్యే ఖర్చుగానే అనుకుంటాడు. ఖర్చులన్నిటినీ కలిపి దానిమీద లాభం వేసుకోవాలి కదా? ఆ ఖర్చుల్లో భూమి అద్దెకోసం 2 ని కూడా కలుపుతాడు. అప్పుడు వాడి లెక్క ఇలా వుంటుంది: శ్రమ సాధనాల కోసం 80. జీతాల కోసం 20. వర్తక కమిషన్ 5. వడ్డీ 3. భూమి అద్దె 2. ఈ ఖర్చులన్నీ కలిపి — 110. దీనిమీద వాడు 10 లాభం వేసుకుంటాడు. అప్పుడు సరుకు విలువ 120 అవుతుంది. ఆ విలువకి, ఆ సరుకు అమ్ముడుపోయి, ఖర్చులన్నీ వెనక్కివస్తాయి. దీన్ని చూస్తే, భూమి అద్దె ఖర్చు, బట్ట విలువలోకి చేరినట్టూ, అందుకే దాన్ని బట్ట విలువలో నించి వెనక్కి తీసుకోవడం సాధ్యమైనట్టూ, కనిపిస్తుంది. అంతా 'వర్తక కమిషన్' గురించీ, 'వడ్డీ' గురించీ, చూసినట్టే.

కానీ, నిజం ఏమిటి? బట్టకి వున్న 120 విలువలో భూమి ద్వారా చేరిన విలువ ఏమీ లేదు. ఆ 120 విలువలో 80 విలువ శ్రమ సాధనాలదీ (భూమి గాక మిగిలిన శ్రమ సాధనాలది), 20 విలువ జీతాలదీ, 20 విలువ జీతాలు లేనిదీ.

పెట్టుబడిదారుడు, భూమి అద్దె కోసం ఇచ్చే 2 ని, బట్ట విలువలోని ఏ అంశంలో నించి తీసి ఇస్తాడు? శ్రమ సాధనాల 80 లో నించి కాదు. జీతాల 20 లో నించి కూడా కాదు. అదనపు విలువగా వున్న 20 లో నించే ఇవ్వగలడు.

ఈ ఉదాహరణలో, భూమి అద్దె 2 రూ.లు. దీన్ని 'బట్ట'గా చూస్తే — 1 మీటరు కన్నా కొంత ఎక్కువ.

బట్ట పెట్టుబడిదారుడికి, 'పని స్థలం'గా వాడుకోవ డానికి 'స్వంత భూమే' వుంటే, అప్పుడేమవు తుంది? ఆ భూమికి అద్దె వుంటుందా, వుండదా? — అప్పుడు కూడా అద్దె వుంటుంది. పెట్టుబడిదారుడు అప్పుడు కూడా "భూమి అద్దె కోసం — 2" అని తన ఖర్చుల్లో రాసు కుంటాడు. ఆ 2 ని, తనే తీసుకుంటాడు. అంటే వాడు, తన భూమిని తనకే అద్దెకి ఇచ్చుకుంటాడన్నమాట! అద్దె లేకుండా భూమిని తనకి కూడా తను ఇచ్చుకోడన్నమాట! "నీ భూమికోసం నువ్వే ఎందుకు అద్దె తీసుకుంటావు?" అని అడిగితే, వాడి దగ్గిర ఒక అద్భుతమైన తర్కరాజం వుంది కదా? వాడు ఇలా జవాబు చెపుతాడు: "నా భూమిని ఎవరికైనా అద్దెకి ఇస్తే దాని వల్ల నాకు 2 అద్దె వస్తుందా, రాదా? నేను ఎవరి భూమి మీదైనా పని చేయిస్తే, నా సరుకు విలువలోంచి వాళ్ళకి 2 అద్దె చెల్లిస్తానా లేదా? కాబట్టి, నా భూమికైనా నాకు అద్దె ఎందుకు రావొద్దూ?" అంటాడు. వాడి దృష్టితో వాడు కరెక్టే. భూమికి అద్దె వుండాలి — అని ఒప్పుకున్న తర్వాత, ఆ భూమి ఎవడిదైతే వాడికి, అద్దె రావలసిందే కదా?

ఒక మనిషికి భూమి అద్దెగా 2 వచ్చిందంటే, ఆ విలువ వాడికి ఎందుకు వచ్చినట్టు? వాడు ఆ భూమికి హక్కు దారుగా వుండడం వల్ల. ఆ అద్దెని తీసుకునేవాడు, ఏ సరుకు నించైతే ఆ భాగం తీసుకుంటాడో ఆ సరుకు తయారీ కోసం ఏమైనా శ్రమ చేస్తాడా? — లేదు. ఏ శ్రమా ఇవ్వకుండానే, భూమి మీద తన హక్కుని చూపించి, భూమి అద్దె పేరుతో, ఇతరుల శ్రమని తీసుకుంటాడు. 'ఇతరుల శ్రమ' అంటే, ఇది ఎవరి శ్రమ? అద్దె చెల్లించే వాడు పెట్టుబడిదారుడు కాబట్టి, ఇది పెట్టుబడిదారుడి శ్రమా? కాదు. ఆ సరుకుని ఏ శ్రామికులు తయారు చేశారో ఆ శ్రామికుల శ్రమ.

'భూమి అద్దె' ఎవడి చేతిలోకి పోతుందో వాడే

'భూస్వామి'. వాడు, భూమికి 'స్వామి'. భూమికి 'స్వంత దారు'. భూమికి 'యజమాని'! భూమి మీద ఇల్లు కట్టుకుని దాంట్లో నివసిస్తే, అలా తను నివసించే ఇంటి కోసం భూమిని వుపయోగించుకునే మనిషి, భూస్వామి అవడు. భూమి మీద తన 'స్వంత శ్రమ'తో తన పోషణ కోసం పంట పండించుకుంటే, ఆ అవసరం కోసం భూమిని వుపయోగించుకునే మనిషి కూడా భూస్వామి అవడు. 'సహజమైన అవసరాల' కోసం, స్వంత శ్రమతో, భూమిలో ఏ భాగాన్ని ఎలా ఉపయోగించుకునే మనిషైనా, భూస్వామి కాడు.

ఎలాంటి మనిషి భూస్వామి అవుతాడంటే : మొదట ఆ మనిషి కొంత భూమిని తన స్వంత ఆస్తిగా ఆక్రమించి వుంటాడు. కానీ, దాన్నంతా తన స్వంత అవసరాలకోసం ఉపయోగించడు. దాని మీద తను స్వయంగా శ్రమ చెయ్యడు. ఆ భూమిని ఇతరులకు అద్దెకు ఇస్తాడు. ఆ ఇతరులు దాన్ని, ఏ అవసరానికైనా ఉపయోగించు కోవచ్చు. వ్యవసాయానికో, పరిశ్రమకో, ఇల్లు కట్టుకో డానికో, మరోదానికో. వాళ్ళు దానికి అద్దెగా కొన్ని ఉత్పత్తులుగానీ, కొంత డబ్బుగానీ ఇస్తారు. ఆ అద్దెని తీసుకున్న వాడు, తన స్వంత శ్రమ లేకుండా, ఇతరుల శ్రమతో జీవిస్తాడు. ఈ రకంగా భూమిని తన ఆస్తిగా ఆక్రమించి, ఇతరులకు అద్దెకు ఇచ్చి, తన స్వంత శ్రమ లేకుండా, ఆ భూమి అద్దె ద్వారా జీవించే వాడే భూస్వామి అవుతాడు. భూమిని స్వంతానికి, స్వంత శ్రమతో వాడుకోవడానికే గానీ, దాన్ని అద్దెకి ఇవ్వడానికి ఎవరికీ హక్కు వుండదు.

వడ్డీ లాగే, భూమి అద్దె కూడా శ్రమ దోపిడీయే.

బట్ట పెట్టుబడిదారుడికి స్వంత భూమే వుంటే, భూమి అద్దె 2, వాడి జేబులోనే పడుతుంది. 'లాభం' జేబులో కాదు. 'వడ్డీ' జేబులో కూడా కాదు. 'భూమి అద్దె' జేబులో! ఆ 2 అద్దెకి సంబంధించినంతవరకూ వాడు — 'భూస్వామి' అవుతాడు. కానీ వాడు, ఆ అద్దెని తన లెక్కల్లో 'ఖర్చు'గానే రాసుకుంటాడు. భూమి తనదే అయినా దాని అద్దె కోసం 2 చెల్లించినట్టు!

ఒక మనిషి, ఒక నది ఒడ్డున నిలబడి "ఈ నది నాదే" అంటే, వినేవాళ్ళకి అది కొంచెం ఆశ్చర్యం కలిగిస్తుంది. కానీ ఆ మనిషి ఒక భూమిని చూపించి "ఈ భూమి నాదే" అంటే, అది ఆశ్చర్యం కలిగించదు. ఎందుకంటే, అది అలవాటైపోయింది. ప్రశ్నలే రానంత అలవాటు!

భూమి మీద 'భూస్వామి హక్కు'ని ప్రదర్శించడానికి, 'ఈ ప్రాంతం, ఆ ప్రాంతం' అనే తేడా లేమీ వుండవు. అద్దెకి ఇచ్చే భూమి, బట్టలు నేసే పని స్థలంగా వుపయోగపడే భూమి అయినా కావచ్చు; పంటలు పండే భూమి అయినా కావచ్చు; గనులు వున్న భూమి అయినా కావచ్చు; జలపాతాలు వున్న భూమి అయినా కావచ్చు; కొండలూ, లోయలూ, అడవులూ వున్న భూమి కావచ్చు; చేపల పెంపకానికి వీలైన సరస్సులు వున్న భూమి కావచ్చు; కోళ్ళ పెంపకానికీ, పశువుల పెంపకానికీ అనుకూలించే భూమి కావచ్చు; బిల్డింగులు కట్టే భూమి కావచ్చు; ఇదీ అదీ అని లేదు. 'భూగోళం' మీద ఏ ప్రాంతాన్ని అయినా భూస్వామి తన స్వంతంగా ఆక్రమించగలడు. దాన్ని తర్వాత, అద్దెకి ఇచ్చెయ్యగలడు. జలపాతాలు వాడివే! నదులు వాడివే! కొండలూ, లోయలూ వాడివే! మైదానాలూ, అడవులూ వాడివే! అసలు 'భూగోళం' అంతా వాడిదే! అద్దెకి తీసుకునే వాళ్ళు వుంటే గ్రహాలన్నీ కూడా వాడివే! "చంద్రమండలం నాదే. దాన్ని వాడుకుని నాకు అద్దె పంపండి" అనగలడు భూస్వామి. ఒకడు చంద్ర మండలాన్ని అద్దెకిస్తే, ఇంకోడు సూర్యమండలాన్ని అద్దెకిస్తాడు. అప్పుడు వాళ్ళు భూ స్వాములు మాత్రమే గాక, చంద్ర స్వాములూ, సూర్య స్వాములూ కూడా అయిపోతారు.

<u>మనిషి అనేవాడు భూమి మీద లేని కాలం నించీ కూడా భూమి వుంది. భూమి ప్రకృతిలో భాగం. ప్రకృతికి ఎవరూ యజమానులు కారు. ఈ సంగతులు భూమి దొరలు ఎరగరు!</u>

"భూమి ప్రకృతిలో భాగం కదా? అలాంటి భూమి నీ ఆస్తి ఎలా అవుతుంది?" అని భూస్వామిని అడగండి! వాడు ఏం చెపుతాడు? "ప్రకృతా? ప్రకృతేమిటి? భూమి మా వంశానిది. మా తాతది ఇది. ప్రకృతేమిటి?" అని చాలా ఆగ్రహపడతాడు. 'ప్రకృతి'ని అర్థం చేసుకునే ప్రకృతి కాదు వాడిది. ప్రకృతి అంతా వికృతే వాడికి. భూమి ఎలా పుట్టిందో ఇప్పటివరకూ ఏ భూగర్భ శాస్త్రజ్ఞులూ, ఏ ఖగోళ శాస్త్రజ్ఞులూ సరిగా చెప్పలేక పోతున్నారు కదా? కానీ, మన భూమి దొర, అందులో అంత చెప్పలేనిదేమీ లేదంటాడు. భూమిని వాళ్ళ తాతగారే సృష్టించాడంటాడు. ఏ వస్తువైనా ఒకరి స్వంతం ఎప్పుడవుతుందంటే, ఆ మనిషి ఆ వస్తువుని స్వయంగా తయారుచేసినప్పుడే కదా? భూమి — భూస్వామి తాతగారి స్వంతం అయ్యిందంటే, ఆ తాతగారు భూమిని స్వయంగా సృష్టించి ఈ మనవడికి ఇచ్చాడన్న మాట! అందుకే, అది తన స్వంతం అయిందని ఈ మనవడి వాదం. ఆ హక్కుతోటే ఈ మనవడు — భూస్వామి, భూమి అద్దెని లాగుతూ వుంటాడు. ఆ హక్కుని తన ద్వారా, తన పుత్రుడికీ, పౌత్రుడికీ అలా అలా అందిస్తూ వుంటాడు. ప్రతీ భూస్వామికీ భూమిని తన తాతగారే సృష్టించినట్టుగా కనపడుతుంది.

భూమిని 'స్వంత ఆస్తి'గా వుంచుకునే విధానం సమాజంలో వున్నప్పుడు, ఆ ఆస్తిని అమ్మడమూ, కొనడమూ కూడా సమాజంలో వుంటాయి.

ఒక మనిషికి 'తాతగారి' నించి భూమి రాలేదనుకుందాం. ఆ వ్యక్తి కొంత డబ్బుతో కొంత భూమి కొన్నాడనుకుందాం. ఆ మనిషి, "ఈ భూమి కోసం నేను కొంత డబ్బు ఖర్చు పెట్టాను. కాబట్టి ఈ భూమి ద్వారా కొంత అద్దె తీసుకోవడానికి నాకు హక్కు వుంటుంది" అనవచ్చునా?

భూమిని కొన్నారా, కొనకుండా ఆక్రమించారా; భూమిని కొన్న డబ్బు ఆ మనిషి కష్టపడి సంపాదించిందా, దొంగతనం చేసి సంపాదించిందా— అనే విషయాలకీ, భూమి లక్షణానికీ ఏమీ సంబంధం వుండదు. ఒక మనిషి ఇంకో మనిషికి తన డబ్బు ఇచ్చే భూమిని కొని వుండవచ్చు. ఆ డబ్బు అతని కష్టార్జితమే కావచ్చు కూడా. భూమిని కొన్న డబ్బు ఆ వ్యక్తి కష్టార్జితమే అయినా కూడా, దానివల్ల, భూమి స్వభావంలో మార్పు రాదు. అంటే, భూమి తన ద్వారా సరుకులోకి కొంత శ్రమని ఇచ్చే వస్తువుగా మారదు. భూమిని కొనడానికి ఇచ్చిన డబ్బు, ఎక్కడికి వెళ్ళింది? భూమిని అమ్మిన వాడి చేతుల్లోకి. అంటే, ఆ భూమి మీద జరిగే ఉత్పత్తి కార్యంతో సంబంధంలేని మనిషి చేతుల్లోకి పోయింది. ఆ ఖర్చు, ఆ ఉత్పత్తి కార్యం కోసం జరగలేదు. ఆ ఖర్చుకి బదులుగా భూమి ద్వారా సరుకులోకి ఏమైనా శ్రమ వస్తుందా అంటే, అదేమీ జరగదు.

ఒక శ్రమ సాధనం, శ్రమతో తయారైనది అయితే (ఉదా : దారం), దాన్ని స్వంత శ్రమతో సంపాదించారా, దొంగతనం చేసి సంపాదించారా అనేదానితో సంబంధం లేకుండా, దాని విలువ కొత్త ఉత్పత్తికి చేరుతుంది. ఎందుకంటే, ఆ శ్రమ సాధనంతో తయారైంది శ్రమ కాబట్టి.

కానీ, ఒక శ్రమ సాధనం, శ్రమతో తయారైనది కాకపోతే, అది స్వంత డబ్బుతో కొన్నది అయినా కూడా దాని ద్వారా ఏ విలువా కొత్త ఉత్పత్తికి చేరదు. అందులో శ్రమే ఉండదు కాబట్టి. భూమిని, కష్టపడి సంపాదించిన డబ్బుతోనే కొన్నా, ఆ భూమి, ఏ శ్రమనీ సరుకుకి ఇవ్వదు. భూమిని తన కష్టార్జితంతో కొన్న మనిషికి కూడా, ఆ భూమి మీద తయారయ్యే ఉత్పత్తిలో నించి కొంత భాగం తీసుకోవడానికి నిజమైన హక్కు వుండదు. అలాంటి హక్కు రావాలంటే, ఆ మనిషి, ఆ ఉత్పత్తి కార్యంలో ఏదో ఒక పని చేసి వుండాలి. లేదా, తన శ్రమతో తయారైన ఏదైనా ఒక శ్రమ సాధనాన్ని ఆ ఉత్పత్తి కార్యం కోసం ఇచ్చి వుండాలి. ఈ రెండింట్లో ఏదో ఒకటి జరగకుండా, 'నా డబ్బుతో భూమిని కొన్నాను కాబట్టి, నాకు భూమి అద్దె రావాలి' అనడం 'శ్రమని దోచే సిద్ధాంతం' అవుతుంది గానీ, 'శ్రమ సిద్ధాంతం' అవదు.

'శ్రమ సిద్ధాంతం'లో, శ్రమకే స్థానం గానీ, యజమానితనాలకూ, వారసత్వాలకూ, దొరతనాలకూ, లాభాలకూ, వడ్డీలకూ, భూమి అద్దెలకూ స్థానం వుండదు. శ్రమ ప్రపంచంలో అవన్నీ అవాస్తవ, అసహజ, అసహ్య, అతార్కిక విషయాలే.

బట్టలో వున్న అదనపు విలువ 20 కదా? అందులో ఇప్పటికి, వర్తక కమిషన్‌గా 5, వడ్డీగా 3, భూమి అద్దెగా 2 —పంపకం అయ్యాయి. ఇప్పుడు, ఇంకో అంశం గురించి చూద్దాం.

# 4) 'ప్రభుత్వా'నికి చెల్లించే 'పన్నులు'

ఇక్కడ మొదట —'సమాజం, పరిపాలన, ప్రభుత్వం, దేశం' అనే మాటల్ని క్లుప్తంగా అర్థం చేసుకోవాలి.

'సమాజం' అంటే— 'శ్రమ సంబంధాలు గల' మనుషుల సమూహం. ఆ మనుషులంతా శ్రమ చేసే వారిగా వున్నా, లేదా మనుషుల్లో ఒక భాగం శ్రమ చెయ్యని వారిగా వున్నా.

'పరిపాలన' అంటే — శ్రమ చెయ్యకుండా 'దోపిడీ' ద్వారా జీవించే మనుషులు, శ్రమ చేసే మనుషుల్ని, ఎదురు తిరగనివ్వకుండా అణిచివుంచే కార్యక్రమం. శ్రమ దోపిడీ వున్న సమాజంలో సాగే పరిపాలన, 'దోపిడీని రక్షించే' కార్యక్రమమే.

'ప్రభుత్వం' అంటే —'దోపిడీని రక్షించే' కార్యక్రమాన్ని తన అనేక 'శాఖల' ద్వారా నిర్వహించే సంస్థ.

'దేశం' అంటే — ఒక ప్రభుత్వాధీనంలో వున్న 'పాలనా ప్రాంతం'. ఒకే దేశంగా వున్న ప్రాంతంలో, 2 ప్రభుత్వాలు గనక ఏర్పడితే, ఆ ప్రాంతం, 2 దేశాలుగా అయిపోతుంది. ఒక ప్రభుత్వ పాలనలో వున్నదే — ఒక దేశం.

'సమాజం' అన్నప్పుడు— 'శ్రమ సంబంధాల' గురించి మాట్లాడుతున్నామనీ, 'దేశం' అన్నప్పుడు — 'ఒక ప్రభుత్వ పరిపాలన ప్రాంతం' గురించి మాట్లాడుతున్నామనీ — అర్థం.

ఒక దేశ ప్రభుత్వం — పోలీసూ, సైన్యమూ, కోర్టులూ, జైళ్ళూ, ఇంకా ఇతర ప్రభుత్వ శాఖలూ — వంటి అనేక శాఖల ద్వారా, 'శ్రమ చేసే జనాభా'ని, 'అణిచి వుంచడం' అనే లక్ష్యంతో, పరిపాలన సాగిస్తుంది. పరిపాలనా సంబంధమైన శాఖలన్నీ కలిసి 'రాజ్యాంగ యంత్రం' (స్టేట్).

దీనికి అధిపతి — 'రాజు' కావచ్చు; 'రాణీ' కావచ్చు; 'ప్రెసిడెంట్' కావచ్చు; 'ప్రధాన మంత్రి' కావచ్చు. ఆ ఆధిపత్యం ఏ పేరుతోనైనా వుండవచ్చు.

ప్రభుత్వ శాఖలు రక రకాలుగా వుంటాయి. దోపిడీ దారులకు అనుకూలంగా వుండే 'చట్టాల్ని' చేసే శాఖలు కొన్నీ (అసెంబ్లీలూ, పార్లమెంటులూ వంటివి); ఆ చట్టాల్ని అమలు జరిగేలాగ చూసే శాఖలు కొన్నీ (సెక్రటేరియట్, కలక్టరేట్ — లాంటి ప్రభుత్వ ఆఫీసులు); శ్రామికులు, ఆ చట్టాల్ని మీరితే వారికి శిక్షలు విధించే శాఖలు కొన్నీ (కోర్టులు); శ్రామికుల్ని ఎప్పుడూ అణిచి వుంచే విధంగా పని చేసే శాఖలు కొన్నీ (పోలీసూ, గూఢచారీ శాఖలూ) — ఈ రకంగా, ఈ శాఖ లన్నిటితోటీ కలిసి, ప్రభుత్వం, 'పరిపాలన' చేస్తూ వుంటుంది.

'బట్ట' వుదాహరణలో పెట్టుబడిదారుడి దగ్గిర శ్రామికులు, '20 అదనపు విలువ'ని ఇచ్చారని చూశాం కదా?

ఒక పెట్టుబడిదారుడి దగ్గిర జరిగేదే 'సమాజం' అంతా జరుగుతుంది. ఇలాంటి సమాజంలో 'పరిపాలన' అంటే ఏమిటి? — దోపిడీ కొనసాగేలాగ చూడడమే. శ్రామికులు కేవలం 'జీతాల' మీద పనిచేస్తూ, 'అదనపు విలువ'ని యజమానుల కోసం ఇస్తూ వుండాలి. ఉత్పాదక, వర్తక, వడ్డీ పెట్టుబడిదారులూ; భూస్వాములూ — ఆ 'అదనపు విలువ'ని పంచుకుంటూ వుండాలి. భూములూ, పెట్టుబడులూ దోపిడీదారులకే 'ఆస్తులు'గా వుండాలి. ఈ వ్యవహారం అంతా ఇలా చెక్కు చెదరకుండా జరిగిపోయేలాగ చూడడమే ఈ సమాజానికి అవసరమైన 'పరిపాలన'.

ప్రభుత్వానికి — 'పరిపాలన చేస్తుంది' అని ఆర్భాటమైన పేరేగానీ నిజానికి అది చేసే పని, 'దోపిడీదారుల పక్షాన' నిలబడడమే.

'చట్ట సభల' ద్వారానూ, 'పోలీసుల' ద్వారానూ, 'కోర్టుల' ద్వారానూ, 'జైళ్ళ' ద్వారానూ జరిగే పరిపాలనే లేకపోతే దోపిడీదారులు ఒక్క నిముషం కూడా 'ఆస్తుల్ని' (భూమినీ, ఇతర ఉత్పత్తి సాధనాల్నీ) తమ ఆధీనంలో నిలుపుకోలేరు; ఒక్క పూట కూడా దోపిడీ సాగించలేరు. కాబట్టి, దోపిడీదారులకు, తమని రక్షించే పరిపాలన ఎంతో అవసరం. అది శ్రామికులకు ఏ మాత్రమూ అవసరం లేదు. పైగా, అది శ్రామికులకు పూర్తిగా వ్యతిరేకం కూడా.

ప్రభుత్వం తన పరిపాలనా కార్యక్రమాలు నిర్వహించాలంటే, దాని కోసం ఎన్నో ఉత్పత్తులు కావాలి. అంతేగాక, ఆ పనులన్నీ చెయ్యడానికి అనేక రకాల శ్రామికులు కావాలి. ఆ శ్రామికులకు, ప్రభుత్వం, 'జీతాలు' ఇవ్వాలి. ఈ ఖర్చు నంతటినీ ప్రభుత్వం, దేశంలో తయారయ్యే 'ఉత్పత్తుల రాసి'లో నించే తీసుకోవలసి వుంటుంది. ఈ ఖర్చుని ప్రభుత్వం, పెట్టుబడిదారుల నించి 'పన్నులు' (టాక్సులు) పేరుతో వసూలు చేస్తుంది.

ఈ పన్నులు — ఉత్పత్తి పన్నూ, అమ్మకం పన్నూ, ఆదాయం పన్నూ, ఎక్సైజ్ పన్నూ, కస్టమ్స్ పన్నూ — వంటి అనేక పేర్లతో వుంటాయి. ఈ పేర్లు రక రకాలుగా మారుతూ కూడా వుంటాయి. అన్ని రకాల పన్నుల్నీ కలిపి, 'పన్నులు' అనే ఒకే పేరుతో ప్రస్తావించవచ్చు.

పెట్టుబడిదారుడు, ప్రభుత్వానికి, 'పన్నుల' కోసం కొంత డబ్బు కట్టాలంటే, దాన్ని ఎక్కణ్ణించి తెచ్చి కడతాడు? — తను తయారు చేయించే 'సరుకు'ని అమ్మగా వచ్చే దానిలోనించే తీసి కడతాడు.

('ఆదాయం పన్ను' లాంటి వాటిని శ్రామికుల్లో కూడా కొన్ని విభాగాల వారు కడతారు, తమ జీతాల్లోనించి తీసి.)

ప్రభుత్వానికి పన్నులు కట్టవలసింది, సరుకుని తయారు చేయించే ఉత్పాదక పెట్టుబడిదారుడు మాత్రమే కాదు; సరుకుని అమ్మే వర్తక పెట్టుబడిదారుడూ, సరుకు కోసం పెట్టుబడిని అప్పు ఇచ్చే వడ్డీ పెట్టుబడిదారుడూ, సరుకు కోసం భూమిని అద్దెకి ఇచ్చే భూస్వామీ — వీరందరూ కూడా ఏదో ఒక పేరుతో పన్నులు కట్టాలి.

ఉత్పాదక పెట్టుబడిదారుడు — తన 'సరుకు' నించే పన్నులు కడతాడు.

వర్తక పెట్టుబడిదారుడు — తన 'వర్తక కమిషన్' నించి పన్నులు కడతాడు. అంటే, ఉత్పాదక పెట్టుబడిదారుడు ఏ సరుకు నించీ కడతాడో ఆ సరుకు నించే.

వడ్డీ పెట్టుబడిదారుడు — తన 'వడ్డీ' నించి పన్నులు కడతాడు. అంటే, ఏ సరుకు ద్వారా వడ్డీని సంపాదిస్తాడో ఆ సరుకు నించే.

భూస్వామి — తన 'భూమి అద్దె' నించి పన్నులు కడతాడు. అంటే, ఏ సరుకు ద్వారా 'భూమి అద్దె'ని సంపాదిస్తాడో ఆ సరుకు నించే.

ఈ 4 గురికీ సంబంధించింది — ఒకే సరుకు! అది 100 మీటర్ల బట్ట. ఈ 4 గురూ కట్టే పన్నులు ఆ సరుకులో నించి తీసేవే.

ఈ పన్నులన్నీ కలిసి మొత్తం 1 అనుకుందాం. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఈ పన్నుల్ని బట్ట పెట్టుబడిదారుడే కడతాడనుకుందాం. ఈ ఖర్చుని పెట్టుబడిదారుడు మొదటే 'సరుకు విలువ'లోకి చేర్చి లెక్క కడతాడు. 'వడ్డీ'ని ఎలాగైతే సరుకు కోసం అయ్యే ఖర్చుగా లెక్క కడతాడో అలాగే, పన్నుల్ని కూడా సరుకు కోసం అయ్యే ఖర్చుగా లెక్క కడతాడు.

అయితే, ఇక్కడ ప్రధానమైన ప్రశ్న — పన్నుల ఖర్చు

సరుకు తయారీ కోసం అవసరమయ్యే ఖర్చేనా? 'పన్నుల'తో ప్రభుత్వం, తన పరిపాలన కోసం, ఏ పనులైతే చేస్తుందో, ఆ పనులు, 'సరుకు తయారవడానికి' అవసరమా? ఆ పనులు జరగకపోతే ఆ సరుకు తయారవదా? బట్ట ఉదాహరణలో, 1 పన్నుల ఖర్చు, 'బట్ట'ని తయారు చెయ్యడానికి అవసరమైన 'శ్రమ సాధనాల' భాగంలోకి గానీ, 'శ్రామికులు వాడే జీవితావసర వస్తువుల భాగం'లోకి గానీ, వస్తుందా? ఆ ఖర్చు బట్ట విలువని పెంచుతుందా?

'పన్నుల' ఖర్చు — 'బట్ట'కి సంబంధించిన ఏ భాగంలోకీ రాదు. ఏ అంశంలోకీ రాదు. కాబట్టి, ఆ ఖర్చు బట్ట విలువని పెంచదు.

పన్నులు, ఏ 'పరిపాలన' కోసమైతే ఖర్చవుతాయో ఆ పరిపాలన, శ్రామికుల 'జీవితావసరాల' కోసం జరిగేది అయితే, శ్రామికులు, 'పరిపాలన' అనే అంశాన్ని కూడా తమ కోసం వాడుకుంటున్నట్టు అవుతుంది. అప్పుడు ఆ ఖర్చు కూడా శ్రామికుల కోసం జరిగేదే కాబట్టి, అది 'సరుకు విలువ'లోకి చేరుతుంది. కానీ 'దోపిడీ సమా జంలో జరిగే పరిపాలన' శ్రామికుల కోసం జరిగేది కాదు. ఈ పరిపాలన శ్రామికుల 'జీవితావసరం' కాదు. కాబట్టి ఈ 'పరిపాలన ఖర్చు' శ్రామికుల కోసం జరిగే ఖర్చు కాదు.

పోలీసూ, కోర్టులూ, జైళ్ళూ, సైన్యమూ వంటి శాఖలతో జరిగే పరిపాలన, సమాజానికి 'సహజమైన అవసరం' కాదు. సమాజానికి సహజమైన అవసరాలేమిటంటే — ఉత్పత్తులు తయారు చేసుకోవడమూ, వాటిని వాడుకోవడమూ మాత్రమే. ఈ 2 కోణాలకూ సంబంధించిన ఖర్చులు మాత్రమే సమాజానికి సహజమైన ఖర్చులు. ఈ సహజ అవసరాలకు సంబంధం లేకుండా జరిగే ఏ ఖర్చు అయినా — అసహజమైన ఖర్చే. 'వడ్డీ' ఖర్చు ఎలాంటి అసహజమైన ఖర్చో, 'దోపిడీదారుల పరిపాలనా' ఖర్చు కూడా అలాంటి అసహజమైన ఖర్చే. కానీ, 'వడ్డీ' అనేది, దోపిడీదారులకు ఎంత అవసరమో, 'వాళ్ళ పరిపాలన' కూడా వాళ్ళకి అంత అవసరమే. కానీ, ఆ పరిపాలన శ్రామికులకు అవసరం కాదు. దోపిడీదారుల అవసరాలు శ్రామికుల అవసరాలు కావు.

ప్రభుత్వానికీ, దోపిడీదారులకూ ; ప్రభుత్వానికీ, శ్రామికులకూ — వుండే సంబంధాల్ని అర్థం చేసుకుంటేనే, 'పన్నుల' ఖర్చు ఎలాంటి ఖర్చో అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది.

బట్ట పెట్టుబడిదారుడు, 'పన్నుల' కోసం 1ని ఖర్చు పెడతాడని చూశాం కదా? ఆ ఖర్చు, సరుకులో వున్న ఏ భాగంలో నించి వస్తుంది? ఈ విషయం పెట్టుబడి దారుడికి తెలీదు. తన ఖర్చులన్నిటినీ కలపడమూ, ఆ 'ఖర్చుల' మీద తన లాభం వేసుకుని, ఆ మొత్తానికి సరుకుని అమ్మడమూ మాత్రమే వాడికి తెలుసు. సరుకుని అమ్మినప్పుడు, పెట్టుబడిదారుడు పెట్టిన ఖర్చులన్నీ వెనక్కి వచ్చేస్తాయి. దీన్ని చూసి, పెట్టుబడిదారుడు, తను పెట్టిన ఖర్చులు సరుకు కోసం అవసరమైనవేననీ, అందుకే ఆ ఖర్చులన్నీ సరుకు ద్వారా వెనక్కి వచ్చాయనీ, అనుకుంటాడు. బట్ట తయారవడానికి దారం ఎంత అవసరమో, 'పన్నుల' ఖర్చు కూడా అంత అవసరం — అనుకుంటాడు. "పన్నుల ఖర్చుని కూడా నా సరుకులోకి చేర్చకపోతే ఇంకెక్కడి నించి తెచ్చి పన్నులు కడతానూ?" అంటాడు.

కానీ, పన్నుల ఖర్చు, తన విలువని సరుకుకి చేర్చదు. అలాంటి ఏ ఖర్చు అయినా 'అదనపు విలువ'లో నించీ రావలసిందే.

'పన్నుల' విషయాన్ని కూడా లెక్కలోకి తీసుకున్న తర్వాత పెట్టుబడిదారుడి లెక్క మళ్ళీ మారుతుంది. అది ఇప్పుడు ఇలా వుంటుంది: శ్రమ సాధనాలకు 80. జీతాలు 20. వర్తక కమిషన్ 5. వడ్డీ 3; భూమి అద్దె 2 ; పన్నులు 1 ; పెట్టుబడిదారుడి లాభం 9. — మొత్తం 120.

బట్టని 120 కి అమ్మితే, పెట్టుబడిదారుడు పెట్టిన ఖర్చులన్నీ వెనక్కి వచ్చి, వాడి లాభంగా 9 వస్తుంది.

పెట్టుబడిదారుడు కట్టే పన్నుల్లో, 'ఆదాయం పన్ను' గురించి చూద్దాం: ఆదాయం పన్నుని 'ఆదాయం' లో నించే కడతాడు. పెట్టుబడిదారుడి 'ఆదాయం' ఏమిటి? — లాభమే. లాభమే వాడి ఆదాయం. పెట్టుబడి దారుడు, లాభాన్ని తన 'కష్టార్జితమే' అనుకుంటాడు. 'లాభం'లో నించి ఆదాయం పన్ను కట్టి, "నా కష్టార్జితంలో నించే నేను ఆదాయం పన్ను కట్టుకున్నాను" అనుకుంటాడు. కానీ, ఆ ఆదాయమే శ్రామికుల నించి లాగింది. కాబట్టి, అందులో నించి ఏ పన్ను కట్టినా అది శ్రామికుల శ్రమే.

ఉత్పాదక పెట్టుబడిదారుడే కాదు, వర్తక పెట్టుబడిదారుడూ, వడ్డీ పెట్టుబడిదారుడూ, భూస్వామీ — వీళ్ళంతా ఏ పన్నులు కట్టినా, అవన్నీ వాళ్ళ ఆదాయాలలోనే. కానీ, ఆ ఆదాయాలు ఎక్కడివో, ఆ పన్నులు కూడా అక్కడివే.

ఒక సరుకుకి సంబంధించిన సమస్తమైన పన్నులూ, ఆ సరుకు తాలూకు 'అదనపు విలువ'లోవే.

శ్రామికులు కూడా, సరుకుల్ని కొనేటప్పుడు, వాటిమీద 'అమ్మకం పన్ను' చెల్లించవలసి వుంటుంది. కొన్ని విభాగాల శ్రామికులు 'ఆదాయం పన్ను' కూడా చెల్లించవలసి వుంటుంది. శ్రామికులు ఏ పన్ను కట్టినా ఆ పన్నులన్నీ వారి 'జీతాల'లో నించే వెళ్తాయి.

శ్రామికుల ఆదాయాల విషయంలో మొట్టమొదట గ్రహించవలసింది — వారి శ్రమ విలువ అంతా వారికి

అందదు — అని. అందులో చాలా భాగం 'అదనపు విలువ'గా యజమాని చేతికి పోతుంది.— ఇది మొదటి విషయం. తర్వాత — శ్రామికులు, తమ చేతికి అందిన జీతాలతో, జీవితావసర వస్తువుల్ని కొనేటప్పుడు, వర్తక పెట్టుబడిదారుల ద్వారా రక రకాల వర్తక మోసాలకు గురి అవుతారు. ఆ మోసాల వల్ల, శ్రామికులకు అందే ఉత్పత్తులు ఎంతో కొంత తగ్గిపోతాయి. — ఇది రెండో విషయం. దానికి తగ్గట్టు, ప్రతీ సరుకు మీదా 'అమ్మకం పన్ను' లాంటి దాన్ని చెల్లించడం అంటే, చివరికి శ్రామికులు వాడుకోగలిగే ఉత్పత్తులు, జీతాల విలువ కన్నా కూడా తగ్గుతాయని అర్థం.

అమ్మకం పన్నూ, ఆదాయం పన్నూ– లాంటి పన్ను లకూ; రోడ్డు పన్నూ, కాలవ పన్నూ– లాంటి పన్ను లకూ — ఒక తేడా వుంది. రోడ్డూ, కాలవా– అనేవి, 'శ్రమ'తో తయారైనవి. అవి సహజ అవసరాలు. వాటిని ఉపయోగించే వాళ్ళంతా, ఆ శ్రమలో కొంత భాగాన్ని వాడుతున్నారని అర్థం. వాటిని వాడినందుకు బదులుగా కొంత విలువని చెల్లించడం సరైనదే! అయితే, రోడ్లనీ, కాలవల్నీ, రైల్వే స్టేషన్ల వంటి పబ్లిక్ స్థలాల్నీ, శ్రామికులకన్నా పెట్టుబడిదారులే ఎక్కువగా వాడతారు. ఈ రోడ్డు పన్నూ, కాలవ పన్నూ వంటివి — సరుకు విలువ లోకి సహజంగానే చేరతాయి. 'పన్నులు' అన్నప్పుడు, సహజ అవసరాలకు సంబంధించిన వాటిని కాకుండా, 'పరిపాలన' అనే 'అసహజ అవసరం' కోసం చెల్లించే వాటినే దృష్టిలోకి తీసుకోవలసి వుంటుంది.

'పరిపాలన' చేసే ప్రభుత్వానికి, శ్రామికులు కట్టే పన్నులూ శ్రామికుల శ్రమే; పెట్టుబడిదారుడు కట్టే పన్నులూ శ్రామికుల శ్రమే. అంటే, <u>'ప్రభుత్వం' నడవడానికి ఆధారం పూర్తిగా శ్రామికుల శ్రమే.</u>

"పెట్టుబడిదారుడు పన్నులు కడతాడు" అనే అంశంతో పాటే గ్రహించవలసిన ఇంకో అంశం ఏమిటంటే— "పెట్టుబడిదారుడు పన్నులు ఎగ్గొడతాడు" అనేది కూడా! పెట్టుబడిదారుడు ప్రభుత్వానికి చూపించవలసిన ఏ లెక్కలూ సరిగా చూపించడు. 'ఉత్పత్తి' లెక్కలు గానీ, 'అమ్మకం' లెక్కలు గానీ, 'ఆదాయం' లెక్కలు గానీ, ప్రతీ చోటా తప్పుడు లెక్కలే చూపిస్తాడు. అంటే, ప్రతీ పన్ను లోనూ ఎంతో భాగం ఎగ్గొడతాడు. ఉత్పాదక పెట్టుబడి దారుడే కాదు, వర్తక పెట్టుబడిదారుడూ, వడ్డీ పెట్టుబడి దారుడూ, భూస్వామీ — అందరూ ప్రతీ ఒక్కడూ తప్పుడు లెక్కలే చూపిస్తారు. తన లెక్కలన్నీ కరెక్టుగా చూపించి, పన్నులన్నీ కరెక్టుగా కట్టే దోపిడీదారుడు నూటికి ఒక్కడు కూడా వుండడు. ప్రతీ ఒక్కడూ పన్నుల్లో కొంత భాగం ఎగ్గొడతాడు. కాకపోతే, ఆ ఎగ్గొట్టడాలలోనే కొంచెం ఎక్కువ తక్కువ తేడాలు వుంటాయి. ఎక్కువగా ఎగ్గొట్టేవాడి కన్నా కాస్త తక్కువగా ఎగ్గొట్టేవాడు, కొంచెం 'నిజాయితీ పరు డ'న్న మాట!

ప్రతీ దోపిడీదారుడూ పన్నుల్లో కొంత భాగం ఎగ్గొడతాడు కాబట్టి, అలా ఎగ్గొట్టిన పన్నులన్నీ వాడికే మిగులుతాయి.

ఇంత మంది ఇలా పన్నులు ఎగ్గొడుతూ వుంటే, ప్రభుత్వం ఎలా నడుస్తూ వుంటుంది?— అనే సందేహం వచ్చితీరాలి. శ్రామికులు కట్టవలసిన పన్నుల్ని ప్రభుత్వం 'సమర్థవంతంగానే' వసూలు చేస్తుంది. ఆ రకంగా శ్రామి కులు కట్టే భాగాలూ, పెట్టుబడిదారులు కట్టే భాగాలూ కలిసి ప్రభుత్వానికి 'ఆదాయం'గా వుంటాయి.

అంతేగాక, ప్రభుత్వానికి ఇంకో రకం ఆదాయం కూడా వుంటుంది. ప్రభుత్వం కూడా ఒక 'ఉత్పాదక పెట్టుబడి దారుడి' లాగే, కొన్ని రకాల సరుకుల్ని ఉత్పత్తి చేయించి అమ్ముతూ వుంటుంది. ఉదా॥ కరెంటుని సప్లై చెయ్య డమూ, రైళ్ళని నడపడమూ — వంటి వాటిని.

బట్ట పెట్టుబడిదారుడు, తన 'పని స్థలం'లోకి కావలసిన 'కరెంటు'ని ప్రభుత్వం నించి కొని, దాని కోసం 'కరెంటు బిల్లు' చెల్లిస్తాడు. 'బిల్లు' చెల్లించడం అంటే, కొన్న సరుకు 'విలువ'ని చెల్లించడమే. అలాగే, ప్రభుత్వం నించి 'నీటి'ని కొని, 'నీటి బిల్లు' చెల్లిస్తాడు. అలాగే, ఏ 'బిల్లు' అయినా.

బట్ట పెట్టుబడిదారుడు చెల్లించే ఇలాంటి బిల్లులు, బట్ట తయారీకి అవసరమైన 'శ్రమ సాధనాల' ఖర్చులోకి వస్తాయి.

ప్రభుత్వం అమ్మే సరుకులన్నీ, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే శ్రామికుల ద్వారా తయారవుతాయి.

బట్ట పెట్టుబడిదారుణ్ణి, ప్రైవేటు పెట్టుబడి దారుడు — అందాం.

ప్రభుత్వం కూడా అన్ని విషయాలలోనూ 'ప్రైవేటు పెట్టుబడిదారుడి' లాంటిదే. అంటే, ప్రభుత్వం కూడా సరుకుల్ని శ్రామికులతో ఉత్పత్తి చేయిస్తుంది. సరుకుల విలువల్ని నిర్ణయించేటప్పుడు, వర్తక కమిషన్లూ, వడ్డీలూ, భూమి అద్దెలూ, పన్నులూ వగైరాలన్నిటినీ కలుపుతుంది. సరుకుని అమ్మినప్పుడు, ఆ భాగాలన్నిటినీ వెనక్కి తీసుకుంటుంది. అంటే, ప్రభుత్వం కూడా శ్రామికుల 'అదనపు విలువ'ని లాగుతుంది. ఆ అదనపు విలువ ప్రభుత్వానికి ఆదాయంగా వుంటుంది. కాబట్టి ప్రభుత్వం కూడా ఒక పెట్టుబడిదారుడే. ప్రభుత్వం నడిపే ఉత్పాదక సంస్థలు కూడా శ్రామికుల్ని దోపిడీ చేసేవే.

ప్రభుత్వ బిల్లుల గురించి ఇంకా కొంత చూడాలి.

ప్రభుత్వానికి చెల్లించే బిల్లులూ, పన్నులూ ఒకటే అయినట్టు కనపడతాయి. కానీ బిల్లులు వేరూ, పన్నులు వేరూ. రెండూ ఒకే రకం కాదు.

ప్రభుత్వం అమ్మే సరుకు కోసం చెల్లించేది — బిల్లు.

ప్రభుత్వం చేసే 'పరిపాలన' కోసం చెల్లించేది— పన్ను.

ఒక పెట్టుబడిదారుడి దగ్గిర, ఏదో ఒక ఉత్పత్తి తయారవడానికి అవసరమైన బిల్లుల ఖర్చు, సహజమైన అవసరం. పన్నుల ఖర్చు, అలాంటి అవసరం కాదు.

బిల్లు ఖర్చు — 'శ్రమ సాధనాల ఖర్చు'లో భాగం.

పన్నుల ఖర్చు — ఆ సరుకులో వుండే 'అదనపు విలువ'లో భాగం.

పెట్టుబడిదారుడు చాలా పన్నులు ఎగ్గొడతాడని చూశాం. పన్నులే కాదు, బిల్లులు కూడా ఎగ్గొడతాడు. ఎలాగంటే: పెట్టుబడిదారుడు, ప్రభుత్వం నించి కరెంటు వాడుకుంటూ, కరెంటు బిల్లు కట్టలేదంటే అర్థ మేమిటి? — తన సరుకు తయారీ కోసం 'శ్రమ సాధనాల' మీద ఎంత డబ్బు చెల్లించాలో అంత చెల్లించకుండానే సరుకుని తయారు చేశాడన్నమాట! వాడు పెట్టకుండా తప్పించుకున్న ఆ కరెంటు ఖర్చుని, ప్రభుత్వం పెడు తోందన్నమాట! అయితే, వీడు తన సరుకుని అమ్మి నప్పుడు అన్ని ఖర్చులూ వెనక్కి వస్తాయి. వీడు పెట్టని కరెంటు ఖర్చు కూడా వీడి చేతికి వస్తుంది. అప్పుడైనా వీడు దాన్ని ప్రభుత్వానికి చెల్లించడు. తన జేబులో వేసు కుంటాడు. అలాగే నీటి బిల్లూ, అలాగే ఇంకో బిల్లూ. అలా ఎగ్గొట్టిన బిల్లులన్నీ ఒక జేబులోకి పోతాయి.

శ్రామికుల విషయంలో అయితే, ఏ బిల్లు కట్టక పోయినా, ఏ పన్ను కట్టకపోయినా, ప్రభుత్వం శ్రామికులకు ఇచ్చే సరఫరాల్ని వెంటనే ఆపివేస్తుంది. వాళ్ళ ఇళ్ళూ వాకిళ్ళూ జప్తుచేసి మరీ వాళ్ళ నించి బాకీలు వసూలు చేస్తుంది. చెప్పాలంటే, ప్రభుత్వం అలా చెయ్యడం చాలా 'తెలివైన' పనే. ఎందుకంటే, దానికి కట్టవలసిన దాన్ని పెట్టుబడిదారులూ కట్టక, శ్రామికులూ కట్టక, ఎవ్వరూ కట్టకపోతే, పాపం అది ఎలా బతకాలి? కట్టనివాడు ఎలాగూ కట్టడు, కట్టేవాడు కూడా కట్టకపోతే, ప్రభుత్వం పూరుకోజాలదు కదా! కాబట్టి, పన్నులూ బిల్లులూ కట్టని శ్రామికుల చిన్న చిన్న ఆస్తుల్ని ప్రభుత్వం తీసుకుపోవడం చాలా న్యాయమే.

కానీ, ఈ 'న్యాయం' పెట్టుబడిదారుల దగ్గిర సహజంగానే తారుమారవుతుంది. ప్రభుత్వానికి, పెట్టుబడి దారుల 'కష్ట సుఖాల' మీద చాలా సానుభూతి! తనూ స్వయంగా ఒక పెట్టుబడిదారుడే కాబట్టి, ఆ బాధలన్నీ దానికి బాగా తెలుస్తాయి. పన్నులూ, బిల్లులూ కట్టని పెట్టుబడిదారుణ్ణి, ప్రభుత్వం అల్లరి చేసే పిల్లవాణ్ణి ఏ మేనమామో, పినతండ్రో చూసినట్టు ముద్దుగా చూస్తుంది, 'చిన్న పిల్లలు అల్లరి చెయ్యరా' అన్నట్టు! 'పెట్టుబడి దారులు కూడా పన్నులు కడతారా? కట్టినా పూర్తిగా కడతారా? పూర్తిగా కట్టాలంటే చాలా కట్టాలి కదా, ఎలా కట్టగలరు పాపం?' అని పెద్ద పెద్ద మొత్తాలు ఎగ్గొట్టిన వాళ్ళందర్నీ అది చాలా మురిపెంగా చూస్తూ ఊరు కుంటుంది.

ఇంకా విచిత్రమైన విషయం: ప్రభుత్వ సంస్థలు కూడా ప్రభుత్వానికి పన్నులూ, బిల్లులూ ఎగ్గొడతాయి! అంటే, ఆ సంస్థల అధికారులు, ఆ మొత్తాల్ని స్వాహా చేస్తారన్నమాట!

ప్రభుత్వానికి కట్టవలసిన వాటిని కట్టకపోవడం వల్ల తను వ్యక్తిగతంగా లాభపడినా, దాని వల్ల తన ప్రభుత్వం ఇబ్బందుల పాలై దాని పరిపాలనకే ముప్పు వస్తుందేమో ననే ఇంగిత జ్ఞానం ఏ పెట్టుబడిదారుడికీ వుండదు. వాడి జేబులు నిండితే చాలు వాడికి. వాడి దృష్టి వాడి జేబుల్ని దాటి అంగుళం దూరం కూడా ఇటూ అటూ పోదు.

**ఇప్పుడు వాడి, ఇంకనూ మరో జేబు సంగతి !** దీని సంగతి మరీ విచిత్రం. ప్రభుత్వానికి 'కట్టని' వాటితో వెనకటి జేబు నిండితే, 'కట్టిన' వన్నీ వెనక్కొచ్చి ఈ జేబు నిండుతుంది. అదెలాగంటే: వీడు కట్టినవన్నీ మొదట ప్రభుత్వ ఖజానాలోకే వెళ్తాయి కదా? అప్పుడు, ప్రభుత్వం, పెట్టుబడిదారులు తమ 'పరిశ్రమల' ద్వారా చేసే 'దేశ సేవ'కు మెచ్చి, వీరికి 'పరిశ్రమల అభివృద్ధి' పేరుతో, వడ్డీలేని అప్పులూ, అతి తక్కువ వడ్డీగల అప్పులూ, తిరిగి చెల్లించనక్కరలేని సబ్సిడీలూ, కొన్నేసి సంవత్సరాల వరకూ పన్నులు కట్టనక్కరలేదనే రాయితీలూ వగైరాలన్నీ ఇస్తుంది. ప్రభుత్వం నించి అతి తక్కువ వడ్డీతో తీసుకున్న అప్పుతో, వీడు తన పరిశ్రమ నడిపి దాని ద్వారా చాలా పెద్ద వడ్డీలూ, లాభాలూ సంపాదిస్తాడు. ఈ రకంగా, ఈ వ్యవహారంలో కలిసి వచ్చేదంతా ఈ జేబులో పడుతుంది.

ఇప్పటి వరకూ మనం 'అదనపు విలువ'— వర్తక లాభమూ, వడ్డీ, భూమి అద్దే, పన్నులూ— అనే భాగాలుగా పంపకాలు అవడం చూశాం. కానీ, 'అదనపు విలువ'కి సంబంధించి ఇంకా కూడా కొన్ని విషయాలు చూడాలి. అవి "ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా" అనే వాటిని చూసిన తర్వాతే సరిగా అర్థమవుతాయి. ప్రస్తుతానికి, 'పెట్టుబడిదారుడు అదనపు విలువలో నించి పెట్టే ఖర్చులు ఇంకా కూడా కొన్ని వుంటాయి' అని మాత్రమే అనుకుందాం. ఉదాహరణకి, పెట్టుబడిదారుడు తన పన్నులూ, బిల్లులూ ఎగ్గొట్టాలంటే, ఆ పనిలో సహకరించే

ప్రభుత్వోద్యోగులకు కొన్ని 'లంచాలు' ఇస్తాడనుకుందాం. లేదా, ప్రభుత్వ శాఖలకు కావలసిన సరుకుల్ని సప్లయ్ చెయ్యడానికి ప్రభుత్వం తనకు కాంట్రాక్టులు ఇచ్చి నందుకో, తన సరుకుకోసం ఆర్డర్లు ఇచ్చినందుకో ప్రభు త్వాధికారులకు లంచాలిస్తాడనుకుందాం. ఈ లంచాలన్నీ ఎక్కణ్ణించి తెస్తాడు వాడు? 'అదనపు విలువ'లో నించే. ఈ రకం ఖర్చుల్ని సరుకు కోసం అయిన ఖర్చులుగా రాయడానికి వాడు కొంచెం సిగ్గుపడతాడు. 'వడ్డీ ఖర్చు – 3' అని రాసినట్టుగా 'లంచానికి – 2' అని రాయగలడా? రాయలేడు. నిజానికి, లంచానికీ వడ్డీకీ తేడా ఏమీ లేదు. రెండూ శ్రమ లేకుండా వచ్చేవే. కానీ వడ్డీని తీసుకోవడానికి బహిరంగంగా వున్న హక్కు, లంచం తీసుకోవడానికి లేదు. కాబట్టి, పెట్టుబడిదారుడు 'లంచం ఖర్చు'ని అదే పేరుతో లెక్కల్లో చూపించలేడు. కాబట్టి ఇలాంటి ఖర్చుల్ని వాడు 'ఇన్సిడెంటల్ ఖర్చులు' అనీ, 'మిస్‌లేనియస్ ఖర్చులు' అనీ, అంటాడు. అవి ఏమిటో, వాటి వివరాలు కాయితాల మీద చెప్పకుండా ఆ పేరుతో కొంత ఖర్చుని సరుకు విలువలోకి చేరుస్తాడు. ఈ ఖర్చుల కోసం ఎంత భాగం అయితే సరుకుకి చేరుస్తాడో అది కూడా సరుకు విలువలో నించే వాడి చేతికి వస్తుంది. అంటే, ఈ ఖర్చులన్నీ కూడా 'అదనపు విలువ'లో భాగమే అని వేరే చెప్పనక్కరలేదు. ఇలాంటి ఖర్చుల కోసం చేర్చిన విలువని 1 అనుకుందాం.

ఇక, ఇప్పుడు 'అదనపు విలువలో ఆఖరి భాగం' తీసుకునేవాణ్ణి చూస్తాం.

# 5) ఉత్పాదక లాభం, చివరికి!

'అదనపు విలువ'ని పంచుకునే వాళ్ళల్లో చిట్ట చివరివాడు, సరుకుని తయారు చేయించే పెట్టుబడి దారుడు. సరుకు వల్ల వచ్చే అదనపు విలువలో నించి, వర్తక లాభమూ, వడ్డీ, కౌలూ, పన్నులూ వగైరాలన్నీ పోయాక అప్పుడు మిగులుతుంది — 'ఉత్పాదక లాభం'! అన్ని వాటాలూ పోయాక మిగలడం అంటే, వీడికి చాలా తక్కువ మిగులుతుందనో, ఒక్కోసారి ఏమీ మిగలదనో అర్థం కాదు. ఎవడి వాటాలు వాడికి సురక్షితంగానే వుంటాయి. అందరికీ 'తగినంత' వాటాలు రావడానికి సరిపోయేలాగే వీడు అదనపు విలువని లాగుతాడు. అందులో, పంచవలసినవన్నీ పంచి, మిగిలింది తను జాగ్రత్త చేసుకుంటాడు.

**'బట్ట విలువ'ని గురించి, పెట్టుబడిదారుడి లెక్క చివరికి ఇలా వుంటుంది:** శ్రమ సాధనాలు 80. జీతాలు 20. వర్తక కమిషన్ 5. వడ్డీ 3. భూమి అద్దె 2. పన్నులు 1. ఇన్సిడెంటల్ ఖర్చులు 1. ఇప్పటికి మొత్తం ఖర్చులు 112. చివరికి ఉత్పాదక లాభం 8. మొత్తం బట్ట విలువ 120.

అయితే, ఇప్పుడు మన చివరి ప్రశ్న 'ఉత్పాదక లాభం' గురించి. బట్ట తయారవడానికి, 'ఉత్పాదక లాభం'— అవసరమా? 'వడ్డీ' మీద వేసుకున్న ప్రశ్నే చివరికి 'ఉత్పాదక లాభం' మీద వేసుకోవాలి. 'బట్ట' కోసం — దారమూ, మగ్గమూ ఖర్చయినట్టుగా, 'ఉత్పాదక లాభం' అనేది ఏదైనా ఖర్చయిందా? — ఈ 'లాభం' పేరుతో '8 విలువ' బట్టకి ఏ కారణం వల్ల చేరింది? — జవాబు తెలిసిందే. ఆ విలువ, 'ఉత్పాదక లాభం' ద్వారా చేరింది కాదు. అప్పటికే బట్టకి వున్న అదనపు విలువలో నించి, 8 భాగం, బట్టని ఉత్పత్తి చేయించినవాడికి పంపకం అవుతుంది. సరిగ్గా 'వర్తక కమిషన్'లాగా, 'వడ్డీ'లాగా, 'భూమి అద్దె' లాగా — ఇది కూడా అలాగే.

"నీకు 8 లాభం ఎందుకు రావాలి?" అని బట్ట పెట్టుబడిదారుణ్ణి అడిగితే, వాడు నిర్ఘాంతపోతాడు — "అదేం ప్రశ్న?" అన్నట్టు.

"నాకు లాభం ఎందుకు రావాలా? 'పెట్టుబడి'ని అప్పు తెచ్చి, శ్రమ సాధనాల్ని కొని, పనివాళ్ళని కుదిర్చి, రోజంతా వాళ్ళతో పనిచేయించి, బట్టని వర్తకుడికి అమ్మి... ఇన్నీ చేస్తే.... నాకు 'లాభం' ఎందుకు రావాలా?" అని మళ్ళీ నిర్ఘాంతపోతాడు.

"సరేనయ్యా అవన్నీ చేశావు. అవన్నీ చేసినందుకు 'జీతం' తీసుకున్నావుగా? మరి 'లాభం' ఎందుకూ?"

"జీతం నా 'శ్రమ'కీ! లాభం నా 'పెట్టుబడి'కీ!"

"ఆ మాట మొదటే ఎందుకు అనలేదు? లాభం, నీ 'కష్టానికే' రావాలన్నట్టుగా మొదట ఎందుకు యాకరువు పెట్టావు?"

"సరే, ఇప్పుడు చెపుతున్నాగా? లాభం నాకు కాదు. నా 'పెట్టుబడి'కి! తెలిసిందా?"

"పెట్టుబడి పెడితే, దాన్నంతా వెనక్కి తీసుకుంటావుగా? అది ఎక్కడికీ పోదుగా? దానికి లాభం ఎందుకూ? పెట్టుబడి — లాభాన్నేం చేసుకుంటుంది? లాభాన్ని తినేది నువ్వే కదా? దాన్ని నువ్వే ఖర్చుపెట్టుకుంటావు కదా? మరి, లాభం పెట్టుబడి కోసం అంటావేం?"

"అవును. నేనే ఖర్చుపెట్టుకుంటాను. 'పెట్టుబడి' నాదే కాబట్టి లాభమూ నాదే."

చివరికి అదీ పెట్టుబడిదారుడి జవాబు!

కానీ, పెట్టుబడి వాడిదే అయినా, దాని కోసం లాభాన్ని తీసుకునే హక్కు వుండదని ఇప్పటికే చూశాం. పెట్టుబడి పెడితే, దాన్ని వెనక్కి తీసుకోవడానికి మాత్రమే హక్కు వుంటుంది. దాని మీద 'అదనంగా' ఏ భాగమూ తీసుకోవడానికి హక్కు వుండదు. అలా తీసుకుంటే, అది శ్రమ దోపిడీయే అవుతుంది.— ఈ మాట మనం అంటే, పెట్టుబడిదారుడు నిర్ఘాంతపోతాడు — "పెట్టుబడికి లాభం రావొద్దా? లాభం రావొద్దా?" అని!

అంతే కాదు, ఇక్కడ పెట్టుబడిదారుణ్ణి మళ్ళీ నిర్ఘాంత పోయేటట్టు చేసే ఇంకో విషయం కూడా వుంది. 'పెట్టుబడి అనేది, అసలు పెట్టుబడిదారుడిది కానే కాదు! అది కూడా శ్రామికులదే!' — అనే విషయం. "నా పెట్టుబడి..., నా పెట్టుబడి..." అంటున్నాడు కదా వాడు? పెట్టుబడి, పెట్టుబడిదారుడిది కాదనే సంగతి మనం ఇంకా తర్వాత భాగాల్లో చూస్తాం. అప్పుడు, పెట్టుబడిదారుడి 'లాభ రహస్యమే' గాక, 'పెట్టుబడి రహస్యం' కూడా బయట పడుతుంది.

పెట్టుబడి ఎవరిది అయినా, వాళ్ళకి కూడా 'పెట్టుబడి' ద్వారా 'లాభాన్ని' తినే హక్కు వుండదు. — ఈ విషయాలు శ్రామికులకు తెలియనంత కాలమూ, పెట్టుబడిదారుడు, తొణుకూ బెణుకూ లేకుండా "పెట్టుబడి నాదే, లాభం నాదే" అని మాట్లాడుతూనే వుంటాడు. భూస్వామియేమో "భూమి నాదే! మా బాబు ఇచ్చాడు, మా తాత ఇచ్చాడు" అంటూ వుంటాడు. శ్రామికులకు ఏమీ తెలియదు కాబట్టి, దోపిడీదారులు ఎలాగైనా వాగుతారు.

ఈ బట్ట ఉదాహరణలో, పెట్టుబడిదారుడు, పాపం 8 లాభమే వేసుకుంటాడు. 'పెట్టుబడి' మీద వేసుకునే లాభానికి ఒక హద్దు వుండవలసి వుంటుంది కాబట్టే అలా చేస్తాడు. లాభానికి ఒక హద్దు ఎందుకు వుంటుందంటే, ఖర్చులూ లాభమూ కలిసి సరుకులో నిజంగా వున్న విలువ కన్నా ఎక్కువ అయిపోకూడదు గనక. ఆ రెండూ కలిసి, 'అసలు విలువ'తో సరిపోవాలి గనక. ఒకవేళ, పెట్టుబడిదారుడు దురాశ కొద్దీ ఎక్కువ లాభం వేసుకుని, సరుకు విలువని ఎక్కువగా నిర్ణయిస్తే, వాడి తప్పుని మార్కెట్ సవరిస్తుంది. అంటే, అక్కడి పరిస్థితుల్ని బట్టి, ఆ సరుకు, ఎంతకి అమ్ముడుపోవాలో అంతకే అమ్ముడు పోతుంది గానీ, వీడు వేసుకున్నంత 'ఎక్కువ'కి అమ్ముడు పోదు.

చివరికి, బట్ట 120 కి అమ్ముడుపోయి, బట్ట పెట్టుబడిదారుడికి ఈ 8 లాభం మిగులుతుంది. ఇది, సరుకుని 'ఉత్పత్తి చేయించిన వాడికి' వచ్చే లాభం. అందుకే ఇది 'ఉత్పాదక లాభం'. దీనికి క్లుప్తమైన పేరు— 'లాభం'. వర్తక పెట్టుబడిదారుడికి మిగిలేది— 'వర్తక లాభం' అయితే, ఉత్పాదక పెట్టుబడిదారుడికి మిగిలేది — 'ఉత్పాదక లాభం.'

ఈ ఉదాహరణలో, ఉత్పాదక లాభాన్ని డబ్బుగా చూస్తే, 8 రూ.లు. బట్టగా చూస్తే $6^1/_2$ మీటర్లు.

ఈ '8 ఉత్పాదక లాభాన్ని' ఇంకా కూడా కొన్ని భాగాలుగా పంచుకునే పరిస్తితి వుంటే వుండవచ్చు. ఎలాగంటే : ఈ పెట్టుబడిదారుడికి ఇంకో 'భాగస్తుడు' వున్నాడనుకుందాం. అంటే, ఇద్దరు పెట్టుబడిదారులు కలిసి సగం సగం పెట్టుబడి పెట్టి (ఒకడు 50, ఇంకోడు కూడా 50 పెట్టి) ఈ సరుకుని తయారు చేయించారనుకుందాం. పెట్టుబడి ఇద్దరు వాటాదార్లది అయినా, ఇంతవరకూ మనం చూసిన ఏ లెక్కలోనూ మార్పులు రావు. ఆ విషయాలన్నీ అలాగే వుంటాయి. చివరికి మిగిలిన 8 ఉత్పాదక లాభాన్ని ఇద్దరూ సగం సగం తీసుకుంటారు. మొదట పెట్టిన పెట్టుబడి అంతా ఒక్కడిదే అయితే, ఆ లాభం అంతా ఒక్కడిదే. లేదా, ఆ పెట్టుబడినే కొంత మంది వాటాదార్లు కలిసి పెడితే వాళ్ళందరూ ఆ లాభాన్ని పంచుకుంటారు. అంతే తేడా!

ఇప్పటి వరకూ 'అదనపు విలువ' ఏ యే పేర్లతో చీలుతుందో ఆ అంశాలన్నిటినీ క్లుప్తంగా చూశాం. 'అదనపు విలువ'కీ, 'లాభాని'కీ తేడా ఏమిటో అర్థం చేసుకోవడం ఇప్పుడు తేలికే.

'అదనపు విలువ' అంటే, 'పెట్టుబడి' కన్నా అదనంగా వచ్చేది. అది ఏ యే భాగాలుగా విడిపోతుందో ఆ భాగాలన్నీ కలిసినది. లేదా వివరంగా చూస్తే, 'అదనపు విలువ' అంటే— వర్తక కమిషనూ, వడ్డీ, భూమి అద్దే, పన్నులూ, ఉత్పాదక లాభమూ, అన్నీ కలిసిన మొత్తం. లాభం— అంటే, చిట్టచివరికి మిగిలే 'ఉత్పాదక లాభం' మాత్రమే.

బట్ట ఉదాహరణలో, అదనపు విలువ 20 అయితే, లాభం— 8. అంటే, 'అదనపు విలువ' అంతా— లాభం కాదు. అందులో ఒక భాగమే లాభం. కాబట్టి, రెంటినీ ఒకే సైజుతో వుండే విషయాలుగా భావించకూడదు. అయితే ఉదాహరణలు తేలిగ్గా వుండడం కోసం, చాలాసార్లు 'అదనపు విలువ'ని 'లాభం' అనే చెప్పుకుంటూ వుంటాము. '20 అదనపు విలువ' అనడానికి బదులు, '20 లాభం' అంటాము. సందర్భాన్ని బట్టి, విషయాలు సరిగ్గా అర్థం చేసుకుంటే, 'అదనపు విలువ'ని 'లాభం' అనడం వల్ల సమస్యేమీ రాదు.

మొదట అదనపు విలువ ఎలా ఉత్పత్తి అవుతుందో తెలుసుకుంటే, అది ఎన్ని పేర్లతో చీలుతుందీ అనేది తర్వాత విషయం. అదనపు విలువ ఎలా వస్తుందో తెలుసుకోవడానికి మనం ఈ చాప్టర్లో చూసింది సరిపోదు.

ఇంకా ఎన్నో విషయాలు చూడాలి.

ఇక్కడ గట్టిగా, మళ్ళీ మళ్ళీ అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే: ఈ ఉత్పాదక, వర్తక, వడ్డీ పెట్టుబడిదారులూ, భూస్వామీ కూడా, 100 మీటర్ల బట్ట ఉదాహరణలో, ఆ ఉత్పత్తి కోసం ఏమైనా 'శ్రమ' చేసివుంటే, ఆ 'శ్రమ'కి తగిన జీతం వాళ్ళకి వేరుగానే వుంటుంది. వాళ్ళ శ్రమ ఫలితాన్ని వాళ్ళు తీసుకోవడంలో తప్పు వుండదు. కానీ, వాళ్ళు, వర్తక కమిషనూ, వడ్డీ, భూమి అద్దే, లాభమూ పేర్లతో ఏ యే భాగాలైతే తీసు కుంటారో అవి మాత్రం వాళ్ళ శ్రమ కాదు. ఈ రక రకాల పేర్లతో వాళ్ళు లాగేదంతా శ్రామికుల శ్రమే.

ఉత్పాదక పెట్టుబడిదారుడికి వచ్చే 'ఉత్పాదక లాభం', పెట్టుబడిదారుడి శ్రమే అయితే, దానికి 'లాభం' అనే పేరు వుండదు. దానికి కూడా 'జీతం' అనే పేరే వుంటుంది. వర్తక పెట్టుబడిదారుడికి వచ్చే 'వర్తక లాభం' వాడి శ్రమే అయితే, దానికి 'వర్తక లాభం' అనే పేరు వుండదు. 'జీతం' అనే పేరే వుంటుంది. వడ్డీ పెట్టుబడి దారుడికి వచ్చే 'వడ్డీ', వాడి శ్రమ వల్ల వచ్చేదే అయితే, దానికి 'వడ్డీ' అనే పేరు వుండదు. 'జీతం' అనే పేరే వుంటుంది. భూస్వామికి వచ్చే 'భూమి అద్దె', వాడి శ్రమే అయితే, దానికి 'అద్దె' అనే పేరు వుండదు. 'జీతం' అనే పేరే వుంటుంది. కాబట్టి, వీళ్ళందరూ తమ శ్రమలతో సంబంధం లేకుండా ఏ యే అంశాలనైతే లాగుతున్నారో అదంతా 'శ్రామికుల శ్రమే.'

'శ్రమ దోపిడీ'ని అర్థం చేసుకోవాలంటే, 'సరుకు విలువ'ని ఎక్కడా సందేహాలు లేనంత స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

# 'సరుకు విలువ' గురించి మళ్ళీ ఒకసారి

ఇప్పుడు మనం 'సరుకు విలువ' గురించి మళ్ళీ ఒక సారి ప్రశ్నించుకుని, సరైన జవాబులు చెప్పుకుంటే, అప్పుడు ఇక ఈ విషయం వదిలేసి ముందుకు వెళ్ళి పోవచ్చు.

బట్ట ఉదాహరణలో, 'ఈ సరుకుకి 120 విలువ వుంది' అని పెట్టుబడిదారుడూ, మనమూ (శ్రామికులం) కూడా ఒప్పుకుంటాం. అందులో వివాదం లేదు. దాని కోసం 80 శ్రమ సాధనాలూ, 20 జీతాలూ ఖర్చయ్యాయి— అనే విషయంలో కూడా వివాదం లేదు. ఈ ఖర్చులు కాకుండా, ఇంకా ఆ పైన వున్న '20 విలువ' గురించే వివాదం అంతా. 'ఆ 20 విలువ ఏమిటి? అది ఎలా వచ్చింది?'— అనే చోటే, పెట్టుబడిదారుడి అవగాహనా, మన అవగాహనా, పరస్పర విరుద్ధంగా వుంటాయి.

**పెట్టుబడిదారుడి ప్రకారం:** బట్ట కోసం 80 శ్రమ సాధనాలూ, 20 జీతాలూ ఖర్చయ్యాయి. నిజమే. కానీ, అంతే కాదు. బట్ట కోసం ఇంకా కూడా చాలా అంశాలు ఖర్చయ్యాయి. 5 వర్తక కమిషనూ, 3 వడ్డీ, 2 భూమి అద్దే, 1 పన్నులూ, 1 ఇన్సిడెంటల్ ఖర్చులూ — ఇవన్నీ కూడా ఖర్చయ్యాయి. ఈ ఖర్చులన్నీ కలిపితే 112 అయింది. దాని మీద పెట్టుబడిదారుడు '8 ఉత్పాదక లాభం' వేసు కున్నాడు. లాభం లేకపోతే ఎవరూ 'పెట్టుబడి' పెట్టరు కదా? — కాబట్టి, 'సరుకు' తయారవ్వాలంటే, 'ఉత్పాదక లాభం' కూడా అత్యవసర అంశమే. దాన్ని కూడా సరుకు విలువలోకి కలపాలి. మొత్తం అన్నీ కలిసి 120. కాబట్టి, ఈ రకంగానే బట్ట విలువ 120 అయింది.

**మన ప్రకారం అయితే :** పెట్టుబడిదారుడు చూపిస్తున్న అంశాల్లో చాలా అంశాలు తప్పుడు అంశాలే. వర్తక కమిషనూ, వడ్డీ, భూమి అద్దే, పన్నులూ, ఇన్సిడెంటల్ ఖర్చులూ, ఉత్పాదక లాభమూ— ఈ అంశాలకూ, 'సరుకు విలువ'కీ ఏమీ సంబంధం లేదు. ఆ అంశాలు, సరుకు కోసం ఏ శ్రమనీ ఇవ్వవు. అవన్నీ, 'సరుకు తయారీ'కి బయటి విషయాలు. నిజానికి, బట్టకి '120 విలువ' ఏర్పడింది — 80 శ్రమ సాధనాలూ, 40 సజీవ శ్రమా ఖర్చవడం వల్ల మాత్రమే. పెట్టుబడిదారుడు, శ్రామికుల శ్రమ కంతటికీ 'జీతాలు' ఇవ్వకుండా, 20 ని ఎగ్గొట్టి, దానినే ఈ అంశాలన్నిటికీ పంచుతాడు. అందులోంచి తను కూడా '8 లాభం' తీసుకుంటాడు. — అంటే, వీళ్ళందరూ ఆ 'ఉత్పత్తి' కోసం, ఏ శ్రమలూ చెయ్యకుండానే, ఆ 'ఉత్పత్తి'లో నించి రక రకాల పేర్లతో కొంత కొంత భాగాల్ని లాగేస్తున్నా రన్నమాట! కాబట్టి, 'విలువ' గురించి పెట్టుబడిదారుడు చెప్పే లెక్క అంతా 'దోపిడీ దొంగల' లెక్క మాత్రమే.

'విలువ' అనేది కంటికి కనపడే విషయం కాదు. బట్టకి '120 విలువ' ఎలా వచ్చిందో, బట్టని చూసి చెప్పడం సాధ్యం కాదు. కాబట్టి, 'విలువ'ని కళ్ళతో చూసి గాక, "హేతుబద్ధమైన తర్కం'తో తెలుసుకోవాలి. హేతుబద్ధమైన ఆలోచన, కంటితో చూడడం కన్నా సమగ్రమైనది. అది చూడలేని లోతులూ, ఎత్తులూ వుండవు.

"విలువ అంటే ఏమిటి? విలువ ఎలా ఏర్పడు తుంది?" అనే విషయాల్ని సరిగా అర్థం చేసుకోవడం మీదే

'మానవ సమాజాన్ని' అర్థం చేసుకోవడం అంతా ఆధారపడి వుంటుంది. 'సరుకు విలువలో కొంత భాగం శ్రామికుల అదనపు విలువగా వుంటుంది' అని అర్థం చేసుకుంటే, 'సమాజం ఏనాటి నించో దోపిడీ మీద ఆధారపడి వుంది' అని అర్థమవుతుంది. శ్రామికులకు 'దోపిడీ' అర్థమైతేనే, దోపిడీ నించి తమని రక్షించుకోవడం కోసం, 'దోపిడీని తీసివెయ్యాల'నే సంగతి అర్థమవుతుంది.

'విలువ' సంగతే తెలియకపోతే, 'అదనపు విలువ' సంగతీ తెలీదు. దోపిడీ జరుగుతోందనీ తెలీదు. అప్పుడే మవుతుందంటే, సమాజంలో భూమి అద్దెలూ, వడ్డీలూ, లాభాలూ వుండడం ఎంతో సహజంగా, అత్యవసరంగా, కనపడుతుంది. వాటి గురించి దోపిడీదారులు చెప్పేదే 'సత్యం'గా కనపడుతుంది.

అంటే, 'విలువ'ని వివరించడంలో మన సిద్ధాంతమూ, దోపిడీదారుల సిద్ధాంతమూ పరస్పర విరుద్ధంగా వున్నా యన్నమాట!

"లాభమూ, వడ్డీలూ, భూమి అద్దెలూ దోపిడీకి మార్గాలు" అని మనం అంటే,

"వాటిని తీసుకోవడం మా హక్కు" అని వాళ్ళు అంటారు.

కాబట్టి, మొదట మనం, మన సిద్ధాంతం ఏమిటో చాలా స్పష్టంగా నేర్చుకోవాలి. అప్పుడే వాళ్ళ సిద్ధాంతంలో తప్పు లేమిటో స్పష్టంగా గ్రహించగలుగుతాము.

ఇప్పుడు, బట్ట పెట్టుబడిదారుడి 'బ్యాలెన్స్ షీటు'తో మళ్ళీ ప్రారంభిస్తున్నాము. బట్ట పెట్టుబడిదారుడు చూపించే లెక్క ఇలా ఉందను కుందాం :

<u>100 మీటర్ల బట్ట విలువ</u>

| | |
|---|---|
| 1) శ్రమ సాధనాలు | 80 రూ.లు |
| 2) పనివాళ్ళ జీతాలు — | 20 |
| 3) వర్తక కమిషన్ — | 5 |
| 4) పెట్టుబడి మీద వడ్డీ | 3 |
| 5) పని స్థలానికి అద్దె — | 2 |
| 6) పన్నులు — — | 1 |
| 7) ఇన్సిడెంటల్ ఖర్చులు | 1 |
| ఈ ఖర్చులన్నీ కలిసి | 112 |
| 8) నేను వేసుకున్న లాభం | 8 |
| సరుకు విలువ | 120 |

ఈ సరుకు కోసం నిజంగా ఖర్చయిన పెట్టుబడి, శ్రమ సాధనాల 80 + జీతాల 20 = 100 మాత్రమే. మిగిలిన అంశాలేవీ ఆ ఉత్పత్తి కోసం నిజమైన అవసరాలు కావు.

ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పుకోవాలి. ఈ ఉదాహరణలో, పెట్టుబడి 100, వడ్డీ 3 కదా? ఈ 2 అంశా లనే తీసుకుందాం. ఈ అంశాల్ని ఇలాగే పెట్టుబడిదారుడు కూడా విడివిడిగానే చెపుతాడా? లేకపోతే, వడ్డీని కూడా పెట్టుబడితో కలిపి "103 పెట్టుబడి పెట్టాను" అని చెపుతాడా? పెట్టుబడిదారుడు కూడా పెట్టుబడినీ, వడ్డీనీ విడివిడిగానే చెపుతాడు. వడ్డీని విడిగా చెప్పకపోతే, పెట్టుబడిదారుడు కూడా ఒక ఇబ్బందిలో పడవలసి వస్తుంది. అదేమిటంటే— వడ్డీని కూడా పెట్టుబడిలో కలిపేసి మొత్తం పెట్టుబడిని 103 గా చెప్తే, అప్పుడు 'వడ్డీ ఏదీ' అనే ప్రశ్న వస్తుంది. అంతేగాక ఆ '103 పెట్టుబడి' మీదైనా వడ్డీని చూపించవలసి వస్తుంది. అలా చూపించకపోతే, పెట్టుబడిదారుడి లెక్కల్లో 'వడ్డీ' అనే అంశమే లేకుండా పోతుంది.

కాబట్టి పెట్టుబడిదారుడు తప్పనిసరిగా, పెట్టుబడినీ వడ్డీనీ వేరు వేరు అంశాలుగానే చూపిస్తాడు. అంటే వడ్డీని 'పెట్టుబడి'తో కలపడు. అయితే, వడ్డీని పెట్టుబడితో కలపకపోయినా, పెట్టుబడిదారుడు, వడ్డీ కోసం చెల్లించే దాన్ని, సరుకు కోసం చేసే ఖర్చుగానే భావిస్తాడు. ఈ రకంగా, పెట్టుబడిదారుడు, తన ఖర్చు లన్నిటినీ లెక్క కట్టుకుంటే, అది 112 గా తేలుతుంది. దాని మీద తన లాభాన్ని కూడా కలుపుతాడు.

సరుకు కోసం నిజంగా అవసరమయ్యే ఖర్చులూ, నిజంగా అవసరం కాని ఖర్చులూ కూడా ఒకే రకంగా ఆ సరుకు అమ్మకం ద్వారానే పెట్టుబడిదారుడికి అందుతాయి కాబట్టి ఆ ఖర్చుల్లో ఏది నిజమైన అవసరమో, ఏది కాదో —ఆ తేడాలు మరుగున పడిపోతాయి.

'బట్ట విలువ' గురించి, పెట్టుబడిదారుడు చూపించిన వివరాలు చూసి, ఈ పెట్టుబడిదారుడికి స్వంత పెట్టుబడీ, స్వంత భూమీ, స్వంత వ్యాపారపు ఏర్పాట్లూ వున్నాయో లేవో చెప్పగలమా?— చెప్పలేం. అవన్నీ వాడి స్వంతానివి అయినా కాకపోయినా ఆ ఖర్చులన్నిటినీ వాడు అలాగే చూపిస్తాడు. కాబట్టి, అవి స్వంతానివో కావో చెప్పలేం.

ఇప్పుడు, వాడి లెక్కల్ని మన దృష్టితో తిరిగి రాయాలి. సరుకుని ఎంతకి అమ్మాడో చెప్పాడు. శ్రమ సాధనాల మీదా, జీతాల మీదా ఎంత ఖర్చు పెట్టాడో చెప్పాడు. <u>ఈ 3 వివరాలూ వుంటేచాలు, అదనపు విలువ ఎంతో కనుక్కోవచ్చు.</u>

బట్టకి సంబంధించిన మన లెక్క ఇలా వుంటుంది:


100 మీటర్ల బట్ట విలువ 120

| | | |
|---|---|---|
| 1) శ్రమ సాధనాలకు | — | 80 రూ. |
| 2) శ్రామికుల జీతాలకు | — | 20 |
| ఖర్చయిన పెట్టుబడి | — | 100 |
| సరుకుని అమ్మిన విలువ | — | 120 |
| ఖర్చయిన పెట్టుబడి | — | 100 |
| పెట్టుబడి కన్నా అదనం | — | 20 |
| శ్రామికుల 'అదనపు విలువ' | — | 20 |

'అదనపు విలువ'లో భాగాలు:

| | | |
|---|---|---|
| 1) వర్తక కమిషన్ | — — | 5 |
| 2) పెట్టుబడి మీద వడ్డీ | — | 3 |
| 3) స్థలానికి అద్దె | — — | 2 |
| 4) పన్నులు | — — — | 1 |
| 5) ఇన్సిడెంటల్ ఖర్చులు | — | 1 |
| 6) ఉత్పాదక లాభం — | — | 8 |
| మొత్తం అదనపు విలువ | — | 20 |

దీన్ని ఇప్పుడు, ఇంకో రకంగా కూడా రాద్దాం.




1) వర్తక కమిషన్ లో నించి వచ్చే లాభం = వర్తక పెట్టుబడిదారుడి ఆదాయం

2) పెట్టుబడి మీద వడ్డీ = వడ్డీ పెట్టుబడిదారుడి ఆదాయం

3) పని స్థలానికి అద్దె = భూస్వామి ఆదాయం

4) పన్నులు — — = ప్రభుత్వానికి ఆదాయం

5) ఇన్సిడెంటల్ ఖర్చులు = 'లంచాల' లాంటివి.

6) ఉత్పాదక లాభం — = ఉత్పాదక పెట్టుబడిదారుడి ఆదాయం.

ఈ ఆదాయాలన్నిటికీ మూలం ఉత్పాదక పెట్టుబడి దారుడి పని స్థలంలో పనిచేసిన శ్రామికుల 'అదనపు శ్రమే.' దీన్ని లాగే వాళ్ళు ఏ శ్రమా చెయ్యడం లేదని అర్థం.

# గ్రాస్ & నెట్

ఇప్పుడు పెట్టుబడిదారుడు తరచుగా మాట్లాడే 'గ్రాస్, నెట్' అనే మాటల్ని చూద్దాం.

పెట్టుబడిదారుడు, అమ్మకానికి సిద్ధంగా వున్న సరుకు విలువని 'గ్రాస్ విలువ'అనీ, పెట్టుబడి ఖర్చుల్ని తీసి వెయ్యగా చివరికి తనకు మిగిలే లాభాన్ని 'నెట్ విలువ' అనీ, అంటాడు.

బట్ట ఉదాహరణలో:

| పెట్టుబడిదారుడి ప్రకారం: | | | మన ప్రకారం: | | |
|---|---|---|---|---|---|
| గ్రాస్ విలువ | — | 120 | గ్రాస్ విలువ | — | 120 |
| పెట్టుబడి | — | 112 | పెట్టుబడి | — | 100 |
| నెట్ | — | 8 | నెట్ | — | 20 |

పెట్టుబడిదారుడి ప్రకారం, వాడి 8 లాభం తప్ప, మిగతా అంతా 'పెట్టుబడే.' అందుకే వాడికి 'పెట్టుబడి' మీద వేసుకున్నది 8 గా మాత్రమే కనపడుతుంది. కానీ, మన ప్రకారం, సరుకు కోసం నిజంగా ఖర్చయిన పెట్టుబడి 100 మాత్రమే. మిగతాదంతా — పెట్టుబడి మీద వేసు కున్నదే. అది 20.

ఈ గ్రాసూ, నెట్టూ అనే మాటలు పెట్టుబడిదారుడివే గానీ, మనవి కావు. ఈ మాటలు, అసలు వివరాల్ని మరుగు పరుస్తాయి. అందుకే మనం ప్రతీ అంశాన్నీ అది ఎందు కోసం ఖర్చయిందో ఆ పేరుతోనే ప్రస్తావించాలి. 'శ్రమ సాధనాల' ఖర్చూ, 'జీతాల' ఖర్చూ, 'అదనపు' విలువా, 'సరుకు' విలువా — ఇలా! అంతేగానీ, గ్రాసూ, నెట్టూ — అని కాదు.

# రెండు బృందాలు

'బట్ట విలువ'ని పరిశీలిస్తే, ఆ విలువని వాడే మనుషులు, '2 బృందాలు'గా వుండడం కనపడుతుంది.

బట్ట విలువ, 3 భాగాలుగా వుంటుంది. శ్రమ సాధనాల భాగం 80; జీతాల భాగం 20; అదనపు విలువ భాగం 20. ఇందులో — 'శ్రమ సాధనాల విలువ' నించి ఎవరూ ఏమీ తినడానికి సాధ్యం కాదు. ఆ విలువ అంతా (ఆ ఉత్పత్తి అంతా) చెక్కు చెదరకుండా వెనక్కి రావాలి. అది మళ్ళీ 'కొత్త బట్ట' తయారవడానికి సిద్ధంగా వుండాలి. కాబట్టి, ఈ భాగం నించి శ్రామికులు గానీ, పెట్టుబడి దారుడు గానీ, ఏమీ తీసుకోలేరు.

'సరుకు'లో ఇంకా మిగిలినవి 2 భాగాలు. జీతాలూ, అదనపు విలువా. ఈ 2 భాగాలూ 'సజీవ శ్రమ విలువే.' అంటే శ్రామికులు ఇచ్చిన విలువే. ఇందులో 'జీతాల' భాగాన్ని వాడేవారు — 'శ్రామికులు'. వీరంతా — ఒక బృందం. 'అదనపు విలువ'ని వాడేది— ఇంకో బృందం. ఈ బృందంలో— ఉత్పాదక పెట్టుబడిదారుడూ, వర్తక పెట్టుబడిదారుడూ, వడ్డీ పెట్టుబడిదారుడూ, భూస్వామీ — ప్రధానంగా వుంటారు. వీళ్ళందరి ఆదాయాలకూ మూలం— అదనపు విలువే. అది, ఉత్పత్తి అయ్యేది — ఉత్పాదక పెట్టుబడిదారుడి దగ్గిరే. కాబట్టి, ఈ బృందానికి ప్రతినిధి — ఉత్పాదక పెట్టుబడిదారుడే.

పెట్టుబడిదారుడు — అన్నప్పుడల్లా, ఆ ఒక్క వ్యక్తి గురించే మాట్లాడుతున్నామని అర్థం కాదు. 'అదనపు విలువ'ని తినే బృందాన్నంతా ప్రస్తావిస్తున్నామని అర్థం. భూస్వామి కూడా అందులో భాగమే.

ఏ సరుకుని తీసుకున్నా, అందులో వున్న 'శ్రమ సాధనాల' భాగాన్ని తినడం ఏ బృందానికీ సాధ్యం కాదు. కాబట్టి, ఎవరు తిన్నా, 'సజీవ శ్రమ' భాగాన్ని తినవలసిందే. అంటే, శ్రామికులూ, పెట్టుబడిదారులూ కూడా 'శ్రామికుల శ్రమని' తినవలసిందే. కాబట్టి పెట్టుబడి దారుల బృందం, శ్రామికుల బృందం నించి రోజూ వీలైనంత ఎక్కువ 'అదనపు విలువ'ని లాగడానికే ప్రయత్నిస్తూ వుంటుంది.— ఇది మొదటి విషయం. అలా లాగిన అదనపు విలువే— ఆ బృందంలో పంపకం అవ్వాలి కాబట్టి, ఈ బృందంలో వాళ్ళందరూ ఎవడికి వాడే తన భాగానికి వీలైనంత ఎక్కువని లాగడానికి ప్రయత్నిస్తాడు.— ఇది రెండో విషయం.

ఇప్పటి నించీ 'బృందాలు' అనే మాటలకు బదులు 'వర్గాలు' (క్లాసెస్) అనే మాటలు ప్రారంభిద్దాం.

ఈ ఒక్క 'పని స్థలాన్నే' మొత్తం 'సమాజంగా' అనుకుంటే, ఇక్కడ 2 వర్గాలు వున్నాయన్న మాట! — శ్రమ చేస్తూ, అందులో కొంత భాగాన్ని పోగొట్టుకుంటూ, 'జీతాల' భాగంతో జీవించేది — 'శ్రామిక వర్గం'. శ్రమ చెయ్యకుండా, శ్రామిక వర్గం నించి 'అదనపు విలువ'ని లాగుతూ జీవించేది — 'దోపిడీ వర్గం'. దాని పేరు ఇక్కడ 'పెట్టుబడిదారీ వర్గం.' పెట్టుబడిదారులూ, శ్రామికులూ ప్రధాన వర్గాలుగా వున్న సమాజం — 'పెట్టుబడిదారీ సమాజం'.

ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, సమాజంలో వున్న జనాభా అంతా ఆ 2 వర్గాల్లోనే వున్నారని అనుకోవాలి.

పెట్టుబడిదారీ వర్గం, శ్రామికవర్గాన్ని నిత్యం దోపిడీ చేస్తూ — 'భూమి మాది, పెట్టుబడి మాది. కాబట్టి, మాకు భూమి అద్దెలూ, లాభాలూ, వడ్డీలూ తినే హక్కులు వున్నాయి' అని తన సిద్ధాంతాన్ని నిస్సంకోచంగా ప్రకటిస్తూ వుంటుంది.

ఆ సిద్ధాంతాన్నే శ్రామికులు కూడా అంగీకరిస్తే — "అవును, వాళ్ళకి భూములు వున్నాయి. పెట్టుబడులు వున్నాయి. వాళ్ళకి భూమి అద్దెలూ, లాభాలూ, వడ్డీలూ, తినే హక్కులు వున్నాయి" అనుకుంటూ ఊరుకోవాలి. ఎప్పటిలాగే పెట్టుబడిదారుల దగ్గిర జీతాలకు పనిచేస్తూ, వాళ్ళకి జీతాల కన్నా ఎక్కువ శ్రమని ఇస్తూ, తాము 'పేదతనం' లోనూ, 'సేవకత్వం' లోనూ వుంటూ, అంతా ఇప్పటిలాగే వుండాలి.

లేదా, శ్రామికులు, పెట్టుబడిదారుల సిద్ధాంతాన్ని ఒప్పుకోకపోతే, తమ సిద్ధాంతం ప్రకారం, సమాజాన్ని మార్చుకోవాలి. లాభాలూ, వడ్డీలూ, భూమి అద్దెలూ లేని సమాజాన్ని నిర్మించుకోవాలి. అంటే దోపిడీ లేని సమాజాన్ని! 'అందరూ శ్రమ చేసే' సమాజాన్ని!

**అందరూ శ్రమ చేస్తే?:** ఆ పరిస్థితి ఎలా వుంటుందో, ఇక్కడ బట్ట ఉదాహరణ ద్వారానే చూద్దాం.

100 మీ. బట్టని, కొంత మంది శ్రామికులు తయారు చేశారు కదా? మధ్యాన్నం అయ్యేటప్పటికి 50 మీటర్లూ, రాత్రి అయ్యేటప్పటికి ఇంకో 50 మీటర్లూ చేశారు కదా? ఆ కాలంలో మొత్తం 40 విలువ గల పని చేశారు. అందులో 20 విలువ, జీతాల కోసం. ఆ 20 విలువ, శ్రామికుల పోషణకి ఒక రోజుకి. మిగతా 20 విలువ, పెట్టుబడిదారీ బృందం పోషణకి, ఒక రోజుకి.

శ్రామికులతోపాటు, పెట్టుబడిదారీ బృందం కూడా ఆ వుత్పత్తి కోసమే పని చేస్తే, ఏం జరుగుతుంది? అందరూ

పొద్దున్నే పనిలోకి దిగారనుకుందాం. అందరూ పనిచేస్తారు. కాబట్టి, 100 మీ. బట్ట తయారవడానికి రాత్రి దాకా అక్కరలేదు. సగం కాలానికే పని పూర్తి అవుతుంది. 'శ్రమ సాధనాల' ఖర్చులో ఏమీ మార్పురాదు. అది 80 య్యే. 'సజీవ శ్రమ'లో కూడా ఏమీ మార్పు రాదు. అది 40 య్యే. సరుకు విలువలో కూడా ఏమీ మార్పు రాదు. అది 120 య్యే. మార్పు జరిగేదంతా, శ్రామికులు చెయ్యవలసిన శ్రమ లోనే. ఆ '40 విలువ గల' శ్రమనే ఇప్పుడు 2 బృందాలూ కలిసి చేస్తాయి. శ్రామికుల బృందం చేసేది ఇప్పుడు 20 శ్రమ మాత్రమే. 'అదనపు శ్రమ' వుండదు. గతంలో శ్రామికుల నించి 20 అదనపు శ్రమని లాక్కుని బతికే వాళ్ళంతా ఇప్పుడు ఆ శ్రమ వాళ్ళే చేసుకుంటారు. వాళ్ళ శ్రమే వాళ్ళకి పోషణ వస్తువుల్ని ఇస్తుంది. ఇప్పుడు 'సరుకు విలువ'లో — 'అదనపు విలువ' భాగం వుండదు. అయినా సరుకు విలువ ఏమీ తగ్గదు. అది గతంలోలాగే, 80 శ్రమ సాధనాలూ, 40 సజీవ శ్రమా — అనే 2 భాగాల ఖర్చులతోటే తయారవుతుంది. ఇప్పుడు పనిచేసిన వాళ్ళందరూ మధ్యాన్నానికే పని ముగించి ఇళ్ళకి వెళ్ళిపోవచ్చు. తర్వాత కాలం అందరికీ విశ్రాంతే.

ఇప్పుడు, 'శ్రమ చేసే వాళ్ళూ — శ్రమ చెయ్యని వాళ్ళూ' అనే తేడా వుండదు. అంటే, ఇప్పుడు, 'శ్రమ దోపిడీ' వుండదు.

ఇప్పుడు — భూమిగానీ, ఇతర శ్రమ సాధనాలుగానీ, డబ్బు గానీ — స్వంత ఆస్తులుగా వుండే పాత్రల్నీ, పెట్టుబడిగా వుండే పాత్రనీ నిర్వహించవు. అంటే, ఇప్పుడు భూమి, కౌలుని తీసుకురాదు. ఇతర శ్రమ సాధనాలు వడ్డీ లాభాల్ని తీసుకురావు. అవన్నీ కేవలం శ్రమ సాధనాలుగా మాత్రమే వుంటాయి.

ఇప్పుడు — పెట్టుబడిని 'అప్పు' తీసుకోవడం వుండదు. 'శ్రమ సాధనాల్ని' సమిష్టిగా, అవసరాల్ని బట్టి ఉపయోగిస్తారు. అవి, ఒకరి స్వంత ఆస్తులు కావు. వాటిని సమిష్టిగా ఉపయోగిస్తారు.

ఇప్పుడు — 'వర్తకం' వుండదు. ఉత్పత్తుల్ని తయారు చేసుకోవడమూ, వాటిని పంపిణీ చేసుకోవడమూ మాత్రమే వుంటాయి.

ఇప్పుడు — 'యజమానులూ — సేవకులూ' అనే తేడాలు వుండవు. ఎవ్వరూ యజమానులు కారు. ఎవ్వరూ శ్రామికులూ కారు. అందరూ స్వతంత్రులు. అందరూ సమానులు. అందరూ ఉత్పత్తిదారులు.

ఇప్పుడు — అందరికీ పనీ, అందరికీ విశ్రాంతీ!

ఇప్పుడు — శ్రామిక వర్గాన్ని అణచడానికి దోపిడీ వర్గం చేసే కౄర పరిపాలన వుండదు. దానితో అవసరం వుండదు.

ఈ రకంగా, 'అందరూ శ్రమ చెయ్యడం' అనే మార్పుతో, సమాజమే తారుమారైపోతుంది. 'నూతన సమాజం' ఆవిర్భవిస్తుంది! ఈ మార్పులన్నిటినీ, శ్రమ సిద్ధాంతం మీద ఆధారపడి తార్కికంగా ఊహిస్తున్నాం.

కానీ, ఈ మార్పుల్ని దోపిడీవర్గం ఎంత మాత్రమూ అంగీకరించదు. ఎందుకంటే, ఈ మార్పులు జరగాలంటే, దోపిడీ వర్గం కూడా శ్రమ చెయ్యాలి కాబట్టి. శ్రమ చెయ్యకుండా, యజమానితనంతో అహంకారంగా బతకాలనే కదా దాని ప్రయత్నం అంతా? కాబట్టి అది, ఈ మార్పుల్నీ ఈ నూతన సమాజాన్నీ అంగీకరించదు. కానీ, మన తర్కమూ, మన ప్రశ్నలూ మన హేతుబద్ధతలూ — ఇవన్నీ, దోపిడీ దొంగలకు సత్యాన్ని బోధించడానికి కాదు. వాళ్ళకి 'హృదయ పరివర్తనలు' కలిగించడానికి కాదు. మనం (శ్రామికులం) సత్యం తెలుసుకోవడానికే. మనం కళ్ళు తెరుచుకోవడానికే. మనకేం జరుగుతోందో మనం తెలుసుకోవడానికే.

శ్రామిక వర్గం, 'దోపిడీవర్గం'తో పోరాటం చేసి, దాన్ని ఓడించి, తన 'పరిపాలన' ప్రారంభించిందను కుందాం. ఆ 'పరిపాలన' ప్రారంభమైన తక్షణమే 'వర్గాలు' నశించవు. శ్రామిక వర్గం, దోపిడీ వర్గాన్ని 'శ్రమ చేసేలాగ' చెయ్యడమూ, దోపిడీని తీసివెయ్యడమూ — అనే లక్ష్యాల తోనే 'పరిపాలన' చెయ్యవలసి వుంటుంది. దోపిడీని తీసివేసే వరకూ శ్రామిక వర్గం, తన 'ఆత్మరక్షణ' మార్గాన్ని అవలంబించవలసి వుంటుంది. శ్రామిక వర్గ పరిపాలనలో, ప్రభుత్వ శాఖలన్నీ, దోపిడీని రక్షించే స్వభావంతో గాక, దాన్ని తీసివేసే స్వభావంతో పని చేస్తాయి (చెయ్యాలి). అయినప్పటికీ, 'పరిపాలన' అనే దానికోసం అయ్యే ఖర్చు అంతా 'ఉత్పత్తి క్రమాలకు' అవసరంలేని ఖర్చుగానే వుంటుంది. ఆ సమాజంలో కూడా, 'పరిపాలన' ఖర్చు 'శ్రమ సాధనాల' భాగంలోకి గానీ, 'సజీవ శ్రమ' భాగంలోకి గానీ రాదు. ఆ ఖర్చు, సమాజంలో ఇంకా 'వర్గ భేదాలు' వుండడం వల్ల అవసరమయ్యే 'అసహజమైన' ఖర్చుగా మాత్రమే వుంటుంది. వర్గాలే పోయినప్పుడు, వర్గ పరిపాలనా వుండదు; దానికోసం కొన్ని ఉత్పత్తులు ఖర్చవడమూ వుండదు.

ఉత్పత్తి క్రమమూ, పంపిణీ క్రమమూ మాత్రమే, ఏ కాలానికైనా తప్పనిసరిగా వుండే సహజ అవసరాలు.

అందరూ శ్రమ చెయ్యడం — అనే అంశంతోనే సమాజంలో మార్పులు ప్రారంభం అవవలసి వుంటుంది. కానీ, దోపిడీ వర్గం, ఈ మార్పులకు పూర్తిగా వ్యతిరేకం. దోపిడీ సమాజాన్ని మారనివ్వకుండా చెయ్యడమే దాని లక్ష్యం. అంటే, 'శ్రమ' లోకి దిగకుండా వుండడమే.

దోపిడీ సమాజం, దోపిడీ లేని సమాజంగా మారడం

శ్రామికులకు ఇష్టమే. ఈ నాటి సమాజంలో దొరకని సుఖశాంతులతో తమ జీవితాలు సాగడం వారికి ఇష్టమే. కానీ, ఉత్త ఇష్టం వుంటే చాలదు. దానికి చాలా జ్ఞానమూ, ప్రయత్నమూ కావాలి. సమాజం ఎందుకు మారాలో, ఎలా మారాలో, చాలా స్పష్టంగా తెలుసుకోవాలి. దీని కోసం మనం ఇంకా ఒక లక్ష అంశాలు నేర్చుకోవాలి.

ఇప్పుడు ఇక, నూతన సమాజపు కలలు వదిలిపెట్టి, మళ్ళీ 'పెట్టుబడి'కి సంబంధించిన పరిశోధనలోకి వెళ్దాం.

ఇప్పటివరకూ మనం 'సైను బట్ట' అనే ఒక్క సరుకునే చూశాం. కానీ, మనుషులు జీవించడానికి సైను బట్ట మాత్రమే చాలదు. ధాన్యమూ, ఇతర ఆహార పదార్థాలూ, బట్టలూ, మందులూ, బొగ్గూ, చమురూ, పంచదారా, ఇళ్ళూ — వంటి అనేక వందల రకాల ఉత్పత్తులు కావాలి. అయితే, '100 మీ. సైను బట్ట' విషయంలో జరిగేదే, ప్రతీ ఉత్పత్తి విషయంలోనూ జరుగుతుంది. ఒక సరుకు విషయంలో జరిగేదే, ప్రతీ సరుకు విషయంలోనూ జరుగుతుంది. ఒక పెట్టుబడిదారుడి 'పని స్థలం'లో జరిగేదే, ప్రతీ పెట్టుబడిదారుడి పని స్థలంలోనూ జరుగుతుంది.

ఇప్పుడు, వేరు వేరు సరుకుల్ని ఉత్పత్తి చేసే వేరు వేరు శాఖల గురించి చూద్దాం.

# వేరు వేరు శాఖలు

సైను బట్ట — ఒక ఉపయోగపు విలువ. ఒక ఉత్పత్తి. ఒక సరుకు. ఈ సరుకుని పెట్టుడిదారులూ కొంటారు; శ్రామికులూ కొంటారు. సమాజానికి కావలసిన సైను బట్ట అంతా ఒకే ఒక్క పెట్టుబడిదారుడి దగ్గిరే ఉత్పత్తి అవదు. ఇంకా అనేక మంది పెట్టుబడిదారులు కూడా అదే సరుకుని ఉత్పత్తి చేయిస్తారు. (కొందరు 'స్వతంత్ర ఉత్పత్తిదారులు' కూడా ఆ సరుకుని ఉత్పత్తి చేస్తారు.) 'సైను బట్ట'ని ఉత్పత్తిచేసే పని స్థలాలన్నీ కలిసి ఒక 'ఉత్పత్తి శాఖ'. లేదా, ఒక 'పారిశ్రామిక శాఖ'.

'పత్తి' ని ఉత్పత్తి చేసేదంతా ఒక 'ఉత్పత్తి శాఖ'. ('పత్తి'ని ఎవరు కొంటారు?— శ్రామికులు కొనరు. దాన్ని ముడి పదార్థంగా వాడుతూ, దానితో ఇంకో సరుకుని తయారు చేయించే పెట్టుబడిదారులు మాత్రమే పత్తిని కొంటారు. పత్తితో అవసరం లేని పెట్టుబడిదారులు గానీ, శ్రామికులు గానీ దాన్ని కొనరు.)

'మగ్గాల్ని' ఉత్పత్తి చేసేదంతా ఒక ఉత్పత్తి శాఖ. (మగ్గాల్ని— కొందరు పెట్టుబడిదారులే కొంటారు. వాటితో అవసరంలేని పెట్టుబడిదారులుగానీ, శ్రామికులు గానీ, వాటిని కొనరు.)

ధాన్యమూ, దుస్తులూ, పంచదారా, చమురూ, బొగ్గూ — ఇలా ఒక్కో వస్తువుకీ సంబంధించింది — ఒక్కో ఉత్పత్తి శాఖ.

ఈ మొత్తం ఉత్పత్తుల్లో కొన్ని రకాలు — 'వ్యవసాయం' ద్వారానూ, కొన్ని రకాలు — 'గనుల తవ్వకం' ద్వారానూ, కొన్ని రకాలు — 'ఇతర పరిశ్రమల' ద్వారానూ వస్తాయి.

నదుల్లోనూ, సముద్రాల్లోనూ చేపల్ని పట్టడమూ, లేదా చెరువుల్లో చేపల్ని పెంచడమూ — చేపల ఉత్పత్తి శాఖ.

కలప కోసం చెట్లని పెంచేదంతా — కలప ఉత్పత్తి శాఖ.

భోజన పదార్థాల్ని తయారు చేయించే హోటళ్ళన్నీ — హోటళ్ళ శాఖ. భోజన పదార్థాలే ఇక్కడ సరుకులు.

బస్సులూ, లారీలూ, రైళ్ళూ, విమానాలూ నడిపే శాఖలన్నీ — రవాణా శాఖలు. 'రవాణా సౌకర్యమే' ఇక్కడ సరుకు.

ఇళ్ళూ, రోడ్లూ, వంతెనలూ, ఆఫీసు భవనాలూ, రైలు కట్టలూ — వంటి కట్టడాల్ని నిర్మించేవి కట్టడాల శాఖలు.

దిన, వార, మాస, పత్రికల్ని తయారుచేసేది — పత్రికల శాఖ. పత్రికలే ఇక్కడ సరుకులు.

'అచ్చు పని' చేసేదంతా — ప్రింటింగ్ శాఖ.

సినిమాలు తీసి, ప్రదర్శించేది — సినిమా శాఖ. లేదా సినిమా పరిశ్రమ. సినిమా ప్రదర్శనే ఇక్కడ సరుకు.

స్కూళ్ళని నడిపేది — స్కూళ్ళ శాఖ. విద్యాబోధనే ఇక్కడ సరుకు.

ఆస్పత్రి పెట్టి, రోగులకు వైద్యం చేసేది — ఆస్పత్రుల శాఖ. వైద్య సౌకర్యమే ఇక్కడ సరుకు.

ఈ విధంగా, ఒక్కో 'ఉపయోగపు విలువ'ని ఉత్పత్తి చేసేది — ఒక్కో 'ఉత్పత్తి శాఖ'. లేదా, ఒక్కో 'పరిశ్రమ'.

'ఒక శాఖ'లో, ఒక్క పెట్టుబడిదారుడే వుండడు. అనేక మంది పెట్టుబడిదారులు వుంటారు.

(కొన్ని శాఖల్లో, కొందరు 'స్వతంత్ర ఉత్పత్తిదారులు' కూడా వుంటారు. కానీ, ఒక శాఖలో పెట్టుబడిదారులు చేయించే ఉత్పత్తి పరిమాణంతో పోలిస్తే, ఆ శాఖలోని స్వతంత్ర ఉత్పత్తిదారులు చేసే ఉత్పత్తి పరిమాణం అత్యల్పం.)

'కాంట్రాక్టర్లు,' అనే వాళ్ళందరూ కూడా పెట్టుబడిదారులే. ఒక రకం 'సరుకు'ని ఉత్పత్తి చేసి ఇవ్వడానికి

'కాంట్రాక్టు' తీసుకునే వ్యక్తే 'కాంట్రాక్టరు'. పెట్టుబడి దారుడికే మరో పేరు ఇది.

ప్రతీ పెట్టుబడిదారుడూ కొంత 'పెట్టుబడి'తో తన కార్యక్రమం ప్రారంభించి, 'సరుకు'ని ఉత్పత్తి చేయించి, అమ్మి, చివరికి 'అదనపు విలువ'ని లాగుతాడు. కాబట్టి, పెట్టుబడిదారుడు వున్నాడంటే, వాడి చుట్టూ ప్రతి రోజూ వర్తక కమిషన్లూ, వడ్డీలూ, భూమి అద్దెలూ, లాభాలూ, లంచాలూ వగైరాలన్నీ వుండవలసిందే.

ఒక పెట్టుబడిదారుడి దగ్గిర జరిగేదే, ఆ శాఖలో ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా జరుగుతుంది. 'ఒక శాఖ'లో జరిగేదే, ప్రతి శాఖలోనూ జరుగుతుంది.

అన్ని శాఖలూ కలిసి— 'సమాజం.' ఆ సమాజానికి కావలసిన రక రకాల 'ఉపయోగపు విలువల్ని' అన్ని శాఖలూ కలిసి ఉత్పత్తి చేస్తాయి. అన్ని శాఖలలోనూ తయారయ్యే ఉత్పత్తి అంతా కలిసి 'సమాజపు ఉత్పత్తుల రాసి'. లేదా 'సరుకుల రాసి.' ఈ 'రాసి' అంతా, ప్రతిసారీ, (1) 'శ్రమ సాధనాలు' గానూ (2) 'జీతాలు' గానూ, (3) లాభాలూ, వడ్డీలూ, భూమి అద్దెలూ, పన్నులూ, వగైరాలు గానూ — పంపకాలు అయిపోతూ వుంటుంది. తర్వాత ఖర్చయిపోతూ కూడా వుంటుంది. మళ్ళీ కొత్త 'ఉత్పత్తుల రాసి' తయారై, మళ్ళీ పంపకమై, మళ్ళీ ఖర్చయిపోతూ వుంటుంది. ప్రతీసారీ ఇదే వరస.

ఒక 'విడి సరుకు'ని తీసుకున్నా, 'మొత్తం సరుకుల రాసి'ని తీసుకున్నా, అందులో విషయాలన్నీ ఒకే రకంగా వుంటాయి.

ఒక సరుకులో అంశాల్ని 'విలువ' గానూ, 'ఉత్పత్తి' గానూ కూడా అర్థం చేసుకున్నట్టే, 'మొత్తం సరుకుల రాసి'ని కూడా, విలువ గానూ, ఉత్పత్తి' గానూ కూడా అర్థం చేసుకోవాలి.

100 మీ. బట్టని, దాని విలువ అంశాల మధ్య విభజించినప్పుడు, ఏ భాగానికి ఎంత బట్ట వస్తుందో ఇంతకుముందే చూశాం. 'శ్రమ సాధనాల' భాగానికి కొంత బట్టా, 'జీతాల' భాగానికి కొంత బట్టా, 'అదనపు విలువ' భాగానికి కొంత బట్టా, వచ్చింది. అయితే, అక్కడేం జరిగిందంటే, ఆ 3 భాగాలూ, ఒకే 'ఉత్పత్తి'గా ('బట్ట'గానే) వున్నాయి. అంటే, 'శ్రమ సాధనాల' భాగమూ బట్టగానే, 'జీతాల' భాగమూ బట్టగానే, 'అదనపు విలువ' భాగమూ బట్టగానే— వున్నాయి. నిజానికి, బట్ట కోసం ఖర్చయిన శ్రమ సాధనాలు— అన్నప్పుడు, అక్కడ, దారమూ, మగ్గమూ లాంటివి కనపడాలి. అలాగే, 'జీతాల భాగం' అన్నప్పుడు, శ్రామికుల ఇళ్ళల్లో బియ్యమూ, కూర గాయలూ లాంటివి కనపడాలి. అలాగే, 'అదనపు విలువ భాగం' — అన్నప్పుడు, పెట్టుబడిదారుల ఇళ్ళల్లో వాడు కునే వస్తువులు కనపడాలి. ఈ రకంగా, ఆ 3 భాగాల లోనూ ఏ యే వస్తువులు వుండాలో అవే కనపడాలి. కానీ, 'బట్ట'ని విభజించినప్పుడు, వేరు వేరు ఉత్పత్తులు కనపడ లేదు. 3 భాగాలలోనూ బట్టే వుంది. అలా ఎందుకు జరిగిం దంటే — మనం, 'బట్ట' అనే ఒక్క సరుకునే 3 భాగాలు చేశాం కాబట్టి.

కానీ, అలా కాకుండా, అన్ని శాఖలలోనూ ఉత్పత్తి అయ్యే 'మొత్తం సరుకుల రాసి' ని తీసుకుని, దాన్ని 3 భాగాలుగా చేసి చూస్తే, ఏ భాగంలో వుండవలసిన ఉత్పత్తులు ఆ భాగంలో కనపడతాయి.

ఇప్పుడు, ఒక సంవత్సరపు 'సరుకుల రాసి'ని తీసు కుందాం. ఈ 'రాసి'ని సమాజంలోవున్న అన్ని శాఖల శ్రామికులూ కలిసి ఉత్పత్తి చేస్తారు. ఈ శ్రామికులు, ఒక్కో పెట్టుబడిదారుడి దగ్గిరా కొందరు కొందరు చొప్పున పనిచేస్తూ వుంటారు. కొన్ని చోట్ల పత్తీ, కొన్ని చోట్ల దారమూ, కొన్ని చోట్ల బట్టా, కొన్ని చోట్ల మగ్గాలూ, కొన్ని చోట్ల బొగ్గూ, కొన్ని చోట్ల చమురూ— ఇలా మొత్తం సమాజం నిండా అన్ని రకాల శ్రమలూ చేసే శ్రామికు లందరూ కలిసి, 'సంవత్సరపు సరుకుల రాసి'ని ఉత్పత్తి చేస్తారు. ఆ 'రాసి'లో, కొత్తగా తయారైన అన్ని శాఖల సరుకులూ కలిసి వుంటాయి.

వాటిలో — 'శ్రమ సాధనాలు'గా ఉపయోగపడే ఉత్పత్తులూ; 'శ్రామికుల పోషణ' ఉత్పత్తులూ; 'పెట్టుబడి దారుల పోషణ' ఉత్పత్తులూ — అన్నీ కలిసి వుంటాయి.

ఆ 'సంవత్సర ఉత్పత్తుల రాసి విలువ'ని — 1200 అనుకుందాం.

శ్రమ సాధనాలు 800. జీతాలు 200. అదనపు విలువ 200.

ఆ 'రాసి'ని 3 భాగాలుగా విభజిస్తే: 'శ్రమ సాధనాల' భాగానికి కొన్ని ఉత్పత్తులూ, 'జీతాల' భాగానికి — కొన్ని ఉత్పత్తులూ, 'అదనపు విలువ' భాగానికి— కొన్ని ఉత్పత్తులూ —వస్తాయి.

'శ్రమ సాధనాల' భాగంలోనించి — శ్రామికులు గానీ, పెట్టుబడిదారులు గానీ, ఏమీ తినడానికి అవకాశం వుండదు. (ఈ భాగంలో పత్తీ, మగ్గాలూ, ఇనుమూ, సిమెంటూ— లాంటి ఉత్పత్తులు వున్నాయి — అను కుందాం. ఇవి, పెట్టుబడిదారులకు గానీ, శ్రామికులకు గానీ 'పోషణ' ఉత్పత్తులుగా పనికిరావు. వీటిని మళ్ళీ కొత్త 'శ్రమ సాధనాలు'గా వాడవలసిందే). ఈ భాగం అంతా ఏమిటంటే: ఈ భాగం అంతా ఏ 'రాసి'లో వుందో, ఆ 'రాసి'ని ఉత్పత్తి చెయ్యడానికి ఖర్చయిన శ్రమ సాధనాలన్నీ ఇలా వెనక్కి వచ్చాయని అర్థం. ఈ భాగం అంతా, మళ్ళీ 'కొత్త రాసి'ని ఉత్పత్తి చెయ్యడానికి కావలసిన 'శ్రమ

సాధనాలు'గా, అన్ని శాఖల పని స్థలాల్లోకీ వెళ్ళిపోవాలి. మొత్తం 'రాసి'లో నించి, ఈ భాగాన్ని తీసి వేస్తే, ఇంకా మిగిలినవి — 400 విలువ గల ఉత్పత్తులు. ఇవి, 2 బృందాలకూ 'పోషణ' వస్తువులుగా వుండే ఉత్పత్తులు.— వీటినే 2 బృందాలూ పోషణ కోసం వాడాలి. ఎవరు తిన్నా ఈ భాగంలో నించి తినవలసిందే.

ఈ 1200 విలువగల రాసి అంతా 'అమ్మకం' అయి పోయిందనుకుందాం. అంటే, ఏం జరిగిందని అర్థం?

ఒక సంవత్సర కాలం పూర్తి అయ్యేటప్పటికి — 'శ్రమ సాధనాల' భాగంలో వున్న ఉత్పత్తులన్నీ, అన్ని శాఖల పని స్థలాల్లోకీ వెళ్ళిపోతాయి. ('పత్తి' పెట్టుబడిదార్ల సరుకు అంతా, 'దారం' పెట్టుబడిదార్ల పని స్థలాల్లోకీ, 'దారం' పెట్టుబడిదార్ల సరుకు అంతా, 'బట్ట' పెట్టుబడిదార్ల పని స్థలాల్లోకీ — ఇలా!.)

శ్రామికుల పోషణ ఉత్పత్తులన్నీ వారి ఇళ్ళల్లోకీ, పెట్టుబడిదార్ల పోషణ వస్తువులు, వాళ్ళ ఇళ్ళల్లోకీ వెళ్ళిపోతాయి.

మొత్తంగా ఆ 'రాసి' అంతా, సమాజం నిండా వున్న అన్ని శాఖల పని స్థలాల్లోనూ, ఇళ్ళల్లోనూ సర్దుకుంటుంది.

'రాసి'లో వున్న ఉత్పత్తులన్నీ ఎక్కడికి చేరాలో అక్కడికి చేరాలంటే, ప్రతీ సరుకుకీ 'అమ్మకం' జరగాలి.

ఆ 'రాసి'లో వున్న కొన్ని రకాల సరుకుల్ని — పెట్టుబడిదారులు మాత్రమే కొంటారు. కొన్ని రకాల సరుకుల్ని, పెట్టుబడిదారులూ శ్రామికులూ కూడా కొంటారు.

ప్రతీ పెట్టుబడిదారుడూ, తన సరుకుని అమ్మేస్తాడు. తన 'పనిస్థలం'లోకి శ్రమ సాధనాలుగా కావలసిన సరుకుల్నీ, తన ఇంటి అవసరాలకు కావలసిన సరుకుల్నీ, ఇతర పెట్టుబడి దారుల నించి కొంటాడు.

'శ్రామికుల' వేపు నించీ చూస్తే : వీరు, పెట్టుబడిదార్ల పని స్థలాల్లోకి వచ్చి 'పని' చేస్తారు. 'జీతాలు' తీసుకుంటారు. ఆ జీతాలతో, తమ పోషణకు సంబంధించిన ఉత్పత్తుల్ని, వేరు వేరు పెట్టుబడిదారుల నించి కొంటారు. అలా కొనేటప్పుడు ఒక శ్రామికుడు, తను పనిచేసినచోట తయారైన సరుకుల్నీ కొనవచ్చు; ఇతర పని స్థలాల్లో ఇతర శ్రామికుల ద్వారా తయారైన సరుకుల్నీ కొనవచ్చు.

ఈ రకంగా, 'సరుకుల రాసి' అంతా, అమ్మకాల ద్వారా అన్ని శాఖల పని స్థలాలలోకీ, ఇళ్ళల్లోకీ చేరిపోతూ వుంటుంది.

ఒకవేపు, అమ్మకాల పని బయట జరుగుతూ వుండగా, ఇంకోవేపు — పని స్థలాల్లో కొత్త సరుకుల ఉత్పత్తి జరుగుతూనే వుంటుంది. శ్రామికులు, నిత్యం పని స్థలాల్లోకి వచ్చి పనులు చేస్తూనే వుంటారు. పని స్థలాల్లో కొత్త శ్రమ సాధనాలన్నీ ఖర్చయిపోతూనే వుంటాయి. ప్రతీరోజూ 'అదనపు శ్రమ' జరుగుతూనే వుంటుంది.

సంవత్సరం గడిచేసరికి మళ్ళీ 'కొత్త ఉత్పత్తుల రాసి' సిద్ధమవుతుంది.

ఆ 'రాసి' కోసం ఖర్చయిన 'శ్రమ సాధనాల' విలువా, 'జీతాల' విలువా, 'అదనపు విలువా' కలిసి, 'రాసి'కి మొత్తం విలువ అవుతుంది.

ఆ ఉత్పత్తులు మళ్ళీ పంపకాలవుతాయి. మళ్ళీ ఖర్చయిపోతాయి.

ప్రతీ రోజూ శ్రామికులు 'అదనపు శ్రమ' చేస్తూనే వుంటారు. దాని ద్వారా 'అదనపు ఉత్పత్తి' తయారవుతూనే వుంటుంది. పెట్టుబడిదారులు, ప్రతి రోజూ శ్రామికుల 'అదనపు విలువ'ని తింటూనే వుంటారు.

అంటే, శ్రామికుల శ్రమ తోనే — శ్రామికులూ, పెట్టుబడిదారులూ కూడా జీవిస్తూ వుంటారు.

శ్రమ చేసేవాళ్ళు — బికారితనం తోనూ;<br>
దోచుకునేవాళ్ళు — సుఖ భోగాల తోనూ!<br>
ప్రతీ సారీ — ఉత్పత్తీ, దాని పంపకమూ!<br>
ప్రతీ సారీ — శ్రమ సాధనాలూ, జీతాలూ, అదనపు విలువా!<br>
ప్రతీ సారీ — శ్రమ దోపిడీ!<br>
ప్రతీ శాఖలోనూ, ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా,<br>
శ్రమ దోపిడీ!

సమాజం అంతా — శ్రమ దోపిడీ! అదే మళ్ళీ మళ్ళీ మళ్ళీ! ఇవే, యజమానులకూ శ్రామికులకూ ఉండే 'శ్రమ సంబంధాలు'!

# 'ఆస్తి' అంటే ఏమిటి?

'ఆస్తి' అంటే — శ్రమ సాధనాలే.

శ్రమ — సాధనాల్లో ప్రధానమైన అంశం 'భూమే' కాబట్టి, 'ఆస్తి'లో ప్రధానమైన అంశం — భూమే. ఇతర శ్రమ సాధనాలన్నీ కూడా ఆస్తిలో భాగమే.

'డబ్బు' అనేది, 'ఉత్పత్తి'కి మారు రూపమే కాబట్టి, 'డబ్బు' కూడా ఆస్తిలో భాగమే. 'భూమి' వున్నా, ఇతర శ్రమ సాధనాలు వున్నా, 'డబ్బు' వున్నా — 'ఆస్తి' వున్నట్టే లెక్క.

శ్రామికులకు, ఈ 'ఆస్తి'లో ఏ అంశమూ వుండదు. 'భూమి' గానీ, 'ఇతర శ్రమ సాధనాలు' గానీ, 'డబ్బు' గానీ, ఏదీ వుండదు. ఏదైనా వున్నా అది మహా అత్యల్పం. అది, లేని దానితో సమానం.

స్వతంత్ర ఉత్పత్తిదారులకు, చిన్న చిన్న స్వంత

ఆస్తులు ఏర్పర్చుకునే అవకాశం వుంటుంది. ఎందుకంటే, వీరు 'శ్రమ దోపిడీ'కి గురి అవరు కాబట్టి. (వారి శ్రమ ఫలితం అంతా వారికే అందుతుంది కాబట్టి.) కానీ, వీరికి కూడా ఎక్కువ ఆస్తులు కూడబెట్టే అవకాశం వుండదు. ఎందుకంటే, వీరి శ్రమ విలువని— (1) పోషణ ఉత్పత్తుల భాగంగానూ, (2) అదనపు ఉత్పత్తుల భాగంగానూ విభజిస్తే— మొదటి భాగంతో పోషణ సంతృప్తికరంగా జరగదు. రెండో భాగంలో నించి కూడా చాలా ఉత్పత్తుల్ని పోషణ కోసమే వాడవలసి వస్తుంది. కాబట్టి, స్వతంత్ర ఉత్పత్తి దారులు, జీతాల మీద బతికే శ్రామికుల కన్నా కొన్ని ఎక్కువ ఉత్పత్తుల్ని పోషణ కోసం వాడడం సాధ్యం కావచ్చుగానీ, 'ఆస్తులు కూడ బెట్టడం (' భూమి' గానీ, 'డబ్బు'గానీ) వీరికి కూడా సాధ్యం కాదు.

వీరు, తమ 'శ్రమ సాధనాల' కోసం కావలసిన ఖర్చుని 'అప్పుగా' తెచ్చివుంటే, దానిమీద 'వడ్డీలు' చెల్లించాలి. సరుకుని అమ్మేటప్పుడు వర్తకుడికి లాభం మిగిలేలాగ 'కమిషన్' చెల్లించాలి. సరుకు మీద 'పన్నులు' చెల్లించాలి. ఈ ఖర్చులన్నీ వారి 'అదనపు విలువ' భాగంలో నించే పోవలసి వుంటుంది. ఇవన్నీ పోయాక కూడా మిగిలేదాన్ని మాత్రమే 'ఆస్తి'గా కూడబెట్టడం సాధ్యం.

స్వతంత్ర ఉత్పత్తిదారుడు స్వయంగా శ్రమ చేస్తాడు. ఒక వ్యక్తి ఎంత శక్తి సామర్థ్యాలుగలవాడైనా, ఒక శరీరం రోజుకి ఎంత శ్రమ చెయ్యగలదు? అందులో ఎంత భాగాన్ని మిగల్చగలదు? ఒక వ్యక్తి చెయ్యగలిగే శ్రమకి ఒక హద్దు వుంటుంది కాబట్టి, స్వంత శ్రమతో ఏర్పడే ఆస్తికి కూడా ఒక హద్దు వుంటుంది. ఆ ఆస్తి అతి చిన్నస్థాయిలోనే ఏర్పడగలదుగానీ భారీ స్థాయిలో ఏర్పడదు. ఆ ఆస్తి, ఒక హద్దుని దాటి పెరగదు.

కానీ, 'దోపిడీ' ద్వారా ఏర్పడే ఆస్తికి ఆ హద్దు వుండదు. ఎందుకంటే, అది ఇతరుల శ్రమని లాగడం ద్వారా ఏర్పడుతుంది గనక. ఇతరుల శ్రమని లాగడం అంటే, ఎంత మంది శ్రమని లాగడానికైనా అవకాశం వుంటుంది. ఒక పెట్టుబడిదారుడు, 10 మంది శ్రామికులనైనా పెట్టుకో వచ్చు, 100 మందినైనా పెట్టుకోవచ్చు, 500 మందినైనా, వెయ్యి మందినైనా పెట్టుకోవచ్చు. అందులో అసాధ్యం ఏమీ వుండదు. శ్రామికుల సంఖ్య ఎంత పెరిగితే, 'అదనపు విలువ రాసి' అంత పెరుగుతుంది. ఒక శ్రామికుడి ద్వారా, రోజుకి వచ్చే అదనపు విలువ 5 రూ.లు అనుకుంటే, 'వెయ్యి' మంది కార్మికుల ద్వారా, రోజుకి '5 వేల' అదనపు విలువ'ని సంపాదించడం సాధ్యమే. ఆ పెట్టుబడిదారుడే తన 'స్వంత శ్రమతో' అయితే, ఒక రోజులో ఒక్క శరీరంతో చెయ్యగలిగే పనే చేస్తాడు గానీ, 500 మంది చెయ్యగలిగే పని చెయ్యలేడు. ఇద్దరు చేసే పని అయినా చెయ్యలేడు. రోజుకి 5 వేలు సంపాదించడం సాధ్యం కాదు. ఆ 'పని స్థలం'లో అత్యున్నత జీతం నెలకి 'వెయ్యి' రూ.లు అనుకుంటే, పెట్టుబడిదారుడు, స్వంత శ్రమ ద్వారా ఆ జీతం మాత్రమే సంపాదించగలడు. కానీ, శ్రామికుల్ని దోచడం ద్వారా అయితే, రోజుకి 5 వేల చొప్పున, నెలకి, 'లక్షా 50 వేలు' సంపాదిస్తాడు. 'పెట్టుబడి'ని ఇంకా పెంచి, శ్రామికుల సంఖ్యని కూడా ఇంకా పెంచితే, వారి ద్వారా వచ్చే అదనపు విలువ రాసి ఇంకా పెరుగుతుంది.

అలా సంపాదించిన 'డబ్బు'తో ఏం చేస్తాడు?— 'భూమి' కొంటాడు. ఇతర శ్రమ సాధనాలు కొంటాడు. కొంత 'డబ్బు'ని నిల్వగా వుంచుతాడు. ఆ రకంగా, కొంత ఆస్తి సంపాదిస్తాడు.

ఆ భూమి ద్వారా ఇంకా భూమి అద్దె, ఆ శ్రమ సాధనాల ద్వారా ఇంకా లాభమూ, ఆ డబ్బు ద్వారా ఇంకా వడ్డీ— రావడం ప్రారంభమవుతాయి. పాత ఆస్తి ఇంకా పెరుగుతూ వుంటుంది.— ఈ రకంగా, 'దోపిడీ' ద్వారా ఏర్పడే ఆస్తికి హద్దు వుండదు. అది, ఆ దోపిడీదారుడి శారీరక శక్తి సామర్థ్యాల మీద ('స్వంత శ్రమ' మీద) ఆధారపడి వుండదు కాబట్టి, దానికి హద్దు వుండదు. ఈ రకంగా పెరిగే ఆస్తి ఎంత పెద్ద స్థాయిలోనైనా ఏర్పడు తుంది. ఎంత ఎక్కువగా దోపిడీ చెయ్యగలిగితే అంత పెద్ద స్థాయిలో! అందుకే బానిస యజమానుల ఆస్తీ, భూస్వాముల ఆస్తీ, మితిమీరిన స్థాయిలో వుంటాయి. వెనకటి దోపిడీ దొంగల ఆస్తుల కన్నా ఈ నాటి పెట్టుబడిదారుల ఆస్తులు అనేక వందల, వేల రెట్లు పెద్దవి. స్వతంత్ర ఉత్పత్తిదారుల్లో వెయ్యి కుటుంబాల ఆస్తుల్ని కలిపినా వుండనంత ఆస్తి దోపిడీదారుల్లో ఒక్క కుటుంబానికే వుంటుంది.

చరిత్రలో, 'స్వంత ఆస్తి' అనేది, అనేక రూపాలలో కనపడుతుంది. 'ప్రాచీన తెగల' ఆస్తిగా, 'బానిస యజమాని' ఆస్తిగా, 'భూస్వామి' ఆస్తిగా, 'కౌలు రైతు ఆస్తి'గా, 'స్వతంత్ర ఉత్పత్తిదారుల' ఆస్తిగా, 'పెట్టుబడిదారుల' ఆస్తిగా! ఇంకా వేరు వేరు దేశాల్లో అది, వేరు వేరు రూపాలలో కూడా వుంటే వుండవచ్చు. కొంత ఆస్తి 'వ్యక్తి ఆస్తి' గానూ, కొంత ఆస్తి అందరికీ చెందిన 'సమిష్టి ఆస్తి' గానూ వుండే రూపాలలో కూడా అది వుండవచ్చు.

'స్వంత ఆస్తి విధానం' వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఇంకా ముందు ముందు చూస్తాము. ఒక శ్రామిక కుటుంబానికి గానీ, స్వతంత్ర ఉత్పత్తిదారుల కుటుంబానికి గానీ, ఒక ఎకరం భూమి వుంటే, అది కూడా 'స్వంత ఆస్తే'. కానీ 'దుష్పరిణామాలు కలిగించే స్వంత ఆస్తి విధానం' అన్నప్పుడు, అది 'స్వంత శ్రమతో ఏర్పడే స్వంత ఆస్తి విధానం' గురించి కాదు. 'దోపిడీ' ద్వారా ఏర్పడే స్వంత ఆస్తి విధానం గురించే. 'దోపిడీ' అనేది, అనేక దుష్పరిణామాలకు దారితీస్తూ మానవ సమాజాన్ని అనేక

సమస్యల పాలు చేస్తూ సాగుతూ వుంటుంది.

దోపిడీ సమాజాలలో, భూమీ, ఇతర శ్రమ సాధనాలూ, డబ్బూ వంటి ఆస్తులన్నీ దోపిడీదారుల వ్యక్తిగత ఆస్తులు గానూ, కుటుంబ ఆస్తులు గానూ, వుంటాయి.

కానీ అందరూ శ్రమ చేసే (అంటే, దోపిడీ లేని) 'నూతన సమాజం'లో, 'ఆస్తి' అనేది, వ్యక్తిగత స్థాయిలోనో కుటుంబ స్థాయిలోనో వుండడం అర్థ రహితం. అక్కడ శ్రమ సాధనాలన్నీ సమిష్టి స్థాయిలో, సమిష్టి హక్కుల కింద వుంటాయి.

ఇలా, స్వంత ఆస్తులు, సమిష్టి ఆస్తులుగా మారడానికి, 'నూతన సమాజం'లో కూడా కొన్ని దశలు కలిగిన 'పరిణామ క్రమం' వుంటుంది. ఆ పరిణామ క్రమం అంతా పూర్తి అయిందనీ, నూతన సమాజం 'డబ్బు'ని కూడా తీసివేసే దశకి చేరిందనీ అనుకుంటే, అప్పుడు ప్రతి మనిషికీ (స్త్రీకి అయినా, పురుషుడికి అయినా) వుండే ఆస్తి 2 రకాలుగా వుంటుంది.

**(1)** 'సమిష్టి ఆస్తి' మీద హక్కు.

**(2)** కుటుంబ సభ్యులతోనూ, వ్యక్తిగతంగానూ వాడుకునే వస్తువుల మీద హక్కు. నివసించే ఇల్లు కుటుంబ సభ్యుల కందరికీ సంబంధించి వుంటుంది. ఆహారమూ, బట్టలూ, చెప్పులూ, మంచమూ, పెన్నూ, దువ్వెనా వంటివి వ్యక్తిగతంగా వాడుకునే వస్తువులుగా వుంటాయి. ఆ వ్యక్తి వున్నంత కాలమూ అవి ఆ వ్యక్తివే, ఇంకొకరివి కావు. ఆ వ్యక్తి పోయిన తర్వాత, ఆ వస్తువులు 'సమిష్టి ఆస్తి'లో కలిసిపోతాయి. అంటే ఆ వస్తువుల్ని, కుటుంబ సభ్యులైనా వాడవచ్చు, ఇతరులైనా వాడవచ్చు.

ఈ 2 రకాల హక్కుల సారాంశమూ ఏమిటంటే — మనుషులు, (1) శ్రమ చెయ్యడమూ, (2) శ్రమ ఫలితాన్ని వాడుకోవడమూనూ. ఈ 2 విషయాలూ కూడా మనిషి జీవించి వున్నంత కాలమే సాధ్యం.

జీవించి వున్న కాలంలో వాడుకోగలిగే వస్తువులే — నిజమైన 'స్వంత ఆస్తి'. 'స్వంత ఆస్తి' అనే మాట, నిజమైన, సహజమైన అర్థాన్ని ఆ నాటికి పొందుతుంది.

# 'లాభం' గురించి
# పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త ఏమంటాడు?

'లాభం' గురించే కాదు, దేన్ని గురించి అయినా పెట్టుబడిదారుడు ఏమంటాడో, పెట్టుబడిదారీ ఆర్థికవేత్త కూడా అదే అంటాడు. 'పెట్టుబడిదారుడికి తెలిసిన దానికన్నా పెట్టుబడిదారీ ఆర్థికవేత్తకి తెలిసినదేమీ లేదు' అనలేము గానీ, అది దాదాపు లేనిదానితో సమానమే.

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తకి, శ్రమకి సంబంధించిన ఏ వివరాలూ తెలియవు. ఈ ఆర్థికవేత్త దృష్టిలో, ఉపయోగపు విలువా, విలువా అనే తేడాలు కొంచెంగా వున్నా, నిర్జీవ శ్రమా, సజీవ శ్రమా — అనే తేడాలు మాత్రం వుండవు. — ఈ విషయాలేవీ తెలియకపోవడం వల్లనే, ఈ ఆర్థికవేత్తల అభిప్రాయాలు అనేక తప్పులతో వుంటాయి.

లాభం ఎలా వస్తుందని ఆర్థికవేత్తలు చెపుతారో, ఈ చాప్టర్ మొదట్లోనే చూశాం. చవగ్గా కొని ప్రియంగా అమ్మడాల వల్ల లాభం వస్తుందనీ, కొనే మనిషి, సరుకుతో తన అవసరం వల్ల ఎక్కువ ఇస్తాడు కాబట్టి లాభం వస్తుందనీ, ఖర్చుల మీద ఎక్కువ వేసుకోవడం వల్ల లాభం వస్తుందనీ — ఇలా. ఈ అభిప్రాయాలన్నీ తప్పే — అని, చూశాం.

'పెట్టుబడి'కి లాభం రావడం— చూసే ఆర్థికవేత్తలు, దాన్నే 'సరైన విషయం'గా భావిస్తూ— "పెట్టుబడి, లాభాన్ని ఇస్తుంది" అని సూత్రీకరిస్తారు.

"పెట్టుబడిలో ఏ అంశం లాభాన్ని ఇస్తుంది? ఎలా ఇస్తుంది? లాభం అనేది న్యాయమైన విషయమా కాదా?" అనే ప్రశ్నలు అక్కడ వుండవు. అసలు అది 'తర్కించదగ్గ' విషయమే కాదు, ఆ ఆర్థికవేత్తలకి!

'లాభాన్ని ఇవ్వడంలో, శ్రామికుల పాత్రే గానీ, శ్రమ సాధనాల పాత్ర ఏమీ వుండదు' అనే అంశాన్ని ఆర్థికవేత్త నిజంగా గ్రహించలేకపోయాడనే అనుకుందాం. కానీ "పెట్టుబడి లాభాన్ని ఇస్తుంది" అని భావించేవాళ్ళు (ఆ అభిప్రాయం తప్పే అయినా) కనీసం అందులో కూడా 'నిజాయితీ'తో వుండాలి. ఎలాగంటే: పెట్టుబడి అంటే 'శ్రమ సాధనాలే' కాదు, 'జీతాలు' కూడా కదా? కాబట్టి, 'పెట్టుబడి లాభాన్ని ఇస్తుంది' అని భావించే వాళ్ళు, లాభాన్ని ఇవ్వడంలో, శ్రమ సాధనాల పాత్రే గాక, జీతాల పాత్ర కూడా వుంటుందని భావించాలి. 'లాభాన్ని, శ్రమ సాధనాల భాగానికే గాక, జీతాల భాగానికి కూడా పంచాలి' అని వాళ్ళు ప్రతిపాదించాలి. అలాంటి ప్రతిపాదన గనక ఆర్థికవేత్తలు చేసి వుంటే, నిజానికి లాభం గురించి వాళ్ళ అవగాహనలో చాలా తప్పు వున్నా, వాళ్ళు అలా అర్థం చేసుకున్నారు కాబట్టి అలా చెప్పారు — అనుకోవచ్చు.

కానీ "లాభాన్ని పెట్టుబడి ఇస్తుంది" అని మాట్లాడే వాళ్ళెవరూ, "పెట్టుబడిలో జీతాలు కూడా ఒక భాగం కాబట్టి, లాభాన్ని ఇవ్వడంలో జీతాల పాత్ర కూడా వుంటుంది" అని చెప్పరు. ఎందుకంటే, అలా చెప్తే, 'లాభాన్ని, జీతాలకు కూడా పంచాలి' అని కూడా చెప్ప వలసివస్తుంది కాబట్టి. అంటే, శ్రామికులకు 'జీతాలు' ఇవ్వడమేగాక, 'లాభం'లో కూడా ఒక భాగాన్ని ఇవ్వవలసి వస్తుంది. ఇది పెట్టుబడి దారుడికి నచ్చని విషయం కాబట్టి, అది ఆర్థికవేత్తకి కూడా నచ్చదు. "లాభాన్ని, పెట్టుబడి ఇస్తుంది" అనేవాళ్ళ అభిప్రాయం ఏమిటంటే, "లాభాన్ని పెట్టుబడిలోవున్న శ్రమ సాధనాలు మాత్రమే ఇస్తాయి" అని!

అంటే, ఏ పనైతే శ్రామికుల వల్ల మాత్రమే జరుగుతుందో, ఆ పని, శ్రమ సాధనాల వల్ల మాత్రమే జరుగుతుందని ఆర్థికవేత్తలు భావిస్తారన్న మాట! అంటే, పూర్తిగా తల్లకిందులుగా! 'లాభం' ఎలా వస్తుందో ఆర్థిక వేత్తలకు సరిగా తెలియకపోయినా, ఆ 'తెలియని తనం'లో కూడా వాళ్ళు పెట్టుబడిదారుడికే మేలుచేసే విధంగా ఆలో చిస్తారే గానీ, శ్రామికులకు మేలుచేసే విధంగా ఆలోచించరు.

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల్లో, స్మిత్తూ, రికార్డో లాంటి వాళ్ళు కూడా 'లాభం' గురించి చెప్పిందంతా పూర్తిగా పాత పాటే. వీరి అవగాహన ప్రకారం కూడా— 'పెట్టుబడి'కి, లాభాల్నీ వడ్డీల్నీ తీసుకునే హక్కూ, 'భూమి'కి అద్దె ని తీసుకునే హక్కూ — వుంటాయి. ఈ అంశాలన్నీ 'సరుకు విలువ' లోకి చేరతాయి. సరుకుని అమ్మినప్పుడు, అవన్నీ వెనక్కి వస్తాయి. అంటే, బట్టని తయారు చెయ్యడానికి 'దారం' ఎంత అవసరమో, లాభమూ— వడ్డీ— భూమి అద్దె కూడా అంత అవసరం — అన్నదే ఆర్థికవేత్తలందరూ చెప్పేది!

ఒక విషయం దీర్ఘకాలంగా జరుగుతూ వున్నప్పుడు, దాన్నే చూస్తూ వుండే వాళ్ళకి, అది, చాలా సహజ విషయమైపోతుంది. జరుగుతున్నదాన్ని చూడడమూ, దేన్ని చూస్తున్నామో అదే సరైంది అనుకోవడమూ అలవాటై పోతుంది. కానీ అది పైకి కనపడే 'లోక జ్ఞానం' (కామన్ సెన్స్) మాత్రమే. కొన్ని విషయాల్లో 'లోక జ్ఞానం' కూడా సత్యమైన విషయంగానే వుంటుంది. కానీ అదే 'పూర్తి సత్యం'గా గాక, పూర్తి సత్యంలో ఒక చిన్న భాగంగా వుంటుంది. మరికొన్ని విషయాల్లో లోక జ్ఞానం పూర్తిగా అసత్యంగా వుంటుంది. అసలు సత్యం బయటపడ్డ తర్వాత, అంతవరకూ సత్యంగా కనపడ్డ లోక జ్ఞానం పూర్తిగా అసత్యంగా రుజువైపోతుంది. అందుకే, లోక జ్ఞానంగా కనపడే విషయం సత్యమా, కాదా; సత్యమైతే అసలు సత్యంలో అది ఎంత భాగం— అనే విషయాల్ని హేతుబద్ధమైన పరిశోధన ద్వారా తెలుసుకోవాలి. సత్యాన్ని అలా తప్ప ఇంకో రకంగా తెలుసుకోవడం సాధ్యం కాదు.

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల అభిప్రాయాలన్నీ పై పై లోక జ్ఞానపు స్థాయిలో మాత్రమే వుంటాయి. వాళ్ళ పరిశోధన ఆ లోక జ్ఞానాన్ని దాటి 'అంతర్గత' విషయాలలోకి పోదు.

సరుకు 'విలువ', అనేక భాగాలుగా పంపకం అవడం చూస్తాడు ఆర్థికవేత్త. అలా పంపకం చేసుకునే వాళ్ళకి, ఏవేవో 'హక్కులు' వుండడం కూడా చూస్తాడు. అంతే. హక్కు వుంది కాబట్టి, అది 'ఉండ వలసిన హక్కు' అని భావిస్తాడు. అది ఉంది కదా? ఉండవలసింది కాబట్టే వుంది' అని భావిస్తాడు.

సమాజంలో వున్న ఒక రోగాన్ని చూసి, "సమాజంలో ఇది ఎప్పటి నించో వుంటున్నది కదా? ఎప్పటి నించో వుంటున్నది కాబట్టి ఇది సరైనదే. ఉండవలసిన విషయం కాబట్టే ఉంది" అని భావించడం ఎలాంటిది? సరైనదేనా? వడ్డీల్నీ లాభాల్నీ భూమి అద్దెల్నీ గురించి ఆర్థికవేత్తల అవగాహన కూడా అలాంటిదే.

అవి ఎంతో కాలం నించి వున్నాయి. వాటిని తీసు కోవడానికి కొందరికి 'హక్కులు' కూడా వున్నాయి. సమా జంలో అందరూ ఆ హక్కుల్ని గుర్తించి, వాటిని నిలబెడు తూనే వున్నారు. అంటే, 'అప్పులు' తీసుకున్న వాళ్ళు 'వడ్డీలు' చెల్లిస్తున్నారు. భూమిని అద్దెకి తీసుకున్న వాళ్ళు అద్దెలు చెల్లిస్తున్నారు. జీతాలతో పని చేసేవాళ్ళు అదనపు శ్రమచేసి లాభం రావడానికి మార్గం కల్పిస్తున్నారు. (వాళ్ళకి తెలియకుండానే.) ఈ విషయాలన్నీ ఇలా జరుగుతున్నాయి కాబట్టి, ఇదంతా సరిగానే వున్నట్టుగా 'లోక జ్ఞానం' భావిస్తుంది. అంటే, సాధారణ దృష్టిలో— 'జీతం' ఎలాంటి విషయమో, వడ్డీ కూడా అలాంటి విషయమే. భూమి అద్దె, లాభమూ కూడా అలాంటి విషయాలే.

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తది కూడా సాధారణ దృష్టే. "వడ్డీలూ, లాభాలూ, భూమి అద్దెలూ వుండదగ్గవి కాబట్టే వున్నాయి. గతం నించీ వున్నాయి కాబట్టి, అవి సరైనవే" అనే తప్పుడు దృష్టి అది!

సమాజం ఈ తప్పుని గ్రహించడం ఎప్పుడు సాధ్య మవుతుందంటే, 'విలువ' గురించి నిజం తెలిసినప్పుడు! విలువ అంటే ఏమిటో, అది సరుకుకి ఎలా చేరుతుందో తెలిసినప్పుడు.

కానీ, 'విలువ' గురించి తెలియగానే దోపిడీదారుల బృందం దోపిడీని మానుకుంటుందని దీని అర్థం కాదు.

'విలువ' గురించి తెలియడం, శ్రామిక బృందానికి సరైన జ్ఞానాన్ని ఇస్తుంది. తర్వాత, ఆ జ్ఞానం దాని పని అదే చేస్తుంది.

కానీ, విలువకి సంబంధించిన సూత్రాలేవీ బహిరంగంగా పైకి కనపడవు. ఖర్చుల మీద లాభం వేసుకోవడం వరకే పైకి కనపడుతుంది గానీ, అలా 'వేసుకోవడం' ఎందుకు చెయ్యవలసి వస్తోందో దాని కారణం పైకి కనపడదు. ఆ వేసుకునే లాభం ఒక హద్దులో వుండడం వరకే పైకి కనపడుతుందిగానీ, అది ఒక హద్దులో ఎందుకు వుండవలసి వస్తోందో పైకి కనపడదు. 'కారణాలె'ప్పుడూ పైకి కనపడవు. కారణాల వల్ల పుట్టుకు వచ్చే ఫలితాలే పైకి కనపడతాయి. ఆ ఫలితాల్ని చూసి, వాటిని ఆధారం చేసుకుంటూ ఎంతో కొంత పరిశోధన చేసి, అసలు నిజాన్ని గ్రహించడమే 'సైన్సు' (శాస్త్రం)! లోక జ్ఞానాన్ని తిరిగి వల్లించడమే సైన్సు కాదు. లోక జ్ఞానం వివరించలేని విషయాన్నే సైన్సు వివరిస్తుంది. లోక జ్ఞానం చాలని చోటే సైన్సు పాత్ర ప్రారంభమవుతుంది.

"ఖర్చుల మీద కొంత వేసుకుంటే లాభం వస్తుంది" అనేదాన్ని పెట్టుబడిదారుడు ఎంత నమ్ముతాడంటే, దాన్నే సంపూర్ణ సత్యంగా నమ్ముతాడు. "నా బట్ట కోసం 112 ఖర్చు అయింది. దానిమీద నేను 8 లాభం వేసుకుని, బట్టని 120 కి అమ్మాను. నేను వేసుకున్న లాభం నాకు వచ్చిందా లేదా?" అంటాడు. ఆ వాదానికి ఆర్థికవేత్త ముగ్ధుడైపోయి, దాన్నే 'లాభ సూత్రం'గా చెప్పడం అంటే, దాని అర్థం ఏమిటి? పెట్టుబడిదారుడి చిట్టా పుస్తకానికి కొత్త అట్టలు కుట్టి, దాని మీద "ఆర్థిక శాస్త్రం" అని రాయడమే.

ఈ ఆర్థికవేత్తలు, ఒక విషయాన్ని ప్రతీ చోటా ఒకే రకంగా చెపుతారనడానికి కూడా వీలు లేదు.

'ఆర్థిక శాస్త్ర' విషయాల్ని కొన్ని కోణాలలో అభివృద్ధి పరిచిన ఆర్థికవేత్తలు కూడా అనేక వైరుధ్యాల్లో వున్నారు.

**రికార్డో**ని చూస్తే, "సరుకులో విలువ అంతా శ్రమ వల్లనే ఏర్పడుతుంది" అని ఒకవేపు చెపుతూనే, ఇంకో వేపు — "శ్రామికులకు జీతాలూ, పెట్టుబడికి లాభమూ రావడం సరైనదే" అని లాభాన్ని సమర్థిస్తాడు. అయితే, "జీతాలు పెరిగితే లాభం తగ్గుతుంది. జీతాలు తగ్గితే, లాభం పెరుగుతుంది" అని, ఆ రెండు అంశాలకూ ఒక తప్పనిసరి సంబంధం వున్నదని ఇంకో అభిప్రాయం కూడా చెపుతాడు.

ఈ అభిప్రాయాలన్నిటినీ వివరంగా చూస్తే, ఇవి పరస్పర విరుద్ధంగా వున్నట్టు తేలుతుంది. "సరుకులో విలువ అంతా శ్రమ వల్లనే ఏర్పడుతుంది" అనే అభిప్రాయం ప్రకారం — 'విలువ'కి శ్రమే కారణం అవుతుంది. ఆ 'విలువ'లో నించి పెట్టుబడి విలువని తీసివెయ్యగా, మిగిలిన విలువ అంతా శ్రామికుల ద్వారా వచ్చినదే — అవుతుంది. కాబట్టి, అదంతా శ్రామికులకే చెందవలసి వుంటుంది. కానీ రికార్డో ప్రకటించిన రెండో అభిప్రాయం ప్రకారం — శ్రామికులకు రావలసింది జీతాలు మాత్రమే. శ్రామికులకు జీతాలు వస్తే, వారి శ్రమ ఫలితం వారికి అందిపోయినట్టే రికార్డో అర్థం. అంటే, శ్రామికుల శ్రమ ఫలితం అంతా శ్రామికులకు అందిన తర్వాత కూడా సరుకులో 'లాభం' అనే భాగం వుంటుందనీ, అది కూడా శ్రమే అనీ — రికార్డో అర్థం. మరి, 'లాభం' అనే పేరుతో వుండే ఆ భాగం, సరుకులోకి ఏ అంశం ద్వారా చేరిందో రికార్డో వివరించడు. అంటే రికార్డో అభిప్రాయాలన్నీ అరకొరగా వున్నట్టే అర్థం. అయినప్పటికీ, ఆ అభిప్రాయాలలో కూడా కొన్ని 'ముందడుగులు' వున్నాయి. 'జీతాలు పెరిగితే లాభం తగ్గుతుంది' అనే అభిప్రాయం ఒక ముందడుగే. ఇది ఎంత అస్పష్టంగానూ, ఎంత అరకొరగానూ వున్నప్పటికీ, ఇది ఒక 'నిజాన్ని' చెప్పగలిగింది. కానీ, ఈ అభిప్రాయమే పెట్టుబడిదారీ పక్షానికి ఆగ్రహం కలిగించింది. ఎందుకంటే — ఈ అభిప్రాయం 'పెట్టుబడిదారులకూ శ్రామికులకూ మధ్య ఘర్షణ' వుంటుందని చెపుతోంది కాబట్టి. (ఈ విషయాన్ని ఇంకో సందర్భంలో కొంత వివరంగా చూస్తాము.)

"సరుకు విలువ అంతా శ్రమదే" అనే అభిప్రాయాన్ని అందరి కన్నా ముందు ఒక 'అనామక రచయిత' చెప్పాడనే సంగతి మనం మొదటి భాగంలోనే చూశాం. అదే అభిప్రాయాన్ని రికార్డో సమర్థించాడు. దాని ప్రకారమే విషయాల్ని పరిశీలిస్తే, ఏం తేలుతుంది? లాభమూ, వడ్డీ, భూమి అద్దె — వంటి అంశాలన్నీ శ్రామికుల శ్రమే — అని తేలుతుంది. కానీ రికార్డో, పెట్టుబడిదారీ దృష్టిని వదలలేక పోవడం వల్లనే ఆ సంగతి గ్రహించలేకపోయాడు. లాభమూ వగైరాల్ని సమర్థించాడు. సమాజంలో వున్నదాన్ని వున్నట్టు!

తన పరిశీలనకు అందిన నూతన సత్యాన్ని కూడా లోక జ్ఞానపు పరిధిలో కుదించాలని భావించే ఏ శాస్త్రజ్ఞుడూ కంటికి కనపడేదాన్ని చూడలేడు, చేతికి అందేదాన్ని పట్టుకోలేడు. తన అన్వేషణలో దొరికే సత్యాన్ని తనే జారవిడుచుకుంటాడు — రికార్డో లాగ!

రికార్డో 'అదనపు శ్రమ' దాకా వెళ్ళాడు. కానీ, అది శ్రామికుల శ్రమే కాబట్టి అది శ్రామికుల స్వంతమనీ, దానిపై వారికే హక్కనీ గ్రహించలేకపోయాడు. 'అప్పుడు, పెట్టుబడికి రావలసిన లాభం మాటేమిటి? అదనపు శ్రమ శ్రామికులకే వెళ్ళిపోతే పెట్టుబడికి లాభం ఎలా వస్తుంది?' — అనే ప్రశ్నని ఛేదించలేకపోయాడు. 'పెట్టుబడికి లాభం రానక్కరలేదేమో; అసలు పెట్టుబడే అక్కరలేదేమో! పెట్టుబడీ, పెట్టుబడిదారుడూ లేకుండానే ఉత్పత్తి సాధ్యమేనేమో!'— అనే 'నూతనమైన ఊహ'

చెయ్యలేకపోయాడు. 'లాభం అనేది కూడా శ్రమే' అని గ్రహించి కూడా, 'అది కూడా శ్రామికులదే' అని గ్రహించ లేకపోయాడు! 'శ్రామికులు జీతాలతోనే సంతృప్తి పడుతూ జీవించక తప్పదు మరి' అని నిట్టూర్చాడు. 'పెట్టుబడికి లాభం రావాలి, తప్పదు. లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు? పెట్టుబడి లేకపోతే ఉత్పత్తి ఎలా వస్తుంది?' అనే సాధారణ వాస్తవాన్ని దాటి చూడలేని దృష్టి ఇది. అంతర్గత సత్యాన్ని ఎంతో కొంత గ్రహించి కూడా, ఆ సత్యానికి తగ్గట్టుగా పైకి కనిపించే వాస్తవాన్ని అర్థం చేసుకోలేక, పై వాస్తవానికి తగ్గట్టుగానే అంతర్గత సత్యాన్ని అర్థం చేసుకున్నాడు రికార్డో. ఇదంతా పూర్తిగా తెలిసీ కాదు, బొత్తిగా తెలియకా కాదు! తెలిసి కొంతా, తెలియక కొంతా!

'లాభం' లేని పెట్టుబడినీ, పెట్టుబడి లేని ఉత్పత్తి క్రమాన్నీ ఊహించలేని దృష్టే — పెట్టుబడిదారీ దృష్టి. ఈ దృష్టితో 'లాభానికి కారణం శ్రమ దోపిడీయే' అని గ్రహించడం అసహజమూ, అసాధ్యమూ కూడా.

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు 'శ్రమ దోపిడీ'ని గ్రహించ లేదంటే, ఆ ఆర్థికవేత్తల ద్వారా "ఆర్థిక శాస్త్రానికి" ఏమీ అందలేదని అర్థం కాదు. 'విలువ' మీద ప్రాథమికమైన పరిశోధన అంతా ఈ ఆర్థికవేత్తలే చేశారు. కానీ, పెట్టుబడి దారీ దృష్టిని వదలని ఆర్థికవేత్తకి, ఏ స్థాయిని దాటి ముందుకు అడుగు వెయ్యడం అసాధ్యమో, అక్కడ అతను ఆగిపోయాడు. 'పెట్టుబడికి లాభం రాక తప్పదు' అనే దృష్టి గల ఏ ఆర్థికవేత్తా 'ఆర్థిక శాస్త్రం'లో నూతన మార్గాన్నీ, సత్యాన్నీ, కనిపెట్టడానికి అవకాశం లేదు. కనిపెడితే అది 'దోపిడీ'ని గ్రహించే ధిక్కరించే మార్గమే అవుతుంది. అది ఆర్థిక శాస్త్రాన్ని 'విప్లవ' మార్గానికి తిప్పడమే అవుతుంది. ఆ పనే చేశాడు — కార్ల్ మార్క్స్!

# మార్క్స్ ప్రవేశం!

అప్పుడు వచ్చాడు మార్క్స్ చరిత్రలోకి! అర్థ శాస్త్ర చరిత్రలోకీ, తత్వ శాస్త్ర చరిత్రలోకీ, కమ్యూనిస్టు చరిత్రలోకీ. ఈ చరిత్రలన్నీ, 'మానవ చరిత్ర'కు వివిధ కోణాలే. ఈ కోణాలన్నీ, మార్క్స్ వచ్చే నాటికి, అస్పష్టతల తోటీ, అయోమయాల తోటీ నిండివున్నాయి. వీటి పరిశోధనలోకి దిగిన మార్క్స్, ఆ పరిశోధనా క్రమంలోనే సమాజం గురించి అసలు నిజం గ్రహించాడు.

"శ్రామికుల అదనపు శ్రమే — లాభాలకూ, వడ్డీలకూ, భూమి అద్దెలకూ మూలకారణం" అనేదే ఆ అసలు నిజం. మార్క్స్ ఆ నిజాన్ని గ్రహించి, ఆ దృష్టితో, సమాజపు భూత — వర్తమాన — భవిష్యత్ కాలాల్ని వివరించాడు. మానవ సమాజానికి మూలం — శ్రమే. 'శ్రమే' — మానవుణ్ణి జంతుత్వం నించి దూరం చేసింది. ఆ శ్రమని వదులుకున్న మానవుడు దోపిడీదారుడై జంతు స్థాయిలోకి పోయాడు. జంతువు, తన శత్రు జంతువుని వేటాడినట్టు, శ్రమని వదులుకున్న మానవుడు, శ్రమ చేసే మానవుణ్ణి వేటాడటం మొదలుపెట్టాడు. మానవుడికీ మానవుడికీ మధ్య 'శత్రు సంబంధం' ప్రారంభమైంది. శ్రమని దోచడమే మానవుల మధ్య వర్గాల్నీ, వర్గ పోరాటాల్నీ సృష్టించింది. ఈ పోరాటమే ఒకప్పటికి మానవుల మధ్య శత్రు సంబంధాల్ని రద్దు చెయ్యగల సమాజానికి దారితీస్తుంది. — ఈ చరిత్ర మార్గాన్నంతా గ్రహించిన మార్క్స్, అప్పటికి అనేక తప్పుల తోటీ, వైరుధ్యాల తోటీ వున్న అర్థ శాస్త్రం నించీ, తత్వ శాస్త్రం నించీ, సమసమాజ (కమ్యూనిస్టు) భావనల నించీ, నిజమైన వాటినీ, సరియైన వాటినీ, శ్రమ దోపిడీని రద్దు చెయ్యగల వాటినీ స్వీకరించి; అబద్ధమైన వాటినీ, కృత్రిమమైన వాటినీ, శ్రమ దోపిడీని స్థిర పరిచే వాటినీ తిరస్కరించాడు.

'శ్రమ దోపిడీ రహస్యం' మార్క్సు ద్వారానే బైట పడింది. సమాజంలో అతి తక్కువ మందికి భోగ భాగ్యాలూ, అతి ఎక్కువ మందికి పేదతనమూ ఎందుకు వున్నాయో — ఆ రహస్యం అప్పటి వరకూ ఏ ఆర్థిక వేత్తలకూ తత్వవేత్తలకూ అర్థం కాని విషయం.

తన పరిశోధన ఫలితంగా కళ్ళబడ్డ సత్యంతో మార్క్సు శ్రామిక పక్షాన నిలిచిన మొట్ట మొదటి ఆర్థికవేత్త అయ్యాడు. ఆ దశ నించి, ఆర్థిక శాస్త్రం, 'పెట్టుబడి దారుల ఆర్థిక శాస్త్రం'గానూ, 'శ్రామికుల ఆర్థిక శాస్త్రం'గానూ స్పష్టంగా విడిపోయింది. ఆర్థిక శాస్త్రం, మార్క్సు దగ్గిర, 2 మార్గాల్లోకి చీలక తప్పలేదు.

శ్రామికుల ఆర్థిక శాస్త్రం — దోపిడీని రద్దు చేసే లక్ష్యంతో విప్లవ మార్గంలోకీ, పెట్టుబడిదారుల ఆర్థిక శాస్త్రం — దోపిడీని రద్దు కానివ్వని లక్ష్యంతో విప్లవ వ్యతిరేక మార్గంలోకీ సాగుతున్నాయి.

'శ్రమ దోపిడీయే లాభానికి మూలం' అనే నిజం బైట పడ్డాక కూడా — పెట్టుబడి వుంది! లాభాలూ, వడ్డీలూ, భూమి అద్దెలూ అన్నీ వున్నాయి! వాటిని సమర్థించే ఆర్థికవేత్తలూ వున్నారు!

ఇప్పుడు మళ్ళీ మనం 'పెట్టుబడిదారుడి' దగ్గిరికి వెళ్దాం.

# 7 జేబుల పెట్టుబడిదారుడు!

ఒక ఉత్పాదక పెట్టుబడిదారుడికి స్వంత పెట్టుబడీ, స్వంత భూమీ, స్వంత వ్యాపారపు ఏర్పాట్లూ — వగైరాలన్నీ వుంటే, అదనపు విలువలో ఒక్క పైసా కూడా ఎటూ పోకుండా అంతా వాడి జేబుల్లోనే సర్దుకుంటుంది. అప్పుడు వాడికి 7 జేబులు వుంటాయి.

(1) వర్తక లాభం జేబు (2) వడ్డీ జేబు (3) భూమి అద్దె జేబు (4) ఎగ్గొట్టిన పన్నుల జేబు (5) ఎగ్గొట్టిన బిల్లుల జేబు (6) ప్రభుత్వ ఖజానా నించి లాగిన మొత్తాల జేబు (7) చివరికి, ఉత్పాదక లాభం జేబు. — ఈ రకంగా, 'అదనపు విలువ' నంతా తనలోనే లీనం చేసుకోగలవాడు 'సంపూర్ణ' పెట్టుబడిదారుడు. 'పెట్టుబడికి విశ్వరూపం' వీడు! వీడే ఉత్పాదక పెట్టుబడిదారుడు! వీడే వర్తక పెట్టుబడిదారుడు! వీడే వడ్డీ పెట్టుబడిదారుడు! వీడే భూముల దొర! వీడే ప్రభుత్వ ఆదాయం తినే అధికారి! వీడే ఇదీ, వీడే అదీ! వీడే, వీడే, సమస్తమూ వీడే! అందుకే, పెట్టుబడికి విశ్వరూపం వీడు! పెట్టుబడి, తన వెయ్యి రూపాలతో, వెయ్యి హస్తాలతో, వెయ్యి దంతాలతో, వీడి ద్వారా దర్శనమిస్తుంది! చిన్న పెట్టుబడిదారులందరికీ వీడే లక్ష్యం! వీడే గమ్యం! వీడే ఆదర్శం!

కానీ, ఈ దశకు చేరడానికి సాధారణ పెట్టుబడిదారుడు చాలా "కృషి" చెయ్యాలి.

పెట్టుబడిదారుడికి మొదట్లోనే, స్వంత పెట్టుబడులూ, స్వంత భూములూ, స్వంత వ్యాపార సంస్థలూ వగైరాలన్నీ వుండవు. ఒక పెట్టుబడిదారుడికి 'ఉత్పాదక లాభం' జేబు ఒక్కటే వుంటే, పాపం వాడు చాలా బీద పెట్టుబడిదారుడన్న మాట! వాడు చొక్కా కుట్టించుకునే టప్పుడు 7 జేబులూ కుట్టించుకుంటాడు, చొక్కా చిరిగే లోగా సంపూర్ణ పెట్టుబడిదారుణ్ణి కాలేకపోతానా అనే నమ్మకంతో! పాపం వాడి బీద జేబులన్నీ — "భవిష్యత్తులో నిండకపోతామా?" అని చాలా ఆశతో నిరీక్షిస్తూ వుంటాయి. నిజంగానే, అలాగే జరుగుతుంది కూడా. 'పెట్టుబడి' అనేది తన కార్యక్రమం ప్రారంభించిందీ అంటే, సాయంత్రానికే కొంత 'అదనపు విలువ'ని సంపాదిస్తుంది. రేపు సాయంత్రానికి మరి కొంతనీ! ఇక, ఆ కొంతలకు అవరోధాలేవీ వుండవు. పెట్టుబడిదారుడు, కొంచెం ఓర్పుతో, పట్టుదలతో, చాకచక్యంతో పరిశ్రమని నిర్వ హిస్తూపోతే, కొంతకాలానికి వాడికి స్వంత పెట్టుబడీ, స్వంత భూమీ వగైరాలన్నీ ఏర్పడతాయి. క్రమంగా వాడి అన్ని జేబులూ బలవడం మొదలు పెడతాయి. ఇవన్నీ జరుగుతాయని పెట్టుబడిదారుడి ప్రతీ జేబుకీ మొదటే తెలుసు. పెట్టుబడిదారుడి జేబు ఎప్పుడూ ఆశావాదే. అది తన సమీప భవిష్యత్తు మీద ఆశతో కలలు కంటూ వుంటుంది.

కానీ, మన బట్ట పెట్టుబడిదారుడు, పాపం ఇప్పుడు ఇంకా బీదవాడే. 20 అదనపు విలువలో చాలా భాగాలు అందరికీ పంచేశాక వాడికి 8 మాత్రమే మిగిలింది కదా? అది చూసి వాడి ఆర్థికవేత్త "ఇన్ని ఖర్చులు పోతే ఇంకేం మిగులుతుంది? 8 మిగలక 20 మిగులుతుందా?" అని చాలా నిట్టూర్చాడు. ఈ ఆర్థికవేత్త అప్పుడప్పుడూ తన పెట్టుబడిదారుడి ఇక్కట్లకు చలించిపోయి కళ్ళనీళ్ళు కూడా పెట్టుకుంటూ వుంటాడు. ఈయనకి, ఎందుచేతో గానీ ఉత్పాదక పెట్టుబడిదారుడి ఆదాయం మీదే ఎక్కువ మక్కువ.

సరుకులో వున్న అదనపు విలువ 20 య్యే. అందులో నించి ఉత్పాదక లాభం బాగా మిగలాలంటే, మిగతా భాగాలన్నీ బాగా తగ్గవలసిందే కదా? ఎవరు లాక్కున్నా ఆ 20లో నించి లాక్కోవలిసిందే కదా? 'మిగతా వాటాలన్నీ తగ్గే మార్గం ఏమిటబ్బా?' అని ఉత్పాదక ఆర్థిక వేత్త తెగ ఆలోచిస్తాడు.

కానీ, ఆలోచనలన్నీ వాడి సొత్తే కాదుగదా? అవి వాడి తోటి వేత్తల సొత్తులు కూడా గదా? 'అదనపు విలువ' ఎన్ని రకాలుగా చీలుతుందో, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు అన్ని రకాలుగా చీలుతారు. ఒకరు ఉత్పాదక పెట్టుబడిదారుడి మంచిచెడ్డలు కాంక్షిస్తే, ఒకరు వడ్డీ పెట్టుబడిదారుడి యోగక్షేమాలు యోచిస్తారు. ఒకరు వర్తక పెట్టుబడిదారుడి గురించీ, ఇంకోరు భూస్వామి గురించీ, కష్టసుఖాలు కనుక్కుంటూ వుంటారు. ఈ ఆర్థికవేత్త లందరివీ 'వెన్నల్లాంటి' మనసులు. తమ వారికి లాభాలు తక్కువైనా, వడ్డీలు తక్కువైనా, వెంటనే కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ వుంటారు. తమ వారి ఆదాయాలు పెరిగే మార్గాలేమైనా వున్నాయేమోనని యోచిస్తూ, ఒకడి బేబులో వాటా ఒకడి జేబులోకి (అందులో కొంత తమ జేబులోకి) మారే మార్గాలు ఊహిస్తూ, నూతన సిద్ధాంతాలు సృష్టిస్తూ, కాలక్షేపాలు చేస్తూ వుంటారు.

'అదనపు విలువ'తోపాటు చీలేది ఆర్థికవేత్తలు ఒక్కళ్ళే కాదు. తత్వవేత్తలూ, కళావేత్తలూ, ఈ వేత్తలూ, ఆ వేత్తలూ, 'వేత్తల'నే వాళ్ళు ఎక్కడెక్కడ వుంటారో అక్కడక్కడల్లా వాళ్ళు రక రకాలుగా చీలుతారు. అందరూ పైకి ఒకే రకంగా 'వినపడినా', వాళ్ళ వాదాల్ని లోపలికి దిగి చూస్తే, ఎవడు ఎవణ్ణి ప్రత్యేకంగా గానం చేస్తున్నాడో చక్కగానే తెలిసిపోతుంది.

కొత్తగా పరిశ్రమ పెట్టి, అప్పుడప్పుడే 'ఎదుగుతోన్న' ఉత్పాదక పెట్టుబడిదారుడికి, ఇలా వడ్డీలూ, కౌళ్ళూ, కమిషన్లూ చెల్లించాలంటే, మాచెడ్డ 'బాధ'గా వుంటుంది. వాడి బాధని వాడి ఆర్థికవేత్త తీసేసుకుని ఆ బాధంతా తనే పడతాడు. "వడ్డీలేని పెట్టుబడి వుండకూడదా? అద్దె లేని భూమి వుండకూడదా?" అని మొదట ఆ ఆర్థికవేత్త, వడ్డీల మీదా, కౌళ్ళ మీదా చాలా దురుసుగానే ఎదురు తిరుగుతాడు. కానీ, అవన్నీ త్వరలో తమ జేబుల్లోకే రాబోయే రోజులు మదిలో మెదిలి పరాయి వడ్డీల మీదా, పరాయి భూమి అద్దెల మీదా విరుచుకుపడే ఉత్సాహాన్ని కొంచెం ఆపుకుని, ప్రస్తుతం ఆ ఖర్చుల్ని తగ్గించడానికి ఏమన్నా మార్గాలున్నాయా — అని ఆలోచన మొదలు పెడతాడు.

"వడ్డీ అంత ఇవ్వాలా? తగ్గించేస్తే? భూమి అద్దె అన్నా తగ్గించేస్తే?...... అది తగ్గించేస్తే? ఇది తగ్గించేస్తే?" అనే తగ్గింపుల ఉపాయాలతో సతమత మవుతాడు. ఈ ఉపాయాలు మిగతా వాళ్ళందరికీ తెలిసిపోతాయి. తెలిసిపోయి అందరికీ అందులో అపాయాలు కనపడి కోపాలొస్తాయి. "ఏమిటీ నీ కుట్రలు! వడ్డీ తగ్గించెయ్యాలా? వడ్డీకి అంతెందుకా? మేం డబ్బు అప్పివ్వకపోతే దేంతో పెడతావు నీ 'పరిశ్రమ'?" అని వడ్డీ పెట్టుబడిదారుడి కుర్చీ వెనకాల నించున్న ఆర్థికవేత్త, పెద్ద పాయింటు లేవతీస్తాడు.

ఇంకో పక్క, భూస్వామి పరుపుల పీఠం పక్క వొంగున్న ఆర్థికవేత్త కూడా చాలా వెటకారంగా — "మా భూమి లేకపోతే నీ 'ప....రి....శ్ర....మ' ఎక్కడ పెడతావు? గాలిలోనా? భూమి అద్దె తగ్గించాలంటావా?" అని కళ్ళెర్ర జేస్తాడు.

"కమిషన్ కూడా తగ్గించాలని ఆలోచిస్తున్నావే! మేం అమ్మకపోతే సరుకు తయారుచేసి ఏం చేసుకుంటావు?" అని వర్తకుడి ఆర్థికవేత్త చాలా విస్తుపోతాడు.

ఎవ్వరి ప్రశ్నల్నీ లెక్క చెయ్యనట్టు 'ఉత్పాదక' ఆర్థికవేత్త చాలా నిర్లక్ష్యంగా అందరికీ ఒకటే సమాధానంగా "మేం కష్టపడి సరుకుని ఉత్పత్తి చేయించకపోతే ఎక్కడుంటారు మీరంతా? మేం 'దివాళా' తీస్తే ఏం పంచుకుంటారు మీరంతా? మాకు మంచి లాభం మిగిలితేనే కదా పరిశ్రమ నిలిచేది?" అని అందరి మీదకీ ఉమ్మడి ప్రశ్నలు విసిరి, తన పెట్టుబడిదారుడి వేపు "బాగా చెప్పానా?" అన్నట్టు, ఆయన మెప్పు కోసం వినయంగా చూస్తూ తల వాలుస్తాడు.

ఉత్పాదక పెట్టుబడిదారుడు కొంచెం గంభీరుడు! వీడు ఎప్పుడంటే అప్పుడు మాట్లాడడు. వీడిమీద వీడికి చాలా గౌరవం. వీడు కాని వాళ్ళ మీద వీడికి కొంచెం చిన్న చూపు. భూస్వామి అయితే చాలా మొరటువాడనీ, వాడు భూమి అంతా ఆక్రమించుకుని కూర్చుని భూమిని ఉత్సాహంగా ఉపయోగించనివ్వకుండా చేస్తున్నాడనీ, ఈ పెట్టుబడి దారుడికో అభిప్రాయం. 'వడ్డీల' వాడైతే సోమరిగా కూర్చుని డబ్బు లాగుతూ వడ్డీల చీదరతో అప్పు అంటేనే భయం పుట్టేలాగ చేస్తున్నాడని 'ఉత్పాదక' వాడికి ఇంకో అభిప్రాయం. 'వర్తకుడి' మీదా అలాంటి చిన్న చూపే. తను మాత్రం చాలా 'పరిశ్రమిస్తాన'నీ, మానవ సమాజానికి తను చాలా 'సేవ చేస్తున్నాన'నీ, వాడి గాఢాభిప్రాయం.

కానీ, వడ్డీలూ, భూమి అద్దెలూ, వర్తక కమిషన్లూ ఎంత చీదరో, 'లాభమూ' అంత చీదరే — అని వాడికి తెలీదు. వాడికి తెలీదు కాబట్టి ఆ సంగతి వాడి ఆర్థికవేత్తకి కూడా తెలీదు. పెట్టుబడిదారుడికి తెలిస్తేనేకదా వాణ్ణి చూసి వాడి ఆర్థికవేత్త తెలుసుకునేది? ఆర్థికవేత్త తెలుసుకోలేకపోయాడు కాబట్టి వాడా సంగతి పెట్టుబడిదారుడికి చెప్పడు. ఆర్థికవేత్త చెప్పలేదు కాబట్టి, ఆ సంగతి పెట్టుబడి దారుడికి తెలీదు. మొత్తం మీద 'లాభం కూడా చీదరేనని' వాళ్ళిద్దరికీ తెలీదు.

ఉత్పాదక పెట్టుబడిదారుడు ఎప్పుడూ తన 'దేశ సేవ'ని గురించే తలపోస్తూ వుంటాడు. ఎప్పటిలాగే మన బట్ట పెట్టుబడిదారుడు తన తలపోతల్లో మునిగి వున్నాడేమో, తన ఆర్థికవేత్త మాటలకు 'గంభీరంగా' చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

ఎవరు చిరునవ్వు నవ్వినా కంపరం పుడుతుంది భూస్వామికి. "చిరునవ్వులేమిటి ఇక్కడ?" అని మొహం చిట్లిస్తూ విసుక్కున్నాడు ఆయన.

"చిరునవ్వా?" అని వడ్డీ పెట్టుబడిదారుడు హఠాత్తుగా ఏదో పనిబడ్డట్టు గబగబా ఆలోచనలో మునిగాడు. అటు నించి ఒక చిరునవ్వు కళ్ళబడితే, ఇటు నించి ఒక చిరునవ్వు వెళ్ళాలి కదా? కానీ, వడ్డీల వాడికి అలా జరగదు. ఇంకోలా జరుగుతుంది. "ఒక చిరునవ్వుకైతే .... నెలకీ.... నూటికీ .... 3 చొప్పున, 12 నెలలకీ.... నూటికీ.... 6 చొప్పన, .... నెలకీ.... నూటికీ... 16 చొప్పున..." అలా వాడి మెదడు ఏవేవో లెక్కలు కట్టెయ్యడం మొదలుపెట్టింది. వాడి పరిస్థితి ఎప్పుడూ అంతే. వాడి గుండె ఎప్పుడూ "నెలకీ...నూటికీ...నెలకీ... నూటికీ..." అని కొట్టుకుంటూ వుంటుంది.

ఆర్థికవేత్తలు నలుగురూ మళ్ళీ ఎవరి జవాబులు వాళ్ళు చెప్పారు. ఎవరి వాదాలు వాళ్ళు చేశారు. ఎన్ని చుట్లు తిరిగినా, ఎవ్వరూ ఎవ్వరి వాదం నించీ ఒక్క అంగుళం కూడా కదలరు. అరుచుకుంటారు. తిట్టుకుంటారు. 'నువ్వెంత' అంటే, 'నువ్వెంత' అనుకుంటారు.

"మానవ సమాజానికి 'ఉత్పాదక పరిశ్రమ' ఎంత అవసరమో నేనో పుస్తకం రాస్తున్నాను. అది వచ్చాక

చదువుకో!" అంటాడు ఒకడు.

"భూమి ఎంత అవసరమో నేను పుస్తకం రాసే వుంచాను. ముందు అది చదువు నువ్వు!" అంటాడు ఇంకోడు.

వడ్డీ పెట్టుబడిదారుడు కొంప మునిగిపోయినట్టు తన ఆర్థికవేత్త వేపు "మన కోసం నువ్వేం రాయలేదా?" అన్నట్టు చూస్తాడు. ఆ ఆర్థికవేత్త హడలిపోయి, "....అయిపో వచ్చింది, అయిపోవచ్చింది" అని, ఆ కంగారులో చేతులు ఎక్కడ పెట్టుకోవాలో తెలీక వడ్డీల వాడి మొహానికి కొట్టబోయి, వెనక్కి లాక్కోబోయి, కిందా మీదా అయ్యి, చేతులు బార్లాగా జాపి వదిలేశాడు. అసలు 'మొదలే పెట్టని' పుస్తకం ఎలా 'అయిపోవొస్తుందో' తెలీక, వడ్డీల వాడు నిర్ఘాంతపోతూ, వాడి చేతి తాపులు కూడా ఎందుకు లెమ్మని వెనక్కి జరిగి మొహం చిట్లించు కున్నాడు.

ఈ వాద వివాదాల్లో ఒక్కడు కూడా "శ్రామికుడు" అన్న మాట ఎత్తరు. 'మా అప్పు', 'మా పెట్టుబడి', 'మా భూమి' అనే మాటలు తప్ప, 'శ్రమ' అనేమాట ఒకటి వుందని వాళ్ళు ఎరగరు!

'అదనపు విలువ'ని పంచుకోవడానికే ఈ కుమ్ములాట లన్నీ. ఎవడి భాగం కోసం వాడికి తాపత్రయం. ఎవడికి ఎక్కువ రావాలన్నా పక్క వాడి జేబులు కొట్టవలిసిందే. ఒకడి జేబులోంచి ఒక పైసా తగ్గితేనే, ఇంకోడి జేబులో ఒక పైసా పెరుగుతుంది. ఎవడికి ఏది రావాలన్నా అదనపు 'విలువ'లో నించి రావలిసిందే. అందుకే, ఒకడి మీదకి ఒకడు కత్తులూ బాకులూ తీస్తారు. ఒకడి పీక ఒకడు పర పరా కోసేసుకోవడానికి సిద్ధపడిపోతారు.

'సమాజం'లో వుండే ఉత్పాదక పెట్టుబడిదారులంతా ఒక గుంపు! ఈ గుంపుని 'సెట్' అనండి, 'సెక్షన్' అనండి, ఏదన్నా అనండి. మాటలో ఏమీ లేదు. దాని అర్థం ముఖ్యం. వర్తక పెట్టుబడిదారులంతా ఒక గుంపు! వడ్డీల వాళ్ళంతా ఒక గుంపు! భూమి కౌళ్ళవాళ్ళు ఒక గుంపు!, ఈ గుంపుల్లో ఏ గుంపు బాధలు ఆ గుంపువి. ఏ గుంపు లాభ నష్టాలు ఆ గుంపువి. ఏ గుంపు ప్రయోజనాలు ఆ గుంపువి.

గుంపుని 'సెక్షన్' అందాం. ఉత్పాదక పెట్టుబడి దారులంతా ఒక 'సెక్షన్' అన్నాం కాబట్టి, ఆ సెక్షన్ చాలా ఐకమత్యంగా వుంటుందని అర్థం కాదు. ఆ సెక్షన్‌లో మళ్ళీ అనేక చిన్న చిన్న బృందాలు! ఆ బృందాల మధ్యా ఘర్షణలు! ఒక్కొక్క బృందంలో కొందరు విడి విడి పెట్టుబడిదారులు. ఆ విడి విడి పెట్టుబడిదారుల మధ్య కూడా ఘర్షణలు! సరుకుల్ని అమ్ముకోవడంలో వచ్చే పోటీల వల్లనే ఈ ఘర్షణలు!

వర్తక పెట్టుబడిదారుల సెక్షన్‌ని తీసుకుంటే, అదీ అంతే. అందులో మళ్ళీ చిన్న చిన్న బృందాలూ, ఒక్కో బృందంలోనూ విడి విడి వ్యాపారులూ.

వడ్డీ పెట్టుబడిదారుల సెక్షన్ సంగతీ అంతే; భూస్వాముల సెక్షన్ సంగతీ అంతే.

ప్రతీ ఇద్దరి మధ్యా ఘర్షణ! ప్రతీ 2 బృందాల మధ్యా ఘర్షణ! ప్రతీ రెండు సెక్షన్ల మధ్యా ఘర్షణ! ఇదంతా ఎందుకంటే, వాళ్ళ దాకా అందవలసిన 'అదనపు విలువ'లో భాగాల కోసం.

ఈ భాగాల ద్వారా 'ఆదాయాలు' పొందే వాళ్ళు, ఏదో ఒకే ఒక సెక్షన్‌కే చెంది వుంటారని అర్థం కాదు. ఒకడికి భూమి అద్దె ద్వారా కొంత ఆదాయమూ, వడ్డీల ద్వారా కూడా కొంత ఆదాయమూ రావచ్చు. వాడు భూస్వామీ అవుతాడు, వడ్డీ పెట్టుబడిదారుడూ అవుతాడు. ఇంకోడికి 'కమీషన్ల' ద్వారానూ, 'వడ్డీల' ద్వారానూ రావచ్చు.

ఒకడికి ఆదాయం నాలుగైదు మార్గాల ద్వారా కూడా రావచ్చు. అలాంటప్పుడు వాడు ఏ సెక్షన్‌కి చెందిన వాడవుతాడు? ఒకడికి వచ్చే మొత్తం ఆదాయంలో, ఏ మార్గం ద్వారా ఎక్కువ ఆదాయం వుంటుందో, వాడు ప్రధానంగా ఆ సెక్షన్‌కి చెంది వుంటాడు. ఆ సెక్షన్‌కి సంబంధించిన ప్రయోజనాలవేపు మొగ్గుగా వుంటాడు.

అంటే, 'అదనపు విలువ'లో భాగాలు పొందే ప్రతీ ఒక్కడూ ప్రధానంగా ఏదో ఒక 'సెక్షన్'లో ఇమిడి వుంటాడు. ఇతర సెక్షన్లతో ఘర్షణలో వుంటాడు. ఆ ఇతర మార్గాలలో కూడా తనకు కొంత కొంత ఆదాయం వున్నప్పటికీ, తన ఆదాయానికి అవి ప్రధాన మార్గాలు కావు కాబట్టి.

ఎవడి లాభం కోసం వాడు కత్తులూ, బాకులూ, తుపాకులూ తీసి కుమ్ములాడుకునే ఈ దోపిడీ దొంగ లంతా ఒక్కోసారి హఠాత్తుగా 'ఐక్యం' ఐపోతూ వుంటారు. ఒకడి సరసన ఒకడు 'గోడలో ఇటికలున్నంత ఐక్యంగా' (ఇది మార్క్స్ వర్ణనే) నిలబడుతూ వుంటారు. ఎప్పుడో తెలుసా? —శ్రామికులతో ఘర్షణ వచ్చినప్పుడు!

శ్రామికులకు ఉత్పాదక పెట్టుబడిదారుడితోటే డైరెక్టు సంబంధం ఉంటుంది. శ్రామికులు, ఆ పెట్టుబడిదారుడి దగ్గరే పని చేస్తారు. వాడి నించే జీతాలు తీసుకుంటారు. అంతా వాడితోటే సంబంధం. అదనపు విలువలో భాగాల్ని ఎవరెవరు పంచుకుంటారో వాళ్ళందరితోటీ శ్రామికులకు పని స్థలంలో సంబంధాలు వుండవు. శ్రామికులు ఏ విషయంలోనైనా ఘర్షణ పడితే, ఉత్పాదక పెట్టుబడి దారుడితోటే పడతారు. అప్పుడు దోపిడీ వాటాదార్లంతా ఉత్పాదక పెట్టుబడిదారుడికి దన్నుగా నిలబడతారు. అందరూ కలిసి శ్రామికుల మీద ఘర్షణకు దిగుతారు. ముందు ఉత్పాదక పెట్టుబడిదారుడి పరిశ్రమ వ్యవహారం

తిన్నగా నడిస్తేనే కదా తమ జేబులు నిండేది? శ్రామికులతో ఘర్షణ వచ్చినప్పుడు, ఉత్పాదక పెట్టుబడిదారుడి ప్రత్యేకత ఏమిటో మిగతావాళ్ళకి బాగానే తెలుస్తుంది. అందుకే వాళ్ళంతా వాడి చుట్టూ అంత ఐక్యంగా నిలబడతారు.

ఈ ఉత్పాదక పెట్టుబడిదారుడు నిజానికి మిగతా వాళ్ళందరి కన్నా చిన్నవాడు. 'దోపిడీ కుటుంబ చరిత్ర'లో వీడు 'కడగొట్టువాడు'. భూస్వామీ, వర్తకుడూ, వడ్డీల వాడూ, వీడి కన్నా ముందే పుట్టారు. ఉత్పాదక పెట్టుబడిదారుడు పుట్టక ముందు నించీ వాళ్ళు వున్నారు. అప్పుడు వాళ్ళు ఎవరికి వాళ్ళు విడి విడిగా పాపం 'స్వంత కృషి'తో భూమి అద్దెలూ వడ్డీలూ, వర్తక లాభాలూ లాగుకుంటూ వుండేవాళ్ళు. ఉత్పాదక పెట్టుబడిదారుడు పుట్టాక, వీడు చాలా త్వరత్వరగా చకచకా ఎదిగొచ్చాడు. అన్నల్ని చూసి "ఇన్నాళ్ళూ మీరు దోపిడీ పని చాలా బాగానే నడుపుకొచ్చారు. ఇంకా మీకు కష్టం ఎందుకు? మీ అందరి బాధ్యతా నేను తీసుకుంటాను. మీ వడ్డీలకీ, అద్దెలకీ, కమిషన్లకీ, నా లాభానికీ కావలసినంత మొత్తం నేను లాగుతాలెండి. మీరు విశ్రాంతులు తీసుకోండి!" అంటాడు. అంతకుముందు కూడా వాళ్ళు పడ్డ 'కష్టం' ఏమీలేదు గానీ, ఆ 'కష్టం లేకపోవడం'లో కూడా ఇదో మార్పు.

ఉత్పాదక పెట్టుబడిదారుడు ఏ నాడైతే 'చరిత్ర'లో కాలుపెట్టాడో ఆ నాటి నించీ దోపిడీకి కేంద్రం వాడే. అందరికీ కావలసిన 'అదనపు విలువ'ని ఉత్పత్తి చేయించే ఘనుడు వాడే. వీడికి పెట్టుబడిని అప్పు ఇచ్చేది ఒకడూ; భూమిని అద్దె కిచ్చేది ఒకడూ; సరుకుని అమ్మిపెట్టేది ఒకడూ! అందరూ వీడికి సాయం. అందరికీ వీడు సాయం. వీళ్ళంతా — వాళ్ళల్లో వాళ్ళు కుమ్ములాడుకుంటూనూ వుంటారు; మళ్ళీ జట్టు అయిపోతూనూ వుంటారు. అందుకే వీళ్ళు 'శతృ సోదరులు.' ( ' హాస్టయిల్ బ్రదర్స్' — ఇది మార్క్సు వర్ణనే ! ) ఈ శతృ సోదరుల సెక్షన్లన్నీ కలిసిన మొత్తమే ఆ సమాజంలో 'దోపిడీ వర్గం'! అంటే, పెద్ద దోపిడీ దొంగల గుంపు! దీనికి వ్యతిరేకమైనది "శ్రామిక వర్గం". శ్రామిక వర్గానికీ, దోపిడీ వర్గానికీ వుండే సంబంధం పూర్తిగా శతృ సంబంధం. అది 'శతృ వర్గాల' సంబంధం.

'అదనపు విలువ'ని ఉత్పత్తి చేయించేవాడు ఉత్పాదక పెట్టుబడిదారుడే కాబట్టి, దాన్ని పంచుకునే వాళ్ళందరికీ ప్రతినిధి వాడే. అంటే, 'దోపిడీకి ప్రతినిధి' వాడే. అందుకే మన పరిశీలన చాలా దూరం వరకూ వాడి మీదే సాగుతుంది. అయినా వాడి గురించి మనం ఏ మాట అన్నా అది వాళ్ళ గుంపులో ప్రతి ఒక్కడికీ వర్తిస్తుంది.

## 'అదనపు విలువ సిద్ధాంతం' కన్నా ముందూ, తర్వాతా

'అదనపు విలువ సిద్ధాంతం' బయటపడిన తర్వాత కూడా, లాభాల్నీ — వడ్డీల్నీ — భూమి అద్దెల్నీ తిరస్కరించ కుండా, ఇంకా వాటిని సమర్థిస్తూ రాసే ఆర్థికవేత్తలంతా దొంగలు. మార్క్సుకన్నా వెనకటి ఆర్థికవేత్తల్నీ, ఈ దొంగల్నీ ఒకే గాటిన కట్టకూడదు. 'అదనపు విలువ' గురించి తెలియని కాలంలో వున్న ఆర్థికవేత్తలందరికీ ఒక 'క్షమాపణ' దొరుకుతుంది. కానీ, ఆ ఆర్థికవేత్తల్లో కూడా ఒక తేడా వుంది. 'దోపిడీ' గురించి తెలియకపోయినా కూడా, మొదటి నించీ 'శ్రామికుల పక్షాన' నిలిచిన వాళ్ళూ వున్నారు; నిలవని వాళ్ళూ వున్నారు. దోపిడీ గురించి తెలియకపోయినా, లోకంలో కలిమి లేములు కనపడు తూనే వుంటాయి. లేమిలో వున్న వాళ్ళు బాధల్లో వుండడం కనపడుతూనే వుంటుంది. 'బాధ'ని చూడడానికి హృదయం ముఖ్యం గానీ, జ్ఞానం ముఖ్యం కాదు. మనుషులు దోషులయ్యేది, హృదయం లేనందుకే గానీ, జ్ఞానం లేనందుకు కాదు.

దోపిడీ గురించి తెలియని కాలంలో కూడా చాలా మంది ఆర్థికవేత్తలు శ్రామికుల పట్ల ప్రేమతో శ్రామికుల శ్రేయస్సుని కాంక్షిస్తూ సిద్ధాంతాలు ప్రతిపాదించారు. ఆ సిద్ధాంతాల్లో లక్ష తప్పులు వుండవచ్చు గాక. వారి సిద్ధాంతాలు వారి హృదయ సంస్కారాన్నీ, మానవత్వాన్నీ ప్రతి బింబించాయి. అంతే కాదు, అవి ఉన్నతమైన జ్ఞానానికి కూడా మార్గాన్నిచ్చాయి.

లాభాల, వడ్డీల, భూమి అద్దెల రహస్యమేమిటో మార్క్సు బట్టబయలు చేసే దాకా ఆ విషయం, దోపిడీదారు లకూ, శ్రామికులకూ కూడా కొత్త విషయమే. లాభాల, వడ్డీల, అద్దెల మూలం శ్రమ దోపిడీయే — అనే సత్యం ఎప్పుడు బయటపడిందో అప్పుడు దోపిడీ దొంగల నెత్తిన పిడుగు పడింది.

"లాభాన్నిచ్చేది 'పెట్టుబడి' కాదా? పనివాళ్ళా! పనివాళ్ళా లాభాన్నిచ్చేది! పనివాళ్ళా వడ్డీ ఇచ్చేది! పనివాళ్ళా భూమి అద్దె ఇచ్చేది! ఈ మాటలన్నీ పనివాళ్ళకి కూడా తెలిసిపోలేదు కదా!" అని నిర్ఘాంతపోతారు వాళ్ళంతా. అందరి నిర్ఘాంతాలూ ఒక ఎత్తూ, ఉత్పాదక పెట్టుబడి దారుడి నిర్ఘాంతం ఒక్కటే ఒక ఎత్తూ! వడ్డీలూ, అద్దెలూ, లాభాలూ, అన్నీ స్వాహా చేసే అవకాశం వాడికొక్కడికే వుంది.

మార్క్సు పేరు చెవిన పడగానే మన బట్ట పెట్టుబడి

దారుడు మండిపడిపోయాడు. తన ఆర్థికవేత్తని పిలిపించి, వాడింకా గుమ్మంలోకి రాకుండానే వాడి మీద విరుచుకు పడ్డాడు. "ఏమిటీ, మార్క్సు అనీ పనికిమాలిన వాడెవడో వున్నాడట! వాడేదేదో రాసేస్తున్నాడట! వాడి సిద్ధాంతం అంతా తప్పని రాయవేం నువ్వు?" అని అరిచాడు. ఆర్థికవేత్త మీద అప్పటి వరకూ చూపే మర్యాద అంతా గంగలో కలిసింది.

"అదే ఆలోచిస్తున్నా. ఆ వాదాలన్నిటికీ ఏం జవాబులు చెపుదామా అని...." వొణుక్కుంటూ నించున్నాడు ఆర్థికవేత్త.

"ఇంకా ఆలోచిస్తున్నావా? పనివాళ్ళకి జీతాలు పూర్తిగా ఇవ్వకుండా ఎగ్గొడతామని రాస్తాడట వాడు! జీతాలు తక్కువిస్తే వాళ్ళెందుకు పని చేస్తారు? వాళ్ళేం పిచ్చివాళ్ళా?"

"చెయ్యకేం చేస్తారులెండి! వాళ్ళకి బతుకు తెరువేదీ? శ్రమ సాధనాలన్నీ వాళ్ళకి లేకుండా పోవడం వల్లనే వాళ్ళు వేతన శ్రామికులయ్యా రంటాడు మార్క్స్. ఆ పాయింటు మాత్రం చాలా చక్కగా చెప్పాడు లెండి..." — ఎంతైనా ఈ ఆర్థికవేత్త కాస్త 'శాస్త్రం' చదివి మిడికినవాడు కాబట్టి, మార్క్స్ రాసినదంతా చదువుతూ అక్కడక్కడా ఆ రచనా శక్తికీ, ఆ తర్కానికీ, ఆ హేతుబద్ధతకీ, మెప్పు ప్రకటించ కుండా వుండలేకపోయాడు. చాలా కాలం నించి 'ఆర్థిక శాస్త్రం'లో కొరుకుడు పడకుండా వుండిపోయిన సమస్య లన్నీ తేలిగ్గా విడిపోయినట్టు కనపడ్డాయి. "ఓహో! లాభానికి కారణం ఇదా? ఓహో! అదనపు విలువ ఉత్పత్తి అవుతోందా పని స్థలంలో?" అంటూ, సైన్సులో కొత్త అంశాలు దొరికినట్టు వాడు చాలా ఆశ్చర్యపోయాడు. "అవును, ఈ సిద్ధాంతాన్ని కాదనడం కష్టమే. ఏం జవాబు చెప్పగలం దీనికి? ఇక మార్క్స్‌కి 'కీర్తి' వచ్చేస్తుంది కాబోలు!" అని కడుపులో చాలా అసూయపడ్డాడు కూడా, అదంతా చదివినప్పుడు.

మార్క్సు చెప్పిందంతా సబబుగా వుందని ఈ ఆర్థిక వేత్తకి నమ్మకం కలిగితే — "అవును, మార్క్సు చెప్పిం దంతా సత్యమే. నా పాత అభిప్రాయాలన్నీ మార్చు కుంటున్నాను. ఇక నించి నేను 'శ్రామిక వర్గం' పక్షాన్నే నిలబడదలిచాను" అనాలి కదా? అందుకు మాత్రం సిద్ధంగా లేడు ఆయన. మార్క్సు పుస్తకంలో చదివిన సంగతులన్నీ మళ్ళీ గుర్తొచ్చి, తనకు చాలా గొప్ప విషయాలు తెలుసు అన్నట్టు — "శ్రామికుడు, శ్రమ సాధనాల నించి దూరం అవడం వల్లనే 'శ్రమ శక్తినే సరుకుగా' అమ్ముకునే స్థితికి వచ్చాడంటాడు మార్క్సు... అసలు పెట్టుబడి ఎలా ఏర్పడిందంటాడంటే...."

పెట్టుబడిదారుడి చూపుల సెగకి మొహం భగ్గున మండి, హఠాత్తుగా మాట మార్చుకున్నాడు. — "....మనం ఒప్పుకుంటామా అదంతా? శ్రామికుడు శ్రమ సాధనాలు పోగొట్టుకున్నాడంటే, ఎందుకు పోగొట్టుకున్నాడు? ఎందుకు పోగొట్టుకున్నాడయ్యా? సోమరితనం వల్ల పోగొట్టుకున్నాడు. తాగేసి దొర్లుతూ వుంటే ఆస్తులు నాశనం గాక ఏమవుతాయి? ఆ పాయింటే రాద్దామను కుంటున్నాను."

"ఇంకా ఎప్పుడు రాసేది?"

"రాస్తాను....రాసేస్తాను."

"ఎప్పుడో రాస్తే ఏం లాభమయ్యా? రేపీపాటికి రాసి పట్టుకురా! అచ్చు వేయించేస్తాను. మార్క్సు సిద్ధాంతం పని వాళ్ళందర్లో ప్రచారం అయిపోయాక అప్పుడు రాస్తే ఏం లాభం, చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు!"

"ఆ భయం అక్కర్లేదు లెండి. మార్క్సు పుస్తకం ఎవరికీ అర్థం కాదు. పనివాళ్ళకి అసలే అర్థం కాదు. నాకే తల ప్రాణం తోక కొచ్చింది."

"వాళ్ళకి అర్థం కాకపోతే ఎవడో అర్థమైన సన్యాసి చదివి చెపుతాడు. వాళ్ళకేం పనా పాటా? ధనవంతుల సిరిసంపదలు చూసి కన్ను పొడుచుకునే వాళ్ళెంతమంది లేరు ప్రపంచంలో! నిప్పురవ్వ పుట్టిం తర్వాత దాన్ని వూది రాజెయ్యటం ఎంత సేపు?" అంటూ చిరాకు పడిపోతూ చూశాడు పెట్టుబడిదారుడు, ఆర్థికవేత్తని.

మార్క్సు వాదాన్ని గ్రహించి కూడా తను చెప్పినట్టే రాయడానికి సిద్ధపడ్డ ఆర్థికవేత్తని చూస్తే, వాడు 'పెట్టుబడి సేవ'ని విడిచి వెళ్ళడని పెట్టుబడిదారుడికి రుజువై పోయింది. ఆ ఆర్థికవేత్త మార్క్సుని సమర్థిస్తూ ఏమన్నా వాదిస్తే, పెట్టుబడిదారుడు కాస్త జంకి వాణ్ణి లోబరుచుకో డానికి కాస్త మర్యాదగా మాట్లాడే వాడేమో. ఆలాంటి ప్రయత్నాలేవీ అవసరం లేకుండానే ఆర్థికవేత్త ఎప్పటిలాగే తన 'పాద సేవ'కి సిద్ధంగా వుండేసరికి, ఆ వేత్తంటే పెట్టుబడిదారుడి దృష్టిలో మరీ హీనమైపోయింది. తన ఆఫీసు లెక్కలు రాసే ఉద్యోగితో చెప్పినట్టు " రేపీపాటికి రాసెయ్యాలి సుమా!" అన్నాడు మళ్ళీ గట్టిగా.

ముచ్చట గొలిపే మార్క్సు సిద్ధాంత మైకం నించి పెట్టుబడిదారుడి చివాట్లతో బయట పడ్డ ఆర్థికవేత్త, 'అలాగే' అన్నట్టు మౌనం వహించి, తల వాలేసి కది లాడు — 'రేపీపాటికి' మార్క్సు వాదాన్ని తిప్పికొట్టే సిద్ధాంత వ్యాసం తయారు చెయ్యడానికి! ఆ క్షణం నించి ఆ ఆర్థికవేత్త 'దోపిడీ' గురించి పూర్తిగా తెలిసి కూడా దోపిడీ పక్షాన కాన్షియస్‌గా నిలబడ్డ దొంగ ఆర్థికవేత్త అయ్యాడు!

# ప్రశ్నలూ — జవాబులూ

**1. 'పెట్టుబడి' అంటే ఏమిటి?**

**జ:** సరుకుని తయారు చెయ్యడానికి అవసరమయ్యే శ్రమ సాధనాలూ, శ్రామికుల జీతాలూ — ఈ 2 అంశాలూ కలిసినదే పెట్టుబడి.

**2. 'పెట్టుబడిదారుడు' అంటే ఎవరు?**

**జ:** పెట్టుబడి పెట్టేవాడు—పెట్టుబడిదారుడు. శ్రామికుల మీద యజమానిగా వుంటూ సరుకుని తయారు చేయించేవాడే పెట్టుబడిదారుడు.

**3. 1 వస్తువుని ఉత్పత్తి చేయించడానికి పెట్టుబడిదారుడికి 2 రూ.లు ఖర్చయింది. ఈ ఖర్చుని 'పెట్టుబడి' అనవచ్చా?**

**జ:** అనవచ్చు. సరుకు కోసం పెట్టుబడిదారుడు పెట్టే ఖర్చే పెట్టుబడి.

**4. ఒక వస్తువుని తయారు చేయించడం కోసం పెట్టుబడిదారుడు 2 రూ.లు ఖర్చు చేస్తే, ఆ వస్తువు ఆ ఖర్చుతోనే తయారయినట్టా?**

**జ:** కాదు. ఆ వస్తువు తయారవడానికి 2 రూ.ల కన్నా ఎక్కువ ఖర్చే అవసరమవుతుంది. కానీ, అదంతా పెట్టుబడిదారుడు పెట్టడు.

**5. మీకు ఒక వస్తువుని ఉచితంగా ఎవరో ఇచ్చారు. దాని కోసం మీరు ఏమీ ఖర్చుపెట్టలేదు. ఆ వస్తువు తయారవడానికి శ్రమ ఖర్చయినట్టా, లేనట్టా?**

**జ:** ఏ వస్తువూ శ్రమ లేకుండా తయారవదు. ఒక వస్తువుని తీసుకున్న వ్యక్తి, దాని కోసం ఏమీ చెల్లించకపోయినా అది శ్రమ లేకుండా తయారైందని అర్థం కాదు.

**6. అన్నం వండే పనిలో కట్టెలు ముడి పదార్థాలు అవుతాయా? ఏమవుతాయి?**

**జ:** కట్టెలు మండి మసైపోతాయి. అంటే, అవి ఆగ్జిలరీ పదార్థాలు. ముడి పదార్థాలు కావు.

**7. ఇల్లు —అనే వస్తువుకి ముడి పదార్థాలు ఏవి?**

**జ:** ఇటుకలూ, ఇసకా, సిమెంటూ, చెక్కా, ఇనుమూ, రంగులూ — ఇంకా ఏ యే పదార్థాలైతే 'ఇల్లు'లో ఇమిడిపోయివుంటాయో అవన్నీ, దానికి ముడి పదార్థాలు.

**8. బస్సుని నడిపే పనిలో ముడి పదార్థం ఏది?**

**జ:** ఈ పనిలో ముడి పదార్థం వుండదు. బస్సుని నడిపే పనిలో బస్సు —శ్రమ పరికరం.

**9. మొక్కలూ, పశువులూ, చేపలూ వంటి వాటిని పెంచే పనుల్లో, ముడి పదార్థాలు ఏవి?**

**జ:** ఇలా ప్రాణంతో పెరిగే వాటి విషయంలో, ముడి పదార్థాలు వేరుగా వుండవు. వాటిని పెంచే క్రమం పూర్తి అయ్యేవరకూ, ఆ పెరిగేవే ముడి పదార్థాలు. పశువుల్ని పెంచే పనిలో, ఆ పెరిగే పశువులే ముడి పదార్థాలు. మొక్కల్ని పెంచే పనిలో, విత్తనాల్నిగానీ, ఎరువుల్ని గానీ, ముడి పదార్థాలుగా అనుకోకూడదు. చొక్కాకి బట్ట ముడి పదార్థం అయినట్టుగా, అదే పద్ధతి, ప్రాణంతో పెరిగే వాటికి యథాతథంగా వర్తించదు.

**10. పశువుల మేత — ముడి పదార్థమా, శ్రమ పరికరమా, ఆగ్జిలరీ పదార్థమా?**

**జ:** పశువులు వ్యవసాయం పనుల్లో అయితే, శ్రమ పరికరాలు అవుతాయి. వాటి కోసం 'మేత'ని వాడితే, దాన్ని ఆగ్జిలరీ పదార్థంగా అనుకోవచ్చు, యంత్రానికి ఆయిల్‌ని వాడినట్టు. లేదా, పశువుల్ని పెంచే పనిలో 'మేత'ని తీసుకుంటే, అప్పుడు కూడా దాన్ని ఆగ్జిలరీగానే అనుకోవచ్చు.

**11. బట్ట, పంచదార, ఇనుము, చెప్పులు, పెన్ను, బియ్యం, బొగ్గు, కుర్చీ, నీళ్ళు — వీటిలో ఏవి ముడి పదార్థాలు? ఏవి శ్రమ పనిముట్లు?**

**జ:** అలా చెప్పడానికి వీలవదు. ఒక వస్తువు, ఏ సందర్భంలో ఉపయోగపడుతోంది — అనే దాన్ని బట్టి, దాని విషయం ఉంటుంది. నీళ్ళని అన్నం వండడానికి ఉపయోగిస్తే, అవి ముడి పదార్థం. పాత్రల్ని కడగడానికి ఉపయోగిస్తే, ఆ నీళ్ళు, ఆగ్జిలరీ. అలాగే మిగిలిన వస్తువుల విషయం కూడా. పెన్నూ, కుర్చీ లాంటివి —ఎప్పుడూ శ్రమ పరికరాలే.

**12. ఎద్దు —ముడి పదార్థంగా ఎప్పుడు వుంటుంది? శ్రమ పరికరంగా ఎప్పుడు వుంటుంది?**

**జ:** ఎద్దు — ముడి పదార్థంగా, మాంసం తయారీలో వుంటుంది. వ్యవసాయం పనుల్లో, శ్రమ పరికరంగా వుంటుంది.

**13. ఒక కవి, ఒక పాట రాశాడు. ఒక చిత్రకారుడు ఒక చిత్రం గీశాడు. వీటికి ముడి పదార్థాలు ఏవి?**

**జ:** 'పాట' ఒక వస్తువు కాదు. కాబట్టి దానికి ముడి పదార్థం వుండదు. చిత్రం అనేది ఒక వస్తువే. ఆ కాయితమూ, రంగులూ, దానికి ముడి పదార్థాలే. వాటినే చిత్రకారుడి శ్రమ 'చిత్రం'గా తయారు చేసింది. అలాగే, రాతిని శిల్పంగా మలిస్తే, ఆ రాయి ఆ శిల్పానికి ముడి పదార్థమే.

**14. భూస్వామి, తన పొలంలో పనిచేసిన శ్రామికుడికి పిచ్చి కుంచంతో తప్పుడు కొలత కొలుస్తాడు. ఇది ఉత్పత్తి క్రమమా, చలామణీ క్రమమా? ఇందులో భూస్వామికి**

**వచ్చే లాభం ప్రధాన లాభమా, సెకండరీ లాభమా?**

జ: 'జీతాలు'గా ధాన్యాన్ని ఇచ్చేది చలామణీ క్రమం. ధాన్యాన్ని ఇవ్వడంలో చేసిన మోసంవల్ల భూస్వామికి మిగిలేది సెకండరీ లాభం.

15. **'సరుకు'కి విలువని చేర్చే అంశాలు ఎన్ని? అవి ఏవి?**

జ: అవి రెండే.
(1) శ్రమ సాధనాలూ (గత శ్రమ)
(2) శ్రామికులు చేసే పని (ప్రస్తుత శ్రమ)

16. **లాభం ఎలా వస్తుంది?---- అనే ప్రశ్నకి, పెట్టుబడి దారుడు ఏం చెపుతాడు? అది సరైనదేనా, తప్పా? ఎలాగ?**

జ: ఖర్చుల మీద 'కొంత వేసుకుంటే అదే లాభం' అని చెపుతాడు. అది తప్పు. ఎందుకంటే : ప్రతీ పెట్టుబడి దారుడూ, తన సరుకుని అమ్మేవాడిగానేగాక, ఇతర పెట్టుబడిదారుల సరుకుల్ని కొనే వాడిగా కూడా వుంటాడు. ఖర్చుల మీద కొంత వేసుకోవడంద్వారా లాభం వచ్చేటట్టయితే, ఆ సూత్రం ప్రతీ పెట్టుబడి దారుడికీ వర్తిస్తుంది. అమ్మేవాడిగా వున్నప్పుడు వచ్చే లాభం, కొనే వాడిగా వున్నప్పుడు పోతుంది. కాబట్టి, లాభాన్ని వివరించడానికి ఈ జవాబు సరైంది కాదు.

17. **జీతాలు అంటే జీవితావసర వస్తువులే కదా? జీవితా వసర వస్తువులన్నీ నిర్జీవ వస్తువులే కదా? నిర్జీవ వస్తువులు తమ విలువ కన్నా ఎక్కువ విలువని సరుకుకి ఇస్తాయి అనడం తప్పు కాదా?**

జ: జీతాలు అంటే శ్రామికుల జీవితావసర వస్తువులే. అవి నిర్జీవ వస్తువులే. కానీ, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇచ్చేది ఆ వస్తువులు కాదు. పని స్థలంలోకి వచ్చేది ఆ వస్తువులు కాదు. శ్రామికులే. వారు, పని స్థలంలోకి వచ్చి, తాము వాడుకునే వస్తువుల విలువ కన్నా ఎక్కువ విలువ గల శ్రమ చేస్తారు. జీతాలు ఎక్కువ విలువని ఇస్తాయి —అంటే, అర్థం ఇదే.

18. **సరుకు —అంటే ఎంత పరిమాణంతో వుంటుంది?**

జ: సరుకు — అనేది ఎంత పరిమాణంలోనైనా వుండ వచ్చు. చిన్నదిగా అయినా, పెద్దదిగా అయినా. 1 మీటరు బట్ట అయినా కావచ్చు; 100 మీ. బట్ట అయినా కావచ్చు.

19. **సరుకు పరిమాణాన్ని బట్టి దాని కోసం ఖర్చయ్యే పెట్టుబడి పరిమాణం వుంటుంది — అనే విషయాన్ని 2 ఉదాహరణల ద్వారా చెప్పండి.**

జ: 1 మీ. బట్టకి పెట్టుబడి ఖర్చు-1 రూపాయి అనుకుంటే, 100 మీ. బట్టకి పెట్టుబడి ఖర్చు — 100 రూ.లు. 1 చెప్పుల జతకు పెట్టుబడి—5 రూ.లు అయితే, 20 చెప్పుల జతలకు పెట్టుబడి — 100 రూ.లు. తక్కువ సరుకుకి తక్కువ పెట్టుబడీ, ఎక్కువ సరుకుకి ఎక్కువ పెట్టుబడీ.

20. **సజీవ శ్రమ — అంటే ఏమిటి? అది ఏ యే పాత్రలు నిర్వహిస్తుంది? ఒక్కొక్క వాక్యంతో చెప్పండి.**

జ: 'సజీవ శ్రమ' అంటే, పనిస్థలంలో మనుషులు చేసే శ్రమ. అది 3 రకాల పాత్రలు నిర్వహిస్తుంది.
(1) శ్రమ చేసే మనుషులు, తమ పోషణ కోసం ఖర్చయిపోయే శ్రమని, 'పునరుత్పత్తి' చేస్తారు.
(2) కొంత శ్రమని కొత్తగా కూడా చేస్తారు.
(3) శ్రమ సాధనాల్ని వాడడం ద్వారా, ఆ సాధనాల శ్రమని, కొత్త ఉత్పత్తికి బదిలీ అయ్యేలాగ చేస్తారు.

21. **ఒక బట్ట విలువ 10. కొంత చమురు విలువ 10. వాటి విలువల మొత్తం ఎంత? ఈ సరుకులకు మారకం జరిగింది. మారకం జరిగిన తర్వాత వాటి విలువల మొత్తం ఎంత?**

జ: ఆ 2 సరుకులకూ మారకం జరగకముందు వాటి విలువల మొత్తం 10+10=20.
ఆ సరుకులకు మారకం జరిగిన తర్వాత కూడా వాటి విలువల మొత్తం 20 య్యే.

22. **బస్తా ధాన్యాన్ని శ్రమ సాధనాలూ, జీతాలూ, అదనపు విలువా —అనే భాగాల కోసం విభజించాం.**
**(1) 'శ్రమ సాధనాల' భాగానికి వచ్చిన ధాన్యంలో 'జీతాల' భాగం గానీ, 'అదనపు విలువ' భాగంగానీ వుండదు. — ఇలాగే, మిగతా భాగాల గురించి కూడా రాయండి.**

జ: (1) శ్రమసాధనాల భాగంలో— జీతాలూ, అదనపు విలువా వుండవు. (2) జీతాల భాగంలో—శ్రమ సాధ నాలూ, అదనపు విలువా వుండవు. (3) అదనపు విలువ భాగంలో— శ్రమసాధనాలూ, జీతాలూ వుండవు.

23. **శ్రామికులు పనిచేసేటప్పుడు, జీతాల విలువ 'పున రుత్పత్తి' అవుతుంది —అంటే ఏమిటి?**

జ: శ్రామికులు, జీతాలతో కొన్ని సరుకులు కొని, వాటిని తమ పోషణ కోసం ఖర్చుపెట్టుకుంటారు. జీతాలుగా ఎంత విలువని తీసుకున్నారో, అంత విలువ గల 'పని'ని, పని స్థలంలో మొదట చేస్తారు. అది జీతాల విలువ పునరుత్పత్తి అవడమే.

24. **స్వతంత్ర ఉత్పత్తిదారులు తమ పోషణ కోసం నిత్యం కొన్ని వస్తువుల్ని వాడుతూ వుంటారు కదా? వారు కూడా ఆ వస్తువుల్ని పునరుత్పత్తి చేసుకుంటారా?**

జ: తప్పకుండా చేసుకోవలసిందే. లేకపోతే, కొత్త పోషణ కోసం కొత్త వస్తువులు వుండనే వుండవు. ఒకవేపు — పాత వస్తువుల్ని ఖర్చు చేస్తూ, అదే కాలంలో కొత్త వాటిని ఉత్పత్తి చేసుకుంటూ వుండవలసిందే.

**25. ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుల కుటుంబంలో రోజుకి 10 విలువని పోషణ కోసం వాడతారు. వాళ్ళు రోజూ 10 విలువ గల వస్తువులనే ఉత్పత్తి చేస్తారా? అంత కన్నా ఎక్కువ విలువని ఉత్పత్తి చేస్తారా?**

**జ:** రోజూ 10 విలువని వాడాలంటే, అంత విలువ గల పని రోజూ చేసుకోవలిసిందే. అది 10 కన్నా తగ్గడానికి వీలు వుండదు. ఆ శ్రమశక్తితో 10 కన్నా ఎక్కువ కూడా చేసుకోగలరు. అవసరమైతే ఎక్కువ పని కూడా చేసుకుంటారు. ఆ ఎక్కువ ఉత్పత్తిని కూడా వాళ్ళే వాడుకుంటారు.

**26. ఉత్పత్తి సాధనాల విలువ 60, జీతాల విలువ 20. తయారైన సరుకు విలువ 60+20 గా వుంటుంది. ఇది కరెక్టేనా?**

**జ:** కరెక్టుకాదు. ప్రశ్నలో 'జీతం' అనే మాట వచ్చింది కాబట్టి, ఇక్కడ వున్నది యజమానీ శ్రామికుల సంబంధమే. యజమానికి తప్పనిసరిగా 'లాభం' రావాలి. తయారైన సరుకు విలువ 60+20 కన్నా తప్పనిసరిగా ఎక్కువగా వుంటుంది. సరుకు కోసం ఖర్చయిన అంశాలు మాత్రమే ఆ సరుకు ద్వారా వెనక్కి వస్తే, దాని ద్వారా లాభమే రాదు. కాబట్టి సరుకు విలువ ఆ 2 అంశాలే కాదు.

**27. ఒక కొత్త చొక్కా తయారీ కోసం మొత్తం ఖర్చయిన శ్రమ సాధనాల విలువ 10+సజీవ శ్రమ 5 = 15. ఒక వ్యక్తి ఆ చొక్కాని ఒక సంవత్సరం పాటు వాడితే అది పూర్తిగా పాత బడి చిరిగి పోయింది. ఆ చొక్కా విలువ కూడా ఖర్చయి పోయినట్టేనా, కాదా? చొక్కాకి సంబంధించిన శ్రమ సాధనాల విలువ ఇంకా మిగిలినట్టా? అది ఇంకో వస్తువులోకి బదిలీ అయినట్టా?**

**జ:** కాదు. చొక్కా పాతబడి పోయిందంటే, దాని విలువ అంతా ఖర్చయి పోయినట్టే. దాని తయారీ కోసం శ్రమ సాధనాల 10 శ్రమా, శ్రామికులు ఇచ్చిన 5 శ్రమా, మొత్తం 15 శ్రమ అంతా ఖర్చయిపోయింది. ఉపయోగపు విలువా, విలువా రెండూ ఖర్చయి పోయాయి. చొక్కా విలువ ఎక్కడికీ బదిలీ అవలేదు.

**28. ఒక కొత్త చొక్కా తయారై వుంది. దాని విలువ = శ్రమ సాధనాల 10+సజీవ శ్రమ 5 = 15. చొక్కాని ఇంకా ఎవరూ వాడడం లేదు. చొక్కా ఖర్చయిపోలేదు. అయితే, చొక్కా తయారీ కోసం అవసరమైన 'బట్ట' వంటి శ్రమ సాధనాలు ఖర్చయి పోయినట్టేనా కాదా? ఆ శ్రమ సాధనాల విలువ ఖర్చయిపోయినట్టేనా కాదా?**

**జ:** చొక్కా తయారై వుందంటే, దాని తయారీకి అవసరమైన శ్రమ సాధనాలన్నీ ఖర్చయి పోయినట్టే. ఇప్పుడు ఇంకో చొక్కాని తయారు చెయ్యాలంటే, ఇంకో కొత్త బట్టని తీసుకోవాలిగానీ, మొదటి బట్ట అయితే లేదు కదా? అది ఖర్చయిపోయినట్టే. అయితే, ఆ శ్రమ సాధనాల విలువ మాత్రం ఇంకా ఖర్చయి పోలేదు. ఆ విలువ అంతా చొక్కాలోకి బదిలీ అయింది. అంటే, ఇక్కడ శ్రమ సాధనాలు ఖర్చయిపోయినా, వాటి విలువ ఖర్చయిపోలేదు. చొక్కా పాతబడిపోయినప్పుడే, ఆ విలువ అంతా ఖర్చయినట్టు అర్థం.

**29. పెట్టుబడి విలువ, మళ్ళీ మళ్ళీ వెనక్కి వస్తూనే వుంటుంది; అది ఖర్చయిపోదు — అని ఎందుకు అంటాం? సరుకు తయారైనపుడు, పెట్టుబడి ఖర్చయిపోదా?**

**జ:** తప్పకుండా ఖర్చయిపోతుంది. కొన్ని శ్రమ సాధనాలూ, కొంత సజీవ శ్రమా ఖర్చయితేనే ఒక ఉత్పత్తి తయారవుతుంది. ఆ ఉత్పత్తిని స్వంతానికి వాడేస్తే, దాని కోసం అవసరమైన అంశాల విలువ అంతా ఖర్చయిపోయినట్టే. కానీ, పెట్టుబడిదారుడు, తను తయారు చేయించే సరుకుని, తన స్వంతానికి వాడడు. దాన్ని బైటికి అమ్మేస్తాడు. అప్పుడు ఖర్చయిన పెట్టుబడి విలువ అంతా వెనక్కి వచ్చేస్తుంది. (పెట్టుబడిగా ఖర్చయిన రక రకాల ఉత్పత్తులన్నీ కూడా వెనక్కి వచ్చేశాయని అర్థం.) అదే పెట్టుబడితో పెట్టుబడిదారుడు, మళ్ళీ కొత్త సరుకుని చేయిస్తాడు. ఆ సరుకుని కూడా అమ్మినప్పుడు, పెట్టుబడి మళ్ళీ వెనక్కి వచ్చేస్తుంది. ఈ రకంగా, ఎన్ని సార్లయినా ఎంత కాలమైనా, జరుగుతూనే వుంటుంది. అందుకే, 'పెట్టుబడి ఎప్పటికీ ఖర్చయిపోదు' అంటాం. అంటే దీని అర్థం— ఒక సరుకు తయారైనప్పుడు దాని కోసం పెట్టుబడి ఖర్చవదని కాదు. మొదట ఖర్చయినా, ఆ ఖర్చంతా వెనక్కి వచ్చేస్తూ వుంటుంది. కాబట్టి, పెట్టుబడి ఎప్పటికీ ఖర్చవదు.

**30. ఒక కుర్చీ కోసం పెట్టుబడి ఖర్చు 60. పెట్టుబడి దారుడు, ఆ ఖర్చుమీద 30 లాభం వేసుకుని, కుర్చీ విలువని 90 గా నిర్ణయించాడు. వాడు, ఇంకా ఎక్కువ లాభం ఎందుకు వేసుకోలేదు?**

**జ:** వాడికి లాభం ఇంకా ఎక్కువగా వేసుకోవాలనే వుంటుంది. కానీ, ఆ రకం సరుకుని ఇతర పెట్టుబడిదారులు, 90 విలువతోనే అమ్ముతున్నారు. వీడు ఇంకా ఎక్కువ లాభం వేసుకుంటే ఆ సరుకుని అమ్మలేడు. అందుకే వాడు 30 కన్నా ఎక్కువ లాభం వేసుకోడు. అంత కన్నా వాడికేమీ తెలీదు. కానీ, అసలు కారణం – ఆ సరుకు కోసం ఖర్చయిన మొత్తం శ్రమ 90 మాత్రమే. అందులో అంతకన్నా ఎక్కువ విలువ లేదు. ఆ సరుకు కోసం పెట్టుబడి దారుడు 60 ఖర్చు పెట్టాడు కాబట్టి, దాని మీద ఇంకా 30 లాభం వేసు కోవడానికి మాత్రమే అవకాశం

వుంది. అంత కన్నా ఎక్కువ లాభానికి అవకాశం లేదు. ఇదంతా పెట్టుబడిదారుడికి తెలియక పోయినా, '90 కన్నా ఎక్కువ అయితే, ఈ సరుకు అమ్ముడు పోదు' అని వాడికి తెలుసు కాబట్టి, తన సరుకు విలువని అలాగే నిర్ణయిస్తాడు.

**31.** 'చలామణీ క్రమం'లో ఏం పని జరుగుతుంది?

**జ:** సరుకుల్ని అమ్మడాలూ, కొనడాలూ జరుగుతాయి.

**32. ఒక పెట్టుబడిదారుడు తన సరుకుని 5 రూ.లకు అమ్మాడు. ఆ సరుకుకీ, 5 రూ.లకూ జరిగిన మారకం సమాన విలువల మారకమే. అయినా, ఆ 5 రూ. లలో నించే పెట్టుబడిదారుడికి 1 రూపాయి లాభం వచ్చింది. ఇది ఎలా సాధ్యమయింది?**

**జ:** ఎలాగంటే, పెట్టుబడిదారుడు, ఆ సరుకుని తయారు చేయించడంలో 4 రూ.లు మాత్రమే ఖర్చు పెట్టా డన్నమాట! శ్రామికులకు ఇవ్వవలసిన దాంట్లో 1 రూపాయి ఇచ్చివుండడు. కానీ, ఆ సరుకు తయారవ డానికి మొత్తం 5 రూ.ల విలువగల శ్రమ పట్టింది కాబట్టి, దాన్ని అమ్మితే 5 రూ.లు వచ్చాయి. ఆ రకంగా, పెట్టుబడిదారుడికి, ఆ సరుకు ద్వారా 1 రూపాయి లాభం వచ్చింది.

**33.** ప్రధాన లాభానికీ, సెకండరీ లాభానికీ తేడా ఏమిటి? ఏది ఎక్కడి నించి వస్తుంది?

**జ:** ప్రధాన లాభం — 'సమాన విలువల మారకం'లో నించీ, సెకండరీ లాభం — 'అసమాన విలువల మారకం'లో నించీ వస్తాయి. ప్రధాన లాభం — శ్రామికుల అదనపు శ్రమలో నించి. సెకండరీ లాభం— అమ్మే వాళ్ళు గానీ, కొనే వాళ్ళు గానీ, నష్టపోవడం నించి. ఏ లాభం అయినా శ్రమ చేసే వాళ్ళ అదనపు శ్రమే.

**34. 10 వస్తువుల విలువ 280. శ్రమ సాధనాల విలువ 160. జీతాలు 60. సగం పని జరిగేటప్పటికి ఎన్ని శ్రమ సాధనాలు ఖర్చయి వుంటాయి? అప్పటికి తయారైన సరుకు విలువ ఎంత వుంటుంది? అప్పటికి ఎంత అదనపు శ్రమ జరిగి వుంటుంది?**

**జ:** ఈ లెక్కల ప్రకారం— 10 వస్తువుల విలువలో శ్రమ సాధనాలు 160 + జీతాలు 60 + అదనపు విలువ 60 = 280. సగం పని అంటే, 5 వస్తువులు. వాటి విలువ = శ్రమ సాధనాలు 80 + జీతాలు 60 = 140. అప్పటికి ఇంకా అదనపు శ్రమ ప్రారంభం కాదు.

**35. వడ్డీలూ, కౌళ్ళూ చెల్లించడంవల్ల పెట్టుబడిదారుడు నష్టపోతాడా?**

**జ:** నష్టపోడు. శ్రామికుల నించి లాగిన దానిలో నించే వడ్డీలూ కౌళ్ళూ చెల్లిస్తాడు.

**36. మీ ఆదాయానికి మార్గం ఏమిటి? జీతాలా, లాభాలా, వడ్డీలా, కౌళ్లా?**

**జ:** జీతాలే.

**37.** శ్రమ సాధనాలు పెట్టుబడిగా పనిచెయ్యడం — **అంటే** ఏమిటి?

**జ:** ఏ ఉత్పత్తి తయారవ్వాలన్నా, ఆ పని స్థలం కోసం కొంత భూమీ, కొన్ని ఇతర శ్రమ సాధనాలూ కావాలి. తయారైన ఉత్పత్తిలో నించి కొంత భాగం ఆ భూమికి కౌలు గానూ, ఆ శ్రమ సాధనాలకు వడ్డీ – లాభాలు గానూ వెళ్ళడమే, ఆ శ్రమ సాధనాలు, శ్రమ సాధనాలు గానే గాక పెట్టుబడిగా కూడా పని చెయ్యడం.

**38. భూమి, కౌలుగా వచ్చే ఉత్పత్తిని ఎలా వాడుతుంది? ఇతర శ్రమ సాధనాలు– వడ్డీ లాభాల్ని ఎలా వాడతాయి?**

**జ:** కౌలుని వాడేది భూమి కాదు; భూస్వామి. ఆ వ్యక్తి, శ్రమ చెయ్యకుండా బతకడం కోసమే ఆ భాగం. అలాగే, వడ్డీ – లాభాల్ని వాడేది శ్రమ సాధనాలు కాదు; పెట్టుబడిదారుడు. వాడు (లేదా, వాళ్ళు) శ్రమ చెయ్యకుండా బతకడం కోసమే ఆ భాగాలు.

**39.** స్వంత పెట్టుబడీ, స్వంత వ్యాపార సంస్థా, స్వంత **భూమీ గల ఒక పెట్టుబడిదారుడెవడైనా మీకు తెలుసా? మీకు తెలిసిన పెట్టుబడిదారుడికి ఎన్ని జేబులు?**

**జ:** తెలుసు. వాడికి అన్ని రకాల వ్యాపారాలూ ఉన్నాయి. ఈ పాఠంలో చెప్పిన జేబుల కన్నా కూడా ఎక్కువ జేబులు ఉన్నాయి వాడికి.

**40. చిత్రకారులకు ప్రత్యేకం : ఈ బొమ్మ గీయండి. ఒక తరగతి గది. మార్క్సు — టీచరు. శ్రామికు లంతా విద్యార్థులు. ఈ విద్యార్థుల్లో స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ అందరూ వుండాలి. బాగా చదువుకున్న శ్రామికులు కూడా వుండాలి. విద్యార్థులకు ఎదురుగా 5 గురు వ్యక్తులు నేర స్తుల్లా నిలబడి వుంటారు. ఒకడి చేతిలో ప్రయా ణాలు చేసే సంచి (వీడు— వర్తక పెట్టుబడి దారుడు). 2 వ వాడి చేతిలో డబ్బు మూట (వడ్డీ పెట్టుబడిదారుడు). 3 వ వాడికి పెద్ద పెద్ద కోర మీసాలు (భూస్వామి). 4 వ వాడు పన్నులు వసూలు చేసే ప్రభుత్వోద్యోగిలా వుండాలి. 5 వ వాడు కొంచెం 'గంభీరుడు' (ఉత్పాదక పెట్టుబడి దారుడు). మార్క్సు, విద్యార్థులకు వాళ్ళని చూపిస్తూ, ఇలా అంటాడు — "వీళ్ళే మీ అదనపు విలువని పంచుకునేది!"**

★

# 2. శ్రమశక్తి విలువ

**శ్రామికులు,** పెట్టుబడిదారుడి దగ్గిర 'శ్రమ' చేస్తారు. ఆ 'శ్రమ'కి బదులుగా వారికి 'జీతాలు' వస్తాయి. ఆ జీతాలు, శ్రామికులు చేసిన 'శ్రమ విలువ'తో సమానంగా వుండవు. అంతకన్నా తప్పనిసరిగా తక్కువగా వుంటాయి. 'శ్రమ విలువ'లో 'జీతం భాగం' పోగా మిగిలినది 'అదనపు విలువ'గా పెట్టుబడిదారుడికి పోతుంది. —ఇంత వరకూ మనకు తెలుసు.

అయితే శ్రామికులకు వచ్చేది ఏమిటి? 'జీతం' అంటే ఏమిటి? 'శ్రమ విలువ'లో ఎంత భాగం 'జీతం'గానూ, ఎంత భాగం 'అదనపు విలువ'గానూ వుంటుంది? ఆ భాగాలు ఎలా నిర్ణయమవుతాయి? 'జీతం' అనే దానికి ఏమైనా సూత్రాలూ, నియమాలూ వున్నాయా? శ్రామికుడి 'శ్రమ విలువ'లో నించి, పెట్టుబడిదారుడు శ్రామికుడికి ఇచ్చేది ముందు నిర్ణయమవుతుందా, మిగుల్చుకునేది ముందు నిర్ణయమవుతుందా? 'ఇచ్చేదాన్ని ఇంతకన్నా తగ్గించడానికి వీలులేదు' అనే కనీసపు హద్దు ఏమైనా దానికి వుంటుందా?— ఈ విషయాలన్నీ ఇప్పుడు వివరంగా చూస్తాము. 'జీతం' అంటే ఏమిటో అర్థమైతేనే, 'అదనపు విలువ' ఉత్పత్తి అవడం ఎలా సాధ్యమో, అంటే 'శ్రమ దోపిడీ' ఎలా సాధ్యమో, అర్థమవుతుంది.

శ్రామికుడు (పురుషుడు గానీ, స్త్రీ గానీ) — పెట్టుబడి దారుడికి ఇచ్చేది— 'శ్రమ విలువ'. అందులో నించి శ్రామికుడికి అందే భాగం— 'శ్రమ శక్తి విలువ'. 'శ్రమ విలువ'లో నించి 'శ్రమ శక్తి విలువ'ని తీసివెయ్యగా మిగిలేది — 'అదనపు విలువ.' దోపిడీ చరిత్ర అంతా— 'శ్రమ విలువా, శ్రమ శక్తి విలువా' అనే 2 అంశాలకూ వున్న తేడా మీదే నిలబడి వుంటుంది.

## 'శ్రమ శక్తి' అంటే ఏమిటి?

**ఈ** పొడుపు కథ విప్పగలరా? "ఒక పెట్టుబడిదారుడు ఉన్నాడంట. వాడు కొన్ని సరుకులు కొన్నాడంట. వాటిలో ఒక్క సరుకు మాత్రం, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇస్తుందంట! ఏమిటా సరుకూ?"

పెట్టుబడిదారుడు కొన్న సరుకుల్లో తన విలువకన్నా ఎక్కువ విలువని ఇవ్వగల సరుకు ఒక్కటైనా లేకపోతే, పెట్టుబడిదారుడి చరిత్రే ప్రారంభమయ్యేది కాదు. పెట్టుబడిదారుడి చరిత్రే కాదు, అలాంటి 'అంశం' లేకపోతే, 'దోపిడీ చరిత్రే' ప్రారంభమయ్యేది కాదు.

అలాంటి అంశం ఉంది! అదే 'శ్రమ శక్తి'! అంటే, 'శ్రమ' చెయ్యడానికి మనిషి శరీరంలో వుండే 'శక్తి'. 'పని' చేసే 'శక్తి'. మనిషి ఒక 'ప్రత్యేక శ్రమ' చెయ్యడానికి ఏ రకమైన శారీరక, మేధాశక్తులు ఉపయోగిస్తాడో ఆ శక్తుల మొత్తమే—'శ్రమ శక్తి'.

ప్రధానంగా కాళ్ళూ చేతులూ ఉపయోగిస్తూ శారీరక కష్టంతో చేసే శ్రమలు— శారీరక శ్రమలు. పొలం దున్నడం, నేత నెయ్యడం, బండి తోలడం— లాంటి శ్రమలు, ఈ కోవలోకి వస్తాయి. ప్రధానంగా ఆలోచనా శక్తిని ఉపయోగిస్తూ చేసే శ్రమలు— మేధా శ్రమలు. చదువు చెప్పడం, వైద్యం చెయ్యడం— లాంటి శ్రమలు, ఈ కోవలోకి వస్తాయి.

చేసే పని ప్రధానంగా కాళ్ళ తోటీ, చేతుల తోటీ చేసేదే అయినా, దానికి కూడా 'మెదడు' సహకారం వుండాలి. ఒక శ్రమని, 'పూర్తిగా శారీరక శ్రమ' అనీ, 'పూర్తిగా మేధా శ్రమ' అనీ, విభజించడం సాధ్యం కాదు. అయినప్పటికీ శరీర కష్టం ఎక్కువగా వుండే శ్రమల్ని 'శారీరక శ్రమలు' అనీ, ఆలోచనతో ఎక్కువగా సంబంధం వుండే శ్రమల్ని 'మేధాశ్రమలు' అనీ, విభజించవచ్చు.

నడిచే పని కాళ్ళు ఎలా చేస్తాయో, ఆలోచించే పని మెదడు అలా చేస్తుంది. ఒక లెక్క చేసేటప్పుడు కాళ్ళు పనిచెయ్యవు, మెదడు పని చేస్తుంది. నడిచీ నడిచీ కాళ్ళు అలిసిపోయినట్టుగానే, ఆలోచించే పనిలో మెదడు కూడా అలిసిపోతుంది. 'మేధా శ్రమ' అంటే — గొప్ప తెలివితేటలతో చేసే శ్రమ అనీ, 'మేధావులు' అంటే చాలా జ్ఞానవంతులు అనీ, అర్థంకాదు. మెదడుతో చేసే శ్రమ కాబట్టి అది మేధా శ్రమ. మేధా శ్రమ చేసేవాళ్ళు— 'మేధాశ్రామికులు'. ఏ శ్రమ చెయ్యడానికైనా కొంత శక్తి కావాలి. 'శారీరక శ్రమ' చెయ్యడానికైనా, 'మేధాశ్రమ' చెయ్యడానికైనా, కొంత 'శక్తి' కావాలి.

పెట్టుబడిదారుడు కొనే అనేక సరుకుల్లో, 'శ్రమ శక్తి' కూడా ఒక సరుకు. పెట్టుబడిదారుడు కొనే ఇతర సరుకులకన్నిటికీ విలువలు వున్నట్టే 'శ్రమ శక్తి'కి కూడా ఒక

విలువ వుండాలి. ఏదో ఒక పద్ధతిలో ఆ విలువని లెక్కకట్టడం సాధ్యం అవ్వాలి. అలా సాధ్యం కాకపోతే, 'శ్రమ శక్తి'ని ఒక సరుకుగా అమ్మడమూ, కొనడమూ సాధ్యమయ్యేదే కాదు.

'శ్రమ శక్తి'కి ప్రత్యక్ష రూపం శ్రమ చేసే మనిషే. (స్త్రీ గానీ, పురుషుడు గానీ.) శ్రమ శక్తిని చూడాలంటే, శ్రమ చేసే మనిషినే చూడాలి. అంతేగానీ, 'శ్రమ శక్తి'నే విడిగా చూడలేం.

శ్రామికులు పనిలోకి దిగి దారం వడుకుతారు. బట్ట నేస్తారు. పొలం దున్నుతారు. గనులు తవ్వుతారు. చదువు చెపుతారు. రాత రాస్తారు. ఇలా పెట్టుబడిదారుడికి రక రకాల పనులు చేసి పెడతారు. అంటే, శ్రామికులు శారీరక శ్రమలు చేసేవారైనా కావచ్చు; మేధా శ్రమలు చేసేవారైనా కావచ్చు. కానీ శ్రమలో ఎన్ని రకాల తేడాలువున్నా, ఏ శ్రమ చేసేవారైనా, అందరూ శ్రామికులే. శ్రామికులలో తేడాల గురించి ఈ చాప్టరులోనూ, ఈ సంపుటంలో వున్న "ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా" చాప్టరులోనూ వివరంగా చూస్తాం. కానీ శ్రామికులు అన్నప్పుడు, మన ఉదాహరణల్లో ఎక్కువ సార్లు శారీరక శ్రమలు చేసే శ్రామికులనే, దృష్టిలో పెట్టుకుంటాం.

'పని స్థలం'లో ఉన్నంతసేపూ శ్రామికుడు ఎంత పని చేస్తాడో, అదే అతను పెట్టుబడిదారుడికి ఇచ్చే 'శ్రమ'. అది 'సజీవ శ్రమ'. అది, పని స్థలంలో కొత్తగా జరిగే శ్రమ. ఆ శ్రమకి ఎంత విలువ వుంటుందో, ఆ విలువ అంతా పెట్టుబడిదారుడు శ్రామికుడికి జీతంగా ఇచ్చేస్తే, ఆ విషయం అర్థంలేనిదైపోతుంది. కాబట్టి, అది అంతా శ్రామికుడికి రాదు. అందులో కొంత మాత్రమే వస్తుంది. అది ఎంత?

పెట్టుబడిదారుడికైతే, అసలు శ్రామికుడికి ఏమీ ఇవ్వ కుండా అంతా తను తీసేసుకోవాలనే వుంటుంది. శ్రామి కుడు గాలి తిని బతుకుతూ, తన దగ్గిరికి వచ్చి పూరికే పనిచేస్తూ వుంటే, పెట్టుబడిదారుడికి చాలా బాగుం టుంది. కానీ, గాలి తిని బతకడమే సాధ్యమైతే శ్రామికుడు తన దగ్గిరికి రానే రాడని పెట్టుబడిదారుడికి కూడా తెలుసు. కాబట్టి, వాడు చాలా అయిష్టంగానైనా, 'శ్రామికుడికి కూడా తిండీ బట్టా అవసరమే' అని ఒప్పుకుంటాడు. కానీ ఈ 'అవసరం' అనే దానికి పెట్టుబడిదారుడి దృష్టిలో చాలా అర్థాలూ, హద్దులూ వుంటాయి. "శ్రామికుడికి తిండి కావాలి. నేనూ ఒప్పుకుంటాను. నాకు మానవత్వం లేదను కోకండి. కానీ, మరీ అంత మంచి తిండి కావాలా? నూకల జావ సరిపోదా? లేకపోతే జొన్నంబలి సరిపోదా?" అంటాడు వాడు. "అవి చాలవు. నాకు అంతకన్నా మంచి ఆహారం కావాలి" అని శ్రామికుడు అంటే, వాడు చాలా ఆశ్చర్యపోతాడు. అలాగే, శ్రామికుడి 'బట్టల' విషయాని కొస్తే — "గోచీ సరిపోదా?" అంటాడు వాడు. శ్రామికుడి 'నివాసం' విషయానికొస్తే, "గుడిసె సరిపోదా?" అంటాడు. తనకైతే ఏవేవి సరిపోవో, అవన్నీ శ్రామికుడికి సరిపోతాయని పెట్టుబడిదారుడి ఉద్దేశం. అసలైన విచిత్రం ఏమిటంటే — శ్రామికుడికి అవే 'సరిపోతాయి' కూడా! 'సరిపోవడం' అంటే, దేనికి సరిపోవడం? 'శ్రామికుడి'గా వుండడానికి సరిపోవడం. శ్రామికుడిగా వుండి శ్రమ చెయ్యడానికి— 'గంజీ, గోచీ, గుడిసీ' కన్నా ఎక్కువ అవసరం లేదనీ, ఎక్కువ లేకపోయినా శ్రామికుడు శ్రమ చెయ్యగలడనీ, శ్రామికుడే రుజువు చేస్తాడు! ఆ 'గంజీ, గోచీ, గుడిసీ' కూడా లేకపోతే మాత్రం శ్రామికుడు బతకనే బతకడు.

ఒక మనిషి బతికి వుండి, శ్రమ చెయ్యగల శక్తితో వుండాలంటే, అతని అవసరాలు 'కనీసంగా' తీరినా చాలు. మనిషి— ప్రకృతి సహజంగా కొంత కాలం బతకాలంటే, పంచ భక్ష్య పరమాన్నాల తోటీ బతకొచ్చు; నూకల జావ తోటీ బతకొచ్చు. విశాలమైన భవనంలో నివసిస్తూనూ బతకొచ్చు; పూరి గుడిసెలో నివసిస్తూనూ బతకొచ్చు. సుఖమైన బట్టలు కట్టుకునీ బతకొచ్చు; గోచీ పెట్టుకునీ బతకొచ్చు. కాకపోతే, మొదటి పద్ధతిలో బతికే మనిషి, సుఖంగా బతుకుతాడు; ఎక్కువ కాలం బతుకుతాడు. రెండో మనిషి — అర్థాకలి తోటీ, అనారోగ్యాల తోటీ, కష్ట పడుతూ బతుకుతాడు. తక్కువ కాలమే బతికి తొందరగా చచ్చిపోతాడు.

'శ్రమ శక్తి' వుండడం అంటే, ప్రాణాలతో జీవించే ఒక మనిషి వుండడం. ఆ మనిషి, ఏదో కొన వూపిరితో వుండడం కాదు. ఆరోగ్యంగానే వుండాలి. శారీరక మానసిక ఆరోగ్యాలు సరిగా లేని మనిషి శ్రమ చెయ్యలేడు. అవసరాలు తీరని మనిషి శ్రమ చెయ్యలేడు.

అయితే, దోపిడీదారుడి దృష్టిలో శ్రామికుడు ఆరో గ్యంగా వుండడం అంటే, జబ్బుతో లేవలేని స్థితిలో పడకుండా వుండడం. శ్రామికుడి మానసిక ఆరోగ్యం అంటే — పిచ్చెత్తకుండా వుండడం. శ్రామికుడి గృహానికి అర్థం — గుడిసె. శ్రామికుడి దుస్తులకు అర్థం — గోచి. శ్రామికుడి ఆహారానికి అర్థం — గంజి. శ్రామికుడు జీవించి వుండడానికి అర్థం, చచ్చిపోకుండా వుండడం. ఇలా, శ్రామికుడు ఎంత తక్కువ అవసరాలతో బతికివుంటూ 'పని' చెయ్యగలడో అంత తక్కువ అవసరాలే శ్రామికుడి అవసరాలుగా దోపిడీదారుడికి కనపడతాయి.

శ్రామికులు, ఎంతో కష్టపడుతూ బాధలు పడుతూ బతికితే యేం? తక్కువ కాలంలోనే చచ్చిపోతే యేం? బతికి నన్నాళ్ళూ పనిచేస్తారు కదా? ఇంకా బోలెడు మంది శ్రామి కులు దొరుకుతారు కదా? అది చాలు, పెట్టుబడిదారుడికి.

# 'అదనపు శ్రమ' రహస్యం!

మనిషి శరీరంలో — 'శ్రమ చేసే శక్తి' ఏర్పడాలంటే ఆ మనిషికి కనీసంగా కొన్ని వస్తువులు కావాలి కదా? ఆ వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యడానికి ఖర్చయ్యే శ్రమ పరిమాణానికీ; ఆ వస్తువుల్ని వాడగా వచ్చిన 'శక్తి'తో ఆ మనిషి చెయ్యగలిగే శ్రమ పరిమాణానికీ — సంబంధం వుండదు. అంటే, ఇక్కడ 2 విషయాలు వున్నాయి. (1) మనిషి పోషణ కోసం ఖర్చయ్యే శ్రమ, (2) ఆ మనిషి చేసే శ్రమ. — మొదటి శ్రమకన్నా రెండో శ్రమ ఎక్కువగా వుండడం, సాధ్యమే. అంటే, మనిషి, తన 'పోషణ' కోసం ఖర్చయ్యే శ్రమకన్నా, ఎక్కువ శ్రమ చెయ్యడం సాధ్యమే. — ఇక్కడే వుంది, శ్రమ చేసే మనిషి ఇచ్చే 'అదనపు శ్రమ' రహస్యం అంతా! దీన్ని సరిగా అర్థం చేసుకోవాలి.

ఒక మనిషి జీవించడానికి ఒక రోజుకి కనీసం 4 వస్తువులు కావాలనుకుందాం. ఆ వస్తువుల వివరాలు ఇక్కడ అక్కరలేదు. ఒక రోజుకి అతని అవసరాలన్నీ కనీస స్థాయిలో ఆ 4 వస్తువుల ద్వారా తీరతాయనుకుందాం. అంటే, ఆ 4 వస్తువుల్లో మొత్తం ఎంత శ్రమ వుంటుందో అంత శ్రమ ఆ పోషణ కోసం అవసరమైందని అర్థం. ఆ 4 వస్తువుల్నీ వాడడంవల్ల అతని శరీరం శ్రమ చెయ్యగల శక్తితో వుంటుంది. ఆ శక్తితోనే అతను పని చేస్తాడు. ఆ పని ద్వారా అతను, తను ఉపయోగించిన 4 వస్తువులలో వున్నంత శ్రమనే చెయ్యగలడా, అంతకన్నా ఎక్కువ శ్రమ చెయ్యగలడా? — శ్రమ శక్తి ఏర్పడడానికి ఎన్ని వస్తువులు ఖర్చవుతాయో, ఆ శ్రమ శక్తి ద్వారా మళ్ళీ అంత శ్రమ మాత్రమే ఉత్పత్తి అయ్యేటట్టయితే, అంటే, అంతకన్నా ఎక్కువ ఉత్పత్తి చేసే పరిస్థితి శ్రమ శక్తికి లేకపోతే, అసలు చరిత్రలో 'బానిసత్వం' అనేది ('దోపిడీ' అనేది) ప్రారంభమయ్యేదే కాదు.

ఒక మనిషిని 'దోపిడీ చెయ్యడం' ఎప్పుడు సాధ్యమవుతుందంటే, ఆ మనిషి చేసే శ్రమ వల్ల, ఆ మనిషి బతకడానికి కావలసిన ఉత్పత్తి కన్నా ఇంకా ఎక్కువ ఉత్పత్తి జరిగే పరిస్తితి ఉన్నప్పుడే. ఒక మనిషి, తను బతకడానికి కావలసిన కనీస శ్రమ మాత్రమే చేసుకోగలిగితే, ఆ మనిషి నించి కొంత శ్రమని లాగడం ఇంకో మనిషికి సాధ్యం కాదు. అలాంటి పరిస్తితిలో ప్రతీ మనిషీ ఎవరికి కావలసిన కనీస ఉత్పత్తి వాళ్ళు చేసుకోవలసిందే. అంటే, అందరూ శ్రమ చెయ్యవలసిందే.

అలాంటి పరిస్తితిలో మార్పుకి అవకాశం ఎప్పుడు కలుగుతుందంటే, ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందడం ప్రారంభమైనప్పుడు. అంటే ఒక మనిషి తను జీవించడానికి కనీసంగా కావలసినంత వుత్పత్తినే గాక, ఇంకా కొంత ఎక్కువని కూడా ఉత్పత్తి చెయ్యడం సాధ్యమైనప్పుడు.

ఈ పరిస్తితిని — 'ఉత్పత్తి' ద్వారానూ, 'శ్రమ' ద్వారానూ, 'విలువ' ద్వారానూ కూడా చూడాలి.

మనిషి జీవించడానికి, 1 రోజుకి, కనీసం 4 వస్తువులు కావాలనుకుందాం. ఆ 4 వస్తువుల్లో వున్న 'మొత్తం శ్రమ' 4 గంటలు. ఈ 4 గంటల శ్రమ విలువ 1 రూపాయి — అనుకుందాం.

ఆ 4 వస్తువుల్ని వాడగా వచ్చిన 'శక్తి'తో, ఆ మనిషి, 1 రోజుకి 8 గంటలు పని చేస్తాడనుకుందాం. ఆ 8 గంటల శ్రమ, 8 వస్తువులకు సంబంధించిన 'మొత్తం శ్రమ' — అనుకుందాం. ఆ 8 గంటల శ్రమ విలువ — 2 రూ.లు.

**ఈ అంశాల్ని 'ఉత్పత్తి'గా చూస్తే :**

ఆ మనిషి, 1 రోజుకి, తన కోసం 4 వస్తువులు వాడుకుని, ఆ రోజులో 8 వస్తువులు ఉత్పత్తి చేశాడని అర్థం.

**ఆ అంశాల్ని 'శ్రమ'గా చూస్తే :**

ఆ మనిషి, 1 రోజుకి, తన కోసం '4 గంటల శ్రమ'ని వాడుకుని, ఆ రోజులో తను, '8 గంటల శ్రమ' చేశాడని అర్థం.

**ఆ అంశాల్ని 'డబ్బు'గా చూస్తే :**

ఆ మనిషి, 1 రోజుకి, తన కోసం '1 రూపాయి విలువ'ని వాడుకుని, తను, ఆ రోజులో '2 రూ.ల విలువ'ని ఉత్పత్తి చేశాడని అర్థం.

'4 వస్తువుల్ని' వాడగా వచ్చిన 'శక్తి'తో — 8 వస్తువులు.

'4 గం.ల శ్రమ'ని వాడగా వచ్చిన శక్తితో — 8 గం.ల శ్రమ.

'1 రూ. విలువ'ని వాడగా వచ్చిన శక్తితో — 2 రూ.ల విలువ.

ఉదాహరణని ఇన్ని రకాలుగానూ అర్థం చేసుకోవాలి.

మనిషి, తన కోసం తప్పనిసరిగా ఖర్చయ్యే దానికన్నా, కొంత ఎక్కువగా ఉత్పత్తి చెయ్యగలిగే పరిస్తితి వుంటేనే, మనిషి నించి కొంత శ్రమని దోచడం సాధ్యమవుతుంది.

ఇక్కడ 2 విషయాల్ని సరిగా అర్థం చేసుకోవాలి.

(1) శ్రమ శక్తి, (2) శ్రమ

ఈ రెండూ ఒకటి కాదు.

వీటి 'విలువలు' కూడా ఒకటి కాదు.

**'శ్రమ శక్తి' అంటే** : మనిషికి వున్న శ్రమ చెయ్యగల సామర్థ్యం. ఆ సామర్థ్యం వూరికే రాదు. దాని కోసం కొన్ని పదార్థాలు ఖర్చయితేనే అది వస్తుంది.

'శ్రమ' అంటే : ఆ సామర్థ్యంతో చేసే 'పని'. శ్రమ చేసే మనిషి, తక్కువ పదార్థాలతో బతికివుంటూ, ఎక్కువ పదార్థాల్ని ఉత్పత్తి చెయ్యగలడు. అంటే, శ్రమ శక్తి, 'తన కోసం' ఖర్చయ్యే శ్రమ కన్నా ఎక్కువ శ్రమ చెయ్యగలదు. వేరే మాటల్లో— శ్రమ శక్తి, తన 'విలువ' కన్నా, ఎక్కువ విలువని ఉత్పత్తి చెయ్యగలదు.

మన ఉదాహరణ ప్రకారం, శ్రమ చేసే మనిషికి సంబంధించిన అంశాలు ఇలా ఉంటాయి :

| శ్రమ విలువ | శ్రమ శక్తి విలువ | అదనపు విలువ |
|---|---|---|
| 8 వస్తువులు | 4 వస్తువులు | 4 వస్తువులు |
| 8 గం.ల శ్రమ | 4 గం. శ్రమ | 4 గం. శ్రమ |
| 2 రూ. విలువ | 1 రూ. విలువ | 1 రూ. విలువ |

దీన్ని చూస్తే ఈ విషయాలు తెలుస్తాయి :

(1) శ్రమా, శ్రమ శక్తీ ఒకటి కాదు.

(2) 'శ్రమ విలువ' కన్నా, 'శ్రమ శక్తి విలువ' తక్కువగా వుంటుంది.

(3) 'శ్రమ విలువ'లో నించి, 'శ్రమ శక్తి విలువ'ని తీసివెయ్యగా మిగిలేదే—అదనపు విలువ. అంటే, మొదట శ్రమ శక్తి విలువే నిర్ణయమవుతుంది. అది ఎంతో కొంత ఖచ్చితమైన భాగంగా ఉంటుంది. శ్రామికుడు చేసిన శ్రమ లోనించి, ఆ భాగాన్ని తీసివెయ్యగా మిగిలేదే— అదనపు విలువ కాబట్టి, అది తర్వాత నిర్ణయమవుతుంది.

(4) 'శ్రమ శక్తి విలువ'ని ఏ మాత్రం తగ్గించినా అదనపు విలువ పెరుగుతుంది. లేదా, 'శ్రమ శక్తి విలువ'ని ఏ మాత్రం పెంచినా, 'అదనపు విలువ' తగ్గుతుంది.

అంటే, 'శ్రమ శక్తి'కి తన 'విలువ' అనేది ఒకటి వుందన్న మాట. ఆ విలువ ఏమిటి? 'శ్రమ శక్తి విలువ' దేన్ని బట్టి ఏర్పడుతుంది? అదే ఇప్పుడు చూడాలి. ఏ సరుకు విలువైనా దేన్ని బట్టి ఏర్పడుతుందో, 'శ్రమ శక్తి' విలువ కూడా దాన్ని బట్టే ఏర్పడుతుంది. అంటే, 'అది ఉత్పత్తి అవడానికి అవసరమయ్యే మొత్తం శ్రమ కాలాన్ని' బట్టి. ప్రస్తుతానికి క్లుప్తంగా చెప్పుకుంటే, 'శ్రమ' చెయ్యా లంటే 'శక్తి' కావాలి కాబట్టి, ఆ శక్తి ఏర్పడడానికి 'కనీసంగా' అవసరమయ్యే ఉత్పత్తుల విలువే —'శ్రమ శక్తి విలువ'.

ఇక్కడ ఒక విషయం ఎంతో స్పష్టంగా అర్థం చేసుకోవాలి. 'కనీసావసరాల విలువే — శ్రమ శక్తి విలువ' అని చెప్పుకుంటున్నామంటే, ఈ లెక్క, పెట్టుబడిదారుడి దృష్టితో నిర్ణయమయ్యేది — అని మాత్రమే అర్థం. అంతే గానీ ఇది శ్రామికుడి దృష్టితో నిర్ణయమయ్యేది కాదు. శ్రామికుడి ప్రకారం అయితే — "శ్రామికుడు చేసిన శ్రమకి బదులుగా అతనికి ఎంత రావాలి?" అనే ప్రశ్నే తప్పు. అతని శ్రమ విలువ అంతా అతనికే రావాలి. అది ఎంత అయితే అంత. దానికన్నా ఎక్కువా కాదు, తక్కువా కాదు. అతని శ్రమ అంతా అతనిదే. కాబట్టి, శ్రమ చేసిన మనిషికి ఎంత శ్రమ రావాలి?—అనే ప్రశ్న ఏమిటి? ఆ ప్రశ్నే అర్థ రహితం. 'ఎవరి శ్రమ వాళ్ళదే' అనే దృష్టితో చూస్తే— శ్రమ విలువ కన్నా శ్రమ శక్తి విలువ తక్కువగా వుండ కూడదు. రెండూ ఒకటి గానే వుండాలి. అప్పుడు ఆ మాటలు కూడా వేరు వేరుగా వుండవు.

కానీ ఇక్కడ చూడవలసిందంతా —పెట్టుబడిదారుడికి మిగిలే 'లాభం' విషయం. పెట్టుబడిదారుడు, శ్రమ చేసే మనిషికి 'జీతం' ఇచ్చి, తను 'లాభం' మిగుల్చుకోవడంలో వున్న రహస్యం ఏమిటీ— అని చూసేటప్పుడు, 'జీతం' అనేది, 'శ్రమ విలువ' కన్నా తక్కువగా వుండే అంశమే— అనే అర్థానికి రావలసి వస్తుంది. ఈ రకంగా, 'జీతం' అనేది 'శ్రమ విలువ'గా గాక 'శ్రమ శక్తి విలువ'గా తేలుతుంది.

పెట్టుబడిదారుడు, శ్రామికుడితో శ్రమ చేయించుకుని, ఆ 'శ్రమ విలువనంతటినీ' ఇవ్వక పోయినా, 'శ్రమ శక్తి విలువైనా' ఇవ్వకుండా తప్పుకోలేడు. అది కూడా ఇవ్వక పోతే, శ్రామికుడు జీవించే వుండడు. అప్పుడు పెట్టుబడిదారుడికి శ్రామికుడే దొరకడు. అతని శ్రమలో కొంత భాగాన్ని తను మిగుల్చుకోవడానికి అవకాశమే వుండదు.

అంటే, పెట్టుబడిదారుడు శ్రామికుడికి ఇచ్చేదానికి ఒక 'కనీస హద్దు' వుంటుందన్నమాట. 'శ్రమ శక్తి విలువే' ఆ కనీస హద్దు. శ్రామికుడి మీద ఎంత ఖర్చు పెడితే అతను 'శ్రమ'ని ఇవ్వడానికి శక్తి కలిగి వుంటాడో అంత వరకూ మాత్రం తప్పనిసరిగా ఇవ్వాలి. అది కూడా మిగుల్చుకోవడానికి వీలు లేదు. అంటే, శ్రామికుడు చేసిన శ్రమలో 'శ్రమ శక్తి'కి ఇవ్వవలసిన భాగమే మొదట నిర్ణయమవుతుంది. దాన్ని తీసేశాక మిగిలిందే పెట్టుబడిదారుడికి ఉంటుంది. అందుకే, పెట్టుబడి దారుడు ఎప్పుడూ, శ్రామికుడికి తక్కువ ఇవ్వడానికే చూస్తాడు; తక్కువ ఇస్తే తనకు మిగిలే భాగం ఎక్కువగా వుంటుంది కాబట్టి. కానీ, ఎంత తగ్గించినా శ్రామికుడికి ఇచ్చే దాన్ని ఒక కనీస స్థాయికన్నా తగ్గించడానికి వీలు అవదు. కాబట్టి, 'కనీసావసరాల విలువే, శ్రమ శక్తి విలువ' — అనే అర్థం, పెట్టుబడిదారీ దృష్టితో ఏర్పడేదే గానీ, శ్రామిక దృష్టితో ఏర్పడేది కాదు. ఈ విషయం సరిగా అర్థం చేసుకోవాలి. ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి.

శ్రామికుడికీ పెట్టుబడిదారుడికీ మధ్య జరిగేదాన్ని ఇప్పుడు క్లుప్తంగా చెప్పుకుంటే: శ్రామికుడు, పని స్థలంలోకి వచ్చి పెట్టుబడిదారుడికి తన 'శ్రమ' ఇస్తాడు. దానికి బదులుగా పెట్టుబడిదారుడు శ్రామికుడికి ఆ 'శ్రమ విలువ'ని ఇవ్వడు. 'శ్రమ శక్తి విలువ'ని ఇస్తాడు. అంటే, శ్రామికుడి నించీ 'ఎక్కువ శ్రమ'ని తీసుకుని, శ్రామికుడికి 'తక్కువ శ్రమని' ఇస్తాడు. ఇలా చెయ్యడం వల్లనే వాడు, ఆ

శ్రామికుడు ఇచ్చిన శ్రమలో నించి కొంత భాగాన్ని మిగుల్చుకో గలుగుతాడు.

ఈ శ్రమా, శ్రమ శక్తీ — అనే వాటి గురించి, పెట్టుబడి దారుడికీ శ్రామికుడికీ కూడా తెలీదు. వాళ్ళిద్దరికీ ఏం కన పడుతుందంటే — ఆ శ్రామికుడు పెట్టుబడిదారుడు చెప్పిన 'శ్రమ' చేస్తాడు. దానికి పెట్టుబడిదారుడు, జీతం ఇస్తాడు. ఈ 2 అంశాలే వాళ్ళకి కనపడతాయి. వాటిలో నిజమైన అర్థాలేవీ కనపడవు. తెలియవు.

# ఒక 'శ్రమ'కు 'విలువ' ఎలా ఏర్పడుతుంది?

'విలువ అంటే శ్రమే'— అని చూశాం. "శ్రమకు విలువ ఎలా ఏర్పడుతుంది?" అన్నప్పుడు, "శ్రమకు శ్రమ ఎలా ఏర్పడుతుంది?" అన్నట్టే అర్థం కదా? ఇది అర్థ రహితమైన ప్రశ్నలాగ కనపడుతుంది. కానీ, అన్ని రకాల శ్రమలకూ ఒకే విలువ ఉండదు. ఈ కారణం వల్ల, "ఒక శ్రమకు విలువ ఎలా ఏర్పడుతుంది?" అనే ప్రశ్న అర్థ రహితం కాదు. 'శ్రమ' గురించీ, 'విలువ' గురించీ, అనేక విషయాలు చూసేటప్పుడు, ఒక్కోసారి ఆ రెంటినీ ఒకే అర్థంతో చూస్తాం. ఒక్కోసారి వేరు వేరు అర్థాలతో చూస్తాం. కాబట్టి, సందర్భాన్ని బట్టి, అక్కడ ఏ విషయం నేర్చుకుంటు న్నామో దాని కోసం, మాటల్ని అలా వాడక తప్పదు.

శ్రమలు రక రకాలుగా ఉంటాయి కదా? కుట్టూ, నేతా, వైద్యం చెయ్యడం, పొలం దున్నడం, చదువు చెప్పడం, బండి తోలడం — ఇలా. ఏ శ్రమకైనా 'విలువ' వుంటుంది. (ఏ శ్రమ అయినా, 'విలువ' అవుతుంది.) అయితే, అన్ని శ్రమలకూ విలువ ఒక్క లాగే ఉంటుందా ; లేకపోతే, కొన్ని శ్రమలకు ఎక్కువ విలువా, కొన్ని శ్రమలకు తక్కువ విలువా ఉంటుందా?

ఒక కుట్టు మనిషి, ఒకరోజు (10 గంటలు) కొంత కుట్టు పని చేశాడు. ఒక వైద్యుడు, ఒకరోజు (10 గంటలు) కొంత వైద్యం చేశాడు. ఇద్దరూ పదేసి గంటల సేపే పని చేశారు. వారి శ్రమలకు ఉండే విలువలు ఒక్కలాగే ఉంటాయా? 1 గంట కుట్టు శ్రమకీ, 1 గంట వైద్యం శ్రమకీ ఒకే విలువ ఉంటుందా? ఒకే పరిమాణం గల ఒక శారీరక శ్రమకీ, ఒక మేధా శ్రమకీ, ఒకే విలువ వుంటుందా? ఒక నైపుణ్యం గల శ్రమకీ, ఒక నైపుణ్యం లేని శ్రమకీ, విలువ ఒకే రకంగా ఉంటుందా?— ఈ ప్రశ్నలకు జవాబులు కావాలి.

నిత్య జీవితంలో మనకు కనపడే పరిస్తితి ప్రకారం, అన్ని శ్రమలకూ ఒకే విలువ ఉండదు. వేరు వేరు శ్రమలు చేసే వాళ్ళందరికీ ఒకే ఆదాయం ఉండదు. 'లోకజ్ఞానం' ప్రకారం మనకు తెలిసేది — కొన్ని శ్రమలకు ఎక్కువ విలువా, కొన్ని శ్రమలకు తక్కువ విలువా, కొన్ని శ్రమలకు మధ్యరకం విలువా ఉంటాయి. కుట్టు పనికి వచ్చే ఆదాయం కన్నా, వైద్యం వల్ల వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుంది. కుండలు చేసే పని వల్ల వచ్చే ఆదాయం, కుట్టు పని ఆదాయం కన్నా కూడా తక్కువగా ఉంటుంది. ఇవి నిత్య జీవితంలో కనపడే వాస్తవాలు. ఈ వాస్తవాలు చెప్పేదేమిటంటే, అన్ని శ్రమలకూ ఒకే విలువ ఉండదు — అని.

అయితే, ఈ వాస్తవాలు, సరైనవేనా?— సరైనవే. అంటే, ఈ వాస్తవాలు, 'విలువ సూత్రం' ప్రకారం కూడా సరైనవే.

సాధారణంగా నిత్య జీవితంలో కనపడే విషయాల్లో అన్నీ 'సరైనవిగా' వుండవు. కొన్ని విషయాలు తప్పులుగా వుంటే, కొన్ని విషయాలు సరైనవిగా ఉంటాయి. కొన్ని, తప్పొప్పులతో కలిసి ఉంటాయి. పూర్తిగా తప్పు విషయాలు కూడా పైకి పూర్తిగా సరైన విషయాలుగానే కనపడుతూ వుంటాయి. ఉదాహరణకి, వడ్డీ, లాభమూ, కౌలూ — వంటి విషయాలన్నీ పూర్తిగా తప్పులే. కానీ అవి ఎంతో సరైన విషయాలుగా పైకి కనపడతాయి. వీటి విషయంలో పైకి కనపడేదంతా పూర్తిగా తప్పే. కాబట్టి, ఒక విషయాన్ని పైకి ఎలా కనపడితే అలాగే, దాన్ని తార్కికంగా పరిశీలించ కుండా, తీసుకోకూడదు. ఇక్కడ మనం చూసే విషయం — 'అన్ని శ్రమల విలువలూ ఒకే రకంగా వుంటాయా, తేడాగా వుంటాయా' అనేది. ఈ విషయంలో, నిత్య జీవితంలో కనపడేది 'విలువ సూత్రం' ప్రకారం కూడా సరైనదే. అంటే, అన్ని శ్రమల విలువలూ ఒకే రకంగా వుండవు. 'శారీరక శ్రమ' విలువకన్నా 'మేధా శ్రమ' విలువ ఎక్కువ. 'నైపుణ్యం లేని శ్రమ' విలువకన్నా 'నైపుణ్యం గల శ్రమ' విలువ ఎక్కువ. ఈ తేడాలు తప్పనిసరిగా వుండే తేడాలే.

అయితే, శ్రమల విలువలు తేడాగా ఎందుకు ఉంటాయి? అదే ఇప్పుడు చూద్దాం. 1 గంట కుట్టుకీ, 1 గంట వైద్యానికీ ఒకే విలువ ఎందుకు ఉండడం లేదు? అదీ గంట శ్రమే, ఇదీ గంట శ్రమే కదా? రెండు శ్రమల్నీ ఒకే పరిమాణంలో తీసుకున్నా, ఒక రకం శ్రమకి ఎక్కువ విలువా, ఇంకో రకం శ్రమకి తక్కువ విలువా ఉండడం ఏమిటీ?— ఇందులో ఏమైనా పొరపాటు జరుగు తోందా?— లేదు. పొరపాటేమీ లేదు. ఎలా జరగాలో అలాగే జరుగుతోంది. జరగవలసిందే జరుగుతోంది.

వైద్యాన్నీ, కుట్టునీ తీసుకుంటే, వైద్యం 'ఎక్కువ విలువ గల' శ్రమగానూ, కుట్టు 'తక్కువ విలువ గల' శ్రమగానూ సమాజంలో ఎప్పుడూ ఉన్నాయి. అలా ఉండడానికి తప్పనిసరిగా కారణం వుంది. అయితే, ఆ విలువల మధ్య తేడా మరీ ఎక్కువగా ఉండడం సరైన విషయం కాదు.

'1 గంట కుట్టు' అనీ, '1 గంట వైద్యం' అనీ అంటున్నామంటే, ఆ 2 శ్రమల్నీ కూడా ఆ శ్రమలకు సంబంధించిన సగటు పరిస్థితుల నించే తీసుకుంటున్నామని అర్థం. ఏ శ్రమకు సంబంధించిన సగటు పరిస్థితులు ఆ శ్రమకు వుంటాయి. 'సగటు పరిస్థితి' అన్నా, 'సాధారణ పరిస్థితి' అన్నా, 'జనరల్ పరిస్థితి' అన్నా, — అన్నీ ఒకటే.

కుట్టుకీ, వైద్యానికీ ఒకే విలువ ఎందుకు వుండదో తెలియాలంటే, అసలు ఏ శ్రమకైనా విలువ ఎలా ఏర్పడుతుందో తెలియాలి. ఒక మనిషి ఒక పని చెయ్యాలంటే, మొదట కొంత కాలంపాటు ఆ పని నేర్చుకోవాలి. ముందు పని నేర్చుకుంటేనే గానీ, ఆ పని చెయ్యడం సాధ్యం కాదు. అంటే, ఈ ఉదాహరణలో, కుట్టు మనిషీ వైద్యం మనిషీ కూడా మొదట కొంత కాలం పాటు ఆ పనులు నేర్చుకోవాలి.

ఏ ప్రత్యేక రకం పని నేర్చుకోవాలన్నా దాని కోసం, (1) కొన్ని 'శ్రమ సాధనాలూ', (2) కొంత 'సజీవ శ్రమా'— ఖర్చవుతాయి. అంటే, ఆ పనిని నేర్చుకోవడంలో కొన్ని వస్తువులు ఖర్చవుతాయి; ఆ పనిని నేర్పే మనిషి కొంత శ్రమ చెయ్యాలి. అంతేగాక, ఆ పనిని నేర్చుకునే మనిషి కూడా కొన్ని నెలలో, కొన్ని సంవత్సరాలో ఆ పని కోసం కృషి చెయ్యాలి.

ఒక మనిషికి, కుట్టు పని సాధారణ స్థాయిలో అలవడడానికి 2 సంవత్సరాల కాలం కావాలనుకుందాం. ఆ కాలంలో— (1) ఆ పని నేర్చుకోడం కోసం అతనికి బట్టల ఖర్చూ, (2) సూదులూ, దారాలూ, కత్తెర్లూ, వగైరా శ్రమ పరికరాల ఖర్చూ (3) ఆ పని నేర్పేమనిషి శ్రమా — ఇవన్నీ కలిసి ఆ పని నేర్చుకోవడానికి అయ్యే ఖర్చులుగా వుంటాయి. ('ఖర్చు' అన్నప్పుడు, దాన్ని 'డబ్బు ఖర్చు'గా చూసినా, అది 'ఉత్పత్తుల ఖర్చే'. డబ్బు ఖర్చవడం అంటే, ఉత్పత్తులు ఖర్చవడమే.) ఆ ఖర్చులతో పాటు, ఆ నేర్చుకునే మనిషి 2 సంవత్సరాలు కృషి చెయ్యాలి.

'వైద్యం' శ్రమకి సంబంధించిన విషయం కూడా అంతే. వైద్యం చెయ్యడం సాధారణ స్థాయిలో అలవడాలంటే, కనీసం 10 సం॥లు పడుతుందనుకుందాం. ఆ చదువుకి కావలసిన పుస్తకాలూ, ఇతర శ్రమ పరికరాలూ వగైరాల కోసం అయ్యే ఖర్చూ; ఆ కాలంలో ఉపాధ్యాయుల కోసం అయ్యే ఖర్చూ కలిసి, ఆ శ్రమని నేర్చుకోవడానికి అయ్యే ఖర్చుగా వుంటుంది. ఆ ఖర్చుతో పాటు, ఆ పని నేర్చుకునే మనిషి 10 సం॥ల వరకూ చెయ్యవలసిన కృషికూడా, ఆ పని నేర్చుకోవడానికి అవసరమయ్యే ఒక అంశంగా ఉంటుంది.

ఈ ఉదాహరణలో, కుట్టుపనికి 100 ఖర్చూ, వైద్యం పనికి 800 ఖర్చూ — అవుతాయనుకుందాం. అంటే, కుట్టు పని రావడానికి అయ్యే ఖర్చుతో పోలిస్తే, వైద్యం పని రావడానికి అయ్యే ఖర్చు, 8 రెట్లన్నమాట. అంతేగాక, కుట్టు మనిషి 2 సంవత్సరాలు కృషి చెయ్యవలసి వస్తే, వైద్యం మనిషి 10 సంవత్సరాలు కృషి చెయ్యవలసి వస్తుందన్నమాట.

ఈ రకంగా, ఇద్దరు మనుషులు, 2 వేరు వేరు రకాల పనుల కోసం, ఒకరు ఎక్కువ ఖర్చూ, ఒకరు తక్కువ ఖర్చూ వెచ్చించీ; ఒకరు ఎక్కువ కాలమూ, ఒకరు తక్కువ కాలమూ శ్రమించీ — ఆ పనులు నేర్చుకున్నారు. అప్పటి నించీ వాళ్ళు ఆ పనులు చెయ్యగలరు; చెయ్యడం మొదలు పెడతారు.

ఆ ఇద్దరి శ్రమలకూ వచ్చే ఆదాయాలు ఒక్కలాగే ఉండవు. కుట్టుపనికి ఒకరోజుకి వచ్చిన ఆదాయం కన్నా, వైద్యానికి ఒకరోజుకి వచ్చే ఆదాయం కొన్ని రెట్లు ఎక్కువగా వుంటుంది. అంటే, కుట్టు శ్రమ విలువా, వైద్యం శ్రమ విలువా, ఒకే రకంగా లేవన్నమాట. ఒక గంట కుట్టు శ్రమ విలువకన్నా, ఒక గంట వైద్యం విలువ ఎక్కువ. ఇలాగే, అన్ని శ్రమల విలువలూ రకరకాల తేడాలతో ఉంటాయి.

శ్రమల విలువలు తేడాలుగా ఉండకపోతే ఏమవుతుంది? సమాజంలో ఉన్న అన్ని శ్రమలకూ ఒకే విలువ ఉన్నట్టు ఊహిద్దాం. అంటే, కుట్టు పనికీ, నేత పనికీ, వైద్యానికీ, అన్నిటికీ ఒకే ఆదాయం! అప్పుడే మవుతుంది? — ఏమవుతుందో వివరంగా చూసేముందు చివరి ఫలితాన్ని మొదటే చెప్పేసుకుందాం. ఆ విలువల సమానత్వం కొంత కాలానికి తప్పనిసరిగా చెదిరిపోతుంది. ఆ విలువలు మళ్ళీ ఎప్పటి లాగే తేడాలుగా అయిపోతాయి. అన్ని శ్రమలకూ ఒకే విలువ స్థిరపడడం ఎప్పటికీ జరగదు. ఈ విషయమే, ఇప్పుడు వివరంగా చూస్తాం.

అన్ని శ్రమల విలువలూ ఒకే రకంగా ఉన్నట్టు ఊహించినా, ఆ శ్రమల్ని నేర్చుకోవడానికి అయ్యే ఖర్చులూ, కాలాలూ కూడా ఒకే రకంగా అయిపోవు. ('ఖర్చుల' విషయంలో, వేరు వేరు శ్రమల్ని నేర్పే టీచర్ల శ్రమల విలువలు ఒకే రకంగా ఉన్నట్టు ఊహిస్తాం. అయినా 'శ్రమ పరికరాల' ఖర్చులు ఒకే రకంగా ఉండవు. కాబట్టి, వేరు వేరు శ్రమల్ని నేర్చుకునే 'ఖర్చులూ, కాలాలూ' ఒకే రకంగా ఉండవు). శ్రమల్ని నేర్చుకోడానికి అయ్యే ఖర్చుల్లోనూ, కాలాలలోనూ తేడాలు ఎప్పటిలాగే వుండగా, ఫలానా ఒక రోజు నించీ, ఆ శ్రమల ద్వారా వచ్చే

ఆదాయాలు ఒక్కలాగే అయిపోతే, అప్పుడేమవుతుంది?

అప్పటికి ఏ శ్రమలో వున్న వాళ్ళు ఆ శ్రమలోనే ఉంటారు. ఏ శ్రమ చేసినా అన్నిటికీ ఒకే విలువ కాబట్టి, వాళ్ళు తమ శ్రమల్ని మార్చుకోడానికి ప్రయత్నించరు. కానీ, ఆ శ్రమల్ని కొత్తగా నేర్చుకోవడానికి సిద్ధపడే వాళ్ళ విషయంలో మాత్రం పెద్ద మార్పు జరుగుతుంది. ఎక్కువ ఖర్చు పెట్టీ, ఎక్కువ శ్రమ పడీ నేర్చుకోవలసిన పనికీ; తక్కువ ఖర్చు తోటీ, తక్కువ శ్రమ తోటీ నేర్చుకోగలిగే పనికీ, 'ఒకే విలువ' వుంటే, మొదటి రకం పనుల వేపు మనుషులు మొగ్గరు. అంటే, కుట్టుకీ, వైద్యానికీ ఒకే విలువ వుంటే, వైద్యం వేపు గతంలో వచ్చే విధంగా నేర్చుకునే వాళ్ళు రారు.

ఇక్కడ, ఇంకా వివరం కావాలి. కుట్టు విలువా, వైద్యం విలువా వేరువేరుగా వుండే కాలంలో, 1 గంట కుట్టు విలువ 1 రూపాయీ, 1 గంట వైద్యం విలువ 4 రూ.లూ అనుకుందాం. ఆ 2 శ్రమల విలువలూ ఒకే రకంగా అయిపోయాయి — అని ఉహించేటప్పుడు, ఆ 2 రకాల విలువల్లో ఏ విలువని దృష్టిలోకి తీసుకుంటాం? కుట్టు విలువ లాగే వైద్యం విలువ కూడా గంటకి 1 రూపాయిగా అయిపోయినట్టా? లేక, వైద్యం విలువకి లాగే కుట్టుకి కూడా గంటకి 4 రూ.లుగా అయిపోయినట్టా? ఏ విలువని తీసుకుంటాం? — ఇక్కడ 2 ఉదాహరణలూ చూడాలి.

**మొదటి ఉదాహరణ** : కుట్టు విలువ ప్రకారమే వైద్యానికి కూడా గంటకి 1 రూపాయి విలువే ఏర్పడిందనుకుందాం. అప్పుడే మవుతుంది? తక్కువ ఖర్చుతో నేర్చుకునే శ్రమకీ, ఎక్కువ ఖర్చుతో నేర్చుకునే శ్రమకీ ఒకే ఆదాయం ఉన్నప్పుడు, ఎక్కువ ఖర్చయ్యే శ్రమని అసలు నేర్చుకోవడమే సాధ్యం కాదు. ఒక వ్యక్తికి వైద్యం మీద ప్రత్యేకమైన ఆసక్తి వుందనుకుందాం. దాని కోసం ఎక్కువ ఖర్చుపెట్టి, దాని వల్ల తక్కువ సంపాదించడానికి కూడా అభ్యంతరం లేదనుకుందాం. అయినా, ఆ వ్యక్తికి వైద్యం నేర్చుకోవడం సాధ్యం కాదు. ఎందుకంటే, పిల్లలు ఏ విద్య నేర్చుకోవాలన్నా దానికి తగ్గ ఆదాయం తల్లిదండ్రులకు వుండాలి. తల్లిదండ్రుల ఆదాయాలు 'కుట్టు శ్రమ'కు వచ్చే ఆదాయాలుగా మాత్రమే వున్నప్పుడు, అలాంటి ఆదాయంతో ఆ తల్లిదండ్రుల పిల్లలు, మళ్ళీ కుట్టు శ్రమలే (అలాంటి తక్కువ ఖర్చయ్యే శ్రమలే) నేర్చుకోవడానికి అవకాశం వుంటుందిగానీ, ఆ శ్రమ కోసం అంతకన్నా అనేక రెట్లు ఎక్కువ ఖర్చయ్యే శ్రమలు నేర్చుకోడానికి అవకాశం వుండదు. ఇలాంటి పరిస్థితి వల్ల, సమాజంలో, వైద్యంవేపు గతంలో వచ్చే విధంగా, నేర్చుకునే విద్యార్థులు రారు. అంటే కొత్త వైద్యులు తయారవడం ఆగిపోతుంది. అంతే కాదు. సమాజంలో కుట్టు మనుషులు ఎక్కువగా తయారయ్యే పరిస్తితి కూడా ఏర్పడుతుంది.

వైద్యులు తక్కువై పోవడంవల్ల, సమాజ అవసరాల మీద ఆ తక్కువ మందే పనిచెయ్యవలసి వస్తుంది. అప్పుడు వైద్య శ్రమకి వచ్చే ఆదాయం తప్పనిసరిగా పెరుగుతుంది.

అలాగే, రెండో వేపు, కుట్టు మనుషులు ఎక్కువై పోవడం వల్ల, సమాజ అవసరాల మీద ఆ ఎక్కువమంది పనిచెయ్యడం వల్ల, కుట్టు శ్రమకి వచ్చే ఆదాయం తప్పనిసరిగా తగ్గుతుంది. అంటే, ఒక నాడు కుట్టు విలువకీ, వైద్యం విలువకీ ఏ తేడాలూ లేని పరిస్తితి చెదిరిపోయి, కొంతకాలానికి మళ్ళీ తప్పనిసరిగా తేడాలు ఏర్పడతాయి. అప్పుడు, వైద్యాన్ని నేర్చుకునే పనిలోకి కూడా కొత్త వాళ్ళు రావడం ప్రారంభమవుతుంది. అంతేగాక, కుట్టుపని నేర్చుకునేవారి సంఖ్య తగ్గటం కూడా జరుగుతుంది. అంతా మళ్ళీ తేడాల పరిస్తితే ఏర్పడుతుంది.

**రెండో ఉదాహరణ** : వైద్యానికి వుండే విలువతోనే, కుట్టుకు కూడా గంటకి 4 రూ.ల విలువ ఏర్పడింది — అనుకుందాం. దీని సారాంశం కూడా మొదటి ఉదాహరణలో లాగే ఉంటుంది. ఇప్పుడు వైద్యం పని చేసే వారి పిల్లల్లో, ఆ పనే నేర్చుకోదల్చుకున్న వాళ్ళకి నేర్చుకునే అవకాశం వుంటుంది. ఎందుకంటే, వారి తల్లిదండ్రుల ఆదాయాలు ఎక్కువగానే వుంటాయి గనక. కానీ అన్ని శ్రమలకూ 'ఒకే విలువ' వున్నప్పుడు, ఎక్కువ ఖర్చూ, ఎక్కువ కాలమూ అవసరమయ్యే శ్రమలు నేర్చుకోవలసిన అవసరం కనపడదు. ప్రత్యేక ఆసక్తి వున్నవాళ్ళు మాత్రమే ఆ శ్రమలలోకి వస్తారు. మిగిలిన వాళ్ళంతా తక్కువ ఖర్చుతో నేర్చుకోగలిగే శ్రమలవేపే మొగ్గుతారు. వైద్యం మీద ప్రత్యేక ఆసక్తివున్న మనుషులు వైద్యంలోకి వచ్చినా, అది చాలా తక్కువ సంఖ్యగానే వుంటుంది. దానివల్ల, సమాజ అవసరాలకు కావలసినంత మంది వైద్యులు తయారు కావడం ఆగిపోతుంది. వైద్యుల సంఖ్య తగ్గి, ఆ వృత్తి కోసం అవసరం పెరిగి, వైద్యం విలువ పెరుగుతుంది. రెండో వైపు, కుట్టు పనికి వైద్యంతో సమానమైన ఎక్కువ విలువ వుంటే, కుట్టు మనుషులే పెరిగి, ఆ పనితో అవసరం తగ్గి, కుట్టు విలువ తగ్గుతుంది. పరిస్తితి అంతా మొదటి ఉదాహరణలో లాగే తయారవుతుంది. కొంత కాలానికి, వైద్యం విలువకీ, కుట్టు విలువకీ ఎక్కువ తక్కువలు మళ్ళీ ఎప్పటిలాగే ఏర్పడిపోతాయి. ఈ రకంగా, ఒక రోజు నించి అన్ని శ్రమల విలువలూ సమానం అయిపోయినట్టు ఊహించినా, కొంత కాలానికి, అవి (శ్రమల విలువలు) తప్పనిసరిగా తేడాలుగా అయిపోతాయి.

వేరు వేరు శ్రమల్ని నేర్చుకునే ఖర్చులూ, కాలాలూ ఒకే

రకంగా ఉండవు కాబట్టే, వాటి విలువలు ఎక్కువ తక్కువలుగా ఉంటాయి.

ఒక మేధా శ్రమ విలువ ఎక్కువగానూ, ఒక శారీరక శ్రమ విలువ తక్కువగానూ; అందులో మళ్ళీ స్కిల్డ్ శ్రమ విలువ ఎక్కువగానూ, అన్ స్కిల్డ్ శ్రమ విలువ తక్కువగానూ —ఇలా.

2 శ్రమల్నీ ఒకే పరిమాణంతో తీసుకున్నా, వాటి విలువలు ఎక్కువ తక్కువలుగా వుండడం— అనే విషయాన్ని ఇంకా తేలిగ్గా అర్థం చేసుకోవడానికి, ఒక ఉదాహరణ చూద్దాం. ఒక దూది బస్తానీ, ఒక ఇసక బస్తానీ తీసుకుందాం. రెండు బస్తాలూ ఒకే సైజుగలవి. దూదీ ఒక్క బస్తాయే, ఇసకా ఒక్క బస్తాయే కాబట్టి, వాటి సైజులు ఒకటే కాబట్టి, వాటి బరువులు ఒక్కలాగే ఉంటాయా?— ఉండవు. ఎందుచేత? ఆ పదార్థాలకు 'బరువుల్ని కలిగించే' లక్షణాలలోనే ఆ తేడా ఉంది.

శ్రమల విలువల విషయం కూడా అంతే. రెండు వేరు వేరు శ్రమలు, ఒకే పరిమాణంతోవున్నా వాటికి విలువల్ని కలిగించే లక్షణాలలోనే ఆ తేడా ఉంది.

వేరు వేరు శ్రమల్ని నేర్చుకోవడానికి సంబంధించిన ఉత్పాదక శక్తులు క్రమంగా పెరుగుతూనే ఉంటాయి. దాని వల్ల, శ్రమల్ని నేర్చుకునే ఖర్చులూ, కాలాలూ తప్పనిసరిగా తగ్గుతూ వుంటాయి. అయినప్పటికీ, ఆ మార్పులు అన్ని రకాల శ్రమలకూ జరుగుతాయి కాబట్టి, శ్రమల విలువల్లో తేడాలు ఎప్పటిలాగే వుంటాయి. కుట్టునీ, వైద్యాన్నీ తీసుకుంటే, వాటిని నేర్చుకునే పరిస్తితులన్నీ 100 సంవత్సరాల కిందట తేడాగా వున్నట్టే, 100 సంవత్సరాల తర్వాత కూడా తేడాగానే వుంటాయి. అంటే కుట్టు విలువకీ వైద్యం విలువకీ తేడా వుండడం అనేది ఏనాడైనా తప్పనిసరి విషయమే.

ఒక శ్రమ గురించి విడిగా చూస్తే, దాన్ని నేర్చుకునే పరిస్తితులేమైనా చవక అయితే, దాని విలువ కూడా గతం కన్నా తగ్గుతుంది. ఇది కూడా 'సరుకు విలువ తగ్గడం' లాంటిదే. 'సరుకు విలువ'కి వర్తించే విషయాలే, 'శ్రమ విలువ' కి కూడా వర్తిస్తాయి.

ఒక మనిషి, ఒక శ్రమని, పదేళ్ళ కిందటో ఇరవై ఏళ్ళ కిందటో నేర్చుకుని వుండవచ్చు. కానీ, ఆ శ్రమ విలువ, ఆ శ్రమని నేర్చుకున్న కాలంనాటి ఖర్చుల్ని బట్టి వుండదు. ఆ శ్రమ ఎప్పుడు జరుగుతూ వుందో ఆ కాలంలో వున్న పరిస్తితుల్ని బట్టి వుంటుంది. అదే శ్రమని, ప్రతీ నిత్యం కొత్త విద్యార్థులు నేర్చుకుంటూనే వుంటారు. ఆ ఖర్చులూ ఆ కాలాలూ కొత్త పరిస్తితుల్ని బట్టి మారుతూ వుంటాయి. కాబట్టి, ఆ శ్రమ విలువ కూడా కొత్త పరిస్తితుల్ని బట్టే వుంటుంది.

శ్రమలు వేరు వేరుగా వుండడం తప్పనిసరి. వాటి శ్రమ శక్తి విలువలు, ఎక్కువ తక్కువలుగా వుండడం కూడా తప్పనిసరి. దాన్నిబట్టి, శ్రమల విలువలు ఎక్కువ తక్కువలుగా ఏర్పడడం తప్పనిసరి.

ఇప్పటి వరకూ చూసిన, శ్రమ విలువా, శ్రమ శక్తి విలువా, విలువల్లో తేడాలూ — వంటి అంశాల గురించి **మార్క్సు** మాటలు కొన్ని చూద్దాం :

> "ఒక మానవ దేహాన్ని, 'పరిశ్రమలోని ఒక శాఖ'లో ఉపయోగపడే విధంగానూ, నైపుణ్యతను పొందే విధంగానూ, ఒక ప్రత్యేక తరహా శ్రమ శక్తిగా రూపొందే విధంగానూ, తీర్చి దిద్దడానికి, ఒక ప్రత్యేక తరహా విద్యా, శిక్షణా అవసరమవుతాయి. దీని కోసం, సరుకుల నించి ఎక్కువగానో, తక్కువగానో, ఒక ఈక్వివలెంటు ఖర్చవుతుంది. ఈ ఖర్చు మొత్తం, 'శ్రమ శక్తి'కి వుండే క్లిష్ట స్వభావంలోని ఎక్కువ తక్కువల్ని బట్టి మారుతుంది. విద్యకయ్యే ఖర్చులు మామూలు (ఆర్డినరీ) శ్రమ శక్తి విషయంలో చాలా తక్కువ. శ్రమ శక్తి ఉత్పత్తి అవడానికి వెచ్చించే మొత్తం విలువలో విద్యకయ్యే ఖర్చులు ఒక భాగంగా వుంటాయి"— మార్క్స్ (కాపిటల్–1. పేజీలు 168-169. మాస్కో ఎడిషన్, 1974).

"....'అదనపు విలువ'ని ఉత్పత్తి చెయ్యడంలో పెట్టుబడిదారుడు స్వాధీనం చేసుకున్న శ్రమ, సగటు క్వాలిటీ వున్న సింపుల్ అన్‌స్కిల్డ్ లేబరా, ఎక్కువ కాంప్లికేటెడ్ స్కిల్డ్ లేబరా— అనే విషయం ఏ మాత్రమూ లెక్కలోకి తీసుకోదగ్గ విషయం కాదు. సాధారణ శ్రమ కంటే, ఎక్కువ కాంప్లికేటెడ్ క్యారెక్టర్ వుండే శ్రమ అంతా, ఎక్కువ విలువైన రకపు 'శ్రమ శక్తి'ని వినియోగించిన శ్రమ అన్నమాట; ఏ 'శ్రమ శక్తి' ఉత్పత్తికైతే ఎక్కువ కాలం పట్టిందో అటువంటి 'శ్రమ శక్తి'ని. అందుకే ఆ శ్రమ శక్తి— అన్‌స్కిల్డ్‌గానూ, సింపుల్‌గానూ వుండే శ్రమ శక్తి కన్నా ఎక్కువ విలువని కలిగి వుంటుంది. ఈ శ్రమ శక్తి ఎక్కువ విలువని కలిగి వుండడంచేత, దీని వినియోగం ద్వారా వచ్చిన శ్రమ ఉన్నత శ్రేణికి చెందిన శ్రమగా వుంటుంది. ఈ ఉన్నత శ్రేణి శ్రమ, అన్‌స్కిల్డ్ శ్రమ ఉత్పత్తి చేసే విలువకన్నా ఎక్కువ విలువని, తగిన పాళ్ళల్లో (ఇన్ ఈక్వల్ టైమ్స్ ప్రాపోర్షనల్లీ) ఉత్పత్తి చేసే శ్రమగా వుంటుంది. స్పిన్నర్ (దూది వడికే వ్యక్తి) శ్రమకీ, జ్యువెలర్ (కంసాలి) శ్రమకీ మధ్య 'స్కిల్'లో కొంత తేడా వున్నప్పటికీ, జ్యువెలరు తన 'శ్రమ శక్తి విలువ'ని పునరుత్పత్తి చెయ్యడానికి తన శ్రమలో ఎంత భాగంతో అయితే చేస్తాడో ఆ భాగం, 'అదనపు విలువ'ని ఉత్పత్తి చేసే

అదనపు శ్రమ భాగం నించి క్వాలిటీలో ఏ రకంగానూ తేడాగా వుండదు. దారాన్ని వడకడంలో లాగే, నగల తయారీలో కూడా 'అదనపు విలువ' అనేది, 'శ్రమ'ని అదనంగా ఇవ్వడం ద్వారానే తల ఎత్తుతుంది. 'శ్రమ క్రమాన్ని' పొడిగించడం ద్వారానే. ఒక ఉదాహరణలో నేమో 'నగల తయారీ క్రమం'లోనూ, ఇంకో ఉదా హరణలోనేమో, 'దారాన్ని వడికే క్రమం'లోనూ.

అయితే, ఇంకో విషయం ఏమిటంటే, 'విలువ'ని ఉత్పత్తి చేసే ప్రతీ క్రమంలోనూ, స్కిల్డ్ శ్రమని, సగటు సాధారణ శ్రమగా మార్చి చూడడం అనివార్యం. ఉదా: 1 రోజు స్కిల్డ్ శ్రమని, 6 రోజుల అన్‌స్కిల్డ్ శ్రమగా మార్చినట్టు. అందుచేత, ఇక్కడ ఉదాహరణల్లో, పెట్టుబడిదారుడు నియమించే కార్మికుడి శ్రమ, సాధారణ అన్‌స్కిల్డ్ శ్రమ అనుకోవడంవల్ల.... మన పరిశీలనని క్లుప్తం చేసుకుంటాము"— మార్క్స్ (కాపిటల్–1, పేజీ 191-92, మాస్కో ఎడిషన్ 1974).

**ఈ కొటేషన్‌లో చూసింది:** అన్ని శ్రమలూ ఒకే విలువ గలవిగా వుండవు. కొన్ని శ్రమలు ఎక్కువ విలువ గలవిగా వుంటే, కొన్ని శ్రమలు తక్కువ విలువ గలవిగా వుంటాయి. దీనికి కారణం, వాటి 'శ్రమ శక్తుల' విలువలు తేడాగా వుండడమే. 'పని స్థలం'లో ఏ శ్రమ వుంటే అది, తన విలువకి తగిన విధంగా, 'అదనపు విలువ'ని ఇస్తుంది. 'పని స్థలం'లో— మేధా శ్రమలూ, శారీరక శ్రమలూ; అందులోనే స్కిల్డ్ శ్రమలూ, అన్ స్కిల్డ్ శ్రమలూ — వంటి అనేక రకాల శ్రమలు వున్నప్పటికీ మనం, ఉదాహరణలు తేలిగ్గా వుండడం కోసం, అన్ని శ్రమలకూ ప్రతినిధిగా సాధారణ శ్రమని మాత్రమే తీసుకుంటాము.— ఇదీ మార్క్స్ మాటల అర్థం.

శ్రమల విలువలు తేడాగా వుండడం — అనేది దోపిడీ సమాజాలలోనేనా, 'నూతన సమాజం'లో కూడా అలాగే వుంటుందా? — ఏ సమాజంలో అయినా అలాగే వుంటుంది. ఒక మేధా శ్రమనీ, ఒక శారీరక శ్రమనీ తీసుకుంటే, వాటిని నేర్చుకోవడానికి అయ్యే ఉత్పత్తుల ఖర్చులూ, కాలాలూ, ఏ సమాజంలో అయినా తేడాగానే వుంటాయి.

అలాంటప్పుడు నూతన సమాజంలో కూడా మేధా శ్రమ చేసేవ్యక్తి ఆదాయం ఎక్కువగానూ, శారీరక శ్రమ చేసే వ్యక్తి ఆదాయం తక్కువగానూ వుండడం తప్పని సరిగా జరుగుతుంది కదా?— అలాంటప్పుడు, ఇద్దరు మనుషుల పరిస్థితుల్ని సమానం చెయ్యడం నూతన సమాజంలో అయినా ఎలా సాధ్య మవుతుంది? — ఈ సంగతి కూడా ఈ చాప్టరులోనే తర్వాత వివరంగా చూస్తాము.

ఇప్పుడు 'శ్రమ శక్తి విలువ'కి సంబంధించి ఇంకా కొన్ని అంశాలు చూడాలి.

'శ్రమ శక్తి విలువ'ని ఏర్పరిచే అంశాలు:

(1) ఆ శ్రమ శక్తి ప్రత్యేకత (2) శ్రమ చేసే వ్యక్తి శరీర పోషణ (3) శ్రామికుల పునరుత్పత్తి (4) శ్రామికులు జీవించే సమాజపు సాంస్కృతిక స్థాయి — ఈ 4 రకాల అవసరాల్నీ తీర్చే ఉత్పత్తులు, శ్రమ చేసే వ్యక్తికి (స్త్రీ అయినా, పురుషుడైనా) 'నిత్య జీవితావసర ఉత్ప త్తులు'.— ఈ ఉత్పత్తులన్నీ కలిసి 'శ్రమ శక్తి విలువ'గా అవుతాయి. ఈ అంశాల్ని ఇప్పుడు వరసగా చూస్తాము.

**(1) శ్రమ శక్తి ప్రత్యేకత :** ఈ అంశం గురించి ఇంతకు ముందే చూశాం. 'ప్రత్యేకత' అన్నప్పుడు, 'శ్రమ ప్రత్యేకత' అన్నా, 'శ్రమ శక్తి ప్రత్యేకత' అన్నా, ఒకే అంశం గురించి మాట్లాడుతున్నామని అర్థం. శ్రమలు రక రకాలుగా ఉంటాయని మనకు తెలుసు. ముఖ్యంగా శారీరక శ్రమలూ మేధా శ్రమలూ అనే తేడాలతో. మళ్ళీ వాటిలో కూడా నైపుణ్యం గల శ్రమలూ, నైపుణ్యం లేని శ్రమలూ అనే తేడాలతో కూడా. 'నైపుణ్యం' అంటే ఒకే రకం శ్రమని ఒకరు బాగా చెయ్యడమూ, ఇంకొకరు బాగా చెయ్యక పోవడమూ వుంటుందే, అలాంటి తేడా సంగతి కాదు. ఇక్కడ చెప్పుకునేది, పూర్తిగా వేరు వేరు శ్రమల సంగతి. కుండలు చేసే పనీ, కుట్టు కుట్టే పనీ కూడా శారీరక శ్రమలే అయినా, ఆ రెంటినే పోల్చి చూస్తే, వాటిలో కుట్టు పనే నైపుణ్యం గల పనిగా వుంటుంది. చదువు చెప్పే పనీ, వైద్యం చేసే పనీ మేధా శ్రమలే అయినా, వాటిలో వైద్యం పనే నైపుణ్యం గల పనిగా వుంటుంది.

శ్రమలకు సంబంధించిన 'ఉపయోగపు విలువల' గురించి మాట్లాడితే మానవ జీవితానికి అన్ని రకాల శ్రమలూ కావాలి. అన్నీ అవసరమైనవే. కుట్టు పని కావల సిన చోట, గొప్ప వైద్యం దొరికితే, ప్రయోజనం ఉండదు. అక్కడ తీరవలసిన అవసరం తీరదు. అలాగే, 'నైపుణ్యం లేని పని' అని దేన్ని అంటామో ఆ పని కావలసిన చోట, నైపుణ్యంగల పని దొరికితే ప్రయోజనం వుండదు. శ్రమల్ని 'ఉపయోగపు విలువ' దృష్టితో చూస్తే, అందులో ఒకటి గొప్పదీ, ఒకటి తక్కువదీ కాదు. కానీ, మనం ఇక్కడ చూసేదంతా శ్రమలు ఇచ్చే ఉపయోగాల గురించి కాదు. వాటి 'విలువల' గురించి.

శ్రమల విలువల్ని దృష్టిలోకి తీసుకున్నప్పుడు, 'శ్రమకు వున్న ప్రత్యేకత' అనే అంశమే, వాటి 'విలువల్ని' తేడాలతో వుంచే ప్రధానాంశం.

ఒక వ్యక్తి, ఒక శ్రమని నేర్చుకునే కాలంలోనే దానికి సంబంధించిన ఖర్చులన్నీ పెట్టేసి వుంటాడు. ఆ శ్రమ చెయ్యడం ప్రారంభించిన తర్వాత అది 'శారీరక శ్రమ'

అయితే దాన్ని 'నేర్చుకోవడానికి' కొత్త ఖర్చులేమీ వుండకపోవచ్చు. కానీ కొన్ని రకాల మేధాశ్రమల్లో ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవలసి వుంటుంది. ఉదా: వైద్యుడు, వైద్యంలో కొత్త విషయాలు ఎప్పుడూ నేర్చుకోవాలి. అతనికి రెగ్యులర్‌గా వైద్య పత్రికల కోసం కొన్ని కొత్త ఖర్చులు అవుతూ వుంటాయి. అలాంటి ఖర్చులు కూడా ఈ అంశంలోకి వస్తాయి.

**(2) శ్రమ చేసే వ్యక్తి శరీర పోషణ** : ఆహారానికీ, దుస్తులకూ, నివాసానికీ సంబంధించిన విషయాలు ఇందులోకి వస్తాయి. శ్రామికులు ఎటువంటి శీతోష్ణ స్థితులు గల వాతావరణంలో నివసిస్తున్నారు — అనే దాన్ని బట్టి ఈ అవసరాలు వుంటాయి. చలి ప్రాంతాలలో నివసించే శ్రామికులకూ, వేడి ప్రాంతాలలో నివసించే శ్రామికులకూ దుస్తుల అవసరం, ఇంటి అవసరం, ఒకే రకంగా వుండవు. చలి ప్రాంతాల శ్రామికులకు చలి గాలి సోకని ఇళ్ళూ, దట్టమైన దుస్తులూ కావాలి. బూట్లూ, స్వెట్టర్లూ, రగ్గులూ వాడితేనే గానీ వారు జీవించి వుండలేరు. వేడి ప్రాంతాల శ్రామికులు, కాలికి చెప్పులైనా లేకుండా పని చెయ్యగలరు. అతి తక్కువ నూలు బట్టలతో వారి దుస్తుల అవసరం తీరిపోతుంది. పై కప్పయినా లేని పాకతో వారి గృహావసరం తీరిపోతుంది. అందుకే శ్రమ — శక్తి అవసరాలనేవి ప్రకృతి సహజంగా వుండే వాతావరణాన్ని బట్టి మారుతూ వుంటాయి. తిండి విషయం, ఆయా ప్రదేశాల ఆహారపుటలవాట్లని బట్టీ, తప్పనిసరి అవసరాల్ని బట్టీ, వుంటుంది. ఒక చలి ప్రాంతపు కుట్టు మనిషినీ, ఒక వేడి ప్రాంతపు కుట్టు మనిషినీ తీసుకుంటే, ఆ ఇద్దరి పోషణ అవసరాలూ ప్రకృతి సహజమైన తేడాల్ని బట్టి వుంటాయి.

ఇప్పుడు, ఒకే ప్రాంతంలో వేరు వేరు శ్రమల్ని తీసుకుంటే, అంటే, చలి దేశంలో గానీ వేడి దేశంలో గానీ, కుట్టు మనిషినీ, వైద్యం మనిషినీ తీసుకుంటే, నిజానికి, ఈ ఇద్దరి పోషణ మధ్యా తేడా వుండనక్కర లేదు. ఇద్దరూ కడుపు నిండా తినాలి. కానీ, 'దోపిడీ' సహజంలో ఈ విషయంలో కూడా తేడాలు వుంటాయి. అవి ఎందుకు వుంటాయో తర్వాత చూస్తాం.

**(3) శ్రామికుల పునరుత్పత్తి** : ఒక శ్రామికుడి 'శ్రమ శక్తి', అతని వృద్ధాప్యంలో ఆగిపోతుంది. అతని మరణంతో పూర్తిగా అంతమయిపోతుంది. 'పెట్టుబడి' అనేది, ఎప్పుడూ పనిచేస్తూ వుండాలంటే, దానికి నిరంతరం శ్రామికులు దొరికే మార్గం వుండాలి. ఒక తరం శ్రామికులంతా వృద్ధులై పోయినప్పుడూ, మరణించి నప్పుడూ, వెంటనే కొత్త శ్రామికుల్ని సంపాదించ లేని పరిస్థితి వుంటే పెట్టుబడి మూలబడవలసి వస్తుంది. పెట్టుబడి నిరంతరం కొనసాగాలంటే, రాబోయే తరం శ్రామికుల పోషణకు అవసరమైన ఖర్చు కూడా ప్రస్తుత శ్రామికుల 'శ్రమ శక్తి విలువ'లోకి చేరవలసి వుంటుంది. అంటే, శ్రామికులు తమ 'సంతతి'ని పెంచడానికి సరిపోయే విలువ కూడా.

సంతతిని పెంచడం — అన్నప్పుడు, ఇందులో, ఆ పిల్లల శరీరపోషణా, వారిని భవిష్యత్ తరం శ్రామికులుగా తయారు చెయ్యడమూ — అనే 2 అంశాలూ కలిసిపోయి వుంటాయి. పిల్లల శరీర పోషణకు కావలసిన ఖర్చు, తల్లిదండ్రుల 'శ్రమ శక్తి విలువ'లో భాగంగా వున్నట్టే, రెండో అంశానికి కావలసిన ఖర్చు కూడా తల్లిదండ్రుల 'శ్రమ శక్తి విలువ' ద్వారానే రావాలి. పిల్లలు, మేధా శ్రమలు నేర్చుకోవాలంటే, వారికి కొన్ని రకాల సాంకేతిక విద్యలు కావాలి. శారీరక శ్రమలు నేర్చుకోవడానికి కూడా కొన్ని ఖర్చులు అవుతాయి. కాబట్టి, పిల్లలు భవిష్యత్ శ్రామికులుగా తయారవ్వాలంటే, దానికి సంబంధించిన ఖర్చులు కూడా తల్లిదండ్రుల 'శ్రమ శక్తి విలువ' ద్వారానే అందాలి. కాబట్టి ఇది శ్రామికుల పునరుత్పత్తిలో ఒక అంశంగా వుంటుంది.

అయితే ఇక్కడ చాలా స్పష్టంగా అర్థం చేసుకోవలసిన అంశం ఏమిటంటే — తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఏ రకపు శ్రామికులుగా తయారు చెయ్యదలిస్తే అలాగే తయారు చెయ్యగలరని అర్థం కాదు. 'శారీరక శ్రమలు' చేసే తలిదండ్రులు, తమ పిల్లల్ని 'ఉన్నత మేధా శ్రమలు' చేసే వారిగా తయారు చెయ్యదలిస్తే, అలా చెయ్యలేరు. ఎందుకంటే, దానికి సరిపోయే ఖర్చులు, ఆ తల్లిదండ్రుల శ్రమ శక్తి విలువలో వుండవు. అంటే శారీరక శ్రమలు చేసే తల్లిదండ్రులు, తమ పిల్లల్ని, మళ్ళీ శారీరక శ్రమలు చేసేవారిగా మాత్రమే తయారు చెయ్యగలరు. దానికి సరిపోయే ఖర్చులు మాత్రమే వారి ఆదాయాల్లో వుంటాయి. అలాగే, మేధా శ్రమలు చేసే తల్లిదండ్రులు, తమ పిల్లల్ని తప్పనిసరిగా మేధా శ్రమలు చేసేవారిగానే తయారుచేస్తారు గానీ, శారీరక శ్రమలు చేసే వారిగా తయారు చెయ్యరు. మొత్తం మీద దీని అర్థం ఏమిటంటే, శారీరక శ్రమల సెక్షన్ల నించి మళ్ళీ శారీరక శ్రమలు చేసేవారూ, మేధా శ్రమల సెక్షన్ల నించి మళ్ళీ మేధా శ్రమలు చేసేవారూ, పెట్టుబడిదారులకు ఎప్పుడూ అందుతూ వుంటారు. తల్లిదండ్రులు ఏ రకం శ్రమలకు పరిమితమై వుంటారో వారి పిల్లలు కూడా సాధారణంగా ఆ రకం శ్రమలకే పరిమితమై వుంటారు. ఈ సత్యాన్ని వారి తల్లిదండ్రుల శ్రమ శక్తుల విలువలే రుజువు చేస్తాయి. తల్లిదండ్రుల శ్రమ శక్తి విలువలు, పిల్లల భవిష్యత్ మార్గాన్నంతా గిరి గీసినట్టు పిల్లల పసితనంలోనే నిర్ణయించి వేస్తాయి. శారీరక శ్రామికుల సంతానం, మళ్ళీ శారీరక శ్రమలుచేసే వారిగానూ; మేధా శ్రామికుల

సంతానం, మళ్ళీ మేధా శ్రమలు చేసే వారిగానూ— తయారవుతారు. ఇది సాధారణంగా జరిగే జనరల్ సూత్రం. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని మార్పులు జరిగితే జరగవచ్చు. అది లెక్కలో విషయం కాదు. — 'శ్రామికుల పునరుత్పత్తి' అనే అంశంలో ఈ విషయాలన్నీ చేర్చి అర్థం చేసుకోవాలి.

అంతేగాక, ఇక్కడ ఇంకో అంశం ఏమిటంటే— శ్రామిక కుటుంబాలలోని 'వృద్ధుల సంరక్షణ' విషయం కూడా ఇందులోకే వస్తుంది. 'వృద్ధులు' అంటే, గతకాలపు శ్రామికులే. వారు వృద్ధాప్యంతో జీవించినంత కాలమూ వారి పోషణా సంరక్షణా వారి బిడ్డల ద్వారానే జరగాలి. ఆ బిడ్డలు ప్రస్తుతం శ్రమ చేస్తూ వున్న శ్రామికులు. కాబట్టి, వృద్ధుల పోషణ ఖర్చు కూడా ప్రస్తుతం శ్రమ చేసే వారి 'శ్రమ శక్తి విలువ'లో భాగంగా వుండాలి.

ఒకవేళ ఈ వృద్ధులకు గత పెట్టుబడిదారుడే పెన్షన్ లాంటిది చెల్లించే ఏర్పాటు వుందనుకుందాం. అలా జరిగితే, ఆ పెన్షను, ఆ వృద్ధులు గతంలో చేసిన శ్రమలో భాగమే. ఆ నాడు వారికి రావలసిన 'జీతాల' నుంచి కొంత భాగాన్ని వెనక్కి వుంచి, దానినే తర్వాత కాలంలో చెల్లిస్తారు. ఈ ఏర్పాటు వున్నట్టయితే, ప్రతి తరమూ వృద్ధాప్యంలో కూడా తన పోషణని తనే చేసుకుంటుందని అర్థం. లేదా పెన్షన్ లాంటి ఏర్పాటు లేదనుకుంటే, వృద్ధులైన తల్లిదండ్రుల్ని బిడ్డలే పోషించాలి. ఈ షరతు, ప్రతీ తరానికీ వర్తిస్తుంది.

శారీరక శ్రమలు చేసే శ్రామికుల విషయంలో, పెన్షను లేని పరిస్థితినే జనరల్ సూత్రంగా తీసుకోవాలి కాబట్టి, వృద్ధుల పోషణ ఖర్చు కూడా బిడ్డల జీతాలలో భాగం అవుతుంది. అయితే ఈ అవసరానికి కావలసిన విలువ కూడా మేధా శ్రామికుల కన్నా శారీరక శ్రమ చేసే శ్రామికులకు తక్కువ స్థాయిలోనే అందుతుంది. ఈ శ్రామికుల కుటుంబాలలో వుండే వృద్ధుల పోషణ, పెట్టుబడిదారుడికి చాలా అనవసరపు ఖర్చుగా కన్పిస్తుంది. "వాళ్ళు రోడ్ల మీద అడుక్కుంటూ బతకవచ్చునే" అంటాడు వాడు. శారీరక శ్రమలుచేసే శ్రామిక కుటుంబాల వృద్ధులందరికీ బిచ్చమెత్తే మార్గం చూపిస్తాడు పెట్టుబడిదారుడు. బిచ్చమెత్తే వాళ్ళకి బిచ్చం వేసే బాధ్యతని కూడా వాడు శ్రామికులకే వదిలిపెడతాడు. బిచ్చగాళ్ళు, పెద్ద ధనికుల భవంతుల ఛాయలకైనా చేరలేరు. నిరుపేద శ్రామికుల దగ్గిరే బిచ్చం ఎత్తుకుంటారు. 'శ్రామికుల పునరుత్పత్తి' అంశంలోకి, ఈ 'వృద్ధుల సంరక్షణ' విషయం కూడా చేర్చుకోవాలి.

**(4) శ్రామికుడు జీవించే సమాజపు సాంస్కృతిక స్థాయి :** విద్యా, నాగరికతా, కళలూ వంటి అంశాలు ఇందులోకి వస్తాయి. 'బానిస సమాజాన్ని' తీసుకుంటే, ఆ సమాజానికి మొత్తంగానే విద్య లేదు. యజమానులకే విద్యలేని చోట, బానిసలకు విద్య అన్న ప్రశ్నే వుండదు. దాని ఖర్చు 'శ్రమ శక్తి విలువ'లోకి చేరవలసిన అవసరమూ వుండదు. పెట్టుబడిదారీ సమాజాన్ని చూస్తే, ఈ సమాజంలో శ్రామికుడికి విద్య వుండాలి. ఆ విద్య చాలా తక్కువే అయినా, ఆ తక్కువ విద్య కోసం అయినా, పెట్టుబడిదారుడు, శ్రామికుడికి, ఆ భాగాన్ని కూడా చేర్చి జీతాన్ని లెక్కకట్టాలి. ఒక దేశానికి వున్న నాగరికమైన అలవాట్లని బట్టి, వార్తా పత్రికలూ, రేడియోలూ వంటి వస్తువులు (అవి అసలు ఆ సమాజంలో ఉత్పత్తి అవుతూ వుంటే), శ్రామికులకు కూడా నిత్యావసరాలుగా ఉంటాయి. కొన్ని దేశాలలో వార్తా పత్రికని ఒక అవసరంగా వాడే శ్రామిక కుటుంబం నూటికి ఒక్కటి కూడా లేకపోవచ్చు. ఈ నాడు వార్తా పత్రికల్ని నిత్య జీవితావసర వస్తువులుగా వాడే దేశాల్లో కూడా 2, 3 వందల సంవత్సరాల కిందటి కాలంతో పోల్చి చూస్తే, 'వార్తా పత్రిక' అనే వస్తువే లేక పోవచ్చు. అలాంటి కాలంలో దాని కోసం ఖర్చు కూడా వుండదు.

సమాజంలో కొత్త కొత్త ఉపయోగపు విలువలను ఉత్పత్తి చెయ్యడం ఎక్కువవుతోన్న కొద్దీ, శ్రామికుల జీవితాలలోకి ప్రవేశించే ఉపయోగపు విలువలు కూడా ఎక్కువవుతూ వుంటాయి. ఒక కాలంలో శ్రామికులు సగటున రోజుకి 10 వస్తువులు వాడేవారనుకుంటే, కొన్ని సంవత్సరాల తర్వాత చూస్తే, ఆ పదే గాక ఇంకో 2, 3 వస్తువులు కూడా శ్రామికుల నిత్యావసరాలుగా పెరిగి వుండవచ్చు.

శ్రామికుడి అవసరాలు ఎప్పుడూ గతంలో లాగే వుండవు. అవి కూడా కొంచెం పెరుగుతూనే వుంటాయి. అయితే ఆ పెరిగే వస్తువులు కూడా, ఆ మారిన పరిస్థితుల్లో జీవించడానికి కావలసిన తప్పనిసరి అవసరాలుగా మాత్రమే వుంటాయి. ఈ పెరిగే అవసరాలకు కూడా సరిపోయే విలువ శ్రామికుడికి అందవలసి వుంటుంది. — ఈ రకంగా, 'సాంస్కృతిక' కోణానికి సంబంధించిన ఉత్పత్తులు కూడా 'శ్రమ శక్తి విలువ'లోకి చేరవలసి వుంటుంది.

అయితే, ఈ 4 రకాల అవసరాలలోనూ, ఏ అంశం గురించి చూసినా, శ్రామికులకు అందే వస్తువులు, కనీస స్థాయిలోనే వుంటాయనే సంగతి మనం మరిచిపోకూడదు. ఈ రకంగా శ్రామికుల ప్రతీ అవసరాన్నీ కనీస స్థాయికి దించేసిన తర్వాతా, కొన్ని అవసరాల్ని వొదిలేసిన తర్వాతా కూడా శ్రామికులకు తప్పనిసరిగా ఏ యే వస్తువులైతే కావాలో ఆ వస్తువులన్నిటినీ కలిపి 'నిత్య జీవితావసర వస్తువులు' అనే మాటలోకి కుదించవచ్చు. ఈ 'నిత్య జీవితావసర వస్తువుల్ని' ఉత్పత్తి చెయ్యడానికి మొత్తం ఎంత 'శ్రమ కాలం' కావాలో ఆ శ్రమ కాలమే 'శ్రమ శక్తి విలువ.'

శ్రామికుల్లో పెద్దలే గాక, పిల్లలు కూడా ఉంటారు.

పురుషులేగాక, స్త్రీలు కూడా ఉంటారు. 'పిల్లల' శ్రమ శక్తి విలువకీ, 'పెద్దల' శ్రమ శక్తి విలువకీ, తేడా ఉంటుంది. స్త్రీల శ్రమ శక్తి విలువకీ, పురుషుల శ్రమ శక్తి విలువకీ కూడా, కొన్ని సహజ అవసరాల్ని బట్టి తేడా ఉంటుంది. గర్భం ధరించి, బిడ్డల్ని కనడం — అనే విషయం స్త్రీ ద్వారా జరుగుతుంది కాబట్టి, ఆ అవసరాలకు సంబంధించిన ప్రత్యేక ఖర్చులు స్త్రీ శ్రమ శక్తి విలువలోకి చేరాలి. కానీ, ఇలాంటి ప్రత్యేకతల్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం లేదు. శ్రమ శక్తి విలువకి 'జనరల్ సూత్రాన్ని' మాత్రమే ఇక్కడ చూస్తున్నాము.

## 'నిత్యజీవితావసర వస్తువుల్ని' లెక్కకట్టడం ఎలాగ?

బియ్యమూ, కూరలూ, పాలూ, కట్టెలూ — వంటివి రోజూ ఖర్చయ్యే వస్తువులు. అగ్గిపెట్టెలూ, సబ్బులూ — వంటివి వారానికోసారి ఖర్చయ్యే వస్తువులు. బట్టలూ, పాత్రలూ, మందులూ — వంటివి కొంత కాలానికోసారి. ఇంటి అద్దె, ప్రతీ నెలా అయ్యే ఖర్చు. ఈ విధంగా ఒక శ్రామిక కుటుంబం, రోజూ ఖర్చయ్యే రకం వస్తువుల్ని కొన్నిటినీ, వారానికి ఖర్చయ్యే రకం వస్తువుల్ని కొన్నిటినీ, నెలకు ఖర్చయ్యే రకాల్ని కొన్నిటినీ, సంవత్సరానికి ఖర్చయ్యే రకాల్ని కొన్నిటినీ — వాడుతుంది. ఈ వస్తువుల్లో కొన్నిటిని ఏ రోజు కారోజు కొంటారు. (ఖర్చు చేస్తారు.) కొన్నిటిని వారానికోసారీ, కొన్నిటిని నెలకోసారీ, కొన్నిటిని సంవత్సరానికోసారీ కొంటారు. మొత్తానికి సంవత్సరాని కంతటికీ అయ్యే ఖర్చుల కోసం, ఆ కుటుంబానికి సంవత్సరానికి వచ్చే ఆదాయం సరిపోవాలి.

ఒక శ్రామిక కుటుంబంలో, భర్తే గాక భార్య కూడా బయట ఒక పెట్టుబడిదారుడి దగ్గర పని చేస్తుందను కుందాం. అప్పుడు భార్యా భర్త లిద్దరికీ ఎవరి 'శ్రమ శక్తి విలువ' వారికి వస్తుంది. అప్పుడు, ఆ కుటుంబం, ఒక్క ఆదాయంతోనే వున్నప్పటి కన్నా ఎక్కువ ఉత్పత్తులు వాడ గలుగుతుంది. అంత మాత్రాన 'శ్రమ శక్తి విలువ' సూత్రం తప్పు అయిపోదు. ఒక శ్రామిక కుటుంబానికి, 2 శ్రమ శక్తి విలువలు వచ్చినా, ప్రతీ శ్రమ శక్తి విలువా పెట్టుబడి దారుడికి ఒక 'అదనపు విలువ'ని ఇస్తుంది — అనే సూత్రం మారదు.

ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం శ్రామిక కుటుం బంలో ఒక్క వ్యక్తే పని చేస్తాడని ఊహిస్తూ 'శ్రమ శక్తి విలువ'ని చూస్తున్నాము. ఒక శ్రామిక కుటుంబం అన్నప్పుడు, ఆ కుటుంబంలో ఎంత మంది వుంటారో ఒక కనీసమైన సంఖ్యని తీసుకోవాలి. వృద్ధులతో కూడా కలిపి, ఆ కనీస సంఖ్యని 6 గా తీసుకుందాం. కుటుంబంలో వున్న ఆ 6 మంది వ్యక్తులకూ అయ్యే ఖర్చుల్ని ఇలా లెక్క కట్టవచ్చు :

(1) రోజూ కావలసిన వస్తువులూ × 365 రోజులు. ఇలా చూస్తే, ఈ రకం వస్తువులు సంవత్సరానికి ఎన్ని కావాలో తెలుస్తుంది. (2) వారానికి కావలసినవి × 52 వారాలు. ఈ రకం వస్తువులు సంవత్సరానికి ఎన్ని కావాలో తెలుస్తుంది. (3) నెలకి కావలసిన రకం × 12 నెలలు. ఇవి మొత్తం సంవత్సరానికి ఎన్ని కావాలో తెలుస్తుంది. (4) సంవత్సరానికి ఒకసారి కావలసిన రకం వస్తువులు.

మొత్తం ఈ వస్తువుల విలువనంతటినీ కలిపితే అది ఒక సంవత్సరానికి కావలసినది. దాన్ని 365 భాగాలు చేస్తే, 1 రోజుకి కావలిసిన విలువ తేలుతుంది.

అయితే ఇక్కడ 'సెలవల్ని' చేర్చలేదు. ఏ మనిషీ కూడా 'సెలవు' అనేది లేకుండా నిత్యం పనిచెయ్యలేడు. 'సెలవలు' కూడా కనీసావసరాలే. సంవత్సరానికి 52 ఆది వారాలు. అవి అన్నీ సెలవలుగానే వుండాలి. అవే గాక, సంవత్సరానికి ఇంకో 20 సెలవల్ని కూడా కలిపితే, మొత్తం 72 సెలవలు. 365 లోంచి 72ని తీసివేస్తే, 293. ఈ 293 రోజుల్లో వచ్చే ఆదాయమే మొత్తం సంవత్సరానికి సరి పోవాలి. కాబట్టి, సంవత్సరానికి కావలసిన వస్తువుల రాసిని 293తో భాగిస్తే, ఒక రోజుకి కావలసిన కనీస విలువ తేలుతుంది. అంటే, 1 రోజుకి, ఒక శ్రామిక కుటుంబానికి, కనీసం ఇంత విలువ గల ఆదాయం వుండాలన్నమాట. ఆ శ్రామిక కుటుంబంలో పిల్లల పోషణా, వృద్ధుల పోషణా కూడా ఈ ఆదాయం నించే జరగాలి. ఆ విలువే, ఆ కుటుం బాన్ని 'పోషించే' మనిషి 'శ్రమ శక్తి విలువ'. ఆ మనిషి స్త్రీ అయినా, పురుషుడు అయినా! పెట్టుబడిదారుడు, శ్రామికులతో 'శ్రమ' చేయించుకుని దానికి బదులుగా ఇచ్చేది ఈ 'శ్రమ శక్తి విలువ'నే.

'శ్రమ శక్తి విలువ'ని 'డబ్బు'లో లెక్కకడితే అదే 'జీతం'.

ఒక శ్రామిక కుటుంబంలో, మనం ఉదాహరణగా చెప్పుకున్న 6 మంది కన్నా ఎక్కువ మంది వ్యక్తులు వుంటే, ఆ 'శ్రమ శక్తి విలువ' ద్వారా ప్రతీ ఒక్కరికీ అందే ఉత్పత్తులు తగ్గిపోతాయి. లేదా ఆ కుటుంబంలో 6 గురి కన్నా తక్కువ మందే వుంటే, ఒక్కొక్కరికే అందే ఉత్పత్తులు పెరుగు తాయి. అలాగే ఆ కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది వ్యక్తులు పనిచేస్తూ వుంటే, ఆ కుటుంబం ఎక్కువ

ఉత్పత్తుల్ని వాడుకో గలుగుతుంది.— ఇవన్నీ ప్రత్యేక పరిస్థితులు.

'శ్రమ శక్తి విలువ'ని 'డబ్బు'లో లెక్క కడితే అదే 'జీతం' అని చూశాం. శ్రామిక కుటుంబం, ఆ 'జీతం'తో తనకు కావలసిన వస్తువులు కొనుక్కుంటుంది. అలా కొనుక్కున్నప్పుడు, ఆ డబ్బు ద్వారా, ఆ కుటుంబానికి ఇంకా జీతం పద్ధతి ఏర్పడని రోజుల్లో వాడుతూవుండే ఉత్పత్తుల కన్నా ఎక్కువ ఉత్పత్తులేమీ రావు. అంటే 'జీతం పద్ధతి' ఏర్పడడం వల్ల ఒక శ్రామిక కుటుంబం వాడే ఉత్పత్తుల సూత్రం ఏమీ మారదు.

ఒక దేశంలో 'జీతం పద్ధతి' ప్రారంభమైనప్పుడు, ఆ జీతాలు ఏ స్థాయిలో వుంటాయీ — అనేది, కొన్ని అంశాల్ని బట్టి వుంటుంది. ఒక దేశంలో శ్రామికులు 'జీతం పద్ధతి' మీద పనిచెయ్యడం అనేది ఎలాంటి పరిస్థితుల్లో ఏర్పడింది? అప్పటికి శ్రామికులు ఎలాంటి వస్తువుల్ని వాడే అలవాట్ల తోటీ, ఎలాంటి సౌకర్యాల తోటీ వున్నారు? అప్పుడు ఉత్పాదక శక్తులు ఏ స్థాయిలో వున్నాయి? — ఇటువంటి పరిస్థితుల్ని బట్టి ఆ దేశపు 'జీతాలు' ప్రారంభమవుతాయి.

శ్రామికులందరూ ఒకే రకం శ్రమ చెయ్యరు. అనేక రకాల శ్రమలు చేస్తారు. ప్రధానంగా శారీరక శ్రమలూ, మేధాశ్రమలూ — అనే తేడాలతో. అంటే, శ్రామికులు కొన్ని సెక్షన్లుగా వుంటారు. ఒక్కో సెక్షన్‌కి ఒక్కో 'శ్రమ శక్తి విలువ' (ఒక్కో స్థాయి జీతం) వుంటుంది. ఒక సెక్షన్‌కి వర్తించే విషయాలే అన్ని సెక్షన్లకూ వర్తిస్తాయి.

# శ్రమ శక్తీ - శ్రమా

ఇంత వరకూ 'శ్రమ శక్తి విలువ' అంటే ఏమిటో చూశాం. జీతమే — శ్రమ శక్తి విలువ. మరి, 'శ్రమ విలువ' అంటే ఏమిటి? జీతాన్ని 'శ్రమ శక్తి విలువ'గా గాక, 'శ్రమ విలువ'గానే ఎందుకు అనుకోకూడదు? — జీతం, శ్రమ విలువే అయితే, ఒక శ్రామికుడికి జీతం రావడం అంటే, అతని శ్రమ విలువ అంతా అతనికి వచ్చేసినట్టే అవుతుంది. అప్పుడు, పెట్టుబడిదారుడికి 'లాభం' ఎలా మిగులుతుంది?

జీతం, శ్రమ విలువే అయితే, అప్పుడు సరుకు విలువ — శ్రమ సాధనాలూ, జీతాలూ కలిసిన మొత్తంగా మాత్రమే వుంటుంది. పెట్టుబడిదారుడికి, సరుకుని అమ్మినప్పుడు మొత్తం ఖర్చయిన ఆ భాగాలు వస్తాయనుకుందాం. శ్రమ సాధనాల ఖర్చుని వెనక్కి తీసుకుంటాడు. జీతాల భాగాన్ని శ్రామికులకు ఇచ్చేస్తాడు. ఇక పెట్టుబడిదారుడికి లాభమూ వగైరాలు ఎలా వస్తాయి? — కాబట్టి, జీతమే శ్రమ విలువ అవదు. 'శ్రమ విలువ' అనేది జీతం కన్నా తప్పనిసరిగా ఎక్కువగా వుండితీరుతుందని అర్థం.

అయితే 'శ్రమ విలువ'ని ఎలా లెక్క కట్టాలి?

మొదట క్లుప్తంగా చెప్పుకోవాలంటే — 'శ్రమ శక్తి విలువ'కి (అంటే, జీతానికి) 'అదనపు విలువ'ని కలపగా వచ్చే మొత్తమే 'శ్రమ విలువ'. సమాజంలో 'అదనపు విలువ' అనేది వున్నప్పుడు, దాన్ని లెక్కలోకి తీసుకోకుండానూ, దానితో సంబంధం లేకుండానూ, 'శ్రమ విలువ'ని లెక్క కట్టడం సాధ్యం కాదు. 'శ్రమ శక్తి విలువ' కన్నా 'శ్రమ విలువ' ఎక్కువగా వుంటుంది. ఎంత ఎక్కువగా అంటే, 'అదనపు విలువ' ఎంత వుంటుందో అంత ఎక్కువగా.

శ్రమ విలువా, శ్రమ శక్తి విలువా — అనే విషయాలు, దోపిడీ వున్న సమాజాలలోనూ, దోపిడీ లేని సమాజంలోనూ, ఎలా వుంటాయో సరిగా అర్థం చేసుకోవాలి.

శ్రామికుడు, పెట్టుబడిదారుడికి ఇచ్చే 'శ్రమ విలువ'కీ, తను 'జీతం'గా తీసుకునే 'శ్రమ శక్తి విలువ'కీ తేడా ఏమిటో ఇప్పుడు 'డబ్బు' లెక్కల ద్వారా చూద్దాం.— ఒక నేత శ్రామికుడు, ఒక పెట్టుబడిదారుడి దగ్గిర రోజుకి 12 గం.లు పని చేస్తాడనుకుందాం. 1 గంట నేత శ్రమ విలువ –1 రూపాయి అనుకుందాం. 12 గం.ల నేత శ్రమ విలువ 12 రూ.లు. అయితే, ఆ విలువ అంతా శ్రామికుడికి రాదు. అంటే, ఆ శ్రామికుడి జీతం 12 రూ.లు గా వుండడానికి వీల్లేదు. కనీస పోషణ వస్తువుల్ని కొనడానికి ఎంత డబ్బు కావాలో అంత డబ్బు మాత్రమే జీతంగా వుంటుంది.

ఆ శ్రామికుడికి ఒక రోజుకి కావలసిన కనీస జీవితావసర వస్తువులు ఉత్పత్తి అవడానికి మొత్తం 6 గంటల శ్రమ పడుతుందనుకుందాం. 1 గంట శ్రమ విలువ 1 రూపాయి కాబట్టి, ఆ శ్రామికుడికి శ్రమ శక్తి విలువని ఇవ్వాలంటే, 6 రూ.లు ఇవ్వాలి. అంటే, ఆ శ్రామికుడికి, 'శ్రమ మార్కెట్లో' 6 రూ.ల జీతం వుంటుంది. ఈ ఉదాహరణ ప్రకారం, 12 రూ.ల విలువ గల శ్రమని చేసిన శ్రామికుడికి పెట్టుబడిదారుడు 6 రూ.ల జీతం ఇస్తాడన్న మాట. శ్రామికుడు చేసిన శ్రమతో కొత్త సరుకు తయారవుతుంది కాబట్టి, ఆ సరుకుకి, దాని 'శ్రమ సాధనాల' విలువతో పాటు ఈ శ్రామికుడు చేసిన 12 రూ.ల విలువ కూడా చేరుతుంది. ఆ సరుకుని అమ్మినప్పుడు, దాని కోసం శ్రామికుడు చేసిన 12 రూ.ల శ్రమ విలువ అంతా పెట్టుబడిదారుడి చేతిలోకి వస్తుంది. కానీ, వాడు ఆ శ్రామికుడికి 6 రూ.ల జీతమే ఇస్తాడు. అప్పుడు పెట్టుబడిదారుడి

చేతిలో ఇంకో 6 రూ.ల విలువ మిగులుతుంది. అదే, శ్రామికుడు, తన జీతం విలువకన్నా 'అదనంగా' ఇచ్చిన విలువ.

ఈ ఉదాహరణలో, శ్రామికుడు నిజానికి 6 గంటల సేపు పని చేసిన తర్వాత పని ఆపెయ్యవచ్చు. అప్పటికి అతను తీసుకునే జీతం విలువకు తగ్గపని అయిపోయింది. కానీ, 12 గంటల సేపు పని చెయ్యాలని పెట్టుబడిదారుడితో ఒప్పందం వుంటుంది కాబట్టి, శ్రామికుడు ఇంకో 6 గంటలు కూడా పనిచేస్తాడు. మొత్తం 12 గంటలు పనిచేస్తే, 12 రూ.ల విలువని ఉత్పత్తి చేస్తాడని అర్థం.

ఈ శ్రామికుడి జీతం 6 రూ.లు. అంటే శ్రామికుడి శరీరంలో 'శ్రమ శక్తి' ఉత్పత్తి అవడానికి రోజుకి 6 రూ.ల విలువ గల వస్తువులు చాలు. కానీ, 6 గంటల శ్రమతో తయారైన వస్తువుల్ని వాడగా వచ్చిన శ్రమ శక్తితో, ఈ శ్రామికుడు 6 గంటల కన్నా ఎక్కువ గంటలు శ్రమ చెయ్యగలడు.

ఈ ఉదాహరణలో, 6 రూ.ల విలువ గల 'శ్రమ శక్తి', 12 రూ.ల విలువ గల 'శ్రమ'ని ఇచ్చింది. 6 విలువ, 12 విలువని ఇవ్వడం వింత విషయం. శ్రమ శక్తి అనే సరుకు, నిర్జీవ వస్తువు కాదు, సజీవ మానవ దేహం. అందుకే, ఈ వింత సాధ్యమవుతుంది. మనిషి, తన పోషణకు కావలసిన కనీసమైన శ్రమని వాడుకుని, దాని కన్నా ఎక్కువ శ్రమ చెయ్యగలడు.

ఇప్పుడు ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. 'శ్రమ శక్తి' అన్నా, 'శ్రమ' అన్నా ఒకటి కాదనే విషయం. శ్రమ శక్తి అంటే, ఒక ప్రత్యేక శ్రమ చెయ్యడానికి శ్రామికుడి శరీరంలో వున్న శక్తి. 'శ్రమ' అంటే, ఆ శక్తితో చేసే 'పని'.

శ్రమ శక్తీ, శ్రమా ఒకటి కావు గనక, 'శ్రమ శక్తి విలువా' 'శ్రమ విలువా' కూడా ఒకటి కావు.

'శ్రమ శక్తి' విలువ = శ్రామికుడి కనీస జీవితావసర వస్తువుల విలువ = జీతం.

'శ్రమ' విలువ = శ్రామికుడు ఒక రోజులో చేసిన పని విలువ. ఆ పని విలువలో నించి జీతాన్ని తీసివేస్తే, మిగిలేది 'అదనపు విలువ'.

'శ్రమ' విలువ = జీతం + అదనపు విలువ.

సరుకు విలువ = దానికోసం ఖర్చయిన 'మొత్తం శ్రమ'. అంటే, శ్రమ సాధనాలూ, శ్రమ విలువా కలిసినది.

ఒక రోజు జీతం — ఒక రోజు అదనపు విలువని ఇస్తే, వారం జీతం — వారం అదనపు విలువనీ, నెల జీతం — నెల అదనపు విలువనీ ఇస్తాయి.

ఒక శ్రామిక కుటుంబంలో, స్త్రీ పురుషులిద్దరూ పెట్టుబడిదారుడి దగ్గిర శ్రమ చేసే వాళ్ళయితే, ఆ కుటుంబానికి 2 జీతాలు వస్తాయి. ఒక్క జీతం వచ్చే కుటుంబం కన్నా, 2 జీతాలు వచ్చే కుటుంబం, కొన్ని ఎక్కువ ఉత్పత్తుల్ని వాడుకోగలుగుతుంది. అయితే, ఒక కుటుంబానికి 2 జీతాలు వస్తే 'శ్రమ శక్తి విలువ' లెక్కలన్నీ తారుమారవుతాయని అర్థం కాదు.

శ్రామిక కుటుంబాల్లో, పిల్లలతో సహా అందరూ పనిచేసినా, ఆ కుటుంబాలు నిత్యదరిద్రంలోనే వుండడం అందరికీ తెలిసిన విషయమే. పెట్టుబడిదారుడికి— ఒక జీతం, ఒక అదనపు విలువని ఇస్తే, 2 జీతాలు 2 అదనపు విలువల్ని ఇస్తాయి. 4 జీతాలు 4 అదనపు విలువల్ని! కాబట్టి, ఒక శ్రామిక కుటుంబానికి 2 జీతాలు వచ్చినా, 4 జీతాలు వచ్చినా, జీతం అనేది శ్రామికుడు ఇచ్చే శ్రమ విలువ కన్నా తక్కువగా వుంటుందనే వాస్తవం మారదు.

'జీతం' అంటే — శ్రమ శక్తి విలువే గానీ, శ్రమ విలువ కాదు — అనే విషయం, పెట్టుబడిదారుడికి కానీ, శ్రామికులకు గానీ, తెలియదు.

'విలువ అంటే శ్రమే' అనే అవగాహనతో విషయాల్ని పరిశీలిస్తూ పోతే ఈ రహస్యాలన్నీ బయటబడతాయి.

పెట్టుబడిదారుడు, ఒక 'పరిశ్రమ' ప్రారంభించినప్పుడు, తనకు కావలసిన శ్రామికులకు ఎంతెంత జీతాలు ఇవ్వవచ్చునో నిర్ణయించడం కోసం, వారి అవసరాల్ని లెక్కలు కట్టడం కొత్తగా మొదలుపెట్టడు. ఆ లెక్కలన్నీ సమాజంలో అప్పటికే సిద్ధంగా వుంటాయి. ఒక్కో రకం 'శ్రమ'కి ఒక్కోరకం జీతాలు ఇవ్వడం సమాజంలో సాగుతూనే వుంటుంది. ఏ పెట్టుబడిదారుడు అయినా తనకు కావలసిన రకం శ్రామికులకు 'శ్రమ మార్కెట్'లో (లేబర్ మార్కెట్‌లో) ఎంతెంత జీతాలు వున్నాయో చూసి, తను కూడా ఆ రకంగానే జీతాలు ఇస్తాడు. ఒకవేళ పరిస్థితులు కొంచెం తేడాగా వుంటే, అంటే, తనకు కావలసిన రకం శ్రామికులు దొరకడం కొంచెం ఇబ్బందిగా వున్నా, లేదా శ్రామికులు దొరకడం బాగా తేలిగ్గా వున్నా, ఆ పరిస్థితుల్ని బట్టి, తను ఇచ్చే జీతాల్ని కొంచెం పెంచడం గానీ, తగ్గించడం గానీ, చేస్తాడు. ఈ రకంగా, ఒక్కో సమయంలో వుండే పరిస్థితుల్ని బట్టి 'జీతం'లో జరిగే మార్పులన్నీ 'సెకండరీ' విషయాలు. ఇవి జీతం ఏర్పడడానికి 'బాహ్య' కారణాలు. జీతానికి 'అంతర్గత' కారణం మాత్రం — 'శ్రమ శక్తి విలువే'.

శ్రమ శక్తి విలువే — జీతం. దాన్ని డబ్బుతో అయినా చెల్లించవచ్చు. ఏదో ఒక 'ఉత్పత్తి' గానైనా చెల్లించవచ్చు. అయితే, జీతంగా ఒక ఉత్పత్తిని ఇచ్చినప్పుడు, ఆ ఉత్పత్తికి ఎంత విలువ వుందో డబ్బులోనే లెక్కకట్టి, ఆ లెక్క ప్రకారమే దాన్ని ఇస్తారు. అంటే, ఇది కూడా జీతాన్ని డబ్బుగా చెల్లించినట్టే అర్థం.

'జీతం' అన్నా, 'వేతనం' అన్నా, 'కూలి' అన్నా, ఒకటే.

'జీతగాడు' అన్నా, 'వేతన శ్రామికుడు' అన్నా, 'కూలి మనిషి' అన్నా, ఒకటే. 'కూలి పనికే కొంత 'నాగరీకమైన' పేరు ఉద్యోగం'. 'కూలికే నాగరీకమైన పేరు —'జీతం'.

పెట్టుబడిదారుడు, శ్రామికులకు జీతాలు ఇవ్వడం, వారానికోసారో, నెలకోసారో చేస్తాడు. వారానికి ఇచ్చే జీతం వారంరోజుల శ్రమ శక్తి విలువ అయితే; నెలకు ఇచ్చే జీతం, నెలరోజుల శ్రమ శక్తి విలువ. జీతం అనేది 1 రోజు జీతం అయినా, నెల రోజుల జీతం అయినా, దాని 'స్వభావం'లో మార్పు వుండదు.

శ్రామికులు చేసే పని పూర్తి అయిపోయిన తర్వాతే వారి చేతుల్లోకి జీతం వస్తుంది. అంతేగానీ, పని చెయ్యకముందే జీతం ఇచ్చే పరిస్తితి ఎప్పుడూ ఎక్కడా వుండదు. అంటే, శ్రామికుడు పెట్టుబడిదారుడికి తన శ్రమని ముందే ఇచ్చేస్తాడు. ఆ తర్వాతే పెట్టుబడిదారుడు 'జీతం' ఇస్తాడు. అంటే, శ్రామికుడు పెట్టుబడిదారుడికి తన శ్రమని ప్రతీ సారీ అప్పుగా ఇస్తాడన్నమాట. ఆ అప్పుని పెట్టుబడి దారుడు తర్వాత తీరుస్తాడు. (శ్రామికుడి శ్రమలో నించే కొంత భాగాన్ని ఇచ్చి !) శ్రామికుడి శ్రమలో ఇంకా మిగిలి వున్న భాగాన్ని చూస్తే, దాని విషయంలో 'అప్పు'ని తీర్చే పద్ధతి కూడా వుండదు. ఈ భాగాన్ని పూర్తిగా ఉచితంగా కొల్లగొట్టడమే.

'శ్రమ విలువ' గురించి చూసే ఈ సందర్భంలో, 'డబ్బు శ్రమ' విలువని గురించి కూడా (మొదటి భాగంలో చూసినదాన్ని) ఒక సారి గుర్తు చేసుకోవడం అవసరం.

# 'డబ్బు'ని ఉత్పత్తి చేసే శ్రమ విలువ

సమాజంలో 'డబ్బు' అనేది, మారకాలు తేలిగ్గా జరగడం కోసమే ఏర్పడింది. బంగారమే — డబ్బు (జనరల్ ఈక్వివలెంటు). బంగారం కూడా శ్రమతో తయారయ్యే వస్తువే. బంగారాన్ని తయారుచేసే శ్రమే — 'డబ్బు శ్రమ'. ఆ శ్రమ విలువే — 'డబ్బు శ్రమ విలువ.'

ప్రతీ శ్రమకూ కొంత విలువ ఉంటుంది. 'డబ్బు శ్రమ'కి కూడా ఎంతో కొంత విలువ వుంటుంది.

డబ్బు — అన్ని సరుకులతోటీ మారుతూ, ఏ సరుకు విలువ ఎంత వుందో (ఎన్ని రూపాయలు వుందో), చెపుతుంది. ఈ పని, డబ్బు, ఎలా చేస్తుంది? — తన శ్రమకు వుండే విలువ ద్వారా చేస్తుంది. అంటే, డబ్బు శ్రమ విలువ, ఇతర శ్రమల విలువల్ని కొలిచే కొలత పాత్ర అన్నమాట !

బరువుల్ని కొలిచే రాయి సంగతి తీసు కుంటే, ఆ రాయికే మొదట కొంత బరువు వుంటుంది. ఆ రాయి, తన బరువుతో — పిండీ, బెల్లం, చింతపండూ లాంటి ఇతర పదార్థాల బరువుల్ని కొలిచి, వాటిని 'కిలోల' లెక్కతో చెపుతుంది. సరిగ్గా అలాగే, బంగారాన్ని ఉత్పత్తి చేసే శ్రమకి మొదట కొంత విలువ ఉంటుంది. ఆ శ్రమ, తన విలువ ద్వారా, ఇతర శ్రమల విలువల్ని కొలిచి, వాటిని డబ్బు లెక్కతో చెపుతుంది.

ఇప్పుడు, ఈ కొలతల గురించి కొన్ని ఉదాహరణలు చూద్దాం. ఈ ఉదాహరణలు చూసే ముందు — డబ్బు శ్రమకీ, ఇతర శ్రమలకూ కూడా, ఎంతెంత విలువలు వున్నాయో ఉదాహరణ కోసం మొదట నిర్ణయించుకోవాలి.

1 గ్రాము బరువుగల బంగారాన్ని ఉత్పత్తి చెయ్యడంలో మొత్తం 1 గంట శ్రమ పట్టిందనుకుందాం. 1 గ్రాము బరువు గల బంగారాన్ని ఒక బిళ్ళగా చేసి దానికి 'రూపాయి' అని పేరు పెట్టారనుకుందాం. అంటే ఆ రూపాయిని ఉత్పత్తి చెయ్యడానికి 'మొత్తం 1 గంట శ్రమ' పట్టింది. అంటే, 1 గంట బంగారం శ్రమ విలువ = 1 రూపాయి. బంగారం శ్రమే డబ్బు శ్రమ.

అన్ని శ్రమల విలువలూ బంగారం శ్రమ విలువలాగే వుండవు కదా? కొన్ని శ్రమలకు అంతకన్నా ఎక్కువ విలువ వుంటే, కొన్ని శ్రమలకు తక్కువ విలువ వుంటుంది. కొన్ని శ్రమలకు సమానమైన విలువలు ఉండవచ్చు. శ్రమల విలువల్లో ఈ తేడాలు వున్నాయి కాబట్టి, దేని విలువ ఎన్ని రూపాయలు వుంటుందో బంగారం శ్రమ విలువతో పోల్చి చూస్తేనే తెలుస్తుంది.

బంగారం శ్రమ విలువ కన్నా కుట్టు శ్రమ విలువ తక్కువ అనీ, సగమే అనీ, అనుకుందాం. ఇప్పుడు 2 గంటల కుట్టు విలువ, ఎన్ని రూపాయలు వుంటుంది? 2 గంటల కుట్టు శ్రమని మొదట బంగారం శ్రమగా మార్చి ఎన్ని గంటలు అవుతుందో చూడాలి. అలా మారిస్తే 2 గంటల కుట్టు శ్రమ, 1 గంట బంగారం శ్రమ అవుతుంది. అంటే 1 గంట బంగారం శ్రమలో ఎంత విలువ వుందో, 2 గంటల కుట్టు శ్రమలో అంత విలువ వుందన్నమాట. కుట్టు శ్రమని కుట్టు శ్రమగానే చూస్తే అది 2 గంటల శ్రమే. కానీ, దాన్ని బంగారం శ్రమతో కొలిస్తే, అది 1 గంట శ్రమే అవుతుంది. 1 గంట బంగారం శ్రమ విలువ 1 రూపాయి కాబట్టి, 2 గంటల కుట్టు శ్రమ విలువ = 1 రూపాయి.

వైద్యం శ్రమ విలువ, బంగారం శ్రమ విలువ కన్నా ఎక్కువ అనీ, 4 రెట్లు అనీ అనుకుందాం. అప్పుడు, 1 గంట వైద్యం శ్రమ విలువ ఎన్ని రూపాయలు? 1 గంట

వైద్యం శ్రమని, బంగారం శ్రమగా మారిస్తే, ఎన్ని గంటలవుతుందో మొదట చూడాలి.

1 గం. వైద్యం శ్రమ = 4 గం. బంగారం శ్రమ
1 గం. బంగారం శ్రమ = 1 రూపాయి
4 గం. బంగారం శ్రమ = 4 రూపాయలు
1 గం. వైద్యం శ్రమ = 4 రూ.లు

కుట్టు — ఒక ప్రత్యేక శ్రమ. వైద్యం — ఒక ప్రత్యేక శ్రమ. ఒక 'ప్రత్యేక శ్రమ'ని 'డబ్బు శ్రమ'తో కొలిస్తే, ఆ ప్రత్యేక శ్రమ విలువ 'డబ్బు' లెక్కతో తెలుస్తుంది.

'డబ్బు శ్రమ'తో, ఇతర శ్రమల్ని కొలవడం — అనే విషయం, చాలా గందరగోళంగా వున్నట్టు అనిపిస్తుంది. కానీ, ఇందులో గందరగోళం ఏమీలేదు. 'డబ్బు శ్రమ'తో, ఇతర శ్రమల్ని కొలవడం — అంటే, 'డబ్బు శ్రమ'కి వున్న విలువతో, ఇతర శ్రమలకు వున్న విలువల్ని కొలవటమే.

ఒక ప్రత్యేక శ్రమకీ, డబ్బు శ్రమకీ వున్న సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి, బరువుల్ని తూచే ఉదాహరణే చాలా తేలికైన ఉదాహరణ.

**(1)** బరువుల్ని కొలిచే పనిలో — ఒక బరువు రాయీ, దాని ఎదురుగా తమ బరువుల్ని కొలిపించుకోడానికి వచ్చిన రకరకాల బరువులు గల పదార్థాలూ ఉంటాయి. అలాగే, విలువల్ని కొలిచే పనిలో — విలువల్ని కొలిచే పాత్రా ( బంగారం శ్రమతో తయారైన రూపాయీ), దాని ఎదురుగా రకరకాల విలువలు గల శ్రమలూ వుంటాయి.

**(2)** బరువుని కొలిచే రాయికి స్వయంగా కొంత బరువు వున్నట్టే, విలువని కొలిచే రూపాయికి కూడా స్వయంగా కొంత విలువ వుంటుంది.

**(3)** బరువుల్ని కొలిపించుకునే పదార్థాలకు వేరు వేరు బరువులు వున్నట్టే, విలువల్ని కొలిపించుకునే శ్రమలన్నిటికీ వేరు వేరు విలువలు వుంటాయి.

ఈ మూడు విషయాల్నీ సమన్వయ పరుచుకోవాలి. అంతే.

ఒక 'కిలో' బరువు తూగాలంటే, దూది అయితే బస్తాడు కావాలి. ఇనుము అయితే పిడికెడు సరిపోతుంది. పిండి అయితే, ఇనుము కన్నా ఎక్కువ సైజులోనూ, దూదికన్నా తక్కువ సైజులోనూ కావాలి.

అలాగే, శ్రమల విలువల్ని కొలిచే విషయం కూడా.

ఇప్పుడు కొన్ని శ్రమల విలువల్ని డబ్బులో చూద్దాం. పొలం దున్నడం, నేతా, కుట్టూ, చదువు చెప్పడం, వైద్యం— ఈ 5 శ్రమల్ని తీసుకుందాం. ఈ శ్రమలు ఏ వరసలో వున్నాయో, వాటి విలువలు కూడా అదే వరసలో రెట్టింపవుతూ వున్నాయి —అనుకుందాం. అంటే, మొదటి శ్రమకన్నా 2 వ శ్రమ రెట్టింపు విలువగలది. 2 వ శ్రమ కన్నా, 3 వ శ్రమ రెట్టింపు విలువ గలది. మిగతావి కూడా అలాగే అనుకుందాం. అయితే, ఈ 5 శ్రమలలోనూ నేతకీ, కుట్టుకీ మాత్రం ఒకే విలువ వుందనుకుందాం. — అంటే, ఈ 5 శ్రమలూ 4 రకాల విలువలతో వుంటాయి. బంగారం 'శ్రమ' విలువ, పొలం దున్నే శ్రమ విలువతో సమానం అనుకుందాం. 1 గంట బంగారం శ్రమ విలువ = 1 రూపాయి — అనుకుందాం. (ఈ ఉదాహరణలో ఒక శ్రమ విలువ కన్నా ఇంకో శ్రమ విలువని రెట్టింపుగా పెట్టుకున్నాం. ఇది కేవలం, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసమే. అంతేగానీ, వేరు వేరు శ్రమల విలువలు ఇంతింత తేడాలతో వుంటాయనీ, అలా వుండడం తప్పనిసరి అనీ, చెప్పడం కాదు.) ఉదాహరణని ఇలా పెట్టుకున్న తర్వాత ఇప్పుడు కొన్ని లెక్కలు చెయ్యాలి.

ఈ శ్రమల విలువల్ని డబ్బులో చెప్పాలి :

దున్నే శ్రమ — 5 గంటలు
కుట్టు — 8 గంటలు
నేత — 11 గంటలు
చదువు చెప్పడం — 10 గంటలు
వైద్యం — 3 గంటలు

**(1)** 5 గంటల దున్నే శ్రమ విలువ, ఎన్ని రూ.లు? — దున్నే శ్రమ విలువా, బంగారం శ్రమ విలువా ఒకటే అనుకున్నాం. కాబట్టి,

1 గంట బంగారం శ్రమ విలువ = 1 రూపాయి.
1 గంట దున్నే శ్రమ విలువ = 1 రూపాయి.
5 గంటల దున్నే శ్రమ విలువ = 5 రూపాయలు.

**(2)** 8 గంటల కుట్టు శ్రమ విలువ, ఎన్ని రూ.లు? ఉదాహరణ ప్రకారం, కుట్టు శ్రమ విలువ, దున్నే శ్రమ విలువ కన్నా రెట్టింపు.

కాబట్టి, 1 గంట కుట్టు విలువ = 2 రూ.లు
8 గం.ల కుట్టు విలువ =16 రూ.లు

**(3)** 11 గం.ల నేత శ్రమ విలువ, ఎన్ని రూ.లు? ఉదాహరణ ప్రకారం, నేత విలువ, కుట్టు విలువతో సమానం.

కాబట్టి, 1 గంట నేత విలువ = 2 రూ.లు
11 గం.ల నేత విలువ = 22 రూ.లు

**(4)** 10 గంటల చదువు చెప్పే శ్రమ విలువ, ఎన్ని రూ.లు? ఉదాహరణ ప్రకారం, ఈ శ్రమ విలువ, నేత విలువ కన్నా రెట్టింపు.

1 గంట చదువు చెప్పే శ్రమ = 4 రూ.లు
10 గంటల చదువు చెప్పే శ్రమ = 40 రూ.లు

**(5)** 3 గంటల వైద్యం శ్రమ విలువ, ఎన్ని రూ.లు? ఉదాహరణ ప్రకారం, వైద్యం విలువ, చదువుచెప్పే శ్రమ విలువ కన్నా రెట్టింపు.

కాబట్టి, 1 గంట వైద్యం విలువ = 8 రూ.లు
3 గం.ల వైద్యం విలువ = 24 రూ.లు

ఇలాగే, ఏ శ్రమ విలువ అయినా, బంగారం శ్రమ విలువ ద్వారా, డబ్బులో కనపడుతుంది.

ఇద్దరు స్వతంత్ర ఉత్పత్తిదారులు, 2 రకాల పనులు చేసి పదేసి రూపాయలు సంపాదించారనుకుందాం. ఇద్దరూ ఒకే విలువ గల పనులు చేశారని అర్థమా?— ఎవరు ఎంతెంత కాలం పని చేశారో చెప్పలేదు కాబట్టి, వాళ్ళు ఒకే విలువ గల పనులు చేశారో, వేరు వేరు విలువలు గల పనులు చేశారో చెప్పలేము. ఒక మనిషి తక్కువ విలువగల పనిని, ఎక్కువసేపు చేసి వుండవచ్చు. ఇంకో మనిషి, ఎక్కువ విలువగల పనిని, తక్కువ సేపు చేసి వుండవచ్చు. గంటకి 2 రూ.ల విలువగల పని, 5 గం.ల సేపు చేస్తే 10 రూ.లు వస్తాయి. గంటకి 5 రూల. విలువ గల పని, 2 గంటలు చేసినా, 10 రూ.లు వస్తాయి. కాబట్టి, ఇద్దరు మనుషుల ఆదాయం ఒకే రకంగా వున్నా, వేరుగావున్నా, ఆ ఆదాయాన్ని చూసి వారు చేసే శ్రమల వివరాల్నీ, కాలాల్నీ గ్రహించలేము.

స్వతంత్ర ఉత్పత్తిదారుల్నిగాక, ఇద్దరు 'వేతన శ్రామికుల్ని' తీసుకుందాం. ఇద్దరూ వేరు వేరు శ్రమలు చేస్తున్నారనుకుందాం. కానీ వారు 'పని చేసే కాలం' ఒకటే అయినప్పటికీ వారి జీతాలు తేడాగా వుంటాయి. ఎవరి శ్రమ శక్తి విలువ వారికి జీతంగా వుంటుంది. 'శ్రమ శక్తి విలువ'లు తేడాగా వుంటాయి కాబట్టి, జీతాలు తేడాగా వుంటాయి. దీన్ని వేరే మాటల్లో చెప్తే, వారు చేసే శ్రమలు తేడాగా వుంటాయి కాబట్టి, వారి జీతాలు తేడాగా వుంటాయి.

అలాగే వాళ్ళు ఇచ్చే 'అదనపు విలువలు' కూడా తేడాగా వుంటాయి.

శ్రమ విలువా, శ్రమ శక్తి విలువా — అనే అంశాల గురించి మనం ఇంత వరకూ చూసినదాన్ని ఒక సారి క్లుప్తంగా ఇలా చెప్పుకోవాలి.

— అన్ని శ్రమలకూ విలువలు ఒకే రకంగా వుండవు. అంటే 'సమానంగా' వుండవు. ఎక్కువ తక్కువలుగా వుంటాయి.

— 'శ్రమ'కు ఎక్కువ విలువో తక్కువ విలువో కలిగించే అంతర్గత కారణం 'శ్రమ శక్తి' విలువే.

— శ్రమ శక్తి విలువ, ఆ 'శక్తి' ఏర్పడడానికి అయ్యే ఖర్చూ కాలమూ అనే అంశాల్ని బట్టి వుంటుంది. అందుకే, అన్ని శ్రమ శక్తుల విలువలూ ఒకే రకంగా వుండవు.

—'శ్రమ శక్తుల విలువలు' తేడాగా వుంటాయి కాబట్టే 'శ్రమల విలువలు' కూడా తేడాగా వుంటాయి.

శ్రమల విలువలు తేడాగా వుండడం అనేది హేతుబద్ధమైన విషయమే. అయితే, 'ఆ తేడా, ఎంత ఎక్కువగా వున్నా, అదంతా సరైనదే' — అని అర్థం కాదు. మన నిత్య జీవితంలో; ఒక డాక్టరు ఆదాయానికీ, ఒక కుట్టు మనిషి ఆదాయానికీ మధ్య విపరీతమైన తేడా కనపడుతుంది. తేడా అంత ఎక్కువగా వుండడం సరైనదేననీ, అది అలా వుండవలసిందేననీ, ఆ తేడా అంతా ఆ శ్రమల ప్రత్యేకతల్ని బట్టే ఏర్పడుతోందనీ — అర్థం కాదు. వేరు వేరు శ్రమల విలువల్లో తేడా, కొంతవరకే తప్పనిసరి. ఆ తేడా అత్యధికంగా వుండడం అనేది, 'దోపిడీకి అనుకూలంగా వుండే కారణాల వల్లనే' జరుగుతుంది.

'దోపిడీకి అనుకూలంగా వుండే కారణాలు' అనేవి 'బాహ్య కారణాలు'. దోపిడీ లేనప్పుడు ఈ బాహ్య కారణాలు అంతర్ధానమవుతాయి — ఈ విషయం తర్వాత వేరే సందర్భాల్లో చూస్తాము.

'దోపిడీ సమాజం'లో— శ్రమ విలువా, శ్రమ శక్తి విలువా ఒకటి కాదని చూశాం. 'శ్రమ శక్తి విలువ' అంటే — జీతం. 'శ్రమ విలువ' అంటే — ఆ జీతానికి అదనపు విలువ కూడా కలిసినది. 'శ్రమ విలువ'ని లెక్క కట్టడానికి అదే మార్గం.

అయితే, అదనపు విలువే లేని సమాజాన్ని ఊహిస్తే, ఆ సమాజంలో జీతం మాత్రమే కనపడి, అదనపు విలువ కనపడదనుకుందాం. అప్పుడు శ్రమ విలువని ఎలా లెక్కకట్టగలం? — అదనపు విలువే లేకపోవడం అంటే అక్కడ శ్రమ చెయ్యని వర్గమే లేదని అర్థం. అంటే అక్కడ అందరూ శ్రమ చేస్తారనీ, ఎవరి శ్రమ వారికే అందుతుందనీ, అర్థం. అప్పుడు 'శ్రమ విలువ' అంతా 'జీతం'గానే వుంటుందన్నమాట ! శ్రమ విలువా, శ్రమ శక్తి విలువా రెండూ సమానమే అన్నమాట !

కానీ, అలాంటి సమాజంలో కూడా (అంటే, 'ఎవరి శ్రమ వారికోసమే ఖర్చయ్యే సమాజం'లో కూడా) ఒక వ్యక్తి 'శ్రమ విలువ' అంతా ఆ వ్యక్తి చేతికే అందే ఒకే రాసిగా వుండదు. అప్పుడు కూడా 'శ్రమ విలువ' అనేది — (1) ఆ వ్యక్తికి అందే భాగమూ (2) సోషల్ ఫండ్‌గా వెళ్ళే భాగమూ — అనే 2 భాగాలుగా తప్పనిసరిగా చీలుతుంది — ఈ వివరాలన్నీ ఇంకా ముందు ముందు అవసరమైన సందర్భాల్లో చూస్తాము.

ప్రస్తుతం ఇక్కడ మనం పెట్టుబడిదారీ సమాజాన్ని తీసుకుంటే (ఏ దోపిడీ సమాజాన్ని తీసుకున్నా) — శ్రమ విలువా, శ్రమ శక్తి విలువా ఒకటి కాదనీ, శ్రమ విలువ కన్నా

శ్రమ శక్తి విలువ తక్కువగా వుండి తీరుతుందనీ — అర్థం చేసుకోవాలి.

'శ్రామికులు' అంటే, శారీరక శ్రమలు చేసే వారే కాదు. మేధా శ్రమలు చేసేవారు కూడా. ఏ శ్రమ చేసేవార్లైనా, జీతాల మీద బతికే వారంతా శ్రామికులే.

శ్రమల్లో తేడాల్ని బట్టి, జీతాలు తేడాగా వుంటాయి. ఆ జీతాల ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విలువలు కూడా తేడాగానే వుంటాయి.

అదనపు విలువల్లో తేడాల గురించి ఇప్పుడు ఒక ఉదాహరణ చూద్దాం.

# 'మేధా శ్రమ' నించి గానీ, 'నైపుణ్యం గల శ్రమ' నించి గానీ, అదనపు విలువ

ఏ శ్రమని దోచే పద్ధతి అయినా ఒకటే. ఆ శ్రామికులకు, ఆ 'శ్రమ విలువ'ని గాక, 'శ్రమ శక్తి విలువ'ని జీతంగా ఇవ్వడమే ఆ పద్ధతి.

బట్ట పెట్టుబడిదారుడి దగ్గిర, నేత పనిలో, సాధారణ శ్రామికులూ, నైపుణ్యం గల శ్రామికులూ కూడా వున్నారనుకుందాం. సాధారణ శ్రామికుల శ్రమ విలువ 1 గంటకి — 1 రూపాయి. రెండో రకపు శ్రామికుల శ్రమ విలువ 1 గంటకి 2 రూ.లు. ఇద్దరికీ, జీతం — 'శ్రమ విలువ'లో సగం. ఇద్దరూ 10 గంటలు పనిచేస్తారు.

సాధారణ శ్రామికుడు 10 గంటల శ్రమ ద్వారా ఇచ్చే విలువ 10 రూ.లు. జీతం 5 రూ.లు. 'అదనపు విలువ' 5 రూ.లు.

నైపుణ్యంగల శ్రామికుడు 10 గంటల శ్రమ ద్వారా ఇచ్చే విలువ 20 రూ.లు. జీతం 10 రూ.లు. అదనపు విలువ 10 రూ.లు.

ఏ శ్రమ చేసే శ్రామికుడైనా తన 'శ్రమ విలువ'లో కొంత భాగాన్ని అదనపు విలువగా వదులుకోవలసిందే. పెట్టుబడిదారుడు, ఏ విలువగల శ్రమ శక్తిని ఉపయోగిస్తే దాన్నే దోస్తాడు. ఒక పెట్టుబడిదారుడి సరుకు తయారీకి ఒక వైద్యుడి శ్రమ అవసరమైతే, ఆ వైద్యుడికి వచ్చే జీతం కూడా, చేసిన శ్రమ కంతటికీ రాదు. అతని శ్రమ శక్తికే వస్తుంది. అప్పుడు, ఆ వైద్యుడు కూడా 'అదనపు విలువ'ని ఇచ్చే శ్రామికుడే.

మేధా శ్రమలూ, నైపుణ్యం గల శ్రమలూ, ఎక్కువ విలువగల శ్రమలు కాబట్టి, పెట్టుబడిదారుడికి ఈ రకం శ్రమల నించే ఎక్కువ అదనపు విలువ వస్తుందని అనుకోవచ్చా? — ఆ సంగతి ఇక్కడ చెప్పుకోలేము. దీనికి అనేక వివరాలు కావాలి. పెట్టుబడిదారుడు తన పని స్థలంలో ఎంత మంది సాధారణ శ్రామికుల్నీ, ఎంత మంది నైపుణ్యం గల శ్రామికుల్నీ, ఎంత మంది మేధా శ్రామికుల్నీ పెట్టాడు? వాళ్ళ శ్రమల విలువలు ఎలా వున్నాయి? వాళ్ళ జీతాలు ఎలా వున్నాయి?— ఈ వివరాల్ని బట్టి వుంటుంది అది. సాధారణంగా చూస్తే, ఏ పని స్థలంలో అయినా సాధారణ శ్రామికులే ఎక్కువ మంది వుంటారు. మేధా శ్రమలూ, నైపుణ్యం గల శ్రమలూ చేసే శ్రామికులు తక్కువ మందే వుంటారు.

ఒక 'పని స్థలం'లో అనేక మంది శ్రామికులు వుంటారు కదా? వారి 'శ్రమ విలువలు' కొన్ని తేడాలతో వుంటాయి. అలాగే వారి 'జీతాలు' కూడా కొన్ని తేడాలతో వుంటాయి. అలాంటప్పుడు, అక్కడ తయారయ్యే సరుకు కోసం, ఎవరు ఎంత 'అదనపు విలువ'ని ఇచ్చారో ఎలా తెలుస్తుంది? — ఎలా తెలుస్తుందంటే : మొదట 'సరుకు'లో వున్న మొత్తం 'అదనపు విలువ'ని లెక్క కట్టాలి. తర్వాత, జీతాలు ఏ యే పాళ్ళల్లో వున్నాయో చూడాలి. 'అదనపు విలువ'ని జీతాల పాళ్ళ ప్రకారం విభజించాలి. ఏ స్థాయి శ్రామికుడు ఎంత 'అదనపు విలువ'ని ఇచ్చాడో తెలుస్తుంది.

ఇప్పుడు ఒక పెద్ద ఉదాహరణ చూద్దాం :

ఒక పెట్టుబడిదారుడి 'బ్యాలెన్స్ షీటు' ఇలా వుంది. ఇదంతా 1 పని దినానికి సంబంధించిన లెక్క అనుకుందాం.

వెయ్యి మీటర్ల బట్ట విలువ వివరాలు :

| | | |
|---|---|---|
| 1) శ్రమ సాధనాలకు | 800 | రూ.లు |
| 2) శ్రామికుల జీతాలు | 200 | |
| 3) వర్తక కమీషన్ | 50 | |
| 4) వడ్డీ — — | 30 | |
| 5) భూమి అద్దె | 20 | |
| 6) పన్నులు — — | 10 | |
| 7) ఇన్సిడెంటల్ ఖర్చులు | 10 | |
| 8) ఉత్పాదక లాభం | 80 | |
| సరుకు విలువ | 1200 | |

ఇది పెట్టుబడిదారుడు చూపించిన లెక్క. ఈ లెక్కల్లో

నించే మనం, అసలు విషయాలు తెలుసుకోవచ్చు. ఇందులో మొదట 'అదనపు విలువ' ఎంత వుందో చూడాలి. అది ఎలా తెలుస్తుంది? అది ప్రత్యేకంగా 'అదనపు విలువ' అనే పేరుతో వుండదు. అది ఏ యే భాగాలుగా చీలుతుందో ఆ పేర్లతోనే వుంటుంది. ఆ భాగాలన్నిటినీ కలిపేస్తే, అదే అదనపు విలువ. ఈ లెక్కలో వున్న 8 అంశాల్లోనూ శ్రమ సాధనాల్నీ, జీతాల్నీ వదిలేసి, మిగతా అంశాలన్నిటినీ కలిపెయ్యాలి. 3 వ అంశం అయిన వర్తక కమిషన్ దగ్గిర నించీ చివరి దాకా. అలా లెక్క చూస్తే, అదనపు విలువ 200 అని తేలుతుంది.

ఇప్పుడు శ్రామికులందరూ చేసిన 'శ్రమ విలువ' ఎంతో చూడాలి. ఇది ఎలా తెలుస్తుంది? — అదనపు విలువనీ, జీతాల్నీ కలిపితే, అదే — 'శ్రమ విలువ'. జీతాలు 200 + అదనపు విలువ 200 = 400. ఇది శ్రామికులందరూ ఇచ్చిన 'శ్రమ విలువ'.

శ్రామికులలో ఎవరు ఎంత 'అదనపు విలువ'ని ఇచ్చారో ఎలా తెలుస్తుంది? ఇది తెలియాలంటే, శ్రామికుల సంఖ్యా, వారిలో రకాలూ, జీతాల్లో తేడాలూ — తెలియాలి. జీతాల పాళ్ళని బట్టి, 'అదనపు విలువ'ని విభజించాలి.

ఈ 'పని స్థలం'లో మొత్తం 28 మంది శ్రామికులు వున్నారనుకుందాం. అందులో, మేధా శ్రమ చేసే శ్రామికులు ఇద్దరూ, శారీరక శ్రమల్లో నైపుణ్యం గల శ్రమలు చేసే శ్రామికులు 6 గురూ, సాధారణ శారీరక శ్రమలు చేసే శ్రామికులు 20 మందీ. శారీరక శ్రమకు జీతం 5. నైపుణ్యం గల శ్రమకు జీతం 10. మేధా శ్రమకు జీతం 20 — అనుకుందాం.

'శారీరక శ్రమ' చేసే శ్రామికులు 20 మంది.
వారి మొత్తం జీతాలు = 20 × 5 = 100 రూ.లు.

నైపుణ్యం గల శ్రమ చేసే శ్రామికులు 6 గురు.
వారి మొత్తం జీతాలు = 6 × 10 = 60 రూ.లు

మేధాశ్రమలు చేసే శ్రామికులు — 2.
వారి మొత్తం జీతాలు = 2 × 20 = 40 రూ.లు

3 రకాల జీతాలూ కలిపి 200.

అవి ఇచ్చిన అదనపు విలువ 200.

200 జీతాలు, 200 అదనపు విలువని ఇచ్చాయంటే, ప్రతీ జీతమూ, తనకి సమానమైన అదనపు విలువని ఇచ్చిందని అర్థం.

జీతాలూ, అదనపు విలువా, ఈ పాళ్ళలో వున్నాయి :

| | |
|---|---|
| 200 : | 200 |
| 1 : | 1 |
| శారీరక శ్రమల జీతాలు | 100. |
| వాటి అదనపు విలువ | 100. |
| ఈ సెక్షన్‌లో ఒక విడి జీతం | 5. |
| దాని అదనపు విలువ | 5. |
| నైపుణ్యం గల శ్రమల జీతాలు | 60. |
| వాటి అదనపు విలువ | 60. |
| ఈ సెక్షన్‌లో ఒక విడి జీతం | 10. |
| అదనపు విలువ | 10. |
| మేధా శ్రమల జీతాలు | 40. |
| వాటి అదనపు విలువ | 40. |
| ఈ సెక్షన్‌లో, ఒక విడి జీతం | 20. |
| అదనపు విలువ | 20. |

ఈ ఉదాహరణలో, ప్రతీ శ్రామికుడూ, తన 'జీతం'తో సమానమైన 'విలువ'ని, పెట్టుబడిదారుడి కోసం అర్పించాడన్న మాట!

ఈ ఉదాహరణలో, పెట్టుబడిదారుడికి, 'శారీరక శ్రమల' సెక్షన్‌లో వున్న 20 మంది శ్రామికుల నించి వచ్చిన అదనపు విలువే ఎక్కువ.

ఒక 'పని స్థలం'లో వున్న శ్రామికులందరూ ఎంతెంత అదనపు విలువని ఉత్పత్తి చేశారో తెలుసుకోవడానికి ఇదే పద్ధతి. మొదట పెట్టుబడిదారుడు చూపించే లెక్కలనే తీసుకుని అందులో వున్న 'అదనపు విలువ రాసి'ని లెక్క చూడాలి. తర్వాత జీతాలూ అదనపు విలువా ఏ పాళ్ళల్లో వున్నాయో చూడాలి. దీన్నిబట్టి, ఏ రకం శ్రామికులు ఎంత అదనపు విలువని ఇచ్చారో తెలుస్తుంది. (ఈ పుస్తకంలోనే 'అదనపు విలువ రేటు' చాప్టరులో ఈ విషయం, ఇంకా వివరంగా చూస్తాము.)

పెట్టుబడిదారుడి లెక్కల్లో, అనేక విషయాలు నిజాలు చెప్పేవిగా వుండవు. అయినప్పటికీ, ఆ వున్న లెక్కలతోనే నిజం తెలుసుకోవచ్చు. జీతాల్నీ, అదనపు విలువనీ కలిపితే, అదే — శ్రామికులందరూ ఇచ్చిన 'శ్రమ విలువ'.

ఒక దేశంలో వెయ్యిమంది ఉత్పాదక పెట్టుబడిదారులు వున్నారు అనుకుంటే, వాళ్ళు ఉత్పత్తి చేయించే వెయ్యి రకాల సరుకులకు సంబంధించి వెయ్యి బ్యాలెన్స్ షీట్లు వుంటాయి. అన్నిటిలోనూ వున్న అదనపు విలువల్నీ, అన్నిటిలోనూ వున్న జీతాల్నీ కలిపేస్తే, ఆ మొత్తం విలువని, ఆ వెయ్యి పని స్థలాలలో వున్న శ్రామికులు ఉత్పత్తి చేశారని అర్థం. అందులో అదనపు విలువలన్నీ దోపిడీ వర్గానికీ, జీతాలన్నీ శ్రామిక వర్గానికీ!

# 'జీతం' సృష్టించే భ్రమ

'శ్రమ శక్తి విలువ'ని డబ్బుగా గానీ, ఏదో ఒక ఉత్పత్తిగా గానీ శ్రామికులకు చెల్లిస్తే, అదే జీతం. కానీ, ఈ 'జీతం' అనేది 'డబ్బు'లో వుంటేనే శ్రామికుల 'అదనపు విలువ'నీ, 'శ్రమ విలువ'నీ, లెక్కకట్టడం సాధ్యమవుతుంది.

శ్రామికులందరికీ ధాన్యాన్నే (లేదా, ఏదో ఒక ఉత్పత్తిని) జీతాలుగా ఇస్తారనుకుందాం. ఆ ఉత్పత్తికి డబ్బు లెక్కలు (ధర) వుండదనుకుందాం. శ్రామికులు ఆ ధాన్యాన్ని ఇళ్ళకు తీసుకుపోయి అందులో కొంత భాగాన్ని ఆహారంగా వాడు కుంటారు. మిగిలిన ధాన్యాన్ని బార్టరు పద్ధతిలో మారకాలు చేసుకుని కొన్ని ఇతర ఉత్పత్తులు సంపాదించుకుంటారు. ఇలా జరిగితే, శ్రామికుల అదనపు విలువని లెక్కకట్టడానికి అవకాశం వుండదు. (అసలు శ్రమ దోపిడీని గ్రహించడానికే అవకాశం వుండదు.) కాబట్టి, 'జీతం' అన్నప్పుడు. అది 'డబ్బు'లోనే (కొన్ని రూపాయలుగా) వుందని అర్థం చేసుకోవాలి.

జీతం పద్ధతి మీద పనిచేసే శ్రామికులు <u>'వేతన శ్రామికులు'. వీరికి ప్రత్యేకమైన పేరు 'కార్మికులు'.</u>

చరిత్రలో, జీతం పద్ధతి ప్రారంభం కాకముందు కూడా శ్రామికులు శ్రమ చెయ్యడం వుంది. బానిసలూ, తర్వాత కాలపు ఫ్యూడల్ కౌలు రైతులూ కూడా — శ్రామికులే. వారంతా యజమానులకు 'శ్రమ'ని ఇచ్చి, 'శ్రమ శక్తి విలువ'నే తమ పోషణ కోసం తీసుకున్నారు. కానీ, వారు, శ్రమ శక్తి విలువని 'జీతం పద్ధతి'లో గానీ, 'డబ్బు'గా గానీ, తీసుకోలేదు.

'శ్రమ శక్తి విలువ'ని 'జీతం' రూపంలో చెల్లించడం ప్రారంభం కావడం అంటే, 'శ్రమ శక్తి'ని కొనే పెట్టుబడి దారుడూ, దాన్ని అమ్ముకునే 'వేతన శ్రామికుడూ' ప్రారంభం కావడమే. — వేతన శ్రామికుడి ప్రారంభమే — పెట్టుబడిదారుడి ప్రారంభం. పెట్టుబడి దారుడి ప్రారంభమే వేతన శ్రామికుడి ప్రారంభం.

'జీతం' అనే దానికి కొన్ని లక్షణాలు వున్నాయి. ఆ లక్ష ణాలు జీతం గురించి ఒక భ్రమని (తప్పు అభిప్రాయాన్ని) కలిగిస్తాయి. (1) ఒక శ్రామికుడికి జీతం ఎందుకు వస్తుంది? 'పని' చేస్తే వస్తుంది.— దీన్ని చూస్తే, 'జీతంగా వచ్చేది పని ఫలితమే' అయినట్టు కనిపిస్తుంది. (2) 'ఇంత పనికి ఇంత జీతం' అని ఒక ఒప్పందం జరిగిన తర్వాత, రెట్టింపు పని చేస్తే రెట్టింపు జీతం వస్తుంది. దీన్ని చూస్తే — 'ఎంత పని చేస్తే అంత ఫలితమూ వచ్చేస్తుంది; ఎక్కువ పనికి ఎక్కువ ఫలితమూ, తక్కువ పనికి తక్కువ ఫలితమూ, ఎంత పనికి అంత ఫలితం' అన్నట్టు కనిపిస్తుంది. (3) 'పని చెయ్యక పోతే జీతం రాదు. పని చేస్తేనే జీతం వస్తుంది.' — దీన్ని చూస్తే, 'పని చెయ్యకపోతే ఏమీ రాదు గానీ, పనిచేస్తే మాత్రం రావలసినదంతా వచ్చేస్తుంది' అన్నట్టు కని పిస్తుంది. — ఈ రకంగా, 'జీతం' అనేది ఇన్ని రకాల తప్పు అభిప్రాయాలు కలిగిస్తుంది. నిజానికి, జీతం అనేది 'శ్రమ శక్తి విలువే' అయినా, అది 'శ్రమ విలువ' లాగే, అంటే చేసిన పని ఫలితాన్నంతా ఇచ్చేదాని లాగే, కనిపిస్తుంది.

# పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు 'జీతం' గురించి ఏమంటారు?

పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రంలో 'శ్రమ శక్తి' అనే మాట గానీ, ఆ అవగాహన గానీ, లేవు. వాళ్ళు, కార్మికుడి జీతాన్ని 'శ్రమ విలువ' అనీ, 'శ్రమ ధర' అనీ అంటారు. అంటే, కార్మికుడికి ఇచ్చే జీతం, అతను చేసిన 'శ్రమకు విలువ' అయినట్టూ, లేదా 'ధర' అయినట్టూ! శ్రామికుడు చేసిన శ్రమకి బదులుగా జీతం ఇవ్వడం అంటే, అతనికి ఇవ్వవల సిందంతా ఇచ్చేస్తున్నట్టే వాళ్ళు అనుకుంటారు. 'శ్రామికుడి శ్రమ కంతటికీ జీతం ఇచ్చేస్తే పెట్టుబడిదారుడికి లాభం ఎలా వస్తోంద'నే ప్రశ్నకి వాళ్ళ దగ్గిర వేరే జవాబులు వుంటాయి. 'లాభం, బైట నించీ వస్తుంద'ని ఒకసారీ, 'పెట్టుబడిదారుడి శ్రమ సాధనాలే లాభాన్ని ఇస్తాయి' అని ఒకసారీ — ఇలా, రకరకాల జవాబులు! ఈ జవాబులన్నీ మనకు తెలిసినవే. 'జీతం' అంటే ఏమిటి? అనే ప్రశ్నని ప్రత్యేకంగా పరిశీలించవలసిన అవసరం పెట్టుబడిదారీ ఆర్థికవేత్త లెవ్వరికీ కనపడలేదు.

శ్రమ చేసినందుకే జీతం ఇస్తారు కదా? కాబట్టి, 'జీతంగా ఇచ్చేది శ్రమ విలువే' అని రికార్డో, దాని వేపు ఎక్కువ సేపు చూడకుండా నిర్ధారించేశాడు. 'ఆర్థిక శాస్త్రం'లో, రికార్డో, కొన్ని సందర్భాల్లో, విషయాల్ని సరిగా గ్రహించడానికి వీలునిచ్చే అభిప్రాయాలు కూడా వ్యక్తం

చేశాడు. అదే, రికార్డో ప్రత్యేకత. ఆ అభిప్రాయాలు ఏమిటో వేరే సందర్భాల్లో చూస్తాం. ప్రస్తుతం ఇక్కడ, 'జీతం' గురించీ, 'శ్రమ విలువ' గురించీ, రికార్డో అభిప్రాయాలు చూద్దాం.

'విలువ అనేది శ్రమ కాలాన్ని బట్టే వుంటుంది' అని గ్రహించే ఏ ఆర్థికవేత్త అయినా, కార్మికుడి శ్రమకి ఎంత విలువ వుంటుందో చెప్పాలంటే — "కార్మికుడు, పెట్టుబడిదారుడికి తన శ్రమతో ఎంత విలువని ఉత్పత్తి చేస్తాడో, ఆ విలువే అతని శ్రమ విలువ" అనాలి. కానీ, ఏ ఆర్థికవేత్తా అలా అనడు. 'శ్రమ విలువ'ని అలా లెక్క కట్టడు. ఈ విషయంలో రికార్డో కూడా ఇతర ఆర్థికవేత్తల లాంటివాడే. 'శ్రమ విలువ' గురించి అతను ఏమంటాడంటే, "జీతాల్ని ఉత్పత్తి చెయ్యడానికి కావలసిన శ్రమ పరిమాణం చేత 'శ్రమ విలువ'ని లెక్క కట్టాలి" అంటాడు. (కాపిటల్ – 1, పేజీ 501, మాస్కో, 1974)

'జీతంలో ఎంత శ్రమ ఉందో' కొత్తగా లెక్క కట్టనక్కరలేదు. అది, జీతంలోనే కనపడుతుంది. జీతాల్ని 'డబ్బు'లోనే ఇస్తారు. డబ్బు అంటే శ్రమే. ఒక శ్రామికుడి జీతం 2 రూ.లు అయితే, ఆ జీతంలో 2 రూ.ల విలువగల శ్రమ వుందని అర్థం. దీన్ని వేరే మాటల్లో చెప్తే, ఈ జీతాన్ని ఉత్పత్తి చెయ్యడానికి 2 రూ.ల విలువగల శ్రమ అవసరమైంది. ఈ శ్రమకి వున్న విలువనే, అంటే 2 రూ.లనే, ఈ శ్రామికుడు ఇచ్చిన శ్రమ విలువగా భావించాలన్నమాట! అంటే దీని అర్థం — 'జీతమే శ్రామికుడి శ్రమ విలువ' అని చెప్పడమే.

ఇదే విషయాన్ని రికార్డో ఇంకో రకంగా కూడా ఇలా చెపుతాడు — "కొనడాలూ అమ్మడాలూ జరిగే ఇతర అన్ని వస్తువుల విషయంలో లాగే, ఎక్కువ పరిమాణంతోటీ తక్కువ పరిమాణం తోటీ వుండే వస్తువుల విషయంలో లాగే, 'శ్రమ'కి కూడా సహజమైన మార్కెట్ ధర వుంటుంది. 'శ్రమ'కు సహజమైన ధర ఏమిటంటే, శ్రామికులు జీవించి వుండడానికీ, వారి సంతతి నిలబడడానికీ, అవసరమైన ధరే" (అదనపు విలువ సిద్ధాంతాలు — 2, మార్క్స్, పేజీ 400.......)

శ్రామికులు జీవించి వుండడానికీ, వారి సంతతి నిలబడడానికీ, అవసరమైన ధర—ఏమిటి? —జీతమే. ఆ జీతమే 'శ్రమ విలువ' అన్నమాట! అంటే, శ్రామికుడికి 'జీతం' ఇస్తే అతని 'శ్రమ విలువ'ని అతనికి ఇచ్చేసినట్టే అన్న మాట! అంటే చివరికి ఏమీ లేదు. పైకి కనపడేదాన్నే ఈ ఆర్థికవేత్త, తన మాటలతో గొప్ప ఆర్థిక సూత్రంగా చెప్పాడన్నమాట!

"శ్రామికుడు చేసే శ్రమకి ఎంత విలువ వుంటుంది?" అనే ప్రశ్న ఆర్థికవేత్త ముందు నిలబడినప్పుడు, అతను మొదట, 'విలువ'ని గురించి 'చర్చించే' పని చెయ్యాలి. కానీ, అదంతా అతను చెయ్యడు. శ్రామికుణ్ణి దగ్గిరికి పిలిచి — "పెట్టుబడిదారుడు నీ కెంత జీతం ఇచ్చాడు?" అని అడుగుతాడు.

"2 రూ.లు ఇచ్చాడు" అని శ్రామికుడు చెపుతాడనుకుందాం.

"2 రూ.లు ఇచ్చాడా? ఈ డబ్బు నీకు ఎందుకు వచ్చిందో చెప్పు!" అని వేత్త మళ్ళీ అడుగుతాడు.

"పని చేశాను కదండయ్యా?" అంటాడు శ్రామికుడు.

"అదీ, చూశావా? నువ్వు శ్రమ చేశావు. ఆ శ్రమ కోసమే ఈ జీతం వచ్చింది. నీకు ఎంత వచ్చిందో అదే నీ శ్రమకు విలువ. పెట్టుబడిదారుడు నీకు ఎంత ఇచ్చాడో అదే నీకు రావలసినది. అంటే, నీ 'శ్రమ విలువ' 2 రూ.లు అన్న మాట! 'జీతం' అంటే ఏమిటనుకున్నావు? 'శ్రమ విలువే'. 'నా పనికి ఎంత విలువ వుంటుందబ్బా' అని నువ్వు లెక్కలు కట్టుకోనక్కరలేదు. జీతాన్ని చూసుకుంటే, నీ పని విలువ నీకు తెలిసిపోతుంది. తెలిసిందా ఇప్పుడు?" అంటాడు ఆర్థికవేత్త — శ్రామికుడికి 'శ్రమ విలువ'ని బోధించాననే సంబరంతో.

వేత్త చెప్పినదాంట్లో కొత్త సంగతి ఏముందో శ్రామికుడికి అర్థం కాదు. 'పని' చేస్తే, ఆ పని కోసమే కదా జీతం వచ్చింది? అందులో కొత్తగా తెలుసుకో వలసిందేముంది?—అనుకుంటాడు.

'వేత్త మాటల్లో వున్న ఘోరం' ఏమిటో శ్రామికుడికి అర్థం కాదు. అర్థమైతే, అతను వేత్తని అన్ని మాటలు మాట్లాడనిస్తాడా? "జీతం ఎంత వుంటే అదే నా పని విలువ అంటున్నావు కదా? నా యజమాని జీతమే ఇవ్వకుండా ఎగ్గొడితే, నా పనికి విలువే లేకుండా అయిపోతుందా? అప్పుడు నేను పని చెయ్యకుండానే సరుకు తయారైనట్టు అవుతుందా? ఇదే పనికి, యజమాని ఒక్కరూపాయే ఇస్తే, అప్పుడు అదే నా పని విలువ అవుతుందా? యజమాని 'ఎంత ఇస్తే అంతే' నా పని విలువ ఎలా అవుతుందయ్యా?" అని అడుగుతాడు. అంతే కాదు, "నా పని విలువ అంతా నాకు ఇచ్చేస్తే, మరి నా యజమానికి లాభం ఎక్కడి నించి వస్తుంది? అప్పుడు లాభానికి మార్గం ఏమిటో చెప్పు!" అని కూడా అడుగుతాడు. కానీ, శ్రామికులకు ఇలాంటి తర్కం ఇంకా తెలీదు కాబట్టి, వేత్తలు శ్రామికుల ముందు నిలబడి ఎన్ని తప్పులైనా ధైర్యంగా మాట్లాడ గలుగుతారు.

"నీ జీతమే నీకు రావలసిన విలువ అన్నమాట. తెలిసిందా?" అని ముగిస్తాడు ఆర్థికవేత్త.

శ్రామికుడు తెల్లబోతూ— "అంతే కదండీ మరీ!

ఇందులో తెలవనిదేముందండీ?" అంటాడు.

బయటికి ఏం కనబడుతోందో అదే తెలుసు శ్రామికుడికీ, ఆర్థికవేత్తకీ కూడా.

పని వాళ్ళు, పని చేస్తారు. పెట్టుబడిదారుడు, జీతా లిస్తాడు. ఆ జీతాలు తీసుకుని పని వాళ్ళు వెళ్ళిపోతారు. మళ్ళీ మర్నాడు పనిలోకి వస్తారు.— ఇదంతా చూస్తాడు ఆర్థికవేత్త.

"పని వాళ్ళకి పనిచేసినందుకు జీతాలిచ్చేస్తాంగా?" అంటాడు పెట్టుబడిదారుడు. 'ఆ మాటలే' ఆర్థికవేత్తకి 'ఆర్థిక శాస్త్రం'! పెట్టుబడిదారుడే ఆర్థికవేత్తకి — గురువు. ఆర్థికవేత్త అవగాహన ప్రకారం— శ్రామికుడు చేసిన శ్రమకీ, అతనికి ఇచ్చే జీతానికీ 'సమానంగా' సరిపోతుంది. 'జీతం' అంటే, పని విలువ కన్నా ఎక్కువో తక్కువో కాని ఖచ్చితమైన పరిమాణంతో వుంటుంది! పెట్టుబడిదారుడికీ శ్రామికుడికీ మధ్య అంతా, చాలా కరెక్టు సూత్రాల ప్రకారం జరుగుతుంది. —ఇదీ ఆర్థికవేత్త అవగాహన!

శ్రామికుడి 'శ్రమ విలువ' 10 రూ.లూ, అతని 'జీతం' కూడా 10 రూ.లూ — అనుకుందాం. అంటే, అతని శ్రమ విలువ అంతా అతనికి జీతంగా వచ్చేస్తూ ఉంటుందను కుందాం. అప్పుడు, "శ్రామికుడి శ్రమ విలువ ఏమిటి?" అనే ప్రశ్నకి జవాబుగా, "జీతమే శ్రమ విలువ" అని నిరభ్యంతరంగా అనవచ్చు. అలా అనడంలో తప్పేమీ వుండదు. — పెట్టుబడిదారీ ఆర్థికవేత్త, సరిగ్గా ఈ పద్ధతి లోనే, 'శ్రమ విలువ అంతా జీతంగా వచ్చేస్తూ వుంటుంది' అనుకుంటాడు.— ఇది మొదటి తప్పు. ఇలా అనుకోవడం వల్ల అతనికి జీతం అనేది 'శ్రమ విలువ'లాగే కనపడు తుంది. కాబట్టి, 'జీతమే — శ్రమ విలువ' అంటాడు. ఇది రెండో తప్పు. మొదట ఒక తప్పు అభిప్రాయంతో వుండి, దాని వల్ల ఇంకో తప్పులోకి పోతాడు.

పెట్టుబడిదారీ ఆర్థికవేత్త 'జీతమే శ్రమ విలువ' అని చెపుతూనే, 'జీతం అంటే జీవితావసర వస్తువులు' అనే అర్థం కూడా చెపుతాడు.

స్మిత్తు, జీతాన్ని "పనివాళ్ళ పోషణ పదార్థాలు" (మెయిన్‌టెనెన్స్ ఆఫ్ వర్క్ మెన్) అంటాడు. అంటే, 'పోషణకు కావలసిన పదార్థాలన్నిటినీ జీతం ఇస్తుంది' అన్నట్టు.

అయితే, ఇక్కడ, 'పోషణ' అంటే ఆర్థికవేత్త దృష్టిలో వున్న అర్థమేమిటో చూడాలి. జొన్నంబలి తిన్నా పోషణే. పరమాన్నం తిన్నా పోషణే. ఆర్థికవేత్త దృష్టిలో వున్నది ఏ పోషణ? ఏ అంశం? కార్మికుడి పోషణ అంటే, పెట్టుబడి దారుడికి ఎలాంటి దృష్టి వుంటుందో, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తకి కూడా అలాంటి దృష్టే వుంటుంది. ఆర్థికవేత్త దృష్టిలో పెట్టుబడిదారుడి పోషణ అవసరాలూ, కార్మికుడి పోషణ అవసరాలూ, ఒకే రకంగా వుండవు. వేరు వేరుగా వుంటాయి. ఎందుకంటే, అవి లోకంలో వేరు వేరుగా వుండడమే అతను చూస్తాడు గనక. కార్మికుడు గంజి తాగడమే చూస్తూ వుండే ఆర్థికవేత్త, 'కార్మికుడికి గంజే సహజ అవసరం' అనుకుంటాడు. కార్మికుడి ఆహారం అనగానే గంజీ, పెట్టుబడిదారుడి ఆహారం అనగానే ఇంకేవేవో పదార్థాలూ కనపడతాయి, ఆర్థికవేత్తకి.

"పనివాడు గంజి తాగి బతగ్గలడు. మనం అలా బతగ్గలమా? ఎవరికి ఏది అలవాటైతే అదే సుఖం" అంటాడు దోపిడీ రుచి మరిగిన వాడు, పెద్ద 'జ్ఞాని' లాగ. ఆ వంకర టింకర ముక్కల వెంట ఆర్థికవేత్తలే కాదు, తత్వవేత్తలు కూడా బైల్దేరతారు. "సుఖం అంటే ఏమిటి అసలు? ఒకడికి పరమాన్నంలో కూడా సుఖం లేక పోవచ్చు. ఒకడికి గంజిలోనే సుఖం దొరకవచ్చు. ఒకడికి హంస తూలికా తల్పం మీద కూడా సుఖం లేకపోవచ్చు. ఒకడికి కటిక నేలమీదే సుఖం దొరకవచ్చు. ఏది సుఖమో, ఏది దుఃఖమో ఎవరు నిర్వచించగలరు? పట్టు పరుపుల మీద నిద్ర పట్టక దొర్లే ధనికుడి కన్నా, కటిక నేల మీద ఆదమరిచి నిద్రబోయే పేదవాడే ధనికుడు కాడా?"— ఇలా, శ్రామికుడి అవసరాల గురించి దోపిడీ తత్వశాస్త్రాలు, అవాకులూ చవాకులూ పేలతాయి. 'పేదతనం'లోనే అంత సుఖం వుంటే, పెట్టుబడిదార్లకి సంపదల కోసం వెంపర్లాట లెందుకో అవి చెప్పవు. గుడిసెల్లో వుంటూ, గంజి తాగుతూ, పేదలు పొందుతోన్న ఆ గొప్ప ఆనందాన్ని ఈ తత్వవేత్తలంతా ఎందుకు పొందరో కూడా అవి చెప్పవు. ఆ గుడిసెలూ, కటిక నేలలూ, అలాంటివన్నీ పేదలకే సుఖాన్నిస్తాయి గానీ, 'తత్వవేత్త'లకు సుఖాన్నివ్వవు కదా? వీరికి సుఖాన్నిచ్చే వస్తువులూ, మార్గాలూ అన్నీ వేరుగానే వుంటాయి కదా?

కార్మికుడి 'అవసరాలు' అంటే, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త దృష్టిలో, అతి తక్కువ స్థాయి అవసరాలే వుంటాయి. కార్మికుడికి వచ్చే జీతంతో ఆ అవసరాలు ఎలాగూ తీరతాయి కాబట్టి, ఈ పరిస్థితి ఆర్థికవేత్తకి ఎలా కనపడు తుందంటే, జీతంతో కార్మికుడి అవసరాలన్నీ తీరుతున్నట్టే కనపడుతుంది.

శ్రామికుడు ఇంకా చాలా పేదతనంలో వుండడం ఆర్థికవేత్త చూస్తూనే వుంటాడు. కానీ, శ్రామికుడికి ఇంకా ఎన్నో అవసరాలు తీరవలసివుందని ఆ వేత్త గ్రహించడు. ఎందుకంటే, శ్రామికులంతా అలాగే వుండడం, ఆ వేత్త దృష్టికి చాలా సహజమైన విషయం. "శ్రామికులంటే అంతే. వాళ్ళు గంజే తాగుతారు. వాళ్ళు శ్రామికులు కదా? అలాగే చేస్తారు" — ఈ దృష్టితో వుండే ఆర్థికవేత్తకి, శ్రామికుల పేదతనం ఏ ప్రశ్నలూ కలిగించదు.

శ్రామికుడు 'పని' రూపంలో పెట్టుబడిదారుడికి ఇచ్చే విలువకీ, పెట్టుబడిదారుడు 'జీతం' రూపంలో శ్రామికుడికి ఇచ్చే విలువకీ,— ఈ 2 విషయాలకూ తేడా వుంటుందనీ, అవి సమానంగా వుండవనీ, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు గ్రహించరు. ఎందుకంటే (వాళ్ళ 'వర్గ పరిమితుల్ని' అలా వుంచితే), 'శ్రమ'కు సంబంధించిన 2 ప్రధాన విషయాలు వాళ్ళు సరిగా గ్రహించక పోవడం వల్ల.

ఆర్థిక వేత్తలకు, ముఖ్యంగా, డబ్బు అంటే ఏమిటో సరిగా తెలీదు. 'డబ్బు' అంటే 'సరుకులతోమారే సాధనం' అన్నంత వరకే వాళ్ళకి తెలుసు. ఆ సాధనం ఏ లక్షణంతో ఆ పని చెయ్యగలదో తెలియదు. అంటే 'విలువ' గురించి తగినంత స్పష్టంగా తెలియదు. 'విలువ'ని ఉత్పత్తి చెయ్యడంలో, నిర్జీవ సజీవ శ్రమలు ఎలాంటి పాత్రలు నిర్వహిస్తాయో అసలే తెలియదు. ఈ రకంగా 'శ్రమ'కీ, 'విలువ'కీ, 'డబ్బు'కీ సంబంధించి సరైన అవగాహన లేక పోవడం వల్ల, పెట్టుబడిదారీ ఆర్థికవేత్త, 'జీతాన్ని' అర్థం చేసుకునే ప్రయత్నమే చెయ్యడు. పెట్టుబడిదారుడు ఏది మాట్లాడితే దానినే, తన మాటలతో వల్లిస్తాడు.

ఒక ఉదాహరణ చూద్దాం : ఒక కుట్టు మనిషి ఒక పెట్టుబడిదారుడి దగ్గిర రోజుకి 12 గంటలు పనిచేస్తాడను కుందాం. అతనికి రోజుకి 3 రూ.లు జీతం అనుకుందాం. దీన్ని చూసి — "12 గం.ల కుట్టు శ్రమకి 3 రూ.ల జీతం వుంటుంది" అనడం చాలదు. ఈ మాట చిన్న పిల్ల వాడైనా చెపుతాడు. ఆర్థికవేత్త చెయ్య వలసింది— అక్కడ వున్న దాన్నే తన మాటలతో తిరిగి చెప్పడం కాదు. అతను చెయ్యవలసింది ఏమిటి?

శ్రామికుడు ఇచ్చేది — 12 గంటల కుట్టుపని. దానికి పెట్టుబడిదారుడు ఇచ్చేది — 3 రూపాయల జీతం. ఈ 2 అంశాలకూ 'మారకం' జరుగుతోంది. <u>ఈ మారకం సమానంగా వుందో లేదో, ఆర్థిక వేత్త పరిశీలించాలి.</u>

ఈ మారకం, 'సమాన విలువల మారకం'గా వుందో లేదో పైకి తెలియదు. ఎందుకంటే, ఈ 2 అంశాలూ ఒకే రూపంలో లేవు గనక. ఒక అంశం 'కుట్టు పని' రూపంలో వుంటే, ఇంకో అంశం 'డబ్బు' రూపంలో వుంది. రెండూ 'కుట్టు పని'గా గానీ, లేదా రెండూ డబ్బుగా గానీ వుంటే, అవి సమానంగా వున్నాయో లేవో తెలుస్తుంది. లేకపోతే వాటిని పోల్చి చూడడం సాధ్యమే కాదు.

5 జామ కాయల్లోంచి, 3 బిస్కట్లని తీసేస్తే ఇంకా ఎన్ని మిగులుతాయి? — ఈ ప్రశ్నకి జవాబు వుండదు. రెండూ జామ కాయలుగానైనా వుండాలి; రెండూ బిస్కట్లుగానైనా వుండాలి. సరిగ్గా అలాగే, ఇక్కడ కుట్టు పనినీ, జీతాన్నీ రెంటినీ 'కుట్టుపని'గా గానీ, రెంటినీ 'డబ్బు'గా గానీ, మార్చి చూడాలి. ఇచ్చేదాన్నీ, పుచ్చుకునే దాన్నీ ఒకే రూపంలోకి మార్చగలిగితేనే, ఆ మారకంలో ఏం జరుగుతోందో గ్రహించగలం. ఆ పనే ఇప్పుడు మనం చేసి చూడాలి.

ఒక వేపు — 12 గం.ల కుట్టు శ్రమా,
ఇంకో వేపు — 3 రూ.ల జీ త మూ, వున్నాయి.

మొదట, రెంటినీ 'డబ్బు'గా చూద్దాం :

జీతం — 'డబ్బు'గానే వుంది. అది 3 రూ.లు.
1 రూపాయిలో, 1 గంట డబ్బు శ్రమ ఉందనుకుందాం.

3 రూ.ల జీతం = 3 గంటల డబ్బు శ్రమ.

12 గం. ల 'కుట్టు శ్రమ'ని కూడా 'డబ్బు'గా మార్చాలి. ఈ శ్రమని డబ్బుతో మారకం చేస్తే, అంటే ఈ శ్రమని అమ్మితే, ఎన్ని రూపాయలు వస్తాయి? 12 గం.ల కుట్టు శ్రమ, ఎన్ని గంటల 'డబ్బు శ్రమ' అవుతుంది? — దీని కోసం ఏదో ఒక ఉదాహరణ పెట్టుకోవాలి. 12 గం.ల కుట్టు విలువ, ఎంత ఉంటుందని అనుకోవాలంటే, 'జీతం కన్నా ఎక్కువగా ఉంటుందని' అనుకోవాలి. 2 గం.ల కుట్టు శ్రమని, 1 గంట డబ్బు శ్రమగా అనుకుందాం. ఈ లెక్కన 12 గం.ల కుట్టు విలువ, 6 రూ.లు అవుతుంది.

అంటే, 'ఈ కుట్టు శ్రమ' ద్వారా తయారైన సరుకుని పెట్టుబడిదారుడు అమ్మినప్పుడు, శ్రమ సాధనాల ఖర్చులన్నిటితో పాటు, ఈ 12 గం.ల కుట్టు శ్రమ కోసం, 6 రూ.లు వస్తాయన్నమాట! అంటే, ఈ ఉదాహరణలో, శ్రామికుడి శ్రమ విలువ— 6 రూ.లు.

ఇప్పుడు మనం చూడవలసిన 2 అంశాలూ 'డబ్బు' లోనే వున్నాయి కాబట్టి, అవి సమానంగా వున్నాయో లేదో చూడగలం.

శ్రామికుడు ఇచ్చిన శ్రమ విలువ — 6 రూ.లు.
అతనికి అందిన జీ తం విలువ — 3 రూ.లు.

అంటే, శ్రమ విలువా, జీతమూ, సమానంగా లేవు. శ్రమ విలువ కన్నా జీతం తక్కువగా వుంది. 2 అంశాలూ ఒకే రూపంలో వుండడం వల్లనే ఈ విషయం స్పష్టంగా కనపడుతోంది.

ఇప్పుడు, ఉదాహరణలోని 2 అంశాల్నీ 'కుట్టు శ్రమ' గానే చూద్దాం : శ్రామికుడు ఇచ్చింది 'కుట్టు శ్రమ'గానే వుంది. అది 12 గం.ల శ్రమ. పెట్టుబడిదారుడు ఇచ్చిన జీతం డబ్బుగా వుంది. ఇది 3 రూ.లు. ఈ డబ్బుని 'కుట్టు శ్రమ'గా మార్చాలి. 3 రూ.ల్ని 'కుట్టు శ్రమ'గా మారిస్తే, ఎన్ని గంటలు అవుతుంది? మనం పెట్టుకున్న ఉదాహరణ ప్రకారం, 1 రూపాయి, 2 గంటల కుట్టు శ్రమతో సమానం కాబట్టి, 3 రూ.లు, 6 గంటల కుట్టుతో సమానం.

2 అంశాల్నీ 'కుట్టు శ్రమ'గా చూస్తే :

శ్రామికుడు ఇచ్చింది — 12 గం.ల కుట్టు శ్రమ.
అతను తీసుకున్న జీతం — 6 గం.ల కుట్టు శ్రమ.

అంటే, అతను ఇచ్చిన శ్రమా, తీసుకున్న శ్రమా సమానంగా లేవు. 2 అంశాల్నీ ఒకే రూపంతో చూశాం కాబట్టి, ఈ విషయం స్పష్టంగా కనపడింది.

కానీ నిత్య జీవితంలో జరిగేది ఇలా వుండదు. అంటే, ఆ 2 అంశాలూ ఒకే రూపంలో వుండవు. శ్రామికుడు ఇచ్చేది తప్పనిసరిగా ఏదో ఒక 'ప్రత్యేక శ్రమ'గా వుంటే, అతనికి వచ్చే జీతం 'డబ్బు'గా వుంటుంది. 'డబ్బు'గా కాక పోతే, ఏదో ఒక ఉత్పత్తిగా వుంటుంది. ఇచ్చేదీ తీసుకునేదీ ఒకే రూపంలో వుండవు. కాబట్టి 'అవి సమానంగా లేవు' అనే సంగతి పైకి కనపడదు. పైగా, 'శ్రామికుడు చేసిన పనికి జీతం ఇస్తే సరిపోతుంది' అన్నట్టే పైకి కనపడుతుంది.

ఇందులో వున్న నిజా నిజాల్ని పెట్టుబడి దారుడూ శ్రామికుడూ గ్రహించలేక పోవచ్చు. కానీ ఆర్థిక వేత్త అయినవాడు దాన్ని గ్రహించాలి. కనీసం దాన్ని పరిశీలిం చాలి. విలువ గురించి ఎంతో కొంత అవగాహన వుండే ఆర్థిక వేత్తకి, ఈ విషయంలో కొన్ని సందేహాలైనా రావాలి. "శ్రామికుడు 12 గం.లు పనిచేస్తే పెట్టుబడిదారుడు 3 రూ.లు జీతంగా ఇచ్చాడు కదా? ఈ రెంటికీ సమానంగా సరిపోయినట్టేనా? అసలు, ఆ శ్రమకి, జీతంతో సంబంధం లేకుండానే ఎంతో కొంత విలువ వుంటుంది కదా? అది ఎంత? అది 3 రూ.లేనా? అది తక్కువో ఎక్కువో కాకుండా జీతంతోనే సమానంగా వుంటుందా?"– ఇలాంటి సందే హాలు తప్పని సరిగా రావాలి. కానీ ఏ ఆర్థికవేత్తకీ ఈ సందే హాలు వుండవు. ఆ మేధావి, ఏం చేస్తాడంటే, పెట్టుబడి దారుడి పనిస్తలంలో శ్రామికుడు పని చెయ్యడమూ, పెట్టుబడిదారుడు జీతం ఇవ్వడమూ — ఈ రెండూ చూస్తాడు. అంతే. దీన్నే గొప్ప 'ఆర్థిక సూత్రం'గా భావించి — "శ్రామికుడి పని విలువని జీతమే చెపుతుంది" అని జీతాన్ని చూసి ముగ్ధుడై పోతాడు. పని స్తలంలో తిరు గుతూ శ్రామికుల్ని పలకరిస్తూ —" వెంకయ్యా! నీ జీతం 3 రూ.లా? అయితే అదే నీ పని విలువ. శేషయ్యా! నీ జీతం ఎంత?.... 5 రూ.లా? అబ్బో! నీ పని విలువ ఎక్కువే. మీ జీతాల్ని చూసుకుంటే మీ కెంత రావాలో మీకు తెలిసి పోతుంది" అంటూ, ఆర్థిక శాస్త్ర జ్ఞానాన్ని శ్రామికులకు ఎంతో సరళంగా బోధిస్తున్నాననుకుంటూ గర్వ పడతాడు.

దీని సారాంశం ఏమిటంటే— 'జీతాన్నే శ్రమ విలువ'గా బోధించే ఏ ఆర్థికవేత్తకి అయినా 'విలువ' గురించి 'అ ఆ'లు కూడా తెలీవన్నమాట! జీతాన్నే శ్రమ విలువగా భావించే వాళ్ళకి దాని మీద ఇంకో ప్రశ్న వచ్చితీరాలి. 'జీతం అనేది శ్రమ విలువే అయితే మరి లాభం ఎక్కడి నించి వస్తుంది?'— అనే ప్రశ్నతో వాళ్ళు సతమతమై పోవాలి. కానీ అలా సతమతమయ్యే కష్టం వాళ్ళు పడరు. 'లాభం ఎక్కడి నించి రావడం ఏమిటి? పెట్టుబడికి లాభం రావద్దూ? కాబట్టి వస్తుంది! లాభం రావడం సహజం. దాంట్లో ఆలోచించే దేముంది?'— అంతే వాళ్ళ ధోరణి! అంటే, ఏ అంశం గురించీ వాళ్ళకి, పైకి కనపడే దాని కన్నా తెలిసిందేమీ లేదు.

శ్రమా, శ్రమ విలువా, డబ్బూ, జీతమూ, లాభమూ — ఇవన్నీ వేరు వేరు జ్ఞానాలు కావు. ఒకే జ్ఞానానికి వేరు వేరు కోణాలు. ఇందులో ఒక అంశం అర్థమైతే, మిగిలిన అంశాలు అర్థం కాకుండా వుండవు.

'జీతం' అర్థమై, 'లాభం' అర్థం కాకుండా వుండడమో; లాభం అర్థమై, శ్రమ విలువ అర్థం కాకుండా వుండడమో— ఇలా జరగదు. 'లాభం సహజమైనది' అనే దృష్టితో వున్న మనిషికీ, కార్మికుడి శ్రమ విలువ అంతా జీతంగా వెళ్ళడం లేదేమో, శ్రమ విలువ కన్నా జీతం తక్కువ విలువతో వుంటుందేమో — అనే ప్రశ్నలు రావడం సాధ్యం కాదు. 'లాభాన్ని' వదల దల్చుకోనప్పుడు, 'శ్రమ విలువ' మీదా, 'జీతం' మీదా, నిజంగానే సందేహాలు రావు. 'జీతమే శ్రమ విలువ' అనీ, కార్మికుడికి ఇవ్వవలసిందంతా ఇచ్చేస్తున్నామనీ అనుకోవడంతో, సమస్య తీరిపోయినట్టు వాళ్ళకి కనపడుతుంది.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, 'లాభ దృష్టి'ని వదలక పోవడం వల్ల, ఆర్థిక సూత్రాల్లో ఏ నిజాన్నీ సరిగా అర్థం చేసుకోలేక పోయారు. ప్రతీ చోటా తప్పు అవగాహనతో వున్నట్టే, 'జీతం' గురించి కూడా బ్రహ్మాండమైన తప్పు అవగాహన తోనే వుండిపోయారు.

# 'జీతం' కాదు, శ్రమ శక్తి విలువ !

పెట్టుబడిదారుడు — 'జీతం' అంటాడే, దాన్ని మనం 'శ్రమ శక్తి విలువ' అనే అనాలి. ఎందుకంటే, జీతం అంటే కార్మికుడు చేసిన శ్రమ కంతటికీ విలువ లాగా కనపడు తుంది. 'జీతం' అనే మాట 'శ్రమ విలువ' అనే అర్థాన్ని ఇస్తుంది. కానీ, 'శ్రమ శక్తి విలువ' అంటే — 'పెట్టుబడి దారుడు చెల్లిస్తున్నది శ్రమ విలువ కాదనీ, కనీసంగా బతికే విలువ మాత్రమేననీ' — స్పష్టంగా తెలుస్తుంది.

సాధారణ జీవితంలో వాడుకలో వుండే మాటల్నీ,

వాడుకలో వుండే అర్థాల్నీ ఎటువంటి విమర్శా లేకుండా యథాతథంగా తీసుకోకూడదు. అది, విషయాల్ని పై పైన చూసే పెట్టుబడిదారీ దృష్టి. దేనినీ కూడా 'పరిశీలన లేకుండా' తీసుకునే పని చెయ్యకూడదు. మన అవగాహన ప్రకారం అయితే, రోజువారీ జీవితంలో, లోక జ్ఞానపు స్థాయిలో వాడుకలో వుండే చాలా మాటలకు అర్థాలూ, కారణాలూ, ఫలితాలూ మారిపోతాయి. మనం, మన అవగాహనని స్పష్టపరిచే పేర్లే ఆ విషయాలకు పెట్టుకోవాలి. ఏ విషయానికి ఏ నిజమైన అర్థం వుంటుందో ఆ అర్థాన్నే ఆ పేరు చాటుతూ వుండాలి. అందులో ఎటువంటి ముసుగులకూ, మర్మాలకూ తావు వుండకూడదు. 'జీతం' అనేది ఒక మాయ మాట. అది 'శ్రమ విలువ' లాగ కనపడే మాట. కాబట్టి, జీతానికి మనం పెట్టే పేరు 'శ్రమ శక్తి విలువ'.

'జీతం' అంటే, 'శ్రమ శక్తి విలువే' కాబట్టి, శ్రమ శక్తి విలువకు సంబంధించిన విషయాలే 'జీతాల సూత్రాల'కు పునాదిగా వుంటాయి.

# వైరుధ్యం కాదా ?

కార్మికుడు పెట్టుబడిదారుడికి ఎక్కువ విలువ ఇస్తే, పెట్టుబడిదారుడు కార్మికుడికి తక్కువ విలువ ఇస్తాడు కదా? వాళ్ళ మధ్య మారకం ఎప్పుడూ ఇలా 'అసమానం' గానే జరుగుతూ వుంటుంది కదా? 'మారకం అనేది సమాన విలువల మధ్యనే జరుగుతుంది' అనే విలువ సూత్రం ప్రకారం, ఇది వైరుధ్యం కాదా? — అవును, ఇది తప్పనిసరిగా వైరుధ్యమే. అయితే, దీనికి కారణం 'విలువ సూత్రం'లో లోపం కాదు. సమాజ 'పునాది' లోనే వున్న లోపం ఇది. దాని ఫలితం ఇది.

కార్మికుడికీ, పెట్టుబడిదారుడికీ జరిగే మారకాన్ని చూసేముందు, వాళ్ళిద్దరూ ఎలాంటి 'సంబంధం'లో వున్నారో చూడడం ముఖ్యం. వాళ్ళిద్దరూ 'ఉత్పత్తి రంగం'లో వున్నారు కదా? అక్కడ, ఆ ఇద్దరూ, 'సమాన' పరిస్థితుల్లో గాక 'అసమాన' పరిస్థితుల్లో వుంటారు. అంటే, పెట్టుబడిదారుడు 'శ్రమ సాధనాలు గలవాడిగా' వుంటే, శ్రామికులు అవి లేని వారిగా వుంటారు. అంతేగాక, పెట్టుబడిదారుడు 'శ్రమ చెయ్యని వాడిగా' వుంటే, శ్రామికులు రెండు పక్షాలకూ కావలసిన శ్రమ చేసే వారిగా వుంటారు. ఈ రకంగా, ఆ ఇద్దరూ 'అసమాన సంబంధం'లో వుంటారు కాబట్టి, దీని ఫలితమే వారి మధ్య 'అసమాన మారకం'. వాళ్ళ మధ్య జరిగే మారకం సమాన విలువల మారకంగా వుండాలీ అంటే, కార్మికుడి నించి తీసుకున్న 'శ్రమ విలువ' అంతా పెట్టుబడిదారుడు కార్మికుడికి జీతంగా ఇచ్చెయ్యాలి. అలా ఇచ్చేస్తే, పెట్టుబడిదారుడేం తింటాడు? ఒక పక్క శ్రమ చెయ్యని మనిషీ, ఇంకో పక్క ఇద్దరి కోసమూ శ్రమ చేసే మనిషీ వున్నప్పుడు, ఆ పరిస్థితి ఆ ఇద్దరి మధ్యా 'అసమాన సంబంధాల్ని' సృష్టించి తీరుతుంది.

కార్మికుడు అదనపు శ్రమ చెయ్యవలసిన అవసరం లేకపోతే, అంటే పెట్టుబడిదారుడుకూడా శ్రమలోకి దిగి, తన కోసం తనే ఉత్పత్తి చేసుకుంటే, 'పెట్టుబడీ' వుండదు ; 'వేతన శ్రమా' వుండదు. ఆ ఇద్దరి మధ్యా యజమానీ శ్రామిక సంబంధమే వుండదు.

పెట్టుబడికీ, వేతన శ్రమకూ జరిగే అసమాన మారకం, ఆ ఇద్దరి మధ్యా వుండే 'ఉత్పత్తి సంబంధం'లోని అసమానత్వానికి బాహ్య రూపమే. ఉత్పత్తి సంబంధంలో అసమానత్వం మారితే గానీ, ఈ మారకంలో అసమానత్వం మారదు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాని కంతటికీ ప్రధానమైన వైరుధ్యం, పెట్టుబడిదారుడు శ్రమ చెయ్యకుండా, శ్రమని పొందడమే. అయితే ఈ వైరుధ్యం పెట్టుబడిదారుడితోనే ప్రారంభమైంది కాదు. అంత కన్నా పూర్వం నించీ వున్నదే.

ఒక మానవుడు, శ్రమ చెయ్యకుండా ఇంకో మానవుడి శ్రమని లాగడం అనేది 'బానిస సమాజం' నించీ కూడా ప్రారంభమైంది.

# యజమానులూ × శ్రామికులూ

ఒకప్పుడు 'దోపిడీ' అనేదే లేని కాలం ఒకటి వుండేది. ఆ ప్రాచీన కాలంలో మనుషులు 'తెగలు'గా ఏర్పడి జీవించేవారు. ఒక 'తెగ'లో వున్న అందరూ శ్రమ చేస్తారు. శ్రమ చెయ్యని వాళ్ళు అప్పుడు ఎవరూ వుండరు. కాబట్టి, 'శ్రమ దోపిడీ' అనేది అక్కడ ఇంకా లేదు.

వేరు వేరు తెగల మధ్య ప్రకృతి వనరుల కోసం కొట్లాటలు వుండేవి. తెగల మధ్య శతృత్వాలూ, యుద్ధాలూ వుండేవి. యుద్ధాల్లో ఓడిన శతృవుల్ని గెలిచిన వాళ్ళు చంపివేసేవారు. లేదా, తమ తెగలో చేర్చుకునేవారు.

క్రమంగా ఉత్పత్తి శక్తుల పెరుగుదల, మనిషి తన పోషణకు మించిన అదనాన్ని ఉత్పత్తి చెయ్యగల శక్తి ని ఇచ్చింది. ఈ పరిస్థితి, యుద్ధాల్లో దొరికిన శతృవుల్ని

'బానిసలు'గా మార్చడానికి అవకాశం ఇచ్చింది. బానిస, తన 'పోషణకు మించిన అదనాన్ని' ఉత్పత్తి చెయ్యగలడు. ఆ 'అదనాన్ని' యజమాని లాక్కోగలిగితే, ఆ యజమాని తన కోసం తను శ్రమ చెయ్యకుండానే జీవించగలడు.

'అందరూ శ్రమ చెయ్యడం' అనే ఒకప్పటి పరిస్థితి ఎలా మారిందంటే, 'కొందరే శ్రమ చెయ్యడం, కొందరు శ్రమ మానెయ్యడం' అనే పరిస్థితిగా మారింది. అంటే, 'శ్రమ దోపిడీ' ప్రారంభమైంది.

ఏ ప్రాంతంలోనూ కూడా (దాన్ని 'దేశం' అనవచ్చు, ఇంకేదైనా అనవచ్చు) దోపిడీ అనేది మొట్టమొదట పెట్టుబడిదారీ పద్ధతిలోనే ప్రారంభం కాలేదు. దాని కన్నా వెనకటి కాలం నించి కూడా దోపిడీ వుంది. ప్రాంతాల తేడాల్ని బట్టి, దోపిడీ పద్ధతుల్లో కూడా తేడాలు వుండవచ్చు. దోపిడీ అనేది మాత్రం సర్వత్రా దీర్ఘ కాలంగా వున్న వాస్తవం.

'యజమానుల' అధికారం కింద శ్రమ చేసేవారంతా శ్రామికులే. ఈ శ్రామికులు, చరిత్రలో బానిసలుగానూ, కౌలు రైతులుగానూ, కార్మికులుగానూ వున్నారు.

దోపిడీని అర్థం చేసుకోవడానికి కొన్ని జనరల్ లక్షణాల్ని క్లుప్తంగా ఇక్కడ చూస్తాము.

**బానిసలు** : ఒక 'బానిస సమాజాన్ని' ఊహిస్తే, ఆ సమాజంలో వున్న మొత్తం మనుషుల్లో కొందరు బానిసలూ, కొందరు వారి యజమానులూ. ఒక్కొక్క యజమానికీ అనేక మంది బానిసలు. భూమి అంతా యజమానుల స్వంత ఆస్తి. బానిసలు కూడా యజమానుల స్వంత ఆస్తే. బానిసల్ని, యజమానులు — అమ్మవచ్చు, కొనవచ్చు, చంపవచ్చు. బానిస ప్రాణాల మీద కూడా యజమానికే హక్కు.

ఒక యజమాని కుటుంబంలో ఎంత మంది బానిసలు వుంటారో ఆ బానిసలే ఆ కుటుంబానికి కావలసిన శ్రమలన్నీ చేస్తారు. యజమానులు ఏ శ్రమా చెయ్యరని వేరే చెప్పనక్కరలేదు.

బానిసలు, భూములు సాగు చేస్తారు. బట్టలు నేస్తారు. గనులు తవ్వుతారు. ఇంకా ఆ కాలానికి ఎన్ని పనులు చెయ్యడం తెలిసివుంటే, అన్ని పనులూ చేస్తారు. బానిసల శ్రమతో తయారయ్యే 'ఉత్పత్తుల రాసి'లోనించి 'శ్రమ సాధనాల' ఖర్చుని తీసి వేస్తే, మిగిలినదంతా బానిసల 'సజీవ శ్రమ' ఫలితమే. కానీ, అదంతా యజమాని కుటుంబానికే వెళ్తుంది. అయితే, యజమాని కుటుంబం, ఆ 'ఉత్పత్తి'లో నించి కొంత భాగాన్ని 'బానిసల పోషణ' కోసం ఖర్చు చేస్తుంది. మిగిలినదంతా యజమాని కుటుంబానికే. అంటే, బానిసల శ్రమ ఫలితం లో నించి— బానిసల పోషణకోసం ఖర్చయ్యే భాగాన్ని వారి 'శ్రమ శక్తి' కోసం ఖర్చయ్యే భాగంగానూ; మిగిలిన భాగాన్ని వారి 'అదనపు ఉత్పత్తి' గానూ విభజించవచ్చు. అంటే. బానిసలకు కూడా 'శ్రమ శక్తి విలువ' అందుతుంది. కానీ అది 'పోషణ పదార్థాల' రూపంలో అందుతుంది. (ఈ విషయాలు తర్వాత సందర్భాలలో ఇంకా కొంత వివరంగా చూస్తాము.) అప్పటికి ఇంకా 'జీతం' అనే మాట లేదు.

బానిస సమాజంలో— బానిసకూ యజమానికీ వున్న సంబంధం ఏమిటి? అది, దేనికి సంబంధించినది? అది 'శ్రమ'కు సంబంధించినది. ఆ ఇద్దరు మనుషులకూ వున్న సంబంధం — 'శ్రమ సంబంధం. లేదా, ఉత్పత్తి సంబంధం'. యజమాని — శ్రమ చెయ్యని దోపిడీ దారుడు. బానిస — ఆ ఇద్దరి కోసమూ శ్రమ చేస్తూ దోపిడీకి గురి అయ్యే శ్రామికుడు. యజమానులకు లాగే బానిసలకు కూడా వివాహాలూ, పిల్లలు పుట్టడాలూ వుంటాయి. ఆ పిల్లలు కూడా యజమాని ఆస్తే. అంటే బానిసలు, తమ సంతానాన్ని బానిసలుగా యజమానులకు అప్పగిస్తూ వుంటారు.

యజమానుల సంతతి కొత్త యజమానులుగా మారుతూ వుంటే, బానిసల సంతతి కొత్త బానిసలుగా మారుతూ వుంటారు. ఈ సమాజంలో బానిసలంతా ఒక వర్గం. యజమానులంతా ఇంకో వర్గం. 'బానిసల వర్గం' చేసే శ్రమతోనే 'యజమానుల వర్గం' కూడా జీవిస్తూ వుంటుంది. ఇది శత్రు వర్గాల సంబంధం. శత్రు వైరుధ్యం గల సంబంధం. శ్రమ దోపిడీకి ఇదే ప్రారంభ దశ.

**కౌలు రైతులు (అర్ధ బానిసలు)** : బానిస పోరాటాలే బానిసల్ని విముక్తి చేశాయి. కానీ ఈ 'విముక్తి' చాలా పరిమితమైనది. అది, బానిసల్ని 'అర్ధ బానిసలు'గా మాత్రమే చేసింది. అది ఒక విధంగా ఇంకా 'దాస్యమే' అయినా, ఒక విధంగా గత పరిస్థితుల నించి కొంత విముక్తి కూడా.

పాత కాలపు బానిస యజమాని, ఇప్పుడు 'భూస్వామ్య ప్రభువు' (ఫ్యూడల్ లార్డు). ఇప్పుడు కూడా 'భూమి' మీద ఆస్తి హక్కు ఈ ప్రభువుదే. అంటే, భూమి అంతా వీడిదే.

పాత కాలపు బానిసలు, ఇప్పుడు 'కౌలు రైతులు'. భూమి మీద వీరికి హక్కు వుండదు. కానీ భూమిని సాగు చెయ్యవలసింది మాత్రం వీరే.

ఈ కౌలు రైతులు, భూస్వాముల భూముల్ని సాగు కోసం తీసుకుని, భూస్వాములకు 'కౌలు' (భూమి అద్దె) చెల్లిస్తారు.

కౌలు రైతుల కుటుంబాలు చేసే శ్రమతోనే భూమి అంతా పండుతుంది. ఆ పంటలోనించి 'శ్రమ సాధనాల ఖర్చు'ని తీసివేస్తే, మిగిలిన పంట ఆ కుటుంబాల 'శ్రమ

విలువే'. అందులోనించే భూస్వామికి 'కౌలు' చెల్లించాలి. ఇంకా మిగిలినది — శ్రమ చేసిన రైతు కుటుంబాల పోషణకు వుంటుంది. రైతు కుటుంబాలు వాడుకో గలిగేది — వారి 'శ్రమ శక్తి విలువ'. దీనికి ఇంకా 'జీతం' అనే పేరు వుండదు. 'కౌలు'గా చెల్లించేది, రైతుల 'అదనపు విలువ'. పంట, పండినా, ఎండినా, ఈ కౌలుని చెల్లించి తీరాలి. ఈ రైతు కుటుంబాలలో, వ్యవసాయంతో పాటు, బట్టల నేతా, వడ్రంగమూ, చెప్పులు కుట్టడమూ వంటి పనులు కూడా జరుగుతూ వుండేవి. ఈ కాలంలో వ్యవసాయమూ, కొన్ని రకాల చేతి పనులూ కలిసి వుండేవి.

ఈ కౌలు కుటుంబం మనుషులు, 'భూమి యజమాని' కుటుంబానికి సేవకులుగా వుంటూ కౌలు చెల్లించడమే గాక, యజమాని కుటుంబానికి గృహ సంబంధమైన శ్రమలు కూడా ఉచితంగా చేస్తూ, ఎప్పటికప్పుడు రక రకాల బహుమతులు సమర్పించుకుంటూ, 'అర్ధ బానిసత్వం'లో పడివుండేవారు. "అర్ధ బానిసలు" అన్నా, "కౌలు రైతులు" అన్నా, "ఫ్యూడల్ రైతులు" అన్నా, ఒకటే. ( ఫ్యూడల్ అంటే 'భూమి సంబంధమైన' అని. )

ఈ 'ఫ్యూడల్' సమాజంలో, 'కౌలురైతుల వర్గం' చేసే శ్రమతోనే 'భూమి యజమానుల వర్గం' జీవిస్తూ వుంటుంది. ఇది కూడా శత్రు వర్గాల సంబంధమే. చరిత్రలో, బానిసల లాగే ఈ ఫ్యూడల్ రైతులు కూడా భయంకరమైన దోపిడీ పీడనలకు గురి అయ్యారు. బానిసల పోరాటాలలాగే, చరిత్రలో ఫ్యూడల్ రైతుల పోరాటాలు కూడా జరిగాయి.

**కార్మికులు** : 'జీతం పద్ధతి' మీద శ్రమ చేసే శ్రామికులే — కార్మికులు. కార్మికులకు 'జీతం'గా, యజమాని, 'డబ్బు' ఇస్తాడు. ఆ 'జీతాలతో కార్మికులు, జీవితావసర ఉత్పత్తులు' కొనుక్కుంటారు.

కార్మికుడు పెట్టుబడిదారుడికి, ఏం అమ్ముతాడు? తన 'శ్రమ శక్తి'ని అమ్ముతాడు. అంటే, కొంత సమయం కోసం తన 'దేహాన్ని' అమ్ముతాడు. తన దేహాన్ని అమ్ముకోవలసిన కార్మికుడికి మొదట ఆ దేహం మీద తనకే హక్కు వుండాలి. 'బానిస'గా వుండే మనిషి, తన 'శ్రమ శక్తి'ని అమ్మే 'స్వేచ్ఛ'తో వుండలేడు. కాబట్టి, శ్రమ శక్తిని అమ్మే శ్రామికుడు, ఎల్లకాలం ఒక యజమాని ఆధీనంలో వుండే బానిస కాకుండా వుండాలి. అలాగే, ఆ శ్రామికుడు, ఒక భూస్వామి భూమిని సాగుచేసి కౌలు చెల్లించవలసిన 'కౌలు రైతు' కాకుండా కూడా వుండాలి. కౌలు చెల్లించే బాధ్యతగల రైతు, తన కౌలు భూమిని సాగు చేసుకోవడంలోనే ప్రధానంగా నిమగ్నమై వుంటాడు. అలాంటి మనిషికి, 'జీతం' తీసుకుని ఇంకో యజమాని దగ్గిర పనిచెయ్యవలసిన అవసరమూ వుండదు, సమయమూ వుండదు. ఎప్పుడైనా అలా చేసినా, అది అతని ప్రధాన జీవనోపాధిగా వుండదు. కాబట్టి, 'జీతం'తో పని చెయ్యడమే ప్రధాన కర్తవ్యంగా గల కార్మికుడు ఉద్భవించాలంటే, అతను బానిస కాకుండానూ, కౌలు రైతు కాకుండానూ కూడా వుండాలి. ఈ రెండు మార్పులూ జరిగిన దాని ఫలితమే చరిత్ర క్రమంలో బానిసలూ, కౌలు రైతులూ, కార్మికులుగా తల ఎత్తడం.

గత కాలపు ఫ్యూడల్ కౌలు రైతే కార్మికుడి గా మారాడు కాబట్టి, గత కాలపు భూస్వామే 'పెట్టుబడిదారుడి'గా మారాడని అర్థమా? — కాదు. భూస్వామి అలా వుండగానే, 'పెట్టుబడిదారుడు' పుట్టుకొచ్చాడు. ( ఈ విషయం **2** వ సంపుటంలో, 'భూమి కౌలు' చాప్టరులో వివరంగా చూస్తాము. )

ఒక యజమాని దగ్గిరికి పోయి జీతం మీద పనిచేస్తూ తన శ్రమ నంతా ఇచ్చే కార్మికుడు, ఆ శ్రమని, తనకోసమే ఎందుకు చేసుకోడు? పెట్టుబడిదారుడి దగ్గిర తయారు చేసే సరుకుని తనే ఉత్పత్తి చేసి తనే ఎందుకు అమ్ముకోడు? గత చరిత్రలోలేని, జీతానికి పనిచేసే ఈ 'వేతన శ్రామికుడు', శ్రమ మార్కెట్లో ఎందుచేత ఉద్భవించాడు? — ఈ విషయాలు తెలుసుకోవడం గురించి పెట్టుబడిదారుడికేమీ ఆసక్తి వుండదు. తను ఎలా పుట్టుకొచ్చాడో తనకే తెలీదు గనక, కార్మికుడి ప్రారంభం గురించి కూడా వాడికి తెలీదు.

కార్మికుల వర్గమూ, పెట్టుబడిదారుల వర్గమూ ఏ దేశంలో ఎలా పుట్టుకు వచ్చాయో ఇక్కడ చూడగలిగే విషయం కాదు. కానీ, అన్ని దేశాల చరిత్రలకూ సంబంధించిన జనరల్ సూత్రం ఏమిటంటే : 'శ్రమ సాధనాల్ని' పోగొట్టుకున్న గత కాలపు కౌలు రైతులే కార్మికులుగా మారారు.

యజమానుల వర్గం వాళ్ళల్లో కొందరు భూస్వాములుగా వుండగా, కొందరు పెట్టుబడి దారులుగా మారారు. లేదా, ఒక యజమాని భూస్వామిగానూ పెట్టుబడిదారుడిగానూ కూడా వుండవచ్చు.

శ్రమ సాధనాల్లో ప్రధానమైంది — భూమి. ఆ భూమి ఏ నాడూ కౌలు రైతుల స్వంత ఆస్తి కాకపోయినా, అది ఒకప్పుడు ఆ రైతుల చేతుల్లోనే వుండేది. తర్వాత కాలంలో భూస్వామి, తన భూమిని, స్వయంగా శ్రమ చేసే 'కౌలు రైతుల' నించి వూడలాక్కుని, పెట్టుబడిదారుడికి కౌలుకి ఇచ్చే పద్ధతి ప్రారంభమైంది.

అయితే, భూమిని కౌలుకి తీసుకున్న పెట్టుబడి దారుడి కుటుంబం, ఆ భూమిలో స్వయంగా శ్రమ చెయ్యదు. భూమిని పోగొట్టుకున్న పాత కౌలు రైతులే 'వేతన శ్రామికులు'గా మారి, పెట్టుబడిదారుడి దగ్గిర 'కూలి' పద్ధతి

మీద భూమిని సాగుచేస్తారు. ఆ పంటలో నించి పెట్టుబడిదారుడే భూస్వామికి 'కౌలూ', శ్రామికులకు 'జీతాలూ' చెల్లించి, చివరికి తను 'లాభం' తీసుకుంటాడు.

'వేతన శ్రామికులు'గా మారిన తర్వాత కూడా కొందరు శ్రామికులకు కొంత స్వంత భూమి గానీ, చిన్న కౌలు భూమిగానీ, వుంటే వుండవచ్చు. వేతన శ్రామికుల్లో అందరికీ ఆ పరిస్థితి వుండదు.

శ్రమ చేసే మనిషి, 'బానిస'గా వున్నప్పుడూ, 'కౌలు రైతు'గా వున్నప్పుడూ కూడా, ఆ మనిషికి, ప్రధాన ఉత్పత్తి సాధనం అయిన భూమితో సహజమైన సంబంధం లేదు. గతంలో కూడా కౌలురైతుకి భూమి 'పరాయి ఆస్తే.' అయినా, అప్పుడు ఆ ఆస్తితో అతనికి వున్న సంబంధం చాలా దగ్గిర సంబంధం. జీతం తీసుకుని సాగుచేసే కార్మికుడిగా మారిన తర్వాత భూమితో వుండే సంబంధం చాలా దూరపు సంబంధం. శ్రామికుడికి భూమి ఎప్పుడూ పరాయి ఆస్తిగానే వున్నా, పెట్టుబడిదారీ విధానంలో కార్మికుడు భూమికి పూర్తిగా దూరం అయిపోతాడు.

మొత్తం మీద, చరిత్రలో పెట్టుబడిదారులూ, కార్మికులూ పుట్టుకొచ్చారు. 'జీతం పద్ధతి మీద శ్రమ శక్తిని అమ్మడం' పుట్టుకొచ్చింది.

'బానిస'— అన్నప్పుడు, 'బానిస తన శ్రమ అంతా యజమానికి ఉచితంగా ఇచ్చేస్తాడు' అన్నట్టు కనపడుతుంది.

'కౌలు రైతు' —అన్నప్పుడు, భూమి భూస్వామి స్వంతం అయినట్టూ, ఆ భూమి కోసమే రైతు కౌలు ఇస్తున్నట్టూ కనపడుతుంది.

కార్మికుడు— అన్నప్పుడు, కార్మికుడు, తన శ్రమ ఫలితాన్నంతా యజమాని నించి 'జీతం'గా తీసుకుంటున్నట్టు కనపడుతుంది.

కానీ, ఈ 3 అభిప్రాయాలూ తప్పే.

బానిస — తన శ్రమనంతా ఉచితంగా ఇవ్వడు. అందులోనించి తన 'శ్రమ శక్తి విలువ'ని తనే తీసుకుంటాడు. లేకపోతే బానిస జీవించి వుండడమే సాధ్యం కాదు. ఉచితంగా ఇచ్చేది — 'అదనపు ఉత్పత్తి'నే. దాన్ని ఇచ్చేది, 'బానిస' మీద 'యజమాని'కి వున్న 'హక్కు' కోసం! అది అబద్ధపు హక్కు. అది, శ్రమ దోపిడీ కోసం యజమానులు పెట్టుకున్న హక్కు.

కౌలు రైతు, భూస్వామికి 'కౌలు'ని ఇచ్చేది— 'భూమి' కోసం కాదు. భూమి, భూస్వామి స్వంతం కాదు. వాడు, భూమిని ఏ నాటి నించో దౌర్జన్యంగా ఆక్రమించి వున్నాడు కాబట్టి, కౌలుని చెల్లించేది — భూమి మీద భూస్వామికి వున్న 'హక్కు' కోసం. అదీ అబద్ధపు హక్కే. అదీ, శ్రమ దోపిడీయే.

కార్మికుడు, పెట్టుబడిదారుడి నించి తీసుకునే జీతం, శ్రమ కంతటికీ, బదులుగా వచ్చే విలువ కాదు. అది, 'శ్రమ శక్తి విలువ' మాత్రమే. కార్మికుడు ఇచ్చే అదనపు విలువ, 'పెట్టుబడి' మీదా, 'భూమి' మీదా, వాటి యజమానులకు వున్న హక్కుల కోసం. అవి అబద్ధపు హక్కులే. అంటే శ్రమ దోపిడీయే.

శ్రమ చేసే మనిషి — బానిస అయినా, కౌలురైతు అయినా, కార్మికుడు అయినా, తన మొత్తం శ్రమలో కొంత మాత్రమే తను పొంది, మిగిలిన దాన్ని యజమాని కోసం పోగొట్టుకుంటాడు. ఆ అర్థంతో చూస్తే, అన్ని సమాజాలలోనూ జీతం వున్నట్టే లెక్క. ఆ జీతం ఏ పద్ధతిలో వుందీ అన్నది ప్రధానమైన ప్రశ్న కాదు.

'శ్రమ చెయ్యని వర్గం' వున్న ఏ సమాజంలోనైనా ఆ వర్గాన్ని పోషించేది శ్రమ చేసే వర్గమే.

'దోపిడీ' వున్న బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారీ సమాజాలలో, 'అదనపు ఉత్పత్తి'ని లాగే పద్ధతులు ఒకే రకంగా లేవు. బానిస నించి అదనపు ఉత్పత్తిని గుంజే పద్ధతీ, కౌలు రైతునించి అదనపు ఉత్పత్తిని గుంజే పద్ధతీ, కార్మికుడి నించి అదనపు ఉత్పత్తిని గుంజే పద్ధతీ, తేడాగా వుంటాయి. మూడూ మూడు రకాలుగా వుంటాయి. ఈ తేడాలే, ఆ సమాజాలకు ప్రత్యేక లక్షణాలుగా వుంటాయి. ఈ తేడాలే సమాజాన్ని, 'ఇది బానిస సమాజం' అనీ, 'ఇది భూస్వామ్య సమాజం' అనీ, 'ఇది పెట్టుబడిదారీ సమాజం' అనీ వేరు వేరు దశలుగా వేరు వేరు పేర్లతో విభజిస్తాయి.

దోపిడీ సాగే బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారీ సమాజాలలో దేని చారిత్రక లక్షణాలు దానికి వున్నాయి. దేని చారిత్రక ముద్ర దానికి వుంది. ఏ సమాజంలోనైనా, దోపిడీదారుడే శ్రామికులకు యజమాని.

'సమాజ చరిత్ర'లో జరిగిన ఎలాంటి పరిణామాలు దోపిడీకి అవకాశం కలిగించాయి; ఎలాంటి పరిణామాలు సమాజ రూపాన్ని మారుస్తూ వస్తున్నాయి— అనే విషయాలు, దోపిడీచేసే మనిషికీ, దోపిడీకి గురి అయ్యే మనిషికీ కూడా తెలియవు.

సమాజంలో శ్రమ దోపిడీ జరుగుతోందనే విషయం నిన్నటి వరకూ ఏ పక్షానికీ తెలియదు. ఆ విషయం బైటపడి నప్పుడు గత చరిత్ర అంతా కొత్త అర్థంతో కనపడుతుంది. మనుషులు — యజమానులు గానూ, శ్రామికులుగానూ విడిపోయి వుండడాన్నే సహజ విషయంగా చూసే సమాజానికి, ఇప్పుడు అది సహజం కాదనే విషయం స్పష్టం అవుతుంది. ప్రకృతి — ఒక పక్క

యజమానుల్నీ, ఒక పక్క శ్రామికుల్నీ సృష్టించలేదు. ప్రకృతి — అందర్నీ ఒకే రకంగా, 'మానవులు'గా సృష్టించింది. 'మానవులు' అనే కోణంలో అందరూ సమానులే. కొందరే 'మానవులూ', కొందరు జంతువులూ కాదు. జీవశాస్త్ర రీత్యా అందరూ మానవులే. అంత వరకే ఈ విషయంతో ప్రకృతికి సంబంధం. మనుషుల్లో కొందరు 'బానిసలు'గా వుంటే, కొందరు 'యజమానులు'గా వుండడమూ ; కొందరు 'కౌలు రైతులు'గా వుంటే, కొందరు 'భూస్వాములు'గా వుండడమూ ; కొందరు 'కార్మికులు'గా వుంటే, కొందరు 'పెట్టుబడిదారులు'గా వుండడమూ — ఈ విషయాలన్నీ పూర్తిగా సమాజ పరిణామానికి సంబంధించి నవి. ఈ 'సామాజిక సంబంధాలు', చాలా స్పష్టంగా గతంలో జరిగిన ఎన్నో ఆర్థిక విప్లవాల ఫలితమే. ఇదంతా వెనకటి ఉత్పత్తి విధానాలలో కొన్ని అంశాలు విప్లవకరంగా మారుతూ వున్నదాని ఫలితమే.

మనం ఇక్కడ చూసిన 'బానిస' సమాజమూ, దాని తర్వాత 'ఫ్యూడల్' సమాజమూ, తర్వాత 'పెట్టుబడిదారీ' సమాజమూ — అనే దశలు, ప్రధానంగా ఐరోపా దేశాల చరిత్రకు సంబంధించినవి. ప్రపంచంలో ప్రతీ దేశ చరిత్రా ఇవే దశలతో నడిచినట్టుగా భావించకూడదు. కొన్ని దేశాల చరిత్రలో బానిస సమాజాలే వుండక పోవచ్చు. అక్కడ ఆదిమ తెగల సమాజం తర్వాత, వర్గ భేదాలు వేరే పద్ధతుల్లో కూడా ఏర్పడి వుండవచ్చు. 'వర్గాల చరిత్ర'ని ఏ దేశానికాదేశం ప్రత్యేకంగా పరిశీలించుకోవాలి. కార్మికవర్గం ఏ దేశంలో ఎలా ఏర్పడిందో ఏ దేశ కార్మికులు ఆ దేశ చరిత్రని బట్టి తెలుసుకోవాలి.

భూమి మీద వున్న వేరు వేరు ప్రాంతాలలో, వర్గాలు ఏర్పడడం ఏ ప్రత్యేక పద్ధతిలో జరిగినా, అందులో ఎన్ని తేడాలు వున్నా, దోపిడీ అనేది మాత్రం ప్రతీ చోటా నిస్సందేహంగా వుంది. దోపిడీయే లేకపోతే, 'ధనిక – పేద' తేడాలే ఏర్పడేవి కావు. 'దోపిడీ వుంది' అనడానికి, ఇదే ( ధనిక, పేద తేడాలే ) మొట్ట మొదటి బండ గుర్తు.

# 'జీతం' ఎవరి కోసం ?

కార్మికుడి పోషణకు అయ్యే ఖర్చు, కార్మికుడి స్వంత అవసరాల కోసం అయ్యే ఖర్చులాగ కనపడుతుంది. కానీ నిజానికి, ఇది కూడా 'పెట్టుబడిదారుడి'కోసం అయ్యే ఖర్చే. కార్మికుడు, కొన్ని వస్తువులు వాడి 'శ్రమ శక్తి'ని సంపాయించడం ఎందుకు? పెట్టుబడిదారుడికి శ్రమ చెయ్యడానికే. కార్మికుడు శ్రమ చెయ్యకపోతే, పెట్టుబడి దారుడికి 'అదనపు శ్రమ' వుండదు. కార్మికుడు ఉత్పత్తి చెయ్యకపోతే పెట్టుబడిదారుడే శ్రమలోకి దిగవలసి వస్తుంది. వాడు శ్రమ చెయ్యకుండా జీవించాలంటే, కార్మికుణ్ణి శ్రమ చేసే స్తితిలో వుంచాలి. ఈ అవసరం పెట్టుబడిదారుడికి చక్కగానే తెలుసు. యంత్రానికి ఆయిల్ వేసినట్టే, కార్మికుడికి తిండి పెట్టాలి. పెట్టుబడిదారుడు ఈ పని చేసేది, కార్మికుడికి ఆకలి తీరాలనే దృష్టితో కాదు. 'కార్మికుడు' అంటే, ఒక సజీవమైన మానవ దేహమనీ, ఆ దేహానికి సహజమైన అవసరాలు వుంటాయనీ, ఆ అవసరాలన్నీ తీరాలనీ ఆలోచించే దృష్టితో కాదు, కార్మికుడికి పోషణ ఖర్చులు ఇచ్చేది, యజమాని శ్రమ చెయ్యకుండా అన్ని వస్తువులూ ఉత్పత్తి చేసి ఇచ్చే మనిషి కావాలి కాబట్టే.

కార్మికుడి ఇల్లూ వాకిలీ పెట్టుబడిదారుడి 'పనిస్తలం' నించి విడిగా వున్నట్టే, కార్మికుడి జీవితం అంతా పెట్టుబడిదారుడి జీవితం నించి స్వతంత్రంగా వున్నట్టు కనపడుతుంది. కానీ కార్మికుడి జీవితం, పెట్టుబడిదారుడి దాస్యంతో సంబంధం లేకుండా వున్న నిజమైన స్వతంత్ర జీవితం కాదు. తిండి తినేటప్పుడు కార్మికుడి శరీరం ఆనంద పడ్డా, అది కార్మికుడు స్వేచ్ఛతో పొందే ఆనందం కాదు. బరువులు మోసే జంతువు కూడా మేత మేస్తూ ఆనంద పడుతుంది. పని వత్తిడి కాలాల్లో పశువుకి దాణా ఎక్కువ చేస్తారు. ఆ ఆహారం అంతా పశువు పొట్టలోకే వెళ్ళినా, అది పశువు కోసం కాదు. అది పశువు కోసమే అయితే దానికి ఎప్పుడూ అలాంటి మేతే పెట్టాలి. రోజూ పెట్టని మేతని పని కాలాల్లో మాత్రమే పెడతారు. అంటే, అది పశువు యజమాని అవసరం కోసమేగానీ పశువు అవసరం కోసం కాదు. అలాగే, కార్మికుడి జీతం ఖర్చు, పెట్టుబడిదారుడి అవసరం కోసమే గానీ కార్మికుడి జీవితం కోసం కాదు.

శ్రామికుల 'శ్రమ' అంతా, యజమానుల 'విశ్రాంతి' కోసం! శ్రామికుల 'కష్టం' అంతా, యజమానుల 'సౌఖ్యం' కోసం! శ్రామికుల 'దరిద్రం' అంతా, యజమానుల 'సంపద' కోసం! శ్రామికుల జీవితమే మొత్తంగా, యజమానుల జీవితం కోసం! 'దోపిడీ సమాజం'లో, శ్రామికులకు 'స్వంత జీవితం' అనేది ఏదీ వుండదు.

# 'శ్రమ శక్తి'ని కొంటే తప్పేమిటి?

ఎవరైనా ఏ 'సరుకు'ని కొంటే, ఆ 'సరుకు విలువ'నే చెల్లిస్తారు కదా? ఒక సరుకుని కొన్న తర్వాత, దాని 'ఉపయోగపు విలువ'ని పొందడానికి ఆ సరుకుని కొన్న వ్యక్తికి పూర్తిగా హక్కు వుంటుంది కదా?

పెట్టుబడిదారుడు కార్మికులతో ఇలా అంటాడు — "నేను మీ 'శ్రమ శక్తి'నే కొంటున్నానని మీ రంటున్నారు. 'కనీసపు జీవితావసర వస్తువులే — శ్రమ శక్తి విలువ' అని కూడా మీరంటున్నారు. నేను కొన్న సరుకు విలువని నేను చెల్లించేస్తున్నాను. నేను కొన్న సరుకుని నేను వాడు కుంటున్నాను. ఎవరు కొన్న సరుకుని వాళ్ళు వాడుకోరూ? మీరు ఒక చొక్కా కొంటే, దాని ఉపయోగపు విలువంతా ఆఖరయ్యేదాకా, అది చిరిగి ముక్కలయ్యేదాకా, దాన్ని మీరు వాడుకోరూ? అలాగే, నేను కొన్న సరుకుని నేనూ వాడుకుంటాను. 'శ్రమ శక్తి'ని కొన్నాను కాబట్టి, అది ఎంత 'శ్రమ'ని ఇవ్వగలిగితే అంత శ్రమనీ తీసుకుంటాను. ఇందులో తప్పేముంది?"— పెట్టుబడిదారుడు, ఇలా అంటే, అప్పుడు కార్మికుల జవాబేమిటి?

'శ్రమ శక్తి'కీ, ఇతర సరుకులకూ, పోలికే లేదు. ఇతర సరుకులన్నీ నిర్జీవమైనవి. శ్రమ శక్తి, సజీవమైనది. 'శ్రమ శక్తి'ని కొనడం అంటే కొన్ని గంటలపాటు ఒక 'సజీవ మానవ దేహాన్ని' కొనడం. నిర్జీవ వస్తువులకు వర్తించే సూత్రాలేవీ సజీవ దేహానికి యధాతథంగా వర్తించవు. నిర్జీవ వస్తువుని అరిగి ముక్కలయ్యేదాకా వాడినట్టు, మానవ దేహాన్ని పీల్చి పిప్పి చేస్తూ వాడడానికి ప్రకృతి సహజ సూత్రాలు ఒప్పవు. మానవ దేహానికి విలువ కట్టి దాన్ని ఒక సరుకుగా శాశ్వతంగా కొన్నా, కొన్ని గంటల కోసమే కొన్నా, మనిషిని కొనడం, అమ్మడం — అనే విషయమే పూర్తిగా అసహజమైనది. ప్రకృతి విరుద్ధమైనది.

ఒక మనిషి, ఇంకో మనిషిని బానిసగా చెయ్యడం ఎలాంటి తప్పో, కార్మికుడిగా చెయ్యడం కూడా అలాంటి తప్పే. ఏ మనిషికీ కూడా ఇంకో మనిషి మీద 'యజమానిగా ఉండడానికి' నైతికంగా హక్కు ఉండదు. మన పెట్టుబడిదారుడు — "నేను కార్మికుడికి శ్రమ శక్తి విలువని చెల్లించేస్తున్నాను కదా? ఇంకా నా తప్పేమిటి?" అంటు న్నాడే; కానీ, ఆ 'శ్రమశక్తి విలువ'ని నిర్ణయించేది ఎవరు? — ఆ పెట్టుబడిదారుడే! అంటే దోపిడీదారుడే!

'శ్రమ శక్తి విలువ అంటే కనీస పోషణ వస్తువులు' — అంటున్నామంటే దాని అర్థం, దాన్ని యజమాని అలా నిర్ణయిస్తాడని చెప్పడమే గానీ, అది శ్రామికుల నిర్ణయం — అని చెప్పడం కాదు.

ఒక శ్రామికుడు తన 'సజీవ శ్రమ' భాగంగా 10 వస్తువులు ఉత్పత్తి చేశాడనుకుందాం. అప్పుడు అతనితో మనం ఇలా అన్నట్టు ఊహిద్దాం — "నీ శ్రమ విలువ 10 వస్తువులు. అందులోనించి ఎన్ని వస్తువులు నీకు జీతంగా రావాలని అనుకుంటావు? నువ్వు ఎన్ని వస్తువుల్ని నీ 'శ్రమ శక్తి విలువ'గా నిర్ణయించుకుంటావు? పెట్టుబడిదారుడు నీకు జీతంగా 3 వస్తువులు ఇవ్వాలను కుంటున్నాడు. ఏమంటావు?" అని అడిగా మనుకుందాం.

అప్పుడు శ్రామికుడేం చెపుతాడు? అతను మొదట ఆశ్చర్యపోతాడు — "నా శ్రమ విలువ 10 వస్తువులైతే, అందులోనించి నేను ఎంత తీసుకోవాలనే ప్రశ్న ఏమిటి? నా శ్రమ అంతా నాదే కదా? ఆ 10 వస్తువులూ నావే. నా 'శ్రమ శక్తి విలువ' 3 వస్తువులుగానే ఎందుకు వుండాలి? మిగిలిన 7 వస్తువుల్నీ నేను యజమానికి ఎందుకు ఇవ్వాలి? ఆ మనిషి తన శ్రమతో తను జీవించాలిగానీ నా శ్రమని ఎలా తీసుకుంటాడు? నా 10 వస్తువుల్నీ నేనే వాడుకుంటే, నా అవసరాలన్నీ సంతృప్తికరంగా తీరతాయి. అప్పుడు నేను దరిద్రం లేకుండా సుఖంగా వుంటాను. ఇన్ని మాట లెందుకు? నా శ్రమ అంతా నాదే. నా శ్రమ కన్నా నాకు ఎక్కువా అక్కరలేదు, తక్కువా అక్కరలేదు. నా శ్రమ విలువే, నా శ్రమ శక్తి విలువ. రెండూ ఒకటే." అంటాడు.

అంటే, ఎవరి శ్రమ విలువ వాళ్ళకే అందితే, అప్పుడు 'శ్రమ శక్తి విలువ' అనేది యజమాని నిర్ణయించినట్టుగా వుండదు. (అప్పుడు, యజమానే వుండడు) శ్రామికులు వారి శ్రమ శక్తి విలువని వారే నిర్ణయించుకోవాలంటే, యజమాని నిర్ణయించినట్టు నిర్ణయించుకోరు. "మాకు గంజే చాలు. గోచే చాలు. గుడిసే చాలు. మా 'శ్రమ శక్తి విలువ' ఇలాగే వుండాలి. మిగిలిన శ్రమనంతా సంతోషంగా యజమానికి అప్పజెప్పేస్తాం. అదంతా మా కెందుకూ?" అనరు. "మా శ్రమ విలువ అంతా మాదే" అంటారు.

కాబట్టి, 'కనీస పోషణావసరాలే శ్రమ శక్తి విలువ' అనే సూత్రం, యజమాని సూత్రమే గానీ శ్రామికుల సూత్రం కాదు. యజమాని నిర్ణయించే శ్రమ శక్తి విలువ, శ్రామికుల సహజ అవసరాల్ని సంతృప్తికరంగా తీర్చదు. అది వారిని నిత్య దరిద్రంలోనే ఉంచుతుంది.

ఒక మనిషి అవసరాలు, సహజంగా తీరాలంటే — మొదట ఆ మనిషికి ఆరోగ్యంగా జీవించడానికి కావలసిన ఆహారం వుండాలి. గాలీ, వెలుతురూ గల విశాలమైన నివాసం వుండాలి. శీతోష్ణ స్థితులనించి రక్షించే కొన్ని రకాల దుస్తులు వుండాలి. ప్రతీ దినమూ పని తర్వాత విశ్రాంతిగా

గడిపే అవకాశం వుండాలి. మేధాపరంగా అభివృద్ధి చెందడానికి కావలసిన విద్యా, సాంస్కృతిక జీవితమూ వుండాలి. 'శ్రమ'ని భారంగా గాక, ఆనందంగా చేసే పరిస్తితులు వుండాలి. మానసికానందానికి కావలసిన 'కళాత్మక' జీవితం వుండాలి. ఇవన్నీ ఒక మానవ దేహానికి చాలా సహజమైన అవసరాలు.

కానీ, దోపిడీదారుల దృష్టిలో, శ్రామికుడి కోసం ఈ అవసరాలేవీ వుండవు. వాడి దృష్టిలో వుండేది 'శ్రమ శక్తి'ని ఇవ్వడానికి కావలసిన 'కనీస' అవసరాలే. శ్రామికుడి అవసరాల్ని ఇంత కనీస స్థాయిలో నిర్ణయించి, ఆ కనీస విలువనే ఇచ్చి, "శ్రమ శక్తి విలువ అంటే కనీసావసరాలేగా? ఆ విలువని ఇచ్చేస్తున్నాగా? ఇంకా నా తప్పేముంది?" అంటున్నాడు పెట్టుబడిదారుడు.

ఆ తప్పేమిటంటే —ఒక మనిషి, తను 'యజమాని'గా మారి, ఇతర మనుషుల్ని 'సేవకులు'గా చెయ్యడం— మొదటి తప్పు. ఆ సేవకులకు ఇవ్వవలసిన దాన్నంతా ఇచ్చేస్తున్నట్టుగా భావించడం రెండో తప్పు. — తప్పుల్ని ఇలా లెక్కపెడుతూ పోతే, ఈ జాబితా అనంతంగా వుంటుంది. అన్ని తప్పులకూ మూలం —మొదటి తప్పే.

ఒక వేళ, పెట్టుబడిదారుడు, శ్రామికులకు జీతంగా, 'శ్రమ శక్తి విలువ' కన్నా, ఇంకా కొంత ఎక్కువ విలువని ఇచ్చినా, సమస్య తీరదు. ఎందుకంటే, అప్పటికీ ఇంకా కొంత అదనపు శ్రమ పెట్టుబడిదారుడికి పోతూనే వుంటుంది కాబట్టి.

జీతాల్ని పెట్టుబడిదారుడు నిర్ణయిస్తున్నాడు కదా? అలాగాక, జీతాల్ని శ్రామికులే నిర్ణయించుకుంటే? శ్రామికులు అడిగినంత జీతం ఇచ్చేసి, దాని మీదే లాభం వేసుకుంటే? అప్పుడేమవుతుంది? ఆ లాభం కూడా సరుకు విలువలో భాగమే అవుతుంది. సమస్య ఎప్పటిలాగే వుంటుంది. ఆ ఎక్కువగా వేసుకున్నది శ్రామికుల అదనపు విలువే అవుతుంది.

జీతాల్ని ఎవరు నిర్ణయిస్తారనేది ప్రశ్న కాదు. నిర్ణయించేది శ్రామికులే అయినా, 'జీతం' అనేది వుంటే, దాని పక్కనే 'లాభం' అనేది కూడా వుంటుంది. అసలు సమస్య ఆ సంబంధంలోనే వుంది.

దీనికి సహజమైన పరిష్కారం— ఒక్కటే. శ్రమ శక్తి అమ్మకమే రద్దు కావడం. 'శ్రమ శక్తి అమ్మకం' రద్దయినప్పుడు 'శ్రమ శక్తి' అవసరాలకు పెట్టుబడి దారుడు పెట్టే కనీస హద్దులన్నీ రద్దవుతాయి. అప్పుడు, జీతమూ, అదనపు విలువా కలిసిపోతాయి. అదనపు విలువ, జీతంలో కలిసి పోవడం అంటే, పెట్టుబడిదారుడు కార్మికులతో కలిసిపోవడమే. అంటే దోపిడీ దొంగల ముఠా, శ్రమలోకి దిగడమే. అదే సమస్యకి పరిష్కారం!

ఈ విషయాలన్నీ అర్థం చేసుకున్నప్పుడు, "శ్రమ శక్తిని కొంటే తప్పేమిటి?" అని అడిగే పెట్టుబడిదారుడికి కార్మికులు ఇలా జవాబు చెపుతారు! — "దోపిడీ 'పునాది' మీద నిలబడి నువ్వు మా 'శ్రమ శక్తులు' కొంటున్నావు. ఈ పునాది పరిస్థితినే మేము రద్దు చేస్తాం! శ్రమ శక్తి విలువకి నువ్వు నిర్ణయించిన హద్దులన్నిటినీ రద్దు చేస్తాం! నీ దోపిడీ ఉత్పత్తి సంబంధాల్ని రద్దుచేస్తాం! నీ దాస్యం నించి మమ్మల్ని మేము విముక్తి చేసుకుంటూ, నిన్ను కూడా నీ సోమరిపోతు తనం నించీ, నీ అసహజత్వం నించీ, నీ అమానుషత్వం నించీ, విముక్తి చేస్తాం! శ్రమ శక్తిని కొంటే తప్పేమిటో నీ వికృతమైన ఆలోచనకి బోధపడేలాగ చేస్తాం!" అంటారు.

కానీ, కార్మికులు ఈ జవాబు ఎప్పుడు చెప్పగలరు? 'దోపిడీ' గురించి పూర్తిగా తెలిసినప్పుడే! కార్మికులకు, 'దోపిడీ' గురించి ఎంత తెలియాలో అంత తెలియనంత కాలమూ, "శ్రమ శక్తిని కొంటే తప్పేమిటి? జీతం ఇస్తున్నాగా?" అని వాదించే పెట్టుబడిదారుడికి జవాబు చెప్పలేని పరిస్తితిలోనూ, ఆ జవాబుని తెలుసుకోలేని పరిస్తితిలోనూ వుండిపోతారు.

## పెట్టుబడిదారుడికీ, కార్మికులకూ మధ్య అసలు 'మారకమే' లేదు !

కార్మికుడు, పెట్టుబడిదారుడికి, తన 'శ్రమ శక్తి'ని అమ్ముతున్నాడనీ; పెట్టుబడిదారుడు, దాన్ని 'జీతం' ఇచ్చి కొంటున్నాడనీ; ఈ రకంగా, ఆ ఇద్దరి మధ్యా 'మారకం' జరుగుతోందనీ —అనుకున్నాం కదా? కానీ, నిజానికి ఆ ఇద్దరి మధ్యా అలాంటి అమ్మడమూ, కొనడమూ లేనే లేవు. వాళ్ళిద్దరి మధ్యా అసలు 'మారకం' అనేదే లేదు. ఇంతవరకూ చూసిన విషయాల్ని సరిగా గ్రహించి వుంటే, ఈ విషయం ఈ పాటికే అర్థమైపోయి వుండాలి.

కార్మికుడు 12 రూ.ల విలువగల శ్రమ చేశాడనీ, దాని కోసం పెట్టుబడిదారుడు 6 రూ.ల జీతం ఇచ్చాడనీ అనుకుందాం. పెట్టుబడిదారుడు, ఆ జీతాన్ని ఎక్కడి నించి తెచ్చి ఇస్తాడు?

కార్మికుడి 'శ్రమ'లో భాగమే — ఆ 'జీతం'.

12 లోనించి తీసినదే ఆ 6-జీతం.

కార్మికుడు సరుకుని తయారు చేస్తాడు. దాన్ని పెట్టుబడిదారుడు స్వాధీనం చేసుకుంటాడు. తర్వాత దాని అమ్మకం జరుగుతుంది. కార్మికుడి శ్రమ విలువ అయిన 12 రూ.లు, మొదట పెట్టుబడిదారుడి జేబులోకి వెళ్తాయి. అందులోనించే వాడు 6 ని తీసి కార్మికుడి చేతిలో పెట్టి, "జీతం ఇదుగో, సరిపోయిందా?" అంటాడు.

"సరిపోయింది."

"సరే, రేపు రా."

'రేపు' కూడా జరిగేది ఇదే. కార్మికుడు రేపు మళ్ళీ '12 విలువ'ని ఉత్పత్తి చేస్తాడు. అది మళ్ళీ మొదట పెట్టుబడిదారుడి జేబులోకి వెళ్తుంది. అందులోనించే 6 ని తీసి — "ఇదుగో, నీ జీతం, చూసుకో. ఇవ్వాళ కూడా సరిపోయిందా? రేపు రా."

రోజూ జరిగేది ఇదే!

ఇందులో, పెట్టుబడిదారుడు ఇచ్చేది ఏముంది? 'జీతం' అంటే, కార్మికుడి శ్రమలోంచి తీసి కార్మికుడికి ఇవ్వడమే.

అయితే, ఈ ఇవ్వడం ఎలా జరుగుతుందంటే : ఏ రోజు జీతం, ఆ రోజు శ్రమలోనించే రాదు. కార్మికులు ఒక వారం అంతా పనిచేస్తారు. ఆ సరుకుని పెట్టుబడిదారుడు ఇంకా అమ్మడనుకుందాం. అయినా జీతాలు ఇస్తాడు. ఎలా ఇస్తాడంటే, కిందటి వారపు సరుకుని అమ్మగా వచ్చిన విలువలోనించి ఇస్తాడు. కార్మికులు కిందటి వారం ఇచ్చిన శ్రమ, ఇప్పటికి 'డబ్బు'గా అంది వుంటుంది. అందులో నించి తీసి ఈ వారపు జీతం ఇస్తాడు. అలాగే, ఈ వారపు శ్రమలోనించి తీసి రేపు వారపు జీతం ఇస్తాడు.

కార్మికులు పనిలో జేరిన దినం నించీ జరిగేది ఇదే. కార్మికులు కొన్నాళ్ళు పనిచేసిన తర్వాతే మొదటి జీతం వస్తుంది. వాళ్ళు ఇచ్చిన శ్రమ విలువలో భాగమే అది. మళ్ళీ కొన్నాళ్ళు పని చేసిన తర్వాత రెండో జీతం వస్తుంది. ఎప్పుడూ ఇలాగే జరుగుతూ వుంటుంది.

కానీ, ఇది పైకి ఎలా కనపడుతుందంటే — ఈ జీతాన్ని పెట్టుబడిదారుడే ఇస్తున్నట్టుగా కనపడుతుంది. ఎందు కంటే, జీతాలు ఇచ్చే సమయానికి, కార్మికులు ఉత్పత్తి చేసిన 'కొత్త సరుకు' ఇంకా అక్కడే వుంటుంది. ఇంకా అమ్ముడవకుండానే వుంటుంది. జీతం డబ్బుని పెట్టుబడి దారుడు తన జేబులో నించి తీసి ఇస్తాడు. కాబట్టి, పెట్టుబడిదారుడు తన డబ్బునే జీతాలుగా ఇస్తున్నట్టు కనపడుతుంది. అంటే, కార్మికులు పెట్టుబడి దారుడికి తమ పనిని అమ్మినట్టూ, పెట్టుబడి దారుడు, ఆ పనికోసం తన డబ్బుని చెల్లించినట్టూ ! పెట్టుబడిదారుడి డబ్బుకీ, కార్మికుల శ్రమకీ 'మారకం' జరుగుతున్నట్టు!

కానీ, అసలు జరిగేది ఏమిటో సరిగా అర్థమైతే, ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పుకో గలగాలి. (1) కార్మికులకు జీతాలుగా ఇచ్చే డబ్బు ఎక్కడిది? (2) ఈ మొత్తం వ్యవహారంలో, పెట్టుబడిదారుడి వేపు నించి వుండే 'సరుకు' ఏది? లేదా, పెట్టుబడిదారుడు చేసే 'శ్రమ' ఏది?

ఈ జవాబులు చూసేముందు, 'మారకాలు' ఎన్ని రకాలుగా వుంటాయో, ఒకసారి క్లుప్తంగా చూద్దాం.

అసలు, మారకాలు 3 పద్ధతుల్లో జరుగుతాయి.

**(1)** 'వస్తువు'ని ఇచ్చి వస్తువుని తీసుకోవడం: స్వయంగా శ్రమ చేసి ధాన్యం పండించే ఒక రైతు, స్వయంగా శ్రమచేసే నేత మనిషికి, తన ధాన్యం ఇచ్చి, ఒక దుప్పటి తీసుకోవచ్చు. అలా జరిగితే ఇద్దరి శ్రమలకూ మారకం జరిగినట్టు అర్థం. లేదా, ఆ రైతు, తన ధాన్యాన్ని ఇంకెక్కడైనా అమ్ముకుని, ఆ డబ్బుతో నేత మనిషి దగ్గర దుప్పటి కొన్నాడను కుందాం. రైతు చేతిలోకి వచ్చిన డబ్బు అతని స్వంత శ్రమదే కాబట్టి, ఆ డబ్బుతో దుప్పటి కొంటే, అప్పుడు కూడా రైతు శ్రమకీ, నేతమనిషి శ్రమకీ మారకం జరిగినట్టే. ఈ రైతూ, ఈ నేత మనిషీ, తమ ఉత్పత్తుల్ని డైరెక్టుగా బార్టరు పద్ధతిలో మార్చుకున్నా, ఒకరి ఉత్పత్తిని ఒకరు డబ్బు ఇచ్చి కొనుక్కున్నా, ఆ మారకం ఏ పద్ధతిలో జరిగినా, వాళ్ళ 'శ్రమలకు' మారకం జరిగినట్టే అర్థం.

**(2)** 'వస్తువు'ని ఇచ్చి, 'పని'ని తీసుకోవడం : ఒక రైతు, ఒక వైద్యుడితో వైద్యం చేయించుకుని, కొంత ధాన్యం ఇవ్వవచ్చు. లేదా, ధాన్యం ఇంకెక్కడో అమ్మి, ఆ డబ్బు వైద్యుడికి ఇవ్వవచ్చు. లేదా వైద్యుడు, ఇంకెక్కడో వైద్యం చేసి సంపాదించిన డబ్బుతో, రైతు దగ్గర ధాన్యం కొనవచ్చు. లేదా రైతుకే వైద్యం చేసి ధాన్యం తీసుకోవచ్చు. ఇందులో ఏది జరిగినా, ఎవరి వేపు నించి జరిగినా, ఆ మారకం ఇద్దరి శ్రమలకూ జరిగినట్టే.

**(3)** 'పని'ని ఇచ్చి, 'పని'ని తీసుకోవడం : ఒక టీచరు, ఒక వైద్యుడితో వైద్యం చేయించుకుని, డబ్బు ఇవ్వవచ్చు. లేదా, వైద్యుడి పిల్లలకు చదువు చెప్పవచ్చు. లేదా, వైద్యుడు ఒక మనిషితో తన బండి తోలించుకుని, డబ్బు ఇవ్వవచ్చు. లేదా, అతని కుటుంబానికి వైద్యం చెయ్య వచ్చు. ఇందులో ఏది జరిగినా, ఇద్దరి శ్రమలకూ మారకం జరిగినట్టే. — మారకాలు ఇన్ని రకాలుగా జరగవచ్చు.

అయితే, పెట్టుబడిదారుడికీ, కార్మికుడికీ జరిగే మారకం, వీటిలో ఏ కోవలోకి వస్తుంది? ఏ కోవలోకీ రాదు. పెట్టుబడిదారుడు స్వయంగా ఏ వస్తువులూ ఉత్పత్తి చెయ్యడు. లేదా, వైద్యం చెయ్యడమూ, బండి తోలడమూ

లాంటి ఏ పనులూ చెయ్యడు. అసలు వాడి శ్రమ అనేది ఏదీ వుండదు.

పెట్టుబడిదారుడు, కార్మికులతో 'బట్ట'ని తయారు చేయించి అమ్మకానికి పెట్టాడనుకుందాం. ఒక రైతు, తన ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బుతో ఆ పెట్టుబడిదారుడి దగ్గిర, కొంత బట్ట కొన్నాడనుకుందాం. ఆ మారకం జరిగింది ఎవరెవరి శ్రమల మధ్య? రైతు శ్రమకీ, పెట్టుబడిదారుడి శ్రమకీ మధ్యా? —కాదు. బట్టలో పెట్టుబడిదారుడి శ్రమ ఏదీ లేదు. బట్టలో వుండే శ్రమ సాధనాల శ్రమ అయినా పెట్టుబడిదారుడిది కాదు. ఆ శ్రమ అంతా కార్మికులదే. పత్తి పండించిన శ్రమా, దారం వడికిన శ్రమా, బట్ట నేసిన శ్రమా, ఇంకా ఆ రకం శ్రమలన్నీ కలిసి బట్ట తయారైతే, దాంతో రైతు మారకం చేసుకున్నాడు. రైతు శ్రమకీ, కార్మికుల శ్రమకీ మారకం జరిగింది గానీ, ఆ మారకం రైతు శ్రమకీ, పెట్టుబడిదారుడి శ్రమకీ జరిగింది కాదు.

పెట్టుబడిదారుడు, కార్మికుల జీతాల్ని డబ్బులో గాక, జీవితావసర వస్తువుల రూపంలోనే ఇచ్చినా, ఆ వస్తువులు కూడా పెట్టుబడిదారుడి శ్రమ కాదు. అవి ఇతర కార్మికులు గానీ, ఈ కార్మికులే గానీ, ఉత్పత్తి చేసిన వస్తువులుగా వుంటాయి.

ప్రతీ కార్మికుడూ ఏదో ఒక శ్రమ చేస్తూ వున్నట్టుగా పెట్టుబడిదారుడు చేస్తోన్న శ్రమ ఏది? పెట్టుబడిదారుడు కార్మికులతో మారకం చేసుకునే సరుకు ఏది?— ఏదీ లేదు. పెట్టుబడిదారుడికీ, కార్మికుడికీ జరిగే మారకంలో పెట్టుబడిదారుడి వేపునించి వస్తువూ లేదు, పనీ లేదు. అంటే ఆ మారకంలో 2 వస్తువులు గానీ, 2 పనులు గానీ లేవు. ఉన్నది ఒకటే వస్తువు. కార్మికులు తయారు చేసే వస్తువు. ఉన్నది ఒకటే పని. కార్మికులు చేసే పని. ఆ 'పని'లో నించే, లేదా ఆ 'వస్తువు'లోనించే, కొంత భాగం —'జీతం'. <u>అంటే కార్మికుల 'శ్రమలో కొంత ముక్కే' కార్మికులకు 'జీతం'.</u>

కార్మికుడు చేసిన 12 శ్రమకి బదులుగా పెట్టుబడిదారుడు కార్మికుడికి జీతంగా 6 డబ్బు ఇస్తాడు కదా? ఆ డబ్బు, పెట్టుబడిదారుడు ఏదో ఒక శ్రమ చేసి సంపాదించినది అయితే, ఆ 12 కీ ఈ 6 కీ మారకం జరిగినట్టే అవుతుంది. ఆ మారకం సమాన విలువల మారకం కాకపోయినా, కనీసం అది 'అసమాన మారకం' అయినా అవుతుంది. అక్కడ రెండు వేపులా శ్రమలు వున్నట్టూ, వాటికి మారకం జరిగినట్టూ అవుతుంది. కానీ, పెట్టుబడిదారుడు జీతంగా ఇచ్చే డబ్బు, పెట్టుబడిదారుడి శ్రమ వల్ల వచ్చింది కాదు. పైగా, అది కార్మికుడి శ్రమ వల్ల వచ్చిన డబ్బే.

<u>జీతం ఇవ్వడం అంటే, కార్మికుడి వల్ల వచ్చిన డబ్బుని కార్మికుడికి ఇవ్వడమే కాబట్టి, అక్కడ అసలు మారకమే లేదు.</u> మారకమే లేదు కాబట్టి, అది సమాన మారకమా, అసమాన మారకమా —అనే ప్రశ్నే లేదు.

ఇక్కడ కార్మికుడి శ్రమేగానీ పెట్టుబడిదారుడి శ్రమ ఏదీ వుండదు. కార్మికుడి శ్రమే డబ్బుగా మారి, అందులో నించే అతనికి జీతం వస్తుంది. కానీ, ఆ డబ్బు, పెట్టుబడిదారుడి చేతిలో నించి కార్మికుడికి అందుతుంది కాబట్టి, అది పెట్టుబడిదారుడి డబ్బు లాగా కనపడుతుంది.

'డబ్బు' అనేది, ఎవరి చేతిలో వుంటే వాళ్ళది లాగే కనపడుతుంది. పెట్టుబడిదారుడికీ, కార్మికులకూ మధ్య జరిగే వ్యవహారం అంతా, అమ్మడాల ద్వారానూ, కొనడాల ద్వారానూ జరుగుతుంది. కాబట్టి, అసలు విషయం అంతా గందరగోళం అయిపోతుంది.

"కార్మికుడు 'పని' చేస్తే, పెట్టుబడిదారుడు దానికి 'డబ్బు' ఇచ్చేస్తున్నాడు. ఇందులో గందరగోళం ఏమీ లేదు. కార్మికుడి 'పని'ని పెట్టుబడిదారుడు కొంటున్నాడు. అంతే" అంటాడు పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త.

"కార్మికుడి పనిని పెట్టుబడిదారుడు 'కొంటున్నాడా'? ఏం పెట్టీ?"

"డబ్బు పెట్టీ" ఆర్థిక వేత్త జవాబు ఉత్సాహంగా.

"ఆ డబ్బు ఎక్కడిది పెట్టుబడిదారుడికి?"

"................................"

"డబ్బు అంటే ఏమిటీ?"

"................................"

"డబ్బు అంటే శ్రమ. తెలుసా? పెట్టుబడిదారుడు ఏం శ్రమ చేస్తున్నాడని వాడి చేతిలోకి డబ్బు వస్తోంది?"

"................................"

"ఆ డబ్బు కార్మికులదే. పెట్టుబడిదారుడిది కాదు. తెలుసా?"

"................................"

"పెట్టుబడిదారుడు, కార్మికుల డబ్బే కార్మికులకు జీతాలుగా ఇస్తాడు. కానీ, అది పెట్టుబడిదారుడి డబ్బు లాగానూ, వాడు తన డబ్బునే జీతాలుగా ఇస్తున్నట్టూ కనపడుతుంది. పెట్టుబడిదారుడు కార్మికులకు డబ్బు ఇస్తాడు— అన్నంత వరకే తెలుసు నీకు. అంతకన్నా తెలుసుకోడానికి ఇష్టం వుండదు నీకు"

"..............................."

"పెట్టుబడిదారుడు కార్మికుల శ్రమని కొనడం లేదు. ఉచితంగా లాగుతున్నాడు."

"............................."

"దీన్నే మేం 'శ్రమ దోపిడీ' అంటాం. తెలుసా?"

"............................."

"ఈ మాట మీ నిఘంటువుల్లో వుండదు. మా

మాటలు కొన్ని మీ దగ్గిర వుండవు. మీ మాటలు కొన్ని మా దగ్గిర వుండవు. ఉన్న మాటలకు కూడా అర్థాలు ఒక్కలా వుండవు. మేం మాట్లాడే దంతా మీకు చట్ట వ్యతిరేకం."

"ఆఁ తెలుసు. ఈ చివరి మాట మాకు బాగా తెలుసు. చట్ట వ్యతిరేకంగా మాట్లాడేవాళ్ళని ఏం చెయ్యాలో మాకు బాగా తెలుసు"

చివరికి, 'సత్యం' అంతా, చట్ట వ్యతిరేకం అయి పోతుంది — దోపిడీ దృష్టికి! ఆ 'చట్టం' పెట్టుబడి దారుడు ఏర్పరిచిన చట్టమే కదా?

కార్మికుడి జీతం కార్మికుడి శ్రమలో భాగమే కాబట్టి 'జీతాన్ని పెంచడం' అంటే, కార్మికుడి శ్రమ లోనించి కార్మికుడికి ఇచ్చే భాగాన్ని 2 పైసలు ఎక్కువ ఇవ్వడమే, అంటే, పెట్టుబడిదారుడికి మిగిలే భాగంలో నించి 2 పైసలు తగ్గించుకోవడమే. అలా ఇవ్వడం పెట్టుబడి దారుడికి ఎంత కష్టమనీ! కార్మికులు రెండు పైసలు ఎక్కువ అడిగితే, పెట్టుబడిదారుడు చాలా నిర్లక్ష్యంగా "ఏమిటీ? జీతాలు పెంచాలా? ఇంకా పెంచాలంటే, నాకు గిట్టదు" అంటాడు. తను లాక్కునే 'లాటు'లో నించీ 2 పైసలు తగ్గిపోవడం వాడికి నిజంగానే 'కిట్టదు' కదామరీ!

ఇంతకీ, చివరికి ఏం తేలింది? కార్మికులకూ పెట్టుబడి దారుడికీ మధ్య మారకమే వుండదని తేలింది. ఉండేదంతా, కార్మికుల శ్రమ, పెట్టుబడిదారుడి వేపు ప్రవహిస్తూ వుండడమే!

# కార్మికులు కూడా, ఒక సారి 'అమ్మే వారి' గానూ, ఇంకో సారి 'కొనే వారి' గానూ ఉంటారా?

కొనడాలూ, అమ్మడాలూ— అనే చోట, ఒక విషయం స్పష్టం చేసుకోవాలి. కార్మికుడు తన 'శ్రమ'ని ఇచ్చే చోట, ఒక సరుకుని 'అమ్మేవాడి'గా కనపడతాడు. ఈ కార్మికుడే, పెట్టుబడిదారుల నించి 'జీవితావసర వస్తువులు' తీసుకునే చోట, ఇతరుల సరుకుల్ని 'కొనేవాడి'గా కనపడతాడు. అంటే, కార్మికులు కూడా ఒకసారి 'అమ్మేవారి'గానూ, ఇంకో సారి 'కొనేవారి'గానూ వున్నట్టు కనపడతారు. కానీ, అదంతా భ్రమ.

కార్మికుడు తన 'శ్రమ'ని ఇచ్చేచోట పెట్టుబడిదారుడి నించి తీసుకునే డబ్బు (జీతం) పెట్టుబడిదారుడిది కాదు. అది కార్మికుడిదే. కాబట్టి, ఈ సందర్భంలో కార్మికుడు అసలు అమ్మేవాడిగా వుండడు. ఈ కార్మికుడు, పెట్టుబడి దారుల నించి 'జీవితావసర వస్తువులు' తీసుకునే చోట, ఆ వస్తువులు పెట్టుబడిదారులవి కావు. అవి కార్మికుడివే. కాబట్టి, ఈ సందర్భంలో కార్మికుడు కొనేవాడిగా వుండడు.

కార్మికుడి 'శ్రమ'లో భాగమే కార్మికుడికి 'జీతం'గా వస్తుందని చూశాం. 'డబ్బు'గా చూస్తే, కార్మికుడి డబ్బులో భాగమే కార్మికుడికి వస్తుంది. 'ఉత్పత్తులు'గా చూస్తే, కార్మికుడి ఉత్పత్తుల్లో భాగమే కార్మికుడికి వస్తాయి.

కాబట్టి, మొదట కార్మికుడు అమ్మేదీ లేదు, పెట్టుబడి దారుడు కొనేదీ లేదు. తర్వాత, కార్మికుడు, వస్తువుల్ని కొనేదీ లేదు, పెట్టుబడిదారుడు అమ్మేదీ లేదు. — కార్మికులకూ పెట్టుబడిదారులకూ మధ్య ఈ అమ్మడాలూ కొనడాలూ పైకి కనపడుతోన్న నాటకం. అసలు జరుగుతున్నది — కార్మికులు ఉత్పత్తి చెయ్యడమూ, పెట్టుబడిదారులు అందులో నించి కొంత భాగాన్ని లాగెయ్యడమూనూ. ఈ కార్యక్రమమే — కార్మికులకూ పెట్టుబడిదారులకూ మధ్య అమ్మడాలు గానూ, కొనడాలుగానూ, కనపడుతుంది.

ఒక మనిషి — ఒక సారి 'అమ్మేవాడి'గానూ, ఇంకోసారి 'కొనేవాడి'గానూ వుండడం — అనే విషయం ఎక్కడ సరి పోతుందంటే, 'మారకం'లో పాల్గొనే ఇరు పక్షాలవాళ్ళూ 'స్వయంగా శ్రమ చేసేవాళ్ళు' అయినప్పుడుగానీ; లేదా, 'స్వయంగా శ్రమ చెయ్యని' వాళ్ళు అయినప్పుడుగానీ. అలాంటి ఇద్దరికి మాత్రమే ఆ పోలిక సరిపోతుంది. స్వయంగా శ్రమచేసే వాళ్ళిద్దరూ ఒకరితో ఒకరు, అమ్మే— కొనేవాళ్ళుగా వుంటారు కాబట్టి, వాళ్ళు సరిసమానులు. స్వయంగా శ్రమ చెయ్యని వాళ్ళు కూడా ఒకరితో ఒకరు సరిసమానులే. కానీ, ఒక పెట్టుబడిదారుడికీ ఒక కార్మికు డికీ వుండే సంబంధంలో మాత్రం ఈ లక్షణాలు వుండవు. కార్మికుడు శ్రమచేసేచోట, పెట్టుబడిదారుడు కొనేవాడూ కాడు, కార్మికుడు అమ్మేవాడూ కాడు. కార్మికుడు సరుకుల్ని తీసుకునేచోట, పెట్టుబడిదారుడు అమ్మేవాడూ కాదు, కార్మికుడు కొనేవాడూ కాడు. ఈ ఇద్దరిలో ఒకరు ఎప్పుడూ శ్రమచేసేవారూ, ఒకరు ఎప్పుడూ శ్రమచెయ్యని వారూ మాత్రమే. అదీ వాళ్ళ సంబంధం. అంత విచిత్ర సంబంధం వాళ్ళది.

ఒక వేళ, పైకి కనపడే విధంగానే, కార్మికుణ్ణి 'శ్రమ' అనే సరుకుని అమ్మేవాడిగానూ, పెట్టుబడిదారుణ్ణి ఆ సరుకుని కొనేవాడిగానూ చూస్తే, ఈ 'పాత్రలు' తారు మారుగా ఎప్పుడూ మారవు. ఎప్పుడూ కార్మికుడే శ్రమని

అమ్ముకుంటూ వుంటాడు. ఎప్పుడూ పెట్టుబడిదారుడే దాన్ని కొంటూ వుంటాడు. పెట్టుబడిదారుడు కూడా, కార్మికుడి దగ్గిరికి వెళ్ళి తన శ్రమని అమ్మడమూ, దాన్ని కార్మికుడు కొనడమూ — అనే సరిసమాన ఘట్టం ఒక్క సారి కూడా జరగదు. అలాగే, కార్మికుడు 'జీవితావసర వస్తువుల్ని' కొనేటప్పుడు, ఎప్పుడూ పెట్టుబడిదారుడే వాటిని అమ్మేవాడిగా వుంటాడు. కార్మికుడు కూడా 'జీవితా వసర వస్తువుల్ని' అమ్మడం ఎప్పుడూ జరగదు. ఇలాంటి విచిత్రమైన సంబంధాన్ని పెట్టుబడిదారీ శాస్త్రాలూ, చట్టాలూ 'సరిసమానుల సంబంధం'గా వర్ణిస్తాయి.

# పెట్టుబడిదారులూ, కార్మికులూ సమానులా?

నిజానికి బానిసకీ, కార్మికుడికీ సారాంశంలో తేడా ఏమీ వుండదు. ఇద్దరూ 'అస్వతంత్రులే.' ఇద్దరూ యజమానుల కింద సేవకులే. అయితే, 'బానిస' కన్నా కార్మికుడికి దొరికే 'స్వేచ్ఛ' (దాన్ని 'స్వేచ్ఛ' అనగలిగితే) ఏమిటంటే, పని చెయ్యని సమయంలో 'యజమాని లేని' స్వేచ్ఛ. బానిస అయితే పగలూ రాత్రీ కూడా యజమాని ఆధీనంలోనే వుంటాడు. కార్మికుడైతే, పని లేనప్పుడు 'స్వేచ్ఛ'గా వుండి, పని వున్నంత సేపూ యజమాని ఆధీనంలో వుంటాడు. అసలు, యజమానికి కావలసింది అదే కదా? పని వాళ్ళు, పని జరిగేటప్పుడు యజమాని ఆధీనంలో వుంటే, వారిని యజమాని ఎలా కావాలంటే అలా ఉపయోగించు కోవచ్చు. పని జరగనప్పుడు, పనివాళ్ళు ఎంత స్వేచ్ఛగా వుంటే మాత్రం యజమానికి నష్టమేముంది? బానిస కాలం నాటి యజమానికన్నా, కార్మికుడి యజమాని, 'పనివాళ్ళు పని లేని సమయంలో స్వేచ్ఛగా వున్నా నష్టం లేదులే' అనే జ్ఞానం సంపాదించాడన్నమాట.

కార్మికుడి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రతీ అంశం లోనూ ఇలాగే వుంటాయి. కార్మికుడు ఒక యజమానిని వదిలి ఇంకో యజమాని దగ్గిరికి తన ఇష్టం వచ్చినట్టు పోగలడు — అన్నట్టు కనపడుతుంది. బానిస పరిస్తితితో పోలిస్తే, కార్మికుడి పరిస్థితి కొంత మెరుగు అయినా, దాన్ని విడిగా చూస్తే, అది నిజమైన స్వేచ్ఛగా వుండదు. కార్మికుడు వారానికో యజమానిని మార్చెయ్యగలడనే అనుకున్నా, (నిజానికి అలా మార్చలేడు) యజమానిని మార్చే స్వేచ్ఛ అంటే యజమానే లేని స్వేచ్ఛ కాదు. కార్మికుడికి కూడా ఎప్పుడూ ఎవడో ఒక యజమాని వుండవలసిందే. బానిసలకు లాగే కార్మికులకు కూడా స్వంత ఉత్పత్తి సాధనాలు వుండవు గనక, కార్మికుడు, మొత్తం పెట్టుబడిదారుల్లో ఎవడినో ఒకడిని తన యజమానిగా తలదాల్చి వాడి అధికారానికి లోబడి సేవ చెయ్యవలిసిందే. 'ఏ యజమాని దగ్గిరా పని చెయ్యను' అని స్వేచ్ఛగా వెళ్ళిపోయే కార్మికుడు ఎలా బతకగలడు? అతనికి భూమి ఏదీ? ఇతర శ్రమ సాధనాలు ఏవీ? ఉత్పత్తి కార్యానికి కావలసిన అంశాలు లేని అంగ వికలుడు అతను. అలాంటి వాడు యజమానిని తిరస్కరించి ఎలా జీవిస్తాడు? కాబట్టి, ప్రతీ కార్మికుడూ తప్పనిసరిగా ఒక యజమాని కింద పడివుండాలి.

పెట్టుబడిదారుడికైతే ఏ యజమానీ వుండడు. కార్మికుడి మీద పెత్తందారు వున్నట్టుగా, పెట్టుబడిదారుడి మీద పెత్తందారు వుండడు. — ఇదే పెట్టుబడిదారుడికీ, కార్మికుడికీ వున్న 'సరిసమానుల సంబంధం'!

కార్మికుడు, పెట్టుబడిదారుడితో, 'ఆస్తి' విషయంలో కూడా సరిసమానుడే — అని కొందరు ఆర్థికవేత్తల అభిప్రాయం. పెట్టుబడిదారుడికి, 'ఉత్పత్తి సాధనాలు' ఆస్తిగా వుంటే, కార్మికుడికి 'రెక్కలే' ఆస్తిగా వున్నాయనీ, ఎవరి ఆస్తి వారికి వుందనీ, గొప్ప సత్యం కనిపెట్టారు వాళ్ళు. పెట్టుబడిదారుడు తన ఆస్తి ద్వారా 'లాభం' పొందితే, కార్మికుడు తన ఆస్తి ద్వారా 'జీతం' పొందుతాడనీ, రెండూ ఒకటేననీ, ఎవరి ఆస్తి ఫలితం వారు అనుభవిస్తున్నారనీ — వారి సిద్ధాంతం!

'రెక్కలు' కూడా ఆస్తే అయితే, అవి కార్మికుడికే గానీ పెట్టుబడిదారుడికి వుండవా? పెట్టుబడిదారుడికి చేతులూ, కాళ్ళూ, కండరాలూ, నరాలూ, రక్త మాంసాలూ వుండవా? శ్రామికుడికి వున్న శరీరం పెట్టుబడిదారుడికి వుండదా? ఆ శరీరంతో కార్మికుడిలాగే పెట్టుబడిదారుడు కూడా ఏదో ఒక శ్రమని నేర్చుకుని, శ్రమ చెయ్యలేడా? శరీరం కూడా ఆస్తే అయితే, అప్పుడు పెట్టుబడిదారుడికి 2 ఆస్తులు వున్నట్టు కాదా? 'ఉత్పత్తి సాధనాలు' అనే ఆస్తి ఒకటీ, శరీరం అనే ఆస్తి ఒకటీ! ఆ రకంగా చూస్తే, కార్మికుడి కన్నా, పెట్టుబడిదారుడికి ఒక ఆస్తి ('ఉత్పత్తి సాధనాలు' అనే ఆస్తి) ఎక్కువగా వున్నట్టు లెఖ్ఖ.

తమకు కూడా శరీరాలు వున్నాయనే సంగతి పెట్టుబడి దార్లకూ, వాళ్ళ ఆర్థిక వేత్తలకూ తెలియక పోవడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే, వాళ్ళా శరీరాల్ని ఏనాడన్నా 'పని'లో పెడితే కదా, తమకు శరీరాలు వున్నా యనే సంగతి వాళ్ళ స్పృహలోకి వచ్చేది? చచ్చిపోయిన దేహాన్ని భూస్థాపితం చేసినట్టు, వాళ్ళు తమ దేహాల్ని ఎప్పుడూ ఏదో ఒక మూల పారేసి వుంచుతారు. వాటి వల్ల వీసమెత్తు పని

అయినా జరగనివ్వకుండా, వాటిని ఎప్పుడూ పనికిమాలిన రకంగానే వుంచుతారు. అందుకే ఆ దేహాలు, లేని వాటితో సమానం అయిపోతాయి. అందుకే, శ్రమ చేసే శక్తి కార్మికుడికే వున్న విషయం లాగానూ, తమకు లేని విషయంలాగానూ, వాళ్ళకు కనపడుతుంది. రెక్కలు కూడా ఒక ఆస్తే అయితే, 'ఆస్తి' అంటే పడిచచ్చే వీళ్ళు ఆ ఆస్తిని కూడా ఎందుకు ఉపయోగించుకోరు? అప్పుడు పెట్టుబడికి వచ్చే లాభమే గాక రెక్కలకు వచ్చే జీతం కూడా వాళ్ళకే అందుతుంది కదా?

'పెట్టుబడిదారుడికీ, కార్మికుడికీ మధ్య ఒక సంబంధాన్ని ఏర్పర్చే శక్తి, ఇరు పక్షాలకూ వున్న స్వార్థమే' — అని 'బెన్‌థమ్' అనే 'మేధావి' అమూల్య సిద్ధాంతం. పెట్టుబడిదారుడూ కార్మికుడూ కూడా ఎవరి స్వంత ప్రయోజనాలు వాళ్ళు చూసుకుంటారే గానీ ఇతరుల గురించి ఆలోచించరనీ, ఎవరి అవసరాల కోసమే వాళ్ళు రెండో వాళ్ళతో కలుస్తారనీ, మానవ స్వభావమే స్వార్థపూరితమైనదనీ — ఈయన సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం, పెట్టుబడిదారుడూ స్వార్థపరుడే; కార్మికుడూ స్వార్థపరుడే! ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకుంటారు!— ఈ సిద్ధాంతం, పెట్టుబడిదారుడికి చక్కగానే నచ్చుతుంది. ఎందుకంటే, తనని స్వార్థపరుడు అన్నా ఫర్వాలేదు. కార్మికుణ్ణి కూడా 'స్వార్థపరుడే'నని తేల్చడం వాడికి కావాలి. 'మానవులందరూ స్వార్థపరులే' అనే మహత్తర సత్యం కింద తన దోపిడీ రహస్యం మరుగున పడిపోవడం కావాలి, వాడికి.

కార్మికుడికి వున్న 'స్వార్థం' ఏమిటి? తన శ్రమని మొత్తంగా పెట్టుబడిదారుడికి ఇచ్చెయ్యకపోవడమా? అందులో నించి కొంత భాగాన్ని తను బతకడానికి తీసుకోవడమేనా? లేకపోతే, తనకు జీతంగా ఇచ్చేది చాలడం లేదనీ, బతకలేక పోతున్నాననీ, ఇంకా కొంచెం ఇవ్వమనీ అడగడమా? కార్మికుడు చూసుకునే స్వార్థం అదే అయి వుండాలి. అంటే ఈ సిద్ధాంతకర్త కార్మికుణ్ణి 'నిస్వార్థంగా వుండమ'ని చెపుతున్నాడన్నమాట ! "ఈ మాట, ఆయన, పెట్టుబడిదారుడికి కూడా చెపుతున్నాడు కదా" అంటామా? — పెట్టుబడిదారుడికి కూడా చెప్పడం కాదు ; పెట్టుబడిదారుడికి మాత్రమే చెప్పాలి. వాడికొక్కడికే చెప్పాలి. పెట్టుబడిదారుడికి మాత్రమే చెప్పవలసిన దాన్ని కార్మికులకు కూడా చెప్పవలసిన అవసరం లేదు.

పెట్టుబడిదారుణ్ణీ, కార్మికుణ్ణీ కూడా ఒకే గాటిన కట్టే ఇలాంటి సిద్ధాంతాలు ఇంకా చాలా రూపాల్లో కనపడతాయి. ఇవి, మంచినీ చెడ్డనీ ఒకే గాటిన కడతాయి. న్యాయాన్నీ అన్యాయాన్నీ ఒకే గాటిన కడతాయి. ఈ రకం అవగాహనలన్నీ 'పెట్టుబడిదారీ విధానానికి' పూర్తిగా తగినవే. పైపై రూపాల్ని మాత్రమే చూసి సిద్ధాంతాలు చేసే పెట్టుబడిదారీ విధానానికి! ప్రతి సత్యాన్నీ తిరగేసి పట్టుకునే పెట్టుబడిదారీ విధానానికి! అలాంటి తల్లకిందుల విధానానికి ఇంతకన్నా సరియైనదాన్నీ, ఇంత కన్నా జ్ఞానవంతమైన దాన్నీ పొందే శక్తీ, అర్హతా వుండవు.

# 'శ్రమ విలువ'కు గానీ, 'శ్రమ శక్తి విలువ'కు గానీ, బాహ్య కారణం

ఒక 'మేధా శ్రమ' విలువా, ఒక 'శారీరక శ్రమ' విలువా సమానంగా వుండవనీ, తేడాగా వుంటాయనీ, ఇంతకు ముందే చూశాం. వేరు వేరు రకాల శ్రమల విలువలు తేడాలుగా వుండడం సహజమే.

అలాగే వాటి 'శ్రమ శక్తుల్ని' తీసుకుంటే, ఆ 'శ్రమ శక్తుల' విలువలు కూడా తేడాలుగా వుండడం సహజమే.

'శ్రమ విలువల మధ్య తేడా' అన్నప్పుడుగానీ, 'శ్రమ శక్తుల విలువల మధ్య తేడా' అన్నప్పుడుగానీ, రెండు చోట్లా మనం చూస్తున్న విషయం ఒకటే. అది, 'రెండు విలువల మధ్య తేడా' అనే విషయం.

అయితే, ఆ తేడా, 'తగినంతగా మాత్రమే వుందా చాలా ఎక్కువగా వుందా' అనేది, 'సమాజ స్వభావం' మీద ఆధారపడి వుంటుంది. దోపిడీ సమాజాలలో అయితే, ఆ తేడా, 'చాలా అధికంగా' వుంటుంది. దోపిడీ వ్యతిరేక సమాజంలో అయితే ఆ తేడా, తగినంతగా మాత్రమే వుంటుంది.

ఒక 'శ్రమ'కి విలువ, ఫలానా స్థాయిలో ఏర్పడడానికి అంతర్గత కారణం — దాని 'శ్రమ శక్తి' విలువ. బాహ్య కారణం — ఆ 'సమాజ స్వభావం'.

ఒక 'శ్రమ శక్తి'కి విలువ, ఫలానా స్థాయిలో ఏర్పడడానికి అంతర్గత కారణం — దాని కోసం అవసరమయ్యే ఖర్చూ, కాలమూ, వగైరాలు. (గతంలో చూసినవి). బాహ్య కారణం — ఆ 'సమాజ స్వభావం'.

ఒక మేధా శ్రమనీ, ఒక శారీరక శ్రమనీ తీసుకుంటే (లేదా, ఒక నైపుణ్యం గల శ్రమనీ, నైపుణ్యం లేని శ్రమనీ తీసుకుంటే), వాటి విలువల మధ్య, నిజానికి, 'విపరీతమైన

తేడా' వుండనక్కరలేదు. ఎందుకంటే, మేధా శ్రమని నేర్చుకోవాలన్నా, శారీరక శ్రమని నేర్చుకోవాలన్నా, ఆ ఇద్దరు మనుషులకూ ఆహారం ఒక్కలాగే వుండాలి. నివసించే ఇళ్ళూ, ధరించే బట్టలూ, ఇతర అవసరాలూ అన్నీ, ఒక్కలాగే వుండాలి. ఎటొచ్చీ, ఆ నేర్చుకునే పనికి సంబంధించిన ఖర్చులూ, ఆ పని నేర్చుకోవడానికి పడవలసిన శ్రమా మాత్రమే తేడా అవుతాయి. ఆ అంశాల్ని బట్టి మాత్రమే ఆ శ్రమ విలువలు తేడాగా వుండడం జరిగితే, ఆ తేడా చాలా పెద్దగా అవడానికి అవకాశం వుండదు.

కానీ, శ్రమల విలువల్ని నిర్ణయించడంలో— ఆ శ్రమలు ఏ సమాజంలో సాగుతున్నాయో ఆ 'సమాజ స్వభావం' అనేది 'బాహ్య కారణం'గా పని చేస్తుంది.

పెట్టుబడిదారీ సమాజాన్ని తీసుకుంటే, (ఏ దోపిడీ సమాజాన్ని తీసుకున్నా), ఆ సమాజానికి మేధాశ్రమల మద్దతు కావాలి. ఆ సమాజం, మేధా శ్రమలు చేసే వారిని, తన సమర్థకులుగా చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. 'ఉత్పాదక శక్తుల్ని' పెంచే పని, మేధా శ్రమల ద్వారానే జరుగుతున్నట్టుగా సమాజం అనుకుంటుంది. అంతేగాక, విద్యా, కళలూ వంటి సాంస్కృతిక రంగాలలో, పెట్టుబడిదారీ సమాజానికి అనుకూలమైన భావాలను రకరకాల మార్గాలలో ప్రచారం చెయ్యడానికి కూడా మేధా శ్రమలు ఉపకరిస్తాయి. మేధా శ్రమలకు ఎక్కువ విలువా, శారీరక శ్రమలకు తక్కువ విలువా వుండడం — అనే 'అంతర్గత కారణం'వల్ల, శారీరక శ్రమలు చేసే సెక్షన్లు, మేధా శ్రమల పట్ల గౌరవ విశ్వాసాల్ని కలిగివుంటాయి. ఈ పరిస్థితుల వల్ల, మేధా శ్రమలు, శారీరక శ్రమలపై తమ ప్రభావాన్నీ, తమ ఆధిపత్యాన్నీ, నెరపగలుగుతాయి. ఇలాంటి పరిస్తితుల్ని పెట్టుబడిదారీ వర్గం తనకు అనుగుణంగా ఉపయోగించుకుంటుంది. ఒక వేపు సైన్సు అంశాలలోనూ, ఇంకో వేపు సాంస్కృతిక అంశాలలోనూ, మేధా శ్రమలు తనకు 'సేవ' చేసేలాగ, ఆ దోపిడీవర్గం, మేధా శ్రమల్ని మలచడానికి ప్రయత్నిస్తుంది. అది, ఆ ప్రయత్నం ఎలా చేస్తుందంటే 'జీతాల' విషయంలోగానీ, మరే విషయంలో గానీ, శారీరక శ్రమలకు ఇవ్వని ప్రత్యేకత మేధా శ్రమలకు ఇవ్వడం ద్వారా చేస్తుంది.

ఒక శారీరక శ్రమ విలువకూ, ఒక మేధా శ్రమ విలువకూ సహజంగా ఎంత తేడా వుండడం అవసరమో అంత తేడాని మాత్రమే వుంచడంగాక, పెట్టుబడిదారీ సమాజం, శారీరక శ్రమల విలువల్ని వాటి 'న్యాయమైన' విలువల కన్నా మరింత తగ్గించి వేస్తుంది; మేధా శ్రమల విలువల్ని వాటి న్యాయమైన విలువల కన్నా మరింత పెంచుతుంది. అంటే ఆ సమాజం శారీరక శ్రమల విలువలకూ, మేధా శ్రమల విలువలకూ మధ్య 'తేడా'ని, చాలా ఎక్కువ చేసి, ఆ విలువల్ని అంత ఎక్కువ తేడాతోనే గుర్తిస్తుంది. ఆ సమాజంలో ఆ తేడాయే చలామణీ అవుతూ వుంటుంది.

పెట్టుబడిదారీ సమాజంలో, 'జీతాల'కు సంబంధించి కొన్ని 'చట్టాలు' వుంటాయి. సమాజంలో వుండే సాంప్రదాయక పరిస్తితుల మీదే ఆధారపడుతూ ప్రభుత్వం ఆ చట్టాలు చేస్తుంది.

సమాజంలో వున్న శ్రమలన్నీ ఎన్ని స్థాయిలలోకి వస్తాయి? ఏ యే రకం శ్రమలు ఒక స్థాయిలోకి వస్తాయి? ఏ స్థాయికి ఎంత జీతం వుండాలి? ఒక స్థాయికీ ఇంకో స్థాయికీ ఎంత తేడా వుండాలి? — ఇటువంటి విషయాలన్నిటినీ ఈ చట్టాలు నిర్ణయిస్తాయి. అలా నిర్ణయించేటప్పుడు అవి, శారీరక శ్రమల జీతాలకన్నా మేధా శ్రమల జీతాల్ని అనేక రెట్లు ఎక్కువగా పెడతాయి. అలా చెయ్యడానికి, ఆ శ్రమల విలువల మధ్య సహజంగా తేడా వుండడం— అనే విషయమే ఆధారంగా వుంటుంది. ఆ పరిస్తితినే ఆధారం చేసుకుని, దోపిడీ ప్రభుత్వం, ఆ తేడాని మరింత పెద్దది చెయ్యగలుగుతుంది. 'జీతాల్ని' ప్రభుత్వం నిర్ణయించినా, ప్రభుత్వ నిర్ణయంతో సంబంధం లేకుండా సమాజంలో ఏదో ఒక రకపు జీతాలు అమలు జరుగుతూ వున్నా, ఎలా జరిగినా కూడా, సమాజంలో మేధా శ్రమల జీతాలూ, శారీరక శ్రమల జీతాలూ పెద్ద తేడాలతోనే వుంటాయి.

ఒక ఉదాహరణ :

ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, 2 రకాల శ్రమల్ని మాత్రమే తీసుకుందాం. ఒక శారీరక శ్రమనీ, ఒక మేధా శ్రమనీ. 'శారీరక శ్రమ'లో కార్మికులూ, 'మేధా శ్రమ'లో కార్మికులూ, సమాన సంఖ్యలోనే వున్నారనుకుందాం. 2 రకాల శ్రామికులూ కలిసి, ఒక 'సరుకు' కోసం 100 విలువ గల సజీవ శ్రమ చేశారనుకుందాం. శ్రామికులూ పెట్టుబడిదారుడూ కలిసి పంచుకోవలసింది ఈ భాగాన్నే కాబట్టి, దీని సంగతే చూద్దాం. ఇక్కడ ఆ సరుకు కోసం ఖర్చయ్యే శ్రమ సాధనాల సంగతి పూర్తిగా అనవసరం.

శ్రామికులంతా కలిసి 100 విలువగల శ్రమ చేశారు. దాంట్లో శ్రామికులందరికీ కలిసి జీతాల కోసం 50.

అదనపు విలువ 50 — అనుకుందాం.

'జీతాలు'గా వున్న 50లో నించి మేధా శ్రమకు 30, శారీరక శ్రమకు 20 ఇవ్వడం, ఆ శ్రమల ప్రత్యేకతల్ని బట్టి 'న్యాయం' అనుకుందాం. ఇలా ఇస్తే శారీరక శ్రమలోనూ మేధా శ్రమలోనూ కూడా, ఎవరి శ్రమ శక్తి విలువ వారికి అందుతుందనుకుందాం. అప్పుడు ఆ 'శ్రమ శక్తుల' విలువల మధ్య తేడా 10 అవుతుంది. అంత తేడా మాత్రమే సహజమైంది — అనుకుందాం. కానీ ఆ జీతాల 50 ని, ఆ

శ్రమల మధ్య ఇంకోరకంగా పంచడానికి కూడా అవకాశం వుంది. మేధా శ్రమలకు 35 ఇచ్చి, శారీరక శ్రమలకు 15 ఇవ్వవచ్చు. ఇప్పుడు తేడా 20. లేదా మేధా శ్రమలకు 38 ఇచ్చి, శారీరక శ్రమలకు 12 ఇవ్వవచ్చు. తేడా 26. లేదా మేధా శ్రమలకు 40 ఇచ్చి, శారీరక శ్రమలకు 10 ఇవ్వ వచ్చు. తేడా 30. ఈ రకంగా శారీరక శ్రమలకు పోవలసిన వాటిని మేధా శ్రమల వేపుకి చాలావరకు మళ్ళించవచ్చు.

ఇప్పుడు జరుగుతున్నదంతా అదే. ఈ సమాజంలో కనపడే శారీరక శ్రమల జీతాలు, ఆ రకంగా కనీస స్థాయిలో వుండేవే. అందులోనే కొన్ని సెక్షన్ల జీతాలు, ఆ కనీస స్థాయిలో కూడా వుండవు. అలాంటి సెక్షన్లు మరింత ఘోరమైన దరిద్రంలో పడివుంటాయి. ఆ శ్రామికులు, బతికినంత కాలమూ దుర్భరంగా బతికి త్వర త్వరగా వృద్ధులై పోతారు.

దోపిడీ వర్గానికి శారీరక శ్రమల మీద ఇంత నిర్లక్ష్యం ఎందుకంటే, ఆ సెక్షన్లలో దరిద్రంతో ఎంత జనాభా నశించి పోతోన్నా, దోపిడీ వర్గానికి శ్రామికులు అందడంలో ఏమీ ఇబ్బంది రాదుగనక. ఆ సెక్షన్లకు ఎక్కువ సౌకర్యాలు ఏర్పర్చవలసిన అవసరం దోపిడీ వర్గానికి కనపడదు.

ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే : పెట్టు బడిదారీ వర్గం, మేధా శ్రమలకు 'ఎక్కువగా' ఇవ్వడానికి, తన 'అదనపు విలువ'ని ఏమీ వదులుకోదు. శారీరక శ్రమలకు ఇవ్వవలసినదాన్నే మేధా శ్రమలవేపు మళ్ళించి, మేధా శ్రమల్ని ఆకర్షించడానికి ప్రయత్నిస్తుంది.

దీని వల్ల ఏం జరుగుతుందంటే — ఒక 'శ్రమ శక్తి విలువ'కీ ఇంకో 'శ్రమ శక్తి విలువ'కీ మధ్య తేడా, సహేతుకంగా గాక, అహేతుకంగా వుంటుంది. 'తేడా' అధికంగా వుండడానికి కారణం— సమాజానికి వున్న దోపిడీ స్వభావం. అంటే, ఈ ఉదాహరణలో విలువల మధ్య 10 తేడా, అంతర్గత కారణం వల్ల ఏర్పడ్డది అయితే, అంతకన్నా ఎక్కువ తేడా సమాజ స్వభావం అనే బాహ్య కారణం వల్ల ఏర్పడ్డది.

2 రకాల 'శ్రమ శక్తుల విలువల మధ్య తేడా' అధికంగా వుంటే, ఆ శ్రమ శక్తుల ద్వారా ఏ శ్రమలు జరుగుతాయో ఆ 'శ్రమలకు వుండే విలువల మధ్య తేడా' కూడా, అధికంగానే వుంటుంది. శ్రమ శక్తి విలువల్ని బట్టే శ్రమ విలువలు కాబట్టి.

శ్రమల్ని తీసుకున్నా, శ్రమ శక్తుల్ని తీసుకున్నా, వాటి విలువల మధ్య తేడా, అధికంగా వుండడమే దోపిడీ సమాజానికి సహజ విషయం. ఆ సమాజం దోపిడీ సమా జం కానట్టయితే, అది శారీరక శ్రమల పట్ల 'నిర్లక్ష్యంగా' వుండదు. ఆ సమాజం, శ్రమల విలువల మధ్య తేడాని అధికంగా వుండనివ్వదు. శారీరక శ్రమ శక్తి విలువని కొంత పెంచి, మేధా శ్రమ శక్తి విలువని కొంత తగ్గించి, ఆ రకంగా ఆ సమాజం, ఆ తేడాని సహేతుక స్థాయిలో వుంచుతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో, మేధా శ్రమలూ, శారీరక శ్రమలూ కూడా అనేక 'అంతస్తుల భేదాల'తో వుంటాయి. ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, మేధా శ్రమలన్నిటినీ 2 అంతస్తులుగానూ, శారీరక శ్రమలన్నిటినీ కూడా 2 అంతస్తులుగానూ ఊహిద్దాం. మొత్తం ఈ 4 రకాల అంతస్తుల్లోనూ, మేధా శ్రమల్లో పై అంతస్తులో వున్నవి 'ఆర్థికంగా' అతి సౌఖ్యంగా బతుకుతూ వుంటాయి. శారీరక శ్రమల్లో కింది అంతస్తు శ్రమలు, అతి దుర్భరంగా బతుకుతూ వుంటాయి. ఈ రెండు అంతస్తులకూ మధ్య వుండే ఇంకో 2 అంతస్తుల శ్రమలు (మేధా శ్రమల్లో తక్కువ స్థాయివీ, శారీరక శ్రమల్లో ఎక్కువ స్థాయివీ) కనీస అవసరాలు మాత్రమే తీరుతూ బతుకుతూ వుంటాయి. మొత్తం మీద 'శ్రామిక వర్గం'లో, ' ఉన్నత మేధా శ్రమలు' చేసేవాళ్ళు తప్ప, మిగతా అందరూ కొంత కొంత తేడాలతో దరిద్రంలోనే పడి వుంటారు.

పెట్టుబడిదారీ సమాజంలో, ఒక కుట్టు శ్రామికుడి ఆదాయాన్నీ, ఒక డాక్టర్ ఆదాయాన్నీ గానీ; ఒక భూమి దున్నే కూలీ ఆదాయాన్నీ, ఒక ఇంజనీర్ ఆదాయాన్నీ గానీ — ఏ అంశంలోనూ పోల్చలేము. ఆహార విషయంలో గానీ, దుస్తుల విషయంలోగానీ, నివాసం విషయంలో గానీ, ఇంకే విషయంలో గానీ, ఆ ఇద్దరు మనుషుల జీవితాలకూ పోలికే వుండదు.

పెట్టుబడిదారీ సమాజానికి, చాలా ప్రత్యేకంగా దాని అవసరాలకే వూడిగం చేసే సైంటిస్టులూ, ఇంజనీర్లూ, ఇతర మేధావులూ కావాలి. పెట్టుబడిదారీ దోపిడీవర్గం, ఈ రకం మేధా శ్రమలకు చాలా ఎక్కువ విలువ సమర్పిస్తూ ఆ శ్రమల్ని తమకు బంట్లుగా చేసుకుంటుంది. ఆ శ్రమలు చేసే ఉన్నత మేధావులంతా పెట్టుబడిదారుడికి అను కూలించే టెక్నిక్కులూ, అనుకూలించే పద్ధతులూ కనిపెట్ట డానికే తమ మేధా శక్తులన్నీ ధారపోస్తూ వుంటారు. ఈ పని, వాళ్ళు ఊరికే చెయ్యరు. దానికి తగ్గ ప్రతిఫలం తప్పని సరిగా పొందుతూనే చేస్తారు.

ఉన్నత మేధా శ్రమలకు సంబంధించిన డాక్టర్లూ, సైంటిస్టులూ, ఇంజనీర్లూ, ప్రొఫెసర్లూ — వంటి ఉద్యో గులు పొందే విలువలకూ, శారీరక శ్రమలు చేసే శ్రామి కులు పొందే విలువలకూ తేడా చూడాలంటే, మొదట 'జీతాల' విషయం చూడాలి. అవి చాలా 'పెద్ద' తేడాతో వుంటాయి. జీతాల తేడా, పదేసి రెట్ల తేడాగా కూడా వుంటుంది. జీతాల్ని మాత్రమే చూసి వూరుకోకూడదు. 'ప్రత్యేక సౌకర్యాలు' (ప్రివిలేజెస్) అనే విషయం కూడా ఒకటి వుంది. ఉన్నత మేధా శ్రమలకు దొరికే ఈ ప్రత్యేక

సౌకర్యాలు చాలా పెద్ద స్థాయిలో వుంటాయి. ఉచితంగా గానీ, నామమాత్రపు అద్దెలతోగానీ విశాలమైన ఇళ్ళూ, ఉచితంగా కారులూ, ఉచితంగా ఫోనులూ. ఉచితంగా వైద్య సౌకర్యాలూ. ఉచిత విలాస ప్రయాణాలూ; రీసెర్చిల పేర్ల తోటీ, విజ్ఞాన పర్యటనల పేర్ల తోటీ స్పెషల్ గ్రాంటులూ; సంవత్సరానికి అనేక సార్లు సెమినార్ల పేర్ల తోటీ, ఇంకేవో పేర్ల తోటీ, ఫస్టు క్లాసు ప్రయాణాలూ, పెద్ద పెద్ద విందులూ — ఈ రకంగా ఉన్నత మేధా శ్రమలకు, అనేక ప్రత్యేక సౌకర్యాలు వుంటాయి. జీతాల విలువనీ, ఈ ప్రత్యేక సౌకర్యాల విలువనీ కలిపితే ఎంత మొత్తం అవుతుందో అంత విలువని ఉన్నత మేధా శ్రమలు తింటున్నాయని అర్థం.

శారీరక శ్రమల వేపు చూస్తే — అందులో కింది స్థాయి శ్రమలకు అక్షరాలా గంజి, గోచీ, గుడిసే! గుడిసె వుండదని చెప్పుకున్నా చెప్పుకోవచ్చు. ఈ శ్రమలకు ఊహాతీతమైనంత పేదరికం! కొంచెం పై స్థాయి శారీరక శ్రమలకు అర్థాకలి తిండీ, ఒక్క గది నివాసం, లేదా ఒకటి రెండు ఇరుకు గదుల నివాసం. — శారీరక శ్రమల జీవిత సౌఖ్యాలన్నీ కలిసి అంతే.

ఉన్నత మేధా శ్రమలు పొందే విలువకీ, అట్టడుగు శారీరక శ్రమలు పొందే విలువకీ తేడా వందల రెట్లలో వుంటుంది. శారీరక శ్రమల జీవన పరిస్తితులూ, మేధా శ్రమల జీవన పరిస్తితులూ ఒక దాని కొకటి సంబంధం లేనంత దూరంగా విడిపోయి వుండేలాగ దోపిడీ వర్గం ఏర్ప రుస్తుంది. ఆ తేడానే అది ఎప్పుడూ నిలిపి వుంచుతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో, అట్టడుగు శారీరక శ్రమలు పొందేదానికీ, ఉన్నత మేధా శ్రమలు పొందే దానికీ, అపారమైన తేడా వుండడం చూశాక, 'ఇదంతా సహజమైన తేడాయే' అనగలమా? ఈ తేడా అంతా ఆయా శ్రమల్ని నేర్చుకోడానికి అవసరమయ్యే విలువల తేడాని బట్టి వచ్చేదే — అనగలమా? అలాంటి అవగాహనతోనే ఈ తేడాని చూస్తే, ఆ అవగాహన పూర్తిగా దోపిడీ అవగాహన అవుతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో, మేధాశ్రమలు కూడా దోపిడీకి గురి అవుతాయి— అనేది, జనరల్ సూత్రంగా కరెక్టే. కానీ, 'ఉన్నత మేధా శ్రమల' విషయం మాత్రం ప్రత్యేక పరిస్తితి. ఈ శ్రమలకు కూడా మిగతా వాటిలాగే 'శ్రమ శక్తి విలువ' మాత్రమే దొరుకుతుందనీ, అవి ఎంత విలువని పొందుతున్నాయో అదంతా వాటి 'శ్రమ శక్తి విలువ'గానే వుంటుందనీ, ఈ శ్రమలు కూడా చాలా 'అదనపు విలువ'ని పోగొట్టు కుంటాయనీ — ఇలా అర్థం చేసుకోకూడదు.

పెట్టుబడిదారుడి దగ్గిర పని చేసే ప్రతీ శ్రమా, 'శ్రమ శక్తి విలువ'ని మాత్రమే పొందుతుంది— అనేది, 'జనరల్ సూత్రం'. ఏ జనరల్ సూత్రమూ కొన్ని ప్రత్యేక సందర్భా లలో యథాతథంగా వర్తించదు. అట్టడుగు శారీరక శ్రమల పరిస్తితీ, ఉన్నత మేధా శ్రమల పరిస్తితీ ఒకే రకంగా వుండవు. అంటే, వాటిమీద దోపిడీ ఒకే స్థాయిలో వుండదు. ఉన్నత మేధాశ్రమల విషయంలో, కొన్ని సార్లు దోపిడీ వుండకపోవచ్చు కూడా. ఆ ఉన్నత మేధా శ్రమలలోనే ఒక పెట్టుబడిదారుడి దగ్గిర వున్న పరిస్తితికీ, ఇంకో పెట్టుబడి దారుడి దగ్గిర వున్న పరిస్తితికీ కూడా తేడా వుంటుంది. ఒకే రకపు ఇద్దరు ఇంజనీర్లలో ఒకరు చాలా పెద్ద పెట్టుబడిదారీ సంస్థలో పనిచేస్తూ చాలా పెద్ద జీతం పొందుతూవుంటే, రెండో ఇంజనీరు చిన్న పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేస్తూ చాలా దోపిడీకి గురి అవుతూ వుండవచ్చు. ఈ రకమైన ప్రత్యేక విషయాలన్నిటినీ, సందర్భాల్ని బట్టి అర్థం చేసు కోవాలి. ఇక్కడ జనరల్ విషయం ఏమిటంటే, అట్టడుగు శారీరక శ్రమలు తమ 'శ్రమ విలువ'లో నించి ఎంత భాగం (ఎంత శాతం) పోగొట్టుకుంటున్నాయో, ఉన్నత మేధా శ్రమలు కూడా తమ 'శ్రమ విలువ'లోనించి అంత భాగమూ పోగొట్టుకుంటాయనే రకంగా అర్థం చేసుకో కూడదు.

ఒక దోపిడీ సమాజంలో చాలా ఘోరమైన దోపిడీకి గురి అయ్యేది మొట్టమొదట శారీరక శ్రమలూ, తర్వాత కిందిస్థాయి మేధా శ్రమలూ, ఆ తర్వాతే ఉన్నతస్థాయి మేధా శ్రమలూ. ఈ ఉన్నత స్థాయిలో కొన్ని శ్రమలు ఎప్పుడూ దోపిడీకి గురికాక పోవచ్చు కూడా.

దోపిడీ సమాజంలో, ఒక ఉన్నత మేధా శ్రమ చేస్తూ అపారంగా సంపాయించే ప్రతీ వ్యక్తికీ, ఆ సంపాదన అంతా తన 'కష్టార్జితం'లాగే కనపడుతుంది. అసలు ఏ శ్రమా చెయ్యకుండా లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూలాగే వాళ్ళకే వాళ్ళ ఆదాయాలు వాళ్ళ కష్టార్జితాల లాగ కనపడుతూ వుంటే, ఎంతో కొంత శ్రమ చేసే వ్యక్తికి తన ఆదాయం అంతా తన కష్టార్జితం లాగే కనపడడంలో ఆశ్చర్యం లేదు. కానీ, అదంతా పెద్ద భ్రమ.

# శ్రమ నిధీ, అదనపు శ్రమ నిధీ !

సమాజంలో శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ కలిసి ఉత్పత్తి చేసిన మొత్తం ఉత్పత్తినే అన్ని సెక్షన్ల శ్రామికులూ, అన్ని సెక్షన్ల దోపిడీ దారులూ పంచుకోవాలి కదా? 'మొత్తం ఉత్పత్తుల రాసి'లోనించి శ్రామికవర్గాని కంతటికీ కలిసి మొత్తం జీతాలుగా వెళ్ళే భాగాన్ని, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, 'శ్రమ నిధి' (లేబర్ ఫండ్) అంటారు. అంటే,

'శ్రమ' చేసినందుకు బదులుగా వెళ్ళాల్సింది అదే— అని వాళ్ళ అర్థం. అంటే, 'జీతమే శ్రమకువున్న విలువ' అని చెప్పడం. ఈ 'శ్రమ నిధే' (జీతాల మొత్తమే) శ్రామిక వర్గంలో వున్న అన్ని సెక్షన్లకూ అనేక భాగాలై అందాలి. ఆలా అందేటప్పుడు, ఆ 'శ్రమ నిధి'లో నించి ఏ సెక్షన్‌కి ఎక్కువ అందినా, ఏ సెక్షన్‌కి తక్కువ అందినా, ఆ తేడాల్ని పక్కన పెడితే, మొత్తంమీద ఆ 'శ్రమ నిధే' శ్రామిక వర్గాని కంతటికీ అందే భాగం. ఇది ఆ వర్గానికంతటికీ —'శ్రమ శక్తి విలువ'. శ్రామిక వర్గం, తన రక రకాల శ్రమ శక్తుల్ని ఇవ్వాలీ అంటే, 'మొత్తం ఉత్పత్తి'లోనించి ఆ వర్గానికి కనీసం అంత భాగం అందాలన్నమాట!

'శ్రమ నిధి' అనే మాటని మనం ఒప్పుకోము. ఎందుకంటే, 'శ్రమ నిధి' అనే మాట— "శ్రమలకు చెందవలసిన నిధి ఇదే, ఇంతే" అనే అర్థాన్ని ఇస్తుంది. శ్రామిక వర్గం అంతా కలిసి మొత్తం ఎంత ఉత్పత్తి చేసిందో అదే అసలైన శ్రమ నిధి. అంతే గానీ, అందులో కొంత భాగమే 'శ్రమ నిధి' కాదు.

పెట్టుబడిదారీ ఆర్థికవేత్త దృష్టిలో, 'మొత్తం ఉత్పత్తి' నించి 'శ్రమ నిధి' పోగా మిగిలిన భాగం, పెట్టుబడిదారీ వర్గానికి వుండవలసినదే — లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ వగైరాల కోసం.

కానీ మన దృష్టిలో —మొత్తం ఉత్పత్తిలో నించి 'శ్రమ నిధి' పోగా మిగిలినదంతా కూడా శ్రమ నిధే. అది 'అదనపు శ్రమ నిధి'. అంటే 'అదనపు విలువ.'

## జీతాలన్నీ 'అదనపు విలువ'ని ఇచ్చేవేనా?

నిత్య జీవితంలో, కార్మికులేగాక అనేక రకాల 'ఉద్యోగులు' అనేక రకాల పనుల కోసం జీతాలు పొందుతూ వుంటారు. మంత్రులూ, గవర్నర్లూ, కలెక్టర్లూ, మేనేజర్లూ, లాయర్లూ, గుమాస్తాలూ, ఆఫీసర్లూ, లెక్చరర్లూ, ప్రొఫెసర్లూ, జడ్జీలూ, సైనికులూ, రచయితలూ, యాక్టర్లూ, తోట పని మనుషులూ, వంట పని మనుషులూ— ఇలా, అనేక మంది అనేక రకాల పనులు చేస్తూ జీతాలు తీసుకుంటారు. అయితే 'జీతాలు' తీసుకునే ఉద్యోగులందరూ అదనపు విలువని ఇచ్చే వారేనా? జీతం తీసుకునే ప్రతి వ్యక్తీ దోపిడీకి గురి అవుతున్నట్టేనా? — ఈ విషయాలు ఈ సంపుటంలోనే "ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా" చాప్టరులోనూ, 2 వ సంపుటంలో "చలామణీ ఖర్చులూ" చాప్టర్లలోనూ వివరంగా చూస్తాం.

## అందరూ శ్రమ చేసినా 'అసమానత్వం' సమస్య పరిష్కారం కాదు!

'శ్రమ దోపిడీ'కి పరిష్కారం ఏమిటి? — 'శ్రమ చెయ్యని వర్గం అనేది లేకుండా అందరూ శ్రమ చెయ్యడమే' అని చూశాం.

'అందరూ శ్రమ చెయ్యడం'— అంటే? ప్రతీ వ్యక్తీ 'ఏదో ఒక శ్రమ' చేస్తున్నాడనే అనుకుందాం. అప్పుడు, దోపిడీ సమాజ లక్షణాలన్నీ పోయినట్టేనా?— పెట్టుబడిదారీ రాజ్యాధికారాన్ని రద్దు చేశామనీ, 'స్వంత ఆస్తుల్ని, సమిష్టి ఆస్తులుగా మార్చే నూతన సమాజ నిర్మాణం' ప్రారంభమైందనీ, ఆ నూతన సమాజంలో ప్రతి మనిషీ (స్త్రీ పురుషులందరూ) ఏదో ఒక శ్రమ చేస్తున్నారనీ, ఎవరి శ్రమ విలువ వారికే దక్కుతోందనీ —అనుకుందాం. సమాజంలో పిల్లలూ, వృద్ధులూ, రోగులూ, అంగవైకల్యం కలవారూ పని చెయ్యలేరు కాబట్టి, వారిని పోషించడానికి, శ్రమ చేసే ప్రతి మనిషీ తన శ్రమ ఫలితంలోంచి కొంత భాగం వదులుకోవాలి. అలా వదులుకోవలసిన భాగం తప్ప, మిగతాదంతా ఎవరి 'శ్రమ ఫలితం' వారికే దక్కు తోందనే అనుకుందాం. ఇప్పుడు 'భూమి కౌళ్ళు' లేవు, 'వడ్డీలు' లేవు, 'లాభాలు' లేవు. పెట్టుబడిదారుడూ, కార్మికుడూ అనే తేడాలు లేవు. అందరూ 'ఏదో ఒక' శ్రమ చేస్తారు. దాని విలువ తీసుకుంటారు. ఇదంతా చాలా సవ్యంగా, ఖచ్చితంగా, ఎక్కడా మోసం లేకుండా జరుగు తోందనే అనుకుందాం, అయితే ఇక్కడితో సమస్య అంతా తీరిపోయినట్టేనా? 'నూతన సమాజం' అంటే ఇదేనా?

'నూతన సమాజం' అంటే ఇదో కాదో, దోపిడీ అనేది పోయిందో లేదో— తెలుసుకోవడానికి, ఇప్పుడు కొన్ని పరిస్థితులు చూద్దాం.

శ్రమలన్నీ దోపిడీ సమాజంలో వున్నట్టే, కుట్టూ, నేతా, భూమి దున్నడం, చదువు చెప్పడం, వంట చెయ్యడం,

వైద్యం చెయ్యడం, బండితోలడం — లాంటి తేడాలతోనే ఎప్పుడూ వుంటాయి. శ్రమలలో తేడాలు పోవడం ఎప్పటికీ జరగదు. శ్రమలలో, తేడాలు తప్పనిసరి అయినప్పుడు, వాటి 'శ్రమ శక్తుల'కు అయ్యే ఖర్చుల్లో తేడాలు కూడా తప్పనిసరే అవుతాయి. ఈ పరిస్థితి 'నూతన సమాజం'లో కూడా ఆ శ్రమల విలువల్ని తేడాగానే చేస్తుంది.

'నూతన సమాజం'లో అసలు విలువ లెక్కలే వుండవనీ, విలువ లెక్కలూ అమ్మకాలూ కొనుగోళ్ళూ లేకుండానే ఉత్పత్తుల్ని వాడు కోవడం జరుగుతుందనీ అనుకున్నాం కదా? — కానీ, ఆ మార్పు, నూతన సమాజంలో మొట్టమొదటి నించే జరగదు. కొన్ని దశలు గడిచిన తర్వాత, అప్పటికి జరగవలసిన మార్పులన్నీ జరిగిన తర్వాత, దానికి తగిన పరిస్తితులు ఏర్పడినప్పుడే అది ప్రారంభమవుతుంది.

అసలు, నూతన సమాజం అనేది, భూముల మీద భూస్వాముల ఆస్తి హక్కుల్ని రద్దు చెయ్యడం వంటి చర్యలతో ప్రారంభమవుతుంది. ఆ ప్రారంభంలోనే, పాత సమాజపు లక్షణాలన్నిటినీ (సంబంధాలన్నిటినీ) తీసి వెయ్యడం సాధ్యం కాదు. తక్షణమే రద్దు చెయ్యడానికి వీలైన లక్షణాలు మాత్రమే మొదట రద్దవుతాయి.

అలా ప్రారంభమయ్యే నూతన సమాజంలో ప్రతీ వ్యక్తీ (స్త్రీ పురుషులందరూ) శ్రమ చెయ్యాలి. అయితే, కొందరు శారీరక శ్రమలు చేస్తే, కొందరు మేధా శ్రమలు చేస్తారు కదా? శారీరక శ్రమ చేసే మనిషి ఆదాయం తక్కువగా వుంటే, మేధా శ్రమ చేసే మనిషి ఆదాయం ఎక్కువగా వుంటుంది కదా? అలాంటప్పుడు, ఆ మనుషుల మధ్య, నూతన సమాజంలో అయినా సమానత్వం ఎలా ఏర్పడుతుంది?— అందరూ శ్రమ చేసినా సమానత్వం ఏర్పడే అవకాశాలు లేకపోతే, నూతన సమాజం అయినా సమానత్వాన్ని ఎలా ఏర్పర్చగలుగుతుంది?—ఇవీ, ఇక్కడ ఎదురయ్యే ప్రధానమైన ప్రశ్నలు!

ఒక మేధా శ్రమ విలువకీ, ఒక శారీరక శ్రమ విలువకీ దోపిడీ సమాజాలలో వుండేటంత ఎక్కువ తేడా నూతన సమాజంలో వుండదు. ఎందుకంటే, ఆ సమాజం, తన ప్రారంభంనించే ఆ తేడాని తగ్గించడానికి ప్రయత్నిస్తుంది గనక.

మేధా శ్రమల జీతాల్ని కొంత తగ్గించివేసి, శారీరక శ్రమల జీతాల్ని కొంత పెంచుతుంది. మేధా శ్రమలకు వుండే ప్రత్యేక సౌకర్యాల్ని రద్దు చేసి, అందరికీ కొన్ని సౌక ర్యాలు సమానంగా అందుబాటులో వుండేలాగ చేస్తుంది. ఈ మార్పుని నూతన సమాజం సాధించడం సాధ్యమే.

అయితే, మేధా శ్రమ విలువకీ, శారీరక శ్రమ విలువకీ తప్పనిసరిగా వుండే తేడాని మాత్రం నూతన సమాజం కూడా తీసివెయ్య లేదు. ఆ తేడాని తీసివెయ్యాలని ప్రయత్నిస్తే ఏం జరుగుతుందో మళ్ళీ ఇక్కడ కొత్తగా చూడనక్కర లేదు. వైద్యానికీ, కుట్టుకీ ఒకటే విలువని వుంచితే ఏం జరిగిందో గతంలో చూసిందే ఇక్కడ కూడా జరుగుతుంది. కొంత కాలానికి, వాటి విలువలు, తప్పని సరిగా తేడాగా అయిపోతాయి. కాబట్టి, శ్రమలన్నిటికీ ఒకే విలువని ఏర్పరచడం నూతన సమాజానికి కూడా సాధ్యం కాదు. ఆ సమాజం వాటి తేడాల్ని మితిమీరిన స్థాయిలో లేకుండా చెయ్యగలుగుతుందేగానీ అసలు తేడాలే లేకుండా మాత్రం చెయ్యలేదు.

శ్రమలలో కొన్ని శ్రమలు ఎక్కువ విలువ కలవి గానూ, కొన్ని శ్రమలు తక్కువ విలువ కలవిగానూ వున్నప్పుడు, ప్రతీ మనిషీ ఏదో 'ఒక్క శ్రమే' చేస్తూవుంటే, దాని ఫలితాలు ఎలా వుంటాయి? ఈ ఫలితాల్ని 'విలువ' కోణంలోనూ, 'ఉపయోగపు విలువ' కోణం లోనూ కూడా చూడాలి.

మొదట 'విలువ' కోణంలో :

ఒక మనిషి కుట్టుపని చేస్తే, ఒక మనిషి వైద్యం పని చేస్తాడు కదా? కుట్టు మనిషికి తక్కువ ఆదాయం వుంటే, వైద్యం మనిషికి ఎక్కువ ఆదాయం వుంటుంది. వైద్యం మనిషికి ఎక్కువ ఆదాయం అనేది, ఆ మనిషి స్వంత శ్రమ ఫలితమే కావచ్చు. ఇతరుల్ని దోచడం ద్వారా సంపా దించేది కాకపోవచ్చు. అయినా, అప్పుడు పరిస్తితి ఎలా వుంటుందంటే — తక్కువ విలువ గల శ్రమ చేసే మనిషి ఆదాయం ఎప్పుడూ తక్కువ గానూ, ఎక్కువ విలువగల శ్రమచేసే మనిషి ఆదాయం ఎప్పుడూ ఎక్కువగానూ వుంటాయి.

'మనుషులందరూ మొదటి నించీ ఎక్కువ విలువగల శ్రమలే నేర్చుకోరాదా' — అందామా? అయితే, సమాజానికి వైద్యమే గానీ, కుట్టుపని అక్కరలేదా? మేధా శ్రమలే గానీ, శారీరక శ్రమలు అక్కరలేదా? — సమాజానికి అన్ని రకాల శ్రమలూ కావాలి. అట్టడుగు శారీరక శ్రమ లెన్నో కావాలి. ప్రతీ శ్రమలోనూ కొంత కొంత మంది జనం వుండాలి. — ఇది తప్పనిసరి! శ్రమల విలువలలో ఎక్కువ తక్కువ తేడాలు వుంటాయి. — ఇది కూడా తప్పనిసరే.

ఈ 2 షరతుల మధ్యా, ఒక మనిషి, 'ఒకే శ్రమ' చేస్తూవుంటే, మనుషులు కొన్ని సెక్షన్లుగా అయిపోతారు. తక్కువ ఆదాయాలు గల వాళ్ళంతా ఒక సెక్షన్‌గానూ, మధ్య రకం ఆదాయాలు గల వాళ్ళంతా ఒక సెక్షన్ గానూ, ఎక్కువ ఆదాయాలు గల వాళ్ళంతా ఒక సెక్షన్‌గానూ అవుతారు.

ఎక్కువ ఆదాయాలు గల వాళ్ళ సంతానం, ఎక్కువ ఖర్చుపెట్టగల చదువులు చదివి, తమ తల్లిదండ్రుల లాగే, ఎక్కువ విలువ గల పనులలోకే వెళ్తారు. రెండో వైపు, తక్కువ ఆదాయాలు గల వాళ్ళ సంతానం, మళ్ళీ తక్కువ విలువ గల పనులు చేసే వారిగా మాత్రమే తయారవుతారు.

పిల్లల చదువుల ఖర్చులన్నీ కొంత స్థాయి వరకూ సమాజమే భరిస్తుంది — అనుకున్నా, తేడాలు ఏర్పడే పరిస్తితిలో పెద్ద మార్పు వుండదు. తల్లి దండ్రుల ఆదాయాలలో తేడాలు పిల్లల జీవన పరిస్తితుల్ని ఏదో ఒక స్థాయిలో, ఏదో ఒక పద్ధతిలో, ప్రభావితం చేసి తీర తాయి. — ఈ రకంగా, 'ఒక మనిషి ఒకే శ్రమ చెయ్యడం' అనే పరిస్తితి వల్ల, ఆదాయాలలో తప్పని సరిగా తేడాలు ఏర్పడి, మనుషులు ఇంకా 'అసమానతల' లోనే వుండి పోతారు. మరి, నూతన సమాజంలో కూడా 'సమానత్వానికి' ఎక్కడ అవకాశం వున్నట్టు?

ఇప్పుడు శ్రమలకు వుండే వేరు వేరు విలువల సంగతి అలా వుంచి, శ్రమలకు వుండే వేరు వేరు 'ఉపయోగపు విలువ'ల సంగతి చూద్దాం. ప్రతీ మనిషీ ఏదో 'ఒకే శ్రమ' చేస్తాడు కదా? అంటే కొందరు కుట్టు, కొందరు వైద్యం, కొందరు చదువు చెప్పడం, కొందరు వంట చెయ్యడం, కొందరు బళ్ళు తోలడం, కొందరు రోడ్లు వూడ్చడం, కొందరు డ్రైనేజీలు శుభ్రం చెయ్యడం — ఇలాగ.

మనిషి జీవితానికి ప్రతీ పనీ అవసరమే. కానీ, ఒక మనిషి, జీవిత మంతా ఒకే పని చేస్తూ వున్నప్పుడు, ఆ పని చాలా విసుగు కలిగించేదిగా తయారవుతుంది. అది ఏ రకం పని అయినా, జీవితమంతా ప్రతిరోజూ, ప్రతీ గంటా, ఒకే పని చెయ్యడం అనేది, మనిషిని ఘోరంగా హింసిస్తుంది. కుట్టేమనిషి ఎప్పుడూ కుడుతూ వుండడం, నేసే మనిషి ఎప్పుడూ నేస్తూ వుండడం, దున్నే మనిషి ఎప్పుడూ దున్నుతూ వుండడం, బండి తోలే మనిషి ఎప్పుడూ తోలుతూ వుండడం, రోడ్లు వూడ్చే మనిషి ఎప్పుడూ వూడుస్తూ వుండడం, పాయిఖానాలు కడిగే మనిషి ఎప్పుడూ కడుగుతూ వుండడం — ఈ రకంగా, ఒక మనిషి ప్రతీ నిత్యమూ, ప్రతీ గంటా ఒకే పని చెయ్యడం, ఆ మనిషిని నిర్జీవమైన యంత్రంలాగ తయారు చేస్తుంది. ఈ పరిస్తితి 'పని' మీదే విముఖత కలిగించి 'పని'లో నిజమైన ఆనందాన్ని చంపేస్తుంది.

శారీరక శ్రమల విషయంలో అయితేనే ఇలా విసుగు కలుగుతుందనీ, మేధా శ్రమల విషయంలో ఇలా విసుగు కలగదనీ అనుకుంటే, అది చాలా పొరపాటు. చేసేది ఏ శ్రమ అయినా, జీవితమంతా ఒకే శ్రమ చేస్తే, అది తప్పనిసరిగా ఆ మనిషికి బాధాకరమైన విషయంగానే తయారవుతుంది.

ఒకవేళ, ఒక వైద్యుడో, ఒక ఉపాధ్యాయుడో, చాలా మూర్ఖంగా — " నా పని మీద నాకెప్పుడూ విసుగు కలగ లేదు" అని ప్రకటిస్తే ప్రకటించ వచ్చు, కానీ, ఆ మాట 'శారీరక శ్రమలు' చేసే మనుషులు మాత్రం అనరు. ఎప్పుడూ లారీలు నడిపే మనిషికీ, ఎప్పుడూ గనులు తవ్వే మనిషికీ, ఎప్పుడూ బరువులు మోసే మనిషికీ, ఎప్పుడూ వంటచేసే మనిషికీ, ఆ పనుల్లో విసుగెత్తకుండా వుండ డానికి అవకాశమే లేదు.

ఎప్పుడూ డ్రైనేజి గొట్టాలు శుభ్రం చెయ్యడంలో మునిగి తేలే మనిషినీ, ఎప్పుడూ కుర్చీ దిగకుండా రాత పనిలో కూర్చునే మనిషినీ ఒక్కలాగే చూస్తూ — "ఇద్దరూ ఒక్కలాగే పనిచేస్తున్నారు. ఇద్దరూ సమానులే" అంటే, అది 'ఒక్కలాగే పనిచేయ్యడం' అవుతుందా? ఇద్దరూ సమానులు అయినట్టేనా? — కాదు.

ఒక మనిషి ఒక్క శ్రమే చేయ్యడం వల్ల, అంతా పాత సమాజాలలోలాగే, కొన్ని సెక్షన్లు ఎప్పుడూ మేధా శ్రమల్లో వుంటే, కొన్ని సెక్షన్లు ఎప్పుడూ శారీరక శ్రమల్లోనే వుండవలసి వస్తుంది. ఈ శారీరక శ్రమల సెక్షన్లు, మేధా పరంగానూ, సాంస్కృతికంగానూ అభివృద్ధి చెందే మార్గమే వుండదు. ఈ పరిస్థితి గతంలోలాగానే మనుషులను వృత్తులవారీగా విభజించి వుంచుతుంది. మేధాశ్రమలు చేసే వాళ్ళంతా ఒక సెక్షన్ అయితే, శారీరక శ్రమలు చేసేవాళ్ళంతా ఒక సెక్షన్ అవుతారు. ఎవరి సమస్యలు వారివీ, ఎవరి జీవిత విధానం వారిదీ, అవుతాయి. అంటే, ఒక మనిషి ఒక్క శ్రమే చెయ్యడం అనేది ఏ మనిషికైనా ఘోరమైన శిక్షలాగే పరిణమిస్తుందనే సమస్యతోపాటు, ఇది మనుషుల్ని ఇంకా వేరు వేరు సెక్షన్లుగానే విభజించి వుంచుతుంది. మనుషులు అసమాన శ్రమ పరిస్తితుల్లో వుండి పోవడం అనేది — దోపిడీ సమాజాల నించి సంక్రమించే లక్షణమే.

ఒక మనిషి ఒకే శ్రమ చెయ్యడం అనే విషయాన్ని 'విలువ' దృష్టితో చూసినా, 'ఉపయోగపు విలువ' దృష్టితో చూసినా, ఈ రెండు కోణాలలోనూ కూడా అది వైరుధ్యాలతో నిండి వుంటుంది. ఇది మనుషుల ఐక్యతకీ, సమానత్వానికీ, వ్యక్తిలో వివిధ కోణాల అభివృద్ధికీ పనికి రాని విషయంగా వుంటుంది.

ఒక మనిషి జీవితమంతా ఒకే శ్రమ చెయ్యటం అనే 'శ్రమ విభజన', పెట్టుబడిదారీ స్వభావం గల శ్రమ విభజన. (ఈ విషయం ఈ సంపుటంలోనే, 'మాన్యు ఫ్యాక్చర్' చాప్టర్లో వివరంగా చూస్తాం.) ఒక మనిషి ఎప్పుడూ ఒకే పని చేస్తే ఆ పనిలో ఆరితేరి, తక్కువ కాలంలోనే ఎక్కువ పని చెయ్యగలుగుతాడు. ఈ పరిస్తితి పెట్టుబడిదారీ విధానానికి కావాలి. ఈ పద్ధతి వల్ల శ్రమచేసే మనుషులు ఎంత హింసపడతారో, వారి శారీరక, మానసిక ఆరోగ్యాలకు ఎంత హాని జరుగుతుందో, అదంతా పెట్టుబడిదారుడికి అవసరం లేదు.

ఈ సమస్యకి పరిష్కారం ఏమిటి?

మనుషులు, 'విలువ కోణం'లోనూ, 'ఉపయోగపు విలువల కోణం' లోనూ కూడా సమానం కావాలి. దానికి

మార్గం ఏమిటి? — ఒక మనిషి ఒకే శ్రమ చెయ్యడం గాక, కొన్ని వేరు వేరు శ్రమలు చెయ్యడమే దానికి మార్గం. అదే పరిష్కారం. అలా చేసినప్పుడు, 'విలువ' కోణంలో వచ్చే సమస్యా, 'ఉప యోగపు విలువ' కోణంలో వచ్చే సమస్యా కూడా పరిష్కార మవుతాయి. అంటే, 'పెట్టుబడిదారీ శ్రమ విభజన'ని 'నూతన శ్రమ విభజన'గా మార్చాలని దీని అర్థం.

ఆ మార్పు ఎలా జరగాలో ఇప్పుడు చూద్దాం.

'నూతన సమాజం'లో మొత్తం 100 రకాల శ్రమలు వున్నాయి— అనుకుందాం. ఆ శ్రమలలో మేధా శ్రమలు 40, శారీరక శ్రమలు 60 – అనుకుందాం. మేధా శ్రమల్ని, పై స్థాయి శ్రమలూ, కింది స్థాయి శ్రమలూ – అని 2 స్థాయి లుగా చేద్దాం. అలాగే శారీరక శ్రమల్ని కూడా 2 స్థాయిలుగా చేద్దాం. అంటే సమాజంలో వున్న మొత్తం శ్రమలన్నీ 4 స్థాయిలలో వుంటాయి. 'పెట్టుబడిదారీ సమాజంలో వుండే శ్రమలు ఇంకా అనేక స్థాయిలలో (అనేక గ్రేడులలో) వుంటాయి. నిజానికి శ్రమలలో అన్ని స్థాయిలు అక్కర లేదు. ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, అన్ని తేడాల్నీ కుదించి, శ్రమలన్నిటినీ 4 గ్రూపులుగా మాత్రమే చేస్తున్నాం. **A,B,C,D** — అనే గ్రూపులుగా. కొన్ని రకాల శ్రమలు కలిసి ఒక గ్రూపులో వుంటాయి. ఆ గ్రూపులో ఏ శ్రమకైనా ఒకే విలువ వుంటుంది. అంటే, ఒకే స్థాయి విలువ గల శ్రమలన్నీ ఒక గ్రూపు అన్నమాట! అలా 4 గ్రూపులు. వాటి వివరాలు ఇలా వున్నాయి అనుకుందాం:

**A.** ఉన్నత మేధా శ్రమలు :
ఈ శ్రమలన్నిటికీ ఒకే విలువవుందని అర్థం.
ఈ శ్రమలలో ప్రతీ శ్రమా ఉన్నత మేధా శ్రమే.
ఈ స్థాయిలో వున్న శ్రమలు —18 రకాలు

**B.** ఇవి కిందిస్థాయి మేధా శ్రమలు:
ఈ శ్రమలన్నిటికీ ఒకే విలువ.
ఈ స్థాయిలో వున్న శ్రమలు —22 రకాలు

**C.** ఉన్నత శారీరక శ్రమలు:
ఈ శ్రమలన్నిటికీ ఒకే విలువ.
ఈ స్థాయిలో వున్న శ్రమలు —25 రకాలు

**D.** కింది స్థాయి శారీరక శ్రమలు :
ఈ శ్రమలన్నిటికీ ఒకే విలువ.
ఈ స్థాయిలో వున్న శ్రమలు —35 రకాలు

మొత్తం సమాజంలో వున్న శ్రమలు - 100 రకాలు

శ్రమలన్నీ ఇలా 4 స్థాయిలలో, 4 రకాల విలువలతో వుండడం తప్పనిసరి అయినప్పుడు, ఒక మనిషి ఒకే శ్రమ చెయ్యడం అంటే, మనుషులందరూ 4 స్థాయిలలో విడి పోయి వుండడమే.

కాబట్టి, ఇప్పుడు జరగవలసిన మార్పేమిటంటే, ప్రతీ మనిషీ ప్రతీ గ్రూపు నించీ ఒక శ్రమ చెయ్యాలి. ఈ పద్ధతిలో ప్రతీ మనిషి వంతుకీ, 2 శారీరక శ్రమలూ, 2 మేధా శ్రమలూ వస్తాయి. ఈ 4 శ్రమలూ 4 రకాల విలువలు గలవి. ఒక శ్రమ చాలా తక్కువ విలువగలదీ, ఒక శ్రమ చాలా ఎక్కువ విలువ గలదీ, మధ్యలో వుండే 2 శ్రమలూ 2 స్థాయిల విలువగలవీ.

వైద్యం శ్రమ, ఉన్నత స్థాయి శ్రమగా, **A** గ్రూపు శ్రమగా వున్నదనుకుందాం. ప్రతీ మనిషీ ఒక ఉన్నతస్థాయి శ్రమ చెయ్యడం అంటే, ప్రతీ మనిషీ వైద్యం చెయ్యాలని అర్థమా? కాదు. ఉన్నత స్థాయిలో మొత్తం 18 శ్రమలు వున్నాయి. ఆ గ్రూపులోంచి ఏ శ్రమ చేసినా ఒక ఉన్నత స్థాయి శ్రమ చేసినట్టే అర్థం. ఒక్కొక్క గ్రూపులోనించి ఒక్కొక్క శ్రమ చేస్తే, ఒక మనిషి, శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ, మధ్యరకం శ్రమలూ అన్నీ చేసినట్టు అవుతుంది. అప్పుడు ప్రతీ మనిషి శ్రమకూ ఒకే విలువ ఏర్పడుతుంది. అంటే, ప్రతీ మనిషీ ఒకే విలువగల శ్రమ చేసినట్టు అవుతుంది.

దీన్ని చిన్న ఉదాహరణ ద్వారా చూద్దాం. 4 గ్రూపుల్లో శ్రమల విలువలు, కొంత కొంత తేడాగా, ఇలా వున్నాయి— అనుకుందాం. అన్ని శ్రమల్నీ, ఒకే పరిమాణంలో తీసు కుంటున్నామని అర్థం.

1 వ గ్రూపులో, ఏ శ్రమ అయినా, విలువ — 4 రూ.లు
2 వ గ్రూపులో, ఏ శ్రమ అయినా, విలువ — 3 రూ.లు
3 వ గ్రూపులో, ఏ శ్రమ అయినా, విలువ — 2 రూ.లు
4 వ గ్రూపులో, ఏ శ్రమ అయినా, విలువ — 1 రూ.

ఒక వ్యక్తి వరసగా 4 రోజులు, ఒక్కొక్క గ్రూపులోనించి ఒక్కొక్క శ్రమ చేస్తాడనుకుందాం. (చేసే శ్రమని రోజూ మార్చాలని దీని అర్థం కాదు. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసమే ఇలా చూస్తున్నాం.) ఒక వ్యక్తి, వరసగా 4 రోజులు, 4 గ్రూపుల్లో శ్రమలు చేస్తే, ఆ విలువలన్నీ కలిసి 1 + 2 + 3 + 4 =10 విలువ అవుతుంది. అంటే, ఆ వ్యక్తి 4 రోజుల్లో 10 రూ.ల. విలువ గల శ్రమ చేసినట్టు అర్థం.

ఇంకో వ్యక్తి, ఆ 4 గ్రూపులలో నించే మొదటి వ్యక్తి చేసిన రకం శ్రమలు కాకుండా వేరే రకం శ్రమలు చేశా డనుకుందాం. అతని శ్రమ విలువ కూడా, 1+2+3+4 =10 గానే వుంటుంది. ఈ ఇద్దరు వ్యక్తులూ వేరు వేరు శ్రమలు చేసినప్పటికీ, ఇద్దరి శ్రమల విలువలూ సమానం.

ఇలాగే, ప్రతీ వ్యక్తీ కొంత కాలానికి ఒక సారి, చేసే శ్రమని మార్చుకుంటూ 4 గ్రూపుల నించీ ఒక్కో శ్రమ చొప్పున చేస్తే అందరి శ్రమల విలువా ఒకే రకంగా వుంటుంది. అప్పుడు ఒకరు ఎక్కువ శ్రమ చేశారనీ, ఒకరు తక్కువ శ్రమ చేశారనీ, ఆ తేడా లేమీ వుండవు. ఈ పరిస్థితి

ఒక అద్భుతమైన మార్పుకి దారి తీస్తుంది. విలువనే తీసివెయ్య గలిగే మార్పుకి! విలువని తీసివెయ్యడం అంటే 'డబ్బు లెక్కలు' వదిలెయ్యడం. ఎవరి కెంత జీతం వుండాలీ, ఎవరి కెంత ఆదాయం రావాలీ— అనే లెక్కలు ఇక అవసరం లేదు.

అందరూ 2 రకాల శారీరక శ్రమలూ, 2 రకాల మేధా శ్రమలూ చేస్తారు కాబట్టి, అందరి శ్రమల ద్వారా, మొత్తం అందరికీ కావలసిన 'ఉత్పత్తుల రాసి' తయారవుతుంది. దాన్ని ఉత్పత్తి చెయ్యడంలో, అందరూ ఒక్క లాగే శ్రమ చేస్తారు. ఒకరి శ్రమ విలువ ఎక్కువా, ఒకరి శ్రమ విలువ తక్కువా అవదు కాబట్టి, ఆ ఉత్పత్తిని అందరూ సమాన మైన పద్ధతిలోనే వాడుకోవచ్చు. అంటే, అప్పుడు మను షుల మధ్య 'నూతన ఉత్పత్తి సంబంధాలు' ఏర్పడతాయి. శ్రమ చేసే కోణంలో మనుషులు సరిసమానమైన సంబంధాలలో వుంటారు. కాబట్టే, ఉత్పత్తుల్ని వాడుకునే కోణంలో కూడా సమాన సంబంధాలలోనే వుండడం సాధ్య మవుతుంది. అప్పుడు డబ్బుని తీసి వెయ్యడం, అంటే అమ్మకాలూ, కొనుగోళ్ళూ లేకుండా ఉత్పత్తుల్ని వాడు కోవడం సాధ్యమవుతుంది.

"విలువ అసహజమైనది. దాన్ని తీసివెయ్యాలి. మను షుల సంబంధాలు, 'విలువ' ద్వారా ఏర్పడే సంబంధాలుగా గాక, 'ఉపయోగపు విలువ' ద్వారా ఏర్పడే సంబంధాలుగా వుండాలి. అలాంటి సహజ సంబంధాల్ని నిర్మించుకోవాలి" అని మొదటి నించీ చెప్పుకుంటున్నాం. దానికి మార్గం ఇదే. మొదట— అందరూ శ్రమ చెయ్యడం — అనే మార్పు ప్రారంభంకావాలి. ఆ తర్వాత, పాత శ్రమ విభజనలో మార్పు ప్రారంభం కావాలి. మొదటి మార్పు ప్రారంభమైనా, రెండో మార్పు జరగకపోతే, అంటే, ఒక మనిషి ఒకే శ్రమ చెయ్యడం — జరుగుతూ వుండగా, విలువని తీసివెయ్య డానికి కావలసిన పునాది ఏర్పడదు. ఒక మనిషి ఒకే శ్రమ చేసే పరిస్థితుల్లో, ఒక మనిషి ఉత్పత్తి చేసే విలువ ఎక్కువ గానూ, ఇంకో మనిషి ఉత్పత్తి చేసే విలువ తక్కువగానూ వుంటాయి. ఉత్పత్తి చేసే చోట ఇద్దరూ అసమానంగా వుంటే, దాని వల్ల, ఆ ఉత్పత్తిని తీసుకునే చోట కూడా అసమానంగానే వుండవలసి వస్తుంది. అలాంటి పరి స్థితుల్లో విలువని తీసి వెయ్యడం ఎప్పటికీ సాధ్యం కాదు.

సమాజంలో ఏ మార్పు జరగాలన్నా దానికి అవసర మైన పరిస్థితులు ఏర్పడకుండా ఆ మార్పు జరగదు. శ్రమ చేసే విషయంలో సమాన పరిస్థితులు ఏర్పడినప్పుడే విలువ సమస్య అంతర్ధానమవుతుంది.— ఇదంతా విలువకు సంబంధించిన కోణం.

ఇక, 'ఉపయోగపు విలువ' కోణం చూస్తే, ఈ సమస్య కూడా ఇప్పుడు పరిష్కారమవుతుంది.— ఒక మనిషి ఎప్పుడూ ఒకే పని చెయ్యడం వల్ల కలిగే శారీరక, మానసిక నష్టాలు, వేరు వేరు శ్రమలు చెయ్యడం వల్ల పోతాయి. జీవితమంతా శారీరక శ్రమల్లో పడివుండే సెక్షన్లు, ఆ జీవితం నించి బయట పడగలుగుతాయి. ప్రతీ మనిషీ, శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ కూడా చెయ్యగల రక రకాల సమర్థతలు పొంది, అన్ని కోణాలలోనూ అభివృద్ధి చెందుతాడు. దీని వల్ల, మనుషుల జీవన పరిస్థితుల్లో సమానత్వం ఏర్పడుతుంది. ఇదంతా జరగాలంటే, ఒక మనిషి ఒకే పని చేసే 'పెట్టుబడిదారీ శ్రమ విభజన'ని, ఒక మనిషి కొన్ని వేరు వేరు పనులుచేసే 'నూతన శ్రమ విభజన'గా మార్చడం వల్లనే సాధ్యమవుతుంది.

'పాత శ్రమ విభజన'ని, 'కొత్త శ్రమ విభజన'గా మార్చుకోవడం గురించి ఇంకా 2 అంశాలు చూడాలి.

స్త్రీలకూ, పురుషులకూ మధ్య వున్న ఇప్పటి శ్రమ విభజన కూడా మారాలి. గ్రామానికీ, పట్టణానికీ మధ్య వున్న శ్రమ విభజన కూడా మారాలి.

దోపిడీ సమాజాలలో, ఇంటి పనీ, పిల్లల పెంపకమూ, వృద్ధుల సంరక్షణా స్త్రీలకే ప్రత్యేక విధులు. బయటి శ్రమలు చేసే స్త్రీలకు కూడా ఈ విధులన్నీ తప్పవు. ఈ 'శ్రమ విభజన' కూడా నూతన పద్ధతిగా మారాలి. ఇంత కాలమూ స్త్రీల విధులుగా వున్న పనులన్నీ పురుషులు కూడా చెయ్యడమూ ; పురుషులు మాత్రమే చేస్తూ వుండిన అన్ని రకాల శ్రమలూ స్త్రీలు కూడా చెయ్యడమూ — ఇలా ఈ రకం మార్పులు జరగాలి. (దీనికి సంబంధించిన ఇతర వివరాలు, ఈ సంపుటంలోనే, "ఉత్పాదక శ్రమా — అను త్పాదక శ్రమా" చాప్టర్లో చూస్తాము. గ్రామానికీ, పట్టణానికీ మధ్య వున్న శ్రమ విభజన గురించి కూడా ఈ సంపుటం లోనే, "యంత్రాలూ – భారీ పరిశ్రమా" చాప్టర్లో చూస్తాం.)

ఇప్పుడు, ఇక్కడ ప్రధానమైన ప్రశ్న —ప్రతీ మనిషీ రక రకాల శ్రమలు చెయ్యగలడా? మరీ ముఖ్యంగా, ఉన్నత మేధా శ్రమలు చెయ్యగలడా?— అనేది. ఈ సందేహం రావడం అంటే, ఈ నాడు మేధా శ్రమలు చేసే మనుషు లంతా ప్రత్యేక లక్షణాలు గలవారనీ, శారీరక శ్రమలు చేస్తున్న వారంతా 'మేధస్సు' లేకనే ఆ శ్రమలలో పడి వున్నారనీ భావించడం అన్నమాట! ఇలాంటి అభిప్రాయం వుండడం వల్లనే 'అందరూ మేధా శ్రమలు చెయ్యగలరా' అనే ప్రశ్న వస్తుంది.

ఈ నాడు గొప్ప 'ఇంజనీర్' అయిన వ్యక్తి, చిన్న తనం నించీ నిరుపేద కుటుంబంలో పెరిగి, ఎన్నడూ బడి మొహం ఎరగకుండా గొడ్లని కాస్తూ వుండి వుంటే, ఆ మనిషి ఇప్పటిలా గొప్ప ఇంజనీరు కాగలిగేవాడేనా?

మనుషుల శారీరక శక్తి సామర్థ్యాల్లో తేడాలు వున్నట్టే, మేధా శక్తి సామర్థ్యాలలో కూడా తేడాలు వుంటాయనే

మాట నిజమే. కానీ, శారీరక శక్తి సామర్థ్యాలలో తేడాలు, శారీరక శ్రమలు చెయ్యడానికి ఆటంకంగా వుండనట్టే, మేధా శక్తి సామర్థ్యాలలో తేడాలు కూడా మేధా శ్రమలు చెయ్యడానికి ఆటంకంగా వుండవు.

ఒక మనిషి శక్తి సామర్థ్యాలకు తగిన బాహ్య పరిస్తితులు లేకపోతే, ఆ మనిషిలో ఆ శక్తి సామర్థ్యాలు వున్న సంగతి ఎన్నడూ బయటపడదు.

శరీరం వున్న ప్రతీ మనిషీ 'శారీరక శ్రమ' చెయ్య గలిగినట్టే, 'మెదడు' వున్న ప్రతీ మనిషీ 'మేధా శ్రమ' చెయ్యగలడు. 'మేధా' శక్తులన్నీ మనుషుల్లో కొన్ని సెక్షన్ల సొత్తు కాదు. శారీరక, మానసిక ఆరోగ్యాలు సరిగా వున్న ఏ వ్యక్తి అయినా కొన్ని శారీరక శ్రమలూ, కొన్ని మేధా శ్రమలూ కూడా నేర్చుకోవడం నూటికి నూరుపాళ్ళూ సాధ్యమే.

'కళలు' అనే వాటిని అయితే మనుషులు 'కేవలం అభ్యాసం ద్వారా మాత్రమే' నేర్చుకోలేరు. చిత్రలేఖనం, రచన చెయ్యడం, గానం, నాట్యం వగైరా శక్తులన్నీ కళలు. ఈ పను లన్నిటినీ 'యాంత్రికంగా' చెయ్యడమూ వుంటుంది. 'సృజనాత్మకంగా' చెయ్యడమూ వుంటుంది. సృజనాత్మక శక్తినే 'కళ'గా భావిస్తే, అలాంటి కళకు సంబంధించిన సహజ స్పృహ పుటకతోనే మెదడులో వుంటే; దాని మీద 'అభ్యాసం' కూడా తోడ్పడి, అది వృద్ధి చెందుతుంది. కళకు సంబంధించిన స్పృహ ఏ కోశానా లేని మనిషికి ఎంత అభ్యాసం దొరికినా దాని వల్ల ఎక్కువ ప్రయోజనం వుండదు.

'కళ'కు సంబంధించిన 'సహజ స్పృహ' అంటే, అది 'భౌతిక' పరిస్థితితో సంబంధం లేని విషయం అని కాదు. మెదడులో వున్నది ఏదైనా, భౌతిక విషయమే. మెదడుతో సంబంధంలేని అతీత మైన విషయంగా కళని చెప్పడం కాదు ఇది. కానీ, మెదడు ప్రతీ మనిషికీ వుంటుంది. 'కళ' ప్రతీ మనిషికీ వుండదు. మెదడులో ఏదో ఒక ప్రత్యేకత వల్లనే 'కళ'కి తగిన ప్రత్యేక స్పృహ వుంటుంది.

కాని, శ్రమల విషయాలూ, సైన్సు విషయాలూ, కళల లాంటివి కావు. వాటిని, సాధారణ మానసిక, శారీరక ఆరోగ్యాలుగల ప్రతి మనిషీ అభ్యాసం ద్వారా నేర్చు కోవచ్చు. మనుషుల శక్తి సామర్థ్యాలలో సహజంగానే తేడాలు వుంటాయి. కాబట్టి, ఆ నేర్చు కోవడంలో కూడా తప్పనిసరిగా తేడాలు వుంటాయి. ఒక పని కొందరికి తొందరగా పట్టుపడితే, కొందరికి ఆలస్యంగా పట్టుపడు తుంది. కొందరికి ఒక పనిలో నేర్పు వుంటే, కొందరికి ఇంకో పనిలో నేర్పు వుంటుంది. ఇలాంటి సహజ భేదాలన్నిటినీ పక్కన పెట్టి, జనరల్‌గా చూస్తే, అన్ని శ్రమలూ అందరికీ పట్టుపడతాయి.

చిన్నతనం నించీ శిక్షణ ఇస్తే, ఒక మనిషి, స్త్రీ గానీ పురుషుడు గానీ, కుట్టుపనీ, వైద్యం పనీ, రెండూ నేర్చు కోవచ్చు. ఒక మనిషి, పొలం దున్నే పనీ, చదువుచెప్పే పనీ, రెండూ నేర్చుకోవచ్చు. ఒక మనిషి, ఇంజనీరింగ్ పనీ నేర్చు కోగలడు, పాయిఖానాలు శుభ్రం చేసే పనీ నేర్చుకోగలడు. ఒక మనిషి, సైన్సు పరిశోధనలూ చెయ్యగలడు, వంటపనీ చెయ్యగలడు. ఒక మనిషి, పత్రికల రిపోర్టులూ తయారు చెయ్యగలడు, లారీలూ నడపగలడు. ఒక మనిషి, విమా నాలూ నడపగలడు, పశువుల సంరక్షణా చెయ్యగలడు— ఈ రకంగా, మనుషులు రెండేసి పనులే కాదు, నాలుగేసి పనుల్లో, ఆరేసి పనుల్లో కూడా నేర్చుకోగలరు. ప్రతీ మనిషీ, కొన్ని శారీరక శ్రమలూ, కొన్ని మేధా శ్రమలూ చెయ్యడంలో సాధ్యం కానిదేదీ వుండదు.

'నూతన సమాజం,' పెట్టుబడిదారీ 'శ్రమ విభజన'ని తీసివేస్తూ, క్రమంగా ఈ 'నూతన శ్రమ విభజన'ని ప్రవేశ పెట్టుకోవాలి. కానీ, శ్రమ చెయ్యని దోపిడీ వర్గం, శ్రమలోకి రావడానికి ఎంత విముఖంగా వుంటుందో, మేధా శ్రమల సెక్షన్లు శారీరక శ్రమలలోకి రావడానికి అంత విముఖంగా వుంటాయి.

"మేధావులు కూడా శారీరక శ్రమలు చెయ్యాలా? శారీరక శ్రమలు చేసేవాళ్ళు మేధా శ్రమలు చెయ్య గలరా?" అనే సందేహాలు ఈ మేధా శ్రమల సెక్షన్ల నించే వినబడ తాయి. 'శారీరక శ్రమలు చేసే వాళ్ళు' పుటకతోనే శారీరక శ్రమలు చేసేవాళ్ళుగా పుట్టి వుంటారా?— పెట్టుబడిదారీ మేధావుల అభిప్రాయం అదే. మనుషులు పుటకతోనే శారీరక శ్రమలు చేసే వారి గానూ, మేధా శ్రమలు చేసే వారిగానూ వుంటారని, ఈ రకం మేధావులు భావిస్తారు. చిన్న పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతూ వుండగా విద్యలు నేర్చుకోవడానికి వాళ్ళకు దొరికే అవకాశాల్ని బట్టే వాళ్ళు శారీరక శ్రమలు చేసేవారిగానో, మేధా శ్రమలు చేసే వారి గానో తయారవుతారనే నిజాన్ని ఒప్పుకోవడానికి పెట్టుబడి దారీ మేధావులు ఇష్టపడరు.

పెట్టుబడిదారీ సమాజంలో, మేధాశ్రమలు చేసే సెక్షన్లూ, శారీరక శ్రమలు చేసే సెక్షన్లూ, గిరిగీసినట్టు విడి పోయి వుంటాయి. (అసలు ఏ శ్రమా చెయ్యని వర్గం కూడా వుంటూ వుండగా.) ఈ విభజన పూర్తి అయిన తర్వాత కనపడే పరిస్తితే మనుషుల్లో కొందర్ని 'తెలివైనవారి'గానూ కొందర్ని 'తెలివిహీనులు'గానూ చూపిస్తుంది.

పెట్టుబడిదారీ దృష్టిలో, మేధా శ్రమలకు ప్రత్యేక గౌరవ మర్యాదలూ, శారీరక శ్రమలకు చిన్న చూపులూ అవమా నాలూ దొరకడం సాధారణ విషయం.

'అందరూ మేధా శ్రమలు చెయ్యలేర'నే అభిప్రాయం ఒకటి అలావుండగా, ఏ కొత్త విషయాన్ని కనిపెట్టడానికైనా మేధాశ్రమే కారణమనే అభిప్రాయం కూడా అందరి మెద ళ్ళనీ పాలిస్తూ వుంటుంది. ఇదంతా కూడా దోపిడీ సమా జాలలో వుండే అనేక భ్రమల్లో భాగమే. మేధా శ్రమా, శారీ

రక శ్రమా కలిసిన ఐక్యశ్రమ లేకుండా ఏ జ్ఞానమూ దొర కడం గానీ, అభివృద్ధి చెందడంగానీ సాధ్యంకాదు. (ఈ విష యం కూడా తర్వాత చాప్టర్లలో చూస్తాము.) 'పెట్టుబడిదారీ సమాజం'లో, శారీరక శ్రమా మేధా శ్రమా విడిపోయి వుండ డమూ, మేధా శ్రమకి ఎక్కువ విలువ వుండడమూ — అనే విషయాల్ని పైపైనే చూడడంవల్ల, 'ఏ అభివృద్ధికైనా మేధా శ్రమ మాత్రమే కారణం' అనే భ్రమ కలుగుతుంది.

దోపిడీ దారుడు వీలైనంతవరకూ ఏ శ్రమా చెయ్యకుండానే తప్పించుకోవాలని చూస్తాడు. కానీ, ఎప్పటికైనా భవిష్యత్ చరిత్రలో వాడికి శ్రమ అనేది తప్పకపోతే, అప్పుడు మేధాశ్రమల్ని మాత్రమే తన వంతుగా ఎంచుకుంటాడు శారీరక శ్రమలు చెయ్యనంటాడు. తనకు ఎక్కువ ఆదాయం వుండేలాగ చూసుకుంటాడు. అంటే, దోపిడీగా కనిపించని దోపిడీ సాగించాలని చూస్తాడు.

అందుకే, దోపిడీని నిర్మూలించడం అనే సమస్యలో ఈ 'శ్రమ విభజన సమస్య' అతి ప్రధానమైన సమస్య. ఇది ఒకవేపు 'విలువ' సమస్యా, ఇంకో వేపు 'ఉపయోగపు విలువ' సమస్యా కూడా. ఒక మనిషి, ఒకే శ్రమకు అంటి పెట్టుకుని వుండడం — అనే 'శ్రమ విభజన'ని, 'నూతన శ్రమ విభజన'గా మార్చుకోకపోతే, మానవుల మధ్య 'అసమానతలు' నశించవు. దోపిడీకి సహకరించే లక్ష్యంతో పుట్టిన ఏ పద్ధతినైనా మార్చుకోకపోతే, అది దోపిడీ సృష్టించిన సమస్యలనే సృష్టిస్తూ వుంటుంది.

కాబట్టి, "అందరూ శ్రమ చెయ్యాలి. ఎవరి శ్రమ విలువని వారే పొందాలి" అన్నంత వరకే మన 'సిద్ధాంత జ్ఞానాన్ని' పరిమితం చేసుకోకూడదు. దోపిడీని నిర్మూలించే పనిలో, 'అందరూ శ్రమ చెయ్యడం' అనేది మొట్టమొదటి అడుగు మాత్రమే. అక్కడే ఆగిపోతే, అది ఇంకా చాలా దోపిడీ లక్షణాల్ని మిగిల్చి వుంచుతుంది. అందుకే, నూతన సమాజం, పెట్టుబడిదారీ శ్రమ విభజనని మార్చుకునే పరిణామ క్రమాన్ని వెంటనే ప్రారంభించాలి. సరియైన ప్రయోగాల ద్వారా క్రమంగా దానికి మార్గాన్ని అభివృద్ధి పరచాలి.

నూతన శ్రమ విభజన వల్ల, మనుషులందరూ, మూసలో పోసినట్టు, ఒకే రకమైన శారీరక, మానసిక శక్తి సామర్థ్యాలతో తయారవుతారని అర్థం కాదు. శారీరక శక్తులలో గానీ, మేధాశక్తులలో గానీ, సహజమైన తేడాలు ఎప్పుడూ వుంటాయి. కానీ, ఆ తేడాల వల్ల, ఆ మనుషులకు గానీ, సమాజానికి గానీ జరిగే నష్టమేమీ వుండదు.

మనుషులందరికీ సమానమైన హక్కులూ, సమానంగా జీవించే అవకాశాలూ కల్పించడమే 'నూతన శ్రమ విభజన'కు లక్ష్యం.

ఈ విషయం అంతా సరిగా గ్రహిస్తే, అంటే శారీరక శ్రమల పక్షాన నిలబడి గ్రహిస్తే, అందరూ ఏదో ఒక శ్రమ చేసినంత మాత్రానే అసమానత్వం సమస్య రద్దుకాదనే సంగతి అర్థమవుతుంది.

ఇంత వరకూ 'శ్రమ శక్తి'కి సంబంధించిన విషయాలన్నీ చూశాం.

పెట్టుబడిదారుడు కార్మికులతో ఒక ఒప్పందంలోకి వచ్చి 'శ్రమ శక్తి'ని కొనడం ఇప్పటికి పూర్తి అయింది. ఇప్పుడు ఆ ఇద్దరూ శ్రమ మార్కెట్ నించీ పెట్టుబడిదారుడి 'పని స్థలాని'కి బైల్దేరుతున్నారు. పెట్టుబడిదారుడేమో, 'యజమాని' హోదాలో గొప్ప ప్రాధాన్యత గల వ్యక్తిగా, దర్పంగా, 'లాభం' గురించి కలలు కంటూ! కార్మికుడేమో, సేవకుడిననే న్యూనతతో, రెక్కలు అమ్ముకున్న వాడిలా నిరుత్సాహంగా, జీతం డబ్బుల్ని ఊహిస్తూ!

తయారవబోయే ఉత్పత్తి మంచి చెడ్డల గురించి ఆలోచించే పరిస్థితిలో మాత్రం ఎవరూ లేరు!

## ప్రశ్నలూ - జవాబులూ

**1. 'శ్రమ'కూ, 'శ్రమ శక్తి'కీ సంబంధం ఏమిటి?**

జ : ఒక 'శ్రమ' చెయ్యాలంటే, ఆ శ్రమ చెయ్యగలిగే శక్తి వుండాలి. 'శ్రమ శక్తి'తో చేసేదే శ్రమ. అదే వాటి సంబంధం.

**2. ఒక కార్మికుడు ఇచ్చిన 'శ్రమ విలువ' 10 అనుకుందాం. శ్రమ శక్తి విలువ ఎంత వుండవచ్చు?**

జ: 10 కన్నా తప్పనిసరిగా తక్కువగా వుంటుంది.

**3. ఒక కార్మికుడి జీతం రోజుకి 5. పెట్టుబడిదారుడు కార్మికుడి నించి తీసుకునే విలువ ఎంత వుండవచ్చు?**

జ : 5 కన్నా తప్పనిసరిగా ఎక్కువ.

**4. ఒక పెట్టుబడిదారుడి పని స్థలంలో 2 స్థాయిల కార్మికులు పనిచేస్తున్నారు. పెట్టుబడిదారుడు పెద్ద స్థాయి కార్మికుల జీతాల మీద 20, రెండో స్థాయి కార్మికుల జీతాల మీద 30 ఖర్చు పెట్టాడు. పెట్టుబడిదారుడికి సరుకు ద్వారా 100 అదనపు విలువ వచ్చింది. ఏ స్థాయి కార్మికులు ఎంత అదనపు విలువని ఉత్పత్తి చేశారు?**

జ : 2 స్థాయిల జీతాలూ కలిసి 20+30=50. 50 జీతం, 100 అదనపు విలువని ఇచ్చింది. అంటే, ప్రతీ జీతమూ 2 రెట్ల అదనపు విలువని ఇచ్చినట్టు. 20 జీతం — 40 అదనపు విలువనీ, 30 జీతం — 60 అదనపు విలువనీ, ఇచ్చినట్టు అర్థం.

**5. మీరు కార్మికులా, కాదా? కార్మికులైతే, శారీరక శ్రమలు చేసే కార్మికులా? మేధా శ్రమల కార్మికులా?**

జ : నేను రచయితని. రచన చెయ్యడం అనేది, 'కళ' అనే అంశంతో కలిసిన మేధా శ్రమ కిందకు వస్తుంది. నేను

ఒక యజమాని దగ్గిర పనిచెయ్యడం లేదు. కాబట్టి, నేను వేతన శ్రామికురాలిని కాను. 'స్వతంత్ర ఉత్పత్తి దారుల' కోవలోకి వస్తాను.

**6. పెట్టుబడిదారుడి బ్యాలెన్స్ షీట్‌ని ఎప్పుడైనా చూశారా? అందులో అదనపు విలువ ఎంత వుంటుందో ఎలా కనిపెట్టగలం? మొత్తం శ్రమ విలువ ఎంత వుంటుందో ఎలా కనిపెట్టగలం?**

**జ:** చూశాను. పెట్టుబడిదారుడు చూపించే లెక్కల్లో, 'శ్రమ సాధనాల' భాగాన్ని పక్కన బెట్టి, మిగతా అన్నిటినీ కలిపితే అది శ్రామికులు ఇచ్చిన శ్రమ విలువ. ఆ 'శ్రమ విలువ'లో నించి, 'జీతాల' భాగాన్ని పక్కన పెడితే, మిగిలినది— అదనపు విలువ.

**7. ఒక పెట్టుబడిదారుడు కార్మికుడికి జీతం ఇవ్వకుండా ఎగ్గొట్టాడు. సరుకుని అమ్మి 10 రూ.లు తీసుకున్నాడు. దాని శ్రమసాధనాల విలువ 4. దాని కోసం ఇవ్వవలసిన జీతం 3. పెట్టుబడిదారుడు కార్మికుడికి ఎంత ఎగ్గొట్టాడు?**

**జ:** జీతం 3 + అదనపు విలువ 3 = 6 ఎగ్గొట్టాడు.

**8. మానవ సమాజంలో ఒక దశకి 'బానిస సమాజం' అనీ, ఇంకో దశకి 'భూస్వామ్య సమాజం' అనీ, తర్వాత దశకి 'పెట్టుబడిదారీ సమాజం' అనీ, ఈ పేర్లు ఎందుకు ఏర్పడ్డాయి? ఇవి, వారాల పేర్లలాంటి పేర్లేనా?**

**జ:** సమాజాల పేర్లు, వారాల పేర్ల లాంటివి కావు. ఉత్పత్తి విధానాల్లో వున్న తేడాల్ని బట్టి ఆ పేర్లు వచ్చాయి.

**9. ఒక ప్రాంతంలో (ఒక దేశంలో) శ్రమ దోపిడీ వుందని ఎలా చెప్పవచ్చును?**

**జ:** అక్కడ శ్రమ చేసే మనుషులకు యజమానులు వుంటే దోపిడీ వుందని చెప్పవచ్చును. లేదా, కొందరికి ఆదాయాలుగా భూమికౌళ్ళూ, వడ్డీ లాభాలూ వుంటే, శ్రమ దోపిడీ వుందని చెప్ప వచ్చును.

**10. కార్మికుడికీ, పెట్టుబడిదారుడికీ మధ్య మారకం, ఏ యే సరుకుల మధ్య జరుగుతుంది?**

**జ:** కార్మికుడు, పెట్టుబడిదారుడుకి ఇచ్చేది — తన శ్రమని. దానికి బదులుగా పెట్టుబడిదారుడు కార్మికుడికి ఇచ్చే సరుకు గానీ, శ్రమ గానీ ఏదీ వుండదు. కార్మికుడు ఇచ్చే శ్రమలోనించే కొంత భాగాన్ని తీసి, దానికి 'జీతం' అనే పేరు పెట్టి, దాన్ని కార్మికుడికి ఇస్తాడు. మిగిలిన శ్రమనంతా పెట్టుబడి దారుడు తీసుకుంటాడు. పెట్టుబడిదారుడు, జీతం పేరుతో ఇచ్చేది, పెట్టుబడిదారుడి శ్రమ కాదు. వాడు, కార్మికుడి నించి తీసుకోవడమేగానీ కార్మికుడికి ఇచ్చేదేమీ వుండదు. అంటే, పెట్టుబడిదారుడు కార్మికుడి శ్రమని దోచడమేగానీ ఆ ఇద్దరి మధ్యా మారకం అనేది వుండదు.

**11. వీటిలో ఏది కరెక్టు? తప్పుగా వున్నది ఏ విధంగా తప్పు?**

(1) కార్మికుడు 'శ్రమ' ఇస్తే, పెట్టుబడిదారుడు 'జీతం' ఇస్తాడు. ఇది 'సమాన విలువల' మారకం.

(2) కార్మికుడు ఎక్కువ విలువని ఇస్తే, పెట్టుబడిదారుడు 'జీతం' పేరుతో తక్కువ విలువని ఇస్తాడు. ఇది 'అసమాన విలువల 'మారకం.

(3) ఇద్దరి మధ్యా అసలు మారకమే ఉండదు. జరిగేది— కార్మికుడి శ్రమలో కొంత భాగాన్ని పెట్టుబడిదారుడు లాగడమే.

**జ:** చివరిదే కరెక్టు. పెట్టుబడిదారుడు ఇచ్చే సరుకు ఏదీ లేనప్పుడు, అది ఎక్కువ విలువతో వుందా, తక్కువ విలువతో వుందా—అనే ప్రశ్న లేదు. కాబట్టి, మొదటి రెండూ తప్పులే.

**12. పేద తనం లేని పెట్టుబడిదారీ దేశం ఏదైనా వుందా?**

**జ:** 'పెట్టుబడిదారీ దేశం' అన్నప్పుడు, అక్కడ కార్మికులూ, పెట్టుబడిదారులు వున్నారని అర్థం. అంటే, శ్రమలు చేసే వర్గమూ, వారిని దోచే వర్గమూ! అలాంటప్పుడు ఆ దేశం పేదతనం లేని దేశం అవదు. అలాంటి దేశం ఏదీ వుండదు.

**13. 'భారత దేశం' అనే ఒక దేశం వుందనుకుందాం. ఆ దేశపు పెట్టుబడిదారుడు, తన వ్యాపార అవసరాల కోసం, ఇంకో దేశంలో 'పర్యటిస్తూ', "భారతీయులు కష్ట జీవులు" అని ఉపన్యాసాలిస్తాడనుకుందాం. ఆ పెట్టుబడిదారుడి దృష్టిలో వున్న 'భారతీయులు' ఎవరు?**

**జ:** తోటి పెట్టుబడిదారులే. 'పెట్టుబడిదారులందరూ చాలా కష్ట జీవుల'ని ఆ పెట్టుబడిదారుడి ఉద్దేశం.

**14. 'మేధావులు' అంటే ఎవరు?**

**జ:** మేధా శ్రమలు చేసే వాళ్ళే మేధావులు. అంతేగానీ, 'మేధావులు' అంటే, 'తెలివైన వాళ్ళు' అని అర్థం కాదు.

**15. డబ్బు శ్రమ విలువ— 1 గంటకు 1 రూపాయి. వంటశ్రమ విలువ, డబ్బు శ్రమ విలువ కన్నా రెట్టింపు అనుకుందాం. రోజుకి 4 గంటల చొప్పున, 17 రోజుల వంట శ్రమ విలువ ఎంత?**

**జ:** వంట శ్రమ విలువ—1 గంటకి 2 రూ.లు.
1 రోజులో, 4 గంటలకు— 8 రూ.లు.
17 రోజులకు— 17 × 8 = 136 రూ.లు.

**16. బట్ట పెట్టుబడిదారుడు, బొగ్గు పెట్టుబడిదారుడి నించి తన ఇంటి అవసరం కోసం బొగ్గు కొనుక్కుని డబ్బు ఇచ్చాడు. ఎవరెవరి శ్రమలకు మారకం జరిగింది?**

**జ:** ఇద్దరూ పెట్టుబడిదారులే. ఆ బొగ్గు, బొగ్గు పెట్టుబడిదారుడి కార్మికుల శ్రమతో ఉత్పత్తి అయినది. బట్ట పెట్టుబడిదారుడు ఇచ్చిన డబ్బు, వాడి కార్మికుల నించి లాగిన అదనపు విలువ. ఇది, బట్ట కార్మికుల శ్రమకూ, బొగ్గు కార్మికుల శ్రమకూ, మారకం.

**17. లాభం, వడ్డీ, భూమి అద్దె — వీటిని తీసుకునే వాళ్ళు ఏ రకం శ్రమలు చేస్తారు? శారీరక శ్రమలా, మేధా శ్రమలా?**

**జ:** ఈ ఆదాయాల వాళ్ళు, వాటికి బదులుగా చేసే శ్రమ లేవీ వుండవు. శ్రమే లేనప్పుడు, అది శారీరక శ్రమా,

మేధా శ్రమా అనే ప్రశ్న లేదు.

**18. (1) స్వంత శ్రమతో ఏర్పడే ఆస్తి ఎవరిది?**

**జ:** స్వంత శ్రమ ఎవరు చేస్తారో వారిది. స్వతంత్ర ఉత్పత్తి దారులూ, శ్రామికులూ, స్వయంగా శ్రమ చేస్తారు. ఆ శ్రమద్వారా వారు, ఏదైనా ఆస్తిని (చిన్న భూమీ, కొంచెం డబ్బూ) ఏర్పర్చుకుంటే, అది స్వంత శ్రమతో ఏర్పడ్డ ఆస్తి. అది, చాలా తక్కువ స్థాయి లోనే ఉంటుంది.

**(2) దోపిడీ ద్వారా ఏర్పడే ఆస్తి ఎవరిది?**

**జ:** దోపిడీ ఎవరు చేస్తారో వాళ్ళది. భూమి కౌళ్ళ ద్వారానూ, వడ్డీ లాభాల ద్వారానూ సంపాదించే ఆస్తి ఇది. వందల, వేల ఎకరాల భూములూ; లక్షల, కోట్ల విలువ చేసే పెట్టుబడులూ— ఈ ఆస్తులుగా ఉంటాయి.

**19. స్వతంత్ర ఉత్పత్తిదారుడు, తన దగ్గిర వేతన శ్రామికుల్ని పెట్టుకుంటాడనుకుందాం. కానీ తను కూడా పని చేస్తాడు. అప్పుడు కూడా అతను స్వతంత్ర ఉత్పత్తిదారుడేనా? లేదా, ఏమి అవుతాడు?**

**జ:** పెటీ బూర్జువా అవుతాడు. తన శ్రామికుల అదనపు విలువని సంపాదించడం ప్రారంభిస్తాడు.

**20. వీటిలో ఏది కరెక్టు?** **జ:**

కార్మికుడు — 12 గంటల 'శ్రమ' ఇచ్చాడు. ✔

కార్మికుడు — 12 గంటల 'శ్రమ శక్తి' ఇచ్చాడు. ✘

**21. బట్టల పరిశ్రమలో పనిచేసే కార్మికుడు కొంత డబ్బుతో మార్కెట్లో బియ్యం కొనుక్కున్నాడు. ఈ కార్మికుడు తన శ్రమని ఎవరితో మారకం చేసుకున్నాడు?**

**జ:** ఆ బియ్యం ఎవరి శ్రమతో ఉత్పత్తి అయ్యాయో వారితో. అది స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమ అయినా కావచ్చు; లేదా, కార్మికుల శ్రమ అయినా కావచ్చు. అది, ఆ బియ్యాన్ని అమ్మిన పెట్టుబడిదారుడి శ్రమ మాత్రం కాదు.

**22. ఒక కుట్టు కార్మికుడు తన జీతం డబ్బుతో సినిమా చూశాడు. ఏ యే సరుకులకు మారకం జరిగింది?**

**జ:** కుట్టు శ్రమకూ, సినిమాని ఉత్పత్తి చేసిన శ్రమకూ.

**23. ఒక పెట్టుబడిదారుడు, ఒక స్వతంత్ర ఉత్పత్తి దారుడి దగ్గిర పళ్ళు కొన్నాడు. ఎవరెవరి శ్రమలకు మారకం జరిగింది?**

**జ:** ఆ పెట్టుబడిదారుడి కార్మికుల శ్రమకూ, ఆ పళ్ళని పండించిన స్వతంత్ర ఉత్పత్తిదారుడి శ్రమకూ.

**24. కార్మికుడి జీతం పెట్టుబడిదారుడి కోసమే — వివరించండి!**

**జ:** కార్మికుడికి, ఆ 'జీతం'తో, శ్రమ శక్తి నిలబడి వుంటుంది. కార్మికుడు ఆ శక్తితో పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేసి వాడికి అదనపు విలువని ఇస్తూ వుంటాడు. కాబట్టి కార్మికుడి జీతం — పెట్టుబడి దారుడి కోసమే.

**25. ఒక పని స్థలంలో కార్మికుల శ్రమ విలువ 50. జీతం 20.** 'జీతం పెరిగితే, అదనపు విలువ తగ్గుతుంది; జీతం తగ్గితే, అదనపు విలువ పెరుగుతుంది' అని ఈ ఉదాహరణని కొన్ని రకాలుగా మార్చి చూపించండి.

**జ:** జీతం 20 అయితే, అదనపు విలువ 30.
జీతం 15 అయితే, అదనపు విలువ 35.
జీతం 25 అయితే, అదనపు విలువ 25.
జీతం 22 అయితే, అదనపు విలువ 28.

**26. జీతానికి, పెట్టుబడిదారుడు వాడే ఇంకో పేరు ఏమిటి?**

**జ:** శ్రమ ధర. శ్రమ కోసం చెల్లించే ధర అని అర్థం.

**27. కార్మికుడి ఆదాయం జీతం పేరుతో ఉంటుంది. పెట్టుబడిదారుడి ఆదాయం కూడా జీతం పేరుతో ఎందుకు ఉండదు? అది, 'లాభం' పేరుతో ఎందుకు ఉంటుంది?**

**జ:** శ్రమ చేసిన దానికి బదులుగా వచ్చేది జీతం. పెట్టుబడిదారుడికి వచ్చేది, శ్రమ చేసినందుకు కాదు. పెట్టుబడి పెట్టినందుకు. 'పెట్టుబడి'కి వచ్చేది — లాభం. అందుకే అది 'జీతం' పేరుతోగాక, ' లాభం' పేరుతో ఉంటుంది.

**28. ఒక శ్రమ శక్తి, తన పోషణ కోసం అవసరమయ్యే శ్రమ కన్నా ఎక్కువ శ్రమని ఇవ్వగలదు కదా? అదే శ్రమ శక్తి, తన కోసం అవసరమయ్యే శ్రమకన్నా తక్కువ శ్రమని అయినా ఇవ్వగలదా?**

**జ:** ఎలాగైనా ఇవ్వగలదు. ఎక్కువ శ్రమా ఇవ్వవచ్చు; తక్కువ శ్రమా ఇవ్వవచ్చు; అసలు ఏ శ్రమా ఇవ్వకుండా కూడా వుండవచ్చు. కానీ, యజమాని దగ్గిర పని చేసే శ్రామికుడు తన శ్రమ శక్తి విలువ కన్నా ఎప్పుడూ ఎక్కువనే ఇవ్వాలిగానీ, తక్కువని ఇవ్వడం సాధ్యం కాదు. దోపిడీదారుడు అయితే, ఒక వేపు—తన పోషణ కోసం కొన్న ఉత్పత్తుల్ని వాడుతూ, ఇంకో వేపు —ఏ ఉత్పత్తినీ చెయ్యకుండా ఉంటాడు. దోపిడీ దారులు కాని వాళ్ళకి అది సాధ్యం కాదు. వాళ్ళు, కనీసం తమ పోషణకోసం ఖర్చు పెట్టే దాన్నంతా తిరిగి ఉత్పత్తి చేసుకోవాలి. ఖర్చయ్యే శ్రమకన్నా, తిరిగి చెయ్యవలసిన శ్రమ తగ్గడానికి వీలు వుండదు.

**29. ఒక డాక్టరూ, ఒక బస్సు డ్రైవరూ వున్నారు. తెలివైన మనిషే డాక్టరు అయ్యాడనీ, అంత తెలివిలేని మనిషే బస్సు డ్రైవరు అయ్యాడనీ అర్థమా?**

**జ:** కాదు. వాళ్ళు నేర్చుకున్న శ్రమలు అలా వున్నాయి కాబట్టి వాళ్ళు అలా అయ్యారు. మళ్ళీ కొంత కాలం పాటు కొత్త శ్రమలు నేర్చుకోవచ్చు. లేదా, పిల్లలకు విద్యార్థి దశనించీ, నాలుగైదు రకాల శ్రమలు నేర్పితే, ఒక మనిషి డాక్టరూ డ్రైవరూ కూడా కావచ్చు.

**30. ఒక మనిషి — టీచరు గానూ, వడ్రంగి గానూ, పోస్టు మేన్ గానూ కూడా పనిచేస్తాడనుకుందాం. అతన్ని టీచరు అనాలా, వడ్రంగి అనాలా, పోస్ట్‌మేన్ అనాలా?**

**జ:** అతనికి ఏదో ఒక్క పేరే వుండదు. ఆ పేర్లన్నీ కూడా వుంటాయి. కొత్త శ్రమ విభజనలో వచ్చే అనుభవాల ద్వారానే ఆ కొత్త భాష ఏర్పడుతుంది. ★

# 3. శ్రమ క్రమం-ఉత్పత్తి క్రమం

'శ్రమ' జరిగే క్రమమే 'శ్రమ క్రమం.' 'శ్రమ క్రమం' వల్ల ఏదో ఒక ఉత్పత్తి తయారవుతుంది. లేదా, ఏదో ఒక 'పని' జరుగుతుంది.

'శ్రమ క్రమానికి' సంబంధించిన సంబంధాలు — 'శ్రమ సంబంధాలు'. లేదా, 'ఉత్పత్తి సంబంధాలు'.

కార్మికులు, పెట్టుబడిదారుడి దగ్గిరికి వస్తారు — శ్రమ చెయ్యడానికి. యజమాని మాత్రం — ఏ శ్రమా చెయ్యడు. శ్రమ చెయ్యని యజమానికీ, యజమాని కోసం కూడా శ్రమ చేసే కార్మికులకూ ఏర్పడే సంబంధాలే — ఇక్కడ 'శ్రమ సంబంధాలు'.

కార్మికులు పనిలోకి రాగానే, పెట్టుబడిదారుడు, వారితో "డబ్బు రాసిని తయారుచెయ్యండి" అనడు. "బట్ట నెయ్యండి" అంటాడు. లేకపోతే, "కుర్చీలు చెయ్యండి" అంటాడు. లేకపోతే, "ఈ కాయితాల మీద అచ్చు కొట్టండి" అనో, అలా ఏదో ఒక ఉత్పత్తిని తయారు చెయ్యడానికి కావలసిన పనులు చెయ్యమని చెపుతాడు.

కార్మికులు మందగొడిగా పని చేస్తారేమోనని, పెట్టుబడిదారుడు కార్మికుల మధ్యే తిరుగుతూ — "చెయ్యండి, చెయ్యండి" అని వాళ్ళని తొందరపెడుతూ పని చేయిస్తాడు. లేదా, కార్మికులతో పని చేయించడానికి, కొందరు ఉద్యోగుల్ని పెడతాడు. 'పని కాలం' పూర్తి అయ్యేలోగా కార్మికులతో ఎంత ఎక్కువ పని చేయిస్తే అంత మంచిది పెట్టుబడిదారుడికి.

'పని' చేసే మనిషికి ఆ 'పని' మీద నిజమైన ఇష్టం వుండాలంటే, ఆ పని ఆ వ్యక్తికి సంబంధించిన 'స్వంత పని' అయినా అయి వుండాలి; లేదా, అందరూ కలిసి సమాన బాధ్యతతో చేసే 'సమిష్టి పని' అయినా అయి వుండాలి. ఈ పద్ధతుల్లో ఏదీ కాకుండా, ఒక 'యజమాని' అధికారం కింద, యజమాని కోసం శ్రామికులు పని చెయ్యవలసిన ఏ విధానంలో అయినా, శ్రమ చేసే మనుషులు 'శ్రమ'కి విముఖంగానే వుంటారు. కాబట్టి, యజమాని అయిన వ్యక్తి, శ్రామికుల్ని దండించి శ్రమ చేయించవలసి వస్తుంది. ఈ దండించడం, ఆయా పరిస్థితుల్ని బట్టి వేరు వేరు రకాలుగా వుంటుంది.

'జీతాల' పద్ధతి మీద పనిచేసే కార్మికుల విషయంలో అయితే, జీతం కోతలూ, జరిమానాలూ వుంటాయి. జీతాల పద్ధతి లేని 'బానిసల' విషయంలో అయితే, జీతం కోతలకూ, జరిమానాలకూ అవకాశాలు వుండవు కాబట్టి అక్కడ, వారి శరీరాల్ని హింసించడం తప్ప యజమానికి ఇంకో మార్గం వుండదు. కాబట్టి, బానిసలతో పనిచేయించే చోట కొరడాలు కూడా 'పని స్థలం'లోకి వస్తాయి. ఇతర చిత్ర హింసా విధానాలన్నీ యజమానికి అవసరమవుతాయి. — ఈ రకంగా, 'శ్రమ క్రమం' అనేది, వేరు వేరు సామాజిక పరిస్థితుల్లో వేరు వేరు రూపాలలో వుంటుంది. అది, 'బానిస సమాజం'లో ఒక ప్రత్యేక రూపంలో వుంటే, 'భూస్వామ్య సమాజం'లో ఇంకో రూపంతోనూ, ' పెట్టుబడిదారీ సమాజం'లో మరో రూపంతోనూ వుంటుంది. అయితే ఇప్పటివరకూ ఈ శ్రమ క్రమాల స్వభావాలన్నీ ఒకటే. శ్రామికుల్ని 'దండించి పని చేయించే' స్వభావం అది.

అందరూ సమాన బాధ్యతతో పనిచేసే 'సమిష్టి శ్రమ క్రమం'లో, 'శ్రామికుల్ని దండించడం' అనే విధానమంతా మాయమవుతుంది. 'సమిష్టి శ్రమ క్రమానికి' వుండే స్వభావం పాత శ్రమ క్రమాల స్వభావాలకు వ్యతిరేకంగా వుంటుంది. (వుండాలని అర్థం.)

ఈ రకంగా — శ్రమ క్రమానికి వుండే ప్రత్యేకతల్ని పక్కన పెడితే, చరిత్రలో అన్ని రకాల సమాజాల శ్రమ క్రమాలకూ వర్తించే జనరల్ అంశాలు కొన్ని వుంటాయి. అలాంటివాటినే ఇప్పుడు చూస్తాం.

'శ్రమ క్రమం' అనే మాటకీ, 'ఉత్పత్తి క్రమం' అనే మాటకీ, అర్థాలలో ఒక తేడా వుంది. వ్యవసాయ శ్రమని తీసుకుంటే, ఆ పని, పొలం దున్నడంతో ప్రారంభమై, పండిన పంటని కోసి నిల్వ చెయ్యడంతో ముగుస్తుంది. నేలని దున్నడం ప్రారంభించిన దగ్గిర్నించీ పంటని కోసే వరకూ వుండే కాలం అంతా, పని ఆగకుండా జరగనక్కర లేదు. మధ్య మధ్య కొన్ని వారాల పాటూ, నెలలపాటూ పని ఆగిపోతూ వుంటుంది. నాటిన మొక్కలు పెరగాలి. అది ప్రకృతి సహజంగా జరగవలసిన మార్పు. మొక్కల్ని నాటిన తర్వాత, కలుపు తీసే పని వచ్చే వరకూ పని ఆగుతుంది. కలుపు తీసే పని జరిగాక, ఇంకో పని అవసరమయ్యేవరకూ మళ్ళీ పని ఆగుతుంది. ఈ రకంగా ధాన్యం పండించే పని, మధ్య మధ్య కొన్ని విరామాలతో నడుస్తుంది. నేలని దున్నడం దగ్గిర్నించీ, పంటని కోసే వరకూ వున్న కాలం అంతా ఉత్పత్తి కాలం; లేదా, 'ఉత్పత్తి క్రమం'. ధాన్యం ఉత్పత్తి అవడానికి తప్పనిసరిగా అంత కాలం అవసరమవుతుంది. కానీ, ఆ కాలం అంతా శ్రమ

జరుగుతూ వుండనవసరంలేదు. మధ్య మధ్య పని ఆగిపోతూ వుంటుంది. పని జరిగే కాలమే 'శ్రమ కాలం'; లేదా 'శ్రమ క్రమం'. ధాన్యం ఉత్పత్తి కావాలంటే, దాని మొత్తం ఉత్పత్తి కాలంలో, శ్రమ కాలాలు ఆగి ఆగి జరుగుతూ వుంటాయి. శ్రమ కాలాన్నంతటినీ కలిపి లెక్కపెడితే, ఆ కాలం (పని జరిగిన కాలం) ఉత్పత్తి జరిగిన కాలం కన్నా చిన్నదిగా వుంటుంది.

'ఉత్పత్తి క్రమానికీ, శ్రమ క్రమానికీ, తేడా వుండడం అనేది అన్ని ఉత్పత్తుల విషయంలోనూ జరగదు. తయారయ్యే ఉత్పత్తిలో ప్రకృతి సహజమైన మార్పులు కావలసిన చోటే అది జరుగుతుంది. వ్యవసాయమూ, పశువుల పెంపకమూ, చేపల పెంపకమూ, అడవుల పెంపకమూ — వంటి వాటిలోనే.

పరిశ్రమల్లో అయితే, ఉత్పత్తి క్రమమూ, శ్రమ క్రమమూ ఒకటే. దారం, బట్టగా తయారవడానికి మధ్య మధ్య పని ఆగిపోవలసిన అవసరం వుండదు.

'శ్రమ క్రమం' అనే మాటకీ, 'ఉత్పత్తి క్రమం' అనే మాటకీ కొన్ని సందర్భాల్ని బట్టి అర్థాల్లో తేడా వుంటుందనే విషయం మర్చిపోకుండా వుంటే, ఆ రెండు మాటల్నీ ఒకే అర్థంతో వాడవచ్చును. 'శ్రమ చెయ్యడం' అన్నా, 'ఉత్పత్తి చెయ్యడం' అన్నా ఒకటే కాబట్టి, 'శ్రమ క్రమం' అన్నా, 'ఉత్పత్తి క్రమం' అన్నా — ఒకటే. 'శ్రమ సాధనాలు' అన్నా, 'ఉత్పత్తి సాధనాలు' అన్నా — ఒకటే. 'శ్రమ సంబంధాలు' అన్నా, 'ఉత్పత్తి సంబంధాలు' అన్నా— ఒకటే. ఈ మాటల్లో ఎప్పుడే మాటని వాడినా ఒకటే అర్థంతో తీసుకోవాలి.

మనిషి, జంతు దశలో వుంటూ జంతువులాగే ప్రకృతి ఇచ్చిన పదార్థాల మీద మాత్రమే (పళ్ళూ, దుంపలూ, పచ్చి మాంసం వగైరాల మీద) ఆధారపడి బతికిన కాలాన్ని వొదిలేద్దాం. జంతు జాలానికి లేని ఒక ప్రత్యేకతతో మనిషి 'స్వయంగా శ్రమ చెయ్యడం' ప్రారంభించిన కాలం నించి మాత్రమే దృష్టిలోకి తీసుకుందాం. 'శ్రమ క్రమం' అనేది మనిషీ — ప్రకృతీ పాల్గొనే క్రమం. మనిషి, ప్రకృతి ఇచ్చిన సహజ పదార్థం మీదే తన చర్యలు జరుపుతాడు. ప్రకృతి ఇచ్చే సహజ పదార్థాల్ని తన శ్రమతో తనకు కావలసిన రూపంలోకి మార్చుకుంటాడు. ఈ క్రమంలో, మనిషి, తన అనుభవాలతో ప్రకృతి ఇచ్చే పదార్థాల ధర్మాల్ని మరింత స్పష్టంగా తెలుసుకుంటూ, వాటిని మరింత ఎక్కువగా ఉపయోగించుకోవడానికి కావలసిన శారీరక, మేధా శక్తుల్ని పొందుతూ వుంటాడు.

'శ్రమ' అని మనం మాట్లాడేది 'మానవ శ్రమ' గురించేనని వేరే చెప్పుకోనక్కరలేదు. ప్రకృతిలో, కొన్ని జంతు జాలాలు కూడా కొన్ని రకాల శ్రమలు చెయ్యడం కనబడుతుంది. సాలీడు, మనిషి చేసే 'నేత పనిని' పోలినట్టుగానే అల్లిక పని చేస్తుంది. తేనెటీగ — ఎందరో వాస్తు శిల్పులు సిగ్గుపడేంత అందంగా తేనె గూడు కడుతుంది. పిట్టలన్నీ చెట్ల మీద రక రకాల గూళ్ళు కడతాయి. కానీ, ఒక తేనెటీగ ఎంత చురుకైన తేనెటీగ అయినా, ఒక వాస్తు శిల్పి ఎంత తెలివి తక్కువ వాస్తు శిల్పి అయినా, ఆ ఇద్దరికీ వున్న తేడా చాలా పెద్దది. మనుషులు తాము చెయ్యబోయే పనిని ముందే 'ఊహ'లో చూస్తారు. దాన్ని గురించి ఆలోచిస్తారు. తమ అనుభవాలతో ఆ పనుల్ని ఇంకా ఇంకా మెరుగుపర్చుకుంటూ వుంటారు. తమ శక్తి సామర్థ్యాల్ని పెంచుకుంటూ వుంటారు. తాము చేసే పనికి సంబంధించిన సూత్రాల్ని తయారుచేస్తారు. ఈ లక్షణాలేవీ తేనెటీగకి వుండవు. అది, ప్రకృతి సహజంగా ఏర్పడిన శక్తితో (ఇన్‌స్టింక్ట్‌తో) మాత్రమే గూడు కడుతుంది. ఎన్ని వేల సంవత్సరాలు గడిచినా, అది ఒకే పద్ధతిలో గూడు కడుతుంది. అనుభవాల నించి నేర్చుకోవడమూ, గూడు కట్టే పద్ధతిని మార్చడమూ, అది చెయ్యదు. ఆ మార్పు దానికి అవసరం వుండదు. కాబట్టి, 'శ్రమ' విషయంలో, మనిషికీ జంతువుకీ పోలికే లేదు. మనిషి చేసే దాన్ని 'శ్రమ' అనీ, 'పని' అనీ అనవచ్చునుగానీ, జంతువు చేసేదాన్ని అలా అనడానికి వీలులేదు. 'శ్రమ క్రమం' (శ్రమ చెయ్యడం) అనేది, మానవ సమాజానికే ప్రత్యేక విషయం.

'మానవ శ్రమ'కి ప్రపంచవ్యాప్తంగా వుండే ఏకైక శ్రమ సాధనం — భూమి. అన్ని ఉత్పత్తులూ దాని నించి వచ్చేవే. 'శ్రమ క్రమం'లో జరిగే కొన్ని కొన్ని తేడాలతో, భూమి నించి రకరకాల ఉత్పత్తులు పొందడానికి వీలవుతుంది. కొన్ని పదార్థాల్ని, భూమి, మానవ శ్రమతో సంబంధం లేకుండా, తనలో సహజంగా తయారుచేసి వుంచుతుంది. వాటిని కేవలం 'భూమి బంధం' నించి బైటికి తీసుకోవడం మాత్రమే మనుషులు చెయ్యాలి. చెట్ల నించి పళ్ళు కోసుకోవడం, కలప నరుక్కోవడం, నదుల నించి నీళ్ళు తీసుకోవడం, అడవుల నించి జంతువుల్ని వేటాడడం, నీళ్ళ నించి చేపల్ని పట్టుకోవడం, గనుల నించి ఖనిజాలు తవ్వుకోవడం — వగైరా విషయాలు ఈ కోవలోకి వస్తాయి. ఇవి 'వెలికితీత' శ్రమలు. ఈ కోవకు చెందిన శ్రమ క్రమాల్లో, శ్రమచేసే మనుషులూ, శ్రమ పరికరాలూ మాత్రమే వుంటాయి. 'ముడి పదార్థం' అనేది వుండదు. ప్రకృతి ఇచ్చిన పదార్థాన్ని బైటికి తీస్తే, ఆ పదార్థమే, ఆ 'శ్రమ క్రమం' ద్వారా వచ్చిన ఉత్పత్తి అవుతుంది. ఆ ఉత్పత్తి, వెంటనే ఉపయోగించుకోగలిగే దశలో వుండనూ వచ్చు, వుండకపోనూవచ్చు. అడవి చెట్ల నించి కోసిన పళ్ళని (కొయ్యడం — అనే శ్రమ జరిగితేనే ఆ పళ్ళు చేతిలోకి వస్తాయి) వెంటనే వుపయోగించవచ్చును. కానీ నదుల నించి తీసిన చేపల్ని వెంటనే ఉపయోగించడానికి

వీలు కాదు. వాటి మీద ఇంకా కొంత శ్రమ జరగాలి. అంటే, చేపలు, 'ముడిపదార్థం'గా మాత్రమే చేతిలోకి వస్తాయి.

భూమి బంధం నించి తీసిన 'కొన్ని రకాల పదార్థాలు' తప్పనిసరిగా ముడిపదార్థాలుగానే వుంటాయి. ముడి ఖనిజాన్ని ఇంకా ఎన్నో మార్పులకు గురిచేస్తేనేగానీ, అది ఉపయోగపడే స్థితిలోకి రాదు. అలాగే వేటాడిన జంతువుల్ని కూడా. వాటితో ఇంకా ఏదో ఒక వంటకం తయారు చేయాలి. 'ముడిపదార్థం' అంటే, అప్పటికే దానిమీద కొంత శ్రమ జరిగిందని, అర్థం. మానవ శ్రమ లేకుండా ప్రకృతి సహజంగా పెరిగిన చెట్టుని కొందరు మనుషులు కట్టెలుగా చేసి, ఆ కట్టెలతో ఒక కుర్చీ చేస్తే,— అక్కడ పూర్తిగా తయారైన వస్తువు— కుర్చీ. ఆ కుర్చీకి ముడి పదార్థం— ఆ చెక్కలు. ఆ చెక్కలకు ముడిపదార్థం, ఆ చెట్టు కాదు. ఆ చెట్టు, మనుషుల శ్రమ ద్వారా పెరిగినది అయితే, అది ముడి పదార్థమే. శ్రమతో తయారైనది అయితే తప్ప, శ్రమతో సంబంధం లేకుండా వుండే పదార్థం ఏదీ 'ముడి పదార్థం'గా వుండదు. మనిషి వినియోగానికి ('శ్రమ సాధనాలు'గా గానీ, 'పోషణ వస్తువులు'గాగానీ), పనికివచ్చే స్థితిలోకి వచ్చేవరకూ ఒక పదార్థం ముడి పదార్థంగానే వుంటుంది. వినియోగానికి సిద్ధంగావున్న పదార్థం, ముడి పదార్థం కాదు.

పెంపుడు జంతువులూ, మనిషే నాటి పెంచిన చెట్లూ కొంత దీర్ఘకాలపు శ్రమ క్రమాలవల్ల తయారైన ఉత్పత్తులే. అంతే కాదు, అవి, మానవుల పర్యవేక్షణ ద్వారానూ, వారి శ్రమ క్రమాల ద్వారానూ ఎన్నో తరాలవారీగా జరుగుతోన్న క్రమ పరిణామపు ఫలితాలు. జంతువుల పెంపకమూ, చెట్ల పెంపకమూ పూర్తి అయ్యేవరకూ ఆ 'శ్రమ క్రమాలకు' అవి ముడిపదార్థాలే.

'శ్రమ పరికరాల' గురించి చూస్తే, ముడిపదార్థాలు లేని శ్రమ క్రమాల్ని ఊహించగలం గానీ, 'శ్రమ పరికరాలు' లేని శ్రమ క్రమాన్ని ఊహించలేము. మనుషులు జంతు దశలో వున్నప్పుడు కూడా రాళ్ళూ, రప్పలూ, కట్టెలూ — వంటి వాటిని చేతిలో పరికరాలుగా వుపయోగించారంటే దీన్ని బట్టి ఒక శ్రమ జరగడానికి శ్రమ పరికరాల అవసరం ఎలాంటిదో అర్థమవుతుంది. భూమి, మనిషికి సహజమైన 'ఆహారపు గని'గా వున్నట్లే, 'సహజ శ్రమ పరికరాల ఆలయం'గా కూడా వుంది. అనేక రకాలుగా ఉపయోగపడే రాళ్ళని అది సమకూర్చింది. భూమి ఇచ్చిన రాళ్ళని, మనుషులు, చిన్న చిన్న మార్పులతో — విసరడానికీ, రుబ్బడానికీ, చెక్కడానికీ, కొయ్యడానికీ, వొత్తడానికీ, దంచడానికీ, ఇంకా అనేక రకాల పనులకు ఉపయోగపడేలా తయారు చేసుకోగలరు. కానీ, కొన్ని శ్రమ పరికరాల తయారీకి, భూమి ఇచ్చిన వాటి మీద చిన్న చిన్న మార్పులే చాలవు. పెద్ద పెద్ద మార్పుల తోటీ, పెద్ద పెద్ద శ్రమ క్రమాల తోటీ వాటిని తయారు చేసుకోవాలి.

మానవులు ఉపయోగించిన మొట్ట మొదటి శ్రమ పరికరాలు, మానవ శ్రమ కలవని రాళ్ళూ రప్పలూ చెట్టు కొమ్మలూ — వంటివే. భూమి మీద పడివున్న ఒక రాతినో ఒక చెట్టుకొమ్మనో తీసి ఉపయోగిస్తే, అది, ప్రకృతి సహజంగా దొరికిన శ్రమ పరికరం. ఒకవేళ, భూమి మీద పడివున్న రాయి, అలాగే ఉపయోగించడానికి పనికి రాలేదనుకుందాం. దాన్ని కొంచెం అరగదియ్యవలసి వచ్చిందనుకుందాం. ఒక రాతిని ఇంకో రాతి సాయంతో అరగదియ్యాలన్నా, చెక్కాలన్నా, మనిషి 'కొంత శ్రమ' చెయ్యాలి. అలా, మనిషి శ్రమతో ఒక పరికరంగా తయారైన రాయి, 'మానవ శ్రమతో తయారైన శ్రమ పరికరం' అవుతుంది. ఆ శ్రమ పరికరాన్ని వుపయోగిస్తూ 'దుంపలు తవ్వడం'లాంటి ఏదో ఒక పని జరిగిందనుకుందాం. ఆ పని పూర్తి అయినప్పుడు, దుంపలు బయటికి వస్తాయి. అది 'దుంపలు తవ్వడం' అనే శ్రమ వల్ల వచ్చిన ఉత్పత్తి. అయితే ఈ ఉత్పత్తి రావడానికి, అంతకుముందు అరగదీసిన రాయి కూడా అవసరమైంది. అంటే శ్రమ పరికరానికి సంబంధించిన 'శ్రమ' కూడా అవసరమైందని అర్థం.

ఇక్కడ గ్రహించవలసిన విషయం — ఇక్కడ 'విలువ' లెక్కలు వున్నాయా లేవా — అనేది కాదు. ఒక ఉత్పత్తి కోసం అవసరమైన శ్రమని 'విలువ'గా లెక్కకట్టినా, కట్టకపోయినా, ఆ ఉత్పత్తి కోసం ఆ మొత్తం శ్రమ పట్టినట్టే అర్థం.

ఒక 'శ్రమ క్రమం'లో తయారైన ఉత్పత్తికి, 'శ్రమ పరికరాల' నించి కూడా కొంత శ్రమ కలవడం — అనేది, ఏనాడో వేల వేల సంవత్సరాలకు పూర్వం మానవ శ్రమతో తయారైన రాతి శ్రమ పరికరాల దశ నించే ప్రారంభమైంది.

ఈ నాడు ఒక శ్రామికుడు గునపంతో భూమిని తవ్వుతున్నాడనుకుందాం. ఈ 'తవ్వే పని'కి ఎంత శ్రమ అవసరమవుతుంది — అని చూసినప్పుడు, తవ్వడానికి పట్టిన కాలమే గాక, గునపాన్ని తయారుచెయ్యడానికి పట్టిన శ్రమ నించి కొంత భాగం కూడా ఈ తవ్వే పనికి కావలసిన కాలంగా వుంటుంది కదా? ఆ గునపాన్ని తయారు చెయ్యడానికి కూడా కొన్ని శ్రమ పరికరాలు ఖర్చవుతాయి. ఆ శ్రమ పరికరాల్ని తయారు చెయ్యడంలో కూడా కొన్ని శ్రమ పరికరాలు ఖర్చయి వుంటాయి. ఈ రకంగా, శ్రమ పరికరాల నించి చేరే శ్రమని పరిశీలించుకుంటూ వెనక్కి వెనక్కి వెళ్తే, ఈ 'రాళ్ళ' దగ్గిరికే వెళ్తాము. మానవ శ్రమ కలవని రాళ్ళని ఒక పని కోసం ఉపయోగిస్తే, ఆ పనిలో శ్రమ పరికరాల నించి చేరిన శ్రమ ఏమీ

వుండదు. కానీ, మానవ శ్రమతో కొంత మార్చుకున్న రాళ్ళని శ్రమ పరికరాలుగా వాడడం మొదలు పెట్టినప్పుడు, ఆ శ్రమ పరికరాల శ్రమ కూడా ఉత్పత్తికి చేరడం ప్రారంభ మవుతుంది. దీని అర్థం ఏమిటో తెలుసా?— ఆదిమ మానవులు, రాళ్ళ పరికరాల్ని తయారుచేసిన శ్రమ, ఈ నాటికీ నిలిచి వుందని అర్థం. ఆ శ్రమలో ఎంతో కొంత భాగం, ఈ నాటి శ్రమ పరికరాల ద్వారా, ఈ నాటి శ్రమ క్రమాలకు అందుతూనే వుంది. ఈ నాటికే కాదు, మానవ సమాజంలో శ్రమ క్రమాలు సాగినంత కాలమూ, భవిష్యత్తులో కూడా, ఆ ప్రాచీన శ్రమ, శ్రమ పరికరాల రూపంలో, శ్రమ క్రమాలకు అందుతూనే వుంటుంది.

'మానవ చరిత్ర'లో శ్రమ చెయ్యడం ప్రారంభమైన మొదటి కాలంలో— రక రకాల పనుల కోసం తయారు చేసుకున్న రాళ్ళూ, చెక్కలూ, ఎముకలూ, గుల్లలూ వంటి వాటితో పాటు 'పెంపుడు జంతువులు' కూడా 'శ్రమ పరికరాలు'గా ఎంతో ముఖ్యపాత్ర నిర్వహించాయి.

'శ్రమ పరికరాల్ని' ఉపయోగించడం — అనే లక్షణం కొన్ని రకాల జంతువుల్లో కూడా వుంది. కోతులు, చెట్ల కొమ్మల్నీ, రాళ్ళనీ, కొన్ని అవసరాల కోసం ఉపయోగిస్తాయి. కానీ, అవి, వాటిని ఇతర రూపాల్లోకి మార్చుకోలేవు. 'శ్రమ పరికరాల్ని' ఉపయోగించడంలో ఇది అతి తక్కువ స్థాయి జ్ఞానం. 'శ్రమ పరికరాల్ని' శ్రమతో తయారు చేసుకోవడం మానవులకు మాత్రమే వున్న ప్రత్యేక లక్షణం. 'శ్రమ' చేసేది మానవులే కాబట్టి, శ్రమ పరికరాల్ని తయారు చేసుకునే లక్షణం కూడా మానవులకే ప్రత్యేకమైనది. ఫ్రాంక్లిన్ అనే ఆర్థికవేత్త, మనిషిని, "పరికరాలు తయారు చేసే జంతువు" అన్నాడు.

కాల గర్భంలో కలిసిపోయిన జీవ రాసుల ఆకారాల్ని గ్రహించడానికి, వాటి ఎముకలూ, అస్తిపంజరాలూ ఎంత ఆధారంగా వుంటాయో, గతించిపోయిన సమాజాల 'ఆర్థిక రూపాల్ని' గ్రహించడానికి గత కాలపు 'శ్రమ పరికరాల అవశేషాలు' అంత ఆధారంగా వుంటాయి. ఒక సమాజం ఎటువంటి 'ఆర్థిక రూపం'తో వుందో, దాని ఉత్పాదక శక్తులు ఏ స్థాయిలో వున్నాయో — గ్రహించడానికి, ఆ సమాజంలో ఏ యే ఉత్పత్తులు చేసేవారో తెలియడం వల్ల లాభం లేదు. ఆ ఉత్పత్తుల్ని ఏ పరికరాల సహాయంతో చేసేవారో తెలియాలి. "ఫలానా కాలంలో ధాన్యం పండించే వారు" అని తెలిస్తే, దాని వల్ల, ఆ కాలపు వ్యవసాయంలో ఉత్పాదక శక్తి ఎంత అభివృద్ధి చెంది వుందో తెలియదు. ధాన్యం ఏ సమాజంలో అయినా పండుతుంది. సాగు చెయ్యడం తెలిసిన దగ్గిర్నించీ అన్ని రకాల సమాజాలలోనూ ధాన్యం పండిస్తూనే వున్నారు. ఆ పనిలో, భూమిని ఎటువంటి పరికరాలతో దున్నేవారు; నాగళ్ళతోనా, ట్రాక్టర్లతోనా, ఇంకో రకంగానా? కోతలకు ఎటువంటి పరికరాలు వాడేవారు; కొడవళ్ళా, కోత యంత్రాలా, ఇంకో రకం పరికరాలా? — ఇటువంటి, వివరాలు తెలియాలి. 'శ్రమ పరికరాల' విషయం తెలిస్తేనే 'శ్రమ క్రమం' అభివృద్ధి ఏ స్థాయిలో వుందో, ఆ శ్రమ క్రమాన్ని నిర్వహించే సమాజం ఏ స్థితిలో వుందో తెలుస్తుంది.

ఒక భారీ యంత్రం సహాయంతో, ఉత్పత్తి జరుగుతూ వుండడం చూసినప్పుడు, ఆ ఉత్పత్తి, ఒక వ్యక్తి కోసమో, ఒక కుటుంబం కోసమో కాదనీ; అనేక వందల, వేల మంది కోసం అది జరుగుతోందనీ —తెలుస్తుంది. అంతే కాదు, ఆ 'శ్రమ క్రమం'లో ఒకరో ఇద్దరో గాక, అనేక వందల మంది ఒక ఐక్యతతో పాల్గొంటున్నారని కూడా తెలుస్తుంది. అయితే, ఆ ఉత్పత్తిని, 'అమ్మే' లక్ష్యంతో చేస్తున్నారో, విలువ దృష్టి లేకుండా 'సమిష్టిగా వాడుకునే' లక్ష్యంతో చేస్తున్నారో మాత్రం ఆ శ్రమ పరికరాన్ని బట్టి తెలియదు. అమ్మకానికి సరుకుని తయారుచేయించే పెట్టుబడిదారుడూ భారీ యంత్రాన్నే ఉపయోగిస్తాడు, అమ్మకాలు లేని సమాజమూ భారీ యంత్రాన్నే ఉపయోగిస్తుంది. బానిస యజమాని అజమాయిషీ కింద పొలం దున్నే బానిసా నాగలినే ఉపయోగిస్తాడు; స్వతంత్ర రైతూ నాగలినే ఉపయోగిస్తాడు; శ్రమ పరికరాన్ని మాత్రమే చూసి (ఒక నాగలినో, ఒక భారీ యంత్రాన్నో చూసి), అది ఎటువంటి 'శ్రమ సంబంధాలలో' పరికరంగా వుందో గ్రహించలేము. ఆ విషయం తెలియాలంటే, 'శ్రమ క్రమం'లోని ముడి పదార్థాలనో, శ్రమ పరికరాలనో గాక, 'శ్రమ పరిస్తితుల్ని' చూడాలి. అంటే, 'శ్రమ క్రమంలో కనపడే మానవ సంబంధాల్ని' చూడాలి.

'శ్రమ క్రమం' అంటే మనుషులు జీవించడానికి కావలసిన 'ఉపయోగపు విలువల్ని' తయారు చేసుకునే క్రమమే. ప్రకృతి ఇచ్చిన పదార్థాల్ని, ఉపయోగానికి వీలుగా తయారు చేసుకోవడానికి శ్రమ క్రమాలు తప్పనిసరి అవసరం. 'మానవుడి' మీద ప్రకృతి విధించిన శాశ్వితమైన నిబంధన అది. శ్రమ చెయ్యడం మానుకున్న నాడు, మనిషి మళ్ళీ జంతు దశలోకి వెళ్ళిపోవలసి వస్తుంది. అంటే, మళ్ళీ జంతువులా వేటాడుతూ, పళ్ళూ కాయలూ ఏరుకుంటూ, నగ్నంగా గుహల్లో జీవించాలి. శ్రమ లేకపోతే బట్టలు వుండవు. ఇళ్ళు వుండవు. ఏ ఉత్పత్తులూ వుండవు, అప్పుడు మళ్ళీ 'జంతు స్తితి' తప్పదు. గతంలో మానవ జంతువుల్ని, మానవులుగా మార్చిందీ మలిచిందీ— 'శ్రమే'. మానవుల్ని, మానవులుగా నిలబెట్టి వుంచుతూ వున్నది కూడా శ్రమే.

మనుషులు ఏ 'సామాజిక దశ'లో వున్నా, మనుషుల మధ్య 'శ్రమ సంబంధాలు' ఏ రకంగా వున్నా, 'శ్రమ క్రమం'

అనేది తప్పని సరిగా వుంటుంది. అయితే, అది, 'శ్రమ సంబంధాల స్వభావానికి' లోబడి వుంటుంది. అంటే, మనుషులు ఏ రకం శ్రమ సంబంధాలలో వున్నారో, ఆ సంబంధాల 'స్వభావాన్ని' బట్టే, శ్రమ క్రమానికి సంబంధించిన లక్షణాలన్నీ వుంటాయి. శ్రమ క్రమం, ఏ 'వర్గ' అధికారంతో నడుస్తుందో, ఆ 'వర్గ' ప్రయోజనాలకు అనుగుణమైన స్వరూప స్వభావాలతోనే వుంటుంది.

'బానిస సమాజం'లో జరిగే శ్రమ క్రమం, ఒక ప్రత్యేక రూపం తోటీ, ఒక ప్రత్యేక స్వభావం తోటీ వుంటుంది. ఆ నాటి శ్రమ పరికరాలూ, ఆ నాటి పని పద్ధతులూ, పని పరిస్థితులూ, ఆ నాటి నియమ నిబంధనలూ, వగైరా లక్షణాలన్నీ కలిసి ఏర్పడిన ఒక ప్రత్యేకత అది. కొరడాలూ, బెత్తాలూ ఆడిస్తూ మేస్త్రీలు పని స్థలంలో తిరగడమూ, శ్రామికులు దెబ్బలకు శరీరాలు అప్పగిస్తూ తలలు వొంచి పని చెయ్యడమూ — అనే లక్షణాలు ఆ ప్రత్యేకతలో ఒక భాగం.

'భూస్వామ్య సమాజం'లో జరిగే శ్రమ క్రమానికి కూడా దాని ప్రత్యేకత దానికి వుంటుంది. బానిస సమాజం నాటి శ్రమ క్రమానికి వుండే రూపమూ, స్వభావమూ కొంచెంగా ఇక్కడ మార్పుచెంది వుంటాయి.

'పెట్టుబడిదారీ సమాజం'లో జరిగే 'శ్రమ క్రమం' కూడా ఒక ప్రత్యేకతతో వుంటుంది.

అలాగే 'నూతన సమాజం'లో జరిగే 'శ్రమ క్రమం' కూడా. ఇక్కడ, శ్రమ క్రమంలో వున్నా వారి మీద 'దండన' లేని స్వభావమూ, దానికి తగిన రూపమూ ఏర్పడతాయి.

అంటే, 'శ్రమ సంబంధాల' స్వభావాన్ని బట్టే, (అవి దోపిడీ సంబంధాలుగా వున్నాయా, దోపిడీని తీసివేస్తోన్న సంబంధాలుగా వున్నాయా — అనే దాన్ని బట్టి), శ్రమ క్రమానికి రూపు రేఖలు వుంటాయి.

'శ్రమ క్రమా'నికి వున్న ప్రత్యేక రూపం ఏదైనప్పటికీ, దాని అంతర్గత అంశం (సబ్జెక్టివ్ కండిషన్) — శ్రమ శక్తి. అంటే, శ్రమ చేసే మనుషులు. బహిర్గత అంశం (ఆబ్జెక్టివ్ కండిషన్) — 'శ్రమ సాధనాలు'.

దోపిడీ సమాజంలో — 'శ్రమ శక్తి'కి (శ్రమ చేసే వారికి) శ్రమ సాధనాలు, 'పరాయివి'గా వుంటాయి. 'శ్రమ క్రమం' జరగడానికి ఏ 2 అంశాలైతే కావాలో ఆ 2 అంశాల మధ్యా (అంతర్గత — బహిర్గత అంశాల మధ్య) 'శతృ వైరుధ్యం' వుండే పరిస్థితి దోపిడీ సమాజాలలో వుంటుంది. కాబట్టి, దోపిడీ సమాజాలలో సాగే 'శ్రమ క్రమం' వైరుధ్యాలతో సాగుతూ వుంటుంది.

# పెట్టుబడిదారీ శ్రమ క్రమం - పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం

కార్మికులు, పెట్టుబడిదారుడి కోసం 'శ్రమ' చేసి, 'జీతం' తీసుకుంటారు. అంటే, వారు, తమ 'శ్రమ శక్తి'ని అమ్ముకుంటారు. 'శ్రమ శక్తి' అనేది, అమ్మడానికీ కొనడానికీ వీలైన 'సరుకు'గా వుండడం ప్రారంభ మవుతుంది.

మనుషులు జంతు దశ నించి బయటపడుతూ క్రమ క్రమంగా శ్రమ చెయ్యడం నేర్చుకుంటూ వున్న దశకీ, శ్రమ శక్తి 'సరుకు'గా మారిన దశకీ మధ్య, ఊహించలేనంత దీర్ఘకాలం గడిచింది.

'శ్రమ క్రమానికి' వుండే సహజ లక్షణం, జీవితావసరాల్ని తీర్చే 'ఉపయోగపు విలువల్ని' ఉత్పత్తి చేసుకోవడం. కానీ పెట్టుబడిదారీ శ్రమ క్రమానికి సహజ లక్షణం, 'విలువ'ని ఉత్పత్తి చెయ్యడం!

పెట్టుబడిదారీ శ్రమ క్రమం — అన్నప్పుడు, 'పెట్టుబడీ, పెట్టుబడిదారుడూ, వేతన శ్రామికులూ' రంగంలోకి వస్తారు. ఒక పెట్టుబడిదారుడు, కొంత పెట్టుబడి పెట్టి శ్రమ క్రమం నడిపిస్తూ వున్నప్పుడు, దాని ద్వారా, 'పెట్టిన పెట్టుబడి' తిరిగి రావాలి ; అంతే కాదు, అంత కన్నా ఎక్కువ విలువ కూడా రావాలి.

ఇక్కడ 2 విషయాలు స్పష్టం చేసుకోవాలి.

**(1)** ఒక వస్తువుని ఉత్పత్తి చెయ్యడం కోసం ఖర్చయిన దంతా ఆ వస్తువు ద్వారానే తిరిగి రావాలి. ఇది, దోపిడీ లేని సమాజంలో కూడా జరగాలి. దోపిడీ లేని సమాజపు శ్రమ క్రమాన్ని తీసుకుంటే, అప్పుడు కూడా, ఆ 'శ్రమ క్రమం' కోసం మొదట ఖర్చయినదంతా (ఆ 'శ్రమ' అంతా, లేదా ఆ ఉత్పత్తులన్నీ, లేదా ఆ 'విలువ' అంతా) ఆ శ్రమ క్రమం ద్వారానే తిరిగి రావాలి. లేకపోతే తర్వాత కొత్త శ్రమ క్రమం జరగడానికి మార్గమే వుండదు.

**(2)** ఒక 'శ్రమ క్రమం' కోసం యజమాని మొదట ఖర్చు పెట్టిన విలువ కన్నా (లేదా, ఖర్చుపెట్టిన ఉత్పత్తి కన్నా) ఎక్కువ 'విలువ' (ఎక్కువ ఉత్పత్తి) ఆ శ్రమ క్రమం ద్వారా రావాలనే విషయం, పెట్టుబడిదారీ సమాజానికే కాదు, పాత దోపిడీ సమాజాలకు కూడా వర్తిస్తుంది. ఏ దోపిడీ సమాజాన్ని తీసుకున్నా, ఒక శ్రమ క్రమంలో

'అదనపు శ్రమ' జరిగితేనే 'దోపిడీ వర్గం' జీవిస్తుంది. కాబట్టి, యజమాని ఖర్చుపెట్టిన ఉత్పత్తి ద్వారా, అంత కన్నా ఎక్కువ ఉత్పత్తి రావాలనేది — పెట్టుబడిదారీ శ్రమ క్రమానికే ప్రత్యేక లక్షణం కాదు. అయినప్పటికీ, దోపిడీ విధానాలన్నిటికీ 'ప్రతినిధి'గా పెట్టుబడిదారీ విధానాన్ని తీసుకుంటున్నాము. కాబట్టి, దోపిడీకి సంబంధించిన అంశాలన్నిటినీ ప్రధానంగా పెట్టుబడిదారీ విధానం ద్వారానే చూస్తూ, అవసర మైనప్పుడల్లా వెనకటి దోపిడీ విధానాల్ని కూడా చూస్తూ వుంటాము.

సహజ శ్రమ క్రమానికి లక్ష్యం — జీవించడానికి కావల సిన 'ఉత్పత్తుల్ని' ఉత్పత్తి చేసుకోవడం. జనాభా అంతా పని చెయ్యడం. ఇది — 'ఉపయోగపు విలువ' దృష్టి.

పెట్టుబడిదారీ శ్రమ క్రమానికి లక్ష్యం — 'పెట్టుబడి' విలువనీ, దానికన్నా వీలైనంత ఎక్కువ విలువనీ, ఉత్పత్తి చేయించడం. యజమానుల వర్గం పని చెయ్యకపోవడం. ఇది 'విలువ దృష్టి'.

అయితే, 'విలువ'ని ఒక్క దాన్నే విడిగా ఉత్పత్తి చెయ్యడం సాధ్యం కాదు. 'ఉపయోగపు విలువ'తో సంబంధం లేకుండా విలువ వుండదు. విలువ లేకుండా ఉపయోగపు విలువ వుంటుంది గానీ, ఉపయోగపు విలువ లేకుండా విలువ వుండదు. విలువ వుండాలంటే, ముందు ఉపయోగపు విలువ వుండాలి. 'వస్తువు'ని తయారుచేస్తేనే దాన్ని సరుకుగా అమ్మడమూ, లాభం మిగుల్చుకోవడమూ, సాధ్యమవుతాయి. కాబట్టి, పెట్టుబడి దారుడు కూడా ఏదో ఒక 'ఉపయోగపు విలువ'నే ఎంచుకుంటాడు. కానీ, ఆ ఎంచుకోవడం కూడా 'విలువ దృష్టి'తోనే చేస్తాడు.

మనుషుల వాడకానికి ఏ వస్తువులు అవసరమో, ఏ వస్తువులు మంచివో, వారి శారీరక మానసిక ధర్మాలకు ప్రకృతి సహజంగా ఏ వస్తువులు పనికి వస్తాయో, ఏవి పనికిరావో — ఇది కాదు పెట్టుబడిదారుడు ఆలోచించేది. ఏ వస్తువుని తయారు చేయించి అమ్మితే 'ఎక్కువ లాభం' వస్తుంది? — ఇదీ పెట్టుబడిదారుడి దృష్టి. బట్టలు తయారు చేయిస్తే, నూటికి 10 లాభం వచ్చి, కత్తులు తయారు చేయిస్తే నూటికి 20 లాభం వచ్చేలాగ పరిస్తితులు వుంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ కత్తుల ఉత్పత్తి వేపే పరుగులెత్తు తాడు. "కత్తులు ఎందుకు? చంపుకోడా నికే కదా? కత్తులు చేయించి సమాజానికి అందించడం తప్పు కాదా?" అని ఆలోచించడు పెట్టుబడిదారుడు. అవి కత్తులా, తుపా కులా, సారాలా, విషాలా — అన్నది పట్టదు వాడికి.

ఒకవేళ, వాడు, బట్టల ఉత్పత్తినే ఎంచుకుంటే, అందులో కాటన్ బట్టల వల్ల ఎక్కువ లాభమా, సిల్కు బట్టల వల్ల ఎక్కువ లాభమా — అనేది చూస్తాడు. కాటన్ బట్టలనే ఎంచుకుంటే, అందులో మల్లు బట్టల వల్ల ఎక్కువ లాభమా, సైను బట్టల వల్ల ఎక్కువ లాభమా — అనేది చూస్తాడు. ముందు 'లాభం' విషయంలో నమ్మకం కలిగాకే ఒక ఉత్పత్తిలోకి దిగుతాడు.

తయారు చేయించే వస్తువుని కొంచెం 'మంచి'గా తయారు చేయించాలని పెట్టుబడిదారుడు ఆలోచిస్తే, అలా ఎందుకు చేస్తాడంటే, ఇతర పెట్టుబడిదారులు ఉత్పత్తి చేయించే అదే రకం సరుకు కన్నా తన సరుకు కొంచెం మంచిగా వుంటే, కొనే వాళ్ళు తన సరుకునే ఎక్కువగా కొంటారనీ, తనకే ఎక్కువ లాభాలు వస్తాయనీ, అలా చేస్తాడు. అంటే, సరుకుని 'మంచి'గా తయారు చేయించడం కూడా 'విలువ దృష్టి' తోనే! అంతేగానీ, 'వాడకానికి మంచి వస్తువులే వుండాలి; మంచి వస్తువులే సౌఖ్యంగా, ఆరోగ్యకరంగా వుంటాయి' అనే దృష్టితో కాదు.

ఒక విషయాన్ని 'ఉపయోగపు విలువ' దృష్టి తోటీ ఆలోచించవచ్చు, 'విలువ' దృష్టి తోటీ ఆలోచించవచ్చు.

పెట్టుబడిదారుడు కూడా 'ఉపయోగపు విలువ'నే ఉత్పత్తి చేయించినా, వాడి నిజమైన లక్ష్యం — 'ఉప యోగపు విలువ' కాదు, 'విలువ' ని ఉత్పత్తి చేయించ డమే. ఇంకా సరిగా చూస్తే, 'విలువ' ని కూడా కాదు. 'అదనపు విలువ'ని ఉత్పత్తి చేయించడం. వాడి లక్ష్యం 'అదనపు విలువే'. దాని కోసమే వాడి కార్యక్రమం అంతా. అంటే, 'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం' అనేది, కేవలం విలువ దృష్టితో సాగే ఉత్పత్తి విధానం.

ఈ 'విలువ దృష్టి' విషయంలోనూ, 'సరుకు ఉత్పత్తి' విషయంలోనూ, 'అమ్మకాల' విషయంలోనూ (సారాం శంలో ఈ విషయాలన్నీ ఒకటే), వెనకటి దోపిడీ సమా జాలకూ, పెట్టుబడిదారీ సమాజానికీ చాలా తేడా వుంది. ఆ తేడా ఏమిటో మొదట చూడాలి.

అసలు దోపిడీయే ప్రారంభం కాని 'ఆదిమ తెగల' సమాజాలలో గానీ, దోపిడీ ప్రారంభమైన బానిస — భూస్వామ్య సమాజాలలో గానీ, ఉత్పత్తి చెయ్యడం అనేది, 'విలువ దృష్టి'తో గాక, 'అవసరాల దృష్టి'తోనే సాగేది.

ఒక 'ఆదిమ తెగ'లో జరిగే ఉత్పత్తి, ఆ తెగ స్వంత అవసరాల కోసమే జరిగేదని ఊహించాలి. ఆ ఉత్పత్తి అంతా, 'మారకాల'తో సంబంధం లేకుండానే ఆ తెగ కోసం ఖర్చయిపోతూ వుండేది. ఆ తెగకి ఇతర తెగలతో జరిగే మారకాలు అతి తక్కువగా వుండేవి. ఆ మారకాలు కూడా 'అవసరాల దృష్టి'తోనే సాగేవి. రెండు తెగల మధ్య బార్టరు పద్ధతిలో ఒక మారకం జరిగినప్పుడు, ఉత్పత్తులు ఇటూ అటూ మారి, తర్వాత ఖర్చయిపోతాయి. 'ఉత్పత్తి'ని అమ్మి, 'డబ్బు' సంపాదించి, ఆ డబ్బుని కూడబెట్టడం —

అనే లక్షణం, ఏ తెగలోనూ వుండదు. 'డబ్బు' అనేది, తెగల కాలంనాడే ప్రారంభమైనా, డబ్బు ద్వారా జరిగే మారకాలు ఆ నాడు దాదాపు లేని వాటితో సమానం. ఒక తెగకి వుండే 'మొత్తం ఉత్పత్తి'లో, 'మారకాల'లోకి వెళ్ళే భాగమే అతి తక్కువ. ఆ భాగంలో కూడా డబ్బు ద్వారా జరిగే మార కాలు ఇంకా తక్కువ. అంటే, దాదాపు ఉత్పత్తి అంతా, అమ్మకాలతో సంబంధం లేకుండానే వాడకమవుతూ వుండేది.

'బానిస సమాజాన్ని' తీసుకుంటే— శ్రమ చేసేది బానిసలే అయినా, ఆ బానిసలు చేసింది —'యజమాని కుటుంబ అవసరాల' కోసమే. బానిసల అవసరాలు కూడా యజమాని కుటుంబ అవసరాలలోనే కలిసిపోయి వుంటాయి. ఒక యజమాని కుటుంబంలో వుండే బానిసలు పండించిన పంటల్నీ, ఇతర ఉత్పత్తుల్నీ, యజమాని కుటుంబమే చాలా వరకూ ఉపయోగించు కుంటుంది. ఇక్కడ కూడా, మొత్తం ఉత్పత్తిలో అమ్మకాల లోకి పోయే భాగం అతి తక్కువ.

'భూస్వామ్య' సమాజాన్ని తీసుకుంటే— ఇక్కడ కూడా, భూస్వాములకు 'కౌలు'గా వచ్చే భాగం చాలా వరకూ భూస్వామి కుటుంబ అవసరాలకూ, కౌలు రైతుల దగ్గిర మిగిలే భాగం అంతా ఆ రైతు కుటుంబాల అవసరాలకూ ఖర్చవుతుంది. ఈ సమాజంలో కూడా, మొత్తం ఉత్పత్తిలో అమ్మకాలలోకి పోయే భాగం అతి తక్కువగానే వుంటుంది. ఆ అమ్మకాలు కూడా తమ వాడకానికి కావలసిన ఇతర ఉత్పత్తుల్ని కొనే అవసరాల కోసమే జరుగుతాయి.

కానీ, పెట్టుబడిదారీ సమాజం అలాంటిది కాదు. ఇది పాత దోపిడీ సమాజాల నించి అనేక రకాలుగా భిన్నమైనది.

# పెట్టుబడిదారీ విధానం సరుకుల ఉత్పత్తి విధానం !

ఇక్కడ మొత్తం ఉత్పత్తి అంతా 'అమ్మకాల'లో నించి నడవవలసిందే. ఇక్కడ, అమ్మకాలలోకి వెళ్ళకుండా వాడకం అయ్యేభాగం అతి తక్కువగా వుంటుంది. అది, దాదాపు లేని దానితో సమానం. ఎలాగంటే;

'సైను బట్ట' పెట్టుబడిదారుడి దగ్గిర, రోజుకి 100 మీటర్ల బట్ట ఉత్పత్తి అవుతుందనుకుందాం.

నెలకి = 30× 100 = 3000 మీటర్లు.

సంవత్సరానికి = 12 × 3000 = 36,000 మీ.

ఇందులోనించి, పెట్టుబడిదారుడి కుటుంబం స్వంత అవసరానికి ఎన్ని మీటర్లు వాడుతుంది? ఇది 'సైను' బట్ట కాబట్టి, దీన్ని పెట్టుబడిదారుడి కుటుంబం అస్సలు వాడక పోవచ్చు. ఒకవేళ వాడితే, సంవత్సరానికి 10 మీటర్లు వాడుతుందనుకుందాం. అప్పుడు, 36 వేలల్లో 10 మీటర్లకి మాత్రమే అమ్మకం వుండదు. మిగిలిన 35,990 మీటర్లూ అమ్మకంలోకి వెళ్ళవలసిందే. అంటే, అమ్మకంలోకి వెళ్ళ కుండా వాడకం అయ్యే భాగం దాదాపు లేనిదానితో సమానం. ఒకవేళ, పెట్టుబడిదారుడి కుటుంబం ఆ 10 మీటర్లు కూడా వాడకపోతే, అప్పుడు మొత్తం సరుకు అంతా అమ్మకంలోకి వెళ్ళవలసిందే. పెట్టుబడిదారుడు తన సరుకునంతా అమ్మేసి, ఆ 'డబ్బు'లో నించి, శ్రమ సాధనాల భాగంతో మళ్ళీ కొత్త శ్రమ సాధనాల్ని కొనాలి. జీతాల భాగాన్ని కార్మికులకు ఇస్తే, ఆ భాగంతో వారు, జీవితావసర ఉత్పత్తుల్ని వేరు వేరు పెట్టుబడిదారుల నించి కొనుక్కుంటారు. 'అదనపు విలువ' భాగంతో పెట్టుబడి దారుడు తన కుటుంబం అవసరాలకు కావలసిన ఉత్పత్తు లన్నీ ఇతర పెట్టుబడిదారులనించి కొనుక్కోవాలి. అంటే, మొదట 36 వేల మీటర్ల బట్టా 'అమ్మకం'లోకి వెళ్ళి పోతుంది. అలాగే, దాని విలువకి తగిన ఇతర ఉత్పత్తులన్నీ కూడా అమ్మకంలోకి వస్తాయి.— ఇది ఒక్క పెట్టుబడి దారుడి సంగతి.

ప్రతీ పెట్టుబడిదారుడి సంగతీ ఇదే.

'పంచదార' పెట్టుబడిదారుడు రోజుకి 2 టన్నుల పంచదార ఉత్పత్తి చేయిస్తాడనుకుందాం (1 టన్ను = వెయ్యి కిలోలు). నెలకి 60 టన్నులు (60 వేల కిలోలు). ఇంత పంచదారలో నించి, పెట్టుబడిదారుడి కుటుంబం, తన స్వంతానికి, నెలకి ఎన్ని కిలోలు వాడుతుంది? మహా అయితే 20 కిలోలు అనుకుందాం. అంటే, 60 వేల కిలో లలో నించి, 20 కిలోలకు మాత్రమే అమ్మకం వుండదు. మిగిలిన ఉత్పత్తినంతా అమ్మవలసిందే. ఆ ఉత్పత్తినంతా అమ్మేసి, ఆ డబ్బుతో ఇతర ఉత్పత్తులు కొనాలి.

'బొగ్గు' పెట్టుబడిదారుడు, తన కుటుంబ అవసరానికి ఎంత బొగ్గు వాడతాడు? ఏమీ వాడడు. కానీ, తన 'పని స్థలం'లోకి కొంత బొగ్గు వాడవచ్చు. అది అయినా ఎంత భాగం? అది తప్ప, మిగతా ఉత్పత్తినంతా అమ్మవలసిందే.

'దిన పత్రిక' పెట్టుబడిదారుడు, రోజుకి లక్ష కాపీలు ప్రింటు చేస్తాడనుకుందాం. తన కుటుంబంలో స్వంత అవసరానికి ఎన్ని కాపీలు వాడతాడు? — ఒక్క కాపీ! ఆ ఒక్క కాపీకే అమ్మకం వుండదు. ఒక్కటి తప్ప, లక్ష కాపీలూ అమ్మవలసిందే.

'సబ్బుల' పెట్టుబడిదారుడు, తన ఉత్పత్తిలో నించి, కుటుంబంలో అవసరానికి ఎన్ని సబ్బులు వాడతాడు?

'చమురు' పెట్టుబడిదారుడు, ఎంత చమురు వాడతాడు?

నెలకి 1000 రేడియోలు ఉత్పత్తి చేసే 'రేడియోల' పెట్టుబడిదారుడు, నెలకి ఎన్ని రేడియోలు వాడతాడు?

'హోటల్' పెట్టుబడిదారుడు, ఎన్ని పదార్థాలు స్వంతానికి తింటాడు?

ఇలాగే, ఏ పెట్టుబడిదారుడి విషయం చూసినా, వాడు తయారు చేయించే ఉత్పత్తిలో నించి వాడి కుటుంబంలో అవసరానికి గానీ, లేదా వాడి 'పని స్థలం'లో గానీ, ఉపయోగించే భాగం మహా తక్కువ. కొన్ని ఉత్పత్తుల విషయంలో అది కూడా వుండదు. అంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ తన ఉత్పత్తినంతా అమ్మెయ్యాలి. అందులో ప్రతీ ఒక్కటీ 'అమ్మకం'లోకి పోవాలి.

మొత్తం సమాజాన్ని తీసుకుందాం! 'అమ్మకం'లోకి పోకుండానే వాడకం అయ్యే ఉత్పత్తిని 1% గా అనుకుంటే, 99% ఉత్పత్తికి అమ్మకం జరగవలసిందే. లెక్కలు సరిగా చూస్తే, అమ్మకాలలోకి పోకుండా వాడకం అయ్యే భాగం 1% కూడా వుండదు. అంటే, 'మొత్తం ఉత్పత్తి రాసి' అంతా అమ్మకాలలో నించి నడవవలసిందే అన్నమాట!

ఈ రకంగా, 'పెట్టుబడిదారీ విధానం'లో, 'ఉత్పత్తి దశ' తర్వాత 'అమ్మకం దశ' అత్యవసరంగా వుండి తీరాలి. తయారవుతోన్న సరుకు, 'అమ్మకం' కోసమే కాబట్టి, ఉత్పత్తిని తయారు చేయించే ప్రారంభదశ నించే, దాన్ని 'అమ్మకం దృష్టి'తోనే (కొనేవాళ్ళని ఆకర్షించీ, మభ్యపెట్టీ, కొనిపించే దృష్టితో) తయారుచేయించవలసి వస్తుంది.

అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం— 'అమ్మకం కోసమే ఉత్పత్తి చేయించే సరుకు ఉత్పత్తి విధానం'.

మారకాలు జరగడమూ, వస్తువులు సరుకులుగా మారడమూ అనేవి – వెనకటి సమాజాల్లో కూడా వున్నాయి. కానీ, ఆ సమాజాల్లో, అమ్మకంలోకి పోయే ఉత్పత్తి, 'మొత్తం ఉత్పత్తి'లో అతి తక్కువ భాగమే. కాబట్టి, ఉత్పత్తిని కేవలం అమ్మకం దృష్టితోనే తయారు చెయ్యడం అనేది, వెనకటి సమాజాల్లో లేదు. అంటే, వెనకటి సమాజాల్లో 'సరుకులు' అనేవి వున్నా, 'సరుకు ఉత్పత్తి' లేదు. అది 'పెట్టుబడిదారీ విధానానికి' మాత్రమే ప్రత్యేకం.

సమాజంలో, సరుకులూ, డబ్బూ వుండడమే, 'పెట్టుబడిదారీ విధానం' వుండడం కాదు. అవే, పెట్టుబడిదారీ విధానానికి కారణం కాదు.

భూమినీ, ఇతర ఉత్పత్తి సాధనాల్నీ పూర్తిగా ఆక్రమించిన పెట్టుబడిదారీ వర్గం ఒక వేపు; సమస్త ఉత్పత్తి సాధనాల నించీ పూర్తిగా దూరమై తన 'శ్రమ శక్తి'ని జీతం పద్ధతి మీద అమ్ముకునే 'శ్రామిక వర్గం' ఇంకో వేపు — ఇలా, ఈ వర్గాలు ఏర్పడడమే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి దారితీసే భౌతిక పరిస్థితులు.

ప్రపంచంలో ఎక్కడైనా, ఈ రకం పరిస్థితులు ప్రారంభమైనప్పుడే 'శ్రమ శక్తి' ఒక సరుకుగా మారుతుంది. అప్పటి నించే 'సరుకుల ఉత్పత్తి' ప్రారంభమవుతుంది.

గత సమాజాలలో కూడా, మారకాలూ, సరుకుల చలామణీ — వుండడం వల్ల, ఆ సమాజాలలో కూడా 'సరుకు ఉత్పత్తి' వున్నట్టు కనపడుతుంది. కానీ, అలా అర్థం చేసుకో కూడదు. సరుకుల ఉత్పత్తి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి మాత్రమే ప్రత్యేక లక్షణం. అందుకే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ఇంకొక పేరు 'సరుకు ఉత్పత్తి విధానం'. 'సరుకు ఉత్పత్తి' అంటే, దాని చుట్టూ ఉత్పాదక పెట్టుబడీ, వేతన శ్రమా, అమ్మకమూ, ఉత్పాదక లాభమూ, అన్నీ ఏర్పడతాయి.

పెట్టుబడిదారుడు తన 'సరుకు ఉత్పత్తి' ద్వారా ఆశించేదేమిటంటే — 'లాభం'! కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి మూడో పేరు — 'లాభ ఉత్పత్తి విధానం.'

'ఉత్పత్తి విధానం' అన్నా, 'ఉత్పత్తి సంబంధాలు' అన్నా, 'శ్రమ విధానం' అన్నా, 'శ్రమ సంబంధాలు' అన్నా — ఈ మాటలన్నీ ఒకే అర్థాన్ని ఇస్తాయి. ఈ మాట లకు ముందు 'బానిస' అని గానీ, 'భూస్వామ్య' అనిగానీ, 'పెట్టుబడిదారీ' అని గానీ చేరితే, అది ఆ సమాజ ప్రత్యేక లక్షణం అవుతుంది. ఈ రకంగా, పెట్టుబడిదారీ సమాజం — పెట్టుబడిదారులూ, కార్మికులూ అనే వర్గాలతో, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంతో, వుంటుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి వుండే దృష్టి — 'విలువ దృష్టి' కాబట్టి, ఇది 'విలువ దృష్టి'తో సాగే ఉత్పత్తి విధానం. దీన్ని నాలుగో పేరుగా అనుకోవచ్చు.

'విలువ'ని ఉత్పత్తి చెయ్యాలంటే ఏదో ఒక 'ఉపయోగపు విలువ'నే ఎంచుకోవాలి. 'ఉపయోగపు విలువల్ని' ఉత్పత్తి చెయ్యకుండా, 'విలువ'ని మాత్రమే ఉత్పత్తి చెయ్యడం కుదరదు. కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం — ఒక వేపు 'ఉపయోగపు విలువల్ని' ఉత్పత్తి చేసేదిగానూ, ఇంకోవేపు 'విలువని' ఉత్పత్తి చేసేదిగానూ కూడా వుండితీరాలి.

# టైము స్పృహ, పెట్టుబడిదారీ విధానంలోనే ప్రారంభం

'విలువని ఉత్పత్తి చెయ్యడం' — అన్నప్పుడు అది నూటికి నూరు పాళ్ళూ 'టైము'తో ముడిపడివున్న విషయం. ఏ సరుకు విలువ అయినా, దాని 'ఉత్పత్తికి పట్టే శ్రమ కాలాన్ని' బట్టి వుంటుందనే సూత్రం, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి మరింత బాగా వర్తిస్తుంది. ఎందుకంటే, 'పెట్టుబడి'కి తప్పనిసరిగా లాభం మిగలడమూ, పెట్టుబడి తిరిగిరావడమూ జరగాలి. ఈ 2 ఫలితాలూ రావాలంటే, ఉత్పత్తి క్రమంలోవున్న ప్రతీ అంశమూ ఖచ్చితమైన 'విలువ లెక్కల' ప్రకారం (శ్రమ కాలం లెక్కల ప్రకారం) జరిగి తీరాలి.

మన పెట్టుబడిదారుడు 'బట్ట'ని తయారు చేయిస్తాడు కదా? ఇదే రకం బట్టని ఇంకా కొందరు పెట్టుబడిదారులు కూడా తయారు చేయిస్తారు. 100 మీటర్ల బట్టని నేయడానికి అన్ని పని స్థలాలలోనూ 1 రోజు కాలం పడుతూ వుండగా, మన పెట్టుబడిదారుడి దగ్గిర మాత్రం, 2 రోజుల కాలం పడుతుందనుకుందాం. ఆ బట్టని అమ్మేటప్పుడు మన పెట్టుబడిదారుడు, బట్టని కొనే వాళ్ళతో — "నా పని వాళ్ళు చాలా మందగొడిగా పనిచేశారు. అందరి పనివాళ్ళూ ఒక్కరోజులో చేసే పనిని, మా వాళ్ళు 2 రోజులు చేశారు. నేను మా వాళ్ళకి 2 రోజుల జీతం ఇచ్చాను. నా బట్ట కోసం ఎక్కువ ఖర్చు అయింది. కాబట్టి, నా బట్టకి ఎక్కువ డబ్బు ఇవ్వండి" అంటాడనుకుందాం. కొనేవాళ్ళు ఆ మాటలకు ముగ్ధులై "ఈ పెట్టుబడిదారుడు పనివాళ్ళ కోసం ఎక్కువ ఖర్చు పెట్టానంటున్నాడుకదా?" అని ఆ బట్టని ఎక్కువ విలువ ఇచ్చి కొంటారా? — అలా కొనరు. వాళ్ళేమంటారంటే — "ఇదే బట్ట మాకు నీ పక్క పెట్టుబడిదారుడి దగ్గిర తక్కువ విలువకే దొరుకుతోంటే, నీ దగ్గిర ఎక్కువ విలువతో ఎందుకు కొనాలి? అక్కడికే పోతాం" అంటారు. అప్పుడు మన పెట్టుబడిదారుడు కూడా తన బట్టని అందరూ ఇచ్చే విలువకే ఇవ్వవలసి వస్తుంది. అంటే, ఏ పెట్టుబడిదారుడైనా తన దగ్గిర సగటు కన్నా ఎక్కువ ఖర్చులు కాకుండా చూసుకోవాలన్నమాట! కాబట్టి, పెట్టుబడిదారుడు, తనకు ఎక్కువ ఖర్చులు కాకుండా చూసుకోవడం కోసం, కార్మికులు ఎప్పుడూ 'సరిగా పనిచేసేలాగ' చూసుకోవలసి వుంటుంది. అంటే, ఒక పనికి సాధారణంగా ఎంతకాలం పట్టాలో అంత కాలమే పట్టేలాగ (ఆ కాలం దాటకుండా ఆ పని జరిగేలాగ) పెట్టుబడిదారుడు చూసుకోవాలి. తయారయ్యే సరుకుని అమ్మి, 'లాభం మిగుల్చుకోవడం' అనే విషయం ఒకటి ఇక్కడ వుంటుంది కాబట్టి.

బానిస సమాజంలోనో, భూస్వామ్య సమాజంలోనో అయితే, ఒక పని జరగడానికి ఇంత టైమే పట్టాలి — అనే ఖచ్చితమైన లెక్కలు అవసరం లేదు. ఎందుకంటే, ఆ సమాజాలలో, ఖచ్చితంగా 'ఇన్ని గంటలే పని కాలం' అనీ, ఆ గంటలు అయిపోగానే శ్రామికులు పని ఆపేసి వెళ్ళిపోవడం అనీ — వుండదు. జరగాల్సిన పని నాలుగు గంటలు ఇటూ, అటూగా కూడా జరగవచ్చు.

అలా అని 'బానిస ఎంత ఆలస్యంగా అయినా పని చెయ్యవచ్చు' అని దీని అర్థం కాదు. బానిస కూడా ఒక రోజులో చెయ్యవలసిన పనిని ఒక రోజులోనే చెయ్యాలి. అలాగాక అదే పనిని 2 రోజుల పాటు చేస్తే, ఆ బానిస ద్వారా వచ్చే ఉత్పత్తి పెరగకుండా, బానిస పోషణ కోసం అయ్యే ఖర్చు పెరుగుతుంది. అంటే, శ్రమ శక్తి కోసం ఖర్చు పెరుగుతుంది. కాబట్టి, బానిసకి కూడా ఒక రోజు పని కోసం, ఒక రోజు కన్నా ఎక్కువ కాలాన్ని ఉపయోగించడం సాధ్యం కాదు. కాకపోతే, బానిసకు గంటల లెక్కల్ని ఖచ్చితంగా పాటించవలసిన అవసరం వుండదు.

కానీ, ఆ పరిస్థితి 'కార్మికుల' విషయంలో వుంటుంది. వారు, 10 గంటల పనిని, 10 గంటల్లోనే చేసి తీరాలి. తర్వాత కార్మికులు 'పని స్థలం'నించి వెళ్ళిపోతారు కాబట్టి, తర్వాత ఇంకేమీ పని జరగదు. ఆ 10 గంటల పనిలోనించే పెట్టుబడిదారుడికి 'అదనపు పని' రావాలి. కాబట్టి, కార్మికుడి శ్రమ కాలం అంతా ఖచ్చితమైన నిబంధనలతో వుంటుంది.

'పని స్థలం'లో ప్రతీ పని విషయంలోనూ ఖచ్చితమైన టైముని పాటించే స్పృహ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికే అవసరమవుతుంది. అందుకే, ఈ టైము స్పృహ ఇక్కడే ప్రారంభమవుతుంది. ఉత్పత్తి క్రమంలో ఖచ్చితంగా టైముని పాటించవలసిన అవసరం అనేది, సమాజ జీవితంలో ఒక 'క్రమశిక్షణ'కు తప్పనిసరిగా దారితీస్తుంది.

# 'శ్రమ సాధనాల' తో కార్మికుల 'పరాయితనం'

ముడి పదార్థాలకూ, శ్రమ పరికరాలకూ సంబంధించిన జాగ్రత్తల విషయాలు కూడా ఇంతే. 'బట్ట'ని తయారు చేసేటప్పుడు, సాధారణంగా దారం ఎంత రద్దు పోవడం తప్పనిసరో అంతే పోవాలిగానీ, అంతకన్నా ఎక్కువ పోకూడదు. ఎక్కువ రద్దు పోతే, పెట్టుబడి దారుడు మార్కెట్లోకి వెళ్ళి ఆ బట్టని కొనే వాళ్ళతో "నా కార్మికులు, దారం బాగా రద్దు పోగొట్టారు. మగ్గం ఒకటి విరగ్గొట్టారు. ఈ బట్ట తయారవడానికి నాకు చాలా ఖర్చయింది. కాబట్టి ఈ బట్టకి ఆ విలువ అంతా ఇవ్వండి" అనలేడు. ఆ బట్ట అందరి దగ్గరా ఎంత ఖర్చుతో తయారవుతుందో మనవాడి దగ్గిర కూడా అలాగే తయారవ్వాలి. అంటే, వాడు ఎప్పుడూ ముడి పదార్థాల పొదుపు గురించీ, శ్రమ పరికరాల జాగ్రత్త గురించీ కూడా చూసుకుంటూ వుండాలి.

కానీ, సరిగ్గా దీనికి వ్యతిరేకంగా, ఈ విషయాల మీద కార్మికులు ఏమీ ఆసక్తి లేకుండా వుంటారు. ఎందుకంటే, ఈ ముడి పదార్థాలూ, ఈ శ్రమ పరికరాలూ అన్నీ కార్మికులకు 'పరాయి ఆస్తి'! యజమాని ఆస్తి! వాటిని జాగ్రత్తగా వాడాలనే బాధ్యత వారికి సహజంగా పుట్టుకు రావడానికి కావలసిన కారణం ఏదీ అక్కడ వుండదు. అంటే, ఏ వ్యక్తి అయితే స్వయంగా 'శ్రమ' చేస్తాడో ఆ వ్యక్తి, ఆ ముడి పదార్థాల పొదుపు గురించీ, శ్రమ పరికరాల జాగ్రత్త గురించీ, ఏమీ పట్టని పరిస్థితిలో వుంటాడు.

'పొదుపూ, జాగ్రత్తా' అనే విషయాల్ని వాటిని వాటిగా విడిగా చూస్తే, అవి చాలా మంచి విషయాలే. దూదినీ, దారాన్నీ, మగ్గాన్నీ, పొదుపుగా, జాగ్రత్తగా, వాడడం ఎందుకు మంచిది? ఎందుకు మంచిదంటే, దూదిని జాగ్రత్తగా వాడి, రద్దు తక్కువగా వుండేలాగ చేసుకుంటే, దాని వల్ల ఎక్కువ దారం వస్తుంది. దారాన్ని కూడా జాగ్రత్తగా ఎక్కువ రద్దు పోకుండా వాడుకుంటే, ఎక్కువ బట్ట వస్తుంది. అలాగే, ఒక మగ్గాన్ని ఎక్కువ కాలం మన్నేలాగ జాగ్రత్తగా వాడుకుంటే, కొత్త మగ్గాన్ని వెంటనే వాడవలసిన అవసరం వుండదు. ఒక సారి తయారు చేసుకున్న వస్తువుల్నీ పదార్థాల్నీ పొదుపుగానూ, జాగ్రత్తగానూ వాడుకుంటే, అవి ఎక్కువ కాలం మన్ని, ఎంతో శ్రమ కాలం కలిసి వస్తుంది. ఎక్కువ ఉత్పత్తి జరుగుతుంది.

ఒక గాజు గ్లాసుని జాగ్రత్తగా వాడితే, 2 సంవత్సరాల పాటు మన్నే గుణం ఆ గాజుకి వుందనుకుందాం. ఆ గ్లాసు ఒకరి అశ్రద్ధ వల్ల నెల్లాళ్ళకే కిందపడి బద్దలైందనుకుందాం. ఆ గ్లాసుని తయారు చెయ్యడానికి పట్టిన శ్రమలో చాలా భాగం వృథా అయిపోయిందన్నమాట. ఆ గ్లాసుని రెండేళ్ళ దాకా వాడుకోగలిగితేనే దానికి పట్టిన శ్రమ అంతా ఉపయోగపడినట్టు అవుతుంది. చేసిన శ్రమ వృథా అయిపోతే, ఆ శ్రమనే మళ్ళీ చేసుకోవాలి. చేసిన శ్రమ వృథా కాకుండా వుంటే, ఆ పని మళ్ళీ చేసుకోనక్కరలేదు. ఆ కాలం మిగులుతుంది. ఆ కాలాన్ని కొత్త అవసరాల కోసమో, కొత్త జ్ఞానం కోసమో, ఇతర రకాలుగా అభివృద్ధి చెందడం కోసమో, విశ్రాంతి కోసమో, ఉపయోగించుకోవచ్చు. శ్రమతో తయారైన వస్తువుల్ని జాగ్రత్తగా వాడుకోకపోతే, మళ్ళీ మళ్ళీ అదే శ్రమ చేసుకోవాలి. మనుషులు ఎప్పుడూ శ్రమలోనే మునిగి వుండవలసి వస్తుంది. ఎంత శ్రమ చేస్తోన్నా అవసరాలు తీరక బాధ పడవలసి వస్తుంది.

ఒకసారి చేసిన శ్రమని జాగ్రత్తగా వాడుకోవడం వల్ల జరిగే మేలూ, అలా వాడుకోకపోతే జరిగే హానీ, మనుషులందరికీ ఒకేలాగ ఎప్పుడు చెందుతాయంటే, ఆ మనుషులు 'సమాన సంబంధాలలో' వున్నప్పుడు. అందరూ శ్రమ చేసే వాళ్ళే అయితే, ఎవరి పనిలో వాళ్ళు జాగ్రత్తలు పాటిస్తూ వుంటే, వృథాగా పోయే ఉత్పత్తి తగ్గి, కొత్త ఉత్పత్తిని ఎక్కువ స్థాయిలో చేసుకోవలసిన అవసరం వుండక, అందరి శ్రమకాలమూ కొంత కొంత తగ్గుతుంది. శ్రమ సాధనాల పట్ల జాగ్రత్తలు లేకపోతే, అందరి శ్రమ కాలమూ కొంత కొంత పెరుగుతుంది. అంటే, అందరూ శ్రమచేసే వాళ్ళయితే, 'పొదుపుల' వల్లా, 'జాగ్రత్తల' వల్లా వచ్చే ఫలితాలు అందరికీ సమానంగా అందుతాయి.

కానీ, దోపిడీ సమాజంలో, 'పని స్థలం'లో శ్రామికులు నిజంగా శ్రమ సాధనాల పట్ల పొదుపులూ జాగ్రత్తలూ పాటిస్తే, వాటి వల్ల వచ్చే ఫలితాలు యజమానికి మాత్రమే అందుతాయి.

మన బట్ట పెట్టుబడిదారుడి దగ్గర శ్రామికులు, 'శ్రమ సాధనాల్ని' చాలా జాగ్రత్తగా వాడతారనుకుందాం. ఇతర పని స్థలాల్లో కన్నా ఇక్కడ రద్దులు పోవడాలూ, పనిముట్లు విరగడాలూ చాలా తక్కువగా జరుగుతాయనుకుందాం. దాని వల్ల 1 రోజులో ఇంకో 5 మీటర్ల బట్ట ఎక్కువగా వస్తుందనుకుందాం. శ్రామికులు ఎంతో బాధ్యతతో, శ్రమ సాధనాల ఖర్చుని తగ్గించిన ఫలితం — ఈ 5 మీటర్లు. అయితే ఈ ఉత్పత్తి తయారైన తర్వాత ఇది ఎవరికి చెందుతుంది? — పెట్టుబడిదారుడికే! వాడు ఈ 5 మీటర్లు కూడా అమ్ముకుని తన 'లాభం' ఇంకా ఎక్కువ చేసుకుంటాడు. శ్రామికులు, శ్రమ సాధనాలతో ఎంత జాగ్రత్తగా వ్యవహరించినా దాని వల్ల వారికి వచ్చేదేమీ వుండదు. వారికి వచ్చేది, మొదట ఒప్పందం చేసుకున్న 'జీతం' మాత్రమే. కాబట్టి, 'యజమాని ఆస్తి అయిన శ్రమ సాధనాల్ని' పొదుపుగానూ జాగ్రత్తగానూ వాడాలనే దృష్టి శ్రామికులకు ఏర్పడదు.

# 'నిర్ణయాల' తో కార్మికుల 'పరాయితనం'

'పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం'లో వుండే ప్రతీ ఒక్క అంశానికీ కార్మికులు 'పరాయివారి'గానే వుంటారు. ఏ వస్తువుని ఉత్పత్తి చెయ్యాలో నిర్ణయించే దగ్గిర్నించీ, దాన్ని అమ్మేదాకా సమస్తమైన నిర్ణయాలూ యజమానివే.

'శ్రమ' జరగడానికి కావలసిన అంశాలు — శ్రామికులూ, శ్రమ సాధనాలూ కదా? కానీ, ఏ 'దోపిడీ సమాజం'లోనైనా ఈ అంశాలు ఒకదానికొకటి 'పరాయితనం'తోనే వుంటాయి.

బానిస, భూస్వామ్య సమాజాలలో కూడా శ్రామికులకూ, శ్రమ సాధనాలకూ మధ్య 'పరాయితనమే' వుంటుంది. కానీ, పెట్టుబడిదారీ విధానంలో ఈ పరాయితనం మరింత తీవ్ర స్థాయిలో వుంటుంది. ఏ వస్తువుని ఉత్పత్తి చెయ్యాలి? ఎంత ఉత్పత్తి చెయ్యాలి? దానికి ఏ రకం ముడి పదార్థాలు వాడాలి? ఉత్పత్తి క్రమంలో ఎలాంటి పద్ధతులు ఉపయోగించాలి? తయారైన వస్తువుని ఎలా పంపిణీ చెయ్యాలి? దాని అమ్మకానికి ఎంత విలువ నిర్ణయించాలి? దాన్ని ఏ ప్రాంతాలలో అమ్మాలి? — ఇలా ఆ ఉత్పత్తికి సంబంధించిన ఏ 'నిర్ణయం'లోనూ, ఆ ఉత్పత్తుల్ని స్వయంగా తయారుచేసే కార్మికుల పాత్ర వుండదు. ఆ నిర్ణయాలన్నీ పెట్టుబడిదారుడే చేసుకుంటాడు. ఇక్కడ కార్మికుల పాత్ర ఏమిటంటే, యజమాని చెప్పిన పని చెయ్యడం మాత్రమే. అంటే 'కూలి పని' చెయ్యడం మాత్రమే.

పత్తి నించి దారం తీసేటప్పుడు, ఆ పత్తి చెత్తగా వుండడం వల్ల దారం అస్తమానూ తెగిపోతూ, పని ఆగిపోతూ వుందనుకుందాం. తయారైన దారం కూడా ఏమీ గట్టిదనం లేకుండా వుందనుకుందాం. "ఈ పత్తి ఏమీ బాగో లేదు. వచ్చే సంవత్సరం నించి ఇలాంటి రకం పత్తిని పండించ వద్దు. ఇప్పటికైనా ఈ పత్తిని ఇంకేదైనా అవసరాలకు ఉపయోగించాలి. దీనితో దారం తియ్యడం చాలా ఇబ్బంది. కాలం అంతా వృథా అవుతోంది" అని కార్మికులు నిర్ణయించడానికి వీలు వుంటుందా? — ఉండదు. ఆ నిర్ణయం చేస్తే యజమానే చెయ్యాలి. కార్మికులు మాత్రం, యజమాని ఏ ముడి పదార్థం ఇస్తే దాని తోనే మారు మాట్లాడకుండా పని చెయ్యాలి.

ముడి పదార్థం విషయమే కాదు, 'పని స్థలం'లో వుండే ప్రతీ విషయమూ ఇంతే. పని స్థలం ఎలా వుండాలి? శ్రమ పరికరాలు ఎలా వుండాలి? శ్రమచేసే మనుషులకు సౌఖ్యంగా వుండాలంటే అక్కడ ఎలాంటి ఏర్పాట్లు వుండాలి? — ఇలాంటి ఏ విషయాల మీదా ఆ శ్రమ చేసే మనుషుల నిర్ణయాలకు అవకాశం వుండదు. అన్నీ యజమాని నిర్ణయాలే! వాడు ప్రతీ అంశాన్నీ 'లాభ' దృష్టితోటే చూస్తాడు. శ్రమ చేసేది వాడు కాదుగదా? వాడు కూడా శ్రామికుల్లో కలిసివుంటే, శ్రామికుల అవసరాలూ, వాడి అవసరాలూ వేరు వేరు అవవు. శ్రమ సాధనాలు ఎంత సౌఖ్యంగా వుండాలో; 'పని స్థలం', శ్రమకి ఎంత అనుకూలంగా వుండాలో — అన్నీ, శ్రమ చేసే మనుషులకు అర్థమైనట్టే, వాడికి కూడా అర్థమవుతాయి. కానీ, ఇప్పుడు వాడు శ్రమ చెయ్యని 'యజమాని'! ఆ యజమాని నిర్ణయించి ఏర్పరిచిన పరిస్థితుల్లో కార్మికులు కేవలం 'కూలి' మనుషులు! ఈ పరిస్థితి, శ్రమ చేసే మనిషికీ, శ్రమ పరిస్థితులకూ మధ్య 'పరాయితనాన్ని' ('ఎలియనేషన్'ని) సృష్టిస్తుంది.

ఈ పరిస్థితి — బట్టో, పంచదారో, చెప్పులో తయారు చేసే శ్రామికుల విషయంలోనే కాదు, 'మేధా శ్రమల' విషయంలో కూడా వుంటుంది. ఒక వైద్యుడైనా, టీచరైనా, ఇంజనీరైనా, 'పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం'లో పని చేసేటప్పుడు, యజమాని నిర్ణయాల ప్రకారం నడవ వలసిందే. అంత పెద్ద ఉద్యోగి కూడా తన 'పని పరిస్థితులతో పరాయితనం'లోనే వుంటాడు. ఆ 'పని'కి సంబంధించిన 'నిర్ణయాల'లో తన పాత్ర ఏమీ లేకుండానే వుంటాడు.

పెట్టుబడిదారీ శ్రమ విభజనా, పెట్టుబడిదారీ పరాయితనమూ — అనే విషయాల వల్ల చివరికి ఫలితం ఏమిటంటే, శ్రామికులు, శ్రమ పట్ల ఏమీ ఆసక్తి లేకుండా, 'శ్రమ అంటేనే విముఖులుగా' తయారవుతారు.

ప్రతీ రోజూ 'అదనపు శ్రమ' చేస్తున్నామనీ, అది పెట్టుబడిదారుడికి పోతోందనీ కార్మికులకు 'సిద్ధాంత స్థాయి'లో తెలియదు. కానీ, అలా తెలియకపోయినా, ఆ విషయాన్ని కార్మికులు ఒక 'లోక జ్ఞానపు స్థాయి'లో తప్పకుండా ఎంతో కొంత గ్రహిస్తారు. పెట్టుబడిదారుడు ఎప్పుడూ తమతో ఎక్కువ పని చేయించడానికే ప్రయత్నిస్తాడనీ, ఇంకా ఇంకా పని చెయ్యమని పీడిస్తూ ఎక్కువ పనిని లాగే మార్గాలు వెతుకుతూ వుంటాడనీ — కార్మికులు తేలిగ్గానే కనిపెడతారు. "ఎంత పనిచేస్తే మాత్రం మనకేం వొరుగుతుంది?" అనో, "నువ్విచ్చే జీతానికి ఈ మాత్రం పని చాల్లే" అనో, ఆ రకం మాటలతో కార్మికులు 'పని' మీద, తమ విముఖతని ప్రకటిస్తారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే — ప్రతీ కార్మికుడూ 'పని' మీద అయిష్టం తోటే, నిరుత్సాహం తోటే పని చేసినా, 'జీతాల' విలువకి మించిన 'అదనపు విలువ'ని ఇస్తూనే వుంటాడు. ఇది ఎలా సాధ్యమవుతుందంటే, కార్మికులు ఎంత పనిచేస్తే

అంత పని మీదే పెట్టుబడిదారుడు ఇంకా కొంత ఎక్కువని కలుపుకుంటాడు కాబట్టి సాధ్య మవుతుంది. అలా అని, ఒక పెట్టుబడిదారుడి దగ్గిర కార్మికులు మరీ తక్కువ పని చేసి, ఉత్పత్తిని మరీ తక్కువగా చేస్తే, ఆ తక్కువ ఉత్పత్తికే, ఎక్కువ ఉత్పత్తికి వుండేటంత విలువని నిర్ణయించడం సాధ్యం కాదు. కాబట్టి, కార్మికులు ఎంత అశ్రద్ధగా పని చేసినా సగటు పని కన్నా తగ్గకుండా చేస్తూనే వుంటారు. లేకపోతే, లాభం అనే ప్రశ్నే వుండదు.

కానీ, 'పని'మీద కార్మికుల అనాసక్తతనీ, నిరుత్సాహాన్నీ చూసి ఎన్నడూ 'పనిలో వేలు పెట్టని' సోమరిపోతులు ఏమంటారంటే — "లోకం చాలా పాడైపోతోంది. పని వాళ్ళు పెద్ద పని దొంగలుగా తయారవుతున్నారు" అని గొప్ప గొప్ప వ్యాఖ్యానాలు చేస్తారు. ఆ 'పని దొంగలు'గా తయారైంది కార్మికులు కాదనీ, తామేననీ వాళ్ళు గ్రహించరు. "మీ కన్నా పెద్ద పనిదొంగ లెవరు?" అని కార్మికులు వాళ్ళని అడగలేరు కదా?

కార్మికుల్ని 'పని దొంగలు'గా వ్యాఖ్యానించే దోపిడీ దొంగల ముఠా — తామే గొప్ప 'కష్టజీవులమ'నీ, తమ సిరి సంపదలన్నిటినీ తమ శ్రమతోనే కూడబెట్టుకుంటున్నామనీ, తాము నమ్ముతూ, కార్మికుల్ని కూడా నమ్మమంటారు. ఒక రకంగా, కార్మికులు దాన్ని నమ్ముతూనే వుంటారు కూడా.

# పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ప్రధాన లక్షణాలు

ఈ లక్షణాల్ని క్లుప్తంగా ఇలా అర్థం చేసుకోవచ్చు :

(1) ఈ విధానం, మొదట 'పెట్టిన విలువ'తో ఎక్కువ విలువని ఉత్పత్తి చేస్తుంది. అంటే ఇది పూర్తిగా 'డబ్బు దృష్టి'తో వుంటుంది. (2) ప్రతీ ఉత్పత్తినీ 'సరుకు'గా మారుస్తుంది. ఉత్పత్తీ, వాడకమూ అనే — దశల్ని దూరం చేసి, వాటి మధ్యలో 'అమ్మకం' అనే దశని తప్పనిసరి చేస్తుంది. (3) 'ఉత్పత్తి క్రమం'లోని ప్రతీ అంశానికీ, నిజమైన ఉత్పత్తిదారుల్ని (కార్మికుల్ని), 'పరాయితనం' లోనే వుంచుతుంది. ఈ ఉత్పత్తి విధానం వారికి అడుగడుగునా హాని కలిగిస్తూనే సాగుతుంది. — ఈ లక్షణాలు, 'పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానానికి' ప్రధాన లక్షణాలుగా వుంటాయి. మిగతా లక్షణాలన్నీ ఈ ప్రధాన లక్షణాలకే సంబంధించి వుంటాయి.

సమాజంలో, ఉత్పాదక పెట్టుబడి, మొట్టమొదటగా రంగ ప్రవేశం చేసిన దశలో, అప్పటి వరకూ సాగుతూవున్న ఉత్పత్తి విధానంలో 'ఒక కొత్త యుగం' (తీవ్రమైన మార్పు) ప్రారంభమవుతుంది. అది పరస్పర విరుద్ధ లక్షణాలతో వుంటుంది. అది, ఒక వేపు — పాత ఉత్పత్తి విధానంలో వుండే కొన్ని అంశాల కన్నా 'అభివృద్ధికరమైన' అంశాల తోటీ; ఇంకో వేపు — పాత విధానంలో వుండే కొన్ని అంశాల కన్నా 'వెనకబడ్డ' అంశాల తోటీ వుంటుంది. మొత్తంగా పెట్టుబడిదారీ విధానం 'పాత ఉత్పత్తి విధానం' నించి తీవ్రమైన మార్పుతో ప్రారంభమవుతుంది.

# డబ్బు - 'డబ్బు' గా మాత్రమే పని చెయ్యడం; డబ్బు - 'డబ్బు' గానూ, 'పెట్టుబడి' గానూ కూడా పని చెయ్యడం

ఒక 'సరుకుని' అమ్మి దానికి బదులుగా 'డబ్బు' తీసుకుని, తర్వాత ఆ డబ్బుని ఇచ్చేసి ఇంకో సరుకుని కొంటే — ఈ మొత్తం క్రమంలో డబ్బు అనేది, కేవలం 2 సరుకుల మారకానికి 'మధ్యవర్తి'గా ('చలామణీ సాధనం'గా) పనిచేసినట్టు అర్థం.

స్వంత పొలంలో శ్రమ చేసి పంట పండించుకునే ఒక రైతు కుటుంబాన్ని గానీ, స్వంత శ్రమ సాధనాలు గల ఒక చేతి వృత్తుల కుటుంబాన్ని గానీ ఊహిద్దాం. ఈ కుటుంబాల సభ్యులు, ధాన్యం పండించడమో, బట్టల నేతో, ఏదో ఒకటి స్వయంగా చేసుకుంటారు. వాళ్ళ 'ఉత్పత్తి'లో కొంత భాగాన్ని వాళ్ళే వాడుకుని, మిగిలిన భాగాన్ని అమ్మి ఆ డబ్బుతో ఇతర వస్తువులు తెచ్చుకుంటారు. దీని సారాంశం, తమ ఉత్పత్తులు ఇచ్చి ఇతరుల ఉత్పత్తులు తెచ్చుకోవడమే. ఈ కుటుంబాలలో ఉత్పత్తి అయిన ధాన్యమూ, బట్టలూ వంటి వాటిని అమ్మడం గానీ; ఆ డబ్బుతో నాగలీ, విత్తనాలూ, పత్తీ,

మగ్గం లాంటి శ్రమసాధనాల్ని కొనడం గానీ ఆ కుటుంబాలు జీవించడానికి కావలసిన వ్యక్తిగత అవసరాల కోసమే జరుగుతాయి. డబ్బుని కూడబెట్టి పెద్ద స్థాయిలో వ్యాపారం చెయ్యడం కోసం జరగవు.

ఒక రైతు కొంత ధాన్యాన్ని సంతకు తీసుకువెళ్ళి అమ్మాడు. 50 రూ.లు వచ్చాయి. ఆ డబ్బుతో వెంటనే కుటుంబానికీ, వ్యవసాయానికీ కావలసిన సరుకులేవో కొన్నాడు. డబ్బు అయిపోయింది. అతను ఒక సరుకుతో వచ్చి, ఇంకో సరుకుతో (సరుకులతో) వెళ్ళాడు. ఎంత విలువగల సరుకుతో వచ్చాడో, అంత విలువ గల సరుకు తోనే వెళ్ళాడు. అతని మారకాల కార్యక్రమం, సరుకుతో ప్రారంభమై సరుకుతోనే ముగిసింది.

స్వంత శ్రమతో తయారైన ఉత్పత్తిని అమ్మి, ఆ డబ్బుతో వెంటనే ఇంకో ఉత్పత్తిని కొనుక్కోవడం — అనే క్రమానికి గుర్తు :

సరుకూ — డబ్బూ — సరుకూ

**C — M — C**

50 — 50 — 50

ఇది 'సింపుల్ మారకం'. లేదా, 'సింపుల్ చలామణీ'. ఇది 'సరుకు'తో ప్రారంభమై, 'సరుకు'తో ముగుస్తుంది.

ఇందులో, ఇచ్చే విలువకీ, తీసుకునే విలువకీ తేడా వుండదు. ఇలాంటి మారకంలో, డబ్బు అనేది 'చలామణీ సాధనం'గా మాత్రమే పనిచేసినట్టు అర్థం. డబ్బు, అసలు ఈ విధిని నిర్వహించడానికే పుట్టింది. అది, ఏ పని కోసం పుట్టిందో ఆ పని మాత్రమే చేసిందంటే, డబ్బు, 'డబ్బుగా మాత్రమే' పని చేసిందని అర్థం.

**C -- M -- C** లో విలువ, మొదటవున్న సైజుకన్నా ఎక్కువ సైజుగా పెరగదు. మొదటి **C** లో (వెళ్ళిపోయిన సరుకులో) వున్న విలువ కన్నా, 2 వ **C** లో (వచ్చిన సరుకులో) ఎక్కువ విలువ వుండదు. 'మారకం' అయిన 2 సరుకుల విలువా ఒక్కలాగే వుంటుంది. డబ్బు, డబ్బుగా మాత్రమే పనిచేసే సందర్భంలో, ఆ డబ్బు సైజు పెరగదు.

కానీ పెట్టుబడిదారుడి దగ్గిర జరిగే క్రమం ఎలా వుంటుందో ఇంతకుముందే చూశాం. అది, **C–M–C** గా గాక, $M - C - M^1$ గా వుంటుంది, అంటే, అది 'సరుకు'తో ప్రారంభమై 'సరుకు'తో ముగియడం గాక, 'డబ్బు'తో ప్రారంభమై 'డబ్బు'తో (పెరిగిన డబ్బుతో) ముగుస్తుంది.

**పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం :**

డబ్బూ — సరుకూ — డబ్బూ

$M - C - M^1$

మొదటి డబ్బు కన్నా, చివరి డబ్బు ఎక్కువగా వుంటుంది. ($M - C - M^1$ ని, **M – C – M** అని కూడా అనవచ్చు.)

**M – C – M** లో కూడా 2 దశలు ఉన్నాయి. వీటిలో ఏ దశని చూసినా, అది సమాన విలువల మారకంగానే ఉంటుంది.

మొదటి దశ : పెట్టుబడిదారుడి డబ్బు, ఉత్పత్తి క్రమానికి కావలసిన సరుకులుగా మారుతుంది. అంటే — **M, C** గా. ఇది సమాన విలువల మారకమే. సింపుల్ మారకం.

రెండో దశ: ఆ **C**, 'పెట్టుబడి దారుడి ఉత్పత్తి క్రమం'లో, ఎక్కువ విలువ గల కొత్త **C** గా తయారవుతుంది. ఆ కొత్త **C** ని అమ్మితే, దానికి తగినట్టుగానే ఎక్కువ డబ్బు వస్తుంది. అంటే, **C – M** దశ కూడా 'సమాన విలువల మారకం'గానే వుంటుంది, ఇది కూడా ఒక 'సింపుల్ మారకమే'. — ఈ రకంగా, **M– C**, **C– M** దశల్లో కూడా డబ్బు, 'డబ్బు'గానే, 'చలామణీ సాధనం'గానే, పని చేస్తుంది.

అయితే, ఇక్కడ 'డబ్బు' ద్వారా జరిగే ఇంకో పని కూడా వుంది. **M – C – M** క్రమాన్ని మొత్తంగా చూసినప్పుడు, మొదటి డబ్బు, ఎక్కువ డబ్బుగా పెరుగుతుంది. పెట్టుబడి దారుడి ఉత్పత్తి విధానపు లక్ష్యం అంతా అదే.

కొంత డబ్బు, ఎక్కువ డబ్బుని సంపాదించే కార్యక్రమంతో పనిచేస్తే, మొదటి డబ్బు 'పెట్టుబడిగా కూడా' పనిచేసినట్టు అర్థం. అంటే, **M – C – M** క్రమంలో పనిచేసే డబ్బు, 'డబ్బుగా' పనిచేస్తూనే, 'పెట్టుబడిగా కూడా' పనిచేస్తుందన్నమాట!

**C – M – C కీ, M – C – M కీ తేడా ఏమిటి?**

**C – M – C** అనేది, 'ఉపయోగపు విలువ' దృష్టితో, లేదా, 'అవసరాల' దృష్టితో జరిగే ఉత్పత్తి విధానానికి గుర్తు. దీన్ని వేరే మాటల్లో చెప్తే, 'సహజ ఉత్పత్తి విధానానికి' గుర్తు. **M – C – M** అనేది, 'విలువ' దృష్టితో జరిగే ఉత్పత్తి విధానానికి గుర్తు. వేరే మాటల్లో చెప్తే, 'అసహజ ఉత్పత్తి విధానానికి' గుర్తు. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి గుర్తు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని 'అసహజ ఉత్పత్తి విధానం' అంటున్నామంటే, దాని కన్నా వెనకటి బానిస విధానాన్నీ, ఫ్యూడల్ విధానాన్నీ, 'సహజ ఉత్పత్తి విధానాలు'గా అంటున్నట్టు అర్థం కాదు.

'సహజ ఉత్పత్తి విధానానికి' 2 లక్షణాలు వుండాలి.

(1) దోపిడీ వుండకూడదు. (2) ఉపయోగపు విలువ దృష్టితోనే ఉత్పత్తి జరగాలి. ఈ రకం ఉత్పత్తి విధానం,

ఇప్పటివరకూ జరిగిన చరిత్రలో 'ప్రాచీన ఆదిమ తెగలకు' చెందినది మాత్రమే. అంటే, ఇంకా 'వర్గ దోపిడీ' ప్రారంభం కాని కాలానికి సంబంధించినది.

'బానిస సమాజం'లోనూ, 'భూస్వామ్య సమాజం' లోనూ కూడా శ్రమ దోపిడీ వుంది. ఈ కోణంలో చూస్తే, అవి 'సహజ ఉత్పత్తి విధానాలు' కావు. కానీ, అక్కడ, 'అమ్మకం కోసమే' ఉత్పత్తి చేసే విధానం ఇంకా ప్రారంభం కాలేదు. అక్కడ, ఉత్పత్తి విధానం ఇంకా 'అవసరాల' దృష్టితోనే వుంటుంది. ఈ కోణంలో చూస్తే, అక్కడ ఉత్పత్తి విధానం 'సహజ ఉత్పత్తి విధానం' అనదగ్గ స్థితిలోనే వుంటుంది.

'ఉత్పత్తి విధానం' అన్నా, 'ఆర్థిక విధానం' అన్నా ఒకటే. 'ఉత్పత్తి'కీ, దాని 'పంపిణీ'కీ సంబంధించిన అంశాల్ని వివరించేది — "ఆర్థిక శాస్త్రం" (ఎకనామిక్స్.)

'సహజ ఆర్థిక విధానం' (నేచురల్ ఎకానమీ) అనేది, క్రమంగా 'విలువ దృష్టి గల ఆర్థిక విధానం'గా (మనీ ఎకానమీ గా) మారుతూ వచ్చింది. అంటే, 'అవసరాల' దృష్టితో జరిగే ఉత్పత్తి విధానం, 'అమ్మకాల' దృష్టితో (డబ్బు దృష్టితో) జరిగే ఉత్పత్తి విధానంగా మారుతూ వచ్చింది.

ఇది మళ్ళీ 'నూతన సమాజం'లో, 'సహజ ఆర్థిక విధానం'గా మారవలసి వుంటుంది. ఆదిమ సమాజాల ఆర్థిక విధానం కన్నా 'అభివృద్ధి చెందిన పద్ధతి'లో.

ఇక్కడ 'నేచురల్ ఎకానమీ', 'మనీ ఎకానమీ'— అనే మాటలకు వున్న అర్థాల్ని గురించి ఇంకా స్పష్టం చేసుకోవాలి.

'డబ్బు' అనే మధ్యవర్తి లేకుండా, 2 వస్తువుల్ని బార్టరు పద్ధతిలో మారకం చేసుకుంటే, అది 'నేచురల్ ఎకానమీ' అనీ; డబ్బు ద్వారా మారకాలు చేసుకుంటే అది 'మనీ ఎకానమీ' అనీ — అర్థం చేసుకోకూడదు. 2 వస్తువులు, డబ్బు లేకుండా మారతాయా, డబ్బు ద్వారా మార తాయా — అనేది, 'చలామణీకి సంబంధించిన' అంశం మాత్రమే. అందులో, 'ఉత్పత్తి దశ'కు సంబంధించిన అంశం వుండదు. 'ఎకానమీ' (ఆర్థిక విధానం) అన్నప్పుడు, అందులో 'ఉత్పత్తి దశా, చలామణీ దశా కూడా' వుండాలి. 'చలామణీ దశ'లో డబ్బు వుందా లేదా అనేది, కేవలం ఒక 'సాంకేతికమైన' విషయం. ఉత్పత్తి విధానానికి ఒక స్వభావం ఏర్పడేది, డబ్బు వుండడం వల్లా, లేకపోవడం వల్లా, కాదు.

డబ్బు ద్వారా మారకాలు జరిగే పద్ధతినే 'మనీ ఎకానమీ' అనవలిసి వస్తే, ఆదిమ తెగల జీవితంలోనే డబ్బు చలామణీ సరుకు చలామణీ ప్రారంభమయ్యాయి గనక, ఆ తెగలనాడే 'మనీ ఎకానమీ' వుందనే అర్థానికి రావలసి వస్తుంది. అంటే, ఆదిమ తెగల ఉత్పత్తి విధానమూ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ కూడా ఒక రకంగానే ('మనీ ఎకానమీ'గానే) వున్నాయి — అనవలసి వస్తుంది. ఇది తప్పు అని వేరే చెప్పనక్కరలేదు. మారకాలు ఏ పద్ధతిలో జరుగుతున్నాయి — అనే అంశాన్ని బట్టి గాక, 'ఉత్పత్తి విధానం ఏ లక్ష్యంతో వుంది' అనే దాన్ని బట్టే, 'నేచురల్ ఎకానమీ, మనీ ఎకానమీ' అనే విషయాల్ని అర్థం చేసుకోవడం సరైంది. సహజ అవసరాల దృష్టితో సాగే ఉత్పత్తి విధానమే 'సహజ ఉత్పత్తి విధానం' (నేచురల్ ఎకానమీ). 'తక్కువ డబ్బుతో ఎక్కువ డబ్బుని సంపాదించడం' అనే దృష్టితో సాగే ఉత్పత్తి విధానం — 'డబ్బు దృష్టి గల ఉత్పత్తి విధానం' (మనీ ఎకానమీ). అందుకే, 'డబ్బు చలామణీ' అనేది, గత సమాజాలలో కూడా వున్నా, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి మాత్రమే ప్రత్యేకంగా 'మనీ ఎకానమీ' అనే పేరు వర్తిస్తుంది.

అమ్మకానికి వచ్చిన సరుకుని చూసినప్పుడు, ఆ సరుకు ఏ ఉత్పత్తి విధానంలో తయారైందో — ఆ విషయం, ఆ సరుకులో కనపడదు. ఒక బట్టని, స్వయంగా తయారు చేసిన నేత మనిషే మార్కెట్‌కి తెచ్చినా, బట్టని స్వయంగా తయారు చెయ్యని పెట్టుబడిదారుడు మార్కెట్‌కి తెచ్చినా, మార్కెట్‌కి ఆ 2 విషయాలూ ఒకటే. అక్కడ, ఆ 2 బట్టలూ ఒకే విలువ కలిగివుంటాయి. ఒకే విలువతో అమ్ముడు పోతాయి. అలాగే, మార్కెట్ నించి సరుకుల్ని కొనేటప్పుడు కూడా, స్వయంగా శ్రమచేసే మనిషి, తన ఉత్పత్తి అవసరాల కోసం కొన్నా; పెట్టుబడిదారుడు, తన 'సరుకు తయారీ' కోసం కొన్నా; ఆ తేడాలు కూడా మార్కెట్‌కి అనవసరం. కొనే మనిషి పెట్టుబడిదారుడైనా, శ్రమచేసే మనిషి అయినా, కొన్న సరుకుకి తగ్గ విలువని చెల్లించవలిసిందే.

ఈ కొనడాలూ, అమ్మడాలూ ఎవరు చేసినా, ఎంత పెద్దమొత్తంతో చేసినా, మార్కెట్లో అవి 'సింపుల్ మారకాలే.' నేత మనిషి 10 మీటర్ల బట్ట తెచ్చి అమ్మినా, పెట్టుబడిదారుడు 100 మీటర్ల బట్ట తెచ్చి అమ్మినా, రెండూ సింపుల్ మారకాలే. ఎంత విలువ గల సరుకుని ఇస్తే అంత విలువగల డబ్బుని తీసుకుంటారు. ఇచ్చినంత విలువనే వెనక్కి తీసుకుంటారు. ఇదంతా చలామణీ దశ. అసలు తేడా అంతా 'ఉత్పత్తి దశ'లోనే వుంటుంది.

స్వయంగా శ్రమచేసే ఉత్పత్తిదారుల ఉత్పత్తి విధానానికీ, స్వయంగా శ్రమ చెయ్యని పెట్టుబడిదారుల ఉత్పత్తి విధానానికీ, స్వభావాల్లో పరస్పర వ్యతిరేకమైనంత తేడా వుంది. కానీ, ఈ రెండు ఉత్పత్తి విధానాలకూ తేడా వుందనే విషయం, మార్కెట్‌లో జరిగే చర్యల ద్వారా కనపడదు. మార్కెట్‌లో జరిగేది కేవలం సరుకు, డబ్బుగా మార

డమూ; డబ్బు, సరుకుగా మారడమూ మాత్రమే. సరుకుని ఇచ్చే మనిషి, దాని విలువకి తగ్గ డబ్బు తీసుకుంటే; డబ్బుని ఇచ్చే మనిషి, దాని విలువకి తగ్గ సరుకుని తీసుకుంటాడు. ఈ అమ్మకాలలోనూ, కొనుగోళ్ళలోనూ, స్వయంగా శ్రమచేసే మనిషి మారకాలు ఏ సూత్రాల ప్రకారం జరుగుతాయో, స్వయంగా శ్రమచెయ్యని పెట్టుబడిదారుడి మారకాలు కూడా ఆ సూత్రాల ప్రకారమే జరుగుతాయి. అందుకే, సహజ ఉత్పత్తి విధానానికీ, అసహజ ఉత్పత్తి విధానానికీ వుండే తేడాని చూడడానికి, 'మారకాల' దశని మాత్రమే చూస్తే చాలదు. ఉత్పత్తి క్రమాల్నీ, తర్వాత జరిగే మారకాల క్రమాల్నీ కూడా కలిపి చూడాలి.

**C — M — C** లో 'సహజ ఉత్పత్తి విధానం' కనపడితే,

**M — C — M** లో డబ్బు దృష్టిగల ఉత్పత్తి విధానం కనపడుతుంది.

**C — M — C** లో, డబ్బు 'డబ్బుగా మాత్రమే' పనిచేస్తే,

**M — C — M** లో, డబ్బు, ' డబ్బు'గా పనిచేస్తూనే, 'పెట్టుబడిగా కూడా' పని చేస్తుంది.

డబ్బు, పెట్టుబడిగా పని చెయ్యడం—అంటే, తక్కువ డబ్బు, ఎక్కువ డబ్బుని సంపాదించే విధంగా పని చెయ్యడం.

పెట్టుబడి, 'శ్రమ'ని దోపిడీ చేస్తుంది. ఆ పనిలో, డబ్బు, పెట్టుబడి చేసే పనికి ఎక్కువ అనుకూలంగా వుంటుంది.

కేవలం 'బార్టరు' పద్ధతి వుండగా దోపిడీ జరిగితే, 'అదనపు విలువ' అంతా ఉత్పత్తి రూపంలోనే వుంటుంది. కానీ, 'డబ్బు చలామణీ' గనక వుంటే, దోపిడీ చేసిన ఉత్పత్తిని డబ్బు రూపంలో నిల్వ చెయ్యవచ్చు.

డబ్బు, 'డబ్బుగా' పని చెయ్యడానికీ, డబ్బు 'పెట్టుబడిగా' పని చెయ్యడానికీ— తేడా గ్రహించలేని కొంత మంది ఆర్థికవేత్తలు 'సమాజంలో పేద, ధనిక తేడాలకు డబ్బే కారణమ'నీ, 'డబ్బు చలామణీని రద్దు చేస్తే సమస్యలు తీరిపోతాయ'నీ భావించారు. (ఉదా॥ రాబర్టు ఓవెన్. ఈయన శ్రామికుల పట్ల ఎంతో మంచి దృష్టి కలవాడు.)

ఈ ఆర్థికవేత్తల ప్రకారం, 'డబ్బు చలామణీని రద్దు చెయ్యడం' అంటే, మారకాలనే తీసివెయ్యడం — కాదు. 'మారకాలు' వుండవలసిందే. కానీ, అవి 'డబ్బు ద్వారా' జరగకూడదు. 'మారకాల' కోసం ఇంకేదైనా పద్ధతి పెట్టుకోవాలి. —ఇదే వీరి అభిప్రాయం.

కానీ, ఏ 'కార్డుల' ద్వారానో, ఏ 'సర్టిఫికెట్ల' ద్వారానో మారకాలు జరిగేటట్టు ఇంకేదైనా పద్ధతి పెట్టుకుంటే, అప్పుడు ఆ కార్డులే, ఆ సర్టిఫికెట్లే, 'డబ్బు' అవుతాయి!

సమాజంలో 'మారకాలు' అనేవి వున్నప్పుడు, సమాజంలో వుండే ఏదో ఒక 'వస్తువు', జనరల్ ఈక్వివలెంట్'గా ఏర్పడి తీరుతుంది. అదే 'డబ్బు' అవుతుంది. డబ్బు నోట్లనీ, నాణాల్నీ అన్నిటినీ రద్దుచేసి, 'విలువ లెక్కల్ని' ఇంకో పద్ధతిలో జరిపితే, అప్పుడు, డబ్బు ఇంకో పద్ధతిలోకి మారుతుంది. డబ్బుకి రూపం మారుతుంది. అంతే తేడా! కాబట్టి, అది డబ్బుని తీసివెయ్యడం అవదు. 'విలువ లెక్కలు' ఏ పద్ధతిలో జరిగినా అది డబ్బు వుండడమే.— కానీ, ఈ విషయాలేవీ ఆర్థికవేత్తలకు తెలియవు. అంటే, డబ్బు అంటే ఏమిటో, అసలు డబ్బు అనేది తనలోని ఏ లక్షణంతో పనిచేస్తుందో, ఆర్థికవేత్తలకు తెలియదన్నమాట! 'మారకాలు అనేవి వుండగా డబ్బుని తీసివెయ్యడం సాధ్యం కాద'ని తెలియదన్నమాట! 'డబ్బు' గురించి తెలియక పోవడం అంటే, 'ఆర్థిక శాస్త్రానికి' సంబంధించిన ఏ ముఖ్య విషయమూ తెలియక పోవడమే.

'సమాజం'లో— పేద, ధనిక తేడాలకూ; ఇతర అసమానతలకూ కారణం—'శ్రమ దోపిడీ'యే గానీ, డబ్బు వుండడం కాదు. అంటే, మారకాలు డబ్బు ద్వారా జరగడం కారణం కాదు. డబ్బు అనేది మారకాలు తేలిగ్గా జరగడానికి ఏర్పడ్డ సాధనం. అంత కన్నా దానికేమీ మహిమ లేదు.

అయితే, 'పెట్టుబడిదారీ సమాజం'లో మొత్తం ఉత్పత్తి అంతా అమ్మకాలలోనించే నడుస్తుంది కాబట్టి, గత సమాజాలతో పోలిస్తే, ఈ పెట్టుబడిదారీ సమాజంలో కొన్ని ప్రత్యేక సమస్యలు వున్నాయి. ఇక్కడ వున్న సమస్యలకు మూలం— డబ్బు, డబ్బుగా పని చెయ్యడం కాదు. డబ్బు—'పెట్టుబడిగా' పనిచెయ్యడమే.

పెట్టుబడి — శ్రమని దోపిడీ చేస్తుంది కదా? డబ్బు, 'పెట్టుబడిగా' పనిచేస్తోందంటే, శ్రమని దోచే పనిలో అది ఒక సాధనంగా పనిచేస్తోందన్నమాట. శ్రమని దోచడంలో డబ్బు ఎక్కువ సహాయకరమైన పాత్రని నిర్వహిస్తుంది. ఆ రకంగా, ఈ ఉత్పత్తి విధానంలో, సమస్యలు అధిక స్థాయిలో పుట్టుకొస్తాయి. దీన్ని చూస్తే, డబ్బు వల్లనే ఈ సమస్యలు పుట్టుకొస్తున్నట్టు కనపడుతుంది. డబ్బు గురించి సరైన అవగాహన లేని ఆర్థికవేత్తలకు, పెట్టుబడిదారీ సమాజంలో విపరీతమైన డబ్బు చలామణీని చూసినప్పుడు, సమాజంలో వున్న సమస్యలన్నిటికీ ఈ డబ్బు చలామణీయే కారణంగా కనపడుతుంది.

డబ్బుని చూసి అసహ్యం పడడం చాలా 'మృదువైన'

విషయమే. కానీ, డబ్బు అంటే ఏమిటో తెలియకుండా అసహ్యపడడం వల్ల ఏమీ ప్రయోజనం వుండదు.

డబ్బుని చూసి అసహ్యపడ్డ అర్థికవేత్తకి డబ్బు అంటే ఏమిటో తెలీకపోవడమే గాక, 'దోపిడీ' అనేది వుందని కూడా తెలియదు. అందుకే ఆ అర్థికవేత్త దోపిడీని విమర్శించాలని తెలియక, ఆ అవకాశం లేక, 'డబ్బుని రద్దు చేయడం' మీదే ఆశలన్నీ పెట్టుకుంటాడు.

సమాజం నించి డబ్బుని తప్పనిసరిగా రద్దు చెయ్యవలసిందే. డబ్బు వల్ల ఏ సమస్యలూ లేవనీ, అది మానవ జీవితానికి ఎప్పుడూ కావలసిన హేతుబద్ధ, సహజ అవసరమనీ భావించకూడదు. అమ్మకాలు వుండడం వల్లనే అది అవసరమవుతోంది. అమ్మకాలే లేనప్పుడు, దానితో అవసరమే వుండదు. డబ్బు, 'విలువకి రూపం' కాబట్టి, డబ్బు వుండడం అనే పద్ధతి వల్ల, 'విలువ రాసి'ని ఒక చోట పోగుచేసి దాని అండతో ఒక అధికారాన్ని నెరపడానికి అవకాశం కలుగుతుంది. ఇలాంటి చెడ్డ ఫలితాలు డబ్బు వల్ల చాలా వున్నాయి. ఏ దశలోనూ ఇలాంటి ఫలితాలకు ఆస్కారం లేకుండా వుండడానికి 'నూతన సమాజం', తప్పనిసరిగా డబ్బుని రద్దు చెయ్యాలి.

అయితే, డబ్బు ఏ పనిని నిర్వహిస్తోందో ఆ పనికి వున్న అవసరాన్ని తీసివెయ్యకుండా, డబ్బుని తీసివెయ్యడం సమాజానికి సాధ్యం కాదు. డబ్బు చేసే ఆ 'పనిని తీసి వెయ్యడం' ఎప్పటికి సాధ్యమవుతుందంటే, అమ్మకాలూ, కొనుగోళ్ళూ లేకుండానే ఉత్పత్తుల్ని వాడుకోగలిగినప్పటికి. అది ఎప్పటికి సాధ్య మవుతుందంటే, దోపిడీ సంబంధాల్నీ దోపిడీ శ్రమ పరిస్తితుల్నీ, దోపిడీ శ్రమ విభజననీ తీసి వెయ్యగలిగి నప్పటికి. సమాజంలో, ఈ మార్పులు జరగకుండానే, డబ్బుని తీసివెయ్యగలమను కోవడం పెద్ద భ్రమ.

ప్రస్తుతం ఇక్కడ మనం, డబ్బు చేసే పనినీ, పెట్టుబడి చేసే పనినీ, సరిగా అర్థం చేసుకోవాలి. 'పెట్టుబడి'వల్ల వచ్చే సమస్యల్ని, డబ్బు వల్ల వచ్చే సమస్యలుగా భావించకూడదు. డబ్బు, డబ్బుగా పని చెయ్యడం వల్ల 5 సమస్యలూ, డబ్బు పెట్టుబడిగా పని చెయ్యడం వల్ల 10 సమస్యలూ వున్నాయనుకుందాం. డబ్బు, డబ్బుగా మాత్రమే పనిచేస్తే 5 సమస్యలు మాత్రమే వస్తాయి. డబ్బు, డబ్బుగానూ, పెట్టుబడిగానూ కూడా పని చేసినప్పుడు 5 + 10 = 15 సమస్యలు వస్తాయి. అవి తీవ్ర రూపంలోకి మారిన సమస్యలుగా కూడా వస్తాయి.

డబ్బుని తీసివెయ్యదల్చుకున్న వాళ్ళు, ఆ కార్యక్రమాన్ని మొదట 'పెట్టుబడి'ని (పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని) తీసివెయ్యడంతో ప్రారంభించాలి. చివరికి, ఆ కార్యక్రమం డబ్బుని కూడా తీసివెయ్యడంతో ముగుస్తుంది.

డబ్బు వుండగా, పెట్టుబడిని తీసివెయ్యడం సాధ్యమే. కానీ, 'పెట్టుబడి' వుండగా, డబ్బుని తీసివెయ్యడం సాధ్యం కాదు. 'పెట్టుబడి' పోయాక కూడా (పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పోయాక కూడా) కొంత కాలం వరకూ డబ్బు వుంటుంది. అప్పుడు డబ్బు డబ్బుగా మాత్రమే పనిచేస్తూ వుంటుంది. కొంత కాలానికి డబ్బుతో ఆ అవసరం కూడా పోతుంది.

'చరిత్ర' నడకని క్లుప్తంగా ఇలా చూడవచ్చు :

**(1) 'ఆదిమ సమాజం'లో**: దోపిడీ వుండదు. అవసరాల దృష్టితోనే ఉత్పత్తి. సరుకు చలామణీ, డబ్బు చలామణీ అతి తక్కువ స్థాయిలోనే వుంటాయి.

**(2) 'బానిస సమాజం'లో**: దోపిడీ వుంటుంది. అవసరాల దృష్టితోనే ఉత్పత్తి. సరుకు చలామణీ, డబ్బు చలామణీ వుంటాయి.

**(3) 'భూస్వామ్య సమాజం'లో**: దోపిడీ వుంటుంది. అవసరాల దృష్టితోనే ఉత్పత్తి. సరుకు చలామణీ, డబ్బు చలామణీ వుంటాయి. ఇవి కొంచెం పెరిగిన స్థాయిలో వుంటాయి.

**(4) 'పెట్టుబడిదారీ సమాజం'లో**: దోపిడీ వుంటుంది. 'విలువ' దృష్టితో ఉత్పత్తి. సరుకు చలామణీ, డబ్బు చలామణీ పెద్ద స్థాయిలో వుంటాయి. 'ఉత్పత్తి' అంతా సరుకులుగా మారి, మారకాల ద్వారానే ఉత్పత్తుల పంపిణీ జరుగుతుంది.

**(5) నూతన సమాజంలో**: దోపిడీ వుండదు. అవసరాల దృష్టితోనే ఉత్పత్తి. సరుకు చలామణీ, డబ్బు చలామణీ, వుండవు. కేవలం ఉత్పత్తి క్రమమూ, పంపిణీ క్రమమూ మాత్రమే వుంటాయి. అయితే, 'నూతన సమాజం' ప్రారంభమైన వెంటనే ఈ మార్పులన్నీ జరగవు. ఆ సమాజం, క్రమక్రమంగా సాధించవలసిన గమ్యం అది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, 'డబ్బు దృష్టి గల' ఉత్పత్తి విధానం — అనే విషయాన్ని ఇంకా చాలా ముందుకు పోతేనేగానీ పూర్తిగా అర్థం చేసుకోలేము.

కొంత డబ్బుని ఒక మూల పడేస్తే, జగత్తు ఆఖరయ్యే రోజు వరకూ అందులో ఒక్క అణువు కూడా పెరగదు. కానీ, దాన్ని 'పెట్టుబడిగా' పని చెయ్యడానికి పెడితే, అది తనను తను పెంచుకునే 'అద్భుత శక్తి'ని పొందుతుంది. ఒక గడ్డిపరకని 'పెట్టుబడిగా' పెడితే, అది చిలవలూ వలవలూ వేసి అడవిలా అల్లుకుపోతుంది. ఆవుకి దూడలు పుట్టడమూ, చెట్టుకి కాయలు కాయడమూ, ఎంత ప్రకృతి సహజ కార్యాలో, డబ్బు, ఎక్కువ డబ్బుగా పెరగడం అంత సహజ కార్యంగా పెట్టుబడిదారుడికి కనపడుతుంది.

డబ్బుని ఒక మూల పడేస్తే అది పెరగదని తెలుసు కాబట్టే, పెట్టుబడిదారుడు, దానితో 'పరిశ్రమ' అనే ఒక నాటకం ప్రారంభిస్తాడు. అందులో ప్రధాన పాత్రధారి 'పెట్టుబడే'. అది ద్విపాత్రాభినయం చేస్తుంది. ఒకవేపు 'శ్రమ సాధనాల' వేషమూ, ఇంకోవేపు 'జీతాల' వేషమూ కడుతుంది. 'శ్రమ సాధనాల' వేషంలో అది, గోడ మీద ఫోటో లాగ నిర్జీవంగా నిలబడే పాత్ర నిర్వహిస్తుంది. 'జీతాల' వేషంలో, 'పనివాడి' పాత్ర నిర్వహించాలి కదా? ఆ పనికి అది 'డూప్'ని (కార్మికుల్ని) పెట్టుకుంటుంది. ఆ పాత్రకి సంబంధించిన పని అంతా డూపే చేస్తాడు. కానీ, ఆ పనంతా బయటికి పెట్టుబడి చేసినట్టే కనపడుతుంది. "ఆహా! పెట్టుబడి ఎంతెంత సాహస కార్యాలు చేస్తోందో! పొలాలన్నీ సాగు చేస్తోంది! గనుల్లోకి చొచ్చుకుపోతోంది! కొండలు పిండి కొడుతోంది!" అని పెట్టుబడిదారుడు దాని చర్యల్ని చూసి ఆశ్చర్యపోతాడు. ఆ కార్యాలన్నీ తనే చేసినట్టు పెట్టుబడి దర్పంగా వాడి ముందు నిలబడుతుంది.

'పెట్టుబడి'తో ఈ వేషాలన్నీ కట్టించి, ఈ విన్యాసాలన్నీ చేయించే డైరెక్టరు — పెట్టుబడిదారుడే. నిజానికి వాడికి ఈ తతంగం మీద ఏమీ ఆసక్తి వుండదు. ఈ నాటకం మీద గొప్పకళానురక్తో, భక్తో ఏమీ వుండవు. కానీ ఏం చేస్తాడు? డబ్బుని 'అభివృద్ధి' చెయ్యడానికి ఇంకో మార్గం లేదు మరి! ఏ తతంగాలూ పెట్టుకోకుండా, వాడు, ఒక 100 రూ.లు తీసుకుపోయి ఎవరికన్నా ఇచ్చి — "ఈ 100 తీసుకుని, వెంటనే నాకు 120 ఇచ్చెయ్యండి" అంటే, ఇస్తారా వాళ్ళు? "ఫో, ఫో! అవతలికి ఫో, పిచ్చోడా!" అంటారు. మన వాడు 'పిచ్చోడు' కాడు కదా? అందుకే, ఆ 100 తో గొప్ప చతురుడి లాగ ఒక సరుకుని ఎంచుకుని, దాన్ని ఉత్పత్తి చేయించే ఒక 'పరిశ్రమ నాటకాన్ని' ప్రారంభిస్తాడు, తన డైరెక్షన్ కింద!

# ప్రశ్నలూ — జవాబులూ

**1. 'శ్రమ క్రమం' అంటే ఏమిటి? 2 ఉదాహరణలు ఇవ్వండి!**

**జ:** 'శ్రమ క్రమం' అంటే — శ్రమ జరిగే క్రమం. బట్టని, చొక్కాగా కుట్టడానికి పట్టే సమయం అంతా కలిసి, ఒక శ్రమ క్రమం. చెక్కని కుర్చీగా చెయ్యడానికి పట్టే సమయం — ఒక శ్రమ క్రమం.

**2. శ్రమ లేకుండా తయారై, మనం ఉపయోగించుకోగలిగే పదార్థం ఏదైనా వుందా?**

**జ:** ఉంది. గాలి, మనుషుల శ్రమతో సంబంధంలేని పదార్థమే. కానీ, విసన కర్రతో విసురుకున్నప్పుడు, ఆ గాలికి కారణం, కొంత శ్రమ కూడా. విసనకర్రని తయారుచేసిన శ్రమా, ఆ వస్తువుతో విసురుకునే శ్రమా, రెండూ కలుస్తాయి. అలాగే ముడి భూమి, శ్రమ లేకుండా సహజంగా వున్న పదార్థమే. దాన్ని వ్యవసాయానికో, నివాసానికో కొంత మార్చుకుంటే, అలా మారిన భూమికి కారణం, కొంత శ్రమ కూడా.

**3. గాలి పీల్చడం ఒక శ్రమ క్రమమేనా?**

**జ:** కాదు. ప్రకృతి సహజంగా జరిగే శరీర ధర్మాలేవీ శ్రమల కిందకి రావు.

**4. అడవి చెట్టు నించి పళ్ళు కొయ్యడం — ఒక శ్రమ క్రమమేనా?**

**జ:** శ్రమ క్రమమే. అడవిలో చెట్టుకి పళ్ళురావడం వరకూ, అది మానవ శ్రమతో సంబంధం లేని విషయం. ఆ పళ్ళు ప్రకృతి సహజ పదార్థం. ఆ పళ్ళని చెట్టు నించి విడదీసి కిందకి తెచ్చుకోవాలంటే, కొంత మానవ శ్రమ జరగాలి. కాబట్టి, పళ్ళని చెట్టునించి కోసే పని శ్రమ క్రమమే. ఆ పళ్ళని తింటే, ఆ 'తినడం' శ్రమ కాదు.

**5. ఒక మనిషి నదిలో దిగి నీళ్ళు తాగాడు. ఇంకో మనిషి చెరువులో దిగి నీళ్ళు తాగాడు. ఈ 2 చోట్లా — ఆ నీటికి వున్న విలువలోనూ, ఆ మనుషులు చేసిన పనుల్లోనూ తేడా ఏమైనా వుందా, లేదా?**

**జ:** నది, మానవ శ్రమతో తయారైనది కాదు. చెరువు, మానవులు తవ్వినదే. చెరువు నీటికి విలువ వుంటుంది. నది నీటికి విలువ వుండదు. అయితే. నదిలోకి దిగి నీళ్ళు తాగినా, చెరువులోకి దిగి నీళ్ళుతాగినా, 'నీళ్ళు తాగడం' అనేది శ్రమ కాదు. ఆ తాగే పనుల్లో తేడా లేదు.

**6. జంతువు వేటాడి ఆహారం సంపాదించుకుంటుంది. మనిషి కూడా బాణాలతో జంతువుల్ని వేటాడి ఆహారం సంపాదించుకుంటాడు. ఈ 2 ఉదాహరణలకూ 'శ్రమ' విషయంలో తేడా ఏమైనా వుందా?**

**జ:** జంతువు, ఇంకో జంతువుని వేటాడడం 'శ్రమ' కాదు. అది ప్రకృతి సహజ లక్షణం. మనిషి, జంతువుల్ని వేటాడడం — శ్రమే. జంతువు వేటకీ, మనిషి వేటకీ, ఇదే తేడా.

**7. మనుషులు తయారు చేసుకున్న మొట్టమొదటి శ్రమ పరికరాలు ఏవి?**

**జ:** రాళ్ళని అరగదీసి తయారు చేసుకున్నవీ, చెట్ల కొమ్మల్ని విరిచి తయారు చేసుకున్నవీనూ.

**8. రాతి శ్రమ పరికరాల్ని కొన్నిటిని చెప్పండి !**

**జ:** రోలూ, తిరగలీ, సన్నికల్లూ, బట్టలు వుతికేరాళ్ళూ — వంటివి.

**9. 'రాతి గద' ఒక శ్రమ పరికరమేనా ?**

**జ:** కాదు. 'గద'తో చేసే పని, ఒకర్ని ఒకరు కొట్టుకోవడం.

అది 'శ్రమ క్రమం' కాదు. దానివల్ల ఏ ఉపయోగపు విలువలూ ఉత్పత్తి కావు. కొట్లాటలకు ఉపయోగపడే ఆయుధాలేవీ శ్రమ పరికరాలు కావు. కానీ, 'బాణం' లాంటి ఆయుధాలతో జంతువుల్ని వేటాడితే, ఆ సందర్భంలో అది శ్రమ పరికరమే. ఆ బాణంతోనే ఒక మనిషి ఇంకో మనిషిని కొడితే, అది శ్రమ క్రమం కాదు కాబట్టి, ఆ సందర్భంలో ఆ బాణం శ్రమ పరికరం కాదు.

**10. స్త్రీ, గర్భం ధరించి బిడ్డని కనడం శ్రమ క్రమమేనా ?**

**జ:** కాదు. క్రిమి కీటకాలూ జంతువులూ అన్నీ బిడ్డల్ని కంటాయి. అది శ్రమ క్రమం అవదు. భోజనమూ, నిద్రా, మల మూత్ర విసర్జనా వంటి పనులేవీ శ్రమ క్రమాలు కావు. అవి ప్రకృతి సహజ కార్యాలు అవుతాయి.

**11. 'సరుకుల మారకం', 'సరుకుల ఉత్పత్తి' అనే విషయాలకు తేడా వుందా? ఏమిటి ?**

**జ:** తేడా వుంది. 'సరుకుల మారకం' అనేది, ఆటవిక సమాజం నించీ కూడా వుంది. వేరు వేరు తెగల మధ్య, వస్తువుల మారకాలు ఏడాది కోసారి జరిగినా, అది సరుకుల మారకాలు వున్నట్టే. కానీ 'సరుకుల ఉత్పత్తి' అంటే, మొత్తం ఉత్పత్తిని అంతటినీ అమ్మకాల కోసం ఉత్పత్తి చెయ్యడం. ఇది పెట్టుబడిదారీ విధానంలోనే జరుగుతుంది.

**12. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం — అనే మాటతో సమాన అర్థాలు గల మరి కొన్ని మాటలు చెప్పండి!**

**జ:** సరుకు ఉత్పత్తి విధానం. విలువ ఉత్పత్తి విధానం. లాభ ఉత్పత్తి విధానం. అసహజ ఉత్పత్తి విధానం.

**13. ఏ పని శ్రమ అవుతుందో, ఏ పని శ్రమ అవదో గ్రహించడానికి ఏదైనా మార్గం ఉందా ?**

**జ:** ఉంది. శరీర ధర్మాలకు సంబంధించిన పనులు (గాలి పీల్చడం, తినడం, తాగడం, నిద్రా, స్త్రీ-పురుష సంబంధం- వంటి పనులు) శ్రమలు అవవు. ఉపయోగపు విలువల్ని ఉత్పత్తి చెయ్యని కొట్లాటలూ దొంగతనాలూ హత్యలూ వంటి ఏ పనులూ శ్రమలు అవవు. ఎలాంటి పనులు మాత్రమే శ్రమలు అవుతాయంటే - మనుషులు జీవించడానికి కావలసిన పోషణ వస్తువుల్నీ పదార్థాల్నీ సౌకర్యాల్నీ తయారుచేసుకునే పనులు మాత్రమే శ్రమలు అవుతాయి. వాటిలో విలాస వస్తువులు ఉన్నప్పటికీ, మత్తు పదార్థాలు ఉన్నప్పటికీ, కత్తులూ కఠార్లూ ఉన్నప్పటికీ, వాటిని ఉత్పత్తి చేసేవన్నీ శ్రమలే. శ్రమలు చేసేవాళ్ళే శ్రామికులు. జీవించడానికి సహజంగా అవసరం లేని పదార్థాల్ని ఉత్పత్తి చేసుకోకూడదు - అనేది వేరే సంగతి. దోపిడీ లేని సమాజంలో అలాంటి ఉత్పత్తులు ఉండవు.

**14. ఒక పెట్టుబడిదారుడు, ఒక బిల్డింగుని అద్దెకు తీసుకుని, అక్కడ కావలసిన ఏర్పాట్లన్నీ చేయించి, కొందరు స్త్రీలతో వ్యభిచారం చేయిస్తూ దాన్ని ఒక 'పరిశ్రమగా' చెప్పుకుంటాడు. ఆ స్త్రీలకు 'సెక్సు వర్కర్లు' అని పేరు పెడతాడు. ప్రభుత్వం అనేది పెట్టుబడిదారులదే కాబట్టి వ్యభిచారాలు చేయించడాన్ని కూడా అది ఒక పరిశ్రమగా గుర్తించి దానికి లైసెన్సులు ఇస్తుంది. పెట్టుబడిదారుడు నడిపే ఈ వ్యభిచారం ఒక పరిశ్రమ అవుతుందా? ఆ స్త్రీలు శ్రామికులు అవుతారా?**

**జ:** అది పరిశ్రమా కాదు ; ఆ స్త్రీలు శ్రామికులూ కారు. దోపిడీ సమాజంలో, డబ్బు సంపాదించడానికి వీలునిచ్చే ప్రతీ తప్పుడు మార్గమూ గొప్ప పరిశ్రమ లాగే కనపడుతుంది.

**15. ఒక పెట్టుబడిదారుడు, కొందరు మనుషులతో కొట్లాటలూ దొంగతనాలూ హత్యలూ చేయిస్తూ, వాటి ద్వారా సంపాదించిన డబ్బులో నించి ఆ మనుషులకు కొంత ఇచ్చి తను కొంత మిగుల్చుకుంటాడు. ఆ పనులన్నీ శ్రమలేనా ? ఆ మనుషులు శ్రామికులేనా ?**

**జ:** ఆ పనులు శ్రమలూ కావు ; ఆ మనుషులు శ్రామికులూ కారు. వాళ్ళు ఏ ఉపయోగపు విలువనీ ఉత్పత్తి చెయ్యడం లేదు.

**16. క్రమ శిక్షణ — అంటే టైముని ఖచ్చితంగా పాటించడమేనా?**

**జ:** అవును. కార్మికులు ఒక టైము ప్రకారం ఖచ్చితంగా పని స్థలంలోకి రావాలి. ఎవరి పనులు వాళ్ళు ఖచ్చితంగా చెయ్యాలి. అదే పని స్థలంలో పాటించవలసిన క్రమ శిక్షణ.

**17. ఈ క్రమ శిక్షణ నూతన సమాజంలో కూడా వుంటుందా, వుండాలా?**

**జ:** కొంత మంది మనుషులు కలిసి ఒక పని చెయ్యవలసినచోట క్రమశిక్షణ అనేది ఎప్పుడూ అవసరమే. అందరూ ఒకే టైము ప్రకారం పని స్థలానికి రావడమూ, ఒక పద్ధతి ప్రకారం పనులు చెయ్యడమూ అవసరమే. అయితే, పెట్టుబడిదారీ విధానంలో శ్రామికుల్ని పనిలో నించి మూత్రానికి కూడా కదలనివ్వని నీచత్వం వుంటుంది. పనిలోకి రావడం ఏ మాత్రం ఆలస్యం అయినా, ఆ ఆలస్యానికి ఎంత న్యాయమైన కారణం వున్నా, దాన్ని లక్ష్య పెట్టకుండా ఆ శ్రామికులకు జరిమానాల లాంటి శిక్షలు విధించే యజమానితనం వుంటుంది. ఇలాంటి శ్రామిక వ్యతిరేక లక్షణాలు నూతన సమాజపు క్రమ శిక్షణలో వుండకూడదు. ఈ నెగెటివ్ లక్షణాల్ని తీసివేస్తే, పనిలో క్రమ శిక్షణ ఎప్పుడూ అవసరమే.

**18. పొదుపూ పీనాసితనమూ ఒకటేనా, ఏమైన తేడా వుందా? పొదుపుకీ, పెట్టుబడిదారీ పొదుపుకీ, తేడా వుందా?**

**జ:** పొదుపు అంటే – అవసరమైన వాటి కోసం మాత్రమే ఖర్చు పెట్టి, అనవసరమైన ఖర్చులు చెయ్యక

పోవడం. పీనాసితనం అంటే — అవసరమైన ఖర్చులు కూడా చెయ్యకపోవడం. రెండూ ఒకటి కాదు. ఒక మనిషి పొదుపుని పాటిస్తే, దాని వల్ల ఆ మనిషికి చాలా ఉప యోగం వుంటుంది. కానీ, పెట్టుబడిదారుడి పని స్థలంలో కార్మికులు పొదుపుని పాటిస్తే, దాని ప్రయోజనం, ఆ కార్మికులకు గాక, ఆ పెట్టుబడిదారుడికే ఉంటుంది.

**19. కార్మికులు, శ్రమ సాధనాల విషయంలో పాటించే జాగ్ర త్తల వల్ల, యజమానికే లాభంగానీ వారికేమీ లాభం ఉండదు కాబట్టి వారు, ఆ జాగ్రత్తలు పాటించాలా అక్కర లేదా?**

**జ:** తప్పకుండా పాటించాలి. కార్మికులు, తమ పనుల్లో ఎప్పుడూ నిజాయితీగానే ఉండాలి. తమకు ఎప్పుడే సమస్య వుంటే ఆ సమస్య మీద యజమానితో పోరాడ వలసిందే. అది వేరే విషయం. ఆ సమస్యలకూ, శ్రమ సాధనాల విషయంలో పాటించవలసిన జాగ్రత్తలకూ ముడి పెట్టకూడదు.

**20. శ్రామికులకూ, శ్రమ పరిస్థితులకూ వుండే 'పరాయి తనం' ఏమిటి? అది ఏ యే విషయాల్లో వుంటుంది?**

**జ:** శ్రామికులకు, శ్రమ సాధనాల మీద హక్కు వుండదు. అవి యజమాని ఆస్తిగా వుంటాయి. అది, శ్రమ సాధనా లతో పరాయితనం. నిజానికి, శ్రమ సాధనాలన్నీ శ్రామికుల శ్రమలతో తయారయ్యేవే. కానీ, వాటిని యజమానులు తమ ఆస్తులుగా ఆక్రమించడం వల్ల అవి శ్రామికులకు పరాయివిగా అయిపోతాయి. ఇంకో విషయం: శ్రామికు లకు, వారి శ్రమతోకూడా పరాయితనమే. శ్రమ చెయ్యడం అనేది, స్వంత బాధ్యత తోటీ, స్వంత ఇష్టం తోటీ, జరగాలి. శ్రమ చేసే మనిషి, ఒక యజమాని ఆజ్ఞల కింద శ్రమ చెయ్యవలసి వచ్చినప్పుడు, ఆ శ్రమ, ఆ శ్రమ చేసే మనిషికి, యజమాని కోసం చేసే పనిలాగే కనపడు తుంది.— ఈ రకంగా యజమానితనం కింద శ్రమ చేసే మనిషికి, ఆ శ్రమ తోటీ, ఆ శ్రమ సాధనాల తోటీ కూడా పరాయితనమే వుంటుంది.

**21. ఉపాధ్యాయుడి పని, పాఠాలు చెప్పడం. ఎలాంటి పాఠాలు విద్యార్థులకు బోధించాలీ — అనే విషయం నిర్ణయించడంలో, ఉపాధ్యాయుల పాత్ర ఉండాలా?**

**జ:** తప్పనిసరిగా ఉండాలి. కానీ, దోపిడీ సమాజాలలో శ్రమలకు సంబంధించిన ఏ నిర్ణయాలూ ఆ శ్రమలు చేసే మనుషులు చెయ్యరు. వారి యజమానులే చేస్తారు.

**22. C — M — C కీ, M — C — M కీ, ప్రధానమైన తేడా ఏమిటి?**

**జ:** **C — M — C** లో జరిగే మారకాలు, ఒక ఉపయో గపు విలువతో ప్రారంభమై ఇంకో ఉపయోగపు విలువతో ముగుస్తాయి. ఇచ్చే విలువా, తిరిగి పొందే విలువా సమానంగా వుంటాయి. ఇది ఉపయోగపు విలువ దృష్టికి గుర్తు.

**M — C — M** లో మారకాలు డబ్బుతో ప్రారంభమై, డబ్బుతో ముగుస్తాయి. మొదటి డబ్బు కన్నా దాని ద్వారా వచ్చే రెండో డబ్బు ఎక్కువగా వుంటుంది. ఇది విలువ దృష్టికి గుర్తు.

**23. ఆర్థిక విధానం — అనేది, ఏ యే విషయాలకు సంబం ధించి వుంటుంది?**

**జ:** వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోవడానికీ, వాటిని పంపిణీ చేసుకోవడానికీ సంబంధించి ఉంటుంది. అంటే, ఉత్పత్తి క్రమానికీ, పంపిణీ క్రమానికీ సంబంధించి.

**24. పెట్టుబడిదారీ విధానం, 'అమ్మకాల' కోసమే ఉత్పత్తి చేస్తుంది — అని 4 వేరు వేరు సరుకుల ద్వారా చెప్పండి!**

**జ:** సబ్బుల పెట్టుబడిదారుడు, రోజూ వెయ్యి సబ్బులు తయారు చేయిస్తాడు. అందులో వాడి కుటుంబం వాడేది రోజుకి ఒక్క సబ్బు కూడా వుండదు. అన్నీ అమ్మ వలసిందే. బట్ట వాడూ, చెప్పులవాడూ, కుర్చీలవాడూ— ఇలా ప్రతీ పెట్టుబడిదారుడి సరుకూ అమ్మకానికే. వాడికి కావలసిన సరుకులన్నీ ఇతర పెట్టుబడిదారుల దగ్గిర కొనుక్కోవలిసిందే.

**25. సినిమా నిర్మాత 'పెట్టుబడి' పెట్టి, సినిమా తీసేది కళానురక్తితోనేనా?**

**జ:** 'పెట్టుబడి' అనే మాట వుంటే, దాని లక్ష్యం, తక్కువ డబ్బుతో ఎక్కువ డబ్బుని సంపాదించడమే. కాబట్టి, సినిమా పెట్టుబడికి కూడా డబ్బుని సంపాదించడమే మొదటి లక్ష్యం. అయితే, ఆ సినిమా పెట్టుబడిదారుడి ఆసక్తిని బట్టి, 'కళ' విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే తీసుకోవచ్చు. సరుకుని ఇతరుల కన్నా నాణ్యంగా ఇస్తే ఎక్కువ సరుకుని అమ్మగలుగుతారు కదా? అలా ఆలోచించినట్టే, సినిమా పెట్టుబడిదారుడు కూడా సహజమైన కథ, సహజమైన సంభాషణలూ ఉండాలని, అలాంటి విషయాల్లో జాగ్రత్తలు పడవచ్చు. అప్పుడు ఆ సినిమా, ధనాత్మకం గానూ, కళాత్మకంగానూ కూడా తయారవుతుంది.

**26. చిత్రకారులకు ప్రత్యేకం :**

**శ్రమ క్రమాన్ని వివరించే చిత్రం గియ్యండి ! బట్టల నేతో, వడ్రంగమో, అచ్చుపనో, ఏదో ఒక పనిని ఎంచుకోండి. ఆ పని స్థలంలో, కార్మికులు అందరూ ఒక్కొక్క పనిలో వుంటారు. ఒక కుర్చీ మీద పెట్టుబడిదారుడు కూర్చుని వుంటాడు. చిత్రాన్ని చూడగానే, ఒక శ్రమ క్రమం జరుగు తోందనీ, అక్కడ అందరూ పని చేస్తోంటే, ఒకడు మాత్రం పని చెయ్యడం లేదనీ, వెంటనే స్ఫురించేలాగ చిత్రం వుండాలి.**

**జ:** పాఠకుల్లో ఎవరైనా చిత్రకారులు వుంటే, వారు చెయ్యవలిసిన పని ఇది.

★

# 4. స్థిర పెట్టుబడీ- అస్థిర పెట్టుబడీ ఫిక్సెడ్ పెట్టుబడీ- చలామణీ పెట్టుబడీ

స్థిర పెట్టుబడీ – అస్థిర పెట్టుబడీ ;

ఫిక్సెడ్ పెట్టుబడీ – చలామణీ పెట్టుబడీ ;

డబ్బు పెట్టుబడీ-ఉత్పాదక పెట్టుబడీ-సరుకు పెట్టుబడీ;

వ్యక్తి పెట్టుబడీ –సామాజిక పెట్టుబడీ ; ఇలా, ఇన్ని పేర్లతో, 'పెట్టుబడి'కి సంబంధించిన వేరు వేరు కోణాల్నీ, వేరు వేరు విషయాల్నీ చూస్తాం, ఈ చాప్టర్‌లో.

'పెట్టుబడి' 2 భాగాలుగా వుంటుందని ఇంతకు ముందే చూశాం. **(1)** 'ఉత్పత్తి సాధనాల' మీద పెట్టే భాగం. ('శ్రమ సాధనాలు' అనే మాటనే, ఇక నించి 'ఉత్పత్తి సాధనాలు' అని వాడుతున్నాము.)

**(2)** 'జీతాల' మీద పెట్టే భాగం.

ఈ 2 భాగాల మీద పెట్టిన విలువా, పెట్టుబడి దారుడికి తిరిగి వచ్చేస్తుంది. అలా తిరిగి రావడంలో, 'ఉత్పత్తి సాధనాల' మీద పెట్టింది, ఎంత పెడితే అంతే వస్తుంది. అది ఎక్కువా తక్కువా అవకుండా 'స్థిరంగా' వుంటుంది. అందుకే అది 'స్థిర పెట్టుబడి'. 'జీతాల' మీద పెట్టిన భాగం, తిరిగి వచ్చేటప్పటికి 'ఎక్కువై' వస్తుంది. అది, మొదట ఎంత వుంటుందో అంతే వుండక, తప్పని సరిగా మారి వుంటుంది. అందుకే అది 'అస్థిర పెట్టుబడి'.

మొదట ఈ 2 విషయాలూ వివరంగా చూద్దాం.

## స్థిర పెట్టుబడి (కాన్‌స్టెంట్ కాపిటల్)

ముడి పదార్థాలూ, శ్రమ పరికరాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ కలిసిన మొత్తమే 'ఉత్పత్తి సాధనాలు.' వీటి మీద పెట్టే పెట్టుబడే 'స్థిర పెట్టుబడి'. ఉత్పత్తి సాధనాలు, తమ 'విలువ'ని ఎక్కువో తక్కువో చెయ్యవు. కాబట్టే, ఈ పెట్టుబడి—'స్థిర పెట్టుబడి.

'ఉత్పత్తి సాధనాల'లో ఒక ముడి పదార్థం విలువ గానీ, ఒక 'శ్రమ పరికరం' విలువ గానీ, ఒక ఆగ్జిలరీ వస్తువు విలువ గానీ, ఎప్పుడూ ఒకే లెక్కన వుండదు. పత్తి విలువ ఒక సంవత్సరం వున్నట్టు ఇంకో సంవత్సరం వుండదు. ఒక సరుకు ఎప్పుడూ ఒకే విలువతో వుండదనే విషయం 'లాభం' చాప్టర్లో చూశాం. 'ఉత్పత్తి సాధనాల' విలువలో ఏమైనా మార్పులు జరిగితే, పెట్టుబడిదారుడికి దాని ఫలితాలు ఎలా వుంటాయి?

100 మీటర్ల బట్టని తయారు చెయ్యడానికి '80 విలువ గల ఉత్పత్తి సాధనాలు' ఖర్చవుతా యనుకుందాం. తయారైన బట్టని అమ్మేస్తే పెట్టుబడి దారుడి చేతిలోకి కొంత డబ్బు వస్తుంది. అందులోంచి 80 ని తీసి దానితో పెట్టుబడిదారుడు, ఖర్చయిపోయిన ఉత్పత్తి సాధనాలన్నీ మళ్ళీ కొంటాడు. ఎందుకంటే, వాడు మళ్ళీ కొత్త బట్టని తయారు చేయించాలి కదా? బట్టని ఒక్క సారి చేయించడంతోనే వాడు 'పరిశ్రమ'ని మూసేసుకోడు. సరుకుని మళ్ళీ తయారు చేయించి మళ్ళీ అమ్మాలి. మళ్ళీ తయారు చేయించాలంటే మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాలు కావాలి. వెనకటి ఉత్పత్తి సాధనాల డబ్బుతోనే, కొత్త ఉత్పత్తి సాధనాలు కొనాలి. వీడి దగ్గిర 'బట్ట' తయారవుతూ వున్నట్టే, వీడికి కావలసిన ఉత్పత్తి సాధనాలన్నీ వేరు వేరు పెట్టుబడి దారుల దగ్గిర తయారవుతూ వుంటాయి. వీడు, మొదటి బట్టని అమ్మేసి, దాని ఉత్పత్తి సాధనాల డబ్బుతోనే మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాలు కొంటాడు.

ఒక 'ఉత్పత్తి సాధనం' విలువ, ఒక సారి కన్నా ఇంకో సారి పెరగడమో తరగడమో జరిగితే దాని ఫలితం ఎలా వుంటుంది? దారాన్ని ఉదాహరణగా తీసుకుందాం. మిగిలిన ఉత్పత్తి సాధనాలకు కూడా ఈ ఉదాహరణే సరిపోతుంది.

100 మీటర్ల బట్టకి ఒకసారి 30 విలువ గల దారం పట్టింది — అనుకుందాం. బట్టని తయారుచేసి అమ్మే సమయానికి, కొత్త పత్తి పంట పాడై, మార్కెట్లో దారం విలువ కొంత పెరిగిందనుకుందాం. గతంలో 30 గా వున్న దారం విలువ ఇప్పుడు 40 అయిందనుకుందాం. మన బట్ట పెట్టుబడిదారుడు, తన బట్టలో దారం విలువని కూడా 40 గానే లెక్క కడతాడు. అప్పుడు, బట్ట విలువ 10 పెరుగుతుంది. 30 కి కొన్న దారం విలువని 40 గా లెక్క కట్టడం అంటే, పెట్టుబడిదారుడికి దారం ద్వారా 10 లాభం వచ్చినట్టా? — కాదు. ఆ 40 తో వాడు మళ్ళీ కొత్త దారం కొనెయ్యాలి కదా? కొత్త దారం కొనాలంటే, ఆ 40 నీ ఖర్చు పెట్టెయ్యాలి. అందులోంచి వాడు, ఆ 10 ని జేబులో

వేసుకోడానికి వీలు ఉండదు. ఇప్పుడు ఏం జరిగిందంటే, పాత దారం విలువ 30గానూ, కొత్త దారం విలువ 40 గానూ వుండడం వల్ల, పెట్టుబడిదారుడికి మిగిలేదేమీ వుండదు. ఆ 40 తో కొత్త దారం కొనేస్తాడు. అంటే, ఖర్చయిపోయిన దారానికి బదులు కొత్త దారం వచ్చిందని మాత్రమే అర్థం. పాత దారం విలువ పెరిగినా, ఆ దారం, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇచ్చిందని అర్థం కాదు.

అలాగే, దారం విలువ తగ్గినా కూడా పరిస్థితి అంతే. 30 కి కొన్న దారం విలువ 'బట్ట'ని అమ్మే సమయానికి 20 గా తగ్గిపోయిందనుకుందాం ఆ బట్టని అమ్మినప్పుడు, పెట్టుబడిదారుడి చేతిలోకి దారం విలువగా 20 య్యే వస్తుంది. కానీ, దాని వల్ల పెట్టుబడిదారుడికి నష్టమేమీ వుండదు. ఎందుకంటే, ఇప్పుడు, కొత్త దారాన్ని కొనడానికి ఆ 20 య్యే సరిపోతుంది. పాత దారం డబ్బుతో కొత్త దారం వచ్చేస్తుంది. దారం బదులు దారం వస్తుంది. దారం విలువ తగ్గినా, అది తన విలువ కన్నా తక్కువ విలువ ఇచ్చిందని అర్థం కాదు.

ఒకవేళ, బట్టని అమ్మే సమయానికి దారం విలువ ఎప్పటిలాగే 30 గానే వుండి, కొత్త దారాన్ని కొనే సమయానికే దాని విలువ 10 పెరిగితే, పెట్టుబడిదారుడు 10 పెట్టుబడి ఎక్కువగా పెట్టవలసిందే. అయినా దానివల్ల పెట్టుబడిదారుడికి సమస్యేమీ రాదు. ఆ కొత్త బట్టని అమ్మినప్పుడు ఆ పెట్టినదంతా వెనక్కి వచ్చేస్తుంది. అందులో వాడు పోగొట్టుకునేదేమీ వుండదు.

ఒక వేళ పెట్టుబడిదారుడు తన బట్టని ఎప్పటి విలువకే అమ్మి, కొత్త దారాన్ని కొనే సమయానికే దారం విలువ తగ్గితే, పాత దారానికి సంబంధించిన డబ్బులో కొంత మిగిలేమాట నిజమే. అయితే, అదే సమయంలో ఉత్పత్తి సాధనాల్లో ఇంకేదో అంశం తాలూకు విలువ కొంత పెరగవచ్చు. దారం విలువ తగ్గడం ద్వారా మిగిలిన పెట్టుబడి, 'విలువ పెరిగిన' ఇంకో అంశం కోసం అవసరం కావచ్చు. — ఈ రకంగా, ఉత్పత్తి సాధనాల్లో ప్రతీ అంశం విలువా ప్రతీసారీ ఎక్కువో తక్కువో అవుతూనే వుంటుంది. అంటే, 'ఉత్పత్తి సాధనాల' కోసం పెట్టవలసిన పెట్టుబడి, ఎక్కువో తక్కువో అవుతూనే వుంటుంది.

కానీ ఉత్పత్తి సాధనాల్లో ఏ అంశం విలువ ఎప్పుడు ఎలా మారినా, దాని ఫలితం ఒకటే. ఒక ఉత్పత్తి సాధనానికి ఏ విలువ వుంటే ఆ విలువనే అది తిరిగి ఇస్తుంది. ఎక్కువ విలువ వుంటే ఎక్కువ విలువనీ, తక్కువ విలువ వుంటే తక్కువ విలువనీ!

'స్థిర పెట్టుబడి తన విలువని మాత్రమే తిరిగి ఇస్తుంది' అన్నప్పుడు, దాని విలువ ఎప్పుడూ పెరగదనీ, తరగదనీ అర్థం కాదు. పెరిగితే, ఆ పెరిగిన విలువే దాని విలువ. తరిగితే, ఆ తరిగిన విలువే దాని విలువ.

ఉత్పత్తి సాధనాలే —స్థిర పెట్టుబడి. అయితే. 'ఉత్పత్తి సాధనాలు' అన్నప్పుడు, ఆ మాటలో బిల్డింగూ, దారమూ, మగ్గమూ, వగైరా వస్తువులన్నీ విడి విడిగా కనపడతాయి. 'స్థిర పెట్టుబడి' అన్నప్పుడు, ఆ మాటలో ఆ తేడా లేమీ కనపడవు. ఆ భాగానికి ఎంత డబ్బు పెట్టారో మాత్రమే కనపడుతుంది. 'ఉత్పత్తి సాధనాలు' అన్నప్పుడు, 'కొన్ని ఉపయోగపు విలువలు' కనపడితే; 'స్థిర పెట్టుబడి' అన్నప్పుడు, కేవలం 'కొంత విలువ' (డబ్బు) మాత్రమే కనపడుతుంది.

'పెట్టుబడి'కి ఇంగ్లీషు మాట 'కాపిటల్' కాబట్టి, 'పెట్టుబడి'కి గుర్తు — **C.** దీన్ని 'పెద్ద – సి' అని చదవాలి. దీనికి గుర్తుగా 'పెద్ద – సి' అక్షరాన్నే పెట్టాలి.

'స్థిర పెట్టుబడి'కి ఇంగ్లీషు మాట 'కాన్‌స్టెంట్ కాపిటల్'. 'కాన్‌స్టెంట్' అనే మాట కూడా **C** తోనే ప్రారంభమవుతుంది. కాబట్టి, 'స్థిర పెట్టుబడి'కి కూడా గుర్తు **C** యే. కానీ, దీనికి 'చిన్న **c**'ని పెట్టాలి. దాన్ని 'చిన్న – సి' అని చదవాలి.

('సరుకు'కి ఇంగ్లీషు మాట 'కమాడిటీ' కాబట్టి, దాని గుర్తు కూడా **C** యే. సందర్భాన్ని బట్టే ఈ **C** ల్ని అర్థం చేసుకుంటూ వుండాలి.)

'ఉత్పత్తి సాధనాల'కు ఇంగ్లీషు మాట 'మీన్స్ ఆఫ్ ప్రొడక్షన్' కాబట్టి, ఉత్పత్తి సాధనాలకు గుర్తు — **MP.**

ఒక పెట్టుబడిదారుడు 'ఉత్పత్తి సాధనాలుగా 80 పెట్టాడు' అన్నా; 'స్థిర పెట్టుబడిగా 80 పెట్టాడు' అన్నా, రెండూ ఒకటే.

# అస్థిర పెట్టుబడి ( వేరియబుల్ కాపిటల్ )

'పెట్టుబడి'లో ఇంకో భాగం 'జీతాల' మీద పెట్టే భాగం. ఈ భాగం, తన విలువని తిరిగి ఇవ్వడం మాత్రమే గాక, ఇంకా ఎక్కువ విలువని కూడా ఇస్తుంది. ఇది స్థిరంగా వుండని భాగం గనక, ఇది 'అస్థిర పెట్టుబడి'.

'అస్థిర పెట్టుబడి' అన్నా, 'జీతాలు' అన్నా — ఒకటే. కార్మికులు, జీతాల్ని, 'జీవితావసర వస్తువులు'గా మార్చుకుంటారు.

'జీతాలు' అన్నా, 'అస్థిర పెట్టుబడి' అన్నా, అది 'డబ్బు' రూపంలో కనపడుతుంది. 'జీవితావసర వస్తువులు' అన్నప్పుడు, అవి 'ఉపయోగపు విలువల' రూపంలో కనపడతాయి. కానీ 'ఉత్పత్తి క్రమం'లోకి వచ్చే అంశం, ఆ డబ్బు కాదు; ఈ వస్తువులూ కాదు. మనుషులే.

'ఉత్పత్తి క్రమం'లో వుండే ఒక అంశం 'ఉత్పత్తి సాధనాలు' అయితే, రెండో అంశం — శ్రామికులు. అంతే. ఇక ఏ అంశమూ అవసరం లేదు.

'అస్థిర పెట్టుబడి'కి గుర్తు — **V** (వేరియబుల్ కాపిటల్)

'శ్రమ శక్తి'కి గుర్తు — **LP** (లేబర్ పవర్)

పెట్టుబడిదారుడు — స్థిర పెట్టుబడిగా 80, అస్థిర పెట్టుబడిగా 20 పెడితే, దాన్ని ఇలా చెపుతాము.

పెట్టిన పెట్టుబడి 100 = 80 స్థిర + 20 అస్థిర

100 **C** = 80 **C** + 20 **V**

100 పెట్టుబడిలో, 80ని స్థిర మీదా, 20ని అస్థిర మీదా పెట్టడం అంటే, పెట్టుబడిలో 4 పాళ్ళు స్థిర మీదా, 1 పాలు అస్థిర మీదా, పెట్టినట్టు అర్థం. ఈ పాళ్ళు పెట్టుబడిదారుడి ఇష్టాయిష్టాల్ని బట్టి వుండవు. తయారయ్యే సరుకుకి సంబంధించిన 'ఉత్పాదక శక్తుల' ప్రత్యేకతని బట్టి వుంటాయి. అంటే పూర్తిగా సాంకేతిక పరిస్థితిని బట్టి. (ఈ విషయం ఈ సంపుటంలోనే, "మాన్యు ఫాక్చర్" చాప్టర్లోనూ, 2వ సంపుటంలో "పెట్టుబడిదారీ ధర" చాప్టర్లోనూ కొంత వివరంగా చూస్తాం.)

'పెట్టుబడి'లో స్థిర, అస్థిరల పాళ్ళు ఎలావున్నా, స్థిర, అస్థిర స్వభావాలు మారవు. 100 పెట్టుబడిలో 90 స్థిరగా వుండి, 10 అస్థిరగా వున్నా; 10 స్థిరగా వుండి, 90 అస్థిరగా వున్నా — వాటి స్వభావాలు వాటివే. అంటే, స్థిర, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వదు. అస్థిర, తన విలువకన్నా ఎక్కువ విలువని ఇవ్వకుండా వుండదు.

'20 అస్థిర పెట్టుబడి' అనే మాటల్లో ఏవైనా వైరుధ్యం వుందా? ఒక పక్క, దాన్ని 'అస్థిరగా వుండే పెట్టుబడి' అంటున్నాం. ఇంకో ప్రక్క, దాన్ని '20' అని ఒక స్థిరమైన మొత్తంగా చెపుతున్నాం. ఇది వైరుధ్యం అవుతుందా? కాదు. ఎందుకంటే, '20 అస్థిర పెట్టుబడి' అనే మాటల పూర్తి అర్థం "జీతాల మీద పెట్టింది 20" అని మాత్రమే కాదు. "20 అస్థిర పెట్టుబడి ఉత్పత్తి చేసే విలువ 20 కన్నా ఎక్కువ" అని చెప్పడం కూడా. జీతాలు కూడా ఏదో ఒక స్థిరమైన మొత్తంగానే వుంటాయి. కాబట్టి, ఆ భాగం కూడా ఒక స్థిరమైన సంఖ్యనే చూపిస్తుంది. కానీ, ఆ భాగం ద్వారా వచ్చే విలువ ఎంత పెడితే అంతగా మాత్రమే వుండదు. కాబట్టి, '20 అస్థిర పెట్టుబడి' అనడంలో ఏమీ పొరపాటు లేదు.

ఒక సరుకు ఉత్పత్తి కోసం, 100 పెట్టుబడి, 80 స్థిర + 20 అస్థిరలు గా పని చేస్తోందంటే అర్థం ఏమిటి? ఆ సరుకు ఉత్పత్తి కోసం, 80 విలువ గల ఉత్పత్తి సాధనాలు 'పని స్థలం'లోనూ, 20 విలువ గల 'జీవితావసర వస్తువులు' కార్మికుల ఇళ్ళలోనూ ఖర్చవుతున్నాయి — అని అర్థం. అంటే, 'పెట్టుబడి'కి అసలైన అర్థం — కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కొన్ని జీవితావసర వస్తువులూ అన్నమాట! ఒక పెట్టుబడిదారుడి చేతిలో 100 పెట్టుబడి వుంది — అంటే, కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కార్మికుల జీవితావసర వస్తువులూ, వున్నాయని అర్థం.

'పెట్టుబడి' అంటే: (1) ఉత్పత్తి సాధనాలూ,
(2) కార్మికుల జీవితావసర వస్తువులూ.
కానీ, 'ఉత్పత్తి క్రమం' లో వుండేది:
(1) ఉత్పత్తి సాధనాలూ, (2) కార్మికులూ!

'శ్రమ దోపిడీ'ని, అర్థం చేసుకోవడానికి తెలియవలసిన అంశాలలో, ఈ 'స్థిర, అస్థిర'ల విషయం ఎంతో ప్రధానమైనది. ఈ స్థిర, అస్థిరలు నిర్వహించే పాత్రల్ని సరిగా అర్థం చేసుకుంటేనే, ముందు ముందు చూడబోయే విషయాలు సరిగా అర్థమవుతాయి.

# ఫిక్సెడ్ పెట్టుబడి ( ఫిక్సెడ్ కాపిటల్ )

మొదట పెట్టిన 'పెట్టుబడి'ని (100ని) 'స్థిర – అస్థిర' భాగాలుగా విభజించాం. ఇప్పుడు 'స్థిర' భాగాన్ని మాత్రమే తీసుకుని దాని అంశాల్ని విడి విడిగా చూడాలి.

'స్థిర పెట్టుబడి'లో వుండే అంశాలు 'ఉత్పత్తి సాధనాలే'. ఇవి, 2 పద్ధతుల్లో ఖర్చవుతాయి. దారమూ, చమురూ, బొగ్గూ లాంటి వస్తువులు ఎప్పటికప్పుడు ఖర్చయిపోతూ వుంటాయి. మగ్గాలూ, యంత్రాలూ, బిల్డింగులూ లాంటి వస్తువులు రోజూ కొంచెం కొంచెం చొప్పున ఖర్చవుతూ ఎన్నో ఏళ్ళ వరకూ నిలిచి వుంటాయి. ఎప్పటికప్పుడు ఖర్చయిపోకుండా రోజూ కొంత కొంత చొప్పున, ఖర్చవుతూ, కొంత కాలం వరకూ పని స్థలంలో నిలిచి వుండే సాధనాలన్నీ 'ఫిక్సెడ్ ఉత్పత్తి సాధనాలు'. పేరులో క్లుప్తత కోసం ఈ మాటని 'ఫిక్సెడ్ సాధనాలు' అనవచ్చు. 'ఫిక్సెడ్ సాధనాల' మీద పెట్టే పెట్టుబడి 'ఫిక్సెడ్ పెట్టుబడి'.

'పని స్థలం'లో వుండే మొత్తం ఉత్పత్తి సాధనాల్ని 'ఫిక్సెడ్ సాధనాలు' అనీ, 'నాన్ – ఫిక్సెడ్ సాధనాలు' (ఫిక్సెడ్ కాని సాధనాలు) అనీ, 2 భాగాలుగా అర్థం చేసుకోవాలి. ఈ

సాధనాల్లో, 'ఫిక్సెడ్' అనీ, 'నాన్-ఫిక్సెడ్' అనీ తేడా ఎందుకు ఏర్పడుతుంది? ఎందుకంటే, ఈ సాధనాలతో పని జరిగేటప్పుడు, అవి ఖర్చయ్యే పద్ధతుల్లో వుండే తేడాల్ని బట్టి. ముడిపదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ కలిసి నాన్-ఫిక్సెడ్ సాధనాలు అవుతాయి. మిగిలినవి అన్నీ ఫిక్సెడ్ సాధనాలు. నాన్-ఫిక్సెడ్ సాధనాలలో ముడి పదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ కలిసి వుంటాయి కాబట్టి, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం వీటిని, 'ముడి పదార్థం' అనే ఒక్క మాటతోనే వ్యవహరించవచ్చు.

ఫిక్సెడ్ సాధనాలూ, నాన్-ఫిక్సెడ్ సాధనాలూ ఖర్చయ్యే పద్ధతుల్లో తేడా వుంటుంది కాబట్టి, వాటి విలువలు సరుకుకి చేరే పద్ధతుల్లో కూడా తేడా వుంటుంది. నాన్-ఫిక్సెడ్ సాధనాల మీద పెట్టిన విలువ ఒకే సారి సరుకుకి చేరిపోయి, సరుకుని అమ్మినప్పుడు అది పూర్తిగా వెనక్కి వచ్చేస్తుంది. ఫిక్సెడ్ సాధనాల విలువ అయితే, అందులో కొంత కొంత భాగమే సరుకుకి చేరుతూ, సరుకుని అమ్మినప్పుడు, అది మాత్రమే వెనక్కి వస్తూ వుంటుంది.

'మగ్గం' అనే ఫిక్సెడ్ సాధనాన్ని తీసుకుందాం. 100 మీ. బట్ట కోసం ఒక మగ్గం అంతా ఖర్చు కాకపోయినా, 'ఉత్పత్తి క్రమం'లో ఆ మగ్గం అంతా వుండాలి. లక్ష మీటర్ల బట్ట తయారవ్వాలన్నా, ఒక్క మీటరు బట్ట తయారవ్వాలన్నా, మగ్గం అంతా వుండాలి.

పెట్టుబడిదారుడు ఒక ఫిక్సెడ్ సాధనాన్ని కొనేటప్పుడు, దాని విలువ అంతా ఒక్కసారే ఇచ్చేసి కొనాలి. ఆ విలువని వెనక్కి తీసుకోవడంలో మాత్రం కొన్ని సంవత్సరాలపాటు తీసుకోవాలి.

ఒక మగ్గం విలువ 500 అనీ, దాని జీవిత కాలం 5 సం॥లు అనీ, అనుకుందాం. అది, పని ప్రారంభించింది మొదలూ, పాడై పోయే లోగా (అంటే 5 సం॥లలో) ఎంత బట్టని నేస్తుందో ఆ బట్టకి తన ద్వారా 500 విలువని చేరుస్తుంది. మొదటి సంవత్సరం పూర్తి అయ్యేటప్పటికి ఆ మగ్గం విలువలో నించి 100 రూ.లు ఖర్చయిపోయి (తగ్గి పోయి), ఇంకా 400 విలువ మగ్గంలో మిగిలి వుంటుంది. అంటే, అప్పటికి ఈ ఫిక్సెడ్ సాధనం నించి అరిగి ఖర్చయి పోయిన విలువ 100. ఇంకా మిగిలివున్న భాగం 400. 'అరిగిపోవడం' అంటే, ఫిక్సెడ్ సాధనం సబ్బుబిళ్ళ లాగ అరిగి చిన్నదైపోతూ వుంటుందని కాదు. అది పనిచేస్తున్న కొద్దీ పాతబడిపోతూ వుంటుంది. ఈ పాతబడే స్థితినే 'అరిగి ఖర్చయిపోవడం' (డిప్రిసియేషన్) అంటాము.

ఫిక్సెడ్ సాధనం విలువలో కొంత భాగం వెనక్కివస్తే, ఆ డబ్బు పెట్టుబడి దారుడి దగ్గిర నిల్వగానే వుంటుంది. కొత్త మగ్గాలతో అవసరం పడేదాకా, ఆ డబ్బుని పెట్టుబడి దారుడు ఇంకో అవసరానికి వాడుకోగలడు. ముడి పదార్థాల విషయంలో అయితే, దాని విలువ వెనక్కిరాగానే దానితో కొత్త ముడి పదార్థాన్ని కొనెయ్యవలసి వస్తుంది.

మన మగ్గం విషయంలో, రెండో సంవత్సరం పూర్తి అయ్యేటప్పటికి మగ్గంలో నిలిచివున్న విలువ 300 అవుతుంది. డిప్రిసియేషన్‌గా 200 ఖర్చు అయి పోతుంది. 5 సం॥లు పూర్తి అయ్యేటప్పటికి మగ్గం పూర్తిగా పాతబడి పాడై పోతుంది. ఇక అది పని చెయ్యదు. అప్పుడు కొత్త మగ్గం కావాలి. అప్పటికి దాని విలువ అంతా పెట్టుబడి దారుడి చేతిలోకి డబ్బుగా వచ్చేసి వుంటుంది కాబట్టి, ఆ డబ్బుతో వాడు కొత్త మగ్గం కొనగల స్థితిలో వుంటాడు. మగ్గాల పెట్టుబడిదార్ల దగ్గిర ఎప్పుడూ కొత్త మగ్గాలు తయారవుతూ వుంటాయి కాబట్టి, బట్ట పెట్టుబడి దారుడికి, కొత్త మగ్గం కావలసిన సమయానికి అది దొరుకుతుంది.

కొత్త మగ్గం విలువ 500 కాదనుకుందాం. 600 అనుకుందాం. పెట్టుబడిదారుడు ఇంకో 100 కొత్త పెట్టుబడిని కొత్త మగ్గం మీద పెట్టవలిసిందే. అయితే, ఈ సారి పెట్టుబడిదారుడు మగ్గం విలువని ఈ కొత్త విలువ ప్రకారమే లెక్కకట్టుకుంటాడు.

మగ్గం 5 సం॥లు పనిచేస్తుంది కదా? ఆ 5 సంవత్సరాల మధ్యలోనే బయట మార్కెట్లో మగ్గాల విలువ ఎక్కువో, తక్కువో అవుతూ వుంటే, బట్ట పెట్టుబడిదారుడు కూడా ఆ ప్రకారమే తన లెక్కలు మార్చుకుంటూ వుంటాడు. 5 సం॥లు అయ్యేటప్పటికి దానిమీద పెట్టిన ఖర్చుని వెనక్కి తీసుకుంటాడు. ఆ ఖర్చుతో, మళ్ళీ పాత మగ్గానికి బదులు కొత్త మగ్గం వస్తుంది. ఆ కొత్త మగ్గాన్ని తయారుచేసిన కాలంలో ఉత్పాదక పద్ధతుల్లో ఏమైనా మార్పులు జరిగి, మగ్గాల్ని ఇంకా ఎక్కువ కాలం పని చేసేటట్టుగా తయారుచేస్తే, దాని విలువని వెనక్కి తీసుకోవడానికి ఇంకా ఎక్కువ కాలం పడుతుంది.

ఒక ఉత్పత్తి సాధనం, 'ఫిక్సెడ్ సాధనం'గా ఎందుచేత అవుతుందంటే, అది ఖర్చయ్యే విధానాన్ని బట్టే. ఏ ఉత్పత్తి సాధనమైతే, తన విలువనంతా, సరుకుకి ఒకే సారి మొత్తంగా (ఫుల్‌గా) ఇచ్చెయ్యకుండా, కొంచెం కొంచెంగా (పీస్‌మీల్‌గా) ఇస్తుందో, ఆ సాధనమే — ఫిక్సెడ్ సాధనం. దాని మీద పెట్టిన పెట్టుబడే 'ఫిక్సెడ్ పెట్టుబడి'. 500 తో మగ్గం కొంటే, ఆ 500, ఫిక్సెడ్ పెట్టుబడి. 'పని స్థలం'గా వుండే బిల్డింగూ, శ్రమ పరికరాలూ, పాత్రలూ — వంటివి ఈ కోవలోకే వస్తాయి. ఇవి పూర్తిగా పాతబడిపోయి వాడడానికి పనికి రాకుండా పోయినప్పుడు కూడా తమ ఆకారాలు మారకుండా వుంటాయి. మగ్గం ఎంత పాతబడిపోయినా మగ్గం ఆకారంలోనే వుంటుంది. ఫిక్సెడ్ సాధనాలకు ఇదే గుర్తు.

# చలామణీ పెట్టుబడి ( సర్క్యులేటింగ్ కాపిటల్ )

'ఉత్పత్తి సాధనాల'లో, ఫిక్సెడ్ సాధనాలు కాకుండా వున్నవన్నీ ఎప్పటికప్పుడు ఖర్చయిపోయే సాధనాలుగా వుంటాయి. ముడి పదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ ఈ కోవలోకి వస్తాయి. 100 మీటర్ల బట్ట కోసం ఎంత దారం కావాలో అంత దారాన్నే విడిగా తీసి వాడవచ్చు. అంత దారం కోసమే పెట్టుబడి పెట్టవచ్చు. ఆ దారం విలువ 30 అనుకుంటే, ఆ దారంతో తయారయ్యే బట్టకి ఆ 30 విలువ ఒక్కసారే చేరిపోతుంది. ఆ 30 లో కొంత భాగం బట్టకి చేరకుండా వెనక్కి వుండదు. అలా బట్టకి చేరిన విలువ, 'చలామణీ'లోకి వెళ్ళిపోతుంది.

అంటే 'అమ్మకం' లోకి. తయారైన సరుకు ద్వారా చలామణీలోకి వెళ్ళే పెట్టుబడి 'చలామణీ పెట్టుబడి'.

తయారైన సరుకు ద్వారా చలామణీలోకి వెళ్ళే మొత్తం విలువ ఏమిటి? అది ఏ యే అంశాల నించి సరుకుకి చేరుతుంది?

(1) ముడి పదార్థాల ద్వారా
(2) ఆగ్జిలరీ వస్తువుల ద్వారా
(3) ఫిక్సెడ్ సాధనాల ద్వారా
(4) 'జీతాల' ద్వారా
(5) 'అదనపు విలువ' ద్వారా. — ఇలా మొత్తం 5 రకాల అంశాల విలువలు కలిసి కొత్త సరుకుకి వుండే 'మొత్తం విలువ' అవుతుంది. అయితే, ఈ 5 విలువలలో పెట్టుబడిదారుడు పెట్టిన విలువలు ఏవి? మొదటి 4 అంశాలూ పెట్టుబడిదారుడు పెట్టినవి. అదే చలామణీ లోకి వచ్చిన పెట్టుబడి. కాబట్టి, అదే 'చలామణీ పెట్టుబడి.'

'అదనపు విలువ' కూడా 'చలామణీ'లోకి వస్తుంది. కానీ, అది పెట్టుబడిదారుడు పెట్టిన పెట్టుబడి కాదు. కాబట్టి, పెట్టుబడి గురించి చూసేటప్పుడు, మొదటి 4 అంశాలలో వున్న విలువే 'చలామణీ పెట్టుబడి.'

పెట్టుబడిదారుడు పెట్టిన పెట్టుబడిలో ఇంకా కొంత విలువ 'ఫిక్సెడ్ సాధనాల'లోనే వుండిపోయింది. 'పని స్థలం'లో వుండే ఫిక్సెడ్ సాధనాలు ఇంకా పూర్తిగా పాతబడ లేదు కాబట్టి, వాటిలో ఇంకా కొంత విలువ నిలిచి వుంది. అది కూడా తర్వాత క్రమంగా, రోజూ కొంత చొప్పున ఖర్చవుతూ చలామణీలోకి వచ్చేస్తూ వుంటుంది. కానీ, ఇక్కడ, 'కొంత సరుకు'ని మాత్రమే తీసుకుని, దాని విలువ ఎంత అని చూసేటప్పుడు, దాని కోసం ఖర్చయిన అంశాలనే తీసుకుంటాం. ఆ సరుకు కోసం ఖర్చుకాకుండా, 'పని స్థలం'లోనే వున్న విలువని లెక్కలోకి తీసుకోము.

ఒక 'పని స్థలం'లో వున్న మొత్తం ఉత్పత్తి సాధనాల విలువ అంతా ఒకే సరుకులోకి చేరదు. ఒక సరుకు కోసం ఖర్చయిన ముడి పదార్థాల విలువా, ఆగ్జిలరీ వస్తువుల విలువా, ఫిక్సెడ్ సాధనాలలో అరిగిన భాగం విలువా కలిసి, 'ఉత్పత్తి సాధనాల' విలువ అవుతుంది. దీనికి 'జీతాలు' కూడా కలిస్తే, అది 'చలామణీ పెట్టుబడి' అవుతుంది.

'చలామణీ పెట్టుబడి'కి 'అదనపు విలువ' కూడా కలిస్తే, అది ఆ సరుకుకి వుండే మొత్తం విలువ అవుతుంది.

'చలామణీ పెట్టుబడి'ని 'కాస్ట్ ప్రైస్' అని కూడా అనవచ్చు.

'కాస్ట్ ప్రైస్'కి, 'అదనపు విలువ' కూడా కలిస్తే, అది 'సరుకు విలువ'.

'పెట్టుబడి'ని — స్థిర పెట్టుబడీ, అస్థిర పెట్టుబడీ — అని విభజించడానికీ; ఫిక్సెడ్ పెట్టుబడీ, చలామణీ పెట్టుబడీ — అని విభజించడానికీ — తేడా ఏమిటో సరిగా అర్థం చేసుకోవాలి. 'స్థిర – అస్థిర' విభజనలో, ' జీతాల' భాగం ఒక్కటే ఒక భాగంగా వుండి, మిగిలిన భాగాలన్నీ కలిసి ఇంకో భాగంగా వుంటాయి. 'స్థిర పెట్టుబడి' తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వదనీ, 'అస్థిర' పెట్టుబడి, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇస్తుందనీ చెప్పే విభజన ఇది. 'పెట్టుబడి'ని ఇలా చూడడం వల్లనే 'అదనపు విలువ' ఎక్కడి నించి వస్తుందో తెలుస్తుంది.

'ఫిక్సెడ్ – చలామణీ' విభజనలో, సరుకుకి తమ విలువల్ని ఫుల్‌గా ఇచ్చే అంశాలన్నీ ఒక భాగంగా వుండి, పీస్ మీల్‌గా ఇచ్చే అంశాలన్నీ ఇంకో భాగంగా వుంటాయి. ఇక్కడ జీతాలు — ముడిపదార్థాల తోటీ, ఆగ్జిలరీ పదార్థాల తోటీ సమానం అయిపోతాయి. అంటే, ఆ ఇతర అంశాలు ఎలాంటివో జీతాలు కూడా అలాంటివే — అయిపోతాయి. ఈ 'విభజన'లో జీతాల ప్రత్యేకత కనపడదు. ఈ విభజన కేవలం దేనికి ఉపయోగపడుతుందంటే, పెట్టుబడిలో ఒక అంశం మీద పెట్టిన విలువ, ఒకే సారి తిరిగి వస్తుందా, కొంచెం కొంచెంగా తిరిగి వస్తుందా — అని లెక్కలు కట్ట డానికి ఉపయోగపడుతుంది. 'పెట్టుబడి' కన్నా ఎక్కువ విలువ ఎలా వచ్చిందో గ్రహించడానికి అయితే ఈ విభజన పనికిరాదు.

అందుకే, 'పెట్టుబడి'ని — 'స్థిర – అస్థిర' భాగాలుగా విభజించడానికీ; 'ఫిక్సెడ్ – చలామణీ' భాగాలుగా విభ జించడానికీ వున్న తేడాని, సరిగా అర్థం చేసుకోవాలి.

# 'డబ్బు' పెట్టుబడి ( మనీ కాపిటల్ )

ఒక సరుకుని ఉత్పత్తి చేయించదల్చుకున్న పెట్టుబడి దారుడు, మొదట కొంత డబ్బుతో తన పని ప్రారంభిస్తాడని చూశాం. అంటే, పెట్టుబడి మొదట 'డబ్బు పెట్టుబడి' దశలో వుంటుంది. ఈ డబ్బు పెట్టుబడికి గుర్తు — **M.**

'పెట్టుబడి'ని, డబ్బు రూపంలో చూసినప్పుడు, అందులో ఎలాంటి ముడి పదార్థాలున్నాయో, ఎలాంటి శ్రమ పరికరాలున్నాయో, ఎలాంటి శ్రమ చేసే శ్రామికులు వున్నారో, ఆ తేడాలేమీ కనపడవు. అన్నిటికీ బదులుగా డబ్బే కనపడుతుంది. బట్టని తయారు చేయించ దల్చుకున్న పెట్టుబడిదారుడి చేతిలో '100 డబ్బు' కాయితాలు వుంటే, అందులో దారాలూ, మగ్గాలూ, నేత పని వాళ్ళూ కనపడరు. పెట్టుబడి ఇంకా 'విలువ రూపం'లో నించి, అసలైన ఉత్పత్తి అంశాల రూపంలోకి మారలేదు. అందుకే, 'డబ్బు పెట్టుబడి'ని చూసి (అంటే, పెట్టుబడిగా పనిచెయ్యబోతోన్న డబ్బుని చూసి) పెట్టుబడికి సంబంధించిన నిజానిజాలు గ్రహించడం సాధ్యం కాదు.

# 'ఉత్పాదక' పెట్టుబడి ( ప్రొడక్టివ్ కాపిటల్ )

ఈ దశలో, పెట్టుబడి, 'ఉత్పత్తి క్రమం' జరగడానికి కావలసిన నిజమైన అంశాలుగా మారుతుంది. అంటే, 'ఉత్పత్తి సాధనాలు'గానూ, 'శ్రమ చేసే మనుషులు'గానూ. ఈ అంశాలతోనే 'ఉత్పత్తి క్రమం' నడుస్తుంది.

బట్ట పెట్టుబడిదారుడి చేతిలో, '100 డబ్బు పెట్టుబడి' వుంది — అంటే, అదే సమయంలో, ఇతర పెట్టుబడి దారుల చేతుల్లో 80 విలువగల ఉత్పత్తి సాధనాలూ, 20 విలువ గల కార్మికులు వాడేరకపు పోషణ వస్తువులూ వున్నాయని అర్థం. ఈ ఉత్పత్తి సాధనాలూ, ఈ జీవితావసర వస్తువులూ అంతకు ముందే తయారై సిద్ధంగా వున్నాయి. అలా లేకపోతే బట్టవాడి 'పని స్థలం'లో ఉత్పత్తి క్రమం ప్రారంభం కానే కాదు. అంటే, 'పెట్టుబడి' అంటే, ఉత్పత్తి సాధనాలూ, కార్మికుల పోషణ వస్తువులే గానీ కేవలం డబ్బు కాయితాలే కాదు. అవి బంగారం నాణాలే అయినా, ఆ డబ్బు అలాగే వుంటే, వాటి తోటే ఏ ఉత్పత్తీ జరగదు.

ఈ 'ఉత్పాదక దశ'కి ఒక ప్రత్యేకత వుంది. 'పెట్టుబడి'లో వున్న రహస్యాలన్నీ ఈ దశని పరిశీలించి నప్పుడే బయట పడతాయి. ఈ దశని పరిశీలించడం అంటే, 'ఉత్పత్తి క్రమాన్ని' పరిశీలించడమే. 'ఉత్పత్తి క్రమం'లో ఉత్పత్తి అంశాలన్నీ దేని స్వభావంతో అవి కనపడతాయి. ముడి పదార్థాలూ, అగ్గిలరీ పదార్థాలూ, ఫిక్సెడ్ సాధనాలూ, శ్రామికులూ — ఈ అన్ని అంశాలూ ఇక్కడ కనపడతాయి. స్వయంగా పనిచేసేవాళ్ళూ, పని చెయ్యకుండా 'పెత్తనం' చేసేవాళ్ళూ, అందరూ ఇక్కడ కనపడతారు. ఈ అంశాలన్నీ 'ఉత్పత్తి క్రమం'లోనే నిజరూపాలతో వుంటాయి. 'కొత్త ఉత్పత్తి'ని తయారు చెయ్యడంలో, ఏ అంశం ఎలా ప్రవర్తిస్తుందో, ఏ అంశం ఎలాంటి స్వభావంతో వుంటుందో, ఇక్కడే తెలుస్తుంది. స్థిర – అస్థిర, ఫిక్సెడ్ – చలామణీ అంశాల తేడాల్ని గ్రహించడం ఈ దశలోనే సాధ్యమవుతుంది. 'ఉత్పాదక అంశాల్ని' పరిశీలించడం అంటే, 'పెట్టుబడి' అనే అయోమయ విషయాన్ని చీల్చి, దాని 'అంతర్గత లక్షణాల్ని' పరిశీలించడమే.

ఉత్పాదక పెట్టుబడి = ఉత్పత్తి సాధనాలూ + కార్మికుల జీవితావసర వస్తువులూ.

ఉత్పాదక అంశాలు = ఉత్పత్తి సాధనాలూ + శ్రామికులు (శ్రమ శక్తి)

ఈ 2 ఉదాహరణలలోనూ వున్న తేడా ఏమిటి? 'పెట్టుబడి'లో భాగంగా వుండే శ్రామికుల జీవితావసర వస్తువులు, 'ఉత్పత్తి క్రమం' లోకి రావు. 'ఉత్పత్తి క్రమం' లోకి వచ్చే శ్రామికులు, 'పెట్టుబడి'లో భాగం కాదు. ఈ తేడాని గ్రహించిన తర్వాత, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఈ రెంటినీ ఒక్కలాగే ప్రస్తావించుకోవచ్చు.

'ఉత్పాదక పెట్టుబడి'కి గుర్తు **P.**

**P** అన్నప్పుడు 'ఉత్పాదక పెట్టుబడి' అనీ, 'ఉత్పత్తి క్రమం' అనీ, 'ఉత్పత్తి అంశాలు' అనీ, ఆ యా సందర్భాల్ని బట్టి అర్థం చేసుకోవాలి.

# 'సరుకు పెట్టుబడి' ( కమాడిటీ కాపిటల్ )

'ఉత్పత్తి క్రమం'లో తయారై బయటికి వచ్చే కొత్త సరుకే 'సరుకు పెట్టుబడి'. అంటే బట్ట ఉదాహరణలో, కొత్తగా తయారైన 100 మీటర్ల బట్టే 'సరుకు పెట్టుబడి'. ('సరుకు' రూపంలో వున్న పెట్టుబడి)

చలామణీ పెట్టుబడీ + అదనపు విలువా = సరుకు పెట్టుబడి విలువ.

అదనపు విలువ కి గుర్తు — **S.** ( సర్ప్లస్ వాల్యూ )

'సరుకు పెట్టుబడి'కి గుర్తు — $\mathbf{C^1}$. దీన్ని 'సి – వన్'

అని చదవాలి. $C^1$ – ని చూడగానే, తయారై అమ్మకానికి సిద్ధంగా వున్న 'కొత్త సరుకు' అని గ్రహించాలి.

'పెట్టుబడి'ని పరిశీలించే పని, అది డబ్బుగా వున్న దశలో సాధ్యం కానట్టే, ఈ 'సరుకు పెట్టుబడి' దశలో కూడా సాధ్యం కాదు. ఈ దశలో పెట్టుబడి, డబ్బు రూపంలోగాక, ఒక 'ఉత్పత్తి రూపం'లోనే వున్నా, ఉత్పత్తిని చూడడం వల్ల 'పెట్టుబడి' రహస్యాన్ని అర్థం చేసుకోలేము. ఎందుకంటే, ఇక్కడ 'పెట్టుబడి'లోని అంశాలన్నీ ఒకే రూపంలోకి మారి వుంటాయి. ఏ సరుకు తయారైందో ఆ సరుకు రూపం లోకి. పెట్టుబడిలోని ఏ అంశం ఏ స్వభావంతో పని చేస్తుందో, ఏ అంశం ఏ పద్ధతిలో విలువని ఇస్తుందో— వగైరా విషయాలేవీ కొత్త ఉత్పత్తిలో కనపడవు. స్థిర–అస్థిర, ఫిక్సెడ్–చలామణీ అంశాల తేడా లేవీ ఇక్కడ కనపడవు. అన్నిటి కన్నా ముఖ్యం, శ్రామికులే ఇక్కడ కనపడరు.

పెట్టుబడి M గా వున్నప్పుడూ, $C^1$ గా వున్నప్పుడూ కూడా దాని మీద పరిశీలన జరపడం సాధ్యం కాదు. అది P గా వున్నప్పుడే, ఆ పని సాధ్యం. అంటే, అది ఉత్పాదక పెట్టుబడిగా మారి 'ఉత్పత్తి క్రమం'లో పనిచేస్తూ వున్నప్పుడే. అప్పుడే దాని అంతర్గత విషయాలు అర్థం చేసుకోవడానికి అవకాశం వుంటుంది.

మొదట పెట్టిన డబ్బు పెట్టుబడి, 'పెరిగిన డబ్బుగా మారే వరకూ వుండే మొత్తం పెట్టుబడి నడక' ఇలా వుంటుంది:

| మొదటి డబ్బు | సరుకు | ఉత్పత్తి క్రమం | కొత్త సరుకు | పెరిగిన డబ్బు |
|---|---|---|---|---|
| M | C | P | $C^1$ | $M^1$ |
| 100 | 100 | P | 120 | 120 |
| $(80_C + 20_V)$ | | | | |

# మొదట పెట్టిన పెట్టుబడి

కొంత బట్ట కోసం ఖర్చయిన చలామణీ పెట్టుబడి — 100 రూ.లు. కానీ ఆ పని స్థలంలో వున్న మొత్తం పెట్టుబడి 600 రూ.లు — అనుకుందాం. అయితే, పెట్టుబడి దారుడు, 'మొదట కొంత పెట్టుబడి పెట్టాడు' అంటాం కదా? 'మొదట పెట్టిన పెట్టుబడి' అంటే, సరుకు కోసం ఖర్చయిన 100 'చలామణీ పెట్టుబడా'? లేక, పని స్థలంలో ఉన్న ఫిక్సెడ్ సాధనాలన్నిటితోనూ కలిసివున్న మొత్తం 600 పెట్టుబడా? ఏది 'మొదట పెట్టిన పెట్టుబడి?'

దీన్ని మనం చూసే సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలి. కొంత సరుకునే తీసుకుంటే, దాని కోసం ఖర్చయినదే — మొదట పెట్టిన పెట్టుబడి. లేదా, పని స్థలాన్నంతా తీసుకుంటే, అక్కడ వున్న పెట్టుబడి అంతా కలిసే — మొదట పెట్టిన పెట్టుబడి. ఇది, ఆ సందర్భాన్ని బట్టే వుంటుంది.

100 మీ. బట్టని తీసుకుంటే, దాని కోసం ఖర్చయిన 100 చలామణీ పెట్టుబడే — మొదట పెట్టిన పెట్టుబడి. పనిస్థలంలో వుండిపోయిన ఫిక్సెడ్ సాధనాల విలువతో ఈ బట్టకి సంబంధం లేదు. ఆ విలువ, దీని లెక్కలోకి రాదు. ఈ చలామణీ పెట్టుబడే, వెనక్కి వచ్చేటప్పుడు, లాభాన్ని తీసుకు వస్తుంది.

ఇక్కడ కొన్ని ప్రశ్నలు వస్తాయి. ఈ చలామణీ పెట్టుబడి, లాభాన్ని తెచ్చేటప్పుడు, ఆ లాభం, చలామణీ పెట్టుబడి మీదే వస్తుందా, పని స్థలంలో వున్న మొత్తం పెట్టుబడి అంతటి మీదా వస్తుందా?— దీనికి జవాబు మొదట క్లుప్తంగా చెప్పుకుంటే, లాభం అనేది, మొత్తం పెట్టుబడి అంతటి మీదా రావాలి. చలామణీ పెట్టుబడి మీదే కాదు. పని స్థలంలో వున్న మొత్తం పెట్టుబడి అంతటి మీదా లాభం రాకపోతే ఆ పెట్టుబడి అంతా లాభం లేకుండా పడి వుంటుందా?— అలా వుండదు. కాబట్టి, లాభం, అరగని ఫిక్సెడ్ సాధనాలతో కలిసి వున్న మొత్తం పెట్టుబడి మీద రావాలి.

అయితే, ఆ లాభం అంతా రోజూ అమ్మకం అవుతూ వుండే సరుకు ద్వారానే రావాలి. అంటే చలామణీ పెట్టుబడి ద్వారానే. పని స్థలంలోవున్న మొత్తం పెట్టుబడి మీద ఒక సంవత్సరానికి రావలసిన లాభం, ఆ సంవత్సరంలో అమ్మకం అయ్యే సరుకు ద్వారానే వస్తుంది. దీన్ని ఇంకో సందర్భంలో వివరంగా చూస్తాం. ఇప్పుడు పెట్టుబడిలో అంశాల్నే చూద్దాం.

100 మీ. బట్ట కోసం, 80 స్థిరా, 20 అస్థిరా ఖర్చవుతాయి అనుకుందాం.

'80 స్థిర'లో — ముడిపదార్థం 30. ఫిక్సెడ్ సాధనాల నించి చేరే విలువ 30. ఆగ్జిలరీ 20.

ఫిక్సెడ్ సాధనాల నించి చేరే విలువ 30 య్యే అయినా, వాటి మొత్తం విలువ 500 అనుకుందాం. (ఇది, ఆ ఫిక్సెడ్ సాధనాలన్నిటినీ కొత్తగా కొంటే వుండే విలువ.) ఈ ఉదాహరణలో, 'పని స్థలం'లో వుండే మొత్తం విలువ, ఆ 'పని స్థలం'గా వుండే కట్టడంతో సహా, 600 అని అర్థం.

ఈ ఉదాహరణని ఒక టేబుల్ ద్వారా ఇలా చూడవచ్చు:

'పని స్థలం'లో వున్న మొత్తం పెట్టుబడి
600

100 మీ.బట్ట కోసం ఖర్చయిన పెట్టుబడి 100
స్థిర 80 అస్థిర 20
(ఫిక్సెడ్ సాధనాల డిప్రిసియేషన్-30. ముడి పదార్థం-30. ఆగ్జిలరీ-20).

ఫిక్సెడ్ సాధనాల్లో అప్పటికి మిగిలి వున్న పెట్టుబడి 500. (ఇందులో నించి ప్రతీ సారీ 30 విలువ ఫిక్సెడ్ సాధనాల డిప్రీసియేషన్‌గా సరుకుకి చేరుతూ వుంటుంది.)

బట్ట కోసం ఖర్చయిన పెట్టుబడి =
80 స్థిర + 20 అస్థిర = 100. ఇది, 'చలామణీ పెట్టుబడి'. లేదా, 'కాస్ట్‌ప్రైస్'.

'అదనపు విలువ'ని ( S ని )20 అనుకుందాం.

బట్ట-
విలువ = 80 స్థిర + 20 అస్థిర + 20 అదనపు విలువ = 120

$C^1 = C + V + S = 120$

ఈ సరుకులో వున్న 20 అదనపు విలువే, పని స్థలంలో వున్న 600 పెట్టుబడి కోసం వడ్డీ లాభాల్నీ, ఆ భూమి కోసం కౌలునీ, ఇలా అన్నిటినీ తేవాలి.

ఈ ఒక్క యూనిట్ సరుకే కాదు, ఒక సంవత్సరపు సరుకు అంతా కలిసి, ఆ సంవత్సరపు అదనపు విలువని తెస్తుంది.

ఒక్క పెట్టుబడిదారుడి ఆధీనంలో వున్నది 'వ్యక్తి పెట్టుబడి'.

మొత్తం సమాజంలో వున్నది 'సామాజిక పెట్టుబడి'.

ఇప్పుడు 'ఫిక్సెడ్ పెట్టుబడి'ని గురించే ఇంకా కొన్ని విషయాలు చూడాలి.

## 'ఫిక్సెడ్ పెట్టుబడి' కి సంబంధించి ఇంకా కొన్ని విషయాలు

'పని స్థలం'లో వుండే ఫిక్సెడ్ సాధనాలు అనేక రకాలుగా వుంటాయి. ముఖ్యంగా బిల్డింగూ, శ్రమ పరికరాలూ, పాత్రలూ — వగైరాలు. వీటిలో ప్రతీ ఒక్క దానికీ, దేని 'జీవిత కాలం' దానికి వుంటుంది. జీవిత కాలాన్ని 'టర్నోవర్ పీరియడ్' అనవచ్చు. ఒక యంత్రం 10 సం။ల వరకూ పనిచేసేదైతే దాని 'టర్నోవర్ పీరియడ్' 10 సం။లు. ఆ కాలం గడిచేటప్పటికి అది పాడైపోతుంది. మొదటి నించీ దాన్ని చాలా జాగ్రత్తగా వాడుకుంటే, అది ఇంకా కొంత ఎక్కువ కాలం మన్నితే మన్నవచ్చు. లేకపోతే గడువులోపలే పోవచ్చు. ఇలాంటివి ప్రత్యేక సందర్భాలు. ప్రత్యేక సందర్భాల్ని వదిలేసి, జనరల్‌గా చూస్తే, ఆ యంత్రానికి జీవిత కాలం 10 సం॥లే. ఇలా, ప్రతీ వస్తువు మన్నికకూ ఎంతో కొంత హద్దు వుంటుంది. దాని కోసం ఉపయోగించిన ముడి పదార్థాల ధర్మాల్ని బట్టీ, దాన్ని తయారుచేసిన పద్ధతిని బట్టీ దానికి ఆ జీవిత కాలం ఏర్పడుతుంది. ఆ రకం వస్తువుల్ని ఎప్పుడూ వాడుతూ వుండడం వల్ల వచ్చే అనుభవాలతో, దాని జీవిత కాలాన్ని అంచనా కట్టడం సాధ్యమవుతుంది.

ఒక 'పని స్థలం'లో వుండే బిల్డింగు టర్నోవరు కాలం 50 సం॥లూ, మగ్గం టర్నోవరు కాలం 10 సం॥లూ అయితే, బిల్డింగు ఒకసారి మారేటప్పటికి మగ్గం 5 సార్లు మారుతుంది. ఫిక్సెడ్ సాధనల్లో దేని టర్నోవరు కాలాన్ని బట్టి అది మారుతూ వుంటుంది. ఒక సాధనం సరికొత్తగా పనిలోకి దిగే సమయానికి మిగతా సాధనాలు కొంత కొంత పాతబడి, రక రకాల స్థితుల్లో వుండవచ్చు. ఏది పాతబడి పోతే అదే మారుతూ వుంటుంది. అంతేగానీ, ఫిక్సెడ్ సాధనాలన్నీ ఒక 'సెట్'గా ఒకే సారి మారవు. మొత్తం మీద అవి 'పని స్థలం'లో ఎప్పుడూ సిద్ధంగానే వుంటాయి.

ఒక మగ్గం విలువ 500. దాని జీవిత కాలం 5 సం॥లు. దాని ద్వారా జరిగే సంవత్సరపు ఉత్పత్తి 'ఇన్ని' మీటర్లు. అది ఎంత విలువని సరుకుకి ఇస్తుంది? ఒక్కొక్క మీటరు బట్టకీ మగ్గం బాపతుగా ఎంత విలువ చేరుతుంది? ఇలా లెక్కకట్టడం చాలా తేలికే. కానీ, పెట్టుబడిదారుడు ప్రతీ రోజూ ఈ లెక్కలన్నీ కట్టుకుంటూ కూర్చోడు. ప్రతీ 'పరిశ్రమ'కీ దాని ప్రత్యేకతని బట్టి ఎంతో కొంత 'ఫిక్సెడ్ పెట్టుబడి' వుంటుంది. దాని అరుగుదల గురించి కూడా పరిశ్రమలో ఒక 'జనరల్ అంచనా' వుంటుంది. ఆ అంచనాల ప్రకారమే ప్రతీ పెట్టుబడిదారుడూ ఆ ఖర్చులు రాసుకుంటాడు.

బిల్డింగు అరుగుదల ఖర్చుని ఎప్పుడూ 'అద్దె' పేరుతో రాస్తారు. ఇతర ఫిక్సెడ్ సాధనాల అరుగుదల ఖర్చుల్ని 'డిప్రిసియేషన్' పేరుతో రాస్తారు.

## వేరు వేరు ఫిక్సెడ్ సాధనాల ఖర్చులు :

ఒక 'పని స్థలం'లో 4 రకాల ఫిక్సెడ్ సాధనాలు వున్నాయి అనుకుందాం. వాటి జీవిత కాలాల్ని బట్టీ వాటి విలువల్ని బట్టీ, ఒక సంవత్సరానికి ఎంత విలువ వుంటుందో చూస్తే, అంత విలువ గల ఫిక్సెడ్ సాధనాలు ఆ 'పని స్థలం'లో ప్రతీ సంవత్సరమూ ఖర్చవుతాయి — అని తెలుసుకోవచ్చు.

ఫిక్సెడ్ సాధనాల ఖర్చు పట్టిక

| | 'పని స్థలం'లో ఉండే ఫిక్సెడ్ సాధనాలు | వాటి జీవిత కాలాలు | వాటి విలువలు | 1 సంవత్సరానికి ఖర్చయ్యే విలువ |
|---|---|---|---|---|
| 1. | బిల్డింగు | 60 సం.లు | 1200 | 1200 ÷ 60 = 20 |
| 2. | శ్రమ పరికరాలు | 10 సం.లు | 300 | 300 ÷ 10 = 30 |
| 3. | పాత్రలు | 5 సం.లు | 50 | 50 ÷ 5 = 10 |
| 4. | కుర్చీలూ, బల్లలూ | 8 సం.లు | 160 | 160 ÷ 8 = 20 |
| | మొత్తం ఫిక్సెడ్ సాధనాల ఖర్చు ఒక సంవత్సరానికి | | | = 80 |

ఈ పని 'స్థలం'లో ప్రతీ సంవత్సరం 80 విలువ గల ఫిక్సెడ్ సాధనాలు ఖర్చవుతాయి.

ఒక 'పరిశ్రమ'లోని పెట్టుబడిదారులందరి దగ్గిరా ఈ 'డిప్రిషియేషన్' ఖర్చులు జనరల్‌గా ఒకే రకంగా వున్నా, అందులో ఎవరి ప్రత్యేక పరిస్థితులు వాళ్ళకి వుంటాయి. కాబట్టి, వాళ్ళ ఖర్చులు కొన్ని కొన్ని తేడాలతోనే వుంటాయి. ఒక పరికరం మన్నికకు ఒక జనరల్ అంచనా వున్నా, ఆ రకం పరికరాలన్నీ గిరి గీసినట్టు ఒకే కాలంపాటు పని చెయ్యవు. ఆ అంచనా, 'సగటు అంచనా' మాత్రమే. 10 మంది పెట్టుబడిదారుల దగ్గిర 10 మగ్గాలు వున్నప్పుడు, వాటిలో ఎక్కువ మగ్గాలు చిన్న చిన్న తేడాలతో ఒకే అంచనా ప్రకారం వుంటాయి. కానీ కొన్ని మగ్గాలు ఇటూ అటూగా కూడా వుండవచ్చు.

**ఫిక్సెడ్ సాధనాల మన్నిక :** ఒక పరికరం విలువ 8 అనుకుందాం. జనరల్ అంచనా ప్రకారం దాని జీవిత కాలం 5 సం॥లు. కానీ ఒక పెట్టుబడిదారుడి దగ్గిర ఆ పరికరం 5 సం॥లకే పాడైపోకుండా 10 సం॥లు పని చేసిం దనుకుందాం. ఆ 10 సం॥ల కాలంలో అలాంటి కొత్త పరికరం విలువ మార్కెట్లో ఏమీ మారలేదనుకుందాం. 5 సం.లు మన్నవలసిన పరికరం 10 సం.లు మన్నింది కాబట్టి, అది ఆ 10 సం.ల కాలంలో సరుకుకి 8 విలువని ఇచ్చినట్టా, 16 విలువని ఇచ్చినట్టా? — 8 విలువనే ఇచ్చినట్టు. 10 సం.ల వరకూ 8 విలువ గల ఒక్క పరికరమే పనిచేసింది కాబట్టి, ఆ పరికరం ద్వారా, ఆ 10 సం.ల కాలంలో తయారైన సరుకుకి, 8 విలువే చేరుతుంది. కానీ, ఈ పెట్టుబడి దారుడికి, ఈ పరికరం ద్వారా, 5 సం. లకే 8 విలువ తిరిగి వచ్చి, తర్వాత 5 సం.లకు ఇంకో 8 కూడా వస్తుంది. ఎలాగంటే: ఆ పరికరం 5 సం॥లకే పాడైపోవడం జనరల్ పరిస్తితి. అందరి దగ్గిరా అలాగే జరుగుతుంది. అంటే ఆ పరికరం 5 సం॥ల కాలంలో, 8 విలువని ఇవ్వడం జనరల్ పరిస్తితి. అయితే ఒక పెట్టుబడిదారుడి దగ్గిర ఆ పరికరం 10 సం॥ల వరకూ మన్నితే అది 'ప్రత్యేక పరిస్తితి'. ఆ ప్రత్యేక పరిస్తితి, ఆ పెట్టుబడిదారుడికి కొంత ఎక్కువ 'లాభాన్ని' ఇస్తుంది. ఆ పరికరం వున్న పెట్టుబడిదారుడు, దాని ద్వారా మొదటి 5 సం॥ల్లో 8 విలువని వెనక్కి తీసుకుంటాడు. కానీ అప్పటికి ఆ పరికరం పాడైపోదు. కాబట్టి, వెనక్కి వచ్చిన 8 తో వాడు కొత్త పరికరం కొననక్కర లేదు. పాత పరికరమే ఇంకో 5 సం॥లు పని చేస్తుంది. దాని పేరుతో సరుకు ద్వారా ఇంకో 8 విలువ వస్తుంది. అంటే ఆ పరికరం వల్ల 10 సం॥ల కాలంలో 8 విలువ గాక, 16 విలువ వస్తుంది. అప్పుడు కొత్త పరికరాన్ని కొనాలి. ఒక 8 తో కొత్త పరికరాన్ని కొంటే, ఇంకో 8, పెట్టుబడిదారుడికి పూరికే వచ్చినట్టు అర్థం. నిజానికి ఆ పరికరం 5 సం॥లు మాత్రమే పనిచేస్తే, దాని విలువ మాత్రమే వెనక్కి వస్తుంది. ఆ విలువతో, కొత్త పరికరాన్ని కొనేస్తే, పాత పరికరానికి బదులు కొత్త పరికరం వచ్చినట్టు మాత్రమే అవుతుంది. అలా జరిగితే, దాని ద్వారా ఎక్కువ విలువ రావడానికి అవకాశం వుండదు. కానీ, ఒక పెట్టుబడిదారుడి పరికరం జనరల్ పరిస్తితి కన్నా ఎక్కువ కాలం మన్నింది కాబట్టి దానివల్ల వాడికి ఖర్చు తగ్గి, అది వాడికి ప్రత్యేక లాభంగా అందింది. మొదట ఖర్చు పెట్టకుండా సంపాదించే ఏ విలువ అయినా, ఆ సరుకు ద్వారా వచ్చే 'అదనపు విలువ'లో భాగమే అవుతుంది.

నిజానికి ఒక పరికరం ఎక్కువ కాలం మన్నినప్పుడు కూడా ఎక్కువ విలువని ఇవ్వదు. అలా కనపడిన సందర్భాలలో కూడా ఆ ఎక్కువ విలువ, ఆ పరికరం వల్ల వచ్చింది కాదు.

ఒక పరికరం, ఎక్కువ కాలం పనిచేసిందా, తక్కువ కాలం పని చేసిందా అనేది (ఎంత కాలం మన్నింది — అనేది) దాని 'ఉపయోగపు విలువ'కు సంబంధించిన విషయమే గానీ, 'విలువ'కు సంబంధించిన విషయం కాదు. ఒక పరికరం సగటు అంచనాని దాటి ఎక్కువ కాలం పనిచేసిందంటే 'ఎక్కువ ఉపయోగపు విలువని ఇచ్చిం దని' అర్థం. అంతే గానీ 'ఎక్కువ విలువని ఇచ్చిందని' అర్థం కాదు. ఆ పరికరం, మొత్తం తను పని చేసిన

కాలంలో, ఎంత ఉత్పత్తి చెయ్యడానికి ఉప యోగపడిందో, ఆ ఉత్పత్తి అంతటి మీదా దాని విలువ అయిన 8 మాత్రమే పరుచుకుంటుంది. అంటే, ఆ పరికరాన్ని 'ఉత్పత్తి చెయ్యడానికి ఖర్చయిన శ్రమ', ఆ పరికరం ఎంత కాలం పనిచేసిందో అంత కాలం వరకూ ఉపయోగ పడిందని అర్థం.

8 విలువ గల పరికరం 5 సం॥లు పనిచేసినా, 10 సం॥లు పనిచేసినా, దాని విలువ 8 మాత్రమే. అది 5 సం॥లు గాక, 10 సం॥లు పని చేస్తే పెట్టుబడిదారుడు దాని కోసం 8 గాక, 16 ఖర్చు పెట్టినట్టు అవదు. దాన్ని తయారు చెయ్యడానికి 8 గాక 16 శ్రమ పట్టినట్టు అవదు. దాని తయారీకి ఎక్కువ శ్రమ పడితేనే, అది, 'ఎక్కువ విలువ' కలదిగా వుంటుంది. అది ఎక్కువ విలువ కలది అయితేనే, దానివల్ల ఎక్కువ విలువ తిరిగి వస్తుంది. శ్రమ పరికరం వంటి ఒక వస్తువు ఇచ్చే 'ఉపయోగపు విలువ'కి గిరి గీసినట్టు ఖచ్చితమైన హద్దు వుండదు గానీ, అది ఇచ్చే 'విలువ'కు ఖచ్చితమైన హద్దు వుంటుంది. 5 సం॥లు పని చెయ్య వలసిన పరికరం, 10 సం॥లు పనిచేసినా, అది ఆ కాలంలో, తన విలువని మాత్రమే ఇస్తుంది గానీ రెట్టింపు విలువని ఇవ్వదు.

అయితే, 'శ్రమ పరికరం' అనేది పెట్టుబడిదారుడి 'స్వంత ఆస్తి'గా వుంటుంది కాబట్టి, దాని 'మంచి' అయినా, 'చెడ్డ' అయినా, ఆ పెట్టుబడిదారుడికే అందుతుంది. ఆ పరికరం సగటు కన్నా ఎక్కువ కాలం మన్నితే దాని వల్ల లాభమూ, సగటు కన్నా తక్కువ కాలంలోనే పాడైపోతే దాని వల్ల నష్టమూ — ఏది జరిగినా అది ఆ పెట్టుబడిదారుడికే.

ఈ రకంగా, శ్రమ పరికరాలు, పెట్టుబడిదారుడి స్వంత ఆస్తిగా వుంటాయి కాబట్టి, వాటి మన్నికలో ఎగుడు దిగుళ్ళ వల్ల వచ్చే లాభ నష్టాలు, పెట్టుబడిదారుడి స్వంత విషయాలుగా వుంటాయి.

కానీ, 'ఈ బిల్డింగు నాది, ఈ పరికరం నాది' అని వాటిమీద ఒక వ్యక్తికి ప్రత్యేక హక్కులు లేకుండా, ఉత్పత్తి సాధనాలన్నీ సమాజానికి సమిష్టిగా చెంది వుంటే, వాటి మన్నికలో ఎగుడు దిగుళ్ళ వల్ల వచ్చే లాభ నష్టాలు సమాజంలో అందరికీ సమానంగా చెందుతాయి. ఉత్పత్తి సాధనాలు అంచనాని మించి ఎక్కువగా మన్నడం వల్ల, ఆ 'సాధనాల' ఉత్పత్తిని కొంత తగ్గించవచ్చు. కొంత ఉత్పత్తి కోసం చెయ్యవలసిన శ్రమ తగ్గినప్పుడు, అందరి శ్రమల నించీ కొంత కొంత భాగం తగ్గుతుంది. లేదా, ఉత్పత్తి సాధనాలు తొందరగా పాడై, మామూలు కన్నా కొంత ఎక్కువ శ్రమ చెయ్యవలసి వస్తే, సమాజంలో అందరికీ కొంత కొంత శ్రమ పెరుగుతుంది. ఈ రకంగా ఉత్పత్తి సాధనాలూ, మనుషులూ 'సమిష్టి సంబంధాల'లో వున్నప్పుడు, ఏ రకమైన మంచి చెడ్డలైనా, ఏ రకమైన కష్ట సుఖాలైనా, అందరికీ ఒక్కలాగే చెందుతాయి. <u>అలాంటప్పుడు వ్యక్తులు విడి విడిగా లాభ పడడం గానీ, విడి విడిగా నష్టపడడం గానీ, జరగదు.</u>

<u>ఏ విషయంలోనైనా, సమాజం అంతటి తోటీ సంబంధం లేకుండా, వ్యక్తులకు విడి విడిగా కలిగే లాభ నష్టాలే, కష్ట సుఖాలే, ఆ వ్యక్తులకు తమ 'అదృష్ట దురదృష్టాలు'గా కనపడతాయి.</u>

**ఫిక్సెడ్ సాధనాల సంరక్షణ :** 'ఫిక్సెడ్ సాధనాల్ని' ఎప్పుడూ మంచి కండిషన్‌లో వుంచాలంటే, వాటిని ఎప్పుడూ శుభ్రం చేస్తూ, అవసరమైన రిపేర్లు చేస్తూ వుండాలి. 'బిల్డింగు'ని శుభ్రంగా వుంచాలంటే, ఆ పని చేసే శ్రామికులూ; ఆ పనికి అవసరమైన నీళ్ళూ, చీపుళ్ళూ, బకెట్లూ, క్రిమిసంహారక మందులూ — వంటి సాధనాలు కావాలి. ఇవన్నీ అక్కడ తయారయ్యే సరుకుకోసం జరిగే పని క్రమానికి అవసరమైన ఉత్పత్తి సాధనాల కిందకే వస్తాయి. ప్రతీ ఫిక్సెడ్ సాధనాన్నీ దానికి అవసరమైన పద్ధతిలో దాన్ని సంరక్షణ చెయ్యాలి. ఈ ఖర్చులన్నీ 'మెయిన్‌టెనెన్స్' ఖర్చులూ, 'రిపేర్' ఖర్చులూ — అవుతాయి. అంటే, ఫిక్సెడ్ సాధనాల మీద, వాటిని కొన్నప్పటి ఖర్చులే గాక, ఎప్పటికప్పుడు ఇంకా కొంత విలువ ఖర్చవుతూ వుంటుంది. అది కూడా ఫిక్సెడ్ సాధనాల ఖర్చుగానే లెక్కకి వస్తుంది. ఫిక్సెడ్ సాధనాల నించి కొంత 'అరుగుదల' ఖర్చు సరుకుకి చేరినట్టే, ఈ మెయిన్‌టెనెన్స్ ఖర్చూ, రిపేర్ల ఖర్చూ కూడా, సరుకుకి చేరతాయి. సరుకుని అమ్మగానే ఇవి వెనక్కి వచ్చేస్తాయి.

అయితే, ఏ ఖర్చు అయినా సగటు అంచనాల్ని దాటకుండా వుండాలి. ఒక పెట్టుబడిదారుడి దగ్గిర ఒక శ్రమ పరికరం అస్తమానూ పాడైపోతూ వుంటే, దాన్ని రిపేరు చేయించడానికి సగటు కన్నా ఎక్కువ ఖర్చులు అవుతాయి. "నా శ్రమ పరికరం చాలా సార్లు పాడైంది. నాకు చాలా ఎక్కువ ఖర్చులయ్యాయి. కాబట్టి, నేను అమ్మే సరుకుకి ఎక్కువ విలువ ఇవ్వండి" అని వాడు తన సరుకుకి ఎక్కువ విలువని అడగలేడు.

ఒక పెట్టుబడిదారుడి శ్రమ పరికరానికి ఒక నెలలో ఏ రిపేర్‌లూ రాలేదనుకుందాం. అయినా, వాడు తన కొత్త సరుకు విలువ లోకి 'సగటు రిపేరు ఖర్చుల్ని' చేర్చుకో గలడు. 'సగటు రిపేరు ఖర్చుల్ని' చేర్చడానికి, అందరికీ అవకాశం వున్నట్టే, వాడికీ అవకాశం వుంటుంది. ఒక నెలలో ఏ రిపేరూ రాకపోయినా తర్వాత నెలలో సగటుని మించిన రిపేర్లు వస్తే రావచ్చు. ఒకవేళ, వాడి శ్రమ పరికరం చాలా మంచిదై, దానిమీద రిపేర్లు ఎప్పుడూ తక్కువగానే వున్నాయనుకుంటే, సరే, అది వాడి "అదృష్టం"! రిపేర్ల మీద ఏమీ ఖర్చు చెయ్యకుండానే దాని పేరుతో సరుకుకి

కొంత విలువని చేర్చగలడు. దానివల్ల వాడి 'లాభం' కొంత ఎక్కువవుతుంది. ఇలాంటి ప్రత్యేక సందర్భాలు 'లాభ' రహస్యాన్ని మరింత మరుగు పరుస్తాయి. ఎలాగంటే: శ్రమ పరికరాల మీద రిపేర్లు తక్కువగా వుంటే లాభం ఎక్కువగా వుండడమూ, రిపేర్లు ఎక్కువైతే లాభం తగ్గడమూ — జరుగుతాయి కాబట్టి, లాభం రావడం అనేది శ్రమ పరికరాలకు సంబంధించిన విషయమే — అని మరింత గట్టి నమ్మకం కలుగుతుంది.

మగ్గాన్ని తీసుకుంటే దానితో నేత పని జరగడం— ఒక రకం శ్రమ క్రమం. ఆ మగ్గాన్ని రిపేరు చెయ్యవలసివస్తే, అది ఇంకో రకం శ్రమ క్రమం. రిపేరు కార్మికులే వచ్చి నేత పని చెయ్యరు. దేని ఖర్చులు దానివే. కానీ, నేత పని జరగాలంటే, మగ్గం రిపేర్లు అవసరమే కాబట్టి, ఆ ఖర్చులన్నీ కూడా బట్ట విలువలోకి చేరతాయి.

ఫిక్సెడ్ సాధనాల 'మెయిన్‌టెనెన్స్' మీదా, 'రిపేర్ల' మీదా జరిగే ఖర్చుల్ని 2 రకాలుగా విభజించాలి. (1) ఆ పనులు చేసే కార్మికుల జీతాల మీద పెట్టే భాగం (2) ఆ పనుల కోసం కావలసిన ఉత్పత్తి సాధనాల మీద పెట్టే భాగం.— మొదటి భాగం 'అస్థిర పెట్టుబడి'లోకీ రెండో భాగం 'స్థిర పెట్టుబడి'లోకీ, చేరతాయి. రెండూ కూడా సరుకుకి చేరి, సరుకు కోసం 'ఖర్చయిన పెట్టుబడి'గా అవుతాయి. ఆ రిపేరు పని జరిగే క్రమంలో ఆ కార్మికుల ద్వారా కూడా 'అదనపు విలువ' వస్తుంది.

**పబ్లిక్ ఫిక్సెడ్ సాధనాలు :** ఫిక్సెడ్ సాధనాలు, 'పని స్థలం'లోనే కాదు, నిత్య జీవితంలో ప్రతీచోటా వుంటాయి. శ్రమతో తయారై, చాలా కాలం పాటు మన్నేది ఏదైనా ఫిక్సెడ్ సాధనమే. రోడ్లూ, కాలవలూ, నూతులూ, చెరువులూ, రైలు కట్టలూ, వంతెనలూ, రేవులూ, విమానాశ్రయాలూ, రైలు స్టేషనులూ, బస్ స్టాండులూ, వాటర్ ట్యాంకులూ — వగైరా, సమాజంలో వున్న మొత్తం నిర్మాణాలన్నీ ఫిక్సెడ్ సాధనాలే. బళ్ళూ, బస్సులూ, రైళ్ళూ, విమానాలూ వంటివి— పరిగెత్తే ఫిక్సెడ్ సాధనాలు. (రవాణా కార్మికుల శ్రమతో.)

మనుషుల, ఆధీనంలో వుండే ఎద్దులూ, గుర్రాలూ వంటివి— 'సజీవ ఫిక్సెడ్ సాధనాలు.' వీటన్నిటిలోనూ కొన్ని, వ్యక్తుల 'స్వంత' వాడకానికి ఉపయోగపడితే, కొన్ని కేవలం పెట్టుబడిదారుల 'పని స్థలాలలో' ఉపయోగపడతాయి.

రోడ్లూ, వంతెనలూ, రైలు స్టేషన్లూ— వంటి పబ్లిక్ నిర్మాణాలన్నీ 'ప్రభుత్వ' ఆస్తులు. అంటే, సమాజానికంతటికీ 'సమిష్టి' ఆస్తులు. కానీ, పెట్టుబడిదారీ సమాజంలో, ఈ 'సమిష్టి' ఆస్తిని, పెట్టుబడిదారీ వర్గం ఉపయోగించుకున్నంతగా, కార్మిక వర్గం ఉపయోగించుకోడానికి అవకాశాలు వుండవు. పెట్టుబడిదారీ సమాజంలో వుండే 'సమిష్టి' ఆస్తులు, పెట్టుబడిదారులకు మాత్రమే సమిష్టి ఆస్తులు. అంటే, వాళ్ళల్లో ప్రతీ ఒక్కడికీ వ్యక్తిగత ఆస్తులు వేరే వుండగా, ఈ ప్రభుత్వ ఆస్తులు వాళ్ళందరికీ సమిష్టిగా ఉపయోగించుకోడానికి వీలైనవిగా వుంటాయి. అందుకే, పెట్టుబడిదారీ సమాజపు సమిష్టి ఆస్తులు, పెట్టుబడిదారీ వర్గానికే సమిష్టి ఆస్తులు. ఈ 'సమిష్టి తనం'లో కార్మికులకు వుండే చోటు చాలా తక్కువ. దాదాపు అది లేనిదానితో సమానం.

ఫిక్సెడ్ సాధనాల్ని పునర్నిర్మించే పద్ధతి, ఆ ఫిక్సెడ్ సాధనాల స్వభావాల్ని బట్టి రక రకాలుగా వుంటుంది. బిల్డింగులూ, వంతెనలూ, వంటివి పాతబడిపోయి నప్పుడు, వాటిని పూర్తిగా కూలగొట్టి కొత్త వాటిని నిర్మించాలి. కానీ, రోడ్లూ, రైలుకట్టలూ, లాంటి వాటిని ఎక్కడ పాడైతే అక్కడ మార్చవచ్చును. అంతా ఒకే సారి మార్చనక్కరలేదు — ఇలా.

**ఫిక్సెడ్ సాధనాల అద్దె :** ఇంటిని ఉదాహరణగా తీసుకుందాం. ఒక ఇంటి విలువ 10 వేలు. ఆ ఇల్లు, ఏ భూమి మీద వుందో ఆ భూమి సంగతి వదిలేసి, ఇంటి సంగతి మాత్రమే తీసుకుంటున్నాము. ఆ ఇంటిని కొనాలంటే, 10 వేలు ఇస్తే సరిపోతుంది. ఇంటికి ఎంత విలువ వుందో అంత విలువనే ఇచ్చి 'ఇంటి'ని తీసుకున్నట్టు అవుతుంది. అది, 'సమాన విలువల మారకం'గానే వుంటుంది. కానీ ఆ ఇంటినే అద్దెకి తీసుకున్నప్పుడు, అది 'సమాన విలువల మారకం'గా వుండదు. ఈ విషయమే ఇప్పుడు చూస్తాం.

**A** అనే పెట్టుబడిదారుడు, ఒక ఇంటిని కట్టించడం కోసం **C + V** ల మీద 6 వేలు పెట్టుబడి పెట్టాడు. (భూమి సంగతి తీసుకోవడం లేదు.) ఇల్లు తయారైంది. దాని విలువ 10 వేలు. ఆ ఇంటిని **A, B** కి అమ్మాడు. ఇంటిని అమ్మగా వచ్చిన 10 వేలలో నించి 6 వేల పెట్టుబడిని వెనక్కి తీసుకుంటే, అదనపు విలువ 4 వేలు. అది ఆ ఇంటిని నిర్మించిన కార్మికులది.

ఆ ఇంటిని కొన్న **B**, దాన్ని అద్దెకి ఇచ్చే వుద్దేశ్యంతోనే దాన్ని కొన్నాడు. (లేదా, ఆ ఇంటిని **A** యే అద్దెకి ఇచ్చుకోవచ్చు. అది వేరే సంగతి.) ఇంటి కోసం **B** 10 వేలు పెట్టుబడి పెట్టాడు. ఇప్పుడు **B** యే ఇంటి యజమాని.

ఆ ఇంటి జీవిత కాలం 20 సం.లు అనుకుందాం. అంటే, అప్పటికి అది పాతబడిపోయి, ఇక నివసించడానికి పనికి రాదని అనుకోవాలి.

ఆ ఇంట్లో 20 సం.ల పాటు నివసిస్తే, అంత కాలం పాటు ఆ ఇంటిని వాడుకున్నందుకు 10 వేల విలువ ఖర్చవుతుందని అర్థం. (దాని మెయింటెనెన్స్ ఖర్చులు గాక.) 20 సం.లు పూర్తయిన తర్వాత అదే రకం ఇంటిని మళ్ళీ కట్టడానికి అయ్యే ఖర్చు, 10 వేల కన్నా

మారదు— అనుకుందాం. (మారితే మారిన విలువే లెక్కలోకి వస్తుంది. కానీ, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఇంటి విలువ 20 సం.ల వరకూ మారదు అనుకుంటున్నాము.)

ఆ ఇంటిని వాడుకోవడం వల్ల 20 సం॥లకు 10 వేలు ఖర్చు అయితే, 1 సం॥రానికి ఖర్చు 500. 1 నెలకి 42. ఇదే, ఆ ఇంటిని వాడుకోవడం వల్ల నిజంగా అయ్యే ఖర్చు. ఆ ఇంటిలో స్వంత వాళ్ళే నివసించినా, అద్దె వాళ్ళు నివసించినా, (దాన్ని 'అద్దె'కి ఇచ్చినా, స్వంతానికి వాడినా), దాన్ని వాడడం వల్ల ఖర్చయ్యేది నెలకి 42 మాత్రమే. (రిపేర్ల ఖర్చు గాక). అదే ఆ ఇంటికి, నెలకి వున్న అసలైన విలువ.

అయితే అద్దెకు ఇవ్వాలనే దృష్టితో 10 వేలు పెట్టి ఈ ఇంటిని కొన్న **B**, దాన్ని నెలకు 42 లెక్కనే అద్దెకు ఇచ్చాడనుకుందాం. **B** కి ప్రతినెలా అద్దె ద్వారా 42 వస్తూ వుంటుంది. 20 సం.లు అయ్యేసరికి 10 వేలు తిరిగి వస్తాయి. అప్పటికి ఇల్లు శిథిలమై పోతుంది.

తిరిగి వచ్చిన 10 వేలతో, **B**, మళ్ళీ కొత్త ఇల్లు సంపాదించగలడు. (మళ్ళీ కొత్త ఇల్లు కట్టించవచ్చు). అంటే, ఇంటి యజమాని, ఆ ఇంటిని కొనడానికి మొదట 10 వేలు ఖర్చు పెట్టి, దాని అద్దె ద్వారా తిరిగి ఆ 10 వేలే సంపాదించాడన్నమాట! ఇలా జరిగితే ఈ వ్యవహారానికేమీ అర్థం వుండదు. అద్దె ద్వారా ఇంటి విలువ తిరిగి రావడమే కాదు, పెట్టిన పెట్టుబడి మీద (10 వేల మీద) వడ్డీ, లాభమూ కూడా రావాలి. ఇంటి కోసం ప్రభుత్వానికి చెల్లించవలసిన 'పన్నులు' రావాలి. ఇప్పుడు 'భూమి'ని కూడా లెక్కలోకి తీసుకోవాలి. ఇల్లు ఏ భూమి మీద వుందో ఆ భూమికి అద్దె (కౌలు) కూడా రావాలి. ఈ అంశాలన్నీ కూడా ఇంటి అద్దె ద్వారానే రావాలి.

నెలకి, భూమి అద్దెని 40 అనీ, లాభమూ వడ్డీ వగైరాల్నీ 70 అనీ అనుకుందాం. అప్పుడు ఈ ఇంటి అద్దె, 42 + 40 + 70 = 152 అవుతుంది. ఇక తర్వాత, ఆ ప్రాంతంలో ఇళ్ళని అద్దెలకు తీసుకునే వాళ్ళు ఎక్కువ మంది వున్నారా, అద్దెలకు దొరికే ఇళ్ళు ఎక్కువగా వున్నాయా — అనే పరిస్థితుల్ని బట్టి ఆ 152 అద్దె కొంత తగ్గడం గానీ, ఇంకా హెచ్చడం గానీ జరుగుతుంది. ఆ రకంగా ఆ ఇంటి అద్దె 150 అయిందనుకుందాం. ఆ 150 లో నిజమైన అద్దె — 42. ఆ ఇంటిలో వున్న అసలు విలువకి ఏమీ సంబంధం లేని అబద్ధపు అద్దె — 108.

ఒక ఇంటిని కొన్నప్పుడైతే, దానికోసం చెల్లించేది దాని అసలు విలువే. అది, 'సమాన విలువల' మారకమే. కానీ ఆ ఇంటిని అద్దెకి తీసుకున్నప్పుడు, దానికి చెల్లించే అద్దె దాని విలువ మాత్రమే కాదు; అంత కన్నా ఎక్కువ. ఆ ఎక్కువ కోసమే, ఇంటి యజమాని దాన్ని అద్దెకి ఇస్తాడు. అది సమాన విలువల మారకంగా వుండదు.

ఈ ఉదాహరణలో, ఇంటి యజమాని, ప్రతీ నెలా నిజంగా ఖర్చయిన విలువని 42 ద్వారా వెనక్కి తీసు కుంటూ, ఆపైన ఇంకా 108 ని కూడా తీసుకుంటాడు.

ఆ ఇల్లు కట్టిన భూమి, ఆ ఇంటి యజమానికి 'స్వంత' భూమే అయితే, 'భూమి అద్దె' బైటికి పోకుండా, ఆ కుటుంబానికే వుండిపోతుంది. అలాగే ఆ ఇల్లు కట్టిన 'పెట్టుబడి' కూడా 'స్వంత పెట్టుబడే' అయితే, ఆ పెట్టుబడి మీద వడ్డీ కూడా బైటికి పోకుండా, ఆ కుటుంబానికే వుండిపోతుంది.

ఒకవేళ ఆ భూమీ, ఆ పెట్టుబడీ కూడా స్వంతానివి కాకపోతే, భూమి అద్దే, వడ్డీ — బైటికి పోతాయి. కానీ, ఆ పెట్టుబడి మీద 'లాభం' మాత్రం ఆ కుటుంబానికే అందుతుంది.

అంటే, 'అద్దె ఇల్లు' అనే సరుకు, తన స్వంత యజమానికి, ప్రతీ నెలా, ఇంటి కోసం పెట్టిన 10 వేల పెట్టుబడిలో నించి కొంత భాగాన్ని— వెనక్కి తెస్తూ, దానితో పాటు కొంత 'అదనపు విలువ'ని కూడా తెస్తూ వుంటుంది. అలా 20 సం॥లు అయ్యేటప్పటికి, ఇంటి మీద పెట్టిన పెట్టుబడి అంతా వెనక్కి వచ్చేసి, దాని మీద అన్ని సంవత్సరాలకూ 'అదనపు విలువ' వస్తుంది.

పెట్టుబడి అనే దాన్ని ఏ 'సరుకు' మీద పెట్టినా, అది తన విధ్యుక్త ధర్మాన్ని చాలా ఖచ్చితంగా నెరవేరుస్తుంది. ఏ రంగంలోనైనా ఆ ధర్మం నెరవేరకపోతే ఆ రంగంలోకి పెట్టుబడి దిగనే దిగదు. అద్దె ఇంటి యజమాని, ఇంటి 'అద్దె' ద్వారా లాగే 'అదనపు విలువ', ఆ ఇంటి యజమాని శ్రమ కాదు. అది, ఆ యజమాని, 'శ్రమ పడకుండా' సంపాదించే భాగం.

అయితే, అది 'ఎవరి శ్రమ?'— ఆ ఇంటిని కట్టినప్పుడు పని చేసిన కార్మికుల 'అదనపు శ్రమా?'— కాదు. ఆ ఇంటిని **A** కట్టించి **B** కి అమ్మాడని చూశాం. ఆ ఇంటిని కట్టిన కార్మికుల అదనపు విలువ 4 వేలు **A** చేతికే వెళ్ళిపోయిందని కూడా చూశాం. ఒకవేళ, ఆ ఇంటిని **B** యే కట్టించుకుని వుంటే, ఆ 4 వేల అదనపు విలువ **B** కే అందేది. కానీ దాని సంగతి ఇక్కడ అనవసరం. ఆ దశ అయిపోయింది. ఇప్పుడు, ఇంటిని అద్దెకి ఇవ్వడం ద్వారా వచ్చే 'అదనపు విలువ' సంగతే ఇక్కడ చూడాలి. ఈ 'అదనపు విలువ' ఎవరిది? ఇది, ఆ ఇంటిని కట్టిన కార్మికులది కాదు. ఇది ఎవరిదో తెలియాలంటే, ఆ ఇంటిని అద్దెకి తీసుకున్నది ఎవరో తెలియాలి. ఆ ఇంటిని ఒక కార్మికుడుగానీ; లేదా, ఒక పెట్టుబడిదారుడు, తన పని స్థలంగాగానీ—అద్దెకి తీసుకోవచ్చు.

ఆ ఇంటిని ఒక కార్మికుడు అద్దెకు తీసుకున్నా డనుకుందాం. ఆ అద్దెని కార్మికుడు తన 'జీతం'లో నించే చెల్లిస్తాడు. అద్దెలో 42 వరకూ అయితే, 'ఇల్లు' అనే

వస్తువుని ఒక 'నెల' రోజులు వాడుకున్నందు కోసం 'న్యాయంగా' చెల్లించవలిసిందే. అది, తీసుకున్న వస్తువుకి సంబంధించిన 1 నెల విలువని చెల్లించడం. ఇంకా ఆ పైన వున్న 108 మాత్రం తీసుకున్న వస్తువుతో సంబంధం లేని విలువ. అంటే, ఇంటి యజమాని, ఇంటిని అద్దెకు తీసుకున్న వ్యక్తికి, 42 విలువ గల వస్తువుని ఇచ్చి, దానికి బదులుగా 150 విలువని లాగుతున్నాడన్నమాట! ఇంటిని అద్దెకి ఇచ్చే యజమానికీ, ఇంటిని అద్దెకి తీసుకునే వ్యక్తికీ జరిగే మారకం — 'సమాన విలువల మారకం' కాదన్నమాట!

ఆ ఇంటిని అద్దెకు తీసుకున్న కార్మికుడు, అద్దె కోసం 150 గాక, 42 ని మాత్రమే చెల్లిస్తే, అతని జీతంలో ఎంతో భాగం అతనికే మిగులుతుంది. దాన్ని ఆ కార్మిక కుటుంబమే తన పోషణ కోసం కొంచెం సౌఖ్యంగా వాడుకోగలుగుతుంది. అసలు ఈ కార్మికుడు తను పని చేసే చోట కొంత విలువని పోగొట్టుకుంటాడు. అది అలా వుండగా, ఈ అద్దె ఇంటి వల్ల, తన జీతం లోనించి కూడా, కొంత పోగొట్టుకుంటాడు. ఇది కూడా ఇంటి యజమాని చేసే శ్రమ దోపిడీయే. అయితే, ఇక్కడ దోపిడీ జరిగే మార్గంలోనే కొంచెం తేడా!

ఇంటి యజమాని, ఈ కార్మికుణ్ణి తన దగ్గిర పనికోసం పెట్టుకుని, అతని నించి అదనపు శ్రమని లాగడం ద్వారా ఈ దోపిడీ చేస్తున్నాడా?— అలా కాదు. ఇక్కడ 'అసమాన మారకం' ద్వారా దోపిడీ జరుగుతుంది. 42 విలువ గల వస్తువుకి ఎక్కువ అద్దెని వసూలు చెయ్యడం ద్వారా. ఆ ఎక్కువ అద్దె దేని కోసం అంటే, భూమి అద్దె, వడ్డీ, లాభాల కోసం. మార్గం ఏదైనా జరిగేది మాత్రం దోపిడీయే! ఇంటి యజమాని, ఎక్కువ అద్దెని లాగడం ద్వారా, ఆ కార్మికుడి శ్రమని తీసుకుంటున్నాడు.

ఇప్పుడు, ఉదాహరణని ఇంకో రకంగా చూద్దాం. ఆ ఇంటిని, ఒక బట్ట పెట్టుబడిదారుడు, తన 'పని స్థలం'గా అద్దెకి తీసుకున్నాడనుకుందాం. అప్పుడు, ఆ ఇల్లు, 'బట్ట' అనే సరుకు తయారీ కోసం అవసరమయ్యే 'ఫిక్సెడ్ సాధనం'గా వుంటుంది. ఆ బట్ట పెట్టుబడిదారుడు, ప్రతీ నెలా ఆ ఇంటికి అద్దెని, ఆ నెల రోజుల్లో తయారైన తన 'సరుకు విలువ'లో నించే చెల్లిస్తాడు.

పెట్టుబడిదారుడు 1 నెల అద్దెగా 150 చెల్లిస్తే అదంతా నిజంగా ఆ సరుకు కోసం జరిగిన ఖర్చే అవుతుందా? — కాదు. ఆ ఇంటికే అంత విలువ లేదు కాబట్టి, అక్కడ తయారైన సరుకుకి, ఆ ఇంటి ద్వారా, అంత విలువ చేరదు. ఆ సరుకుకి అంత విలువ అవసరమైనట్టు అర్థం కాదు. ఆ ఇంటి విలువలో 42 వరకూ మాత్రమే 'ఉత్పత్తి సాధనాల' భాగానికి సంబంధించింది. కానీ, పెట్టుబడి దారుడు ఇంకా 108 ని కూడా చెల్లిస్తాడు. అది, ఉత్పత్తి సాధనాల కోసం అవసరమైనది కాదు. ఇంటి యజమానికీ, ఇంటిని అద్దెకి తీసుకున్న బట్ట పెట్టుబడిదారుడికీ మధ్య జరిగే మారకం కూడా 'అసమాన విలువల' మారకమే. బట్ట పెట్టుబడిదారుడు, అద్దె కోసం చెల్లించవలిసిన ఎక్కువ భాగాన్ని ఎక్కడినించి తెచ్చి చెల్లిస్తాడు? — ఇంకెక్కడి నించి? తన సరుకుద్వారా వచ్చే అదనపు విలువలో నించే. అద్దె కోసం, ఆ 108 ని చెల్లించ వలిసిన అవసరం లేకపోతే, అది ఆ పెట్టుబడిదారుడికే మిగులుతుంది. ఆ 108 ని, బట్ట పెట్టుబడిదారుడు తిన్నా, లేదా ఇంటి యజమాని తిన్నా, ఎలా జరిగినా, అది, బట్ట వాడి దగ్గిర పనిచేసే కార్మికుల అదనపు విలువలో భాగమే.

దీన్ని బట్టి, 'ఫిక్సెడ్ సాధనాల' విషయాలు సరిగా అర్థం చేసుకోవాలి. పెట్టుబడిదారుడు చూపించే లెక్కల్లో 'బిల్డింగు అద్దె – 150' అని చూపిస్తాడనుకుందాం. పెట్టు బడిదారుడు ఆ అద్దెని నిజంగానే చెల్లించి వుండవచ్చు. అయినా అదంతా కొత్త సరుకు కోసం అవసరమైన ఖర్చు అవదు. పెట్టుబడిదారుడు, వడ్డీ కోసం కొంత డబ్బుని నిజంగానే చెల్లించినా, అది సరుకు కోసం అవసరమైన ఖర్చు అవదు కదా? అలాగే, పెట్టుబడి దారుడు, 'పని స్థలంగా ఒక ఇంటి కోసం చెల్లించే' అద్దె సంగతి కూడా అంతే. ఆ అద్దెలో కొంత భాగాన్నే నిజమైన విలువ గానూ, మిగిలిన భాగాన్ని, అదనపు విలువలో భాగం గానూ అర్థం చేసుకోవాలి.

ఒక పెట్టుబడిదారుడు, తన స్వంత బిల్డింగునే తన 'పని స్థలం'గా పెట్టుకున్నాడనుకుందాం. ఆ బిల్డింగుకి నిజమైన విలువ నెలకి 100 అయితే, పెట్టుబడిదారుడు దానికి 300 అద్దె తీసుకుంటూ, దాన్నే లెక్కల్లో రాస్తా డనుకుందాం. బిల్డింగుకి అద్దెగా ఎంత చెల్లిస్తే అంతా నిజంగా అక్కడ తయారయ్యే సరుకు కోసం ఖర్చయినట్టు అర్థం కాదు. ఈ ఉదాహరణలో, నిజం అద్దె 100. దొంగ అద్దె 200. నిజం అద్దె— 'స్థిర పెట్టుబడి'లో భాగం అయితే, దొంగ అద్దె — 'అదనపు విలువ'లో భాగం.

మొత్తం సమాజాన్ని తీసుకుంటే, ఇళ్ళకీ, పని స్థలానికీ చెల్లించే అద్దెల్లో చాలా భాగం సమాజంలో వున్న కార్మికుల అదనపు విలువే అన్నమాట!

ఇంటిని అద్దెకి ఇవ్వకుండా, దాన్ని స్వంత వాళ్ళే వాడుకుంటే, అది ఆ కుటుంబానికి 'ఉపయోగపు విలువ' గానే వుంటుంది. ఆ ఇల్లు పాతబడి పోయేటప్పటికి, ఆ ఇంటి ద్వారా ఆ కుటుంబానికి 'డబ్బు'గా ఒక్క పైసా కూడా రాదు. కానీ, అన్ని సంవత్సరాలపాటు నివసించడానికి ఉపయోగపడిన 'ఆశ్రయం'గా వుంటూ అది ఖర్చయి పోతుంది.

ఒక అద్దెల పెట్టుబడిదారుడు, కొన్ని బళ్ళు కొని (సైకిళ్ళూ, రిక్షాలూ, ఆటోలూ, టాక్సీలూ, లారీలూ,

బస్సులూ— ఇలాంటివన్నీ) వాటిని అద్దెలకు ఇచ్చే వ్యవహారం చేస్తున్నాడనుకుందాం. ఆ బళ్ళని అద్దెలకు ఇవ్వడం ద్వారా వాడు సంపాదించే ఎక్కువ విలువ, ఆ బళ్ళని ఉత్పత్తి చేసిన కార్మికులదా? — కాదు. అద్దెలవాడు ఒక బండిని కొనేటప్పుడు దాని విలువని పూర్తిగా చెల్లించేసి కొంటాడు. బళ్ళని అద్దెలకు ఇవ్వడం వల్లనే, వాటి మీద పెట్టిన పెట్టుబడికన్నా ఎక్కువ విలువని సంపాదిస్తాడు.

కార్మికులు కూడా అద్దెలకు తీసుకునే రకపు వస్తువులు కొన్ని వుంటాయి. చౌక రకపు ఇళ్ళు, సైకిళ్ళు, కొన్ని రకాల పాత్రలూ, బట్టలూ లాంటివి.

వస్తువుల్ని అద్దెలకు ఇవ్వడం ద్వారా లాభాలు సంపాదించే పెట్టుబడిదారుడు, ఆ 'అద్దె'ని ఒక కార్మికుడి నించి తీసుకున్నప్పుడు, ఆ అద్దె ద్వారా వచ్చే లాభం, ఆ కార్మికుడి జీతంలో భాగం. అద్దెని పెట్టుబడిదారుడి నించి తీసుకున్నప్పుడు, ఆ అద్దె ద్వారా వచ్చే లాభం, ఆ పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేసే కార్మికుల అదనపు విలువలో భాగం. ఎలా చూసినా, అద్దెల వాడు సంపాదించే లాభాలన్నీ కార్మికుల శ్రమ ఫలితమే. అంటే, వస్తువుల్ని అద్దెలకు ఇవ్వడం ద్వారా లాభాలు సంపాదించేవాడు కూడా, ఇతరుల శ్రమ ఫలితాన్ని తినే దోపిడీ గుంపులోకి చేరేవాడే.

'అద్దె ఇంటి' ఉదాహరణని చూడడం ప్రారంభించినప్పుడు, ఆ ఇల్లు ఏ భూమి మీద వుందో ఆ భూమి విలువని చేర్చకుండా ఇంటి విలువనే చూస్తున్నట్టు చెప్పకున్నాం. ఎందుకంటే, ముడిభూమి — ప్రకృతి సహజ పదార్థం కాబట్టి, దానికి విలువ వుండదు. 'భూమి విలువ' పేరుతో కొంత విలువని సరుకు విలువలోకి చేరిస్తే, అది అబద్ధపు విలువ అవుతుంది కాబట్టి, ఆ విలువని చేర్చకుండా ఇంటికి ఉండే అసలు విలువని అర్థం చేసుకోవాలని అలా చూశాం. కానీ, దోపిడీ సమాజాల్లో, ముడి భూమికి కూడా కొంత విలువ వున్నట్టే లెక్కలు కడతారు. భూమి విలువని కలపకుండా ఒక వస్తువు విలువని నిర్ణయించడం జరగనే జరగదు.

ఏ వస్తువు తయారవ్వాలన్నా కొంత పని స్థలం వుండాలి. అలాగే, ఫిక్సెడ్ సాధనాల్ని అద్దెలకు ఇచ్చే వ్యాపారం చెయ్యాలన్నా, వాటిని ఒక చోట పెట్టి వుంచడానికి ఒక స్థలం వుండాలి. అది 'ఉత్పత్తి స్థలం' అయినా, 'అద్దెల స్థలం' అయినా, పెట్టుబడిదార్లు ఆ స్థలాలకు విలువల్ని కట్టి, వాటిని కూడా అక్కడ జరిగే పనుల్లోకి చేరుస్తారు. అంటే మనం ఒక ఇంటి అద్దెని చూసినప్పుడు, లేదా ఏ సరుకు విలువని చూసినా, అందులో, ఆ సరుకు ఏ పని స్థలంలో తయారైందో ఆ భూమి విలువ కూడా కొంత ఉంటుంది. నిజానికి, సరుకుకి ఉండే అసలైన విలువ (భూమి విలువ లేకుండా, కేవలం శ్రమకు మాత్రమే సంబంధించిన విలువ) మనకు కనపడనే కనపడదు. అద్దె ఇల్లు అయినా, ఇంకే సరుకు అయినా.

'అద్దె వస్తువుల'కు పెద్ద పెద్ద రిపేర్లు, వాటి స్వంత యజమానులు చేయిస్తారు. చిన్న చిన్న రిపేర్లు అద్దెలకు పుచ్చుకునే వాళ్ళు చేయించుకుంటారు.

పెట్టుబడిదారుడి 'బ్యాలెన్స్ షీట్'లో బిల్డింగూ, ఇతర శ్రమ పరికరాలూ వుంటాయి కదా? 'బిల్డింగు'కి నెలకి 300 అద్దె చెల్లిస్తున్నట్టూ, ఇతర పరికరాల్లో కూడా కొన్నిటిని అద్దెలకు తెచ్చి కొంత కొంత అద్దెలు చెల్లించినట్టూ, 'బ్యాలెన్స్ షీట్'లో లెక్కలు కనపడతా యనుకుందాం. ఆ 'లెక్కల్ని' మనం యథాతథంగా తీసుకుని, ఆ విలువ అంతా నిజంగానే 'ఉత్పత్తి సాధనాల' కోసం ఖర్చయినట్టుగా భావించకూడదు. నిజమైన విలువ ఎంత వుండవచ్చునో గ్రహించి, దాన్ని మాత్రమే 'స్థిర' భాగంలోకి చేర్చాలి. మిగిలినదాన్ని 'అదనపు విలువ' భాగంలోకే చేర్చెయ్యాలి.

పెట్టుబడిదారుడి 'పని స్థలం'గా వుండే బిల్డింగు వాడి స్వంత బిల్డింగే అయితే, ఆ బిల్డింగు అద్దెగా వాడు తీసుకునే దానిలో నించి కొంత భాగం 'వాడి జేబులోకే' పోతుంది కాబట్టి, పెట్టుబడిదారుడి జేబుల సంఖ్య ఇప్పుడు 7 కాదు, 8. ఈ జేబుల సంఖ్యని వూరికే లెక్క పెట్టడం కాదు. ఒక్కొక్క జేబూ పెరగడం చూసినప్పుడల్లా, శ్రామిక వర్గం ఎందుకింత పేదతనంలో వుందో, అది ఎన్ని మార్గాల్లో దోపిడీ అయిపోతోందో, ఇంకా ఎక్కువ స్పష్టంగా గ్రహిస్తూ వుండాలి. పెట్టుబడిదారుడికి ఇంకో 'జేబు' పెరగడం అంటే, కార్మికుల శ్రమ ఫలితాన్ని లాగెయ్య డానికి ఇంకో మార్గం పెరగడమే. స్వంత శ్రమ లేకుండా తిని కూర్చునే ఇంకో గుంపు పెరగడమే — అని అర్థం చేసుకోవాలి.

# అంతస్తులపై అంతస్తులు పెట్టుబడిదారీ పద్ధతే

బిల్డింగుల్ని అంతస్తుల మీద అంతస్తులుగా లేపడం ఆ 'శ్రమ క్రమం'లో పాల్గొనే మనుషులకు హాని కలిగించే విషయం. ఏ శ్రమ అయినా, ఆ శ్రమ చేసే మనుషులకు హాని కలగని పద్ధతిలోనే సాగాలి. కానీ, పెట్టుబడిదారీ విధానం సరిగ్గా దీనికి వ్యతిరేకం. బిల్డింగుల్ని కట్టించి అమ్మడం కూడా సరుకు ఉత్పత్తి శాఖల్లో ఒక శాఖ. పెట్టుబడిదారులు బిల్డింగుల్ని ఆకాశంలోకి లేపుకుంటూ పోతారు. ఎందుకంటే, ఆకాశాన్ని చూద్దామని కాదు. అంత ఎత్తు డబ్బు రాసిని చూద్దామని! ఒక పెట్టుబడిదారుడి ఆధీనంలో వుండే భూమి ఎంతో కొంత పరిమితిలోనే

వుంటుంది. ఆ వున్న కొంత భూమితోనే డబ్బు మాత్రం అనంతంగా సంపాదించాలి. ఆ కొంత భూమి మీదే ఇళ్ళు కట్టి అమ్మదల్చుకున్నప్పుడు, ఇల్లు మీద ఇల్లు కట్టడం తప్ప ఇంకో మార్గం వుండదు. అందుకే, పెట్టుబడిదారుడు అంతస్తుల మీద అంతస్తులు పెంచుకుంటూ పోతాడు. ఇది ఆ అంతస్తులు కట్టడంలో పాల్గొనే శ్రామికులకు ఎన్నో రకాలుగా హాని కలిగించే విషయం. అంతే కాదు, ఆ 'మహా భవనం' పూర్తి అయిన తర్వాత, అందులో నివసించే వాళ్ళకి, అది చాలా ప్రమాదాలు తెచ్చిపెట్టే నివాసంగా తయారవుతుంది. కానీ, పెట్టుబడిదారుడి డబ్బు దృష్టి, ఈ విషయాలేవీ పట్టించుకోదు.

భూమి, ముక్కలు ముక్కలుగా వ్యక్తుల స్వంతానికి చెందేదిగా వుండకుండా, భూమి అంతా సమాజానికి సమిష్టిగా చెందేదిగా వుంటే, భూమిలో ఎంత భాగాన్నయినా విశాలంగా ఉపయోగించగలిగే పరిస్థితి సమాజానికి వుంటుంది. అప్పుడు సమాజం సహజమైన పద్ధతుల్లోనే ఇళ్ళ నిర్మాణం చేసుకోగలుగుతుంది. (ఈ విషయంలో, 'గ్రామానికీ పట్టణానికీ వైరుధ్యం' అనే అంశాన్ని కూడా చేర్చి అర్థం చేసుకోవాలి. పెట్టుబడిదారీ విధానంలో, జనాభాలో అధిక భాగం, గ్రామాల నించి పట్టణాలకు చేరే క్రమం సాగుతుంది. పట్టణాలలో ఇళ్ళ సమస్య పెరిగి పోతూ వుండడం వల్ల కూడా అంతస్తులపై అంతస్తుల పద్ధతి అనివార్యం అవుతుంది. (ఈ విషయాలు, ఈ సంపుటంలోనే, 'పెట్టుబడి విస్తరణ' చాప్టరులో చూస్తాం.)

పెట్టుబడిదారీ సమాజంలో, ప్రతీ సరుకూ కల్తీ అవుతుంది. భవనాలు కూడా పెట్టుబడిదారుడి 'సరుకు' గానే తయారవుతాయి కాబట్టి, అవి కూడా అనేక కోణాల్లో 'కల్తీ' సరుకుగా తయారవుతాయి. కేవలం పైకి ఆడంబరంగా కనపడుతూ, లోపల నిజమైన సౌకర్యాలు లేక పోవడం — అనే పద్ధతిలోనూ, నెత్తి మీద వేలాడే కత్తి లాగ ఏ క్షణాన్నయినా కూలిపోయే రకం గానూ, అవి కల్తీ అవుతాయి. నిజమైన సుఖ శాంతులు ఇవ్వగలిగే లక్షణాలు పెట్టుబడిదారుడి సరుకులో ఏ కోశానా వుండవు కాబట్టి, కట్టడాల సంగతీ అంతే.

## 'పెట్టుబడి విభజన' గురించి ఆర్థికవేత్తలు

'పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం'లో, 'స్థిర పెట్టుబడీ, అస్థిర పెట్టుబడీ' అనే మాటలు గానీ, ఆ విషయాలకు సంబంధించిన అవగాహన గానీ వుండవు. 'పెట్టుబడి'లో, ఉత్పత్తి సాధనాల మీద పెట్టే భాగం, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వదనీ; 'జీతాల' మీద పెట్టే భాగమే ఎక్కువ విలువని ఇస్తుందనీ — పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు గ్రహించలేదు. (ఈ నాటికైనా ఈ విషయం గ్రహించడం వాళ్ళకు ఇష్టం వుండదు.) కాబట్టి, వాళ్ళ 'గ్రంథాలలో' ఆ అవగాహనని ఇచ్చే మాటలూ, ఆ విభజనా వుండవు. వాళ్ళు, పెట్టుబడిని 'ఫిక్సెడ్ పెట్టుబడి' అనీ, 'చలామణీ పెట్టుబడి' అనీ మాత్రమే విభజిస్తారు. అది కూడా చాలా తప్పు తప్పులుగానే.

అంతే గాక, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, ఫిక్సెడ్ — చలామణీ అంశాల విభజన ద్వారా, వేరు వేరు శాఖల్లో పెట్టుబడుల మధ్య లాభాల తేడా సమస్యని కూడా పరిశీలించగలం — అనుకున్నారు.

ఒక శాఖలో పెట్టుబడి ఎక్కువ లాభాన్ని ఉత్పత్తి చేస్తే, ఇంకో శాఖలో పెట్టుబడి తక్కువ లాభాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఇలా ఎందుకు జరుగుతుందో ఆర్థిక శాస్త్రం వివరించగలగాలి. లాభాల ఉత్పత్తి వేరు వేరు శాఖల్లో ఎక్కువ తక్కువలుగా ఎందుకు జరుగుతుందంటే, 'ఉత్పత్తి సాధనాల' మీదా 'జీతాల' మీదా (స్థిర, అస్థిరల మీద) వుండవలసిన భాగాలు అన్ని శాఖల్లోనూ ఒక్కలాగే వుండవు కాబట్టి. ఆ తేడాల్ని బట్టి అదనపు విలువ ఉత్పత్తిలో తేడాలు ఏర్పడతాయి. (ఈ విషయం 2 వ సంపుటంలో, 'పెట్టుబడిదారీ ధర' చాప్టర్లో చూస్తాం). కానీ, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలకు 'స్థిర – అస్థిర' దృష్టే వుండదు కాబట్టి, వేరు వేరు శాఖల మధ్యా; ఒక్క శాఖలోనే వేరు వేరు పెట్టుబడిదారుల మధ్యా, లాభాలలో తేడాలు ఎందుకు వస్తాయో తెలుసుకోలేరు. కానీ లాభాలలో తేడాలు ఏర్పడడం మాత్రం నిత్యజీవితంలో చూస్తూ వుంటారు కాబట్టి, అవి ఎలా ఏర్పడుతున్నాయో పరిశీలించడమే 'ఆర్థిక శాస్త్రం నిర్వహించవలసిన ప్రధాన కర్తవ్యం' అనుకున్నారు. లాభాలలో తేడాలకు కారణం, పెట్టుబడుల్లో వుండే ఫిక్సెడ్ – చలామణీ భాగాలు తేడాగా వుండడమే — అనుకున్నారు. విలువల్ని ఫుల్‌గా ఇవ్వడమూ, పీస్ మీల్‌గా ఇవ్వడమూ — అనే విషయాల్ని అర్థం చేసుకుంటే, లాభాల తేడాల సమస్యని అర్థం చేసుకోగలం — అనుకున్నారు. ఈ విషయం కోసమే, పెట్టుబడిలో, ఏది ఫిక్సెడ్ అంశం, ఏది చలామణీ అంశం — అనే విభజన మీదే దృష్టి పెట్టారు.

వింత ఏమిటంటే, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రానికి — 'లాభాలలో తేడాలు' ఎలా వస్తున్నాయో పరిశీలించడం ప్రధాన విషయం అయిందిగానీ, 'అసలు లాభాలు ఎలా

వస్తున్నాయో' పరిశీలించడం ప్రధాన విషయం కాలేదు! లాభాలు ఎలా వస్తాయో తెలిస్తేనే కదా, లాభాలలో తేడాలు ఎలా వస్తాయో తెలిసేది? లాభం గురించి ఏ అంశం తెలియాలన్నా, 'పెట్టుబడి'ని 'స్థిర–అస్థిర' భాగాలుగా చూడాలిగానీ, 'ఫిక్సెడ్–చలామణీ' భాగాలుగా చూస్తే చాలదు. 'స్థిర–అస్థిర' విభజన వల్ల, పెట్టుబడి ఎలా పెరుగుతుందో, దాన్ని ఏ అంశం పెంచుతుందో తెలుస్తుంది. ఉత్పత్తి సాధనాల విలువ సరుకుకి కేవలం బదిలీ అవుతుందనీ, 'జీతాల' విలువ పునరుత్పత్తి అవుతుందనీ, ఆ 'పునరుత్పత్తి క్రమం'లోనే జీతాలు తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఉత్పత్తి చెయ్యడానికి అవకాశం వుంటుందనీ — తెలుస్తుంది. 'ఫిక్సెడ్–చలామణీ' విభజనలో అయితే, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇచ్చే అంశమూ (అస్థిరా), ఇవ్వని అంశాలూ (స్థిరా) — అన్నీ కలిసిపోతాయి.

ఫిక్సెడ్–చలామణీ విభజన, పెట్టిన విలువలు ఎలా తిరిగి వస్తాయి — అనే 'టర్నోవర్' పరిశీలనకు సంబంధించినదే గానీ; పెట్టిన విలువ కన్నా, ఎక్కువ విలువ ఉత్పత్తి అవుతోంది — అనే 'ఉత్పాదక' పరిశీలనకు సంబంధించినది కాదు.

'పెట్టుబడిలో ఏ అంశం విలువ ఏ పద్ధతిలో తిరిగి వస్తుంది' అని చూడడం అంటే, పెట్టిన విలువలు తిరిగి రావడం గురించి చూడడమే. అంటే, పెట్టిన విలువల్ని మించిన 'కొత్త విలువ' ఒకటి వస్తోందనే విషయాన్ని చూసే ప్రసక్తే లేకపోవడం అన్నమాట. పెట్టుబడి ద్వారా కొత్త విలువ ఒకటి వస్తోందనీ, అది అంతకు పూర్వం ఎక్కడా లేనిదనీ, 'ఫిక్సెడ్–చలామణీ' విభజన వివరించదు. లాభ కారణాన్ని చూపించని పరిశీలన, లాభాల్లో తేడాల కారణాన్ని కూడా చూపించదు.

కానీ, 'లాభం' గురించి ప్రత్యేకంగా పరిశీలించవలసిన అవసరం లేదనీ, పెట్టుబడికి లాభం రావడం సహజమనీ భావించే అర్థికవేత్తలకు, 'స్థిర–అస్థిర' విభజనతో అవసరం వుండదు. ఇక, వాళ్ళకు మిగిలిన పరిశీలన, పెట్టుబడిగా వుండే ఏ అంశం విలువ ఎలా తిరిగి వస్తుంది — అనేదే.

'లాభ పరిశీలన'ని వదిలెయ్యడం అంటే, 'ఉత్పత్తి క్రమాన్ని' వదిలెయ్యడమే. అప్పుడు ఇక మిగిలేది 'చలామణీ క్రమమే'. పెట్టుబడిదారీ అర్థికవేత్తలు ఎంత సేపూ అర్థిక శాస్త్ర పరిశోధన అంతా చలామణీ రంగానికే పరిమితం చేస్తారు. వీరి పరిశీలనలో 'ఉత్పాదక పెట్టుబడి' దశ వుండనే వుండదు. 'డబ్బు పెట్టుబడి' దశని మాత్రమే కొంత చూస్తారు. దేన్ని చూడడం వల్ల ఏ సత్యమూ కనపడదో, ఏ ప్రయోజనమూ వుండదో, దాన్ని! వాళ్ళ పరిశీలన ఎంత సేపూ 'చలామణీ రంగం' చుట్టూ తిరుగుతూ వుండడం వల్లనే, ఏ విషయంలోనూ వాళ్ళు 'అంతర్గత కారణాల్ని' చూడలేరు. కేవలం పైపైకి కనపడే 'ఫలితాల్ని' మాత్రమే చూస్తారు. 'కారణాలు' తెలియకుండా 'ఫలితాల్ని' మాత్రమే చూస్తూ, ఆ ఫలితాలకు తప్పు తప్పు కారణాల్ని ఊహిస్తారు!

# సామాజిక పెట్టుబడి ( సోషల్ కాపిటల్ )

ఒక 'సమాజం'లో తయారయ్యే 'మొత్తం ఉత్పత్తి' కోసం ఖర్చయ్యే మొత్తం పెట్టుబడే 'సామాజిక పెట్టుబడి'. 'మొత్తం ఉత్పత్తి' అంటే, అది ఒక రోజుదైనా కావచ్చు, నెల రోజులదైనా కావచ్చు, సంవత్సరానిదైనా కావచ్చు. ఒక రోజు ఉత్పత్తినే చూస్తే, ఒక రోజు పెట్టుబడినే చూస్తాం. నెల రోజుల ఉత్పత్తిని చూస్తే నెల రోజుల పెట్టుబడినీ, సంవత్సరం ఉత్పత్తిని చూస్తే సంవత్సర పెట్టుబడినీ! సాధారణంగా, 'మొత్తం సామాజిక ఉత్పత్తి' అన్నప్పుడు, 'సంవత్సర ఉత్పత్తి'నే దృష్టిలో వుంచుకుంటాం. సమాజానికి కావలసిన ప్రధానమైన పంటలన్నీ సంవత్సరానికి ఒక సారే వస్తాయి. భూమి మీద పండే ఉత్పత్తులే, చాలా పరిశ్రమలకు ముడి పదార్థాలుగా వుంటాయి. ఉత్పత్తుల విలువలన్నీ సంవత్సరానికోసారి పెరగడమో, తరగడమో (గత సంవత్సరపు విలువకన్నా) జరుగుతాయి. కాబట్టి, 'సామాజిక ఉత్పత్తి' అన్నప్పుడు ఒక 'సంవత్సరపు ఉత్పత్తి'నే లెక్కలోకి తీసుకుంటాం. ఉత్పత్తి 'విలువ'ని పరిశీలించడానికి, ఒక రోజు ఉత్పత్తిని తీసుకున్నా, ఒక సంవత్సరపు ఉత్పత్తిని తీసుకున్నా, సూత్రాలన్నీ ఒకటే.

ఒక 'పెట్టుబడిదారీ దేశం' అన్నప్పుడు — అక్కడ పెట్టుబడిదారులూ, కార్మికులూ మాత్రమే వుంటారనీ, ఆ 2 రకాలకూ చెందనివాళ్ళు వుండనే వుండరనీ అర్థం కాదు. 'స్వతంత్ర ఉత్పత్తిదారులు' కూడా కొంత జనాభా వుంటారు. వారు తయారుచేసే ఉత్పత్తిని కూడా ఆ సమాజం వాడుతుంది. అయితే ఆ ఉత్పత్తి, అతి తక్కువగా మాత్రమే వుంటుంది. ఒక పెట్టుబడిదారీ దేశంలో ఒక సంవత్సరానికి సంబంధించిన మొత్తం ఉత్పత్తి విలువని 100 అనుకుందాం. అందులో, పెట్టుబడిదారుల ద్వారా ఉత్పత్తి అయినది 98% అనీ, స్వతంత్ర ఉత్పత్తిదారుల ద్వారా ఉత్పత్తి అయినది 2% అనీ అనుకుందాం. అంటే, స్వతంత్ర ఉత్పత్తిదారుల ఉత్పత్తిని, మొత్తం ఉత్పత్తితో

పోలిస్తే అతి స్వల్పం. అది అసలు లేనిదానితో సమానం. ఏ పెట్టుబడిదారీ దేశంలో అయినా స్వతంత్ర ఉత్పత్తి దారుల ఉత్పత్తి అతి స్వల్పంగానే వుంటుంది. కాబట్టి, పెట్టుబడి దారీ విధానాన్ని పరిశీలించేటప్పుడు స్వతంత్ర ఉత్పత్తి దారుల ఉత్పత్తిని లెక్కలోకి తీసుకోము (అది సమాజంలో వున్నప్పటికీ). పెట్టుబడిదారుల ద్వారా తయారయ్యే ఉత్పత్తిని మాత్రమే 'సమాజ ఉత్పత్తి'గా తీసుకుని, దాన్ని గురించే పరిశీలిస్తాము.

'సమాజం'లో మొత్తం 100 మంది పెట్టుబడిదారులు వున్నారనుకుందాం. ఆ సమాజంలో వుండే 'ప్రభుత్వం' కూడా ఒక పెట్టుబడిదారుడే. ప్రభుత్వం కూడా అనేక 'పరిశ్రమలు' నడుపుతూ, అనేక సరుకులు ఉత్పత్తిచేసి, అమ్మి, లాభాలు గడిస్తూ వుంటుంది. (ఆ 'ఆదాయం' అంతా ప్రభుత్వ ఖజానాలోకి వెళ్తుంది.) కాబట్టి, సమాజంలో వున్న 100 మంది విడి పెట్టుబడిదారులతో ప్రభుత్వాన్ని కూడా కలిపితే, మొత్తం 101 మంది పెట్టుబడి దారులు అవుతారు. ఈ 101 మంది పెట్టుబడిదారుల దగ్గిరా ఉత్పత్తి అయ్యే ఉత్పత్తే ఆ సమాజానికి వుండే 'మొత్తం ఉత్పత్తి'. ఆ మొత్తం ఉత్పత్తి కోసం ఖర్చయ్యే చలామణీ పెట్టుబడే 'సామాజిక పెట్టుబడి'.

'సామాజిక పెట్టుబడి' అనేది, ఒక విడి పెట్టుబడి దారుడి పెట్టుబడి కాదు. మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి వున్న పెట్టుబడి. ఈ పెట్టుబడితోనే ఈ వర్గం, సంవత్సర ఉత్పత్తిని చేయిస్తూ వుంటుంది.

ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, సమాజంలో మొత్తం 4 గురు పెట్టుబడిదారులే వున్నారనుకుందాం. వాళ్ళల్లో ప్రతీ ఒక్కడి దగ్గిరా ఒక సంవత్సరంలో ఖర్చయ్యే చలామణీ పెట్టుబడి కొంతా, ఖర్చుకాని ఫిక్సెడ్ పెట్టుబడి కొంతా వుంటాయి. వాళ్ళ పెట్టుబడులు ఇలా వున్నాయి అనుకుందాం.

| | | | | |
|---|---|---|---|---|
| 1 వ వాడి | ఫిక్సెడ్ | – 700 | చలామణీ | – 100 |
| 2 వ వాడి | ,, | – 800 | ,, | – 150 |
| 3 వ వాడి | ,, | – 500 | ,, | – 200 |
| 4 వ వాడి | ,, | – 1200 | ,, | – 80 |
| మొత్తం 4గురి | ,, | – 3,200 | ,, | – 530 |

సమాజానికి వున్న మొత్తం పెట్టుబడి = మొత్తం ఫిక్సెడ్ 3200 + మొత్తం చలామణీ 530 = 3,730. ఈ పెట్టుబడి అంతా, పని స్థలాలలో పనిచేస్తూనే వుంటుంది. కానీ, అరగని ఫిక్సెడ్ సాధనాల విలువ వెనక్కి వుండి, మిగిలిన విలువే 'చలామణీ పెట్టుబడి' అవుతూ వుంటుంది. ఈ లెక్కలు ఒక సంవత్సరానివి అనుకుంటే, ఆ సంవత్సరంలో జరిగిన మొత్తం ఉత్పత్తి, ఈ 4 చలామణీ పెట్టుబడులు ఖర్చవడం ద్వారానే జరిగినట్టు అర్థం. అంటే 530 తో. ఇదే ఆ సంవత్సరపు 'సామాజిక పెట్టుబడి'.

ఈ సంవత్సరంలో తయారైన సరుకు అంతా అమ్ముడై పోయినప్పుడు (అంటే, పెట్టుబడిదారులకూ, పెట్టుబడి దారులకూ మధ్యా; పెట్టుబడిదారులకూ, కార్మికులకూ మధ్యా, రక రకాల మారకాలతో సరుకు అంతా ఎక్కడికి చేరాలో అక్కడికి చేరిపోయినప్పుడు), ప్రతీ పెట్టుబడి దారుడికీ ఎవడి చలామణీ పెట్టుబడి వాడికి తిరిగి వచ్చేస్తూ, దానితోపాటు ప్రతీ వాడికీ 'అదనపు విలువ' కూడా వస్తుంది.

# సామాజిక సంపద ( సోషల్ వెల్త్ )

ఒక సంవత్సరంలో తయారైన మొత్తం ఉత్పత్తే ఆ సంవత్సరపు 'సామాజిక సంపద'. 'సామాజిక పెట్టుబడి'కి, 'అదనపు విలువ' కూడా కలిసిందే 'సామాజిక సంపద'. ఇది సమాజానికి $C^1$. సామాజిక పెట్టుబడి విలువకన్నా సామాజిక సంపద విలువ ఎక్కువగా వుంటుంది — ఇందులో 'అదనపు విలువ' కూడా వుంటుంది కాబట్టి. 'సామాజిక సంపద'లో' 'జీతాల' భాగాన్ని కార్మికవర్గం వాడుతుంది. 'అదనపు విలువ' భాగాన్ని 'పెట్టుబడిదారీ వర్గం' వాడుతుంది. 'ఉత్పత్తి సాధనాల' భాగం తిరిగి ఉత్పత్తి సాధనాలుగా మారుతుంది.

ఈ 'సామాజిక సంపద'లో', 'అదనపు విలువ' మాత్రమే కొత్తగా ఉత్పత్తి అయిన విలువ. మిగతాదంతా పాత విలువే. అందులో జీతాల విలువ 'పునరుత్పత్తి' అవుతుంది. 'ఉత్పత్తి సాధనాల' విలువ మళ్ళీ ఉత్పత్తి అవదు. అది సరుకుకి 'బదిలీ' మాత్రమే అవుతుంది. (ఖర్చయిపోయిన ఉత్పత్తులన్నీ ఎలా తిరిగి వస్తాయి— అనే అంశాన్ని, వాటి విలువ లెక్కలతో సహా ఈ సంపుటం లోనే, "సరుకు విలువ భాగాల్ని సరుకు పరిమాణం భాగాల ద్వారా చూడడం" అనే చాప్టర్లో చూస్తాం).

ఒక సంవత్సరపు 'సామాజిక ఉత్పత్తి'ని 120 అను కుందాం. (120 ని 120 లక్షలు అనుకోవచ్చు, 120 కోట్లు అనుకోవచ్చు. సంఖ్యల్ని వీలైనంత తక్కువ స్థాయిలో తీసు కుంటేనే విషయాలు తేలిగ్గా అర్థమవుతాయి.) ఆ సమా జంలో వున్న పెట్టుబడిదారులందరూ కలిసి తయారు చేయించిన ఉత్పత్తి అది. దాని చలామణీ పెట్టుబడి 100 అనుకుందాం. అందులో స్థిర – 80. అస్థిర – 20. అదనపు

విలువ — 20. మొత్తం ఉత్పత్తి విలువ — 120.

పెట్టుబడిదారులు వాడే 'గ్రాస్ – నెట్' అనే మాటలు వాడుతూ, మన అర్థాలతో ఈ విషయాల్ని చెప్పాలంటే, ఈ 120 విలువ గల మొత్తం ఉత్పత్తి — 'గ్రాస్' ఉత్పత్తి. ఇందులోంచి, దాని కోసం ఖర్చయిన 100 పెట్టుబడిని తీసేస్తే, మిగిలిన 20 విలువ గల ఉత్పత్తి – 'నెట్' ఉత్పత్తి.

'సామాజిక సంపద'కి ఇంకో పేరు — 'జాతీయ సంపద'. కానీ ఈ 2 మాటలూ కూడా అసలు నిజాన్ని మరుగు పరుస్తాయి. ఎలాగంటే: 'సామాజిక సంపద' అనే మాట, ఆ సంపద, సమాజానికంతటికీ సంబంధించినది — అనే అర్థాన్ని ఇస్తుంది. అలాగే, 'జాతీయ సంపద' అనే మాట కూడా, ఆ సంపద, జాతి కంతటికీ సంబంధించినది — అనే అర్థాన్ని ఇస్తుంది. నిజానికి ఆ సంపదలో శ్రామికవర్గానికి అందేది జీతాల భాగం మాత్రమే. మిగిలిన దంతా పెట్టుబడిదారీ వర్గానికే. కానీ 'సామాజిక సంపదా — జాతీయ సంపదా' అనే మాటల్లో ఆ తేడా లేమీ కనపడవు.

'సంపద' అనేది, శ్రమ చేసే జనాభాకి 'జీతాల' భాగం గానూ, శ్రమ చెయ్యని జనాభాకి 'అదనపు విలువ' భాగం గానూ విడిపోయే సమాజంలో, ఈ సామాజిక సంపదా, జాతీయ సంపదా అనే మాటలు, పూర్తిగా అర్థ రహితమైన మాటలే.

# ధనిక - పేద తేడాలు, మనుషులకే గానీ, ప్రాంతాలకూ, దేశాలకూ వర్తించవు

డబ్బూ, ఇతర ఆస్తులూ వున్న వ్యక్తులు ధనికులు. (అవి, ఆ వ్యక్తులకు ఎలా వస్తాయో వేరే చెప్పనక్కరలేదు.) కనీస పోషణ వస్తువుల కన్నా ఎక్కువగా ఏమీ వుండని వ్యక్తులు పేదలు. (వారు, పేదలుగా ఎందుకు వుంటారో కూడా వేరే చెప్పనక్కరలేదు) ఈ రకంగా మనుషుల్ని 'పేదలూ, ధనికులూ' అని విభజించగలం. కానీ, 2 దేశాల్ని 'ధనిక దేశం – పేద దేశం' అని విభజించడం అర్థరహితం. ఎందుకంటే: ఒక దేశాన్ని 'ధనిక దేశం' అన్నప్పుడు, అక్కడ వుండే మనుషులందరూ ధనికులేనా? అక్కడ పేదలు వుండరా? అక్కడ వుండే దోపిడీదారులు మాత్రమే ధనికులు. శ్రామికులందరూ పేదలే. కాబట్టి, మొత్తం దేశాన్ని 'ధనిక దేశం' అనడానికి వీలు లేదు. అలాగే, ఒక దేశాన్ని 'పేద దేశం' అనడానికి కూడా వీలు లేదు. అక్కడ వుండే శ్రామికులు మాత్రమే పేదలు. దోపిడీదారు లందరూ ధనికులే.

ధనికులూ, పేదలూ కూడా కలిసివున్న దేశం, ధనిక దేశమూ అవదు; పేద దేశమూ అవదు.

'ధనిక దేశం, పేద దేశం' అనే విభజన — ధనిక దేశంలో పేదలే లేనట్టూ; పేద దేశంలో ధనికులే లేనట్టూ —భ్రమలు కల్పిస్తుంది. ఈ విభజన, ధనిక – పేద తేడాల్ని గందరగోళ పరుస్తుంది. కాబట్టి, వ్యక్తుల్ని 'ధనికులూ, పేదలూ' అని విభజించినట్టుగా, దేశాల్ని 'ధనిక దేశం, పేద దేశం' అని విభజించకూడదు. అది అర్థ రహితమైన, హేతు విరుద్ధమైన విషయం.

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, ఇతర అన్ని విషయాలలో లాగే, ఈ విషయంలో కూడా తప్పు అవగాహనతోనే వుంటారు.

దేశాలు ప్రకృతి సహజంగానే ధనిక – పేద తేడాలతో వుంటాయి — అనేది, ఒక తప్పు అవగాహన.

ఒక దేశం పేద దేశంగానూ, ఇంకో దేశం ధనిక దేశం గానూ వుండడానికి ఆర్థికవేత్తలు ఏం కారణం చెపుతారు? 'ప్రకృతి సహజం'గానే అవి అలా వున్నట్టు చెపుతారు. భూమి మీద ఒక ప్రాంతానికీ, ఇంకో ప్రాంతానికి ప్రకృతి సహజంగా తేడాలు వుండే మాట నిజమే. కానీ, ఈ తేడాలు ఒక ప్రాంతాన్ని ధనిక ప్రాంతంగానో, పేద ప్రాంతంగానో చెయ్యవు. భూమి మీద ఒక చోట ధాన్యం పండితే, ఇంకో చోట గోధుమ పండుతుంది. ఒక చోట బొగ్గు దొరికితే, ఒక చోట చమురు దొరుకుతుంది. ఒక చోట కొండలు వుంటే, ఒక చోట అడవులు వుంటాయి. కొండల్లో ఔషధాలు దొరికితే, అడవుల్లో కలప దొరుకుతుంది. నదుల్లో మంచి నీళ్ళు దొరికితే, సముద్రాల్లో చేపలు దొరుకుతాయి. మానవులు జీవించడానికి ఈ రక రకాల వనరులన్నీ కావాలి. ఇందులో, ఏ పదార్థాన్ని ధనిక పదార్థం అనీ, ఏ పదార్థాన్ని పేద పదార్థం అనీ విభజించగలం?

ఎక్కువ శ్రమతో తయారయ్యే ఉత్పత్తి ఎక్కువ విలువతో వుంటే; తక్కువ శ్రమతో తయారయ్యే ఉత్పత్తి తక్కువ విలువతో వుంటుంది. 1 కిలో జొన్నల విలువకన్నా, 1 కిలో గోధుమల విలువ ఎక్కువగా ఉంటుంది. విలువ ఎక్కువ గల ఉత్పత్తి ధనవంతమైనదీ కాదు; విలువ తక్కువ గల ఉత్పత్తి పేదదీ కాదు. అలాగే జొన్నలు పండే

భూమి పేదదీ కాదు, గోధుమ పండే భూమి ధనవంతమైనదీ కాదు. ధనిక – పేద తేడాలు వస్తువులకు గానీ, ప్రాంతాలకు గానీ వర్తించవు.

అయితే, 'భూమి'ని కొంత మందే 'స్వంత ఆస్తి'గా ఆక్రమించి వుండడం వల్ల, భూమిలో ప్రత్యేకతలే, ధనిక – పేద తేడాలుగా కనపడతాయి. స్వంత ఆస్తి పునాది మీద ప్రతీ సహజ విషయమూ, అసహజ విషయంగా మారిపోతుంది.

భూమి మీద నివసించే మొత్తం మానవజాతి (జంతు జాతి కానిది) ఆ భూమి మీద అనేక తేడాలతో వున్న వనరులన్నిటినీ, ఒక ప్రాంతంలో వున్న వాటిని ఒక ప్రాంతానికి సరఫరా చేసుకుంటూ, 'విలువ' దృష్టి లేకుండా, ఆ వనరుల్ని 'సమిష్టి తనం'తో ఉపయోగించుకో గలిగితే, అన్ని ప్రాంతాలకూ అన్ని వనరులూ ఒకే రకంగా దొరుకుతాయి. అప్పుడు ఒక ప్రాంతం ధనిక ప్రాంతమూ కాదు, ఒక ప్రాంతం పేద ప్రాంతమూ కాదు.

మనుషులు ప్రకృతి విషయాల్ని సరిగా అర్థం చేసుకో గలిగినకొద్దీ భూమిలో వున్న రక రకాల తేడాల్ని వేరు వేరు అవసరాల కోసం ఉపయోగించుకోగలుగుతారు. ఒకవేళ ఎప్పటికీ ఉపయోగించలేని పదార్థాలూ, ప్రాంతాలూ ఏవైనా వుంటే వాటిని వదిలేస్తారు.

ఎప్పుడూ పై పై విషయాలు మాత్రమే చూసి అభిప్రాయాలు ఏర్పర్చుకునే పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, వివిధ ప్రాంతాల ఉత్పత్తి రాసుల్లో తేడాల్నీ, అవి తెచ్చే డబ్బు రాసుల్లో తేడాల్నీ చూసి, ఆ ప్రాంతాల్ని 'ధనిక, పేద' ప్రాంతాలుగా విభజించి, ఆ తప్పుడు విభజనతోనే ఆ ప్రాంతాల్ని ప్రస్తావిస్తూ వుంటారు.

ఈ విషయంలో రెండో తప్పుడు అవగాహన: 'సామాజిక పెట్టుబడి' ఎక్కువగా వుంటే, ఆ దేశం ధనిక దేశం అనీ, అలా లేని దేశం పేద దేశం అనీ, భావించడం. పెట్టుబడి ఎక్కువగా ఉంటే, దాని ద్వారా వచ్చే లాభం కూడా ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఇలా భావిస్తారు. కానీ, ఇలా భావించడం కూడా ఎందుకు తప్పంటే, ఒక దేశంలో 'సామాజిక పెట్టుబడి' ఎంత ఎక్కువగా వున్నా, పెట్టుబడి దార్లకి ఎంతెంత లాభాలు వచ్చినా, అక్కడ కూడా పేద జనాభా వుంటారు. 'శ్రామిక వర్గం'లో అధిక భాగం పేద జనాభాయే. అలాగే, ఇంకో దేశంలో, సామాజిక పెట్టుబడి ఎంత తక్కువగా వున్నా అక్కడ కూడా ధనిక జనాభా వుంటారు. 'పెట్టుబడిదారీ వర్గం' అంతా ధనిక జనాభాయే. కాబట్టి, సామాజిక పెట్టుబడుల్లో ఎక్కువ తక్కువల్ని బట్టి, దేశాన్ని ధనిక – పేద దేశాలుగా విభజిస్తే, అది చాలా తప్పు విభజనే.

ఈ విషయంలో మూడో తప్పు అవగాహన ఏమిటంటే; ఒక దేశంలో ఒక సంవత్సరంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఆదాయాన్ని, మొత్తం జనాభాతో భాగించి 'సగటు ఆదాయాన్ని' బట్టి, ధనిక – పేద తేడాల్ని నిర్ణయించడం. సగటు ఆదాయానికి ఇంకో పేరు, 'తలసరి ఆదాయం'. **A** అనే దేశంలో తలసరి ఆదాయం 10 అనీ, **B** దేశంలో తలసరి ఆదాయం 5 అనీ అనుకుందాం. **A** దేశం ధనిక దేశమూ **B** దేశం పేద దేశమూ అన్నమాట! ఈ అవగాహనలో తప్పు ఏమిటంటే — 'తలసరి ఆదాయం' అన్నప్పుడు, ప్రతీ మనిషికీ (ప్రతీ తలకీ) ఆదాయం ఒకే రకంగా కనపడుతుంది. **A** దేశంలో కార్మికుడి ఆదాయం 10 అయితే, పెట్టుబడిదారుడి ఆదాయం కూడా అంతే. **B** దేశంలో కార్మికుడి ఆదాయం 5 అయితే, పెట్టుబడి దారుడి ఆదాయం కూడా అంతే. ఈ పద్ధతి ప్రకారం చూస్తే, **A** దేశంలో జనాభా అంతా ధనికులూ, **B** దేశంలో జనాభా అంతా పేదలూ — అన్నమాట! **A** దేశంలో కార్మికుడు, **B** దేశంలో పెట్టుబడిదారుడి కన్నా ధనికుడు అన్న మాట!

ధనికులూ పేదలూ కూడా వున్న దేశాల్ని 'ధనిక దేశం' అని గానీ, 'పేద దేశం' అని గానీ విభజించడం, ఏ రకంగానూ సరైన అవగాహన కాదు. ఈ విభజన ఏ దేశానికీ వర్తించదు.

సమాజంలో ఏటా తయారయ్యే మొత్తం ఉత్పత్తి ఎంతా, అందులో కార్మిక వర్గానికి వెళ్ళే భాగం ఎంతా, పెట్టుబడిదారీ వర్గానికి వెళ్ళే భాగం ఎంతా — వగైరా విషయాల్ని సరిగా గ్రహించాలంటే — సామాజిక పెట్టుబడీ, సామాజిక సంపదా, గ్రాస్ ఉత్పత్తీ, నెట్ ఉత్పత్తీ — అనే విషయాల మీద సరైన అవగాహనతో వుండాలి.

'సమాజం' అన్నప్పుడు, ఒక దేశాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకున్నా, ప్రపంచాన్నంతా దృష్టిలో పెట్టుకున్నా, 'విలువ' సూత్రాలన్నీ ఒకటే.

ఒక 'దేశం'లో వుండే పెట్టుబడిదారులందరి పెట్టుబడులూ కలిసి, ఆ దేశానికి 'మొత్తం పెట్టుబడి' అయినట్టుగానే, 'ప్రపంచం'లో ఉండే మొత్తం పెట్టుబడి దారుల పెట్టుబడి అంతా కలసి మొత్తం ప్రపంచ పెట్టుబడి అవుతుంది. ఒక దేశపు ఉత్పత్తి ఆ దేశానికి సంపద అయితే, ప్రపంచ ఉత్పత్తి 'ప్రపంచ సంపద' అవుతుంది.

# ప్రశ్నలూ – జవాబులూ

**1. పెట్టుబడి — ఏ యే భాగాలుగా వుంటుంది?**

**జ:** శ్రమ సాధనాలూ, జీతాలూ — అనే 2 భాగాలుగా.

**2. స్థిర పెట్టుబడికీ, అస్థిర పెట్టుబడికీ వుండే సంబంధం ఏమిటి?**

**జ:** రెండూ కలిసే 'పెట్టుబడి'. అవి, పెట్టుబడిలో భాగాలు. అందులో ఏది లేకపోయినా ఉత్పత్తి ఉండదు. రెండూ కలిసే ఖర్చు అవుతాయి. అదే వాటి సంబంధం.

**3. ఈ అంశాల్లో, 'ఉత్పత్తి క్రమం'లో పాల్గొనే అంశాలు ఏవి?**

(1) ఉత్పత్తి సాధనాలూ, జీతాలూ. ✗
(2) ఉత్పత్తి సాధనాలూ, జీవితావసర వస్తువులూ. ✗
(3) ఉత్పత్తి సాధనాలూ, శ్రామికులూ. ✓
(4) ఉత్పత్తి సాధనాలూ, శ్రమ శక్తి. ✗

**4. ఒక ఉత్పత్తి సాధనం ఫిక్సెడ్ సాధనంగా ఎందుకు అవుతుందో వివరించడానికి ఇక్కడ 4 జవాబులు వున్నాయి. ప్రతీ జవాబు గురించి కొంచెం వివరించండి!**

**(1) 'శ్రమ పరికరం'గా వుండడం వల్లనే ఒక వస్తువు ఫిక్సెడ్ సాధనం అవుతుంది.**

**జ:** ఇలా అనడం సరైనదే. ప్రతీ శ్రమ పరికరమూ (శ్రమ పని ముట్టు) ఫిక్సెడ్ సాధనం గానే వుంటుంది. ఇలా చెప్పడం — 'ఉపయోగపు విలువ దృష్టితో' చెప్పినట్టు అవుతుంది.

**(2) ఎక్కువ కాలం మన్నడం వల్లనే ఒక వస్తువు ఫిక్సెడ్ సాధనం అవుతుంది.**

**జ:** ఇది సరైనది కాదు. కొన్ని ముడి పదార్థాలు కూడా ఎక్కువ కాలమే మన్నుతాయి. కాబట్టి, ఈ జవాబు సరిపోదు.

**(3) తన విలువని సరుకుకి ఒకే సారి ఇవ్వకుండా కొంచెం కొంచెంగా ఇవ్వడం వల్లనే అది ఫిక్సెడ్ సాధనం అవుతుంది.**

**జ:** ఇది సరైన జవాబే. అయితే, ఇలా చెప్పడం, ఫిక్సెడ్ సాధనానికి కారణాన్ని విలువ కోణంతో చెప్పడం.

**(4) లోహాలతో తయారై గట్టి సాధనంగా వుండడం వల్లనే ఫిక్సెడ్ సాధనం అవుతుంది.**

**జ:** ఇది కరెక్టు కాదు. ఫిక్సెడ్ సాధనం అనేది లోహాలతోనే తయారవ్వాలని రూలేమీ లేదు. అట్టలతో తయారైన అట్టపెట్టె కూడా ఫిక్సెడ్ సాధనంగా వుండగలదు.

**5. ఒక ఫిక్సెడ్ సాధనం విలువ 600. జీవిత కాలం 12 సం॥లు. 7 సం॥లు పూర్తి అయ్యాక దానికి ఇంకా ఎంత విలువ వుంటుంది?**

**జ:** ఫిక్సెడ్ సాధనం విలువ 600. జీవిత కాలం 12 సం.లు. ఒక సంవత్సరానికి అది ఇచ్చే విలువ = 600 ÷ 12 = 50. 7 సం.లు పూర్తి అయ్యేటప్పటికి అది ఇచ్చే విలువ = 7 × 50 = 350. అప్పుడు ఇంకా ఆ పరికరం విలువ = 600 – 350 = 250.

**6. 'ఫిక్సెడ్ పెట్టుబడి'ని తేలిగ్గా అర్థం చేసుకోవడానికి ఏదైనా గుర్తు చెప్పగలరా?**

**జ:** శ్రమ పనిముట్లే ఫిక్సెడ్ పెట్టుబడి.

**7. 'ఫిక్సెడ్ పెట్టుబడి' కూడా కొంత కాలానికి చలామణీ పెట్టుబడిగానే అవుతుంది.— ఇది కరెక్టేనా?**

**జ:** కరెక్టే. ఫిక్సెడ్ పెట్టుబడి నించి కూడా కొంత కొంత విలువ ప్రతి రోజూ సరుకుకి చేరుతూ, అది కూడా చలామణీలోకి వెళ్ళిపోతూ వుంటుంది.

**8. జవాబులు క్లుప్తంగా రాయండి!**

| | జ: |
|---|---|
| (1) చలామణీ పెట్టుబడీ + అదనపు విలువా = ? | సరుకు విలువ |
| (2) సరుకు విలువా మైనస్ అదనపు విలువా = ? | చలామణీ పెట్టుబడి |
| (3) అరగని ఫిక్సెడ్ + చలామణీ పెట్టుబడి = ? | మొత్తం పెట్టుబడి |

**9. అతి చిన్న శ్రమ పరికరం గల ఒక శ్రమ క్రమాన్ని చెప్పగలరా?**

**జ:** చేతి కుట్టుతో బట్టలు కుట్టే పనిలో, అతి చిన్న శ్రమ పరికరం — సూది. బట్టల్ని కత్తిరించే పనిలో అయితే, అతి చిన్న శ్రమ పరికరం — కత్తెర.

**10. సూది ఫిక్సెడ్ సాధనమా, కాదా?**

**జ:** ఫిక్సెడ్ సాధనమే. ఒక సూదితో 10 రవికెలు కుడితే, సూది విలువ ఆ 10 రవికెలకూ చేరుతుంది.

**11. ఒక శ్రమ పరికరం విలువ 200. దాని జీవిత కాలం 10 గం.లు. ఇంకో శ్రమ పరికరం విలువ 300. దాని జీవిత కాలం 5 సం.లు. ఈ 2 శ్రమ పరికరాలూ, 1 సంవత్సరంలో, ఆ పని స్థలంలో తయారయ్యే సరుకుకి ఎంత విలువని చేరుస్తాయి? — ఈ జవాబు కోసం, ఆ శ్రమ పరికరాల విలువల్ని కలిపేసి, జీవిత కాలాల్ని కూడా కలిపేసి, ఆ విలువని, ఆ కాలంతో భాగించవచ్చునా?**

**జ:** అలా చేస్తే జవాబు తప్పుగా వస్తుంది. 2 పరికరాల విలువా కలిసి 200 + 300 = 500. వాటి జీవిత కాలాలు కలిసి 10 + 5 = 15 సం.లు. ఆ విలువని, ఆ కాలంతో భాగిస్తే 500 ÷ 15 = 33. ఇలా చేస్తే వచ్చే జవాబు తప్పు అవుతుంది. దేని విషయం దానికి విడిగా చూసి, ఆ విలువల్ని కలపాలి. అప్పుడే సరైన జవాబు వస్తుంది.

మొదటి పరికరం, 1 సంవత్సరానికి ఇచ్చే విలువ = 200 ÷ 10 = 20. రెండో పరికరం, 1 సంవత్సరానికి ఇచ్చే విలువ = 300 ÷ 5 = 60. ఆ విలువల్ని కలిపితే, 20 + 60 = 80. ఇదే సరైన జవాబు కాబట్టి, ఈ పద్ధతిలోనే అర్థం చేసుకోవాలి.

**12. ఈ వస్తువుల్లో ఏవి ఫిక్సెడ్? ఏవి ముడి పదార్థం? ఏవి ఆగ్జిలరీ? —నీళ్ళు, బొగ్గు, చీపురు, కలం, దూది, చొక్కా, బియ్యం, నూనె, చెప్పులు, ఎద్దు.**

**జ:** నీళ్ళు, దూది, నూనె — లాంటి వస్తువులు, ముడి పదార్థాలు గానూ, ఆగ్జిలరీ గానూ కూడా వుండ గలవు. చీపురూ, కలమూ లాంటివి ఎప్పుడూ శ్రమ పనిముట్లే, బియ్యం ఎప్పుడూ ముడి పదార్థమే. ఇలా, ఒక వస్తువుని వాడే సందర్భాన్ని బట్టి చూడాలి.

**13. ఒక ఇంటి అద్దె నెలకి 250. ఇంటి యజమానికి అదంతా లాభమేనా?**

**జ:** కాదు. అందులో కొంత భాగం, ఇంటి నిర్మాణానికి సంబంధించిన అసలు విలువ వుంటుంది. ఆపైన వున్నదే — లాభం. అంతే కాదు, వడ్డీ, భూమి అద్దె కూడా అందులో వుంటుంది.

**14. ఒక కుటుంబం వాళ్ళు తమ స్వంతానికే ఒక ఇల్లు కట్టుకున్నారు. అద్దె సంపాదించాలనే దృష్టితో ఇల్లు కట్ట లేదు. కానీ, కొంత కాలానికి ఇంట్లో వ్యక్తులు కొందరు ఇతర ఊళ్ళకు వెళ్ళిపోవడం వల్ల, ఇంట్లో కొంత భాగాన్ని 'మార్కెట్ రేటు' ప్రకారమే అద్దెకు ఇచ్చారు. ఆ అద్దె వాళ్ళకి లాభాన్ని తెస్తుందా?**

**జ:** తప్పకుండా తెస్తుంది. 'మార్కెట్ రేటు' అనే దాంట్లో, అసలు విలువా, లాభమూ కలిసే వుంటాయి.

**15. కడుతూ కడుతూ వున్న వంతెన కూలి పోయిందని ఒక వార్త. దీనికి కారణం ఏమిటి?**

**జ:** దాన్ని కట్టడంలో చాలా కల్తీ జరిగి వుంటుంది.

**16. కట్టడాల నిర్మాణంలో శ్రామికులు గాయపడడమూ, మరణించడమూ రోజూ జరుగుతాయి. ఆ కట్టడాల పెట్టుబడిదారులు కూడా గాయపడడమూ, మరణించడమూ జరుగుతూ వుంటుందా?**

**జ:** జరగదు. ఎందుకంటే, వాళ్ళు ఆ శ్రమ క్రమాల్లో ఉండరు గనక.

**17. 'సామాజిక సంపద'కీ, 'సామాజిక పెట్టుబడి'కీ తేడా వుందా? ఏమిటి?**

**జ:** తేడా వుంది. 'సామాజిక పెట్టుబడి' అంటే: ఆ ఉపయోగపు విలువల రాసిని ఉత్పత్తి చెయ్యడానికి అవసరమైన పెట్టుబడి. ఇందులో అదనపు శ్రమ ఉండదు. 'సామాజిక సంపద' అంటే: ఒక సంవత్సర కాలాన్ని తీసుకుంటే, ఆ కాలంలో, సమాజం అంతటిలోనూ ఉత్పత్తి అయిన ఉపయోగపు విలువల రాసి. ఇందులో అదనపు శ్రమ కూడా ఉంటుంది.

**18. ఒక దేశంలో, ఒక సంవత్సరంలో, మొత్తం ఉత్పత్తి విలువ 500. ఈ ఉత్పత్తిలో, పెట్టుబడిదారుల ద్వారా తయారైనది 90%. స్వతంత్ర ఉత్పత్తిదారుల ద్వారా తయారైనది 10%. పెట్టుబడిదారుల ఉత్పత్తి విలువ ఎంత? అలాగే, స్వతంత్ర ఉత్పత్తిదారుల ఉత్పత్తి విలువ ఎంత?**

**జ:** మొత్తం ఉత్పత్తి విలువ 500. అందులో పెట్టుబడిదారుల ఉత్పత్తి —90%. 500లో 90% అంటే — 90 ÷ 100 × 500 = 450. స్వతంత్ర ఉత్పత్తిదారుల ఉత్పత్తి 50.

| **19. ఈ అర్థాలు సరైనవేనా?** | **జ:** |
|---|---|
| 1) 'ధనిక దేశం'లో అందరూ ధనికులే వుంటారు. పేదలు వుండరు. | ✘ |
| 2) 'పేద దేశం'లో అందరూ పేదలే, ధనికులు వుండరు. | ✘ |
| 3) 'ధనిక దేశం'లో మొత్తం జనాభాలో ధనికులే ఎక్కువగానూ, పేదలు తక్కువగానూ, వుంటారు. | ✘ |
| 4) 'పేద దేశం'లో మొత్తం జనాభాలో పేదలే ఎక్కువగానూ, ధనికులు తక్కువగానూ వుంటారు. | ✔ |
| 5) 'ధనిక దేశం'లో అందరూ యజమానులే. శ్రామికులు వుండరు. | ✘ |
| 6) 'పేద దేశం'లో అందరూ శ్రామికులే. యజమానులు వుండరు. | ✘ |

**20. పేద దేశం, ధనిక దేశం — అనే మాటలకు ఎలాంటి అర్థాలు చెప్పుకోవచ్చు?**

**జ:** రెండు దేశాల్ని తీసుకుందాం. ఒక దేశంలో, పెట్టుబడిదారుల దగ్గిర పెట్టుబడి తక్కువగా వుంటే, అది పేద దేశం. ఇంకో దేశంలో పెట్టుబడిదారుల దగ్గిర పెట్టుబడి ఎక్కువగా వుంటే, అది ధనిక దేశం. దేశాల్లో పేద–ధనిక తేడాల్ని ఈ అర్థాలతోనే చెప్పగలం.

**21. చిత్రకారులకు ప్రత్యేకం:**

'సామాజిక పెట్టుబడి'ని ఒక చెట్టుతో పోల్చవచ్చును. సామాజిక పెట్టుబడిలో కొంత కొంత భాగం ఒక్కొక్క ఉత్పత్తి శాఖలో వుంటుంది. ఒక చెట్టు బొమ్మ వెయ్యండి! చెట్టు మొదలు మీద 'సామాజిక పెట్టుబడి' అని రాయండి. కొమ్మల మీద —బట్టల ఉత్పత్తి శాఖ, యంత్రాల శాఖ, రవాణా శాఖ, సినిమాల శాఖ, పత్రికల శాఖ — ఇలా, ఒక్కొక్క కొమ్మ మీదా ఒక్కొక్క పేరు రాయండి! అన్ని శాఖల పెట్టుబడీ కలిసి 'సామాజిక పెట్టుబడి' అవుతుంది. ★

# 5. అదనపు విలువ రేటు (దోపిడీ స్థాయి)

'అదనపు విలువ' అంటే ఏమిటో తెలుసు మనకి. పెట్టిన పెట్టుబడికన్నా 'అదనంగా' వచ్చే విలువే 'అదనపు విలువ'. కార్మికులు, ప్రతీ రోజూ తప్పనిసరిగా తమ పనిలో కొంత 'అదనపు విలువ'ని ఉత్పత్తి చేస్తారు. అంటే, కొంత 'అదనపు శ్రమ' చేస్తారు.

పనిలోకి దిగిన తర్వాత కార్మికులు మొదట కొంత సేపటి వరకూ 'జీతాల' విలువకు సరిపోయేటంత పని చెయ్యాలి. ఈ భాగం కార్మికుల స్వంతానికి చేసుకోవలిసిన భాగం. ఈ భాగం పని, కార్మికులు తప్పనిసరిగా చెయ్యాలి. ఇది కార్మికులకు 'అవసర శ్రమ' భాగం. జీతాల విలువకు తగ్గ పని అయిపోయిన తర్వాత, ఇక అప్పటి నించి జరిగే పని అంతా కార్మికుల కోసం కాదు. 'పెట్టుబడిదారుడి' కోసం. అది కార్మికులు చేసే 'అదనపు శ్రమ' భాగం. అంటే, కార్మికులు ప్రతీ రోజూ పనిలోకి దిగిన తర్వాత కొంత సేపు 'అవసర శ్రమా', ఆ తర్వాత కొంత సేపు 'అదనపు శ్రమా' చేస్తారు. కానీ, రోజూ చేసే పని ఇలా 2 భాగాలుగా వుంటుందని పెట్టుబడిదారుడికీ, కార్మికులకూ కూడా తెలీదు.

'పని దినం' 12 గంటలు అయితే — అందులో 6 గం.లు అవసర శ్రమా, 6 గం.లు అదనపు శ్రమా వుండవచ్చు. లేదా, 4 గం.లు అవసర శ్రమా, 8 గం.లు అదనపు శ్రమా వుండవచ్చు. 10 గం.లు అవసర శ్రమా, 2 గం.లు అదనపు శ్రమా వుండవచ్చు. ఇలా ఈ భాగాలు రెండూ, ఏ రకంగా నైనా వుండవచ్చు.

'పని దినం'లో, ఏ శ్రమ ఎంతెంత భాగం వుందో వాటి పాళ్ళని చెప్పేదే 'అదనపు విలువ రేటు' (శాతం). ఈ 'రేటు' వల్ల కార్మికులు, తమ కోసం ఎంత పని చేసుకున్నారో, దోపిడీదారుడి కోసం ఎంత పని చేశారో తెలుస్తుంది. థర్మామీటరు, 'వేడి'ని కొలిచినట్టే, ఈ 'అదనపు విలువ రేటు' 'దోపిడీ'ని కొలుస్తుంది. దోపిడీ ఏ స్థాయిలో వుందో ఇది చూపిస్తుంది. అందుకే 'అదనపు విలువ రేటు'ని, 'దోపిడీ డిగ్రీ' (దోపిడీ స్థాయి) అని కూడా అనవచ్చు.

ఒక పెట్టుబడిదారుడి దగ్గిర 'పని దినం' ఎన్ని గంటలు వుందో తెలుస్తుంది గానీ, అందులో ఎన్ని గంటల వరకూ 'అవసర శ్రమ' జరుగుతుందో, ఎన్ని గంటలు 'అదనపు శ్రమ' జరుగుతుందో, పైకి కనపడదు. దాన్ని కొన్ని లెక్కల ద్వారా కనిపెట్టాలి. పెట్టుబడిదారుడు ఎంత పెట్టుబడి పెట్టాడూ, దాని మీద ఎంత లాభం వచ్చిందీ — అనే లెక్కలతో దాన్ని ప్రారంభించాలి.

బట్ట పెట్టుబడిదారుడు మొదట 100 పెట్టుబడి పెట్టాడు. అందులో స్థిర మీద 80, అస్థిర మీద 20. పని దినం 12 గం.లు. పని స్థలంలో కార్మికులు ఎంత మంది వున్నారో వివరాలు అవసరం లేదు. అందరికీ కలిసి 'జీతాల' మీద ఎంత మొత్తం పెట్టాడో తెలిస్తే చాలు. అది 20. ఒక రోజు పనితో '100 మీటర్ల' బట్ట తయారైంది. పెట్టుబడిదారుడు దాన్ని అమ్మేశాడు. ఎంతకి అమ్మాడో తెలియకపోతే, పెట్టిన పెట్టుబడి కన్నా అదనంగా ఎంత వచ్చిందో తెలీదు. బట్టని ఇంకా అమ్మక పోయినా, ఆ నాటి మార్కెట్ పరిస్తితుల్లో దాని విలువ ఎంత వుంటుందో అయినా తెలియాలి. దాని విలువ తప్పనిసరిగా, దాని కోసం ఖర్చయిన పెట్టుబడి విలువ కన్నా ఎక్కువగా వుండి తీరుతుంది. కాబట్టి, పెట్టుబడిదారుడు దాన్ని 120 కి అమ్మాడనుకుందాం. అంటే పెట్టిన పెట్టుబడి కన్నా 20 ఎక్కువగా వచ్చింది. ఇది 'అదనపు విలువ.' దీన్ని 'అదనపు విలువ రాశి' అనీ, 'అదనపు విలువ పరిమాణం' అనీ అనవచ్చు.

సరుకు కోసం మొదట అయిన ఖర్చూ, సరుకుని అమ్మిన విలువా తెలిస్తే 'అదనపు విలువ' తెలుస్తుంది. తర్వాత, జీతాలకూ, అదనపు విలువకూ వున్న పాళ్ళు చూస్తే 'అదనపు విలువ రేటు' తెలుస్తుంది.

జీతాలు 20. అదనపు విలువ 20. ఈ 2 విలువల్నీ కార్మికులే ఉత్పత్తి చేస్తారని మనకు తెలుసు. కార్మికులు ఆ రోజు పనిలో 20 + 20 = 40 విలువగల శ్రమ చేశారని అర్థం. కార్మికులు చేసిన శ్రమతో ఇక్కడ, జీతాలూ, అదనపు విలువా కూడా సగం సగంగా వున్నాయి. కాబట్టి, 12 గం.ల పని దినంలో సగం కాలం అవసర శ్రమ అనీ, సగం కాలం అదనపు శ్రమ అనీ, తేలిగ్గానే తెలుసుకోవచ్చు. కానీ, అన్ని ఉదాహరణలూ ఇలా తెలిసిపోయేలా వుండవు. కాబట్టి, ఈ భాగాల్ని తెలుసుకోవడానికి ఒక 'సూత్రం' వుండాలి. జీతాలకూ, అదనపు విలువకూ వుండే సంబంధాన్ని 'శాతం'గా చూడడమే 'అదనపు విలువ

రేటు'ని కనిపెట్టే సూత్రం. 'రేటు' అంటే, శాతమే.

20 జీతాలకు — 20 అదనపు విలువ అయితే,
100 జీతాలకైతే — ఎంత అదనపు విలువ?

$\frac{20 \text{ అదనపు విలువ}}{20 \text{ జీతాలు}} \times 100 = 100\%$

ఇదే అదనపు విలువ రేటు.
లేదా, అదనపు విలువ శాతం.

100% అంటే అర్థం 'నూటికి, నూరు' అని. 'జీతాలు' నూరు అయితే, 'అదనపు విలువ' కూడా నూరు. లేదా, 'అవసర శ్రమ' ఎంత అయితే, 'అదనపు శ్రమ' అంత — ఇలా! ఈ ఉదాహరణలో, అవసర శ్రమా, అదనపు శ్రమా సగం, సగంగా వున్నాయి.

| అవసర శ్రమా | : | అదనపు శ్రమా |
|---|---|---|
| 100 | : | 100 |
| 1 | : | 1 |

ఇక్కడ 'పని దినం' 1+1 = 2 సమాన భాగాలుగా వుందన్న మాట. పని దినానికి ఎన్ని గంటలో ఇక్కడ తెలిసినా, తెలియకపోయినా ఒకటే. పని దినం ఎంత వుంటే అంతలోనే సగం కాలం అవసర శ్రమా, సగం కాలం అదనపు శ్రమా వున్నట్టు అర్థం. పని దినం 12 గం. అయితే, 6 గం.లు అవసర శ్రమా, 6 గం.లు అదనపు శ్రమా! పని దినం 8 గం.లు అయితే, 4 గం.లు అవసర శ్రమా, 4 గం.లు అదనపు శ్రమా! — ఇలాగ.

100% అదనపు విలువ రేటు అంటే, కార్మికులు, జీతాలతో ఎంత కాలం పనిచేశారో, జీతాలు లేకుండా అంత కాలం పనిచేసినట్టు అర్థం. జీతాలు లేని కాలానికి కూడా జీతాలు ఇవ్వాలంటే, మళ్ళీ 20 జీతాలు ఇవ్వాలి. అంటే, 'అదనపు విలువ'ని కార్మికులకే ఇచ్చెయ్యాలి. జీతాల 20 నీ, అదనపు విలువ 20 నీ కలిపేస్తే, కార్మికులు ఇచ్చిన మొత్తం విలువ అవుతుంది. కానీ, 'అదనపు శ్రమ' భాగానికి జీతం వుండదు. ఈ ఉదాహరణలో అదనపు విలువ రేటు, లేదా దోపిడీ స్థాయి — 100%. ఒక అదనపు విలువ రేటుని చూసినప్పుడల్లా, దోపిడీ ఆ స్థాయిలో వుంది — అని అర్థం చేసుకోవాలి.

అదనపు విలువ రేటుని తెలుసుకోవడానికి జీతాలూ, అదనపు విలువా తెలిస్తే చాలు. స్థిర పెట్టుబడి ఎంత వుందో తెలియ నక్కరలేదు. ఎందుకంటే, 'అదనపు విలువ'ని ఉత్పత్తి చెయ్యడంలో స్థిర పెట్టుబడి పాత్ర ఏమీ వుండదు. 'అదనపు విలువ'ని ఉత్పత్తి చేసేది, 'జీతాలు' మాత్రమే కాబట్టి, 'అదనపు విలువ రేటు'ని లెక్క కట్టే విషయంలో స్థిర పెట్టుబడి, 'సున్నా'తో సమానం అయిపోతుంది.

'అదనపు విలువ రేటు'ని ఇంకో పద్ధతిలో కూడా లెక్క కట్టవచ్చు. ఎలాగంటే — కార్మికులు ఇచ్చిన మొత్తం విలువలో అదనపు విలువ ఎంత శాతం వుంటుందో చూసే పద్ధతిలో.

మొదటి ఉదాహరణే మళ్ళీ చూద్దాం.

జీతాలు 20. అదనపు విలువ 20.
కార్మికులు ఇచ్చిన మొత్తం విలువ 20 + 20 = 40.
ఈ 'మొత్తం విలువ'లో, అదనపు విలువ ఎంత శాతం?

మొత్తం 40 విలువలో, అదనపు విలువ 20 అయితే,
మొత్తాన్ని 100 గా తీసుకుంటే, అందులో
అదనపు విలువ — $20 \div 40 \times 100 = 50\%$

మొదటి పద్ధతిలో 100% గా వచ్చినదే, రెండో పద్ధతిలో 50% గా వచ్చింది. కానీ, ఈ 2 పద్ధతులూ ఒకే సారాంశాన్ని చెపుతాయి.

మొదటి పద్ధతిలో — అదనపు విలువని జీతాలతో పోల్చాం. రేటు 100%. అంటే జీతాలు 100 అయితే, అదనపు విలువ కూడా 100. రెండూ సమానం. 'పని దినం' 2 సమాన భాగాలుగా వుందని అర్థం.

రెండో పద్ధతిలో — అదనపు విలువని కార్మికులు ఇచ్చిన మొత్తం విలువతో పోల్చాం. రేటు 50%. అంటే జీతాలు 50 అయితే, అదనపు విలువ 50. ఇప్పుడు కూడా పని దినం, 2 సమాన భాగాలుగా వుందని అర్థం.

ఏ పద్ధతిలో చూసినా విషయం ఒకటే కాబట్టి, ఏ పద్ధతిలో అయినా చూడవచ్చు. అయితే, మొదటి పద్ధతిలో — 'పని దినం'లో భాగాల్ని అర్థం చేసుకోవడంలో కొంత గందరగోళ పడే ప్రమాదం వుంటుంది. రెండో పద్ధతిలో ఆ పరిస్థితి వుండదు.

మొదటి పద్ధతిలో — అదనపు విలువ రేటుని 100% గా చూసినప్పుడు, దీన్ని సరిగా అర్థం చేసుకోకపోతే, పనిదినం అంతా అదనపు విలువగానే వున్నట్టు కనపడ వచ్చు. ఈ పద్ధతిలో, కొన్ని ఉదాహరణల్లో, అదనపు విలువ రేటు 100% కన్నా కూడా ఎక్కువగా వుంటుంది. అలాంటి ఉదాహరణలు, మరింత గందరగోళ పరచ వచ్చు. కానీ, రెండో పద్ధతి అయితే, అదనపు విలువ రేటు 100% గా గానీ, దాని కన్నా ఎక్కువగా గానీ, ఎప్పుడూ వుండదు. ఏ ఉదాహరణలో అయినా అది 100% కన్నా తక్కువగానే వుంటుంది. మనం చూసిన ఉదాహరణలో ఆ రేటు 50%. దీన్ని చూడగానే, 'పని దినం'లో సగం కాలం జీతాలు అనీ, సగం కాలం అదనపు విలువ అనీ తేలిగ్గా తెలుస్తుంది. ఈ పద్ధతిలోనే, ఇంకో ఉదాహరణలో, అదనపు విలువ రేటుని 99% అనుకుందాం. దీన్ని అర్థం

చేసుకోవడం కూడా తేలికే. 'పని దినం'లో అదనపు విలువ భాగం 99% అనీ, జీతాల భాగం 1% అనీ తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఈ రకంగా రెండో పద్ధతిలో అదనపు విలువ రేటు 100% గా ఎప్పుడూ వుండదు కాబట్టి, పని దినంలో భాగాల్ని అర్థం చేసుకోవడానికి కష్టం వుండదు.

[అయితే మార్క్సు, అదనపు విలువ రేటుని మొదటి పద్ధతిలోనే వివరించాడు. ఒరిజినల్ 'కాపిటల్'ని చూసే పాఠకులకు మొదటి పద్ధతే కనపడుతుంది. అయినా, 2 రకాలుగానూ అర్థం చేసుకోవాలి.]

ఇంకో ఉదాహరణ : ఖర్చయిన పెట్టుబడి 120. అందులో జీతాలు 80. సరుకు విలువ 160. దోపిడీ స్థాయి ఎంత?

మొదట 'అదనపు విలువ' ఎంతో చూడాలి. తర్వాత, జీతాలకూ, అదనపు విలువకూ సంబంధాన్ని 'శాతం'గా చూడాలి. అంతే.—'సరుకు విలువ'లో నించి 'పెట్టుబడి'ని తీసేస్తే 'అదనపు విలువ' తెలుస్తుంది. ఈ ఉదాహరణలో అదనపు విలువ, 160 – 120 = 40.

80 జీతాలు—40 అదనపు విలువని ఇస్తే,
100 జీతాలు —ఎంత అదనపు విలువని ఇచ్చినట్టు?

40 ÷ 80 × 100 = 50%. ఇది 'అదనపు విలువ రేటు'.

అంటే, 100 కి — 50. 'అవసర శ్రమ భాగం' 100 అయితే, 'అదనపు శ్రమ' భాగం —50.

| అవసర శ్రమా | : | అదనపు శ్రమా |
|---|---|---|
| 100 | : | 50 |
| 2 | : | 1 |

పనిదినం 2 + 1 = 3 భాగాలు అవుతుంది.

అందులో 2 భాగాలు అవసర శ్రమా, 1 భాగం అదనపు శ్రమా. పని దినం 12 గంటలు అయితే, దాన్ని 3 భాగాలు చేస్తే, ఒక్కో భాగం 4 గం.లు. అవసర శ్రమ భాగం 8 గం.లూ + అదనపు శ్రమ భాగం 4 గం.లూ. ఈ ఉదాహరణలో, జీతాలతో ఎంత కాలం పని చేశారో, అందులో సగం కాలం జీతాలు లేకుండా పనిచేశారు. ఇక్కడ 'అదనపు శ్రమ'కి కూడా జీతాలు ఇచ్చెయ్యాలంటే, 'అదనపు విలువ'గా వున్న 40 ని కూడా ఇచ్చెయ్యాలి. ఇక్కడ కార్మికుల శ్రమ విలువ = జీతాలు 80 + అదనపు విలువ 40 = 120.

ఇంకో ఉదాహరణ : జీతాలు 27. అదనపు విలువ 108. 'అదనపు విలువ రేటు' ఎంత? 'పనిదినం'లో, అవసర, అదనపు శ్రమల భాగాలు ఎంతెంత?

27 జీతాలు —108 అదనపు విలువని ఇస్తే,
100 జీతాలు — ఎంత అదనపు విలువని ఇచ్చినట్టు?

108 ÷ 27 × 100 = 400%.

ఈ ఉదాహరణలో అదనపు విలువ రేటు 400%. అంటే, 100 కి — 400. అంటే, మొదటి భాగం 100 అయితే, రెండో భాగం 400.

| అవసర శ్రమా | : | అదనపు శ్రమా |
|---|---|---|
| 100 | : | 400 |
| 1 భాగం | : | 4 భాగాలు |

పని దినం 1+ 4 = 5 భాగాలు. అందులో 1 భాగం అవసర శ్రమా, 4 భాగాలు అదనపు శ్రమా. ఈ లెక్కన 12 గం.ల పని దినాన్ని విభజిస్తే, అవసర శ్రమ కాలం 2 గం. 24 నిముషాలూ; అదనపు శ్రమ కాలం 9 గం.ల 36 ని.లూ అవుతుంది. ఇక్కడ దోపిడీ — 400%.

అదనపు విలువ రేటు — అనే విషయాన్ని సరిగా అర్థం చేసుకోకపోతే, అది 100% వుందన్నా, అంతకన్నా ఎక్కువ వుందన్నా ఆ లెక్కలో ఏదో పొరపాటు వున్నట్టు అనిపిస్తుంది. అదనపు విలువ రేటు 100% —అన్నప్పుడు, కార్మికులు 'పని దినం'లో వున్న కాలమంతా అదనపు శ్రమే చేశారని చెపుతున్నట్టుగా విషయం పొరపాటుగా అర్థమవుతుంది. కానీ, అదనపు విలువ రేటు 100% అనడం అంటే, కార్మికులు, జీతాలతో పని చేసినంత కాలం, మళ్ళీ జీతాలు లేకుండా పని చేశారు — అని చెప్పడమే. అంతేగానీ మొత్తం పని చేసిన కాలం అంతా అదనపు శ్రమే చేశారని చెప్పడం కాదు. అదనపు విలువ రేటు 100% వుందన్నా, అంతకన్నా ఎక్కువ వుందన్నా, అందులో ఏమీ పొరపాటు వుండదు.

# 'అదనపు విలువ' కీ, దాని 'రేటు' కీ సంబంధించిన కొన్ని విషయాలు

**(1)** బట్ట ఉదాహరణలో — 80 స్థిరా, 20 అస్థిరా అనుకున్నాం. 'పని స్థలం'లో, ఇంకా 400 విలువ గల ఫిక్సెడ్ సాధనాలు వున్నాయి అనుకుందాం. 'అదనపు విలువ రేటు'కి 80 స్థిరతో గానీ, పని స్థలంలో ఇంకా వున్న 400 ఫిక్సెడ్ సాధనాలతో గానీ, ఏమీ సంబంధం లేదు. 'అదనపు విలువ'ని ఇచ్చేది జీతాలే కాబట్టి, ఈ 2 అంశాల సంబంధమే 'అదనపు విలువ రేటు.'

అదనపు విలువా, అదనపు విలువ రేటూ ఒకటి కాదు.

'అదనపు విలువ' అంటే, 'పెట్టుబడి' కన్నా అదనంగా వున్న 'రాసి'. 'అదనపు విలువ రేటు' అంటే అవసర, అదనపు శ్రమల పాళ్ళ సంబంధం.

**(2)** 'అదనపు విలువ'ని తెలుసుకోవడానికి సూత్రం : సరుకు విలువా, మైనస్ పెట్టుబడీ.

అదనపు విలువ రేటుని తెలుసుకోవడానికి అదనపు విలువని, **V** తో (జీతంతో) పోల్చాలి.

అ.వి. = **S**; దీని రేటు = $S^1$ (ఎస్-వన్)

$S^1$ = 20 **S** ÷ 10 **V** × 100 = 200%.

**(3)** అదనపు విలువ రేటు, ఒక పని దినంలో అవసర, అదనపు శ్రమల పాళ్ళు ఎలా వున్నాయో చెపుతుందేగానీ, ఆ 'పని దినం' ఎంత పొడవు వుందో చెప్పదు. ఆ పని దినానికి 8 గంటలు కావచ్చు, 12 గంటలు కావచ్చు, 14 గంటలు కావచ్చు, ఎంతైనా కావచ్చు. ఆ వివరం, అదనపు విలువ రేటులో కనపడదు. పని దినంలో 2 భాగాలూ, 5 గం : 5 గం.లుగా వుంటే, అదనపు విలువ రేటు 100% గా కనపడుతుంది. పని దినంలో 2 భాగాలూ 6 గం : 6 గం.లుగా వున్నా కూడా అదనపు విలువ రేటు 100% గానే కనపడుతుంది. ఇక్కడ మొదటి పని దినంలో కన్నా రెండో పని దినంలో, కార్మికులు, 1 గంట ఎక్కువ అదనపు శ్రమ చేస్తారు. మొదటి దాంట్లో 5 గంటలు అదనపు శ్రమ చేస్తే, రెండో దాంట్లో 6 గంటలు చేస్తారు.

**(4)** కార్మికుల సంఖ్య ఎక్కువవడాన్ని బట్టీ, తక్కువవడాన్ని బట్టీ 'అదనపు విలువ రాసి' మారుతుంది గానీ, 'అదనపు విలువ రేటు' మారదు. అదనపు విలువ రేటు, పని దినంలో ఏ భాగం ఎంతో చెపుతుంది కాబట్టి, ఆ విషయం అందరు కార్మికులకూ (ఒకే రకం పనిచేసే కార్మికులకు) ఒక్కలాగే వర్తిస్తుంది. పని దినంలో అవసర శ్రమా, అదనపు శ్రమా 5 : 5 గం.లుగా వుంటే, కార్మికుల్లో ప్రతీ ఒక్కరూ 5 గంటలు అవసర శ్రమా, 5 గంటలు అదనపు శ్రమా చేశారని అర్థం. ఒక కార్మికుడికి వర్తించేదే 100 మంది కార్మికులకైనా వర్తిస్తుంది. కార్మికులు ఎక్కువగా వుంటే, 'అదనపు విలువ రాసి' ఎక్కువగా వుంటుంది; కార్మికులు తక్కువగా వుంటే ఆ రాసి తక్కువగా వుంటుంది. కానీ, కార్మికుల సంఖ్యని బట్టి 'అదనపు విలువ రేటు'లో మార్పులు జరగవు.

**(5)** 'అదనపు విలువ రాసి' ఎక్కువో తక్కువో అవడం కొన్ని పరిస్థితుల్ని బట్టి వుంటుంది. ఆ పరిస్థితులు ఇలా వుండొచ్చు: అదనపు విలువ రేటు ఎక్కువగా వుండడం, లేదా తక్కువగా వుండడం, కార్మికుల సంఖ్య ఎక్కువగా వుండడం, లేదా తక్కువగా వుండడం. — ఈ 4 పరిస్థితుల్లో. 'అదనపు విలువ రేటు' నించి ఒక పరిస్థితీ, 'కార్మికుల సంఖ్య' నించి ఒక పరిస్థితీ కలిస్తే, ఆ రెండిటి కాంబినేషన్ని (కలయికని) బట్టి ఫలితం వుంటుంది. ఆ కాంబినేషన్లు ఇలా వుండవచ్చు.

అదనపు విలువ రేటు ఎక్కువా + కార్మికుల సంఖ్య ఎక్కువా = ఫలితం : అదనపు విలువ రాసి ఎక్కువ.

రేటు ఎక్కువా + సంఖ్య తక్కువా = ఫలితాన్ని చెప్ప లేము. వివరాలు ఇంకా కావాలి.

రేటు తక్కువా + సంఖ్య తక్కువా

రేటు తక్కువా + సంఖ్య ఎక్కువా — ఇలా.

రక రకాల కాంబినేషన్లని బట్టి పెట్టుబడిదార్లకు వచ్చే 'అదనపు విలువ రాసి' వుంటుంది.

**(6)** ఒక పని దినం 6 గం. + 6 గం. అనుకుందాం. దీన్ని రేటుగా లెక్క కడితే, 100% అవుతుంది. ఈ 'పని దినాన్ని' 1 గంట తగ్గిస్తే, అవసర – అదనపు భాగాలు ఎలా మారతాయి? — 12 గంటల పని దినంలో 1 గంట తగ్గితే, పని దినం 11 గంటలే అవుతుంది. అప్పుడు అవసర శ్రమ భాగంలో నించి అర గంటా, అదనపు శ్రమ భాగంలో నించి అర గంటా తగ్గుతాయా? — కాదు. ఇందులో 'అవసర శ్రమ' భాగం ఏమీ తగ్గడానికి వీలు లేదు. కార్మికులు 6 గంటల సేపు పనిచేస్తే గానీ, జీతాల విలువని పునరుత్పత్తి చెయ్యలేరు. కాబట్టి 11 గం.ల పని దినంలో కూడా అవసర భాగం 6 గం.లు గానే వుంటుంది. ఆ తగ్గిన గంట అదనపు భాగంలో నించే తగ్గుతుంది. అప్పుడు పని దినం పాళ్ళు 6 గం. + 5 గంటలుగా వుంటాయి. దీన్ని రేటుగా చూస్తే ఎంత వుంటుంది?

5 **S** ÷ 6 **V** × 100 = 83%. అదనపు విలువ రేటు తగ్గింది.

ఇప్పుడు పని దినాన్ని 1 గంట పెంచి చూద్దాం. అంటే, 12 గంటల పని దినాన్ని 13 గం.లు చేసి. అప్పుడు కూడా 'అవసర శ్రమ కాలం'— 6 గంటలే. ఆ పైన చేసేదంతా అదనపు శ్రమే. అది 7 గం.లు అవుతుంది. పని దినం పాళ్ళు 6 + 7 గా వుంటాయి. ఇప్పుడు 'అదనపు విలువ' రేటు ఎంత?

7 **S** ÷ 6 **V** ×100 = 117%. రేటు పెరిగింది.

| | | | | |
|---|---|---|---|---|
| పని దినం | 6 + 6 గా వున్నప్పుడు, | అ. వి. రేటు | | 100% |
| " | 6 + 5 | " | " | 83% |
| " | 6 + 7 | " | " | 117% |

ఈ రకంగా, 'పని దినం'లో భాగాలు మారితే, 'అదనపు విలువ రేటు' కూడా మారుతుంది.

అదనపు విలువ రేటూ, పని దినం పొడవూ తెలిస్తే, 'పని దినం'లో ఏ భాగం ఎంత వుందో కనిపెట్టగలం.

ఒక 'సరుకు విలువ'కి సంబంధించిన వివరాలు చూసేటప్పుడు, ఆ సరుకుని అమ్మారా లేదా అనే దానితో సంబంధం లేకుండానే, 'అదనపు విలువ రేటు'ని 50% అనో, 100% అనో, ఎంతో కొంత రేటుని ఉదాహరణగా తీసుకుంటూ వుంటాం. "సరుకుని అమ్మాక, ఎంత 'అదనపు విలువ' వస్తుందో చూసి, దానితో అదనపు విలువ రేటుని లెక్క కట్టాలి కదా? సరుకుని అమ్మక ముందే అదనపు విలువ రేటుని 50% అనో, 100% అనో, ఎలా లెక్కగట్టగలం?" అనే సందేహం వస్తుంది. సరుకుని అమ్మిన తర్వాత వచ్చేదాన్నే మొదటే ఉదాహరణగా తీసుకుంటాం అన్నమాట!

ఆ రకం సరుకుని పెట్టుబడిదారుడు ఎప్పుడూ అమ్ముతూనే వుంటాడు. ఒకవేపున — తయారైన సరుకుని మార్కెట్లో అమ్ముతూనూ, ఇంకో వేపున — 'పని స్థలం'లో అదే రకం కొత్త సరుకుని తయారు చేయిస్తూనూ, వుంటాడు. కాబట్టి, 'పని స్థలం'లో వున్న సరుకుని ఇంకా అమ్మకపోయినా, దాని కోసం ఖర్చయ్యే పెట్టుబడీ, దాని విలువా, దాని వల్ల వచ్చే లాభమూ — అన్నీ తెలిసిపోతూనే వుంటాయి. కాబట్టి, సరుకుని ఇంకా అమ్మకపోయినా, 'అదనపు విలువ'నీ, 'అదనపు విలువ రేటు'నీ, ఏదో ఒక లెక్కన తీసుకుంటాము.

ఇక్కడ ఒక విషయం సరిగా అర్థం చేసుకోవాలి. ఒక పనిస్థలంలో వేరు వేరు రకాల కార్మికులు ఉంటారు. అందరూ అక్కడ తయారయ్యే సరుకు కోసమే పని చేస్తారు. ఆ సరుకులో అందరి శ్రమలూ కలిసి ఉంటాయి. ఎవరు ఎంత అదనపు విలువని ఇచ్చారో చూడాలంటే, మొదట అదనపు విలువ రేటుని తెలుసుకుని, దాని ద్వారానే చూడాలి. కానీ, అదనపు విలువ రేటు అనేది అందరికీ సంబంధించిన సగటు రేటు. అది, అందరి గురించీ ఒకే రకంగా చెపుతుంది. అంటే, అదనపు విలువ రేటు 100% అయితే, ప్రతీ జీతమూ ఆ రేటుతోనే అదనపు విలువని ఇచ్చినట్టు కనపడుతుంది. కానీ, ఈ లెక్క అసలు నిజాన్ని కొంతవరకే చెపుతుంది గానీ పూర్తిగా చెప్పదు. దోపిడీ సమాజాల్లో ఒక ఉన్నత మేధాశ్రమల కార్మికుడి జీతం, ఒక శారీరక శ్రమల కార్మికుడి జీతం కన్నా ఎంత ఎక్కువగా ఉండాలో అంతమాత్రమే గాక అంతకన్నా చాలా ఎక్కువగా ఉంటుంది. జీతాల మధ్య తేడాలు అలా వున్నప్పుడు అందరి అదనపు శ్రమా ఒకే శాతంతో ఉంటుందనుకోవడం కొంత వరకే కరెక్టు. కానీ, అదనపు విలువ రేటు, సగటు లెక్కల కన్నా ఎక్కువ వివరాలు చూపించదు. కాబట్టి, శ్రామికుల విషయంలో గ్రహించ వలసింది ఏమిటంటే - అందరి విషయంలోనూ దోపిడీ రేటు ఒకే రకంగా ఉండదు - అని. శారీరక శ్రమల కార్మికులు, మేధాశ్రమల కార్మికుల కన్నా తప్పనిసరిగా ఎక్కువ దోపిడీకి గురి అవుతారనీ, అందుకే వారు ఎక్కువ పేదతనంలో ఉంటారనీ గ్రహించాలి. కానీ, వేరు వేరు కార్మికుల అదనపు విలువని చూడడానికి అక్కడ వున్న అదనపు విలువ రేటు ద్వారా చూడడం తప్ప దానికి వేరే మార్గం ఉండదు. అందుకే అవి ఒకే రేటుతో కనపడతాయి.

# లాభం రేటు

పెట్టుబడిదారుడి దృష్టిలో 'అదనపు విలువ' అనే మాట వుండనే వుండదు. 'లాభమే' వుంటుంది. తను పెట్టిన పెట్టుబడి కన్నా ఎక్కువగా వచ్చేదాన్ని వాడు 'లాభం' అనే మాటతోనే వ్యవహరిస్తాడు. '100 పెట్టుబడి'కి ఎంత లాభం? ('నూటి'కి ఎంత లాభం?) — అని చూసుకుంటాడు. ఇదే 'లాభం రేటు'.

అయితే, పెట్టుబడిదారుడి లెక్కలన్నీ, నిజమైన లెక్కలకన్నా చాలా తేడాగా వుంటాయి. కాబట్టి, ప్రతీచోటా మనం, విషయాల్ని ఎలా అర్థం చేసుకోవాలంటే — సరైన అవగాహన ప్రకారమూ, పెట్టుబడిదారుడి అవగాహన ప్రకారమూ కూడా — అర్థం చేసుకుంటూ వుండాలి.

బట్ట ఉదాహరణలో — బట్ట కోసం ఖర్చయిన పెట్టుబడి 100. స్థిర 80. అస్థిర 20. అదనపు విలువ 20.

ఈ వివరాలతో, 'లాభం రేటు'ని సరైన అవగాహన ప్రకారమూ, పెట్టుబడిదారీ అవగాహన ప్రకారమూ కూడా చూడాలి.

**సరైన అవగాహన ప్రకారం :**

అంటే, ఇది మన అవగాహన. 'జీతాల'కూ (20 కీ), 'అదనపు విలువ'కూ (20 కీ) వున్న సంబంధం — 'అదనపు విలువ రేటు'. ఇది 100%.

'ఖర్చయిన పెట్టుబడి'కీ (100 కీ), 'అదనపు విలువ'కీ (20 కీ) వున్న సంబంధం — 'లాభం రేటు'. (లేదా, లాభ శాతం.) 100 పెట్టుబడికి, 20 లాభం కాబట్టి, లాభం రేటు 20%

100 పెట్టుబడికి, 20 లాభం అన్నప్పుడు, ఆ లాభాన్ని, 'పెట్టుబడి'లోని అన్ని భాగాలూ (పెట్టుబడి అంతా) ఇచ్చినట్టు కనపడుతుంది. కానీ, నిజానికి, ఆ '20 లాభాన్ని' ఇచ్చింది — పెట్టుబడిలోని 'జీతాల' భాగం మాత్రమే.

ఉదాహరణలో, '100% అదనపు విలువ రేటు' అన్నా, '20% లాభం రేటు' అన్నా, కార్మికులు ఇచ్చిన అదనపు విలువ మొత్తం ఒకటే. కానీ, 'అదనపు విలువ రేటు' అన్నప్పుడు కనపడే విషయం, ('పని దినం'లో సగం కాలం 'అదనపు శ్రమ' జరిగింది— అనే విషయం) 'లాభం రేటు' అన్నప్పుడు కనపడదు.

**పెట్టుబడిదారీ అవగాహన ప్రకారం :**

బట్ట ఉదాహరణలో, పెట్టుబడిదారుడి అవగాహన ప్రకారం, ఖర్చయిన పెట్టుబడి 100 కాదు. వర్తక కమిషనూ, వడ్డీ, భూమి అద్దె, పన్నులూ వగైరాలన్నిటికీ కలిపి పెట్టుబడిదారుడు, ఇంకో 12 చెల్లిస్తాడు కాబట్టి, అదంతా కలిసినదే 'ఖర్చయిన పెట్టుబడి'. అదీ 112. పెట్టుబడిదారుడికి, చివరికి మిగిలే ఉత్పాదక లాభం 8. కాబట్టి, పెట్టుబడిదారుడు, '112 పెట్టుబడి పెడితే, 8 లాభం వచ్చింది'— అనుకుంటాడు. అంతేగానీ, '100 పెట్టుబడికి 20 లాభం వచ్చింది' అనుకోడు.

కాబట్టి పెట్టుబడిదారుడి ప్రకారం,

112 పెట్టుబడికి — 8 లాభం అయితే,

100 కి ఎంత? = 8 ÷ 112 × 100 = 7%

పెట్టుబడిదారుడికి కనపడే లాభం రేటు 7%

కాని, నిజం లాభం రేటు 20%

పెట్టుబడిదారుడికి, లాభం రేటు 7% మాత్రమే కనపడినా, దానివల్ల విషయం ఏమీ మారదు. అంటే, ఈ ఉదాహరణలో 'కార్మికులు 100% అదనపు విలువని ఇచ్చారు' అనే విషయం ఏమీ మారదు.

'లాభం రేటు'ని అర్థం చేసుకోవడంలో ఇంకా కొన్ని విషయాలు చూడాలి.

**(1)** 'పని స్థలం'లో చాలా ఫిక్సెడ్ పెట్టుబడి వుంటుంది. కానీ అదంతా సరుకులోకి రాదు. పెట్టుబడిదారుడు, 'లాభం రేటు'ని మొత్తం పెట్టుబడి మీద చూసు కుంటాడా? 'చలామణీ పెట్టుబడి' మీద మాత్రమే చూసుకుంటాడా?

ఈ ఉదాహరణ చూడండి.

ఒక పని స్థలంలో వున్న మొత్తం పెట్టుబడి 500. అందులో స్థిర 410. అస్థిర 90. స్థిరలో ఫిక్సెడ్ సాధనాల మీద 200. నాన్ ఫిక్సెడ్ మీద 210. ఫిక్సెడ్ సాధనాల నించీ అరిగిన భాగం 20. అదనపు విలువ రేటు 100%. వివరాలన్నీ ఇలా వుంటే, తయారైన సరుకు విలువ ఎంత?

సరుకు విలువ = నాన్ ఫిక్సెడ్ సాధనాలు 200 + ఫిక్సెడ్ నించి అరిగిన భాగం 20 + జీతాలు 90 + అదనపు విలువ 90 = 400. ఇందులో, 'చలామణీ పెట్టుబడి' ఎంత? సరుకు విలువ అయిన 400 నించి అదనపు విలువ అయిన 90 ని తీసేస్తే, మిగిలిన 310 చలామణీ పెట్టుబడి. 310 ఖర్చుతో తయారైన సరుకుని అమ్మితే, 400 వస్తుంది. అంటే, 90 అదనపు విలువ. లేదా, 90 లాభం.

ఈ ఉదాహరణలో 'లాభం రేటు' ఎంత? — ఇక్కడ 2 పెట్టుబడులు వున్నాయి. 500 అనేది పని స్థలంలో వుండే మొత్తం పెట్టుబడి. 310 అనేది, ఒక సరుకు కోసం ఖర్చయిన 'చలామణీ పెట్టుబడి'. ఈ సరుకు ద్వారా 90 లాభం వచ్చింది కదా? 'లాభం రేటు'ని చూడాలంటే, 'మొత్తం పెట్టుబడి' మీద చూడాలా, 'చలామణీ పెట్టుబడి' మీదే చూడాలా? —ఎలా చూసినా విషయం ఒకటే. ఎందుకంటే, ఎలా చూసినా 'ఉన్న లాభం రాసి' ఒకటే. అది 90 య్యే. దానితోనే 'లాభం రేటు'ని చూడాలి.

'చలామణీ పెట్టుబడి' మీద లాభం రేటుని చూస్తే :

410 చ. పెట్టుబడికి —90 లాభం అయితే,

100 ,, ?

90 ÷ 410 × 100 = 22%

మొత్తం 'పెట్టుబడి మీద 'లాభం రేటు'ని చూస్తే :

500 మొత్తం పెట్టుబడికి —90 లాభం అయితే,

100 ,, ?

90 ÷ 500 × 100 = 18%

దీని అర్థం ఏమిటి? — లాభం రేటుని చలామణీ పెట్టుబడి మీద చూస్తే, అది కొంత ఎక్కువ రేటుగా ఉంటే, మొత్తం పెట్టుబడి మీద అయితే, కొంత తక్కువ రేటుగా వుంటుంది. ఎలా అయినా ఒకటే.

బట్ట ఉదాహరణలో, పెట్టుబడిదారుడు, 'లాభం రేటు'ని, చలామణీ పెట్టుబడి మీద చూసుకున్నట్టయితే 22% చొప్పునా ; 'మొత్తం పెట్టుబడి' మీద చూసుకున్నట్టయితే 18% చొప్పునా — చూసుకుంటాడని అర్థం. ఆ లెక్కనే తన లాభాన్ని వేసుకుంటాడు.

ఒక పెట్టుబడిదారుడికి వర్తించేదే పెట్టుబడిదారులందరికీ వర్తిస్తుంది. ఒకడు, లాభం రేటుని చలామణీ పెట్టుబడి మీదే చూసుకోవచ్చు, ఎక్కువ రేటుతో. ఇంకొకడు మొత్తం పెట్టుబడి మీద చూసుకోవచ్చు, తక్కువ రేటుతో. ఎలా చూసినా సారాంశం ఒకటే.

పెట్టుబడిదారుడు, కొత్త సరుకుని తయారు చేయిస్తూ వుండగా అదే రకం సరుకు మార్కెట్లో అమ్ముడుపోతూ వుంటుంది. దాని ద్వారా 'లాభం' వస్తూ వుంటుంది. దాన్ని బట్టి, ఆ సరుకు విషయంలో 'లాభం రేటు' ఎంత వుందో తెలుస్తుంది. ఆ సరుకుని తయారుచేసే ఖర్చులో మార్పేమీ

లేకపోతే, పెట్టుబడిదారుడు తన కొత్త సరుకుకి 'విలువ'ని నిర్ణయించేటప్పుడు, ఎప్పుడూ వస్తూ వున్న 'లాభం రేటు' ప్రకారమే విలువని నిర్ణయిస్తాడు. ఈ కొత్త సరుకు కూడా మార్కెట్లోకి వెళ్ళి అమ్మకం అయినప్పుడు, ఖర్చయిన పెట్టుబడి అంతా తిరిగివస్తూ, పెట్టుబడి దారుడు వేసుకున్న 'లాభం రేటు'నే తెస్తుంది.

**(2)** 'లాభం రేటు' అనేదాన్ని సాధారణంగా, 1 సంవత్స రానికి గానీ, 6 నెలలకు గానీ చూస్తారు. సంవత్సర లాభం రేటు 24% అయితే, 6 నెలల లాభం రేటు 12% అవు తుంది. 1 నెల లాభం రేటు 2%. ఎలా చూసినా విషయం ఒకటే. — లాభం రేటు 1 నెలకి సంబంధించింది అయితే, 'సరుకు'కి సంబంధించిన సమస్త ఖర్చులూ 1 నెలకి సంబంధించినవే అవుతాయి. 1 నెల పెట్టుబడీ, 1 నెల వడ్డీ, 1 నెల పన్నులూ — ఇలా. లాభం రేటు, సంవత్సరానికి సంబంధించింది అయితే, ఖర్చులన్నీ సంవత్సరానికి సంబంధించినవే.

**(3)** అదనపు విలువా, అదనపు విలువ రేటూ — అనే మాటలు, 'దోపిడీ'నీ, దాని స్థాయినీ స్పష్టంగా చూపి స్తాయి. అవి, 'శ్రమ'నే ప్రధాన విషయంగా చూపిస్తాయి.

లాభమూ, లాభం రేటూ — అనే మాటలు, దోపిడీని మరుగుపరుస్తాయి. 'లాభం' అనేది 'పెట్టుబడి' ద్వారా వచ్చే విషయం అయినట్టూ, పెట్టుబడి నించి రావలసిన దేదో వచ్చినట్టూ, చూపిస్తాయి. ఇవి, 'పెట్టుబడి'నే ప్రధాన విషయం చేస్తాయి.

**(4)** లాభానికి గుర్తు — P ( ప్రాఫిట్ )
'లాభం రేటు'కి గుర్తు — $P^1$

$P^1$ = లాభమూ ÷ పెట్టుబడీ × 100

90 P ÷ 500 C × 100 = 18%

**(5)** ఒక శాఖలో పెట్టుబడిదారులందరూ ఒకే రకం సరుకుని ఉత్పత్తి చేయించినప్పటికీ, అందరి లాభం రేట్లూ గిరి గీసినట్టు ఒకే స్థాయిలో వుండవు. వాళ్ళ ప్రత్యేక పరిస్థితుల్ని బట్టి వాళ్ళ లాభం రేట్లు కొంత కొంత తేడాలతోనే వుంటాయి. కానీ, ఆ తేడాలు మరీ ఎక్కువగా వుండవు. ఆ తేడాల మధ్య కూడా ఒక సగటు పరిస్థితి వుంటుంది. అంటే, ప్రతీ శాఖలోనూ ఒక సగటు లాభం రేటు వుంటుంది.

అలాగే వేరు వేరు శాఖల్ని తీసుకుంటే, అన్ని శాఖలలోనూ లాభం రేట్లు ఒకే స్థాయిలో వుండవు. కొంత కొంత తేడాలతో ఏ శాఖ లాభం రేటు ఆ శాఖకి వుంటుంది. కానీ, ఆ తేడాల మధ్య కూడా ఒక సగటు పరిస్థితి వుంటుంది. అంటే, అన్ని శాఖలకూ సంబంధించి ఒక 'సగటు లాభం రేటు' వుంటుంది. — ఈ విషయాలన్నీ తర్వాత చాప్టర్లలో వివరంగా చూస్తాము.

# ప్రశ్నలూ — జవాబులూ

**1. పని దినం ఏ యే భాగాలుగా వుంటుంది? అలా ఎందుకు వుంటుంది?**

**జ:** పని దినం — అవసర శ్రమ భాగం, అదనపు శ్రమ భాగం – అని, 2 భాగాలుగా వుంటుంది. ఎందుకు అలా వుంటుందంటే : శ్రామికులు, తాము వాడుకునే జీతాల విలువకు సరిపోయే పని చెయ్యాలి కాబట్టి, అది మొదటి భాగం. అంతకన్నా అదనంగా కూడా చెయ్యాలి కాబట్టి, అది రెండో భాగం.

**2. 'అదనపు విలువ' అంటే ఏమిటి? 'అదనపు విలువ రేటు' అంటే ఏమిటి? రెండూ ఒకటేనా?**

**జ:** రెండూ ఒకటి కాదు. 'అదనపు విలువ' అంటే — జీతాల విలువ కన్నా అదనంగా ఉత్పత్తి అయిన విలువ. 'అదనపు విలువ రేటు' అంటే — అదనపు విలువని జీతాలతో పోల్చినప్పుడు వచ్చే శాతం.

**3. అదనపు విలువ రేటు — 100%. అవసర శ్రమ 100. అదనపు శ్రమ 100. వాటి సంబంధం = 100 : 100 = 1:1. పనిదినం 1+1 = 2 భాగాలుగా వుంటుంది. పని దినం 8 గం.లు. — ఈ ఉదాహరణలో చూపించిన విధంగా, ఇక్కడ ఇచ్చే అదనపు విలువ రేట్లన్నిటినీ వివరించి రాయండి! పని దినంలో ఏ భాగం ఎంత?**

**300%, 700%, 25%, 75%.**

**జ:** **(1)** అదనపు విలువరేటు 300%. పని దినంలో మొదటి భాగం 100 అయితే, రెండో భాగం 300.

| అవసర శ్రమ | : | అదనపు శ్రమ | |
|---|---|---|---|
| 100 | : | 300 | |
| 1 | : | 3 | = 4 భాగాలు. |

మొదటి భాగం $\frac{1}{4}$; రెండో భాగం $\frac{3}{4}$

8 గంటల పని దినంలో,

మొదటి భాగం = $\frac{1}{4} \times 8$ = 2 గంటలు

రెండో భాగం = $\frac{3}{4} \times 8$ = 6 గంటలు

**(2)** అదనపు విలువ రేటు 700%

| మొదటి భాగం | : | రెండో భాగం | |
|---|---|---|---|
| 100 | : | 700 | |
| 1 | : | 7 | = 8 భాగాలు. |

మొదటి భాగం $\frac{1}{8}$; రెండో భాగం $\frac{7}{8}$

8 గంటల పని దినంలో,

మొదటి భాగం = $\frac{1}{8} \times 8$ = 1 గంట

రెండో భాగం = $\frac{7}{8} \times 8$ = 7 గంటలు

**(3)** అదనపు విలువ రేటు 25%

అవసర భాగం 100 అయితే, అదనపు భాగం 25.

100 : 25

4 : 1 = 5 భాగాలు.

8 గంటల పని దినంలో,

మొదటి భాగం = $\frac{4}{5} \times 8$ = 6 గం. 24 ని.

రెండో భాగం = $\frac{1}{5} \times 8$ = 1 గం. 36 ని.

**(4)** అదనపు విలువ రేటు 75%

మొదటి భాగం : రెండోభాగం

100 : 75

4 : 3 = 7 భాగాలు

8 గంటల పని దినంలో,

మొదటి భాగం = $\frac{4}{7} \times 8$ = 4.34 ని.

రెండో భాగం = $\frac{3}{7} \times 8$ = 3.26 ని.

**4. ఒక 'పని స్థలం'లో అదనపు విలువ రేటు 50%. కార్మికులు గతం కన్నా రెట్టింపు అయ్యారు. అప్పుడు, అదనపు విలువ రేటు ఎంత?**

**జ:** కార్మికులు పెరిగినా, అదనపు విలువరేటు గతంలో లాగే వుంటుంది. అదనపు విలువ రాసే పెరుగు తుంది.

**5. జీతాలు 150. అదనపు విలువ రేటు 50%. అదనపు శ్రమ చేసిన కాలానికి కూడా జీతాలు ఇచ్చేస్తే, ఇంకా ఎంత జీతాలు ఇవ్వాలి?**

**జ:** అదనపు విలువ రేటు 50% అంటే, అవసర కాలం 100 అయితే, అదనపు కాలం 50. జీతాలు 150 కాబట్టి, అదనపు విలువ 75. కార్మికుల శ్రమని కార్మికులకు ఇచ్చెయ్యాలంటే, ఆ 75 ని కూడా ఇచ్చెయ్యాలి.

**6. సరుకు విలువ 115. ఆ సరుకుని ఉత్పత్తి చెయ్యడానికి 83 ఖర్చయిందన్నాడు పెట్టుబడిదారుడు. ఆ ఖర్చులు ఇలా చెప్పాడు — జీతాలు 30. వడ్డీ 5. పన్నులు 5. భూమి అద్దె 8. ఉత్పత్తి సాధనాలకు 35. అదనపు విలువ రేటు ఎంత?**

**జ:** జీతాలకు 30. ఉత్పత్తి సాధనాలకు 35. ఈ 2 ఖర్చులూ కలిసి 65. సరుకు విలువ అయిన 115 లో నించి, ఈ 2 ఖర్చుల్నీ తీసేస్తే, మిగిలినదంతా అదనపు విలువే. అది, 115 – 65 =50. 30 జీతాలకు 50 అదనపు విలువ అయితే, 100 కి ఎంత?

50 ÷ 30 × 100 = 167%. ఇదే అదనపు విలువ రేటు.

**7. జీతాలు 30. అదనపు విలువ 150. ఇక్కడ, అదనపు శ్రమకు కూడా జీతాలు ఇచ్చేస్తే ఎంత ఇవ్వాలి?**

**జ:** అదనపు విలువ అంతా ఇచ్చెయ్యాలి. అంటే 150 ని.

**8. అదనపు విలువ రేటు 300%. పనిదినం 12 గం.లు. దాని భాగాలు ఎంతెంత?**

**జ:** అవసర కాలం 100 అయితే, అదనపు కాలం 300. వాటి పాళ్ళు = 1 : 3 = 4 భాగాలు

12 గంటల పనిదినంలో—

మొదటి భాగం = 12 × $\frac{1}{4}$ = 3 గంటలు.

రెండో భాగం = 12 × $\frac{3}{4}$ = 9 గంటలు.

**9. ఒక సరుకు కోసం ఖర్చయిన పెట్టుబడి 30. అందులో స్థిర, అస్థిరలు = 20 : 10. అదనపు విలువ —50. అదనపు విలువ రేటు ఎంత? లాభం రేటు ఎంత?**

**జ:** అదనపు విలువ రేటు—అంటే, అదనపు విలువకీ జీతాలకూ వున్న సంబంధం. 10 జీతానికి 50 అదనపు విలువ అయితే, 100కి ఎంత?

50 ÷ 10 ×100 = 500%.

లాభం రేటు అంటే — అదనపు విలువకీ పెట్టుబడికీ వున్న సంబంధం. 30 పెట్టుబడికి 50 అదనపు విలువ అయితే, 100 పెట్టుబడికి ఎంత?

50 ÷ 30 × 100 = 167%.

అదనపు విలువ రేటు 500% అయితే, లాభం రేటు 167%.

**10. అదనపు విలువ రేటు ఎక్కువగానూ, లాభం రేటు తక్కువగానూ కనపడతాయి. ఎందుచేత?**

**జ:** రెండు సందర్భాల్లోనూ అదనపు విలువరాసి ఒకటే. ఆ రాసిని, జీతాలతో మాత్రమే పోల్చడం వల్ల ఆ రేటు ఎక్కువ గానూ, పెట్టుబడి అంతటితోటీ పోల్చడం వల్ల ఆ రేటు తక్కువగానూ, కనపడతాయి.

★

# 6. ఉత్పత్తి సాధనాల విలువ బదిలీ

# ఉత్పత్తి సాధనాలు ఎవరివి?

[ ఈ చాప్టరు, ఈ సంపుటానికి 2 వ ముద్రణ సమయంలో, 2008 మార్చిలో, కొత్తగా రాసినది ]

ఉత్పత్తి సాధనాల విలువ బదిలీ - గురించి, ఈ సంపుటంలోనే, ఈ 2 వ భాగంలోనే, 'లాభం' చాప్టరులో క్లుప్తంగా చూశాం. కానీ దీన్ని ఇంకా ఎక్కువ వివరాలతో అర్థం చేసుకోవాలి. ఈ వివరాలు చూస్తే, గత కాలం నించీ వున్న ఉత్పత్తి సాధనాలన్నీ ఎవరివీ — అనేది తెలుస్తుంది. 'ఆర్థిక శాస్త్రం'లో ఇది, అతి ముఖ్య విషయాల్లో ఒకటి.

ఒక సరుకు తయారైనప్పుడు, దాని కోసం ఖర్చయిన ఉత్పత్తి సాధనాల విలువ, ఆ సరుకు విలువలోకి బదిలీ అవుతుందని గతంలోనే చూశాం. బట్ట, చొక్కాగా తయారైనప్పుడు ముడి పదార్థం అయిన ఆ బట్ట విలువ అంతా, చొక్కా విలువలోకి లెక్కకు వస్తుంది. కత్తెర నించీ, కుట్టు మిషను నించీ, ఆ రకం 'శ్రమ పరికరాల' నించి కూడా కొంత కొంత విలువలు, చొక్కా విలువ లెక్కలోకి చేరతాయి. పత్తి విలువ దారానికీ, దారం విలువ బట్టకీ, బట్ట విలువ చొక్కాకీ — ఇలా. ( ఇలా చేరేటప్పుడు, ఉత్పత్తి సాధనాలు, తమ విలువ కన్నా ఎక్కువ విలువని చేర్చలేవు. ఎందుకంటే, అవి నిర్జీవ వస్తువులు కాబట్టి, అవి తమ విలువని ఎక్కువో తక్కువో చెయ్యలేవు. ఈ సంగతంతా మనకు గతంలోనే తెలుసు. ఈ చాప్టరులో చూడబోయేది ఈ సంగతి కాదు. )

ఉత్పత్తి సాధనాల విలువ, ఒక చోటు నించి ఇంకో చోటుకి ( ఒక ఉత్పత్తి నించి ఇంకో ఉత్పత్తికి ) మారుతూ వుంటే, మరి, ఆ విలువ ఎప్పుడు ఖర్చయిపోతుంది? ఆ శ్రమ, అసలు ఎప్పుడు జరిగింది? ఎవరి ద్వారా జరిగింది? — ఈ విషయాలు ఇప్పుడు చూస్తాం.

ఈ ప్రశ్నలకు మొదట క్లుప్తంగా జవాబులు: ఒక వస్తువు పూర్తిగా పాతబడి పనికి రాకుండా పోయినప్పుడు, దాని విలువ అంతా ఖర్చయి పోయిందని అర్థం. ఆ వస్తువు మన్నినంత కాలమూ, దాని విలువలో కొంత కొంత ఖర్చవుతూ, చివరికి విలువ అంతా పూర్తిగా పోతుంది. ఆ వస్తువుకి ఆ విలువని ఇచ్చిన సజీవ, నిర్జీవ శ్రమలు రెండూ ఖర్చయిపోతాయి. 'ఉత్పత్తి సాధనాల' విషయంలో అయినా అదే జరుగుతుంది. వాటి శరీరాలూ ఖర్చయి పోతాయి, వాటి విలువలూ ఖర్చయిపోతాయి. పూర్తిగా పాడవకుండా ఇంకా వాడకంలో వున్న వస్తువుల విషయంలో, వాటి విలువలు ఇంకా కొంత కొంత నిలిచి వుంటాయి.

'శ్రమ' అనేది ఏదైనా, ఎప్పుడు జరిగినది అయినా, అది శ్రమలు చేసిన మనుషులదే. ఉత్పత్తి సాధనాల నించి బదిలీ అయ్యే శ్రమ, గత కాలంలో చేసినది. గత కాలం అంటే ఎప్పుడు? — ఈ విషయాలు చూస్తే, సమాజంలో ఎప్పుడూ వున్న ఉత్పత్తి సాధనాలన్నీ శ్రమలు చేసిన మనుషులవే — అని అర్థం చేసుకోగలం.

కుట్టు మనిషి ఒక చొక్కా కుట్టాడు. దాని కోసం కొంత బట్టా, కొంత దారం, మిషను అరుగుదలా వంటి ఉత్పత్తి సాధనాల విలువ 8. కుట్టు మనిషి చేసిన శ్రమ విలువ 4. చొక్కా మొత్తం విలువ 12.

ఈ ఉదాహరణలో, కుట్టు మనిషి శ్రమ — సజీవ శ్రమ. ( కొత్త శ్రమ. ప్రస్తుత శ్రమ. ) ఉత్పత్తి సాధనాలు, అప్పటికే తయారైవున్న వస్తువులు కాబట్టి, వాటి నించి చేరే శ్రమ — నిర్జీవ శ్రమ ( పాత శ్రమ. గత శ్రమ. ) ఆ సజీవ - నిర్జీవ శ్రమలు రెండూ కలిసే చొక్కా విలువ.

ఇక్కడ చూడవలసిందంతా ఉత్పత్తి సాధనాల సంగతే. అవి బదిలీ చేసే నిర్జీవ శ్రమ సంగతే. ( ఉత్పత్తి సాధనాలు బదిలీ చేసే శ్రమని 'నిర్జీవ శ్రమ' అనడంలోనే దాని స్వభావం సరిగా కనపడుతుంది. తన విలువ కన్నా ఎక్కువ విలువ ఇవ్వలేనిది — అని. సజీవ శ్రమ లాగా చెయ్యలేనిది — అని. )

చొక్కాకి ఉత్పత్తి సాధనాల ద్వారా చేరిన 8 నిర్జీవ శ్రమ, ఆ ఉత్పత్తి సాధనాలకు ఎలా వచ్చింది? ఏ ఉత్పత్తికైనా విలువ ఎలా వస్తుందో, వాటికీ అలాగే వచ్చింది. అవి తయారయ్యేటప్పుడు ఖర్చయిన సజీవ, నిర్జీవ శ్రమలు కలిసి. ఆ ఉత్పత్తి సాధనాలు తయారయ్యేటప్పుడు, వాటి కోసం కూడా కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కొంత సజీవ శ్రమా కావాలి. ఆ సజీవ శ్రమని 2 అనీ, అక్కడికి బదిలీ అయిన

నిర్జీవ శ్రమని 6 అనీ అనుకుంటే, ఆ రెండూ కలిసే ఆ 8 విలువ.

అయితే, ఆ 8 విలువ గల ఉత్పత్తి సాధనాలలోకి చేరిన 6 నిర్జీవ శ్రమ, అక్కడికి ఎలా వచ్చింది? — ఇది పాత జవాబే. ఒక ఉత్పత్తిలోకి 6 నిర్జీవ శ్రమ చేరిందంటే, అక్కడ 6 విలువ గల ఉత్పత్తి సాధనాలు ఖర్చయ్యాయి అని అర్థం. ఆ 6 విలువ కూడా సజీవ, నిర్జీవ శ్రమలు కలిసి ఏర్పడినదే. అందులో నిర్జీవ శ్రమ 4, సజీవ శ్రమ 2 అనుకుంటే, ఆ 4 నిర్జీవ శ్రమ మీద మళ్ళీ ప్రశ్న వస్తుంది. అది అక్కడికి ఎలా వచ్చింది — అని. — మళ్ళీ పాత జవాబే.

ఈ రకంగా, చొక్కాకి గానీ, ఇంకో వస్తువుకి గానీ బదిలీ అయిన ఉత్పత్తి సాధనాల విలువ ఎలా వచ్చిందో దాన్ని వెతుక్కుంటూ వెనక్కి వెనక్కి వెళ్తే, అసలు ఉత్పత్తి సాధనాలే ప్రారంభం కాని, ఆ విలువే లేని, ఆ శ్రమే జరగని ప్రాచీన కాలానికి చేరుకుంటాం. అంత పాత కాలానికి వెళ్తేనే ఉత్పత్తి సాధనాలు ఎలా ప్రారంభమయ్యాయో, అవి క్రమ క్రమంగా ఎలా పెరిగాయో చూస్తాం.

ఒక వెయ్యి సంవత్సరాలు వెనక్కి పోయి చూస్తే, సమాజంలో ఆ నాడు వుండే 'ఉత్పత్తి సాధనాలు' చాలా తక్కువ. 10 వేల సంవత్సరాలు వెనక్కి పోయి చూస్తే, అప్పుడు వుండే ఉత్పత్తి సాధనాలు మరీ తక్కువ. ఇంకా ఇంకా వెనక్కి పోయి చూస్తే, ఒక చోట 'ఉత్పత్తి సాధనాలే లేని కాలం' కనపడుతుంది. మనుషులు జంతువుల లాగే కేవలం ప్రకృతిలో ఏది దొరికితే అది తింటూ జీవించిన కాలం అది. ఇంకా బట్టలు కట్టుకోవడం కూడా తెలియని కాలం అది.

అలాంటి కాలంలో, మనుషులు నగ్నంగానే చెట్లెక్కి పళ్ళు కోసుకుని తినేవారనుకుందాం. 'పళ్ళు కొయ్యడం' అనే పనిలో ఉత్పత్తి సాధనం ఏది? — ఏదీ వుండదు.

చెట్టు మీద వున్న పళ్ళు — ప్రకృతి సహజ పదార్థం.

అవి, కిందికి రావడానికి 15 నిముషాల 'సజీవ శ్రమ' అవసరమైందనుకుందాం. ఆ పనిలో శ్రమ పరికరం ఏదీ లేదు కాబట్టి 'గత శ్రమ' లేదు.

ఆ పళ్ళ కోసం, ఎంత శ్రమ ఖర్చయినట్టు? 15 నిముషాల సజీవ శ్రమ మాత్రమే. ( విలువగా చూస్తే, ఆ శ్రమే, ఆ పళ్ళ విలువ. )

చెట్టు కిందకి చేరిన పళ్ళు, గత శ్రమ లేకుండా సజీవ శ్రమతో మాత్రమే వచ్చిన ఉత్పత్తి. ఆ ఉత్పత్తిలో నించి 'శ్రమ'ని తీసేస్తే ఏం మిగులుతుంది? శ్రమని తీసెయ్యడం అంటే, ఆ శ్రమే జరగకపోవడం. ఆ పనే జరగకపోతే, ఆ పళ్ళు చెట్టు మీదే వుంటాయి.

ఆ పళ్ళని తినేస్తే ఏ యే అంశాలు ఖర్చయిపోతాయి? ఆ సజీవ శ్రమ ఖర్చయిపోతుంది. ఆ సహజ పదార్థం కూడా వాడకం అయిపోతుంది. కానీ, సహజ పదార్థం విషయంలో, అది 'ఖర్చయి పోవడం' అవదు. 'ఖర్చు' అనేది శ్రమకు మాత్రమే వర్తిస్తుంది.

మళ్ళీ పళ్ళు కోసుకోవాలంటే, మళ్ళీ 'శ్రమ' చెయ్యాలి. మళ్ళీ చెట్టు ఎక్కాలి.

రెండో ఉదాహరణ : అలాంటి కాలంలోనే, మనుషులు భూమిలో వున్న 'దుంపలు' తవ్వుకోవాలనుకున్నారు. ఆ పని కోసం సూదిగా వున్న రాతి ముక్క కోసం వెదికి పట్టుకున్నారు. ( ఆ రాతిని ఎవరూ అలా సూదిగా తయారు చెయ్యలేదు. అలాంటి రాతి ముక్కే దొరికింది. )

భూమిలో మట్టితో కప్పడిపోయి వున్న దుంపలు — ప్రకృతి సహజ పదార్థం. అలాగే, ఒక చోట పడి వున్న ఆ సూది రాతి ముక్క కూడా — ప్రకృతి సహజ పదార్థమే.

ఒక మనిషి, ఆ రాతి ముక్కతో 'తవ్వకం' పని చేసి, దుంపల్ని తీసి నేల మీద పెట్టాడు. దాని కోసం 30 నిముషాలు పట్టిందనుకుందాం. 'తవ్వకం' పని — సజీవ శ్రమ.

ఆ పని జరగటానికి, ఒక రాతి ముక్క, 'శ్రమ పరికరం'గా ఉపయోగపడింది. అయితే, ఆ శ్రమ పరికరం మనుషుల శ్రమతో తయారైనది కాదు. ప్రకృతిలో సహజంగా దొరికినది.

నేల మీద వున్న దుంపల కోసం ఎంత శ్రమ ఖర్చయింది? 30 నిముషాల 'సజీవ శ్రమ' మాత్రమే ఖర్చయింది. తవ్వకం పనిలో, ఒక శ్రమ పరికరం వున్నా, అది మనుషుల శ్రమతో తయారైనది కాదు కాబట్టి, ఆ పరికరం వల్ల దుంపలకు చేరే 'గత శ్రమ' వుండదు.

ఆ దుంపలు బైట పడడానికి, సహజ శ్రమ పరికరం కూడా కారణమే. కానీ, దుంపల కోసం ఖర్చయిన శ్రమ అయితే, సజీవ శ్రమ మాత్రమే. నిర్జీవ శ్రమ లేదు.

నేల మీద దుంపలు — ప్రకృతి సహజ పదార్థమేనా? — కాదు. భూమి లోపల వున్నప్పుడు మాత్రమే అవి ప్రకృతి సహజ పదార్థం. తవ్వకం శ్రమ జరిగి బయటికి వచ్చిన తర్వాత అవి, సహజ పదార్థమూ, సజీవ శ్రమా కలిసి తయారైన 'ఉత్పత్తి'.

ఆ ఉత్పత్తి, ఆ నేల మీద దుంపలు, ముడి పదార్థమా? — ఆ దుంపల మీద ఇంకే పనీ జరగకుండా అవే వాడకంలోకి వెళ్ళిపోతే, ( ఆ దుంపల్ని తినేస్తే), అవి ముడి పదార్థం కాదు. వాడకానికి సిద్ధంగా వున్న పదార్థమే. ఆ దుంపల్ని నిప్పుల్లో కాల్చడం లాంటి ఇంకో పని ఏదైనా జరగవలసి వుంటే, ఆ ఇంకో పని జరగడానికి అవి ముడి పదార్థం.

నేల మీదకు చేరిన ఆ దుంపలలో నించి 'శ్రమ' భాగాన్ని తీసివేస్తే ఏం మిగులుతుంది? — 'శ్రమ' భాగాన్ని

తీసివెయ్యడం అంటే, శ్రమే జరగకపోవడం. శ్రమే జరగనప్పుడు, ఆ దుంపలు నేల మీద ఉండవు. నేలలో కప్పడిపోయి వుంటాయి. 'శ్రమ సాధనం' గా ఉపయోగపడిన రాతి ముక్కేమో, మొదట ఎక్కడ పడి వుందో అక్కడే వుంటుంది. 'శ్రమే' లేనప్పుడు, ప్రకృతిలో ఏ పదార్థమూ కదలదు.

పళ్ళు — చెట్ల మీదే వుంటాయి.
దుంపలు — భూమి లోపలే వుంటాయి.
చేపలు — నీళ్ళల్లోనే వుంటాయి.
అంతా ఎక్కడివి అక్కడే!

తవ్వకం పని చేసి భూమిలో నించి తెచ్చుకున్న ఆ పచ్చి దుంపల్ని తినేస్తే ఏ యే శ్రమలు ఖర్చవుతాయి? — వాటి కోసం ఏ యే శ్రమలు జరిగాయో అవే ఖర్చవుతాయి. సజీవ శ్రమ ఒక్కటే జరిగింది కాబట్టి, ఆ 30 నిముషాల శ్రమ ఖర్చయిపోతుంది. ఆ సహజ పదార్థం కూడా వాడకం అయిపోతుంది. ఆ సూది రాతి ముక్క తవ్వకం పనిలో విరిగి పోతే, అది ఇక శ్రమ పరికరంగా పనిచెయ్యకుండా పాడై పోతుంది.

ఆ దుంపల్ని తిన్న వాళ్ళకి శక్తి వస్తుంది.

మూడో ఉదాహరణ :

దుంపల్ని తవ్వడానికి సరైన రాతి ముక్క దొరకలేదు. రాళ్ళన్నీ బండగా వున్నాయి. ఒక మనిషి, ఒక రాతి ముక్కని, ఇంకో రాతి మీద అరగదీసి సూదిగా తయారుచేశాడు. ఆ పనికి 20 నిముషాలు పట్టింది. అరగదియ్యక ముందు వున్న రాతి ముక్క — సహజ పదార్థం. దాన్ని అరగదీసిన శ్రమ — సజీవ శ్రమ. ఆ అరగదీసే శ్రమ జరగడానికి ఉపయోగపడిన ఇంకో రాయి, ఆ పనిలో శ్రమ పరికరం. కానీ ఆ శ్రమ పరికరంగా వున్న రాయి, శ్రమతో తయారైనది కాదు. కాబట్టి, దాని ద్వారా చేరే గత శ్రమ ఏదీ వుండదు. సూదిగా తయారైన రాయి, గత శ్రమ లేకుండా, సజీవ శ్రమతో మాత్రమే తయారైన శ్రమ పరికరం.

ఆ సూది రాతి ముక్కని తయారుచేసింది, దేని కోసం? — తవ్వకం పని కోసం.

మొదట శ్రమ పరికరాన్ని తయారుచేసుకున్నారు. అది మొదట జరిగింది. 20 నిముషాలు.

తర్వాత, ఆ రాతితో దుంపలు తవ్వారు. ఇది తర్వాత జరిగింది. 30 నిముషాలు.

అప్పటికి ఆ రాతి ముక్క విరిగి పోయిందనుకుందాం. దానితో ఇంకో చోట తవ్వడానికి ఇక పనికి రాదు.

ఈ ఉదాహరణలో, తవ్వకం పని సజీవ శ్రమ అయితే, అంతకు ముందు శ్రమ పరికరాన్ని తయారుచేసుకున్న శ్రమ — నిర్జీవ శ్రమ. గత శ్రమ.

ఇప్పుడు ఆ దుంపల్ని చూస్తే, వాటి కోసం ఏ యే శ్రమలు ఖర్చయ్యాయి? భూమిని తవ్విన 30 నిముషాల సజీవ శ్రమ మాత్రమే కాదు. ఆ పనిలో, శ్రమ పరికరంగా పని చేసిన రాతి ముక్క తాలూకు 20 నిముషాల 'గత శ్రమ' కూడా. మొత్తం 50 నిముషాల శ్రమ ఖర్చుతో, ఆ దుంపలు బైట పడ్డాయి.

ఇక్కడ, 'గత శ్రమ' అని దేన్ని అంటున్నామో ఆ శ్రమ, అది జరిగిన సమయంలో (రాతిని అరగదీసిన సమయంలో), సజీవ శ్రమే. అలా తయారైన వస్తువుని (సూది రాతిని), శ్రమ పరికరంగా వాడుతూ, ఒక పని చేసేటప్పుడు, ఆ శ్రమ పరికరాన్ని చేసిన సజీవ శ్రమ, గత శ్రమ అయింది. అది ప్రస్తుత శ్రమ కన్నా ముందు జరిగింది కాబట్టి.

ఆ దుంపల్ని అలాగే తినేస్తే, దాని కోసం జరిగిన మొత్తం 50 శ్రమ ఖర్చయిపోతుంది. అందులో వున్న నిర్జీవ, సజీవ శ్రమలు రెండూ కూడా. లేదా, ఆ దుంపల్ని అలాగే తినెయ్యకుండా, వాటి మీద ఇంకో పని ఏదైనా జరిగితే, అందులో వున్న సజీవ శ్రమ కూడా గత శ్రమే అవుతుంది.

ఆ దుంపల్ని నిప్పుల్లో పెట్టి కాల్చారనుకుందాం. ఆ 'కాల్చే' పనిలో ఆ దుంపలు, ముడి పదార్థం. (ఆ నిప్పులు ఆగ్జిలరీ పదార్థం. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఇక్కడ నిప్పుల్ని వదిలేసి ముడి పదార్థాన్నే తీసుకుందాం.)

దుంపల్ని కాల్చిన పనికి 15 నిముషాలు పట్టింది.

కాలిన దుంపలు తినడానికి సిద్ధంగా వున్నాయి. ఇప్పుడు చూస్తే, ఆ దుంపల కోసం జరిగిన శ్రమ ఎంత? ముడి పదార్థానికి వున్న 50 శ్రమ అంతా ఇప్పుడు గత శ్రమే (నిర్జీవ శ్రమ). ఆ పైన జరిగిన 15 నిముషాల సజీవ శ్రమని కూడా (దుంపల్ని కాల్చిన శ్రమని కూడా) కలిపితే, మొత్తం 65 ని.లు. (నిప్పుల్ని తయారుచేసిన శ్రమని కూడా కలిపితే, ఆ మొత్తం ఇంకా ఎక్కువవుతుంది.)

ఆ దుంపల్ని తినేస్తే ఆ శ్రమ అంతా ఖర్చయిపోతుంది.

ఉత్పత్తి సాధనాల నించి బదిలీ అయ్యే శ్రమ, ఎలా పెరుగుతూ వుంటుందో తెలుసుకోవడం ఇప్పుడు సాధ్యం. ఒకప్పుడు శ్రమ పరికరాలూ లేవు, ముడి పదార్థాలూ లేవు. ఏ ఉత్పత్తి సాధనమూ లేదు. దాని నించి చేరే గత శ్రమ లేదు. క్రమ క్రమంగా అతి చిన్న చిన్న శ్రమలతో శ్రమ పరికరాలు తయారై, గత శ్రమ బదిలీ ప్రారంభమైంది.

<u>గత శ్రమ కూడా ఒకప్పుడు జరిగిన సజీవ శ్రమే.</u> రాతిని అరగదీసిన 20 నిముషాల సజీవ శ్రమే, తర్వాత గత శ్రమ అయింది. దుంపల్ని తవ్విన 30 నిముషాల సజీవ శ్రమ కూడా తర్వాత గత శ్రమగా మారి, మొదటి గత శ్రమకి కలిసి గత శ్రమ పెరిగింది. ఆ తర్వాత, దుంపల్ని కాల్చిన 15 నిముషాల సజీవ శ్రమ కూడా గత శ్రమగా మారి వెనకటి దానికి కలిసింది.

ఉత్పత్తి సాధనాల నించి బదిలీ అయ్యే నిర్జీవ శ్రమ అంతా, ఒకప్పుడు జరిగిన సజీవ శ్రమే. ఈ సజీవ శ్రమ అనేది ( మనుషులు శ్రమ చెయ్యడం అనేది ), ఏ శ్రమ పరికరాలూ లేని కాలంలోనే ప్రారంభమై ఆ నాటి నించీ జరిగినదే. అది ప్రకృతి పదార్థాల్ని సూటిగా ఆహారం కోసం సేకరించడానికీ కావచ్చు, శ్రమ పరికరాల్ని తయారు చేసుకోవడానికీ కావచ్చు.

' ఉత్పత్తి సాధనాల' గురించి 3 ప్రారంభ దశల్ని అర్థం చేసుకోవాలి.

**(1)** ఈ దశలో, శ్రమ పరికరాలే లేవు. ముడి పదార్థాలూ లేవు. సజీవ శ్రమలే గానీ నిర్జీవ శ్రమలు లేవు.

**(2)** ఈ దశలో, రాళ్ళూ రప్పలూ వంటి సహజ శ్రమ పరికరాలే వున్నాయి. ముడి పదార్థాలు లేవు. ఇక్కడ కూడా సజీవ శ్రమలే గానీ నిర్జీవ శ్రమలు లేవు.

**(3)** ఈ దశలో, సహజ శ్రమ పరికరాలతో పాటు, మనుషులు తయారు చేసుకునే చిన్న చిన్న శ్రమ పరికరాలు కూడా ప్రారంభమయ్యాయి. ముడి పదార్థాలూ ప్రారంభమయ్యాయి. వేరు వేరు శ్రమలు చేసుకోవడం ప్రారంభమైంది.

శ్రమ పరికరాలూ, ముడి పదార్థాలూ కొత్తగా మొదలైన ఆ ప్రారంభ కాలంలో, అవి అత్యల్ప శ్రమలతో తయారై నటువంటివే. ఆ నాటి ఉత్పత్తి సాధనాల నించి బదిలీ అయ్యే నిర్జీవ శ్రమ అత్యల్పమైనది. అటువంటి అత్యల్ప ఉత్పత్తి సాధనాలే, క్రమ క్రమంగా అనేక రకాల శ్రమ క్రమాలతో, అనేక దశల్లో, సజీవ, నిర్జీవ శ్రమలు చేరుతూ పెరిగాయి.

' భూమి' అనేది కూడా ప్రకృతి సహజ పదార్థం. సహజ ఉత్పత్తి సాధనం. కానీ, ఆ భూమి మీద ఒక చోట చారెడు ప్రదేశంలో రాళ్ళూ రప్పలూ ఏరేసి, దాన్ని తవ్వి గుల్ల చేసి నాలుగు మొక్కలు పాతితే, ఆ చారెడు భూమి, శ్రమతో తయారైన ఉత్పత్తి సాధనం. ఆ చారెడు భూమి మీద, గుప్పెడు పంట పండితే, ఆ పంట కోసం, సజీవ శ్రమతో పాటు నిర్జీవ శ్రమ కూడా ఖర్చయినట్టే. ఆ చారెడు భూమిని బాగు చెయ్యడానికి గతంలో చేసిన శ్రమే ఆ నిర్జీవ శ్రమ. అది మనుషులు చేసినదే గానీ భూమి ఇచ్చినది కాదు. భూమి మీద ఎంతెంత పంటలు పండినా, ఏ రకం పనులు జరిగినా, వాటికి, భూమి ద్వారా సహజంగా కలిసే శ్రమ ఏదీ వుండదు.

' చొక్కా' అనే పూర్తిగా తయారై వాడకానికి సిద్ధంగా వున్న వస్తువుని తీసుకుంటే, దాని ముడి పదార్థం, ' పత్తి' నించీ ప్రారంభమవుతుంది. ఆ పత్తి తయారవడానికి వ్యవసాయ క్రమంలో జరిగిన సజీవ, నిర్జీవ శ్రమలు, పత్తిలో వుంటాయి. చొక్కా కోసం అవసరమైనంత పత్తి విలువని 2 అనుకుందాం. ఆ పత్తి మీద సజీవ, నిర్జీవ శ్రమలు కలిసి, అది దారంగా తయారవుతుంది. దారం విలువ 4. పత్తి లాగే దారం కూడా ముడి పదార్థమే. మళ్ళీ దారం మీద సజీవ, నిర్జీవ శ్రమలు కలిసి, అది బట్టగా. బట్ట కూడా ముడి పదార్థమే. దాని విలువ 8. బట్ట మీద కూడా సజీవ, నిర్జీవ శ్రమలు కలిసి, చివరికి చొక్కా.

ప్రారంభంలో వున్న, తక్కువ విలువతో తయారైన ముడి పదార్థం మీద ( పత్తి మీద ), వేరు వేరు రకాల శ్రమలు కలిసి, చివరి ముడి పదార్థం అయిన బట్ట, ఎక్కువ విలువతో వుంది. ఒకప్పుడు ముడి పదార్థాలే లేని సమాజంలో, అత్యంత విలువ గల ముడి పదార్థాలు తయారవడానికి కారణం, అనేక దశల ద్వారా సజీవ, నిర్జీవ శ్రమలు చేరుతూ వుండడమే.

శ్రమ పరికరాల సంగతీ అంతే. ' చొక్కా'ని కుట్టడంలో శ్రమ పరికరంగా వుండే ' కుట్టు మిషన్' ని తీసుకుంటే, దాన్ని తయారుచేసే లోహాలూ, ఆ లోహాల్ని తయారుచేసే పదార్థాలూ, ఆ రకంగా ఆ మిషను కూడా, అనేక దశల్లో ఖర్చయిన సజీవ, నిర్జీవ శ్రమల్ని కలుపుకుంటూ తయారవుతుంది.

మిషను మీద చొక్కాని కుట్టేటప్పుడు కుట్టు మనిషి, కుట్టు శ్రమే చేస్తాడు గానీ, ముడి పదార్థాన్ని తయారు చెయ్యడానికో, శ్రమ పరికరాల్ని తయారు చెయ్యడానికో సంబంధించిన శ్రమ లేవీ చెయ్యడు. చొక్కాకి, ఉత్పత్తి సాధనాల నించి చేరే నిర్జీవ శ్రమ, కుట్టు మనిషిది కాదు. అతని శ్రమ, కుట్టు పని మాత్రమే.

మరి, చొక్కాకి బదిలీ అయిన నిర్జీవ శ్రమ ఎవరిది? " అది ఎవరిదీ కాదు ; దాన్ని ఎవరూ చెయ్యనక్కరలేదు ; అది బదిలీ అవుతుంది, అంతే" అనాలా? లేకపోతే, ఉత్పత్తి సాధనాలన్నీ బానిస యజమాని ఆస్తి గానో, భూస్వామి ఆస్తి గానో, పెట్టుబడిదారుడి ఆస్తి గానో వుంటాడు కాబట్టి, వాటి నించి చేరే నిర్జీవ శ్రమ, బానిస యజమానిదో, భూస్వామిదో, పెట్టుబడిదారుడిదో, అలా ఆ యజమానులు చేసినదే — అనుకోవాలా? — ఈ 2 జవాబులూ తప్పే.

ఎక్కడి నించి ఎక్కడికి బదిలీ అయ్యే నిర్జీవ శ్రమ అయినా, ఒకప్పుడు సజీవ శ్రమే. ఆ శ్రమ అంతా మనుషులు చేసినదే. ఆ మనుషులు, బానిస యజమానులో, భూస్వాములో, పెట్టుబడిదారులో కారు. ఏ కాలంలో అయినా, ఏ శ్రమ అయినా, శ్రమలు చేసే మనుషులదే. చొక్కాలో వున్న నిర్జీవ శ్రమ కారణాల్ని చూస్తూ వెనక్కి వెళ్తే, వెనక్కి ' బట్ట' దగ్గిరికి, ఇంకా వెనక్కి ' దారం' దగ్గిరికి, ఇంకా వెనక్కి ' పత్తి' దగ్గిరికి, ఇంకా వెనక్కి వ్యవసాయ శ్రమ దగ్గిరికి, ఇంకా వెనక్కి వ్యవసాయ పరికరాల దగ్గిరికి...

అలా అలా అందుకోలేనంత దూరానికి వెళ్తాం.

వాడకంలో వున్న ఒక చొక్కాని చూస్తే, దాని సజీవ, నిర్జీవ శ్రమల్లో, సజీవ శ్రమ ( కుట్టు శ్రమ) అయితే, నిన్న మొన్నటిదే. కానీ, నిర్జీవ శ్రమ అంతా నిన్న మొన్నటిదిగానే వుండదు, అందులో కొంత భాగం నిన్న మొన్నటిదే అయినా, మిగిలిన భాగం, ఏ నాడో వ్యవసాయం కోసం భూమిని బాగు చేసిన కాలం నాటిది కూడా కావచ్చు. ఆ పత్తిని పండించడంలో, ఇనుముతో తయారైన శ్రమ పరికరాలేవైనా వాడి వుంటే, వాటి నించీ చేరిన శ్రమ కూడా కావచ్చు. ఆ ఇనుమును తయారు చెయ్యడానికి గనుల్ని తవ్వితే, ఆ శ్రమలలో నించి చేరినది కూడా కావచ్చు.

ఈ నాడే తయారైన కొత్త చొక్కాని చూస్తే, అది కొత్త వ్యవసాయ శ్రమతో, కొత్త దారంతో, కొత్త బట్టతో వచ్చినది అయినా, ఆ శ్రమ క్రమాల్లో ఉపయోగపడిన శ్రమ పరికరాలూ, ఆ శ్రమ పరికరాలకు శ్రమల్ని అందించిన వెనకటి శ్రమ పరికరాలూ.... అలా చూస్తూ వెళ్తే, వెనకటి శ్రమల్లో ఎంతో కొంత అల్ప భాగం ఈ కొత్త చొక్కాలో నిలిచి వుందనే అర్థానికి రావలసి వస్తుంది.

అలా చేరుతూ వచ్చిన నిర్జీవ శ్రమ, ఒక రాతిని ఇంకో రాతి మీద అరగదీసిన కాలం నాటి శ్రమ కాకపోవచ్చు. అలాంటి రాతి పరికరం, ఒకటి రెండు పనులతోనే పాడై పోతుంది. పళ్ళ కోసమో, దుంపల కోసమో, వేట జంతువుల కోసమో ఉపయోగపడిన పరికరం నించి బదిలీ అయిన నిర్జీవ శ్రమ, ఆ పదార్థాలతో పాటే ఖర్చయి పోతుంది. అది ఎంతో దూరం దాకా నిలిచే ప్రసక్తి వుండదు. త్వర త్వరగా పాడై పోయే శ్రమ పరికరాల నిర్జీవ శ్రమ చాలా దూరం దాకా అందుతూ వుండకపోయినా, కొంత కాల మైనా, ఒక దశ నించి ఒక దశ వరకైనా అందుతూ వుంటుంది.

అల్ప విలువ గల శ్రమ పరికరాల సంగతి గాక, ఎన్నెన్నో శ్రమల ద్వారా తయారైన, విలువైన శ్రమ పరికరాల్ని తీసుకుంటే, వాటి ద్వారా బదిలీ అయ్యే నిర్జీవ శ్రమలో ఎంతో కొంత భాగం, చాలా వెనకటి కాలం నించీ చేరుతూ వచ్చినదై వుంటుంది. అంటే, ఈ నాటి ఉత్పత్తుల విలువలో, వెనకటి శ్రామికుల శ్రమలు కూడా నిలిచి వున్నట్టే అర్థం.

## ముడి పదార్థం నించి నిర్జీవ శ్రమ బదిలీ అవని సందర్భాలేమైనా ఉంటాయా? - ఆలోచించండి!

ముడి పదార్థం మీద సజీవ శ్రమ జరిగేటప్పుడు, ఆ ముడి పదార్థం నించి నిర్జీవ శ్రమ బదిలీ అయ్యే విషయంలో, కొంత తేడాగా వుండే సందర్భాల్ని కూడా ఇప్పుడు చూడాలి. బట్టలు ఉతకడం, గిన్నెలు కడగడం, ఇళ్ళు శుభ్రం చెయ్యడం — లాంటి సందర్భాలు ఇవి.

ఒక చొక్కా మాసింది. దాన్ని ఉతకాలి. ఆ చొక్కా మనిషి, ఆ పని తనే స్వయంగా చేసుకోకుండా, ఆ చొక్కాని, బట్టలు ఉతికే మనిషికి అప్పగించాడు. అతను, మాసిన చొక్కాని ఉతకడానికి తన ఇంటికి తీసుకుపోయాడు.

ఉతికే పని — సజీవ శ్రమ. ఆ పని, మాసిన చొక్కా మీదే జరుగుతుంది కాబట్టి, ఆ పనిలో, ఆ మాసిన చొక్కాయే ముడి వస్తువు ( ముడి పదార్థం ). ఉతికే పని విలువ 4. ఆ పని జరగడానికి బకెట్ల వంటి శ్రమ పరికరాలూ, సబ్బూ నీళ్ళూ వంటి ఆగ్జిలరీలూ కావాలి. వాటి నించి చేరే శ్రమ 3. మొత్తం 7 శ్రమతో ఆ ఉతికే పని జరిగి, మాసిన చొక్కా శుభ్రమైన చొక్కాగా తయారవు తుంది. ఆ పని చేసి పెట్టిన మనిషికి 7 డబ్బు ఇవ్వాలి.

అయితే, ఏ పని జరిగేటప్పుడైనా ఆ పనిలోకి ముడి పదార్థం నించి కూడా కొంత నిర్జీవ శ్రమ బదిలీ అవడం జరగాలి కదా? ఇక్కడ కూడా అలాగే జరుగుతుందా? ముడి పదార్థంగా వున్న చొక్కా నించి కూడా దాని విలువలో కొంత భాగం ఉతుకు పనిలో ఖర్చవుతుందా? ఆ ఖర్చు, ఉతుకు పనికి అయ్యే మొత్తం ఖర్చులోకి చేరుతుందా?

చొక్కా విలువని 50 అనీ, అది పాడయ్యే లోగా 50 సార్లు ఉతుకులకు వెళ్తుంది అనీ అనుకుంటే, ప్రతీ ఉతుకు పని లోనూ, చొక్కా నించి 1 నిర్జీవ శ్రమ ఖర్చవు తుందా? ఆ ఖర్చు కూడా చొక్కాని ఉతికిన మనిషికి వెళ్తుందా?

ఉతుకు పని చేసిన మనిషికి, ఆ పని విలువ అయిన 4 మాత్రమే వెళ్తుంది గానీ, ఉత్పత్తి సాధనాల నించి వచ్చే ఏ నిర్జీవ శ్రమా ఆ మనిషికి వెళ్ళదు. కాబట్టి ఆ ప్రశ్న లేదు.

ఉతుకు పని జరిగినప్పుడల్లా చొక్కా విలువ కొంత తగ్గుతుంది. కానీ, ఆ వస్తువు పాడైపోవడం, దాన్ని వాడడం వల్ల జరుగుతుంది గానీ ఉతుకుల వల్ల కాదు.

ప్రతీ ఉతుకు వల్లా, చొక్కా నించి ‘ ఫలానా కొంత ’ నిర్జీవ శ్రమ వెళ్ళిపోతూ వుంటుందా? — అలాంటి లెక్కలు ఇక్కడ వర్తించవు. చొక్కాని వాడుతూ వుండడం వల్ల, దాని విలువ కొంత కొంత తగ్గుతూనే వుంటుంది. ఒక నాటికి ఆ విలువంతా పూర్తిగా పోతుంది. అది ఉతుకుల లెక్కల్ని బట్టి కాదు.

దుమ్ముతో వున్న గదిని, చీపురుతో ఊడ్చి శుభ్రం చెయ్యాలంటే, ఆ పనిలో, ఆ దుమ్ము గది, ముడి వస్తువే. ఆ చీపురు, శ్రమ పరికరం. ఆ గదిని నీళ్ళతో కడిగితే, ఆ నీళ్ళు, ఆగ్జిలరీ. ఆ శుభ్రం చేసే పనికి, ఆ ముడి వస్తువు నించి ( మాసిన గది నించి ) బదిలీ అయ్యే శ్రమ ఏదీ వుండదు.

**ఇంకో విషయం :**

ఒక వస్తువుని విడిగా చూస్తే, అది పాడైపోయినప్పుడు, అందులో వున్న సజీవ, నిర్జీవ శ్రమలు రెండూ ఖర్చయిపోవడం కనపడుతుంది. కానీ, సమాజంలో తయారయ్యే మొత్తం 'ఉత్పత్తుల రాసి'ని చూస్తే, అందులో వుండే నిర్జీవ శ్రమ, ఎప్పటికీ అంతరించనట్టు కనపడుతుంది. ఒక సంవత్సరపు ఉత్పత్తి సాధనాల నించి బదిలీ అయ్యే నిర్జీవ శ్రమ, అదే పరిమాణంతో, ఏమీ తగ్గకుండా, తర్వాత సంవత్సరానికి అందుతూనే వుంటుంది. ఒక వేపు, అనేక ఉత్పత్తి సాధనాలూ వాటి విలువలూ ఖర్చయిపోతూనూ వుంటాయి ; అయినా, ఇంకో వేపు — ఆ విలువ అంతా, బదిలీ అవుతూనూ వుంటుంది.

ఈ వింత ఎలా జరుగుతుందో, ఈ 2 వ భాగంలోనే, తర్వాత చాప్టరులో చూస్తాం.

అంతే కాదు. ఉత్పత్తి సాధనాలు ఎలా పెరుగుతూ వుంటాయో ఈ సంపుటంలోనే 3 వ భాగంలో, 'పెట్టుబడి విస్తరణ' చాప్టరులో చూస్తాం.

**ఉత్పత్తి సాధనాలే లేని కాలం గురించి, ఇక్కడ ఒక సారి మార్క్స్ మాటలు వినాలి.**

> "మనం సమాజ ప్రారంభాన్ని తీసుకున్నట్టయితే, అక్కడ, అప్పటికే తయారు చేసుకున్నటువంటి ఉత్పత్తి సాధనా లేవీ ఉనికిలో ఉండవు. అంటే, 'స్థిర పెట్టుబడి' అనేది ఏదీ ఉండదు.... ఈ సందర్భంలో, ప్రకృతి, జీవనాధారాల్ని డైరెక్టుగానే సమకూర్చుతుంది — వేటినైతే ఉత్పత్తి చేసుకోనవసరం లేదో వాటిని. ఆ విధంగా ప్రకృతి, ఆటవిక మానవులకు, ఎవరికైతే అవసరాలు అతి తక్కువగా ఉంటాయో ఆ మానవులకు, ఒక వ్యవధిని ఇస్తుంది. ప్రకృతిలో సహజంగా దొరికే జీవనాధారాల్ని స్వాధీనం చేసుకోవ డానికి పట్టే సమయాన్నే గాక, ప్రకృతిలోనే సహజంగా దొరికే ఇతర పదార్థాలను ఉత్పత్తి సాధనాలుగా మార్చుకోవడానికి ( బాణాలూ, రాతి కత్తులూ, పడవలూ వగైరాలుగా మార్చుకోవడానికి ) కావలిసిన వ్యవధిని ఇస్తుంది." ( కాపిటల్-3, పే. 847, మాస్కో. )

ఉత్పత్తి సాధనాలే లేని కాలం ఒకటి గడిచింది. ప్రకృతి, ఆటవిక మానవులకు, ఉత్పత్తి సాధనాల్ని తయారుచేసు కోవడానికి కావలసినంత వ్యవధి ఇచ్చింది, అందాకా వారికి జీవనాధారాల్ని తను సిద్ధంగా అందించడం ద్వారా.

[ గమనిక : ఈ చాప్టరులో ప్రశ్నలూ జవాబులూ ఇవ్వడం లేదు. ]

★

# 7. సరుకు 'వి లు వ' భాగాల్ని సరుకు'పరిమాణం'భాగాలుగా చూడడం

**100** మీ. బట్ట 'విలువ' — 120.

ఆ 'విలువ'లో భాగాలు = 80 స్థిర + 20 అస్థిర + 20 అదనపు విలువ.

ఆ 100 మీ. బట్టని, ఈ విలువ భాగాల ప్రకారం పంచితే, స్థిరకి ఎంత బట్ట? అస్థిరకి ఎంత? అదనపు విలువకి ఎంత?

ఈ విషయం 'లాభం' చాప్టర్లో చూసిందే. దాన్ని ఒకసారి గుర్తుచేసుకుని, దీనికి సంబంధించి ఇక్కడ ఇంకా కొన్ని విషయాలు చూడాలి.

100 మీ. బట్ట విలువ 120 రూ. 1 మీ = 1రూ. 20 పై.

| | |
|---|---|
| 80 స్థిర భాగానికి | 67 మీ. |
| 20 అస్థిరకి — | 16½ మీ. |
| 20 అ.వి.కి — | 16½ మీ. |
| 120 రూ.లకు | 100 మీ. |

బట్టని విభజించే పని, ఇంకో రకంగా కూడా చెయ్యవచ్చు.

బట్టకి 'విలువ'ని ఇచ్చిన అంశాల్లో ఏది ఎన్ని భాగాలుగా వుందో చూసి, బట్టని ఆ భాగాలకు పంచాలి.

స్థిర : అస్థిర : అదనపు విలువ
80 : 20 : 20
4 : 1 : 1 = 6 భాగాలు

బట్టలో 4 భాగాలు స్థిరకీ, 1 భాగం అస్థిరకీ, 1 భాగం అ.వి.కీ. ఇలా చూస్తే కూడా ఆ జవాబులే వస్తాయి.

'స్థిర' భాగాన్ని, 'డబ్బు' గా చూస్తే 80 రూ.లు. బట్టగా చూస్తే 67 మీ. అంటే, 80 డబ్బుతో బట్టని కొంటే, మీటరు 1 కి, 1 రూ. 20 పై.ల చొప్పున, 67 మీటర్ల బట్ట వస్తుందన్నమాట.

20 జీతాలకు 16½ మీ. బట్ట వస్తుంది.

20 అదనపు విలువ సంగతీ అంతే.

సరుకు తయారైన తర్వాత దాన్ని అమ్మినప్పుడు, దానికి రావలసిన డబ్బు మొదట పెట్టుబడిదారుడి చేతిలోకే వస్తుంది. అక్కడి నించే అది అనేక భాగాలుగా వెళ్ళిపోతుంది.

'ఉత్పత్తి సాధనాల' విలువ —మళ్ళీ ఉత్పత్తి సాధనాలకీ,
'జీతాల' విలువ —మళ్ళీ జీతాలకీ,
అదనపు విలువ —మళ్ళీ పెట్టుబడిదారీ వర్గం పోషణకీ.

బట్ట పెట్టుబడిదారుడు, ఒక సారి బట్టని అమ్మగా వచ్చిన 'డబ్బు'లో నించి 80 తో, 'పని స్థలం'లోకి కొత్త ఉత్పత్తి సాధనాలు కొంటాడు.

అంతే కాదు, తనకు 'ఉత్పాదక లాభం'గా వచ్చిన 8 తో, తన కుటుంబానికి కావలసిన పోషణ వస్తువులు కొంటాడు.

వర్తక పెట్టుబడిదారుడు, తన 'వర్తక కమిషన్'తో వర్తకం పనుల కోసమూ, స్వంత పోషణ కోసమూ కొంటాడు.

వడ్డీ పెట్టుబడిదారుడు, తన 'వడ్డీ'తో కొంటాడు.

భూస్వామి, తన 'భూమి అద్దె'తో — కొంటాడు.

ఈ గుంపు అంతా కలిసి, తమ కుటుంబ అవసరాల కోసం '20 అదనపు విలువ'ని వాడతారు. <u>ఈ ఉత్పత్తులన్నీ వాడిన దానికి బదులుగా వీళ్ళు ఏ శ్రమనీ ఇవ్వరు. ఏ వస్తువులూ ఉత్పత్తి చెయ్యరు. ఏమీ ఉత్పత్తి చెయ్యకుండానే, ఉత్పత్తుల్ని ఖర్చు మాత్రం చేస్తూ వుంటారు.</u>

కాని, కార్మికుల సంగతి అలా కాదు. వారు, 20 జీతాలతో, కుటుంబాలకు కావలసిన పోషణ వస్తువులు కొంటారు. ఆ ఉత్పత్తుల్ని వాడడం వల్ల, వారికి మళ్ళీ కొత్త 'శక్తి' వస్తుంది. ఆ శక్తితో వారు మర్నాడు మళ్ళీ 'పని స్థలం'లోకి వచ్చి, కొత్త శ్రమ ప్రారంభిస్తారు. <u>కార్మికులు, పోషణ కోసం కొన్ని ఉత్పత్తుల్ని వాడుతున్నారంటే, ఒకవేపు వాటిని ఖర్చుచేస్తూ, ఆ కాలంలోనే ఇంకోవేపు కొత్త వస్తువుల్ని ఉత్పత్తి చేస్తారు.</u>

కార్మికుల కోసం ఖర్చయ్యే జీతాలు, 'శ్రమ శక్తి'ని ఇవ్వడం కోసం ఖర్చయితే, పెట్టుబడిదారీ బృందం కోసం ఖర్చయ్యే లాభాలూ వడ్డీలూ వంటివి ఏ శ్రమ శక్తి కోసమూ కాదు. ఈ బృందం ఏ రోజు కా రోజు కొత్త ఉత్పత్తుల్ని సంపాదించాలంటే, కొత్త లాభాల్నీ, కొత్త వడ్డీల్నీ లాగ

వలసిందే. అంటే, మర్నాడు కూడా మళ్ళీ దోపిడీ జరగవలసిందే. రోజూ, 'దోపిడీ క్రమం' కొనసాగవలసిందే. ఇదంతా మనకు తెలిసిందే.

ఇప్పుడు, ఇంకా ఇతర విషయాలు కొన్ని :

బట్టని, దాని 'విలువ' భాగాల ప్రకారం పంచినట్టుగా, దాని 'ఉపయోగపు విలువ' భాగాల ప్రకారం పంచ గలమా?— అంటే, 'దారం' ఇచ్చిన ఉపయోగపు విలువ కోసం కొంత బట్టనీ, మగ్గం ఇచ్చిన ఉపయోగపు విలువ కోసం కొంత బట్టనీ, బిల్డింగు ఇచ్చిన ఉపయోగపు విలువ కోసం కొంత బట్టనీ — ఇలా, దేని 'ఉపయోగపు విలువ' కోసం దానికి, బట్టని విడదియ్యగలమా? — అలా విడదియ్యలేము.

ఎందుకంటే, దారమూ మగ్గమూ నేత పనీ ఇచ్చే ఉపయోగపు విలువల్ని విడదియ్యలేము కాబట్టి, ఆ ఉపయోగపు విలువల కోసం బట్టని కూడా విడదియ్య లేము. బట్టని వాడినప్పుడే, అన్నీ కలిసి ఇచ్చిన ఉపయోగపు విలువ 'అనుభవానికి' వస్తుంది.

కానీ 'విలువ' విషయంలో బట్టని విడదీయడం ఎందుకు సాధ్యమవుతుందంటే, 'విలువ' అనేది, బట్టకి 'బయటి' విషయం కాబట్టి. వేరు వేరు అంశాల విలువలు ఏ లెక్కన ఒక చోట కలిసి బట్ట విలువ అయ్యాయో, ఆ లెక్కనే వాటి కోసం ఆ బట్టని విడదియ్యగలం.

కానీ, విలువ అంశాల ప్రకారం విభజించడం కూడా ప్రతీ వస్తువు విషయంలోనూ సాధ్యం కాదు. ఇల్లూ, యంత్రమూ, చొక్కా, కుర్చీ లాంటి ఒకే మొత్తంగా వుండే సరుకుల్ని, వాటి విలువ అంశాల కోసం విడదీసి పంచడం సాధ్యం కాదు.

బట్టని, దాని విలువ అంశాల మధ్య విభజించినట్టుగా చూస్తున్నామంటే, బట్ట తయారైన వెంటనే, పెట్టుబడి దారుడూ కార్మికులూ, దాన్ని పని స్థలంలోనే పంచు కుంటారనీ, దాన్నే ఇళ్ళకు తీసుకుపోతారనీ కాదు. పెట్టుబడిదారుడూ, కార్మికులూ ఆ తయారైన సరుకునే అక్కడే పంచేసుకోరు. కానీ, 'సమాజం' మొత్తం మీద జరిగే పని మాత్రం అదే. సమాజం మొత్తం మీద పెట్టుబడిదారు లందరి దగ్గిరా తయారైన మొత్తం సరుకుని 'ఒక రాసిగా' ఊహిస్తే, ఆ 'రాసి'నే మొత్తం పెట్టుబడిదారులూ, మొత్తం కార్మికులూ పంచుకుంటారు.

ఒక విడి పెట్టుబడిదారుణ్ణీ, అక్కడ పనిచేసే కార్మికుల్నీ మాత్రమే చూస్తే, ఈ విషయం సరిగా తెలియదు. ఒక విడి పని స్థలాన్నే చూసినప్పుడు, ఆ పని స్థలంలో తయారైన సరుకునే, అక్కడి పెట్టుబడిదారుడూ కార్మికులూ పంచుకోరు. కాబట్టి, కార్మికులు తయారుచేసే ఉత్పత్తులనే పెట్టుబడిదారులూ, కార్మికులూ పంచు కుంటున్నారనే సంగతి ఆ పని స్థలంలో కనపడదు. అంతే కాదు, ఒక 'పని స్థలం'లో తయారయ్యే సరుకుని బైటికి అమ్మెయ్యకపోతే, మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాల్నీ, కొత్త పోషణ వస్తువుల్నీ తీసుకోగలిగే మార్గం వుండదు. కాబట్టి, ఒక్క పని స్థలాన్ని మాత్రమే చూస్తే, 'సమాజంలో అమ్మకాలూ, కొనుగోళ్ళూ లేకపోతే ఉత్పత్తులు పంపకం అయ్యే మార్గమే వుండదు'— అన్నట్టు కనపడుతుంది. — ఈ రకంగా, పెట్టుబడిదారుల్ని విడి విడిగా చూసినప్పుడు, అసలు విషయం అంతా ముక్కలు ముక్కలుగా తెగిపోయి, ఆ ముక్కలన్నీ ఒకదాని కొకటి సంబంధం లేని విషయాల్లాగ కనపడతాయి. అందుచేత, మొత్తం విష యాన్ని, సరైన పద్ధతిలో గ్రహించడానికి, 'మొత్తం సమాజా న్నంతా' దృష్టిలోకి తీసుకోవాలి. మొత్తం సమాజంలో వుండే పెట్టుబడిదారుల్నీ, కార్మికుల్నీ కలిపిచూస్తే, కార్మికుల శ్రమనే (ఆ శ్రమతో తయారైన ఉత్పత్తుల్నే) అందరూ పంచుకుంటున్నారనీ, అమ్మకాలూ కొనుగోళ్ళూ అనేవి 'పంపకాల'కు ఒక అసహజ మార్గం తప్ప ఏమీ కాదనీ, స్పష్టంగా తెలుస్తుంది.

మొత్తం సమాజాన్నంతా తీసుకుందాం. సమాజంలో విడి విడిగా వున్న పని స్థలాలు అన్నీ ఇప్పుడు ఒకే ఒక 'పెద్ద పని స్థలం' అనుకుందాం. సమాజం— ఒకే పని స్థలం. ఆ పెద్ద పని స్థలం, అనేక చిన్న చిన్న పని స్థలాలతో నిండి వుంటుంది. ఒక్కొక్క చిన్న పని స్థలంలో ఒక్కొక్క పెట్టుబడిదారుడు, ఒక్కో రకం సరుకుని తయారు చేయిస్తూ వుంటాడు. అన్ని పని స్థలాలలోనూ కలిసి తయారైన మొత్తం ఉత్పత్తులే ఆ సమాజానికి ఒక సంవత్సరపు ఉత్పత్తుల రాసి. సంవత్సరం చివరికి ఈ 'రాసి' సిద్ధమైనట్టుగా ఊహించాలి.

రక రకాల ఉత్పత్తులు గల ఈ బ్రహ్మాండమైన 'రాసి'లో, గుండుసూది మొదలు మహా భవనాల వరకూ వున్నాయి— అని ఊహించాలి. బస్సులూ, రైళ్ళూ, షిప్పులూ, యంత్రాలూ, వంతెనలూ, రోడ్లూ, ధాన్యం, మందులూ, బట్టలూ, చెప్పులూ, పుస్తకాలూ, విలాస వస్తువులూ — వగైరా సమస్తమైన ఉత్పత్తులూ అందులో వున్నాయి. అంతే కాదు, వైద్య సౌకర్యాలూ, విద్యా సౌకర్యాలూ, ప్రయాణ సౌకర్యాలూ — వంటి సౌకర్యాలన్నీ కూడా సరుకులుగా అందులో వున్నాయి. ఇలా వస్తువుల తోటీ, పదార్థాల తోటీ, సౌకర్యాల తోటీ నిండిన బ్రహ్మాండమైన 'ఉత్పత్తుల రాసి' సంవత్సరం చివరికి సమాజంలో తయారైంది. దీన్ని ఉత్పత్తి చేయించింది మొత్తం పెట్టుబడిదారీ వర్గం. దీన్ని ఉత్పత్తి చేసింది మొత్తం కార్మిక వర్గం. ఈ కార్మిక వర్గంలో మేధా శ్రమలూ, శారీరక

శ్రమలూ, నైపుణ్యం గల శ్రమలూ, నైపుణ్యం లేని శ్రమలూ, అన్ని రకాల శ్రమలూ చేసే కార్మికులంతా వుంటారు. ఇలా తయారైన ఈ రాసిని కార్మికులూ, పెట్టుబడిదారులూ పంచుకుంటారు.

ఈ రాసిని తయారు చెయ్యడానికి ఎన్ని ఉత్పత్తి సాధనాలైతే ఖర్చయి పోయాయో, ఆ ఉత్పత్తి సాధనాలన్నీ మళ్ళీ ఆ రాసిలో తయారై వుంటాయి. ఈ రాసిని తయారు చేసిన కాలంలో, కార్మికులందరి కోసం ఎన్ని జీవితావసర వస్తువులైతే ఖర్చయి పోయాయో అవన్నీ కూడా మళ్ళీ ఆ రాసిలో తయారై వుంటాయి. ఈ 2 అంశాలే గాక, పెట్టుబడిదారుల వాడకానికి కావలసిన వస్తువులన్నీ కూడా అందులో తయారై వుంటాయి. ఇలా తయారై వున్న ఈ 'ఉత్పత్తుల రాసి'లో నించి 1వ, 2వ భాగాల ఉత్పత్తులన్నిటినీ తీసివేస్తే, మిగిలినదంతా అదనపు ఉత్పత్తి. ఈ రాసిలో 1వ, 2వ భాగాల ఉత్పత్తుల విలువ ఎంత వుంటుందో — ఆ విలువతోనే, అదనపు ఉత్పత్తులతో కూడా కలిసిన మొత్తం రాసి తయారైంది. ఈ రాసికన్నా వెనకటి రాసిలో వున్న అదనపు ఉత్పత్తుల్ని పెట్టుబడిదారీ వర్గం వాడుతూ వుండగా, అవి ఖర్చయి పోయేటప్పటికి ఈ కొత్త రాసి తయారైంది. ఇందులో వున్న అదనపు ఉత్పత్తుల్ని పెట్టుబడిదారీ వర్గం మళ్ళీ ఇంకో సంవత్సరం పాటు వాడుతుంది. ఈ రకంగా, ప్రతీ సంవత్సరపు రాసిలోనూ

(1) ఉత్పత్తి సాధనాల భాగమూ,

(2) కార్మికుల జీవితావసర వస్తువుల భాగమూ,

(3) పెట్టుబడిదారీ వర్గానికి కావలసిన జీవితావసర వస్తువుల భాగమూ (విలాస వస్తువులతో కూడా కలిసి) — ఈ 3 భాగాలూ కలిసి వుంటాయి.

ఒక సంవత్సరపు బ్రహ్మాండమైన ఉత్పత్తుల రాసిని ఊహిద్దాం. దీని విలువ 120 (కోట్లు). ఇది 3 రకాల సంచుల్లో వుంటుంది. ఒక సంచి నిండా ఉత్పత్తి సాధనాలు. దీని విలువ 80. రెండో సంచి నిండా కార్మికుల పోషణ ఉత్పత్తులు. విలువ 20. మూడో సంచి నిండా పెట్టుబడిదారుల పోషణా, విలాసాల ఉత్పత్తులు. విలువ 20. (ఈ మూడో సంచి గురించి ఇంకా వివరాలు చూడాలి తర్వాత.) ఈ 3 సంచులూ కలిసి ఒక సంవత్సరపు రాసి.

ఈ రాసి అంతా బట్ట లాగానో, పంచదార లాగానో, ఒకే రకం ఉత్పత్తి కాదు. ఇందులో లక్షల రకాల ఉత్పత్తులు వున్నాయి. ఎన్ని రకాల ఉత్పత్తులు వున్నా, ఆ రాసి పంపకం అయ్యే పద్ధతి మాత్రం బట్ట విషయంలో చూసిందే. 100 మీటర్ల బట్ట దాని విలువ అంశాల మధ్య ఎలాగైతే పంపకం అవుతుందో, ఈ రక రకాల ఉత్పత్తుల బ్రహ్మాండమైన రాసి కూడా అలాగే పంపకం అవుతుంది.

ఈ 120 విలువ గల రాసిలో నించి, 80 విలువ గల మొదటి సంచిలో వున్న కొత్త ఉత్పత్తి సాధనాలు, పెట్టుబడిదారుల పని స్థలాలలోకి వెళ్తాయి. 20 విలువ గల రెండో సంచి కార్మికుల ఇళ్ళల్లోకీ, ఇంకో 20 విలువ గల మూడో సంచి పెట్టుబడిదారుల ఇళ్ళల్లోకీ వెళ్తాయి. ఈ రాసి అంతా పంపకం అయ్యే పని ఒక సంవత్సరం పాటు జరుగుతూ వుంటుంది. ఆ సంవత్సర కాలంలో ఆ రాసి అలా ఖర్చవుతూ వుండగా, ఇంకోవేపు — మళ్ళీ 'కొత్త రాసి' తయారవుతూ వుంటుంది. పాత రాసిలో తయారైన ఉత్పత్తి సాధనాలన్నీ ఈ కొత్త రాసి కోసం ఖర్చవుతూ వుంటాయి. పాత రాసిలో తయారైన కార్మికుల పోషణ పదార్థాలన్నీ ఈ కొత్త రాసిని తయారు చేసే కాలంలో శ్రమ శక్తుల కోసం ఖర్చవుతూ వుంటాయి. పాత రాసిలో తయారైన పెట్టుబడిదారుల పోషణ వస్తువులూ, విలాస వస్తువులూ, ఈ కొత్త రాసి తయారయ్యే కాలంలో పెట్టుబడిదారీ వర్గం ద్వారా ఖర్చయిపోతూ వుంటాయి. మొత్తం మీద 'పాత రాసి' ఖర్చయి పోయేటప్పటికి మళ్ళీ 'కొత్త రాసి' సిద్ధం అవుతుంది!

**పాత రాసి ఖర్చయిపోవడం అంటే?**

బొగ్గూ, చమురూ లాంటి ఆగ్జిలరీ వస్తువుల శరీరాలు పూర్తిగా కనపడకుండా ఖర్చయిపోతాయి. అలాగే, పోషణ పదార్థాలన్నీ కూడా ఖర్చయిపోతాయి. శ్రమ పరికరాలన్నీ కూడా పాతబడిపోయి ఖర్చయిపోతాయి. కానీ, ముడి పదార్థాలు మాత్రం వాటి ఆకారాలు ఇతర రూపాల్లోకి మారి కొత్త రాసిలోకి చేరతాయి. ఆ రాసిని వాడినప్పుడే ఆ ముడి పదార్థాల శరీరాలు ఖర్చవుతాయి. అంతవరకూ అవి ఖర్చు కావు. కానీ, అవి ముడిపదార్థాల రూపంలో నించి ఎప్పుడైతే మారిపోయాయో అప్పుడు అవి ఖర్చయిపోయిన వాటితో సమానమే. దారం, బట్టగా మారిందంటే, దారం ఖర్చయిపోయినట్టే. మళ్ళీ కొత్త దారం తయారయ్యే వరకూ దారం వుండదు. కాబట్టి, పాత రాసిలో వుండే ముడి పదార్థాలన్నీ, ఆకారాలు మారి, కొత్త రాసిలోకి చేరి అక్కడ ఇంకా కనపడుతోనే వున్నా, పాత రాసి అంతా ఖర్చయి పోయినట్టే అర్థం. అంటే, పాత రాసి ఖర్చుతోనే కొత్త రాసి ప్రత్యక్షమవుతుంది.

ఒక సంవత్సర ఉత్పత్తుల రాసి ఖర్చవడం అనేది — పెట్టుబడిదారులకూ పెట్టుబడిదారులకూ మధ్యా; పెట్టుబడిదారులకూ, కార్మికులకూ మధ్యా — పంపకాలు అవడమే. ఈ పని, లక్షల కోట్ల విడి విడి 'అమ్మకాల' ద్వారా సంవత్సరం పొడుగునా జరుగుతూనే వుంటుంది. మొత్తం మీద దీని సారాంశం, ఉత్పత్తుల రాసి 3 భాగాలుగా (స్థిర, అస్థిర, అదనపు విలువలుగా) పంపకం అవడమే.

మనం, ఇక్కడ ఉత్పత్తి క్రమాన్నీ, పంపకాల క్రమాన్నీ

కూడా కలిపి చూస్తున్నాము. ఇందులో అర్థం చేసుకో వలసిన విషయాలు ఇంకా చాలా వున్నాయి. ఎక్కువ ఇబ్బంది కలిగించే చాప్టర్లలో ఇది ఒకటి. ఇందులో విష యాల్ని చాలా శ్రద్ధగా, సరిగా, అర్థం చేసుకోవాలి.

'ఉత్పత్తి'కీ, 'పంపిణీ'కీ సంబంధించిన అంశాల్ని, ఒకవేపు — 'ఉపయోగపు విలువ' కోణం లోనూ, ఇంకో వేపు — 'విలువ' కోణం లోనూ కూడా అర్థం చేసుకుంటూ వుండాలి.

'సమాజం'లో ప్రతి నిత్యమూ జరిగే పని రక రకాల వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోవడమూ, వాటిని పంపిణీ చేసుకోవడమూ మాత్రమే. ఏ సమాజంలో అయినా, ఈ 2 విషయాలూ జరగవలసిందే. ఇవి ఏ సమాజంలో జరుగుతాయో, ఆ సమాజ 'స్వభావానికి' అనుగుణమైన పద్ధతుల్లోనే జరుగుతాయి.

పెట్టుబడిదారీ సమాజంలో, 'ఉత్పత్తి' అంతా 'సరుకు ఉత్పత్తి'గానూ; దాని 'పంపిణీ' అంతా 'వర్తకం' ద్వారానూ (అంటే, అమ్మకాల ద్వారా) జరుగుతుంది.

ఒక సంవత్సరంలో తయారైన ఉత్పత్తుల రాసి, మరుసటి సంవత్సరానికి ఖర్చయిపోతుంది — అను కున్నాం. ఆ ఉత్పత్తుల రాసిలో బస్సులూ, రైళ్ళూ లాంటి ఫిక్సెడ్ సాధనాలు కూడా వుంటాయి కదా? ఇవి, పని చెయ్యడం ప్రారంభించాక, ఒక్క సంవత్సరంలోనే ఖర్చయి పోతాయా?— అలా ఖర్చయి పోవు. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఒక సమాజంలో, రవాణా అవసరాలు తీరడానికి నిత్యం 100 బస్సులు పనిచేస్తూ వుండాలి — అనుకుందాం. ప్రతీ బస్సూ 10 సం॥ల కాలం పని చేస్తుంది — అనుకుందాం. ఈ లెక్కన, ప్రతీ సంవత్స రమూ 10 బస్సులు పాతవైపోతూ వుంటాయి. ఈ సంవ త్సరం తయారైన బస్సు, వచ్చే సంవత్సరానికే పాతబడి పోదు. కానీ, 9 సంవత్సరాల కిందట తయారైన బస్సు ఈ సంవత్సరం కూడా పని చేసి ఈ సంవత్సరం చివరికి పూర్తిగా పాతబడిపోతుంది. 8 సం.ల కిందట తయారైన బస్సు వచ్చే సంవత్సరం చివరికి పాడై పోతుంది. ఇలా ప్రతీ సంవత్స రమూ 10 బస్సులు పాతబడిపోతాయి. వాటికి బదులుగా ప్రతీ సంవత్సరమూ 10 కొత్త బస్సులు తయారవ్వాలి. ఈ కొత్తవి, పాడైపోయిన వాటి స్థానం లోకి వెళ్తూ వుంటాయి. వచ్చే సంవత్సరం మళ్ళీ 10 బస్సులు పాతబడిపోతాయి కాబట్టి, వాటికి బదులుగా, వచ్చే సంవత్సరం కూడా 10 కొత్త బస్సులు తయారవ్వాలి. కొత్తగా తయారయ్యేవి పదేళ్ళ పాటు పనిచేస్తూనే వున్నా, ప్రతీ సంవత్సరం ఎన్ని బస్సులు తయారవుతున్నాయో అన్ని బస్సులు ఖర్చయి పోతున్నా యని అర్థం. ప్రతీ సంవత్సరమూ కొన్ని కొత్త బస్సుల ఉత్పత్తి జరగవలిసిందే. అలాగే కొన్ని కొత్త రైళ్ళూ, కొన్ని కొత్త ఇళ్ళూ, కొన్ని కొత్త భవనాలూ, కొత్త యంత్రాలూ — ఇలా 'ఫిక్సెడ్ సాధనాల' ఉత్పత్తి, ఆ సమాజానికి కావలసిన అంచనాతో ప్రతీ సంవత్సరం జరుగుతూ వుంటుంది. ఈ ఫిక్సెడ్ సాధనాలన్నీ 'సంవత్సర సామాజిక ఉత్పత్తి రాసి'లో ఒక భాగంగా వుంటాయి. (ఉత్పత్తి సాధనాలు వుండే మొదటి సంచిలో.)

ముడి పదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ ఎప్పటికప్పుడే ఖర్చయి పోతాయి కాబట్టి, ఇవి మొత్తం ఎన్ని కావాలో అన్నీ ప్రతీ సంవత్సరమూ ఉత్పత్తి అవుతూ వుండాలి. ధాన్యం. దూదీ, దారం, బట్టా, బొగ్గూ, చమురూ, కాయితం, వగైరాలన్నీ ఇందులోకి వస్తాయి. ఇవన్నీ కూడా 'సంవత్సర ఉత్పత్తి రాసి'లో ఒక భాగం. (ఇవి కూడా మొదటి సంచిలోవే.)

వాడకానికి సిద్ధంగా వున్న బట్టలూ, చెప్పులూ, పుస్తకాలూ, బియ్యం, గోధుమా, పంచదారా, వంటనూనే, మందులూ, వగైరాలన్నీ 'నిత్య జీవితావసర వస్తువులు.' ఇవన్నీ కూడా 'సంవత్సర ఉత్పత్తి రాసి'లో ఒక భాగం.

కొన్ని రకాల ఉత్పత్తులు ఏ రోజు కా రోజే తయారవుతాయి. కొన్ని — వారానికోసారీ. కొన్ని — నెలకో సారీ. కొన్ని సంవత్సరానికోసారీ. కానీ, మనం సంవత్సరాన్నే కొలతగా తీసుకుంటున్నాం కాబట్టి, ప్రతీ సంవత్సరమూ ఒక వేపున కొత్త ఉత్పత్తి తయారవుతూ వుండగా, దాని పక్కనే ఇంకోవేపున, కిందటి సంవత్సరపు ఉత్పత్తి అంతా ఖర్చయిపోతూ వుంటుంది — అని ఊహిస్తాం. నిజానికి, పాలూ, గుడ్లూ, కూరగాయలూ, చమురూ, బొగ్గూ లాంటివి సంవత్సరంలోనే అనేక సార్లు తయారై, అనేక సార్లు ఖర్చయిపోతాయి. కానీ, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఒక సంవత్సరపు 'పాలు' అన్నిటినీ కలిపి, దాన్ని ఆ సంవత్సరపు పాల ఉత్పత్తిగా చూస్తాం. ఆ రకపు రోజువారీ పదార్థాల ఉత్పత్తులన్నిటినీ అలాగే.

ఒక సంవత్సర ప్రారంభంలో, పూర్తిగా తయారైన వస్తువులు కొన్నీ, సగం తయారైన వస్తువులు కొన్నీ, భూమి మీద మొక్కల రూపంలో పెరుగుతూ వున్న పదార్థాలు కొన్నీ వున్నాయి— అనుకుందాం. ఆ సంవత్సరం ముగిసి, రెండో సంవత్సరం ప్రారంభమయ్యే సరికి, కిందటి సంవత్సరపు ఉత్పత్తుల దశలన్నీ మారిపోయి వుంటాయి. తయారైన బట్ట వాడకానికి వెళ్ళిపోతుంది. మళ్ళీ కొత్త బట్టని నేస్తూ వుంటారు. ఈ పనిలో దారం ఖర్చయిపోతూ వుంటుంది కాబట్టి, ఇంకోచోట దారం తయారవుతూ వుంటుంది. ఆ పనిలో పత్తి ఖర్చయిపోతూ వుంటుంది కాబట్టి, ఇంకోచోట పత్తిని పండిస్తూ వుంటారు. ఏ ఒక్క వస్తువుని తీసుకున్నా, దానికి సంబంధించిన అన్ని దశలూ, ఒకే కాలంలో, ఒక దాని పక్కన ఒకటి జరుగుతూనే

వుంటాయి. పత్తి పంట పూర్తి అయ్యి, అది అమ్మకానికి వెళ్ళినప్పుడు, ఆ దశకి అదే 'తయారైన సరుకు'గా (ఫినిష్డ్ సరుకుగా) వుంటుంది. దారాన్ని తయారుచేయించే పెట్టుబడిదారుడు పత్తిని కొన్నప్పుడు, అది వాడి 'ఉత్పత్తి క్రమం'లో 'ముడి సరుకు'. దారం తయారైపోయి, అమ్మకానికి వచ్చినప్పుడు, అది 'ఫినిష్డ్ సరుకు'. ఆ దారమే, బట్ట తయారీలోకి వచ్చినప్పుడు అక్కడ అది, 'ముడి సరుకు'. బట్ట తయారై అమ్మకానికి వస్తే అది 'ఫినిష్డ్ సరుకు'. ఆ బట్టే దుస్తుల తయారీలోకి వస్తే, అక్కడ అది 'ముడి సరుకు.' ఈ రకంగా, దుస్తులు తయారై వెళ్ళిపోతూ వుండగా, ఆ 'పని స్థలం'లోకి బట్ట వస్తుంది. బట్ట తయారయ్యే పని స్థలంలోకి దారం వస్తుంది. దారం తయారయ్యే పని స్థలంలోకి పత్తి వస్తుంది. పత్తి తయారయ్యే పని స్థలంలో వ్యవసాయం పని జరుగుతూ పత్తి మొక్కలు పెరుగుతూ వుంటాయి.

ఈ రకంగా, కిందటి సంవత్సరంలో వుండిన కొన్ని 'ఉత్పత్తులు, రెండో సంవత్సరం ప్రారంభం నాటికి వాడకం వల్ల పూర్తిగా అంతర్ధానమైపోతాయి. <u>కిందటి సంవత్సరంలో ఎక్కడా లేని కొన్ని ఉత్పత్తులు కొత్తగా ప్రత్యక్షమై వుంటాయి, కొత్త పంటల రూపంలో.</u>

ఉత్పత్తీ, దాని పంపకమూ— అనే విషయాల గురించి, ఉదాహరణల్ని ఎలాగైనా తీసుకోవచ్చు.

ఒక ఉదాహరణ ప్రకారం, ఒక సంవత్సరం ఉత్పత్తిని మరుసటి సంవత్సరంలో ఖర్చుపెడుతూ ఉన్నట్టు అనుకోవచ్చు. ఏటా అలాగే.

ఇంకో ఉదాహరణ ప్రకారం, ఏ సంవత్సరపు ఉత్పత్తిని ఆ సంవత్సరమే ఖర్చు పెడుతున్నట్టు అనుకోవచ్చు. ఏటా అలాగే.

మూడో ఉదాహరణ ప్రకారం, ఒక సంవత్సరపు ఉత్పత్తిలో కొన్ని రకాల్ని అదే సంవత్సరంలో ఖర్చు పెడతాం. మిగతా రకాల్ని తర్వాత సంవత్సరాల్లో క్రమంగా ఖర్చుపెడతాం. ఏటా అలాగే.

ఉదాహరణని ఎలా తీసుకున్నా అన్నిటి సారాంశమూ ఒకటే. ఉత్పత్తీ, దాని పంపకమూ—అనేదే ఆ సారాంశం.

ఒక సంవత్సరం మొదట్లో కొంత పత్తి పండిందనుకుందాం. కొన్ని నెలలకు ఆ పత్తి అంతా దారంగా మారిందనుకుందాం. మళ్ళీ కొన్ని నెలలకు ఆ దారం అంతా బట్టగా మారిందనుకుందాం. అప్పటికి ఆ సంవత్సరం పూర్తి అయిందనుకుందాం. ఆ సంవత్సరపు ఉత్పత్తిని లెక్క కట్టాలంటే, ఆ చివరి ఉత్పత్తి అయిన 'బట్ట' విలువ మాత్రమే లెక్కలోకి వస్తుంది. ఆ బట్టకి సంబంధించిన పత్తి విలువా, దారం విలువా, విడి విడిగా లెక్కలోకి రావు. ఆ పత్తీ, దారమూ, విడి విడిగా లేవు. పత్తి దారంగా మారి, దారం బట్టగా మారిపోయింది. కాబట్టి, అన్నిటి విలువా బట్టలోనే వుంది. ఆ బట్ట అలా వుండగా కూడా, దాని సరసనే కొంత దారం వుండవచ్చు. అది, ఆ బట్టతో సంబంధంలేని వేరే దారం. అది ఇంకో సరుకు. ఆ రెండిటి సరసనా కొంత పత్తి కూడా వుండవచ్చు. అది ఇంకో సరుకు. ఆ మూడూ వేరు వేరుగా వున్నాయి కాబట్టి, దేని విలువ దానికి వేరు వేరు గానే వుంటుంది. అప్పుడు, ఆ మూడూ వేరు వేరు ఉత్పత్తులుగా లెక్కకు వస్తాయి.

ఒక సమాజంలో ఏ రోజున చూసినా పూర్తిగా తయారైన వస్తువులు కొన్నీ, సగం తయారైన వస్తువులు కొన్నీ, మరీ ముడిగా వున్న వస్తువులు కొన్నీ వుంటాయి. వేరు వేరు దశలలో వున్న వస్తువులూ, పదార్థాలూ, అన్నీ కలిసే ఆ క్షణంలో వున్న మొత్తం ఉత్పత్తి అవుతుంది.

అమ్మకానికి వచ్చే ఒక సరుకు, పెట్టుబడిదారుడి 'పని స్థలం'లోకైనా చేరుతుంది; లేదా, వాడి స్వంత వాడకం కోసం వాడి ఇంటికైనా చేరుతుంది, లేదా, కార్మికుడి ఇంటికైనా చేరుతుంది.

ఒక పెట్టుబడిదారుడి నించి 100 మీటర్ల బట్ట అమ్మకానికి వెళ్ళిందనుకుందాం. దానికి బదులుగా, మళ్ళీ 100 మీటర్ల బట్ట కోసం కావలసిన కొత్త ఉత్పత్తి సాధనాలూ, కార్మికుల జీవితావసర వస్తువులూ, పెట్టుబడి దారుడి జీవితావసర వస్తువులూ, ఈ 3 రకాలూ, మార్కెట్ నించి వెళ్ళిపోతాయి. ఆ బట్ట కోసం, కావలసిన ఫిక్సెడ్ సాధనాలు మాత్రం కొన్ని సంవత్సరాలకు ఒక సారి మారతాయి.

ప్రతీ పెట్టుబడిదారుడూ, అనేక మంది ఇతర పెట్టుబడిదారుల నించి అనేక రకాల సరుకుల్ని కొని తెచ్చి, వాటిని ఖర్చు పెట్టి, ఏదో 'ఒకే రకం' కొత్త సరుకుని తయారు చేయిస్తాడు. ఒక పెట్టుబడిదారుడి సరుకు అంతా దారంగా వుంటే, ఒకడి సరుకు అంతా బట్టగా, ఒకడి సరుకు అంతా యంత్రాలుగా, ఒకడి సరుకు అంతా ధాన్యంగా, ఒకడి సరుకు అంతా 'ప్రయాణ సౌకర్యాలు'గా — ఇలా.

ఇదే విషయాన్ని కార్మికుల వేపు నించి చూస్తే — ప్రతీ కార్మికుడూ ఏదో ఒక్క రకం సరుకు ఉత్పత్తి కోసమే పని చేస్తాడు. నేత కార్మికులు బట్టని తయారు చేసే పని తప్ప రెండో పని చెయ్యరు. వ్యవసాయ కార్మికులు ధాన్యం పండించే పనీ, గని కార్మికులు బొగ్గు తవ్వే పనీ. ఇలా. కొందరేసి కార్మికులు ఒక్కో సరుకుని మాత్రమే ఉత్పత్తి చేస్తారు. కానీ, సమాజంలో చూస్తే అన్ని రకాల సరుకులూ ఉత్పత్తి అవుతూనే వుంటాయి. ఈ మొత్తం ఉత్పత్తిలోనే 'ఉత్పత్తి సాధనాలు'గా ఉపయోగపడే ఉత్పత్తులూ, కార్మికుల పోషణ వస్తువులూ, పెట్టుబడిదారుల పోషణ

వస్తువులూ, అన్నీ వుంటాయి.

ఒక పెట్టుబడిదారుడి సరుకు అంతా వాడి దగ్గిరి నించి బయటికి వెళ్ళిపోయి, దానికి బదులుగా ఇతర పెట్టుబడి దారుల సరుకులు కొన్ని వాడి చేతిలోకి రావడం అంటే, ఒక 'ఉపయోగపు విలువ' ఇటు నించి వెళ్ళిపోయి, వేరే రకం 'ఉపయోగపు విలువలు' అనేక చోట్ల నించి ఇటు వస్తున్నాయని అర్థం.

ప్రతీ పెట్టుబడిదారుడూ, తన 'పని స్థలం'లోకి ఇతర పెట్టుబడిదారుల సరుకులు కొనడమూ, తన సరుకు అమ్మడమూ, కార్మికులకు జీతాలు ఇవ్వడమూ, ఆ కార్మికులు ఆ జీతాలతో తమ పోషణ వస్తువుల్ని పెట్టుబడిదారుల దగ్గిర కొనడమూ, పెట్టుబడిదారులు కూడా తమ స్వంత వాడకానికి కావలసిన వస్తువుల్ని 'తమ స్వంత ఆదాయాలతో' ఇతర పెట్టుబడిదారుల దగ్గిర కొనడమూ — ఇలాంటి దశలతో నిండిన ఈ వ్యవహారం అంతా పెద్ద 'అబద్ధాల నాటకం'. అమ్మడాలూ, కొనడాలూ అనేవి సమాజం అంతా ప్రతీ నిత్యం ఎన్నో కోట్ల సార్లు జరిగినా, ఎవరి వేపు నించి ఎవరి వేపు జరిగినా, వాటన్నిటి ద్వారా జరిగే అసలు విషయం — కార్మికులందరూ వేరు వేరు స్థలాలలో ఉత్పత్తి చేసే రక రకాల ఉత్పత్తులన్నీ అందరి మధ్యా ఇటూ అటూ మారడమే. అంటే, 'మొత్తం ఉత్పత్తి' రాసిలో కొంత భాగం కార్మికులకూ, కొంత భాగం పెట్టుబడిదారులకూ అందడమే. ఈ విషయం, ఒక్కో పెట్టుబడిదారుడి ఉత్పత్తినీ విడి విడిగా చూడడం గాక, మొత్తం సమాజ ఉత్పత్తిని చూస్తేనే అర్థమవుతుంది.

సమాజంలో, ప్రతి రోజూ జరుగుతోన్న పని, రక రకాల సరుకుల్ని తయారు చెయడమూ, తయారైన సరుకుల రాసిని దాని విలువ అంశాల మధ్య పంచుకోవడమూ. ఏ సరుకు తయారైతే ఆ సరుకునే ఆ పని స్థలంలోనే పంచుకోవడం గాక, దాన్ని ఇచ్చేసి, దానికి బదులుగా వేరే సరుకుల్ని తెచ్చుకోవడం. పెట్టుబడిదారుడైతే, తన స్వంత వాడకానికీ, తన సరుకు తయారీకీ కావలసిన 2 రకాల ఉత్పత్తులు తెచ్చి వాడతాడు. కార్మికులైతే, స్వంత వాడకానికి సంబంధించిన ఉత్పత్తుల్ని మాత్రమే వాడతారు.

## 'ఉత్పత్తి' విలువా, 'విలువ' ఉత్పత్తీ

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ఏ మాత్రమూ అర్థం చేసుకోలేకపోయిన విషయాలు ఇవి. గత చాప్టర్లలో చూసిన విషయాలతోనే మనం వీటిని ఎంతో తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. ఇంత వరకూ చూసినదాన్ని సరిగా అర్థం చేసుకున్నట్టయితే, ఈ ప్రశ్నకి జవాబు తేలిగ్గా చెప్ప కోవచ్చు. — ఒక 'సరుకు' ఏ 'ఉత్పత్తి క్రమం'లో తయారవుతుందో, దాని మొత్తం విలువ అంతా ఆ ఉత్పత్తి క్రమంలోనే తయారవుతుందా?

బట్టని నేసే ఉత్పత్తి క్రమాన్ని తీసుకుంటే, ఆ ఉత్పత్తి క్రమంలోంచి బయటపడ్డ 100 మీటర్ల బట్టకి 120 విలువ ఏర్పడింది కదా? ఈ 120 విలువా, ఆ బట్ట తయారైన ఉత్పత్తి క్రమంలో ఉత్పత్తి అయిన దేనా?— కాదు. ఈ 'ఉత్పత్తి క్రమం'లో, జీతాలు 20 + అదనపు విలువ 20 = 40 విలువ మాత్రమే ఉత్పత్తి అయింది. ఇక్కడ అంత విలువగల శ్రమ మాత్రమే జరిగింది. బట్టలో ఇంకా వున్న 80 విలువ, దాని ఉత్పత్తి సాధనాలది. బట్టని తయారు చెయ్యడానికి కావలసిన ఉత్పత్తి సాధనాలన్నీ అంతకు ముందే తయారై వుండాలి. అవి తయారుగా వుంటేనే వాటి మీద కొంత కొత్త శ్రమ చేసి బట్టని నెయ్యడం సాధ్యమవుతుంది. అంటే, ఆ 80 విలువ, బట్టని తయారు చెయ్యడాని కన్నా ముందే వుంది. అది, గత ఉత్పత్తి క్రమాలలోనే ఉత్పత్తి అయి వుంది. బట్టని ఉత్పత్తి చేసిన 'ఉత్పత్తి క్రమం'లో 40 విలువ మాత్రమే ఉత్పత్తి అయి, మిగిలిన 80 విలువ బట్టలోకి కేవలం 'బదిలీ' మాత్రమే అయింది. కాబట్టి, ఒక సరుకు ఏ ఉత్పత్తి క్రమంలో తయారవుతుందో, దాని విలువ అంతా ఆ ఉత్పత్తి క్రమంలోనే ఉత్పత్తి అవదు.

ఒక విడి సరుకుకి విలువ ఏర్పడడం ఏ పద్ధతిలో జరుగుతుందో, ఒక 'సంవత్సర ఉత్పత్తి రాసి'కి విలువ ఏర్పడడం కూడా ఆ పద్ధతిలోనే జరుగుతుంది. అంటే, ఒక సంవత్సరంలో తయారైన 'ఉత్పత్తి రాసి'కి ఎంత విలువ వుంటుందో, ఆ విలువ అంతా, ఆ సంవత్సరంలోనే ఏర్పడేది కాదు. అందులో 'ఉత్పత్తి సాధనాల విలువ' అంతా గత సంవత్సరం నించి ఈ సంవత్సర ఉత్పత్తిలోకి బదిలీ అవుతుంది. అలా బదిలీ అయిన ఉత్పత్తి సాధనాల విలువకి ఈ సంవత్సరపు 'కొత్త సజీవ శ్రమ' కూడా కలిసి, అదంతా ఈ సంవత్సర ఉత్పత్తికి 'మొత్తం విలువ' అవుతుంది.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు అర్థం చేసుకోని ఈ 'ఉత్పత్తి విలువా, విలువ ఉత్పత్తీ' అనే విషయాల్ని మనం

సరిగా అర్థం చేసుకోవాలి.

'ఉత్పత్తి విలువ' అంటే, 'ఉత్పత్తి'కి వున్న మొత్తం విలువ.

'విలువ ఉత్పత్తి' అంటే, ఒక వుత్పత్తి క్రమం జరిగేటప్పుడు ఉత్పత్తి అయిన విలువ.

సంవత్సరపు ఉత్పత్తి విలువ — అంటే 1 సంవత్సరంలో తయారైన ఉత్పత్తికి వున్న 'మొత్తం విలువ'. దీన్ని 120 గా (కోట్లు) అనుకున్నాం. ఇందులో 80 స్థిర + 20 అస్థిర + 20 అదనపు విలువా వుంటాయి.

'సంవత్సర విలువ ఉత్పత్తి' అంటే, ఆ సంవత్సరంలో ఎంత విలువ ఉత్పత్తి అయిందో అదీ. అంటే, 20 అస్థిరా + 20 అదనపు విలువా మాత్రమే. ఈ 40 మాత్రమే ఈ సంవత్సరంలో ఉత్పత్తి అయిన విలువ.

ఉత్పత్తికి వున్న మొత్తం విలువ 120. ఈ సంవత్సరంలో ఉత్పత్తి అయిన విలువ మాత్రం 40.

ఇక్కడ ఒక విషయం సరిగా అర్థం చేసుకోవాలి. 'వెయ్యి కోట్ల ఉత్పత్తుల రాసి'ని తీసుకున్నా, లేదా 'ఒక్క మీటరు బట్ట'నే తీసుకున్నా, అది, **C + V + S** అనే 3 భాగాలుగా వుంటుంది. అంటే 3 రకాలుగా చేరిన విలువలు కలిసి. అంతే కాదు, అందులో ప్రతీ భాగమూ కూడా 3 భాగాలుగా వుంటుంది. అంటే, **C** — 3 భాగాలుగా, **V** — 3 భాగాలుగా, **S** — 3 భాగాలుగా. మళ్ళీ ఆ భాగాలు కూడా అలాగే, మూడేసి భాగాలుగా వుంటాయి.

ఈ 3 భాగాల సంగతిని సరిగా అర్థం చేసుకుంటే గానీ, ఆర్థిక శాస్త్రాన్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

ఒక్క మీటరు బట్టని తీసుకున్నా, వెయ్యి కోట్ల ఉత్పత్తుల రాసిని తీసుకున్నా, దాని కోసం అవసరమయ్యే మొత్తం శ్రమ 2 మార్గాల ద్వారానే వస్తుంది. (1) ఉత్పత్తి సాధనాల ద్వారానూ. (2) సజీవ శ్రమ ద్వారానూ.

అయితే, ఈ సజీవ శ్రమ, దోపిడీ విధానంలో, 2 భాగాలుగా అవుతుంది కాబట్టి, ఉత్పత్తికి వుండే మొత్తం విలువని ( మొత్తం శ్రమని ) 3 మార్గాల ద్వారా చేరిన విలువగా చూస్తాం. **C** ద్వారానూ, **V** ద్వారానూ, **S** ద్వారానూ చేరిన విలువలుగా.

ఒక సంవత్సర వుత్పత్తుల రాసికి వున్న విలువని చూడాలంటే, ఆ ఉత్పత్తుల్ని, 3 సంచుల్లో వున్నట్టు ఊహించాలి. (1) ఉత్పత్తి సాధనాల సంచి, (2) కార్మికుల పోషణ వస్తువుల సంచి, (3) పెట్టుబడిదారుల పోషణ వస్తువుల సంచి (అదనపు విలువని తినే వాళ్ళందరూ ఇందులో నించే.)

మొదటి సంచిలో వున్న వుత్పత్తుల్ని చూస్తే, అవి తయారవడానికి కూడా, (దీని విలువకి కూడా) 3 మార్గాల నించి చేరే విలువలు అవసరం. **C + V + S** లు.

రెండో సంచి సంగతీ అలాగే.

మూడో సంచి సంగతీ అలాగే.

ఏ సంచిలో నించి అయినా, ఒకే ఒక విడి వుత్పత్తిని తీసుకుంటే, దాని విలువ కూడా 3 భాగాలుగా వుండేదే.

ఒక సంవత్సరపు రాసిని తీసుకుని, దాన్ని కనీసం 2 సార్లు విభజించి చూస్తే, విలువకి సంబంధించిన విషయాలు కొంచెం తేలిగ్గా తెలుస్తాయి.

కత్తులూ, తుపాకులూ, యుద్ధ పరికరాలూ, యుద్ధ విమానాలూ, యుద్ధ నౌకలూ వగైరా 'ఆయుధ సామాగ్రి' అంతా 'ఉత్పత్తి సాధనాల' కోవలోకీ రాదు; 'జీవితావసర వస్తువుల' కోవలోకీ రాదు. కానీ, ఇది 'దోపిడీ ఉత్పత్తి విధానం' కాబట్టి, 'ఆయుధాలు' అనే వన్నీ పెట్టుబడిదారీ వర్గానికి అవసరం కాబట్టి, ఇవి ఆ వర్గం వాడే భాగంలోకే చేరతాయని అర్థం చేసుకోవాలి. ఆయుధాల సంగతి ఇక్కడ ఇంత కన్నా అవసరం లేదు.

ఇప్పుడు, మనం ఒక సంవత్సర ఉత్పత్తిని 3 భాగాలుగా విభజించుకోవాలి. ప్రతీ సంవత్సరమూ, ఈ 3 రకాలూ ఉత్పత్తి అవ్వాలి. వీటినన్నిటిని ఉత్పత్తి చెయ్యాలంటే, దాని కోసం ఉత్పత్తి సాధనాలూ, కార్మికుల పోషణ వస్తువులూ కావాలి. ఈ 2 రకాలూ కిందటి సంవత్సరంలో తయారై సిద్ధంగా ఉన్నాయని అనుకోవాలి. అంతే కాదు, వాటితోపాటు, పెట్టుబడిదారీ వర్గపు పోషణ ఉత్పత్తులు కూడా వుండవలసిందే. కిందటి సంవత్సరంలో తయారైన ఈ ఉత్పత్తులన్నిటినీ ఖర్చు చేస్తూ ఇప్పుడు మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాల్నీ కొత్త జీవితావసర వస్తువుల్నీ (కార్మికుల పోషణకూ, పెట్టుబడిదారుల పోషణకూ కూడా కావలసిన వాటిని) ఉత్పత్తి చెయ్యాలి. ఇవన్నీ వచ్చే సంవత్సరంలో ఖర్చవుతాయి.

ఒక సంవత్సరం ఉత్పత్తి కోసం కావలసిన 'చలామణీ పెట్టుబడి' — 300 అనుకుందాం. అందులో 240 స్థిరా, 60 అస్థిరా. అంటే, పెట్టుబడిదారులందరి పని స్థలాలలోనూ ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాలు 240. వాళ్ళందరూ ఇచ్చే జీతాలు — 60. అదనపు విలువ రేటుని 100% అనుకుంటే, పెట్టుబడిదారులందరికీ వచ్చే అదనపు విలువ — 60. మొత్తం సంవత్సర ఉత్పత్తి విలువ = 240 **C** + 60 **V** + 60 **S** = 360. ఇంత విలువ గల ఈ సంవత్సర ఉత్పత్తిలో, 240 విలువ ఇప్పుడు ఉత్పత్తి అయినది కాదు. కిందటి సంవత్సరం నించి అందినది.

మొత్తం 360 విలువ గల ఉత్పత్తిలో స్థిర, అస్థిర, అదనపు విలువల పాళ్ళు = 240 : 60 : 60 = 4 : 1 : 1 గా

వున్నాయి. అంటే, తయారైన ఉత్పత్తికి వున్న మొత్తం విలువలో 4 పాళ్ళు స్థిరదీ, 1 పాలు అస్థిరదీ, 1 పాలు అదనపు విలువదీ.

తయారయిన ఉత్పత్తి సాధనాల విలువ = 240
తయారయిన జీవితావసర వస్తువుల విలువ = 120

కొందరు పెట్టుబడిదారులు 'ఉత్పత్తి సాధనాల'నే ఉత్పత్తి చేస్తారు (చేయిస్తారు). కొందరు పెట్టుబడిదారులు 'జీవితావసర వస్తువుల'నే ఉత్పత్తి చేస్తారు (చేయిస్తారు). ఈ 2 అంశాల విలువల్నీ విడి విడిగా చూడాలి.

**(1) 'సంవత్సర రాసి'లో వున్న ఉత్పత్తి సాధనాలు:** వీటి విలువ 240. ఈ విలువ కూడా స్థిర, అస్థిర, అదనపు విలువలుగా వుండాలి. ఈ 'ఉత్పత్తి సాధనాలు' తయారవ్వాలంటే, మొదట కొంత స్థిరా, కొంత అస్థిరా వుండాలి. మొత్తం సంవత్సర రాసికి వుండే విలువ పాళ్ళని 4:1:1 గా అనుకున్నాం కదా? ఆ పాళ్ళనే ఇక్కడ కూడా పెట్టుకుంటాం. 240 విలువ గల ఉత్పత్తి సాధనాల పాళ్ళని 4:1:1 గా అనుకుంటే, ఆ విలువ — 160 స్థిర: 40 అస్థిర: 40 అదనపు విలువ — గా వుంటుంది. ఈ 'ఉత్పత్తి సాధనాలు' ఈ సంవత్సరం కొత్తగా ఉత్పత్తి అయ్యాయి. అయితే, వీటి ఉత్పత్తి ప్రారంభం అయ్యేటప్పటికే, 160 స్థిరా, 40 అస్థిరా తయారయి సిద్ధంగా వుండాలి. వాటిని ఖర్చు చేస్తూ కార్మికులు ఈ 'ఉత్పత్తి సాధనాల్ని' ఉత్పత్తి చేస్తారు.—ఏ ఉత్పత్తి తయారవ్వాలన్నా, **C** విలువ బదిలీ అవడమూ, **V** విలువ పునరుత్పత్తి అవడమూ, **S** విలువ కొత్తగా ఉత్పత్తి అవడమూ జరుగుతాయి కదా? అలాగే ఇక్కడ కూడా జరుగుతుంది. ఈ ఉత్పత్తులు, తయారవుతూ వున్న సమయంలోనే ఉత్పత్తి సాధనాలు కావు. అప్పుడు ఇవి కొత్తగా తయా రయిన సరుకులు (**C'**) మాత్రమే. తర్వాతే ఇవి 'ఉత్పత్తి సాధనాలు' అవుతాయి.

**(2) సంవత్సర 'రాసి'లో వున్న జీవితావసర వస్తువులు. (2 వర్గాలకూ సంబంధించినవి):** ఇవి కొంత మంది పెట్టుబడిదారుల దగ్గిర తయారవుతూ వుంటాయి. వీటి విలువ 120. ఈ విలువ కూడా స్థిర, అస్థిర, అదనపు విలువలుగా వుండాలి. వీటి పాళ్ళని కూడా 4:1:1 గానే అనుకుంటాం. ఆ ప్రకారం ఈ 120 విలువని విభజిస్తే, అది 80 స్థిర: 20 అస్థిర: 20 అదనపు విలువలుగా వుంటుంది. ఇందులో స్థిర, అస్థిరల విలువలు కిందటి సంవత్సరానివే. ఆ విలువల్ని వాడుతూ, ( స్థిరని పని స్థలం లోనూ అస్థిరని తమ ఇళ్ళ లోనూ వాడుతూ, ) కార్మికులు ఈ కొత్త జీవితావసర వస్తువుల్ని తయారుచేశారు.

ఇలా ఒక సంవత్సరపు ఉత్పత్తుల రాసి తయారైంది. ఆ రాసిని మళ్ళీ 3 రకాల సంచులుగా ఉన్నట్టు ఊహించాలి. **C** సంచిలోవున్న ఉత్పత్తుల్ని మరుసటి సంవత్సరంలో పెట్టుబడిదారులందరూ తమ పనిస్థలాల్లో ఉత్పత్తి సాధనాలుగా వాడతారు. **V** సంచిని కార్మిక వర్గమూ, **S** సంచిని పెట్టుబడిదారీ వర్గమూ తమ పోషణ కోసం వాడతారు.

ఈ వాడకాలన్నీ పూర్తి అయ్యేటప్పటికి మళ్ళీ కొత్త రాసి తయారవుతుంది. అది కూడా మళ్ళీ 3 సంచులుగా వుంటుంది. —ఏటా జరిగేది ఇదే.

# ఉత్పత్తి సాధనాల విలువ ఎప్పుడూ ఖర్చయిపోదా? ఎప్పుడూ బదిలీ అవుతూనే వుంటుందా?

ఈ 2 విషయాలూ నిజమే. 2 విషయాలూ దేని దారిన అవి జరుగుతూ వుంటాయి.

మగ్గం, ఒక ఉత్పత్తి సాధనం ( శ్రమ పరికరం ). దాని విలువ 100. దాని జీవిత కాలం 5 సం.లు. అది శ్రమ పరికరంగా పనిచేసిన కాలంలో, ఏటా 20 విలువ ని బదిలీ చేస్తుంది. 5 సంవత్సరాలు ముగిసేటప్పటికి, 100 విలువని బదిలీ చేస్తుంది. అప్పటికి ఆ మగ్గం, ఇక పనికి రాకుండా పాడైపోతుంది.

ఆ మగ్గం ద్వారా, ఒక సంవత్సరంలో తయారైన బట్ట, ఇంకో సంవత్సరం నాటికి పాతబడి పాడైపోతే, ఆ బట్ట కోసం ఖర్చయిన శ్రమ అంతా వాడకం అయిపోయినట్టే. ఆ బట్టకి, ఉత్పత్తి నాధనాల ద్వారా బదిలీ అయిన నిర్జీవ శ్రమ కూడా ఖర్చయిపోయినట్టే.

ఆ మగ్గం పాతబడి పాడైపోయే నాటికి దాని ద్వారా గత సంవత్సరాల్లో తయారైన బట్ట అంతా పాతబడిపోయి, చిట్ట చివరి సంవత్సరంలో తయారైన బట్ట ఇంకా కొత్తగా ఇంకా వాడకంలో వుండవచ్చు. ఆ చివరి బట్ట కూడా పాతబడి పోయినప్పుడు, ఆ మగ్గం ద్వారా బదిలీ అయిన విలువ అంతా పూర్తిగా ఖర్చయిపోయినట్టే. అప్పుడు ఇక, ఆ మగ్గమూ వుండదు, అది బదిలీ చేసిన విలువా వుండదు.

కానీ, ఆ ఉత్పత్తి క్రమంలోకి, ఆ పాత మగ్గం పోగానే దాని స్థానంలోకి వెంటనే కొత్త మగ్గం వస్తుంది. అది, తన విలువని, కొన్ని సంవత్సరాల పాటు కొత్త ఉత్పత్తికి బదిలీ చెయ్యడం మొదలుపెడుతుంది. అది పాత మగ్గం ద్వారా

గాక, కొత్త మగ్గం ద్వారా జరుగుతుంది. ఆ కొత్త మగ్గం కూడా పాడైపోయినప్పుడు, ఇంకో కొత్త మగ్గం, ఉత్పత్తి క్రమంలోకి దిగుతుంది. మగ్గం, పాతదైనా కొత్తదైనా మగ్గం విలువ బదిలీ అవడం, ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది. ప్రతీ ఉత్పత్తి క్రమంలోకీ, అలా బదిలీ అయ్యే C విలువ, గత స్థాయి కన్నా తగ్గకుండా అదే స్థాయిలో ఎప్పుడూ వుంటుంది. ఉత్పత్తుల స్థాయి పెరుగుతూ వుంటే, బదిలీ అయ్యే C విలువ కూడా పెరుగుతూ వుంటుంది.

ఒక వస్తువు తయారవడం కోసం, కొన్ని ఉత్పత్తి సాధనాల నించి కొంత విలువ బదిలీ అయినట్టుగానే, ఒక సంవత్సరంలో తయారయ్యే మొత్తం ఉత్పత్తుల రాసిని తీసుకుంటే, ఆ రాసి కోసం కూడా అలాగే జరుగుతుంది. ప్రతీ సంవత్సరమూ కొత్త ఉత్పత్తి రాసి తయారవడానికి, దాని కోసం అవసరమయ్యే ఉత్పత్తి సాధనాల విలువ, ఆ రాసికి బదిలీ అవుతుంది.

ఒక సంవత్సరపు ఉత్పత్తుల రాసిని తీసుకుంటే, ఆ ఉత్పత్తులన్నీ అలాగే వుండిపోవు. ఆ రాసిలో నించి 2 వర్గాలకూ సంబంధించిన పోషణ వస్తువులన్నీ తర్వాత ఖర్చయిపోతాయి. ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగపడే ఉత్పత్తులు కూడా తర్వాత సంవత్సరంలో ఖర్చయిపోతాయి. ఆ సమయంలో, వాటి విలువ, తర్వాత సంవత్సరంలో జరిగే కొత్త ఉత్పత్తుల రాసికి బదిలీ అవుతుంది.

ఒక సంవత్సరపు వుత్పత్తుల రాసి తయారవుతూ వున్నప్పుడు, ఒక వేపు - దాని కోసం కొంత C విలువ బదిలీ అవడమూ జరుగుతూ వుంటుంది ; ఇంకో వేపు - ఆ సంవత్సర కాలంలో 2 వర్గాల పోషణ వస్తువులూ ఖర్చవుతూ వుంటాయి కాబట్టి, ఆ వస్తువుల లోకి బదిలీ అయి వున్న నిర్జీవ శ్రమా, సజీవ శ్రమా కూడా ( ఆ వస్తువుల మొత్తం విలువ ) ఖర్చయిపోవడమూ జరుగుతుంది. ఇవి రెండూ వేరు వేరు విషయాలు. అవి, లంకెలు పడి సాగుతాయి.

C విలువని బదిలీ చేసే క్రమం వేరూ, ( ఇది కొత్త ఉత్పత్తుల్ని తయారుచేసే క్రమం ), వస్తువుల్లోకి గతంలోనే బదిలీ అయి వున్న C విలువ ఖర్చయిపోయే క్రమం వేరూ ( ఇది పోషణ వస్తువుల్ని వాడే క్రమం ).

ఒక 'వస్తువు'ని ఉత్పత్తి సాధనంగా వాడితే, దాని విలువ ఖర్చయిపోదు; కొత్త ఉత్పత్తిలోకి బదిలీ అవుతుంది. లేదా, అదే వస్తువుని పోషణ కోసం వాడితే, దాని విలువ ఖర్చయిపోతుంది.

కొన్ని వస్తువులు, సూటిగా పోషణ కోసం ఉపయోగపడవు. ఉత్పత్తి సాధనాలుగానే ఉపయోగపడతాయి. ఉదా : మగ్గం, బియ్యం.


ఒక చోట - C విలువని బదిలీ చేసే ఉత్పత్తులు వేరూ, ఇంకో చోట - C విలువ ఖర్చయిపోయే ఉత్పత్తులు వేరూ.

ఉత్పత్తి సాధనాల విలువ, ఒక సంవత్సరపు ఉత్పత్తుల రాసి నించి, తర్వాత సంవత్సరపు ఉత్పత్తుల రాసికి బదిలీ అవడం - అనేది ఒక విషయం.

ఉత్పత్తి సాధనాల నించి బదిలీ అయిన విలువ కూడా ఖర్చయిపోతూ వుండడం - అనేది ఇంకో విషయం.

ఈ 2 విషయాలూ జరుగుతూనే వుంటాయి.

ఒక సంవత్సర రాసిలో భాగాల్ని ఒక పట్టిక ద్వారా ఇలా చూడవచ్చు. దీన్ని అర్థం చేసుకోలేకపోతే ఇంత కన్నా తేలికైన మార్గం ఏదీ వుండదు.




అన్ని పని స్థలాల్లోనూ కలిసి 360 విలువగల రాసి తయారవుతుంది. ప్రతీ చోటా C + V లు ఖర్చవుతాయి. S లు మాత్రం ఏ పెట్టుబడి ఖర్చూ లేకుండానే కొత్తగా ఉత్పత్తి అవుతూ వుంటాయి.

ఒక్క పని స్థలాన్నే విడిగా చూస్తే, మొత్తం విషయం అర్థం కాదు. అన్ని స్థలాల్నీ కలిపి చూడాలి. అంటే, మొత్తం ఉత్పత్తుల రాసిని.

3 చోట్లా వున్న C ల్ని కలిపితే, అది C ల మొత్తం.

3 చోట్లా వున్న V ల్ని కలిపితే, అది V ల మొత్తం.

3 చోట్లా వున్న S ల్ని కలిపితే, అది S ల మొత్తం.

C లన్నీ = 160 C + 40 C + 40 C = 240 C

V లన్నీ = 40 V + 10 V + 10 V = 60 V

S లన్నీ = 40 S + 10 S + 10 S = 60 S

సంవత్సర ఉత్పత్తి విలువ $= 240_C + 60_V + 60_S = 360$

సంవత్సర విలువ ఉత్పత్తి $= 0_C + 60_V + 60_S = 120$

ఒక విడి పని స్థలాన్ని తీసుకుంటే, ఉదా : బట్ట తయారయ్యే స్థలాన్ని తీసుకుంటే, అక్కడ, జీతాల శ్రమ పునరుత్పత్తి అవడమూ, అదనపు శ్రమ కొత్తగా జరగడమూ, ఉత్పత్తి సాధనాల విలుల బదిలీ అవడమూ, కనపడతాయి. కానీ, ఈ పని స్థలంలో బట్ట అనే ఒకే ఒక్క రకం సరుకు తప్ప ఇంకే సరుకూ తయారవదు.

కానీ సమాజంలో అన్ని శాఖల్లోనూ జరిగే అన్ని పని స్థలాల్నీ తీసుకుంటే, ఇక్కడ సమస్త విషయాలూ కనపడతాయి.

**(1)** జీతాల విలువ ఖర్చయిపోయి, ఆ శ్రమ తిరిగి జరగడం కనపడుతుంది. ఈ పోషణ ఉత్పత్తులన్నీ అనేక

చోట్ల తయారవడం కూడా కనపడుతుంది.

(2) ఉత్పత్తుల కోసం కొత్త శ్రమ జరగడమూ, అనేక పని స్థలాల్లో ఆ ఉత్పత్తులు తయారవడమూ కూడా కనపడుతుంది.

(3) ఉత్పత్తి సాధనాల విలువ అంతా బదిలీ అవడమూ కనపడుతుంది. అనేక పని స్థలాల్లో కొత్త ఉత్పత్తి సాధనాలు తయారవడమూ కనపడుతుంది.

ఒక 'విడి సరుకు విలువ'లో, స్థిర, అస్థిర, అదనపు విలువలు వున్నట్టే, 'సంవత్సర ఉత్పత్తి విలువ'లో కూడా ఆ 3 అంశాలూ వుంటాయి. కానీ, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలకు ఇంత ప్రధానమైన విషయాలు ఏ మాత్రమూ తెలియవు. ఉదా: స్మిత్తు అవగాహన ప్రకారం — ఒక విడి సరుకు విలువలో అయితే, ఉత్పత్తి సాధనాల విలువా, జీతాల విలువా, లాభం విలువా వుంటాయిగానీ, 'సంవత్సర ఉత్పత్తి'లో అయితే ఉత్పత్తి సాధనాల విలువ విడిగా వుండదు. అదంతా జీతాలలోకీ, లాభంలోకీ చేరిపోయి వుంటుంది. మన ఉదాహరణనే తీసుకుంటే, 'సంవత్సర ఉత్పత్తి విలువ' స్మిత్తు ప్రకారం కూడా 360 గానే వుంటుంది. కానీ, అది 3 అంశాలకు చెందిన విలువగా గాక, 2 అంశాలకు చెందిన విలువగా మాత్రమే వుంటుంది. అంటే, సంవత్సర రాసిలో, జీతాలూ, లాభాలూ మాత్రమేగానీ, ఉత్పత్తి సాధనాల విలువ వుండదు.

ఆ ఆర్థికవేత్త అవగాహన అలా ఎందుకు ఉందంటే : 'శ్రమ'లో నిర్జీవ, సజీవ లక్షణాల గురించి, సరైన స్పష్టమైన అవగాహన లేకపోవడం వల్ల.

'సంవత్సర ఉత్పత్తి' అన్నప్పుడు, అందులోకి మొత్తం అన్ని శాఖల ఉత్పత్తీ వస్తుంది కదా? ఒక చోట ఉత్పత్తి సాధనాలుగా పనిచేసే సరుకులు, వేరేచోట్ల తయారైన సరుకులే కాబట్టి, మొత్తం ఉత్పత్తి విలువని లెక్క చూసేటప్పుడు, 'ఉత్పత్తి సాధనాల విలువ' ప్రత్యేకంగా ఉండనక్కరలేదు — అనుకోవడం వల్ల. లేదా, మొత్తం ఉత్పత్తి అంతా కొత్తగా తయారయ్యేదే కాబట్టి, కొత్త ఉత్పత్తి విలువ అంతా కొత్తగా ఉత్పత్తి అయ్యేదే — అనుకోవడం వల్ల. కానీ, 'మొత్తం ఉత్పత్తి'ని తీసుకున్నప్పుడు కూడా, అది తయారవడానికి కావలసిన **C** భాగం విలువ, కొత్తగా ఉత్పత్తి అయ్యేదిగా గాక, గతం నించి బదిలీ అయ్యేదిగానే ఉంటుందని గ్రహించకపోతే 'విలువ' గురించి ఏమీ అర్థం కాదు. ఇలా పొరపాటు అభిప్రాయాలెన్నో ఉండడం వల్లనే, 'సంవత్సర ఉత్పత్తి'కి సంబంధించిన విలువ అంశాల గురించి స్మిత్తు వివరణ అలా ఉంటుంది. 'ఉత్పత్తి సాధనాలు' అనే విషయం గురించీ; విలువ బదిలీ అవడమూ, పునరుత్పత్తి అవడమూ — అనే విషయాల గురించీ; 'శ్రమ'కు వున్న నిర్జీవ, సజీవ లక్షణాల గురించీ — ఇలా, ఈ విషయాల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్లనే పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల వివరణలు, ఈ రకంగా, అనేక పొరపాట్లతో వుంటాయి.

మనం మళ్ళీ 'సంవత్సర ఉత్పత్తి క్రమాని'కి వస్తే:

ఒక సంవత్సరంలో తయారైన ఉత్పత్తి సాధనాలూ, పోషణ వస్తువులూ ఇంకో సంవత్సరానికి అంది, అక్కడ 'కొత్త శ్రమ' జరిగి, కొత్త 'ఉత్పత్తి రాసి' తయారై, దానికోసం పాత ఉత్పత్తుల రాసి ఖర్చయిపోతుంది.

ఒక సంవత్సరపు ఉత్పత్తి సాధనాలూ, పోషణ వస్తువులూ, తర్వాత సంవత్సరానికి అందడం — అనే విషయం ఎలా జరుగుతుందో ఇలా చూడవచ్చు. 4 సం.ల కాలాన్ని వరసగా తీసుకుంటే, ఆ సంవత్సరాల సంబంధాలు ఇలా ఉంటాయి.

పాత సంవత్సరపు ఉత్పత్తి సాధనాలూ+కొత్త సంవత్సరంలో జరిగిన సజీవ శ్రమా = కొత్త సంవత్సరపు ఉత్పత్తుల రాసి.

1 వ సం.రపు ఉత్పత్తి సాధనాలూ + 2 వ సం.రపు సజీవ శ్రమా = 2 వ సం.రపు ఉత్పత్తుల రాసి.

2 వ సం.రపు ఉత్పత్తి సాధనాలూ + 3 వ సం.రపు సజీవ శ్రమా = 3 వ సం.రపు ఉత్పత్తుల రాసి.

3 వ సం.రపు ఉత్పత్తి సాధనాలూ + 4 వ సం.రపు సజీవ శ్రమా = 4 వ సం.రపు ఉత్పత్తుల రాసి.

4 వ సం.రపు ఉత్పత్తి సాధనాలూ + 5 వ సం.రపు సజీవ శ్రమా = 5 వ సం.రపు ఉత్పత్తుల రాసి.

ఈ విధంగా, ఉత్పత్తి సాధనాలకూ, కొత్తగా జరిగే సజీవ శ్రమకూ సంబంధం ఏర్పడడం అంటే, 'గతాని'కీ 'వర్తమానా'నికీ సంబంధం ఏర్పడడం. గతంలో తయారయిన ఉత్పత్తుల్లో, ప్రకృతి ఇచ్చిన పదార్థమూ, మానవ శ్రమా కలిసి వుంటాయి. ఆ రక రకాల ఉత్పత్తుల మీద రక రకాల కొత్త శ్రమలు కలిసినప్పుడు, వాడకం ద్వారా పాత ఉత్పత్తులు కొన్ని పూర్తిగా నశించి పోవడమూ, అంత వరకూ లేని కొత్త ఉత్పత్తులు కొన్ని పుట్టుకు రావడమూ జరుగుతూ వుంటుంది. పాత ధాన్యం ఖర్చయిపోయి, కొత్త ధాన్యం పుట్టుకొస్తుంది. పాత బట్ట ఖర్చయిపోయి కొత్త బట్ట తయారవుతుంది. ఈ రకంగా ఒక సంవత్సరం నించి ఇంకో సంవత్సరానికి 'పదార్థాల' సంబంధాలూ, 'శ్రమల' సంబంధాలూ పెనవేసుకుని ఒక ప్రవాహంలాగా, గతం నించి వర్తమానానికీ, వర్తమానం నించి భవిష్యత్తుకీ, సాగుతూ వుంటాయి.

'ఉత్పత్తి'కీ, 'పంపిణీ'కీ సంబంధించిన విషయాల్ని 'డబ్బు' ద్వారా గాక, సూటిగా 'ఉత్పత్తుల' ద్వారానే అర్థం చేసుకోవడంలో ఏమీ గజిబిజి వుండదు. ఏ సంవత్సరాన్ని తీసుకున్నా, ఆ సంవత్సర కాలంలో, ఆ సమాజపు

అంచనాల ప్రకారం ఒకవేపున కొత్త పదార్థాలు ఉత్పత్తి అవుతూ వుండడమూ, దాని సరసనే ఇంకో వేపున, పాత పదార్థాలు ఖర్చయిపోతూ వుండడమూ — ఈ 2 పనులూ ఒక దానితో ఒకటి పెనవేసుకుని జరిగిపోతూ వుంటాయని తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. కానీ, విషయాల్ని 'ఉత్పత్తుల' ద్వారా గాక, డబ్బు లెక్కల ద్వారా చూడవలసి వస్తే అప్పుడు అంతా గజి బిజిగా అయిపోతుంది.

పెట్టుబడిదారుడి దగ్గర తయారైన సరుకుని, వెంటనే ఆ సరుకు రూపంలోనే స్థిర, అస్థిర, అదనపు విలువ భాగాలకు పంచెయ్యడం సాధ్యం కాదు కాబట్టి, ఆ పంపకాలు డబ్బు రూపంలోనే జరగాలి. అంటే, సరుకుని మొదట 'డబ్బు'గా మార్చాలి. పెట్టిన పెట్టుబడి అంతా తిరిగి వచ్చి, 'లాభం' కూడా రావాలంటే, తయారైన సరుకు నంతటినీ పూర్తిగా అమ్మాలి.

100 మీటర్ల బట్టలో నించి, 50 మీటర్లు మాత్రమే అమ్మితే, అప్పటికి పెట్టిన పెట్టుబడిలో కొంత భాగం మాత్రమే తిరిగి వచ్చినట్టు అవుతుంది. 67 మీటర్లు అమ్మితే స్థిర పెట్టుబడి భాగం తిరిగి వచ్చినట్టు. ఇంకో $16\frac{1}{2}$ మీటర్లు అమ్మితే అస్థిర భాగం కూడా తిరిగి వచ్చినట్టు. చివరి $16\frac{1}{2}$ మీటర్ల బట్టని కూడా అమ్మేస్తే ఆ పెట్టుబడి మీద రావలసిన అదనపు విలువ కూడా వచ్చినట్టు.

బట్ట అమ్మకం ప్రారంభించాక, మొదట 16 మీటర్లు అమ్మగానే (20 డబ్బు రాగానే) "నా లాభం నాకు వచ్చింది" అనుకోగలడా పెట్టుబడిదారుడు? — మొదట ఖర్చు పెట్టిన పెట్టుబడి అంతా తిరిగి వచ్చాకే లాభం వస్తుంది. తయారైన సరుకు అంతా పూర్తిగా నార్మల్ ధరకి అమ్ముడు పోతేనే పెట్టుబడి అంతా సవ్యంగా తిరిగి వచ్చి, లాభం కూడా సవ్యంగా చేతికి అందుతుంది.

తయారైన సరుకుని, దాని విలువ భాగాలకు పంచి, ఏ భాగానికి ఎంత వచ్చిందో చూపే పద్ధతి, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలదే. సరుకుని, దాని విలువ అంశాల మధ్య విభజించి చూడడంలో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల ఉద్దేశ్యం ఏమిటంటే — ఆ సరుకు తయారవడానికి ఉత్పత్తి సాధనాలూ, జీతాలూ మాత్రమే గాక, లాభం కూడా కారణం అయినట్టూ; సరుకులో నించి కొంత భాగాన్ని తీసుకోవడానికి అన్నిటికీ హక్కు వున్నట్టే లాభానికి కూడా హక్కు వున్నట్టూ: తయారైన సరుకులో నించి ఏ భాగానికి రావలసింది ఆ భాగానికి వచ్చి సరుకు పంపకం అంతా చాలా న్యాయమైన పద్ధతిలో జరుగుతోంది అన్నట్టూ — చూపించాలని!

సరుకుని, దాని విలువ అంశాల మధ్య విభజించి చూపించడంలో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల అర్థం ఎలాంటిదైనా, ఉత్పత్తిని అలా విభజించి చూడడం మన ప్రకారం కూడా చాలా మంచిదే. 'అదనపు విలువ' అనే విషయం గురించి బోధపడిన తర్వాత, దాన్ని 'అదనపు ఉత్పత్తి' రూపంగా కూడా చూడడం వల్ల, అసలు విషయం చాలా స్పష్టంగా కనపడుతుంది. కార్మిక వర్గం వాడుకోవలసిన ఎంత ఉత్పత్తి, ఆ వర్గానికి దక్కకుండా పోతోందో 'అదనపు ఉత్పత్తి'ని చూసినప్పుడే తెలుస్తుంది. 'పెట్టుబడి దారీ ఆర్థిక శాస్త్రం' ద్వారా గ్రహించలేని అనేక వాస్తవాల్ని గ్రహించడానికీ, అనేక సమస్యల్ని పరిష్కరించడానికీ, ఈ విభజన మనకు ఎంతో అవసరమవుతుంది.

# ప్రశ్నలూ — జవాబులూ

**1. 'సంవత్సర ఉత్పత్తుల రాసి' ఏ యే భాగాలుగా వుంటుంది?**

**జ:** ఒక్క రోజు ఉత్పత్తుల రాసి ఏ యే భాగాలుగా ఉంటుందో, సంవత్సర ఉత్పత్తుల రాసి కూడా ఆ భాగాలుగానే ఉంటుంది. (1) ఉత్పత్తి సాధనాలూ (2) జీతాలూ (3) అదనపు ఉత్పత్తీ — ఈ 3 భాగాలుగా.

**2. ఒక సరుకు తయారైనప్పుడు C విలువ, గతంలో నించి కొత్త సరుకుకి బదిలీ అవుతుంది కదా? ఆ విలువ, గతంలోకి ఎక్కడి నించి వచ్చింది?**

**జ:** ఆ గతం కన్నా గతం నించీ.

**3. ఒక ఉత్పత్తుల రాసి విలువ 840. దాని స్థిర, అస్థిర, అదనపు విలువల పాళ్ళు = 4 : 3 : 3. ఏ భాగానికి ఎంత విలువ గల రాసి వస్తుంది?**

**జ:** విలువ పాళ్ళు:

**C + V + S**

4 + 3 + 3 = 10 భాగాలు.

| | |
|---|---|
| ఉత్పత్తుల రాసి విలువ | = 840. |
| **C** భాగం = 4 ÷ 10 × 840 | = 336 |
| **V** భాగం = 3 ÷ 10 × 840 | = 252 |
| **S** భాగం = 3 ÷ 10 × 840 | = 252 |
| రాసి విలువ | = 840 |

**4. కొన్ని ఫినిష్డ్ సరుకుల్ని చెప్పండి!**

**జ:** ఒక శ్రమ క్రమంలో ఒక వస్తువు తయారైనప్పుడు, అది ఎలాంటి వస్తువు అయినా, అది ఏ దశలో వున్నా, ఆ శ్రమ క్రమానికి అదే ఫినిష్డ్ సరుకు. వ్యవసాయం పనితో పత్తి తయారైనప్పుడు, ఆ దశకి అదే ఫినిష్డ్ సరుకు. దాన్ని దారంగా చేస్తే, అప్పుడు దారమే ఫినిష్డ్ సరుకు. దారంతో బట్ట తయారైతే అప్పుడు బట్టే ఫినిష్డ్ సరుకు. బట్టతో చొక్కా కుడితే, చొక్కాయే ఫినిష్డ్ సరుకు.

**5. 'ఉత్పత్తి విలువ' అంటే ఏమిటి? 'విలువ ఉత్పత్తి' అంటే ఏమిటి? ఉదాహరణతో చెప్పండి!**

**జ:** ఒక రెడీమేడ్ దుస్తుల పెట్టుబడిదారుడి దగ్గిర ఒక కుట్టు కార్మికుడు ఒక చొక్కా కుట్టాడు. దాని విలువ = 15 C + 10 V + 12 S. ఈ ఉత్పత్తికి విలువ = 37. కానీ ఈ విలువ అంతా ఈ కుట్టు కార్మికుడి ద్వారా ఈ శ్రమ క్రమంలోనే ఉత్పత్తి అయినది కాదు. ఇక్కడ ఎంత విలువని ఉత్పత్తి చెయ్యడం జరిగిందంటే (ఎంత విలువ గల శ్రమ ఇక్కడ జరిగిందంటే) 10V + 12S = 22 విలువని.

కాబట్టి ఈ ఉదాహరణలో, చొక్కా అనే ఉత్పత్తికి ఉన్న మొత్తం విలువ 37; కానీ, దాని కోసం ఇక్కడ ఉత్పత్తి అయిన విలువ 22.

**6. ఒక మగ్గం, ఒక నేత పని స్థలంలో, కొంత బట్ట కోసం, పూర్తిగా పాతబడి ఖర్చయి పోయిందనుకుందాం. ఈ పని స్థలంలోకి మళ్ళీ కొత్త మగ్గం కావాలి కదా? దాని కోసం కొంత డబ్బు కావాలి కదా? ఆ కొత్త మగ్గం ఎలా వస్తుంది? దాని కోసం కావలసిన డబ్బు ఎలా వస్తుంది?**

**జ:** ఇక్కడ 'బట్ట' తయారవుతూ వున్నట్టే, ఇంకో చోట 'మగ్గాలు' తయారవుతూ వుంటాయి. నేత పని స్థలంలో, కొంత బట్ట తయారై ఒక మగ్గం పాతబడి పోయే సమయానికి, ఇంకో చోట కొత్త మగ్గం తయారై సిద్ధంగా ఉంటుంది. పాత మగ్గం విలువ, బట్ట ద్వారా, వెనక్కి వచ్చి ఉంటుంది. పాత మగ్గం డబ్బుతోటే, పాత మగ్గానికి బదులు కొత్త మగ్గం వస్తుంది.

**7. ఇది మగ్గాలు తయారయ్యే పని స్థలం. ఒక మగ్గం విలువ = 15 C + 4V + 6S = 25. ఒక మగ్గం తయారయ్యేటప్పుడు, 25 విలువ గల శ్రమ, ఇక్కడ కొత్తగా జరిగిందా? మగ్గం కొత్తగా తయారైందా?**

**జ:** మగ్గం అయితే, కొత్తగానే తయారవుతుంది. కానీ, దాని విలువలో ప్రతీ భాగమూ కొత్తగా తయారవదు. ఆ విలువలో V + S భాగాల శ్రమ మాత్రమే కొత్తగా జరుగుతుంది. C భాగం బదిలీ అవుతుంది. V భాగం, పునరుత్పత్తి అయ్యేదే అయినా, ఆ శ్రమ ఇక్కడ మళ్ళీ కొత్తగా జరగవలసిందే.

**8. ఈ లెక్క తప్పకుండా చెయ్యండి!**

**ఒక సంవత్సర ఉత్పత్తి రాసి విలువ 1800. దాని స్థిర, అస్థిర, అదనపు విలువల పాళ్ళు — 4 : 1 : 1. ఒక సంవత్సర ఉత్పత్తిని, ఉత్పత్తి సాధనాల భాగంగానూ, జీవితావసర వస్తువుల భాగంగానూ విభజిస్తే, ఏ భాగం విలువ ఎంత? 'ఉత్పత్తి సాధనాల' భాగాన్ని మళ్ళీ స్థిర, అస్థిర, అదనపు విలువలుగా (మొత్తం రాసి ఏ పాళ్ళతో వుందో ఆ పాళ్ళతో) విభజించండి! అలాగే 2 వర్గాలకూ వుండే జీవితావసర వస్తువుల భాగాల్ని కూడా.**

**జ:** మొత్తం ఉత్పత్తి రాసి విలువ 1800. దాని పాళ్ళు,

4 C + 1 V + 1 S = 6 భాగాలు.

C భాగం = 4 ÷ 6 × 1800 = 1200

V భాగం = 1 ÷ 6 × 1800 = 300

S భాగం = 1 ÷ 6 × 1800 = 300

ప్రతీ భాగమూ C + V + S లుగా ఉంటాయి కాబట్టి, ప్రతీ భాగాన్నీ కూడా అలా విభజించగలం. ఆ పాళ్ళని, 4 + 1 + 1 గానే తీసుకోవాలి.

C భాగం అయిన 1200 ని,

C + V + S లుగా విభజిస్తే:

C భాగం = 4 ÷ 6 × 1200 = 800

V భాగం = 1 ÷ 6 × 1200 = 200

S భాగం = 1 ÷ 6 × 1200 = 200

ఇలాగే, మొదట చూసిన V భాగం అయిన 300 నీ, S భాగం అయిన 300 నీ కూడా చూడాలి. అప్పుడు, C లన్నిటినీ కలిపితే అవి 1200; V ల్ని కలిపితే అవి 300; S ల్ని కలిపితే అవి 300 అవుతాయి. ★

# 8. పని దినం

'పని దినం' అంటే, కార్మికులు పని ప్రారంభించ డానికీ, దాన్ని ఆపివెయ్యడానికీ మధ్య వుండే కాలం.

పని దినం, 2 భాగాలుగా వుంటుంది.

(1) అవసర శ్రమ జరిగే కాలం,

(2) అదనపు శ్రమ జరిగే కాలం.

కార్మికులు, మొదట, 'జీతాల' విలువని తిరిగి ఇవ్వాలి కాబట్టి, పని దినం 'అవసర శ్రమ'తో ప్రారంభమవుతుంది. జీతాల విలువకి సరిపోయినంత పని జరిగాక, తర్వాత జరిగే పనంతా 'అదనపు శ్రమ'. అందుకే, అవసర శ్రమ కాలమూ + అదనపు శ్రమ కాలమూ = ఒక 'పని దినం'.

ఇక్కడ 3 రకాల పొడవులు గల పని దినాలు ఉన్నాయి.

1) ● ———————— ● —— ●
అవసర కాలం 6 గం. అదనపు కాలం 2 గం.

2) ● ———————— ● ———— ●
అవసర కాలం 6 గం. అదనపు కాలం 3 గం.

3) ● ———————— ● ———————— ●
అవసర కాలం 6 గం. అదనపు కాలం 6 గం.

ఈ 3 పని దినాలూ, వేరు వేరు పొడవులు గలవి. కానీ, మూడిటిలోనూ 'అవసర కాలం' ఒకటే. 'అదనపు కాలమే, మారింది. అంటే, ఏ పొడవు గల పని దినాన్ని తీసుకున్నా, అవసర కాలాన్ని తీసివెయ్యగా మిగిలేదే 'అదనపు కాలం'. 'అవసర శ్రమ' కాలానికి ఒక హద్దు వుంటుంది. జీతాల విలువ'ని తిరిగి ఇవ్వడం (ఆ విలువకు సరిపోయే శ్రమ చెయ్యడం) అనే కారణం వుంటుంది కాబట్టి, ఆ భాగానికి ఒక ఖచ్చితమైన హద్దు వుంటుంది. ఆ తర్వాత జరిగే 'అదనపు శ్రమ కాలానికి' అలాంటి హద్దు వుండదు. అదనపు శ్రమ కాలం ఎంత వుండాలి? 1 గంటా, 2 గంటలా, 5 గంటలా? ఎంత? ఈ రెండో భాగం ఎంతైనా వుండవచ్చు. అవసర శ్రమ కాలాన్ని 6 గంటలు అనుకుంటే, దాని తర్వాత అదనపు శ్రమ 2 గంటలసేపు జరిగితే, అప్పుడు పని దినం 8 గంటలు. లేదా, అదనపు శ్రమ 3 గంటలసేపు జరిగితే, పని దినం 9 గంటలు. లేదా అదనపు శ్రమ 6 గంటల సేపు జరిగితే, పని దినం 12 గంటలు. అంటే, అదనపు శ్రమ కాలాన్ని బట్టే 'పని దినం' పొడవు వుంటుంది.

'పని దినం'లో వుండే రెండో భాగం స్థిరమైనది కాదు కాబట్టి, పని దినం కూడా స్థిరమైనది కాదు.

'అదనపు శ్రమ కాలం' చాలా ఎక్కువగా వుంటే, పెట్టుబడిదారుడికి చాలా ఇష్టం. కానీ, అది వాడికి ఎంత ఇష్టం అయినా, అదనపు శ్రమ భాగానికి కూడా ఒక హద్దు తప్పనిసరి అవుతుంది. ఎందుకంటే, పెట్టుబడిదారుడి 'దురదృష్టం' కొద్దీ రోజుకి 24 గంటలే. 'పని దినం' అనేది ఆ 24 గంటల హద్దులోనే వుండి తీరాలి. భూమి, తన చుట్టూ తను తిరిగే కాలం 24 గంటలు కాకుండా, 34 గంటలో, 44 గంటలో అయితే పెట్టుబడిదారుడికి చాలా బాగుండేది. కార్మికుల్ని పీడించడానికి వాడికి ప్రతిరోజూ ఇంకో 10 గంటలో, 20 గంటలో ఎక్కువగా దొరికేవి. కానీ, భూమి 'నడ్డి' మరీ లావుగా లేక, అది తన చుట్టూ తను తిరుగుతూ ఒక రోజుని సృష్టించడానికి 24 గంటలే తీసుకుంటోంది. రోజుకి ఎక్కువ గంటలు 'పని చెయ్యడం' దానికీ ఇష్టం లేదు గావును!

రోజుకి 24 గంటలు కాబట్టి, కార్మికులకు 2 గంటలకో, 3 గంటలకో మాత్రమే జీతాలిచ్చి ఆ 24 గంటలూ పని చేయించాలనే వుంటుంది పెట్టుబడిదారుడికి. కానీ, దానికి కార్మికుడి దేహం ఒప్పదు. అది 'సజీవమైనది' కాబట్టి, తిండి తినడానికీ, ఇతర అవసరాలకూ, విశ్రాంతికీ, నిద్రకీ, ఎంతెంత తక్కువ కాలాలు తీసుకున్నా అన్నిటికీ కలిసి ఎంతో కొంత కాలం కావాలి. కాబట్టి, కార్మికులతో 24 గంటలూ పని చేయించడం సాధ్యం కాదు. 'శ్రమ శక్తి'కి వున్న ఈ భౌతిక పరిస్థితుల్ని బట్టి, పని దినానికి తప్పనిసరిగా ఒక హద్దు ఏర్పడుతుంది.

'శ్రమ చరిత్ర' ఇప్పటికి అనేక రకాల పని దినాల్ని చూసింది. ఒకప్పుడు 18 గంటల పని దినం కూడా వుండేది. 14 వ శతాబ్దం మధ్య నించి 17 వ శతాబ్దం చివరి వరకూ, ఐరోపాలో, 'పని దినాన్ని' మరింత మరింత పెంచుతూ అనేక శాసనాలు వచ్చాయి. అవన్నీ మళ్ళీ మారుతూ, పని దినం క్రమంగా తగ్గింది. 18 గంటల పని దినం క్రమంగా తగ్గుతూ ఇప్పటికి 8 గంటల పని దినంగా వుంది. ఆ పాత 18 గంటల పని దినానికీ, ఇప్పటి 8 గంటల పని దినానికీ మధ్య కాలంలో 16, 14, 12, 10 గంటల పని దినాల నన్నిటినీ కాలం చూసింది.

పని దినం పొడవు, దానికదే పెరిగేదీ, దానికదే తగ్గేదీ, కాదు. పని దినాన్ని పెంచాలని పెట్టుబడిదారులు చూస్తే,

తగ్గించాలని కార్మికులు చూస్తారు. రకరకాల పరిస్తితుల వల్ల వచ్చే అనుభవాల్ని బట్టి, ముఖ్యంగా పెట్టుబడిదారీ వర్గానికీ, కార్మిక వర్గానికీ జరిగే పోరాటాల బలాబలాల్ని బట్టి, పని దినం పొడవు వుంటుంది. 8 గంటల పని దినం అనేది, కార్మిక వర్గం కొన్ని శతాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితమే.

ఒకప్పటి 18 గంటల పని దినం, ఇప్పటికి 8 గంటల పని దినంగా మారినప్పటికీ, ఇప్పటికీ కూడా ఇంకా అనేక చోట్ల 8 గంటల కన్నా ఎక్కువ పొడవు గల పని దినాలు కూడా నడుస్తున్నాయి. ప్రభుత్వ చట్టాల్లో వున్న నిబంధనల్ని ఏ పెట్టుబడిదారుడూ పాటించడు. ప్రభుత్వమే స్వయంగా ఒక పెట్టుబడిదారుడు కాబట్టి, అది పై పై నాటకం కోసం చట్టాలు చేస్తుందేగానీ, ఆ చట్టాల్ని పెట్టుబడిదారులంతా పాటించాలని అది ఒత్తిడి చెయ్యదు. కార్మికుల పోరాట శక్తి తగ్గినప్పుడల్లా పని దినం మళ్ళీ దేహం పెంచుతూ వుంటుంది.

ఒకప్పుడు, ఇంగ్లండులో, 8 సంవత్సరాల పిల్లలు కూడా రోజుకి 8 గంటలు పని చెయ్యాలని శాసనం ఉండేది. 12 సం. నించి 18 సం.ల వరకూ వుండే పిల్లలకు రోజూ 12 గం.ల పని! పెద్ద వాళ్ళకు తెల్లారగట్ల 5 గంటల నించి రాత్రి 8 వరకూ 15 గంటల పని!

1848 లో, పిల్లలు 10 గంటల కన్నా ఎక్కువ పని చెయ్యరాదని, బ్రిటన్‌లో ప్రభుత్వం శాసనం చేసినప్పుడు, నూనె మిల్లుల యజమానులు కొందరు, వాళ్ళ కార్మికులతో ప్రభుత్వానికి పిటీషన్లు పెట్టించారు. ఏమనీ?— "మీ పిటీషను దారులమైన మేము, మా పిల్లల తల్లితండ్రులుగా ప్రభుత్వానికి విన్నవించుకునే దేమి టనగా — మా పిల్లలకు ఎక్కువ ఖాళీ దొరికితే సోమరులుగా తిరుగుతూ చెడిపోతారు గనక, 10 గంటల పని దినాన్ని ఇంకా పెంచి మా పిల్లలు ఎప్పుడూ పనిలోనే వుండే విధంగా చేసి మా పిల్లలు చెడిపోకుండా చేయవలసినదిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాము" అని! పెట్టుబడిదారులే పిటీషన్లు తయారుచేసి కార్మికుల్ని సంతకాలు పెట్టమంటారు. సంతకాలు పెట్టకపోతే ఉద్యోగాలు పోతాయనే భయంతో కార్మికులు సంతకాలు పెడతారు. ఆ పిటీషన్ల రహస్యం అంతా అదే. రోజూ 10 గంటల సేపు పనిచేసే పిల్లలే 'సోమరులు'గా లెక్కకు వస్తే, రోజుకి ఒక్క నిముషం కూడా పనిచెయ్యని పెట్టుబడిదారుల పిల్లలు ఏంగా లెక్కకు రావాలి? 10 గంటలు పని చేసినా, పదకొండో గంట పని లేనందు వల్ల కార్మికుల పిల్లలు చెడిపోతే, పెట్టుబడి దారుల పిల్లలు ఎన్ని రెట్లు చెడిపోతూ వుండాలి! అంతకన్నా ముందు, వాళ్ళ బాబులూ, అమ్మలూ, ఎన్ని రెట్లు చెడిపోయి వుండాలి!

# షిఫ్టు పద్ధతి

24 గంటలూ పనిచెయ్యడానికి కార్మికుల శరీరాలు ఒప్పుకోవు గానీ, యంత్రాలూ, బిల్డింగులూ, పాత్రలూ వగైరా ఉత్పత్తి సాధనాలన్నీ ఒప్పుకుంటాయి కదా? వాటిని పగలు మాత్రమే వాడి, రాత్రుళ్ళు వాడకుండా ఖాళీగా వుంచడం, పెట్టుబడిదారుడికి చాలా 'తెలివి తక్కువ' పనిగా తోస్తుంది. వాటిని పగలే గాక రాత్రి కూడా ఉపయోగించగలిగితే వాటి మీద పెట్టిన పెట్టుబడి తక్కువ కాలంలోనే తిరిగి వచ్చేస్తుంది కదా? అంతేగాక, వాటిని రాత్రులు కూడా వాడుతూ వుంటే, రాత్రులు కూడా సరుకు తయారై, రాత్రులు కూడా 'అదనపు విలువ' ఉత్పత్తి అవుతూ వుంటుంది కదా? అయితే, ఒకే జట్టు కార్మికులు పగలూ రాత్రీ కూడా పని చెయ్యలేరు కాబట్టి, ఒక జట్టు కార్మికులు పనిలోంచి బైటికి వెళ్ళగానే, వెంటనే ఇంకో జట్టు కార్మికులు పనిలోకి దిగి ఉత్పత్తి సాధనాల్ని ఖాళీగా వుండనివ్వకుండా పని కొనసాగించవచ్చు. ఈ మార్గం పెట్టుబడిదారులు కొత్తగా కనిపెట్టారు. అదే షిఫ్టు పద్ధతి.

పగటి షిఫ్టులో ఎంత మంది కార్మికులు వుండాలో, రాత్రి షిఫ్టులో కూడా అలాగే వుండాలి. ప్రతీ కార్మికుడూ కొంత కాలం పగటి షిఫ్టులోనూ, కొంత కాలం రాత్రి షిఫ్టులోనూ పని చెయ్యాలి. రోజుకి 3 షిఫ్టులు వుండే పని స్తలాలలో, పని దినం, 8 గంటలే అవుతుంది.

ఒక షిఫ్టులో పని చెయ్యడానికి 20 మంది కార్మికులు కావాలనుకుంటే, 3 షిఫ్టుల్లో పని చెయ్యడానికి 60 మంది కార్మికులు కావాలి. కానీ, మొత్తం 60 మంది కార్మికుల్ని పెట్టి, ఏ షిఫ్టు కార్మికుల్ని ఆ షిఫ్టుకి వుంచడం కన్నా, ఆ సంఖ్యని కూడా తగ్గించే పద్ధతిలో పెట్టుబడిదారుడు, మరింత తెలివిగా ఆలోచిస్తాడు. మొత్తం 45 మందినో, 50 మందినో మాత్రమే పెట్టి, వాళ్ళల్లోనే కొంతమందితో రెండో షిఫ్టులో కూడా పని చేయించడం పెట్టుబడిదారుడికి ఎక్కువ 'లాభదాయకం'గా వుంటుంది.

చాలామంది కార్మికులు, నెలలో అనేకసార్లు రెండేసి షిఫ్టుల్లో వరసగా పని చెయ్యవలసి వుంటుంది. 2 షిఫ్టుల్లో పనిచేసే కార్మికుడు, 2 షిఫ్టులకూ 2 జీతాలు తీసుకున్నప్పటికీ ఇక్కడ అసలు విషయం 'జీతం' గురించి కాదు. ఒక మానవ దేహం, వరసగా 16 గంటల పాటు పని చెయ్యవలసి రావడమే ఇక్కడ అసలు విషయం.

ఈ 'షిఫ్టు పద్ధతి' పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి మాత్రమే ప్రత్యేకమైనది. ఇది, గత సమాజాలలో లేదు. పెట్టుబడిదారీ విధానం, అమ్మకానికి సరుకుని ఉత్పత్తి చేసే విధానం కాబట్టి, ఇది పూర్తిగా 'విలువ దృష్టితోనే' సాగుతుంది. ఇది, రోజులో ప్రతీ నిముషంలోనూ 'సరుకు'ని ఉత్పత్తి చేయించడానికే చూస్తుంది.

షిఫ్టు విధానంలో, కార్మికులు, గతం కన్నా మరింత అసహజమైన జీవిత విధానంలో పడిపోతారు. ప్రతీ కార్మికుడూ 3 రకాల షిఫ్టుల్లోనూ పని చెయ్యాలి కాబట్టి, కార్మికుడికి నిత్య జీవితంలో కొన్నాళ్ళు 'ఉదయాలూ', కొన్నాళ్ళు 'సాయంత్రాలూ', కొన్నాళ్ళు 'రాత్రులూ' లేకుండా పోతాయి. మొదటి షిఫ్టు చేసే రోజుల్లో కార్మికుడు విశ్రాంతిగా నిద్రలేవవలసిన కాలంలో ఆందోళనపడుతూ ఆదరా బాదరాగా లేచి, తన స్వంత పనులు అస్తవ్యస్తంగా చేసుకుని, తెల తెలవారే వేళకే పని స్థలంలో హాజరవ్వాలి. రెండో షిఫ్టు చేసే కాలంలో, మిట్టమధ్యాన్నం బైల్దేరి వెళ్ళి, అర్ధరాత్రి వేళ ఇంటికి రావాలి. రాత్రి షిఫ్టు చేసే కాలంలో, రాత్రి పూట వెళ్ళి తెల్లవార్లూ నిద్రలేకుండా గడిపి, విశ్రాంతిగా నిద్ర లేవవలసిన ఉదయం సమయంలో నిద్ర కళ్ళతో ప్రయాణం చేసి ఇంటికి రావాలి.

మనిషి, ప్రతి రోజూ 8 గం.లు నిద్రపోవాలి — అనుకుంటే, రాత్రి షిఫ్టు చేసిన కార్మికుడు పగలంతా నిద్రలోనే వుండాలి. రాత్రి షిఫ్టు చేసే కార్మికులకు, రాత్రి పనీ, పగలు నిద్రా అవుతాయి. కార్మిక కుటుంబపు ఇరుకు గదిలో పగలు నిద్రపోవడం ఎంత అసాధ్యమో కార్మికులకు తెలిసిందే.

షిఫ్టుల పద్ధతిగా శ్రమలు చేసే కార్మికులకు ఏ అలవాటూ ఒక సరైన పద్ధతిలో ఏర్పడడానికి అవకాశం వుండదు. కాల కృత్యాలు తీర్చుకోవడం, ఇంటి పని చేసుకోవడం, పిల్లల పని చేసుకోవడం, స్నానం చెయ్యడం, భోజనం చెయ్యడం, నిద్రపోవడం, ఇతర వ్యవహారాలు చూసుకోవడం, విశ్రాంతిగా గడపడం — వగైరా విషయాల్ని దేని సమయంలో దాన్ని, ఒక క్రమశిక్షణ తోటీ, సహజమైన అలవాట్ల తోటీ పాటించడం సాధ్యం కాదు. ఒక షిఫ్టు కాలంలో వున్న అలవాట్లు, మిగతా షిఫ్టుల కాలాల్లో పనికి రావు.

కొన్ని రకాల పనుల్లో స్త్రీ కార్మికులకు కూడా నైట్ షిఫ్టులు వుంటాయి.

భార్యా భర్తలిద్దరూ ఉద్యోగాలు చేసే కుటుంబాల్లో ఇద్దరూ, నైట్ షిఫ్టులకు పోవలసిన సందర్భాలు అనేక సార్లు వుంటాయి.

ఒకవేళ స్త్రీ కార్మికులకు షిఫ్టుల పద్ధతి లేకపోయినా, కుటుంబంలో పురుషుడు షిఫ్టుల పద్ధతిలో పని చేస్తాడు గనక, ఆ స్త్రీ జీవితం కూడా పురుషుడి షిఫ్టుల పద్ధతికి అనుగుణంగానే మారుతుంది. షిఫ్టుల పద్ధతిలో పనిచేసే పురుషుడు పిల్లల పెంపకం బాధ్యత నిర్వహించలేడు కాబట్టి, అది పూర్తిగా స్త్రీ మాత్రమే ఒంటరిగా నిర్వహించవలసిన బాధ్యత అవుతుంది. — ఈ రకంగా, కార్మికుల జీవితాలలో షిఫ్టు పద్ధతి ప్రతీ విషయాన్నీ అస్తవ్యస్తంగా మార్చివేస్తుంది.

షిఫ్టు పద్ధతి లేకపోయినా శ్రమ దోపిడీ వుంటుంది. కానీ, షిఫ్టు పద్ధతివల్ల శ్రమ దోపిడీయే గాక, కార్మికులకు ఇంకా అదనపు సమస్యలు కూడా వుంటాయి.

పెట్టుబడిదారుడు, ప్రతీ రాత్రీ హాయిగా నిద్రపోతూ వుంటే, కార్మికులు వంతులవారీగా ప్రతీ రాత్రీ పనిచేస్తూ వుంటారు. ఒక పెట్టుబడిదారుడు రవాణా పెట్టుబడిదారుడు అయితే, వాడు తెల్లవార్లూ నిద్రపోతూ వుంటే, వాడి కార్మికులు తెల్లవార్లూ బస్సులూ, లారీలూ నడుపుతూ వుంటారు. బట్ట పెట్టుబడిదారుడి కార్మికులు, తెల్లవార్లూ బట్ట నేస్తూ వుంటారు. చెప్పుల పెట్టుబడి దారుడి కార్మికులు, తెల్లవార్లూ చెప్పులు కుడుతూ వుంటారు. పత్రిక పెట్టుబడిదారుడి కార్మికులు, తెల్లవార్లూ అచ్చు పనో, ఇంకో పనో చేస్తూ వుంటారు. ఈ విధంగా, కార్మికులంతా రాత్రీ పగలూ, 3 రకాల షిఫ్టుల్లోపడి శ్రమ చేస్తూ వుంటే, పెట్టుబడిదార్లకు మాత్రం ఏ షిఫ్టులూ వుండవు. వాళ్ళకి అసలు పనే వుండదు. వాళ్ళకి నిత్యం వెచ్చని ఉదయాలూ, చల్లని సాయంత్రాలూ, కమ్మని రాత్రులూ, అన్నీ వుంటాయి. వాళ్ళు ఆదరా బాదరాగా ఎప్పుడూ ఎక్కడికీ పరుగులెత్తక్కరలేదు. వాళ్ళకి ఉదయం విశ్రాంతి! మధ్యాన్నం విశ్రాంతి! సాయంత్రం విశ్రాంతి! రాత్రి విశ్రాంతి! రోజంతా విశ్రాంతే! వాళ్ళు ఎన్నెన్ని విశ్రాంతులు తీసుకుంటూ వున్నా, వాళ్ళ 'పని స్థలం'లో ప్రతీ నిముషమూ సరుకు తయారైపోతూనే వుంటుంది. అందులో వున్న 'అదనపు విలువ' వాళ్ళ ఖజానాకి చేరిపోతూనే వుంటుంది.

ఒక పెట్టుబడిదారుడు నిద్ర నించి లేచి మళ్ళీ నిద్రకు ఉపక్రమించేలోగా కొత్త సరుకు తయారై, దానిలో వున్న అదనపు విలువతో, నిద్ర లేచినప్పటికన్నా ధనవంతుడై వుంటాడు. అలాగే రాత్రి నిద్రపోయి మళ్ళీ తెల్లారి లేచేలోగా కూడా మళ్ళీ కొత్త సరుకు తయారై, దానిలో వున్న కొత్త అదనపు విలువతో ఇంకా ధనవంతుడై వుంటాడు. ఈ రకంగా అది పగలు అయినా, రాత్రి అయినా, పెట్టుబడిదారుడు నించున్నా కూర్చున్నా పడుకున్నా, ఏం చేస్తోన్నా ఏం చెయ్యకపోయినా, ప్రతీ నిముషమూ ధనవంతుడవుతూనే వుంటాడు.

కష్టపడే వాడికి 'డబ్బు' రావడం, ప్రతీ నిముషమూ

జరగదు. రోజూ కొంతసేపు 'శ్రమ' చేసే దేహం కొంతసేపు 'విశ్రాంతి'ని కోరుతుంది. ఆ విశ్రాంతి కాలంలో ఆ మనిషికి 'డబ్బు' రాదు. కానీ, 'ఇతరుల శ్రమ'ని దోచేవాడికి డబ్బు రావడం, వాడి స్వంత దేహంతో సంబంధంలేనిది కాబట్టి, వాడి డబ్బు ప్రవాహానికి సహజమైన ఆటంకాలేవీ వర్తించవు. ఆ ప్రవాహానికి విశ్రాంతి వుండదు. కార్మికుల రక్త మాంసాల నించి, పెట్టుబడిదారుడి ఖజానాలోకి ప్రతీ క్షణం 'డబ్బు ధార' ప్రవహిస్తోనే వుంటుంది. నిజానికి అది, కార్మికుల సుఖ శాంతులూ, వారి రక్త మాంసాలూ, వారి అవయవాలూ, వారి ప్రాణాలూ, పెట్టుబడిదారుడి ఖజానాలోకి ప్రవహించడమే. కాకపోతే, అవన్నీ 'డబ్బు'గా మారి ప్రవహిస్తాయి.

**సమాజానికి, 'షిప్టు పద్ధతి'లోనే పని జరగడం అవసరమా? 'షిప్టు పద్ధతి' ఏ అవసరం కోసం ఏర్పడింది?**

'బట్ట'ని ఉత్పత్తి చేసే అన్ని పని స్థలాల్నీ ఒకే పని స్థలంగా అనుకుందాం. ఆ పని స్థలంలో, 3 షిఫ్టుల్లోనూ కలిసి, 60 మంది కార్మికులు, రోజుకి 300 మీటర్ల బట్టని ఉత్పత్తి చేస్తారనీ, ఆ బట్ట ప్రతీ రోజూ అమ్ముడుపోతూ వుంటుందనీ అనుకుందాం. అంటే, సమాజానికి ప్రతి రోజూ 300 మీటర్ల బట్ట కావాలన్నమాట. ఆ అవసరం తీరాలంటే, బట్టని ఉత్పత్తి చేసే పని స్థలంలో అప్పటి ఉత్పాదక శక్తిని బట్టి, రోజూ 60 మంది కార్మికులు పని చెయ్యాలి. ఆ 'పని స్థలం'లో 3 షిఫ్టులు వున్నాయి అనుకుంటే, ఒక్కొక్క షిఫ్టులోనూ 20 మంది కార్మికులు వుంటారు. ప్రతీ కార్మికుడూ రోజుకి 8 గంటలు పనిచేస్తాడు.

ఇప్పుడు షిఫ్టుల పద్ధతి లేకుండా చూద్దాం. పగలు మాత్రమే ఉదయం 8 నించి సాయంత్రం 4 వరకూ (8 గంటలు) అందరికీ ఒకే షిఫ్టు వుంటుంది. 60 మంది కార్మికులూ ఒక్క సమయంలోనే పనిచేస్తూ 300 మీటర్ల బట్టని ఉత్పత్తి చేస్తారు — అనుకుందాం. ఇలా జరిగినప్పుడు కూడా సమాజానికి రోజూ ఎంత బట్ట కావాలో అంత బట్టా తయారవుతుంది. ఇప్పుడు కూడా, 3 షిఫ్టుల్లోనూ కలిసి ఎంత మంది కార్మికులకు ఉద్యోగాలు ఏర్పడతాయో, ఆ ఉద్యోగాలన్నీ ఎప్పటిలాగే ఒక్క షిఫ్టులోనే వుంటాయి. అందరూ పగలే పని చేస్తారు. అంతే తేడా ఇక్కడ. దీని వల్ల, తయారయ్యే ఉత్పత్తిలో గానీ, ఉద్యోగాలలో గానీ, ఏమీ తేడా రాదు.

కానీ, పెట్టుబడిదారుడు, కార్మికులతో షిఫ్టుల పద్ధతిలోనే ఎందుకు పని చేయిస్తాడు? దాని వల్ల వాడికి ఏ యే విషయాల్లో లాభం వుంటుంది? — విషయాలు వరసగా చూద్దాం.

కార్మికులంతా కలిసి 3 షిఫ్టుల్లో పనిచేసినా, ఒక్క షిఫ్టులోనే పని చేసినా, వారికి ఇచ్చే 'జీతాల' విషయంలో ఏమీ తేడా రాదు. 2 పద్ధతుల్లోనూ ఒకే జీతాలు ఖర్చవుతాయి.

జరిగే పని 3 షిఫ్టుల్లో జరిగినా, ఒక్క షిఫ్టులోనే జరిగినా 'ముడిపదార్థాల' విషయంలోనూ, 'ఆగ్జిలరీ పదార్థాల' విషయంలోనూ కూడా ఏమీ తేడా రాదు. 2 పద్ధతుల్లోనూ అవి ఒకే రకంగా ఖర్చవుతాయి.

'ఫిక్సెడ్ సాధనాల' ఖర్చు విషయంలో కూడా ఏమీ తేడా రాదు. 3 షిఫ్టుల్లోనూ కలిసి 50 విలువ గల ఫిక్సెడ్ సాధనాలు ఖర్చవుతాయి అనుకుంటే, ఆ పని అంతా ఒక్క షిఫ్టులోనే జరిగినప్పుడు కూడా అంతే విలువ గల ఫిక్సెడ్ సాధనాలు ఖర్చవుతాయి. వాటి కోసం అంత కన్నా ఎక్కువ ఖర్చయ్యే దేమీ వుండదు. కానీ, షిఫ్టుల పద్ధతి వల్ల ఈ ఫిక్సెడ్ సాధనాల విషయంలోనే పెట్టుబడిదారుడికి కొంత లాభం వుంటుంది.

ఈ విషయాన్ని మొదట చిన్న ఉదాహరణ ద్వారా చూద్దాం. ఒక ఇంట్లో ముగ్గురు మనుషులు వున్నారు. వాళ్ళు స్నానాలకు 'సబ్బులు' వాడే విధానం, 2 రకాలుగా వుండవచ్చు. మొదటి విధానం ఏమిటంటే: ఎవరి సబ్బు వారికి వేరుగా వుంటుంది. ప్రతి ఒక్కరికీ 1 సబ్బు నెల రోజులు వస్తుంది. అంటే, ముగ్గురికీ కలిసి, నెలకి, 3 సబ్బులు ఖర్చవుతాయి. 3 సబ్బుల్నీ నెల మొదట్లోనే కొనాలి. నెల మధ్యలో కొత్త సబ్బులు కొననక్కరలేదు. అయితే, 3 సబ్బులు పెట్టడానికి, స్నానాల దగ్గిర 3 స్థలాలు వేరు వేరుగా వుండాలి.

సబ్బుల్ని వాడడంలో ఇంకో విధానం: ముగ్గురూ కలిసి ఒకే సబ్బుని వాడతారు. 1 సబ్బు, 10 రోజుల పాటు వస్తుంది. నెలకి 3 సబ్బులు ఖర్చవుతాయి. అయితే 3 సబ్బులూ నెల మొదట్లోనే కొననక్కరలేదు. మొదట ఒక్క సబ్బు కొంటే చాలు. 10 రోజుల తర్వాత రెండో సబ్బూ, ఇంకో 10 రోజుల తర్వాత మూడో సబ్బూ కొనవచ్చు. అంతే కాదు, ఇక్కడ, 3 సబ్బులు పెట్టడానికి 3 స్థలాలు అక్కర లేదు. ఒక్క స్థలం చాలు.

ఈ 2 విధానాల్లోనూ సబ్బుల ఖర్చు ఒకే రకంగా వుంటుంది. ఏ పద్ధతిలో చూసినా నెలకి 3 సబ్బులు వుండాలి. కానీ, మొదటి విధానంలో సబ్బుల్ని పెట్టడానికి 3 స్థలాలు అవసరమైతే, రెండో విధానంలో ఒక్క స్థలంతోనే సరిపోతుంది.— ఈ ఉదాహరణలో చూసిన విధంగానే 'ఫిక్సెడ్ సాధనాల' విషయాన్ని అర్థం చేసుకోవాలి.

3 షిఫ్టులూ వేరు వేరుగా జరగడానికీ, ఆ పని అంతా ఒక్క షిఫ్టులోనే జరగడానికీ, తేడా ఏమిటి? — ఏ ఖర్చు విషయంలోనూ తేడా రాదు. 'పని స్థలం' విషయంలో

మాత్రమే తేడా వస్తుంది.

ఫిక్సెడ్ సాధనాలు ఖర్చు అయ్యే విధానాన్ని 2 ఉదాహరణల ద్వారానూ చూద్దాం.

మొదటి ఉదాహరణ: ఒక షిఫ్టు 8 గంటలు. కావలసిన కార్మికులు 20 మంది. పని స్థలంలో ఫిక్సెడ్ సాధనాలన్నీ సిద్ధంగా వుంటాయి. ఒక షిఫ్టు పూర్తి అయ్యేటప్పటికి, ఫిక్సెడ్ సాధనాల నించి 200 విలువ ఖర్చవుతుంది. ఒక రోజులో, 3 షిఫ్టులు ఒక దాని తర్వాత ఒకటి జరుగుతాయి. 3 షిఫ్టుల లోనూ కలిసి మొత్తం 60 మంది కార్మికులు పని చేస్తారు. 3 షిఫ్టులలోనూ కలిసి ఫిక్సెడ్ సాధనాలు మొత్తం 600 ఖర్చవుతాయి. పని స్థలంలో వున్న ఫిక్సెడ్ సాధనాలు, రోజుకి 3 షిఫ్టుల లెక్కన, మొత్తం ఒక సంవత్సరం వరకూ మన్నుతాయి — అనుకుందాం. అంటే, సంవత్సరానికి ఒకసారి కొత్త ఫిక్సెడ్ సాధనాల్ని పని స్థలంలోకి తేవలసి వుంటుంది.

రెండో ఉదాహరణ: 3 షిఫ్టుల కార్మికులూ కలిసి, 3 బృందాలుగా, ఒకే సమయంలో (పగటి కాలంలోనే) పని చేస్తారు. ఇలా జరగాలంటే, పని స్థలం ఇంకా 2 రెట్లు ఎక్కువగా వుండాలి. 3 బృందాలూ ఒకే సమయంలో పని చెయ్యాలంటే, ఫిక్సెడ్ సాధనాలు, 3 చోట్ల వేరు వేరుగా వుండాలి. 3 చోట్లా కలిసి 1 రోజుకి 600 ఫిక్సెడ్ సాధనాలే ఖర్చవుతాయి. 8 గంటలు పనిచేశాక కార్మికులందరూ ఇళ్ళకు వెళ్ళిపోతారు. 2 వ షిఫ్టు గానీ, 3 వ షిఫ్టు గానీ వుండవు. కార్మికులు మళ్ళీ మర్నాటి దాకా పనిలోకి రారు. అప్పటిదాకా, అంటే 16 గంటలసేపు ఫిక్సెడ్ సాధనాలు ఖాళీగా వుంటాయి. ఈ పద్ధతిలో అయితే ఫిక్సెడ్ సాధనాలన్నీ ఖర్చు అవడానికి 3 సంవత్సరాలు పడుతుంది. కానీ అప్పటి దాకా మళ్ళీ కొత్త ఫిక్సెడ్ సాధనాల్ని కొననక్కరలేదు.

అంటే, 2 ఉదాహరణల్లోనూ ఫిక్సెడ్ సాధనాల ఖర్చు ఒకే రకంగా వుంటుంది. మొదటి ఉదాహరణలో — ప్రతీ ఏటా కొత్త ఫిక్సెడ్ సాధనాల్ని కొనాలి. 3 సంవత్సరాల్లో, 3 సార్లు కొనాలి. 2 వ ఉదాహరణలో — 3 సెట్ల ఫిక్సెడ్ సాధనాల్నీ మొదటే ఒకే సారి కొనాలి. కానీ వాటిని 3 సంవత్సరాల దాకా మార్చనక్కరలేదు. ఈ రకంగా ఈ 2 ఉదాహరణల్లోనూ, ఫిక్సెడ్ సాధనాల ఖర్చు ఒకే రకంగా వుంటుంది. అందులో తేడా ఏమీ రాదు. అయితే, 2 వ ఉదాహరణలో, 3 సెట్ల ఫిక్సెడ్ సాధనాల్ని ఒకే సారి కొనాలంటే, ఆ పెట్టుబడి అంతా ఒకే సారి పెట్టాలి. అంతే గాక ఈ ఉదాహరణలో, పని స్థలం ఎక్కువగా కావాలి.

కార్మికులందరూ పగలు మాత్రమే పనిచేసే విధానంలో, ఫిక్సెడ్ సాధనాలన్నీ కొన్ని గంటల పాటు ఖాళీగా వుండిపోతాయి. ఫిక్సెడ్ సాధనాలు 'ఖాళీగా పడి వుంటే' వాటిని త్వర త్వరగా ఖర్చు పెట్టెయ్యడం సాధ్యం కాదు. ఇది పెట్టుబడిదారుడికి 'పెద్ద సమస్య' అయిపోతుంది.

పెట్టుబడిదారీ ప్రపంచం, 'పోటీ' ప్రపంచం. (పోటీ అనే విషయం మనం ఇంకా చూడలేదు). ఈ పోటీలో శ్రమ పరికరాలు త్వర త్వరగా మారిపోతూ వుంటాయి. శ్రమ పరికరాల్ని ఉత్పత్తి చేసి అమ్మే పెట్టుబడిదారులు, 'పోటీలు' పడుతూ ఎప్పటికప్పుడు మరింత మెరుగైన వాటిని తయారుచేయిస్తూ వుంటారు.

ఒక బట్ట పెట్టుబడిదారుడి దగ్గిర ఒక రకపు మగ్గం వుంది. అది 5 సం॥లు పనిచేస్తుంది. కానీ, దాన్ని ప్రారంభించి 2 సం॥లు అయ్యేటప్పటికి, ఆ శాఖలోనే ఇంకో పెట్టుబడిదారుడు ఇంకా మెరుగైన మగ్గాన్ని ప్రారంభించా డనుకుందాం. దాని మీద పనిచేస్తే ఎక్కువ పని జరుగుతుందనుకుందాం. దాన్ని చూసిన మన బట్ట పెట్టుబడి దారుడు కూడా తన దగ్గిర ఎక్కువ పని చేయించాలని ఆశిస్తాడు. కానీ, తన దగ్గిర వున్న మగ్గాన్ని తీసివెయ్యాలంటే, ఇంకో 3 సం॥లు ఆగాలి. తన మగ్గాన్ని తీసి వెయ్యనూ లేడు, దానితో సరిపెట్టుకోనూ లేడు. ఇదో సమస్య అయిపోతుంది వాడికి. అందుకే పెట్టుబడి దారులు ఎప్పుడూ, 'శ్రమ పరికరాల్ని' త్వర త్వరగా ఖర్చు పెట్టేసే పద్ధతినే అవలంబిస్తారు. అంటే, షిఫ్టుల పద్ధతిని. ఇలాంటి పోటీ ప్రపంచంలో, ప్రతీ పెట్టుబడి దారుడూ తన ఫిక్సెడ్ సాధనాల్ని త్వరత్వరగా ఖర్చు చేసెయ్యాలని ఆరాటపడతాడు.

3 షిఫ్టుల్లో జరిగే పని ఒక్క షిఫ్టులోనే జరగాలంటే, ఫిక్సెడ్ సాధనాల్ని పెంచి తీరాలి కాబట్టి, పెట్టుబడిదారుడు వాటి మీద ఒకే సారి ఎక్కువ పెట్టుబడి పెట్టాలి. అయినా, 600 సాధనాలు 3 సం.లలో ఖర్చయినా, లేదా, సంవత్సరానికి 200 చొప్పున 3 సంవత్సరాల వరకూ ఖర్చయినా, రెండూ ఒకటే. పని స్థలంలో ఎక్కువ ఫిక్సెడ్ సాధనాల్ని పెట్టడం వల్ల పెట్టుబడిదారుడికి ఎక్కువ ఖర్చయ్యేదేమీ వుండదు.

కానీ, 3 షిఫ్టుల పద్ధతిలో అయితే, ఫిక్సెడ్ మీద, ఒక్క సెట్ సాధనాల కోసం 200 పెడితే చాలు. మొదటి సంవత్సరం చివర అది వెనక్కి రాగానే, దానితోనే రెండో సంవత్సరం కోసం ఫిక్సెడ్‌ని కొనవచ్చు. మళ్ళీ అది వెనక్కి రాగానే, దానితోనే మూడో సంవత్సరం కోసం ఫిక్సెడ్‌ని కొనవచ్చు. ప్రతీ సారీ ఇలాగే. ఈ పద్ధతిలో, ఫిక్సెడ్ మీద, ఒకే సారి 3 సెట్ల కోసం 600 పెట్టనక్కరలేదు.

ఏ విధానంలో చూసినా ఫిక్సెడ్ సాధనాల ఖర్చు ఒకటే. జరిగే పని 3 షిఫ్టుల్లో జరిగినా, ఒక్క షిఫ్టులోనే జరిగినా, దాని వల్ల వచ్చే 'ఉత్పత్తి' ఒక్కలాగే (300 మీటర్లే) వుంటుంది. దాని ద్వారా వచ్చే 'అదనపు విలువ' కూడా ఒక్కలాగే వుంటుంది. కానీ, పెట్టిన పెట్టుబడిని త్వర

త్వరగా వెనక్కి తీసుకోకుండా దాన్ని రాత్రుళ్ళు ఖాళీగా ఎందుకు వుంచాలి?— రాత్రుళ్ళు పని చేస్తే మాత్రం కార్మికుల కేం బాధ? —ఇవీ పెట్టుబడిదారుడి అభిప్రాయాలు.

రాత్రుళ్ళు పని చేస్తే కార్మికులకేం బాధో పెట్టుబడిదారుడికి తెలిసేది, వాడు కూడా శ్రమలోకి దిగి, 3 షిఫ్టుల్లోనూ పనిచేస్తేనే కదా? పెట్టుబడిదారుడు కూడా, 'జీవితం'లో మూడో వంతు కాలం రాత్రి షిఫ్టుల్లో పని చెయ్యవలసి వస్తే అప్పుడు తెలుస్తుంది. — "సమాజానికి రాత్రి పని అవసరమా?" అని, ఆలోచన అప్పుడు ప్రారంభిస్తాడు. ఇప్పుడు వాడికా అవసరం లేదు కాబట్టి, వాడికి అవసరం లేని విషయం గురించి వాడు ఆలోచించడు. కార్మికుల సమస్య పెట్టుబడిదారుడి సమస్య కాదు. కార్మికుల బాధ పెట్టుబడిదారుడి బాధ కాదు. అందుకే కార్మికుల ఆలోచన పెట్టుబడిదారుడి ఆలోచన కాదు.

ఫిక్సెడ్ సాధనాల్ని రాత్రులు ఖాళీగా వుంచడాన్ని పెట్టుబడిదారుడు ఊహించలేడు. ఫిక్సెడ్ సాధనాల్ని త్వర త్వరగా మార్చడానికి ఏకైక మార్గం వాటిని రాత్రింబవళ్ళూ పనిలో వుంచడమే. ఆ పని ఒకే జట్టు కార్మికులతో సాధ్యం కాదు గనకే, 3 జట్లూ, రాత్రి పనీ! షిఫ్టు పద్ధతిలో వుండే రహస్యం అంతా ఇదే! కానీ, పెట్టుబడిదారుడి పరిష్కారం, కార్మికులకు సమస్యని సృష్టిస్తుంది. కార్మికులు షిఫ్టుల పద్ధతి జీవితాలు గడపవలసి వస్తుంది.

కార్మికులు గనక తమ పోరాటాల ద్వారా పని దినాన్ని 6 గం.లు చేసుకోగలిగితే, పెట్టుబడిదారుడు 3 షిఫ్టులకు బదులు, 4 షిఫ్టులు పెడతాడు. అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం సాగుతూ వుండగా షిఫ్టుల పద్ధతి మారడం అనేది ఊహాతీతమైన విషయం.

షిఫ్టు పద్ధతి వల్ల పెట్టుబడిదారుడు తక్కువ పెట్టుబడితోనే ఉత్పత్తి క్రమాన్ని నడుపుతూ లాభాలు తియ్యగలుగుతాడు కాబట్టి, ఇది పెట్టుబడిదారుడికి 'ఆర్థికంగా' కలిగే లాభం.

షిఫ్టు పద్ధతి వల్ల, ఒక పని స్థలంలో కార్మికులు 3 జట్లుగా చీలిపోయి వుంటారు కాబట్టి, వాళ్ళు తమ సమస్యల మీద పెట్టుబడిదారుడితో పోరాడవలసి వచ్చినప్పుడు అందరూ 'సమిష్టితనం'తో కలవడంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇది పెట్టుబడిదారుడికి 'రాజకీయంగా' కలిగే లాభం.

ఇక షిఫ్టు పద్ధతి వల్ల కార్మికులకు నిత్యమూ అస్తవ్యస్తపు జీవితం వుండనే వుంది. కార్మికులు నిత్యం ఆందోళన తోటీ, ఒక స్థిరత్వం లేని అలవాట్ల తోటీ, శారీరక మానసిక రుగ్మతల తోటీ, రాత్రనక పగలనక శ్రమలో పడివుంటారు.

ఎన్ని కోణాలలో చూసినా 'రాత్రి పని' అనేది కేవలం పెట్టుబడిదారుల ప్రయోజనాలకే గానీ, అది ఉత్పత్తి క్రమానికి సహజ అవసరం కాదు.

మానవులకు 'రాత్రి' అనేది, విశ్రాంతికీ, నిద్రకూ సహజంగా అత్యవసరమైన కాలం. కొన్ని రకాల క్రిమి కీటకాలూ, కొన్ని రకాల పక్షులూ, కొన్ని రకాల జంతువులూ రాత్రి వేళల్లోనే సంచారం చేస్తాయి. మానవులకు అది సహజ ధర్మం కాదు. పగలు పనీ, రాత్రి నిద్రా మాత్రమే మానవులకు సహజమైనది. స్త్రీ పురుషులు విశ్రాంతిగానూ, నిశ్చింతగానూ కుటుంబ జీవితం గడపాలన్నా; పిల్లల పెంపకానికీ, వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణకూ సంబంధించిన పనులు స్త్రీ పురుషులు సమాన బాధ్యతలతో నిర్వహించాలన్నా— షిఫ్టుల పద్ధతీ, రాత్రి పనీ, పరమ అభ్యంతరకరమైనవి. సమాజానికి ఎంత ఉత్పత్తి కావాలన్నా దాన్ని పగలు పనితోనే సాధించవచ్చు. సమాజం, తన రాత్రి కాలాన్ని కూడా 'ఉత్పత్తి' కోసం వెచ్చించవలసిన అవసరం లేదు. పెట్టుబడిదారీ విధానం ప్రారంభమయ్యే వరకూ, గత కాలంలో సమాజం 'రాత్రి పని' లేకుండానే జీవించింది. సమాజంలో వున్న మనుషులందరూ పనిచేస్తే రాత్రి పనే కాదు, పగలు పని కూడా ఎంతో భాగం తగ్గిపోతుంది.

కార్మిక వర్గం నిర్మించబోయే, 'విలువ దృష్టి లేని నూతన సమాజం'లో షిఫ్టుల పద్ధతీ, రాత్రి పనీ — వుండకూడదు. కొన్ని అత్యవసర రంగాలలోనూ, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనూ మాత్రమే 'రాత్రి పని' తప్పనిసరి అవుతుంది. ఆస్పత్రుల్లో కొన్ని విభాగాలు రాత్రులు కూడా పనిచెయ్యవచ్చు. అత్యవసర వార్తల సరఫరా కోసం (మరణ వార్తలూ, ప్రమాదాల వార్తలూ) టెలిఫోన్, టెలిగ్రాఫ్ సంస్థల్లో కొన్ని విభాగాలు రాత్రులు కూడా పని చెయ్యవచ్చు. పాలూ, కూరగాయలూ వంటి ప్రత్యేక పదార్థాల సరఫరా కోసం కొన్ని రవాణా సాధనాలు రాత్రులు కూడా పని చెయ్యవచ్చు. కానీ, ఆ పదార్థాల్ని తాజాతనం చెడకుండా వాటిని ఆరోగ్యవంతంగా నిలువ వుంచగలిగే మార్గాలు కనిపెడితే, వాటిని కూడా రాత్రులకు రాత్రులు రవాణా చెయ్యవలసిన అవసరం వుండదు. 10, 12 గంటలకన్నా ఎక్కువ కాలం పట్టే దీర్ఘ ప్రయాణాల కోసం రైళ్ళు మాత్రమే రాత్రి ప్రయాణాలు చెయ్యవచ్చు గానీ, బస్సులు ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి ప్రయాణాలు చెయ్యకూడదు. పగలంతా బస్సులో వుండే ప్రయాణీకులు, సాయంత్రం వేళకే బస్సులోంచి దిగి, ఆ రాత్రి ఒక చోట విశ్రాంతిగా గడిపే ఏర్పాట్లు వుండాలి. సమాజం మారుతూ వున్న ప్రారంభ దశలో, బస్సులూ, లారీలూ వంటి రవాణా సాధనాలు ఎక్కువ సంఖ్యలో వుండవు

కాబట్టి, అలాంటి దశలో సమాజానికి వున్న రవాణా అవసరాల్ని తీర్చడానికి రాత్రి ప్రయాణాలు కూడా తప్పని సరి కావచ్చు. అలాంటి తప్పనిసరి పరిస్థితుల్లో రాత్రి రవాణా అవసరమైతే, వాహనాల డ్రైవర్లు త్వర త్వరగా మారాలి.

మొత్తం మీద 'నూతన సమాజం' చాలా తక్కువ కాలంలోనే 'రాత్రి పని'ని తప్పనిసరిగా తీసివేసే మార్పు ప్రారంభించాలి. మనుషులందరూ ఉదయాలూ, సాయం త్రాలూ, రాత్రులూ పని భారం లేని సహజ విశ్రాంతుల తోటీ, కళాత్మక కార్యక్రమాల తోటీ, కుటుంబ సంబంధ మైన పనుల తోటీ, పిల్లల పెంపకం తోటీ, నిశ్చింతగా గడపాలి.

'పెట్టుబడిదారీ సమాజం'లో ఇదంతా ఒక హాస్యా స్పదమైన కల. ఇక్కడ రాత్రి పనే కాదు, పగలు పని కూడా పెద్ద భారమే. 'పెట్టుబడి' దేహంలో 'అదనపు విలువ' కోసం దాహానికి అంతూ పొంతూ వుండదు. అది కార్మికు లకు భోజనం చేసే నిముషాల్ని కూడా లెక్కకట్టి ఇచ్చి, మిగతా కాలాన్నంతా 'శ్రమ క్రమం'లోకి లాగివేస్తుంది. యంత్రానికి బొగ్గు లాగా, చక్రానికి ఆయిల్ లాగా, కార్మికుడి శరీరానికి యాంత్రికంగా ఆహారం పడుతుందే గానీ, దాన్ని విశ్రాంతిగా అనుభవిస్తూ తినడానికి అక్కడ సమయమూ వుండదు, తినే పదార్థాలూ వుండవు. కార్మి కుడు తీసుకునే కొన్ని గంటల విశ్రాంతి కూడా మళ్ళీ మర్నాడు పనిచేసే శక్తిని కూడగట్టుకోడానికే. ఇక్కడ కార్మికులు రెండు దశల్లోనే వుంటారు. శ్రమ శక్తిని ఖర్చుచేస్తూ పని చేసే దశలోనూ, మళ్ళీ మర్నాటి పని కోసం శ్రమ శక్తిని కూడగట్టుకునే దశలోనూ! ఈ రెండు దశల్లోనే పడి వుండడం తప్ప, ఇక్కడ శ్రామికుడి దేహం, తన భౌతిక ధర్మాల్ని సహజ పద్ధతుల్లో నెరవేర్చుకోడానికి తగిన పరిస్థితులు వుండవు. పెట్టుబడి, శ్రామిక జనాల సాయంత్రపు చల్లగాలి షికార్లనీ, వారు సూర్య కాంతినీ చంద్ర కాంతినీ చూసే అవకాశాల్నీ పీల్చేస్తుంది. శ్రామికుల దేహాలకు అలసట తీరేటంత విశ్రాంతినీ, గాఢ నిద్రనీ పెట్టుబడి అనుమతించదు.

'పెట్టుబడిదారీ పని దినం'లో శ్రామికుల వ్యక్తిగత వికాసాన్ని ఊహించడమే సాధ్యం కాదు. వారి విద్యకీ, మేధోపరమైన అభివృద్ధికీ, మానవులుగా ఇతర మానవు లతో సహజ సంబంధాలకూ, సామాజిక విధుల నిర్వ హణకూ; వారి అంతర్గత శారీరక, మానసిక శక్తుల విని యోగానికీ; వారి జ్ఞాన తృష్ణనీ, కళాతృష్ణనీ, సహజ మార్గాలతో నెరవేర్చుకోవడానికీ — ఈ రకపు ఏ సహజ అవసరాలకూ ఇక్కడ సమయమూ వుండదు, ఆర్థికంగా అవకాశమూ వుండదు.

పెట్టుబడిదారుడు ఆలోచించేది, శ్రామికుల్ని ఎలా ఆరోగ్యంగా వుంచాలా — అని కాదు; శ్రామికుల్ని ఎంత ఎక్కువ వుపయోగించాలా — అని! పెట్టుబడిదారుడికి కావలసింది, ఒక శ్రామికుడు ఎంత కాలం జీవిస్తాడా — అని కాదు, జీవించి వున్న కాలంలో ఎంత ఎక్కువ శ్రమ ఇస్తాడా — అని! పెట్టుబడిదారుడి అన్ని ఆశలకూ గమ్యం ఒక్కటే. తను శ్రమలోకి దిగకుండా ఇతరుల శ్రమని లాగడం!

'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం' అంతా 'శ్రమ శక్తి' అనే ఏ ఏకైక అంశం మీదైతే నూటికి నూరుపాళ్ళూ ఆధారపడి వుందో, ఆ అంశాన్ని అది, నిత్యమూ అర్థాకలిగా, అనారోగ్యంగా, అసంతృప్తిగా, నిరుత్సాహంగా వుంచుతూ, దాని భౌతిక సామాజిక పరిస్థితుల్ని ఉన్నతంగా అమర్చుకునే అవకాశాలు లేకుండా చేసి, దాన్ని ఎప్పుడూ అధమ స్థాయిలోనే వుంచుతుంది. దాన్ని నిత్యం, బాధల్లో, సమస్యల్లో వుంచి, చివరికి దాన్ని అకాల వృద్ధాప్యానికీ, అకాల మరణానికీ గురి చేస్తుంది.

ఒక పెట్టుబడిదారుడు, వ్యక్తిగతంగా 'జాలి గుండె' కలవాడైనా, ఆ 'జాలి గుండె', శ్రామికుల పరిస్థితి నేమీ మార్చదు. ఆ పెట్టుబడిదారుడు శ్రామికులకు కొన్ని ఎక్కువ సౌకర్యాలు చెయ్యగలడే గానీ, వారి నించి 'అదనపు శ్రమ'ని తీసుకోకుండా మానడు. వారితో షిఫ్టుల పద్ధతిలో పని చేయించకుండానూ మానడు. శ్రామికుల్ని రాత్రీ పగలూ దోచడం మానుకునే పెట్టుబడి, పెట్టుబడిగా నిలబడదు. 'పెట్టుబడి' అంటేనే తనను తను పెంచుకునే స్వభావం కల శక్తి. అది 'అదనపు శ్రమ'ని పిండడం మానేస్తే, అది తన మీద తనే జాలి చూపుకోవలసి వస్తుంది. అలాంటి పరిస్థితి తెచ్చుకునేంత తెలివితక్కువది కాదు పెట్టుబడి. అంటే, పెట్టుబడిదారీ పని దినం, 'శ్రామిక శక్తి'ని తప్పనిసరిగా దుర్భర పరిస్థితుల్లోనే వుంచి తీరుతుంది!

> "రోజులో ఉండే మొత్తం 24 గంటలూ శ్రమని స్వాహా చేయటం అనేది పెట్టుబడిదారీ ఉత్పత్తిలో అంతర్నిహితంగా ఉన్న ధోరణి. అయితే ఒకే శ్రమ శక్తిని నిరంతరాయంగా రాత్రింబగళ్ళు వినియో గించుకోవడ మన్నది భౌతికంగా అసాధ్యం కనుక యీ భౌతిక అడ్డంకిని అధిగమించటానికి, పగటి కార్మికులనూ, రాత్రి కార్మికులనూ మార్చి మార్చి వినియోగించుకోవడం అవసరమవుతుంది."-

మార్క్స్ (కాపిటల్ –1, విశాలాంధ్ర అనువాదం, పే.234).

> "పెట్టుబడిదారీ సమాజంలో, ప్రజా బాహుళ్య జీవిత కాలమంతటినీ శ్రమ కాలంగా మార్చడం ద్వారా ఒక వర్గానికి విరామ కాలం లభిస్తోంది"—

మార్క్స్ (కాపిటల్ – 1, విశాలాంధ్ర, పే.486).

"కమ్యూన్ చేపట్టిన.... చర్యలు ప్రజల కోసం ప్రజల యొక్క ప్రభుత్వ ధోరణిని మాత్రమే సూచించాయి. బేకర్ల (నాన్‌రొట్టెలు తయారుచేసే కార్మికుల) చేత రాత్రి పూట పనిచేయించడం రద్దు చెయ్యడం ; యజమానులు తమ దగ్గర పనిచేసే కార్మికులపై రక రకాల సాకులతో జుల్మానాలు వేసి వేతనాల్లోంచి వాటిని విరగ కొయ్యడంపై నిషేధం విధించడం — యివన్నీ అలాంటి చర్యలే—" మార్క్స్. ('పారిస్ కమ్యూన్ గురించి', మాస్కో ప్రతి, 1979, పే.88).

# 'ఎబ్సల్యూట్' అదనపు విలువా, 'రెలెటివ్' అదనపు విలువా

సాధారణంగా ఒక శాఖలో వుండే పెట్టుబడిదారులందరి దగ్గిరా 'పని దినం' పొడవూ, ఒకే రకపు 'శ్రమ శక్తి'కి సంబంధించిన జీతాలూ, ఇంచుమించుగా ఒక్కలాగే వుంటాయి. నిజానికి, వాటిలో కొన్ని తేడాలు వున్నా అవి మరీ ఎక్కువ తేడాలుగా వుండవు. జీతం, ఏ పెట్టుబడిదారుడి దగ్గిర మరీ తక్కువగా వుంటుందో, అక్కడికి కార్మికులు వెళ్ళరు. ఆ పెట్టుబడిదారుడికి కార్మికులు దొరకరు. అప్పుడు ఆ పెట్టుబడిదారుడు కూడా ఇతరులు ఇచ్చే జీతమే ఇవ్వవలసి వస్తుంది. అలాగే, 'పని దినం' పొడవు విషయం కూడా. ఏ పెట్టుబడిదారుడి దగ్గిర 'పని దినం' మరీ ఎక్కువగా వుంటుందో అక్కడికి కార్మికులు పోరు. అప్పుడు, ఆ పెట్టుబడిదారుడు కూడా ఇతర పెట్టుబడిదారుల లాగానే పని కాలాలు వుంచవలసి వస్తుంది. ఈ రకంగా, ఒక శాఖలో వేరు వేరు పెట్టుబడిదారుల దగ్గిర అన్ని విషయాలూ జనరల్‌గా ఒక్కలాగే వుంటాయి. కానీ, వాటిలోనే చిన్న చిన్న తేడాలు కూడా వుంటాయి. కానీ, మనం ఇక్కడ ఆ తేడాల్ని దృష్టిలో పెట్టుకోకుండా, ఒక పనికి సంబంధించిన జీతాలూ, పని దినాలూ, అందరి దగ్గిరా ఒక్కలాగే వుంటాయి — అనే జనరల్ సూత్రాన్నే దృష్టిలో పెట్టుకుంటాము.

పని దినం 12 గంటలై, అవసర శ్రమ కాలం 6 గంటలైనప్పుడు, 'అదనపు శ్రమ' కాలం అందరికీ 6 గంటలే. పని దినం 14 గంటలైనప్పుడు, అదనపు శ్రమ కాలం అందరికీ 8 గంటలే. పని దినం 10 గంటలైనప్పుడు అదనపు శ్రమ కాలం అందరికీ 4 గంటలే. ఈ రకంగా పని దినం పరిమాణమూ, జీతాలూ అందరి దగ్గిరా ఒక్కలాగే వుండడం వల్ల, 'అదనపు విలువ' అందరికీ ఒక్కలాగే వుంటుంది.

'అదనపు విలువ' అందరి దగ్గిరా ఒక్కలాగే వుండాలంటే — పని దినమూ, జీతాలూ ఒక్కలాగ వుండడం మాత్రమే కాదు, మరీ ముఖ్యంగా 'ఉత్పత్తి శక్తి' ఒక్కలాగే వుండాలి. ('ఉత్పత్తి శక్తి' అన్నా, 'ఉత్పాదక శక్తి' అన్నా ఒకటే.)

ఒక శాఖలో, సాధారణంగా అందరికీ వుండే రకపు శ్రమ పరికరాల తోటీ, శ్రమ విధానాల తోటీ శ్రమ చెయ్యగా ఆ 'శ్రమ' ఎంత ఉత్పత్తి చెయ్యగలుగుతుందో (ఒక గంటకి చూసినా, ఒక రోజుకి చూసినా), అది అప్పటి 'సామాజిక ఉత్పత్తి శక్తి'. (సగటు ఉత్పత్తి శక్తి).

బట్టల శాఖలో 10 మంది పెట్టుబడిదారులు ఉన్నారనుకుందాం. అందులో 9 మంది దగ్గిర, ఒకే 'ఉత్పత్తి శక్తి' వుంది. వీళ్ళ దగ్గిర, ఒక కార్మికుడు, ఒక 'పని దినం' లో 10 మీటర్ల బట్ట తయారు చేస్తాడు.

1 మీటరుకి 'పెట్టుబడి' 1 రూ. (స్థిర 80 పై.లు, అస్థిర 20 పై.లు.) 1 మీటరు 'విలువ' = 1 రూ. 20 పైసలు.

1 రూపాయి ఖర్చుతో (1 రూపాయి పెట్టుబడి తో) తయారైన సరుకుని 1 రూ. 20 పై.లకు అమ్మితే, లాభం—రేటు 20%. ఆ 'రూపాయి పెట్టుబడి'లో జీతం భాగం 20 పై.లు. 20 పైసల జీతం, 20 పైసల అదనపు విలువని ఇస్తే, అదనపు విలువ రేటు 100%.

బట్ట శాఖలో వున్న 10 మంది పెట్టుబడిదారుల్లో 9 మంది దగ్గిర అదనపు విలువ రేటు 100%.

లాభం రేటు 20%.

ఇప్పుడు 10వ వాడి సంగతి చూద్దాం. వీడి దగ్గిర 'మెరుగైన' శ్రమ పరికరాలూ, ఆ శ్రమ పరికరాలతో పని చెయ్యడం తెలిసిన స్కిల్డ్ కార్మికులూ వున్నారు — అనుకుందాం. ఇక్కడ ప్రతీ కార్మికుడూ, ఒక 'పని దినం'లో 20 మీటర్లు తయారు చేస్తాడనుకుందాం. అంటే, మిగతా పని స్థలాలలో కార్మికులు 1 మీ. తయారు చేసే సమయంలో, ఇక్కడ కార్మికులు 2 మీ. తయారు చేస్తారు. అంటే, ఇక్కడ ఉత్పత్తి శక్తి, రెట్టింపుగా వుంది. ఇది, 10వ

పెట్టుబడిదారుడి దగ్గిర మాత్రమే వున్న ప్రత్యేక (వీడి వ్యక్తిగత) ఉత్పత్తి శక్తి. ఇక్కడ, కార్మికులు 'పని దినం'లో రెట్టింపు సరుకుని ఉత్పత్తి చేస్తారు కాబట్టి, ఇక్కడ ప్రతీ మీటరుకి జీతం ఖర్చు 'సగం' అవుతుంది. అంటే, ఇక్కడ, 1 మీ.కి జీతం ఖర్చు, 10 పై.లే.

1 మీటరు కోసం పనిచేసే కాలంలోనే 2 మీటర్లు చేస్తే, 1 మీటరుకి వుండే జీతమే 2 మీటర్లకీ కలిసి వుంటుంది— అని చూస్తున్నాం. ఇలా చూడడం అంటే, ఉత్పత్తి శక్తి పెరిగిన తర్వాత కూడా పాత జీతమే వున్నట్టు అర్థం. కానీ, నిజానికైతే ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు కూడా పాత జీతమే వుండదు. ఎందుకంటే, మెరుగైన శ్రమ పరికరాలతో పని చెయ్యడానికి కార్మికులకు మెరుగైన 'శ్రమ శక్తి' వుండాలి. దాని వల్ల జీతం కొంత పెరుగుతుంది. గతంలో 20 పైసల జీతం వుండే కాలానికి ఇప్పుడు 30 పైసల జీతం వుందనుకుందాం. ఆ కాలానికి జీతం పెరిగినట్టే లెక్క. కానీ, గతంలో 20 పైసల జీతంతో 1 మీటరు బట్టని నేస్తే, ఇప్పుడు 30 పైసల జీతంతో 2 మీటర్లు తయారవుతాయి. అంటే, ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు, జీతం పెరిగిందా తగ్గిందా అనేది అర్థం చేసుకోవాలి.

ఉత్పత్తి శక్తి అందరి దగ్గిరా పెరిగి, ఒక సరుకు కోసం అవసరమయ్యే శ్రమ అందరి దగ్గిరా తగ్గితే, ఆ సరుకు విలువ తగ్గడం అందరి దగ్గిరా ఒకేలా జరుగుతుంది. సరుకు విలువని గతంలో లాగే ఎక్కువగా వుంచడం ఎవరికీ సాధ్యం కాదు.—ఇది జనరల్ పరిస్థితి.

కానీ, ఉత్పత్తి శక్తి అందరి దగ్గిరా పెరగకుండా ఒక్కడి దగ్గిర మాత్రమే పెరిగి, ఉత్పత్తి పెరిగి, ఒక సరుకుకి పట్టే శ్రమ తగ్గినా, ఈ పెట్టుబడిదారుడు తన సరుకు విలువని తగ్గించకుండా, దాన్ని కూడా ఇతర పెట్టుబడిదారులు అమ్మే విలువ తోనే (ఎక్కువ విలువతోనే) అమ్ముతాడు.— ఇది వీడి ప్రత్యేక పరిస్థితి.

ఉత్పత్తి శక్తి పెరిగినా, సరుకు విలువ పాత రకంగానే వుంటే, అప్పుడు జీతం పెరిగినా, అది జీతం పెరిగినట్టు లెక్క కాదు. ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు, దానికి తగ్గట్టుగా సరుకు విలువ తగ్గితేనే, అప్పుడు జీతంలో పెరుగుదల, నిజమైన పెరుగుదల అవుతుంది.— ఈ వివరాలన్నీ ఇంకో సందర్భంలో చూస్తాము. ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం ఏం చేస్తామంటే, ఉత్పత్తి శక్తి పెరిగిన తర్వాత కూడా ఆ పెట్టుబడిదారుడి దగ్గిర సరుకు విలువ గానీ, జీతం గానీ మారలేదు — అనుకుంటాము.

10 వ పెట్టుబడిదారుడి దగ్గిర ఉత్పత్తి శక్తి పెరిగింది కదా? కానీ ఈ కార్మికులకు కూడా పాత జీతమే వుందనుకుందాం. ఆ ప్రకారమే చూస్తే, కార్మికుడు 20 పై. జీతంతో, 2 మీటర్ల బట్ట తయారు చేస్తాడు. 1 మీ.కి జీతం 10 పై.లు

ఇక్కడ తగ్గేది జీతం ఖర్చే. 'ఉత్పత్తి సాధనాల ఖర్చు' ఇక్కడ కూడా ఏమీ మారదు. అది గతంలో లాగే వుంటుంది. అది 1 మీ.కి 80 పై.లే.— ఈ రకంగా, 10 వ పెట్టుబడిదారుడి దగ్గిర తయారైన 1 మీ. బట్టకి నిజమైన ఖర్చు = 80 స్థిర + 10 అస్థిర = 90 పై.లు.

'ఉత్పత్తి శక్తి' తక్కువగా వున్న ఇతర అన్ని పని స్థలాల్లోనూ 1 మీటరు కోసం 1 రూపాయి ఖర్చు అవుతూ వుండగా, 10 వ వాడి దగ్గిర 90 పై.లు మాత్రమే అవడం అంటే, ఇక్కడ ఖర్చు తగ్గడమే.

ఎక్కువ మంది దగ్గిర అయ్యే ఖర్చు, 'సామాజికంగా' అవసరమయ్యే ఖర్చు. 10 వ వాడి దగ్గిర ఖర్చు — వాడికి మాత్రమే సంబంధించిన 'వ్యక్తిగతమైన ఖర్చు.'

అయితే, తన సరుకుని తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయించిన ఈ 10 వ పెట్టుబడిదారుడు, తన సరుకుని ఇతరులకన్నా తక్కువ విలువతో అమ్ముతాడా?— అలా చెయ్యడు. వీడు కూడా ఇతర పెట్టుబడిదారులందరూ అమ్మే విలువకే అమ్ముతాడు. అంటే, 1 మీటరుని 1 రూ. 20 పై.లకి! — దీని ఫలితం ఎలా వుంటుంది? ఇతర పెట్టుబడిదారుల కన్నా వీడికి 'అదనపు విలువ' పెరుగుతుంది. ఎందుకంటే, వీడికి ఖర్చు తగ్గినా విలువని తగ్గించకుండా పాత విలువకే ఇస్తున్నాడు కాబట్టి. ఇతర పెట్టుబడిదార్లకి, 1 మీ. ద్వారా 20 పై. లాభం అయితే, 10 వ వాడికి —1 మీ. ద్వారా —30 పై. లాభం.

10 వ వాడి దగ్గిర, అదనపు విలువ రేటూ, లాభం రేటూ ఎలా వుంటాయో చూద్దాం.

అదనపు విలువ రేటు :

30 పై. **S** ÷ 10 పై.**V** × 100 = 300%

లాభం రేటు :

90 పై. పెట్టుబడికి —30 పై. లాభం అయితే,

100 కి ——— 30 ÷ 90 × 100 = 33%

ఇతర పెట్టుబడిదార్ల దగ్గిర అ.వి. రేటు — 100% అయితే,
10వ వాడి దగ్గిర " —300%
ఇతర పెట్టుబడిదార్ల దగ్గిర లాభం రేటు— 20% అయితే,
10వ వాడి దగ్గిర " — 33%

మిగతా పెట్టుబడిదారులందరికీ వచ్చిన అదనపు విలువ 10 వ వాడికీ వచ్చింది. అదే కాకుండా, ఇంకా ఎక్కువగా కూడా వచ్చింది. ఇంకా ఎక్కువగా వచ్చినది 10 వ వాడికి 'ప్రత్యేక అదనపు విలువ.' లేదా, 'ప్రత్యేక లాభం'.— 10 వ వాడి దగ్గిర ఇలా ఎందుకు జరిగింది? వాడి దగ్గిర మాత్రమే ఎక్కువ 'ఉత్పత్తి శక్తి' వుండడం వల్ల. ఒక యూనిట్‌కి పట్టే శ్రమ కాలం తగ్గడం వల్ల. ఇతర

పెట్టుబడిదారులందరి దగ్గిరా వున్నది 'తక్కువ ఉత్పత్తి శక్తి' అయితే, 10 వ వాడి దగ్గర వున్నది, దాన్ని మించిన ప్రత్యేక ఉత్పత్తి శక్తి.

ఈ రకంగా, 'అదనపు విలువ'ని సంపాదించడానికి, 2 మార్గాలు వుంటాయి. అందరికీ వచ్చే 'సగటు అదనపు విలువ'ని సంపాదించే మార్గం ఒకటీ, దానికన్నా ఇంకా 'ఎక్కువ అదనపు విలువ'ని సంపాదించే మార్గం ఒకటీ.

ఒక శాఖలో, అందరి దగ్గిరా వుండే సాధారణ ఉత్పత్తి శక్తి ద్వారా, అందరికీ ఒకే రకంగా వచ్చే అదనపు విలువ — 'ఎబ్సల్యూట్ అదనపు విలువ'. సామాజిక ఉత్పత్తి శక్తి కన్నా మించిన ప్రత్యేక ఉత్పత్తి శక్తి ద్వారా వచ్చే అదనపు విలువ — 'రెలెటివ్ అదనపు విలువ.'

'ఎబ్సల్యూట్' అంటే అర్థం 'దానికి అదిగా స్వతంత్రంగా వుండేది' అని. 'నీరు పల్లానికి ప్రవహించడం' ఒక ఎబ్సల్యూట్ సత్యం. 'భూమి గుండ్రంగా వుండడం' ఒక ఎబ్సల్యూట్ సత్యం — ఇలా. ఇతర పరిస్తితులతో సంబంధం లేకుండా సర్వ సాధారణంగా అన్ని సందర్భాలకూ వర్తించే విషయాలు, ఎబ్సల్యూట్ విషయాలు. ఈ అర్థంలోనే, ఇతర ప్రత్యేక పరిస్తితులతో సంబంధం లేకుండా అందరికీ వచ్చే అదనపు విలువ, ఎబ్సల్యూట్ అదనపు విలువ.

కొన్ని ప్రత్యేక పరిస్తితుల్ని బట్టి, ప్రత్యేక సందర్భాలలో జరిగే విషయాలన్నీ రెలెటివ్ విషయాలు. సాధారణంగా వుండే విషయాలతో పోల్చి చూసినప్పుడు, తేడాగా వుండే విషయాలు ఇవి. అందుకే, కొన్ని ప్రత్యేక పరిస్తితుల్లో మాత్రమే వచ్చే ఎక్కువ అదనపు విలువ, రెలెటివ్ అదనపు విలువ. ఇది అందరికీ వచ్చేది కాదు. ఎబ్సల్యూట్ అదనపు విలువకన్నా, రెలెటివ్ అదనపు విలువ ఎప్పుడూ ఎక్కువగా వుంటుంది.

పెట్టుబడిదారుడి దృష్టి ఎప్పుడూ 'లాభం' మీదే వుంటుంది. 'సగటు లాభం' మీద కాదు. 'ప్రత్యేక' లాభం మీద. ఇతరులకు వచ్చే లాభం కన్నా 'ఎక్కువ' లాభం మీద! అంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ ఎప్పుడూ 'రెలెటివ్ అదనపు విలువ' కోసమే ప్రయత్నాలు చేస్తూ వుంటాడు.

ఈ 'రెలెటివ్ అదనపు విలువ' కోసం ప్రయత్నాలే పెట్టుబడిదారుల్ని నిరంతరం 'పోటీ'లోకి లాగుతూ వుంటాయి. ఈ విషయమే పెట్టుబడిదారీ విధానాన్ని నడిపే శక్తిగా వుంటుంది. కాబట్టి ఈ విషయాలు సరిగా అర్థం చేసుకోవడం ఎంతో అవసరం.

ఉత్పత్తి శక్తి ఎలా పెరుగుతుంది?

10వ పెట్టుబడిదారుడి దగ్గిర 'ఉత్పత్తి శక్తి' పెరగడానికి కారణం ఏమిటి? ఇతర చోట్ల వున్న శ్రమ పరికరాలకన్నా మెరుగైన శ్రమ పరికరాలూ, మెరుగైన పని పద్ధతి తెలిసిన కార్మికులూ — ఈ రెండూ దానికి కారణం.

మెరుగైన శ్రమ పరికరాలు తయారవడానికి కారణం ఏమిటి? — 'శ్రమ పరికరాల'లో మెరుగుదలలు రోజుకో సారో, వారానికోసారో, ఎప్పుడు కావాలంటే అప్పుడు జరగవు. అమలులో వున్న శ్రమ పరికరాల మీద పని జరుగుతూ వుండగా, ఆ పని ద్వారా కొంత కాలానికి కొన్ని 'అనుభవాలు' పోగుపడ్డ తర్వాత, ఆ శ్రమ పరికరాలలో కొన్ని వీలైన మార్పులు జరుగుతూ వుంటాయి. అలా మారిన శ్రమ పరికరాలతో మళ్ళీ పని చేస్తూ వుంటే, మళ్ళీ కొత్త అనుభవాలతో, వీలైతే అవి మళ్ళీ మారతాయి. అలా మారుతూ మారుతూ పాత శ్రమ పరికరంలో వుండే లోపాలన్నీ పోయే దశకు చేరి, ఒక శ్రమ పరికరం ఒక నాటికి ఒక ఆకారంతో స్తిరపడి పోతుంది. లేదా, ఇంకా మార్పుల్ని స్వీకరించగల పరికరం ఇంకా మారుతూనే వుంటుంది.

ఒక శ్రమ పరికరం ఏర్పడడానికి కారణం — శారీరక, మేధా శ్రమల మొత్తం. అందులో ఏ శ్రమ ప్రధానం; శారీరక శ్రమా, మేధా శ్రమా — అనే ప్రశ్న లేదు. శారీరక శ్రమ, పరికరాన్ని ఉపయోగిస్తుంది. దాని వల్ల వచ్చిన అనుభవాల్ని గ్రహించి, మేధా శ్రమ, పరికరంలో మార్పులు చెయ్యగలుగుతుంది. ఆ శారీరక శ్రమా, మేధా శ్రమా ఒకే వ్యక్తివైనా కావచ్చు; వేరు వేరు వ్యక్తులవైనా కావచ్చు. మొత్తం మీద శ్రమ పరికరాల అభివృద్ధికి, శారీరక మేధా శ్రమలు రెండూ కలిసిన ఐక్య శ్రమే కారణం.

ఒక పెట్టుబడిదారుడు ఒక ఇంజనీరుతో పాత శ్రమ పరికరంలో కొన్ని మెరుగులు చేయించాడంటే, ఆ ఇంజనీరు ఆ మెరుగుదలల్ని శూన్యంలో నించి తీసుకు రాడు. ఆ పరికరాన్ని ఉపయోగిస్తూ పనిచేసిన శ్రామికుల అనుభవాల్ని తన దృష్టిలోకి తీసుకున్నప్పుడే ఆ పరికరాన్ని మెరుగు చెయ్యగలుగుతాడు. భూమిని తవ్వే రాతి పరికరమో, చెక్క పరికరమో లేకుండా మొట్ట మొదటే ఇనప నాగలిని ఊహించడం సాధ్యం కాదు. ఇనప నాగలి లేకుండా మొట్టమొదటే ట్రాక్టర్‌ని ఊహించడం కూడా సాధ్యం కాదు.

ఒకవేళ, ఒక ఇంజనీరు తన సృజనాత్మక శక్తితో ఒక శక్తివంతమైన పరికరానికి కావలసిన రచన అంతా చేశాడనుకుందాం. ఊహలో గానీ, కాయితం మీద గానీ వున్న ఆ పరికరం, చెక్క తోనో, లోహం తోనో వాస్తవంగా తయారై భూమి మీద నిలబడాలంటే, దానికోసం అనేక రకాల శారీరక శ్రమలు అవసరమవుతాయి. తర్వాత, దానితో పనిచెయ్యడానికి కూడా, ప్రత్యేక శ్రమ శక్తి కలిగిన శారీరక శ్రమ అవసరమవుతుంది. ఈ రకంగా, శ్రమ పరికరాల నిర్మాణమూ, దాని వాడకమూ, దాని అభివృద్ధీ

అన్నీ, పూర్తిగా 'శ్రమ'కు సంబంధించిన విషయాలే. 'శ్రమ' అన్నప్పుడల్లా, అది 'శారీరక శ్రమ' అయినా కావచ్చు; 'మేధా శ్రమ' అయినా కావచ్చు. ఏ శ్రమ అయినా అది 'శ్రమే'. ఒక పరికరం రూపొందడానికీ, దాని ద్వారా ఉత్పత్తి జరగడానికీ పూర్తిగా శ్రమే కారణం గానీ, శ్రమతో సంబంధం లేనిదేదీ కారణం కాదు.

పాత రకం పరికరంతో కన్నా, మెరుగైన పరికరంతో పని చెయ్యడానికి కార్మికుల సాంకేతిక జ్ఞానం కూడా దానికే తగ్గట్టుగా ఎదగాలి. అభివృద్ధి చెందిన శ్రమ పరికరమూ, అభివృద్ధి చెందిన కార్మికుల సాంకేతిక జ్ఞానమూ కలిసే 'కొత్త ఉత్పాదక శక్తి' అవుతుంది. ఆ కొత్త ఉత్పాదక శక్తితో ఎక్కువ ఉత్పత్తి జరిగితే, ఆ 'ఎక్కువ ఉత్పత్తి' తయారవడానికి కారణం, కార్మికులే కాదు, ఆ 'పరికరం' కూడా. కానీ, ఆ ఎక్కువ ఉత్పత్తి ద్వారా ఎక్కువ 'విలువ' వస్తే, ఆ ఎక్కువ విలువకి కారణం— కార్మికులు మాత్రమే గానీ, ఆ పరికరం కాదు.

ఒక 'పని స్థలం'లో ఉత్పాదక శక్తి తక్కువగా వున్నా, ఎక్కువగా వున్నా; ఆ పని స్థలంలో తయారైన మొత్తం ఉత్పత్తికి వున్న విలువలో నించి, 'ఉత్పత్తి సాధనాల ఖర్చు'ని (స్థిర పెట్టుబడిని) తీసివేస్తే, మిగిలినదంతా 'శ్రమదే'.

తక్కువ ఉత్పాదక శక్తి గల శ్రమ పరికరాలు, తమ 'అరుగుదల విలువని మాత్రమే' సరుకుకి చేర్చినట్టే, ఎక్కువ ఉత్పాదక శక్తి గల శ్రమ పరికరాలు కూడా తమ అరుగుదల విలువని మాత్రమే సరుకుకి చేరుస్తాయి. ఎంత విలువని చేరిస్తే అంత విలువనే అవి వెనక్కి తీసుకోగలుగుతాయి. ఇచ్చిన విలువ కన్నా ఎక్కువని తీసుకోవడానికి ఏ శ్రమ పరికరానికీ హక్కు వుండదు.

10 పని స్థలాల్లో, 10 రకాల ఎక్కువ తక్కువ ఉత్పత్తి శక్తులు వున్నా, తయారైన ఉత్పత్తికి సంబంధించిన 'విలువ సూత్రం' అన్ని చోట్లా ఒకటే. ఉత్పత్తి అయిన దాంట్లోంచి ఉత్పత్తి సాధనాల ఖర్చు పోగా, మిగిలేది — శ్రమదే. ఆ మిగిలే భాగం ఎంత ఎక్కువగా వున్నా, ఎంత తక్కువగా వున్నా! 'ఉత్పత్తి శక్తి' అనేది, 'శ్రమ'కు సంబంధించిందే గానీ, 'పెట్టుబడి'కి సంబంధించింది కాదు.

10వ పెట్టుబడిదారుడు, ఎక్కువ 'ఉత్పత్తి శక్తి' కోసం కొంత ఎక్కువ ఖర్చుపెట్టి (ఎక్కువ పెట్టుబడి పెట్టి) ఏర్పాట్లు చేసుకుని వుంటే, ఆ ఎక్కువ ఖర్చుని వెనక్కి తీసుకోవడానికి వాడికి తప్పనిసరిగా హక్కు వుంటుంది. కానీ, ఖర్చునంతా వెనక్కి తీసుకున్న తర్వాత మిగిలేది — శ్రమదే.

తక్కువ ఉత్పత్తి శక్తి గల ఇతర పని స్థలాల్లో 'సగటు అదనపు విలువ' అనేది అక్కడి కార్మికులది అయినట్టే, ఎక్కువ ఉత్పత్తి శక్తి గల పని స్థలంలో వచ్చే 'ఎక్కువ అదనపు విలువ' కూడా అక్కడి కార్మికులదే.

ఎంత ఎక్కువ ఉత్పత్తి శక్తి వున్న చోటైనా, అక్కడి అదనపు విలువలో పెట్టుబడిదారుడికి చెందవలసింది ఒక్క అణువు కూడా వుండదు.

'అబ్సల్యూట్ అదనపు విలువ' అయినా కార్మికులదే.

'రె లె టి వ్ అదనపు విలువ' అయినా కార్మికులదే.

# 'ఉత్పత్తి శక్తుల' కోసం పోరాటం

బట్ట ఉదాహరణలో, 10 వ పెట్టుబడిదారుడు. మెరుగైన శ్రమ పరికరాల్నీ, మెరుగైన శ్రమ శక్తి గల కార్మికుల్నీ పెట్టి, 1 మీ.ని, అందరిలాగా 1 రూ. ఖర్చుతో గాక, 90 పై.ల ఖర్చుతోనే చేయించాడు కదా? అప్పుడు, ఆ సరుకుకి 'నిజమైన విలువ' తగ్గిపోయిందని అర్థం. 90 పై.ల ఖర్చు మీద, 'సగటు లాభాన్ని' కలపగా వచ్చేదే దాని అసలు విలువ అవుతుంది. అందరి దగ్గిరా వున్న సగటు లాభం రేటుని 20% అనుకుందాం. 10 వ వాడి సరుకు మీద కూడా ఈ ప్రకారమే లాభం వేసుకుంటే, 20÷100 × 90 = 18 పై. లాభం కలుస్తుంది. ఈ సరుకు విలువ 90 + 18 = 108 పై. అవుతుంది. ఇది, ఈ సరుకుకి మాత్రమే వున్న వ్యక్తిగత విలువ.

అయితే, 10 వ పెట్టుబడిదారుడు, తన సరుకుని ఈ తగ్గిన విలువకే అమ్మితే వాడి పెట్టుబడి వాడికి తిరిగి వచ్చి, దాని మీద 20% లాభం వస్తుంది. దాని వల్ల వాడికి, ఇతర పెట్టుబడిదారుల కన్నా తగ్గేదేమీ వుండదు. కానీ, వాడు తన సరుకుని తక్కువ విలువతో అమ్మడు. వాడికి కావలసింది, అందరికీ వచ్చే లాభం మాత్రమే కాదు. అంతకన్నా ఎక్కువ లాభం కావాలి. దాని కోసమే వాడు ఉత్పత్తి శక్తి పెరిగేలాగ చేసుకున్నాడు. కాబట్టి వాడు, తన సరుకు తక్కువ విలువతో తయారైనా దాన్ని తక్కువకి అమ్మడు. తను కూడా అందరిలాగానే మీటరుని 1-20 కి అమ్మడానికే ప్రయత్నిస్తాడు. లేదా, అవసరమైతే, ఆ విలువని కొంత తగ్గించగలడు కూడా. ఎందుకంటే, తన సరుకుని తక్కువ ఖర్చుతోనే చేయించాడు కాబట్టి. అమ్మే విలువని కొంత తగ్గించినా — వాడు నష్టపోయేదేమీ వుండదు. పైగా, అప్పటికీ వాడికి ఎక్కువ లాభమే వుంటుంది.

10 వ వాడు, 1 మీ. ని, 1-20 కి గాక, 1-15 కి అమ్ముతాడనుకుందాం. ఇతరుల కన్నా 5 పై.లు తగ్గించి.

అంటే, ఇక్కడ జరిగిన మొత్తం విషయం ఏమిటి?

ఆ బట్టకి వున్న సగటు విలువ 1. 20
10 వ వాడి బట్ట వ్యక్తిగత విలువ 1. 08
10 వ వాడు అమ్మిన విలువ 1. 15

అంటే, 10 వ వాడు తన బట్టని, దాని 'సగటు విలువ' కన్నా తక్కువగానూ, దాని 'వ్యక్తిగత విలువ' కన్నా ఎక్కువగానూ అమ్ముతాడన్నమాట.

ఇతర పెట్టుబడిదారులు 1 మీటరు కోసం, 1 రూపాయి ఖర్చు పెట్టి, దాన్ని 1-20 కి అమ్మితే, లాభం రేటు 20% అని చూశాం.

10వ వాడు, 1 మీటరు కోసం 90 పై. ఖర్చు పెట్టి, 1-15 కి అమ్మితే లాభం రేటు 28%. సరుకుని, ఇతరుల కన్నా కొంచెం తక్కువకే అమ్మినా, 10 వ వాడికే ఎక్కువ లాభం రేటు వుంది. అంతే కాదు, 10 వ వాడు, ఇతరుల కన్నా తక్కువ విలువతో అమ్ముతాడు కాబట్టి, వీడే ఎక్కువ సరుకుని అమ్మగలుగుతాడు.

సమాజానికి, 1 రోజుకి, మొత్తం 500 మీ.ల బట్ట కావాలనుకుందాం. మిగతా పెట్టుబడిదారులందరూ కలిసి 300 మీ. అమ్మితే, 10 వ వాడు ఒక్కడూ 200 మీ. అమ్ముతాడనుకుందాం. 10 వ వాడికే ఎక్కువ లాభం వస్తుంది.

మిగతా పెట్టుబడిదారులందరూ ఇదంతా చూస్తూ వూరుకోరు. "పోనీలే, వాడినే ఎక్కువ సరుకు అమ్ముకోనిద్దాం. వాడినే ఎక్కువ లాభాలు తీసుకోనిద్దాం" అని వాళ్ళంతా మౌనం వహించరు. వాళ్ళు కూడా 10 వ వాడి దగ్గిర వున్న 'ఉత్పత్తి శక్తి'ని పట్టుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెడతారు.

అప్పటికే ఎక్కువ ఉత్పత్తి శక్తిని సంపాదించినవాడు, ఆ 'జ్ఞానాన్ని' ఎవరికీ అందనివ్వకుండా దాన్ని రహస్యంగా వుంచడానికే శాయశక్తులా తంటాలు పడతాడు. అయినప్పటికీ కొంత కాలానికి ఇతర పెట్టుబడిదారులు కూడా ఆ కొత్త ఉత్పత్తి శక్తి రహస్యాల్ని పట్టుకో గలుగుతారు. అప్పటి నించి అందరి దగ్గిరా పరిస్తితి మారిపోతుంది. అంటే, ఇక అప్పటి నించీ మెజారిటీ పని స్తలాల్లో, ఒక 'పని దినం'లో, ఒక కార్మికుడు 10 మీ. గాక, 20 మీ. ఉత్పత్తి చేయగలుగుతాడన్న మాట.

తీరా, 10 వ వాడి 'ఉత్పత్తి శక్తి'నే ఆ శాఖలో ఎక్కువ మంది సాధించగలిగితే, అప్పుడేమవుతుంది? ఆ 'సరుకు విలువ' సహజంగానే తగ్గిపోతుంది. ఎందుకంటే, ఇప్పుడు, 'తక్కువ ఖర్చు'తో (1 మీ.కీ, 90 పై.ల ఖర్చుతో) 'ఉత్పత్తి' చేసే పని అందరూ చెయ్యగలుగుతారు. కాబట్టి, ఎక్కువ పని స్తలాల్లో వున్న ఉత్పత్తి శక్తే, 'సామాజిక ఉత్పత్తి శక్తి' అవుతుంది. అంటే, ఇప్పుడు 1 మీటరు, నిజంగా ఏ విలువతో తయారవుతుందో అదే దాని 'సామాజిక విలువ' అవుతుంది. ఇప్పుడు, 1 మీటరు విలువ, గతంలో లాగ 1.20 కాదు; 10 వ పెట్టుబడిదారుడు అప్పటి వరకూ అమ్ముతూ వుండినట్టుగా 1.15 కూడా కాదు. ఇప్పటి విలువ 1.08 మాత్రమే.

అయితే, ఇప్పుడు కూడా పెట్టుబడిదారులందరూ మీటరుని 1.15 కే ఎందుకు అమ్మకూడదు? ఎందుకంటే, ఆ లోగా ఏం జరుగుతుందంటే, ఇతర పెట్టుబడిదారులందరూ 1.15 కి అమ్మే పరిస్తితికి చేరుకునేటప్పటికి, 10 వ వాడు తన మీటరు విలువని 1.15 కన్నా కూడా తగ్గిస్తాడు. అప్పుడు మిగతావాళ్ళు కూడా అదే పని చేస్తారు. ఈ తగ్గింపు ఎంత వరకూ సాగుతుందంటే — 'కొత్త సామాజిక విలువ' వరకూ. అంటే, ఈ ఉదాహరణ ప్రకారం 1.08 వరకూ. అంతకన్నా తగ్గించడం ఎవరికీ సాధ్యం కాదు. కాబట్టి, కొత్త విలువ అక్కడ స్తిరపడుతుంది. అందరి దగ్గిరా స్తిరపడ్డ విలువే కొత్త సామాజిక విలువ అవుతుంది. అయితే, ఈ విలువకి అమ్మినప్పుడు, లాభం, గతంలో లాగ 20% గా మాత్రమే వుంటుంది.

1 మీటరుకి–పాత ఉత్పత్తి శక్తి ప్రకారం వుండే విలువ:

80 **C** + 20 **V** + 20 **S** = 1.20 పై.

ఇక్కడ, అదనపు విలువ రేటు = 100%
లాభం రేటు = 20%

కొత్త ఉత్పత్తి శక్తి ప్రకారం వుండే విలువ:

80 **C** + 10 **V** + 18 **S** = 1.08 పై.

ఇక్కడ అదనపు విలువ రేటు = 180%
లాభం రేటు = 20%

మొదటి ఉదాహరణలో, 20 జీతం వల్ల 20 అదనపు విలువ.

రెండో ఉదాహరణలో 10 జీతం వల్ల 18 అదనపు విలువ. అంటే, ఇక్కడ 20 జీతంవల్ల 36 అదనపు విలువ.

ఈ 2 ఉదాహరణల్లోనూ, 'లాభం రేటు'ని చూస్తే, అది గతంలోనూ, ఇప్పుడూ కూడా 20% గానే వుంది. కానీ 'అదనపు విలువ రాసి' ని చూసినా, 'అదనపు విలువ రేటు'ని చూసినా, అవి, ఉత్పత్తి శక్తి పెరిగిన 2 వ ఉదాహరణలోనే ఎక్కువగా వున్నాయి.

10 గంటల పని దినాన్ని తీసుకుందాం. (లేదా, దాని పొడవు ఎలాగైనా తీసుకోవచ్చు.)

మొదటి ఉదాహరణ ప్రకారం :

| అవసర కాలం | : | అదనపు కాలం |
|---|---|---|
| 20 V | + | 20 S |
| 5 గం. | + | 5 గం. |

రెండో ఉదాహరణ ప్రకారం:

10 V + 18 S

3.20 + 6.40

అంటే, ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు, పని దినంలో అవసర కాలం తగ్గి, అదనపు కాలం పెరుగుతుంది. అందుకే ఆ ఉత్పత్తి శక్తి వున్న చోట ఎక్కువ అదనపు విలువ వస్తుంది. ఇదే విషయాన్ని ఇంకా కొన్ని ఉదాహరణల ద్వారా తర్వాత చూస్తాము.

పెరిగిన కొత్త ఉత్పత్తి శక్తి అందరికీ ఒకే రకంగా అందినప్పుడు, అదనపు విలువని పెంచుకునే పరిస్థితి అందరికీ ఒకే రకంగా వుంటుంది. అంటే 10వ వాడికీ, మిగిలిన వాళ్ళకీ మధ్య వుండే తేడా మాయమవుతుంది. ఇప్పుడు అందరికీ ఒకే రకంగా వచ్చే పెరిగిన అదనపు విలువే, ఇప్పటి 'అబ్సల్యూట్ అదనపు విలువ' అవుతుంది. 10 వ వాడు మాత్రమే 'రెలెటివ్ అదనపు విలువ'ని తినే పరిస్థితి ఇప్పుడు వుండదు.

ఇప్పటికీ ఎక్కువ ఉత్పత్తి శక్తిని సాధించలేని ఒకరిద్దరు చిన్న స్థాయి పెట్టుబడిదారులు గానీ, స్వతంత్ర ఉత్పత్తి దారులు గానీ వుంటే, వాళ్ళ దగ్గిర, ఖర్చులు తగ్గవు. అవి గతంలో లాగే వుంటాయి. కానీ, 'సరుకు విలువ' మాత్రం సామాజికంగానే అందరి దగ్గిరా తగ్గిపోతుంది కాబట్టి, వాళ్ళు కూడా తమ సరుకుల్ని ఆ తగ్గిన కొత్త విలువకే అమ్మవలసి వస్తుంది. అంటే, వీరి దగ్గిర 1 మీటరు బట్ట కోసం ఖర్చు తగ్గకుండా గతంలో లాగ 1 రూపాయిగానే వుంటుంది. కానీ, దాన్ని అమ్మేటప్పుడు, గతంలో లాగ 1.20 కి గాక, 1.08 కే అమ్మాలి. అంటే, 1 రూపాయికి 8 పైసలే లాభం. స్వయంగా శ్రమ చేసి సరుకుల్ని అమ్ముకునేవాళ్ళకి లాభం ఎక్కువో తక్కువో ఎలా వచ్చినా, అది వాళ్ళ స్వంత శ్రమదే. వాళ్ళ దగ్గిర కొత్త ఉత్పత్తి శక్తి లేక పోవడంవల్ల, వాళ్ళ 'లాభం రేటు' గతం కన్నా తగ్గుతుంది.

మొత్తానికి బట్ట శాఖలో, ఏం జరిగిందంటే— పెట్టుబడిదారులు 'ఎక్కువ లాభం' కోసం గానీ, పాత లాభం స్థాయిని నిలబెట్టుకోవడం కోసం గానీ చేసిన ప్రయత్నాల వల్ల, అందరి దగ్గిరా 'ఉత్పత్తి శక్తి' పెరిగి, 'పాత సామాజిక ఉత్పత్తి శక్తి'కి బదులు, 'కొత్త సామాజిక ఉత్పత్తి శక్తి' ప్రారంభమైందన్నమాట.

'ఉత్పత్తి శక్తి'ని పెంచడంలో, ఇప్పుడు ఇంకో మార్గం చూద్దాం.

## శ్రమ తీవ్రత :

శ్రమ పరికరాలలోనూ, శ్రమ పద్ధతులలోనూ మార్పు లేకుండానే ఎక్కువ ఉత్పత్తి చెయ్యగల మార్గం — 'శ్రమ తీవ్రత'ని పెంచడం. అమలులో వున్న పని విధానాలతోనే ఎక్కువ వేగంగానూ పని చెయ్యవచ్చు; మందగొడిగానూ పనిచెయ్యవచ్చు. చురుగ్గా పనిచేస్తే ఎక్కువ ఉత్పత్తి వస్తుంది; మందగొడిగా పనిచేస్తే తక్కువ ఉత్పత్తి వస్తుంది.

ప్రతీ శాఖలోనూ 'శ్రమ తీవ్రత'కు సాధారణంగా ఒక హద్దు వుంటుంది. పని స్థలంలో వున్న శ్రమ పరికరాల్ని బట్టీ, పని పద్ధతుల్ని బట్టీ, పనిచెయ్యవలసిన సగటు వేగం నిర్ణయమవుతుంది. కానీ, ఆ సగటు వేగం కన్నా చురుగ్గానూ, నెమ్మదిగానూ కూడా పనిచెయ్యవచ్చు.

శ్రమ పరికరాలూ, పద్ధతులూ మారకుండానే, సాధారణంగా 1 గంటలో జరిగే పని గంట కన్నా తక్కువ సేపట్లోనే జరిగినా; లేదా, 1 గంటలో ఎంత పని జరగాలో అంత కన్నా ఎక్కువ పని జరిగినా 'శ్రమ తీవ్రత' పెరిగిందని అర్థం.

పొలం దున్నే పనిలో, అప్పటికి అమలులోనున్న శ్రమ పరికరాలతో సాధారణంగా 1 మనిషి, 1 ఎకరం పొలం దున్నడానికి 8 గం.లు పడుతుందనుకుందాం. శ్రమ పరికరాల్ని మార్చకుండా ఒక మనిషి 6 గం.ల లోనే ఆ పని చేస్తే దాని అర్థం, శ్రమ తీవ్రత పెరిగిందని. ఆ మనిషి సాధారణ వేగంతో గాక, ఎక్కువ వేగంతో పని చేశాడన్న మాట. 8 గం.ల పనిని 6 గంటల్లోనే చేసేశాడంటే, ఆ పనికి తక్కువ శ్రమ పట్టిందని అర్థమా?— కాదు. దానికి పట్టవలసిన శ్రమ అంతా పట్టింది. అప్పటి సగటు లెక్కల ప్రకారం ఆ పని 8 గం.ల పనే గానీ 6 గం.ల పని కాదు. ఆ కార్మికుడు, 6 గంటల్లోనే 8 గం. శ్రమ చేశాడు. ఇక్కడ '8 గంటలు' అనేది, ఆ పనికి సంబంధించిన జనరల్ పరిస్థితి. సగటు పరిస్థితి. '6 గంటలు' అనేది, ఒక చురుకైన కార్మికుడికి సంబంధించిన ప్రత్యేక పరిస్థితి.

100 చదరపు అడుగుల గోడకి సున్నం వెయ్యడానికి సాధారణంగా 1 గంట కాలం పడుతూ వుండగా, ఒక మనిషి ఆ పని 2 గంటల్లో చేస్తే, ఆ పనికి ఎక్కువ శ్రమ పట్టిందని అర్థమా?— కాదు. 1 గంటలో ఎంత పని జరగాలో ఆ పనే 2 గంటల్లో జరిగింది. అంతేగానీ, ఇక్కడ అసలు పని కన్నా ఎక్కువ పని జరగలేదు. ఇక్కడ 2 గంటల శ్రమా, 1 గంట శ్రమతోటే సమానం. అంటే, ఇక్కడ శ్రమ తీవ్రత తగ్గింది.

శ్రమ తీవ్రత పెరిగిందా, తగ్గిందా, సాధారణ స్థాయిలోనే వుందా— అనేది ఎలా తెలుస్తుంది? తయారైన ఉత్పత్తిని బట్టి తెలుస్తుంది. ఒక 'పని దినం' లో, ఒక కార్మికుడి ద్వారా సాధారణంగా ఎంత ఉత్పత్తి జరగాలీ — అనే దానికి ఒక హద్దు వుండగా, ఆ హద్దు కన్నా ఉత్పత్తి పెరిగితే శ్రమ తీవ్రత పెరిగినట్టూ, ఉత్పత్తి తగ్గితే శ్రమ తీవ్రత తగ్గినట్టూ, ఉత్పత్తిలో మార్పు లేకపోతే, శ్రమ తీవ్రత సాధారణ స్థాయిలోనే వున్నట్టూ అర్థం.

10 వస్తువులు తయారయ్యే కాలంలో, శ్రమ పరికరాలేమీ మారకుండా 20 వస్తువులు తయారైతే, శ్రమ తీవ్రత 100% పెరిగింది. 15 వస్తువులు తయారైతే, శ్రమ తీవ్రత 50% పెరిగింది. 5 వస్తువులే తయారైతే, శ్రమ తీవ్రత 50% తగ్గింది.

పెట్టుబడిదారుడికి అర్జంటు ఆర్డర్లు వచ్చినప్పుడు కార్మికులు శ్రమ తీవ్రత పెంచి పని చేస్తారు. సాధారణంగా, పెట్టుబడిదారుడు, ఆ ప్రత్యేక సందర్భాల్లో ఎక్కువ జీతాలు ఇవ్వడు. కొంత ఎక్కువ ఇచ్చినా, శ్రమ తీవ్రత ఏ స్థాయిలో పెరిగిందో ఆ స్థాయిలో ఇవ్వడు.

శ్రమ తీవ్రత, 'ఉత్పత్తి శక్తి'ని కొంత వరకూ పెంచ గలదు. కానీ, శ్రమ తీవ్రతే, పాత సామాజిక ఉత్పత్తి శక్తిని, కొత్త సామాజిక ఉత్పత్తి శక్తిగా మార్చలేదు. కొత్త సామాజిక శక్తి ఏర్పడాలంటే, శ్రమ పరికరాలలోనూ, 'శ్రమ శక్తి'లోనూ మార్పు జరగాలి. ఆ కొత్త పరికరాలు, పెట్టుబడిదారులలో ఎక్కువ మంది దగ్గర వుండాలి. అప్పుడు కూడా శ్రమ జరగడానికి ఒక సగటు వేగం వుంటుంది. అది అప్పటి పరిస్తితుల్ని బట్టి ఏర్పడే సాధారణ శ్రమ తీవ్రత. అది కూడా మళ్ళీ పెరగడానికీ, తగ్గడానికీ అవకాశం వుంటుంది.

'పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం'లో శ్రమ తీవ్రత సాధారణ స్థాయిలోనైనా వుండాలి, కొంత పెరిగే స్థాయిలోనైనా వుండాలి. తగ్గడం అనే ప్రశ్న ఎన్నడూ వుండదు. శ్రమ తీవ్రత తగ్గితే, పెట్టుబడిదారుడు సరుకుని 'సగటు శ్రమ కాలం' లెక్కతో తయారు చేయించలేడు.

శ్రమ తీవ్రత, ఒక శాఖలో పెట్టుబడిదారులందరి దగ్గిరా ఒక్కలాగే వుండదు. ఒక పెట్టుబడిదారుడు కార్మికుల పట్ల చాలా కఠినంగా ఉండి, చాలా తీవ్రతతో పని చేయించవచ్చు. లేదా, 'పని స్తలం'లో కొంచెం ఎక్కువ సౌకర్యమైన ఏర్పాట్లు వుంటేనూ, శ్రమ పరికరాలలో చిన్న చిన్న మార్పులు చేసినా కూడా, పని ఎక్కువ వేగంతో జరుగుతుంది. ఆ ఏర్పాట్ల కోసం కొంత ఖర్చు అయినా, ఆ ఖర్చుని మించిన విలువ గల పని జరుగుతుంది. ఆ రకంగానైనా శ్రమ తీవ్రతని పెంచవచ్చు. కాబట్టి శ్రమ తీవ్రత, పెట్టుబడిదారులందరి దగ్గిరా ఒకే రకంగా వుండదు. అందరూ చేతి మగ్గాల మీద పనిచేయించినా శ్రమ తీవ్రతలో తేడాలు వుంటాయి; అందరూ మర మగ్గాల మీద పనిచేయించినా శ్రమ తీవ్రతలో తేడాలు వుంటాయి. కార్మికులపై పెట్టుబడిదారుల 'అజమాయిషీ, చాక చక్యమూ' ఈ శ్రమ తీవ్రతని పెంచే విషయంలోనే బాగా ఉపయోగపడతాయి.


ఒక 'పని స్తలం'లో ఎక్కువ ఉత్పత్తి జరిగినప్పుడల్లా, పాత ఉత్పత్తి శక్తి కొత్త ఉత్పత్తి శక్తిగా మారిపోయిందని అర్థం కాదు. ఎక్కువ ఉత్పత్తి రావడానికి, 'ఉత్పత్తి శక్తి'లో మార్పు కారణం కావచ్చు; ఉత్పత్తి శక్తి మారకుండా కేవలం శ్రమ తీవ్రత పెరగడమైనా కారణం కావచ్చు. కానీ, కేవలం శ్రమ తీవ్రత పెరగడం వల్ల వచ్చే ఉత్పత్తి కన్నా, కొత్త ఉత్పత్తి శక్తి వల్ల వచ్చే ఉత్పత్తి అనేక రెట్లు ఎక్కువగా వుంటుంది. నాగలితో ఎంత తీవ్రంగా పనిచేసినా, ట్రాక్టర్‌తో జరిగినంత పని జరగదు. కానీ, ఎప్పుడు కావాలంటే అప్పుడు, కొత్త శ్రమ పరికరాల్ని తెచ్చెయ్యడం సాధ్యం కాదు. కాబట్టి, 'రెలెటివ్ అదనపు విలువ'ని సంపాదించడానికి శ్రమ తీవ్రతని పెంచడమే మొదటి మార్గంగా వుంటుంది. అందులో కూడా అందరూ ఒకే స్థాయిని సాధించలేరు కాబట్టి, కార్మికులతో ఎక్కువ పని చేయించడంలో అందరిలోకీ ఎక్కువ 'నేర్పరి' అయిన పెట్టుబడిదారుడికే ఎక్కువ అదనపు విలువ వస్తుంది.

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, 'ఉత్పత్తి శక్తి'లో మార్పుల్ని గ్రహిస్తారు గానీ, 'శ్రమ తీవ్రత'లో మార్పుల్ని గ్రహించరు. ఒక శాఖకు చెందిన పెట్టుబడిదారులందరి దగ్గిరా, శ్రమ ఎప్పుడూ ఒకే వేగంతో జరిగే విషయంలాగ వాళ్ళు భావిస్తారు. 'ఉత్పత్తి శక్తిలో పెరుగుదల'ని గ్రహించడంలో కూడా సరైన దృష్టితో వుండరు. ఉత్పత్తి శక్తిలో పెరుగుదలకి 'శ్రమ'ని కారణంగా గాక, 'పెట్టుబడి'ని కారణంగా చూస్తారు. అందుకే, పెరిగిన ఉత్పత్తి శక్తి వల్ల వచ్చే పెరిగిన లాభాల్ని పొందడానికి పెట్టుబడిదారుడికే హక్కు వున్నట్టు భావిస్తారు.

# ఉత్పత్తి శక్తి పెరిగితే, అవసర - అదనపు శ్రమ కాలాలు మారతాయి

బట్ట ఉదాహరణలో, 'సగటు అదనపు విలువ'ని సంపాదించే పెట్టుబడిదారుల దగ్గిర అదనపు విలువ రేటుని 100% గానూ, ఎక్కువ అదనపు విలువని సంపాదించే 10వ పెట్టుబదారుడి దగ్గిర దాన్ని 300% గానూ అనుకుందాం. ఈ 2 ఉదాహరణల్నీ 'పని దినం'లోని అవసర, అదనపు శ్రమ కాలాల ద్వారా అర్థం చేసుకోవాలి.

పని దినాన్ని ఒక గీత ద్వారా చూద్దాం.
దీని పొడవు 10 గం.లు.




అవసర కాలం 5 గం.    అదనపు కాలం 5 గం·

ఈ పని దినాన్ని పెంచకుండా, 'అదనపు శ్రమ కాలాన్ని' పెంచే మార్గం ఏమిటి? 2 ని 1 వేపు జరపడమే. అంటే, అవసర కాలాన్ని తగ్గిస్తే, అదనపు కాలం పెరుగుతుంది. అంటే, 'జీతాలు' తగ్గించడమా?— కాదు. జీతాలు తగ్గిస్తే, అదనపు విలువ పెరిగేమాట నిజమే గానీ, జీతాలు తగ్గిస్తే కార్మికుల జీవితావసర వస్తువులు తగ్గిపోయి దాని వల్ల కార్మికులు, శ్రమ శక్తిని ఇవ్వలేని (పని చెయ్యలేని) స్తితికి వస్తారు. కాబట్టి, జీతాలు తగ్గించ కుండానూ, పని దినాన్ని పెంచకుండానూ, అదనపు విలువని పెంచడానికి మార్గం— అదే 'పని దినం'లో మామూలు ఉత్పత్తి గాక ఇంకా ఎక్కువ ఉత్పత్తి జరిగేలాగ చూడడమే. ఎక్కువ ఉత్పత్తి రావాలి. దాన్ని పాత రకంగానే అమ్మాలి. అంతేగాక కార్మికులకు పాత జీతమే ఇస్తే (పోనీ జీతం కొంచెం పెంచినా), కావలసినంత అదనపు విలువ!

ఉత్పత్తి శక్తి పెరిగితే, కార్మికుల అవసర శ్రమ కాలం తగ్గి, అదనపు శ్రమ కాలం పెరుగుతుంది. అంటే, 'ఉత్పత్తి శక్తి'ని పెంచి, ఎక్కువ అదనపు విలువని సంపాదించే పెట్టుబడిదారుడు కార్మికుల్ని ఎక్కువ దోపిడీ చేస్తాడని అర్థం. అయితే, ఉత్పత్తి శక్తిని పెంచడం, ఆ పెట్టుబడి దారుడికి ఒక కొత్త సమస్యని తెచ్చి పెడుతుంది.

**కొత్త** సమస్య: ఉత్పత్తి శక్తిని పెంచి, ఎక్కువ సరుకుని ఉత్పత్తి చేయించే పెట్టుబడిదారుడికి, ఎక్కువ సరుకుని అమ్మవలిసిన సమస్య వచ్చి పడుతుంది. బట్ట ఉదాహరణలో, మిగతా పెట్టుబడిదారులందరూ 100 మీ.ని అమ్మే కాలంలో, 10 వ వాడు 200 మీ. అమ్మవలసి వస్తుంది. అందుకే, 10 వ వాడు, తన సరుకు నంతా చకచకా అమ్మడం కోసం, అవసరమైతే సరుకుని ఇతరులు అమ్మే విలువ కన్నా కొంత తక్కువకే అమ్ముతాడు.

క్రమంగా ఆ శాఖలో ఇతర పెట్టుబడిదారులు కూడా ఎక్కువ ఉత్పత్తి శక్తిని పట్టుకుంటారని చూశాం. అప్పుడు అందరూ కూడా 10 వ వాడిలాగానే, రెట్టింపు సరుకుని ఉత్పత్తి చేయిస్తారు కాబట్టి, 'రెట్టింపు సరుకు'ని అమ్మవలసిన సమస్య అప్పుడు అందర్నీ పట్టుకుంటుంది.

గతంలో పెట్టుబడిదారులంతా రోజుకి 20 మీటర్లు అమ్మి 20% లాభం సంపాదించేవారు అనుకుంటే, ఇప్పుడు అదే లాభం సంపాదించడానికి 40 మీటర్లు అమ్మాలన్న మాట! అంటే, ఉత్పత్తి శక్తి పెరిగినా, ఎవరికీ 'లాభం రేటు' పెరగదు.

లాభంలో పెరుగుదల 'లాభం రేటు'లో కనపడక పోయినా, ఉత్పత్తి శక్తి పెరిగిందీ అంటే లాభరాసి (అదనపు విలువ రాసి) తప్పని సరిగా పెరుగుతుంది. కానీ, పెట్టుబడిదారుడికి అది అర్థం కాదు. లాభం రేటు పెరిగినట్టు కనపడితేనే వాడికి ఎక్కువ లాభం వచ్చినట్టు లెక్క. లాభం రేటులో పెరుగుదల కనపడకపోతే, అది వాడికి మళ్ళీ ఒక సమస్యలాగ కనపడుతుంది.

లాభం రేటు పెరగక పోవడం —ఒక సమస్య అయితే, ఎక్కువ సరుకుని అమ్మవలసి రావడం ఇంకో సమస్య అవుతుంది. లాభం రేటుని పెంచుకోవాలన్నా, తన ఎక్కువ సరుకుని ఇతర పెట్టుబడిదారుల కన్నా తేలిగ్గా అమ్ముకోవాలన్నా, తన సరుకు విలువని కొంచెం తగ్గించి ఇవ్వగల గాలి. ఈ సమస్యల్ని పరిష్కరించుకోవడానికి, పెట్టుబడి దారుడికి కనపడే మార్గం, 'ఉత్పత్తి శక్తి'ని ఇంకా పెంచడమే.

ఒక పెట్టుబడిదారుడు, తన దగ్గిర ఉత్పత్తి శక్తిని ఇంకా పెంచితే, సరుకుని ఇతర పెట్టుబడిదారుల కన్నా తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చెయ్యవచ్చు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చెయ్యగలిగితే, ప్రతీ యూనిట్‌నీ ఇతరుల కన్నా తక్కువ విలువతో అమ్మవచ్చు. అలా అమ్మగలిగితే, ఇతరుల కన్నా ఎక్కువ సరుకుని అమ్మవచ్చు. ఎక్కువ సరుకుని అమ్మితే ఇతరుల కన్నా ఎక్కువ లాభం సంపాదించవచ్చు. కాబట్టి, ఎక్కువ సరుకుని అమ్మడానికి పెట్టుబడిదారుడికి కనపడే మార్గం —'ఉత్పత్తి శక్తి'ని మళ్ళీ పెంచడమే.

'ఉత్పత్తి శక్తి'ని పెంచే ప్రయత్నాలు ప్రతీ పెట్టుబడి దారుడి దగ్గిరా ఎప్పుడూ జరుగుతూనే వుంటాయి. దాని కోసం వాడి దగ్గిర ఒక డిపార్టుమెంటూ, ప్రత్యేక ఉద్యోగులూ వుంటారు. ఒక్కో సారి ఆ ప్రయత్నాలు మరీ ముమ్మరంగా జరుగుతాయి. ఒక్కో సారి కొంత మందగొడిగా జరుగుతాయి.

ప్రతీ పెట్టుబడిదారుడూ ఇతర పెట్టుబడిదారులతో 'పోటీ తీవ్రత' ఎదురైనప్పుడల్లా తన సైంటిస్టుల్నీ, ఇంజనీర్లనీ పిలుస్తాడు. "మీరేం చేస్తారో నాకు తెలీదు. ఖర్చులు ఇంకా తగ్గిపోయే మార్గాలు కనిపెట్టండి! లేకపోతే ఉద్యోగాల్లోంచి వెళ్ళిపోండి!" అంటాడు.

ఆ ఉద్యోగులు ఇంకో పెట్టుబడిదారుడి దగ్గిరికి పోయినా, వాడు కూడా ఈ పనే చెయ్యమంటాడు. వాళ్ళు చెయ్యవలసింది ఉత్పత్తి శక్తిని పెంచే పరిశోధనలే. కాబట్టి, వాళ్ళు వెంటనే పరిశోధనల వేగం పెంచుతారు. వాళ్ళు అసలు ఎప్పుడూ 'ముడి పదార్థాల' మీదా, 'శ్రమ పరికరాల'

మీదా పరిశోధనలు చేస్తూనే వుంటారు.

మొత్తానికి, ఇలాంటి పరిస్థితుల్లో మొదట ఒకరిద్దరు పెట్టుబడిదారుల దగ్గిర మేధా శ్రమల కార్మికులు మళ్ళీ 'కొత్త ఉత్పత్తి శక్తి'ని పట్టుకుంటారు. ఈ కొత్త ఉత్పత్తి శక్తి మళ్ళీ 10 వ పెట్టుబడిదారుడి దగ్గిరే ప్రారంభం కావాలనే రూలేమీ లేదు. అది ఇంకో పెట్టుబడిదారుడి దగ్గిరైనా ప్రారంభం కావచ్చు. కానీ సాధారణంగా ఎప్పుడూ పెద్ద పెట్టుబడిదారుల దగ్గిరే కొత్త ఉత్పత్తి శక్తి వస్తూ వుంటుంది. ఇప్పుడు కూడా కొత్త ఉత్పత్తి శక్తి మొట్ట మొదట 10 వ వాడి దగ్గిరే ప్రారంభమైందనుకుందాం.

ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడల్లా, గతంలో కన్నా ఇంకా ఎక్కువ సరుకుని అమ్మవలసిన సమస్య పట్టుకుంటుంది. పెట్టుబడిదారుడనేవాడు ఎప్పుడూ, నెత్తి మీద 'అమ్మకం సమస్య' అనే బండని మోస్తూ వుంటాడు. ఒక బండ కింద సతమతమవుతూనే వాడు ఇంకా పెద్ద పెద్ద బండల్ని (ఇంకా ఎక్కువ సరుకుని అమ్మాల్సిన సమస్యల్ని) నెత్తికి ఎక్కించు కుంటూ వుంటాడు. 'ఎక్కువ అదనపు విలువ'ని చూసు కుంటూ, వాడు, నెత్తి మీదకి బండ మీద బండెక్కినా 'ఇప్పుడు చాలా తేలిగ్గా వుంది' అనుకుంటాడు.

'రెలెటివ్ అదనపు విలువ'ని సంపాదించే ప్రయత్నంలో పెట్టుబడిదారులు తమ శాఖల్ని హఠాత్తుగా వొది లెయ్యడానికి కూడా సిద్ధపడతారు. ఇంకా పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతులు లేని శాఖలలోకి ప్రవేశిస్తారు. అక్కడ పాత పద్ధతుల్లో ఉత్పత్తి చేస్తోన్న 'స్వతంత్ర ఉత్పత్తిదారుల' సరుకుల లాంటి వాటినే వీళ్ళు కొంత తక్కువ విలువతో తయారుచేసి వాటిని కొంత చవకగా అమ్మడం మొదలు పెడతారు. ఆ రకంగా, స్వంతంత్ర ఉత్పత్తిదారుల మీద తమ 'చవక' సరుకులతో పోటీచేసి, రెలెటివ్ అదనపు విలువని సంపాదిస్తారు. ఈ విధంగా, శాఖల్ని మార్చడం గానీ, వున్న చోటే వుండి పద్ధతుల్ని మార్చడం గానీ, రెండూ గానీ, ఏది వీలైతే అది చెయ్యడం — 'ఎక్కువ అదనపు విలువ' కోసమే. అన్ని రంగాలలోనూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే స్థిరపడి పోయినప్పుడు, 'రెలెటివ్ అద నపు విలువ' కోసం పోరాటం తీవ్ర స్థాయిలోకి మారుతుంది.

## ఉత్పత్తి శక్తి పెరిగితే, దాని ఫలితాలు, వేరు వేరు వర్గాల మీద ఎలా వుంటాయి ?

ఒక సరుకు తయారీకి సంబంధించిన పాత ఉత్పత్తి శక్తి, కొత్త ఉత్పత్తి శక్తిగా మారి, ఉత్పత్తి రెట్టింపైతే, దాని ఫలితం 'పెట్టుబడిదారుడి' విషయంలోనూ, 'కార్మికుల' విషయంలోనూ ఒక్కలాగే వుంటుందా? పెట్టుబడిదారీ విధానానికి వున్న స్వభావాన్ని వివరించే అతి ప్రధానమైన అంశాలలో ఇది ఒకటి.

'ఉత్పత్తి శక్తి' అంటే, ఏ శ్రమకు సంబంధించిన ఉత్పత్తి శక్తి ఆ శ్రమకు వుంటుంది. ఉదా: 'కుట్టు శ్రమ'లో ఉత్పత్తి శక్తి; 'నేత శ్రమ'లో ఉత్పత్తి శక్తీ — ఇలా. ఒక శాఖలో ఉత్పత్తి శక్తి పెరగడం, ఎలా జరుగుతుందో ఇంతకు ముందే చూశాం. మొదట, ఒకరిద్దరు పెట్టుబడిదారుల దగ్గిరే ఉత్పత్తి శక్తి పెరుగుతుంది. అప్పుడు అది ఆ పెట్టుబడిదారుల 'వ్యక్తిగత ఉత్పత్తి శక్తి'గా వుంటుంది. ఆ దశలో అది, ఆ పెట్టుబడిదారులకు 'ఎక్కువ అదనపు విలువ'ని ఇస్తుంది. కానీ, క్రమంగా అది, ఆ శాఖలో అందరికీ సంబంధించిన 'సామాజిక ఉత్పత్తి శక్తి' అయిపోతుంది. సరుకుకి పట్టే శ్రమ కాలం అందరి దగ్గిరా తగ్గిపోయి, సరుకు విలువ తగ్గుతుంది. అప్పటి వరకూ ఒకరిద్దరు పెట్టుబడిదారులకు వస్తూ వున్న 'ఎక్కువ అదనపు విలువ' మాయమవుతుంది. ఈ రకంగా, ఒక శాఖలో 'ఉత్పత్తి శక్తి' ఎన్ని రకాలుగా వుందీ — అనే దాన్ని బట్టి, ఆ శాఖలో సరుకు కోసం అయ్యే ఖర్చూ, సరుకు విలువా, అదనపు విలువా, లాభం రేటూ — వంటి విలువ అంశాలన్నీ ఆ పరిస్థితులకు తగినట్టుగా కొన్ని తేడాలతో వుంటాయి.

ఒక శాఖలో ఉత్పత్తి శక్తి పెరుగుతూ వున్నప్పుడు, ఆ కాలమంతా మిగిలిన శాఖలన్నీ చలనం లేకుండా పాత స్థితిలోనే వుండిపోవు. అన్ని శాఖల్లోనూ, వాటి ఉత్పత్తి శక్తులు గతంలో కన్నా పెరుగుతూనే వుంటాయి. అయితే, ఆ పెరుగుదల అన్ని శాఖల్లోనూ ఒకే స్థాయిలో జరగదు. ఒక శాఖలో ఉత్పత్తి శక్తి 20% పెరిగితే, ఆ కాలంలో ఇంకో శాఖలో ఉత్పత్తి శక్తి 10% మాత్రమే పెరగవచ్చు. మూడో శాఖలో 15% పెరగవచ్చు. 4 వ శాఖలో 25% పెరగ వచ్చు.— ఈ రకంగా, ఉత్పత్తి శక్తుల పెరుగుదలలు అన్ని శాఖల్లోనూ ఒకే స్థాయిలో గాక, ఎక్కువ తక్కువ స్థాయిల్లో వుంటాయి. ఆ మార్పుల్ని బట్టి, ఆ శాఖల సరుకుల 'విలువ సంబంధాలు' గతంలో కన్నా వేరే రకంగా మారుతూ వుంటాయి.

2 వేరు వేరు శాఖల్లో ఉత్పత్తి శక్తులు ఒకే రకంగా, 'రెట్టింపు' అయ్యాయి అనుకుందాం. ఆ 2 శాఖల్లోనూ సరుకులకు పట్టే శ్రమ కాలాలు సగమే అవుతాయి కాబట్టి, వాటి విలువలు సగానికి తగ్గుతాయి. 2 సరుకుల

విలువలూ ఒకే స్థాయిలో తగ్గుతాయి కాబట్టి, అప్పుడు వాటి పరస్పర విలువ సంబంధం ఏమీ మారని దానితో సమానంగా వుంటుంది.

కానీ, ఉత్పత్తి శక్తుల్లో మార్పులు ఒకే రకంగా గాక, ఎక్కువ తక్కువ స్థాయిల్లో వుంటే, ఆ శాఖల సరుకులకు పట్టే శ్రమ కాలాలు కూడా ఆ రకంగానే మారి, ఆ సరుకుల 'విలువ సంబంధాలు' కూడా ఆ రకంగానే మారతాయి. (దీనికి సంబంధించిన ఉదాహరణల్ని ఈ సంపుటంలోనే, 1 వ భాగంలో, 2 వ చాప్టరులో, 'ఉత్పాదక శక్తి' కి సంబంధించిన చోట చూడవచ్చు.)

వేరు వేరు శాఖల్లో 'ఉత్పత్తి శక్తులు' వేరు వేరు స్థాయిల్లో వున్నప్పటికీ, మొత్తం అన్ని శాఖలకూ సంబంధించిన ఒక 'సగటు ఉత్పత్తి శక్తి' ని కనిపెట్టవచ్చు.

ఒక శాఖ ఒక సంవత్సరంలో, '100 పెట్టుబడి'తో ఎంత 'అదనపు విలువ'ని ఉత్పత్తి చెయ్యగలదు? ఇతర శాఖలు ఎంతెంత చెయ్యగలవు? — అన్ని శాఖల 'అదనపు విలువల్నీ' కలిపి, సగటు చేస్తే, ఒక '100 సగటు పెట్టుబడి'కి, ఫలానా 'కొంత అదనపు విలువ'ని ఉత్పత్తి చేసే 'సగటు ఉత్పత్తి శక్తి' వున్నట్టు తెలుస్తుంది. అదే, ఆ కాలంలో, అన్ని శాఖలకూ సంబంధించి వున్న 'సామాజిక ఉత్పత్తి శక్తి'.

ఒక విడి శాఖకు — ఒక 'సామాజిక ఉత్పత్తి శక్తి' వున్నట్టే, ఒక సమాజంలో,అన్ని శాఖలకూ కలిసి కూడా ఒక 'సామాజిక ఉత్పత్తి శక్తి' వుంటుంది. విడి శాఖల్లో ఉత్పత్తి శక్తులు పెరుగుతూ వుంటే, అన్ని శాఖలకూ సంబంధించిన 'సామాజిక ఉత్పత్తి శక్తి' కూడా పెరుగుతూ వుంటుంది.— 'ఉత్పత్తి శక్తి' కి సంబంధించిన ఈ కనీసమైన విషయాలు తెలిస్తేనే, మొదట చూసిన ప్రశ్నకి ("ఉత్పత్తి శక్తి పెరిగితే, దాని ప్రభావం వేరు వేరు వర్గాల మీద ఎలా వుంటుంది?" అనే ప్రశ్నకి) జవాబు చెప్పుకోగలం. ఈ జవాబు చూడాలంటే, అన్ని శాఖలకూ సంబంధించిన సామాజిక ఉత్పత్తి శక్తినే తీసుకోవాలి.

ఎందుకంటే, 'పని దినం'లో, అవసర శ్రమ భాగం కార్మిక వర్గం కోసమూ, అదనపు శ్రమ భాగం పెట్టుబడిదారీ వర్గం కోసమూ, ఖర్చవుతాయని మనకు తెలుసు. అవసర శ్రమ భాగం తగ్గడం — అనేది, అన్ని శాఖలకూ సంబంధించిన ఉత్పత్తి శక్తి పెరగడం వల్లనే జరుగుతుంది.

కార్మికుల పోషణ వస్తువులు అనేక శాఖల్లో తయారవుతాయి. ఆ పోషణ వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యడానికి కావలసిన ఉత్పత్తి సాధనాలు కూడా అనేక శాఖల్లో తయారవుతాయి. ఆ శాఖలన్నిటిలోనూ వుండే ఉత్పత్తి శక్తుల్ని బట్టే, కార్మికుల 'పోషణ వస్తువులకు పట్టే శ్రమ కాలం' వుంటుంది. ఆ శ్రమ కాలమే, 'పని దినంలోని మొదటి భాగాన్ని' నిర్ణయిస్తుంది. ఆ శ్రమ కాలం తగ్గితే, పని దినంలోని మొదటి భాగం తగ్గుతుంది. ఈ రకంగా మొత్తం సమాజంలో అన్ని శాఖలకూ సంబంధించిన ఉత్పత్తి శక్తి పెరుగుదల, పని దినంలో భాగాల్ని ప్రభావితం చేస్తుంది.

మొత్తం సమాజాన్నంతా 'ఒకే పని స్థలంగా' అనుకుందాం. అక్కడ ఒక పనిదినం వుంటుంది. ఒకే పని స్థలంలో కూడా వేరు వేరు శ్రమ శక్తులు గల కార్మికులు పని చేస్తారు. అందులో ఏదో ఒక రకం జీతాన్ని ఉదాహరణగా తీసుకుందాం. ఆ జీతానికి జరిగేదే, అన్ని రకాల జీతాలకూ జరుగుతుందని అర్థం.

ఇప్పుడు ఆ పని స్థలంలో 'ఉత్పత్తి శక్తి' పెరుగుతూ వుంటే, దాని ఫలితాలు 'పని దినంలోని భాగాల మీద' ఎలా వుంటాయో వరసగా కొన్ని ఉదాహరణలు చూద్దాం.

**1)** సమాజంలో, ఫలానా స్థాయి గల 'ఉత్పత్తి శక్తి' వుందనుకుందాం. పని దినం 10 గంటలు. ఒక కార్మికుడు, ఈ 'ఉత్పత్తి శక్తి'తో, ఈ పని దినంలో, కొన్ని వస్తువులు ఉత్పత్తి చేస్తాడు. ఆ ఉత్పత్తిలో 'స్థిర పెట్టుబడి భాగం' సంగతి అనవసరం. 'సజీవ శ్రమ భాగాన్ని' మాత్రమే తీసుకోవాలి. ఇదే, 'జీతం'గానూ, 'అదనపు విలువ'గానూ విభజన అవుతుంది కాబట్టి. అన్ని ఉదాహరణల్లోనూ ఈ భాగాన్నే చూస్తాము. ఇక్కడ ఈ 'సజీవ శ్రమ' భాగం విలువ 10 వస్తువులు, లేదా 10 రూ.లు — అనుకుందాం. ఇక్కడ స్థిర పెట్టుబడి భాగాన్ని తీసుకోవడం లేదు కాబట్టి, వస్తువుల్లో విలువ అంతా సజీవ శ్రమే. ఈ భాగమే 10 వస్తువులు. 10 గం.ల పని దినంలో 10 వస్తువులు అంటే 1 వస్తువుకి పట్టే కాలం 1 గంట. 1 వస్తువు విలువ 1 రూ.

కార్మికుడి జీతం 5 రూ; లేదా, 5 వస్తువులు — అనుకుందాం. అదనపు విలువ 5 రూ, లేదా, 5 వస్తువులు.

| | | |
|---|---|---|
| జీతమూ | : | అదనపు విలువా |
| 5 | : | 5 |
| సగం | : | సగం |

'పని దినం'లో, అవసర కాలం 5 గం; అదనపు కాలం 5 గం.లు. ఇక్కడ, అదనపు విలువ రేటు = $5\mathbf{S} \div 5\mathbf{V} \times 100 = 100\%$

**2)** కొన్ని సంవత్సరాలకు సామాజిక ఉత్పత్తి శక్తి రెట్టింపు అయిందనుకుందాం. (అంటే, అన్ని శాఖలలోనూ ఉత్పత్తి శక్తి రెట్టింపు అయిందనుకుందాం.) పని దినం 10 గం.లు. ఇప్పుడు, 'పని దినం'లో, కార్మికుడు, తన 'శ్రమ విలువ'గా 10 వస్తువులు గాక, 20 వస్తువులు తయారు చేస్తాడు.

పనిదినం — గతంలోనూ, ఇప్పుడూ కూడా ఒకే పొడవుతో వుంది. అది 10 గంటలు. ఆ కాలంలో, ఎంత ఉత్పత్తి జరిగితే అంత ఉత్పత్తి మీదే ఆ కాలం పరుచుకుంటుంది.

విలువ అంటే శ్రమ కాలమే.

'1 గంట' అంటే, ఆ గంటలో ఎక్కువ పని జరిగినా, తక్కువ పని జరిగినా, అది గంటే. ఆ పని విలువ—గంటే. 10 గంటల పనిదినం విలువ, ఎప్పుడైనా 10 గంటలే. ఉత్పత్తి శక్తి ఎలా వున్నా ఆ కాలం విలువ ఒకటే.

గతంలో 10 వస్తువులకు పట్టిన కాలమే (10 గంటలు), ఇప్పుడు 20 వస్తువులకు పడుతుంది. కాబట్టి, గతంలో 10 వస్తువులకు వున్న విలువే ఇప్పుడు 20 వస్తువులకు వుంటుంది.

గతంలో 1 వస్తువుకి మొత్తం శ్రమ —1 గంట.

ఇప్పుడు 1 వస్తువుకి ఎంత శ్రమ?—$\frac{1}{2}$ గంట శ్రమ.

ఇప్పుడు, 1 వస్తువుకి ఎంత విలువ? $\frac{1}{2}$ రూపాయా?–కాదు. ఎందుకంటే, ఇక్కడ, 'డబ్బు విలువ'లో మార్పుని కూడా లెక్కలోకి తీసుకోవాలి. అన్ని శాఖల్లోనూ 'ఉత్పత్తి శక్తి' రెట్టింపు అయినట్టే, 'డబ్బు సరుకు' అయిన 'బంగారాన్ని ఉత్పత్తి చేసే శాఖ'లో కూడా ఉత్పత్తి శక్తి రెట్టింపు అయిందనుకోవాలి. అప్పుడేం జరుగుతుంది? 1 రూపాయి విలువ, సగమే అవుతుంది. ఇప్పుడు, 1 రూపాయి, గతంలోని $\frac{1}{2}$ రూపాయితో సమానం అవుతుంది.

గతంలో, 1 వస్తువు =1 రూపాయి. ఇప్పుడు ఆ వస్తువు విలువ సగానికి తగ్గి, ఆ రూపాయి విలువ కూడా సగానికి తగ్గితే, ఇప్పుడు కూడా ఆ 'వస్తువు విలువ'కీ, ఆ 'రూపాయి విలువ'కీ, సరిపోతుంది. కాబట్టి, ఇప్పుడు కూడా, 1 వస్తువు = 1 రూపాయే. వస్తువు విలువా, రూపాయి విలువా కూడా ఒకే రకంగా తగ్గడం వల్ల ఇలా జరిగింది.

'ఉత్పత్తి శక్తి' పెరిగినా, ఒకే పరిమాణం గల శ్రమ కాలానికి విలువ పెరగదూ, తగ్గదూ. దాని 'డబ్బు వ్యక్తీకరణ' మాత్రమే మారుతుంది.

గతంలో, పని దినం విలువ = 10 రూ.లు = 10 వస్తువులు
ఇప్పుడు ,, ” =20 రూ.లు = 20 వస్తువులు
గతంలోనూ, ఇప్పుడూ కూడా, 1 రూ. = 1 వస్తువు

'ఉత్పత్తి శక్తి' పెరుగుదల, 'మొత్తం ఉత్పత్తి అయ్యే విలువ సైజు'ని మార్చకపోయినా, 'ఉపయోగపు విలువ సైజు'ని మారుస్తుంది. (ఈ విషయం మొదటి భాగంలో చూశాం) ఉత్పత్తి శక్తి రెట్టింపు అవడం వల్ల, అదే పని దినంలో ఇప్పుడు 10 వస్తువులు గాక, 20 వస్తువులు వచ్చాయి. గతంలో 10 వస్తువులకు వున్న విలువే ఇప్పుడు 20 వస్తువులకు వుంది. ఈ రకంగా, 'పని దినం'లో 'విలువ' పెరగకుండా, 'ఉపయోగపు విలువ' పెరిగింది.

అయితే, ఇప్పుడు 'జీతం' ఎలా వుంటుంది? 'ఉత్పత్తి శక్తి' రెట్టింపు అవడం వల్ల, జీతం కూడా రెట్టింపు అవుతుందా? గతంలో, 'శ్రమ విలువ' 10 రూ.లుగా వున్నప్పుడు, జీతమూ, అదనపు విలువా 5 + 5 గా వున్నాయికదా? అలాగే, ఇప్పుడు 'శ్రమ విలువ' 20 రూ. అయినప్పుడు, జీతమూ, అదనపు విలువా, 10 + 10 గా వుంటాయా?—అలా జరగదు. పెట్టుబడిదారుడు ఉత్పత్తి శక్తిని పెంచేది, అందులో కార్మికుడికి సమానమైన భాగం ఇవ్వడానికి కాదు. కానీ, పెరిగే ఉత్పత్తిలో కార్మికుడికి ఏమీ ఇవ్వకుండా పూర్తిగా తప్పించుకోవడం కూడా పెట్టుబడిదారుడికి సాధ్యం కాదు. ఎందుకంటే, 'ఉత్పత్తి శక్తి' పెరగడం అంటే, కొత్త శ్రమ పరికరాలతో పని చెయ్యడమే కాబట్టి, కొత్త శ్రమ పరికరాల మీద పని చెయ్యడానికి కార్మికుడికి గతంలో లేని కొత్త రకపు 'సాంకేతిక జ్ఞానం' కావాలి. నాగలితో పనిచేసే కార్మికుడి కన్నా ట్రాక్టర్‌తో పనిచేసే కార్మికుడికి సాంకేతిక శిక్షణ మీద ఎక్కువ ఖర్చు అవుతుంది. అంటే, ఆ కార్మికుడి 'శ్రమ శక్తి విలువ' పెరిగిందని అర్థం. పెట్టుబడిదారుడి పని స్థలంలోకి, గతం కన్నా ఎక్కువ సాంకేతిక శిక్షణ గల కార్మికుడు కావాలంటే, ఆ కొత్త శ్రమ శక్తికి పాత జీతం కన్నా ఎక్కువ జీతం ఇవ్వవలసి వుంటుంది. అలా ఇచ్చే పరిస్థితి లేకపోతే, పెట్టుబడిదారుడికి కావలసిన ఆ 'కొత్త శ్రమ శక్తి' తయారవనే తయారవదు. కాబట్టి, ఉత్పత్తి శక్తి పెరిగి నప్పుడల్లా, దాని సాంకేతిక విషయాలకు సంబంధించిన ఖర్చు భాగం జీతానికి చేరుతూ వుంటుంది. అది 'కొత్త శ్రమ శక్తి విలువ' అవుతుంది. అంటే, ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడల్లా 'జీతం' కూడా పెరుగుతుంది. అయితే ఆ పెరిగే జీతం కొత్త పరిస్థితులకు అవసరమైన 'శ్రమ శక్తి విలువే' గానీ, అంత కన్నా ఎక్కువ కాదు. కాబట్టి, ఏ పరిస్థితుల్లో అయినా, 'జీతం' అంటే—'శ్రమ శక్తి' విలువే. 'శ్రమ శక్తి' ఏర్పడడానికి కనీసంగా ఎన్ని వస్తువులు కావాలో ఆ వస్తువులే, లేదా ఆ వస్తువుల విలువే — 'జీతం'.

కిందటి ఉదాహరణలో 'శ్రమ శక్తి' విలువగా 5 వస్తువులు వున్నాయి కదా? ఇప్పుడు 'కొత్త శ్రమ శక్తి' విలువగా 7 వస్తువులు కావాలనుకుందాం. ఆ 7 వస్తువుల విలువ ఎంత వుంటుందో, అదే ఇప్పుడు 'జీతం'.

ఇప్పుడు 7 వస్తువులు = 7 రూ.లు
కాబట్టి, ఇప్పుడు జీతం = 7 రూ.లు. లేదా, 7 వస్తువులు.

5 జీతం, 7 జీతంగా మారింది కాబట్టి, ఇప్పుడు జీతం పెరిగినట్టే కనపడుతుంది. గతంలో, 1 వస్తువుకీ, 1 రూపాయికీ ఎంతెంత విలువలు వుండేవీ, అవి ఇప్పుడు ఎలా వున్నాయీ — అనే లెక్కలేవీ లేకుండా జీతాల సంఖ్యల్ని చూస్తే, ఇప్పుడు జీతం పెరిగినట్టే లెక్క. కానీ, గతంలో 5 జీతం, కార్మికుడికి కనీస పోషణని ఇస్తే, ఇప్పుడు 7 జీతం కూడా కార్మికుడికి కనీస పోషణనే ఇస్తుంది.

'శ్రమ విలువ'లో నించి 'జీతం' పోగా మిగిలేది — 'అదనపు విలువ' కదా? ఇప్పుడు, అదనపు విలువ = 13 రూ ; లేదా, 13 వస్తువులు. గతంలో, అదనపు విలువ రేటు 100% అని చూశాం. ఇప్పుడు, అదనపు విలువ రేటు = 13 **S** ÷ 7 **V** × 100 = 185%

గతంలో — అవసరకాలం 5 గం.లు; అదనపు కాలం 5 గం.లు కదా? ఇప్పుడు 'పని దినం'లో — అవసర, అదనపు కాలాలు ఎంతెంత? ఇప్పుడు 1 వస్తువు = ½ గంట కాబట్టి, 7 వస్తువుల కోసం అవసర శ్రమ 3½ గం. 13 వస్తువుల కోసం అదనపు శ్రమ 6½ గం.

కార్మికులు, తమ 'శ్రమ శక్తి విలువ'ని పునరుత్పత్తి చేసుకోవడానికి, గతంలో 5 గం.ల కాలం పట్టేది. కానీ, 'ఉత్పత్తి శక్తి' పెరగడం వల్ల దానికి ఇప్పుడు 3½ గం.ల కాలమే సరిపోతుంది. కార్మికులు తమ కనీస పోషణ కోసమే పని చేసుకున్నట్టయితే, 3½ గం.ల తర్వాత పని మానెయ్యవచ్చు. కానీ కార్మికులు ఇప్పుడు కూడా 'ఆ పోషణ కోసం' 10 గం.లూ శ్రమ చేస్తారు. అందులో 6½ గం.ల కాలం దోపిడీదారుల కోసమే.

సామాజిక ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల 'జీతం' పెరిగినట్టు కనపడుతుంది. గతంతో పోలిస్తే 'జీతం' పెరిగిన మాట నిజమే. 5 వస్తువులు వాడే చోట 7 వస్తువులు వాడడం అంటే, అది జీతం పెరగడమే. కానీ, అదనపు విలువ, జీతాన్ని మించి పెరిగింది. దేని పెరుగుదల ఎంత శాతం వుందో ఇప్పుడు చూద్దాం.

గతంలో జీతం 5. ఇప్పుడు జీతం 7. అంటే, జీతంలో పెరుగుదల 2. ఈ పెరుగుదల శాతం = 5 కి – 2 పెరిగితే, 100 కి — ఎంత? 2 ÷ 5 ×100 = 40%. ఇది 'జీతం'లో పెరుగుదల శాతం.

మరి, 'అదనపు విలువ'లో పెరుగుదల? గతంలో, అదనపు విలువ 5. ఇప్పుడు 13. ఇందులో పెరుగుదల 8. 5 కి — 8 పెరిగితే, 100కి — ? 8 ÷ 5 × 100 = 160%. ఇది, 'అదనపు విలువ'లో పెరుగుదల శాతం.

'ఉత్పత్తి శక్తి' రెట్టింపు అవడం వల్ల, జీతాల పెరుగుదల 40% అయితే, అదనపు విలువ పెరుగుదల 160%. 'ఉత్పత్తి శక్తి' పెరగడం వల్ల, జీతం పెరిగినా, దాన్ని మించి 'అదనపు విలువ' అనేక రెట్లు పెరిగింది. ఇక్కడ అసలు విషయం ఏమిటంటే — ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల, 'పని దినం'లో అవసర శ్రమ కాలం' తగ్గి, 'అదనపు శ్రమ కాలం' పెరిగింది. అంటే, దోపిడీ స్థాయి గతం కన్నా పెరిగింది. 'ఉత్పత్తి శక్తి'ని పెంచి, గతం కన్నా ఎక్కువ ఉత్పత్తి చెయ్యడం వల్ల, కార్మికులకు వచ్చే ఫలితం ఇదన్న మాట!

ఇది, అన్ని శాఖలకూ, ఆ శాఖల్లో అన్ని స్థాయిల జీతాలకూ వర్తిస్తుంది.

ఇప్పుడు — 'ఉత్పత్తి శక్తి' పెరిగినా, 'దోపిడీ స్థాయి' గతంలోలాగే వుండే ఉదాహరణ ఒకటి చూద్దాం. గతంలో, 'శ్రమ విలువ' అయిన 10 లో, జీతమూ అదనపు విలువా సగం సగంగా (5 + 5గా) వున్నాయి కదా? (దోపిడీ స్థాయి 100%). అలాగే, ఇప్పుడు కూడా, 'శ్రమ విలువ' అయిన 20 లో, జీతమూ అదనపు విలువా సగం సగంగా (10 + 10గా) వున్నట్టయితే, దోపిడీ స్థాయి ఇక్కడ కూడా 100% గానే, గతంలోలాగే, వుంటుంది. అంటే, 'ఉత్పత్తి శక్తి' పెరిగినా దోపిడీ స్థాయి పెరగనట్టు అవుతుంది.

కానీ, 'అదనపు ఉత్పత్తి'ని చూస్తే, అది గతంలో 5 వస్తువులు అయితే, ఇప్పుడు 10 వస్తువులు. ఇప్పుడు 'అదనపు ఉత్పత్తి' రెట్టింపు అయింది. 'అదనపు విలువ రేటు'ని చూస్తే, అది, 2 చోట్లా ఒకే రకంగా (100% గానే) వుంది. దాన్ని చూస్తే దోపిడీ పెరిగినట్టు కనపడడం లేదు. అంటే, 'విలువ' లెక్కతో చూసినప్పుడు కనపడని విషయాలు కూడా, 'ఉత్పత్తుల' లెక్కతో చూసినప్పుడు కనపడతాయి. దోపిడీ స్థాయి ఏమీ పెరగనట్టుగా కనపడ్డ చోట కూడా, 'అదనపు ఉత్పత్తి' పెరిగే వుంటుంది. దోపిడీ స్థాయి ఎంతో పెరిగినట్టు స్పష్టంగానే కనపడేచోట, అదనపు ఉత్పత్తి ఇంకా ఎంతో పెరిగి వుంటుంది. అదనపు విలువ రేటు 185%గా వున్న ఉదాహరణలో అదే జరిగింది. అక్కడ, అదనపు ఉత్పత్తి 5 వస్తువులు కాదు, 10 వస్తువులు కాదు, 13 వస్తువులు.

**3)** కొన్ని సంవత్సరాలకు 'ఉత్పత్తి శక్తి' మళ్ళీ రెట్టింపైంది — అనుకుందాం. 'పని దినం' ఎప్పుడూ 10 గంటలే. ఇప్పుడు కార్మికుడు, తన 'శ్రమ విలువ'గా 20 వస్తువులు గాక, 40 వస్తువులు ఉత్పత్తి చేస్తాడు. గతంలో 20 వస్తువులకు పట్టిన కాలమే (10 గంటలు) ఇప్పుడు 40 వస్తువులకు పడుతుంది. కాబట్టి, గతంలో 20 వస్తువులకు వున్న విలువే ఇప్పుడు 40 వస్తువులకు వుంటుంది. ఇప్పుడు, 1 వస్తువుకి ఎంత శ్రమ?— 15 ని.లు. ఇప్పుడు, 1 వస్తువుకి ఎంత విలువ?— గతంతో పోలిస్తే, ఇప్పుడు అన్ని వస్తువుల శ్రమ కాలాలూ సగానికి తగ్గినట్టు, ఇప్పుడు 'డబ్బు సరుకు' శ్రమ కాలం కూడా సగానికి తగ్గి, 'డబ్బు విలువ' కూడా సగానికి తగ్గుతుంది. గతంలో 20 రూ.లకు వుండే విలువే ఇప్పుడు 40 రూ.లకు వుంటుంది.

ఇప్పుడు, 40 వస్తువులు = 40 రూ.లు
1 వస్తువు = 1 రూ.

వస్తువు విలువా, రూపాయి విలువా కూడా సగానికి తగ్గడం వల్ల, వాటి 'విలువ సంబంధం' ఎప్పటిలాగే వుంది.

అయితే ఇప్పుడు, 'కొత్త శ్రమ శక్తి' కావాలి కాబట్టి,

ఇప్పుడు 'జీతం' ఎంత? ఇప్పుడు, 'ఉత్పత్తి శక్తి' రెట్టింపు అయింది కాబట్టి, 'జీతం' కూడా రెట్టింపు అవుతుందా? గతంలో జీతం 7 వస్తువులు కాబట్టి, ఇప్పుడు జీతం 14 వస్తువులు అవుతుందా?—అలా జరగదు.

జీతం అంటే ఏమిటి? — 'శ్రమ శక్తి' విలువే. 'కొత్త శ్రమ శక్తి' పోషణకి కనీసంగా ఎన్ని వస్తువులు కావాలో ఆ వస్తువులే, లేదా ఆ వస్తువుల విలువే— కొత్త జీతం. ఈ కొత్త జీతాన్ని, 10 వస్తువులు, లేదా 10 రూ.లు అనుకుందాం. అంటే, ఇప్పుడు అదనపు విలువ 30 వస్తువులు. లేదా, 30 రూ.లు.

ఇప్పుడు, జీతమూ : అదనపు విలువా
10 రూ.లు : 30 రూ.లు
1 భాగం : 3 భాగాలు = 4 భాగాలు.

10 గం.ల 'పని దినం'లో— 1 భాగం అవసర శ్రమ కాలం. అది $2\frac{1}{2}$ గం.—3 భాగాలు అదనపు శ్రమ కాలం, అది $7\frac{1}{2}$ గం. ఇప్పుడు అవసర శ్రమ, గతంలో కన్నా కూడా తగ్గింది. అదనపు శ్రమ, గతంలో కన్నా కూడా పెరిగింది. కార్మికులు, తమ పోషణ కోసం మాత్రమే శ్రమ చేసుకున్నట్టయితే, ఇప్పుడు, $2\frac{1}{2}$ గం.లు చేస్తే చాలు. ఆ తర్వాత వారు పని మానెయ్యవచ్చు. కానీ, ఉత్పత్తి శక్తి ఇంత పెరిగినా కూడా, ఇప్పుడు కూడా కార్మికులు 10 గం.లూ పనిచేస్తారు. అందులో $7\frac{1}{2}$ గం.లు యజమానుల కోసమే.

ఇప్పుడు, అదనపు విలువ రేటు = 30 **S** ÷ 10 **V** × 100 = 300%

**4)** కొన్ని సంవత్సరాలకు, 'ఉత్పత్తి శక్తి' మళ్ళీ రెట్టింపయింది. పని దినం 10 గం.లు. ఇప్పుడు, కార్మికుడు, తన 'శ్రమ విలువ'గా 40 వస్తువులు గాక, 80 వస్తువులు ఉత్పత్తి చేస్తాడు. గతంలో 40 వస్తువులకు పట్టిన కాలమే (10 గంటలు) ఇప్పుడు 80 వస్తువులకు పడుతుంది. కాబట్టి, గతంలో 40 వస్తువులకు వున్న విలువే ఇప్పుడు 80 వస్తువులకు వుంటుంది. ఇప్పుడు 1 వస్తువుకి ఎంత శ్రమ?— $7\frac{1}{2}$ ని. ఇప్పుడు 1 వస్తువుకి ఎంత విలువ?— ఇప్పుడు అన్ని వస్తువుల శ్రమ కాలాలూ సగానికి తగ్గినట్టే, 'డబ్బు సరుకు' శ్రమ కాలం కూడా సగానికి తగ్గి, 'డబ్బు విలువ' కూడా సగానికి తగ్గుతుంది. గతంలో 40 రూ.ల్లో వున్న విలువ, ఇప్పుడు 80 రూ.ల్లో వుంటుంది.

80 వస్తువులు = 80 రూ.లు.
1 వస్తువు = 1 రూపాయి

అయితే, ఇప్పుడు, 'కొత్త శ్రమ శక్తి'కి జీతం' ఎంత? ఇప్పుడు, 'ఉత్పత్తి శక్తి' రెట్టింపు అయింది కాబట్టి, 'జీతం' కూడా రెట్టింపు అవుతుందా?— గతంలో జీతం 10 వస్తువులు కాబట్టి, ఇప్పుడు జీతం 20 వస్తువులు అవుతుందా? — అలా జరగదు. జీతం అంటే ఏమిటి?— 'శ్రమ శక్తి విలువ'. కొత్త శ్రమ శక్తి పోషణకు కనీసంగా ఎన్ని వస్తువులు కావాలో ఆ వస్తువులే, లేదా ఆ వస్తువుల విలువే —కొత్త జీతం. ఈ కొత్త జీతాన్ని 15 వస్తువులు, లేదా 15 రూ.లు — అనుకుందాం. అంటే, ఇప్పుడు అదనపు విలువ 65 వస్తువులు. లేదా, 65 రూ.లు.

ఇప్పుడు, జీతమూ : అదనపు విలువా
15 : 65
3 భాగాలు : 13 భాగాలు = 16 భాగాలు

'పని దినం'లో', 3 భాగాలు, అవసర శ్రమ. అది, 1 గం. 53 ని.లు.

13 భాగాలు అదనపు శ్రమ. అది, 8 గం. 7 ని.లు ఇప్పుడు, అదనపు విలువ రేటు = 65 **S** ÷ 15 **V** × 100 = 433%.

కార్మికులు, తమ పోషణ కోసం మాత్రమే శ్రమ చేసుకున్నట్టయితే, ఇప్పుడు 1 గంటా 53 ని.లు చేస్తే చాలు. ఆ తర్వాత పని మానెయ్యవచ్చు. కానీ, ఉత్పత్తి శక్తి ఇంత పెరిగినా కూడా, ఇప్పుడు కూడా కార్మికులు 10 గం.లూ పనిచేస్తారు. అందులో, 8గం. 7 ని.లు, యజమానుల కోసమే.

ఇంత వరకూ, 'ఉత్పత్తి శక్తి పెరుగుదల'లో 4 ఉదాహరణలు చూశాం. 4 ఉదాహరణలలోనూ కార్మికులు పని చేసింది ఒకే 'శ్రమ కాలం' (ఒకే పని దినం). కాబట్టి, కార్మికులు ఉత్పత్తి చేసిన విలువ ఒకటే. 'ఉత్పత్తి శక్తి' పెరుగుతోన్న కొద్దీ కార్మికులు తమ 'శ్రమ'లో నించి తీసుకున్నదీ, పోగొట్టుకున్నదీ ఇలా వున్నాయి :

| | పని దినం | కార్మికుడి 'శ్రమ విలువ' | జీతం | కార్మికుడు పోగొట్టుకున్నది | దోపిడీ రేటు | 'పని దినం'లో అవసర అదనపు కాలాలు |
|---|---|---|---|---|---|---|
| 1) | 10గం | 10రూ.లు | 5 | 5 | 100% | 5గం: 5గం |
| 2) | 10గం | 20రూ.లు | 7 | 13 | 185% | 3.30: 6.30 |
| 3) | 10గం | 40రూ.లు | 10 | 30 | 300% | 2.30: 7.30 |
| 4) | 10గం | 80రూ.లు | 15 | 65 | 433% | 1.53: 8.07 |

ఇదే విషయాన్ని 'ఉత్పత్తి' ద్వారా చూస్తే:
1 వ ఉదా॥లో— జీతం 5 వస్తువులు.
అదనపు ఉత్పత్తి 5 వస్తువులు.

2వ ఉదా॥లో— జీతం 7 వస్తువులు.
అదనపు ఉత్పత్తి 13 వస్తువులు.

3వ ఉదా॥లో— జీతం 10 వస్తువులు.
అదనపు ఉత్పత్తి 30 వస్తువులు.

4వ ఉదా॥లో—జీతం 15 వస్తువులు.
అదనపు ఉత్పత్తి 65 వస్తువులు.

మొదటి ఉదాహరణ నించి, 4 వ ఉదాహరణ నాటికి: జీతం — 5 వస్తువుల నించి 15 వస్తువులు అయింది. 5 వస్తువుల జీతానికి పెరుగుదల 10 వస్తువులు.

100 కి పెరుగుదల—10 ÷ 5 × 100 = 200%

అదనపు ఉత్పత్తి, 5 వస్తువుల నించి 65 వస్తువులు అయింది. 5 వస్తువుల అదనపు విలువకు పెరుగుదల 60 అయితే, 100 కి పెరుగుదల = 60÷5 × 100 = 1200%.

జీతంలో పెరుగుదల 100% అయితే, అదనపు విలువలో పెరుగుదల 1200%.

ఈ ఉదాహరణల్లో 'ఉత్పత్తి శక్తి' పెరుగుతోన్నకొద్దీ, 'దోపిడీ రేటు' కూడా పెరుగుతూ వుండడం కూడా చూశాం.

ఇప్పుడు, 'ఉత్పత్తి శక్తి' ఎంత పెరుగుతోన్నా దోపిడీ రేటు — 1వ ఉదాహరణలో లాగ, 100%గా మాత్రమే వుండాలంటే ఏం జరగాలి? ప్రతీ ఉదాహరణలోనూ, 'శ్రమ విలువ'లో సగం — 'జీతం'గానూ; సగం — 'అదనపు విలువ'గానూ వుంటే, దోపిడీ రేటు ప్రతీ చోటా 100%గా మాత్రమే వుంటుంది. కానీ, అప్పుడు అదనపు ఉత్పత్తి ఎలా వుంటుంది?

1వ ఉదాహరణలో– జీతం 5, అదనపు ఉత్పత్తి 5. దోపిడీ 100%.
2వ ఉదాహరణలో– జీతం10, అదనపు ఉత్పత్తి 10. ,,
3వ ఉదాహరణలో– జీతం20, అదనపు ఉత్పత్తి20. ,,
4వ ఉదాహరణలో– జీతం40, అదనపు ఉత్పత్తి40. ,,

ఈ రకంగా, దోపిడీ రేటు ఎప్పుడూ 100%గా మాత్రమే వుందనుకున్నా, ఉత్పత్తి శక్తి పెరుగుతోన్న కొద్దీ, పెట్టుబడి దారుడికి పోయే ఉత్పత్తుల రాసి పెరిగిపోతూనే వుంటుంది. మొదటి ఉదాహరణలో వాడికి 5 వస్తువులు దొరికితే, రెండో ఉదాహరణలో 10, తర్వాత 20, తర్వాత 40 — ఇలా, వాడి భాగం పెరిగిపోతూనే వుంటుంది.

'ఉత్పత్తి శక్తి' రెట్టింపు అయినప్పుడు, అదనపు విలువా జీతమూ కూడా రెట్టింపు అయితే, అప్పుడు కూడా దోపిడీ వున్నప్పటికీ, ఉత్పత్తి శక్తి పెరిగిన ఫలితం పెట్టుబడి దారులకే గాక, కార్మికులకు కూడా దక్కినట్టు అవుతుంది కానీ, 'ఉత్పత్తి శక్తి' పెరిగినప్పుడు, ఆ స్థాయిని బట్టి జీతాలు పెరగడం జరగదు.

ఉత్పత్తి శక్తి రెట్టింపు అయినప్పుడు జీతం కూడా రెట్టింపు అవడం జరుగుతూ వుంటే, 'జీతం అంటే, శ్రమ శక్తి విలువ' అనే అర్థాన్ని మార్చేసి, 'జీతం అంటే, కార్మికులు ఉత్పత్తి చేసే దాంట్లో సగం' అనే అర్థం పెట్టవలసి వస్తుంది. కార్మికుడి ఉత్పత్తిలో నించి కార్మికుడికి వచ్చే భాగాన్ని 'జీతం' అనుకుంటే, ఆ జీతాన్ని నిర్ణయించే సూత్రం 'శ్రమ శక్తి విలువే' గానీ, కార్మికుడు ఉత్పత్తి చేసే దాంట్లోంచి 'సగం' అనో, 'పావు' అనో కాదు.

'ఉత్పత్తి శక్తి' పెరుగుతోన్న కొద్దీ, కార్మికుడికి వచ్చే వస్తువులు కూడా పెరుగుతాయి. కానీ, ఆ పెరిగిన వస్తువులు కూడా 'కొత్త శ్రమ శక్తి కోసమే' కాబట్టి, ఆ పెరుగుదల పెరుగుదల కాదు. అప్పుడు కూడా కార్మికుడికి 'శ్రమ శక్తి విలువే' వచ్చినట్టు అర్థం. దానికన్నా ఎక్కువ వచ్చినట్టు కాదు. అంటే 'ఉత్పత్తి శక్తులు' ఎంత పెరిగినా కార్మికుడికి వచ్చేది శ్రమ శక్తి విలువకన్నా ఎక్కువేమీ వుండదు. రోజుకి 10 వస్తువుల్ని ఉత్పత్తి చేసినా, 20 చేసినా, 40 చేసినా, 80 చేసినా, వచ్చేది శ్రమ శక్తి విలువే. ఎప్పుడూ కనీసపు పోషణ వస్తువుల్ని మాత్రమే జీతాలుగా పొందే కార్మికులకు, ఉత్పత్తి శక్తి ఏ దశలో వున్నా, ఎన్ని రెట్లు పెరిగినా, ఏమీ పెరగకపోయినా, అన్నీ ఒకటే. ఉత్పత్తి శక్తి ఎంత అధమ స్థాయిలో వున్నా కార్మికుల 'శ్రమ శక్తి విలువ' కార్మికులకు వస్తుంది. ఉత్పత్తి శక్తి పెరిగినా పెరుగుదల ఫలితాన్ని కార్మికులు పొందేదేమీ వుండదు.

ఇంత వరకూ 'సామాజిక ఉత్పత్తి శక్తి'ని దృష్టిలో పెట్టుకున్నాం. కొంత కాలానికి ఒకసారి అన్ని శాఖల్లోనూ ఉత్పత్తి శక్తులు రెట్టింపు అయినట్టుగా చూశాం. కానీ, నిత్య జీవితంలో అలా జరగదు. అన్ని శాఖల్లోనూ ఉత్పత్తి శక్తులు, ఎప్పుడూ ఎంతో కొంత పెరుగుతూనే వున్నా, అవి అన్ని చోట్లా ఒకే స్థాయిలో పెరగవు. ఎక్కువ తక్కువ స్థాయిల్లో పెరుగుతాయి. దాని వల్ల ఆ వేరు వేరు శాఖల ఉత్పత్తులకు పట్టే శ్రమ కాలాలు మారుతూ, వాటి విలువ పాళ్ళూ మారుతూ వుంటాయి.

'డబ్బు విలువ'లో మార్పులు కూడా ఎప్పుడూ ఒకే స్థాయిలో వుండవు. 'డబ్బు విలువ'లో తగ్గుదల వల్ల ఉత్పత్తుల 'డబ్బు వ్యక్తీకరణ' గతం కన్నా పెరుగుతూ వుంటుంది.

కానీ, ఇవన్నీ కేవలం సాంకేతికమైన మార్పులు. 'డబ్బు' విలువ మారడం అనేది, ధాన్యాన్ని కొలిచే కొలత పాత్ర సైజు మారడం లాంటిదే. 'డబ్బు విలువ'లో మార్పుకి తగినట్టుగానే, ఉత్పత్తుల విలువ కొలతలూ, జీతాలూ అన్నీ మారితే, డబ్బు విలువలో మార్పు అనేది, అసలు

మార్పే జరగనిదానితో సమానం.

అలాగే, వేరు వేరు శాఖల విలువ సంబంధాలలో మార్పులు కూడా, నిజంగా శ్రమ కాలాల్లో మార్పుల ప్రకారమే జరిగితే, అవి కూడా మార్పులు జరగని దాని తోనే సమానం.

విలువ పాళ్ళల్లో మార్పులు, దోపిడీ స్థాయిని తగ్గించడమో, హెచ్చించడమో చెయ్యవు. కార్మికులు ఎంత ఉత్పత్తి చేస్తున్నారూ, దాంట్లో ఎంత తీసుకుని ఎంత పోగొట్టుకుంటున్నారూ— అనే దాన్ని బట్టి మాత్రమే దోపిడీ స్థాయి వుంటుంది.

శ్రమ చేసే మనిషికి, 'శ్రమ విలువ' గాక, 'శ్రమ శక్తి విలువ' మాత్రమే దొరికే సమాజంలో, ఉత్పత్తి శక్తులు ఎన్నిరెట్లు పెరిగితే మాత్రం దాని వల్ల శ్రమ చేసే వాళ్ళకు వచ్చే ప్రయోజనం ఏమిటి? 10 గంటలు పనిచేసి, అందులో 5 గంటల ఉత్పత్తిని జీతంగా తీసుకోవడం కన్నా; 10 గంటలు పనిచేసి, 3 గంటల ఉత్పత్తిని జీతంగా తీసుకున్నప్పుడు, కార్మికుడు గతం కన్నా 'చవక' అయిపోయినట్టు అర్థం. 5 గంటల ఉత్పత్తిని జీతంగా ఇవ్వడం కన్నా, 3 గంటల ఉత్పత్తినే, జీతంగా ఇవ్వడం అంటే, కార్మికుడు చవక అయినట్టు. తర్వాత ఇంకా ఇంకా చవక అవుతాడు.

'ఉత్పత్తి శక్తి' పెరుగుతోన్నకొద్దీ, కార్మికులకూ పెట్టుబడి దారులకూ మధ్య అంతరం పెరిగిపోతూ వుంటుంది. ఎలాగంటే: కార్మికుడు రోజుకి 10 వస్తువులు ఉత్పత్తి చేసి, అందులో 5 ని జీతంగా తీసుకుని 5 ని పెట్టుబడిదారుడికి వదిలినప్పటి కన్నా, 20 వస్తువులు ఉత్పత్తి చేసి అందులో 7 జీతంగా తీసుకుని 13 పెట్టుబడిదారుడికి వదిలినప్పుడు, ఇద్దరి జీవన పరిస్థితుల మధ్యా తేడా గతం కన్నా పెద్దదైందని అర్థం. మొదటి ఉదాహరణలో కార్మికుడు రోజుకి 5 వస్తువులు వాడితే, పెట్టుబడిదారుడు కూడా 5 వస్తువులే వాడతాడు. రెండో ఉదాహరణలో, కార్మికుడు రోజుకి 7 వస్తువులు వాడితే, పెట్టుబడిదారుడు 13 వస్తువులు వాడతాడు. మూడో ఉదాహరణలో, కార్మికుడు రోజుకి 10 వస్తువులు వాడితే పెట్టుబడిదారుడు 30 వస్తువులు వాడతాడు. నాలుగో ఉదాహరణలో, కార్మికుడు రోజుకి 15 వస్తువులు వాడితే, పెట్టుబడిదారుడు 65 వస్తువులు వాడతాడు.— ఈ రకంగా ఉత్పత్తి శక్తులు పెరుగుతోన్న కొద్దీ, ఇద్దరి జీవన పరిస్థితులకూ మధ్య అంతరం పెరిగిపోతూ వుంటుంది. ఈ 4 ఉదాహరణల్లో, ప్రతీ దాంట్లోనూ పెట్టుబడిదారుడు 'శ్రమ చెయ్యని' వాడే. రోజుకి 5 వస్తువులు దోచిననాడూ 'శ్రమ చెయ్యని' వాడే; రోజుకి 65 వస్తువులు దోచిననాడూ 'శ్రమ చెయ్యని' వాడే. కానీ, రోజుకి 5 వస్తువుల్ని దోచే స్థితిలో కన్నా, 65 వస్తువుల్ని దోచే స్థితిలో పెట్టుబడి దారుడు ఎక్కువ 'ధన శక్తి'తో వుంటాడు. ఎక్కువ 'పీడకుడి'గా వుంటాడు. కార్మికుడికీ, పెట్టుబడిదారుడికీ మధ్య జీవన పరిస్థితుల్లో ఏర్పడ్డ అంతరం క్రమ క్రమంగా 'అగాధం' అనదగ్గ స్థాయికి మారుతుంది. ఉత్పత్తి శక్తులు ఇంకా ఇంకా పెరుగుతోన్న కొద్దీ ఆ అగాధపు లోతూ, వెడల్పూ పెరిగిపోతూ, దోపిడీదార్ల 'ధన మదం' కూడా పెరిగిపోతూ, కార్మికుల్ని ఎదురు తిరగనివ్వకుండా చేసే శక్తులన్నీ పెరిగిపోతూ వుంటాయి.

## 'ఉత్పత్తి శక్తి' గురించి పెట్టుబడిదారీ అర్థికవేత్త ఏమంటాడు?

ఉత్పత్తి శక్తులు పెరిగితే పెట్టుబడిదారుల 'లాభాలు' పెరుగుతాయి.— ఇది చూస్తాడు అర్థికవేత్త. 'ఇది సరైందే. సరైంది కాబట్టే ఇలా జరుగుతోంది' అనుకుంటాడు. ఈ అర్థికవేత్తకి ఎక్కడా ఏ తర్కమూ వుండనట్టే ఇక్కడ కూడా ఏ తర్కమూ, ఏ ప్రశ్నలూ వుండవు. "ఉత్పత్తి శక్తులు పెరిగితే పెట్టుబడిదారుల లాభాలే ఎందుకు పెరగాలి? కార్మికుల జీతాలు కూడా అదే స్థాయిలో ఎందుకు పెరగకూడదు? ఉత్పత్తి శక్తులు పెరగడంవల్ల సమాజంలో అందరి జీవన పరిస్థితులూ ఒకే స్థాయిలో పెరగాలి కదా? అలా ఎందుకు జరగడం లేదు?" అనే ప్రశ్నలు వాళ్ళకు రానేరావు. ఆ ప్రశ్నలకు వాళ్ళ దగ్గిర స్థానం లేదు. ఎందుకంటే, వాళ్ళ దృష్టిలో ఉత్పత్తి శక్తి అంతా 'శ్రమ పరికరాలదే'. ఆ శ్రమ పరికరాలు పెట్టుబడిదారుడివి. పెట్టుబడిదారుడే 'తన డబ్బుతో' వాటిని కొంటాడు. సైంటిస్టుల తోటీ, ఇంజనీర్ల తోటీ ప్రయోగాలు చేయించి, పెట్టుబడిదారుడే ఉత్పత్తి శక్తిని పెంచుకుంటాడు. అది పెట్టుబడిదారుడి స్వంతం. కాబట్టి, ఉత్పత్తి శక్తి పెరగడం ద్వారా వచ్చే ఉత్పత్తినంతా తీసుకోవడానికి పెట్టుబడిదారుడే హక్కుదారుడు. అందులో 'శ్రమ'కు భాగం ఉండవలసిన అవసరం లేదు.— ఇదే ఉత్పత్తి శక్తుల పట్ల పెట్టుబడిదారీ దృష్టి. ఇలాంటి దృష్టితో ఉండే అర్థికవేత్తకి, 'ఉత్పత్తి శక్తి పెరిగితే కార్మికుల జీతాలు కూడా అదే స్థాయిలో ఎందుకు పెరగడం లేదు?' అనే ప్రశ్న ఉండదు. 'ఉత్పత్తి శక్తి'కీ కార్మికులకూ ఏమీ సంబంధం లేదన్నదే ఆయన సూత్రం. కాబట్టి, ఉత్పత్తి శక్తి ఏ స్థాయిలో

పెరిగితే ఆ స్థాయిలోనే జీతాలు పెరగవలసిన అవసరం ఆయనకు కనపడదు.

ఏ విషయానికైతే పూర్తిగా 'శ్రమతో మాత్రమే' సంబంధమో, ఆ విషయాన్ని పూర్తిగా 'పెట్టుబడితో మాత్రమే' సంబంధంగా చూడడం అంటే, అసలు నిజాన్ని 'పూర్తిగా తల్ల కిందులుగా' చూడడం అన్నమాట! పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు, పెట్టుబడిదారుడి లాగే ప్రతీ విషయం లోనూ తల్లకిందులుగా నడవడం మనం మొదటి నించీ చూస్తూ ఉన్నదే.

కార్మికుల శ్రమ శక్తిని మరింత చవక చేస్తూ, పెట్టుబడిదారుడి ధన రాసుల్ని మరింత ఎత్తుకి పెంచే ఈ ఉత్పత్తి శక్తుల పెరుగుదలనే, ఈ ఆర్థికవేత్తలు 'పారిశ్రామిక ప్రగతి' అనీ, 'పారిశ్రామిక పురోగతి' అనీ, 'దేశాభివృద్ధి' అనీ, రక రకాల పేర్లతో శ్లాఘిస్తారు. వాళ్ళ దృష్టితో చూస్తే, ఈ మాట లన్నీ నిజమే. దోపిడీ వర్గానికి 'ప్రగతి' అన్నా, 'పురోగతి' అన్నా, 'అభివృద్ధి' అన్నా, 'అదనపు ఉత్పత్తి రాసి' పెరగడం కన్నా ఇంకేముంటుంది? వాళ్ళ 'ప్రగతి' అంతా అందులోనే వుంది!

ఉత్పత్తి శక్తులకు సంబంధించి, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలకు వున్న ఇంకో తప్పు అభిప్రాయం— 'ఉత్పత్తి శక్తులు ఎక్కువగా వున్న చోటే పెట్టుబడిదారీ విధానం ఏర్పడుతుంది' అనేది. భూసారం ఎక్కువగా వున్న ప్రాంతాలలోనే ఉత్పత్తి శక్తులు ఎక్కువగా వుంటాయి కాబట్టి, భూసారం ఎక్కువగా వున్న ప్రాంతాలలోనే పెట్టుబడిదారీ విధానం ఏర్పడుతుంది — అనే తప్పు అభిప్రాయం ఇది. ('పెట్టుబడిదారీ విధానం' అనే మాటని, వాళ్ళు, వ్యతిరేకార్థంతో వాడుతున్నారని కాదు. దాన్ని సమర్థించే వాళ్ళయినా; వ్యతిరేకించే వాళ్ళయినా, దాన్ని ఆ పేరుతోనే పిలుస్తారు. పెట్టుబడిదారుణ్ణి, పెట్టుబడి దారుడు కూడా 'పెట్టుబడిదారుడు' అనే అంటాడు కదా? అలాగే ఇది కూడా.) 'పెట్టుబడిదారీ విధానం' ఏర్పడడానికి — ఒకవేపు, ఉత్పత్తి సాధనాలు లేక తమ 'శ్రమ శక్తి'ని అమ్ముకునే కార్మికులూ, ఇంకోవేపు దాన్ని కొనే యజమానులూ — వుంటే చాలు. పరిస్థితి అలా వున్నప్పుడు భూసారం ఏ స్థాయిలో వున్నా ఒకటే. కాకపోతే, భూసారమూ, ఇతర వనరులూ ఎక్కువ అనుకూలంగా వున్న చోట, శ్రమ చేసే మనిషి, ఎక్కువ ఉత్పత్తి చెయ్యగలుగుతాడు కాబట్టి, అలాంటిచోట పెట్టుబడిదారుడికి అదనపు ఉత్పత్తి ఎక్కువగా వుంటుంది. అలా లేనిచోట, అదనపు ఉత్పత్తి తక్కువగా వుంటుంది. అంతే తేడా.

భూసారాలలో తేడాల్ని బట్టీ, ప్రకృతి సహజమైన ఇతర వనరులలో తేడాల్ని బట్టీ, ఒకే కొలత గల శ్రమ (ఉదా॥ 1 గంట శ్రమ) వేరు వేరు ప్రాంతాల్లో ఎక్కువ తక్కువ ఉత్పత్తుల్ని ఇస్తుంది. శ్రమ శక్తి విలువ కూడా వేరు వేరు స్థాయిలలో వుంటుంది. ఈ అంశాల్ని బట్టి, 'అదనపు ఉత్పత్తి' కూడా వేరు వేరు స్థాయిలలో వుంటుంది.

ఒక పెట్టుబడిదారుడు, ఇతరుల కన్నా ఎక్కువ ఉత్పత్తి శక్తిని సాధించి, ఎక్కువ లాభాలు గడిస్తోంటే, మిగతా వాళ్ళందరికీ అదే 'ఆదర్శం' అవుతుంది. ఎదటివాడి మిరుమిట్లు గొలిపే లాభాలు, ప్రతీ ఒక్కడినీ ఆకర్షించి, ప్రతీ ఒక్కడూ ఆ బాటనే పయనించే లాగ చేస్తాయి. అందరూ ఒకే ఉత్పత్తి శక్తిని సాధించినప్పుడు, అంతకు ముందు వరకూ ఆ శాఖలో కొంత మందికే ప్రత్యేకంగా వస్తూ వున్న 'రెలెటివ్ అదనపు విలువ' ఇప్పుడు అందరికీ వచ్చే 'ఎబ్సల్యూట్ అదనపు విలువ'గా స్థిర పడుతుంది. ఇదంతా ఇంతకు ముందే చూశాం.

కానీ, ఈ స్థిరత్వం కొంత కాలం వరకే. అది ఎంత దీర్ఘ కాలంగా కనపడినా, అది తాత్కాలికమే. మళ్ళీ 'రెలెటివ్ అదనపు విలువ' కోసం వేట! ఇతరుల కన్నా ఎక్కువగా తన సరుకునే అమ్మాలనీ, ఇతరుల కన్నా ఎక్కువ లాభాలు తనే లాగాలనీ పెట్టుబడిదారీ సహజమైన దురాశ!

'ప్రకృతి జ్ఞానం' పట్ల మనిషికి ఉన్న సహజమైన కాంక్షా, రెలెటివ్ అదనపు విలువ కోసం పెట్టుబడిదారుల నీచమైన వాంఛా కలిసి, సాధ్యమైనన్ని మార్గాలలో ఉత్పత్తి శక్తుల్ని పెంచుతూనే వుంటాయి. ఇక్కడ ఉత్పత్తి శక్తులు 'లాభ దృష్టి' వల్ల అమిత వేగంతో పెరుగుతూ పోతాయి.

గత సమాజాలలో కూడా ఉత్పత్తి శక్తులు పెరుగుతూనే వున్నాయి. కానీ, ఆ నాడు ఉత్పత్తి శక్తి అతి కొంచెంగా పెరగడానికి కూడా వందల కొద్దీ సంవత్సరాల కాలం పట్టేది. 'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం' ప్రారంభమైన తర్వాత, అతి తక్కువ కాలంలోనే ఉత్పత్తి శక్తులు అనేక వందల రెట్ల వేగంతో సాగాయి. పెట్టుబడిదారీ విధానం, సరుకు— ఉత్పత్తి విధానం కాబట్టి, ఉత్పత్తి శక్తుల్ని 'డబ్బు దృష్టితో' పెంచే లక్షణం, దానికే ప్రత్యేక లక్షణం. 'పెట్టుబడిదారీ విధానం' ప్రకారం, ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు ఒక సహజమైన హద్దు వుండదు.

# 'ఉత్పత్తి శక్తి' పెరగడం మంచిదా, చెడ్డదా ?

ఉత్పత్తి శక్తి పెరగడం — అనే విషయాన్ని విడిగా చూస్తే, అది చాలా మంచిదే. దానివల్ల ఒక వస్తువుకి పట్టే శ్రమ కాలం గతం కన్నా తగ్గుతుంది. కాబట్టి, అదే కాలంలో ఎక్కువ వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోవచ్చు. ఒక రోజులో 10 వస్తువులు తయారు చేసుకోవడం కన్నా, 20 వస్తువులో 100 వస్తువులో తయారు చేసుకోగలిగితే, అది

మనుషులకు మేలే గానీ కీడు కాదు. పెరిగిన ఉత్పత్తి శక్తితో, సమాజానికి కావలసిన ఉత్పత్తిని తక్కువ కాలం లోనే చేసుకుని, ఆ తర్వాత పని ఆపెయ్యవచ్చు. కాలాన్నంతా శ్రమ కోసం వెచ్చించడం గాక, శ్రమ నించి తీరిక దొరికిన కొద్దీ, ఆ కాలాన్ని కళల కోసమూ, ఇతర జ్ఞానాల కోసమూ వెచ్చించవచ్చు. అంటే, ఉత్పత్తి శక్తులు పెరిగే కొద్దీ 'పని దినాన్ని' తగ్గించుకోవచ్చు. కాబట్టి, ఉత్పత్తి శక్తుల పెరుగుదల సమాజానికి ఎంతో ఆనందకరమైన విషయమే.

కానీ, ఆ 'ఉత్పత్తి శక్తుల మీద అధికారం' దోపిడీ దారుల చేతుల్లో వున్నప్పుడు, ఆ శక్తుల పెరుగుదల వల్ల వచ్చే మంచి ఫలితాలన్నీ దోపిడీదారులకే అందుతాయి గానీ, దానివల్ల శ్రామిక వర్గానికి అందేదేమీ వుండదు. కాబట్టి, పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి శక్తులు పెరగడమూ, పెరగకపోవడమూ, కార్మిక వర్గానికి ఒకటే.

కానీ, పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి శక్తులు పెరగకుండా ఆగవు. పెట్టుబడుల మధ్య పోటీ నిరంతరం ఆ పని చేస్తూనే వుంటుంది.

# 'నూతన సమాజం'లో ఉత్పత్తి శక్తి

ఇక్కడ, 'నూతన సమాజ దృష్టితో' ఒక ఉదాహరణ చూద్దాం. నూతన సమాజంలో, జనాభా అందరూ పని చేస్తారు — అనేది, మొట్టమొదటి విషయం. పని దినం 8 గంటలు. 'సమాజ ఉత్పత్తి శక్తి' రెట్టింపు అయిం దనుకుందాం. ఈ సమాజానికి ఈ రెట్టింపు ఉత్పత్తి కూడా కావలసివుంటే, సమాజ జనాభా అంతా ఎప్పటి లాగే, రోజుకి 8 గంటలూ పనిలో వుండి రెట్టింపు ఉత్పత్తిని చేసుకోవచ్చు. లేదా, సమాజానికి గతంలో వుండినంత ఉత్పత్తి కన్నా ఎక్కువ ఉత్పత్తి అవసరం లేకపోతే, జనాభా అంతా ఈ పెరిగిన ఉత్పత్తి శక్తితో రోజుకి 4 గం.లు మాత్రమే పనిచేస్తూ కావలసినంత ఉత్పత్తిని మాత్రమే చేసుకోవచ్చు. అంటే, 'ఉత్పత్తి శక్తి' పెరగడం వల్ల 'పని దినం' తగ్గిపోతుంది. అందరి శ్రమ కాలమూ తగ్గిపోతుంది.

'ఉత్పత్తి శక్తి' ఇంకా పెరిగితే, 'పని దినం' ఇంకా తగ్గుతుంది. ఆ రకంగా, 'నూతన సమాజం'లో, ఉత్పత్తి శక్తి పెరిగే ఫలితం సమాజంలో అందరికీ ఒకే రకంగా అందుతూ వుంటుంది.

అంతేగాక, 'నూతన సమాజం'లో, ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు, 'సహజమైన హద్దులు' వుంటాయి. మనుషులందరి క్షేమమే ఆ సహజమైన హద్దు.

ఒక 'ఉత్పత్తి శక్తి'ని పెంచుతూపోతే అది ఎంత దూరమైనా పోతుంది. 'ఉపయోగపు విలువ' దృష్టితో పరిశీలించి, మనుషుల క్షేమం కోసం ఆ పెరుగుదలని ఎక్కడో అక్కడ ఆపుకోవలసి వుంటుంది.

ఉదా: రవాణా సాధనాల విషయం తీసుకుందాం. సైన్సు జ్ఞానం పెరుగుతోన్న కొద్దీ రైళ్ళ వేగాన్నీ, విమానాల వేగాన్నీ ఇంకా ఇంకా పెంచుతూ పోవచ్చు. కానీ, అంత వేగం గల వాహనాలలో ప్రయాణాలు చేస్తే, మనుషుల ఆరోగ్యాలు పాడవడమో, ప్రమాదాల అవకాశాలు ఎక్కు వవడమో జరుగుతుందనుకుందాం. అలాంటి పరిస్థితి వస్తే, ప్రయాణ వేగాల్ని ఇక పెంచనక్కరలేదు. ప్రయా ణాలు తొందరగా జరగడం అంటే, ఆ వాహనాలు గమ్యం చేరేసరికి వాటిలోంచి మనుషులు దిగాలి గానీ, మనుషుల శవాలు కాదు. సజీవ దేహానికి ఏమీ హాని కలిగించనంత వరకే 'ప్రయాణ వేగం' ఉండాలి కాబట్టి, ఆ వేగం తప్పని సరిగా ఒక స్థాయిలో ఆగిపోవలసి వుంటుంది. సైన్సు జ్ఞానంతో చూస్తే, ఆ వేగాన్ని ఇంకా వెయ్యి రెట్లు పెంచడం సాధ్యం కావచ్చు. దానికి కావలసిన సూత్రాలు కూడా సైన్సులో వుండవచ్చు. మనిషికి ఆ సూత్రాలన్నీ తెలిసినా వాటితో మనిషికి ఉపయోగం వుండదు. అంటే, వాటిని వదిలెయ్యవలసిందే. ఇది 'ఎక్కువ ఉత్పత్తి శక్తిని' వదిలి వెయ్యడమే. అలాగే అనేక రకాల కొత్త ఉత్పత్తులకు సంబంధించిన సూత్రాలెన్నో మనిషికి తెలిసి వుండవచ్చు. తెలిసిన సూత్రాలన్నిటినీ ఉపయోగించుకోవలసిన అవసరం వుండదు.

'పత్తి'ని ఉత్పత్తి చెయ్యడానికన్నా, బట్టల కోసం ఉపయోగపడే ఇంకో రకం ముడి పదార్థాన్ని ఉత్పత్తి చెయ్యడానికి చాలా తక్కువ కాలమే సరిపోతుందను కుందాం. కానీ, ఆ ముడి పదార్థంతో తయారైన బట్టలు వాడితే చర్మ వ్యాధులు రావడమో, వాటికి చెమటని పీల్చే లక్షణం లేకపోవడమో, అలా వాటి వల్ల చెడ్డ ఫలితాలు ఉన్నాయనుకుందాం. అలాంటప్పుడు, ఆ ముడి పదార్థం తక్కువ శ్రమతో తయారయ్యేదైనా సరే దాన్ని వదిలేసి, ఎక్కువ శ్రమతో తయారయ్యే పత్తినే ఉత్పత్తి చేసుకోవలసి ఉంటుంది.

అలాగే, ఒక రకమైన 'శ్రమ పరికరాల'తో పనిచేస్తే ఎక్కువ ఉత్పత్తి జరగవచ్చు. కానీ ఆ శ్రమ పరికరాల వల్ల ఎక్కువ ప్రమాదాలకు అవకాశం ఉంటుందనుకుందాం. అలాంటప్పుడు ఆ శ్రమ పరికరాల్ని వదిలెయ్యవలసిందే. అంటే, ఇది ఎక్కువ ఉత్పత్తి శక్తిని వదిలెయ్యడమే.

100 అంతస్తుల భవనాలూ, 200 అంతస్తుల భవనాలూ కట్టడానికి కావలసిన సైన్సు జ్ఞానం అంతా మనుషులకు తెలిసి ఉండవచ్చు. కానీ, ఆ భవనాల్ని నిర్మించే దశలోనూ, తర్వాత వాటిని వాడుకునే దశలోనూ కూడా అవి అనేక రకాలుగా హానికరమైన ఫలితాల్ని ఇస్తాయి. కాబట్టి, అంతస్తుల మీద అంతస్తులు కట్టే సాంకేతిక జ్ఞానం ఎంత తెలిసినా, దాన్ని వదిలివెయ్య వలిసిందే. 3 అంతస్తులకు మించిన భవనాలు, క్షేమకరం కాదు — అని సమాజం అనుకుంటే, 4 వ అంతస్తుకి సంబంధించిన సాంకేతిక జ్ఞానాన్ని కూడా వదిలి వెయ్య వలిసిందే. 100 అంతస్తులకు సంబంధించిన సాంకేతిక విషయాలు తెలిసినా, ఆ జ్ఞానాన్ని వాడనక్కరలేదు. అంటే, ఇది, ఉత్పత్తి శక్తుల పెరుగుదలని ఒక దశ తర్వాత వదిలి వెయ్యడమే.

రోడ్డు మీద నడిపే మోటారు వాహనాన్ని 200 కి.మీ. వేగంతో నడిపే సాంకేతిక జ్ఞానం అందరికీ తెలుసు నను కుందాం. కానీ, వాహనాన్ని 50 కి. మీ కన్నా ఎక్కువ వేగంతో నడపడం 'క్షేమం' కాదనుకుందాం. అప్పుడు, ఎక్కువ వేగాన్ని ఇచ్చే సాంకేతికత నిరర్థకం అవుతుంది.— ఈ రకంగా, శారీరక ధర్మాల్నీ, సహజ అవసరాల్నీ దృష్టిలో పెట్టుకుంటే, ఉత్పత్తి శక్తుల్ని అనంతంగా పెంచుతూ పోనక్కరలేదు.

'ప్రకృతి'లో, అనేక పదార్థాలు వున్నాయి. వాటిలో క్షేమకరమైన వాటిని మాత్రమే ఉపయోగించుకుంటు న్నాము. ఇంకా ఉపయోగించుకుంటాము. హానికరమైన పదార్థాల్ని వదిలివేస్తున్నాము. అలాగే, సైన్సు సూత్రాల విషయం కూడా. సైన్సు ద్వారా తెలిసిన విషయాలన్నిటినీ యథాతథంగా ఉపయోగించుకోలేము. అవసరమైన వాటినే, అవసరమైనంత వరకే ఉపయోగించుకోవలసి ఉంటుంది. ఒక హద్దు లేకుండా పెంచడానికి వీలైన ఉత్పత్తి శక్తుల విషయంలో, మానవ శరీర ధర్మాలకూ, యోగ క్షేమాలకూ అనుగుణంగా, ఒక హద్దు ఏర్పర్చుకో వలసి వుంటుంది.

'ఉపయోగపు విలువ' దృష్టితో సాగే నూతన సమాజం, ఉత్పత్తి శక్తుల విషయంలో ఈ రకమైన హేతుబద్ధ దృష్టితో ఉంటుంది (ఉండాలి).

ఉత్పత్తి శక్తులు, గత సమాజాలలో అనేక వందల సంవత్సరాల పాటు ఏ మాత్రమూ పెరగలేదనీ, పెట్టుబడి దారీ విధానమే, 'లాభ దృష్టితో' ఉత్పత్తి శక్తుల్ని పెంచు తోందనీ చూశాం. అయితే, పెట్టుబడిదారీ విధానం లేక పోతే, ఉత్పత్తి శక్తుల పెరుగుదల ఆగిపోతుందా? 'లాభ దృష్టి' లేకపోయినా ఉత్పత్తి శక్తులు పెరుగుతాయా? — ఈ ప్రశ్నలకు జవాబులు చూడాలి.

పెట్టుబడిదారీ సమాజం, లాభ దృష్టితోనే ఉత్పత్తి శక్తుల్ని పెంచగలిగితే, నూతన సమాజం, అవసరమైతే లాభ దృష్టి లేకుండానే ఉత్పత్తి శక్తుల్ని పెంచ గలుగుతుంది.

పెట్టుబడిదారీ విధానంలో, ఒక పెట్టుబడిదారుడి దగ్గిర వున్న 'ఉత్పత్తి శక్తి జ్ఞానం' ఇంకొకరికి అందదు. సైన్సు జ్ఞానం అంతా ఎక్కడికక్కడ రహస్యాలలో పడి వుంటుంది. ఎవరి లాభం కోసం వాళ్ళు దాన్ని స్వంత ఆస్తిగా, ఇతరులకు అందనివ్వకుండా చేస్తారు. ఒక పెట్టుబడి దారుడి పనిస్థలంలో కనిపెట్టిన దాన్నే, ఇతర పెట్టుబడి దారుల పని స్థలాలలో కూడా మళ్ళీ కొత్త ఖర్చుతో కనిపెట్టవలిసి వస్తుంది. ఈ పరిస్థితి, నిజానికి, ఉత్పత్తి శక్తుల పెరుగుదలకి ఎన్నో ఆటంకాలు కలిగిస్తుంది.

ఇలాంటి పరిస్థితి 'నూతన సమాజం'లో వుండదు. అది స్వంత ఆస్తీ, లాభ దృష్టి లేని సమాజం. అలాంటి సమాజంలో ఉత్పత్తి శక్తుల పెరుగుదల ఎలాంటి ఆటం కాలూ లేని విధంగా సాగుతుంది. 'శ్రమలో అనుభవాలు' ఎప్పుడూ పెరుగుతూనే వుంటాయి. ప్రకృతి శాస్త్ర జ్ఞానం పెరుగుతూనే ఉంటుంది. ఆ జ్ఞానాన్ని అన్ని పని స్థలాలూ పంచుకోవడానికి సామాజికంగా ఏ ఆటంకాలూ ఉండవు. ఈ కారణాల వల్ల, ఉత్పత్తి శక్తుల పెరుగుదల 'నూతన సమాజం'లో కూడా ఏ మాత్రమూ ఆగదు. పైగా, ఆ 'శక్తుల'కు అంత కాలమూ వున్న బంధనాలన్నీ చెదిరి పోతాయి. కాబట్టి ఆ శక్తుల్ని ఎక్కడో అక్కడ ఆపి తీరవలసి వస్తుంది. వాటిని విచక్షణతో ఉపయోగించవలసి వస్తుంది.— ఈ రకంగా, 'నూతన సమాజం'లో, 'ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు' ఆటంకాలు ఏర్పడక పోవడమే గాక, ఆ పెరుగుదల వల్ల కలిగే ఫలితాలు సమాజంలో అందరికీ ఒకే రకంగా అందుబాటులోకి వస్తాయి.

కానీ, పెట్టుబడిదారీ సమాజానికి ఇందులో ఏ అంశమూ సాధ్యం కాదు. పెట్టుబడిదారీ విధానానికి ప్రధాన లక్ష్యం —'అదనపు విలువ'ని ఉత్పత్తి చెయ్యడం. అదనపు శ్రమే— అదనపు విలువ. అదనపు శ్రమే లేకపోతే, పెట్టుబడిదారీ విధానమే వుండదు. కాబట్టి, కార్మికులతో ఎంత ఎక్కువ శ్రమ చేయిస్తే, అంత ఎక్కువ అదనపు విలువ మిగులుతుంది. అలాంటి లక్ష్యం గల ఉత్పత్తి విధానంలో, ఉత్పత్తి శక్తి ఎంత పెరిగినా, దానివల్ల ఎంత ఎక్కువ ఉత్పత్తి జరిగినా, అదనపు శ్రమ కాలం తగ్గడం జరగదు. అంటే, ఉత్పత్తి శక్తి ఎంత స్థాయికి పెరిగినా పని దినం తగ్గదు. కార్మికులు ఎప్పుడూ 'ఫుల్ వర్క్' లోనే ఉండడం తప్పదు. రోజుకి 10 వస్తువులు తయారు చేసే కాలంలోనూ అదే పని దినం. రోజుకి 100 వస్తువుల్ని

ఉత్పత్తి చేసే కాలంలోనూ అదే పని దినం. ఉత్పత్తి శక్తి పెరుగుతోంటే పని దినం తగ్గడం అనేది ఇక్కడ జరగదు. పైగా, ఉత్పత్తి శక్తి పెరుగుతోన్న కొద్దీ కార్మికులు, తమ 'శ్రమ విలువ'లో నించి పోగొట్టుకునే భాగం అధికమై పోతూ వుంటుంది. ఆ భాగం పెట్టుబడిదారుడి చేతుల్లోకి పోయి, కార్మికుల్ని అణిచే శక్తి పెరిగిపోతూ వుంటుంది. ఈ రకంగా, పెట్టుబడిదారీ విధానంలో, శ్రమ చేసే వర్గానికి, 'అదనపు శ్రమ' నించి ఏ నాటికీ స్వేచ్ఛ వుండదు.

# పోటీ ! ఒక అసహ్యమైన మాట !

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని పరిశీలిస్తూ, 'పోటీ' అనే అసహ్యమైన మాటని ఇప్పటికి పరిచయం చేసుకోబోతున్నాం. 'రిలెటివ్ అదనపు విలువ' గురించి చూడడం మొదలు పెట్టిన దగ్గిర్నించీ మనం చూసిందంతా ఆ అసహ్యమైన 'పోటీ' విషయమే. 'రిలెటివ్ అదనపు విలువ' కోసం జరిగే పోరాటం అంతా పోటీ పోరాటమే. ఇతరుల కన్నా తనే ఎక్కువ సరుకుని అమ్మి, తనే ఎక్కువ డబ్బు గడించాలి — అనే దృష్టే పోటీ దృష్టి. ఇతరులకు లేనంత డబ్బు తనకు రావాలి. దాని కోసం ఇతరులు అమ్మలేనంత సరుకుని తను అమ్మాలి.

"ఉన్నదానితో సంతృప్తి పడాలి. అత్యాశకు పోరాదు. దురాశ దుఃఖానికి చేటు" లాంటి కూతలన్నీ శ్రామికుల కోసమే గానీ దోపిడీదార్ల కోసం కాదు. 'దోపిడీ ఉత్పత్తి విధానాల' ప్రభావంలో వుండే తత్వవేత్తలు వల్లించే ఈ రకం సూత్రాల ప్రభావం, దోపిడీదారుల మీద ఏమీ వుండదు. ఆ ప్రభావం శ్రామికుల మీదే వుంటుంది. ఎందుకంటే, శ్రామికులు ఎలాగూ పేదతనం లోనే వుంటారు. ఇంకా తినాలనీ, ఇంకా కావాలనీ వారికి ఆశలు వున్నా, అవి తీరే మార్గం ఎలాగూ వుండదు. అలాంటి పరిస్తితిలో వున్నవారికి "ఉన్న దానితోనే తృప్తి పడాలి" అనే బోధన చాలా ఓదార్పు కలిగిస్తుంది. పరిస్తితుల్ని భరించగలిగేలా చేస్తుంది. కానీ, ఈ బోధన బానిస యజమానుల మీదా, భూస్వాముల మీదా, పెట్టుబడి దారుల మీదా, ఏ మాత్రమూ పని చెయ్యదు. అన్నిటి కన్నా ముఖ్యం, 'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం' మీద అసలే పని చెయ్యదు. దాని బతుకే దురాశా, పేరాశా, అత్యాశా! దాని బతుకే 'ఉన్నదానితో అసంతృప్తి పడడం'! దాని బతుకే అడుగడుగునా కుళ్ళూ, స్వార్థం, పోటీ!

పెట్టుబడిదారీ విధానంలో ఈ 'పోటీ' అనేది ఎంత ముఖ్యమైనదంటే, ఈ విధానాన్ని తెలుసుకునేటప్పుడు, ఈ పోటీ లక్షణాన్ని గమనించడం మరిచిపోతే, పెట్టుబడిదారీ విధానానికి వున్న సమస్త లక్షణాల్నీ మరిచిపోయినట్టే. 'పోటీ', పెట్టుబడిదారీ విధానానికి మాత్రమే ప్రత్యేకమైనది. ఇది గత సమాజాలలో లేదు. గత సమాజాలలో కూడా బానిస యజమానుల మధ్యా, భూస్వాముల మధ్యా ఆస్తుల కోసం పోరాటాలు వున్నా, అక్కడ రోజువారీ జీవితంలో నిత్య కృత్యంగా పోటీ లేదు. పోటీ, పెట్టుబడిదారీ విధానానికి ఎంత ప్రత్యేకమైనదంటే, పెట్టుబడిదారీ విధానాన్ని 'పోటీ ఉత్పత్తి విధానం' అనికూడా అనవచ్చు.

'పోటీ'ని పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు 'జీవన పోరాటం'గా (స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్‌గా) చిత్రిస్తారు. "జీవించాలంటే ఈ పోరాటం తప్పదు. పాము, కప్పని మింగుతుంది. పెద్ద చేప, చిన్న చేపని మింగుతుంది. అలాగే, మనిషి కూడా తన బతుకుదెరువు కోసం ఇతర మనుషులతో పోరాడక తప్పదు" అనే అస్తవ్యస్తపు వాదంతో ఈ మేధావులు, దోపిడీనీ, పోటీనీ, వాటి వల్ల పుట్టే ప్రతీ అక్రమాన్నీ, సమర్థించడానికి చూస్తారు.

పాము కప్పని మింగడం గానీ, పెద్ద చేప చిన్న చేపని మింగడం గానీ, 'ప్రకృతి సహజ' విషయాలు. మనుషులు మనుషుల్ని దోపిడీ చెయ్యడమూ, పోటీలు పడడమూ, 'సామాజిక' విషయాలు. ఈ రెండు విషయాల్నీ సమానం చెయ్యకూడదు. పాము కప్పని మింగకుండా ప్రకృతిలో ఏ శక్తీ ఆపలేదు. పాము కప్పని మింగితే, కప్ప కూడా ఇంకో పురుగుని మింగుతుంది. ఆ పురుగు కూడా తనకన్నా చిన్న పురుగుని మింగుతుంది. లేదా, అది పెద్ద జంతువుల శరీరాల్ని ఆశ్రయించి బతుకుతుంది. పాముని కూడా ముంగిసో, గద్దో చంపుతాయి. ఈ రకంగా ఈ చంపుళ్ళన్నీ ప్రకృతి ధర్మాలే. జంతువుల మధ్య పోరాటాలన్నీ ఆహారం కోసంగానీ, ఆత్మరక్షణ కోసంగానీ, జరుగుతాయి. అలాంటి పోరాటాలే వాటికి 'జీవన పోరాటాలు' అవుతాయి.

మనుషుల మధ్య జరిగే శ్రమ దోపిడీ, జీవన పోరాటం అవదు. ఒక మనిషి శ్రమ చెయ్యకుండా కూర్చుని, ఇతర మనుషులతో తన కోసం కూడా శ్రమ చేయించడమూ; ఇద్దరు సోమరిపోతులు, డబ్బు పెంచుకోడానికి పోటీలు పడడమూ — 'జీవన పోరాటాలు' అవవు. ఒక మనిషి, ఇంకో మనిషిని బానిసని చేసి, కొరడాలతో బాదుతూ, కుక్కలతో పీకిస్తూ శ్రమ చేయించడం — జీవన పోరాటం అవదు. ప్రకృతిలో, పామూ కప్పా కూడా కలిసి సుఖంగా

వుండే మార్గం లేదు. కానీ, సమాజంలో, మనుషు లందరూ, కలిసి సుఖంగా జీవించే మార్గం వుంది. దోపిడీ లేకుండా, పోటీ లేకుండా, అందరూ హాయిగా జీవించే మార్గం ఉంది. అందరూ శ్రమ చెయ్యడమే ఆ మార్గం. పెట్టుబడిదారులు డబ్బు పిచ్చితో చేసే పోటీ పోరాటాన్ని, వాళ్ళ బంటు ఆర్థికవేత్తలు, బతుకుదెరువు కోసం చేసే 'జీవన పోరాటం'గా సమర్థిస్తారు. వాళ్ళ దృష్టితో చూస్తే వాళ్ళకి అది 'జీవన పోరాటమే.' కానీ, అదంతా పూర్తిగా డబ్బు పిచ్చి గాళ్ళ వికృత జీవన పోరాటం మాత్రమే.

'పెట్టుబడిదారీ విధానం' గురించి ఇంకా ఎన్నో విషయాలు చూడాలి. పెట్టుబడిదారుల మధ్య ఎక్కువ లాభాల కోసం జరిగే పోటీ, క్రమంగా 'ప్రపంచ మార్కెట్టు'కీ, 'ప్రపంచ యుద్ధాల'కీ కూడా దారితీస్తుంది. పెట్టుబడిదారీ ప్రపంచం యావత్తూ, లాభాల కోసమూ, ఎక్కువ లాభాల కోసమూ, దురాశల తోటీ, పరుగుల తోటీ సాగే డబ్బు ప్రపంచం అయిపోతుంది. డబ్బే దాని 'ఆత్మ' అయిపోతుంది! — ఈ విషయాలన్నీ ఇంకా తర్వాత భాగాలలో క్రమంగా చూస్తాము.

ఇప్పుడు మళ్ళీ మనం, 'పని దినం' గురించే ఇంకా కొన్ని విషయాలు చూడాలి.

# అదనపు విలువ రేటుని పాలించే సూత్రాలు

"10 గంటల పని దినంలో ఎంత పని జరుగు తుంది?" అనే ప్రశ్నకి పెట్టుబడిదారీ ఆర్థికవేత్త అయితే, ఠక్కున— "10 గంటల పని దినంలో 10 గంటల పని జరుగుతుంది" అంటాడు. అతని ప్రకారం 10 గంటల్లో 10 గంటల పనే జరుగుతుంది. మన ప్రకారం — 10 గంటల్లో 11 గంటల పని జరగవచ్చు; 14 గంటల పని జరగవచ్చు; 20 గంటల పని కూడా జరగవచ్చు.

బట్టల శాఖలో 10 మంది పెట్టుబడిదారులు ఉన్నారు. అందరి దగ్గిరా పని దినం పొడవూ, శ్రమ తీవ్రతా, శ్రమ పరికరాలూ జనరల్‌గా చూస్తే సమానంగానే ఉన్నాయి. కానీ, నిజానికి ప్రతీ విషయమూ కొన్ని కొన్ని తేడాలతోనే ఉన్నాయి.

అందరి దగ్గిరా ప్రతీ గంటలోనూ గిరి గీసినట్టు ఒకే రకంగా పని జరిగితేనే '10 గంటల్లో 10 గంటల పని జరుగుతుంది' అనవచ్చు. కానీ, నిజానికి అందరి పరిస్థితులూ రక రకాల తేడాలతో ఉంటాయి కాబట్టి, అందరి దగ్గిరా ఒక పని దినంలో ఒకే పని జరగదు. అంటే, 'ఉత్పత్తి' ఒకే రకంగా రాదు.

పరిస్థితుల్లో ఎన్ని తేడాలు ఉన్నా— ఒక వేపు, తేడాలన్నీ సమసిపోయే పరిస్థితులూ; ఇంకో వేపు, తేడాలన్నీ నిలిచివుండే పరిస్థితులూ — దేని దారిన అవి పని చేస్తూ ఉంటాయి. అందులో దేని శక్తి ఎక్కువగా వుంటే, దాని ఫలితం చివరికి మిగులుతుంది.

ఒక శాఖలో పెట్టుబడిదారులందరి ఉత్పత్తి స్థాయి ఒకే రకంగా ఉండదు. ఒకడు వెయ్యి పెట్టుబడితో పనిచేస్తే, ఒకడు 2 వేల పెట్టుబడితో పనిచేస్తాడు. మొదటి వాడి కన్నా రెండోవాడి దగ్గిర 'ఉత్పత్తి సాధనాల్ని' కొంత పొదుపు చెయ్యడం సాధ్యమవుతుంది. మొదటివాడు, తన దగ్గిర శ్రమ తీవ్రతని పెంచితే, ఆ లోపం పూడ్చుకో గలుగుతాడు. కానీ రెండో వాడి దగ్గిర కూడా శ్రమ తీవ్రత పెరిగితే, తేడా మళ్ళీ మామూలే.

ఇద్దరు వేరు వేరు ప్రాంతాల వ్యవసాయ పెట్టుబడి దారుల్ని తీసుకుంటే, ఒక ప్రాంతంలో పంటలు పాడయ్యే పరిస్థితులూ, ఒక ప్రాంతంలో పంటలు బాగా వుండే పరిస్థితులూ ఉన్నాయి — అనుకుందాం. మొదటి వాడు శ్రమ తీవ్రతని పెంచి తన నష్టం పూడ్చుకోవడానికి అవకాశం ఉంటుంది.

రోజుకి 2 షిఫ్టులు అయితే పని దినం 12 గం.లూ, 3 షిఫ్టులు అయితే పని దినం 8 గం.లూ ఉంటుంది. షిఫ్టు పద్ధతి ఉన్నప్పుడు పని దినం ఖచ్చితంగా, ఇన్ని గంటలు అని ఉంటుంది. కానీ షిఫ్టు పద్ధతి లేని కాలంలో గానీ, లేని చోట్ల గానీ (వ్యవసాయ రంగంలో), పని గంటల్ని ఖచ్చితంగా పాటించకుండా ఎక్కువ గంటలు పని చేయించడం సాధ్యమే. దాని వల్ల, పని జరగడంలో తేడాలు వస్తాయి.

గనుల తవ్వకం పనిలో, ప్రతీ చోటా పదార్థం ఒకే రకంగా దొరకదు. ఒక చోట పదార్థం సమృద్ధిగా వుండి, ఒక చోట పలచ పలచగా వుండవచ్చు. ఇలాంటి పరిస్థితిలో ఆ సందర్భాల్ని బట్టి పని దినాన్ని పెంచి గానీ, శ్రమ తీవ్రతని పెంచి గానీ, ప్రతీ పెట్టుబడిదారుడూ సమానమైన ఉత్పత్తి వచ్చేటట్టు చేసుకోవచ్చు. చేసుకో లేకపోతే తేడాలు ఉంటాయి.

'ముడి పదార్థాల' మంచి చెడ్డల్ని బట్టి కూడా, జరిగే పనిలో తేడాలు వస్తాయి. పత్తి మంచిది అయితే, దారం తీసే పని తేలిగ్గా జరిగి ఎక్కువ ఉత్పత్తి వస్తుంది. పత్తి చెత్తది అయితే, దారం అస్తమానూ తెగిపోతూ ఉత్పత్తి తగ్గిపోతుంది. చెత్త పత్తి కన్నా మంచి పత్తి విలువ కొంత ఎక్కువైనా, దానితో పని త్వరగా జరగడం వల్ల, ఆ ఎక్కువ

విలువని మించిన విలువ గల పని జరగవచ్చు. చెత్త పత్తితో పని జరిగే చోట, పని దినాన్నీ, శ్రమ తీవ్రతనీ పెంచి, ఆ లోపం పూడ్చుకోడానికి అవకాశం ఉంటుంది. ముడి పదార్థం మంచిది అయిన చోటే ఈ పని కాలం పెంపూ, శ్రమ తీవ్రత పెంపూ జరిగితే, అవి మరింత ఎక్కువ ఉత్పత్తిని ఇస్తాయి.

ఈ రకంగా, పెట్టుబడిదారులంతా, తమ ప్రత్యేక పరిస్తితుల్ని బట్టి, ఏ మార్పులు అవసరమో అవి చేసు కుంటూనే ఉంటారు. ఎంత చేసుకున్నా ఫలితాలు తేడా గానే ఉంటాయి. అందుకే, ఒకే 'పని దినం', పెట్టుబడి దారులందరికీ ఒకే రకంగా ఉత్పత్తిని ఇవ్వదు. వేరు వేరు సైజుల ఉత్పత్తుల్ని ఇస్తుంది. దానివల్ల ఒకడికి ఎక్కువ అదనపు విలువా, ఒకడికి తక్కువ అదనపు విలువా వస్తాయి. కాబట్టి, 'అదనపు విలువ రేటుని పాలించే పరిస్తితులు'గా కొన్ని పరిస్తితుల్ని చూడాలి. వీటిని 'అదనపు విలువ రేటుని పాలించే సూత్రాలు' అనవచ్చు.

ఒక 'పని దినం'లో ఎంత ఉత్పత్తి జరుగుతుంది — అనేది, పని దినం పొడవూ, శ్రమ పరికరాల ద్వారా వుండే ఉత్పాదకతా, శ్రమ తీవ్రతా — అనే 3 విషయాల మీద ఆధారపడి వుంటుంది. వేరు వేరు పెట్టుబడిదారుల దగ్గిర ఈ 3 విషయాలూ రక రకాల స్థాయిలలో కలుస్తూ వుంటాయి. ఒకటి హెచ్చి, మిగతావి తగ్గవచ్చు. మిగతావి హెచ్చి, ఒకటి తగ్గవచ్చు. అన్నీ ఒక సారే హెచ్చవచ్చు. అన్నీ ఒక సారే తగ్గవచ్చు. ఈ రకంగా పని దినాలు, ఒక్కొక్క పెట్టుబడిదారుడి దగ్గిర ఒక్కొక్క విధంగా, వాటి ప్రత్యేక అంశాల రక రకాల కలయికలతో, ఏర్పడుతూ వుంటాయి.

కొన్ని ఉదాహరణలు :

**(1)** పని దినం పొడవూ, శ్రమ తీవ్రతా మారకుండా వుండి, ఉత్పత్తి శక్తి పెరిగితే ఏమవుతుంది?— తప్పని సరిగా ఉత్పత్తి పెరుగుతుంది. దీని ఫలితం, 'అవసర శ్రమ' కాలం తగ్గి, 'అదనపు శ్రమ' కాలం పెరగడం. అంటే, 'అదనపు విలువ రేటు' పెరుగుతుంది.

**(2)** పని దినం పొడవూ, శ్రమ తీవ్రతా తగ్గి ఉత్పత్తి శక్తి పెరిగితే?—మొదటివి రెండూ తగ్గడంవల్ల ఉత్పత్తి తగ్గాలి. ఉత్పాదకత పెరగడం వల్ల ఉత్పత్తి పెరగాలి. మొదటి 2 అంశాలూ ఎంతెంత శాతం తగ్గాయో, 3 వ అంశం ఎంత శాతం పెరిగిందో వివరాలు తెలిస్తేనే గానీ, చివరి ఫలితాన్ని చెప్పలేము. సాధారణ అవగాహన ప్రకారం చూస్తే, ఈ ఉదాహరణలో, ఉత్పత్తి ఎప్పటిలాగే వుండడం గానీ, కొంచెం పెరగడం గానీ, జరగవచ్చు. అంటే, 'పని దినం' లో పాళ్ళు అలాగే వుండడం గానీ, కొంచెం మారడం గానీ, జరగవచ్చు.

**(3)** పని దినం పొడవూ, ఉత్పాదకతా మారకుండా వుండి, శ్రమ తీవ్రత పెరిగితే?— తప్పనిసరిగా ఉత్పత్తి పెరుగుతుంది. ఇది, మొదటి దాని ఫలితమే.

**(4)** ఉత్పాదకతా, శ్రమ తీవ్రతా అలాగే వుండి, పని దినం పెరిగితే?— చెప్పాలా? ఎక్కువ ఉత్పత్తి. మొదటి దాని ఫలితమే.

**(5)** 'పని దినం' అలాగే వుండి, ఉత్పాదకత తగ్గి, శ్రమ తీవ్రత పెరిగితే?— ఈ రెండూ ఒక దాన్ని ఒకటి బ్యాలెన్స్ చేసుకుని, ఉత్పత్తి ఎప్పటి లాగే వుండవచ్చు. ఉత్పాదకత ఎంత తగ్గిందో, శ్రమ తీవ్రత ఎంత పెరిగిందో తెలియ కుండా, ఫలితాన్ని చెప్పలేము.

ఈ కలయికలన్నీ — 'పని దినం'లో అవసర, అదనపు శ్రమల పాళ్ళు ఎలా మారగలవో, 'శ్రమ శక్తి విలువ' ఎలా మారగలదో చెపుతాయి.

'ఉత్పాదకత' తగ్గగానే, 'అదనపు విలువ రేటు' కూడా తగ్గిపోనక్కరలేదు. శ్రమ తీవ్రతనీ, పనిదినాన్నీ పెంచి ఆ నష్టాన్ని పూడ్చుకోవచ్చు. ఫలితం ఎప్పటిలాగే వుండేటట్టు చూసుకోవచ్చు.

1799 కీ, 1815 కీ మధ్య, ఇంగ్లండులో, వ్యవసాయ రంగంలో ఉత్పాదకత తగ్గి, జీవితావసర వస్తువుల విలు వలు పెరిగాయి. అందుచేత, పెట్టుబడిదారులు కార్మికుల జీతాల్ని కూడా కొంచెం పెంచక తప్పలేదు. 'జీతాన్ని' పెంచినా, పెట్టుబడిదారులు అమ్మే సరుకుల విలువలు కూడా పెరిగాయి కాబట్టి, పెట్టుబడిదార్లకి 'లాభం రేటు' తగ్గలేదు. కానీ, 'జీతాల్ని పెంచడం' అనే కారణం చూపించి, ప్రభుత్వం, పని దినాన్నీ శ్రమ తీవ్రతనీ గతం కన్నా పెంచుకోవడానికి పెట్టుబడిదారులకు హక్కు ఇచ్చింది. ఈ రకంగా, 'ఉత్పాదకత' తగ్గినా, పెట్టుబడి దారుల లాభాలు ఎప్పటిలాగే ఉండే ఏర్పాట్లు జరిగాయి. 'ఉత్పాదకత' తగ్గడం వల్ల నష్టపోయింది కార్మికులే. అది పెరిగినా నష్టపోయేది కార్మికులే.

'పని దినాన్ని' చట్టబద్ధంగా తగ్గించవలసి వచ్చినప్పు డల్లా (18 గంటల పని దినాన్ని 17 గంటలు గానూ, తర్వాత 16 గంటలు గానూ, ఇలా తగ్గించి నప్పుడల్లా), పెట్టుబడి దారులు, దాన్ని తమకు 'లాభం' తగ్గే విషయంలాగే చూస్తారు. ఆ నష్టాన్ని ఎలా పూడ్చుకుంటారంటే, ఉత్పత్తి శక్తినీ, శ్రమ తీవ్రతనీ పెంచే మార్గాల ద్వారా. తగ్గిన పని దినంలోనే ఎక్కువ ఉత్పత్తి జరిగేలా చేసుకోగలిగితే, పెట్టుబడిదారుడికి పని దినం ఏమీ తగ్గని దానితో సమానం! పని దినం అనేది, దానికి వుండే ప్రత్యేక పరిస్తితుల్ని బట్టి ఎక్కువ తక్కువ విలువల్ని ఇస్తుంది గానీ, ప్రతీచోటా ఒకే స్థిరమైన విలువని ఇవ్వదు.

బట్టల శాఖలో పని దినం అందరి దగ్గిరా 8 గం.లే అనుకుందాం. ఈ 8 గంటల్లో ప్రతీ కార్మికుడూ జనరల్‌గా 8 మీటర్ల బట్టని ఉత్పత్తి చెయ్యాలి. ఇక్కడ 3 పని స్థలాల్ని తీసుకుంటే, 1వ చోట 10 మంది కార్మికులూ, 2వ చోట 20 మందీ, 3వ చోట 15 మందీ ఉన్నారు. 1 పని దినంలో— 1వ చోట 100 మీటర్లూ, 2వ చోట 180 మీటర్లూ, 3వ చోట 120 మీటర్లూ ఉత్పత్తి చేశారు. ఎక్కడ ఎక్కువ ఉత్పత్తి జరిగింది?— 180 మీటర్లు తయారైనచోటే ఎక్కువ ఉత్పత్తి జరిగినట్టు అర్థమా?— కాదు. ప్రతీ చోటా ఉత్పత్తిని అక్కడి కార్మికుల సంఖ్యతో భాగించి, ఒక్కొక్క కార్మికుడి లెక్కకీ ఎంత ఉత్పత్తి వచ్చిందో చూడాలి. ఒక కార్మికుడు ఉత్పత్తి చేసింది ఎక్కడ ఎక్కువగా వుంటే అక్కడే ఎక్కువ ఉత్పత్తి జరిగినట్టు అర్థం. 1వ చోట ఒక్కొక్క కార్మికుడూ 10 మీటర్లూ, 2వ చోట ఒక్కొక్క కార్మికుడూ 9 మీటర్లూ, 3వ చోట ఒక్కొక్క కార్మికుడూ 8 మీటర్లూ ఉత్పత్తి చేశారు. మొదటి చోట తక్కువ మంది కార్మికులే వున్నా, ఇక్కడే ఎక్కువ ఉత్పత్తి జరిగింది. ఈ 3 చోట్లా పని దినం 8 గం.లే. అయినా ఒక కార్మికుడి ద్వారా వచ్చే ఉత్పత్తి ఒక్కొక్క పని స్థలంలో ఒక్కొక్క రకంగా ఉంది. అందుకే, ఒకే పొడవు గల పని దినం కూడా, వేరు వేరు పరిస్థితుల్ని బట్టి వేరు వేరు సైజుల ఉత్పత్తుల్ని ఇస్తుంది. దానివల్ల పెట్టుబడిదారులు అదనపు విలువని వేరు వేరుగా పొందగలుగుతారు. అంటే పని దినం ప్రతీచోటా ఒకే స్థిరమైన విలువని ఇవ్వదు — అనే అర్థానికి రావాలి. పని దినాన్ని పైకి కనపడే గంటల లెక్కతో చూస్తే, అది స్థిరమైనదే. కానీ, 'ఎంత ఉత్పత్తి జరిగింది' అనే వాస్తవం ద్వారా చూస్తే — అది స్థిరమైనది కాదు; అస్థిరమైనది.

కానీ, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల ప్రకారం, పని దినం స్థిరమైనది. దాని ఉత్పాదకతా, శ్రమ తీవ్రతా, అందరి దగ్గిరా ఒక్క స్థాయిలోనే వుంటాయి. అందరి దగ్గిరా ఒక్క స్థాయిలోనే ఉత్పత్తి జరుగుతుంది. అందుకే 10 గంటల పని దినంలో 10 గంటల పనే జరుగుతుంది. వాళ్ళు 'గంట' అనే దాన్ని గడియారం లెక్కతోనే గానీ, ఉత్పత్తి లెక్కతో చూడరు. 'రోజుకి 24 గంటలు' అనే కొలత వాళ్ళకి ఎంత సహజ విషయంగా కనపడుతుందో, '10 గంటల్లో 10 గంటల పని జరగడం' కూడా అంత సహజ విషయం గానే కనపడుతుంది. అందుకే 'పని దినం' పొడవుని తగ్గించాలంటే, 1 గంట తగ్గితే, ఉత్పత్తి తగ్గిపోతుందని ఘోర ప్రమాదం వచ్చిపడ్డట్టు గగ్గోలు పెడతారు. పని దినం 1 గంట తగ్గినా, 2 గంటలు తగ్గినా, ఆ ఉత్పత్తిని, ఇంకో పద్ధతి ద్వారా వాళ్ళు ఎలాగూ రాబడతారు. కానీ, ఆ గంట కూడా తగ్గకపోతే వాళ్ళకి ఇంకా లాభం కదా?

పని దినం పొడవూ, ఉత్పాదకతా, శ్రమ తీవ్రతా — అనేవి, ఒక శాఖలోనే ఒక పెట్టుబడిదారుడికీ, ఇంకో పెట్టుబడిదారుడికీ తేడాగా వున్నట్టే; ఒక దేశంలో ఆ రకపు శాఖకీ, ఇంకో దేశపు శాఖకీ కూడా తేడాగానే వుంటాయి. అంటే, ఒక దేశపు బట్టల శాఖ పరిస్థితులకూ, ఇంకో దేశపు బట్టల శాఖ పరిస్థితులకూ తేడా వుంటుంది. అలాగే, ఒక దేశపు వ్యవసాయ పరిస్థితులకూ, ఇంకో దేశపు వ్యవసాయ పరిస్థితులకూ; ఒక దేశపు గనుల పరిస్థితులకూ, ఇంకో దేశపు గనుల పరిస్థితులకూ — ఇలా.

కాబట్టి, వేరు వేరు దేశాల పని దినాలు వేరు వేరు విలువ పరిమాణాల్ని ఉత్పత్తి చేస్తాయి. శ్రమ తీవ్రత ఎక్కువగా వున్న దేశపు పని దినం, శ్రమ తీవ్రత తక్కువగా వున్న దేశపు పని దినం కన్నా, ఎక్కువ ఉత్పత్తినీ, దాని వల్ల ఎక్కువ అదనపు విలువని పొందే అవకాశాల్నీ ఇస్తుంది. వేరు వేరు దేశాల మధ్య పరిస్థితులు కూడా వేరు వేరు పెట్టుబడి దారుల మధ్య పరిస్థితుల లాగానే ఫలితాల్ని ఇస్తాయి.

'రెలెటివ్ అదనపు విలువ' కోసం ఒక దేశపు పెట్టుబడిదారుల మధ్య పోటీ వున్నట్టే, వేరు వేరు దేశాల పెట్టుబడిదారుల మధ్య కూడా పోటీ వుంటుంది. అది మరింత తీవ్ర స్థాయిలో వుంటుంది. ఈ విషయాలన్నీ కూడా తర్వాత చాప్టర్లలో చూస్తాము.

ఇప్పుడు, 'పని దినానికి' సంబంధించిన విషయాలే ఇంకా కూడా కొన్ని చూడాలి.

# జీతాలు ఇవ్వడంలో వేరు వేరు పద్ధతులు

కార్మికులకు జీతాలు ఇవ్వడం ప్రధానంగా 2 పద్ధతుల్లో వుంటుంది. (1) టైమ్‌వేజ్ : ఇది పని చేసిన 'కాలాన్ని బట్టి' జీతం ఇచ్చే పద్ధతి. (2) పీస్ వేజ్ : ఇది, చేసిన 'ఉత్పత్తిని బట్టి' జీతం ఇచ్చే పద్ధతి.

## 1) టైమ్ వేజ్ :

ఒక 'రోజు పని' తర్వాత గానీ, 'వారం పని' తర్వాత గానీ, 'నెల పని' తర్వాత గానీ, జీతాలు వస్తాయి.

ఒక పని దినం 10 గం.లూ, శ్రమ విలువ 10 రూ.లూ, జీతం 5 రూ.లూ— అనుకుందాం. 10 రూ.లు — శ్రమ విలువ. 5 రూ.లు —జీతం. లేదా, 'శ్రమ శక్తి విలువ'.

అయితే జీతాన్ని, 'శ్రమ కోసం చెల్లించే ధర' అనే అర్థంతో, 'శ్రమ ధర' అని కూడా అనవచ్చు. 'విలువ' అనే

మాటనే గానీ, 'ధర' అనే మాటని మనం ఇంత వరకూ చూడలేదు. నిజానికి విలువా, ధరా ఒకటే. కానీ అవి ఒకటి కాని సందర్భాలు కూడా వుంటాయి. ఈ విషయాలు, 2 వ సంపుటంలో, 'పెట్టుబడిదారీ ధర' చాప్టర్లో తర్వాత చాలా వివరంగా చూస్తాము.

ఒక శ్రమని కొనాలంటే, ఆ శ్రమ చేసే వ్యక్తికి కొంత 'ధర' చెల్లించాలి. అంటే, కొంత 'జీతం' చెల్లించాలి. ఈ అర్థంతోనే జీతాన్ని 'శ్రమ ధర' అనవచ్చు. అంటే 'శ్రమ శక్తి విలువ'కి ఒక పేరు 'జీతం' అయితే, ఇంకో పేరు 'శ్రమ ధర'.

10 గం. శ్రమకు ధర — 5 రూ.లు అయితే,

1 గం. శ్రమకు ధర — $\frac{1}{2}$ రూ.

పని దినానికి వుండే జీతం మారకుండా పని గంటలు పెరిగితే, గంటకి జీతం తగ్గినట్టు అర్థం. లేదా, పెరిగిన గంటలకు కూడా జీతం ఇస్తే, రోజు మొత్తం మీద వచ్చే జీతం పెరుగుతుంది. కానీ, 1 గంటకి 'శ్రమ ధర' ఎప్పటి లాగే వున్నట్టు అర్థం.

టైమ్ వేజ్ గురించి చూసే సందర్భంలోనే 'ఓవర్ టైమ్' గురించీ, 'పార్ట్ టైమ్' గురించీ కూడా చూడాలి.

**ఓవర్ టైమ్** : పని దినానికి సంబంధించిన గంటలు అయిపోయిన తర్వాత కూడా, ఇంకా ఎక్కువ కాలం పనిచేస్తే, ఆ ఎక్కువ కాలమే 'ఓవర్ టైమ్'. దీన్ని క్లుప్తంగా 'ఓ.టీ.' అంటారు. కార్మికులు ఓ.టీ. చేసినప్పుడు, ఆ గంటలకు, మామూలు 'శ్రమ ధర' కన్నా కొంత ఎక్కువ ధర ఇవ్వాలనే షరతు వుంటుంది. ఓ.టీ.కి కొంత ఎక్కువ ధర ఇస్తే, ఆ శ్రమ ద్వారా వచ్చే 'అదనపు విలువ' కొంత తగ్గినట్టు కనపడుతుంది. కానీ, మొత్తం మీద చూస్తే, అది నిజం కాదు. ఓ.టీ.లు లేకుండా ఏ షిఫ్టు కార్మికుల్ని ఆ షిఫ్టుకి ప్రత్యేకంగా వుంచి పనిచేయిస్తే, ఆ కార్మికులందరికీ సంబంధించి కొన్ని రకాల ఖర్చులు ఎక్కువగా అవుతాయి. తక్కువ కార్మికుల్నే పెట్టి వారి తోనే ఓ.టీ.ల ద్వారా పనిచేయిస్తే, ఓ.టీ.ల కోసం కొంత ఎక్కువగా చెల్లించ వలసి వచ్చినా, మొత్తం మీద పెట్టుబడిదారుడికి ఓ.టీ. పద్ధతే 'లాభదాయకం'గా వుంటుంది. ఏ పద్ధతి ఎక్కువ లాభదాయకమో, ఆ పద్ధతి నే పెట్టుబడిదారుడు అనుస రిస్తాడు. ఓ.టీ.లు లేకుండా ఎక్కువ మంది కార్మికులతో పనిచేయించడమే లాభదాయకమై, ఓ.టీ. పద్ధతి లాభ దాయకం కాకపోతే, ఏ పెట్టుబడిదారుడూ ఓ.టీ. పద్ధతిని పాటించేవాడు కాదు. ఎక్కువ లాభాన్నిచ్చే పద్ధతి ఒకటి వుండగా, తక్కువ లాభాన్నిచ్చే పద్ధతిని పెట్టుబడిదారులు పాటించరు. కాబట్టి, ఏ విషయంలో నైనా, రెండు పద్ధతులు వుండగా అందులో పెట్టుబడిదారుడు ఒక పద్ధతిని ఎంచుకున్నాడంటే, అది కార్మికులకు పూర్తిగా వ్యతిరేకమైనదనే అభిప్రాయానికి కార్మికులు రెండో ఆలోచన లేకుండా వచ్చెయ్యవచ్చు.

**పార్ట్ టైమ్** : పని దినంలో ఎన్ని గంటలు వుంటాయో అన్ని గంటలూ పనిచేసి, పూర్తి జీతం తీసుకోవడం 'ఫుల్ టైమ్' ఉద్యోగం. కొన్ని గంటలే పనిచేసి, ఆ గంటలకే జీతం తీసుకోవడం 'పార్ట్ టైమ్' ఉద్యోగం. ఫుల్ టైమ్ ఉద్యోగాలు దొరకనప్పుడే కార్మికులు పార్ట్ టైమ్ ఉద్యోగా లకు సిద్ధపడతారు.

కొందరు పెట్టుబడిదారుల దగ్గిర ఫుల్ టైమ్ ఉద్యోగు లతో పాటు పార్ట్ టైమ్ ఉద్యోగులు కూడా వుంటారు.

ఒక ఉదాహరణ : పని దినం 10 గం.లు. దాని విలువ 10 రూ.లు. కార్మికుడి జీతం 5 రూ.లు. అదనపు విలువ 5 రూ.లు. అదనపు విలువ రేటు 100%. అంటే, కార్మి కుడు 1 గంటకు ఇచ్చిన విలువ 1 రూపాయి. ఆ గంట కోసం తీసుకున్న జీతం అర్ధ రూపాయి.

పరిస్తితి ఇలా ఉన్నప్పుడు, పెట్టుబడిదారుడు, ఒక పార్ట్ టైమ్ ఉద్యోగం ఇచ్చే ముందు కార్మికుడితో ఇలా అంటాడు: "ఈ రకం పనికి బైట అందరూ, 10 గంటలకు 5 జీతం ఇస్తున్నారు. అంటే, గంటకి అర్ధ. నేను కూడా ఆ లెక్కనే ఇస్తాను. నా దగ్గిర 10 గంటలు చెయ్యక్కరలేదు. రోజూ 5 గంటలు చేస్తే చాలు. దానికి $2\frac{1}{2}$ రూపాయలు ఇస్తాను. ఏమంటావు?" అంటాడు.

ఆ మహత్తర తర్క చాతుర్యానికి ఏమంటాడు కార్మికుడు? ఫుల్ టైమ్ ఉద్యోగం దొరకకే కదా కార్మికుడు దీని కోసం వచ్చింది? "10 గం. పనికి 5 జీతం అయితే, 5 గం.ల పనికి రావలసింది $2\frac{1}{2}$ జీతమే కదా? వీడు న్యాయంగానే ఇస్తానన్నాడులే" అనుకుంటాడు కార్మికుడు. కానీ, ఆ 'న్యాయంలో వున్న అన్యాయం' ఏమిటో కార్మి కులు గ్రహించుకోలేరు. ఎందుకంటే, కార్మికుడికి అసలు, జీతం అంటే ఏమిటో తెలియదు కదా?

కార్మికుడు, ఆ రోజు 5 గంటలే పని చేసి, $2\frac{1}{2}$ జీతం తీసుకుని వెళ్ళిపోయాడనుకుందాం. పని ప్రారంభించిన తర్వాత 5 గంటలే పనిచేస్తే, అది 'అవసర కాలమే' కదా? అంటే, మన కార్మికుడు అవసర శ్రమ మాత్రమే చేశాడనీ, అందులో అదనపు శ్రమ లేదనీ, ఈ కార్మికుడి వల్ల పెట్టు బడిదారుడికి అదనపు విలువ రాదనీ అర్థమా? —కాదు.

ఈ కార్మికుడికి కూడా అతని 'శ్రమ – విలువ' అంతా అతనికి అందినట్టు కాదు. 5 గంటలు పని చేసినందుకు, ఆ శ్రమ విలువ అంతా అతనికి అందినట్టు కాదు. 1 గంట శ్రమ విలువ 1 రూపాయి కదా? 5 గంటలు పని చేసినందుకు, ఆ శ్రమ విలువ అంతా అందాలంటే, జీతం

5 రూ.లు రావాలి. ఇతనికి 5 గంటల పనికే 5 జీతం అందినట్టయితే, అతని శ్రమ విలువ అంతా అతనికే అందినట్టూ, అతని ద్వారా అదనపు శ్రమ రానట్టూ అవుతుంది. కానీ, అతనికి అందిన జీతం 5 రూ.లు కాదు, $2\frac{1}{2}$ . 10 గంటల ఫుల్ టైమ్ కార్మికుడు 5 రూ.ల జీతం తీసుకొని 5 రూ.ల అదనపు విలువని పోగొట్టుకోవడం ఎలాంటిదో, 5 గంటల పార్ట్ టైమ్ కార్మికుడు $2\frac{1}{2}$ జీతం తీసుకుని, $2\frac{1}{2}$ అదనపు విలువని పోగొట్టుకోవడం కూడా అలాంటిదే. 2 ఉదాహరణల్లోనూ, కార్మికుడు ఇచ్చింది, 1 గంటకి 1 రూపాయి విలువ. జీతంగా తీసుకున్నది —అర్థ రూపాయి. ఫుల్ టైమ్ కార్మికుడి విషయంలో, సగం కాలం అదనపు శ్రమ వున్నట్టే, పార్ట్ టైమ్ కార్మికుడి విషయంలో కూడా సగం కాలం అదనపు శ్రమ వుంటుంది. పని చేసింది తక్కువ గంటలే అయినా, ఆ తక్కువ గంటల్లోనే అదనపు శ్రమ వుంటుంది. ఒక కార్మికుడు 2 గంటలే పనిచేసి జీతంగా 1 రూపాయే తీసుకుంటే, ఆ 2 గంటల విలువ అంతా అతనికి అందలేదు కాబట్టి, ఆ 2 గంటల శ్రమలోనే సగం అదనపు శ్రమ వుందని అర్థం. జీతం ఏర్పాటులోనే అదనపు శ్రమని లాగే మార్గం ఏర్పడి పోయి వుంటుంది.

కార్మికుడు చేసిన పని వల్ల అదనపు విలువ వస్తుందా లేదా అనేది, 'ఆ పని ఎన్ని గంటలు జరిగిందీ' — అనేదాన్నిబట్టి కాదు; ఆ పని విలువ అంతా కార్మికుడికి వచ్చిందా లేదా — అనే దాన్ని బట్టి. కార్మికుడు ఫుల్ టైమ్ వాడైనా, పార్ట్ టైమ్ వాడైనా, ఏ రకం కార్మికుడికీ అతని శ్రమ విలువ అంతా జీతంగా రాదు. ఈ విషయంలో ఏ కార్మికుడైనా ఒకటే.

పార్ట్ టైమ్ కార్మికుడు తక్కువ గంటలే పని చేస్తే, ఆ తక్కువ పని లోనే 2 భాగాలు వుంటాయి. కొంత కార్మికుడికీ, మిగిలింది పెట్టుబడిదారుడికీ.

10 గం.ల పనిలో సగం కాలం అదనపు శ్రమ అయితే, 5 గం.ల పనిలో కూడా సగం కాలం అదనపు శ్రమ.

ఒక్క గంటే పని చేస్తే, అందులో కూడా సగం కాలం అదనపు శ్రమే.

పార్ట్ టైమ్ కార్మికుడు తక్కువ గంటలే పనిచేస్తాడు కాబట్టి, ఆ పని ద్వారా పెట్టుబడిదారుడికి అదనపు విలువ రాదని అర్థం కాదు. అదనపు విలువ, ఫుల్ టైమ్ కార్మికుడి ద్వారా ఏ రేటున వస్తుందో పార్ట్ టైమ్ కార్మికుడి ద్వారా కూడా అలాగే వస్తుంది. ఎంత పని చేస్తే అంత పనిలో నించే!

దోపిడీకి గురి అవడం — అనేది, ఏ కార్మికుడికి అయినా జరుగుతుంది. కానీ, ఫుల్ టైమ్ కార్మికుడికి అయితే, పోషణకి సరిపోయే జీతాన్ని సంపాదించుకునే అవకాశం వున్న తర్వాత, అదనపు విలువని ఇవ్వవలసి వస్తుంది. కానీ, పార్ట్ టైమ్ శ్రామికుడైతే, తన పోషణకు తగిన విలువ తీసుకునే అవకాశం లేకుండానే అదనపు విలువని ఉత్పత్తి చెయ్యాలి.

| | | | |
|---|---|---|---|
| 10 గం.ల ఫుల్‌టైమ్‌కి— | అవసర శ్రమా | : | అదనపు శ్రమా |
| | 5 గం. | : | 5 గం. |
| | 5 రూ. | : | 5 రూ. |
| 5 గం.ల పార్ట్‌టైమ్‌కి — | $2\frac{1}{2}$ గం. | : | $2\frac{1}{2}$ గు. |
| | $2\frac{1}{2}$ రూ. | : | $2\frac{1}{2}$ రూ. |

పార్ట్ టైమ్ కార్మికుడు, తన పోషణకోసం 5 విలువ రాకుండానే అదనపు విలువని ఇవ్వాలి.

మన ఉదాహరణ ప్రకారం, పార్ట్ టైమ్ కార్మికుడి విషయంలో '1 గంట పనికి అర్థ రూపాయి జీతం' అనే లెక్క దేని వల్ల ఏర్పడింది? '10 గంటల పనికి 5 జీతం' అనే దాని వల్ల. అయితే, '10 గంటల పనికి 5 జీతం' అనే లెక్క దేని వల్ల ఏర్పడింది? ఆ పని చెయ్యడానికి కావలసిన శ్రమ శక్తికి రోజూ 5 విలువ గల జీవితావసర వస్తువులు కావాలి — అనే దాని వల్ల. అంటే, ఒక కార్మికుడికి ప్రతి రోజూ శ్రమ శక్తి ఉండాలంటే, కనీసం 5 జీతం సంపాదించే అవకాశం ఉండాలి. కార్మికుడు తన జీతం విలువని మాత్రమే విడిగా ఉత్పత్తి చేసుకోడు; దానితోపాటు 'అదనపు విలువ'ని కూడా ఉత్పత్తి చేస్తాడు. ఈ ఉదాహరణలో, ఫుల్ టైమ్ కార్మికుడు, రోజూ జీతం కోసం 5 విలువనీ, పెట్టుబడిదారుడి కోసం ఇంకో 5 విలువనీ, మొత్తం 10 విలువని 10 గంటల్లో ఉత్పత్తి చేస్తాడు. ఇలా జరగడం వల్లనే 1 గంట శ్రమకి 1 రూపాయి విలువ ఏర్పడుతుంది. అందులో సగం — జీతమూ, సగం — అదనపు విలువా అవుతాయి. ఈ షరతులన్నీ ఇలా నెరవేరితేనే, 1 గంటకి జీతం అర్థ రూపాయి అవుతుంది. అంటే పెట్టుబడిదారుడు, కార్మికుడికి ఫుల్ టైమ్ ఉద్యోగం చేసే అవకాశం ఇచ్చినప్పుడు ఏం జరుగుతుందంటే, కార్మికుడికి 'పూర్తి శ్రమ శక్తి విలువ'ని (5 జీతాన్ని) సంపాదించుకునే అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. కార్మికుడికి, అలాంటి అవకాశం ఇస్తూ పెట్టుబడిదారుడు ఆ కార్మికుడి ద్వారా 100% అదనపు విలువని సంపాదిస్తున్నట్టు అవుతుంది.

కానీ, ఆ కార్మికుడికే ఫుల్ టైమ్ పని గాక, పార్ట్ టైమ్ పని మాత్రమే ఇచ్చినప్పుడు, ఏం జరుగుతుంది? కార్మికుడికి 'పూర్తి శ్రమ శక్తి విలువ'ని సంపాదించే అవకాశం ఇవ్వకుండానే, అదనపు విలువని లాక్కోవడం అవుతుంది. నిజానికి, ఈ ఉదాహరణలో కూడా కార్మికుడు 5 గంటల కాలం పని చేసి, 5 విలువని ఉత్పత్తి చేస్తాడు. అయినప్పటికీ, అదంతా అతనికి రాదు. అతనికి వచ్చినది మర్నాటి శ్రమ శక్తి కోసం చాలదు. ఫుల్ టైమ్ పని చేస్తేనే,

అంటే 10 గం.ల పాటు పని చేసి అందులో నించి 5 జీతం తీసుకునే అవకాశం వుంటేనే, కార్మికుడు, పూర్తి శ్రమ శక్తి విలువని సంపాదించగలుగుతాడు.

కార్మికుడు, ఫుల్ టైమ్ పనిచెయ్యాలన్నా, పార్ట్ టైమ్ పని చెయ్యాలన్నా శ్రమ శక్తి మాత్రం ఒకే రకంగా కావాలి. పార్ట్ టైమ్ కార్మికుడు, పూర్తి జీతం లేకపోయినా, తన శ్రమ శక్తిని పునరుత్పత్తి చేసుకోవడం ఎలా సాధ్యమవుతుం దంటే—ఇది 2 రకాలుగా జరగవచ్చు.

**(1)** ఆ కార్మికుడు 2, 3 చోట్ల పార్ట్ టైమ్ పనులు చేస్తూ 'శ్రమ శక్తి విలువ'ని సంపాదించవచ్చు. ఇలా జరిగితే ఆ కార్మికుడు, శ్రమ శక్తి విలువని సంపాదించడానికి అతనికి పనులు ఇచ్చిన పెట్టుబడిదారుల్లో ఏ ఒక్కడూ పూర్తిగా బాధ్యుడు కాదు. ఆ బాధ్యతని నెరవేర్చకుండానే వాళ్ళు అదనపు విలువని సంపాదిస్తారు.

**(2)** పార్ట్ టైమ్ ఉద్యోగం చేసే కార్మికుడు తనకు పూర్తి జీతం లేకపోయినా, తన కుటుంబ సభ్యుల్లో ఫుల్ టైమ్ పనులు చేసే వారి పోషణ వస్తువుల నించి కొంత భాగాన్ని పంచుకోవడం ద్వారా, 'శ్రమ శక్తి విలువ'ని సంపాదించ వచ్చు. ఇలా జరిగితే, ఆ కార్మిక కుటుంబంలో అందరి భాగానికీ పోషణ వస్తువులు తగ్గిపోతాయి. అంతేగాక, ఈ పార్ట్ టైమ్ కార్మికుడు, తన పోషణ కోసం కుటుంబ సభ్యుల మీద కొంత వరకూ ఆధారపడడం అంటే, అతని స్వతంత్రత కొంత తగ్గిపోయినట్టే. ఫుల్ టైమ్ కార్మికుడికైతే అలాంటి సమస్య వుండదు. ఆ కార్మికుడు, తన పోషణకు కావలసిన విలువనంతా (తన 5 జీతాన్నంతా) తన స్వంత శ్రమతోటే, ఇతరుల్ని యాచించకుండా, సంపాదించుకో గలుగుతాడు. పార్ట్ టైమ్ కార్మికుడికి ఆ అవకాశం వుండదు.

ఫుల్ టైమ్ – పెట్టుబడిదారుడు, కార్మికుడికి శ్రమ శక్తి పునరుత్పత్తికి అవకాశం ఇచ్చి, అతని నించి 1 గంటలో సగాన్ని అదనపు శ్రమగా సంపాదిస్తే, పార్ట్ టైమ్ – పెట్టు బడిదారుడు కార్మికుడికి ఆ అవకాశం పూర్తిగా ఇవ్వ కుండానే ఫుల్ టైమ్ పని ఇచ్చిన వాడి లాగానే, ప్రతీ గంట నించీ అర్ధ గంట అదనపు శ్రమని సంపాదిస్తాడు.

ఓ.టీ. పద్ధతి లాగానే, ఈ 'పార్ట్ టైమ్' పద్ధతిని కూడా పెట్టుబడిదారుడు తన లాభం కోసమే చేస్తాడు.

'ఫుల్ టైమ్'లో 10 గంటల పనికి 5 జీతం రావడమూ, 'పార్ట్ టైమ్'లో 1 గంట పనికి అర్ధ రూపాయి జీతం రావడమూ, రెండూ ఒకటే అయినట్టు కనపడుతుంది. విషయాల్ని కేవలం 'అంకెలు'గా చూస్తే, రెండూ ఒకటే. కానీ, విషయాల్ని సజీవ మానవుడి పోషణకు సంబం ధించిన పరిస్థితిగా చూస్తే రెండూ ఒకటి కాదు.

కార్మికుడి 'శ్రమ శక్తి పునరుత్పత్తి' అవడానికి ఏ పూర్తి పనీ, ఏ పూర్తి జీతమూ అవసరమో, వాటికి అవకాశమే లేనప్పుడు, '1 గంట పనికి 1 రూపాయి విలువ' అనీ, అందులో సగం అవసర శ్రమా – సగం అదనపు శ్రమా అనీ— ఈ కొలతలన్నీ పాత సంబంధాల నించి చెదిరి పోతాయి. అంటే, ఫుల్ టైమ్ పనిలో ఏర్పడే లెక్కలన్నీ, పార్ట్ టైమ్ పనిలో అర్థం లేనివైపోతాయి.

పెట్టుబడిదారులు, కార్మికుల్ని, గంటల లెక్కనో పూటల లెక్కనో రోజుల లెక్కనో పనిలోకి తీసుకునే పద్ధతులన్నీ 'టైమ్ వేజ్'కి సంబంధించిన పద్ధతుల్లాగానే కనపడతాయి. కానీ, కార్మికులకు స్థిరమైన ఉద్యోగాలు లేకుండా, ఏ పూటకాపూటే, ఏ రోజుకారోజే తాత్కాలికంగా పనిలోకి తీసుకునే పద్ధతుల వల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత వుండదు. జీవితావసర వస్తువుల్ని పొందే గ్యారంటీ వుండదు. ఈ పద్ధతుల వల్ల, శ్రమని ఇచ్చే కార్మికులు ప్రతీ క్షణమూ తీవ్రమైన ఆందోళనలోనే ఉంటారు. ఏ క్షణంలోనైనా పని పోతుందనే భయం వల్ల పని వున్న కాలంలో కూడా నిశ్చింతగా వుండలేరు.

ఇక ఇప్పుడు, 'పీస్ వేజ్'ని చూద్దాం.

## 2) పీస్ వేజ్ :

ఉత్పత్తి సాధనాలన్నీ పెట్టుబడిదారుడివే. కార్మికులు చేసే ఉత్పత్తిని కొన్ని పీసులుగా (భాగాలుగా) కొలిచి, 'పీసుకి ఇంత రేటు' లెక్కన, కార్మికుడికి చెల్లిస్తారు. ఒక పీసు అంటే, ఒక్కో రకం శ్రమలో ఒక్కో రకం లెక్క వుంటుంది. కుర్చీలు చేసే పనిలో 1 పీసు అంటే, 1 కుర్చీని చెయ్యడం కావచ్చు. నేత పనిలో 1 పీసు అంటే, 10 మీటర్ల బట్టని నెయ్యడం కావచ్చు. గోడ కట్టే పనిలో 1 పీసు అంటే, 60 ఘనపుటడుగుల గోడని కట్టడం కావచ్చు. బస్సు నడిపే పనిలో 1 పీసు అంటే, 100 కిలో మీటర్ల దూరం బస్సు నడపడం కావచ్చు. ఇలా, పీసు అంటే ఒక్కో శ్రమలో ఒక్కో రకం లెక్క ఉంటుంది.

పీసు రేటు — ఎలా నిర్ణయమవుతుంది? ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు, పీసు రేటులో ఎలాంటి మార్పు జరుగు తుంది? కార్మిక వర్గానికి టైమ్ వేజ్ మంచిదా, పీస్ వేజ్ మంచిదా?— ఈ విషయాలన్నీ ఇక్కడ చూస్తాం.

కార్మికులు టైమ్ వేజ్ పద్ధతిలో పని చేసినా, పీస్ వేజ్ పద్ధతిలో పని చేసినా, కార్మికులు ఉత్పత్తి చేసిన దాంట్లో నించే 'శ్రమ శక్తి విలువా, అదనపు విలువా' రెండూ రావాలి. అంటే, 'పీస్ వేజ్'లో కూడా, కార్మికుడు తయారుచేసిన పీసుల్లో నించి కార్మికుడికి వచ్చేది, 'శ్రమ శక్తి విలువ'గా మాత్రమే వుంటుంది. 'జీతం' అనేది ఏ పద్ధతిలో అందినా,

అది 'శ్రమ శక్తి విలువ'గా మాత్రమే వుంటుందనేది — అన్ని పద్ధతులకూ వర్తించే తిరుగు లేని జనరల్ సూత్రం.

ఒక పని దినం 10 గం.లు. (షిఫ్టు పద్ధతి వుండే చోట 10 గం.ల పని దినం వుండదు. కానీ, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం పని దినాన్ని 10 గం.లుగా అనుకుంటాం. దీని ద్వారా చూసే విషయాలతోనే 8 గం.ల పని దినాన్ని కూడా అర్థం చేసుకోవచ్చు).

పని దినం 10 గం.లు. దాని విలువ 10 రూ.లు. శ్రమ శక్తి విలువ 5 రూ.లు. ఇక్కడ వున్న ఉత్పత్తి శక్తిని బట్టి, కార్మికుడు 10 గం.ల పని దినంలో సాధారణంగా 10 పీసులు చెయ్యగలడనుకుందాం. అంటే ఈ ఉదాహరణలో, కార్మికుడికి 10 పీసులు చెయ్యడం ద్వారానే 'శ్రమ శక్తి విలువ'గా 5 రావాలి. అంటే ఒక్కొక్క పీసుకీ రేటు అర్ధ రూపాయి అవుతుంది.

ఏ శ్రమని తీసుకున్నా, 1 పని దినంలో ఉత్పత్తి అయ్యే పీసుల సంఖ్యకు ఒక జనరల్ లెక్క ఉంటుంది. ఆ 'శ్రమ శక్తి విలువ'కు కూడా ఒక జనరల్ లెక్క ఉంటుంది. ఈ 2 విషయాల వల్లా, ఆ శ్రమకు సంబంధించిన పీసు రేటు ఏర్పడుతుంది.

పీసు రేటు సూత్రం = శ్రమ శక్తి విలువా ÷ జనరల్ పీసుల సంఖ్యా.

5 జీతం, 10 పీసుల ద్వారా రావాలి. ఈ ఉదాహరణలో, పీసు రేటు అర్ధ రూపాయి. ఇదే ఒక పీసు చేసినందుకు జీతం. లేదా ఆదాయం. ఈ లెక్కన, ఎక్కువ పీసులు చేసుకునే కార్మికుడికి ఎక్కువ ఆదాయం వుంటే, తక్కువ పీసులు చేసుకునే కార్మికుడికి తక్కువ ఆదాయం ఉంటుంది. ఎక్కువా, తక్కువా కాకుండా సగటు (జనరల్) పీసులు మాత్రమే చేసుకునే కార్మికుడికి, సాధారణంగా రావలసిన 'శ్రమ శక్తి విలువ' మాత్రమే వస్తుంది.

ఈ ఉదాహరణలో, 1 పీసు చేసినందుకు జీతం అర్ధ రూపాయి కదా? ఇక్కడ అదనపు విలువ రేటుని 100% అనుకుందాం. కార్మికుడు 1 పీసుకి తన శ్రమ ద్వారా 1 రూపాయి విలువని చేరుస్తాడు. ఆ పీసుకి వుండే మొత్తం విలువ ఇంకా ఎక్కువగా వుంటుంది. అందులో 'ఉత్పత్తి సాధనాల' విలువ కూడా వుంటుంది కాబట్టి. ఆ ఉత్పత్తి సాధనాల భాగమూ, కార్మికుడి శ్రమ విలువా కలిసి, అదే పీసుకి మొత్తం విలువ అవుతుంది. కానీ పీసుకి వుండే 'మొత్తం విలువ' సంగతి ఇక్కడ అనవసరం. 1 పీసుకి, కార్మికుడి సజీవ శ్రమ ద్వారా చేరే రూపాయి సంగతే ఇక్కడ కావాలి. పెట్టుబడిదారుడు, 1 పీసుని అమ్మి, కార్మికుడి ద్వారా దానికి చేరిన రూపాయి విలువలో నించి అర్ధ రూపాయిని జీతంగా ఇచ్చి, ఇంకో అర్ధని తను తీసుకుంటాడు.

ఒక పని దినంలో కార్మికుడు చేసే 10 పీసులకూ ఇలాగే చూస్తే, 10 పీసుల నించి జీతం 5 రూ.లు. అదనపు విలువ 5 రూ.లు.

'టైమ్ వేజ్' అయినా, 'పీస్ వేజ్' అయినా, జీతాలు ఇవ్వడంలో తేడాలే గానీ, అసలు సారాంశంలో తేడాలేమీ ఉండవు. సారాంశం అంటే : జీతాలు ఇచ్చే పద్ధతి ఎలా వున్నా, శ్రమ చేసేది కార్మికులే. పని స్థలంలో బట్టని నెయ్యవలసి వుంటే, టైమ్ వేజ్‌లో అయినా, పీస్ వేజ్‌లో అయినా, బట్టని కార్మికులు నెయ్యవలిసిందే. దాని ద్వారా 'శ్రమ శక్తి విలువ'ని పునరుత్పత్తి చెయ్యవలిసిందే. అదనపు విలువని కొత్తగా ఉత్పత్తి చెయ్యవలిసిందే. అన్నీ జరగవలిసిందే.

ఈ సారాంశం అంతా ఇలా వుంటూనే, టైమ్ వేజ్‌కీ, పీస్ వేజ్‌కీ కొన్ని తేడాలు వుంటాయి. వాటినే సరిగా అర్థం చేసుకోవాలి.

పీసు అన్నప్పుడు, అందులో 'ఉత్పత్తి సాధనాల' విలువా, 'సజీవ శ్రమ విలువా' కూడా వుంటాయి. కానీ, 'ఉత్పత్తి సాధనాల విలువ'తో ఇక్కడ అవసరంలేదు కాబట్టి దాన్ని వదిలేసి, 'సజీవ శ్రమ విలువ' భాగాన్నే తీసుకుందాం. 1 పీసులో వుండే సజీవ శ్రమ విలువని, 1 రూ. అనుకున్నాం. కాబట్టి 1 రూ. విలువ గల భాగాన్నే 1 పీసుగా అనుకుందాం. అంటే, ఇప్పటి నించి, 1 పీసు అంటే, అందులో 'ఉత్పత్తి సాధనాల' భాగం లేదనీ, 'సజీవ శ్రమ' భాగం మాత్రమే ఉందనీ అనుకోవాలి.

కార్మికుడి శ్రమ విలువ 10 రూ.లు. అంటే 10 పీసులు. అందులో జీతం 5 పీసులూ, అదనపు ఉత్పత్తి 5 పీసులూ.

ఇప్పుడు అన్ని శాఖలలోనూ, బంగారం శాఖలో కూడా, ఉత్పత్తి శక్తులు పెరిగాయనుకుందాం. 1 పని దినంలో 10 పీసులు చేసే ఉత్పత్తి శక్తి మారి, రెట్టింపు ఉత్పత్తి సాధ్యమయ్యే కొత్త ఉత్పత్తి శక్తి వచ్చిందనుకుందాం. అంటే, ఇప్పుడు, 1 కార్మికుడు 1 పని దినంలో జనరల్‌గా 10 పీసులు గాక, 20 పీసులు చేస్తాడు. గతంలో 10 పీసులకు పట్టిన శ్రమే ఇప్పుడు 20 పీసులకు పడుతుంది. గతంలో 10 పీసులకు వున్న విలువే ఇప్పుడు 20 పీసులకు ఉంటుంది. ( ఇది సజీవ శ్రమ మాత్రమే వున్న పీసుల సంగతి. ఈ పీసుల్లో ఉత్పత్తి సాధనాల విలువ లేదని అర్థం. ) అప్పుడూ ఇప్పుడూ కూడా ఒక పని దినమే (10 గం.లే) ఖర్చయింది.

ఇప్పుడు, పీసు విలువ సగమే అవుతుంది.

అయితే డబ్బు విలువ కూడా సగమే అవుతుంది.

పీసు విలువా, డబ్బు విలువా కూడా సగమే అవడం

వల్ల, 1 పీసు విలువ ఇప్పుడు కూడా 1 రూ. గానే వుంటుంది.

| | | | |
|---|---|---|---|
| గతంలో, | 1 పీసు | = | 1 రూ. |
| | (1 గంట) | | (1 గంట) |
| ఇప్పుడు, | 2 పీసులు | = | 2 రూ. |
| | (1 గంట) | | (1 గంట) |
| ఇప్పుడు, | 1 పీసు | = | 1 రూ. |
| | ($\frac{1}{2}$ గంట) | | ($\frac{1}{2}$ గంట) |

ఇప్పుడు కూడా 'పని దినం' 10 గంటలే. కానీ, ఇప్పుడు దాని విలువ 20 రూ.లు. ప్రతీ గంట విలువా 2 రూ.లు (2 పీసులు) అయితే, ఇప్పుడు 'పీసు రేటు' ఎంత?

జీతాన్ని, పీసుల సంఖ్యతో భాగిస్తే, అదే పీసు రేటు. అయితే, ఇప్పటి 'జీతం' ఎంత? 'జీతం' అంటే 'శ్రమ శక్తి విలువ' కదా? గతంలో శ్రమ శక్తి విలువ — 5 పీసులు. (5 రూ.లు) కొత్త ఉత్పత్తి శక్తిలో, శ్రమ శక్తి విలువ కొంచెం పెరగాలి. కాబట్టి, ఇప్పటి శ్రమ శక్తి విలువని 7 పీసులు అనుకుందాం. అంటే, 7 రూ.లు.

ఇప్పుడు కార్మికుడు '1 పని దినం'లో చేసే 20 పీసుల ద్వారా అతనికి 7 రూ.లు రావాలి.

1 పీసుకి రేటు = 7 రూ.ల జీతం÷20 పీసులు = 35 పైసలు

1 పీసుకి 35 పైసల చొప్పున, 20 పీసులు చేస్తే, 7 రూ.లు వస్తాయి. అదే జీతం. పెరిగిన జీతం.

కార్మికుడు, 1 పీసుకి చేర్చిన విలువ 1 రూ. కదా? పీసు విలువ నించి దాని జీతాన్ని తీసివేస్తే, మిగిలినది అదనపు విలువ. 1 పీసు నించీ అదనపు విలువ = 65 పైసలు. 20 పీసుల నించీ అదనపు విలువ = 20 × 65 ÷ 100 = 13 రూ.లు.

1 కార్మికుడు, 1 పని దినంలో ఇచ్చే 20 పీసుల విలువ 20 రూ.లు. అందులో నించి 7 జీతం పోతే, అదనపు విలువ 13. రూ.లు.

గతంలో — జీతం 5. అదనపు విలువ 5.
అదనపు విలువ రేటు 100%.

ఇప్పుడు — జీతం 7, అదనపు విలువ 13.
అదనపు విలువ రేటు 186%.

అంటే, ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు ఇక్కడ ఏం జరిగింది? ఒక కార్మికుడు, ఒక పనిదినంలో చేసే పీసుల సంఖ్య పెరిగింది. 1 పీసు విలువ తగ్గింది. కార్మికుడికి ఇచ్చే పీసు రేటు తగ్గింది. కార్మికుడి జీతం కొంచెం పెరిగింది. కానీ, అది కొత్త శ్రమ శక్తి విలువగా మాత్రమే ఉంటుంది. అదనపు విలువ గతం కన్నా పెరుగుతుంది. ఈ ఉదాహరణని గతంతో పోలిస్తే, పని దినంలో అవసర కాలం తగ్గి, అదనపు కాలం పెరుగుతుంది.

ఇలాగే, సామాజిక ఉత్పత్తి శక్తి పెరిగినట్టుగా ఇంకా కొన్ని ఉదాహరణలు చూస్తే, ఉత్పత్తి శక్తి పెరిగేకొద్దీ 'పని దినం'లో పీసుల సంఖ్య పెరుగుతుంది. పీసు రేటు తగ్గుతుంది.

అంటే, 'ఉత్పత్తి శక్తి పెరిగితే, దోపిడీ స్థాయి పెరుగుతుంది' అనే విషయం 'టైమ్ వేజ్'లో అయినా, 'పీస్ వేజ్'లో అయినా ఒక్క లాగే వుంటుంది.

కార్మికుడు, 1 పని దినంలో ఎన్ని పీసులు చెయ్యాలో అన్నీ చెయ్యకపోతే 'శ్రమ శక్తి విలువ'ని సంపాదించు కోలేడు. కాబట్టి, శ్రమ చెయ్యడం అనేది, ఈ పద్ధతిలో కూడా, సగటు కాలం ప్రకారమే జరగవలసి వుంటుంది. ఒక శ్రమలో ఉత్పత్తి శక్తి ఏ స్థాయిలో వుందో పీస్ వేజ్ పద్ధతిలోనే ఖచ్చితంగా కనపడుతుంది.

'విలువ' అనేది ఎప్పుడూ 'టైము'కి సంబంధించిన విషయమే. 1 పీసు చేసినందుకు వచ్చే రేటు కన్నా, 2 పీసులు చేసినందుకు వచ్చే రేటు రెట్టింపుగా వుంటుంది. ఎందుకంటే 1 పీసు చేసినందుకు పట్టే కాలం కన్నా 2 పీసులు చేసినందుకు పట్టే కాలం రెట్టింపుగా వుంటుంది కాబట్టి. అంటే 'పీస్ రేటు'లో కూడా విలువ నిర్ణయమయ్యేది, ఉత్పత్తికి పట్టే శ్రమ కాలాన్ని బట్టే. టైమ్ వేజ్‌లో అయినా, పీస్ వేజ్‌లో అయినా విలువ అనేది శ్రమ కాలమే.

కాబట్టి, <u>'పీస్ వేజ్' అనేది, 'టైమ్ వేజ్'కి ఇంకో రూపం మాత్రమే.</u>

అయితే, ఈ 2 పద్ధతుల సారాంశమూ ఒకటే అయినా, ఇందులో 'పీస్ వేజ్' పద్ధతే పెట్టుబడిదారుడికి ఎక్కువ అనుకూలంగా వుంటుంది. ఎందుకంటే :

| 'టైమ్ వేజ్' లో : | 'పీస్ వేజ్' లో : |
|---|---|
| **1)** కార్మికుడు, పని శ్రద్ధగా చేసినా చెయ్యక పోయినా, 'పని దినం' పూర్తి అయితే జీతం ఇచ్చి తీరాలి. కార్మికులు పని సరిగా చేసే లాగ చూడడానికి అజమాయిషీ ఉద్యోగులు వుండి తీరాలి. అజమాయిషీ పనుల కోసం పెట్టుబడి దారుడికి తప్పనిసరిగా కొన్ని ఖర్చులు అవుతాయి. | **1)** కార్మికులు 1 పని దినంలో కనీసం ఎన్ని పనులు చెయ్యాలో అన్నీ చెయ్యకపోతే శ్రమ శక్తి విలువని సంపా దించడం సాధ్యం కాదు. కాబట్టి, కార్మికులు తమ స్వంత బాధ్యత తోనే పని చేసుకుంటారు. కార్మికుల మీద అజ మాయిషీ అంతగా వుండనక్కరలేదు. పెట్టుబడిదారుడికి అజ మాయిషీ ఖర్చులు కొన్ని కలిసి వస్తాయి. |

| | |
|---|---|
| **2)** పని 'నాణ్యం'గా చేసినా చెయ్యక పోయినా, జీతం వస్తుంది కాబట్టి 'నాణ్యత' విషయంలో కార్మికులు శ్రద్ధ పట్టరని పెట్టుబడిదారుడు భావిస్తాడు. ఈ విషయంలో కూడా అజమాయిషీ వుంటుంది. | **2)** పీసులు ఎంత నాణ్యంగా వుండాలో అంత నాణ్యంగా వుండకపోతే పెట్టుబడిదారుడు వాటికి చెల్లించేదాన్ని తగ్గించేస్తాడు. కాబట్టి నాణ్యత విషయం కూడా కార్మికుడే చూసుకోవలసి వుంటుంది. అజమాయిషీ ఖర్చులు వుండవు. |
| **3)** 'టైమ్ వేజ్'లో, సాధారణంగా జరగవలసిన పని కన్నా ఎక్కువ పని జరక్క పోవచ్చు. ఉత్పత్తి సాధనాలు ఖర్చు అవడం తొందరగా జరగదు. | **3)** ఎక్కువ పీసులు చేస్తే కార్మికుడికి ఎక్కువ రాబడి వుంటుంది కాబట్టి, కార్మికులు, శ్రమ తీవ్రతని పెంచి ఎక్కువ పీసులు చెయ్యడానికే ప్రయత్నిస్తారు. దీని వల్ల పెట్టుబడిదారుడి ఉత్పత్తి సాధనాలు త్వర త్వరగా ఖర్చవుతాయి. ఫిక్సెడ్ సాధనాల మీద పెట్టిన పెట్టుబడి త్వర త్వరగా వెనక్కి వస్తూ వుంటుంది. |
| **4)** కార్మికుల శక్తి సామర్థ్యాల్లో ఎన్ని తేడాలు వున్నా అందరికీ ఆదాయాలు ఒకే పద్ధతిలో వుంటాయి. దీని వల్ల కార్మికుల మధ్య అసూయా ద్వేషాలకు అవకాశం వుండదు. అందరూ ఐకమత్యంగా వుంటారు. ఇది పెట్టుబడిదారుడికి రాజకీయంగా చాలా నష్టం. | **4)** కార్మికుల శక్తి సామర్థ్యాలు తప్పనిసరిగా తేడాగా ఉంటాయి కాబట్టి, దీనివల్ల కార్మికుల పనిలో తప్పనిసరిగా తేడాలు ఉంటాయి. అంటే, వారి 'ఆదాయాలలో' తేడాలు వుంటాయి. దానివల్ల కార్మికుల మధ్య పోటీ, ఘర్షణా, వ్యక్తిగత అసూయలూ ఏర్పడతాయి. ఇది కార్మికుల ఐక్యతని పాడు చేస్తుంది. అంటే ఇది, కార్మికులంతా సమిష్టిగా వుంటూ పెట్టుబడిదారుడి మీద పోరాడే శక్తిని పాడు చేస్తుంది. ఇది పెట్టుబడిదారుడికి 'రాజకీయంగా' ఎంతో అనుకూలించే విషయం. |

ఈ రకంగా, 'టైమ్ వేజ్' పద్ధతి కన్నా 'పీస్ వేజ్' పద్ధతి పెట్టుబడిదారుడికి ఎంతో అనుకూలించే విషయంగా వుంటుంది. పెట్టుబడిదారుడికి అనుకూలించే విషయంగా వుందంటే, అది కార్మికులకు హాని చేసే విషయంగా వుందన్న మాట!

> "శాల్తీ వేతనం (పీస్ వేజ్) అన్నది, కాలం వేతనం (టైమ్ వేజ్) యొక్క మారిన రూపం మాత్రమే... శాల్తీ వేతన రూపం అన్నది, కాలం వేతన రూపంలాగే నిర్హేతుకం... శాల్తీ వేతనం అన్నది, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అత్యంత అనుకూలమైన వేతనాల రూపం"— మార్క్స్ (కాపిటల్–1, విశాలాంధ్ర అనువాదం, పేజీలు :
>
> 506, 507, 510).

పీస్ వేజ్ పద్ధతి వల్ల కార్మికులకు జరిగే ప్రత్యేక నష్టాలు ఇంకా కొన్ని వున్నాయి. పీస్ వేజ్‌లో కార్మికులు శ్రమ తీవ్రతని పెంచి పని చేస్తారు కాబట్టి, వారి ఆరోగ్యాలు త్వర త్వరగా పాడవుతాయి. 'పీస్ వేజ్'లో చురుగ్గా పనిచేసే వారికే ఎక్కువ ఆదాయం వుంటుంది కాబట్టి, చిన్న వయసు కార్మికుల ఆదాయాలకూ, వయసు మళ్ళిన వారి ఆదాయాలకూ, తప్పనిసరిగా తేడాలు ఏర్పడతాయి. కార్మికుల దృష్టిలో కూడా, వయసు మళ్ళిన వారి పట్ల విలువ తగ్గుతుంది.

పెట్టుబడిదారుడు అందించే ఉత్పత్తి సాధనాలు గానీ ముడి పదార్థాలు గానీ నాణ్యమైనవి కాకపోతే, కార్మికులు ఎంత శ్రద్ధగా పని చేసినా పని కుంటుపడి తయారయ్యే వస్తువుల సంఖ్య తగ్గిపోతుంది. టైమ్ వేజ్‌లో అయితే, ఈ నష్టం పెట్టుబడిదారుడే అనుభవించాలిగానీ, కార్మికులకు పోయేదేమీ వుండదు. పీస్ వేజ్‌లో అయితే, ఈ నష్టం కార్మికుల నెత్తిన పడుతుంది. శ్రమ పరికరాలు మంచివి కాకపోయినా, పీసుల సంఖ్య తగ్గిపోతుంది. ఈ రకంగా, పీస్ వేజ్ పద్ధతి కార్మికులకు అనేక విధాలుగా హానికరంగా వుంటుంది.

**కానీ, శ్రద్ధగా పనిచేసే కార్మికులకు టైమ్ వేజ్ కన్నా పీస్ వేజే 'మంచిదిగా' కనపడుతుంది. ఈ విషయం కొంచెం వివరంగా చూడాలి.**

కార్మికుల్లో కొందరు సగటు కన్నా ఎక్కువ పనిచేస్తే, కొందరు సగటు కన్నా తక్కువ పనిచేస్తారు. ఈ 'తక్కువ పని చేసే'వారిని, 2 రకాలుగా విభజించవచ్చు. స్వతహాగా వుండే మందగొడితనం వల్లా, కొన్ని రకాల అనారోగ్యాల వల్లా, వృద్ధాప్యం వల్లా, తక్కువ పని చేసేవారు ఒక రకం. అన్ని పరిస్తితులూ సరిగానే వుండీ, పని చెయ్యగలిగే శక్తి సామర్థ్యాలు వుండీ కూడా పని సరిగా చెయ్యకుండా తప్పించుకుంటూ తక్కువ పని చేసేవారు —రెండో రకం. ఈ 2 రకాల వారి వల్లా, పని శ్రద్ధగా చేసే కార్మికులకు,

'టైమ్ వేజ్'లో ఏం జరుగుతుందో, 'పీస్ వేజ్'లో ఏం జరుగుతుందో చూద్దాం.

పని దినం 10 గంటలు. కార్మికుడు, ఆ 10 గంటల్లోనూ ఇచ్చే విలువ (సగటున) 10 రూ.లు. జీతం 5. అదనపు విలువ 5. అదనపు విలువ రేటు 100%. 'టైమ్ వేజ్'లో అయినా, 'పీస్ వేజ్'లో అయినా ఈ వివరాలన్నీ ఇలాగే వున్నాయి అనుకుందాం.

ఒక చురుకైన కార్మికుణ్ణీ, ఒక మందగొడి కార్మికుణ్ణీ తీసుకుని విషయాలు చూడాలి.

చురుకైన కార్మికుడు, 1 పని దినంలో 11 విలువ గల శ్రమా, మందగొడి కార్మికుడు 9 విలువ గల శ్రమా చేస్తారనుకుందాం. జీతాల్ని ఇచ్చే పద్ధతి ఎలా వున్నా వారి శ్రమలు అలాగే జరుగుతాయి. చురుకైన కార్మికుడు, ఏ పద్ధతిలోనైనా చురుగ్గానే పని చేస్తాడు. మందగొడి కార్మికుడు ఏ పద్ధతిలోనైనా మందగొడిగానే పనిచేస్తాడు. శారీరకంగా వుండే చురుకుదనమూ, మందగొడితనమూ అనేవి, జీతాల్ని ఇచ్చే పద్ధతిని బట్టి మారవు.

## 'టైమ్ వేజ్' ప్రకారం :

'పని దినం'లో చురుకైన కార్మికుడు ఇచ్చే విలువ 11. అతని జీతం 5. అతని నించి అదనపు విలువ 6.

మందగొడి కార్మికుడు ఇచ్చే విలువ 9. అతని జీతం 5. అతని నించీ అదనపు విలువ 4.

ఇద్దరు కార్మికులకూ కలిసి జీతాలు ......... 5 + 5 = 10

ఇద్దరు కార్మికులూ ఇచ్చిన అదనపు విలువ 6 + 4 = 10

ఇద్దర్నీ కలిపితే, అదనపు విలువ రేటు 100%

ఇద్దరు కార్మికులకూ ఒకే రకంగా 'శ్రమ శక్తి విలువ' (5 జీతం) అందింది. అయితే పెట్టుబడిదారుడికి చురుకైన కార్మికుడి నించి ఎక్కువ అదనపు విలువా, మందగొడి కార్మికుడి నించి తక్కువ అదనపు విలువా వచ్చాయి. ఏ కార్మికుడి విలువ లెక్కల్ని ఆ కార్మికుడికి విడి విడిగా చూస్తే, మొదటి కార్మికుడి నించి వచ్చిన అదనపు విలువ 100% కన్నా ఎక్కువ గానూ, రెండో కార్మికుడి నించి వచ్చిన అదనపు విలువ 100% కన్నా తక్కువగానూ వుంటాయి. ఇద్దరి అదనపు విలువల్నీ కలిపితేనే అది 100% అయింది.

## పీస్ వేజ్ ప్రకారం :

విలువ అంశాలన్నీ టైమ్ వేజ్‌లో వున్నట్టే అనుకోవాలి. పని దినం 10 గం. దాని విలువ 10 రూ.లు. 1 కార్మికుడు చెయ్యవలసిన సగటు పీసుల సంఖ్య 10. అంటే, కార్మికుడి శ్రమ ద్వారా 1 పీసుకి చేరే విలువ 1 రూ. పీసు రేటు $\frac{1}{2}$ రూ. అంటే, కార్మికుడు పీసుకి చేర్చే 1 రూపాయి విలువలో, సగం — జీతమూ, సగం — అదనపు విలువా. ఇక్కడ కూడా అదనపు విలువ రేటు 100%.

చురుకైన కార్మికుడు, పని దినంలో 11 పీసులు చేస్తాడనుకుందాం. పీసు రేటు ప్రకారం అతనికి వచ్చే జీతం $5\frac{1}{2}$ . అతని నించి పోయే అదనపు విలువ $5\frac{1}{2}$ .

మందగొడి కార్మికుడు 9 పీసులు చేస్తాడనుకుందాం. పీసు రేటు ప్రకారం అతనికి వచ్చే జీతం $4\frac{1}{2}$ ; అతని నించి పోయే అదనపు విలువ $4\frac{1}{2}$ .

ఇద్దరి జీతాల మొత్తం $5\frac{1}{2} + 4\frac{1}{2} = 10$.
అదనపు విలువ మొత్తం $5\frac{1}{2} + 4\frac{1}{2} = 10$.

ఇప్పుడు కూడా అదనపు విలువ రేటు 100%

పెట్టుబడిదారుడికి, టైమ్ వేజ్‌లో అయినా, పీస్ వేజ్‌లో అయినా, 'అదనపు విలువ రేటు' ఒక్కలాగే వుంది.

అయితే, ఈ చురుకూ, మందగొడీ అయిన కార్మికుల విషయంలో, టైమ్ వేజ్ ప్రకారం ఏం జరిగింది? 'పీస్ వేజ్' ప్రకారం ఏం జరిగింది?— ఇది చూడాలి.

1 వ కార్మికుడికి — టైమ్ వేజ్‌లో, జీతం 5. అ.వి. 6.
పీస్ వేజ్‌లో జీతం $5\frac{1}{2}$ . అ.వి. $5\frac{1}{2}$ .

అంటే, పీస్ వేజ్‌లో, జీతం $\frac{1}{2}$ పెరిగి, అది అదనపు విలువలో నించి తగ్గింది. ఈ కార్మికుడికి, 'టైమ్ వేజ్'లో శ్రమ శక్తి విలువ మాత్రమే అందితే, పీస్ వేజ్‌లో, శ్రమ శక్తి విలువ కన్నా కొంత ఎక్కువ అందింది. అందుకే ఇతనికి, టైమ్‌వేజ్ కన్నా పీస్ వేజే మంచిదిగా కనపడుతుంది.

2 వ కార్మికుడికి, టైమ్ వేజ్‌లో జీతం 5. అ.వి. 4
పీస్ వేజ్‌లో, జీతం $4\frac{1}{2}$ . అ.వి. $4\frac{1}{2}$ .

అంటే ఇతనికి, టైమ్ వేజ్‌లో శ్రమ శక్తి విలువ— అందితే, పీస్ వేజ్‌లో అది పూర్తిగా అందదు.

కానీ ఈ 2 పద్ధతులూ చూసి, చురుకైన కార్మికుడు ఏమంటాడంటే— "అతను నా లాగా చురుగ్గా పని చెయ్యడు. చురుగ్గా పని చేసే వాళ్ళకీ మందగొడిగా పని చేసే వాళ్ళకీ కూడా ఒకే రకంగా జీతం రావడం ఏం న్యాయం? ఎవరి పనిని బట్టి వాళ్ళకి రావాలి కదా? నాకు టైమ్ వేజ్‌లో 5 జీతం వస్తే, పీస్ వేజ్‌లో $5\frac{1}{2}$ వచ్చింది. కాబట్టి టైమ్ వేజ్ కన్నా పీస్ వేజ్ చాలా న్యాయమైంది" అంటాడు.

అంటే, చురుకైన కార్మికుడు, తను మాత్రమే బాగా పనిచేశాననీ, మందగొడి కార్మికుడు 5 జీతం తీసుకోగలిగే పని కూడా చెయ్యలేదనీ అనుకుంటాడు. కానీ, అసలు నిజం ఏమిటి?

మందగొడి కార్మికుడు కూడా ఎంత మందగొడిగా పనిచేసినా, 9 విలువ గల పని చేశాడు. అతని 'శ్రమ విలువ' అంతా అతనికే దక్కితే, అతని పోషణకి సమస్యే వుండదు. కానీ ఆ విధంగా కార్మికుడి 'శ్రమ విలువ' అంతా కార్మికుడికే దక్కడం అనేది, టైమ్ వేజ్ లోనూ జరగదు, పీస్ వేజ్ లోనూ జరగదు. అయితే, 'టైమ్ వేజ్' లో అయితే కార్మికుడికి, కనీసం 'శ్రమ శక్తి విలువ' అయినా అందుతుంది. అంటే, టైమ్ వేజ్‌లో, కార్మికుడికి, జీతంగా 5 వచ్చాకే మిగిలిన 4, పెట్టుబడిదారుడికి పోతుంది. కానీ 'పీస్ వేజ్'లో అయితే, ఈ ఉదాహరణ ప్రకారం, పీస్ రేటు లెక్క వల్ల, కార్మికుడికి 'శ్రమ శక్తి విలువ' కూడా అందదు. $4\frac{1}{2}$ మాత్రమే అందుతుంది. దీన్ని చూసి చురుకైన కార్మికుడు సంతృప్తి చెంది "మందగొడి కార్మికుడికి జీతం తగ్గడం న్యాయమే" అనుకుంటాడు. అంటే, మందగొడి కార్మికుడు '5 జీతం' తీసుకోదగ్గ పని కూడా చెయ్యలేదని భావిస్తాడు.

ఇద్దరికీ 'శ్రమ శక్తి విలువ'ని ఇచ్చే టైమ్ వేజ్ అంటే, చురుకైన కార్మికుడికి అన్యాయమైన పద్ధతిగా కనపడు తుంది. తనకు ఒక $\frac{1}{2}$ రూ. ఆదాయాన్ని పెంచే పీస్ వేజే, అది రెండో కార్మికుడికి $\frac{1}{2}$ రూ. ఆదాయాన్ని తగ్గించినా సరే, న్యాయమైనదిగా కనపడుతుంది.

తనకు ఒక $\frac{1}{2}$ రూ. ఆదాయాన్ని పెంచడం వల్ల, చురుకైన కార్మికుడికి, పీస్ వేజే న్యాయమైనదిగా కనపడితే, ఆ పీస్ వేజ్ లోనే, ఆ చురుకైన కార్మికుడు పెట్టుబడిదారుడి కోసం పోగొట్టుకునే '$5\frac{1}{2}$ అదనపు విలువ' మాట ఏమిటి? ఆ 'అన్యాయం' మాట ఏమిటి?

అంతేకాదు, ఆ పీస్ వేజ్ లోనే మందగొడి కార్మికుడు కూడా పెట్టుబడిదారుడి కోసం పోగొట్టుకునే $4\frac{1}{2}$ అదనపు విలువ మాట ఏమిటి?— ఈ విషయాలేవీ ఏ కార్మికుడికీ తెలియవు.

ఇప్పుడు, 'శ్రద్ధగా పని చేసే' కార్మికుణ్ణీ, చెయ్యగలిగే శక్తి వుండి కూడా 'పని ఎగవేసే' కార్మికుణ్ణీ తీసుకుంటే, ఈ ఉదాహరణ కూడా 'చురుకైన — మందగొడి' కార్మికుల ఉదాహరణ లాంటిదే. పని ఎగవేసే కార్మికుడు, ఎంత పని ఎగవేసేవాడైనా రోజు మొత్తం మీద ఎంతో కొంత పని చెయ్యకుండానూ, పని స్థలంలోకి రాకుండానూ, షిఫ్టులు చెయ్యకుండానూ వుండడు. (అతను పెట్టుబడిదారుడికి బంటుగా మారి, పెట్టుబడిదారుడి అనుమతితోనే పని ఎగవేస్తే తప్ప. అలాంటి వాడైతే అది వేరు.)

'పని దినం'లో సగటున 10 విలువ గల శ్రమ చెయ్య వలసిన చోట, పని ఎగవేసే కార్మికుడు 6 విలువ గల శ్రమ మాత్రమే చేస్తాడనుకుందాం. జీతం 5 అను కుందాం.

టైమ్ వేజ్‌లో అయితే — పని ఎగవేసే కార్మికుడికి కూడా 5 జీతం వచ్చి, పెట్టుబడిదారుడికి 1 మాత్రమే మిగులుతుంది.

పీస్ వేజ్‌లో అయితే — ఈ కార్మికుడు 6 పీసులు మాత్రమే చేస్తాడనుకుందాం. ఈ రకంగా కూడా ఈ కార్మి కుడి శ్రమ విలువ 6. కానీ, పీసు రేటు ప్రకారం, ఈ కార్మికుడికి జీతంగా 3 మాత్రమే వచ్చి, పెట్టుబడిదారుడికి 3 పోతుంది. ఈ కార్మికుడి శ్రమ అంతా, 6 అంతా, ఇతనికే వస్తే, ఇతను ఎంత పని ఎగవేసినా, ఇతని పోషణకి ఏమీ సమస్య వుండదు.

కానీ, పని శ్రద్ధగా చెయ్యని కార్మికుణ్ణి చూసినప్పుడు, శ్రద్ధగా పనిచేసే కార్మికుడికి ఏమనిపిస్తుందంటే, శ్రద్ధగా పని చెయ్యని కార్మికుడికి టైమ్ వేజ్ ప్రకారం 5 జీతం రావడం కన్నా, పీస్ వేజ్ ప్రకారం 3 జీతం రావడమే న్యాయం — అనిపిస్తుంది. "శ్రద్ధగా పనిచేసే వాళ్ళకీ, శ్రద్ధగా పని చెయ్యని వాళ్ళకీ కూడా ఒకటే జీతమా? ఇదేం న్యాయం?" అనిపిస్తుంది. కానీ, శ్రద్ధగా పని చెయ్యని కార్మికుడు కూడా ఎంతో కొంత పనిచేసి తీరతాడు కదా? ఎంతో కొంత 'అదనపు విలువ'ని పోగొట్టుకుంటాడు కదా? ఆ కార్మికుడు కూడా పోగొట్టుకునే 'అదనపు విలువ' మాటేమిటి? అతని అదనపు విలువని పెట్టుబడిదారుడు లాక్కోవడంలో వున్న అన్యాయం మాటేమిటి? — ఇవేవీ తెలియవు.

ఒకవేళ, పని ఎగ్గొట్టే కార్మికుడు, అదనపు విలువని ఇచ్చేటంత పని చెయ్యలేదని అనుకుంటే, కనీసం 'తన జీతం కోసం సరిపోయేటంత' పని అయినా చేసి తీరాలి. అది కూడా చెయ్యకుండా తప్పించుకోలేడు. పని అంతగా ఎగ్గొట్టే వాణ్ణి పెట్టుబడిదారుడు పనిలోనే వుంచడు. తన జీతానికి తగిన పనిచేసే వాడు, జీతం తీసుకోవడంలో అన్యాయమేమీ వుండదు. అతని ద్వారా అదనపు విలువ వెళ్ళకపోతే, అది పెట్టుబడిదారుడి సమస్యే గానీ కార్మికుల సమస్య కాదు.

జీతానికి తగినంత పని కూడా చెయ్యని కార్మికుడు ఎవడైనా వున్నాడనుకుందాం. అలాంటి కార్మికుణ్ణి పెట్టు బడి దారుడు భరిస్తున్నాడంటే, దానికి వేరే కారణాలు వుంటాయి. అలాంటి కార్మికుణ్ణి సగటు కార్మికుడిగా లెక్క కట్టకూడదు.

ఈ టైమ్ వేజ్, పీస్ వేజ్ పద్ధతులకు సంబంధించిన విలువ లెక్కలేవీ కార్మికులకు తెలియవు. చురుకైన కార్మికులకూ, శ్రద్ధగా పనిచేసే కార్మికులకూ, పీస్ వేజ్‌లోనే ఎక్కువ ఆదాయం వుంటుంది కాబట్టి, అదే మంచి పద్ధతిగా వారికి కనపడుతుంది. పీస్ వేజ్ ద్వారా దొరికే తమ

వ్యక్తిగత ఆదాయాలనే చూసుకుంటే అది నిజమే. విషయాల్ని పై పైనే చూస్తే, అది అలాగే కనపడుతుంది.

కానీ, 'దోపిడీ' అనే మూలాన్ని అర్థం చేసుకుంటే, అనేక నిజాలు అర్థమవుతాయి. మందగొడి కార్మికులూ, పని శ్రద్ధగా చెయ్యని కార్మికులూ కూడా జీతాల్ని మించిన శ్రమ చేస్తారనీ, 'అదనపు విలువ'ని పోగొట్టుకుంటా రనీ, అర్థమవుతుంది. అందరికీ ఒకే జీతాలు రావడం అన్యాయం — అనుకునే కార్మికులు, దోపిడీని గనక అర్థం చేసుకుంటే, 'దోపిడీయే అసలు అన్యాయం' అని అర్థమవుతుంది.

టైమ్ వేజ్, — కార్మికులందరికీ 'శ్రమ శక్తి విలువ'ని గ్యారంటీ చేస్తుంది. పీస్ వేజ్‌లో ఆ పని జరగదు. కాబట్టి, పీస్ వేజ్ వల్ల, కొందరు కార్మికులకు ఎక్కువ ఆదాయాలు వచ్చే మార్గం వున్నా, ఆ కార్మికులు, ఇతర కార్మికుల క్షేమం కోసం, పీస్ వేజ్‌ని తిరస్కరించాలి. అది 'శ్రామిక న్యాయం'. శ్రామిక జ్ఞానం.

టైమ్ వేజ్ పద్ధతి కార్మికుల మధ్య ఐక్యతని పెంచితే, పీస్ వేజ్ పద్ధతి వారి మధ్య అనైక్యత కలిగిస్తుంది. కాబట్టి, కార్మికులు 'పీస్ వేజ్ — టైమ్ వేజ్' సమస్యని ప్రధాన సమస్యగా గాక, 'దోపిడీ'నే ప్రధాన సమస్యగా తీసుకోవాలి. దోపిడీ నించి బైట పడగలిగితే, పెట్టుబడిదారుడికి పోయే దంతా కార్మికులకే దక్కుతుంది.

కాబట్టి, చురుగ్గానూ శ్రద్ధగానూ పనిచేసే కార్మికులకు, అసలైన శత్రువులు మందగొడిగానూ, అశ్రద్ధగానూ పని చేసే కార్మికులు కారు. కార్మికులందరికీ అసలు శత్రువులు దోపిడీదారులే.

టైమ్ వేజ్ మంచిదా, పీస్ వేజ్ మంచిదా — అనే ప్రశ్న కార్మిక వర్గాన్నీ పెట్టుబడిదారీ వర్గాన్నీ దృష్టిలో పెట్టుకుని చూడవలసింది గానీ, కార్మిక వర్గంలోనే కొన్ని తేడాల్ని దృష్టిలో పెట్టుకుని చూడవలసింది కాదు. పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలించే పీస్ వేజ్ పద్ధతి, కార్మికవర్గానికి పూర్తిగా వ్యతిరేకమైనది. దాని వల్ల కార్మికులకు అనేక నష్టాలు వున్నా అందులో ప్రధానమైన నష్టం — అది కార్మికుల 'ఐక్యత'ని నాశనం చేస్తుంది. టైమ్ వేజ్ పద్ధతి ఎందుకు మంచిదంటే — శ్రద్ధగా పనిచేసే కార్మికులకు ఆ 'శ్రద్ధ'కు తగిన ప్రతిఫలం, టైమ్ వేజ్‌లో, ఎక్కువ డబ్బు రూపంలో అందకపోయినా, కార్మికుల ఐక్యత రూపంలో అందుతుంది. కార్మికులు తమ ఐక్యత గురించి ఆలోచించడం అంటే, కార్మిక వర్గ చైతన్యంతో ప్రవర్తించడమే. డబ్బు రూపంలో అందని ఆ ప్రతిఫలం, కార్మిక వర్గ చైతన్యం రూపంలో అందుతుంది. అది కార్మిక వర్గ విముక్తికి దారితీస్తుంది. కాబట్టి, కార్మిక వర్గ చైతన్యం గల కార్మికులు, కేవలం తమ ఆదాయాలనే దృష్టిలో పెట్టుకో కూడదు. పీస్ వేజ్ పద్ధతికి ఎంత మాత్రం అనుకూలంగా వుండకూడదు.

కార్మికుల్ని పీస్ వేజ్‌కే అనుకూలంగా మలచడానికే పెట్టుబడిదారులు ఎప్పుడూ ప్రయత్నిస్తారు. "ఎక్కువ కష్టపడ్డ వాళ్ళకీ, తక్కువ కష్టపడ్డ వాళ్ళకీ, ఒకటే జీతాలు రావడం ఏం న్యాయం? తెలివైన కార్మికులు పీస్ వేజ్‌నే ఎంచుకోవాలి" అంటారు వాళ్ళు. పెట్టుబడిదారుడికి కూడా 'న్యాయా న్యాయాలు' తెలుసు! ఎక్కువ కష్టపడే వాళ్ళకీ తక్కువ కష్టపడే వాళ్ళకీ ఒకటే జీతాలు రావడం న్యాయం కాకపోతే, అసలు ఏ కష్టమూ పడని వాళ్ళకి, ఏ పనీ చెయ్యకుండానే ఆదాయాలు రావడం ఏం న్యాయం?— ఈ ప్రశ్న కార్మికులు అడగరు కదా? పెట్టుబడిదారుడికి, కార్మికుల నించి తను లాగే దాని విషయంలో అన్యాయం కనపడదు. కార్మికుల జీతాల పద్ధతికి వచ్చేసరికి మాత్రం 'ఎవరి కష్టార్జితం వారికే దక్కాలి' అని గొప్ప నీతి చంద్రిక లాగా వ్యాఖ్యానాలు చేస్తాడు. కార్మికుల్ని చీల్చడానికి ఎత్తు ఇది.

తెలివైన కార్మికులు రెండో ఆలోచన లేకుండా పీస్ వేజ్ పద్ధతిని తోసివేస్తారు. పెట్టుబడిదారుడితో వాళ్ళు ఇలా అంటారు — "నీ నీతి సూక్తులు గొప్పగానే వున్నాయిలే. ముందు నీ దోపిడీ నించి బైటపడ్డాక, మేం పీస్ వేజ్‌ని పెట్టుకోవాలో, టైమ్ వేజ్‌ని పెట్టుకోవాలో 'తెలివిగానే' ఆలోచించు కుంటాంలే" అంటారు.

ఇంత వరకూ ఇక్కడ చూసిన టైమ్ వేజ్, పీస్ వేజ్ పద్ధతుల్లోనే ఇంకా కొన్ని తేడాలు వుంటే వుండవచ్చును. ఒక్కోసారి రెండూ కలిసి కూడా వుండవచ్చును. కొంత వరకూ టైమ్ వేజీ, దాని కన్నా ఎక్కువగా జరిగిన ఉత్పత్తి విషయంలో పీస్ వేజీ — ఇలా. తయారయ్యే ఉత్పత్తుల స్వభావాన్ని బట్టి ఆ పద్ధతులన్నీ వుంటాయి. యంత్రాల మీద జరిగే కొన్ని రకాల పనుల్లో 'పీస్ వేజ్' సాధ్యం కాదు. అక్కడ పని అంతా యంత్రం స్పీడుని బట్టే వుంటుంది కాబట్టి, టైమ్ వేజ్ అయినా, పీస్ వేజ్ అయినా ఒక్కలాగే వుంటుంది. ఈ పద్ధతులన్నీ నిత్య జీవితంలో కార్మికులకు అనుభవంలోనే వుంటాయి.

జీతాలు ఇవ్వడంలో, ఒకే దేశంలో గానీ, వేరు వేరు దేశాల్లో గానీ, ఎన్ని వేరు వేరు పద్ధతులు వున్నా, కార్మికులు ఉత్పత్తి చేసిన దాంట్లో నించే పెట్టుబడిదారుడికి 'అదనపు విలువ' వచ్చి తీరాలి. అంటే జీతాలివ్వడంలో ఎన్ని తేడాలు వున్నా 'జీతం అంటే శ్రమ శక్తి విలువే' అనే జనరల్ సూత్రాన్ని కార్మికులు వదిలిపెట్టకూడదు.

# పనిదినం పొడవు ఎంత వుంటే 'సహజంగా' వుంటుంది ?

'సహజంగా' వుండడం గురించి మాట్లాడడం అంటే, 'నూతన సమాజం' గురించి మాట్లాడడమే. ఇప్పుడు, 'నూతన సమాజాన్నే' దృష్టిలో పెట్టుకుందాం. ఇక్కడ అందరూ శ్రమ చేస్తారు. ఇది మొట్టమొదటి సహజత్వం! ప్రతీ మనిషీ— శారీరక శ్రమా, మేధా శ్రమా కూడా (లేదా, మేధా శ్రమా, శారీరక శ్రమా కూడా) చెయ్యాలనేది, ఇంకో సహజత్వం. ఇప్పుడు, మన ప్రశ్నని చూడవచ్చు. ఈ సమాజంలో, ప్రతీ మనిషీ, రోజూ ఎంత పని చెయ్యడం 'సహజంగా' వుంటుంది? ఈ సమాజంలో, పని దినానికి సహజమైన హద్దు ఏమిటి? 6 గంటలా, 5 గంటలా, 4 గంటలా? ఎన్ని గంటలు?

పని దినానికి సహజమైన హద్దు గంటల లెక్కతో ఉండదు; 'అవసరాల' లెక్కతో ఉంటుంది. అవసరమే దాని హద్దు. ఒక మనిషి ఆరోగ్యంగా, సుఖంగా జీవించడానికి '1 రోజుకి' ఎంత ఉత్పత్తి కావాలో, అంత ఉత్పత్తి చెయ్యడానికి ఎంత సమయం పడుతుందో, అదే పని దినానికి సహజమైన హద్దు. ఏ మనిషికైనా ఇదే.

మనిషికి వున్న బాధ్యత ఒకటే — తనను తను పోషించుకోవడం. అంటే, తన కోసం తను శ్రమ చేసుకోవడం. ప్రతీ మనిషీ ఈ బాధ్యతనే నిర్వహించుకోవాలి.

ఈ బాధ్యత 2 భాగాలుగా వుంటుంది. (1) తనను తను పోషించుకోవడం (2) తనని తను పోషించుకోలేని పిల్లల్నీ, రోగుల్నీ, వృద్ధుల్నీ పోషించడంలో బాధ్యత పంచుకోవడం.— ఈ రెండు బాధ్యతలూ కలిసి 'తనని తను పోషించుకోవడం' కిందకే వస్తాయి.— దీన్ని సరిగా అర్థం చేసుకోవాలి.

మనుషులు పుట్టిన తర్వాత కొంత కాలం వరకూ 'పిల్లలుగా' వుంటారు. చివరి కాలంలో 'వృద్ధులుగా' వుంటారు. మధ్య మధ్య కొన్నిసార్లు 'రోగులుగా' కూడా వుంటారు. ఈ 3 దశల్లోనూ 'పని' చెయ్యలేరు. ఈ దశల్లో మనిషిని ఇతరులు పోషించాలి. అందుకే ప్రతి మనిషీ తను శ్రమ చేసే కాలంలో, ఈ 3 దశల్లో వున్న వాళ్ళనీ పోషించే బాధ్యతలో భాగం పంచుకోవాలి.

ఇక్కడ మొట్ట మొదట అర్థం చేసుకోవలిసిన విషయం — ఈ 3 దశలూ ప్రతీ మనిషికీ వుంటాయి. పని చెయ్యలేని దశలు అవి. ఏ మనిషి అయినా— "నేను — పిల్లల్నీ వృద్ధుల్నీ రోగుల్నీ పోషించడంలో పాలు పంచుకుంటున్నాను" అన్నంత వరకే గ్రహిస్తే చాలదు. తను కూడా ఆ 3 దశల్లోనూ వుంటాననీ, అలాంటి దశల్లో తనని కూడా ఇతరులు పోషిస్తారనీ — ఆ సంగతి కూడా గ్రహించాలి.

చిన్న తనం— శ్రమ చెయ్యని దశ. వృద్ధాప్యం కూడా— శ్రమ చెయ్యని దశ. ఈ రెంటికీ మధ్య కాలమే శ్రమ చేసే దశ. (అనారోగ్యాల సంగతి తర్వాత). శ్రమ చేసే దశలో వున్న మనిషి, చిన్నతనంలో తను సమాజం నించి ఏం తీసుకున్నాడో అది సమాజానికి ఇచ్చేస్తాడు. (తను శ్రమ చేసే కాలంలో సమాజంలో వున్న చిన్న పిల్లల్ని పోషించడంలో భాగం పంచుకోవడం ద్వారా.) అలాగే, రేపు వృద్ధాప్యం వచ్చాక తను సమాజం నించి ఏం తీసుకోబోతాడో అది కూడా సమాజానికి ఇచ్చేస్తాడు. (తను శ్రమ చేసే కాలంలో సమాజంలో వున్న వృద్ధుల్ని పోషించడంలో భాగం పంచుకోవడం ద్వారా.) అంటే, తను శ్రమ చెయ్యలేని 2 దశలలోనూ పోషణకు కావలసిన శ్రమని కూడా తను శ్రమ చేసే కాలంలోనే ఇస్తాడన్నమాట. అంటే, ప్రతీ మనిషీ చిన్న తనంలోనూ, వృద్ధాప్యంలోనూ కూడా తనని తనే పోషించుకుంటాడన్నమాట. చిన్నతనం లోనూ, వృద్ధాప్యం లోనూ ఒక మనిషిని ఇతరులు పోషిస్తున్నట్టు కనపడినా, ఇందులో ఒకర్ని ఒకరు పోషిస్తున్నదేమీ లేదు. ఇది, ఎవర్ని వారు పోషించుకోవడమే.

అయితే, మనిషి తనని తను పోషించుకునే పని, ఎవరికి వాళ్ళకు విడి విడిగా జరగదు. ఇది, వేరు వేరు దశలలో వున్న మనుషుల మధ్య గొలుసులా ఏర్పడే సంబంధాల ద్వారా జరుగుతుంది. అంటే, శ్రమ చేసే దశలో తనని తను పోషించుకుంటూ, అప్పటి వృద్ధుల్నీ చిన్న పిల్లల్నీ పోషిస్తే, ఆ చిన్న పిల్లలు పెద్ద వాళ్ళయి అదే పని చేస్తారు. ఆ వృద్ధులు, తమ కాలంలోనే ఆ పని చేసి వుంటారు. దీని సారాంశం, ప్రతీ మనిషీ తనని తను పోషించుకోవడమే.

'నూతన సమాజం'లో కూడా తల్లిదండ్రులు పిల్లల్ని పోషించడమూ, పిల్లలు వృద్ధులైన తల్లిదండ్రుల్ని పోషించడమూ— ఈ లక్షణాలు మారవు. అయితే, ఇక్కడ జరిగే మార్పేమిటంటే, ఈ 'పోషణ' విషయాలలో 'సమాజం' కూడా బాధ్యత వహించే సంస్థగా తయారవుతుంది.

నూతన సమాజానికి, 'పోషణ'కు సంబంధించిన కొన్ని బాధ్యతలు వుంటాయి కాబట్టి, 'సమిష్టి అవసరాల' కోసం వాడడానికి 'సమాజానికి కొంత ఉత్పత్తుల నిధి' (సోషల్

ఫండ్) వుండాలి. దీని కోసం, శ్రమచేసే దశలో వున్న ప్రతీ మనిషీ, తన శ్రమలో కొంత భాగాన్ని సమాజానికి వదలవలసి వుంటుంది. ఇలా వదిలే భాగం 'ఎవరి కోసమో వూరికే ఇచ్చి వేసే' భాగం కాదు. ఆ భాగమే ఆ వ్యక్తిని చిన్నతనంలోనూ, వృద్ధాప్యంలోనూ పోషించే భాగంగా వుంటుందని అర్థం.

సమాజం నిర్వహించే కార్యక్రమాలన్నీ ఈ 'పోషణ'కు సంబంధించినవే. అవి ఎన్ని రకాలుగా వున్నా అన్నిటి లక్ష్యమూ అదే. కాబట్టి, ఒక వ్యక్తి తన శ్రమలో నించి సమాజానికి వదిలే భాగం కూడా ఆ వ్యక్తి స్వంతానికి అవసరమయ్యే భాగమే. కాబట్టి, 'పని దినా'నికి సహజమైన హద్దు ఏమిటంటే— తన పోషణకూ, సమాజానికి వదలడానికీ కలిసి, ఒక రోజుకి ఎంత పని అవసరమో, అంత పని చెయ్యడమే.

ఒక సమాజంలో, పని దినానికి 'సహజమైన హద్దు' ఏర్పడాలంటే, అది కొన్ని పరిస్తితుల మీద ఆధారపడి వుంటుంది. (1) దోపిడీ వుండకూడదు. (2) 'సోషల్ ప్లాన్' ద్వారా ఉత్పత్తి సాధనాల్ని సమిష్టిగా వాడాలి. (3) అమ్మకాలూ, కొనుగోళ్ళూ వుండకూడదు. (4) మానవ జీవితానికి పనికిరాని అనవసరపు ఉత్పత్తులు వుండకూడదు. (5) కుత్రిమమూ, ఆడంబరమూ, అనారోగ్య కరమూ అయిన ఉత్పత్తులు వుండకూడదు. (6) శుభ్రతకీ, విశ్రాంతికీ అవసరమయ్యే ఉత్పత్తులు వుండాలి — ఈ రకంగా ఏది వుండకూడదో, ఏది వుండాలో లెక్కలు వేసుకుంటే, కొన్నిటి విషయంలో ఇప్పటి పని దినం ఎంతో తగ్గిపోయి, కొన్నిటి విషయంలో అది మళ్ళీ పెరుగుతుంది.

ఈ విషయాలు ఇక్కడ క్లుప్తంగా చూసి, ఇందులో కొన్నిటిని మళ్ళీ వేరే సందర్భాల్లో కొంచెం వివరంగా చూస్తాం.

## 1) అందరూ శ్రమ చెయ్యాలి, శ్రమ దోపిడీ ఉండకూడదు :

'పెట్టుబడిదారీ సమాజం'లో, దోపిడీ వర్గానికి చెందిన పురుషులూ, స్త్రీలూ కూడా ఏ శ్రమా చెయ్యరు కదా? 'నూతన సమాజం'లో ఈ జనాభా అంతా కూడా శ్రమలోకి దిగుతారని ఊహిస్తాం. (దిగుతారని కాదు, దించుతామని! క్రమంగా ఇది అందరికీ బాధ్యత అయిపోతుంది.)

'పెట్టుబడిదారీ సమాజం'లో, కార్మిక వర్గంలో, శారీరక శ్రమల సెక్షన్లలో మాత్రమే చిన్నతనం నించీ కూడా శ్రమ చెయ్యడం మొదలుపెడతారు. ఈ సెక్షన్లలో చిన్న పిల్లలు కూడా శ్రమలు చేస్తారు. కానీ, మేధాశ్రమల సెక్షన్లలో, మనిషికి దాదాపు పాతిక సంవత్సరాలు వచ్చేవరకూ ఏ శ్రమలోకీ దిగరు. నూతన సమాజంలో, ప్రతీ మనిషీ ఏడెనిమిదేళ్ళ వయసు నించీ కూడా రోజూ కొంత సేపు తేలికపాటి శ్రమలు చేస్తారని ఊహిస్తాం.— ఈ రకంగా, మొత్తం జనాభా అంతా ఎవరి కోసం వాళ్ళే శ్రమ చేసుకుంటే, అదనపు శ్రమతో నిండివుండే ఇప్పటి పని దినం ఎంత తగ్గుతుందో ఎవరికి వాళ్ళు ఊహించ వలసిందే.

'పెట్టుబడిదారీ పని దినం'లో ఒక కార్మికుడు ఉత్పత్తి చేసే దాంట్లో నించి, పదో వంతో, ఇరవయ్యో వంతో, ముప్ఫయ్యో వంతో మాత్రమే కార్మికుడికి అంది, మిగతాదంతా దోపిడీదార్లకు పోతుంది కదా? ఈ దోపిడీ సంబంధాలు కూలిపోయినప్పుడు, కార్మికుడి ఉత్పత్తి అంతా కార్మికుడికే దక్కుతుంది. తన శ్రమలో ఇతరులకు పోయే భాగం ఏమీ లేనప్పుడు మనిషి ప్రతిరోజూ ఇప్పుడు చేస్తున్నంత శ్రమ చెయ్యవలసిన అవసరం వుండదు. అయితే, పెట్టుబడిదారీ పని దినంలో కార్మికుడు ఎంత 'అదనపు శ్రమ' చేస్తాడో ఆ భాగాన్నంతా నూతన పని దినంలో పూర్తిగా వదిలెయ్యడానికి వీలు వుండదు. ఎందుకంటే, కార్మికుడు ఇప్పుడు జీతంగా ఎంత ఉత్పత్తిని వాడతాడో అది అతి తక్కువగా వుంటుంది కాబట్టి, అది కార్మికుడికి ఏ మాత్రమూ సరిపోదు. దానితో చాలా అవసరాలు తీరవు. కార్మికులు ఇప్పుడు ఘోరమైన పేదతనంలో వున్నారు కాబట్టి, ఆ పేదతనం పూర్తిగా పొగొట్టుకుని, విద్యలూ కళలూ నేర్చుకుని, ఆరోగ్యంగా, సుఖంగా, జీవించాలంటే, ప్రతీరోజూ కార్మికులకు ఇంకా చాలా ఉత్పత్తులు కావాలి. అంటే, పెట్టుబడిదారీ పని దినంలో 'అవసర శ్రమకాలం'గా ఏ భాగాన్ని చూస్తామో అది చాలా పెరగవలసి వుంటుంది. ఇప్పుడు 'అదనపు శ్రమ'గా వుండే దానిలో నించి చాలా భాగం అప్పుడు 'అవసర శ్రమే' అవుతుంది.

ఒక పెట్టుబడిదారీ పని దినం 8 గం.లు అనుకుందాం. అందులో అవసర శ్రమ కాలం 2 గం.లూ, అదనపు శ్రమ కాలం 6 గం.లూ — అనుకుందాం. ఈ పరిస్తితిలోనే నూతన సమాజం ప్రారంభమైంది అనుకుందాం. అందరూ పని చెయ్యడం మొదలు పెట్టారనుకుందాం. గతంలో కార్మికుడిగా వున్న వ్యక్తి సంగతే తీసుకుందాం. ఈ వ్యక్తి ఇప్పుడు 2 గం.ల శ్రమ మాత్రమే చేసుకుంటే చాలా? 6 గం.ల శ్రమని మానివెయ్యవచ్చునా?— అలా వీలు కాదు. 2 గం.ల శ్రమ అనేది, పేదతనంతో బతకడానికే గానీ, ఆరోగ్యంగానూ, సుఖంగానూ బతకడానికి సరిపోదు. కాబట్టి, ఇప్పుడు కూడా 2 గం.ల కన్నా ఇంకా ఎక్కువ శ్రమ చేసుకుని ఆ ఉత్పత్తిని కూడా వాడుకోవాలి. అంటే ఇప్పుడు

మొత్తం 6 గం.ల శ్రమ కావాలనుకుందాం. అందులో నించి 1 గంట శ్రమని 'సోషల్ ఫండ్' కోసం వదలా లనుకుందాం. ఆ సోషల్ ఫండ్‌గా వదిలే భాగం కూడా ఆ వ్యక్తి నిర్వహించవలసిన బాధ్యతల కోసమే. మొత్తం ఈ 6 గంటల శ్రమ అంతా ఇక్కడ 'అవసర శ్రమగానే' వుంటుంది. ఇక్కడ, అదనపు శ్రమ (ఇతరులకు పోయే శ్రమ) ఏమీ వుండదు.


మనం తీసుకున్న ఉదాహరణల ప్రకారం, పెట్టుబడి దారీ పని దినం 8 గం.లు. అందులో అవసర కాలం 2 గం.లూ, అదనపు కాలం 6 గం.లూ.

నూతన సమాజపు పని దినం మొత్తం 6 గం.లు. అది అంతా అవసర కాలమే. అదనపు కాలం వుండదు.


పెట్టుబడిదారీ పని దినంలో అదనపు శ్రమగా వుండే 6 గం.ల భాగంలో నించి 4 గం.ల భాగం ఇప్పుడు (నూతన సమాజంలో) అవసర శ్రమ భాగంగానే మారింది. మిగిలిన 2 గం.ల భాగాన్ని ఇప్పుడు మానివెయ్యవచ్చు. ఆ శ్రమ ఇప్పుడు చెయ్యనక్కరలేదు. అంటే, ఇప్పుడు పని దినం పొడవు తగ్గిందన్నమాట!

పని దినాన్ని ఇలా చూద్దాం.

పెట్టుబడిదారీ పనిదినం: 8 గం.లు




నూతన పని దినం: 6 గం.లు




పెట్టుబడిదారీ పనిదినంలో వుండే 6 గం.ల అదనపు కాలంలోనించి కొంత భాగం అవసరశ్రమగా మారింది. మిగిలిన భాగం అవసరంలేకపోయింది. పని దినం తగ్గింది. తర్వాత చూసే విషయాలన్నీ పని దినాన్ని ఇంకా తగ్గించి వేస్తాయి.

## 2) సోషల్ ప్లాన్ :

భూమీ, గనులూ, ఇతర ఉత్పత్తి స్థలాలూ — వంటి 'ఉత్పత్తి సాధనాల' మీద విడి వ్యక్తులకో, విడి కుటుంబా లకో 'స్వంత ఆస్తి – హక్కు' వుండే పరిస్థితి పోయినప్పుడు, సమాజంలో ప్రతీ ఒక్క విషయాన్నీ సమిష్టి ప్లానుల ద్వారా నిర్వహించడం సాధ్యమవుతుంది. దానివల్ల, ఇప్పుడు జరుగుతోన్న అనవసరపు శ్రమ అంతా కలిసి వస్తుంది. (ఈ 'సోషల్ ప్లాన్' గురించి, ఈ సంపుటంలోనే 3 వ భాగంలో, "పెట్టుబడి విస్తరణ" చాప్టర్‌లో వివరంగా చూస్తాం.) పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, విడి విడి ఆస్తిపరుల ఉత్పత్తి విధానం కాబట్టి, ప్రతీ పెట్టుబడి దారుడూ పొదుపు కోసం ఎంత ప్రయత్నించినా, దాని అరాచక పోటీ విధానం వల్ల, అది శ్రమ శక్తినీ, ఉత్పత్తి సాధనాల్నీ పెద్ద ఎత్తున దుర్వినియోగం చేస్తూనే వుంటుంది. పెట్టుబడిదారీ విధానం లేనప్పుడు, శ్రమ క్రమాలు విడి విడిగా వుండడం గాక, 'అవసరమైనంత' పెద్ద స్థాయిలోనూ, అవసర మైనంత మంచి పరికరాల తోనూ, పని చెయ్యడం సాధ్య మవుతుంది. ఇది, 'శ్రమ'ని ఎంతో శక్తివంతంగానూ, పొదుపుగానూ వాడడానికి వీలైన పరిస్థితులు ఏర్పరు స్తుంది. దీని ఫలితం, సమాజ మొత్తానికి శ్రమ కాలం తగ్గడమే.

స్వంత ఆస్తి లేని సమాజంలో, సైన్సు జ్ఞానాన్ని రహస్యంగా దాచే పరిస్థితి వుండదు. ఇప్పుడు, పెట్టుబడి దారులు, ఒకరికి దొరికిన సైన్సు జ్ఞానాన్ని ఒకరికి ఇచ్చుకోరు. ఆ సైన్సు విషయాలు అందరికీ తెలిసిపోతే అందరూ అదే రకం సరుకుని, అదే పద్ధతిలో తయారు చేయించి అమ్ముకుంటారు కాబట్టి, ఒక పెట్టుబడి దారుడు తన సైంటిస్టుల ద్వారా దొరికించుకున్న సైన్సు విషయాల్ని తన ఆధీనంలోనే రహస్యంగా వుంచు కుంటాడు. ఒకరు కనిపెట్టిన విజ్ఞానం కోసమే ఇంకొకరు మళ్ళీ అంత ఖర్చూ, అంత టైమూ వెచ్చించి కనిపెట్టాలి. మళ్ళీ మూడో పెట్టుబడిదారుడు కూడా అలాగే చెయ్యాలి. ఈ రకంగా, ఒకసారి తెలిసిన విషయాన్నే మళ్ళీ మళ్ళీ కొత్తగా పరిశోధనలు చేసి కనిపెట్టవలసి రావడం వల్ల, దోపిడీ సమాజంలో సైన్సు పరిశోధనల కోసం ఊహాతీత మైనంత ఖర్చు అవుతూ వుంటుంది. 'స్వంత ఆస్తి' లేనప్పుడు, సైన్సు పరిజ్ఞానాన్ని ఎవరికి వారు దాచుకుని లాభ పడవలసిన అవసరం వుండదు. అప్పుడు, 'ఉత్పత్తి శక్తుల' వినియోగానికి ఏమీ ఆటంకాలు లేని పరిస్థితులు ఏర్పడి, సమాజం మొత్తానికి అవసరమయ్యే శ్రమ తగ్గిపోతూ వుంటుంది.

## 3) అమ్మకాలూ, కొనుగోళ్ళూ ఉండకూడదు :

నూతన సమాజానికి ప్రారంభంలోనే ఈ మార్పు సాధ్యం కాదు. కానీ ఒకప్పటికైనా ఇది జరగాలి.

అమ్మకాలూ, కొనుగోళ్ళూ లేకుండా ఉత్పత్తుల్ని వాడుకోవడం సాధ్యమే. అమ్మకాలూ, కొనుగోళ్ళూ 'సహజ' అవసరాలు కావు. సమాజానికి, 'ఉత్పత్తి క్రమం'తో పాటు,

'పంపిణీ క్రమం' కూడా ఎప్పుడూ అవసరమే. అయితే, పంపిణీ క్రమం 'మారకాల్ని' నిర్వహించే వర్తకం ద్వారా జరగనక్కరలేదు. (ఈ విషయం 2వ సంపుటంలో, 'చలామణీ ఖర్చులు' చాప్టర్లో వివరంగా చూస్తాం.) ఏ ప్రాంతంలో ఏ ఉత్పత్తి చెయ్యడం సాధ్యమో, ఆ ఉత్పత్తి చేసుకోవడమూ, దాన్ని అవసరమైన అన్ని ప్రాంతాలకూ తీసుకుపోయి మారకాలు లేకుండా వాడుకోవడమూ అనేది పెట్టుబడిదారీ సమాజంలో ఎందుకు సాధ్యం కాదంటే, ఆ ఉత్పత్తి ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో చెందిన స్వంత ఉత్పత్తిగా వుంటుంది గనక. సమాజంలో వున్న మొత్తం ఉత్పత్తి అంతా విడి విడి వ్యక్తులకు చెంది వుండే విధానంలో, ఆ ఉత్పత్తుల్ని అందరూ తీసుకోవా లంటే, ఒకరి ఉత్పత్తిని ఒకరికి అమ్ముకోవడమూ, కొనుక్కో వడమూ — అనే మార్గం తప్ప ఇంకో మార్గం ఉండదు. 'స్వంత ఆస్తి' విధానం వల్లనే ఉత్పత్తుల మారకాల్ని నిర్వహించే 'వర్తకం' తప్పనిసరి అవుతుంది. దాని వల్ల, సమాజంలో వున్న జనాభాలో ఒక పెద్ద సంఖ్య ఈ వర్తకం పనుల్లో తమ శ్రమల్ని వెచ్చించవలసి వస్తుంది. ఇదంతా సమాజంలో వ్యర్థంగా జరుగుతోన్న శ్రమే. సమాజంలో, ఈ వర్తకమే లేనప్పుడు, దానికోసం ఖర్చయ్యే శ్రమ అంతా ఇతర కార్యాలలోకి వెళ్ళిపోతుంది. దీని ఫలితం సమాజం చెయ్యాల్సిన శ్రమ కాలం తగ్గిపోవడమే.

## 4) అనవసరపు ఉత్పత్తులు ఉండకూడదు :

మనుషుల మధ్య దోపిడీ మీద ఆధారపడి సాగే సంబంధాలు పోయి, 'సమానత్వం మీద' ఆధారపడ్డ సంబంధాలు ఏర్పడినప్పుడు, పోలీసులూ జైళ్ళూ కోర్టులూ వగైరా శాఖలన్నీ అనవసరమైపోతాయి. దోపిడీ సమాజా లలో ఈ శాఖలతోపాటు సైన్యం కూడా వుంటుంది. ఆయుధ ఉత్పత్తి వుంటుంది. ఈ శాఖలన్నీ ఒక వేపు — కార్మిక తిరగబాట్లని అణచడం కోసమూ, ఇంకోవేపు — దోపిడీవర్గంలోనే (ప్రపంచ దోపిడీ వర్గంలో) 'అదనపు విలువ'ని లాగడంలో వచ్చే ఘర్షణల్ని 'యుద్ధాల' ద్వారా అణచడం కోసమూ, పని చేస్తూ వుంటాయి. పెట్టుబడిదారీ విధానం, తన దోపిడీ తోటీ, తన అరాచక పోటీల తోటీ, సమాజంలో అపారమైన శ్రమ శక్తినీ, ఉత్పత్తి సాధనాల్నీ ఊహాతీతమైనంత పెద్ద స్థాయిలో దుర్వినియోగం చేస్తూ వుంటుంది. దోపిడీ మీద ఆధారపడే ప్రతీ దేశమూ తన మొత్తం 'శ్రమ'లో అతి పెద్ద భాగాన్ని ఆయుధాల మీదా, సైన్యాల మీదా, ఖర్చు పెట్టవలసి వుంటుంది. ఇలాంటి పరిస్థితి మారిపోయి, పోలీసూ, జైళ్ళూ, కోర్టులూ, సైన్యమూ వగైరా శాఖల జనాభా అంతా 'సహజమైన పనులలోకి' వచ్చినప్పుడు, సమాజానికి ఎంత శ్రమ తగ్గుతుందో ఊహకు కూడా అందని విషయం.

ప్రతీ మనిషికీ పుట్టినప్పటి నించీ సరియైన పోషకా హారమూ, పరిశుభ్రమైన ఇళ్ళూ, తగినంత విశ్రాంతీ, మానసికాందోళనలు లేకుండా జీవించే పరిస్థితులూ వున్న ప్పుడు, ఇప్పుడు వున్నన్ని ఆస్పత్రులూ, పిచ్చాసుపత్రులూ, మందులూ అవసరం లేదు. ఈ జబ్బుల్లో నూటికి 99 వంతులు అప్పుడు లేకుండా పోతాయి. ప్రతీ విష యాన్నీ ఇదే దృష్టితో ఆలోచిస్తే, సమాజానికి ఎలాంటి శ్రమలు అవసరమో, ఎలాంటి శ్రమలు అనవసరమో తేలిగ్గానే గ్రహించవచ్చు.

## 5) కృత్రిమమూ, ఆడంబరమూ, అనారోగ్యకరమూ అయిన ఉత్పత్తులు ఉండకూడదు :

నిత్య జీవితంలో అనేక రకాల వస్తువులూ, పదార్థాలూ అవసరమవుతాయి. అందులో, ఆహారానికి మాత్రమే సహజమైన హద్దు వున్నట్టూ, మిగతా అవసరాలకు అలాంటి హద్దులు లేనట్టూ, కనపడుతుంది. ఆహారం అయితే కడుపు నిండడం కన్నా ఎక్కువ అవసరం వుండదు గానీ, బట్టలూ, కుర్చీలూ, చెప్పులూ వంటివి ఎన్ని వున్నా అవసరమే — అన్నట్టు కనపడుతుంది. కానీ, అది పూర్తిగా తప్పు. 'ఉపయోగపు విలువ దృష్టి'తో చూసి నప్పుడు ప్రతీ అవసరానికీ సహజమైన హద్దు వుంటుంది.

ఒక మనిషికి 100 చొక్కాలు వున్నా, ఆ మనిషి తన ఒంటి మీద ఒక్క చొక్కాయే వేసుకోగలుగుతాడు గానీ ఒక్కసారే 5 చొక్కాల్లో, కనీసం 2 చొక్కాల్లో వేసుకోలేడు. ఒక చొక్కా ఒంటి మీద వుంటే, 99 చొక్కాలు బయట వుండవలసిందే. చెప్పుల సంగతీ అంతే, కుర్చీల సంగతీ అంతే, ప్రతీ 'ఉపయోగపు విలువ' సంగతీ అంతే. రెండు పూటలా స్నానం చేసి, రెండు పూటలా బట్టలు మార్చే నూతన మానవుల్ని ఊహిస్తే. అప్పుడు కూడా ఒక్కొక్క మనిషికీ 10 జతల బట్టలు ఉండడం కూడా ఎక్కువే. విప్పిన బట్టలన్నీ ఉతకకుండా 3 నెలలపాటు మురగబెట్టి దల్చుకుంటే తప్ప, లేకపోతే ఒక మనిషికి 100 బట్టలు ఎప్పుడూ అవసరం వుండవు. కనీసం 15 కూడా అవసరం వుండవు. ఎక్కువ బట్టలు వుంటే, వాటిలో చాలా వరకూ వాడకం లేకుండానే పాడైపోతాయి. బట్టల సంఖ్య పెరిగితే ఆ వ్యవహారం బట్టల తోటే సరిపోదు. వాటిని పెట్టడానికి పెట్టెల్లో, బీరువాల్లో కావాలి. బట్టలు రెట్టింపయితే పెట్టెలు రెట్టింపవ్వాలి. ఆ పెట్టెలకు కావలసిన ముడి పదార్థాలూ,

ఇతర ఉత్పత్తి సాధనాలూ రెట్టింపవ్వాలి. వాటి రవాణాకి బస్సులూ, రైళ్ళూ రెట్టింపవ్వాలి. ఇళ్ళల్లో వాటిని పెట్టే స్థలాలు రెట్టింపవ్వాలి. ఈ రకంగా, ప్రతీ ఉపయోగపు విలువ గురించీ చూస్తే, ప్రతీ రకాన్నీ అనేక రెట్లు ఎక్కువగా ఉత్పత్తి చెయ్యవలసిందే. పెట్టుబడిదారీ సమాజపు మనుషులు కేవలం 'ఆడంబరాల దృష్టితోనే' తమకు సహజంగా అవసరం లేనంత సామగ్రిని చేర్చుకుంటారు. ఆడంబరానికి పునాది — పేద, ధనిక తేడాలు గల సమాజమే.

పేద జనాభాకు అందుబాటులో లేని వన్నీ — ఆడంబరాలే, విలాసాలే. ధనికులు, తమ సిరి సంపదల్ని, ఇతర ధనికుల ముందు ప్రదర్శించడం కోసమే వస్తువుల్ని కుప్ప తెప్పలుగా పోగుచేసుకుంటారు. ఉత్పత్తుల్ని వాడే విషయంలో 'సహజ అవసరం' అనే దృష్టిని వదిలేస్తే, మనిషికి నిత్యజీవితంలో 'ఏ వస్తువులు ఎన్ని వుండాలీ' అనే విషయానికి ఒక 'సహజ పునాది' గాక, అసహజ పునాదే వుంటుంది.

ప్రపంచంలో వున్న మొత్తం జనాభాకంతటికీ కలిసి, రోజుకి వెయ్యి లీటర్ల పాలు అవసరమనుకుందాం. ఇది, పాలతో ఒక రోజుకి వుండే సమస్త అవసరాల్నీ సంపూర్ణంగా తీర్చుకోవడానికి కావలసిన లెక్కే అనుకుందాం. అలాంటప్పుడు, రోజుకి వెయ్యి లీటర్ల కన్నా ఎక్కువ పాలు ఎందుకు ఉత్పత్తి చెయ్యాలి? ఉత్పత్తి చేసి ఏం చేసుకుంటాం? — ఏమీ చేసుకోలేం. కాబట్టి, రోజుకి వెయ్యి లీటర్ల వరకూ మాత్రమే ఉత్పత్తి అయ్యేలాగ పాల ఉత్పత్తిని ప్లాన్ చేసుకోవలసిందే. అంతకన్నా ఎక్కువ పాల ఉత్పత్తి జరగకుండా ఉత్పత్తిని తప్పనిసరిగా ఆపెయ్యవలసిందే. అవసరాల్ని బట్టి ఉత్పత్తి గానీ, ఉత్పత్తిని బట్టి అవసరాలు కాదు. ఇక్కడ ప్రపంచం మొత్తాన్ని ఉదాహరణగా ఎందుకు తీసుకున్నామంటే, విషయాన్ని జనరల్‌గా అర్థం చేసుకోవడానికే.

ఒక దేశాన్ని ఉదాహరణగా తీసుకుంటే, అక్కడ జనాభాకి 1 రోజుకి 100 లీటర్ల పాలు (అన్ని అవసరాలకూ కలిసి) చాలనుకుందాం. ఆ దేశం, సహజ విధానంలో జీవిస్తూందనుకుందాం. ఆ దేశానికి బయట ఇంకా అనేక దేశాలలో దోపిడీ విధానాలే రాజ్యమేలుతున్నాయనుకుందాం. ఇలాంటి పరిస్థితిలో, ఆ దేశం బాధ్యత, తన స్వంత జనాభా సుఖంగా జీవించేలాగ చేసుకోవడం మాత్రమే కాదు; బయట దోపిడీ విధానాలతో జీవిస్తోన్న దేశాలలోని కార్మిక జనాభా కూడా నూతన సమాజాల్ని నిర్మించుకోవడానికి ఆ దేశం తోడ్పడాలి. ఆ బాధ్యత కూడా ఆ దేశానికి వుంటుంది. ఆ 'తోడ్పాటు' కేవలం 'మాటల'తో గాక, 'చేతల'తో కూడా జరగవలసి వుంటుంది. దానికి అనేక రకాల 'ఉత్పత్తులు' అవసరమవుతాయి. అలాంటప్పుడు, ఆ దేశం తన స్వంత జనాభా అవసరాలను మాత్రమే తన ఉత్పత్తికి హద్దుగా పెట్టుకోవడం సాధ్యం కాదు. ఈ ప్రత్యేక సందర్భాల్ని కూడా దృష్టిలో పెట్టుకుంటూ, అర్థం చేసుకోవలసిం దేమిటంటే — ఒక సమాజానికి సహజ అవసరాల్ని మించినంత ఉత్పత్తి అవసరం లేదు — అని.

**సమాజంలో వుండకూడని ఇంకా కొన్ని ఉత్పత్తుల సంగతి చూస్తాం.**

**'కల్తీ' ఉత్పత్తి:** పెట్టుబడిదారీ సమాజంలో ప్రతీ సరుకూ 'కల్తీ' అవుతుంది. బియ్యంలో కలపడానికి రాళ్ళు ప్రత్యేకంగా తయారవుతాయి. ఆ రాళ్ళని తయారుచేసే పనిలో కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కొంత సజీవ శ్రమా ఖర్చవుతాయి. 10 టన్నుల బియ్యంలో, మొత్తం ఒక బస్తా తుక్కూ, రాళ్ళూ వున్నాయి అనుకుంటే, ఆ 10 టన్నుల బియ్యాన్ని ఒక ప్రాంతం నించి ఇంకో ప్రాంతానికి రవాణా చేసేటప్పుడు, ఆ బియ్యంతో పాటు ఆ బస్తా తుక్కుని కూడా రవాణా చెయ్యవలసిందే. ఆ బియ్యాన్ని వాడుకునేటప్పుడు, ఆ తుక్కునీ రాళ్ళనీ వేరు చెయ్యడానికి మళ్ళీ కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కొంత సజీవ శ్రమా ఖర్చవ్వాలి. 'కల్తీ' కోసం రక రకాల దశల్లో జరిగే ఈ శ్రమ అంతా పూర్తిగా వ్యర్థంగా జరుగుతోన్న శ్రమ.

బియ్యంలో రాళ్ళని వేరు చెయ్యగలిగినట్టుగా అన్ని సరుకుల నించీ కల్తీని వేరుచెయ్యడం సాధ్యం కాదు. మందుల్లో కల్తీ వల్ల మనుషుల ఆరోగ్యాలు పాడై, దానివల్ల డాక్టర్‌లూ, మందులూ కావలసి వస్తాయి. ఆ మందుల్లోనే మళ్ళీ కల్తీ! డాక్టర్లలోనూ కల్తీయే!

కల్తీ అనేది, సరుకు స్వభావాన్ని బట్టి వుంటుంది. ఆహార పదార్థాలలో అయితే తుక్కు పదార్థాల కల్తీ! బట్టల్లో అయితే అవి షాపుల్లో వున్నంతసేపూ తళ తళా మిల మిలా మెరుస్తూ, వాటిని వాడడం ప్రారంభించగానే ఎందుకూ పనికిరాకుండా పోయే కల్తీ! పత్రికల్లో అయితే రోత రాతలూ, బూతు బొమ్మలూ వగైరా సరంజామాతో కల్తీ! సినిమాల్లో అయితే, వంకర టింకర తప్పుడు తప్పుడు వెకిలి వెకిలి పద్ధతులతో కల్తీ! — ఈ రకంగా, పెట్టుబడిదారీ సమాజంలో కల్తీ లేని సరుకేదీ వుండదు. ఏ సరుకుని ఎలా కల్తీ చెయ్యాలో, ఏ సరుకుకి ఏ పెంట అతుకుతుందో, కల్తీ శాస్త్రానికి సంబంధించిన వ్యాపార టక్కులన్నీ పెట్టుబడిదార్లకు చాలా బాగా తెలుసు. దాన్నే వాళ్ళు 'తెలివిగా పరిశ్రమల్ని నడుపుకోవడం' అంటారు.

పెట్టుబడిదారులు ఈ 'కల్తీ – కళ'లో ఎంత చాతుర్యం సంపాదించారో వివరిస్తూ మార్క్సు కొన్ని ఆధారాలు

చూపించాడు. ఇంగ్లండు పార్లమెంటరీ కమిటీ, ఆహార పదార్థాల మీద ఒక నివేదిక (1855–56) ప్రచురించింది. డాక్టర్ హాసల్ అనే ఆయన "కల్తీ కనిపెట్టబడింది" అనే పుస్తకం రాశాడు. ఫ్రెంచి రసాయన వేత్త షెనాలియర్ కల్తీ సరుకుల మీద ఒక పరిశోధనా గ్రంథం రాశాడు. ఆ ఆధారాల్ని చూపిస్తూ మార్క్స్ ఇలా రాశాడు.

> "నమ్మశక్యంగాని రీతిలో బ్రెడ్ కల్తీ గావడం, ముఖ్యంగా లండన్‌లో మొదట హౌస్ ఆఫ్ కామన్స్ కమిటీ యొక్క 'ఆహార పదార్థాల కల్తీ గురించి' అన్న నివేదిక (1855 – 56) ద్వారానూ, 'కల్తీ కనిపెట్టబడింది' అనే డాక్టర్ హాసల్ యొక్క రచన ద్వారానూ వెల్లడయింది."
>
> " 'దైవానుగ్రహం' చేత పెట్టుబడిదారుడో, భూస్వామో, గౌరవ వేతనం పొందేవాడో కాకుంటే, మనిషి చెమటోడ్చి పనిచేయడం ద్వారా మాత్రమే రొట్టె ముక్క తినగలడు — అన్న సంగతి బైబిల్‌తో మంచి పరిచయం ఉన్న ఇంగ్లీషు ప్రజలకు బాగానే తెలుసు. అయితే అతడు రోజూ తినే రొట్టెలో పటిక, యిసుక, తదితర ఆమోదయోగ్యమైన ఖనిజ పదార్థాలు గాక, కొంత పరిమాణం పుళ్ళ చీము, బూజు, చచ్చిన బొద్దింకలు, మురిగిన జర్మన్ యీస్టుతో కలిసిన చెమట కూడా ఉందనే సంగతి మాత్రం వారికి తెలియదు."
>
> "కల్పిత సరుకులపై తన గ్రంథ సంగ్రహంలో ఫ్రెంచి రసాయన వేత్త షెనాలియర్ తాను సమీక్షించిన 600, లేదా అంత కంటే యెక్కువ సరుకుల్లో చాలా వాటికి ఒక్కో దానికి 20, 30 కల్తీ పద్ధతుల్ని వివరించాడు. తనకు అన్ని పద్ధతులూ తెలియవనీ, తనకు తెలిసిన వాటన్నిటినీ పేర్కొన లేదనీ జత చేశాడు. పంచదారకి 6 రకాలు, ఆవనూనెకి 9, వెన్నకి 10, ఉప్పుకి 12, పాలకి 18, బ్రెడ్‌కి 20, బ్రాందీకి 23, గోధుమ పిండికి 24, చాక్లెట్‌కి 28, వైన్‌కి 30, కాఫీకి 32 వగైరా... కల్తీ పద్ధతుల్ని ఆయన తెలిపాడు. సర్వ శక్తిమంతుడైన దేవుడు కూడా ఈ తల రాతని తప్పించుకోలేడు."
> (కాపిటల్ – 1, విశాలాంధ్ర అనువాదం, పేజీలు 225, 226.)

కల్తీ పరిస్తితి 150 ఏళ్ళ నాడే ఇలా వుందంటే, సైన్సు రహస్యాల్ని ఎంతో తెలుసుకోగలిగిన ఈ నాడు కల్తీ పద్ధతులు ఎన్ని వందల రెట్లు పెరిగిపోయాయో ఊహించడం అసాధ్యం!

దేవుడికి పెట్టే నైవేద్యంలో కూడా పుళ్ళ చీములూ, బొద్దింకలూ వుంటాయని ఆయనకు తెలుసు. అందుకే ఆయన ఏ నైవేద్యాలూ తినడు.

సమాజం మొత్తం మీద ఉత్పత్తి అయ్యే సరుకులో 'కల్తీ' అంశం కోసం ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాల్నీ, సజీవ శ్రమనీ లెక్కకడితే, ఈ ఖర్చంతా సమాజానికి ఘోరమైన వృథా! కల్తీ వల్ల శారీరక మానసిక అనారోగ్యాల సంగతి చెప్పనే అక్కరలేదు. సమాజంలో వున్న మోసపూరిత సంబంధాలకు ఈ కల్తీ ఒక బాహ్య చిహ్నం. ఒక సమాజంలో, 'బియ్యం'లో, ఒక ప్రత్యేక పద్ధతిలో తయారు చేసిన చిన్న తెల్లని రాయి కనపడిందంటే, దాన్ని చూసి, ఆ సమాజం 'పెట్టుబడిదారీ సమాజం' అని నిస్సంకోచంగా చెప్పెయ్యవచ్చు. అది పెట్టుబడిదారీ సమాజం కాకపోతే, ఆ రకమైన రాళ్ళ ఉత్పత్తి వుండదు. రాళ్ళు లేని బియ్యాన్ని చూసి, 'ఇది పెట్టుబడిదారీ సమాజం కాద'నే నిర్ధారణకు రానక్కరలేదు గానీ, ఆ రకం రాళ్ళ బియ్యాన్ని చూసి మాత్రం అదే నిర్ధారణకు రావాలి.

'కల్తీ' అనేది, పెట్టుబడిదారీ సమాజానికి మరీ ప్రత్యేక లక్షణం. ఇది గత సమాజాలలో ఎక్కువగా లేదు. కల్తీ లేని 'నూతన సమాజం'లో, ప్రతీ 'మ్యూజియం'లోనూ, 'పెట్టుబడిదారీ కల్తీ సైంటిస్టుల, ఇంజనీర్ల ప్రతిభా వుత్పత్తులు' అనే పేరుతో ఒక ప్రత్యేక శాఖని వుంచాలి. అందులో, అద్దాల బీరువాలో, ఒక్కో అరా, ఒక్కో కల్తీ చాతుర్యానికి కేటాయించాలి. 'పెట్టుబడిదారీ సమాజంలో — బియ్యంలో ఈ రకం రాళ్ళు కలిపేవారు; కారం పొడిలో ఈ రకం ఇటిక పొడి కలిపేవారు; మందుల్లో ఈ రకం రంపం పొట్టు కలిపేవారు' — ఇలా పెట్టుబడిదారీ మేధావుల ఊహా శక్తినీ, పెట్టుబడిదారీ ఉత్పత్తిదారుల పారిశ్రామిక చతురతనీ, భవిష్యత్ తరాలన్నీ చూసే ఏర్పాటు చెయ్యాలి. అంటే 'నూతన సమాజం'లో కూడా ఈ రకం కల్తీ శాంపిల్స్ కోసం కొంచెం ఖర్చు పెట్టాలా? తప్పదు మరి! నూతన సమాజం, 'పాత చరిత్ర'ని గ్రహించడం కోసం అయ్యే ఖర్చులో ఇది కూడా ఒక భాగమే మరి!

**'వృథా'ని నివారించడం:** పెట్టుబడిదారీ సమాజంలో, అనేక వస్తువులు సరైన రిపేర్లు లేక, కొత్తన్నా మాయకుండా మూలబడుతూ వుంటాయి. పాత వస్తువులే ఎక్కువ కాలం మన్నుతూ వుంటే కొత్త వస్తువులు ఎక్కువగా అమ్ముడు పోవు కాబట్టి, పెట్టుబడిదారీ సమాజంలో రిపేర్ల మీద శ్రద్ధ వుండదు. ఒక వస్తువుకి ఎప్పటికప్పుడు సరైన రిపేర్లూ, స్పేర్ పార్టులూ అందుతూవుంటే, అది ఎంతో కాలం వరకూ మన్నుతుంది. కాస్త కాస్త విరిగిన చెక్క సామాన్లూ, పలకని రేడియోలూ, తిరగని వాచీలూ, కొర్రులు పట్టిన బట్టలూ, మిగిలిపోయిన మందులూ — వగైరా వస్తువు లెన్నో, పెన్ను దగ్గిర్నించీ యంత్రం వరకూ, ఇళ్ళల్లోనూ,

ఉత్పత్తి స్థలాల్లోనూ, వ్యర్థంగా పడివుంటాయి. ఇంకా ఎంతో 'జీవిత కాలం' వుండి కూడా పనికి రాకుండా పోయిన ఈ రకం వస్తువులు సమాజం మొత్తం మీద, లక్షల కోట్ల సంఖ్యల్లో వుంటాయి. అంటే, గతంలో జరిగిన ఎంతో 'శ్రమ' ఉపయోగానికి రాకుండా వ్యర్థంగా వుండిపోయిందన్నమాట! ఒకసారి తయారైన సరుకులు పూర్తిగా వాడకం అవకుండా త్వర త్వరగా మూలబడుతూ వుంటేనే పెట్టుబడిదార్ల నించి ఎప్పటికప్పుడు కొత్త సరుకులు అమ్ముడు పోతూ వుంటాయి.

ఎప్పుడూ కొత్త సరుకు! ఎప్పుడూ కొత్త బట్టలు! కొత్త చెప్పులు! కొత్త కుర్చీలు! ప్రతీ దాంట్లోనూ కొత్త రకాలు! కొత్త ఫేషన్లు! పాత వస్తువుల్ని త్వర త్వరగా వొదిలెయ్యడమూ, ఎప్పుడూ కొత్త వాటినే వాడడమూ పెట్టుబడిదారీ సమాజంలో 'గొప్ప విలువ'! పాత ఫేషన్‌ని వదిలేసి, కొత్త ఫేషన్‌ని ప్రారంభించిన తర్వాత, ఆ కొత్త వస్తువు వాడకం పూర్తి కాకుండానే ఆ ఫేషనే మారిపోతుంది. మళ్ళీ కొత్త సరుకు అమ్మకాల కోసమే ఈ మార్పులన్నీ. ఇదంతా 'శ్రమ' పట్ల గౌరవం లేని దృష్టి. ఇది పూర్తిగా దోపిడీకి అనుకూలించే దృష్టి. ఒక సారి తయారైన వస్తువుల్ని అవి మన్నినంత కాలమూ జాగ్రత్తగా వాడుకునే విధానం వల్ల సమాజానికి ఎంతో శ్రమ కలిసి వస్తుంది.

**'పోటీ' ఉత్పత్తి:** ఆటల పోటీలూ, బహుమతులూ, బిరుదులూ, సన్మానాలూ వగైరాలన్నీ ఇందులోకి వస్తాయి. ఆటలు, శారీరక మానసిక ఆరోగ్యానికీ ఆనందానికీ చాలా అవసరమే. ఆ అవసరం కోసం అయ్యే ఖర్చులన్నీ సహజ అవసరాల కోసం అయ్యే ఖర్చులే. అయితే, ఈ సహజ అవసరంలోకి 'పోటీ' అనే కృత్రిమ విషయం ప్రవేశిస్తే, ఆ అవసరం సహజత్వాన్ని కోల్పోతుంది. <u>మనుషుల జీవితానికి 'ఆటలు' అవసరం గానీ, 'ఆటల పోటీలు' అవసరం కాదు.</u> ఒక పరుగు పందాన్ని తీసుకుంటే, అందరి కన్నా ఒక్క 'సెకన్' ముందు గమ్యం చేరిన మనిషి పోటీలో గెలిచినట్టూ, ఒక్క సెకన్ వెనక వచ్చిన వాళ్ళంతా ఓడిపోయినట్టూ అవుతారు. ఈ ఒక్క సెకన్ కాలమే (పోనీ, ఒక్క నిముషం) గెలుపు ఓటముల్నీ, కీర్తి ప్రతిష్టల్నీ, డబ్బు రాసుల్నీ, నిర్ణయిస్తుంది. ఈ పోటీలో నెగ్గిన మనిషికి, ఆ 'పరుగు శక్తి' ఎందుకు ఉపయోగపడుతుంది? ఈ మనిషి ఏ ఊరైనా వెళ్ళాలంటే, పరిగెత్తుకుంటూ వెళ్ళిపోతాడా?— వెళ్ళడు. పోటీలో ఓడిపోయిన వాళ్ళందరి లాగానే, ఇతను కూడా బస్సో, రైలో ఎక్కుతాడు. మరి అంత పరుగు శక్తి ఆ మనిషికి జీవితంలో ఏం ఉపయోగపడ్డట్టు? ఒక శక్తి వుందంటే, అది నిత్య జీవితంలో ఉపయోగపడాలి కదా? <u>పోటీ అనేది సహజ అవసరం కాదు గనకే, దాని కోసం సంపాదించే శక్తి వల్ల, ఏ సహజ అవసరమూ తీరదు.</u> ఏ పనీ చెయ్యకుండా, రోజూ కొన్ని గంటలు పరుగు ప్రాక్టీసు చేస్తూ, మితిమీరిన తిండి తింటూ, మిగిలిన కాలం అంతా విశ్రాంతులు తీసుకుంటూ, వింత జంతువులాగ గడుపుతూ, నిలబెట్టుకునే పరుగు శక్తితో ఆ మనిషికి గానీ, ఇతరులకు గానీ, ఏ ప్రయోజనమూ వుండదు.

పోటీలో పాల్గొనే ప్రతీ మనిషీ— "నేనే గెలవాలి. అందరూ ఓడిపోవాలి" అనే దృష్టితోనే వుంటాడు, పోటీకి వున్న లక్షణమే అది. 'అందరం గెలవాలి. అందరం సమానంగా వుండాలి' అని ఆశించడానికి అక్కడ అవకాశమే వుండదు. పోటీలో గెలిచిన వాడికి ఆనందం! ఓడిపోయిన వాళ్ళకి దుఃఖం! అందరూ ఆనందించే మార్గం లేదు అక్కడ. ఈ రకంగా పోటీ అనేది మనుషుల్ని స్వార్థపరులుగానూ, అసూయపరులుగానూ, సమిష్టి దృక్పథం లేని వారిగానూ తయారు చేస్తుంది. ఈ పోటీ వ్యవహారం లేకుండా, మామూలుగా ఆటలాడుకుంటే ఎవరు నెగ్గినా, ఎవరు ఓడినా, అది ఎవరినీ బాధించదు. ఆ గెలుపు ఓటములు, ఆట స్థలాన్ని దాటిపోవు.

మనిషి 'అభివృద్ధి' చెందడానికి పోటీయే ప్రోత్సాహక శక్తిగా వుంటుందంటారు — పెట్టుబడిదారీ ఆలోచనా పరులు. ఈ దృష్టి ప్రకారం, 'అభివృద్ధి' అంటే — పోటీలో గెలవడమే. పోటీలో గెలవడం ఎందుకు? ఇతరులకన్నా గొప్పవాడిగా ప్రచారం కావడానికి. ఇంతకన్నా వేరే జవాబేదీ చెప్పలేరు వాళ్ళు. ఆటల పోటీలు 'ఆరోగ్యం కోసం' అనో, 'ఆనందం కోసం' అనో చెప్పలేరు. వాటి కోసం అయితే పోటీలు లేకుండానే ఆటలు వుండవచ్చు కదా? 'పోటీలు లేకుండా ఆటలు ఆడితే ఆనందం రాదు' అంటారా? అలాంటి వాళ్ళకి నిజంగా ఆనందం వచ్చేది 'ఆటల వల్ల' కాదన్నమాట. 'పోటీల వల్లే' అన్నమాట! కాబట్టి 'అభివృద్ధి' అనే దానికి, అది ఒక మనిషి అభివృద్ధి అయినా, సమాజం అభివృద్ధి అయినా, దాని కోసం పెట్టుబడిదారీ దృష్టి వేరూ, శ్రామిక దృష్టి వేరూ.

పెట్టుబడిదారీ సమాజంలో ఆటల పోటీలన్నీ డబ్బు సంపాదించే వ్యాపారాలు గానూ, జనాల్ని ఒక మత్తులో పడేసి వుంచే వ్యసన మార్గంగానూ, పనిచేస్తాయి. పెట్టుబడిదారీ ప్రభుత్వం కార్మిక జనాభాని వ్యసనపరుల్ని చెయ్యడానికి, (వారి ద్వారా డబ్బు సంపాదించడానికి కూడా) సారాలూ, లాటరీలూ, గుర్రప్పందాలూ లాంటి వాటిని ఉపయోగించినట్టే, ఈ ఆటల పందాల్ని కూడా ఉపయోగిస్తుంది.

బిరుదులూ, బహుమతులూ, సన్మానాలూ కూడా— ఈ రకమైనవే. ఒక మనిషికి ఒక 'కళ'లో గానీ, ఒక

'విద్య'లో గానీ నిజమైన శక్తి సామర్థ్యాలు వున్నా, సద్గుణాలు వున్నా, అవి సమాజానికి అందినప్పుడు, సమాజం ఆ మనిషిని ప్రేమిస్తుంది. గౌరవిస్తుంది. ఆ ప్రేమనీ, గౌరవాన్నీ వ్యక్తం చేయడానికి సహజమైన మార్గాలు చాలా వుంటాయి. కానీ, ఈ సన్మానాలన్నీ పై పై ప్రదర్శనలు! "ఈమె గొప్ప గాయకురాలు" అనీ, "ఈయన గొప్ప చిత్రకారుడు" అనీ కాయితాల మీదో, లోహపు బిళ్ళల మీదో రాసి ఇవ్వడమూ ; ఆ బహుమతులు పొందిన వాళ్ళు ఆ పత్రాల్నీ, ఆ రేకుల్నీ తమ ఇళ్ళల్లో గోడలకు వేళ్ళాడ దియ్యడమూ — వగైరా కార్యక్రమాలలో వున్న దంతా పైపై ప్రదర్శనా, పటాటోపమూ తప్ప ఇంకేమీ కాదు. ఈ రకమైన ఖర్చులన్నీ కూడా సమాజానికి అసహజమైన ఖర్చులే.

**'మూఢ నమ్మకాల' వల్ల అయ్యే ఖర్చు** : మత కార్య కలాపాలకు సంబంధించిన ఖర్చు అంతా ఇందులోకి వస్తుంది. గుళ్ళకీ, గోపురాలకీ అయ్యే ఖర్చూ; అదృష్టం — అనే నమ్మకాల విషయంలో అయ్యే ఖర్చూ; జోతిష్యాలూ, వాస్తు శాస్త్రాలూ, మొక్కుబడులూ, లాటరీలూ వగైరాలకు అయ్యే ఖర్చూ— ఇలాంటివన్నీ. మానవ సమాజానికి సమిష్టి జీవితమూ, ప్రకృతి శాస్త్ర జ్ఞానమూ దొరికినప్పుడు, సమాజం ఈ మూఢ నమ్మకాల మార్గంలో తన శ్రమని వినియోగించడం ఆగిపోతుంది.

**అనారోగ్యకరమైన ఉత్పత్తులు** : పొగాకూ, సారా, నల్ల మందూ— లాంటి ఉత్పత్తులన్నీ ఈ కోవలోకి వస్తాయి. ఇవి 'అలవాట్ల' వల్ల ఏర్పడే అవసరాలుగా వుంటాయి. ఈ అలవాట్లు ఆరోగ్యకరమైనవి కావు గనక సమాజం క్రమంగా వీటిని మార్చుకోవలసి వుంటుంది.

**విలాస ఉత్పత్తులు**: గుర్రప్పందాలూ, మల్లయుద్ధాలూ, ఇళ్ళల్లో కుక్కల్ని పెంచడాలూ— వంటివన్నీ ఈ కోవలోకి వస్తాయి. 'దోపిడీ మంద' పొందే వికృత మానసోల్లాసం కోసం పుట్టిన విలాసాలు ఇవి. ('విలాస ఉత్పత్తి' గురించి ఇదే సంపుటంలో, "పెట్టుబడి విస్తరణ" చాప్టర్లో కొన్ని వివరాలు చూస్తాం.)

ఈ 5వ అంశంలో, అనవసరపు ఉత్పత్తులూ, ఆడంబరపు ఉత్పత్తులూ, కల్తీ ఉత్పత్తులూ, అనారోగ్యకర ఉత్పత్తులూ— అంటూ వీటిని ఇన్ని రకాలుగా విభజించాం గానీ సారాంశంలో ఇవన్నీ ఒకటే. ఒక 'పనికి రాని' ఉత్పత్తికి, ఈ అన్ని లక్షణాలూ వుంటాయి. అదే అనవసర ఉత్పత్తీ, అదే కృత్రిమ ఉత్పత్తీ, అదే అనారోగ్యకర ఉత్పత్తీ, అదే అన్ని చెడ్డ లక్షణాలూ గల ఉత్పత్తి.

## 6) శుభ్రతకీ, విశ్రాంతికీ అవసరమయ్యే ఉత్పత్తులు ఉండాలి:

ఒక పక్క, సమాజం నించి అనవసరపు ఉత్పత్తుల్ని తీసివెయ్యడం ఒక బాధ్యతైతే, ఇంకో పక్క —సమాజంలో అంతవరకూ లేని అవసరమైన ఉత్పత్తులు చేసుకోవడం ఇంకో బాధ్యత.

**శుభ్రత కోసం** : 'శుభ్రత' అనే ఒక్క అంశాన్నే తీసుకుంటే పెట్టుబడిదారీ సమాజం దీని కోసం ఏమీ ఖర్చు పెట్టడం లేదని నిస్సంకోచంగా తేల్చెయ్యవచ్చు. 'శ్రామిక వర్గం'లో మెజారిటీ భాగం పేదతనంలోనే వుంటుంది కాబట్టి, అది పూర్తిగా అశుభ్రత లోనే వుంటుంది. పెట్టుబడిదారీ వర్గాన్నీ, కార్మిక వర్గంలో ఉన్నత మేధా శ్రమల సెక్షన్లనీ తీసుకుంటే, ఈ భాగానికి కూడా నిజమైన శుభ్రత వుండదు. ఈ సంగతి ఎలా చెప్పవచ్చుంటే, ఆ శుభ్రతకి సంబంధించిన పనులన్నీ శ్రామికులే చెయ్యాలి. ఆ శ్రామికుల జీవితాలలోనే శుభ్రత వుండదు గనక, వారికి శుభ్రత సరైన పద్ధతిలో తెలియదు. శుభ్రత తెలియని వారి ద్వారా జరిగే శుభ్రత నిజమైన శుభ్రతగా వుండదు. కాబట్టి, పెట్టుబడిదారీ వర్గమూ, ఉన్నత మేధాశ్రమల సెక్షన్లూ, శుభ్రత గల జీవితాలు గడుపుతున్నాయంటే, అది వుత్త భ్రమ మాత్రమే.

పబ్లిక్ స్థలాల్ని చూస్తే, పెట్టుబడిదారులు సమాజానికి ఎంత శుభ్రత ఇవ్వగలుగుతున్నారో తెలుస్తుంది. రోడ్లూ, ప్లాట్‌ఫారాలూ, రైలుస్టేషన్లూ, ఆఫీసులూ, ఆస్పత్రులూ, హోటళ్ళూ, పార్కులూ, స్కూళ్ళూ, కోర్టులూ, బస్సులూ, రైళ్ళూ, సినిమా థియేటర్లూ, వాటిల్లో మళ్ళీ బాత్ రూమ్‌లూ, పాయిఖానాలూ — ఇవన్నీ ఘోరమైన అశుభ్రతలోనే వుంటాయి. దోమలూ, ఈగలూ, మురుగు గుంటలూ, డ్రైనేజికి ఏర్పాట్లే లేని ప్రాంతాలూ, వున్నా పూడిపోయిన డ్రైనేజి గొట్టాలూ — వగైరాల్ని వర్ణించనక్కర లేదు. మొత్తం సమాజంలో, ఇళ్ళల్లో గానీ, పబ్లిక్ స్థలాల్లో గానీ, ఎక్కడ చూస్తే అక్కడ అశుభ్రతే! మురికే! నాగరికత రాజ్యమేలుతున్నట్టు కీర్తి పొందే పెద్ద పెద్ద నగరాలలో పరిస్థితి కూడా ఇంతే. కాయితం ముక్కలు కనపడని రోడ్లులే శుభ్రతకి కొలతబద్దలు కావు. పరిశ్రమల ద్వారా సంభవించే గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, శబ్ద కాలుష్యం; రసాయనిక ఎరువుల ద్వారా, కల్తీల ద్వారా సంభవించే ఆహార కాలుష్యం — ఈ కాలుష్యాలన్నీ మానవ దేహంలోకి మురుగుని సరఫరా చేసే మార్గాలే. ఈ సమస్యలన్నీ శుభ్రతకీ, ఆరోగ్యానికీ సంబంధించినవే.

ఈ పరిస్థితులన్నిటినీ పరిశుభ్రతలోకి మార్చాలంటే, ఈ

పనుల కోసం రోజూ కోట్లకొద్దీ మనుషులు శ్రమ చెయ్యాలి. ఆ పనులు జరగడానికి ఎన్నో ఉత్పత్తి సాధనాలు కావాలి. ఇవన్నీ ఒకనాడు అవసరమై, ఒకనాడు అవసరం లేకుండా పోయేవి కావు. 'నూతన సమాజం'లో కొంత కాలానికి ఆస్పత్రుల సంఖ్య తగ్గిపోయినట్టుగా, కొంత కాలానికి శుభ్రత కోసం పెట్టవలసిన ఖర్చు తగ్గిపోదు. అది ఎప్పుడూ ఒక్కలాగే తప్పనిసరిగా జరగాల్సిన ఖర్చుగా వుంటుంది.

**విశ్రాంతి కోసం** : 'విశ్రాంతి' అనేదానికి ఇప్పటి అర్థం చాలదు. 'నూతన సమాజం'లో రాత్రి పని ఎలాగైతే వుండకూడదో, అలాగే ఏప్రిల్, మే నెలల మండుటెండల్లో, అత్యవసరమైన పనులు తప్ప మిగతా పనులేవీ వుండ కూడదు. లేదా, తక్కువ గంటలే పని వుండాలి. విశ్రాంతి అనేది ప్రకృతి రుతువుల్ని బట్టీ, ప్రకృతి సహజంగా శారీరక మానసిక అవసరాల్ని బట్టీ, వుండాలి. స్కూలు పిల్లలకూ, టీచర్లకూ వేసవి కాలాల్లో శలవులు ఇచ్చి స్కూళ్ళు మూసేసినట్టే, ఆ నెలల్లో ఫ్యాక్టరీల్లో పనులు తగ్గించెయ్య డానికి వీలయ్యేలాగ పనులన్నీ ప్లాన్ చేసుకోవాలి.

ఈ రకంగా, సమాజానికి ఏం కావాలీ, ఏం అక్కర లేదూ— అనే విషయాల్ని బట్టి సమాజానికి మొత్తం ఎంత శ్రమ కావాలో నిర్ణయమవుతుంది. సమాజంలో అందరూ పని చేస్తారనీ, వ్యాపారమూ యుద్ధాలూ వంటి అసహజ మైన ఖర్చులు వుండవనీ ఊహిస్తే, ఇప్పుడు లేని కొత్త అవసరాలు ఎన్ని వచ్చినా, సమాజానికి కావలసిన మొత్తం శ్రమ చాలా తగ్గిపోతుంది. మొత్తం శ్రమ చాలా తగ్గడం అంటే, ఒక వ్యక్తి చెయ్యవలసిన శ్రమ చాలా తగ్గడమే. అంటే, 'పని దినం' చాలా తగ్గడమే.

'పని' అనేది, ఒక 'అవసర' విషయంగా, ఒక 'బాధ్యత'గా వున్నప్పుడు, ఎక్కువ సేపు పనిచెయ్యవలసి వచ్చినా, దాని వల్ల కష్టం వుండదు. పనిచేసే మనుషులు ఆరోగ్యంగా వుండి, పని పరిస్థితులన్నీ సౌకర్యంగా వుండి, పని సహజ అవసరం అయినప్పుడు, అలాంటి పరిస్థితుల్లో పని చెయ్యడం ఆనంద కార్యంగా వుంటుంది. ఎక్కువ పనా, తక్కువ పనా — అన్న ప్రశ్న వుండదు. అవసరాన్ని బట్టి పని! ఎంత పని అవసరమైతే అంత పని! అదే పని దినానికి సహజమైన హద్దు!

నూతన సమాజంలో కూడా పని దినం ఫలానా కొన్ని గంటల కాలం తోటీ, క్రమశిక్షణా నియమాల తోటీ, వుండవలసి వుంటుంది.

# నూతన సమాజంలో కూడా పనిదినం 2 భాగాలుగా ఉంటుందా?

'నూతన పని దినం' కూడా 2 భాగాలుగానే వుంటుంది. కానీ, ఆ భాగాల స్వభావాల్ని దోపిడీ సమాజాల్లో వుండే భాగాలతో పోలిస్తే, ఇవి పూర్తిగా వేరుగా వుంటాయి. ఈ విషయాలు కొంచెం వివరంగా చూడాలి.

నూతన సమాజం ప్రారంభమైన వెంటనే మారకాల్నీ 'డబ్బు'నీ తీసివెయ్యడం జరగదు. డబ్బుని తీసివెయ్యక ముందూ, తీసివేసిన తర్వాతా కూడా పని దినం 2 భాగాలు గానూ వుంటుంది. మొదట, డబ్బుని తీసివెయ్యక ముందు వుండే పరిస్థితులు చూద్దాం.

ఒక భార్యా భర్తా, వారికి ఇద్దరో ముగ్గురో పిల్లలూ వృద్ధులైన తల్లిదండ్రులూ — వీరందరూ కలిసి ఒక కుటుంబం. (ఈ తల్లిదండ్రులు, పనిచేసే స్తితిలో లేరనుకుందాం. వారికి వేరే పిల్లలు కూడా లేరనుకుందాం. వేరే పిల్లలు వుంటే, తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలందరి మీదా వుంటుంది. ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, భార్య తల్లిదండ్రులకూ, భర్త తల్లిదండ్రు లకూ కూడా వేరే పిల్లలు లేరనుకుందాం.) ఈ కుటుం బానికి కావలసిన ఉత్పత్తులన్నీ ఆ ఇద్దరు భార్యా భర్తల శ్రమతోటే ఉత్పత్తి కావాలి. భార్య చేసే శ్రమకు 1 రోజుకి జీతం 10 వస్తువులూ, ఆమె నించి 'సమాజ నిధి'కి పోయే భాగం 3 వస్తువులూ అనుకుందాం. భర్త శ్రమకు జీతం 8 వస్తువులూ, అతని నించి 'సమాజ నిధి'కి పోయే భాగం 2 వస్తువులూ అనుకుందాం. ఈ ఇద్దరికీ కలిసి మొత్తం జీతాలు 18 వస్తువులూ, సమాజ నిధికి పోయే భాగం 5 వస్తువులూ. ఈ కుటుంబ సభ్యులంతా ఆరోగ్యంగా సుఖంగా జీవించడానికి, ఇంటి అవసరాల కోసం, 1 రోజుకి జీతాలుగా వున్న ఆ 18 వస్తువులూ సరిపోవాలి. వీరికి సమాజం నించి అందవలసిన అవసరాల కోసం సమాజ నిధిలోకి వెళ్ళే 5 వస్తువులూ సరిపోవాలి.

'సమాజ నిధి'లోకి చేరే ఉత్పత్తులన్నీ దేని కోసం ఖర్చవుతాయి?

(1) సమాజం, కొన్ని సంస్థల్ని 'ఉచితంగా' నిర్వహించ వలసి వుంటుంది. ఉదా॥ స్కూళ్ళనీ, ఆస్పత్రుల్నీ.

(2) సమాజంలో అప్పుడప్పుడూ 'ప్రకృతి సహజమైన' ఆపదలు సంభవించవచ్చు. తుఫానులూ, భూకంపాలూ లాంటివి. ఇలాంటి సందర్భాలలో ప్రాణనష్టం జరగకుండా

చూసుకోవడం సాధ్యమే గానీ, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవడం సాధ్యం కాకపోవచ్చు. ఇళ్ళూ, చెట్లూ, కొన్ని రకాల స్తంభాలూ కూలిపోతే, వాటిని మళ్ళీ నిర్మించుకోవాలి.

(3) అప్పుడప్పుడూ యాక్సిడెంట్లు జరగవచ్చు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా యాక్సిడెంట్లు పూర్తిగా తగ్గకపోవచ్చు. 10 సం॥ల పాటు యాక్సిడెంట్ అనేదే లేకపోయినా, అది ఏ క్షణంలోనైనా జరగవచ్చనే దృష్టితోనే వుండాలి.

(4) కొన్ని రకాల జబ్బుల గురించీ, ఉత్పత్తి క్రమాల గురించీ, నూతన శాస్త్ర పరిశోధనలు అవసరమవుతూనే వుంటాయి.

ఈ రకంగా సమాజం మొత్తానికి సంబంధించిన 'సమిష్టి అవసరాల' కోసం 'సమాజ నిధి' ఖర్చవుతూ వుంటుంది. ఈ ఖర్చు అంతా ఎవరి కోసం? ఆ సమాజంలో నివసించే జనాభా కోసమే. అంటే, ఈ ఖర్చు కూడా ఆ జనాభా అవసరాల కోసం అయ్యే ఖర్చే. మొత్తం అంతా అవసర శ్రమే.

'విద్య' అనే విషయాన్ని తీసుకుంటే, సమాజంలో వున్న పిల్లలందరూ స్కూళ్ళల్లో చదువుకోవాలంటే దాని కోసం లక్షలాది స్కూలు బిల్డింగులూ, కుర్చీలూ, బెంచీలూ, టేబుళ్ళూ, నల్ల బల్లలూ, పుస్తకాలూ, కలాలూ, సైన్సు పరికరాలూ — వగైరా సామగ్రి ఎంతో కావాలి. చదువు చెప్పే పని మీద వేలాది మంది టీచర్లు పని చెయ్యాలి. ఆ టీచర్లకు ఇళ్ళూ, ఆహార పదార్థాలూ వగైరా సామగ్రి అంతా వుండాలి. ఇన్ని ఉత్పత్తులు ఖర్చవుతూ వుంటేనే ప్రతీ రోజూ విద్యాబోధన సాగుతూ వుంటుంది.

ఈ చదువుల ఖర్చుని పిల్లల తల్లిదండ్రులే భరించడం ఒక పద్ధతీ, సమాజం భరించడం— ఇంకో పద్ధతీ.

చదువు ఖర్చుని పిల్లల తల్లిదండ్రులే భరించడం అంటే : ఆ తల్లిదండ్రులు ఉత్పత్తి చేసిన దాంట్లో నించి, వారికి జీతాలుగా వచ్చే భాగం ఎక్కువగా వుండి, 'సమాజ నిధి'లోకి వెళ్ళే భాగం తక్కువగా వుంటుంది. ఆ జీతాలలో నించీ తల్లిదండ్రులే స్కూళ్ళకు జీతాలు కట్టి, పిల్లలకు పుస్తకాలూ అవీ కొంటారు.

చదువు ఖర్చుని సమాజం భరించడం అంటే: తల్లిదండ్రులు ఉత్పత్తి చేసిన దాంట్లో నించి జీతాల భాగం తగ్గి, 'సమాజ నిధి'లోకి వెళ్ళే భాగం పెరుగుతుంది. అప్పుడు, స్కూళ్ళకు జీతాలు కట్టడమూ, పుస్తకాలు కొనడమూ వగైరా ఖర్చులేవీ తల్లిదండ్రులు జీతాలలో నించి పెట్టరు. ఆ ఖర్చులన్నీ సమాజ నిధే భరిస్తుంది.

అంటే, సారాంశంలో రెండూ ఒకటే. మొదటి పద్ధతిలోనూ, రెండో పద్ధతిలోనూ కూడా పిల్లల చదువుల ఖర్చుల్ని భరించేది తల్లిదండ్రులే. మొదటి పద్ధతిలో ఆ పని, తల్లి దండ్రుల ద్వారా విడి విడిగా జరిగితే, రెండో పద్ధతిలో ఆ పని, ఆ తల్లిదండ్రుల శ్రమతోనే ఏర్పడిన 'సమాజ నిధి' ద్వారా సమిష్టిగా జరుగుతుంది. అంటే, ఏ పద్ధతిలోనైనా పిల్లల చదువుల ఖర్చుని భరించేది తల్లిదండ్రులే. కానీ, ఈ విషయం (చదువుల ఖర్చుని తల్లిదండ్రులే భరిస్తారనే విషయం) మొదటి పద్ధతిలో కనపడినంత స్పష్టంగా, రెండో పద్ధతిలో కనపడదు. మొదటి పద్ధతిలో తల్లిదండ్రులే స్వయంగా జీతాలలో నించి ఆ ఖర్చులు పెడతారు కాబట్టి, ఆ విషయం బహిరంగంగా కనపడుతుంది. రెండో పద్ధతిలో, ఆ ఖర్చులు తల్లిదండ్రులు స్వయంగా పెట్టకుండా, సమాజమే పెడుతుంది కాబట్టి, అది సమాజమే భరిస్తోన్న ఖర్చు లాగానూ, ఆ ఖర్చుకీ తల్లిదండ్రులకూ సంబంధం లేనట్టు గానూ కనపడుతుంది. ఈ రెండో పద్ధతిలో జరుగుతున్న విషయం కూడా తల్లిదండ్రులకు స్పష్టంగా అర్థం కాకపోతే, 'వ్యక్తి'కీ 'సమాజా'నికీ వున్న సంబంధం, ఆ శ్రమని ఇవ్వవలసిన వాళ్ళకే అర్థం కాకుండా పోతుంది.

'సమాజం' అంటే మొత్తం జనాభాయే. ఆ జనాభా, ఫలానా రకపు ఉత్పత్తి సంబంధాలతో వున్న జనాభా. వ్యక్తి అంటే, ఆ 'మొత్తంలో' ఒక కనీస భాగం. ఒక యూనిట్. దోపిడీ సమాజంలో అయితే, కుటుంబమే ఒక యూనిట్. ఆ యూనిట్‌కి పురుషుడే యజమాని. నూతన సమాజంలో 'కుటుంబం' అనేది ఎప్పటిలాగే వున్నా, ఇక్కడ సమాజానికి యూనిట్ కుటుంబం కాదు, వ్యక్తే. ప్రతీ వ్యక్తినీ లెక్కలోకి తీసుకుని గుర్తించవలసిందే. ఇక్కడ, ఏ వ్యక్తికి ఆ వ్యక్తే స్వతంత్రుడు కాబట్టి, ఇక్కడ వ్యక్తే సమాజానికి కనీస భాగం. ఈ కనీస భాగానికీ, మొత్తం సమాజానికీ వుండే సంబంధం, (అంటే ఒక విడి వ్యక్తికీ మిగతా వ్యక్తులకూ వుండే సంబంధం), ఆ వ్యక్తికీ, ఆ మిగతా వ్యక్తులకూ కూడా స్పష్టంగా తెలుస్తూ వుండాలి. ప్రతీ వ్యక్తీ, తోటి వ్యక్తులతో సమానమైన శ్రమ సంబంధాలలో వుండడమూ, అలా వుంటున్న సంగతి గ్రహించడమూ జరుగుతూ వున్నప్పుడు, సమాజం అనేది అయోమయమైన 'దూరపు' విషయం గానో, 'పరాయి' విషయం గానో, వుండదు.

సమాజం ద్వారా జరిగే ఏ కార్యక్రమం అయినా పిల్లల చదువు విషయంలో చూసినట్టే వుంటుంది. సమాజం ఏ ఖర్చునైనా 'ఉచితంగా' భరిస్తోన్నట్టు కనపడినా, నిజానికి అది ఉచితం కాదు. అదంతా ఆ సమాజ జనాభా శ్రమ ద్వారా వచ్చే ఉత్పత్తే. ఆ జనాభా చేసే శ్రమ నించి కొంత

ఉత్పత్తి 'సమాజ నిధి'లోకి రాకపోతే, సమాజం అనేది, ఏ ఖర్చులూ పెట్టడం సాధ్యం కాదు. సమాజం, కొన్ని ఉత్పత్తుల్ని అందరికీ ఒకే పద్ధతిలో అందేలాగ ఖర్చుపెడుతూ, దానికి బదులుగా ఆ వ్యక్తుల నించి డబ్బు తీసుకోకపోతే, అది 'ఉచితంగా' ఖర్చు పెట్టడం లాగ కనపడుతుంది. కానీ, ఆ ఉత్పత్తులు ఎవరి కోసం ఖర్చవుతాయో, అవి ఆ వ్యక్తుల శ్రమతో గానీ, వారి తల్లిదండ్రుల శ్రమతో గానీ, వారి బిడ్డల శ్రమతో గానీ, తయారై వుంటాయి. అంటే వారి ఉత్పత్తులే వారి అవసరాల కోసం ఖర్చవుతాయి. కాబట్టి, ఎక్కడైనా సరే, 'ఉచితం' అనే మాట అర్థం లేని మాటే.

చదువుల ఖర్చుని సమాజ నిధి, ఉచితంగా భరించడం అనే విషయం, ఒక పక్క తల్లిదండ్రుల 'వ్యక్తిగత' విషయంగానూ, ఇంకో పక్క తల్లిదండ్రులందరి 'సమిష్టి' విషయంగానూ కూడా వుంటుంది. వ్యక్తిగత విషయంగా ఎందుకు వుంటుందంటే, ఆ చదువుల ఖర్చులో ఎవరి పిల్లల ఖర్చుని వాళ్ళు భరిస్తోన్నట్టే అవుతుంది గనక. కార్యక్రమం ఎంత సమిష్టిగా జరిగినా, ఒక తల్లిదండ్రులు ఖర్చు పెట్టేది, వాళ్ళ పిల్లల కోసమే. ఈ కోణంలో చూస్తే, ఇది తల్లిదండ్రుల 'వ్యక్తిగత' విషయంగానే అవుతుంది. అదే విషయం, 'సమిష్టి' విషయంగా కూడా ఎందుకు అవుతుందంటే — పిల్లల తల్లిదండ్రుల జీతాలు ఎక్కువ తక్కువలుగా వుంటాయి కాబట్టి, ఆ జీతాల నించి సమాజనిధి లోకి వచ్చే భాగాలు కూడా ఎక్కువ తక్కువలుగానే వుంటాయి. కానీ, సమాజ నిధి, ఒక తరగతి పిల్లలందరి మీదా ఎక్కువ తక్కువ తేడాలు లేకుండా సమానంగానే ఖర్చు చేస్తుంది. అంటే, సమాజంలో వున్న తల్లిదండ్రు లందరూ పిల్లలందరి చదువుల ఖర్చునీ కలిసి భరిస్తారన్నమాట. ఆ రకంగా అది 'సమిష్టి' విషయంగా వుంటుంది.

ఈ రకంగా, నూతన సమాజంలో, జీవితానికి సంబంధించిన ప్రతి కోణంలోనూ సమిష్టితనం కూడా ప్రారంభమవుతూ వుంటుంది.

'పోషణ' విషయం తీసుకుంటే — బిడ్డల్ని తల్లిదండ్రులు పోషిస్తే, వృద్ధులైపోయిన తల్లిదండ్రుల్ని బిడ్డలు పోషిస్తారు. ఇది, ఏ సమాజంలోనైనా జరిగేదే. ఈ ధర్మం, నూతన సమాజంలో కూడా ఏమీ మారదు. అయితే, ఈ ధర్మాన్ని నిర్వహించే పద్ధతి, నూతన సమాజంలో చాలా భిన్నంగా వుంటుంది.

దోపిడీ సమాజాలలో పోషణ విషయాలన్నీ వ్యక్తిగత బాధ్యతల మీదా, కుటుంబ బాధ్యతల మీదా మాత్రమే ఆధారపడి జరుగుతాయి. దాని వల్ల ఆ విషయాలు సంకుచితమైన హద్దుల్లో వుండిపోతాయి. బాధ్యతలు నిర్వహించవలసిన వాళ్ళు వాటిని వదిలేసినప్పుడుగానీ, బాధ్యత వహించ వలసిన ఆ వ్యక్తులే లేనప్పుడుగానీ, ఆ వ్యక్తుల ద్వారా పోషణ పొందవలసినవారు 'అనాథలై' పోవడం తప్ప అక్కడ ఇంకో మార్గం వుండదు.

నూతన సమాజంలో పరిస్థితి అది కాదు. ఇక్కడ 'సమాజ బాధ్యత' అనే విషయం ఒకటి కొత్తగా ప్రారంభమవుతుంది. 'వ్యక్తుల బాధ్యత'తో పాటు ఇక్కడ, 'సమాజ బాధ్యత' కూడా కలుస్తుంది. ఇక్కడ సమాజం ఏం చేస్తుందంటే — వ్యక్తి, తన బాధ్యతల్ని సహజ ధర్మాలుగా గ్రహించి నిర్వర్తించేటట్టు చెయ్యడమూ, తను వ్యక్తికి సహకరించడమూ — చేస్తుంది.

ఇక్కడ పోషణ విషయాలు, కుటుంబ స్థాయిలోనూ, సమిష్టి స్థాయిలోనూ కూడా ఏర్పడతాయి.

తల్లిదండ్రులు లేని బిడ్డలూ, బిడ్డలు లేని తల్లి తండ్రులూ అనాథలైపోకుండా, 'లేని వాళ్ళ' బాధ్యతనీ, తన బాధ్యతనీ కూడా, ఇక్కడ సమాజమే నిర్వర్తిస్తుంది. పోషించే వాళ్ళు లేని లోపాన్ని తీర్చడం అంటే, 'అనాథ శరణాలయాలు' నడపడం కాదు. 'అనాథ' అనే మాట నూతన సమాజ స్వభావానికే కళంకమైన మాట. సమిష్టి, జీవిత విధానం గల సమాజంలో, పోషించే వ్యక్తులు లేని చిన్న పిల్లల కోసమూ, వృద్ధుల కోసమూ సమాజంలో వున్న మిగతా జనాభా అంతా 'బాధ్యత' వహిస్తారు గనక, ఇక్కడ ఏ వ్యక్తీ 'అనాథ' కాదు.

సమాజంలో వున్న ప్రతీ మనిషికీ శ్రమ చెయ్యలేని దశల్లో సమాజం నించి పోషణ పొందే హక్కు వుంది. అలాంటి దశలో వున్న వ్యక్తులకు ఆత్మాభిమానం గాయపడని పద్ధతిలోనూ, వారి హక్కుని వారు పొందుతున్నారనే పద్ధతిలోనూ, పోషణ దొరకాలి. నూతన విధానంలో అలాగే జరుగుతుంది. ఇక్కడ పోషణ అనేది, వ్యక్తుల మీదనో కుటుంబాల మీదనో మాత్రమే ఆధారపడే సంకుచిత స్వభావంతో గాక, 'సమాజం' మీద ఆధారపడే విశాల స్వభావంతో వుంటుంది కాబట్టి, పోషణ విషయంలో గత సమాజాలలో పుట్టుకు వచ్చే సమస్య లన్నిటికీ ఇక్కడ సహజమైన పరిష్కార మార్గాలు ఏర్పడతాయి. క్రమ క్రమంగా అనుభవాల ద్వారా సరైన పద్ధతులు స్థిరపడతాయి.

నూతన సమాజంలో ఏర్పడే ఈ మార్పుల స్వభావాన్ని సరిగా గ్రహించకపోతే, 'సమాజ బాధ్యత' అనే మాట చాలా యాంత్రికమైన పద్ధతిలో తప్పు తప్పులుగా అర్థమవుతుంది. ఆ తప్పు అభిప్రాయాలు ఎలా వుంటాయంటే: 'నూతన సమాజంలో, పిల్లల్ని, తల్లిదండ్రులు పెంచనక్కర లేదు. ఎవర్ని ఎవరూ పోషించనక్కర లేదు. వ్యక్తులకు ఏ బాధ్యతలూ వుండవు. అందర్నీ సమాజమే పోషిస్తుంది. అన్ని బాధ్యతలూ సమాజమే నిర్వర్తిస్తుంది. సమాజంలో

జరిగే ఏ పనికీ ఏ ఖర్చుకీ వ్యక్తులతో సంబంధం వుండదు. ఎంత ఖర్చయినా సమాజం అవలీలగా భరిస్తుంది. ఎంతెంత ఖర్చులైనా సమాజం మీదకి తోసెయ్యవచ్చు'— ఇలాంటి తప్పుడు అభిప్రాయాలు అవి. సమాజం అనేది, ఎన్నెన్నో మహిమలు గల సంస్థ అయినట్టు కనపడుతుంది. సమాజంలో వుండే జనాభాకి సమాజం గురించి ఈ రకమైన తప్పు అభిప్రాయాలు వుంటే, ఆ జనాభాయే నిర్మించుకోవలిసిన ఆ సమాజం తప్పు పద్ధతులతోనే వుంటుంది. వ్యక్తికీ సమాజానికీ వుండే సంబంధాన్ని స్పష్టంగా గ్రహించినప్పుడు, సమాజం గురించి పొరపాటు అభిప్రాయాలు ఏర్పడవు.

నూతన పని దినం కూడా 2 భాగాలుగా వుంటుందా— అనే విషయాన్ని ఇప్పుడు సరిగా అర్థం చేసుకోవచ్చు. అవును, నూతన పని దినం కూడా 2 భాగాలుగానూ వుంటుంది.

నూతన సమాజం అన్నప్పుడు, దాన్ని మొదట 2 దశలుగా విభజించుకోవాలి.

**1.** ఇంకా జీతాల విధానం వున్న దశ.
**2.** జీతాల విధానం ఆగిపోయిన దశ.

ఈ 2 దశలలోనూ కూడా పని దినం 2 భాగాలుగానూ వుంటుంది.

మొదటి దశలో పని దినం: జీతమూ + సోషల్ ఫండూ

2 వ దశలో పని దినం: స్వంత పోషణార్థం వాడే ఉత్పత్తుల భాగమూ + సోషల్ ఫండూ

ఈ విషయాలు సరిగా అర్థం చేసుకోవాలి. 'నూతన సమాజం'లో కూడా ప్రతీ వ్యక్తీ తన శ్రమ ఫలితంలో కొంత భాగాన్ని తన చేతిలోకి తీసుకుని, కొంత భాగాన్ని 'సమాజ నిధి' కోసం వదలడం తప్పనిసరిగా జరగాలి కాబట్టి, నూతన పని దినం కూడా 2 భాగాలుగా వుండవలసిందే. అయితే, ఈ భాగాలు గతంలో లాగ 'అవసర— అదనపు' భాగాలు కావు. 2 భాగాలూ 'అవసర' భాగాలే. రెండో భాగం కూడా అవసరం కాకపోతే, ఆ భాగం శ్రమ చెయ్యడం వ్యక్తికి ఒక బాధ్యతగా వుండనక్కరలేదు. ఆ భాగం పని కూడా ఆ వ్యక్తి చెయ్యవలసిందే అయినప్పుడు, అది కూడా ఆ వ్యక్తికి అవసర భాగమే అవుతుంది. తన పిల్లల చదువుల కోసమూ, తన తల్లిదండ్రుల సంరక్షణ కోసమూ, సమాజం పట్ల తను నిర్వర్తించవలసిన విధుల కోసమూ, ఈ రకంగా అంతా తన కోసమే తను చేసుకునే శ్రమ, అవసర శ్రమ కాకుండా అదనపు శ్రమ అవదు. అదనపు శ్రమ అంటే చేసిన మనిషికి దక్కకుండా పోయే శ్రమ. ఇక్కడ అలాంటి భాగం ఏదీ వుండదు కాబట్టి, ఇక్కడ పని దినం లోని 2 భాగాలూ అవసర భాగాలే.

ఇక్కడ, మొదటి భాగాన్ని మాత్రమే 'అవసర భాగం' అంటే, అది తప్పు అవుతుంది కాబట్టి, ఆ మాటని ఇక్కడ వదిలి వెయ్యవచ్చు. అంటే, ఇప్పుడు, మొదటి భాగానికి 'అవసర భాగం' అనే పేరు పోతుంది. కానీ, ఈ భాగానికి 'జీతం' అనే పేరు మాత్రం అప్పుడే పోదు. ఎందుకంటే, శ్రమ చేసే వ్యక్తి చేతికి ఈ భాగం జీతాల లెక్క ద్వారానే అందుతుంది. జీతాల విధానం వున్నంత కాలమూ ఈ భాగానికి జీతం అనే పేరే వుంటుంది.

అయితే ఇక్కడ కూడా జీతాన్ని 'శ్రమ — శక్తి విలువ' అనవచ్చునా?— అనవచ్చును. అంటే, ఇక్కడ, ఒక వ్యక్తి శ్రమ, (1) 'శ్రమ శక్తి విలువ' భాగం గానూ, (2) 'సమాజ నిధి' భాగం గానూ చీలుతుంది. మొదటి భాగం ఆ వ్యక్తి ద్వారానే, ఆ వ్యక్తి కోసం ఖర్చవుతుంది. రెండో భాగం సమాజ నిధిలోకి పోయి, సమాజం నిర్వహించే సమిష్టి కార్యక్రమాలలో ఆ వ్యక్తికి సంబంధించిన భాగంగా ఖర్చవుతుంది. దోపిడీ సమాజంలో అయితే ఈ రెండో భాగం అంతా దోపిడీ వర్గానికి పోతుంది గానీ అందులో నించి ఏ మాత్రమూ శ్రమ చేసే మనిషికి తిరిగి అందదు. కానీ ఇక్కడ (నూతన సమాజంలో) రెండో భాగం కూడా ఆ వ్యక్తి అవసరాల కోసమూ, ఆ వ్యక్తి నిర్వహించ వలసిన సామాజిక బాధ్యతల కోసమూ ఖర్చవుతుంది. కాబట్టి, ఆ భాగం కూడా ఆ వ్యక్తికి తిరిగివచ్చినట్టే అర్థం. అంటే, ఇక్కడ, శ్రమ చేసే వ్యక్తికి వచ్చేది 'శ్రమ శక్తి విలువ' కాదు, 'శ్రమ విలువే'. అంటే, ఇక్కడ ఎవరి శ్రమ ఫలితం వారికే దక్కుతుంది. అయితే, అదంతా ఒకే సారి, ఒకే రూపంతో తిరిగి రాదు. కొంత భాగం జీతం రూపంలో తిరిగి వస్తే, మిగిలిన భాగం మొదట 'సమాజ నిధి'లో కలిసి, దాని ద్వారా తిరిగి వస్తుంది.

ఇక్కడ కూడా ఒక వ్యక్తి శ్రమ, 'జీతం'గానూ, 'సమాజ నిధి'గానూ విడిపోవాలి కాబట్టి, ఇక్కడ కూడా జీతానికి 'శ్రమ శక్తి విలువే' పునాదిగా వుంటుంది. అయితే, ఇక్కడ శ్రమ శక్తి విలువ, పెట్టుబడిదారుడు ఇచ్చే శ్రమ శక్తి విలువ అంత తక్కువ స్థాయిలో వుండదు.

పెట్టుబడిదారీ విధానంలో శ్రమ శక్తి విలువ, శ్రమ చేసే వ్యక్తికి, జీవితావసరాల్ని కనీస స్థాయిలో మాత్రమే తీర్చే స్వభావంతో వుంటే, నూతన సమాజంలో శ్రమ శక్తి విలువ, శ్రమ చేసే మనిషి, సుఖ సంతోషాలతో జీవించడానికి తగిన స్థాయి లోనూ, ఆ స్వభావం తోనూ, వుంటుంది. ఇక్కడ, వ్యక్తి అవసరాలు కేవలం జీతం ద్వారా మాత్రమే గాక,

సమాజ నిధి ద్వారా కూడా తీరతాయి. ఈ రకంగా, ఇక్కడ, 'శ్రమ శక్తి విలువ'కు వుండే పెట్టుబడిదారీ స్వభావమూ, దాని హద్దులూ మారిపోవడం ప్రారంభమవుతుంది.

ఒక వ్యక్తికి ప్రతి రోజూ 20 అవసరాలు తీరాలను కుందాం. ఆహారం, బట్టలూ, నివాసం, విద్యా, రవాణా, ఆరోగ్యం, కళలూ — ఇలా మొత్తం సహజమైన అవసరా లనే లెక్కకడితే 20 అవసరాలు తీరా లనుకుందాం. ఆ వ్యక్తి ఉత్పత్తిచేసే మొత్తం ఉత్పత్తి ద్వారానే ఆ అవసరాలు తీరాలి. అందులో కొన్ని అవసరాలు 'జీతం' లోంచి తీరితే, కొన్ని అవసరాలు 'సమాజ నిధి'లోంచి తీరతాయి. జీతం ద్వారా 12 అవసరాలు తీరితే, సమాజ నిధి ద్వారా 8 అవసరాలు తీరాలి. జీతం ద్వారా 6 తీరితే సమాజ నిధి ద్వారా 14 తీరాలి. ఈ విధంగా, ఒక వ్యక్తి శ్రమతో ఆ వ్యక్తికి ఇంటా బయటా కలిసి మొత్తం అవసరాలన్నీ తీరాలి.

పిల్లల చదువు బాధ్యతలు జీతంలో నించే నిర్వ హించుకోవలసి వున్నప్పుడు, జీతం భాగం ఎక్కువగా వుండి, సమాజ నిధికి వదలవలసిన భాగం తక్కువగా వుంటుంది.

వృద్ధుల సంరక్షణ బాధ్యతలు ఇళ్ళల్లోనే నిర్వహించుకో వలసి వున్నప్పుడు, జీతం భాగం ఎక్కువగా వుండి, సమాజ నిధి భాగం తక్కువగా వుంటుంది.

రవాణా ఖర్చులన్నీ ఎవరికి వాళ్ళే భరించుకోవలసి వున్నప్పుడు, జీతం భాగం ఎక్కువగా వుండి, సమాజ నిధి భాగం తక్కువగా వుంటుంది.

ఉచిత పాఠశాలలూ, ఉచిత రవాణా, ఉచిత వైద్యం, వృద్ధుల కోసం కొన్ని ఏర్పాట్లూ, సమిష్టి వంటశాలలూ — వగైరా సమిష్టి సంస్థలు క్రమంగా ఏర్పడుతోన్న కొద్దీ జీతం భాగం తగ్గుతూ, సమాజ నిధి భాగం పెరుగుతూ వుంటుంది. ఇది క్రమంగా జీతాల భాగం రద్దు అవడానికి దారితీస్తుంది. ఈ సమిష్టి సంస్థలు ఏర్పడడానికి కావలసిన భౌతిక పునాది, పెట్టుబడిదారీ 'శ్రమ విభజన' మారడమే. (ఈ విషయం కొంచెం వివరంగా ఈ సంపుటంలోనే, "ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా" చాప్టర్‌లో చూస్తాం.)

సమాజంలో 'పెట్టుబడిదారీ శ్రమ విభజన' మారి, 'నూతన శ్రమ విభజన' ఏర్పడిందనీ, జీతాలూ విలువ లెక్కలూ పోయాయనీ — అనుకుంటే, అప్పుడు కూడా ఉత్పత్తి చేసుకోవడమూ, దాన్ని వాడుకోవడమూ వుండవలి సిందే. అప్పుడు కూడా ప్రతీ వ్యక్తీ (స్త్రీ పురుషులందరూ) శ్రమ చేస్తారు. తన స్వంత పోషణా, పిల్లల పోషణా, కుటుంబంలోని వృద్ధుల పోషణా అన్నీ ఎప్పటిలాగే సాగాలి. అప్పుడు కూడా ఇంటి అవసరాలు కొన్నీ, బయటి అవసరాలు కొన్నీ వుంటాయి. రోజూ తినే తిండీ, బట్టా, ఇల్లూ లాంటిది మొదటి రకం అవసరాలు. పిల్లల స్కూళ్ళూ ఆస్పత్రులూ రైళ్ళూ బస్సులూ లాంటివి — బయట సమిష్టిగా వుండే రెండో రకం అవసరాలు. ఇంటా బయటా కలిసి వాడే ఉత్పత్తుల్లో కొన్ని విడి విడిగా వాడేవి అయితే, కొన్ని సమిష్టిగా వాడేవిగా వుంటాయి.

ఒక వ్యక్తి, విడి విడిగా వాడే ఉత్పత్తులన్నీ వ్యక్తికి సూటిగా అందే భాగం. సమిష్టిగా వాడే ఉత్పత్తులన్నీ సమాజ నిధి ద్వారా అందే భాగం. ఈ రకంగా, అప్పుడు కూడా (జీతాల పద్ధతిలేని కాలంలో కూడా) వ్యక్తి శ్రమ, 'వ్యక్తిగత భాగం' గానూ, 'సమాజ నిధి భాగం' గానూ వుంటుంది.

ఇక్కడ, ఇంకో ప్రశ్న : నూతన పని దినంలో అదనపు శ్రమ వుంటుందా?— ఒక శ్రమ చేసే వ్యక్తి, తన కోసం వాడుకునే శ్రమ కన్నా ఎక్కువ శ్రమని ఇస్తే, ఆ అర్థంలోనే అది 'అదనపు శ్రమే'. అయితే, ఆ అదనపు శ్రమ కూడా, తర్వాత, ఆ వ్యక్తి అవసరాల కోసమే వాడకం అయితే, ఆ అర్థంలో అది అదనపు శ్రమ అవదు. నూతన సమాజంలో అదనపు శ్రమ వుండదు. అయినా పని దినం 2 భాగాలు గానే వుంటుంది.

ఇక్కడ, ఒక విషయం గ్రహించాలి. పని దినం 2 భాగాలుగా చీలడం — అనే విషయంలోనే, ఆ రెండో భాగం ఆ వ్యక్తి నించి దూరంగా పోయే పరిస్తితి వుంది. ఆ భాగాన్ని ఖర్చు పెట్టడంలో, ఆ వ్యక్తికి నిజమైన పాత్ర వుండడానికీ, వుండక పోవడానికీ కూడా అవకాశం వుంది.

ఒక వ్యక్తి శ్రమలో కొంత భాగం సమాజ నిధిలోకి పోతోందంటే, ఆ నిధిని ఖర్చుపెట్టే విషయాల్లో ఆ వ్యక్తి పాత్ర వుండి తీరాలి. అంతే కాదు, ఆ వ్యక్తి పాత్ర వున్నప్పటికీ, ఆ వ్యక్తి ఆలోచనా విధానం విలువ దృష్టితో వుండడం కాదు, ఉపయోగపు విలువ దృష్టితో వుండాలి. ఇలా జరగకపోతే ఆ పరిస్తితులు మళ్ళీ ఘర్షణలకూ సమస్యలకూ దారి తీస్తాయి.

ఈ విషయాలన్నీ ఇంకా వివరంగా ఇంకో చోట చూస్తాం.

ఈ భాగంలో ఇంత వరకూ చూసిన విషయాలతో, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని కనీసంగా అర్థం చేసుకోగలం.

# ప్రశ్నలూ — జవాబులూ

**1. 'పని దినం' అంటే ఏమిటి?**

**జ:** శ్రమ చెయ్యడం మొదలు పెట్టిన సమయానికీ, శ్రమని ఆపివేసే సమయానికీ మధ్య వుండే కాలమే — పని దినం.

**2. పని దినం 2 భాగాలుగా ఎందుకు వుంటుంది?**

**జ:** మొదటిభాగం —శ్రమ శక్తి పునరుత్పత్తి కోసం. రెండో భాగం — ఇంకా ఆ పైన జరగవలసిన ఉత్పత్తి కోసం.

**3. 'షిఫ్టు పద్ధతి' అంటే?**

**జ:** ఒకే రోజులో, ఒక్క జట్టు కార్మికులే గాక, 2 జట్లుగానీ, 3 జట్లుగానీ, ఒక జట్టు తర్వాత ఒక జట్టుగా, పగలూ రాత్రీ కూడా పని చెయ్యడమే షిఫ్టు పద్ధతి.

**4. "పగలు నిద్ర, పని చేటు; రాత్రి పని, నిద్ర చేటు" అనే సామెత మీరు ఎప్పుడన్నా విన్నారా? బాగుందా ఈ సామెత? దాని అర్థం ఏమిటి?**

**జ:** విన్నాను. చాలా బాగుంది సామెత. పెట్టుబడిదారుల చేష్టలు చూసే అది పుట్టి వుంటుంది. ఆ సామెతకి అర్థం – పని చెయ్యవలసింది పగలూ, నిద్రపోవలసింది రాత్రీ — అని. దాన్ని తారుమారు చేసుకోవడం బుద్ధిలేని తనం — అని!

**5. మీరు షిఫ్టుల పద్ధతిలో పని చేస్తారా? మీకు షిఫ్టుల పద్ధతి లేకపోయినా ఆ పద్ధతిలో పనిచేసే స్నేహితులు వుంటారు కాబట్టి, షిఫ్టుల జీవితానికి సంబంధించిన కొన్ని సమస్యలూ, అనుభవాలూ రాయండి!**

**జ:** ఆ అనుభవాలన్నీ పాఠంలో చెప్పినవే. తిండి సమయాలూ, నిద్ర సమయాలూ అన్నీ రకరకాలుగా మారిపోతూ వుంటాయి. షిఫ్టు పద్ధతుల్లో పని చెయ్యాలంటే (మొగ వాళ్ళయినా, ఆడ వాళ్ళయినా) ఇంటి వ్యవహారాలు సరిగా పట్టించుకోలేరు. నాకు తెలిసిన ఒకాయన రాత్రి పని చేసినప్పుడు పగలంతా నిద్ర పోతూ వుంటాడు. పిల్లల్ని ఆస్పత్రికి తీసుకు వెళ్ళే పని కూడా చెయ్యడు. దాని వల్ల వాళ్ళింట్లో బోలెడు గొడవలు. ఇలాంటివి ఎన్నో!

**6. లారీ కార్మికులు, రాత్రి షిఫ్టులో ఒక్కో సారి కొంచెం విశ్రాంతి కోసం, లారీని రోడ్డు ప్రక్క ఆపి, లారీ పక్క నేల మీద నిద్రపోతూ వున్నప్పుడు, లారీ పెట్టుబడిదారుడు ఎక్కడ నిద్రపోతూ వుంటాడు?**

**జ:** అది వేరే చెప్పాలా? లారీ పక్కన కాదు. రోడ్డు మీద మట్టిలో కాదు. తన ఇంట్లో, తన పడక గదిలో, పరుపు మీద నిశ్చింతగా నిద్ర పోతూ వుంటాడు. తెల్లారి లేచే టప్పటికి, రాత్రి షిఫ్టు తాలూకు అదనపు విలువ సుందరి వచ్చి ముసి ముసి నవ్వులతో, "వచ్చేశాను" అంటుంది. పెట్టుబడిదారుడు లేచీ లేవగానే ఎవరి మొహం చూస్తాడో తెలుసా? అదనపు విలువ సుందరి మొహమే చూస్తాడు.

**7. 3 షిఫ్టుల పని ఒకే షిఫ్టులో జరిగితే ఉద్యోగాలు తగ్గుతాయా? ఉత్పత్తి తగ్గుతుందా?**

**జ:** ఉద్యోగాలు తగ్గవు. ఉత్పత్తి తగ్గదు. శ్రమ సాధనాల ఖర్చు తగ్గదు. పని —స్థలమే కొంత ఎక్కువగా అవసర మవుతుంది.

**8. 'రాత్రి పని'ని ఏ యే రంగాలలో వెంటనే తీసివెయ్యవచ్చు? ఎప్పటికీ తీసివెయ్యడం సాధ్యం కాని రంగాలు ఏవి?**

**జ:** 'నూతన సమాజం' అనేది ప్రారంభమైతే, ఇళ్ళకు రాత్రులు కాపలాలు కాసే పనుల్ని వెంటనే ఆపి వెయ్యవచ్చు. బట్టలూ, సబ్బులూ వంటి ఉత్పత్తుల పనులన్నిటిలోనూ కూడా రాత్రి పనులు తీసివెయ్యవచ్చు. కానీ, అలా జరగాలంటే పని స్థలాలూ, ఉత్పత్తి సాధనాల సెట్లూ పెరగాలి కాబట్టి, ఇదంతా వెంటనే సాధ్యం కాదు. ఆస్పత్రుల్లోనూ, రవాణాలోనూ, వార్తా సంస్థల్లోనూ, సైన్సు ప్రయోగాల్లోనూ కొన్ని సెక్షన్లలో, రాత్రి పనులు ఎప్పుడూ సాగవలసే వుంటుంది. ఈ విషయాలన్నీ చర్చల ద్వారానూ, కొత్త అనుభవాల ద్వారానూ తెలుసుకోవాలి.

**9. 'ఉత్పత్తి శక్తి'కి ఏ యే విషయాలు కారణం?**

**జ:** ఉత్పత్తి సాధనాలూ, ఆ శ్రమ చెయ్యడం తెలిసిన మనుషులూ —ఇవే కారణం.

**10. ఎబ్సల్యూట్ ఉత్పత్తి శక్తి పెద్దదిగా వుంటుందా, రెలెటివ్ ఉత్పత్తి శక్తి పెద్దదిగా వుంటుందా? ఈ రెండూ ఒకటిగా ఎప్పుడు అవుతాయి?**

**జ:** రెలెటివ్ ఉత్పత్తి శక్తే పెద్దదిగా ఉంటుంది. ఒక శాఖలో అన్ని పని స్థలాల్లోనూ ఆ పెద్ద ఉత్పత్తి శక్తి తోనే పనులు జరుగుతూ వుంటే, తక్కువ ఉత్పత్తి శక్తిని వదిలి వేసినట్టు అవుతుంది. అలా జరగడం అంటే, ఆ రెండూ ఒకటే అవడం కాదు.

**11. 'శ్రమ తీవ్రత' అంటే ఏమిటి? శ్రమ తీవ్రత పెరిగిందని ఎప్పుడు అనవచ్చు? 2 ఉదాహరణలు చెప్పండి!**

**జ:** ఒక శ్రమని, సాధారణ వేగం కన్నా ఎక్కువ వేగంతో చెయ్యడమే శ్రమ తీవ్రత. శ్రమ తీవ్రత పెరిగిందని ఎలా తెలుస్తుందంటే, ఒక పనిని సాధారణ వేగంతో చేసినప్పుడు వచ్చే ఉత్పత్తి కన్నా, ఎక్కువ ఉత్పత్తి వచ్చినప్పుడు గానీ; లేదా, ఒక పని కోసం సాధారణంగా అవసరమయ్యే కాలం తగ్గినప్పుడు గానీ, శ్రమ తీవ్రత పెరిగిందని తెలుస్తుంది. సాధారణంగా 1 గంటలో కుట్టే చొక్కాని, అవే శ్రమ పరికరాలతో, గంటకన్నా తక్కువ సమయంలోనే కుడితే, అది శ్రమ తీవ్రత పెరగడమే. 1 ఎకరం భూమిని దున్నడానికి సాధారణంగా 1 పూట సమయం పడుతూ వుండగా, అంతే మంది మనుషులు, అవే శ్రమ పరికరాలతో, 1 పూటలో, ఒక ఎకరంకన్నా ఎక్కువ భూమిని

దున్నగలిగితే, అది శ్రమ తీవ్రత పెరగడమే.

**12. సాధారణంగా 50 వస్తువులు తయారయ్యే కాలంలో 60 వస్తువులు తయారయ్యాయి. శ్రమ తీవ్రత ఎంత శాతం పెరిగింది?**

**జ:** 50 కి —10 పెరిగితే, 100 కి ఎంత? 10÷50 × 100 = 20%. శ్రమ తీవ్రత 20% పెరిగిందని అర్థం.

**13. ఒక పని స్థలంలో పాత ఉత్పత్తి శక్తి పోయి కొత్త ఉత్పత్తి శక్తి ఏర్పడినప్పుడు జీతాలు పెరుగుతాయా, పెరగవా? ఎందుకు?**

**జ:** జీతాలు పెరుగుతాయి. ఎందుకంటే కొత్త ఉత్పత్తి శక్తి అంటే, కొత్త శ్రమ పరికరాలూ, కొత్త శ్రమ శక్తీ. కొత్త శ్రమ శక్తి ఏర్పడాలంటే, దాన్ని ఎక్కువ ఖర్చులు పెట్టి నేర్పుకోవాలి. అది అలా నేర్చుకున్న శ్రమ శక్తి. దాని విలువ పెరుగుతుంది. కాబట్టి జీతాలు పెరుగుతాయి.

**14. ఒక పని స్థలంలో రోజుకి 100 వస్తువులు తయారవుతాయి. శ్రమ పరికరాలలో మెరుగుదలల వల్ల వాటి ఉత్పత్తి శక్తి 50% పెరిగింది. శ్రమ తీవ్రత 10% తగ్గింది. పని దినం 5% తగ్గింది. ఈ మారిన పరిస్థితుల్లో ఉత్పత్తి శక్తి పెరుగుతుందా, తరుగుతుందా, ఎంత శాతం?**

**జ:** మొదట 100 వస్తువుల్ని తీసుకుందాం. ఉత్పత్తి శక్తి 50% పెరగడంవల్ల, ఇప్పుడు, 1 రోజులో 150 వస్తువులు వస్తాయి. శ్రమ తీవ్రత 10% తగ్గడం వల్ల, 150 లో 15 వస్తువులు తగ్గి, 135 వస్తువులే వస్తాయి. పని దినం కూడా 5% తగ్గడం వల్ల, 135 లో నించి కూడా, కొన్ని వస్తువులు తగ్గుతాయి. 100 కి 5 తగ్గితే, 135 కి ఎన్ని తగ్గుతాయి? 5÷100×135=7. 135లో నించి 7 తగ్గితే, 128. ఈ మార్పులేవీ జరగకముందు, ఆ పని స్థలంలో 100 వస్తువులు వచ్చేవి. ఇప్పుడూ 128 వస్తాయి. ఉత్పత్తి శక్తి పెరిగినట్టే అర్థం. 28% పెరిగింది. 50% కాదు.

**15. ఒకే రకం సరుకుని ఉత్పత్తి చేసే 2 పని స్థలాలు ఉన్నాయి. పని దినం సమానం. ఒక చోట కార్మికులు 20 మంది. వారి ఉత్పత్తి 1 వారంలో 140 వస్తువులు. 2 వ చోట కార్మికులు 35 మంది. వారి ఉత్పత్తి రోజుకి 30 వస్తువులు. ఎక్కడ ఎక్కువ ఉత్పత్తి శక్తి వుంది?**

**జ:** (1) 20 మంది కార్మికులు, 7 రోజుల్లో, 140 వస్తువులు చేస్తారు. 1 రోజులో 20 వస్తువులు. 1 కార్మికుడు 1 రోజులో, 1 వస్తువు. (1 యూనిట్‌ని.)
(2) 35 మంది కార్మికులు, 1 రోజులో, 30 వస్తువులు చేస్తారు. అంటే, ఇక్కడ, 1 కార్మికుడు, 1 రోజులో, 1 వస్తువు కూడా చెయ్యడు.—కాబట్టి, మొదటి పని స్థలంలోనే ఉత్పత్తి శక్తి ఎక్కువ.

**16. మీకు జీతాలు ఇచ్చే పద్ధతి టైమ్ వేజా; పీస్ వేజా? ఈ పద్ధతుల్లో ఇంకేమైనా తేడాలు వున్నాయా మీ దగ్గర? మీకు ఏ పద్ధతి నచ్చుతుంది? ఎందుకు?**

**జ:** నేను కార్మికురాలిని కాను. కానీ, శ్రమ చేసే మనిషినే. కాబట్టి నేను కార్మిక పక్షమే. టైమ్ వేజే శ్రమ చేసే వర్గానికి ఎంతో క్షేమం అని నాకు తెలుసు. అది కార్మికుల్ని ఆదాయాల్లో తేడాలు లేకుండా ఐక్యతగా వుంచుతుంది. కాబట్టి, అదే నాకు నచ్చుతుంది.

**17. పీస్ వేజ్‌లో జనరల్ లెక్క—ఒక పని దినంలో 10 వస్తువులు. 1 వస్తువు చేసినందుకు రేటు 1 రూపాయి. ఒక కార్మికుడు 1 పని దినంలో 15 వస్తువులు చేశాడు. అతనికి 15 రూ.లు వచ్చాయి. పీస్ రేటు పెరిగిందా?**

**జ:** లేదు. అతను, శ్రమ తీవ్రతతో పనిచేసి ఎక్కువ వస్తువులు చేశాడు. పీసు రేటు, ఇప్పుడు కూడా 1 వస్తువుకి 1 రూపాయే. 15 వస్తువులు చేశాడు కాబట్టి 15 రూ.లు వచ్చాయి.

**18. ఒక దేశం ఎప్పుడూ 'పారిశ్రామిక ప్రగతి' సాధిస్తూ వుంటుంది. 1940 నాటి కన్నా 1960లో చూస్తే దాని ఉత్పత్తి శక్తులు అనేక రెట్లు పెరిగాయి. 1960 నాటి కన్నా 1985 నాటికి దాని ఉత్పత్తి శక్తులు మళ్ళీ అనేక రెట్లు పెరిగాయి. మరి, అక్కడ పనిదినం ఎందుకు తగ్గడంలేదు?**

**జ:** ఉత్పత్తి శక్తులు పెరగడంవల్ల వచ్చే మంచి ఫలితాలన్నీ పెట్టుబడిదారులకే గానీ కార్మికుల కోసం కాదు. కాబట్టి, ఉత్పత్తి శక్తులు ఎంత పెరిగినా కార్మికులకు పనికాలం తగ్గడం జరగదు.

**19. ఉత్పత్తి శక్తి పెరిగితే దాని ఫలితం శ్రమ చేసే మనుషుల విషయంలో ఎలా ఉండాలి?**

**జ:** వారు శ్రమ చేసే కాలం కొంత తగ్గాలి.

**20. పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానం లేకపోతే, సమాజంలో ఉత్పత్తి శక్తి పెరుగుదల ఆగిపోతుందా?**

**జ:** అలా జరగదు. పైగా, ఉత్పత్తి శక్తులు స్వేచ్ఛగా పెరగడానికి పెట్టుబడిదారీ విధానం కల్పించే ఆటంకాలన్నీ పోయి, ఆ పెరుగుదల ఊహాతీతమైన స్థాయిలోకి పోతుంది. ప్రతీ శాఖలోనూ, ఉత్పత్తి శక్తుల పెరుగుదలని, ఉపయోగపు విలువ దృష్టితో ఎక్కడో అక్కడ ఆపి వెయ్యవలసి వస్తుంది.

**21. నూతన సమాజాన్నే దృష్టిలో పెట్టుకోండి! ఉత్పత్తి శక్తులు పెరుగుతోంటే పని దినం తగ్గుతూ వుండాలి కదా? ఒక నాటికి పని దినం ఏమీ లేకుండా పోతుందా?**

**జ:** అలా జరగదు. పని దినమే లేక పోవడం అంటే శ్రమలన్నీ మాని వెయ్యడం. అలా జరిగితే అప్పుడు ఉత్పత్తులే ఉండవు. ఉత్పత్తి శక్తుల పెరుగుదల అనంతంగా సాగదు. వాటిని ఒక హద్దులో ఉంచవలసి ఉంటుంది. పని ఎప్పుడూ జరగాలి కాబట్టి, పని దినం ఎప్పుడూ ఉంటుంది.

**22.** చిత్రకారులకు ప్రత్యేకం:

కార్మికులు ప్రేక్షకులుగా వున్న ఒక సభ. వేదిక మీద ఒక ఉపన్యాసకుడు తల్లకిందులుగా నిలబడి ఉపన్యసిస్తూ వుంటాడు. వేదికకు కొంచెం దిగువగా ఇలా రాసి వుంటుంది — 'పెట్టుబడిదారీ ఆర్థికవేత్త!''.

★

# 3వ భాగం

# పెట్టుబడిదారీ పునరుత్పత్తి క్రమం

[ఈ భాగంలో 6 చాప్టర్లు ఉన్నాయి.]

# 1. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ, దాని రూపాలూ

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం — అనగానే, వెంటనే 'యంత్రాలు' గుర్తొస్తాయి. యంత్రాలతో ఉత్పత్తి జరగడమే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం — అనే అభిప్రాయం సాధారణంగా మనందరికీ ఉంటుంది. కానీ, యంత్రాల్ని ఇంకా కనిపెట్టక పూర్వంనించి కూడా, అంటే చేతి పనిముట్లతో పనిచేసే కాలం నించి కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఉంది. కొంత పెట్టుబడి పెట్టి, వేతన శ్రామికులతో శ్రమ చేయించి, లాభం సంపాయించే ఉత్పత్తి విధానమే— పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం. అది చేతి పనిముట్ల కాలంలోనే ప్రారంభమైంది.

యంత్ర దశ కన్నా వెనకటి దశ — 'మాన్యుఫాక్చర్' దశ. ఈ దశలో ఉత్పత్తి, చేతి పనిముట్ల ద్వారానే నడిచింది. దీనికన్నా వెనకటి దశ — 'గిల్డుల' దశ. ('వృత్తి సంస్థల' దశ. ఈ దశలు 'ఇంగ్లండ్ చరిత్ర'కు సంబంధించినవి.)

ఎక్కువ మంది శ్రామికులు, ఒకే సమయంలో, ఒకే స్థలంలో, ఒక 'యజమాని' ఆధిపత్యం కింద, జీతాలకు పని చెయ్యడం అనేదే — పెట్టుబడిదారీ విధానానికి ప్రారంభ దశ.

'గిల్డుల'లోనూ, 'మాన్యుఫాక్చర్'లోనూ ఉత్పత్తి, చేతి పనిముట్ల ద్వారానే జరిగింది.

యంత్రాల్ని కనిపెట్టి, వాటితో ఉత్పత్తి చెయ్యడం ప్రారంభమైనప్పటి నించీ క్రమంగా అది 'భారీ పరిశ్రమ'గా మారింది.

## గిల్డు

**'గిల్డు'** అంటే — నేతగానీ, కుట్టుగానీ, కమ్మరంగానీ, వడ్రంగంగానీ, ఏదో ఒక ప్రత్యేకమైన వృత్తి (పని) జరిగే స్థలం. ఒక నేత మనిషో, కుట్టు మనిషో తన దగ్గిర కొందరు పనివాళ్ళని పెట్టుకుని తను కూడా ఆ పని చేస్తూ ఉంటే, అదే గిల్డు. ఒక వృత్తి తెలిసిన యజమాని దగ్గిర, కొందరు పనివాళ్ళు ఆ పని నేర్చుకుంటూ, ఆ ప్రత్యేక రకం వస్తువులు ఉత్పత్తిచేస్తూ ఉంటారు. 'గిల్డు'లో ఉత్పత్తి సాధనాలు యజమానికి చెందినవి గానే ఉంటాయి. కొన్ని సందర్భాలలో పని వాళ్ళ స్వంత పనిముట్లు కూడా ఉంటాయి. పని, చేతి పనిముట్ల ద్వారానే జరుగుతుంది. గిల్డ్ యజమాని కూడా పని వాళ్ళతో సమానంగా పని చేస్తాడు. పనివాళ్ళకు 'జీతాలు' ఉంటాయి. తయారైన ఉత్పత్తి, గిల్డు యజమానిదే. ఈ ఉత్పత్తి విలువలోనించి మొదట పెట్టిన ఖర్చులూ, యజమాని జీతమూ కూడా పోగా, మిగిలేది 'అదనపు విలువ.' అందులో, పనివాళ్ళ భాగంతో పాటు, యజమాని

భాగం కూడా ఉంటుంది.

గిల్డులో పెట్టుబడి, చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది గనకా, యజమాని కూడా పనిచేస్తాడు గనకా, ఇక్కడ శ్రామికుల అదనపు విలువ చాలా తక్కువ స్థాయిలోనే ఉంటుంది. అంటే, దోపిడీ తక్కువ స్థాయిలో ఉంటుంది. యజమానికి వచ్చే ఆదాయంలో కొంత భాగం 'దోపిడీ' మీదా, కొంత భాగం 'స్వంత శ్రమ' మీదా వచ్చేది గనక, ఈ యజమాని 'చిన్న పెట్టుబడిదారుడి'గా (పెటీ బూర్జువాగా) ఉంటాడు.

ఇక్కడ, యజమానికీ, పనివాళ్ళకూ ఉండే సంబంధాలు, విద్య నేర్పే ఉపాధ్యాయుడికీ, విద్యార్థులకూ ఉండే సంబంధాల్ని పోలి ఉంటాయి. ఇక్కడ విద్యకూ కళలకూ సంబంధించిన 'సాంస్కృతిక జీవితం'లో, యజమానికీ శ్రామికులకూ మధ్య పెద్ద తేడా ఉండదు.

గిల్డులో, శ్రామికులు ఎవరికి వారుగా విడి విడిగా పని చేస్తారు. అంటే, ఒక కుట్టు గిల్డులో 4గురు శ్రామికులు ఉంటే, ఒక్కొక్కరూ ఒక్కొక్క బట్ట తీసుకుని, దాన్ని కత్తిరించే పనీ, కుట్టే పనీ ఎవరికి వారే చేసుకుంటారు. కత్తిరింపుల్ని కొందరు చెయ్యడమూ, కుట్టే పని కొందరు చెయ్యడమూ — అనే పద్ధతిలో ఇక్కడ పని జరగదు. (ఈ పద్ధతి 'మాన్యుఫాక్చర్'లో ప్రారంభమవుతుంది.) గిల్డు శ్రామికుడు, వస్తువుకి సంబంధించిన అన్ని దశల్నీ, ఒక దశ తర్వాత ఒక దశగా, తనే చేసుకుంటాడు. అన్ని దశలూ తనే చేస్తూ వస్తువుని పూర్తి చేస్తాడు.

ఒక 'కుట్టు గిల్డు'నీ, ఒక 'నేత గిల్డు'నీ తీసుకుంటే, ఆ రెండు చోట్ల పనులూ తేడాగా ఉంటాయి కాబట్టి, ఆ రకంగా ఆ గిల్డుల మధ్య 'శ్రమ విభజన' ఉంటుంది. కానీ ఒకే గిల్డుని తీసుకుంటే అక్కడ ఉండే శ్రామికుల మధ్య 'శ్రమ విభజన' ఉండదు. ఒక గిల్డులో శ్రామికులందరూ ఒకేరకం శ్రమ చేస్తారు. అందులో ప్రతి ఒక్కరూ వస్తువుకి సంబంధించిన అన్ని దశల్నీ చేస్తారు. కాబట్టి, వారి మధ్య 'అంతస్తుల భేదా'లేవీ ఏర్పడవు. (ఇది కూడా 'మాన్యు ఫాక్చర్'లోనే ప్రారంభమవుతుంది.)

గిల్డులో జరిగే ఉత్పత్తి, 'అవసరాల హద్దుల్నిబట్టే' ఉంటుంది. జనాలు, వస్తువుల్ని తయారుచేసి ఇమ్మని పురమాయించిన తర్వాతే వస్తువుల్ని తయారు చెయ్యడం ఉంటుంది. ఒక కుట్టు గిల్డులో, జనాలు తెచ్చి ఇచ్చిన గుడ్డలు కుట్టి ఇవ్వడమే ఉంటుంది. నేత గిల్డులో, జనాలు పురమాయించిన బట్టలు నేసి ఇవ్వడమే ఉంటుంది. అలాగే చెప్పుల విషయం. అలాగే నగల విషయం. అలాగే ఇతర ఉత్పత్తుల విషయం. ఆర్డర్లు లేకుండానే పెద్ద ఎత్తున సరుకుని ఉత్పత్తి చెయ్యడమూ, వాటిని అమ్మడం కోసం మార్కెట్లని వెతుకుతూ పోవడమూ — ఇలాంటి పద్ధతులు గిల్డుల కాలంలో ఇంకా ప్రారంభం కాలేదు. అంటే, గిల్డు దశలో, ఉత్పత్తి అనేది ఇంకా 'అవసరాల హద్దులకే' పరిమితమై ఉంది. అందుకే ఈ 'గిల్డు —పెట్టుబడి', ఇంకా అసలైన పెట్టుబడి కాదు. ఈ దశలో శ్రామికులు, 'పెట్టుబడి'తో ఇంకా తగినంత 'వైరుధ్యాన్ని' ఎదుర్కోరు. మధ్య యుగాలలో (క్రీ. శ. 600 — 1,500) ఐరోపాలో, గిల్డు విధానంలో ఉన్న ఉత్పత్తి సంబంధాలు, 'పెట్టుబడికీ వేతన శ్రమకూ మధ్య ఉన్న శతృత్వాన్ని' వివరించడానికి తగినంతగా సరిపోవు.

ప్రతీ గిల్డు యజమానీ, తన దగ్గిర కొంత మంది పనివాళ్ళని మాత్రమే పెట్టుకోవాలనే నిబంధనకు లోబడి ఉంటాడు. ఈ నిబంధన గిల్డు యజమానులు పెట్టుకునే నిబంధనే. ఒక వృత్తికి సంబంధించిన యజమానులందరికీ, తప్పని సరిగా కొంత కొంత లాభం ఉండేలాగ చేసుకున్న ఏర్పాటు అది. — ప్రతీ యజమానికీ 'రాజకీయమైన' హక్కులు ఉంటాయి. మునిసిపల్ పరిపాలనలోనూ, ఇతర రాజకీయ విషయాలలోనూ వాళ్ళు భాగస్వాములుగా ఉంటారు.

క్రమంగా, గిల్డు ఉత్పత్తి గత కాలపు హద్దుల్నీ, నిబంధనల్నీ దాటిపోయి పెట్టుబడిదారీ సంబంధాల దిశగా ప్రయాణం సాగించింది. దాని 'ఉత్పత్తి విధానం'లో అంతర్గతంగా ఉన్న లక్షణం దోపిడీయే గనక, శ్రామికుల ద్వారా వచ్చే అదనపు విలువ ఎంత తక్కువ స్థాయిలో ఉన్నా, అది క్రమంగా పెట్టుబడిని పెంచుతుందేగానీ తగ్గించదు. గిల్డు — పెట్టుబడి క్రమంగా పెరుగుతూ, దాని పరిమితులూ దాని మీద నిబంధనలూ తొలగిపోతోన్న కొద్దీ, ఉత్పత్తి స్థాయి పెరుగుతూ ఉంటుంది. అప్పుడు గిల్డు యజమానికి 'ఉత్పత్తి క్రమాన్ని నిర్వహించుకోవడమే' ప్రధాన కర్తవ్యం అవుతుంది. అంటే, అతను 'శారీరక శ్రమ చెయ్యడం' మానివేస్తాడు. ఉత్పత్తి కార్యకలాపాల్ని నిర్వహించుకోవడంలోనూ, శ్రామికులపై 'అజమాయిషీ' చేసుకోవడంలోనూ పూర్తి కాలాన్ని వెచ్చిస్తాడు. ఆ పని కోసం కూడా తన తరపున 'మేనేజర్ల వంటి ఉద్యోగుల్ని' నియమించుకున్నప్పుడు, గిల్డు యజమాని, సంపూర్ణంగా శ్రమ దోపిడీ మీదే బతికే పెట్టుబడిదారుడవుతాడు. (పెటీ బూర్జువా కాకుండా, బడా బూర్జువా అవుతాడు.)

యజమాని ఎప్పుడైతే, శ్రమ చెయ్యడం మానివేస్తాడో

అప్పటి నించి అతనికీ పనివాళ్ళకూ మధ్య, పాత స్వభావం గల సంబంధాలు మాయమై, పెట్టుబడిదారుడికీ వేతన శ్రామికులకూ ఉండే కొత్త స్వభావం గల సంబంధాలు ప్రారంభమవుతాయి. క్రమంగా, గిల్డు యజమాని, మాన్యు ఫాక్చర్ యజమానిగా మారతాడు.

## మాన్యుఫాక్చర్

గిల్డు విధానానికీ, మాన్యుఫాక్చర్ విధానానికీ ప్రారం భంలో తేడా ఏమీ లేదు — 'మాన్యుఫాక్చర్'లో కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండడం తప్ప. ప్రారం భంలో, గిల్డుకి విస్తరించిన రూపమే మాన్యుఫాక్చర్. దీని సాంకేతిక పునాది కూడా చేతి వృత్తే. ఐరోపాలో మాన్యుఫాక్చర్ దశ 16వ శతాబ్దం నించి 18వ శతాబ్దం వరకూ. ఉత్పత్తి స్థలంలో శ్రామికుల సంఖ్య పెరగడంవల్ల వచ్చే ఫలితాలన్నీ (సహ కారమూ, శ్రమ విభజనా— వంటివి) ఈ దశలోనే ప్రారంభ మయ్యాయి. ఈ దశలో చివరి కాలంలో 'యంత్రాలు' ప్రారంభమయ్యాయి.

## భారీ పరిశ్రమ

ఆటోమేటిక్ యంత్రాలద్వారా ఉత్పత్తి జరగడం ప్రారంభమైనప్పటినించీ అది 'భారీ పరిశ్రమ'. యూరప్‌లో ఇది 18వ శతాబ్దంనించి ప్రారంభం. మాన్యుఫాక్చర్‌నీ, భారీ పరిశ్రమనీ వివరంగా చూసేముందు 'ఉత్పత్తి క్రమంలో సహకారం' అనే అంశాన్ని చూడాలి.

# సహకారం

అనేక మంది శ్రామికులు, ఒక ప్లాను ప్రకారం, ఒకే క్రమంలో గానీ, ఒక దానితో ఒకటి సంబంధంగల వేరు వేరు క్రమాలలో గానీ కలిసి పనిచెయ్యడమే — 'సహ కారం' (కో ఆపరేషన్). ఈ 'సహకారం' వల్ల, అంటే 'కలిసి పనిచెయ్యడం' వల్ల, ఎంతో పెద్ద పెద్ద పనులు కూడా అతి తేలిగ్గా జరుగుతాయి. ఒక టన్ను బరువుని (వెయ్యి కిలోలు) ఎత్తాలంటే, ఆ పని ఒక మనిషి వల్ల జరగదు. 20 మంది కలిస్తే, అతి కష్టం మీద ఎత్తుతారు. 40 మంది కలిస్తే ఎంతో తేలిగ్గా ఎత్తుతారు.

ఒక పనిని, 1 మనిషి 10 రోజుల్లో చేస్తే, అదే పనిని 1 రోజులోనే చెయ్యడానికి 10 మంది మనుషులు అక్కర లేదు. అంత కన్నా తక్కువ మందే సరిపోతారు.

ఇళ్ళు కట్టేపనిలో ఇటుకలూ రాళ్ళూవంటి సామాగ్రిని కిందనించి పైకి చేర్చాలనుకుందాం. ఒక మనిషి కొన్ని ఇటుకలు పైకి మోసుకుపోయి, అవన్నీ అక్కడ పెట్టి, మళ్ళీ కిందికి వచ్చి, మళ్ళీ కొన్ని ఇటుకలు తీసుకుపోయి పైన పెట్టి — ఇలా, ప్రతీ ఒక్కరూ వేరు వేరుగా ఎవరి బరువులతో వాళ్ళు కిందకీ పైకీ నడవడంకన్నా, అందరూ ఒక వరసలో నిలబడి, బరువు తట్టల్ని ఒకరి నించి ఒకరు అందుకుంటూ, బరువుల్ని చివరికి చేరుస్తూ ఉంటే, పని తేలిగ్గానూ, తొందరగానూ జరుగుతుంది. ఎవరికివారు వేరు వేరుగా బరువులు మోసే పద్ధతిలో అయితే, ఒకరితో ఒకరికి సంబంధం ఉండదు. పని, అలా జరిగినప్పుడు, ఎవరి పని వాళ్ళు విడి విడిగా చేస్తున్నారని అర్థం. కానీ, అందరూ ఒక వరసలో నిలబడి, బరువుని ఒకరి చేతు ల్లోంచి ఒకరు అందుకుంటూ దాన్ని చివరికి చేర్చడం అంటే, అందరూ 'సమిష్టి సంబంధం'లోకి వచ్చి, 'సహ కారం'తో, అంటే ఒకరికి ఒకరు సహకరించుకుంటూ, పని చేస్తున్నారని — అర్థం. 100 మంది జనం 100 ఎకరాల భూమిని దున్నాలంటే, ఒక్కొక్కరూ ఒక్కో ఎకరం మీద విస్తరించి పని చెయ్యడంకన్నా, మొదట అందరూ కలిసి 10 ఎకరాల మీదా, తర్వాత ఇంకో 10 ఎకరాల మీదా — అలా 'సహకార పద్ధతి'లో పనిచేస్తే, పని తేలిగ్గానూ, తొందరగానూ, జరుగుతుంది.

మనుషులు సమిష్టిగా కలిసి పని చెయ్యడం వల్ల పని తొందరగానూ, తేలిగ్గానూ జరుగుతుందంటే — 'కలిసి పని చెయ్యడం' అనే పద్ధతిలో వెచ్చించే శ్రమకి, ఉత్పాదక శక్తి పెరుగుతుందని అర్థం. 'సహకారం' వల్ల, సమిష్టి స్వభావం గల ఒక కొత్త ఉత్పాదక శక్తి సృష్టి అవుతుంది.

శ్రామికుల శక్తి సామర్ధ్యాల్ని విడివిడిగా చూసినప్పుడు, అందులో తప్పని సరిగా అనేక తేడాలు ఉంటాయి. ఒక పనిని అందరూ ఒకే వేగంతో, ఒకే కాలంలో చెయ్యలేరు. ఒక మనిషి, 1 గంటలో చేసే పనిని, ఇంకో మనిషి అంత కన్నా తక్కువ కాలంలోనే చేస్తాడు; మూడో మనిషి అంత కన్నా ఎక్కువ కాలంలో చేస్తాడు. అలాగే, 10 మందిని విడి విడిగా తీసుకుంటే, 10 మందీ 10 రకాలుగా చెయ్య వచ్చు. కానీ అలాంటి 10 మంది గల బృందాల్ని రెంటిని తీసుకుంటే, ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే తేడా 2 బృందాల మధ్య ఉండదు. ఎందుకంటే, ప్రతీ బృందం లోనూ చురుగ్గా పని చేసే వాళ్ళూ మందగొడిగా పని చేసే వాళ్ళూ కూడా కలిసి ఉంటారు కాబట్టి. ప్రతీ మనిషి నించీ

సగటు శ్రమ అందినట్టు అవుతుంది. ఒక రోజులో ఎక్కువ మంది శ్రామికులు కలిసి చేసిన పనిని (సమిష్టి పని దినాన్ని) ఆ శ్రామికుల సంఖ్యతో భాగిస్తే వచ్చేదే — 'సగటు శ్రమ.' అదే — 'సామాజిక శ్రమ.'

10 మంది కలిసి ఒక పని దినంలో 20 వస్తువులు తయారు చేస్తారనుకుంటే, ఒక్కొక్కరూ రోజుకి 2 వస్తువులు చెయ్యడం 'సగటు శ్రమ' చెయ్యడంగా ఉంటుంది. ఆ 10 మంది శ్రామికుల్నీ ఇద్దరేసి చొప్పున 5 బృందాలుగా విడదీసి పనిచేయిస్తే, ప్రతీ బృందమూ తప్పని సరిగా 4 వస్తువులు చెయ్యడం సాధ్యం కాదు. కానీ, ఆ 10 మందికీ ఇంకో 10 మందిని కలిపితే, మొత్తం 20 మందీ కలిసి 40 వస్తువులు చేస్తారనేది గ్యారంటీగా ఉంటుంది. వాళ్ళు 40 వస్తువుల కన్నా ఎక్కువగా చెయ్యవచ్చు కూడా. 'సహకారం'లో పాల్గొనే కార్మికుల సంఖ్య ఎక్కువైన కొద్దీ ప్రతీ కార్మికుడి నించీ సగటు పని దొరకడం గ్యారంటీగా ఉంటుంది. — పెట్టుబడిదారీ విధానంలో, ప్రతీ కార్మికుడి నించీ 'సగటు పని' దొరికి తీరాలి.

ఒక వస్తువుకి సంబంధించిన అన్ని దశల్నీ మొదటి నించీ చివరి వరకూ ఒకే మనిషి చేస్తే, అది ఆ ఒక్క మనిషికి సంబంధించిన 'విడి శ్రమక్రమం.' ఒక వడ్రంగి, చెక్కని తనే చిత్రిక పట్టి, దానితో తనే కుర్చీ చేసి, దానికి తనే రంగులు వేసి, చివరికి కుర్చీని అక్కడ పెడితే, అది ఒక్క మనిషి శ్రమతోనే తయారైనట్టు అర్థం. అయితే శ్రామికులందరూ ఇలా ఎవరి పని వాళ్ళే, విడి విడిగానే, చేసుకుంటూ ఉన్నా, వాళ్ళంతా 'ఒకే పని స్థలం'లోకి చేరి ఒకరి పక్కన ఒకరు కూర్చుని పని చెయ్యడం వల్ల, ఆ పని స్థలాన్నీ, శ్రమ పరికరాల్నీ, పాత్రల్నీ, ఇతర ఉత్పత్తి సాధనాల్నీ, సమిష్టిగా ఉపయోగించడానికి అవకాశం ఉంటుంది. ఎవరి పని వాళ్ళు విడి విడిగా చేసుకుంటూ, 'ఉత్పత్తి సాధనాల్ని మాత్రమే సమిష్టిగా వాడుతూ' పనిచేస్తే అది 'సామాన్య సహకారం' (సింపుల్ కో — ఆపరేషన్).

చెయ్యవలసిన పనిని కొన్ని దశలుగా విభజించి, ఒక దశలో కొందరూ, రెండో దశలో కొందరూ, అలా కొన్ని దశల ద్వారా వస్తువుని పూర్తిచేస్తే, అది 'సంపూర్ణ సహకారం' (కంప్లీట్ కో — ఆపరేషన్). దీనివల్ల శ్రమ క్రమానికి 'అంతర్గతంగా కూడా' సమిష్టితనం ఏర్పడుతుంది. ఇది, కేవలం ఉత్పత్తి సాధనాల్ని మాత్రమే సమిష్టిగా ఉపయోగించడం గాక, జరగవలసిన పనిని కూడా సమిష్టిగా చెయ్యడం. ఒక కుర్చీకోసం జరగవలసిన పనిని 4 దశల్లో 4 గురు చేసినప్పుడు, అది ఒకే వ్యక్తి శ్రమతోగాక, సమిష్టి శ్రమతో తయారైన వస్తువుగా ఉంటుంది. అప్పుడు, ఆ శ్రమక్రమానికే సమిష్టి స్వభావం ఏర్పడినట్టు అవుతుంది.

'సామాన్య సహకారం'తో కన్నా 'సంపూర్ణ సహకారం'తో పని జరిగినప్పుడు, ఎక్కువ పని జరుగుతుంది. అంటే ఆ శ్రమ, ఎక్కువ ఉత్పత్తి చెయ్యగల శక్తిని పొందుతుంది. ఈ సంపూర్ణ సహకారం, ఒకే శ్రమ క్రమంలో, రకరకాల శ్రమల్నీ, రకరకాల శ్రామికుల్నీ కలుపుతుంది. రోడ్ల నిర్మాణం, రైల్వే మార్గాల నిర్మాణం, కాలవల తవ్వకం - వంటి భారీ పనులు జరగడానికి సమిష్టి శ్రమక్రమాలే అవసరం. ఇవి, శ్రామికులు విడి విడిగా చెయ్యగల పనులు కావు. ఒక్క శ్రామికుడే ఒక కుర్చీని తయారు చేసినట్టు, ఒక్క శ్రామికుడే ఒక కాలవో, రోడ్డో తయారు చెయ్యలేడు. దానికి సంపూర్ణ సహకారం అవసరం.

సహకారం — ఉత్పత్తి సాధనాల్ని పొదుపు చేస్తుంది. ఒక నేత మనిషి పని చెయ్యడానికి కొంత వైశాల్యం గల గది కావలసి వస్తే, ఒకే సమయంలో 10 మంది మనుషులు ఒకరి పక్కన ఒకరు కూర్చుని పని చెయ్యడానికి 10 వేరు వేరు గదులు అవసరం లేదు. విడి విడిగా 10 గదులు కట్టడం కన్నా 10 మందికీ సరిపోయే ఒక హాలు కట్టడానికి తక్కువ ఖర్చు అవుతుంది. అలాగే, ముడి సరుకుల్ని ఉంచే స్టోరులూ, పాత్రలూ, ఇతర పనిముట్లూ ఉమ్మడిగా ఉపయోగపడ్డప్పుడు, వాటి ఖర్చు తగ్గి, వాటి ద్వారా సరుకుకి చేరే విలువ తగ్గుతుంది. పాత్రల్లాంటి వాటిని ఎక్కువగా ఉపయోగిస్తే తొందరగా పాడయ్యే మాట నిజమే. అయినా, 10 మంది మనుషులు ఉపయోగిస్తే ఒక సంవత్సరంలో పాడయ్యే పనిముట్టు, 20 మంది ఉపయోగిస్తే తప్పనిసరిగా 6 నెలల్లోనే పాడవుతుందన డానికి అవకాశం లేదు. ఉమ్మడి వాడకం ఏ పాళ్ళలో పెరుగుతుందో బిల్డింగులూ పనిముట్లూ పాత్రలూ అదే పాళ్ళలో నాశనం కావు. అందులో మళ్ళీ బిల్డింగులకూ, పాత్రలకూ తేడా ఉంది. ఉత్పత్తి సాధనాల్ని సమిష్టిగా వాడడం పెరిగే కొద్దీ, వాటి ద్వారా సరుకులోకి చేరే విలువ ఏ పాళ్ళలో తగ్గుతుందో, సరుకు విలువ ఆ పాళ్ళలో తగ్గుతుంది.

సమాజంలో ఉన్న ఉత్పత్తిదారులు (ఉత్పత్తి చేసే శ్రామికులు) విడి విడిగా, చెల్లా చెదురుగా, వేరు వేరు చోట్ల, ఎవరికి వాళ్ళు, ఉత్పత్తి చేసుకుంటూ ఉండే గత కాలపు ఉత్పత్తి విధానాల కన్నా, ఒకే విశాలమైన పని స్థలంలో శ్రమ సాధనాల్ని సమిష్టిగా ఉపయోగిస్తూ పని చెయ్యడం ప్రారంభమైనప్పుడు (అక్కడ ఎవరి పని, వాళ్ళు

విడి విడిగానే చేస్తూ వున్నప్పటికీ), ఏం జరిగినట్టు అర్థ మంటే — 'శ్రమక్రమం' సమిష్టిగా మారడానికి కావలసిన బాహ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయని అర్థం. శ్రమ క్రమం, సమిష్టి స్వభావాన్ని పొందడానికి ముందు, శ్రమ సాధనాలు సమిష్టి స్వభావాన్ని పొందుతున్నాయని అర్థం.

'శ్రమక్రమం' ఇంకా సమిష్టిగా మారక పోయినా, శ్రమ పరికరాలు ఇంకా ఏమీ అభివృద్ధి చెందకపోయినా, కేవలం చెల్లా చెదురుగా ఉన్న ఉత్పత్తిదారుల్ని ఒక చోటకు చేర్చడం — అనే మార్పు ద్వారా కూడా ఉత్పత్తిలో ఎంతో పెరుగుదల సాధ్యమే. 'గిల్డుల' ద్వారా జరిగిన పని అదే.

'శ్రమక్రమం' సమిష్టి స్వభావాన్ని పొందినప్పుడు, ఆ శ్రమ అనేక రెట్ల ఉత్పాదక శక్తిని పొందుతుంది. మాన్యుఫాక్చర్ ద్వారా జరిగిన పని ఈ రెండోది.

చెల్లాచెదురుగా ఉన్న ఉత్పత్తిదారుల్ని ఒక చోటకు చేర్చి, శ్రమ సాధనాలకూ, శ్రమక్రమానికీ సమిష్టి స్వభావాన్ని కలిగించే పని, చరిత్ర క్రమంలో, పెట్టుబడిదారుడి ద్వారానే జరిగింది. ఆ పని, పెట్టుబడిదారుడు, తెలిసీ, కావాలనీ, కాన్షియస్ చైతన్యంతో చేసిన పని కాదు. అది పెట్టుబడి దారుడి ఇష్టా ఇష్టాల మీద ఆధారపడి జరిగిన పని కాదు.

'శ్రమ సాధనాల్ని ఒకచోట కేంద్రీకరిస్తున్నామ'ని గిల్డు యజమానిగానీ, అతని కార్మికులు గానీ అనుకోరు. అలాగే, విడి విడి శ్రమ క్రమాల్ని సమిష్టి శ్రమక్రమంగా మారుస్తూ, ఉత్పత్తి సంబంధాలలో విప్లవకరమైన మార్పులకు దారి తీస్తున్నామని మాన్యుఫాక్చర్ యజమాని గానీ, ఆ కార్మికులుగానీ అనుకోరు.

శ్రమ సాధనాల్నీ, శ్రమ క్రమాన్నీ సమిష్టీకరించడం — అనే చారిత్రక కర్తవ్యాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే నిర్వర్తించింది. 'చరిత్ర'లో అదే దాని ప్రత్యేకత.

శ్రమ చేసే మనుషులు శ్రమక్రమంలో ఒక 'సహకారం'తో పని చెయ్యడం అనేది, చరిత్రలో ఆదిమ సమాజాల నించీ కూడా ఉంది. ఇది పెట్టుబడిదారీ విధానానికే ప్రత్యేకమైనది కాదు. కానీ, గత కాలాల సహకారానికీ, పెట్టుబడిదారీ సహకారానికీ కొన్ని ప్రత్యేకమైన తేడాలు ఉన్నాయి.

ప్రాచీన కాలపు వేటాడే జనాలలోనూ, భారతీయ వ్యవసాయ తెగలలోనూ 'సహకారం' ఉంది. బానిస సమాజాలలో ఉన్న సహకారంతో బ్రహ్మాండమైన కట్టడాల పని జరిగింది. (ఈజిప్టులో పిరమిడ్లూ, చైనా గోడా వంటి కట్టడాలు).

ప్రాచీన కాలపు వేటాడే తెగలలో, 'వ్యక్తికి తెగతో బొడ్డూడని సంబంధం' ఉంటూ ఆ సహకారం ఆ తెగ సభ్యుల మధ్య జరిగే శ్రమ క్రమాలకు మాత్రమే పరిమితమై ఉండేది. భారతీయ వ్యవసాయ తెగల్లో, ఆ తెగ సభ్యులందరికీ విడి విడి భూములు ఉంటూనే, కొంత భూమి మీద ఉమ్మడి యాజమాన్యం కూడా ఉండేది. ఆ ఉమ్మడి భూమి మీదే, కలిసి ఉత్పత్తి చేసుకోవడానికి వారి సహకారం పరిమితమై ఉండేది.

ప్రాచీన తెగలలో ఉండే సహకారాన్ని చూస్తే, ఆ తెగ సభ్యులు, శ్రమ సాధనాల్ని సమిష్టిగా కలిగి ఉంటూ, తమ శ్రమలన్నీ 'తమ స్వంతానికే' చేసుకుంటారు కాబట్టి అక్కడ 'కలిసి పని చెయ్యడం'లో 'బలవంతం' ఉండదు. కానీ, బానిస సమాజాలలో సహకారాన్ని చూస్తే, బానిస ఎల్లప్పుడూ దాస్యంలోనే మునిగి ఉంటాడు కాబట్టి, అక్కడ శ్రమ చెయ్యడంలో 'బలవంతం' ప్రారంభమవుతుంది.

పెట్టుబడిదారీ సహకారంలో, ఆ గతకాలపు లక్షణాలు కలిసి ఉంటాయి. ప్రాచీన తెగల ఉత్పత్తిదారులతో పోలిస్తే, వేతన శ్రామికులు — అస్వతంత్రులు. ప్రాచీన తెగల సభ్యులు శ్రమ సాధనాల్ని కలిగి ఉన్నట్టుగా, వేతన శ్రామికులు వాటిని కలిగి ఉండరు. ప్రాచీన తెగల సభ్యులు తమ స్వంతానికి తాము ఉత్పత్తి చేసుకుంటే, వేతన శ్రామికులు యజమాని ఆస్తిని (పరాయి ఆస్తిని) పెంచడానికి ఉత్పత్తి చేస్తారు. ఈ కారణాల వల్ల, వేతన శ్రామికుల శ్రమలో బలవంతం ఉంటుంది.

కానీ, వేతన శ్రామికుల్ని బానిసలతో పోలిస్తే, వేతన శ్రామికులు స్వతంత్రులు. బానిసలకు శ్రమ సాధనాలు లేనట్టే, వేతన శ్రామికులకు కూడా అవి లేకపోయినా, వేతన శ్రామికులు బానిసల లాగ రోజంతా దాస్యంలో ఉండరు. తమ శ్రమకు 'జీతం' తీసుకుంటారు కాబట్టి, వేతన శ్రామికులు, పనిచెయ్యడం తమ బాధ్యతగా భావిస్తారు. బానిసల చైతన్యంలో లేని 'పనిపట్ల బాధ్యత', జీతంతో పనిచేసే శ్రామికుల చైతన్యంలోకి కొత్తగా ప్రవేశించిన నూతన భావం. ఈ రకంగా కార్మికులు, ప్రాచీన తెగల ఉత్పత్తి దారులకన్నా అస్వతంత్రులుగానూ, బానిసలకన్నా స్వతంత్రులు గానూ ఉంటారు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో, ప్రతీ అంశమూ విరుద్ధ లక్షణాలతో ఉంటుంది. ఈ ఉత్పత్తి విధానంలో, ఒక పక్క — కార్మికుడికి గతంకన్నా హాని కలిగించే అంశమూ, ఇంకోపక్క — గతంకన్నా అభివృద్ధి కలిగించే అంశమూ — కలిసిపోయి ఉంటాయి. ఈ పరిస్తితులవల్ల పెట్టుబడిదారీ సహకారం, గత సమాజాల సహకారాల కన్నా స్థాయిలోనూ, స్వభావంలోనూ కూడా మార్పులతో

ప్రారంభమవుతుంది. ఇంకా భవిష్యత్ సమాజంలో ('నూతన సమాజం'లో) ఏర్పడబోయే నిజమైన సంపూర్ణ మైన సహకారానికి, ఈ విరుద్ధ లక్షణాలు గల పెట్టు బడిదారీ సహకారం బీజ రూపంగా ఉంటుంది.

పెట్టుబడిదారీ విధానం, అమ్మకానికి సరుకుని తయారు చేసే విధానం కాబట్టి, పెట్టుబడిదారుడి దగ్గిర ఉన్నంత మంది శ్రామికులు, గత కాలపు బానిస యజ మాని దగ్గిరగానీ, ప్రాచీన తెగల శ్రమ క్రమంలోగానీ ఉండడం సాధ్యం కాదు. గత కాలంతో పోలిస్తే, శ్రామి కులు ఎక్కువ సంఖ్యలో ఒక పని స్థలంలో కూడడం అనేది, పెట్టుబడిదారీ విధానంలోనే ప్రారంభమవుతుంది. శ్రామికుల సంఖ్య పెరగడమే గాక, శ్రమ క్రమానికి ఉన్న స్వభావం కూడా ఇక్కడ సమిష్టి స్వభావంగా మారుతుంది. ఈ కారణాల వల్ల పెట్టుబడిదారీ సహకారం ఉత్పాదక శక్తుల్ని అధిక స్థాయికి పెంచుతుంది.

పెట్టుబడిదారీ ఉత్పాదక శక్తులకు కారణం 'సహ కారమే' గానీ, పెట్టుబడి కాదు. కానీ ఈ సహకారాన్ని ఏర్పాటు చేసేది పెట్టుబడే కాబట్టి, సహకారం వల్ల పుట్టు కొచ్చే శక్తి, పెట్టుబడివల్ల పుట్టుకొచ్చే శక్తిలాగ కనపడు తుంది. శ్రామికుల్ని పెద్ద సంఖ్యలో ఒక చోటుకి చేర్చేపని పెట్టుబడి చెయ్యక ముందు, శ్రామికులు అంత ఎక్కువ సంఖ్యతో ఒక చోటుకి చేరడమూ, ఒక ప్లాను ప్రకారం సహకారంతో పనిచేస్తూ ఒక నూతన శక్తిని ప్రదర్శించడమూ జరగలేదు. కాబట్టి, ఆ శక్తికి పెట్టుబడే కారణంగా కనపడు తుంది. సహకారానికి ఉన్న (సమిష్టి శ్రమకు ఉన్న) సహజ శక్తులన్నీ పెట్టుబడికి ఉన్న సహజ శక్తులలాగ కనపడ తాయి. భూమికి సహజ ఆకర్షణ శక్తి ఉన్నట్టే, పెట్టుబడికి సహజ ఉత్పాదక శక్తులు ఉన్నట్టు! చివరికి దీని ఫలితం — ఆ ఉత్పాదక శక్తులతో తయారయిన ఉత్పత్తి అంతా పెట్టుబడిదారుడి స్వాధీనం కావడం!

పెట్టుబడిదారీ దోపిడీ అధిక స్థాయికి చేరడానికి, తప్పని సరిగా 'శ్రమలో సహకారం' అవసరం. 10 మంది శ్రామికులతో విడి విడిగా పని చేయించినా, సమిష్టిగా పని చేయించినా, ఆ 10 మంది మీదా పెట్టుబడిదారుడు చెల్లిం చేది 10 జీతాలే. కానీ, ఆ 10 మందీ, విడి విడిగా గాక సమిష్టిగా పని చెయ్యడం వల్ల, ఉత్పాదక శక్తి పెరిగి, పెట్టుబడిదారుడు ఎక్కువ ఫలితం పొందుతాడు. 'సహ కారం' వల్ల పుట్టుకొచ్చే ఉత్పాదకత ఎప్పటికప్పుడు పెట్టు బడికి ఒక 'ఉచిత బహుమతి'!

పెట్టుబడిదారీ సహకారానికి అనేక పరిమితులు ఉంటాయి. పెట్టుబడిదారుడు ఎంత మంది కార్మికుల్ని ఒక చోట చేర్చగలడు అనేది, వాడి పెట్టుబడి స్థాయి మీద ఆధారపడి ఉంటుంది. వాడు ఎంత పెట్టుబడి పెట్టగలడు — అనే దాని మీదే వాడు ఒక చోట చేర్చగల కార్మికుల సంఖ్య ఉంటుంది.

పెట్టుబడిదారీ సహకారం ద్వారా కార్మికుల మధ్య సమిష్టి సంబంధాలు ఏర్పడతాయి. కానీ, ఆ సంబంధాలు ఇంకా 'సరియైన సమిష్టి సంబంధాలు'గా ఉండవు. ఎందు కంటే, ప్రతీ కార్మికుడూ యజమానితోనే డైరెక్టు సంబం ధంలో ఉంటాడు. ఈ పరిస్థితి కార్మికుడి చైతన్యాన్ని ఒక అస్పష్ట స్థాయిలో ఉంచుతుంది. ప్రతీ కార్మికుడూ ఎలా అనుకుంటాడంటే - నా యజమానితోనే నాకు సంబంధం. ఇతరులతో (ఇతర కార్మికులతో) నాకు సంబంధం లేదు. యజమాని, నన్ను చేర్చినట్టే ఇతర కార్మికుల్ని కూడా చేర్చాడు. యజమాని కోసమే నేను ఇతర కార్మికులతో కలిసి ఉన్నాను. యజమానే లేకపోతే నాకూ ఇతర కార్మికులకూ సంబంధమే ఉండదు — అనుకుంటాడు. ఈ రకంగా, ప్రతీ కార్మికుడూ తనకూ, తన తోటి కార్మికు లకూ ఉన్న శ్రమ సంబంధాన్ని యజమాని ద్వారానే గ్రహిస్తాడు. అంటే, యజమాని ఉంటేనే ఆ సంబంధం నిలిచేది అయినట్టూ, యజమాని లేకపోతే దానికి అవ కాశమే లేనట్టూ భావిస్తాడు.

కార్మికుల మీద యజమాని లేడనీ, కార్మికులే ఒక సమిష్టి పద్ధతిలో ఉత్పత్తి క్రమాన్ని నిర్వహించుకుంటు న్నారనీ ఊహిస్తే, అప్పుడు కార్మికుల గ్రహింపు ఇంకో రకంగా ఇలా ఉంటుంది: అందరం కలిసి సమిష్టి బాధ్య తతో ఉత్పత్తి కార్యం నిర్వహించుకుంటున్నాము. ఈ శ్రమే అందరి మధ్యా సమిష్టి సంబంధాలు ఏర్పరుస్తోంది. శ్రమ చేసే మనుషులమధ్య ఏర్పడే సంబంధం శ్రమ ద్వారా ఏర్పడుతోన్న సంబంధమే. ఇది యజమాని ద్వారా ఏర్పడు తోన్న సంబంధం కాదు. యజమానితనం అనేది, శ్రమ క్రమంతో సంబంధంలేని బయట విషయం. అసహజ విషయం — ఇలాంటి గ్రహింపు కలుగుతుంది. అప్పుడు, ప్రతీ కార్మికుడూ, తనకూ ఇతర కార్మికులకూ ఉన్న సంబంధాల్ని నిజమైన అర్థంతో గ్రహిస్తాడు.

యజమాని ద్వారా మాత్రమే ఒకచోట కలిసే కార్మి కులు, ఒక అస్వతంత్ర స్థితిలో ఉంటూ, ఆ స్థితిలోనే సహకారంతో ఉంటారు. పెట్టుబడిదారీ సహకారం అంటే, పాత దోపిడీ సమాజాలలో లాగానే 'అస్వతంత్ర శ్రామికుల సహకారం.' 'యజమానిని కలిగిఉండడం' అనే పరిస్థితి,

కార్మికుల్ని విడి విడి సంబంధాలతో ఉంచితే, 'సహ కారంతో పని చెయ్యడం' అనే పరిస్థితి ఆ కార్మికుల్నే సమిష్టి సంబంధాలలో ఉంచుతుంది. అంటే, పెట్టుబడి దారీ సమిష్టి సంబంధాలు ఇంకా సరియైన సమిష్టి సంబంధాలుగా గాక, వైరుధ్య పూరితమైన సమిష్టి సంబం ధాలుగా ఉంటాయి. అందుకే, ఆ స్థితిలో ఉన్న కార్మికుల చైతన్యం కూడా వైరుధ్య పూరితంగానే ఉంటుంది. వారు, 'సరియైన దాన్ని' పూర్తిగా గ్రహించే పరిస్థితిలోనూ ఉండరు; బొత్తిగా గ్రహించలేని పరిస్థితిలోనూ ఉండరు. కొన్ని విషయాల్ని సరిగానే గ్రహిస్తారు. కొన్ని విషయాల్ని పూర్తిగా పొరపాటుగా గ్రహిస్తారు. కొన్ని విషయాల్ని ఇటూ అటూగా గ్రహిస్తారు. మొత్తంమీద, ఏ విషయంలోనూ ఒక స్పష్టతతో గాక, గందర గోళపు అవగాహనతో ఉంటారు.

చరిత్ర క్రమంలో, ప్రతీ ఒక్క అంశమూ అనేక రూపాల లోకి మారుతూ అభివృద్ధి చెందుతూ వచ్చినట్టే, 'సహకారం' కూడా కాల క్రమంలో వేరు వేరు రూపాలలోకి మారుతూ వచ్చింది. 'పెట్టుబడిదారీ సహకారం' ఇంకా సరైన రూపంతో గాక, పెట్టుబడిదారీ స్వభావానికి అను గుణమైన రూపం తోనే ఉంటుంది. కానీ శ్రామికుల్ని ఒక చోటికి చేర్చి సహకారాన్ని ఒక సమిష్టి శక్తిగా అభివృద్ధి పరచడంలో పెట్టుబడిదారీ విధానం, అతి ప్రధానమైన పాత్ర నిర్వర్తించింది. అయితే, ఆ పాత్రని (శ్రామికుల్ని ఒక చోటకి చేర్చే పాత్రని) అది ఎల్లకాలమూ నిర్వర్తించనక్కర లేదు. శ్రమ క్రమాన్ని సమిష్టి శ్రమ క్రమంగా మార్చడం తోనే, పెట్టుబడి పాత్ర చారిత్రకంగా ముగిసిపోయింది. పెట్టుబడిదారుడితో అవసరం లేకుండానే శ్రామికులు సమిష్టి చైతన్యంతో శ్రమ క్రమంలో పాల్గొనడాన్ని సాధ్యం చేసే భౌతిక పునాది ఏర్పడి పోయింది. శ్రమచేసే మనుషు లంతా ఒక ప్లాను ప్రకారం, శ్రమ క్రమాలలో పాల్గొనడమే సహకారానికి కావలసిన భౌతిక పునాది. ఈ భౌతిక పునాది మీద, శ్రామికులు, ఒక సమిష్టి చైతన్యంతో ఉత్పత్తి సాధ నాల్ని స్వాధీనం చేసుకోగలిగినప్పుడు, పెట్టుబడి ప్రత్యేకత అంతర్ధానమైపోతుంది. పెట్టుబడి లేకుండానే సహకారం ఉండడం సాధ్యమవు తుంది. అప్పుడు సహకారం, మరొక స్వభావంతోటీ, మరొక రూపంతోటీ ఏర్పడుతుంది.

కానీ, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు ఎలా భావిస్తారంటే, శ్రమ క్రమం జరగాలంటే శ్రామికుల్ని ఒక చోటుకి చేర్చే కర్తవ్యం ఎప్పుడూ పెట్టుబడే నిర్వర్తించాలి — అని భావి స్తారు. ఈ ఆర్థికవేత్త, పెట్టుబడిదారీ సహకారాన్ని ఒక 'చారిత్రక అవసరం'గా గాక, శాశ్వతావసరంగా భావిస్తాడు. ఎందుకంటే, ఈ వేత్త పెట్టుబడినే శాశ్వత విషయంగా భావి స్తాడు గనక. కానీ, పెట్టుబడిదారీ విధానం మారిపోయి నప్పుడు, పెట్టుబడిదారీ స్వభావమూ, ఆ స్వభావానికి తగిన రూపమూ గల ప్రతీ అంశానికీ, నూతన స్వభావమూ, ఆ స్వభావానికి తగిన నూతన రూపమూ ఏర్పడతాయి. సహకారానికి కూడా అంతే.

పెట్టుబడిదారీ సహకారంతో పనిచేసే కార్మికులు 'కలెక్టివ్ కార్మికులు' అయితే, నూతన సహకారంతో పని చేసే కార్మికులు 'ఎస్సోసియేటెడ్ కార్మికులు' అవుతారు. 'కలెక్టివ్' అన్నా, 'ఎస్సోసియేటెడ్' అన్నా 'సమిష్టిగా కలిసి ఉండే' అన్నదే అర్థం. కానీ పెట్టుబడిదారీ సమిష్టితనంతో ఉండే కార్మికుల్ని 'కలెక్టివ్ కార్మికులు' అనీ; యజమాని లేకుండా స్వంత బాధ్యతతో కాన్షియస్‌గా సమిష్టి సంబం ధాలలో ఉండే కార్మికుల్ని 'ఎస్సోసియేటెడ్ కార్మికులు' అనీ అంటున్నాము. కార్మికుల సంబంధాలలో 'ఎసోసి యేషన్‌కి కావలసిన పునాది' పెట్టుబడిదారీ విధానంలోనే ఏర్పడుతుంది. కానీ, అది కొన్ని వైరుధ్యాలతో ఏర్పడు తుంది. కాబట్టి, నూతన సమాజాన్ని నిర్మించవలసిన కార్మికులు, అంటే తమ సంబంధాల్ని 'ఎస్సోసియేటెడ్' సంబంధాలుగా మార్చుకోవలసిన కార్మికులు, తమ సంబంధాలలో పెట్టుబడిదారీ విధానం వల్ల ఏర్పడే వైరుధ్య లక్షణాల్ని కాన్షియస్‌గా గ్రహించుకోవాలి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1. ఒక గిల్డు యజమానితో కలిసి మొత్తం పనిచేసే వాళ్ళు 4 గురు. ఒక వారంలో ఉత్పత్తి సాధనాల ఖర్చు 60. జీతాల ఖర్చు 40. అదనపు విలువ రేటు 25%. యజమానికి స్వంత శ్రమ మీద వచ్చింది ఎంత? దోపిడీ మీద వచ్చింది ఎంత?**

**జ:** గిల్డులో, మొత్తం పని చేసేవారు 4 గురు. జీతాల మొత్తం 40. 1 మనిషి జీతం 10. అదనపు విలువ విషయం చూస్తే: దాని రేటు 25%. అంటే, 100 Vకి — 25S. ఆ లెక్కన 40 Vకి — 10S. ఈ 10S 4గురికి సంబంధించింది. అందులో, ఒక్కొక్కరి భాగం $2\frac{1}{2}$. యజమానికి, స్వంత శ్రమమీద వచ్చింది = $10V + 2\frac{1}{2}S = 12\frac{1}{2}$. దోపిడీ మీద వచ్చింది = $7\frac{1}{2}S$.

**2. పెటీ బూర్జువా అంటే? స్వంత శ్రమచేసే ఒక రైతు ఒక పాలేరుని సంవత్సర జీతానికి ఉంచుకున్నాడు. వ్యవసాయం పనుల సమయాలలో కూలీలను కూడా పెట్టు కుంటాడు. ఆ రైతు 'పెటీ బూర్జువా' అవుతాడా?**

**జ:** పెటీ బూర్జువా అంటే, కార్మికులతో పాటు తను కూడా శ్రమ చేసేవాడు. ఈ వ్యక్తి, కొందరు కార్మికుల్ని పెట్టుకుని తను కూడా శ్రమ చేస్తాడు. ప్రశ్నలో ఉన్న రైతు, పెటీ బూర్జువాయే అవుతాడు.

**3. 'పెటీ' (చిన్న) బూర్జువా, పెద్ద బూర్జువాగా ఎప్పుడు అవుతాడు?**

**జ:** పెట్టుబడినీ, కార్మికుల్నీ పెంచి, తను శ్రమ చెయ్యడం పూర్తిగా మానివేసినప్పుడు.

**4. బానిసకీ, వేతన శ్రామికుడికీ పోలికలేమిటి? తేడా లేమిటి?**

**జ:** **పోలికలు:** ఇద్దరూ యజమానుల అధికారం కిందే ఉంటారు. ఇద్దరికీ పోషణ కోసం శ్రమశక్తి విలువే అందుతుంది. ఇద్దరూ దోపిడీకి గురి అవుతారు.

**తేడాలు:** బానిస, యజమాని ఆస్తి. బానిసని అమ్మ డానికీ కొనడానికీ చంపడానికీ కూడా యజమానికి హక్కులు ఉంటాయి. కార్మికుడు, యజమాని ఆస్తి కాదు. కార్మికుడు, పని కాలంలో మాత్రమే యజమాని అధీ నంలో ఉండి, మిగతా కాలంలో స్వేచ్ఛగా ఉంటాడు. బానిసకు అందే పోషణ - జీతంగా ఉండదు. కార్మికుడికి అందేది జీతంగా ఉంటుంది.

**5. సహకారం అంటే? సహకారంతో పని చెయ్యడం అన్నా, సమిష్టిగా పనిచెయ్యడం అన్నా - ఒకటేనా?**

**జ:** సహకారం అంటే శ్రమ చేసే మనుషులు, శ్రమ క్రమానికి అవసరమైన పద్ధతిలో వేరు వేరు స్థానాల్లో ఉండి, వేరు వేరు పాత్రలు నిర్వహిస్తూ, ఒకరితో ఒకరు సహకరించుకుంటూ పనిచెయ్యడం. సహకారంతో పని చెయ్యడంలో సమిష్టితనం ఉంటుంది. కానీ, అంత మాత్రాన సమిష్టిగా పనిచెయ్యడం అంటే అదే కాదు. సహ కారం అనేది శ్రమ జరిగే విధానానికి మాత్రమే సంబంధిం చిన విషయం. సమిష్టితనం అనేది — శ్రమ జరిగే విధా నానికే కాదు, ఉత్పత్తి సాధనాల మీద ఉండే ఆస్తి హక్కు లకు సంబంధించిన విషయంగా కూడా ఉంటుంది. దోపిడీ శ్రమ క్రమంలో పాల్గొనే మనుషులు, ఆ ఉత్పత్తి సాధనాల మీద స్వంత ఆస్తి హక్కులు లేని వారిగా ఉంటారు. కానీ 'నూతన విధానం'లో ఉత్పత్తి సాధనాల మీద అందరూ సమిష్టి హక్కుతో ఉంటారు. ఆ రకంగా 'సమిష్టిగా పనిచెయ్యడం' అనే దాంట్లో, ఆస్తి హక్కుల అర్థం కూడా ఇమిడి ఉంటుంది.

**6. సహకారం విషయంలో, పెట్టుబడిదారీ విధానం చారిత్ర కంగా నిర్వర్తించిన పాత్ర ఏమిటి?**

**జ:** విడి విడిగా, ఎవరికి వారుగా, చెల్లా చెదురుగా ఉన్న శ్రామికుల్ని, పెట్టుబడిదారీ విధానం ఒకే పని స్థలం లోకి చేర్చి, సహకారాన్ని ఒక సమిష్టి శక్తిగా అభివృద్ధి పరిచే పాత్రని నిర్వర్తించింది. ఈ పాత్ర, గిల్డుల కాలం నించే ప్రారంభమై భారీ పరిశ్రమ కాలంతో ముగిసి పోయింది.

**7. ఒక కుట్టు మనిషి, 10 చొక్కాలు కుడితే, ఆ పనిని 10 సార్లూ ఖచ్చితంగా ఒకే సమయంలో చెయ్యలేడు. అలాగే, 10 మంది వేరు వేరు కుట్టు మనుషులు 10 చొక్కాలు కుడితే, వాళ్ళు కూడా ఆ పని ఒకే సమయంలో చెయ్యలేరు. 1 చొక్కాని కుట్టడానికి సగటున ఎంత కాలం పడుతుందో చూడాలంటే ఒకే మనిషి 10 సార్లు చేసే వేరు వేరు సమయాల నించి సగటుని తీసుకోవాలా, వేరు వేరు మనుషుల నించి సగటుని తీసుకోవాలా?**

**జ:** వేరు వేరు మనుషుల నించే తీసుకోవాలి. ఒకే మనిషి నించి కాదు. ఎందుకంటే, ఒక మనిషి చురుగ్గా పని చేసేవాడైతే, ఎన్ని సార్లు చేసినా చురుగ్గానే చేస్తాడు. మంద గొడిగా పనిచేసే వాడైతే ఎన్ని సార్లు చేసినా మందగొడి గానే చేస్తాడు. కాబట్టి, ఒక మనిషి చేసే పనుల్ని తీసు కుంటే, అది ఆ మనిషికి సంబంధించిన సగటే గానీ అందరికీ సంబంధించింది అవదు. ఏ శ్రమలో అయినా సగటు కాలం అంటే, అది వేరు వేరు మనుషులకు సంబంధించిందే. అదే ఆ శ్రమలో అందరికీ సంబంధిం చిన సామాజిక సగటు.

**8. ఒక పెట్టుబడిదారీ పని స్థలంలో 5 వేల మంది కార్మి కులు ఉండడం సాధ్యమే. ఒక బానిస యజమాని దగ్గిర 5 వేల మంది బానిసలు ఉండడం సాధ్యమా, కాదా? ఎందుచేత?**

**జ:** పెట్టుబడిదారుడు, అమ్మకం కోసం సరుకుని ఉత్పత్తి చేయిస్తాడు. బానిస యజమాని కేవలం అమ్మకం కోసం సరుకుని తయారు చేయించే యజమాని కాడు. కాబట్టి, వందల, వేల మంది బానిసలతో వాడికి అవసరం ఉండదు. కాబట్టి, పెట్టుబడిదారుడి దగ్గిర ఉన్నంత మంది శ్రామికులు బానిస యజమాని దగ్గిర ఉండరు.

★

# 2. మాన్యుఫాక్చర్ ఉత్పత్తి

గిల్డు ఉత్పత్తి విధానానికీ, మాన్యుఫాక్చర్ ఉత్పత్తి విధానానికీ ప్రారంభంలో తేడా ఏమీ లేదు, కేవలం కార్మికుల సంఖ్య పెరగడం తప్ప.

16వ శతాబ్దంలో, పెట్టుబడిదారుల సరుకుల అమ్మకాలకు ఎక్కువ అవకాశాలు ఏర్పడ్డాయి. అమెరికా ఖండాన్ని కనిపెట్టడంతోనూ, కొత్త కొత్త సముద్ర మార్గాల్ని ప్రారంభించడంతోనూ, ఇంగ్లండుకి ఇతర దేశాల తోటీ, ఇతర ఖండాలతోటీ వర్తక సంబంధాలు పెరిగి, ఉత్పత్తిని ఇంకా అధికం చేయవలసి వచ్చింది.

మాన్యుఫాక్చర్ దశ అంతటిలోనూ సాంకేతిక పునాది చేతి పనే. చేతి పనిముట్లే దాని శ్రమ పరికరాలు. కొన్ని కొన్ని పనుల్లో చిన్న చిన్న యంత్రాలు ప్రారంభమైనప్పటికీ, వాటిని కార్మికులు చేతితో తిప్పడమో, కాలితో తొక్కడమో చేస్తూ వాటిని తమ చేతి పనిముట్లుగానే ఉపయోగించే వారు. మనిషి తిప్పవలసిన అవసరం లేకుండా ఇంజన్ల ద్వారా ఆటోమేటిక్‌గా నడిచే యంత్రాలు వచ్చే వరకూ ఉన్న దశ — మాన్యుఫాక్చర్ దశ.

యూరప్‌లో ఈ మాన్యుఫాక్చర్ దశ 16వ శతాబ్దం ప్రారంభం నించి, దాదాపు 18వ శతాబ్దం చివరి వరకూ.

వస్తువుకి సంబంధించిన అన్ని దశల్నీ ఒకే మనిషి చేస్తూ వస్తువుని పూర్తిచేసే గిల్డు ఉత్పత్తి విధానం, మాన్యుఫాక్చర్ కాలంలో, వస్తువుకి సంబంధించిన వేరు వేరు దశల్ని వేరు వేరు కార్మికులు చేసే పద్ధతిలోకి మారింది. అంటే, విడి విడిగా సాగే శ్రమక్రమాలన్నీ మాన్యుఫాక్చర్‌లో 'సమిష్టి శ్రమ క్రమం'గా మారాయి.

మాన్యుఫాక్చర్ ఉత్పత్తి విధానం — అన్నప్పుడు, అది, ప్రధానంగా 2 విషయాలకు ప్రారంభ దశగా ఉంటుంది.

**(1)** కార్మికులు సమిష్టిగా పని చేసే విధానానికీ,

**(2)** కొత్త రకపు శ్రమ విభజనకీ.

ఈ 2 విషయాలూ, ఒక వేపు అనుకూలాంశాలతోటీ, ఇంకోవేపు వ్యతిరేకాంశాలతోటీ సాగుతాయి.

ఒక గుర్రబ్బండి తయారవ్వాలంటే, దాని కోసం వడ్రంగం పనీ, కమ్మరం పనీ, కుట్టుపనీ వగైరా పనులు కొన్ని కావాలి. ఆ పనులన్నీ అప్పటికే సమాజంలో వేరు వేరు చేతి వృత్తులుగా ఉన్నాయి. గుర్రబ్బళ్ళని తయారు చేయించే పెట్టుబడిదారుడు (మాన్యుఫాక్చరరు) ఆ వేరు వేరు చేతి వృత్తుల ఉత్పత్తిదారుల్ని జీతాలిచ్చే పద్ధతి మీద తన వర్క్ షాపులోకి చేరుస్తాడు. పూర్వం చెల్లా చెదురుగా ఉండే ఆ వృత్తులన్నీ (తయారయ్యే వస్తువు కోసం కావలసిన ఆ పనులు), ఇప్పుడు ఒక చోటే చేరతాయి. అలా చేరిన పని వాళ్ళు, బైట లాగే, ఇక్కడ కూడా ఎవరి పని వాళ్ళే చేస్తారు. కుట్టుపని అంతా ఒకరూ, వడ్రంగం పని అంతా ఒకరూ — ఇలా. అయినప్పటికీ ఆ పనులన్నీ ఒక చోటుకి చేరడం వల్ల, తయారయ్యే వస్తువు, ఒకరి చేతి నించి ఒకరి చేతికి త్వర త్వరగా కదులుతుంది. ఒక దశలో కొంత తయారైన బండి, రెండో దశలో పని వాడి దగ్గరికి వెళ్ళడానికి ఎక్కువ సమయం పట్టదు. ఆ దశల మధ్య విరామాలు తగ్గి, పనులన్నీ త్వర త్వరగా జరిగిపోతాయి.

చొక్కాలు కుట్టాలంటే నలుగురు మనుషులు తలో బట్టా తీసుకుని ఎవరి కత్తిరింపులు వాళ్ళే, ఎవరి కుట్లు వాళ్ళే చేసుకుంటూ చొక్కాలు పూర్తి చేస్తారనుకుందాం. ఈ పద్ధతిలో ఒక చొక్కాని పూర్తి చెయ్యడానికి పట్టే సమయం కన్నా, కత్తిరింపులన్నీ ఒకరు చేస్తూ, కుట్టు పని అంతా ఇంకొకరు చేస్తూ, ఇలా ఈ రెండో పద్ధతిలో చొక్కా తయారవడానికి తక్కువ సమయం పడుతుంది. పనివాళ్ళతో సమిష్టిగా పని చేయించే ఈ పద్ధతులన్నిటినీ ప్రతీ పెట్టుబడిదారుడూ, అదే రకం సరుకుని ఉత్పత్తి చేయించే ఇతర పెట్టుబడిదారుల కన్నా తన దగ్గరే ఎక్కువ సరుకుని ఉత్పత్తి చేయించే ఉద్దేశంతోనే అమలు జరుపుతాడు. ఆ కొత్త పద్ధతిలో కూడా ఏ పెట్టుబడిదారుడు ఎక్కువ 'సమర్థత'తో ఏర్పాట్లు చేసుకోగలుగుతాడో వాడు, ఇతరుల కన్నా ఎక్కువ లాభపడుతూ ఉంటాడు.

వస్తువులోని వేరు వేరు దశల్ని వేరు వేరు కార్మికులు చెయ్యడం అనే పద్ధతి, ఒక కొత్త రకపు శ్రమ విభజనకు దారితీస్తుంది. ఎలాగంటే: గుర్రబ్బళ్ళని తయారు చేయించే ఒక పెట్టుబడిదారుడు ఉన్నాడనుకుందాం. వాడి దగ్గిర, గుర్రబ్బళ్ళు తప్ప, కుర్చీలుగానీ, మంచాలుగానీ, పీటలూ నాగళ్ళూ గిలక్కాయలూ వంటి ఇతర చెక్క వస్తువులుగానీ ఏవీ తయారుకావు. గుర్రబ్బళ్ళు మాత్రమే తయారవుతాయి. ఆ బండి చక్రాలు చెయ్యడానికి వడ్రంగి కావాలి. ఈ పెట్టుబడిదారుడు, బండి చక్రాల పని కోసం ఒక

వ(డంగిని పెట్టుకున్నాడనుకుందాం. ఈ వ(డంగి, గతంలో (ఈ పెట్టుబడిదారుడి దగ్గిర చేరకముందు), కుర్చీలూ మంచాలూ నాగళ్ళూ పీటలూ వగైరా అన్ని రకాల చెక్క వస్తువులూ చేస్తూ ఉండేవాడు. ఆ వ(డంగి గు(ర(బ్బళ్ళ పెట్టుబడిదారుడి దగ్గిర చేరిన తర్వాత బళ్ళ చక్రాలు మా(త్రమే చేసే వాడిగా తయారవుతాడు. ఇతర పనులన్నీ మానివేస్తాడు. (క్రమంగా ఆ పనులు చేసే అలవాటు పోతుంది. — అలాగే, గతంలో అన్ని రకాల కుట్టు పనులూ చేసే కుట్టు మనిషి, ఈ గు(ర(బ్బళ్ళ కర్మాగారంలో చేరాక, బండి సీట్లు కుట్టే పని మా(త్రమే చేస్తాడు. అలాగే కమ్మరులూ, ఇతర పని వాళ్ళూకూడా.

ఒక వ(డంగి, అన్ని రకాల చెక్క వస్తువులీ తయారు చేయించే పెట్టుబడిదారుడి దగ్గిర చేరినా, అక్కడ కూడా అతను, కుర్చీలు మా(త్రమే చేసే వాడిగానో, మంచాలు మా(త్రమే చేసే వాడిగానో మారతాడు. అంతే కాదు, ఆ కుర్చీలకూ, మంచాలకూ సంబంధించిన పనుల్లో ఏదో ఒకే ఒక దశని చేసేవాడిగా మా(త్రమే ఉంటాడు.

ఒక మనిషి, అన్ని రకాల పనులూ చెయ్యడం కన్నా, ఏదో ఒక్క రకం పనే ఎప్పుడూ చేస్తూ వుంటే, ఆ పనిలో ఎక్కువ అనుభవం కలిగి, ఆ పని ఎక్కువ వేగంగానూ నైపుణ్యంగానూ చేసే సామర్థ్యం అలవడుతుంది. ఈ పద్ధతి వల్ల పనివాడు, ఒక (ప్రత్యేక రకం పనిలో 'స్పెషలైజ్' అవుతాడు. స్పెషలైజ్డ్ పనివాళ్ళ వల్ల యజమానికి తక్కువ కాలంలో ఎక్కువ పని దొరుకుతుంది. — ఈ 'స్పెషలైజేషన్' గురించి కొంచెం వివరంగా చూడాలి.

కత్తిరింపూ, కుట్టూ కూడా చేసే మనిషి ద్వారా ఒక చొక్కా బట్టని కత్తిరించడానికి 1 గంటా, కుట్టడానికి 2 గంటలూ, మొత్తం 1 చొక్కా తయారవడానికి 3 గంటల కాలం పడుతుందనుకుందాం. ఎప్పుడూ కత్తిరింపులు మా(త్రమే చేసే రెండో రకం కార్మికుడి ద్వారా చొక్కాబట్ట కత్తిరింపుకి 1 గంటకన్నా తక్కువ కాలమే పడుతుంది. దాన్ని అరగంట అనుకుందాం. అలాగే, 1 చొక్కా కుట్టు పనికి మొదటి పద్ధతి కార్మికుడి ద్వారా 2 గంటలు పడితే, ఎప్పుడూ కుట్టుపని మా(త్రమే చేసే రెండో రకం కార్మికుడి ద్వారా చొక్కా కుట్టుకి 2 గంటల కన్నా తక్కువ కాలం పడుతుంది. దాన్ని గంటన్నర అనుకుందాం. అంటే, 2 పనులూ ఒకే మనిషి చేసే పద్ధతిలో, ఆ 2 పనులూ పూర్తి అవడానికి 3 గంటలు పడితే, ఆ 2 పనుల్లోనూ 'స్పెషలైజ్' అయిన కార్మికుల ద్వారా ఆ 2 పనులూ జరగడానికి 2 గంటలే పడుతుంది.

చొక్కాలు తయారు చేయించే పెట్టుబడిదారు లందరూ మొదటి పద్ధతిలో పని చేయిస్తూ ఉండగా, అందులో ఒకరిద్దరు మా(త్రం రెండో పద్ధతిలో పని చేయించడం మొదలు పెట్టారనుకుందాం. మిగతా పెట్టుబడి దారులందరి దగ్గిరా ఒక చొక్కా తయారవడానికి 3 గంటలు పడుతోంటే, రెండో పద్ధతిలో పనిచేయించే వాళ్ళ దగ్గిర 2 గంటలే పడుతుంది. అయినా వీళ్ళు కూడా (చొక్కాని తక్కువ సమయంలో తయారు చేయించే వాళ్ళు కూడా) చొక్కాల్ని మిగతా వాళ్ళు అమ్మినట్టే 3 గంటల విలువతోనే అమ్ముతారు. లేదా, అవసరమైతే కొంచెం చవగ్గా కూడా అమ్ముతారు. ఈ రెండో పద్ధతిలో పని చేయించే పెట్టుబడిదారుడు, 'ఎక్కువ అదనపు విలువ' కోసమే తన దగ్గిర స్పెషలైజేషన్ల వ్యవహారం (ప్రారంభిస్తాడు.

గతంలో అన్ని రకాల కుట్టుపనులూ చేసే కుట్టు మనిషి, గు(ర(బ్బండి సీట్లు కుట్టే పనిలో మా(త్రమే నిపుణుడై నప్పుడూ; గతంలో అన్ని రకాల పనులూ చేసే వ(డంగి, గు(ర(బ్బండి చక్రాల పనిలో మా(త్రమే నిపుణుడైనప్పుడూ — ఇలా గు(ర(బ్బండికి కావలసిన పనులన్నీ స్పెషలైజ్డ్ పనులుగా జరిగినప్పుడు, ఆ పెట్టుబడిదారుడు, ఇతర పెట్టుబడిదారుల కన్నా (అంత మంది స్పెషలైజ్డ్ పనివాళ్ళు లేని ఇతర పెట్టుబడిదారుల కన్నా) ఒక 'పని దినం'లో ఎక్కువ పని చేయించగలుగుతాడు. దానివల్ల వాడి సరుకు తక్కువ ఖర్చుతో తయారవుతుంది. దాన్ని వాడు అందరూ అమ్మే ధరకే అమ్మితే, లేదా వాళ్ళతో పోటీగా కొంత తక్కువకే అమ్మినా, వాడు ఇతర్ల కన్నా ఎక్కువ లాభం సంపాదించగలుగుతాడు.

కానీ, త్వరలోనే ఇదే రకం స్పెషలైజేషన్ని ఇతర పెట్టుబడిదారులు కూడా (ప్రారంభిస్తారు. అప్పుడు స్పెషలైజేషన్లో ఇంకా మార్పులు జరగడంగానీ, అది సాధ్యం కానిచోట ఉత్పాదక శక్తుల్ని పెంచడానికి ఇతర పద్ధతులు అనుసరించడం గానీ జరుగుతుంది.

మాన్యుఫాక్చర్ దశకన్నా పూర్వమే సమాజంలో 'ఒక (శ్రమ విభజన' ఉంది. అది ఎలాంటిదంటే — నేతపని వేరుగా, కుట్టుపని వేరుగా, చెప్పులు కుట్టేపని వేరుగా, వ్యవసాయ పని వేరుగా — ఇలా, అది పూర్తిగా వేరు వేరు తరహాల (శ్రమలు వేరు వేరు వ్యక్తులూ బృందాలూ చేసే విధంగా ఉన్న (శ్రమ విభజన. ఇందులో వేరు వేరు

రకాల శ్రమల్ని ఒకే వ్యక్తి గానీ, ఒకే కుటుంబం గానీ చెయ్యడం కూడా ఉంది. ఒక వ్యవసాయ కుటుంబం, వ్యవసా యంతో పాటు నేత పని కూడా చేస్తూ ఉంటుంది. ఒక చెప్పులు కుట్టే కుటుంబం. ఆ పనితో పాటు వ్యవసాయం పని కూడా చేస్తూ ఉంటుంది. ఈ రకంగా, గతంలో ఒకే మనిషి పూర్తిగా వేరు వేరు రకాల రెండేసి మూడేసి శ్రమలు చెయ్యడం ఉండేది. మాన్యుఫాక్చర్ దశలో 'శ్రమ విభజన'లో జరిగిన మార్పేమిటంటే — ఒక మనిషి వేరు వేరు శ్రమలు చెయ్యడం ఉండదు. అంతేగాక, ఏదో ఒక్క శ్రమ లోనే వుండి పోతాడు. ఆ ఒకే రకం శ్రమ కూడా ఇంకా చిన్న చిన్న భాగాలుగా విడి పోతుంది. అంటే, అప్పటికి ఉన్న శ్రమ విభజనలో ఇంకా ఉప విభజన జరుగుతుంది. ఈ రకంగా, మాన్యుఫాక్చరు, అంతకు పూర్వమే ఉన్న శ్రమ విభజనని మరింత 'అభి వృద్ధి' చెయ్యడమూ, అప్పటికి లేని కొత్త శ్రమల్ని ప్రారం భించడమూ చేస్తుంది. కానీ, పెట్టుబడిదారీ పునాది మీద జరిగే శ్రమ విభజనలో ఏ అభివృద్ధి అయినా పూర్తిగా వైరు ధ్యాల తోనే ఉంటుంది.

## స్పెషలైజేషన్‌లో వైరుధ్యాలు:

పనిలో స్పెషలైజేషను, కొన్ని మంచి లక్షణాలతోనూ, కొన్ని చెడ్డ లక్షణాలతోనూ ఉంటుంది. మంచి లక్షణా లేమిటంటే — స్పెషలైజేషన్‌లో ఒక మనిషి ఎప్పుడూ ఒకే పని చేస్తాడు కాబట్టి, ఆ పనిని అతను చాలా నైపుణ్యం గానూ, త్వరగానూ చెయ్యగలుగుతాడు. వస్తువుల్ని నాణ్యంగా తయారు చేసుకోవడానికీ, శ్రమ కాలాన్ని తగ్గించుకోవడానికీ స్పెషలైజేషన్ ఉపయోగపడుతుంది.

స్పెషలైజేషన్‌వల్ల చెడ్డ ఏమిటంటే — ఒక మనిషి ఎప్పుడూ ఒకే పని చేస్తూ ఉంటాడు కాబట్టి, ఎప్పుడూ ఒకే పనికి కట్టుబడిపోయి ఉంటాడు. గతంలో 10 రకాల కుట్టు పనులు చేసే సామర్థ్యంగల కుట్టుమనిషి, ఒక పెట్టుబడిదారుడి దగ్గిర చేరి, తన 10 పనుల్లో ఒక్క పని మాత్రమే చేస్తూ ఉంటాడు. మిగతా 9 పనులూ ఎప్పుడూ చెయ్యడు కాబట్టి, ఆ పనులకు కావలసిన సామర్థ్యాలన్ని టినీ పోగొట్టుకుని ఆ మనిషి ఒక్క పనిలో మాత్రమే ఆరితేరతాడు. పనివాడు ఇలా తయారవడం పెట్టుబడి దారుడికి చాలా లాభం. పెట్టుబడిదారుడికి కావలసిన ఆ ఒక్క పనీ, పనివాడి నించి, స్పెషలైజ్డ్ పనిగా దొరుకు తుంది. కానీ, ఇది పనివాడికి చాలా నష్టం. అతనిలో ఒక్క పనికి సంబంధించిన శక్తి మాత్రమే అభివృద్ధి చెంది, మిగతా శక్తులన్నీ నాశనమైపోతాయి. పాత శ్రమ విభజన ప్రకారం అనేక రకాల పనులు చెయ్యగలిగిన మనిషి, ఇప్పుడు పెట్టుబడిదారుడి 'శ్రమ క్రమం'లో ఒక అతి చిన్న పాత్ర నిర్వహించేవాడిగా మాత్రమే అవుతాడు. ఆ ఒక్క పని తప్ప ఇంకే పనీ చెయ్యలేనివాడిగా తయారై, వృత్తి రీత్యా 'అవిటివాడై' పోతాడు. ఈ రకంగా, ప్రతి పనీ స్పెషలై జేషన్‌తో కావలసిన పెట్టుబడిదారుడి శ్రమ క్రమంలో, ప్రతి శ్రామికుడూ, ఒక సంకుచిత పరిధిలో ఇరుక్కుపోతాడు. స్పెషలైజేషను, మనిషిని, ప్రతీ గంటా, ప్రతీ రోజూ, జీవి తాంతమూ ఒక అతి చిన్న పనికి బంధించి ఉంచుతుంది. జీవితాంతమూ ఒక చేతిని తిప్పుతూ ఉండడమో, ఒక కాలిని తిప్పుతూ ఉండడమో; జీవితాంతమూ చెక్కని చిత్రిక పడుతూ ఉండడమో; జీవితాంతమూ గుడ్డలు కత్తిరిస్తూ ఉండడమో; ఇలా, జీవితమంతా ఒకే రకమైన పని చేస్తూ ఉండవలసి వచ్చినప్పుడు, ఆ పని, ఆ మనిషికి ఒక భయంకరమైన శిక్షగా పరిణమిస్తుంది. ఈ పరిస్థితి, పని పట్ల ఆసక్తినీ, ఉత్సాహాన్నీ చంపివేస్తుంది. అంతేగాక, ఈ పద్ధతిలో, కార్మికులు, తమ పనిలో ఎప్పుడూ ఒకే అవయవాన్ని ఉపయోగిస్తూ పని చెయ్యడం వల్ల, ఈ పరిస్థితి కార్మికుల్ని ప్రత్యేక రకపు శారీరక, మానసిక రోగాలకు గురిచేస్తుంది. పరిశ్రమలలోని పరిస్థితుల వల్ల వచ్చే జబ్బులన్నీ 'పారిశ్రామిక రోగాలు.' శ్రామికులకు, పేదతనం వల్ల వచ్చే రోగాలతో పాటు, పెట్టుబడిదారీ విధానంలో, స్పెషలైజేషన్ల వల్ల వచ్చే రోగాలు కూడా కలుస్తాయి.

స్పెషలైజేషన్‌లో ఈ నష్టాలన్నీ ఉన్నా, అందులో ఉన్న కొన్ని మంచి లక్షణాలు 'పెట్టుబడిదారుడికి ఉపయోగ పడుతూ' అభివృద్ధి చెందాయి. స్పెషలైజేషన్ వల్ల వచ్చే మంచి ఫలితాలన్నీ పెట్టుబడిదారుడికీ, చెడ్డ ఫలితాలన్నీ కార్మికులకూ అన్నమాట!

## అంతస్థుల భేదం:

స్పెషలైజేషన్ పద్ధతి, ఒక 'సంపూర్ణ శ్రమ'ని శారీరక శ్రమగానూ, మేధా శ్రమగానూ విడదీసింది. గతంలో ఒక రైతుగానీ, ఒక చేతి వృత్తుల మనిషిగానీ, తన ఉత్పత్తి కార్యక్రమాలు తనే నిర్వహించుకునేటప్పుడు, ఆ పనులకు కావలసిన ఆలోచనలూ, నిర్ణయాలూ ఆ మనిషే చేసుకునే వాడు. అతని ఉత్పత్తి కార్యంలో అతని మేధాశ్రమా శారీరక శ్రమా కలిసి ఉండేవి. గిల్డులలో కూడా, శ్రామి కులు, వస్తువుకి సంబంధించిన అన్ని దశల్నీ ఎవరికి

వారుగా విడి విడిగా చేసేవారు కాబట్టి, ప్రతి శ్రామికుడూ తన పని గురించి తనే ఆలోచిస్తూ (యజమాని ఆధ్వర్యం లోనే అయినా) పని చేసేవాడు. కానీ మాన్యుఫాక్చర్ దశలో, ఏ శ్రామికుడూ వస్తువుని పూర్తిగా చెయ్యడు. ప్రతి శ్రామికుడూ వస్తువుకి సంబంధించిన ఏదో ఒక చిన్న దశనే చేస్తాడు కాబట్టి, వస్తువుని తయారు చెయ్యడానికి కావల సిన సంపూర్ణక్రమం గురించి ఆలోచించే పరిస్థితి ఏ శ్రామి కుడికీ ఉండదు. వస్తువుని తయారు చెయ్యడానికి కావల సిన మేధా శ్రమలూ, శారీరక శ్రమలూ వేరు వేరు వ్యక్తులు చేసే శ్రమలుగా విడిపోతాయి. మొదట ఆ వస్తువుని గురించి ప్లానులు తయారు చెయ్యడం ఒకరి పని అయితే, ఒక్కొక్క విడి భాగాన్ని తయారు చెయ్యడం ఒక్కొక్కరి పని అవుతుంది. మళ్ళీ ఒక్కొక్క విడి భాగానికి సంబంధించిన పని కూడా కొన్ని చిన్న చిన్న భాగాలుగా విడిపోతుంది.

ఎప్పుడూ ఒక చేతితోనో, కాలితోనో చిన్న యంత్రాన్ని తిప్పుతూ పని చేసే మనిషికి, జీవిత కాలంలో ఏ మేధాశ్రమ తోనూ అవసరం ఉండదు. ప్రకృతి సహజంగా ఉండే అతని మేధాశక్తి ఎన్నడూ అమలులోకి రాక నిర్వీర్యం అయిపోతుంది. ఈ పద్ధతి వల్ల, కొందరు — కేవలం 'మేధా శ్రమలు' చేసే వారిగానూ, కొందరు — కేవలం 'శారీరక శ్రమలు' చేసే వారిగానూ విడిపోతారు. అందులో మళ్ళీ, నైపుణ్యం గల శ్రమలు చేసేవారిగానూ; నైపుణ్యం లేని శ్రమలు చేసేవారిగానూ కూడా విడిపోతారు.

ఒక 'ఉత్పత్తి స్థలం'లో ఒకే రకం ఉత్పత్తి తయారవు తుంది. కుండలో, బల్లలో, దుస్తులో, వైద్యమో — ఇలా. అవన్నీ కలిసి ఒకే ఉత్పత్తి స్థలంలో తయారుకావు. కుట్టు పనినీ, వైద్యాన్నీ పోల్చిచూస్తే కుట్టు శ్రమశక్తి విలువ కన్నా వైద్యం శ్రమశక్తి విలువ ఎక్కువ. కాబట్టి, కుట్టు మనిషి కన్నా వైద్యం మనిషి ఎక్కువ 'అంతస్తులో' ఉంటాడు.

ఈ ఇద్దరు వ్యక్తుల మధ్యా సమాజంలో 'అంతస్తుల భేదం' (హైరార్కీ) ఉంటుంది. ఈ అంతస్తుల భేదం మాన్యుఫాక్చర్ దశ వరకూ 'ఉత్పత్తి స్థలం'లోకి ప్రవేశించ లేదు. ఒకే వస్తువుకి సంబంధించిన వేరు వేరు దశల్ని వేరు వేరు కార్మికులు చెయ్యడం ప్రారంభించిన దగ్గిర్నించీ అది (హైరార్కీ) 'ఉత్పత్తి స్థలం'లోకి కూడా ప్రవేశిస్తుంది.

దుస్తులు తయారు చెయ్యడానికి కావలసిన పనుల్లో కత్తిరింపుల పనిని స్కిల్డ్ (నైపుణ్యంగల) పని గానూ, కుట్టు పనిని అన్‌స్కిల్డ్ (నైపుణ్యంలేని) పని గానూ — అను కుందాం. ఈ 2 దశల్నీ ఒకే మనిషి చేస్తూ చొక్కాపని పూర్తి చేస్తే, ఆ కార్మికుడు స్కిల్డ్ పనీ, అన్‌స్కిల్డ్ పనీ కూడా చేసినట్టు అవుతుంది. ఈ పద్ధతిలోనే ఇద్దరు కార్మికులు విడి విడిగా 2 చొక్కాలు కుట్టినప్పుడు, అందులో ఒక కార్మికుడు స్కిల్డ్ పనివాడిగానూ, ఇంకో కార్మికుడు అన్ స్కిల్డ్ పనివాడిగానూ అవరు. ఇద్దరూ 2 రకాల పనులూ చేస్తారు కాబట్టి, పని స్థలంలో ఇద్దరూ 'సమానులుగా' ఉంటారు. కానీ, ఒక కార్మికుడు ఎప్పుడూ కత్తిరింపుల పనీ, ఒక కార్మికుడు ఎప్పుడూ కుట్టుపనీ చేసే విధంగా పని పద్ధతి మారినప్పుడు, కత్తిరింపుల కార్మికుడు స్కిల్డ్ పనివాడిగానూ, కుట్టు కార్మికుడు అన్‌స్కిల్డ్ పనివాడి గానూ అయిపోతారు.

ఏ రకపు ఉత్పత్తిని తీసుకున్నా దాన్ని తయారు చెయ్యడంలో తప్పనిసరిగా కొన్ని దశలు ఉంటాయి. ఒక దశలో శారీరక శ్రమా, ఇంకో దశలో మేధాశ్రమా కావలసి రావచ్చు. అందులోనూ కొంతసేపు నైపుణ్యంగల శ్రమా, కొంతసేపు నైపుణ్యంలేని శ్రమా కావలసి రావచ్చు. ఈ వేరు వేరు దశలన్నిటినీ ఒకే కార్మికుడు చేసే పద్ధతి ఉన్నప్పుడు, అలాంటి ఇద్దరు కార్మికులు ఒకరికన్నా ఒకరు ఎక్కువో తక్కువో అవరు. కానీ, ఈ దశలన్నీ వేరు వేరుగా విడిపోయి, ఆ దశల్ని వేరు వేరు కార్మికులు చేసే పద్ధతిలో, ఒక కార్మికుడు మేధాశ్రమ చేసేవాడి గానూ, ఒక కార్మికుడు శారీరక శ్రమ చేసేవాడి గానూ, అందు లోనూ మళ్ళీ ఒకరు స్కిల్డ్ కార్మికుడుగానూ, ఒకరు అన్‌స్కిల్డ్ కార్మికుడు గానూ — ఇలా, రక రకాల భేదాలతో విడి పోతారు. ఈ రకంగా, మాన్యుఫాక్చర్ దశ వరకూ ఉత్పత్తి స్థలాలకు బైట ఉన్న 'అంతస్తుల భేదం' అప్పట్నించి ఉత్పత్తి స్థలాలలోకి కూడా ప్రవేశించింది. <u>ఉత్పత్తి స్థలంలో అంతస్తుల భేదం, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి మాత్రమే ప్రత్యేకమైనది. ఇది గత సమాజాలలో లేదు.</u>

ఒక కార్మికుడు, ఎప్పుడూ వస్తువుకి సంబంధించిన ఒక చిన్న దశని మాత్రమే చేస్తూ ఉండే శ్రమ విభజనే 'పెట్టుబడిదారీ శ్రమ విభజన.' ఇది, పెట్టుబడిదారుడికి 'ఎక్కువ అదనపు విలువ'ని ఇవ్వడానికి పుట్టుకు వచ్చిన శ్రమ విభజన. అందుకే ఇది పెట్టుబడిదారీ స్వభావంగల శ్రమ విభజన. ఇది పూర్తిగా పెట్టుబడిదారీ సృష్టి.

ఏ ఉత్పత్తి విధానం గల సమాజానికైనా శ్రమ విభజన అవసరమే. 'నూతన సమాజానికి' కూడా శ్రమ విభజన

కావాలి. 'శ్రమ విభజన' లేకుండా ఏ సమాజమూ ఉత్పత్తి క్రమాల్ని నిర్వహించజాలదు. అయితే, నూతన సమాజానికి కూడా శ్రమ విభజన కావాలి — అంటే దాని అర్థం, ఆ శ్రమ విభజన, పెట్టుబడిదారీ పద్ధతిలోనే ఉండాలని కాదు. నూతన సమాజం, పెట్టుబడిదారీ విధానం నించి ఏ అంశాన్నీ యథాతథంగా తీసుకోకూడదు. శ్రమ విభజనని కూడా పెట్టుబడిదారీ పద్ధతిలోనే తీసుకోకూడదు. శ్రమ విభజన వల్ల శ్రమ చేసే మనుషులకు హాని లేకుండా ఉండాలంటే, మాన్యుఫాక్చర్ దశకన్నా వెనకటి కాలం నాటి శ్రమ విభజననే తిరిగి అనుసరించాలని దీని అర్థం కాదు. ఆ పాత సమాజాల శ్రమ విభజన, శ్రామికుల్ని విడి విడి ఉత్పత్తిదారులుగా మాత్రమే ఉంచుతుంది. ఆ శ్రమ విభజనలో, ఉత్పత్తి క్రమానికి ఇంకా సమిష్టి స్వభావం ఏర్పడదు. కాబట్టి, ఆ శ్రమ విభజనకు తిరిగి వెళ్ళడం అంటే, చరిత్ర సాధించిన అభివృద్ధిని వదులుకోవడమే అవుతుంది. పెట్టుబడిదారీ విధానం ఇచ్చిన ఏ అభివృద్ధినీ నూతన సమాజం వదులుకోనక్కరలేదు. అందులో ఉన్న హానికర లక్షణాల్ని మాత్రమే తీసివెయ్యాలి. పెట్టుబడిదారీ విధానం స్పెషలైజేషన్‌ని ఇచ్చింది. దీన్ని నిలబెట్టుకోవాలి. కానీ, ఈ విధానం, శారీరక శ్రమలూ మేధా శ్రమలూ విడిపోయే విధంగానూ, ఒక మనిషి ఎప్పుడూ ఒకే శ్రమకు కట్టుబడి ఉండే విధంగానూ చేసింది. ఈ లక్షణాల్ని తీసి వెయ్యాలి.

## నూతన శ్రమ విభజనకు మార్గం:

ఒక మనిషి ఎప్పుడూ మేధాశ్రమా, ఇంకో మనిషి ఎప్పుడూ శారీరక శ్రమా చేస్తూ ఉండడంగాక, ఆ ఇద్దరూ ఆ పనుల్ని కొంత కాలానికి ఒకసారి మార్చుకుంటూ ఉంటే ఏమవుతుంది? అలాగే, ఒక మనిషి కొన్ని వేరు వేరు రకాల పనులు చేస్తే ఏమవుతుంది? ఏ పని చేసే సమయంలో ఆ పని స్పెషలైజ్డ్ పనిగానే ఉంటుంది. అలాంటి స్పెషలైజ్డ్ పనుల్ని మార్చి మార్చి చెయ్యడంవల్ల, ఒక మనిషి ఒకే పనికి కట్టుబడి ఉండడం అనే లక్షణాన్ని తీసివేసినట్టవుతుంది. ఒక మనిషి కొన్ని వేరు వేరు రకాల పనులు చేస్తూ కూడా కొన్ని పనుల్లో నైపుణ్యాలు సాధించవచ్చు. ప్రతి మనిషీ కొన్ని సాధారణమైన పనులూ, కొన్ని నైపుణ్యం గల పనులూ చేసే వ్యక్తిగా ఉండవచ్చు.

తయారు చెయ్యవలసిన ఉత్పత్తులకు సంబంధించిన సమస్తమైన అంశాల్నీ, ఆ ఉత్పత్తి క్రమంలో పాల్గొనే వాళ్ళంతా కలిసి చర్చించి నిర్ణయించవచ్చు. ఎటువంటి రకాల ముడిపదార్థాల్ని వాడాలీ, పని పద్ధతులు ఎలా ఉండాలీ, శ్రమ పరికరాలు ఎలా ఉండాలీ, పంపిణీ విధానాలు ఎలా ఉండాలీ—వగైరా సమస్త విషయాల గురించీ, ఆ ఉత్పత్తి క్రమంలో పాల్గొనే వాళ్ళందరూ కలిసి చర్చించి నిర్ణయించినప్పుడు ఆ ఉత్పత్తి క్రమానికి కావలసిన శారీరక శ్రమా, మేధాశ్రమా కలిసి ఒక సమన్వయంతో పని చేసినట్టు అవుతుంది. అంతేగాక, శారీరక శ్రమలు చేసే వారు మేధాశ్రమలలోకీ, మేధాశ్రమలు చేసే వారు శారీరక శ్రమలలోకీ మారడం వల్ల, ఈ క్రమం సంపూర్ణం అవుతుంది. ఈ పద్ధతులన్నిటి వల్లా పెట్టుబడిదారీ శ్రమ విభజన సృష్టించిన సమస్యలన్నిటినీ పరిష్కరించే మార్గం ఏర్పడుతుంది. ఆ క్రమంలో, మానవుల సంపూర్ణ వికాసానికి అనుగుణమైన 'నూతన శ్రమ విభజన' రూపొందుతుంది. అంటే నూతన సమాజం, పెట్టుబడిదారీ శ్రమ విభజననే యథాతథంగా అనుసరించడం గాక, దాన్ని 'నూతన శ్రమ విభజన'గా మార్చా లన్నమాట. అలా మార్చకపోతే, శ్రమ చేసే మనుషులు ఎక్కువ తక్కువ స్థాయిలలో ఉండిపోయి, వారి ఆదాయాలలో తేడాలూ, వారి మానసిక శారీరక సౌఖ్యాలకు హాని కలిగించే పరిస్తితులూ ఎప్పటిలాగే ఉండిపోతాయి. దాని వల్ల సమాజంలో వైరుధ్యాలు లేని నూతన ఉత్పత్తి సంబంధాల్ని నిర్మించడం ఎప్పటికీ సాధ్యం కాదు. (ఈ విషయం గురించి 'శ్రమశక్తి విలువ' చాప్టర్‌లో చాలా వివరంగా చూశాం.)

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల దృష్టిలో నూతన సమాజం అనేదేదీ ఉండదు కాబట్టి, వాళ్ళకి 'నూతన శ్రమ విభజన' కూడా ఉండదు. వాళ్ళు నివసించే సమాజంలో వాళ్ళకు కనపడే శ్రమ విభజనే వాళ్ళకు సరైన శ్రమ విభజన. ఆ కనపడే శ్రమ విభజన పెట్టుబడిదార్లకు లాభాలు వృద్ధి చేసే శ్రమ విభజనేగానీ, శ్రామికుల క్షేమానికి అనుగుణమైనది కాదనే విషయాన్ని వాళ్ళు గమనించరు. ఈ ఆర్థికవేత్తల దృష్టిలో సమాజం అంటే — పెట్టుబడిదారీ సమాజమే. ఉత్పత్తి విధానం అంటే — పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే. సహకారం అంటే — పెట్టుబడిదారీ సహకారమే. శ్రమ విభజన అంటే — పెట్టుబడిదారీ శ్రమ విభజనే. — ఈ రకంగా, ప్రతీ అంశమూ వాళ్ళకు లాభదాయకమైనదే, వాళ్ళకు సరైనదీ, తిరుగులేనిదీ!

కానీ పైకి 'సరైనదిగా' కనపడుతోన్న విషయంలో ఒక చెడుగు అనేది ఉన్నప్పుడు, దాని ఫలితాలు బైట పడు

తూనే ఉంటాయి. సమాజం ఆ చెడుగుని కూడా ఎంతో కొంత స్థాయిలో గ్రహిస్తుంది. ఒక చెడుగుని పూర్తిగా చూడకుండా తప్పించుకోవడం దోపిడీ వర్గానికి కూడా సాధ్యం కాదు.

## పెట్టుబడిదారీ శ్రమ విభజన పట్ల కొందరు ఆర్థిక వేత్తలు:

పెట్టుబడిదారీ శ్రమ విభజనలో ఉన్న చెడుగుల్నీ, దుర్మార్గాన్నీ ఎంతో కొంత స్థాయిలో గమనించిన ఆర్థిక వేత్తలు కూడా కొందరున్నారు. 'ఈ శ్రమ విభజన పెట్టుబడిదారుడి లాభాల్ని వృద్ధిచేసే స్వభావం కలదే' అనే అసలు విషయాన్ని వాళ్ళు గ్రహించలేకపోయినా, దాని చెడు ఫలితాల్ని మాత్రం గ్రహించగలిగారు.

**'యాడమ్ ఫెర్గూసన్'** అనే ఆర్థిక వేత్త (1767) మాన్యు ఫాక్చర్ సృష్టించిన శ్రమ విభజనలో నష్టాల్ని చాలా వరకూ చెప్పాడు. "ప్రతీదీ విడిపోయే ఈ యుగంలో 'ఆలోచించడం' కూడా ఒక ప్రత్యేక వృత్తిగా అయిపోవచ్చును" అన్నాడు.

18 వ శతాబ్దపు **'బెకారియా'** అనే ఆర్థికవేత్త — ఈ శ్రమ విభజనని, 'తలనీ — ఇతర అవయవాల్నీ విడదీసే' శ్రమ విభజనగా భావించాడు. "ఉత్పత్తిదారుడు, తన చేతుల్నీ తలనీ కూడా ఒకే పనిలో ఉపయోగిస్తూ వస్తువుల్ని నైపుణ్యంగానూ, ఎక్కువ పరిమాణంలోనూ కూడా చెయ్యవచ్చును" అన్నాడు. ఎక్కువ ఉత్పత్తి జరగా లంటే, మేధా శ్రమా, శారీరక శ్రమా, విడిపోనక్కరలేదు — అని ఆయన అర్థం.

**'ఉర్ కుహర్ట్'** అనే ఆయన — "ఒక మనిషి మరణ శిక్షకు అర్హుడైతే, అతన్ని ఒక స్వల్పమైన పనిలో పెడితే చాలు. అది అతనికి మరణ శిక్ష విధించడమే. ఆ శిక్షకు అర్హుడు కాని మనిషిని అలాంటి పనిలో పెట్టడం అతన్ని హత్య చెయ్యడమే. 'శ్రమలో ఉప విభజన' జనాల హత్యే" అన్నాడు.

**స్మిత్తు**, ఈ శ్రమ విభజన గురించి కొన్ని మంచి మాటలు చెప్పాడు — "మానవుల్లో తెలివితేటలు చాలా వరకూ వారు చేసే పనుల్ని బట్టే ఏర్పడతాయి. జీవిత మంతా కొన్ని స్వల్పమైన చర్యలు మాత్రమే చేసే వ్యక్తికి, తన తెలివిని ఉపయోగించడానికి ఎటువంటి అవకాశమూ ఉండదు. అలాంటి వ్యక్తి, మనిషి అనేవాడు ఎంత మూర్ఖుడిగానూ ఎంత తెలివిమాలిన వాడిగానూ తయారవ గలడో అలా అయిపోతాడు. ఒకే రకంగా స్తంభించి ఉండే అతని జీవితం, అతని మేధస్సుకి ఉన్న ధైర్యాన్నీ, శారీరక ఉత్సాహాన్నీ తప్పనిసరిగా నాశనం చేస్తుంది. తన పనిలో తప్ప, ఇతర పనులకు పనికిరాని అసమర్థుడిగా అతన్ని చేసి వేస్తుంది. మనిషి ఒకే పనిలో నైపుణ్యం సంపాదించ డానికి, తన సమస్త శక్తుల్నీ, సద్గుణాల్నీ ఆహుతి చెయ్య వలసి వస్తుంది. కానీ, ప్రతీ మెరుగైన (ఇంప్రూవ్డ్), నాగరీక మైన (సివిలైజ్డ్) సమాజంలోనూ, శ్రమచేసే పేదలు (లేబ రింగ్ పూర్), అంటే జనాలలో అత్యధికులు, ఏ పరిస్థితిలో అయితే ఉండితీరాలో ఆ పరిస్థితి ఇది" — ఈ మాటలే గాక, స్మిత్తు, ఈ శ్రమ విభజన గురించి "సామాజిక అస మానతలకు ఇది మూలం" అని కూడా అంటాడు.

శ్రామికుల పట్ల ఎంత అనాసక్తంగా ఉన్న ఆర్థికవేత్త అయినా గమనించక తప్పని అసహజత్వాలు పెట్టుబడి దారీ శ్రమ విభజనలో ఉన్నాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు కూడా దానిమీద ఎంత అస్పష్టంగానైనా ఏదో ఒక అభిప్రాయం ప్రకటించకుండా ఉండలేక పోయారు. — "స్పెషలైజేషన్ కోసం జరిగే ఈ శ్రమ విభజన చాలా చెడ్డదే. కానీ, అది తప్పదు మరి! పాపం శ్రామికులు ఆ పరిస్థితుల్లోనే ఉండాలి మరి!" అంటారు వాళ్ళు. అంత కన్నా ఏం చెప్పాలో వాళ్ళకు తెలీదు. వాళ్ళ దృష్టిలో పెట్టు బడిదారీ విధానమే ఎప్పుడూ ఉండవలసిన విధానం కాబట్టి, దానికి కావలసిన శ్రమ విభజనే ఎప్పుడూ ఉండ వలసిన శ్రమ విభజన! 'ఈ శ్రమ విభజనని మార్చెయ్య వచ్చును' అనే సంగతి తెలియాలంటే, ముందు శ్రామికుడి నించి పెట్టు బడిదారుడు లాగే 'అదనపు విలువ సంగతి' తెలియాలి, అది తెలుసుకోలేని ఆర్థికవేత్త, ఈ శ్రమ విభజనలో తనకు కనపడే చెడుగుల గురించి కొంచెం విసుక్కుని, చివరికి — 'తప్పదు మరి! సమాజానికి శ్రమ విభజన ఉండాలి కదా? శ్రమ విభజన లేకుండా సమాజం నడవదు కదా? శ్రమచేసే పేదలంతా (స్మిత్తు మాటల్లో 'లేబరింగ్ పూర్') ఈ పరిస్థితుల్లోనే ఉండాలి మరి' అని తేలుస్తారు. చివరికి వీరు, పెట్టుబడిదారులకే అనుకూల మైన ముగింపుకే వస్తారు. అంతకు ముందు ఆ 'చెడుగుల' మీద వేసిన కేకలన్నీ గాలికి కొట్టుకు పోతాయి.

పెట్టుబడిదారీ శ్రమ విభజనలో పైకి కనపడే చెడుగు లనే గాక, దాని అసలు స్వభావాన్ని గ్రహించిన ఆర్థికవేత్త మార్క్స్. 'ఈ శ్రమ విభజన పెట్టుబడిదారీ స్వభావం కలది. ఇది పెట్టుబడిదారీ విధానానికి మాత్రమే ప్రత్యేకమైనది.

కార్మికవర్గం దీన్ని నూతన శ్రమ విభజనగా మార్చుకోవాలి' అని మార్క్సు గ్రహించాడు. 'అదనపు విలువ'ని కని పెట్టడం వల్లనే, ప్రతీ అంశాన్నీ శ్రామిక దృష్టితో అర్థం చేసుకోవడం మార్క్సుకి సాధ్యమైంది.

మాన్యుఫాక్చర్ శ్రమ విభజనలో, శ్రామికులకు హాని కలిగించే లక్షణాలు ఎన్ని ఉన్నా, ఈ శ్రమ విభజన, ఈ దశలో, శ్రామికుల ప్రత్యేకతల్ని ఇంకా పూర్తిగా నాశనం చెయ్యలేకపోయింది. ఎందుకంటే, అప్పటికీ పని అంతా ఇంకా చేతి పనిముట్ల ద్వారా జరిగేదిగానే ఉంది. ఇంకా పని అనేది శ్రామికుల శారీరక శక్తి సామర్థ్యాల ద్వారానూ, వ్యక్తిగత నైపుణ్యాల ద్వారానూ జరిగేదిగానే ఉంది. నైపుణ్యం గల ప్రతీ వృత్తికీ వృత్తి రహస్యాలు ఉండేవి. ప్రాచీన సమాజంలో వృత్తుల్ని వారసత్వంగా ఆచరించినట్టే, ఈ వృత్తి నైపుణ్యాలు కూడా కుటుంబంలో ఒక తరం నించి ఒక తరానికి వారసత్వంగా సంక్రమించేవి.

కుట్టుపనిగానీ, నేతపనిగానీ, వడ్రంగంగానీ, కమ్మరం గానీ — చేతి పనిముట్లతో ఏ పని చెయ్యాలన్నా, అందులోనూ నైపుణ్యంగా చెయ్యాలంటే, దానికి అనేక సంవత్సరాల శిక్షణ అవసరం. ఒక వృత్తిని వదిలేసి వెంటనే ఇంకో వృత్తిని ప్రారంభించడం మాన్యుఫాక్చర్ దశలో అసాధ్యమైన విషయం. అందుకే, ఒక మనిషి ఒకే వృత్తి చెయ్యడం అనే శ్రమ విభజన, మాన్యుఫాక్చర్ దశలో, మార్పులు లేని, ఖచ్చితమైన ప్రత్యేక సాంప్రదాయక రూపంలో (క్లాసికల్ రూపంలో) సాగింది.

**శ్రమ విభజన గురించి మార్క్సు మాటల్లో:**

"సమాజంలో సహజంగా ఏర్పడిన భిన్న వృత్తుల్ని వర్క్ షాపులో ఒక క్రమ పద్ధతిలో ఉన్నత స్థాయికి చేర్చడం ద్వారానూ, వాటిని పునరుత్పత్తి చెయ్యడం ద్వారానూ, మాన్యుఫాక్చరు, స్పెషలైజ్డ్ శ్రామికుడికి నైపుణ్యాన్ని ఇస్తుంది. అతి చిన్న ముక్కగా ఉన్న ఒక పని, ఒక మనిషికి జీవితాంతపు వృత్తిగా మారడం అనేది, గత సమాజాలలో ఉండే ఒక ధోరణిని పోలి ఉంది. వృత్తుల్ని వారసత్వంగా చేసిన ధోరణి అది. వృత్తుల్ని కులాలుగా (కాస్ట్లుగా) గడ్డ కట్టించడంగానీ; లేదా చారిత్రక పరిస్థితులు, వ్యక్తిలో కులాల స్వభావానికి పొంతనలేని విధంగా మారే ధోరణిని తెచ్చినప్పుడేమో వృత్తుల్ని గిల్డులుగా స్థిరీకరించడం గానీ, చేసిన ధోరణి అది. మొక్కల్నీ, జంతువుల్నీ, జాతులు గానూ ఉపజాతులు గానూ వేరు పడడాన్ని నిర్దేశించే ప్రకృతి సూత్రపు చర్యవంటి చర్యలవల్లనే, కులాలూ, గిల్డులూ తలెత్తుతాయి. కానీ, వాటి అభివృద్ధి ఒక స్థాయికి చేరాక, కులాల వారసత్వమూ, గిల్డుల ప్రత్యేకతా సామాజిక నియమంగా స్థిరపడిపోతాయి".

(కాపిటల్-1, పేజీ 321, మాస్కో ఎడిషన్, 1974)

(ఇక్కడ ప్రత్యేకంగా మన ఆసక్తి 'కులాల' విషయం మీద. పాత సమాజాలకు అవసరమైన పద్ధతిలో జరిగిన శ్రమ విభజన వల్ల 'వృత్తులు' ఏర్పడితే, అవి క్రమంగా 'కులాలు'గా గడ్డకట్టాయి. ఆ కులాలు సామాజిక నియమంగా అయిపోయాయి. ఈనాడు 'వృత్తులతో' సంబంధం లేకుండానే కులాలు సాంఘిక విషయంగా మిగిలి ఉన్నట్టు కనపడినా, అది పూర్తిగా, వృత్తులతోటీ, శ్రమ దోపిడీ తోటీ చాలా గట్టి సంబంధంతో ఉన్నాయి. కాబట్టి కులాల్ని నిర్మూలించే మార్గం దోపిడీ నిర్మూలనా, దోపిడీ సమాజపు శ్రమ విభజన నిర్మూలనా మాత్రమే.)

మాన్యుఫాక్చర్‌లో, 'పని' అనేది, శ్రామికుడి వ్యక్తిగత శక్తి సామర్థ్యాల మీదా, నైపుణ్యాల మీదా ఆధారపడి ఉండే పరిస్థితి, ఇంకా చెక్కు చెదరకుండానే ఉండడం వల్ల (ఈ పరిస్థితి, తర్వాత కాలంలో ఇంకో రకంగా మారుతుంది), శ్రామికుడు పెట్టుబడికి లోబడడం అనేది, ఇంకా సంపూర్ణంగా జరగలేదు. శ్రమశక్తి మీద పెట్టుబడి సంపూర్ణాధిపత్యానికి, ఈ పరిస్థితి ఇంకా అడ్డంకే. కార్మికులకు 'క్రమ శిక్షణ అలవడలేద'నే ఫిర్యాదులు, మాన్యుఫాక్చర్ కాలమంతా వినబడుతూనే ఉన్నాయి. క్రమశిక్షణ అలవడక పోవడం అంటే పెట్టుబడిదారుడి అర్థం, శ్రమశక్తి అన్ని రకాలా పెట్టుబడికి దాసోహం చెయ్యకపోవడమే.

## మాన్యుఫాక్చర్ దశ ఇచ్చిన మంచి అంశాలు:

మాన్యుఫాక్చర్ ఉత్పత్తి విధానం, 'ఉత్పత్తి క్రమం'లో కొన్ని మంచి అంశాల్ని రూపొందించింది. అవన్నీ ఆనాటికీ ఈనాటికీ దోపిడీకే ఉపయోగపడుతూ ఉన్నా, వాటిని దోపిడీ నించి వేరు చేసుకోగలిగినప్పుడు వాటి ప్రయోజనాల్ని సమాజం అంతా పొందుతుంది. — 'ఉత్పత్తి క్రమం'లో, ఏ దశలో ఎంత మంది కార్మికులు ఉండాలీ, వేరు వేరు దశల్లో పాల్గొనే కార్మికుల సంఖ్యల మధ్య సమన్వయం (ప్రొపోర్షనాలిటీ) ఎలా ఉండాలీ — వంటి విషయాలు మాన్యుఫాక్చర్ కాలం లోనే అభివృద్ధి చెందాయి. ఉత్పాదక శక్తుల్లో మార్పులు జరిగినప్పుడల్లా,

ఈ ప్రొపోర్షనాలిటీ కొలతలు మారుతూ ఉన్నా, ఉత్పత్తి క్రమంలో ఈ సాంకేతిక జ్ఞానాన్ని ప్రారంభించింది మాన్యుఫాక్చర్ దశే.

రెడీమేడ్ బట్టల పరిశ్రమలో కత్తిరింపులూ, కుట్టూ వేరు వేరు సెక్షన్లలో జరుగుతాయనుకుందాం. 1 చొక్కా బట్టని కత్తిరించడానికి అర్ధ గంటా, దాన్ని కుట్టడానికి గంటా పడుతుందనుకుందాం. కత్తిరింపుల దగ్గిర ఒక మనిషి ఉంటే, కుట్టే చోట ఇద్దరు మనుషులు ఉండాలి. అప్పుడు ముగ్గురూ ఫుల్‌వర్క్‌లో ఉంటారు. ఇది ఈ 'ఉత్పత్తి క్రమానికి' సంబంధించిన సాంకేతిక పరిస్థితి. పెట్టుబడిదారుడు, ఈ లెక్కతోనే శ్రామికుల్ని పెట్టాలి. వాడు తన ఉత్పత్తి స్థాయిని ఇంకా పెంచదల్చుకుంటే మళ్ళీ ఇంకో ముగ్గుర్ని పెట్టాలిగానీ, ఒకరినో ఇద్దరినో పెట్టడానికి వీలు లేదు. — ఈ రకంగా 'ఉత్పత్తి క్రమం' సమిష్టి పద్ధతిలో సాగడం వల్ల, ఈ 'ప్రొపోర్షనాలిటీ' అనే లక్షణం ఏర్పడుతుంది. అంతేగాక, ప్రతీ రోజూ తప్పని సరిగా పని జరగడం (రెగ్యులారిటీ), ప్రతి రోజూ కొన్ని గంటల పాటు వరసగా పని జరగడం (కంటిన్యుటీ) — వగైరా లక్షణాలన్నీ కూడా మాన్యుఫాక్చర్ దశలోనే ఏర్పడ్డాయి.

'సరుకు విలువ'కీ, దాని 'శ్రమ కాలాని'కీ సంబంధం ఉందనే విషయం మాన్యుఫాక్చర్ దశలోనే స్పష్టంగా వ్యక్తమైంది. అంటే, 'విలువ అంటే శ్రమ కాలమే' అనీ, శ్రమ కాలాన్ని తగ్గించినప్పుడే విలువని తగ్గించగలమనీ, శ్రమ కాలానికీ విలువకీ తప్పనిసరి సంబంధం ఉందనీ, పెట్టుబడిదారులుగానీ, ఆర్థిక వేత్తలుగానీ గ్రహించడం (ఇంకా అది చాలా పొరపాట్లతోనే అయినా) ఈ కాలంలోనే జరిగింది. 'ఆర్థిక శాస్త్రం' అనేది ఒక స్వతంత్ర శాస్త్రంగా (ఇతర శాస్త్రాలతో కలిసిపోయి ఉండకుండా) విడిపోవడం మాన్యుఫాక్చర్ కాలంలోనే జరిగింది.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం ప్రారంభమవడం కూడా మాన్యుఫాక్చర్ దశలోనే జరిగింది. పరిశ్రమలలో పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన తర్వాతే వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైంది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం అంటే, పెట్టుబడిదారుడు తన హస్తాన్ని వ్యవసాయ రంగం మీదకి కూడా సాచడమే. భూస్వామి 'తన' భూముల్ని, తర తరాలుగా సాగుచేసుకుంటూ జీవిస్తోన్న కౌలు రైతులనించి లాక్కుని, పెట్టుబడిదారుడికి కౌలుకిస్తాడు. పెట్టుబడిదారుడే భూస్వామికి కౌలు చెల్లిస్తాడు. పాత కౌలు రైతులు ఆ భూమిలో శ్రామికులుగా మారతారు. అంతవరకూ 'ఫ్యూడల్ సంబంధాల'తో సాగుతూ ఉన్న వ్యవసాయంలో, (స్వయంగా శ్రమించే రైతు కుటుంబమే భూమిని సాగుచేస్తూ, భూస్వామికి కౌలు చెల్లిస్తూ ఉండడమే ఫ్యూడల్ సంబంధం), మాన్యుఫాక్చర్ దశలో, పెట్టుబడిదారీ సంబంధాలు ప్రారంభమవుతాయి. స్వయంగా శ్రమచేసే ఉత్పత్తిదారుడు (పాత రైతు) ఉత్పత్తి సాధనాన్ని (భూమిని) పోగొట్టుకుని, దానికి పరాయి వాడిగా, 'శ్రమశక్తిని అమ్ముకునే' వాడిగా ఉండే సంబంధమే పెట్టుబడిదారీ సంబంధం. పెట్టుబడిదారులు భూముల్ని ఆక్రమించడం కోసం, ఫ్యూడల్ రైతుల్ని భూములనించి తరిమి వేశారు. ఇర్లండులో, పెట్టుబడిదారులు, 'ఉన్ని'ని ఉత్పత్తి చేయించి అమ్మడం కోసం, వేల వేల ఎకరాల భూమిని ఆక్రమించి (భూస్వాముల ఆమోదంతోనే) వ్యవసాయ భూములన్నిటినీ గొర్రెల మందల్ని పెంచే భూములుగా మార్చివేశారు. గ్రామాల నించి పట్టణాలకు వలసలు వచ్చిన గ్రామీణ జనాన్ని పనులలోకి తీసుకుని పట్టణాలలో మాన్యుఫాక్చరర్లు కొత్త కొత్త ఉత్పత్తి శాఖలు తెరిచారు.

'ఎక్కువ అదనపు విలువ'కోసం పెట్టుబడితీసే పరుగులు, మాన్యుఫాక్చర్ కాలంలో ఉత్సాహంగా సాగాయి.

మాన్యుఫాక్చర్ దశని కూడా కలుపుకుంటే <u>'చేతి వృత్తుల' కాలం, సమాజానికి, అచ్చు యంత్రాన్నీ, తుపాకీ మందునీ, ఆటోమేటిక్ గడియారాన్నీ, కంపాస్‌నీ — వగైరాల్ని ఇచ్చింది.</u> కొన్ని కొన్ని పనులకు చిన్న చిన్న యంత్రాలు కూడా ఈ కాలంలో ప్రారంభమయ్యాయి. ఈ కాలపు యంత్రాలకు ఇంజన్లు లేవు. మనుషులే చేతులతో తిప్పడం గానీ, కాళ్ళతో తొక్కడం గానీ చేసేవారు. జంతువుల సహాయంతో కూడా యంత్రాల్ని నడిపేవారు. ఈ యంత్రాలు, ఒక్కొక్క విడి విడి పని మాత్రమే చేస్తూ ఉండేవి. కాయితం తయారీలో ముడి పదార్థాల గుజ్జుని దంచే పని పేపర్ మిల్లులు చేసేవి. లోహాలకు సంబంధిం చిన పనిలో ముడి ఖనిజాన్ని దంచే పని స్టాంపింగ్ మిల్లులు చేసేవి. నీటి చక్రం కూడా ఒక రకపు యంత్రానికి ప్రాథమిక రూపం. పిండి మిల్లు కూడా ఈ కాలానిదే.

ఉత్పత్తి క్రమంలోకి భారీ యంత్రాలు ప్రవేశించడం ద్వారా, మాన్యుఫాక్చర్‌కి ఉన్న సాంకేతిక పునాది విప్లవకరమైన మార్పులకు దారితీసింది.

# ప్రశ్నలూ - జవాబులూ

**1. మాన్యుఫాక్చర్ దశలో శ్రమ విభజనలో జరిగిన మార్పు ఏమిటి?**

**జ:** ఒక వస్తువుని తయారుచెయ్యడానికి 2 రకాల పనులు అవసరమైతే, ఆ 2 రకాల్నీ ఒకే వ్యక్తి చెయ్యడం మాన్యుఫాక్చర్ కన్నా వెనకటి కాలంలో ఉండేది. మాన్యుఫాక్చర్ కాలంలో, ఆ 2 రకాల పనుల్ని వేరు వేరు వ్యక్తులు చేసేలాగా మార్పు జరిగింది. ఒక కార్మికుడు ఎప్పుడూ మొదటి రకం పనీ, ఇంకో కార్మికుడు ఎప్పుడూ రెండో రకం పనీ చేస్తారు. అంటే, ఇక్కడ స్పెషలైజేషన్ అనేది ప్రారంభమైంది.

**2. శ్రమ క్రమం సమిష్టిగా జరగడం ప్రారంభమైంది — అంటే?**

**జ:** వస్తువుకి సంబంధించిన వేరు వేరు దశల్ని వేరు వేరు కార్మికులు చేస్తూ వస్తువుని తయారుచేస్తారు. ఆ వస్తువు, ఒకే వ్యక్తి శ్రమతోగాక, వేరు వేరు వ్యక్తుల శ్రమల ద్వారా తయారవుతుంది. అదే శ్రమ క్రమం సమిష్టిగా జరగడం.

**3. 'పెట్టుబడిదారీ శ్రమ విభజన' అంటే?**

**జ:** ఒక మనిషి ఎప్పుడూ ఒకే పని చెయ్యడం. ఎప్పుడూ ఒకే మేధాశ్రమ, లేదా ఒకే శారీరక శ్రమ; ఎప్పుడూ ఒక నైపుణ్యం గల శ్రమ లేదా, నైపుణ్యం లేని శ్రమ. జీవిత మంతా ఏదో ఒక చిన్న శ్రమ మళ్ళీ మళ్ళీ చేస్తూవుండడం.

**4. దోపిడీ శ్రమ విభజన, సామాజిక అసమానతలకు మూలం. — ఏ విధంగా?**

**జ:** ఒక వర్గం, ఏ శ్రమా చెయ్యదు. ఇంకోవర్గం, 2 వర్గాల కోసమూ శ్రమ చేస్తుంది. ఇది — 'శ్రమ విభజన' అనే అంశంలోకే వస్తుంది. ఇది, సమాజంలో వున్న మొట్ట మొదటి అసమానత్వం. శ్రమ చేసే వర్గంలో కూడా ఎప్పుడూ శారీరక శ్రమ చేసే మనిషికి తక్కువ ఆదాయమూ, ఎప్పుడూ మేధాశ్రమ చేసే మనిషికి ఎక్కువ ఆదాయమూ ఉంటాయి. ఇది రెండో రకం అసమానత్వం. ఈ రకంగా, మనుషులు అసమానులుగా ఉండడానికి దోపిడీ శ్రమ విభజనే మూలం.

**5. ఎంత ఉన్నత మేధాశ్రమచేసే మనిషి అయినా, ఆ పని తప్ప రెండో పని చెయ్యలేని అసమర్థుడిగా ఉంటాడు. —ఈ విషయాన్ని కొన్ని ఉదాహరణలతో వివరించండి!**

**జ:** ఒక డాక్టరు, ఎంత నైపుణ్యంతో వైద్యం చేసేవాడైనా, ఇంట్లో నీటి పంపు పాడైతే దాన్ని బాగు చేసుకునే పని చెయ్యలేడు. ఒక ఇంజనీరు, ఎంత పెద్ద పెద్ద బిల్డింగులకు ప్లానులు తయారుచేసే వాడైనా అవసరమై నప్పుడు కూడా తన తిండి తను వండుకోలేడు. ఒక మనిషి తనకు అలవాటైన ఒకే ఒక్క పని తప్ప, రెండో పని ఏదీ చెయ్యలేడు.

**6. ఒక మనిషి ఎప్పుడూ ఒకే పనికి కట్టుబడి ఉండ డమూ, గానుగెద్దు జీవితమూ ఒకటే — అనవచ్చునా?**

**జ:** అనవచ్చును. గానుగెద్దు ఎప్పుడూ ఒకే గాడిలో తిరిగే పనే చేస్తుంది. అదే దాని పని. అలాగే, ఒక శ్రమచేసే మనిషి ఎప్పుడూ అదే పనికి అతుక్కుపోయి ఉంటాడు. ఎప్పుడూ కుట్టడం, నెయ్యడం, ఎప్పుడూ వండడం, ఎప్పుడూ ఏదో ఒకే పని! అలాంటి జీవితం గానుగెద్దు జీవితమే.

**7. స్పెషలైజేషన్ ఉండాలి. దాని చెడుగుల్ని తీసివె య్యాలి. ఈ రెంటినీ సాధించడానికి ఏమిటి మార్గం?**

**జ:** స్పెషలైజేషన్ ఉండడం అంటే, అది అతిచిన్న శ్రమకే పరిమితమై ఉండనక్కరలేదు. ఒక టీచరు ఎప్పుడూ లెక్కలే చెప్పడం కాదు. ఇంకా కొన్ని సబ్జెక్టులు కూడా చెప్పగలిగే సమర్థత సాధించడం అసాధ్యం కాదు. లేదా ఒకసారి టీచరుగానూ, ఇంకోసారి లారీ డ్రైవరు గానూ పనిచెయ్యడం అసాధ్యం కాదు, రెండు పనులూ నైపుణ్యం గానే చెయ్యవచ్చు. చేసేపని అతి స్పీడుగా తక్కువ సమ యంలోనే చేయాలనే పెట్టుబడిదారీ నిబంధన లేకపోతే, స్పెషలైజేషన్‌కి ఉండే మంచి లక్షణాన్ని నిలబెట్టుకొని హానికర లక్షణాన్ని వదిలివెయ్యవచ్చు.

**8. 'అంతస్తుల భేదం' అంటే? కుట్టు మనిషికీ, వైద్యుడికీ వున్న భేదం ఏమిటి?**

**జ:** అంతస్తుల భేదం అంటే, శ్రమ క్రమంలో వుండే సంబంధాల్లో వుండే భేదం. యజమానులు నిర్వ హించే శ్రమ క్రమాల్లో, శ్రామికులూ, వారిపై పర్యవేక్షణ చేసే ఉద్యోగులూ కూడా ఉంటారు. అధికారం చేసేవారు ఎక్కువ అంతస్తు గల వారిగానూ, అధికారానికి లోబడే స్థానంలో ఉన్నవారు తక్కువ అంతస్తు గల వారిగానూ ఉంటారు. — కుట్టు మనిషీ వైద్యుడూ ఒకే పనిస్థలంలో ఉండరు. వారి సంబంధం, ఒకే శ్రమ క్రమానికి సంబం ధించి ఉండదు. కుట్టు శ్రమకి తక్కువ ఆదాయం ఉంటే, వైద్యం శ్రమకి ఎక్కువ ఆదాయం ఉంటుంది. ఆ రకంగా, వారి ఆర్థిక పరిస్థితులు ఎక్కువ తక్కు వలుగా ఉంటాయి. ఆ ఇద్దరి మధ్యా ఉండే భేదం, సమాజంలో ఉండే అంతస్తుల భేదంగా ఉంటుంది. ★

# 3. యంత్రాలూ, భారీ పరిశ్రమా

ప్రకృతి శాస్త్ర విజ్ఞానం పట్ల మనిషికి ఉన్న నిజమైన కాంక్షా, 'రెలెటివ్ అదనపు విలువ కోసం' పెట్టుబడికి ఉండే దురాశా కలిసి, క్రమ క్రమంగా 'భారీ యంత్ర నిర్మాణానికి' దారి తీశాయి.

చేతి పనుల కాలంలో, మనిషి ఎలాంటి చేతి పని ముట్లతో పనిచేశాడో, ఆ పనిముట్లే 'యంత్రం'లో కూడా అమరి ఉంటాయి. కుట్టు పనిని చేతితో చేసినప్పుడు, ఆ పని 'సూది'తో చేస్తారు. కుట్టుయంత్రంలో కూడా ఆ సూదే ప్రధాన పరికరంగా ఉంటుంది. దానితోనే కుట్టు పని జరుగుతుంది. కలపని కోసే పని చేతితో చేసినప్పుడు ఆ పని రంపంతో చేస్తారు. కలపకోత యంత్రంలో కూడా ఆ రంపమే ప్రధాన పరికరంగా ఉంటుంది. కాయితాల్ని కోసే కటింగ్ మిషన్‌లో కత్తి ఉంటుంది. దాదాపు అన్ని యంత్రాల సంగతీ ఇంతే. ఒక చేతి పనికి సంబంధించిన పనిముట్టే ఆ పనికి సంబంధించిన యంత్రంలో ప్రధాన మైన పనిముట్టుగా ఉంటుంది. చేతి పనిముట్టుని తనలో అమర్చుకుని సాంకేతికంగా అభివృద్ధి అయిన రూపమే — యంత్రం (మెషీన్).

యంత్రాన్ని మనిషి చేతితో తిప్పడమో, కాలితో తొక్క డమో చేస్తూ నడిపితే, యంత్రాన్ని నడపడానికి మనిషి తన కండర శక్తిని ఉపయోగిస్తున్నట్టు అర్థం. అప్పుడు ఆ యంత్రం 'చేతి మిషను' మాత్రమే. ఆ యంత్రం ఇంకా చేతి పనిముట్టుగా ఉన్నట్టే అర్థం. కాకపోతే కొంచెం పెద్ద పనిముట్టు. పనిచేసే మనిషి, తన చేతిలో పనిముట్టుని తన ఇష్ట ప్రకారం ఎప్పుడైనా కదపవచ్చు, ఎప్పుడైనా ఆపవచ్చు. పనిముట్టు కదలికలు, పనిచేసే మనిషి ఇష్టా యిష్టాల మీద ఆధారపడి ఉంటాయి. యంత్రాన్ని కూడా మనిషి తన చేతితోనో కాలితోనో నడపవలసి వున్నప్పుడు, సుత్తిలాగే, కత్తెరలాగే అంత పెద్ద యంత్రం కూడా పని చేసే మనిషి చేతి కదలికలకే లోబడి ఉంటుంది.

కానీ, యంత్రాన్ని మనిషి స్వయంగా నడపనక్కర లేకుండా, ఇంజన్ సహాయంతో నడపగలిగితే, ఆ యంత్రం 'ఆటోమాటిక్ యంత్రం' అవుతుంది. అలాంటి యంత్రాన్ని నడపడానికి ఇంజన్లు కావాలి. ఆ ఇంజన్లు, నీరూ - గాలీ - నీటి యావిరీ - కరెంటూ — వగైరాలతో నడుస్తాయి. ఒక యంత్రం, మానవ కండర శక్తితో అవ సరం లేకుండా ఇంజన్ ద్వారా నడిచేదిగా వుంటే, అది 'ఆటోమేటిక్ యంత్రం.'

యంత్రం దానికదే నడిచే మార్పు జరిగినప్పుడు, పనిచేసే మనిషికీ, అతని శ్రమ పరికరానికీ (యంత్రానికీ) మధ్య సంబంధం, ఇంకో రూపంలోకి మారుతుంది.

మనిషి, చేతి పనిముట్లతో పనిచేసేటప్పుడు, ఒకే సమయంలో మనిషి ఎన్ని పనిముట్లు వాడగలడనేది, మనిషి శరీర నిర్మాణాన్ని బట్టి ఉంటుంది. ఒకే సమ యంలో మనిషి ఒకటి, రెండు పనిముట్ల కన్నా ఎక్కువగా వాడలేడు. కానీ, ఆటోమాటిక్ యంత్రానికి ఆ నిబంధన వర్తించదు. అది ఎన్ని పనిముట్లయినా తనలో వేరు వేరు చోట్ల అమర్చుకోగలుగుతుంది. యంత్ర నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక విషయాల్ని మనిషి ఎక్కువగా గ్రహిస్తోన్న కొద్దీ, యంత్రాన్ని, అనేక పనిముట్లతో అనేక చర్యలు ఒకే సమయంలో చేసే విధంగా నిర్మించుకో వచ్చు. క్రమంగా, అనుభవాల్ని బట్టి యంత్రాన్ని ఇంకా మార్చుకోవచ్చు కూడా.

ఒక్క పని కన్నా ఎక్కువ పనులు ఒకే సమయంలో చేసే యంత్రం — 'భారీ యంత్రం.'

మాన్యుఫాక్చర్ కాలంలో కూడా కొన్ని రకాల యంత్రాలు ఉన్నా, వాటిని ఆటోమేటిక్‌గా నడిపే ఇంజన్లు ఆనాడు లేవు. అందువల్ల అవి, ఏదో ఒకే ఒక్క చర్య తప్ప ఎక్కువ చర్యలు ఏక కాలంలో చేసేవికావు. కాయితం కవర్లు తయారుచేసే పనిలో, ఒక మనిషి ఒక చేతి మిషన్ సహాయంతో కాయితాలు మడవడమూ, ఇంకో మనిషి ఇంకో చేతి మిషన్ సహాయంతో వాటికి జిగురు అంటించ డమూ, మూడో మనిషి వాటి మీద ముద్ర కొట్టడమూ చేసేవారు. కానీ, నాలుగైదు రకాల పనులు చేసే భారీ యంత్రాన్ని తీసుకుంటే, కాయితాల్ని కోసే పనీ, మడిచే పనీ, జిగురు అంటించే పనీ, ముద్ర కొట్టే పనీ, కవర్లని ఒక వరసలో పేర్చే పనీ, అన్నీ వరసగా అదే చేస్తుంది. ఇలాంటి యంత్రాల దగ్గిర కార్మికులు చేసే పనేమిటంటే — ఇంజన్‌ని చూసుకోవాలి. యంత్రానికి ముడి పదార్థాల్ని అందిస్తూ ఉండాలి. తయారయ్యే ఉత్పత్తిని బట్టి ప్రతీ దశ దగ్గిరా గానీ, అక్కడక్కడ గానీ, ఒక దశ నించి ఒక దశలోకి మారుతోన్న పదార్థాన్ని పరిశీలిస్తూ ఉండాలి. చెడిపోయిన వాటిని తీసివేసి, స్థానం తప్పిన వాటిని సరిగా సర్దుతూ ఉండాలి. ఏమరపాటు లేకుండా అవసరమైన మార్పులు చేస్తూ, చివరికి యంత్రం నించి బైటపడ్డ వస్తువుని తీసి తర్వాత దశకి సిద్ధం చెయ్యాలి.

భారీ యంత్రం అనేది, వేరు వేరు పనులు చేసే కొన్ని సింపుల్ యంత్రాల గొలుసు. ఆ సింపుల్ యంత్రాలన్ని

టికీ విడిపోని సంబంధాలు ఉంటాయి. భారీ యంత్రం లోకి జొరబడే ముడిపదార్థం, కొన్ని క్రమాల ద్వారా ప్రయాణిస్తూ, రూపాలు మారుతూ, చివరికి కొత్త వస్తువుగా తయారై బయటపడుతుంది.

ఆటోమేటిక్ యంత్రాలు సాధారణంగా, ఒక చర్య కన్నా ఎక్కువ చర్యలు చేసే భారీ యంత్రాలుగానే ఉంటాయి. ఆటోమేటిక్ యంత్రాల ద్వారా జరిగే ఉత్పత్తి విధానమే 'భారీ పరిశ్రమ'. 'యంత్ర పరిశ్రమ' అన్నా, 'భారీ పరిశ్రమ' అన్నా, 'ఫ్యాక్టరీ పరిశ్రమ' అన్నా, 'ఆధునిక పరిశ్రమ' అన్నా — ఇవన్నీ యంత్రాలతో ఉత్పత్తిచేసే విధానానికే వేరు వేరు పేర్లు.

'యంత్ర చరిత్ర' అంతా మొక్కజొన్న పిండి మిల్లు తోనే ప్రారంభమైంది. అందుకే, ఫ్యాక్టరీని ఇప్పటికీ 'మిల్లు' అంటారు.

ఇంగ్లండులో, 1735లో, జాన్‌వాట్, దారం వడికే యంత్రాన్ని కనిపెట్టి, 18వ శతాబ్దపు పారిశ్రామిక విప్లవానికి ప్రారంభకుడయ్యాడు.

ప్రారంభ దినాల్లో, యంత్రాలు — నీరూ, బొగ్గూ దొరికే ప్రాంతాలలోనే ఉండేవి.

యంత్రాల్ని నిర్మించడమూ, వాటితో పని చెయ్య డమూ — అనే విషయాలు, తెలిసీ తెలియని అస్పష్ట జ్ఞానం ద్వారా జరగడం సాధ్యం కాదు. మనిషి, యంత్రాల్ని ఉపయోగించగలుగుతున్నాడంటే, ప్రకృతి శాస్త్ర విష యాల్ని ఖచ్చితమైన అవగాహనతో (కాన్షియస్‌గా) గ్రహించ గలుగుతున్నాడని అర్థం.

యంత్రాలు, చేతి వృత్తుల పాత్రని పూర్తిగా తీసివేసి, సమిష్టి ఉత్పత్తి రూపాన్ని పూర్తిగా ఆచరణలోకి తెస్తాయి. ఏ విధంగానంటే: చేతి పనిముట్లతో పని జరిగేటప్పుడు, వస్తువుకి సంబంధించిన అన్ని దశల్నీ ఒకే వ్యక్తి చేస్తూ, ఎవరి పని వాళ్ళు విడి విడిగా చేసుకోవడం సాధ్యమవు తుంది. కానీ, యంత్రాన్ని శ్రమ పరికరంగా పెట్టుకున్న ప్పుడు, శ్రామికులు ఎవరి పని వాళ్ళు విడి విడిగా చేసు కోవడం సాధ్యం కాదు. అందరి పనులూ యంత్రంతో సంబంధం కలిగి, యంత్రం చుట్టూ అల్లుకుని ఉంటాయి. ఒక మనిషి ఇంజన్‌ని నడిపే చోట ఉంటే, ఒక మనిషి ముడిపదార్థాల్ని యంత్రానికి అందించే చోట ఉండాలి. ఇంకో మనిషి ఇంకోచోటా. ఇలా వేరు వేరు స్థానాలలో నిలబడి, శ్రామికులంతా పరస్పర సంబంధాలతో ఉంటూ పనులు చెయ్యాలి. శ్రామికులు 'సమిష్టి నిర్మాణంతో' పనిచేసే మార్పు మాన్యుఫాక్చర్ కాలంలోనే జరిగినా, యంత్ర విధానంలో అది మరింత ఖచ్చితమైన సాంకేతిక అవసరం అవుతుంది. అందుకే, యంత్రాలు, వ్యక్తిగత ఉత్పత్తి విధానంగా ఉండే చేతి వృత్తుల పాత్రని పూర్తిగా తీసివేసి సమిష్టి ఉత్పత్తి విధానాన్ని ఆచరణలోకి తెస్తాయి — అనవచ్చు.

ఇక్కడ, యంత్రానికి సంబంధించిన చాలా విష యాలు ఒక వరసలో చూడాలి. యంత్రాన్ని ఉత్పత్తి చెయ్యడానికి అవసరమయ్యే విలువ గురించీ, యంత్రం పెట్టుబడిదారుడికి ఆదా చెయ్యగల విలువ గురించీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో యంత్రం నిర్వహించే ప్రత్యేక పాత్ర గురించీ — ఇలా. 'యంత్ర ఉత్పత్తి విధానం' అనే మాట, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి మారుపేరు. యంత్ర విధానాన్ని స్పష్టంగా తెలుసుకోక పోతే, పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసుకోవడం అసాధ్యమవుతుంది.

## 'ఉత్పాదక శక్తుల చరిత్ర'లోకి, 'యంత్రం' ఎలా వచ్చింది?

పెట్టుబడిదారుడు మార్కెట్‌కిపోయి ఇంకో పెట్టుబడి దారుడి దగ్గిర యంత్రాన్ని కొని తెస్తాడు. 'యంత్రాలు మార్కెట్లో దొరుకుతాయి' అన్నంతవరకే పెట్టుబడిదారు డికి తెలుసు. అవి మార్కెట్‌లోకి ఎలా వచ్చాయో, మార్కెట్‌లో అవి గత కాలం నించి ఎందుకు లేవో వాడికి పట్టదు.

వందల, వేల తరాల శారీరక, మేధా శ్రమల ద్వారా వచ్చిన అనుభవాలవల్లనే ఒకనాటికి యంత్ర నిర్మాణం సాధ్యమైంది. కుట్టు యంత్ర చరిత్ర, కొన్ని వేల సంవత్స రాల కిందటే 'సూది'తో ప్రారంభమైంది. ఒకనాడు సూదే లేకపోతే, ఈ నాడు కుట్టు యంత్రం లేదు. 'సూది' పుట్ట డానికి ఎన్ని అనుభవాలు పని చేశాయో, వాటినికూడా కుట్టుయంత్ర చరిత్రకు కలపాలి. గత కాలపు అనుభవాలు గానీ, యంత్రాన్ని నిర్మించే విజ్ఞానం గానీ, యంత్రాల్ని నడిపే సామర్థ్యం గానీ, అన్నీ 'శ్రమ'కు సంబంధించిన విషయాలే. యంత్రం తయారైంది సుదీర్ఘమైన 'శ్రమ చరిత్ర' నించే. శ్రమతో సంబంధంలేని పెట్టుబడిదారుడి ఆస్తి హక్కునించి కాదు. ఏ పెట్టుబడిదారుడైనా, ఇంజనీరై ఉండి, ఒక యంత్రాన్ని కనిపెడితే, ఆ వ్యక్తి ఆ సంద ర్భంలో పెట్టుబడిదారుడిగా గాక, 'శ్రమ'ని ఇచ్చిన శ్రామి కుడిగానే అవుతాడు. ఆ యంత్రం, 'శ్రమ' ద్వారా పుట్టు కొచ్చిన వస్తువుగానే ఉంటుంది.

యంత్రం, అనేకమైన ప్రకృతి సూత్రాలను తనలో అమర్చుకొని తయారవుతుంది గనక, అది, శ్రమ ఉత్పాద కతను అసాధారణ స్థాయికి పెంచివేస్తుంది. అమితోత్పత్తి చెయ్యగల యంత్రం ఆవిర్భవించిందీ అంటే, మానవ సమాజం, జంతు స్థితిని వదిలిపెట్టి శ్రమ చెయ్యడం

ప్రారంభించినప్పటినించి తన తరతరాల అనుభవాలతో, అప్పటికి, తన శ్రమ పరికరాన్ని అంత అభివృద్ధి చేసుకో గలిగిందన్నమాట! అప్పటికి అంత అధికమైన ఉత్పాదక శక్తుల్ని పొందగలిగిం దన్నమాట! అది 'శ్రమ చరిత్ర' సాధించిన ఫలితమే.

కానీ ఈ ఫలితం, శ్రామికులకుగాక, పెట్టుబడిదార్లకు దక్కుతుంది. ఒక యంత్రంకన్నా పూర్వం ఉన్న శ్రమ పరికరాల ఉత్పాదక శక్తితో, యంత్ర ఉత్పాదక శక్తిని పోలిస్తే, ఈ శక్తి అనేక రెట్లు అధికంగా ఉండి, యంత్రం ద్వారా జరిగే ఉత్పత్తి అనేక రెట్లు పెరుగుతుంది. కానీ, ఈ కొత్త ఉత్పాదక శక్తి ద్వారా ఉత్పత్తి అయిన రాసిలో నించి శ్రామికులకు వచ్చేది ఎప్పటిలాగే 'జీతాలే'. మిగిలినదంతా పెట్టుబడిదారుడికి స్వాధీనమై, 'లాభం' (అదనపు విలువ) గతంకన్నా అనేక రెట్లు పెరుగుతుంది. లాభం ఎందుచేత పెరిగిందో పెట్టుబడిదారుడికి 'అసలు కారణం' తెలీదు. ఆ అసలు కారణం ఏమిటంటే: ఉత్పాదకశక్తి తక్కువగా ఉందా, ఎక్కువగా ఉందా - అనే దానితో సంబంధం లేకుండా, ఉత్పాదకశక్తి ఎంత పెరిగినా, దానిద్వారా ఎంత ఎక్కువ ఉత్పత్తి వచ్చినా, అందులోనించి శ్రామికులకు వెళ్ళేది 'శ్రమశక్తి విలువ' మాత్రమే. ఉత్పాదక శక్తి పెరిగినప్పుడల్లా లాభం పెరుగుతూ ఉంటుంది. కొత్త యంత్రాన్ని తెచ్చినప్పుడే లాభం పెరుగుతుంది కాబట్టి, దాన్ని చూసి పెట్టుబడిదారుడు, లాభం పెరగడానికి తన కొత్త యంత్రమే కారణం అనుకుంటాడు. ఈ రకంగా, పనిస్థలంలోకి ఎప్పుడే కొత్త శ్రమ పరికరం వస్తే, అదే లాభం పెరగడానికి కారణంగా కనపడుతుంది. 'లాభం రావడానికి శ్రమ పరికరాలే కారణం' అనే అభిప్రాయం, 'యంత్రం' ద్వారా మరింత గట్టిపడిపోతుంది.

కానీ, ఎంత భారీ యంత్రమైనా 'నిర్జీవ వస్తువే'. కార్మికుల చేతిలో సుత్తీ కత్తెరా ఎలాంటి పనిముట్లో భారీ యంత్రం కూడా అలాంటి పనిముట్టే. కాకపోతే ఇది భారీ పనిముట్టు. సుత్తినీ కత్తెరనీ చూసి, 'పెట్టుబడిదారుడి లాభానికి ఈ సుత్తే కారణం' అనో, 'ఈ కత్తెరే కారణం' అనో అనడం ఎలాంటిదో, 'పెట్టుబడిదారుడి లాభానికి ఈ యంత్రమే కారణం' అనడం కూడా అలాంటిదే.

ఉత్పత్తిని (ఉపయోగపు విలువని) తయారుచెయ్యడానికైతే శ్రామికులతోపాటు 'శ్రమ పరికరాలు' కూడా కారణమే. కానీ, ఆ 'ఉత్పత్తి విలువని' సృష్టించడానికి ఏ శ్రమ పరికరమూ కారణం కాదు. ఈ విషయం ఇంతకు ముందే చాలా వివరంగా చూశాం. శ్రమ పరికరాలు కూడా శ్రమతో తయారయ్యేవే. 'విలువ' అనేది ఎక్కడ ఉన్నా అది — శ్రమే. ఎంత విలువగల యంత్రమైనా, తన ద్వారా తయారయ్యే సరుకుకి, తన విలువకన్నా ఎక్కువ విలువని ఇవ్వదు. ఈ విషయంలో చిన్న కుట్టు సూది ఎలాంటిదో, వెయ్యి పనులు ఒక్కసారే చెయ్యగల భారీ యంత్రం కూడా అలాంటిదే. ఒక పైస విలువగల సూది, తను పాడైపోయేలోగా, తన ద్వారా తయారైన మొత్తం ఉత్పత్తికి ఆ పైస విలువ కన్నా ఎక్కువ విలువని చేర్చదు. సూది విలువ వెనక్కివచ్చినప్పుడు, ఆ విలువని మళ్ళీ కొత్త సూది కోసం ఉపయోగించవలసి వస్తుంది. పాత సూదికి బదులు కొత్త సూది వస్తుంది. ఆ పనిముట్టు ద్వారా పెట్టుబడి దారుడికి వచ్చే లాభం ఏమీ ఉండదు. అలాగే, భారీ యంత్రం విషయం కూడా. వెయ్యి విలువగల యంత్రం, తను పాడైపోయేలోగా, తన ద్వారా తయారైన మొత్తం ఉత్పత్తికి ఆ వెయ్యి కన్నా ఎక్కువ విలువని ఇవ్వదు. ఆ వెయ్యి విలువ వెనక్కిరాగానే, దానితో కొత్త యంత్రాన్ని తేవలసి వస్తుంది. ఒక యంత్రం ద్వారా, దాని విలువే వెనక్కి వస్తుందిగానీ, అంతకన్నా ఎక్కువ విలువ రాదు. ఎంత భారీ పనిముట్టు సంగతైనా ఇంతే, కానీ, భారీ యంత్రం ద్వారా భారీ ఉత్పత్తి జరిగి, దాని ద్వారా భారీ లాభాలు వచ్చి, ఆ భారీ లాభాలకు భారీ యంత్రమే కారణంగా కనపడుతుంది.

'ఉత్పత్తి క్రమం'లోకి యంత్రం ప్రవేశించినప్పటి నించీ 'లాభం' అనేది మరింత మార్మిక (రహస్య) విషయంగా తయారవుతుంది. శ్రమ చరిత్ర నించి ఆవిర్భవించిన భారీ యంత్రం పెట్టుబడిదారుడికి 'గొప్ప వరం' అవుతుంది. పెట్టుబడిదారుడికి 'వరం' అయిన ప్రతీదీ శ్రామికులకు 'శాపం' అవవలసిందే.

# 'యంత్రం' గురించి తెలుసుకోవలసిన విషయాలు

**1.** మాన్యుఫాక్చర్‌లో, కార్మికులు, చేతి పనిముట్లతో పనిచేసినా, చేతి మిషన్లతో పనిచేసినా, 'ఉత్పత్తిక్రమం' అంతా కార్మికుల ఆధీనంలోనే ఉండేది. కార్మికుడు ఆగితే పనిముట్టు ఆగుతుంది; కార్మికుడు కదిలితే పనిముట్టు కదులుతుంది. కార్మికుడి కదలికల్ని బట్టే పనిముట్టు కదలికలు ఉంటాయి. చేతి పనిముట్టుని కార్మికుడు, తనకు అనుకూలమైన పద్ధతిలో ఉపయోగిస్తాడు. దాన్ని తన కంట్రోలులో ఉంచుతాడు. కానీ, ఆటోమేటిక్

యంత్రం దగ్గిర కార్మికుడి పరిస్తితి వేరుగా ఉంటుంది. యంత్రం ఒకసారి కదలడం ప్రారంభమైందంటే, కార్మికుడే దాని కదలికలకు అనుగుణంగా ఉండాలి. శ్రమచేసే మనిషి ఆధీనంలో శ్రమ పరికరాలు ఉండడం గాక, శ్రమ పరికరాల ఆధీనంలోనే శ్రమచేసే మనిషి ఉండడం అనేది, ఆటోమేటిక్ యంత్రాల ద్వారా జరిగే ఉత్పత్తి క్రమంలో ఒక సాంకేతిక అవసరంగా అవుతుంది. యంత్రం, అనేక ప్రకృతి శాస్త్ర సూత్రాలతో పనిచేస్తుంది కాబట్టీ, ఒకే పద్ధతిలో యూనిఫామ్‌గా కదులుతుంది కాబట్టీ, దానికదే స్వయంగా నడుస్తుంది కాబట్టీ, దానితో పనిచెయ్యాలంటే, పనిచేసే మనుషులే దానికి అనుగుణంగా ప్రవర్తించడం తప్పనిసరి. ఈ సాంకేతిక అవసరాన్నిబట్టే, యంత్రంతో పనిచేసేటప్పుడు కార్మికులకు, అంతకు పూర్వం లేని ఒక 'క్రమశిక్షణ' అవసరమవుతుంది. ఈ క్రమశిక్షణ, ఒక సహజ అవసరం. యంత్రం దగ్గిర ఎలాంటి జాగ్రత్తలు అవసరమో, అలాంటి జాగ్రత్తలు పాటించడం అంటే, మనిషి యంత్రానికి 'లోబడడం' కాదు. యంత్రం ఇచ్చే 'సౌఖ్యాలు' పొందాలంటే, మనిషి యంత్రం దగ్గిర తప్పని సరిగా కొన్ని 'నియమాలతో' ప్రవర్తించాలి. అది, తగిన జాగ్రత్తలు తీసుకోవడమే. అంతేగానీ, యంత్రానికి 'లొంగి పోవడం' కాదు. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, మొత్తం పరిస్తితి అంతా తారుమారుగా ఉంటుంది. అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో శ్రామికులు, యంత్రాల వల్ల ఎన్ని నష్టాలు సాధ్యమో అన్ని నష్టాలకూ గురి అవుతారు. ఇది, శ్రామికులు యంత్రానికి లోబడడంగానే ఉంటుంది.

**2.** యంత్ర విధానం వల్ల, కార్మికుడి వ్యక్తిగత సమర్థతా, నైపుణ్యమూ అనే అంశాలలో ఒక పెద్ద మార్పు జరుగుతుంది. చేతి పనిముట్లతో పనిచేసినప్పుడు, పని చెయ్యడానికి కావలసిన శక్తి సామర్థ్యాలన్నీ, పనిచేసే మనిషికి ఉండే వ్యక్తిగత శక్తి సామర్థ్యాలే. కానీ, యంత్రం దగ్గిర పని చేసేటప్పుడు పనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ యంత్రం లోనే ఉంటాయి కాబట్టి, మనిషి ప్రదర్శించే వ్యక్తిగత శక్తి సామర్థ్యాలు గతంలోలాగ అవసరం లేదు. మర మగ్గం దగ్గిర పనిచేసే మనిషి, గతంలో చేతి మగ్గం మీద స్వయంగా నేత నేసినప్పుడు ప్రదర్శించే పద్ధతిలో శక్తి సామర్థ్యాలు ప్రదర్శించనక్కరలేదు. యంత్రం ద్వారానే నేత పని జరుగుతూ ఉంటే, కార్మికుడు ఆ యంత్రం దగ్గిర నిలబడి, ముడి పదార్థాన్ని సరిదిద్దుతూ ఉండాలి. ఆ పనికి కూడా ప్రత్యేక సాంకేతిక జ్ఞానమూ, అనుభవమూ అవసరమే అయినా, ఇది, శ్రామికుడు స్వయంగా తన చేతులతో నేత నెయ్యడం లాంటిది కాదు. యంత్రంతో 10 మంది కార్మికులు పనిచేస్తే, తయారయ్యే వస్తువులు, అన్ని సందర్భాలలోనూ దాదాపు ఒక్కలాగే ఉంటాయి. ఉత్పత్తి క్రమం అనేది, మానవ పరిమితుల నించి ఒక రకంగా విముక్తి చెందడమే ఇది. అంటే, పని జరగడానికి కావలసిన నైపుణ్యం అంతా మనిషి, తన శారీరక శక్తి సామర్థ్యాల ద్వారానే చూపనక్కరలేని మార్పు ఇది. అందుకే ఇది, 'శ్రమ క్రమం నించి' మనిషి కొంత వరకూ విముక్తి చెందడం అవుతుంది. అయితే, ఎంత భారీ యంత్రం వచ్చినా, మనిషికి 'శ్రమ క్రమం నించి' సంపూర్ణ మైన విముక్తి ఎన్నటికీ ఉండదు. మనిషి శ్రమ (సజీవ శ్రమ) అవసరం లేకుండా, యంత్రమే ఉత్పత్తి చెయ్యడం ఎన్నటికీ జరగదు. భారీ యంత్రంతో పని జరుగుతోం దంటే, ఆ యంత్రాన్ని మనిషే నిర్మించాడనీ, దాన్ని మనిషే నడుపుతున్నాడనీ అర్థమేగానీ, అది భారీ యంత్రం కాబట్టి దానికదే తయారైందనీ, మనిషితో సంబంధం లేకుండా దానికదే పనిచేస్తోందనీ అర్థం కాదు. మనిషి, ఒకనాడు తన శ్రమ పరికరంగా చిన్న చేతి పనిముట్టుని నిర్మించు కున్నట్టే, క్రమంగా అంత భారీ యంత్రాన్ని నిర్మించుకు న్నాడు. మనిషి నడిపే శ్రమ క్రమంలో చేతి పని ముట్టులాగే భారీ యంత్రం కూడా ఒక శ్రమ పనిముట్టే.

కానీ, చేతి పనిముట్టుతో కన్నా యంత్రం ద్వారా వందల, వేల రెట్ల పని ఎక్కువగా జరుగుతుంది కాబట్టి, ఆ విషయం చూసే పెట్టుబడిదారుడికి, యంత్రమే ఒక మహత్తర శక్తిలాగా, యంత్రమే ప్రధాన ఉత్పాదకుడిలాగా కనిపిస్తుంది. అందుకే వాడు, కార్మికులతో — "నా యంత్రం ముందు మీ శ్రమ ఎంత! మీ నైపుణ్యం ఎంత! మీరు ఉంటే ఎంత, లేకపోతే ఎంత!" అంటాడు.

"సరే, మేం లేకపోతే ఎంతో.... చూడు!" అని కార్మి కులు యంత్రాన్ని ఆపేస్తే తెలుస్తుంది ఎవరు ఎంతో! నిర్జీవ వస్తువు ఎంతో, సజీవ మానవుడు ఎంతో!

యంత్రం లేకుండా కార్మికుడు పని చెయ్యగలడు గానీ (చేతి పనిముట్లతో), మనిషి లేకుండా యంత్రం పని చెయ్యలేదు. మానవుడి 'సజీవ స్పర్శ' లేకపోతే, యంత్రా నికి చలనం రాదు. ఎంత కాలమైనా అది కదలకుండా పడి ఉంటుంది. కానీ ఎవరు ప్రధాన ఉత్పాదకులో తెలియని మూర్ఖాగ్రేసర పెట్టుబడిదారుడు, యంత్రశక్తి అంతా తన పెట్టుబడి శక్తే అని విర్రవీగుతాడు. యంత్రశక్తి పెట్టుబడి శక్తే అయితే, ఆ శక్తి పెట్టుబడికి గిల్డుల కాలంలోనే ఎందుకు లేదో, పెట్టుబడి ప్రారంభమైననాడే భారీ యంత్రాలన్నీ ఎందుకు ప్రారంభం కాలేదో — పెట్టు బడిదారుడి మేధస్సు ఆలోచించదు.

పెట్టుబడి ప్రారంభమైననాడే యంత్రాలు ఎందుకు ప్రారంభం కాలేదంటే, యంత్రాల నిర్మాణానికి కావలసిన

ప్రకృతి శాస్త్రజ్ఞానమూ, అనుభవమూ అప్పటికి ఇంకా మనిషికి అందలేదు గనకే. ఆ జ్ఞానం, శ్రమ క్రమాలవల్ల అభివృద్ధి చెందేదేగానీ, 'పెట్టుబడి'వల్ల పుట్టు కొచ్చేది కాదు. పెట్టుబడిదారుడి డబ్బు రాసిలోంచి సైన్సు రాదు. అది 'శ్రమ'లో నించే వస్తుంది. అందుకే, యంత్ర నిర్మాణం, ఎన్నో వేల సంవత్సరాల శ్రమ క్రమాల అనుభవాలు కూడే వరకూ సాధ్యం కాలేదు. అందుకే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రారంభమైన తర్వాత కూడా యంత్రం లేకుండానే ఎంతో దీర్ఘ కాలం గడిచింది.

'పెట్టుబడి'కి కూడా యంత్రంతో ఒక తప్పనిసరి సంబంధం ఉంది. కానీ అది కేవలం 'బాహ్య సంబంధం' (పైపై సంబంధం). కార్మికుల్ని పెద్ద సంఖ్యలో ఒక చోటికి చేర్చడమూ, సైన్సు ప్రయోగాలకు కావలసిన డబ్బూ, వనరులూ ఏర్పాటు చెయ్యడమూ (ఆ డబ్బు కూడా వాడిది కాదని త్వరలోనే చూస్తాం) వగైరాలన్నీ యంత్ర నిర్మాణానికి సంబంధించిన బాహ్య పరిస్థితులు. యంత్రానికీ, శ్రమకూ ఉన్న సంబంధం 'అంతర్గత' సంబంధం అయితే, యంత్రానికీ పెట్టుబడికీ ఉన్న సంబంధం 'బాహ్య' సంబంధం.

**3.** 'శ్రమ విభజన' విషయంలో, 'ఫ్యాక్టరీ విధానం'లో (యంత్రాలతో ఉత్పత్తిచేసే విధానమే ఫ్యాక్టరీ విధానం), ఒక మార్పు ప్రారంభమవుతుంది. నేత మనిషి, చేనేత మగ్గం మీద నైపుణ్యంగా పని చెయ్యడానికి ఐదారు సంవత్సరాల శిక్షణ అవసరమైతే, నేత యంత్రం మీద పని చెయ్యడానికి ఐదారు నెలల శిక్షణే సరిపోతుంది. కొన్ని యంత్రాల దగ్గిర పని చెయ్యడానికైతే కొన్ని వారాల శిక్షణే సరిపోతుంది. పనికి సంబంధించిన నిర్మాణం అంతా యంత్రంలోనే ఉంటుంది గనక, ఆ యంత్రాన్ని నడపడమే మనిషి చేసే పనిగా ఉంటుంది. అందుకే, మనిషి ఒక యంత్రాన్ని నడిపే పనిలోనించి ఇంకో యంత్రాన్ని నడిపే పనిలోకి మారడం చాలా తేలిగ్గా సాధ్యమవుతుంది.

మాన్యుఫాక్చర్ కాలంలో అయితే, 'నేతపని' చేసే మనిషి 'కుట్టుపని'లోకి మారాలంటే, అది ఎన్నో సంవత్సరాలకు గానీ సాధ్యమయ్యే విషయం కాదు. అక్కడ ప్రతీ పనీ, చేతి పనిముట్ల ద్వారా వ్యక్తిగత నైపుణ్యంతో చెయ్యాల్సిన పరిస్థితిగా ఉంటుంది కాబట్టి, అక్కడ ఒక పనిలోంచి ఇంకో పనిలోకి మారడం తేలిక విషయం కాదు. కానీ, ఫ్యాక్టరీ విధానంలో, చాలా తక్కువ కాలపు శిక్షణతోనే ఏ యంత్రాన్ని అయినా నడపవచ్చు కాబట్టి, మనిషి ఏ పని చెయ్యడానికైనా సాధ్యమయ్యే సాంకేతిక పరిస్థితి ఇక్కడ ఏర్పడుతుంది. అందువల్లనే, ఫ్యాక్టరీ విధానంలో, కార్మికులు అనేక ఉద్యోగాలలోకి మారడం సాధ్యమవుతుంది.

ఒక మనిషి ఒకే పనికి అతుక్కుపోయే శ్రమ విభజన మాన్యుఫాక్చర్‌లో ఉన్నంత గడ్డకట్టి, భారీ పరిశ్రమలో ఉండదు. అతి తక్కువ కాలంలోనే అనేక పనులు నేర్చుకోవడానికీ, ఒక రోజులోనే పూర్తిగా వేరు వేరు రకాల పనులు చెయ్యడానికీ వీలునిచ్చే భౌతిక పునాదిని భారీ పరిశ్రమ ఏర్పరుస్తుంది. ఏ శాఖలో పని అయినా యంత్రాల మీదే జరుగుతుంది కాబట్టి వేరు వేరు పనుల్ని త్వరత్వరగా నేర్చుకోవడమూ, చేసే పనుల్ని త్వరత్వరగా మార్చుకోవడమూ యంత్ర విధానంలో సాధ్యమే. అంటే, 'నూతన శ్రమ విభజన'ని ఏర్పర్చుకోవడానికి ఇది తగిన పరిస్థితే. ఈ పరిస్థితి విప్లవాత్మకమైనది. కానీ ఈ పరిస్థితిని ఉపయోగించుకోవడానికి తగిన 'సామాజికమైన మార్పులు' ఇక్కడ కూడా జరగవు. ఈ భారీ పరిశ్రమ కూడా పెట్టుబడిదారీ విధానమే. ఇది పెట్టుబడిదారీ పరిమితులకూ, నియమాలకూ లోబడి ఉన్నదే. కాబట్టి, ఉత్పత్తి క్రమం అంతా, ఇంకా ఇక్కడ కూడా 'పెట్టుబడిదారీ శ్రమ విభజన'తోనే ఉంటుంది. ఒక మనిషి ఒకే పని చెయ్యడం వల్ల వచ్చే స్పెషలైజేషన్లు, భారీ పరిశ్రమకు కూడా కావాలి. అందుకే ఇక్కడ కూడా 'ఒక మనిషి ఎప్పుడూ ఒకే పని చెయ్యడం' అనే విధానమే కొనసాగుతుంది. ఇక్కడ కూడా కార్మికుడు ఎప్పుడూ ఒకే పని స్థలంలో, ఒకే యంత్రం దగ్గిర ఉంటాడు. మాన్యుఫాక్చర్‌లో, ఒక పనివాడు, చేతి పనిముట్లని వాడుతూ ఒకే పని చేసే జీవితాంతపు ప్రత్యేకత, భారీ పరిశ్రమలో, ఒకే యంత్రం దగ్గిర పని చేసే జీవితాంతపు ప్రత్యేకతగా ఉంటుంది. మనిషి, ఎప్పుడూ ఒకే యంత్రానికి అతుక్కుపోయి ఉండడం అంటే, యంత్రానికి ఉన్న చక్రంలో ఒక భాగంగా అయిపోవడమే. ఇది, మనిషిని, నిర్జీవ యంత్ర భాగాలతో సమానం చెయ్యడమే. ఈ రకంగా, సమాజం, యంత్రం అనే గొప్ప జ్ఞానాన్ని దుర్వినియోగం చెయ్యడమే ఇది. యంత్ర ఆవిర్భావంతో, పాత సంకుచిత సాంకేతిక పునాది కదిలిపోయినప్పటికీ, పెట్టుబడిదారీ విధానం, కార్మికుల్ని పాత శ్రమ విభజనకే కట్టి ఉంచి, దాన్నే పునరుత్పత్తి చేస్తూ ఉంటుంది. యంత్రం, 'పెట్టుబడిదారీ సంబంధాలలో ఉన్నంత కాలమూ' ఇదంతా జరగక మానదు. యంత్రానికి అతుక్కుపోయి, దానిలో భాగమైపోయిన స్పెషలైజ్డ్ శ్రామికులద్వారా అమిత వేగంగా పని జరగడమే పెట్టుబడిదారుడికి కావాలి కాబట్టి, పెట్టుబడిదారీ విధానం ఉండగా దాని శ్రమ విభజన, శ్రమచేసే మనుషుల మంచికి తగినట్టుగా ఎన్నటికీ మారదు.

**4.** యంత్రానికి ఉండే నిర్మాణాన్నిబట్టీ, దానిద్వారా తయారయ్యే సరుకు స్వభావాన్నిబట్టీ, యంత్రానికంతటికీ ఒకే కార్మికుడు ఉండడం గానీ, ఒక్కో దశ దగ్గిరా ఒక్కో కార్మికుడు ఉండడంగానీ, బృందాలుగా ఉండడంగానీ, అవసరమవుతుంది. భారీ పరిశ్రమలో, 'సహకారం' అనేది, ఒక యంత్రం దగ్గిర కార్మికులు కలిసి పనిచెయ్యడంగా గానీ, ప్రత్యేక విధుల్ని నిర్వర్తించే స్పెషలైజ్డ్ యంత్రాల్ని నడిపే వేరు వేరు కార్మికుల మధ్య సమన్వయంగా గానీ ఉంటుంది.

**5.** ఉత్పత్తి క్రమానికి అవసరమైన శారీరకశ్రమా, మేధాశ్రమా విడిపోవడమూ; శారీరక శ్రమమీద మేధాశ్రమ పెత్తనం చలాయించడమూ — అనే అంశాలు రెండూ భారీ పరిశ్రమలో కూడా ఉంటాయి. అంతేగాక, అవి ఇప్పటికి సంపూర్ణ స్థాయికి చేరతాయి కూడా. ఏ మనిషి అయితే యంత్రాన్ని నడపాలో, ఆ మనిషికి ఆ యంత్రాన్ని రూపొందించే విషయాలలో ఏ పాత్రా ఉండదు. ఇది, ఇక్కడ, శారీరకశ్రమా మేధాశ్రమా విడిపోవడమే. వెనకటి శ్రమ పరికరాల్ని శ్రామికులు నడపగా వచ్చిన అనుభవాల్ని గ్రహించి, ఆ మేధాశ్రమతో పుట్టుకొచ్చిన యంత్రం, శ్రామికుణ్ణి అమితంగా దోచడానికి వీలైన 'టెక్నిక్కులతో' తయారవడమే, ఇక్కడ మేధాశ్రమ, శారీరక శ్రమ మీద పెత్తనం చెలాయించడం.

**6.** కార్మికుల మధ్య, మాన్యుఫాక్చర్ విధానంలో ఉండే 'అంతస్తుల భేదం' (హైరార్కీ) తొలగిపోవడానికి కావలసిన పరిస్థితి భారీ పరిశ్రమలో ఏర్పడుతుంది. చేతి పనిముట్ల కాలంలో, 'నైపుణ్యం గల శ్రమ'గానూ, 'నైపుణ్యంలేని శ్రమ'గానూ ఉండే పనులన్నీ యంత్రాల ద్వారానే జరగడం ప్రారంభమైనప్పుడు, ఆ నైపుణ్యాల హద్దులు చెదిరిపోతాయి. ఒకే కార్మికుడు అతి తక్కువ కాలంలో అనేక రకాల పనులు నేర్చుకోగలిగే పరిస్థితివల్ల, ఇక్కడ, ఒక కార్మికుడు కొన్ని నైపుణ్యంగల పనులూ, కొన్ని నైపుణ్యంలేని పనులూ చెయ్యడానికి వీలు ఏర్పడుతుంది. ఈ పరిస్థితి అంతస్తుల భేదాన్ని తొలగించే అవకాశాలు కల్గిస్తుంది. ఒక పక్క ఇలాంటి పరిస్థితిని ఏర్పర్చుతూ, యంత్ర విధానం, ఇంకోపక్క శారీరక శ్రమకూ మేధా శ్రమకూ ఉండే భేదాన్ని మరింత పెంచివేస్తుంది. ఆ రూపంలో ఇక్కడ 'అంతస్తుల విధానం' ఎప్పటిలాగే నిలిచి ఉంటుంది. - ఈ రకంగా, భారీ యంత్ర విధానం రక రకాల వైరుధ్యాల్ని తీసుకొస్తుంది.

# 'యంత్రం'నించి సరుకుకి చేరే విలువ

**టూ**లు (చేతి పనిముట్టు) — తక్కువ ఉత్పాదక శక్తి గల శ్రమ పరికరం.

యంత్రం — — ఎక్కువ ఉత్పాదక శక్తి గల శ్రమ పరికరం.

సూది — 'టూలు' అయితే,
కుట్టు మిషను — యంత్రం.
కత్తెర — 'టూలు' అయితే,
కటింగ్ మిషను— యంత్రం.
నాగలి — 'టూలు' అయితే, ట్రాక్టరు — యంత్రం.

ఒక కాలంలో ఫలానా కొంత ఉత్పాదక శక్తిగల యంత్రం కూడా క్రమంగా కొన్ని సంవత్సరాలకు, ఇంకా ఇంకా మెరుగవుతూ, గతంకన్నా ఎక్కువ ఉత్పాదక శక్తిగల కొత్త యంత్రంగా మారవచ్చు.

'చేతి పనిముట్టు' స్థానంలోకి యంత్రం వచ్చినప్పుడూ, తక్కువ ఉత్పాదక శక్తిగల యంత్రం స్థానంలోకి ఎక్కువ ఉత్పాదక శక్తిగల యంత్రం వచ్చినప్పుడూ — ఈ 2 ఉదాహరణలకూ సంబంధించిన అంశాలన్నీ ఒకటే. పాతదీ కొత్తదీ కూడా యంత్రాలే అయితే, పాత యంత్రం కన్నా కొత్త యంత్రం ఎక్కువ ఉత్పాదక శక్తి గలదిగా ఉంటుంది. కొత్త దానికి ఎక్కువ ఉత్పాదకశక్తి ఉండడం వల్లనే అది పాతదాన్ని తోసి వెయ్యగలుగుతుంది. ఇక్కడ, ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, తక్కువ ఉత్పాదక శక్తి గల శ్రమ పరికరాన్ని 'టూలు' అనీ, దానికన్నా ఎక్కువ ఉత్పాదక శక్తిగల శ్రమ పరికరాన్ని 'యంత్రం' అనీ అందాం. టూలూ, యంత్రమూ — అనే విషయాల మీద మొదట ఇలాంటి అర్థాలతోనే ప్రారంభించాలి.

'టూలు'గానీ, యంత్రం గానీ, 'ఫిక్సెడ్ సాధనాల' కిందకి వస్తాయి. 'ఫిక్సెడ్ సాధనం' అనేది, తన 'విలువ'ని, సరుకుకి ఏ పద్ధతిలో చేరుస్తుందో, గతంలో చూశాం. ఫిక్సెడ్ సాధనం, తన విలువ అంతటితోటీ, 'పని స్థలం'లో ఉంటుంది. కానీ, అది ఆ 'విలువ'లో నించి కొంత కొంత భాగాన్ని మాత్రమే, ముక్కముక్కలుగా సరుకుకి చేరుస్తూ ఉంటుంది.

పెట్టుబడిదారుడు, తన సరుకుని, ఇతరులకన్నా తక్కువ ఖర్చుతో తయారుచేసి, దాన్ని ఇతరులు అమ్మే విలువకే అమ్మి, ఇతరులకన్నా ఎక్కువ లాభం తీసుకోవాలనే దృష్టితో, తన దగ్గిర ఉత్పాదకశక్తిని పెంచుకోవడానికే ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాడని గతంలోనే చూశాం. ఆ

ప్రయత్నాలు, శ్రమ పరికరాల్ని ఇంకా ఇంకా 'అభివృద్ధి' పరుస్తూ ఉంటాయి. అయితే, 'ఉత్పాదక శక్తి'లో ఏమాత్రం మార్పులు జరిగినా, 'సరుకు'కి చేరే శ్రమ అంశాల్లో కూడా మార్పులు జరుగుతూ ఉంటాయి.

ఒక పెట్టుబడిదారుడు, తన టూలునే మెరుగుపరిచినప్పుడు గానీ, టూలుని తీసివేసి యంత్రాన్ని తెచ్చినప్పుడు గానీ, 'విలువ'కి సంబంధించి అనేక సమస్యలు ఎదురవుతాయి. ఆ సమస్యలు, ఇప్పుడు చూడబోయే అనేక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయి.

పెట్టుబడిదారుడి దగ్గిర అప్పటికే ఉన్న పాత టూలు విలువ ఎంత? దాని ఉత్పాదక శక్తి ఎంత? దాని జీవిత కాలం ఎంత? అది 1 సరుకుకి చేర్చే విలువ ఎంత?

'టూలు'ని తీసేసి (దాన్ని చిన్న స్థాయి పెట్టుబడిదారుడికి అమ్మేసి), కొత్త యంత్రాన్ని తెస్తే, ఆ యంత్రం విలువ ఎంత? దాని ఉత్పాదక శక్తి ఎంత? దాని జీవిత కాలం ఎంత? అది 1 సరుకుకి చేర్చే విలువ ఎంత?

1 సరుకుకి— 'టూలు' ద్వారా చేరే విలువ ఎక్కువగా ఉంటుందా? యంత్రం ద్వారా చేరే విలువ ఎక్కువగా ఉంటుందా, 'టూలు'ని తీసివేసి యంత్రాన్ని తేవడంవల్ల సరుకు విలువ తగ్గుతుందా, పెరుగుతుందా? టూలుని తీసివేసి యంత్రాన్ని తేవడం, సరుకు విలువని తగ్గించాలనా, పెంచాలనా?

ఉత్పాదక శక్తి — అన్నప్పుడు, అది కేవలం శ్రమ పరికరాలకు మాత్రమే సంబంధించిన విషయం కాదు. శ్రమ పరికరాలూ, శ్రామికులూ కలిసినదే ఉత్పాదక శక్తి. కొత్త అనుభవాలు వచ్చేది 'శ్రమ క్రమం' నించే. పరికరాల్ని అభివృద్ధి చేసేదీ, అలా అభివృద్ధి అయిన పరికరాల మీద, కొత్త సాంకేతిక జ్ఞానంతో పనిచేసేదీ అంతా శ్రామికులే. (మేధాశ్రమలూ, శారీరకశ్రమలూ కలిసి.) కాబట్టి, ఉత్పాదక శక్తి అంటే — శ్రమ పరికరాలూ + శ్రామికులూ. ఉత్పాదక శక్తి మారినప్పుడల్లా, ఈ 2 అంశాల నించీ చేరే విలువలు కూడా మారుతూ ఉంటాయి. (ఉదాహరణలు తేలిగ్గా ఉండడంకోసం, ముడి పదార్థాలూ వగైరాల్నీ తీసుకోనక్కర లేదు. అలాగే 'ఉత్పాదక శక్తి' అంటే 'శ్రమ పరికరానికి' సంబంధించి మాత్రమే కాకపోయినా, ఉదాహరణలు తేలిగ్గా ఉండడం కోసమే, 'టూలు ఉత్పాదక శక్తి' అనీ, 'యంత్రం ఉత్పాదకశక్తి' అనీ, ఉత్పాదక శక్తుల్ని శ్రమ పరికరాల పేర్లతోనే చెప్పుకుంటున్నాము.)

ఒక మనిషి, 'టూలు'తో 2 గంటల్లో చేసే పనిని, కొత్తగా వచ్చిన చిన్న యంత్రంతో 1 గంటలోనే చెయ్యగలిగితే, ఉత్పాదకశక్తి రెట్టింపు అయినట్టు అర్థమా? — కాదు. 'సజీవశ్రమ' సగం తగ్గడాన్నిబట్టే, ఉత్పాదక శక్తి రెట్టింపు అయినట్టు కాదు. 'శ్రమ పరికరం' నించి చేరే విలువలో మార్పు ఎలా జరిగిందో కూడా తెలియాలి. 1 సరుకు కోసం గతంలో పట్టే 'మొత్తంశ్రమ' సగం అయితేనే ఉత్పాదక శక్తి రెట్టింపు అయినట్టు అర్థం.

1 సరుకు విలువని, టూలు ద్వారానూ, యంత్రం ద్వారానూ కూడా చూద్దాం.

**టూలు సరుకు:**

| | |
|---|---|
| 'టూలు' నించి చేరే శ్రమ | 1 గంట |
| సజీవ శ్రమ | 2 గంటలు |
| మొత్తం శ్రమ | 3 గంటలు |
| 'విలువ'గా | 3 రూ.లు |

**యంత్రం సరుకు:**

| | |
|---|---|
| యంత్రం నించి చేరే శ్రమ | 1.10 ని. |
| సజీవ శ్రమ | 1.00 |
| మొత్తం శ్రమ | 2.10 |
| 'విలువ'గా | 2.17 పై. |

ఈ ఉదాహరణలో 'సజీవశ్రమ' విషయం మాత్రమే తీసుకుంటే, అది 'సగం' అయింది కాబట్టి, ఉత్పాదకశక్తి రెట్టింపు అయినట్టుగా కనపడుతుంది. కానీ 'శ్రమ పరికరం' విషయం కూడా తీసుకుంటే, ఆ భాగం, గతంలో కన్నా తగ్గలేదు సరిగదా, అంతకన్నా కూడా పెరిగింది.

మొత్తం మీద 'యంత్రం — సరుకు'లో, 'మొత్తం శ్రమ' తగ్గింది. కాబట్టి, ఇది, ఉత్పాదకశక్తి పెరగడమే. కానీ, అది 'రెట్టింపుగా' మాత్రం అవలేదు. కానీ ఉదాహరణలు తేలిగ్గా ఉండడం కోసం 'సజీవ శ్రమ'లో మార్పుని బట్టే ఉత్పాదక శక్తిని అర్థం చేసుకోవచ్చు.

టూలు సరుకులో కన్నా యంత్రం సరుకులో, సజీవ శ్రమ సగమే అయింది కాబట్టి, ఉత్పాదకశక్తి రెట్టింపు అయినట్టు భావించవచ్చు.

ఈ ఉదాహరణలో ఒక ముఖ్య విషయం గమనించాలి. సరుకుకి టూలు నించి చేరే శ్రమ కన్నా, యంత్రం నించి చేరే శ్రమ ఎక్కువగా ఉంది. ఇది, ఈ ఉదాహరణలో మాత్రమే కాదు ప్రతి ఉదాహరణలోనూ ఇలాగే ఉంటుంది. సరుకుకి టూలు నించి చేరే శ్రమ కన్నా, యంత్రం నించి చేరే శ్రమ తప్పనిసరిగా కొంత ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, 'యంత్రం — సరుకు'లో మొత్తం శ్రమ తగ్గుతుంది, ఈ మార్పు ఎలా జరుగుతుందంటే, సజీవ శ్రమ భాగం గతం కన్నా తగ్గడం ద్వారా. (దీన్ని తర్వాత వివరంగా చూస్తాం)

టూలుకీ యంత్రానికీ 2 రకాల తేడాలు ఉంటాయి.

**(1)** టూలు విలువ కన్నా యంత్రం విలువ తప్పనిసరిగా ఎక్కువగా ఉంటుంది.

(2) టూలు ఉత్పత్తిశక్తి కన్నా యంత్రం ఉత్పత్తి శక్తి కూడా తప్పనిసరిగా ఎక్కువగా ఉంటుంది.

అయితే, విలువల్లో తేడా ఎన్ని రెట్లు ఉంటుందో, ఉత్పత్తి శక్తుల్లో తేడా కూడా అలాగే ఉంటుందనడానికి వీలు లేదు. విలువల్లో తేడా రెట్టింపుగా ఉంటే, ఉత్పత్తి శక్తుల్లో తేడా రెట్టింపుగా ఉండనూ వచ్చు, ఉండకపోనూ వచ్చు. రెట్టింపు కన్నా ఎక్కువ గానూ ఉండవచ్చు, కొంత తక్కువ గానూ ఉండవచ్చు.

టూలుతో పోలిస్తే యంత్రం చాలా పెద్దది. టూలు కన్నా నాణ్యమైన లోహాలతో తయారవుతుంది, ప్రకృతి సూత్రాలను ఇముడ్చుకునే విధానంతో తయారవుతుంది. యంత్రం నడవడానికి, ఆయిలూ, కరెంటూ వంటి పదార్థాలతో అవసరం ఉంటుంది. యంత్రానికి అనేక సార్లు రిపేర్లు అవసరమవుతాయి. ఈ ఖర్చులన్నీ కలిసి, యంత్రంకోసం ఖర్చయ్యే మొత్తం శ్రమ చాలా ఎక్కువగా ఉంటుంది (టూలు కోసం ఖర్చయ్యే శ్రమతో పోలిస్తే). అందుకే యంత్ర ఉత్పాదక శక్తి ఎంత ఎక్కువగా ఉన్నా, దాని విలువ ఇంకా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, 'సరుకు'కి, టూలు నించి చేరే శ్రమ కన్నా, యంత్రం నించి చేరే శ్రమ తప్పనిసరిగా ఎక్కువగా ఉంటుంది.

ఇప్పుడు 'కుట్టు' శ్రమకి సంబంధించిన పాత, కొత్త శ్రమ పరికరాల్ని చూద్దాం.

చేతి సూది— ఇది టూలు. పాత శ్రమ పరికరం.

కుట్టుమిషను— ఇది యంత్రం. కొత్త శ్రమ పరికరం.

'చేతి కుట్టు'ని తీసుకుంటే, దానికి 'సూది' మాత్రమే ఏకైక శ్రమ పరికరం. 'సూది'లాంటి అతి చిన్న, ఏకైక శ్రమ పరికరం గల 'చేతి కుట్టు'లాంటి ముచ్చటైన ఉదాహరణ ఇంకేదీ ఉండదు. దారమూ, గుండీలూ, బట్టా — అన్నీ ముడి పదార్థాలే కాబట్టి, వాటి సంగతి అనవసరం. కత్తెర, 'కత్తిరింపు శ్రమకి' సంబంధించిన శ్రమ పరికరం కాబట్టి, దాని సంగతి కూడా అనవసరం. 'కుట్టు'ని తీసుకున్నప్పుడు, కేవలం ఆ శ్రమకి సంబంధించిన శ్రమ పరికరాలనే చూడాలి. చేతి కుట్టులో, అది సూది.

పని దినాన్ని 2 ఉదాహరణల్లోనూ ఒకే పొడవుతో తీసుకుంటాం.

**'టూలు' ఉదాహరణ:**

కుట్టు మనిషి, 'చేతి కుట్టు'తో చొక్కాలు కుడతాడు. 1 చొక్కాకి, సగటున, 10 గంటలు పడుతుంది. ఆ 10 గంటల శ్రమ విలువ 6 రూ.లు అనుకుందాం. (10 గంటలు = 6 రూ.లు అయితే, 1 నిమిషం = 1 పైస అవుతుంది. తర్వాత లెక్కకోసం ఈ వివరాలు అవసరం.) 1 సూది విలువ 2 పైసలు అనీ, అది 2 చొక్కాలు కుట్టే వరకూ మన్ని అప్పటికి విరిగిపోతుందనీ — అనుకుందాం. సూది అరుగుదల శ్రమా, కుట్టు మనిషి శ్రమా కలిసి, 1 చొక్కా కోసం పట్టే 'మొత్తం శ్రమ' అవుతుంది. (ముడి పదార్థాల్ని లెక్కలోకి తీసుకోవడం లేదు.) 1 చొక్కాకి సూది ద్వారా చేరే విలువ 1 పైస. (1 నిమిషం). కుట్టు మనిషి ద్వారా చేరే విలువ 6 రూ.లు (10 గం.లు).

**'కుట్టు మిషను' ఉదాహరణ:**

కుట్టు మనిషి, 'మిషను' మీద చొక్కాలు కుడతాడు. మిషను విలువ 600 రూ.లు. అది 10 సం॥లు మన్నుతుంది. మిషను కోసం కావలసిన ఆయిలూ, రిపేర్లూ వంటి వాటికి ఆ 10 సం॥ల కాలంలో ఇంకో 600 ఖర్చవుతుందనుకుందాం. మిషను 'విలువ'ని చూసేటప్పుడు, దానికోసం అవసరమయ్యే ఖర్చులన్నిటినీ కూడా కలపాలి. కాబట్టి, 10 సంవత్సరాల్లో కుట్టు మిషనుకి మొత్తం ఖర్చు 1,200. దీనినే మిషను విలువగా అనుకోవాలి.

10 సం॥లకు 1,200 అయితే, 1 సం॥నికి ఖర్చు 120.
1 నెలకి ఖర్చు 10. 1 రోజుకి (10 గం.లకు) ఖర్చు — 33 పైసలు.

మిషను మీద 1 పని దినంలో (10 గంటల్లో) ఎన్ని చొక్కాలు తయారవుతాయో అన్ని చొక్కాలకూ కలిసి మిషను ఖర్చుగా 33 పైసల విలువ చేరుతుంది.

కుట్టు మనిషి ఈ మిషను మీద, రోజుకి 10 గం.లు పనిచేస్తే 5 చొక్కాలు కుడతాడనుకుందాం. మిషను ద్వారా 5 చొక్కాలకు 33 పైసల విలువ చేరితే, 1 చొక్కాకి చేరే విలువ - 6 పై.లు. తర్వాత సజీవ శ్రమ సంగతి చూస్తే, 10 గం.ల విలువ 6 రూ.లు. టూలు ఉదాహరణలోనూ, మిషను ఉదాహరణలోనూ కూడా 'పని కాలం' ఒక్కలాగే ఉంది కాబట్టి, దాని 'విలువ' కూడా ఒక్కలాగే ఉంటుంది. పనికాలం 10 గంటలు. 10 గం.ల విలువ ఎప్పుడైనా 10 గంటలే. ఉత్పాదకశక్తి పెరగడంవల్ల ఆ కాలంలో ఉత్పత్తి అయ్యే 'ఉత్పత్తుల రాసి' పెరుగుతుందిగానీ, ఆ కాలం 'విలువ' పెరగదు. ఆ 10 గంటల కాలమే ఎక్కువ ఉత్పత్తుల మీద పరచుకుంటుంది. టూలు ఉదాహరణలో 10 గంటల కాలం, 1 చొక్కాకే చేరితే, మిషను ఉదాహరణలో ఆ కాలం, 5 చొక్కాలకు చేరుతుంది.

మిషను ఉదాహరణలో, 1 చొక్కాని కుట్టడానికి పట్టే కాలం (సజీవ శ్రమ) 2 గం.లు. 10 గంటల విలువ 6 రూపాయలు. కాబట్టి, 2 గంటల విలువ 1 రూ. 20 పై. ఇది, 1 చొక్కాకి, సజీవ శ్రమ ద్వారా చేరే విలువ.

మిషను అరుగుదల శ్రమా, కుట్టుమనిషి శ్రమా కలిసి 1 చొక్కాకి పట్టే 'మొత్తం శ్రమ' అవుతుంది. (ఇక్కడ కూడా ముడి పదార్థాల సంగతి తీసుకోవడం లేదు.)

**టూలు చొక్కా వివరాలు:**

| | గం. ని | |
|---|---|---|
| టూలు అరుగుదల | 0.01 | (1 పైస) |
| సజీవ శ్రమ | 10.00 | (6 రూ.) |
| మొత్తం శ్రమ | 10.01 | |
| ఆ శ్రమ 'విలువ'రూ. | 6.01 | |

**మిషను చొక్కా వివరాలు:**

| | గం. ని | |
|---|---|---|
| మిషను అరుగుదల | $0.06\frac{1}{2}$ | ($6\frac{1}{2}$ పై.) |
| సజీవ శ్రమ | 2.00 | (1.20 పై) |
| మొత్తం శ్రమ | $2.06\frac{1}{2}$ | |
| ఆ శ్రమ 'విలువ' రూ. | $1.26\frac{1}{2}$ | |

'టూలు'కి బదులుగా 'మిషను' రావడంవల్ల సరుకుకి విలువ ఏర్పడడంలో ఎలాంటి మార్పులు జరిగాయి? **3** మార్పులు జరిగాయి.

**(1)** శ్రమ పరికరం ద్వారా చేరే శ్రమ — గతం కన్నా పెరిగింది.

**(2)** సజీవ శ్రమ — గతం కన్నా తగ్గింది.

**(3)** మొత్తం శ్రమ — గతం కన్నా తగ్గింది.

మొత్తం శ్రమ, గతం కన్నా తగ్గడం ఎందుకు జరిగింది? — సజీవ శ్రమ తగ్గడం వల్లనే. అంతేగానీ, 'శ్రమ పరికరం' ద్వారా చేరిన భాగం తగ్గడం వల్ల కాదు. లేదా, రెండు భాగాలూ కొంత కొంత తగ్గడం వల్ల కాదు. కేవలం, సజీవశ్రమ తగ్గడంవల్ల మాత్రమే. టూలుద్వారా 10 గంటల కాలంలో తయారయ్యే చొక్కా, మిషనుద్వారా 2 గంటల్లో తయారవడం అంటే, అది సజీవ శ్రమ తగ్గడమే.

మిషను వచ్చి చేసిన పని ఏమిటంటే, సజీవశ్రమ భాగాన్ని తగ్గించి, ఆ రకంగా 'మొత్తం శ్రమ'ని తగ్గించడం.

ఈ విషయాలు అర్థం చేసుకోవడంలో కష్టం ఏమీ ఉండదు. కానీ 2, 3 రకాల ఉదాహరణలు తీసుకుని, జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

టూలు ఉత్పాదక శక్తి : 10 గంటలకు 1 చొక్కా

మిషను ఉత్పాదక శక్తి : 10 గంటలకి 5 చొక్కాలు

టూలు ఉత్పాదక శక్తిని 100% అనుకుంటే,

మిషను ఉత్పాదక శక్తి 500%, లేదా టూలు కన్నా 400% ఎక్కువ.

టూలు విలువ : 1 చొక్కాకి 1 పైస.

మిషను విలువ: 1 చొక్కాకి $6\frac{1}{2}$ పైసలు.

టూలు విలువని 100% అనుకుంటే, మిషను విలువ 650%. లేదా, టూలు కన్నా 550% ఎక్కువ.

'టూలు'నీ మిషనునీ పోల్చడం అంటే — 1 సూదినీ, 1 మిషనునీ పోల్చడం కాదు. రెంటికీ వేరు వేరు విలువలూ, వేరు వేరు ఉత్పాదక శక్తులూ ఉన్నాయి కాబట్టి, ఆ 4 అంశాల్నీ లెక్కలోకి తీసుకుని చూడాలి. 1 సరుకుని తీసుకుని, దానికి టూలు ద్వారా చేరే విలువ ఎలా ఉంటుందో, మిషను ద్వారా చేరే విలువ ఎలా ఉంటుందో చూడాలి. లేదా, కొంత ఎక్కువ సరుకునితీసుకున్నా అలాగే చూడాలి.

'1 సరుకు'ని తీసుకుంటే:

1 చొక్కాకి — 'టూలు' ద్వారా చేరే విలువ 1 పైస.

మిషను ద్వారా $6\frac{1}{2}$ పైసలు.

ఇదే, టూలు విలువనీ, మిషను విలువనీ పోల్చడం.

ఎంత ఎక్కువ సరుకుని తీసుకున్నా, విషయం ఇలాగే ఉంటుంది. ఒక శ్రమ పరికరం ద్వారా తయారయ్యే మొత్తం సరుకు - అంటే, ఆ పరికరం పాడైపోయే దాకా తయారయ్యే మొత్తం సరుకు.

**సూది ద్వారా (టూలు ద్వారా) మొత్తం సరుకు:**

1 సూది పాడైపోయేటప్పటికి 2 చొక్కాలు తయారవుతాయి — అనుకున్నాం. అంటే, సూది ద్వారా మొత్తం సరుకు — 2 చొక్కాలు. ఆ 2 చొక్కాలకు సూది ద్వారా అయ్యే ఖర్చు 2 పైసలు. 1 చొక్కా 1 పైస.

**మిషను ద్వారా మొత్తం సరుకు:**

మిషను ఎంత కాలం మన్నుతుందో, ఆ కాలంలో తయారయ్యే సరుకే దాని మొత్తం సరుకు. అది ఎంత? మిషను విలువ 1,200. అది మన్నే కాలం 10 సంవత్సరాలు. దాని ఉత్పాదకశక్తి రోజుకి 5 చొక్కాలు. ఈ ప్రకారం చూస్తే, ఈ మిషను, 10 సం॥ల కాలంలో, మొత్తం 18,000 చొక్కాలు కుడుతుంది. ఇదే మిషను ద్వారా మొత్తం సరుకు. 1 చొక్కాకి మిషను ద్వారా ఖర్చు $6\frac{1}{2}$ పైసలు. (కార్మికులు, సెలవు రోజుల్లో పని చెయ్యరు. సెలవుల్ని తీసేస్తే, చొక్కాల సంఖ్య కొంత తగ్గుతుంది. కానీ, ఆ వివరాలన్నీ ఇక్కడ తీసుకోవడం లేదు)

టూలు సరుకుకీ, మిషను సరుకుకీ విలువల్లో తేడాని చూడాలంటే: సూదిద్వారా 1 చొక్కాని తీసుకుంటే, మిషను ద్వారా కూడా 1 చొక్కానే తీసుకోవాలి. లేదా, మిషను ద్వారా వచ్చే మొత్తం 18,000 చొక్కాల్ని తీసుకుంటే, సూదిద్వారా కూడా అన్ని వేల చొక్కాల్నీ తీసుకోవాలి. అలా పోల్చి చూస్తేనే వాటి తేడాలు అర్థమవుతాయి.

మిషను ద్వారా వచ్చే 18,000 చొక్కాల్ని సూదుల ద్వారా తయారుచేస్తే, ఎన్ని సూదులు ఖర్చవుతాయి? ఆ

సూదుల విలువ ఎంత?

1 సూది — 2 చొక్కాలు కుడుతుంది. సూది విలువ 2 పై.లు. 18,000 చొక్కాలకోసం కావలసిన సూదులు - 9,000. మొత్తం సూదుల విలువ 18,000 పై=180 రూ.

| టూలు ద్వారా చేరే విలువ | మిషను ద్వారా చేరే విలువ: |
|---|---|
| 1 చొక్కాకి 1 పైస | $6\frac{1}{2}$ పై. |
| 18,000 చొక్కాలకు 180 రూ.లు | 1,200 రూ.లు |

1 సరుకుని తీసుకున్నా, ఎక్కువ సరుకుని తీసుకున్నా, టూలు విలువకీ, మిషను విలువకీ తేడా ఒకే రకంగా ఉంది. అది 1 : $6\frac{1}{2}$ . టూలు ద్వారా చేరే విలువ కన్నా మిషను ద్వారా చేరే విలువ ఎక్కువగా ఉంటుంది.

ఇక్కడ ఒక ప్రశ్న వేసుకుని జవాబు వెంటనే చెప్పుకుందాం.

సరుకుకి టూలు ద్వారా చేరే విలువ కన్నా మిషను ద్వారా చేరే విలువ తప్పనిసరిగా ఎక్కువగా ఉంటుందని ఎందుకు అనుకోవాలి? వేరే ఉదాహరణల్లో, మిషను ద్వారా చేరే విలువ, టూలు ద్వారా చేరే విలువతో సమానంగా గానీ, కొంత తక్కువగా గానీ ఉండకూడదా? మిషను ఉత్పాదక శక్తిని ఇంకా చాలా ఎక్కువగా తీసుకోకూడదా? టూలు ఉదాహరణలో, 1 చొక్కాకి టూలు ద్వారా 1పైసే చేరింది కదా? అలాగే, 1 చొక్కాకి మిషను ద్వారా కూడా 1 పైసే చేరినట్టు, ఉదాహరణ ఎందుకు తీసుకోకూడదు?— మిషను విలువ, 1 రోజుకి 33 పైసలు అనీ, మిషను ఉత్పాదక శక్తి 1 రోజుకి 5 చొక్కాలు అనీ — అనుకున్నాం కదా? అలాగాక, మిషను విలువని 33 పైసలు గానే ఉంచి, దాని ఉత్పాదక శక్తిని 1 రోజుకి 5 చొక్కాలు గాక, 33 చొక్కాలు అనుకుంటే, అప్పుడు, 33 చొక్కాలకూ 33 పైసలు. 1 చొక్కాకి 1 పైస. అప్పుడు 1 చొక్కాకి, టూలు ద్వారానూ మిషను ద్వారానూ కూడా చేరే శ్రమ ఒక్కలాగే ఉంటుంది కదా? ఇలా ఎందుకు అనుకోకూడదు? —ఇదీ ప్రశ్న!

దీనికి జవాబు చాలా తేలికే. ఏ సమస్యలో అయినా, మనకు ఎలా కావాలంటే అలా అనుకోవడం కాదు. అది 'తార్కికంగా' చూస్తే సరిపోవాలి. ఉదాహరణని ఆ ప్రశ్నలో చెప్పుకున్నట్టు తీసుకోవడం తార్కికంగా ఉంటుందో లేదో చూడాలి.

10 గంటల్లో ఒక్క చొక్కాని కుట్టే టూలు విలువా, 10 గంటల్లో 33 చొక్కాల్ని కుట్టే మిషను విలువా, ఒక్కలాగే ఉంటాయనీ, ఉండాలనీ, అనుకోవచ్చునా? — అది అర్థంలేని విషయం. టూలు ఉత్పాదక శక్తికన్నా మిషను ఉత్పాదక శక్తి తప్పనిసరిగా ఎక్కువగానే ఉంటుంది. కానీ, ఆ ఎక్కువగా ఉండడం, ఆ ప్రశ్నలో చెప్పుకున్న ఉదాహరణని ఇచ్చే విధంగా ఉండదు.

సరుకుకి టూలు ద్వారానూ మిషను ద్వారానూ చేరే విలువలు ఒకే రకంగా ఉండాలంటే, ముందు ఆ టూలు విలువా మిషను విలువా ఒకే రకంగా ఉండాలి. కానీ, అవి అలా ఉండవు. ఎందుకంటే, వాటి నిర్మాణాలు ఒక్కలాగే ఉండవు గనక. 10 గంటల్లో 1 చొక్కాని కుట్టే సూది నిర్మాణమూ, 10 గంటల్లో 5 చొక్కాల్ని కుట్టే మిషను నిర్మాణమూ ఒకే రకంగా ఉండవు. మిషనుకి ఎక్కువ ఉత్పాదకశక్తి ఎందుకు ఉంటుంది? దాని నిర్మాణంలో మెరుగైన ఏర్పాట్లు ఉంటాయి కాబట్టి.

ఉత్పాదక శక్తి పెరగాలంటే, పాత శ్రమ పరికరంలో కొత్త సాంకేతికతని ఇచ్చే ఏర్పాట్లు జరగాలి. పాత నిర్మాణం ఎంతో మారితే తప్ప ఉత్పాదక శక్తి పెరగదు. నిర్మాణం మారాలంటే, దాని కోసం గతం కన్నా ఎక్కువ విలువ ఖర్చవుతుంది. అంటే, ఉత్పాదక శక్తి గతం కన్నా పెరగడం అంటే, శ్రమ పరికరం విలువ కూడా గతం కన్నా పెరగడమే.

ఒక శ్రమ పరికరానికి ఫలానా ఉత్పాదక శక్తీ, ఫలానా విలువా ఉన్నట్టయితే, అంతకన్నా ఎక్కువ ఉత్పాదకశక్తిని ఇచ్చేలాగ తయారైన కొత్త శ్రమ పరికరానికి, గతం కన్నా ఎక్కువ విలువ ఉండి తీరుతుంది. అంటే, టూలుకన్నా మిషనుకి ఎక్కువ ఉత్పాదకశక్తి ఉండాలంటే, టూలు విలువకన్నా మిషను విలువ తప్పనిసరిగా ఎక్కువగా ఉండి తీరుతుంది. (అయితే, 'ఉత్పాదక శక్తి'లో పెరుగుదలా, 'విలువ'లో పెరుగుదలా ఒకే పరిమాణంలో ఉంటాయనే రూలేమీ ఉండదు. 'విలువ' 100% పెరిగినా, ఉత్పాదకశక్తి 100% పెరక్కపోవచ్చు. లేదా, విలువలో తక్కువ పెరుగుదలతోనే ఉత్పాదకశక్తి ఎక్కువగా పెరగవచ్చు. అది, ఆ 'శ్రమ'కు సంబంధించిన ప్రత్యేక సాంకేతిక పరిస్థితుల్ని బట్టి ఉంటుంది.)

పెరిగే విలువకీ, పెరిగే ఉత్పాదక శక్తికీ సంబంధం ఎలా ఉన్నా, 'టూలు'లో ఇంకా కొన్ని అదనపు మార్పులు జరగకుండా, అంటే ఇంకా ఎక్కువ విలువ ఖర్చవకుండా, దాని ఉత్పాదక శక్తి పెరగడం జరగదు.

కుట్టు మిషను ఉదాహరణలో, దాని విలువని 1 రోజుకి 33 పైసలు గానూ, దాని ఉత్పాదక శక్తిని 1 రోజుకి 5 చొక్కాలుగానూ మొదట తీసుకున్నాం. ఆ ఉదాహరణలో, 'విలువ'ని అలాగే ఉంచి, ఉత్పాదక శక్తిని మాత్రం ఇంకా పెరిగినట్టుగా తీసుకోవడం సాధ్యం కాదు. ఎందుకంటే, ఉత్పాదక శక్తిని, గతం కన్నా పెరిగినట్టుగా తీసుకోవాలంటే, మిషను విలువని కూడా పెరిగినట్టుగా

తీసుకోవాలి. ఉత్పాదక శక్తితోపాటు విలువ కూడా పెరిగినప్పుడు, ఆ కొత్త శ్రమ పరికరం నించి 1 సరుకుకి చేరే శ్రమ, గతంలో లాగే ఉండడంగాక, తప్పని సరిగా పెరిగి తీరుతుంది. కాబట్టి, ఈ విషయంలో చివరికి గ్రహించవలసింది ఏమిటంటే — టూలు ద్వారానూ, మిషను ద్వారానూ కూడా 1 సరుకుకి చేరే విలువ ఒకే రకంగా ఉండడం ఎప్పుడూ జరగదు. టూలు ద్వారా చేరే విలువ కన్నా, మిషను ద్వారా చేరే విలువ తప్పనిసరిగా ఎక్కువగా ఉండి తీరుతుంది.

ఇప్పటికి ఒక విషయం స్పష్టం. తక్కువ ఉత్పాదక శక్తిగల శ్రమ పరికరానికి బదులు, ఎక్కువ ఉత్పాదక శక్తిగల శ్రమ పరికరం వచ్చినప్పుడు, అంటే ఉత్పాదక శక్తి పెరిగినప్పుడు, 1 సరుకుకోసం పట్టే 'సజీవ శ్రమ' భాగం గతం కన్నా తగ్గడమూ, 'శ్రమ పరికరం' నించి చేరే భాగం గతంకన్నా పెరగడమూ జరుగుతాయి. ఇప్పటికి ఇంత వరకూ స్పష్టం.

ఉత్పాదక శక్తి పెరగడం — అంటే, సరుకుకి పట్టే 'మొత్తం శ్రమ'లో ఒక భాగం తగ్గడమూ, ఇంకో భాగం పెరగడమూ కాబట్టి, ఈ 2 మార్పులకూ ఎలాంటి సంబంధం ఉంటుందో చూడాలి. పెరిగే భాగానికీ, తగ్గే భాగానికీ ఉండే సంబంధం ఎలా ఉంటుంది? ఎలా ఉండాలి? ఒక భాగం ఎంత పెరుగుతుందో, ఇంకో భాగం అంత తగ్గాలా? లేక, ఒక భాగం ఎంత తగ్గుతుందో ఇంకో భాగం అంత పెరగాలా? పెరిగే భాగంకన్నా తగ్గే భాగం ఎక్కువగా ఉండాలా, తగ్గే భాగంకన్నా పెరిగే భాగం ఎక్కువగా ఉండాలా? ఈ మార్పులు ఎలా జరిగితే, ఉత్పాదక శక్తి పెరిగినట్టు అవుతుంది?

ఉత్పాదకశక్తి పెరగడం అంటే, సరుకుకి పట్టే 'మొత్తం శ్రమ' తగ్గడం కదా? ఆ 'మొత్తం'లో ఉండే వేరు వేరు భాగాల్లో మార్పులు ఎలా జరిగినా సరే, ఆ మొత్తం మాత్రం గతం కన్నా తగ్గాలి. అలా జరగకపోతే, ఉత్పాదక శక్తి పెరిగినట్టే అర్థం కాదు.

ఉదాహరణ:

టూలు విలువ 10. దాని ద్వారా 1 సరుకు తయారవడానికి, 10 గంటల కాలం పడుతుంది. అప్పటికి, ఆ టూలు పూర్తిగా పాడైపోతుందనుకుందాం. ఆ సరుకు కోసం అవసరమయ్యే 10 గంటల సజీవ శ్రమ విలువ 100. అంటే, టూలు ద్వారా తయారయ్యే సరుకుకి మొత్తం విలువ, టూలు విలువ 10 + సజీవ శ్రమ 100 = 110.

ఇలా ఉండగా, టూలుకి బదులు మిషను వచ్చింది. దాని విలువ 1,000. దీని ఉత్పాదకశక్తి, టూలుతో పోలిస్తే, 10 రెట్లు. ఈ మిషను మీద 10 గంటల కాలంలో, 1 సరుకుని గాక, 10 సరుకుల్ని తయారు చెయ్యవచ్చు. అప్పటికి మిషను పాడై పోతుందనుకుందాం. ఈ మిషను వల్ల సరుకు విలువలో మార్పు జరుగుతుందా, లేదా?

టూలు ద్వారా అయితే 10 గంటల కాలంలో ఒక్క సరుకే తయారవుతుంది. కానీ మిషను ద్వారా, అదే కాలంలో, 10 సరుకులు తయారవుతాయి. 10 గంటల సజీవ శ్రమ విలువ 100. 1 సరుకుకోసం అవసరమయ్యే సజీవ శ్రమ విలువ 10. ఈ రకంగా, ఈ మిషను, 1 సరుకుకి పట్టే సజీవ శ్రమలోనించి 90 ని తగ్గించి వేస్తుంది.

అయితే ఈ మిషను తాలూకు అరుగుదల ఖర్చుగా 1 సరుకుకి, ఎంత చేరుతుంది? మిషను విలువ 1000 కదా? అది 10 సరుకులకు చేరితే, 1 సరుకు కోసం 100 చేరుతుంది.

టూలు ద్వారానూ, మిషను ద్వారానూ కూడా, 1 సరుకు విలువనీ, 10 సరుకుల విలువనీ, చూద్దాం.

**1 సరుకు విలువ:**

| | | |
|---|---|---|
| టూలు ద్వారా — | టూలు విలువ | 10 |
| | సజీవ శ్రమ | 100 |
| | **మొత్తం** | **110** |
| మిషను ద్వారా — | మిషను విలువ | 100 |
| | సజీవ శ్రమ | 10 |
| | **మొత్తం** | **110** |

టూలు సరుకు విలువా, మిషను సరుకు విలువా ఒకే రకంగా ఎందుకు ఉన్నాయి? మిషను సరుకుకి విలువ తగ్గలేదు. ఎందుకు? ఎందుకు ఇలా జరిగిందో తెలియాలంటే - టూలు సరుకులో విలువ భాగాల్నీ, మిషను సరుకులో విలువ భాగాల్నీ పోల్చి చూస్తే తెలుస్తుంది.

మిషను సరుకులో జరిగిన మార్పు ఏమిటి?

టూలు ఖర్చు 10. మిషను ఖర్చు 100. టూలుకన్నా మిషనుకి 90 ఖర్చు ఎక్కువగా అయిందని అర్థం. అలాంటి మిషను వచ్చి ఏం చేసింది? — సజీవ శ్రమలో నించి 90 ని తగ్గించింది.

యంత్రం కోసం —90 శ్రమ ఎక్కువగా ఖర్చయితే,
ఆ యంత్రం వచ్చి— 90 శ్రమని తక్కువ చేసింది.

అంటే, యంత్రంవల్ల, సరుకు భాగాల్లో ఒక చోట 90 శ్రమ పెరిగి, ఇంకోచోట 90 శ్రమ తగ్గింది. ఇది, శ్రమ ఖర్చవడంలో స్థానాల మార్పే తప్ప ఇంకేమీ కాదు.

ఈ యంత్రం వచ్చి, సజీవ శ్రమలోనించి ఎంత భాగాన్ని తగ్గించిందో, ఆ శ్రమ అంతా ఆ యంత్రం తయారవడానికే పట్టింది. అందుకే సరుకుకి పట్టే 'మొత్తం శ్రమ' ఏమీ తగ్గలేదు. అందుకే సరుకు విలువ మారలేదు.

ఈ యంత్రం, టూలు కన్నా 10 రెట్ల ఉత్పాదక శక్తితో ఉన్నట్టు కనపడినా, నిజానికి ఈ యంత్రం ద్వారా ఉత్పాదక శక్తి ఏమాత్రమూ పెరగలేదని అర్థం. మనం విషయాలు అర్థం చేసుకోవడం కోసమే ఇలా చూశాం. నిజానికి ఇలాంటి యంత్రం అసలు ఉనికిలోకి రాదు. ఎందుకంటే, ఈ యంత్రం తన ద్వారా ఎంత శ్రమని తగ్గిస్తుందో, అంత శ్రమ ఆ యంత్రం తయారవడానికే ఎక్కువగా ఖర్చవుతుంది. అలాంటప్పుడు ఆ యంత్రం వల్ల ఏం ప్రయోజనం? ఆ యంత్రం టూలుతో సమానమైనది మాత్రమే అవుతుంది. సరుకు కోసం అవసరమయ్యే శ్రమని, టూలు ఉదాహరణలో కన్నా తగ్గించలేకపోతే, అలాంటి కొత్త శ్రమ పరికరం టూలుకన్నా మెరుగైనది అవదు. అందుకే అది ఉనికిలోకి రాదు.

ఈ ఉదాహరణలో, 'టూలు'కి బదులు ఒక యంత్రం రావాలంటే, దాని విలువ, ఇప్పుడు తీసుకున్న దాని కన్నా తక్కువగా అయినా ఉండాలి. లేదా, దాని ఉత్పాదక శక్తి, ఇప్పుడు తీసుకున్న దాని కన్నా ఎక్కువగా అయినా ఉండాలి.

టూలు కన్నా, యంత్రం కోసం ఎక్కువ శ్రమ ఖర్చవడం తప్పనిసరి. మన ఉదాహరణలో అది 90. ఆ యంత్రం వచ్చి, ఆ 90 శ్రమని మాత్రమే తగ్గించడం గాక, 90 కన్నా ఎక్కువ శ్రమని తగ్గించగలగాలి. కనీసం 91 శ్రమని అయినా తగ్గించగలగాలి. అలా జరిగితేనే, ఉత్పాదక శక్తి పెరిగినట్టు అర్థం.

లేదా, ఇంకో రకంగా చూస్తే — యంత్రం వచ్చి 'సజీవ శ్రమ'ని తగ్గించడం తప్పనిసరి. మన ఉదాహరణలో ఆ తగ్గిన సజీవ శ్రమ 90. 90 సజీవ శ్రమని తగ్గించగలిగే యంత్రాన్ని తయారు చెయ్యడానికి, టూలుకన్నా 90 శ్రమ ఎక్కువగా ఖర్చవడం గాక, అంతకన్నా తక్కువ శ్రమే ఖర్చవ్వాలి. కనీసం అది 89ని దాటకూడదు. టూలుకన్నా 89 ఎక్కువ శ్రమతో తయారైన యంత్రం వచ్చి, 90 శ్రమని తగ్గిస్తే, అది ఉత్పాదక శక్తి పెరగడమే. ఈ రకంగా, ఈ ఉదాహరణల్లో ఏదో ఒకటి జరగాలి.

అంటే, ఉత్పాదక శక్తి పెరగడం అంటే,
'శ్రమ పరికరం' విలువలో పెరుగుదలకీ,
'సజీవ శ్రమ' విలువలో తరుగుదలకీ తప్పనిసరి సంబంధం ఉంటుందన్న మాట. ఆ సంబంధం ఎలా ఉంటుందంటే,

'శ్రమ పరికరం' విలువలో పెరుగుదల కన్నా,
'సజీవ శ్రమ' విలువలో తరుగుదల — ఎక్కువగా ఉండాలి.

లేదా, 'సజీవ శ్రమ' విలువలో తరుగుదల కన్నా,
'శ్రమ పరికరం' విలువలో పెరుగుదల— తక్కువగా ఉండాలి.

టూలుకి బదులుగా వచ్చే యంత్రానికి కనీసం ఎంత ఉత్పాదకశక్తి ఉండాలంటే, (ఎంత ఉత్పాదక శక్తి ఉన్నప్పుడు మాత్రమే టూలుకి బదులుగా యంత్రం రాగలుగుతుందంటే), టూలు విలువకీ యంత్రం విలువకీ ఎంత తేడా అయితే ఉంటుందో, ఆ తేడా కన్నా ఎక్కువ విలువ గల శ్రమని తగ్గించగలిగేటంత ఉత్పాదకశక్తి ఉండాలి. యంత్రం రాకకు సంబంధించిన ప్రధానమైన సూత్రం ఇది.

**మార్క్సు మాటల్లో:**

"సరుకు విలువ, దానిలో ఉన్న 'మొత్తం శ్రమకాలం చేత' నిర్ణయమవుతుంది. ఆ శ్రమ, పాతదీ, సజీవమైనదీ కూడా. అయితే శ్రమ ఉత్పాదకతలో పెరుగుదల అంటే ఏమిటంటే — ఖచ్చితంగా, సజీవశ్రమ భాగం తగ్గడమూ; గత శ్రమ భాగం పెరగడమూనూ. ఏ రకంగా అంటే — సరుకులో ఉన్న 'శ్రమ మొత్తం' తగ్గేలాగ. వేరే మాటల్లో చెప్పాలంటే — సజీవ శ్రమలో తగ్గుదల, గత శ్రమలో పెరుగుదల కంటే ఎక్కువగా ఉంటుంది."

(కాపిటల్-3, పేజీ 260, మాస్కో ప్రతి 1971).

పెట్టుబడిదారీ విధానంలో 'నిరుద్యోగ సమస్య' తప్పనిసరిగా ఎందుకు ఏర్పడుతుందో వివరించగల విషయం ఇది. కాబట్టి, ఈ విషయాన్ని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

# పెట్టుబడిదారుడి దృష్టిలో ఉత్పాదక శక్తి

ఉత్పత్తికి పట్టే 'మొత్తం శ్రమ' ఏమాత్రం తగ్గినా, నిజానికి అది 'ఉత్పాదక శక్తి' పెరగడమే. కానీ, 'పెట్టుబడిదారీ విధానం'లో పరిస్థితి అలా ఉండదు. ఎందుకంటే — ఇప్పుడు ఒక ఉదాహరణ చూద్దాం. (ఇది మార్క్సు ఇచ్చిన ఉదాహరణే — యథాతథంగా. అయితే అందులో 'షిల్లింగులు' అన్నచోట్ల నేను 'రూపాయలు' అని మార్చాను. దీన్ని సరిగా అర్థం చేసుకుంటే, ఉత్పాదక శక్తి పెరగడానికీ, పెట్టుబడిదారీ విధానానికీ ఉండే సంబంధం తెలుస్తుంది.)

ఒక శాఖలో, సాధారణ పరిస్థితుల్లో, 1 సరుకు విలువ

వివరాలు ఇలా ఉన్నాయి అనుకుందాం:

'టూలు'గా ఉన్న ఫిక్సెడ్ సాధనం నించి సరుకుకి చేరే విలువ $\frac{1}{2}$ రూ. ముడిపదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ కలిసి $17\frac{1}{2}$ రూ. జీతాలు 2 రూ. ఇదంతా కలిసి "పెట్టుబడి'. మొత్తం 20. అదనపు విలువ రేటుని 100% అనుకుందాం. అంటే, అదనపు విలువ 2 రూ.లు. చివరికి సరుకు విలువ 22 రూ.లు.

ఈ సరుకు విలువలో — జీతాలూ, అదనపు విలువా కలిసి 4. ఇది, 'సజీవశ్రమ' విలువ. ఉత్పత్తి సాధనాల 18కి, సజీవశ్రమ 4 కూడా కలిసి, సరుకు విలువ 22 అయింది. (18C + 2V + 2S) పెట్టుబడి 20 + లాభం 2 = 22. ఇది 'టూలు' ఉదాహరణ.

పరిస్తితి ఇలా ఉండగా, సజీవ శ్రమని సగానికి తగ్గించే కొత్త యంత్రం తయారైందనుకుందాం. ఇప్పుడు, 1 సరుకుకి చేరే ఫిక్సెడ్ సాధనాల అరుగుదల విలువ గతంలో కన్నా పెరుగుతుంది కాబట్టి, దాన్ని ఇప్పుడు $1\frac{1}{2}$ అనుకుందాం. ముడిపదార్థాల భాగం మాత్రం ఇప్పుడు కూడా $17\frac{1}{2}$ గానే ఉంటుంది. (ఎందుకంటే, కొత్త యంత్రం వచ్చింది, ఈ సరుకుని తయారుచేసే పని స్తలంలోకే గానీ, ఆ ముడి పదార్థాలూ వగైరాల్ని తయారు చేసే పని స్తలాల్లోకి కాదు. కాబట్టి, వాటి విలువలు ఎప్పటిలాగే ఉంటాయి.) ఇప్పటి జీతాలు, గత జీతాల్లో సగం. అంటే 1 రూపాయి. ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, అదనపు విలువ రేటుని ఇప్పుడు కూడా 100% గానే అనుకుందాం. అంటే, ఇప్పుడు అదనపు విలువ 1 రూపాయి.

ఇప్పుడు సరుకు విలువ = ఫిక్సెడ్ $1\frac{1}{2}$ + ముడి $17\frac{1}{2}$ + జీతాలు 1 + అ. వి 1 = 21 రూ. లు. (19C + 1V + 1S). పెట్టుబడి 20 + లాభం 1 = 21. ఇది మిషన్ ఉదాహరణ.

ఈ ఉదాహరణలో 'సజీవ శ్రమ' ఎంత? 2 మాత్రమే. గతంలో, సరుకుకి, 4 సజీవ శ్రమ పడితే, ఇప్పుడు 2 మాత్రమే పట్టింది. ఇంకో 2 సజీవ శ్రమ ఖర్చు కాకుండా యంత్రం తప్పించగలిగింది. (జీతాల నించి 1 నీ, అదనపు విలువ నించి 1 నీ తగ్గించింది. 'జీతాల' నించి 1ని తగ్గించడం అంటే, కార్మికులకు ఇచ్చే జీతం పరిమాణాన్ని తగ్గించడం కాదు. కార్మికుల సంఖ్యని తగ్గించడం. ఆ రకంగా జీతాల మీద పెట్టే మొత్తాన్ని తగ్గించవచ్చు. 'జీతాల' నించి 1ని తగ్గించడం అంటే, ఇలా అర్థం చేసుకోవాలి).

అయితే, ఇప్పుడు యంత్రం వల్ల, దాని అరుగుదల ద్వారా సరుకుకి చేరే భాగం పెరిగింది. అది, గతంలో $\frac{1}{2}$ అయితే, ఇప్పుడు $1\frac{1}{2}$. అంటే 1 పెరిగింది.

ఈ కొత్త యంత్రం, తన అరుగుదల ద్వారా సరుకుకి చేర్చే విలువని ఎంతైతే పెంచిందో (1ని పెంచింది), అంతకన్నా ఎక్కువని 'సజీవశ్రమ' నించి తగ్గించింది (2ని తగ్గించింది). ఇది, 'టూలు'కి బదులు కొత్త యంత్రం రావడానికి సరిపోయే షరతే. ఆ షరతు ఇక్కడ చక్కగానే నెరవేరింది. గతంలో సరుకు విలువ 22 అయితే, ఇప్పుడు 21. ఇప్పుడు సరుకుకి పట్టే 'మొత్తం శ్రమ' తగ్గింది కాబట్టి, ఇది 'ఉత్పాదక శక్తి' పెరగడమే. కాబట్టి, 'టూలు'కి బదులుగా ఈ యంత్రాన్ని తప్పనిసరిగా ఆహ్వానించవచ్చు.

కానీ, ఏ పెట్టుబడిదారుడూ ఈ యంత్రాన్ని అంగీకరించడు. ఎందుకంటే: పెట్టిన పెట్టుబడి ఎంతా, దానిమీద 'లాభం' ఎంతా — అనే లెక్కలే పెట్టుబడిదారుడికి ముఖ్యం. అలా లెక్కలు చూసుకున్నప్పుడు, పెట్టుబడిదారుడికి, కొత్త యంత్రం వల్ల, పెట్టుబడి గతం కన్నా తగ్గడం గానీ, లాభం గతం కన్నా పెరగడం గానీ, కనపడాలి. ఇక్కడ అలా జరిగిందా?

'టూలు' ఉదాహరణలో - పెట్టుబడి 20. లాభం 2.

యంత్రం ఉదాహరణలో - పెట్టుబడి 20. లాభం 1.

పెట్టుబడిదారుడు, గతంలో, 20 పెట్టుబడి మీద 2 లాభం (అదనపు విలువ) సంపాదించగలుగుతూ ఉండగా, కొత్త యంత్రాన్ని తెచ్చి, అదే 20 పెట్టుబడి మీద, 1 లాభం సంపాదించడానికి ఎందుకు అంగీకరిస్తాడు?

లేదా, పెట్టుబడిదారుడు, తన కొత్త సరుకుని 21తోనే తయారు చేసినప్పటికీ, దాన్ని తను కూడా ఇతర పెట్టుబడిదారులలాగే 22కే అమ్మి 2 లాభం సంపాదిస్తాడనే అనుకుందాం. 2 లాభం, గతంలో టూలుద్వారా కూడా వస్తూ ఉన్నదే కదా? ఇది, ఇతర పెట్టుబడిదారులకు కూడా వస్తూ ఉన్నదే కదా? గతంలో లాగే 20 పెట్టుబడి పెట్టి, దానిమీద గతంలో లాగే 2 లాభం మాత్రమే సంపాదించడం అయితే, దానికోసం టూలుని తీసేసి యంత్రాన్ని తేవడం ఎందుకు? పెట్టుబడిదారుడి లెక్కలలో ఇదంతా 'లాభం లేని' వ్యవహారంగా అయిపోతుంది.

టూలు ద్వారా 22తో తయారయ్యే సరుకుని, యంత్రంద్వారా 21తో (గతం కన్నా 1 తక్కువతో) తయారు చెయ్యగలిగితే, అది ఉత్పాదకశక్తి పెరగడమే కదా? కానీ, ఈ విషయం పెట్టుబడిదారుడి లెక్కల్లో కనపడదు. అది వాడికి అర్థమే కాదు. దాని వల్ల, వాడికి గతంకన్నా ప్రత్యేకంగా వచ్చే లాభమేమీ ఉండదు కాబట్టి, ఆ యంత్రం మీద ఏ పెట్టుబడిదారుడికీ ఆసక్తి ఉండదు.

అయితే, పెట్టుబడిదారుడికి కొత్త యంత్రం మీద ఆసక్తి కలగాలంటే ఆ యంత్రం ఎలా ఉండాలి? — కొత్త యంత్రానికి ఇప్పుడు చెప్పుకున్న ఉత్పాదకశక్తి పెట్టుబడి

దారుడికి చాలదు కాబట్టి, దాని ఉత్పాదక శక్తి ఇంకా ఎక్కువగా ఉండాలి. సరుకు కోసం ఖర్చయ్యే పెట్టుబడిని గతంకన్నా తగ్గించడమూ, లాభాన్ని గతంకన్నా పెంచ డమూ చెయ్యడానికి ఇంకా ఎంత ఉత్పాదక శక్తి అయితే ఉండాలో, అంత ఎక్కువ ఉత్పాదకశక్తి కలదిగా ఆ యంత్రం ఉండాలి. సరుకుకి పట్టే ఖర్చుని తగ్గించి, 'రెలెటివ్ లాభాన్ని' తెచ్చేంత ఉత్పాదక శక్తిగల యంత్రాన్నే పెట్టుబడిదారుడు అంగీకరిస్తాడు.

అంటే, ఉత్పాదక శక్తి గతం కన్నా ఎంతో కొంత పెరగడం — అనేది, పెట్టుబడిదారీ విధానానికి తప్పని సరిగా ప్రయోజనకరమైన విషయం కాదు. ఆ పెరుగుదల, లాభం లెక్కలకు సరిపోయేదిగా ఉండాలి, కొత్త యంత్రం 'సజీవశ్రమ'లో నించి ఎంత ఎక్కువ భాగాన్ని తగ్గించగలి గిందీ అనేదిగాక, 'జీతాల భాగం'లో నించి ఎంత ఎక్కువ భాగాన్ని తగ్గించగలిగిందీ — అనేదే పెట్టుబడిదారుడికి అవసరమైన విషయం. 'జీతాల ఖర్చు'లో నించి ఎంత ఎక్కువ భాగాన్ని తగ్గించి వెయ్యగలిగితే, (కార్మికుల సంఖ్యని ఎంత ఎక్కువగా తగ్గించి వెయ్యగలిగితే) ఉత్పా దక శక్తి అంత ఎక్కువగా పెరిగినట్టు పెట్టుబడిదారీ అర్థం.

అయితే, సరిగ్గా ఈ అంశం దగ్గిర పెట్టుబడిదారీ విధానం మరో కొత్త వైరుధ్యంలో ఇరుక్కుంటుంది. ఎందు కంటే, 'జీతాల ఖర్చుని తగ్గించి వెయ్యడం' అంటే, అద నపు విలువని ఉత్పత్తిచేసే మార్గాన్ని కూడా తగ్గించి వెయ్యడమే కాబట్టి.

1 సరుకుని, గతంకన్నా తక్కువ విలువతో ఉత్పత్తి చెయ్యడం అంటే, అక్కడ జరిగే విషయం — కార్మికుల్ని తగ్గించివేసి, జీతాల మీద పెట్టే భాగాన్ని తగ్గించివెయ్య డమే. కానీ, కార్మికుల్లో కొందర్ని తగ్గించినప్పటికీ, గతంలో వచ్చే లాభం రాసీ, లాభం రేటూ తగ్గకూడదు. పైగా పెర గాలి. కొత్త యంత్రానికి ఎక్కువ ఉత్పాదకశక్తి ఉంటుంది కాబట్టి, 'పని'లో మిగిలిన తక్కువ మంది కార్మికులే, గతంలో కన్నా ఎక్కువ ఉత్పత్తినీ ఎక్కువ లాభాన్నీ ఇవ్వ గలుగుతారు. (ఎక్కువ లాభం ఎలా వస్తుందో 'రెలెటివ్ అదనపు విలువ' గురించి చర్చించిన చాప్టర్లో చూశాం.)

అయితే, ఆ కొత్త యంత్రాలు ఒకరిద్దరు పెట్టుబడి దారుల దగ్గిర మాత్రమే ఉండి, ఇతర పెట్టుబడిదారుల దగ్గిర లేనంతవరకూ ఇదంతా సవ్యంగానే సాగుతుంది. అంటే, ఈ యంత్రాలు గల పెట్టుబడిదారులు, 'రెలెటివ్ అదనపు విలువ'ని సంపాదించగలుగుతూ ఉన్నంత వరకూ. కానీ, ఆ పెట్టుబడిదారుడి రోజులు అలాగే ఉండి పోవు. క్రమంగా, అదే రకపు యంత్రాలు ఇతర పెట్టుబడి దారుల దగ్గిరికి కూడా ప్రవేశిస్తాయి. ఆ సరుకు, అందరి దగ్గిరా తక్కువ విలువతోనే ఉత్పత్తి అవుతూ ఉన్నప్పుడు, ఆ తక్కువ విలువే దాని 'అసలు విలువ' (కొత్త సామాజిక విలువ) అయిపోతుంది. 'రెలెటివ్ అదనపు విలువ' మాయమవుతుంది. ఆ సమస్యలో నించి బయటపడటా నికి పెట్టుబడిదారులకు కనపడే మార్గం — ఉత్పాదక శక్తిని ఇంకా పెంచడమే.

ఫలానా కొంత పెట్టుబడిని (ఉదా: ఒక 100 పెట్టు బడిని) తీసుకుంటే, అది ఉత్పత్తి చెయ్యగల అదనపు విలువ — 2 అంశాల మీద ఆధారపడి ఉంటుంది. (1) కార్మికుల సంఖ్యా, (2) అదనపు విలువ రేటూ.

'టూలు' ఉదాహరణలో, కార్మికుల సంఖ్యా, అద నపు విలువ రేటూ ఫలానా ఫలానా రకంగా ఉన్నాయను కుందాం.

టూలుకి బదులుగా యంత్రం వచ్చినప్పుడు, గతంలో ఉండే 100 పెట్టుబడినే తీసుకుంటే, దానికి సంబంధించినంత వరకూ కార్మికుల సంఖ్య గతం కన్నా తగ్గి, 'అదనపు విలువ రేటు' గతం కన్నా పెరగవలసి ఉంటుంది.

తర్వాత, ఉత్పాదక శక్తి ఇంకా పెరిగినప్పుడు, ఒక 100 పెట్టుబడినే చూస్తే, కార్మికుల సంఖ్య ఇంకా తగ్గి, అదనపు విలువ రేటు ఇంకా పెరగవలసి ఉంటుంది. ఈ క్రమం ఒక దశలో తప్పనిసరిగా వైరుధ్యంలో పడుతుంది.

'టూలు'తో పనిచేసే 24 మంది కార్మికులు, రోజూ 12 గంటల చొప్పున పనిచేస్తూ, ఒక్కొక్కరూ 1 గంట అదనపు విలువని ఇస్తే, పెట్టుబడిదారుడికి 1 రోజుకి మొత్తం 24 గంటల అదనపు విలువ దొరుకుతుంది. కానీ, ఉత్పాదక శక్తిని అపారంగా పెంచివేసిన అనేక దశల తర్వాత, ఒక కొత్త యంత్రం మీద ఇద్దరు కార్మికులే సరి పోతారనుకుందాం. ఇప్పుడు కూడా పని దినం 12 గంటలు గానే ఉందనుకున్నా, ఆ ఇద్దరు కార్మికుల నించి ఇప్పుడు కూడా 24 గంటల అదనపు విలువని తీసుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదు. ఎందుచేత? ఆ ఇద్దరు కార్మికుల మొత్తం పని కాలమే 24 గంటలు. ఆ కాలమంతా 'అదనపు విలువ'గా ఉండడం సాధ్యం కాదు. ఆ 24 గంటల కాలంలో ఆ కార్మికుల 'అవసర కాలం' పోగా మిగిలినదే అదనపు కాలం అవుతుంది. కాబట్టి, కార్మికుల సంఖ్య తగ్గిపోతూ ఉన్నప్పుడు, ఆ తక్కువ మంది ద్వారా గతం కన్నా ఎక్కువ అదనపు విలువని రాబట్టడం అసాధ్యం అవుతుంది. ఇది, కార్మికుల సంఖ్యకీ, అదనపు విలువ రాసికీ ఉండే సంబంధం.

రెండోది — అదనపు విలువ రేటు సంగతి.

అదనపు విలువ రేటు 50% ఉండడం కన్నా, 100% ఉండడం వల్ల ఎక్కువ అదనపు విలువ వస్తుంది. అదనపు విలువ రేటు 50% ఉన్నప్పుడు గానీ, 100% ఉన్నప్పుడు

గానీ కార్మికులు 10 మంది ఉండడంకన్నా 20 మంది ఉండడంవల్ల ఎక్కువ అదనపు విలువ వస్తుంది. అదనపు విలువ ఎక్కువగా రావాలంటే, కార్మికుల సంఖ్యా పెర గాలి, అదనపు విలువ రేటూ పెరగాలి. కానీ, పెట్టుబడి దారుడికి ఈ 2 అంశాల్నీ సాధించడం పెట్టుబడిని పెంచ కుండా, పాత పెట్టుబడితోనే సాధ్యం కాదు.

పెట్టుబడిదారుడు అదనపు విలువని పెంచడానికే యంత్రాన్ని తెస్తాడు. కానీ, యంత్రం తప్పనిసరిగా కార్మి కుల సంఖ్యని తగ్గించి వేస్తుంది. యంత్రం వచ్చి కార్మికుల సంఖ్యని తగ్గించినప్పటికీ, ఉన్న వాళ్ళతోటే, గతంలో కన్నా అదనపు విలువ రేటు పెరుగుతుంది. ఈ 'రేటుని పెంచడం' అనే దాన్ని, కార్మికుల్ని తగ్గించకుండా సాధించ లేడు. కార్మికుల్ని తగ్గించకపోతే అదనపు విలువ రేటుని పెంచలేడు. రెండూ సాధించాలంటే, పాత పెట్టుబడితో సాధ్యం కాదు. పెట్టుబడిని పెంచి తీరాలి. లేకపోతే ఈ సమస్యలో నించి బయటపడే మార్గమే ఉండదు. కానీ, పెట్టుబడిని పెంచి అదనపు విలువని పెంచితే, ఆ మార్గం కూడా తాత్కాలిక మార్గమే అవుతుంది.

# నిరుద్యోగానికి కారణం

పెట్టుబడిదారీ విధానంలో ఉత్పాదక శక్తుల పెరుగు దల, తప్పనిసరిగా నిరుద్యోగానికి దారితీస్తుంది. అది ఎలా జరుగుతుందో ఇప్పుడు చూస్తాం.

ఒక తివాచీల ఫ్యాక్టరీ, సంవత్సరానికి 6,000 పెట్టు బడితో పనిచేస్తోంది. టూలూ, ముడిపదార్థాలూ వగైరాల కోసం 3,000. జీతాలకోసం 3,000. ఈ జీతాలతో సంవత్స రానికి 100 మంది కార్మికులు పనిచేస్తున్నారు. 1 మనిషికి సంవత్సర జీతం — 30.

ఇలా ఉండగా, సజీవ శ్రమని సగానికి తగ్గించే కొత్త యంత్రం వచ్చింది. జీతాలలోనించే 1,500ని తీసి, కొత్త యంత్రం కోసం అదనంగా (టూలు ఖర్చు కన్నా అద నంగా) పెట్టారు. కొత్త యంత్రం వల్ల 50 మంది కార్మి కులు అవసరం లేకుండా పోయారు. ఇంకా మిగిలిన 50 మంది కార్మికులతోనే గతంలో జరిగిన పని అంతా జరుగుతుంది.

ఆ పెట్టుబడి, గతంలో — 3,000C + 3,000Vగా ఉంటే, అదే ఇప్పుడు — 4,500C + 1,500Vగా ఉంది.

ఆ పెట్టుబడితో గతంలో — 100 మంది కార్మికులు పనిలో ఉంటే, దానితో ఇప్పుడు 50 మంది మాత్రమే పనిలో ఉన్నారు. ఇంకో 50 మంది పనిలోనించి పోయారు.

అయితే 'టూలు'ని ఉత్పత్తి చెయ్యడానికన్నా, యంత్రాన్ని ఉత్పత్తి చెయ్యడానికి ఎక్కువ విలువ (ఎక్కువ శ్రమ) అవసరం కాబట్టి, యంత్రాన్ని తయారు చేసే చోట ఎంత ఎక్కువ మందికి పని ఏర్పడుతుందో చూడాలి. ఆ <u>యంత్రం వల్ల ఒక చోట 50 మందికి పనిపోయింది కాబట్టి ఆ యంత్రాన్ని తయారుచేసే చోట 50 మందికి కొత్తగా పని ఏర్పడుతుందా?</u>

అలా జరగదని మనకు ఈపాటికే తెలిసి ఉండాలి. ఎందుకంటే, టూలు కన్నా యంత్రానికి అదనంగా పట్టే శ్రమా, యంత్రం ద్వారా మిగిలే శ్రమా — సమానంగా ఉండవని ఇంతకు ముందే చూశాం. <u>యంత్రం ద్వారా మిగిలే శ్రమ కన్నా, యంత్రం కోసం ఖర్చయ్యే (టూలు కన్నా అదనంగా ఖర్చయ్యే) శ్రమ తక్కువగా ఉంటుంది.</u>

మన ఉదాహరణలో కూడా అలాగే ఉంది. ఈ యంత్రానికి టూలు కన్నా 1,500 అదనంగా పట్టింది. ఆ యంత్రం వచ్చి 1,500 జీతాల ఖర్చుని తగ్గించింది. అంటే, అది తగ్గించిన శ్రమ 1,500 మాత్రమేనా? — కాదు. ఆ 1,500 జీతాలతో పనిచేసే కార్మికులు, 1,500 శ్రమని మాత్రమే ఇచ్చి ఊరుకోరు. 'అదనపు శ్రమ'ని కూడా ఇస్తారు. అదనపు విలువ రేటుని 100% అనుకుంటే, ఆ కార్మికులు, తమ జీతాల్నీ అదనపు విలువనీ కలిసి 3,000 శ్రమని ఇస్తారు. యంత్రం వచ్చి 50 మంది కార్మికుల్ని తగ్గించిందంటే, ఆ కార్మికులు ఇచ్చే శ్రమనంతా తగ్గించిం దన్నమాట. 1,500నే కాదు, 3,000ని తగ్గించింది.

కానీ, పెట్టుబడిదారుడు, ఈ యంత్రంకోసం టూలు కన్నా ఎంత ఎక్కువగా పెట్టాలో ఆ ఖర్చునీ, ఆ యంత్రం తగ్గించే జీతాల ఖర్చునీ మాత్రమే పోల్చి చూసుకుంటాడు. వాడు ఎలా అనుకుంటాడంటే — "ఈ యంత్రం కోసం 1,500 అదనంగా పెడితే, అది వచ్చి 1,500 జీతాల ఖర్చుని తగ్గిస్తుంది. దానివల్ల ఏం లాభం? జీతాల ఖర్చుని అది ఇంకా ఎక్కువగా తగ్గిస్తే దాన్ని పెట్టుకోవచ్చుగానీ లేకపోతే ఈ యంత్రం ఎందుకూ మతిలేని పనీ?" అనుకుంటాడు.

నిజానికి, ఆ యంత్రం తగ్గించిన శ్రమ 1,500 మాత్రమే కాదు, 3,000. కానీ, ఆ సంగతి పెట్టుబడిదారు డికి పట్టదు. అర్థం కాదు. అలాంటి యంత్రాన్ని వాడు పెట్టుకోడు. కానీ, ఉదాహరణ కోసం అలాంటి యంత్రాన్ని పెట్టుబడిదారుడు పెట్టుకున్నాడనే అను

కుందాం. ఆ యంత్రాన్ని పెట్టుకుంటే, జీతాల ఖర్చు 1,500 తగ్గుతుంది కాబట్టి, టూలు ఖర్చుకి ఈ 1,500ని కూడా కలిపి ఆ మొత్తంతో యంత్రాన్ని తెస్తాడనుకుందాం. ఆ యంత్రం పనిచేసే చోట జీతాల ఖర్చు 1,500 తగ్గుతుంది కదా? అలాంటి యంత్రాన్ని తయారుచేసే చోట, ఆ 1500 ని అంతా మళ్ళీ జీతాల మీదే పెట్టడం సాధ్యమేనా? అంటే, ఒక యంత్రం రావడంవల్ల ఒకచోట కొన్ని ఉద్యోగాలు పోయినా, ఇంకోచోట (ఆ యంత్రం తయారయ్యే చోట) మళ్ళీ ఆ ఉద్యోగాలన్నీ ఏర్పడ తాయా? — అలా జరిగితే, ఈ ఉదాహరణలో నిరుద్యోగ సమస్య ఉండదు. అలా జరగకపోతే, నిరుద్యోగ సమస్య ఏర్పడి తీరుతుంది.

ఒక యంత్రం 1,500 జీతాల ఖర్చుని తగ్గిస్తే, ఆ యంత్రాన్ని తయారు చేసేచోట ఆ విలువని అంతా జీతాల మీదే పెట్టడం సాధ్యం కాదు. ఎందుకంటే, ఒక యంత్రాన్ని తయారు చేయడానికి 1,500ని (టూలుకన్నా అదనంగా) యంత్రం మీద పెట్టడం అంటే, ఆ విలువ C+V+S లుగా ఉంటుంది గానీ అదంతా Vగా మాత్రమే ఉండదు. ఆ 1,500ని, 500C + 500V + 500Sలుగా అనుకుందాం. ఆ అంశాలన్నిటినీ చెల్లించి యంత్రాన్ని కొన్నారని అర్థం. అందులో V మీద ఎంత ఉందో అది మాత్రమే యంత్రాన్ని తయారుచేసే చోట కొత్త పనులు ఏర్పరుస్తుంది. 500Vతో ఎంతమంది కార్మికులు పని చెయ్యగలరు? తివాచీల ఫ్యాక్టరీలో ఉన్న సగటు జీతాల లెక్కనే ఇక్కడ కూడా తీసుకుంటే, 1 మనిషికి సంవత్స రానికి 30 జీతం లెక్కన, 500తో 17 మందికి మాత్రమే పనులు ఏర్పడతాయి. ఆ కొత్త యంత్రాల్ని తయారు చేసే చోట 17 మంది కార్మికులు 500C మీద (ఉత్పత్తి సాధనాల మీద) పని చేస్తూ, 500 V + 500 Sలను ఇస్తారు. ఆ విధంగా, ఆ యంత్రం తయారైనప్పుడు, దాని కోసం టూలు కన్నా అదనంగా 1,500 శ్రమ పడుతుంది.

ఈ మొత్తం ఉదాహరణలో, కొత్త యంత్రం వచ్చిన తివాచీల ఫ్యాక్టరీలో 50 మందికి పనులుపోతే, ఆ యంత్రాన్ని తయారుచేసే చోట, కొత్తగా 17 మందికి పనులు ఏర్పడతాయి. 50 - 17 = 33 మంది, ఆ యంత్రం వల్ల, 'నిరుద్యోగులు'గా మారితీరతారు.

ఈ 33 మంది నిరుద్యోగులకూ కూడా మళ్ళీ పనులు కల్పించాలంటే, ఇదే రకపు ఇంకా 2 యంత్రాల్ని తయారు చేసే పనుల్లో వారిని పెట్టాలి.

ఆ 2 యంత్రాలూ వెళ్ళిన ఇంకో 2 తివాచీల ఫ్యాక్ట రీల నించి 50 + 50 = 100 మంది కార్మికులు కొత్తగా నిరుద్యోగులవుతారు.

ఆ 100 మందికీ కొత్త పనులు ఏర్పడాలంటే, ఇంకా 6 కొత్త యంత్రాల్ని తయారుచేసే పనుల్లో వారిని పెట్టాలి. ఆ 6 కొత్త యంత్రాలు మళ్ళీ నిరుద్యోగుల్ని తయారు చేస్తాయి. ఈ రకంగా ఈ పరిష్కారం, సమస్యని రెట్లు రెట్లుగా పెంచివేస్తూ పోతూ ఉంటుంది. — ఇది, ఒక్క యంత్రం సంగతి. ఏ శాఖలో యంత్రాన్ని తీసుకున్నా ఇలాగే జరుగుతుంది. ఒక యంత్రం వచ్చి ఎంతమంది కార్మికుల్ని తగ్గిస్తుందో అంతమంది కార్మికులకూ ఆ యంత్రాల తయారీవల్ల కొత్త పనులు ఏర్పడవు. ఎందు కంటే, ఒక యంత్రం తగ్గించే శ్రమకన్నా ఆ యంత్రం తయారీకోసం అవసరమయ్యే శ్రమ తక్కువగా ఉంటుంది. అలా ఉంటేనే ఆ యంత్రం అమలులోకి వస్తుంది. లేకపోతే ఆ యంత్రం వల్ల ఉపయోగమే ఉండదు.

పత్తినించి గింజలు తీసే మిషను లేనప్పుడు, 1 కార్మి కుడు, 1 పని దినంలో, 1 కిలో పత్తినించి గింజలు తీసే వాడనుకుందాం. గింజలు తీసే మిషను వచ్చాక 1 పని దినంలో ఆ మిషనుతో 100 కిలోల పత్తినించి గింజలు తియ్యగలడనుకుందాం. 100 మంది చెయ్యగలిగే పనిని, ఒకే మనిషి చేసే విధంగా ఉత్పాదకశక్తి పెరిగిపోయింది. ఇప్పుడు 1 మనిషి 100 రెట్ల ముడిపదార్థంతో పనిచెయ్య గలుగుతాడు. ఇప్పుడు, ఆ పని స్థలంలో 99 మంది కార్మికులు అనవసరం అవుతారు.

అయితే ఒక పనిలోకి ఒక కొత్త యంత్రం రావడం వల్ల, దానికి ఎక్కువ ముడి పదార్థాలు అవసరమవుతాయి కాబట్టి, ఆ ముడి పదార్థాన్ని ఉత్పత్తి చేసే శాఖల్లో పనులు పెరుగుతాయి. కానీ, ఆ రకంగా పనులు పెరగడం అనేది వేరే సంగతి. అక్కడ వేరే పెట్టుబడులు పని చేస్తాయి. అది వేరే సంగతి. దాన్ని తర్వాత చూస్తాం. ఇక్కడ, ఏ యంత్రాన్ని చూస్తున్నామో, ఆ యంత్రం కోసం కొంత ఎక్కువ పెట్టుబడి పెట్టాలి కాబట్టి, ఆ పెట్టుబడి వల్ల పనులు పెరుగుతాయా లేదా అనేది చూడాలి. అలా చూస్తే, ఏ యంత్రం వల్లా పనులు పెరగవు. యంత్రం వస్తే, ఆ పని స్థలం నించి అనేక మంది కార్మికులు బయటికి పోయి తీరవలసిందే.

కొంత పెట్టుబడితో పనిచేసే పెట్టుబడిదారుడు, తన ఫ్యాక్టరీలోకి కొత్త యంత్రాన్ని తెచ్చినప్పుడు, పాత కార్మికులందర్నీ ఉంచుతాడా, కొందర్ని తీసేస్తాడా అనేది, వాడు పాత పెట్టుబడితోనే పనిచెయ్యదలిచాడా, పెట్టు బడిని పెంచదలిచాడా — అనే దాన్ని బట్టి ఉంటుంది. పాత కార్మికులందర్నీ పనిలో ఉంచాలంటే, పెట్టుబడిని పెంచకుండా సాధ్యం కాదు.

# కొత్త యంత్రం వస్తే నిజానికి ఏం జరగాలి?

ఒక పని స్థలంలోకి సజీవ శ్రమని కొంత తగ్గించే కొత్త యంత్రం వచ్చినప్పుడు, నిజానికి అక్కడ శ్రమచేసే మనుషుల జీవితాల్లో ఎలాంటి మార్పు జరగాలి? వారి శ్రమ కాలం కొంత తగ్గిపోవాలి. అంతే కదా?

ఒక పని స్థలంలో కార్మికులు 20 మంది. పనిదినం 12 గంటలు. సజీవ శ్రమని సగానికి తగ్గించే కొత్త యంత్రం వచ్చింది. ఆ కార్మికులు ఇప్పుడు 6 గం.లు పనిచేస్తే, గతంలో చేసినంత ఉత్పత్తినీ చెయ్యగలరు. ఇంకో గంట ఎక్కువ సేపు చేస్తే ఉత్పత్తిని కొంత పెంచ వచ్చు కూడా. ఆ తర్వాత వారు పని ఆపేసి వెళ్ళిపోవచ్చు. మిగిలిన కాలం అంతా వారికి విశ్రాంతి కాలంగా ఉండ వచ్చు. లేదా, ఆ కాలాన్ని వారు చదువులకో, కళలకో ఉపయోగించుకుంటారు. ఇలా జరిగితే గతంలో లాగే అందరూ (ఆ 20 మందీ) పనుల్లో ఉంటారు. అందరికీ శ్రమకాలం తగ్గిపోతుంది. ఇలా జరిగితే, శ్రమని తగ్గించే యంత్రం వచ్చిన ఫలితం, శ్రమ చేసే మనుషులకు అందినట్టు అవుతుంది.

కానీ పెట్టుబడిదారుడి దగ్గిర అలా జరగదు. వాడు, కొత్త యంత్రాన్ని తెచ్చేది, కార్మికుల శ్రమనీ పనికాలాన్నీ తగ్గించడానికి కాదు; తన లాభాల్ని పెంచుకోవడానికి మాత్రమే. కాబట్టి, ఈ ఉదాహరణలో వాడేం చేస్తాడంటే, గతంలో ఉన్న 20 మంది కార్మికుల్లోనించి 10 మందిని తీసివేసి మిగిలిన 10 మందితోనే గతంలో లాగే 12 గంటలూ పని చేయిస్తాడు. ఆ 'పని'లో ఉన్నవాళ్ళు కొత్త యంత్రం దగ్గిర దాని కదలికలకు అనుగుణంగా గతం కన్నా తీవ్రతతో పని చెయ్యాలి. అంటే, కొత్త యంత్రం రావడం వల్ల, కార్మికుల్లో కొందరికి నిరుద్యోగమూ, కొందరికి పని తీవ్రతా, ప్రమాదాలూ — అన్నమాట!

ఉత్పాదక శక్తిని రెట్టింపుగా పెంచిన కొత్త యంత్రం వల్ల ఎవరికి లాభం జరిగింది? కార్మికులకా, పెట్టుబడి దారుడికా? — వేరే చెప్పాలా?

పెట్టుబడిదారీ విధానంలో, పెరిగే ఉత్పాదకశక్తి, కార్మికుల సంఖ్యని తగ్గించి వేస్తుందని చూపించే ఇంకో ఉదాహరణ:

ఒక పెట్టుబడి 600. దాని స్థిర, అస్థిరలు = 1:1. అంటే 300 స్థిర; 300 అస్థిర. కార్మికుల సంఖ్య 100. ఒక్కో కార్మికుడికి 1 రోజుకి జీతం 3. ఇలా ఉండగా కొత్త యంత్రం వచ్చింది. దాని కోసం 400 కొత్త పెట్టుబడిని పనిలోకి దించారు. అందులో నించి 300 ని స్థిర మీదా, 100 ని అస్థిర మీదా పెట్టారు. కార్మికుల్ని పెంచలేదు. తగ్గించలేదు. పాత కార్మికులంతా పనిలో ఉన్నారు. కొత్త యంత్రం అంటే పెరిగిన ఉత్పత్తి శక్తి కాబట్టి, ఇప్పుడు 1 కార్మికుడి జీతం 4. అయితే ఇప్పుడు కొత్త యంత్రం వల్ల ఏం జరిగినట్టు? — ఏం జరిగిందో తెలియాలంటే, పాత, కొత్త పెట్టుబడుల్ని కలిపి చూడాలి.

ఆ 2 పెట్టుబడులూ కలిసి— 600 + 400 = 1,000.

వాటి స్థిర, అస్థిరలు = 600 : 400. వాటి పాళ్ళు, 3 : 2. ఇప్పుడు. పెట్టుబడి మొత్తం పెరిగి, అది 1,000 అయినా, దానితో, గతంలో లాగే 100 మంది కార్మికులు మాత్రమే పనిలో ఉన్నారు. ఇంత పెట్టుబడి, పాత ఉత్పాదక శక్తితోనే పని చేస్తూ ఉండి ఉంటే, అందులో నించి స్థిర మీద 500; అస్థిర మీద 500 ఉండేవి. 500 అస్థిరతో, పాత జీతాల లెక్కన, 167 మందికి ఉద్యోగాలు ఏర్పడేవి. కానీ ఇప్పుడు 400 కొత్త పెట్టుబడి పనిలోకి దిగినా కూడా ఉద్యోగాలు పెరగలేదు. పాత ఉద్యోగాలు మాత్రమే నిల బడ్డాయి. పెట్టుబడి పెరిగినా ఉద్యోగాలు పెరగలేదంటే, అది కూడా నిరుద్యోగ సమస్యే. ఉత్పాదక శక్తి ఇంకా పెరిగితే, కొత్త పెట్టుబడి వచ్చినా, పాత ఉద్యోగాలు కూడా నిలబడకపోవచ్చు.

పాత ఉత్పాదకశక్తి మారకుండా ఉండగా పెట్టుబడిని పెంచితే, కార్మికుల సంఖ్య తప్పనిసరిగా పెరుగుతుంది. కానీ, ఉత్పాదకశక్తిని పెంచడానికే పెట్టుబడిని పెంచితే, అది కార్మికుల సంఖ్య పెరగడానికి పనికి రాకపోగా గతంలో పనిచేసే కార్మికుల్లో చాలా మందికి ఉద్యోగాలు నిలబడని పరిస్థితి కూడా ఏర్పడుతుంది. పెట్టుబడిదారీ విధానంలో జరిగేది ఎప్పుడూ ఈ రెండో పద్ధతే. పెట్టుబడి దారులంతా కొత్త పెట్టుబడుల్ని రంగంలోకి దించేది ఉత్పాదక శక్తుల్ని పెంచడానికే. కొత్త పెట్టుబడి వచ్చాక, మొత్తం పెట్టుబడి పాళ్ళు మారిపోతాయి. కొత్త పెట్టుబడి కూడా చేరడంవల్ల, మొత్తం పెట్టుబడిలో స్థిర, అస్థిరలు రెండూ పెరిగినా, 'స్థిర'లో పెరుగుదల ఎక్కువ గానూ, 'అస్థిర'లో పెరుగుదల తక్కువగానూ ఉంటుంది.

'ఉత్పాదక శక్తి పెరగడం' గురించి చూసేటప్పుడు — యంత్రం, టూలుకన్నా ఎక్కువ శ్రమతో తయారవు

తుంది కాబట్టి, విషయాన్ని అంతవరకే చూస్తే, కొత్త యంత్రాల్ని తయారుచేసే శాఖల్లో ఎక్కువ ఉద్యోగాలు ఏర్పడతాయి - అన్నట్టు కనపడుతుంది. కానీ, 'యంత్రం, తన కోసం ఖర్చయ్యే (టూలు కన్నా అదనంగా ఖర్చయ్యే) శ్రమ కన్నా ఎక్కువ శ్రమని తగ్గిస్తుంది' — అనే విషయం కూడా చూస్తేనే, యంత్రాల వల్ల ఏం జరుగుతుందో అర్థం చేసు కోవడం సాధ్యం.

యంత్రాలు వచ్చి కార్మికుల్ని పని లోంచి తీసి వెయ్యడం — అనే విషయం, అనేక వైరుధ్యాలతో సాగు తుంది. యంత్రాలు, అన్ని శాఖలలోకీ, ఒకే సారి రావు. అంటే, అన్ని శ్రమలలోకీ ఒకే సారి రావు. ఒక శ్రమలోకి కొత్త యంత్రం వచ్చినప్పుడు, అది గతం కన్నా ఎక్కువ ఉత్పాదక శక్తితో ఉంటుంది కాబట్టి, ఆ శాఖలోకి, ముడి పదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ, వాటిని స్టోరుచేసే ఏర్పాట్లూ కూడా అనేక రెట్లు ఎక్కువగా అందాలి. ఆ ముడిపదార్థాల్నీ ఆగ్జిలరీ పదార్థాల్నీ ఉత్పత్తిచేసే శాఖల్లో ఇంకా యంత్రాలు ఉండవుగనక, అక్కడ కార్మికుల అవసరం ఎక్కువవుతుంది. అక్కడే కాదు; యంత్రం ద్వారా తయారయ్యే ఉత్పత్తి, ఏ శాఖల్లోకి ముడి పదార్థంగా వెళ్తుందో, ఆ శాఖల్లో కూడా కార్మికులతో అవసరం ఎక్కు వవుతుంది.

ఆ ముడి పదార్థాలూ వగైరాల శాఖల్లో, ఎక్కువ సరుకుని ఉత్పత్తి చెయ్యడంకోసం ఎక్కువ పెట్టుబడులు పెడతారు. అక్కడ పనులు పెరుగుతాయి. అక్కడ ఆ పనులు పెరగడం, కొత్త పెట్టుబడుల వల్ల (పెట్టుబడి పెరగడం వల్ల) జరిగిందేగానీ పాత పెట్టుబడులతోనే జరిగింది కాదు. అంతేగాక, ఆ శాఖల్లో పనులు పెరగడం, మనం ఏ యంత్రం గురించి మాట్లాడుతున్నామో ఆ యంత్రం మీద పెట్టిన ఎక్కువ పెట్టుబడి వల్ల జరిగేది కాదు. ఒక శాఖలో, ఉత్పత్తి శక్తి మారకుండా పెట్టుబడిని పెంచితే, అక్కడ కొత్త పనులు ఏర్పడడంలో వింత ఏముంది? ఆ శాఖల్లో అదే జరిగింది.

ఏ శాఖలో అయినా పాత ఉత్పాదక శక్తితో మాత్రమే, పాత పెట్టుబడితో మాత్రమే పని చేస్తే, అక్కడ పాత పనులు మాత్రమే ఉంటాయి.

ఒక శాఖలోకి కొత్త యంత్రాలు ప్రవేశించడం అంటే, దానికి సంబంధించిన అనేక శాఖల్లోకి కొత్త పెట్టుబడులు ప్రవేశిస్తున్నాయనీ, ఆ కారణం వల్లనే ఆ ఇతర శాఖల్లో కార్మికుల సంఖ్య గతం కన్నా పెరుగుతోందనీ, సమా జంలో మొత్తం పెట్టుబడీ, దాని ఉత్పత్తి స్థాయీ పెరుగు తున్నాయనీ అర్థం.

యంత్రాలు వచ్చిన శాఖలో ఉద్యోగాలు పోగొట్టు కున్న కార్మికులకు, ఇంకా యంత్రాలు లేని, మొదటి శాఖకు సంబంధిత శాఖల్లో ఉద్యోగాలు దొరకడానికి అవకాశాలు ఉంటాయి. అయితే, ఆ శాఖల్లో ఉద్యోగాల పెరుగుదల ఏ స్థాయిలో ఉంటుందీ అనేది, యంత్రం వచ్చిన శాఖలో ఏర్పడిన కొత్త ఉత్పాదక శక్తికీ, ఇంకా యంత్రాలు లేని శాఖల్లో ఉన్న పాత ఉత్పాదక శక్తులకూ ఉన్న తేడాల్ని బట్టి, ఉంటుంది. ఒకచోట ఉత్పాదక శక్తి రెట్టింపు అయితే, ఇంకోచోట కొత్త ఉద్యోగాలు రెట్టింపు అవుతాయని లేదు. ఆ ఇతర శాఖల్లో పని దినాలూ పని తీవ్రతలూ ఏమాత్రం పెరిగినా, పాత కార్మికులతోనే ఎక్కువ పని జరుగుతుంది. కొత్త కార్మికులతో అవసరమే రాకపోవచ్చు. లేదా ఇతర శాఖల్లో ఉద్యోగాలు పెరగ వలసిన అవసరమే కలిగితే, అది ఎంతకాలం వరకూ సాగు తుందంటే, ఆ శాఖల్లోకి కూడా యంత్రాలు వచ్చేవరకే. అప్పటివరకే ఆ శాఖల్లో కార్మికుల అవసరం ఎక్కువగా ఉంటుంది. మొదటి శాఖకు కావలసిన ముడిపదార్థాలూ వగైరాల్ని త్వరత్వరగా అందించడం అనే అవసరం, ఆ శాఖల్లో కూడా యంత్రాల ప్రవేశాన్ని ప్రోత్సహిస్తుంది. కానీ, నిరుద్యోగులైన కార్మికులు, చాలా తక్కువ జీతాలతో పని చెయ్యడానికి సిద్ధంగా ఉంటారు. కాబట్టి, ఆ పరిస్తితి అక్కడ యంత్రాల ప్రవేశాన్ని అడ్డుకోవచ్చు కూడా.

ఈ విధంగా, ఒక శాఖలోకి ఒక యంత్రం రావడంతో, దానికి ఇటూ అటూ ఉన్న శాఖల్లో కూడా యంత్రాలు రావడానికీ, రాకపోవడానికీ కూడా పరస్పర విరుద్ధమైన పరిస్తితులు ఏర్పడతాయి. ఏ మార్పు జరగడానికైతే పరిస్తితులు ఎక్కువ అనుకూలంగా ఉంటాయో — దాన్ని బట్టి, ఆ ఇతర శాఖల్లో యంత్రాలు తొందరలోనే రావడం గానీ, కొంత కాలం వరకూ రాకపోవడం గానీ, జరుగు తుంది. ఈ రకంగా, మొత్తం ఉత్పత్తి శాఖలన్నిటిలోనూ, ఉత్పాదక శక్తులు రక రకాలుగా మారుతూ ఉన్నప్పుడల్లా, కార్మికులకు ఒక పక్క పనులు దొరికే పరిస్తితులూ, ఇంకో పక్క పనులు పోయే పరిస్తితులూ కూడా ఏర్పడుతూ ఉంటాయి. సమాజం మొత్తం మీద ఒక 'సామాజిక ఉత్పాదక శక్తి', ఇంకో సామాజిక ఉత్పాదకశక్తిగా మారే సరికి, సమాజంలో తప్పనిసరిగా కొంత 'నిరుద్యోగ జనాభా' ఏర్పడి ఉంటుంది.

దారం వడికే యంత్రం (స్పిన్నింగ్ జెన్నీ) వచ్చినప్పుడు, దానితో పాటే నేత శాఖలోకి 'మరమగ్గం' రాలేదు. దారం వడికే శాఖలోకి యంత్రం రావడంతో, ఆ శాఖకి పత్తిని అందించే 'వ్యవసాయ' శాఖలోనూ, వడికిన దారాన్ని ముడి

పదార్థంగా వాడే నేత శాఖలోనూ పనులు విపరీతంగా పెరిగాయి. కానీ, పనుల్లో ఆ పెరుగుదల అంతా ఆ ఇతర శాఖల్లో కూడా యంత్రాలు వచ్చేవరకే సాగింది. ముఖ్యంగా 'మర మగ్గం' రావడంతో, చేతి మగ్గాల మీద పనిచేసే నేత కార్మికుల పనులు పోవడం పెద్ద ఎత్తున సాగింది. పత్తి పండించే శాఖలోనూ, దారం వడికే శాఖ లోనూ, బట్టలు నేసే శాఖ లోనూ కూడా పూర్తిగా యంత్రాలు రావడంతో, ఆ శాఖలన్నీ కార్మికుల్ని బైటికి తరిమాయి. ఆ శాఖల్లో ఉత్పాదక శక్తులు మళ్ళీ మారుతూ ఉన్నప్పుడు, అవి మళ్ళీ కార్మికుల్ని పనుల్లోకి తీసుకోవ డమూ, కొంత కాలానికి మళ్ళీ బైటికి గెంటెయ్యడమూ చేస్తూ ఉంటాయి.

యంత్రాల నిర్మాణం ప్రారంభమైన కొత్తలో యంత్రాలు తయారవడానికీ నడవడానికీ ఇనుమూ బొగ్గూ చమురూ కావాలి కాబట్టి, లోహపు గనుల్లోనూ, బొగ్గూ చమురూ గనుల్లోనూ, లక్షల కొద్దీ కార్మికులు అవసర మయ్యారు. క్రమంగా, ఆ శాఖలన్నిటిలోకీ, యంత్రాలు రావడంతో, అటు నించి నిరుద్యోగుల ప్రవాహాలు ప్రారంభమయ్యాయి.

కుట్టు మిషను రాకముందు, కుట్టుపని వారి సంఖ్య ఎంతో ఎక్కువగా ఉండేది. కుట్టుమిషన్ వచ్చాక, కుట్టు పనిలో అంత సంఖ్య అనవసరం అయింది. కుట్టుమిషను — దుస్తులూ, మేజోళ్ళూ, సంచులూ, టోపీలూ తయారు చేసే పనులన్నిటిలోకీ ప్రవేశించింది.

కొత్త యంత్రానికి సంబంధించిన 'ఉత్పాదకశక్తి'ని కనిపెట్టడానికి ఏడెనిమిది విషయాల్ని తీసుకుని లెక్కలు కట్టాలి. (1) పాత యంత్రం విలువ (2) కొత్త యంత్రం విలువ (3) పాత యంత్రం జీవిత కాలం (4) కొత్త యంత్రం జీవిత కాలం (5) పాత జీతాలు (6) కొత్త జీతాలు (7) పాత యంత్రం ద్వారా జరిగే ఉత్పత్తి (8) కొత్త యంత్రం ద్వారా జరిగే ఉత్పత్తి (9) పాత అదనపు విలువ రేటు — ఇన్ని విషయాల్ని తీసుకుంటే, కొత్త యంత్రం ఉత్పాదక శక్తి తెలుస్తుంది. 1 విడి వస్తువు విలువ ఎంత తగ్గుతుందో తెలుస్తుంది.

యంత్రం తయారవడానికి పట్టేకాలం తగ్గిపోతోన్న కొద్దీ దాని ఉత్పాదకశక్తి పెరుగుతూ ఉంటుంది. యంత్రాల్ని తయారుచేసే పని, మొదట చేతి పనిముట్ల తోనే ప్రారంభమైంది. క్రమంగా, యంత్ర భాగాల్ని తయారు చెయ్యడానికి కూడా యంత్రాలు తయార య్యాయి. యంత్రాలు, యంత్రాల ద్వారానే తయారై నప్పుడు, ఆ తయారయ్యే కొత్త యంత్రానికి పట్టే శ్రమ కాలం చాలా తగ్గి, ఆ యంత్రం ద్వారా 1 సరుకుకి చేరే శ్రమ కూడా తగ్గుతుంది.

'1 సరుకు'కి,

(1) 'టూలు' ద్వారా చేరే శ్రమా,

(2) 'టూలుతో తయారైన యంత్రం' ద్వారా చేరే శ్రమా, (ఈ యంత్ర భాగాలన్నిటినీ టూళ్ళతోనే చేశారని అర్థం)

(3) 'యంత్రంతో తయారైన యంత్రం' ద్వారా చేరే శ్రమా,

ఈ 3 విషయాలూ ఎలా ఉండవచ్చునో ఒక ఉదా హరణ చూద్దాం. 1 సరుకుకి,

(1) 'టూలు' ద్వారా చేరే శ్రమ 1 గంట

(2) 'టూలుతో తయారైన యంత్రం' ద్వారా చేరే శ్రమ 2 గం.లు

(3) 'యంత్రంతో తయారైన యంత్రం' ద్వారా చేరే శ్రమ $1\frac{1}{2}$ గం.

ఈ ఉదాహరణల ద్వారా ఏం గ్రహించగలం?

'టూలు'కి బదులుగా యంత్రం వచ్చినప్పుడు, (ఉత్పాదకశక్తి పెరిగినప్పుడు), సరుకుకి 'శ్రమ పరికరం' ద్వారా చేరే శ్రమ పెరగడం — అనివార్యం. అలా జరగ కుండా చెయ్యడం సాధ్యం కాదు. అయితే, ఆ కొత్త శ్రమ పరికరం కూడా యంత్రాల ద్వారా తయారైనది అయితే అది తక్కువ శ్రమతో తయారవుతుంది కాబట్టి, సరుకుకి ఆ పరికరం ద్వారా చేరే శ్రమ మరీ ఎక్కువగా ఉండ కుండా కొంత తగ్గుతుంది. అందుకే, టూళ్ళ ద్వారా తయారైన యంత్రం నించి చేరే శ్రమ 2 గంటలు అయితే, యంత్రంతో తయారైన యంత్రం నించి చేరే శ్రమ $1\frac{1}{2}$ గంటలుగా మాత్రమే ఉంది. కానీ, ఇది కూడా, 'టూలు' ద్వారా చేరే శ్రమ కన్నా ఎక్కువే. అయినప్పటికీ ఈ రెండో యంత్రం, సరుకుకి చేరే శ్రమని, మొదటి యంత్రం కన్నా తగ్గించింది. అంటే, యంత్రాల్ని యంత్రా లతో తయారు చేసినప్పుడు, యంత్ర ఉత్పత్తి విధానం, దాని కాళ్ళ మీద అది నిలబడగల సాంకేతిక పరిస్థితి ఏర్పడుతుంది.

స్మిత్తు ఇచ్చిన ఒక ఉదాహరణ ప్రకారం, మాన్యు ఫాక్చర్ శ్రమ విభజనతో, 10 మంది మనుషులు, ఒక రోజులో, 48 వేల కుట్టు సూదులు చేసేవారు. అంటే ఒక్కొక్క మనిషీ సుమారుగా రోజుకి 5 వేల సూదులు. తర్వాత కాలంలో వచ్చిన సూదుల్ని తయారుచేసే యంత్రం (నీడిల్ మేకింగ్ మెషీన్) 11 గంటల పని దినంలో, 1 లక్షా, 45 వేల సూదులు చేస్తుంది. అలాంటి యంత్రాల్ని నాలుగింటిని ఒక చిన్న పిల్లవాడు కూడా

నడపవచ్చు. అంటే, ఆ మిషన్ మీద, ఒక మనిషి రోజుకి దాదాపు 6 లక్షల సూదులు చెయ్యవచ్చు. ఒక మనిషి రోజుకి 5 వేలు ఎక్కడ! 6 లక్షలు ఎక్కడ! ఉత్పాదకశక్తి, 120 రెట్లు పెరిగింది! ఈ రెండో యంత్రం మార్పు కాలంలో ఉదాహరణ. ఈ నాడు ఉన్న యంత్రాల్ని చూస్తే వాటి ఉత్పాదకశక్తి ఇంకెన్ని వందల రెట్లు ఉంటుందో! యంత్రాల ద్వారా ఇంత అధిక ఉత్పాదకత సాధ్యమవుతుంది కాబట్టే, యంత్ర విధానం, ఇతర విధానాలన్నిటినీ నాశనం చెయ్యగలుగుతుంది.

పెట్టుబడిదారుడు తన పని స్థలంలోకి కొత్త యంత్రాన్ని తెచ్చే ప్రతీసారీ 'దీనివల్ల లాభం పెరుగుతుందా, లేదా' అనే షరతు మీదే ఆ పని చేస్తాడు. అంతే గానీ, 'కార్మికుల శరీర కష్టాన్ని తగ్గించడం' అనే దృష్టితో కాదు ఆ పని చేసేది.

కార్మికులతో సమ్మెలూ వగైరా 'తలనొప్పులు' ఎక్కువగా ఉంటే, పెట్టుబడిదారుడు మరింత తప్పనిసరిగా యంత్రంవేపే మొగ్గుతాడు. తన దగ్గిర ఎక్కువ కార్మికులు చేరడంకన్నా, తక్కువ కార్మికులతోనే పని జరగడం మంచిదనుకుంటాడు. 'యంత్రాలు సమ్మెలు చెయ్యవుగదా' అనుకుంటాడు. ఆ యంత్రం మీద పనిచేసే ఒక్క కార్మికుడే సమ్మె చేసినా యంత్రం పడుకుంటుందనే స్పృహ వాడికి ఉండదు. కార్మిక సమస్యకు పరిష్కార మార్గాల కోసం, పెట్టుబడిదారుడు, 'సామాజిక శాస్త్రం'లో గాక, 'యంత్ర శాస్త్రం'లో వెతుకుతాడు.

# యంత్రంతో కార్మికుల సంబంధం

**యం**త్రానికి ఉన్న ప్రతీ లక్షణమూ కార్మికుల శారీరక మానసిక ఆరోగ్యాలతో ముడిపడి ఉంటుంది. యంత్రం స్పీడుగా కదిలితే, కార్మికులు స్పీడుగా కదలాలి. యంత్రం పెద్ద మోతతో నడిస్తే కార్మికులు ఆ మోతని భరిస్తూ పనిచెయ్యాలి. యంత్రం తీవ్రమైన ఉష్ణోగ్రతతో నడిస్తే, కార్మికులు ఆ అగ్నిలో నిలబడి పనిచెయ్యాలి. యంత్రం ఏ పద్ధతిలోకి మారితే కార్మికుల కదలికలు ఆ పద్ధతిలోకి మారాలి. రోజుకి 100 వస్తువులు తయారుచేసే యంత్రం దగ్గిర చెయ్యవలసిన పనికన్నా, 200 వస్తువులు తయారు చేసే యంత్రం దగ్గిర చెయ్యవలసిన పని రెట్టింపు అవుతుంది, యంత్రంలోకి ముడిపదార్థాల్ని పంపడంతో ప్రారంభించి అన్ని పనులూ రెట్టింపు అవుతాయి. కార్మికుల జీతాలు ఎంత పెరిగాయి అన్నది ప్రశ్న కాదు ఇక్కడ. ఇది పూర్తిగా శరీర కష్ట సుఖాల ప్రశ్న.

చేతి పనిముట్లతో పనిచేసేటప్పుడు కార్మికుల కదలికలు కార్మికుల ఇష్టాల్ని బట్టే ఉంటాయి గానీ పనిముట్లని బట్టి ఉండవు. అక్కడ పెట్టుబడిదారుడు కార్మికుల కదలికల్ని తన ఇష్టానుసారం పెంచలేడు. కానీ, యంత్రం దగ్గిర అయితే కార్మికుల కదలికలు యంత్రాన్ని బట్టి ఉంటాయి. ఈ సాంకేతిక పరిస్థితిని పెట్టుబడిదారుడు తన స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటాడు. కార్మికుడితో ఎక్కువ పని చేయించడానికి, యంత్రాన్ని ఎక్కువ వేగంగా తిరిగేలాగ తయారు చేయిస్తే చాలు. యంత్రంలో స్పీడుకి సంబంధించిన ఏదో ఒక మార్పు చేయిస్తే చాలు. 'ఎక్కువ పని చెయ్యండి' అని కార్మికులతో అనక్కరలేకుండానే ఎక్కువ పని జరుగుతుంది.

యంత్రానికి ఎంత వేగం ఉండాలీ, దాని నిర్మాణం ఎలా ఉండాలీ— అనే విషయాల్లో పెట్టుబడిదారీ యంత్రకారులు, (ఇంజనీర్లు) ఆ యంత్రం దగ్గర పని చెయ్యవలసిన కార్మికుల శారీరక మానసిక ఆరోగ్యాల్ని దృష్టిలో పెట్టుకోరు. (ఆ ఇంజనీర్లు కూడా కార్మికులే. కాకపోతే వాళ్ళు మేధా శ్రమల కార్మికులు.) 'కార్మికుడు చేతిని ఇటు నించి అటు కదపటానికి ఇన్ని సెకన్లు చాలు, కాలిని కదపటానికి ఇన్ని సెకన్లు చాలు' — అనే లెక్కలతో ఇంజనీర్లు యంత్ర వేగాన్నీ దాని కదలికల్నీ ఏర్పాటు చేస్తారు.

ఆ వేగంతో యంత్రం కదులుతూ ఉంటే, కార్మికుల అవయవాలు కూడా అదే వేగంతో, ఆ సెకన్ల లెక్కలతో కదలాలి. వేగం పెరిగిన యంత్రం కార్మికులతో గతంకన్నా ఎక్కువ పని చేయిస్తూ వారినించి ఎక్కువ శ్రమని పిండేసాధనంగా పని చేస్తుంది. ఆవు పాదుగుకి పాలు పితికే యంత్రాన్ని పట్టిస్తే అది పాలనీ రక్తాన్నీ కూడా పిండేసినట్టు పెట్టుబడిదారీ టెక్నిక్కులతో తయారైన యంత్రాలు, కార్మికుల శ్రమ శక్తి నంతటినీ పిండేస్తూ వారితో పని చేయిస్తాయి.

యంత్రం అనేది ఇక్కడ (పెట్టుబడిదారీ పని స్థలంలో) ఎలాంటి పాత్ర నిర్వహిస్తుందంటే, కార్మికుడితో ఎక్కువ పని చేయించి, ఆ ఫలితాన్ని పెట్టుబడిదారుడికి అప్పగించే పాత్రని! పెట్టుబడిదారుడి పని స్థలంలోకి వచ్చే ప్రతీ యంత్రమూ పెట్టుబడిదారుడితో ఇలా అంటుంది — "నీ కెందుకు, నువ్వు నిశ్చింతగా ఉండు! పనివాళ్ళతో 100 రెట్లు ఎక్కువగా పని చేయించే పూచీ నాదీ. సాయంత్రానికి ఎంత ఉత్పత్తి చేయిస్తానో చూడు!" అంటుంది. అది అలాగే చేయిస్తుంది కూడా.

పెట్టుబడిదారుడి దగ్గిర ఉండే యంత్రం, బానిస యజమాని దగ్గిర ఉండే కుక్క లాంటిది. బానిస యజమాని పెంచే కుక్క, యజమానికి విశ్వాస పాత్రంగా

ఉంటూ, పారిపోయే బానిసల్ని పట్టి కండలు కండలు చీరేస్తుంది. అలాగే, పెట్టుబడిదారుడి యంత్రం, యజమానికి విశ్వాస పాత్రంగా ఉంటూ, కార్మికుల శ్రమశక్తినీ, రక్త మాంసాల్నీ పీల్చేస్తూ వారితో మితిమీరిన శ్రమ చేయిస్తుంది.

"ఇంత వేగంతో ఈ యంత్రాల మీద పనిచెయ్యలేక పోతున్నాము" అని కార్మికులు అంటే, పెట్టుబడిదారుడు నివ్వెరపోతాడు — "జీతాలు పెంచానుగా? జీతాలు పెరిగినా పని చెయ్యలేరా?" అంటాడు. వాడికి ప్రతీ సమస్యా డబ్బుతో చక్కబడే సమస్యలాగే కనపడుతుంది. ఇది డబ్బు సమస్య కాదనీ, శరీరాల కష్టసుఖాల సమస్య అనీ, వాడికి ఎందుకు అర్థం కాదంటే, వాడి శరీరం ఆ యంత్రం దగ్గిరికి ఎన్నడూ రాదు గనక. వాడు కూడా వచ్చి యంత్రం దగ్గిర నిలబడి పని చేసిన నాడు మాత్రమే అసలు సమస్య ఏమిటో, యంత్రం అనేది ఎలా ఉండాలో, వాడికి బోధ పడుతుంది.

యంత్రాలలో 'మెరుగుదలలు' జరుగుతోన్న కొద్దీ, యంత్రాలు 'అభివృద్ధి' చెందుతోన్న కొద్దీ, కార్మికులకు జరిగే లాభమేమిటి? కాళ్ళూ చేతులూ కదపటానికి వీలు లేనంత తక్కువ స్థలంలో, యంత్రాలతో కిక్కిరిసిన పెట్టుబడిదారుడి ఫ్యాక్టరీలో, దుమ్ముతోటీ ధూళితోటీ నిండిన వాతావరణంలో, చెవులు బద్దలయ్యే శబ్దాల మధ్య, విపరీతమైన ఉష్ణోగ్రతల మధ్య, కాళ్ళూ చేతులూ తెగిపోయే ప్రమాదాల మధ్య, ఏ క్షణంలో మృత్యువు మీదకురుకుతుందో తెలీని ప్రాణభీతితో, ప్రతీ గంటా ప్రతీ రోజూ పని చెయ్యవలసిరావడం అంటే, అదంతా కార్మికులకు దుర్భరమైన పరిస్తితేగానీ, యంత్రాల ప్రవేశం వల్ల వారికి వచ్చిన సౌఖ్యమేమీ లేదు.

కార్మికులు చేతి పనిముట్లతో పనిచేసినప్పుడు, ఆ చేతి 'పనిముట్లు కూడా పెట్టుబడిదారుడివే అయినా, అవి యజమానికి కుక్కలాగ సేవ చెయ్యవు. అలాంటి సేవ యంత్రం చేస్తుంది. పెట్టుబడిదారుడి దగ్గిర శ్రమ పరికరం యంత్ర రూపం దాల్చ గానే అది కార్మికులకు 'శత్రువు' అవుతుంది. శ్రమచేసే మనిషికీ, శ్రమ పరికరానికీ శత్రుత్వం ఏర్పడే పరిస్తితి ఇది. ఒక పక్క నిత్య ప్రమాదాలు కలిగించేది గానూ, ఇంకోపక్క అమితమైన శ్రమని పీల్చేది గానూ ప్రతీ యంత్రమూ ఒక 'భూతం'గా కార్మికుడికి ఎదురవుతుంది.

యంత్రాల్ని విడిగా చూస్తే, వాటి వల్ల లాభాలూ, నష్టాలూ కూడా ఉన్నాయి. వాటి దగ్గిర పనిచేసే మనుషులకు శారీరక ప్రమాదాలు కలగడం యంత్రాల వల్ల వచ్చే నష్టం. చేతి పనిముట్ల వల్ల జరగని ప్రమాదాలు యంత్రాల వల్ల జరగడానికి అవకాశం ఉంది. కాబట్టి అది యంత్రాల వల్ల కలిగే నష్టమే. కానీ, పనిచేసే మనిషికి, శారీరక కష్టాన్ని తగ్గించడమూ, పని ఎంతో వేగంగా జరిగేటట్టు చేసి ఉత్పత్తిని ఎన్నో రెట్లు పెంచడమూ యంత్రం వల్ల వచ్చే ఉపయోగాలు.

యంత్రంతో పని చెయ్యడంవల్ల కార్మికుల శరీర కష్టం కొంత తగ్గినా, ఆ మంచిని మించిన ప్రమాదాలు దాన్నించి శ్రామికులకు పొంచి ఉంటాయి. యంత్రం దగ్గిర నిలబడి పని చేసేది పెట్టుబడిదారుడు కాదు కాబట్టి, దాని వల్ల వచ్చే ఏ నష్టమూ పెట్టుబడిదారుడికి రాదు. యంత్రానికి హక్కుదారులు కార్మికులు కారు కాబట్టి, దానివల్ల వచ్చే ఏ లాభమూ కార్మికులకు రాదు. అందుకే యంత్రాన్ని ఎలా అర్థం చేసుకోవాలంటే — 'ఉత్పత్తి క్రమంలో పనిచేసే భారీ శ్రమ పరికరం'గా కాదు; 'పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో పనిచేసే భారీ శ్రమ పరికరం'గా అర్థం చేసుకోవాలి.

యంత్రం అనేది, సమాజంలో అందరికీ సంబంధించిన ఆస్తిగా ఉంటే, దానివల్ల వచ్చే 'మంచి'ని అందరూ పొందవచ్చు. దాని వల్ల నష్టాలు రాని మార్గాల కోసం అందరూ ప్రయత్నించవచ్చు. కానీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో ఉండే యంత్రం, పెట్టుబడిదారుడికి ఒక్కడికే చెందిన ఆస్తిగా ఉంటుంది. దాని వల్ల వచ్చే లాభాలన్నీ పెట్టుబడిదారుడివీ, నష్టాలన్నీ కార్మికులవీ!

పెట్టుబడిదారీ విధానాన్ని 'సరుకు ఉత్పత్తి విధానం' అనీ, 'లాభ ఉత్పత్తి విధానం' అనీ, ఇలా రకరకాల పేర్లతో చెప్పుకోవచ్చు — అని గతంలో చూశాం. ఇప్పుడు దానికి 'యంత్ర ఉత్పత్తి విధానం' అనే ఇంకో పేరు కూడా చేర్చవచ్చు.

భారీ యంత్రాన్ని నిర్మించే పనీ, నడిపే పనీ, ఒక వ్యక్తి వల్ల గానీ, ఒక కుటుంబం వల్లగానీ సాధ్యంకాదు. ఆ యంత్రం ఇచ్చే ఉత్పత్తిని వాడడం కూడా ఒక వ్యక్తికి గానీ, ఒక కుటుంబానికి గానీ సాధ్యం కాదు. ఈ 2 లక్షణాలూ, యంత్రానికి ఒక ప్రత్యేక స్వభావాన్ని ఇస్తాయి. ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో గాక, అంతకన్నా అధికమైన సంఖ్యకి శ్రమ పరికరంగా, అంటే 'సమిష్టి'కి శ్రమ పరికరంగా ఉపయోగపడగల స్వభావాన్ని! కానీ, అలాంటి భారీ యంత్రం (సమిష్టికి ఉత్పత్తి చెయ్యగల భారీ యంత్రం) ఒక వ్యక్తి ఆధీనంలో (పెట్టుబడిదారుడి ఆధీనంలో) బందీ అయి

ఉంటుంది. దాని ఉత్పత్తి అంతా ఒక్క వ్యక్తికి మాత్రమే స్వంతం అవుతుంది. ఆ ఉత్పత్తి, అమ్ముడు కానప్పుడల్లా పెట్టుబడిదారుడు యంత్రాన్ని ఆపేస్తాడు. ఉత్పత్తి చెయ్యడానికి కార్మిక జనాలు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ ఉత్పత్తితో వారికి ఎంతో అవసరం ఉన్నప్పటికీ, యంత్రానికీ కార్మికులకూ మధ్య పెట్టుబడిదారుడు, తన 'లాభాల' లెక్కల తోటీ, అమ్మకాలకు మార్కెట్లు లేవనే సమస్య తోటీ ఎదురవుతాడు. అలాంటి సమయాల్లో వాడు యంత్రాన్ని ఆపేసి — "ఇది నా ఆస్తి. నా యంత్రాన్ని నాకు కావలసినప్పుడు నడిపిస్తాను. లేనప్పుడు ఆపేస్తాను. నా ఆస్తిని నాకిష్టమైనట్టు చేసుకుంటాను" అంటాడు. ఉత్పాదక శక్తులు ఎన్నో రెట్లు పెరిగే సమాజానికి తనకు తెలియకుండానే పునాదులు వేసిన పెట్టుబడిదారుడు, ఆ శక్తులన్నీ, సంపూర్ణంగా ఆచరణలోకి రాకుండా అనేక రకాలుగా ఆటంకమవుతాడు. సమిష్టి అవసరాలకోసం భారీ స్థాయిలో ఉత్పత్తి చెయ్యగల శ్రమ పరికరం, సమిష్టికి చెందిన వస్తువుగా గాక, వ్యక్తికి చెందిన వస్తువుగా ఉండడంలో ఏర్పడే అనేక వైరుధ్యాలలో ఇది ఒకటి.

ఒక శాఖలోకి ఒక రకం యంత్రం ప్రవేశించిన తర్వాత, దాని విలువ ఎల్లకాలం చెక్కుచెదరకుండా ఉండదు. ప్రతీ సరుకునీ అనేక మంది పెట్టుబడిదారులు తయారుచేయి స్తారు. యంత్రాల్ని కూడా అలాగే. పెట్టుబడిదారుల మధ్య పోటీల వల్ల ఆ ఫలానా రకం యంత్రం కొంత కాలానికి గతం కన్నా చవకలో తయారవుతుంది. దాని విడి భాగాలు కూడా చవకలో తయారవుతాయి. అలా జరిగితే, పెట్టుబడిదారుడు, తను ఎక్కువ విలువతో కొన్న యంత్రాన్ని తక్కువ విలువగా లెక్క కట్టుకోవలసి వస్తుంది. దాని వల్ల వాడికేమీ నష్టం లేకపోయినా, ప్రతీ కొత్త యంత్రాన్నీ త్వర త్వరగా వాడేసి, దాని మీద పెట్టిన పెట్టుబడిని త్వర త్వరగా రాబట్టడానికే వాడు ఆరాట పడతాడు.

# యంత్రాలు వచ్చిన కొత్తలో

**యం**త్రాలు వచ్చిన కొత్తలో, ప్రతీచోటా 'పనిదినం' పెరిగింది. లేదా 2 షిఫ్టుల పద్ధతి వచ్చింది. అమెరికాలోని ఫిలడెల్ఫియాలో, 1806లో, అక్కడ యంత్రాలు ప్రారంభమైన కొత్తలో, పనిదినం 19, 20 గంటలు ఉండేది. 1832 ప్రాంతాల్లో ఇంగ్లండులో, రోజుకి 2 షిఫ్టుల్లో పని చేయించారు. యంత్రాలు వచ్చిన కొత్తలో ప్రతీచోటా ఇదే రకం మార్పులు జరిగాయి. పెట్టుబడిదారుడి చేతిలోకి యంత్రం రావడం వల్ల వచ్చిన ఫలితం ఇది!

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలూ, యంత్రకారులూ, గణిత శాస్త్రజ్ఞులూ, పెట్టుబడిదారీ యంత్రాల ప్రత్యేక సాంకేతిక పద్ధతుల్ని గానీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో యంత్రం నిర్వహించే ప్రత్యేక పాత్రనిగానీ, ఏమాత్రమూ గమ నించరు. వాళ్ళు, 'చేతి పనిముట్టు'నీ, 'యంత్రాన్నీ' ఒకే దృష్టితో, ఒకే రకపు శ్రమ పరికరాలలాగ చూస్తారు. వాళ్ళు — చేతి పనిముట్టుని 'చిన్న స్థాయి యంత్రం' గానూ, యంత్రాన్ని 'పెద్ద స్థాయి పనిముట్టు'గానూ నిర్వచిస్తారు. ఇలా చెప్పడం అంటే, ఇది, వాటి 'పరిమాణాల్నీ, ఆకారాల్నీ' వర్ణించడమే. ఈ వర్ణన, పని స్థలంలో చేతి పనిముట్టు నిర్వహించే పాత్రనిగానీ, యంత్రం నిర్వహించే పాత్రని గానీ చెప్పదు. చేతి పనిముట్టుకి లేని ఒక ప్రత్యేక లక్షణం యంత్రానికి ఉందనీ, అది పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో కార్మికుల పట్ల ఒక వ్యతిరేక పాత్రని నిర్వహిస్తుందనీ వివరించే నిర్వచనం ఏదీ అక్కడ ఉండదు.

పెట్టుబడిదారీ యంత్రంలో కనపడే అభివృద్ధి, శ్రమ చేసే మనిషికి సుఖాన్నిచ్చే అభివృద్ధి కాదు. అది ఎక్కువ శ్రమని లాగడానికి పనికివచ్చే పద్ధతులతోనే ఏర్పడిన అభివృద్ధి. కాబట్టి, అది పూర్తిగా శ్రామిక వ్యతిరేక లక్ష్యంతో ఉంటుంది. అందుకే 'నూతన సమాజం', పెట్టుబడిదారీ యంత్ర నిర్మాణాల్నీ, దాని టెక్నిక్కుల్నీ యధాతథంగా తీసుకోకూడదు. 'పని ఎక్కువగా జరగడం' అనే దృష్టితోగాక, 'పని సౌఖ్యంగా జరగడం' అనే దృష్టితో మాత్రమే యంత్రాన్ని నిర్మించుకోవాలి. అంటే, విలువ దృష్టితో గాక, ఉపయోగపు విలువ దృష్టితో! 'అసహజ' దృష్టితోగాక, 'సహజ' దృష్టితో!

ఫ్యాక్టరీ విధానం ప్రారంభమైన కొత్తలో, పోయే పనులు తక్కువగానూ, దొరికే పనులు ఎక్కువగానూ ఉండడం సాధ్యమైంది. అది ఎందుకు సాధ్యమైందంటే — కొత్త ఫ్యాక్టరీల నిర్మాణం రెగ్యులర్‌గా జరగడం వల్లా, ఒకే ఫ్యాక్టరీని అనేక శాఖలతో విస్తృతం చెయ్యడం వల్లా, సాధ్యమైంది. అన్ని శాఖలూ యంత్ర విధానంలోకి మారిన తర్వాత ఇది గతంలో లాగ సాధ్యం కాదు. పోయే పనుల్నీ, కొత్తగా వచ్చే పనుల్నీ పోల్చిచూస్తే, పోను పోనూ కొత్త పనులు ఏర్పడడం తగ్గిపోతూ ఉంటుంది.

ఇంగ్లండులో 1860 నుంచి, 1865 వరకూ, కొన్ని నగరాలలో ఉన్న బట్టల ఫ్యాక్టరీల వివరాలు చూస్తే, ఆ 5 సంవత్సరాలలోనూ, ఆ ఫ్యాక్టరీల్లో ఉత్పాదక శక్తి

పెరిగింది. కానీ, కార్మికులు మాత్రం తగ్గారు.

("కాపిటల్" రాసిన కాలం 1867 కాబట్టి, ఆ కాలానికి సంబంధించిన వివరాలే ఇందులో ఉంటాయి. ఇక్కడ చెపుతున్న 'విషయాల' మీదే దృష్టి పెట్టాలి. పెట్టుబడిదారీ విధానంలో ఈ విషయాల స్వభావం ఎప్పుడూ ఒక్కలాగే ఉంటుంది. ఈ నాడు ఈ పరిస్థితులు ఇంకా తీవ్ర స్థాయికి మారి ఉంటాయి.)

1860లో, 570 ఫ్యాక్టరీల్లో ఉన్న మరమగ్గాలు 86వేలు. వాటి హార్స్‌పవర్ 29 వేలు. వాటి కార్మికులు 94 వేలు. 1865లో, మగ్గాలు 95 వేలు అయ్యాయి. వాటి హార్స్‌పవర్ 30 వేలు అయింది. కార్మికులు 89 వేలు అయ్యారు. (తగ్గారు).

ఉలెన్ ఫ్యాక్టరీలలో, 1852 నించీ 62 వరకూ ఉత్పాదక శక్తుల పెరుగుదల చెప్పుకోదగ్గట్టుగా ఉంది. కానీ, కార్మికుల సంఖ్య మాత్రం ఏమీ మారలేదు.

ఒక శాఖలోకి యంత్రం వచ్చాక, దాని సంబంధిత శాఖల్లో పనులు పెరిగే అవకాశం ఉన్న పరిస్థితుల్లో కూడా, పనిపోయిన ప్రతీ కార్మికుడికీ, ఇంకో చోట గ్యారంటీగా పని దొరికే పరిస్థితి ఉండదు. ఎందుకంటే, పెట్టుబడిదారీ విధానంలో, పనులు వెతుక్కోవడం ఎవరికి వారికి వ్యక్తిగత సమస్యగా ఉంటుంది. పనుల కోసం వెతుకులాటలో అందరూ విజయం సాధించలేరు. కుట్టుమిషన్ వచ్చిన కొత్తలో అనేక వేల మంది పనులుపోయి, ఆకలి చావులకు గురి అయ్యారని అనేక రిపోర్టులు చెపుతున్నాయి. ఇతర శాఖల్లో పనులు దొరకడానికి అవకాశాలు ఉన్న కాలంలో కూడా ఇలా జరిగింది.

ఒక శాఖలో పనులు పోయిన వాళ్ళకు, ఇతర శాఖల్లో పనులు దొరికినా, అక్కడ జీతాలు ఎక్కువగా ఉంటాయా తక్కువగా ఉంటాయా అనేది, అక్కడ కార్మికులతో అవసరం ఎక్కువ ఉందా తక్కువ ఉందా అనే దాన్నిబట్టి ఉంటుంది.

ఒక శాఖలో పనులకు అలవాటుపడిన కార్మికులు ఇతర శాఖలకు పోయినప్పుడు, ఆ కార్మికుల పరిస్థితి అనేక రకాలుగా దుర్భరంగా ఉంటుంది. పెట్టుబడిదారీ శ్రమ విభజన వల్ల ఆ కార్మికులు అంతవరకూ ఏదో ఒకే పనితో పరిచయం కలిగి ఉంటారు. ఆ పనిలోంచి ఇంకో పనిలోకి పోయినప్పుడు, ఆ ఇతర పనులు చేత కాని వారుగా ఉంటారు. దీనివల్ల ఆ కార్మికులు ఇతర పనులలోకి పోయినప్పుడు అక్కడ ఎక్కువ నైపుణ్యం అక్కరలేని తక్కువ రకాల పనుల్లో, తక్కువ జీతాలతో చేరవలసి వస్తుంది.

ఒక శాఖలో పనులు పోయిన కార్మికులకు వెంటనే పనులు దొరక్కపోతే, ఈ పరిస్థితి, కార్మికుల జీవితావసర వస్తువుల్ని ఉత్పత్తి చేసే శాఖల్లో కూడా పనులు పోవడానికి దారితీస్తుంది. నిరుద్యోగులైన కార్మికులకు జీతాలు రావు కాబట్టి, వారు మార్కెట్‌నించి పోషణ వస్తువులు కొనలేరు. వారి కుటుంబాలలో జీతాలు వచ్చేవారి పోషణ వస్తువులనే పంచుకుంటూ బతకవలసి ఉంటుంది. ఆ కుటుంబాలలో ఉద్యోగాలలో ఉన్న కార్మికులు కూడా, ఈ నిరుద్యోగుల్ని పోషించవలసి రావడం వల్ల, తమ అవసర పదార్థాలలో కొంతభాగం కోల్పోయి, ఫుల్‌వర్క్ చేస్తూ కూడా, అవసరాలు తీరని దశలో ఉంటారు.

నిరుద్యోగులైన కార్మికులు, మార్కెట్‌నించి జీవితావసర వస్తువులు కొనలేకపోవడంవల్ల, వాటిని ఉత్పత్తిచేసే శాఖల్లో సరుకుకి అమ్మకాలు తగ్గుతాయి. అదే పరిస్థితి కొంత కాలం పాటు సాగితే, ఆ శాఖల కార్మికులు కూడా నిరుద్యోగులవడం మొదలవుతుంది.

యంత్రం ఒక శాఖలోకి వస్తే, అది క్రమంగా అన్ని శాఖల్నీ ఆక్రమిస్తుంది. వడికే యంత్రాలు, మరమగ్గాలకు దారితీశాయి. నూలు యంత్రాలు, ఉలెన్, సిల్కు పరిశ్రమల్లో యంత్రాలకు కారణమయ్యాయి. యంత్రం అన్ని శాఖల్నీ ఆక్రమించినప్పుడు ఉత్పత్తిని రవాణా చెయ్యడానికి రవాణా పరిశ్రమ కూడా అభివృద్ధి చెందవలసిన అవసరం కలిగింది. ఆవిరి ఓడలూ, రైల్వేలూ ప్రారంభమయ్యాయి. వార్తా సౌకర్యాల కోసం కమ్యూనికేషన్ సాధనాలు అభివృద్ధి చెందాయి. టెలిగ్రాఫూ, టెలిఫోనూ పుట్టుకొచ్చాయి. ఈ రకంగా భారీ పరిశ్రమ, అనేక కొత్త శాఖల్నీ, ప్రపంచ మార్కెట్‌నీ సృష్టించింది. పెట్టుబడిదారుడి సరుకు అమ్మకానికి ఒక దేశపు మార్కెట్టే హద్దు కాదు. ప్రపంచమంతా అల్లుకుపోయిన రవాణా — కమ్యూనికేషన్ మార్గాలు, ప్రపంచంలో ఏ మూల నించి ఏ మూలకిపోయి సరుకుని అమ్మడానికైనా అవకాశాలు కలిగించాయి.

పరిశ్రమలోని అన్ని శాఖలూ 'యంత్ర ఉత్పత్తి విధానం'లోకి మారుతోన్న కొద్దీ, ఇక గతంలోలాగ పనులు దొరకడం పూర్తిగా అసాధ్యమవుతుంది. అంటే, పెట్టుబడిదారీ సమాజంలో 'నిరుద్యోగ సమస్యని' పరిష్కరించడం అనేది, కలలో కూడా సాధ్యమయ్యే విషయం కాదు — అది పెట్టుబడిదారుడి కల అయినా, కార్మికుడి కల అయినా! ఈ సమాజంలో, ఏ నిరుద్యోగికీ, ఉద్యోగం దొరికినట్టు కలలు రావడం సహజం కాదు; ఉద్యోగం ఉన్న వాళ్ళకి ఉద్యోగం పోయినట్టు కలలు రావడం మాత్రం చాలా సహజం.

# 'నిరుద్యోగ సమస్య' గురించి
## పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ఏమంటారు?

పెట్టుబడిదారీ విధానంలో యంత్రాలవల్ల పనులు పోవడం గురించి పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చాలా వంకర టింకర వాదాలు చేస్తారు. వాళ్ళ వాదాలు ఇలా ఉంటాయి: యంత్రం వచ్చాక పెట్టుబడిదారుడు కార్మికుల్ని తగ్గిస్తాడు, నిజమే. కార్మికుల్ని తగ్గించడంవల్ల జీతాల భాగంలో కొంత పెట్టుబడి మిగులుతుంది కదా? పెట్టుబడిదారుడు, పెట్టుబడిని ఎప్పుడూ ఖాళీగా ఉంచడు కదా? దాన్ని ఎక్కడో అక్కడ పెడతాడు కదా? ఆ 'మిగిలిన జీతాల భాగంతో' మళ్ళీ కొత్త కార్మికులకు పనులు కల్పిస్తాడు. కాబట్టి, కార్మికులకు ఒకచోట పనులు పోయినా ఆ పెట్టుబడితోనే ఇంకోచోట పనులు దొరుకుతాయి. కాబట్టి, యంత్రంవల్ల నిరుద్యోగం ఏర్పడడానికి అవకాశమే ఉండదు — ఇది ఒక వాదం.

దీనికి జవాబు ఇంతకు ముందే చూశాం. జీతాలలో నించి మిగిల్చిన దాన్నంతా మళ్ళీ జీతాల మీదే పెట్టడం సాధ్యంకాదని చూశాం. పెట్టుబడిదారుడు ఒక కొత్త యంత్రాన్ని తెచ్చి, 50 మంది కార్మికుల్ని పనులలోంచి తీసివేసి, జీతాలలోనించి 150ని మిగిల్చాడనుకుందాం. ఆ 50 మంది కార్మికులకూ ఇంకోచోట పనులు ఏర్పడాలంటే, ఆ 150ని అంతా జీతాల మీదే పెట్టాలి కదా? మరి ఆ కొత్త చోట 'స్థిర' మీద ఏం పెడతాడు? దాని కోసం కొత్త పెట్టుబడి కావాలి. అంటే, యంత్రం వచ్చాక పాత కార్మికులందర్నీ పనుల్లో ఉంచడం, పాత పెట్టుబడితోనే సాధ్యం కాదన్నమాట!

లేదా ఇంకో రకంగా చూస్తే: యంత్రం వచ్చాక జీతాలలో నించి 150 మిగిలింది కదా? అందులో నించే కొంత భాగాన్ని స్థిరమీదా, కొంత భాగాన్ని అస్థిరమీదా పెట్టవచ్చు. కానీ, అప్పుడేం జరుగుతుంది? ఆ 150తో గతంలో 50 మంది కార్మికులు పనుల్లో ఉంటే, ఇప్పుడు అదంతా జీతాల మీద ఉండదు కాబట్టి, ఇప్పుడు ఆ 50 మందికీ కొత్త పనులు ఏర్పడవు. అందులో కొందరికే కొత్త పనులు ఏర్పడతాయి. మిగిలిన వాళ్ళు నిరుద్యోగులై తీరవలసిందే, అంటే యంత్రం వచ్చాక, పాత పెట్టుబడితోనే పని చెయ్యాలంటే, నిరుద్యోగం తప్పదు. ఉద్యోగాలు పోయిన కార్మికులకు కొత్త ఉద్యోగాలు ఏర్పర్చవలసిన బాధ్యత ఆ యంత్రాన్ని తెచ్చిన పెట్టుబడిదారుడిది కాదు కాబట్టి, వాడు, కొత్త పెట్టుబడి పెట్టి, ఆ 50 మంది కార్మికులకూ కొత్త పనులు కల్పించడు. కాబట్టి, యంత్రం రావడం వల్ల మిగిలే జీతాల భాగాన్ని మళ్ళీ జీతాల మీదే పెడితే పనులుపోయిన వాళ్ళందరికీ పనులు ఏర్పడతాయనే వాదన అర్థంలేని వాదన.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త చేసే ఆ వాదనే, కొంచెం మారి, ఇలా ఉంటుంది: ఉత్పత్తి రంగంలోకి యంత్రాలు రావడంవల్ల, యంత్రాల్ని ఉత్పత్తిచేసే పని ఒకటి పుట్టుకొస్తుంది కదా? టూలు ఉత్పత్తికన్నా యంత్రం ఉత్పత్తికి ఎక్కువ శ్రమ కావాలి కదా? కాబట్టి, యంత్ర నిర్మాణం వల్ల, కార్మికులకు ఎక్కువ శ్రమచేసే అవకాశాలు ఏర్పడతాయి. యంత్రాలతో పనిచేసే చోట కార్మికుల సంఖ్య తగ్గినా, యంత్రాన్ని ఉత్పత్తి చేసే చోట ఆ కార్మికులందరికీ పనులు ఏర్పడుతూ ఉంటాయి. కాబట్టి, యంత్రాల వల్ల నిరుద్యోగం అన్న ప్రశ్నే ఉండదు.

దీనికి కూడా జవాబు చూశాం. యంత్రాన్ని ఉత్పత్తి చెయ్యడానికి ఎక్కువ శ్రమ పడుతుంది — అన్నంత వరకే చూస్తాడు పెట్టుబడిదారీ ఆర్థికవేత్త. యంత్రాలు, అవి తయారవడంకోసం అవసరమయ్యే శ్రమకన్నా ఎక్కువ శ్రమని తగ్గించివేస్తాయి — అనే రెండో అంశాన్ని పట్టించుకోడు. ముక్కలు ముక్కలుగా కనపడే విషయాల్లోనించి, తనకు నచ్చే ముక్కలే ఏరుకుంటాడు ఆయన. ఆ ముక్కల్నే గొప్ప సిద్ధాంతంగా ప్రదర్శిస్తాడు.

ఒక కొత్త రకం యంత్రాల్ని ఉత్పత్తిచేసే శాఖలో 100 మంది కార్మికులకు పనులు ఏర్పడ్డాయనుకుంటే, ఆ కార్మికులందరికీ ఎప్పుడూ పనులు నిలబడాలంటే, ఆ యంత్రాలు ఎప్పుడూ తయారవుతూనే ఉండాలి. అంత వరకూ ఆ రకం యంత్రాలతో పని చేయించని పెట్టుబడిదారులందరూ ఆ యంత్రాల్ని తమ పని స్థలాలలో ప్రవేశపెడుతూ ఉండాలి. ఆ యంత్రం ఎక్కడికి వెళ్తే అక్కడ, కొందరు కార్మికులు నిరుద్యోగులవుతూ ఉంటారు. అంటే, ఆ యంత్రాన్ని నిర్మించే శాఖలో కార్మికులందరికీ ఎప్పుడూ పనులు ఉండాలంటే, అనేకచోట్ల కార్మికులకు పనులు పోతూ ఉండాలి. ఆ యంత్రాల్ని తయారుచేసే కార్మికులకు, ఆ రకంగా పనులు నిలబడడం కూడా ఎంతో కాలం జరగదు. ఎందుకంటే: ఆ యంత్రాల్ని ఉపయోగించే శాఖల్లో అందరు పెట్టుబడిదారుల దగ్గిరికీ ఆ యంత్రాలు వచ్చేశాక, మరుసటి రోజునించీ గతంలో

చేసినన్ని యంత్రాల్ని తయారు చెయ్యవలసిన అవసరం ఉండదు. ఆ యంత్రాల జీవితకాలాన్ని బట్టి, ఒక సంవత్స రంలో ఎన్ని యంత్రాలైతే పాతబడతాయో అన్ని కొత్త యంత్రాల్ని మాత్రమే తయారుచేస్తే చాలు. ఆ పరిస్థితి వచ్చినప్పుడు, ఆ యంత్రాల్ని తయారుచేసే శాఖలో కార్మి కులు కూడా తగ్గవలసి ఉంటుంది. ఒకవేళ, ఆ కార్మికు లందరికీ పనులు కల్పించడానికి ఇంకో కొత్త రకపు యంత్రాల ఉత్పత్తిని ప్రారంభిస్తే, ఆ కొత్త యంత్రం వెళ్ళేచోట కార్మికులకు పనులు పోవడం మొదలవుతుంది.

యంత్రాల వల్ల పనులు పోవని వంకర టింకర వాదాలు చేసే ఆర్థిక వేత్తలు, ఆ వంకర టింకర్ల ద్వారా ఏం రుజువు చేస్తారంటే, - తమ వాదాలు పూర్తిగా తప్పు అని రుజువు చేస్తారు. ఈ తప్పుడు వాదాలన్నిటికీ ఒక 'గొప్ప పేరు' కూడా ఉంది. 'నష్టపరిహార సిద్ధాంతం' అనే పేరు. అంటే, యంత్రాలవల్ల కార్మికులకు జరిగే 'నష్టం' ఎప్పటి కప్పుడు 'పరిహారమై'పోతూ ఉంటుందని దాని అర్థం. యంత్రాలవల్ల ఒకచోట పనులు పోయినా, వెంటనే ఇంకో చోట పనులు ఏర్పడుతూ ఉంటాయనీ, యంత్రాల వల్ల వచ్చే నిరుద్యోగ సమస్య తాత్కాలిక సమస్యగా మాత్రమే ఉంటుందనీ, ఉద్యోగం పోవడంవల్ల జరిగే నష్టం వెంటనే పరిహారమై పోతూ ఉంటుందనీ పెట్టుబడి దారీ ఆర్థికవేత్తల 'నష్టపరిహార సిద్ధాంతం' (కాంపెన్సేషన్ థీరీ) చెపుతుంది. కానీ, నిజానికి, పెట్టుబడిదారీ యంత్ర విధానంలో నష్టం తాత్కాలికం కాదు, నష్ట పరిహారమే తాత్కాలికం. నిరుద్యోగం తాత్కాలికం కాదు, ఉద్యోగమే తాత్కాలికం. పెట్టుబడిదారీ యంత్ర విధానంలో ఉద్యో గాలూ, నష్ట పరిహారాలూ తాత్కాలిక విషయాలుగా ఉండి, నష్టాలూ — నిరుద్యోగాలూ మాత్రం శాశ్వత విషయాలుగా ఉంటాయి.

'నిరుద్యోగ సమస్య తాత్కాలికమే' అని ఆర్థికవేత్త ఇంత గట్టిగా నొక్కి చెపుతోంటే, సంస్కరణవాదులు చాలా నిరుత్సాహ పడిపోతారు. పెట్టుబడిదారీ సమాజం ఎడ తెరిపి లేకుండా సృష్టించే 'అనాథలకు' సేవలు చేస్తూ 'ఎడ తెరిపి లేకుండా' కీర్తి పొందాలని కుతూహలపడే సంస్క రణ వాదులు "అయ్యో, నిరుద్యోగ సమస్య తాత్కాలిక మేనా? అలాగైతే మనం సేవలు చేసి కీర్తి పొందడానికేం మార్గం ఉంటుంది?" అని చాలా విచారపడతారు. సంస్క రణ వాదుల్ని నిరుత్సాహపరచడానికి తప్ప, ఈ పెట్టుబడి దారీ ఆర్థిక వేత్తల 'నష్టపరిహార సిద్ధాంతాలు' ఇంకెందుకూ పనికిరావు. (నిరుద్యోగ జనాభా గురించి ఈ సంపుటంలోనే 'పెట్టుబడి విస్తరణ' చాప్టర్‌లో ఇంకా కొన్ని విషయాలు చూస్తాము.)

# యంత్రాల వాడకమూ, దాని ఫలితాలూ

**యం**త్రాన్ని గానీ, మరో సైన్సు అంశాన్ని గానీ, పెట్టుబడిదారీ సంబంధాలలో ఉపయోగించడమూ, సమిష్టి సంబంధాలలో ఉపయోగించడమూ, ఒకటి కాదు. అవి పూర్తిగా వేరు వేరు విషయాలు. అందుకే అవి వేరు వేరు ఫలితాలనే ఇస్తాయి.

యంత్రాన్ని విడిగా చూస్తే, అది — శ్రమచేసే మనిషికి శ్రమ భారాన్ని తగ్గించే సాధనం. తక్కువ కాలంలో ఉత్పత్తిచేసే సాధనం. ఎక్కువ ఉత్పత్తులు ఇచ్చే సాధనం. ప్రకృతి శక్తుల్ని గ్రహించిన సాధనం. — ఇవన్నీ నిజమే. కానీ, దాన్ని 'పెట్టుబడిదారీ సంబంధాల్లో' వాడినప్పుడు, ఇవన్నీ అబద్ధం! <u>పెట్టుబడిదారుడి చేతుల్లో ఉన్న యంత్రం, కార్మికులకు శ్రమకాలం తగ్గించదు.</u> వారి అవసర కాలాన్ని తగ్గించి అదనపు కాలాన్ని పెంచి, వారిని మరింత దోచి, మరింత బీదరికం పాలుచేస్తుంది. కార్మి కుల పాలిటికి గతంలో లేని కొత్త ప్రమాదాలు తెచ్చిపెట్టి కార్మికుల్ని మరింత కష్టాలపాలు చేస్తుంది. కార్మికుల్ని యంత్రానికి అతుకుగా చేసే పరిస్థితి, కార్మికుల్ని ప్రకృతి శక్తుల నించి విముక్తి చెయ్యడానికి బదులు, ప్రకృతి శక్తులకు మరింత బానిసని చేస్తుంది. కానీ, పెట్టుబడిదారీ మేధావి, ఇదంతా పెడ చెవినబెట్టి, "శ్రమ భారాన్ని తగ్గించే యంత్రాన్ని వద్దనడం ఎంత అవివేకం!" అని విస్మయం ప్రకటిస్తాడు. ఇవతల వాళ్ళు యంత్రం ఇచ్చే ఉపయోగాల్ని గ్రహించలేని అజ్ఞానులు అయినట్టూ, ఈ 'అజ్ఞానులు' యంత్రమే వద్దని వాదిస్తోన్నట్టూ అర్థాలు తీసి, ఆయన విస్తుపోతాడు! — "కత్తి అన్న తర్వాత, దాంతో కూర గాయలూ కొయ్యొచ్చు, గొంతులూ కొయ్యొచ్చు. అంత మాత్రాన కత్తే వద్దంటామా?" అని ఆయన గొంతులు కోసే వాదం ఒకటి తీసుకొస్తాడు. కానీ, <u>ఇవతల వాళ్ళు, కత్తిని వద్దనడం లేదు, దానితో గొంతులు కొయ్యడమే వద్దంటు న్నారు.</u> "కూరగాయలు కొయ్యడానికే తయారు చేస్తున్నాం" అని పైకి చెపుతూ, గొంతులు కొయ్యడానికే పనికి వచ్చే ఆకారంతోటీ, ఆ టెక్నిక్కులతోటీ, కత్తుల్ని తయారు చేసి ఉపయోగిస్తే, అవి కూరగాయలు కొయ్యవు, గొంతులే కోస్తాయి. పెట్టుబడిదారీ యంత్ర టెక్నిక్కులన్నీ గొంతులు కోసే టెక్నిక్కులే కాబట్టి, అవి కార్మికుల్ని గతం కన్నా ఎక్కువ స్థాయిలో దోపిడీ చేస్తూ, ఆ రకంగా అవి కార్మికుల గొంతులే కోస్తాయి. ఈ సంగతి, పెట్టుబడిదారీ మేధావులకు క్షుణ్ణంగానే తెలుసు. కానీ,

పట్టించుకోరు.

యంత్రాల వాడకమూ, యంత్రాల మీద పనిచేసే కార్మికుల అనుభవమూ పెరిగేకొద్దీ, శ్రమ తీవ్రతా, వేగమూ ఎక్కువవుతాయి. యంత్రాలతో ఉత్పత్తి ప్రారంభమైన పారిశ్రామిక దేశాలలో కార్మికులు, పని దినం తగ్గింపు కోసం పోరాటాలు ప్రారంభించినప్పుడు, ఆ దేశాల ప్రభుత్వాలు పని దినాన్ని తగ్గిస్తూ శాసనాలు చెయ్యడం తప్పనిసరైంది. అలాంటి పరిస్థితుల్లో, పెట్టుబడిదారులు, యంత్రాల వేగం పెంచి, తగ్గిన పని దినంలోనే ఎక్కువ ఉత్పత్తిని సాధించే పద్ధతులు అవలంబిస్తారు. పని దినాన్ని తగ్గించడం ద్వారా వచ్చే నష్టాన్ని, శ్రమ తీవ్రతని పెంచడం ద్వారా పూడ్చుకునే మార్గాలు వెతుకుతారు. ఆ మార్గాల్లో ఎంత సాధ్యమైతే అంత ఫలితం సాధిస్తారు.

'స్పీడప్' అయిన యంత్రాలతోటీ, మారిన ఇతర పద్ధతులతోటీ పనిచేసే కార్మికులకు, పనిదినం తగ్గినా, ఆ సౌఖ్యమేమీ లేకుండా పోతుంది. కొంత కాలానికి మళ్ళీ కార్మికులు పనిదినం తగ్గింపుకోసం పోరాటాలు సాగిస్తారు. పని దినం మళ్ళీ తగ్గితే, యంత్రాలు మళ్ళీ 'మెరుగవు' తాయి. మరింత కొత్త పద్ధతులు వస్తాయి. పెట్టుబడిదారీ విధానంలో దీనికి అంతం ఉండదు.

పని దినం, అన్ని దేశాలలోనూ, ఒక దేశపు అన్ని శాఖలలోనూ, ఒకే పద్ధతిలో ఉండదు. దాని తగ్గింపులు కూడా ఆయా దేశాల కార్మిక వర్గపు చైతన్యాన్నిబట్టీ, దాని పోరాట శక్తినిబట్టీ, వివిధ పరిస్థితుల్లో ఉంటాయి. 1824లో, న్యూయార్కులో (అమెరికా), బేకరీ కార్మికులు రోజుకి 20 గంటలు పనిచేస్తున్నారనీ, పనికాలం తగ్గింపు కోసం సమ్మె చేస్తున్నారనీ, అక్కడి కార్మిక పత్రిక రాసింది. 1832లో, ఇంగ్లండులో, పని దినం 12 గంటలకు తగ్గింది. 1847లో 10 గంటలకు తగ్గింది. 1850 నాటికి ఆస్ట్రేలియా కార్మి కులు 8 గంటల పనిదినం సాధించారు. 1867లో, లాంక్ షైర్ (ఇంగ్లండు) కార్మికులు 8 గంటల పనిదినం కోసం పోరాటం ప్రారంభించారు.

పని దినం తగ్గినకొద్దీ, పెట్టుబడిదారుడు ఉత్పాదక శక్తుల్ని పెంచగల కొత్త యంత్రాల్ని తయారు చేయిస్తాడన డానికి రుజువుగా 1860లో ఇంగ్లండులో, 'అభివృద్ధి చెందిన' యంత్రాలు కనపడతాయి. ఒక ఫ్యాక్టరీ ఇన్ స్పెక్టరు, ఒక ప్రత్యేక శాఖ గురించి రాసిన రిపోర్టులో, ఆ శాఖలో ఒకప్పుడు 5 యంత్రాలు చేసే పనిని, తన రిపోర్టు కాలంలో ఒక్క యంత్రమే చేస్తోందనీ రాశాడు.

భారీ పరిశ్రమ, ఏ సాంకేతిక విధానంతో నడుస్తుందో, ఆ విధానానికి, పెట్టుబడిదారుడి ఇష్టారాజ్యం పనికిరాదు. పెట్టుబడిదారుడి ఇష్టా ఇష్టాల ప్రకారమే యంత్రాలతో ఉత్పత్తి క్రమం నడిస్తే, అక్కడ కార్మికులకోసం ఏ రక్షణ ఏర్పాట్లూ జరగవు. కొంత కాలానికి కార్మిక వర్గమే నశించి, పెట్టుబడిదారులు పరిశ్రమలన్నీ మూసుకోవలసి వస్తుంది. 'యంత్రంతో పనిచేయడం' అనే సాంకేతిక పరిస్థితి, పని పరిస్థితుల్లో కొన్ని నియమ నిబంధనల్ని తప్పనిసరి చేస్తుంది. పని గంటల మీదా, పని పరిస్థితుల మీదా, 'ఫ్యాక్టరీ చట్టాలు' రావడం భారీ పరిశ్రమలోనే ప్రారంభ మైంది. 'పని గంటల నియమం' అనేది, పెట్టుబడిదారుడి హేతువిరుద్ధ హింసకి ఒక కళ్ళెం. ఫ్యాక్టరీ చట్టాలు సరిగా అమలు జరిగినా, జరక్కపోయినా, అసలా చట్టాలనేవి రావడమే, సమాజ పరిస్థితుల మీద జరిగిన కాన్షియస్ పోరాట ఫలితం.

పెట్టుబడిదారీ విధానంలోని ప్రతీ అంశం లాగానే ఫ్యాక్టరీ చట్టాలు కూడా, ఒక పక్క బూటకత్వం తోటీ, ఇంకోపక్క గతంలో లేని కొత్త స్వభావంతోటీ, ప్రవర్తిస్తాయి. చట్టాలలో ఉన్న బూటకత్వాన్ని ఉపయోగించుకోవడానికి పెట్టుబడిదారులు ప్రయత్నిస్తే, దాంట్లో మంచి అంశాన్ని ఉపయోగించుకోవడానికి కార్మికులు ప్రయత్నిస్తారు. పని స్థలాలు తగినంత గాలీ వెలుతురూ వచ్చే ఏర్పాట్లతో శుభ్రంగా ఉండాలనీ, కార్మికులకు రక్షణ ఏర్పాట్లు ఉండాలనీ, చట్టాలు చెపుతాయి. సాధారణంగా, ఈ 'శుభ్రత' లకూ, ఈ 'రక్షణ'లకూ ఖచ్చితమైన నిర్వచనాలేవీ ఉండవు. ప్రతీ పెట్టుబడిదారుడూ ఈ చట్టాలనించి తేలిగ్గా తప్పు కోగలుగుతాడు. "నా ఫ్యాక్టరీ ఎప్పుడూ శుభ్రంగానే ఉంటుంది. గాలీ వెలుతురూ తగినంతేమిటి, అంతకన్నా ఎక్కువే వస్తాయి. నా కార్మికులకు రక్షణ ఏర్పాట్లకేమీ కొదవ లేదు" అంటాడు ప్రతీ పెట్టుబడిదారుడూ, వాడి కార్మికులకు ఫ్యాక్టరీలో 'మంచినీళ్ళ' ఏర్పాటైనా లేక పోయినా.

కార్మికుల ఆరోగ్యాల్నీ, అవయవాల్నీ, ప్రాణాల్నీ రక్షించే జాగ్రత్తలు తీసుకోవాలని పెట్టుబడిదారుల్ని 'చట్టాల ద్వారా' నిర్బంధించవలసి వస్తుంది. శ్రామికుల పట్ల పెట్టుబడిదారీ విధానం ఎలాంటిదో గ్రహించడానికి ఇంతకన్నా గొప్ప రుజువు అక్కరలేదు. ఆ చట్టాలే లేకపోతే, కార్మికుల రక్షణ గురించి పెట్టుబడిదారులు ఆ ఒకటి రెండు జాగ్రత్తలు కూడా తీసుకోరనీ, ఆ ఒకటి రెండు ఏర్పాట్లు కూడా చెయ్యరనీ అర్థం.

ఇంగ్లండు పింగాణీ (పాటరీ) పరిశ్రమలో, 200 వర్క్ షాపులకు 1864 నాటి ఫ్యాక్టరీ చట్టం వల్లనే మొట్టమొదటి సారిగా సున్నాలుపడ్డాయి. ఆ సంస్థలు ప్రారంభమై అప్పటికి 20 సంవత్సరాలు గడిచాయి. ఆ 200 వర్క్‌షాపుల్లోనూ మొత్తం కార్మికుల సంఖ్య 29 వేలు. కార్మికులు రోజంతా పనిచేసే స్థలాలు 'శుభ్రంగా ఉండాలని' ఒక చట్టం వచ్చి పెట్టుబడిదార్లకు చెప్పవలసి వచ్చింది!

"పని స్థలంలో ప్రతీ కార్మికుడికీ 500 ఘనపుటడుగుల స్థలం అవసరం. కానీ, ఈ నిబంధనని పెట్టుబడిదారులు అమలుపరిచేలాగ చెయ్యలేము" అని హెల్త్ ఆఫీసర్లు అనేక రిపోర్టుల్లో ప్రకటించారు. అంటే, దీని అర్థం, 'పెట్టుబడి' అనేది లాభాలతో సుఖంగా వర్ధిల్లుతూ ఉండాలంటే, 'కార్మికులు' కిక్కిరిసిన స్థలాలలో పనిచేస్తూ శ్వాసకోశ వ్యాధులు తెచ్చుకోవడం తప్పనిసరి అవసరం! కిక్కిరిసిన జాగాలో, భారీ యంత్రాల దగ్గిర పనిచేస్తూ కార్మికులు హఠాత్తుగా అవయవాలు తెగగొట్టుకోవడమూ, హఠాత్తుగా మరణించడమూ కూడా తప్పనిసరి అవసరం!

యంత్రాల్ని, పనిచేస్తూ ఉండగానే శుభ్రం చెయ్యడాల వల్ల కూడా చాలా ప్రమాదాలు జరుగుతాయి. యంత్రాన్ని ఆపితే ఉత్పత్తి తగ్గుతుంది కాబట్టి, వాటిని నడుస్తూ ఉండగానే క్లీన్ చేయిస్తారు. కార్మికుల చేతులూ, కాళ్ళూ తెగిపోవడం పెట్టుబడిదారుడి దృష్టికి, తన లాభంలో ఒక పైసా తగ్గడం కన్నా కూడా చిన్న విషయంగా ఉంటుంది.

కార్మికులకు జరిగే యాక్సిడెంట్ల విషయంలో పెట్టుబడిదారులు ఎలాంటి దృష్టితో ఉంటారో చెబుతూ ఒక ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు ఇలా అంటాడు — "కొంత మంది మిల్లు ఓనర్లు, యాక్సిడెంట్ల గురించి క్షమించరానంత నిర్లక్ష్య దృష్టితో మాట్లాడుతూ ఉంటారు. వేళ్ళు తెగిపోవడం లాంటి ప్రమాదాలు జరిగినప్పుడు, 'వేలుకేనా ఇంత గందరగోళం?' అన్నట్టు, అదేదో ఆలోచించక్కర లేనంత స్వల్ప విషయం అన్నట్టు, మాట్లాడతారు. అలాంటి సందర్భాల్లో వాళ్ళని నేనెప్పుడూ ఒక ప్రశ్న అడుగుతూ ఉంటాను — 'మీకో కార్మికుడు కావాలనుకోండీ. ఇద్దరు కార్మికులు మీ దగ్గిరికి వచ్చారు. అన్ని విషయాల్లోనూ ఇద్దరూ సమానమే. కానీ, ఒకతనికి ఒక వేలు లేదు. ఆ ఇద్దర్లో మీరు ఎవర్ని తీసుకుంటారు?' అని అడుగుతూ ఉంటాను. జవాబు ఇవ్వడానికి వాళ్ళు ఎన్నడూ తడుముకో లేదనుకోండీ' అంటాడు ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు. మిల్లు ఓనర్లు ఇచ్చిన ఆ జవాబేమిటో ఎవరైనా తేలిగ్గానే ఊహించ వచ్చు. "వేళ్ళు లేనివాణ్ణి నేనేం చేసుకోను?" అంటాడు ఏ పెట్టుబడిదారుడైనా. మనిషికి వేళ్ళన్నీ ఎందుకు ఉండాలో, పెట్టుబడిదారుడికి అర్థమయ్యే భాషలోనే వివరించాడు ఇన్‌స్పెక్టరు. పెట్టుబడిదారుడికి అంతకన్నా సహజమైన భాష అర్థం కాదు మరి!

పని స్థలంలో కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు ఉండాలో, ఎలాంటి రక్షణలు ఉండాలో, అవన్నీ ఏర్పాటు చేస్తే, పెట్టుబడిదారుడికి ఉత్పత్తి సాధనాలమీద ఎక్కువ ఖర్చు అవుతుంది. కాబట్టి వాడు కార్మికులకు రక్షణ ఏర్పాట్లు చేసేపని పెట్టుకోడు. ఏ పెట్టుబడిదారుడూ ఆ ఏర్పాట్లు చెయ్యడు కాబట్టి, ఎవడైనా ఒక 'మంచి' పెట్టుబడిదారుడు ఆ ఏర్పాట్లేవైనా చెయ్యాలంటే, వాడికి లాభం కొంత తగ్గుతుంది. తనకు లాభం తగ్గినా సహించగలంత 'మంచితనం' ఉన్నవాడు, తన దగ్గిర కార్మికులకు కొన్ని సౌకర్యాలు ఏర్పరిస్తే ఏర్పరుస్తాడు. అది వాడి ప్రత్యేక దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ 'దయ'కి నిజమైన అర్థమేమీ లేదు. కార్మికుల శ్రమ ఫలితం కార్మికు లకు ఇవ్వడమే అది. కానీ, ఇతరులెవ్వరూ చెయ్యని దాన్ని చేసేవాడు 'దయగలవాడే' అవుతాడు. ఇది, ఆ పెట్టుబడిదారుడి కార్మికులకు కొంత మేలు చేస్తుంది కూడా. ఆ శాఖలో ఇతరుల దగ్గిర లేని కొన్ని సౌకర్యాలు తన కార్మికులకు ఏర్పరచే పెట్టుబడిదారుడికి ఎంత లాభం తగ్గుతుందో, అది ఇతర పెట్టుబడిదారుల దగ్గిర తగ్గదు కాబట్టి, ఆ భాగం, వాళ్ళకి 'అదనపు లాభం'గా ఉంటుంది. అంటే కార్మికులకు సౌకర్యాలు చెయ్యకపోవడం వల్ల మిగిలిన భాగం అది. అంటే, పెట్టుబడిదారుడు కార్మికుల పని పరిస్థితుల్ని ఎంత దుర్భరంగా ఉంచగలిగితే, అంత ఎక్కువ లాభం పొందుతాడు.

కార్మికులకు 'రోజు'లో ఎక్కువ భాగం పని స్థలంలోనే గడుస్తుంది. ఆ పని స్థలంలో పరిస్థితుల్ని దుర్భరంగా ఉంచడం అంటే కార్మికుల 'జీవన పరిస్థితుల్ని' దుర్భరంగా ఉంచడమే. కానీ, పెట్టుబడిదారుడు ఏమనుకుంటాడంటే, తన పని స్థలంలో చాలా ఖర్చుల్ని పొదుపు చేస్తూ పని చేయించడం వల్లనే తన లాభాలు ఎక్కువగా ఉంటాయనీ, ఆ ఎక్కువ లాభం తన సమర్థతవల్లనే వచ్చిందనీ అనుకుంటాడు. వాడు పొదుపు చేసేది కార్మికుల సౌకర్యాలనే. కార్మికుల రక్షణకోసం చేయవలసిన ఏర్పాట్లనే. ఆ ఏర్పాట్లేవీ చెయ్యకపోవడంవల్లనే తన లాభాలు మరింత ఎక్కువగా ఉంటున్నాయని పెట్టుబడిదారుడు అనుకోడు.

సమాజం మొత్తంమీద కార్మికుల క్షేమం కోసం పని స్థలంలో జరగవలసిన ఏర్పాట్లేవీ జరగనప్పుడు, వాటి కోసం ఖర్చు కావలసిన ఉత్పత్తులన్నీ పెట్టుబడిదారీ వర్గానికే మిగులుతాయి. పని పరిస్థితులలో దుర్భరత్వం అంతా కార్మికులకు మిగులుతుంది. పెట్టుబడిదారుడు, పని స్థలంలో ప్రతీ ఖర్చునీ పొదుపుచేస్తాడు — మానవ 'శ్రమ శక్తి'ని తప్ప! సజీవ మానవ దేహాన్ని మాత్రం విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తాడు!

పని స్థలంలో ఉండే శ్రమ పరికరాలన్నీ పెట్టుబడిదారుడి ఆస్తే కాబట్టి, అవి కార్మికుడికి ఎప్పుడూ పరాయి ఆస్తిగానే ఉంటాయి. ఈ సంగతి గతంలోనే చూశాం. ఈ 'పరాయి' శ్రమ పరికరాల పట్ల కార్మికుడికి ఉండే శతృత్వం, ఆ శ్రమ పరికరం యంత్ర రూపం ధరించినప్పుడు, ఉన్నత స్థాయికి చేరుతుంది. కార్మికులకు,

యంత్రం, 'పెట్టుబడి — ప్రతినిధి'గా కనపడుతుంది. యంత్రాల వల్ల తమ పనులు పోవడం చూసిన కార్మికులు, యంత్రాల ప్రారంభ కాలంలో యంత్రాల్ని రానివ్వకుండా చెయ్యడానికే పోరాడారు. 17వ శతాబ్దంలో జర్మనీలో రిబ్బన్ లూమ్‌ని కనిపెడితే, ఆ కనిపెట్టిన వ్యక్తిని, కార్మికులు నీళ్ళల్లో ముంచి చంపేశారు. 1623లో, ఎడెన్ నగరంలో లేసు యంత్రాన్ని కనిపెడితే, దాన్ని 1629 వరకూ పనిలోకి రాని వ్వకుండా చేశారు. నీటి శక్తితో నడిచే ఊలు యంత్రాన్ని కనిపెడితే, లక్ష మంది కార్మికులు కలిసి దాన్ని తగలబెట్టేశారు. యంత్రాల ప్రారంభ కాలంలో కార్మికులు భారీ ఎత్తున యంత్రాల్ని ధ్వంసం చేశారు. కానీ కార్మికులకు కోపం రావలసింది, యంత్రాల మీద కాదు. యంత్రాన్ని తమ స్వంత ఆస్తులుగా ఉంచుకునే పెట్టుబడిదారుల మీద! వాళ్ళ ఆధీనంలో నడిచే పెట్టుబడిదారీ విధానం మీద! కానీ, కార్మికులకు ఆ నాడు ఈ సంగతి తెలీదు. యంత్రానికీ, యంత్రాన్ని ఉపయోగించే పెట్టుబడిదారీ విధానానికీ తేడా ఉందనే సంగతి గ్రహించడానికి కార్మిక వర్గానికి కొంత కాలం పట్టింది.

— యంత్రాల ప్రవేశంతో వచ్చిన అతి ప్రధాన ఫలితాల్లో ఒకటి, స్త్రీలూ పిల్లలూ కూడా 'అన్ని రకాల' పనుల్లోకీ రాగలగడం. చేతి వృత్తుల కాలంలోనూ, మాన్యుఫాక్చర్ కాలంలోనూ కూడా స్త్రీలు, శ్రమ కార్యాల్లో ఉన్నప్పటికీ, ఆ కాలంలో స్త్రీలు ఏయే పనులకైతే పరిమితమై ఉన్నారో ఆ పరిమితుల్ని దాటి అన్ని రకాల పనులలోకీ రావడానికి యంత్రాలు దోహదం చేశాయి. యంత్రాల్ని నడపడానికి, వృత్తి నైపుణ్యాలూ, శారీరకశక్తి సామర్ధ్యాలూ గతంలోలాగ అవసరం లేదు. చాలా యంత్రాల దగ్గిర పనికి చాలా తక్కువ కాలపు శిక్షణే సరిపోతుంది. గతంలో, నైపుణ్యం గల పనివాళ్ళు మాత్రమే చేస్తూ ఉండిన పనుల్ని ఇప్పుడు నైపుణ్యం లేని వాళ్ళూ, గతంలో పురుషులు మాత్రమే చేస్తూ ఉండిన పనుల్ని ఇప్పుడు స్త్రీలూ, గతంలో పెద్దవాళ్ళు మాత్రమే చేస్తూ ఉండిన పనుల్ని ఇప్పుడు పిల్లలూ కూడా చేసే పరిస్తితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్తితి, ఆయా పనులకు ఉండే 'శ్రమశక్తి విలువల్ని' తగ్గించింది.

యంత్రాలతో ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత, పిల్లలు (ముఖ్యంగా ఆడ పిల్లలు), స్కూలు చదువులు మాని ఫ్యాక్టరీ పనుల్లోకి రావడం ఎక్కువైంది.

తల్లులు ఫ్యాక్టరీ పనుల్లోకి వెళ్ళడం ఎక్కువైన తర్వాత, కార్మిక కుటుంబాలలో శిశు మరణాలు ఎక్కువయ్యాయి. స్త్రీలు బయటకుపోయి పనులు చెయ్యని కుటుంబాలలో శిశు మరణాల సంఖ్య తక్కువ. కార్మిక కుటుంబాలలో పిల్లలకు సంరక్షణచేసే సమయం తల్లిదండ్రులకు లేకపోవడంవల్లా, పిల్లలకు తగిన పోషకాహారం లేకపోవడం వల్లా, పిల్లల అనారోగ్య పరిస్తితుల్లో తగిన వైద్య సౌకర్యాలు లేకపోవడం వల్లా, అనేక సందర్భాల్లో పిల్లలకు నల్లమందువంటి మత్తు పదార్ధాలు వాడటం వల్లా, పిల్లల జీవితాలు పసితనంలోనే ముగిసి పోతూ ఉంటాయి. కార్మికవాడల్లో నల్లమందు మాత్రలు విరివిగా అమ్ముడు పోతాయనీ, కార్మిక కుటుంబాలలో పిల్లలు చిన్నప్పుడే ముసలి రూపు పడి చిన్న వయసు ముసలివాళ్ళలా కనపడ తారనీ, కొన్ని రిపోర్టులు రాశాయి. పిల్లల్ని సంరక్షించే పరిస్తితి లేక సతమతమయ్యే కార్మిక స్త్రీల సమస్య ఎప్పటికప్పుడు ఒక మార్గంలో పరిష్కారమవుతూ ఉంటుంది. 'పిల్లలు చచ్చిపోవడం' అనే మార్గంలో! పిల్లలు మరణించ గానే ఆ సమస్య తీరినట్టు తల్లులు తేలికపడతారు. పిల్లల మరణాలకు కార్మిక స్త్రీలు చలించకపోవడం 'అసహజంగా' ఉందని కార్మికవాడల్ని సందర్శించిన మేధావుల రిపోర్టులు! తల్లుల్ని అంత 'అసహజంగా' మార్చిన ఘనత పెట్టుబడిదారీ విధానానికే దక్కవలసి ఉంటుంది కదా?

పెట్టుబడిదారీ విధానంలో, ప్రతీ అంశమూ వైరుధ్య పూరితంగా ఉంటుంది కాబట్టి, కుటుంబ సంబంధాలు కూడా వైరుధ్యాలతోనే సాగుతాయి. పెట్టుబడిదారీ విధానం వల్ల ఒక పక్క, పాత కుటుంబ సంబంధాలు మాయం కావడం అనేది, ఎంత భయంకరమైన పద్ధతిలోనూ, అసహ్యమైన పద్ధతిలోనూ సాగినా; ఇంకోపక్క, ఆ పెట్టుబడిదారీ విధానంవల్లనే ఆ సంబంధాలు, స్వేచ్ఛా సంబంధాల స్వభావంతో మారడానికి మార్గం ఏర్పడుతుంది. భారీ పరిశ్రమ, పాత కుటుంబ విధానపు ఆర్థిక పరిస్తితినీ, దాని సంబంధాల్నీ పెద్ద మార్పులకు గురి చేస్తుంది. అప్పటి వరకూ ప్రధానంగా 'గృహ పరిశ్రమ పరిధి'లోనే ఉండిన స్త్రీలనీ, పిల్లల్నీ, సామాజిక ఉత్పత్తి క్రమంలో ఒక ముఖ్య పాత్రను నిర్వర్తించే పరిస్తితికి తేవడం ద్వారా, భారీ పరిశ్రమ, కుటుంబ సంబంధాలన్నీ గతంకన్నా ఉన్నత రూపానికి రావడానికి అనుకూలించే భౌతిక పునాదిని సృష్టిస్తుంది. స్త్రీ పురుష భేదమూ, చిన్నా పెద్దా భేదమూ లేకుండా సమిష్టిగా శ్రమలో పాల్గొనే అవకాశాన్ని సరైన సహజ మార్గంలో వినియోగించుకుంటే, అది అందరి అభివృద్ధికీ కారణమవుతుంది.

**మార్క్సు మాటల్లో:**

"పెట్టుబడిదారీ విధానంలో, పాత కుటుంబ బంధనాలు నాశనం కావడం (డిజల్యూషన్ ఆఫ్ ఫామిలీ టైస్) ఎంత ఘోరంగానూ, అసహ్యకరంగానూ జరిగినప్పటికీ, ఆధునిక పరిశ్రమ, స్త్రీలకూ యువతీ యువకులకూ చిన్న పిల్లలకూ, గృహ పరిధికి ఆవల ఉన్న ఉత్పత్తి క్రమంతో (అవుట్ సైడ్

డొమెస్టిక్ స్ఫియర్) ఒక ముఖ్యమైన పాత్రను కేటాయించడం ద్వారా, ఒక ఉన్నత కుటుంబ రూపానికీ, స్త్రీ పురుషుల మధ్య సంబంధాలలో (బిట్వీన్ బోత్ సెక్సెస్) ఉన్నత రూపానికీ దారితీసే ఒక కొత్త ఆర్థిక పునాదిని సృష్టిస్తుంది ... ఆడా మగా, చిన్నా పెద్దా కార్మికులతో కూడిన ఈ నాటి సమిష్టి కార్మిక బృందం, సరైన పరిస్థితులలో, తప్పనిసరిగా, మానవత్వంతో కూడిన అభివృద్ధికి సాధనంగా ఉంటుందనేది స్పష్టం, అయితే, ఈ నాటి కార్మిక బృందం, స్పాంటేనియస్‌గా తలఎత్తిన క్రూరమైన పెట్టుబడిదారీ రూపంలో ఉండడమనే వాస్తవం, అవి నీతికీ, బానిసత్వానికీ ఆధారమయ్యే దుష్ట విషయంగా ఉంటుంది. ఎందుకంటే, ఈ పెట్టుబడిదారీ రూపంలో, శ్రమ చేసే మనిషి, ఉత్పత్తి క్రమం కోసం ఉంటాడు గానీ; ఉత్పత్తి క్రమం, శ్రమచేసే మనిషి కోసం ఉండదు గనక."

— (కాపిటల్-1, మాస్కో ఎడిషన్ 1974. పేజీ 460).

1866లో (ఇంగ్లండులో) బాల కార్మికుల ఉద్యోగ విషయాలు తనిఖీ చేసే చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషను, ఒక రిపోర్టులో, కార్మిక తల్లిదండ్రుల 'దుర్మార్గాల' గురించి ఇలా వాపోయింది — "కార్మిక తల్లి దండ్రులు, తమ పిల్లల్ని వారానికి కొంత డబ్బు సంపాదించే యంత్రాలుగా మాత్రమే చూస్తున్నారు. పిల్లల మీద ఇటువంటి అధికారం తల్లిదండ్రులకు ఉండడానికి వీలు లేదు. తమ శారీరక బలం చిన్నతనంలోనే నాశనం కాకుండానూ; తాము నైతికం గానూ, మేధాపరం గానూ పతనం కాకుండానూ ఉండే హక్కుని చట్టం ద్వారా పొందడానికి పిల్లలు అర్హులు. మాకు దొరికిన సమాచారాన్నంతటినీ చూస్తే చాలా విచారకరం గానూ, బాధాకరం గానూ ఉన్న విషయం ఏమిటంటే, కార్మికుల పిల్లలందరికీ వాళ్ళ తల్లిదండ్రుల నించే రక్షణ కావాలి!"

కార్మికుల పిల్లలకు తల్లిదండ్రులనించి ఏ రక్షణైతే లేదని కమిషన్ వారు వాపోయారో ఆ రక్షణ పిల్లలకు లేకపోవడానికి కారణం, పిల్లల 'శ్రమ శక్తుల' మీదా, వారి తల్లిదండ్రుల 'శ్రమశక్తుల'మీదా పెట్టుబడి సాగించే దోపిడీయే. అంతేగానీ తల్లిదండ్రులు తమ అధికారాన్ని దుర్వినియోగం చెయ్యడం కాదు. ఈ సంగతి కమిషన్ వారు గ్రహించలేకపోయారు. ధనిక కుటుంబాల తల్లిదండ్రులు, తమ పిల్లల్ని, డబ్బు సంపాదించే యంత్రాలుగా చూడడం లేదు. ఎందుకనీ? వారు, 'ఉదాత్తులైన' తల్లిదండ్రులు అయినందు వల్లనా? వారి 'ఉదాత్తత' అంతా, వారి 'ధనం'లో ఉంది. ఆ 'ధనం'లేని కార్మిక తల్లిదండ్రులు, పిల్లల ద్వారా కూడా డబ్బు సంపాదించడం తప్పనిసరి అవుతుంది. ఇదంతా, పెట్టుబడిదారీ దోపిడీ సృష్టించే నీచ పరిస్థితుల ఫలితమేనని కమిషన్ వారికి బోధపడకపోవడం చాలా సహజమే.

1844లో వచ్చిన ఒక చట్టం, పెట్టుబడిదారులు బాల కార్మికుల్ని కొంతవరకూ చదివించే ఏర్పాట్లు కూడా చెయ్యాలనీ, ప్రతీ బాల కార్మికుడికీ 'స్కూల్లో చదువుతున్నా డ'నే సర్టిఫికెట్టు ఉండాలనీ, ఆదేశించింది. ఈ ఆదేశాల్ని పెట్టుబడిదారులు రక రకాల ఎత్తులతోటీ జిత్తుల తోటీ తిరస్కరించిన సందర్భాల్నీ, అమలు జరపని సందర్భాల్నీ, ఇంకా ఆ రకం వాటన్నిటినీ తీసివేస్తే, మిగిలిన సమాచారం ఏమిటంటే - బాల కార్మికుల చదువులకోసం ఫ్యాక్టరీల్లోనే స్కూళ్ళు వెలవడం ప్రారంభమైందని క్లుప్తంగా చెప్పుకోవచ్చు. ఆ స్కూళ్ళు ఎలా ఉండేవో చాలా రిపోర్టులు వర్ణించాయి. కిక్కిరిసిన తరగతి గదుల్లో బాల కార్మికుల చదువులు! తమ పేర్లు కూడా సరిగా రాసుకోలేని వాళ్ళే ఆ స్కూళ్ళల్లో టీచర్లు!

ఈ ఫ్యాక్టరీ స్కూళ్ళల్లో చదువులు ఎంత అధ్వాన్నంగా ఉన్నా, అప్పుడప్పుడూ చాలా తక్కువసేపు మాత్రమే చదివే ఆ పిల్లలు, రోజంతా స్కూళ్ళల్లో కూర్చుని చదివే ఫుల్‌టైమ్ విద్యార్థుల్లాగానే చదవగలిగారు. చదువులో 'విసుగు పుట్టించేటంత కాలం' ఉండకపోవడం వల్ల, తక్కువ కాలంలోనే ఆసక్తిగా నేర్చుకోగలిగారు. 'పిల్లలకు చదువూ, పనీ కూడా కలిపి నేర్పవచ్చును' — అనే విషయం ఈ ఫ్యాక్టరీ స్కూళ్ళ ద్వారానే రుజువైంది. ఎప్పుడూ చదువే కాకుండానూ, ఎప్పుడూ పనే కాకుండానూ, రెండూ కలిపి నేర్పితే, నేర్చు కునే వాళ్ళకు ఆసక్తికరంగా ఉంటుందనే కొత్త అంశం ఒకటి ఈ రకంగా సమాజానికి దొరికింది. రోజంతా స్కూల్లో కూర్చోడం (లాంగ్ స్కూల్ డే) విసుగెత్తించేలా ఉండి, చదువు మీద ఆసక్తిని చంపుతుంది. దాని వల్ల పిల్లల శక్తులూ, టీచర్ల శక్తులూ కూడా వేస్టవుతాయి.

'లాంగ్ స్కూల్ డే' పద్ధతి చాలా తప్పని 1863లో, 'సీనియర్'అనే పెట్టుబడిదారీ ఆర్థికవేత్త చెప్పాడు. ఈయన ఇతర విషయాలన్నీ చాలా అవక తవకగా చెప్పినప్పటికీ.

ఓవెన్ అనే మేధావి కూడా "భవిష్యత్తులో విద్యా విధానం ఎలా ఉంటుందనేది ఫ్యాక్టరీ విధానంలోనే ఉంది" అన్నాడు.

చదువునీ, పనినీ, ఆట పాటల్నీ కంబైన్ చెయ్యడం అనేది, కేవలం ఉత్పాదక శక్తుల్ని పెంచడానికి కాదు; మనిషి, చిన్నతనంనించీ శ్రమించే బాధ్యతనీ, తనను తను

పోషించుకోవలసిన అవసరాన్నీ గ్రహించడానికీ; అందుకు తగిన సమర్థత పొందడానికీ, ఇది అవసరం. అన్ని కోణాల లోనూ సంపూర్ణంగా అభివృద్ధి చెందిన నూతన మానవుడు రూపొందడానికి ఇది అవసరం.

మార్క్సు మాటల్లో:

"రాబర్ట్ ఓవెన్ మనకు వివరంగా చూపించి నట్టుగా, ఉత్పత్తి కార్యంలో సామర్థ్యానికి దోహదం చేసే పద్ధతి గానే గాక, సంపూర్ణంగా అభివృద్ధి చెందిన మానవులను తయారుచేసే ఏకైక పద్ధతిగా కూడా, కొంత వయసు గల ప్రతీ బిడ్డ విషయంలోనూ, 'ఉత్పత్తికి సంబంధించిన శ్రమ'ని చదువుతోనూ, వ్యాయామ కార్యకలాపాలతోనూ (విత్ జిమ్నాస్టిక్స్), మిళితంచేసే భవిష్యత్ విద్య, ఫ్యాక్టరీ విధానం నించే మొగ్గ తొడిగింది." (కాపిటల్-1; పేజీ 454)

"ఆధునిక పరిశ్రమ — జీవితాంతమూ ఒకే రకమైన, స్వల్పమైన పనిని తిరిగి తిరిగి చెయ్యడం ద్వారా వికలాంగుడై (క్రిపుల్డ్), కేవలం మనిషిలోని ముక్కగా మాత్రమే కుంచించుకుపోయిన నేటి డీటేల్డ్ కార్మికుణ్ణి, రకరకాల శ్రమలు చెయ్యగల వాడిగానూ; తన స్వంత సహజ శక్తులనూ, అభ్యాసం ద్వారా పొందిన శక్తులనూ (ఓన్ నాచురల్ అండ్ ఎక్వైర్డ్ పవర్స్) వినియోగించడానికి అవకాశాలు కలిగే విధంగా — భిన్న సామాజిక విధులను నిర్వర్తించే వాడిగానూ — రూపొందించి, ఆ విధంగా, గత కాలపు కార్మికుణ్ణి, సంపూర్ణంగా అభివృద్ధి చెందిన నూతన మానవుడిగా మార్చే విధంగా, సమాజాన్ని, మరణశిక్ష ద్వారా, బలవంత పెడుతుంది. ఈ రక మైన విప్లవం జరిగే దిశలో, ఇప్పటికే స్పాంటేని యస్‌గా తీసుకున్న ఒక చర్య ఏమిటంటే — కార్మి కుల పిల్లలు, సాంకేతిక విషయాలలోనూ, వివిధ శ్రమ పరికరాలను ప్రాక్టికల్‌గా ఉపయోగించడం లోనూ కొంత శిక్షణ పొందే సాంకే తిక, వ్యవసాయక స్కూళ్ళనూ, వృత్తి విద్యా సంబంధ మైన స్కూళ్ళనూ ఏర్పర్చడం ........ 'ఫ్యాక్టరీ చట్టం' అనేది (కార్మికవర్గం 'పెట్టుబడి'నించి తీసుకోగలిగిన మొదటి అతి స్వల్ప మైన రాయితీ ఇది), ఫ్యాక్టరీ పనితో 'ప్రాథమిక విద్య'ను మాత్రమే మిళితం చెయ్యడానికి పరి మితమై ఉంది. కానీ, కార్మికవర్గం తప్పని సరిగా రాజకీయాధికారాన్ని పొందినప్పుడు, కార్మికవర్గ స్కూళ్ళల్లో, సైద్ధాంతిక, ఆచరణాత్మక, సాంకేతిక విద్య తగిన స్థానాన్ని పొందుతుందనేది నిస్సందేహం. పాత శ్రమ విభజనను నిర్మూలించడమే లక్ష్యంగా గల విప్లవకర శక్తులు, పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపానికీ, దానికి తగినట్టుగా ఉండే కార్మికుల ఆర్థిక పరిస్థితికీ, పూర్తి వైరుధ్యంతో ఉంటాయి — అనేది కూడా నిస్సందేహం" — (కాపిటల్-1, పేజీ - 458).

ఈ పేరాల్లో అద్భుతమైన మాటలెన్నో ఉన్నాయి. ప్రతీ మనిషీ శ్రమ చెయ్యాలనేది మొట్టమొదటి షరతు. అంతే కాదు. మనిషి అనేవాడు 'రకరకాల శ్రమలు చెయ్య గలవాడిగానూ', 'భిన్న సామాజిక విధ్యలు నిర్వర్తించగల వాడిగానూ' రూపొందాలని ఈ మాటలు చెపుతున్నాయి. దోపిడీ సమాజాన్ని మార్చివేసే విప్లవ శక్తులు, పాత శ్రమ విభజనను నిర్మూలించడమే లక్ష్యంగా చేసుకోవాలని చెపుతున్నాయి!

— పెట్టుబడిదారుడి పని స్థలంలోకి భారీ యంత్రం ప్రవేశించడం అంటే, ప్రకృతి శాస్త్రజ్ఞానం అంతా పెట్టుబడి దారుడి సేవలోకి ప్రవేశించినట్టే. సైన్సులో ఒక సూత్రం ప్రపంచానికి వెల్లడైపోయిన తర్వాత, దాన్ని కనిపెట్టే కొత్త ఖర్చులేవీ లేకుండా ప్రతీ పెట్టుబడిదారుడూ దాన్ని ఉప యోగించుకోగలుగుతాడు. యంత్రం అంతా పూర్తిగా సైన్సు మీదే ఆధారపడి ఉంటుంది. యంత్రం పని చెయ్యడం అంటే, సైన్సు పని చెయ్యడమే. సైన్సు ద్వారా తయారై సైన్సు ద్వారా నడిచే యంత్రాన్ని పెట్టుబడి దారుడు కేవలం డబ్బు సంపాయించడం కోసమే తన పని స్థలంలో ఉపయోగిస్తాడు. ఇతర పెట్టుబడిదారులతో పోటీలో తన ఉత్పాదక శక్తుల్ని పెంచుకోవడం కోసమే ప్రతీ పెట్టుబడిదారుడూ నిత్యం సైన్సు ప్రయోగాలు చేయిస్తూ ఉంటాడు. అంతేగానీ వాడి బతుకులో సైన్సూ తర్కమూ హేతుబద్ధతా వగైరా లక్షణాలేవీ ఉండవు. సైన్సు మీద ఏమీ నమ్మకం లేకుండానే, సైన్సుకి విరుద్ధమైన దాని మీద భక్తి విశ్వాసాలు వదలకుండానే, వాడు సైన్సుని తన సేవలోకి లాగి, దానితో డబ్బు చేసుకుంటాడు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో ఎంతెంత భారీ యంత్రాలు నడుస్తోన్నా, అవి ఎంతెంత ప్రకృతి శాస్త్ర సూత్రాలతో పని చేస్తోన్నా, ఆ జ్ఞానం సమాజానికి 'సైన్సు దృష్టి'ని ఇవ్వదు. భారీ యంత్రాలతో పనిచేస్తూ, వాటి చలన సూత్రాల్ని నిత్యమూ చూసే కార్మికులు కూడా, ఆ సూత్రాలకూ మొత్తం ప్రకృతికీ సంబంధం ఉందనీ, యంత్రంలో ఉన్న భౌతిక సూత్రాలే ప్రకృతి అంతా నిండి ఉన్నాయనీ, ప్రకృతి అంతా హేతుబద్ధ సూత్రాలతో నడిచే ఒక సహజ యంత్రమనీ, ప్రకృతి అంతా భౌతిక ప్రపంచ మనీ — ఈ విషయాలేవీ గ్రహించలేరు. యంత్ర సూత్రా

లన్నీ పని స్థలానికి మాత్రమే పరిమితమైన విషయాలుగా వారికి కనపడతాయి. సైన్సు సూత్రాలన్నిటినీ అధ్యయనం చేసి అత్యద్భుత యంత్రాల్ని నిర్మించే సైంటిస్టులూ, ఇంజనీరులూ కూడా సైన్సుని సైన్సుగానూ, 'సృష్టికర్తని సృష్టికర్త'గానూ, చూస్తారు. ఆ మేధావులు, యంత్ర రచన నించి బయటపడగానే (ఇంకా సరిగా చూస్తే, ఆ యంత్ర రచనలో ఉండగా కూడా) సృష్టికర్త లీలావిలాసాన్ని ఊహించి ముగ్ధులవుతారు. యంత్రంలో సైన్సు సూత్రాలు చూసే సాధారణ కార్మికులు కూడా, యంత్రం సరసనే 'మహిమల' ముందు మోకరిల్లుతారు. యంత్రం ద్వారా పెట్టుబడిదారుడికి ఎక్కువ డబ్బు రావడం చూసే కార్మికులు, యంత్రాన్ని 'డబ్బు సంపాదించే సాధనంగా' మాత్రమే గ్రహిస్తారు. ఇది, హేతుబద్ధ సూత్రాల్ని (సైన్సుని) హేతు విరుద్ధ దృష్టితో (డబ్బు దృష్టితో) ఉపయోగించే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఇచ్చే ఫలితమే. ఈ ఉత్పత్తి విధానం, కార్మికుల సైన్సు జ్ఞానాన్ని అస్పష్ట స్థితిలో (అన్ కాన్షియస్‌గా) ఉంచి, వారి చైతన్యాన్ని ప్రతీ కోణంలోనూ వైరుధ్య పూరితం చేస్తుంది.

# ఆధునిక గృహ పరిశ్రమా, ఆధునిక మాన్యుఫాక్చరూ

ఒక శాఖలో ఉత్పత్తి అయ్యే సరుకులో అధిక భాగం యంత్రాల ద్వారానే ఉత్పత్తి అవుతూ ఉంటే, ఆ శాఖలో యంత్ర విధానం అనేది, సాధారణ ఉత్పత్తి విధానం అయి పోతుంది. ఇంగ్లండులో, భారీ పరిశ్రమ అన్ని శాఖల లోనూ సాధారణ ఉత్పత్తి విధానం అయిపోయే దాకా, గృహ పరిశ్రమా మాన్యుఫాక్చరూ ఇంకా కొంత స్థాయిలలో, ఆధునిక రూపాలలో, నిలిచి ఉన్నాయి.

ఈ 'ఆధునిక గృహ పరిశ్రమ'కీ, 'ప్రాచీన గృహ పరిశ్రమ'కీ పేరులో తప్ప ఏమీ పోలిక లేదు. అలాగే, ఈ ఆధునిక మాన్యుఫాక్చర్‌కీ పాతకాలపు మాన్యుఫాక్చర్‌కీ కూడా.

ప్రాచీన గృహ పరిశ్రమ, చేతి వృత్తుల పని వారూ రైతులూ — తమ గృహావసరాల కోసమూ, కొద్ది స్థాయిలో మారకాల కోసమూ — బట్టలూ, చెప్పులూ, ఇతర పని ముట్లూ తయారు చెయ్యడంగా ఉండేది. ఆ ప్రాచీన గృహ పరిశ్రమదారులు, తమకు అవసరమైన ఇతర వస్తువులు తెచ్చుకోవడం కోసం, తమ వస్తువులు అమ్మడం చేసే వారు. కానీ, ఆధునిక గృహ పరిశ్రమ - స్వభావం అలాంటిది కాదు. ఇది పూర్తిగా పెట్టుబడిదారీ స్వభావం తోనే ఉంటుంది. అంటే, ఇది అమ్మకాల కోసమే సరుకుని ఉత్పత్తి చేస్తుంది. దీని శ్రమ పరికరాలూ, ఉత్పత్తీ, అతి తక్కువ స్థాయిలో ఉంటాయి కాబట్టే, ఆ కారణాల వల్లనే ఇది 'గృహ పరిశ్రమ' అవుతుంది. ఇది అతి తక్కువ స్థాయి పరికరాలతోటీ, అతి తక్కువ మంది పనివాళ్ళతోటీ నడుస్తుంది. యజమాని ఇంటి భాగంలోనో, లేదా ఒక చిన్న అద్దె గదిలోనో ఏదో ఒక సరుకుని తయారు చేస్తారు. ఈ సరుకుని తయారు చేయించే వాళ్ళు కూడా (యజమానులు కూడా) శ్రమలో ఉంటూ, బయట శ్రామికుల్ని కూడా పనిలో పెట్టుకుంటారు. 'ఆధునిక గృహ పరిశ్రమ' యజమాని, 'చిన్న పెట్టుబడిదారుడి'గా (పెటీ బూర్జువాగా) ఉంటాడు. ఈ పరిశ్రమ ద్వారా కొంత సంపాదించిన తర్వాత, ఆ యజమాని తప్పనిసరిగా తను శ్రమ చెయ్యడం మానేస్తాడు. ఒక కుటుంబమనిషి, తన దగ్గిర పనివాళ్ళని పెట్టుకుని గానీ, పెట్టుకోకగానీ జనాలకు బట్టలు కుట్టి ఇవ్వడం ఆధునిక గృహ పరిశ్రమే. (శ్రామికుల్ని పెట్టుకోని కుటుంబమనిషి స్వతంత్ర ఉత్పత్తిదారుడవుతాడు.) లేసులూ, స్వెట్టర్లూ, మేజోళ్ళూ లాంటివి అల్లి అమ్మడం, బీడీలు చుట్టడం, అట్టపెట్టెల తయారీ, బుక్ బైండింగూ — వగైరా పనులన్నీ గృహ పరిశ్రమల ద్వారా కూడా జరుగుతాయి.

'ఆధునిక మాన్యుఫాక్చర్'లో ఉత్పత్తి స్థాయి, గృహ పరిశ్రమలో కన్నా చాలా ఎక్కువగానూ, భారీ పరిశ్రమలో కన్నా చాలా తక్కువగానూ ఉంటుంది. ఇందులో, భారీ యంత్రాలు ఉండవు. తక్కువ స్థాయి యంత్రాలూ, భారీ పరిశ్రమకి పనికిరాక వెనకబడిపోయిన రకాల యంత్రాలూ ఉంటాయి. ఇక్కడ, పనిలో ఎక్కువ భాగం చేతి పని ముట్ల తోనే నడుస్తుంది.

ఏ శాఖని తీసుకున్నా, అక్కడ తయారయ్యే 'మొత్తం ఉత్పత్తి'లో కొంత సరుకు, గృహ పరిశ్రమ ద్వారానూ, మాన్యుఫాక్చర్ ద్వారానూ ఉత్పత్తి అవుతూ ఉంటుంది. భారీ పరిశ్రమల సరుకులతో పోలిస్తే, వీటి సరుకులు నాసిరకంగానే ఉంటాయి. 'పేదజనాల' (ముఖ్యంగా శారీరక శ్రమలు చేసే కార్మికుల) అవసరాలలో కొన్నింటిని ఈ నాసిరకం సరుకులు తీరుస్తాయి.

గృహ పరిశ్రమ, మాన్యుఫాక్చర్ తోనూ; మాన్యుఫాక్చరు, ఫ్యాక్టరీతోనూ — పోటీపడవలసి ఉంటుంది

కాబట్టి, ఫ్యాక్టరీలలో కన్నా మాన్యుఫాక్చర్లలోనూ, మాన్యుఫాక్చర్లలో కన్నా గృహ పరిశ్రమలలోనూ పరిస్థితులన్నీ దుర్భరంగా ఉంటాయి. కార్మికుల పనిగంటలు ఎక్కువగా ఉండి, జీతాలు తక్కువగా ఉంటాయి. ఫ్యాక్టరీలతో పోలిస్తే, వీటి అదనపు విలువలు కూడా చాలా తక్కువగానే ఉంటాయి.

ఈ గృహ పరిశ్రమలూ, మాన్యుఫాక్చర్లూ కూడా (అందులోనూ ముఖ్యంగా గృహ పరిశ్రమలు) ఫ్యాక్టరీలకు అనుబంధ సంస్థలుగా ఉంటాయి. ఇవి — ఫ్యాక్టరీలో తయారయ్యే సరుకుకి సంబంధించిన చిన్న చిన్న విడి భాగాల్ని చేసి ఇవ్వడమూ; లేసులూ, దుస్తులూ లాంటి కొన్ని ప్రత్యేక సరుకుల విషయంలో, ఫ్యాక్టరీలో తయారైన సరుకుకి ఫినిషింగ్ ఇవ్వడమూ — వంటి పనులు చేస్తాయి. ఇవి చాలావరకూ ఫ్యాక్టరీలు ఇచ్చే ఆర్డర్ల మీదే ఆధారపడతాయి. ఈ సంస్థలకూ ఫ్యాక్టరీలకూ మధ్య 'దళారులు' ఉంటారు. ఫ్యాక్టరీల నించి కొన్ని రకాల ముడి సరుకుల్ని తెచ్చి గృహ పరిశ్రమలకు ఇవ్వడమూ, తయారైన సరుకుని తిరిగి ఫ్యాక్టరీలకు ఇవ్వడమూ చేస్తూ ఈ దళారులు, 'కమిషన్లు' పొందుతూ ఉంటారు. ఈ దళారులు కార్మికులుగా పని చేసే వ్యక్తులైనా కావచ్చు, ఏ శ్రమా చెయ్యని వాళ్ళయినా కావచ్చు. సాధారణంగా ఏ శ్రమా చెయ్యని వాళ్ళే దళారులుగా ఉంటారు. ఈ దళారుల కమిషన్లు 'అదనపు విలువ'లో భాగాలే.

గృహ పరిశ్రమల్లో జీతాలు 'పీస్ వేజ్' పద్ధతిలోనే ఇస్తారు. (పీస్ వేజ్ అంటే ఏమిటో ఈ సంపుటం లోనే 2వ భాగంలో, 'పని దినం' చాప్టర్లో చూశాం.)

ఒక రెడీమేడ్ దుస్తుల ఫ్యాక్టరీని తీసుకుంటే, దానికి కావలసిన సరుకు ఆ ఫ్యాక్టరీలోనేగాక, అనేక గృహ పరిశ్రమల్లోనూ, మాన్యుఫాక్చర్లలోనూ కూడా తయారవుతుంది. ఇక్కడ కత్తిరింపులు చేసి అక్కడికి పంపడంగానీ, ప్రధానమైన భాగాల్ని అతికించి మిగతా పనుల కోసం పంపడంగానీ, చేస్తారు. ఆ పనులు కూడా ఫ్యాక్టరీలో చేయించడం కన్నా బైట చేయిస్తే తక్కువ ఖర్చు అయితేనే అలా చేస్తారు. బైట ఖర్చు ఎందుకు తగ్గుతుందంటే - ఫ్యాక్టరీలో కన్నా బైట ఉత్పాదక శక్తులు ఎక్కువగా ఉండడం వల్ల కాదు; అక్కడ కార్మికులు, ఫ్యాక్టరీలో కన్నా ఎక్కువ గంటలు పనిచేస్తారు; ఎక్కువ తీవ్రతతో కూడా చేస్తారు; జీతాలు చాలా తక్కువ. ఇతర సౌకర్యాల మాటే లేదు. కాబట్టి, అలాంటి చోట్ల కొన్ని పనులు చేయించడం వల్ల, ఫ్యాక్టరీకి కొన్నిసార్లు లాభదాయకంగా ఉంటుంది. ఫ్యాక్టరీలో ఉత్పాదక శక్తులు ఇంకా పెరిగి, బైట కన్నా, ఫ్యాక్టరీలలోనే తక్కువ ఖర్చుతో పని జరిగే పరిస్థితి ఏర్పడితే, బైట కార్మికులతో పని చేయించడం ఆపేస్తారు. అలాంటి పరిస్థితి వల్లనే గృహ పరిశ్రమలూ, మాన్యుఫాక్చర్లూ క్రమంగా నశించి, ఆ కార్మికులంతా పని లేని స్థితికి చేరతారు.

వెయ్యి మంది కార్మికులతో పనిచేసే ఒక లండన్ షర్టు ఫ్యాక్టరీకి, వివిధ గ్రామీణ ప్రాంతాల్లో కూడా, 9 వేల మంది కార్మికులు ఉండేవారు. మొత్తం ఈ 10 వేల మందీ ఆ ఫ్యాక్టరీ సరుకుని తయారు చేసేవారే. అయితే, ఫ్యాక్టరీ చట్టాలన్నీ, ఆ ఫ్యాక్టరీలో డైరెక్టుగా పనిచేసే వెయ్యి మంది కార్మికులకే వర్తిస్తాయిగానీ, బైట ఉన్న 9 వేల మంది కార్మికులకు వర్తించవు. వారు చేసే పనికూడా ఈ ఫ్యాక్టరీకి సంబంధించిందే అయినా వారికి ఫ్యాక్టరీ చట్టాల ద్వారా ఏ రక్షణా ఉండదు.

లండన్‌లో, 1861 నాటి ఫ్యాక్టరీ చట్టం ప్రకారం, అన్ని ఫ్యాక్టరీలలోనూ కలిసి 10 వేల మంది కార్మికులు మాత్రమే చట్టం రక్షణ కిందకి వచ్చారు! 1 లక్షా, 40 వేల మంది కార్మికులు చట్టాల రక్షణ దొరకని స్థితిలో ఉండిపోయారు. వారిలో స్త్రీలూ, పిల్లలూ కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు.

ఫ్యాక్టరీ కార్మికులు ఒక పని స్థలంలో కలిసి ఉన్నట్టు, గృహ పరిశ్రమల కార్మికులు ఒకేచోట కలిసి ఉండరు. వారంతా అనేక చోట్ల చెల్లాచెదురుగా ఒకరితో ఒకరికి డైరెక్టు సంబంధాలు లేకుండా ఉంటారు. అందరూ కలిసి సంఘ టితపడే అవకాశం వారికి ఉండదు. అందుకే వారి పోరాట శక్తి తక్కువ స్థాయిలో ఉంటుంది.

పనులు లేక భారీ పరిశ్రమ నించీ, వ్యవసాయం నించీ తప్పుకునే కార్మికులకు గృహ పరిశ్రమలూ మాన్యుఫాక్చర్లూ ఆశ్రయాలుగా ఉంటాయి. కానీ పనులు దొరకడం అక్కడ కూడా గ్యారంటీ కాదు.

ఒక గృహ పరిశ్రమలో పని పరిస్థితిని ఒక రిపోర్టు ఇలా వర్ణించింది. — "ఫ్యాక్టరీలలో తయారైన లేసులకు ఫినిషింగ్ టచెస్ ఇచ్చే పనులు ఇక్కడ చేస్తారు. స్త్రీలూ, పిల్లలూ ఈ పని చేస్తారు. ఈ పరిశ్రమ యజమానులు, ఫ్యాక్టరీల నించి కాంట్రాక్టు పద్ధతి మీద ఆర్డర్లు తీసుకుంటారు. ఇక్కడ కార్మికులు అతి బీదతనంలో ఉంటారు. పని ఒత్తిడి ఎక్కువ. ఉదయం 6 గంటల నించి, అర్ధరాత్రి 12 గంటల వరకూ, మొత్తం 18 గంటలు పని చేస్తారు. పిల్లలకు 15 గంటల పని! కిక్కిరిసిన గదుల్లో గ్యాసులైట్ల వెలుతురులో పని చేస్తారు. లేసులు మాయకుండా ఉండడం కోసం గజ గజ వణికించే చలిలో కూడా కార్మికుల్ని జోళ్ళు వేసుకోనివ్వరు. వంచిన తల ఎత్తకుండా ఒకే పద్ధతిలో మెడ వంచి చక చకా పని చెయ్యాలి. కళ్ళకు

విపరీతమైన శ్రమ. యజమానులు బెత్తాలతో తిరుగుతూ, నిద్రతో జోగుతోన్న పిల్లల్ని ఛెళ్ళు ఛెళ్ళున బాదుతూ ఉంటారు. కార్మికులకు ఇళ్ళ దగ్గర చెయ్యడానికి కూడా కొంత పని అప్పగిస్తారు. బానిసత్వాన్ని మించిన ఘోరమైన పని ఇది" — ఇదీ ఆ రిపోర్టు!

'ఘోరమైన పని' అనే కీర్తి పొందడానికి ఆధునిక మాన్యుఫాక్చర్లు కూడా ఏమీ తీసిపోవు. కొన్ని లండన్ మాన్యుఫాక్చర్లు 'కబేళాలు' అనే బిరుదులు పొందాయి. పెద్ద వాళ్ళకీ, పిల్లలకీ అందరికీ అక్కడ రోజంతా శ్రమే.

గృహ పరిశ్రమలు — మాన్యుఫాక్చర్లుగానూ, మాన్యు ఫాక్చర్లు — ఫ్యాక్టరీలుగానూ ఎదగడానికే ప్రయత్నిస్తాయి. పరిస్థితులన్నీ కలిసి వచ్చినవి (ఎక్కువ దోపిడీ చెయ్యగలిగి నవి) ఎదుగుతాయి. లేనివి నశించిపోతాయి.

భారీ పరిశ్రమలో నిత్యం సాగే పోటీ, సాంకేతిక అంశాల్ని అభివృద్ధి చేస్తూ, భారీ పరిశ్రమ మాత్రమే ఉనికిలో ఉండగలిగేలాంటి పరిస్థితుల్ని త్వరితంచేసి, ఇతర ఉత్పత్తి రూపాలన్నిటినీ క్రమంగా ధ్వంసం చేస్తుంది. స్వతంత్ర చేతి వృత్తుల్నీ, గృహ పరిశ్రమల్నీ, మాన్యు ఫాక్చర్లనీ, అన్నిటినీ ధ్వంసం చెయ్యడంద్వారా అది, భారీ పరిశ్రమ నించి తరలిపోయే నిరుద్యోగ కార్మిక జనాల ఆశ్రయాలను ధ్వంసం చేస్తుంది. ఆ రకంగా, మొత్తం సామాజిక యంత్రాంగం లోనే అంతవరకూ రక్షణ మార్గంగా ఉన్న దాన్ని మూసి వేస్తూ, తన నెత్తి మీదకు ఉరికే ఆపదని తనే త్వరితం చేసుకుంటుంది.

ఒక దేశపు మొత్తం ఉత్పత్తి రంగాల్లో యంత్ర విధానం తగినంత భాగంలో నిలదొక్కుకున్నప్పుడూ; యంత్రాలు యంత్రాల ద్వారానే తయారవడం ప్రారంభ మైనప్పుడూ; యంత్రాలకు కావలసిన లోహ పరిశ్రమా, బొగ్గుపరిశ్రమా, రసాయనాల పరిశ్రమా, రవాణా పరిశ్రమా, వార్తా ప్రసార పరిశ్రమా — వగైరా పరిశ్రమలు తగినంత అభివృద్ధి చెందినప్పుడూ; ఈ పరిస్థితులన్నీ ఏర్పడినప్పుడు, భారీ పరిశ్రమకు కావలసిన కనీస సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయని అర్థం. అప్పటి నించి, ఈ ఉత్పత్తి విధానం, ఇక పెద్ద పెద్ద అంగలతో విస్తరించడానికి తగిన శక్తి సామ ర్థ్యాలు పొందుతుంది. దాని విస్తరణకు ఇక ఎటువంటి హద్దులూ ఉండవు — ముడి పదార్థాలు దొరకడమూ, తయారైన సరుకుకి మార్కెట్లు దొరకడమూ అనే హద్దులు తప్ప. అసాధారణమైన అంగలతో ఉత్పత్తి చేసే భారీ పరిశ్రమకి, 'దేశీయ' సంకుచిత హద్దులు పనికి రావు. అవసరమైతే 'విదేశీ' మార్కెట్లలో కూడా అమ్ముకోగలిగే పరిస్థితి దానికి ఉండాలి. ఒక పారిశ్రామిక దేశం, విదేశీ మార్కెట్లలో జొరబడడానికి, రవాణా సాధనాలూ, కమ్యూ నికేషన్ సాధనాలూ గొప్ప ఆయుధాలుగా పనిచేస్తాయి. స్వదేశీ మార్కెట్లలో అమ్మినప్పటి కన్నా, విదేశీ మార్కెట్లలో అమ్మడంవల్ల ఎక్కువ లాభం వచ్చేటట్టయితే, ఆ సరు కుతో స్వదేశంలో ఎంత అవసరం ఉన్నా, పెట్టుబడి దారుడు దాన్ని విదేశాలకే తీసుకుపోయి అమ్ముతాడు. వాడి సరుకు వాడి ఇష్టం! దాన్ని ఎక్కడ అమ్ముకోడానికైనా వాడికి హక్కు ఉంటుంది.

భారీ పరిశ్రమల ద్వారా ఉత్పత్తిచేసే ఒక పారిశ్రామిక దేశపు పెట్టుబడిదారులు, వెనకబడ్డ ఉత్పత్తి విధానాలు గల దేశాల మార్కెట్లని ఆక్రమిస్తారు. ఆ దేశాల స్వతంత్ర ఉత్పత్తిదారులు గానీ, అక్కడి పెట్టుబడిదారులు గానీ, తమతో పోటీలో నిలబడలేని పరిస్థితులు కల్పిస్తారు. ఆ దేశాల పరిశ్రమలు కొన్ని రకాల ముడిపదార్థాల్ని మాత్రమే ఉత్పత్తి చేసి, తమకు సప్లయి చేసేవిధంగా ఆ దేశాల పరిశ్రమల్ని మార్చివేస్తారు. అభివృద్ధి చెందిన రవాణా మార్గాల ద్వారా, ఆ ముడిపదార్థాల్ని తమ దేశాలకు తీసుకు పోయి, అక్కడ వాటిని వాడకానికి పనికి వచ్చే సరుకులుగా తయారు చేసి, తమ దేశంలోనూ, ఇతర దేశాలలోనూ అమ్ముతారు.

ఒక పారిశ్రామిక దేశం (అంటే, దాని పెట్టుబడి దారులు), తను వేళ్ళూనిన అన్ని దేశాలలోనూ, శ్రామికు లలో మెజారిటీ సంఖ్యకు పనులు పోగొట్టి, వారు ఆకలి చావులకు గురయ్యే లాగానూ, ఇతర దేశాలకు వలసలు పోయేలాగానూ (ఎమిగ్రేషన్), ఆ దేశాలు తనకు వలస లుగా మారేలాగానూ (కాలనైజేషన్), పరిస్థితులు సృష్టి స్తుంది. అప్పటినించి, వలస దేశాలన్నీ, 'యజమాని — దేశానికి' కావలసిన ముడిపదార్థాల్ని ఉత్పత్తిచేసే, 'సెటిల్ మెంట్స్'గా మారతాయి.

బ్రిటన్ పరిశ్రమల కోసం భారత దేశం, పత్తీ, ఉన్నీ, జనపనారా నీలిమందూ వగైరా ముడిపదార్థాలు ఉత్పత్తి చెయ్యవలసి వచ్చింది. 1846లో భారత దేశం నించి, బ్రిటన్‌కి పత్తి ఎగుమతి 4 కోట్ల పౌన్లు అయితే, అది 1865 నాటికి 45 కోట్ల పౌన్లు అయింది. పత్తిని బ్రిటన్‌కి ఇచ్చి, ఆ పత్తితోనే బ్రిటన్‌లో తయారైన బట్టలు భారత దేశం కొనాలి — ఆ భారత దేశంలోనే లక్షల నేత శ్రామికులు పనులు లేక ఆకలితో మరణిస్తూ ఉండగా! అలాగే, బ్రిటను, తన ఉన్ని పరిశ్రమ కోసం, ఆస్ట్రేలియా భూముల్ని గొర్రెల మందల్ని పెంచే బీళ్ళుగా మార్చి వేసింది. 1846లో, ఆస్ట్రే లియానించి బ్రిటన్‌కి 2 కోట్ల పౌన్ల ఉన్ని ఎగుమతైతే, 1865 నాటికి అది 11 కోట్ల పౌన్లు అయింది. — ఈ

రకంగా, యజమాని దేశానికీ, దాని వలస దేశాలకూ మధ్య ఒక 'కొత్త రకపు శ్రమ విభజన' పుట్టు కొస్తుంది. పరిశ్రమలకు కావలసిన ముడిసరుకుల్నీ, ముడి వ్యవసాయ ఉత్పత్తుల్నీ తయారు చేసే పని వలస దేశాలదైతే, వాటితో పారిశ్రామిక సరుకుల్ని తయారు చేసే పని పారిశ్రామిక దేశాలది. ఈ శ్రమ విభజన, యజమాని దేశాల ప్రయోజనాలకు అనుకూలంగా ఉండే పద్ధతుల్లోనే సాగుతూ ఉంటుంది.

# 'వ్యవసాయం'లో భారీ పరిశ్రమ

**యం**త్రాలతో వ్యవసాయం జరగడమే, 'వ్యవసాయంలో భారీ పరిశ్రమ'. పరిశ్రమలలోకి యంత్రం ప్రవేశించినప్పుడు ఎలాంటి పరిస్థితులు ఏర్పడతాయో, వ్యవసాయంలోకి యంత్రం ప్రవేశించినప్పుడు కూడా అలాంటి పరిస్థితులే ఏర్పడతాయి.

ఏ రంగంలో అయినా పెట్టుబడి పెట్టే వాడే పెట్టుబడిదారుడు. వ్యవసాయంలో పెట్టుబడి పెట్టదల్చిన పెట్టుబడిదారుడే, భూస్వామి నించి భూమిని కౌలుకి తీసుకుంటాడు. ఆ భూమిలో గత కాలంనించీ శ్రమ చేస్తూ ఉన్న రైతు కుటుంబాల సభ్యుల్ని తన కూలీలుగా పెట్టుకుంటాడు. పెట్టుబడిదారుడు పని చెయ్యకుండానే ఆ భూమిలో పంట పండుతుంది. అందులోనించి ఉత్పత్తి సాధనాల ఖర్చులూ, జీతాలూ, భూమి కౌలూ అన్నీ పోగా మిగిలింది వాడికి - లాభం! వాడే పెట్టుబడిదారీ కౌలు రైతు! కాలికి మట్టి అంటకుండా వ్యవసాయం చేసే రైతు!

అదే పెట్టుబడిదారీ వ్యవసాయం. అదే ఆధునిక వ్యవసాయం.

'ఫ్యూడల్ కౌలు విధానం' నశించి, 'పెట్టుబడిదారీ కౌలు విధానం' వృద్ధి చెందడం అనేది, వ్యవసాయంలోకి యంత్రాల ప్రవేశంతో మరీ ఎక్కువవుతుంది.

పారలూ గునపాలూ నాగళ్ళూ కొడవళ్ళూ వంటి చేతి పరికరాల్ని ఉపయోగిస్తూ స్వయంగా పనిచేసే వెనకటి కౌలు రైతు — దున్నే యంత్రాలూ తవ్వే యంత్రాలూ కోసే యంత్రాలూ వంటి వ్యవసాయ యంత్రాలన్నీ పుట్టుకు రావడంతో, కాలక్రమంలో, ఆ భూమిమీదే, శ్రమ చెయ్యని పెట్టుబడిదారీ కౌలు రైతు పెత్తనం కింద, యంత్రాల్ని నడపడంలోగానీ, ఇతర పనుల్లోగానీ పనిచేసే కూలి మనిషి అవుతాడు. గత కాలంలో, వ్యవసాయ రంగానికి వెన్నెముకగా ఉన్న శ్రామికుడైన రైతు, యంత్రం రాకతో కూలి మనిషి (వ్యవసాయ కార్మికుడు) అవుతాడు. ఆ తర్వాత ఫలితాలన్నీ పారిశ్రామిక రంగంలో వచ్చే ఫలితాల వంటివే.

గత కాలంలో, కష్టసాధ్యంగానూ హేతురహితంగానూ జరిగే పనులన్నిటినీ వ్యవసాయ యంత్రం, సునాయాసంగానూ హేతుబద్ధంగానూ జరగడానికి మార్గం కల్పిస్తుంది. గతంలో కన్నా అనేక రెట్ల భూమిని సాగుచెయ్యడం ద్వారా, అది, పనుల్ని (ఉద్యోగాల్ని) పెంచడమూ, ఉత్పాదక శక్తుల్ని పెంచడం ద్వారా పనుల్ని పోగొట్టడమూ రెండూ చేస్తుంది.

భూమి మీద, సాగుకి అనుకూలించే విధంగా కొన్ని కట్టడాలూ, నీటిపారుదల ఏర్పాట్లూ, భూమిని సారవంతం చేసే ఏర్పాట్లూ జరిగినప్పుడే, వ్యవసాయం ఎక్కువ ఫలితాలనిస్తుంది. కానీ, కౌలుకాలం ముగిసి పోయినప్పుడు, భూమిలో పెట్టిన పెట్టుబడిని తిరిగి వెనక్కి తీసుకోవడం సాధ్యం కాకపోవడం — అనే పరిస్థితి వల్ల, పెట్టుబడిదారీ వ్యవసాయం, కౌలుభూమిలో పెట్టుబడిని గుమ్మరించడానికి ఇష్టపడదు. ఈ వైరుధ్యం, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చెందనివ్వకుండా ఉంచుతుంది. పరిశ్రమల్నీ వ్యవసాయాన్నీ పోల్చినప్పుడు, పరిశ్రమల్లో ఎంత పెట్టుబడి పెట్టడానికైనా పెట్టుబడిదారుడికి అవకాశం ఉంటుంది. వ్యవసాయంలో అది సాధ్యంకాదు. అయినప్పటికీ, ఉన్న పరిమితుల్లోనే వ్యవసాయ రంగంలో కూడా ఒక పెట్టుబడిదారుడికీ, ఇంకో పెట్టుబడిదారుడికీ పోటీ ఉంటుంది. అది ఎంతో కొంత స్థాయిలో ఉత్పాదక శక్తుల్ని పెంచుతూనే ఉంటుంది. పెట్టుబడిదారుడు తన చేతుల్లో ఉన్న భూమిని పెంచుకుంటూ పోవడం సాధ్యం కాదు కాబట్టి, ఆ పెరిగే ఉత్పాదక శక్తులు, వ్యవసాయ శ్రామికుల్లో ఎప్పటికప్పుడు కొంత సంఖ్యని, పనుల నించి వెడలగొడతాయి.

పనులు పోగొట్టుకునే వ్యవసాయ జనాభాకి పట్టణాలే ఆశ్రయాలవుతాయి. పట్టణాలలో కూడా నిరుద్యోగమే తాండవిస్తోన్నా, పనులులేని వ్యవసాయ జనాభాకి, పట్టణాలకు పోవడం కన్నా ఇంకో మార్గం ఉండదు.

యంత్రం వల్ల పుట్టుకొచ్చిన ఈ పరిణామాలన్నీ, ఫ్యూడల్ రైతు కుటుంబ జీవన పరిస్థితుల్ని ఛిన్నాభిన్నం చేస్తాయి. కానీ, ఈ పరిస్థితే, ఒక రకపు బానిస సంబంధాలతో కౌలు భూమికి కట్టుబడిపోయిన ఫ్యూడల్ రైతు కుటుంబ సభ్యుల్ని, ఉత్పత్తి సాధనాలులేని వేతన కార్మికులుగా చెయ్యడం ద్వారా, ఒక రకపు స్వేచ్ఛాయుత సంబంధాలలోకి తీసుకొస్తుంది.

అప్పటికి ఇంకా అసంపూర్ణంగా ఉన్న 'వ్యవసాయమూ, పరిశ్రమా (చేతి వృత్తులూ) విడిపోవడం' అనే విషయాన్ని, పెట్టుబడిదారీ యంత్ర విధానం, కాల క్రమంలో పూర్తి చేస్తుంది.

వ్యవసాయమూ, చేతి పనులూ పసితనంలో ఉన్న కాలంలో, అవి, ఒకే మనిషి (లేదా ఒక సముదాయం) చేసే పనులుగా ఉండేవి. అలాంటి కాలంలో 'గ్రామమూ, పట్టణమూ' అనే విభజన లేదు. కానీ, అవి రెండూ (వ్యవసాయమూ, చేతిపనులూ) పసితనాన్ని దాటి అభివృద్ధి చెందుతోన్న కొద్దీ, అవి వేరు వేరు మనుషులు చెయ్యవలసిన పనులుగా విడిపోవడం సహజ పరిణామమే. వ్యవసాయమూ, పరిశ్రమలూ విడిపోవడం అనేది, ఎన్నో వందల సంవత్సరాల పాటు జరిగిన సుదీర్ఘమైన పరిణామం. ఒకప్పుడు 'సహజ అవసరం'గా జరిగిన ఈ విభజనలోకి క్రమంగా పెట్టుబడిదారీ స్వభావం ప్రవేశించింది.

పరిశ్రమల ప్రాంతాలు పట్టణాలుగానూ, వ్యవసాయ ప్రాంతాలు గ్రామాలుగానూ స్థిరపడడమూ; వ్యవసాయానికీ పరిశ్రమలకూ మధ్య మిగిలివున్న సంబంధాలన్నీ తెగిపోవడమూ — వగైరా దశలు, వ్యవసాయంలోకి భారీ పరిశ్రమ రాకతో పూర్తి అవుతాయి.

అదే సమయంలో, ఇంకో కోణంలో పెట్టుబడిదారీ విధానమే నశించే భౌతిక పరిస్థితులు పెంపొందడం ద్వారా వ్యవసాయమూ, పరిశ్రమలూ మరొక రూపంలో తిరిగి కలిసే ఒక నూతన, ఉన్నత సంయోగానికి ('నూతన సమాజం'లో జరగబోయే దానికి) అవసరమైన పరిస్థితులు కూడా సృష్టి అవుతాయి. ('నూతన సమాజం'లో వ్యవసాయమూ, పరిశ్రమలూ తిరిగి కలవాలని దీని అర్థం.)

'ఆధునిక వ్యవసాయం'లో కూడా, పరిశ్రమల్లో లాగే, వ్యవసాయ శ్రామికుల శ్రమశక్తి విలువని హీనస్థాయికి తగ్గించడమూ, శ్రామికుల్ని పనులులేని స్థితిలో గ్రామాల నించి వలసలు పోయేటట్టు చెయ్యడమూ — వంటి పరిస్థితుల మీదే, ఉత్పాదకత పెరగడం సాధ్యమవుతుంది. పెరిగిన ఉత్పాదక శక్తుల ఫలితంగా, వ్యవసాయ రంగంలో, తక్కువ భూమిలో ఎక్కువ మంది పనిచేసే పాత పద్ధతిలో గాక, విశాలమైన భూములమీద తక్కువ మంది సరిపోయే పరిస్థితులు ఏర్పడి, శ్రామికుల కేంద్రీకరణ శక్తి తగ్గుతుంది. ఈ పరిస్థితి శ్రామిక జనాల ప్రతిఘటనకు ఒక రకమైన ఆటంకంగా తయారవుతుంది.

పెట్టుబడిదారీ వ్యవసాయం, గ్రామీణ జనాభాని పట్టణాలకు తరమడం ద్వారా, అక్కడ కార్మికులు కిక్కిరిసిన పరిసరాల్లో నివసించే పరిస్థితుల్ని పెంచి, మొత్తం అక్కడి కార్మికులకు శారీరక మానసిక ఆరోగ్యాల్ని ధ్వంసం చేస్తుంది.

సమస్త పరిశ్రమల్నీ, సాంకేతిక విద్యల్నీ, కళల్నీ పట్టణాలలోనే కేంద్రీకరిస్తూ, గ్రామాలకు అటువంటి అవకాశాలు కల్పించకపోవడం ద్వారా, పెట్టుబడిదారీ విధానం, గ్రామీణ జనాల మేధో జీవితాన్ని సంకుచిత పరుస్తుంది. పట్టణ కార్మికుల మేధో జీవితం పెద్ద స్థాయిలో అభివృద్ధి చెంది ఉంటుందని దీని అర్థం కాదు. కానీ కొన్ని సాంకేతిక విద్యలూ, కళలూ నేర్చుకోవడానికి పట్టణ జనాభాకి అందే కనీస అవకాశాలు కూడా గ్రామీణ జనాభాకి అందవు.

ఆధునిక వ్యవసాయ పురోగతి, కార్మికశక్తిని దోచడం మీదేగాక, భూమిశక్తిని నాశనం చెయ్యడం మీద కూడా ఆధారపడి ఉంటుంది. కౌలు కాలం తీరిపోయేలోగానే భూమి నించి ఎక్కువ ఫలితం పొందాలనే ఆరాటంతో, భూమి మీద ఎరువులూ మందులూ గుప్పించే పద్ధతిలో మాత్రమే పెట్టుబడిదారీ వ్యవసాయం సాగుతుంది. భూమి శక్తుల్ని సహజ పద్ధతుల్లో ఉపయోగించాలనీ, భూమిని తీవ్రంగా అలవగొట్టి అది నిర్జీవ ఎడారిగా మారే పరిస్థితి కల్పించకూడదనీ, పెట్టుబడిదారీ విధానం ఆలోచించదు. దాని 'లాభాల ఆరాటం' దాన్ని అలా ఆలోచించనివ్వదు. పెట్టుబడిదారుడు స్వంతభూమిని సంపాదించాడనీ, లేదా ఒక భూస్వామి తన భూమిమీద తనే వ్యవసాయం చేయిస్తున్నాడనీ అనుకున్నా కూడా, ఆ వ్యవసాయం అంతా భూమికి హానిచేసే అసహజ పెట్టుబడిదారీ పద్ధతుల్లోనే సాగుతుంది.

జనాలు గ్రామాల నించి పట్టణాలకు పెద్దఎత్తున తరలిపోయే పరిస్థితులు ఏర్పడడంవల్ల, గ్రామాలలో భూమి సారం తగ్గిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. వారి మలమూత్రాలతోనూ, వారు పెంచే జంతుజాలాల మలమూత్రాలతోనూ సారవంతంగా ఉండే గ్రామాల భూమి, క్రమంగా ఆ అవకాశం పోగొట్టుకుంటుంది. పట్టణాలలో భూమికి ఆ అవకాశం దొరికినా, వ్యవసాయం లేనిచోట, ఆ అవకాశం వృధా అవుతుంది. ఆహారం రూపంలో, భూమి నించి తీసుకునే సారాన్నే, తిరిగి మలమూత్రాల రూపంలో భూమికి చేర్చి, భూమి సారాన్ని తరిగిపోనివ్వకుండా ఉంచే మార్గానికి, గ్రామీణ జనాభా వలసలు ఆటంకమవుతాయి.

పెట్టుబడిదారీ విధానం, ఎక్కువ దిగుబడి కోసం భూమి సారాన్ని పెంచడానికే చూస్తుంది. కానీ, భూమికే నష్టం కలిగే కృత్రిమ పద్ధతుల్లోనే ఆ పని చెయ్యగలుగుతుంది. పెట్టుబడిదారీ విధానం ద్వారా భూమి సారాన్ని పెంచడంలో వచ్చే 'పురోగతి' అంతా, ఆ సారాన్ని శాశ్వ

తంగా నిలిపే మార్గాల్ని నాశనం చేసే పురోగతిగానే ఉంటుంది.

ఏ వ్యవసాయ ప్రాంతమైనా, పెట్టుబడిదారీ పద్ధతుల ద్వారా ఎంత ఎక్కువ ఉత్పాదక శక్తుల్ని సాధిస్తుందో అంత ఎక్కువ త్వరగా భూమి సారాన్ని నాశనంచేసే క్రమాన్ని సాధిస్తుంది.

పెట్టుబడిదారీ విధానం, సాంకేతిక అంశాల్నీ (టెక్నాలజీని), వివిధ ఉత్పత్తి క్రమాలు ఒక సామాజిక ఉత్పత్తి క్రమంగా మారే స్థాయినీ, తప్పనిసరిగా అభివృద్ధి చేస్తుంది. కానీ, ఆ అభివృద్ధిని అది ఏ మార్గంలో సాధిస్తుందంటే, సంపద కంతటికీ మూలాధారాలైన శ్రామికుల్నీ, భూమినీ ధ్వంసం చేసే మార్గంలోనే!

శ్రమ చేసే మనుషుల క్షేమాన్నీ భూమి క్షేమాన్నీ 'లక్ష్యం లోకి' తీసుకునే నూతన సమాజం, గ్రామాన్నీ పట్టణాన్నీ తిరిగి ఐక్యం చెయ్యవలసి ఉంటుంది. వ్యవసాయం ఒక చోటా, పరిశ్రమలు ఒక చోటా ఉండడం గాక, ఒకే ప్రాంతంలో 2 రకాల ఉత్పత్తులూ ఉత్పత్తి అయ్యే ఏర్పాటు జరగాలి. అంతేకాదు, ఉత్పత్తి క్రమాల్లో పాల్గొనే మనుషులు కేవలం పారిశ్రామిక శ్రమే గానీ, కేవలం వ్యవసాయ శ్రమే గానీ చెయ్యడం గాక, 2 రకాల శ్రమలూ కూడా చెయ్యాలి. మొక్కల పెంపకమూ, పశువుల పెంపకమూ, చేపల పెంపకమూ, అడవుల పెంపకమూ, పాల ఉత్పత్తీ వగైరా అంశాలకు సంబంధించిన శ్రమలు వ్యవసాయ శ్రమల కోవలోకి వస్తాయి. శ్రమ చేసే మనుషులు, వ్యవసాయ రంగానికి సంబంధించి కొన్ని మేధాశ్రమలూ, కొన్ని శారీరక శ్రమలూ; పారిశ్రామిక రంగానికి సంబంధించి కొన్ని మేధాశ్రమలూ కొన్ని శారీరక శ్రమలూ — చెయ్యాలి. ఈ మార్పులు జరిగినప్పుడు, వ్యవసాయమూ — పరిశ్రమలూ, ఉన్నత రూపంలో తిరిగి కలుస్తాయి. అప్పుడు గ్రామమూ, పట్టణమూ ఐక్యం అవుతాయి. అంటే, ఒక ప్రాంతం గ్రామం గానూ, ఇంకో ప్రాంతం పట్టణం గానూ, దేని ప్రత్యేక లక్షణాలతో అది వేరుపడిపోయి ఉండే పరిస్థితి క్రమంగా చెదిరిపోతుంది. భారీ పరిశ్రమ, ఈ మార్పుకి తగిన భౌతిక పునాదిని ఏర్పరుస్తుంది.

భారీ పరిశ్రమకు ఉన్న సాంకేతిక పునాది 'విప్లవాత్మక'మైనది. దాని ఉత్పాదక శక్తులు కొంత దీర్ఘకాలం పాటు ఒకే రూపంలో నిలబడవు. దాని శ్రమ పరికరాలు చాలా తక్కువ వ్యవధిలో మారిపోతూ ఉంటాయి. తరాల తరబడీ మార్పులేకుండా స్థిరంగా పడి ఉండే గత ఉత్పత్తి విధానాల సాంకేతిక పునాదుల ముందు, భారీ పరిశ్రమలో మార్పులు అమితమైన వేగంగలవి. భారీ పరిశ్రమ నిరంతరం అభివృద్ధి చెందే తన టెక్నిక్కుల ద్వారానూ, అభివృద్ధి చెందే రసాయనిక క్రమాల ద్వారానూ, ఉత్పత్తి విధానపు సాంకేతిక పరిస్థితుల్ని నిరంతరం మార్చివేస్తూ ఉంటుంది. కార్మికుల విధులనూ, ఉత్పత్తి క్రమంలో కార్మికుల కలయికలనూ కూడా నిరంతరం మార్చివేస్తూ ఉంటుంది. ఈ విధంగా, భారీ పరిశ్రమ, సమాజంలోని శ్రమ విభజనని తీవ్రమైన మార్పులకు గురిచేస్తుంది. పెట్టుబడినీ, కార్మికులనూ పరిశ్రమలోని ఒక శాఖనించి ఒక శాఖకు నిరంతరం విసిరివేస్తూ, కార్మికులు అన్ని దిక్కులకూ కదిలే అవసరాల్నీ, అవకాశాల్నీ కల్పిస్తూ; ఒక వేపు — కార్మికులకు గతంలో ఉండే రకపు స్థిరత్వాన్నీ విరామాన్నీ రక్షణనీ నాశనం చేస్తూ; ఇంకో వేపు — కార్మికుల్ని నూతన సమాజ నిర్మాణానికి కావలసిన శక్తి సామర్థ్యాల్నీ అర్హతల్నీ సమకూర్చుకోగలిగే వారిగా మలుస్తుంది.

ఆకస్మికంగా పెద్ద పెద్ద అంగలతో విస్తరించే భారీ యంత్ర ఉత్పత్తి విధానపు సామర్థ్యమూ, ప్రపంచ మార్కెట్టుకై దాని అవసరమూ, తప్పనిసరిగా ఎప్పటికప్పుడు పారిశ్రామిక సంక్షోభాలకు దారి తీస్తాయి. 'అమితోత్పత్తి'తో ఏర్పడే సరుకు గుట్టలూ; అమ్మకానికి మార్కెట్లు లేని స్థితీ; ఉత్పత్తిని తగ్గించడమో, కొంత కాలం పాటు పూర్తిగా ఆపడమో చేసే స్థితీ; పెరిగే నిరుద్యోగమూ— వగైరాలన్నీ ఒకదాని వెంట ఒకటి తరుముకుంటూ వస్తాయి. 'ప్రకృతి రుతుచక్రం' తిరిగినంత సహజంగా, తప్పనిసరిగా, ఈ పరిస్థితి కొంత కాలానికోసారి వివిధ దశలుగల 'పారిశ్రామిక వలయాన్ని' సృష్టిస్తుంది. పెరిగే ఉత్పాదక శక్తులు మొదట కొందరి చేతుల్లోనే ఉండి, క్రమంగా అవి అందరి చేతుల్లోకీ అన్ని శాఖల్లోకీ పాకడమూ, గుట్టలు గుట్టలుగా సరుకు ఉత్పత్తీ, ఉత్పత్తి స్తంభనా, పునరుత్పత్తి అసాధ్యం కావడమూ, క్రమంగా అనేక నష్టాల తోటీ, అనేక హానికర పరిణామాల తోటీ సరుకులు కదలడమూ— వగైరా దశలతో ఉండే వలయాన్ని. ప్రతీ పారిశ్రామిక వలయమూ , సామాజిక ఉత్పాదక శక్తిని, గతం కన్నా పై స్థాయికి చేరుస్తూ ఉంటుంది.

పెట్టుబడిదారీ వర్గం, ఉత్పత్తి సంబంధాలనూ, దానితోపాటే సమాజంలోని సమస్త సంబంధాలనూ తనకు తెలియకుండానే, తీవ్రమైన మార్పులకు గురిచేస్తుంది. ఉత్పత్తి విధానం నిరంతరం తీవ్రమైన మార్పులకు గురి అవడమూ, అన్ని సామాజిక పరిస్థితులూ నిరంతరం అల్లకల్లోలం అవడమూ, అనంతంగా సాగే అస్థిరతా, ఆందోళనా — వగైరా లక్షణాలన్నీ పెట్టుబడిదారీ సమాజాన్ని, గత సమాజాల నించి ప్రత్యేక స్వభావం గల దాన్నిగా చేస్తాయి. గడ్డ కట్టినంత స్థిరంగానూ, అచంచలం గానూ,

అనంత కాలం పాటు ఉండిన ప్రాచీన ఉత్పత్తి సంబంధాలూ; వాటితోపాటే వివిధ ప్రాచీన భావజాలాలూ — 'భారీ పరిశ్రమ తుఫాను ప్రభంజనం'లో, ఊడ్చి పెట్టుకుపోతాయి! 'సుస్థిరంగా' కనపడ్డదంతా 'అస్థిరం'గానూ; 'శాశ్వతంగా' కనపడ్డదంతా, 'అశాశ్వతం'గానూ చెదిరిపోతుంది! 'పవిత్రమై'నదంతా అపవిత్ర'మై సాక్షాత్కరిస్తుంది! 'గౌరవ ప్రద'మైనదంతా 'అగౌరవాల' పాలబడుతుంది!

భారీ యంత్రం, పెట్టుబడిదారుడికీ కార్మికులకూ ఉన్న సంబంధాల్ని మౌలికంగా 'విప్లవాత్మకం' చెయ్యడం ద్వారానూ, భౌతిక పరిస్థితుల్ని పరిపక్వం చెయ్యడం ద్వారానూ, పెట్టుబడిదారీ వైరుధ్యాలను కూడా పరిపక్వం చేస్తుంది. ఆ విధంగా 'నూతన సమాజాన్ని' నిర్మించడమూ, పాత దోపిడీ సమాజాన్ని కూలదొయ్యడమూ చెయ్యగల శక్తుల్ని పరిపక్వం చేస్తుంది.

# ప్రశ్నలూ - జవాబులూ

**1. చేతి యంత్రం అంటే ఏమిటి? ఆటోమేటిక్ యంత్రం అంటే? భారీ యంత్రం అంటే?**

**జ:** మనిషి, ఒక పనిముట్టుని, చేతితో తిప్పుతూనో కాలితో తొక్కుతూనే తన కండరశక్తిని ఉపయోగిస్తూ నడిపితే, ఆ పనిముట్టు చేతి యంత్రం. ఆ పనిముట్టు, మనిషి కండర శక్తితో అవసరం లేకుండా గాలి చక్రం ద్వారానో, నీటిచక్రం ద్వారానో, ఇంజన్ ద్వారానో, దానికై అదే నడిస్తే, అది — ఆటోమేటిక్ యంత్రం, ఆ ఆటోమేటిక్ యంత్రం, ఒక్క చర్యకన్నా ఎక్కువ చర్యలు చేస్తే అది భారీ యంత్రం.

**2. బస్సు, రైలు, విమానం, పెన్ను, గ్యాస్ స్టౌ, ఫ్యాను, ఫోను, మగ్గం, రాట్నం — ఇవి యంత్రాలేనా?**

**జ:** పెన్ను — సాధారణ పనిముట్టు. మగ్గం, రాట్నం, మనిషి కండర శక్తితో నడిచే చేతి యంత్రాలు. మిగిలినవి అన్నీ ఆటోమేటిక్ యంత్రాల కిందకే వస్తాయి. బస్సుని నడపడంలో మనిషి తన కండర శక్తిని కూడా కొంత ఉపయోగించవలసి ఉంటుంది. ఆటోమేటిక్ యంత్రాలు నడిచేటప్పుడు కూడా మనిషి ఆ యంత్రాన్ని పూర్తిగా వదిలేసి ఉండడానికి వీలు ఉండదు.

**3. భారీ యంత్రమే శ్రమ పరికరం అయినప్పుడు, శ్రమ చేసే మనిషికీ, శ్రమ పరికరానికీ ఉండే సంబంధంలో జరిగే మార్పేమిటి?**

**జ:** శ్రమ పరికరం అనేది చేతి పనిముట్టుగా ఉన్నప్పుడు, ఆ పరికరం శ్రమచేసే మనిషి ఆధీనంలో ఉంటుంది. ఆ పరికరం భారీ యంత్రం అయినప్పుడు, శ్రమ చేసే మనిషే ఆ పరికరం ఆధీనంలో ఉంటాడు. ఆ పరికరానికి తగిన కదలికలతో మనిషి నడవాలి.

**4. 'భారీ పరిశ్రమ'కు ఇతర పేరులేమిటి?**

**జ:** యంత్ర పరిశ్రమ. ఫ్యాక్టరీ పరిశ్రమ. ఆధునిక పరిశ్రమ.

**5. ఆటోమేటిక్ యంత్రం, 'మనిషి'తో అవసరం లేకుండా పని చేస్తుందా?**

**జ:** ఎంత భారీ యంత్రం అయినా మనిషితో అవసరం లేకుండా ఉండదు. దాని దగ్గర ఉండి, దాని నడకకి తగిన మీటలు నొక్కుతూ మనిషి ఆ ఏర్పాటు చూస్తూ చేస్తూ ఉండవలిసిందే. బస్సు, రైలూ లాంటి యంత్రాలలో ఇది చాలా ఎక్కువగానే ఉంటుంది.

**6. యంత్రం, పాత శ్రమ విభజనని మార్చే పరిస్థితికి పునాదిని ఏర్పరుస్తుంది. ఏ విధంగా?**

**జ:** చేతి పనిముట్లతో శ్రమ జరిగేటప్పుడు, శ్రమకు సంబంధించిన నైపుణ్యం అంతా మనిషిలోనే ఉంటుంది. యంత్రం వచ్చినప్పుడు, శ్రమకు సంబంధించిన ఏర్పాట్లన్నీ యంత్రంలోనే ఉంటాయి. యంత్రం మీద పనిచెయ్యడం మనిషి చాలా తక్కువ కాలంలోనే నేర్చుకోగలడు. ఒక శ్రమలో నించి ఇంకో శ్రమలోకి మారడం యంత్రాల ద్వారా త్వర త్వరగా సాధ్యమవుతుంది. ఒక మనిషి ఎప్పుడూ ఒకే పని చెయ్యడం — అనే పాత శ్రమ విభజన మారడానికి తగిన పరిస్థితి యంత్రాల ద్వారా ఏర్పడుతుంది.

**7. ఒక శ్రమలోకి పాత శ్రమ పరికరాన్ని తోసేసి కొత్త శ్రమ పరికరం ఎప్పుడు రాగలుగుతుంది?**

**జ:** ఒక వస్తువు తయారవడానికి గతంలో అవసరమవుతోన్న సజీవ శ్రమని తగ్గించగలిగినప్పుడు.

**8. యంత్రం వల్ల ఉత్పాదక శక్తి పెరిగిందని ఎప్పుడు అనవచ్చు?**

**జ:** వస్తువు కోసం గతంలో అవసరమయ్యే మొత్తం శ్రమ తగ్గినప్పుడే.

**9. టూలు ద్వారా తయారైన వస్తువు విలువ = టూలు ఖర్చు 2 + సజీవ శ్రమ 15 = 17; యంత్రం ద్వారా తయారైన వస్తువు విలువ = యంత్రం ఖర్చు 6 + సజీవ శ్రమ 4 = 10. రెండు వస్తువులకూ తేడా 7. ఈ 2 ఉదాహరణల్లోనూ ముడి పదార్థాల విలువా, ఆగ్జిలరీ పదార్థాల విలువా లేవు. వాటి కోసం కూడా కొంత విలువని 2 ఉదాహరణల్లోనూ కలపండి. అప్పుడు టూలు వస్తువు విలువ ఎంత పెరిగింది? యంత్రం వస్తువు విలువ ఎంత పెరి**

**గింది? రెంటికీ తేడా ఎంత పెరిగింది?**

**జ:** ముడీ — ఆగ్జిలరీ పదార్థాల విలువల్ని 20 అనుకుందాం. ఈ 20 విలువ కలవక ముందు, టూలు వస్తువు విలువకీ యంత్రం వస్తువు విలువకీ తేడా ఎంత ఉంటుందో, ఈ 20 విలువ కలిసినా, ఆ 2 వస్తువుల మధ్య తేడా అలాగే ఉంటుంది. ఈ 20ని కలిపితే, ఆ వస్తువుల విలువలు 20 చొప్పున పెరుగుతాయి.

టూలు వస్తువు విలువ 17+20 = 37
యంత్రం వస్తువు విలువ 10+20 = 30
తేడా = 7

ఆ 20 విలువని కలిపినా, కలపకపోయినా ఈ తేడా ఒక్కలాగే ఉంటుంది. కాబట్టి, శ్రమ పరికరాల నించి సరుకుకి చేరే విలువని చూసేటప్పుడు, ముడీ — ఆగ్జిలరీ పదార్థాల సంగతి అనవసరం.

**10. యంత్రం కోసం పట్టే ఎక్కువ విలువా, ఆ యంత్రం తగ్గించే జీతాలూ సమానంగా ఉంటే, అది ఉత్పాదక శక్తి పెరిగినట్టు కాదా?**

**జ:** పెరిగినట్టే. ఎలాగంటే: ఒక యంత్రం కోసం, గత శ్రమ పరికరం కన్నా 20 విలువని ఎక్కువగా పెట్టాలనుకుందాం. ఆ యంత్రం వచ్చి 20 జీతాల్ని తగ్గిస్తుందనుకుందాం. కానీ ఆ యంత్రం తగ్గించింది 20 జీతాల శ్రమనే కాదు; ఆ కార్మికుల్ని తగ్గించడం అంటే వారు చేసే అదనపు శ్రమని కూడా తగ్గించడమే. దాన్ని ఇంకో 20 అనుకుంటే, ఆ యంత్రం తగ్గించేది 20ని కాదు, 40ని. 20 ఎక్కువతో తయా రయ్యే యంత్రం 40ని తగ్గించడం అంటే అది, ఉత్పాదక శక్తి పెరగడమే. కానీ, ఇలాంటి యంత్రాన్ని పెట్టుబడిదారులు ఒప్పుకోరు. అది ఇంకా ఎక్కువ జీతాల్ని తగ్గించాలి. అంటే, పెట్టుబడిదారులు కొత్త యంత్రాల్ని తెచ్చినప్పుడల్లా అది ఎంతో శ్రమని తగ్గిస్తేనే ఆ యంత్రాన్ని తెస్తారు.

**11. యంత్రం విలువ 1,800. అది పాడైపోయేటప్పటికి 300 వస్తువుల్ని తయారు చేస్తుంది. టూలు విలువ 6. అది పాడైపోయేలోగా 12 వస్తువుల్ని తయారు చేస్తుంది. సరుకుకి యంత్రం ద్వారా చేరే విలువ ఎంత? టూలు ద్వారా చేరే విలువ ఎంత? యంత్రంతో జరిగినంత పని టూలు తోనే చెయ్యాలంటే, ఎన్ని టూళ్ళు ఖర్చవుతాయి? వాటి విలువ ఎంత?**

**జ:** యంత్రం విలువ 1,800. దాని ద్వారా మొత్తం వస్తువులు 300. యంత్రం ద్వారా 1 వస్తువుకి చేరే విలువ = 1,800 ÷ 300 = 6.

టూలు విలువ 6. దాని మొత్తం వస్తువులు 12.

1 వస్తువుకి చేరే విలువ = 6÷12 = $\frac{1}{2}$

యంత్రం ద్వారా తయారయ్యే 300 వస్తువులు, టూలు ద్వారా తయారవ్వాలంటే, 300 ÷12 = 25 టూళ్ళు ఖర్చవుతాయి. వాటివిలువ = 25 × 6 = 150. 300 వస్తువులు యంత్రం ద్వారా తయారవ్వా లంటే, 1,800 ఖర్చవుతుంది. అప్పుడు సజీవశ్రమ భాగం చాలా తగ్గుతుంది. అన్ని వస్తువులు టూళ్ల ద్వారా తయారవ్వాలంటే 150 ఖర్చవుతుంది. అప్పుడు సజీవ శ్రమ భాగం చాలా పెరుగుతుంది.

**12. టూలు విలువ 10. అది 10 గంటల వరకూ మన్నుతుంది. 10 వస్తువుల్ని ఉత్పత్తి చేస్తుంది. యంత్రానికి టూలు కన్నా, విలువా, ఉత్పాదక శక్తీ కూడా రెట్టింపు అయ్యాయి అనుకుందాం. దీని వల్ల 1 వస్తువుకి యంత్రం ద్వారా చేరే విలువ ఎలా మారుతుంది? ఈ యంత్రం టూలు కన్నా మెరుగైనదేనా?**

**జ:** టూలు విలువ 10. యంత్రం విలువ రెట్టింపు కాబట్టి 20. టూలు సరుకు 10. యంత్రం సరుకు రెట్టింపు కాబట్టి 20. టూలు ద్వారా వస్తువుకి చేరే విలువ 1. యంత్రం ద్వారా చేరే విలువ కూడా 1. రెండూ ఒకటే. ఈ టూలు కన్నా ఈ యంత్రం ఏమీ మెరుగైనది కాదు. యంత్రానికి ఉత్పాదక శక్తి ఇంకా ఎక్కువగా ఉండడం గానీ, విలువ ఇంకా తక్కువగా ఉండడం గానీ జరిగితేనే అది, టూలు కన్నా కొంత మెరుగైన యంత్రం అవుతుంది.

**13. కంప్యూటరు భారీ యంత్రమేనా? కంప్యూటర్లు ఎక్కడెక్కడ పనిచెయ్యడం సాధ్యమవుతుందో అక్కడికల్లా అవి వచ్చినట్టు ఊహిస్తే ఎక్కువ ఉద్యోగాలు ఏర్పడతాయా?**

**జ:** కంప్యూటరు — భారీ యంత్రమే. ఏ భారీ యంత్రం వల్ల అయినా జరిగేదే కంప్యూటరు వల్ల కూడా జరుగుతుంది. ఉద్యోగాలు పెరగడం కాదు, తగ్గడమే జరుగుతుంది. కానీ పని గంటల్ని తగ్గించి అందర్నీ పనుల్లో ఉంచవచ్చు. కానీ, స్వంత ఆస్తి విధానంలో అది జరగదు. కాబట్టి నిరుద్యోగం పెరగ డమే దాని ఫలితం.

**14. ఒక శ్రమకు సంబంధించి, పాత కాలపు శ్రమ పరికరానికి బదులు ఆధునిక శ్రమ పరికరం వస్తూ ఉంటుంది. ఉదా॥ విసన కర్రకు బదులు ఫాన్. కట్టెల పొయ్యికి బదులు గ్యాస్ స్టౌ. రెండెడ్ల బండికి బదులు బస్సూ, రైలూ — ఇలా, కనీసం 10 ఉదా హరణలు చెప్పండి.**

**జ:** మట్టి ఇళ్ళకు బదులు, సిమ్మెంటు ఇళ్ళు,
నాగలికి బదులు ట్రాక్టరు,
టైపు మిషను బదులు కంప్యూటరు
........................................................

**15. పెద్ద మోతతో పనిచేసే యంత్రాల వల్ల కార్మికులకు చెముడు వస్తుంది. వెల్డింగ్ మిషన్ల దగ్గిర పనిచేసే కార్మికులకు కళ్ళు పాడవుతాయి—ఇలాంటి ఉదాహరణలు కొన్ని చెప్పండి. ఇలాంటి సమస్యలురాకుండా పని జరగాలంటే, తీసుకోవలసిన జాగ్రత్త లేమిటి?**

**జ:** రసాయనిక పరిశ్రమల్లో చర్మవ్యాధులు వస్తాయి.

సిమ్మెంటూ, గనుల తవ్వకాలూ వంటి పరిశ్రమల్లో, ఊపిరి తిత్తుల వ్యాధులు వస్తాయి. పని స్థలాలు కిక్కిరిసి అశుభ్రంగా ఉన్నచోట అన్ని రకాల వ్యాధులూ వస్తాయి.

**16. పెట్టుబడిదారీ పని స్థలంలో పని చేసే యంత్రం ఎలాంటి పాత్ర నిర్వహిస్తుంది?**

**జ:** కార్మికులతో ఎక్కువ పని చేయించే పాత్ర నిర్వహిస్తుంది. యంత్రం అనేది, తక్కువ వేగంతోనూ కదలవచ్చు; ఎక్కువ వేగంతోనూ కదలవచ్చు. తక్కువ వేగంతో కదిలి యంత్రం దగ్గిర పనిచేస్తే, ఆ మనిషి, అతిగా అలిసిపోవడం జరగదు. కానీ, యంత్రం త్వరత్వరగా కదిలిపోతూ ఉంటే, కార్మికులు కూడా అదే వేగంతో కదలవలసి ఉంటుంది. ఒక కదలిక జరిగే సమయంలోనే 2 కదలికలు జరిగేలాగ మార్పు చేస్తే, రెట్టింపు పని జరుగుతుంది. పెట్టు బడిదారీ ఇంజనీర్లు, యంత్రాల్ని ఆ యంత్రాల్ని నడిపే వారి కష్ట సుఖాల దృష్టితోగాక, వారి ద్వారా ఎక్కువ పని జరగాలనే దృష్టితోనే తయారు చేస్తారు. అందుకే, యంత్రం అనేది పెట్టుబడిదారుడికి అనుకూలమైన పాత్రని నిర్వహిస్తుంది — అనవలసి వస్తుంది.

**17. మీ 'యజమాని' రోజూ పని స్థలంలోకి వస్తాడా? మీరు లారీ డ్రైవరనుకుందాం. మీ పెట్టుబడిదారుడు కూడా మీతో సమానంగా అయిపోతాడనుకుందాం. అతను కూడా మీ లాగే లారీ నడుపుతాడనీ, నైట్ షిఫ్టులు చేస్తాడనీ ఊహించండి. ఆ మార్పు మీకు ఇష్టంగా ఉంటుందా, కష్టంగా ఉంటుందా?**

**జ:** ఈ మాటలు వినడానికి ఆశ్చర్యంగా ఉంది. 'అంత మార్పా' అని నమ్మలేనట్టుగా ఉంది. కానీ, దీన్ని ఆలో చిస్తే, అది జరిగి తీరవలసిన మార్పు. లేకపోతే ఎంత కాలం శ్రామిక వర్గం, దోపిడీ వర్గానికి సేవలు చెయ్యడం?

**18. మీరు యంత్రాల దగ్గిర పనిచేసే కార్మికులా? మీరు అప్పుడప్పుడూ యంత్రాలకు పూజలు చెయ్యడం, యంత్రాలకు దండలు వెయ్యడం లాంటి పనులు చేస్తారా? బస్సులకూ, లారీలకూ హారతులివ్వడం లాంటి పనులు చేస్తారా? యంత్రాలు, 'మహిమలతో' నడుస్తాయని మీరు నిజం గానే నమ్ముతారా? యంత్రాలకు పూజలు చెయ్యకపోతే ప్రమాదాలు జరుగుతాయని మీరు నిజంగా నమ్ముతారా? పూజలు లేకపోవడానికీ, ప్రమాదాలకీ ఎలాంటి సంబంధం ఉంటుందని మీ అభిప్రాయం?**

**జ:** నేను యంత్రాల దగ్గిర పనిచేసే కార్మికురాలిని కాను గానీ, ఆ రకం కార్మికులు చాలా మంది తెలుసు. కార్మికులందరూ, తమ పని స్థలాల్లో యంత్రాలకు పూజలు చేస్తారు. కార్మికుల్లో ఇంకా హేతువాద దృష్టీ తర్కమూ ప్రవేశించలేదు. చిన్నతనం నించీ మూఢ నమ్మకాలే వారిని పాలిస్తున్నాయి. అంత కన్నా ఆలోచన లేదు.

**19. డాక్టర్లూ, సైంటిస్టులూ కూడా వాళ్ళు ఉపయోగించే శ్రమ పరికరాలకు పూజలు చేస్తారు. మీకు తెలిసిన ఇలాంటి ఉదాహరణలు కొన్ని చెప్పండి.**

**జ:** ఒకాయనకు కేన్సర్ జబ్బు వచ్చింది. ఆయన నాస్తికుడు. వైద్యం చేసే డాక్టరు చాలా పేరున్నవాడు కానీ, ఆ డాక్టర్ ఆ పేషెంటుకి సలహాలిస్తూ ఉండే వాడు దేవుళ్ళకు మొక్కుకోమని! ఆ పేషెంటు నవ్వి, "నాకు వైద్యం మీదే నమ్మకం! ఎక్కడా లేని దేవుళ్ళ మీద కాదు. మీ ప్రయత్నం మీరు చెయ్యండి! తగ్గితే తగ్గుతుంది. లేకపోతే లేదు" అనేవాడు. డాక్టరు తెల్లబోతూ ఉండే వాడు. అసలా డాక్టరుకి వైద్యశాస్త్రం మీద నమ్మకమే లేదు. ఆ వృత్తిలో డబ్బు వస్తోంది కాబట్టే అందులో నిలబడి ఉన్నాడు! అతని ఆస్పత్రి నిండా దేవుళ్ళ ఫొటోలే. మూర్ఖత్వంలో చాలా పై స్థాయి మూర్ఖులు డాక్టర్లే. మిగతా మూర్ఖులు వాళ్ళ తర్వాతే.

ఆ మధ్య ఒక సైంటిస్టు, 'మంత్రాల్లో సైన్సు'ని వివరించబోయాడు. నేను నవ్వి "నా టైము వేస్టు చెయ్యకండి! ఇలాంటి మాటల మీద నా టైము పెట్టను" అన్నాను. తన సైన్సు బోధనకు విఘాతం కలిగినందుకు అతను తెల్లబోయాడు. మూర్ఖులతో నిండి ఉన్న ప్రపంచంలో, వీళ్ళు నిత్యం ఎక్కడికక్కడ ఎదురవుతూనే ఉంటారు. తమ కంపెనీలో, కంప్యూటర్లకు కుంకం బొట్లు పెట్టి దణ్ణాలు పెడతారని, ఈ మధ్య ఒక కార్మికుడు చెప్పాడు.

**20.** చిత్రకారులకు ప్రత్యేకం:

**యంత్రాలతో కిక్కిరిసిన ఒక పని స్థలాన్ని చిత్రించండి. అది ప్రెస్సు కావచ్చు. నూనె మిల్లు కావచ్చు. ధాన్యం మిల్లు కావచ్చు. ఇంకేదైనా కావచ్చు.**

**'పని స్థలం'లో ఉన్న యంత్రం ఒక 'భూతం'లాగ కనిపించాలి.**

**జ:** చిత్రకారుల పని ఇది.

★

# 4. శ్రమ, పెట్టుబడికి లోబడడం

ఉత్పత్తి సాధనాలు లేని పరిస్తితి వల్లనే, శ్రమశక్తి, పెట్టుబడికి లోబడుతుంది. పెట్టుబడికీ, శ్రమకీ ఉన్న సంబంధం 'శతృ స్థాయి'కి రావడం అనేది, పెట్టుబడిదారీ విధానపు తొలి దశ నించే ప్రారంభం కాలేదు. పెట్టుబడి చేసే అజమాయిషీకి, శ్రమ, 'లోబడడం'లో ప్రధానంగా 2 దశలు ఉన్నాయి.

(1) పై పైన లోబడడం (ఫార్మల్ సబ్ సంప్షన్)

(2) నిజంగా లోబడడం (రియల్ సబ్ సంప్షన్)

'పెట్టుబడిదారీ సమాజం' అనీ, 'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం' అనీ, 'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వల్ల పుట్టుకొచ్చే వైరుధ్యాలు' అనీ, 'పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు' అనీ — వేటి గురించైతే చెప్పుకుంటున్నామో, అవన్నీ 'పెట్టుబడి' ప్రారంభమైన దగ్గిర్నించీ ఒకే తీవ్రతతో ఉన్నవి కావు.

అసలు, ఈ 'పెట్టుబడి' అనేది, సమాజంలోకి ఎలా వచ్చింది? 'పెట్టుబడి' అంటే, పెద్ద రాసిగా చేరిన 'శ్రమ.' గతం నించీ కూడా శ్రమ చెయ్యని వర్గానికి ఈ 'పెద్ద శ్రమ రాసి' ఎక్కణ్ణించి వచ్చింది? — పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రారంభంగాక ముందునించీ కూడా 'పెట్టుబడి' ఉంది — 'వర్తక పెట్టుబడి' రూపంలోనూ, 'వడ్డీ పెట్టుబడి' రూపంలోనూ. అప్పటికి ఇంకా ఉత్పత్తి సాధనా లకు దూరంకాని ఉత్పత్తిదారులు (ఉదా: ఫ్యూడల్ రైతులు) తమ 'ఉత్పత్తి'లో కొంత భాగాన్ని వర్తకులకు అమ్మేవారు (అదనపు ఉత్పత్తిలో చాలా భాగాన్ని కౌలుగా చెల్లించి నప్పటికీ!) అలా అమ్మే 'సరుకు'లో కొంత భాగాన్ని వర్తకులకు 'కమిషన్'గా వదిలేవారు. వర్తక వర్గం, వర్తక లాభాల ద్వారా శ్రమ చెయ్యకుండానే 'అదనపు విలువ'ని సంపా దిస్తూ వచ్చింది. అలాగే, వడ్డీలకు అప్పులు ఇవ్వడం ద్వారా కూడా రైతుల 'అదనపు విలువ'ని సంపాదించే మార్గం ఏర్పడింది. డబ్బుని అప్పులు ఇచ్చే వాళ్ళు, వర్తకులూ కావచ్చు, భూస్వాములూ కావచ్చు. ఈ రకంగా 'వర్తక లాభాల' ద్వారానూ, 'వడ్డీల' ద్వారానూ, 'కౌళ్ళ' ద్వారానూ, 'డబ్బు రాసి' పోగుపడే అవకాశం గతం లోనే ఉంది.

స్వయంగా శ్రమచేసే ఫ్యూడల్ రైతులకు ఉత్పత్తి సాధనాలు లేకుండా చెయ్యడంలో వడ్డీ పెట్టుబడీ, వర్తక పెట్టుబడీ కూడా పెద్ద పాత్రలు నిర్వహించాయి. సమాజంలో ఏ రకమైన పెట్టుబడీ లేని ప్రాచీన ఉత్పత్తి విధానానికీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికీ మధ్య, వర్తక పెట్టుబడీ, వడ్డీ పెట్టుబడీ అనేవి పరివర్తనా రూపాలుగా ఉన్నాయి. పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన తర్వాత ఈ 2 రూపాలూ, దానిలో ఉప రూపాలుగా ఐక్యం అయిపోయాయి.

<u>పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి దారితీసిన మార్గం, ఉత్పత్తిదారుల నించి ఉత్పత్తి సాధనాల్ని లాగివేసిన మార్గమే.</u> ఆదిలో, 'పెట్టుబడి రాసి' కూడడానికి (ఆదిమ సంచయనానికి) ముఖ్య కారణం, ఉత్పత్తిదారుల ఆస్తి హరణమే. 'ఉత్పత్తిదారుల ఆస్తి' అంటే, అప్పటి వరకూ వారి నించీ లాగిన 'అదనపు విలువ' అని ఒక అర్థం. ఆ అదనపు విలువలో కొంత భాగమే 'పెట్టుబడి'గా మారుతుంది. అంతేగాక, 'ఉత్పత్తిదారుల ఆస్తి' అంటే, అప్పటి వరకూ వారి ఆధీనంలో ఉన్న భూమి — అని కూడా ఇంకో అర్థం. స్వయంగా శ్రమ చేసే ఉత్పత్తిదారుల నించి ఈ భూమిని లాక్కోవడంతో, ఆస్తి హరణంలో ఒక దశ పూర్తి అవుతుంది. ఈ ఆస్తి హరణాన్ని 'ఆదిమ సంచయనం' అని ఎందుకు అంటామంటే, పెట్టుబడిదారీ విధానానికి అది 'ఆది దశ'గా ఉంటుంది గనక.

అప్పటి నించి, శ్రమ చేసే మనుషులు భూస్వాముల దాస్యం నించి, పెట్టుబడిదారీ దాస్యంలోకి ప్రవేశిస్తారు. అయితే, పెట్టుబడిదారీ దాస్యం, ప్రారంభంలో తీవ్ర వైరుధ్యాలతో ఉండదు. సహజ అవసరాలనే దృష్టిలో ఉంచుకుని, ఆ అవసరాలకు తగిన స్థాయిలోనే ఉత్పత్తి సాగినంత కాలమూ, ఆ ఉత్పత్తి విధానానికి, 'పెట్టుబడిదారీ స్వభావం' అన దగ్గ స్వభావం ఏర్పడదు, ఆ ఉత్పత్తి క్రమం పెట్టుబడిదారుడి అజమాయిషీలోనే సాగినప్పటికీ.

ఎంత సరుకుని అమ్మడం సాధ్యమో అంత సరుకునే ఉత్పత్తి చెయ్యడం గాక, అమ్మలేనంత ఎక్కువ సరుకుని ఉత్పత్తిచేసి ఎక్కువ లాభం సంపాదించాలనే దృష్టి క్రమంగా ఏర్పడుతూ ఉండగా, పెట్టుబడిదారీ స్వభావం గల ఉత్పత్తి విధానం — అనేది మొదలవుతుంది. మొదటి విధానం తప్పనిసరిగా ఇందులోకి పరివర్తన చెందవలసిందే. ఎందుకంటే, మొదటిది కూడా 'శ్రమ

దోపిడీ' మీద ఆధారపడ్డదే కాబట్టి.

లాభాల్ని పెంచుకోవడమే ఉత్పత్తికి లక్ష్యం అయినప్పుడు, 'ఉత్పత్తి కోసం ఉత్పత్తి' ప్రారంభమవుతుంది. అప్పుడు శ్రామికులతో 'అదనపు శ్రమ' చేయించే పద్ధతుల్లో తేడా ప్రారంభమవుతుంది. 'అదనపు లాభాల' కోసం వెంపర్లాటతో, శ్రమ పరికరాలూ, శ్రమ విధానాలూ, పెద్ద ఎత్తున మార్పులకు లోనవుతాయి.

శ్రామికులు, గతంలో కన్నా ఎక్కువ స్థాయిలో దోపిడీకి గురి అవుతారు. 'పెట్టుబడిదారీ సంబంధాలు' అనేవి, నిజమైన అర్థంతో అప్పటి నించే ప్రారంభమవుతాయి. 'పెట్టుబడి' — దాని సహజ స్వభావంతో అప్పటి నించే ఉనికిలోకి వస్తుంది. ఈ దశ ఇంగ్లండులో 'గిల్డుల' చివరి కాలంలోనే ప్రారంభమైంది.

ఉత్పత్తి క్రమంలో పెట్టుబడిదారీ స్వభావం ఎప్పటి నించైతే ప్రారంభమవుతుందో అప్పటినించి 'పెట్టుబడి — పాలన'కు, శ్రమ, నిజంగా లోనవుతుంది. శ్రమని ఎక్కువ స్థాయిలో దోచడమూ, శ్రమ మీద ఎక్కువ స్థాయిలో అజమాయిషీ చెయ్యడమూ ప్రారంభమవుతాయి.

గిల్డు యజమాని, శ్రమచెయ్యని పెట్టుబడిదారుడిగా మారడం ద్వారానూ; వర్తకుడే, సరుకుని తయారు చేయించే పారిశ్రామిక పెట్టుబడిదారుడిగా మారడం ద్వారానూ (ఈ 2 మార్గాలలోనూ కూడా) పెట్టుబడిదారీ స్వభావం గల ఉత్పత్తి విధానం ప్రారంభమవుతుంది.

ఫ్యూడల్ భూస్వాముల అధిక హక్కుల మీదా, అధికోత్పత్తికి ఆటంకంగా ఉన్న గిల్డు నిబంధనల మీదా, పారిశ్రామిక పెట్టుబడిదారుల పోరాటాలు అనేకం జరిగిన తర్వాత, ఆ పాత ఉత్పత్తి విధానాల స్థానంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం స్థిరపడింది. అందుకే పెట్టుబడిదారీ విధానం, ఒకప్పటి 'సంకుచిత' ఉత్పత్తి విధానాన్నీ దాని సంబంధాల్నీ 'విప్లవకరంగా ఎదుర్కొన్న తిరుగుబాటు శక్తి' అయింది. శ్రామికుల్ని ఫ్యూడల్ దాస్యాలనించీ, ఫ్యూడల్ నిబంధనల నించీ విముక్తి చేయగలిగినంత వరకూ, ఆ దశలో అది (పెట్టుబడిదారీ విధానం) చరిత్రలో విప్లవశక్తే, కానీ ఆ తర్వాత కాలంలో శ్రామికుల నిజమైన విముక్తికి ఆటంకంగా అది ఎప్పటినించైతే తయారైందో, అప్పటి నించీ అది విప్లవ వ్యతిరేక శక్తి. శ్రామిక విముక్తికీ, తద్వారా మానవ విముక్తికీ, ఆటంకంగా తయారైన పెట్టుబడిదారీ విధానంనించి ఇక ఆశించవలసిన విప్లవాంశాలేమీ లేవు. దాన్ని నాశనం చెయ్యగల శక్తిని అది అభివృద్ధి చెయ్యడమే, దానిలో మిగిలి ఉన్న విప్లవాంశం.

# పెట్టుబడి, ఒక చారిత్రక ఉత్పత్తి సంబంధం!

"పెట్టుబడి అంటే ఏమిటి?" అనే ప్రశ్నకి, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త వెంటనే 'ఉత్పత్తి సాధనాలూ, కార్మికుల జీతాలూ' అంటాడు. ఆయనకి 'తెలిసిన', లేదా ఆయన 'నమ్మిన' అర్థం అది. ఆ వేత్త ప్రకారం, 'పెట్టుబడి' అంటే 'ఉత్పత్తి సాధనాలూ, కార్మికుల జీతాలూ' మాత్రమే కదా? అయితే, ఆ అంశాలు రెండూ ఖర్చయినప్పుడు వాటికి బదులుగా మళ్ళీ అవే ఉత్పత్తి అయితే చాలదా? వాటి కోసం 'లాభం' కూడా రావాలా? — ఈ ప్రశ్నలు తప్పకుండా రావాలి.

పెట్టుబడికి లాభం ఎందుకు రావాలో పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త ఇలా చెపుతాడు — "మానవ సమాజానికి ఎప్పుడూ ఉత్పత్తులు కావాలి. ఉత్పత్తులు కావాలంటే ముందు 'పెట్టుబడి' కావాలి. పెట్టుబడి లేకపోతే, 'ఉత్పత్తి సాధనాల్ని' ఎవరు ఏర్పాటు చేస్తారు? కార్మికులకు 'జీతాలు' ఎవరు ఇస్తారు? ఈ బరువు బాధ్యతలన్నీ మోసే పెట్టుబడికి లాభం రాకపోతే, ఏ వ్యక్తి అయినా పెట్టుబడి ఎందుకు పెడతాడు? లాభం లేకుండా, మొదట ఎంత పెడితే అంతే తిరిగి రావడం అయితే, ఒక మనిషి దేన్ని ఆశించి పెట్టుబడి పెడతాడు? లాభం రాకపోతే ఎవ్వరూ పెట్టుబడి పెట్టరు. పెట్టుబడి పెట్టకపోతే సమాజంలో ఉత్పత్తులే తయారుకావు. ఉత్పత్తులు లేకపోతే మనుషులు జీవించలేరు. కాబట్టి, మనుషులకు కావలసినవన్నీ ఉత్పత్తి అవుతూ ఉండాలంటే, పెట్టుబడి పెట్టే పెట్టుబడిదారుడూ, అతనికి లాభమూ, ఉండి తీరాలి."

విషయాన్ని ఈ రకంగా అర్థం చేసుకున్నప్పుడు, 'లాభాన్ని సంపాదించే దృష్టి'తో ('లాభ దృష్టి'తో) సాగే ఉత్పత్తి విధానమే సమాజంలో ఎప్పుడూ తప్పనిసరిగా ఉండి తీరవలసిన ఉత్పత్తి విధానంగా కనపడుతుంది. ఈ వాదంలో, 'పెట్టుబడీ, లాభమూ' అనే మాటలు తప్ప 'శ్రమ' అనే మాట వినపడదు. 'శ్రమ'కి బదులు 'జీతం' అనే మాట చేరుతుంది. పెట్టుబడీ, జీతమూ, లాభమూ! ఈ వాదం ప్రకారం, సమాజానికి తిండి కావాలంటే, ఈ

మూడూ ఉండి తీరాలి! కార్మికుడికి 'జీతం' అందితే, పెట్టుబడిదారుడికి 'లాభం' అందుతుంది. ఈ వాదానికి, ఈ రెండూ ఒకటే. శ్రామికుడూ, పెట్టుబడిదారుడూ ఒకటే.

ఈ వాదం ప్రకారం మాట్లాడే వాళ్ళు ఏమంటారంటే: వెనకటి సమాజాలలో శ్రామికులు, బానిసలుగానూ కౌలు రైతులుగానూ ఉండడం వల్ల, వారు యజమానుల కన్నా తక్కువ స్థాయిలో ఉన్న మాట నిజమే. కానీ, ఇప్పుడు అలాంటి పరిస్తితి లేదు. ఇప్పుడు, కార్మికులు, తమ యజమానులైన పెట్టుబడిదారులతో సరి సమాన స్తితికి చేరారు. ఇప్పుడు మానవులంతా సమానులు. ఇప్పుడు ఇక, మానవ సంబంధాలలో జరగవలసిన మార్పులేవీ లేవు. కార్మికులు, పెట్టుబడిదారుల దగ్గిరికి వచ్చి వారిని ఉద్యోగాలిమ్మని అడిగి, వారు చెప్పిన పనులు చేసి, వారు ఇచ్చే జీతాలు తీసుకుని, ఇళ్ళకుపోయి 'సుఖంగా' బతక వచ్చును. ఈ రకంగా, కార్మికులకు జీతాలూ, పెట్టుబడి దారులకు లాభాలూ ఇచ్చే ఉత్పత్తి విధానం చాలా సరైంది. ఇది పాత ఉత్పత్తి విధానాల లాంటిది కాదు. ఇది, సర్వ సమగ్రమైన ఉత్పత్తి విధానం. భూమి మీద మానవులు ఎన్ని కోట్ల కోట్ల సంవత్సరాల వరకూ జీవిస్తారో అప్పటివరకూ ఈ ఉత్పత్తి విధానంతోనే (పెట్టు బడులు పెడుతూ, లాభాలు తీస్తూ), ఉత్పత్తి చేసుకోవల సిందే. ఇక ఇందులో మార్పులు జరగవు. ఇది 'శాశ్వత మైన' ఉత్పత్తి విధానం - ఇదీ, ఈ ఉత్పత్తి విధానం గురించి పెట్టుబడిదారుల, వారి ఆర్థిక వేత్తల, వారి మేధావుల అవగాహన! అందుకే, ఇక్కడ మనకు "పెట్టుబడి అంటే ఏమిటి?" అనే ప్రశ్న ఇంత ప్రధానమైన ప్రశ్నగా ఉంటుంది.

పెట్టుబడి అంటే, కొన్ని ఉత్పత్తి సాధనాలూ, శ్రామి కుల జీవితావసర వస్తువులూ అయితే, అవి ఖర్చయి పోయి నందుకు వాటికి బదులుగా మళ్ళీ అవి ఉత్పత్తి అయితే చాలదా? ఖర్చయిపోయిన పత్తి బేలుకి బదులు కొత్త పత్తి బేలు వస్తే చాలదా? పాత 'పత్తి బేలు'కి లాభం కూడా రావాలా? ఖర్చయిపోయిన మగ్గానికి బదులు కొత్త మగ్గం వస్తే చాలదా? పాత మగ్గానికి, లాభం కూడా రావాలా? — ఇలా ప్రశ్నించి చూస్తే — లాభం వచ్చేది, ఖర్చయిన పత్తి బేలుకో, ఖర్చయిన మగ్గానికో, ఖర్చయిన ఇతర ఉత్పత్తి అంశాలకో కాదని తేలుతుంది. లాభం వచ్చేది, పెట్టుబడిగా ఉన్న ఏ వస్తువుకీ కాదు; ఆ వస్తువుల్ని తన స్వంత ఆస్తిగా కలిగి ఉన్న మనిషికి! అంటే లాభం రావలసింది 'పెట్టుబడి'కి కాదు; దాని మీద ఒక వ్యక్తికి ఉన్న 'హక్కు'కి! పెట్టుబడికి ఒక వ్యక్తి యజమానిగా వున్నాడు గనక, ఆ వ్యక్తికీ, ఉత్పత్తిలో నించి కొంత భాగాన్ని తీసుకునే హక్కు ఏర్పడుతోంది.

కానీ, సమాజానికి కావలసిన వస్తువులన్నిటినీ ఉత్పత్తి చేసుకునే బాధ్యతని సమాజంలో ఉన్న జనాభా అంతా కలిసి, ఒక ప్లాను ప్రకారం, 'సమిష్టిగా' నిర్వర్తించుకుంటే ఏమవుతుంది? ఆ ప్లాను ఎలా ఉండాలనేది వేరే విషయం. అది పూర్తిగా 'సాంకేతిక' విషయం. ఆ ప్లాను విషయంలో మొదట్లో కొన్ని పొరపాట్లు జరిగినా, క్రమంగా సరైన అనుభవాలు దొరుకుతాయి. (ఈ సమిష్టి ప్లాను గురించి ఈ సంపుటంలోనే 'పెట్టుబడి విస్తరణ' చాప్టర్లో చూస్తాము.) సమాజానికి కావలసిన ఉత్పత్తి క్రమాల్ని 'సమిష్టిగా' నిర్వహించుకుంటే అప్పుడు 'లాభం' పేరుతో కొంత ఉత్పత్తి ఎవరికి వెళ్ళాలి? — ఎవరికీ వెళ్ళనక్కర లేదు. 'లాభం' అనే దాని అవసరం లేకుండానే, అప్పుడు కూడా సమాజానికి కావలసిన సమస్త ఉత్పత్తులూ తయా రవుతాయి.

ఏమంటారు ఇప్పుడు పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు? 'లాభం' అనేమాట లేకుండానే సమాజం ఉత్పత్తుల్ని పొందడం చూసి వాళ్ళు నిర్ఘాంతపోయినా, అది వారి పెట్టు బడిదారీ జిహ్వలకు రుచించకపోయినా, సమాజంలో 'లాభం' లేకుండా ఉత్పత్తులు పొందడం సాధ్యమేనని మాత్రం ఆ మేధావులు ఒప్పుకోవలసి ఉంటుంది.

'ఉత్పత్తి సాధనాల్ని' విడిగా చూస్తే, అవి 'పెట్టుబడి' కాదు. అవి ఉత్పత్తి సాధనాలు మాత్రమే. దారాన్ని విడిగా చూస్తే అది పెట్టుబడి కాదు. అది దారమే. అది ముడి పదార్థం. మగ్గాన్ని విడిగా చూస్తే అది పెట్టుబడి కాదు. అది మగ్గమే. అది శ్రమ పనిముట్టు. కానీ వాటిని ఉప యోగించే ఒక 'ప్రత్యేక సంబంధం' వల్లనే అవి 'పెట్టుబడి' అవుతాయి. వాటిని 'చేతన శ్రమ'తో సంబంధంలో పెట్టి నప్పుడే, అవి పెట్టుబడి అవుతాయి. అంటే, 'లాభం' వచ్చేది ఉత్పత్తి సాధనాలకు కాదు. వాటిని 'పెట్టుబడి'గా చేసే విధానానికి! ఉత్పత్తి సాధనాల్ని స్వంత ఆస్తిగా కలిగి ఉండే 'సంబంధానికి!' అందుకే, పెట్టుబడి అంటే, కొంత డబ్బో, కొన్ని వస్తువులో కాదు. ఆ డబ్బూ, ఆ వస్తువులూ, 'స్వంత ఆస్తి'గా ఉండడం. ఆ స్వంత ఆస్తి, వెనకటి సమాజాల్లో ఏ పద్ధతిలో ఉందో ఆ పద్ధతిలో ఉండడం కూడా కాదు. లాభాన్ని తెచ్చే పద్ధతిలో ఉండే స్వంత ఆస్తే

— పెట్టుబడి. ఒక ప్రత్యేక సంబంధంలో ఉండే స్వంత ఆస్తే పెట్టుబడి. అందుకే, పెట్టుబడి అంటే, ఒక 'ప్రత్యేక ఉత్పత్తి విధానం'. ఒక ప్రత్యేక ఉత్పత్తి సంబంధం. ఈ ప్రత్యేక ఉత్పత్తి సంబంధంలో — పెట్టుబడికి వ్యతిరేక కోణం వేతనశ్రమా, వేతన శ్రమకి వ్యతిరేక కోణం పెట్టుబడీ! ఈ 2 కోణాలకూ ఉండే శత్రు సంబంధమే 'పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధం.'

పెట్టుబడిదారీ అర్థికవేత్త, 'ఉత్పత్తి సాధనాల'కూ, 'శ్రమ'కూ ఉండే 'సంబంధాన్ని' అరకొరగా చూసి, ఉత్పత్తి సాధనాలనే పెట్టుబడి అనుకుంటాడు. ఉత్పత్తి సాధనాలు లేకుండా ఉత్పత్తి జరగదు కాబట్టి, పెట్టుబడి లేకుండా ఉత్పత్తి జరగదు — అనుకుంటాడు.

'పెట్టుబడి' తప్పనిసరి అయితే. దానితోపాటే 'వేతన శ్రమ' కూడా తప్పనిసరి! 'లాభం' తప్పనిసరి! చివరికి 'దోపిడీ' తప్పనిసరి!

'ఉత్పత్తి సాధనాల'కూ, శ్రమ'కూ మధ్య ఉండే దోపిడీ సంబంధం, గత సమాజాలలో, కొంత మార్పులతో, వేరు వేరు వర్గాల మధ్య ఉండేది. అది, ఇప్పుడు, కార్మిక వర్గానికీ, పెట్టుబడిదారీ వర్గానికీ మధ్య ఉంటుంది.

మనుషులు, ప్రకృతి సహజంగా బానిసలూ కారు, బానిస యజమానులూ కారు. కౌలు రైతులూ కారు, భూస్వాములూ కారు, కార్మికులూ కారు, పెట్టుబడిదారులూ కారు. ఈ సంబంధాలన్నీ, మానవుల మధ్య, చరిత్ర పరిణామ క్రమంలో ఏర్పడ్డ తాత్కాలిక ఉత్పత్తి సంబంధాలే. 'పెట్టుబడి' కూడా ఒక తాత్కాలిక సంబంధమే. చరిత్ర నడకలో ఒక దశలో ఏర్పడ్డ సంబంధం అది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కూడా తాత్కాలికమైనదే — అనడానికి కారణం, ఆ విధానంలో కూడా ఉత్పత్తి సాధనాలకూ శ్రమకూ ఉన్న శత్రు వైరుధ్యాలే. ఈ పరిస్తితి, ఈ రెండు అంశాలకూ ఉన్న శత్రు సంబంధాల్ని తప్పనిసరిగా నాశనం చేసి, అంతకన్నా ఉన్నతమైన సంబంధాల్ని తప్పనిసరి చేస్తుంది. గత విధానాలనించి పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందినట్టే, ఇంకా శత్రువైరుధ్యాలు పోని పెట్టుబడిదారీ విధానంనించి కూడా ఇంకా ఉన్నతమైన ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందుతుంది. ఈ అభివృద్ధి ఎంతవరకూ సాగవలసి ఉంటుందంటే — ఉత్పత్తి సాధనాలకూ, శ్రమకూ ఉండే శత్రు వైరుధ్యాలన్నీ నశించే వరకూ.

కానీ, ఈ విషయాలేవీ పట్టని పెట్టుబడిదారుడు, తన మేధావుల సమర్ధనలతో, మానవ రక్త మాంసాల నించి డబ్బుని పుట్టించే తన కసాయి డబ్బు కంపు ఉత్పత్తి విధానాన్నే, సర్వసమగ్ర, ఉన్నత, శాశ్వత ఉత్పత్తి విధానంగా శ్లాఘిస్తాడు! — "స్వంత ఆస్తిలేని ఉత్పత్తి విధానమా? అది జరిగే పని కాదు. స్వంత ఆస్తి లేకపోతే ఉత్పత్తి చెయ్యడానికి ఎవరికీ ప్రోత్సాహమే ఉండదు" అని తేల్చేస్తాడు.

"స్వంత ఆస్తి ఉన్న నువ్వు ఎంత ప్రోత్సాహంతో ఉత్పత్తి కోసం శ్రమ చేస్తున్నావు? కార్మికులు, స్వంత ఆస్తి లేకపోయినా శ్రమ చేస్తున్నారే! ఉద్యోగాలు దొరికితే పనులు చెయ్యడానికి ప్రపంచం నిండా ఎన్నో కోట్ల మంది నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారే! స్వంత ఆస్తి లేకుండానే పని చెయ్యాలని వారికి ప్రోత్సాహం ఎందుకు ఉంది?" అని అడగండి!

"బతకాలంటే జీతాలు కావాలి. పని చెయ్యకేం చేస్తారు?" అంటాడు పెట్టుబడిదారుడు.

"బతకడం కోసం యజమాని కింద పని చెయ్యడానికే సిద్ధపడే వాళ్ళు, ఆ బతకడం కోసమే యజమాని లేకుండా పని చేసుకోవడానికి ఎందుకు సిద్ధపడరు?"

"యజమాని ఉంటేనే పని చెయ్యడానికి మొండికెత్తుతారు కదా, ఇక యజమానే లేకపోతే పనిలోకి దిగుతారా?"

"దిగకపోతే ఏం తింటారు?"

"పని లేకండా పోతే చాలు, తిండి కూడా మానుకుంటారు."

"మంచిదే. తిండి మానేసినా బతకడం సాధ్యమైతే, ఎవరైనా పని ఎందుకు చెయ్యాలి? తిండి అక్కరలేని వాళ్ళు పని కూడా మానుకుంటారు. తిండి కావలసిన వాళ్ళే పని చేసుకుంటారు. అందులో తిరకాసేముంది? ఏ పనీ చెయ్యకుండానే ముప్పూటలా విందులూ, వినోదాలూ, భోగభాగ్యాలూ కావాలనే వాళ్ళతోనే సమస్యగానీ, పనీ తిండీ - రెండూ మానుకున్న వాళ్ళతో సమస్యేముంది?"

అప్పటి వరకూ చకచకా జవాబులు చెప్పిన పెట్టుబడిదారుడు ఇక మాట్లాడడు. ఈ 'కార్మికుల పరిపాలన'గాని వస్తే గిస్తే, అప్పుడు తనకి తిండి కావాలో లేదో తేల్చుకోవడంలో మునిగిపోతాడు. ఇంత కాలమూ 'ఆస్తి మీద వాడి యజమానితనం', వాడికి, శ్రమ చెయ్యకుండానే భోగ భాగ్యాలు సమకూర్చి పెట్టింది. ఆ ఆస్తీ, దానితోపాటు ఆ యజమానితనమూ, నేడో రేపో ఊడతాయేమోనని

వాడికి లోపల్లోపల భయమే అయినా, 'అదంతా జరిగి చచ్చే వ్యవహారం కాదులె'మ్మనుకుని ఆ ఊహలతో ధైర్యం తెచ్చుకుంటాడు. తన దోపిడీ ఆస్తిపాస్తులూ, రోజంతా తీసుకునే తన విశ్రాంతులూ, తోటి మానవుల మీద తన ఆధిపత్యాలూ అన్నీ, ఎల్లకాలం చెక్కు చెదరకుండా ఉండి పోతాయనే నమ్ముతాడు.

'పూర్వకాలపు ఆస్తి సంబంధాలన్నీ మారిపోయాయి కదా? బానిస యజమానులు నశించారు. ఫ్యూడల్ ప్రభువులూ నశించారు. నిరంకుశ రాజరికాలు అంతరించాయి. ఈ పెట్టుబడిదారులేనా చిరంజీవులు? ఈ డబ్బు సంబంధాలేనా అజరామరాలు?' — అనే సందేహాలు వాడికి ఏ కోశానా రావు.

"గత సమాజాలు కొంచెం చెడ్డవి కాబట్టి అవి మారాయి. ఇప్పుడు అలా కాదు. ఈ పెట్టుబడిదారీ సంబంధాలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గలవి" అని ఆయన తన ఆర్థిక వేత్తల్నీ, తన మేధావుల్నీ, తన తత్వవేత్తల్నీ చుట్టూ పెట్టుకుని, తిండి లేని కోట్ల కోట్ల పేదలతో నిండిన సమాజాన్ని చూపిస్తూ "ఇది అత్యున్నత స్థాయికి చేరింది!" అని ప్రకటిస్తాడు. "కావాలంటే ఈ మేధావుల్ని అడగండి!" అని తన చుట్టూ చేరిన విగ్రహాల్ని చూపిస్తాడు. ఆ విగ్రహ మేధావులు — "అయ్యగారు చెప్పిందే సత్యం! ఈ అత్యున్నత స్థాయిలో కొందరికి తిండి లేకపోతే లేకపోవచ్చు. అది తప్పదు మరి! అయినా, తిండిలేని వాళ్ళందరికీ అయ్యగార్ని చూస్తే కడుపు నిండదా?" అంటారు.

కలిమితో పాటు లేమి కూడా ఉన్న సమాజాన్ని 'అత్యున్నత సమాజం'గా ఒప్పుకోని సిస్మాండీ, రాబర్ట్ ఓవెన్ - వంటి ఆర్థికవేత్తలు, పెట్టుబడిదారీ సమాజాన్ని 'అత్యున్నత సమాజం'గా భావించలేదు. సమాజంలో ఇంకా ఎన్నో మార్పులు జరగాలని వారు కలలుగన్నారు. అయితే, వారు 'శ్రమ దోపిడీ'ని అర్థం చేసుకోలేదు కాబట్టి, సమాజంలో కనపడే చెడుగులకు మూలాన్ని గ్రహించ లేదు. ఓవెన్ అయితే, తప్పంతా 'డబ్బు'కి ఆపాదించాడు.

సమాజంలో 'డబ్బు ఉండడం వల్లనే' మానవ సంబంధాలు దుర్భరంగా తయారవుతున్నాయని భావించాడు. దోపిడీ సృష్టించే సమస్యల్ని డబ్బు సృష్టించే సమస్యలుగా భావించడం వల్లనే, దోపిడీని రద్దు చెయ్యాలనే ఆలోచనలకు బదులు, డబ్బుని రద్దు చెయ్యాలనే ఆలోచనలు సాగాయి. డబ్బు వల్లే హాని ఉంటే, అది సమాజంలో అందరికీ ఒకే రకమైన సమస్యల్ని సృష్టించాలి. కానీ, 'డబ్బు' ఉన్న సమాజంలో, శ్రామికులే బాధల్లో ఉన్నారు గానీ, పెట్టుబడిదారులు ఏ బాధల్లోనూ, ఏ దరిద్రంలోనూ లేరు. దోపిడీని గ్రహించలేని మనిషి, ఉన్నత మానవ సంబంధాల కోసం ఎంత నిర్మల హృదయంతో తపించినా, అది సమస్య మూలాన్ని తాకదు. అందుకే డబ్బుని రద్దు చెయ్యాలనే ప్రతిపాదన, మంచి మనసుతో ఊహించిన ఆదర్శంగా మాత్రమే మిగిలి పోయింది.

మానవ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, ఉత్పత్తి సంబంధాల స్వభావాన్ని అర్థం చేసుకోవడమే ఏకైక మార్గం. 'పెట్టుబడి'ని కేవలం కొంత డబ్బుగానో, కొన్ని 'ఉత్పత్తి సాధనాలు'గానో చూడడంగాక, దాన్ని ఒక 'దోపిడీ ఉత్పత్తి సంబంధం'గా గ్రహించినప్పుడే, దాని చెడుగుల్ని గ్రహించడం సాధ్యమవుతుంది.

పెట్టుబడిదారీ సంబంధాల్ని, దాని ఆర్థికవేత్తలు ఎంత 'అత్యున్నత' సంబంధాలుగా కీర్తించినా, అవి కూడా దోపిడీ సంబంధాలే. కాబట్టి, గత దోపిడీ సంబంధాల లాగానే అవి కూడా మరింత ఉన్నత సంబంధాలకు మార్గం వదిలి, గత చరిత్రలోకి తప్పుకోవలసి ఉంటుంది. కానీ పెట్టుబడిదారీ అజ్ఞానం, పెట్టుబడిని చరిత్రలో ఒక తాత్కాలిక సంబంధంగా గాక; 'శాశ్వత సంబంధం' గానూ, అత్యున్నత సంబంధం' గానూ భావిస్తూ, తనను తను భ్రమల్లో ఉంచుకుంటుంది.

## 'పెట్టుబడిదారీ సమాజం'లో -పెట్టుబడి; 'నూతన సమాజం'లో- పెట్టుబడి కాదు, ఉత్పత్తి సాధనాలు!

**ఉ**త్పత్తి జరగాలంటే, ఏ సమాజంలో అయినా ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తి చేసే మనుషులూ, (ఆ మనుషులకు పోషణ వస్తువులూ) కావాలి. పెట్టుబడిదారీ సమాజం, ఈ 2 అంశాలమీదా పెట్టే ఖర్చుల్ని కలిపేసి

(ఉత్పత్తి సాధనాల ఖర్చునీ, జీతాల ఖర్చునీ కలిపేసి) ఒకే మాటతో 'పెట్టుబడి' అంటుంది. పెట్టుబడిదారుడికి ఈ 2 అంశాలూ ఒకటే.

కానీ, 'నూతన ఉత్పత్తి విధానం'లో ఈ 2 అంశాల్నీ విడి విడిగానే చూడాలి. 'ఉత్పత్తి జరగాలంటే — ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తిదారులూ కావాలి' అనాలిగానీ 'ఉత్పత్తి జరగాలంటే — పెట్టుబడి కావాలి' అనకూడదు. 'ఉత్పత్తి దారులు కావాలి' అంటే, 'వారికి పోషణ వస్తువులు కావాలి' అని కూడా అర్థం. అంటే నూతన సమాజపు అర్థంలో కూడా ఉత్పత్తిక్రమం జరగాలంటే (1) ఉత్పత్తి సాధనాలూ (2) ఉత్పత్తిదారులకు పోషణ వస్తువులూ — అనే 2 అంశాలూ కావాలి. ఈ 2 అంశాల్నీ కలిపేసి, ఒకే మాటగా 'ఉత్పత్తి సాధనాలు', 'ఉత్పత్తి అంశాలు' అనవచ్చు. ఎందుకంటే ఉత్పత్తి క్రమం జరగాలంటే ఈ 2 రకాల 'సాధనాలూ' (2 రకాల అంశాలూ) కావాలి కాబట్టి. అంటే పెట్టుబడిదారీ అర్థంలో ఏ 2 అంశాల్ని కలిపి 'పెట్టుబడి' అంటారో వాటినే మనం నూతన అర్థంలో 'ఉత్పత్తి సాధనాలు' అంటాం — 'పెట్టుబడి' అనకుండా.

ఇప్పుడు, పెట్టుబడిదారీ విధానంలో పెట్టుబడి నిర్వహించే పాత్ర ఏమిటీ, నూతన విధానంలో ఉత్పత్తి సాధనాలు నిర్వహించే పాత్ర ఏమిటీ — అనే విషయాలు చూడాలి.

'పెట్టుబడి' అనేది, తన విలువకన్నా ఎక్కువ విలువని ఉత్పత్తి చెయ్యాలి. పెట్టుబడి ఈ బాధ్యతని నిర్వర్తించకపోతే, శ్రమ చెయ్యని వర్గానికి ఆహారం ఉండదు. ఇక్కడ, 'పెట్టుబడిగా' ఏ యే అంశాలైతే ఖర్చవుతాయో (ఉత్పత్తి సాధనాలూ, శ్రామికుల పోషణ వస్తువులూ ఖర్చవుతాయి), ఆ ఖర్చుతో మళ్ళీ ఆ వస్తువులే ఉత్పత్తి అయితే, దానివల్ల కార్మిక వర్గానికి ఆహారం ఉత్పత్తి అవుతుంది గానీ, పెట్టుబడిదారీ వర్గానికి ఆహారం ఉండదు. కాబట్టి, పెట్టుబడి అనేది, పెట్టుబడిగా ఖర్చయ్యే వస్తువుల్ని మాత్రమే తిరిగి ఉత్పత్తి చేస్తే చాలదు. అదనపు ఉత్పత్తుల్ని కూడా తప్పనిసరిగా ఉత్పత్తి చెయ్యాలి. ఈ అదనపు ఉత్పత్తుల్ని శ్రమ చెయ్యని వర్గం అంతా (లాభాలూ, కమిషన్లూ, వడ్డీలూ, కౌళ్ళూ, పన్నులూ తినే సెక్షన్లన్నీ) ఉపయోగిస్తూ ఉంటారు. కార్మికులు, పోషణ వస్తువుల్ని తమకోసం ఖర్చు చేస్తూ, కొత్త రాసిని ఉత్పత్తి చేస్తూ ఉన్న కాలంలో, శ్రమ చెయ్యని వర్గం, కిందటి రాసిలోని 'అదనపు ఉత్పత్తుల్ని' ఖర్చు చేస్తూ ఏ శ్రమా చెయ్యకుండా విశ్రాంతులతో, విలాసాలతో కాల క్షేపం చేస్తూ ఉంటుంది. మళ్ళీ కొత్త రాసి తయారై, మళ్ళీ అదే జరుగుతుంది. ఎప్పుడూ అదే జరుగుతూ ఉంటుంది.

కానీ, <u>నూతన సమాజంలో ఉత్పత్తి సాధనాలకు, పెట్టుబడిగా పని చెయ్యవలసిన అవసరం ఉండదు.</u> ఎందుకంటే — ఇక్కడ జనాభా అంతా పనిచేస్తారు. ఇది, ఈ సమాజానికి మొట్టమొదటి షరతు. పనిచేసే మనుషుల పోషణ వస్తువులు, ఆ పని కాలంలో ఖర్చయ్యే వస్తువులు గానే ఉంటాయి కదా? పని స్థలాల్లో ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాలూ, మనుషులందరి కోసం ఇంటా బైటా ఖర్చయ్యే పోషణ వస్తువులూ కలిసి, ఆ మొత్తమే, 'మొదట ఖర్చయ్యే ఉత్పత్తుల రాసి' అవుతుంది. ఇక్కడ ఈ 'ఉత్పత్తుల రాసి' ఎంత ఉంటుందో అంత ఖర్చుతో, మళ్ళీ అంత రాసినే ఉత్పత్తి చేస్తే చాలు. ఆ 'కొత్త రాసి'లో కొత్త ఉత్పత్తి సాధనాలూ, అందరికీ కావలసిన కొత్త పోషణ వస్తువులూ ఉంటాయి. ఇక్కడ, మొదట ఖర్చయ్యే ఉత్పత్తులు, తమ ఖర్చుతో, అంతకన్నా ఎక్కువ ఉత్పత్తుల్ని తీసుకు రావు. అంటే ఇక్కడ ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిగా పని చెయ్యవు.

ఈ విషయాలు ఒక ఉదాహరణ ద్వారా చూద్దాం:

**'పెట్టుబడిదారీ సమాజం'లో:** ఒక సంవత్సరంలో, సమాజంలో ఉన్న మొత్తం పెట్టుబడి —100. దాని పాళ్ళు — 40 స్థిర +60 అస్థిర. అదనపు విలువ రేటు — 100%. తయారైన ఉత్పత్తి రాసి విలువ = 40 స్థిర +60 అస్థిర + 60 అ. వి. = 160. ఈ 160 విలువ గల కొత్త రాసిలో 40 విలువగల కొత్త ఉత్పత్తి సాధనాలూ, 60+60=120 విలువ గల పోషణ వస్తువులూ ఉంటాయి. అంటే, ఈ ఉదాహరణలో, కార్మిక వర్గం, 40 విలువ గల ఉత్పత్తి సాధనాల మీద 120 విలువగల సజీవ శ్రమ చేసింది. అందుకే, ఆ కొత్త రాసి 160 అవుతుంది.

ఈ తయారైన రాసిలోనించి 40 విలువగల ఉత్పత్తి సాధనాలు, కొత్త ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగపడతాయి. 60 పోషణ వస్తువులు మళ్ళీ కార్మికవర్గానికీ, ఇంకో 60 పోషణ వస్తువులు కొత్త రాసి తయారయ్యే దాకా పెట్టుబడిదారీ వర్గానికీ! అంటే, ఇక్కడ 100 పెట్టుబడి, 160 విలువగల ఉత్పత్తుల్ని తయారు చేసింది. అందులో

అదనపు విలువ 60.

**'నూతన సమాజం'లో:** ఇక్కడ పరిస్థితి అంతా పూర్తిగా వేరు. ఇక్కడ కూడా మొదటి ఉదాహరణలో సంఖ్యలనే తీసుకుంటే విషయం తేలిగ్గా అర్థమవుతుంది. అంటే, ఇక్కడ కూడా మొత్తం సమాజానికి ఒక సంవత్సరానికి 160 ఉత్పత్తుల రాసి కావాలి — అనుకుందాం. అందులో 40 విలువ గల ఉత్పత్తి సాధనాలూ, 120 విలువ గల పోషణ వస్తువులూ ఉండాలి. జనాభా అంతా కలిసి ఈ 160 రాసిని తయారు చేస్తారు. ఈ రాసి కోసం మొదట అయిన ఖర్చు 40 ఉత్పత్తి సాధనాలూ +120 పోషణ వస్తువులూ = 160. తయారైన రాసి విలువ కూడా 160యే.

**పెట్టుబడిదారీ విధానంలో:**

పెట్టుబడి = 40C + 60V = 100

కొత్త రాసి = 40C + 60V + 60S = 160

**నూతన విధానంలో:**

మొదటి ఖర్చు =40 ఉ.సా. +120 పోషణ=160

కొత్త రాసి =40 ఉ.సా. +120 పోషణ=160

పెట్టుబడిదారీ సమాజపు ఉత్పత్తుల రాసి 3 భాగాలతో ఉంటే, నూతన సమాజపు ఉత్పత్తుల రాసి 2 భాగాలతోనే ఉంది. ఇక్కడ 'అదనపు ఉత్పత్తుల భాగం' లేదు. అది 2వ భాగంతోనే కలిసిపోయి ఉంది. కానీ, అది ఇప్పుడు అదనపు ఉత్పత్తి భాగం కాదు. ఎందుకంటే, ఇక్కడ దోపిడీ వర్గం కూడా శ్రమచేసే వర్గంతో కలిసి పోయింది కాబట్టి. అందరూ శ్రమ చేస్తారు కాబట్టి, ఎవరి పోషణని వాళ్ళే ఉత్పత్తి చేసుకుంటారు. ఇక్కడ వడ్డీ లాభాలూ, వర్తక కమిషన్లూ, భూమి కౌళ్ళూ — వగైరా దోపిడీ ఆదాయాల్ని ఆశ్రయించి బతికే పద్ధతి ఉండదు కాబట్టి, ఉత్పత్తుల రాసిలో నించి ఆ పేర్లతో కొంత కొంత భాగాన్ని లాగవలసిన అవసరం ఉండదు. అంటే ఇక్కడ 'అదనపు ఉత్పత్తుల భాగం' ఉండదు. జనాభా అందరూ కలిసి ఒక సంవత్స రంలో ఎంత ఉత్పత్తిని వాడేస్తారో, మళ్ళీ అందరూ కలిసి అంత ఉత్పత్తే చేసుకుంటే చాలు. పాత ధాన్యం వాడేస్తూ కొత్త ధాన్యమూ; పాత బట్టలు వాడేస్తూ కొత్త బట్టలూ; పాత ఉత్పత్తి సాధనాల్ని వాడేస్తూ కొత్త ఉత్పత్తి సాధనాలూ. - అన్నీ ఇలాగే.

పాత ఉత్పత్తుల్ని వాడేస్తూ కొత్త వాటిని ఉత్పత్తి చెయ్యడం — అనే పని ఏ సమాజంలో అయినా జరుగుతుంది. కానీ దోపిడీ సమాజాల్లో అయితే, యజమానుల వర్గం, ఉత్పత్తి సాధనాల్ని తమ స్వంత ఆస్తులుగా ఆక్రమించి, వాటిద్వారా తప్పుడు ఆదాయాలు లాగుతూ, శ్రమ చెయ్యకుండా జీవిస్తూ ఉంటుంది. నూతన సమాజంలో అయితే, ఉత్పత్తి సాధనాల్ని స్వంత ఆస్తులుగా ఆక్రమించే విధానమే రద్దవుతుంది కాబట్టి, శ్రమలు చెయ్యకుండా, యజమాని తనాలతో జీవించే విధానం కూడా రద్దవుతుంది. ఉత్పత్తి సాధనాలు అనేవి, స్వంత ఆస్తులు గానూ, పెట్టుబడులు గానూ ఉండడం రద్దవుతుంది. అప్పటి నించి అవి ఉత్పత్తి సాధనాలు మాత్రమే. — ఇదీ, పెట్టుబడిదారీ సమాజంలో పెట్టుబడి నిర్వహించే పాత్రకీ, నూతన సమాజంలో ఉత్పత్తి సాధనాలు నిర్వహించే పాత్రకీ తేడా!

నూతన సమాజంలో అదనపు శ్రమ ఉండదు — అనే విషయాన్ని సరిగా అర్థం చేసుకోవాలి. దీన్ని, 2వ భాగంలో, 'పని దినం' చాప్టర్లో కొంతవరకూ చూశాం. ఇంకా చూడవలసిన అంశాల్ని ఈ సంపుటంలోనే **'పెట్టుబడి విస్తరణ'** చాప్టరులో చూస్తాం.

నూతన సమాజంలో కూడా, ఒక ఉత్పత్తి క్రమం కోసం, 10C +5V = 15ని ఖర్చుపెట్టి, ఆ ఖర్చుతో, 20 విలువగల ఉత్పత్తులు చేసుకుంటే, ఆ ఎక్కువగా ఉన్న 5, అదనపు శ్రమ వల్లనే వస్తుంది. 'శ్రమశక్తి' అనే దానికి, తనకోసం ఖర్చయ్యే దాని కన్నా అవసరమైతే ఎక్కువ శ్రమ చెయ్యడం ఎప్పుడూ సాధ్యమే. అయితే, ఆ 'అదనపు శ్రమ'ని కూడా ఉత్పత్తిదారులు తమ స్వంతానికే తర్వాత ఖర్చు పెట్టుకున్నట్టయితే, ఆ అర్థంలో అది, 'అదనపు శ్రమ' అవదు. శ్రమ చేసే మనిషికి దక్కకుండా పోయే శ్రమే 'అదనపు శ్రమ' అవుతుంది.

పెట్టుబడి, తన విలువ కన్నా ఎక్కువ విలువని ఉత్పత్తి చేసే అవసరాన్ని వదిలేసినప్పుడు, దానికి దోపిడీ స్వభావం పోతుంది. ఉత్పత్తి సాధనాలకూ, శ్రమకూ, అప్పటి వరకూ ఉండే శత్రు సంబంధం పోతుంది. అప్పుడు పెట్టుబడికి, 'పెట్టుబడి' అనే పేరు కూడా పోతుంది. అప్పుడు పెట్టుబడి, 'ఉత్పత్తి సాధనాలు' అనే సహజమైన పేరుతో మాత్రమే ఉంటుంది.

నూతన సమాజంలో కూడా కొత్త అవసరాల కోసం, ఎక్కువ శ్రమ చేసుకోవలసిన సందర్భాలు ఉంటాయి. ఆ విషయాలన్నీ తర్వాత చూస్తాం.

# ప్రశ్నలూ - జవాబులూ

**1. 'శ్రమ, 'పెట్టుబడికి' లోబడడం — అంటే ఏమిటి?**

**జ:** పెట్టుబడిదారీ విధానంలో (గిల్డుల విధానంలో), అవసరాల మీదే ఆధారపడి ఉత్పత్తి జరిగినంత కాలమూ దానికి ఇంకా 'పెట్టుబడిదారీ స్వభావం' అనే స్వభావం ఏర్పడదు. అవసరాల్ని బట్టిగాక, ఎక్కువ సరుకుని అమ్మాలనీ, ఎక్కువ లాభాలు సంపాదించాలనీ — ఆ దృష్టి ఏర్పడినప్పటి నించీ శ్రామికులతో శ్రమ చేయించే పద్ధతుల్లో తేడా ప్రారంభమవుతుంది. ఎక్కువ లాభాలకోసం జరిగే వెంపర్లాటలో, శ్రమ పరికరాలూ శ్రమ విధానాలూ పెద్ద పెద్ద మార్పులకు లోనవుతాయి. శ్రామికుల మీద అజమాయిషీ పెరుగుతుంది. క్రమశిక్షణ పేరుతో రకరకాల నిబంధనలు ప్రారంభమవుతాయి. పని దినంలో అవసర భాగం కన్నా అదనపు శ్రమ భాగం పెరుగుతూ ఉంటుంది. ఆ రకంగా, శ్రమమీద పెట్టుబడి అధికారం పెరుగుతూ ఉంటుంది. ఇదంతా శ్రమ, పెట్టుబడికి లోబడడమే.

**2. పెట్టుబడిదారీ విధానానికి పూర్వం కూడా, శ్రమ, ఆస్తి పరుల యజమానితనానికి లోబడలేదా?**

**జ:** శ్రమచేసే మనుషులు, ఏ సమాజంలోనూ స్వేచ్ఛగా లేరు. వారు, బానిసల కాలంనించీ యజమానితనాలకు లోబడే ఉన్నారు. అయితే, ఇక్కడ చెపుతున్నది, పెట్టుబడిదారీ విధానంలోనే ఉన్న వేరు వేరు దశల గురించి. అవసరాల ప్రకారం ఉత్పత్తి జరిగే గిల్డుల కాలానికీ తర్వాత కాలానికీ ఉండే తేడాని ఇక్కడ చెపుతున్నట్టు తీసుకోవాలి. మొదటి దశలో కన్నా తర్వాత దశలోనే శ్రమ మీద పెట్టుబడి చేసే పెత్తనమూ, దోపిడీ స్థాయీ పెరుగుతూ వచ్చాయని అర్థం.

**3. కార్మికులు, తమ యజమానులైన పెట్టుబడిదారు లతో సమాన స్థితిలో ఉన్నారు. — ఈ మాటల్లో వైరుధ్యం ఏమిటి?**

**జ:** యజమానులూ, కార్మికులూ — అనే మాటలే ఒక దానికి ఒకటి విరుద్ధాలు. యజమానులు — పనులు ఇచ్చేవాళ్ళు అయితే, కార్మికులు — పనులు చేసే వాళ్ళు. అవి సమాన స్థితులు కావు. అదే ఆ మాటల్లో వైరుధ్యం.

**4. 'లాభం' రావలసింది ఎవరికి? ముడి పదార్థాలకా? శ్రమ పరికరాలకా? ఆగ్జిలరీ పదార్థాలకా? జీతాలకా? ఎవరికి?**

**జ:** లాభం రావలసింది, వాటిలో దేనికీ కాదు. పెట్టుబడి పెట్టే మనిషికి. ఆ సంబంధానికి!

**5. బానిస సమాజంలోనూ, ఫ్యూడల్ సమాజంలోనూ ఉన్నట్టుగానే, 'పెట్టుబడిదారీ విధానం'లో కూడా ఉత్పత్తి సాధనాలకూ, శ్రమకూ మధ్య వైరుధ్యం ఉందని ఎలా చెప్పగలం?**

**జ:** ఎలా చెప్పగలమంటే — గత సమాజాలలోలాగే పెట్టుబడిదారీ సమాజంలో కూడా ఉత్పత్తి సాధనాలు శ్రమ చెయ్యని వర్గానికి స్వంత ఆస్తిగానూ, శ్రమచేసే వర్గానికి పరాయి ఆస్తిగానూ ఉంటాయి. శ్రమ సంబంధాలు ఇక్కడ కూడా పాత సమాజాలలో లాగే దోపిడీ సంబంధాలుగానే ఉంటాయి. కాబట్టి, దాని వల్ల ఏర్పడే వైరుధ్యాలు కూడా గతంలో లాగే ఉంటాయని చెప్పగలం.

**6. వీటిలో ఒకటే సరైనది. అది ఏది?**

| | జ: |
|---|---|
| 1) ఉత్పత్తి కావాలంటే, పెట్టుబడి కావాలి. | × |
| 2) ఉత్పత్తి కావాలంటే — ఉత్పత్తి సాధనాలూ, కార్మికులూ కావాలి. | × |
| 3) ఉత్పత్తి కావాలంటే, ఉత్పత్తి సాధనాలూ, శ్రమచేసే మనుషులూ కావాలి. | ✓ |
| 4) ఉత్పత్తి కావాలంటే — ఉత్పత్తి సాధనాలూ పోషణ వస్తువులూ కావాలి. | × |

**7.** పెట్టుబడిదారీ విధానం, ఒక తాత్కాలిక చారిత్రక ఉత్పత్తి విధానం అయితే, గత కాలపు ఉత్పత్తి విధానాలు కూడా ఒక్కొక్క తాత్కాలిక చారిత్రక ఉత్పత్తి విధానాలేనా?

**జ:** అవును. వర్గాలు అనేవి ఉన్నంత కాలమూ ప్రతీ సమాజమూ కొంత కాలం పాటు ఉండే తాత్కాలిక సమాజమే. వర్గాలు కలిసిపోయి అందరూ సమాను లైన తర్వాత, అది తాత్కాలికం కాదు. ఆ సంబంధాలు అదే విధంగా శాశ్విత సంబంధాలుగా కొనసాగుతాయి, మానవ సమాజం ఉన్నంత కాలమూ. సమానత్వ సంబంధాలు ఏర్పడిన తర్వాత, ఆ స్వభావంలో ఏమాత్రం మార్పు జరిగినా, అది అసమానత్వానికే దారి తీస్తుంది. కాబట్టి, సమానత్వానికన్నా ఉన్నత దశ ఏమీ ఉండదు. ఆ స్వభావమే కొనసాగుతూ ఉండవలసి ఉంటుంది. అది తాత్కాలిక స్వభావం అవదు. ★

# 5. ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా

**ఉత్పాదక** శ్రమ అంటే— ఉత్పత్తి చేసే శ్రమ. అనుత్పాదక శ్రమ అంటే—ఉత్పత్తి చెయ్యని శ్రమ. ఈ ఉత్పత్తి చేసేదీ, చెయ్యనిదీ — దేనిని?

'ఉపయోగపు విలువ'నా, 'విలువ'నా? — రెంటినీ కాదు. 'అదనపు విలువ'ని. అంటే, 'అదనపు డబ్బు'ని.

'అదనపు విలువ'ని ఉత్పత్తిచేసే శ్రమ — ఉత్పాదక శ్రమ. 'అదనపు విలువ'ని ఉత్పత్తి చెయ్యని శ్రమ — అను త్పాదక శ్రమ.

శ్రమలలో — ఉత్పాదక శ్రమా, అను త్పాదక శ్రమా — అనే తేడా, శ్రమలకు సహజంగా ఉండేది కాదు. ఈ తేడా, పెట్టుబడిదారీ సమాజంలో ఉండే శ్రమలకు మాత్రమే, వర్తిస్తుంది. (దీన్ని తర్వాత చూస్తాం.)

ఒక సమాజ స్వభావంతో సంబంధం లేకుండా శ్రమల్ని సహజంగా చూస్తే, ఏ శ్రమ అయినా ఉత్పత్తి చేసే శ్రమే. ప్రతీ శ్రమా ఏదో ఒక 'ఉపయోగపు విలువ'ని ఉత్పత్తి చేస్తుంది. అంటే, ప్రతీ శ్రమా 'ఉత్పాదక శ్రమ'గానే ఉంటుంది. కాబట్టి, సహజంగా చూస్తే, శ్రమల్లో ఉత్పాదక — అనుత్పాదక తేడాలు అర్థం లేనివి.

కానీ, ఇక్కడ చూసేది, శ్రమల 'సహజ లక్షణాల్ని' గురించి కాదు. పెట్టుబడిదారీ సమాజంలో శ్రమలు, ఏయే సంబంధాలలో ఉంటాయో ఆ సంబంధాల్నిబట్టి ఏర్పడే లక్షణాల గురించి.

ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా — అనే మాటలు వినగానే మొదట వస్తువుల్ని ఉత్పత్తిచేసే శ్రమే ఉత్పాదక శ్రమ — అనీ, వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యకుండా పని రూపంలో ఉండే శ్రమ అయితే అనుత్పాదక శ్రమ అనీ — భావిస్తాము. కానీ, ఈ అర్థాలు తప్పు. ఒక శ్రమ — వస్తువుల్ని ఉత్పత్తి చేస్తుందా, పని రూపంలో ఉంటుందా — అనే తేడా, శ్రమల సహజత్వానికి సంబంధించిన తేడా. శ్రమలలో ఉత్పాదక — అనుత్పాదక భేదం ఏర్పడేది, ఆ శ్రమల సహజ లక్షణాలలో ఉండే తేడాల్ని బట్టి కాదు.

నేతా, కుట్టూ - లాంటి శ్రమలు 'వస్తువుల్ని' ఉత్పత్తి చేస్తాయి. నేత, బట్టని తయారు చేస్తుంది. కుట్టు, చొక్కాని తయారు చేస్తుంది. 'వస్తువు' పూర్తి అయ్యాక, ఆ శ్రమ చేసే మనిషినించి ఆ వస్తువు విడిపోతుంది. అప్పుడే ఆ వస్తువుని వాడతాము. చొక్కాని కుడుతూ వుండగానే వాడడం గానీ, బట్టని నేస్తూ వుండగానే వాడడం గానీ, సాధ్యం కాదు.

వైద్యం చెయ్యడం, బండి తోలడం - లాంటి శ్రమల్ని తీసుకుంటే, ఇవి వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యవు. ఇవి ఎప్పుడూ 'పని' రూపంలోనే ఉంటాయి. ఈ విషయాలు గతంలో కూడా చూశాం. ఇలాంటి శ్రమల విషయంలో, శ్రమ జరుగుతూవుండగానే దాన్ని వాడతాం. ఆ శ్రమ ఆగిపోయిందంటే, దాని వాడకం కూడా ఆగిపోతుంది. బండి మనిషి, బండి తోలడం ఆపేశాడంటే, ప్రయాణం ఆగిపోతుంది. ఆ శ్రమని ఉపయోగించడం కూడా ఆగిపోతుంది. ఇలాంటి శ్రమతో తయారయ్యే ఉత్పత్తి, శ్రమ చేసే మనిషి నించి విడిగా ఉండదు. ఇలాంటి శ్రమల్ని పెట్టుబడిదారులు 'సేవలు' (సర్వీసెస్) అంటారు. కానీ, 'సేవ' అనే మాట, 'పని రూపంలో వుండే శ్రమ' అనే అర్థాన్ని ఇవ్వదు. 'సపర్యలు చెయ్యడం', 'దాస్యం చెయ్యడం', 'సంఘసేవ చెయ్యడం' అనే అర్థాల్ని ఇస్తుంది. పని రూపంలో వుండే శ్రమల గురించి ఈ అర్థాలన్నీ తప్పవుతాయి. అందుకే, ఇలాంటి శ్రమల్ని సేవలు అనడం గాక, 'పని రూపంలోవుండే శ్రమలు' అనడమే సరైంది. (వస్తువుల ఉత్పత్తిని 'మెటీరియల్ ఉత్పత్తి' అనీ, పనుల ఉత్పత్తిని 'నాన్— మెటీరియల్ ఉత్పత్తి' అనీ — ఇంగ్లీషు మాటలతో అంటాం.) ఈ రకంగా, శ్రమల్లో — వస్తువుల్ని తయారు చేసే శ్రమలూ, పనుల రూపంలో వుండే శ్రమలూ — అనే సహజమైన తేడాలు ఉంటాయి.

ప్రతీ ఒక్క శ్రమా (అది ఏ రూపంలో ఉన్నా). ఏదో ఒక 'ఉపయోగపు విలువ'ని ఇస్తుంది. ఆ 'ఉపయోగపు విలువ' మంచిదా, చెడ్డదా — అనేది వేరే సంగతి.

ఇప్పుడు, 'ఉత్పాదక శ్రమ అంటే ఏమిటి?' అనే ప్రశ్నకి, 'ఉపయోగపు విలువని ఇచ్చేది' అని జవాబు చెప్పుకోవచ్చునా? అలా చెప్పుకుంటే, ప్రతి శ్రమా ఏదో ఒక ఉపయోగపు విలువని ఇస్తుంది కాబట్టి, ప్రతీ శ్రమా ఉత్పాదక శ్రమే అవుతుంది. అప్పుడు 'అనుత్పాదక శ్రమ' అనేది ఏదీ ఉండదు. అప్పుడు, 'అనుత్పాదక శ్రమ' అనే మాట అర్థంలేనిది అవుతుంది. కాబట్టి, 'ఉత్పాదక శ్రమ అంటే ఏమిటి?' అనే ప్రశ్నకి, 'ఉపయోగపు విలువని ఇచ్చేది' అనే జవాబు పనికిరాదు.

రెండోది — 'విలువ' విషయం. ఈ విషయంలోనే ఉత్పాదక — అనుత్పాదక తేడా ఏర్పడుతుందేమో చూడాలి. ప్రతీ శ్రమా ఏదో ఒక ఉపయోగపు విలువని ఇస్తుంది. కానీ, ఉపయోగపు విలువని ఇచ్చే ప్రతీ శ్రమా 'విలువ'గా మారకపోవచ్చు. ఒక శ్రమ, 'విలువ'గా (డబ్బుగా) మారకుండానే, 'ఉపయోగపు విలువ'గానే ఖర్చయి పోవచ్చు. ఒక శ్రమనిగానీ, ఆ శ్రమతో తయారైన వస్తువుల్నిగానీ అమ్మకపోతే, ఆ శ్రమకు బదులుగా డబ్బు రాదు. అందులో వున్న అదనపు శ్రమ కూడా డబ్బుగా మారదు. 'విలువ'గా మారని శ్రమ, 'అదనపు విలువ'ని ఇవ్వదు.

'అదనపు విలువ'ని ఇచ్చే శ్రమనే ఉత్పాదక శ్రమగా చెప్పుకున్నాం. ఒక కార్మికుడు చేసే శ్రమ, 'అదనపు విలువ'ని ఇవ్వాలంటే, అది, మొదట డబ్బుగా మారాలి. అంటే, దాన్ని అమ్మాలి. దానికి బదులు డబ్బు రావాలి. ఆ డబ్బులోనే కొంత భాగం అదనపు డబ్బుగా ఉంటుంది. విలువగా మారే శ్రమలోనే కొంత భాగం, 'అదనపు విలువ'గా ఉంటుంది కాబట్టి, 'విలువ'గా మారే శ్రమే ఉత్పాదక శ్రమ.

'విలువగా' మారకుండా 'ఉపయోగపు విలువగానే' ఖర్చయ్యే శ్రమ 'అదనపు విలువ'ని ఇవ్వదు, అందులో 'అదనపు శ్రమ' ఉన్నప్పటికీ. అది అనుత్పాదక శ్రమ అవుతుంది. అంటే, శ్రమకి ఉత్పాదక — అనుత్పాదక తేడాలు ఏర్పడేది, అది అదనపు విలువని ఇస్తోందా లేదా' అనేదాన్ని బట్టి. ఈ విషయాలన్నీ ఇప్పుడు వివరంగా చూడాలి.

'పెట్టుబడిదారీ విధానం'లో, శ్రమలన్నీ ఒకే పాత్రని నిర్వహిస్తాయా? వేతన శ్రామికులందరూ ఉత్పాదక శ్రామికులేనా? వేతన శ్రామికులందరూ 'అదనపు శ్రమ' చేస్తారా? అదనపు శ్రమ, ప్రతీచోటా 'అదనపు విలువ'గా మారుతుందా? మొత్తం 'సామాజిక ఉత్పత్తి'లో ఉత్పాదక శ్రమలకూ అనుత్పాదక శ్రమలకూ వున్న సంబంధం ఏమిటి? అసలు సమాజంలోవున్న డబ్బు అంతా ఏమిటి? — ఈ విషయాలన్నీ మనకు ఇప్పటికే తెలిసిన విషయా ల్లాగా కనపడతాయి. కానీ అది నిజం కాదు. ఇప్పుడు చూడబోయే విషయాలన్నీ చాలా కొత్తవి. ఈ విషయాలు అర్థం చేసుకోవడం, శ్రమల ఉత్పాదక, అనుత్పాదక తేడాల్ని అర్థం చేసుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది.

'సమాజం'లో వుండే మొత్తం శ్రమల్ని కొన్ని రకాలుగా ఇలా విభజించవచ్చును.

1. పెట్టుబడిదారుల ఉత్పత్తి స్థలాల్లో జరిగే శ్రమలు.
2. పెట్టుబడిదారుల ఇళ్ళల్లో జరిగే శ్రమలు.
3. కార్మికుల ఇళ్ళల్లో జరిగే శ్రమలు.
4. ఉత్పత్తి స్థలంలో అనుత్పాదక శ్రమలు
5. స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమలు.
6. చిన్న పెట్టుబడిదారుల పనిస్థలంలో శ్రమలు
7. ప్రభుత్వాధీనంలో జరిగే శ్రమలు.
8. మత సంస్థల్లో జరిగే శ్రమలు.

ఈ శ్రమలన్నీ కలిసే సమాజంలో జరిగే మొత్తం శ్రమలు. ఈ విషయాలన్నీ వరసగా చూస్తే, ఉత్పాదక — అనుత్పాదక విభజన పూర్తిగా అర్థమవుతుంది.

# పెట్టుబడిదారుడి 'ఉత్పత్తి స్థలం'లో జరిగే శ్రమలు

ఏ పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలాన్ని తీసుకున్నా అక్కడ ఏదో ఒక 'సరుకు' తయారవుతుంది. ఆ సరుకుని ఉత్పత్తి చెయ్యడానికి అనేక రకాల శ్రమలు అవసరమవు తాయి. శారీరక శ్రమలూ, మేధాశ్రమలూ, వాటిలో మళ్ళీ నైపుణ్యం గల శ్రమలూ, నైపుణ్యం లేని శ్రమలూ — ఇలా. కార్మికుల్లో కొందరు ముడి పదార్థాల్ని చేతుల్లోకి తీసుకుని పని చేసే వారిగా ఉంటారు. కొందరు, యంత్రాల్నీ, పాత్రల్నీ, పని స్థలాన్నీ శుభ్రంచేసే 'అన్‌స్కిల్డ్' (నైపుణ్యం లేని) పనులు చేస్తారు. యంత్రాల్ని రిపేరు చేసే మెకానిక్కులూ, జాయినర్లూ కొంత పైస్థాయి కార్మికు లుగా ఉంటారు. వీరు సాంకేతికమైన విద్యా, కొంత ట్రైనింగూ పొందిన వారై ఉంటారు. యంత్రాల్ని నడిపే వారూ, ముడి పదార్థాలతో సంబంధంలో ఉండే వారూ ఉత్పత్తి కార్యంతో డైరెక్టుగా సంబంధం కలిగి ఉంటారు. వర్క్సు ఇంజనీర్స్ లాంటి ఉద్యోగులు చేసే పని మేధాశ్రమ. ఇలాంటి ఉద్యోగులు, అసలు పనికి కొంత దూరంలో ఉంటారు. తయారయ్యే వస్తువు స్వభావాన్ని బట్టి ముడి పదార్థాల కొలతలూ, లెక్కలూ చూసే పనికూడా ఉత్పత్తి కార్యానికి అవసరమవుతుంది. మందుల తయారీలో ప్రతీ ముడి పదార్థమూ ఖచ్చితమైన కొలతలతో ఉండాలి. ఇలాంటి లెక్కలు రాసే పని కూడా ఉత్పత్తి కార్యానికి అవసరమవుతుంది. — ఇన్ని రకాల వేరు వేరు కార్మికుల శ్రమలతో ఒక సరుకు (వస్తువు) తయారవుతుంది. ఆ సరుకుని అమ్మకం కోసమే ఉత్పత్తి చేస్తారు కాబట్టి, దాన్ని

అమ్మేస్తారు. సరుకు వెళ్ళిపోయి డబ్బు వస్తుంది. అంటే, సరుకు కోసం జరిగిన శ్రమలన్నిటినీ అమ్మేసినట్టు అర్థం. ఆ శ్రమలన్నీ డబ్బుగా మారతాయి. ఆ డబ్బులో నించే పెట్టుబడిదారుడికి 'అదనపు డబ్బు' వస్తుంది. అంటే, కార్మికులు ఇచ్చిన అదనపు శ్రమ పెట్టుబడిదారుడి చేతిలోకి డబ్బుగా అందాలంటే, ఆ వస్తువుని అమ్మితేనే అది జరుగుతుంది. తయారైన వస్తువుని అమ్మకపోతే అందులో ఎంత అదనపు శ్రమ ఉన్నా (ఆ వస్తువు కోసం ఎంత అదనపు శ్రమ జరిగినా), అది పెట్టుబడిదారుడి చేతికి డబ్బుగా అందదు.

అదనపు శ్రమ — డబ్బుగా అందాలంటే, ఆ వస్తువు, అమ్మకం కోసమే తయారయ్యే సరుకుగా ఉండాలి. సరుకుని తయారుచేసే శ్రమే ఉత్పాదక శ్రమ. సరుకుని తయారుచేసే ఉత్పత్తి క్రమంలో పాల్గొనే వ్యక్తే ఉత్పాదక కార్మికుడు. ఈ ఉత్పత్తి స్థలాన్ని ఒక 'వర్క్‌షాప్' అనుకుంటే, ఆ వర్క్‌షాప్‌కి అవసరమయ్యే కార్మికులంతా కలిసి ఒక 'ఎగ్రిగేట్ కార్మికుడు' (మొత్తం కార్మికుడు). వర్క్‌షాపులో ఉన్న ప్రతీ విడి కార్మికుడూ ఎగ్రిగేట్ కార్మికుడిలో ఒక భాగం, ఒక అంగం, — స్త్రీ అయినా, పురుషుడైనా.

ఈ ఉత్పాదక కార్మికులందరూ ఒకే స్థలంలో ఉండి తీరనక్కరలేదు. ఒక ఇంజనీరు, సరుకు తయారవుతోన్న స్థలంలోగాక, ఇంకో చోట ఉండి డిజైన్లు గీసి పంపడమో, ఇంకో పనో చేస్తూవుంటే (ఈ పెట్టుబడిదారుడి నించే జీతం తీసుకుంటూ) అతను కూడా ఈ ఉత్పత్తి క్రమానికి చెందిన కార్మికుడే అవుతాడు. ఈ రకంగా, ఈ విడి విడి కార్మికులు, సరుకు తయారయ్యే అసలు ఉత్పత్తి స్థలానికి దగ్గర్లో ఉన్నారా, దూరంలో ఉన్నారా — అనే దానితో సంబంధం లేకుండా, ఒక సరుకుకోసం అవసరమైన శ్రమలు చేసే వారంతా 'ఎగ్రిగేట్ కార్మికుడి'లో భాగం.

పెట్టుబడిదారుడి పనిస్థలంలో, ఉత్పాదక కార్మికులూ అనుత్పాదక కార్మికులూ కూడా ఉంటారు. పెట్టుబడిదారుడు అందరికీ జీతాలు ఇస్తాడు. కానీ, సరుకు తయారయ్యేది ఉత్పాదక కార్మికుల శ్రమల ద్వారానే. మరి, అనుత్పాదక కార్మికులు ఏం చేస్తారు — అనేది తర్వాత చూస్తాం.

సరుకు కోసం ఖర్చయ్యే అస్థిర పెట్టుబడి (V) అనేది, ఉత్పాదక కార్మికుల జీతాలే. అనుత్పాదక కార్మికుల జీతాలు అస్థిర పెట్టుబడిలోకి రావు. కాబట్టి, ఇక్కడ చూసేదంతా ఉత్పాదక కార్మికుల శ్రమల విషయమే.

బట్టల పరిశ్రమలో నేత కార్మికుడి శ్రమ — 'బట్ట' అనే సరుకుని ఉత్పత్తిచేస్తే, రవాణా పరిశ్రమలో బస్సు డ్రైవరు శ్రమ — 'ప్రయాణ సౌకర్యం' అనే సరుకునీ, తంతి తపాలా పరిశ్రమలో కార్మికుడి శ్రమ — 'ఉత్తర ప్రత్యుత్తర సౌకర్యం' అనే సరుకునీ — ఈ రకంగా.

సరుకుని అమ్మినప్పుడు, 'పెట్టుబడి' అంతా వెనక్కి వచ్చి, ఆ పైన అదనపు డబ్బుకూడా వస్తుంది. పెట్టుబడిదారుడు, ఆ అదనపు డబ్బుని తన స్వంత కుటుంబ అవసరాలకు ఉపయోగించుకుంటూ, ఆ 'పెట్టుబడి'ని మళ్ళీ కొత్త సరుకు ఉత్పత్తి కోసం, కొత్త పెట్టుబడిగా వాడతాడు. లేదా, 'అదనపు డబ్బు'లోనించి కొంత భాగాన్ని మాత్రమే స్వంతానికి వాడుకుని, మిగిలిన దాన్ని పెట్టుబడికి కలిపి, పెట్టుబడిని పెంచవచ్చు. ఇలా, మొదటి పెట్టుబడిని ఎన్ని సార్లయినా తిరిగి వాడుతూ, దానితో ప్రతీసారీ 'అదనపు డబ్బు'ని సంపాదిస్తూ ఉండవచ్చు.

పెట్టుబడిదారుడు చేసే పని — సరుకుని ఉత్పత్తి చేయించడమూ, దాన్ని అమ్మి, పెట్టుబడిని వెనక్కి తీసుకుని, దానిద్వారా అదనపు డబ్బుని లాగడమూనూ. ఈ కార్యక్రమంద్వారా పెట్టుబడిదారుడికి కావలసిన అసలు విషయం — అదనపు డబ్బే. పెట్టుబడి మాత్రమే వెనక్కి వచ్చి, దానిమీద ఏ అదనమూ రాకపోతే, దానివల్ల పెట్టుబడిదారుడికి ఏ ప్రయోజనమూ ఉండదు. కాబట్టి, పెట్టుబడిదారుడికి 'అదనపు డబ్బు'ని తెచ్చే శ్రమే — ఉత్పాదక శ్రమ. ఈ పని, 'సరుకు' ద్వారానే జరుగుతుంది కాబట్టి, క్లుప్తంగా చూస్తే, సరుకుని ఉత్పత్తి చేసే శ్రమే ఉత్పాదక శ్రమ (ప్రొడక్టివ్ లేబర్).

'సరుకు'ని ఉత్పత్తి చెయ్యడం కోసం, ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాలన్నీ ' ఉత్పాదకంగా' ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాలు. సరుకుని ఉత్పత్తిచేసి, దానిద్వారా అదనపు విలువని ఇచ్చే కార్మికులు — ఉత్పాదక కార్మికులు.

పెట్టుబడిదారుడి 'ఉత్పత్తి స్థలం'లో మొదటినించీ మనం చూస్తున్నదంతా ఈ 'ఉత్పాదక' కార్మికుల గురించే. బట్ట ఉదాహరణలో, 100 పెట్టుబడికి, 20 అదనపు విలువ వచ్చినట్టుగా మొదటి నించీ చూస్తున్నాం. ఇలా వచ్చే అదనపు విలువని, 'డైరెక్టు అదనపు విలువే' అందాం. (తర్వాత 'ఇన్‌డైరెక్ట్ అదనపు విలువ' ని కూడా చూస్తాం.)

ప్రతీ ఉత్పత్తి స్థలంలోనూ, ఉత్పాదక శ్రమలేగాక, అనుత్పాదక శ్రమలు కూడా కొన్ని ఉంటాయి. అంటే, ఉత్పాదక కార్మికులే గాక, అనుత్పాదక కార్మికులు కూడా కొందరు ఉంటారు. కానీ, అనుత్పాదక శ్రమల్ని తేలిగ్గా అర్థం చేసుకోవడానికి, పెట్టుబడిదారుడి 'సరుకు ఉత్పత్తి స్థలం' సరైన చోటు కాదు. దానికోసం, పెట్టుబడిదారుడి 'ఇంటికి' వెళ్ళాలి. పెట్టుబడిదారుడి ఇంటి దగ్గిర శ్రమల్ని మొదట చూసి, అప్పుడు మళ్ళీ ఈ ఉత్పత్తి స్థలానికి వచ్చి, ఇక్కడ ఉండే అనుత్పాదక శ్రమల్నీ, తర్వాత ఇక్కడ ఇంకా కొన్ని ఉత్పాదక శ్రమల్నీ కూడా చూడాలి.

# పెట్టుబడిదారుడి ఇంటి దగ్గిర శ్రమలు

పెట్టుబడిదారుడు, తన ఇంట్లో పనులకోసం వంట మనిషినీ, పని మనుషుల్నీ, బండితోలే మనిషినీ (లేదా కారు డ్రైవర్‌నీ). తోట మాలినీ — ఇలా తన కుటుంబ వ్యక్తిగత అవసరాల కోసం కొంత మంది శ్రామికుల్ని పెట్టుకుంటాడు. ఈ శ్రామికులంతా జీతాల పద్ధతి మీదే పని చేస్తారు. అంటే వీరు కూడా వేతన శ్రామికులే. అయితే, ఈ శ్రామికులందరూ కూడా తమ యజమానికి 'అదనపు శ్రమ' చేస్తారా? 'అదనపు విలువ'ని ఉత్పత్తి ఇస్తారా? వీరి ద్వారా యజమానికి అదనపు డబ్బు వస్తుందా? ఈ శ్రామికులందరూ కూడా యజమాని దోపిడీకి గురి అవుతారా? — ఈ సంగతులే ఇప్పుడు చూస్తాం.

ఇంటి శ్రమలన్నిటికీ ఉదాహరణంగా 'వంట శ్రమ'ని తీసుకుందాం. ఈ శ్రమ ద్వారా చూసే విషయాలు అన్ని రకాల ఇంటి శ్రమలకూ వర్తిస్తాయి.

వంట మనిషి, పెట్టుబడిదారుడి ఇంట్లో, పెట్టుబడి దారుడి పదార్థాలతోనే వంట చేస్తుంది. ఆ పని జరగడానికి, ఒక 'వంట గది' ఉండాలి. అదే, ఆ వంట శ్రమకి — 'పని స్థలం.' అంతే కాదు, ఆ శ్రమ జరగడానికి, ముడి పదార్థాలూ, శ్రమ పరికరాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ, అన్నీ ఉండాలి. బియ్యమూ, కూరగాయలూ వంటివన్నీ ముడి పదార్థాలు. కట్టెలూ, గ్యాసూ, కరెంటూ — వంటివి ఆగ్జిలరీ పదార్థాలు. వంట పాత్రలూ, పొయ్యీ— లాంటివి శ్రమ పరికరాలు. అంటే, ఇంట్లో చేసే ఉత్పత్తికి కూడా కొన్ని 'ఉత్పత్తి సాధనాలు' అవసరమవుతాయి. వంట మనిషి, ఆ ఉత్పత్తి సాధనాల్ని ఖర్చు చేస్తూ, తన శ్రమతో వంటలు తయారు చేస్తుంది.

ఒక పూట కొన్ని వంటలు తయారయ్యాయి — అను కుందాం. తయారైన ఆ వంట పదార్థాలకోసం, (1) కొన్ని ఉత్పత్తి సాధనాలూ, (2) వంట మనిషి సజీవ శ్రమా— ఖర్చయ్యాయి అని అర్థం.

తయారైన వంట పదార్థాల్ని, ఆ ఇంటి వాళ్ళు ఏం చేస్తారు? — బయటికి అమ్మేస్తారా? అమ్మేసి, మొదట పెట్టిన ఖర్చునంతా వెనక్కి తీసుకుంటారా? — అలా చెయ్యరు. ఆ పదార్థాల్ని తయారు చేయించింది, బయటికి అమ్మడానికి కాదు. తమ స్వంతానికి వాడుకోవడానికే. ఆ ఇంటి వాళ్ళు తినడానికి ప్రతి పూటా వంటలు కావాలి. ఆ పని, వాళ్ళుచేసుకోకుండా ఉండడానికే వంట మనిషిని పెట్టుకున్నారు. ఆ మనిషి ప్రతి పూటా వంటచేస్తూవుంటే ఆ కుటుంబం ప్రతి పూటా ఆ పదార్థాల్ని స్వంతానికి ఉప యోగించుకుంటూ ఉంటుంది.

ఆ ఇంటి వాళ్ళు ఆ వంట పదార్థాల్ని బైటికి అమ్మడం లేదంటే, వాటిని తయారు చెయ్యడానికి పట్టిన ఉత్పత్తి సాధనాల్నిగానీ, వంట మనిషి శ్రమని గానీ బైటికి అమ్మడం లేదని అర్థం. అంటే ఆ సాధనాల్నీ, ఆ శ్రమనీ, ఆ కుటుంబం తన 'స్వంతానికే' వాడుకుంటుంది. అంటే, ఆ సాధనాల్నీ, ఆ వంట శ్రమనీ ఆ కుటుంబం మళ్ళీ 'విలువ'గా (డబ్బుగా) మార్చుకోదు. అవన్నీ ఆ కుటుం బానికి 'ఉపయోగపు విలువలు'గా అవుతాయి.

అయితే, ఇక్కడ అసలు విషయం — ఈ వంట మనిషి 'అదనపు శ్రమ' చేస్తుందా, లేదా? 'అదనపు డబ్బు'ని ఇస్తుందా లేదా? — మొదట క్లుప్తంగా చెప్పుకోవా లంటే, ఆ వంట మనిషి, 'అదనపు శ్రమ' చేస్తుంది. కానీ, ఆ అదనపు శ్రమ, 'అదనపు విలువ'గా ('డబ్బు'గా) మారదు. ఈ విషయాలు ఇప్పుడు వివరంగా చూడాలి.

ఈ వంట మనిషి కూడా — వేతన శ్రామికురాలే. వేతనం ('జీతం') అనేది, శ్రమ శక్తి విలువేగానీ, శ్రమ విలువ కాదు అనే సూత్రమే ఇక్కడ కూడా ఉంటుంది. ఈ వంట మనిషి కూడా తన 'శ్రమ విలువ'లో నించి కొంత భాగాన్నే 'జీతం'గా తీసుకుని, మిగిలిన భాగాన్ని 'అదనపు శ్రమ'గా పోగొట్టుకుంటుంది. ఈమె కూడా 'దోపిడీ'కి గురి అవుతుంది.

ఈమె జీతం ఎలా ఉంటుందో, ఒక ఉదాహరణ పెట్టుకోవాలి. రక రకాల వంట పదార్థాల్ని అమ్మే 'హోటల్' లాంటి ఉత్పత్తి స్థలంలో, రక రకాల స్థాయిల్లో పని చేసే వంట మనుషులు ఉంటారు. వారు చేసే పనులు కొన్ని తేడాలతో ఉంటాయి కాబట్టి, వారికి జీతాలు కూడా తేడాగా ఉంటాయి. అక్కడ ఉండే ఒక తక్కువ స్థాయి వంట మనిషి జీతంతో, మన వంట మనిషి జీతం సమానం — అనుకుందాం. హోటల్ వంట మనిషికి, రోజూ 8 గంటల పనికి 16 జీతం అనుకుందాం. అంటే, గంటకి 2 జీతం. 8 గంటల పనికి 16 జీతం అంటే, ఆ 8 గంటల్లో ఆ వంట మనిషి చేసే శ్రమ విలువ 16 యేనా? — కాదు. అదనపు విలువ రేటుని 100% అనుకుంటే, ఆ 8 గంటల్లో ఆ వంట మనిషి చేసిన పనికి 32 విలువ ఉంటుంది. అంటే, ప్రతీ గంట పనికీ 4 విలువ. అందులో సగం విలువని మాత్రమే ఆమెకి జీతంగా ఇస్తే, మిగిలినది

హోటలు పెట్టుబడి దారుడికి అదనపు విలువ. ఈ వంట మనిషి హోటల్లోనే భోజనం చేస్తుంది అనుకుంటే, ఆ భోజనం ఖర్చుతో కూడా కలిసే, 1 గంటకి జీతం 2 అని అర్థం. ఇది హోటల్లో పరిస్థితి.

మన బట్ట పెట్టుబడిదారుడి ఇంటి వంట మనిషి జీతం కూడా 1 గంటకి 2 రూపాయలు అనుకుందాం. ఈ వంట మనిషి రోజూ 4 గంటలు పనిచేసి 8 జీతం తీసుకుంటుం దనుకుందాం. (వంట మనిషి, యజమాని ఇంట్లోనే భోజనం చేస్తుందనుకుంటే, ఆ భోజనం ఖర్చుతో కూడా కలిసే 1 గంటకి 2 జీతం అనుకోవాలి.) వంట మనిషి, యజమాని ఇంట్లో రోజూ 4 గంటలు పనిచేసి, 8 జీతం తీసుకుంటే, ఆమె శ్రమ విలువ అంతా ఆమెకి దక్కి నట్టేనా? — కాదు. 4 గంటలకి 8 జీతం అనేది, అది శ్రమ శక్తి విలువే గానీ శ్రమ విలువ కాదు. ఇక్కడ కూడా అదనపు శ్రమ రేటుని 100% అనుకుంటే, వంట మనిషి శ్రమ విలువ 1 గంటకి 2 కాదు, 4. గంటకి 4 జీతం ఇస్తేనే ఆమె శ్రమ విలువ ఆమెకి దక్కినట్టు అవుతుంది. రోజూ 4 గంటలు వంట పని చేసి తయారుచేసే పదార్థాల కోసం ఆమె శ్రమ భాగం 8 కాదు, 16.

పెట్టుబడిదారుడి కుటుంబం ఈ వంటల్ని బైటకి అమ్మకపోయినప్పటికీ, వాటికి ఎంత విలువ ఉండవచ్చో లెక్కకట్టడం సాధ్యమే. అలా లెక్కకట్టి చూద్దాం.

ఆ కుటుంబానికి 1 రోజు వంటకోసం 30 విలువగల ఉత్పత్తి సాధనాలు ఖర్చవుతాయి అనుకుందాం. వంట మనిషి జీతం 8. అదనపు శ్రమ రేటు 100%. తయారైన వంటల విలువ = ఉత్పత్తి సాధనాలు 30 + వంట మనిషి జీతం 8 + అదనపు శ్రమ 8 = 46. ఇదీ ఆ ఇంట్లో ఒక రోజు తయారైన వంటల విలువ. కానీ, ఈ వంటల కోసం ఆ కుటుంబం ఖర్చుపెట్టింది = 30 + 8 = 38 మాత్రమే. 38 ఖర్చుతో వాళ్ళకి 46 విలువగల వంట పదార్థాలు దొరికాయి.

ఇప్పుడు, ఈ వంటలన్నిటినీ గనక బయటికి అమ్మితే, వాటికి బదులుగా 46 రూపాయలు వస్తాయి. మొదట ఖర్చు పెట్టిన 38 రూపాయలూ తిరిగి వచ్చి, ఇంకో 8 రూపాయలు కూడా డైరెక్టు అదనపు విలువగా (డబ్బుగా) వస్తాయి. అంటే, మొదట పెట్టిన డబ్బు, 'పెట్టుబడి'గా పని చేసి, అది మొదటి 38 డబ్బుని 46 డబ్బుగా పెంచిం దని అర్థం.

కానీ, ఇంటి వంటల్ని బయటికి అమ్మరు కదా? అలా అమ్మనప్పుడు ఈ విలువ లెక్కలన్నీ ఏమవుతాయి? ఆ వంటల్ని బయటికి అమ్మినా, అమ్మకపోయినా, అవి ఉత్పత్తి అవడానికి 46 విలువ గల శ్రమ పట్టిందని అర్థం. వాటిని అమ్మితే, అదంతా డబ్బుగా వస్తుంది. లేదా, ఆ వంటల్ని ఆ కుటుంబమే వాడేసుకుంటే, అవన్నీ ఆ కుటుంబానికి ఉపయోగపు విలువలుగా ఖర్చయిపోతాయి. అందులో ఉన్న 8 అదనపు శ్రమ కూడా ఉపయోగపు విలువగానే ఖర్చయిపోతుంది.

హోటల్ వంట మనిషి, 'సరుకుల్ని' ఉత్పత్తి చేస్తుంది. ఆ శ్రమ అంతా డబ్బుగా మారుతుంది. ఆ శ్రమలోనే ఉన్న వంట ఆమె అదనపు శ్రమ కూడా డబ్బుగా మారుతుంది. ఆ కారణం వల్ల ఆ శ్రమ - ఉత్పాదక శ్రమ. ఆమె - ఉత్పా దక శ్రామికురాలు.

ఇంటి వంట మనిషి కూడా వంటలు చేస్తుంది. ఆ శ్రమ, డబ్బుగా మారదు. అందులో ఉన్న ఆమె అదనపు శ్రమ కూడా డబ్బుగా మారదు. ఆ కారణంవల్ల ఆ శ్రమ— అనుత్పాదక శ్రమ. ఆమె — అను త్పాదక శ్రామికురాలు.

> "అనుత్పాదక శ్రామికుల సేవలు (యజమానికి) తిరిగి డబ్బుగా మారవు" — మార్క్స్.
>
> (అదనపు విలువ సిద్ధాంతాలు-1, పేజీ 303)

అయితే, ఇంటి వంట మనిషి వేపు నించి చూస్తే: ఆమె, యజమానికి 'అదనపు శ్రమ' ఇచ్చే మాట నిజం. ఆమె శ్రమని యజమాని బైటికి అమ్ముకుంటాడా లేదా, అది డబ్బుగా మారుతుందా లేదా అనేది, ఆమెకి అనవసరం. ఆమె, యజమాని కుటుంబానికి రోజూ వంట చేస్తూ వుంటే, రోజూ 8 జీతంతో 16 శ్రమ చేస్తూ, రోజూ 8 అదనపు శ్రమని పోగొట్టుకుంటూ, రోజూ 'శ్రమ దోపిడీ'కి గురి అవుతూనే వుంటుంది.

ఇక్కడ ఒక విషయం సరిగా గ్రహించాలి. ఇంటి వంట మనిషి వల్ల కూడా 'అదనపు డబ్బు' వస్తుందని ఇంకో రకంగా అనుకోవచ్చునేమో చూద్దాం. ఎలాగంటే: ఈ వంట మనిషి శ్రమకి, పూర్తిగా చెల్లించాలంటే, ఆమెకి రోజూ ఇంకో '8 డబ్బు' ఇవ్వాలి కదా? అలా ఇవ్వకపోవడం వల్ల, ఆ కుటుంబానికి రోజూ 8 డబ్బు మిగులుతున్నట్టే కదా? వంట మనిషికి ఇవ్వకపోవడం వల్ల మిగిలే 8 డబ్బునే, ఆ వంట మనిషి ద్వారా వచ్చే 'అదనపు విలువ'గా అనుకోకూడదా? ఆ కుటుంబం, వంట మనిషి శ్రమని బయటికి అమ్మకపోయినా, ఆమెకి ఇవ్వకుండా మిగుల్చుకున్న 8 డబ్బు, ఆమె ద్వారా వచ్చే 'అదనపు విలువ' అవదా?

దీనికి మొదట క్లుప్తంగా జవాబు — అలా అవదు. ఈ విషయం సరిగా అర్థం చేసుకోవాలంటే, దీన్ని, ఉత్పాదక కార్మికులు పెట్టుబడిదారుడికి ఇచ్చే 'అదనపు విలువ'తో కూడా కలిపి చూడాలి.

ఇప్పుడు మనం, ఇంటి వంట మనిషికి యజమాని అయిన పెట్టుబడిదారుడి 'ఆదాయం' దగ్గిరికి వెళ్ళాలి.

పెట్టుబడిదారుడు, తన ఇంటి అవసరాల కోసం, తన ఆదాయంలో నించే ఖర్చుపెడతాడని మనకు తెలుసు. వాడికి 'ఆదాయం' ఏమిటి? వాడు, బయట ఏ సరుకుని ఉత్పత్తి చేయించి అమ్ముతాడో, ఆ సరుకు ద్వారా వచ్చే అదనపు డబ్బే. ఉత్పాదక కార్మికుల ద్వారా వచ్చే అదనపు డబ్బే పెట్టుబడిదారుడి ఆదాయం. ఆ డబ్బులో నించే వాడు, తన కుటుంబ అవసరాలకు ఖర్చుపెడతాడు.

ఈ పెట్టుబడిదారుడికి, రోజూ తన సరుకు ద్వారా, 50 అదనపు విలువ (డబ్బు) వస్తుందనుకుందాం. ఇంటి పనులన్నిటికీ ఉదాహరణగా 'వంట పని'నే తీసుకుందాం. ఆదాయమూ ఖర్చూ కూడా 1 రోజుకి సంబంధించినవే అనుకుందాం.

వంట పనికి సంబంధించిన ఉత్పత్తి సాధనాల కోసం 30. వంట మనిషి జీతం 8. మొత్తం ఖర్చు 38. పెట్టుబడిదారుడి 50 ఆదాయంలో ఇంకా 12 మిగిలి ఉంటుంది.

ఇప్పుడు మన ప్రశ్న ఏమిటంటే: పెట్టుబడిదారుడు, వంట మనిషి నించి 16 శ్రమ తీసుకుని 8 జీతమే ఇస్తాడు కదా? వంట మనిషికి ఇంకో 8 కూడా ఇచ్చేస్తే, అప్పుడు, పెట్టుబడిదారుడి దగ్గిర 12 గాక, 4 డబ్బే మిగిలేది కదా? ఇప్పుడు పెట్టుబడిదారుడి దగ్గిర ఉన్న 12 డబ్బులో నించి 8ని, వంట మనిషికి సంబంధించిన 'అదనపు విలువ'గా అనుకోవచ్చు కదా? అంటే, వంట మనిషి అదనపు శ్రమ కూడా, పెట్టుబడిదారుడికి 8 డబ్బుగా అందిందని ఎందుకు అనుకోకూడదు? - ఇదీ మన ప్రశ్న.

అలా అనుకోవడం చాలా పొరపాటు. ఎందుకంటే, పెట్టుబడిదారుడి దగ్గిర మిగిలి ఉన్న 12 డబ్బు, ఉత్పాదక కార్మికుల అదనపు విలువలోది — అని మొదటే చూశాం. వంట మనిషి వల్ల కూడా 8 అదనపు విలువ వచ్చి వుంటే, ఆ 8 డబ్బు, పెట్టుబడిదారుడి దగ్గిర అప్పటికే ఉన్న 12తో సంబంధం లేకుండానే, ఆ 12 అలా వేరుగా ఉండగానే, ఇది కూడా వేరుగా కనపడాలి. అదీ ఇదీ కలిసి మొత్తం, 12+8=20 డబ్బు, పెట్టుబడిదారుడి దగ్గిర ఉండాలి. ఇలా జరిగితేనే వంట మనిషి అదనపు శ్రమ కూడా డబ్బుగా మారిందని అర్థం.

కానీ అలా జరగదు. పెట్టుబడిదారుడి దగ్గిర 12 డబ్బే ఉంటుందిగానీ 20 డబ్బు ఉండదు. వాడి దగ్గర ఉన్న 12లో నించే 8ని, వంట మనిషి అదనపు విలువగా అనుకుంటే దాని వల్ల జరిగే తప్పేమిటంటే — ఆ 8ని, ఒక వేపు — ఉత్పాదక కార్మికుల అదనపు విలువగానూ; ఇంకోవేపు — వంట మనిషి అదనపు విలువ గానూ కూడా అనుకోవలసి వస్తుంది. తప్పు ఇదే.

ఆ 12లో నించే 8ని అనుత్పాదక వంట మనిషి అదనపు విలువగా అనుకుంటే, అప్పుడేం జరుగుతుందంటే, ఉత్పాదక కార్మికులు ఇచ్చిన అదనపు విలువలో నించి 8 తగ్గిపోతుంది. పెట్టుబడిదారుడికి ఉత్పాదక కార్మికుల నించి వచ్చిన అదనపు విలువ 50 గా గాక, 42 గా మాత్రమే అవుతుంది. కానీ మొదటి ఉదాహరణ ప్రకారం ఉత్పాదక కార్మికుల అదనపు విలువ 42 కాదు; 50. దాన్ని ఎలా ఖర్చుపెట్టినా, ఆ ఖర్చులన్నిటినీ కలిపితే, అది 50గా కనపడి తీరాలి. వంట మనిషి నించి కూడా 8 అదనపు విలువ వచ్చి ఉంటే, అది కూడా వేరుగా కనపడాలి. పెట్టుబడిదారుడు మొత్తం 58 డబ్బుని ఖర్చు పెట్టగలగాలి.

ఈ ఉదాహరణలోకి, ఇంటి వంట మనిషిని గాక, హోటల్ వంట మనిషిని తీసుకుంటే, అప్పుడు ఆ హోటల్ వంట మనిషి అదనపు విలువ వేరుగానే ఉంటుంది.

బట్ట పెట్టుబడిదారుడికి, ఒక హోటల్ కూడా ఉందనుకుందాం. అక్కడ పనిచేసే ఒక వంట మనిషి 8 అదనపు శ్రమ చేసినట్టయితే అది యజమానికి, డబ్బుగానే అందుతుంది. 2 చోట్ల వేరు వేరుగా పనిచేసే ఉత్పాదక కార్మికుల నించి వచ్చిన అదనపు విలువల మొత్తం 50 + 8 = 58 అవుతుంది. అది అంతా డబ్బుగానే ఉంటుంది. అంటే, ఉత్పాదక కార్మికుల విషయంలో అయితే, అదనపు విలువలు వేరు వేరుగానే ఉంటాయి. అక్కడ ఒకరి అదనపు విలువగా ఉన్న 8నే, ఇంకొకరి అదనపు విలువగా అనుకోనక్కరలేదు.

కానీ, ఇంటి వంట మనిషి విషయంలో అలా జరగదు. ఆమె అదనపు శ్రమ, వేరుగా ఉండే డబ్బుగా కనపడదు.

కాబట్టి, విషయాన్ని సరిగా అర్థం చేసుకుంటే: పెట్టుబడిదారుడి దగ్గిర మిగిలి ఉన్న 12 డబ్బు, బట్ట కార్మికుల అదనపు విలువలోది మాత్రమే. అందులో ఇంటి వంట మనిషి అదనపు విలువ ఏమీ ఉండదు.

అయితే, ఇంటి వంట మనిషి ఇచ్చిన 8 అదనపు శ్రమ ఏమైపోయింది? ఇంతకు ముందే చూసినట్టు, 'డబ్బు'గా మారకుండా, ఉపయోగపు విలువగా ఖర్చయిపోయింది.

వంట మనిషి ఇచ్చిన అదనపు శ్రమవల్ల, యజమాని కుటుంబానికి ఏం లాభం జరిగింది? — ఏం లాభం జరిగిందంటే, 8 జీతంతోనే 16 వంట శ్రమ అందింది. వంట మనిషి అదనపు శ్రమవల్ల, ఆ కుటుంబం ఖర్చు పెట్టవలసిన దాంట్లో 8 ఖర్చు తగ్గడం — అనే లాభం జరిగింది. అంటే, వంట మనిషి అదనపు శ్రమ, ఆ కుటుంబానికి, 'డబ్బుని పెంచడానికి' గాక, 'ఖర్చుని తగ్గించడానికి' ఉపయోగపడింది. వంట మనిషివల్ల, ఆ కుటుంబానికి 8 ఖర్చు తగ్గినప్పటికీ, ఆ కుటుంబం దగ్గిర ఉన్న

డబ్బులో ఒక 8 డబ్బు, వంట మనిషి అదనపు విలువ అవదు.

యజమాని కోసం సరుకుల్ని ఉత్పత్తి చేసే శ్రమ — ఉత్పాదక శ్రమ. ఈ కార్మికులు ఉత్పాదక కార్మికులు. ఈ కార్మికుల అదనపు శ్రమ యజమానికి డబ్బుని పెంచు తుంది. దీన్ని 'డైరెక్టు అదనపు విలువ' అనవచ్చు.

యజమాని కోసం ఉపయోగపు విలువల్ని ఉత్పత్తి చేసే శ్రమ అనుత్పాదక శ్రమ. ఈ కార్మికులు అనుత్పాదక కార్మికులు. ఈ కార్మికుల అదనపు శ్రమ యజమానికి ఖర్చుని తగ్గిస్తుంది. ఈ తగ్గే ఖర్చుని, 'ఇన్‌డైరెక్ట్ అదనపు విలువ' అనవచ్చు.

చివరికి సారాంశం ఏమిటి? యజమానికి డబ్బునీ, అదనపు డబ్బునీ ఉత్పత్తి చేసేది — ఉత్పాదక శ్రమ.

వాటిని ఉత్పత్తి చెయ్యనిది — అనుత్పాదక శ్రమ.

అనుత్పాదక శ్రమ అనేది ప్రత్యేకంగా ఉండదు. ఉత్పాదక శ్రమ కానిదే అనుత్పాదక శ్రమ.

'చీకటి' అనే దానికి ప్రత్యేకంగా ఏ పదార్థమూ ఉండదు. వెలుతురు కానిదే — చీకటి. వెలుతురు లేక పోవడమే — చీకటి. అలాగే, ఉత్పాదక శ్రమ కానిదే, డబ్బుగా మారనిదే — అనుత్పాదక శ్రమ. ఉత్పాదక శ్రమగా లేని శ్రమలన్నీ అనుత్పాదక శ్రమలే అవుతాయి. ఆ పేరు కిందకే వస్తాయి.

ఈ ఉదాహరణలో, యజమాని కుటుంబానికి, బయట నించి ఉత్పాదక కార్మికుల ద్వారానూ, ఇంట్లో వంట మనిషి ద్వారానూ కలిసి, 1 రోజుకి వచ్చే మొత్తం 'అదనపు శ్రమ' ఎంత?

| | |
|---|---|
| ఉత్పాదక కార్మికుల నించి (ఇది డబ్బుగా) | — 50 |
| అనుత్పాదక వంట మనిషి నించి (ఇది, 'ఉపయోగపు విలువ'గా) | — 8 |
| మొత్తం అదనపు శ్రమ | 58 |

యజమాని కుటుంబం కోసం అనుత్పాదక శ్రమలు చేసేది వంట మనిషి మాత్రమే కాదు. ఇంకా కొందరు శ్రామికులు కూడా ఉంటారు. ఇల్లూ వాకిలీ శుభ్రం చెయ్యడమూ, బట్టలు ఉతకడమూ, బండి తోలడమూ, పిల్లల పెంపకమూ, తోట పనీ — ఇలా. యజమాని 'ఇంటి పనులు' చేసే వారంతా అనుత్పాదక శ్రామికులే. ఈ శ్రమలు జరగడానికి కావలసిన సాధనాలన్నీ 'అనుత్పాదకంగా' ఖర్చయ్యే సాధనాలే. ఈ ఖర్చులన్నిటినీ, యజమాని, ఉత్పాదక కార్మికుల నించి సంపాదించిన 'ఆదాయం'లో నించే ఖర్చు పెడతాడు.

ఉత్పాదక శ్రమకీ అనుత్పాదక శ్రమకీ తేడాని ఇంకో రకంగా కూడా చూడవచ్చు. ఒక యజమాని, ఉత్పాదక శ్రమల కోసం పెట్టే డబ్బు పెట్టుబడిగా పని చేస్తే, అనుత్పాదక శ్రమల కోసం పెట్టే డబ్బు అలా పని చెయ్యదు.

ఒక పెట్టుబడిదారుడి దగ్గిర 150 పెట్టుబడి (డబ్బు) ఉంది. అది 50C +100Vగా ఉంది. కార్మికులు 20 అదనపు శ్రమ ఇచ్చారు. సరుకు విలువ 170 అయింది. పెట్టుబడిదారుడు ఆ సరుకుని అమ్మి, మొదట పెట్టిన 150ని వెనక్కి తీసుకుని, ఆపైన ఇంకా 20 డబ్బుని కూడా తీసుకున్నాడు. మొదటి 150ని మళ్ళీ కొత్త పెట్టుబడిగా పెట్టగలడు. దాని ద్వారా మళ్ళీ కొత్త అదనపు విలువ! ఈ రకంగా ఆ మొదటి 150 డబ్బునే మళ్ళీ మళ్ళీ ఎన్ని సార్లయినా ఉపయోగించవచ్చు. ఉత్పాదక శ్రమ, ప్రతీసారీ సరుకుని తయారుచేస్తూ, పెట్టుబడిని వెనక్కి తెస్తూ, అదనపు డబ్బుని కొత్తగా ఇస్తూ ఉంటుంది.

కానీ, అనుత్పాదక శ్రమ సంగతి అలా కాదు. పెట్టుబడిదారుడు, తన ఇంటి పనులన్నిటి మీదా కలిసి 150 డబ్బు పెట్టాడనుకుందాం. ఇంటి పని మనుషులు అందరూ కలిసి 20 అదనపు శ్రమ ఇచ్చారు. పెట్టుబడిదారుడికి 150తో 170 విలువ గల పనులు దొరికాయి. ఇంట్లో ఒక రోజు అవసరాలన్నీ తీరాయి. 150 డబ్బు ఖర్చయిపోయింది. 20 అదనపు శ్రమ కూడా ఖర్చయిపోయింది. మళ్ళీ మర్నాడు ఆ పనులన్నీ జరగాలంటే పాత డబ్బు వెనక్కి రాదు. కొత్త డబ్బు కావాలి. అది కూడా ఖర్చయి పోతుందిగానీ వెనక్కిరాదు. మళ్ళీ కొత్త డబ్బు కావాలి. ప్రతి రోజూ కొత్త డబ్బు కావాలి. పెట్టుబడిదారుడు, రోజూ ఉత్పాదక శ్రమల ద్వారా సంపాదించిన ఆదాయాన్నే తెచ్చి, అనుత్పాదక శ్రమల కోసం పెట్టాలి.

ఉత్పాదక శ్రమలు 'పెట్టుబడి'తో సంబంధంలో ఉంటే, అనుత్పాదక శ్రమలు 'ఆదాయం'తో సంబంధంలో ఉంటాయి.

ఉత్పాదక — అనుత్పాదక కార్మికులందరూ 'అదనపు శ్రమ'ని పోగొట్టుకుంటారు. 'శ్రమ దోపిడీ'కి గురి అవుతారు. యజమానుల 'ఆజ్ఞల' కింద 'సేవకులు'గా జీవిస్తారు.

కార్మికులు చేసే శ్రమ, యజమానికి ఉత్పాదక శ్రమగా ఉందా, అనుత్పాదక శ్రమగా ఉందా — అనే సంగతి కార్మికులకు అనవసరం. వారి శ్రమ విలువ అంతా వారికి దక్కకపోవడమే వారి సమస్య. ఉత్పాదక కార్మికులైనా, అనుత్పాదక కార్మికులైనా 'దోపిడీ'నించీనూ, యజమానుల కింద సేవకత్వం నించీనూ బయటపడాలి. అది ఎలా సాధ్యమో తెలుసుకోవడానికే కార్మికులంతా, ఉత్పాదక — అనుత్పాదక విభజన గురించి తెలుసుకోవాలి.

పెట్టుబడిదారుడితో, ఉత్పాదక కార్మికులు ఎలాంటి సంబంధంలో ఉన్నారు? అనుత్పాదక కార్మికులు ఎలాంటి సంబంధంలో ఉన్నారు? ఉత్పాదక — అనుత్పాదక కార్మికులు పరస్పరం ఎలాంటి సంబంధాల్లో ఉన్నారు? — ఈ సంగతులన్నీ, కార్మికులు అర్థం చేసుకోవాలి. తర్వాత చూడబోయే అనేక విషయాలు దీని మీద ఆధార పడి ఉంటాయి. వర్గాల్నీ, వర్గాల్లో సెక్షన్లనీ అర్థం చేసుకోవడానికి ఈ విషయాలు ఎంతో అవసరం.

పెట్టుబడిదారీ విధానం, తక్కువ డబ్బుని ఎక్కువ డబ్బుగా పెంచే విధానం. అలా జరిగితేనే పెట్టుబడిదారుడికి 'ఆదాయం' దొరుకుతుంది. ఆ ఆదాయం లేకపోతే, పెట్టుబడిదారుడు జీవించడానికే మార్గం ఉండదు.

డబ్బుని పెంచడం, ఉత్పాదక క్రమం ద్వారానే సాధ్యంగానీ, అనుత్పాదక క్రమం ద్వారా కాదు. అందుకే పెట్టుబడిదారీ విధానంలో, శ్రమల వాడకం లోనూ, వస్తువుల వాడకం లోనూ కూడా ఉత్పాదక — అనుత్పాదక తేడాలు ఏర్పడతాయి. పెట్టుబడిదారుడు వాడే ఒక 'శ్రమ' అయినా, ఒక 'వస్తువు' అయినా, వాడితో అది ఎలాంటి సంబంధంలో ఉందీ అనే దాన్ని బట్టే, వాడికి అది ఉత్పాదకంగా ఉందా, అనుత్పాదకంగా ఉందా — అనేది ఉంటుంది.

ఈ ఉత్పాదక — అనుత్పాదక విభజన పెట్టుబడిదారుడికి సంబంధించిన విషయమే గానీ శ్రమలకు గానీ వస్తువులకు గానీ 'సహజంగా ఉండే' విషయం కాదు.

వంట శ్రమ — అనే శ్రమ, యజమాని దగ్గిర 'సరుకుల్ని' తయారుచెయ్యడం కోసం జరిగితే అప్పుడు అది ఉత్పాదక శ్రమ. అదే శ్రమ, యజమాని స్వంత అవసరం కోసం జరిగితే అప్పుడు అనుత్పాదక శ్రమ.

ఆ వంట మనిషే, ఆ 2 సంబంధాలలోనూ గాక, తన ఇంటి దగ్గరే వంటలు చేసి ఆ పదార్థాన్ని అమ్మితే, అప్పుడు ఆ శ్రమ యజమాని లేని స్వంతంత్ర ఉత్పత్తిదారుల శ్రమ.

అలాగే 'బియ్యం' అనే పదార్థాన్ని తీసుకుంటే, అది ఒక సంబంధంలో 'ఉత్పాదకం' గానూ, ఇంకో సంబంధంలో 'అనుత్పాదకం' గానూ ఖర్చయ్యే పదార్థంగా ఉంటుంది. బియ్యాన్ని ఒక స్వంతంత్ర ఉత్పత్తిదారుడు, ఒక సరుకు తయారీ కోసం ఉపయోగిస్తే, అప్పుడు అది స్వతంత్ర ఉత్పత్తిదారుడికి ఉత్పాదకంగా ఖర్చయ్యే పదార్థంగా ఉంటుంది. ఈ రకంగా, శ్రమలకూ వస్తువులకూ ఉత్పాదక, అనుత్పాదక భేదం అనేది, వాటిని ఉపయోగించే వేరు వేరు సంబంధాల్ని బట్టి ఏర్పడేదేగానీ, ఆ శ్రమలకే, ఆ వస్తువులకే ఉండే సహజ లక్షణాల్ని బట్టి ఏర్పడేది కాదు.

"కుట్టు శ్రమ ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా, స్వతంత్ర శ్రమా?" అని అడిగితే, చెప్పడం కుదరదు. అది ఏ సంబంధంలో ఉందో తెలియాలి.

ఉత్పాదక శ్రమని తీసుకుంటే, ఆ శ్రామికుడి యజమాని — ఏదో ఒక పెట్టుబడిదారుడే.

అనుత్పాదక శ్రమని తీసుకుంటే — ఆ శ్రామికుడి యజమాని గృహస్తుడిగా ఉండే యజమాని. ఈ సంబంధం — గృహ యజమానికీ, గృహ శ్రామికుడికీ ఉండే సంబంధం.

స్వతంత్ర శ్రమని తీసుకుంటే — యజమానీ శ్రామిక సంబంధం ఉండదు. ఆ స్వతంత్ర ఉత్పత్తిదారుడే, తన ఇంటి పనుల కోసం శ్రామికుల్ని పెట్టుకుంటే, అక్కడ యజమానీ శ్రామిక సంబంధం ఏర్పడుతుంది.

ఉత్పాదక, అనుత్పాదక శ్రమల్ని తేలిగ్గా అర్థం చేసుకోవడానికి ఇంకా కొన్ని ఉదాహరణలు చూద్దాం.

ఒక పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలంలో 'ధాన్యం' ఉత్పత్తి అయిందనుకుందాం. దాని కోసం జరిగిన శ్రమలన్నీ ఉత్పాదక శ్రమలే. అక్కడ మిషన్లని శుభ్రం చేసే శ్రామికుల లాగానే, ఆ పని స్థలాన్నీ, ఆ బిల్డింగుల్నీ శుభ్రం చేసే శ్రామికులందరూ ఉత్పాదక శ్రామికులే.

తర్వాత, ఆ ధాన్యం, ధాన్యం మిల్లు పెట్టుబడిదారుడి దగ్గిర బియ్యంగా మారింది. ఆ శ్రమలు కూడా ఉత్పాదక శ్రమలే.

పెట్టుబడిదారుడి ఇంటికి ఒక బస్తా బియ్యం వచ్చాయి. ఆ ఇంట్లో వంట పనులూ, వడ్డనలూ, గిన్నెలు కడిగే పనులూ అన్నీ ఇంటి పని మనుషులు చేస్తారు. ఈ పనులన్నీ అనుత్పాదక శ్రమలు.

ఒక మనిషి ఒక పూట ఒక హోటల్లో భోజనం చేశాడు. ఆ భోజనాన్ని ఒక సరుకుగా కొన్నాడు కదా? అక్కడ వంటా, వడ్డనా, గిన్నెలు కడిగే పనులూ అన్నీ ఉత్పాదక శ్రమలే. ఆ భోజనాన్ని కొన్న మనిషి, ఆ పనుల విలువలన్నీ (ఒక మనిషి భోజనానికి సంబంధించినంత వరకూ) చెల్లించాడని అర్థం.

ఆ మనిషి హోటల్‌కి వెళ్ళకుండా, ఇంటి దగ్గిరే కూర్చుని, సేవకుడితో హోటల్ నించి కారియర్ తెప్పించుకుంటాడనుకుందాం. ఆ కారియర్ కోసమే డబ్బు చెల్లిస్తాడు. ఇంటి సేవకుడు, యజమానికి ఆ భోజనం వడ్డించి, తర్వాత ఆ గిన్నెలు తోమి శుభ్రం చేస్తాడనుకుందాం. ఆ శ్రమలన్నీ అనుత్పాదక శ్రమలు.

# ఉత్పాదక - అనుత్పాదక శ్రమల సంబంధం

ఉత్పాదక శ్రమలు — సరుకు కోసం, యజమాని 'ఉత్పత్తి స్థలం'లో జరుగుతాయి. అనుత్పాదక శ్రమలు యజమాని ఇంటి దగ్గిర జరుగుతాయి. — ఈ రెంటికీ ఏమిటి సంబంధం?

యజమాని, ఉత్పాదక శ్రమల ద్వారా సంపాదించే 'అదనపు డబ్బు'నే తెచ్చి, ఇంటి దగ్గిర అనుత్పాదక శ్రమలకు 'జీతాలు'గా ఇస్తాడు. కాబట్టి, మొదట 'అదనపు విలువ' ఉంటేనే అనుత్పాదక శ్రమలకు జీతాలు ఇవ్వడం ఉంటుంది. ఆ అదనపు విలువే లేకపోతే అనుత్పాదక శ్రమలకు జీతాలు ఇవ్వడమే ఉండదు. అంటే, ఉత్పాదక శ్రమల్ని దోచడం లేకపోతే, అనుత్పాదక శ్రమల్ని దోచడం కూడా ఉండదు. ఇదే, ఉత్పాదక — అనుత్పాదక శ్రమల సంబంధం.

బట్ట పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలంలో 100 మంది ఉత్పాదక శ్రామికులూ, ఇంటి దగ్గిర 5గురు అనుత్పాదక శ్రామికులూ ఉన్నారనుకుందాం. ఈ పెట్టుబడిదారుడికి, ప్రతిరోజూ ఉత్పత్తి స్థలంలో, 1200 విలువగల సరుకు తయారై అమ్ముడుపోతూ ఉంటుందనుకుందాం. ఈ సరుకు విలువ పాళ్ళు = 800 స్థిర + 200 అస్థిర + 200 అదనపు విలువ. ప్రతీ రోజూ సరుకు అమ్ముడుపోయి, పెట్టుబడిదారుడికి 1200 డబ్బు చేతిలోకి వస్తుంది. అందు లోంచి పెట్టుబడిని వెనక్కి తీసుకుంటాడు. ఇంకా మిగిలిన 200 అదనపు విలువని వర్తక కమిషన్‌కీ, వడ్డీకీ, కౌలుకీ, పన్నులకీ, ఇంకా అలాంటి వాటన్నిటికీ కొంత కొంత పంచెయ్యగా పెట్టుబడిదారుడికి '80 లాభం' మిగులుతుందనుకుందాం. అది వాడికి 'ఆదాయం'. అదనపు విలువ నించి ఎవడికి ఎంత అందుతుందో అదే వాడికి 'ఆదాయం.'

పెట్టుబడిదారుడికి, 1 రోజుకి ఆదాయం 80. దాన్ని వాడు పూర్తిగా జీవితావసరాల మీద ఖర్చు పెట్టేస్తాడు — అనుకుందాం. ఆదాయాన్ని 'జీవితాసరాల' మీద ఖర్చు పెట్టడం అంటే, ఇంటికి కావలసిన వస్తువుల మీదా, ఇంటి పనులు చేసే శ్రామికుల జీతాల మీదా పెట్టడమే.

పెట్టుబడిదారుడు, తన 80 ఆదాయంలోంచి 60ని ఇంటికి కావలసిన వస్తువుల మీదా, 20ని 5గురు అనుత్పాదక శ్రామికుల జీతాల మీదా పెడతాడనుకుందాం. (ఇవన్నీ ఒక రోజుకి సంబంధించిన లెక్కలు.)

పెట్టుబడిదారుడు, 60 తో తన ఇంటి కోసం బియ్యమూ, పాలూ, కూరగాయలూ, పళ్ళూ, మందులూ, బట్టలూ వగైరాలన్నీ మార్కెట్లో ఇతర పెట్టుబడిదారుల నించి కొంటాడు. (కొన్ని వస్తువుల్ని స్వతంత్ర ఉత్పత్తి దారుల నించి కూడా కొనవచ్చు. వాటిని లెక్కలోకి తీసు కోవడం లేదు.) మార్కెట్‌లో కొనే ఈ వస్తువులన్నీ, వివిధ పని స్థలాలలో ఉన్న ఉత్పాదక శ్రామికులు ఉత్పత్తి చేసేవే. ఈ వస్తువులన్నీ యజమాని ఇంటికి వచ్చాక, వాటి మీద ఇంటిదగ్గిర, అనుత్పాదక పని మనుషులు చేసే శ్రమలు కూడా కలిసి, ఇంటి అవసరాలన్నీ తీరతాయి.

ఉత్పాదక కార్మికులు ధాన్యం పండించీ, వాటిని బియ్యంగా మార్చీ ఇస్తే, యజమాని ఇంటి అనుత్పాదక కార్మికులు వాటితో భోజనం తయారుచేస్తారు.

ఉత్పాదక కార్మికులు, ఇల్లు కట్టి ఇస్తే, అనుత్పాదక కార్మికులు, దాన్ని రోజూ శుభ్రంచేస్తూ నివాసయోగ్యంగా ఉంచుతారు.

ఉత్పాదక కార్మికులు పత్తి పండించీ, బట్టలు నేసీ, దుస్తులు కుట్టీ ఇస్తే, అనుత్పాదక కార్మికులు, వాటిని రోజూ ఉతికి ఇస్త్రీలు చేసి అందిస్తారు.

అంటే, 'యజమాని' కుటుంబానికి కావలసిన ముడి ఉత్పత్తులన్నీ ఉత్పాదక కార్మికులు అందిస్తూ ఉంటే, వాటి మీద ఇంకా జరగవలసిన శ్రమలన్నీ అనుత్పాదక గృహ సేవకులు చేస్తూ ఉంటారు.

ఈ ఉదాహరణలో, పెట్టుబడిదారుడు తన గృహ శ్రామికులకు 20 జీతం ఇస్తాడు కదా? ఆ డబ్బుతో వాళ్ళు ఏం చేస్తారు?— తమ పోషణ వస్తువులు కొనుక్కుంటారు.

ఈ పెట్టుబడిదారుడి కుటుంబం వాడే 60 విలువగల ఉత్పత్తులూ, ఈ అనుత్పాదక శ్రామికులు వాడే 20 విలువ గల ఉత్పత్తులూ, మొత్తం ఈ 80 ఉత్పత్తులూ, ఈ పెట్టు బడిదారుడి ఉత్పత్తి స్థలంలో పనిచేసే ఉత్పాదక కార్మికుల అదనపు విలువే.

అంటే, పెట్టుబడిదారుడు ఏం చేస్తాడంటే — తన ఉత్పాదక కార్మికుల ద్వారా 80 అదనపు డబ్బుని (అదనపు ఉత్పత్తుల్ని) లాగి, అందులో కొంత భాగాన్ని తను వాడు కుంటూ, కొంత భాగాన్ని ఇంటి పనిమనుషులకు జీతాలుగా ఇస్తాడు. ఆ మనుషులతో ఇంటి పనులు చేయించుకుని, వారికి ఇచ్చిన విలువ కన్నా ఎక్కువ శ్రమ తీసుకుంటాడు.

ఇక్కడ కొన్ని ప్రశ్నలకు వెంటనే జవాబులు చెప్పు కోవాలి. అనుత్పాదక కార్మికులుకూడా 'అదనపు విలువ'ని

పంచుకుంటారా? అనుత్పాదక కార్మికుల పోషణ వస్తువులన్నీ (జీతాలన్నీ) ఉత్పాదక కార్మికుల అదనపు విలువలో భాగాలే కదా? అంటే అనుత్పాదక కార్మికులు కూడా తమ యజమానిలాగే ఉత్పాదక కార్మికుల అదనపు విలువలో నించి ఒక వాటాని తింటూ 'దోపిడీ' ద్వారా జీవిస్తున్నారని అర్థమా? అంతే గాక, ఆ యజమాని, తనకు వచ్చే '80 అదనపు విలువ'లో నించి 20ని, అనుత్పాదక కార్మికులకు ఇచ్చేస్తున్నాడంటే, ఆ యజమాని, 60 అదనపు విలువని మాత్రమే వాడుకుంటున్నాడని అర్థమా? — ఇంతకు ముందు చూసిన విషయాలన్నీ సరిగా అర్థం చేసుకుని వుంటే, అసలు ఈ సందేహాలే రావు. ఒక స్పష్టతకోసం మాత్రమే ఈ ప్రశ్నలు వేసుకుని జవాబులు చెప్పుకోవడం.

యజమాని, 80 అదనపు విలువలో నించి 20ని తీసి, గృహ సేవకులకు జీతాలుగా ఇస్తున్నాడంటే, దాన్ని ఉచితంగా ఇస్తున్నాడని కాదు. ఆ ఇచ్చిన 'విలువ'కి బదులుగా యజమాని, ఆ శ్రామికుల నించి 'శ్రమలు' తీసుకుంటాడు. పైగా, 'అదనపు శ్రమ'ని కూడా. అంటే, యజమాని, గృహ సేవకులకు జీతాలుగా ఇచ్చే '20 అదనపు విలువ'ని కూడా తనే వాడుకుంటున్నట్టు అర్థం. అంతే గానీ, దాన్ని వదిలివేస్తున్నట్టు కాదు.

గృహ శ్రామికుల వేపు నించి చూస్తే — వారు, తమ జీతాల్ని ఉచితంగా తీసుకోవడం లేదు. యజమాని కుటుంబం కోసం, తమ శ్రమలు ఇచ్చినందుకే ఆ జీతాలు తీసుకుంటారు. ఆ జీతాల్ని, యజమాని, ఎక్కడి నించి తెచ్చి ఇస్తున్నాడు — అనేది వారికి అనవసరం. వారు మాత్రం, శ్రమలు చేసిన దానికి బదులుగానే ఆ జీతాలు తీసుకుంటారు. ('అదనపు శ్రమ' కూడా చేసి.) శ్రమచేసి, జీతం తీసుకుని, ఆ జీతంతో పోషణ వస్తువులు కొనుక్కోవడం అంటే, అది, 'స్వంత శ్రమతో' జీవించడమే. వారి శ్రమతో వారు జీవించడమే. కాబట్టి, అనుత్పాదక శ్రామికుల జీతాలు కూడా 'అదనపు విలువ'లో భాగమే అయినా, ఆ శ్రామికులు, అదనపు విలువని పంచుకుంటున్నట్టు గానీ, దోపిడీ మీద జీవిస్తున్నట్టు గానీ అర్థం కాదు.

యజమాని, తన '80 అదనపు విలువ'నీ తనే వాడుకుంటాడు. 60ని 'ఉత్పత్తుల' రూపం లోనూ, 20ని 'గృహ కార్మికుల నించి సేవల' రూపం లోనూ. వారి అదనపు శ్రమని కూడా.

ఇప్పుడు, యజమానినీ, వాడి ఉత్పాదక కార్మికుల్నీ, అనుత్పాదక కార్మికుల్నీ కలిపి చూస్తే, ఈ 3 రకాల వారికీ ఉన్న సంబంధాలు ఏమిటి?

యజమాని కుటుంబ పోషణకు కావలసిన ముడి వస్తువులన్నిటినీ ఉత్పాదక కార్మికులు తమ 'అదనపు విలువ'లో నించి ఇస్తూవుంటే, వాటిని, వాడకానికి సిద్ధం చెయ్యడం కోసం ఇంకా జరగవలసిన శ్రమలన్నీ అనుత్పాదక కార్మికులు చేస్తూ ఉంటారు. ఈ రకంగా, యజమాని కుటుంబం కోసం, ఉత్పాదక, అనుత్పాదక కార్మికులు ఇంటా బయటా అన్ని రకాల శ్రమలూ చేస్తూ వుంటే, ఆ కుటుంబం, ఏ శ్రమలూ చెయ్యకుండా, రాత్రింబవళ్ళూ విశ్రాంతులు తీసుకుంటూ, సుఖ భోగాలతో జీవిస్తూ వుంటుంది. ఇవీ ఈ 3 రకాల వారికీ ఉన్న సంబంధాలు!

ఇదే విషయం, 'అదనపు విలువ'ని పంచుకునే పెద్ద మనుషులందరికీ కూడా యధాతథంగా వర్తిస్తుంది.

వడ్డీల వాడిని తీసుకుంటే, బట్ట పెట్టుబడిదారుడి ద్వారా వడ్డీల వాడికి వచ్చేది, 1 రోజుకి, 30 అనుకుందాం. ఈ 30, బట్టని ఉత్పత్తి చేసే ఉత్పాదక శ్రామికుల అదనపు విలువే. వడ్డీల వాడు, ఆ 30లో 25తో తన ఇంటికి కావలసిన వస్తువులు కొని, 5ని ఇంటి పని మనుషులకు జీతాలుగా ఇస్తాడనుకుందాం. ఇంటి పని మనుషుల అదనపు శ్రమని 100% అనుకుంటే, వారు 5 జీతాలతో 10 విలువ గల శ్రమ చేస్తారు. అంటే, వడ్డీలవాడు ఉత్పాదక, అనుత్పాదక శ్రామికుల నించి మొత్తం 30 + 5 = 35 అదనపు శ్రమని లాగుతాడు.

భూమి కౌళ్ళ వాడికీ ఇదే వర్తిస్తుంది. వాడు భూమి కౌళ్ళ ద్వారా వచ్చే ఆదాయాన్ని — తన కుటుంబానికి కావలసిన వస్తువుల మీదా, తన అనుత్పాదక శ్రామికుల జీతాల మీదా ఖర్చు చేస్తాడు.

వర్తక పెట్టుబడిదారుడికీ ఇదే వర్తిస్తుంది. వాడు, తన 'వర్తక లాభం'గా వచ్చిన ఆదాయాన్ని — తన కుటుంబానికి కావలసిన వస్తువుల మీదా, గృహ శ్రామికుల జీతాల మీదా ఖర్చు చేస్తాడు. (వర్తక పెట్టుబడిదారుడి దగ్గిర వర్తక కార్మికులు కూడా ఉంటారు. వీరు కూడా అనుత్పాదక కార్మికులే. వీరి గురించి **2** వ సంపుటంలో, 'వర్తక పెట్టుబడి' చాప్టరులో చూస్తాము.)

బట్ట ఉదాహరణలో ఉన్న దోపిడీదారులంతా, బట్ట పెట్టుబడిదారుడి చుట్టూ ఉన్న 'బృందం.' ఈ బృందానికంతటికీ ఆదాయం, బట్ట ద్వారా వచ్చే 'అదనపు విలువే.' ఈ అదనపు విలువ ఉత్పత్తి అయ్యేది, బట్ట పెట్టుబడిదారుడి 'ఉత్పత్తి స్థలం'లోనే. అందుకే, వాడొక్కడే 'ఉత్పాదక పెట్టుబడిదారుడు.' మిగిలిన వాళ్ళంతా 'అనుత్పాదక'

భాగస్తులే.

పెట్టుబడిదారీ బృందానికి రక రకాల పేర్లతో ఆదాయాలుగా వచ్చే 'డబ్బు' అంతా ఉత్పాదక కార్మికుల అదనపు డబ్బే కదా? అంటే, పెట్టుబడిదారుల దగ్గిర 'డబ్బు' అనేది ఉందీ అంటే, అది అంతా ఉత్పాదక కార్మికులకు సంబంధించినదే గానీ అందులో అనుత్పాదక కార్మికులకు సంబంధించినది ఏమీ ఉండదు.

బట్ట ఉదాహరణలో చూసిన ఈ విషయాలన్నీ ప్రతి సరుకుకీ యధాతధంగా వర్తిస్తాయి.

సమాజంలో ఉన్న మొత్తం అన్ని శాఖల్నీ తీసుకుంటే, 'మొత్తం సరుకుల రాసి'ని ఉత్పత్తి చేసేది — అన్ని శాఖల లోనూ ఉన్న ఉత్పాదక కార్మికులే. — ఈ రకంగా, ఒక విడి పెట్టుబడిదారుణ్ణి చూసినా, అన్ని శాఖల పెట్టుబడి దారుల్నీ కలిపి చూసినా, విషయాలన్నీ ఒకటే.

ఇప్పటి వరకూ, మొదట పెట్టుబడిదారుడి 'ఉత్పత్తి స్థలం'లో జరిగే ఉత్పాదక శ్రమల్నీ, పెట్టుబడిదారుడి ఇంటి దగ్గిర జరిగే 'అనుత్పాదక శ్రమల్నీ' చూశాం.

ఇప్పుడు తర్వాత అంశం.

# కార్మికుల ఇళ్ళల్లో శ్రమలు

కార్మికుల్లో ఉత్పాదక — అనుత్పాదక తేడాలు ఉంటాయని చూశాం. ఉత్పాదక కార్మికుల్లో - శారీరక శ్రమల వారూ, మేధాశ్రమల వారూ కూడా వుంటారని చూశాం. అలాగే, అనుత్పాదక కార్మికుల్లో కూడా, శారీరక శ్రమల వారే గాక, మేధా శ్రమల వారు కూడా వుంటారు. మేధా శ్రమల వారందరూ, తమ ఇంటి పనుల కోసం, పని మనుషుల్ని (అనుత్పాదక శ్రామికుల్ని) పెట్టుకుంటారు. ఈ విషయాలే ఇక్కడ చూస్తాం.

మొదట, ఉత్పాదక కార్మికుల సంగతి చూద్దాం. వీరు, సరుకుల్ని ఉత్పత్తి చేసే స్థలాల్లో పని చేసి, జీతాలు తీసుకుని, వాటితో తిండీ, బట్టా, నివాసం వగైరాలు కొనుక్కుంటారు. కానీ, ఆ వస్తువుల్ని వాడుకోవాలంటే, వాటి మీద ఇంకా కొన్ని పనులు జరగాలి. రోజూ వంట పనీ, ఇంటి శుభ్రం, బట్టల ఉతుకూ — వంటి పనులు. ఆ ఇంటి పనులన్నీ ఆ కుటుంబ సభ్యులే స్వయంగా చేసుకుంటారనుకుందాం. (ఆ కుటుంబ సభ్యుల్లో కూడా ఆ పనులు స్త్రీలు చేస్తారా, పురుషులు చేస్తారా, అందరూ కలిసిచేస్తారా — అనేది వేరే విషయం. ఆ విషయం కూడా ఈ చాప్టరు లోనే తర్వాత చూస్తాము. ప్రస్తుతం ఇక్కడ, ఇంటి పనులన్నీ స్వయంగా చేసుకునే ఉత్పాదక కార్మికుల ఉదాహరణే తీసుకుంటున్నాము.)

ఉత్పాదక కార్మికులు, తమ పోషణ వస్తువుల్ని, బయటి పని స్థలాల్లో స్వయంగా ఉత్పత్తి చేస్తారు. ఇంటి శ్రమలు కూడా స్వయంగా చేసుకుంటారు. ఇంటి పనుల కోసం అనుత్పాదక శ్రామికుల మీద ఆధారపడరు. ఈ రకంగా, వీరు, ఇంటా బయటా స్వయంగా శ్రమలు చేస్తూ, తమ స్వంత శ్రమతోటే జీవిస్తారు. (బయటి శ్రమల్లో కొంత భాగాన్ని యజమానుల కోసం పోగొట్టుకుంటూ.)

**శారీరక శ్రమలు చేసే అనుత్పాదక కార్మికుల సంగతి:** వీరు, యజమానులకు 'గృహ సేవలు' చేసి, జీతాలు తీసుకుని, పోషణ వస్తువులు కొనుక్కుంటారు. ఆ వస్తువుల్లో దేనినీ వీరు ఉత్పత్తి చెయ్యరు. ఆ వస్తువుల ఉత్పత్తి కోసం వీరు, 'ఉత్పాదక శ్రామికుల' మీదే ఆధార పడి ఉంటారు. అయితే, ఆ వస్తువుల్ని కొనడానికి కావలసిన డబ్బుని (జీతాల్ని) తమ శ్రమతోనే సంపాదిస్తారు. తమ కుటుంబాలకు సంబంధించిన శ్రమలన్నీ వీరు కూడా స్వయంగానే చేసుకుంటారు. — ఈ రకంగా, ఈ అనుత్పాదక శ్రామికులు కూడా తమ 'స్వంత శ్రమ తోటే' జీవిస్తారు. (ఆ శ్రమలో ఎంతో భాగాన్ని యజమానుల కోసం పోగొట్టుకుంటూ.)

## ఉత్పాదక శ్రామికుల ఇళ్ళల్లో అనుత్పాదక శ్రామికులు:

ఉత్పాదక శ్రామికుల్లో, ఉన్నత మేధాశ్రమల సెక్షన్లలో అందరూ, 'గృహ శ్రమల' కోసం అనుత్పాదక శ్రామికుల్ని నియమించుకుంటూ, 'జీతాల' విషయంలో, వీరు కూడా ఇతర యజమానులు ఇచ్చినట్టే ఇస్తారు. అంటే 'శ్రమశక్తి విలువ'ని మాత్రమే. అంటే వీరు కూడా తమ ఇంటి పని మనుషుల నించి కొంత 'అదనపు శ్రమ'ని పొందుతారన్న మాట! ఇది, శ్రామికులే శ్రామికుల్ని దోపిడీ చెయ్యడం కిందకి వస్తుంది.

'నూతన సమాజాన్ని' ఊహిస్తే, ఇంటి పని మనుషుల విధానాన్ని పూర్తిగా తీసివెయ్యవలసి ఉంటుంది. కానీ

ప్రస్తుతం అమలులో ఉన్న పెట్టుబడిదారీ సమాజాన్నే దృష్టిలో పెట్టుకుంటే, ఈ సమాజంలో మేధా శ్రమల కార్మికులు, తమ 'ఇంటి పనుల' కోసం, అనుత్పాదక కార్మికుల్ని నియమించుకున్నప్పుడు, వారికి, మార్కెట్ జీతాల కన్నా ఎక్కువ జీతాలు ఇవ్వడమూ, వారి పట్ల 'యజమానితనం ప్రదర్శించకుండా' ఉండడమూ చెయ్యాలి. — ఇవి తోటి కార్మికుల పట్ల నిర్వహించవలసిన కనీస బాధ్యతలు. కానీ, 'శ్రమ దోపిడీ' గురించి తెలియనప్పుడు, మేధాశ్రమల కార్మికులు కూడా ఈ విషయాలు పాటించలేరు. తాము కార్మికులుగా ఉంటూ కూడా. అనుత్పాదక కార్మికుల మీద 'యజమానులు' గానే ప్రవర్తిస్తారు.

అనుత్పాదక శ్రామికుల ఇళ్ళల్లో అనుత్పాదక శ్రామికులు ఉంటారా? — మేధాశ్రమలు చేసే వారి ఇళ్ళల్లోనే పని మనుషులు వుంటారు. శారీరక శ్రమలు చేసే అనుత్పాదక శ్రామికుల ఇళ్ళల్లో పని మనుషులు వుండరు. ఎందుకంటే, ఆ శ్రామికులే ఇతరుల ఇళ్ళల్లో పని మనుషులు. అలాంటి వారు తమ ఇళ్ళల్లో పని మనుషుల్ని ఎలా పెట్టుకుంటారు? ఈ శారీరక శ్రమల అనుత్పాదకలు, ఎక్కువ దోపిడీకి గురిఅవుతూ ఎక్కువ పేదతనంలో ఉంటారు. కాబట్టి వీరు తమ ఇంటి పనుల కోసం పని మనుషుల్ని పెట్టుకునే స్థాయిలో ఉండరు. అలాంటి సందర్భాలు ఉంటే అవి చాలా అరుదు.

# ఉత్పాదక, అనుత్పాదక విభజన, యజమానులకే గానీ శ్రామికులకు వర్తించదు

యజమానికి, శ్రామికుల నించి అందే శ్రమ, డబ్బుగా మారుతుందా లేదా అనే దాన్ని బట్టి, అది యజమానికి ఉత్పాదకమో అనుత్పాదకమో అవుతుంది కదా? ఈ విభజన, శ్రామికులకు ఏ సందర్భంలోనూ వర్తించదు.

శ్రామికుల వేపు నించి చూస్తే: శ్రామికులు, బయట ఒక యజమాని దగ్గిర పని చేసినందుకు 'జీతం' (డబ్బు) వస్తే, వారి శ్రమ వారికి 'విలువ'గా మారినట్టు అర్థం. లేదా, ఆ శ్రామికులు తమ పనిని తమ ఇంటి అవసరాల కోసమే చేసుకుంటే, (ఒక యజమాని దగ్గిర కాకుండా చేసుకుంటే), వారి శ్రమ వారికి ఉపయోగపు విలువ గానే ఖర్చయిందని అర్థం. అంటే, శ్రామికుల విషయంలో వారి శ్రమ వారికి, 'విలువగా ఉందా, ఉపయోగపు విలువగా ఉందా' అనే విభజనే ఉంటుంది గానీ, ఆ శ్రమ, వారికి ఉత్పాదకంగా ఉందా, అనుత్పాదకంగా ఉందా'' అనే విభజన ఉండదు. ఎందుకంటే, ఇతరుల నించి అదనపు శ్రమనో, అదనపు డబ్బునో పొందడం అనేది, యజమానుల విషయం లోనే గానీ, శ్రామికుల విషయంలో జరగదు. అందుకే ఉత్పాదక — అనుత్పాదక విభజన శ్రామికులకు వర్తించదు.

స్వతంత్ర ఉత్పత్తిదారుల గురించి చూడవలసిన సందర్భం, తర్వాత వేరేగా వున్నా, ప్రస్తుతానికి ఇక్కడ వారి గురించి ఒక విషయం మాత్రం చూస్తాం. ఈ ఉత్పాదక - అనుత్పాదక విభజన, స్వతంత్ర ఉత్పత్తిదారులకు వర్తిస్తుందా? - వీరికి కూడా వర్తించదు.

స్వతంత్ర ఉత్పత్తిదారుడు కొత్త ఉత్పత్తి చేసేటప్పుడు, అదనపు శ్రమ లేకుండానూ చెయ్యవచ్చు; అదనపు శ్రమతోనూ చెయ్యవచ్చు. పోషణ కోసం ఖర్చయినంత శ్రమ మాత్రమే తిరిగి చేస్తే, అదనపు శ్రమ వుండదు. పోషణ ఖర్చు కన్నా ఎక్కువ శ్రమ చేస్తే, అది అదనపు శ్రమ అవుతుంది. దాని వల్ల అదనపు ఉత్పత్తి వస్తుంది. మొదటి రకంగా చేస్తే తక్కువ ఉత్పత్తీ, రెండో రకంగా చేస్తే ఎక్కువ ఉత్పత్తీ తయారవుతాయి. ఆ ఉత్పత్తిని అమ్మితే ఆ ఉత్పత్తి సైజుని బట్టి డబ్బు తక్కువో ఎక్కువో వస్తుంది. దాన్ని అమ్మకపోతే అది ఉపయోగపు విలువగానే ఖర్చయిపోతుంది. కానీ దీన్ని పెట్టుబడిదారీ అర్థంతో చూస్తే, స్వతంత్ర ఉత్పత్తిదారుడి శ్రమని కూడా ఉత్పాదక — అనుత్పాదక అర్థాలతో చెప్పుకోవచ్చు. ఆ ఉత్పత్తిని అమ్మి దాన్ని డబ్బుగా మారిస్తేనే అది ఉత్పాదకంగా ఉన్నట్టూ, లేకపోతే అనుత్పాదకంగా ఖర్చయినట్టూ. కానీ, ఈ ఉత్పత్తిదారుడికి, తన సరుకు ద్వారా అదనపు డబ్బు అందితే, అది ఆ వ్యక్తి శ్రమ వల్ల వచ్చేదే గానీ ఇతరుల శ్రమ వల్ల వచ్చేది కాదు. కాబట్టి, స్వతంత్ర ఉత్పత్తిదారుల విషయంలో కూడా ఉత్పాదక — అనుత్పాదక విభజన వర్తించదు.

ఉత్పాదక, అనుత్పాదక, స్వతంత్ర శ్రామికుల్ని తీసుకుని, వారి శ్రమల్ని వేరు వేరు సందర్భాలలో పెట్టి చూస్తే, ఈ విషయాలు బాగా తెలుస్తాయి.

ఇంకా ఎన్ని రకాలుగా చూసినా, శ్రామికుల విషయంలో, 'విలువా — ఉపయోగపు విలువా' విభజనే ఉంటుంది గానీ, 'ఉత్పాదక — అనుత్పాదక' విభజన ఉండదు. ఆ విభజన శ్రమల్ని కొనే యజమానులకు సంబంధించిందే గానీ, శ్రమల్ని అమ్మే శ్రామికులకు సంబంధించింది కాదు.

**ఉత్పాదక — అనుత్పాదక విభజన శ్రామికులకు వర్తించదు:**

| శ్రమ చేసేది ఎవరు? | ఎక్కడ? ఆ శ్రమ, 'డబ్బుగా' మారుతుందా, లేదా? | ఆ వ్యక్తి ఏ రకపు శ్రామికురాలు? | ఆ వ్యక్తి శ్రమ, ఆ వ్యక్తికి ఎలాంటి శ్రమ? యజమానికి ఎలాంటి శ్రమ? |
|---|---|---|---|
| **1.** హోటల్ వంట మనిషి | ఆ శ్రమ, డబ్బుగా మారుతుంది. ఆ డబ్బులో నించి, శ్రామికురాలికి జీతమూ, యజమానికి 'అదనపు విలువా'. | యజమానికి ఆమె, ఉత్పాదక శ్రామికు రాలు | ఆమె శ్రమ, ఆమెకి ఉత్పాదక శ్రమా కాదు, అను త్పాదక శ్రమా కాదు. అది, యజమానికే ఉత్పాదక శ్రమ. |
| **2.** హోటల్ వంట మనిషి, ఆ వంటల్ని తన ఇంటి దగ్గరే 'సరుకులు'గా చేసి అమ్మితే? | ఆ శ్రమ, డబ్బుగా మారుతుంది. జీతం భాగమూ, అదనపు విలువా కూడా ఆమెకే. | స్వతంత్ర శ్రామికురాలు. | ఆ శ్రమ, ఆ వ్యక్తికి 'ఉత్పాదక శ్రమ' కాదు. ఎందుకంటే, ఆమెకి వచ్చే 'అదనపు విలువ' ఆమెదే. ఇతరులది కాదు. ఇక్కడ ఉత్పాదక — అనుత్పా దక విభజన వర్తించదు. |
| **3.** హోటల్ వంట మనిషి, ఇంటి దగ్గిర, తన స్వంతానికే వంట చేసుకుంటే? | ఆ శ్రమ డబ్బుగా మారదు. 'ఉపయోగపు విలువ'గా ఉంటుంది. 'అదనపు శ్రమ' వుంటే, అది ఆమెకే. ఉపయోగపు విలువ ఎక్కువగా వస్తుంది. | గృహస్తురాలు | ఆ శ్రమ, ఆ వ్యక్తికి 'అనుత్పా దక శ్రమ' కాదు. ఎందుకంటే, 'అదనపు శ్రమ' ఉంటే, అది ఆమెదే. ఇతరులది కాదు. ఉత్పాదక — అనుత్పాదక విభజన ఇక్కడ వర్తించదు. |
| **4.** ఒక వంట మనిషి, యజమాని ఇంటి దగ్గిర వంట చేస్తే? | ఆ శ్రమ, ఆమెకి డబ్బుగా మారు తుంది. 'జీతం' వస్తుంది. కానీ ఆ శ్రమ, యజమానికే డబ్బుగా మారదు. అయినా, యజమానికి 'అదనపు శ్రమ' దొరుకుతుంది. | యజమానికి, ఆమె, అనుత్పాదక శ్రామికురాలు. | ఆ శ్రమ, యజమానికి అనుత్పా దక శ్రమ. ఆ శ్రమ, ఆ శ్రామికు రాలికి- ఉత్పాదక శ్రమా కాదు, అనుత్పాదక శ్రమా కాదు. ఆమెకి ఆ విభజన వర్తించదు. |
| **5.** అనుత్పాదక వంట మనిషి, ఆ పని తన ఇంటి కోసమే చేసుకుంటే? | ఆ శ్రమ, డబ్బుగా మారదు. అది ఆమెకి ఉపయోగపు విలువ'గా ఉంటుంది. 'అదనపు శ్రమ' ఉంటే, అది ఆమెకే. | గృహస్తురాలు. | ఆమె శ్రమకి, ఉత్పాదక — అను త్పాదక విభజన వర్తించదు. |

ఇంకా ఎన్ని రకాలుగా చూసినా ఉత్పాదక - అనుత్పాదక విభజన, యజమానులకే గానీ, శ్రామికులకు వర్తించదు.

# ఉత్పాదక శ్రమల' విముక్తే అనుత్పాదక శ్రమల' విముక్తి!

**ఉ**త్పాదక శ్రామికులూ, అనుత్పాదక శ్రామికులూ కూడా దోపిడీకి గురి అవుతూవున్నా, ఆ రెండు రకాల దోపిడీలలోనూ ఉత్పాదక శ్రామికుల విషయంలో జరిగే దోపిడీయే మౌలికమైన దోపిడీ! ఉత్పత్తి స్థలంలో ఒక సరుకు తయారై దానిద్వారా వచ్చే ఆదాయాన్నే పెట్టుబడి దారుడు, తన కుటుంబ అవసరాల మీదా, గృహ సేవకుల మీదా, విలాసాల మీదా ఖర్చు చెయ్యగలడు కాబట్టి, 'ఉత్పత్తి స్థలం'లో దోపిడీయే లేకపోతే పెట్టుబడిదారుడికి

జీవితావసర వస్తువులూ ఉండవు, గృహ సేవకులూ ఉండరు. విలాసాలూ ఉండవు. ఉత్పత్తి స్థలంలో దోపిడీయే లేకపోతే, పెట్టుబడిదారుడు, ఇంటా బయటా తన పనులన్నీ తను చేసుకోవలిసిందే.

ఒక పెట్టుబడిదారుడు, ఉత్పాదక శ్రమల్ని ఎంత ఎక్కువ స్థాయిలో దోపిడీ చెయ్యగలిగితే అంత ఎక్కువ ఆదాయం సంపాదిస్తాడు. దానితో అనుత్పాదక శ్రమల్ని అంత ఎక్కువ స్థాయిలో తన ఆధీనంలో పెట్టుకోగలుగుతాడు. లాభం ద్వారా రోజుకి 50 ఆదాయం పొందే పెట్టుబడిదారుడి కన్నా 100 ఆదాయం పొందే పెట్టుబడిదారుడు గృహ సేవకుల మీద ఎక్కువ భాగం పెట్టగలడు.

పెట్టుబడిదారుడు, తన 'ఉత్పత్తి స్థలం'లో పనిచేసే ఒక కార్మికుడి నించి వచ్చిన లాభంతో, ఆ కార్మికుడి కుటుంబానికి చెందిన మనుషులనే తన గృహ సేవకులుగా పెట్టుకోగలడు. అంటే, ఒక కార్మిక కుటుంబానికి చెందిన మనుషుల్లో కొందరు పెట్టుబడిదారుడి 'ఉత్పత్తి స్థలంలోనూ,' కొందరు పెట్టుబడిదారుడి 'ఇంటిలోనూ', పెట్టుబడిదారుడి కుటుంబం కోసం శ్రమలు చేస్తున్నారన్న మాట.

ఈ శ్రమలు చెయ్యడానికి మొదట శ్రామికులు జీవించి ఉండాలి కాబట్టి, వాళ్ళు తమ శ్రమల్లో నించి కనీస అవసరాలకు మాత్రం తీసుకుని మిగిలినదంతా పెట్టుబడిదారులకు అప్పగిస్తూ ఉంటారు. ఉత్పాదక శ్రామికులేమో కొంత అదనపు విలువనీ (డబ్బునీ), అనుత్పాదక శ్రామికులేమో కొన్ని ఇంటి శ్రమల్ని. అంటే, ఉత్పాదక, అనుత్పాదక శ్రామికులు జీవించేది నూటికి నూరుపాళ్ళూ యజమానుల కోసమే. యజమానులు ఏ శ్రమా చెయ్యకుండా, రాత్రీ పగలూ సోమరిపోతు జీవితాలు గడపడానికే, ఉత్పాదక— అనుత్పాదక శ్రామికులు రాత్రనకా పగలనకా శ్రమిస్తారు.

అనుత్పాదక శ్రామికులూ, ఉత్పాదక శ్రామికులూ కూడా యజమానుల దగ్గిర సేవకులే అయినా, వారిలో అనుత్పాదక శ్రామికుల సేవకత్వం మరీ దుర్భరమైనది. వీరికి 'పని గంటల' నియమం ఉండదు. ఉత్పాదక శ్రామికులందరూ సాధారణంగా పని స్థలంలో ఒకే సరుకు కోసం సమిష్టిగా పని చేస్తారు. అనుత్పాదక శ్రామికుల పరిస్థితి అలా ఉండదు. వీరిలో ఒక్కొక్కరూ ఒక్కో రకం పని చేస్తారు. కాబట్టి ఎవరికి వారుగా విడిపోయి వుంటారు.

యజమానికి వ్యతిరేకంగా సమిష్టిగా నిలబడి పోరాడే అవకాశం ఉత్పాదక శ్రామికులకు ఉన్నట్టుగా, అనుత్పాదక శ్రామికులకు ఉండదు. శ్రామికులు, ఉత్పత్తి రంగాల్లో ఉద్యోగాలు దొరకనప్పుడే గృహ సేవలలాంటి అనుత్పాదక శ్రమలలోకి వస్తారు కాబట్టి, ఉత్పాదక శ్రామికుల జీతాలతో పోలిస్తే, అదే రకం పనులుచేసే అనుత్పాదక శ్రామికుల జీతాలు చాలా తక్కువ స్థాయిలో ఉంటాయి. అంటే, 'దోపిడీ విధానం' అనేది ఉన్నంత కాలమూ 'కార్మిక వర్గం'లో ఒక పెద్ద సెక్షను, దోపిడీదారుల ఇళ్ళల్లో పని చేసే సేవకులుగా, చాలీచాలని జీతాలతో, స్వతంత్రతా ఆత్మ గౌరవమూ లేని పరిస్థితుల్లో (ఉత్పాదక కార్మికుల కన్నా దుర్భరమైన పరిస్థితుల్లో), నిరుపేద జీవితాలు గడిపి తీరవలసిందేనన్న మాట!

ఒక దోపిడీదారుడి బండి మనిషి (కారు డ్రైవరు) రోజంతా కలిసి 2, 3 గంటల కంటే ఎక్కువసేపు బండి తోలే పనిలో ఉండడనుకుందాం. ఆ సేవకుడు, 1 రోజులో ఎన్ని గంటలసేపు బండి తోలాడు — అన్నది కాదు ప్రశ్న. యజమానికి సంబంధించిన పనిలో ఉన్నంతసేపూ అతను యజమానికి బానిసే. పనిలోకి వచ్చాక మధ్యమధ్యలో పనిలేని కాలం కొంత ఉన్నా, ఆ కాలాన్ని ఆ మనిషి తన స్వంత ఇష్టాయిష్టాలతో ఖర్చుపెట్టుకోలేడు. ఆ కాలంలో తన ఇంటికి పోయి ఇంటి పనులు చేసుకోలేడు. తన పిల్లల పనులు చూసుకోలేడు. తన స్వంత అవసరాల కోసం ఆ కాలాన్ని ఖర్చు పెట్టుకోలేడు. పని చెయ్యని కాలంలో కూడా యజమాని పిలుపుకోసం ఎదురుచూస్తూ, నిత్యం యజమాని సేవకు సిద్ధంగా ఉంటూ, యజమానికి అమ్ముడుపోయిన మనిషిగా, తన దేహం తనది కాని మనిషిగా, తనకు తను పరాయిగా, నిత్యం యజమానికి లోబడి ఉండాలి. ఈ రకంగా, అనుత్పాదక శ్రామికులు, యజమానితో నూటికి నూరుపాళ్ళూ బానిస సంబంధంలోనే ఉంటారు. ఈ పరిస్థితి నించి అనుత్పాదక శ్రామికుల విముక్తి, ఉత్పాదక శ్రామికుల విముక్తి మీదే ఆధారపడి ఉంటుంది.

సమాజంలో, ఉత్పాదక శ్రమలు విముక్తి అయినప్పుడే అనుత్పాదక శ్రమలు కూడా విముక్తి అవుతాయి. ఉత్పాదక, అనుత్పాదక శ్రమలు దోపిడీ నించి విముక్తి చెందినప్పుడు, అవి యజమాని లేని 'స్వతంత్ర శ్రమలు' అవుతాయి. అప్పుడు వాటికి ఉత్పాదక, అనుత్పాదక భేదం పోతుంది. పెట్టుబడిదారీ సమాజంలో ఎంత శ్రమ వృధాగా ఖర్చవుతూ ఉంటుందో చెపుతూ ఎంగెల్స్, ధనవంతుల ఇళ్ళల్లో కేవలం ఆడంబరాల కోసం ఉండే సేవక బృందాల గురించి చెప్పేది ఇప్పుడు చూస్తాం. ఎంగెల్స్, ధనిక కుటుంబానికంతటికీ ఆ ఇంటి యజమానిని 'ప్రతినిధి'గా చేస్తూ "ఒక్క వ్యక్తి కోసం సేవ చెయ్యడం" అంటాడు ఎంగెల్స్. సాధారణ ధనవంతుడి కుటుంబంలో ఏం జరుగుతుందో చూడమంటున్నాడు.

"…. ధనికులు తమ సామాజిక స్థాయిని ప్రదర్శించుకోవడంలో, మరింత 'శ్రమశక్తి — దుర్వినియోగం' కనిపిస్తుంది. కేవలం ప్రదర్శించుకోవాలనే తాపత్రయం నించి మాత్రమే తల ఎత్తేటటువంటీ, అపారమైన శ్రమశక్తి అవసరమయ్యేటటువంటీ, నిరుపయోగకరంగానూ హాస్యాస్పదంగానూ ఉండేటటువంటీ ఇతర ఆడంబరాల గురించి నేనిక్కడ ఏమీ చెప్పడం లేదు. కానీ, ఒక ధనవంతుడి ఇంటిలోకి, బాగా లోపలికి పోయి చూడండి! అక్కడ ఒక వ్యక్తి సేవలో అనేక మంది సేవకులు నిమగ్నమై ఉండడం ఎలాంటిదంటే — వారి సమయాన్నంతటినీ తగిన పని లేకుండానే వెచ్చించడంగానీ, లేదా ఒక వ్యక్తి నాలుగు గోడల మధ్యా ఒంటరిగా జీవించే పరిస్థితి నించి పుట్టుకు వచ్చే పనికిమాలిన పనుల కోసం ఆ శ్రమ శక్తినంతా అర్థరహితంగా వ్యర్థం చెయ్యడంగానీ కాదేమో చెప్పండి! పరిచారికలూ, వంటవాళ్ళూ, నౌకర్లూ, బండి మనుషులూ, ఇంటి పని మనుషులూ, తోటమాలీలూ — వగైరా ఏ పేర్లతో నైనా వారిని పిలవండి! ఈ జనాలు నిజంగా చేసేదేమిటి? …. యజమానుల జీవితాలను నిజంగా ఆహ్లాదకరం చెయ్యడంలో గానీ, తమ మానవ స్వభావమూ, సహజ శక్తులూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందడానికి సంబంధించిన పనుల్లో గానీ రోజుకి ఎన్ని క్షణాలు ఉంటారో; లేదా 'తప్పుడు సామాజిక సంబంధాల' నించి మాత్రమే తలఎత్తే పనుల్లో — అనగా బండి వెనక నిలుచోవడమూ, యజమానుల ప్రతీ చిత్త చాంచల్యానికీ సేవ చెయ్యడమూ, పెంపుడు కుక్కలను ఎత్తుకోవడమూ — వంటి అసంబద్ధపు పనుల్లో రోజుకి ఎన్ని గంటలు ఉంటారో చూడండి! హేతుబద్ధంగా నిర్మించుకున్న సమాజంలో, ఎక్కడైతే ఏ వ్యక్తీ, ధనికుల చిత్త చాంచల్యాలకు లోబడే పరిస్థితి గానీ, తనే ఆ రకపు చిత్తచాంచల్యానికి లోబడే పరిస్థితి గానీ ఉండదో; అలాంటి సమాజంలో, ఆడంబరాల కోసం ఇప్పుడు, ఈ విధంగా దుర్వినియోగమవుతూ వున్న శ్రమ శక్తి అంతా, అప్పుడు అందరి కోసమూ, తన కోసమూ కూడా, ప్రయోజనకరం గానూ, సహజం గానూ వినియోగపడుతుంది." — ఎంగెల్స్ (మార్క్స్, ఎంగెల్స్, లెనిన్: ఆన్ కమ్యూనిస్ట్ సొసైటీ. పేజీలు: 14, 15. ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో, 1981).

ఈ మాటల్లో — "ఒక వ్యక్తి నాలుగు గోడల మధ్యా ఒంటరిగా జీవించే పరిస్థితుల నించి పుట్టుకు వచ్చే" అన్నప్పుడు — 'సమిష్టి జీవిత విధానం' లేకుండా, వ్యక్తిగత సిరిసంపదలు కూడబెట్టుకుంటూ, వ్యక్తిగత ప్రదర్శనలతో జీవించే పరిస్థితుల గురించి చెప్పడమే.

'యజమానుల జీవితాలను నిజంగా ఆహ్లాదకరం చెయ్యడంలో గానీ' అన్నప్పుడు, 'ఒక వ్యక్తి, ఇంకో వ్యక్తిని తన కళల వంటి ప్రత్యేక శక్తులతో ఆహ్లాదపరచడం లాంటిదేమీ ఇక్కడ జరగదు' అని చెప్పడమే.

ఈ రకంగా, అనుత్పాదక శ్రామికులు, యజమానుల గర్వపోతుతనాన్ని తృప్తిపరిచే పాత్రలు కూడా నిర్వహించ వలసి వుంటుంది.

# పిల్ల పెట్టుబడిదారుడికి వాడి ఆర్థికవేత్త నీతి బోధ!

**ఉ**త్పాదక అనుత్పాదక విషయాల గురించి, తెలివైన పెట్టుబడిదారీ ఆర్థికవేత్త, తన పెట్టుబడిదారుడికి ఎలాంటి సలహాలు ఇస్తాడో ఒక ఉదాహరణ చూద్దాం.

'పరిశ్రమ'లోకి కొత్తగా దిగిన ఒక 'పిల్ల పెట్టుబడిదారుడి'కి రోజూ '100 ఆదాయం' వస్తుందనుకుందాం. దాంట్లోంచి వాడు రోజూ 95 వరకూ ఇంటికోసం ఖర్చు పెట్టేస్తాడనుకుందాం. ఈ వివరాలన్నీ వాడు, ఒక ఆర్థికవేత్త ముందుపెట్టి — "ఇవిగో నా జమా ఖర్చులు. నాకు రోజూ 100 వస్తుంది. అందులో 95 దాకా ఖర్చయిపోతుంది. ఒక్కోసారి వందా ఖర్చయిపోతుంది. అసలు ఒక్కోసారి అది కూడా చాలదు. నా పరిశ్రమ అభివృద్ధి చెందే మార్గం చెప్పండి!" అని సలహా అడిగాడనుకుందాం.

ఆ జమాఖర్చులు చూసిన ఆ 'తెలివైన' ఆర్థికవేత్త, పెట్టుబడిదారుడి మీద చాలా విసుక్కుంటాడు. "ఏమిటిది! ఆదాయం అంతా అన్‌ప్రొడక్టివ్‌గా (అనుత్పాదకంగా) ఖర్చు పెట్టేస్తున్నావు! ఇలాగైతే పరిశ్రమనేం అభివృద్ధి చేసుకుంటావు? ఇంటి ఖర్చు కోసం రోజూ 10 తోటో, 15 తోటో సరిపెట్టుకోలేవూ? నీ 100 ఆదాయం లోంచి, రోజూ 90 అయినా మళ్ళీ 'పెట్టుబడి'లో కలిపెయ్యాలయ్యా! అలా చేసి చూడు! నీ పరిశ్రమ ఎంత తొందరగా డెవలప్ అవుతుందో నువ్వే చూస్తావు" అంటాడు.

"ఇంటి ఖర్చుకోసం పదో, పదిహేనో ఎలా సరిపోతుం

దండీ! కనీసం 80 అయినా ఉండాలి. మా ఇంట్లో పని మనుషులే ఆరుగురు ఉన్నారు. వంట మనిషి తప్పదు. ఇళ్ళూడ్చి, బట్టలు ఉతికే మనిషి తప్పదు. బండి మనిషి తప్పదు. తోటమాలి తప్పదు, పిల్లల పనికి ఆయా తప్పదు. కాపలా మనిషి తప్పదు. కుక్కలు తప్పవు. కుక్కల పని చూసే మనిషి తప్పదు. ఇంకా పిల్లల స్కూలు జీతాలూ, డాక్టర్ ఫీజులూ...."

"అరెరే! ఇదంతా అన్‌ప్రొడక్టివ్ ఖర్చు. ఏం లాభం దీనివల్ల? డబ్బు తీసుకుపోయి బూడిదలో పోసేస్తున్నావే!"

పిల్ల పెట్టుబడిదారుడు నవ్వుతాడు — "బూడిదలో పొయ్యడం ఏమిటండీ! ఏ ఖర్చు తగ్గించుకోగలం? పని మనుషులు లేకపోతే ఒక్క క్షణం గడవదు. ఆ చెత్తాకారీ పనులన్నీ మనం చేసుకుంటామా? నలుగుర్లోనూ ఎంత చిన్నతనంగా ఉంటుంది!"

"చాలా పిల్ల తరహాగా ఆలోచిస్తున్నావే! వచ్చే ఆదాయం అంతా ఇలా ఖర్చు పెట్టేస్తే పరిశ్రమలో ఎలా నిలదొక్కుకుంటావు? రేపట్నించీ పోటీలో ఎలా నెగ్గు కొస్తావు? పరిశ్రమలో ఆటు పోట్లన్నీ ఎప్పుడూ ఇలాగే ఉంటాయనుకుంటున్నావా? ఇలాగైతే ఆర్నెల్లలోనే దివాళా తీస్తావు."

"దివాళా? .... అంటే?"

"నీ సరుకు అమ్ముడు పోకుండా ఉండిపోతుంది. పెట్టిన పెట్టుబడి వెనక్కిరాదు. అలాంటప్పుడు, అవసర మైతే సరుకంతా చవగ్గా తోసెయ్యవలసి వస్తుంది."

"చవగ్గానా?చవగ్గా అమ్మితే మనకి గిట్టుబాటెలా అవుతుంది?"

"అందుకే మనం మొదటే సరుకుని 'చవగ్గా' ప్రొడ్యూస్ చేసుకోవాలి. మార్కెట్ సరిగా ఉండి, సరుకం తట్నీ లాగేసేలా ఉంటే, నార్మల్‌గానే అమ్మేస్తాం. అప్పుడు నార్మల్ లాభంకన్నా ఎక్కువ లాభం ఉంటుంది. కానీ మార్కెట్లో ఏదైనా ఒడిదుడుకులు వస్తే, శాల్తీకి 10 పైసలు తక్కువ చేసైనా అమ్మగలగాలి. సరుకుని మొదటే చవకలో తయారు చేయిస్తే, రేపొద్దున్న చవగ్గా అమ్మాల్సి వచ్చినా నష్టం రాదు."

"చవగ్గా తయారు చెయ్యాలంటే....?"

"ప్రొడక్షన్ పెంచాలి. 100 శాల్తీలు ప్రొడ్యూస్ చేసే చోట 200 శాల్తీలు చేస్తే, కొన్ని ఖర్చులు కలిసి వచ్చి ప్రతీ శాల్తీ కొంత చవగ్గా పడుతుంది. వెయ్యి శాల్తీలు చేస్తే ఇక చెప్పనే అక్కర్లేదు. శాల్తీకి సగం కూడా ఖర్చవదు. అయితే, దానివల్ల ఒక ఇబ్బంది ఉందనుకో, ఆ సరుకంతా అమ్ము కోడానికి మార్కెట్‌ని వెతుక్కోవాలి. పోనీ వెయ్యి కాక పోయినా, ఎంతో కొంత.... ప్రొడక్షన్‌ని పెంచుకుంటూ పోకపోతే మాత్రం లాభం లేదు."

పిల్ల పెట్టుబడిదారుడు కొంచెం భీతిగా — "నన్నేం చెయ్యమంటారు?" అంటాడు.

"ముందు ప్రతీ పైసా ప్రొడక్టివ్‌గా ఖర్చుపెట్టడం నేర్చుకో! డబ్బంతా పెట్టుబడిలోకే ఉపయోగించుకోవాలి. పెట్టుబడిగా పెట్టింది ఎటూ పోదు. వడ్డీతో సహా తిరిగొచ్చే స్తుంది. అన్‌ప్రొడక్టివ్‌గా పెడితే ఏం వస్తుంది, మట్టి! నీ ఆదాయం అంతా ముడి పదార్థాల మీద పెట్టు! ప్రొడక్టివ్ కార్మికుల మీద పెట్టు! అలా ఎంత పెట్టినా నీ డబ్బు రెండింతలై, మూడింతలై, నాలుగింతలై, తిరిగొస్తుంది. అదంతా మళ్ళీ పెట్టుబడిగా పెట్టు! మళ్ళీ పెట్టిందంతా, రెండింతలై, నాలుగింతలై, తిరిగొస్తుంది. మళ్ళీ పెట్టు బడిగా పెట్టు! మళ్ళీ రెండింతలై, మూడింతలై .... ఆరింతలై...."

పెట్టుబడిదారుడి వదనం కూడా, రెండింతలూ, నాలుగింతలూ ఎనిమిదింతలూ అవుతూ విప్పారుతోంది, భవిష్యత్తులో తన పరిశ్రమ ఎలా విస్తరించబోతోందో ఊహించుకున్న ఆనందంతో! కానీ, వాడింకా పిల్ల తరహా పెట్టుబడిదారుడే కాబట్టి, వాడికి ఒక సందేహం పుట్టు కొచ్చింది. "డబ్బుని అలా పెంచుకుంటూ పోతే, మరి దాన్ని మనం ఎప్పుడు ఉపయోగిస్తాం?" అన్నాడు ఆశ్చర్య పోతూ.

"ఏం, ఉపయోగిస్తూనే వున్నాంగా? 'పెట్టుబడి'గా పెట్టడం అంటే డబ్బుని ఉపయోగించడం కాదూ?"

"అలా ఉపయోగించడం గురించి కాదు నేనడిగేది. డబ్బుని, మనం స్వంత అవసరాలకీ, ఇంట్లోకీ, ఎప్పుడు ఉపయోగిస్తాం మరి?"

"అదుగో! అదే వద్దన్నాను. అది అన్‌ప్రొడక్టివ్ ఖర్చంటే అర్థం చేసుకోడం లేదే నువ్వు!"

"అది కాదండీ, నాకు అర్థంకాకే అడుగుతున్నా. మరి డబ్బుని అలా పెంచుకుంటూ పోతే ఎప్పుడు ఉపయో గిస్తామా అని...."

"ఎప్పుడేమిటి? ఎప్పుడైనా ఉపయోగించొచ్చు. ఒకటి గుర్తు పెట్టుకో. స్వంతానికి ఉపయోగించిన ప్రతీ పైసా అన్ — ప్రొడక్టివ్ అయిపోతుందని గుర్తు పెట్టుకో. దాని వల్ల పరిశ్రమ పెరగదు. పరిశ్రమ పెరగడం ఎందు కంటావా? పరిశ్రమ పెరగకపోతే రాను రానూ పరిశ్రమలో నిలబడలేవు. రోజూ 100 అయితే ఇంటి ఖర్చులకు సరి పోతుందా నీకు? అయితే, రోజూ 'వెయ్యి లాభం' సంపా యించుకో. అప్పుడు నీ ఖర్చుల మీద 100 పెట్టుకో. ఎవరు కాదంటారు? అంతేగానీ, సంపాదించేదే 100 అయితే. వచ్చిందంతా ఖర్చు పెట్టేస్తానంటే.... పరిశ్రమని ఏం చేస్తావు? దాని బాగోగులు చూడకపోతే మొదటికే మోసం వస్తుంది కదా? అప్పయినా తెచ్చి పరిశ్రమలో

పెట్టుకోవచ్చునుకో. కానీ, అప్పులు తెస్తే వడ్డీలకే పోతుంది కదా? ఏం లాభం దాని వల్ల? మొదట్లో కొంత కాలం 'ఆత్మనిగ్రహం'తో ఉండి పరిశ్రమని వృద్ధి చేసుకోవాలి. రేపు, పరిశ్రమ పెరిగిన తర్వాతైనా అన్‌ప్రొడక్టివ్ ఖర్చుల కోసం ఎంత తక్కువపెడితే అంత మంచిది" — అదీ తెలివైన ఆర్థికవేత్త ఉద్బోధ! వాళ్ళు నించున్న 'పునాది' మీద అది తెలివైన ఉద్బోధే మరి! వాళ్ళ పరిశ్రమ, డబ్బు కుప్పని పెంచుకోవడం కోసమే కదా? ఆ కుప్పకి కొలతలూ, హద్దులూ ఉండవు కదా? అందుకే వాళ్ళకి 'ఉత్పాదక' ఖర్చుకీ, 'అనుత్పాదక' ఖర్చుకీ, తేడా ఉంటుంది.

అందుకే, 'ఉత్పాదక శ్రమ' అనే మాట, 'పెట్టుబడిని పెంచేది' అనడానికి ఒక క్లుప్తమైన మాట!

'అనుత్పాదక శ్రమల' గురించి చూస్తూ ఇప్పటి వరకూ 'యజమాని గృహ సేవల' గురించే చూశాం. కానీ అను త్పాదక శ్రమలు అంటే, యజమాని గృహ సేవలు మాత్రమే కాదు. పెట్టుబడిదారుడి 'ఉత్పత్తి స్థలం'లో కూడా కొన్ని అనుత్పాదక శ్రమలు ఉంటాయి. ఇప్పుడు మళ్ళీ 'ఉత్పత్తి స్థలం'లోకి వెళ్ళి అక్కడ ఇంకా కొన్ని శ్రమల గురించి చూద్దాం.

# 4. 'ఉత్పత్తి స్థలం'లో అనుత్పాదక శ్రమలు

'**అ**నుత్పాదక శ్రమ'ల గురించి కొంత తెలిసిన తర్వాతే, 'ఉత్పత్తి స్థలం'లో ఉండే అనుత్పాదక శ్రమల్ని చూడడం తేలిగ్గా ఉంటుంది. 'సరుకు' తయారయ్యే ఉత్పత్తి సంస్థలో ('ఉత్పత్తి స్థలం' అన్నా 'ఉత్పత్తి సంస్థ' అన్నా ఒకటే) ఉత్పాదక శ్రమలే గాక, అనుత్పాదక శ్రమలు కూడా ఉంటాయని చెప్పుకున్నాం. ఈ అనుత్పాదక శ్రమల్ని చూసే ముందు, ఉత్పత్తి సంస్థలో ఉండే మరికొన్ని 'ఉత్పాదక శ్రమల్ని' చూడాలి.

## నిర్వహణ శ్రమ:

ఒక ఉత్పత్తి స్థలంలో, ఆ ఉత్పత్తి కార్యాన్నంతటినీ నిర్వహించే శ్రమలు కూడా అవసరమవుతాయి. ఆ ఉత్పత్తి స్థలంలో నాలుగైదు సెక్షన్లు ఉంటే, ఏ సెక్షన్ కార్మికులు ఆ సెక్షన్‌లోనే పని చేస్తారు. ఒక సెక్షన్‌లో ఏదైనా సమస్య వస్తే, దాన్ని పట్టించుకునే బాధ్యతని ఎవరో ఒకరు నిర్వ హించవలసి ఉంటుంది. అలాగే, అన్ని సెక్షన్ల పనినీ సమన్వయపరిచి చూసుకునే బాధ్యతని కూడా ఎవరో ఒకరు నిర్వహించాలి. 'ఉత్పత్తి క్రమానికి' అవసర మైన ఏ వస్తువు సిద్ధంగా లేకపోయినా పని ఆగిపోతుంది. సెక్షన్ల మధ్య సమన్వయానికి సంబంధించిన ఏ విషయం చూడక పోయినా పని ఆగిపోతుంది.

ఏ విధుల నిర్వహణ లేకపోతే ఉత్పత్తి క్రమం ఆగిపోతుందో ఆ విధుల నిర్వహణ మాత్రమే నిర్వహణ శ్రమ. ఈ నిర్వహణ శ్రమ చేసే ఉద్యోగి కూడా ఉత్పత్తి క్రమానికి అవసరమవుతాడు. ఈ ఉద్యోగి కూడా 'ఉత్పత్తి క్రమానికి' కావలసిన ఒక పని చేస్తున్నాడు కాబట్టి, ఇతడు కూడా 'ఉత్పాదక శ్రామికుడు' అవుతాడు.

నిర్వహణ శ్రమని, పెట్టుబడిదారుడే స్వయంగా చేసుకుంటే, అప్పుడు పెట్టుబడిదారుడు కూడా ఉత్పాదక శ్రామికుల్లో ఒకడవుతాడు. ఆ శ్రమ చేసినందుకు వచ్చే 'జీతం' తీసుకోవడానికి అర్హుడవుతాడు. అంతే కాదు, ఇతర ఉత్పాదక శ్రామికుల విషయంలో లాగే, ఆ పెట్టుబడిదారుడి శ్రమలో కూడా కొంత 'అదనపు శ్రమ' ఉంటుంది. అంటే, ఆ సరుకు ద్వారా వచ్చే 'అదనపు విలువ'లో ఆ పెట్టుబడిదారుడి భాగం కూడా కొంత ఉంటుంది. కాబట్టి, 'నిర్వహణ శ్రమ' చేసే పెట్టుబడి దారుడికి, ఒక జీతమూ, అదనపు విలువలో ఒక భాగమూ తీసుకోవడానికి హక్కు ఉంటుంది. అంతే గానీ మొత్తం శ్రామికులందరి అదనపు విలువనీ తీసుకోవడానికి హక్కు ఉండదు.

పెట్టుబడిదారుడు, ఆ 'నిర్వహణ' శ్రమ కోసం కూడా వేరే ఉద్యోగిని పెట్టి, ఆ శ్రమని కూడా తను మానుకుంటే, అప్పటి నించి వాడు 'ఉత్పత్తి క్రమాని'కి పూర్తిగా 'అనవ సరం' అవుతాడు. అప్పటి నించి, ఉత్పత్తిక్రమం, పెట్టుబడి దారుడి పాత్రతో అవసరం లేకుండా నడిచే క్రమం అయి పోతుంది. (ఈ సంపుటంలోనే, 2వ భాగంలో, 'లాభం' చాప్టరులో, 'పెట్టుబడిదారుడు శ్రమ చేస్తాడా, చెయ్యడా?' అనే సబ్‌టైటిల్ కింద, పెట్టుబడిదారుడి శ్రమ వివరాలు కొన్ని చూశాం.)

## అజమాయిషీ శ్రమ, లేదా పెత్తనం శ్రమ:

నిర్వహణ శ్రమ తర్వాత, 'అజమాయిషీ శ్రమ'ని కూడా చూడాలి. 'అజమాయిషీ శ్రమ' అంటే కార్మికులతో పాటు కలిసి పని చెయ్యడం కాదు. కార్మికులందరూ శ్రమ చేస్తున్నారో లేదో చూస్తూ వారితో శ్రమ చేయించడం. నేత పని స్థలాన్ని తీసుకుంటే, అక్కడ అజమాయిషీ ఉద్యోగి ఏం చేస్తాడంటే: 'బట్ట తయారీ'కి సంబంధించిన పనులు చేసే కార్మికుల మధ్య తిరుగుతూ, వారిని త్వరత్వరగా

పని చెయ్యమని మాటిమాటికీ హెచ్చరిస్తూ, మందలిస్తూ, బెదిరిస్తూ ఉంటాడు. కార్మికుల్ని 'ఒకటికీ రెంటికీ' వెళ్ళడానికి కూడా అభ్యంతర పెడుతూ, వారిని పనిలో నించి తలెత్త నివ్వకుండా ప్రతీ నిముషమూ పని మీదకి తరుముతూ, తను ఎప్పుడూ యజమాని తరపు మనిషి లాగానే వ్యవహరిస్తూ ఉంటాడు. ఇదంతా కార్మికుల మీద 'పెత్తనం' చెయ్యడం. లేదా 'అజమాయిషీ' చెయ్యడం. ఈ వ్యక్తి, 'ఉత్పత్తి' కోసం తను స్వయంగా పని చెయ్యడు. పని చేసే వారి మీద 'పెత్తనం' చేస్తాడు.

బానిస సమాజంలో, బానిసలతో పని చేయించే మేస్త్రీ చేతిలో, కొరడా ఉంటుంది. (ఆ మేస్త్రీ కూడా బానిసే.) ఆ మేస్త్రీ కూర్చోడానికి ఒక బల్ల ఉంటే, ఆ బల్లా, ఆ కొరడా కలిసి, అవి ఆ మేస్త్రీ పనికి కావలసిన 'శ్రమ పరికరాలు.'

పెట్టుబడిదారీ విధానాన్ని తీసుకుంటే, 'సూపర్‌వైజర్ల' లాంటి ఉద్యోగులు 'అజమాయిషీ శ్రమ' చేస్తారు. వీళ్ళ దగ్గిర కొరడాలు ఉండవు కానీ శ్రామికుల 'తప్పుల్ని' రాసే పుస్తకాలు ఉంటాయి. ఇలాంటివే ఇంకేవేవో ఉంటాయి. ఈ రకంగా అజమాయిషీ శ్రమ జరగాలంటే కొన్ని జీతాలూ, కొన్ని శ్రమ పరికరాలూ కూడా ఖర్చవుతాయి.

అజమాయిషీ చెయ్యడం కూడా ఒక శ్రమే. అంటే, 'శ్రమ చేయించడం' కూడా ఒక శ్రమే. కానీ, ఈ శ్రమ, పని స్థలంలో జరగవలసిన అసలు శ్రమలో భాగంగా గాక, దానితో సంబంధం లేనిదిగా ఉంటుంది. వస్తువు తయారీకి ఇది అవసరం కాదు. కానీ, ఇది కూడా అక్కడ చాలా అవసరమైన శ్రమలాగే కనపడుతుంది. ఇది ఎలా కనపడినా అది 'ఉత్పాదక శ్రమ' కాదు. దాని కోసం జరిగే ఖర్చులేవీ ఉత్పత్తి కోసం జరిగే ఖర్చులు కావు.

పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలాన్ని తీసుకుంటే అక్కడ ఉత్పత్తి కోసం సహజంగా అవసరమైన ఖర్చులూ, సహజంగా అవసరం కాని ఖర్చులూ కూడా కలిసిపోయి ఉంటాయి. పెట్టుబడిదారుడు ఆ ఖర్చులన్నిటినీ అవసరమైన ఖర్చులుగానే భావిస్తాడు. కానీ మనం, సరుకు విలువని అర్థం చేసుకునేటప్పుడు, ఆ ఖర్చుల్ని ఉత్పాదక — అనుత్పాదక అవగాహనతో చూడడం చాలా అవసరం. పని స్థలంలో జరిగే ప్రతీ ఖర్చూ ఆ ఉత్పత్తికోసం అవసరమైనది కాదు కాబట్టి, కొన్ని ఖర్చులు, ఆ ఉత్పత్తి విలువలోకి చేరవనీ, కొన్ని ఖర్చులు మాత్రమే చేరతాయనీ, అర్థం చేసుకోవాలి. అలా అర్థం చేసుకోకపోతే పెట్టుబడిదారుడి లాగే మనం కూడా ప్రతీ ఖర్చునీ అవసరమైన ఖర్చుగానే అనుకుంటాము. ఆ ఉత్పత్తిద్వారా ఎంత అదనపు విలువ వచ్చిందో సరిగా అర్థం చేసుకోలేము. కాబట్టి ఉత్పాదక — అనుత్పాదక విషయాన్ని సరిగా తెలుసుకోవాలి.

పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలంలో జరిగే అనుత్పాదక ఖర్చులేవీ సరుకు విలువలోకి చేరవు. అయినా పెట్టుబడిదారుడు ఆ ఖర్చులన్నీ పెట్టక తప్పదు. ఆ ఖర్చుల్ని వాడు ఎక్కడి నించి తెచ్చిపెడతాడు? ఇంకెక్కడి నించి? — ఆ సరుకు ద్వారా వచ్చే అదనపు విలువలో నించే. వడ్డీని ఎక్కడి నించి తీసి చెల్లిస్తాడో, ఏ అనుత్పాదక ఖర్చుని అయినా అలాగే పెడతాడు.

వడ్డీ లాభాలూ, భూమి కౌలూ వంటి అంశాల్ని అదనపు విలువగా ఎలాగైతే లెక్కకడతామో అలాగే, ఉత్పత్తి స్థలంలో జరిగే అనుత్పాదక ఖర్చులన్నిటినీ కూడా అదనపు విలువగానే లెక్క కట్టాలి.

అయితే ఉత్పత్తి స్థలంలో ఉండే అనుత్పాదక శ్రమలు ఏమిటి? — కాపలా శ్రమా, ఫ్యాక్టరీ లాయరు శ్రమా — వంటి వాటిని అనుత్పాదక శ్రమలుగా తేలికగానే లెక్క కట్టవచ్చు. (ఈ శ్రమల గురించి తర్వాత చూస్తాం.) కానీ, అన్ని సందర్భాలూ ఇంత స్పష్టంగా ఉండవు. కొన్ని అనుత్పాదక శ్రమల్ని లెక్క కట్టడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ఎందుకంటే — నిర్వహణ శ్రమని ఉత్పాదక శ్రమగానూ, అజమాయిషీ శ్రమని అనుత్పాదక శ్రమగానూ చెప్పుకుంటున్నాం. కానీ, ఏ 'ఉత్పత్తి స్థలం'లో అయినా, నిర్వహణ శ్రమా, అజమాయిషీ శ్రమా — విడివిడిగా ఉండవు. ఆ 2 శ్రమలకూ ఉద్యోగులు వేరువేరుగా ఉండరు. ఆ శ్రమలు ఒక దానితో ఒకటి కలిసిపోయి, పెనవేసుకు పోయి, ఐక్యం అయిపోయి ఉంటాయి. ఈ ఐక్య శ్రమకి 'మేనేజిమెంటు శ్రమ' అని పేరు.

ఉత్పత్తి క్రమాన్ని మేనేజ్‌చేసే శ్రమ 'మేనేజిమెంటు శ్రమ'. ఈ శ్రమ చెయ్యడానికి పెట్టుబడిదారుడు, సూపర్‌వైజర్లనీ, మేనేజర్లనీ నియమిస్తాడు. తను, తన సంస్థ కంతటికీ 'డైరెక్టరు'గా ఉంటాడు.

'మేనేజిమెంటు శ్రమ'కి సంబంధించిన ఉద్యోగులు ఇంకా అనేక పేర్లతో ఉండవచ్చు. కానీ, ఇక్కడ మనం, సూపర్‌వైజరూ, మేనేజరూ — అనే ఉద్యోగుల్ని చూస్తే చాలు.

**సూపర్‌వైజరు:** ఈ రకపు ఉద్యోగి చేసే పనుల్లో నిర్వహణా, అజమాయిషీ సగం సగంగా ఉన్నాయి అనుకుంటే, ఆ ఉద్యోగి, మొత్తం 'పని దినం'లో, సగం కాలం ఉత్పాదక శ్రమా, సగం కాలం అనుత్పాదక శ్రమా చేసే వాడిగా ఉంటాడు. వేరే మాటల్లో చెప్తే ఆ ఉద్యోగి, సగం ఉత్పాదక శ్రామికుడిగానూ, సగం అనుత్పాదక శ్రామికుడిగానూ ఉంటాడు. అతని జీతం 4; అదనపు విలువ రేటు 100% అనుకుందాం.

అప్పుడు అతని శ్రమ విషయాలు ఇలా ఉంటాయి:
ఉత్పాదక జీతం 2; అది ఇచ్చే 'అదనపు విలువ' 2.
అనుత్పాదక జీతం 2, అది ఇచ్చే 'అదనపు శ్రమ' 2.
ఉత్పాదక జీతం 2 — 'అస్థిర పెట్టుబడి'కీ,
అనుత్పాదక జీతం 2, 'అదనపు విలువ'కీ చెందుతాయి.
మొత్తం 4 జీతం, 4 అదనపు శ్రమని ఇస్తుంది.

'4 అదనపు శ్రమ'లో 2 మాత్రమే పెట్టుబడిదారుడికి డబ్బుగా అందుతుంది. ఇంకో 2, పెట్టుబడిదారుడికి ఉపయోగపు విలువగానే ఖర్చవుతుంది.

ఈ ఉదాహరణలో, 4 అంశాలు ఉన్నాయి.

2 జీతాలూ, 2 అదనపు శ్రమలూ.

ఈ 4 అంశాల్లోనూ ఏవి 'డబ్బు'గా ఉన్నాయి? ఏవి 'డబ్బు'గా లేవు? 'డబ్బు'గా ఉన్న అంశాల్లో ఏ 'డబ్బు' ఎక్కడిది? ఈ 4 అంశాలకూ ఉన్న సంబంధాలు ఏమిటి? — ఈ విషయాలు జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

ఈ ఉద్యోగి పూర్తిగా ఉత్పాదక శ్రామికుడే అయితే, అతని 4 జీతం అంతా 'ఉత్పాదక జీతం' గానే ఉంటుంది. అది, 'అస్థిర పెట్టుబడి'లోనే భాగం అవుతుంది. అది 'సరుకు విలువ'లోకి చేరి సరుకుని అమ్మగానే డబ్బుగా వెనక్కి వస్తుంది. ఆ 4 డబ్బునే మళ్ళీ అదే ఉద్యోగికి కొత్త జీతంగా ఇవ్వడానికి సాధ్యం అవుతుంది. అలాగే ఆ ఉద్యోగి ఇచ్చిన 4 అదనపు శ్రమ కూడా 'సరుకు విలువ'లోకి చేరి, సరుకుని అమ్మినప్పుడు, డబ్బుగా పెట్టుబడిదారుడికి అందుతుంది.

కానీ ఈ 'సూపర్‌వైజర్' అనే ఉద్యోగి పూర్తి ఉత్పాదక శ్రామికుడు కాడు కాబట్టి, అతని శ్రమ అంశాల్ని అర్థం చేసుకోవడం కొంత గందరగోళంగా ఉంటుంది. అతని శ్రమలో 'ఉత్పాదకంగా' ఉండే భాగం మాత్రమే సరుకు విలువలోది. 'అనుత్పాదకంగా' ఉండే భాగం, అలా కాదు. కాబట్టి, అతని 'అదనపు విలువ'గా వచ్చిన డబ్బుతోనే అతనికి 'అనుత్పాదక జీతాన్ని' ఇవ్వవలసి వస్తుంది.

ఈ ఉద్యోగి, నిన్న, 4 జీతం తీసుకుని, 4 ఉత్పాదక శ్రమా, 4 అనుత్పాదక శ్రమా, మొత్తం 8 శ్రమ చేశాడనుకుందాం, అందులో నించి 'సరుకు విలువ'లోకి, 2 ఉత్పాదక జీతమూ, దాని తాలూకు 2 అదనపు విలువా మాత్రమే చేరతాయి. 2 అనుత్పాదక జీతమూ, దాని తాలూకు 2 అదనపు శ్రమా చేరవు. నిన్నటి సరుకుని అమ్మి, 'డబ్బు'గా మార్చినప్పుడు, 2 ఉత్పాదక జీతం వెనక్కి వచ్చి, అదే మళ్ళీ కొత్త 2 ఉత్పాదక జీతంగా ఉంటుంది. నిన్నటి 2 అదనపు విలువ కూడా డబ్బుగా వచ్చి, అది కొత్త '2 అనుత్పాదక జీతం'గా ఉంటుంది. అంటే, నిన్నటి 2 అనుత్పాదక జీతమూ, అది ఇచ్చిన 2 అదనపు శ్రమా — డబ్బుగా మారకుండా పెట్టుబడిదారుడి కోసం ఉపయోగపు విలువలు గానే ఖర్చయి పోతాయి. అందుకే, నిన్నటి 2 అదనపు విలువని తెచ్చి, ఇవ్వాళ్టి 2 అనుత్పాదక జీతంగా ఇవ్వ వలసి వస్తుంది.

ఒక శ్రామికుడి శ్రమలో, ఏ భాగం ఉత్పాదకంగా ఉందో, ఏ భాగం అనుత్పాదకంగా ఉందో — ఈ వివరాలేవీ పెట్టుబడిదారుడికి గానీ, ఆ శ్రామికుడికి గానీ, తెలియవు; పట్టవు. శ్రామికుడు పెట్టుబడిదారుడు చెప్పిన పనులు చేస్తాడు. పెట్టుబడిదారుడు జీతం ఇస్తాడు. అంతకన్నా వివరాలు ఇద్దరికీ అర్థం కావు. కానీ 'శ్రమ'కి సంబంధించి ఈ వివరాలన్నీ అర్థం చేసుకోవడం శ్రామికులకు చాలా అవసరం. ఎందుకంటే, అదనపు విలువ ఎంత ఉంటుందో అర్థం చేసుకోవడానికి.

'మేనేజిమెంటు శ్రమ' పేరుతో — నిర్వహణ శ్రమతో పాటు, అనుత్పాదకమైన అజమాయిషీ శ్రమ కూడా కలిసి పోయి ఉంటుంది. <u>అజమాయిషీ శ్రమ చేసే ఉద్యోగులు చాలా వరకూ యజమాని పక్షం మనుషులుగానే వ్యవహరిస్తారు. అంటే. కార్మిక పక్షానికి వ్యతిరేకులుగా.</u> వాళ్ళు చెయ్యవలసిన పనే అది.

**మేనేజరు:** ఈ ఉద్యోగి విషయం తీసుకుంటే, సూపర్‌వైజరు నిర్వహించే రకం బాధ్యతలనే ఇతను చాలా పైస్థాయిలో నిర్వహిస్తాడు. అంటే, ఒక పక్క ఉత్పత్తి క్రమానికి అవసరమయ్యే విషయాల గురించి చూడడమూ, ఇంకో పక్క సూపర్‌వైజర్ల ద్వారా కార్మికుల మీద అజమాయిషీ సక్రమంగా జరిగేలాగ చూడడమూ చేస్తాడు. కానీ, సూపర్‌వైజర్‌లాగ, మేనేజరు, ఉత్పత్తి స్థలంలో కార్మికుల మధ్య తిరగడు.

మేనేజరు, సూపర్‌వైజరు కన్నా పెద్ద అధికారి.

మేనేజరు బాధ్యత — 'పని చెయ్యడం' కాదు. అది కార్మికులు చేస్తారు. - 'పని చేయించడం' కూడా కాదు. అది సూపర్‌వైజర్లు చేస్తారు.

మరి, మేనేజరు బాధ్యత ఏమిటి? — సూపర్‌వైజర్ల మీద అజమాయిషీ చెయ్యడం. మేనేజరు, 'ఉత్పత్తి సంస్థ'లో ఒక విభాగం మీదగానీ, మొత్తం సంస్థ మీదగానీ, అధికారిగా ఉండే బాధ్యతని నిర్వహిస్తాడు. అందులో 'శ్రమ' అనదగిన అంశం అతి తక్కువ. అది, అనుత్పాదక శ్రమే అయినా, ఆ శ్రమలో కూడా సూపర్‌వైజరు కన్నా మేనేజరు చేసే శ్రమ అతి తక్కువ. జీతం మాత్రం మేనేజరుకే ఎక్కువ.

మేనేజరు 'శ్రమ'కీ, అతని జీతానికీ సంబంధించి, ఒక ఉదాహరణ చూద్దాం.

ఒక 'ఉత్పత్తి క్రమం'లో, మేనేజరుకి 5 జీతం ఇవ్వడం 'సరైనది' అనుకుందాం. అది '5 అదనపు శ్రమ'ని ఇస్తుం దనుకుందాం. అప్పుడు, మేనేజరుకి, జీతమూ

ప్రత్యేక సౌకర్యాలూ కలిసి, మొత్తం 10 విలువ అందితే, అతని 'శ్రమ విలువ' అతనికి అందినట్టే. కానీ, అన్నీ కలిసి మేనేజరుకి 30 విలువ అందుతుందనుకుందాం. దీని అర్థం ఏమిటి? ఇది ఎలా సాధ్యం? — మేనేజరు తీసుకునే 30లో 10 వరకూ అయితే అతని శ్రమ విలువే. దాని కన్నా ఎక్కువగా ఉన్న 20 — అతనిది కాదు. అది ఎక్కడిదంటే — ఆ ఉత్పత్తి సంస్థలో పనిచేసే ఉత్పాదక కార్మికుల 'అదనపు విలువ'లోది. కాబట్టి, ఆ 20కి సంబంధించినంత వరకూ, మేనేజరు కూడా దోపిడీదారుడే అవుతాడు.

మేనేజరు చేసే ఉద్యోగ కార్యక్రమాల్ని పరిశీలిస్తే, ఈయన విశాలమైన చల్లని సుఖవంతమైన గదిలో కూర్చుని, ఫోనుల మీద పనులు జరిపిస్తూవుంటాడు. బైటికి వెళ్ళాలంటే కారుల్లోనూ, బైట ఊళ్ళకి వెళ్ళాలంటే విమానాల్లోనూ తిరుగుతాడు. ఈ తిరుగుళ్ళన్నీ పెట్టుబడిదారుడి కోసమే చేస్తాడనేది నిజమే. మరి, కార్మికులు కూడా పెట్టుబడిదారుడి కోసం చేసే వాళ్ళే. 'పని స్థలం'లో గానీ, ఇళ్ళ దగ్గిరగానీ, వారికి ఈ సౌఖ్యాలేవీ ఉండవు. మేనేజర్‌కి ఉండే జీతమూ, ప్రత్యేక సౌకర్యాలూ కలిసి, ఒక సాధారణ కార్మికుడి జీతంతో పోలిస్తే, 10 రెట్లో, 20 రెట్లో ఎక్కువగా ఉంటాయి. మేనేజరు పొందే ఈ రెట్ల రెట్ల విలువని చూసి ఈయన 'శ్రమ శక్తి విలువ' అన్ని రెట్లు ఉందని భ్రమ పడకూడదు. మేనేజరు చేసే శ్రమకీ, తిరిగి పొందే ప్రతిఫలానికీ ఏమీ సంబంధం ఉండదు. మేనేజర్‌కి అధిక జీతమూ, ప్రత్యేక సౌకర్యాలూ ఇవ్వకుండా, ఒక నైపుణ్యం గల కార్మికుడికి ఇచ్చే జీతం మాత్రమే ఇస్తే, అప్పుడు మేనేజరు కార్మికుల్లో ఒకడిగా ఉంటాడే గానీ పెట్టుబడిదారుడి మనిషిగా ఉండడు. మేనేజరు, పెట్టుబడిదారుడి మనిషిగా ఉండాలంటే, అతనికి పెట్టుబడిదారుడి నించి ఎక్కువ ప్రతిఫలం ముట్టి తీరాలి. ఈ అవసరం పెట్టుబడిదారుడికి తెలుసు గనకే, మేనేజరు నిర్వహించే పనులకు చాలా ఎక్కువ విలువ చెల్లిస్తాడు. అంటే, 'అదనపు విలువ'లో నించి కొంత వాటాని మేనేజర్‌కి ఉచితంగా పంచుతాడన్నమాట.

పెట్టుబడిదారుడి పక్షాన పని చేసే ఇంజనీర్లూ, సైంటిస్టులూ, ఇతర పెద్ద పెద్ద ఉద్యోగులూ కూడా ఇంతే. వాళ్ళు ఒక వేపు శ్రమ చేసే లక్షణాలతో ఉన్నా, అంతకన్నా ఎక్కువగా దోపిడీ చేసే లక్షణాలతో ఉంటారు. వాళ్ళ ఆదాయాల్లో ఎక్కువ భాగం, కార్మికుల 'అదనపు విలువ'లో నించే పొందుతారు. అందుకే వాళ్ళు దోపిడీకి అనుకూలమైన అంశాలు సమకూరుస్తూ, పెట్టుబడిదారుడికి సహకరిస్తారు.

(సూపర్‌వైజర్లూ, మేనేజర్లూ, ఇంజనీర్లూ, సైంటిస్టులూ, స్పెషలిస్టులూ — అనే ఈ పేర్లు వేర్వేరు దేశాల్లో వేరు వేరు రకాలుగా ఉండొచ్చు. మన దృష్టి ఈ పేర్ల మీద గాక, ఈ పేర్లతో ఉండే ఉద్యోగులు, శ్రమ క్రమంతో ఎలాంటి సంబంధంతో ఉన్నారనే దాని మీదే ఉండాలి.)

**డైరెక్టర్ శ్రమ:** ఇక, ఉత్పత్తి సంస్థ డైరెక్టరు సంగతి! ఈయన సంస్థ మొత్తానికే 'అత్యున్నత' ఉద్యోగి! ఈయన ఎవరో కాదు, ఆ సంస్థకి యజమాని అయిన పెట్టుబడిదారుడే! ఆ సంస్థలో ఇతర వాటాదార్లు లేకపోతే ఆ సంస్థకి ఒక్క డైరెక్టరే ఉంటాడు. ఎక్కువ మంది వాటాదార్లు ఉంటే, అందులోంచి ముగ్గురో నలుగురో డైరెక్టర్లుగా ఉంటారు. పరిశ్రమ అనే నాటకాన్ని డైరెక్టు చెయ్యాలి కదా? అందుకని, వీరు జంకూ గొంకూ లేకుండా 'డైరెక్టర్లు'గా పేరుపెట్టుకుంటారు. ఈ పేరుతో వీరు తమ పదవీ కాంక్షని సంతృప్తి పరుచుకుంటారు. ఇంతకీ, వీరు చేసే శ్రమ ఏమిటంటే, ఒక్క మాటలో చెప్పాలంటే - ఏమీ ఉండదు. 'ఉద్యోగి'గా ఉంటూ, ఏ శ్రమా చెయ్యకుండా ఉండడంలో 'అత్యున్నత' స్థాయి ఇది! ఎంతసేపూ ఇతర పెట్టుబడిదారులతో పోటీలు పడే పద్ధతుల గురించీ, లాభాలు ఇంకా పెంచుకునే మార్గాల గురించీ, పెరిగిపోయే లాభాల రాసుల్ని ఏ శాఖల్లోకి మళ్ళించాలో, కొత్త మార్కెట్లు ఎక్కడ సంపాదించాలో, అక్కడికి పోటీదారుల్ని రానివ్వకుండా ఎలా చెయ్యాలో - వగైరాల గురించీ — ఈ రకంగా, ఎత్తులూ — పైఎత్తులూ జిత్తులూ ఆలోచించడం ఈయన పని! ఉత్పత్తి క్రమానికి ఏమీ అవసరంలేని ఈ అత్యున్నతమైన శ్రమపడ్డందుకే వీరు మేనేజర్ల జీతాలను కూడా మించిన జీతాలూ, మించిన సౌకర్యాలూ తీసుకుంటారు.

మేనేజర్ల ఆదాయంలో కొంతైనా 'స్వంత శ్రమ ఫలితం' ఉంటుంది. కానీ, ఈ డైరెక్టర్ల ఆదాయాల్లో ఒక్క పైసా కూడా స్వంత శ్రమ ఫలితం ఉండదు. డైరెక్టర్ల శ్రమ — ఉత్పాదక శ్రమ అవుతుందా, అనుత్పాదక శ్రమ అవుతుందా — అన్న ప్రశ్నే అర్థం లేనిది. అసలు అక్కడ శ్రమే ఉండదు గనక. ఈ రకంగా, మేనేజర్లూ, డైరెక్టర్లూ ఉత్పాదక శ్రమ ఎలాగూ చెయ్యరు. అనుత్పాదక శ్రమ విషయంలో కూడా పదవి పెరిగినకొద్దీ శ్రమ నించి తప్పించుకోవడం ఎక్కువవుతుంది.

జీతాల్ని నిర్ణయించడంలో ఒక విచిత్రమైన విషయం ఏమిటంటే — కార్మికుల జీతాలనైతే యజమాని నిర్ణయిస్తాడు. మరి, ఆ యజమానే డైరెక్టరుగా ఉన్నప్పుడు ఆ డైరెక్టరు జీతాన్ని ఎవరు నిర్ణయిస్తారు? — ఆ డైరెక్టరే! అంటే, తన జీతాన్ని తనే నిర్ణయించుకునే విచిత్ర కార్మికు

డన్న మాట — డైరెక్టరు!

ఇంతకు ముందు వరకూ బోలెడు జేబుల పెట్టుబడి దారుణ్ణి చూశాం. డైరెక్టర్ పదవిని అధిరోహించే పెట్టుబడి దారుడికి ఇంకో జేబు కూడా ఉంటుంది. అందులో డైరెక్టర్ జీతమూ, దానిపేర్న దొరికే సౌకర్యాలూ ఉంటాయి. కార్మికుల నించి అదనపు విలువని కబళించడానికి ఇవన్నీ వేరు వేరు మార్గాలు.

'మేనేజిమెంటు శ్రమ'లో అత్యధిక భాగం సూపర్ వైజర్ల వంటి చిన్న స్థాయి ఉద్యోగుల ద్వారానే జరుగుతూ వుండగా, పైకి మాత్రం సంస్థ మేనేజిమెంటు అంతా మేనే జర్ల ద్వారానూ, డైరెక్టర్ల ద్వారానూ జరుగుతూ వున్నట్టుగా కనపడుతుంది.

పెట్టుబడిదారుడు, ఉత్పత్తి క్రమాన్ని ఎంతో కష్టపడి 'మేనేజ్' చేసుకుంటాడనీ, ఆ శ్రమకి బదులు గానే అతనికి 'లాభం' వస్తుందనీ — పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెపు తారు. అంటే, 'లాభం' అనేదాన్ని మేనేజిమెంటు శ్రమ చేసి నందుకు వచ్చే ఫలితంగా చెపుతారు. కానీ, 'ఉత్పత్తి స్థలం'లో సూపర్‌వైజర్లూ మేనేజర్లూ డైరెక్టర్లూ రక రకాల జీతాలు తీసుకుంటూ ఉత్పత్తి క్రమాన్ని నిర్వహిస్తున్నారనీ, వాళ్ళ జీతాల మీద అయిన ఖర్చు అంతా 'నిర్వహణ శ్రమ'కోసం అయిన ఖర్చేననీ, ఈ ఆర్థిక వేత్తలే అంటారు కదా? కానీ ఆ ఖర్చులన్నీ పోయాక కూడా పెట్టుబడి దారుడికి 'లాభం' వస్తుంది కదా? 'లాభం' అనేది, పెట్టు బడిదారుడు చేసే 'నిర్వహణ శ్రమ'కు జీతం అయితే, అంతకు ముందే మేనేజర్లూ, డైరెక్టర్లూ తిన్నదంతా దేనికి జీతం? అంతంత జీతాలు తీసుకుని వాళ్ళు నిర్వహణ శ్రమ చెయ్యకుండా ఏం వెలగబెట్టినట్టు?

నిర్వహణ శ్రమని చేసేది పెట్టుబడిదారుడే అయితే, ఉత్పత్తి స్థలంలో ప్రతీ రోజూ 3 షిఫ్టుల్లోనూ వాడే ఉండాలి. వాడికి బదులు ఇతర ఉద్యోగులు ఉన్నారంటే ఆ శ్రమ ఇతర ఉద్యోగులు చేసేది అవుతుందిగానీ, పెట్టుబడి దారుడు చేసేది అవదు. నిర్వహణ శ్రమకోసం వేరే ఉద్యో గులు ఉన్నా కూడా పెట్టుబడిదారుడు ఇంకా ఏదో కంటికి కనిపించని నిగూఢశ్రమ చేస్తున్నట్టూ, ఆ శ్రమకి 'లాభాన్ని' తీసుకునే హక్కు ఉన్నట్టూ — ఆర్థిక వేత్తలు వర్ణిస్తారు. కానీ అదంతా భ్రమ!

సూపర్‌వైజర్ల వంటి చిన్న స్థాయి ఉద్యోగులే నిర్వ హణ శ్రమ ఎక్కువగా చేస్తారు. వాళ్ళ శ్రమలో ఉత్పాదక — అనుత్పాదక శ్రమలు రెండూ ఉన్నా, వాటిలో ఏది ఎంత భాగం ఉన్నా, అవి రెండూ కూడా శ్రమలే. ఏది చేసినా శ్రమ చేసినట్టే. కాబట్టి, ఈ ఉద్యోగులు, తమ స్వంత శ్రమ మీదే జీవిస్తారు. 'అదనపు శ్రమ'ని కూడా ఇస్తూ దోపిడీకి గురి అవుతారు.

మేనేజర్ల వంటి ఉద్యోగులు స్వంత శ్రమ మీద, తక్కువ గానూ, దోపిడీ మీద ఎక్కువ గానూ జీవిస్తారు.

డైరెక్టర్లు — పూర్తిగా దోపిడీ మీదే!

'డైరెక్టర్లు'గా ఉన్నందుకు - దోపిడీ జీతాలూ,

'పెట్టుబడికి యజమానులు'గా ఉన్నందుకు —

లాభాలూ!

సారాంశంలో రెండూ ఒకటే. రెండూ దోపిడీయే. వాటి పేర్ల లోనే తేడా!

పెట్టుబడిదారుడికి వచ్చే లాభం గురించి ఆర్థిక వేత్తలు ఏదో ఒకే కారణం చెప్పరు. ఎప్పుడు ఎలా తోస్తే అలా చెపుతారు. 'పెట్టుబడి పెట్టినందుకే లాభం వస్తుంది' అని కొన్నిసార్లూ, 'నిర్వహణ శ్రమ చేసినందుకు దానికి జీతం గానే లాభం వస్తుంది' అని కొన్నిసార్లూ చెపుతారు. లాభం ఎందుకు వస్తుందో చెప్పడానికి, ఇందులో ఏ కారణం చూపించినా తప్పే అని కార్మికులు అర్థం చేసుకోవాలి.

కార్మికులు, తాము ఉత్పత్తి చేసిన 'సరుకు'లో ఎంత 'అదనపు విలువ ఉందో' గ్రహించాలంటే, కేవలం వడ్డీలూ లాభాలూ వంటి వాటిని మాత్రమే కలిపితే చాలదు. మేనేజర్లూ, డైరెక్టర్లూ తీసుకునే జీతాల గురించి కూడా సరైన అవగాహనతో ఉండాలి.

ఇక్కడ, చాలా ముఖ్యంగా గమనించవలసిన అంశం ఏమిటంటే, 'జీతాల' గురించి పెట్టుబడిదారుడు చూపించే లెక్కల్ని యథాతథంగా తీసుకుని అదంతా 'అస్థిర పెట్టు బడే' అనుకోకూడదు. పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలంలో జీతాలమీద అయ్యే ఖర్చు అంతా 'ఉత్పాదక శ్రామికుల కోసం' అయ్యే ఖర్చు కాదు. ఆ జీతాలలో అనుత్పాదక జీతాలూ, ఏ శ్రమా చెయ్యని వాళ్ళు తీసుకునే దోపిడీ జీతాలూ కూడా ఉంటాయి. ఈ జీతాలన్నీ 'అస్థిర పెట్టు బడి'లోకి చేరదగ్గవి కావు. 'అస్థిర పెట్టుబడి' అన్నప్పుడు, ఉత్పాదక శ్రమల జీతాల్ని మాత్రమే చూడాలి. అలా చూసి నప్పుడే నిజమైన 'దోపిడీ రేటు' తెలుస్తుంది.

## ఇంకా కొన్ని అనుత్పాదక శ్రమలు

**కాపలా శ్రమ:** 'ఉత్పత్తి స్థలం'లో ఇంకా కొన్ని రకాల 'అనుత్పాదక శ్రమలు' ఉంటాయి. ఉదా: కాపలా శ్రమ. ఫ్యాక్టరీ గేట్ల దగ్గిరా, ఇతర చోట్లా, కాపలా మనుషులు (వాచ్‌మెన్) ఉంటారు. కార్మికుల్ని తనిఖీ చేసే సెక్యూరిటీ

గార్డులు ఉంటారు. ఇలాంటి శ్రమలన్నీ 'కాపలా శ్రమ' కిందికి వస్తాయి. ఫ్యాక్టరీలో వస్తువుల్ని కార్మికులు గానీ బయటి వాళ్ళు గానీ దొంగతనాలు చెయ్యకుండా చూడడమే వీరి పని. ఇది, ఉత్పత్తి క్రమానికి 'సహజ అవసరం' కాదు. ఇది 'దోపిడీ ఉత్పత్తి సంబంధాల' వల్ల పుట్టుకు వచ్చే అవసరం మాత్రమే. ఈ కాపలా శ్రమ అంతా — అనుత్పాదక శ్రమ. ఈ శ్రమ జరగడానికి కూడా కొన్ని ఖర్చులు అవుతాయి. కాపలా మనిషికి 'జీతం' ఇవ్వాలి. ఆ పనికోసం కొన్ని 'శ్రమ పరికరాలు' సమకూర్చాలి. ఈ ఖర్చులన్నీ — అనుత్పాదక ఖర్చులు. వీటిని, ఉత్పాదక శ్రామికుల అదనపు విలువలో నించి తీసి ఖర్చు పెట్టవలసిందే.

కాపలా మనుషులంతా అనుత్పాదక శ్రామికులు. అదనపు శ్రమని ఇస్తారు. దోపిడీకి గురి అవుతారు.

**ఫ్యాక్టరీ లాయరు శ్రమ:** పెట్టుబడిదారుడికి అవసరమయ్యే ఇంకో అనుత్పాదక శ్రమ ఇది. పెట్టుబడిదారుడికి, కార్మికులతో వచ్చే తగువుల్లోనూ, ఇతర పెట్టుబడిదారులతో వచ్చే తగువుల్లోనూ, ఈ లాయరు, పెట్టుబడిదారుడి తరపున, పని చేస్తాడు. దానికి బదులుగా పెద్ద పెద్ద మొత్తాలు ఫీజులుగా తీసుకుంటాడు. అందులో కొంత భాగం అతని శ్రమదీ, మిగతాదంతా దోపిడీదీ. అంటే, ఈ లాయరు కూడా 'అదనపు విలువ'లో భాగం తింటాడు.

**ఆడిటర్లు:** ఈ ఉత్పత్తి సంస్థ జమా ఖర్చులకు సంబంధించి ప్రభుత్వానికి చూపించవలసిన దొంగ లెక్కలు రాసే ఆడిటర్ల శ్రమ కూడా ఉత్పత్తి క్రమానికి అవసరం లేని అనుత్పాదక శ్రమే. ('ఉత్పత్తి క్రమాని'కి అవసరమైన లెక్కలు కూడా కొన్ని ఉంటాయి. ఆ లెక్కల పని ఆడిటర్లు చెయ్యరు. ఫ్యాక్టరీలోనే గుమస్తాలు చేస్తారు. ఆ లెక్కలు రాసే శ్రమ అయితే, 'ఉత్పాదక శ్రమ'లలోకే వస్తుంది. దీన్ని ఇంకో చోట చూస్తాము.)

ఈ రకంగా, పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలంలో ఉత్పాదక శ్రమలే గాక, అనుత్పాదక శ్రమలు కూడా ఉంటాయి. అసలు ఏ శ్రమా లేకుండానే (అనుత్పాదక శ్రమ అయినా లేకుండానే) పెద్ద పెద్ద జీతాలూ, ప్రత్యేక సౌకర్యాలూ తీసుకోవడం కూడా ఉంటుంది.

పెట్టుబడిదారుడి లెక్కల్లో 'ఉత్పాదక జీతాలు' అనీ, 'అనుత్పాదక జీతాలు' అనీ, వేరు వేరుగా ఉండవు. అన్ని రకాల జీతాల్నీ కలిపేసి (డైరెక్టర్ల జీతాల్నీ, సాధారణ కార్మికుల జీతాల్ని కూడా కలిపేసి) మొత్తం జీతాల కోసం అంత చెల్లించినట్టుగా చూపిస్తాడు. అలాగే, ఉత్పాదక సాధనాల్నీ, అనుత్పాదక సాధనాల్నీ కలిపేసి, మొత్తం ఉత్పాదక సాధనాలుగా చూపిస్తాడు. కానీ, అసలు విషయం — అన్ని రకాల జీతాలూ కలిసి — 'అస్థిర పెట్టుబడి' కాదు. ఉత్పాదక జీతాలు మాత్రమే — అస్థిర పెట్టుబడి. అలాగే, ఉత్పాదక సాధనాలు మాత్రమే — 'స్థిర పెట్టుబడి.'

'అనుత్పాదక' ఖర్చులన్నీ — 'అదనపు విలువ'లో భాగమే.

కాబట్టి, ఒక 'సరుకు విలువ'లో ఎంత అదనపు విలువ ఉందో తెలుసుకోవాలంటే ఏం చెయ్యాలంటే — అనుత్పాదక ఖర్చుల్ని ఉత్పాదక ఖర్చుల నించి విడదీసి లెక్కకట్టాలి.

<u>ఉత్పాదకంగా ఖర్చయ్యే సాధనాల విలువా, ఉత్పాదక కార్మికుల జీతాల విలువా — ఇదే ఉత్పాదక పెట్టుబడి.</u>

పెట్టుబడిదారుడు, ఆ 'సరుకు'ని అమ్మినప్పుడు దానికి 'విలువ'ని ఇచ్చిన అంశాలనే అమ్ముతున్నాడని అర్థం. అంతేగానీ, అనుత్పాదక ఖర్చుల్ని కూడా అమ్ముతున్నాడని అర్థం కాదు. అనుత్పాదక ఖర్చులన్నిటినీ అదనపు విలువలో నించి పెట్టవలసిందే.

ఉత్పత్తి స్థలంలో ఉండే అనుత్పాదక శ్రామికులు ఇచ్చే అదనపు శ్రమ, అనుత్పాదక శ్రమల మీద పెట్టవలసిన ఖర్చుని తగ్గించడానికి ఉపయోగపడుతుంది.ఈ అనుత్పాదక శ్రమలు తక్కువగా ఉంటే, వాటి కోసం ఖర్చులు తగ్గి, పెట్టుబడిదారుడికి అదనపు విలువలో నించి మిగిలే ఆదాయం ఎక్కువగా ఉంటుంది.

అనుత్పాదక ఖర్చులన్నీ 'ఆదాయం'లో నించే వెళ్తాయి — అనే విషయం, పెట్టుబడిదారుడి 'గృహ శ్రమల' విషయంలో కనపడినట్టుగా, ఉత్పత్తి స్థలంలో జరిగే అనుత్పాదక శ్రమల విషయంలో కనపడదు. పెట్టుబడిదారుడు, తన ఇంటి పనులు చేసే శ్రామికుల జీతాల్ని, తన 'ఆదాయం'లో నించే ఇస్తాడనే సంగతి పైకి స్పష్టంగానే తెలుస్తూ వుంటుంది. కానీ, ఉత్పత్తి స్థలంలో ఉండే అనుత్పాదక ఖర్చులన్నీ కూడా ఆదాయంలో నించే వెళ్తాయనే సంగతి పైకి తెలియదు. ఎందుకంటే, ఉత్పత్తి స్థలంలో ఏది ఉత్పాదక శ్రమో, ఏది అనుత్పాదక శ్రమో తెలీదు. అక్కడ జరిగే ప్రతీ శ్రమా, ఉత్పత్తికి సంబంధించిన అత్యవసరమైన శ్రమలాగే కనపడుతుంది. కాబట్టి, దాని ఖర్చు కూడా అవసరమైన ఖర్చులాగే కనపడుతుంది. కానీ, ప్రతీ ఖర్చునీ అలా తీసుకోకూడదు.

ఇప్పుడు మనం, 'ఉత్పత్తి స్థలం'లో ఉండే జీతాలన్నిటినీ కలిపి ఒక ఉదాహరణ చూడాలి.

మొత్తం ఖర్చులన్నిటినీ సరుకు కోసం అవసరమైన ఖర్చులు గానే అనుకుంటే, అప్పుడు అదనపు విలువ రేటూ, రాసీ తక్కువగా కనపడతాయి. ఖర్చుల్ని, ఉత్పాదక — అనుత్పాదక తేడాలతో చూస్తే, అసలైన అదనపు విలువ రేటూ, రాసీ తెలుస్తాయి. ఒక సరుకు విషయంలో

ఎంత అదనపు విలువ ఉందో తెలుసుకోవడానికి ఈ ఉదాహరణని అర్థం చేసుకోవడం చాలా అవసరం.

ఒక 'ఉత్పత్తి స్థలం'లో, ఉత్పాదక — అనుత్పాదక జీతాలన్నిటి మీదా కలిపి, మొత్తం 200 ఖర్చయిందను కుందాం. (ఇది ఒక రోజుకి అనుకోవచ్చు, వారానికి అను కోవచ్చు, నెలకి అనుకోవచ్చు, ఎలా అనుకున్నా ఒకటే.) ఆ జీతాల వివరాలు ఇవి: ఒక డైరెక్టర్ జీతం 35. (ప్రత్యేక సౌకర్యాల విలువ కూడా ఇందులో ఉన్నట్టు అర్థం.) ఒక మేనేజర్ జీతం 25. 6 గురు సూపర్‌వైజర్ల జీతాలు 55. కాపలా శ్రమలూ, లాయరు ఫీజులూలాంటి అనుత్పాదక ఖర్చు 20. ఉత్పాదక శ్రమల జీతాలు 65. ఈ జీతాలన్నీ కలిసి మొత్తం 200. తయారైన సరుకుని అమ్మిన తర్వాత, ఉత్పత్తి సాధనాల ఖర్చూ, ఈ 200 జీతాల ఖర్చూపోగా, అదనపు విలువ 210 మిగిలిందనుకుందాం. అప్పుడు, అదనపు విలువరేటు ఎంత?

అదనపు విలువ రేటు $= \frac{S}{V} = \frac{210}{200} \times 100 = 105\%$.

పెట్టుబడిదారుడు ఇచ్చే జీతాలన్నిటినీ 'అస్థిర పెట్టు బడి'గానే భావించి, అదనపు విలువ రేటుని చూస్తే, అది 105%గా వచ్చింది.

కానీ, సరుకు కోసం ఖర్చయిన జీతాలలోకి అనుత్పా దక జీతాల్ని కలపకుండా,'ఉత్పాదక జీతాలతో' మాత్రమే అదనపు విలువ రేటుని చూస్తే, అది ఎంత ఉంటుంది?

డైరెక్టరు జీతాన్ని, 'జీతాల' భాగం లోంచి తీసేసి, 'అదనపు విలువ' భాగంలో కలపాలి. 'అనుత్పాదక ఖర్చుల్ని' కూడా జీతాల భాగంలో నించి తీసేసి 'అదనపు విలువ భాగంలో కలపాలి. సూపర్‌వైజర్ల శ్రమలో కొంత భాగం 'ఉత్పాదక శ్రమ' గానూ, కొంత భాగం 'అనుత్పాదక శ్రమ' గానూ ఉంటుంది కాబట్టి, ఈ జీతాలుగా ఉన్న 55లో నించి 25ని మాత్రమే జీతాల భాగంలో ఉంచి, ఇంకో 30ని 'అదనపు విలువ' భాగంలో కలుపుదాం.

మేనేజర్ జీతాన్ని 3 భాగాలు చెయ్యాలి. ఒక భాగం ఉత్పాదక జీతం. ఒక భాగం అనుత్పాదక జీతం. ఒక భాగం ఏ శ్రమకీ సంబంధం లేని దోపిడీ జీతం. మేనేజర్ జీతంగా ఉన్న 25లో, ఉత్పాదక జీతం 5, అనుత్పాదక జీతం 5, దోపిడీ జీతం 15 అనుకుందాం. ఉత్పాదక భాగాన్ని 'జీతాల' భాగంలో ఉంచి, మిగతా 2 భాగాల్నీ 'అదనపు విలువ'లో కలపాలి.

లెక్కలన్నీ ఇలా విభజించుకున్నాక, అసలైన 'అస్థిర పెట్టుబడి' ఇలా ఉంటుంది: ఉత్పాదక శ్రామికుల జీతాలు 65 + సూపర్‌వైజర్ల జీతాలలో ఉత్పాదక భాగం 25 + మేనేజర్ల జీతంలో ఉత్పాదక భాగం 5 = 95. ఇదే అసలైన 'అస్థిర పెట్టుబడి'.

అసలైన అదనపు విలువ — ఇలా ఉంటుంది: మొదటి లెక్క ప్రకారం అదనపు విలువ 210 + డైరెక్టర్ జీతం 35 + అనుత్పాదక జీతాలు 20 + సూపర్‌వైజర్ల జీతాల్లో ఉన్న అనుత్పాదక భాగం 30 + మేనేజర్ జీతంలో ఉన్న అనుత్పాదక భాగం 5 + మేనేజర్ జీతంలో ఉన్న దోపిడీ భాగం 15 = 315. ఇదీ ఆ సరుకులో వున్న అసలైన అదనపు విలువ.

ఉత్పాదక — అనుత్పాదక జీతాలన్నిటినీ కలిపేసి లెక్క చూస్తే, 200 జీతాలు 210 అదనపు విలువని ఇచ్చినట్టుగా కనపడుతుంది. కానీ నిజానికి, 95 ఉత్పాదక జీతాలు, 315 అదనపు విలువని ఇచ్చాయి. ఒక సరుకు తయా రైందంటే, అక్కడ ఉత్పత్తి అయిన విలువ మొత్తం ఎలా చూసినా ఒక్కలాగే ఉంటుంది. దాని భాగాల గురించి చెప్పడంలోనే తేడాలు వస్తాయి.

200 జీతాలూ + 210 అదనపు విలువా = 410.
95 జీతాలూ + 315 అదనపు విలువా = 410.

ఇక్కడ ప్రశ్న — ఎంత జీతాలు ఎంత అదనపు విలువని ఇచ్చాయి — అనేది. 200 జీతాలు 210 అ.వి.ని ఇచ్చాయా; లేకపోతే, 95 జీతాలు 315 అ.వి.ని ఇచ్చాయా? ఇందులో ఏది నిజం? — ఉత్పాదక శ్రమలు మాత్రమే ఉత్పత్తికి కారణం కాబట్టి, ఇక్కడ 95 జీతాలు 315 అద నపు విలువని ఇచ్చాయి — అనేదే నిజం. అంతే గానీ, 200 జీతాలు 210 అదనపు విలువని ఇచ్చినట్టు అర్థం కాదు.

ఇప్పుడు 95 జీతాల్నీ, 315 అదనపు విలువనీ తీసు కుని, 'అదనపు విలువ రేటు' చూస్తే:

$\frac{S}{V} = \frac{315}{95} \times 100 = 332\%$. ఇదీ నిజమైన అదనపు విలువ రేటు!

ఏ పెట్టుబడిదారీ సంస్థలోనైనా జీతాల మీదా, సాధనాల మీదా ఖర్చవుతున్నట్టు కనపడే ప్రతీ అంశాన్నీ ఉత్పత్తి కోసం అవసరమైన ఖర్చులుగానే తీసుకుంటే, నిజమైన అదనపు విలువ రాసి తగ్గిపోయి కనపడుతుంది. ఉత్పత్తి క్రమానికి కావలసిన నిజమైన ఖర్చుల్ని మాత్రమే తీసుకోవాలి. పెద్ద పెద్ద ఉద్యోగుల జీతాల్లో ఎంత భాగాన్ని జీతాల భాగంలో ఉంచవచ్చునూ, ఎంత భాగాన్ని అదనపు విలువలోకి చేర్చవచ్చునూ — అనే విషయాల మీద ప్రత్యేక పరిశీలన ఉండాలి.

సూపర్‌వైజర్, ఇంజనీర్, కెమిస్ట్ — లాంటి కొన్ని రకాల ఉద్యోగాల్ని ఉత్పాదక శ్రమలు అనో, అనుత్పాదక శ్రమలు అనో, ఒక్కసారిగా నిర్ణయించి వెయ్యడానికి వీలు

లేదు. ఉత్పత్తి కోసం ఆ ఉద్యోగులు చేసే పని సహజంగా అవసరమా కాదా— అని ఆ 'ఉత్పత్తి క్రమాన్ని' బట్టి పరిశీలించి నిర్ణయించాలి. సూపర్‌వైజర్ చేసే పనిలో ఎంత భాగం నిర్వహణ శ్రమ కావచ్చు, ఎంత భాగం అజమాయిషీ శ్రమ కావచ్చు — అని పరిశీలించి, ఆ పాళ్ళతో ఆ జీతాన్ని విభజించి. మిగిలిన జీతాల సంగతి కూడా ఇలాగే.

'జీతాల' విషయంలోనే గాక, 'ఉత్పత్తి సాధనాల' విషయంలో కూడా ఉత్పాదక — అనుత్పాదక తేడాలు ఉంటాయని ఇంతకు ముందే చూశాం. 'కాపలా శ్రమ' జరగడానికి కావలసిన శ్రమ పరికరాలూ, అలాగే 'ఫ్యాక్టరీ లాయరు' శ్రమకి కావలసిన శ్రమ పరికరాలూ — వంటివి అన్నీ 'అనుత్పాదకమైన' ఖర్చులే. అంతేగాక, డైరెక్టర్లూ, మేనేజర్లూ వంటి పెద్ద ఉద్యోగుల ఆఫీసు ఖర్చుల్లో అధిక భాగం, అనుత్పాదకమైన ఖర్చులే. ఈ ఖర్చులన్నిటినీ పెట్టుబడిదారుడు మొదటపెట్టినా, వాటిని 'అదనపు విలువ' లోనించే వెనక్కి తీసుకోగలుగుతాడు. పెట్టుబడిదారుడు చూపించే లెక్కల్ని కార్మికులు యధాతధంగా తీసుకోకూడదు. 'అనుత్పాదక' ఖర్చులన్నిటినీ 'అదనపు విలువ' లోకే చేర్చాలి. ఈ అవగాహనతో పరిశీలించినప్పుడే నిజమైన అదనపు విలువ ఎంత ఉందో తెలుస్తుంది. లెక్కల్లో తప్పు జరిగితే, 'అదనపు విలువ' తగ్గిపోయి కనపడుతుంది.

'సమాజం'లో వేరు వేరు చోట్ల జరిగే శ్రమల్ని చూస్తూ, ఇప్పటి వరకూ — మొదట పెట్టుబడిదారుడి 'ఉత్పత్తి స్థలం'లో జరిగే ఉత్పాదక శ్రమల్నీ; తర్వాత వాడి 'ఇంటి దగ్గిర' జరిగే అనుత్పాదక శ్రమల్ని; తర్వాత కార్మికుల ఇళ్ళల్లో జరిగే శ్రమల్నీ; తర్వాత మళ్ళీ పెట్టుబడిదారుడి 'ఉత్పత్తి స్థలం'లో జరిగే మరికొన్ని ఉత్పాదక — అనుత్పాదక శ్రమల్నీ — చూశాం. ఇప్పుడు, తర్వాత విషయం చూడాలి.

# స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమలు

స్వతంత్ర ఉత్పత్తిదారులంటే ఎవరో మనకు ఇప్పటికే తెలుసు. తనకు యజమాని లేకుండానూ, తను ఇతరులకు యజమాని కాకుండానూ ఉండే ఉత్పత్తిదారుడే స్వతంత్ర ఉత్పత్తిదారుడు. (స్త్రీ అయినా, పురుషుడైనా.)

ఒక కుట్టు మనిషి, తన ఇంట్లోనే గానీ, ఒక అద్దె గదిలో గానీ కుట్టు మిషను పెట్టుకుని జనాలకు బట్టలు కుట్టి ఇస్తూ వుంటే, అతను స్వతంత్ర ఉత్పత్తిదారుడే. అతని శ్రమకి డబ్బు వస్తుంది. (ఆ శ్రమ, విలువగా మారిందని అర్థం.) ఆ డబ్బుతో తన పోషణ వస్తువుల్ని కొనుక్కుంటాడు.

చిన్న స్వంత భూమి మీద, శ్రామికులు లేకుండా 'స్వంత శ్రమ'తో సాగుచేసుకునే కుటుంబ సభ్యులు స్వతంత్ర ఉత్పత్తిదారులే. (స్వతంత్ర శ్రామికులు.)

ఒక వంట మనిషి, వేతన శ్రామికుడిగా ఒక యజమాని దగ్గిర చేరకుండా, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఎవరు పిలిస్తే వాళ్ళ దగ్గిరికి వెళ్ళి వంటలు చేస్తే, అతను స్వతంత్ర ఉత్పత్తిదారుడే.

ఒక కుట్టుమనిషి, ఒక రెడీమేడ్ దుస్తుల పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేస్తూ, తన తీరిక సమయాల్లో, తన ఇంటి దగ్గిరే బట్టలు కుట్టి ఇస్తే, అతను, వేతన శ్రామికుడూ, స్వతంత్ర ఉత్పత్తిదారుడూ కూడా.

స్వంత ప్రాక్టీసుచేసే చిన్న స్థాయి లాయర్లూ, ప్రైవేట్లు చెప్పే టీచర్లూ, రిక్షాలూ టాక్సీలూ లారీలూ స్వంత బాధ్యతతో నడుపుకునే డ్రైవర్లూ — స్వతంత్ర ఉత్పత్తిదారులే.

ఈ రకంగా, అన్ని రకాల శ్రమల్లోనూ స్వతంత్ర ఉత్పత్తిదారులు ఉంటారు.

స్వతంత్ర ఉత్పత్తిదారుడు ఏ శ్రమ చేసినా అది 'ఉద్యోగం' అవదు. 'ఉద్యోగం' అంటే, ఒక యజమాని దగ్గిర జీతం తీసుకుంటూ చేసేపని. యజమానీ శ్రామిక సంబంధం ఉన్నప్పుడే అది — ఉద్యోగం.

స్వతంత్ర ఉత్పత్తిదారుడు 'నేను ఒక ఉద్యోగం చేస్తున్నాను' అని చెప్పుకోడు. తను ఏ పని చేస్తూవుంటాడో ఆ పనిని మాత్రమే చెప్పుకుంటాడు.

పెట్టుబడిదారుడికి గానీ, శ్రామికులకు గానీ వర్తించే విషయాలు స్వతంత్ర ఉత్పత్తిదారులకు వర్తించవు. ఉత్పాదక — అనుత్పాదక విభజన సంగతి కూడా అంతే. వీరు కూడా సరుకుల్ని అమ్మే సరుకు యజమానులే అయినా, పెట్టుబడిదారులకు లాగా వీరికి ఉత్పాదక — అనుత్పాదక విభజన వర్తించదు. కానీ, స్వతంత్ర ఉత్పత్తిదారుడు, సమాజంలో ఉన్న పెట్టుబడిదారీ విధానపు ప్రభావం వల్ల, తన శ్రమని తనే ఉత్పాదక — అనుత్పాదక లక్షణాలతో విభజించుకుంటాడు. ఎలాగంటే: తన శ్రమని బయటికి అమ్మి, దాన్ని 'డబ్బు'గా మార్చుకుంటే, అది తనకి 'ఉత్పాదకంగా' ఉన్నట్టూ; లేదా తన శ్రమని తన కుటుంబ అవసరాలకే ఖర్చు చేసుకుంటే, దానిద్వారా డబ్బు రాదు గనక, అది 'అనుత్పాదకం' అయిపోయినట్టూ — భావి

స్తాడు. అంటే, తన శ్రమకు ఉండే 'విలువా — ఉప యోగపు విలువా' విభజనని, 'ఉత్పాదక — అనుత్పాదక' విభజనగా అర్థం చేసుకుంటాడు. స్వతంత్ర ఉత్పత్తిదా రులు కూడా శ్రమ సంబంధాల్నీ, శ్రమ లక్షణాల్నీ గ్రహించ లేరు. ప్రతీదాన్నీ పెట్టుబడిదారీ అవగాహనల ప్రకారమే చూస్తారు.

స్వతంత్ర ఉత్పత్తిదారుడు కూడా తన సరుకుల్ని అమ్ముకోవలసి ఉంటుంది కాబట్టి, ఆ క్రమాన్నంతా పెట్టుబడిదారీ పద్ధతిలోనే అర్థం చేసుకుంటాడు. అంటే — పెట్టుబడీ, జీతమూ, లాభమూ — అనే పద్ధతిలో. తన సరుకు కోసం పెట్టే మొదటి ఖర్చుని పెట్టుబడి అను కుంటాడు. తన పోషణ ఖర్చుని 'జీతం లాంటిది' అను కుంటాడు. సరుకుని అమ్మినప్పుడు, ఖర్చులు పోగా మిగిలే దాన్ని 'లాభం' అనుకుంటాడు. సరుకు ద్వారా పెట్టుబడిదారుడికి లాభం వచ్చినట్టే, తన సరుకు ద్వారా తనకూ లాభం వచ్చింది — అనుకుంటాడు. ఈ అవ గాహన అంతా తప్పే. సరుకుని అమ్మినప్పుడు, ఉత్పత్తి సాధనాల ఖర్చుని తీసివెయ్యగా మిగిలేదంతా ఉత్పత్తి దారుడి శ్రమే. ఎవరి శ్రమ ఫలితం వాళ్ళకి అందితే అది 'లాభం' అవదు. ఇతరుల శ్రమని దోచుకుంటేనే అది లాభం అవుతుంది. కాబట్టి, స్వతంత్ర ఉత్పత్తిదారుడికి సరుకుద్వారా వచ్చేదంతా, అతని స్వంత శ్రమ ఫలితమే. కానీ, ఇదంతా అతనికి తెలియదు. తనకు లాభంగా కన పడుతున్నది ఎక్కడినించో వచ్చింది కాదనీ, అది తన శ్రమే ననీ గ్రహించడు.

స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా సరుకు ఉత్పత్తి లోనూ, అమ్మకంలోనూ పెట్టుబడిదారుడు చేసే మోసాల న్నిటినీ అలవర్చుకుంటారు. పెట్టుబడిదారుడి సరుకులతో పోటీలో నిలబడాలంటే, ఆ మోసాలన్నీ అవసరమవు తాయి కూడా.

కేవలం అమ్మకం కోసమే సరుకుల్ని ఉత్పత్తిచేసే పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన దగ్గిర్నించి, స్వతంత్ర ఉత్పత్తిదారుల ఉత్పత్తులన్నీ కూడా (అవి 'వస్తువుల' రూపంలో ఉండేవైనా, 'పనుల' రూపంలో ఉండేవైనా), 'అమ్మకం' దృష్టితోనే తయారవడం ప్రారంభమవుతాయి. అంతకు పూర్వపు కాలంలో ఎంతో కొంత 'ఉపయోగపు విలువ' దృష్టితో సాగే మారకాలూ, విలువ లెక్కల ఖచ్చి తత్వం లేకుండానే ఒకరినించి ఒకరికి దొరికే కొన్ని రకాల పనులూ (వైద్యులూ, ఉపాధ్యాయులూ వంటి వారు చేసే పనులు కూడా), క్రమంగా 'అమ్మే — కొనే సరుకులుగా' అయిపోతాయి. ప్రతీ స్వతంత్ర ఉత్పత్తిదారుడూ, తన శ్రమని ఎప్పుడూ సరుకుగానే చూసుకుంటూ, దాన్ని ఉప యోగించినప్పుడల్లా, దానికి బదులుగా డబ్బు చేతిలో పడి పోవాలని ఆశిస్తాడు. డబ్బుదృష్టి లేకుండా తన శ్రమని వినియోగించే ప్రత్యేక సందర్భాలన్నిటినీ క్రమక్రమంగా వొదిలేసుకుంటాడు. అంటే, తన చేతిలో ఉన్న పనితో ఇతరులకు సహాయం చెయ్యడమూ, అలాగే ఇతరుల నించి సహాయం పొందడమూ అనే సహజ సంబంధాల్ని వదిలేస్తాడు. తనకు కావలసిన శ్రమలన్నీ కొనుక్కోవ డమూ, తన శ్రమని ఇతరులకు ఇవ్వవలసినప్పుడల్లా దాన్ని ఖచ్చితంగా డబ్బుకి అమ్మడమూ చేస్తాడు. ఈ రకంగా, స్వతంత్ర ఉత్పత్తిదారుడు కూడా, తన జీవితంలో ప్రతీ సంబంధాన్నీ 'డబ్బు సంబంధంగా' మార్చేసుకుం టాడు. 'డబ్బు సంబంధం' అంటే, శ్రమల్నీ వస్తువుల్నీ అమ్మే — కొనే సంబంధం. స్వతంత్ర ఉత్పత్తిదారుడికి, తన వస్తువుల వల్లా తన శ్రమవల్లా డబ్బు రాబట్టాలనే దృష్టి ఎక్కువైన కొద్దీ, అతను 'సరుకు డీలర్'గా మారే క్రమం తీవ్ర మవుతుంది.

ఎటుచూస్తే అటు ఉత్పత్తులన్నీ 'సరుకులుగా' మారి పోతున్న పెట్టుబడిదారీ ప్రపంచంలో, స్వతంత్ర ఉత్పత్తి దారుడికి కూడా పెట్టుబడిదారుడికి లాగానే 'డబ్బు రాసి'ని కూడబెట్టాలన్నదే ప్రధాన లక్ష్యంగా ఉంటుంది - కూడబెట్ట గలిగినా, లేకపోయినా.

పెట్టుబడిదారీ సమాజంలో ఉండే ఏ స్వతంత్ర ఉత్పత్తిదారుడైనా 'డబ్బు సంపాదన' కోసం తప్పనిసరిగా ఎక్కువ కాలం శ్రమించక తప్పదు. అందులోనూ నేత శ్రమా, కుట్టు శ్రమా — వంటి సాధారణ శారీరక శ్రమలు చేసే స్వతంత్ర ఉత్పత్తిదారులైతే, కుటుంబాల పోషణ కోసం మితిమీరిన శ్రమ చెయ్యడం తప్పనిసరి అవు తుంది.

కానీ, మేధాశ్రమలకు సంబంధించిన డాక్టర్లూ ఇంజ నీర్లూ వంటి స్వతంత్ర ఉత్పత్తిదారులు, మితిమీరిన శ్రమ చెయ్యకుండా కూడా అవసరాలకు తగినంతగా సంపా దించుకోగలరు. ఎందుకంటే, మేధాశ్రమల విలువలు, శారీరక శ్రమల విలువల కన్నా ఎక్కువగా ఉంటాయి కాబట్టి. కానీ, వీరు — తిండీ బట్టా, ఇల్లూ వాకిలీ వంటి సహజ అవసరాల్ని తీర్చుకోవడంతో సంతృప్తిపడరు. పెట్టు బడిదారుడికి లాగానే వీరికి కూడా 'డబ్బుని కూడబెట్ట డమే' (ఆస్తిని కూడబెట్టడం) ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. శ్రమ చెయ్యడం అనేది సహజ అవసరాల కోసంగాక, 'ఆస్తి సంపాదించడం కోసమే' అనే పెట్టుబడిదారీ అవగాహనే వీరికి అలవడుతుంది. పెట్టుబడిదారుడు, తన డబ్బు సంపాదన కోసం కార్మికుల్ని పీడిస్తూ వారితో మితిమీరిన

శ్రమ చేయించే విధంగానే, డబ్బు సంపాదించాలనే ఆరాటం గల స్వతంత్ర ఉత్పత్తిదారుడు తనని తనే హింసించుకుంటూ, విశ్రాంతి లేకుండా మితిమీరిన శ్రమ చేస్తాడు. డబ్బు పిచ్చి పట్టిన ఈ ఉత్పత్తిదారుడు, 'యజమాని' గానూ, 'సేవకుడి' గానూ - 2 భాగాలుగా విడిపోతాడు. యజమాని సేవకుణ్ణి ఆజ్ఞాపించినట్టే, ఈ వ్యక్తి తనని తనే ఆజ్ఞాపించుకుంటూ తనని తను ఎప్పుడూ శ్రమలో పడేసి ఉంచుకుంటాడు. డబ్బు కూడబెడుతూ త్వర త్వరగా 'ఆస్తులు' సంపాదించాలని ఆరాటపడతాడు. ఆ ఆరాటంతో క్రమ క్రమంగా తన 'పని స్థలం'లోకి వేతన శ్రామికుల్ని చేరుస్తూ, క్రమంగా చిన్న పెట్టుబడిదారుడిగా ('పెటీ బూర్జువా'గా) మారతాడు. తన ఉత్పత్తి స్థాయిని ఇంకా ఇంకా పెంచుకుంటూ పోగలిగితే, ఈ చిన్న పెట్టుబడిదారుడు క్రమంగా 'శ్రమని వదిలేసే' అసలు సిసలైన పెట్టుబడిదారుడిగా ఎదిగిపోతాడు.

ఈ రకంగా, స్వతంత్ర ఉత్పత్తిదారులలో ఒక రకం మనుషులు, పెట్టుబడిదారీ డబ్బు దృష్టి ప్రభావంతో, కొంతకాలానికి చిన్న పెట్టుబడిదారులుగానో, పెద్ద పెట్టుబడిదారులుగానో మారితే, ఇంకో రకం వ్యక్తులు ఇంకో రకపు ప్రభావాలలో చిక్కుకుంటారు. 'పెట్టుబడిదారీ ప్రపంచం'లో డబ్బు దృష్టి సరసనే 'ఆడంబరాల' దృష్టీ తప్పనిసరిగా ఉండేదే. ఈ ప్రభావాలలో వుండే స్వతంత్ర ఉత్పత్తిదారుడు, తన శ్రమలో చాలా భాగం సహజ అవసరాల కోసం గాక, కృత్రిమ అవసరాల కోసం వృధా చేస్తాడు. విలువైన సరుకులే వాడాలనీ, ఆడంబరమైన జీవితం గడపాలనీ, తహతహ లాడతాడు. తన ఆర్థిక పరిమితినీ, తన కుటుంబ అవసరాల్నీ, ఎంత మాత్రమూ పట్టించుకోడు. తన శ్రమ ఫలితాన్నంతా ఆడంబరాల మీదా, వ్యసనాల మీదా దుబారా చేస్తాడు. ఇదంతా పెట్టుబడిదారీ జీవిత విధానాన్ని అనుకరించే ధోరణి. (ఈ రకం ప్రభావాలలో ఉండేది స్వతంత్ర ఉత్పత్తిదారులే కాదు, వేతన కార్మికులు కూడా.)

పెట్టుబడిదారుడి దగ్గిర దోపిడీ డబ్బు ఉంటుంది కాబట్టి, వాడు ఎన్ని తప్పుడు మార్గాల్లో అయినా డబ్బుని ఖర్చు చెయ్యగలడు. వాడిని చూసి వాడి జీవిత విధానాన్ని అనుకరించడం వల్ల గానీ, సరుకుల పోటీలో నిలబడలేక పోవడం వల్ల గానీ — ఆ రకం పరిస్తితుల్లో చిక్కుకున్న స్వతంత్ర ఉత్పత్తిదారులు, క్రమక్రమంగా అప్పుల పాలై 'వేతన శ్రామికులు'గా మారిపోతారు.

> "పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే ప్రముఖంగా ఉండే సామాజిక వ్యవస్థలో, పెట్టుబడిదారీయేతర ఉత్పత్తిదారుడు కూడా (నాన్ కేపిటలిస్ట్ ప్రొడ్యూసర్) పెట్టుబడిదారీ అవగాహనలకు (కాపిటలిస్ట్ కన్సెప్షన్స్‌కి) లోబడి ఉంటాడు. వాస్తవికతని చక్కగా గ్రహించడంలో ప్రత్యేకతగల బాల్జాక్, తన 'రైతులు' ('లెపైజాన్స్') నవలలో ఈ విషయం చాలా సరిగ్గా చిత్రించాడు." — మార్క్స్ (కాపిటల్-3. పేజీ-39. మాస్కో ఎడిషన్, 1971)

మార్క్సు చెప్పిన ఈ మాటలు, స్వతంత్ర ఉత్పత్తిదారులకు ప్రతీ విషయంలోనూ వర్తిస్తాయి.

పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి అయ్యే 'మొత్తం ఉత్పత్తి రాసి'లో, స్వతంత్ర ఉత్పత్తిదారుల ఉత్పత్తి కూడా కలిసి ఉంటుంది. సమాజానికి ఉన్న కుట్టు అవసరాలు తీరడానికి, 1 రోజుకి, 'వెయ్యి' విలువగల కుట్టు పని కావలసి వస్తే, అందులో 900 కుట్టు పని పెట్టుబడిదారీ సంస్థల ద్వారానూ, 100 పని స్వతంత్ర ఉత్పత్తిదారుల ద్వారానూ జరుగుతుందనుకుందాం. స్వతంత్ర ఉత్పత్తిదారుల స్వంత కుటుంబాల కోసం 20 కుట్టుపని అవసరమనుకుందాం. అంటే, వారు 20 పనిని తమ కుటుంబాల కోసం చేసుకుంటూ, ఇంకో 80 పనిని బయట అవసరాల కోసం చేస్తారు. ఆ డబ్బుతో తమ కుటుంబాలకు కావలసిన ఇతర ఉత్పత్తులు సంపాదించుకుంటారు. ఇతర శ్రమల విషయం కూడా ఇంతే. పెట్టుబడిదారీ వైద్య సంస్థలూ, స్వతంత్రంగా ఉండే వైద్యులూ కలిసి, సమాజానికి ఉన్న వైద్య అవసరాల్ని తీరుస్తారు. ఈ రకంగా ప్రతీ శాఖలోనూ పెట్టుబడిదారీ సంస్థలూ, స్వతంత్ర ఉత్పత్తిదారులూ కలిసే సమాజ అవసరాల కోసం ఉత్పత్తి చేస్తారు.

అయితే, 'పెట్టుబడిదారీ సమాజం' అన్నప్పుడు, దాని ఉత్పత్తిలో అధిక భాగం, పెట్టుబడిదారీ సంస్థల ద్వారానే ఉత్పత్తి అవుతుంది కాబట్టి (స్వతంత్ర ఉత్పత్తిదారుల ద్వారా ఉత్పత్తి అయ్యే భాగం చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి), 'పెట్టుబడిదారీ సమాజం' గురించి చర్చించేటప్పుడు, స్వతంత్ర ఉత్పత్తిదారుల ఉత్పత్తిని లెక్కలోకి తీసుకోనక్కరలేదు. అందుకే, పెట్టుబడిదారీ సమాజంలో జరిగే ఉత్పత్తి అంతా 'ఉత్పాదక శ్రామికుల ద్వారానే జరుగుతుంది' అంటాము. 'మొత్తం సామాజిక ఉత్పత్తి రాసి' అన్నప్పుడల్లా, స్వతంత్ర ఉత్పత్తిదారుల ఉత్పత్తుల్ని కూడా లెక్కలోకి తీసుకుంటే, లెక్కలన్నీ గందరగోళం అవుతాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, దాని ఉత్పత్తి సంబంధాల్నీ పరిశీలించేటప్పుడు కార్మికులకూ పెట్టుబడిదారులకూ మధ్య జరిగే విషయాలే అవసరం. కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తికి సంబంధించిన వివరాలు చూసేటప్పుడు, స్వతంత్ర ఉత్పత్తిదారుల ఉత్పత్తుల్ని

వదిలివేసి, కార్మికుల ఉత్పత్తిని మాత్రమే ఆ 'సమాజ ఉత్పత్తి'గా తీసుకుంటాము.

స్వతంత్ర ఉత్పత్తిదారుల గురించి తెలుసుకోవలసిన ఇంకో ముఖ్యవిషయం ఉంది. ఈ ఉత్పత్తిదారుల శ్రమ ఫలితంలో కొంత భాగం ఎవరికీ పోదు కదా? వారి శ్రమ విలువ వారికే దక్కుతుంది కదా? అయినా, వీరు కూడా సాధారణంగా చాలా పేదతనంలోనే ఉంటారు. ఎందు చేత?

స్వతంత్ర ఉత్పత్తిదారుల పేదతనం, పెట్టుబడిదారీ సమాజంలో మరింత ఎక్కువ స్థాయిలో ఉంటుంది. ఎందుకంటే — పెట్టుబడిదారీ సరుకులతో పోటీ వల్ల! పెట్టుబడిదారుల దగ్గిర ఉన్నంత 'ఉత్పాదకశక్తి' స్వతంత్ర ఉత్పత్తిదారుల దగ్గిర ఉండదు. ఒక సరుకుని ఉత్పత్తి చెయ్యడానికి పెట్టుబడిదారుడి దగ్గిర 1 గంట కాలం పడితే, స్వతంత్ర ఉత్పత్తిదారుడి దగ్గిర 4 గంటల కాలం పడుతుందనుకుందాం. కానీ, ఆ సరుకుని అమ్మేటప్పుడు, పెట్టుబడిదారుడు అమ్మే విలువకే స్వతంత్ర ఉత్పత్తి దారుడు కూడా అమ్మాలి. అంటే, స్వతంత్ర ఉత్పత్తి దారుడు 4 గంటలు శ్రమ చేసినా అది 1 గంట శ్రమగానే లెక్కకి వచ్చి, 3 గంటల శ్రమకి ఏ విలువా రాకుండా అంత శ్రమ వృధా అయిపోతుంది. ఈ రకంగా పెట్టుబడి దారీ సరుకులతో పోటీవల్ల, స్వతంత్ర ఉత్పత్తిదారులు, ఎక్కువ శ్రమతో ఉత్పత్తి చేసిన తమ సరుకుల ద్వారా తక్కువ విలువనే సంపాదిస్తాడు. అందుకే రాత్రింబవళ్ళూ శ్రమ చేస్తూ కూడా పేదతనంలోనే ఉంటారు. (ఈ వివ రాలు తర్వాత వేరే సందర్భాల్లో కూడా కొంత చూస్తాము.)

# చిన్న పెట్టుబడిదారుడి పని స్థలంలో శ్రమలు

**ఒ**క పెట్టుబడిదారుడు, తన పని స్థలంలో, శ్రామి కులతోపాటు తను కూడా పని చేస్తే, అలాంటి వాడు చిన్న పెట్టుబడిదారుడు (పెటీ బూర్జువా). ఈ చిన్న పెట్టుబడి దారుడు క్రమంగా ఎక్కువ ఆస్తి సంపాదిస్తే, తను శ్రమ చెయ్యడం మానేస్తాడు. అది వేరే సంగతి. ఇక్కడ ఇంకా శ్రమ చేస్తూ వున్న పెట్టుబడిదారుణ్ణే తీసుకుంటాం. ఈ పని స్థలంలో జరిగే శ్రమల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవల సిందేమీ ఉండదు. అంతా పెద్ద పెట్టుబడిదారుడి పని స్థలంలో లాగే జరుగుతుంది.

మన నిత్యజీవితంలో, 'మధ్య తరగతి' అనే మాట ఒకటి తరుచుగా వాడుతూ ఉంటాం. ఎక్కువ ధనికులుగా గానీ, మరీ పేదలుగా గానీ ఉండని సెక్షన్లని, మధ్య తర గతిగా భావిస్తాం. కానీ మధ్య తరగతి అనే మాట గానీ, దానికి చెప్పుకునే అర్థం గానీ, శ్రమ సంబంధాల దృష్టితో చెప్పు కునేవి కావు. ఆ మాటలు కేవలం పైపై దృష్టితో మాట్లాడేవే.

'మధ్య తరగతి' అంటే, 'మధ్యలో ఉండే తరగతి' అనే కదా? 'మధ్యలో' అంటే ఏ యే వర్గాలకు మధ్యలో? దోపిడీ వర్గానికీ, శ్రామిక వర్గానికీ మధ్యలో. పూర్తిగా దోపిడీ వర్గంగా గానీ, పూర్తిగా శ్రామిక వర్గంగా గానీ ఉండనిదే మధ్య తరగతి. ఈ అర్థంతో చూస్తే పెటీ బూర్జువాయే — మధ్య తరగతి. స్వంత శ్రమ ద్వారా కొంత ఆదాయమూ, దోపిడీ ద్వారా కొంత ఆదాయమూ వచ్చే ఏ వ్యక్తి అయినా, ఏ కుటుంబం అయినా, పెటీ బూర్జువా కిందకే వస్తుంది. ఆ ఆదాయంలో, ఏ మార్గం ప్రధాన మార్గంగా ఉందీ అనేది లెక్కలోకి తీసుకోవాలి.

ఒక కార్మికుడికి జీతమే గాక, వడ్డీ ద్వారా కూడా కొంత ఆదాయం రావచ్చు. కానీ, జీతమే ప్రధాన ఆదాయం కావచ్చు.

ఒక టీచరుకి జీతమేగాక భూమి కౌలు ద్వారా కూడా కొంత ఆదాయం రావచ్చు.

ఒక డాక్టర్‌కి, జీతమే గాక, తన స్వంత ఆస్పత్రి ద్వారా కొంత లాభం రావచ్చు. — ఇలాంటి సందర్భాలన్నీ పెటీ బూర్జువాల కిందకే వస్తాయి. వారి ఆదాయాల్లో చాలా తేడాలు ఉండవచ్చు.

పెటీ బూర్జువగా ఉన్న వ్యక్తి, పూర్తిగా దోపిడీదారుడూ కాడు; పూర్తిగా శ్రామికుడూ కాడు. రెండూనూ. 'పెటీ బూర్జువా' అనే మాటలో కనపడే శ్రమ సంబంధం, 'మధ్య తరగతి' అనే మాటలో కనపడదు. అది, 'శ్రమ'కు సంబం ధించిన అర్థాన్ని ఇవ్వదు.

పెట్టుబడిదారీ సమాజంలో, స్వతంత్ర ఉత్పత్తి దారులూ పెటీ బూర్జువాలూ కూడా ఉంటారు. అయినప్ప టికీ, పెట్టుబడిదారీ సమాజం అన్నప్పుడు, శ్రమ చెయ్యని పెట్టుబడిదారులూ, వేతన శ్రామికులూ — ఇవే ప్రధాన వర్గాలు. జనాభాలో ఎక్కువ సంఖ్య ఈ 2 వర్గాల లోనే ఉంటారు. ఈ వర్గాల విభజన, గత సమాజాలలో లేనంత స్పష్టంగా పెట్టుబడిదారీ సమాజంలోనే ఏర్పడుతుంది.

# ప్రభుత్వాధీనం'లో శ్రమలు

'ప్రభుత్వం' కూడా ఒక పెట్టుబడిదారుడే. చాలా పెద్ద పెట్టుబడిదారుడు. ఈ పెద్ద పెట్టుబడిదారుడికి, అనేక వేల 'ఉత్పాదక' సంస్థలూ, అనేక వేల 'అనుత్పాదక' సంస్థలూ ఉంటాయి. ఉత్పాదక సంస్థలన్నీ పెట్టుబడి తోటీ, అనుత్పాదక సంస్థలన్నీ ఆదాయం తోటీ నడుస్తాయి. ఉత్పాదక సంస్థలు, పెట్టుబడిని పెంచుతూవుంటే, అనుత్పాదక సంస్థలు, ఆదాయాన్ని ఖర్చు చేస్తూ వుంటాయి.

ప్రభుత్వానికి వచ్చే ' ఆదాయం' 2 మార్గాల ద్వారా వస్తుంది. (1) దాని 'ఉత్పత్తి సంస్థల్లో' వచ్చే 'లాభాల' ద్వారా (2) మొత్తం సమాజంలో అన్ని వర్గాలనించి వచ్చే 'పన్నుల' ద్వారా. - ఈ 2 మొత్తాలూ కలిసి దాని ఆదాయం అవుతుంది.

## ప్రభుత్వం నడిపే ఉత్పాదక సంస్థలు':

ఏ సంస్థల ఉత్పత్తులనైతే ప్రభుత్వం 'సరుకులు'గా అమ్ముతుందో ఆ సంస్థలన్నీ ప్రభుత్వానికి 'ఉత్పాదక' సంస్థలు. ప్రభుత్వ ఫ్యాక్టరీలూ; ప్రభుత్వాధీనంలో ఉన్న గనులూ; రైళ్ళూ, బస్సులూ, షిప్పులూ, విమానాలూ వగైరా రాక పోకల సాధనాల్ని నడిపే సమస్త రవాణా పరిశ్రమా; తంతి — తపాలా పరిశ్రమా; విద్యుత్ సౌకర్యాల్ని ఏర్పరిచే విద్యుత్ పరిశ్రమా — వగైరాలన్నీ 'ఉత్పాదక సంస్థలు'. (ఇక్కడ ఒక విషయం గమనించాలి. 'ప్రభుత్వాధీనంలో ఫలానా ఫలానా సంస్థలు ఉంటాయి - అవి ఆ యా సంస్థల గురించి ఖచ్చితంగా చెప్పడానికి వీలు లేదు. అది, ఒక్కో దేశంలో ఒక్కో రకంగా ఉంటుంది. ఒక దేశంలో రవాణా పరిశ్రమ అంతా ప్రభుత్వాధీనం లోనే ఉండవచ్చు; ఇంకో దేశంలో ఆ పరిశ్రమలో అత్యధిక భాగం ప్రైవేటు పెట్టుబడిదారుల ఆధీనంలో ఉండవచ్చు. అలాగే ఇతర పరిశ్రమల విషయం కూడా. కాబట్టి, ప్రభుత్వాధీనంలో ఉండే పరిశ్రమలు — అన్నప్పుడు, దాన్ని ఆ యా దేశాల్లో ఉన్న దాన్ని బట్టి చూడాలి.)

ఈ పరిశ్రమల్లో ఒక్కొక్కటీ ఒక్కో రకం 'సరుకు'ని ఉత్పత్తి చేస్తాయి. రవాణా పరిశ్రమ - 'ప్రయాణ సౌకర్యం' అనే సరుకునీ, తంతి — తపాలా పరిశ్రమ, 'ఉత్తర ప్రత్యుత్తర సౌకర్యం' అనే సరుకునీ - ఇలా. ఈ సరుకుల్ని, ప్రభుత్వం, సమాజ జనాభాకి అమ్ముతుంది. (సమాజంలో ఉన్న పెట్టుబడిదారులకూ, ఉత్పాదక — అనుత్పాదక కార్మికులకూ, స్వతంత్ర ఉత్పత్తి దారులకూ.)

ప్రభుత్వం, 'ఆయుధాల్ని' ఉత్పత్తి చేయించి, వాటిని 'సరుకులు'గా అమ్మితే, ఆ సంస్థ — ఉత్పాదక సంస్థే. ఆయుధాల్ని ఉత్పత్తి చేసే శ్రమలు, మానవ సమాజానికి సహజంగా అవసరమైన శ్రమలు కాకపోయినా, ఆ శ్రమలు, 'సరుకుల్ని' ఉత్పత్తి చేసి, ప్రభుత్వానికి 'అదనపు విలువ'ని ఇస్తాయి కాబట్టి, అవి ఉత్పాదక శ్రమలే. ప్రభుత్వం ఇలాంటి సంస్థ లెన్నిటినో నడుపుతుంది.

ప్రతీ ఉత్పత్తి సంస్థా, కొంత 'పెట్టుబడి'తో పని చేస్తుంది. 'సరుకు'ని అమ్మిన తర్వాత 'పెట్టుబడి'ని వెనక్కి తీసుకుని, దానిమీద 'లాభాన్ని' కూడా తీసుకుంటుంది. ఆ లాభం, ప్రభుత్వానికి 'ఆదాయం'. అంటే ప్రభుత్వం కూడా, తన సంస్థల్లో పని చేసే కార్మికుల 'అదనపు విలువ'ని లాగుతుందని అర్థం. అందుకే ప్రభుత్వం కూడా ఒక 'దోపిడీదారుడే.'

ప్రభుత్వ ఉత్పాదక సంస్థలో, ఉత్పాదక కార్మికులే గాక, అనుత్పాదక కార్మికులు కూడా ఉంటారు. అంతా ప్రైవేటు పెట్టుబడిదారుడి సంస్థలో ఉన్నట్టే ఇక్కడ కూడా.

'ప్రభుత్వ సంస్థ'లో కూడా ఉత్పాదక కార్మికుల జీతాలు మాత్రమే — 'అస్థిర పెట్టుబడి.' అనుత్పాదక కార్మికుల జీతాలూ, ఇతర అనుత్పాదక ఖర్చులూ, డైరెక్టర్లూ మేనేజర్లూ వంటి పెద్ద ఉద్యోగుల జీతాల్లో అత్యధిక భాగాలూ, వాళ్ళ ఆఫీసు ఖర్చులూ, ఇవన్నీ ఆ సరుకు తాలూకు 'అదనపు విలువ'లో భాగాలే. కానీ, ప్రభుత్వ సంస్థల లెక్కల్లో కూడా అన్ని రకాల జీతాలూ కలిసిపోయి, 'జీతాలు' అనే లెక్క కింద ఉంటాయి. అలాగే, అన్ని రకాల ఖర్చులూ కలిసిపోయి 'ఉత్పత్తి సాధనాల' లెక్కకింద ఉంటాయి.

ప్రభుత్వ సంస్థల్లో 'లాభాలు' వచ్చినట్టు ఎప్పుడో గానీ చెప్పరు. ఈ సంస్థల అధికారులు చూపించే లెక్కల ప్రకారం, ఈ సంస్థలకు ఎప్పుడూ 'నష్టాలే' సంభవిస్తూ ఉంటాయి! కానీ ఆ లెక్కల్ని కార్మికులు ఎంత మాత్రమూ నమ్మకూడదు. ఆ లెక్కల్ని 'సరైన లెక్కలుగా' భావించ కూడదు. అధికారులు చూపించే లెక్కల్లో 'లాభాల్ని' చూపించకపోయినా, వడ్డీలూ, భూమి అద్దెలూ తప్పకుండా ఉంటాయి. అవి, 'అదనపు విలువ'లో భాగాలే. ఈ లెక్కల్లో ఉన్న అనుత్పాదక ఖర్చుల్నీ, బిల్డింగుల దొంగ అద్దెల్నీ, శ్రమతో సంబంధంలేని అబద్ధపు జీతాల్నీ, అధికారులు తినేసి ఇంకేవో పేర్లతో చూపించే దొంగ పద్దుల్నీ — ఈ రకంగా తప్పుడు లెక్కలన్నిటినీ పట్టుకుని లెక్కల్ని

తిరిగి రాస్తే, అదంతా 'అదనపు విలువే.' అంటే, 'నష్టాల్ని' చూపించే సంస్థల్లో కూడా ఎప్పుడూ 'అదనపు విలువ' ఉండి తీరుతుంది. అదంతా 'లాభాల రాసే'. కాబట్టి, పెట్టుబడిదారీ లెక్కల్లో ఎన్ని నష్టాలు చూపించినా, కార్మికులు వాటినే నమ్మి, వాటినే యథాతథంగా తీసుకోవడం గాక, ఏ అంశం ఏ భాగంలోకి చేరుతుందీ — అనే 'సరైన అవగాహన'తో వాటిని తిరిగి రాస్తే 'అదనపు విలువ రాసి' తెలుస్తుంది.

## ప్రభుత్వం నడిపే 'అనుత్పాదక' సంస్థలు:

ఏ సంస్థల ఉత్పత్తులనైతే ప్రభుత్వం సరుకులుగా అమ్మదో, ఆ సంస్థలన్నీ ప్రభుత్వ అనుత్పాదక సంస్థలు. ఈ సంస్థల్లో జీతాలూ, శ్రమ సాధనాల ఖర్చులూ అన్నీ ప్రభుత్వ 'ఆదాయం'లో నించే నడుస్తాయి. పోలీసూ, సైన్యమూ (నేల మీదా, నీటిలోనూ, ఆకాశం లోనూ తిరిగే సైన్యం అంతా), కోర్టులూ, జైళ్ళూ, పరిపాలనా రంగానికి చెందిన సమస్త ఆఫీసులూ, ప్రభుత్వం నడిపే ఆస్పత్రుల వంటి సంస్థలూ, మత సంస్థలూ — వగైరాలన్నీ ఇందులోకి వస్తాయి.

'వైద్యం చెయ్యడం' అనే శ్రమని తీసుకుంటే, అది మానవ సమాజానికి ఎప్పుడూ సహజంగా అవసరమైన శ్రమ. ప్రభుత్వ ధర్మాసుపత్రిలో ఉచితంగా వైద్యం చేస్తారనుకుందాం. ఆ వైద్యానికి బదులు రోగుల నించి డబ్బు తీసుకోరనుకుందాం. అంటే, అక్కడ వైద్యాన్ని 'సరుకుగా అమ్మడం లేద'ని అర్థం. ఆ ఆస్పత్రిని నడపడానికి కావలసిన ఖర్చునంతటనీ, 'ప్రభుత్వాదాయం'లో నించే పెట్టాలి. ఈ ధర్మాసుపత్రి, 'పెట్టుబడిని పెంచే' సంస్థగా గాక, 'ఆదాయాన్ని ఖర్చుచేసే' సంస్థగా ఉంటుంది. అందుకే అది — అనుత్పాదక సంస్థ.

ప్రభుత్వం నడిపే ఇంకో ఆస్పత్రిలో రోగులనించి డబ్బుని వసూలు చేసే విధానం ఉంటే, ఆ ఆస్పత్రి 'ఉత్పాదక సంస్థ' అవుతుంది. ఇక్కడ ఉత్పాదక శ్రమలుగా ఉండే వైద్య శ్రమలే ధర్మాసుపత్రిలో అయితే, అనుత్పాదక శ్రమలుగా ఉంటాయి.

పెట్టుబడిదారీ సమాజానికి ఉండే అవసరాలలో — సహజ అవసరాలూ, అసహజ అవసరాలూ కూడా ఉంటాయి.

ఉత్పాదక శ్రమల్ని తీసుకుంటే — వాటిలో సహజ శ్రమలూ, అసహజ శ్రమలూ కూడా ఉంటాయి.

అలాగే అనుత్పాదక శ్రమల్ని తీసుకుంటే — వాటిలో కూడా, సహజశ్రమలూ, అసహజ శ్రమలూ ఉంటాయి.

అంటే, పెట్టుబడిదారీ సమాజానికి శ్రమల గురించి, 'ఉత్పాదక — అనుత్పాదక' విభజనే గానీ (డబ్బుని పెంచు తుందా లేదా — అనే విభజనే గానీ), 'సహజ — అసహజ' విభజన ఉండదు.

ఇప్పుడు, ప్రభుత్వాధీనంలో ఉండే కొన్ని అసహజ విధుల్ని (అసహజ ఉద్యోగాల్ని) చూద్దాం.

**(1) సైనిక విధి:** ఇది 'యుద్ధాలు చేసే' పని. మనుషులు, ఒకళ్ళని ఒకళ్ళు కొట్టుకోవడమూ, చంపుకోవడమూ దీని లక్షణాలు. ఇది అసలు 'శ్రమే' అవదు. 'యుద్ధం చెయ్యడం' అనేది ఒక 'శ్రమ క్రమం' అవదు. మానవ సమాజానికి యుద్ధాలు చెయ్యడం సహజ అవసరం కాదు. వ్యవసాయం, నేతా, కుట్టూ, వైద్యం, బండి తోలడం — లాంటి శ్రమలలాగ, సైన్యానికి సంబంధించిన ఏ పనులూ ఏ విధులూ సమాజానికి సహజ అవసరాలు కావు. సమాజం దోపిడీ ఉత్పత్తి సంబంధాలతో ఉండడంవల్ల పుట్టుకువచ్చే వైరుధ్య పరిస్థితులే, 'యుద్ధాల్ని' సృష్టిస్తూ వుంటాయి. మానవ జాతి, 'జంతు దశ'లో ఉన్న ప్రాచీన కాలంలో, ప్రకృతి వనరుల కోసం, ఆటవిక తెగల మధ్య జరిగిన కొట్లాటల సంగతి వేరు. వాటిని వదిలేస్తే, 'దోపిడీ'తో పాటు ప్రారంభమైన యుద్ధాలు మాత్రం మానవ సమాజానికి సహజ అవసరం కాదు.

అలాగే, ' ఆయుధాల ఉత్పత్తి'ని చూస్తే, అవి ఆహార వేట కోసమో, క్రూరజంతువుల నించి ఆత్మరక్షణ కోసమో ఉపయోగపడే లక్ష్యంతో తయారయ్యేవి కావు. ఇవి కేవలం 'యుద్ధాల' కోసమే తయారవుతాయి. కర్రలూ కత్తులూ — దగ్గిర్నించీ, రక రకాల తుపాకులూ, ఫిరంగులూ, బాంబులూ, టాంకులూ, యుద్ధ నౌకలూ, యుద్ధ విమానాలూ, జలాంతర్గాములూ — వగైరా ఆయుధ సామాగ్రి అంతా ఇందులోకి వస్తుంది. ఈ ఉత్పత్తుల మీద పెట్టే శ్రమలూ, సైన్యంలో ఉండే శ్రమలూ, మానవ సమాజానికి పూర్తిగా అనవసరం. కానీ దోపిడీ సంబంధాలలో ఉన్న సమాజానికి ఇవి కూడా తప్పనిసరి అవసరమే.

'యుద్ధాలు' అంటే, సాధారణంగా కనపడేది, రెండు వేరు వేరు పరిపాలనా ప్రాంతాల (దేశాల) సైనికులు ఆయుధాలతో ఒకరి మీద ఒకరు పడి కొట్టుకుని చంపుకోవడం. సైనికులూ, సైనికులూ చంపుకోవడమే గాక, ఇతర జనాభాని కూడా చంపడం. ఏ దేశం, రెండో దేశాన్ని ఎక్కువ ధ్వంసం చేసి, వాళ్ళ జనాభాని ఎక్కువగా చంపి, వాళ్ళ భూముల్నీ వెండి బంగారాల్నీ ఎక్కువగా ఆక్రమించగలుగుతుందో ఆ దేశం జయించినట్టు లెక్క!

ప్రతీ దేశ ప్రభుత్వమూ తన జనాభాతో — "మన సరిహద్దుల్లో శత్రువులు పొంచి ఉన్నారు. వాళ్ళని చంపేసి మాతృ దేశాన్ని రక్షించండి!" అని చెపుతుంది. ఒక దేశ ప్రభుత్వం రెండో దేశం గురించి తన జనాభాకి ఏం చెపుతుందో, ఆ రెండో దేశ ప్రభుత్వం కూడా తన జనాభాకి ఈ దేశం గురించి అదే చెపుతుంది. ప్రభుత్వాలు చెప్పే

దాని ప్రకారం చూస్తే, అన్ని దేశాల జనమూ ఎప్పుడూ 'సరిహద్దుల్లోనే' ఉంటారనే అర్థానికి రావలసి వస్తుంది. ఈ ప్రభుత్వాలు చెప్పే దాంట్లో అబద్ధాలూ, నిజాలూ కూడా ఉంటాయి. శతృవులు సరిహద్దుల్లో పొంచి ఉన్నా లేక పోయినా, యుద్ధాలు జరిగేది మాత్రం 'శతృత్వాల'వల్లనే. మరి, ఆ శతృత్వాలు దేని వల్ల?

సమాజంలో ఉండే శతృత్వాలు 2 రకాలు. (1) దోపిడీ చేసే వర్గానికీ, దోపిడీకి గురి అయ్యే వర్గానికీ ఉండే శతృత్వం. (2) దోపిడీ చేసే వర్గంలోనే ఒక గుంపుకీ, ఇంకో గుంపుకీ ఉండే శతృత్వం. ఈ రెండో శతృత్వం ఎందుకంటే, సరుకుల ద్వారా వచ్చే అదనపు విలువని పంచుకునే వాళ్ళు, ఎవరికి వాళ్ళు ఎక్కువెక్కువ భాగాల్ని లాగాలని ఆశిస్తారు.

మొదటి అంశం మీదే, రెండో అంశం ఆధారపడి ఉంటుంది. మొదటి శతృత్వమే లేకపోతే, రెండో శతృత్వం కూడా ఉండదు. దోపిడీద్వారా అదనపు విలువని లాగడం ఉన్నప్పుడు, దాన్ని పంచుకోవడంలో ఘర్షణలూ శతృత్వాలూ తప్పనిసరిగా ఉంటాయి.

ఈ శతృత్వాలు, ఒకే దేశంలో వుండే దోపిడీ బృందాల మధ్యనే కాదు. వేరు వేరు దేశాల మధ్య కూడా ఉంటాయి. ఒక దేశంలో వున్న భూమినీ, ఇతర వనరుల్నీ ఆక్రమించడానికి ఇంకో దేశం ప్రయత్నిస్తుంది. అదే, దేశాల మధ్య శతృత్వాలుగా పరిణమిస్తుంది.

శతృత్వాలు 2 రకాలుగా ఉంటాయి కాబట్టి, యుద్ధాలు కూడా 2 రకాలుగా ఉంటాయి. (1) దోపిడీచేసే వర్గానికీ, దోపిడీకి గురి అయ్యే వర్గానికీ మధ్య జరిగే యుద్ధాలు. ప్రపంచ చరిత్రలో జరిగిన బానిస పోరాటాలూ, ఫ్యూడల్ కౌలు రైతుల పోరాటాలూ, కార్మిక పోరాటాలూ, ఈ కోవలోకి వస్తాయి. (2) దోపిడీ దారులలోనే ఒక గుంపుకీ, ఇంకో గుంపుకీ మధ్య జరిగే యుద్ధాలు. శ్రామిక వర్గం ఉత్పత్తి చేసే అదనపు ఉత్పత్తుల్నీ, ఉత్పత్తి జరగడానికి అవసరమైన భూమినీ ఇతర ప్రకృతి వనరుల్నీ, ఎవరికి వాళ్ళు ఎక్కు వెక్కువగా ఆక్రమించడం కోసం జరిగే యుద్ధాలు ఇవి. ఫ్యూడల్ ప్రభువుల మధ్యా, రాజుల మధ్యా, పెట్టుబడిదారుల మధ్యా జరిగే యుద్ధాలన్నీ ఈ కోవలోకి వస్తాయి.

దోపిడీ సమాజంలో ఈ 2 రకాల యుద్ధాలూ తప్పని సరి. దోపిడీదారులు, ఒక్కోసారి వాళ్ళలో వాళ్ళు పోట్లాడు కుంటారు. ఒక్కోసారి, అందరూ కలిసి 'శ్రామిక వర్గం'తో పోట్లాడతారు. ఒక్కోసారి ఈ 2 రకాల యుద్ధాలూ విడి విడిగా ఉండవు; కలిసిపోయి ఉంటాయి.

సమాజంలో ఉన్న ఒక 'ప్రత్యేక పరిస్థితి'లో (ఒక చారిత్రక దశలో) 'దోపిడీ వర్గం'లో ఉండే ఒక గుంపుకన్నా ఇంకో గుంపు — 'అభివృద్ధికర' భావాలతో ఉంటుంది — (పెట్టుబడిదారులు ఒక దశలో ఫ్యూడల్ భూస్వాముల కన్నా అభివృద్ధికరంగా ఉన్నట్టు.) దోపిడీదారుల్లో అభివృద్ధి కరంగా ఉన్న గుంపూ, శ్రామిక వర్గమూ కలిసి ఒక పక్కనా; దోపిడీదారుల్లో అభివృద్ధి నిరోధకంగా ఉండే రెండో గుంపు ఒక్కటీ ఒక పక్కనా ఉంటూ యుద్ధాలు జరుగుతాయి. ఇలాంటి యుద్ధం, ఒక వేపు దోపిడీ గుంపుల మధ్య జరిగే యుద్ధంగానూ; ఇంకో వేపు — దోపిడీ వర్గానికీ, శ్రామిక వర్గానికీ జరిగే యుద్ధంగానూ కూడా ఉంటుంది.

మొత్తం మీద దోపిడీ సమాజాల్లో యుద్ధాలు తప్పని సరి కాబట్టి, ఇక్కడ 'సైనిక విధి' తప్పనిసరి విధిగా ఉంటుంది. అలాగే, ఈ సమాజంలో ఆయుధాల ఉత్పత్తి, ఆహార ఉత్పత్తి కన్నా ఎక్కువ అవసరంగా ఉంటుంది.

సమాజం, తప్పుడు సంబంధాలతో (దోపిడీ సంబంధాలతో) ఉన్నంత కాలమూ, సమాజంలో ఈ యుద్ధాలూ, ఆయుధ ఉత్పత్తీ, సైనిక శ్రమలూ తప్పనిసరిగా అవసర మవుతూనే ఉంటాయి. శ్రామికవర్గం చేసే శ్రమలో ఎంతో భాగం ఈ అవసరాల కోసం వృధాగా ఖర్చుయిపోతూ ఉంటుంది.

సైనికులకూ, సైనికాధికారులకూ జీతాలలో చాలా తేడాలు ఉంటాయి. సైనికుల శ్రమలు, శారీరక శ్రమలు గానూ; సైనికుల్ని నడిపే సైనికాధికారుల శ్రమలు 'మేధా శ్రమలు'గానూ — ఉంటాయి. సైనికాధికారులు, దోపిడీ వర్గానికి డైరెక్టు ఏజంట్లు. అందుకే సైనికాధికారులకు పెద్ద పెద్ద జీతాలూ ఎక్కువ సౌకర్యాలూ ఉంటాయి.

సైనికుడి విధి — యుద్ధాలు చెయ్యడం. యుద్ధాల్లో, సైనికుడు, అవయవాలు పోగొట్టుకోవాలి. ప్రాణాలే పోగొట్టుకోవాలి. అది ప్రమాదవశాత్తూ జరిగేది కాదు. సైనికుడు చెయ్యవలసిన ఉద్యోగమే అది. యుద్ధాలు చెయ్యడం — అనే పనిని ఒక 'శ్రమ క్రమం' కింద లెక్క కట్టడం అర్థంలేని పని. దోపిడీదారులు, తమ లాభాల కోసం, కొందరు మానవుల్ని సైనికులుగా మార్చే నీచత్వానికీ దుర్మార్గానికీ తలపడతారు. మనుషుల్ని చంపే పనిని కూడా ఒక శ్రమగానూ, ఒక ఉద్యోగంగానూ వర్గీకరిస్తారు.

ఒక యుద్ధం జరిగేటప్పుడు దానికోసం డబ్బు ఖర్చవు తుందేగానీ డబ్బు పెరగదు. ఆ ఖర్చులన్నిటినీ ప్రభుత్వం తన ఆదాయంలో నించే పెట్టాలి. కాబట్టి, 'యుద్ధం చెయ్యడం' ఉత్పాదక శ్రమ కాదు — అనేది స్పష్టమే. అయితే, ఇది అనుత్పాదక శ్రమ అవుతుందా? ఉత్పాదక శ్రమ కానిది ఏదైనా అనుత్పాదక శ్రమ పేరు కిందకి రావలసిందే కాబట్టి, ఆ అర్థంలో మాత్రమే ఇది అనుత్పాదక శ్రమ. <u>నిజానికి ఇది శ్రమే కాదు.</u>

ఒక పని గురించి, అది ఉత్పాదక శ్రమగా ఉందా,

అనుత్పాదక శ్రమగా ఉందా — అని చూడాలంటే, మొదట అది 'శ్రమ అయి' ఉండాలి. ఆ తర్వాతే అది ఉత్పాదకమా, అనుత్పాదకమా — అనే ప్రశ్న.

యుద్ధాలు చెయ్యడం శ్రమ కాకపోయినా, అదీ ఒక శ్రమగానే చలామణీ అవుతోంది. అదీ ఒక ఉద్యోగం అయింది. దాన్ని ఆ పద్ధతిలోనే ఒక శ్రమగా తీసుకుంటే, ఈ శ్రమ, ఉత్పాదక శ్రమ కాదు కాబట్టి, అనుత్పాదక శ్రమల కోవలోకి వస్తుంది.

సైనికుల్ని, అనుత్పాదక శ్రామికులు అనుకుంటే, ఈ శ్రామికులు 'అదనపు శ్రమని' ఇస్తారా? — యుద్ధం అనేది ఒక శ్రమ క్రమమే కానప్పుడు, అక్కడ పని దినం పొడవులూ, అందులో అవసర కాలమూ, అదనపు కాలమూ కొలతలూ — ఎలా వర్తిస్తాయి? అనుత్పాదక వంట మనిషి శ్రమలో ఉండే అంశాలన్నీ సైనికుడి శ్రమకు కూడా యథాతథంగా వర్తిస్తాయని భావించకూడదు. సైనికుడు యజమాని కోసం అదనపు శ్రమని ఇచ్చినా ఇవ్వకపోయినా, యజమాని తెచ్చి పెట్టే యుద్ధంలో ప్రాణాలు మాత్రం ఇస్తాడు. ఏ అవయవాన్ని బలి ఇవ్వడానికైనా ఎల్లవేళలా సిద్ధంగా ఉంటాడు. యజమానికి అంతకన్నా ఇంకేం ఇవ్వాలి? ఈ ప్రాణ త్యాగాల ముందు అదనపు శ్రమ ఇవ్వడం ఒక లెక్కా?

సైనిక విధిని గురించి మార్క్సు ఇలా వివరిస్తున్నాడు:

> "సైనికుడు — సామాజిక ఉత్పత్తి క్రమంలో ఇన్సిడెంటల్ ఖర్చులకు చెంది ఉంటాడు. అనుత్పాదక శ్రామికులలో అత్యధిక సంఖ్య ఎలాగైతే భౌతికంగా (మెటీరియల్) గానీ, భావాలపరంగా (స్పిరిట్యువల్) గానీ, ఏమీ ఉత్పత్తి చెయ్యరో ఆ విధం గానే. తప్పుడు సామాజిక సంబంధాల (ఫాల్టీ సోషల్ రిలేషన్స్) కారణంగా మాత్రమే అవసరమూ ఉప యోగమూ (దోపిడీ వర్గానికి) అయ్యేటటువంటి వీరు (సైనికులు), సామాజిక చెడుగుల వల్ల మాత్రమే ఉనికిలో ఉంటారు."
>
> (అదనపు విలువ సిద్ధాంతాలు -1; పేజీ 289)

'ఇన్సిడెంటల్ ఖర్చులు' అనే మాటల్ని మనం ఈ సంపుటం లోనే, 2వ భాగంలో 'లాభం' చాప్టరులో చూశాం. పెట్టుబడిదారుడు ప్రభుత్వోద్యోగులకు ఇచ్చే లంచాల్ని ఇన్సిడెంటల్ — ఖర్చులుగా చెప్పుకున్నాం. 'లంచాలు' అనేవి, ఉత్పత్తి — తయారీకి అవసరం కాదు, కానీ పెట్టుబడిదారుడు ఆ ఖర్చులు పెట్టక తప్పదు. అలాంటి పనికి మాలిన ఖర్చులన్నీ ఇన్సిడెంటల్ ఖర్చులు. 'సైన్యం' మీదా 'ఆయుధాల' మీదా పెట్టే ఖర్చులన్నీ అలాంటి పనికిమాలినవే. అయినా దోపిడీ వర్గం, తమ ప్రయోజనాల కోసం ఆ ఖర్చులు పెట్టక తప్పదు. ఇవన్నీ ఉత్పాదక కార్మికుల అదనపు డబ్బులోవే.

**(2) 'నేర విచారణ' శ్రమలు:** దోపిడీ సమాజాల్లో 'సైనిక' శ్రమల తర్వాత, అదే కోవలోకి వచ్చే అసహజ శ్రమలు — 'నేర విచారణ' శ్రమలు.

'నేరాలు' అంటే — ఆస్తి కొట్లాటలూ, దొంగతనాలూ, వ్యాపార మోసాలూ, లంచగొండితనాలూ, మనుషుల్ని ఎత్తుకు పోవడాలూ, స్త్రీలపై దౌర్జన్యాలూ, హత్యలూ, మత కలహాలూ — వంటివన్నీ.

'నేరాల' గురించి, దోపిడీ సిద్ధాంత కర్తల అవగాహన ఏమిటంటే: మానవుడు దుర్మార్గుడు. వాడు ఎప్పుడూ నేరాలే చేస్తాడు. అందులోనూ పేదవాడైతే మరీ దుష్టుడు. వాడికి నేరాలే ఊపిరి. మానవుడంటూ ఉంటే, వాడి వెంట 'నేరం' ఉండక తప్పదు. కాబట్టి, నేర విచారణ శ్రమలూ, వాటికి కావలసిన సాధనాలూ వగైరాలన్నీ, మానవ సమాజానికి శాశ్వతమైన అవసరాలు. — ఇది దోపిడీ సిద్ధాంత కర్తల అవగాహన!

కానీ, దోపిడీ వ్యతిరేక అవగాహన ప్రకారం: దోపిడీ సమాజమే నేరాలకు పుట్టిల్లు. సమాజంలో ఉన్న మొట్ట మొదటి బ్రహ్మాండమైన నేరం - శ్రమ దోపిడీయే. అదే సమస్త నేరాలకూ సృష్టి కర్త. నేరం చెయ్యడం మానవుడి 'సహజ' లక్షణం కాదు. అది 'సామాజిక' లక్షణం. సమాజంలో దోపిడీ లేకుండా చేసుకోగలిగితే, నేరాలన్నిటినీ తీసివెయ్యవచ్చు. — ఇదీ దోపిడీ వ్యతిరేకుల అవగాహన!

'నేరం' 2 రకాల కారణాల వల్ల జరుగుతుంది. (1) ఇతరులకు హాని కలిగించైనా తన స్వప్రయోజనాలు సాధిం చాలనే దృష్టివల్లా (2) గత్యంతరంలేని పరిస్థితుల వల్లా. — నేరాలన్నీ ఈ 2 కోణాలలో దేనికో ఒక దానికి చెంది ఉంటాయి. దోపిడీ సమాజం, ఈ 2 రకాల నేరాలకూ కావలసిన 'పునాది'ని కల్పిస్తుంది.

దోపిడీ సమాజంలో — 'స్వంత ఆస్తి' ఉంటుంది కాబట్టి, మనుషుల మధ్య 'ఆస్తి కొట్లాటలు' తప్పనిసరిగా ఉంటాయి. 'వ్యాపారం' ఉంటుంది కాబట్టి 'వ్యాపార మోసాలు' తప్పనిసరిగా ఉంటాయి. ప్రకృతి పట్ల హేతు విరుద్ధ దృష్టిగల 'మతాలు' ఉంటాయి కాబట్టి, 'మత కలహాలు' తప్పనిసరి. 'డబ్బు' ఉంటుంది కాబట్టి, డబ్బు సంపాదన కోసం తప్పుడు ప్రయత్నాలు ఉంటాయి. 'పేదతనం' ఉంటుంది కాబట్టి దొంగతనాలు ఉంటాయి. స్త్రీ పురుషుల మధ్య 'అసమానతలు' ఉంటాయి కాబట్టి, స్త్రీలపై దౌర్జన్యాలు ఉంటాయి. — ఈ రకంగా, సమాజంలో కనపడే ఏ నేరాన్ని తీసుకున్నా, దాని వేళ్ళు 'దోపిడీ' లోకి చొచ్చుకుపోయి ఉంటాయి. దోపిడీ అనేది, నేరాలకు కావలసిన అన్ని రకాల పరిస్థితుల్నీ ఎప్పటికప్పుడు సృష్టిస్తూ, దాని కోసం అన్ని రకాల మార్గాల్నీ బాహాటంగా

తెరిచి ఉంచుతుంది. ఒక్క మాటలో, దోపిడీ అనేది ఎప్పుడూ 'నేరాల నారు' పాతి, దానికి నీరుపోసి పెంచుతూ ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త నారూ, కొత్త నీరూ! దోపిడీ సమాజం ప్రతీ క్షణమూ 'నేరాల పంట' పండిస్తూనే ఉంటుంది. ధాన్యం పంట అయితే, ఒక సారి పండితే ఒక సారి ఎండుతుంది. నేరాల పంటకి అలాంటి కరువు కాటకాల సమస్య ఉండదు. పెట్టుబడిదారీ సమాజంలో 'పోటీ' పెరిగిపోతున్న కొద్దీ, దానితో పాటు నేరాల పంట కూడా 'అభివృద్ధి చెందుతూ' ఒక సంవత్సరం కన్నా ఒక సంవత్సరం దాని దిగుబడి పెరిగిపోతూ ఉంటుంది.

విషయాల్ని పైపైనే చూసి అభిప్రాయాలు ఏర్పరుచుకునే పెట్టుబడిదారీ ఆలోచనా పరులకు — సమాజంలో శ్రమ చెయ్యకుండానే భోగభాగ్యాలు కూడబెట్టుకోవడం కన్నానూ, చిత్ర విచిత్రమైన వ్యాపార మోసాలు చెయ్యడం కన్నానూ, ఉన్నతోద్యోగులు వందల రెట్ల జీతాలు లాగడాల కన్నానూ — ఇలాంటి నిజమైన నేరాలకన్నా , కూటికీ గుడ్డకీ దారిలేని పేద శ్రామికుడో, పేద నిరుద్యోగో చేసే చిల్లర మల్లర దొంగతనాలే మహా నేరాలుగా కనపడతాయి. 'నేరం' అనగానే వెంటనే పేదలు చేసే దొంగతనాలే మొదటి కోవలోకి వస్తాయి. పేద జనాల శ్రమని యజమానులు దోపిడీచేసే విషయం ఏ నేరాల లిస్టులోకీ రాదు.

పెట్టుబడిదారులు చేసే నేరాలలో, 'గత్యంతరం లేక నేరం చెయ్యడం' అనే లక్షణం ఉండదు. అవి అన్నీ డబ్బు సంపాదన కోసమూ, పోటీ కోసమూ, ఆస్తిని పెంచడం కోసమూ చేసే నేరాలుగానే ఉంటాయి.

పేదలు చేసే నేరాలలో 'గత్యంతరం లేక నేరం చెయ్యడం' అనే లక్షణమే అత్యధిక సందర్భాలలో ఉంటుంది.

కొన్ని సందర్భాల్లో, నేరానికి ఉన్న రెండు కోణాలూ (గత్యంతరం లేక చెయ్యడమూ, స్వప్రయోజనం కోసం చెయ్యడమూ) కలిసిపోతాయి. అంటే పేదజనాలు కూడా చాలా 'స్వార్థం'తోటీ, దుర్మార్గంతోటీ నేరాలు చేసే సందర్భాలు కూడా ఉంటాయి. అయినప్పటికీ, పేదల ద్వారా జరిగే నేరాలు 'పేదతనం' వల్ల జరిగేవి అయినా, 'స్వార్థం' వల్ల జరిగేవి అయినా, అన్ని రకాల నేరాలకూ మూలం దోపిడీ సమాజమే. అది నేర్పిన మార్గాలే అవి.

ఎదటి వాడు సర్వనాశనం అయినా సరే, తనకే లాభం కలగాలనే స్వార్థ దృష్టితో జరిగే నేరాలన్నీ ధనికుల ద్వారానే జరుగుతాయి. ధనికులు చేసే నేరాలకు పేదలే పరికరాలుగా ఉంటారు. ఒక ధనికుడు, ఒక 'హత్య' చెయ్యాలనుకున్నప్పుడు, ఆ పని, పేద మనుషుల ద్వారానే చేయిస్తాడు. పేదలు చేసే అనేక నేరాలు, ధనికులు, తమ కోసం చేయించే నేరాలే. అవి పేదల కోసం కాదు, ధనికుల కోసమే జరుగుతాయి. కానీ, పేదల ద్వారా నేరాల్ని సృష్టించే పరిస్థితులు ఉన్నంత కాలమూ, వాటి చుట్టూ — పోలీసులూ, లాయర్లూ, కోర్టు మనుషులూ, జైలు మనుషులూ, ఉరి తీసే మనుషులూ — వగైరా కృత్రిమ శ్రమలన్నీ అవసరమవుతాయి. దోపిడీ ఉన్నంత కాలమూ ఈ శ్రమలన్నీ బతికి ఉంటాయి.

'దోపిడీ' అనే మౌలిక నేరమే నశించినప్పుడు, అది సృష్టించే సెకండరీ నేరాలన్నీ కూడా నశిస్తాయి. నేరాల్ని ఆశ్రయించి బతికి ఉన్న అసహజ శ్రమలూ, ఆ శ్రమలు జరగడానికి కావలసిన కోర్టులూ జైళ్ళూ, వాటికి సంబంధించిన శ్రమ సాధనాలూ — వగైరా సమస్త ఖర్చులూ అనవసరం అవుతాయి. ఒక్క మాటలో — నేరం లేనప్పుడు, 'నేర విచారణ' కూడా లేకుండా పోతుంది.

**(3) ఇతర అనుత్పాదక శ్రమలు:** ఇప్పుడు, సైన్యమూ కోర్టులూ జైళ్ళూగాక ఇంకా మిగిలిన ప్రభుత్వ ఆఫీసుల్ని చూస్తే, ఇందులో కూడా నూటికి తొంభై శ్రమలు అసహజ శ్రమలే. తాగే నీటినీ, వ్యవసాయానికి కావలసిన నీటినీ, సప్లయి చేసే నీటి పారుదలకు సంబంధించిన శ్రమలూ; రోడ్లనీ, పబ్లిక్ స్థలాల్నీ శుభ్రంచేసే శ్రమలూ — వంటివి తప్ప, 'పరిపాలన' పేరుతో జరిగే మిగతా శ్రమలన్నీ 'నూతన సమాజం'లో పూర్తిగా అనవసరమవుతాయి. ఆస్తుల అమ్మకాలూ రిజిస్ట్రేషన్లూ, ఉత్పత్తుల మీద పన్నుల వసూళ్ళూ వగైరా వ్యవహారాలకు సంబంధించిన శ్రమలన్నీ కూడా పూర్తిగా అనవసరమవుతాయి.

(పెట్టుబడిదారీ ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో ఉత్పత్తి సంస్థల లాభాల్నీ పన్నుల్నీ మాత్రమే చూశాం కదా? అందులోకి ఇంకా కొన్ని రాబడుల్ని కూడా కలపాలి. కోర్టులకు వచ్చే జనాలు చెల్లించే కోర్టు ఫీజులూ, ఆస్తి రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో చెల్లించే రిజిస్ట్రేసన్ ఫీజులూ — వంటి వాటిని కూడా.)

'దోపిడీ సమాజం'లో ప్రభుత్వాదాయం నించి జీతాలు పొందే ప్రెసిడెంటులూ, గవర్నర్లూ, కలెక్టర్లూ, మంత్రులూ, సైనికాధికారులూ, జడ్జీలూ, ఇతర ఉన్నతోద్యోగులూ - ఈ ఉద్యోగాలన్నీ - అనుత్పాదక ఉద్యోగాలే.

ఈ పెద్ద పెద్ద అధికారులంతా పెద్ద పెద్ద జీతాలు తీసుకుంటారు కాబట్టి, వీరంతా చాలా ఎక్కువ శ్రమలు చేస్తారా? 'జీతం' అంటే 'శ్రమ శక్తి విలువే'గాని 'శ్రమ విలువ' కాదు కదా? కాబట్టి, ఈ ప్రెసిడెంట్లూ, గవర్నర్లూ, మంత్రులూ తీసుకునే జీతాలు కూడా 'శ్రమశక్తి విలువలు' మాత్రమేనా? సాధారణ అనుత్పాదక శ్రామికులు, 'అదనపు శ్రమ'ని ఇస్తూ, దోపిడీకి గురి అవుతున్నట్టుగానే,

ఈ ప్రెసి డెంట్లూ, గవర్నర్లూ, మంత్రులూ కూడా అదనపు శ్రమని ఇస్తూ దోపిడీకి గురి అవుతారా? వీరికి 'న్యాయం' జరగా లంటే, వీరికి ఇంకా పెద్ద పెద్ద జీతాలు అందవలసి ఉంటుందా?—కాదు, ఈ అవగాహన అంతా చాలా తప్పు.

జీతం అంటే శ్రమశక్తి విలువ — అనేది 'జనరల్ సూత్రం'. ఒక జనరల్ సూత్రం, ప్రతీ ఒక్క ప్రత్యేక పరిస్థితికీ యధాతధంగా వర్తించదు. ప్రెసిడెంట్లూ గవర్నర్లూ— వంటి వాళ్ళు అసలు ఏ శ్రమా చెయ్యరు. వాళ్ళు చేసేది, 'అను త్పాదక శ్రమ' కూడా కాదు. వాళ్ళు శ్రమే చెయ్యరు గనక, 'అదనపు శ్రమ'ని పోగొట్టుకోవడం — అనే ప్రశ్నే ఉండదు. వాళ్ళకి అందే విలువలో, వాళ్ళ స్వంత శ్రమ ఫలితం అనేది ఒక్క అణువు కూడా ఉండదు. కాబట్టి, వాళ్ళ జీతాలు — పూర్తిగా దోపిడీ జీతాలే.

జడ్జీలూ, కలెక్టర్లూ — వంటివాళ్ళు కొంత శ్రమ చేస్తారు. అయినప్పటికీ, వీరి విషయంలో కూడా 'శ్రమశక్తి విలువ సూత్రం' వర్తించదు. ఎందుకంటే, వీరికి అందే జీతాలూ సౌకర్యాలూ కలిసిన మొత్తం విలువ — 'శ్రమ విలువ'ని కూడా దాటిపోతుంది. అంటే వీరి 'శ్రమ విలువ' అంతా వీరికి అంది, ఇంకా ఇతరుల 'అదనపు విలువ' నించి కూడా కొంత భాగం అందుతుంది. కాబట్టి, ఇవి కూడా చాలా భాగం దోపిడీ జీతాలే.

ఒక శ్రమకి బదులుగా, దానికి రావలసినదంతా తిరిగి రానప్పుడే దానినించి కొంతభాగం యజమానికి పోయి నట్టు అర్థం. అంతేగానీ, ఒక శ్రమకి బదులుగా ఎంత ఎక్కువ విలువ అందినా, ఆ వ్యక్తి ఎంత భోగభాగ్యాల్లో తుల తూగుతూ వున్నా, ఆ వ్యక్తి గవర్నరు అయినా ప్రెసి డెంట్ అయినా, అసలు ఆ వ్యక్తి శ్రమే చెయ్యకపోయినా, ఇలాంటి సందర్భాల్లో కూడా, ఆ వ్యక్తికి అందేదంతా శ్రమశక్తి — విలువేననీ, ప్రెసిడెంట్లూ గవర్నర్లూ కూడా అదనపు శ్రమని పోగొట్టుకుంటూ దోపిడీకి గురి అవుతారనీ — అర్థం కాదు.

ఇక్కడ ఉన్న విచిత్రమైన విషయం — అత్యల్పమైన శ్రమకే అత్యధిక జీతాలు! ఆ 'అల్ప' శ్రమ కూడా లేనిచోట ఊహాతీతమైన జీతాలు!

కాబట్టి, 'జీతం' ఉన్న ప్రతీ చోటా తప్పనిసరిగా శ్రమ ఉంటుందనీ, అదనపు శ్రమ కూడా ఉంటుందనీ, అర్థం కాదు. శ్రమ శక్తి వున్న చోట జీతం వుండవచ్చు. 'జీతం' వున్న చోట శ్రమ శక్తి వుండి తీరుతుందనుకో కూడదు.

'రాజ్యాంగానికి' సంబంధించిన ఉన్నతాధికారులంతా నిర్వహించే పాత్ర, దోపిడీకి అనుకూలమైన పాత్ర. అందుకే వీరికి 'సామాజిక అదనపు విలువ' నించి మితిమీరిన రాసి అందుతూ ఉంటుంది. వీరంతా శ్రామికుల శ్రమని తింటు న్నారని అర్థమే గానీ, వీరే తమ శ్రమని పోగొట్టుకుంటు న్నారని అర్థం కాదు.

ఇంతవరకూ పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలలో ఏది ఉత్పాదక శ్రమా — ఏది అనుత్పాదక శ్రమా — అనే విషయాలు చూశాం.

'ప్రభుత్వం'లో గానీ, 'ప్రైవేటు'లో గానీ పనిచేసే వారంతా — వేతన శ్రామికులే. కానీ, వేతన శ్రామికు లంతా ఉత్పాదక శ్రామికులు కారు. వారిలో, ఉత్పాదక శ్రామికులూ, అనుత్పాదక శ్రామికులూ కూడా ఉంటారు.

ఉత్పాదక శ్రామికులు ఉత్పాదక సంస్థల్లో (సరు కుల్ని ఉత్పత్తి చేసేచోట్ల) మాత్రమే ఉంటారు. ఇంకెక్కడా ఉండరు.

అనుత్పాదక శ్రామికులు — ఉత్పాదక సంస్థల్లోనూ అనుత్పాదక సంస్థల్లోనూ, ప్రైవేటు ఇళ్ళల్లోనూ (3 చోట్ల) ఉంటారు.

# మత సంస్థల్లో జరిగే శ్రమలు

గుళ్ళూ గోపురాలూ, సన్యాసి మఠాలూ — వంటి స్థలాల్లో కూడా కొన్ని రకాల శ్రమలు జరుగుతాయి. అక్కడ పూజా పునస్కారాలు చేస్తారు. ఆ స్థలాల్ని శుభ్రం చేస్తారు. భక్తుల కోసం ప్రసాదాలు తయారుచేస్తారు. ఆ గుళ్ళల్లోనూ మఠాల్లోనూ నివాసం ఉండే సన్యాసుల పోషణ కోసం రోజూ వంటా వార్పూ వంటి అనేక రకాల శ్రమలు అవసరమవుతాయి. ఆ స్థలాల్లో పూల తోటలూ, పళ్ళ తోటలూ కూడా పెంచుతారు. ఈ పనులన్నీ ఏకోవకు చెందుతాయి?

ఈ మత సంస్థల్ని నడిపే వాళ్ళు భక్తుల నించి అనేక రకాల ఛార్జీలు వసూలు చేస్తారు. ఉదా: భక్తులకు ఇచ్చే ప్రసాదాల్ని 'సరుకులు'గా ఉత్పత్తి చేసి, 'డబ్బు'కి అమ్మి, 'లాభాలు' సంపాదిస్తారు. అలాగే భక్తులకు నివాసాలు ఏర్పాటు చేసినందుకు, వారి నించి 'అద్దెలు' వసూలు చేస్తారు. ఇలాంటి సందర్భాల్లో ఆ శ్రమలన్నీ ఉత్పాదక శ్రమలే అవుతాయి.

ఒక గుడి గానీ, సన్యాసి మఠం గానీ, భక్తుల నించి తప్పనిసరిగా ఆదాయం సంపాదిస్తుంది. (ఆ భక్తులు కార్మి కులూ కావచ్చు, పెట్టుబడిదారులూ కావచ్చు.) ఒక సన్యాసి మఠం, భక్తుల విరాళాల ద్వారా ఆదాయం సంపా దించి ఆ ఆదాయాన్ని ఖర్చు చేస్తూ సన్యాసుల్ని ఉచితంగా పోషిస్తూ ఉంటుందనుకుందాం. ఆ మఠంలో జరగ

వలసిన పనులన్నీ 'జీతాల' పద్ధతి మీద కొందరు శ్రామికులు చేస్తారనుకుందాం. ఆ శ్రమలన్నీ అనుత్పాదక శ్రమలు అవుతాయి. మత సంస్థల్లో కూడా, ఆ శ్రమలు జరిగే సందర్భాల్ని బట్టే, వాటి విభజన ఉంటుంది.

# కొన్ని ప్రత్యేక ఉదాహరణలు

ఒకే శ్రమ (ఉదా॥ వంట) ఒక చోట 'ఉత్పాదక శ్రమగా' ఉంటే, ఇంకో చోట 'అనుత్పాదక శ్రమగా' ఉండ వచ్చు. మూడో చోట 'స్వతంత్ర శ్రమగా'.

ఈ విషయాలకు సంబంధించిన వేరు వేరు ఉదాహరణలు కొన్ని ఇప్పుడు చూస్తాం. ఇంటి పనులు చేసే కుటుంబ స్త్రీలూ, డాక్టర్లూ, బస్సు డ్రైవర్లూ, బ్యాంకు ఉద్యోగులూ, రచయితలూ, నటులూ, వేశ్యలూ — వీరి గురించి కొన్ని ప్రత్యేక విషయాలు చర్చించాలి. ఈ విషయాలన్నీ చూడడంవల్ల, నిత్య జీవితంలో ఎదురయ్యే దాదాపు అన్ని పరిస్థితుల్నీ అర్థం చేసుకోవడం సాధ్య మవుతుంది.

# 1) 'కుటుంబ శ్రమ' ఏ కోవకు చెందుతుంది?

స్త్రీలు గానీ, పురుషులు గానీ వాళ్ళ ఇంటి పనులు వాళ్ళే చేసుకున్నప్పుడు, అక్కడ ఉత్పాదక — అనుత్పాదక విభజన వర్తించదు. ఆ వ్యక్తులు ఆ శ్రమల్ని బయటికి అమ్మడం లేదు గనక, ఆ శ్రమలు 'డబ్బు'గా మారవు. అవి, వారికి 'ఉపయోగపు విలువలు'గానే ఖర్చవుతాయి.

శారీరక శ్రమల సెక్షన్ల స్త్రీలలో అధిక సంఖ్య, బయటి పనులు కూడా తప్పనిసరిగా చేస్తారు. కానీ బయటి పనులు చేస్తూ వున్నప్పటికీ, ఇంటి పనులన్నీ కూడా పూర్తిగా ఆ స్త్రీలే చేస్తారు.

పురుషులు - 'బయటి శ్రమలు' చెయ్యడమూ, స్త్రీలు - 'ఇంటి శ్రమలు' చెయ్యడమూ — అనేది, 'సమాజం'లో స్త్రీ — పురుషుల మధ్య వందల, వేల సంవత్సరాలనించి ఏర్పడి ఉన్న 'శ్రమ విభజన.' స్త్రీ పురుషుల మధ్య శ్రమ విభజన ఇలా ఎందుకు ఏర్పడిందనే విషయం గురించీ ఇక్కడ చర్చించలేము. స్త్రీ పురుషుల మధ్య ఈ నాటికీ కొనసాగుతూ వున్న శ్రమ విభజన మాత్రం ఇదే. దీని వల్ల, భార్యాభర్తల శ్రమ పరిస్థితులూ, శ్రమ సంబంధాలూ ఎలా ఉన్నాయి- అనేవే ఇప్పుడు పరిశీలించబోయే విషయాలు.

బయటి శ్రమ (ఉద్యోగం. ఎంత చిన్న స్థాయి కూలి పని అయినా అది ఉద్యోగమే.) చేసే స్త్రీల ఉదాహరణని తర్వాత చూస్తాం. ఇప్పుడు, మొదట 'ఇంటి పనులకు మాత్రమే పరిమితమై వుండే' స్త్రీల ఉదాహరణ చూద్దాం.

ఒక కుటుంబంలో, భార్యే ఇంటి పనులన్నీ చేస్తూ ఇంటికే పరిమితమై వుంటుందనీ, భర్త బయట ఏదో ఒక 'ఉద్యోగం' చేస్తాడనీ — అనుకుందాం. ఈ ఇద్దరి పరిస్థితులకూ తేడా ఏమిటి?

భర్త, బయట ఉద్యోగం చేస్తే, తన 'శ్రమ'ని ఒక యజమానికి అమ్ముతున్నాడని అర్థం. ఆ శ్రమ, యజమానికి ఉత్పాదక శ్రమగా ఉందా, అనుత్పాదక శ్రమగా ఉందా — అనేది, ఆ కార్మికుడికి అనవసరం. అతని శ్రమకి, యజమాని, డబ్బు (జీతం) ఇస్తాడు. భర్త శ్రమ, 'డబ్బు'గా ('విలువ'గా) మారుతుంది. ఆ డబ్బుతో భర్త, తనకీ, కుటుంబానికీ, పోషణ ఉత్పత్తులు కొనగలుగుతాడు.

భార్య సంగతి చూస్తే — భార్య, ఇంటి పనులన్నీ చేస్తుంది. అదంతా కూడా 'శ్రమే'. కానీ, ఆ శ్రమని ఆమె ఒక యజమానికి గానీ, లేదా బయట ఇంకొకరికి గానీ అమ్మడం లేదు. కాబట్టి, దానికి 'డబ్బు' రాదు. ఆ శ్రమ, డబ్బుగా మారదు. ఆ శ్రమతో పోషణ ఉత్పత్తులు కొనడం సాధ్యం కాదు. కానీ, ఆ శ్రమతో ఇంటిలో జరగవలసిన పనులన్నీ జరుగుతాయి. అంటే, భార్య శ్రమ 'విలువ'గా మారకుండా, 'ఉపయోగపు విలువ'గా ఖర్చవుతుంది. ఈ భార్య, ఉత్పాదక శ్రామికురాలు గానీ, అనుత్పాదక శ్రామికురాలు గానీ, స్వతంత్ర ఉత్పాదకురాలు గానీ, ఈ 3 రకాలలో ఏదీ అవదు. ఈ శ్రమ 'కుటుంబ శ్రమ'. దీనికి ఆ పేరే ఉంటుంది.

ఈ ఉదాహరణలో, భార్యా భర్తల 'శ్రమ సంబంధాలు' ఎలా ఉన్నాయి?

**భర్త విషయం:** ఈ వ్యక్తి, తన శ్రమతో (శ్రమవల్ల వచ్చిన డబ్బుతో) తనకీ, భార్యకీ, పిల్లలకీ కావలసిన 'పోషణ ఉత్పత్తులు' తెస్తున్నాడు. అందులో, అతని పోషణ, అతని బాధ్యతే. 'పిల్లల పోషణ'లో సగభాగం, తండ్రిగా అతని బాధ్యతే. ఈ 2 అంశాలే అతని బాధ్యత. కానీ, భార్య పోషణనీ, పిల్లల పోషణలో తల్లి నిర్వహించవలసిన సగ భాగాన్నీ కూడా భర్తే నిర్వహిస్తున్నాడు. అంటే భర్త, తన శ్రమతో తెచ్చే పోషణ ఉత్పత్తుల్లో సగ భాగాన్ని — తను నిర్వహించవలసిన బాధ్యతల కోసమూ; ఇంకో సగ భాగాన్ని — భార్య నిర్వహించవలసిన బాధ్యతల

కోసమూ, ఇస్తున్నాడని అర్థం.

**భార్య విషయం:** ఈమె, తనకీ, భర్తకీ, పిల్లలకీ కావలసిన ఇంటి పనులన్నీ చేస్తుంది. అందులో, ఆమె కోసం జరగవలసిన భాగం ఆమె బాధ్యతే. పిల్లల పెంపకానికి సంబంధించిన పనుల్లో కూడా సగ భాగం తల్లిగా ఆమె బాధ్యతే. ఈ 2 అంశాలే ఆమె బాధ్యత. కానీ, భర్తకి సంబంధించీ, పిల్లల పెంపకంలో తండ్రి నిర్వహించవలసిన సగ భాగానికి సంబంధించి కూడా భార్యే చేస్తుంది. అంటే, భార్య, తను చేసే ఇంటి పనుల్లో సగ భాగాన్ని — తను నిర్వహించవలసిన బాధ్యతల కోసమూ; ఇంకో సగ భాగాన్ని — భర్త నిర్వహించవలసిన బాధ్యతల కోసమూ, చేస్తుంది.

(ఇక్కడ, కుటుంబంలో ఉండే వృద్ధుల విషయం తీసుకోవడం లేదు. 'వృద్ధులు' అంటే, ఈ భార్యా భర్తల 'తల్లి తండ్రులే'. ఆ వృద్ధులు, తాము శ్రమచేసే కాలంలో, పిల్లల్ని (ఈ భార్యాభర్తల్ని) పోషించి పెంచారు కాబట్టి, ఆ పిల్లలు పెద్ద వాళ్ళయ్యాక తమ శ్రమలతో వృద్ధుల్ని పోషించి సంరక్షణ చెయ్యాలి. అది, తల్లిదండ్రుల నించి తీసుకున్న దాన్ని తల్లిదండ్రులకు ఇవ్వడమే. ఇందులో పిల్లలు వృద్ధుల కోసం ప్రత్యేకంగా చేస్తోన్నదేమీ లేదు. కాబట్టి, ఇక్కడ వృద్ధుల విషయం కలపడం లేదు. 'భార్యాభర్తల' విషయాలు చూస్తే, 'కుటుంబానికి' సంబంధించిన అన్ని విషయాలూ అందులోకే వస్తాయి.)

భర్త- ఆ కుటుంబానికి 'పోషణ ఉత్పత్తులు' తెస్తాడు.

భార్య- ఆ కుటుంబానికి 'ఇంటి పనులు' చేస్తుంది.

ఇవీ ఆ ఇద్దరి మధ్య ఉన్న శ్రమ సంబంధాలు. ఈ సంబంధాల్లో, భర్త శ్రమని భార్యా, భార్య శ్రమని భర్తా, ఉపయోగించుకుంటున్నారని అర్థం. అంటే, 'పోషణ ఉత్పత్తుల' కోసం — భార్య, భర్త మీద ఆధారపడి ఉంటే; 'ఇంటి పనుల' కోసం — భర్త, భార్య మీద ఆధారపడి ఉంటారు. ఇద్దరూ, ఒకరి శ్రమ మీద ఒకరు ఆధారపడి ఉంటారు.

అయితే, ఈ 'ఆధారపడడాల'లో, ఏది 'ప్రధానం;' ఏది 'సెకండరీ?' అంటే, ఏ విషయం మీద ఏ విషయం ఆధారపడి ఉంది? లేదా ఈ ఆధారపడడాలు రెండూ, ఒకే రకమైన, సమానమైన విషయాలా?

ఇక్కడ ఉన్న రకపు శ్రమ సంబంధాల్లో, ఏ విషయం మీద ఏ విషయం ఆధారపడి ఉందో అర్థం చేసుకుంటేనే, ఏది ప్రధానమో, ఏది సెకండరీయో అర్థం చేసుకోగలం: దాన్ని బట్టి, మార్పు ఎక్కడ జరగాలో, ఎలా జరగాలో కూడా అర్థం చేసుకోగలం.

మనుషులు జీవించడానికి కొన్ని శ్రమలు కావాలి. ఆ శ్రమలు జరగాలంటే, మొదట కొన్ని శ్రమ సాధనాలు కావాలి. ఆ సాధనాలు ఉంటేనే వాటి మీద సజీవ శ్రమలు జరుగుతాయి.

కుటుంబంలో, మొదట 'పోషణ వస్తువులు' ఉంటేనే, వాటిని వాడకానికి సిద్ధం చెయ్యడం ఉంటుంది. 'ఇల్లు' ఉంటేనే, దాన్ని శుభ్రం చెయ్యడం ఉంటుంది. 'బియ్యం' ఉంటేనే, దానితో వంట చెయ్యడం ఉంటుంది. 'బట్టలు' ఉంటేనే, వాటిని ఉతకడం ఉంటుంది. ఈ రకంగా, భార్య, 'ఇంటి పనులు' చెయ్యాలంటే మొదట, భర్త తెచ్చే 'పోషణ వస్తువులు' ఉండాలి. భార్య చేసే శ్రమలు జరగడానికి, ఆ పోషణ వస్తువులే 'శ్రమ సాధనాలు'గా ఉంటాయి. అవి లేకపోతే భార్య ఏ శ్రమా చెయ్యడం సాధ్యం కాదు.

భర్త విషయం చూస్తే — అతను, ఆ పోషణ వస్తువుల్ని సంపాదించడం కోసం చేసే శ్రమ, యజమాని దగ్గిర, ఏదో ఒక పని స్థలంలో జరుగుతుంది. (అది, 'సరుకు'ని ఉత్పత్తి చేసే చోట అయినా; లేదా, యజమాని ఇంటి దగ్గిర అయినా.) భర్త శ్రమ జరగడానికి అక్కడ శ్రమ సాధనాలు ఉండాలి. అంటే, భర్త శ్రమ, యజమాని దగ్గిర ఉండే 'శ్రమ సాధనాల' మీద జరుగుతుంది. భార్య చేసే 'ఇంటి పనుల' మీద కాదు. అంటే భార్య — శ్రమ జరగడానికి భర్త తెచ్చే పోషణ వస్తువులే శ్రమ సాధనాలుగా ఉన్నట్టుగా, భర్త — శ్రమ జరగడానికి భార్య చేసే ఇంటి పనులు, 'శ్రమ సాధనాలు'గా ఉండవు.

దీని అర్థం — భార్య చేసే ఇంటి పనులు, భర్తకోసం ఉపయోగపడడం లేదని కాదు. భార్య చేసే ఇంటి పనులు భర్తకోసం ఉపయోగపడుతున్నట్టే, భర్త తెచ్చే పోషణ వస్తువులు కూడా భార్య కోసం ఉపయోగపడుతున్నాయి. ఈ 'ఉపయోగ పడడాల'లోనే ఏది ప్రధానమో పరిశీలించే సందర్భం ఇది.

భార్య, 'ఇంటి పనులు' చెయ్యాలంటే, దానికన్నా ముందు, భర్త తెచ్చే 'పోషణ వస్తువులు' ఉండాలి.

భర్త, 'ఆ పోషణ వస్తువులు' తేవాలంటే, దాని కన్నా ముందు, యజమాని దగ్గిర 'శ్రమ సాధనాలు' ఉండాలి. (ఈ భర్తని ఉత్పాదక శ్రామికుడనీ, అతని యజమానిని పెట్టుబడిదారుడనీ అనుకుందాం.)

'ఇంటి పనులకు' పరిమితమైన భార్యకీ,

బయట 'ఉత్పాదక శ్రమ' చేసే భర్తకీ,

ఆ భర్తకి యజమాని అయిన పెట్టుబడిదారుడికీ — ఈ ముగ్గురికీ ఉండే సంబంధాలలో, మనం ఇక్కడ, భార్యా భర్తల మధ్య ఉండే శ్రమ సంబంధాలనే చూస్తున్నాము.

పెట్టుబడిదారుడి పని స్థలంలో సాధనాలు స్థిర పెట్టుబడిగా పనిచేస్తాయి కాబట్టి ఆ భాగాన్ని C అంటాం.

భర్త, ఇంటికి తెచ్చే సాధనాలు స్థిర పెట్టుబడి కాదు కాబట్టి, వాటిని C అనకూడదు. MP (మీన్స్ ఆఫ్ ప్రొడక్షన్) అందాం. భర్త శ్రమని అయినా, భార్య శ్రమని అయినా L (లేబర్) అందాం. ఇప్పుడు దేనికి ఏది ప్రారంభమో తెలుస్తుంది.

యజమాని దగ్గిర C + భర్త L = యజమాని దగ్గిర కొత్త సరుకు

ఇంటికి భర్త తెచ్చే MP + భార్య L = ఇంటి ఉపయోగపు విలువ.

భార్యాభర్తల శ్రమ సంబంధాల్లో,

మొదటి విషయం — భర్త శ్రమే. ఆ శ్రమ 'డబ్బు'గా మారుతుంది గనక, దానితో 'పోషణ ఉత్పత్తుల్ని' కొనడం సాధ్యం. భర్త శ్రమ జరిగితేనే కుటుంబానికి పోషణ ఉత్పత్తులు వస్తాయి. అంటే, భర్తకి, 'తన పోషణ ఉత్పత్తుల్ని తనే సంపాదించుకోవడం' అనే పరిస్థితి ఉంటుంది.

రెండో విషయం — భార్య శ్రమ. భర్త తెచ్చే పోషణ వస్తువులు ఉంటేనే, ఈ శ్రమ జరుగుతుంది. భార్య శ్రమ, 'డబ్బు'గా మారదు గనక 'తన పోషణ వస్తువుల్ని తనే సంపాదించుకోవడం' అనే పరిస్థితి భర్తకి ఉన్నట్టుగా భార్యకి ఉండదు. భర్త శ్రమే లేకపోతే భార్య శ్రమ జరగడానికి అవకాశమే ఉండదు.

అంటే, భార్య శ్రమ చెయ్యడం — అనేది, భర్త శ్రమ చెయ్యడం మీదే ఆధారపడి ఉంటుంది. అంతేగానీ, భర్త శ్రమ చెయ్యడం, భార్య శ్రమ చెయ్యడం మీద కాదు.

ఇద్దరూ ఒకరి శ్రమ మీద ఒకరు ఆధారపడి ఉన్నప్పటికీ, ఈ ఆధారపడడాలలో, భార్య, తన పోషణ కోసం, భర్త మీద ఆధారపడి ఉండడమే — ప్రధాన విషయం. భర్త, ఇంటి పనుల కోసం, భార్య మీద ఆధారపడి ఉండడం సెకండరీ విషయం. ఈ 2 విషయాలూ 'సమానమైన' విషయాలు కావు. మొదటి విషయం జరిగితేనే రెండోది జరుగుతుంది. అంతేగానీ, రెండో దాని వల్ల మొదటిది కాదు. దేని మీద ఏది ఆధారపడి ఉందో అర్థం చేసుకుంటే, ఒక 'సంబంధం'లో 'ప్రధాన — సెకండరీ' అంశాల్ని పట్టుకోగలం.

శ్రమ — 'డబ్బు'గా మారే పరిస్థితికీ, అలా మారని పరిస్థితికీ ఉండే తేడాయే, భార్యాభర్తల పరిస్థితుల్లో ఉండే తేడా.

భార్యతో పోలిస్తే, భర్త స్థితి — స్వతంత్రమైనది.

భర్తతో పోలిస్తే, భార్య స్థితి — అస్వతంత్రమైనది.

ఇది, భార్యా భర్తల మధ్య కొనసాగుతూ ఉన్న అసమానమైన శ్రమ విభజన. దీని వల్ల, భార్య, తన పోషణ కోసం భర్తపై ఆధారపడి ఉంటుంది. భార్యపై భర్తకి, 'పోషకుడిగా' అధికారం ఏర్పడుతుంది. భార్య, భర్త అధికారానికి లోబడి ఉండవలసి ఉంటుంది.

అయితే, ఈ 'పోషణ' సమస్య వల్ల ఏర్పడే సంబంధం, 'శ్రమ దోపిడీ సంబంధం' లాంటిది కాదు.

'శ్రమ దోపిడీ' సంబంధంలో — యజమాని, శ్రామికులకు 'ఉద్యోగాలు ఇచ్చే' వ్యక్తి గానూ; శ్రామికులు, యజమాని దగ్గిర జీతాలకు పని చేసే వ్యక్తులు గానూ ఉంటారు. ఈ సంబంధంలో, యజమానే శ్రామికుల నించి కొంత శ్రమని దోపిడీ చేస్తాడు గానీ, శ్రామికులు యజమాని నించి ఏ శ్రమనీ తీసుకోరు.

కానీ, భార్యాభర్తల 'శ్రమ సంబంధం'లో — భర్త, భార్యకి — ఉద్యోగం ఇచ్చే యజమాని గానీ; భార్య, భర్త దగ్గిర జీతానికి పనిచేసే శ్రామికురాలు గానీ — కారు. ఈ సంబంధంలో, ఎప్పుడూ భార్య శ్రమనే భర్త తీసుకోవడం జరగదు. భర్త శ్రమని భార్య కూడా తీసుకుంటుంది. ఇద్దరూ ఒకరి శ్రమని ఒకరు తీసుకుంటారు. కాబట్టి, ఇది, 'ఎప్పుడూ శ్రామికుల శ్రమనే యజమాని తీసుకోవడం' అనే రకపు సంబంధం కాదు.

భార్యాభర్తలు, శ్రమ దోపిడీ సంబంధాలలో ఉండే యజమానీ సేవకులు కారు.

కానీ, భార్యాభర్తల సంబంధం కూడా ఇంకో రకమైన 'యజమానీ సేవకుల' సంబంధమే. ఎలాగంటే: భార్యాభర్తల సంబంధం — 'కుటుంబ సంబంధం'. ఆ కుటుంబం, అసమాన పరిస్థితుల్ని ఏర్పరిచే శ్రమ విభజనతో ఉన్న కుటుంబం. ఆ శ్రమ విభజన — దోపిడీ ఉత్పత్తి సంబంధాల పునాది మీద ఏర్పడి ఉన్న శ్రమ విభజన. ఇలాంటి 'అసమాన శ్రమ విభజన' గల కుటుంబంలో — భర్తే యజమాని. భార్య, ఆ యజమానికి లోబడి ఉండే సేవకురాలు. ఈ రకంగా, భార్యాభర్తల సంబంధం కూడా ఒక రకంగా యజమానీ సేవకుల సంబంధమే.

అయితే, ఈ సంబంధంలో, భర్త, భార్య నించి అదనపు శ్రమని సంపాదించే యజమానిగానీ; భార్య తన అదనపు శ్రమని పోగొట్టుకునే సేవకురాలు గానీ — కాదు. ఈ సంబంధం, శ్రమ దోపిడీ జరిగే వర్గాల సంబంధం లాంటిది కాదు. అయినప్పటికీ, ఈ సంబంధం, దోపిడీ సమాజంలో స్త్రీ పురుషుల మధ్య అసమాన శ్రమ విభజన వల్ల ఏర్పడినదే కాబట్టి, ఈ సంబంధంలో ఉండే భార్యాభర్తలు 'కుటుంబ పరిధిలో ఉండే యజమానీ సేవకులు' అవుతారు.

భార్యాభర్తల శ్రమ సంబంధాల్ని అర్థం చేసుకోవడంలో, సాధారణంగా రక రకాల తప్పులు జరుగుతూ వుంటాయి.

**మొదటి** తప్పు: భార్యాభర్తలిద్దరూ ఒకరి మీద ఒకరు ఆధారపడి వుంటారు కాబట్టి, వారు సమానులు. వారి

మధ్య వున్న శ్రమ విభజన చాలా ఉన్నతమైనది. అందులో మార వలసిందేమీ లేదు. — ఈ అభిప్రాయం తప్పు ఎందుకు అవుతుందో మనకు ఇప్పటికే తెలుసు. భార్యా భర్తలు, ఒకరి మీద ఒకరు ఆధారపడి వున్నా, వారి పరి స్తితులు సమాన పరిస్తితులు కావు. ఈ పరిస్తితులు సమాన పరిస్తితులుగా వున్నాయని చెప్పే వాదం, ఈ పరిస్తితులు మారనక్కరలేదని చెపుతోందన్న మాట!

**రెండో** తప్పు: ఈ వాదం ఇలా ఉంటుంది: "భార్య శ్రమ జరగాలంటే భర్త తెచ్చే పోషణ వస్తువులు ఉండవలసిందే, నిజమే. అయితే, భర్త శ్రమ జరగాలంటే, అతనికి 'శ్రమ శక్తి' ఏర్పడడం కోసం, అంతకు ముందే భార్య చేసే ఇంటి పనులన్నీ జరగాలి. భార్య శ్రమ లేకపోతే భర్తకి శ్రమ శక్తే ఏర్పడదు కాబట్టి, భార్య శ్రమే ప్రధాన విషయం. భర్త శ్రమ సెకండరీ విషయం" — ఇది కొత్త వాదం లాగా కనపడినా, సారాంశంలో ఇదీ మొదటి వాదం లాంటిదే.

భర్తకు 'శ్రమ శక్తి' ఏర్పడాలంటే, దాని కన్నా ముందు భార్య శ్రమ ఉండాలి — అనేటట్టయితే, ఆ వాదం అక్కడే ఆగదు. మరి, భార్యకు శ్రమ శక్తి ఏర్పడాలంటే? భార్యకు శ్రమశక్తి ఎలా ఏర్పడుతుంది? ఆమెకు కూడా, ఆమె ఏ పనులు చెయ్యాలో ఆ పనులు చేసే 'శ్రమ శక్తి' ఏర్పడా లంటే, దానికన్నా ముందు భర్త తెచ్చే పోషణ వస్తువులు ఉండొద్దా? — ఇక ఈ వరస ఎలా వెనక్కి వెనక్కి సాగు తుందంటే:

భర్త శ్రమ కన్నా ముందు, భార్య శ్రమ ఉండాలి.

భార్య శ్రమ కన్నా ఇంకా ముందు, భర్త శ్రమ ఉండాలి.

భర్త శ్రమ కన్నా మరీ ముందు, భార్య శ్రమ ఉండాలి.

ఈ రకంగా, వెనక్కి వెనక్కి పోతూ ఉండాలి. ఎంత వెనక్కి పోయినా 'ప్రారంభం' దొరకదు. ఆ భార్యాభర్తలకు ఇంకా 'పెళ్ళి' కాని దశ దగ్గరికి వెళ్ళినా పరిస్తితి మారదు. ఆ భార్యకి, పెళ్ళి కాక ముందు పోషణ వస్తువులన్నీ తండ్రి ద్వారా (పురుషుడి ద్వారా) అందితే; ఆ భర్తకి, పెళ్ళికాక ముందు ఇంటి పనులన్నీ తల్లి ద్వారా (స్త్రీ ద్వారా) అందినట్టు తెలుతుంది. అంటే అక్కడ కూడా స్త్రీ పురుషుల మధ్య అదే పరిస్తితి! 'పురుషుడికి శ్రమ శక్తి ఏర్పడాలంటే అంత కన్నా ముందు స్త్రీ శ్రమ ఉండాలి' అనే వాదం ప్రకారం, 'ఆ శ్రమ చెయ్యవలసిన స్త్రీకి శ్రమ శక్తి ఏర్పడాలంటే అంత కన్నా ముందు పురుషుడి శ్రమ ఉండొద్దా?' అనే ప్రశ్న, ప్రత్యక్ష మవుతూనే ఉంటుంది. ఏ శ్రమ ప్రధానమో, ఏ శ్రమ సెకండరీయో, ఏ శ్రమ మీద ఏ శ్రమ ఆధారపడి ఉందో గ్రహించడం ఎప్పటికీ సాధ్యం కాదు. అంటే, ఈ వాదమే తప్పన్న మాట!

శ్రమ చేసే మనిషి స్త్రీ అయినా, పురుషుడైనా; ఆ శ్రమ — ఇంటి పని అయినా, బైటి పని అయినా; అసలు ఒక శ్రమ జరగాలంటే, దానికోసం కావలసింది — (1) శ్రమ సాధ నాలూ — (2) శ్రమ చేసే మనుషులూ మాత్రమే. అంతేగానీ, ఆ శ్రమ చేసే మనుషులకు 'శ్రమ శక్తి' ఎలా ఏర్పడిందనే దానితో అక్కడ సంబంధం ఉండదు.

ఇంట్లో, భార్య శ్రమ జరగాలంటే, భర్త తెచ్చే పోషణ వస్తువులు అప్పటికే సిద్ధంగా ఉండాలి. బయట, భర్త శ్రమ జరగాలంటే, దానికి, బయట యజమాని సమకూర్చే సాధనాలు సిద్ధంగా ఉండాలి.

భార్యా భర్తలిద్దరినే తీసుకున్నప్పుడు, వారి శ్రమ సంబంధాలలో, భర్త శ్రమే — ప్రధాన విషయం. భర్త 'పోషణ వస్తువులు' తెస్తాడు కాబట్టి, భర్తకి 'కుటుంబ పోషకుడి'గా అధికారం ఏర్పడుతుంది. భార్య, ఆ అధి కారానికి లోబడే స్తితిలో ఉంటుంది.

అయితే, దీనికి పరిష్కారం ఏమిటి? — భార్యాభర్తల శ్రమ పరిస్థితులు, 'సమాన పరిస్థితులుగా' ఏర్పడడమే పరిష్కారం. అంటే, డబ్బు సంపాదించే పరిస్తితులు భర్తకు ఉన్నట్టే, భార్యకు కూడా ఉండాలి. ఇది మొదట జరగ వలసిన మార్పు.

ఈ మార్పు ఎలా జరగాలి? భార్యకి డబ్బు ఎలా రావాలి? ఆమె చేసే పనులకు భర్త 'జీతం' ఇవ్వాలా? — అలా ఇవ్వవలసిన అవసరం భర్తకేం ఉంటుంది? భర్త, భార్య నించి ఇంటి పనుల్ని ఉచితంగా తీసుకోవడంలేదు. దానికి బదులుగా తను ఆమెకి పోషణ వస్తువులు ఇస్తున్నాడు. కాబట్టి, భార్యకి జీతం ఇవ్వవలసిన బాధ్యత భర్తకి ఉండదు.

ఒకవేళ ఉదాహరణ కోసం — భార్యనించి తీసుకునే 'ఇంటి పనుల' కోసం, ఆమెకి భర్త 'డబ్బు' ఇవ్వవలసి ఉంటే, అప్పుడు భార్య కూడా, భర్త నించి తీసుకునే 'పోషణ వస్తువుల' కోసం భర్తకి కూడా 'డబ్బు' ఇవ్వవలసిందే కదా? అసలు, భార్యా భర్తలు ఒకరికి ఒకరు 'డబ్బు' చెల్లించుకోవాలంటే, మొట్టమొదట ఎవరు ఎవరికి చెల్లించాలి? పోషణ వస్తువుల్ని, భర్త, ఇంటికి తేవడమే మొదట జరుగుతుంది. అందులో భార్య భాగానికి భార్యే మొదట భర్తకు డబ్బు చెల్లించాలి. భర్తకి డబ్బు చెల్లించి, ఆ వస్తువుల్ని తీసుకుని, వాటితో భార్య తన పనులు మొదలుపెట్టాలి. అలా భర్తకి డబ్బు చెల్లించా లంటే భార్యకి డబ్బు ఏదీ? ఎక్కడన్నా అప్పు తెచ్చి ఆ డబ్బుని భర్తకి చెల్లిస్తే, తర్వాత ఇంటి పనుల కోసం భర్తనించి డబ్బు వచ్చాక ఆ అప్పు తీర్చాలన్నమాట! మళ్ళీ మర్నాడు కూడా అదే కథ!

మర్నాడు మళ్ళీ కొత్త అప్పు! — ఒక భార్య, రోజూ ఈ అప్పు ఎవరి దగ్గిర తీసుకోవాలి? — తన భర్త దగ్గిర తీసుకుంటే ఆ భర్త మీద ఆధారపడి ఉన్నట్టే కదా?

లేకపోతే, ఇంకో 'భార్య' దగ్గిర తీసుకోవాలా? ఆ భార్యకే అప్పు కావాలికదా, ఆమె ఈ భార్యకి అప్పు ఎలా ఇవ్వ గలుగుతుంది? పోనీ, ఆ భార్య గారి భర్త దగ్గిరా? అతనూ పురుషుడే కదా? ఒక భార్య తన ఇంట్లో పురుషుడి మీద గాక, పక్కింట్లో పురుషుడి మీద ఆధారపడాలా? ఈ భార్య, ఆ ఇంటి భర్తమీదా; ఆ భార్య, ఈ ఇంటి భర్త మీదా ఆధార పడాలా? సమాజంలో, ఇంటి పనులకే పరిమితమైవున్న స్త్రీలందరూ ఈ అప్పుల మార్గం లోనే పరిష్కారం వెతు క్కోవాలా?

ఇంతకీ అప్పు ఇచ్చే వాళ్ళు దయదల్చి ఇవ్వవలసిందే గానీ, అప్పు ఇచ్చి తీరాలనే రూలేమీ ఉండదు కదా? అప్పు ఇచ్చే వాళ్ళకి ఆ దయ కలగకపోతే, అప్పుడు ఈ సమస్య ఏమవుతుంది?

ఇంటి పనికి జీతం రావడానికి, పోనీ ఇంకో మార్గం ఆలోచిద్దామా? — ఇంటి పనికే పరిమితమై ఉన్న స్త్రీలంద రికీ ప్రభుత్వమే జీతాలు ఇస్తే? — ఈ మార్గం ఎలాంటిదో కూడా చూద్దాం. అసలు ఏ మనిషికైనా జీతం ఎందుకు వస్తుంది? — ఒక యజమాని దగ్గిర ఏదో ఒక శ్రమ చేస్తే ఆ శ్రమలో భాగమే జీతంగా వస్తుంది. మరి, ఈ స్త్రీ, ప్రభుత్వం కోసం ఏ పనీ చెయ్యకుండానే ప్రభుత్వం ఈమెకు జీతాన్ని ఎక్కడినించి తెచ్చి ఇవ్వగలుగుతుంది? ఈమెకు ప్రభుత్వం కొంత డబ్బు ఇవ్వాలంటే, దాన్ని ప్రభుత్వం ఈమె భర్త నించే వసూలు చేసి, దాన్నే ఈమెకు అందించాలి. అలా జరగాలంటే, ఈమె భర్త తన జీతం లోంచి కొంత భాగాన్ని ప్రభుత్వానికి కట్టాలి. కానీ అతను అలా ఎందుకు కడతాడు? "నేను, నా భార్య పనుల్ని ఉచి తంగా తీసుకోవడం లేదు. దానికి బదులుగా పోషణ వస్తు వులన్నీ ఇస్తున్నాను. కాబట్టి, ఆమెకోసం డబ్బు ఇవ్వవల సిన అవసరం నాకు లేదు" అంటాడు కదా ఆ భర్త?

ఇక, భార్యకి జీతం వచ్చే విధానం ఏమిటి? — ఏమీ లేదు. అది ఏ మార్గంలోనూ జరగదు.

ఇంటి పనులు, స్వంతానికి చేసుకునే పనులు. అవి బైట ఒక యజమానికోసం చేసే పనులు కావు. కాబట్టి, దానికి డబ్బు ఇవ్వవలసిన అవసరం ఎవరికీ ఉండదు.

పోనీ, ఉదాహరణకోసం కాస్సేపు, భార్యాభర్తలిద్దరూ ఒకరికి ఒకరు డబ్బు చెల్లించుకుంటారనే ఊహిద్దాం. — ఈ మార్గంలో, ఆ ఇద్దరి మధ్యా పాత పరిస్తితులు మారిపోతాయా? — అలా జరగదు. భర్త, ఎప్పటిలాగే బయట పనులకూ, భార్య, ఎప్పటిలాగే ఇంటి పనులకూ — పరిమితమైపోయి ఉంటారు. అంటే, డబ్బు చెల్లిం పులు లేనప్పుడు ఇద్దరి సంబంధమూ ఎలా ఉండేదో, డబ్బు చెల్లింపుల తర్వాత కూడా ఆ సంబంధం అలాగే ఉంటుందన్నమాట! భర్త ఎప్పుడూ బైట పనుల్లోనే. భార్య ఎప్పుడూ ఇంటి పనుల్లోనే. అంతా పూర్తిగా పాత రకంగానే ఉంటుంది. కాబట్టి, భర్త నించి డబ్బు వసూలు చేసి, దాన్ని మళ్ళీ భర్తకి చెల్లించే పద్ధతివల్ల, భార్య సమస్య పరిష్కారం అవదు.

అయితే, భార్యకి కూడా డబ్బు రావడం ఎలా జరగాలి? ఆమె, తన శ్రమలతో ఇంట్లో తయారు చేసే పదార్థాల్నీ పనుల్నీ బైటకి అమ్మెయ్యాలా? అలా అమ్మేస్తే ఇంట్లో ఏం తినాలి? ఇంట్లో అవసరాలు ఎలా తీరాలి? — ఇదీ పనికిరాదు.

ఇంటి పనులు డబ్బుగా మారడం ఏ విధంలోనూ జరగదు — ఆ పనులు స్త్రీ చేసినా, పురుషుడు చేసినా. ఆ పనులన్నీ అలా, ఉపయోగపు విలువలుగా ఉండ వలసిందే.

గృహాలకే పరిమితమై వున్న స్త్రీలను, 'గృహ బానిసలు' అని గానీ, 'గృహ సేవకులు' అని గానీ, అన వలసి ఉంటుంది. మరి భార్యకు, ఈ బానిసత్వం గానీ, సేవ కత్వంగానీ వదలాలంటే ఏం జరగాలి? భార్యకి డబ్బు రావాలంటే అది ఎలా జరగాలి? — భర్త విషయంలో ఎలా జరుగుతుందో అలాగే. ఆ విధంగానే. ఆ పద్ధతిలోనే!

ఈ సమస్యకి సరైన పరిష్కారం — భార్యాభర్తల పరిస్తితులన్నీ 'సమానంగా' ఏర్పడడమే. అంటే భార్య, తన పోషణ కోసం భర్త మీద ఆధారపడే సమస్యా; భర్త, తనకు కావలసిన ఇంటి పనుల కోసం భార్యమీద ఆధారపడే సమస్యా — రెండూ మారాలి. అంటే, స్త్రీ పురుషుల మధ్య ఏ నాటి నించో 'అమలులో ఉన్న శ్రమ విభజన' మారాలన్న మాట!

భర్త ఎలాగయితే బయట శ్రమ చేస్తున్నాడో అలాగే భార్య కూడా బయట శ్రమ చెయ్యాలి. అప్పుడు, భర్త శ్రమ, 'డబ్బు'గా మారినట్టే, భార్య శ్రమ కూడా 'డబ్బు'గా మారుతుంది. భర్తకి జీతం వచ్చినట్టే, భార్యకి కూడా బయట చేసే పనికి జీతం వస్తుంది. దానివల్ల 'తన పోషణ ఉత్పత్తుల్ని తనే సంపాదించుకోవడం' అనే స్వతంత్ర పరిస్తితి, భర్తకిలాగే, భార్యకి కూడా ఏర్పడుతుంది. తన పోషణ కోసంగానీ, పిల్లల పోషణలో తన బాధ్యత నిర్వ హించడం కోసం గానీ, భర్త మీద ఆధారపడి ఉండే పరిస్తితి భార్యకి పోతుంది.

తర్వాత 'ఇంటి పనుల' విషయంలో — భార్య ఎలాగైతే ఇంటి పనులు చేస్తుందో అలాగే భర్త కూడా ఇంటి పనులు చెయ్యాలి. అప్పుడు, 'ఇంటి పనుల' కోసం భర్త, భార్య మీద ఆధారపడడం కూడా పోతుంది.

ఇద్దరూ బయటి పనులు చేస్తారు; ఇద్దరికీ డబ్బు వస్తుంది.

ఇద్దరూ ఇంటి పనులు చేస్తారు. ఇద్దరికీ డబ్బురాదు.

ఇద్దరూ, పిల్లల్ని, తల్లిదండ్రులుగా 'సమాన బాధ్యత'తో పోషిస్తారు. పిల్లల పనులు కూడా సమాన బాధ్యతతో చేస్తారు.

దీన్ని MP + L పద్ధతితో చూస్తే, కుటుంబానికి ఇద్దరూ MP ని సమకూరుస్తారు. ఇద్దరూ L చేస్తారు. ఆ రకంగా, 'సమానమైన శ్రమ విభజన'లోకి వస్తారు.

ఈ మార్పుని సమాజం అంతటిలోనూ ఊహిస్తే, భార్యకి, ఇంటి పనుల్లో కొంత కాలం తగ్గి అది బైటి పనికీ; భర్తకి, బైటి పనిలో కొంత కాలం తగ్గి, అది ఇంటి పనికీ ఖర్చవుతుంది. ఎవరికీ శ్రమ కాలం పెరగకుండానే కావలసిన మార్పు జరుగుతుంది.

అప్పుడు, పోషణ కోసం భార్య, భర్త మీద ఆధారపడడం గానీ, ఇంటి పనుల కోసం భర్త, భార్యమీద ఆధారపడడం గానీ, ఉండదు. ఎవరూ ఎవరి మీదా ఆధారపడి ఉండరు. అయినా, ఇద్దరూ భార్యాభర్తలు గానూ, పిల్లలకు తల్లిదండ్రులు గానూ, 'సహజీవనం'తో ఉంటారు.

ఈ రకంగా, ఇద్దరి శ్రమ పరిస్థితులూ 'సమానం' అవడం ద్వారానే ఇద్దరూ 'సమానులు' అవుతారు.

అప్పుడు, 'ఆధారపడడాలు' అనేవే ఉండవు కాబట్టి, అందులో ఏది ప్రధానం, ఏది సెకండరీ —అనే తేడాలకు ఆస్కారం ఉండదు. ఆ ప్రశ్నే ఉండదు.

## ఇంటా బయటా కూడా శ్రమ చేసే స్త్రీలు!

'ఇంటి పనులు' చేస్తూనే, బయటి పనులు కూడా చేసే స్త్రీల సమస్య ఏమిటి? 'శారీరక శ్రమలు' చేసే సెక్షన్లలో పురుషులే గాక, స్త్రీలు కూడా బయట ఉత్పాదక — అనుత్పాదక శ్రమలు చేస్తూనే ఉంటారు. 'మేధా శ్రమలు' చేసే సెక్షన్లలో కూడా కొందరు స్త్రీలు, బయటి పనులు (ఉద్యోగాలు) చేస్తారు.

స్త్రీలు బయట శ్రమలు చేస్తే, బయట శ్రమలు చేసే పురుషులకు వర్తించే విషయాలన్నీ ఆ స్త్రీలకు కూడా యధాతథంగా వర్తిస్తాయి. బయట శ్రమ చేసే స్త్రీ, ఒక యజమాని దగ్గిర శ్రామికురాలిగా ఉంటుంది (ఉత్పాదక శ్రామికురాలిగా గానీ, అనుత్పాదక శ్రామికురాలిగా గానీ.) ఈ శ్రామికురాలికీ, ఆమెకి 'పని' ఇచ్చిన యజమానికీ ఉండే సంబంధం, 'కుటుంబ సంబంధం' కాదు, 'శ్రమ దోపిడీ సంబంధం'.

స్త్రీ, బయట ఒక యజమాని దగ్గిర పని చెయ్యక పోయినా, స్వతంత్ర శ్రామికురాలిగా 'సరుకుల్ని' ఉత్పత్తి చేస్తోంటే, ఆ శ్రమ, 'డబ్బు'గా మారుతుంది. కాబట్టి, ఆ స్త్రీ, బయట శ్రమ చేస్తున్నట్టే అర్థం.

స్త్రీలు బయటి పనులు చేసి జీతాలు తెచ్చి కుటుంబం కోసమే వాడుతోన్నా, అలాంటి కుటుంబాల్లో కూడా పురుషులు ఇంటి పనులు చెయ్యరు. ఈ నాటి వరకూ జరుగుతున్నది ఇదే. దీనికి పరిష్కారం - ఇంతకు ముందు చూసిందే. పురుషులు కూడా ఇంటి పనులు చెయ్యడమే.

బయట శ్రమ చేసే పురుషుడు, ఇంటి పనులేవీ చెయ్యడు కాబట్టి, బయట శ్రమ చేసే స్త్రీ కూడా ఇంటి పనులేవీ చెయ్యనక్కరలేదని అర్థమా? — కాదు. బయట శ్రమ చేసే స్త్రీకి కూడా ఇంటి పనుల్లో సగ భాగం చెయ్య వలసిన బాధ్యత ఉంటుంది. అప్పుడు, రెండో సగ భాగం పని భర్త చెయ్యాలి. అది అతని బాధ్యత. 'బయట పని చెయ్యడం' అనే కారణంతో, ఇంటి పనినంతా వదిలివేసే హక్కు భర్తకి గానీ, భార్యకి గానీ ఉండదు.

'పెట్టుబడిదారీ విధానం'లో, మేధాశ్రమల సెక్షన్లలో కూడా స్త్రీలు బయటి శ్రమలలోకి రావడం — అనే మార్పు కొంత వరకూ ప్రారంభమైంది. కానీ, ఆ మార్పుతో సమా నంగా, పురుషులు ఇంటి పనులు చెయ్యడం — అనే మార్పు ప్రారంభం కాలేదు, దీనివల్ల, శారీరక శ్రమల సెక్షన్లలో గానీ, మేధాశ్రమల సెక్షన్లలో గానీ, స్త్రీలు ఇంటా బయటా కూడా శ్రమలు చేసే పరిస్థితి ఏర్పడింది. బయట శ్రమ చేస్తూనే, ఇంటి పనులన్నీ పూర్తిగా తన బాధ్యతగానే చేసే స్త్రీ, 2 రకాల పూర్తి శ్రమలు చేస్తోందనీ, భర్త కన్నా రెట్టింపు శ్రమ చేస్తోందనీ అర్థం.

మేధా శ్రామికుల కుటుంబాల్లో పని మనుషులు తప్పనిసరిగా ఉంటారు కాబట్టి, ఆ ఇంటి పనులన్నీ ఆ కుటుంబ స్త్రీలే చేస్తారనడానికి వీలు ఉండదు. పని మనుషులు చెయ్యగా మిగిలిన ఇంటి పనులన్నీ మాత్రం స్త్రీలే చేస్తారు. ఆ పనుల్లో పురుషుల పాత్ర ఉండదు.

సమాజంలో పాత శ్రమ విభజన మారడం — అన్నప్పుడు, ఒక కుటుంబంలో పనుల్ని పని మనుషులు వచ్చి చెయ్యడం ఉండదు. ఆ కుటుంబంలో స్త్రీ పురుషులందరూ కలిసి ఆ పనులు చేసుకోవాలి.

ప్రస్తుత సమాజాలలో, స్త్రీలు బైటి శ్రమలు చేసే కుటుంబంలో, పురుషులు ఇంటి పనులు చెయ్యక పోయినా, స్త్రీల దాస్యం ఎంతో కొంత స్థాయిలో తగ్గడం జరుగుతుంది. బయటి శ్రమలు చేస్తూ, కొంత జీతం సంపాదిస్తూ, ఆర్థికంగా తమని తాము పోషించుకునే స్థితిలో వుండే స్త్రీల మీద భర్తల పెత్తనం తప్పనిసరిగా తగ్గుతుంది. ఇది స్త్రీలకు చాలా మేలు చేస్తుంది.

అయితే, ఇలాంటి స్త్రీల మీద కూడా భర్తల పెత్తనం ఇంకా కొంత స్థాయిలో కొనసాగుతూ కూడా ఉంటుంది. ఎందుకంటే, బయట శ్రమ సంబంధాలలో వున్న పాత శ్రమ విభజన వల్లనే. బయట శ్రమలు చేసే శ్రామిక స్త్రీ పురుషులు, తమకు యజమానులతో వున్న అసమాన

త్వాన్ని తెలుసుకోలేనప్పుడు, తమ కుటుంబాల్లో వున్న అసమానత్వాన్ని కూడా తెలుసుకోలేరు. ఉత్పత్తి సంబంధాలలో సమానత్వాన్ని తీసుకురాగలిగే క్రమమే, కుటుంబాలలో స్త్రీ పురుషుల సమానత్వానికి కూడా దారి తీస్తుంది. అంటే, స్త్రీ పురుషులు, 'నూతన శ్రమ విభజన'ని ప్రారంభించవలసి ఉంటుంది. ఇంటా బయటా శ్రమలు చేసే స్త్రీలు, పురుషులు గృహశ్రమలలోకి రావలసిన అవసరాన్ని గ్రహించాలి. స్త్రీలు, ఈ విషయాలు గ్రహించకుండా ఎంత కాలమైతే ఉంటారో అంత కాలమూ వారు రెండు రకాల శ్రమలు చేసినా కూడా కుటుంబాలలో పురుషులకు లోబడే ఉంటారు. అంత కాలమూ, స్త్రీల మీద పురుషులు యజమానులు గానే ఉంటారు.

స్త్రీలు బైట పని చెయ్యడం అంటే అక్కడ మళ్ళీ కొన్ని పనులు స్త్రీలకే పరిమితమై ఉండడం కాదు. బయట ఒక ఫ్యాక్టరీలో క్యాంటీన్ లాంటి ఒక వంట శాలని నడుపుకోవాలనుకుందాం. అది ఒక కుటుంబానికి సంబంధించిన ఇంటి పని కాదు. బైటి పనే. అలాగే, అక్కడ ఒక చిన్న పిల్లల నర్సరీని నడపాలనుకుందాం. అది కూడా బైటి పనే. ఇళ్ళల్లో నించి కొన్ని పనులు బైటికి మారాయని అర్థం. ఆ పనులు చేసే వాళ్ళకు జీతాలు వస్తాయి. కానీ, బైట కూడా వంటలూ, పిల్లల పెంపకాలూ మళ్ళీ ఆడ వాళ్ళే చేస్తే, అది పాత శ్రమ విభజన మారినట్టు కాదు.

ఇంటా బైటా కూడా అన్ని రకాల పనులూ స్త్రీ పురుషులిద్దరూ చెయ్యాలి, గత కాలం నించీ ఆడ పనులుగా ఉన్న వాటిని మొగ వాళ్ళు కూడా చెయ్యడమూ, మొగ పనులుగా ఉన్న వాటిని ఆడ వాళ్ళు కూడా చెయ్యడమూ జరగాలన్న మాట! ఆడ పనీ, మొగ పనీ అనే తేడాలే అంతర్ధానమై పోవాలి. ఈ మార్పులు, మొత్తం సామాజిక శ్రమ విభజనతో లంకెలు పడి ఉంటాయి.

కుటుంబంలో కూడా శ్రమ సంబంధాలు ఉన్నాయి — అనే విషయం అర్థం చేసుకోకపోతే, స్త్రీ పురుషుల అసమానత్వానికి పరిష్కారం దొరకదు.

## కుటుంబ శ్రమ, సమాజానికి అవసరమయ్యే 'మొత్తం శ్రమ'లో భాగమేనా, కాదా?

'కుటుంబ శ్రమ'ని స్త్రీలు చేసినా, పురుషులు చేసినా, ఇద్దరూ కలిసి చేసినా, ఆ శ్రమని బైటికి అమ్మరు కాబట్టి, అది డబ్బుగా మారదు. అది ఉత్పాదక శ్రమ గానీ, అనుత్పాదక శ్రమ గానీ, స్వతంత్ర శ్రమ గానీ కాదు. అది, 'కుటుంబ శ్రమ' మాత్రమే. దాని పేరు అదే. అది, 'ఉపయోగపు విలువ'గా ఖర్చయ్యే శ్రమ.

అయితే, ఇది సమాజానికి అవసరమైన శ్రమేనా, కాదా?— పూర్తిగా అవసరమైన శ్రమే. పూర్తిగా 'సహజమైన' శ్రమే. వంటా, ఇంటి శుభ్రతా, పిల్లల పెంపకమూ — వంటి శ్రమలన్నీ సమాజానికి ఎప్పుడూ అవసరమే. ఈ శ్రమల్ని, సమాజం నించి తీసివెయ్యడం ఎప్పటికీ జరగదు. ఈ శ్రమల్లో కొంత కొంత భాగాల్ని ఇళ్ళ నించి బయటికి మార్చడం మాత్రమే జరగవలసి ఉంటుంది. అంటే, 'వంట పని'లో కొంత భాగం ఇళ్ళల్లో జరిగితే, కొంత భాగం సమిష్టి వంటశాలల్లోనూ, పని స్థలాల దగ్గిర ఉండే వంటశాలల్లోనూ జరగవచ్చు. దీని అర్థం, వంట పని జరిగే స్థలాన్ని విభజించడం మాత్రమే. అంతే గానీ, ఆ పనినే తీసివెయ్యడం కాదు. సమాజానికంతటికీ కావలసిన వంట పని అంతా సమాజం మొత్తం మీద ఎక్కడో అక్కడ జరగవలసిందే.

అలాగే, కుటుంబానికి సంబంధించిన ఇతర శ్రమల విషయం కూడా. వాటిని కూడా విభజించడమే జరుగుతుందిగానీ, ఆ శ్రమల్ని తీసివెయ్యడం ఎప్పటికీ జరగదు.

సమాజానికి తప్పనిసరిగా కావలసిన వేరు వేరు శ్రమలన్నీ కలిసిన మొత్తం శ్రమ ఎంత? — అని గనక లెక్క కడితే, ఆ 'మొత్తం'లోకి 'కుటుంబ శ్రమలన్నీ' కలుస్తాయి. ఆ రకంగా, కుటుంబ శ్రమలన్నీ సమాజానికి కావలసిన శ్రమలే.

కానీ, ఒక రోజుని గానీ, ఒక సంవత్సరాన్ని గానీ తీసుకుని, 'ఈ కాలంలో సమాజంలో ఉత్పత్తి అయిన విలువ ఎంత?' అని గనక లెక్కచూస్తే, అందులోకి, కుటుంబ శ్రమలేవీ చేరవు. ఎందుకంటే, ఏ కుటుంబ శ్రమా సరుకు గానూ, డబ్బు గానూ మారదు గనుక.

'కుటుంబ శ్రమలే' కాదు, సమాజంలో జరిగే 'అనుత్పాదక' శ్రమలేవీ కూడా ఆ లెక్కలోకి చేరవు. ఎందుకు చేరవో మనకు ఇప్పటికే తెలుసు. అనుత్పాదక శ్రామికులకు ఆ శ్రమలు చేసినందుకు డబ్బు (జీతాలు) వచ్చినా, ఆ డబ్బు, ఆ శ్రమల వల్ల ఉత్పత్తి అయ్యేది కాదు. అది, ఉత్పాదక శ్రమల ద్వారా ఉత్పత్తి అయ్యేదే.

అంటే సమాజంలో ఉన్న డబ్బు అంతా ఉత్పాదక శ్రమలదే. అందులో కొంత భాగం ఉత్పాదక జీతాలూ, మిగిలినదంతా అదనపు డబ్బూ! అంతే. ఆ 2 భాగాలకూ చెందని డబ్బు ఏదీ సమాజంలో ఉండదు.

సమాజంలో, ఒక రోజున, మొత్తం ఒక లక్ష విలువ గల సరుకులు తయారై, అమ్ముడై, లక్ష డబ్బు వచ్చిందనుకుంటే, ఆ డబ్బులో, కుటుంబ శ్రమల భాగం గానీ, అనుత్పాదక శ్రమల భాగంగానీ, ఒక్క పైసా కూడా ఉండదు. ఆ డబ్బు అంతా ఉత్పాదక శ్రమల ద్వారా వచ్చినదే. ఆ డబ్బే తర్వాత జరిగే పంపకాల ద్వారా అందరి చేతుల్లోకీ

వెళ్తుంది.

అయితే, 'విలువగా మారని శ్రమలన్నీ వృధా అయి పోతున్నాయ'ని అర్థం కాదు. అవి, 'ఉపయోగపు విలు వలు'గా ఖర్చవుతున్నాయని అర్థం.

'కుటుంబ శ్రమ, సామాజిక శ్రమలో భాగామా, కాదా?' అనే ప్రశ్నకి ఇప్పుడు జవాబు చెప్పుకోవచ్చు. — సమాజానికి కావలసిన మొత్తం శ్రమనంతటినీ 'ఉప యోగపు విలువలు'గా చూస్తే, అప్పుడు కుటుంబ శ్రమ కూడా, ఆ 'సామాజిక శ్రమ'లో భాగమే. కానీ, 'సమాజంలో ఉత్పత్తి అయిన విలువ ఎంత?' — అని చూసినప్పుడు, కుటుంబ శ్రమ, అందులోకి రాదు. అది విలువగా మారే శ్రమ కాదు కాబట్టి. కుటుంబ శ్రమ — ఉపయోగపు విలువల్ని ఉత్పత్తిచేసే శ్రమలో భాగమే. కానీ, డబ్బుని ఉత్పత్తి చేసే శ్రమలో భాగం కాదు.

'సామాజిక శ్రమ' అన్నప్పుడల్లా విలువని ఉత్పత్తి చేసే శ్రమ గురించే మాట్లాడుతున్నామని అర్థం. సమాజంలో ఉండే విలువనంతా ఉత్పత్తి చేసేది, ఉత్పాదక శ్రమ మాత్రమే. కాబట్టి, ఉత్పాదక శ్రమ మాత్రమే — డబ్బు.

ఈ రకంగా, ఉత్పాదక, అనుత్పాదక, స్వతంత్ర, కుటుంబ శ్రమల — తేడాల్ని సరిగా అర్థం చేసుకోవాలి.

**ఉత్పాదక శ్రమ:** 'సరుకు'ని ఉత్పత్తిచేస్తుంది. 'డబ్బు'గా మారుతుంది.

**అనుత్పాదక శ్రమ:** 'సరుకు'ని ఉత్పత్తి చెయ్యదు. కానీ, శ్రామికుడికి 'డబ్బు'గా మారుతుంది. దాన్ని కొన్న వాడికి డబ్బుగా మారదు. 'ఉపయోగపు విలువ'గా ఖర్చవుతుంది.

**స్వతంత్ర శ్రమ:** 'సరుకు'ని ఉత్పత్తి చేస్తుంది. 'డబ్బు'గా మారుతుంది.

**కుటుంబ శ్రమ:** సరుకుని ఉత్పత్తి చెయ్యదు; డబ్బుగా మారదు. 'ఉపయోగపు విలువ'గా ఖర్చవుతుంది.

సామాజిక శ్రమ అంటే బయట చేసే శ్రమ — అని గనక అర్థం చెప్పుకుంటే, అప్పుడు అనుత్పాదక శ్రమ కూడా సామాజిక శ్రమ అవుతుంది. ఆ శ్రమచేసే మనిషికి డబ్బు వస్తుంది.

బయట శ్రమలు చేసే స్త్రీ పురుషులందరూ తమ శ్రమల ద్వారా డబ్బు సంపాదించి, పోషణ వస్తువుల్ని స్వయంగా సంపాదించగలరు.

'కుటుంబ శ్రమ'కే పరిమితమైన స్త్రీలు, 'సామాజిక శ్రమ' చెయ్యడం లేదనీ, పోషణ వస్తువుల్ని స్వయంగా సంపాదించలేరనీ అర్థం.

ఈ విషయాలు సరిగా అర్థం చేసుకుంటే, సమాజంలో 'కుటుంబ శ్రమ పాత్ర' ఏమిటీ, ఆ శ్రమకే పరిమితమైవున్న స్త్రీల పరిస్థితి ఏమిటీ — అనే విషయాలు అర్థమవుతాయి. ఉన్న సమస్య సరిగా అర్థమైనప్పుడు, దాన్ని పరిష్కరించుకోవడానికి కూడా సరైన మార్గం కనపడుతుంది.

స్త్రీ పురుషుల మధ్య సమానత్వం ఏర్పడడానికి మార్గం — స్త్రీ పురుషులు ఇంటా బయటా కూడా సమాన మైన హక్కులతోటీ, సమానమైన బాధ్యతల తోటీ శ్రమలు చెయ్యడమే. అయితే, ఈ మార్పు దేని మీద ఆధారపడి ఉంటుందంటే — సమాజానికంతటికీ సంబంధించిన 'దోపిడీ ఉత్పత్తి సంబంధాల మార్పు' మీదా, ఆ ఉత్పత్తి సంబంధాలలో ఉండే 'దోపిడీ శ్రమ విభజన మార్పు' మీదాను. 'ఉత్పత్తి సంబంధాలలో సమానత్వం కోసం' జరిగే పోరాటమే, కుటుంబ సంబంధాలలో సమానత్వ పోరాటానికీ, ఆ రకపు అనేక సమస్యలపై పోరాటాలకూ దారితీస్తుంది.

## స్త్రీలు ఏ వర్గం?

'పురుషులు ఏ వర్గం?' అంటే ఏం జవాబు వస్తుంది? ఆ పురుషులు, శ్రమ చేస్తున్నారో లేదో తెలియాలి. శ్రమ చేస్తే, శ్రామిక వర్గం. శ్రమ చెయ్యకపోతే దోపిడీ వర్గం. 'శ్రమ'ని బట్టే వర్గ నిర్ణయం. అంటే, పురుషులందరూ ఒకే వర్గం కాదు.

అలాగే స్త్రీల విషయం కూడా. 'స్త్రీలు ఏ వర్గం?' అంటే, జవాబు రాదు. ఆ స్త్రీలు, శ్రమ చేస్తున్నారో లేదో తెలియాలి. స్త్రీ లందరూ ఒకే వర్గం కాదు. శ్రమతో ఉన్న సంబంధాన్ని బట్టే వర్గ నిర్ణయం. అంతేగానీ స్త్రీలా పురు షులా — అనే దాన్ని బట్టి కాదు.

'శ్రమ చేసే' పురుషులకు వర్తించే ప్రతీ విషయమూ 'శ్రమ చేసే' స్త్రీలకు కూడా వర్తిస్తుంది. అలాగే 'శ్రమ చెయ్యని' పురుషులకు వర్తించే విషయాలన్నీ 'శ్రమ చెయ్యని' స్త్రీలకు కూడా వర్తిస్తాయి.

'ప్రభుత్వ' సంస్థల్లో గానీ, 'ప్రైవేటు' సంస్థల్లో గానీ, ప్రభుత్వాధికారుల ఇళ్ళల్లో గానీ, ప్రైవేటు పెట్టుబడిదారుల ఇళ్ళల్లో గానీ, ఎక్కడైనా సరే 'శ్రమ' చేస్తూ, 'జీతం' సంపా దించే స్త్రీలు, అలాంటి పురుషుల లాగానే, 'ఉత్పాదక శ్రామికులు'గా గానీ, 'అనుత్పాదక శ్రామికులు'గా గానీ అవుతారు. అంటే 'శ్రామిక వర్గాని'కే చెంది ఉంటారు.

స్వతంత్రంగా ఉత్పత్తులు తయారుచేసి, అమ్ముకునే స్త్రీలు, 'స్వతంత్ర ఉత్పత్తిదారులు' అవుతారు.

ఏ శ్రమా చెయ్యని స్త్రీలు, అలాంటి పురుషులలాగానే, 'దోపిడీ వర్గానికి' చెంది ఉంటారు. ఈ స్త్రీలలో ఎక్కువ మంది 'కుటుంబ శ్రమలు' కూడా చెయ్యరు. ఆ శ్రమలన్నీ అనుత్పాదక శ్రామికులే చేస్తారు.

'దోపిడీ వర్గానికి' చెందిన స్త్రీలలో కూడా కొంతమంది

బయట ఉద్యోగాలు చేస్తారు. ఆ ఉద్యోగాలు తప్పనిసరిగా 'మేధా శ్రమలకు' సంబంధించినవిగానే ఉంటాయి.

బయటి శ్రమలు చెయ్యకుండా పూర్తిగా 'గృహ శ్రమలకే' పరిమితమై ఉండే స్త్రీలు, వారికి 'పోషణ ఉత్పత్తులు' ఏ వర్గ పురుషుల ద్వారా అందుతాయో ఆ వర్గాలకు చెందుతారు. 'గృహ శ్రమలకు' పరిమితమై ఉండే ఒక స్త్రీ భర్త శ్రామికుడైనట్టయితే, ఆ స్త్రీ కూడా 'శ్రామిక వర్గానికే' చెందుతుంది. లేదా, ఆ స్త్రీ భర్త, వడ్డీలో లాభాలో సంపాదించే దోపిడీదారుడైతే, ఆ స్త్రీ కూడా దోపిడీ వర్గానికే చెందుతుంది.

స్త్రీ అయినా పురుషుడైనా 'బయటి శ్రమ' చేస్తున్నారా లేదా? బయటి శ్రమ చెయ్యనట్టయితే, ఆ వ్యక్తి పోషణ, ఏ రకపు ఆదాయం ద్వారా జరుగుతోంది? — ఈ విషయాల్ని బట్టి ఆ వ్యక్తి, ఏ వర్గానికి, అందులో ఏ సెక్షన్‌కి చెందుతాడు — అనేది ఉంటుంది.

**'పిల్లల'** విషయం చూస్తే — తల్లిదండ్రుల వర్గమే పిల్లల వర్గం. శ్రామిక వర్గంలో — 'శారీరక శ్రమల' సెక్షన్ల పిల్లలు అతి చిన్నతనం నించీ శ్రమ చెయ్యడం ప్రారంభిస్తారు. ఈ పిల్లలు, తల్లిదండ్రుల ద్వారానే గాక, తమ స్వంత శ్రమ ద్వారా కూడా శ్రామిక వర్గానికి చెందుతారు.

'మేధా శ్రమల' సెక్షన్లలో పిల్లలు, చిన్నతనంలో ఏ శ్రమలూ చెయ్యరు.

'దోపిడీ వర్గం'లో పిల్లలు, చిన్నతనంలోనే కాదు, పెద్దతనంలో కూడా ఏ శ్రమలూ చెయ్యరు. నేటి ఈ బాలలే రేపటి దోపిడీదారులు.

'దోపిడీ వర్గపు' స్త్రీలను గురించి కొంత వివరంగా చూడాలి. ఈ వర్గంలో, కొంత తక్కువ ఆదాయాలు ఉన్న కుటుంబాలలో స్త్రీలు, కొన్ని 'ఇంటి పనులు' చేస్తారు. కొన్ని పనులు పని మనుషులతో చేయించుకుంటారు. భారీ ఆదాయాలు గల కుటుంబాలలో స్త్రీలు, 'పిల్లల పెంపకాలతో సహా' ఇంటి పనులన్నీ పూర్తిగా గృహ సేవకులతోనే చేయిస్తారు.

ఈ వర్గంలో అన్ని కుటుంబాలూ ఒకే స్థాయిలో ఉండవు కాబట్టి, ఈ కుటుంబాల స్త్రీలు కూడా ఒకే స్థాయిలో ఉండరు. ఆ తేడాలన్నీ వదిలేసి, దోపిడీ వర్గాన్ని జనరల్‌గా చూస్తే, పురుషులే ఉద్యోగాలు చెయ్యని చోట, స్త్రీలు ఉద్యోగాలు చెయ్యడం అనే మాట ఉండదు. కానీ, ఈ వర్గ స్త్రీలలో కొంతమంది తమ భర్తల సంస్థలకు 'డైరెక్టర్లు'గా ఉంటారు. (భర్తలు, వారిని అలా ఉంచుతారు.) ఆస్తులు భర్తలవే. ఆ సంస్థల్లో భర్తలతో పాటు, భార్యలు కూడా డైరెక్టర్లు! మొగ డైరెక్టర్లు ఎంత 'శ్రమిస్తారో', ఈ ఆడ డైరెక్టర్లయినా అంత 'శ్రమిస్తారు!'

ఈ వర్గపు పురుషులలాగానే, ఈ వర్గపు స్త్రీలు కూడా ఆడంబరాలతోటీ, విలాసాలతోటీ, కాలం గడుపుతారు. ఖరీదైన బట్టలతోటీ, నగలతోటీ అలంకారాలు చేసుకోవడమూ, విందులతో వినోదాలతో గడపడమూ — వీరి దిన చర్యగా ఉంటుంది.

వీరి తండ్రులూ, భర్తలూ నడిపే సంస్థల్లో, శ్రామిక స్త్రీలు పిల్లలకు పాలిచ్చుకునే తీరికా స్వేచ్ఛా కూడా లేకుండా ప్రతి దినం అనేక గంటలు శ్రమతో సతమతమవుతూ వుంటే, ఈ పెట్టుబడిదారీ స్త్రీలు, పిల్లల సంరక్షణ బాధ్యతలన్నీ కూడా సేవకులకు అప్పగించి, రోజూ అనేక గంటలు నిలువుటద్దాల ముందు నిలబడి ముడులు చుట్టుకోడానికీ, లిప్‌స్టిక్కులు పూసుకోడానికీ, చెంపలూ కనుబొమ్మలూ దిద్దుకోడానికీ, కట్టుకునే దుస్తులు ఎంపిక చేసుకోడానికీ, వాటిని ధరించడానికీ, గంటలు గంటలు 'శ్రమిస్తూ' ఉంటారు. ఆ శ్రమ కూడా పడలేనప్పుడు, కార్లలో బ్యూటీ సెంటర్లకు పోయి పెద్ద పెద్ద చార్జీలు చెల్లించి, తలలు దువ్వించుకుని, మొహాలు దిద్దించుకుని, అలంకారాలు చేయించుకుంటారు. ఆ అలంకారాలన్నీ పూర్తి అయ్యే వరకూ కారు డ్రైవర్లు ఒక చోట పడి ఉండాలి! తర్వాత, వీరు క్లబ్బులకు పోతే అక్కడ మళ్ళీ కారు డ్రైవర్లు పడి ఉండాలి! ఈ కారు డ్రైవర్లు చేసే పని — 'కారు నడపడం' ఒక్కటే కాదు, యజమానుల అహంకారాల్ని సంతృప్తిపరిచే ఉద్యో గాలు కూడా చెయ్యాలి.

ఈ పెట్టుబడిదారీ స్త్రీలు — పేకాటలూ, సిగరెట్లూ, తాగుడూ, గుర్రప్పందాలూ — వంటి సమస్త విలాసాలలోనూ పురుషులతో 'సమానులై' ఉంటారు.

పెట్టుబడిదారీ దోపిడీ ఆదాయాలతో జీవిస్తూ, పెట్టుబడిదారీ భావాలతో, పెట్టుబడిదారీ జీవన విధానం గల స్త్రీలే పెట్టుబడిదారీ స్త్రీలు. లేదా, బూర్జువా స్త్రీలు. ఈ బూర్జువా స్త్రీలు, సాధారణ సరదాలన్నీ 'బోర్' కొట్టినప్పుడు, కొంచెం 'మార్పు కోసం', వీరి పురుషులు 'కళా సేవ'లకు దిగినట్టుగానే, (ఈ కళా సేవల్ని మనం ఇంకా చూడలేదు) వీరు 'సంఘ సేవ'లకు దిగుతారు. అందులోనూ మరీ ముఖ్యంగా 'అనాథ స్త్రీల' సేవకి! వీరి తండ్రులూ భర్తలూ సమాజం నిండా ఎప్పటికప్పుడు అనాథల్ని సృష్టిస్తూ వుంటే, వీరు బ్యూటీ సెంటర్లలో మేకప్పులు చేయించుకు వచ్చి, అనాథల సేవలోకి దిగి, స్త్రీలందర్నీ మొదట 'విజ్ఞానవంతుల్ని' కమ్మంటారు. తర్వాత, పిల్లల్ని విజ్ఞానవంతుల్ని చెయ్యమంటారు. తమని ఏం కమ్మంటున్నారో, ఏం చెయ్యమంటున్నారో బోధ పర్చుకోలేని ఆ అనాథ స్త్రీలు, పరాయి భాషలో ఉపన్యాసం విన్నట్టు తెల్లమొహాలేస్తారు. ఆ ఘట్టం అయ్యాక, వారు తమ కష్టాలు చెప్పుకోవడం మొదలుపెడతారు.

ఒక పేద మనిషి ఇలా చెప్పుకుంటుంది: తనకు పని లేదనీ, తల దాచుకోవడానికి గుడిసె కూడా లేదనీ, పిల్ల

లందరికీ జబ్బులనీ, మందులు లేవనీ, రోజూ కాస్తో కూస్తో సంపాదించే మొగవాడు మిల్లులో కాళ్ళు తెగి చచ్చిపోయాడనీ, తమ కుటుంబానికి మిల్లు యజమాని ఏమీ ఇవ్వలేదనీ, అద్దె కట్టకపోతే గుడిసె యజమాని తరిమేశాడనీ, పిల్లలు ఆకలితో మలమల మాడిపోతున్నారనీ, ఏదన్నా దారి చూపించి పుణ్యం కట్టుకోమనీ ... ఇదనీ అదనీ చెప్పి ఏడుస్తూ, వెయ్యి నమస్కారాలు చేస్తుంది.

మిగతా వాళ్ళంతా కూడా ఎవరి గాథ వాళ్ళు గబగబా చెప్పుకుంటారు.

అన్ని గాథలూ ఒకటే మచ్చు. మొగవాళ్ళు చచ్చిపోతారు. లేకపోతే కాళ్ళూ చేతులూ తెగి పడి ఉంటారు. అప్పుల వాళ్ళు గుడిసెల మీద దండెత్తుతారు. ఉన్న గిన్నీ ముంతా పట్టుకుపోతారు. పిల్లలు జబ్బులు పడి ఉంటారు. తిండి ఉండదు. గుడ్డ ఉండదు. నీడ ఉండదు. అది ఉండదు, ఇది ఉండదు. లేదు, లేదు, లేదు —అన్న మాట తప్ప ఇంకో మాట ఉండదు!

బూర్జువా స్త్రీలు, ఈ 'అనాథ సేవ ఆట'లోకి దిగేటప్పుడు ఈ 'చెత్తంతా' వినాల్సి వస్తుందని అనుకోరు. ఈ శోకాలూ, మొత్తుకోళ్ళూ, ఇదంతా కాస్సేపు వినేటప్పటికి వారి 'సున్నిత' హృదయాలకు ఏదో అవుతుంది. "సరే నమ్మా! అవన్నీ సరే! అవన్నీ మీరు ప్రభుత్వానికి చెప్పుకోండి. ప్రభుత్వం తప్పకుండా మీకు ఏదో ఒకటి చేస్తుంది" అని నెమ్మదిగా ఆ సంగతులన్నీ తోసెయ్యాలని చూస్తారు.

"ఆ పెబుత్వం ఎక్కడుందో మాకు తెలవదు. మా కోసం మీరు ఇవన్నీ పెబుత్వానికి చెప్పకూడదా? మమ్మల్ని తీసుకు పొండి పెబుత్వం దగ్గిరికి. మేమే అడుక్కుంటాం" అంటారు వాళ్ళు.

"అది కాదమ్మా, మేమొచ్చింది అందుక్కాదు. మీకు చదువులు నేర్పాలని వచ్చాం. మానవుడు ముందు విజ్ఞానవంతుడుగా ఉండాలి. స్త్రీ విజ్ఞానవంతురాలైతేనే బిడ్డలు విజ్ఞాన వంతులవుతారు. మీకు పలకలూ, పుస్తకాలూ ఇస్తాం కదా ఇప్పుడు? రోజూ ఒక టీచరు వచ్చి..."

"అయ్యేందుకు మాకు? ఆ పైసలిచ్చెయ్యండి. జొన్నలు కొనుక్కుంటాం."

ఉద్ధారకులు ఆ మాట వినరు. గబగబా కార్లలోంచి పలకల దొంతర్లు తీయించి అందరికీ పంచేసి 'రేపు వస్తాం' అనేసి వెళ్ళిపోతారు!

ఆ పలకలన్నీ జొన్నలుగా మారి అనాథ కుటుంబాలకు ఆ పూట గడుస్తుంది.

సంఘ సేవకులు, కారుల్లో మర్నాడు వచ్చేటప్పటికి అనాథలు విజ్ఞానవంతులవు తోన్న జాడలేవీ కనపడవు. మిగతా సరదాలన్నీ విసుగెత్తి, ఈ సరదాలోకి దిగిన సంఘ సేవకులకు, ఆ సేవా ఫలితాలన్నీ ఆ సాయంత్రానికో, మర్నాటి సాయంత్రానికో కనపడాలి! మహా అయితే వాళ్ళు, మూడు రోజుల వరకూ నిరీక్షించగలరు. కానీ, ఈ అనాథ సేవ అంతూ దరీ లేని, వారం రోజులైనా ఓ కొలిక్కిరాని వ్యవహారం అయిపోతుంది! 'మీ వల్లే మేమంతా విజ్ఞాన వంతులయ్యాం తల్లీ! అజ్ఞానాంధకారంలో పడి వున్న మమ్మల్ని మీరు రక్షించారు. మీరు రాకపోతే మేము జీవిత మంతా అజ్ఞానం లోనే పడి ఉండే వాళ్ళం. ఈ పూట నించీ మేము దేశ సేవ చేస్తాం' అని అనాథ స్త్రీలు పది రోజులైనా ఇంకా ప్రకటించరు!

బూర్జువా స్త్రీల సరదాలు చాలా త్వరత్వరగా మారిపోతాయి. ఆ స్త్రీలు రెండు వారాలయ్యేటప్పటికి ఈ సేవల గోలతో బాగా విసుగెత్తి 'లాభం లేదు. ఈ మూర్ఖుల్ని మార్చలేం' అనో, 'డాక్టరు రెస్ట్ తీసుకోమన్నాడు' అనో ఆ ఛాయలకు పోకుండా తప్పుకుంటారు. బూర్జువా స్త్రీల సంఘ సేవలన్నీ చివరికి ఈ రకంగానే ముగుస్తాయి.

నిజానికి, 'అనాథ' అంటే ఎవరు? తనని తను పోషించుకోడానికి ఏదో ఒక 'శ్రమ శక్తి లేని' మనిషి. అలాంటి మనిషే నిజమైన అనాథ. ఆ అర్థంతో చూస్తే, పెట్టుబడిదారీ స్త్రీ పురుషులే అసలైన అనాథలు! ధనిక స్త్రీలు, ఏ స్త్రీలని అనాథలుగా భావిస్తారో ఆ అనాథలంతా ఏదో ఒక పని చెయ్యగల శక్తి సామర్థ్యాలు గల వాళ్ళే. ఏ శ్రమ శక్తులూ లేని ధనిక స్త్రీలు, తామే అనాథలమనే సంగతి గ్రహించుకోలేరు. ఆఖరికి దోపిడీ చేసే పనిలో అయినా వీరికి పురుషులతో సమానమైన పాత్ర ఉండదు. తండ్రులూ భర్తలూ దోచి తెచ్చే సంపదల మత్తులో మునిగి, ఆత్మ గౌరవం లేని సోమరి విలాస జీవితాలు గడపడంలో వీరు తమ పురుషులకేమీ తీసిపోకుండా కాలం గడుపుతూ వుంటారు. కాబట్టి, 'స్త్రీలు ఏ వర్గం?' అన్నప్పుడు, దానికి జవాబు —

స్త్రీలందరూ ఒకే వర్గం కాదు. స్త్రీల ప్రయోజనాలన్నీ ఒకే రకం కాదు.

ఇప్పుడు, మనం చూస్తూవున్న కొన్ని ప్రత్యేక ఉదాహరణల్లో, తర్వాత అంశం చూడాలి.

## 2) బస్సు డ్రైవరు శ్రమ

**ఒ**క రవాణా పెట్టుబడిదారుడి దగ్గిర, ఒక శ్రామికుడు బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఈ బస్సు, మనుషుల్ని ఒక ఊరు నించి ఒక ఊరికి రవాణా చేస్తూ వుంటుంది. 'రవాణా సౌకర్యం' అనే సరుకు కోసం, ప్రయా

ణీకులు డబ్బు చెల్లిస్తారు.

ఒక బస్సు ఫలానా ఊరు నించి ఫలానా ఊరికి వెళ్తోంది. ఆ బస్సులో 50 సీట్లు ఉన్నాయి. ఒక్కొక్క టిక్కట్టు ధర 40. ఒక ట్రిప్పులో ఆ ప్రయాణంవల్ల వసూలైన మొత్తం $50 \times 40 = 2.000$. ఇందులో, పెట్రోలూ, బస్సు అరుగుదలా, రోడ్డు అరుగుదలా — వగైరా 'స్థిర పెట్టుబడి' ఖర్చంతా 500 అనుకుందాం. 2000 లోంచి 500 తీసివెయ్యగా మిగిలేది 1500. ఇది ఆ బస్సుని నడపడం అనే 'ఉత్పత్తి కార్యం' నిర్వహించిన శ్రామికుల శ్రమది. అంటే ఆ బస్సుని నడిపిన డ్రైవర్లూ, అవసరమైనప్పుడల్లా బస్సుని శుభ్రంచేసే క్లీనర్లూ, మెకానిక్కులూ వగైరా శ్రామికులు కలిపి ఇచ్చిన శ్రమది. ఆ ప్రయాణంలో ఇద్దరు డ్రైవర్లూ, ఇద్దరు మెకానిక్కులూ, ఇద్దరు క్లీనర్లూ పనిచేశారు — అనుకుంటే ఆ 1500, ఆ 6గురు శ్రామికులకే చెందాలి. ఆ ప్రయాణం, 6 గంటల కాలం పట్టిందనుకుందాం. ఆ 6 గంటల డ్యూటీలో పనిచేసినందుకు ఆ 6గురు శ్రామికులకూ జీతాలుగా, ఆ బస్సు పెట్టుబడిదారుడు 200 ఇచ్చి, మిగిలిన 1300 తనే తీసుకున్నాడనుకుందాం. ఈ 1300, ఉత్పాదక కార్మికుల ద్వారా వచ్చిన 'అదనపు విలువ'.

అయితే, బస్సు పెట్టుబడిదారుడికి, కొన్ని 'అనుత్పాదక' ఖర్చులు ఉంటాయి. ఉదా: టిక్కట్లు అమ్మే శ్రమ అనుత్పాదక శ్రమ. 'టిక్కెట్ల అమ్మకం' అనేది, ఏ ప్రయాణానికి అయినా 'సహజ అవసరం' కాదు. టిక్కెట్ల అమ్మకం లేకపోయినా ప్రయాణం జరుగుతుంది. బస్సుని నడిపే శ్రమ లేకపోతేనో, బస్సుకి ఆయిల్ లేకపోతేనో బస్సు ఆగిపోయినట్టుగా, టిక్కెట్ల అమ్మకం లేకపోతే బస్సు ఆగిపోదు. సహజ అవసరాలు కాని ఖర్చులన్నీ అనుత్పాదక ఖర్చులుగా అవుతాయని ఇంతకుముందే చూశాం. కాబట్టి, టిక్కెట్ల పుస్తకాల ఖర్చూ, టిక్కెట్లు అమ్మే ఉద్యోగి జీతమూ వంటివి — అనుత్పాదక ఖర్చులు. ఈ ఖర్చులు, ఆ ప్రయాణానికి అవసరమయ్యే 'శ్రమ మొత్తం'లోకి చేరవు. కానీ, బస్సు పెట్టుబడిదారుడు, ఈ అనుత్పాదక అంశాల మీద కూడా ఖర్చు పెట్టాలి. ఈ ఖర్చుల్ని 100 అనుకుంటే, ఉత్పాదక కార్మికుల ద్వారా వచ్చిన '1300 అదనపు విలువ'లో నించే ఈ 100 ని ఖర్చుపెట్టాలి. ఇంకా 1200 మిగులుతుంది. (దీన్ని బస్సు పెట్టబడిదారుడు, ఇంకా కొన్ని భాగాలుగా పంపకాలు చేస్తాడు. అది తర్వాత విషయం.)

బస్సు డ్రైవరూ, క్లీనరూ వంటి వారు, 'ఉత్పాదక కార్మికులు' అయితే; టిక్కెట్లు అమ్మే ఉద్యోగీ, బస్సులో టిక్కట్లని తణిఖీ చేసే ఉద్యోగీ — అనుత్పాదక కార్మికులు.

ఈ 'బస్సు ప్రయాణానికి' సంబంధించి, బస్సు పెట్టుబడిదారుడు ఏ శ్రమా చెయ్యడు. వాడు అసలు బస్సులో ఉండడు. ఇంటి దగ్గిరో ఎక్కడో విశ్రాంతిగా ఉంటాడు. ఏ శ్రమా చెయ్యని పెట్టుబడిదారుడికి, బస్సు ఒక్కసారి వెళ్ళడం వల్ల 1200 అందడం, ఆ పెట్టుబడిదారుడికి గానీ, ఆ శ్రామికులకు గానీ ఏమీ ఆశ్చర్యం కలిగించదు. పైగా, 'పెట్టుబడిదారుడికి అందినదంతా శ్రామికులదే' అనడమే అందరికీ అమితాశ్చర్యం కలిగిస్తుంది.

ఈ ఉదాహరణలో, 6 గంటల చొప్పున పనిచేసిన 6 గురు కార్మికులకే ఆ డబ్బంతా రావాలనడమే అంత ఆశ్చర్యం కలిగించే విషయం అయితే, ఆ బస్సు ప్రయాణం కోసం ఒక్క నిముషం కూడా శ్రమచెయ్యని, ఒకే ఒక్క మనిషికి (బస్సు పెట్టుబడిదారుడికి), ఆ డబ్బంతా పోవడం ఇంకెంత ఆశ్చర్యం కలిగించాలి! — కానీ, అలా జరగదు. పెట్టుబడిదారుడికి, ప్రతీ ప్రయాణం వల్లా ఎంత 'లాభం' వస్తూవున్నా, అది కార్మికులకు గానీ, పెట్టుబడిదారుడికి గానీ ఏమీ ఆశ్చర్యం కలిగించదు. ఎందుకంటే, లాభం రావడం అంత సహజ విషయంగా అలవాటై పోయి ఉంటుంది. యజమాని అనే వ్యక్తి శ్రమ చెయ్యడనీ, శ్రమ చెయ్యకపోయినా ఆ వ్యక్తికి 'లాభం' తీసుకునే హక్కు ఉంటుందనీ, కార్మికులు నమ్ముతూ వుంటారు. అలవాటైపోయిన నమ్మకాల మీద ప్రశ్నలు ఉండవు. అవి, 'స్థిరపడిపోయిన సత్యాల'లాగ అయిపోతాయి.

ఈ పెట్టుబడిదారుడికి, 4 బస్సులు ఉంటే, ఒకే రోజున 4 బస్సులనించి 4 లాభాలు! 10 బస్సులు ఉంటే, ఒకే రోజున 10 లాభాలు!

మన ఉదాహరణలో ఉన్న బస్సు ప్రయాణం 6 గంటలే. ఆ బస్సు రాత్రింబవళ్ళూ పనిలోనే ఉంటుంది. రోజుకి 3, 4 ప్రయాణాలు! ఒక ఊరు నించి ఇంకో ఊరుకి వెళ్ళేటప్పుడు ఒక లాభమూ, మళ్ళీ ఆ ఊరు నించి ఈ ఊరుకి వచ్చేటప్పుడు ఒక లాభమూ! అలాగ ఒక ట్రిప్పు తర్వాత ఒక ట్రిప్పు తిరుగుతూనే ఉంటుంది. కార్మికులు పగలూ రాత్రీ పని చేస్తూనే ఉంటారు. ఇక లెక్క కట్టండి లాభాల రాసిని!! అదంతా పెట్టుబడిదారుడి హక్కు లాగే కనపడుతుంది. పెట్టుబడిదారుడికే కాదు, కార్మికులకు కూడా! 'నిజం' అనేది తెలియనప్పుడు, అబద్ధమే నిజం లాగా తళ తళ లాడిపోతూ వుంటుంది.

ఇంకో ఉదాహరణ: భూమిలో నీటిని పైకి తీసుకు వచ్చే 'బోరు' వెయ్యడానికి ముగ్గురు శ్రామికులు,

24 గంటలు పని చేశారు. ఆ బోరు వెయ్యడానికి కాంట్రాక్టు తీసుకున్న పెట్టుబడిదారుడు, ఆ పని కోసం 7 వేలు తీసుకున్నాడు. భూమిలోకి దించే గొట్టాలూ, ఇంజనూ, ఆయిలూ వగైరాల కోసం 5 వేలు ఖర్చయింది. మిగిలిన 2 వేలలోంచి, ఆ శ్రామికులు ముగ్గురికీ కలిసి 300 ఇచ్చాడనుకుందాం. ఇంకా మిగిలిన 1700 ఆ కాంట్రాక్టర్‌కే! ఏమీ శ్రమ చెయ్యని మనిషి 24 గంటల కాలంలో, 1700 సంపాదిస్తాడు! ఇంటి దగ్గిరో క్లబ్బులోనో పేకాడుతూనో నిద్రపోతూనో గడుపుతూ!

ఒక్కొక్క 'బోరు' కాంట్రాక్టు మీదా, పెట్టుబడిదారుడికి వెయ్యి వస్తుంది అనుకుంటే, ఒకే రోజున 4 చోట్ల వేరు వేరుగా అదే పని చేయించే పెట్టుబడిదారుడు, ఒకే రోజున 4 వేలు సంపాదిస్తాడు. కానీ ప్రతీ రోజూ ఎక్కడో ఒక చోట బోర్లు వేస్తూ వుండే ఆ కార్మికులు, చెవులు పాడైపోయేంత హోరుతో పని చేసే ఇంజన్ మోతతో, కొంత కాలానికి చెవిటి వాళ్ళయిపోతారు. అలాంటి పరిస్తితి, ఆ ఇంజన్ సమీపానికైనా రాని పెట్టుబడిదారుడికి మాత్రం ఎన్నటికీ సంభవించదు.

# 3) డాక్టర్ శ్రమ

**ఒ**క డాక్టరు, రెండో మనిషి సహాయం లేకుండా వైద్యం చేస్తూవుంటే అతను— 'స్వతంత్ర ఉత్పత్తిదారుడు.'

ఆ డాక్టరే, ఒక పెట్టుబడిదారుడు నడిపే ఆస్పత్రిలో పని చేస్తూ వుంటే, అతను — ఉత్పాదక శ్రామికుడు.

ఆ డాక్టరే, ప్రభుత్వ ధర్మాసుపత్రిలో పని చేస్తూ వుంటే, అతను — అనుత్పాదక శ్రామికుడు.

ఆ డాక్టరే, తనతో కొందరు ఇతర శ్రామికుల్ని పెట్టుకుని 'స్వంత ఆస్పత్రి' నడుపుతూ వుంటే, అతను — చిన్న స్థాయి పెట్టుబడిదారీ డాక్టరు. (పెటీ బూర్జువా డాక్టరు)

ఆ డాక్టరే, తన శ్రమని పూర్తిగా మానేసి, ఇతర డాక్టర్లని పెట్టి, ఒక ఆస్పత్రిని నడుపుతూ వుంటే, అప్పుడు ఆ డాక్టరు, పెద్ద పెట్టుబడిదారుడు. (ఎంత పెద్ద అనేది అనవసరం. తను కూడా శ్రమ చేస్తూనే ఉన్నప్పుడు చిన్న బూర్జువా. శ్రమ పూర్తిగా మానేసిన వాడు పెద్ద బూర్జువా)

సమాజంలో 'వైద్య శ్రమ'కి ఎక్కువ విలువ ఉండడం వల్ల, పెటీ బూర్జువా డాక్టరు కూడా, ఇతర వృత్తులలో ఉండే పెటీ బూర్జువాల కన్నా చాలా ఎక్కువ సంపాదిస్తాడు. పెటీ బూర్జువా డాక్టరు, ఉత్పాదక శ్రామికుడిగానూ, పెట్టుబడిదారుడి గానూ కూడా ఉంటాడు. ఈ ఆస్పత్రిలో పని చేసే నర్సులూ, కాంపౌండర్లూ, ఆయాలూ, ఆస్పత్రిని శుభ్రం చేసే మనుషులూ అంతా — ఉత్పాదక శ్రామికులే. ఇతర ఉత్పాదక సంస్థల్లో లాగానే, గేటు దగ్గిర కాపలా ఉద్యోగులూ, ఆస్పత్రి బిల్లులు తయారు చేసే ఉద్యోగులూ, ఆడిటర్లూ — వంటి ఉద్యోగులు, అనుత్పాదక శ్రామికులు.

ఉత్పాదక శ్రామికులంతా 'వైద్య సౌకర్యం' అనే సరుకుని ఉత్పత్తి చేస్తారు. జనం (సమాజంలో ఉన్న పెట్టుబడిదారులూ, ఉత్పాదక — అనుత్పాదక శ్రామికులూ, స్వతంత్ర ఉత్పత్తిదారులూ) ఆ 'సరుకు'ని కొని దాని 'విలువ'ని చెల్లిస్తారు.

వైద్య సౌకర్యాన్ని కొనే ఒక రోగి, ఆ సరుకులో ఉన్న విలువకి సమానమైన డబ్బుని చెల్లిస్తున్నాడని అర్థం. ఇది జనరల్ సూత్రం. ఒక జనరల్ సూత్రానికి చుట్టూ, అనేక ప్రత్యేక పరిస్తితులూ ప్రత్యేక సందర్భాలూ ఉంటాయి, ఆ సరుకు, ఏ రంగానికి సంబంధించిందో, ఆ రంగానికి ఉండే ప్రత్యేక మోసాలూ, ప్రత్యేక వ్యాపార ఎత్తుగడలూ, ప్రత్యేక మినహాయింపులూ, పరిమితులూ — వగైరా అంశాలెన్నో కూడా అక్కడ ఉంటాయి. జనరల్ సూత్రం మీదే ఆధారపడి వాటిని అర్థం చేసుకోవాలి.

ఈ వైద్య కార్యక్రమంలో ఖర్చయ్యే మందులూ, దూదీ, బేసిన్లూ, పడకలూ, తోపుడు బళ్ళూ, ఆపరేషన్ సామాగ్రీ, బిల్డింగులూ వగైరాలన్నీ 'ఉత్పత్తి సాధనాలు' (స్తిర పెట్టుబడి). డాక్టర్ జీతంతో సహా మొత్తం ఉత్పాదక జీతాలన్నీ కలిసి 'అస్తిర పెట్టుబడి.' రోగుల నించి వచ్చిన మొత్తంలో నించి ఈ స్తిర — అస్తిర ఖర్చులన్నీ తీసేస్తే, 'అదనపు డబ్బు' మిగులుతుంది. దాన్ని హాస్పిటల్‌కి చెందిన ఉత్పాదక శ్రామికులంతా ఉత్పత్తి చేశారని అర్థం. జీతాలన్నీ ఏ పాళ్ళలో ఉన్నాయో ఆ పాళ్ళ ప్రకారం ఆ 'అదనపు విలువ'ని విభజిస్తే, అందులో డాక్టర్‌కి కూడా ఒక భాగం ఉంటుంది. మిగతా భాగాలు మిగతా వాళ్ళవి. ఆ ఆస్పత్రికి సంబంధించిన అనుత్పాదక శ్రమలకూ అనుత్పాదక సాధనాలకూ అయ్యే ఖర్చులు, 'అదనపు విలువ'లో నించే వెళ్తాయి.

స్వంత ఆస్పత్రి నడుపుతోన్న ఒక డాక్టరు, చాలా ఉదార స్వభావం గల వాడనుకుందాం. పేదల నించి చాలా తక్కువ ఫీజులు తీసుకుంటాడనుకుందాం. సాధారణంగా 10 ఫీజు తీసుకోవలసిన వైద్యానికి ఈయన 4 మాత్రమే తీసుకుంటాడనుకుందాం. ఈ రకంగా చేసే డాక్టరు, తన ఆస్పత్రి ద్వారా రావలసిన 'అదనపు డబ్బు'లో కొంతభాగం పేదలకు 'వైద్యసౌకర్యం' రూపంలో వదిలేస్తున్నాడని అర్థం.

# 4) రచయిత శ్రమ

ఒక పెట్టుబడిదారుడు, ఒక 'పత్రిక' నడుపుతున్నాడు. ఆ పత్రిక ఒక 'సరుకు'. జనం, ఆ పత్రికని కొని దాని 'విలువ'ని చెల్లించేస్తారు. ఈ పత్రికాఫీసులో పని చేసే జర్నలిస్టులూ (సంపాదకుడితో సహా), బైట నించి రెగ్యులర్‌గా శీర్షికలు నడిపే రచయితలూ — ఆ సరుకు ఉత్పత్తికి అవసరమయ్యే మేధాశ్రమలు చేసే వారిగానూ, అచ్చు పనులు చేసే వారంతా శారీరక శ్రమలు చేసే వారిగానూ ఉంటారు. వీరందరూ ఉత్పాదక శ్రామికులే. అదనపు విలువ, వీరందరి సమిష్టి శ్రమ ద్వారా వస్తుంది.

ఈ పత్రికలో వేతన శ్రామికులుగా ఉండని రచయితలు, అప్పుడప్పుడూ ఆ పత్రికకు రచనలు ఇచ్చి డబ్బు తీసుకుంటే, ఆ మారకాలు సింపుల్ మారకాలుగా (సమాన విలువల మారకాలుగా) ఉంటాయి. వేతన శ్రామికులుగా ఉండని రచయితలు, స్వతంత్ర ఉత్పత్తిదారులు. స్వతంత్ర ఉత్పత్తిదారుడైన ఒక రచయిత, ఒక పత్రిక యజమానికి ఒక రచన ఇచ్చి డబ్బు తీసుకుంటే, తన సరుకుని అమ్మి దాని విలువని తీసుకున్నాడని అర్థం. ఆ పత్రిక యజమాని, ఆ స్వతంత్ర రచయితకి, సాధారణంగా ఉన్న మార్కెట్ విలువ ప్రకారమే డబ్బు ఇచ్చాడనుకుందాం. పత్రిక యజమాని ఆ రచన మీద పెట్టిన ఖర్చు, 'స్థిరపెట్టుబడి' కిందకి వస్తుంది.

ఒక స్వతంత్ర రచయిత, ఒక పెట్టుబడిదారుడి పత్రిక కోసం, ఆ పత్రిక సంపాదకుడు కోరిన టెక్నిక్కులతో ఒక రచన తయారు చేసి ఇస్తాడనుకుందాం. దానికి బదులుగా చాలా ఎక్కువ డబ్బు తీసుకుంటాడనుకుందాం. పత్రికలో ఆ రచన ఉండడం వల్ల ఆ పత్రికలు చాలా ఎక్కువ సంఖ్యలో అమ్ముడుపోతాయనుకుందాం. దాని వల్ల పెట్టుబడిదారుడికి ఎక్కువ లాభాలు వస్తాయనుకుందాం. ఆ లాభాలకు కారణం ఎవరు? ఆ లాభాలను ఉత్పత్తి చేసింది ఎవరు? — ఆ రచయితా? — కాదు.

ప్రతీ సరుకుకీ, ఉపయోగపు విలువా, విలువా ఉన్నట్టే పత్రిక్కి కూడా ఆ 2 లక్షణాలూ ఉంటాయి.

'ఈ పత్రికలో ఫలానా రచయిత రాశాడు' అనే దృష్టితోనే దాన్ని ఎక్కువమంది కొని ఉండవచ్చు. ఒక సరుకుని కొనే మనిషి, దాన్ని ఎందుకు కొంటున్నాడనే దానికీ, ఆ సరుకు విలువకీ సంబంధం ఉండదు. ఒక బొమ్మని కొనే మనిషి 'ఎవరికో బహుమతిగా ఇవ్వాలని' కొనవచ్చు. ఆ వస్తువు తన ఇంట్లో ఉంటే 'గొప్పగా ఉంటుంది' అని కొనవచ్చు. 'ఈ పుస్తకంలో హాస్యం బాగుంటుంది' అని కొనవచ్చు. ఈ 'రచయిత బాగా రాస్తాడు' అని కొనవచ్చు. 'ఈ పళ్ళు తింటే ఆరోగ్యం' అని కొనవచ్చు. ఈ రకంగా ఒక సరుకుని కొనేటప్పుడు ఎంతో ఇష్టంతోనూ కొనవచ్చు; ఇష్టం లేకుండానూ కొనవచ్చు. మోసపోయి కొనవచ్చు. ఈ రకంగా, ఎన్నో రకాల పరిస్థితులవల్ల కొనవచ్చు. సరుకుని కొనే మనిషి ఏ దృష్టితో కొంటున్నారనేది 'ఉపయోగపు విలువ'కి సంబంధించిన విషయం. సరుకుని తీసుకుని, దానికి డబ్బుని చెల్లించడం అనేది, విలువకి సంబంధించిన విషయం. కొనే మనిషి, కొంత శ్రమతో తయారైన సరుకుని తీసుకుంటాడు కాబట్టే, దానికి బదులుగా డబ్బు ఇస్తాడు. అతను దాన్ని ఏ దృష్టితో నైనా కొనవచ్చు గాక.

ఒక పత్రిక ఎక్కువ సంఖ్యలో అమ్ముడు పోయినప్పుడైనా, తక్కువ సంఖ్యలో అమ్ముడుపోయినప్పుడైనా, అదనపు విలువ సూత్రం ఒకటే. పత్రిక ఎక్కువ సంఖ్యలో అమ్ముడు పోయినా, తక్కువ సంఖ్యలో అమ్ముడు పోయినా, ఆ పత్రికల్లో ప్రతీ ఒక్క పత్రికా కొంత శ్రమతో తయారైనదే. ప్రతీ ఒక్క సరుకు నించీ, కొంత అదనపు విలువ దొరుకుతుంది కాబట్టే ఎక్కువ సరుకులు అమ్ముడు పోయినప్పుడు, ఎక్కువ అదనపు విలువ దొరుకుతుంది. వెయ్యి పత్రికల మీద వచ్చే అదనపు విలువ కన్నా, 2 వేల పత్రికల మీద వచ్చే అదనపు విలువ రెట్టింపుగా ఉంటుంది. ఈ రెట్టింపు అదనపు విలువ, శ్రమతో సంబంధం లేకుండా వచ్చింది కాదు. వెయ్యి పత్రికల ఉత్పత్తికి ఎంత శ్రమ ఖర్చవుతుందో, 2 వేల పత్రికల ఉత్ప త్తికి రెట్టింపు శ్రమ ఖర్చవుతుంది. పత్రికల సంఖ్య పెరిగితే, దాని కోసం వెచ్చించవలసిన శ్రమ రాసి కూడా పెరుగుతుంది. ఎక్కువ శ్రమతో ఉత్పత్తి జరగడం వల్లనే ఎక్కువ అదనపు విలువ వస్తుంది. ఎక్కువ పత్రికల ద్వారా పెట్టుబడిదారుడికి వచ్చే ఎక్కువ అదనపు విలువకు కారణం, ఆ పత్రికల్ని ఉత్పత్తి చేసిన ఉత్పాదక శ్రామికులే.

ఒక పత్రికలో మొత్తం 10 మంది రచయితలు రాశారనుకుందాం. అందులో, 4 గురు స్వతంత్ర రచయితలూ, 6 గురు వేతన శ్రామికులూ అనుకుందాం. స్వతంత్ర రచయితలు, ఆ పత్రిక్కి రచనలు ఇస్తే, వాటికి రావలసిన విలువ అంతా పూర్తిగా వారికి అందుతుందని అనుకోవాలి. అది జనరల్ సూత్రం. ఆ పత్రిక తయారవడానికి, అచ్చు పనిలో ఇంకో 20 మంది శ్రామికులు పని చేశారనుకుందాం. ఆ పత్రిక 'ఉపయోగపు విలువ'కి, ఉత్పాదక

శ్రామికులూ, స్వతంత్ర రచయితలూ కూడా కారణమే. కానీ ఆ పత్రిక విలువకి ఉత్పాదక శ్రామికులూ, స్వతంత్ర రచయితలూ ఒకే రకంగా కారణం కాదు. 'విలువ' కోణంలో చూస్తే — స్వతంత్ర రచయితల పాత్ర, పత్రికకు కావలసిన కొన్ని 'ఉత్పత్తి సాధనాల్ని' (Cని) అందించే పాత్రగా మాత్రమే ఉంటుంది.

బట్ట తయారీకి దారం కావాలి కదా? ఆ దారం 'స్థిర పెట్టుబడి'లో ఒక అంశం. ఆ దారాన్ని ఉత్పత్తి చేసిన శ్రామికుడికి, బట్ట విలువతో ఎలాంటి సంబంధం ఉంటుంది? బట్ట తయారీకి కావలసిన ఉత్పత్తి సాధనాల్లో ఒక సాధనాన్ని ఇచ్చిన సంబంధం ఉంటుంది. దారంతో బట్ట తయారయ్యే 'ఉత్పత్తి క్రమం'లో అయితే, దారాన్ని తయారు చేసిన శ్రామికుల పాత్ర ఏమీ ఉండదు. సరిగ్గా అలాగే, ఒక పత్రికకు తన రచనని ఇచ్చిన స్వతంత్ర రచయితకి, ఆ పత్రిక ద్వారా వచ్చే 'అదనపు విలువ' ఉత్పత్తిలో ఏమీ పాత్ర ఉండదు. ఎందుకంటే, ఆ రచయిత, తన రచనకు రావలసిన విలువనంతా తీసేసుకుంటాడు కాబట్టి.

స్వతంత్ర రచయితల రచనల కోసం పెట్టిన ఖర్చు, 'స్థిర పెట్టుబడి'లో భాగం. పత్రికని అమ్మగా వచ్చిన డబ్బులో నించి, స్థిర - అస్థిర పెట్టుబడుల్ని తీసివెయ్యగా మిగిలిన అదనపు డబ్బుకి ఆ పత్రికలో పని చేసే ఉత్పాదక శ్రామికులే కారణం.

ఒకవేళ, పత్రిక యజమాని, ఒక స్వతంత్ర రచయిత నించి రచన తీసుకుని 'న్యాయమైన' విలువ ఇవ్వకుండా చాలా తక్కువ విలువ ఇచ్చాడనుకుందాం. ఇది 'సరుకు మారకం'లో జరిగిన మోసం. ఈ మోసం చేసిన మనిషి తప్పకుండా 'లాభ'పడతాడు. మోసానికి గురి అయిన మనిషి తప్పకుండా 'నష్ట'పోతాడు. కానీ అప్పుడు కూడా ఆ రచయిత, పత్రిక ద్వారా వచ్చిన 'అదనపు డబ్బు' ఉత్పత్తిలో భాగస్తుడు కాడు.

పత్రిక యజమాని, ఒక స్వతంత్ర రచయితకి చాలా ఎక్కువ డబ్బు ఇస్తాడనుకుందాం. 'అదనపు విలువ'లో నించి తీసి ఇస్తే తప్ప, అంత ఎక్కువ డబ్బు ఇవ్వడానికి ఇంకో రకంగా అవకాశం ఉండదు.

పెట్టుబడిదారుడికి కావలసిన పద్ధతిలో యంత్రాల్ని తయారుచేసే ఇంజనీరులాగా, పెట్టుబడిదారుడికి కావలసిన పద్ధతిలో 'సంస్థ'ని నడిపే మేనేజరులాగా, పెట్టుబడిదారుడికి కావలసిన టెక్నిక్కులతో రాసే రచయిత కూడా పెట్టుబడిదారుడి పక్షం మనిషే అవుతాడు. పెట్టుబడిదారీ ఇంజనీరూ, మేనేజరూ కూడా ఏదో ఒక శ్రమ చేసే వారిగానూ, తమ 'శ్రమ విలువ'ని మించిన ఫలితం పొందే వారిగానూ ఉన్నట్టే, ఈ పెట్టుబడిదారీ రచయిత కూడా ఒక శ్రమ చేసే వాడిగా ఉంటూ, ఆ శ్రమ విలువని మించిన ఫలితం పొందే వాడిగా ఉంటాడు. ఇలాంటి రచయిత పైకి మాత్రం స్వతంత్ర ఉత్పత్తిదారుడి లాగానే కనపడతాడు. అంటే పెట్టుబడిదారుడికి తన సరుకుని ఇచ్చి, దాని విలువని మాత్రమే తీసుకుంటూ, పెట్టుబడిదారుడితో కేవలం 'సింపుల్ మారకం' జరిపే వాడిలాగా. కానీ, అసలు నిజం, పెట్టుబడిదారుడికి కావలసినట్టుగా రాసి ఇచ్చి, పెట్టుబడిదారుడి నించి ఎక్కువ మొత్తం తీసుకోవడం అంటే, తన శ్రమకు రావలసింది కొంతా, అదనపు విలువ నించి కొంతా లాగుతాడు.

కానీ, ఈ విషయం పైకి ఎలా కనపడుతుందంటే, ఆ రచయిత రచనల కోసం పత్రికల పెట్టుబడిదారుల మధ్య అంత పోటీ ఉన్నట్టూ, ఆ పోటీలో ఆ రచనకు అంత విలువ ఏర్పడినట్టూ, కనపడుతుంది. పైకి కనపడేది అంత వరకే. పోటీ అనే 'సత్యాన్ని' ఒప్పుకోవచ్చు. పత్రిక పెట్టుబడిదారుడు పోటీ వల్లనే ఆ రచనకి అంత డబ్బు ఇస్తాడు. కానీ, పెట్టుబడిదారుడు, ఆ రచన కోసం ఇవ్వవలసిన దాని కన్నా ఎక్కువ డబ్బు ఎక్కడి నించి తెచ్చాడు — అనే అసలు సత్యం దగ్గిరికి వస్తే, అది 'అదనపు విలువ లోదే' అని తేలుతుంది. అంటే, ఆ రచనకు ఇచ్చిన డబ్బులో కొంత భాగం C లోదీ, కొంత భాగం Sదీ అవుతాయి.

ఈ రచయిత, ఒక పెట్టుబడిదారుడి దగ్గిర వేతన శ్రామికుడే అయితే, అప్పుడు కూడా అతని రచనకి మితిమీరిన విలువ ఉండదు. ఎక్కువ డబ్బు వచ్చిన ఏ సందర్భంలో అయినా, అది, ఇతరుల అదనపు విలువే అవుతుంది.

# 5) సినిమా నటుల శ్రమ

'సినిమా పరిశ్రమ'ని తీసుకుంటే 'సినిమా ప్రదర్శనే' — ఒక సరుకు. ఒక సినిమా హాల్లో కూర్చుని సినిమా చూసేవాళ్ళు, ఆ 'సరుకుని' కొన్నారు. 2 రూ.లతో టిక్కట్టు కొని సినిమా చూసే మనిషి, ఆ డబ్బుని దేనికి చెల్లించినట్టు? ఆ సినిమా చూడడానికీ, అంతసేపూ ఆ సినిమా హాల్లో ఒక కుర్చీలో కూర్చోవడానికీనూ. ఆ కుర్చీ ఇంకా మెత్తని పరుపుల కుర్చీ అయితేనూ, ఆ కూర్చునే స్థలం కూడా ఇంకా సుఖాన్నిచ్చే స్థలం అయితేనూ, ఆ టిక్కెట్టు విలువ ఇంకా ఎక్కువగా ఉంటుంది. మన 2 విలువగల టిక్కెట్టులో, సినిమా హాలుకి సంబంధించిన భాగం అర్ధ

రూపాయీ, సినిమాకి సంబంధించిన భాగం రూపాయి న్నరా — అనుకుందాం. 'సినిమా నటుల' శ్రమ విలువని పరిశీలించే ఈ ఉదాహరణలో, 'సినిమా'కి సంబంధించిన విషయాలనే తీసుకోవాలిగానీ, 'సినిమా హాలు — విలువ' విషయం అనవసరం. టిక్కెట్టు విలువలో సినిమా హాలుకి సంబంధించిన భాగాన్ని వదిలేసి, సినిమాకి సంబంధించిన భాగాన్నే దృష్టిలో ఉంచుకుందాం.

సినిమాని ఉత్పత్తి చెయ్యడంలో డైరెక్టర్ దగ్గిర్నించీ, లైట్ బోయ్ వరకూ అందరూ ఉత్పాదక శ్రామికులే. నటు లందరూ కూడా ఉత్పాదక శ్రామికులే. ఈ మొత్తం శ్రమల్లో ఏ శ్రమ లేకపోయినా, ఆ సరుకు (సినిమా) తయారుకాదు.

ఒక రోజున లైట్‌బోయ్, 'పని'లోకి రాకపోతే ఆ పని ఇంకెవరైనా చెయ్యాలి. అంతేగానీ, ఆ పని లేకుండానే సినిమా తీసేపని జరిగిపోదు. అలా జరిగితే, ఆ పనిలో లైట్‌బోయ్ ఎప్పుడూ ఉండనక్కరలేదు. కాబట్టి, ఈ ఉత్పత్తి క్రమంలో హీరో ఎంత ఉత్పాదక శ్రామికుడో, లైట్‌బోయ్ కూడా అంత ఉత్పాదక శ్రామికుడే.

ఇతర పరిశ్రమలకూ, సినిమా పరిశ్రమకూ, జీతాలు ఇచ్చే పద్ధతిలో ఒక తేడా ఉంటుంది. నేతా, కుట్టూ లాంటి పరిశ్రమల్లో జీతాలు 'టైమ్ వేజ్'గానో, 'పీస్ వేజ్'గానో ఇస్తారు. ఇక్కడ జీతాలు, సినిమాకంతటికీ ఒకే మొత్తంలో ఉంటాయి. ఇది జీతాలివ్వడంలో ఇంకో పద్ధతి మాత్రమే. (ఇది పీస్ వేజ్‌లోనే ఇంకో రకం.) కొంత 'పెట్టుబడి పెట్టి, సినిమా తీస్తే, దాని వల్ల అదనపు విలువా, అందులో నించి వడ్డీలూ లాభాలూ — అంతా మామూలే. జీతాలు — నెల వారీగా తీసుకున్నారా, ఒకే మొత్తంగా తీసు కున్నారా — అన్నది ప్రశ్న కాదు.

కుట్టూ, నేతా, వ్యవసాయం — లాంటి శ్రమలకూ; రచనా, నటనా, నాట్యం, గానం, చిత్రలేఖనం — లాంటి శ్రమలకూ — ఒక ప్రధానమైన తేడా ఉంది. మొదటిరకం శ్రమలన్నీ , 'సాధారణ' శ్రమలైతే; రెండో రకం శ్రమలన్నీ 'అసాధారణ' శ్రమలు. అంటే, 'కళల కోవకు' చెందిన శ్రమలు. మొదటి రకం శ్రమలు అందరూ నేర్చుకోగలరు. వాటిని దాదాపు అందరూ ఒకే సామర్థ్యంతో చెయ్యగలరు. రెండో రకం శ్రమలు అందరూ నేర్చుకోలేరు. నేర్చుకున్న వాళ్ళు కూడా అందరూ ఒకే సామర్థ్యంతో చెయ్యలేరు.

మొదటి రకం శ్రమలకు, శ్రమ కాలాల్ని బట్టి విలు వలు కట్టడం సాధ్యమైనట్టుగా, రెండో రకం శ్రమలకు, పూర్తిగా అలాగే విలువలు కట్టడం సాధ్యం కాదు. 'కళలు' కేవలం శ్రమతో మాత్రమే ఉత్పత్తి అయ్యే విషయాలు కావు. కళల్లో , శ్రమతో సంబంధంలేని ఒక 'సహజ శక్తి' (నేచురల్ టాలెంట్) అనే ప్రత్యేక లక్షణం కూడా ఉంటుంది. అంటే, 'కళ' అనేది — సహజ శక్తీ, శ్రమ శక్తీ కలిసి ఏర్పడే విషయంగా ఉంటుంది. ఒక కళని తీసుకుంటే, దానిలో ఉన్న 'శ్రమ' అనే అంశానికే విలువ లెక్కలుగానీ, 'సహజ శక్తి' అనే అంశానికి విలువ లెక్కలు వర్తించవు.

పిట్టలాగా పాడే గాయకురాలి పాటకి డబ్బుతో విలువ కట్టాలంటే అక్కడ ఏ సూత్రం పని చెయ్యాలి? ఆ పాటకి బదులు ఎంత డబ్బు ఇస్తే అది సమానమైన మారకం అవుతుంది? ఒక కుట్టు శ్రమనో, నేత శ్రమనో తీసుకు న్నప్పుడు దాని కోసం ఎంత చెల్లించాలో, లెక్క కట్టడానికి మార్గం ఉంటుంది. ఆ పనికి 'ఎంత శ్రమ కాలం పట్టిందో' అంత చెల్లించాలి. కానీ, కళకి ఎంత ఇవ్వాలో లెక్క కట్టడానికి అలాంటి మార్గం ఉండదు.

నేతా, కుట్టూ లాంటి పనులు ఎంత మంది చేసినా అందరి పనీ ఒకే రకంగా ఉంటుంది. దున్నిన భూమిని చూసిగానీ, నేసిన బట్టని చూసి గానీ, 'ఇది ఫలానా మనిషే చేశాడ'ని చెప్పడానికి వీలు ఉండదు. కానీ, 'కళల' విషయం అలా కాదు. వంద మంది గాయకుల్లో ఎవరి ప్రత్యేకత వాళ్ళది. ఎవరి కంఠం వాళ్ళది. ఒక కంఠంలో ఒక అందం ఉంటే, ఇంకో కంఠంలో ఇంకో అందం ఉంటుంది. ఒక కంఠం ఎక్కువ శ్రావ్యంగా ఉండడంలో గానీ, ఉండకపోవడంలో గానీ, ఏ ఇద్దరు గాయకులూ ఒకే రకంగా ఉండరు. వంద కంఠాల్లో వంద ప్రత్యేకతలు ఉంటాయి. ప్రతీ ప్రత్యేకతా ఒక 'ఉపయోగపు విలువ.' ఒక గాయకుడిని విన్న వాళ్ళు, ఆ గానం బాగుందనో — బాగు లేదనో, ఎక్కువ బాగుందనో — తక్కువ బాగుందనో, ఎవరి అభిరుచిని బట్టి వాళ్ళు అనుభూతి చెందడమే — ఆ గానానికి బదులుగా దొరికే 'ప్రతిఫలం.' అంటే, 'కళ' ఎప్పుడూ 'ఉపయోగపు విలువ'గా మాత్రమే ఉంటుంది. కళకు అసలైన మారకం, 'డబ్బు' ద్వారా గాక, ఆ కళని ఇష్టపడే జనాల 'గుర్తింపు' ద్వారా దొరుకుతుంది. అంటే, కళకు నిజమైన ప్రతిఫలం — జనాల హృదయాల నించి ఆ కళాకారుడికి దొరికే ప్రేమే, కీర్తే! ఆ కీర్తి ఒకరికి ఎక్కువగా దొరకవచ్చు. ఒకరికి తక్కువగా దొరక వచ్చు — ఆ కళా ప్రతిభలో తేడాల్ని బట్టి.

అయితే, ఒక కళలో 'సహజ శక్తి' అనే అంశంతో పాటు, 'శ్రమ శక్తి' అనే రెండో అంశం కూడా ఉంటుంది కాబట్టి, ఈ రెండో అంశమే ఆ కళకు డబ్బు రూపంలో ఎంతో కొంత విలువ ఏర్పడే అవకాశం కలిగిస్తుంది. ఒక కళాకారుడికి కూడా, జీవితావసర వస్తువులూ, సౌకర్యాలూ కావాలి. అవేగాక, కళని అభివృద్ధి చేసుకునే అవకాశాలు కూడా కావాలి. అవి లేకపోతే, ఆ మనిషి, కళని ప్రదర్శించ లేడు. ఏ కళకి కావలసిన పరిస్తితులు ఆ కళకి వేరు

వేరుగా ఉంటాయి. ఆ తేడాల్ని బట్టే ఆ కళల విలువలు కూడా తేడాగా ఉంటాయి. 'కళ'లో కూడా 'శ్రమ' అనే అంశం ఉండడం వల్లనే 'కళ' కూడా కొంతవరకూ 'విలువ సూత్రా నికి' లోబడుతుంది. కానీ, కళని పూర్తిగా డబ్బుతో లెక్క కట్టడం అసహజమైన కొలత. కానీ, పెట్టుబడిదారీ సమా జంలో అన్ని కళల ప్రతిఫలాలూ, 'డబ్బు' రూపం లోనే ఉంటాయి. కళలకు ప్రతిఫలంగా ఇక్కడ కీర్తి కూడా ఉన్నా, ఆ కీర్తిలో ఎక్కువ భాగం అబద్ధపు కీర్తి గానే ఉంటుంది. కీర్తితో సంబంధం లేకుండానే, ఇక్కడ డబ్బు లెక్కలన్నీ వేరుగా ఉంటాయి.

పెట్టుబడిదారీ దృష్టిలో కళల్నీ, పరువు ప్రతిష్టల్నీ, గౌరవ మర్యాదల్నీ, మంచి చెడ్డల్నీ — అన్నిటినీ డబ్బుతో కొలవడం తప్ప ఇంకో మార్గం (సహజ మార్గం) ఉండదు.

పెట్టుబడిదారీ పరిశ్రమల కోసం పనిచేసే రచనా, నటనా, గానం, నృత్యం — వంటి కళలన్నీ, పెట్టుబడి దారుడికి ఎలా కావాలంటే అలా, కేవలం 'సరుకుల' స్థాయిలోనే, ఉత్పత్తి అవుతాయి. అవి శారీరక శ్రమల కోవలోకో, మేధాశ్రమల కోవలోకో చేరిపోతాయి. అందుకే వాటికి విలువలు ఏర్పడడమూ, వాటిని డబ్బుతో మారకం చెయ్యడమూ, సర్వసాధారణం అయిపోతుంది.

ఒక సినిమా పెట్టుబడిదారుడు, ఒక హీరో స్థాయి నటుడికి, ఒక సినిమా కోసం 20 లక్షలు ఇచ్చాడను కుందాం. ఇది ఆ స్థాయి నటులందరికీ సాధారణంగా ఇచ్చే రేటు కాదనీ, ఒక నటుడికే (లేదా, కొందరు నటులకే) అంతంత రేట్లు ఉన్నాయనీ అనుకుందాం.

పెట్టుబడిదారుడు తీసే సినిమాలో పనిచేసే నటుడు ఉత్పాదక శ్రామికుడు కదా? ఒక శ్రామికుడికి వచ్చేది శ్రమశక్తి విలువే గానీ, శ్రమ విలువ కాదు — అనే జనరల్ సూత్రాన్ని యధాతథంగా తీసుకుని బైల్దేరితే, ఇప్పుడు మనం చాలా విచిత్రమైన శ్రామికుణ్ణి చూస్తాం.

ఈ సినిమా 'అదనపు విలువ రేటు'ని కూడా, మనం గతంలో ప్రతీచోటా అనుకుంటూ ఉన్నట్టుగానే, 100%గా అనుకుందాం. అంటే, ఈ సినిమాకోసం పనిచేసిన ప్రతీ ఉత్పాదక శ్రామికుడూ తన జీతాలకు సమానమైన అద నపు విలువని పోగొట్టుకుంటాడని అర్థం. అంటే, మన 20 లక్షల నటుడు కూడా, తన జీతానికి సమానమైనంత అదనపు విలువని పోగొట్టుకున్న వాడవుతాడు. అంటే, ఈ నటుడి శ్రమ విలువ = 20 లక్షల జీతం + 20 లక్షల అదనపు విలువ = 40 లక్షలు అవుతుంది. అంటే, ఈ నటుడు ఈ సినిమా కోసం 40 లక్షల విలువ గల శ్రమ చేసి, అందులో 20 లక్షలు మాత్రమే జీతంగా పొంది, ఇంకో 20 లక్షలు పోగొట్టుకున్నట్టు తేలుతుంది. ఈ సినిమా తయారవడానికి 6 నెలలు పట్టిందనుకుందాం. ఈ 6 నెలల కాలంలో ఈ నటుడు ఇంకో 3 సినిమాలలో కూడా నటించాడనీ, ఆ సినిమాలకు కూడా ఇదే రేటున డబ్బు తీసుకున్నాడనీ, వాటి అదనపు విలువల రేట్లు కూడా 100%గా ఉన్నాయనీ, అనుకుందాం. ఆ 6 నెలల కాలంలో ఆ నటుడు మొత్తం 1 కోటీ, 60 లక్షల విలువ గల శ్రమ చేసినట్టూ, అందులో నించి మొత్తం 4 సినిమా లకూ కలిసి, 80 లక్షలు మాత్రమే తీసుకుని, ఇంకో 80 లక్షలు పోగొట్టుకున్నట్టూ తేలుతుంది. 6 నెలల కాలంలో 1 కోటీ, 60 లక్షల శ్రమ చెయ్యడం అంటే, ఒక్కో నెలకీ దాదాపు 27 లక్షల శ్రమ చేశాడన్న మాట! ఏమిటీ లెక్కలు? ఎలా అర్థం చేసుకోవాలి దీన్ని? అతనికి అందింది అతని శ్రమశక్తి విలువేనా? — కాదు. ఎంత మాత్రమూ కాదు.

ఇక్కడ జవాబు మొదట క్లుప్తంగా చెప్పుకుంటే, ఈ నటుడు తినే డబ్బులో చాలా ఎక్కువ భాగం అతని శ్రమతో ఏమీ సంబంధం లేనిదే. — అయితే ఆ డబ్బంతా ఎక్కడిది? — ఇతర కార్మికుల అదనపు విలువ కొంతా, ఆ సినిమా చూసే జనాల జేబుల్లోది కొంతా. ఈ రెండో అంశమే అసలు కారణంగా ఉంటుంది. ఈ విషయాలే ఇప్పుడు వివరంగా చూడాలి.

కళలకు సంబంధించిన రంగాల ఉదాహరణలు, మామూలు వస్తువుల ఉదాహరణలతో యధాతథంగా సరిపోవు. ఇక్కడ, అనేక కోణాలకు సంబంధించిన విష యాల్ని సమన్వయ పరుచుకోవాలి.

బియ్యమూ, బట్టలూ, పాలూ, మందులూ వంటి నిత్యజీవితావసర వస్తువుల వాడకానికీ; రచనా, నటనా, గానం, నాట్యం — లాంటి 'కళ'ల వాడకానికీ - ఒక తేడా ఉంది. మొదటి రకం వస్తువులన్నీ శరీర పోషణకు సంబం ధించినవి కాబట్టి, వాటితో అవసరాలు మితిమీరిన స్థాయికి పెరగడం గానీ, అసలే లేకుండా పోవడం గానీ, ఎప్పుడూ జరగవు. రెండో రకం అవసరాలు ఎక్కువ భాగం 'మానసి కానందానికి' సంబంధించినవి. ఈ ఆనందాలు పూర్తిగా జనాల 'సాంస్కృతిక స్థాయి మీదే' ఆధారపడి ఉంటాయి. పెట్టుబడిదారీ సమాజంలో, పెట్టుబడిదారీవర్గమూ శ్రామిక వర్గమూ కూడా (ఉత్పాదక — అనుత్పాదక శ్రామికులూ, స్వతంత్ర ఉత్పత్తిదారులూ, స్త్రీలూ — పురుషులూ అనే తేడాలు లేకుండా), ప్రధానంగా పెట్టుబడిదారీ భావాల లోనే, ఆ సాంస్కృతిక స్థాయిలోనే ఉంటారు. అంటే, పెట్టుబడిదారీ ఆలోచనా విధానం తోటే, పెట్టుబడిదారీ అభిరుచుల తోటే, పెట్టుబడిదారీ కృత్రిమ విలువల తోటే, ఉంటారు. జనాల భావాలూ, అభిరుచులూ, అలవాట్లూ, దోపిడీ పరిధిలోనే ఉన్నప్పుడు, 'కళల' అంశకు సంబం ధించిన పత్రికా, సినిమా — వంటి పరిశ్రమల టెక్నిక్కు

లన్నీ, జనాల్ని, దోపిడీకే అనుకూలంగా ప్రభావితం చేస్తాయి.

ఒక సరుకుని ఉత్పత్తిచేసే ఏ పెట్టుబడిదారుడైనా, తన సరుకే అత్యుత్తమమైనదనీ, ఇతరుల సరుకులు పనికిమాలినవనీ ప్రచారం చేసే విధంగానే, సినిమా పెట్టుబడిదారుడు కూడా తన సినిమాలో నటులవేపే జనాలు ఆకర్షితులయ్యేటట్టు చెయ్యడానికి కావలసిన జిత్తులన్నీ ప్రయోగిస్తాడు. జనాలకు ఏ నటుడి మీద 'వెర్రి వ్యామోహం' ఏర్పడుతుందో ఆ నటుడు ఉన్న సినిమాకి కనక వర్షం కురుస్తుంది కాబట్టి, నటుల 'గ్లామర్'ని పెంచే సర్వప్రయత్నాలూ పెట్టుబడిదారులు చేస్తారు. (నటులూ చేసుకుంటారు.) నటుల మధ్య పోటీలో కొందరు నటులు తారాస్థాయికి ఎగిరితే, కొందరు నటులు నేలరాలి కను మరుగైపోతారు.

బట్టా, కుర్చీ, ధాన్యం — లాంటి జీవితావసర వస్తువుల ఉత్పత్తిలో, ఒకే రకం పనిలో, 10 మంది శ్రామికులు పనిచేస్తే, అందరూ ఇచ్చే ఉపయోగపు విలువ ఒకే రూపంతో, ఒకే పద్ధతిలో ఉంటుంది. కళల విషయం అలా కాదు. 'నటన'లో ఒకే పాత్రని, ఇద్దరు వేరు వేరు నటులు నటిస్తే, ఆ 2 పాత్రలూ వేరు వేరు ఉపయోగపు విలువలు అయిపోతాయి. ఇక్కడ ఆ నటులు చేసే 'శ్రమ' మాత్రమే కాదు, వాళ్ళ దేహాలే ఆ పనిలో పాల్గొంటాయి. ఇద్దరు మనుషులు చేసే 'శ్రమ' ఒకే రకంగా ఉన్నట్టు, ఇద్దరి దేహాలు ఒకే రకంగా ఉండవు. మనుషుల ఆకారాలూ, కదలికలూ, కంఠస్వరాలూ, నటించే విధానాలూ, అన్నీ వేరు వేరుగా ఉంటాయి. ఇవన్నీ సహజమైన తేడాలు. ఈ సహజ తేడాలు గల నటుల్లో, జనాలకు ఒక నటుడిపట్ల ఎక్కువ ఆకర్షణా, ఒక నటుడిపట్ల తక్కువ ఆకర్షణా ఏర్పడినప్పుడు, పెట్టుబడిదారీ భాషలో చెప్పుకుంటే, మొదటి నటుడికి ఎక్కువ 'డిమాండ్' ఉందని అర్థం. ('సప్లై — డిమాండ్లు' అనే మాటల్ని మనం ఇంతవరకూ పరిచయం చేసుకో లేదు. వీటిని 2వ సంపుటంలో చూస్తాం.) నిజానికి, 'సప్లై — డిమాండ్లు,' వస్తువులకు వర్తించవలసిన విషయాలు. కానీ, పెట్టుబడిదారీ సమాజంలో, 'సరుకు' ఉన్న ప్రతీ చోటా ఇవి ఉంటాయి. రచయిత తన రచననీ, నటుడు తన నటననీ, గాయకుడు తన గానాన్నీ — ఈ రకంగా మనుషులు తమ సహజ శక్తుల్నీ, శరీరాల్నీ కూడా పెట్టుబడిదారులకు 'సరుకులు'గా అమ్ముకునేటప్పుడు, ఆ సరుకుల విలువల్ని నిర్ణయించడంలో, 'శ్రమ' అనేది సెకండరీ విషయంగా అయిపోయి, సప్లయి డిమాండ్లే ప్రధాన విషయాలుగా ముందుకు వస్తాయి.

ఒక నటుడికి ఎక్కువ డిమాండ్‌వల్ల ఎక్కువ డబ్బు వస్తుంది. 'డబ్బు' అంటే — 'శ్రమ.' కొంత డబ్బు నటుడి చేతిలోకి వచ్చినప్పుడు, దానికి తగ్గ శ్రమ నటుడి నించి వెళ్ళాలి. కానీ, ఇక్కడ, అంటే, ఊహాతీతమైన డిమాండ్లు ఉండే సినిమా ప్రపంచంలో, శ్రమతో నిజమైన సంబంధం లేకుండానే, డబ్బు రాసులు ఇటూ అటూ పరుగులు తీస్తూ ఉంటాయి. ఒక నటుడి చేతిలోకి వచ్చిన 20 లక్షలకీ, అతని శ్రమకీ నిజమైన సంబంధం ఉండదు.

అయితే, ఆ సినిమా పెట్టుబడిదారుడు, ఆ డబ్బంతా నటుడికి, ఎలా ఇవ్వగలుగుతాడు? — ఇదే ఇక్కడ అసలైన ప్రశ్న. 'ఇతర కార్మికుల అదనపు విలువలో నించే' అనే జవాబు ఇక్కడ పూర్తిగా సరిపోదు. కొంత వరకే సరిపోతుంది. ఎందుకంటే, ఈ సరుకు విషయంలో, 'అదనపు విలువ' కూడా అంత ఎక్కువ స్థాయిలో ఉండదు.

ఒక సినిమా కోసం పెట్టుబడిదారుడు మొత్తం 'జీతాల' మీద 45 లక్షలు పెట్టాడనుకుందాం. అందులో హీరోకి 20 లక్షలూ, హీరోయిన్‌కి 5 లక్షలూ, డైరెక్టర్‌కి 15 లక్షలూ, మిగిలిన ఉత్పాదక శ్రామికులందరికీ కలిసి 5 లక్షలూ — ఈ రకంగా పెట్టాడనుకుందాం. మొత్తం అందరి జీతాలూ కలిసి 45 లక్షలు. ('స్థిరపెట్టుబడి' సంగతి అనవసరం. దాని మీద ఎంత పెట్టినా ఒకటే. ఎంత పెడితే అంతే వెనక్కి వస్తుంది, దాని వల్ల, పెట్టిన దాని కన్నా ఎక్కువగా వచ్చేదేమీ ఉండదు కాబట్టి.)

'జీతాల' మీద పెట్టిన 45 లక్షల్లో, హీరోకీ హీరోయిన్‌కీ డైరెక్టర్‌కీ కలిసి, 40 లక్షలు. ఈ ముగ్గురి శ్రమ విలువలూ కలిసి 'న్యాయంగా' అయితే, ఆ సినిమా తీసిన కాలాని కంతటికీ కలిసి, '3 లక్షలు' మాత్రమే ఉంటుంది — అనుకుందాం. ఈ ఉదాహరణ ప్రకారం, ఆ ముగ్గురికీ కలిసి 3 లక్షలు ఇస్తే, వాళ్ళ 'శ్రమ విలువ' అంతా వాళ్ళకి ఇచ్చినట్టే అర్థం. (వారి 'అదనపు విలువ' కూడా ఆ 3 లక్షలలోనే ఉందని అర్థం.) కానీ, పెట్టుబడిదారుడు వాళ్ళకి 40 లక్షలు ఇచ్చాడు. అంటే, వాళ్ళకి ఇంకా 37 లక్షలు 'అదనంగా' అందింది. 'ఇది ఎక్కడిది' అని చూసి నప్పుడు, సాధారణంగా ఇతర సరుకుల ఉదాహరణల్లో చెప్పుకున్నట్టు, 'సరుకు తాలూకు అదనపు విలువలో నించే తీసి, పెట్టుబడిదారుడు ఆ మొత్తాన్ని ఆ ముగ్గురుకీ ఇవ్వగలిగాడు' అని జవాబు చెప్పుకున్నామనుకుందాం. దాని అర్థం ఏమిటంటే — ఆ సినిమా కోసం చిన్న చిన్న జీతాలతో పని చేసిన ఉత్పాదక శ్రామికులందరూ తమ జీతాల విలువ అయిన 5 లక్షల్నీ, ఈ 37 లక్షల అదనపు విలువనీ ఇచ్చినట్టు అర్థం వస్తుంది. అంతే కాదు. ఈ సినిమా ద్వారా పెట్టుబడిదారుడికి కూడా కొంత 'అదనపు విలువ' రావాలి కాబట్టి అది కూడా కలవాలి కదా? దాన్ని 30 లక్షలు అనుకుంటే, చిన్న జీతాల

ఉత్పాదక శ్రామికులు, మొత్తం ఎంత అదనపు విలువని ఇచ్చినట్టు అవుతుందంటే — 37+30 = 67 లక్షల 'అదనపు విలువ'ని! అంటే, 5 లక్షల జీతాల శ్రామికులు-. 67 లక్షల 'అదనపు విలువ'ని ఇచ్చారనీ, ఆ అదనపు విలువలోనించే పెట్టుబడిదారుడు, పెద్ద నటులకూ, డైరెక్టర్‌కీ ఇచ్చి, మిగిలింది తను తీసుకున్నాడనీ — అర్థానికి రావలసి వస్తుంది.

కానీ, 'సినిమా' అనే ప్రత్యేక సరుకు విషయంలో, పెట్టుబడి కన్నా అదనంగా, ఎంతో ఎక్కువగా వచ్చిన దంతా, చిన్న జీతాల శ్రామికుల అదనపు విలువే — అనడం హేతుబద్ధంగా ఉండదు.

అందుకే ఇక్కడ పెట్టుబడి కన్నా ఎక్కువగా వచ్చే 'అదనపు డబ్బు'లో చాలా భాగానికి కారణం, ఇంకేదో విషయం అయి వుంటుంది. ఇప్పుడు, ఆ ఇంకేదో విష యాన్ని పట్టుకోవాలి. సినిమా అనే సరుకుకి ఉన్న ప్రత్యేక తల్ని దృష్టిలోకి తీసుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది.

కొంత పెట్టుబడితో ఒక సరుకు తయారైనప్పుడు, ఆ సరుకు అంతా అమ్ముడుపోయినప్పుడే ఆ పెట్టుబడీ, దాని అదనపు విలువా వచ్చినట్టు అవుతుంది. అదనపు విలువ అనేది సరుకులో భాగమే కాబట్టి, అదనపు విలువ కూడా వస్తేనే సరుకు విలువ అంతా వచ్చినట్టు అర్థం. 'సినిమా' అనే సరుకుని తీసుకుంటే, దీని విలువ అంతా రావా లంటే, అనేక ప్రదర్శనలు జరగాలి. పెట్టుబడి అంతా వెనక్కి వచ్చి, ఆ పైన అదనపు విలువ కూడా వచ్చేవరకూ కూడా జరగాలి. అయితే, ఒక సినిమాకి అదనపు విలువ రావడం అంటే, అది ఎంత రావాలి? ఎంత అదనపు విలువ వస్తే 'సినిమా విలువ వచ్చేసింది' అనవచ్చు? — ఇది, ఆ సినిమా కోసం పెట్టిన పెట్టుబడిని బట్టీ, ఆ సినిమాని తీసిన కాలాన్ని బట్టీ ఉంటుంది.

మన సినిమా ఒక సంవత్సరం పాటు 'విజయ వంతంగా' నడిచిందనుకుందాం. (ఆ తర్వాత కూడా ఆ సినిమా అనేక సంవత్సరాల పాటు నడుస్తూనే ఉంటుంది. కానీ, ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, ఈ సినిమా 'ఒక సంవత్సరం పాటు' నడిచిందని అనుకుందాం.) కానీ ఈ సినిమా 3 నెలలు నడిచేటప్పటికే 'పెట్టుబడి' అంతా వెనక్కి వచ్చి, దానికి రావలసిన అదనపు విలువ కూడా వచ్చింది — అనుకుందాం. అంటే, 3 నెలల నాటికి 'సినిమా విలువ' అంతా వచ్చేసిందన్నమాట!

కానీ, సినిమా ప్రదర్శన అక్కడితో ఆగిపోదు. ఇంకా చాలా నెలలపాటు నడుస్తూనే ఉంటుంది (మన ఉదా హరణలో సినిమా ఇంకా 9 నెలలపాటు నడుస్తుంది) 'సినిమా విలువ' అంతా వచ్చేసిన తర్వాత కూడా ఇంకా సినిమా నడిస్తే, అప్పుడు ఆ సినిమాని తియ్యడానికి కొత్త ఖర్చులేమీ ఉండవు. (ఫిల్ము పాతబడి పోతే కొత్త ప్రింటు తీసే ఖర్చుతప్ప.) కానీ, అప్పుడు కూడా ఆ సినిమాని చూడడానికి టిక్కెట్ల విలువలు గతంలో లాగే ఉంటాయి.

2 రూ.ల టిక్కట్టు విషయం తీసుకుందాం. అందులో అర్ధ రూపాయి, సినిమా హాలు ఖర్చు కదా? ఆ ఖర్చు ఇప్పుడు కూడా ఎప్పటి లాగే ఉంటుంది. ఆ ఖర్చు గాక, ఇంకా మిగిలిన రూపాయిన్నర ఖర్చు, సినిమా ఉత్పత్తి కోసం కదా? ఇప్పుడు, సినిమా పెట్టుబడిదారుడి వేపు నించి సినిమా కోసం ఆ ఖర్చు జరగలేదు. తనకు ఆ ఖర్చు జరగకుండానే పెట్టుబడిదారుడు, సినిమా చూసే మనిషి నించి ఆ ఖర్చుని తీసుకుంటాడు.

సినిమా చూసే మనిషి, కొత్త సినిమాకి ఇచ్చినట్టే, పాత సినిమాకి కూడా టిక్కెట్టు విలువ అంతా ఇస్తాడు. ఈ పరిస్తితి వల్ల సినిమా పెట్టుబడిదారుడికి, ఒక ప్రత్యేక సౌకర్యం ఉంది. మొదట కొంత కాలం వరకూ, ఇతర పెట్టుబడిదారుల లాగానే, పెట్టిన పెట్టుబడినీ, దానికి రావలసిన అదనపు విలువనీ సంపాదించిన తర్వాత, ఇక అప్పటి నించి 'పెట్టుబడి ఖర్చు' లేకుండానే లాభం సంపాదించడం మొదలుపెడతాడు.

బట్టా, ధాన్యం — లాంటి వస్తువుల ఉత్పత్తిలో అయితే, పెట్టుబడిదారుడు ప్రతీసారీ కొత్త పెట్టుబడి పెట్టాలి. బట్ట పెట్టుబడిదారుడు 100 మీటర్ల బట్టని ఉత్పత్తి చేయించి, అమ్మి, 100% అదనపు విలువని సంపాదిస్తే, అదే బట్టద్వారా ఇంకో సారి మళ్ళీ కొత్త అదనపు విలువని సంపాదించడం సాధ్యం కాదు. మళ్ళీ కొత్త బట్టని ఉత్పత్తి చేస్తేనే గానీ కొత్త అదనపు విలువ ఉండదు. దాని కోసం మళ్ళీ కొత్త పెట్టుబడిని ఖర్చు పెట్టాలి. కానీ, సినిమా పెట్టుబడిదారుడికి ఆ బాధ లేదు. కొత్త పెట్టుబడి ఖర్చులేకుండా, పాత సినిమానే ఎన్ని సంవత్సరాలైనా అమ్మి, ఎంత లాభమైనా సంపాదించ గలడు. మళ్ళీ కొత్త పెట్టుబడిని ఖర్చుపెట్టడు గనక, దానికి వడ్డీలూ, భూమి అద్దెలూ వగైరాలు ఇవ్వనక్కర లేదు. అదంతా 'ఉత్పాదక లాభం' జేబులోనే పడుతుంది. ఈ రకంగా, ఇతర వస్తువుల అమ్మకానికీ, సినిమా అమ్మకానికీ తేడా ఉంటుంది.

ఒక సినిమా కోసం పెట్టిన పెట్టుబడీ, దానికి రావలసిన కొంత అదనపు విలువా — ఈ రెండూ ఎప్పటికైతే పూర్తి అవుతాయో అప్పటి నించి ఆ సినిమాని చాలా తక్కువ టిక్కెట్టుకే చూపించవచ్చు. ఫిల్ము అరుగు దల ఖర్చూ, సినిమా హాలు ఖర్చూ మాత్రమే తీసుకుని చూపించవచ్చు. లేదా, 'విజయవంతంగా' నడిచే సినిమాకి మొదటి నించీ కూడా టిక్కెట్టు విలువని చాలా తక్కువగా పెట్టవచ్చు. ఎందుకంటే, ఆ సినిమా చాలా కాలం వరకూ

ఆడుతుంది కాబట్టి. అంటే, ఆ సినిమా ఉత్పత్తికి అయిన ఖర్చుని, ఆ చాలా కాలం వరకూ జరిగే ప్రదర్శనల సంఖ్య మీద పరిచి లెక్కకడితే ప్రతీ ఒక్క ప్రదర్శనా, చాలా తక్కువ ఖర్చుతోనే ఉత్పత్తి అవుతుంది కాబట్టి, దాన్ని మొదట్నించీ తక్కువకే అమ్మవచ్చు. కానీ, పెట్టుబడిదారీ సమాజంలో ఈ ఊహ పూర్తిగా అర్థరహితమైనది. ఒక పెట్టుబడిదారుడు సినిమా తీసేది, వీలైనంత కాలం వరకూ వీలైనంత ఎక్కువ డబ్బు సంపాదించాలనే గానీ, లాభం కొంత వరకే సంపాదించి, ఇక అప్పటి నించి లాభాలన్నీ వదిలేద్దామని కాదు.

5 సం.లు మాత్రమే మన్నవలసిన ఒక యంత్రం 10 సం.ల వరకూ మన్నితే, ఆ యంత్రంగల పెట్టుబడిదారుడు, ఆ యంత్రం మీద తయారయ్యే సరుకుని తక్కువ విలువకు ఇవ్వడు కదా? అలాగే, సినిమా పెట్టుబడిదారుడు కూడా, తనకు కొత్త పెట్టుబడి ఖర్చు లేకుండా సినిమాని ప్రదర్శించే కాలంలో కూడా, ఆ సినిమాని తక్కువకి ఇవ్వడు. అయితే, ఇక్కడ ఏం జరుగుతుందంటే — ఈ కాలంలో ఆ సినిమాకి పూర్తి విలువని చెల్లించి దాన్ని చూసే మనిషి, అంత విలువలేని సరుకుకి అంత విలువ చెల్లిస్తున్నాడన్న మాట. ఉపయోగపు విలువగా చూస్తే, ఆ సినిమాకి ఉన్న ఉపయోగపు విలువ ఎప్పుడూ ఒకటే. కానీ, విలువగా చూస్తే, కొంత కాలానికి ఆ సినిమా విలువ తగ్గుతుంది! కానీ, టిక్కెట్టు విలువ తగ్గదు. ఆ రకంగా, ఆ సినిమా, తన జీవిత కాలంలో తన విలువ కన్నా అనేక రెట్ల ఎక్కువ విలువని జనాల నించి వసూలు చేసినట్టు అవుతుంది. ఇలా వసూలు చెయ్యడం, బట్టా, ధాన్యం — లాంటి సరుకుల విషయంలో సాధ్యం కాదు. 'సినిమా' అనే ప్రత్యేక రకపు సరుకు, అది ఎక్కువ కాలం ఆడినట్టయితే, ఆ కాలంలో, తన అసలు విలువనీ, తనలో లేని విలువనీ కూడా వసూలు చెయ్యగలదు.

'సినిమా' అనే సరుకుకి సంబంధించి ఇంకో పరిస్థితి కూడా ఉంది. ఏమిటంటే — ఈ సరుకుని వంద మందికి అమ్మినా వెయ్యి మందికి అమ్మినా పెట్టుబడిదారుడికి అయ్యే ఖర్చు ఒకటే. ఒక సినిమా హాలులో వెయ్యి మంది జనం కూర్చుని సినిమా చూడవచ్చనుకుందాం. సినిమా ఉత్పత్తికి సంబంధించిన ఖర్చు గానీ, సినిమా హాలుకి సంబంధించిన ఖర్చు గానీ, సినిమా హాలులో వెయ్యి మంది కూర్చుని చూసినా, వంద మంది కూర్చుని చూసినా ఒకటే. (కుర్చీల అరుగుదల ఖర్చులోనే కొంచెం తేడా వస్తుంది.) సినిమా, కొత్తగా విడుదలైన దగ్గిర్నించి ప్రతీ ప్రదర్శనకీ, సినిమా హాలంతా నిండుతూ వుంటే, సినిమా పెట్టుబడిదారుడి పెట్టుబడి త్వరత్వరగా వెనక్కి వచ్చేస్తుంది. ఇక, అప్పటినించి, ఆ పెట్టుబడిదారుడికి, కొత్త పెట్టుబడి ఖర్చు లేకుండానే ఆ సినిమా ఆడినంత కాలమూ 'లాభాలు' వస్తూనే ఉంటాయి.

మొదట చూసిన ప్రశ్నకి ఇప్పుడు జవాబు చెప్పుకోవచ్చు. సినిమా పెట్టుబడిదారుడు, నటీనటులకు పెద్ద పెద్ద మొత్తాలు ఇవ్వడమూ, తను కూడా పెద్ద మొత్తాన్ని 'లాభం'గా సంపాదించడమూ, ఎలా చెయ్యగలుగుతాడు - అనే ప్రశ్నకి. జవాబుగా '2 మార్గాల నించి' అని చెప్పుకోవాలి.

**1)** ఆ సినిమాకి సంబంధించిన చిన్న జీతాల ఉత్పాదక శ్రామికుల 'అదనపు విలువలో నించి కొంతా;

**2)** ఆ సినిమాని చాలా కాలం పాటు చూసిన ప్రేక్షకులు, 'తక్కువ విలువ గల' సరుకుకి, ఎక్కువ విలువని ఇవ్వడం ద్వారా కొంతా. అంటే, 'అసమాన మారకం' ద్వారా వచ్చే 'అదనం' నించీ.

సినిమా పెట్టుబడిదారుడు, తను ఖర్చుపెట్టిన పెద్ద పెద్ద మొత్తాల్ని ఈ 2 మార్గాల ద్వారానే వెనక్కి తీసుకోగలుగుతాడు. అంటే, చిన్న జీతాల శ్రామికుల్నీ, ప్రేక్షకుల్నీ కూడా 'దోపిడీ చెయ్యడం ద్వారా' అన్నమాట!

కాబట్టి, సినిమా పెట్టుబడిదారుడు, పెద్ద నటులకూ, డైరెక్టర్‌కీ ఇచ్చే పెద్ద పెద్ద మొత్తాలు, నిజమైన 'అస్థిర పెట్టుబడి' కాదు. అవి, నిజమైన 'శ్రమ శక్తి విలువలు' గానీ, 'శ్రమ విలువలు' గానీ కావు. ఆ డబ్బు రాసులన్నీ దోపిడీ ద్వారా వచ్చేవే.

బట్ట పెట్టుబడిదారుడూ, నేత కార్మికులూ వేరు వేరు వర్గాల మనుషులు అయినట్టుగా, సినిమా పెట్టుబడిదారుడూ, పెద్ద పెద్ద మొత్తాలు తీసుకునే ప్రముఖ నటులూ వేరు వేరు వర్గాలు కాదు. ఇద్దరూ ఒకటే వర్గం. ఇది, ఆ సినిమా ఉత్పత్తి క్రమంలో పాల్గొన్న చిన్న జీతాల ఉత్పాదక శ్రామికుల్నీ, ఆ సినిమా చూసే జనాల్నీ దోచే వర్గం. (ఆ జనాలలో ఇతర పెట్టుబడిదారులు కూడా ఉంటారు. కానీ, సినిమా దోపిడీ వల్ల వాళ్ళకేమీ నష్టం ఉండదు). సినిమా పెట్టుబడిదారుడు, దోపిడీ డబ్బులో నించే, తను కొంత తీసుకుని, ప్రముఖ నటులకు కొంత అప్పచెపుతాడు.

ఈ విషయం, 'మంచి' కళాకారుడికి కూడా వర్తిస్తుంది. ఒక నటుడు, నిజమైన ప్రతిభ కలిగి ఉంటాడనుకుందాం. మంచి పాత్రలే వేస్తాడు. దాని వల్ల అతనికి పెద్ద డిమాండ్ ఏర్పడి, పెద్ద డబ్బు మొత్తాలు వస్తాయి. అతను ఎంత ప్రతిభావంతుడైనా, అతనికి అందే డబ్బంతా అతని శ్రమ ఫలితం అవదు. అతను, ఎంత సహజ ప్రతిభ గల కళాకారుడైనా, ఆ కళకి ప్రతిఫలాన్ని మితిమీరిన డబ్బు రూపంలో పొందడం, పెట్టుబడిదారీ

సమాజ లక్షణమే. మితిమీరిన డబ్బు సంపాదనకు అవకాశ మిచ్చే ప్రత్యేక పరిస్థితులు, 'కళల' రంగం లోనూ, 'వ్యస నాల' రంగం లోనూ మాత్రమే ఉంటాయి.

ఒక సినిమాని తియ్యడానికి నటుల కోసం చాలా మొత్తం ఖర్చయిందనీ, కానీ ఆ సినిమా ఏ మాత్రమూ ఆడలేదనీ — అనుకుందాం. నటులకు ఇచ్చిన మొత్తాలు, పెట్టుబడిదారుడికి సినిమా ద్వారా తిరిగి రాలేదను కుందాం. అంటే, ఏం జరిగింది? — ఆ సినిమాకి సంబం ధించిన ఉత్పాదక శ్రామికులు 'అదనపు శ్రమ' ఇవ్వలేదా? — సినిమా తయారైపోయింది కాబట్టి, 'అదనపు శ్రమ జరగకపోవడం' అనే ప్రశ్నే లేదు. 'అదనపు శ్రమతో కూడా కలిసే' సినిమా తయారైంది, అయితే, ఆ 'సరుకు'కి అమ్మకం జరగలేదు కాబట్టి, (ఆ సినిమాని కనీసం ఎన్ని సార్లు ప్రదర్శించాలో అన్ని సార్లయినా ప్రదర్శించ లేదు కాబట్టి), ఆ సరుకు డబ్బుగా మారలేదు. ఆ సరుకు 'ఉపయోగపు విలువ'గా కూడా లేకుండా అయింది. ఆ సరుకు కోసం ఖర్చయిన ఉత్పత్తి సాధనాలూ, శ్రమలూ అన్నీ 'వృధా' అయి పోయాయి. ఆ సరుకు ద్వారా 'అదనం' రావడం ఏ మార్గం లోనూ జరగలేదన్న మాట! అయితే, అప్పటికే నటులకు పెద్ద మొత్తాలు అందాయి — అనుకుందాం. అదంతా పెట్టుబడిదారుడికి తిరిగి రాదు కాబట్టి, ఆ పెట్టుబడిదారుడు నష్టాల పాలవుతాడు.

సినిమా సరుకు ద్వారా వచ్చే లాభనష్టాలు, ధాన్యమూ బట్టా వంటి ఇతర సరుకుల ద్వారా వచ్చే లాభ నష్టాల లాంటివి కావు. ఆ ఇతర సరుకుల్ని జనం మితిమీరిన స్థాయిలోనూ వాడరు; అసలు వాడకుండానూ ఉండరు. ఆ సరుకుల ద్వారా లాభనష్టాలు మితిమీరిన స్థాయిలో ఉండవు. కానీ, సినిమా సంగతి అలా కాదు. ఒక్కో సినిమాని జనం అనేక నెలల పాటు విరగబడి చూస్తారు. ఒక్కొక్కరూ అనేక సార్లు చూస్తారు. లేదా, ఒక్కో సినిమా వారం రోజులు కూడా నడవదు. ఈ సరుకు ద్వారా, వస్తే మితిమీరిన లాభాలు! పోతే సర్వం నాశనం!

అందుకే ఈ శాఖ, కొత్త పెట్టుబడుల్ని ఆకర్షిస్తూనూ, వికర్షిస్తూనూ కూడా ఉంటుంది.

## 6) 'బ్యాంకు' ఉద్యోగుల శ్రమలు

**బ్యాం**కు ఉద్యోగుల శ్రమలు ఉత్పాదక శ్రమలా, అనుత్పాదక శ్రమలా? - కొన్ని అవీ, కొన్ని ఇవీ.

బ్యాంకులో ప్రధానంగా 2 రకాల పనులు జరుగు తాయి, (1) కొన్ని రకాల 'సరుకుల్ని' ఉత్పత్తి చేసి అమ్మడం (2) డబ్బుని, 'వడ్డీకి' ఇవ్వడం.

బ్యాంకు ఉత్పత్తి చేసే 'సరుకులు' ఏమిటి? బ్యాంకు, జనాల డబ్బుని దాచి పెడుతుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు కొంచెం కొంచెం డబ్బు ఇస్తూ ఉంటుంది. ఒక మనిషి, ఇంకో ఊళ్ళో ఉన్న మనిషికి కొంత డబ్బు పంపా లంటే, ఆ డబ్బుని తన ఊరు బ్యాంకులో ఇస్తే, ఆ బ్యాంకు, ఆ డబ్బుని ఇంకో ఊళ్ళో మనిషికి అందజేస్తుంది. ఈ రకంగా బ్యాంకు, డబ్బుని ఇటూ అటూ అందించడమూ, డబ్బుని దాచడమూ — లాంటి పనులు చేసి, దానికి తగ్గ 'ఛార్జీలు' తీసుకుం టుంది. బ్యాంకుకి, ఈ పనులన్నీ 'సరుకులే'. ఈ పనులు బ్యాంకు ఉద్యోగులే చేస్తారు.

బట్ట పెట్టుబడిదారుడు, కార్మికుల ద్వారా బట్టని ఉత్పత్తి చేయించినట్టే, బ్యాంకు — వ్యాపారం ప్రారం భించిన పెట్టుబడిదారుడు కూడా, బ్యాంకు ఉద్యోగులతో, ఆ ఫలానా ఫలానా పనులు చేయిస్తాడు. ఆ పనులన్నిటికీ చార్జీలు వసూలు చెయ్యడం అంటే, ఉద్యోగులు చేసే ఆ పనుల్ని ఇతరులకు అమ్ముతున్నట్టే అర్థం. అందుకే ఆ పనులు, సరుకులే. ఈ సరుకుల వల్ల వచ్చే మొత్తంలో నించి బ్యాంకు ఖర్చుల్ని (ఉద్యోగుల జీతాలతో సహా) తీసి వెయ్యగా, ఇంకా మిగిలే లాభమే, బ్యాంకుకి ఆదాయం. ఈ సరుకులకు సంబంధించినంత వరకూ, బ్యాంకు ఉద్యోగులు ఉత్పాదక శ్రామికులుగానూ, బ్యాంకు పెట్టు బడిదారుడు ఉత్పాదక పెట్టుబడిదారుడి గానూ అవు తారు. (ఇతర 'ఉత్పత్తి సంస్థల'లో, పెద్ద పెద్ద జీతాలూ ప్రత్యేక సౌకర్యాలూ తీసుకునే మేనేజర్ల రకం ఉద్యోగుల విషయంలో చూసిన విషయాలన్నీ ఇక్కడ ఉండే పెద్ద పెద్ద ఉద్యోగుల విషయంలో కూడా యధాతథంగా వర్తిస్తాయి.)

బ్యాంకు చేసే రెండో రకం పని — జనాల నించి డబ్బుని అప్పులు తీసుకుని, దాన్ని మళ్ళీ జనాలకు అప్పులు ఇవ్వడం. ఈ విషయంలో, బ్యాంకు, ఒక 'వడ్డీ పెట్టుబడిదారుడు.' వడ్డీ పెట్టుబడిదారుడికి వర్తించే విష యాలన్నీ 'బ్యాంకు'కి కూడా వర్తిస్తాయి. వడ్డీ పెట్టుబడి దారుడు, వడ్డీల ద్వారా తన డబ్బు పెంచుకుంటాడు. బ్యాంకు కూడా అదే చేస్తుంది. ఈ 'అప్పుల' విషయంలో, వడ్డీలే బ్యాంకుకి ఆదాయం.

ఒక వ్యక్తి, ఇంకో వ్యక్తి దగ్గిర నూటికి నెలకి 2 వడ్డీ చొప్పున కొంత డబ్బు అప్పు తెచ్చి, ఆ డబ్బుని, ఇతరులకు నూటికి 3 చొప్పున అప్పుగా ఇస్తాడనుకుందాం. దానివల్ల ఆ మనిషికి ప్రతీ నెలా నూటికి 1 మిగులుతుంది. ఎక్కువ వడ్డీలోంచి, తక్కువ వడ్డీని తీసివెయ్యగా వచ్చే మిగులే ఆ

వడ్డీల వాడికి ఆదాయంగా ఉంటుంది. సరిగ్గా అలాగే, బ్యాంకు కూడా బయట నించి తక్కువ వడ్డీకి డబ్బు తీసుకుని, దాన్నే మళ్ళీ ఎక్కువ వడ్డీకి బయటికి ఇచ్చి, ఆ తేడా వల్ల వచ్చే వడ్డీని తన ఆదాయంగా పొందుతుంది.

ఒక బ్యాంకు — ఉత్పాదక సంస్థలకు అప్పులు ఇచ్చి, ఆ సంస్థల నించి తీసుకునే వడ్డీలు, ఆ సంస్థల 'అదనపు విలువల్లో' భాగం. బ్యాంకు — ఉత్పాదక, అనుత్పాదక శ్రామికులకు అప్పులు ఇచ్చి, వారినించి తీసుకునే వడ్డీలు, వారి జీతాలలో భాగం. ఎలా చూసినా బ్యాంకుకి వడ్డీల ద్వారా వచ్చే ఆదాయం, శ్రామికుల శ్రమ ఫలితమే.

'అప్పు' ఇచ్చి 'వడ్డీ'ని వసూలు చెయ్యడమూ, కొంత కాలం తర్వాత అప్పుగా ఇచ్చిన డబ్బుని కూడా వెనక్కి తీసుకోవడమూ — ఇదంతా ఒక సరుకుని ఉత్పత్తి చేసి అమ్మడం కాదు. కాబట్టి, ఈ విషయంలో జరిగే శ్రమలు, ఉత్పాదక శ్రమలు కావు.

ఈ అప్పులకు సంబంధించిన పనులు చేసే విషయంలో, బ్యాంకు ఉద్యోగులు — అనుత్పాదక శ్రామికులు. ఈ విషయంలో వీరు అదనపు విలువని ఉత్పత్తి చెయ్యరు. ఈ విషయాలు ఒక విడి వడ్డీ పెట్టుబడిదారుడి ఉదాహరణ ద్వారా చూస్తే, తేలిగ్గా అర్థమవుతుంది.

ఒక వడ్డీ పెట్టుబడిదారుడు, కొంత మంది ఉత్పాదక పెట్టుబడిదారులకు, 5 వేల డబ్బుని అప్పులుగా ఇచ్చాడనుకుందాం. ఆ పెట్టుబడిదారుల నుంచి వడ్డీల వాడికి ప్రతి నెలా వడ్డీగా 200 వస్తుందనుకుందాం. ఈ వడ్డీ వ్యాపారానికి కూడా కొన్ని పనులు జరగాలి. వడ్డీలు వసూలు చెయ్యాలి, ఎకౌంట్లు రాయాలి. ఈ పనుల కోసం, వడ్డీ పెట్టుబడిదారుడు తన దగ్గిర ఒక గుమాస్తాని పెట్టుకున్నాడు. (గుమాస్తా అంటే కార్మికుడే.) ఆ గుమాస్తాకి నెల జీతం 50. (ఆ గుమాస్తా చేసే రాత పనికీ, వడ్డీల వసూళ్ళకోసం తిరగడానికీ కూడా, కొన్ని ఖర్చులు అవుతాయి. కానీ, ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, ఆ ఖర్చుల్ని పట్టించుకోవడం లేదు. ఆ ఖర్చుల్ని కూడా లెక్క చూడాలంటే, వాటిని గుమాస్తా జీతానికి కలిపితే సరిపోతుంది.)

వడ్డీల వాడు తన గుమాస్తా కోసం ఖర్చు పెట్టే 50 జీతం, యజమానికి, మళ్ళీ వెనక్కి వస్తుందా? ఆ గుమాస్తా ద్వారా యజమానికి 'అదనపు డబ్బు' కూడా వస్తుందా? — ఈ 2 విషయాల్లోనూ ఏదీ జరగదు. ఎందుకంటే, ఈ గుమాస్తా చేసే పనుల్ని, యజమాని, బైటకి అమ్మడు. ఈ ఉద్యోగి శ్రమ, యజమానికి డబ్బుగా మారదు. అది యజమానికి అవసరమైన 'ఉపయోగపు విలువ'గా ఖర్చవుతుంది. కాబట్టి ఈ ఉద్యోగి జీతం మళ్ళీ వెనక్కి రావడం గానీ, అది 'అదనపు డబ్బు'ని తేవడం గానీ జరగవు.

ఈ విషయాలు సరిగా అర్థం చేసుకోకపోతే, వడ్డీల వాడి దగ్గిర కూడా 'అప్పు సౌకర్యం' అనే సరుకు తయారవుతున్నట్టూ, అక్కడ పని చేసే గుమస్తా కూడా ఉత్పాదక శ్రామికుడు అయినట్టూ, పొరపాటు అభిప్రాయాలు కలుగుతాయి.

వడ్డీల వాడు అప్పుగా ఇచ్చింది 5 వేలు. దాని మీద నెలకి వడ్డీ 200. ఈ వడ్డీయే అప్పు ఇచ్చే వాడికి ఆదాయం. వడ్డీల వాడు, తన గుమాస్తా జీతాన్ని (50 ని), బయటికి అప్పు ఇచ్చిన 5 వేలతో నించి ఇస్తాడా, తనకు ఆదాయంగా వచ్చిన 200 లో నించి ఇస్తాడా? - ఆదాయంలో నించే ఇస్తాడు. తన వ్యాపారం కోసం అయ్యే ఇతర ఖర్చుల్ని కూడా ఆదాయంలో నించే పెడతాడు. ఖర్చులన్నీ పోగా మిగిలినదే నికరాదాయం.

ఉత్పాదక పెట్టుబడిదారుడి విషయంలో అయితే, ఖర్చులన్నీ పెట్టుబడి లోనే భాగం. సరుకుని అమ్మినప్పుడు ఖర్చులన్నీ (జీతాలతో సహా) వెనక్కి వస్తాయి. వెనక్కి వచ్చినదే మళ్ళీ కొత్త పెట్టుబడి అవుతుంది. వడ్డీల వాడి విషయంలో అలా జరగదు. ఏ నెల ఖర్చులు, ఆ నెల ఆదాయంలో నించే పెట్టాలి.

వడ్డీల వాడికి, వడ్డీల ద్వారా వచ్చే 200, ఎవరి శ్రమ? వాడు ఉత్పాదక పెట్టుబడిదారులకు అప్పులు ఇచ్చాడు. వాళ్ళు ఆ వడ్డీలు చెల్లించారు. అంటే ఆ డబ్బు, ఆ ఉత్పాదక సంస్థల్లో పని చేసే ఉత్పాదక శ్రామికుల అదనపు విలువ.

వడ్డీల వాడి గుమస్తా కూడా యజమానికి 'అదనపు శ్రమ' ఇస్తాడు. దాన్ని 100% అనుకుందాం. అంటే, ఈ ఉద్యోగి 50 జీతంతో, 100 శ్రమ చేస్తాడు. యజమాని, ఆ శ్రమ కంతటికీ చెల్లించాలంటే 100 డబ్బు ఇవ్వాలి. కానీ 50 మాత్రమే ఇస్తాడు కాబట్టి యజమానికి 50 ఖర్చు తగ్గుతుంది. ఇలాంటి సంబంధంలో ఉద్యోగి ఇచ్చే అదనపు శ్రమ, యజమానికి డబ్బుని పెంచడానికి గాక, ఖర్చుని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. కాబట్టి ఈ ఉద్యోగి, అనుత్పాదక శ్రామికుడు.

ఈ ఉద్యోగి చేసే రాత పనికీ, వడ్డీ వసూళ్ళకోసం తిరగడానికీ సంబంధించిన సాధనాల ఖర్చుని 20 అనుకుందాం. వడ్డీ వ్యాపారం కోసం నిజంగా అయ్యే మొత్తం ఖర్చు, సాధనాల 20, ఉద్యోగి శ్రమ 100 = 120. కానీ యజమాని 120 ఖర్చు పెట్టడు. 20 + 50 = 70ని మాత్రమే ఖర్చు పెడతాడు. యజమానికి, వడ్డీల ద్వారా వచ్చే 200లో నించి, 70 ఖర్చుని తీసివేస్తే, మిగిలేది 130.

గుమస్తా చేసే పని, వడ్డీ పెట్టుబడిదారుడే చేసు

కుంటే, అప్పుడు కూడా 'సాధనాల' 20 ఖర్చు తప్పదు. గుమస్తాకి ఇచ్చే జీతం మాత్రం మిగులుతుంది.

వడ్డీ పెట్టుబడిదారుడి విషయంలో జరిగేదే, వడ్డీ వ్యాపారం చేసే బ్యాంకు విషయంలో కూడా జరుగుతుంది. ఈ వ్యాపారానికి సంబంధించి, వడ్డీలే — బ్యాంకు ఆదాయం. ఈ వ్యాపారంలో పనిచేసే శ్రామికులు అనుత్పాదక శ్రామికులు. వీరి జీతాలూ, సాధనాలూ — అనుత్పాదక ఖర్చులే. ఈ ఖర్చులన్నీ, బ్యాంకుకి వచ్చే వడ్డీలలో నించే ఖర్చవుతాయి.

బ్యాంకులో కొన్ని ఉత్పాదక శ్రమలూ, కొన్ని అనుత్పాదక శ్రమలూ కూడా జరుగుతాయి. అంటే, బ్యాంకు, కొన్ని పనుల విషయంలో ఉత్పాదక పెట్టుబడిదారుడూ, కొన్ని పనుల విషయంలో వడ్డీ పెట్టుబడిదారుడూ అన్నమాట. బ్యాంకులో పనిచేసే ఒక ఉద్యోగి, ఏ రకం పని చేస్తాడో దాన్ని బట్టి అతను ఉత్పాదక శ్రామికుడి గానో, అనుత్పాదక శ్రామికుడి గానో, రెండు రకాల పనులూ చేసే శ్రామికుడి గానో ఉంటాడు. అంటే, బ్యాంకులకు తమ ఉద్యోగుల ద్వారా అదనపు విలువలూ, అదనపు శ్రమలూ కూడా వస్తాయి.

బ్యాంకు పెట్టుబడిదారుడే — బ్యాంకరు. బ్యాంకరు కూడా, బట్ట పెట్టుబడిదారుడి లాగా, సినిమా పెట్టుబడిదారుడిలాగా, కొంత 'పెట్టుబడి'తో వేతన శ్రామికుల్ని ఏర్పర్చుకుని, బ్యాంకు అనే సంస్థని పెట్టి, ఇక 'సంపాదన' ప్రారంభిస్తాడు.

ప్రతీ ఉత్పత్తి సంస్థలోనూ ఉన్నట్టే, బ్యాంకులో కూడా మేనేజర్లూ, డైరెక్టర్లూ వగైరా ఉన్నతోద్యోగులూ, వాళ్ళ జీతాలూ, వాళ్ళ భోగాలూ — అన్నీ మామూలే!

బ్యాంకులో జరిగే పనులన్నీ (డబ్బు వ్యవహారాలు గానీ, వడ్డీ వ్యాపారం గానీ,) సమాజానికి సహజంగా అవసరం లేనివే. పెట్టుబడిదారీ విధానం పోయినప్పుడు బ్యాంకుకి ఉండే 'జీవ శక్తులన్నీ' పోతాయి. సమాజం నించి 'విలువ' కూడా పోయినప్పుడు, బ్యాంకు అనేదే అంతర్ధా నమైపోతుంది!

# 7) వేశ్యల విషయం?

ఒక పెట్టుబడిదారుడు ఒక 'వేశ్యాగృహం' (బ్రోతల్) నడుపుతున్నాడనుకుందాం. ఆ ఇంటి అద్దె దగ్గిర్నించీ దానికి సంబంధించిన ఖర్చులన్నీ వాడు పెడతాడు. వారానికోసారో, నెలకోసారో ఏదో ఒక లెక్కన, 'వేశ్యలకు' కొంత కొంత డబ్బు చెల్లిస్తాడు. 'విటుల'నించి వసూలు చేసిన డబ్బులో నించి ఈ ఖర్చులన్నీ పోగా 'లాభం' సంపాదిస్తాడు. ఈ లాభం వేశ్యల ద్వారానే వచ్చిందనడానికి సందేహం లేదు. వారి వల్ల, పెట్టుబడిదారుడి డబ్బు పెరుగుతుంది. అయితే, ఇక్కడ ప్రశ్న — వేశ్యలు కూడా 'ఉత్పాదక శ్రామికులే' అవుతారా?

'పెట్టుబడిదారుడి డబ్బుని పెంచే శ్రమ ఎలాంటి శ్రమ అయినా ఉత్పాదక శ్రమే' అనే సూత్రం ప్రకారం, వేశ్యలు కూడా ఉత్పాదక శ్రామికులే అవుతారనే అర్థం వస్తుంది.

కానీ, 'వేశ్యలు ఉత్పాదక శ్రామికులా, కాదా' అనే ప్రశ్న కన్నా ముందు, అసలు 'వేశ్యా వృత్తి ఒక శ్రమేనా?' అనే ప్రశ్న వేసుకోవాలి.

శ్రమలలో సహజ శ్రమలూ, అసహజ శ్రమలూ ఉంటాయని చూశాం. కుట్టూ, నేతా, వ్యవసాయం, వైద్యం చెయ్యడం, బండి తోలడం, చదువు చెప్పడం — లాంటి శ్రమలన్నీ 'సహజ' శ్రమలు. ఇలాంటి శ్రమలు మానవ అవసరాల్ని తీర్చడానికి ఎప్పుడూ ఉండాలి. ఇవి లేకపోతే మానవ జీవితమే సాగదు. ఇవి 'నూతన సమాజం'లో కూడా నశించవు.

పోలీసు శ్రమా, సైనిక శ్రమా, ఆయుధాల్ని ఉత్పత్తి చేసే శ్రమా, కాపలా కాసే శ్రమా, వస్తువుల్ని అమ్మే శ్రమా — వంటి శ్రమలు, 'అసహజ' శ్రమలు. వీటితో దోపిడీ సమాజాలకే అవసరం గానీ, దోపిడీ లేని సమాజానికి అవసరం ఉండదు. ఈ రకం శ్రమలు 'నూతన సమాజం'లో క్రమంగా నశించిపోతాయి.

వేశ్యావృత్తి — అనేది, సహజశ్రమల కోవలోకిగానీ, అసహజ శ్రమల కోవలోకిగానీ రాదు. అది అసలు 'శ్రమ కోవకు చెందే' విషయం కాదు.

స్త్రీ పురుషుల మధ్య ఏర్పడే శారీరక సంబంధం — ఒక ప్రకృతి సహజ కార్యం. క్రిమి కీటకాలూ, పక్షులూ, జంతువులూ, మానవులూ — అనే తేడా లేకుండా 'ప్రాణుల' దేహాలన్నీ కొన్ని ప్రకృతి సహజ కార్యాలు నిర్వర్తిస్తాయి. ఆహారం తీసుకోవడమూ, మల మూత్ర విసర్జనా, స్త్రీ - పురుష శారీరక సంబంధమూ, స్త్రీ దేహం బిడ్డని కనడమూ — లాంటి చర్యలన్నీ ఈ కోవలోకి వస్తాయి.

అయితే, మానవులు కాని ఇతర జాతుల ప్రాణులు నిర్వర్తించే శారీరక చర్యలన్నీ కేవలం 'ప్రకృతి సహజ విధులుగా' మాత్రమే ఉంటే, మానవుల విషయంలో మాత్రం, శరీరాలు నిర్వర్తించే ప్రతీ ప్రకృతి సహజ కార్యంలోనూ 'సమాజ లక్షణం' అనే అంశం ఒకటి కలుస్తూ ఉంటుంది.

'ఆహారం' విషయం తీసుకుంటే, కడుపులోకి కొంత ఆహారం వెళ్ళాలి — అన్నంత వరకే అది ప్రకృతి సహజ విషయం. దాన్ని ఏ పద్ధతిలో తీసుకోవాలీ, ఏ రకంగా తయారు చేసుకోవాలీ, తినే కార్యక్రమం ఎలా నడవాలీ — లాంటి విషయాలన్నీ 'సామాజిక' విషయాలు. ఈ రెండు కోణాలకూ చెందిన అంశాల కలయికల తోటే, ఆహారం కడుపు లోకి వెళ్ళే పని జరుగుతుంది.

అలాగే, స్త్రీ పురుషుల శారీరక సంబంధాన్ని తీసుకుంటే, 'రెండు శరీరాల సంబంధం' అన్నంతవరకే అది ప్రకృతి విషయం. ఆ వ్యక్తుల మధ్య ఏ కారణం వల్ల, ఆ సంబంధం ఏర్పడుతోందీ, అందులో ఆ వ్యక్తుల ఇష్టాయిష్టాల ప్రమేయం ఉందా, లేదా; ఆ ఇష్టాయిష్టాల స్వభావం ఎలాంటిదీ; ఆ స్త్రీ పురుషులు ఎలాంటి భావాలతో ఆ సంబంధం లోకి ప్రవేశిస్తారూ; ఏ విషయాలు ఆ సంబంధానికి కారణమవుతాయీ — ఇలాంటి విషయాలన్నీ 'సామాజిక' విషయాలు. ఇది, కేవలం 'వ్యభిచార' సంబంధం విషయంలో మాత్రమే కాదు; భార్యా భర్తలుగా ఏర్పడే స్త్రీ పురుషుల శారీరక సంబంధానికి కూడా, ఈ రెండు అంశాలూ ఉంటాయి. ('ప్రకృతి'కి సంబంధించిన అంశమూ, సామాజిక అంశమూ.)

స్త్రీ పురుషుల శారీరక సంబంధాన్ని కేవలం ప్రకృతి సహజ విషయంగా మాత్రమే చూస్తే, అది రెండు జంతువుల సంబంధంతో సమానం అయిపోతుంది. మనుషుల సంబంధం, కేవలం జంతువుల సంబంధం లాంటిది కాదు. మనుషులు కూడా, పూర్తిగా జంతుస్థితిలో ఉన్నంత వరకూ మాత్రమే, మనుషుల సంబంధం కూడా జంతువుల సంబంధమే. కానీ 'శ్రమ చెయ్యడం' అనే కార్యక్రమంతో మానవ — జంతువు మానవుడిగా మారడం ప్రారంభ మైంది. ఆ కాలం నించి, మానవ దేహాల సంబంధంలో ప్రకృతి అంశంతో పాటు, 'సామాజిక అంశం' కూడా కల వడం ప్రారంభమవుతుంది. మనుషుల శారీరక సంబంధం, ఏ దశలోనైనా కూడా (నూతన సమాజంలో కూడా), ప్రకృతి సహజ విషయంతో కొన్ని సామాజిక విషయాలు కూడా కలిసి ఏర్పడే సంబంధంగానే ఉంటుంది. ఆ మనుషులు ఏ రకం సమాజంలో జీవిస్తూ ఉంటారో, ఆ సమాజ పరిస్థితుల వల్ల ఏర్పడిన భావాలతో ఆ దేహాల సంబంధం ఉంటుంది.

మానవ దేహాల మధ్య ఏర్పడే 'కామ' సంబంధం, 'శ్రమ సంబంధం' కాదు. కుట్టూ, నేతా — లాంటి పనులు 'శ్రమలు' అయినట్టుగా, ఆహారం తీసుకోవడమూ, కామ సంబంధమూ — లాంటి పనులు 'శ్రమలు' కావు. శారీరక ధర్మాలు నిర్వర్తించినప్పుడు కూడా శరీరం శ్రమపడుతుంది. ఆహారం తీసుకున్నప్పుడు కూడా శరీరం అలసట చెందు తుంది. కానీ, అది 'శ్రమ' కాదు. మనం 'శ్రమ' అని మాట్లాడేది, ఈ రకం శ్రమ గురించి కాదు. నేత పని చేసినప్పుడు శరీరం అలసట చెందడానికీ, ఆహారం తీసుకున్నప్పుడు శరీరం అలసట చెందడానికీ, తేడా ఉంది. ఆహారం తీసుకోవడం అనేది, ఆ శరీర స్వంత పోషణకే అవసరమైన కార్యం. నేత పని, ఒక బయట పనిని నిర్వర్తించే కార్యం. కాబట్టి, ఆహారం తీసుకునే శ్రమా, నేత నేసే శ్రమా ఒకే రకమైన పరిస్థితులు కావు.

'కామ' విషయం కూడా ఆహారం తీసుకోవడం లాంటి సహజ అవసరాలకు సంబంధించిన విషయమే గానీ, 'శ్రమ' కోవకు చెందే విషయం కాదు. కామ సంబంధం అనే ప్రకృతి సహజ విషయం, సామాజిక లక్షణాలతో కలిసి, ఆ సామాజిక లక్షణాల స్వభావాన్ని బట్టి, 'సహజ సంబంధం'గా గానీ, 'అసహజ సంబంధం'గా గానీ తయారవుతుంది.

'సహజ సంబంధం' అంటే, భార్యాభర్తల సంబంధమనీ, 'అసహజ సంబంధం' అంటే వ్యభిచార సంబంధమనీ — ఈ రకమైన అర్థాలకు రాకూడదు. 'వ్యభిచారం' అనే దాన్ని 'అసహజ సంబంధం'గా అర్థం చేసుకోవడం పూర్తిగా సరైనదే. కానీ, భార్యా భర్తల సంబంధాన్ని, అది భార్యా భర్తల సంబంధం అయినంత మాత్రాన, దాన్ని 'సహజ సంబంధం'గా అర్థం చేసుకోవడం పూర్తిగా సరైంది కాదు.

స్త్రీ పురుషుల మధ్య ఎలాంటి సంబంధం మాత్రమే సహజ సంబంధంగా ఉండగలదంటే — అది 'ప్రకృతి' కోణం లోనూ, 'సామాజిక' కోణంలోనూ కూడా 'సహజ సంబంధం'గా ఉండాలి. ప్రకృతి కోణాన్ని తీసుకుంటే, స్త్రీ పురుషుల సంబంధానికి, ప్రకృతి ఎలాంటి శారీరక నియమాలనైతే నిర్దేశించిందో, ఆ నియమాల ప్రకారం ఏర్పడే సంబంధమే సహజ సంబంధం. ఇద్దరు స్త్రీల శరీరాల సంబంధం గాని, ఇద్దరు పురుషుల శరీరాల సంబంధం గానీ, సహజ సంబంధం అవదు. అది అసహజ సంబంధమే. అలాగే, స్త్రీ పురుషుల మధ్యనే అయినా, అది వికృత పద్ధతిలో అయితే, అది కూడా సహజ సంబంధం కాదు. అసహజ సంబంధమే.

'సామాజిక' కోణాన్ని తీసుకుంటే, స్త్రీ, పురుషులు జీవించే పరిస్థితులు 'వైరుధ్యాలు లేని పరిస్థితులుగా' ఉండాలి. స్త్రీ పురుషుల మధ్య ప్రేమ అనేది, మానవుల ప్రత్యేక సంస్కారం. ఆ సంస్కారంతో ఏర్పడే సంబంధమే సహజ సంబంధం.

స్త్రీ పురుష సంబంధం వల్ల కలిగే ఫలితం — సంతానం. సంతానానికి కారణం అయిన స్త్రీ పురుషులు, ఆ సంతానం పట్ల తల్లిదండ్రుల బాధ్యతలు వహిం

చడం కూడా మానవ సంస్కారానికే ప్రత్యేకం. అలాంటి సంస్కారాలతో ఏర్పడే సంబంధమే సహజ సంబంధం.

స్త్రీ పురుషుల మధ్య సమానత్వమూ, స్త్రీ పురుషుల మధ్య అనురాగమూ — అనే 2 అంశాలూ, మానవ సమాజ పరిణామ క్రమంలోనే క్రమక్రమంగా అభివృద్ధి చెంది, వైరుధ్యాలు లేని దశకు చేరతాయి. అంత వరకూ స్త్రీ పురుష సంబంధాలు అసహజ సంబంధాలే.

మానవ సంబంధాలు — బానిస సమాజం నించీ కూడా, దోపిడీదారులకూ, శ్రామికులకూ మధ్య వైరుధ్య పూరిత సంబంధాలుగా ఉన్నట్టే, స్త్రీ పురుష సంబంధాలు కూడా — దోపిడీ ప్రారంభం నించీ కూడా, అసమానతలు గల వైరుధ్య పూరిత సంబంధాలుగానే ఉంటున్నాయి. కానీ, దోపిడీదారులకూ, శ్రామికులకూ కూడా తమ సంబంధాలు అసహజ సంబంధాలుగా కనపడనట్టే, స్త్రీ పురుషులకు కూడా తమ సంబంధాలు అసహజ సంబంధాలుగా కనపడవు.

భార్యాభర్తల సంబంధంలో ఎలాంటి అసహజత్వాలు ఉన్నా, అవి అలా ఉండడమే వారికి సహజత్వాలుగా కనపడతాయి. ఆ సంబంధాలు అంత అలవాటైపోయి ఉంటాయి.

ఇద్దరు స్త్రీ పురుషులు భార్యా భర్తలైతే, ఆ సంబంధం సహజ సంబంధమేననీ, వ్యభిచార సంబంధమే అసహజ సంబంధమనీ భావిస్తే, అందులో మొదటి విషయం పూర్తిగా తప్పు. 'వ్యభిచార' సంబంధం తప్పనిసరిగా అసహజ సంబంధమే. కానీ, భార్యా భర్తల సంబంధం కూడా, ఇంకో రకంగా అసహజ సంబంధమే.

'వ్యభిచారం'లో స్త్రీ పురుషుల మధ్య సమానత్వం అనే అంశం గానీ, 'ప్రేమ' అనే అంశం గానీ, ఉండవు. అందుకే, ఆ సంబంధం పూర్తిగా అసహజ సంబంధం.

'భార్యా భర్తల' సంబంధంలో కూడా సమానత్వం అనే అంశం ఉండదు. కానీ కొన్ని జంటల విషయంలో 'ప్రేమ' అనే అంశం ఉంటుంది. అవి ప్రత్యేక ఉదాహరణలు, కానీ ఎంత ప్రేమ ఉన్నా, ఆ ప్రేమ 'సమానత్వం' అనే చైతన్యంతో ఉండదు కాబట్టి, అలాంటి భార్యా భర్తల సంబంధం కూడా ఇంకా కొన్ని వైరుధ్యాలు గల అసహజ సంబంధం గానే ఉంటుంది.

తప్పుడు పునాది మీద నిలిచిన దోపిడీ సమాజాలలో, స్త్రీ పురుష సంబంధాలు కూడా తప్పుడు సంబంధాలు గానే (అసమాన సంబంధాలుగా) ఉంటాయి. అవి ఉన్నత మావన సంస్కారానికి చాలా దూరంలో ఉంటాయి. భార్యా భర్తలుగా ఏర్పడే స్త్రీ పురుషుల కామ సంబంధాలు కూడా సమానత్వమూ, ప్రేమా లేని అసహజ సంబంధాలే కాబట్టి, అదే లక్షణాలు గల వ్యభిచారం కూడా స్త్రీ పురుషుల మధ్య సాధ్యమవుతుంది. స్త్రీ పురుషుల మధ్య తప్పుడు సంబంధాల అత్యున్నత రూపమే వ్యభిచారం.

'వ్యభిచారం' అంటే వేశ్యకీ, విటుడికీ ఏర్పడే సంబంధం మాత్రమే కాదు. భార్యా భర్తలుగా ఉండే స్త్రీ పురుషులు, ఆ సంబంధానికి ఉండే నియమాల్ని మీరే ప్రతీ సంఘటనా వ్యభిచారమే. ఈ అంశాల్ని దృష్టిలో ఉంచుకుంటూనే ఇక్కడ 'వేశ్యా వృత్తి'ని గురించి మాత్రమే తీసుకుంటాము.

ఈ సమస్యని 'వేశ్య' వేపునించీ చూస్తే — అది ఆమె 'పేదతనం' వల్లా, కొన్ని రకాల 'సాంప్రదాయాల' వల్లా జరుగుతుంది.

'విటుడి' వేపు నించీ చూస్తే — దోపిడీ సమాజంలో పురుషుడికి ఉండే ప్రత్యేక హక్కుల వల్లా, భార్యాభర్తల సంబంధంలో ఉండే లోపాల వల్లా, జరుగుతుంది.

వ్యభిచారం అనేది — 'బానిస సమాజం' లోనూ, 'భూస్వామ్య సమాజం' లోనూ, 'పెట్టుబడిదారీ సమాజం' లోనూ వేరు వేరు రూపాలలో ఉంటుంది.

కొంత పెట్టుబడితో ఒక వ్యభిచార గృహానికి కావలసిన ఏర్పాట్లు చేసి, కొందరు స్త్రీలను అక్కడికి చేర్చి, వారికి కొంత డబ్బు చెల్లిస్తూ, ఆ వృత్తి చేయించడం — అనేది, పెట్టుబడిదారీ సమాజానికి మాత్రమే ప్రత్యేక లక్షణం. ఈ వృత్తి, ఈ పద్ధతిలో గతకాలపు దోపిడీ సమాజాలలో ఉండదు.

పెట్టుబడిదారుడనే వాడు, ప్రతీ రొచ్చు నించీ, ప్రతీ దుర్మార్గం నించీ డబ్బు సంపాదించడానికే చూస్తాడు కాబట్టి, వాడు వ్యభిచారం నించి కూడా డబ్బు సంపాయించగలుగుతాడు. పెట్టుబడిదారీ సమాజంలో, పేదతనంలో మగ్గే శ్రామిక కుటుంబాలు కొల్లలుగా ఉంటాయి కాబట్టి, ఆ కుటుంబాల స్త్రీలు, వ్యభిచార వృత్తికి అనువుగా దొరుకుతారు. వేశ్యా గృహాల్ని నడిపే పెట్టుబడిదారుడు, వస్తువుల్ని అద్దెలకు ఇచ్చినట్టుగా స్త్రీల శరీరాల్ని అద్దెలకు ఇచ్చి, వాటి ద్వారా డబ్బు సంపాదిస్తాడు. పెట్టుబడిదారీ సమాజంలో ఉండే ప్రభుత్వం, పెట్టుబడిదారీవర్గ ప్రభుత్వమే కాబట్టి, అది వ్యభిచారం చేయించడాన్ని కూడా ఒక 'పరిశ్రమ'గా గుర్తిస్తుంది. నేత పరిశ్రమకీ, కుట్టు పరిశ్రమకీ లైసెన్సులు ఇచ్చినట్టే అది 'వేశ్యా గృహాలు నడపడం' అనే పరిశ్రమకి కూడా లైసెన్సులు ఇస్తుంది. అన్ని పరిశ్రమల నించీ పన్నులు వసూలు

చేసినట్టే అది వ్యభిచార పరిశ్రమ నించి కూడా పన్నులు వసూలు చేస్తుంది.

పెట్టుబడిదారీ దృష్టికి — సారాలూ, జూదాలూ, గుర్రప్పందాలూ, లాటరీలూ, వ్యభిచారాలూ — అన్నీ పరిశ్రమలే! 'డబ్బుని' సంపాదించగలిగే మార్గం ఏదైనా, దానికి పరిశ్రమే. డబ్బుని సంపాదించడమే దాని ఏకైక లక్ష్యం! ఏకైక నీతి! డబ్బుని మించిన నీతి నియమాలూ, డబ్బుని మించిన మంచి చెడ్డలూ, డబ్బుని మించిన న్యాయాన్యాయాలూ, దానికి ఉండవు.

రక రకాల మోసాలతో, ఊళ్ళ వెంట తిరుగుతూ వలలు పన్ని, ఆడ పిల్లల్ని ఎత్తుకు పోతూ, వారిని బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దింపుతూ, వారిని ఇతర ప్రాంతాలకు అమ్మివేస్తూ, కొన్ని సందర్భాలలో వారిని హత్యలు చేస్తూ — నిత్యం ఈ రకపు కార్యక్రమాలతో 'వ్యభిచార పరిశ్రమ'ని నడిపే పెట్టుబడిదారుడు (ఆ వ్యక్తి పురుషుడైనా కావచ్చు, స్త్రీ అయినా కావచ్చు), పెట్టుబడిదారీ సమా జంలో 'గొప్ప గౌరవనీయుడి' గానే చలామణీ అవుతూ ఉంటాడు. 'గౌరవం' అనే మాటకి పెట్టుబడిదారీ అర్థం — 'డబ్బు కుప్ప' అని! ఆ కుప్ప ఎవడి దగ్గిర ఎక్కువగా ఉంటుందో వాడే గౌరవనీయుడు! ఆ కుప్ప పెరుగుతోన్న కొద్దీ వాడి గౌరవం కూడా పెరుగుతూ ఉంటుంది.

'పెట్టుబడిదారుడికి డబ్బుని పెంచే శ్రమ ఉత్పాదక శ్రమ' అనే సూత్రాన్ని ఈ సందార్భానికి కూడా యధాతథంగా తీసుకుంటే, అప్పుడేమవుతుంది? వేశ్యా వృత్తి కూడా పెట్టుబడిదారుడి డబ్బుని పెంచుతుంది కాబట్టి, ఆ వృత్తి కూడా ఒక 'శ్రమ' అయినట్టూ, అది ఉత్పాదక శ్రమ కూడా అయినట్టూ, కనపడుతుంది. అప్పుడు వేశ్యా వృత్తికి పరిష్కారం ఎలా ఉంటుంది? — ఏ 'శ్రామిక సమస్య' కైనా సరైన పరిష్కారం ఏమిటి? — ఎవరి శ్రమ విలువ వారికే దక్కాలి. 'దోపిడీ' ఆగిపోవాలి. అదే కదా పరిష్కారం? 'వేశ్యా వృత్తి'ని కూడా ఒక 'శ్రమ'గా భావిస్తే అప్పుడు ఈ సమస్యకి పరిష్కారం ఎలా ఉంటుందంటే — 'వేశ్యల శ్రమ విలువ అంతా వేశ్యలకే దక్కడం' అనే పద్ధతిలో ఉంటుంది. అంటే, నూతన సమాజంలో కూడా స్త్రీలు వేశ్యా వృత్తితో జీవించవచ్చు. అది కూడా ఒక శ్రమే. కాకపోతే వారి శ్రమ విలువ అంతా వారికే దక్కాలి. అలా జరిగితే చాలు! — పరిష్కారాన్ని ఇలా చూడవలసి వస్తుంది.

పెట్టుబడిదారీ సమాజంలో — వ్యభిచార వృత్తిలో జీవించే స్త్రీలు, ఆ జీవితం నించి బయటపడి సహజ శ్రమల ద్వారా జీవించే మార్గం కోసం పోరాటం చెయ్యడం ఎప్పటికీ ఉండదు. ఇక వారికి మిగిలిన మార్గం ఏమిటంటే — ఎప్పటి లాగే అదే వృత్తిలో ఉంటూ తమ ఆదాయాన్ని పెంచుకోవడం కోసమూ, వృత్తి పరిస్థితుల్ని మెరుగు పరుచుకోవడం కోసమూ పోరాడవలసి వస్తుంది. వ్యభిచారాన్ని ఒక శ్రమగా అనుకుంటే, ఆ వృత్తి చేయించే పెట్టు బడిదారుడితో పోరాడే పద్ధతి ఆ విధం గానే ఉండవలిసి వస్తుంది. ఇదంతా సమస్యని చాలా వికృతంగా అర్థం చేసుకోవడమే.

వ్యభిచారం అనేది, శ్రమ దోపిడీ వల్ల పుట్టుకొచ్చిన అనేక చెడు ఫలితాల్లో ఒక చెడు ఫలితం. కానీ, అదే డైరెక్టుగా శ్రమ దోపిడీ సమస్య కాదు. అంటే, వేశ్యలు ఉత్పాదక శ్రమ చేస్తూ, అదనపు విలువని పోగొట్టుకుంటూ దోపిడీకి గురి అవడం — అనే సమస్యకాదు.

'శ్రమ సమస్య'లో, శ్రమ విలువ అంతా శ్రామికులకు దక్కడమే పరిష్కారంగా ఉంటుంది. కానీ, వ్యభిచారానికి అలాంటి పరిష్కారం పనికి రాదు. ఆ రకపు జీవితం పూర్తిగా లేకుండా పోవడమే — దానికి సరైన పరిష్కారంగా ఉంటుంది.

ఈ సమస్యలో ఇంకో కోణం కూడా ఉంది. <u>వ్యభిచార సమస్య కేవలం వేశ్యాసమస్య మాత్రమే కాదు; 'విటుడి' సమస్య కూడా.</u> ఇంకా సరిగా చూస్తే, అది విటుడి భార్య సమస్య కూడా. వేశ్య, ఆర్థిక కారణాల వల్ల వ్యభిచారానికి లోబడితే; విటుడు, ఇతర కారణాల వల్ల దానికి లోబడతాడు. దోపిడీ సమాజాలలో — 'దోపిడీ వర్గం'లో గానీ, 'శ్రామిక వర్గంలో' గానీ, స్త్రీ పురుషుల (భార్యా భర్తల) సంబంధాలు లోప భూయిష్టంగా ఉంటాయి.

శ్రామిక వర్గ పరిస్థితినే చూస్తే, గృహ జీవితాన్ని శాంతిగా, విశ్రాంతిగా గడపడానికి అనుకూలించే సుఖమైన గృహాలూ అవకాశాలూ లేని పేదరికం, కుటుంబ జీవితాన్ని అశాంతికరంగా చేస్తుంది. దానికి తోడు పురుషులకు, ఎంత మంది స్త్రీలతో నైనా గడిపే ప్రత్యేక హక్కులు ఉంటాయి. దీని ఫలితాలు — పురుషుల బహిరంగ వ్యభిచారం గానూ, కుటుంబ స్త్రీల రహస్య వ్యభిచారం గానూ ఉంటాయి. కుటుంబాలలో ఘర్షణలూ విడాకులూ, హత్యలూ ఆత్మ హత్యలూ, ఇంకా అనేక రూపాలలో, ఈ ఫలితాలు ఉంటాయి.

<u>వ్యభిచారం అనేది — పేదరికం సమస్యా, సెక్సు సమస్యా, ప్రేమ లేని పెళ్ళిళ్ళ వల్ల పుట్టే అసంతృప్తుల సమస్యా, పురుషాధిక్యత సమస్యా, సమాజం అంతా అల్లుకుని ఉన్న తప్పుడు భావాల సమస్యా — ఇలా అనేక సమస్యల గందరగోళపు సృష్టి.</u> ఈ సమస్యలన్నిటికీ మూలం శ్రమ దోపిడీయే. దాని పరిష్కారంలో నించే ఈ సమస్యకు పరిష్కారం ప్రారంభమవుతుంది.

# 8) 'నిరుద్యోగుల' విషయం

'ఉద్యోగం' అంటే, ఒక యజమాని దగ్గిర ఏదో ఒక శ్రమ చెయ్యడం. అది, మేధా శ్రమ అయినా, శారీరక శ్రమ అయినా. 'నిరుద్యోగం' అంటే, శ్రమ చెయ్యడానికి సిద్ధంగా ఉన్న మనిషికి శ్రమ చేసే అవకాశం లేకపోవడం.

పెట్టుబడిదారుడు ఏ శ్రమా చెయ్యడు కాబట్టి, పెట్టుబడిదారుడు నిరుద్యోగా? 'శ్రమ చెయ్యకుండా ఉండడం' అనే అర్థంతో అయితే, పెట్టుబడిదారుడు నిరుద్యోగే. కానీ ఇక్కడ నిరుద్యోగానికి ఉన్న అర్థం అది కాదు. శ్రమ చెయ్యడానికి సిద్ధంగా ఉండి కూడా శ్రమ చేసే అవకాశాలు లేని వాళ్ళే నిరుద్యోగులు.

పెట్టుబడిదారీ సమాజంలో నిరుద్యోగం ఎందుకు ఏర్పడుతుందో 'భారీ పరిశ్రమ' చాప్టర్‌లో కొంత వరకూ చూశాం. ఈ సంపుటం లోనే 'పెట్టుబడి విస్తరణ' చాప్టర్‌లో కూడా ఇంకా కొన్ని విషయాలు చూస్తాం.

ఏదో ఒక శ్రమ చేసే ('ఉద్యోగి'గా ఉన్న) ప్రతీ మనిషికీ 'సమాజంలో తయారయ్యే ఉత్పత్తి రాసి' నించి రోజూ కొంత భాగం అందుతుంది. అలా కొంత ఉత్పత్తి తీసుకోవడానికి ఉద్యోగికి హక్కు ఉంటుంది. నిరుద్యోగికి ఆ హక్కు ఉండదు. కానీ, నిరుద్యోగి కూడా జీవిస్తూనే ఉంటున్నాడంటే, నిరుద్యోగికి కూడా రోజూ కొంత ఉత్పత్తి అందుతూనే ఉంటుందని అర్థం. ఒక నిరుద్యోగి ఏ కుటుంబానికి చెంది వుంటాడో, ఆ కుటుంబ సభ్యుల్లో ఉద్యోగులుగా వున్న వాళ్ళకు వచ్చే ఉత్పత్తుల వల్లనే ఆ నిరుద్యోగి కూడా జీవిస్తూ వుంటాడు. అంటే, నిరుద్యోగి రోజూ కొన్ని వస్తువులు వాడతాడే గానీ, వాటి ఉత్పత్తిలో తన శ్రమని ఇవ్వడు. తన శ్రమతో తను జీవించడానికి అవకాశం లేకపోవడం వల్ల, ప్రతీ నిరుద్యోగీ ఇతరుల 'దయా దాక్షిణ్యాల' మీద ఆధారపడుతూ జీవించవల సిందే.

కుటుంబ సభ్యుల ద్వారా జీవించే అవకాశం కూడా లేకపోతే, ఆ నిరుద్యోగి దొంగ గానో, గూండా గానో, వ్యభి చారవృత్తికి సంబంధించిన బ్రోకర్ గానో — అలా, శ్రమగా లెక్కకు రాని పనుల ద్వారా, అందులో కూడా ఒక స్థిరమైన సంపాదన లేకుండా, జీవిస్తూ ఉంటాడు.

ఉత్పాదక — అనుత్పాదక శ్రమలు గానీ, స్వతంత్ర శ్రమలు గానీ చెయ్యని జనాభా అంతా, నిరుద్యోగులు గానే లెక్కకు వస్తారు. దొంగతనాల వంటి నేరాలతో బతికే వాళ్ళూ, బిచ్చగాళ్ళూ, వేశ్యలూ, అనాథ శరణాలయాలలో ఉండే స్త్రీలూ, కొంత ఎదిగిన పిల్లలూ కూడా ఈ 'నిరు ద్యోగ సెక్షన్'లోకే వస్తారు.

సమాజంలో — ఉత్పాదక, అనుత్పాదక ఉద్యోగు లకు వచ్చే ఉత్పత్తులనే సమాజంలోని ఉద్యోగులూ, నిరుద్యోగులూ కూడా కలిసి వాడాలి. నిరుద్యోగులు అనే వాళ్ళంతా శ్రామిక కుటుంబాలకు చెందిన వాళ్ళే. అంటే, శ్రామిక వర్గానికి చెందిన వాళ్ళే.

తమ శ్రమ ఫలితంలో కొంతభాగాన్ని నిరుద్యోగులతో పంచుకోవడం — అనే విషయం, పెట్టుబడిదారీ వర్గానికి వర్తించదు. ఆ వర్గం మొత్తంగానే ఒక 'వింత నిరుద్యోగుల దండు.' అందులో ఉద్యోగీ, నిరుద్యోగీ అనే తేడాలేవీ వుండవు. అక్కడ అందరూ తినేదీ దోపిడీ రాసినే.

**బిచ్చగాళ్ళు:** సమాజంలో, కేవలం 'అడుక్కోవడం మీద' బతికే జనం కూడా ఉంటారు. వీరు కూడా 'సమాజ ఉత్పత్తి'లో నించి ఎంతో కొంత భాగం (ఊహాతీతమైనంత తక్కువ భాగం) పొందుతున్నారు. అది, వారికి కేవలం ఇతరులు చేసే దాన ధర్మాల ద్వారానే దొరుకుతుంది. సమాజంలో, శ్రామికులు చేసే దాన ధర్మాలూ, దోపిడీ దారులు చేసే దాన ధర్మాలూ కూడా శ్రామికుల శ్రమే. సమాజంలో 'దాన కర్ణులు'గా పేరుపొందిన వారి వెనక ఉన్న నిజమైన దాన కర్ణులు శ్రామికులే. దాన ధర్మాలు చెయ్యని ధనికులతో పోల్చినప్పుడు, దాన ధర్మాలు చేసే ధనికుడు 'దాన కర్ణుడే' అవుతాడు. కానీ, సమాజంలో జరిగే మొత్తం దాన ధర్మాల భారాన్నంతా శ్రామిక వర్గమే భరిస్తోంది.

**జైళ్ళల్లో మనుషులు:** జైళ్ళల్లో వుండే ఖైదీలంతా మరొక సెక్షన్. జైలుకి సంబంధించిన ప్రతీ ఖర్చూ 'ప్రభుత్వ ఆదాయం' నించే జరుగుతుంది. కొన్ని తరగతుల ఖైదీలతో, జైళ్ళల్లో కూడా కొన్ని రకాల శ్రమలు చేయిస్తారు. ఆ శ్రమ, వారి పోషణకు సరిపోయేటంత శ్రమ అయితే, ఆ ఖైదీలు వారిని వారే పోషించుకుంటున్నారని అర్థం. అంటే, వాళ్ళు 'స్వతంత్రులు'గా ఉన్నారని కాదు. ఇతరుల ఆజ్ఞలలోనే వున్నా, వాళ్ళని వాళ్ళు పోషించుకునే 'ఖైదీ —స్వతంత్రులు' వాళ్ళు! జైళ్ళలో శ్రమ చెయ్యని రకం ఖైదీలు, ప్రభుత్వ ఆదాయం తోనే జీవిస్తారు. అంటే, ఉత్పాదక శ్రామికుల శ్రమ ద్వారా తయారైన అదనపు విలువలోనించి ప్రభు త్వానికి వచ్చే పన్నులతో.

— ఈ చాప్టర్‌లో, ఇంత వరకూ ఉత్పాదక — అను త్పాదక శ్రమల గురించి చూస్తూ, కొన్ని ప్రత్యేక ఉదాహర ణలు కూడా చూశాం.

ఉత్పాదక, అనుత్పాదక శ్రమల గురించి సాధారణ

లోకజ్ఞానపు దృష్టితో చూస్తే — వస్తువుల్ని తయారు చేసే శ్రమే ఉత్పాదక శ్రమ అనీ; పని రూపంలో ఉండే శ్రమ అనుత్పాదక శ్రమ అనీ, పొరపాటు అభిప్రాయాలు ఉంటాయి. కానీ, ఒక శ్రమ, వస్తువుల్ని తయారు చేస్తుందా — పని రూపంలో ఉంటుందా — అనే దాన్నిబట్టి గాక, అది పెట్టుబడిదారు డితో ఎలాంటి సంబంధంలో ఉందీ — అనే దాన్ని బట్టే ఉత్పాదక — అనుత్పాదక విభజన ఉంటుందని అర్థం చేసుకోవాలి.

# ఉత్పాదక - అనుత్పాదక విషయాలపై పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల అవగాహన

పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల అవగాహనలు, ప్రతీ విషయం లోనూ తప్పు తప్పులుగా వున్నట్టే, ఈ విష యంలో కూడా తప్పు గానే వుంటాయి. 'లాభం అనేది, శ్రామికుల అదనపు డబ్బే' అనే అసలు విషయం గ్రహించ నప్పుడు, ఇక ఆర్థిక శాస్త్రంలో ఏ విషయాన్నీ సరిగా గ్రహించడానికి అవకాశం ఉండదు. అసలు నిజాన్ని గ్రహించకపోతే, పెట్టుబడిదారుడి 'పెట్టుబడిని పెంచేదే ఉత్పాదక శ్రమ' అనీ, పెట్టుబడిదారుడి 'ఆదాయాన్ని ఖర్చు చేసేది అనుత్పాదక శ్రమ' అనీ, అసలైన అర్థాలకు రావడం సాధ్యం కాదు. అందుకే, ఈ ఉత్పాదక — అను త్పాదక విషయాల్లో కూడా ఆర్థిక వేత్తల అభిప్రాయాలు తప్పులు గానే ఉంటాయి.

'తప్పులు' అనేవి, ఏ విషయానికి సంబంధించినవి అయినా, అన్నీ ఒకే రకంగా ఉండవు. రక రకాలుగా ఉంటాయి. అలాగే ఈ విషయంలో కూడా (ఉత్పాదక అనుత్పాదక విభజనకు సంబంధించి), ఆర్థిక వేత్తల తప్పు అభిప్రాయాలన్నీ ఒకే రకంగా ఉండవు. రక రకాలుగా ఉంటాయి.

కొందరి అవగాహన ప్రకారం — వస్తువుల్ని తయారు చేసేది ఉత్పాదక శ్రమా, పని రూపంలో ఉండేది అను త్పాదక శ్రమా.

కొందరి అవగాహన ప్రకారం — అన్ని శ్రమలూ ఉత్పాదక శ్రమలే. అనుత్పాదక శ్రమ అనేది లేనేలేదు.

కొందరి అవగాహన ప్రకారం — మనిషి కూర్చున్నా, నించున్నా ఉత్పాదక శ్రమే. నిద్రపోతే మరింత ఉత్పాదక శ్రమ!

మనిషి ఏ పని చేసినా ఉత్పాదక శ్రమే — అనే అభి ప్రాయం, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల్లో ఎక్కువ మందికి ఉండే అభిప్రాయం. ఇలాంటి అభిప్రాయం ఏర్పడడానికి కారణం, 'శ్రమ' అనే దాన్ని గురించి వాళ్ళకు, ఏ మాత్రమూ సరైన అవగాహన లేకపోవడమే. ఇలాంటి ఆర్థిక వేత్తల దృష్టిలో — కుట్టూ, నేతా, వ్యవసాయం, బండి తోలడం — లాంటి పనులు ఎంత ఉత్పాదక శ్రమలో, దొంగతనాలూ దోపిడీలూ, హత్యలూ ఖూనీలూ, వ్యభిచారాలూ యుద్ధాలూ — అన్నీ అంత ఉత్పాదక శ్రమలే. ఒక ఫలితాన్ని ఉత్పత్తి చేసే ఏ పనైనా ఉత్పాదక శ్రమే. ప్రతీ పనీ ఏదో ఒక ఫలితాన్ని ఇస్తుంది. ఏదో ఒక ఫలితం లేని పని ఏదీ ఉండదు. — ఈ దృష్టితో, ఈ ఆర్థిక వేత్తలు, ప్రతీ పనినీ 'శ్రమగా' భావిస్తూ, దాన్నే ఉత్పాదక శ్రమగా కూడా భావిస్తారు.

వారి వాదనాచాతుర్యం ఇలా ఉంటుంది: 'దొంగ తనాలు ఉండడం వల్లనే కదా బ్యాంకు నోట్లు మరింత నాణ్యంగా తయారు అవుతాయి? చిత్రహింసలు ఉండడం వల్లనే కదా, రక రకాల చిత్ర హింసల పని ముట్లూ, వాటిని నిర్మించే ఇంజనీర్లూ ఉత్పత్తి అయ్యేది? వ్యభిచారం ఉండడం వల్లనే కదా, సుఖ వ్యాధులూ, మందులూ, డాక్టర్లూ ఉత్పత్తి అయ్యేది? నేరాలు ఉండడం వల్లనే కదా, పోలీసులూ, జైళ్ళూ, కోర్టులూ, లాయర్లూ, జడ్జీలూ ఉత్పత్తి అయ్యేది? ఫలితం లేని పని ఏదీ ఉండదు. ప్రతీ పనీ ఏదో ఒక ఫలితాన్ని ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి, అన్ని పనులూ ఉత్పాదక శ్రమలే. ప్రతీ పనివల్లా సమాజంలో ఏదో ఒకటి ఉత్పత్తి అవుతుంది కాబట్టి, సమస్త చర్యలూ ఉత్పాదక శ్రమలే. ఉత్పత్తి అవడానికి ఇదీ అదీ అనే తేడా ఏమిటి? — తత్వవేత్తలు, భావాల్ని ఉత్పత్తి చేస్తారు. కవులు, పద్యాల్ని ఉత్పత్తి చేస్తారు. మత బోధకులు, బోధనల్ని ఉత్పత్తి చేస్తారు. ప్రొఫెసర్లు, పుస్తకాలు ఉత్పత్తి చేస్తారు. నేరస్తులు, నేరాలు ఉత్పత్తి చేస్తారు. ఎవరి ఉత్పత్తి వాళ్ళదీ! అన్నీ ఉత్పాదక శ్రమలే!' — ఇదీ వారి వాదనా పటిమ!

దొంగతనాలు ఉండడంవల్లనే కదా తాళాలు ఉత్పత్తి అవుతాయి — అనే ఒక్క ఉదాహరణనే తీసుకుందాం. నిజమే, దొంగతనాల వల్లనే తాళాలు అవసరం. తాళాలే కాదు, పోలీసులూ, కోర్టులూ, జైళ్ళూ, కొరడాలూ - ఇంకా చాలా విషయాలు అవసరం. ఈ ఆర్థికవేత్తలు - 'దొంగ తనం ఉత్పాదక శ్రమే' అని కనిపెట్టి, తమ తెలివికి చాలా సంతోషిస్తారు. ఆ సంతోషంతో సరిపెట్టేసుకుంటారు. కానీ,

'సమాజంలో అసలు దొంగతనాలు ఎందుకు ఉన్నాయి' అనే విషయం వేపు వాళ్ళు దృష్టి పోనివ్వరు, 'దొంగ తనాలా? అవి ఉంటాయి కదా?' అని అది చాలా సహజ విషయం అయినట్టూ, దాన్ని గురించి ఆలోచించేదేమీ లేనట్టూ, దాన్ని పట్టించుకోకుండా వదిలేస్తారు. 'దొంగ తనాలు లేకుండా చేసే మార్గమేమీ లేదా?' అని వాళ్ళు ఎందుకు ఆలోచించరంటే — దొంగతనాలు ఉండడమే వారికి కావాలి. దాని వల్ల తాళాల పరిశ్రమ నడపవచ్చు కాబట్టి.

నిజానికి దొంగతనాలూ, తాళాలూ లేకపోతే మానవ జీవితానికి బోలెడు హాయి! బోలెడు శాంతి! కానీ, అవి లేకపోతే 'పెట్టుబడిదారీ మానవ జీవితానికి' మాత్రం చాలా గొప్ప నష్టం! దొంగల ధర్మమా అని పెట్టుబడిదారీ మాన వులు 'తాళాల పరిశ్రమ' చేపట్టి, ప్రతీ రోజూ వందల, వేల తాళాలు ఉత్పత్తి చేసి, అమ్మి, లాభాలు జేబుల్లోకి పంపిస్తూ ఉంటారు. దొంగలు ఉత్సాహంగా పనిచేస్తూ వుంటేనే, తాళాల దొంగలు కూడా ఉత్సాహంగా డబ్బు పోగేస్తూ వుండగలుగుతారు.

ఈ తాళాల పరిశ్రమ కూడా పరిశ్రమ శాఖలన్నిటి లోనూ ఒక శాఖ. తాళాల ఉత్పత్తి, ఒక్క ప్రాంతం లోనే కాదు, ఒక్క దేశం లోనే కాదు, ప్రపంచమంతా ఉండేదే. ప్రపంచంలో, ప్రతీ రోజూ లక్షల లక్షల తాళాలు ఉత్పత్తి అవుతూ, అమ్ముడు పోతూ ఉండవలసిందే! ప్రతీ తాళానికీ మధ్య మధ్య రిపేర్లు జరుగుతూ ఉండవలసిందే. ఇంత శ్రమ ఈ వ్యవహారం మీద ప్రతీనిత్యం ఖర్చయి పోతూ ఉండవలసిందే. దొంగతనాల నించి 'రక్షణ' కోసం తాళాలే గాక, ఇంకా ఏయే వస్తువులు అవసరమవుతాయో ఆ వస్తువుల్నీ, ఆ రక్షణ పద్ధతుల్నీ ఏర్పరిచేవన్నీ, పెట్టుబడి దారీ దృష్టికి గొప్ప పరిశ్రమలే.

ఈ దృష్టికి, మానవ సమాజంలో ధాన్యం పండిం చడం ఎంత అత్యవసర కార్యమో తాళాల ఉత్పత్తి కూడా అంత అత్యవసర కార్యమే. వాళ్ళ ప్రకారం— మానవులు ధాన్యం లేకుండా బతకలేనట్టే, తాళాలు లేకుండా బతక లేరు. దొంగలూ తాళాలూ లేని సమాజాన్ని వాళ్ళు ఊహించలేరు!

దోపిడీ సమాజంలో, తాళం లేకుండా జీవించడం సాధ్యం కాదు కాబట్టి ఆ సమాజ పరిధిలో అది నిజం గానే ధాన్యం అంత అత్యవసర వస్తువే.

దోపిడీ సమాజం ఎలాంటిదంటే — ఒకవేపు దొంగ తనాల్నీ అదే సృష్టిస్తుంది, ఇంకో వేపు తాళాల్నీ అదే సృష్టి స్తుంది! నేరాల్నీ అదే సృష్టిస్తుంది, శిక్షల్నీ అదే సృష్టిస్తుంది! కానీ, తాళాలు, దొంగతనాల్నీ ఆపలేవు; శిక్షలు, నేరాల్నీ ఆపలేవు. ఎన్ని తాళాలు ఉన్నా, ఎన్ని శిక్షలు ఉన్నా, పరిస్థితి అంతా ఎప్పుడూ చెక్కుచెదరకుండా యథాతథం గానే ఉంటుంది.

పెట్టుబడిదారులు — ఎలాంటి శ్రమతోనైనా, అసలు అది 'శ్రమ' అయినా కాకపోయినా, ఏ మార్గంలోనైనా, డబ్బు రాసులతో జేబులూ, సంచులూ, బ్యాంకులూ, నింపుకోగలుగుతారు. అందుకే వాళ్ళకి, ఈ శ్రమా, ఆ శ్రమా అనే తేడాల్ని గుర్తించడం అసాధ్యమవుతుంది.

ప్రపంచం అంతా ఏదన్నా గొప్ప మార్పు జరిగి దొంగ తనాలు లేకుండా పోతే, ఆ క్షణంనించి తాళాలతో అవ సరం పోతుంది. తాళాల పరిశ్రమ అంతర్ధానమవుతుంది. 'తాళాల పరిశ్రమ'కు ఏ మాత్రం ఆటంకం కలగ బోతోన్నా పెట్టుబడిదారీ మానవులు సహించలేరు. సమాజం ప్రతీనిత్యం 'మూడు దొంగతనాలూ, ఆరు తాళాలూ' అయి విలసిల్లుతూ ఉండాలి. అందుకే, దొంగ తనాలు, దోపిడీ దొంగలకూ వాళ్ళ ఆర్థిక వేత్తలకూ చక్కని ఉత్పాదక శ్రమలుగా కనపడతాయి.

అన్ని శ్రమలూ ఉత్పాదక శ్రమలే — అన్నప్పుడు, ఉత్పాదక శ్రమలకు ఉండే నిజమైన అర్థం మరుగున పడిపోతుంది. ఉత్పాదక శ్రమని సరిగా గ్రహించనప్పుడు, సమాజంలో ఉండే 'డబ్బు' అంతా ('విలువ' అంతా) ఉత్పాదక శ్రామికుల ద్వారా ఉత్పత్తి అయ్యేదే — అనే విషయం అర్థం కాకుండా పోతుంది. పెట్టుబడిదారీ వర్గపు సుఖభోగాలకు ఉత్పాదక, అనుత్పాదక శ్రమలు రెండూ కారణమే అయినా, పెట్టుబడిదారీ వర్గపు 'ధనరాసులకు' మాత్రం ఉత్పాదక శ్రమలే కారణం. 'అన్ని శ్రమలూ ఉత్పాదక శ్రమలే' అనే మాటతో, పెట్టుబడికీ, దాన్ని పెంచే ఉత్పాదక శ్రమకూ ఉండే ప్రత్యేక సంబంధం అర్థం కాకుండా పోతుంది.

పెట్టుబడీదారీ ఆర్థికవేత్త, ఉత్పాదక శ్రమకు ఉన్న ప్రత్యేకతని గ్రహించలేక పోవడానికి ఒక కారణం — 'శ్రమని అమ్మడం'లో, వేతన శ్రామికుడికీ, స్వతంత్ర ఉత్పత్తిదారుడికీ తేడా ఉందనే సంగతి గ్రహించకపోవడం.

స్వతంత్ర ఉత్పత్తిదారుడు, ఒక్కోసారి తన 'శ్రమ'ని అమ్మితే, ఒక్కోసారి 'వస్తువుల్ని' తయారుచేసి అమ్ము తాడు. ఎలా అమ్మినా, తన 'శ్రమ విలువ'ని తను తిరిగి పూర్తిగా పొందుతాడు.

వేతన శ్రామికుడు యజమానికి 'శ్రమ'నే అమ్ము తాడుగానీ, వస్తువుల్ని తయారుచేసి అమ్మడు. వస్తువుల్ని తయారు చేసి అమ్ముకోగలిగే పరిస్థితే ఉంటే, ఆ ఉత్పత్తి దారుడు వేతన శ్రామికుడిగా మారడు. వేతన శ్రామికుడు, పెట్టుబడిదారుడి ఆధీనంలోకి వచ్చి శ్రమని అమ్ముతాడు కాబట్టే, ఆ శ్రమలో కొంత భాగాన్ని పెట్టుబడిదారుడు తన కోసం లాగగలుగుతాడు.

ఈ సంగతులేవీ పెట్టుబడిదారీ ఆర్థికవేత్త గ్రహించడు. ఈ ఆర్థిక వేత్తకి ఉత్పాదక శ్రామికుడూ, అనుత్పాదక శ్రామికుడూ, స్వతంత్ర ఉత్పత్తిదారుడూ, అందరూ ఒకటే. అందరి శ్రమల అమ్మకాలూ ఒకటే. అన్ని సంబంధాలూ ఒకటే. ఎవరు, ఎక్కడ, ఏ శ్రమ చేసినా, చెయ్యకపోయినా ఒకటే.

'అన్ని శ్రమలూ ఒకటే, అన్ని శ్రమలూ ఉత్పాదక శ్రమలే' — అనే పొరపాటు అవగాహన ఆర్థిక వేత్తల్లో ఉన్న కాలంలో, స్మిత్తు దాన్ని గురించి చాలా వరకూ సరైన అవ గాహనకు వచ్చాడు — "అన్ని శ్రమలూ ఒకటి కాదు. అన్ని శ్రమలూ ఉత్పాదక శ్రమలు కావు. పెట్టుబడిదారుడికి డబ్బుని పెంచేదే ఉత్పాదక శ్రమ. కానిది అనుత్పాదక శ్రమ" అనే అవగాహనకి. కానీ, ఇంత సరైన అభిప్రాయం వ్యక్తం చేసినా, ఆ ఆర్థికవేత్త, అందులో ఇంకా అస్పష్టత తోనే ఉన్నాడు. 'పెట్టుబడిదారుడికి డబ్బుని పెంచేదే ఉత్పాదక శ్రమ' అని చెప్తే చాలదు. ఆ శ్రమ, పెట్టుబడి దారుడికి డబ్బుని ఎలా పెంచుతుందో — ఆ క్రమాన్ని గ్రహించగలగాలి. అంటే, ఉత్పాదక శ్రామికుడు తయారు చేసిన సరుకుని అమ్మినప్పుడు, ఆ శ్రామికుడి శ్రమ అంతా డబ్బుగా మారుతుందనీ, ఆ డబ్బులో నించి శ్రామికుడికి అందే జీతం అతని శ్రమలో కొంత భాగమే గానీ, అది పూర్తి శ్రమ విలువ కాదనీ, కార్మికుడి శ్రమని దోచడం వల్లనే పెట్టుబడిదారుడి డబ్బు పెరుగుతుందనీ — ఈ క్రమాన్నంతా గ్రహించాలి. కానీ, 'పెట్టుబడిని పెంచేదే ఉత్పాదక శ్రమ' అని చెప్పిన స్మిత్తు, పెట్టుబడి ఎలా పెరుగుతుందో ఆ క్రమాన్ని గ్రహించలేదు.

అసలు ఈ 'ఉత్పాదక — అనుత్పాదక' పరిశీలన, స్మిత్తు కన్నా వెనకటి ఆర్థిక వేత్తలైన 'ఫిజియోక్రాట్ల'తో ప్రారంభమైంది.

**ఫిజియోక్రాట్లు:** వీరు 'ఫిజియోక్రసీ' అనే సిద్ధాంతం గల ఆర్థిక వేత్తలు. 'ఫిజియో' అంటే 'ప్రకృతి'. 'క్రసీ' అంటే 'పాలన'. ఫిజియోక్రసీ అంటే ప్రకృతి పాలన. 'విలువ అనేది ప్రకృతి ద్వారానే ఏర్పడుతుంది' — అనే సిద్ధాంతం ఇది. ఫ్రాన్సులో, 18వ శతాబ్దపు మధ్యకాలంలో ప్రారంభమైన సిద్ధాంతం ఇది. ఈ సిద్ధాంతానికి ప్రారంభకుడు — క్వెస్నే (Quesnay). ఈ సిద్ధాంతం రాక ముందు వరకూ, 'విలువ అనేది వర్తకం ద్వారానే (అంటే చలామణీ క్రమంలోనే) పెరుగుతుంద'నే సిద్ధాంతం ఉండేది. ఆ రకం భావాలనించి ఫిజియోక్రాట్ల సిద్ధాంతం ఒక ముందడుగు.

ఫిజియోక్రాట్లు, మొట్టమొదట, వ్యవసాయరంగంలో పెట్టే పెట్టుబడిని మాత్రమే 'ఉత్పాదక పెట్టుబడి' అన్నారు. అంటే వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడి మాత్రమే, 'ఉత్పాదకంగా' (తనని తను పెంచుకునే విధంగా) పని చేస్తుందనీ, 'పరిశ్రమల్లో' పెట్టే పెట్టుబడులు అలా పని చెయ్యవనీ భావించారు.

ఫిజియోక్రాట్లు, అలా ఎందుకు భావించారంటే: 'వ్యవసాయం'లో, మొదట భూమిలో పాతిన విత్తనాలు, పెద్ద చెట్లుగా పెరిగి, ధాన్యమూ, పళ్ళూ, కలపా ఇస్తాయి. ఒక బస్తా విత్తనాలతో 100 బస్తాల ధాన్యం వస్తుంది. వ్యవసాయంలో మొదట ఖర్చు అయ్యే ఉత్పత్తి ద్వారా ఎన్నోరెట్ల ఎక్కువ ఉత్పత్తి రావడం కనపడుతుంది. వ్యవసాయం కాని పరిశ్రమల్లో అలా జరగదు. ఏ పరిశ్రమని తీసుకున్నా, 'ముడిపదార్థం' నించి కొంత రద్దుపోయి, చివరికి తయారయ్యే ఉత్పత్తి, ముడిపదార్థం కన్నా తక్కువ బరువుతో ఉంటుంది. ఒక బట్టతో చొక్కాని కుడితే, బట్ట బరువుకన్నా చొక్కా బరువు తక్కువగా ఉంటుంది. కానీ, బట్ట విలువకన్నా చొక్కా విలువే ఎక్కువగా ఉంటుంది — దానికి కుట్టు శ్రమ ఖర్చులన్నీ కూడా చేరతాయి కాబట్టి. కానీ 'విలువ' గురించి ఏమీ తెలియని కాలంలో, ఫిజియోక్రాట్లు, ఉత్పత్తి సైజులో పెరుగుదలనే విలువలో పెరుగుదలగా అనుకున్నారు. 'వ్యవసాయం'లో, భూమి వల్ల, తక్కువ ఉత్పత్తితో ఎక్కువ ఉత్పత్తి వస్తుంది కాబట్టి, వ్యవసాయంలో భూమి వల్లనే తక్కువ విలువతో ఎక్కువ విలువ వస్తుందనీ; పరిశ్రమల్లో అయితే అలా జరగదనీ, పొరపాటుగా అర్థం చేసుకున్నారు.

కానీ, 'వ్యవసాయం'లో, భూమి, ఎక్కువ ఉత్పత్తిని ఇస్తే, ఎక్కువ విలువని ఇచ్చినట్టు కాదు. భూమి పాత్ర, ఉత్పత్తిని ఇచ్చే విషయంలోనే గానీ, దానికి 'విలువ'ని ఇచ్చే విషయంలో ఉండదు. విలువని ఇచ్చే పాత్ర అంతా 'శ్రమ'దే. శ్రమ చేసే మనుషులదే.

వ్యవసాయంలో అయినా, పరిశ్రమల్లో అయినా, ఒక వస్తువుని ఉత్పత్తి చెయ్యడం కోసం (ఉదా: ధాన్యం కోసం గానీ, బట్ట కోసం గానీ) పెట్టుబడిదారుడు సజీవ శ్రమ కోసం ఎంత విలువని ఖర్చు పెడతాడో (Vని ఖర్చు పెడతాడు) అంత శ్రమ మాత్రమే తిరిగి జరిగితే, మొదట ఖర్చయిన విలువకీ, కొత్తగా తయారైన విలువకీ తేడా రాదు. మొదట ఖర్చయినంత విలువే తిరిగి వస్తుంది. అలా గాక ఆ 'ఉత్పత్తి క్రమం'లో మొదట ఖర్చయిన Vకన్నా ఎక్కువ శ్రమ జరిగినప్పుడే, ఆ ఉత్పత్తికి విలువ పెరుగుతుంది. ఈ పని వ్యవసాయంలోనే కాదు, పరిశ్రమల్లోనూ జరుగుతుంది. పెట్టుబడి పని చేసే ప్రతిచోటా జరుగుతుంది. పెట్టుబడిదారుడు పెట్టిన మొదటి విలువ పెరిగినట్టు ఎక్కడ కనపడ్డా, ఆ ఎక్కువకి కారణం, శ్రామికుల అదనపు శ్రమే గానీ, భూమి గానీ — ఇతర ప్రకృతి గానీ, శ్రమ సాధనాలు గానీ, కావు.

పరిశ్రమల పెట్టుబడిదారులు కూడా లాభాలు సంపాదించడం ఫిజియోక్రాట్లు చూస్తూనే ఉంటారు. పరిశ్రమల్లో కూడా లాభాలు వస్తాయి అనేది, అందరికీ కనపడే విషయమే. కానీ ఆ లాభాలకు ఆ పెట్టుబడులే కారణంగా ఫిజియోక్రాట్లకు కనపడలేదు. వారు పరిశ్రమలో లాభాల గురించి పట్టించుకోలేదు.

ఫిజియోక్రాట్ల అవగాహనలో ఇలాంటి పరిమితులు ఎన్ని ఉన్నా, 'ఒక పెట్టుబడి, తన విలువకన్నా ఎక్కువ విలువని ఉత్పత్తి చెయ్యగలిగినప్పుడే అది ఉత్పాదక పెట్టుబడి అవుతుంది' అనే భావాన్ని కొత్తగా చెప్పడమే ఆ నాడు ఫిజియోక్రాట్ల ద్వారా జరిగిన గొప్ప విషయం. 'అర్థిక శాస్త్రాని'కి సంబంధించిన భావాలలో, ఫిజియోక్రాట్ల కాలం వరకూ ఈ 'ఉత్పాదక — అనుత్పాదక' తేడాలే లేవు. 'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం' గురించి ఒక క్రమబద్ధమైన పరిశీలన అనేది, ఈ ఫిజియోక్రాట్ల తోనే ప్రారంభమైంది.

ఫిజియోక్రాట్ల అవగాహనలో పొరపాట్లని, తర్వాత కాలంలో స్మిత్తు కొంతవరకూ సవరించాడు. పెట్టిన పెట్టుబడి ఎక్కువ విలువని ఉత్పత్తి చెయ్యడం అనేది, వ్యవసాయ రంగంలో మాత్రమే కాదనీ, పరిశ్రమల్లో కూడా జరుగుతుందనీ, స్మిత్తు వివరించాడు. కానీ, ఆ వివరించడంలో పెద్ద పొరపాటు చేశాడు — "భూమినించీ, గనుల నించీ వచ్చే ఉత్పత్తి, తన పెట్టుబడులనే గాక, సమాజంలోని అన్ని ఇతర పెట్టుబడులనూ లాభాలతో సహా తిరిగి తెస్తుంది" అన్నాడు. అంటే, భూమి నించీ, గనుల నించీ వచ్చే ఉత్పత్తి, తన పెట్టుబడుల్ని తిరిగి తేవడమూ, తన లాభాల్ని తేవడమూ మాత్రమే గాక, సమాజంలో అన్ని పెట్టుబడుల్నీ తిరిగి తెస్తూ, వాటి లాభాల్నీ కూడా తెస్తుంది — అని అర్థం. అంటే, పరిశ్రమల్లో రావలసిన లాభాల్ని కూడా వ్యవసాయ రంగమే ఉత్పత్తి చేస్తుంది — అనే అభిప్రాయం ఇది.

వ్యవసాయ రంగమూ, గనులూ కలిసి, సమాజంలో ఉన్న అన్ని పరిశ్రమలకూ కావలసిన 'ముడి పదార్థాల్ని' ఇస్తాయి కదా? దీన్ని చూసి స్మిత్తు ఎలా భావించాడంటే — పరిశ్రమలకు వచ్చే లాభాలు, వ్యవసాయం లోనే ఉత్పత్తి అవుతాయని భావించాడు.

దారం పరిశ్రమకి కావలసిన ముడి పదార్థం - 'పత్తి'. అది వ్యవసాయ రంగంలోనే ఉత్పత్తి అవుతుంది. దారాన్ని తయారు చేయించే పెట్టుబడిదారుడు పత్తిని కొన్నప్పుడు, దాని విలువనంతా చెల్లించేసి కొంటాడు. ఆ తర్వాత ఆ పత్తితో దారం తయారయ్యే క్రమంలో, పత్తి విలువకు, C+V+Sలు చేరి దారం తయారవుతుంది. తర్వాత ఆ దారాన్ని అమ్మినప్పుడు, దాని విలువలో నించి పెట్టుబడి వెనక్కి వచ్చి, ఆ పైన S వస్తుంది. ఆ S, వ్యవసాయ రంగం వల్ల వచ్చినది కాదు. వ్యవసాయ రంగం, దారం పరిశ్రమలోకి, 'పత్తి' అనే ముడి పదార్థాన్ని ఇచ్చిందంటే, ఆ పరిశ్రమకి రావలసిన లాభాన్ని కూడా ఇచ్చిందని అర్థం కాదు. పరిశ్రమకి వచ్చే లాభం దాని ముడి పదార్థంలో ఉండదు. ఆ ముడి పదార్థం ద్వారా కొత్త సరుకు తయారయ్యేటప్పుడు శ్రామికులు చేసే అదనపు శ్రమే లాభంగా ఉంటుంది. కానీ, ఈ విషయాలన్నీ సరిగా అర్థం చేసుకోక పోవడం వల్లనే ఈ పొరపాట్లన్నీ.

పరిశ్రమలకు వచ్చే లాభాల గురించి స్మిత్తు చాలా పొరపాటు గానూ గందరగోళం గానూ చెప్పినా, ఆయన వేసిన ముందడుగు ఏమిటంటే — 'పెట్టుబడి అనేది అన్ని రంగాలలోనూ ఉత్పాదకం గానే పని చేస్తుంది; వ్యవసాయ రంగం లోనే కాదు' అని చెప్పడమే. పెట్టుబడి, పని చెయ్యడం ఎలా జరుగుతుందో ఆయన గ్రహించక పోయినా, ఆయన చెప్పగలిగినంత వరకూ అది పెద్ద ముందడుగే. ఫిజియోక్రాట్లు ఒక ముందడుగు వేస్తే, దాన్ని ఆధారం చేసుకుని స్మిత్తు మరింత పెద్ద ముందడుగు వేశాడు.

స్మిత్తు తర్వాత **రికార్డో** మరింత పెద్ద ముందడుగు వేశాడు. ఈయన - 'శ్రామికులు అదనపు శ్రమ చేస్తారు' అని చెప్పగలిగే వరకూ వచ్చాడు. కానీ, అది చాలా పొరపాటు గానూ, అస్పష్టం గానూ, గందరగోళం గానూ మాత్రమే చెప్పగలిగాడు.

రికార్డో దృష్టిలో 'ఉత్పాదక శ్రామికుడు దురదృష్టవంతుడు.' ఎందుకంటే, 'ఉత్పాదక శ్రామికులు పెట్టుబడిదారుల లాభాల కోసం ఎక్కువ శ్రమ చెయ్యక తప్పదు' కాబట్టి. అంటే, కార్మికులు, జీతాలకు తగ్గ శ్రమేగాక, పెట్టుబడిదారుడికి 'లాభం' రావడానికి కావలసిన శ్రమ కూడా చేస్తారని రికార్డో గ్రహించాడు. అంటే, ఈ ఆర్థిక వేత్త దాదాపు 'అదనపు శ్రమని' గ్రహించడం దాకా వచ్చాడు. ఇదే ఈయన వేసిన గొప్ప ముందడుగు! కానీ, ఆ ముందడుగుని మళ్ళీ ఆయనే వెనక్కి తీసేసుకున్నాడు! అది ముందడుగు అని కూడా ఆయన అర్థం చేసుకోలేకపోయాడు. కార్మికులు, పెట్టుబడిదారుడి కోసం ఎక్కువ శ్రమ చేస్తారు — అని గ్రహించి కూడా 'మరి అలా చెయ్యవలసిందే' అని తేల్చాడు. ఎందుకంటే, ఆయన వాదం పెట్టుబడిదారుడి వాదమే. అదేమిటంటే: పెట్టుబడి మీద లాభం రాకపోతే ఏ మనిషి అయినా పెట్టుబడి ఎందుకు పెడతాడు? పెట్టుబడికి లాభం రావలసిందే. కార్మికులు ఎక్కువ శ్రమ చెయ్యకపోతే లాభం ఎలా వస్తుంది? కాబట్టి, కార్మికులు ఎక్కువ శ్రమ చెయ్యవలసిందే! — ఇదీ ఆ వాదం.

'పెట్టుబడికి లాభం రావలిసిందే' అని పెట్టుబడి దారుడు చెప్పే దానికీ, ఈ ఆర్థిక వేత్త చెప్పేదానికీ, తేడా ఏమైనా ఉందా? — ఏమీ లేదు. 'పెట్టుబడికి లాభం రావాలి' అని పెట్టుబడిదారుడు అన్నట్టే ఈ ఆర్థికవేత్త కూడా అంటున్నాడు. 'లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు?' అని పెట్టుబడిదారుడు అన్నట్టే ఈయనా అంటున్నాడు. ఈ ఆర్థిక వేత్త ఒక తర్కంతో ఆలోచించింది ఏమిటి? పెట్టుబడిదారుడుపెట్టుబడి పెట్టకపోతే ఉత్పత్తి — క్రమం జరిగే మార్గమే లేదా? అసలు పెట్టుబడి అంటే ఏమిటి? దానికి లాభం ఎందుకు రావాలి? — ఈ ప్రశ్న లేవీ ఈ ఆర్థిక వేత్తకి లేవు. 'పెట్టుబడికి లాభం రావల సిందే' అనుకున్నాడు కాబట్టి, ఉత్పాదక శ్రామికులు ఎక్కువ శ్రమ చెయ్యక తప్పదనీ, అది వారి దురదృష్టమనీ విచారించాడు. 'ఏం చేస్తారు మరి? చాలా దురదృష్టం! విచారకరం!' అనే మాటలతో ఆయన ఉత్పాదక శ్రామికు లకు సానుభూతి చూపించాడు.

అనుత్పాదక శ్రామికుల విషయంలో ఆయన సాను భూతి ఇంకో రకంగా ఉంటుంది. 'పరిశ్రమల్లో ఉత్పాదక శక్తులు ఇంకా పెరిగితే, పెట్టుబడిదారుల లాభాలు కూడా ఇంకా పెరుగుతాయి కదా? అప్పుడు, పెట్టుబడిదారులు మీ జీతాలు కూడా కొంచెం పెంచుతారులెండి' అనే మాట లతో ఆయన అనుత్పాదక శ్రామికుల్ని ఓదార్చాడు.

ఉత్పాదక శక్తులు ఎంత పెరిగినా, దాని వల్ల పెట్టు బడిదారులకే లాభం గానీ కార్మికులకు ఒరిగేదేమీ ఉండ దని రికార్డోకి అర్థం కాలేదు. శ్రామికుల్ని చూసి జాలి పడడం మాత్రం ఆయన బాగా చేశాడు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ఉన్న లక్షణాల్ని గ్రహించడంలో గతకాలపు ఆర్థిక వేత్తలంతా, ఎంతో గందర గోళపడుతూ ముందుకు సాగారనడానికి ఇవన్నీ రుజువులు. ఏ శాస్త్రంలో నైనా, సరైనదాన్ని స్పష్టంగా గ్రహించే లోగా, ప్రతీ అంశంలోనూ ఇన్ని తప్పటడుగులతో సాగ వలసిందే.

అయితే రికార్డో చెప్పిన దాంట్లో 'కార్మికులు, పెట్టు బడిదారుడి కోసం ఎక్కువ శ్రమ చేస్తారు' అనే కొత్త విషయం ఉంది కాబట్టి, దాని విలువ ఆయనకి అర్థం కాకపోయినా, దాన్నే మనం గట్టిగా పట్టించుకోవాలి. దాని మీద సరైన అవగాహనకు రావాలి.

ఆ పనే చేశాడు మార్క్సు. గత ఆర్థిక వేత్తలు అరకొరగా చెప్పిన విషయాలన్నిటినీ పరిశీలించాడు. ఎవరిలో ఏ మంచి అంశం దొరికినా దాన్ని అర్థం చేసుకోవ డానికి ప్రయత్నించాడు. చివరికి అసలు నిజం గ్రహిం చాడు! 'శ్రమ దోపిడీ'ని పట్టుకున్నాడు! 'లాభం అనేది శ్రమ దోపిడీయే' అని వివరించాడు. 'పెట్టుబడిగా పని చేసేది ఉత్పత్తి సాధనాలే కాబట్టి, అవి ఖర్చయినప్పుడు అవి తిరిగి వస్తే చాలు, వాటికి లాభం రావలసిన అవసరం లేదు' అన్నాడు. 'లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు' అనే ప్రశ్నకి, 'అసలు పెట్టుబడే అక్కరలేదు, దాన్ని ఎవరూ పెట్ట నక్కరలేదు' అన్నాడు. ఈ విషయాలన్నీ హేతు బద్ధంగా వివరించి, శ్రమ దోపిడీ ఎలా జరుగుతుందో రుజువు చేశాడు.

లాభాన్ని ఇచ్చేది ఉత్పాదక కార్మికుల అదనపు శ్రమ. లాభం కోసం ఎక్కువ శ్రమ చెయ్యవలసిన అవసరం కార్మికులకు ఉండదు. ఎవరి శ్రమ వారికే దక్కాలి. అంత శ్రమ వారికి అక్కరలేకపోతే, వారి శ్రమ కాలం తగ్గిపోవాలి. ప్రతీ మనిషీ ఎవరి కోసం వాళ్ళు శ్రమ చేసుకోవాలి. శ్రమ చెయ్యకుండా జీవిస్తోన్న మనిషి ఇతరుల శ్రమని దోపిడీ చేస్తూ జీవిస్తున్నాడని అర్థం. — ఈ రకంగా మార్క్సు, శ్రమ దోపిడీ రహస్యాలూ, స్వంత ఆస్తుల రహస్యాలూ, అన్నీ బైటపెట్టాడు. శ్రమలకు సంబంధించి, రక రకాల నిజాలు చూపించాడు. ఉత్పాదక — అనుత్పాదక విభజనని ఎలా అర్థం చేసుకోవాలో సరైన పద్ధతిలో వివరించాడు.

మార్క్సు చూపించిన కొత్త అర్థాలతో, అప్పటి వరకూ వున్న ఆర్థిక శాస్త్రమే తల్లకిందులుగా మారిపోయింది! అసలు రహస్యాలన్నీ బైటపడ్డాయి.

మళ్ళీ పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల విషయానికి వస్తే, ఉత్పాదక శ్రమ పెట్టుబడిని పెంచుతుంది కాబట్టి, ఈ ఆర్థిక వేత్తలకు ఉత్పాదక శ్రమ అంటే చాలా ప్రీతి. అను త్పాదక శ్రమ అంటే చిన్న చూపు. రికార్డో దృష్టిలో, సరుకుల్ని ఉత్పత్తి చేయించే పెట్టుబడిదారులు 'ఉత్పాదక శ్రమ'లో నిమగ్నమైన వారి గానూ, భూస్వాములు మాత్రం పనీ పాటా లేకుండా కూర్చుని తినే 'అనుత్పాదక గుంపు' గానూ ఉంటారు.

అలాగే '**కేరే**' అనే ఆర్థికవేత్త దృష్టికి, వ్యాపారులంతా అనుత్పాదకులు.

'అదనపు విలువ' ఎన్ని రకాలుగా చీలుతుందో, ఆర్థిక వేత్తలు కూడా అన్ని రకాలు గానూ చీలుతారు కాబట్టి, ఈ రక రకాల ఆర్థిక వేత్తలంతా, తమకు ఆసక్తి గల పెట్టుబడి దారుల కార్యకలాపాలనే అసలైన ఉత్పాదక కార్యకలా పాలుగా వర్ణించడానికి తంటాలు పడతారు.

ఉత్పాదక పెట్టుబడిదారుల మీద ప్రత్యేక శ్రద్ధా సక్తులు గల ఆర్థిక వేత్తలు ఉత్పాదక కార్యకలాపాల్ని ఆకా శానికెత్తేసి పొగుడుతారు. ఎందుకంటే, 'ఉత్పాదక శ్రామి కులే మొత్తం సమాజాని కంతటికీ ఉత్పత్తి చేస్తున్నారు' అని చెప్పడానికి కాదు. వర్తక కమిషన్లూ, కౌళ్ళూ, వడ్డీలూ తింటున్న వాళ్ళంతా ఊరికే కూర్చుని కాలం గడుపుతూ ఉండగా, ఉత్పాదక పెట్టుబడిదారుడు మాత్రమే 'కష్టించి

చెమటోడ్చి. ఉత్పత్తి కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నాడు సుమా' అని చాటడానికి! ఉత్పాదక కార్యక్రమాన్ని కీర్తించే ఈ ఆర్థిక వేత్తలకు,, ఆ కార్యక్రమం నిండా ఉత్పాదక పెట్టుబడిదారుడి ప్రతిభా విశేషాలే కనపడతాయి.

## అనుత్పాదక పెట్టుబడిదారుల గుండె కోత!

వర్తక కమిషన్లూ, వడ్డీలూ, కౌళ్ళూ, వసూలు చేసుకునే వాటాదార్ల ముందు, ఉత్పాదక పెట్టుబడిదారుడు, తనే 'గొప్ప కష్టజీవి'గా, 'ఉత్పాదకుడి'గా, చలామణీ అవ్వాలని చూస్తాడు. ఈ వ్యవహారం చూసి మిగతా వాళ్ళందరికీ ఒళ్ళులు మండుకొస్తాయి. వాళ్ళు తమ ఆర్థిక వేత్తల్ని కోపంగా సంప్రదిస్తారు. "ఏవిటీ, సరుకులవాడు, పెద్ద 'ఉత్పాదక కార్యక్రమం, ఉత్పాదక కార్యక్రమం' అని బడాయిలు పోతున్నాడు? వాడేవన్నా పార పట్టుకుని మట్టి పెళ్ళలు కిందకీ మీదకీ తిరగేస్తున్నాడా? 'తల్లి పుట్టిల్లు మేనమామ ఎరగడా' అని వీడి గొప్పలు మన దగ్గిరా? వీడొక్కడూ మహా కష్టపడి చెమటోడుస్తూంటే, మనందరం ఊరికే కూర్చుని తింటున్నట్టు వాగుతున్నాడే! వాడికి కాస్త గడ్డి పెట్టండయ్యా!" అని రుస రుసలాడతారు.

యజమానులకు కలిగిన అవమాన భారానికి వాళ్ళ ఆర్థిక వేత్తలు కూడా ఉడికిపోతూ — "మనం ఇంట్లో కూర్చుంటే, వాడు ఫ్యాక్టరిలో కూర్చుంటాడు. అంతేగా తేడా? వాడు మాత్రం 'కూర్చోవడం' కన్నా ఏం చేస్తున్నాడేం మహా?" అని ఎగురుతారు.

ఆర్థిక వేత్తల అసిస్టెంట్లు మరింత చురుగ్గా "వాడు ఫ్యాక్టరీకెక్కడ పోతాడండీ? ఆ పనులన్నీ మేనేజర్లే చూస్తారు కదా? వాడూ ఇంట్లోనే కూర్చుంటాడు" అంటారు, మరింత ఎగురుతూ.

"మరింకేం? ఆ మాటే రాసెయ్యండి!" అంటారు అనుత్పాదక పెట్టుబడిదారులు.

"రాసెయ్యడం ఎంతసేపు గానీ...."

"ఏమిటి ఆలశ్యం? గానీ ఏమిటి?"

"ఆలశ్యాని కేముంది గానీ ... ఎందుకులెండి ... ఎంత కాదన్నా మనం మనం ఒకటే. 'నువ్వు ఊరికే తింటున్నావంటే, నువ్వు ఊరికే తింటున్నావ'ని మనలో మనం పోట్లాడుకుంటే, పని వాళ్ళకి లోకువై పోతాం. 'ఓహో, అసలు సంగతి ఇదా? వీళ్ళందరూ ఊరికే కూర్చుని తింటున్నారా?' అని, వాళ్ళు అసలు సంగతి గ్రహించేసి మనందర్నీ పను ల్లోకి లాక్కుపోతారు. అంత దుష్టులు వాళ్ళు! అందు కనీ...."

"ఆ మాటా నిజమే గానీ .... మరి ఈ పరిశ్రమల వాళ్ళ బడాయి మాటలు ఎలా సహిస్తాం?"

"దానికొకటి ఆలోచించాను. మనది శ్రమ కాదని వాళ్ళంటే, వాళ్ళది శ్రమ కాదని మనం అనడం కాదు. మనలో మనం అలా పోట్లాడుకుని ఏం లాభం? 'అందరిదీ శ్రమే' అనుకుంటే పోలా? 'కూర్చోడం' మాత్రం శ్రమ కాదా? కూర్చునీ, కూర్చునీ నడుం ఎంత పట్టేస్తుందీ! అసలు కూర్చునే వాడి శ్రమ పని చేసే వాడి కెక్కడుంటుంది? పరిశ్రమల వాడిదీ శ్రమే, మనదీ శ్రమే, అందరిదీ శ్రమే. ఉత్త శ్రమ కాదు. ఉత్పాదక శ్రమే!' అలా అనుకుంటే పోలా?"

"స్మిత్తు ఎప్పుడో చెప్పేశాడటనే — 'అన్ని పనులూ ఉత్పాదక శ్రమలవవూ' ... అవఁటా — అనీ ...."

"చెప్తే చెప్పాడు లెద్దురూ! అందరం కలసి దాన్ని ఒప్పుకోం పొమ్మంటే పోలా? ఎవడేది చెప్తే అదే ఒప్పేసుకోవాలని రూలేమన్నా ఉందా? అలాగైతే, నాస్తికులు ఏ నాటి నించో 'దేవుడు లేడు, దేవుడు లేడు' అని మొత్తుకోడం లేదూ? అదంతా మనం ఒప్పేసుకుంటున్నామా? రోజూ పూజలెందుకు చేసుకుంటున్నాం? చెప్పే వాళ్ళు చెపుతూనే ఉంటారు. మనకు నచ్చింది తీసుకుంటాం, నచ్చంది వదిలేస్తాం. స్మిత్తు చెప్పిందాన్ని బట్టి అయితే, మనందరం ఉత్పాదకులం కాకుండా పోవలసిందే. రేపొద్దున్న ఇంకెవడో వచ్చి ఇంకేదో అంటాడు. ఎల్లుండి ఇంకెవడో వచ్చి అందర్నీ పనిలోకి దిగమంటాడు. అవన్నీ ఒప్పుకుంటూ కూర్చుంటే ఇక అయినట్టే మన పని!"

"అలాగైతే మరి అదేదో రాసెయ్యండి! తొందరగా పరిశ్రమల వాడికి తెలుస్తుంది. మనం కూడా వాడిలాగే 'కూర్చునే శ్రమ' చేస్తున్నామని రాసెయ్యండి! మీరే వంటారు దొర గారూ?" అని వడ్డీల వాడు భూస్వామికేసి చూస్తాడు.

దొర గారు మీసాలు మెలేస్తూ కొర కొర చూపుల గాంభీర్యం ప్రదర్శిస్తూ తల పంకించి ఊరుకుంటాడు. దొరగారి వాటాదార్లందరికీ 'కూర్చునే శ్రమ' ఒక్కటేగానీ, దొర గారికైతే 'మీసాలు మెలేసుకునే అదనపు శ్రమ' కూడా ఉంటుంది కదా పాపం?

ఈ సోమరిపోతు మందని కాపాడడం కోసమే, 'ఎవరే పని చేసినా ఉత్పాదక శ్రమే' అనే వెకిలి సూత్రాలు పుట్టుకొచ్చాయి.

## ఉత్పాదక రంగానికి పునాది ఎవరు?

ఉత్పాదక రంగమూ, వర్తక రంగమూ, వడ్డీల రంగమూ, కౌళ్ళ రంగమూ, పన్నుల రంగమూ — వగైరా వేరు వేరు రంగాలన్నిటి లోనూ ఉత్పాదక రంగం ఒక్కటే అసలైన ఉత్పాదక రంగం. సమాజంలో ఉండే మిగతా అన్ని రంగాలకూ, ఉత్పాదక రంగానికీ ఉండే ఈ తేడా,

పెట్టుబడిదార్ల దృష్టిలో కూడా ఎంతో కొంత తేడాగానే ఉంటుంది — ఆ తేడా ఏమిటో వాళ్ళకి సరిగా అర్థం కాకపోయినా.

సమాజంలో ఉన్న సమస్త రంగాలకూ ఉత్పాదక రంగమే — పునాది. ఈ ఉత్పాదక రంగాని కంతటికీ నిజమైన కర్తలు ఉత్పాదక శ్రామికులే. కానీ, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలూ, పెట్టుబడిదారీ మేధావులూ, ఈ అసలు సంగతిని గుర్తించడానికి ఇష్టపడరు. వారి దృష్టిలో, సమాజంలో జరిగే మొత్తం ఉత్పత్తి కార్యక్రమాల కంతటికీ ప్రధాన కారణం 'ఉత్పాదక పెట్టుబడిదారులే.' ఈ పెట్టుబడిదారులే, తమ ఉత్పత్తి సంస్థలకు మేనేజింగ్ డైరెక్టర్లుగా ఉంటారు కాబట్టి, ఉత్పత్తికంతటికీ ప్రధాన కారకులు మేనేజింగ్ డైరెక్టర్లన్న మాట! ఆ డైరెక్టర్ల తర్వాత కారకులు మేనేజర్లు! సమాజంలో ఉత్పత్తి కంతటికీ అసలు సిసలైన కారకులు ఈ డైరెక్టర్లూ, మేనేజర్లూ అన్నమాట!

సమాజంలో — ఈ మేనేజర్లూ, మేనేజింగ్ డైరెక్టర్లూ చేసే 'సేవలకు' పెట్టుబడిదారీ ప్రభుత్వం వారు, ప్రతి ఏటా, ఒక తారీఖున ముగ్ధులై పోతూ వుంటారు. ముగ్ధులై పోయి, ఆ మేనేజర్ల లోనూ, మేనేజింగ్ డైరెక్టర్ల లోనూ మరీ ఉత్తములైన వారికీ, ఉత్తమోత్తములైన వారికీ, గొప్ప గొప్ప బహుమతులు ప్రకటిస్తూ వుంటారు. ఆ గొప్ప గొప్ప బహుమతులు ఎందుకటా? 'ఉత్పత్తిని పెంచడంలో ఉన్నత స్థాయిని సాధించినందుకు' ఒకరికీ, 'సంస్థల్ని నిర్వహించటంలో అత్యంత ప్రతిభా విశేషాలు ప్రదర్శించినందుకు' ఇంకొకరికీ — ఇలా, వారు సమాజానికి గొప్ప గొప్ప 'సేవలు' చేసినందుకు!

ఉత్పత్తి స్థాయిని పెంచడం అంటే, కార్మికుల సమస్యల గురించి పట్టించుకోకుండా వారిని పీడించి పీడించి పని చేయించడమే. అలా పని చేయిస్తేనే ఉత్పత్తి స్థాయి పెరుగుతుంది. ఉత్పత్తి సంస్థల్ని ప్రతిభావంతంగా నిర్వహించడం అంటే, 'సమ్మెలు'లాంటి తల నొప్పులు లేకుండా వాటిని ఎప్పటికప్పుడు అణగదొక్కడమే. అప్పుడే ఉత్పత్తి సంస్థల నిర్వహణ 'ప్రతిభావంతంగా' జరుగుతుంది. పెట్టుబడిదారీ వర్గానికి ఇవి గొప్ప సేవలే. కానీ, ఈ 'సేవల్ని' వారు సమాజానికంతటికీ కావలసిన సేవలుగా అభివర్ణిస్తారు. అలాగాక ఇంకెలా చెప్పగలరు? 'సమాజాని కంతటికీ సేవ చేశారు' అనకుండా, 'మీరంతా మన దోపిడీ వర్గానికి చాలా బాగా సేవ చేశారు. శ్రామికుల్ని దోచడంలో మీరంతా ఉత్తమోత్తమంగా కృషి చేశారు' అని పైకి చెప్పలేరు కదా? అందుకే, 'మీరంతా సమాజానికి గొప్ప సేవ చేశారు' అని ప్రశంసిస్తూ ఆ బహుమతులు ఇస్తారు. అసలు సంగతంతా బహుమతులు ఇచ్చే వాళ్ళకీ తెలుసు, పుచ్చుకునే వాళ్ళకీ తెలుసు. ఎటొచ్చీ తెలియనిది శ్రామికులకే!

మేనేజర్లకీ, డైరెక్టర్లకీ, వాళ్ళ వర్గానికి చేసే సేవల కోసం కాకపోయినా, వారుపడే ఇంకో రకం కష్టానికైనా వారికి ఏటా తప్పనిసరిగా పెద్ద పెద్ద బహుమతులు ఇవ్వవలసిందే. పాపం వారు ఎప్పుడూ చల్లని విశాలమైన రూముల్లో మెత్త మెత్తని మెత్తల మీద కూర్చునీ కూర్చునీ నడుం నొప్పులు పుట్టించుకునే కష్టం చేస్తూ ఉంటారు కదా? ఆ నడుములు సాఫీగా లేవడానికి వారు రోజా మోర్నింగ్ వాకులూ, ఈవెనింగు వాకులూ చేస్తూనే ఉంటారు కదా? ఆ వాకుల కన్నా ఈ బహుమతుల పేర్లతో చేటలంతంత, పీటలంతంత షీల్డు దిమ్మల్ని కాస్సేపు మోసే పరిశ్రమ చేస్తే, వేదిక మీద ఆ షీల్డు దిమ్మల్ని ఎత్తుకో గానే, ఆ నెప్పుల నడుములు తక్కున సాఫీ అయిపోవా? ఆ రకంగా వారి ఆరోగ్యానికి ఆ దిమ్మల మోతల వైద్యం ఎంతో అవసరం కాదా? ఆ దిమ్మల మీద, "వీరి నడుం నొప్పికి వైద్యంగా ఈ దిమ్మలు మోయిస్తున్నాం" అని రాస్తే ఎంతో బాగుంటుంది. కానీ, అలా రాయరు. 'చాలా గొప్పవారైన ఫలానా వీరు, సమాజానికి ఫలానా అంత సేవ చేశారు. ఉత్పత్తి రంగంలో ఫలానా అంత ఉత్పత్తి చేశారు. సమాజాన్నంతా తమ సేవల మీదే నిలబెట్టారు....' అంటూ పచ్చి అబద్ధాల సువర్ణాక్షరాల్ని ఆ దిమ్మల మీద చెక్కిస్తారు.

ఈ అబద్ధాల చెక్కుళ్ళ వ్యవహారాలు పూర్వకాలం నించీ ఉన్నవే. సమాజంలో ప్రతీ ఉన్నతమైన కార్యానికీ, రాజులూ, మహారాజులూ, చక్రవర్తులూ మాత్రమే కారకులు! వారు గొప్ప గొప్ప సేద్యాలూ, భవనాలూ, కట్టడాలూ, రహదారులూ, నీటిపారుదలలూ, సత్రవలూ, శిల్పాలూ, ఇదీ అదీ అని కాదు, సమస్తమూ నిర్మిస్తారు! సమస్త కార్యాలకూ వారే కర్తలు! సమస్త నిర్మాణాలకూ వారి ప్రతిభా వ్యుత్పత్తులే కారణాలు!

సరిగ్గా అలాగే, పెట్టుబడిదారీ సమాజంలో, ఉత్పత్తి రంగానికీ, నిర్వహణ రంగానికీ పెట్టుబడిదారీ డైరెక్టర్లే, మేనేజర్లే కర్తలు! జీవ నాడులు!

ఈ కీర్తి తమ రంగాలకు రావటం లేదే — అని వర్తక, వడ్డీ, కౌలు — వగైరా రంగాల ప్రముఖులు అప్పుడప్పుడూ చింతాక్రాంతులవుతూ వుంటారు. ఎవరి కంట తడినీ చూడ లేని రకపు ఆర్థిక వేత్తలు 'ఎవ్వరేం చేసినా ఉత్పాదక శ్రమే. అందరూ ఉత్పాదక శ్రామికులే' అనే ఓదార్పులతో అందర్నీ ఆనంద పరచ జూస్తారు.

న్యాయంగా ఆలోచిస్తే, ఉత్పాదక రంగంలో, మేనే

జింగ్ డైరెక్టర్లు కూడా 'ఉత్పాదక శ్రామికు'లైనప్పుడు, వడ్డీ పెట్టుబడిదారులు మాత్రం ఉత్పాదక శ్రామికులు కాకూడదా? భూమి దొరలు మాత్రం ఉత్పాదక శ్రామికులు కాకూడదా? దీని మీద ఇంత చర్చ ఎందుకు? 'ఉత్పత్తి స్థలం' ఛాయలకు ఎన్నడూ రాని ఉత్పాదక, వర్తక, వడ్డీ, అద్దెల, పన్నుల, కౌళ్ళ, వగైరాల హేమా హేమీలంతా ఉత్పాదక ప్రముఖులే — రాత్రీ పగలూ ఉత్పత్తి స్థలాల్లో పడివుండే ఉత్పాదక శ్రామికులు తప్ప!

# 'సమాజ ఉత్పత్తుల రాసి' పంపకం!

సమాజంలో ఒక సంవత్సరంలో ఉత్పత్తి అయ్యే మొత్తం 'ఉత్పత్తుల రాసి'ని, సమాజంలో ఉండే జనాభా అంతా ఎలా పొందుతారో ఇక్కడ చూస్తాం.

సమాజానికి కావలసిన బట్టనంతటినీ ఒక శాఖలో ఉన్న ఉత్పాదక శ్రామికులూ, పంచదారనంతటినీ ఒక శాఖలో శ్రామికులూ, మందులన్నీ ఒక శాఖలో శ్రామికులూ, యంత్రాలన్నీ ఒక శాఖలో శ్రామికులూ — ఇలా, ఒక్కో రకం సరుకునీ ఒక్కో శాఖకు చెందిన ఉత్పాదక శ్రామికులు ఉత్పత్తి చేస్తారు.

ఈ ఉత్పత్తులు, వేరు వేరు పెట్టుబడిదారుల దగ్గిర వేరు వేరు స్థలాలలో చిన్న చిన్న రాసులుగా ఉంటాయి.

మనం, ఇక్కడ ఆ తేడాలన్నీ వదిలేస్తాం. విడి విడి పెట్టుబడిదారులందర్నీ వదిలేస్తాం. సమాజం అంతటిలోనూ కలిసి ఏం జరుగుతుందో మొత్తంగా చూస్తాం.

విడి విడి పెట్టుబడిదారులందరూ కలిసి ఒకే పెద్ద పెట్టుబడిదారుడు — అనుకుంటాం.

విడి విడి పెట్టుబడులన్నీ కలిసి — ఒకే పెద్ద పెట్టుబడి.

విడి విడి ఉత్పాదక శ్రామికులందరూ కలిసి — ఒకే పెద్ద ఉత్పాదక శ్రామికుల బృందం.

విడి విడి ఉత్పత్తుల రాసులన్నీ కలిసి — ఒకే పెద్ద ఉత్పత్తి రాసి.

విడి విడి జీతాలన్నీ కలిసి — ఒకే జీతాల మొత్తం.

విడి విడి ఉత్పత్తుల విలువలన్నీ — మొత్తం ఉత్పత్తుల రాసి విలువ.

విడి విడి అదనపు విలువలన్నీ కలిసి — మొత్తం సామాజిక (ఆ సమాజంలో వున్న) అదనపు విలువ.

అంటే, ఇప్పుడు మన లెక్క, విడి విడి శాఖలకూ, అందులో విడి విడి ఉత్పత్తి సంస్థలకూ సంబంధించి గాక, మొత్తం సమాజానికంతటికీ సంబంధించి ఉంటుంది.

ఈ 'ఉత్పత్తి రాసి'లో, ఇంతకు ముందే ఒక సారి చూసినట్టు, సమస్త వస్తువులూ, పదార్థాలూ, సౌకర్యాలూ, విలాస వస్తువులూ, ఆయుధాలూ అన్నీ ఉంటాయని ఊహించాలి. అగ్గిపుల్ల నించీ విమానాల దాకా. ఒక సంవత్సరపు ఉత్పత్తుల రాసి ఇది. దీన్ని ఉత్పత్తి చేసింది ఆ సమాజంలో ఉన్న మొత్తం ఉత్పాదక శ్రామికులు. దీన్ని ఉత్పత్తి చేయించింది — ఆ సమాజంలో ఉన్న మొత్తం ఉత్పాదక పెట్టుబడిదారులు. ప్రభుత్వం కూడా ఒక పెట్టుబడిదారుడే కాబట్టి, ప్రభుత్వ ఉత్పత్తి సంస్థల లోనూ, ప్రైవేటు పెట్టుబడిదారుల ఉత్పత్తి సంస్థల లోనూ కలిపి ఉత్పత్తి అయిన మొత్తం ఉత్పత్తుల రాసి ఇది.

ఈ 'రాసి'ని, ఒక సంవత్సరానికి సంబంధించింది — అనుకుంటే, అందులో విషయాలన్నీ సంవత్సరానికే సంబంధించీ; లేదా, ఆ రాసి ఒక రోజుకి సంబంధించింది — అనుకుంటే, దాని విషయాలన్నీ ఒక రోజుకే సంబంధించీ ఉంటాయి. ఎలా అనుకున్నా ఒకటే.

ఒక 'ఉత్పత్తుల రాసి'లో — కొన్ని రెడీ మేడ్ దుస్తులూ, కొంత బట్టా, కొంత దారమూ, కొంత పత్తీ — ఉన్నాయి అనుకుందాం. ఈ ఉదాహరణలో రెడీమేడ్ దుస్తులు తప్ప, మిగతావన్నీ ముడి పదార్థాలే. అన్నీ వేరు వేరుగా ఉన్నాయి కాబట్టి, దేని 'విలువ'దానిదే. అంటే, ఒక 'రాసి'లో రక రకాల స్థాయిల్లో ఉన్న ముడి పదార్థాలూ, సగం తయారైన ఉత్పత్తులూ, పూర్తిగా తయారైన ఉత్పత్తులూ — ఇలా, రక రకాల స్థాయిల్లో ఉన్న ఉత్పత్తులు ఉంటాయి. తర్వాత, పత్తి — దారం శాఖ లోకీ, దారం — బట్ట శాఖ లోకీ వెళ్తాయి. అది తర్వాత జరిగే సంగతి. ఏ సమయంలో అయినా, మొత్తం సమాజంలో ఉన్న ఉత్పత్తుల రాసిని చూసినప్పుడు, అందులో ఉన్న ప్రతీ ఉత్పత్తికీ, దేని 'విలువ' దానికి ఉంటుంది. అన్ని విలువలూ కలిసి ఆ 'రాసి విలువ' అవుతుంది.

ఈ రాసి పంపకాలు కొన్ని దశల్లో జరుగుతాయి. C ఉత్పత్తులన్నీ ఉత్పాదక పెట్టుబడిదారుల మధ్య పంపకాలవుతాయి. V ఉత్పత్తులన్నీ, ఉత్పాదక కార్మికులకు అందుతాయి. S ఉత్పత్తులు, పెట్టుబడిదారీ వర్గం లోనే వేరు వేరు సెక్షన్లకు అందుతాయి — ఇవన్నీ మొదటి దశ పంపకాలు. ఆ తర్వాత, 2 వర్గాల నించీ, వాళ్ళకు అందిన ఉత్పత్తుల్లో కొంత భాగం అనుత్పాదక కార్మికులకు అందుతుంది. — ఆ రకంగా, మొత్తం ఉత్పత్తుల రాసి పంపకాలు పూర్తి అవుతాయి. అప్పటికి మళ్ళీ కొత్త రాసి తయారై సిద్ధంగా ఉంటుంది.

ఈ పంపకాల్ని 'విలువ' కోణంలోనూ, 'ఉపయోగపు విలువ' కోణంలోనూ కూడా అర్థం చేసుకోవాలి. 'విలువ' కోణంలో చూసినప్పుడు, మొత్తం విలువలో ఏ వర్గానికి ఎంత భాగం అందుతుందో విలువ లెక్కలు మాత్రమే కనపడతాయి. 'ఉపయోగపు విలువ' కోణంలో చూసినప్పుడు, విలువ లెక్కలతో పాటు ఏ వర్గానికి 'ఎలాంటి' ఉత్పత్తులు వస్తాయో, ఆ ఉత్పత్తుల నాణ్యతలూ, మంచి చెడ్డలూ, శారీరక పరిమాణాలూ కూడా తెలుస్తాయి.

ఈ బ్రహ్మాండమైన రాసి విలువని 1200 అనుకుందాం. (1200 లక్షలు అనుకోవచ్చు. 1200 కోట్లు అనుకోవచ్చు. ఎలాగైనా ఒకటే. సంఖ్యల్ని ఎంత తక్కువగా తీసుకుంటే ఉదాహరణలు అంత తేలిగ్గా ఉంటాయి.) ఈ రాసి విలువ C+V+Sలుగా ఉంటుంది. ఇందులో Cవిలువని 200 అనుకుందాం. అంటే, ఈ రాసి తయారవడానికి 200 విలువగల ఉత్పత్తి సాధనాలు ఖర్చయిపోయి, అవి మళ్ళీ అంతే విలువతో కొత్తగా తయారై ఈ రాసిలో ఉన్నాయని అర్థం. ఆ ఉత్పత్తి సాధనాల్ని తీసివేస్తే, ఇంకా 1000 విలువ గల ఉత్పత్తులు ఉంటాయి. ఈ 'వెయ్యి' విలువే, ఉత్పాదక శ్రామికులు ఉత్పత్తి చేసిన విలువ. ఈ వెయ్యి విలువలో నించి ఏ వర్గానికి ఎంత వెళ్ళిందో తెలుసుకోవడానికి, ఇక్కడ మనం, ఎంతో కొంత 'అదనపు విలువ రేటు'ని ఉదాహరణగా పెట్టుకోవాలి. ఇక్కడ 300% రేటుని పెట్టుకుందాం.

( నిజానికి పెట్టుబడి దారీ సమాజంలో దోపిడీ స్థాయి గత దోపిడీ సమాజాలలో లేనంత ఎక్కువగా, 'వేల' శాతంలో ఉంటుంది. ఎందు కంటే, ఇక్కడ ఉత్పాదక శక్తులు, గతంలో కన్నా అనేక వందల రెట్లు పెరిగి ఉంటాయి. దీనివల్ల, పని దినంలో అవసర శ్రమ భాగం తగ్గి, అదనపు శ్రమ భాగం చాలా పెరుగుతుంది. అందుకే ఇక్కడ అదనపు విలువ రేటు 'వేల శాతం'లో ఉంటుందని తేలిగ్గా ఊహించవచ్చు. ఈ రేటు ఏ పెట్టుబడిదారుడి లెక్కల్లోనూ కనపడదు. వాళ్ళ లెక్కల్లో కొన్ని ఖర్చులు దొరకనే దొరకవు. దొరికిన లెక్కలన్నీ అబద్ధపు లెక్కలే. అంతేగాక, సమాజంలో ఉండే పోలీసూ సైన్యమూ ఆయుధాలూ కోర్టులూ జైళ్ళూ ప్రభుత్వ నిర్వహణా, పెట్టుబడిదారీ వర్గపు విలాసాలూ — ఇవన్నీ అదనపు విలువే కాబట్టి, వీటన్నిటినీ లెక్కలు కడితే, అదనపు విలువ రేటు వేల స్థాయిలో ఉంటుందని ఊహిం చడంలో అతిశయోక్తి ఉండదు. కానీ, ఉదాహరణలు తేలిగ్గా ఉండడం కోసం, 'అదనపు విలువ రేటు'ని ప్రతీ చోటా 100%గా మాత్రమే అనుకుంటున్నాము. ఇప్పుడు దాన్ని 300%గా చూద్దాం. ఇది కూడా చాలా తక్కువ రేటే. కానీ, ఉదాహరణ తేలిగ్గా ఉండడంకోసం ఈ రేటునే తీసుకుందాం.)

అదనపు విలువ రేటు 300% అంటే — జీతాలు 100 అయితే, అదనపు విలువ 300. జీతాలు 1 పాలు అయితే, అదనపు విలువ 3 పాళ్ళు. ఇప్పుడు, ఆ రాసిని విభజించాలి.

మొత్తం ఉత్పత్తి రాసి విలువ 1200. ఉత్పత్తి సాధనాలు 200; జీతాలు 250; అదనపు విలువ రేటు 300%; అదనపు విలువ 750.

ఇక్కడి నించీ — స్థిర, అస్థిర, అదనపు విలువల్లో ఒక్కొక్క భాగాన్నీ విడి విడిగా చూస్తాం.

## (1) ఉత్పత్తుల రాసిలో ఉన్న 'ఉత్పత్తి సాధనాలు':

ఉత్పత్తుల రాసిలో ఒక 'పత్తి బేలు' ఉంటే, దాన్ని ఇళ్ళకు తీసుకుపోయి వాడడానికి వీలు ఉండదు. ఒక పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలంలో తయారైన ఆ పత్తి బేలు, ఇంకో పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలంలోకి వెళ్ళాలి. అక్కడ అది బట్టగా తయారై, అక్కడినించి ఆ బట్ట పెట్టుబడిదారుల ఇళ్ళకీ, కార్మికుల ఇళ్ళకీ వస్తుంది. అలాగే, ఒక పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలంలో తయారైన అచ్చు యంత్రం, ఇంకో పెట్టుబడిదారుడి ఉత్పత్తి స్థలంలోకే వెళ్తుంది. అక్కడ దాని ద్వారా రక రకాల పుస్తకాలూ పత్రికలూ కర పత్రాలూ తయారై, అవి అందరి ఇళ్ళల్లోకీ వస్తాయి.

కొన్ని పని స్థలాల్లో, కేవలం ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగపడే వస్తువులు మాత్రమే ఉత్పత్తి అవుతాయి. వీటి అమ్మకాలూ కొనుగోళ్ళూ పెట్టుబడిదారుల మధ్య మాత్రమే జరుగుతాయి. వీటిని కొనవలసిన అవసరం కార్మికులకు ఉండదు. వీటి పంపకం పెట్టుబడిదారుల మధ్యనే జరుగుతుంది. ఒక బట్ట పెట్టుబడిదారుడు బట్టని తయారు చేయించేటప్పుడు కొన్ని ఉత్పత్తి సాధనాలు ఖర్చయిపోతాయి. వాటి విలువ, కొత్త సరుకుకి (బట్టకి) బదిలీ అవుతుంది. బట్టని అమ్మివేసినప్పుడు, ఆ విలువ (ఆ డబ్బు) వెనక్కి వస్తుంది. అలా వెనక్కి వచ్చిన ఆ విలువతో (ఆ డబ్బుతో) ఆ పెట్టుబడిదారుడు మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాల్ని ఇతర పెట్టుబడి దారుల నించి కొంటాడు. అవి మళ్ళీ పని స్థలంలోకి వస్తాయి. ఇక్కడేం జరిగిందంటే — 'బట్ట'ని తయారు చేసిన పని స్థలంలో ఆ బట్ట కోసం కొన్ని ఉత్పత్తి సాధనాలు ఖర్చయినప్పటికీ వాటి విలువ ఖర్చయి పోలేదు. అది కొత్త బట్టకి బదిలీ మాత్రమే అయ్యి, అదే వెనక్కి వచ్చి, ఆ విలువ తోనే మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాలు వచ్చాయి. అంటే, పాత సాధనాల విలువ తోనే కొత్త సాధనాలు ఉత్పత్తి అవుతూ ఉంటాయి.

ఉత్పత్తి సాధనాల మీద ఉన్న విలువ, ఎప్పుడూ వాటి మీదే తిరుగుతూ ఉంటుంది. బట్ట పెట్టుబడిదారుడి పని స్థలంలో జరిగేదే ప్రతీ ఒక్క పని స్తలం లోనూ జరుగు తుంది.

అన్ని పని స్తలాల్నీ కలిపితే అదే మొత్తం సమాజం. ఒక పని స్తలంలో జరిగేదే మొత్తం సమాజంలో జరుగు తుంది. వేరు వేరు శాఖల్లో ఉండే అన్ని రకాల ఉత్పత్తి సాధనాలూ ఎప్పుడూ ఖర్చయి పోతూనే ఉంటాయి. అదే విలువతో మళ్ళీ వస్తూనే ఉంటాయి.

ఉత్పత్తి సాధనాల్ని కార్మికులు గానీ, పెట్టుబడి దారులు గానీ వ్యక్తిగతంగా వాడుకోవడం సాధ్యం కాదు, వాటి విలువని (200ని) కూడా ఎవరూ వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలు కాదు. కొత్త రాసిలో తయారై ఉన్న ఉత్పత్తి సాధనాలన్నీ, పెట్టుబడిదారుల ఆధీనంలోకే వస్తాయి. పెట్టుబడిదారులంతా వీటిని ఒకరి నించి ఒకరు అమ్ముకోవడాలూ, కొనుక్కోవడాలూ చేసుకుంటారు. మొత్తం మీద ఉత్పత్తి సాధనాలన్నీ పెట్టుబడిదారుల ఆస్తులుగా, వాళ్ళ పని స్తలాల్లోనే ఉంటాయి.

1200 ఉత్పత్తి రాసిలోనించి 200 ఉత్పత్తి సాధనాల్ని తీసి ఒక పక్కన పెడితే, మిగిలిన 1000 ఉత్పత్తుల్ని ఉత్పాదక శ్రామిక సెక్షన్లూ, పెట్టుబడిదారీవర్గమూ పంచుకోవాలి.

## (2) ఉత్పత్తుల రాసిలో ఉన్న 'ఉత్పాదక శ్రామికుల జీతాల' భాగం:

సమాజంలో ఉన్న మొత్తం 'ఉత్పత్తి సంస్థల్లో' పని చేసే ఉత్పాదక శ్రామికుల జీతాల భాగం ఇది. ఉత్పత్తి సాధనాల్నీ పోషణ వస్తువుల్నీ విలాస వస్తువుల్నీ అన్నిటినీ ఉత్పత్తి చేసే సంస్తలన్నీ కలిసి ఇందులో ఉన్నాయని అర్థం. ఈ జీతాల్ని 250 అనుకుందాం. ఈ శ్రామికులు చేసే శ్రమల్లో తేడాల్ని బట్టి, వారి జీతాలు కూడా తేడాగా ఉంటాయి కాబట్టి, కొందరికి ఎక్కువ జీతాలూ, కొందరికి తక్కువ జీతాలూ ఉంటాయి.

దోపిడీ సమాజాలలో, ఉత్పాదక — అనుత్పాదక శ్రామికులందరూ అనేక సెక్షన్లుగా ఉంటారు. కానీ, ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, ఉత్పాదక శ్రామి కుల్ని 3 సెక్షన్లుగా మాత్రమే విభజిద్దాం.

(1) ఉన్నత స్థాయి మేధాశ్రమలు చేసేవారు, (2) తక్కువ స్థాయి మేధాశ్రమలు చేసేవారూ + ఉన్నత స్థాయి శారీరక శ్రమలు చేసే వారూ, (3) తక్కువ స్థాయి శారీరక శ్రమలు చేసేవారు.

ఈ 3 సెక్షన్లలో, మొదటిది — అంటే ఉన్నత మేధా శ్రమల సెక్షను, కొంతవరకూ పెట్టుబడిదారీ వర్గం లాగానే విలాస వస్తువులు వాడుతుంది. ఇంటా, బయటా అనుత్పాదక శ్రమల్ని కూడా వాడుతుంది. అంటే, తన జీతాల్లో కొంత భాగాన్ని వాటి మీద ఖర్చు పెట్టగలుగుతుంది. 2వ సెక్షను, విలాస వస్తువుల్నీ అనుత్పాదక శ్రమల్నీ చాలా తక్కువ స్థాయిలో వాడుతుంది. 3వ సెక్షను, అలాంటి వాటిని మచ్చుకి కూడా వాడదు. మొత్తం ఉత్పాదక శ్రామి కుల్లో, శారీరక శ్రమల సెక్షనే సంఖ్యలో అతి పెద్ద సెక్షనుగా ఉంటుంది.

మొత్తం మీద ఈ ఉత్పాదక శ్రామికులు, తమ జీతాల్ని, రక రకాల ఉత్పత్తుల్నీ, అనుత్పాదక శ్రమల్నీ కొనడం కోసం వెచ్చిస్తారు. బియ్యమూ, బట్టలూ, పాలూ, మందులూ వగైరా అనేక సరుకులు పెట్టుబడిదారుల నించీ కొనేవే. సినిమాలు చూస్తే, సినిమా పెట్టుబడిదారుల నించి సరుకులు కొన్నట్టు అర్థం. బస్సుల్లోనూ, రైళ్ళల్లోనూ ప్రయాణాలు చేస్తే, రవాణా పెట్టుబడిదారుల నించి సరు కులు కొన్నట్టు. ప్రభుత్వానికి కరెంటు ఛార్జీలూ, నీటి ఛార్జీలూ కడితే, ప్రభుత్వ పెట్టుబడిదారుడి నించి సరు కులు కొన్నట్టు. పిల్లల చదువుల కోసం ఒక స్కూలుకి జీతాలు కడితే, స్కూలు పెట్టుబడిదారుడి సరుకుని కొన్నట్టు. ఒక ప్రైవేటు టీచరుకి జీతం ఇస్తే, స్వతంత్ర ఉత్పత్తిదారుడి నించి సరుకుని కొన్నట్టు. ఇంటి పనుల కోసం పని మనుషుల్నీ, డ్రైవర్లనీ, తోట మాలుల్నీ, కాపలా మనుషుల్నీ పెట్టుకుంటే, అనుత్పాదక శ్రమల్ని కొన్నట్టు.

ఈ సరుకులన్నీ కొనడమే గాక, ఈ శ్రామికుల్లో 1, 2 సెక్షన్ల వారు, రక రకాల 'పన్నులు' కూడా కడతారు. ఈ పన్నుల్ని 50 అనుకుంటే, ఈ సెక్షన్లకు జీతాల భాగంగా ఉన్న 250లో నించి 50 తగ్గిపోతుంది. మిగిలిన 200ని మాత్రమే ఈ శ్రామికులు జీవితావసరాల మీద వాడ గలుగుతారు.

ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం అంటే, ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారానూ, ప్రభుత్వ ఆఫీసుల ద్వారానూ, ఇంకా ఆ రకం ప్రభుత్వ అనుత్పాదక సంస్థల ద్వారానూ దొరికే అనుత్పాదక శ్రమల్ని, ఆ పన్నులకు బదులుగా తీసు కుంటున్నట్టు అర్థం. కానీ, ప్రభుత్వం ద్వారా దొరికే ఆ అనుత్పాదక శ్రమలేవీ పెట్టుబడిదారీ వర్గానికి అంది నట్టుగా, శ్రామిక వర్గానికి అందవు. ఆ శ్రామిక వర్గంలో కూడా ఉన్నత మేధాశ్రమల సెక్షన్‌కి అందినట్టుగా మిగిలిన సెక్షన్లకు అందవు.

శారీరక శ్రమల సెక్షన్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లాంటి వాటిని ఏ కొంచెమో ఉపయోగించుకున్నా, అక్కడ ఇవ్వా ల్సిన లంచాల్ని లెక్కలోకి తీసుకుంటే, ఆ వైద్య శ్రమల కోసం పూర్తి విలువని చెల్లించేసినట్టే అవుతుంది.

ఉత్పాదక శ్రామికుడైన ఒక డాక్టరో, ఇంజనీరో, గృహ సేవకుల ద్వారా కొన్ని శ్రమలు పొందుతున్నాడంటే, ఆ

సేవకుల ద్వారా 'అదనపు శ్రమని కూడా' తీసుకుంటు న్నాడని అర్థమే. ఈ రకంగా, ఉన్నత మేధా శ్రమల సెక్షన్ పొందే కొన్ని అనుత్పాదక శ్రమల్నీ, కొన్ని విలాస వస్తువుల్నీ మినహాయిస్తే, మొత్తం శ్రామిక వర్గానికి వచ్చే జీతాలన్నీ ప్రధానంగా 'జీవితావసర వస్తువుల' మీదే ఖర్చవుతాయి.

ఉత్పాదక శ్రామిక సెక్షన్లు వాడే జీవితావసర వస్తువు లన్నీ ఒక వేపు వారి 'వ్యక్తిగత వాడకం'గా ఉంటూనే, ఇంకో వేపు 'ఉత్పాదక వాడకం'గా కూడా ఉంటాయి. ఈ జీతాలు 'పెట్టుబడి'లో భాగమే. ఈ శ్రామికులు ఈ పోషణ ఉత్పత్తులతో తమ శ్రమ శక్తుల్ని నిలబెట్టుకుంటూ కొత్త ఉత్పత్తుల రాసి కోసం మళ్ళీ కొత్త శ్రమలు చేస్తారు.

## (3) ఉత్పత్తుల రాసిలో ఉన్న 'అదనపు విలువ' భాగం:

'ఉత్పత్తిరాసి' నించి C+Vల్ని తీసివెయ్యగా మిగిలిన దంతా 'సామాజిక అదనపు విలువ'. (మొత్తం సమాజానికి సంబంధించినది.) ఈ అదనపు విలువ, మొదట వర్తక కమిషన్లూ, వడ్డీలూ, కౌళ్ళూ, పన్నులూ, లాభాలూ వగైరాలుగా వేరు వేరు వాటాదార్లకు పంపకాలు అవుతుంది.

'అదనపు విలువ'ని పంచుకున్న వాళ్ళంతా ఎవరి ఆదాయాన్ని వాళ్ళు, 'పోషణ వస్తువుల' మీదా, 'విలాస వస్తువుల' మీదా, 'అనుత్పాదక శ్రమల' మీదా, ఖర్చు చేస్తారు. 'పన్నులు' కూడా కడతారు.

పెట్టుబడిదారీ వర్గానికి, ఇంటా — బయటా అను త్పాదక శ్రమలు కావాలి. గృహ సేవలన్నీ, ఇంట్లోకి కావల సిన అనుత్పాదక శ్రమలు. సైనిక విధులూ, కోర్టు విధులూ, ప్రభుత్వ ఆఫీసు శ్రమలూ వగైరాలన్నీ, ఈ వర్గానికి బయట కావలసిన అనుత్పాదక శ్రమలు.

1200 విలువ గల ఉత్పత్తి రాసిలో అదనపు విలువ 750. దీన్ని పంచుకునే వాళ్ళ వాటాలు ఇలా ఉన్నాయి అనుకుందాం: ఉత్పాదక లాభం 150, వర్తక కమిషన్ 130, వడ్డీ 80, భూమి కౌలు 100, పన్నులు 200, లంచాల ద్వారా అదనపు విలువని తినే ఇతరుల భాగం 90.

సమాజంలో ఉన్న ఉత్పాదక పెట్టుబడిదారుల కుటుంబాలన్నీ 'ఉత్పాదక లాభం' పేరుతో వచ్చే 150 విలువ గల ఉత్పత్తుల్నీ; భూస్వాముల కుటుంబాలన్నీ 'కౌలు' పేరుతో వచ్చే 100 విలువ గల ఉత్పత్తుల్నీ .... ఇలా, ఏమీ శ్రమ చెయ్యని సెక్షన్లన్నీ, 'ఉత్పత్తి రాసి'లో నించి రక రకాల తప్పుడు పేర్లతో ఉత్పత్తుల్ని పొందు తాయి.

ఈ 750 ఖర్చు అంతా అనుత్పాదకమైన ఖర్చే, అంటే, మళ్ళీ కొత్త ఉత్పత్తిరాసి తయారవడానికి ఈ ఖర్చుతో ఏమీ సంబంధం ఉండదు. ఈ ఖర్చు ఉత్పత్తి సాధనాల ఖర్చుగా గానీ, సజీవ శ్రమకోసం జరిగే ఖర్చుగా గానీ, ఉండదు. ఇది ఏ శ్రమా ఇవ్వకుండా తీసుకునే భాగం. అందుకే ఇది 'శ్రమ దోపిడీ'!

ఈ రకంగా, మొత్తం 1,200 ఉత్పత్తుల రాసి, 200C + 250V + 750Sలుగా పంపకాలై పోతుంది.

ఇప్పుడు 'పన్నుల' భాగం గురించీ, 'అదనపు విలువని తినే ఇతరుల' భాగం గురించీ — కొన్ని వివరాలు చూడాలి.

# 'ప్రభుత్వ ఆదాయం'లో పన్నులూ, ఇతరములూ

ప్రభుత్వ ఆదాయానికి 2 మార్గాలు ఉంటాయి. (1) పన్నులు: వీటిని పెట్టుబడిదారీ వర్గమూ, శ్రామిక వర్గంలో కొన్ని సెక్షన్లూ కడతారు. (2) ప్రభుత్వం నడిపే ఉత్పాదక సంస్థల ద్వారా వచ్చే అదనపు విలువ: గనులూ, రైల్వేలూ వంటి అనేక సంస్థల ద్వారా లాభాలు వస్తాయి.

ఈ ఆదాయాన్ని ప్రభుత్వం, 'పరిపాలన' పేరుతో — పోలీసూ, సైన్యమూ, కోర్టులూ, జైళ్ళూ, అసెంబ్లీలూ, పార్లమెంటులూ, సెక్రటేరియట్‌లూ, కలెక్టరాఫీసులూ, తాలూకాఫీసులూ, ఇతర ఆఫీసులూ, ప్రభుత్వ ఆస్ప త్రులూ, ప్రభుత్వ స్కూళ్ళూ — లాంటి అనుత్పాదక సంస్థల మీద ఖర్చు చేస్తుంది. (ఈ సంస్థల్లో కొన్నిటి వల్ల కొంత ఆదాయం కూడా ఉంటుంది.)

ఒక 'పని' కోసం కొంత ఆదాయాన్ని ఖర్చు చెయ్యడం అంటే, కొన్ని ఉత్పత్తి సాధనాల్నీ, ఆ పని చెయ్యవలసిన శ్రామికులకు కావలసిన కొన్ని జీవితావసర వస్తువుల్నీ ఖర్చు చెయ్యడమే. ఒక 'సంస్థ' కోసం ఖర్చు చెయ్యడం అన్నా అంతే. 'ఖర్చు' అన్నప్పుడల్లా, 'కొన్ని ఉత్పత్తుల ఖర్చు' అని వెంటనే గుర్తు రావాలి.

'కోర్టు' అనే సంస్థని తీసుకుంటే — ఒక పెద్ద బిల్డింగూ, అందులో ఉండవలసిన కుర్చీలూ, బెంచీలూ, పుస్తకాలూ, కాయితాలూ, టైపు మిషన్లూ — వగైరా అనేక రకాల ఉత్పత్తి సాధనాలూ + అక్కడ పని చేసే ఉద్యోగు లందరికీ జీతాలూ (వారికి పోషణ ఉత్పత్తులు) కావాలి. ప్రభుత్వం, 'సామాజిక ఉత్పత్తుల రాసి'లో నించి 'కోర్టు'

కోసం కొన్నిటినీ, 'పోలీసు' మీద కొన్నిటినీ, 'సైన్యం' మీద కొన్నిటినీ, ఇతర ఆఫీసుల మీద కొన్నిటినీ, ఇలా, తన 'పరిపాలన' కోసం, ఖర్చు చేస్తుంది.

ప్రభుత్వం, తన అనుత్పాదక సంస్థల కోసం కావల సిన బిల్డింగుల్నీ ఇతర వస్తు సామాగ్రినీ, కొంత వరకూ తన ఉత్పత్తి సంస్థల ద్వారా ఉత్పత్తి చేసుకున్నా, ప్రధానంగా ఎక్కువ భాగాన్ని ప్రైవేటు పెట్టుబడిదారుల నించే కొంటుంది. తన సంస్థల కోసం ప్రైవేటు పెట్టుబడి దారుల నించి బిల్డింగుల్ని అద్దెలకు తీసుకుని, 'మితి మీరిన' అద్దెలు ఇస్తుంది. బిల్డింగుల్ని కట్టదల్చుకుంటే, ప్రైవేటు పెట్టుబడిదారులకు కాంట్రాక్టులు ఇస్తుంది. ఆ కాంట్రాక్టర్లు, తమ శ్రామికులకు ఎంతెంత జీతాలు ఇస్తు న్నారో, వారిని ఎలాంటి పరిస్థితుల్లో పని చేయిస్తున్నారో — ఆ విషయాలేవీ ప్రభుత్వం పట్టించుకోదు. ఆ బిల్డింగుల్ని అలంకరించడానికీ, ఇతర అవసరాలకూ కావలసిన సామగ్రి కోసం కూడా ప్రైవేటు పెట్టుబడిదారు లకు కాంట్రాక్టులిస్తుంది. పోలీసుకీ, సైన్యానికీ కావలసిన ఆయుధాల్నీ, యూనిఫారాల్నీ, ఇంకా ఇతర సామాగ్రినీ ప్రైవేటు పెట్టుబడిదారుల నించి కొనవలసిందే. ప్రభుత్వ ఆఫీసులకూ, స్కూళ్ళకూ, ఆస్పత్రులకూ కావలసిన మందులూ, బట్టలూ, పుస్తకాలూ వగైరా ఏ సరుకు కావాలన్నా, ప్రైవేటు పెట్టుబడిదార్ల నించి కొనవలసిందే.

అలా కొన్న వాటిలో, ప్రతీ ఏటా కొన్ని బిల్డింగులు ఖర్చయి పోతాయి. కొన్ని బస్సులు ఖర్చయి పోతాయి. కొంత చెక్క సామానూ, కొంత స్టీలు సామానూ ఖర్చయి పోతాయి. కొంత కాయితమూ, కొన్ని మందులూ, కొన్ని బట్టలూ వగైరా ఉత్పత్తులెన్నో ఖర్చయి పోతాయి. ప్రతీ ఏటా వాటిని ప్రభుత్వం ప్రైవేటు పెట్టుబడిదారుల నించీ మళ్ళీ మళ్ళీ కొనవలసిందే, వాడవలసిందే. అంటే, <u>ప్రైవేటు పెట్టుబడిదారుల సరుకులు గ్యారంటీగా అమ్ముడు పోవడానికి, ప్రభుత్వ నిధులు పెద్ద ఆధారంగా ఉంటాయి.</u>

ప్రభుత్వానికి సరుకుల్ని సప్లయి చేసే కాంట్రాక్టులు సంపాయించడం కోసం, పెట్టుబడిదారులు తీవ్రంగా పోటీలు పడుతూ ఉంటారు. ప్రభుత్వం తనకు కావలసిన సరుకు కోసం 'టెండర్లు' పిలవడమూ, ఎవరు తక్కువ విలువతో సరుకుని అమ్మడానికి సిద్ధపడితే వాళ్ళకు కాంట్రాక్టులు ఇవ్వడమూ — అనేది పెద్ద డ్రామా. ఈ కాంట్రాక్టులు దొరికించుకునే వ్యవహారంలో సమస్తమైన వ్యాపార చాతుర్యాలూ పని చేస్తాయి. ఆ చాతుర్యాల పోటీలో నెగ్గిన పెట్టుబడిదారుడు కొన్ని లక్షల కాంట్రాక్టునో, కోట్ల కాంట్రాక్టునో సంపాదిస్తాడు. ప్రభుత్వంనించి కాంట్రా క్టులు దొరుకుతాయనే నమ్మకం ఉంటే, రాత్రికి రాత్రే కొత్త పెట్టుబడిదారులు పుట్టుకొస్తారు. పెట్టుబడులు లేని పెట్టుబడిదారులకు ప్రభుత్వమే పెట్టుబడులు కూడా సప్లయి చేస్తుంది. అతి తక్కువ వడ్డీలతో అప్పులు ఇస్తుంది. "సరుకుని తయారు చేయించి తీసుకురా. నీ సరుకు అంతా నేనే కొంటాను" అని 'కాంట్రాక్టు' పేరుతో గ్యారంటీ ఇస్తుంది. — ఈ రకంగా, ప్రభుత్వ ఆదాయంలో చాలా ఎక్కువ భాగం, ప్రైవేటు పెట్టుబడిదారుల సరుకుకి మార్కెట్‌ని కల్పించడానికే ఉపయోగపడుతుంది.

పెట్టుబడిదారుల గ్రూపులు, తమకు అనుకూలంగా ఉండే వ్యక్తులనే ప్రభుత్వంలో నిలపడానికి ప్రయత్ని స్తారు. ఏ స్థాయికి తగిన ప్రయత్నాలు ఆ స్థాయిలో నడుస్తూ ఉంటాయి. గ్రామ స్థాయి నించీ, రాజధాని స్థాయి వరకూ ఏ స్థాయిని తీసుకున్నా పెట్టుబడిదార్ల గ్రూపుల మధ్య ఎప్పుడూ తీవ్రమైన పోటీ ఉంటుంది. ఎందుకంటే, ప్రభుత్వం నించి అప్పులూ కాంట్రాక్టులూ సంపాదించడం కోసమూ, తమ గ్రూపు ప్రయోజనాలకు తగిన నిర్ణయాలు ప్రభుత్వంద్వారా జరిగే విధంగా చేసుకోవడం కోసమూనూ.

ప్రభుత్వం అనేది — ఒక వేపు శ్రామిక వర్గాన్ని అణిచే 'పరిపాలనా' కార్యక్రమాలూ; ఇంకోవేపు పెట్టుబడిదారుల్లో కొన్ని గ్రూపుల సరుకు అమ్మకాలకు తోడ్పడే కార్య క్రమాలూ — నిర్వహిస్తూ ఉంటుంది. పెట్టుబడిదారుల గ్రూపుల బలా బలాలలో తేడాలు వచ్చినప్పుడు, ప్రభు త్వంలో పార్టీలూ, ఉన్నత పదవుల్లో ఉండే వ్యక్తులూ మారిపోతూ ఉంటారు.

పెట్టుబడిదారుల మధ్య ఈ 'ముఠా తగాదాలు' ఎన్ని రకాలుగా ఉన్నా, మొత్తంగా చూస్తే, ఒక దోపిడీ సమా జంలో, ప్రభుత్వ ఆదాయం అనేది దోపిడీదారులకు సిరి సంపదలు సమకూర్చడానికి మాత్రమే ఉపయోగపడుతూ ఉంటుంది.

ప్రభుత్వ అనుత్పాదక సంస్థలలో ఉండే శ్రమల విష యానికి వస్తే, ఉత్పాదక సంస్థలో లాగానే ఇక్కడ కూడా, అతి నికృష్ట శారీరక శ్రమల దగ్గిర నించీ ఉన్నత మేధా శ్రమల వరకూ అన్ని స్థాయిల శ్రమలూ, అంతస్తుల భేదాలూ, జీతాలలో అనేక రెట్ల తేడాలూ — అన్నీ ఉంటాయి. ఉత్పాదక సంస్థల్లో మేనేజర్లూ డైరెక్టర్లూ ఎంత 'శ్రమిస్తారో', అనుత్పాదక సంస్థల్లో ఆఫీసర్లు కూడా అంత 'శ్రమిస్తారు'! ఆ శ్రమకీ, దానికి బదులుగా పొందే ఆదా యానికీ ఏమీ సంబంధం ఉండదు.

దోపిడీ ప్రభుత్వం, తన ఆదాయాన్ని ఖర్చుపెట్టడంలో కళలకూ, సాంస్కృతిక రంగానికీ సంబంధించిన భారీ

కార్యక్రమాలు కూడా కొన్ని నిర్వహిస్తూ ఉంటుంది. దేశ దేశాల సినిమాలన్నిటినీ పోగేసి, ఒక దేశంలో ప్రదర్శించ డమూ; దేశదేశాల ఆటగాళ్ళందర్నీ పోగేసి, ఒకచోట 'ఆటల పోటీలు' నిర్వహించడమూ — లాంటి ఇంకా అనేక పనికి మాలిన కార్యక్రమాల మీద కోట్లు కోట్లు ఖర్చు చేస్తూ ఉంటుంది. ఇంకో వేపు, శ్రామిక జనాభా తిండీ గుడ్డా లేక, తలదాచుకోడానికి గుడిసెలు కూడా లేక, మందూ మాకులేక, నిత్యం దుర్భరమైన దరిద్రంతో తల్లడిల్లుతూ ఉంటే, ప్రభుత్వం తన భారీ సాంస్కృతిక కార్యక్రమాల మీద, వందల వేల కోట్లు సునాయాసంగా ఖర్చు చేస్తుంది. ఈ ఖర్చుని, కేవలం పైపై దృష్టితో చూస్తే, ఇది చాలా 'అర్ధ రహితమైన' ఖర్చు లాగ కనపడవచ్చు. కానీ, ఇది దోపిడీ వర్గానికి చాలా 'అర్ధవంతమైన', అత్యవ సరమైన ఖర్చే. శ్రామిక వర్గం, 'సరైన దాన్ని' ఆలోచించ కుండా, ఎప్పుడూ తప్పుడు సాంస్కృతిక భావాల తోటీ, తప్పుడు విలువల తోటీ కల్తీ అయిపోతూ ఉండాలనీ, తన సమస్యల కోసం పోరాడే ప్రయత్నాల వేపు మొగ్గకుండా ఉండాలనీ, దోపిడీ ప్రభుత్వం, ఈ రకమైన తప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటుంది. ఈ ప్రయత్నాలు చాలా వరకూ 'సత్ఫలితాల్ని' ఇస్తూ ఉంటాయి కూడా. ఉన్నత మేధాశ్రమల సెక్షన్లూ, విద్యార్థులూ, యువతీ యువకులూ, ఎల్లకాలమూ గృహ వాతావరణంలో పడి వుండే స్త్రీలూ, ఈ కార్యక్రమాల ప్రభా వానికి చాలా తేలిగ్గా లోబడి పోతారు. ఈ కార్యక్రమాల్ని ప్రత్యక్షంగా చూడడానికి వారు ఎంత డబ్బయినా ఖర్చు చేస్తారు. ఆ అవకాశాలు లేకపోతే ఆ 'అద్భుత' వార్తల్ని రేడియోల ద్వారా వింటూ, టీవీలలో చూస్తూ, రక రకాల పత్రికల్లో చదువుతూ, మైమరుస్తూ కాలం గడుపుతారు. ఈ రకంగా, శ్రామిక వర్గంలో అనేక సెక్షన్ల జనం ఎప్పుడూ ఏదో ఒక 'మత్తు'లో మునిగి ఉంటారు. అదే తరహా కార్యక్రమాలు తిరిగి తిరిగి వంతుల వారీగా దర్శనమిస్తూ శ్రామిక జనాల ఆలోచనల్నీ, అభిరుచుల్నీ ఎప్పటికప్పుడు కల్తీ చేస్తూ తమ బాధ్యత సక్రమంగా నిర్వహిస్తూ ఉంటాయి.

ప్రభుత్వం చేసే ప్రతీ పనీ 'గొప్ప పనిలాగే' జనాలకు కనపడుతుంది. ఆ 'గొప్ప' కార్యక్రమాలతో పాటు, తమ కష్టాలు కూడా కొంచెం తీరాలని మాత్రమే వారు ఆశిస్తారు. ఇలాంటి అవగాహనలో, శ్రామికుల గోడు శ్రామికులకే వినపడకుండా పోతుంది. వారి సమస్యలూ, హక్కులూ, వారికే అర్ధ రహితమైన ఆలోచనల్లాగ అయిపోతాయి.

ప్రభుత్వం ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని కోట్ల ఖర్చుతో భారీ ఎత్తున నిర్వహించేటప్పుడు, ఆ కార్యక్రమా నికి సంబంధించిన ఏర్పాట్ల కోసం వందల కొద్దీ పెట్టుబడి దారులు కొత్త కొత్త కాంట్రాక్టులు పొంది, ఆ కార్యక్రమం పేరుతో కుబేరులవుతారు. 'ఒక్క దెబ్బకి రెండు పిట్టలు' పద్ధతిలో, ఈ సాంస్కృతిక కార్యక్రమాలు, ఒక వేపున ప్రభుత్వ ఆదాయాన్ని పెట్టుబడిదారుల ఖజానాల లోకి మార్చే పనీ; ఇంకో వేపున శ్రామిక వర్గాన్ని ఎప్పటికప్పుడు కల్తీ చేసే పనీ కూడా శక్తివంతంగా నిర్వహిస్తూ ఉంటాయి.

దోపిడీ సమాజంలో ప్రభుత్వం, తన ఆదాయాన్ని ఏయే విషయాల మీద ఖర్చు చేస్తోందీ — అనే విషయం గురించి, ఒక సాధారణ వ్యవసాయ శ్రామికుడు ఎంత అజ్ఞానం గానూ ఎంత పట్టని విధం గానూ ఉంటాడో, డాక్టర్లూ, లెక్చరర్లూ, ఇంజనీర్లూ, సైంటిస్టులూ — వంటి ఉన్నత మేధా శ్రామికులు కూడా అంత అజ్ఞానం గానే, అంత పట్టని రకం గానే ఉంటారు. అందరికీ కూడా, 'ప్రభుత్వం' అనేది, ఒక 'మహా మహిమాన్వితమైన శక్తిలాగ' కనపడుతుంది.

'ప్రభుత్వ శక్తి'ని గురించి ఇరు వర్గాలూ కూడా అనేక తప్పుడు అభిప్రాయల తోనే ఉంటాయి. 'ప్రభుత్వానికి ధనరాసులు కుప్పతెప్పలుగా ఉంటాయి. ప్రభుత్వం ఎన్ని కోట్ల కోట్ల ధనాన్ని అయినా సునాయాసంగా ఖర్చుపెట్ట గలదు. ఎంత ఖర్చు పెట్టినా ఆ ధనానికి అంతం అనేది ఉండదు' — అనే రకపు తప్పుడు అభిప్రాయాలతో.

శ్రామిక వర్గానికి అనేక నిజాలు తెలియనట్టే 'ప్రభుత్వ ధనానికి' సంబంధించిన నిజాలు కూడా తెలియవు. 'డబ్బు అంటే మన శ్రమే. మనం తయారు చేసే ఉత్పత్తులే. పన్నుల రూపంలో మన శ్రమ, ప్రభుత్వానికి అందడమే ప్రభుత్వానికి ఉండే శక్తి' అనే సంగతి శ్రామిక వర్గానికి తెలీదు.

# అదనపు విలువని తినే ఇతరులు

**'లంచాలు' తినే అధికారులు:** ప్రతీ పెట్టుబడి దారుడూ, ప్రతీ ఉత్పత్తి సంస్థలోనూ 'లంచాలు' ఇవ్వడం కోసం ప్రతీ ఏటా తప్పనిసరిగా కొంత డబ్బు ఖర్చుపెడ తాడు. పన్నులు ఎగ్గొట్టే విషయంలో గానీ, సరుకుకి ఆర్డర్లు సంపాదించే విషయంలో గానీ ప్రభుత్వ — ప్రైవేటు అధికారుల సహకారాలు అవసరమవుతాయి. పన్నులు ఎగ్గొట్టడం కోసం లంచాలిచ్చినా, కాంట్రాక్టుల కోసం లంచా లిచ్చినా, కేసుల్లో తమకు అనుకూలమైన తీర్పుల కోసం

జడ్జీలకు లంచాలిచ్చినా, ఇంకా ఏ సందర్భాల్లో లంచా లిచ్చినా, పెట్టుబడిదారీ వర్గం లంచాల మీద ఖర్చు పెట్టేదంతా వాళ్ళ సరుకుల ద్వారా వచ్చే అదనపు విలువ లోదే. ఉత్పాదక శ్రామికుల శ్రమ ఫలితంలో ఎంతో భాగం ఈ 'లంచాల' కోసం కూడా వెళ్ళి పోతోందన్న మాట!

ఈ 'లంచాలు' తినే వాళ్ళల్లో, ప్రభుత్వ సంస్థా, ప్రైవేటు సంస్థా — అనే తేడా గానీ; పెద్ద ఉద్యోగా, చిన్న ఉద్యోగా — అనే తేడా గానీ ఉండదు.

పెట్టుబడిదారీ ప్రపంచం 'సరుకుల ప్రపంచం' కాబట్టి, ఈ ప్రపంచంలో ఒక విలువా, ఒక సంబంధమూ ఉన్న ప్రతీ చోటా, దాని వెనకాలే, 'లంచం' పేరుతో ఇంకో విలువా, ఇంకో సంబంధమూ కూడా ఉంటాయి. 'లంచం' అంటే, చట్ట విరుద్ధంగానూ, అవినీతికరం గానూ ప్రవర్తించినందుకు అందే బహుమతి. ఇది ప్రధానంగా డబ్బు రూపంలోనే ఉంటుంది. అప్పుడప్పుడూ 'విందుల' రూపం లోనూ, 'వస్తువుల' రూపం లోనూ కూడా ఉంటుంది.

'లంచాలు' తీసుకోవడంలో ఉత్పాదక శ్రామికుల పాత్ర ఏమీ ఉండదు. బట్ట నేసే శ్రామికుడు గానీ, పొలం దున్నే శ్రామికుడు గానీ, ఎవరి నించి లంచాలు తీసుకో గలరు?

లంచాలు తీసుకోవడంలో ప్రధాన ఘట్టాలన్నీ రాజ కీయ నాయకుల స్థాయి లోనూ, పెద్ద పెద్ద అధికారుల స్థాయిలోనూ జరుగుతాయి. రెండో స్థాయి లంచాలు, ప్రభుత్వ అనుత్పాదక సంస్థల్లో మేధాశ్రమల ఉద్యోగుల ద్వారా జరుగుతాయి. అడుగు స్థాయి లంచాలు, పేద అనుత్పాదక శ్రామికుల ద్వారా జరుగుతాయి.

లంచాలు ఇచ్చే వాళ్ళల్లో, ధనికులూ పేదలూ కూడా ఉంటారు. తీసుకునే వాళ్ళల్లో కూడా, ధనికులూ పేదలూ ఉంటారు. లంచం ఇచ్చే మనిషి, శ్రామికుడా దోపిడీ దారుడా; లంచం తీసుకునే మనిషి, శ్రామికుడా దోపిడీ దారుడా — అనే అంశాల్ని బట్టి, ఆ సందర్భాలు రక రకాలుగా ఉంటాయి.

ఒక పెట్టుబడిదారుడు ఇచ్చే లంచం — అదనపు విలువలో భాగంగా ఉంటే, ఒక శ్రామికుడు ఇచ్చే లంచం — అతని కష్టార్జితమైన జీతంలో భాగంగా ఉంటుంది.

ఆఫీసుల్లో ప్యూనులూ, ఆస్పత్రుల్లో అడుగుస్థాయి శ్రామికులూ, పెద్ద పెద్ద ధనికుల నించి లంచాలు తీసుకో లేరు. మధ్య స్థాయీ, అడుగు స్థాయీ జనాల నించి మాత్రమే లంచాలు తీసుకోగలరు. పేద ఉద్యోగులు, లంచాల ద్వారా కొంత డబ్బు సంపాదిస్తే, దాని ఫలితం, వారు పోగొట్టుకునే అదనపు విలువలో కొంత భాగం తిరిగి పొందడమే. కానీ, పోగొట్టుకున్న దాన్ని తిరిగి పొందడానికి ఇది అడ్డ దారి. తప్పుడు దారి. ఒక శ్రామికుడు, ఒక ధనికుడి నించి లంచం తీసుకుంటే, ఆ ధనికుడికి పోయే దేమీ ఉండదు. కానీ, ఇతర పేద శ్రామికుల నించి లంచాలు తీసుకుంటే, ఆ పేదలు వాడుకోవలసిన ఉత్పత్తులు మరింత తగ్గిపోతాయి.

దోపిడీదారుల మధ్య నడిచే లంచాలు, ఆర్థిక, రాజ కీయ ప్రయోజనాలతో ముడిపడి ఉంటాయి. మంత్రులూ, గవర్నర్లూ, ప్రెసిడెంట్లూ, కలెక్టర్లూ, జడ్జీలూ, పోలీసు అధి కారులూ — వంటి వాళ్ళు తీసుకునే లంచాలతో పోలిస్తే, కాపలా మనుషులూ, ప్యూనులూ, నర్సులూ, ఆయాలూ — వంటి పేద శ్రామికులు తీసుకునే లంచాలు లెక్కలోవి కావు. 'లంచం' అన్నప్పుడు, దోపిడీదారుల ద్వారానూ, అధి కారుల ద్వారానూ, పాలకుల ద్వారానూ నడిచే లంచాలనే ప్రధానంగా దృష్టిలో పెట్టుకోవాలి.

లంచం చెయ్యలేని నీచమైన, కౄరమైన పనులేవీ ఉండవు. లంచం తీసుకునే న్యాయాధికారి, నిర్దోషులకు సునాయాసంగా మరణ శిక్షలు వేసెయ్యగలడు. లంచం తీసుకునే దేశ పాలకుడు, తన దేశాన్ని సునాయాసంగా శతృవుకి అప్పగించగలడు. చరిత్రలో ఇలాంటి సంఘట నలు ఎన్నో!

సమాజంలో అన్ని నేరాలూ ఏ పునాది నించి పుట్టు కొస్తాయో లంచాల నేరం కూడా ఆ పునాది నించే పుట్టు కొస్తుంది. ఒక వర్గపు శ్రమలో నించి కొంత భాగాన్ని అదనపు విలువగా దోచే పరిస్తితి ఉండడం వల్లనే, అందులో నించి కొంత భాగాన్ని లంచాలుగా పంచవలసిన అవసరాలు ఏర్పడతాయి. అసలు, లంచాలు ఎలాంటి అవసరాల కోసం ఇస్తారో ఒక జాబితాని తయారు చేస్తే, పెట్టుబడిదారులు ఇచ్చే లంచాలన్నీ, కాంట్రాక్టుల కోసమూ, సరుకుల అమ్మకాల కోసమో ఆస్తుల పెంపకాల కోసమూ, ఇంకా ఆ రకం అవసరాల కోసమే ఇస్తారని తేలుతుంది. ఇదంతా, పెట్టుబడిదారీ వర్గం, శ్రామిక వర్గపు అదనపు విలువని దోచడంతో సంబంధించిన విషయమే. మొదట అదనపు విలువని దోచడమే లేకపోతే లంచాలు ఇవ్వవలసిన పరిస్తితులూ ఉండవు. అవినీతికి మూలం లంచం అయితే, ఆ లంచానికి మూలం శ్రమ దోపిడీ!

లంచాలన్నీ ఉత్పత్తుల రాసిలోనించి రావలసినవే కాబట్టి, ఉత్పత్తుల రాసి పంపకాన్ని చూసేటప్పుడు, లంచాల్ని కూడా అందులో ఒక భాగంగా అర్థం చేసు కోవాలి. అన్ని నేరాలకూ ఏది పరిష్కారమో, ఈ నేరానికి కూడా అదే పరిష్కారం.

# శ్రామికుల్ని సప్లై చేసే బిజినెస్!

పెట్టుబడిదారులు చేసే రక రకాల బిజినెసుల్లో, సరుకుల్ని ఉత్పత్తి చేయడం లాగే, 'శ్రామికుల్ని సప్లై చెయ్యడం' కూడా ఒక బిజినెస్ మార్గం. లాభం వచ్చే ఏ మార్గం అయినా వాళ్ళకి సన్మార్గమే.

A అనే కంపెనీ వాడు, కుట్టు శ్రామికుల్ని సప్లై చేస్తా డనుకుందాం. కొంత పెట్టుబడి పెట్టి ఒక ఆఫీసూ అదీ ఏర్పాటు చేసుకుంటాడు. ఉద్యోగం లేని ఒక కుట్టు శ్రామికుడు ఆ కంపెనీ దగ్గిరికిపోయి ఉద్యోగం అడుగు తాడు. ఆ కంపెనీ వాడు, ఆ శ్రామికుడికి రోజుకి 6 జీతం ఒప్పందంతో ఉద్యోగం ఇస్తాడనుకుందాం. తర్వాత ఆ శ్రామికుణ్ణి A కంపెనీ నించి ఏదో ఒక రెడీమేడ్ దుస్తుల కంపెనీ వాడు తీసుకు వెళ్తాడు.

అలా, ఆ శ్రామికుణ్ణి తీసుకు వెళ్ళే పెట్టుబడిదారుడు, A కంపెనీకి, రోజుకి, 6 కన్నా ఎక్కువ చెల్లించాలి. దాన్ని 8 అనుకుందాం. ఆ 8లో నించి, A కంపెనీ వాడు, ఆ శ్రామికుడికి 6 జీతం ఇచ్చి, మిగిలిన 2ని, తన లాభంగా జేబులో వేసుకుంటాడు. ప్రతీ శ్రామికుడి నించీ, ప్రతీ రోజూ ఇలాగే వాడి జేబు లాభంతో నిండి పొంగిపొర్లుతూ వుంటుంది. — ఇక్కడ మన ప్రశ్న, ఈ కుట్టు శ్రామికుడు, ఉత్పాదక శ్రామికుడా కాదా? A కంపెనీకి లాభం ఎలా వస్తుంది?

**జవాబు:** ఈ కుట్టు శ్రామికుడి ద్వారా, అతనికి ఉద్యోగం ఇచ్చిన A కంపెనీ వాడి డబ్బు పెరుగుతుంది. కాబట్టి, ఈ శ్రామికుడు ఉత్పాదక శ్రామికుడే. కానీ, ఒక శ్రామికుడు ఉత్పాదక శ్రామికుడా కాదా అనేది, అతని ద్వారా అతన్ని సప్లయి చేసిన యజమానికి డబ్బు వస్తుందా లేదా అనే దాన్ని బట్టి మాత్రమే కాదు; అతని శ్రమ అతను పనిచేసే చోట సరుకుల్ని ఉత్పత్తి చేస్తుందా లేదా — అనే దాన్ని బట్టి చూడాలి.

ఈ కుట్టు శ్రామికుణ్ణి తెచ్చుకున్న దుస్తుల పెట్టుబడి దారుడు, ఆ శ్రామికుడితో బట్టలు కుట్టిస్తాడు. తర్వాత ఆ దుస్తుల్ని అమ్ముతాడు. అంటే, ఈ శ్రామికుడు, 'సరుకుల్ని ఉత్పత్తి చేస్తాడు. తర్వాత ఆ సరుకుల్ని అమ్ముతారు. డబ్బు వస్తుంది. ఈ కుట్టు శ్రామికుడు, ఒక పని దినంలో, 6V + 6S = 12 శ్రమ చేస్తాడనుకుందాం. ఈ శ్రామికుడు శ్రమ చెయ్యడం అనేది, అతని మొదటి యజమాని అయిన A కంపెనీ వాడి దగ్గిర జరగదు. రెండో యజ మాని అయిన దుస్తుల వాడి దగ్గిరే జరుగుతుంది. ఈ శ్రామికుడి ద్వారా దుస్తుల వాడికి 12 డబ్బు వస్తుంది. అందులో నించి 8ని వాడు A కంపెనీకి చెల్లిస్తాడు. సరుకు తాలూకు Vలో నించి 6నీ, Sలో నించి 2నీ.

ఈ శ్రామికుణ్ణి, దుస్తుల వాడు, A కంపెనీ నించి తెచ్చుకోకుండా తనే ఎంచుకోవాలనుకుందాం. శ్రామికుల కోసం పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలనుకుందాం. ఈ ఖర్చు దుస్తుల వాడి దగ్గిర తగ్గి, A కంపెనీ ద్వారా జరుగుతుంది, ఈ ఖర్చులు C లోకి వస్తాయి.

దుస్తుల వాడు, ఈ శ్రామికుణ్ణి A కంపెనీ నించి తెచ్చుకోకుండా, తనే కుదుర్చుకుని వుంటే, అప్పుడైనా అత నికి జీతంగా ఇవ్వవలసిన 6V ఖర్చు తప్పదు. కానీ అప్పుడు, A కంపెనీ కోసం 2Sని ఇవ్వవలసిన అవసరం ఉండదు. అది దుస్తుల వాడికే మిగులుతుంది.

A కంపెనీ ద్వారా ఇక్కడ జరిగింది ఏమిటంటే: — ఈ కంపెనీ వాడు, దుస్తుల వాడికి, ఉత్పాదక శ్రామి కుణ్ణి (సరుకుల్ని ఉత్పత్తి చేసే శ్రామికుణ్ణి) సప్లయ్ చేశాడన్న మాట. ఆ శ్రామికుడి ద్వారా వచ్చిన Sలో నించే తన లాభం తీసు కున్నాడు. ఈ 'సప్లయ్' వ్యవహారంలో, A వాడు, మొదట కొంత M (పెట్టుబడి) పెట్టి, చివరికి $M^1$ సంపాదిస్తాడు. అంటే ఆ శ్రామికుడి వల్ల వచ్చే Sని పంచుకోవడంలో A కంపెనీ వాడు కూడా చేరాడన్న మాట!

ఇది Sని పంచుకునే ఇంకో మార్గం! శ్రామికుల్ని సప్లయ్ చేసే బ్రోకర్లందరూ చేసేది, ఆ శ్రామికుల అదనపు శ్రమని పంచుకోవడమే.

కుట్టు శ్రామికుడి శ్రమ, దుస్తుల పెట్టుబడిదారుడి దగ్గిరే సరుకుగా మారింది కాబట్టి, అతను ఉత్పాదక శ్రామికుడు. A కంపెనీ వాడి దగ్గిర కుట్టు మనిషి అసలు శ్రమే మొదలు పెట్టలేదు కాబట్టి, అక్కడ అతను ఉత్పాదక శ్రామికుడా, అనుత్పాదక శ్రామికుడా అనే ప్రశ్నే వుండదు. A కంపెనీ వాడికీ, కుట్టు శ్రామికుడికీ మధ్య జరిగినది ఒక బేరం ఒప్పందం మాత్రమే. A కంపెనీ వాడు, దుస్తుల వాడికి, ఒక ఉత్పాదక శ్రామికుణ్ణి సప్లై చేశాడని మాత్రమే అర్థం.

ఇంకో ఉదాహరణ:

B కంపెనీ వాడు, ఇంటి పని మనుషుల్నీ, కాపలా మనుషుల్నీ సప్లై చేస్తాడు. ఈ కంపెనీ నించి దుస్తుల కంపెనీ వాడు, తన పని స్థలంలోకి ఒక కాపలా శ్రామికుణ్ణి (వాచ్‌మెన్‌ని) తెచ్చుకున్నాడు. అతనికోసం B కంపెనీ వాడికి 3 చెల్లించాలి. ఆ 3లో నించి, ఆ శ్రామికుడికి

జీతం 2. B కంపెనీకి లాభం 1. ఇప్పుడు ప్రశ్న — ఈ కాపలా శ్రామికుడి ద్వారా B కంపెనీ వాడికి డబ్బు పెరుగుతుంది కాబట్టి, ఈ శ్రామికుడు ఉత్పాదక శ్రామికుడేనా? B కంపెనీకి దుస్తుల వాడు చెల్లించే 3, ఎక్కడిది?

**జవాబు:** ఈ కాపలా శ్రామికుడి ద్వారా, అతన్ని పంపించిన B కంపెనీ వాడికి డబ్బు పెరుగుతుంది కాబట్టి, ఈ సంబంధంలో ఈ శ్రామికుడు ఉత్పాదక శ్రామికుడి గానే కనపడతాడు. కానీ, ఉత్పాదక — అనుత్పాదక తేడాలు ఏర్పడేది, ఆ శ్రామికుడు సరుకుల్ని ఉత్పత్తి చేస్తాడా లేదా అనే దాన్ని బట్టే కాబట్టి, ఆ కోణం లోనే చూడాలి. ఈ కాపలా మనిషి శ్రమ చేసేది, అతని మొదటి యజమాని అయిన B కంపెనీలో కాదు. రెండో యజమాని అయిన దుస్తుల వాడి పని స్థలంలో. అక్కడ ఈ శ్రామికుడు కాపలా పని చేస్తాడు. అది దుస్తుల ఉత్పత్తికి అవసరమైన పని కాదు. ఆ పని, అక్కడ తయారయ్యే సరుకుకి విలువగా చేరదు, అది డబ్బుగా మారదు. కాబట్టి, అది అనుత్పాదక శ్రమ. ఆ శ్రామికుడి శ్రమ, ఏ యజమాని దగ్గిర జరుగుతుందో, ఆ సంబంధంలో అతను అనుత్పాదక శ్రామికుడే. అంటే B కంపెనీ వాడు, దుస్తుల వాడి కోసం, అనుత్పాదక శ్రామికుణ్ణి సప్లయ్ చేశాడని అర్థం.

ఈ శ్రామికుణ్ణి తెచ్చుకున్న దుస్తుల వాడు, B కంపెనీకి చెల్లించే 3 ఎక్కడిది? — దుస్తుల వాడి సరుకు ద్వారా వచ్చే Sలోది. దుస్తుల వాడు కుట్టు శ్రామికుల ద్వారా దుస్తులు తయారు చేయిస్తాడు. ఆ సరుకుల్లో S ఉంటుంది. కాపలా మనిషికి జీతం 2 + B కంపెనీ వాడికి లాభం 1. ఇదంతా కుట్టు శ్రామికుల Sలోదే. ఈ కాపలా పని మనిషి కూడా ఉత్పాదక శ్రామికుడే అయితే, అతని జీతం, సరుకు తాలూకు V లోనే భాగంగా ఉంటుంది. దాన్ని Sలోనించి తియ్యనక్కరలేదు. కానీ, కాపలాశ్రమ అనుత్పాదక శ్రమ కాబట్టి, దాని జీతాన్నీ, B కంపెనీ లాభాన్నీ కూడా సరుకు తాలూకు Sలోనించే ఇవ్వాలి. దుస్తుల పెట్టుబడిదారుడు, ఆ కాపలా మనిషిని, B కంపెనీ ద్వారా గాక, తనే కుదుర్చుకుంటే, అతని జీతం కోసం Sలో నించి 2ని ఖర్చు పెడితే చాలు. B కంపెనీ కోసం 1 లాభం ఇవ్వనక్కర లేదు. ఆ 1 దుస్తుల వాడికే మిగులుతుంది.

ఒక కంపెనీ వాడు, ఉత్పాదక శ్రామికుల్ని సప్లై చేస్తే, తన లాభాన్ని, ఆ శ్రామికుల S లో నించే పంచుకుంటాడు. అనుత్పాదక శ్రామికుల్ని సప్లయ్ చేస్తే, అప్పుడు కూడా వాడి లాభం ఉత్పాదక శ్రామికుల Sలోదే. అనుత్పాదక శ్రామి కుల శ్రమ డబ్బుగా మారదు కాబట్టి, ఆ శ్రామికుల ద్వారా సంపాదించే లాభం, ఆ అనుత్పాదక శ్రామికుల శ్రమ ద్వారా వచ్చేది కాదు. ఆ శ్రామికులు ఎక్కడ పని చేస్తే అక్కడ ఆ యజమానికి కావలసిన ఏదో ఒక ఉపయోగపు విలువనే ఇస్తారు. అందులోనే అదనపు శ్రమని కూడా.

పెట్టుబడిదారీ విధానంలో ప్రతీ అడ్డమైన పనీ 'సరుకులు'గానూ, లాభాన్ని సంపాదించే మార్గాలుగానూ అయిపోతాయి. వేశ్యల్ని సప్లయ్ చెయ్యడం కూడా ఒక గౌరవనీయమైన వృత్తే. దాని వల్ల, ఆ బ్రోకరు గాడు డబ్బు సంపాదిస్తాడు కాబట్టి, వేశ్యలు ఉత్పాదక శ్రామికులు గానే కనపడతారు. అలాగే, దొంగతనాలు చేయించీ, రౌడీతనాలు చేయించీ డబ్బు సంపాదిస్తే, వాళ్ళందరూ ఉత్పాదక శ్రామికులే అయిపోతారు! పెట్టుబడిదారీ విధానంలో, క్రమక్రమంగా 'ఏది శ్రమా, ఏది కాదూ' అనే విభజనే పోతుంది.

అదనపు విలువలో ఇంత వరకూ చూడని ఇంకో భాగం — ఇన్సూరెన్స్ కోసం కట్టే మొత్తాలు. దీన్ని గురించి, ఈ సంపుటంలోనే, తర్వాత వచ్చే **'పెట్టుబడి విస్తరణ'** చాప్టరులో చూస్తాం.

# వస్తువుల్లో ధనిక పేద తేడాలు!

**ఇం**తవరకూ, 'సామాజిక ఉత్పత్తుల రాసి' ఏయే భాగాలుగా పంపకాలు అవుతుందో 'విలువ' కోణంలో చూశాం. ఇప్పుడు ఈ రాసి పంపకాల్ని, 'ఉపయోగపు విలువ' కోణంలో కూడా చూడాలి. ఇక్కడ, ఉత్పాదక — అనుత్పాదక తేడాల్ని వదిలేసి, శ్రమ చేసే వాళ్ళూ, శ్రమ చెయ్యని వాళ్ళూ — అనే తేడాల్ని దృష్టిలో ఉంచుకోవాలి. శ్రమ చేసే వాళ్ళు ఎలాంటి ఉత్పత్తులు వాడుతున్నారు? శ్రమ చెయ్యని వాళ్ళు ఎలాంటి ఉత్పత్తులు వాడుతున్నారు? — ఇదే ఇక్కడ ప్రధాన విషయం.

'ఉత్పత్తుల రాసి'లో ఉండే ప్రతీ సరుకూ నాణ్యతలో రక రకాల తేడాలతో ఉంటుంది. 'బట్టల' విషయం తీసుకుంటే, అవి, నాజూకైన బట్టలూ, ముతక బట్టలూ, మధ్య రకం బట్టలూ — అనే తేడాలతో ఉంటాయి. 'ధాన్యం' విషయం తీసుకుంటే, అందులో కూడా నాజూకైన ధాన్యం, ముతక ధాన్యం, మధ్యరకం ధాన్యం — అనే తేడాలతో! 'ఇళ్ళ' విషయం తీసుకుంటే, మహా విశాలమైన భవంతులూ, మధ్య రకం ఇళ్ళూ, పూరి గుడిసెలూ, ఇలా రక రకాల ఇళ్ళు! ఏ ఒక్క సరుకుని తీసుకున్నా ఇంతే.

ఇలాంటి ఉత్పత్తుల రాసిలో నించి ఆ రాసిని ఉత్పత్తి చేసిన శ్రామికులకు ఎవరి జీతాల విలువకు తగిన ఉత్పత్తులు వారికి అందుతాయి. ఉన్నత మేధా శ్రమల సెక్షను, దాదాపు అన్నిటినీ నాణ్యమైన ఉత్పత్తులనే పొందుతుంది. విశాలమైన ఇళ్ళూ, మంచి ఆహారమూ, మంచి బట్టలూ, ఇలా అన్నీ నాణ్యమైన ఉత్పత్తులనే. ఈ సెక్షన్ నించి కిందికి వెళ్ళే కొద్దీ ఉత్పత్తుల నాణ్యతా, సంఖ్యా కూడా తగ్గిపోతాయి.

శారీరక శ్రమల సెక్షన్లకు దొరికే ఉత్పత్తులన్నీ పూర్తిగా తక్కువ స్థాయి లోనే ఉంటాయి. ఎందుకంటే, తమ జీతాలతో నాణ్యమైన వస్తువుల్ని కొనలేరు కాబట్టి, తక్కువ స్థాయి వస్తువుల్నే కొంటారు. ఆరోగ్యాన్నివ్వని — రుచీ పచీ లేని ఆహారమూ, సుఖాన్నివ్వని ముతక బట్టలూ; గాలీ వెలుతురూ సోకని ఇరుకు ఇళ్ళూ గుడిసెలూ, ఇలా అన్నీ 'సౌఖ్యం' అనే మాట లేని ఉత్పత్తులే ఈ సెక్షన్లకు వస్తాయి. ఈ శ్రామికులు— బట్టలు కుట్టించుకోవాలంటే, నైపుణ్యం లేని కుట్టే దొరుకుతుంది. వైద్యం చేయించుకోవాలంటే, నైపుణ్యంలేని వైద్యమే! ప్రయాణం చెయ్యాలంటే, సౌకర్యాలు లేని ఇరుకు బస్సులూ, మురికి రైళ్ళూ! 'ఉత్పత్తుల రాసి'లో బ్రహ్మాండమైన నీటి పారుదల ఏర్పాట్లు ఎన్ని వున్నా, ఈ సెక్షన్లకు, తాగే మంచినీళ్ళు కూడా దొరకవు. శరీర శుభ్రతా, బట్టల శుభ్రతా — అనే మాటే ఉండదు. విద్యా సౌకర్యం, న్యాయ సౌకర్యం వగైరా సౌకర్యాల్ని తలపెట్టడానికే వీలు ఉండదు. — ఈ రకంగా, ఈ సెక్షన్లకు, అసలు దొరకని అంశాలెన్నో ఉండగా. దొరికేవన్నీ కూడా అధమ స్థాయికి చెందేవి గానే ఉంటాయి.

ఈ శ్రామికుల చేతుల్లోకి కూడా జీతాలుగా డబ్బే వస్తుంది కదా? ఆ డబ్బుతో ఈ శ్రామికులు మంచి ఉత్పత్తులే ఎందుకు కొనుక్కోకూడదూ? నాణ్యమైన ఉత్పత్తులు కొనుక్కోవద్దనీ, అన్నీ ముతక సరుకులే కొనుక్కోమనీ, వాళ్ళని ఎవరైనా నిర్బంధిస్తున్నారా? — నిజమే, ఎవరూ నిర్బంధించడం లేదు. ఏ రకం సరుకు కావాలంటే ఆ రకం సరుకునే మార్కెట్లో కొనుక్కోవచ్చు. టిక్కట్టు కొనుక్కుంటే, విమానం ఎక్కవద్దని ఎవ్వరూ అనరు. అయితే, విమానం టిక్కెట్టు కొనడానికి డబ్బేదీ? అలాగే, అన్ని ఉత్పత్తుల్నీ నాణ్యమైన వాటినే, ఉత్తమమైన వాటినే కొనుక్కోవాలంటే, ఈ శ్రామికుల చేతుల్లో ఉన్న డబ్బు ఎలా సరిపోతుంది? 10 కిలోల జొన్నలు వచ్చే చోట, నాణ్యమైన బియ్యం కావాలంటే, ఒక్క కిలోయే వస్తాయి. పుచ్చిన, కుళ్ళిన కూరగాయలు ఒక కిలో వచ్చేచోట, తాజాకూరలూ పళ్ళూ కావాలంటే, పావుకిలో కూడా రావు. ఇంటిల్లిపాదికీ ముతక గుడ్డలు వచ్చేచోట, నాణ్యమైన బట్టలు కావాలంటే ఒక్క చొక్కా కూడా రాదు. ఏ వస్తువు విషయం చూసినా ఇంతే.

'ఉత్పత్తుల రాసి'లో, అసలు ముతక సరుకులన్నీ ఎందుకు తయారవుతున్నాయి? ఎవరి కోసం తయారవుతున్నాయి? శారీరక శ్రమల సెక్షన్ల కోసమే. ఈ శ్రామికుల జీతాలు, అతి తక్కువ స్థాయిలో ఉంటాయి కాబట్టి, ఆ జీతాలతోనే వాళ్ళు బతికి ఉండాలంటే, వాళ్ళు వాడే ఉత్పత్తులన్నీ అతి 'పేద' లక్షణాలతోనే తయారై తీరాలి. అంటే, అతితక్కువ శ్రమ మాత్రమే పట్టేవి'గా. తక్కువ శ్రమపట్టే సరుకులు, తక్కువ విలువకే దొరుకుతాయి కదా? అలాంటి అధమ స్థాయి సరుకులు ఉత్పత్తి అవుతూ వుంటేనే, అధమ స్థాయి జీతాలు గల శ్రామికులు బతికి ఉండడం సాధ్యమవుతుంది.

రుచికరమైన ఆహారం తినే హక్కూ, సుఖవంతమైన గృహాలలో నివసించే హక్కూ, విద్యాజ్ఞానం పొందే హక్కూ — వగైరా హక్కులన్నీ పేద శ్రామికులకు కూడా ఉన్నాయి. కానీ, అందులో ఏ ఒక్క దానికీ కావలసిన డబ్బు మాత్రం వారికి ఉండదు. అంటే, ఆ హక్కు లేవీ వారికి లేవన్న మాట! ఆ హక్కులు లేకపోవడం, 'చట్టాల'లో కనపడదు. "మీకు రుచికరమైన ఆహారం తినే హక్కు లేదు. విశాలమైన ఇళ్ళల్లో నివసించే హక్కు లేదు" అని ఆ శ్రామికులతో ఏ చట్టమూ అనదు. వారి ఆర్థిక స్థితే వారితో ఆ మాటలు అంటుంది. ఆ స్థితే వారికి ఆ హక్కులు లేకుండా చేస్తుంది.

ఉత్పత్తుల రాసిలో ఉన్న ముతక సరుకులన్నిటినీ ఒక పక్కకి చేరిస్తే, అవే శారీరక శ్రమలకు దొరికే ఉత్పత్తులు.

ఇప్పుడు, దోపిడీ వర్గం వాడే ఉత్పత్తుల్ని చూస్తే, శ్రామిక వర్గం వాడే ఉత్పత్తులకు ఇవి పూర్తిగా భిన్నం! వీళ్ళ దగ్గర దోపిడీ డబ్బు, కుప్పతెప్పలుగా ఉంటుంది కాబట్టి వీళ్ళు ప్రతీ వస్తువునీ ఎక్కువెక్కువ డబ్బుతో కొనగలరు. 'ఎక్కువ డబ్బు' అంటే 'ఎక్కువ శ్రమే' కదా? వీళ్ళ కోసం తయారయ్యే ప్రతీ వస్తువూ శ్రమ దట్టంగా పట్టి తయారయ్యే ధనిక వస్తువుగా ఉండాలి. రుచికరమైన ఆహార పదార్థాలూ, నాణ్యమైన బట్టలూ, విశాలమైన భవనాలూ, ఓడలంతంత కారులూ, సుఖవంతమైన ఫస్టుక్లాసు రైలు ప్రయాణాలూ విమాన ప్రయాణాలూ; వీళ్ళ భవనాలకూ పూల తోటలకూ ఈత కొలనులకూ కావలసినంత నీరూ; వీళ్ళు పెంచే గుర్రాలకూ, కుక్కలకూ, నక్కలకూ పుష్టికరమైన ఆహారాలూ మందులూ వైద్యాలూ ప్రత్యేకమైన నివాసపు ఏర్పాట్లూ — ఒకటేమిటి? వీళ్ళు వాడే దాంట్లో ఏది జీవితావసర వస్తువో, ఏది విలాస వస్తువో నిర్ణయించడం సాధ్యం కాదు.

ఒక దోపిడీదారుడి మహా భవనంలో ఒక్క గది అలం

కారాన్ని మాత్రమే తీసుకున్నా, దాని మెరిసే నేలా, గోడలూ, వాటి రంగులూ, నేల నిండా తివాచీలూ, గుమ్మాలకూ కిటికీలకూ సిల్కు తెరలూ, గదుల్లో సోఫాలూ బీరువాలూ పూల కుండీలూ ఫాన్లూ ఫోన్లూ ఎయిర్ కండిషనర్లూ టీవీలూ — వగైరా సరంజామా కంతటికీ పట్టే శ్రమ, ఒక లక్ష శ్రామిక కుటుంబాల గుడిసెల నిర్మాణానికి సరి పోతుంది. ఈ రకంగా, పెట్టుబడిదారుడు వాడే ప్రతీ ఒక్క ఉత్పత్తినీ చూస్తే, వాడి 'నిత్య జీవితావసరాల' కోసం, లక్షల లక్షల శ్రామిక కుటుంబాల సౌఖ్యాలకు కావలసిన 'శ్రమ రాసులు' ఖర్చవుతూ ఉంటాయి.

'శ్రమపడని వాళ్ళ వాడకం' కోసం తయారయ్యే ప్రతీ వస్తువూ తప్పనిసరిగా అత్యంత విలువైనదిగా ఉండి తీరాలి. అంత విలువైన ఉత్పత్తుల్ని వాడకపోతే వాళ్ళ దగ్గిర 'అదనపు శ్రమ' లాట్లుపడి మిగిలిపోతుంది. ఈ సోమరి మంద, లక్షల లక్షల విలువని వాడినప్పటికీ కూడా, అద నపు శ్రమ ఇంకా పెద్ద పెద్ద రాసులుగా మిగిలిపోతూనే ఉంటుంది. ఒక ధనిక కుటుంబానికి, రక రకాలుగా ఆస్తులూ, డబ్బూ కుప్పతెప్పలుగా ఉన్నాయి — అంటే, దాని అర్థం ఏమిటి? ఆ కుటుంబం రోజూ ఎంతో విలువని వాడుతోన్నా కూడా ఇంకా అదనపు విలువ రాసులు అలా అన్ని ఆస్తుల రూపంలోనూ, డబ్బు రూపంలోనూ, మిగిలి పోతున్నాయి అని అర్థం.

# దోపిడీ విలాసాలు!

దోపిడీదార్లకి, ఇంట్లో గానీ బైట గానీ చెయ్యడానికి చిన్నమెత్తు పని అయినా ఉండదు. బైట — ఉత్పాదక శ్రామికులూ, ఇంట్లో — అనుత్పాదక శ్రామికులూ, ఆ సేవలన్నీ చేస్తారు. ఆఖరికి, <u>వీళ్ళు కార్లు ఎక్కేటప్పుడూ దిగేటప్పుడూ కారు తలుపులు తెరిచే పనీ మూసే పనీ కూడా సేవకులు చెయ్యవలసిందే!</u> వీళ్ళ సోమరిపోతు భోగ జీవితం, అంత అహంకారపు స్థాయిలో ఉంటుంది. రోజు మొత్తం మీద వీళ్ళు ఏ పని కోసమూ కాళ్ళూ చేతులూ కదపవలసిన అవసరం ఉండదు. కానీ, ఎంత సోమరి పోతులైనా ఎప్పుడూ కూర్చునీ, పడుకునీ కాలం గడప లేరు. సజీవ దేహం ఎప్పుడూ ఏదో ఒక చలనాన్ని కోరుతుంది. కానీ సహజమైన శ్రమలో ఉండని దేహం, ఏ రకంగా కాలం గడపగలుగుతుంది? దాని కాలక్షేపానికి తప్పని సరిగా ఏవో 'అసహజ కార్యక్రమాలు' కావాలి. అంటే, విలాస కార్యక్రమాలు! అందుకే దోపిడీదార్లకు, విలాసాలతో గడపడమే దినచర్య అయిపోతుంది. రక రకాల మత్తు పానీయాలు సేవిస్తూ గంటలు గంటలు పడి ఉండడం! ఈతకొలనుల్లో కొంతసేపూ, పెంపుడు కుక్క లతో కొంతసేపూ! గుర్ర పందాల్లో, జూద గృహాల్లో, వ్యభిచార గృహాల్లో, క్లబ్బుల్లో పూటల కొద్దీ రోజుల కొద్దీ కాలక్షేపాలు! కాలక్షేపాల్లో ఎవడికి ఏది బాగా నచ్చితే వాడు దాంట్లో నిష్ణాతుడైపోతాడు. ఇవన్నీ వీళ్ళ విలాస క్రీడల జాబితా లోకి వచ్చే కొన్ని అంశాలు మాత్రమే. ఈ నాటి కాలంలో అయితే, బూతు సినిమాలు కూడా ఈ కోవలోకి చేరతాయి. వీళ్ళ విలాసాలు ఇంకా ఏ యే రూపాల్లో ఉంటాయో శ్రామికులకు వివరాలు తెలియకపోయినా, అవి ఇంకా చాలా రూపాల్లో ఉంటాయని మాత్రం ఊహించవచ్చు. ఆ సోమరిపోతు మెదళ్ళు ఎలా ఎలా పుచ్చి వుంటాయో ఆ పుచ్చులకు తగ్గ రూపాల్లో!

ఈ సోమరి మందలో ఒక్కొక్కడైతే, మామూలు విలాస కాలక్షేపాలతో విసుగెత్తి, ఏదో ఒక 'కళాసేవ' క్రీడ మొదలు పెడతాడు. రాళ్ళూ రప్పలూ పోగేసే క్రీడతో కాల క్షేపం సాగిస్తాడు. శ్రామికులకు నాలుగు పైసలు జీతం పెంచడానికి చేతులు రాని ఈ దోపిడీ దొంగ, ఎక్కడెక్కడి పాత కాలపు పాట్లిపోయిన చిత్రపటాల్నీ, ఖిలుం పట్టిన దీపపు సెమ్మెల్నీ, ముక్కులూ చెవులూ ఊడిన రాతి బొమ్మల్నీ, వేలూ లక్షలూ పోసి కొని, వాటి కోసం అద్దాల బీరువాలూ పట్టు తెరలూ ఏర్పాటు చేసి దాని కేదో 'ప్రదర్శన శాల' అని పేరు పెట్టి, దేశ దేశాల జనాలందరూ వచ్చి దాన్ని చూసి తన 'కళా పిపాస'ని పొగడాలంటాడు! విలాసాల్లో అదో మార్పు!

"ఈ కళాఖండాన్ని లక్ష పెట్టి కొన్నాను" అని ఒక ఇత్తడి సిబ్బినీ, "ఈ శిల్పానికైతే 13 లక్షలు పెట్టాను" అని ఒక రాతి దిమ్మనీ చూపిస్తాడు. నిజానికి ఆ సిబ్బి —'గుండిగ' మీద మూతకీ, ఆ దిమ్మ — మాసిన బట్టలు బాదుకోడానికీ అయితే చక్కగా పని కొస్తాయి. "ఈ సిబ్బికీ, ఈ దిమ్మకీ 14 లక్షలా?" అని ఎవరైనా తెల్లబోతోంటే, ధనాన్ని చిల్ల పెంకుల్లా ఖర్చు చేసే తన కళా పిపాసకే వారు నిర్ఘాంత పోతున్నారని, వాడు, తన గొప్పకి తనే ఉక్కిరి బిక్కిరైపోతాడు.

"దీనికి ఇన్ని వేలు పెట్టా. దానికి అన్ని లక్షలు పెట్టా" అని వాడు అన్నప్పుడు "పెడతావు మరి! నీ సొమ్మేం పోయింది? దోచుకొచ్చిందే కదా? ఎంతైనా పెడతావు" అని ఎవరూ అనరు. అంతే కాదు, "పది మంది కార్మికుల్ని పెట్టి ఈ ఇత్తడి కళాఖండాలన్నీ కరిగించెయ్యి! ఆ ఇత్తడి ముద్దతో బిందెలో బకెట్లో గిన్నెలో చేయించు! వాటిని పేద జనాలకు పంచెయ్యి! అంత కన్నా కళాసేవా, మానవ సేవా ఏం ఉంటాయి?" అని కూడా ఎవరూ అనరు. ఈయన

పోగేసిన కళాఖండాల్ని చూసి ఎవరూ వ్యతిరేకంగా అనరు కాబట్టి, తన కళాసేవకి అందరూ మూర్ఛలు పోతున్నారని మనవాడు నమ్ముతూ ఉంటాడు. వాడా కార్యక్రమం మీద ఇంకా ఇంకా సొమ్ము గుమ్మరిస్తూ, కళాసేవ పేరుతో, తన లాంటి వాళ్ళు కురిపించే పొగడ్తలతో, 'కీర్తిని పోగేసుకునే కార్యక్రమం' నిరాటంకంగా సాగిస్తాడు.

వాడి కళాసేవ ఎంత వింతైనదంటే, వాడు 'గొప్ప కళాఖండాలు'గా ప్రశంసించే ఆ వస్తువుల సేవలో వాడు ఒక్కనాడు కూడా తన స్వహస్తాలు ఉపయోగించడు. వాటి శుభ్రతకీ, వాటి రక్షణకీ కావలసిన ఏ ఒక్క పనీ వాడు స్వయంగా చెయ్యడు. అన్నిటికీ సేవకులే కావాలి. సేవ కుల మీద సేవకులూ, వాళ్ళ మీద సూపర్‌వైజర్లూ, వాళ్ళ మీద మేనేజర్లూ, వాళ్ళ మీద డైరెక్టర్లూ! వాళ్ళందర్నీ పోగెయ్యడమే వాడు చేసే కళాసేవ!

ఒక కళాఖండం అనేది, పది కాలాలపాటు నిలిచి భవిష్యత్ తరాల కంటికి కనపడాలంటే, అదంతా దాని శుభ్రత వల్లా, దాని రక్షణ వల్లా మాత్రమే సాధ్యమవుతుంది. ఆ చాకిరీ అంతా శ్రామికులు చేస్తూ ఉంటే, మన లక్షల దోపిడీదారుడు పత్రికల్లోనూ, మీటింగుల్లోనూ మాత్రం గొప్ప 'కళా సేవకుడై'పోతాడు. పెట్టుబడిదారీ లోకంలో తయారయ్యే ప్రతీ సరుకూ కల్తీ సరుకు అయినట్టు గానే, వాడి కీర్తి కూడా కల్తీ కీర్తే. కానీ, ఏది మంచిదో ఏది కల్తీదో పోల్చే సహజ శక్తి లేని ఈ అవివేకి, తనూ తన కళా సేవా ఈ భూమి మీద 'ఆచంద్ర తారార్కమూ' నిలిచి పోతామనుకుంటాడు.

ఈ రకంగా, ఈ దోపిడీదారుల విలాసాలు ఎంత ఎక్కువ స్థాయిలో ఉంటే, అంత ఎక్కువ 'అదనపు విలువ'ని ఖర్చు చేస్తున్నారని అర్థం.

దోపిడీదారుల నిత్యజీవితావసర వస్తువులూ, విలాస వస్తువులూ, వాళ్ళ కళాపిపాసలూ — అన్నీ, ఎప్పటికప్పుడు పెద్ద పెద్ద శ్రమరాసుల్ని పీల్చేస్తూ ఉంటాయి. అంటే, ఈ అన్ని అవసరాల కోసమూ దోపిడీ వర్గం, 'సామాజిక ఉత్పత్తుల రాసి'లోనించి అతి పెద్ద ఉత్పత్తుల వాటాని, అందులోనూ అతి నాణ్యమైన ఉత్పత్తుల వాటాని, స్వాధీనం చేసుకుంటూ ఉంటుందన్నమాట!

# దోపిడీదారుల్లో స్థాయీ భేదాలు

ఉత్పాదక — అనుత్పాదక శ్రామికులలో వేరు వేరు స్థాయిలు ఉన్నట్టుగానే, 'అదనపు విలువ'ని తినే దోపిడీ దారుల్లో కూడా వేరు వేరు స్థాయిలు ఉంటాయి. ఉత్పాదక పెట్టుబడిదారులందరూ ఒకే స్థాయిలో ఉండరు. అందరూ ఒకే స్థాయి పెట్టుబడులతో ఉండరు. ఒకడికి కోట్ల పెట్టుబడి ఉంటే, ఒకడికి లక్షల పెట్టుబడే ఉంటుంది. ఒకడికి వేల పెట్టుబడే ఉంటుంది. అలాగే, భూస్వాములందరికీ కూడా ఒకే స్థాయి భూమి ఉండదు. ఒకడికి వేల ఎకరాలు ఉంటే, ఒకడికి వందల ఎకరాలే ఉంటాయి. అలాగే, వడ్డీ పెట్టుబడిదారుల్లోనూ, వర్తక పెట్టుబడిదారుల్లోనూ కూడా, పెద్దా చిన్నా తేడాలు ఉంటాయి. కాబట్టి, ఒక 'దోపిడీ కుటుంబం'లో, ఏ సభ్యులైనా, ఏవైనా 'ఉద్యోగాలు' చేస్తారా లేదా — అనేది, ఆ కుటుంబానికి ఉండే పెట్టుబడి స్థాయి మీదా, భూమి స్థాయి మీదా ఆధారపడి ఉంటుంది. పెట్టుబడులూ భూములూ ఎంత ఎక్కువగా ఉంటే, ఆ కుటుంబ సభ్యులు, శ్రమకి అంత దూరంగా ఉంటారు.

'అదనపు విలువ'లో ఏదో ఒక వాటా ద్వారా ఆదాయాన్ని పొందే కుటుంబాల్లో కూడా కొందరు సభ్యులు కొన్ని రకాల ఉద్యోగాలు చేస్తూ ఉంటారు. ఒక ఉత్పాదక పెట్టుబడిదారుడి కొడుకు ఇంజనీరుగా ఉండవచ్చు. ఒక వడ్డీ పెట్టుబడిదారుడి కూతురు టీచరుగానూ, ఒక భూస్వామి కొడుకు డాక్టరుగానూ పనిచేస్తూ ఉండవచ్చు. ఒక ఉద్యోగం చేసే ఏ వ్యక్తి అయినా ఆ ఉద్యోగానికి వచ్చే జీతం తీసుకుంటాడు. దానితో సమస్య ఉండదు. సమస్య అంతా శ్రమ లేకుండా లాగే ఆదాయాల తోనే.

ఒక కుటుంబానికి, 'భూమి కౌలు' ద్వారా కొంత ఆదాయం వస్తుందనుకుందాం. ఆ కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు ఉన్నత మేధా శ్రమలు చేస్తున్నారనుకుందాం. అంటే, ఆ కుటుంబానికి వచ్చే మొత్తం ఆదాయంలో కొంత భాగం 'శ్రమ' ద్వారానూ, కొంత భాగం 'దోపిడీ' ద్వారానూ వచ్చేదిగా ఉందని అర్థం.

ఒక వ్యక్తి విషయం కూడా అంతే. ఒక వ్యక్తి ఆదాయంలో కొంత భాగం జీతం ద్వారానూ కొంత భాగం 'వడ్డీల' ద్వారానూ రావచ్చు.

ఒక కుటుంబానికిగానీ, ఒక వ్యక్తికిగానీ ఏ మార్గం ద్వారా ఎక్కువ ఆదాయం ఉంటుందో, ఆ మార్గం వేపే వాళ్ళ దృష్టి ఎక్కువ అనుకూలంగా ఉంటుంది. ఒక కుటుంబం పూర్తిగా వడ్డీల ద్వారా బతికేది అయితే, ఆ కుటుంబం వడ్డీ విధానాన్ని సమర్థించే దృష్టితోటే ఉంటుంది. కౌలు మీద బతికేది అయితే, కౌలునీ! ఇలా.

# ‘స్తితి’ని బట్టి చైతన్యం!

‘పెట్టుబడిదారీ సమాజం’లో ఉన్న మొత్తం స్త్రీ పురుషుల జనాభాని కొన్ని రకాల వేరు వేరు స్తితులలో ఉన్న వారిగా విభజించవచ్చు. ఈ రకాన్ని ఇంతకు ముందే కొంత వరకూ చూశాం. ఇక్కడ ఇంకా కొన్ని వివరాలు చూడాలి.

ఆ స్తితులు ఇవీ:

(1) ఉత్పాదక శ్రామికులు, (2) అనుత్పాదక శ్రామికులు, (3) శ్రమని పూర్తిగా వదిలేసిన దోపిడీదారులు, (4) కొంత శ్రమ చేసే దోపిడీదారులు, (5) స్వతంత్ర ఉత్పత్తి దారులు, (6) కుటుంబ శ్రమలు చేసే కుటుంబ సభ్యులు, (7) నిరుద్యోగులూ + అనాథ శరణాలయాల్లో మనుషులూ + జైళ్ళల్లో మనుషులూ + మత సంస్థల్లో మనుషులూ.

సమాజంలో ఉన్న ఏ మనిషి అయినా, ఈ స్తితుల్లో ఏదో ఒక స్తితికి చెంది ఉంటాడు. అయితే ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, ఈ 7 స్తితుల్నీ రెండే రెండు రకాలుగా కుదించవచ్చు. యజమానులూ, శ్రామికులూ — అనే రకాలుగా. దోపిడీదారులూ, మత సంస్థల్లో కొందరూ తప్ప మిగిలిన వాళ్ళందరూ శ్రామిక వర్గం మనుషులే. కాబట్టి మొత్తం జనాభాని 2 రకాలుగా విభజించడంలో పొరపాటు ఉండదు.

‘స్తితి’ అంటే శ్రమ సంబంధాల్లో ఆ మనిషి ఉన్న స్థానం. ‘చైతన్యం’ అంటే ఆ మనిషికి ఉన్న భావాలు. లేదా, అభిప్రాయాలు. ‘స్తితిని బట్టి చైతన్యం’ అంటే, ఒక మనిషికి సమాజంలో విషయాల గురించి ఏర్పడే భావాలు, సమాజంలో ఆ మనిషి ఏ స్థానంలో ఉంటాడో దాన్ని బట్టే ఏర్పడతాయి — అని.

మనుషుల స్తితుల్లో — ‘యజమానులూ, శ్రామికులూ’ అనే ప్రధానమైన తేడాలు, ఏ దోపిడీ సమాజానికైనా వర్తిస్తాయి.

యజమాని — తనని తను అధికుడిగానూ, పెత్తందారుగానూ, శ్రమచెయ్యవలసిన అగత్యం లేని వాడిగానూ భావించుకుంటాడు. అతని భావాలన్నీ ప్రతీ అంశంలోనూ ‘యజమానితనం అనే స్తితికే’ అనుగుణంగా ఉంటాయి.

శ్రామికుడు — తను, యజమానికి లోబడి ఉండవలసిన వాడిననీ, యజమాని ఏ పని ఇస్తే ఆ పని చేయవలసిన వాడిననీ, యజమాని ఆజ్ఞల్ని శిరసావహించడమే తన కర్తవ్యమనీ భావిస్తాడు. ఈ వ్యక్తి అభిప్రాయాలు ‘శ్రామికత్వం అనే స్తితి’కే అనుగుణంగా ఉంటాయి.

ఈ శ్రామికుడు, శ్రామికుడిగా గాక యజమానిగా ఉన్నవాడే అయితే, అప్పుడు ఆ వ్యక్తి భావాలు, యజమానితనానికే అనుకూలంగా ఉంటాయి. అలాగే, యజమాని, శ్రామికుడి స్తితిలో ఉన్నవాడే అయితే, ఆ వ్యక్తి భావాలు, శ్రామికత్వాన్ని బట్టే ఉంటాయి.

అంటే మనుషుల సంబంధాన్ని గురించి గానీ, సమాజంలో ఉండే ఇతర పరిస్తితుల్ని గురించి గానీ, ఒక వ్యక్తికి ఏర్పడే అభిప్రాయాలు, ఆ వ్యక్తి, శ్రమ సంబంధాల్లో ఏ స్థానంలో ఉంటాడూ అనే దాన్ని బట్టే ఉంటాయి.

అయితే ‘స్తితి’ అన్నప్పుడు ఆ స్థితి, వైరుధ్యాలతో ఉన్నట్టయితే, దాని వల్ల పుట్టుకు వచ్చే భావాలు కూడా వైరుధ్యాలతోనే ఉంటాయి. ఎలాగంటే: బానిసత్వం అనేది — ఒక స్తితి. కానీ అది సహజమైన స్తితి కాదు. మనుషులు — ‘స్త్రీ పురుషులు’ అనే తేడాలతో ఉండడం అయితే, అది సహజమైన స్తితి. కానీ, మనుషులు బానిసలు గానూ యజమానులుగానూ ఉండడం సహజమైన విషయం కాదు. అది బానిసల పక్షానికి హాని కలిగించే విధంగా ఏర్పడిన పరిస్తితి. కాబట్టి, ఈ స్తితి, బానిసల్లో, బానిసత్వం పట్ల అనుకూల భావాలనే గాక వ్యతిరేక భావాల్ని కూడా కలిగిస్తుంది. యజమానులకు లోబడి ఉండాలనే భావాలు ప్రధానంగా ఉంటూనే, దాని వ్యతిరేక భావాలు కూడా కొంత స్థాయిలో ఉంటాయి. ఈ రెండు రకాల భావాలూ ‘బానిసత్వం’ అనే స్తితి నించి పుట్టుకొచ్చేవే. రెండో రకం భావాలు కూడా ఆ స్తితి నించి గాక, ఇంకెక్కడి నించో వచ్చేవి కావు. అంటే, వైరుధ్యాలు గల స్తితి వల్ల దానికి అనుకూల భావాలూ వ్యతిరేక భావాలూ కూడా ఏర్పడతాయి.

అయితే, బానిసల్లో లాగే యజమానుల్లో కూడా రెండు రకాల భావాలు ఏర్పడడం జరగదు. ఎందుకంటే, వాళ్ళు ఏ స్తితిలో ఉన్నారో ఆ స్తితే వాళ్ళకు లాభదాయకంగా ఉంటుంది కాబట్టి. వాళ్ళు ఆ స్తితినే నిలబెట్టుకోవాలనే భావాలతో మాత్రమే ఉంటారు.

మనుషుల మధ్య ఒక సంబంధం, వైరుధ్య పరిస్తితులతో ఉన్నప్పుడు, అది ఏ పక్షానికైతే బాధాకరంగా ఉంటుందో, ఆ పక్షంలోనించే ఆ సంబంధానికి వ్యతిరేకమైన మార్పు ప్రారంభమవుతుంది.

బాధాకరమైన స్తితికి అనుకూలంగా ఉండే భావాలు తగ్గిపోతూనూ, వ్యతిరేకంగా ఉండే భావాలు అభివృద్ధి చెందుతూనూ ఉన్నప్పుడు. (అది ఎలా జరుగుతుందనేది

వేరే విషయం), వ్యతిరేక భావాలే ఆ స్థితిని మార్చ గలుగుతాయి.

బానిసలో - ఆ స్థితి పట్ల,

అనుకూల భావాలూ,

వ్యతిరేక భావాలూ కూడా వుంటాయి.

అంటే ఇది, స్థితిని బట్టే భావాలు. ఆ భావాల మీద ఆ స్థితి ప్రభావమే వుందని అర్థం.

అయితే, ఆ వ్యతిరేక భావాలు తగినంతగా అభివృద్ధి చెందినప్పుడు, అవి నూతన భావాలు అవుతాయి. ఆ నూతన భావాలు, ఆ పాత స్థితిని మారుస్తాయి. పాత స్థితి కన్నా అభివృద్ధికరమైన స్థితిని ఏర్పరుస్తాయి.

అంటే ఇది, భావాల్ని బట్టే స్థితి.

పాత స్థితి మీద నూతన భావాల ప్రభావం వుందని అర్థం.

దీని అర్థం స్థితి ప్రభావం భావాల మీద ఉన్నట్టే, భావాల ప్రభావం స్థితి మీద ఉంటుంది — అని. ఇక్కడ, 'భావాల ప్రభావం' అంటే, ఆ స్థితికి అనుకూలంగా ఉండే భావాల ప్రభావం అని కాదు. అనుకూలంగా ఉండే భావాల వల్ల అమలులో ఉన్న స్థితి ఇంకా గట్టిపడుతుంది గానీ, వ్యతిరేకంగా మారదు. ఆ స్థితిని వ్యతిరేకించే నూతన భావాలే ఆ స్థితిని మార్చుతాయి.

అయితే ఈ వ్యతిరేక భావాలు మొదటి స్థితితో సంబంధం లేకుండా ఎక్కడి నించో స్వతంత్రంగా వచ్చేవి కావు. అవి కూడా మొదటి స్థితి వల్ల ఏర్పడేవే. 'స్థితిని బట్టి చైతన్యం' అన్నప్పుడు, ఆ చైతన్యం లోనే (ఆ భావాల లోనే), ఆ వ్యతిరేక భావాలు కూడా ఒక భాగం. వ్యతిరేక భావాలకు కూడా పునాది ఆ బానిస స్థితే. స్థితిని బట్టి భావాలు ఏర్పడినట్టే, ఆ భావాల్లోనే ఉన్న ఒక భాగం వల్ల ఆ స్థితి మారుతుంది.

బానిసల కాలం నాడే శ్రమ దోపిడీ గురించి తెలిసిన భావాలు లేవు. కానీ, బానిసలకు శ్రమ దోపిడీ గురించి తెలియక పోయినా, రోజు వారీ జీవితంలో అనుభవించే బాధల వల్ల వారు యజమానులతో అనేక రకాలుగా ఘర్ష ణలు పడతారు. ఆ పోరాటాలే వారి స్థితిని కొంత కొంత మారుస్తూ ఉంటాయి.

వర్గాలు ఆ రకం గానే మారుతున్నాయి.

మనుషులు వేరు వేరు వర్గాలుగా ఏర్పడి వున్నారని ఆ మనుషులకు స్పష్టంగా తెలియని దశలో, ఆ భేదాల గురించి రెండు వర్గాల చైతన్యమూ అస్పష్ట స్థితి లోనే (అన్‌కాన్షియస్‌గా) ఉంటుంది. యజమాని భావాలకూ శ్రామికుల భావాలకూ తేడా ఎక్కువగా ఉండదు. పెట్టుబడిదారీ సమాజంలో కూడా అంతే. యజమానికీ శ్రామికుడికీ ఉన్న సంబంధం గురించి ఇద్దరూ ఒకే రకంగా ఆలోచిస్తారు.

**పెట్టుబడిదారుడు ఇలా ఆలోచిస్తాడు:** "శ్రామికుడు పని చేస్తాడు. దానికి జీతం ఇచ్చేస్తాను. నేను పెట్టుబడి పెడతాను కాబట్టి నాకు లాభం వస్తుంది. శ్రామికుడు పేదతనంలో ఉన్నాడంటే దానికి నేనేం చేస్తాను? ఆస్తి లేని వాళ్ళ గతి అంతే కదా?"

**శ్రామికుడు ఇలా ఆలోచిస్తాడు:** "నేను పని చేస్తే జీతం వచ్చేస్తుంది. పెట్టుబడి పెట్టే వాళ్ళకి లాభం వస్తుంది. నేను పేదతనంలో ఉన్నానంటే దానికి యజమానేం చెయ్యగలడు? నాకు ఆస్తి లేదు కాబట్టి నేను ఇలా ఉన్నాను."

ఇరు పక్షాల ఆలోచనా ఒకటే. అందరికీ తెలిసింది అదే. యజమానీ శ్రామిక సంబంధం, ఇరు వర్గాలకూ సహజ సంబంధం గానే కనపడుతుంది. ఎందుకంటే, దోపిడీ సమాజాలలో దోపిడీ వర్గమే మొత్తం సమాజాన్ని పాలించే వర్గంగా ఉంటుంది. అంటే, శ్రామిక వర్గాన్ని పాలించేది యజమాని వర్గమే. యజమానుల భావాలే శ్రామికుల భావాలు! యజమానులు నేర్పేదే శ్రామికుల విజ్ఞానం!

"ప్రతీ యుగంలోనూ పాలించే భావాలు, ఆ యుగపు పాలక వర్గ భావాలే" - మార్క్స్ ఎంగెల్స్‌లు (కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక; సెలెక్టెడ్ వర్క్స్ - 1; పేజీ 125;)

"ప్రతీ యుగంలోనూ, పాలక వర్గ భావాలే పాలించే భావాలు. అంటే, సమాజాన్ని పాలించే 'భౌతిక శక్తిగా' ఉన్న వర్గమే, అదే సమయంలో, దాన్ని పాలించే బౌద్ధిక శక్తిగా కూడా ఉంటుంది. భౌతిక ఉత్పత్తి సాధనాలు తన ఆధీనంలో ఉన్న వర్గం, దాని పర్యవసానంగా, బౌద్ధిక ఉత్పత్తి సాధనాల్ని కూడా ('మీన్స్ ఆఫ్ మెంటల్ ప్రొడక్షన్'ని) కంట్రోలు చేస్తుంది. ఏ విధంగా నంటే, బౌద్ధిక ఉత్పత్తి సాధనాలు లేని వారి భావాలు, మొత్తం మీద, తనకు లోబడి ఉండే విధంగా. పాలించే భావాలు అనేవి ప్రబలంగా ఉన్న భౌతిక సంబంధాలకు, ఏ సంబంధాలనైతే భావాల రూపంలో గ్రహిస్తారో ఆ భౌతిక సంబంధాలకు, స్వచ్ఛమైన (ఐడియల్) వ్యక్తీకరణ తప్ప వేరు కాదు. అందుకే, ఆ సంబంధాలు, ఒక వర్గాన్ని పాలక వర్గంగా చేస్తాయి. తద్వారా ఆ పాలక వర్గ భావాలు ఆధిపత్యం నెరుపుతాయి" — మార్క్స్ ఎంగెల్సులు.

(జర్మన్ ఐడియాలజీ; పేజీ-67)

కాబట్టి, దోపిడీ వర్గ ఆలోచనా విధానపు ప్రభావం లోనే శ్రామిక వర్గం మునిగి ఉంటుంది.

మితిమీరిన సౌఖ్యాల తోటీ, అట్టహాసాల తోటీ, కుత్రిమ విలువల తోటీ, అసమానతల తోటీ, హేతు విరుద్ధతల తోటీ జీవించడమే దోపిడీ వర్గ జీవిత విధానం. అదే ఆ వర్గ ప్రత్యేక సంస్కృతి. ఆ సంస్కృతి ప్రభావం శ్రామిక వర్గం మీద కూడా బలంగా ఉంటుంది. ఉన్నత మేధాశ్రమల సెక్షను, పూర్తిగా దోపిడీ వర్గ జీవిత విధానాన్నే అనుకరిస్తుంది. శ్రామిక వర్గంలో కింది సెక్షన్లు కూడా ఆ ప్రభావం లోనే మునిగి ఉంటాయి.

కానీ, ఇరు వర్గాల మధ్య యదార్థంగా ఉన్న పరిస్థితి — శ్రమ దోపిడీయే కాబట్టి, దాన్ని ఏ వర్గమూ గ్రహించకపోయినా, ఆ పరిస్థితి, దాని ప్రభావం అది చూపుతూనే ఉంటుంది. శ్రామిక వర్గం, 'శ్రమ చెయ్యడం' అనే ఏ స్థితిలో అయితే ఉంటుందో ఆ స్థితి, ఆ వర్గ జీవిత విధానాన్ని యజమాని వర్గ జీవిత విధానం నించి ఎంతో కొంత వేరు పరుస్తూనే ఉంటుంది. వర్గాల స్థితుల్లో భేదాలు, వాటి భావాల్నీ వాటి సంస్కృతుల్నీ కొన్ని కోణాల్లో అయినా వేరు పరుస్తూ ఉంటాయి.

దోపిడీ అనే అసలు నిజాన్ని గ్రహించడం ఎక్కు వెక్కువ సాధ్యమవుతోన్న కొద్దీ, వర్గాల భావాలు క్రమ క్రమంగా వేరయి పోతాయి. దోపిడీ నించి బయటపడాలని శ్రామిక వర్గమూ, దోపిడీనే స్థిరంగా నిలబెట్టి ఉంచాలని యజమాని వర్గమూ స్పష్టమైన గ్రహింపుతో (కాన్షియస్‌గా) పోరాడడం మొదలుపెడతాయి.

ఇంతవరకూ మనం ఉత్పాదక — అనుత్పాదక శ్రమల్ని చూసే క్రమంలో, అనేక రకాల శ్రమ సంబంధాలు చూశాం. ఈ సంబంధాలన్నిటినీ ఎలా సూత్రీకరించవచ్చునో, ఇప్పుడు క్లుప్తంగా ఒక పట్టిక ద్వారా చూద్దాం. ఉదాహరణలు తేలిగ్గా ఉండడం కోసం, ఈ 'పట్టిక'లో, 'సరుకు'కీ, 'శ్రమ'కీ కూడా 'C' అనే అక్షరాన్నే గుర్తుగా ఉంచుతున్నాము — శ్రమ కూడా సరుకే కాబట్టి!

## 'శ్రమ సంబంధాల' సూత్రీకరణలు

| సంబంధం ఎవరెవరికి?<br>చూసేది, ఎవరి వేపు నించీ? | సూ త్రీ క ర ణ |
|---|---|
| **1.** పెట్టుబడిదారుడికీ, ఉత్పాదక శ్రామికులకూ ఉండే సంబంధంలో —<br>పెట్టుబడిదారుడి వేపు నించి చూస్తే: | డబ్బూ — దాని కన్నా ఎక్కువ శ్రమా — ఆ శ్రమకి తగిన డబ్బూ<br>M — $C^1$ — $M^1$ |
| ఉత్పాదక శ్రామికుల వేపు నించీ చూస్తే: | ఎక్కువ శ్రమా — తక్కువ డబ్బూ — తక్కువ సరుకూ<br>$C^1$ — M — C |
| **2.** పెట్టుబడిదారుడికీ, అనుత్పాదక శ్రామికులకూ సంబంధంలో —<br>పెట్టుబడిదారుడి వేపు నించి చూస్తే: | డబ్బూ — దానికన్నా ఎక్కువ శ్రమా<br>M — $C^1$ |
| అనుత్పాదక శ్రామికుల వేపునించి చూస్తే: | ఎక్కువ శ్రమా — తక్కువ డబ్బూ — తక్కువ సరుకూ<br>$C^1$ — M — C |
| **3.** పెట్టుబడిదారుడికీ, స్వతంత్ర శ్రామికుడికీ ఉండే సంబంధంలో,<br>పెట్టుబడిదారుడు, 'ఉత్పాదక' అవసరానికి కొంటే: | డబ్బూ — సమానమైన సరుకూ — సమానమైన డబ్బూ<br>M — C — M |
| పెట్టుబడిదారుడు, తన కుటుంబ అవసరానికి కొంటే: | M — C |
| స్వతంత్ర శ్రామికుడు, పెట్టుబడి దారుడికి, ఏ అవసరానికి అమ్మినా: ⟶ | తన సరుకూ — సమానమైన డబ్బూ — సమానమైన సరుకూ<br>C — M — C ⟶ |

| | |
|---|---|
| **4.** ఇద్దరు స్వతంత్ర ఉత్పత్తిదారుల మధ్యగానీ: ఒక స్వతంత్ర ఉత్పాదకుడికీ, ఒక వేతన శ్రామికుడికీ మధ్యగానీ; ఎటునించి ఎటు చూసినా: | తన శ్రమా — సమానమైన డబ్బూ — సమానమైన సరుకూ<br>C — M — C |
| **5.** 'గృహశ్రమలకే' పరిమితమైన భార్యకీ, ఆమెకి 'పోషణ ఉత్పత్తులు' ఇచ్చే భర్తకీ వున్న సంబంధంలో —<br>భార్య వేపు నించీ చూస్తే:<br><br>భర్త వేపు నించీ చూస్తే:<br><br>భార్య, 'గృహ శ్రమలే' గాక, 'బయటి శ్రమ' కూడా చేస్తే | <br><br>భార్య, భర్త కోసం ఇచ్చేది, భార్య భర్త నించీ తీసుకునేది<br>గృహశ్రమలో సగం — గృహ పోషణ ఉత్పత్తుల్లో సగం<br>C — C<br><br>భర్త ఇచ్చేది — భర్త తీసుకునేది<br>గృహ పోషణలో సగం — గృహ శ్రమల్లో సగం<br>C — C<br><br>'బయటి శ్రమకు' సంబంధించి:<br>ఆ స్త్రీ, ఒక యజమాని దగ్గిర ఉత్పాదక శ్రామికురాలు గానీ, అనుత్పాదక శ్రామికురాలు గానీ అవుతుంది. లేదా, స్వతంత్ర శ్రమ చేస్తే, 'స్వతంత్ర ఉత్పాదకురాలు' అవుతుంది. ఆ శ్రమ సంబంధాన్ని బట్టి ఆ సూత్రీకరణ ఉంటుంది. |
| **6.** ఇంటా బయటా ఏ శ్రమా చెయ్యని దోపిడీ కుటుంబపు స్త్రీ | ఈమెకి 'భూమి' గానీ, ఇంకో 'ఉత్పాదక సంస్థ' గానీ ఉంటే, ఈమె 'యజమానురాలు' అవుతుంది. అంతా, 'మొగ యజమానుల' విషయంలో లాగానే - అలాంటి 'ఆస్తి' ఏమీ లేకపోతే, భర్త దోచి తెచ్చే దానితో జీవిస్తూ, 'గృహ శ్రమలు' కూడా చెయ్యకుండా జీవించే వ్యర్థ ప్రాణి అవుతుంది. |

**ఈ 'శ్రమ సంబంధాల'న్నిటిలోనూ, 'యజమానీ శ్రామిక సంబంధం' ఉన్నచోటే 'శ్రమ దోపిడీ' ఉంది!**

# ఉత్పాదక, అనుత్పాదక శ్రమల గురించి ఒక వివరణ

ఇక్కడ, ఉత్పాదక — అనుత్పాదక శ్రమల 'నిర్వచనాల' గురించి ఒక చిన్న వివరణ అవసరమవుతుంది. ఉత్పాదక శ్రమ విలువలో, కొంత భాగం చెల్లించనిదిగా ఉన్నట్టే, అనుత్పాదక శ్రమ విలువలో కూడా కొంత భాగం చెల్లించనిదిగా ఉంటుంది. ఉత్పాదక శ్రమ దాన్ని కొన్న వాళ్ళకు డబ్బుగా మారితే, అనుత్పాదక శ్రమ దాన్ని కొన్న వాళ్ళకు డబ్బుగా మారదు. ఈ చాప్టర్‌లో చూసిన ఈ అభిప్రాయాలన్నీ మార్క్సువే. అయితే, ఈ విషయాల గురించి మార్క్సు చెప్పింది అర్థం చేసుకోవడం, మొదట చాలా కష్టం అవుతుంది. మార్క్సు రాసిన దాంట్లో ఈ విషయాలు కొన్నిచోట్ల కొంత అస్పష్టంగానూ, కొన్నిచోట్ల కొంత పొరపాటు అర్థాల్ని ఇచ్చేవిగానూ కూడా ఉంటాయి. ఈ విషయాలు, కొన్నిచోట్ల, 'అనుత్పాదక శ్రమలు అదనపు శ్రమ చెయ్యవు, దోపిడీకి గురి అవవు' అనే పొరపాటు అభిప్రాయం కూడా ఇస్తాయి. కానీ, మార్క్సు ఈ విషయాల మీద 'కాపిటల్'లోనే వేరు వేరు చోట్ల చెప్పిన అభిప్రాయాలన్నిటినీ కలిపి చూస్తే, అలాంటి పొరపాటులో పడకుండా అసలు విషయం సరిగానే అర్థం చేసుకోగలం.

మార్క్సు, 'ఉత్పాదక — అనుత్పాదక శ్రమల' గురించి, 'అదనపు విలువ సిద్ధాంతాలు' అనే పేరుతో

ఉన్న 'కాపిటల్ — 4'లోనూ, 'ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా' అనే పేరుతో ఒక ప్రత్యేకమైన విడి చాప్టర్‌గానూ కూడా రాశాడు. (ఈ చాప్టరు 'కాపిటల్'లోది కాదు). ఈ విడి చాప్టరుగానీ, 'కాపిటల్ — 4'గానీ, నిన్న మొన్నటి దాకా బయటికి (అచ్చులో) రాలేదు. ఈ విడి చాప్టరు, 1933లో జర్మన్ భాషలోనూ, రష్యన్ భాషలోనూ, 'మార్క్స్ — ఎంగెల్స్ ఆర్కైవ్స్' పేరుతో ప్రింటు చేసిన సంపుటాలలో మొదటి సారి వచ్చింది. పెంగ్విన్ వాళ్ళు 1976లో మాత్రమే మొట్టమొదటి సారి ఇంగ్లీషులో ఈ చాప్టర్‌ని 'కాపిటల్-1' లోకి 'అనుబంధం'గా చేర్చారు. ఈ చాప్టరు, 'కాపిటల్-1'కి సంబంధించిన ఇతర ఎడిషన్లలో దొరకదు.

'అదనపు విలువ సిద్ధాంతాలు' భాగం (కాపిటల్-4) ఎంగెల్స్ కూడా పోయాక, 1905 కీ 10 కీ మధ్య జర్మన్ భాషలో మొదటి సారి వచ్చింది. దాన్ని తర్వాత ఇంగ్లీషులో ప్రింటు చేశారు.

'ఉత్పాదక, అనుత్పాదక శ్రమల' గురించి సరిగా తెలుసుకోకపోతే, కార్మిక వర్గం అంటే ఎవరు? — అనే విష యాన్ని అర్థం చేసుకోవడంలో చాలా పొరపాటు జరుగు తుంది. ఈ విషయాల మీద మార్క్సు ప్రత్యేకంగా రాసిన చాప్టర్‌నీ, 'కాపిటల్-4'లో రాసిన భాగాల్నీ చూడకుండా, కాపిటల్ 1, 2, 3 భాగాల్ని మాత్రమే చూస్తే, ఈ విషయాల్లో కావలసిన సమాచారం దొరకదు.

అనుత్పాదక శ్రమల విషయంలో — అదనపు శ్రమ ఉంటుందా, ఉండదా; ఆ శ్రమలు దోపిడీకి గురి అవుతాయా లేదా — అనే విషయాల మీద రక రకాల సందేహాలకూ, అనవసరపు చర్చలకూ అవకాశం లేకుండా ఉండడానికి, ఇక్కడ మార్క్సునించి కొన్ని కొటేషన్లు చూస్తాము.

**1)** "అనుత్పాదక శ్రామికుల సర్వీసుల విలువ, ఉత్పా దక శ్రామికుల శ్రమల విలువలాగే గానీ, దాన్ని పోలివుండే విధంగా గానీ ఏర్పడడాన్ని, ఏదీ నివా రించదు." (అదనపు విలువ సిద్ధాంతాలు-1. పేజీ- 159. మాస్కో ఎడిషన్, 1975).

**2)** "ఉత్పాదక శ్రామికుడి శ్రమశక్తి, ఆ శ్రామికుడికి సరుకు అయినట్టే, అనుత్పాదక శ్రామికుడి శ్రమశక్తి ఆ శ్రామికుడికి కూడా సరుకే. కానీ, ఉత్పాదక శ్రామికుడు, తన శ్రమశక్తిని కొన్నవాడి కోసం 'సరుకుల్ని' ఉత్పత్తి చేస్తే, అనుత్పాదక శ్రామికుడు, తన శ్రమ శక్తిని కొన్నవాడి కోసం సరుకుల్ని గాక, కేవలం 'ఉపయోగపు విలువల్ని' మాత్రమే ఉత్పత్తి చేస్తాడు" (అదనపు విలువ సిద్ధాంతాలు-1. పేజీ 160).

ఉత్పాదక, అనుత్పాదక శ్రమల గురించి అర్థం చేసుకోవలసినదంతా ఈ 2 కొటేషన్ల లోనూ ఎంతో వివరంగా ఉంది కదా?

**3)** ఈ కొటేషను — 'వర్తక పెట్టుబడిదారుల' దగ్గిర పనిచేసే 'వర్తక శ్రామికుల' గురించి చెపుతుంది. ఈ శ్రామికులు, అనుత్పాదక శ్రామికులు. (ఈ శ్రామికుల గురించి మనం ఇంకా చూడలేదు. 2వ సంపుటంలో 'వర్తక పెట్టుబడి' చాప్టరులో చూస్తాము).

"...అతను (వర్తక కార్మికుడు) కొంత మెరుగైన జీతంగల వేతన శ్రామికుడు అనుకుందాం. అతనికి చెల్లించే జీతం ఎంతైనా కానివ్వండి. వేతన శ్రామికుడిగా అతను, రోజులో కొంత భాగానికి చెల్లింపు లేకుండానే పని చేస్తాడు. అతను, రోజూ 8 గంటల శ్రమ విలువని జీతంగా పొంది, 10 గంటలు పని చేస్తాడనుకుందాం. అతను చేసే 8 గంటల 'అవసర శ్రమ' (జీతాల భాగం) ఎలాగైతే 'విలువ'ని ఉత్పత్తి చెయ్యదో, అతను చేసే 2 గంటల 'అదనపు శ్రమ' కూడా అలాగే విలువని ఉత్పత్తి చెయ్యదు." (కాపిటల్-2. పేజీ-135. మాస్కో ఎడిషన్, 1974).

**4)** ఈ కొటేషను, 'వర్తక పెట్టుబడిదారుడి'కి సంబంధించింది. వర్తక పెట్టుబడిదారుడికి అయ్యే అమ్మకం ఖర్చులు, వాడి ఆదాయంలో తగ్గింపుగా ఉంటాయనీ, వాడు, తన శ్రామికులకు చెల్లించని భాగం వాడి ఖర్చుల్ని తగ్గించే భాగంగా ఉంటుందనీ, శ్రామికుల మీద ఎంత ఖర్చు పెట్టాలో అంత పెట్టక పోవడం వల్ల కలిసి వచ్చే భాగంతో, వాడి పెట్టుబడి పెరుగుదలని వ్యతిరేకించే అంశం తగ్గుతుందనీ — ఈ విషయాలన్నీ ఈ కొటేషన్ చెపుతుంది.

"...వాడు (వర్తక పెట్టుబడిదారుడు) పొందే దానిలో తగ్గింపుగా ఉండేటటువంటి చలామణీ ఖర్చులు, శ్రామికుడికి 2 గంటల విలువని చెల్లించక పోవడంవల్ల, కొంత తగ్గుతాయి. వాడికి ఇది ఒక పాజిటివ్ ప్రోఫిట్‌గా ఉంటుంది. ఎందుకంటే, వాడి పెట్టుబడి విలువ పెరగడం మీద నెగటివ్ ఆంక్ష తగ్గిపోతుంది". (కాపిటల్-2. పేజీ-135).

'వర్తక పెట్టుబడిదారుడు పొందే దానిలో తగ్గింపుగా ఉండే చలామణీ ఖర్చులు' — అంటే, వర్తక పెట్టుబడిదారుడు, సరుకు పెట్టుబడిదారుడి నించి సరుకుని కొంత కమిషన్‌తో తీసుకుంటాడు కదా? అందులోనించే సరుకు

అమ్మకాల ఖర్చులన్నీ పెట్టాలి. ఆ ఖర్చులు ఎక్కువగా ఉంటే, వర్తకుడికి చివరికి మిగిలే లాభం తగ్గిపోతుంది. ఆ ఖర్చులు తక్కువగా ఉంటే, చివరి లాభం ఎక్కువగా ఉంటుంది. వర్తకుడు కూడా, తన కార్మికుల శ్రమకు పూర్తిగా చెల్లించడు. కాబట్టి, ఆ రకంగా, ఆ కార్మికుల అదనపు శ్రమ వల్ల, వర్తకుడు ఖర్చు పెట్టవలసింది కొంత తగ్గుతుంది — ఈ మాటల సారాంశం, అనుత్పాదక వర్తక కార్మికులు అదనపు శ్రమని ఇస్తారు — అని.

— ఈ రకంగా, అనుత్పాదక శ్రామికులు కూడా తమ శ్రమ విలువలో కొంత భాగాన్ని పోగొట్టుకుంటారనీ, 'అదనపు శ్రమ' చేస్తారనీ, మార్క్సు కొన్ని సందర్భాలలో చాలా స్పష్టంగానే చెప్పాడు.

అయితే, దానికి విరుద్ధమైన అభిప్రాయాలు కూడా మార్క్సులో కనపడడం వల్ల, 'అనుత్పాదక శ్రమల' విషయం చాలా అయోమయంగా తయారవుతుంది. పొరపాటు అర్థాల్ని ఇచ్చే అభిప్రాయాల్ని కూడా కొన్నిటిని ఇక్కడ చూస్తాం.

> **1)** "పియానోలు తయారుచేయించే వాడిచేత నియమించబడిన కార్మికుడు, ఉత్పాదక కార్మికుడే. అతని శ్రమ, అతని జీతాలను తిరిగి ఇవ్వడం మాత్రమే గాక, అతని శ్రమలో 'అదనపు విలువ' కూడా ఉంటుంది. కానీ, దీనికి భిన్నంగా ఊహించండి. ఎలాగంటే, పియానోకి కావలసిన మెటీరియల్స్ అన్నీ నేను కొనుక్కున్నాననీ, పియానోని షాపులో కొనడానికి బదులు దాన్ని నేను మా ఇంటి దగ్గిరే తయారు చేయించుకున్నాననీ, ఊహించండి. పియానోని చేసిన పనివాడు ఇప్పుడు 'అనుత్పాదక' శ్రామికుడు. ఎందుకంటే, అతని శ్రమ, నా 'ఆదాయం'తో మారకం అవుతోంది గనక" (అదనపు విలువ సిద్ధాంతాలు-1, పేజీ-160, మాస్కో, 1975).

ఇందులో, పొరపాటేమిటి? ఒకరి ఇంటికి వచ్చి వాళ్ళ స్వంత వాడకం కోసం పియానో చేసి ఇచ్చిన పనివాడిని మార్క్సు, 'అనుత్పాదక శ్రామికుడు' అంటున్నాడు. కానీ, ఇది పొరపాటు. ఈ శ్రామికుడు, ఒక యజమాని ఇంటికి రోజూ వెళ్ళి వంట పనో, తోట పనో చేసే రకం శ్రామికుడు కాడు. పియానోల్ని ఆ ఇంట్లో రోజూ ఒకటి చెయ్యడు. ఇది యజమానీ శ్రామిక సంబంధం కాదు. ఈ శ్రామికుడు 'స్వతంత్ర ఉత్పత్తిదారుడి'గా (స్వతంత్ర శ్రామికుడిగా) లెక్కకు రావాలి. పియానో విలువ — 60C + 20V + 20S = 100గా ఉందనుకుందాం. పియానోలు తయారు చేసే వ్యక్తి, ఒక పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేస్తే, అతను ఒక పియానో చేసినప్పుడల్లా, 20V+20S=40 శ్రమ చేస్తాడు. ఆ శ్రామికుడి నించి పెట్టుబడిదారుడికి '20S' పోతూ ఉంటుంది. కానీ, ఆ శ్రామికుడు, ఒకరి ఇంటికి వెళ్ళి, పియానోని చేసి పెడతాడనుకుందాం. పియానోకి అవసరమయ్యే 60Cని ఆ ఇంటి వాళ్ళే తెచ్చుకుంటారు. ఆ 60C మీద శ్రామికుడు, తన 40 శ్రమ కలుపుతాడు. పియానో తయారవుతుంది. దాన్ని చేయించుకున్న వాళ్ళు, దాన్ని చేసిన వ్యక్తికి, 40 ఇస్తారు. పియానో విలువ 100 అవుతుంది. చేసిన వ్యక్తికి 40 రావడం అంటే, అతని 'శ్రమ విలువ' అంతా అతనికే అందింది. కాబట్టి, ఈ వ్యక్తి అనుత్పాదక శ్రామికుడు కాడు. స్వతంత్ర ఉత్పత్తిదారుడు అవుతాడు. ఈ వ్యక్తి, పియానోల ఉత్పత్తి సంస్థలో 'ఉత్పాదక శ్రామికుడిగా' ఉంటూనే, ఎవరి ఇళ్ళకైనా వెళ్ళి పియానోలు చేసి పెడితే, ఆ సంబంధంలో 'స్వతంత్ర ఉత్పత్తిదారుడే'.

ఒక వేళ, ఒక పియానోల పెట్టుబడిదారుడు, తన శ్రామికులలో ఒకరిని, ఒకరి ఇంటికి పంపి వాళ్ళకి పియానో చేసి ఇచ్చి రమ్మంటే, అప్పుడు ఆ శ్రామికుడు ఉత్పాదక శ్రామికుడు. ఆ ఇంటి వాళ్ళు, పియానో పెట్టుబడిదారుడికే శ్రమ ఛార్జీలు (40) చెల్లిస్తారు. అందులోంచి, ఉత్పాదక శ్రామికుడికి 20Vయే వస్తుంది. ఆ శ్రామికుడే స్వతంత్ర శ్రామికుడు అయితే, ఆ మొత్తం ఛార్జీలన్నీ అతనికే అందుతాయి. ఒక పని వాడు 'అనుత్పాదక' శ్రామికుడిగా లెక్కకు రావాలంటే, అతను ఒక ఇంటిలో గానీ, ఒక 'ఉత్పత్తి స్థలంలో' గానీ, ఒక యజమాని కింద జీతానికి పని చేసే వేతనశ్రామికుడిగా ఉండాలి. అలా కాని వ్యక్తి అనుత్పాదక శ్రామికుడు కాడు. ఇంటికి వచ్చి పియానో చేసి ఇచ్చిన శ్రామికుడి కోసం ఆ ఇంటి యజమాని తన 'ఆదాయం' లోంచి చెల్లించడం చూసి, ఆ శ్రామికుణ్ణి అనుత్పాదక శ్రామికుడిగా భావించడం పొరపాటు. ఆదాయంలో నించి ఖర్చు పెట్టడం అనేది, స్వతంత్ర ఉత్పత్తిదారుడితో ఒక పని చేయించుకున్నప్పుడూ, అతను తయారు చేసిన వస్తువుల్ని కొన్నప్పుడూ కూడా జరుగుతుంది. కాబట్టి, 'ఆదాయం'లోంచి చెల్లించడాన్ని మాత్రమే చూసి, అమ్మిన వ్యక్తిని, 'అనుత్పాదక శ్రామికుడు' అని నిర్ణయించడానికి వీలు లేదు. ఈ సంగతి మార్క్సుకి తెలియదనీ, తెలియకనే అలా చెప్పాడనీ అనుకోగలమా? రాయడంలో కొన్ని సార్లు అలాంటి పరాకులూ, పొరపాట్లూ జరుగుతూనే వుంటాయి.

**2)** ఇప్పుడు చూడబోయే కొటేషన్ మహా గందరగోళంగా ఉంటుంది. రాయడంలో కొన్ని సార్లు అలాంటి

పొరపాట్లు జరుగుతూనే వుంటాయి. అనువాదం ఎంత జాగ్రత్తగా చేసినా, గందరగోళం తప్పడం లేదు. జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

" నేను తొడుక్కోవడానికి, ఒక టైలర్‌తో, ఇంటి దగ్గిరే ఒక కోటుని తయారుచేయించుకున్నప్పుడు, ఆ విషయం నన్ను ఆర్థిక అర్థంలో 'యజమానిగా' చెయ్యదు. ఒక 'యజమాని — టైలరు', తన పని వాళ్ళు తయారు చేసిన కోటుని, తన స్వంత అవసరానికి వాడుకున్నప్పుడు, అది, 'యజమాని — టైలర్ని' ఎలాగైతే యజమానిగా చెయ్యదో, అలాగే, నా విషయంలో జరిగింది కూడా నన్ను అంత కన్నా ఎక్కువేమీ యజమానిగా చెయ్యదు. ఇక్కడ, కుట్టు శ్రమని కొన్నవాడూ, కోటుని కుట్టిన టైలరూ, కేవలం కొనుగోలుదారుడు గానూ, అమ్మకందారుడు గానూ మాత్రమే ఒకరికొకరు ఎదురవుతారు. ఒకరు డబ్బు చెల్లిస్తే, ఆ డబ్బు ఏ ఉపయోగపు విలువ రూపంలో కైతే మారిందో, ఆ ఉపయోగపు విలువని ఇంకొకరు సరుకుగా చెల్లిస్తారు. ఈ లావాదేవికీ, నేను ఒక షాపునించి కోటుని కొనడానికీ, తేడా ఏమీ ఉండదు. ఇక్కడ కొనుగోలుదారుడూ, అమ్మకం దారుడూ ఒకరికొకరు ఎదురవుతారు. దీనికి భిన్నంగా ఇంకో ఉదాహరణలో అయితే, 'పెట్టుబడి'గానూ, 'వేతన శ్రమ'గానూ ఒకరికొకరు ఎదురవుతారు.

'గృహ సేవకుడి'కి (డొమెస్టిక్ సర్వెంట్‌కి) సంబంధించి చూస్తే, అతని విషయం, ఇంటికి వచ్చి కుట్టి పెట్టే టైలరు విషయంలో లాగే ఉంటుంది. ఈ ఇద్దరూ, కేవలం కొనుగోలుదారులూ, అమ్మకం దారులూ మాత్రమే (సెల్లర్స్ అండ్ బయర్స్). కానీ, 'గృహ సేవకుడి' విషయంలో అయితే, 'ఉపయోగపు విలువ'ని అనుభవించే పద్ధతి, యజమానీ సేవకుల స్వభావంతో ఉండే పితృస్వామిక సంబంధ రూపంలో, ఏ సంబంధమైతే 'ఆర్థిక రూపం'లో మార్పుగా లేక పోయినప్పటికీ 'విషయం'లో మార్పు గానూ అరుచి గానూ ఉంటుందో, ఆ సంబంధ రూపంలో ఉంటుంది. ఇక్కడ ఆ సంబంధ రూపం ఒకటి, అదనంగా ఉంటుంది." (అదనపు విలువ సిద్ధాంతాలు-1. పేజీ-296).

మార్క్సు, ఈ కొటేషన్‌లో, ఇంటికి వచ్చి కోటు కుట్టి ఇచ్చే శ్రామికుణ్ణి అనుత్పాదక శ్రామికుడిగా గాక, స్వతంత్ర శ్రామికుడి గానే చెపుతున్నాడు. ఆ స్వతంత్ర శ్రామికుడికి, ఆ ఇంటి మనిషి, యజమానిగా ఉండడనీ, గృహ సేవకుడి మీద మాత్రం యజమానిగా ఉంటాడనీ, చెపుతున్నాడు. కానీ వాళ్ళిద్దర్నీ 'ఆర్థిక అర్థం'లో సమానం చేస్తున్నాడు. ఆ ఇద్దర్నీ కూడా, వాళ్ళ శ్రమల్ని తీసుకున్న ఇంటి వాళ్ళతో, అమ్మే, కొనే సంబంధాలలో ఉండే వాళ్ళుగా (సెల్లర్స్ అండ్ బయర్స్‌గా) చెపుతున్నాడు. ఇదంతా 'స్వతంత్ర' శ్రామికుడి విషయం లోనే కరెక్టు. గృహ సేవకుడి విషయంలో తప్పు. గృహ సేవకుడు ఇచ్చే శ్రమా, యజమాని ఇచ్చే జీతమూ, సరి సమానమైన విలువలతో, సెల్లర్స్‌కీ బయర్స్‌కీ మధ్య ఉండే సంబంధంతో ఉంటాయని చెప్పడం అంటే, గృహ సేవకుడి విషయంలో 'అదనపు శ్రమ' ఉండదని చెప్ప డమే. ఇది పొరపాటు. ఇది, మార్క్సే వేరే చోట కరెక్టుగా చెప్పిన అంశాలకు విరుద్ధం.

యజమానీ శ్రామిక సంబంధం ఉందంటే — అక్కడ శ్రమ దోపిడీ ఉండి తీరుతుంది. ఉత్పాదకంగా గానీ, అనుత్పాదకంగా గానీ. దోపిడీయే లేకపోతే, అది సమానత్వమే. అక్కడ యజమానీ శ్రామికత్వాలు ఉండవు. కాబట్టి, గృహ సేవకుడు అదనపు శ్రమని పోగొట్టుకునే శ్రామికుడే. ఈ రకం శ్రామికుడూ, స్వతంత్రుడైన కుట్టుమనిషీ ఒకే కోవకు చెందరు.

ఈ కొటేషన్‌లో, మొదటి వాక్యాల్లో కూడా ఒక పొరపాటు ఉంది. ఒక ఇంటి వాళ్ళు ఒక కుట్టు మనిషిని ఇంటికి పిలిపించుకుని కోటు కుట్టించుకుంటే, అతని శ్రమ విలువ అంతా (20V + 20S = 40ని) చెల్లిస్తారు. అది యజమానీ శ్రామిక సంబంధం కాదు. ఇది సరిగానే ఉంది. కానీ ఈ ఉదాహరణని, యజమానిగా వున్న టైలరు ఉదాహరణతో సమానం చెయ్యడం సరిగా లేదు. యజమాని టైలరు, తన శ్రామికుడు కుట్టిన కోటుని తన స్వంతానికి వాడుకుంటే, ఆ శ్రామికుడికి Sని కూడా చెల్లించినట్టు అర్థమా? — కాదు. ఆ కోటు కుట్టినందుకు శ్రామికుడికి అందేది 20V మాత్రమే. 20S అందదు. ఆ కోటుని, యజమాని, బైటికి అమ్మినా తన స్వంతానికి వాడుకున్నా, అందులో వున్న S కి చెల్లింపు ఉండదు. అలాంటప్పుడు కోటుకి సంబంధించి, యజమాని టైలరు ఉదాహరణా, వేరే ఇంటి వాళ్ళ ఉదాహరణా, ఒకటి ఎలా అవుతాయి?—దీన్ని సరిగా అర్థం చేసుకోవాలి. — తర్వాత చూడబోయే కొటేషన్‌లో కూడా ఇలాంటి పొరపాటే ఉంది.

**3)** ".... రెండవ వారు (అనుత్పాదక శ్రామికులు), మొదటి వారికి (లాభాల్నీ, కౌలునీ పొందే వారికి) 'ఆదాయాల్ని' వినియోగించుకోవడంలో సహాయపడి, తిరిగి వారికి, తమ 'సేవల' రూపంలో,

ఒక 'ఈక్వివలెంట్'ని ఇస్తారు."

(అదనపు విలువ సిద్ధాంతాలు-1. పేజీ-218)

'ఈక్వివలెంట్'ని ఇవ్వడం అంటే, ఇచ్చే విలువా, తీసు కునే విలువా సమానంగా ఉంటాయి — అని అర్థం. 'అనుత్పాదక శ్రామికులు ఈక్వివలెంట్‌ని ఇస్తారు' అన్న ప్పుడు, ఈ శ్రామికులు యజమానులకు ఇచ్చే శ్రమ విలువా, వాళ్ళనించీ తీసుకునే జీతాల విలువా సమా నంగా ఉంటాయనీ, అనుత్పాదక శ్రామికుల విషయంలో 'అదనపు శ్రమ' ఉండదనీ, చెపుతున్నట్టు అర్థం వస్తుంది. అందుకే ఇది కూడా పొరపాటే.

4) "దాని (అనుత్పాదక శ్రమకి సంబంధించిన) వినియోగాన్ని సూత్రీకరించవలసింది M-C-Mగా కాదు, C-M-Cగా. .... ఇక్కడ, డబ్బు కేవలం 'చలా మణీ సాధనం'గా మాత్రమే పని చేస్తుందిగానీ 'పెట్టుబడి'గా కాదు."

(కాపిటల్-1. పెంగ్విన్ ఎడిషన్. పేజీ-1041).

C-M-C అనే సూత్రం, సమాన విలువలుగల సరుకుల మారకాలనే సూచిస్తుంది. అనుత్పాదక శ్రామి కుడికీ, అతని యజమానికీ జరిగే మారకాన్ని ఈ సూత్రం ద్వారా చెప్తే, ఆ మారకం, 'సమాన విలువల' మారకం గానే ఉందనే అర్థాన్ని ఇస్తుంది. ఇది తప్పు. అనుత్పాదక శ్రమ, యజమానికి ఉపయోగపు విలువనే ఇచ్చినప్పటికీ, అది యజమాని ఇచ్చిన డబ్బుకన్నా 'ఎక్కువ ఉపయోగపు విలువ'ని ఇస్తుంది. కాబట్టి, ఈ సంబంధాన్ని C-M-Cగా చెప్పడం సరి కాదు. అలా చెప్తే, అనుత్పాదక శ్రామి కులు, 'అదనపు శ్రమ' ఇవ్వరనే అర్థం వస్తుంది. కాబట్టి, దాన్ని C-M-C సంబంధంగా గాక, ఎలా చెప్పవచ్చునో ఆలోచించి ఇంకో సూత్రీకరణ తయారు చెయ్యాలి (ఇంతకు ముందు ఇచ్చిన 'శ్రమ సంబంధాల సూత్రీకర ణల పట్టిక' చూడండి).

విషయాల్ని ఇలా చెప్పవలసి ఉండగా, మార్క్సు, 'అనుత్పాదక శ్రమ'ని వివరించడంలో, కొన్ని చోట్ల సరి గానూ, కొన్ని చోట్ల పొరపాటుగానూ ఉన్నాడు. 'కాపి టల్-2'లో 'చలామణీ ఖర్చుల' గురించి చెప్పిన చోట, అనుత్పాదక శ్రమ గురించి చాలా ఖచ్చితమైన, 'పూర్తిగా సరియైన' అభిప్రాయాలు ఇచ్చాడు. వాటికి వ్యతిరేకమైన అర్థాలు వచ్చే పొరపాట్లు ఎలా జరిగాయో గానీ, వాటిని పొరపాట్లు గానే అర్థం చేసుకుని వదిలివెయ్యాలి.

అనుత్పాదక శ్రమలు 'అదనపు శ్రమ'ని ఇస్తాయని ఒక చోటా, ఇవ్వవని ఒక చోటా, చెప్పడం వల్ల, ఈ పరిస్థితి, మనల్ని మొదట చాలా అయోమయంలో పడేస్తుంది. ఇందులో ఏదో ఒక విషయాన్ని 'పొరపాటు' అని నిర్ధారణ చేసుకుంటే తప్ప, దీన్ని సరిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. 'జీతం అంటే శ్రమశక్తి విలువే' అనే సూత్రాన్నే ఆధారం చేసుకుంటే, 'అనుత్పాదక శ్రమలు కూడా అద నపు శ్రమని ఇస్తాయి' అనే విషయాన్నే సరైన విషయంగా ఎంచుకుంటాము. దానికి వ్యతిరేకంగా ఉన్న వాటిని 'పొర పాట్లు'గా భావించి వదిలివేస్తాము.

గృహ సేవకులు కేవలం 'అరుచికరమైన యజమానీ సేవకుల' సంబంధంతో ఉండడమే కాదు, 'ఆర్థిక అర్థం'లో కూడా దోపిడీకి గురి అవుతారు. అలా కాకపోతే, రాత్రింబగళ్ళూ శ్రమ చేస్తూ కూడా జీవితమంతా నిత్య దరిద్రం లోనే ఎందుకు ఉంటారు? — ఈ ప్రశ్న చాలా మామూలు లోకజ్ఞానంతో కూడా రావాల్సిన ప్రశ్న. 'పేద తనంలో ఉన్న శ్రామికులంతా దోపిడీకి గురి అవుతున్న వాళ్ళే' అనే అభిప్రాయానికి రావడం, ఆర్థిక దోపిడీ గురించి తెలిసిన వాళ్ళకి, ఎక్కువ కష్టం కాదు.

'అనుత్పాదక శ్రమ విషయంలో అదనపు శ్రమా, దోపిడీ ఉండవు' అనే పద్ధతిలో గనక అర్థం చేసుకుంటే, అప్పుడు 'కార్మికవర్గం అంటే ఉత్పాదక కార్మికులు మాత్రమే' అనే పొరపాటు అర్థానికి రావలసి వస్తుంది.

ఉత్పాదక, అనుత్పాదక తేడాలు, ఆ శ్రమల్ని ఉప యోగించుకునే యజమానికి సంబంధించినవేగానీ, ఆ శ్రమల్ని ఇచ్చే శ్రామికులకు సంబంధించినవి కావు. 'వేతన శ్రామికుడి'గా ఉన్నప్పుడు, ఉత్పాదక శ్రామికుడైనా అను త్పాదక శ్రామికుడైనా, ఆ ఇద్దరూ, దోపిడీకి గురి అయ్యే వాళ్ళే. దోపిడీయే లేకపోతే, ఉత్పాదక శ్రామికుడికీ, అను త్పాదక శ్రామికుడికీ కూడా పేదతనం ఉండదు. యజ మానుల దగ్గిర దాస్యం ఉండదు. కాబట్టి, ఉత్పాదక — అనుత్పాదక శ్రామికులందరూ ఆర్థికంగానూ సాంఘి కంగానూ, అన్ని రకాలుగానూ కూడా, దోపిడీవల్ల పుట్టుకు వచ్చే సమస్యలలో ఉంటారు. అనుత్పాదక శ్రమల్ని కూడా సరిగా అర్థం చేసుకుంటేనే కార్మికవర్గం అంటే ఏమిటో సరిగా అర్థం చేసుకుంటాము. ఉత్పాదక — అనుత్పాదక శ్రామికులందరూ కలిసే కార్మికవర్గం అవుతారనీ, ఉత్పా దక శ్రామికులు మాత్రమే కార్మికవర్గం కాదనీ, అర్థం చేసుకుంటాము.

మార్క్సు నించి ఈ సందర్భంలో ఇంకో కొటేషన్ కూడా చూడాలి.

".... వేశ్య నించీ రాజు వరకూ చేసే భిన్నమైన

కార్యకలాపాల ధర, వేతన శ్రమ ధరని నిర్దేశించే సూత్రాలకే లోబడి ఉంటుంది."

(కాపిటల్-1; పే-1042; పెంగ్విన్ 1976)

ఈ మాటలు చెప్పిన మొత్తం సందర్భాన్ని తీసుకోకుండా, ఈ నాలుగు మాటలనే విడిగా చూస్తే, వీటిని అర్థం చేసుకోవడంలో చాలా తప్పు చేస్తాం. రాజు కూడా వేతన శ్రామికుడిగా జీతం మాత్రమే తీసుకుని అదనపు విలువని పోగొట్టుకుంటాడని చెపుతున్నట్టుగా అర్థం చేసుకుంటాం. కానీ, అలా అర్థం చేసుకోకూడదనే మార్క్సు చెపుతున్నాడు. ఆ మొత్తం సందర్భం ఇలా ఉంటుంది.

"పెట్టుబడిదారీ విధానంలో, అన్ని ఉత్పత్తులూ సరుకులు కావడమూ, అన్ని రకాల శ్రమలూ వేతన శ్రమలు కావడమూ ఒక స్పష్టమైన ధోరణి అయి పోతుంది. గతంలో ఒక రకమైన పవిత్రతా భావం కలిగిన అనేక విధులూ కార్యకలాపాలూ — ఏవైతే గతంలో ఉచితంగా గానీ, ఒకరికి ఒకరు సహాయపడే విధంగా గానీ జరిగేవో — అలాంటి కార్యకలాపాలన్నీ వేతన శ్రమలుగా మారిపోతాయి — ఆ కార్యకలాపాలూ వాటికి చెల్లింపులూ ఎన్ని రకాలుగా ఉన్నప్పటికీ. ఇంకోవేపు వేశ్య నించీ రాజు వరకూ చేసే భిన్నమైన కార్యకలాపాల ధర, వేతన శ్రమ ధరను నిర్దేశించే సూత్రాలకే లోబడి ఉంటుంది. <u>ఈ చివరి విషయంలో ఇమిడి ఉన్న అంశాలను 'వేతన శ్రమా — వేతనాలూ' అనే వాటి గురించి ప్రత్యేకంగా చేసే పరిశీలన లోనే చూడవలసి ఉంటుంది.</u> పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పెరిగే కొద్దీ, అన్ని కార్యకలాపాలూ వేతన శ్రమలు గానూ, ఆ శ్రమలు చేసిన వారు వేతన శ్రామికులు గానూ పరివర్తన చెందడం అనే వాస్తవాల వల్ల, వారిని ఉత్పాదక కార్మికులుగా భావించడం ఎక్కువ అవుతుంది. కేవలం ఆ కార్యకలాపాలు వేతన శ్రమలుగా మారడం అనే ఒక్క లక్షణం ఉండడం వల్లనే. ఈ గందరగోళం ఇక్కడ ఎందుకు ఉంటుందంటే, ప్రతీ శ్రమా వేతన శ్రమగా పరివర్తన చెందడం అనేది పెట్టుబడిదారీ విధానంలోనే పుట్టు కొస్తుంది కాబట్టి."

(కాపిటల్-1; పే-1041-42; పెంగ్విన్ 1976)

ఈ అంశాల్ని బట్టి గ్రహించవలసింది ఏమిటంటే — 'జీతం' పేరుతో కనపడ్డ ప్రతిచోటా, అది శ్రామికుల జీతం పద్ధతిలోనే ఏర్పడినట్టుగా భావించకూడదు — అని. 'జీతం' అనే దానికి జనరల్ సూత్రం — 'పోషణకు సరిపోయే విలువ' అనేదే. కానీ, ఈ జనరల్ సూత్రం, అన్ని ప్రత్యేక పరిస్థితులకూ యథాతథంగా వర్తించదు. ప్రతీ జీతమూ కనీస పోషణ సూత్రంతోనే ఉండదు. ఒకవేళ అన్ని జీతాలకూ ఆ పోషణ సూత్రాన్నే తీసుకుంటే, ఆ శ్రమల్లో తేడాల్ని బట్టి ఆ పోషణ అంశాలు కూడా చాలా తేడాగా ఉంటాయి. ఆ రకంగా చూసినా, ఆ జనరల్ సూత్రం కొన్ని చోట్ల బొత్తిగా వర్తించని సూత్రం అయి పోతుంది.

రాజులకు, వెనకటి సమాజాలలో జీతాల పద్ధతి లేదు. ఖజానా లోంచి ఎంత వాడినా అది రాజు గారి ఇష్టమే. కానీ పెట్టుబడిదారీ విధానంలో పరిపాలన చేసే ప్రెసిడెంట్లూ గవర్నర్లూ ప్రధానమంత్రులూ ముఖ్య మంత్రులూ — వంటి వాళ్ళందరికీ జీతాల పద్ధతే ఉంటుంది. ఆ జీతాలు వాళ్ళ హోదాల్ని బట్టి ఉంటాయి. ఈ పరిపాలకులు చేసేది — సంతకాలు పెట్టడం తప్ప ఇంకే శ్రమా ఉండదు. కానీ వాళ్ళకి కూడా జీతాలు ఉంటాయి. ఆ పరిపాలకులందరూ గొప్ప గొప్ప శ్రమలు చేస్తున్నట్టూ, వాళ్ళ జీతాలు ఆ గొప్ప శ్రమలకు తగ్గట్టుగానే ఏర్పడుతున్నట్టూ కనపడుతుంది. 'జీతాలు' అనే పేరు వల్ల, ప్రెసిడెంట్లూ ప్రధాన మంత్రులూ కూడా 'వేతన శ్రామికులు గానే' కనపడతారు. యంత్రాన్ని నడిపే సాధారణ కార్మికుడూ, దేశాన్ని పాలించే ప్రెసిడెంటూ కూడా జీతం పద్ధతి మీద పని చేస్తున్న వారి లాగానే కనపడతారు. పరిపాలకులకు అందేది జీతాల రూపంలో అందుతుంది కాబట్టి, ఆ జీతం శ్రమ శక్తి విలువేననీ, వాళ్ళు ఇంకా ఎంతో అదనపు విలువని పోగొట్టుకుంటున్నారనీ అర్థమా? - కాదు. జీతం రూపం అన్ని చోట్లా ఒకే అర్థంతో ఉండదు. అసలు శ్రమే లేనిచోట్ల కూడా జీతాలు ఉండే సందర్భాలు ఇవి!

'వేశ్య' సంగతి తీసుకుంటే — ఈమె కార్యకలాపం ఏ శ్రమ కిందకీ రాదు. కానీ, ఈమె ద్వారా వ్యభిచార గృహం నడిపే పెట్టుబడిదారుడికి డబ్బు పెరుగుతుంది కాబట్టి, ఈమె ఉత్పాదక శ్రామికురాలి గానే కనపడుతుంది. ఇవన్నీ 'జీతం' అనే రూపం వల్ల ఏర్పడే గందరగోళాలు.

కాబట్టి, 'జీతం' అనేది కనపడ్డ ప్రతీచోటా, కేవలం దాన్ని చూసి, <u>జీతం ఉంది కాబట్టి అక్కడ తప్పనిసరిగా శ్రమ ఉంటుందనీ, అది ఉత్పాదక శ్రమగా కూడా ఉంటుందనీ, రాజూ పేదా కూడా ఒకే రకమైన వేతన శ్రామికులేననీ — ఇలా భావించకూడదు.</u> ప్రత్యేక పరిస్థితుల్ని ప్రత్యేకంగానే పరిశీలించి చూడాలి. — ఇదీ మార్క్సు మాటల అర్థం. ఈ విషయాలు సరిగా అర్థం చేసుకోకపోతే, 'వేశ్యా, రాజూ ఉదాహరణ' పొరపాటు అర్థాలకు దారి తీస్తుంది.

# పోలీసులూ, సైనికులూ కార్మికులేనా?

**పో**లీసులూ సైనికులూ కోర్టు మనుషులూ జైలు మనుషులూ — వీరందరూ చేసే పనులు అసలు శ్రమ క్రమాల కిందకి రావు. అయినప్పటికీ వీరందరూ యజమానికి లోబడి జీవించే వారే. ప్రభుత్వమే వీరి యజమాని. యజమానుల ఆజ్ఞల కింద పని చెయ్యవలసినప్పుడు, చేసే వాళ్ళ ఇష్టా యిష్టాలకు అవకాశం ఉండదు. యజమాని చెప్పే పని చెయ్యడమే వారి ఉద్యోగం. ఆ ఉద్యోగాలు మానవ జీవితాలకు నిజంగా అవసరమైనవి అయినా, కాకపోయినా ఆ పనులనే శ్రమలుగా అనుకుంటే, ఈ ఉదాహరణలో వున్న శ్రమలు, ప్రభుత్వపు ఆదాయాన్ని ఖర్చుచేసే శ్రమలుగా ఉంటాయి. కాబట్టి, అవి అనుత్పాదక శ్రమలు.

> "సైనికుడు — వేతన శ్రామికుడే. కానీ అంత మాత్రాన అతడు ఉత్పాదక శ్రామికుడు అవడు" — మార్క్స్. (కాపిటల్-1; పే. 1042)

అనుత్పాదక శ్రామికులు కూడా శ్రామిక వర్గంలో భాగమే కాబట్టి, పోలీసూ సైనికులూ వంటి వారందర్నీ కూడా కార్మికులు గానే అర్థం చేసుకోవాలి. ఈ సెక్షన్లలో ఉన్నతాధికారులు తప్ప సాధారణ ఉద్యోగులందరూ కార్మిక వర్గమే అవుతారు.

కానీ, వీరు చేసే ఉద్యోగాలు, బయటి కార్మికుల్ని అణిచే ఉద్యోగాలే. వీరు రాజకీయంగా కార్మిక వర్గానికి వ్యతిరేకులే అవుతారు. కాబట్టి, వీరిని కార్మికులుగా భావించడం పొరపాటుగా కనపడుతుంది.

కానీ, వీరిని కార్మికులుగా అర్థం చేసుకోవడానికి ఏ లక్షణాలైతే మనకు అభ్యంతరాలుగా ఉంటాయో అలాంటి లక్షణాలు, ఉత్పాదక కార్మికుల విషయంలో కూడా బోలెడు ఉంటాయి. ఉత్పాదక కార్మికులు కూడా యజమానుల ఆజ్ఞల ప్రకారం, కార్మిక ప్రయోజనాలకు హాని కలిగించే పనులెన్నో చేస్తారు. ఉత్పాదక కార్మికులందరూ ధాన్యమే, బట్టలే ఉత్పత్తి చెయ్యరు. అనేక రకాల తప్పుడు ఉత్పత్తులన్నీ ఉత్పత్తి చేస్తారు. కత్తులూ, తుపాకులూ, బాంబులూ, యుద్ధ విమానాలూ, యుద్ధ నౌకలూ, చిత్ర హింసల పని ముట్లూ, మత్తు మందులూ, పోలీసులూ సైనికులూ ఉపయోగించే లాఠీలూ టోపీలూ యూనిఫారాలూ సమస్త ఆయుధాలూ, ఇవన్నీ ఉత్పత్తి చేసేది ఉత్పాదక శ్రామికులే. మరి వీరి మాటేమిటి? పెట్టుబడిదారుడికి కావలసిన టెక్నిక్కులతో కార్మికుల నించి ఎక్కువ శ్రమని లాగే విధంగా యంత్రాల్ని తయారు చేసే ఇంజనీర్ల మాటేమిటి? సైంటిస్టుల మాటేమిటి? పెట్టుబడిదారీ భావజాలానికి అనుగుణమైన పాఠ్య గ్రంథాలు రాసే టీచర్ల మాటేమిటి? నిరుపేద కార్మిక జనాలకు సంభవించే ప్రమాద వార్తల్నీ, వారిపై మూకుమ్మడి హత్యా వార్తల్నీ కూడా పట్టించుకోకుండా, దోపిడీ ప్రభుత్వ నేతల దిన చర్యల్నీ, తల నొప్పుల్నీ, వారి కుక్కల, గుర్రాల ముద్దు పేర్లనీ పెద్ద పెద్ద శీర్షికలతో పేపర్ల నిండా వర్ణిస్తూ రాసే జర్నలిస్టుల మాటేమిటి? — ఈ రకంగా చూస్తే, 'ఉత్పాదక కార్మికులు' కూడా యజమానుల ఆజ్ఞల ప్రకారం పని చెయ్య వలసిందే. అందులో వారి ఇష్టా యిష్టాలేమీ ఉండవు. వారు ఉత్పత్తి చేసే ధాన్యమూ, బట్టలూ వంటి జీవితావసర ఉత్పత్తుల సంగతి తీసుకున్నా, అవి కూడా అనేక రకాల కల్తీ పద్ధతుల్లో తయారైనవై ఉంటాయి. అవన్నీ యజమానులు చెప్పినట్టుగా కార్మికులు చెయ్యవలసిందే.

తుపాకుల్ని ఉత్పత్తి చేసే వాళ్ళు శ్రామికులే అయినప్పుడు, ఆ తుపాకులతో పని చేసేవాళ్ళు శ్రామికులు కాకుండా ఎలా పోతారు?

'శ్రామికులు' అవడానికి ప్రధాన లక్షణం 'శ్రమ చెయ్యడం.' అది, 'ఎలాంటి శ్రమ' అయినా సరే; అది 'ఎలాంటి సంబంధం'లో ఉన్నా సరే. అది, ఉత్పాదక శ్రమ అయినా, అనుత్పాదక శ్రమ అయినా, అది శ్రమ కాకుండా పోదు.

శ్రమ చేసే వారందరూ శ్రామికులే!

శ్రామికులందరూ కలిసే 'శ్రామిక వర్గం'.

శ్రామిక వర్గం — విముక్తి చెందడం అంటే, ఉత్పాదక, అనుత్పాదక శ్రామికులందరూ విముక్తి చెందడమే.

అయితే, అనుత్పాదక శ్రామికుల లోనూ, ఉత్పాదక శ్రామికుల లోనూ కూడా కొన్ని సెక్షన్లు 'శ్రామిక వ్యతిరేక' కార్యక్రమాల కోసమే పని చేస్తాయి. అనుత్పాదక శ్రామికుల్లో — పోలీసులూ, సైనికులూ, కోర్టు ఉద్యోగులూ, జైలు ఉద్యోగులూ — వంటి సెక్షన్లు, శ్రామిక పోరాటాల్ని అణిచే పాత్రని నిర్వహిస్తాయి. అలాగే, ఉత్పాదక శ్రామికుల్లో ఇంజినీర్లూ, సైంటిస్టులూ, సూపర్‌వైజర్లూ, టెక్నీషియన్లూ — వంటి సెక్షన్లు, యజమానుల లాభాలకు అనుకూలంగా, సాధారణ శ్రామికుల నించీ 'ఎక్కువెక్కువ శ్రమని లాగే' పెత్తందారీ పాత్రని నిర్వహిస్తాయి. అందుకే, ఈ సెక్షన్లు, మిగిలిన శ్రామికులకు, 'శ్రామిక వ్యతిరేకులు'గా కనపడతాయి.

సాధారణ శ్రామికులకూ, ఆ సాధారణ శ్రామికులకు

హాని చేసే ఉద్యోగాలు నిర్వహించే శ్రామికులకూ ఉండే 'తేడా'ని, సాధారణ శ్రామికులు తప్పనిసరిగా గ్రహించ వలసిందే. వ్యతిరేకులతో ఎలా ప్రవర్తించాలో అలా వారితో ప్రవర్తించవలసిందే. అయితే, వ్యతిరేకులుగా కనపడే ఆ శ్రామికుల వెనక 'అసలైన వ్యతిరేక వర్గం' ఒకటి ఉందనే సంగతి కూడా గ్రహించాలి. శ్రామికులు, దోపిడీ వర్గాన్ని గ్రహించకపోతే, అసలు గ్రహించవలసిన దాన్ని గ్రహించ లేదని అర్థం.

ఉత్పాదక — అనుత్పాదక శ్రామికులందరూ కలిసే 'దోపిడీ వర్గానికి' సేవ చేస్తారు కాబట్టి, ఆ రెండు రకాల శ్రామికులూ కలిసిన మొత్తమే కార్మిక వర్గం. ఇది కార్మిక వర్గానికి — జనరల్ సూత్రం. అందులో, ఒక్కొక్క ప్రత్యేక సెక్షనూ నిర్వర్తించే పాత్రని బట్టి, దాని ప్రత్యేక పరిస్తితుల్ని వేరుగా చూడాలి. ఏ సెక్షన్ని తీసుకున్నా, అందులో, పెద్ద పెద్ద జీతాల తోటీ, ప్రత్యేక సౌకర్యాల తోటీ, ఎంతో భాగం దోపిడీ రాబడి మీదే బతుకుతోన్న ఉన్నతాధికారులూ, దానికి విరుద్ధ పరిస్తితులలో జీవించే కింద స్థాయి ఉద్యోగులూ ఉంటారు.

'పోలీసు'లోనూ, 'సైన్యం' లోనూ కూడా, ఈ తేడాలు ఉంటాయి. కాబట్టి, దోపిడీ విధానాలమీద తిరగబాట్లు జరిగేటప్పుడు, ఆ సెక్షన్లలో ఉండే సాధారణ పోలీసులూ, సైనికులూ కూడా ఆ తిరగబాట్లలో కలుస్తారు. తిరగబాట్ల కోసం శ్రామికులందర్నీ సమీకరించే విప్లవ శ్రామికులు, పెట్టుబడిదారుల్లోకి పోయి పని చెయ్యరు. కానీ పోలీసుల్లోకీ, సైనికుల్లోకీ పోయి పని చేస్తారు. ఎందుకంటే, ఆ సెక్షన్లు కూడా దోపిడీ వర్గం సృష్టించే సమస్యలకు గురై బతుకుతోన్నవే కాబట్టి. అంటే, విశాలమైన అర్థంలో ఉత్పాదక — అనుత్పాదక కార్మికులందరూ కలిసిందే 'కార్మిక వర్గం'.

అయితే, కార్మిక వర్గానికి 'కేంద్రం' — ఉత్పాదక కార్మి కులే. అందులోనూ, 'శారీరక శ్రమల' కార్మికులే మరీ ప్రధానం. ఎందుకంటే వారే ఎక్కువ దోపిడీకి గురి అవుతూ ఎక్కువ అదనపు విలువని పోగొట్టుకుంటూ ఉంటారు గనక.

మార్క్సు ఏమంటున్నాడో చూడండి!

"పారిశ్రామిక కార్మికులలోని అతి తక్కువ జీతాలు గల (వరస్ట్ పెయిడ్) వారూ, వ్యవసాయ కార్మికులూ కలిసి 'కార్మికవర్గం'లో మెజారిటీగా ఉంటారు. ప్రధానంగా వీరి గురించే పట్టించుకునేలా ఈ పుస్తకం పరిమితులు మనల్ని ఒత్తిడి చేస్తాయి"— మార్క్స్. (కాపిటల్-1, పేజీ-611. మాస్కో ఎడిషన్, 1974).

పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్ని కలిపి చూస్తే, శారీరక శ్రమల జనాభాయే ఎక్కువ దోపిడీకి గురి అవుతారు.

ఒక దేశంలో ఒక ప్రాంతంలో, ఫ్యూడల్ కౌలు విధానం ప్రధానంగా ఉందా, జీతాల విధానం ప్రధానంగా ఉందా — అనేది ప్రధానమైన ప్రశ్న. జీతం విధానమే ప్రధానంగా ఉన్నా, ఫ్యూడల్ సంబంధాలు లేనేలేవని నిర్ణయించడానికి అది చాలదు. జీతం విధానంతో పాటు, శ్రామికులకు యజమానితో ఉండే ఇతర సంబంధాల్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి.

ఉన్నత స్థాయి అధికారుల గురించి మార్క్సు నించి కొన్ని ఆసక్తికరమైన మాటలు విందాం:

"ప్రభుత్వ అధికారులూ, మిలటరీ వాళ్ళూ, కళాకారులూ, డాక్టర్లూ, మత బోధకులూ, జడ్జీలూ, లాయర్లూ — మొదలైన 'ఉన్నత స్థాయి కార్మికులు' (హయ్యర్ గ్రేడ్ వర్కర్స్) అయిన ఒక పెద్ద సమూహంలో కొందరు, ఉత్పాదక కార్మికులు కాక పోవడమే కాదు, సారాంశంలో, వినాశకారులు (డిస్ట్రక్టివ్) కూడా. తమ ఇమ్మెటీరియల్ (వస్తు రూపంలో ఉండని) సరుకుల అమ్మకాల ద్వారా కొంతా, తమ సరుకుల్ని ఇతరుల మీద బలవంతంగా రుద్దడం ద్వారా కొంతా, ఆ రకంగా, 'మెటీరియల్ సంపద'లో నించి చాలా ఎక్కువ భాగాన్ని స్వాహా చెయ్యడమే వీరికి తెలుసు. విదూషకులూ (క్లౌన్స్), అధమ స్థాయి సేవకులూ (మీనియర్ సర్వెంట్స్) ఆర్థికంగా ఏ తరగతికైతే చెందుతారో ఆ తరగతికే తాము కూడా చెంది ఉండడమూ, ఉత్పత్తుల్ని వాడడంలో మాత్రమే (కంజంప్షన్‌లో) భాగస్వాములుగా కనిపించే వాళ్ళుగా ఉండడమూ, నిజమైన ఉత్పత్తిదారుల మీద పడి బతికే పరాన్న భుక్కులుగా (పేరసైట్స్‌గా) కనిపించడమూ, ఈ సమూహానికి ఎంత మాత్రమూ రుచించదు." (అదనపు విలువ సిద్ధాంతాలు-1. పేజీ-174.)

ఈ సమూహంలో కళాకారులూ, డాక్టర్లూ తప్ప మిగతా వాళ్ళ శ్రమలన్నీ అసహజ శ్రమలే. ఆ 2 రకాల వాళ్ళూ కూడా తమ 'శ్రమ విలువ'ని మించిన దాన్ని స్వాహా చేస్తూ ఉంటారని మార్క్సు అంటున్నాడు. ఈ సమూహంలో ఉండే రకపు వాళ్ళందరికీ, తాము 'అనుత్పాదక తరగతికి చెందిన వారిగా' లెక్కకు రావడం చాలా అయిష్టంగా ఉంటుంది. తమ పనులు కూడా సమాజానికి అవసరమేననీ, తమ శ్రమలు కూడా సహజ సంపదల్ని సృష్టించే ఉత్పాదక శ్రమలేననీ వాదించే రకంగా వీరి అభిప్రాయాలు ఉంటాయి. దోపిడీ సమాజాలకు ఈ

శ్రమలన్నీ అవసరమే అయినా, అవి అనుత్పాదక శ్రమలే!

"అనుత్పాదక శ్రామికులలో పనీ పాటాలేని ప్రభుత్వాధికారుల వంటి ఒక పెద్ద భాగం — కేవలం 'గౌరవనీయులైన' బికారులు. (రెస్పెక్టబుల్ పాపర్స్)" — (అదనపు విలువ సిద్ధాంతాలు-1, పేజీ-218).

సమాజంలో అతి నిరు పేదలుగా ఉండే 'బికారులు', ఇతరుల దయాదాక్షిణ్యాల మీదా, ప్రభుత్వాదాయంతో నడిచే శరణాలయాల వంటి సంస్థల దయ మీదా ఆధార పడి బతుకుతూ ఉన్నట్టుగానే, అనుత్పాదక తరగతిలో ప్రభుత్వ ఉన్నతాధికారులందరూ స్వంత శ్రమ లేకుండా ప్రభుత్వాదాయం మీద పడి బతుకుతారు. కాబట్టి, వాళ్ళు కూడా 'బికారులే'. కాకపోతే, 'గౌరవనీయులుగా కనపడే బికారులు!'

'రాజ్యాంగ యంత్రంలో అనుత్పాదక ప్రభుత్వాధి కారుల గుంపు ఉండడం బొత్తిగా అనవసరం' అని బూర్జువా వర్గం, ఒకప్పుడు వెనకటి సమాజాన్ని విమర్శిం చింది. కానీ, తర్వాత కాలంలో, ఆ బూర్జువా వర్గమే రాజ్యాధికారం ఫ్యూడల్ ప్రభువుల నించి తన చేతుల్లోకి వచ్చాక, రాజ్యాంగ యంత్రంలో అనుత్పాదక ప్రభు త్వాధికారులు ఉండడం తన వర్గ ప్రయోజనాలకు ఎంత తప్పనిసరో అది త్వరలోనే గ్రహించింది.

"....ఫ్యూడల్ రూపంలోనూ, నిరంకుశ ప్రభువుల పాలనా సంబంధమైన రూపంలోనూ ఉన్నప్పుడు ఏ యే అంశాలతో నైతే పెట్టుబడిదారీ సమాజం పోరా డిందో, ఆ అంశాలలో ప్రతీ ఒక్కదాన్నీ ఆ సమాజం, తన స్వంత రూపంలో పునరుత్పత్తి చేస్తుంది"

(అదనపు విలువ సిద్ధాంతాలు-1. పేజీ-175)

పెట్టుబడిదారీ సమాజం గత సమాజాలకన్నా మౌలి కంగా వేరే రకపు స్వభావం కలది కాదు — అని చెప్పడమే ఇది. గత సమాజాలలాగే పెట్టుబడిదారీ సమాజం కూడా దోపిడీ సమాజమే కాబట్టి, అది గతకాలపు చెడుగులన్నిటినీ ఎప్పటిలాగే నిలబెట్టి ఉంచుతుంది. కాకపోతే, తన విధానానికి తగిన ప్రత్యేక రూపంలో.

# ఉత్పాదక — అనుత్పాదక విభజన, 'పెట్టుబడిదారీ సమాజానికి' మాత్రమే ప్రత్యేకం!

'పెట్టుబడిదారీ సమాజం'లో ఉన్న శ్రమల ఉత్పా దక, అనుత్పాదక విభజనని చూసిన తర్వాత, ఇదే విషయం 'బానిస సమాజం'లోనూ, 'భూస్వామ్య సమాజం' లోనూ ఎలా ఉండగలదో పరిశీలిస్తే, అక్కడ ఉత్పా దక — అనుత్పాదక విభజన వర్తించదని తేలుతుంది.

ఒక బానిస యజమాని ఆధీనంలో కొంత మంది బానిసలు ఉన్నారనుకుందాం. (వారిలో స్త్రీలు కూడా ఉంటారు.) ఆ బానిసల్లో కొందరు యజమాని భూముల్లో వ్యవసాయం పనులు చేస్తే, కొందరు యజమాని కుటుంబం కోసం ఇంటి పనులు చేస్తారు. బానిసలందరికీ పోషణ కోసం ఖర్చయ్యే ఉత్పత్తులు వారి 'శ్రమ శక్తి విలువ'గా ఉంటాయి. 'జీతం' అనే పేరులేని జీతం అది. ఇంటా బయటా శ్రమ చేసే బానిసలందరూ 'అదనపు శ్రమ' చేస్తారు. అదనపు శ్రమతో 'అదనపు ఉత్పత్తులు' వస్తాయి. యజమాని కుటుంబం, ఏ శ్రమా చెయ్యకుండా జీవించగలగడానికి కారణం — బానిసల అదనపు శ్రమే.

అయితే, బానిసలు చేసే శ్రమల్లో బయట పొలాల్లో జరిగే వ్యవసాయ శ్రమనంతా 'ఉత్పాదక శ్రమ' అనీ, యజమాని ఇంటి దగ్గిర జరిగే శ్రమనంతా 'అనుత్పాదక శ్రమ' అనీ విభజించగలమా? — అలా సాధ్యం కాదు. ఎందుకంటే: పెట్టుబడిదారీ విధానంలో అయితే, పెట్టు బడిదారుడి దగ్గిర తయారయ్యే ఉత్పత్తి అంతా అమ్మకం లోకి వెళ్ళి 'డబ్బు'గా మారుతుంది. ఆ డబ్బులో నించి పెట్టుబడిదారుడికి 'అదనపు డబ్బు' అందుతుంది. కాబట్టి, ఆ బయటి శ్రమ అంతా పెట్టుబడిదారుడికి 'ఉత్పాదక శ్రమ'గా ఉంటుంది. కానీ, బానిస విధానంలో అలా జరగదు.

బానిస యజమాని పొలాల్లో జరిగే వ్యవసాయ శ్రమని చూస్తే, ఆ శ్రమ ద్వారా ఉత్పత్తి అయిన ధాన్యం అంతా 'సరుకు'గా మారదు. అందులో కొంతభాగం మాత్రమే అమ్మకానికి వెళ్తుంది. మిగిలిన భాగం బానిస కుటుంబాల పోషణకీ, యజమాని కుటుంబ పోషణకీ అవ సరమవుతుంది. అది, అమ్మకంలోకి వెళ్ళదు. అమ్మకం లోకి వెళ్ళిన ధాన్యం మాత్రమే డబ్బుగా మారుతుంది. మిగిలిన భాగం డబ్బుగా మారదు. అలాంటప్పుడు వ్యవ సాయ శ్రమలోనే కొంత భాగం ఉత్పాదక శ్రమగానూ, కొంత భాగం అనుత్పాదక శ్రమగానూ అవుతుందా? వ్యవసాయ శ్రమ చేసిన బానిసలు ఒక వేపు ఉత్పాదక

శ్రామికులూ, ఇంకో వేపు అనుత్పాదక శ్రామికులూ కూడా అవుతారా? — ఇది అర్థరహితమైన విషయం. బానిస సమాజంలో 'అదనపు శ్రమ' ఉంటుంది. అది 'అదనపు ఉత్పత్తి'ని ఇస్తుంది. కానీ, అది 'డబ్బు'గా మారదు. కాబట్టి, ఉత్పాదక — అనుత్పాదక విభజన, పెట్టుబడిదారీ సమాజానికి వర్తించినట్టుగా బానిస సమాజానికి వర్తించదు.

అలాగే, ఈ విభజన, భూస్వామ్య సమాజానికి కూడా వర్తించదు. ఈ సమాజంలో కూడా బయట తయారయ్యే ఉత్పత్తులన్నీ అమ్మకం లోకి వెళ్ళవు. డబ్బుగా మారవు. కౌలు రైతులు పండించిన ధాన్యంలో, ఆ రైతుల కుటుంబాల కోసమూ, భూస్వామి కుటుంబం కోసమూ వాడకం అయ్యే భాగం వరకూ అనుత్పాదక శ్రమ అనీ, అమ్మకం లోకి వెళ్ళే భాగమే ఉత్పాదక శ్రమ అనీ విభజించ వచ్చునా? అప్పుడు, ఆ ధాన్యాన్ని పండించిన రైతు కుటుంబాల సభ్యులు, ఉత్పాదక శ్రామికులూ, అనుత్పాదక శ్రామికులూ కూడా అవుతారు. బానిస సమాజంలో లాగే ఇది అర్థ రహితమే. ఈ రకంగా, ఉత్పాదక — అనుత్పాదక విభజన గత సమాజాలకు వర్తించదు, ఆ సమాజాలలో కూడా యజమాని వర్గం, శ్రామికుల అదనపు శ్రమని దోపిడీ చెయ్యడం ఉన్నప్పటికీ.

**దీన్ని మార్క్సు మాటల్లో చూద్దాం:**

> "వెనకటి ఉత్పత్తి విధానాలలో, వేటిలోనైతే పెట్టుబడికీ వేతన శ్రమకూ మధ్య సంబంధాలు ఇంకా ఉనికి లోకి రాలేదో అక్కడ, దాని పర్యవసానంగా, 'ఉత్పాదక శ్రమా — అనుత్పాదక శ్రమా' అనే పెట్టుబడిదారీ భావనలు, ఏ మాత్రమూ అన్వయించవు" — (కాపిటల్-1, పెంగ్విన్, 1042)

కాబట్టి, శ్రమల్లో ఈ ఉత్పాదక — అనుత్పాదక విభజన పెట్టుబడిదారీ విధానానికే ప్రత్యేకం.

# 'నూతన సమాజం'లో ఉత్పాదక, అనుత్పాదక విభజన ఉంటుందా?

**'నూ**తన సమాజం' అన్నప్పుడల్లా, దాన్ని, 'దోపిడీ లేని సంబంధాలు గల సమాజం'గా ఊహించాలి. మార్పులు అప్పుడే ప్రారంభమై, అవి ఇంకా అరకొరగా ఉన్న దశల్ని తీసుకోకూడదు. ప్రారంభ దశల్లో అయితే, పాత సమాజాల లక్షణాలు ఇంకా అనేకం ఉంటాయి. కాబట్టి, నూతన సమాజాన్ని 'స్వచ్ఛమైన స్వభావం'తోనూ, 'స్పష్టమైన రూపం'తోనూ ఏర్పడివున్న సమాజంగా ఊహించాలి. అప్పుడే దోపిడీ స్వభావానికి విరుద్ధమైన స్వభావమూ, దోపిడీ రూపానికి విరుద్ధమైన రూపమూ అర్థమవుతాయి.

మన ప్రశ్నకి జవాబు మొదట క్లుప్తంగా, ఉత్పాదక అనుత్పాదక విభజన నూతన సమాజానికి వర్తించదు అని. పెట్టుబడిదారీ విధానం, సరుకు ఉత్పత్తి విధానం కాబట్టి, దానికి, సరుకుల్ని ఉత్పత్తిచేసి పెట్టుబడిని పెంచే దశ — ఉత్పాదక దశగానూ, సరుకులు కాని వాటిని ఉత్పత్తి చేసి ఆదాయాన్ని ఖర్చుచేసే దశ — అనుత్పాదక దశగానూ ఉంటాయి. ఆ విభజనని బట్టి, పెట్టుబడిదారీ సమాజానికి కొన్ని శ్రమలు ఉత్పాదక శ్రమలూ, కొన్ని శ్రమలు అనుత్పాదక శ్రమలూ అవుతాయి.

ప్రతీ ఉత్పత్తినీ 'ఉపయోగపు విలువలు'గా ఉత్పత్తి చేసే నూతన సమాజానికి అన్ని శ్రమలూ ఒకటే. 'ఆహారం' అనే అవసరాన్ని తీసుకుంటే, అది, భూమిని దున్నే పనితో ప్రారంభించి, అన్నం తిన్న పళ్ళాలు శుభ్రం చేసుకునే పని వరకూ సాగాలి. ఇన్ని రకాల వేరు వేరు పనులు జరిగితేనే ఆ అవసరం తీరుతుంది. ఈ మొత్తం శ్రమల్లో, కొన్ని శ్రమల్ని ఉత్పాదక శ్రమలు అనీ, కొన్ని శ్రమల్ని అనుత్పాదక శ్రమలు అనీ విభజించడానికి వీలు ఉండదు. ఇక్కడ అన్ని శ్రమలూ ఒకటే.

పెట్టుబడిదారుడికి, డబ్బుని పెంచుకునే దశా, ఆదాయాన్ని ఖర్చు చేసే దశా — అనే తేడాలు ఉంటాయి కాబట్టి, వాడికి ఒకే రకం శ్రమ, రెండు వేరు వేరు సంబంధాల్లో, రెండు రకాలుగా ఉంటుంది. వాడికి, హోటల్లో వంట మనిషి శ్రమ ఉత్పాదక శ్రమగా ఉండి, ఇంటి వంట మనిషి శ్రమ అనుత్పాదక శ్రమగా ఉంటుంది. హోటల్ని శుభ్రంచేసే శ్రమ ఉత్పాదక శ్రమగా ఉండి, ఇంటిని శుభ్రం చేసే పని మనిషి శ్రమ అనుత్పాదక శ్రమగా ఉంటుంది. ఈ విభజన, కేవలం, శ్రమలకు పెట్టుబడిదారుడితో ఏర్పడే సంబంధాన్ని బట్టి ఉంటుంది. కానీ, నూతన సమాజంలో, యజమానులూ వాళ్ళ కోసం పని చేసే శ్రామికులూ — అనే సంబంధాలు ఉండవు కాబట్టి, పెట్టుబడిదారీ సంబంధాలలో ఏర్పడే విభజన ఇక్కడ అర్థం లేనిదై పోతుంది.

పై పై ఆలోచనలతో చూస్తే, నూతన సమాజంలో కూడా 'శ్రమల' విషయంలో గానీ 'వస్తువుల' విషయంలో గానీ, ఉత్పాదక — అనుత్పాదక విభజన ఉన్నట్టే కన పడుతుంది. పైపై దృష్టికి ఇలా ఒక ప్రశ్న రావచ్చు. నూతన సమాజంలో యజమానులూ — సేవకులూ లేకపోయినా, అప్పుడు కూడా వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యడమూ, తర్వాత వాడడమూ ఉంటాయి కదా? వస్తువుల్ని ఉత్పత్తి చేసే శ్రమల్ని — 'ఉత్పాదక శ్రమలు' అనీ; వస్తువుల్ని వాడే (ఖర్చు చేసే) శ్రమల్ని — 'అనుత్పాదక శ్రమలు' అనీ, ఎందుకు విభజించకూడదు? — ఇలాంటి ప్రశ్న రావచ్చు.

ఈ ప్రశ్నలో పొరపాటు ఏమిటో చూద్దాం.

పెట్టుబడిదారుడికి అదనపు డబ్బుని ఇచ్చేది — ఉత్పాదక శ్రమ. పెట్టుబడిదారుడి ఆదాయాన్ని ఖర్చు చేసేది — అనుత్పాదక శ్రమ. ఇది పెట్టుబడిదారీ సమా జాన్నిబట్టి ఏర్పడే విభజన. ఆ విభజనని వదిలేసి ఇప్పుడు మనం,

"ఉత్పత్తుల్ని తయారు చేసేది — ఉత్పాదక శ్రమ.

ఉత్పత్తుల్ని వాడేది — అనుత్పాదక శ్రమ" — అని నూతన సమాజం కోసం కొత్త నిర్వచనం చేస్తున్నామన్న మాట. కానీ, వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యడం అంటే ఏమిటో, వాడడం అంటే ఏమిటో ఒక సారి గుర్తు చేసుకోవాలి.

వస్తువుల్ని వాడడం 2 రకాలుగా ఉంటుందని మనకు తెలుసు. 'ఉత్పత్తి సాధనాలు'గా వాడడమూ, 'పోషణ కోసం' వాడడమూ.

ఒక ఉత్పత్తి క్రమాన్ని తీసుకుంటే, అక్కడ ఒక వస్తు వుని వాడడమూ, ఇంకో వస్తువుని తయారుచెయ్యడమూ, వేరు వేరు విషయాలుగా ఉండవు. బట్టని ఉత్పత్తి చేసే క్రమంలో, బట్ట తయారవడం కోసం దారం ఖర్చవుతుంది. ఈ క్రమాన్ని 'బట్టని ఉత్పత్తి చేసే క్రమం' అంటామా? 'దారాన్ని ఖర్చు చేసే క్రమం' అంటామా? రెండూ ఒకటే, రెంటినీ విడదియ్యడానికే వీలు ఉండదు. అలాంటప్పుడు, ఇక్కడ జరిగే శ్రమని, 'బట్టని ఉత్పత్తి చేసే శ్రమ' అంటామా, 'దారాన్ని వాడే శ్రమ' అంటామా? <u>కొత్త వస్తువుని ఉత్పత్తి చేసే శ్రమే, పాత వస్తువుని వాడే శ్రమ.</u> అంతా కలిసి ఒకే శ్రమ. ఒకే క్రమం. కానీ, మన కొత్త నిర్వచనం ప్రకారం, బట్టని ఉత్పత్తి చేసే శ్రమ ఉత్పాదక శ్రమ గానూ, దారాన్ని ఖర్చు చేసే శ్రమ అనుత్పాదక శ్రమగానూ అవ్వాలి. అంటే, ఒక శ్రమ, ఒకే సమయంలో — ఉత్పాదక శ్రమ గానూ, అనుత్పాదక శ్రమ గానూ కూడా ఉండాలన్న మాట! — ఇదీ కొత్త నిర్వచనంలో ఉన్న అర్థం లేని తనం.

ఇంకా ఎన్ని ఉదాహరణలైనా చూడొచ్చు. బట్టని చొక్కాగా కుట్టే శ్రమానీ, ధాన్యాన్ని బియ్యంగా మార్చే శ్రమానీ — ఇలా ఏ క్రమాన్ని చూసినా, మొదటి ఉదా హరణలో లాగే ఉంటుంది. కొత్త నిర్వచనం ప్రకారం, ఉత్పాదక — అనుత్పాదక శ్రమల విభజన సాధ్యమే కాదు.

### ఇప్పుడు, ఉత్పత్తుల్ని వాడడంలో, 'పోషణ కోసం వాడడం' గురించి చూద్దాం.

అన్నం — అనే ఉత్పత్తిని తీసుకుంటే, మన కొత్త నిర్వచనం ప్రకారం, (1) అన్నాన్ని — ఉత్పత్తి చేసే శ్రమ, ఉత్పాదక శ్రమ గానూ, (2) అన్నాన్ని — వాడే శ్రమ, అను త్పాదక శ్రమ గానూ అవ్వాలి.

ఇందులో, మొదటి విషయం ఎంత అర్థరహితమో ఇప్పటికే చూశాం. అన్నాన్ని — ఉత్పత్తి చేసే శ్రమే, బియ్యాన్ని వాడే శ్రమ కాబట్టి, అక్కడ కొత్త నిర్వచనం వర్తించదని చూశాం. ఇప్పుడు రెండో విషయమే చూడాలి. 'అన్నాన్ని వాడడం' — అనే విషయాన్ని.

అన్నాన్ని వాడడం — అంటే ఏమిటి? దాన్ని తినడమే. తినడమే — దాన్ని వాడడం. కొత్త నిర్వచనం ప్రకారం, ఈ 'తినడం' అనే పని, అనుత్పాదక శ్రమ అవ్వాలన్న మాట. కానీ, 'తినడం' అనేది, అసలు 'శ్రమ' కిందకే రాదు. అది ప్రతీ ప్రాణీ చేసే ప్రకృతి సహజ కార్యం. సమస్త ప్రాణులూ ఆహారం తింటున్నాయంటే, సమస్త ప్రాణులూ అను త్పాదక శ్రమలు చేస్తున్నాయని అర్థమా? — కాదు. కాబట్టి, తినడం — 'శ్రమ' అవదు. అది, శ్రమే కానప్పుడు, అది ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా — అనే ప్రశ్నే ఉండదు. అంటే, కొత్త నిర్వచనం, ఏ సందర్భానికీ వర్తించ దన్న మాట. కాబట్టి, ఆ నిర్వచనమే తప్పు.

'ఉత్పత్తుల వాడకం' గురించి, మూడో రకంగా చూద్దామా? — 'ఉత్పత్తి సాధనాలుగా' ఖర్చయ్యే వాటిని ఉత్పాదకమైన ఖర్చు అనీ, 'పోషణ కోసం' ఖర్చయ్యే వాటిని అనుత్పాదకమైన ఖర్చు అనీ, అనుకుందామా? — దీని సంగతి ఎలా ఉంటుందో చూద్దాం.

బట్ట — తయారవ్వాలంటే, దారమూ మగ్గమూ వంటివి ఉత్పత్తి సాధనాలు కదా? వాటిని 'ఉత్పాదకమైన ఖర్చు' అంటాం. కానీ, బట్ట తయారయ్యేటప్పుడు ఖర్చ య్యేవి ఉత్పత్తి సాధనాలే కాదు; అదే సమయంలో, ఆ శ్రమ చేసే మనుషుల ఇళ్ళల్లో పోషణ వస్తువులు కూడా ఖర్చవుతాయి. ఆ 2 రకాల ఖర్చులూ జరగకపోతే, కొత్త

బట్ట తయారుకాదు. కొత్త బట్ట కోసం, పని స్థలాల్లో ఉత్పత్తి సాధనాలూ, ఇళ్ళల్లో పోషణ వస్తువులూ కూడా ఖర్చవుతూ ఉన్నప్పుడు, వాటిలో ఒకటి ఉత్పాదకమైన ఖర్చు, ఇంకొకటి అనుత్పాదకమైన ఖర్చూ ఎలా అవుతుంది? (పెట్టుబడిదారీ నిర్వచనంలో అయితే, మొత్తం C + Vల ఖర్చు అంతా ఉత్పాదకమైన ఖర్చుగానే లెక్కకు వస్తుంది.) పని స్థలంలో ఉత్పత్తి సాధనాల ఖర్చూ, ఉత్పత్తిదారుల ఇళ్ళల్లో పోషణ వస్తువుల ఖర్చూ, ఈ 2 రకాల ఖర్చులూ జరుగుతూ ఉంటేనే — కొత్త ఉత్పత్తి తయారవుతుంది కదా? కాబట్టి, ఈ ఖర్చులకు ఉత్పాదక — అనుత్పాదక పేర్లు పెట్టడం అర్థరహితం అవుతుంది.

'శ్రమల్ని' వాడే విషయంలో గానీ, 'వస్తువుల్ని' వాడే విషయంలో గానీ, ఉత్పాదక — అనుత్పాదక విభజన అనేది ఉంటే, అది పెట్టుబడిదారీ అర్థంతో మాత్రమే ఉంటుంది. లేకపోతే, ఆ విభజనే ఉండదు.

ఒక వర్గం ఇంకో వర్గపు 'అదనపు విలువ'ని దోచడం అనే పరిస్థితే లేనప్పుడు ('నూతన సమాజం'లో), ఉత్పాదక — అనుత్పాదక విభజన కోసం కొత్త రకపు నిర్వచనాలు ఏ రకంగా పెట్టినా, అవన్నీ అర్థరహితం అయిపోతాయి. ఆ పరిస్థితికి, ఆ విభజన ఏ రకం గానూ వర్తించదు.

నూతన సమాజానికి, శ్రమలలో ఉండే భేదం, ఉత్పాదక — అనుత్పాదక భేదం కాదు; సహజ — అసహజ భేదం. నూతన సమాజం, శ్రమల్లో కొన్నిటిని సహజంగా అవసరమయ్యే శ్రమలుగానూ, కొన్నిటిని సహజంగా అవసరం కాని శ్రమలుగానూ చూస్తుంది. అసహజ శ్రమల్ని ఆ సమాజం, క్రమంగా తీసివేస్తుంది.

సహజంగా అవసరమయ్యే శ్రమలలో కూడా శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ — అనే తేడాలు ఉంటాయి. నూతన సమాజంలో మనుషులందరూ కొన్ని శారీరక శ్రమలూ, కొన్ని మేధా శ్రమలూ చేస్తారు. ప్రతీ శ్రమా ఏదో ఒక అవసరాన్ని తీరుస్తుంది కాబట్టి, ప్రతీ శ్రమా అవసరమైనదిగానే ఉంటుంది. అందుకే అలాంటి సమాజానికి ఉత్పాదక — అనుత్పాదక భేదం వర్తించదు.

'నూతన సమాజం'లో కొన్ని ప్రత్యేక విషయాలు ఎలా మారవచ్చునో ఇక్కడ కొన్ని ఉదాహరణలు చూద్దాం.

## ఉమ్మడి వంటిల్లు (సమిష్టి వంటశాల)

**నూ**తన సమాజంలో, 'గృహ శ్రమల'లో జరిగే మార్పుల్ని మనం ఈ సందర్భంలో కాస్సేపు ఊహించుకోవచ్చు. నూతన సమాజం ప్రారంభమైందనీ, 'పాత కాలపు శ్రమ విభజన'లో మార్పులు జరుగుతున్నాయనీ, ఊహిద్దాం. అప్పుడు గృహ శ్రమలన్నీ ఎలా జరుగుతాయో చూద్దాం.

గృహ శ్రమలలో ప్రధానమైన పనులు — వంట పనీ, ఇంటి శుభ్రతా, బట్టల వుతుకూ, పిల్లల పెంపకమూ, వృద్ధుల సంరక్షణా — వగైరాలు. ఈ పనులన్నీ పాత సమాజాల్లో స్త్రీల ద్వారానూ, అనుత్పాదక సేవకుల ద్వారానూ, జరుగుతాయి. శ్రామిక కుటుంబాల స్త్రీలు అయితే, బయట పనీ, ఇంటి పనీ కూడా చేసుకుంటారు.

దోపిడీ సమాజాలలో, ఏ ఇంటి పనులు ఆ ఇంటికి వ్యక్తిగత బాధ్యతలుగా విడిపోయి ఉంటాయి. పిల్లలకూ వృద్ధులకూ సంబంధించిన పనుల కోసం, ఇళ్ళల్లో తప్ప, బయట ఏర్పాట్లు ఉండవు. ఈ పరిస్థితుల వల్ల, స్త్రీలకు, ఇంటి — పనుల నించి కొంత వరకైనా విడుదల ఉండదు. కాబట్టి, ఈ సమస్యకి పరిష్కారం ఏమిటంటే, ఈ పనుల్ని ఇళ్ళల్లోనూ బయటా కూడా సమిష్టి బాధ్యతలతో నిర్వహించుకోవడమే.

నూతన సమాజంలో, ఈ పనుల్లో కొన్నిటిని పూర్తిగా సమిష్టిగానూ; కొన్నిటిని కొంత వరకూ సమిష్టి గానూ, కొంత వరకూ వ్యక్తిగతం గానూ — నిర్వహించుకునే నిర్మాణాలు ఏర్పడతాయి.

నూతన సమాజంలో, ఇంటి పనులకు సంబంధించి గ్రహించవలసిన మొట్ట మొదటి విషయం — ఒక కుటుంబానికి సంబంధించిన ఇంటి పనులు చెయ్యడానికి, బయటి నించి అనుత్పాదక శ్రామికులు రావడం అనేది ఉండదు ఉండకూడదు. ఏ కుంటుంబంలో పనులు ఆ కుటుంబ సభ్యులు, స్త్రీలూ పురుషులూ కూడా, చేసుకోవలసిందే. ఆ పనులు ఎలా జరగాలో ఆ మార్పుల్ని కనిపెట్టుకోవాలి.

సమాజంలో జరగవలసిన ఒక మార్పు గురించి వినగానే మొదట జడుసుకోకూడదు. ఆ మార్పు న్యాయంగా, హేతుబద్ధంగా, సమానత్వానికి అనుగుణంగా ఉందా లేదా అనేదే ఆలోచించాలి. అది న్యాయమైనదే అయితే దాన్ని ఆహ్వానించాలి. దాన్ని అనుసరించేటప్పుడు దొరికే అనుభవాల ద్వారా దాన్ని అభివృద్ధిపరుచుకోవాలి. క్రమంగా దాన్ని జీవితాల్లో భాగం చేసేసుకోవాలి.

'వంట పని'ని తీసుకుంటే, ఇంటింటికీ ఒక్కో పొయ్యి

కాకుండా, ఒక వీధిలో కొన్ని ఇళ్ళ జనం కలిసి 'ఉమ్మడి వంటిల్లు' పెట్టుకుంటారని ఊహిద్దాం. ఈ ఉమ్మడి వంటిల్లు, ప్రతీ ఇంటికీ చాలా దగ్గిరగా అందుబాటులో ఉండాలనేది మొట్టమొదటి షరతు. చలికాలంలోనూ, వానాకాలంలోనూ కూడా ఆ వంటింటికి వెళ్ళి భోజనం చెయ్యాలంటే, ఆ ఇల్లు అందరికీ చాలా దగ్గరలో ఉండాలి. అంటే, ఉమ్మడి వంటశాలలో సభ్యులుగా ఉండే ఇళ్ళ సంఖ్య మరీ ఎక్కువగా ఉండకూడదు.

మన ఉదాహరణలో, 10 కుంటుంబాల జనం కలిసి ఒక సమిష్టి వంటశాల పెట్టుకున్నారు. ఈ జనాభా అందరూ బయట పనులకు వెళ్ళినప్పుడు గాక, ఇళ్ళ దగ్గిరే ఉన్నప్పుడు తినడానికి కావలసిన వంటలన్నీ ఈ ఉమ్మడి వంట శాలలో తయారవుతాయి. ఈ కుటుంబాల జనమే, 'ఆడా మొగా తేడా లేకుండా' డ్యూటీల వారీగా ఈ ఉమ్మడి వంటింట్లో పని చేస్తారు.

ఈ వంటింట్లో పనులు కొన్ని సెక్షన్లుగా ఉంటాయి. పాత్రల్నీ, వంట శాలనీ శుభ్రం చేసే సెక్షనూ, వంటల సెక్షనూ, వడ్డింపుల సెక్షనూ, తోట పని సెక్షనూ — వగైరా సెక్షన్లుగా.

ఆ కుటుంబాల జనం అంతా ఒకే సమయంలో ఈ వంట డ్యూటీల్లో ఉండనక్కరలేదు. వంటశాలలో ఉన్న అన్ని సెక్షన్ల పనులకూ కలిసి 10 మంది సరిపోతారు అనుకుంటే, ప్రతీరోజూ 10 మందే వంటశాల డ్యూటీలో ఉండి, మిగిలిన జనం అంతా బయట డ్యూటీలకు వెళ్ళి పోతారు. బయటికి వెళ్ళిన వాళ్ళు ఒక పూట భోజనం అక్కడ వంటశాలల్లో (పని స్తలాలలో ఉండే వంటశాలల్లో) చేస్తారు.

వంటశాల డ్యూటీలో ఉన్న వాళ్ళందరూ కొన్నాళ్ళ కోసారి సెక్షన్లు మారతారు. ఒక సెక్షన్లో ఉన్నప్పుడు కూడా అందులోని వేరు వేరు పనుల్లోకి మారతారు. వంటల సెక్షన్లో, కూరలు కోసే పనీ, వంట వండే పనీ ఉంటాయి. వంటల సెక్షన్లో ఉండే వాళ్ళు, ఈ 2 పనుల్లోకీ కూడా మారతారు.

7, 8 సంవత్సరాల వయస్సు నించి పిల్లలు కూడా వంటింట్లో కొన్ని రకాల పనులు చేస్తారు.

వంట శాలకు సంబంధించిన సమస్త విషయాల్నీ దానిలో సభ్యులుగా ఉన్న కుటుంబాల జనం ఎప్పటి కప్పుడు చర్చిస్తూ ఉంటారు. వంటలకు ఉపయోగించే పదార్థాల గురించీ, వాటిని వండే పద్ధతుల గురించీ, వాటి రుచుల గురించీ, శుభ్రత గురించీ, ఆరోగ్య నియమాల గురించీ, పొదుపు గురించీ, వంటశాలలో ఏర్పాటు చేసు కోవలసిన పరికరాల గురించీ, వంట శాల చుట్టూ తప్పని సరిగా పెంచవలసిన చెట్ల గురించీ — ఈ రకంగా. ఆ నిర్మాణానికి సంబంధించిన ప్రతీ సమస్య గురించీ సరైన అవగాహనకు వస్తూ ఆ అవగాహనని బట్టి వంట శాలని నడుపుకుంటూ ఉంటారు.

'వంటలు ఎవరి ఇష్ట ప్రకారం జరుగుతాయి' అనే ప్రశ్న ప్రత్యేకంగా అవసరం లేదు. సాధారణంగా, ఏ రుతువులో ఏ రకం కూరగాయలు దొరికితే, వాటినిబట్టి వంటలు ఉంటాయి. అందులో కూడా ఒక్కో రోజు కూరలు, ఒక్కో బృందం ఇష్టప్రకారం ఉండవచ్చు. వండే వాళ్ళ ఇష్టం ప్రకారం ఉంటేనే మంచిది. లేకపోతే ఆ పని చేసే వాళ్ళు దాన్ని ఇష్టంగా చెయ్యలేరు.

సమిష్టి జీవితానికి సంబంధించిన సరైన అవగాహనా, సరైన పద్ధతులూ అలవడే వరకూ, ప్రతీ నిర్మాణం లోనూ మొదట్లో చాలా సమస్యలు తలెత్తుతాయి. కానీ, క్రమంగా, రోజు వారీ అనుభవాలతో ఒక్కో ఇబ్బందినీ పరిష్కరించుకుంటూ ఉంటే, ఈ ఉమ్మడి వంటింటి పద్ధతి జీవితంలో ఒక సహజ విషయంగా అయిపోతుంది.

విషయాల గురించి ఎంత ఎక్కువ స్పష్టత ఉంటే సమస్యలు అంత తక్కువగా ఉంటాయి. ఈ వంటింట్లో జరగవలసిన పనులు ఒక ఖచ్చితమైన స్పష్టతతో అందరికీ తెలిసిపోయి, నిబంధనలుగా కనిపించని పద్ధతులుగా ఉండాలి. 'కూరగాయలు ఇక్కడ కడగాలి. వాటిని ఇక్కడ పెట్టి ఉంచాలి. ఇక్కడ కొయ్యాలి. వాటి మీద ఇలా మూతలు పెట్టి ఉంచాలి. అంట్లన్నీ ఇక్కడ తోమాలి. వాటిని ఇక్కడ సర్దాలి. అందులో పళ్ళాలన్నీ ఇక్కడ. గ్లాసులన్నీ ఇక్కడ. మూతలన్నీ ఇక్కడ. గిన్నెలన్నీ ఇక్కడ. చీపుళ్ళన్నీ ఇక్కడ. కత్తిపీటలు ఇక్కడ. భోజనాలు చేసిన వాళ్ళు ఫలానా చోటకి వెళ్ళి చేతులు కడుక్కోవాలి. వాళ్ళ పుక్కిలింతలూ, దగ్గులూ, చీదుళ్ళూ, భోజనాల దగ్గిరికి వినబడనంత దూరంగా ఆ చేతులు కడిగే స్తలం ఉండాలి. వాళ్ళు చప్పుళ్ళు చెయ్యకుండా కడుక్కోవడం అలవాటు చేసు కోవాలి. చేతులు తుడుచుకునే తువ్వాళ్ళు ప్రతి పూటా మార్చాలి. మొత్తం వంటశాల అంతా ప్రతి పూటా కడగాలి. చెప్పులు లోపలికి తేకూడదు. అవసరమైతే లోపలవాడే చెప్పులు వేరుగా ఉండాలి' — ఈ రకంగా, ఈ నియమాలన్నీ సభ్యులకు అలవాటై పోయి జీర్ణించుకు పోయి ఉండాలి.

'శుభ్రత' అనే విషయాన్ని తీసుకుంటే, వంటల్లో వెంట్రుకలు రావడం తప్పనిసరిగా అశుభ్రతకి నిదర్శనం. వెంట్రుక వచ్చిందంటే, శుభ్రత ఏ మాత్రమూ చాల లేదని అర్థం. కానీ వెంట్రుకలు రాకపోతే అదే శుభ్రతకి నిదర్శనం కాదు. అంత మాత్రాన్నే పూర్తి శుభ్రత ఉందని అర్థంకాదు.

శుభ్రతకి సంబంధించిన ఇతర విషయాల్లో కూడా ఇలాంటి అర్థాల తోనే ఆలోచించాలి.

సమిష్టి వంట శాలని ప్రారంభించిన మొదట్లో, ఒక సెక్షన్ పనిలో భార్యాభర్తలు కలిసి ఉండకూడదు. భార్యలు పక్కనే వుంటే, భర్తలు 'పని దొంగలు' అవుతారు. భర్తలు పక్కనే ఉంటే, భార్యలు 'పిరికిపందలు' అవుతారు. దీని వల్ల ఉమ్మడి వంటింట్లో కూడా మళ్ళీ పనిలో ఎక్కువ భాగం భార్యల మీదే పడుతుంది. ఇలాంటి సమస్య తలెత్త డానికి అవకాశం ఇవ్వకూడదు.

ఉమ్మడి వంటింటిని 'పెట్టుబడిదారీ హోటల్'గా ఊహించకూడదు. హోటల్ పద్ధతుల్ని పరిశీలించి అందులో మంచి అంశాలేవైనా ఉంటే తీసుకోవచ్చు. కానీ అన్ని విషయాల లోనూ హోటల్‌ని అనుకరించకూడదు.

వంతుల ప్రకారం వంట పని చెయ్యడం — అనే పద్ధతి పాత కాలపు ఉమ్మడి కుటుంబాలలో ఉన్నదే. అక్కడ ఇంటి కోడళ్ళు, వంతుల ప్రకారమే వంట పనులూ, ఇతర పనులూ చేస్తారు. కానీ, ఆ రకపు ఉమ్మడి కుటుంబాలలో పులి లాంటి అత్త గారూ, నక్కల్లాంటి ఆడబడుచులూ, తోడేలు లాంటి భర్తా, ఇంకా రక రకాల అడివి జంతువుల్లాంటి మామలూ, బావలూ, మరుదులూ వగైరా జంతు జాలాల మధ్య, ఇంటి కోడళ్ళు (అసలు శ్రమ చేసే వాళ్ళు) బిక్కచచ్చిపోతూ ఇంటి చాకిరీ అంతా చేస్తారు. ఈ అత్తగారు ఒకప్పుడు కోడలు స్థాయి నించి ప్రమోషన్ పొంది అత్త స్థాయికి చేరిన మనిషి. ఈ కోడళ్ళు కూడా కొంత కాలానికి అత్తలుగా ఎదుగుతారు. ఇక్కడ కోడళ్ళుగా చాకిరీలతో సతమతమయ్యే వీళ్ళు, తమ పుట్టిళ్ళల్లో 'ఆడ బిడ్డల' పాత్రలు పోషిస్తారు.

పాత కాలపు ఉమ్మడి కుటుంబాలలో ఒక 'సమిష్టి జీవిత సౌఖ్యం' ఉన్నా, ఒకర్ని ఒకరు పీడించుకునే రకపు ఆ కుటుంబ సంబంధాలతో ఆ సౌఖ్యం అంతా నేలపాలై పోతూ ఉంటుంది. నూతన సమాజపు ఉమ్మడి వంటింటి సంబంధాల పరిస్తితి ఆ రకమైంది కాదు. ఇక్కడ, ఆడా మగా తేడా లేకుండా అందరూ వంతుల వారీగా పనులు చేస్తారు. ఇక్కడ, అత్తా — కోడలూ, ఆడబిడ్డా — వదినా, భర్తా — భార్యా — వంటి ఏ రకమైన పీడించే సంబంధాలూ లేకుండా, ఉమ్మడి వంటిల్లు, 'సమిష్టి కుటుంబ సౌఖ్యాన్ని' పొందడానికి మార్గంగా ఉంటుంది.

కొన్ని వంట శాలలు కలిసి, ఒక 'వంటల పత్రిక' నడుపుకోవచ్చు. ఆ వంట శాలలకు సంబంధించిన అన్ని విషయాలూ అందులో చర్చించవచ్చు. ఒక వంట శాల అనుభవాలు, ఇంకో వంట శాల అందుకోవచ్చు.

ఉమ్మడి వంటిల్లు ఉన్నప్పటికీ, కొన్ని అవసరాల కోసం ఎవరి ఇంట్లో వాళ్ళు పొయ్యి వెలిగించడం కూడా ఒక్కోసారి తప్పనిసరి అవుతూ ఉంటుంది. చిన్న పిల్లల కోసం తరుచుగా పాలూ నీళ్ళూ కాగబెట్టాలంటే, ప్రతీసారీ ఉమ్మడి వంటింటికి బైల్దేరలేరు. ఇంట్లో ఉన్నప్పుడు కాఫీ తాగాలంటే, ఉమ్మడి వంటింటికి బైల్దేరతామా? ఉమ్మడి వంటింట్లో నైట్ షిఫ్టు ఉండదు. ఇంట్లో అనారోగ్యంగా ఉన్న వాళ్ళ కోసం కూడా ఏదైనా వేడిగా తాగడానికి అప్పు డప్పుడూ ఇవ్వవలసి ఉంటుంది. ఇలాంటి అవసరాలు తప్పనిసరిగా ప్రతీ ఇంటికీ ఉంటాయి. ఆ ప్రత్యేక అవస రాల్నీ, సందర్భాల్నీ బట్టి ఒక పొయ్యీ కొన్ని గిన్నెలూ ప్రతీ ఇంటిలోనూ ఏర్పాటు చేస్తే, అది సమిష్టి జీవితానికి భంగం కలిగించే విషయం అవదు.

ఏ ఉత్పత్తి క్రమాన్ని అయినా ఎక్కువ స్థాయిలో చేస్తే, ఖర్చులు కలిసివస్తాయి. కానీ, ఆ సూత్రాన్ని 'ఉమ్మడి వంట శాల'కి కూడా వర్తింప చెయ్యకూడదు. అంటే, ఒక వంట శాలలో సభ్యుల సంఖ్యని పెంచకూడదు. జనం పెరిగిన కొద్దీ, శుభ్రతని నిర్వహించడం కష్టం అవుతుంది. 'వంట శాల' అనేది, అంగుళం అంగుళమూ మహా పరి శుభ్రంగా ఉండవలసిన స్తలం. ఇందులో కనీస సంఖ్య తప్ప, అంత కన్నా ఎక్కువ మంది సభ్యులు ఉండ కూడదు. శుభ్రత విషయమే గాక, జనం పెరిగిన కొద్దీ, సభ్యుల మధ్య సంబంధాలు తగ్గి, దూరం పెరుగుతుంది. అప్పుడు వంట శాలకి 'ఇంటి వాతావరణం' పోయి, యాంత్రికంగా పని చేసి తిండి తిని వెళ్ళిపోయే వాతా వరణం ఏర్పడుతుంది. ఈ పరిస్తితి ఆ నిర్మాణాన్ని చాలా త్వరగా పాడు చేస్తుంది. తక్కువ మంది సభ్యులతో, 'ఇంటి వాతా వరణం'తో ఏర్పడినప్పుడే ఉమ్మడి వంటిల్లు చాలా త్వరగా స్తిరపడుతుంది.

'ఇంటి పనుల' విషయంలో పాత కాలపు శ్రమ విభజన మారాలంటే, మొదట 4, 5 ఇళ్ళ జనాభా కలిసి ఉమ్మడి వంటిల్లు ఏర్పర్చుకున్నా చాలు. మొదటే ఎక్కువ ఇళ్ళు కలవాల్సిన అవసరం లేదు. ఈ నిర్మాణానికి ఉన్న ప్రత్యేక స్వభావాన్ని బట్టి, దీనికి ఎక్కువ మంది సభ్యులు ఉండడం పనికి రాదు.

'ఉమ్మడి వంటిల్లు' అనగానే మొట్టమొదట గ్రహించ వలసిన విషయం ఒకటి ఉంది. నూతన సమాజం ప్రారంభమైనా, ఉత్పత్తి స్తలాల్లో శ్రమ విభజన ఇంకా పెట్టుబడిదారీ పద్ధతి లోనే ఉన్నప్పుడు, ఉమ్మడి వంటిల్లు ఏర్పడడం సాధ్యమే కాదు. ఎందుకంటే, శారీరక శ్రమలు చేసేవారి ఆదాయాలు తక్కువ గానూ, మేధా శ్రమలు చేసే వారి ఆదాయాలు ఎక్కువ గానూ ఉంటాయి. ఎక్కువ ఆదాయాలు గల వాళ్ళు, ఆహారం మీద ఎక్కువ ఖర్చు

పెట్టగలరు. అలాగే, తక్కువ ఆదాయాల వాళ్ళు ఆహా రానికి ఎక్కువ ఖర్చు పెట్టలేరు. ఆదాయాలు చాలా తేడాలుగా ఉన్నప్పుడు, అందరూ ఒకే రకమైన ఆహార పద్ధతులు పాటించరు. వేరు వేరు ఆర్థిక స్థాయిలు గల కుటుంబాలు, ఉమ్మడిగా ఒక చోట కలవలేవు. అప్పుడు, ఎక్కువ ఆదాయాలు గల కుటుంబాలకు 'ధనిక' వంటిల్లూ, తక్కువ ఆదాయాలు గల కుటుంబాలకు 'పేద' వంటిల్లూ ఏర్పడవలసి ఉంటుంది. ఈ తేడాలు లేని వంటిళ్ళు ఏర్పడాలంటే, ఆదాయాలన్నీ సమానం కావాలి. అంటే, గత కాలపు శ్రమ విభజనలో మార్పు దగ్గిరికే వస్తాం.

గోడలన్నీ పొగచూరి, జిడ్డుబారి, చీకటి గుయ్యారాల్లా ఉండే పాతకాలపు నిరుపేద చీకటి వంటిళ్ళన్నీ కాల గమనంలో కలిసి పోతాయనీ; చుట్టూ చల్లని చెట్లతో, విశాలమైన ఆవరణతో, గాలీ వెలుతురూ ప్రసరించే గదులతో, వరండాలతో, ప్రశాంతమైన చక్కని ఉమ్మడి వంటిళ్ళు సమాజ జీవితంలో సహజ భాగం అయిపోతాయనీ — ఊహిద్దాం. ప్రస్తుతానికి ఊహలు కూడా చెయ్యలేమా?

ఆ ఊహలతోనే దీన్ని కొనసాగిద్దాం.

ఉమ్మడి వంటిల్లు ఏర్పడిందనీ, అక్కడ పురుషులు కూడా పని చేస్తున్నారనీ అనుకుంటే, అంత మాత్రానే, ఇంటి పనుల్లో వెనుకటి శ్రమ విభజన అంతా మారినట్టు అవదు. ఇళ్ళల్లో జరగవలసిన పనులు ఇంకా చాలా ఉంటాయి. ఇల్లూ వాకిలీ రోజూ చీపురుతో ఊడ్చి శుభ్రం చేసుకోవాలి. ఆ పని ఆడవాళ్ళు చేసినట్టే మొగవాళ్ళూ చెయ్యాలి. ఒక పురుషుడు, బయట ఎంత మేధాశ్రమ చేసేవాడు అయినా, ఇంట్లో చీపురు పట్టుకుని ఇల్లూ వాకిలీ ఊడ్చే పని స్త్రీల లాగే చెయ్యకపోతే అతను అభివృద్ధి చెందిన నూతన మానవుడిగా లెక్కకు రాడు.

బైట వీధులూ ఆఫీసులూ ఊడ్చే పని చేసే శ్రామికుడు కూడా ఇంటి దగ్గిర మాత్రం చీపురు ముట్టుకునే పని భార్య బాధ్యతే అనుకుంటాడు. అలాంటి పురుషులూ స్త్రీలూ అందరూ సమానత్వ భావాలతో నూతన మానవులుగా మారవలసిందే.

'ఇల్లు' అన్నప్పుడు, అక్కడ రోజువారీగా చేసుకోవలసిన పనులు కొన్నీ, అప్పుడప్పుడూ చేసుకోవలసిన పనులు కొన్నీ ఉంటాయి. ఇంటి శుభ్రతా, రోజువారీ బట్టల ఉతుకూ లాంటి పనులు రోజూ ఇళ్ళల్లోనే జరగాలి. ఎవరి ఇంటి పనులు వాళ్ళే చేసుకోవాలి. ఇళ్ళకు సున్నాలు వెయ్యడం లాంటి కొంత కాలానికి ఒకసారి అవసరమయ్యే పనులు, ఒక వీధి పరిధిలో ఉన్న జనం, సమిష్టి బృందాలుగా ఏర్పడి చేసుకోవచ్చు.

'పిల్లల పెంపకం' విషయంలో — తల్లిదండ్రులూ, పిల్లల సంరక్షణ కోసం ఏర్పడ్డ ప్రత్యేక సంస్థలూ కలిసి, పిల్లల సంగతులు చూడాలి. వేరు వేరు సమయాల్ని బట్టీ, అవసరాల్ని బట్టీ, పిల్లలు, తల్లిదండ్రుల దగ్గిరా, బయట సంరక్షకుల దగ్గిరా కూడా ఉంటూ ఉంటారు. పిల్లల పెంపకంలో, తండ్రీ సమాజమూ కూడా బాధ్యత వహించడం అంటే, ఆ బాధ్యతని తల్లి వదిలెయ్యాలని అర్థం కాదు. ఆ బాధ్యత అంతా పూర్తిగా తల్లి మీదే పడి, అది తల్లికి భారం కాకుండా ఉండడానికే, అందులో కొంత బాధ్యతని తండ్రీ, బయట సమాజమూ కూడా తీసుకోవాలి. పిల్లల సంరక్షణలో సమాజం కూడా సరియైన పద్ధతిలో బాధ్యత వహించినప్పుడు, తల్లి, బయట సమిష్టి శ్రమలో (బయట చేసే ఉద్యోగంలో) నిశ్చింతగా ఉండగలుగుతుంది.

'వృద్ధుల' విషయం కూడా ఇలాగే. కొన్ని బాధ్యతల్ని ఇళ్ళల్లోనే చూసుకోవాలి. కొన్ని బాధ్యతల్ని బయటి సంస్థలు నిర్వహిస్తాయి. వృద్ధులైన తల్లిదండ్రులకు రోజూ స్నానాలు చేయించాలంటే, స్వంత పిల్లలూ, ఇంట్లో వున్న మనవలూ, మనవరాళ్ళూ ఆ పనులు బాధ్యతతో చెయ్యాలి. వృద్ధుల 'ఆరోగ్యాల్ని పరిశీలించే' పనులు అయితే, బయటి ఆరోగ్య సంస్థల మనుషులు వచ్చి చేస్తారు. ఈ రకంగా, వృద్ధుల సంరక్షణలో కొన్ని బాధ్యతల్ని — కుటుంబ సభ్యులూ, కొన్ని బాధ్యతల్ని సమాజ సంస్థల సభ్యులూ బాధ్యతతో నిర్వహించాలి.

గతంలో, ప్రతి కుటుంబమూ వ్యక్తిగత బాధ్యతతో నిర్వహించుకునే ఇంటి పనుల్ని, ఇప్పుడు సమిష్టి బాధ్యతతో నిర్వహించడం అంటే, ఆ పనుల్లో ఆ ఇళ్ళ వ్యక్తులు వేలన్నా పెట్టకుండా తప్పించుకోవచ్చనీ, ఆ పనులన్నీ బయటి నించి 'ఎవరో' వచ్చి చేస్తారనీ, అర్థం కాదు. ఆ పనులు ఏ జనాలకు కావాలో ఆ జనమే ఆ పనులు చేసుకుంటారు. కాకపోతే ఆ పనులన్నీ ఆడా మొగా తేడా లేకుండా, సమిష్టి బాధ్యతతోటీ, సమిష్టి ప్లానింగ్‌తోటీ చెయ్యడమే ఇక్కడ జరిగే మార్పు.

అంతకు పూర్వం శ్రమ చెయ్యని వాళ్ళంతా (దోపిడీ మీద బతికిన వాళ్ళంతా) శ్రమలోకి రావడమే, సమాజంలో ప్రతీ నిర్మాణాన్నీ సమిష్టి నిర్మాణంగా చేస్తుంది.

పెట్టుబడిదారీ సమాజంలో 'గృహ శ్రమలు'గా ఉండే పనుల్లో అనేకం పనులు ఇలా దోపిడీ వ్యతిరేక నిర్మాణాల

ద్వారా 'సోషలైజ్' అయినప్పుడు, గతంలో గృహ శ్రమలు చేస్తూ జీవించే అనుత్పాదక శ్రామిక సెక్షన్లూ, గృహ దాస్యంలో పడి వుండే స్త్రీలూ, ఆ గత జీవితాల నించి విముక్తి చెందుతారు.

'నూతన సమాజం' అనేది ప్రారంభమైన తర్వాత చాలా తక్కువ కాలంలో జరగవలసిన మార్పుల్లో ఒకటి 'గృహ సేవలు' చేసే అనుత్పాదక శ్రామికులందరూ ఆ పనుల నించి బయటపడాలి. దీని అర్థం, ఎవరి ఇంటి పనులు వాళ్ళే చేసుకోవాలి. ఇది, క్రమంగా, స్త్రీ పురుషుల మధ్య 'పాత శ్రమ విభజన'లో మార్పులకు దారితీస్తుంది.

# నూతన సమాజంలో 'సైనిక' శ్రమ

సమాజం — దోపిడీ సంబంధాలలో ఉన్నంత కాలమూ, యుద్ధాలూ, సైనిక శ్రమలూ అవసరమవుతూనే ఉంటాయని చూశాం. అయితే, 'నూతన సమాజం' ప్రారంభమైన వెంటనే ఈ అవసరాలన్నీ పోవు, అప్పటికి దోపిడీ వర్గం, 'పరిపాలించే అధికారం' నించీ ఓడిపోయి, ఒక పక్కకి తప్పుకుని ఉండడం మాత్రమే జరుగుతుంది. అది, పాత సమాజంకోసం మళ్ళీ మళ్ళీ రహస్య ప్రయత్నాల్లో ఉంటుంది. కాబట్టి, 'పాత శ్రమ విభజన'లో మార్పులు జరుగుతూ, 'ఉత్పత్తి సంబంధాల్లో' దోపిడీ లక్షణాలు మారుతూ, మార్పులు స్థిరపడుతూ ఉండే వరకూ, కార్మిక వర్గానికి 'ఆత్మ రక్షణ' కోసం సైనిక విధులు అవసరమే.

దోపిడీ సమాజపు సైనికులు దోపిడీని రక్షించే విధిని నిర్వర్తిస్తే, నూతన సమాజపు సైనికులు దోపిడీని నాశనం చేసే విధిని నిర్వర్తిస్తారు. అంటే, నూతన సమాజపు సైనికుల విధి, గత సమాజాల సైనికుల విధినించి స్వభావంలో పూర్తిగా వ్యతిరేకంగా ఉంటుంది.

అయితే, 'నూతన సమాజం'లో ఈ విధి ఎంత తేడాగా ఉన్నా, ఈ తేడాగా ఉండే విధి కూడా సమాజానికి 'సహజ విధి' అవదు. నూతన సమాజంలో సైనిక విధి ఎంత కాలమైతే ఇంకా అవసరమవుతుందో, అంత కాలమూ ఆ సమాజంలో 'ఉత్పత్తి సంబంధాలు' ఇంకా శతృత్వాలు లేని స్థితిలోకి రాలేదని అర్థం. సమాజం ఇంకా ఎంతో కొంత శతృ వైరుధ్యాల తోనే ఉందని అర్థం. దోపిడీ అంశాలతో ఇంకా పోరాడవలసిన అవసరం ఉంది కాబట్టే, సమాజంలో ఇంకా సైనిక విధి అవసరమవుతోందని అర్థం. అంతే గానీ, సైనిక విధి అనేది, మానవ సమాజానికి శాశ్వతమైన సహజ అవసరం అని అర్థం కాదు. అది క్రమంగా నశించిపోవలసిన విధి. మానవుల మధ్య, 'తప్పుడు సంబంధాలు' లేనప్పుడు, తప్పుడు విధులు కూడా ఉండవు. తప్పుడు విధులు ఉండడం, తప్పుడు సంబంధాలు ఉండడానికే గుర్తు.

నూతన సమాజంలో సైనికులు, సైనిక విధిని నిర్వహించవలసిన అవసరం లేని సమయాలలో, కార్మికుల లాగానే ఇతర శ్రమలలో తప్పనిసరిగా పాల్గొంటారు. కొంత కాలానికి 'సైనిక విధే' అవసరం లేకుండా పోతుంది.

# నూతన సమాజంలో, 'నేర విచారణ' శ్రమలు

దోపిడీ సమాజంలో ఉండే నేరాల గురించీ, నేర విచారణ శ్రమల గురించీ (పెట్టుబడిదారీ కోర్టుల గురించి) ఈ చాప్టరు లోనే మొదట చూశాం. ఈ విషయంలో, నూతన సమాజ పరిస్థితుల గురించి కూడా ఒక కనీస స్పష్టతతో ఉండాలి. నూతన సమాజానికి కూడా, దాని చట్టాలు దానికి ఉంటాయి. దాని సాంఘిక బాధ్యతలు దానికి ఉంటాయి. సమిష్టి మానవ జీవితం, వైరుధ్యాలు లేకుండా సాగడానికి, ఎటువంటి 'క్రమశిక్షణా సూత్రాలు' అవసరమో ఇవన్నీ ఆ సూత్రాలన్నీ దానికి ఉంటాయి. ఈ చట్టాలూ, సూత్రాలూ, బాధ్యతలూ, అందరి క్షేమాన్నీ కాపాడే లక్ష్యంతో ఉంటాయి. సమాజంలో జీవించే ప్రతీ మనిషీ ఈ నియమాలన్నిటికీ కట్టుబడి ఉండాలి. అందరూ ఒకే రకమైన నియమాల్ని పాటించినప్పుడు, ఆ పరిస్థితి, 'నియమాలు లేని స్వేచ్ఛ'తో సమానం అవుతుంది. అంత కన్నా, సహజమైన, నిజమైన, స్వేచ్ఛ ఏదీ ఉండదు. 'ఆట'లో కొన్ని నియమాలకు కట్టుబడి ఉండడం ఎవరికీ బాధ కలిగించదు. అది సహజ క్రమశిక్షణ అవుతుంది. అలాగే నిత్యజీవితంలో కొన్ని నియమాల్ని పాటించడం కూడా అంత సహజ విషయంగా అయిపోతుంది. అలాంటి పరిస్థితుల్లో మనుషులు తప్పనిసరిగా 'ఆట'లో నియమాల్ని పాటించినంత సహజం గానే జీవితంలో నియమాల్ని పాటిస్తారు.

కానీ, ఇక్కడ 'నేరానికి' మిగిలివుండే ఒక 'సూక్ష్మమైన అవకాశాన్ని' కూడా ఊహించాలి. నూతన సమాజం, 'హద్దులు లేని ఎబ్సల్యూట్ స్వేచ్ఛ'గల సమాజం కాదు. ఈ సమాజంలో, 'అందరూ శ్రమ చెయ్యాలి' అనే

నియమం ఉంటుంది గానీ, 'ఇష్టమైన వాళ్ళే శ్రమ చెయ్యండి, లేని వాళ్ళు మానెయ్యండి' అనే నియమం ఉండదు. 'ఈ క్రమశిక్షణని అందరూ పాటించాలి' అనే నియమం ఉంటుందిగానీ, 'ఇష్టమైన వాళ్ళే పాటించండి. లేని వాళ్ళు మానెయ్యండి' అనే నియమం ఉండదు. ఆ రకపు అసమానమైన, అవధులు లేని స్వేచ్ఛని నూతన సమాజం ఎవరికీ ప్రసాదించదు. 'ఎవరికి ఇష్టమైనట్టు వాళ్ళు ఉండడం' అనే స్వేచ్ఛని గనక మనుషులు తమకు తాము ఇచ్చుకుంటే, ఆ సమాజం చాలా తక్కువ కాలం లోనే జంతు ముఖంగా ప్రయాణం ప్రారంభిస్తుంది. మనిషి జీవితానికి 'శ్రమ' తప్పనిసరి అయితే, దాని కోసం కొన్ని నియమాలు పాటించడం కూడా తప్పనిసరే. అయితే, 'నియమాలు' అనేవి, ఎంత న్యాయమైనవీ, ఎంత సమానమైనవీ అయినా, నియమాలు నియమాలే. హద్దులు హద్దులే. నియమాలూ, హద్దులూ ఉన్నచోట, వాటిని దాటే సందర్భాలు కూడా ఉంటే ఉండవచ్చు. నూతన సమాజపు నియమాలూ హద్దులూ, సహజమైనవీ, అందరికీ ఒకే రకంగా వర్తించే స్వభావం గలవీ కాబట్టి, వాటిని మీరే సందర్భాలు దాదాపుగా ఉండవు; ఎక్కువ స్థాయిలో ఉండవు; ఎక్కువ సంఖ్యలో ఉండవు. కానీ, 'కొన్ని అయినా ఉంటాయి' అనే ఊహించాలి. చాలా అరుదు గానే అయినా, అతి తక్కువ సంఖ్య లోనే అయినా, అతి తక్కువ స్థాయిలోనే అయినా, సమాజ నియమాల్ని పాటించని సందర్భాలు జరగడానికి అవకాశం ఉండవచ్చు. అంటే, 'నేరం' అనదగ్గ సంఘటనలు నూతన సమాజంలో కూడా ఏదో ఒక స్థాయిలో జరుగుతాయి.

కానీ, ఈ నేరానికీ, దోపిడీ సమాజాల నేరానికీ, ఏ కోశానా పోలిక ఉండదు. ఈ నేరాలు, ఆస్తి కొట్లాటలూ, వ్యాపార మోసాలూ, దొంగతనాలూ, హత్యలూ — వంటి విగా ఉండవు. ఇవి నూతన సమాజ భౌతిక పరిస్థితుల్ని బట్టి మాత్రమే ఉంటాయి. అంటే, పనిలో అశ్రద్ధగా ఉండ డంగా గానీ, బాధ్యతలు సరిగా నిర్వర్తించకపోవడంగా గానీ — ఆ రకంగా కావచ్చు. ఆ నాటి స్థాయికి అదే నేరం కావచ్చు.

'నేరం' ఏ రూపంలో ఉన్నా, ఆ నేరం గురించి 'విచారణ' చెయ్యడం అవసరమే. కాబట్టి, నూతన సమా జంలో కూడా 'నేర విచారణ' విధి ఒకటి అప్పుడప్పుడైనా అవసరమవుతుంది. కానీ, ఈ విధి నిర్వహణ కోసం దోపిడీ సమాజాల రకపు కోర్టులూ, పద్ధతులూ, శిక్షలూ — పనికి రావు. 'సహజ సంబంధాల' పునాది మీద నిలబడ్డ సమాజం, ఏ 'విధి'ని అయినా సహజ పద్ధతి లోనే నిర్వర్తిస్తుంది. అంటే, నేరస్తుడి తరఫున, లాయరు, డబ్బు తీసుకుని మాట్లాడి పెట్టడమూ, 'జీతం' తీసుకునే జడ్జీ న్యాయం చెప్పడమూ — లాంటి పద్ధతులు లేకుండా.

ఒక కార్మికుడు (లేదా, కార్మికురాలు) 'పని' విష యంలో 'అశ్రద్ధ'గా ఉన్నాడనుకుందాం. ఒక వ్యక్తి అలా ఉంటే, దాని వల్ల ఇతర వ్యక్తుల మీద ఎక్కువ పని భారం పడుతుంది. కాబట్టి, ఈ 'నేరం' మీద 'విచారణ' జరగా లంటే, ఆ నేరం వల్ల జరిగే దుష్ఫలితాన్ని అనుభవించ వలసిన తోటి కార్మికుల మధ్యనే, నేరం జరిగిన స్థలం లోనే, విచారణ జరగాలి. ఎవరు చెప్పదల్చినది వాళ్ళు చెపుతారు. నేరస్తుడు చెప్పేది నేరస్తుడు చెపుతాడు. నేరస్తుడు చెప్పేది న్యాయంగా తోస్తే, అతన్ని సమర్థిస్తూ ఇతరులు కూడా మాట్లాడవచ్చు. లేదా, అతన్ని ప్రశ్నిస్తూ కూడా ఇతరులు మాట్లాడవచ్చు. ఇక్కడ నేరస్తుడి కోసం ఒక లాయరూ, అతనికి వ్యతిరేకంగా ఇంకో లాయరూ ఉండవలసిన అవసరం ఉండదు. సంబంధిత వ్యక్తులే వాదోపవాదాలు చెయ్యవచ్చు. చర్చించవచ్చు. నిజాన్ని రాబట్టవచ్చు. మెజారిటీ సభ్యుల అభిప్రాయమే 'తీర్పు'గా ఉంటుంది. ఇక్కడ విచారణలో పాల్గొనే జనాలే లాయర్లూ, జడ్జీలూ.

ఈ రకంగా, నూతన సమాజంలో కూడా నేర విచా రణకు కొన్ని నియమాలు గల ఏదో ఒక పద్ధతి ఏర్పడు తుంది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు, నేరం జరిగిన ప్రాంతం లోనే, ఆ జనాల మధ్యే, నేర విచారణ జరగ వచ్చు. ఆ జనంలో వ్యక్తులే తాత్కాలికంగా న్యాయాధికారు లుగా వ్యవహరిస్తూ ఆ విచారణ అంతా జరిపించవచ్చు. నేర స్తుడు, లాయరు మీద ఆధారపడడు గనక, లాయరు సరిగా పని చెయ్యకపోవడం గానీ, అతను నేరస్తుడి శత్రు పక్షంతో కుమ్మక్కవడంగానీ జరిగే పరిస్థితి ఉండదు. అలాగే, ఇక్కడ అంతా జనం మధ్యే జరుగుతుంది కాబట్టి, న్యాయాధికారులు న్యాయాన్యాయాలు పెడ చెవిన బెట్టి, లంచాలకు లొంగి, తమ చిత్తం ప్రకారం శిక్షలు విధించే పరిస్థితి కూడా ఉండదు. అంటే, ఇక్కడ 'ఫీజు' తీసుకుని మాట్లాడి పెట్టే అసహజ లాయరు వృత్తీ, 'న్యాయాధికారి' పేరుతో ఒక ఉద్యోగి న్యాయం చెప్పే పద్ధతీ, అవసరమై పోతాయి.

దోపిడీ సమాజంలో, నేరం ఒక చోటా, నేర విచారణ ఇంకో చోటా జరుగుతాయి. అన్ని ఉద్యోగాల లాగానే న్యాయం చెప్పడం కూడా కేవలం ఒక 'ఉద్యోగంగా' ఉంటుంది. అంతేగాక, ఈ సమాజంలో ఒక కేసు విచారణ పూర్తి అవడానికి కనీసం 10, 15 సం.లు పడుతుంది. 20, 30 సం.లు పట్టే సందర్భాలు కూడా ఉన్నాయి.

నూతన సమాజపు 'నేర విచారణ'లో ఈ అసహజ పద్ధతులన్నీ పోతాయి. ఇక్కడ ఒక నేరం గురించి విచారణ

కొన్ని 'గంటల్లో' గానీ, 'రోజుల్లో' గానీ పూర్తి అయి పోతుంది. అంటే, ఇక్కడ 'నేర విచారణ' స్వభావమూ, రూపమూ మారిపోతాయి.

నూతన సమాజ నిర్మాణానికి సంబంధించిన అనుభ వాలు ఇంకా ఇంకా పెరుగుతోన్న కొద్దీ, ప్రతీ విషయానికీ, సహజమైన విధానాలూ మార్గాలూ ఏర్పడుతూ, ఒక నాటికి అవి సరైన పద్ధతిలో స్థిరపడతాయి.

దోపిడీ అనేది నిజంగా పోతే నూటికి 99 నేరాలు పోతాయి. ఆ ఉన్న ఒక్క శాతం నేరం కూడా పూర్తిగా తీవ్రత తగ్గిపోతుంది. నేరం అనదగ్గ సంఘటనలు చాలా అరుదుగా మాత్రమే జరిగే పరిస్థితుల్లో, ఇప్పటి నేర విచారణ బలగాలన్నీ పూర్తిగా అంతర్థానమై పోతాయి.

# నూతన సమాజంలో, 'కళలు'

**నూ**తన సమాజంలో, నూతన శ్రమ విభజన సూత్రాల ప్రకారం, ఒక 'కళ'గల మనిషి కూడా, సాధారణ శారీరక, మేధా శ్రమలు చెయ్యవలసిందే. అయితే, 'కళ' అభివృద్ధికి తప్పనిసరిగా కొంత సమయం ఉండాలి కాబట్టి, ఆ వ్యక్తికి ఇతర శ్రమలలో కొంత భాగం తగ్గించ వచ్చు. కానీ, జీవితావసర వస్తువుల్నీ, సౌకర్యాల్నీ పొందే విషయంలో అందరి లాగానే కళాకారుడు కూడా. కానీ, కళాకారుడు తన కళాభివృద్ధికి కావలసిన ప్రత్యేక అవసర వస్తువులు పొందవచ్చు. అంతకన్నా, ఎంత గొప్ప కళాకారు డికి కూడా, ప్రత్యేక విలువలు (డబ్బు గానీ, సౌకర్యాలు గానీ) ఉండ నక్కరలేదు.

అంతా సహజ నియమాల మీద ఆధారపడిన ప్రపం చంలో, ఒక కళాకారుడు తన కళని ప్రపంచానికి ఇచ్చి, దానికి ప్రతిఫలంగా, ఆ కళని ఇష్టపడే ఇతర మానవుల ప్రేమని పొందుతాడు. ఇదంతా, నూతన సమాజ సహజ సూత్రాలకు సంబంధించిన విషయం.

# నూతన సమాజంలో, 'వ్యభిచార సమస్య!'

**వ్య**భిచారం అనేది — పేదరికం సమస్యా, సెక్సు సమస్యా, ప్రేమ లేని పెళ్ళిళ్ళ సమస్యా, పురుషాధిక్యత సమస్యా, సమాజం అంతా అల్లుకుని ఉన్న తప్పుడు భావాల సమస్యా — వగైరా అనేక సమస్యల గందర గోళపు సృష్టి — అని ఈ చాప్టరు లోనే చూశాం. ఈ సమస్యలన్నిటికీ మూలం — దోపిడీయే. అంటే, వ్యభి చారానికి మూలం — దోపిడీతో సాగే తప్పుడు సమాజమే.

కాబట్టి, వ్యభిచారాన్ని నిర్మూలించవలసిన నూతన సమాజం, దానికి సంబంధించిన సమస్యలన్నిటినీ దృష్టిలో పెట్టుకోవాలి. వ్యభిచారాన్ని నిర్మూలించవలసిన నూతన సమాజానికి పేదరికాన్ని నిర్మూలించడం ఎంత అవ సరమో, స్త్రీ పురుష సంబంధాలలోని అసమానతల్ని నిర్మూలించడం కూడా అంత అవసరం. ఈ రెండు అంశాలూ కలిసే వ్యభిచారాన్ని సృష్టిస్తాయి గనక, ఈ రెండు అంశాల్నీ పరిష్కరించి నప్పుడే, వ్యభిచార సమస్య పరిష్కారమవుతుంది. 'వేశ్యా వృత్తి'ని నిర్మూలించడమే వ్యభిచారాన్ని నిర్మూలించడం కాదు. పేదరికం పోయి నప్పుడు వేశ్యావృత్తి పోతుంది. కానీ, స్త్రీ పురుషుల సహ జీవనంలో ఇంకా ఇతర 'అశాంతులు' ఉండి పోయి నప్పుడు వ్యభిచార లక్షణాలు రహస్య స్థితిలో ఇంకా ఉండి పోతాయి.

నూతన సమాజం, స్త్రీ పురుషుల సంబంధాల్ని, పైకి మాత్రమే సాంప్రదాయ బద్ధంగా కనపడే కపట సంబం ధంగా గాక, నిజమైన స్నేహానురాగాలతో ఏర్పడే నిర్మల మైన నూతన సంబంధంగా నిర్మించవలసి ఉంటుంది.

ఇప్పటి వరకూ ఉత్పాదక — అనుత్పాదక విభజన గురించి అనేక విషయాలు చూశాం. వీటి ఆధారంతో ఇక్కడ చూడని విషయాల్ని కూడా అర్థం చేసుకోవచ్చు.

దోపిడీ సమాజంలో ఉండే మొత్తం శ్రమల్లో అనేక అసహజ శ్రమలు, రేపు నూతన సమాజంలో పూర్తిగా నశించిపోవలసినవే. మరి కొన్ని రకాల శ్రమలు ('నేర విచారణ' శ్రమల లాంటివి) రూపమూ, స్వభావమూ మారతాయి. ఆహారానికీ, కళలకూ, ఇంకా అటువంటి అవసరాలకూ సంబంధించిన శ్రమలన్నీ ఎప్పుడూ చెక్కు చెదరకుండా శాశ్వితంగా ఉంటాయి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1. సహజ శ్రమలు — అంటే ఏమిటి?**
**అసహజ శ్రమలు — అంటే ఏమిటి?**

**జ:** ఏ శ్రమలు లేకపోతే మానవ జీవితమే ఉండదో, అవి సహజ శ్రమలు. ఏ శ్రమలు లేకపోయినా మానవ జీవితానికేమీ హాని జరగదో అవి అసహజ శ్రమలు. వ్యవసాయం, నేతా, కుట్టూ, రవాణా, వైద్యం — వంటి శ్రమలన్నీ సహజ శ్రమలు. అమ్మే - కొనే శ్రమలూ, యుద్ధాలూ, వ్యసనాలూ — వంటి శ్రమలు అసహజ శ్రమలు.

**2. ఒక నేత శ్రామికుడు ఒక పెట్టుబడిదారుడి దగ్గిర పని చేస్తున్నాడు. ఆ శ్రమని, పెట్టుబడిదారుడి వేపు నించి చూస్తే, ఆ శ్రమ, ఎలాంటి విభజనతో ఉంటుంది? శ్రామికుడి వేపు నించి చూస్తే, ఎలాంటి విభజనతో ఉంటుంది?**

**జ:** ఒక శ్రమని, దాన్ని కొన్న యజమాని వేపునించి చూస్తే, 'ఉత్పాదక — అనుత్పాదక' విభజనతో ఉంటుంది. శ్రమ చేసే వ్యక్తి వేపు నించి చూస్తే, 'విలువా — ఉపయోగపు విలువా' విభజనతో ఉంటుంది.

**3. ఒక స్త్రీ, ఒక ఇంట్లో వంట మనిషి ఉద్యోగం చేస్తోంది. ఆమె, తన శ్రమని, ఆ ఇంటివాళ్ళకి అమ్ముకుంటోంది. అంటే, ఆమె శ్రమ, సరుకుగా మారినట్టే కదా? ఆ ఉద్యోగం వల్ల ఆమెకు జీతం వస్తుంది. ఆ సరుకు, డబ్బుగా మారినట్టే కదా? ఆమె, ఉత్పాదక శ్రామికురాలు ఎందుకు కాదు?**

**జ:** ఒక శ్రమ, సరుకుగానూ డబ్బుగానూ మారేది, ఆ శ్రమచేసే వ్యక్తి వేపు నించి చూసినప్పుడు కాదు; ఆ శ్రమని కొనే యజమాని వేపు నించి చూసినప్పుడు అది జరగాలి. ఆ శ్రమ, యజమానికి సరుకుగా ఉండదు కాబట్టే, ఆ శ్రామికురాలు యజమానికి ఉత్పాదక శ్రామికురాలు కాదు.

**4. ఒక పెట్టుబడిదారుడు, తన సరుకు విషయంలో నిర్వహణ శ్రమ చేస్తాడు. అతనికి వచ్చే లాభం నిర్వహణ శ్రమకా, పెట్టుబడికా?**

**జ:** నిర్వహణ శ్రమ కోసం వచ్చేది — జీతం. 'లాభం' అనేది ఏ శ్రమకీ కాదు. అది, పెట్టుబడిదారుడికి, ఉత్పత్తి సాధనాలతో వున్న స్వంత ఆస్తి సంబంధానికి. అంటే, దోపిడీకే.

**5. ఈ శ్రమలు — ఉత్పాదక శ్రమలా, అనుత్పాదక శ్రమలా, స్వతంత్ర శ్రమలా, కుటుంబ శ్రమలా? కుట్టు, వైద్యం, వంట, రాత.**

**జ:** అలా చెప్పలేము. ఒక శ్రమ, ఎలాంటి సంబంధాల్లో ఉందో తెలియాలి. యజమానితో సంబంధంలో ఉందా లేదా; సరుకుని ఉత్పత్తి చేసేదిగా ఉందా లేదా? ఈ సంబంధాల్ని బట్టే. ఒక శ్రమ నిర్వహించే పాత్ర ఉంటుంది.

**6. పెట్టుబడిదారుడు, ఉత్పాదక శ్రమ ద్వారా లాభపడతాడు. కానీ, అనుత్పాదక శ్రమ ద్వారా నష్టపోతాడు. — ఈ అభిప్రాయం సరైనదేనా?**

**జ:** కాదు. పెట్టుబడిదారుడికి ఏ శ్రమ ద్వారా అయినా లాభమే ఉంటుంది. ఉత్పాదక శ్రమద్వారా డబ్బుని పెంచుకునే లాభం అయితే, అనుత్పాదక శ్రమ ద్వారా ఖర్చుల్ని తగ్గించుకునే లాభం. ఏదైనా లాభమే. ప్రతీ చోటా నష్టపోయేది శ్రామికులే.

**7. ఈ పనులన్నీ శ్రమలేనా?**
**(1) అన్నం వండడం,**
**(2) అన్నం తినడం,**
**(3) వ్యాయామం నేర్పడం,**
**(4) వ్యాయామం చెయ్యడం,**
**(5) పాఠాలు చెప్పడం,**
**(6) పాఠాలు నేర్చుకోవడం,**
**(7) స్నానం చెయ్యడం,**
**(8) పిల్లలకు స్నానాలు చేయించడం.**

**జ:** వాటిలో 1, 3, 5, 8 నంబర్లు గలవి మాత్రమే శ్రమలు. మిగిలినవి కావు.

**8. 'డబ్బు నోట్ల'ని ముద్రించే ప్రెస్సులలోనూ, 'నాణాల్ని' తయారు చేసే టంకశాలలలోనూ పనిచేసే కార్మికులు ఉత్పాదక కార్మికులేనా?**

**జ:** ఆ పనులు అనుత్పాదక శ్రమలే. ఎందుకంటే: ఈ శ్రమల వల్ల, డబ్బు నాణాలూ, నోట్లూ తయారవుతాయి. కానీ, అవి 'సరుకులు' కావు. వాటిని అమ్మరు. ఆ నోట్లనీ నాణాల్నీ తయారు చెయ్యడానికి అయ్యే ఖర్చుని, ప్రభుత్వ ఆదాయంలో నించే పెట్టవలసి ఉంటుంది. ఈ కారణాల వల్ల ఇదంతా అనుత్పాదక శ్రమే అవుతుంది. ఈ శ్రామికులందరూ అనుత్పాదక శ్రామికులే.

**9. కుటుంబ శ్రమల స్వభావం ఏమిటి?**

**జ:** ఉపయోగపు విలువల్ని, అంటే స్వంత వాడకం వస్తువుల్ని తయారు చేసే స్వభావం.

**10. ఒక కుటుంబం వాళ్ళు పచ్చళ్ళు తయారుచేసి అమ్ము తారు. ఆ శ్రమ కుటుంబ శ్రమేనా?**

**జ:** కాదు. ఆ శ్రమ, సరుకుల్ని తయారు చేస్తుంది. ఆ సరుకుల్ని అమ్మేస్తారు. కాబట్టి, అది కుటుంబం కోసం కాదు. అది, స్వతంత్ర ఉత్పత్తి దారుల శ్రమ అవుతుంది..

**11. వస్తువుల వాడకానికి కూడా ఉత్పాదక — అనుత్పాదక తేడా ఉంటుంది. వివరించండి!**

**జ:** పెట్టుబడిదారుడి దగ్గిర, 'సరుకు'ని తయారు చెయ్యడం కోసం అవసరమయ్యే ఉత్పత్తి సాధనా లన్నీ వాడికి ఉత్పాదకంగా ఖర్చవుతున్నట్టూ; అదే పెట్టుబడిదారుడి ఇంటి దగ్గిర వాడే వస్తువులన్నీ వాడికి అనుత్పాదకంగా ఖర్చవుతున్నట్టూ అర్థం.

**12. సైనికులు, రైల్లో ప్రయాణం చేసి ఒక చోటు నుంచి ఒక చోటుకి వెళ్ళారు. దాని కోసం ప్రభుత్వం కొంత ఖర్చు పెట్టింది. అది ప్రభుత్వానికి ఉత్పాదమైన ఖర్చా, అనుత్పాదకమైన ఖర్చా?**

**జ:** అనుత్పాదకమైన ఖర్చే. పోలీసూ, సైన్యమూ, ప్రభు త్వాఫీసులూ — వంటి సంస్థలకోసం ప్రభుత్వం పెట్టే ఖర్చులన్నీ అనుత్పాదకమైన ఖర్చులే. ఆ ఖర్చులన్ని టినీ ప్రభుత్వం, తన ఆదాయంలో నించే పెడుతుంది.

**13. ప్రభుత్వం, తన పరిపాలన కోసం పెట్టే ఖర్చు అంతా దానికి తిరిగి రాని ఖర్చే. అయితే, అది అలాంటి ఖర్చులు ఎందుకు పెడుతుంది?**

**జ:** ప్రభుత్వం పెట్టే ఖర్చు, దానికి తప్పకుండా తిరిగి వస్తుంది. కానీ, డబ్బుగా కాదు; దానికి కావలసిన ప్రయోజనాలన్నీ నెరవేరే రూపంలో అది తిరిగి వస్తుంది. ప్రభుత్వం అనేది — దోపిడీ వర్గ సంస్థ. ఆ వర్గానికి కావల సింది — తను శ్రమ చెయ్యకుండా బతకడమే. దానికోసం అది శ్రామిక వర్గాన్ని అణిచి ఉంచాలి. అదే దాని పరిపాలన. శ్రామిక వర్గం చేసే శ్రమలలో నించే కొంత భాగాన్ని అది 'పరిపాలన' కోసం ఖర్చుపెట్టక తప్పదు. ఆ ఖర్చు వల్ల దానికి లాభమే గానీ 'నష్టం' ఉండదు. ఆ పరిపాలనే లేకపోతే, దాని దోపిడీ ఆస్తి హక్కులు దానికి నిలబడవు.

**14. పెట్టుబడిదారుడి చేతిలో 300 ఆదాయం ఉంది. అందులో నించి 100ని అనుత్పాదక శ్రమల మీద పెట్టాడు. అదనపు శ్రమ రేటు 200%. అనుత్పాదక శ్రమల కోసం నిజంగా జరగవలసిన ఖర్చులో ఎంత ఖర్చు కలిసి వచ్చింది?**

**జ:** అనుత్పాదక జీతాలు — 100. ఆ శ్రామికుల అద నపు శ్రమ — 200. యజమానికి, 100 ఖర్చుతో 300 శ్రమ దొరికింది. 200 డబ్బుని ఖర్చుపెట్టక్కర లేకుండా ఆ ఖర్చు తగ్గింది.

**15. పెట్టుబడిదారుడు, ఉత్పాదక శ్రామికుడి శ్రమకంతటికీ చెల్లించాలంటే, 10 ఇవ్వాలి. కానీ, 4 ఇచ్చి, 6 ఇవ్వ లేదు. అనుత్పాదక శ్రామికుడికి కూడా పూర్తిగా చెల్లించా లంటే 10 ఇవ్వాలి. అతనికి కూడా 4 ఇచ్చి, 6 ఇవ్వ లేదు. ఈ 2 సందర్భాలకూ, తేడా ఏమిటి?**

**జ:** ఉత్పాదక శ్రామికుడికి ఇచ్చిన 4 + ఇవ్వని 6 = 10. ఇది అంతా పెట్టుబడిదారుడికి డబ్బుగా అందు తుంది. అనుత్పాదక శ్రామికుడికి ఇచ్చిన 4 గానీ, ఇవ్వని 6 గానీ, ఏదీ డబ్బుగా మారదు. తేడా ఇదే.

**16. ఒక డ్రిల్లు టీచరు, కొంత మంది విద్యార్థులతో ఆటలు ఆడించి, ఆ ఆటల్ని చూసే జీవాలకు టిక్కెట్లు అమ్మి, టిక్కెట్ల ద్వారా కొంత డబ్బు సంపాదిస్తాడు. ఆ విద్యార్థులు ఉత్పాదక శ్రామికులా?**

**జ:** కారు. ఆటలు ఆడడం శ్రమ క్రమం కాదు. ఆ ఆటగాళ్ళు, ఏ రకం శ్రామికులూ కారు.

**17. తోటమాలి ఉత్పాదక శ్రామికుడిగా ఎప్పుడవుతాడు?**

**జ:** ఆ తోట, ఒక యజమానిదై ఉండాలి. ఆ తోటలో తయారైన కాయగూరలూ, పళ్ళూ అమ్మకానికి వెళ్ళేవై ఉండాలి. అప్పుడే ఆ తోటమాలి ఉత్పాదక శ్రామికుడు.

**18. ఒక సంవత్సరపు ఉత్పత్తిరాసి విలువ 120. దాని భాగాలు = $80C + 20V + 20S$. అందులో స్వతంత్ర ఉత్పత్తిదారుల ఉత్పత్తి 10%. దాన్ని తీసేస్తే, పెట్టుబడి దారుల ఉత్పత్తి వివరాలు ఎలా ఉంటాయి?**

**జ:** ప్రతీ రాసిలోనూ 10% తగ్గితే, మిగిలినది పెట్టుబడి దారుల లెక్క. ధాని వివరాలు $72C + 18V + 18S = 108$.

**19. ఒక కుట్టు మనిషి, తన బంధువులకు కొన్ని బట్టలు కుట్టి ఇచ్చాడు. ఆ బంధువులు ఇతనికి కొంత ధాన్యం ఇచ్చారు. కుట్టు మనిషి శ్రమ — అతనికి ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమా?**

**జ:** ఈ కుట్టు మనిషి విషయంలో ఉత్పాదక — అను త్పాదక విభజన వర్తించదు. అతని శ్రమకి బదులుగా అతనికి కొంత ధాన్యం వచ్చింది. కాబట్టి, ఆ శ్రమ అతనికి 'విలువ' అయింది.

**20.** **ఒక పెట్టుబడిదారుడు, తన కంపెనీకి తనే డైరెక్టరు. వాడి జీతాన్ని ఎవరు నిర్ణయిస్తారు?**

**జ:** వాడే నిర్ణయించుకుంటాడు. శ్రామికులు నిర్ణయించరు.

**21.** **ప్రభుత్వంలో, ఎం.ఎల్.ఏల, ఎం.పీల, మినిస్టర్ల జీతాల్ని ఎవరు నిర్ణయిస్తారు?**

**జ:** వాళ్ళే నిర్ణయించుకుంటారు. వాళ్ళ నిర్ణయాలే — చట్టాలు. జీతాల చట్టాల్ని నిర్ణయించేది వాళ్ళే కాబట్టి, వాళ్ళ జీతాల్ని నిర్ణయించుకునేది వాళ్ళే!

**22.** **ఇందులో ఏది కరెక్టు? ఏది కాదు?**

| | జ: |
|---|---|
| (1) అదనపు శ్రమని ఇచ్చేదే ఉత్పాదక శ్రమ | × |
| (2) అదనపు శ్రమని ఇవ్వనిది అనుత్పాదక శ్రమ | × |
| (3) వేతన శ్రామికులందరూ ఉత్పాదక శ్రామికులే | × |
| (4) కుటుంబ శ్రమ, స్వతంత్ర శ్రమ | × |
| (5) అనుత్పాదక శ్రామికులందరూ వేతన శ్రామికులే | ✓ |
| (6) 'జీతం' పేరుతో ఉన్న ప్రతీదీ శ్రమ శక్తి విలువే | × |
| (7) స్వతంత్ర ఉత్పత్తిదారుడు, వస్తువులే అమ్ముతాడు; శ్రమని అమ్మడు | × |
| (8) బానిస ఎప్పుడూ శ్రమని అమ్ముతాడు | × |

**23.** **ఈ ఖర్చులు, 'పెట్టుబడి'తో సంబంధం కలిగినవా? 'ఆదాయం'తో సంబంధం కలిగినవా?**

| | **జవాబులు:** |
|---|---|
| (1) పెట్టుబడిదారుడు, టిక్కెట్టు కొని సినిమా చూశాడు. | ఆదాయంతో |
| (2) కార్మికుడు, కొన్ని పుస్తకాలు కొనుక్కున్నాడు. | ఆదాయంతో |
| (3) పెట్టుబడిదారుడు, ఒక యంత్రాన్ని రిపేర్ చెయ్యడానికి వచ్చిన మెకానిక్కుకి కూల్ డ్రింకులు తెప్పించి ఇచ్చాడు. | పెట్టుబడితో |
| (4) పెట్టుబడిదారుడు, కార్మికులందర్నీ ఒక విహార యాత్రకు తీసుకు వెళ్ళాడు. | పెట్టుబడితో |
| (5) పెట్టుబడిదారుడు, కార్మికులు 'పని స్థలం'లో వాడడం కోసం ఒక ప్రత్యేక రకపు జోళ్ళు కొన్నాడు. | పెట్టుబడితో |
| (6) ప్రభుత్వం, మంత్రులందరికీ జీతాలు ఇస్తుంది. | ఆదాయంతో |
| (7) భూస్వామి, పాలేళ్ళకు రోజూ భోజనాలు పెడతాడు. | పెట్టుబడితో |
| (8) ఒక డాక్టరు, వాచ్‌మెన్‌కి జీతం ఇస్తాడు. | ఆదాయంతో |
| కాంపౌండర్‌కి జీతం ఇస్తాడు. | పెట్టుబడితో |

**24.** **ఒక వంట మనిషి, కొన్ని పదార్థాలు తయారుచేసి అమ్ముతాడు. లేదా, అతన్ని ఎవరైనా తమ ఇళ్ళకు పిలిస్తే కూడా వెళ్ళి వంటలు చేసి ఇస్తాడు. రెంటికీ తేడా ఏమిటి?**

**జ:** మొదటి ఉదాహరణలో, ఆ వంట మనిషి, ఆ పదార్థాల కోసం అవసరమయ్యే ఉత్పత్తి సాధనాల్నీ, తన శ్రమనీ కూడా అమ్ముతాడు. రెండో ఉదాహరణలో, తన శ్రమని మాత్రమే అమ్ముతాడు. 2 ఉదాహరణల్లోనూ స్వతంత్ర ఉత్పత్తిదారుడే.

**25.** **పెట్టుబడిదారుడి పని స్థలంలో కార్మికుల కోసం 'మంచి నీళ్ళ' ఏర్పాటు ఉంది. ఎప్పుడైనా ప్రమాదాలు జరిగితే, 'ప్రథమ చికిత్స' చేసే ఏర్పాట్లు ఉన్నాయి. ఈ ఖర్చులు Vలోకి వస్తాయా? ఇవి, ఉత్పాదక ఖర్చులా, అనుత్పాదక ఖర్చులా?**

**జ:** ఉత్పాదక ఖర్చులే. ఇవి Vలోకి వస్తాయి. కానీ, ఇవి కార్మికుల చేతుల్లోకి జీతాలుగా వెళ్ళవు కాబట్టీ, పని స్థలంలోనే జరుగుతాయి కాబట్టీ, ఇవి Cలోకి వచ్చే ఖర్చులు లాగ కనపడతాయి. కానీ, Cలోకి రావాలంటే, అవి ముడి పదార్థాలుగా గానీ, శ్రమ పరికరాలుగా గానీ, ఆగ్జిలరీలుగా గానీ - ఈ 3 రకాలకే చెంది ఉండాలి. ఈ ఖర్చులు అలాంటివి కావు కాబట్టి, Cలోకి రావు. ఇవి, కార్మికుల చేతికి జీతంగా వస్తాయంటే, ఈ ఖర్చుల్ని కూడా పెట్టుబడిదారుడు, కార్మికులు ఇచ్చే 'సజీవ శ్రమలోనించే' తీసి పెట్టాలి. కార్మికులు తమ చేతికి జీతంగా అందే భాగాన్ని పనిస్థలానికి బైటవాడతారు. అది సజీవ శ్రమలో భాగం అయినట్టు గానే, పని స్థలంలో కార్మికుల కోసం జరిగే ఖర్చులు కూడా వారి శ్రమలో భాగాలే. ఆ ఖర్చులన్నీ పోయాకే పెట్టుబడిదారుడికి అదనపు విలువ మిగలాలి. కార్మికుల కోసం, పని స్థలంలో గానీ, బైట గానీ జరిగే ఖర్చు అంతా, పెట్టుబడిదారుడు, V కోసం పెట్టే ఖర్చు కిందే లెక్క. పని చెయ్యని పెట్టుబడిదారుడికోసం ఆఫీసు గదిలో జరిగే ఖర్చు — Sలో భాగమే. వాడు ఇంట్లో మంచి నీళ్ళు తాగినా, ఆఫీసులో మంచి నీళ్ళు తాగినా, అదంతా కార్మికుల శ్రమే!

**26.** ఏ పనులూ చెయ్యని దోపిడీదారులు నిరుద్యోగులేనా?
**జ:** 'ఉద్యోగం — నిరుద్యోగం' అనే మాటలు దోపిడీ దారులకు వర్తించవు. ఉద్యోగం అంటే—యజమాని దగ్గిర ఏదో ఒక శ్రమ చెయ్యడం. అది, యజమానీ శ్రామికుల సంబంధం. స్వతంత్ర ఉత్పత్తిదారుడు, తను ఒక ఉద్యోగం చేస్తున్నానని చెప్పుకోడు. అతనికి యజమాని ఉండడు కాబట్టి, అతను చేసే పని ఉద్యోగం కిందకి రాదు. భూస్వామికిగానీ, పెట్టుబడిదారుడికి గానీ, యజమానులు ఉండరు. వాళ్ళు 'నిర్వహణ శ్రమ' లాంటిది ఏదైనా చేసినా, అది ఉద్యోగం అవదు. వాళ్ళ పని వాళ్ళు చేసుకుంటున్నట్టు అవుతుంది.

**27.** **శ్రామికుల్లో ఉత్పాదక — అనుత్పాదక తేడాలు ఉన్నట్టుగా, పెట్టుబడిదారుల్లో కూడా ఆ తేడాలుంటాయా?**
**జ:** ఉంటాయి. 'సరుకు'ని ఉత్పత్తి చేయించేవాడు ఉత్పాదక పెట్టుబడిదారుడు. ఆ సరుకులో వున్న S ని పంచుకునే వడ్డీ పెట్టుబడిదారుడూ, వర్తక పెట్టుబడిదారుడూ, అనుత్పాదక (S ని ఉత్పత్తి చేయించని) పెట్టుబడిదారులే.

**28.** **స్త్రీలకు ఇంటి పనుల భారం తగ్గాలంటే, పురుషులు కూడా ఆ పనులు చెయ్యాలి. అంతే కదా? ఆ మార్పు కోసం 'ఉమ్మడి వంటిళ్ళు' ఎందుకు? పురుషులందరూ ఎవరింట్లోనే వాళ్ళు ఇంటి పనులు చెయ్యవచ్చు కదా?**
**జ:** ఆ మార్పు ఇంట్లోనే జరిగితే మంచిదే. కానీ, అది జరగదు కాబట్టే ఈ మార్గం. ఉమ్మడి వంటింట్లో అయితే, అక్కడ డ్యూటీల ప్రకారం అందరూ పనిచేసి తీరాలి. అక్కడ, 'పని సంబంధాలు' తప్ప, 'కుటుంబ సంబంధాలు' ఉండవు. అక్కడ భర్తలు, తమ పనుల్ని భార్యల మీదకి తోసివెయ్యడానికి వీలవదు. ఈ రకంగా, ఉమ్మడి వంటిళ్ళు, స్త్రీ పురుషుల మధ్య పాత శ్రమ విభజన మారడానికి దోహదం చేస్తాయి. ఏ మార్పు అయినా, దానికి తగిన పద్ధతిలో జరగాలి. అప్పుడే అది సరైన ఫలితాలు ఇస్తుంది. ఇద్దరు స్త్రీలు, ఇంటి పనులన్నీ కలిసి చేసుకున్నట్టుగా, ఇంట్లో ఉన్న స్త్రీ పురుషులు, ఇంటి పనులు కలిసి చేసుకుంటే, అది స్త్రీల శ్రమని తప్పకుండా తగ్గిస్తుంది. కానీ, ఈ మార్పు స్త్రీలందరూ బైటి పనులు చెయ్యడంతో లంకెపడి ఉంటుంది. పాత శ్రమ విభజనలో మార్పు అప్పుడే జరుగుతుంది.

**29.** **మీరు, ఒక ధనికుడి ఇంటి కారు డ్రైవరు. మీ యజమానులు ప్రతి రోజూ హోటళ్ళకో, సినిమాలకో, పెళ్ళిళ్ళకో, విందులకో, షికార్లకో, స్నేహితుల ఇళ్ళకో, తప్పని సరిగా పోతూ ఉంటారు. అలాంటి సందర్భాల్లో మీరు రెండేసి, మూడేసి గంటలు కారుని కనిపెట్టుకుని కూచుని ఉంటారు. అలాంటి వేళల్లో, ఆ కారు పక్కనించి అనేక మంది పేదలూ, చిన్న పిల్లలూ, వృద్ధులూ నడిచి వెళ్తూ ఉంటారు. మీ చేతిలో కారు ఉంది. కారుని నడిపే శక్తి ఉంది. మీకు టైము కూడా ఉంది. కానీ, ఆ కారుని మీరు ఎవరి అవసరానికీ ఉపయోగించరాదు. ఎందుచేత? ఒక పక్క రవాణా సాధనం ఉంది. ఇంకో పక్క దానితో అవసరం ఉంది. అయినా అది ఆ అవసరానికి ఉపయోగ పడదు. ఇక్కడ ఉన్న వైరుధ్యం ఏమిటి?**
**జ:** ఆ కారు, ఒక యజమాని స్వంత ఆస్తి. ఆ డ్రైవరు, ఒక యజమాని దగ్గిర శ్రామికుడు, అతనికి, ఆ కారుని, తనకు ఇష్టమైనట్టు ఉపయోగించే హక్కు ఉండదు. కాబట్టి, అక్కడ ఎంత అవసరం కలిగినా అతనేమీ చెయ్యలేడు.

**30.** **ఆ కారు, ఆ డ్రైవరు స్వంతానిదే అనుకుందాం. అప్పుడు అతను, ఆ కారుతో, దారేపోయే పిల్లలకూ, వృద్ధులకూ సహాయం చెయ్యగలడా?**
**జ:** ఎప్పుడైనా దయదల్చి ఒకటి రెండు సార్లు చేస్తే చెయ్యగలడు గానీ, ప్రతి సారీ అలా చెయ్యలేడు. ఎందుకంటే, కారుని ఉపయోగించాలంటే, దానికి కొంత ఖర్చు అవుతుంది, ఆ ఖర్చు అతనే పెట్టుకుని సంఘ సేవ చెయ్యలేడు. రవాణా సాధనాలు, స్వంత ఆస్తులుగా గాక, సమిష్టిగా ఉన్నప్పుడే అవి అందరికీ ఉపయోగపడడం సాధ్యం.

**31.** **మీరు బస్ కోసం నిలబడీ, నిలబడీ విసిగెత్తి పోయారు. నీరసపడి పోయారు. రోడ్డు మీద పోతూ ఒక ఖాళీ కారు కనిపించింది. మీరు దాన్ని ఆపారు. డ్రైవర్‌కి డబ్బు ఇస్తానంటే, మిమ్మల్ని డ్రైవరు కారు ఎక్కించుకున్నాడు. మీరు అందులో 'సుఖంగా' కూర్చుని ప్రయాణం చేస్తున్నారు. అప్పుడు మీకు ఏమని పిస్తుంది?**
(1) మనకు కూడా ఇలాంటి కారు ఉంటే ఎంత బాగుండును! (2) ఈ డ్రైవర్ చూడు, యజమానిని మోసం చేసి డబ్బు సంపాదిస్తున్నాడు. (3) డ్రైవరు చాలా మంచి వాడిలా ఉన్నాడు. అడగ గానే ఒప్పుకున్నాడు. (4) కోట్ల కోట్ల జనం బస్సుల కోసం రోజూ అనేక గంటలు రోడ్ల మీద పడి ఉంటోంటే, ఈ కార్లున్న దోపిడీ దొంగలు రోజూ ఇంత సుఖంగా ప్రయాణాలు చేస్తున్నారన్న మాట!
**జ:** నాకు నాలుగో రకం గానే అనిపిస్తుంది.

**32.** **ఒక సినిమా నటుడు 20 సం.ల నటజీవితంలో 20 కోట్ల రూ.లు సంపాదించాడు. అదంతా అతని కష్టార్జితమేనా?**

**జ:** కాదు. అందులో కొంత మాత్రమే అతని కష్టార్జితం. మిగిలినదంతా జనాల జేబుల్లోదీ, ఆ సినిమాల కోసం పని చేసిన చిన్న స్థాయి కార్మికుల అదను విలువలోదీ.

**33. సీజన్లు మారే కాలాల్లో, జనాలకు జబ్బులు బాగా వస్తూ ఉంటే, డాక్టర్లకు ఆనందం. జనాలు బాగా పోట్లాడు కుంటూ, కేసులు బాగా వస్తూ ఉంటే, లాయర్లకు ఆనందం. ఇలాంటివి ఇంకా కొన్ని ఉదాహరణలు చెప్పండి!**

**జ:** దోమలు పెరిగిపోతే, దోమల మందుల పెట్టుబడి దారులకు ఆనందం. ఈగలు పెరిగిపోతోంటే, ఈగల మందుల వాళ్ళకీ. తుఫాన్లు లేచి రహదారులన్నీ ధ్వంసం అయితే, రోడ్ల కాంట్రాక్టర్లకు ఆనందం. ఎవరి లాభం వాళ్ళకి ఆనందం! పెట్టుబడిదారీ వర్గంలో, 'ఆనందం' అనేది వేరే ఏమీ లేదు. లాభమే ఆనందం.

**34. బానిసకు, బానిసత్వం పట్ల విరుద్ధాభిప్రాయాలు ఉంటాయి. యజమానికి అనుకూలంగా ప్రవర్తించా లనీ, అలా ప్రవర్తించనక్కర లేదనీ. అలాగే, యజమానికి కూడా బానిసత్వం పట్ల విరుద్ధాభిప్రాయాలు ఉంటాయా?**

**జ:** యజమానికి అలా ఉండవు. యజమాని బానిసల వల్ల చాలా సౌఖ్యాలు అనుభవిస్తాడు కాబట్టి, యజ మానికి ఎప్పుడూ బానిసత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఏకైక అభిప్రాయమే ఉంటుంది. కానీ, బానిసల కైతే, బానిసత్వం వల్ల చాలా బాధలు పడతారు కాబట్టి, వారికే దాని పట్ల వ్యతిరేకాభిప్రాయాలు కూడా ఉంటాయి.

**35. దోపిడీ సంస్కృతి — అంటే ఏమిటి?**

**జ:** ఆడంబరాలతోటీ, విలాసాలతోటీ, వ్యసనాలతోటీ జీవించడమే — దోపిడీ సంస్కృతి.

**36. దోపిడీ వర్గం, అలాంటి జీవిత విధానంలో ఎందుకు ఉంటుంది?**

**జ:** అది శ్రమ చెయ్యదు కాబట్టి, దానికి, శ్రమ కాకుండా ఉండే కాలక్షేపాలు కావాలి. అందుకే విలాసాలూ, వ్యసనాలూ. ఒక మనిషి, తన స్వంత శరీరంతో శ్రమ చేస్తే, ఒక శరీరం ఎంత శ్రమ చెయ్యడం సాధ్యమో అంత శ్రమ మాత్రమే చెయ్యగలడు. ఆ శ్రమ అంతా జీవితావసరాలు సుఖంగా తీరడానికి మాత్రమే సరిపోతుంది. కానీ, దోపిడీ దారుడి ఆధీనంలోకి వచ్చే శ్రమ, ఇతరుల శరీరాల ద్వారా వచ్చేది కాబట్టి, ఆ రకంగా ఎన్ని శరీరాల ద్వారా వచ్చే శ్రమని అయినా లాగడం సాధ్యమే. ప్రతీ దోపిడీదారుడి దగ్గిరా, శ్రామికుల శ్రమ లాట్లుపడి ఉంటుంది. దాన్నంతా ఖర్చు పెట్టుకోవాలంటే, ఆడంబరంగా జీవించడం తప్పని సరి. అందుకే, దోపిడీ వర్గ జీవిత విధానం ఆడంబరాలతో ఉంటుంది.

**37. నూతన సమాజం ప్రారంభమైందనీ, కానీ అది ఇంకా 'పరివర్తనా దశ'లోనే ఉందనీ, అనుకుందాం. అక్కడ, పాత భూస్వాములూ, పాత పెట్టుబడిదారులూ, కార్మి కుల లాగే పనులు చేస్తూ ఉంటారా?**

**జ:** ఆ పాత యజమానులు, కార్మికులలాగే శారీరక శ్రమలు కూడా చేస్తున్నారా లేదా అనేది చెప్పలేము. దానికి చాలా వివరాలు కావాలి. కార్మికవర్గం తన విముక్తి గురించి ఎంత సిద్ధాంత జ్ఞానంతో ఉందీ — అనే దాని మీదే అది ఆధారపడి ఉంటుంది. 'పరివర్తనా దశ' అనేది కూడా అనేక స్థాయిల్లో ఉంటుంది. అప్పటికి ఇంకా అన్ని మార్పులూ జరిగి ఉండవు. కానీ పాత యజమానులు ఇంకా శ్రమలు చెయ్యడమే ప్రారంభించకపోతే అది పాత సమాజమే అవుతుంది గానీ, పరివర్తనా దశ ఎలా అవుతుంది? పరివర్తనా దశ అంటున్నామంటే, అప్పటికి పాత యజ మానుల ఆస్తి హక్కుల్ని రద్దు చెయ్యడమూ, కొన్ని ఆస్తుల మీద నిబంధనలు విధించడమూ, పాత యజమానులందరూ కూడా ఏదో ఒక శ్రమ చెయ్య డమూ — వంటి మార్పులు ప్రారంభమై పోయి ఉండాలి. అలా మార్పులు ప్రారంభమైతేనే అది పరివర్తనా దశ. ఇంకా జరగవలసిన మార్పులన్నీ కూడా క్రమ క్రమంగా జరుగుతాయి.

**38. 'అభివృద్ధి చెందిన' మానవుడు ఎలా ఉండాలి?**

**జ:** మార్క్సు చెప్పిన నిర్వచనం ప్రకారం, ఆ మానవుడు కొన్ని వేరు వేరు శ్రమలు చెయ్య గల వాడిగా ఉండాలి. ఏదో ఒక శ్రమలో ఒక చిన్న భాగానికి మాత్రమే పరి మితమైపోయి, ఇతర పనులేవీ తెలియని వాడిగా ఉండకూడదు. శారీరక శ్రమలూ, మేధాశ్రమలూ కూడా, లేదా మేధా శ్రమలూ శారీరక శ్రమలూ కూడా, చేసే వాడిగా ఉండాలి. ఇతర మానవులతో సమానుడైన వాడిగా, అంటే మానవుల మధ్య సమానత్వాన్ని ఆచరించే వాడిగా, ఉండాలి. తన స్వంత శక్తులూ, అలవర్చుకున్న శక్తులూ (ఓన్ + ఎక్వైర్డ్ పవర్స్) గల వాడి గానూ, ఆ శక్తు లతో శ్రమలు చెయ్యగల వాడిగానూ, ఉండాలి. అలాంటి మానవుడు — తన శ్రమతోనే తను జీవించా లనీ, అది తన బాధ్యత అనీ, ఇతరుల శ్రమతో జీవించడం నీచమనీ; అంతే గాక శ్రమకి దోపిడీ గురి అవుతూ, దాన్ని భరిస్తూ జీవించడం ఆత్మాభిమాన రాహిత్యమనీ, తెలుసుకుం టాడు. దీన్నంతా క్లుప్తంగా చెప్పుకుంటే, <u>శ్రమ సంబం ధాల్లో సమానత్వాన్ని ఆచరించే లక్ష్యం గల వాడే అభివృద్ధి చెందిన మానవుడు. మానవ సంబంధాల్లో అభివృద్ధి దశ అదే.</u> ★

# 6. పెట్టుబడి విస్తరణ

**సమాజం,** ఉత్పత్తుల్ని ఎప్పుడూ తయారు చేసుకుంటూనే ఉండాలి. 'ఉత్పత్తి క్రమం' అనేది, మళ్ళీ మళ్ళీ జరుగుతూ, ఎప్పుడూ జరుగుతూ వుండే నిత్య నూతన ప్రవాహం.

ప్రతీ ఉత్పత్తి క్రమమూ ఒక 'పునరుత్పత్తి క్రమం' గానూ, ప్రతీ పునరుత్పత్తి క్రమమూ ఒక 'ఉత్పత్తి క్రమం' గానూ ఉంటాయి.

ఆదివారానికి సోమవారం 'రేపు'గా ఉంటే, సోమవారానికి ఆదివారం 'నిన్న'గా ఉంటుంది. ప్రతీ ఒక్కరోజూ — 'రేపు' గానూ, 'నేడు' గానూ, 'నిన్న' గానూ కూడా ఉంటుంది. అలాగే, ప్రతీ ఉత్పత్తి క్రమమూ, మొదట 'భవిష్యత్ ఉత్పత్తి క్రమం'గానూ, తర్వాత 'తక్షణ ఉత్పత్తి క్రమం' గానూ, ఆ తర్వాత గతించిన 'ఉత్పత్తి క్రమం'గానూ ఉంటుంది. ఒక ఉత్పత్తి క్రమంలో తయారైన ఉత్పత్తులతో రెండో ఉత్పత్తి క్రమం నడుస్తూ, అది మూడో ఉత్పత్తిక్రమానికి కావలసిన ఉత్పత్తుల్ని తయారుచేస్తుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో, ఒక సంవత్సరపు ఉత్పత్తి క్రమానికీ, తర్వాత సంవత్సరపు ఉత్పత్తి క్రమానికీ మధ్య సంబంధాలు ఎలా ఉంటాయి? అవి పెట్టుబడిదారీ వర్గం మీదా, శ్రామిక వర్గం మీదా ఎలాంటి ప్రభావాలు కలిగిస్తాయి? — ఈ విషయాలే ఈ చాప్టర్‌లో ప్రధానంగా చూస్తాము.

## సింపుల్ పునరుత్పత్తి:

ఒక 'ఉత్పత్తి క్రమం' వల్ల వచ్చిన 'అదనపు విలువ' అంతా ('అదనపు ఉత్పత్తి' అంతా) దాన్ని పంచుకున్న వాళ్ళ దగ్గిర స్వంత వాడకాలకే ఖర్చయిపోయి, మళ్ళీ పాత పెట్టు బడితోనే, పాత స్థాయిలోనే ఉత్పత్తి క్రమం జరిగితే, అది 'సింపుల్ పునరుత్పత్తి' ( సింపుల్ రిప్రొడక్షన్).

100 మీటర్ల బట్ట కోసం పని చేసిన పెట్టుబడి 100 రూ.లు. (80 స్థిర + 20 అస్థిర). దానివల్ల వచ్చిన అదనపు విలువ 20. ఈ 20 విలువగల ఉత్పత్తి అంతా దోపిడీదార్లకు చేరుతుంది. దీన్ని వాళ్ళు స్వంత అవసరాలకే వాడేశారనుకుందాం. మళ్ళీ కొత్త ఉత్పత్తి క్రమం జరగాలంటే, అది మొదటి దానిలాగే, 100 పెట్టుబడితో మాత్రమే జరుగుతుంది. అంటే, గతంలో ఖర్చయినన్ని ఉత్పత్తి సాధనాల తోటే; గతంలో పని చేసినంత శ్రమ శక్తి తోటే. అప్పుడు, తయారయ్యే బట్ట కూడా గతంలో లాగే మళ్ళీ 100 మీటర్లే ఉంటుంది. దాన్నించి వచ్చే 'అదనపు విలువ' కూడా మళ్ళీ 20య్యే ఉంటుంది. ఈ రకంగా, అదనపు విలువనంతా (అదనపు ఉత్పత్తినంతా) దోపిడీదార్లు, స్వంతానికే వాడేసి, కొత్త ఉత్పత్తిక్రమాన్ని పాత స్థాయిలో మాత్రమే చేస్తే, అది 'సింపుల్ పునరుత్పత్తి'.

## విస్తృత పునరుత్పత్తి:

'అదనపు విలువ'లో కొంత భాగం మొదటి పెట్టుబడికి చేరి, పెట్టుబడి పెరిగి, పెరిగిన పెట్టుబడితో, పెరిగిన స్థాయిలో, కొత్త ఉత్పత్తి క్రమం జరిగితే, అది 'విస్తృత (విస్తరించిన) పునరుత్పత్తి (ఎక్స్‌పాండెడ్ రిప్రొడక్షన్).

బట్ట ఉదాహరణలో, 100 పెట్టుబడికి (80 స్థిర + 20 అస్థిర) 20 అదనపు విలువ వచ్చింది కదా? దాన్ని పంచుకున్న వాళ్ళంతా దాన్ని కేవలం స్వంత వాడకానికే ఖర్చు పెట్టేసుకోకుండా, ఎవరి వాటాలో నించి వాళ్ళు కొంత కొంత భాగం 'పెట్టుబడి'కి చేర్చవచ్చు. వడ్డీ పెట్టుబడిదారుడు, తన ఆదాయంలో నించి కొంత భాగాన్ని పెట్టుబడికి కలిపి, పెట్టుబడిని కొంత పెంచవచ్చు. లేదా, వర్తక పెట్టుబడిదారుడు, తన పెట్టుబడిని పెంచవచ్చు. లేదా, ఉత్పాదక పెట్టుబడిదారుడు ఒక్కడైనా తన 'లాభం'లో నించి కొంత భాగాన్ని పెట్టుబడికి చేర్చవచ్చు. ఎవరెవరు తమ భాగాల్ని పెట్టుబడికి చేర్చారు — అనే వివరాలు ఇక్కడ అనవసరం. ఆ వివరాల్ని వదిలేసి, 20 అదనపు విలువలోనించీ 10 అదనపు విలువ పెట్టుబడికి చేరిందనుకుందాం. ఇప్పుడు మొత్తం పెట్టుబడి 110 అవుతుంది. అంటే, గతంలో ఉండే 100 విలువగల ఉత్పత్తులతో పాటు, ఈ 10 అదనపు ఉత్పత్తులు కూడా కలిసి, ఇప్పుడు మొత్తం 110 ఉత్పత్తులు 'పెట్టుబడి'గా పని చేస్తాయి. అందులో కొన్ని ఉత్పత్తులు 'ఉత్పత్తి సాధనాలు' గానూ, కొన్ని ఉత్పత్తులు 'కార్మికుల జీవితావసర వస్తువులు' గానూ ఉంటాయి. ఈ 110 పెట్టుబడితో జరిగే కొత్త ఉత్పత్తిక్రమం, గతంలో కన్నా పెద్ద స్థాయిలో ఉంటుంది. అందుకే ఇది 'విస్తరించిన పునరుత్పత్తి క్రమం.' ఇది, గతంలోకన్నా ఎక్కువ అదనపు విలువని తీసుకొస్తుంది. పాత పెట్టుబడిలో స్థిర, అస్థిరల పాళ్ళు 4:1 కాబట్టి, కొత్త పెట్టుబడి కూడా ఆ పాళ్ళ ప్రకారమే

పని చేస్తుందనుకుందాం. కొత్తగా చేరే '10 పెట్టుబడి'ని, స్థిర, అస్థిరలుగా విభజిస్తే, అందులో 8 స్థిరా, 2 అస్థిరా, అవుతాయి. పెట్టుబడి 110 అయి నప్పుడు కూడా అదనపు విలువ రేటుని గతంలోలాగే 100%గానే అనుకుంటే, ఇప్పుడు అదనపు విలువ 22 అవుతుంది. ఈ రకంగా, ఎక్కువ పెట్టుబడితో ఎక్కువ అదనపు విలువ వస్తుంది.

# 'పెట్టుబడి' ఎక్కడిది?

ప్రతీ పెట్టుబడిదారుడూ మొదట ఎంతో కొంత పెట్టు బడితో పరిశ్రమని ప్రారంభిస్తాడు కదా? వాడికా పెట్టుబడి ఎక్కడిది? పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రారంభమై నప్పుడు, పెట్టుబడిదారీ వర్గానికంతటికీ వున్న 'మొత్తం పెట్టుబడి' ఎక్కడిది?

ఒక్క మాటలో చెప్తే, 'పెట్టుబడి' అనేది ఎక్కడ వున్నా, ఏ కాలంలో వున్నా, అది దోపిడీ ద్వారా వచ్చినదే.

'బానిస సమాజం' నించీ కూడా దోపిడీ ఉంది. యజ మాని వర్గం, అదనపు ఉత్పత్తిని స్వాహా చెయ్యడం ఆ నాటి నించే ఉంది. బానిసలు, యజమానికి 'భూమి కౌలుని చెల్లించడం' అనేది ఉండదు కాబట్టి, ఆ నాడు ఇంకా 'భూమి కౌలు' అనే మాట లేదు. కానీ, 'వడ్డీ' అనేది, ఆ నాటి నించే ఉంది. ఆ నాడు ఎంతో కొంత వర్తకం కూడా ఉంది. కాబట్టి, 'వర్తక లాభం' అనేది కూడా ఆ నాటి నించే ఉంది.

తర్వాత భూస్వామ్య సమాజంలో, బానిసలు కౌలు రైతులుగా మారిన తర్వాత, 'భూమి కౌలు' అనేది కొత్తగా ప్రారంభమైంది.

ఈ రకంగా, వడ్డీలూ, వర్తక లాభాలూ, భూమి కౌళ్ళూ వేల సంవత్సరాల నించీ ఉన్నాయి. యజమాని వర్గం, ఇన్ని రకాలుగా శ్రమని దోస్తూ భూములూ, డబ్బూ, వెండి బంగారాలూ స్వాధీనం చేసుకుంటూ ఉంది. దాని చేతుల్లో ఆస్తులు పోగుపడడంలో ఆశ్చర్యం లేదు.

ఇక్కడ ఉదాహరణ కోసం, ఒక పెట్టుబడిదారుడి చేతుల్లో మొట్టమొదట ఉన్న 'పెట్టుబడి', దోపిడీద్వారా వచ్చింది కాదనే అనుకుందాం. ఒక వ్యక్తి కొంత కాలం పాటు స్వతంత్ర ఉత్పత్తిదారుడిగా శ్రమ చేసి, తన సంపా దనని చాలా పొదుపుగా వాడుకుంటూ ఒక '100 డబ్బు' కూడబెట్టి, దాన్ని 'పెట్టుబడి'గా పెట్టి కార్మికుల్ని ఏర్పర్చు కుని తను 'శ్రమ' మానివేసి, ఒక 'పరిశ్రమ' ప్రారంభించా డనుకుందాం. అప్పటి నించీ ఆ వ్యక్తి, పెట్టుబడిదారుడు అవుతాడు.

ఆ పెట్టుబడి పాళ్ళు 80 స్థిరా + 20 అస్థిరా. అదనపు విలువ రేటు 100%. ఒక ఉత్పత్తి క్రమం నెల రోజులకు పూర్తి అవుతుందనుకుందాం. ఆ పెట్టుబడి, నెలకి ఒక సారి తిరిగి వస్తే, 20 అదనపు విలువని తెస్తూ ఉంటుంది. అతని పెట్టుబడి ఎక్కడికీ పోదు. ప్రతీ సారీ తిరిగి వచ్చేస్తూ వుంటుంది. ప్రతి సారీ వచ్చే 20 అదనపు విలువని, పెట్టుబడిదారుడు, తన స్వంతానికే వాడేస్తూ, ఎప్పుడూ 100 ని మాత్రమే తిరిగి పెట్టుబడిగా పెడుతున్నాడు — అనుకుందాం. 5 నెలలు పూర్తయ్యే టప్పటికి, పెట్టుబడి దారుడు స్వంతానికి వాడిందంతా కలిపి మొత్తం 100. అది కార్మికుల శ్రమే. పెట్టుబడిదారుడు, ఆ 5 నెలల్లో, తన పెట్టుబడిని తనే తినేశాడన్న మాట. లేదా, వేరే మాటల్లో చెప్తే, 'తన పెట్టుబడి విలువకు సమానమైనంత అదనపు విలువ'ని తిన్నాడు. ఎలా అన్నా ఒకటే.

పెట్టుబడిదారుడు ఇప్పుడు ఆ 100 పెట్టుబడిని చూపించి, "ఇది నా పెట్టుబడి" అనడానికి న్యాయమైన హక్కు ఉండదు. అప్పటికి శ్రామికుల శ్రమలోనించి 100 విలువని తినేశాడు కాబట్టి, ఇక ఆ 100 పెట్టుబడి, పెట్టు బడిదారుడిది కాదు; శ్రామికులదే అవ్వాలి.

లేదా, పెట్టుబడిదారుడు కూడా కార్మికులతో పాటు కొంత శ్రమ చేస్తూ ఉన్నాడనుకుందాం, అప్పుడు, ఆ పెట్టు బడిదారుడు ప్రతి నెలా తినే అదనపు విలువ లెక్క కొంత తగ్గుతుంది. అలాంటప్పుడు, ఆ పెట్టుబడిదారుడు తన పెట్టుబడి విలువతో సమానమైన అదనపు విలువని తినెయ్యడానికి, 5 నెలల కాలం గాక, ఇంకా 1, 2 నెలలు ఎక్కువగా పట్టవచ్చు.

కానీ, ఉదాహరణ తేలిగ్గా ఉండడంకోసం పెట్టుబడి దారుడు శ్రమ చెయ్యడనీ, ప్రతినెలా 20 అదనపు విలువని సంపాదిస్తాడనీ అనుకుందాం. అయితే, అదనపు విలువ నంతా స్వంతానికి వాడెయ్యకుండా, అందులో కొంత భాగాన్ని పెట్టుబడికి చేరుస్తూ ఉంటాడనుకుందాం. అలాంటప్పుడు వాడి పెట్టుబడితో సమానమైన విలువని వాడు తినెయ్యడానికి ఇంకా కొంత ఎక్కువ కాలం పడుతుంది. ఈ ఉదాహరణలో, 20 అదనపు విలువలో నించి ప్రతి నెలా 10ని మాత్రమే స్వంతానికి వాడి, మిగిలిన దాన్ని పెట్టుబడికి చేరుస్తున్నాడనుకుందాం. దానివల్ల, పెట్టుబడి ఒక నెల కన్నా ఒక నెల పెరుగుతూ ఉంటుంది. మొట్టమొదటి నెలలో 100 పెట్టుబడితో 20 అదనపు విలువ వస్తుంది. (అదనపు విలువ రేటుని 100% అను

కుంటున్నాం. తర్వాత నెలల్లో కూడా అలాగే అనుకుంటాం.) 2వ నెలలో పెట్టుబడి, 100 + 10 = 110 అవుతుంది. దాని వల్ల 22 అదనపు విలువ వస్తుంది. ఇందులో 10 ని, పెట్టుబడిదారుడు స్వంతానికి వాడేసి మిగిలిన 12 ని మళ్ళీ పెట్టుబడికి చేరిస్తే, 3వ నెలలో పెట్టుబడి, 110 + 12 = 122 అవుతుంది. దీని ద్వారా 24 అదనపు విలువ వస్తుంది. ఇందులో 10ని స్వంతానికి వాడేసి, 14ని పెట్టుబడికి చేరిస్తే, 4వ నెలలో పెట్టుబడి, 122 + 14 = 136 అవుతుంది. దీని వల్ల 27 అదనపు విలువ వస్తుంది. — ఈ రకంగా, ప్రతీ సారీ అదనపు విలువలో కొంత భాగం పెట్టుబడికి చేరుతోన్న కొద్దీ, పెట్టుబడి పెరిగిపోతూ, దాని వల్ల వచ్చే అదనపు విలువ కూడా పెరిగిపోతూ ఉంటుంది.

పెట్టుబడిదారుడు, ప్రతీ నెలా అదనపు విలువలో నించి 10 మాత్రమే తినడం వల్ల, వాడు మొదటపెట్టిన 100 పెట్టుబడిని, తనే తినెయ్యడానికి 10 నెలలు పడుతుంది. 10 నెలల తర్వాత చూస్తే, పెట్టుబడి 200 కన్నా ఎక్కువగా ఉంటుంది. అప్పటికి పెట్టుబడిదారుడు, తను పెట్టిన 100 పెట్టుబడికి తగ్గ అదనపు విలువని తినేసి ఉంటాడు కాబట్టి, అప్పటి నించి ఆ పెట్టుబడి అంతా న్యాయంగా కార్మికులదే అవుతుంది.

ఇక్కడ గ్రహించవలసిన విషయం ఏమిటంటే — పెట్టుబడిదారుడు, మొట్టమొదట పెట్టిన పెట్టుబడి నిజంగా ఆ మనిషి కష్టార్జితమే అయినా, దానివల్ల వచ్చే అదనపు విలువ మాత్రం ఆ మనిషి కష్టార్జితం అవదు. స్వంత శ్రమతో సంపాదించిన దాన్నే తెచ్చి పెట్టుబడిగా పెట్టినా, అది లాభాన్ని ఉత్పత్తి చెయ్యడం అంటే, అది కార్మికుల శ్రమని దోచే పాత్రని నిర్వహిస్తోందని అర్థం. శ్రమని దోచే వ్యవహారమే లేకపోతే, లాభమూ ఉండదు, పెట్టుబడీ ఉండదు, పెట్టుబడిదారుడూ ఉండడు.

పెట్టుబడిదారుడు, తన పెట్టుబడి విలువని తనే తినేసినట్టు లెక్క తేలేటప్పటికి కూడా, పెట్టుబడిదారుడు మొదట తెచ్చిపెట్టిన శ్రమ పరికరాలన్నీ చెక్కుచెదరకుండానే ఉండవచ్చు. శ్రమ పరికరాలు ఇంకా కొత్తగా ఉండ గానే, పెట్టుబడిదారుడు తన పెట్టుబడిని తను తినేసినట్టు లెక్క తేలవచ్చు.

ఒక పెట్టుబడిదారుడు మొదట 5 వేల పెట్టుబడితో పరిశ్రమ ప్రారంభించాడు. అందులో ఒక యంత్రం విలువ 2 వేలు. దాని జీవిత కాలం 10 సం.లు. 10 సం.లు పని చేస్తేనే గాని ఆ యంత్రం పూర్తిగా పాతపడదు. కానీ, పరిశ్రమ ప్రారంభించిన 2 సం.లలోనే, పెట్టుబడిదారుడు 5 వేల 'అదనపు విలువ'ని సంపాదించాడనుకుందాం. అలా జరిగితే, ఆ శ్రమ పరికరాలు చెక్కు చెదరకుండా ఉండగానే వాడి పెట్టుబడి అంతా వాడు తీసేసుకున్నట్టు అర్థం. ప్రతీ నెలా వచ్చే అదనపు విలువ ఇంకా ఎక్కువగా ఉంటే, పెట్టుబడిదారుడి శ్రమ పరికరాలన్నీ ఇంకా కొత్త మాయకుండా ఉండగానే, వాడు సంపాదించిన అదనపు విలువ పెట్టుబడికి సమానం అయిపోతుంది. అంటే, వాడి పెట్టుబడిని వాడు అంత తొందరగా తినేశాడన్నమాట. కానీ, చెక్కుచెదరకుండా ఉన్న ఫ్యాక్టరీ బిల్డింగునీ, ఇంకా పని చేస్తోన్న శ్రమ పరికరాల్నీ చూస్తే, పెట్టుబడిదారుడి పెట్టుబడి అంతా సుస్థిరంగా ఉన్నట్టూ, పరిశ్రమ ప్రారంభించి ఎంత కాలమైనా ఆ పెట్టుబడి అంతా ఎప్పుడూ పెట్టుబడిదారుడిదే అయినట్టూ, కనపడుతుంది. ఇలా కనపడేది పెట్టుబడిదారుడికే కాదు, కార్మికులకు కూడా!

కానీ, నిజం ఏమిటి? ఉత్పత్తి క్రమాలు సింపుల్ స్థాయిలో జరిగినా, విస్తృత స్థాయిలో జరిగినా, ప్రతీ పెట్టుబడిదారుడూ కొంత కాలానికి, పెట్టుబడి విలువకి సమానమైన అదనపు విలువని తినేస్తాడు. ఇక అప్పటి నించి ఆ పెట్టుబడిలో ఒక్క అణువు కూడా ఆ పెట్టుబడిదారుడిది కాదు. అప్పటి నుంచి ఆ పెట్టుబడీ, దాని వల్ల వచ్చే అదనపు విలువా అంతా కార్మికులవే.

మొదటపెట్టిన పెట్టుబడి పెట్టుబడిదారుడి కష్టార్జితం అయిన ఉదాహరణల్లో అయితేనే, ప్రతీ ఏటా ఎంత అదనపు విలువ వచ్చిందీ, మొదటి పెట్టుబడి ఖర్చయిపోవడానికి ఎంత కాలం పట్టిందీ — అనే లెక్కలు అవసరం. మొదటి పెట్టుబడి పెట్టుబడిదారుడి కష్టార్జితం కాని సందర్భాల్లో అయితే, ఆ మాత్రపు లెక్కలు కూడా అక్కర లేదు. అలాంటి సందర్భాల్లో, పెట్టుబడి, మొదటి రోజు నించీ కూడా కార్మికులదే. అది, సమాజంలో అంతకు ముందు కాలంలో శ్రమ చేసిన కార్మికులది.

ఒక పెట్టుబడిదారుడు, కొంత పెట్టుబడిని అప్పుతెచ్చి 'పరిశ్రమ' ప్రారంభించాడు. కొంతకాలంలో అప్పు తీర్చేశాడు. అప్పటి నించి పెట్టుబడిని తన స్వంతం చేసుకున్నాడు. ఇలా జరిగితే, ఆ పెట్టుబడి, పెట్టుబడిదారుడి స్వంతమే అవుతుందా? — ఇది తెలియాలంటే వాడు, ఆ అప్పుని ఎలా తీర్చాడో తెలియాలి. వాడు, ఆ 'అప్పు'ని దేనితో తీర్చాడు? — తన కష్టార్జితంతో కాదు. తన 'లాభం'తోనే. అంటే, కార్మికుల శ్రమతో! తెచ్చిన అప్పుని, తన కష్టార్జితంతో తీర్చినప్పుడు మాత్రమే ఆ మొత్తం ఆ వ్యక్తిది అవుతుంది. అప్పుని లాభాలతోనో, వడ్డీలతోనో, కౌళ్ళతోనో తీర్చినప్పుడు, ఆ పెట్టుబడి ఆ వ్యక్తిది కాదు. ఏ ఆదాయాలతో అయితే అప్పు తీర్చాడో వాటికి కారణం ఎవరో

వాళ్ళదే ఆ మొత్తం.

ఏ రకంగా చూసినా పెట్టుబడి అనేది — శ్రామికులదే. ప్రస్తుత శ్రామికులది కాని సందర్భాలలో, అది, గత కాలపు శ్రామికులది. అంటే, ప్రస్తుత శ్రామికుల తల్లి దండ్రులదీ, తాత ముత్తాతలదీ, ఇంకా వెనకటి వాళ్ళదీనూ.

'పెట్టుబడి శ్రామికులదే' అన్నప్పుడు, ఉత్పాదక శ్రామికులదా, అనుత్పాదక శ్రామికులదా? 'డబ్బు'గా మారే ఏ శ్రమ అయినా 'ఉత్పాదక' శ్రామికులదే. కాబట్టి, 'పెట్టుబడి' అనేదంతా ఉత్పాదక శ్రామికుల 'అదనపు విలువ'లో భాగమే. అనుత్పాదక శ్రామికుల శ్రమ, 'డబ్బు'గా మారదు కాబట్టి, అందులో కొంత భాగం 'పెట్టుబడి'గా మారడం జరగదు. అయినప్పటికీ, దోపిడీ వర్గం అనుత్పాదక శ్రామిక సెక్షన్ల నించి కూడా 'అదనపు శ్రమ'ని లాగుతారనే సంగతి ఏ క్షణంలోనూ మరచిపోకూడదు. ఉత్పాదక, అనుత్పాదక శ్రమల తేడాని ఖచ్చితంగా గుర్తు పెట్టుకుంటూనే, ఉదాహరణలు తేలిగ్గా ఉండడం కోసం, కొన్ని సందర్భాల్లో ఆ తేడాని వదిలివేస్తాము. 'పెట్టుబడి శ్రామికులదే' అన్నప్పుడు, దాన్ని కేవలం ఉత్పాదక శ్రామికులకు చెందిన విషయంగా గాక, ఉత్పాదక — అనుత్పాదక శ్రామికులందరికీ చెందిన విషయం గానే చూడాలి.

ఒక పెట్టుబడిదారుడి విషయంలో జరిగేదే, పెట్టుబడిదారీ సమాజం అంతటిలోనూ జరుగుతుంది. పెట్టుబడిదారీ సమాజంలో ఉండే మొత్తం 'సామాజిక పెట్టుబడి'కి కారకులు — ఆ సమాజంలో ఉన్న ఉత్పాదక, అనుత్పాదక శ్రామికులే.

# పేద-ధనిక తేడాలకు, దోపిడీదారులు చెప్పే కారణం!

పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్న పెట్టుబడుల రాసుల్నీ, భూస్వాముల చేతుల్లోవున్న భూముల్నీ చూపించి "మీకీ ఆస్తులన్నీ ఎలా వచ్చాయి?" అని వాళ్ళని అడిగి చూడండి! వాళ్ళు చాలా దర్పంగా, జంకూ గొంకూ లేకుండా — "మా తాతలు ఇచ్చారు!" అని చెపుతారు. దానికి, వాళ్ళ ఆర్థిక వేత్తలంతా — "అవును, ఆ మాట నిజమే. ఈ ఆస్తులన్నీ వాళ్ళ పెద్దలు ఇచ్చినవే. వారు చాలా కష్టంచేసి, కూడబెట్టి, పిల్లలకు ఇచ్చుకున్నారు" అని సాక్ష్యాలు ఇస్తారు. దోపిడీదారుల ఆస్తుల గురించి వారి ఆర్థికవేత్తలు ఇచ్చే ఏకగ్రీవ సమాధానం ఇది!

> " మొదటి పెట్టుబడి 10 వేల పౌండ్లతో ఏర్పడింది కదా? దాని యజమాని దాన్ని ఎలా పొందాడు? 'తన స్వంత శ్రమ తోటీ, తన తాత ముత్తాతల శ్రమ తోటీ' అని రాజకీయార్థిక శాస్త్రవేత్తలంతా ఏకగ్రీవంగా ఇచ్చే జవాబు" -
>
> మార్క్స్, (కాపిటల్-1. పేజీ-545. మాస్కో ఎడిషన్, 1974).

ఈ ఆర్థిక వేత్తలంతా ఈ నాటికీ 'పాచిపోయిన' కథ ఒకటి చెప్పుకొస్తూ ఉంటారు. పూర్వం చాలా శ్రమ చేసిన కష్టజీవులందరూ ఆస్తులు సంపాదించుకున్నారట! వాళ్ళు వాటిని చాలా 'పొదుపుగా' వాడుకుని తమ పిల్లలకూ, మనవలకూ, ముని మనవలకూ, ఇచ్చుకున్నారట! పూర్వం నించీ పని చెయ్యకుండా సోమరులుగా ఉండే వాళ్ళూ, పని చేసినా తమ ఆదాయాలన్నిటినీ దుబారాగా ఖర్చు పెట్టేసుకున్న వాళ్ళూ, పేదతనంలో ఉండిపోయారట! కష్టించి శ్రమ చేసే వాళ్ళెప్పుడూ ధనికులవుతారట! ఆ లక్షణాలు లేని వాళ్ళు పేదలుగా ఉండిపోతారట! పేద — ధనిక తేడాలకు ఇదే కారణమట! — ఇదీ, దోపిడీ వర్గమూ, దాని బంట్లయిన ఆర్థిక వేత్తలూ, దాని మేధావులూ, ఈనాటికీ నిస్సంకోచంగా చెప్పే సిగ్గుమాలిన, దగుల్బాజీ కథ!

పాత కాలంలో గానీ, ప్రస్తుత కాలంలోగానీ, ఒక దోపిడీ సమాజంలో 'శ్రమ'కు దొరికే ప్రతిఫలం, 'కనీస పోషణ'కు కూడా చాలీచాలని ఉత్పత్తులు మాత్రమే. అవి ఏ నాటికానాడే ఖర్చయిపోతాయి. అవి అలా ఖర్చుకాకపోతే శ్రమ శక్తి పునరుత్పత్తి అయ్యే అవకాశమే ఉండదు. ఈ నాటి పెట్టుబడిదారుల తాతలూ, భూస్వాముల తాతలూ, ఒక నాడు నిజంగా శ్రమ చేసి ఉంటే, వాళ్ళ స్వంత శ్రమ ఫలితం వాళ్ళ పోషణకే ఖర్చయిపోయి ఉండాలి.

ఒక భూస్వామికి తండ్రి నించీ, తాత నించీ, వెయ్యి ఎకరాల సాగు భూమి వచ్చిందంటే, ఆ వెయ్యి ఎకరాల భూమినీ అలా సాగుకి అనుకూలంగా చేసింది ఆ తండ్రీ తాతలిద్దరేనా? వాళ్ళు రాత్రీ పగలూ ఎంతో శ్రమ చేశారనుకున్నా, గతకాలపు ఉత్పాదక శక్తులతో అంత పని జరగడం ఇద్దరు వ్యక్తుల ద్వారా సాధ్యం కాదు. ఎన్నో వందల, వేల మంది చేసిన శ్రమ, అంత భూమిని సాగుకి సిద్ధం చేసింది. కేవలం ఇద్దరు వ్యక్తులే అయితే, తమ శ్రమతో నాలుగైదు ఎకరాల భూమికన్నా ఎక్కువ భూమిని నిత్యం సాగులో

ఉంచలేరు. మరి, ఒక తాతగారు, ఒక మనవడికి వెయ్యి ఎకరాల భూమిని ఇవ్వగలిగాడన్నా, లక్షల లక్షల విలువ చేసే వెండి బంగారాలూ, భవంతులూ, ధన రాసులూ ఇవ్వగలిగాడన్నా, కారణం ఏమిటి? — ఆ తాత గారు, భూమి — కౌళ్ళ ద్వారానో, వడ్డీల ద్వారానో, వర్తక లాభాల ద్వారానో, మొత్తం అన్నిటి ద్వారానో, అదంతా సంపాదించా డన్న మాట! తాతలు అలా చేస్తేనే, అంతంత భూములూ డబ్బు రాసులూ భవంతులూ వెండి బంగారాలూ వజ్ర వైఢూర్యాలూ, మనవళ్ళకూ ముని మనవళ్ళకూ అందించ గలుగుతారు.

నిజంగా 'శ్రమ మీద బతికే' మనుషులకు, ఆస్తులు కూడబెట్టడం అసాధ్యమైన విషయం. ఒకవేళ, పరమ పీనాసితనంగా తినీ తినకా ఎంతో కొంత కూడబెడితే, జీవితం పొడుగునా సంభవించే అనారోగ్యాలూ, ప్రకృతి కల్పించే ఆపదలూ — వగైరా సందర్భాలలో అనేక ఖర్చులు ఉంటాయి. ఆ ఖర్చులన్నీ పోయాక, పిడికెడు డబ్బూ, చారెడు భూమీ దొరికితే దొరకవచ్చు. స్వంత శ్రమ మీద బతికే కుటుంబాలు అంత కన్నా ఎక్కువ గానీ, కనీసం అంతైనా గానీ కూడబెట్టలేవు. దీనికి మంచి రుజువు — వేల సంవత్సరాల నించీ శ్రమిస్తోన్న శ్రామిక వర్గం, తన ఆస్తిగా ఏమీ కూడబెట్టలేక పోవటమే.

శ్రామికుల తాతలు కూడా కష్టజీవులే. కానీ వాళ్ళు పెట్టుబడిదారుల తాతల్లాగ మనవళ్ళకు వందల, వేల ఎకరాల భూములూ, వేలూ లక్షలూ విలువచేసే ధన రాసులూ కూడబెట్టి ఇవ్వలేకపోయారు. ఎందుచేతా? — వాళ్ళు నిజంగా శ్రమ మీదే బతికారు గనక. వాళ్ళకి, వడ్డీలూ కౌళ్ళూ వర్తక లాభాలూ రాలేదు గనక. వాళ్ళకి, వాళ్ళ పోషణ చేసుకోవడమే దిన దిన గండం అయింది గనక. అందుకే, వాళ్ళు ఏ ఆస్తులూ కూడబెట్టలేదు.

స్వతంత్ర ఉత్పత్తిదారుల్ని తీసుకుంటే, వాళ్ళు దోపిడీకి గురికారు గనక, వాళ్ళ శ్రమతో వాళ్ళు కొంచెం సుఖంగా బతకగలరే గానీ, వాళ్ళు కూడా పెద్ద పెద్ద ఆస్తులు కూడ బెట్టలేరు.

కాబట్టి, ఒక తరం నించి ఒక తరానికి అందే వ్యవ సాయ భూములూ, విలువైన లోహాలూ, పెద్ద పెద్ద కట్ట డాలూ, వజ్ర వైఢూర్యాలూ — వంటి ఏ ఆస్తులైనా, ఆ కాలపు శ్రామికుల 'అదనపు శ్రమ' నించి ఏర్పడ్డవే.

పిరమిడ్లూ, తాజ్‌మహాళ్ళూ, చైనాగోడలూ — వంటి కట్టడాలన్నీ కూడా ఆ కాలపు శ్రామికుల అదనపు శ్రమ ఫలితాలే. ఆ శ్రామికులకు శ్రమకు ఫలితంగా ఆనాడు దక్కిన భాగం అంతా, వారి పోషణ కోసం ఆనాడే ఖర్చయి పోతుంది కాబట్టి, అది ఆనాడే కాలగర్భంలో కలిసి పోయింది. అది తర్వాత కాలంలో కనపడదు. వారి 'అదనపు శ్రమ'తో తయారైన అదనపు ఉత్పత్తులు మాత్రమే పాలకుల ఖజానాలోకి చేరి, అంతంత కట్టడాల్ని నిర్మించాయి. ఒక నాటి అదనపు శ్రమతో తయారైన ఆ కట్టడాలు మాత్రం, ఈ నాటికీ నిలిచి ఉన్నాయి. గత దోపిడీ సమాజాలు లాగిన అదనపు శ్రమతో ఏర్పడ్డ కట్టడాలు కాబట్టే, గత కాలపు కట్టడాల మీద ప్రస్తుత దోపిడీ సమాజం ప్రత్యేక శ్రద్ధాసక్తులు చూపిస్తుంది.

మార్క్సు మాటల్లో:

> "గత శ్రమ ఎల్లప్పుడూ పెట్టుబడిగా మారు వేషం ధరిస్తుంది కాబట్టి (అంటే ఏ, బి, సీ — లకు చెల్లించని శ్రమ, ఏమీ శ్రమ చెయ్యని వాడికి ఆస్తిగా మారుతుంది కాబట్టి), పెట్టుబడిదారులూ రాజకీయ ఆర్థికవేత్తలూ, గత శ్రమ చేసిన పనుల్ని విపరీతంగా పొగుడుతారు" (కాపిటల్-1, పేజీ - 560).

> "ప్రాచీన ఈజిప్టులో బ్రహ్మాండమైన కట్టడా లకు, అక్కడి 'జనాభా విస్తృతి' అనేది — తక్కువ కారణం; అక్కడ ఉన్న జనాభాలో ఎక్కువ భాగం, 'అవసర శ్రమ' నించి బయట వినియోగపడడానికి (ఫ్రీలీ డిస్పోజబుల్) వీలైన విధంగా ఉండడం అనేది — ఎక్కువ కారణం. ఒక శ్రామికుడు, 'అవసర శ్రమ కాలం' ఎంత తక్కువగా ఉంటే, దానికి తగినట్టుగా 'అదనపు శ్రమ'ని అంత ఎక్కువగా ఎలాగైతే చేయ గలడో, అలాగే, మొత్తం శ్రామిక జనాభా అంతటి లోనూ కూడా జరుగుతుంది. శ్రామిక అవసర జీవ నాధారాల ఉత్పత్తికి, ఆ జనాభాలో ఎంత తక్కువ భాగమైతే అవసరమవుతారో, అంత ఎక్కువ భాగాన్ని ఇతర పనుల మీద పెట్టడానికి వీలవుతుంది."
>
> (కాపిటల్-1, పేజీ - 480).

శ్రమ చెయ్యని వర్గానికి దొరికే 'అదనపు శ్రమ' తక్కు వగా ఉన్నట్టయితే, అందులోనించి ఆ వర్గ పోషణా, విలాసాలూ పోగా, భారీ కట్టడాల మీద కూడా మితిమీరిన శ్రమని వినియోగించడం సాధ్యం కాదు. ఒక్కొక్క శ్రామి కుడినించి వచ్చే అదనపు శ్రమ చిన్నముక్కే అయినా, ఆ చిన్న ముక్కలు ఇచ్చే జనాభాయే ఎక్కువ సంఖ్యలో ఉంటే, ఆ ఎక్కువ ముక్కలన్నీ కలిసి 'అదనపు శ్రమ రాసి' పెరుగుతుందనేది నిజమే. అయినా, ఆ రకంగా వచ్చే అద నపు శ్రమ రాసికూడా ఆ కట్టడాలకు ఎక్కువ కారణం కాదు. ఆ కట్టడాల పని ఎప్పుడు సాధ్యమవుతుందంటే,

శ్రమ చేసే మనిషి, తన శ్రమ కాలంలో తక్కువ కాలాన్నే అవసర కాలంగా తీసుకుని, ఎక్కువ కాలాన్ని అదనపు కాలంగా వదిలే పరిస్తితి ఉన్నప్పుడే. అంటే, పంటలు బాగా పండుతూ, ఉత్పాదకత ఎక్కువగా ఉండి, సమాజ అవస రాలన్నిటికీ తక్కువ మంది శ్రమే సరిపోతూ, మిగిలిన శ్రామికుల శ్రమ అంతా ఎందుకూ పనికిరాని పనుల మీద పెట్టడం సాధ్యమైతే, ఆ శ్రమ శక్తిని, అలాంటి అనవసరపు, జీవితంలో ఏ రకం గానూ ఉపయోగపడని కట్టడాల పనుల కోసం ఉపయోగించడం సాధ్యమవుతుంది. ఆ కట్టడాలు నివాస స్తలాలుగా గానీ, ఉత్పత్తి స్తలాలుగా గానీ, విశ్రాంతి మందిరాలుగా గానీ, ఏ రకం గానూ ఉపయోగపడవు. కేవలం 'కట్టడాల కోసం కట్టడాలు' అవి! అవి, 'సౌందర్యాన్ని' ఉపయోగపు విలువ నించి విడదీసి, విడిగా నిలబెడతాయి. 'సౌందర్యం' అనేది ఒక ఉపయోగపు విలువతో కలిసి పోయి ఉన్నప్పుడే, 'సౌందర్యం, నిజ జీవితంలో భాగం' అవుతుంది. నిత్యజీవితం సౌందర్యవంతం అవుతుంది. ప్రతీ విషయాన్నీ 'ఉపయోగపు విలువ దృష్టి'తో చూడడం అంటే, ఆ దృష్టి, సౌందర్యాన్ని వదిలేస్తుందని అర్థం కాదు. అది, 'దోపిడీ సమాజాల రకపు సౌందర్యాన్నే' వదిలేస్తుంది. సౌందర్యాన్ని నిజ జీవితం నించి విడదీసి, దాన్ని కేవలం ప్రదర్శనగా మార్చడం దోపిడీ సమాజాల లక్షణమే.

ఇప్పుడు మళ్ళీ పెట్టుబడిదారుల తండ్రులూ తాతలూ ఇచ్చే ఆస్తుల సంగతి చూద్దాం.

తండ్రుల నించీ తాతల నించీ పెద్ద పెద్ద ఆస్తులు పొందిన పెట్టుబడిదారులూ భూస్వాములూ, ఎంతసేపూ తమ తండ్రులూ తాతలూ చెమటోడ్చిన గాథలే చెప్పు కొస్తారు గానీ, తాము చెమటోడ్చే గాథల మాట ఎత్తరు. తాము ఎప్పటికప్పుడు కొత్త కష్టం చెయ్యనక్కర లేకుం డానే, పెద్దలు ఇచ్చిన ఆస్తులే తమకు ప్రతి ఏటా కొత్త ధాన్యమూ, కొత్త బట్టలూ, కొత్త చెప్పులూ, ఇంకా సమస్త కొత్త ఉత్పత్తుల్నీ ఇస్తూ ఉంటాయని, వారు నమ్ముతూ, నమ్ముతున్నట్టు నటిస్తూ, శ్రామికుల్ని కూడా నమ్మ మంటారు.

ఈ నాడు — ఉత్పాదక, వర్తక, వడ్డీ పెట్టుబడిదారు లకూ, భూస్వాములకూ ఆదాయాలు ఎక్కడి నించి వస్తు న్నాయో (శ్రమ దోపిడీ నించి వస్తున్నాయని) మనకు తెలుసు. కానీ, రేపు వీళ్ళ పిల్లలు — "మా ఆస్తులన్నీ మా తాతలూ, తండ్రులూ కష్టం చేసి సంపాదించి మాకు ఇచ్చారు" అని చెప్పుకుంటారు. వీళ్ళ తండ్రులూ అలాగే చెప్పుకున్నారు. వీళ్ళూ అలాగే చెప్పుకుంటున్నారు. వీళ్ళ పిల్లలూ అలాగే చెప్పుకుంటారు — "మా తండ్రులు ఇచ్చారు! మా తాతలు ఇచ్చారు! మా ముత్తాతలు ఇచ్చారు!" — ఇలా!

ఈ మాటలు ఏ శ్రామికుల పిల్లలూ చెప్పుకోలేరు. నిజంగా శ్రమ మీద జీవించే మనుషులు, ఆస్తులు కూడ బెట్టి వాటిని మనవళ్ళ దాకా, ముని మనవళ్ళదాకా అందిం చడం కన్నా అసాధ్యమైన సంగతి పృథ్విలో ఇంకేదీ ఉండదు. అంతకన్నా, 'సూది బెజ్జం లోంచి ఒంటె ని దూరించడం' చాలా తేలిక!

కాబట్టి, 'మా తాతల కష్టార్జితమే మాకు పెట్టుబడిగా అందింది' అని పెట్టుబడిదారులు చెప్పుకునే దాంట్లో అణు వంతైనా నిజం లేదు. దోపిడీ వర్గం చేతుల్లో ఉన్న ఆస్తుల్ని చూపించి ఆ మాట శ్రామిక వర్గమే చెప్పుకోవాలి. "ఈ ఆస్తులన్నీ మా పెద్దలవే! మా వర్గానివే! వందల వేల సంవత్సరాలుగా శ్రామిక వర్గం చేసిన శ్రమతో ఏర్పడిన ఆస్తులు ఇవి! మా ఆస్తులనే దోపిడీ వర్గం కాజేసింది" అని శ్రామిక వర్గం నిస్సంకోచంగా చెప్పుకోవచ్చు. కాబట్టి, దోపిడీ వర్గం, నిత్యం తమ తాతల ముత్తాతల శ్రమ గాథల గురించి చేసే గీతాలాపనలను పెడచెవి బెట్టి, శ్రామిక వర్గం దోపిడీ వర్గపు ఆధీనంలో వున్న ఆస్తులన్నిటినీ రెండో ఆలోచన లేకుండా 'స్వాధీనం' చేసుకోవచ్చు!

ప్రపంచం నిండా, దోపిడీ వర్గం చేతుల్లో ఉన్న సమస్త మైన ఆస్తులూ శ్రామిక వర్గానివే. వాటి నిర్మాణంలో ఖర్చ యిన మొత్తం శ్రమలో కొంత భాగం గతకాలపు శ్రామికుల దైతే, కొంత భాగం ప్రస్తుత కాలపు శ్రామికులదీ. దోపిడీ వర్గం చేతుల్లో ఉన్న ఆస్తుల్ని శ్రామిక వర్గం ఏ క్షణంలో స్వాధీనం చేసుకున్నా అందులో 'అక్రమం' గానీ, 'అన్యాయం' గానీ, 'ఘోర దురంతం' గానీ ఏమీ ఉండదు. ఎవరి కష్టార్జితాన్ని వాళ్ళు తీసుకోవడమే అది. శ్రామిక వర్గం ఏ నాటి నించో తన పట్ల జరుగుతూ వున్న అక్రమాన్నీ, అన్యాయాన్నీ ధిక్కరించడమే అది.

ప్రపంచం నిండా ఉన్న వ్యవసాయ భూములూ, ఫ్యాక్టరీలూ, గనులూ, జలాశయాలూ, రవాణా సాధ నాలూ — వంటి సమస్త ఉత్పత్తి సాధనాలూ శ్రామికులవే! చీపురు పుల్లనించీ, వజ్ర వైఢూర్యాల వరకూ సమస్త ఉత్పత్తులూ శ్రామికులవే! శ్రమతో ఉత్పత్తి అయిన ప్రతీ అణువూ శ్రామికులదే అయినప్పుడు, మానవ సమాజమే శ్రామి కులది! అందులో శ్రమ చెయ్యని మానవ జంతువు లకు స్థానమే లేదు!

# పెట్టుబడి కూడిక

పెట్టుబడిదారుడి లక్ష్యం, 'అదనపు విలువ'ని సంపా దించి దాన్ని సుఖంగా వాడుకోవడం మాత్రమే కాదు. దాంట్లో కొంత భాగాన్ని పెట్టుబడికి కలిపి పెట్టుబడిని పెంచడం కూడా. అదనపు విలువలో ఎంతో కొంత భాగం, పెట్టుబడికి కలిస్తేనే పెట్టుబడి పెరుగుతుంది. అదనపు విలువ వచ్చి కలవడం ద్వారా, పెట్టుబడి పెరిగితే, అది — 'పెట్టుబడి కూడిక'. (ఎక్యూములేషన్).

ఒక విడి పెట్టుబడిదారుడి విషయంలో చూసినా, మొత్తం పెట్టుబడిదారీ వర్గం విషయంలో చూసినా, ఒక సంవత్సరంలో వచ్చిన అదనపు విలువనంతటినీ పెట్టుబడికి కలిపెయ్యడం సాధ్యం కాదు. అలా కలిపేస్తే, వాళ్ళకు పోషణ వస్తువులే ఉండవు. ఒక పెట్టుబడిదారుడు, తన అదనపు విలువలో ఎంతో కొంత భాగాన్ని తప్పని సరిగా స్వంతానికి వాడుకుని, మిగిలిన దాన్నే పెట్టుబడికి కలపగలడు.

అదనపు విలువనంతా పెట్టుబడికి కలిపెయ్యడం సాధ్యం కానట్టే, అదనపు విలువనంతా ఖర్చు పెట్టెయ్యడం కూడా సాధ్యం కాదు. ఎందుకంటే, దోపిడీ వర్గం ఉపయోగించుకోవడానికి ఆ అదనపు విలువ చాలా ఎక్కువై పోతుందనే కారణం వల్ల కాదు. అది కూడా ఒక కారణమే అయినా, అసలు కారణం అది కాదు. ఇక్కడ మనం ఒక 'సాంకేతికమైన కారణం' చూస్తాం.

పునరుత్పత్తి క్రమాల గురించి మొదట్లో కొంత చెప్పుకున్నాం. అదనపు విలువ పెట్టుబడికి కలవకుండా పాత పెట్టుబడితోనే పునరుత్పత్తి క్రమం జరిగితే అది సింపుల్ పునరుత్పత్తి అనీ; అదనపు విలువలో కొంత భాగం పెట్టుబడికి కలిసి, ఆ పెరిగిన పెట్టుబడితో ఉత్పత్తి క్రమం జరిగితే అది విస్తృత పునరుత్పత్తి అనీ — చెప్పుకున్నాం. విషయాల్ని ఒక క్రమంలో అర్థం చేసుకోవడానికే మొదట అలా చెప్పుకున్నాం. కానీ పెట్టుబడిదారీ విధానంలో, సింపుల్ పునరుత్పత్తి ఎప్పుడూ ఉండదు. విస్తృత పునరుత్పత్తే ఎప్పుడూ ఉంటుంది. ఎందుకంటే — ఇక్కడే మనకు ఆ సాంకేతిక విషయం ఎదురవుతుంది.

పెట్టుబడిదారీ విధానంలో తప్పనిసరిగా 'అదనపు ఉత్పత్తి' ఉంటుంది. ఆ ఉత్పత్తి అంతా పోషణ వస్తువులుగా వాడడానికి వీలైన ఉత్పత్తే అయితే దాన్నంతా పెట్టుబడిదారీ వర్గం స్వంతానికి వాడెయ్యగలదు. అప్పుడు, పాత పెట్టుబడితో సింపుల్ పునరుత్పత్తి జరగడం సాధ్యమే. కానీ, అదనపు ఉత్పత్తి అంతా పోషణ వస్తువులుగా మాత్రమే ఉండదు. ఆ భాగంలో, ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగించవలసిన ఉత్పత్తులు కూడా ఉంటాయి. వాటిని పోషణ కోసం వాడడం సాధ్యం కాదు. వాటిని వాడాలంటే ఉత్పత్తి సాధనాలుగా మాత్రమే వాడాలి. ఆ భాగాన్ని పాత పెట్టుబడికి కలిపి తీరాలి. అప్పుడు పెట్టుబడి పెరిగి, దానితో జరిగే పునరుత్పత్తి క్రమం మళ్ళీ విస్తృత పునరుత్పత్తిగానే జరుగుతుంది. ఆ తర్వాత వచ్చే S లో కూడా మళ్ళీ ఉత్పత్తి సాధనాలుగా వాడవలసిన ఉత్పత్తులు కొన్ని ఉంటాయి. ప్రతీ సారీ ఇదే జరుగుతుంది. అందుకే పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం, ఎప్పుడూ విస్తృత పునరుత్పత్తిగానే ఉంటుంది.

'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాని'కి ఉండే స్వభావాన్ని గ్రహించడంలో 'అదనపు విలువ గురించి' గ్రహించడం ఎంత ప్రధానమో, ఈ తర్వాత చూడబోయే విషయాల్ని గ్రహించడం కూడా అంత ప్రధానం. ఈ విషయాల్ని సరిగా గ్రహిస్తేనే, పెట్టుబడిదారీ పునరుత్పత్తి క్రమం ఎలాంటి స్వభావంతో సాగుతుందో, అది ఎలాంటి ఫలితాలకు దారి తీస్తుందో తెలుస్తుంది.

ఈ పునరుత్పత్తి విషయాల్ని విలువ లెక్కలతో (డబ్బు లెక్కలతో) చూస్తే, అందులో ఉన్న సమస్యని గ్రహించలేము. ఉత్పత్తుల రకాల్ని చూస్తేనే, సమస్య అర్థమవుతుంది. అంతేగాక, ఒక విడి పెట్టుబడిదారుడి ఉత్పత్తి క్రమాన్ని మాత్రమే చూస్తే, అప్పుడు కూడా సమస్య అర్థం కాదు. మొత్తం సమాజానికి సంబంధించిన అన్ని శాఖల్నీ కలిపి చూస్తేనే సమస్య అర్థమవుతుంది.

ఒక పెట్టుబడిదారుడికి 20 అదనపు విలువ వచ్చిందనీ, ఆ డబ్బుతో వాడు పోషణ వస్తువుల్ని కొనుక్కుని కుటుంబం కోసం వాడేశాడనీ చెప్పుకుంటే, అందులో సాధ్యంకాని విషయం ఏదీ కనపడదు. కానీ, మొత్తం పెట్టుబడిదారీ వర్గాన్నంతా తీసుకొని, 'S భాగం'లో ఉన్న రకాల్ని కూడా తీసుకుంటే, అప్పుడు అసలు విషయం బైటపడుతుంది. — ఈ విషయాలే కొంచెం వివరంగా చూడాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో తయారైన ఏ సరుకు విలువ అయినా 3 భాగాలుగా ఉంటుందని మనకు తెలుసు. C+V+S లుగా. మొత్తం సమాజంలో అన్ని శాఖల్నీ తీసుకుంటే, ఆ మొత్తం ఉత్పత్తుల రాసి కూడా 3 భాగాలు గానూ ఉంటుంది.

C భాగంలో — అన్నీ ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగపడే ఉత్పత్తులే ఉంటాయి. ఇవి ఎన్ని ఉంటాయంటే — ఈ మొత్తం రాసి తయారవడానికి ఎన్ని ఉత్పత్తి సాధనాలు ఖర్చయ్యాయో అవన్నీ మళ్ళీ తయారై ఈ భాగంలో ఉంటాయి. కానీ, వాటి విలువ మాత్రం పాత

C నించి ఈ C కి బదిలీ అవుతుంది. ఒక విడి పని స్థలంలో, C విలువ బదిలీ అయ్యేదిగానే ఉంటుంది కదా? అలాగే, పని స్థలాలన్నిటినీ కలిపినప్పుడు, C ల మొత్తం అంతా బదిలీ అయ్యేదిగానే ఉంటుంది. మొత్తం C లన్నీ కలిసినదే ఈ భాగం.

V భాగంలో — శ్రామికుల పోషణ ఉత్పత్తులన్నీ ఉంటాయి. ఉత్పాదక శ్రామికుల్లో రక రకాల స్థాయిల శ్రామికులు — ఉంటారు కాబట్టి, వారందరూ వాడే రకపు వస్తువులన్నీ ఇందులో ఉంటాయి. ఇవన్నీ కలిసి ఎన్ని ఉంటాయి? ఈ 'మొత్తం రాసి'ని ఉత్పత్తి చేసే కాలంలో, ఉత్పాదక శ్రామికులు, 'జీతాల' పేరుతో ఎన్ని ఉత్పత్తుల్ని వాడారో అన్ని. అవన్నీ మళ్ళీ తయారై ఇందులో ఉంటాయి. — ఈ 1 వ, 2 వ భాగాల్ని అర్థం చేసుకోవడం చాలా తేలికే. S భాగమే కొంత తికమక పెడుతుంది.

'మొత్తం ఉత్పత్తుల రాసి'లో నించి మొదటి 2 భాగాల్నీ తీసివేస్తే, మిగిలిన ఉత్పత్తులన్నీ 3 వ భాగం. ఇవి 'అదనపు ఉత్పత్తులు'. ఈ భాగాన్నే సరిగా అర్థం చేసుకోవాలి. ఈ భాగంలో ఉండే ఉత్పత్తులన్నీ ఎలాం టివి? ఇవన్నీ, పెట్టుబడిదారుల పోషణకు పనికి వచ్చే ఉత్పత్తులేనా? లేక, ఇవన్నీ కేవలం ఉత్పత్తి సాధనాలుగా పనికి వచ్చే ఉత్ప త్తులా? లేక అవీ, ఇవీ కూడా కలిసి ఉన్న ఉత్పత్తులా?

దీనికి జవాబు, సింపుల్ పునరుత్పత్తిలో అయితే ఒక రకం గానూ, విస్తృత పునరుత్పత్తిలో ఇంకో రకం గానూ ఉంటుంది.

పెట్టుబడిదారీ విధానంలో సింపుల్ పునరుత్పత్తి ఉండకపోయినా, పునరుత్పత్తికి సంబంధించిన అన్ని రకాల పరిస్తితుల్నీ అర్థం చేసుకోవడం కోసం, అవసరమై నప్పుడల్లా విస్తృత పునరుత్పత్తినే గాక సింపుల్ పునరుత్ప త్తిని కూడా చూస్తూ ఉంటాము.

పెట్టుబడిదారీ ఉత్పత్తిక్రమం, విస్తృత పునరుత్పత్తిగా ఎందుకు ఉంటుందో గ్రహించడానికి అనేక వివరాలు చూడాలి.

సింపుల్ పునరుత్పత్తిలో, S లో కొంత భాగం పెట్టు బడిగా మారదు కాబట్టి, ఇక్కడ పాత C, V ల కన్నా ఎక్కువ C, V లతో అవసరం ఉండదు. ఖర్చయిన పాత C, V లు తిరిగి వస్తే చాలు, ఇక్కడ S లో పెట్టుబడి దారుల పోషణ వస్తువులు మాత్రమే ఉంటాయి.

విస్తృత పునరుత్పత్తిలో, S లో కొంత భాగం కొత్త పెట్టుబడిగా మారుతుంది కాబట్టి, దాని కోసం కొత్త C,V లు కూడా కొన్ని కావాలి. పాత C,V లకు కొత్త C,V లు కూడా కలిసి, తర్వాత ఉత్పత్తి క్రమం, పెరిగిన పెట్టుబడితో జరుగుతుంది. ఈ S లో, పోషణ వస్తువులే గాక, కొత్త C,V లు కూడా ఉంటాయి.

'సమాజం'లో ఉండే మొత్తం ఉత్పత్తి సంస్థలు, 2 రకాలుగా ఉంటాయి. కొన్ని సంస్థలు, కేవలం 'ఉత్పత్తి సాధనాల్ని' మాత్రమే ఉత్పత్తి చేస్తాయి. పత్తి, కేవలం ముడి పదార్థంగా మాత్రమే ఉపయోగపడుతుంది. పత్తిని ఉత్పత్తి చేసే సంస్థ, కేవలం ఉత్పత్తి సాధనాల్ని ఉత్పత్తి చేసే సంస్థ. అలాగే, యంత్రాలూ, బొగ్గూ, పెట్రోలూ, కాయితం, ముడి లోహాలూ సిమ్మెంటూ వగైరాల్ని ఉత్పత్తిచేసే సంస్థలన్నీ ఉత్పత్తి సాధనాల్ని ఉత్పత్తి చేసే సంస్థలు.

రెండో రకం సంస్థలు — కేవలం 'పోషణ వస్తువుల్ని' మాత్రమే ఉత్పత్తి చేసే సంస్థలుగా ఉంటాయి . ('విలాస వస్తువుల' సంస్థల్ని కూడా ఇందులో కలిపేస్తున్నాము). బియ్యం మిల్లులూ, పిండి మిల్లులూ, బట్టల మిల్లులూ, హోటళ్ళూ, రెడీమేడ్ దుస్తుల ఫ్యాక్టరీలూ, చెప్పుల ఫ్యాక్ట రీలూ, రవాణా, పత్రికలూ, ప్రింటింగ్ ప్రెస్‌లూ, వాచీ ఫ్యాక్ట రీలూ వగైరాలన్నీ పోషణ వస్తువుల్ని ఉత్పత్తిచేసే సంస్థలు — ఇలా, ఉత్పత్తి సంస్థలు 2 రకాలుగా ఉంటాయి. మొత్తం 2 రకాల సంస్థలకూ కావలసిన ఉత్పత్తి సాధనా లన్నీ — ఉత్పత్తి సాధనాల సంస్థల్లో తయారవుతాయి. మొత్తం 2 రకాల సంస్థల కార్మికులకూ, పెట్టుబడిదారు లకూ కావలసిన పోషణ వస్తువులన్నీ — పోషణ వస్తువుల సంస్థల్లో, తయారవుతాయి, — ఇలా ఉన్న 2 రకాల సంస్థల నించీ కూడా, 'అదనపు ఉత్పత్తులు' వస్తాయి.

'పత్తి'ని ఉత్పత్తి చేసే సంస్థలో వచ్చే ఉత్పత్తి అంతా పత్తి రూపంలోనే ఉంటుంది. అంటే, ఆ సంస్థలో, 'అదనపు ఉత్పత్తి' కూడా పత్తి రూపంలోనే ఉంటుంది. యంత్రాల్ని ఉత్పత్తి చేసే సంస్థలో 'అదనపు ఉత్పత్తి' అంతా, యంత్రాల రూపంలోనే ఉంటుంది. — ఈ రకంగా ప్రతీ సంస్థ నించీ కొంత కొంత 'అదనపు ఉత్పత్తి' వస్తుంది. ఒక సంస్థ ఉత్పత్తి ఏ రూపంలో ఉంటుందో, దాని అదనపు ఉత్పత్తి కూడా ఆ రూపంలోనే ఉంటుంది.

ఉత్పత్తి సాధనాల్ని ఉత్పత్తి చేసే శాఖలన్నిటినీ కలిపి 1వ గ్రూపు అనీ, పోషణ వస్తువుల్ని ఉత్పత్తి చేసే శాఖ లన్నిటినీ కలిపి 2వ గ్రూపు అనీ — అందాం. ఈ 2 గ్రూపు లకూ ఒక సంబంధం ఉంటుంది. 2 గ్రూపులకూ కావల సిన C లన్నీ మొదటి గ్రూపులో తయారైతే, 2 గ్రూపులకూ కావలసిన పోషణ వస్తువులన్నీ రెండో గ్రూపులో తయా రవుతాయి. ఈ 2 గ్రూపులూ తమ సరుకుల్ని ఒక దానికి ఒకటి అమ్ముకుంటాయి.

ఈ 2 గ్రూపుల్లోనూ తయారయ్యే ఉత్పత్తుల పరి మాణాలు ఒక సమన్వయంతో ఉండాలి. ఈ పరిమాణా లకు సంబంధించి తర్వాత కొన్ని వివరాలు చూడాలి.

# సింపుల్ పునరుత్పత్తిలో

మొదట, 2 గ్రూపుల్లోనూ, అన్ని శాఖల్లోనూ సింపుల్ పునరుత్పత్తే ఉన్నట్టు చూస్తాం.

1 వ గ్రూపులో (C ల శాఖల్లో):

పెట్టుబడి 500. ఇది 400 C + 100 V

దీని పాళ్ళు 4C + 1V. అదనపు విలువ రేటు 100%

అదనపు విలువ రాసి 100.

తయారైన కొత్త ఉత్పత్తి = 400C + 100V + 100S = 600

ఈ 600 ఉత్పత్తి అంతా C గా వాడవలసినదే.

ఈ గ్రూపులో, ఖర్చయిపోయిన C — 400. ఇది తిరిగి తయారైంది. ఈ గ్రూపులో కార్మికులకూ పెట్టుబడిదారులకూ కలిసి ఖర్చయిపోయిన పోషణ వస్తువులు 200. ఈ పోషణ వస్తువులు ఈ గ్రూపులో ఉత్పత్తి అవలేదు. కానీ ఆ 200 విలువగల ఉత్పత్తి సాధనాలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ ఉన్న మొత్తం కొత్త C — 600. కానీ, ఇక్కడ 500 పెట్టుబడి ఖర్చుతోనే 600 కొత్త ఉత్పత్తి తయారైంది. ఇందులో 100 అదనపు ఉత్పత్తి ఉంది. అది కూడా C గా వాడవలసిన ఉత్పత్తే.

2వ గ్రూపులో (పోషణ ఉత్పత్తుల శాఖలన్నీ కలిసి):

పెట్టుబడి 250. ఇది 200C + 50Vగా ఉందనుకుందాం. దీని పాళ్ళు 4C + 1V. అదనపు విలువ — రేటు 100%. అదనపు విలువ రాసి 50. తయారైన కొత్త ఉత్పత్తి = 200C + 50V + 50S = 300.

ఈ ఉత్పత్తి అంతా పోషణ వస్తువులే. ఈ గ్రూపులో ఖర్చయిన ఉత్పత్తి సాధనాలు 200. Vగా ఖర్చయిపోయిన పోషణ వస్తువులు 50. ఇక్కడ 250 ఖర్చుతో 300 ఉత్పత్తి వచ్చింది. ఇందులో 50 అదనపు ఉత్పత్తి ఉంది. అది కూడా పోషణ వస్తువులుగానే ఉంటుంది.

2 గ్రూపుల్నీ కలిపి చూస్తే:

| | | | | |
|---|---|---|---|---|
| 1) | 400C | + 100V | + 100S | = 600 |
| 2) | 200C | + 50V | + 50S | = 300 |
| | 600C | + 150V | + 150S | = 900 |

2 గ్రూపులకూ కలిసి, మొత్తం పెట్టుబడి 750

ఆ పెట్టుబడి ఉత్పత్తి చేసిన మొత్తం S - 150

2 గ్రూపుల్లోనూ కలిసి ఖర్చయిన ఉత్పత్తి సాధనాలు 600. మళ్ళీ మొదటి గ్రూపులో తయారైవున్న కొత్త సాధనాలు కూడా 600. ఇవి మళ్ళీ 2 గ్రూపులకూ అందుతాయి. మొదటి దానికి 400; రెండో దానికి 200.

పోషణ ఉత్పత్తుల సంగతి కూడా అలాగే. 2 గ్రూపుల్లోనూ కలిసి ఖర్చయిన పోషణ ఉత్పత్తులు 300. మళ్ళీ 2వ గ్రూపులో తయారైన కొత్త పోషణ ఉత్పత్తులు 300. ఇవి మళ్ళీ 2 గ్రూపులకూ అందుతాయి. మొదటి దానికి 200. రెండో దానికి 100.

ఉత్పత్తి సాధనాలుగానీ, పోషణ వస్తువులు గానీ, 2 గ్రూపుల్లోనూ కలిసి ఎన్ని ఖర్చయ్యాయో, మళ్ళీ అన్నే ఉత్పత్తి అయ్యాయి. ఖర్చయిన 600 C కి బదులు మళ్ళీ 600 C. ఖర్చయిన 300 పోషణ ఉత్పత్తులకు బదులు మళ్ళీ 300 పోషణ ఉత్పత్తులు. కానీ ఈ విషయం, 2 గ్రూపుల్నీ కలిపి చూస్తేనే తెలుస్తుంది. ఈ గ్రూపుల్ని విడివిడిగా చూస్తే, ఖర్చయిన C కన్నా ఎక్కువ C ఉత్పత్తి అయినట్టూ, ఖర్చయిన పోషణ వస్తువుల కన్నా ఎక్కువ పోషణ వస్తువులు ఉత్పత్తి అయినట్టూ కనపడతాయి.

1వ గ్రూపుని మాత్రమే విడిగా చూద్దాం. ఇక్కడ ఖర్చయిన C — 400. కొత్తగా ఉత్పత్తి అయిన C — 600. కాబట్టి, 200 C ఎక్కువగా ఉత్పత్తి అయినట్టు కనపడుతోంది. కానీ, 2 గ్రూపుల్నీ కలిపి చూస్తే, 2 గ్రూపుల్లోనూ కలిసి ఖర్చయిన 600 C కన్నా కొత్తగా ఉత్పత్తి అయిన C, ఎక్కువగా ఉండదు. మొదటి గ్రూపు 2 వ గ్రూపు కోసం కూడా C ని అందించాలి కాబట్టి, 2 గ్రూపుల్లోనూ కలిసి ఖర్చయిన 600 C యే తిరిగి వచ్చింది. అంత కన్నా ఎక్కువ లేదు.

2వ గ్రూపులో పోషణ వస్తువుల సంగతి కూడా అలాగే. ఈ గ్రూపుని విడిగా చూస్తే, ఇక్కడ ఖర్చయిన పోషణ వస్తువులు 100. కొత్తగా తయారైనవి 300. ఇవి 200 ఎక్కువగా ఉత్పత్తి అయినట్టు కనపడుతున్నాయి. కానీ, ఈ గ్రూపు, 1వ గ్రూపు కోసం కూడా పోషణ వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యాలి. 2 చోట్లా కలిసి పోషణ వస్తువుల ఖర్చు 300. మళ్ళీ తయారైనవి కూడా 300 యే. ఇవి కూడా గతం కన్నా ఎక్కువగా ఉత్పత్తి అయినట్టు కాదు.

అయితే, సింపుల్ పునరుత్పత్తిలో ఏ గ్రూపులోనూ అదనపు ఉత్పత్తి జరగదని అర్థమా? — అలా కాదు. ప్రతీ గ్రూపులోనూ, అందులో ప్రతీ శాఖలోనూ అదనపు ఉత్పత్తి ఉంటుంది. S లేకపోతే అది పెట్టుబడిదారీ విధానమే కాదు. ఇక్కడ మనం చూస్తున్నది, S సంగతి కాదు. 2 గ్రూపుల మధ్యా ఉన్న ఉత్పత్తుల పాళ్ళ సంగతి. గతంలో ఖర్చయిన పరిమాణాలే తిరిగి వచ్చాయా, అంత కన్నా ఎక్కువగా వచ్చాయా — అని చూస్తున్నాం.

సింపుల్ పునరుత్పత్తిలో, గతంలో ఖర్చయిన ఉత్ప త్తులు, ఆ పరిమాణాల్లోనే తిరిగి వస్తాయి. అయినా, ఆ పరిమాణాల్లోనే S లు కూడా ఉంటాయి. ప్రతీ శాఖలోనూ S ఉంటుంది. కానీ 2 గ్రూపుల్నీ కలిపి చూస్తే, ఖర్చయి పోయిన C+V+S ల కన్నా ఎక్కువ ఉత్పత్తులు ఉండవు. అందుకే ఇది సింపుల్ పునరుత్పత్తి.

2 గ్రూపుల్లోనూ మొత్తం రాసి:

600C + 150V + 150S = 900

2 గ్రూపులకూ సంబంధించిన ఉత్పాదక కార్మికులు, 300 శ్రమ చేసి, అందులోనించి 150ని జీతాలుగా తీసు కుంటారు. ఇంకా ఆపైన వున్న 150Sలో, మొదటి గ్రూపు పెట్టుబడిదారుల పోషణా — విలాసాల కోసం 100. రెండో గ్రూపు పెట్టుబడిదారుల కోసం 50. ఈ వర్గం, గత సంవ త్సరపు ఉత్పత్తి రాసిలోనించి 150 S ని వాడేసినట్టే, ఇప్పుడు మళ్ళీ కొత్త 150 S ని వాడేస్తుంది.

ఇంత వరకూ చూస్తే, సింపుల్ పునరుత్పత్తిలో ఏం జరిగింది? — ఖర్చయిపోయిన సాధనాలూ (600C), ఖర్చయిపోయిన కార్మికుల పోషణా (150V), ఖర్చయి పోయిన పెట్టుబడిదారుల పోషణా (150S) — ఈ 3 భాగాలూ మళ్ళీ సిద్ధమయ్యాయి. కానీ, ఇది తయారవ డానికి, పెట్టుబడిదారుల ద్వారా ఖర్చయినవి C + V లు మాత్రమే. S ఉత్పత్తుల కోసం వాళ్ళు ఏ ఖర్చూ పెట్టలేదు. S భాగం కార్మికుల అదనపు శ్రమ వల్లనే వస్తుంది. ఇది సింపుల్ పునరుత్పత్తి కాబట్టి, 2 గ్రూపుల్నీ కలిపి చూస్తే, ఇక్కడ వున్న S భాగంలో పెట్టుబడిదారుల పోషణ వస్తువులు మాత్రమే ఉంటాయి. వాటిని ఆ వర్గం, తన పోషణ కోసం వాడేస్తుంది.

మళ్ళీ ఈ C+V లతో ఇంకో సింపుల్ పునరుత్పత్తి జరుగుతుంది. అది మళ్ళీ 3 భాగాల్ని తెస్తుంది. అవి మళ్ళీ ఖర్చయిపోతాయి.

సింపుల్ పునరుత్పత్తి వల్ల పెట్టుబడి స్థాయి పెరగదు. అది ఎప్పుడూ పాత స్థాయిలోనే ఉంటుంది. అయినప్ప టికీ పెట్టుబడిదారీవర్గం, తన స్వంత శ్రమ లేకుండా, ప్రతీ రోజూ కొత్త S ని తింటూ బతకడానికి వాళ్ళకి సింపుల్ పునరుత్పత్తి అయినా మంచిదే.

# విస్తృత పునరుత్పత్తిలో

సింపుల్ పునరుత్పత్తిలో చూసిన లెక్కల ఉదా హరణలు, ఇక్కడ యథాతథంగా పనికిరావు. ఈ ఉదాహరణలు కొంచెం తేడాగా ఉండాలి. ఎందుకంటే, విస్తృత పునరుత్పత్తి జరగడం ద్వారా వచ్చే S లో నించి కొంత భాగం కొత్త పెట్టుబడిగా మారాలి కాబట్టి. పాత C+Vలు పాత పెట్టుబడిగా ఉంటాయి. అవి గాక, కొత్త పెట్టుబడి కావాలంటే, దాని కోసం కొత్త C+Vలు కావాలి. ఈ ఉత్పత్తులు మొదట S భాగం లోనే ఉంటాయి. అంటే, ఇక్కడ S లో ఉండే ఉత్పత్తులన్నీ కేవలం పోషణ వస్తువులే కాదు. S అంతా పోషణ వస్తువులే అయితే, అందులో నించి కొంత భాగాన్ని పెట్టుబడిగా మార్చడం సాధ్యమే కాదు. కాబట్టి, ఈ S లో, కొత్త C, V ల రకాలు కూడా ఉండాలి. ఈ ఉదాహరణల్లో, 2 గ్రూపుల్లోనూ S భాగాలు, విస్తృత పునరుత్పత్తి జరగడానికి వీలైనవిగా ఉండాలి. సింపుల్ పునరుత్పత్తిలో తీసుకున్న లెక్కలు ( ఆ రాసులు), మళ్ళీ సింపుల్ పునరుత్పత్తి జరగడానికే తగినవిగా వుంటాయి. విస్తృత పునరుత్పత్తి కోసం తీసుకున్న లెక్కలు, మళ్ళీ విస్తృత పునరుత్పత్తికే తగినవిగా. సింపుల్ లెక్కలతో, విస్తృత పునరుత్పత్తి రాదు. అలాగే, విస్తృత లెక్కలతో సిపుల్ పునరుత్పత్తి రాదు.

ఈ విషయాలు కొంచెం వివరంగా చూడాలి. ఎందు కంటే, అలా చూస్తేనే పెట్టుబడిదారీ విధానం ఎప్పుడూ విస్తృత పునరుత్పత్తి గానే ఉంటుందని తెలుస్తుంది. దాని వల్ల వచ్చే సమస్య లేమిటో కూడా తెలుస్తాయి.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, పెట్టుబడిదారీ విధా నాన్ని, సింపుల్ పునరుత్పత్తి గానే చెపుతారు. దాని వల్ల ఎలాంటి సమస్యలూ లేనట్టు చెపుతారు. అందుకే ఈ విషయాలు సరిగా అర్థం చేసుకోవాలి. ఇది విస్తృత పునరుత్పత్తి కోసం.

ఒక సంవత్సర ఉత్పత్తి క్రమంలో తయారైన మొత్తం ఉత్పత్తులు, ఇలా ఉన్నాయి అనుకుందాం:

| | |
|---|---|
| 1వ గ్రూపులో: | 400C + 100V + 100S = 600 |
| 2వ గ్రూపులో: | 150C + 75V + 75S = 300 |
| | 550C + 175V + 175S = 900 |

ఉత్పత్తి సాధనాల గ్రూపులో,
మొదట ఖర్చయిన C— 400.
కొత్తగా తయారైనది — 600.
ఇక్కడ 200C ఎక్కువగా ఉన్నాయి.

రెండో గ్రూపులో,

మొదట ఖర్చయిన పోషణ వస్తువులు — 75V + 75S =150. కొత్తగా తయారైన పోషణ వస్తువులు 300. ఇక్కడ 150 పోషణ వస్తువులు ఎక్కువగా ఉన్నాయి.

కానీ, ఈ గ్రూపుల్ని ఇలా విడి విడిగా చూడడం కాదు. విడి విడిగా చూస్తే, ప్రతీ గ్రూపులోనూ S ఉంటుంది కాబట్టి ఖర్చయిన ఉత్పత్తుల కన్నా, కొత్త ఉత్పత్తులు ఎక్కువగానే కనపడతాయి. 2 గ్రూపుల్నీ కలిపి చూసి, అప్పుడు కూడా ఖర్చయిన C కన్నా ఎక్కువ C; ఖర్చయిన పోషణ వస్తువుల కన్నా ఎక్కువ పోషణా ఉన్నాయో లేదో చూడాలి. అలా చూస్తేనే సింపుల్ పునరుత్పత్తికీ, దీనికీ, తేడా తెలుస్తుంది.

మొదట ఉత్పత్తి సాధనాల సంగతి చూద్దాం.

2 గ్రూపుల్లోనూ కలిసి మొత్తం రాసి 900. దీన్ని ఉత్పత్తి చెయ్యడం కోసం, 2 గ్రూపుల్లోనూ కలిసి ఖర్చయిన మొత్తం సాధనాలు = 400C + 150C = 550C. మొదటి గ్రూపులో మళ్ళీ తయారై ఉన్న కొత్త C — 600. అంటే, ఈ గ్రూపులో 50C ఎక్కువగా తయారై ఉన్నాయి. వీటిని 'కొత్త C' అందాం.

ఈ 'కొత్త 50C, మొదటి గ్రూపులో ఏ భాగంలో ఉన్నాయి? C భాగంలోనా, V భాగంలోనా, S భాగంలోనా? — C, V భాగాల్లో అయితే, పాత విలువలతో సమానమైన ఉత్పత్తులే ఉంటాయి. C కి బదులు C, V కి V. C లో 400, Vలో 150 — ఇవి పాత విలువలే. కొత్త విలువ ఈ భాగాల్లో ఉండదు. కాబట్టి కొత్త 50C కోసం S భాగంలోనే చూడాలి. ఇక్కడ ఉత్పత్తి అయిన S భాగం 100. ఈ భాగంలో ఉన్న ఉత్పత్తులన్నీ కూడా C గా వాడవలసిన ఉత్పత్తులే. ఇందులోనే కొత్త C ఉందని అర్థం.

ఇప్పుడు 2వ గ్రూపులో పోషణ వస్తువుల సంగతి.

2 గ్రూపులలోనూ ఖర్చయిన మొత్తం పోషణ వస్తువులు ఎన్ని? 2వ గ్రూపులో కొత్తగా తయారై ఉన్న పోషణ వస్తువులు ఎన్ని? ఇవి గతంలో ఖర్చయిన వాటి కన్నా ఎక్కువగా ఉన్నాయా, లేవా? ఉంటే ఎన్ని ఎక్కువగా ఉన్నాయి? ఈ విషయాల కోసం 2 గ్రూపుల్లోనూ కనపడే పోషణ ఉత్పత్తుల్ని చూస్తే, చాలా ఆశ్చర్యపోతాం. ఎందుకంటే, 2 గ్రూపుల్లోనూ ఖర్చయిన మొత్తం పోషణ వస్తువుల్ని కలపండి. అలా చేస్తే అవి 350 అవుతాయి. అయితే, 2వ గ్రూపులో మళ్ళీ కొత్తగా తయారైన పోషణ వస్తువులు ఎన్ని? 300 మాత్రమే కనపడతాయి. "ఇదేమిటి? ఎక్కువ పోషణ వస్తువులు లేవు సరిగదా, ఖర్చయిపోయినవి అయినా తిరిగి రాలేదే!" అని తెల్లబోతాం. కానీ, ఇంకా జాగ్రత్తగా ఆలోచిస్తే మన పొరపాటు మనకు తెలుస్తుంది.

ఇది, సింపుల్ పునరుత్పత్తి కాదు. విస్తృత పునరుత్పత్తి. ఇందులో, 2 గ్రూపుల్లోనూ S అంతా పెట్టుబడిదారుల స్వంత వాడకానికే కాదు, S లో కొంత భాగమే వాళ్ళ స్వంత వాడకానికి. మిగిలింది, 'కొత్త పెట్టుబడి'గా మారడానికి. కాబట్టి ఇక్కడ, S ని అంతా పెట్టుబడిదారుల పోషణ వస్తువులుగా తీసుకోకూడదు. అందులో కొంత భాగాన్ని మాత్రమే అలా తీసుకోవాలి. ఇలా చూస్తే, మొదట ఖర్చయిన పోషణ వస్తువుల కన్నా, తర్వాత, కొత్తగా తయారైన పోషణ వస్తువులు ఎక్కువ గానే ఉంటాయి. అప్పుడు, ఇక్కడ కూడా 'కొత్త పోషణ వస్తువులు' కనపడతాయి. అదే చూద్దాం.

మొదట, 1వ గ్రూపులో పెట్టుబడిదారులు, తమ S లో ఎంత భాగాన్ని స్వంతానికి వాడతారో, ఎంత భాగాన్ని కొత్త పెట్టుబడిగా మారుస్తారో చూడాలి. దీనికి మనం ఏదో ఒక ఉదాహరణ పెట్టుకోవాలి.

1వ గ్రూపులో ఉత్పత్తిని, 400C + 100V + 100S = 600గా అనుకున్నాం. ఇందులో అదనపు విలువ 100. ఈ Sలో నించి, ఈ గ్రూపు పెట్టుబడిదారుల పోషణ కోసం 50 అనీ; మిగిలిన 50 ని, ఈ గ్రూపులోనే కొత్త పెట్టుబడిగా మార్చడం కోసం అనీ — అనుకుందాం. కొత్త పెట్టుబడిగా మారే 50S అంతా, పూర్తిగా Cలోకే గానీ, పూర్తిగా Vలోకే గానీ చేరదు. ఈ గ్రూపులో పాత పెట్టుబడిలో 'స్థిర — అస్థిరల' పాళ్ళు ఎలా ఉన్నాయో ఆ పాళ్ళ ప్రకారమే, కొత్త పెట్టుబడిలో నించి కూడా కొంత భాగం C లోకీ, కొంత భాగం V లోకీ చేరుతుంది. ఈ గ్రూపులో C+Vలు, 4:1 పాళ్ళతో ఉన్నాయి. కాబట్టి, ఇక్కడ కొత్త పెట్టుబడిగా మారబోయే 50S కూడా, ఆ ప్రకారమే పాత పెట్టుబడికి చేరుతుంది. అంటే ఈ 50Sలో నించి C లోకి 40, V లోకి 10 చేరతాయి. ఈ గ్రూపులో పునరుత్పత్తి జరిగేటప్పుడు, పాత 400C + కొత్త 40C = 440C; పాత 100V + కొత్త 10V = 110V, అవుతాయి.

1వ గ్రూపులో 600C తయారై ఉన్నాయి కదా? అందులోనించి 440C ఆ గ్రూపులోనే వాడకం అవుతాయి. (అవి, ఆ గ్రూపులోనే వేరు వేరు శాఖల మధ్య అమ్మకాలవుతాయి.) ఇంకా అక్కడ 160C మిగులుతుంది. అది 2వ గ్రూపులోకి వెళ్ళి, (2వ గ్రూపులో శాఖలు, వీటిని కొంటాయి), అటు నించి 160 పోషణ వస్తువులు ఈ 1వ గ్రూపు లోకి వస్తాయి. అలా వచ్చే 160 పోషణలో నించి, 1వ గ్రూపులో పాత — కొత్త Vల కోసం 110. ఇంకా మిగిలిన పోషణ 50. ఇవి, ఇక్కడ పెట్టుబడిదారీ పోషణ కోసం.

అంటే, 1వ గ్రూపులో ఉన్న 100S విలువ అంతా పెట్టుబడిదారుల పోషణ కోసమే కాదు. ఆ పోషణ కోసం 50, మిగిలిన 50 కొత్త పెట్టుబడిగా మారడానికి. ఈ రకంగా ఈ గ్రూపులో 50S, కొత్త పెట్టుబడిగా మారుతుంది.

ఇలా 50 కొత్త పెట్టుబడి చేరిన తర్వాత, 1వ గ్రూపులో మొత్తం పెట్టుబడి ఎంత? ఇక్కడ పాత పెట్టుబడి 400C + 100V = 500. దీనికి 50 కొత్త పెట్టుబడి కూడా చేరి, అది 440C +110V = 550 అవుతుంది. తర్వాత జరగ వలసిన పునరుత్పత్తి క్రమం ఈ పెరిగిన 550 పెట్టుబడితో జరుగుతుంది. అది గతం కన్నా ఎక్కువ S ని తెస్తుంది. అదనపు విలువ రేటుని గతంలో లాగే 100% గానే అనుకుంటే, ఈ 550 పెట్టుబడితో తయారయ్యే ఉత్పత్తి విలువ = 440C + 110V + 110S = 660. పునరుత్పత్తి క్రమం పూర్తి అయిన తర్వాత ఈ గ్రూపులో 660 ఉత్పత్తి సాధనాలు ఉంటాయి. ఇవి, గత ఉత్పత్తి క్రమంలో తయారైన వాటి కన్నా (600 కన్నా) 60 ఎక్కువ — ఈ రకంగా మొదటి గ్రూపులో ప్రతీ పునరుత్పత్తి క్రమమూ, విస్తృత పునరుత్పత్తి గానే జరుగుతూ, C గా వాడవలసిన ఉత్పత్తుల్ని పెంచుతూ ఉంటుంది.

ఇప్పుడు 2వ గ్రూపు సంగతి:

ఇక్కడ మొదటి ఉదాహరణ : 150C + 75V + 755 = 300. ఇవి అన్నీ పోషణ ఉత్పత్తులే. ఈ మొదటి ఉదాహరణలో పెట్టుబడి 150C + 75V = 225.

C, Vల పాళ్ళు: 2 : 1. అదనపు విలువ 75. ఈ Sలో నించి ఈ గ్రూపు పెట్టుబడిదారుల పోషణ కోసం 60 అనీ, మిగిలిన 15ని కొత్త పెట్టుబడిగా మారడానికి అనీ అనుకుందాం. ఈ కొత్త 15 పెట్టుబడి, 2 : 1 పాళ్ళతో C, V లలోకి చేరాలి. C లోకి 10, V లోకి 5. ఇప్పుడు ఈ గ్రూపులో మొత్తం పెట్టుబడి = పాత 150C + కొత్త 10C = 160C. పాత 75V + కొత్త 5V = 80V.

ఈ 2వ గ్రూపులో పునరుత్పత్తి క్రమం, 160C + 80V = 240తో జరుగుతుంది. అంటే, పెట్టుబడి 15 పెరుగుతుంది.

2వ గ్రూపులో పునరుత్పత్తి కోసం 160C కావాలి కదా? ఇవి మొదటి గ్రూపులోనించి రావాలి. వాటికి బదులుగా ఇక్కడి నించి 160 పోషణ, మొదటి గ్రూపులోకి వెళ్ళాలి. 2వ గ్రూపులో ఉన్న 300 పోషణలో నించి 160 వెళ్ళి పోతే, ఇక్కడ ఇంకా 140 పోషణ మిగులుతాయి. అందులో నించి 80, ఇక్కడ పునరుత్పత్తి కాలంలో పాత — కొత్త Vల కోసం ఖర్చవుతాయి. ఇంకా మిగిలిన 60 పోషణ, ఈ 2వ గ్రూపులోనే పెట్టుబడిదారుల కోసం.

అంటే, 2వ గ్రూపులో ఉన్న 75S అంతా పెట్టుబడిదారీ పోషణ కోసమే కాదు. అందులో నించి కొంత భాగం కొత్త పెట్టుబడి కోసం కూడా. ఈ రకంగా, ఈ 2వ గ్రూపులో 15 S, కొత్త పెట్టుబడిగా మారుతుంది. ఈ 2వ గ్రూపులో పాత పెట్టుబడి 225. తర్వాత పెట్టుబడి 240. దీనితో విస్తృత పునరుత్పత్తి క్రమం జరుగుతుంది. అదనపు విలువ రేటుని మొదటి గ్రూపులోలాగే 100% అనుకుంటే, పునరుత్పత్తి తర్వాత వచ్చే విలువ = 160C + 80V + 80S = 320. ఇవి అన్నీ పోషణ ఉత్పత్తులే. ఇవి గతం కన్నా (300 కన్నా) 20 ఎక్కువ.

ఈ విస్తృత పునరుత్పత్తిలో, మొదటి ఉదాహరణలో, 2 గ్రూపులూ ఇలా ఉన్నాయి:

1) 400C + 100V + 100S = 600
2) 150C + 75V + 75S = 300

పునరుత్పత్తి జరిగిన తర్వాత, 2 గ్రూపులూ ఇలా ఉంటాయి:

1) 440C + 110V + 110S = 660
2) 160C + 80V + 80S = 320.

ఈ భాగాలతో మళ్ళీ తర్వాత కూడా విస్తృత పునరుత్పత్తి సాధ్యమవుతుంది. ప్రతీ సారీ ఇదే జరుగుతుంది.

సింపుల్ పునరుత్పత్తికీ, విస్తృత పునరుత్పత్తికీ తేడా ఏమిటో ఇప్పుడు తేలిగ్గానే తెలుసుకోగలం. ఏ పునరుత్పత్తిలో అయినా S ఉంటుంది. ఆ విషయంలో తేడా ఉండదు. తేడా ఎక్కడంటే, Sలో ఉండే ఉత్పత్తుల రకాల్లో.

సింపుల్ పునరుత్పత్తిలో అయితే, 2 గ్రూపుల్లోనూ కలిసి ఉత్పత్తి అయిన S లో, కొత్త C, V లు ఉండవు. ఆ ఉత్పత్తులన్నీ పెట్టుబడిదారీ పోషణ ఉత్పత్తులు గానే ఉంటాయి. అందుకే ఈ S, ఎప్పటికప్పుడు ఖర్చయిపోతూ ఉంటుంది. ఇందులో నించి కొంత భాగం పెట్టుబడిగా మారదు. విస్తృత పునరుత్పత్తిలో అయితే, S లో, పోషణ వస్తువులే గాక, కొత్త పెట్టుబడిగా మారడానికి వీలైన వస్తువులు కూడా ఉంటాయి. విస్తృత S లో, మొత్తం 4 రకాలు ఉంటాయి.

(1) ఇది, పెట్టుబడిదారీ వర్గం 2 గ్రూపుల్లోనూ గత సంవత్సర కాలంలో వాడేసిన పోషణ — విలాస వస్తువులకు బదులుగా వచ్చిన భాగం. దీన్ని, ఈ వర్గం, మళ్ళీ ఒక సంవత్సరం పాటు వాడుతుంది. అప్పటికి మళ్ళీ కొత్త రాసి వస్తుంది. ఈ వర్గం, స్వంత శ్రమ లేకుండా ప్రతీ రోజూ, ప్రతీ ఏటా, ఈ భాగం ద్వారానే జీవిస్తూ ఉంటుంది.

(2) కొత్త C వీటిని 2 గ్రూపుల్లోనూ ఉత్పత్తి సాధనాలుగా మాత్రమే వాడవలసి ఉంటుంది. ఇది, పెట్టుబడిదారుల పని స్థలాల్లోకి వెళ్తాయి.

(3) కొత్త V. వీటిని పెరిగే పెట్టుబడిలో కార్మికుల పోషణ కోసం (జీతాలుగా) వాడవలసి ఉంటుంది. ఇవి కార్మికుల వాడకానికి వెళ్తాయి. ( S లో ఉండే ఈ కొత్త C, V లే పాత పెట్టుబడితో కలిసి, పెట్టుబడి పెరుగుతుంది.)

(4) ఇవి, పెట్టుబడిదారీ పోషణ వస్తువులే. ఇవి, 1వ అంశంలో ఉన్న వాటి కన్నా ఎక్కువగా ఉన్నవి. ఈ భాగం ఉంటేనే, పెట్టుబడిదారీ వర్గం వాడే పోషణ వస్తువులు పెరుగుతూ ఉంటాయి. ఈ భాగం లేకపోతే, ఈ వర్గం వాడే పోషణ ఎప్పుడూ పాత పరిమాణంలోనే ఉండి పోతుంది. అది అర్థంలేని విషయం. దోపిడీ వర్గపు సుఖ భోగాలు ఎప్పుడూ ఒకే స్థాయిలో ఉండవు. పెరుగుతూనే ఉంటాయి. అంటే, ఈ వర్గం వాడడానికి, పాత పోషణ వస్తువులకు కొన్ని కొత్త రకాలు కూడా చేరుతూ ఉంటాయి. ఆ పని, S లో ఉండే ఈ 4వ భాగం వల్లనే జరుగుతుంది.

ఈ రకంగా విస్తృత పునరుత్పత్తి తాలూకు Sలో, 4 రకాల ఉత్పత్తులు ఉంటాయి. అందులో C, Vల రకాలు కొత్త పెట్టుబడిగా మారగా, మిగిలినదంతా పెట్టుబడిదారీ వర్గపు పోషణకూ, విలాసాలకూనూ!

ఇక్కడ ఇంకో విషయం కూడా గ్రహించాలి. **'ఆయుధాల ఉత్పత్తి'** విషయం. 'ఆయుధాలు' అనేవి, ఉత్పత్తి సాధనాలలోకీ రావు, పోషణ వస్తువులలోకీ రావు.

ఆయుధాల్లో అనేక రకాల తేడాలు ఉంటాయి. అవి అనేక శాఖల్లో తయారవుతాయి. కానీ, ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, ఆయుధాల శాఖలన్నిటినీ కలిపి ఒకే శాఖగా అనుకుందాం. ఆయుధాలు తయారవడానికి కూడా C, Vలు కావాలి. తయారైన ఆయుధాలన్నీ కొత్త సరుకులు అవుతాయి. ఇవి కూడా సంవత్సర ఉత్పత్తుల రాసిలోనే ఉంటాయి.

తయారైన తుపాకుల్నీ బాంబుల్నీ చూస్తే, అవి Cగా గానీ, Vగా గానీ ఉపయోగపడవు. ఇవి పెట్టుబడిదారుల పోషణలోకి కూడా రావు. మరి వీటిని సంవత్సరపు ఉత్పత్తి రాసిలో ఏ భాగంలో ఉన్నట్టుగా అర్థం చేసుకోవాలి? — అసలు ఇది ఏ వర్గపు అవసరం కోసం? పెట్టుబడిదారీ వర్గపు అవసరం కోసమే. ఇవి, ఆ వర్గానికి కావలసిన ఉత్పత్తులే. కాబట్టి ఇవి ప్రతి సారీ S లోనే భాగం అవుతాయి. పెట్టుబడిదారీ పోషణ ఉత్పత్తులన్నీ S లో భాగం అయినట్టు గానే, ఆయుధాలన్నీ S లో భాగమే. C, V లకు చెందని ఉత్పత్తి ఏది అయినా S భాగం లోకి వెళ్ళవలిసిందే.

2 గ్రూపుల్లోనూ కలిసి, విస్తృత పునరుత్పత్తి వల్ల వచ్చే మొత్తం ఉత్పత్తి రాసిని మళ్ళీ ఒక సారి క్లుప్తంగా చూస్తే:

C అంతా — ఖర్చయిన ఉత్పత్తి సాధనాలు.

V అంతా — ఖర్చయిన కార్మికుల పోషణ.

ఈ 2 భాగాల్ని తీసేస్తే, మిగిలినదంతా S యే. ఆయుధాలైనా, మరే రకాలైనా, ఆ Sలో ఉండవలిసిందే. ఆయుధాల్ని కూడా లెక్కలోకి తీసుకుంటే, Sలో 4 రకాలుగాక, 5 రకాల ఉత్పత్తులు ఉంటాయన్న మాట!

Sలో 5 రకాల ఉత్పత్తులు ఉన్నప్పటికీ, ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, ఆ రకాలన్నిటినీ పట్టించుకోవద్దు. Sలో - (1) పెట్టుబడిదారుల పోషణ వస్తువులూ (2) కొత్త C, Vలూ — ఈ 2 రకాలే ఉంటాయి — అనుకుందాం. ఇలా ఉన్న Sని అంతా పెట్టుబడిదారులు తమ పోషణ కోసమే వాడడం సాధ్యం కాదు. అందులో ఉన్న C,Vల్ని కొత్త పెట్టుబడిగా మార్చితీరాలి.

ఒక బట్ట పెట్టుబడిదారుడు, ఒక సంవత్సరంలో, తన లాభాన్నంతా స్వంత వాడకానికే ఖర్చుపెట్టేసి ఉండవచ్చు. లాభంలో కొంత భాగంతో, కొత్త ఉత్పత్తి సాధనాలేవీ కొనకుండా, పెట్టుబడిని పెంచకుండా ఉండవచ్చు. ఇంకా కొందరు పెట్టుబడిదారులు కూడా అలాగే చేసి ఉండవచ్చు. కానీ, మొత్తం పెట్టుబడిదారులంతా (ఆ వర్గం అంతా) అలాగే చెయ్యడం సాధ్యం కాదు.

2 గ్రూపులలోనూ తయారైన ఉత్పత్తి రాసిలో ఉన్న S భాగంలో, కొన్ని కొత్త C, V లు ఉంటాయి కాబట్టి, ఆ S అంతా డబ్బుగా మారాలంటే, అందులో ఉన్న అన్ని రకాల ఉత్పత్తులూ అమ్ముడై పోవాలి. కొత్త C, Vలు అమ్ముడవడం అంటే, అవి కొత్త పెట్టుబడిగా మారడమే.

S అంతా పూర్తిగా అమ్ముడయ్యిందంటే, మొత్తం సమాజంలో, ఎక్కడెక్కడో పెట్టుబడులు పెరిగాయని అర్థం. పెట్టుబడుల్ని పెంచకుండా S ని వాడడం సాధ్యం కాదు. ఈ విషయం విడి విడి పెట్టుబడిదారుల్ని చూస్తే తెలియదు.

ఒక విడి పెట్టుబడిదారుడి విషయంలో, లాభాన్నంతా స్వంతానికి వాడెయ్యడంలో సాధ్యం కాని విషయం ఏదీ కనపడదు. మొత్తం ఆ వర్గాన్నంతా చూస్తేనే లాభాన్నంతా పోషణకే వాడెయ్యడం ఎందుకు సాధ్యం కాదో తెలుస్తుంది. (ఆ Sలో ఉత్పత్తి సాధనాలుగా వాడవలసినవి కూడా వుంటాయి గనక, వాటిని పోషణ కోసం వాడడం సాధ్యం కాదని.)

అంతే కాదు, S ని కేవలం 'కొంత డబ్బుగా' చూస్తే, అప్పుడు కూడా ఈ విషయాలు అర్థం కావు. S ని 100 డబ్బు అనుకుందాం. ఆ 100 డబ్బంతా ఆ వర్గం, పోషణ వస్తువులు కొనుక్కుని వాడేసింది — అంటే అందులో సాధ్యం కాని విషయం ఏమిటో కనపడదు. S లో ఏ యే రకాల ఉత్పత్తులు ఉంటాయో ఆ వివరాలు చూస్తే, అందులో C,V లుగా వాడవలసిన ఉత్పత్తులు ఉన్నాయనీ, అవి పెట్టుబడిదారీ పోషణకు పనికి రావనీ తెలుస్తుంది. S ని కొంత డబ్బుగా గాక, అసలైన ఉత్పత్తులుగా

చూస్తేనే, అందులో కొంత భాగం పెట్టుబడిగా ఎందుకు మారాలో తెలుస్తుంది.

పెట్టుబడి పెరగాలంటే కార్మికుల సంఖ్య కూడా పెరగాలి. అంటే, ఎక్కువ మంది కార్మికులు దొరకాలి. ప్రతీ శాఖలోనూ నిరుద్యోగులు కుప్పతెప్పలుగా ఉండే పెట్టుబడిదారీ సమాజంలో ఇది సమస్యే కాదు. కార్మికులు ఓవర్ టైములు చేసే విధానం ఎలాగూ ఉంది. అంతే గాక, కార్మిక వర్గంలో, ప్రతీ ఏటా కొత్త కార్మికులుగా తయారయ్యే సంఖ్య ఉంటూనే ఉంటుంది. కార్మికుల సంఖ్య గురించి ఇంత కన్నా చూడనక్కరలేదు.

సమాజంలో ఒక వేపు అదనపు ఉత్పత్తి సాధనాలూ, ఇంకో వేపు అదనపు కార్మికులూ సిద్ధంగా ఉన్నప్పుడు, ఇక పెట్టుబడిదారీ వర్గం చేసేదంతా ఏమిటంటే, ఆ 2 అంశాల్ని కలపడమే. ఆ పని అది చాలా ఉత్సాహం గానే చేస్తుంది — సాయంత్రాని కల్లా పాత S తో పాటు, కొత్త S ని కూడా లాగడానికి.

పెట్టుబడిదారీ విధానం గురించి గ్రహించవలసిన అనేక ముఖ్య విషయాల్లో, ఈ 'పునరుత్పత్తి' విషయం కూడా ఒకటి అని చెప్పుకున్నాం.

ఈ విధానం సింపుల్ పునరుత్పత్తే అయితే S భాగం అంతా ఎప్పటికప్పుడు పెట్టుబడిదారీ పోషణ కోసం ఖర్చయిపోతూ వుండాలి. అప్పుడు పెట్టుబడి పెరగడానికి అవకాశమే ఉండదు. కానీ, సమాజంలో పెట్టుబడి పెరుగుతూనే ఉంది. అదనపు శ్రమ, బానిసల కాలం నించీ కూడా ఉంది. బానిసల అదనపు శ్రమతో, యజమానుల భూమి — ఆస్తులూ, వెండి బంగారాలూ, సుఖ భోగాలూ ఒక నాటి కన్నా ఒక నాటికి పెరుగుతూనే వచ్చాయి. సరుకు ఉత్పత్తీ, వేతన శ్రమా (జీతాల పద్ధతి) ప్రారంభమైన నాటి నించీ అదనపు విలువ పెట్టుబడికి కలిసి పెట్టుబడి పెరుగుతూనే ఉంది. అదే నిజం కాకపోతే, ( అంటే, అదనపు విలువ అంతా ఎప్పటికప్పుడు పోషణ కోసమే ఖర్చయి పోతూ ప్రతీ పునరుత్పత్తి సింపుల్ పునరుత్పత్తిగా ఉండడమే నిజమైతే), సమాజంలో ఉన్న పెట్టుబడి, వేతన శ్రమ ప్రారంభమైన కాలంలో ఏ స్థాయిలో ఉండేదో ఆ స్థాయి లోనే ఈ నాటికీ ఉండాలి. కానీ, వాస్తవం అలా లేదు. పెట్టుబడి స్థాయి ఏ ఏటికా యేడు పెరుగుతూనే ఉంది. పెట్టుబడి కూడిక జరుగుతూనే ఉంది. అదనపు విలువలో కొంత భాగం పెట్టుబడికి చేరుతూనే ఉంది..

ఏదో ఒక సంవత్సరాన్ని మొదటి సంవత్సరంగా తీసుకుని, ఆ సంవత్సరపు S లో, కొన్ని కొత్త C,Vలు ఉన్నాయి అనుకుంటే, ఇక అప్పటి నించీ ప్రతీ సంవత్సర ఉత్పత్తి క్రమమూ విస్తృత పునరుత్పత్తిగానే ఉంటుంది. ఒక విస్తృత పునరుత్పత్తి ఇంకో విస్తృత పునరుత్పత్తికే దారితీస్తుంది.

విస్తృత పునరుత్పత్తిలో మొదటి ఉదాహరణగా, 2 గ్రూపుల లోనూ కలిసి, 900 పెట్టుబడిని తీసుకున్నాం. దాన్ని విస్తృత పునరుత్పత్తికి తగిన భాగాలతోనే తీసుకున్నాం. ఆ 900 పెట్టుబడి 175S ని ఉత్పత్తి చేసింది. ఆ Sలోనించి 65 S కొత్త పెట్టుబడిగా మారింది. తర్వాత పెట్టుబడి 965. ఆ పెట్టుబడి మళ్ళీ S ని ఇస్తుంది. గతం కన్నా ఎక్కువ S ని కూడా. అందులోనించి మళ్ళీ కొంత భాగం కొత్త పెట్టుబడిగా మారుతుంది. ఈ రకంగా, Sలో నించి కొంత భాగం పాత పెట్టుబడికి కలుస్తూవుండడం వల్లనే పెట్టుబడి పెరుగుతూ ఉంటుంది.

అంటే, మొదటి ఉదాహరణగా తీసుకున్న 900 పెట్టుబడి కూడా అలా పెరుగుతూ వచ్చిందేనన్నమాట! వెనకటి కాలంలో ఒకప్పుడు ఉన్నపెట్టుబడి, ఆ 900 కన్నా తక్కువగా ఉండేదన్న మాట! ఆ తక్కువ పెట్టుబడికే ప్రతీ ఏటా కొంత అదనపు విలువ చేరుతూ, అది కొంచెం కొంచెం పెరుగుతూ, అదే ఒక నాటికి 900 అయిందన్న మాట! దాన్ని మనం మొదటి ఉదాహరణగా తీసుకున్నాం. అది ఇంకా పెరుగుతూ కొంత కాలానికి 1,000 అవుతుంది. తర్వాత 2,000. ఆ తర్వాత 3,000. ఆ తర్వాత .... ఆ రకంగా అది ఇంకా ఇంకా పెరుగుతూనే ఉంటుంది. — ఎప్పటి వరకూ అంటే, పెట్టుబడిదారీ పరిపాలనకు ఏమీ భంగం రానంత వరకూ!

# పెట్టుబడి ఎవరిది?

**అ**దనపు విలువ, పెట్టుబడికి కలిస్తేనే పెట్టుబడి పెరుగుతుంది కదా? ఆ అదనపు విలువ ఎవరిది? — శ్రామిక వర్గానిది! అదనపు విలువే పెట్టుబడిగా ఏర్పడినట్టయితే, ఆ పెట్టుబడి ఎవరిది? — శ్రామిక వర్గానిదే! ఇదీ అసలు రహస్యం!

పెట్టుబడిదారీ వర్గపు ఆస్తిగా కనపడే పెట్టుబడి అంతా శ్రామిక వర్గపు ఆస్తి అన్నమాట! శ్రామిక వర్గానికి ఆశ్చర్యంతో నోట మాట రాని సత్యం ఇది! పెట్టుబడిదారీ వర్గానికి కూడా నోట మాట రాదనుకోండీ! కానీ, దానికి ఆశ్చర్యంతో కాదు, ఆగ్రహంతో! సత్యం మీద ఆగ్రహంతో!

శ్రామికుల శ్రమే దోపిడీదారుల ఆస్తిగా మారి, శ్రామికుల మీద 'యజమాని' అవుతూ ఉంటుంది! శ్రామికుల

శ్రమే శ్రామికుల మీద యజమాని!

పెట్టుబడిదారీ వర్గం లక్ష్యమూ, ఒక విడి పెట్టుబడి దారుడి లక్ష్యమూ కూడా — పెట్టుబడి విస్తరణే. ఒకనాడు కొంత పెట్టుబడితో ఒక పరిశ్రమని ప్రారంభించిన పెట్టు బడిదారుడు, తన పెట్టుబడిని పెంచకుండా, అదనపు విలువనంతా ఖర్చు చేసేస్తూ, ఎప్పుడూ ఒకే స్థాయి పెట్టు బడితో ఉండిపోడు. పెట్టుబడిదారుడు చాలా త్వరత్వరగా 'పెరిగిపోతూ' ఉండడం సాధారణ దృష్టికి కూడా కనపడే విషయమే.

వేరు వేరు పెట్టుబడిదారుల మధ్య రెలెటివ్ అదనపు విలువకోసం జరిగే పోటీ పోరాటం, ప్రతీ పెట్టుబడిదారుణ్ణీ పెట్టుబడిని పెంచేలాగ బలవంత పెడుతుంది. పెరిగే పెట్టుబడి, యంత్ర శాస్త్రాన్నీ, రసాయనిక శాస్త్రాన్నీ, ఇంకా ఇతర ప్రకృతి శాస్త్రాల్నీ త్వరత్వరగా అభివృద్ధి చేస్తూ ఉంటుంది.

సమాజం మొత్తంమీద పెట్టుబడి కూడిక (విస్తరణ) జరుగుతోన్న కొద్దీ, ఉత్పత్తి సాధనాల్ని భారీ ఎత్తున చేర్చడం ద్వారానూ, బ్రహ్మాండమైన ప్రకృతి శక్తుల్ని ఉనికిలోకి తేవడం ద్వారానూ, పెట్టుబడి, మరింత అధిక స్థాయిలో ఉత్పత్తి చెయ్యగలుగుతుంది!

పెట్టుబడిదారీ పునాది మీద, ఉత్పాదక శక్తిని పెంచే పద్ధతులన్నీ అదనపు విలువని పెంచే పద్ధతులే. అదనపు విలువని పెంచే పద్ధతులన్నీ మళ్ళీ పెట్టుబడిని పెంచే పద్ధతులే. అంటే, ఇదంతా శ్రామిక వర్గాన్ని మరింత మరింత దోచే పద్ధతులే.

అదనపు విలువ పెట్టుబడిగా మారవలసి ఉన్న ప్పుడు, అది ఏ శాఖలో పుట్టిందో ఆ శాఖలోనే పనిచెయ్యా లని రూలు లేదు. ఏ శాఖలో ఎక్కువ లాభాలు సాధించ గలనని దానికి నమ్మకం కలుగుతుందో ఆ శాఖ వేపే అది పరుగులెత్తుతుంది.

పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన కొత్తలో, అదనపు విలువ కొత్త పెట్టుబడిగా పని చెయ్యడానికి, అనేక శాఖలు దొరుకుతాయి. సమాజంలో ఉన్న ప్రతీ 'ఉపయోగపు విలువ'నీ 'సరుకు'గా మార్చే మార్గంలో అది మహా ఉత్సాహంగా పనిచేస్తుంది. పెట్టుబడి కూడిక, క్రమక్రమంగా అన్ని శాఖల్నీ పెట్టుబడిదారీ విధానం లోకి ఈడుస్తుంది. ఒకప్పుడు, కొన్ని ప్రధాన ఉత్పత్తులతో కలిసి కాంప్లిమెంటరీ ఉత్పత్తులుగా తయారయ్యే ఉత్పత్తులు, క్రమంగా అవే ప్రధానంగా తయారయ్యే స్పెషలైజ్డ్ ఉత్ప త్తులు అవుతాయి. అంతకు పూర్వం లేని కొత్త కొత్త ఉప యోగపు విలువలు పుట్టుకొస్తాయి. శ్రమ విభజన ఎక్కువ వుతూ, ఉత్పత్తి శాఖల సంఖ్య ఎక్కువవుతూ ఉంటుంది. దాదాపు అన్ని శాఖల లోకీ పెట్టుబడిదారీ పద్ధతులు ప్రవే శించినప్పటి నించీ పెట్టుబడుల మధ్య, 'రెలెటివ్ అదనపు విలువ' కోసం పోరాటం తీవ్రమైపోతూ ఉంటుంది.

సరుకుని పెద్ద స్థాయిలో ఉత్పత్తి చేసినప్పుడు, దాన్నంతా అమ్మడానికి, కొనే వాళ్ళు కావాలి. ఒక దేశపు పెట్టుబడిదారుడి దృష్టి, ఇతర దేశాల మీదకు కూడా పోతుంది. ఇతర దేశాల మార్కెట్లని తమ ఆధీనం లోకి లాగే వరకూ కూడా. ఇదంతా పెట్టుబడిదారీ విధానంలో అదనపు విలువ నించి తలెత్తే సమస్య! ఇది క్రమ క్రమంగా ప్రపంచాన్నంతా సమస్యల మయంచేస్తుంది.

కానీ పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, పెట్టుబడిదారీ విధానానికి ఎప్పటిలాగే వంతపాడుతూ, ఈ విధానంలో పెట్టుబడి కూడికే ఉండదంటారు. పెట్టుబడి పెరగడమే ఉండదు కాబట్టి, దాని వల్ల ఏ సమస్యలూ రావు అంటారు. ఇలాంటి వాదాల్లో తప్పులేమిటో గ్రహించ డానికే, మనం పెట్టుబడిదారీ విధానానికి సంబంధించిన ప్రతీ కోణాన్నీ ఎంతో వివరంగా అర్థం చేసుకుంటూ ఉండాలి.

# పెట్టుబడి కేంద్రీకరణ

పెట్టుబడిదారీ విధానం ఉత్పాదక శక్తుల్ని పెంచు తోన్నకొద్దీ, ఒక పరిశ్రమని ప్రారంభించడానికి మొట్ట మొదట పెట్టవలసిన 'కనీస మొత్తం' కూడా గతంకన్నా పెరుగుతూ ఉంటుంది. పరిశ్రమని ఆ మొత్తంతో ప్రారం భించకపోతే, ఆ పరిశ్రమలో సాగే పోటీలో నిలబడి సరు కుని ఉత్పత్తి చెయ్యడమే అసాధ్యమవుతుంది. ఇలాంటి పరిస్తితుల్లో, చిన్న స్థాయిలో ప్రారంభమయ్యే పెట్టు బడులూ, 'చాకచక్యంతో త్వర త్వరగా ఆత్మవిస్తరణ చెంద లేని' పెట్టుబడులూ, పోటీలో నిలబడలేక నష్టాల పాలవు తాయి. ఈ 'ఖాయిలాపడ్డ' పెట్టుబడుల్ని, రెలెటివ్ అదనపు విలువతో కొవ్వుపట్టి బలిసి వుండే పెద్ద పెట్టుబడులు, చవగ్గా కొనేసి తమలో కలిపేసుకుంటూ, అవి ఇంకా భారీ పెట్టుబడులుగా పెరిగిపోతూ ఉంటాయి. ఇలా కొన్ని చిన్న చిన్న పెట్టుబడులు ఒక పెద్ద పెట్టుబడితో కలిసినప్పుడు, అందులో కొత్త పెట్టుబడి ఏదీ ఉండదు. అలా కలిసిన పెట్టుబడి అంతా సమాజంలో అంతకు ముందు ఉన్నదే. వేరు వేరుగా ఉండే రాసులు ఒక చోట కలవడమే ఇది. కొన్ని పెట్టుబడులు ఒక చోట కలిసినప్పుడు, పెట్టుబడి మొత్తం పెరగక పోయినా, ఆ భారీ పెట్టుబడి రాసికి, అంతకు పూర్వం లేని భారీ ఉత్పాదక శక్తి సంక్రమిస్తుంది.

ఇలా, వేరు వేరు పెట్టుబడులు కలిసి, ఒక భారీ పెట్టుబడిగా పెరగడం 'పెట్టుబడుల కేంద్రీకరణ'.

ఒక పెట్టుబడి, తన అదనపు విలువని తనలో కలుపుకుంటూ పెరిగితే, అది 'పెట్టుబడి కూడిక' (ఎక్యూములేషన్). వేరు వేరు పెట్టుబడులు కలిసి ఒక పెద్ద పెట్టుబడిగా మారితే, అది పెట్టుబడి కేంద్రీకరణ (సెంట్రలైజేషన్).

కొందరు చిన్న చిన్న పెట్టుబడిదారులు వేరే వేరే చోట్ల తమ పెట్టుబడుల్ని చవగ్గా పోగొట్టుకుంటేనే, ఇంకో చోట సెంట్రలైజేషన్ సాధ్యమవుతుంది.

పెట్టుబడిదారీ కుటుంబాలలో జరిగే ఆస్తి పంపకాల వల్ల, భారీ స్థాయిలో ఉండే పెట్టుబడులు చిన్న చిన్న ముక్కలవడం కూడా జరుగుతూ ఉంటుంది. ఇది, పెట్టుబడుల కేంద్రీకరణకు వ్యతిరేక దిశలో పనిచేస్తుంది. కేంద్రీకరణ త్వరగా సాగడానికి ఇది ఒక ఆటంకంగా ఉంటుంది. ఒక వేపు దాన్ని (కేంద్రీకరణని) అడ్డుకునే శక్తులూ, ఇంకో వేపు దాన్ని త్వరపరిచే శక్తులూ కూడా పనిచేస్తూ ఉండగా, అది (కేంద్రీకరణ), తనకు అనుకూలించే మార్గంలో ముందుకు సాగుతూ ఉంటుంది.

పెట్టుబడుల కేంద్రీకరణలో ఇంకా 'ఉన్నతమైన' పద్ధతి ఉంది. కొన్ని పెద్ద పెట్టుబడులు కూడా ఒక ఒప్పందంతో కలిసిపోవచ్చు. పెట్టుబడుల సైజుల్ని బట్టి, లాభాల్ని పంచుకునే ఒప్పందాలు ఉంటాయి. అలా ఏర్పడే సంస్థ 'గుత్త సంస్థ' అవుతుంది. (మోనోపలీ కంపెనీ, లేదా జాయింట్ స్టాక్ కంపెనీ).

ఒక శాఖలో (ఉదా: సైను బట్ట శాఖలో) మొత్తం 10 మంది పెట్టుబడిదారులు ఉన్నారనీ, వాళ్ళు ఒక సంవత్సరంలో మొత్తం 1000 మీటర్ల బట్టని ఉత్పత్తి చేయిస్తారనీ, అనుకుందాం. ఈ పెట్టుబడిదారులందరూ ఎవరికి వాళ్ళు విడి విడిగా ఉంటే, వాళ్ళల్లో ప్రతీ ఇద్దరి మధ్యా పోటీ ఉంటుంది. ఆ పోటీ వల్ల, ఏ పెట్టుబడిదారుడూ, తన సరుకు నాణ్యత విషయంలో గానీ, దాని విలువని నిర్ణయించే విషయంలో గానీ, తన ఇష్టారాజ్యంగా చెయ్యలేడు. ఇతర పెట్టుబడిదారులందరూ 1 మీటరు బట్టని ఫలానా విలువతో అమ్ముతూ ఉండగా, ఒక పెట్టుబడిదారుడు, తన బట్టకి, అందరి కన్నా ఎక్కువ విలువని నిర్ణయించ లేడు. అలా నిర్ణయిస్తే దాన్ని అమ్మలేడు. అంటే, అందరి మధ్యా పోటీ ఉన్నప్పుడు, అందరూ కూడా తమ సరుకుల్ని దాదాపు ఒకే విలువతో అమ్మవలసి ఉంటుంది.

కానీ ఆ శాఖ లోనే ఒక గుత్త సంస్థ ఏర్పడితే, అప్పుడు విషయాలు చాలా తేడాగా ఉంటాయి. బట్ట శాఖలో ఉన్న మొత్తం 10 మంది పెట్టుబడిదారుల్లోనూ ఐదారుగురు కలిసి, ఒక గుత్త సంస్థగా ఏర్పడ్డారనుకుందాం. వాళ్ళు ఉత్పత్తి చేయించే బట్ట 800 మీటర్లు అనుకుందాం. గుత్త సంస్థలోకి చేరకుండా బయటవున్న పెట్టుబడిదారుల సరుకు 200 మీటర్లు మాత్రమే. అంటే, ఆ శాఖలో ఎక్కువ సరుకు, గుత్తసంస్థ ఆధీనంలోనే ఉంది. కాబట్టి, ఆ సంస్థ తన సరుకు విలువని, తన ఇష్టారాజ్యంగా నిర్ణయించగలుగుతుంది. ఆ గుత్తసంస్థకీ, దాని బయటవున్న పెట్టుబడిదారులకూ మధ్య పోటీ వున్నా, ఆ పోటీ చాలా తక్కువగా ఉంటుంది. బయటి పెట్టుబడిదారులు, తమ సరుకుని కొంత తక్కువ విలువ తోనే అమ్మినా, అది గుత్త సంస్థకి ఆటంకంగా ఉండదు. సమాజానికి కావలసిన సరుకులో ఎక్కువ భాగం గుత్త పెట్టుబడిదారుల చేతిలోనే ఉన్నప్పుడు, వాళ్ళు, తమ సరుకుకి ఎక్కువ విలువని (లేని విలువని) నిర్ణయించి, దాని ద్వారా ఎక్కువ లాభం సంపాదించగలుగుతారు. (ఈ విషయాలు 2వ సంపుటంలో, 'జనరల్ లాభం రేటు' గురించి చూసే చోట చూస్తాము.)

ఒక శాఖలో ఒక గుత్త సంస్థ ఏర్పడడం వల్ల, పోటీ పోరాటంలో కొన్ని మార్పులు జరిగినప్పటికీ, పోటీ అనేది పూర్తిగా లేకుండా పోదు.

ఒక శాఖలో ఒకే గుత్త సంస్థ గాక 2 గుత్త సంస్థలు ఏర్పడవచ్చు. అప్పుడు పోటీ, ఆ 2 సంస్థల మధ్యా ఉంటుంది. అంటే, ఆ పోటీ, చిన్న చిన్న పెట్టుబడుల మధ్యగాక, భారీ పెట్టుబడుల మధ్య ఉంటుంది. ఎవరికి వాళ్ళు ఎక్కువ సరుకుని అమ్ముకోవడానికీ, ఎక్కువ లాభాలు సంపాదించడానికీ, ప్రయత్నిస్తారు.

ఒక శాఖలో అన్ని పెట్టుబడులూ ఒకే గుత్త సంస్థగా ఏర్పడినట్టు ఊహిస్తే, అప్పుడుకూడా ఆ శాఖ, పోటీనించి బైటపడదు. అప్పుడు ఆ శాఖకి, ఇతర శాఖలతో పోటీ ఉంటుంది. ఎలాగంటే: ఒక శాఖలో ఒక్క గుత్తసంస్థ మాత్రమే ఉంటే, అది తప్పనిసరిగా అధిక లాభాల్ని సంపాదిస్తూ ఉంటుంది. ఆ శాఖ లాభాల్ని చూస్తూ, ఇతర శాఖల పెట్టుబడులు, మౌనంగా ఉండిపోవు. అవి, తమ పాత శాఖల్ని వదిలేసి, ఎక్కువ లాభాల్ని ఇవ్వగలిగే శాఖల్లోకి మారడం ప్రారంభిస్తాయి. ఆ రకంగా, ఒకే గుత్త సంస్థ ఉన్న శాఖలో కూడా మళ్ళీ పోటీ ప్రత్యక్షమవుతుంది.

ఒక దేశంలో, అన్ని శాఖల పెట్టుబడులూ ఒకే సంస్థ ఆధీనం లోకి వచ్చినట్టుగా ఊహిద్దాం. (పెట్టుబడిదారీ విధానం ఎప్పటి లాగే ఉంటూ, పెట్టుబడి అంతా ప్రభుత్వాధీనం లోకి వచ్చినట్టుగా ఊహిద్దాం.) అప్పుడు కూడా పోటీ అనేది నశించదు. అప్పుడు పోటీ, ఆ దేశానికీ ఇతర

దేశాలకూ మధ్య ఉంటుంది, అంటే, ఆ దేశపు సరుకులకూ ఇతర దేశాల సరుకులకూ మధ్య.

పెట్టుబడులన్నీ ఒకే పెట్టుబడిగా ఐక్యమైనా, అది చిన్న స్థాయిలో జరిగినా, పెద్ద స్థాయిలో జరిగినా, అది నిజమైన ఐక్యత అవదు. అప్పుడు కూడా, ఆ విధానం, 'లాభం' కోసం పని చేసే పెట్టుబడిదారీ విధానమే. కాబట్టి, ఆ లాభదృష్టి, ఏ ఐక్యతలో నైనా వైరుధ్యాల్ని తయారు చేస్తుంది. పోటీ అనేది, ప్రతీ ఐక్యతలోనూ, లాభాల్ని పంచుకోవలసిన వేరు వేరు సెక్షన్ల మధ్య ఘర్షణల రూపంలో ఉంటుంది.

సమాజంలో, పెట్టుబడి కూడికలూ, కేంద్రీకరణలూ జరుగుతోన్న కొద్దీ, అంటే సమాజంలో పనిచేస్తోన్న పెట్టుబడి పెరుగుతోన్న కొద్దీ, పెట్టుబడుల మధ్య పోటీ స్థాయి కూడా పెరుగుతూ ఉంటుంది.

పెట్టుబడిదారీ విధానంలో ప్రతీ అంశమూ మంచి చెడ్డలతో కలిసి వైరుధ్య పూరితంగా ఉన్నట్టే, పెట్టుబడి కూడికా, కేంద్రీకరణా కూడా, ఒక వేపు — చెడ్డ ఫలితాల్నీ, ఒకవేపు — మంచి ఫలితాల్నీ కూడా ఇచ్చేవిగా ఉంటాయి. సమాజానికి కావలసిన భారీ ఉత్పత్తి కార్యాల్ని నిర్వహించడానికి ఇవి అవకాశం కల్గిస్తాయి. కూడిక కన్నా కేంద్రీకరణ మరింత త్వరగా వాటిని సాధిస్తుంది.

సమాజంలో, పెట్టుబడుల కేంద్రీకరణే లేకపోతే, రైల్వే మార్గాల నిర్మాణం వంటి భారీ కార్యాల్ని సమాజం అంత త్వరగా సాధించగలిగి ఉండేది కాదు. (ఇంగ్లండులో రైల్వే మార్గాల నిర్మాణం ఎప్పుడైతే జరిగిందో, పెట్టుబడుల కేంద్రీకరణే లేకపోతే, ఆ పని ఇంకా అప్పటికి సాధ్యమై ఉండేది కాదు.) ఇది, పెట్టుబడి కేంద్రీకరణ ద్వారా ఉత్పాదక శక్తులలో ఊహాతీతమైనంత పెరుగుదల జరగడమే. నిత్యమూ జరుగుతూ వుండే పెట్టుబడి కూడికలూ, కేంద్రీకరణలూ పెట్టుబడుల సాంకేతిక పాళ్ళల్లో కొత్త మార్పులకు దారి తీస్తూ వుంటాయి. ఉత్పాదక శక్తులలో జరిగే ఈ మార్పులు, మార్కెట్ల శక్తికి మించినంత ఉత్పత్తికీ, సరుకులు అమ్ముడుకాకుండా నిలిచి పోయే సంక్షోభాలకూ, దారి తీస్తాయి. దాని వల్ల కార్మిక వర్గంలో అధిక భాగం నిరుద్యోగంతో నశించి పోయే పరిస్తితులకు కూడా దారి తీస్తూ వుంటాయి.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల దృష్టిలో ఈ అంశాలేవీ సమస్యలుగా ఉండవు. వాళ్ళు, 'పెట్టుబడి విస్తరణ'ని ఒక ప్రధానమైన అంశంగా గుర్తించరు. పెట్టుబడిదారీ పునరుత్పత్తి క్రమం తప్పని సరిగా 'విస్తృత పునరుత్పత్తి క్రమం'గా ఉండి తీరుతుందనీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి పెట్టుబడిని పెంచుతూ పోయే లక్షణం ఉందనీ, వాళ్ళు గమనించరు.

కార్మికులైతే కేవలం 'బతుకుదెరువు' కోసమే ఉత్పత్తి కార్యంలో ఉంటారు. వాళ్ళ సమస్య బతుకుదెరువు సమస్యే. కానీ, పెట్టుబడిదారుల సమస్య, బతుకు దెరువు సమస్య కాదు. కనీసావసరాలతో జీవించడానికి ఎంత డబ్బు కావాలో అంత డబ్బుతో వాళ్ళు సంతృప్తిపడరు. వాళ్ళకి, అవసరాల్ని మించిన డబ్బు కావాలి. మితిమీరిన లాభాలు కావాలి. ఆ లాభాల్ని కొత్త పెట్టుబడులుగా మార్చాలి. పెరిగిన పెట్టుబడుల ద్వారా మరింత లాభాలు సంపాదించాలి. దీనికి అంతం ఉండకూడదు. నిత్యం డబ్బుని సంపాదిస్తూనే ఉండాలి. కానీ, ఇదంతా పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలకు పట్టదు. వాళ్ళు పెట్టుబడిదారుల కార్యకలాపాన్ని కూడా కార్మికుల కార్యకలాపం లాగే చూస్తారు. కార్మికుల లాగే పెట్టుబడిదారులు కూడా 'పొట్టకూటికోసమే తమ సంస్థల్ని నడుపుకుంటారు'— అన్నట్టు! ఈ రకంగా ఆర్థికవేత్తలు, పెట్టుబడిదారీ విధానాన్ని కేవలం 'అవసరాల దృష్టితో సాగే' ఉత్పత్తి విధానంగానే చిత్రిస్తారు.

భారీ యంత్రాల మీద ఉత్పత్తి చేసే ఆధునిక పెట్టుబడిదారుణ్ణి, ఈ ఆర్థిక వేత్తలు, ఏనాడో వందల సంవత్సరాల కిందట గిల్డుల కాలంలో కార్మికులతో సమానంగా పనిచేస్తూ అతి తక్కువ స్థాయి లాభంతో తన కుటుంబాన్ని పోషించుకునే గిల్డు యజమానితో సమానం చేస్తారు. గిల్డు పెట్టుబడిదారుడికి లాగానే, ఆధునిక పెట్టుబడిదారుడి ఉత్పత్తి లక్ష్యం కూడా 'కుటుంబ పోషణే' అయినట్టు! ఈ ఆర్థిక వేత్తలు, 'పెట్టుబడి విస్తరణ' సమస్యని మొదట అసలు ఒప్పుకోకుండా ఉండడానికే చూస్తారు. అది సాధ్యం కాకపోతే, అప్పుడు కొంచెం ధోరణి మార్చి — "పెట్టుబడి అప్పుడప్పుడూ కొంచెం పెరిగే మాట నిజమే గానీ, దాని వల్ల సమాజానికి సమస్యలైతే ఉండవు" అంటారు. వీళ్ళ దగ్గిర అన్ని రకాల డొంకతిరుగుళ్ళూ, అన్ని రకాల వంకర వాదనలూ, సిద్ధంగా ఉంటాయి.

"పెట్టుబడిదారుడు తన కష్టంతో సంపాదించుకున్న 'లాభం'లో నించి కుటుంబపు ఖర్చుల కోసం ఎంతో పొదుపుగా వాడుకుంటాడు. ఆత్మ నిగ్రహంతో ఎన్నో సౌఖ్యాలు వదులుకుంటాడు. అలా కూడబెట్టిన దాన్ని అప్పుడప్పుడూ పెట్టుబడికి చేర్చి, పెట్టుబడిని కొంచెం పెంచుకుంటూ ఉంటాడు" అంటూ, ఆర్థికవేత్తలు, పెట్టుబడిదారుడి 'ఆత్మ నిగ్రహాన్ని' ఘనంగా శ్లాఘిస్తారు.

**సీనియర్** అనే ఆర్థికవేత్త — "నే నైతే 'పెట్టుబడి' అనే పదానికి బదులు 'ఆత్మ నిగ్రహం' అనే పదం వాడ

తాను" అంటాడు. అంటే, పెట్టుబడిదారుడు, తను అనుభ వించకుండా ఆత్మనిగ్రహంతో ఉంచుకున్న దానినే పెట్టు బడిగా మారుస్తాడు అనే అర్థంతో!

పెట్టుబడిని పెంచుకోవడానికి పెట్టుబడిదారుడు చాలా 'ఆత్మనిగ్రహం చూపిస్తే, ఎవరి కోసం ఆ 'ఆత్మ నిగ్రహం'? ఆత్మనిగ్రహంతో మిగిల్చినదంతా తీసుకుపోయి వాడు కార్మికులకు ఇచ్చేస్తాడా? తిండి ఖర్చులు తగ్గించు కుని, పెట్టుబడిని పెంచితే, ఆ పెరిగిన పెట్టుబడి, పెరిగిన లాభాల్ని తెస్తుంది. ఆ లాభాలన్నీ వెళ్ళేది మళ్ళీ వాడి జేబులోకే! లాభాల్ని ఎప్పటికప్పుడు తినేసినా, అది వాడు అనుభవించినట్టే; లాభాన్ని పెట్టుబడికి కలిపి, పెట్టుబడిని పెంచి, ఎక్కువ లాభం వచ్చాక, అప్పుడు దాన్ని తిన్నా అది వాడు అనుభవించినట్టే. ఎలా చేసుకున్నా అది వాడికే. ఎక్కువ లాభాలు వచ్చినప్పుడైనా వాడు వాటిని తినక మానడు. లాభాల్ని ఎప్పుడూ తినకుండా, ఎప్పుడూ 'త్యాగాలు' చెయ్యడమే పెట్టుబడిదారుడి లక్ష్యం అయితే, ఆ 'బాధామయ త్యాగాల' నించి పెట్టుబడిదారుణ్ణి కార్మి కులు చాలా తొందరగా విముక్తి చెయ్యవలసిందే.

ఇక్కడ, అసలు సమస్యకి వస్తే - పెట్టుబడిదారుడు తన పెట్టుబడిని త్యాగాలతో పెంచుతాడో, నిగ్రహాలతో పెంచుతాడో, ఇంకెలా పెంచుతాడో, ఎలా పెంచినా, అది పెంచడమే. ఆ రకంగానైనా 'పెట్టుబడి విస్తరణ' సమస్యని ఆర్థిక వేత్తలు పట్టించుకోవాలి. దాన్ని ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన సమస్యగా చర్చించాలి. కానీ, వాళ్ళు అన్ని సమస్యల్లా గానే ఈ సమస్యని కూడా, ఎలా పట్టించు కోవాలో అలా పట్టించుకోరు. పెట్టుబడి ఎప్పుడూ విస్త రిస్తూ ఉంటుందనీ, దాని ధోరణి అదేననీ ఒప్పుకుంటే, దాని వల్ల అనేక సమస్యలు ఉన్నాయని కూడా ఒప్పుకుని తీరాలి. చివరికి 'పెట్టుబడిదారీ విధానమే సమస్యల పుట్ట లాగ ఉన్నట్టు' ఒప్పుకోవలసి వస్తుంది. ఇలా ఒప్పుకోవడం వాళ్ళకి సరిపడదు కదా?

కాబట్టి, వాళ్ళు ఇలా అంటారు — " పెట్టుబడిదారీ విధానం, సమాజ అవసరాలను తీర్చే లక్ష్యంతో మాత్రమే పని చేస్తుంది. అవసరాల్ని తీర్చడం కన్నా దానికి వేరే లక్ష్యం లేదు. సమాజంలో ఎప్పుడూ జనాభా పెరుగుతూ ఉంటుంది కాబట్టి, పెరిగే జనాభాకి సరిపోయే ఉత్పత్తి జరగడానికే పెట్టుబడి కొంచెం పెరుగుతూ ఉంటుంది. అంతేగానీ అంత కన్నా అందులో విపరీత పరిస్థితేదీ ఉండదు" — ఈ రకంగా వాళ్ళు ఆ సమస్యని ఎగర గొట్టెయ్యడానికే చూస్తారు. అందుకే, పెట్టుబడి విస్తరణకు ఉన్న ప్రత్యేక స్వభావాన్ని మనం (కార్మికులం) చాలా సరిగా అర్థం చేసుకోవాలి. ఈ విధానం, అవసరాల్ని బట్టి ఎంత వరకూ కావాలంటే అంత వరకే విస్తరించే స్వభావం కలది కాదు. దాన్ని ఆ రకం స్వభావం కలదిగా (పెట్టుబడి దారీ ఆర్థిక వేత్తలు చెప్పేటట్టు) మనం పొరపాటు పడకూడదు. పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసు కోవడంలో ఈ 'విస్తరణ అంశాల్ని' అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం.

# 'పెట్టుబడి విస్తరణ'లో స్థిర పెరిగి, అస్థిర తగ్గుతుంది!

'పెట్టుబడి'లో ఉండే అసలైన భాగాలు — ఉత్పత్తి సాధనాలూ, సజీవ శ్రమా (కార్మికులు). ఒక ప్రత్యేక ఉత్ప త్తిని (బట్టనో, పంచదారనో) తీసుకుంటే, ఆ ఉత్పత్తి క్రమంలో ఎన్ని ఉత్పత్తి సాధనాలూ, ఎంతమంది కార్మి కులూ ఉండాలీ — అనే పాళ్ళు 'సాంకేతికమైన పాళ్ళు'. ఎంత 'స్థిర'కు ఎంత 'అస్థిర' ఉండాలీ — అనే పాళ్ళు 'విలువ పాళ్ళు'. ఉత్పత్తి స్థలంలో ఉన్న ఉత్పా దక శక్తిని బట్టి సాంకేతిక పాళ్ళూ, దాన్ని బట్టి విలువ పాళ్ళూ ఉంటాయి.

పెట్టుబడి పెరుగుదల, ఉత్పాదక శక్తుల పెరుగు దలకు దారి తీస్తుంది. ఉత్పాదక శక్తుల పెరుగుదల, మళ్ళీ, పెట్టుబడిలోని సాంకేతిక పాళ్ళను మారుస్తుంది. ఆ మార్పు, C ని పెంచి, V ని తగ్గిస్తూ ఉంటుంది. దాని వల్ల శ్రామికులకు ఉద్యోగావకాశాల పెరుగుదల, గతం కన్నా తగ్గిపోతూ ఉంటుంది. — ఈ సమస్యకు సంబంధిం చిన కొన్ని విషయాలు ఈ సంపుటం లోనే, 2 వ భాగంలో 'యంత్రాలూ, భారీ పరిశ్రమ' చాప్టర్‌లో చూశాం. ఇంకా కొన్ని విషయాలు ఇక్కడ చూస్తాం.

'ఒక పెట్టుబడి' అన్నప్పుడు — దాన్ని, ఒక విడి పెట్టు బడిగా నైనా అనుకోవచ్చు, ఒక శాఖలో ఉండే మొత్తం పెట్టుబడిగా నైనా అనుకోవచ్చు, ఒక సమాజంలో ఉండే మొత్తం పెట్టుబడిగా నైనా అనుకోవచ్చు. 'పెట్టుబడి'కి ఉండే లక్షణాలు, ఏ స్థాయి పెట్టుబడికైనా ఒక్కలాగే ఉంటాయి. పెట్టుబడి లక్షణాల్ని చూసేటప్పుడు, 'అది ఏ వస్తువుల్ని ఉత్పత్తి చేస్తోంది' అనే వివరాలు అనవసరం. ఏ వస్తువుల్ని ఉత్పత్తి చేసినా పెట్టుబడుల లక్షణాలన్నీ ఒకటే.

పెట్టుబడిదారీ విధానంలో నిరుద్యోగ సమస్య ఎలా

పెరుగుతుందో, ఇప్పుడు వరసగా 3 ఉదాహరణలు చూస్తాం.

ఒక పెట్టుబడి 600. దాని C,V ల పాళ్ళు 1:1. అంటే C 300. V 300. ఈ 300 V తో (జీతాలతో) 100 మంది కార్మికులు పని చేస్తున్నారనుకుందాం. అంటే, ఇక్కడ 300 విలువ గల ఉత్పత్తి సాధనాలతో పని చెయ్యడానికి 100 మంది కార్మికులు అవసరమవుతున్నారు. ఒక్కొక్క కార్మికుడూ 3 విలువ గల ఉత్పత్తి సాధనాల మీద పని చేస్తున్నాడు. ఒక్కొక్క కార్మికుడి శ్రమ శక్తి విలువ (జీతం) 3.

ఈ 600 పెట్టుబడికి, అదనపు విలువ చేరుతూ, కొంత కాలానికి ఈ పెట్టుబడి 1800 అయిందనుకుందాం. అంటే, పెట్టుబడి ఇంకా 2 రెట్లు పెరిగింది. కానీ, దాని ఉత్పాదక శక్తి ఏమీ మారలేదనుకుందాం. ఉత్పాదక శక్తి మారనప్పుడు దాని సాంకేతిక పాళ్ళు కూడా మారవు. C, V లు 1 : 1 గానే ఉంటాయి. అంటే 1800 పెట్టుబడి, 900 C, 900 V లుగా ఉంటుంది. పెట్టుబడి ఎన్ని రెట్లు పెరిగితే, C,V లు కూడా అన్ని రెట్లు పెరుగుతాయి. C — 300గా ఉన్నప్పుడు, 100 మంది కార్మికులు పని చేస్తే, C — 900 అయినప్పుడు, 300 మంది కార్మికులు పని చేస్తారు. అంటే, ఇప్పుడు ఇంకా 200 కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయి. పెట్టుబడి 2 రెట్లు పెరిగితే, ఉద్యోగాలు కూడా 2 రెట్లు పెరుగుతాయి. ఇదంతా ఎప్పుడంటే, ఉత్పాదక శక్తి ఏమీ మారకుండా పెట్టుబడి పెరిగినప్పుడు. ఇలాంటి పెరుగుదల కేవలం పెట్టుబడిలో 'పరిమాణానికి' సంబంధించిన పెరుగుదల. పెట్టుబడికి సంబంధించిన ప్రతీ అంశమూ, పరిమాణంలో మాత్రమే పెరిగితే, అది పరిమాణాత్మకమైన పెరుగుదల.

కానీ, పెట్టుబడి పెరుగుదల ఎప్పుడూ కేవలం 'పరిమాణంలో పెరుగుదలగా' మాత్రమే ఉండదు. అది క్రమంగా 'గుణంలో' మార్పులకు కూడా దారి తీస్తుంది. అంటే, ఇక్కడ అర్థం, 'సాంకేతిక పాళ్ళల్లో మార్పులకు' — అని. సాంకేతిక పాళ్ళు మారడమే పెట్టుబడికి గుణంలో మార్పు. పెట్టుబడి పెరుగుతోన్న కొద్దీ అది తప్పనిసరిగా ఉత్పాదక శక్తిని పెంచుతూ ఉంటుంది. ఉత్పాదక శక్తి ఒక స్థాయినించి, ఇంకా ఎక్కువ స్థాయికి పెరిగినప్పుడు C, V లలో మార్పులు రక రకాలుగా జరగవచ్చు. గతంలో ఉన్నంత V తోనే, గతం కన్నా ఎక్కువ C మీద పని జరగవచ్చు. లేదా గతం కన్నా కొంత ఎక్కువ Vతో, గతం కన్నా చాలా ఎక్కువ C మీద పని జరగవచ్చు. ఈ రకంగా, ఉత్పాదక శక్తి పెరుగుదల వల్ల, C, Vల పాళ్ళు కొత్త రకంగా ఏర్పడతాయి.

పెట్టుబడి ఎన్ని రెట్లు పెరిగితే, దాని ఉత్పాదక శక్తి కూడా ఖచ్చితంగా అన్ని రెట్లు పెరుగుతుందని అర్థం కాదు. ఉత్పాదక శక్తుల పెరుగుదల, ప్రకృతి విషయాలలో సంపాదించే కొత్త జ్ఞానాన్ని బట్టీ, శ్రమలో దొరికే అనుభవాల్ని బట్టీ, ఉంటుంది.

గతంలో పెట్టుబడి 600. C,Vలు 1 : 1. అంటే, 300 : 300. కార్మికుల సంఖ్య 100. ఒక్కొక్కరికీ జీతం 3. ఒక్కొక్కరూ 3 విలువ గల C మీద పని చేస్తారు.

**ఉత్పాదక శక్తి పెరిగినప్పుడు ఏం జరుగుతుంది?**

కొన్ని సంవత్సరాలకు పెట్టుబడి 1800. C,Vలు 2:1. అంటే, 1200 : 600. కార్మికులు 150 మంది. ఒక్కొక్కరికీ జీతం 4. ఇప్పుడు, ఒక్కొక్క కార్మికుడూ ఎంత C మీద పని చేస్తాడంటే, 1200 ÷ 150 = 8C మీద! గతంలో దాదాపు 3 గ్గురు కార్మికుల ద్వారా జరిగినంత పని, ఇప్పుడు ఒక్క కార్మికుడి ద్వారానే జరుగుతుంది.

మళ్ళీ కొన్ని సంవత్సరాలకు పెట్టుబడి, ఇంకా 2 రెట్లు పెరిగి, 5,400గా అయిందనుకుందాం. దాని కొత్తపాళ్ళు 5 : 1. C 4,500: V 900. ఇప్పుడు కార్మికులు 180. ఒక్కొక్కరికీ జీతం 5. ఇప్పుడు ప్రతీ కార్మికుడూ 5,400 ÷ 180 = 25 C మీద పని చేస్తాడు. అంటే, మొదటి ఉదాహరణతో పోలిస్తే, 8 మంది చేసినంత C మీద!

ఈ రకంగా, పెట్టుబడి పెరుగుతోన్న కొద్దీ దాని ఉత్పాదక శక్తి కూడా పెరుగుతూ ఉంటుంది కాబట్టి, ఒక కార్మికుడు, 'గతం కన్నా ఎక్కువ ఉత్పత్తి సాధనాల' మీద పని చేసే విధంగా పరిస్థితి మారుతూ ఉంటుంది.

ఈ ఉదాహరణల్లో, C గతం కన్నా పెరుగుతూ వచ్చినట్టే, V కూడా గతం కన్నా పెరుగుతూ వచ్చింది. మొదటి ఉదాహరణలో, 1 వ్యక్తికి జీతం 3 అయితే, తర్వాత ఉదాహరణలో జీతం 4. తర్వాత జీతం 5. ఈ రకంగా, 'జీతం' కూడా పెరుగుతూనే ఉంది. కానీ, C లో పెరుగుదల అతి ఎక్కువగా ఉంటే, V లో పెరుగుదల అతి తక్కువగా ఉంది.

ఉత్పాదక శక్తి పెరగడం అనేది (ఏ శాఖలో అయినా), ఖచ్చితంగా ప్రతీ ఏటా, ప్రతీ పునరుత్పత్తి క్రమంలోనూ జరగదు. పాత ఉత్పాదక శక్తిలో చిన్న చిన్న మార్పులు జరుగుతూ అది ఒక స్థాయి నించీ ఒక స్థాయికి పెరగడానికి కొన్ని సంవత్సరాల కాలం తీసుకుంటుంది. అంటే, ఉత్పాదక శక్తి పెరగడమూ, దానివల్ల పెట్టుబడిలో సాంకేతిక పాళ్ళు మారడమూ అనేది, కొన్ని సంవత్సరాలకు ఒక సారి జరుగుతాయి. ఆ లోగా, పెట్టుబడి, పాత పాళ్ళతోనే

పని చేస్తూ వుంటుంది. ఆ పాళ్ళు కూడా పెట్టుబడిదారు లందరి దగ్గిరా ఖచ్చితంగా ఒకే రకంగా ఉండవు. కొంత కొంత తేడాలతోనే ఉంటాయి. అందులో, ఎవరి వ్యక్తిగత ఉత్పాదక శక్తి ఎక్కువగా ఉంటుందో ఆ పెట్టుబడి దారుడు, తన సరుకుని, ఇతర పెట్టుబడిదారుల కన్నా తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయిస్తాడు. అమ్మేటప్పుడు మాత్రం ఇతర పెట్టుబడిదారుల లాగే అమ్మి, వాళ్ళ కన్నా ఎక్కువ లాభం సంపాదించగలుగుతాడు. లేదా, తన సరుకుని, ఇతరుల కన్నా కొంత తక్కువకి అమ్మినా, ఇతరుల కన్నా ఎక్కువ లాభమే సంపాదిస్తాడు.

'ఉత్పాదక శక్తులు పెరగడం' అంటే, కొన్ని శాఖల్లో మాత్రమే పెరగడమూ, ఇతర శాఖల్లో పాత ఉత్పాదక శక్తులే మారకుండా ఉండిపోవడమూ కాదు. అలా జరగదు. పెట్టుబడులు ఏ శాఖల్నీ వదిలిపెట్టవు. ఉత్పాదక శక్తులు మారని శాఖల్లోకి కొత్త పెట్టుబడులు ప్రవేశించి, అక్కడ కూడా మార్పులు జరిగేలాగ చేస్తూ వుంటాయి.

కాబట్టి, అన్ని శాఖల ఉత్పాదక శక్తులూ పెరుగుతూనే ఉంటాయి — అనేదే జనరల్ సూత్రం. అయినా, వేరు వేరు శాఖల ఉత్పాదక శక్తుల పెరుగుదలల్లో తప్పనిసరిగా తేడాలు ఉంటాయి. (పారిశ్రామిక రంగానికీ, వ్యవసాయ రంగానికీ ఉత్పాదక శక్తుల పెరుగుదలలో తప్పనిసరిగా ఏర్పడే తేడా గురించి 2వ సంపుటంలో 'భూమి కౌలు' చాప్టర్‌లో చూస్తాము.) తేడాలు వున్నా, సాధారణంగా, పెట్టుబడుల పోటీల వల్ల, అన్ని శాఖల ఉత్పాదక శక్తులూ దాదాపు ఒకే రకంగా పెరుగుతూ ఉంటాయి.

విడి విడి పెట్టుబడులన్నీ కలిసి, 'సామాజిక పెట్టుబడి'. విడి విడి పెట్టుబడుల ఉత్పాదక శక్తులు పెరగడం అంటే — 'సామాజిక పెట్టుబడికి ఉండే సగటు ఉత్పాదక శక్తి' పెరగడమే.

ఒక 'సామాజిక ఉత్పాదక శక్తి', ఇంకో సామాజిక ఉత్పాదక శక్తిగా మారడానికి దాదాపు 10 సం.ల కాలం పడుతుంది అనుకుందాం. ఈ 10 సం.లలోనూ ప్రతి ఏటా అదనపు విలువ వచ్చి పెట్టుబడికి చేరుతూ, పెట్టుబడి పెరుగుతూ ఉంటుంది. పదేళ్ళ నాటికి (అంత కాలాన్ని ఉదాహరణగా పెట్టుకున్నాం కాబట్టి), పెట్టుబడిలో ఖచ్చితంగా గుణాత్మకమైన మార్పు జరుగుతుంది. ఈ కొత్త గుణం (C+Vల పాళ్ళలో కొత్త పాళ్ళు) మళ్ళీ కొంతకాలం పాటు మారకుండా ఉంటుంది. మళ్ళీ ప్రతీ ఏటా అదనపు విలువ పెట్టుబడికి చేరుతూ పెట్టుబడి పెరుగుతూ ఉంటుంది. కొన్ని సంవత్సరాలకు మళ్ళీ పెట్టుబడి పాళ్ళు మారతాయి. రాను రానూ, పెట్టుబడి పాళ్ళు మారడానికి పట్టే కాలం గతం కన్నా తగ్గిపోతూ ఉంటుంది.

'సామాజిక పెట్టుబడి' పెరుగుతోన్న కొద్దీ, Vలో పెరుగుదల కన్నా Cలో పెరుగుదలే అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. అంటే, ఏటా 'అదనపు ఉత్పత్తి రాసి'లో నించి కార్మికుల పోషణ వస్తువులుగా మారే భాగం కన్నా, 'ఉత్పత్తి సాధనాలు'గా మారే భాగమే ఎక్కువగా ఉంటుందన్న మాట!

ఒక దేశంలో, ఒక కాలంలో, మొత్తం సామాజిక పెట్టుబడికి ఉండే C, Vల పాళ్ళు, 1 : 1గా ఉండేవి అనుకుందాం. ఆ దేశంలో పెట్టుబడి విస్తరణ ఎక్కువవుతోన్న కొద్దీ, పెట్టుబడి పాళ్ళు క్రమంగా, 2 : 1, 3 : 1, 4 : 1, 5 : 1, 6 : 1, 7 : 1, 8 : 1, — ఇలా మారిపోతూ ఉంటాయి. అంటే, గతంలో ఒక ఉత్పత్తికి ఎంత సజీవ శ్రమ పట్టేదో, ఆ శ్రమలో సగమే, మూడో వంతే, నాలుగో వంతే, ఐదో వంతే, పదో వంతే, పట్టేలాగ ఉత్పాదక శక్తులు పెరిగిపోతూ ఉంటాయి. ఈ పెరుగుదలలో, ఒక కార్మికుడి ద్వారా జరిగే పని, గతంకన్నా అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, పెట్టుబడి ఎంత పెరిగినా ఉద్యోగావకాశాలు తగ్గిపోతూ ఉంటాయి.

అంటే, <u>పెట్టుబడి పెరుగుదల ఏ స్థాయిలో ఉంటుందో ఉద్యోగాల పెరుగుదల ఆ స్థాయిలో ఉండదు.</u>

సమాజంలో కొత్త ఉద్యోగాలు ఏర్పడడం అనేది, Vగా పని చేసే భాగాన్ని బట్టే ఉంటుంది కాబట్టి, ఆ భాగంలో పెరుగుదల తగ్గిపోతున్న కొద్దీ ఆ అవకాశాలు కూడా తగ్గిపోతూ ఉంటాయి. ఒక్కోసారి, V పెరిగినా కూడా కొత్త ఉద్యోగాలు ఏర్పడకపోవచ్చు. దీనికి సంబంధించి ఒక ఉదాహరణ చూద్దాం.

మొత్తం V — 300. ఒక్కొక్క కార్మికుడికీ జీతం 3 చొప్పున, 100 మంది కార్మికులు పనిలో ఉంటారు. కొంత కాలానికి మొత్తం V 400 అయింది. శ్రమ శక్తి విలువ 4 అయింది. అంటే జీతం పెరిగింది. కానీ V 400 అయినా, ఇప్పుడు కూడా 100 మందే పనిలో ఉంటారు. పెరిగిన V కూడా పాత ఉద్యోగాలకే సరిపోయింది. V — 100 పెరిగినా కొత్త ఉద్యోగాలేమీ ఏర్పడ లేదు. ఒకవేళ, V 400 గా ఉన్నప్పుడు, ఒక కార్మికుడి జీతాన్ని 5 అనుకుంటే, అప్పుడు 100 ఉద్యోగాలు కూడా ఉండవు. అప్పుడు 80 మంది కార్మికులు మాత్రమే పనిలో ఉంటారు. V భాగం పెరిగినా, ఇక్కడ పాత ఉద్యోగాల్ని నిలబెట్టడం కూడా సాధ్యం కాలేదు. దీన్ని బట్టి — <u>పెట్టుబడిలో V భాగంలో పెరుగుదల, ఉద్యోగాల్లో పెరుగుదలకు గుర్తు కాదు. జీతాల భాగం పెరగడం చూసి, ఉద్యోగాలు పెరిగినట్టుగా అనుకోకూడదు.</u>

పెట్టుబడి పెరిగి, గతంకన్నా ఎక్కువ శ్రమ అవసర మైందనుకుందాం, అయినా కొత్త కార్మికుల్ని పెట్ట కుండానే, పాత కార్మికులతోనే ఓవర్ టైములూ వగైరా పద్ధతుల ద్వారా ఎక్కువ శ్రమని పొందవచ్చు. 'శ్రమతో అవసరం' అనేది, మొత్తం ఎంత శ్రమ కావాలో చెపుతుంది గానీ, ఆ శ్రమని ఎంత మంది కార్మికుల నించి తీసు కోవాలో చెప్పదు. కావలసిన శ్రమని, పెట్టుబడిదారుడు, ఎంత మంది కార్మికుల నించి తీసుకుంటాడు — అనేది, కార్మికులు ఎంత ఎక్కువ పని చెయ్యడానికి సిద్ధంగా ఉన్నారూ — అనే విషయం మీద ఆధారపడి ఉంటుంది.

# 'ఉత్పత్తి సంబంధాల' పునరుత్పత్తి!

'పునరుత్పత్తి క్రమం'లో జరిగేది కేవలం 'వస్తువుల పునరుత్పత్తి' మాత్రమే కాదు, ఆ ఉత్పత్తి క్రమంలో ఏర్పడే 'సంబంధాల పునరుత్పత్తి' కూడా. అంటే, పెట్టుబడి దారుడు — పెట్టుబడిదారుడి గానే, కార్మికులు — కార్మి కులుగానే — ఉండడానికి కావలసిన పరిస్థితుల పునరుత్పత్తి!

శ్రమ శక్తి — నిత్యం సరుకుగా ఉండే పరిస్థితీ, కార్మి కులు ఉత్పత్తి సాధనాలకు పరాయిగా ఉండే పరిస్థితి, ఉత్పత్తి క్రమంలో శ్రమ దోపిడీ జరిగే పరిస్థితీ, ఉత్పత్తి విషయాల్ని పెట్టుబడిదారుడే నిర్ణయించే పరిస్థితీ — ఈ విషయాలన్నీ ప్రతీ 'పునరుత్పత్తి క్రమం'లోనూ యథా తథంగా పునరుత్పత్తి అవుతూనే ఉంటాయి.

**(1) శ్రమ శక్తి నిత్యం సరుకుగా ఉండే పరిస్థితి:** ఉత్పాదక శక్తులు ఎంత పెరిగినా కార్మికులకు దొరికేది శ్రమ శక్తి విలువే — అనే విషయం మనకు ఎప్పుడోనే తెలుసు. కార్మికులు, నిత్యం, బతుకుదెరువు కోసం వెతు క్కునే వారి గానే ఉండాలి. ఇది పెట్టుబడి పునరుత్పత్తికి తప్పనిసరి షరతు. ఈ షరతు, రోజు వారీ జీతాల శ్రామికుల విషయం లోనే కాదు, నెలవారీ జీతాల శ్రామికుల విష యంలో కూడా వర్తిస్తుంది. 1 రోజు జీతం, 2 రోజులకో 3 రోజులకో సరిపోదు. అలాగే, 1 నెల జీతం, 2 నెలలకో 3 నెలలకో సరిపోదు. ఏ రోజు జీతం ఆ రోజు పోషణకే. ఏ నెల జీతం ఆ నెల పోషణకే. దీని అర్థం, ప్రతీ వేతన శ్రామికుడూ చెయ్యవలసింది, ఏ రోజు బతుకు దెరువు ఆ రోజు వెతుక్కోవడమే. మనిషికి, ఒక ప్రకృతి సూత్రాన్ని దాటడం ఎంత అసాధ్యమో, శ్రామికులకు 'ఏ రోజు పని కోసం ఆ రోజు వెతుక్కోవాలనే' పెట్టుబడిదారీ పని సూత్రాన్ని దాటడం కూడా అంత అసాధ్యం.

పెట్టుబడి, తన పునరుత్పత్తి కోసం కార్మికుల్ని నిత్యం పనిలోకి లాగుతుంది. కార్మికులు నిత్యం పనిలోకి రావడం కోసం, పెట్టుబడి వారిని నిత్యం బికారులుగా ఉంచుతుంది. కార్మికుల జీతాలు, వారిని ఎప్పుడూ పేదరికంలోనే తిప్పుతూ ఉంటాయి.

**టౌన్‌సెండ్** అనే మతాధికారి ఇలా అంటాడు — "ఆకలే .... శ్రమించడానికి సహజ ప్రేరణ శక్తి. పేదలు మూర్ఖులుగా ఉండడమే ప్రకృతి సూత్రంగా కనపడు తోంది. ఎందుకంటే, పేదలు అలా ఉంటేనే వారిలో కొందరు అధమ స్థాయి పనులు చెయ్యడానికి సంఘంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. ఎక్కువ మృదువుగా ఉండే వాళ్ళు చాకిరీ నించి విడుదలై తమకు తగిన రక రకాల వ్యాపకాలు నిర్వర్తిస్తూ వుంటే, మానవుల ఆనందం అభివృద్ధి చెందుతుంది."

'మానవులు' అంటే ఈ మతాధికారి దృష్టిలో — 'ధని కులే'. ధనికులే 'మృదువుగా' ఉంటారు. వారు 'అధమ స్థాయి' పనులు చెయ్యరు. అసలు ఏ స్థాయి పనులూ చెయ్యరు. వారి ఆనందమే మానవుల ఆనందం! — ఈ రకం సూక్తుల్ని దోపిడీ సమాజం సువర్ణాక్షరాలతో లిఖించి పెట్టుకుంటుంది. - పెట్టుబడి పునరుత్పత్తి కోసం, కార్మి కులు ఎప్పుడూ శ్రమ శక్తిని అమ్ముకునే వేతన శ్రామికు లుగా ఉండవలసిందే. ఆ వేతన శ్రామికులలో, పెట్టుబడి దారీ శ్రమ విభజన ప్రకారం, మేధా శ్రమలు చేసే శ్రామి కులు ఎప్పుడూ మేధా శ్రమలలోనే, శారీరక శ్రమలు చేసే శ్రామికులు ఎప్పుడూ శారీరక శ్రమలలోనే, జీవితాంతం ఏ మార్పూ లేకుండా ఉండవలసిందే.

**(2) కార్మికులు, ఉత్పత్తి సాధనాలకు పరాయిగా ఉండే పరిస్థితి:** తన పోషణకే చాలీచాలని ఆదాయంతో ఉండే కార్మికుడు, ఉత్పత్తి సాధనాల్ని ఎన్నటికీ సమకూర్చు కోలేడు. అది, కొన్ని ప్రత్యేక సందర్భాలలో, కొందరు కార్మికులకు మాత్రమే సాధ్యమవుతుంది. అప్పుడు వాళ్ళు కార్మికులు కాకుండా పోతారు. పెట్టుబడిదారుడి దగ్గిర పనిచేసే ఒక ఇంజనీరు, కొంత కాలానికి తనే పెట్టుబడి దారుడిగా మారవచ్చు. పెట్టుబడిదారుడి దగ్గిర పని చేసే ఒక డాక్టరు, కొంత కాలానికి తనే పెట్టుబడిదారుడిగా మారవచ్చు. ఇలా ఒక కార్మికుడు, పెట్టుబడిదారుడిగా మారినప్పుడు, అంతవరకూ పని చేసే కార్మిక వర్గంలో నించి ఒక కార్మికుడు తగ్గినట్టు అర్థం.

ఒక చిన్న స్థాయి పెట్టుబడిదారుడు, తన 'బిజినెస్'లో

బాగా నష్టపోయి, ఆస్తులన్నీ అప్పులకు కట్టేసి, 'పెట్టుబడి దారుడి' స్థాయినించి ఒక మేనేజర్ గానో, సూపర్‌వైజర్ గానో మారితే, పెట్టుబడిదారీ వర్గంలో నించి ఒక పెట్టుబడి దారుడు తగ్గినట్టు అర్థం.

కార్మికుల్లో కొందరు పెట్టుబడిదారులుగా మారినా, 'కార్మిక వర్గం' అంతా పెట్టుబడిదారులుగా మారదు. అలాగే, పెట్టుబడిదారుల్లో కొందరు కార్మికులుగా మారినా, 'పెట్టుబడిదారీ వర్గం' అంతా కార్మికులుగా మారదు. ఎట్నించి ఎటు ఎలాంటి మార్పులు జరిగినా, ఆ మార్పులతో సంబంధం లేకుండా రెండు వర్గాలూ, ఆ వర్గ పరిస్థితులూ, ఎప్పుడూ ఒకే విధంగా ఉంటాయి. ఒక కార్మికుడు పెట్టుబడిదారుడిగా మారితే, ఆ వ్యక్తి, ఉత్పత్తి సాధనాలకు స్వంతదారవుతాడు. పెట్టుబడిదారుడే కార్మికుడిగా మారితే, ఆ వ్యక్తి, ఉత్పత్తి సాధనాలకు పరాయి వాడవుతాడు.

**(3) ఉత్పత్తి విషయాల్ని పెట్టుబడిదారుడే నిర్ణయించే పరిస్థితి:** తక్షణ ఉత్పత్తి క్రమానికి సంబంధించిన నిర్ణయాలలో గానీ, పునరుత్పత్తి క్రమానికి సంబంధించిన నిర్ణయాలలో గానీ, కార్మికుల పాత్ర ఏమీ ఉండదు. 'పెట్టుబడి'మీదా, 'అదనపు విలువ' మీదా, హక్కులన్నీ పెట్టుబడిదారుడివే గానీ, కార్మికులవి కావు. కాబట్టి నిర్ణయాలన్నీ కూడా పెట్టుబడిదారుడివే. ఒక పాత పెట్టుబడిని గానీ, దానికి చేరే కొత్త పెట్టుబడిని గానీ, అదే శాఖలో ఉంచాలా, వేరే శాఖలోకి మార్చాలా; ఎక్కడ ఏ అవసరాల కోసం, ఏ పద్ధతుల్లో ఏ సరుకుని ఉత్పత్తి చేయాలీ; సరుకుని ఎంతకి అమ్మాలీ; ఏ పద్ధతుల్లో అమ్మాలీ — ఈ రకం విషయాల్ని ప్రతీ పెట్టుబడిదారుడూ తన ప్రయోజనాల దృష్టితోనే, అంటే 'లాభ దృష్టి' తోనే, నిర్ణయిస్తాడు. ఆ నిర్ణయాలతో, ఆ సరుకుని ఉత్పత్తిచేసే కార్మికులకు ఏమీ సంబంధం ఉండదు.

కార్మికులు కేవలం పెట్టుబడిదారుడి 'పని మనుషులు'. పెట్టుబడిదారుడు ఏ పని చెయ్యమంటే, ఎలా చెయ్యమంటే, ఆ పని, అలా చెయ్యడమే కార్మికులకు ఆ విషయాలతో ఉండే సంబంధం.

పెట్టుబడిదారులు బట్టలు నెయ్యమంటే బట్టలూ, కత్తులు చెయ్యమంటే కత్తులూ, బాంబులు చెయ్యమంటే బాంబులూ, ఏ సరుకుని చెయ్యమంటే ఆ సరుకునే, కార్మికులు చెయ్యాలి. 'ఈ రకం బట్టలు ఉండకూడదు' అనో, 'ఈ రకం సినిమాలు ఉండకూడదు' అనో, 'కత్తులూ బాంబులూ చెయ్యకూడదు' అనో — కార్మికులు చర్చించడానికి వీలు లేదు. 'సమాజంలో యుద్ధాలూ, బాంబులూ ఎందుకు? పంటలు పండించుకుంటూ, బట్టలూ చెప్పులూ పుస్తకాలూ తయారు చేసుకుంటూ, ఎంతో సుఖంగా ఉండవచ్చు, ఈ బాంబుల తయారీ పూర్తిగా అనవసరం' అని కార్మికులు నిర్ణయించడానికి వీలు లేదు. వాళ్ళ పని, యజమానులు చెప్పిన పని చెయ్యడమే గానీ, ఆ పనికి సంబంధించిన మంచి చెడ్డలు ఆలోచించడం కాదు.

బాంబుల తయారీకోసం పని చెయ్యడం ఒకరిద్దరు కార్మికులకు ఇష్టం లేకపోతే, వాళ్ళు ఆ పనిలో నించి వెళ్ళిపోగలరే గానీ, ఆ బాంబుల తయారీయే సమాజంలో లేకుండా ఆ ఒకరిద్దరు కార్మికులే చెయ్యలేరు. ఆ పని నించి ఒకరిద్దరు కార్మికులు తప్పుకోగానే అక్కడికి వెయ్యి మంది కార్మికులు చేరతారు. పెట్టుబడిదారీ విధానం సృష్టించే నిరుద్యోగ పరిస్థితి అలాంటిది. అంటే, పెట్టుబడిదారులు ఎంత అసహ్యకరమైన పనులూ, ఎంత భయంకరమైన పనులూ చేయించినా, ఆ పనులకు కార్మికులు దొరకకపోవడం గానీ, ఆ పనులకు కార్మికులు ఇష్టపడకపోవడం గానీ — ఆ సమస్యే ఉండదు.

కార్మికులు బట్టలూ బాంబులూ కూడా చెయ్యాలని పెట్టుబడిదారులు ఆజ్ఞాపించినట్టే, కార్మికులు ఎప్పుడూ యుద్ధాలు చెయ్యాలనీ, అందులో చచ్చిపోతూ కూడా ఉండాలనీ, పెట్టుబడిదారులు ఆజ్ఞాపిస్తారు.

చేసే పనుల గురించి కలగజేసుకోవడానికీ, మాట్లాడడానికీ, నిర్ణయించడానికీ, ఆ పనులు చెయ్యవలసిన వాళ్ళకి హక్కు ఉండదు. ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా ఇలాగే జరుగుతుంది. ప్రతీ 'పని స్థలం' లోనూ, ప్రతీ 'ఉత్పత్తి' విషయం లోనూ, ఇలాగే జరుగుతుంది. మొత్తం సమాజం అంతా ఇదే జరుగుతుంది. సమాజాన్నంతా కలిపి చూసినప్పుడు, దీని అర్థం ఏమిటి? 'సమాజం'లో ఎలాంటి ఉత్పత్తులు ఉండాలీ, సమాజం ఏ పద్ధతులతో నడుస్తూ ఉండాలీ — వంటి విషయాలన్నిటినీ నిర్ణయించేది పెట్టుబడిదారీ వర్గమేనన్నమాట! ఆ విషయంలో కార్మిక వర్గానికి ఎలాంటి పాత్రా, హక్కూ లేదన్న మాట!

కార్మికులు, తమ చేతుల్లోకి వచ్చిన జీతాల డబ్బుతో మార్కెట్‌కి పోయి తమ ఇష్ట ప్రకారమే, తమకు ఇష్టమైన సరుకుల్ని కొనుక్కుంటున్నామనుకుంటారు. కానీ, ఆ సరుకుల్ని మార్కెట్‌కి తెచ్చేది పెట్టుబడిదారీ వర్గమే. అది, లాభ దృష్టితోనే ఆ సరుకుల్ని తయారు చేస్తుంది. డబ్బుని సంపాదించగల ప్రతీ సరుకునీ అది మార్కెట్‌లో పెడుతుంది. మార్కెట్‌లో ఏ సరుకు దొరికితే ఆ సరుకునే, ఎలా దొరికితే అలాగే, కార్మికవర్గం వాడాలి. పెట్టుబడిదారీ వర్గం నిర్ణయించే సరుకులు కల్తీగా, అనారోగ్యకరంగా, ఆడంబరంగా, చెత్తాకారీగా, వికృతంగా తయారై వస్తాయి. ఆ చెత్త

నించే ఏదో ఒక చెత్తని ఎంచుకోవడం లోనే కార్మికులు తమ స్వతంత్రతని ప్రదర్శించగలరు.

ఉన్నత మేధాశ్రమల కార్మికులైనా ఇదే పరిస్తితిలో ఉంటారు. పెట్టుబడిదారులు తయారు చేయించే ఆహార పదార్థాలే కార్మికులు వాడాలి. పెట్టుబడిదారులు తయారు చేయించే రకాల బట్టలే కార్మికులు కట్టాలి. పెట్టుబడిదారులు తయారు చేయించే రకపు పత్రికలే కార్మికులు చదవాలి. పెట్టుబడిదారులు తయారు చేయించే రకపు సినిమాలే కార్మికులు చూడాలి. ఈ రకంగా, కార్మిక వర్గం, నిత్య జీవితంలో ఎలాంటి ఉత్పత్తులు వాడాలో పెట్టుబడిదారులే నిర్ణయిస్తారు.

రెండు వర్గాల జనాభాతో ఉన్నదే 'మొత్తం సమాజం'. ఆ సమాజ విషయాలన్నిటినీ పెట్టుబడిదారీ వర్గమే నిర్ణయిస్తుందంటే, ఆ వర్గం, తన జీవిత విధానాన్ని తను స్వయంగా నిర్ణయించుకుంటూ, కార్మిక వర్గ జీవిత విధానాన్ని కూడా తనే నిర్ణయిస్తుందన్న మాట! కార్మిక వర్గం తన జీవిత విధానాన్ని తనే నిర్ణయించుకోగలిగే స్వతంత్ర స్తితిలో ఉండదు. అంటే, కార్మిక వర్గ జీవిత నిర్ణేత, పెట్టుబడిదారీ వర్గమే! మొత్తం సమాజ జీవిత నిర్ణేత, పెట్టుబడిదారీ వర్గమే!

ఈ రకంగా, శ్రమ దోపిడీ పరిస్తితులన్నీ ప్రతీ పునరుత్పత్తి క్రమంలోనూ యథాతథంగా పునరుత్పత్తి అవుతూనే ఉంటాయి. అంటే, పెట్టుబడిదారుడు పెట్టుబడిదారుడిగానూ, కార్మికులు కార్మికులుగానూ ఉండిపోతారు. కార్మికులు జీతాల మీద బతుకుతూ ఉంటే, పెట్టుబడిదారులు వడ్డీలూ, లాభాలూ, భూమి అద్దెలూ తింటూ బతుకుతారు. కార్మికులు, అవసర శ్రమేగాక, అదనపు శ్రమ కూడా చేస్తూ ఉంటే, పెట్టుబడిదారులు, స్వంత శ్రమ అనేదే లేకుండా సుఖ భోగాలతో జీవిస్తూ వుంటారు. పునరుత్పత్తి క్రమం అనేది ఈ పరిస్తితుల్నే పునరుత్పత్తి చేస్తూ ఉంటుంది. అందుకే పునరుత్పత్తి క్రమంలో జరిగే పని, వస్తువుల పునరుత్పత్తి మాత్రమే కాదు; 'వర్గ సంబంధాల పునరుత్పత్తి' కూడా!

ఒక 'ఉత్పత్తి క్రమాని'కి పెట్టుబడిదారీ స్వభావం ఉంటే, 'పునరుత్పత్తి క్రమాని'కి కూడా ఆ స్వభావమే ఉంటుంది.

మార్క్సు మాటల్లో:

"పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, కేవలం — భౌతిక వస్తువుల్ని మాత్రమే ఉత్పత్తి చెయ్యడం కాదు: ఆ వస్తువులు ఏ ఉత్పత్తి సంబంధాలతో అయితే ఉత్పత్తి అవుతాయో ఆ సంబంధాల్ని కూడా నిరంతరం పునరుత్పత్తి చేస్తుంది. వాటికి తగిన పంపిణీ సంబంధాల్ని కూడా పునరుత్పత్తి చేస్తుంది."

(కాపిటల్ -3. పేజీ-879. మాస్కో ఎడిషన్, 1971).

"ఉత్పత్తి పరిస్థితులే పునరుత్పత్తి పరిస్థితులు కూడా.... ఉత్పత్తి క్రమం పెట్టుబడిదారీ స్వభావంతో ఉంటే, పునరుత్పత్తి క్రమం కూడా అదే స్వభావంతో ఉంటుంది. ఉత్పత్తి క్రమం, పెట్టుబడి ఆత్మవిస్తరణ చెందడానికి సాధనంగా ఉన్నట్టే, పునరుత్పత్తి క్రమం కూడా, ముందు పెట్టిన విలువని 'పెట్టుబడి'గా, అంటే 'ఆత్మవిస్తరణ చెందే విలువ'గా, పునరుత్పత్తి చేసే సాధనంగా మాత్రమే ఉంటుంది."

(కాపిటల్-1, పేజీ-531, మాస్కో ఎడిషన్, 1974)

# పెట్టుబడి విస్తరణా, అదనపు జనాభా!

పెట్టుబడి పెరగడంవల్ల ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఉత్పాదక శక్తులు పెరగడం వల్ల ఉద్యోగావకాశాలు తగ్గుతాయి. కానీ, పెట్టుబడి పెరుగుదలా, ఉత్పాదక శక్తుల పెరుగుదలా ఎప్పుడూ కలిసే ఉంటాయి. కాబట్టి, ఉద్యోగావకాశాల పెరుగుదలా, తగ్గుదలా కూడా కలిసి ఉంటాయి. అంటే, ఉద్యోగావకాశాల పెరుగుదల, తగ్గిపోయే స్థాయిలో ఉంటుందన్నమాట! సమాజం మొత్తం మీద 5 గురికి ఉద్యోగాలు పోయి, 5గురికి ఉద్యోగాలు దొరికితే — సమాజంలో ఉద్యోగ పరిస్తితి ఏమీ మారనట్టు అర్థం. (ఒక కార్మికుడు పెద్దవాడై పని నించి 'రిటైర్' అయినప్పుడు, ఆ ఉద్యోగంలోకి ఇంకో కార్మికుడు వస్తే, అది కొత్త ఉద్యోగం ఏర్పడడం కాదు; పరిస్తితి ఏమీ మారనట్టే). 4 గురికి ఉద్యోగాలు పోయి 7 గురికి ఉద్యోగాలు దొరికితే, 3 కొత్త ఉద్యోగాలు ఏర్పడినట్టు. 8 మందికి ఉద్యోగాలు పోయి 5 గురికి ఉద్యోగాలు దొరికితే, ముగ్గురు కొత్త నిరుద్యోగులు ఏర్పడినట్టు. — ఈ రకంగా, పెట్టుబడిదారీ విధానంలో, ఒక వేపు కొత్త ఉద్యోగాల్ని కల్పించే పరిస్తితులూ, ఇంకో వేపు కొత్త నిరుద్యోగాల్ని కల్పించే పరిస్తితులూ, దేని దారిన అవి, పని చేస్తూ ఉంటాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, 'స్వంత ఆస్తులు గల విడి విడి యజమానుల' ఉత్పత్తి విధానం. కార్మిక వర్గంలో ఉన్న జనాభాకందరికీ పనులు కల్పించవలసిన బాధ్యత, ఈ విడి విడి యజమానుల్లో ఎవరికీ ఉండదు. ఒక పెట్టుబడిదారుడు, తన దగ్గిర ఎంత పని ఉంటే అన్ని ఉద్యోగాలే ఇస్తాడు. ఒక భారీ యంత్రాన్ని తెచ్చి

నప్పుడు, తనకు అక్కర లేని కార్మికుల్ని తీసివేస్తాడు. తన దగ్గిర్నించి బయటికి పోయే కార్మికులకు మళ్ళీ ఉద్యోగాలు దొరుకుతాయా, దొరక్కపోతే వాళ్ళు ఎలా బతుకుతారూ — అనే విషయాలు ఆ పెట్టుబడిదారుడు ఆలోచించ నక్కరలేదు. ఎందుకంటే, అందరికీ ఉద్యోగాలు ఏర్ప రచవలసిన బాధ్యత ఆ పెట్టుబడిదారుడిది కాదు గనక. ఆ బాధ్యత ఇంకే పెట్టుబడిదారుడిదీ కూడా కాదు. ఆ బాధ్యత పెట్టుబడిదారీ ప్రభుత్వానిది కూడా కాదు. — 'సమాజంలో ఉన్న ప్రతీ వ్యక్తికీ ఉద్యోగం కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే' అని పెట్టుబడిదారీ ప్రభుత్వం, తన చట్టాలలో చెప్పదు. అంటే, దీని అర్థం ఏమిటి? శ్రమ చెయ్యడానికి సిద్ధంగా వున్న జనాభాకందరికీ పనులు ఏర్పర్చవలసిన బాధ్యత, మొత్తం సమాజానికే లేదన్న మాట!

కార్మికులకు స్వంత ఉత్పత్తి సాధనాలు ఉండవు కాబట్టి స్వతంత్ర ఉత్పత్తిదారులుగా జీవించే పరిస్తితి ఉండదు; పోనీ, యజమానుల కిందైనా తప్పనిసరిగా ఉద్యోగాల్లో నిలిచే పరిస్తితి ఉంటుందా అంటే అదీ ఉండదు. మరి కార్మిక జనాభా అంతా ఎలా జీవించాలి? — ఎలాగంటే, కొందరికి పూర్తి ఉద్యోగాలూ, కొందరికి సగం ఉద్యోగాలూ, కొందరికి పావు ఉద్యోగాలూ, కొందరికి నిరుద్యోగాలూ, కొందరు దొంగలూ, కొందరు బిచ్చగాళ్ళూ! — అలా జీవించాలి!

ఒక విడి పెట్టుబడిదారుణ్ణి చూస్తే, వాడి సరుకుకి హఠాత్తుగా ఎక్కువ ఆర్డర్లు దొరికినప్పుడు, కార్మికులకోసం వాడి అవసరం హఠాత్తుగా పెరుగుతుంది. ఆర్డర్లు లేనప్పుడు, ఆ అవసరం హఠాత్తుగా తగ్గుతుంది. మొత్తం సమాజం మీద చూసినప్పుడు కూడా పరిస్తితి ఇదే. ఉత్పత్తి క్రమంలోగానీ చలామణీ క్రమంలోగానీ, ఒక క్రమత్వమూ సమిష్టి ప్లానూ లేని ఉత్పత్తి విధానానికి, పెట్టుబడి ఎప్పుడే స్థాయిలో విస్తరిస్తుందో, విస్తరించే పెట్టుబడికి ఎప్పుడే స్థాయిలో ఉద్యోగులు కావాలో ఒక ప్లాను ఉండదు. అస్త వ్యస్తంగా విస్తరించే పెట్టుబడులకు, హఠాత్తుగా ఎక్కువ మంది కార్మికులు అవసరమైతే, వెంటనే ముందుకు వచ్చి పని చెయ్యడానికీ, అవసరం లేకపోతే తక్షణం వెనక్కి తగ్గి పోవడానికీ, అన్ని శాఖల్లోనూ అదనపు కార్మిక జనాభా ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. పెట్టుబడుల అవసరాలు, హఠాత్తుగా విస్తరించి, హఠాత్తుగా కుంచిస్తూ ఉంటాయి. వాటి సంకోచ వ్యాకోచాలకు తగినట్టుగా మాత్రమే వాటికి కార్మిక జనాభా కావాలి.

ప్రతీ పెట్టుబడిదారుడూ కొందరు కార్మికుల్ని 'పెర్మనెంట్' పద్ధతిలోనూ, కొందరు కార్మికుల్ని 'టెంపరరీ' పద్ధతిలోనూ నియమించుకుంటాడు. ఈ పద్ధతి ఎందుకంటే, టెంపరరీ కార్మికుల్ని పెర్మనెంట్ చెయ్యకుండా ఉంచితే కొన్ని ఖర్చుల్ని తప్పించుకోవచ్చుననే దృష్టితో మాత్రమే కాదు; పెట్టుబడిదారుడి సరుకు అమ్మకాలకు ఒక క్రమత్వం ఉండదు కాబట్టి, ఆర్డర్లు తగ్గిపోయినప్పుడు టెంపరరీ కార్మికుల్ని నిలిపి వేసి, పెర్మనెంట్ కార్మికులతో మాత్రమే పని సాగిస్తూ ఉంటాడు. 'అదృష్టవశాత్తూ' పెద్ద ఆర్డర్లు తగిలినప్పుడు, ఫ్యాక్టరీ గేట్లు తీసి బయట సిద్ధంగా ఉన్న నిరుద్యోగ కార్మికుల్ని లోపలికి పిలుస్తాడు. కావలసిన వెంటనే వాడుకోవడానికి స్టోరులో ముడి పదార్థాల్ని సిద్ధంగా నిలవ ఉంచినట్టు, పెట్టుబడిదారీ విధానం, నిరుద్యోగ జనాభాని, సమాజంలో ఎప్పుడూ సిద్ధంగా రిజర్వ్‌లో ఉంచుతుంది. పెట్టుబడి విస్తరణతోపాటు మారే అవసరాలలో, దాని ఆకర్షణ — వికర్షణలకు అనుగుణంగా ప్రవర్తించడానికి, సమాజంలో అదనపు కార్మిక జనాభా ఉండి తీరాలి. అది పెట్టుబడి విస్తరణకూ, దాని సంపదల విస్తరణకూ ప్రధానమైన షరతు. అంటే, పెట్టుబడిదారీ విధానం ఉనికిలో ఉండాలంటే, కార్మికవర్గంలో కొంత భాగం తప్పనిసరిగా ఎప్పుడూ 'నిరుద్యోగులుగా' ఉండి తీరాలి! ఉద్యోగులుగా ఉన్నవాళ్ళు పేదతనంలోనూ, నిరుద్యోగులుగా ఉన్నవాళ్ళు బికారితనంలోనూ ఉండితీరాలి!

కార్మిక వర్గంలో ఉన్న మొత్తం జనాభాలో నించి ఉత్పాదక, అనుత్పాదక ఉద్యోగాల్లో ఉన్న వాళ్ళందర్నీ తీసివేస్తే, మిగిలిన వాళ్ళంతా 'అదనపు జనాభా'. అంటే, పెట్టుబడిదారీ అర్థంతో చూస్తే, ఉద్యోగాలు లేని నిరుద్యోగ జనాభాయే అదనపు జనాభా.

ఇంకా పనిచేసే శక్తి వున్నా, పెట్టుబడిదారీ పద్ధతి ప్రకారం 'రిటైర్' అయిపోయిన కార్మికులూ; భారీ పరిశ్రమ అవసరాలకు తగ్గ విధంగా రక రకాల పనులలోకి మారలేక పోయిన కార్మికులూ; ప్రమాదాలలో అవయవాలు పోగొట్టుకున్న కార్మికులూ; గనులూ, రసాయనిక పరిశ్రమలూ వంటి చోట్ల పని చేసి రోగాల పాలైన కార్మికులూ; తమకు పనులు లేకా, పోషించే భర్తలూ పిల్లలూ లేకా, అనాథలైన స్త్రీలూ; తల్లిదండ్రులు లేని అనాథ శిశువులూ — ఇటువంటి జనాభా అంతా 'అదనపు జనాభా'. పూర్తి నిరుద్యోగులే గాక, పార్ట్ టైమ్ ఉద్యోగులూ, పార్ట్ టైమ్ స్వతంత్ర ఉత్పత్తిదారులూ కూడా అదనపు జనాభా కిందకే వస్తారు.

'అదనం' అంటే ఇక్కడ అర్థం ఏమిటి? దేని కన్నా 'అదనం' అని? ఈ సమాజం ఏర్పర్చగలిగే ఉద్యోగావకాశాల కన్నా అదనం — అని. పెట్టుబడి విస్తరణలో,

పాత, కొత్త పెట్టుబడులకు కూడా కలిసి, మొత్తం ఎంత కార్మిక జనాభా కావాలో ఆ అవసరం కన్నా ఎక్కువగా ఉన్న జనాభాయే అదనంగా ఉన్న జనాభా.

'నిరుద్యోగం' అనే మాట, కార్మిక వర్గానికే గానీ, పెట్టుబడిదారీ వర్గానికి వర్తించదు. పెట్టుబడిదారీ వర్గానికి, శ్రమ చెయ్యడం అనే మాటే ఉండదు. అది, శ్రమ లేకుండా, వడ్డీలూ లాభాలూ కౌళ్ళూ సంపాదిస్తూ, శ్రమ దోపిడీ ద్వారానే జీవిస్తుంది. కాబట్టి, దానికి 'ఉద్యోగమా, నిరుద్యోగమా' అనే ప్రశ్నే ఉండదు నిరుద్యోగ సమస్య అంతా కార్మిక వర్గానికి సంబంధించిందే.

అంతేగాక, నిరుద్యోగ సమస్య, 'పెట్టుబడిదారీ సమాజంలో ఉన్న కార్మిక వర్గానికి' సంబంధించిందే. ఎందుకంటే, నిరుద్యోగ సమస్య అనేది, పెట్టుబడిదారీ విధానపు ప్రత్యేక సృష్టి. ఈ సమస్య గత సమాజాలలో లేదు. (నూతన సమాజంలో ఉండబోదు).

గత కాలపు బానిస సమాజాన్ని తీసుకుంటే, ఏ బానిసా నిరుద్యోగ పరిస్తితిలో ఉండడు. బానిసకు జీవిత కాలంలో ఎన్నడూ నిరుద్యోగం సంక్రమించదు. శ్రమ చేసే అవకాశమూ, దానికి బదులుగా ఎంతో కొంత ఆహారమూ, బానిసకు ఎప్పుడూ దొరుకుతాయి.

బానిసకు నిరుద్యోగం వుండదు, నిజమే. అయితే, ఆ సమాజంలో బిచ్చగాళ్ళు వుండి వుండరా? వాళ్ళు ఎవరై వుంటారు? - ఆ సమాజంలో, మొత్తం జనాభా అంతా బానిసలూ, యజమానులూ అనే 2 వర్గాలుగా మాత్రమే వుండరు. వాళ్ళు మొత్తం జనాభాలో మెజారిటీ సంఖ్య, ఇంకా కొంత చిన్న సంఖ్య, స్వతంత్ర చేతి వృత్తుల వారి లాంటి వాళ్ళు వుంటారు. అలాంటి వాళ్ళలో, శ్రమ చెయ్య లేకపోయిన వాళ్ళూ; బానిసల్లోనే జబ్బులతో, వృద్ధాప్యంతో చావుకి దగ్గిరైనప్పుడు, యజమానులు బైటికి తోలేసిన వాళ్ళూ - ఆ రకం వాళ్ళు బిచ్చగాళ్ళుగా వుండవచ్చు.

శ్రమ చెయ్యగల స్తితిలో వున్న బానిసలకు లాగే, కౌలు రైతుకి కూడా నిరుద్యోగ పరిస్తితి ఏర్పడదు. శ్రమ చేస్తూ, ఎంతో కొంత తిండి తినే అవకాశం కౌలు రైతుకి ఎప్పుడూ ఉంటుంది. అయినా ఈ సమాజంలో కూడా బిచ్చగాళ్ళు వుండవచ్చు.

వేతన కార్మికుల్ని మాత్రమే నిరుద్యోగ సమస్య పట్టు కుంటుంది. కార్మికుడికి, శ్రమ చెయ్యడానికి గ్యారంటీ ఉండదు. పనిలో ఉన్న కార్మికులు కూడా, ఏ క్షణాన్న యినా ఆ పని చేసే అవకాశం పోగొట్టుకోవచ్చు. సాధారణ కార్మికుడి 'పని - భద్రత', నిత్యం ఊగిసలాడుతూ అనిశ్చి తంగా తయారవుతుంది. నిరుద్యోగ కార్మికులు, పెట్టుబడి దార్ల గేట్ల ముందు నిలబడి యాచకులై 'శ్రమ భిక్ష' అడుగుతారు. ఎవరు ఎవరికి భిక్ష పెడుతున్నారో ఎరగని కార్మికులు, జీవితకాలమంతా పెట్టుబడిదార్ల దయాదాక్షి ణ్యాల కోసం పడిగాపులు పడుతూ జీవిస్తారు.

ఈ నిరుద్యోగ సమస్య నూతన సమాజానికి వర్తిం చదు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా శ్రమ చేసి తీరవలసిన సమాజంలో, 'శ్రమ చెయ్యకుండా జీవించడానికి' అవ కాశమే ఉండదు.

ఈ సమస్య కేవలం, పెట్టుబడిదారీ సమాజానికి మాత్రమే ప్రత్యేకం. దాని వికృత సృష్టి ఇది!

ఏ ఉత్పత్తి విధానమైతే నిరుద్యోగ జనాభాని సృష్టి స్తుందో, ఆ విధానమే ఆ జనాభాని చూసి ఛీత్కరిస్తుంది. ఆ జనాభా 'కొంతవరకూ' ఉండడమే దానికి అవసరం గానీ, అది 'మరీ ఎక్కువగా' ఉండడం దానికి అవసరం లేదు. గేట్ల బయట నిరుద్యోగ జనాభా ఉంటే, గేట్ల లోపల ఉన్న కార్మికులు 'చవగ్గా' పనిచేస్తూ ఉంటారనేమాట నిజమే. కానీ, ఆ చవకదనానికి కూడా ఒక హద్దు ఉంటుంది. పెట్టుబడిదారుడికి ఒక కుట్టు మనిషో, ఒక మెకానిక్కో, ఒక డ్రైవరో, ఒక టీచరో, ఏదో ఒక రకం కార్మికుడు కావాలంటే, అతనికి ఇచ్చే జీతం, అతని శ్రమశక్తి విలువగా ఉండక తప్పదు. బయట ఎంత నిరుద్యోగ జనాభా వున్నా లోపలవున్న కార్మికులకు కొంత జీతం ఇవ్వక తప్పదు కాబట్టి, ఆ జీతాలు ఒక హద్దు కన్నా తగ్గేదేమీ వుండదు. కాబట్టి బయట ఎంత నిరుద్యోగ జనాభా మాత్రమే ఉండాలంటే, జీతాల్ని ఎప్పుడూ ఒక 'కనీస స్థాయిలో' ఉండేలాగ చెయ్యడానికీ, అవసరమై నప్పుడు లోపలికి వచ్చి పని చెయ్యడానికీ కావలసినంత కనీస నిరుద్యోగ జనాభా బయటవుంటే చాలు. అంతకన్నా ఎక్కువగా ఉన్న నిరు ద్యోగ జనాభా వల్ల, పెట్టుబడిదారీ వర్గానికి చాలా 'తల నొప్పి'! అందుకే, అది 'అసలు భూమి మీద ఇంత మంది పేద జనం పుట్టడం ఎందుకు?' అని, పిల్లల్ని కనే కార్మికుల్నీ, కార్మికులకు పుట్టే పిల్లల్నీ, చాలా ఛీత్కరిస్తుంది. మనుషులు మనుషుల్ని కనకుండా 'రూపా యిల్ని' కంటే, పెట్టుబడిదారీ వర్గానికి ఎంతో బాగుం టుంది! అదనం అయిపోవు! రూపాయిలు ఎన్ని ఉన్నా ఎక్కువైపోవు! మనుషులే ఎక్కువైపోతారు! ఎక్కువై పోయేది, శ్రమ చేసే మనుషులే! అదే అదనపు జనాభా!

నిరుద్యోగానికీ, తన ఆర్థిక సూత్రాలకూ ఎలాంటి సంబంధం ఉందో పట్టించుకోని పెట్టుబడిదారీ వర్గం — "నిరుద్యోగ సమస్య కంతటికీ కారణం జనాభా పెరుగుదలే" అని నిర్భయంగా చెప్పేస్తుంది. "జనాభా పెరిగిపోతోంది కాబట్టే దేశంలో ఈ కరువూ, ఈ నిరు ద్యోగం, ఈ పేదతనం, ఇవన్నీనూ. జనాభా తగ్గితే అందరికీ

ఉద్యోగాలు దొరుకుతాయి. అప్పుడు అందరూ సిరి సంపదలతో తులతూగవచ్చు" అని ప్రకటిస్తూ ఉంటుంది.

"ఉద్యోగాలు ఉన్న వాళ్ళు కూడా పేదతనంలోనే ఉన్నారే!" అని అడిగితే,

"............................" - అది జవాబు చెప్పదు.

"కరువంతా ఎప్పుడూ కార్మిక కుటుంబాలనే పట్టుకుంటుందేం? పెట్టుబడిదార్లకి ఎందరు పిల్లలున్నా ఈ కరువు వాళ్ళని ఎప్పుడూ పట్టుకోదేం?"

"..............................." — దానికీ జవాబు చెప్పదు.

అది దేనికీ జవాబు చెప్పదు. జవాబుల్లేని, చర్చల్లేని, తిరుగులేని, దాని 'సొంత సత్యాలు' దానికి ఉంటాయి. వాటినే అది ప్రకటించేస్తూ ఉంటుంది.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, నిరుద్యోగ సమస్యకి 'సోమరితనాన్ని' కూడా కారణంగా చెపుతూ ఉంటారు. 'సోమరితనం వల్లనే నిరుద్యోగ సమస్య పుడుతుంది. కష్ట పడే వాడికి ఎప్పుడూ తిండికి కరువు ఉండదు' అని ఒక పక్క చెపుతూ, వాళ్ళే ఇంకో పక్క 'జనాభా పెరుగుదలే నిరుద్యోగానికి కారణం' అని వల్లిస్తూ ఉంటారు.

శ్రమ చెయ్యడానికి సిద్ధంగా ఉండి, 'పని కావాలని' తిరుగుతోన్న నిరుద్యోగ కార్మికులకు 'సోమరితనం వల్లనే నిరుద్యోగం ఉంటుంది' అనే సూత్రంలో ఉన్న బూటకత్వం ఏమిటో కొంతైనా అర్థమవుతుంది. కానీ, 'జనాభా పెరిగిపోవడం వల్లనే నిరుద్యోగం ఉంటుంది' అనే సూత్రంలో బూటకత్వం అంత తేలిగ్గా అర్థం కాదు. 'జనం మితి మీరి పెరిగిపోతూ ఉంటే, అందరికీ ఉద్యోగాలు ఎక్కణ్ణించి వస్తాయి? ప్రభుత్వం మాత్రం అందరికీ ఉద్యోగాలు ఎలా ఇవ్వగలుగుతుంది?' అనే పద్ధతిలోనే కార్మికులు కూడా ఆలోచిస్తారు. 'నిరుద్యోగ సమస్య'కీ, 'జనాభా పెరుగుదల'కీ తప్పనిసరిగా సంబంధం ఉన్నట్టే, కార్మికులు నమ్ముతారు.

కానీ, 'జనాభా పెరుగుదల' అనేది ప్రకృతి సహజత్వానికి సంబంధించిన విషయం. ఆ జనాభాకి 'పనులు కల్పించుకోవడం' అనేది సమాజపు ఏర్పాట్లకు సంబంధించిన విషయం. పెట్టుబడిదారీ విధానం, ప్రకృతి విషయానికి తగ్గట్టుగా సమాజ విషయాన్ని మలుచుకోవడం గాక, పెట్టుబడిదారీ సమాజ విషయానికి తగ్గట్టుగా ప్రకృతి విషయాన్ని మలచడానికి చూస్తుంది. అంటే, కడుపుని బట్టి తిండి ఉండాలనడంగాక, తిండిని బట్టి కడుపు ఉండాలంటుంది. కార్మికులు కడుపు నిండా తిండి తినే అవకాశాలు లేకుండా చేస్తూ, 'మీ కడుపు పెద్దదై పోయింది, కడుపు అంత పెద్దదిగా ఉండకూడదు. అసలు పేద వాళ్ళకి కూడా కడుపు ఉండడం ఎందుకు?' అని అది కార్మికుల్ని తప్పు పడుతుంది. ఏ విషయాన్ని బట్టి ఏ విషయం ఉండాలో అది పట్టించుకోదు.

పెట్టుబడిదారీ విధానం, సమాజంలో జనాభాకందరికీ పనులు కల్పించే మార్గంలేక, జనాభాయే ఎక్కువైపోయిందని (అంటే కార్మిక జనాభాయే ఎక్కువై పోయిందని) ఆగ్రహిస్తుంది.

కార్మిక జనం ఎక్కువ — తక్కువలవడం — అనే విషయాలు, విడి విడి శాఖల్ని తీసుకున్నప్పుడు ఒక ప్రత్యేక అర్థంతో మాత్రమే సరిపోతాయి. ఒక పెట్టుబడిదారుడు, ఒక ప్రత్యేక రకం పని చేసే కార్మికుల కోసం వెతుకుతూ ఉన్నప్పుడు, ఆ రకం కార్మికులు ఎక్కువ మంది దొరకడం గానీ, కావలసినంత మంది దొరక్కపోవడం గానీ, జరగ వచ్చు. ఇలా, ఒక ప్రత్యేక శ్రమకి సంబంధించి చూసి నప్పుడు, ఆ శ్రమ చేసే కార్మికులు ఎక్కువ అయ్యారనో, తక్కువ అయ్యారనో అనడానికి వీలు ఉంది. కానీ సమాజం మొత్తం మీద చూసినప్పుడు, 'జనాభా ఎక్కువైంద'నో, 'తక్కువైంద'నో అనడానికి వీలులేదు. సమాజంలో ఎంత జనాభా ఉంటే, అంత జనాభా జీవించడానికీ సమాజం ఏర్పాట్లు చేసుకోవాలి. చేసుకోవచ్చు. పదార్థాలన్నిటినీ ప్రకృతే ఇస్తుంది. మనుషులు, శ్రమలు చేస్తారు. ప్రకృతి ఇచ్చే పదార్థాలూ, మనుషులు చేసే శ్రమలూ కలిసి, మనుషులంతా సుఖంగా జీవించడానికి కావలసినంత ఉత్పత్తి తయారు చేసుకోవచ్చు.

'జనాభా పెరుగుదల' అనేది, గతంతో సంబంధం లేని స్వతంత్ర విషయం కాదు. ఈ నాటి జనాభా పరిమాణం, గత జనాభా పరిమాణం మీదే ఆధారపడి ఉంటుంది.

'ప్రకృతి'లో ప్రతీ మనిషీ 'నోటి'తోటే కాదు, చేతుల తోటీ, కాళ్ళతోటీ కూడా పుడతాడు. ఆ చేతులూ కాళ్ళూ ఆ నోటికి కావలసినవన్నీ తయారు చెయ్యగలవు. అయితే, పెట్టుబడిదారీ ప్రకృతిలో ఉన్న వింత విషయం ఏమిటంటే — పెట్టుబడిదారుడు, చేతులూ కాళ్ళూ లేకుండా నోటితో మాత్రమే పుడతాడు. వాడికి ప్రకృతి నోరే గానీ కాళ్ళూ చేతులూ ఇవ్వదు. అందుకే వాడు ఏ పని చెయ్యకుండా, జన్మంతా కార్మికుల మీదపడి బతుకుతాడు. కాళ్ళూ చేతులూ ఉన్న మనుషులు ఎవరి అవసరాల కోసం వాళ్ళే శ్రమ చేసుకున్నప్పుడు, వాళ్ళు ఎక్కువ మంది ఉన్నారా, తక్కువ మంది ఉన్నారా — అనే ప్రశ్న, అర్థం లేనిదై పోతుంది.

అంటే, దీని అర్థం. మనుషులు, ప్రకృతి సూత్రాన్ని యధాతథంగా పాటిస్తూ, ప్రకృతి ఇచ్చినంత మంది పిల్లల్ని కంటూ, ప్రకృతి నియమాల్ని మీరకుండా జీవించాలని

కాదు. స్త్రీలు, ప్రకృతి నియమాల్ని యధాతథంగా పాటిస్తే, ప్రతీ ఏటా బిడ్డని కనవలసి వస్తుంది. ఆరోగ్యానికి సంబంధించిన ఆటంకాలేమీ లేకపోతే, స్త్రీ తన జీవిత కాలంలో దాదాపు 45 సంవత్సరాలు నిండే వరకూ బిడ్డల్ని కంటూనే గడపవలసి వస్తుంది. సమాజం ఆమెకి ఎంత సహాయకారిగా ఉన్నా, ప్రకృతి సూత్రాన్ని యధాతథంగా పాటించవలసి వస్తే, స్త్రీ జీవితానికి, బిడ్డల్ని కని పెంచడం తప్ప ఇతర విధాలైన సాంఘిక, కళాత్మక జీవితం అనేదీ ఉండదు. కాబట్టి, స్త్రీ ఆరోగ్యం కోసమూ, ఆమె ఇతర విధాలుగా అభివృద్ధి చెందడం కోసమూ, సంతానాన్ని తప్పనిసరిగా తగ్గించుకోవలసే ఉంటుంది.

కానీ, 'జనాభా ఎక్కువై పోయింది' అనడంలో పెట్టుబడిదారీ విధానానికి ఉన్న దృష్టి ఈ రకమైంది కాదు. అది, 'స్త్రీ జీవితాన్ని' దృష్టిలో పెట్టుకుని ఆ మాటలు అనడం లేదు. అది కార్మిక జనానికందరికీ ఉద్యోగాలు కల్పించలేదు కాబట్టి, ఆ కారణంతోనే అది, 'జనాభా ఎక్కువై పోతున్నారు' అంటుంది. ఆ మాటల అర్థం, 'కార్మిక జనాభా ఎక్కువై పోతున్నారు' అనే. దాని 'ఉద్యోగ' అవసరాలకు సరిపోయే జనాభా వరకూ అయితే, 'జనాభా ఎక్కువ అయ్యారు' అనే సమస్య రాదు. దానికి అక్కరలేని జనాభాయే దానికి 'ఎక్కువై పోయిన' జనాభా! 'అధిక' జనాభా! అదనపు జనాభా!

కార్మిక జనాభా, పెట్టుబడినీ, దాని ఉత్పాదక శక్తుల్నీ పెంచుతూ, దాని అవసరాలకు తను అధికమైపోతూ ఉంటుంది! ఇది, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు ప్రత్యేక జనాభా సూత్రం.

ప్రతీ ఉత్పత్తి విధానానికీ, దాని జనాభా సూత్రం దానికి ఉంటుంది. సమాజంలో ఉండే ఉత్పత్తి విధానపు ప్రత్యే కతతో సంబంధం లేకుండా, ఏ ఉత్పత్తి విధానానికైనా ఒకే రకంగా వర్తించే 'యాబ్‌స్ట్రాక్ట్' (ప్రత్యేకత లేని) జనాభా సూత్రం, మొక్కలకూ — జంతువులకూ తప్ప, మనుషులకు ఉండదు. ఆ మొక్కలకూ జంతువులకూ కూడా, వాటి విషయంలో మనుషులు జోక్యం చేసుకోనంత వరకే వాటి జనాభా సూత్రాలు యాబ్‌స్ట్రాక్ట్‌గా ఉంటాయి. మనుషులతో సంబంధం ఉన్నప్పుడు, అవి కూడా సహజ సూత్రాలుగా ఉండవు. ఏ ఉత్పత్తి విధానం అయినా, తనకున్న పరిజ్ఞానం తోటీ, తన స్వభావం తోటీ, మొక్కల విషయం లోనూ, జంతువుల విషయం లోనూ, జోక్యం చేసుకుంటూనే ఉంటుంది. కాబట్టి, మొక్కలకూ, జంతువులకూ కూడా ఉత్పత్తి విధానపు ప్రత్యేకతలతో సంబంధించిన, ప్రత్యేక స్వభావం గల, జనాభా సూత్రాలే ఉంటాయి.

జనాభా సూత్రాల మీద పెట్టుబడిదారీ వర్గానికి పరమ ప్రీతి పాత్రుడైన అర్థికవేత్త — **మాల్థూస్**. ఈయన, 'ఆధునిక పరిశ్రమ'కు నిరుద్యోగ జనాభాతో అవసరం ఉంటుందనే విషయాన్ని ఒక పక్క అంగీకరిస్తూనే ఉంటాడు. కానీ, నిరుద్యోగ జనాభా అనేది ఆ ఆధునిక పెట్టుబడిదారీ విధానం వల్లనే పుట్టుకొచ్చిందనే విషయాన్ని మాత్రం పట్టించుకోడు. 'జనాభా అదనం అయిపోతూ ఉంటుంది' అనే సూత్రీకరణ మీదే ఈయన తన శక్తి యుక్తులన్నీ ధార పోస్తాడు.

మాల్థూస్ జనాభా సిద్ధాంతం క్లుప్తంగా ఇలా ఉంటుంది: సమాజంలో, ఉత్పాదక శక్తి — 1, 2, 3, 4, 5, 6 — లాంటి వరసలో (ఆరిద్‌మేటిక్‌గా) అతి నెమ్మదిగా మాత్రమే పెరుగుతూ ఉంటుంది. జనాభా మాత్రం — 1, 2, 4, 8, 16, 32 — లాంటి వరసలో (జామెట్రికల్‌గా) పెద్ద పెద్ద దాట్లతో అతి వేగంగా పెరిగిపోతూ ఉంటుంది. ఉత్పాదక శక్తి పెరుగుదలకీ, జనాభా పెరుగుదలకీ ఉండే ఈ తేడా వల్ల ప్రకృతిలో మనుషులకు దొరికే 'తిండి'కన్నా మనుషుల 'సంఖ్య' ఎక్కువై పోతూ వుంటుంది. కాబట్టి, తిండికి మించి 'అదనంగా ఉన్న' మనుషులు ఆకలితో చావడం ప్రకృతి న్యాయం. ప్రకృతిలో తప్పనిసరిగా ఇదే జరుగుతూ ఉంటుంది. — ఇలా, ఈ పద్ధతిలో సాగుతుంది, ఈ సిద్ధాంతం.

ప్రకృతి నిర్దేశించిన న్యాయం ప్రకారం 'ఆకలితో చచ్చిపోయే అదనపు జనాభా' కార్మికవర్గంలోనే ఉంటారుగానీ, పెట్టుబడిదారీ వర్గంలో ఎందుకు ఉండరో ఈయన చెప్పడు. ఈయన ప్రకారం, సమాజంలో ఎప్పుడూ కార్మిక జనాభాయే 'అదనం అయిపోతూ' ఉంటారు! పెట్టుబడిదారీ జనాభా మాత్రం సరిగ్గా సరిపోతూనే ఉంటారు! వాళ్ళు ఇంకా తక్కువ అవుతూ కూడా ఉంటారు! అంటే, సమాజానికి శ్రమ చెయ్యని వాళ్ళతో ఏ సమస్యా లేదు, శ్రమ చేసే వాళ్ళతోనే అన్నమాట సమస్యంతా!

'జనాభా పెరుగుదల' గురించి మాట్లాడే వాళ్ళు, సమాజంలో ఉన్న మొత్తం జనాభా అంతటి గురించీ మాట్లాడుతున్నట్టే పైకి కనపడతారు. కానీ, వాళ్ళ మనసుల్లో ఉన్న నిజమైన అర్థం — 'జనాభా' అంటే, 'కార్మిక జనాభా' అని మాత్రమే. 'జనాభా పెరుగుదల' సమస్య, పెట్టు బడిదారీ వర్గం విషయంలో గానీ, ఉద్యోగ జనాభా విషయంలో గానీ రాదు. 'నిరుద్యోగ జనాభా' విషయంలోనే వస్తుంది. ఆ నిరుద్యోగ జనాభా అంతా కార్మిక వర్గానికి చెందిన జనాభాయే కదా? అంటే, 'సమాజంలో జనాభా ఎక్కువై పోతోంది' అనే మాటలకు అర్థం — 'పేద జనాభా ఎక్కువై పోతోంది' అనే!

ఉత్పాదక శక్తి 'నెమ్మదిగానూ,' జనాభా 'వేగంగానూ' పెరుగుతాయని చెప్పే అంకెల సూత్రాలకు ఆధారా లేమిటో, మాల్తూస్ హేతుబద్ధంగా రుజువు చెయ్యడు. ఆ సూత్రాలు కేవలం ఆ మేధావి స్వంత మేధస్సు నించి పుట్టుకొచ్చినవే తప్ప వాటికి నిజమైన ఆధారాలేవీ ఉండవు.

నిజానికి, వాస్తవ పరిస్తితుల్ని పరిశీలిస్తే, జనాభా పెరుగుదల కన్నా ఉత్పాదక శక్తుల పెరుగుదలే వేగవంత మైనదిగా రుజువవుతుంది. మనుషుల్లో ఒక తరంనించి ఇంకో తరం రావడానికి 17, 18 సంవత్సరాల కాలం పడు తుంది. ఆ లోగా పాత తరంలో కొంత జనాభా తగ్గుతూ కూడా ఉంటుంది. కానీ, ఉత్పత్తి శక్తులు రెట్టింపు అవడానికి 10 సంవత్సరాల కన్నా ఎక్కువ కాలం పట్టదు. అంతేగాక, పెరిగిన ఉత్పత్తి శక్తి మళ్ళీ తగ్గిపోవడం జర గదు. ఉత్పత్తి సాధనాలూ, శ్రమా, సైన్సూ కలిస్తే ఉత్పాదక శక్తులు ఊహాతీతమైన స్థాయిలో పెరిగిపోతూ ఉంటాయి. సైన్సుకి ఎల్లలు లేవు. మనుషులు, సైన్సు అంశాల్ని గ్రహించగలిగిన కొద్దీ, సైన్సు ద్వారా ఎంతెంత ఉత్పాదక శక్తులైనా సాధ్యమవుతాయి. సైన్సు ద్వారా గంటకి వేల మైళ్ళ వేగంతో ప్రయాణించడం సాధ్యమవుతుంది. పర్వ తాల్నీ, సముద్రాల్నీ తవ్వుకుంటూ పోవడం సాధ్యమవు తుంది. రక రకాల మందులూ, ఎరువులూ ఉత్పత్తి చేసి, పంటల్ని వందల — వేల రెట్లు పెంచెయ్యడం సాధ్యమవు తుంది. ఈ రకంగా, ఎంతెంత ఉత్పాదక శక్తులైనా సాధ్య మవుతాయి.

కానీ, సాధ్యమైన ప్రతీ ఉత్పాదక శక్తినీ మనుషులు పూర్తిగా వినియోగించుకోలేరు. గంటకి వేల లక్షల మైళ్ళ వేగంతో ప్రయాణం చేసే విమానాల్ని తయారుచెయ్యడం సాధ్యం కావచ్చు గానీ, వాటిని నిత్యజీవితంలో వాడడం సాధ్యం కాదు. ప్రయాణం పూర్తి అయ్యాక ఆ విమానా లలో నించి మనుషులు దిగాలి గానీ మనుషుల శవాలు కాదు. ఏ ఉత్పాదక శక్తి విషయం అయినా ఇంతే. ఉత్పా దక శక్తుల్ని పెంచుకోవడం లోనూ, వాటిని వాడుకోవడం లోనూ మనుషులు కొన్ని ప్రకృతి నిబంధనలకు లోబడి తీరాలి. శారీరక, మానసిక ఆరోగ్యాలకు హాని కలిగించ నంత వరకే, మనుషులు ఉత్పాదక శక్తుల్ని వాడగలుగు తారు. అంటే, చేతికి అందే ఉత్పాదక శక్తుల్ని వాడడమే అసాధ్యమయ్యే విధంగా పరిస్తితి మారుతుంది. అలాం టప్పుడు 'ఉత్పాదక శక్తులు తక్కువ వేగంతో పెరుగు తాయి; జనాభా ఎక్కువ వేగంతో పెరుగుతుంది' లాంటి సిద్ధాంతాలన్నీ అర్థం లేని సిద్ధాంతాలై పోతాయి.

ప్రపంచంలో, పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన తర్వాత, ఏ దశలో ఉన్న ఉత్పాదక శక్తుల్ని తీసుకున్నా, అవి ఆ దశ నించి ఇంకెంత మాత్రమూ పెరగకపోయినా కూడా, ఆ ఉత్పాదక శక్తులతోనే ప్రపంచం అంతా సమృద్ధి అయిన ఉత్పత్తులతో ఎంతో సుభిక్షంగా జీవించగలదు. సమస్య, ఉత్పాదక శక్తులు పెరగకపోవడం గానీ, సమా జంలో అందరికీ చాలినన్ని ఉత్పత్తులు లేకపోవడం గానీ కాదు. సమస్య అంతా 'శ్రమ దోపిడీ'లో ఉంది. ఒక వర్గం, శ్రమ చెయ్యకపోవడంలో ఉంది. అసలు జరగవలసిన మార్పు 'దోపిడీ సంబంధాలు' మారడమే గానీ, ఉత్పాదక శక్తులు ఇంకా ఇంకా పెరగడం కాదు.

దోపిడీ అంతా ఎప్పటిలాగే సాగుతూ ఉండగా, ఉత్పా దక శక్తులు ఇంకా ఇంకా పెరిగితే ఏం జరుగుతుంది? దోపిడీ వర్గానికి అందే ఉత్పత్తుల రాసి ఇంకా పెరగడమే జరుగుతుంది. దాని వల్ల కార్మిక వర్గానికి వచ్చే ప్రయో జనమేమీ ఉండదు. దోపిడీ ఉత్పత్తి సంబంధాలు మార కుండా ఉత్పాదక శక్తులు వెయ్యి రెట్లు పెరిగినా, లక్ష రెట్లు పెరిగినా, 'అదనపు (నిరుద్యోగ) జనాభా సమస్య' ఇంకా ఇంకా తీవ్రమవుతుందే గానీ పరిష్కారం కాదు.

దోపిడీ సంబంధాలు మారిపోయి, సమిష్టి ప్లానుతో సమాజ నిర్వహణ సాగుతూ ఉన్నప్పుడు, నిరుద్యోగ జనాభా సమస్య అంతర్ధానమవుతుంది. కాబట్టి, నిరుద్యోగ జనాభా సమస్య లేకుండా ఉండాలంటే, 'సమాజంలో ఉత్పాదక శక్తులు ఏ స్థాయిలో ఉన్నాయి' అన్నది ప్రధాన మైన ప్రశ్న కాదు. 'ఉత్పత్తి సంబంధాలు ఎలా ఉన్నాయి' అన్నదే ప్రధానమైన ప్రశ్న. ఇదంతా, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల అవగాహనకు సరిపడని విషయం.

మాల్తూస్ సిద్ధాంతం ప్రకారం, కార్మికులు, పనివున్న కాలాల్లో గొడ్లలాగా పనిచేస్తూ, పిల్లల్ని కనకుండా 'బ్రహ్మ చర్యం' పాటిస్తూ ఉండాలి. పని లేనప్పుడు అదనపు జనాభాగా మారి, 'ప్రకృతి న్యాయం'గా ఆకలితో చచ్చి పోతూ ఉండాలి.

పేదల పట్ల దయగా ఉండడమూ, వారి కోసం దాన ధర్మాలు చెయ్యడమూ లాటి పనుల్ని కూడా ఈయన వ్యతిరేకించాడు. పేద జనాభా, ఆ రకంగా బతికి వుండడం కూడా ఈయనకి గిట్ట లేదు.

పెట్టుబడిదారీ వర్గం, మాల్తూస్ జనాభా సిద్ధాంతాన్ని ఈ నాటికీ మేళ తాళాలతో ఊరేగిస్తూనే ఉంటుంది. కానీ, ఇప్పుడు ఆ వర్గం, మాల్తూస్ అంకెల సూత్రాల్ని, అంత గట్టిగా వల్లించడం లేదు. కానీ, 'జనాభా పెరిగిపోతోంది. అందుకే ఉత్పత్తి చాలడం లేదు. అందుకే పేదతనాలూ కరువు కాటకాలూ పోవడం లేదు' అంటూ, మాల్తూస్ సిద్ధాంత సారాంశాన్ని మాత్రం విడిచి పెట్టకుండా వల్లిస్తూనే ఉంటుంది.

సమాజంలో 'జనాభా ఎక్కువైపోతున్నారు' — అని భావించే వాళ్ళెవరైనా సరే, ఆ మాట చెప్పేసి వెంటనే 'ఆత్మహత్య' చేసుకోవాలి — 'నేను తినే తిండంతా మిగులుతుందని నేనీ పని చేస్తున్నాను' అని రాసిపెట్టి పోవాలి. 'కల్లు తాగరాదు' అని చెప్పే వాళ్ళు, ఆ తాగే పని వాళ్ళు చెయ్యరు కదా? అలాగే, జనాభా ఎక్కువ' అనే వాళ్ళు, వాళ్ళే చచ్చిపోయి, జనాభాని తగ్గించాలి. కానీ, అధిక జనాభా సిద్ధాంత కర్తలెవ్వరూ, అధిక జనాభా మహమ్మారి నించి సమాజాన్ని రక్షించడానికి ఆత్మ హత్యలు చేసుకోలేదు. మాల్థూసూ ఆత్మహత్య చేసుకో లేదు.

శ్రమ చెయ్యని వాళ్ళే ఈ సిద్ధాంతం గురించి మాట్లాడ తారు కాబట్టి, వాళ్ళల్లో ఎవడు తగ్గినా, వాడు తినే తిండంతా నిజం గానే లోకానికి మిగులుతుంది. ఎవడన్నా అలా చేస్తే — ఆ సిద్ధాంతం ఎంత పనికిమాలినదైనా, 'పాపం వీడు తన సిద్ధాంతాన్ని నిజంగా నమ్మే చెప్పాడు' అని, ఆ మనిషిని గౌరవించవచ్చు. కానీ, జనాభా పెరిగి పోయిందని గోలపెట్టే వాళ్ళల్లో ఇంత వరకూ ఒక్కడు కూడా ఆత్మహత్య చేసుకోలేదంటే, వాళ్ళ సిద్ధాంతాన్ని వాళ్ళే నమ్మడం లేదన్నమాట!

'జనాభా పెరుగుదల' అన్నప్పుడు వాళ్ళ దృష్టిలో ఉన్నది 'పేద' జనాభాయే కాబట్టి, ఆ పేద జనాభాయే ఆత్మహత్యలు చేసుకుని తగ్గిపోవాలని వాళ్ళ ఉద్దేశం. ఆ పేద జనాభాని చూసినప్పుడల్లా దోపిడీగాళ్ళకి, 'ఎందుకీ బికారి జనం? ఈ బికార్ల వల్ల లోకానికేం లాభం?' అని గాఢమైన 'తత్వ చింతన' కలుగుతుంది. కానీ ఆ మరుక్షణం లోనే వాళ్ళకి అర్జంటు ఆర్డర్లు తగిలితే, ఆ బికారి జనమే హఠాత్తుగా ప్రత్యక్షమై, 'పని' అయిపోయిన వెంటనే మళ్ళీ మాయం అయిపోవాలి! నిజంగా, జరిగేది కూడా అదే! కార్మికుడు, ఉద్యోగం ఉన్నప్పుడు తన జీతం తోనే తను బతుకుతాడు. ఉద్యోగం లేనప్పుడు, ఉద్యో గాలు ఉన్న తన కుటుంబ సభ్యుల ద్వారా బతుకుతాడు. నిరుద్యోగ కార్మికుల కోసం పెట్టుబడిదారీ వర్గం పోగొట్టు కునేదేమీ ఉండదు. దానికి, నిరుద్యోగ కార్మిక జనాభా లోకంలో లేని దానితోనే సమానం.

పెట్టుబడిదారీ వర్గం, తన దగ్గిర పనిచేసే జనాభా మాత్రమే లోకంలో ఉన్నట్టు, వాళ్ళకే జీతాలిస్తుంది. పని చెయ్యని నిరుద్యోగ జనం లోకంలో లేనేలేరన్నట్టు, వాళ్ళ సంగతి పట్టించుకోదు. 'పని లేనప్పుడు కూడా మనుషులు బతికి ఉండాలి' అని అది ఆలోచించదు.

కొన్ని పెట్టుబడిదారీ దేశాలు నిరుద్యోగులకు, 'నిరు ద్యోగ భృతి' పేరుతో ప్రభుత్వ స్థాయిలో కొంచెం 'బిచ్చం' పడేస్తాయి. ఆ బిచ్చం, ప్రభుత్వానికి అందే 'పన్నుల'లో భాగం. అంటే, అది, ఉత్పాదక కార్మికుల 'అదనపు విలువ'లో భాగం. నిరుద్యోగులు, తమ చేతికి అందిన ఆ బిచ్చంతో, కొన్ని పోషణ వస్తువులు కొనుక్కుంటారు. ఆ పోషణ వస్తువులు ఎక్కడివి? ఉద్యోగాలలో ఉన్న ఉత్పా దక కార్మికులు ఉత్పత్తి చేసినవి. అంటే, నిరుద్యోగులంతా శ్రమ చెయ్యడానికి సిద్ధంగానే ఉన్నప్పటికీ, వారికి శ్రమ చేసే అవకాశం లేక, వారి జీవితావసర వస్తువుల్ని వారే ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉండదు. అయినప్పటికీ వారు బతికే ఉంటారు, 'బిచ్చం' తింటూ! ఇది శ్రామి కులకు చాలా అవమానకరమైన విషయం. స్వంత శ్రమ లేకుండా, ఇతరుల శ్రమని తింటూ బతకడంలో పెట్టు బడిదారుడికి అవమానం కనపడదు గానీ, శ్రమ చెయ్య డానికి సిద్ధంగా ఉన్న మనిషికి అది ఘోరమైన అవ మానమే.

కార్మికులు, పెట్టుబడి అవసరాలకు అనుగుణంగానే తమ సంఖ్యని మలుచుకోవాలని ఆర్థికవేత్తలు ఆశిస్తారు. మాల్థూస్‌కన్నా ఘనుడైన '**మార్కస్**' అనే ఇంగ్లీషు ఆర్థిక వేత్త, 'జనాభా పెరుగుదలని పరిమితం చెయ్యడం' గురించి రాస్తూ — '**పేద వాళ్ళ పిల్లల్ని బాధ లేకుండా చంపడానికి ఒక ప్రభుత్వ సంస్థ ఉండాల**'ని సూచించాడు. ఈ దయాళువు హృదయం పేదల పట్ల ప్రేమతో నిండి పోయింది! పేదల పిల్లల్ని చంపెయ్యాలి! కానీ 'బాధ లేకుండా!' 'బాధకి నిర్వచనం ఏమిటో' ఈ రకం కరుణా మయుడి నించే తెలుసుకోవాలి. ఈ ఆర్థిక వేత్త గాడి న్యాయ శాస్త్రంలో, పేదల్ని చంపడానికి ధనికులకు హక్కు ఉంది! ధనిక కుటుంబాల్లో పిల్లలు ఎందరు వున్నా జనాభా ఎక్కువ అవదు. పేదలే ఎక్కువ అవుతారు కాబట్టి, వాళ్ళని చంపెయ్యాలి! పేదల్లో ఎందర్ని వుంచి, ఎందర్ని చంపాలో ఈ ఆర్థికవేత్త నిర్ణయిస్తాడు!

నిజానికి, పేదలకు తగిన పోషణ లేక వాళ్ళ పిల్లల్లో అధిక సంఖ్య చచ్చిపోతూనే వుంటారు. దాని అర్థం కూడా, దోపిడీ వర్గం, పేదల్ని చంపుతున్నట్టే.

కానీ, పేదల పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు కాకపోతే, శ్రమ చెయ్యని సోమరిపోతు ధనిక మందకి తిండిపెట్టే నాథులు లేక ఆ మందంతా మల మల మాడి చావవల సిందే కదా? పేదల్ని చంపడం అంటే, తమ పీకలకు స్వయంగా ఉరి పోసుకోవడమే కదా? కానీ, ఈ విష యాలు గ్రహించేపాటి లోకజ్ఞానం కూడా లేని మూర్ఖా గ్రేసరుడు ఆ మార్కస్, 'పేదలకు తిండి చాలకుండా చేసి వాళ్ళని ప్రకృతే చంపుతుంది' అనే మాల్థూస్ సిద్ధాంతాన్ని, వీడు, 'పేదల్ని ధనికులే చంపాలి' అనే అత్యున్నత

సిద్ధాంతంగా మార్చాడు. ఈ రకంగా, ఈ ధనిక అహంకారి, మాల్థూస్ సిద్ధాంతంలో ఉన్న నీచత్వాన్ని దాని పరాకాష్టకు తీసుకు పోయాడు.

పెట్టుబడిదారీ విధానం, సమాజంలో ఒక వర్గం పూర్తిగా శ్రమకి దూరంగా ఉండడానికి వీలు నివ్వడమే గాక, శ్రమ చెయ్యడానికి సిద్ధంగా ఉన్న వర్గంలో కూడా ఎంతో భాగాన్ని, పనులు ఇవ్వలేక, శ్రమకి దూరంగా ఉంచుతుంది. ఈ విధానం, సమాజం అంతా, అతి కొద్ది మంది శ్రమపై ఆధారపడే పరిస్థితిని సృష్టిస్తుంది.

పని చెయ్యని జనాభా అంతా పనిలోకి వస్తే, పనిచేసే జనాభాకి ఎంతో భారం తగ్గుతుంది. కానీ, పెట్టుబడిదారీ విధానంలో దానికి అవకాశమే లేదు. ఈ విధానం, శ్రమ చెయ్యని వర్గాన్ని సోమరిపోతు నేరస్తులుగా చెయ్యడమే గాక, శ్రమ చెయ్యడానికి సిద్ధంగా ఉన్న వర్గాన్ని ఇతరుల దయా దాక్షిణ్యాల మీద బతికే నిస్సహాయులుగానూ, 'గతి లేక నేరాలు చేసే వారి' గానూ, 'తిరుగుబోతులు' గానూ, పెట్టుబడిదారీ వర్గానికి తోడ్పడే 'రౌడీలు'గానూ, తయారు చేస్తుంది.

ఒక పక్క — శ్రమకి లొంగని ధనిక సోమరి జనం!

రెండో పక్క — శ్రమ కోసం కలవరిస్తున్నా దానికి అవకాశాలు దొరకని నిరుద్యోగ జనం!

మూడో పక్క — మొత్తం అందరి కోసమూ శ్రమ చేస్తూ, మితిమీరిన శ్రమభారంతో సతమతమయ్యే జనం!

ఇదీ పెట్టుబడిదారీ సమాజం!

పెట్టుబడిదారీ సమాజ పరిస్థితి గురించి **సిస్మాండీ** అనే ఆర్థిక వేత్త "పనీ, విశ్రాంతీ విడిపోయాయి" అన్నాడు. కానీ, ఈ మాటలు, ఈ సమాజానికి పూర్తిగా చాలవు.

దోపిడీ వర్గానికి 'విశ్రాంతీ!'

ఉద్యోగ వర్గానికి 'పని!'

నిరుద్యోగ వర్గానికి, పనీ లేదు, విశ్రాంతీ లేదు. ఇది వింత పరిస్థితి!

ఈ సందర్భంలో మార్క్సు, ఎంగెల్సుల నించి:

"మాల్థూస్ రచన అంతా — డిఫో, సర్‌జేమ్స్ స్టువర్ట్, టౌన్‌సెండ్, ఫ్రాంక్లిన్, వాలెస్ — తదితరుల రచనల నించి కేవలం స్కూలు పిల్లవాడు కాపీ కొట్టి నంత పరమ తెలివి తక్కువ పద్ధతిలో జరిగిన గ్రంధ చౌర్యమే తప్ప, అందులో అతను స్వంతంగా ఆలో చించింది ఒక్క వాక్యం కూడా లేదు."

(కాపిటల్-1, పేజీ-578. మాస్కో ఎడిషన్, 1975).

"ఈ సిద్ధాంతంతో పోలిస్తే మోనోపలీ యుద్ధాలూ, బీభత్సాలూ ఒక లెక్కా?" — ఎంగెల్స్. (మార్క్సు అండ్ ఎంగెల్స్ ఆన్ ది పాప్యులేషన్ బాంబ్. పేజీ- 59, ది రాంపార్ట్స్ ప్రెస్, 1971).

"వెనకటి జనాభా పరిమాణాన్ని బట్టే జనాభా పెరుగుతుంది. ఆ వెనుకటి జనాభా అందించిన జ్ఞానాన్ని బట్టే సైన్సు పురోగమిస్తుంది. అతి మామూలు పరిస్థితుల్లో కూడా సైన్సు జామెట్రికల్‌గా పురోగమిస్తుంది. సైన్సుకి అసాధ్యమైనదేముంది?"

— ఎంగెల్స్ (..... పేజీ-63).

"... అదనపు జనాభాగా ఉన్నది ఖచ్చితంగా పేదలే కాబట్టి, ... ఈ పరిస్థితుల్ని మార్చలేమనీ, తక్కువ మంది పిల్లల్ని కనడం తప్ప పేదల వర్గానికి ఇంకే రకంగానూ విముక్తిలేదనీ, పేదల్ని ఒప్పించడం తప్ప, ఇంకేమీ చెయ్యలేమన్నమాట! ఇది కూడా ఆచరణ సాధ్యం కాకపోతే, ఇక ఏ రకంగా చూసినా, మార్కస్ సూచించినట్టుగా పేదల పిల్లల్ని బాధ లేకుండా చంపడానికి ఒక ప్రభుత్వ సంస్థని స్థాపించ డమే మంచిదన్నమాట! ప్రతీ కార్మిక కుటుంబం లోనూ రెండున్నర మంది పిల్లల్నే ఉంచి అదనంగా ఉన్న వాళ్ళని నాశనం చెయ్యాలన్న మాట!"

—ఎంగెల్స్ (... పేజీ - 59.)

## పెట్టుబడి విస్తరణా, ఇళ్ళ సమస్యా!

పెట్టుబడి విస్తరిస్తోన్న కొద్దీ వ్యవసాయ రంగంలోకి కూడా భారీ యంత్రాలు ప్రవేశించి, గ్రామాల శ్రామిక జనం పట్టణాలకు వలసలు రావడం తప్పనిసరి అవు తుంది. దానితో పట్టణాలలో 'ఇళ్ళ సమస్య' ప్రారంభ మవుతుంది. ('పట్టణం' అన్నా, 'నగరం' అన్నా ఒకటే).

విస్తరించే పెట్టుబడుల అవసరాల కోసం పట్టణాల లోనూ, బయటా కొత్త రోడ్లు నిర్మించవలసి వస్తుంది. ఉన్న రోడ్లని వెడల్పు చెయ్యవలసి వస్తుంది ఈ రోడ్లు, పెట్టుబడిదారుల సరుకుల్ని రవాణా చెయ్యడానికీ, వారి విలాసవంతమైన వాహనాలు మృదువుగా పరుగులు తియ్యడానికీ, నిర్మాణమవుతాయి. పెరిగే పెట్టుబడుల బిజినెస్ ట్రాఫిక్ కోసమై పెరిగే రవాణా మార్గాలూ, పెరిగే ఫ్యాక్టరీలూ, పెట్టుబడిదారుల నివాసాలకోసం పెరిగే భవంతులూ — ఇవన్నీ కలిసి పట్టణాలలో కార్మిక జనాల్ని అనారోగ్యకరమైన పల్లపు స్థలాలలోకీ, నీటి సౌకర్యాలు లేని రాతిమయమైన ప్రాంతాలలోకీ గెంటివేస్తాయి. ప్రకృతి

సహజంగా సౌకర్యాలు కలిగిన స్తలాలన్నిటినీ పెట్టుబడి దారీ వర్గం ఆక్రమిస్తుంది.

కార్మిక వర్గంలో 'ఉన్నత మేధాశ్రమల' సెక్షన్ తప్ప, మిగిలిన సెక్షన్లన్నీ పట్టణాలలో, భయంకరమైన ఇళ్ళ సమస్యలో చిక్కుకు పోతాయి.

పట్టణాలలో ఇళ్ళ అవసరాలు పెరగడంతో, 'అద్దె' లకు ఇచ్చే దృష్టితోనే ఇళ్ళు కట్టడం ప్రారంభమవుతుంది. సరుకుల ప్రపంచంలోకి, 'అద్దె ఇల్లు' అనే 'కొత్త సరుకు' ప్రవేశిస్తుంది. ఏ స్థాయి అద్దె ఇల్లు అయినా ఆరోగ్య సూత్రాల్ని పాటించడం అరుదుగా జరిగే విషయం అవుతుంది. పాత కాలపు విశాలమైన ఇళ్ళు క్రమక్రమంగా మాయమవుతాయి.

కింది స్థాయి మేధాశ్రమల ఉద్యోగులకు, ఒకటి రెండు ఇరుకు గదుల నివాసాలు తప్ప, అంతకన్నా నాలుగడుగులు ఎక్కువ స్తలాన్ని ఆశించడం 'విలాసం' అవుతుంది.

శారీరక శ్రమల జనాభా సంగతి చెప్పనే అక్కరలేదు. ఈ సెక్షన్లలో కొంచెం పై స్థాయి శ్రామికుల నివాసాలు — చిన్న చిన్న రేకు షెడ్లూ, కూలడానికి సిద్ధంగా ఉన్న పెంకు టిళ్ళ వసారాలూనూ. ఇంకా అడుగు స్థాయి శ్రామికులకు అక్షరాలా గుడిసెలే! చింకి చింకి బొంతలతో, నేలకి జానెడెత్తులో ఉండే గుడిసెలు! పట్టణపు మురుగంతా చేరే మురుగు గుంటల ప్రదేశాలలో, కిక్కిరిసిన గుడిసెల జీవితం వీరిది. ఈ మాత్రపు గుడిసెలు కూడా లేకుండా కేవలం రోడ్ల పక్కన పడివుండే జనాభా, చిట్ట చివరి సెక్షను.

'శ్రామికవర్గం'లో ఇంత భయంకరమైన ఇళ్ళ సమస్య కూడా కేవలం పెట్టుబడిదారీ సమాజపు సృష్టే. గత సమాజాలలో శ్రామికులకు ఈ రకపు ఇంటి సమస్య లేదు. బానిసలూ కౌలు రైతులూ కూడా, యజమానుల భూముల్లో నిర్మించుకున్న 'స్వంత పాకల్లో' జీవించేవారు. ఆ పాకలు సౌఖ్యవంతమైనవి కాకపోయినా, కనీసం అవి, మనుషులు నిటారుగా నించోడానికీ, కాళ్ళు చాచి పడుకోడానికీ పనికి వచ్చేంత విశాలత్వంతో ఉండేవి. పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికులు, ఆ మాత్రపు నివాసాలు కూడా లేని దుర్భర సమస్యలో పడిపోతారు. ఈ సమాజంలో, మేధాశ్రమల సెక్షన్లకు తప్ప, దాని కింది సెక్షన్లకు, ఇళ్ళల్లోకి నీటి సౌకర్యమూ, మరుగు దొడ్ల సౌకర్యమూ, డ్రైనేజి సౌకర్యమూ, ఊహాతీతమైన విషయాలు.

కార్మిక వర్గం జబ్బుల పాలయ్యేది, ఆహార లోపం వల్లనే కాదు, శుభ్రత లోపం వల్ల కూడా. కార్మిక జనం శుభ్రత కోసం ప్రయత్నిస్తే, తినే తిండిలో కొంత భాగం తగ్గించుకోవాలి. తిండి తగ్గించుకుంటేనే ఆ ఖర్చు ఇంకో దాని మీద పెట్టడం సాధ్యమవుతుంది. అంటే, కార్మికుడు కొంచెం 'శుభ్రంగా' ఉండదల్చుకుంటే, ఇంకా ఆకలిగా ఉండదల్చుకోవాలి. 'ఆకలి'కీ, 'అశుభ్రత'కీ పోటీ వస్తే, మనుషులు అశుభ్రతనే ఎంచుకుంటారు కదా?

కార్మికులు కొంత తిండి తగ్గించుకుంటే, ఆ ఖర్చుని శుభ్రత మీద పెట్టి శుభ్రతని కొంత పెంచుకోగలరా? ఇది కాస్సేపు ఉదాహరణగా మాట్లాడే మాటే గానీ, కార్మికులు పూర్తిగా తిండి మానుకుని గాలి మీదే బతికినా, శుభ్రతని అణువంత కూడా పెంచుకోలేరు. మనిషి జీవితంలో శుభ్రత ఉండాలంటే, ఇంటా బయటా చాలా విషయాలు ఉండాలి. 'శుభ్రత'కి ఇంకో పేరు 'నీళ్ళు.' శుభ్రతకి ఇంకా చాలా పేర్లు ఉన్నాయి. వాటిలో మరో పేరు — గాలీ వెలుతురూ ప్రసరించే నాలుగైదు గదుల ఇల్లు. ఆ ఇంటి చుట్టూ మొక్కలతో నిండిన కొంత ఖాళీ స్తలం. ఆ ఇంటి పెరట్లో స్నానాల గదీ, పాయిఖానా గదీ, ఉండాలి. ఆ ఇంటికి మంచి నీటి సౌకర్యమూ, డ్రైనేజి సౌకర్యమూ ఉండాలి. ఇది 'కనీసంగా' ఉండవలసిన ఇంటి పరిస్తితి. ఇక బైట పరిస్తితిని చూస్తే, వీధుల్లోనూ, పబ్లిక్ స్తలాల్లోనూ చెత్తా మురుగూ నిలబడకూడదు. ఈగలూ దోమలూ కనపడకూడదు. ఒక్క ఈగ కనపడ్డా, అది, శుభ్రతకి గొడ్డలి పెట్టు! బస్సులూ రైళ్ళూ — వంటి, ప్రతి రవాణా సాధనమూ తళ తళ లాడుతూ ఉండాలి. రంగులు పూసుకుని తళ తళ లాడడం కాదు, పరిశుభ్రతతో తళ తళ లాడుతూ ఉండాలి. ఇలాంటి ఏర్పాట్లన్నీ సమాజం 'సమిష్టి'గా సాధించవలసినవేగానీ, వ్యక్తులు విడి విడిగా సాధించగలిగేవి కావు. మనుషులు పరిశుభ్రతతో జీవించడం అంటే, ఇంటా బయటా కూడా శుభ్రతని సాధించాలి. మొత్తం సమాజం నిండా, ఇంత శుభ్రతని సాధించవలసి ఉంటే, ఇరుకు గదుల, మురికి గుడిసెల కార్మికులు, తిండి తినడం కొంత మానుకున్నా ఎంత శుభ్రతని సాధించగలరు? తమ మురికి జీవితాల్ని ఎంత తగ్గించుకోగలరు?

పెట్టుబడిదారీ సమాజం సృష్టించే ఇళ్ళ సమస్య, శ్రమచేసే మనుషుల్ని మురుగులో ఈదులాడే క్రిమి కీటకాల స్థాయిలో ఉంచుతుంది. ఈ పరిస్తితికి, ఈ దేశం ఆ దేశం అనే తేడా లేమీ లేవు. చలి దేశాలలో శ్రామికులు — కొంచెం గట్టి గోడల మధ్యా, చెక్క గోడల మధ్యా, తల దాచుకోవచ్చు. అక్కడి వాతావరణానికి అది తప్పని సరి. అంతమాత్రాన అక్కడ శ్రామికులకు సుఖవంతమైన నివాసాలున్నట్టు అర్థం కాదు. అక్కడ కూడా శ్రామిక కుటుంబాని కంతటికీ కిక్కిరిసిన 'ఒక్క గది' జీవితమే. గది మీద గది. ఇంటి మీద ఇల్లు. అతి తక్కువ ప్రదేశంలో కొన్ని వందల, వేల కుటుంబాలు! అందులో రాత్రీ పగలూ

పోట్లాటలు! బూతు తిట్ల ప్రవాహాలు! ఒక్కోసారి హత్యలూ, ఆత్మహత్యలూ! ప్రశాంతతా, నిశ్శబ్దతా, విశ్రాంతీ అనే లక్షణాలేవీ ఆ ఛాయలకు చేరలేవు!

**'సైమన్'** అనే ప్రభుత్వ వైద్యుడు (ఇంగ్లండులో) శ్రామికుల దుర్భర జీవితం గురించి ఒక రిపోర్టులో ఇలా అంటాడు:

> "మనుషులు ఒకే చోట కిక్కిరిసి జీవించే పరిస్థితి, మానవ మృదుత్వాన్ని దెబ్బతీస్తుంది. మానవ విధులన్నీ వికలత్వం పొందుతాయి. అలాంటిచోట మానవుల సెక్సువల్ నగ్నత్వం, జంతువుల నగ్నత్వం లాగ బట్టబయలుగా ఉంటుంది. ఇది జంతు స్వభావం కలదేగానీ, మానవ స్వభావం కలది కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో పెరిగే పిల్లలు, పత నాన్ని ఉగ్గుపాల నించీ నేర్చుకుంటారు. ఇలాంటి వాతావరణంలో పుట్టి పెరిగిన మనుషులు, సంస్కార వంతం గానూ, మృదువు గానూ, నాగరీకం గానూ ప్రవర్తించాలని కోరడం నిష్ప్రయోజనం. <u>నాగరికత అనేది, శారీరక, మానసిక శుభ్రతే.</u>"
>
> (కాపిటల్-1, పేజీ-616).

శారీరక, మానసిక శుభ్రతలతో పెరిగే అవకాశాలులేని మనుషులు, నాగరికంగా ప్రవర్తించడం అసాధ్యం — అన్నదే, ఈ మాటల సారాంశం. 'మహాత్ములు' అనీ, 'మహనీయులు' అనీ, ఎవరినైతే దోపిడీ సమాజాలు కీర్తి స్తాయో వారంతా చిన్నతనం నించి నిరుపేదల మురికి వాడల లోనే పెరిగి వుంటే, ఆ మహనీయులు రెండో ఏటి నించీ ముద్దు ముద్దుగా బూతు మాటలు మొదలు పెట్ట వలసిందే. పేద వాడలలో పుట్టి పెరిగే జనాభాని, 'అనాగరి కుల'నీ 'మోటు మనుషుల'నీ ధనిక సమాజం ఛీత్క రిస్తుంది. ఆ మోటు మనుషులు ఉత్పాదకం గానూ, అనుత్పాదకం గానూ చేసే సేవల్ని, విధీ విరామం లేకుండా ఇంటా బయటా రాత్రింబవళ్ళూ పొందుతూ, సోమరి తనంతో మదించి జీవించే ధనిక సమాజం, తాను చాలా 'నాగరికత' అలవరచుకున్నానని విర్రవీగుతుంది.

పెట్టుబడి విస్తరిస్తోన్న కొద్దీ, శ్రామిక జనాభాకి, ప్రకృ తిలో స్థానం కరువైపోతూ వుంటుంది. శ్రామిక నివాసాలు ఎక్కడ స్థిరపడబోయినా, 'పబ్లిక్ ఆరోగ్యమూ — పబ్లిక్ సౌందర్యమూ' భంగపడతాయనే సాకుతో, వారిని అక్కడి నించి, పెట్టుబడిదారీ యంత్రాంగం, తరిమివేస్తూ ఉంటుంది. 'పబ్లిక్ ఆరోగ్యం' అంటే — పెట్టుబడిదారుల ఆరోగ్యం! 'పబ్లిక్ సౌందర్యం' అంటే — పెట్టుబడిదారీ నివాసాల సౌందర్యం! వాటి రక్షణనే ప్రధాన బాధ్యతగా తీసుకునే పెట్టుబడిదారీ యంత్రాంగం, బికారి శ్రామిక జనాన్ని నేల మీద ఎక్కడా కాలూని నిలబడనివ్వదు. 'చట్ట పరంగా' తమకు హక్కులు లేని స్థలాల మీద నిలబడి నందుకు, ఆ జనానికి, ఆ యంత్రాంగం, శిక్షలు కూడా విధిస్తుంది.

శ్రామిక జనాభాలో కొంత భాగం, స్థిర నివాసాలు లేకుండా 'సంచార జీవితం' గడుపుతూనే జీవిస్తుంది. సున్నం బట్టీలూ, రైలు మార్గాలూ, ఇటుకల తయారీ, డ్రైనేజీ పనులూ, కట్టడాల పనులూ — వంటి పనుల్ని వెతుక్కుంటూ శ్రామికులు తాత్కాలిక నివాసాలతో సంచార జీవితాలు గడుపుతూ వుంటారు. ఈ సంచార జీవితంలో వీరు మశూచీ, కలరా, టైఫాయిడ్ వంటి అంటు రోగాల్ని తమతో పాటు మోస్తారు.

సంచార జీవితాలతో సంబంధం లేకుండా కూడా, శుభ్రతకి అవకాశం లేక కిక్కిరిసి జీవించే ఏ ప్రాంతంలో నైనా, అంటురోగాలు ప్రారంభమై వృద్ధి చెందుతాయి. అవి 'గౌరవనీయులైన' ధనవంతుల్ని కూడా వదలవు. సమా జంలో ఉండే ప్రతీ ఒక్క చెడుగూ, వెంటనే కాకపోతే కొంత ఆలస్యంగానూ, డైరెక్టుగా కాకపోతే ఇన్‌డైరెక్టు గానూ, ధని కుల్ని కూడా పట్టుకుంటుంది. సమాజంలో దోమలు ఉంటే, అవి ధనికుల్ని కూడా కుడతాయి. ధనికుల్ని కుడి తేనే వాటికి రుచికరమైన రక్తం దొరికే లాభంగాని, బక్క చిక్కిన పేదల్ని కుడితే ఏం లాభం? పెట్టుబడిదారుడి ఫ్యాక్టరీ విచ్చల విడిగా వదిలే కాలుష్యాలన్నీ, వాడి శరీరం లోకి కూడా పాకుతాయి. పెట్టుబడిదారుడు సృష్టించే యుద్ధాల్లో కురిసే బాంబులు, వాడి నెత్తి మీద కూడా పడతాయి. ఈ రకంగా, పెట్టుబడిదారుడు సృష్టించే ప్రతీ చెడుగూ వాడిని కూడా చుట్ట బెడుతుంది. వాడు చెడగొట్టే నీళ్ళే వాడూ తాగాలి. వాడు చెడగొట్టే గాలే వాడూ పీల్చాలి. వాడు చెడగొట్టే భూమి మీదే వాడూ తిరగాలి. ఈ చెడుగుల నించి తప్పుకోడానికి వాడికి వేరే ప్రపంచం లేదు. వాడు చెడగొట్టే ప్రమాద భరిత ప్రపంచం లోనే వాడు కూడా పడి వుండాలి. కానీ, వాడికి ఇదంతా గ్రహించే ఇంగితం ఉండదు. వాడి దృష్టి ఎప్పుడూ 'నిజమైన దాన్ని' చూడదు, డబ్బుని తప్ప!

సమాజంలో పెట్టుబడి విస్తరిస్తోన్న కొద్దీ, దాని అన్ని చెడుగుల లాగానే ఈ 'ఇళ్ళ సమస్య' కూడా మరింత దుర్భరమవుతూ ఉంటుంది. ఒక నాడు కొంత సహించ దగ్గట్టుగా ఉన్న రెండో స్థాయి టౌన్లు కూడా క్రమంగా నివాసానికి అయోగ్యమవుతాయి. "ప్రతీ పెద్ద పట్టణమూ మానవుల్ని బలి ఇచ్చే స్థలం లాగ ఉంది" అని శామ్యూల్ లెయింగ్ అనే ఆర్థిక వేత్త అన్నట్టు, ప్రతీ చిన్న పట్టణమూ కూడా క్రమంగా అదే స్థితికి చేరుతుంది.

# సమస్తమైన పరిశ్రమలూ పట్టణాలలోనే!

**భూ**మి మీద ఒక ప్రాంతం 'గ్రామం' అనే పేరుతో బతుకు దెరువులు లేని స్థలంగానూ; ఇంకో ప్రాంతం, 'పట్టణం' అనే పేరుతో శ్రామిక జనాలకు ఎంతో కొంత బతుకు దెరువుని ఇచ్చే స్థలంగానూ తయారయ్యే సమాజంలో, ఉన్న జనాభాలో అత్యధిక భాగం, పట్టణాలకు చేరడం తప్పనిసరి అవుతుంది. దోపిడీ వర్గం తప్పనిసరిగా 'విలాస జీవితం' గడపవలసిందే కాబట్టి, అది పూర్తిగా పట్టణాలలోనే ఉంటుంది. దానికి గ్రామాల నిండా భూములూ భవంతులూ ఉన్నప్పటికీ, ఆ భవంతుల్ని మించిన విలాస భవంతులు పట్టణాల నిండా కూడా ఉంటాయి. కాబట్టి, ఈ వర్గం, నాగరీక జీవితాన్నిచ్చే 'నగరాలను' వదిలి గ్రామాలలో కాలుపెట్టదు.

అంటే, 2 వర్గాలలోనూ అత్యధిక జనాభా పట్టణాలలోనే ఉండి తీరాలన్న మాట! అంటే, ఇళ్ళ సమస్య ఇంకా ఇంకా తీవ్రమవుతూ ఉండవలసిందే నన్నమాట!

ఈ సమస్యకి పరిష్కారం, గ్రామాన్నీ పట్టణాన్నీ సమానం చెయ్యడమే. పెట్టుబడిదారీ విధానాన్ని తీసి వేసినప్పుడే, గ్రామానికీ పట్టణానికీ ఉన్న వైరుధ్యాన్ని తీసి వెయ్యడం సాధ్యమవుతుంది. ఆ రకంగానే ఇళ్ళ సమస్యని పరిష్కరించడం సాధ్యమవుతుంది. (గ్రామానికీ, పట్టణానికీ వైరుధ్యం గురించి ఈ సంపుటం లోనే, 2 వ భాగంలో, 'భారీ పరిశ్రమ' చాప్టర్‌లో కూడా కొంత చూశాం.)

వ్యవసాయమూ, పరిశ్రమలూ దేని దారిన అది విడిపోయి ఉండడం, వ్యవసాయానికీ పరిశ్రమలకూ కూడా సహజ అవసరం కాదు. పైగా అవి కలిసి ఉండడమే రెండిటి అభివృద్ధికీ సహజ అవసరం. 'ప్రకృతి సహజంగా ఏ భూమి ఏ అవసరానికి ఉపయోగపడుతుందీ' అనే దృష్టికేమీ భిన్నం కాకుండా, వ్యవసాయాన్నీ పరిశ్రమల్నీ ఐక్యం చెయ్యవచ్చు. ఈ మార్పు, సమాజ జనాభాని ఒక సహజ పద్ధతిలో భూమి నిండా సమాన స్థాయిలో సర్దుతుంది. ఈ మార్పు, తప్పనిసరిగా 'ఆధునిక నగరాన్ని' రద్దు చేస్తుంది. ఈ రకమైన మార్పు చేసుకోకుండా పెట్టుబడిదారీ ఆలోచనా పరుల లాగ, ఆధునిక నగరాన్ని యధాతధంగా ఉంచుతూ, పరిశ్రమలన్నిటినీ అక్కడే కేంద్రీకరిస్తూ, అంతస్తుల మీద అంతస్తులతో భవనాలు కట్టడం ద్వారా ఇళ్ళ సమస్యని పరిష్కరించగల మనుకోవడం, పూర్తిగా అర్ధరహితమైన, అసహ్యమైన ఊహ.

కార్మిక వర్గం రాజకీయాధికారం తీసుకున్న వెంటనే ధనికుల ఆధీనంలో ఉన్న విలాస భవనాలన్నిటినీ స్వాధీనం చేసుకుని, వాటిని పేద జనాల నివాసాలుగా మార్చడం ద్వారా ఇళ్ళ సమస్యని పరిష్కరించడం ప్రారంభించవచ్చు.

> " పెట్టుబడిదారీ విధానం ద్వారా చిట్టచివరి స్థాయికి పోయిన 'గ్రామానికీ పట్టణానికీ మధ్య వైరుధ్యాన్ని' రద్దుచేసే ప్రయత్నాలను ప్రారంభించడానికి తగిన విధంగా సమాజం మారినప్పుడు మాత్రమే, ఇళ్ళ సమస్య పరిష్కారమవుతుంది" — ఎంగెల్స్. (ది హౌసింగ్ క్వశ్చన్. పేజీ 51. మాస్కో ఎడిషన్, 1975).

> " పెద్ద పెద్ద నగరాలను నిలిపి ఉంచాలనుకుంటూనే, ఇళ్ళ సమస్యని పరిష్కరించాలనుకోవడం అర్ధరహితం" — ఎంగెల్స్ (... పేజీ—51).

> ".... ప్రారంభంలో ప్రతీ సామాజిక విప్లవమూ, విషయాల్ని ఎలా ఉంటే అలా తీసుకుని, తనకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా, అతి ముఖ్యమైన చెడుగుల్ని తక్షణమే వదుల్చుకోవడానికి తను చేయగలిగినదంతా చెయ్యవలసి ఉంటుంది. మనం ఇప్పటికీ చూసిందేమిటంటే, ఇళ్ళ కొరతని తక్షణమే నివారించవచ్చును — అని. ఎలాగంటే, ఆస్తిపర వర్గా లకు చెందిన విలాసవంతమైన భవనాలలో ఒక భాగాన్ని స్వాధీనం చేసుకొని, వాటిలో తప్పనిసరిగా నివాసాలు ఏర్పర్చడం ద్వారా ఇళ్ళ 'కొరత'ని వెంటనే నివారించవచ్చును" — ఎంగెల్స్ (... పేజీ-51).

> ".... అనారోగ్యకరం గానూ, నాసిరకం గానూ, అస్తవ్యస్తం గానూ ఉండే ఇళ్ళను కూలగొట్టాలి" — ఎంగెల్స్ (ప్రిన్సిపుల్స్ ఆఫ్ కమ్యూనిజం. పేజీ-16. పెకింగ్ ఎడిషన్, 1977).

> " పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఉనికిలో కొనసాగినంత కాలమూ, ఇళ్ళ సమస్యని గానీ, కార్మికుల్ని బాధించే ఏ ఇతర సామాజిక సమస్యల్ని గానీ, విడిగా పరిష్కరించాలనుకోవడం పరమ మూర్ఖత్వం. పెట్టుబడిదారీ విధానాన్ని రద్దు చెయ్యడం లోనూ, కార్మిక వర్గమే సమస్త శ్రమ పరికరాలనూ, సమస్త జీవనా ధారాలనూ స్వాధీనం చేసుకోవడం లోనూ మాత్రమే పరిష్కారం ఇమిడి ఉంది" — ఎంగెల్స్. (పేజీ-74).

# విలాస వస్తువుల ఉత్పత్తి

పెట్టుబడిదారీ సమాజంలో వస్తువుల వాడకం ఉత్పాదక, అనుత్పాదక తేడాలతో ఉంటుందని ఇప్పటికే చూశాం. 'సామాజిక ఉత్పత్తి రాసి'లో కొంత భాగం ఉత్పాదకంగానూ, కొంత భాగం అనుత్పాదకం గానూ వాడకం అవుతుంది. ఉత్పత్తి సాధనాల కోసమూ, ఉత్పాదక కార్మికుల పోషణ కోసమూ ఖర్చయ్యేదంతా ఉత్పాదకం గానూ; పెట్టుబడిదారీ వర్గం కోసమూ, అనుత్పాదక కార్మికుల కోసమూ ఖర్చయ్యేదంతా అనుత్పాదక వాడకంగానూ — ఉంటాయి. అంటే, ఈ ఉత్పాదక, అనుత్పాదక ఉత్పత్తుల మధ్య ఒక 'పాళ్ళ' (ప్రపోర్షనాలిటీ) సమస్య ఉంటుంది. సమాజంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఉత్పత్తిలో కొంత భాగం ఉత్పాదక వాడకానికీ, మిగిలిన భాగం అనుత్పాదక వాడకానికీ సరిపోయే విధంగా ఉత్పత్తుల రకాలు ఉండితీరాలి. ఈ పాళ్ళను అస్తవ్యస్తం చెయ్యగల శక్తి 'విలాస వస్తువులకు' ఉంది. ఎందుకంటే, సాధారణ పోషణ ఉత్పత్తులైతే, అవసరమైతే ఉత్పాదకంగానూ, లేకపోతే అనుత్పాదకంగానూ, ఎలా కావాలంటే అలా వాడడానికి ఉపయోగపడతాయి. కాని, విలాస వస్తువులు కేవలం అనుత్పాదకంగా (దోపిడీ వర్గం కోసం) వాడడానికి మాత్రమే ఉపయోగపడతాయి. సామాజిక ఉత్పత్తుల రాసిలో విలాస వస్తువుల ఉత్పత్తే ఎక్కువగా జరిగితే, ఉత్పాదక వస్తువుల ఉత్పత్తి తగ్గిపోయి, పెట్టుబడిదారీ వర్గం తన 'అదనపు విలువ'ని కొత్త పెట్టుబడిగా మార్చే పని సాధ్యంకాకుండా పోతుంది.

<u>'విలాస వస్తువు' అంటే సాధారణ కార్మికుల 'శ్రమశక్తి విలువ'లో భాగం అవని వస్తువు.</u>

> "విలాస వస్తువులు అంటే, ఏ వస్తువులైతే పెట్టుబడిదారీ వర్గపు వాడకంలోకి మాత్రమే ప్రవేశిస్తాయో, ఏవైతే 'అదనపు విలువ'తో మారకం అవుతాయో, ఏవైతే కార్మికుల వాడకంలోకి ఎన్నడూ రావో — అవీ" — మార్క్స్. (కాపిటల్—2. పేజీ- 407. మాస్కో ఎడిషన్, 1974).

> "విలాస వస్తువులు అంటే — 'శ్రమశక్తి పునరుత్పత్తి'కి అవసరం లేని ఉత్పత్తులన్నీ" — మార్క్స్. (కాపిటల్—3. పేజీ 106. మాస్కో ఎడిషన్, 1971).

రేడియో అనేది సాధారణ కార్మికులు వాడే వస్తువుగా ఇంకా లేనప్పుడు, అది కేవలం పెట్టుబడిదారీ వర్గం వాడే విలాస వస్తువుగా ఉంటుంది. (పెట్టుబడిదారీవర్గం వాడే విలాస వస్తువుల్ని, ఉన్నత మేధాశ్రమల సెక్షన్‌లో కూడా కొంత వరకూ వాడతారు. కానీ మొత్తం కార్మిక వర్గానికి సంబంధించిన విషయాలు మాట్లాడేటప్పుడు, ఈ చిన్న భాగాన్ని లెక్కలోకి తీసుకోము). పెట్టుబడిదారీ వర్గం మాత్రమే వాడే రేడియో, క్రమంగా సాధారణ కార్మికులు కూడా వాడే పరిస్థితి వచ్చినప్పుడు, రేడియో, విలాస వస్తువుగా గాక, సమాజం మొత్తానికి జీవితావసర వస్తువుగా అయిపోతుంది. కార్మికుల జీవితాల్లోకి రేడియో ప్రవేశించేటప్పటికి, పెట్టుబడిదారుడి జీవితంలోకి ఇంకో వంద కొత్త విలాస వస్తువులు ప్రవేశించి ఉంటాయి — అనేది వేరే సంగతి.

కార్మికుల జీవితంలోకి ప్రవేశించని వస్తువే విలాస వస్తువు — అనడం అంటే, కార్మికుల జీవితంలోకి ప్రవేశించే ప్రతీ వస్తువూ జీవితావసర వస్తువే అయిపోతుందని అర్థం కాదు. కార్మికుల్లో చాలా మంది మద్యం తాగుతారనుకుందాం. సిగరెట్లు కాలుస్తారనుకుందాం. పేకాటలూ వగైరాలతో తమ ఖాళీ సమయాల్ని గడుపుతారనుకుందాం. దోపిడీ సమాజంలో, లాభాలు సంపాదించడం కోసం, వ్యసనాల్ని ప్రోత్సహించే ఉత్పత్తులు అనేకం ఉంటాయి. నిజానికి, అలాంటివి 'సహజ అవసరాలు' కావు. కానీ, కార్మిక వర్గంలో మెజారిటీ సంఖ్య, అలాంటి వ్యసనాలకే అలవాటుపడిపోయి ఉన్నప్పుడు, అవే వారి జీవితావసరాలుగా మారిపోతాయి. కానీ, <u>'జీవితావసరం' అనే మాటని సరైన అర్థంతో చూస్తే — (1) సహజమైన అవసరంగా ఉండడమూ, (2) కార్మికుల జీవితంలోకి ప్రవేశించడమూ — అనే 2 లక్షణాలూ ఉండాలి.</u> అలా ఉన్నప్పుడే, ఒక వస్తువు, 'జీవితావసర వస్తువు' అవుతుంది.

పెట్టుబడిదారీ వర్గం వాడే కొన్ని విలాస వస్తువులు 'సహజ అవసరాలు' గానే ఉంటాయి. కానీ అవి ఎక్కువ విలువైనవిగా ఉండడం వల్ల, అవి కార్మికుల జీవితంలోకి రావు. కొన్ని విలాస వస్తువులు, అసహజ ఉత్పత్తులుగా ఉంటాయి. వాటిని కార్మికులు కూడా వాడతారు. అయినా అవి జీవితావసర వస్తువులు అవవు. కుక్కల్ని పెంచడం పెట్టుబడిదారీ కుటుంబాలలో ఒక 'విలాసం'. ఈ వర్గం, ఇళ్ళల్లో కుక్కల, నక్కల పెంపకాలన్నీ కేవలం ఆడంబరాల కోసమే చేస్తుంది. లేదా దొంగల నించి కాపలా కోసం అనుకుంటే, దొంగలూ, కాపలాలూ, వాటి కోసం ఖర్చులూ వంటివి, దోపిడీ సంబంధాల వల్ల పుట్టుకు వచ్చే 'అసహజ' విషయాలే.

కార్మిక కుటుంబాలలో కూడా కుక్కల్ని పెంచడం ఉంటుంది. 'అది ఏ అవసరం కోసం జరుగుతోంది' అనే దాన్ని బట్టి, దాని స్వభావం ఉంటుంది. పశువుల పెంపకమూ, మేకల పెంపకమూ వంటి పనులు చేసే శ్రామికులు, ఆ పశువుల్ని, తోడేళ్ళవంటి క్రూర మృగాల బారి నించి రక్షించుకోవడం కోసం కుక్కల్ని పెంచితే, ఆ పని (కుక్కల పెంపకం) అసహజ శ్రమ అవదు. లేదా, జంతువుల మీదా పక్షుల మీదా ప్రేమ వల్ల వాటిని పెంచితే, అప్పుడు కూడా ఆ పని అసహజ శ్రమ అవదు. కానీ, ధనిక కుటుంబాల్ని అనుకరించాలనే దృష్టితో, ఆడంబరాల కోసమే ఆ పని చేస్తే, అది జీవితావసరం అవదు.

జంతువుల్ని ప్రేమతో పెంచడం అంటే వాటిని పంజరాల్లోనూ, బోనుల్లోనూ బంధించి పెంచడం కాదు. అలా అని, జంతువుల్ని ఒళ్ళల్లోనూ, నెత్తుల మీదా, మంచాల మీదా ఎక్కించుకుని పెంచడం కూడా కాదు. ఆత్మ రక్షణ కోసం, తప్పనిసరి అయితే తప్ప, లేకపోతే జంతువుల మీద అధికారం చెయ్యడానికీ, వాటిని బంధించడానికీ మనుషులకు హక్కు ఉండదు.

ఆడంబరాల కోసం జరిగే ఉత్పత్తులన్నీ కూడా విలాస ఉత్పత్తుల కిందకే వస్తాయి. సాధారణమైన టేకు చెక్కతో సాధారణమైన పద్ధతిలో ఒక భోజనాల బల్లని తయారు చెయ్యడానికి 100 గంటల శ్రమ కాలం ఖర్చయితే, ఎర్ర చందనం చెక్కమీద, ఏనుగు దంతపు లతల్నీ, బంగారు నక్షత్రాల్ని తాపడం చేసిన అదే సైజు బల్ల కోసం 5 వేల గంటల శ్రమ కాలం ఖర్చవుతుందనుకుందాం. మొదటి రకం బల్లా, రెండో రకం బల్లా కూడా ఒక పని కోసమే (భోజనాల కోసం) ఉపయోగపడతాయి. కానీ, పెట్టుబడిదారుడు, తన భవనంలో రెండో రకం బల్లనే ఉంచుకుంటాడు. పెట్టుబడిదారీ వర్గం అంతా అన్ని అవసరాలకూ ఆడంబరపు వస్తువులనే ఉపయోగించినప్పుడు, సమాజంలో ఖర్చయ్యే 'ఉత్పత్తి సాధనాల' లోనూ, 'సజీవ శ్రమ' లోనూ ఎక్కువ భాగం ఈ రకపు విలాస వస్తువుల ఉత్పత్తి కోసమే ఖర్చవుతుంది.

పెట్టుబడిదారీ వర్గం విలాస వస్తువుల్ని వాడడంలో ఒక వైరుధ్యం ఉంది. ఆ వర్గానికి ఉన్న ఒక అవసరం కోసం, విలాస వస్తువులు పెద్ద సంఖ్యలో ఉండాలి. ఈ అవసరం ఏమిటంటే — శ్రమతో కాలం గడిచే అవకాశం లేని మనుషులకు విలాసాలు కూడా లేకపోతే, కాలం గడపడానికి మార్గమే ఉండదు. దానికోసమే అనేక రకాల విలాసాలూ, వ్యసనాలూ కావాలి. కానీ, ఇంకో అవసరం కోసం విలాస ఉత్పత్తులు పెద్ద సంఖ్యలో ఉండకూడదు. ఈ అవసరం ఏమిటంటే — S లో ఎక్కువ భాగాన్ని ఉత్పత్తి శక్తుల్ని పెంచడానికే పెట్టాలి. అంటే, పెట్టుబడిని పెంచడానికి. అలా చెయ్యక పోతే ఇతర పెట్టుబడిదారులతో పోటీలో నిలబడడమే సాధ్యం కాదు.

దోపిడీ సోమరి జీవితం, సమాజ అదనపు విలువలో నించి ఎక్కువ భాగాన్ని విలాస వస్తువులమీదే పెట్టవలసిన అవసరాన్ని కల్పిస్తుంది. అంటే, అదనపు ఉత్పత్తుల్లో ఎక్కువ భాగం విలాస ఉత్పత్తులుగా ఉండవలసి వస్తుంది. కానీ ఇంకో వేపు — అదనపు విలువని, కొత్త పెట్టుబడిగా మార్చవలసిన పరిస్తితి, విలాస ఉత్పత్తుల మీద ఎంతో కొంత పరిమితిని విధిస్తుంది. ఎందుకంటే, అదనపు C, V లను, సరైన పాళ్ళల్లో ఉత్పత్తి చెయ్యవలసి ఉంటుంది గనక.

బట్ట పెట్టుబడిదారులంతా, ఒక సంవత్సరంలో ఉత్పత్తి చేసిన బట్టని అమ్మివేసి, అదనపు విలువలో కొంత భాగాన్ని, మళ్ళీ బట్ట పరిశ్రమలోనే కొత్త పెట్టుబడిగా మార్చదల్చుకున్నారనుకుందాం. వాళ్ళకి దారమూ వగైరాలన్నీ గతం కన్నా ఎక్కువ స్థాయిలో దొరకాలి. కానీ, దారం శాఖలో నించి కొందరు పెట్టుబడిదారులు, తమ ఉత్పత్తి స్థాయిని తగ్గించి వేసి గానీ, పూర్తిగా ఆపివేసి గానీ, అప్పటికే విలాస వస్తువుల ఉత్పత్తిలోకి పోయి ఉంటే, దారం ఉత్పత్తి తగ్గిపోయి, బట్ట పెట్టుబడిదారులకు కావలసినంత దారం దొరకదు. వాళ్ళకు దారం దొరకక పోయినా, ఇతర శాఖల ఉత్పత్తి సాధనాలైనా దొరికితే, తమ అదనపు విలువల్ని ఏదో ఒక శాఖలో మళ్ళీ పెట్టుబడిగా మార్చగలుగుతారు. కానీ, మొత్తం పెట్టుబడిదారీ వర్గం అంతా తమ అదనపు విలువలో కొంత భాగాన్ని కొత్త పెట్టుబడిగా మార్చడానికి కావలసినన్ని ఉత్పత్తి సాధనాలు సరైన పాళ్ళలో సిద్ధంగా లేకపోతే, వాటికి బదులు విలాస వస్తువులే ఉంటే, అదనపు విలువలో ఎంతో కొంత భాగం, కొత్త పెట్టుబడిగా మారకుండా ఆగిపోతుంది. విలాస ఉత్పత్తులు ఎన్ని దొరికినా వాటిని పెట్టుబడిగా మార్చలేరు. వాటిని కొంటే, అనుత్పాదకంగా మాత్రమే వాడవలసి వస్తుంది. 'సమిష్టి ప్లానులేని' ఉత్పత్తి విధానంలో, ఉత్పత్తి సాధనాలూ, పోషణ వస్తువులూ, విలాస వస్తువులూ, సరైన పాళ్ళల్లో ఉండే అవకాశం లేక పోవచ్చు. అలాంటప్పుడు కొన్ని శాఖలు త్వర త్వరగా పునరుత్పత్తి క్రమాల్ని నిర్వహించలేని సమస్యలో చిక్కుకుంటాయి. ఈ శాఖల కష్టాలు క్రమంగా వాటికి ఇటూ అటూ ఉండే శాఖలన్నిటికీ చుట్టుకుంటాయి. అంటే, ఆ శాఖలకు ఉత్పత్తి సాధనాల్ని ఇచ్చే శాఖలకూ, ఆ శాఖల ఉత్పత్తుల్ని తమకు ఉత్పత్తి సాధనాలుగా వాడే శాఖలకూ కూడా చుట్టుకుంటాయి. ఆ శాఖల పునరుత్పత్తి క్రమాలు

కూడా ఇబ్బందుల పాలవుతాయి. ఈ పరిస్థితులు శ్రామిక వర్గానికి ఒక రకం గానూ, పెట్టుబడిదారీ వర్గానికి ఇంకో రకం గానూ ఇబ్బందులు కలిగిస్తాయి. ఇలాంటి కష్ట కాలాల్లో విలాస ఉత్పత్తుల మీదా, విలాస జీవితం మీదా ఆగ్రహం కురవడం పెట్టుబడిదారీ దృష్టి నించి కూడా జరుగుతుంది.

ఇలాంటి పరిస్థితుల్లో విలాస జీవితాన్ని 'దుయ్యబట్టే' పెట్టుబడిదారీ రుషులు కూడా బైల్దేరుతారు. ఆ రుషులు — మానవుడు 'నిరాడంబరమైన, ఆదర్శనీయమైన' జీవితం గడపాలనీ, మితి మీరిన విలాసాలు మానవుడికి అనర్థహేతువులనీ — వగైరా బోధలూ, రాతలూ, కూతలూ సాగిస్తారు. అంటే, శ్రమ చెయ్యని మానవుడు, విలాస జీవితాన్ని కూడా విడనాడి, కేవలం 'తపస్సు' చేస్తూ కాల క్షేపం చెయ్యాలని, ఆ రుషుల పిచ్చి కూతల సారాంశం. ఈ రుషులూ యోగులూ, విలాస జీవితం తప్ప వేరే జీవితం లేని సోమరిపోతు దోపిడీ మందకి, విలాసాల మీద అనాసక్తత కలిగించడానికి చేసే బోధనలన్నీ వ్యర్థ ప్రేలాపాలై గాలిలో కలిసిపోతాయి.

భారీ యంత్ర విధానం ద్వారా ఆధునిక పరిశ్రమలో ఉత్పాదక శక్తులు పెరుగుతోన్న కొద్దీ పెట్టుబడిదారీ వర్గానికి విలాస జీవితం ఇంకా ఇంకా పెరిగిపోతూనే ఉంటుంది. వెనకటి దోపిడీ వర్గాల కన్నా పెట్టుబడిదారీ వర్గమే విలాస జీవితాలు ఎక్కువ స్థాయిలో గడుపుతుంది.

# నూతన సమాజంలో, విలాస ఉత్పత్తి!

నూతన సమాజంలో విలాస ఉత్పత్తి ఉంటుందా ఉండదా? — మొదట క్లుప్తమైన జవాబు: ఉండదు; ఉండకూడదు.

అసలు, 'విలాస ఉత్పత్తి' అనేదానికి గతంలో చెప్పుకున్న నిర్వచనం ప్రకారం — శ్రమశక్తి విలువలోకి చేరని ఉత్పత్తులే విలాస ఉత్పత్తులు. ఈ నిర్వచనం, అందరూ శ్రమచేసే సమాజానికి వర్తించదు.

ఆడంబరాలూ, విలాసాలూ దోపిడీ వర్గం కోసం పుట్టుకు వచ్చిన జీవిత విధానాలు. ఆ వర్గం దగ్గిర దోపిడీ శ్రమ రాసులు ఉంటాయి కాబట్టీ, ఆ వర్గానికి శ్రమద్వారా కాలక్షేపం ఉండదు కాబట్టీ, దానికి విలాసాలూ వ్యసనాలూ తప్పనిసరి కాలక్షేపాలు అవుతాయి.

కానీ, స్వంత శ్రమతో జీవించే విధానంలో, ఒక మనిషి దగ్గిర మితిమీరిన శ్రమ రాసులు ఉండవు, కాలాన్ని విలాసాలతో గడుపుకోవలసిన అవసరమూ ఉండదు.

ఒక మానవ దేహం చెయ్యగలిగే శ్రమకి ఒక పరిమితి ఉంటుంది. 'ఒక మనిషి చేసే శ్రమ' అంటే, ఒక శరీరం ఎంత శ్రమ చెయ్యగలదో అదే. మనుషులు ప్రతి రోజూ శ్రమ చెయ్యలేరు. ఏ మనిషి అయినా అనారోగ్యంగా ఉండే రోజులు కూడా ఉంటాయి. పని చెయ్యడానికి బద్ధకించే సమయాలూ ఉంటాయి. ఇతర కారణాల వల్ల పని చెయ్యలేని రోజులు ఉంటాయి. తప్పనిసరిగా విశ్రాంతిగా గడిపే సెలవు దినాలు ఉంటాయి. ఈ రోజులన్నిటినీ తీసివేస్తే, మిగిలిన రోజులే శ్రమ చేసే రోజులు. శ్రమ చేసే కాలంలో కూడా, రోజుకి 4, 5 గంటలకు మించిన శ్రమ ఉండకూడదనే షరతు పెట్టుకుందాం. ఒక మనిషి, ఒక సంవత్సర కాలంలో చేసే శ్రమే ఆ మనిషికి సంబంధించి ఒక సంవత్సరపు అవసరాలన్నిటినీ తీర్చేదిగా ఉండాలికాబట్టి, ఆ మనిషి వాడే వస్తువులన్నీ నిరాడంబరమైనవిగానే ఉండి తీరతాయి.

వస్తువులు, ఎక్కువ విలువైనవి కాకుండానే నాణ్యమైనవిగా ఉండవచ్చు. వస్తువుల్ని కల్తీ లేకుండా తయారు చేసుకుంటే, ఏ వస్తువు అయినా నాణ్యంగానే ఉంటుంది. నిత్యజీవితంలో వాడే ప్రతీ వస్తువూ (1) సౌఖ్యంగానూ (2) నాణ్యంగానూ (3) అందంగానూ — ఉండి తీరాలి. ('అందం' అనే దాన్ని 'అలంకరణ', 'ముస్తాబు'లాంటి అర్థాలతో తీసుకోకూడదు. నిర్మాణంలో అస్తవ్యస్తతా ఆడంబరమూ లేని పొందికే అందం.) ఆ లక్షణాల వల్ల అది విలాస వస్తువు అవదు. సహజ అవసరాల కోసం వాడే వస్తువు, విలాస వస్తువు అవదు.

నూతన సమాజంలో, 'విలాస వస్తువు' అనేదీ, 'విలాస జీవితం' అనేదీ, ప్రత్యేకంగా ఉండవు. సహజంగా అవసర మైన ప్రతీ వస్తువూ నిత్య జీవితావసరంగా మారిపోతుంది. కొందరికి అందుబాటులో ఉండి, కొందరికి అందుబాటులో లేని వస్తువు ఏదీ ఉండదు. ఉండకూడదు. కాబట్టి, నూతన సమాజంలో విలాస జీవితం ఉండదు — అనే చెప్పుకోవాలి.

నిత్యజీవితంలో పెట్టుబడిదారీ వర్గం చేతికి వచ్చే అదనపు ఉత్పత్తుల రాసీ, ఆ ఉత్పత్తుల రకాలూ, అనేక రెట్లు పెరిగిపోతూ ఉంటాయి. అదనపు విలువ పెరుగుతోన్నకొద్దీ పెట్టుబడిదారీ వర్గానికి ఒక వేపు మితిమీరిన విలాస జీవితమూ, ఇంకో వేపు పెట్టుబడి పెరుగుదలా, రెండూ జరుగుతూనే ఉంటాయి.

'పెట్టుబడి విస్తరణ'తో పాటు దోపిడీ వర్గానికి విలాస జీవితం పెరగడం అంటే, విలాస ఉత్పత్తులు పెరగడం మాత్రమే కాదు. పెట్టుబడిదారీ వర్గానికి సేవచేసే అను

త్పాదక శ్రామికుల సంఖ్య పెరగడం కూడా. పెట్టుబడి విస్తరణ పెరుగుతోన్న కొద్దీ, కార్మిక జనాలలో ఒక భాగం, పెట్టుబడిదారీ వర్గానికి గృహ సేవలు చేసే వంట మనుషులూ, పని మనుషులూ, బళ్ళు తోలే మనుషులూ -వంటి 'సేవకులు'గా మారడం ఎక్కువవుతూ ఉంటుంది. 'ప్రాచీన గృహ బానిసల' లాగానే, మొగ నౌకర్లూ, ఆడ నౌకర్లూ, రక రకాల పనుల కోసం పరిచారకులూ వంటి వారితో సమాజంలో ఒక 'సేవక వర్గం' (సర్వెంట్ క్లాస్) పునరుత్పత్తి అవుతూ ఉంటుంది.

1861 జనాభా లెక్కల ప్రకారం, ఇంగ్లండూ వేల్సూ దేశాల మొత్తం జనాభా — 2,00,66,224. ఇందులోంచి — (1) పసి పిల్లల్నీ, అతి వృద్ధుల్నీ, ఉత్పత్తిలో పాల్గొనని స్త్రీలనీ, ఉత్పత్తిలో పాల్గొనని యువతీ యువకుల్నీ తీసివేస్తే (2) ప్రభుత్వోద్యోగులూ, ప్రీస్టులూ, లాయర్లూ, సైనికులూ — వంటి ఐడియలాజికల్ గ్రూపుల్ని (ఆ సమాజ భావజాలానికి సంబంధించిన పనులుచేసే గ్రూపుల్ని) తీసివేస్తే (3) పెట్టుబడిదారులూ, భూస్వాములూ — వంటి శ్రమ చెయ్యని సెక్షన్లని తీసివేస్తే (4) బికారులూ (పాపర్స్), తిరుగుబోతులూ (వేగబాండ్స్), నేరస్తులూ (క్రిమినల్స్) — వంటి శ్రమ చెయ్యని 'నిరుద్యోగ జనాభా'ని తీసివేస్తే — ఈ గ్రూపులన్నిటినీ మొత్తం జనాభా నించి తీసివేస్తే, శ్రమ రంగాలకు సంబంధించిన జనాభా 80 లక్షలు మిగులుతారు. వారిలో గృహ సేవకుల సంఖ్య 12 లక్షలు! బట్టల పరిశ్రమనీ, గనుల పరిశ్రమనీ, లోహపు పరిశ్రమనీ — విడి విడిగా చూస్తే, వాటిలో ఏ శాఖలోనూ 12 లక్షల మంది కార్మికులు లేరు. గృహ సేవకుల సంఖ్యని, ఉత్పాదక శాఖల కార్మికుల సంఖ్యతో విడి విడిగా పోలిస్తే, ఒక ఉత్పాదక శాఖలో వున్న కార్మికుల సంఖ్య కన్నా ఈ సంఖ్య రెట్టింపు గానూ, ఇంకో ఉత్పాదక శాఖ సంఖ్య కన్నా ఈ సంఖ్య 2 రెట్లు గానూ, ఇంకో చోట 3 రెట్లు గానూ కూడా ఉంది. మొత్తం 80 లక్షల కార్మిక జనాభాలో 68 లక్షల మంది పెట్టుబడిదారీ వర్గానికి పరిశ్రమల్లో సేవకులు అయితే, 12 లక్షల మంది ఇళ్ళల్లో సేవకులు! ఆ దేశ పరిస్తితినే ఈ నాడు లెక్కవేస్తే, ఈ గృహ సేవకుల శాతం ఇంకా ఎంత పెరిగి ఉంటుందో!

పెట్టుబడిదారీ యంత్ర వినియోగం ఇచ్చిన అత్యద్భుత ఫలితం అన్నమాట ఇది!

## పెట్టుబడి విస్తరణ, 'ఉత్పత్తి సాధనాల' విస్తరణే!

**ప్ర**తీ విడి పెట్టుబడీ 'ఉత్పత్తి సాధనాల్ని కేంద్రీకరించే' శక్తిగా పని చేస్తుంది. ఒకనాడు బట్ట ఉత్పత్తిని ఒక స్థాయితో ప్రారంభించిన పెట్టుబడిదారుడు, క్రమంగా పెట్టుబడిని పెంచుతూ, ఉత్పత్తి స్థాయిని పెంచుతాడు. కొంత కాలానికి పెట్టుబడి ఇంకా ఎక్కువై బట్టల పరిశ్రమ ఉండగానే, 'గనుల' పరిశ్రమలోకి కూడా పోతాడు. తర్వాత 'పంచదార' పరిశ్రమలోకి కూడా. తర్వాత, ఒక 'దినపత్రిక' పెడతాడు. దాని కోసం తెచ్చిన అధునాతన అచ్చు యంత్రానికి రాత్రీ పగలూ ఫుల్ వర్క్ కల్పించడానికి, ఆ దిన పత్రికతో పాటు, వార పత్రికలూ, మాస పత్రికలూ ప్రారంభిస్తాడు. అందులోనే పిల్లల పత్రికలూ, పెద్దల పత్రికలూ, స్త్రీల పత్రికలూ, పురుషుల పత్రికలూ, సినిమా పత్రికలూ — అన్నీ స్థిరపడి పోయాక, 'పచ్చళ్ళ' పరిశ్రమలోకి దిగుతాడు. అందులో ఆవకాయలూ, దబ్బకాయలూ, నిమ్మకాయలూ, గోంగూరలూ, అన్ని రుచుల్నీ స్థాపించేశాక, 'హోటళ్ళ' వ్యాపారం — మొదలు పెడతాడు. తర్వాత సినిమాలు. ఆ తర్వాత 'సిమ్మెంట్' పరిశ్రమలోకీ, తర్వాత 'కట్టడాల' పరిశ్రమలోకీ, ఆ తర్వాత .......... ఇలా, దీనికి అంతం ఉండదు. ప్రతీ పరిశ్రమా ప్రతీ రోజూ 'అదనపు విలువ'ని ఇస్తూనే ఉంటుంది కాబట్టి, అన్ని దిక్కుల నించీ చేతికి వచ్చే అదనపు విలువ రాసులు పిచ్చిగా పెరిగిపోతూ ఉంటాయి. అది మళ్ళీ ఏదో ఒక 'పరిశ్రమ'లోకి జొరబడుతూ ఉంటుంది. అక్కడి నించీ కూడా లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ తెస్తూ ఉంటుంది. — ఈ రకంగా, ఒక పెట్టుబడిదారుడి చేతిలో ఉండే 'ఉత్పత్తి సాధనాలు' క్రమంగా పెరిగిపోతూనే ఉంటాయి.

ప్రతీ పెట్టుబడిదారుడి విషయంలోనూ ఇదే జరుగుతుంది. అక్కడక్కడా ఒక్కో పెట్టుబడి 'ఖాయిలా' పడినప్పుడు, వెంటనే అది, బలిసి మదించిన ఇంకో పెట్టుబడి నీడకు చేరి త్వరలోనే అది కూడా కొవ్వుపట్టి నిగ నిగలాడడం మొదలుపెడుతుంది. ఈ రకంగా, సమాజం మొత్తం మీద ఏటా ఉత్పత్తి అయ్యే ఉత్పత్తి సాధనాలన్నీ పెట్టుబడిగా మారిపోతూ ఉంటాయి.

పరిశ్రమలోకి దిగినప్పుడు 10 వేల పెట్టుబడితో మాత్రమే ఉన్న పెట్టుబడిదారుడు, 5, 6 సంవత్సరాల కాలం తిరిగేసరికి 10 లక్షలలోకీ, ఇంకా కొంత కాలం గడిచేసరికి 10 కోట్లలోకీ పెరిగిపోతాడు. ప్రతీ దేశంలోనూ ఈ నాడు, భారీ పెట్టుబడిదారుల పెట్టుబడులు 200 కోట్లూ, 500 కోట్లూ, 5 వేల కోట్లూ, ఇలా ఇంతింత ఊహాతీతమైన స్థాయిల్లో ఉంటాయి. <u>ఈ పెట్టుబడిదారుల, వారి ఆర్థికవేత్తల ప్రకారం 5 వేల కోట్ల పెట్టుబడి కూడా ఆ</u>


పెట్టుబడిదారుడు 'చెమటోడ్చి' సంపాదించుకున్నదే! తినీ తినకా 'పొదుపుగా' కూడబెట్టుకున్నదే!

ఒక దేశపు సామాజిక పెట్టుబడి, ఉత్పత్తి సాధనాల్ని ఏ స్థాయిలో కేంద్రీకరించగలిగిందీ అనేది, ఆ దేశ చారిత్రక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. శ్రామికుల చేతుల్లో గతంలో ఉండే ఉత్పత్తి సాధనాల్ని (కౌలు భూములూ, చేతివృత్తుల సాధనాలూ వగైరాల్ని) పెట్టుబడి ఎంత వరకూ లాగి వెయ్యగలిగిందీ — అనే అంశం మీద, ఈ విషయం, ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. ఇది (శ్రామికుల్ని ఉత్పత్తి సాధనాలకు దూరం చెయ్యడం అనేది) వేరు వేరు దేశాల్లో, వేరు వేరు స్థాయిల్లో ఉంటుంది. కొన్నిచోట్ల, శ్రామికుల్లో కొంతభాగం, 'వేతన శ్రామికులు'గా ఉంటూనే కొద్దిపాటి భూములు కలిగిన వారిగా కూడా ఉంటారు. కొన్నిచోట్ల, శ్రామికుల్లో చాలా అధిక భాగం, పూర్తిగా నిరాస్తిపరులుగా ఉంటారు. ఈ రకంగా, వేతన శ్రామికులు, ఉత్పత్తి సాధనాలకు దూరం అవడం అనే విషయం వేరు వేరు దేశాల్లో కొన్ని కొన్ని తేడాలతో ఉంటుంది.

అంతేగాక, వేరు వేరు దేశాల ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో కూడా చాలా తేడాలు ఉంటాయి. దానివల్ల, 'దోపిడీ రేటు'లో (అదనపు విలువ రేటులో) తేడాలు ఉంటాయి.

సమాజం మొత్తం మీద, పెట్టుబడిదారీ వర్గం, 'అదనపు శ్రమ'ని ఎక్కువ స్థాయిలో లాగగలిగితే, పెట్టుబడి విస్తరణ ఎక్కువ స్థాయి లోనూ, లేదా, తక్కువ స్థాయి లోనూ ఉంటుంది. అంటే, పెట్టుబడి విస్తరణలో ఎక్కువ తక్కువలు, 'అదనపు శ్రమ'ని లాగడంలో ఎక్కువ తక్కువలే. పెట్టుబడిదారీ వర్గం, అదనపు శ్రమని ఏ స్థాయిలో లాగగలుగుతోందీ అనేది, దానికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేసే ప్రతిఘటన ఏ స్థాయిలో ఉందీ అనే దానిమీద ఆధారపడి ఉంటుంది.

## పెట్టుబడిదారీ విధానం 'సర్క్యులర్' కాదు; స్పైరల్!



సర్క్యులర్



స్పైరల్

సర్క్యులర్ అంటే — ఒక తీగ చుట్ట, గుండ్రంగా ఒకే స్థాయిలో చుట్టలు చుట్టుకుంటూ కింద నించి పైకి పోయే రూపం.

స్పైరల్ అంటే — అడుగు చుట్ట కన్నా దాని పైచుట్ట పెద్దదిగా, అలా పెద్ద పెద్ద చుట్టలు చుట్టుకుంటూ పోయే రూపం.

పెట్టుబడిదారీ పునరుత్పత్తి ఎప్పుడూ గతం కన్నా పెరుగుతూ పోయేదే కాబట్టి అది సర్క్యులర్ కాదు. అది ఒక ఏడాది కన్నా ఒక ఏడాది ఎక్కువ స్థాయిలో జరిగే విస్తృత పునరుత్పత్తే.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని సిస్మాండీ మాటల్లో చెప్తే — 'స్పైరల్'. పెట్టుబడిదారీ విధానం గురించి ఇలా చెప్పిన సిస్మాండీకి, దాని అదనపు విలువ మాత్రం తెలుసునని అర్థం కాదు. 'అంతర్గత' కారణాల్ని గ్రహించకుండా కూడా బాహ్య చిహ్నాల్ని చాలా ఖచ్చితంగా వివరించవచ్చు. ఎందుకంటే, ఆ చిహ్నాలు (మొదట చిన్న పెట్టుబడిగా వున్నది, క్రమంగా పెరుగుతూ వుండడం) పైకే కనపడుతూ ఉంటాయి గనక. అలాంటి వివరణలు చాలా అంశాలలో చాలా మంది ఆర్థిక వేత్తలు ఇచ్చారు.

పెట్టుబడిదారీ విధానపు చెడుగులు (వైరుధ్యాలు) ఎప్పుడూ ఒకే స్థితిలో ఉండవు. ఎప్పుడూ ఒకే వేగంతో వృద్ధి చెందవు. వేరు వేరు పరిస్థితుల్ని బట్టీ, అవకాశాల్ని బట్టీ, అవి ఒక సారి మందగొడి గానూ, ఒక సారి తీవ్రం గానూ ప్రవర్తిస్తాయి.

'అదనపు విలువ'ని పెట్టుబడిదారీ వర్గం స్వాధీనం చేసుకోవడంతో ప్రారంభమయ్యే ఈ విధానపు వైరుధ్యాలు, ఈ విధానం 'పోటీ' అనే గోదాలోకి దిగి 'రెలెటివ్ అదనపు విలువ కోసం ఉత్పత్తి' దశకు ('ఉత్పత్తి కోసం ఉత్పత్తి' దశకు) చేరిన క్షణం నించీ, విజృంభించడం ప్రారంభిస్తాయి.

'అదనపు విలువ'ని తక్కువగా స్వాధీనం చేసుకోగలిగే పరిస్తితి కన్నా, ఎక్కువగా స్వాధీనం చేసుకోగలిగే పరిస్తితి, ఎక్కువ వైరుధ్య పూరితంగా ఉంటుంది. స్వాధీనం చేసుకున్న అదనపు విలువని పూర్తిగా స్వంత పోషణకు ఖర్చుపెట్టే పరిస్తితి కన్నా, దాంట్లో కొంత భాగాన్ని పెట్టుబడిగా మార్చే పరిస్తితి, ఎక్కువ వైరుధ్య పూరితంగా ఉంటుంది. 'అదనపు విలువ'ని పెట్టుబడిగా మార్చడంలో కూడా, తక్కువ భాగాన్ని పెట్టుబడిగా మార్చే పరిస్తితి కన్నా, ఎక్కువ భాగాన్ని పెట్టుబడిగా మార్చే పరిస్తితి, ఎక్కువ వైరుధ్య పూరితంగా ఉంటుంది. 'అదనపు విలువ రేటు' పెరుగుతూ, పెట్టుబడి విస్తరణ రేటు కూడా పెరుగుతోన్న కొద్దీ, దాని వైరుధ్యాలు తీవ్రమవుతూ ఉంటాయి.

పెట్టుబడి విస్తరణ ఏ పాళ్ళలో పెరిగితే, కార్మిక వర్గ దుస్తితి ఆ పాళ్ళలో పెరగవలసిందే. ఏ వర్గమైతే తన శ్రమనీ, తన రక్త మాంసాల్నీ పెట్టుబడిగా ఇస్తూ ఉంటుందో, ఆ వర్గానికి ఆ పెట్టుబడి వల్ల నిత్య దరిద్రం, అజ్ఞానం, బానిసత్వం, జంతుత్వం, నైతిక పతనం, అన్నీ సంక్రమిస్తూ వుంటాయి. కుప్పతెప్పలుగా ఉత్పత్తి రాసులు ఉన్న నగరాలలోనే విపరీతమైన పేదతనం తాండవిస్తూ ఉంటుంది. ఒక పక్క — పెట్టుబడిదారీ వర్గం ఏం చేసుకోవడానికీ మార్గం లేనంత కలిమీ, ఇంకో పక్క — శ్రామిక జనాలు కుక్కల కన్నా పందుల కన్నా హీనంగా బతకవలసినంత లేమీ! ఒక పక్క — నిత్య విలాసాలూ అట్టహాసాలూ, ఇంకోపక్క — నిత్య దుఃఖమూ దుర్భరత్వమూ! — పెట్టు బడిదారీ విస్తరణ, ఈ 2 లక్షణాల్నీ ఒక ఏడాది కన్నా ఒక ఏడాది పెంచివేస్తూ ఉంటుంది.

## పెట్టుబడి విస్తరణ, కార్మికుల విస్తరణ కూడా!

ప్రతీ విడి పెట్టుబడీ, ఒక వేపు ఉత్పత్తి సాధనాల్నీ, ఒక వేపు కార్మిక రాసినీ కూడా పెంచే శక్తిగా పనిచేస్తూ ఉంటుంది. పెట్టుబడుల పెరుగుదలా, కార్మిక రాసుల పెరుగుదలా, ఒకే సంబంధానికి ఉన్న రెండు ఫలితాలు. పెట్టుబడుల కూడిక — కార్మికుల కూడిక కూడా. పెట్టుబడిదారీ ఆస్తుల కూడిక — కార్మిక జనాల బాధల, సమస్యల కూడిక కూడా. ఈ పరిణామం అంతా, శ్రమశక్తికీ, శ్రమ పరిస్తితులకూ మధ్యవున్న వైరుధ్య పూరిత సంబంధాల్ని రద్దుచేసే 'నూతన ఉత్పత్తి విధానా'నికి కావలసిన పునాదిని సమకూరుస్తుంది. పెట్టుబడిని ప్రతిఘటించగల 'విప్లవశక్తి' తయారు కావడమే — ఆ పునాది. పెట్టుబడిదారీ విధానం నించే కార్మిక వర్గం శ్రమ దోపిడీని గ్రహించిన విప్లవ శక్తిగా ఆవిర్భవిస్తుంది. అది, పెట్టుబడి ఆధిక్యతను కూలదోసి, దాని ఉత్పత్తి విధానాన్ని రద్దు చేసి, యుగయుగాల దోపిడీ నించి తనను తను విముక్తి చేసుకుంటూ, 'నూతన ప్రపంచాన్ని' నిర్మించే మార్గంలో ప్రయాణం ప్రారంభిస్తుంది.

పెట్టుబడిదారీ హద్దులలో నిలిచిపోయే ఆలోచనాపరులకు ఇదంతా అయోమయంగానూ, అతిశయంగానూ కనపడుతుంది. ఇదంతా వారికి ఎంత దుర్భరమో, భవిష్యత్తు గురించి అంత భీతి కూడా!

# నూతన ఉత్పత్తి విధానం స్పైరల్ కాదు; సర్క్యులర్!

**నూ**తన సమాజంలో అందరూ శ్రమ చేస్తారు. ఎవరి శ్రమ వారి కోసం ఉపయోగపడుతుంది. ఇది, మొట్టమొదటి షరతు.

ప్రతీ వ్యక్తీ (స్త్రీ పురుషులిద్దరూ) తనని తను పోషించుకోవాలి. తన బిడ్డల్నీ, తన కుటుంబంలో వృద్ధుల్నీ పోషించాలి. ఇదేగాక, సమాజానికి సంబంధించిన కొన్ని రకాల ఖర్చుల్లో భాగం పంచుకోవాలి. ఇదంతా కలిసినదే వ్యక్తి బాధ్యత. ఈ బాధ్యతని నిర్వహించడం అంటే అది, ఎవరి కోసం వారు శ్రమచేసుకోవడమే.

నూతన సమాజంలో, సింపుల్ పునరుత్పత్తి ఉంటుందా, విస్తృత పునరుత్పత్తి ఉంటుందా? — దీనికి మొదట క్లుప్తమైన జవాబు — సమాజంలో అప్పటి పరిస్తితుల్లో ఉన్న అవసరాల్నిబట్టి, పునరుత్పత్తిని ఎలా ప్లాన్ చేస్తే అలా ఉంటుంది. కానీ ప్రారంభంలో కొంతకాలం వరకూ ఉత్పత్తి సాధనాల్ని పెంచుకోవలసి వుంటుంది. విస్తృత పునరుత్పత్తే అవసరమవుతుంది. కానీ, అది పెట్టుబడిదారీ విస్తృత పునరుత్పత్తి లాంటిదిగా ఉండదు. దీని సారాంశం, సింపుల్ పునరుత్పత్తితో సమానంగా ఉంటుంది — ఈ విషయాలు కొంత వివరంగా చూడాలి.

పెట్టుబడిదారీ విధానం నించి నూతన విధానం ప్రారంభమైనప్పుడు, కార్మిక జనాభా అంతా చాలా పేదతనంలోనే ఉంటారు. వారి అవసరాలన్నీ తీరాలంటే,

సమాజంలో ఎన్నో కొత్త ఉత్పత్తులు అవసరమవుతాయి. అంతేగాక, కొత్త రకాల ఉపయోగపు విలువల కోసమూ, ఉత్పత్తి శక్తుల పెరుగుదల కోసమూ, అనేక పరిశోధనలు చేసుకోవలసి ఉంటుంది. ఈ అవసరాలన్నిటికీ ఎక్కువ శ్రమ కావాలి. ఖర్చయిన ఉత్పత్తుల్ని మాత్రమే పునరుత్పత్తి చేసుకోవడం అయితే, ఉత్పత్తుల స్థాయిని పెంచుకోవడం సాధ్యమే కాదు.

కాబట్టి, నూతన సమాజంలో కూడా ఇంకా తీరవల సిన అవసరాల కోసం రోజువారీగా అవసరమయ్యే శ్రమ కన్నా ఎక్కువ శ్రమ చేసుకోవాలి. కానీ, ఆ ఎక్కువ శ్రమకి 'అదనపు శ్రమ' అనే పేరు పనికి రాదు. ఆ ఎక్కువ శ్రమని కూడా ఆ జనాభాయే వాడతారు కాబట్టి, ఈ పరిస్తితి, పెట్టుబడిదారీ విధానంలో ఏర్పడే విస్తరణ వైరుధ్యాల్ని సృష్టించదు.

పెట్టుబడిదారీ విధానంలో, ఉత్పత్తి సాధనాల పెరుగుదల, పునరుత్పత్తిలోనే భాగమైపోయి ఉంటుంది. ఆ విధానంలో ఆ పెరుగుదలని లేకుండా చెయ్యడం సాధ్యం కాదు. కానీ, నూతన విధానంలో ప్రత్యేకంగా ప్లాను చేసుకుంటేనే అది జరుగుతుంది. వేరు వేరు శాఖల్లో ఉత్పత్తుల రకాల్నిపెంచడం గానీ తగ్గించడం గానీ, ఇక్కడ, సమాజ అవసరాల మీదే ఆధారపడి ఉంటుంది. అవసరాల్నిబట్టి ప్లాన్ చేసుకోవడమే నూతన విధానపు లక్షణంగా ఉంటుంది.

ఒక శాస్త్ర విషయాన్ని చూసేటప్పుడు, మొదట దాన్ని 'స్వచ్ఛరూపం'లోనే (ప్యూర్ ఫామ్‌లో) చూడాలి. ఆచరణలో అది ఎన్ని తప్పొప్పులతోనో, ఎన్ని అవక తవకలతోనో జరిగితే జరగవచ్చు. అదంతా తర్వాత సంగతి. మొదట దాని జనరల్ సూత్రం అర్థం చేసుకుంటే, దాని మీద ఆధారపడుతూ ఏ ప్రత్యేక పరిస్తితిని అయినా అర్థం చేసుకోగలం.

శ్రమ చేసే మనిషి, తను వాడే శ్రమ కన్నా ఎక్కువ శ్రమ చెయ్యడం — అనే విషయం, యజమానీ శ్రామిక సంబం ధాల్లో ఎలా ఉంటుందో మనకు తెలుసు. శ్రామికుడు చేసే శ్రమలో కొంత భాగం యజమానికి పోతూ ఉంటుంది కాబట్టి, అక్కడ అదనపు శ్రమ రోజూ జరగడం సాధ్యమే. ఆ సంబంధంలో, ఆ శ్రామికుడు చేసే శ్రమ కన్నా స్వంతానికి వాడే శ్రమ ఎప్పుడూ తక్కువ గానే ఉంటుంది.

కానీ, యజమానీ శ్రామిక సంబంధాలు లేని విధా నాన్ని, అంటే ఒక మనిషి చేసే శ్రమ అంతా ఆ మనిషికే అందే విధానాన్ని ఊహిస్తే, ఆ మనిషి చేసే శ్రమా, ఆ కాలంలో అతను వాడే శ్రమా, రెండూ ఒకే పరిమాణంలో ఉంటాయి.

అయితే, ఒక మనిషి వాడే శ్రమా, తిరిగి చేసే శ్రమా ఒకే పరిమాణంలో వుంటే, అక్కడ 'విస్తృత పునరుత్పత్తి' సాధ్య మవుతుందా? విస్తృత పునరుత్పత్తి లేకుండా సమాజ అవసరాలు తీరతాయా? నూతన సమాజంలో విస్తృత పునరుత్పత్తే ఉండదా? విస్తృత పునరుత్పత్తి జరిగేచోట ఆ ఉత్పత్తి క్రమం స్పైరల్ కాకుండా సర్క్యులర్ అవుతుందా? — ఈ విషయాలన్నీ ఇక్కడ సరిగా అర్థం చేసుకోవాలి.

ఇంతకు ముందు, 2వ భాగంలో, 'పని దినం' చాప్టరులో, 'నూతన సమాజంలో పని దినం 2 భాగాలుగా ఉంటుందా?' అని చూశాం. నూతన పని దినం కూడా 'జీతాలూ — సమాజ నిధీ' అనే భాగాలుగా ఉంటుందనీ, కానీ రెండో భాగం అదనపు శ్రమ అవదనీ — చూశాం. అదే విషయం ఇక్కడ కొంచెం వివరంగా చూస్తాం.

**నూతన సమాజంలో ఒక మనిషి, తను వాడే శ్రమకన్నా ఎక్కువ శ్రమ చెయ్యడం ఉంటుందా?**

దీనికి మొదట క్లుప్తంగా జవాబు — అలా ఉండదు. అవసరమైతే, గతం కన్నా ఎక్కువ శ్రమ చెయ్యడం ఉంటుంది. కానీ అది, వాడే శ్రమకన్నా ఎక్కువ శ్రమ అవదు.

ఒక ఉత్పత్తి క్రమాన్ని, అది దోపిడీ విధానంలో ఉందా, దోపిడీ లేని విధానంలో ఉందా — అనే మాటలు లేకుండా, సహజంగా జరిగే పద్ధతిలో చూద్దాం. ఉత్పత్తి క్రమం జరగా లంటే, దానికి ఉత్పత్తి సాధనాలూ (MP = మీన్స్ ఆఫ్ ప్రొడక్షన్); సజీవ శ్రమా (L = లేబర్) కావాలి.

ఒక పని కాలం 8 గంటలు. ఆ కాలంలో, ఒక మనిషి 10 వస్తువులు తయారు చేస్తాడు. దానికి, ఉత్పత్తి సాధనాలు 80; సజీవ శ్రమ 40. ఆ వస్తువుల కోసం మొత్తం శ్రమ = 80MP + 40 L = 120.

ఆ మనిషి, 8 గంటల్లో చేసిన తన 40 శ్రమని (40 విలువగల ఉత్పత్తుల్ని) ఒక రోజంతా (24 గంటల్లో) తన పోషణ కోసం వాడుకోవాలి. ('పోషణ' అన్నప్పుడు, ఆ మనిషి, ఒక రోజులో, ఇంటా బైటా కలిసివాడేదీ; ఆ మనిషి నిర్వహించవలసిన బాధ్యతల కోసం అవసరమయ్యేదీ — అదంతా కలిసే అందులో ఉంటుందని అర్థం.)

ఆ మనిషి, ఒక రోజులో 40 విలువ గల శ్రమని తన పోషణ కోసం వాడుతూ, అదే కాలంలో, పని స్తలంలో, మళ్ళీ 40 విలువ గల శ్రమ చేశాడనుకుందాం. తర్వాత పని ఆగిపోతుంది. పని కాలం ముగుస్తుంది. దీని అర్థం ఏమిటి? మనిషి, తన పోషణ కోసం ఎంత శ్రమని ఖర్చుపెట్టాడో అంత శ్రమనే తిరిగి చేశాడని అర్థం. ఆ మనిషి మళ్ళీ ఆ 40 కొత్త శ్రమని వాడుకుంటూ మర్నాడు కూడా మళ్ళీ 40 కొత్త శ్రమ చేస్తాడు. రోజూ 40 శ్రమ చేస్తూ దాన్ని తనే వాడు కుంటూ ఉంటాడు. ఇక్కడ, చేసే శ్రమ, వాడే శ్రమ కన్నా

ఎక్కువగా లేదు. ఇక్కడ 40 అనేది — శ్రమ విలువ గానూ అవుతుంది; శ్రమ శక్తి విలువ గానూ అవుతుంది. ఇక్కడ ఆ రెంటికీ తేడా లేదు. రెండూ ఒకటే.

ఇదే ఉదాహరణని పెట్టుబడిదారీ సంబంధాల్లో చూస్తే, ఆ మనిషి చేసే 40 శ్రమ, $V+S$ లుగా చీలుతుంది. $30V+10S$ లుగా అనుకుంటే, ఆ మనిషి, రోజూ 40 శ్రమ చేస్తూ, 30ని తన కోసం వాడుకుంటూ 10ని యజమాని కోసం పోగొట్టుకుంటూ ఉంటాడు. ఇక్కడ, శ్రమ శక్తి విలువ — 30. శ్రమ విలువ — 40. మొదటి దానికన్నా రెండోది ఎప్పుడూ ఎక్కువ. ఇక్కడ, శ్రామికుడు వాడే శ్రమ కన్నా, తిరిగి చేసే శ్రమ ఎక్కువగా ఉండడం రోజూ జరుగుతూ ఉంటుంది.

ఇదే ఉదాహరణని నూతన విధానంలో చూద్దాం. ఒక మనిషి రోజూ 40 శ్రమ చేస్తాడు. అది 2 భాగాలుగా చీలుతుంది.

ఈ ఉదాహరణలో, సజీవ శ్రమని, పెట్టుబడిదారీ విధానంలో లాగ V, S గుర్తులతోనే చెప్పుకుంటే అది, ఈ నూతన సమాజపు సంబంధాలకు పనికిరాదు. S యే లేని చోట శ్రమలో ఒక భాగానికి S అనే పేరు ఎలా పెడతాం? కాబట్టి, ఇక్కడ ఈ 2 భాగాలకూ వేరే రకంగా తగిన గుర్తులు పెట్టుకోవాలి.

సజీవ శ్రమని L (లేబర్) అందాం. ఇది 40.

L, 2 భాగాలుగా చీలాలి కాబట్టి, ఆ భాగాల్ని $L_1, L_2$ అందాం.

$L_1$ = జీతం, ఇది 30 అనుకుందాం.

$L_2$ = సమాజ నిధి. ఇది 10.

సమాజ నిధి భాగం కూడా ఆ మనిషి నిర్వహించ వలసిన బాధ్యతల కోసమే కాబట్టి, ఆ భాగం కూడా ఆ మనిషికి అందినట్టే అర్థం.

అంటే, ఆ వ్యక్తి వాడే శ్రమ — 40

అదే కాలంలో, తిరిగి చేసే శ్రమ — 40

ఇక్కడ, వాడే శ్రమ కన్నా తిరిగి చేసే శ్రమ ఎక్కువగా లేదు. ఈ చేసిన శ్రమ అంతా కొత్తగా చేసినదే. కానీ అది, అంతకు ముందు వున్న శ్రమని వాడుకుని, దానికి బదులుగా చేసినదే. ఆ శ్రమ 2 భాగాలుగా చీలినా, అందులో 2 వ భాగం, వాడుకున్న శ్రమ కన్నా ఎక్కువగా జరిగినది కాదు.

ఇలా వుండగా, కొన్ని ఎక్కువ అవసరాల కోసం, కొన్ని ఎక్కువ ఉత్పత్తులు కావాలనుకుందాం. దాని కోసం ప్రతి వ్యక్తీ కొంత ఎక్కువ శ్రమ చెయ్యాలనుకుందాం. దేని కన్నా ఎక్కువ? గతంలో చేస్తూ వున్న 40 కన్నా ఎక్కువ. ఆ ఎక్కువని 20 అనుకుందాం. ఇప్పుడు ఆ వ్యక్తి రోజూ చేసే శ్రమ 40 + 20 = 60 అవుతుంది. ఈ 60 శ్రమ కూడా, 3 : 1 పాళ్ళలోనే చీలితే, అది, $45L_1 + 15L_2$లుగా అవుతుంది.

ఈ 60 శ్రమ జరగడానికి గతం కన్నా ఎక్కువ కాలం పడుతుంది. లేదా, ఉత్పాదక శక్తి గతం కన్నా కొంత పెరిగి వుంటే, ఎక్కువ ఉత్పత్తులు రావడానికి కూడా అదే కాలం సరిపోవచ్చు. పని కాలం పెరగకుండానే, అంటే, ఎక్కువ శ్రమ లేకుండానే, ఉత్పత్తులు పెరగవచ్చు. కానీ, ఈ ఉదాహ రణలో, ఉత్పాదక శక్తి గతంలో లాగే ఉండగా 20 ఎక్కువ శ్రమ జరగాలనుకుందాం. అప్పుడు 60 శ్రమ జరగడానికి శ్రమ కాలం పెరగవలసిందే. దీనికి అవసర మయ్యే ఉత్పత్తి సాధనాలు 80 కాదు, 80 + 40 = 120.

ఇప్పుడు తయారయ్యే వస్తువులు 10 + 5 = 15.

ఇప్పుడు జరిగే శ్రమ అంతా, ఆ వ్యక్తి కోసమే ఖర్చవుతుంది.

ఈ 15 వస్తువుల విలువ =

$$120\,MP + 45\,L_1 + 15L_2 = 180$$

ఈ కొత్త ఉదాహరణ ప్రకారం,

ఈ వ్యక్తి, రోజూ వాడే శ్రమ — 60

రోజూ చేసే శ్రమ — 60

ఈ వ్యక్తి వాడినంత శ్రమనే తిరిగి చేస్తాడు. లేదా, చేసినంత శ్రమనే తన కోసం వాడతాడు.

గతంలో 40 శ్రమ చేసే వ్యక్తి, ఇప్పుడు 60 శ్రమ చెయ్యడం అంటే, గతం కన్నా ఎక్కువ శ్రమ చేస్తున్నట్టే అర్థం. కానీ, అది, తను వాడే శ్రమ కన్నా ఎక్కువ శ్రమ చేస్తున్నట్టు కాదు.

ఇప్పుడు, ఈ ఉదాహరణ చూడండి! ఇలా జరగడం సాధ్యమవుతుందా, చూడండి! — నూతన సంబంధాల్లో ఉన్న ఒక వ్యక్తి, రోజూ 60 శ్రమ చేస్తూ, తన పోషణ కోసం ఇంటా బైటా కలిసి 40ని మాత్రమే వాడుతూ, ఆ రకంగా రోజూ ఎక్కువ శ్రమ చెయ్యడం (వాడిన దాని కన్నా ఎక్కువ శ్రమ చెయ్యడం) ఉంటుందా?

ఒక శ్రమ ఏ రోజున జరుగుతుందో ఆ రోజునే అది ఆ వ్యక్తికి అందదు. వ్యవసాయ శ్రమ ఇవ్వాళ జరిగితే, అది కొన్ని నెలల తర్వాతే ఆ వ్యక్తికి అందుతుంది. బట్టలు నేసే శ్రమ ఇవ్వాళ చేస్తే, అది కూడా కొంతకాలం తర్వాతే అందుతుంది.

ఒక వ్యక్తి చేసిన శ్రమ, ఆ వ్యక్తికి అదే రోజున అందిందా, కొంతకాలం తర్వాత అందిందా — అనేది సమస్య కాదు. అసలు అందిందా, లేదా — అనేదే అసలు విషయం.

ఒక వ్యక్తి రోజూ 60 శ్రమ చేస్తే, ఒక రోజులో అతను ఇంటా బైటా కలిసి వాడే శ్రమ కూడా 60గా ఉండి తీరాలి. వ్యక్తికోసం ఖర్చయ్యేది ఎన్ని భాగాలుగా చీలినా, అది ఆ వ్యక్తికి ఏయే పద్ధతుల్లో అందినా, ఆ భాగాలన్నీ కలిసిన మొత్తం, ఆ వ్యక్తి చేసిన శ్రమతో సమానంగానే ఉండాలి.

ఒక వ్యక్తి రోజూ 60 శ్రమ చేస్తాడు. అది ఆ వ్యక్తికి రోజూ $40L_1, 20L_2$ భాగాలుగా అందుతుందనుకుందాం.

| | | | |
|---|---|---|---|
| నిన్న చేసిన శ్రమ | 60 | నిన్న వాడిన శ్రమ | 40 + 20 |
| నేడు చేసిన శ్రమ | 60 | నేడు వాడే శ్రమ | 40 + 20 |
| రేపు చేసే శ్రమ | 60 | రేపు వాడే శ్రమ | 40 + 20 |
| రోజూ చేసే శ్రమ | 60 | రోజూ వాడే శ్రమ | 40 + 20 |

దీని అర్థం ఏమిటి? — నూతన శ్రమ సంబంధాల్లో, వాడే శ్రమ కన్నా, చేసే శ్రమ ఎక్కువగా వుండడం సాధ్యమే కాదు. అంటే, ఇక్కడ అదనపు శ్రమ ఉండడం సాధ్యం కాదు.

నూతన సమాజంలో, పని దినం 6 గంటలు అయితే, ఒక వ్యక్తి 6 గంటలు పని చేసి, తన కోసం 6 గంటల శ్రమని వాడుకుంటాడు. లేదా, పని దినం 7 గంటలు అయితే, ఆ వ్యక్తి, 7 గంటలు పని చేసి, 7 గంటల శ్రమని వాడుకుంటాడు. ఈ రకంగా, ఎవరి శ్రమ వారికే దక్కే సూత్రంతో చూస్తే, పని దినం ఎంత వున్నా, అందులో అదనపు శ్రమ ఉండదు.

కాబట్టి, ఈ ఉదాహరణలో మొదట్లో చెప్పుకున్నట్టు, 'ఒక వ్యక్తి రోజూ 60 శ్రమ చేస్తూ 40 శ్రమని మాత్రమే వాడుతూ' అని చెప్పుకోవడమే తప్పు అవుతుంది. '60 శ్రమ, చేస్తూ, 60 శ్రమ వాడుతూ వున్న' సందర్భం గురించి, '60 చేస్తూ, 40 వాడుతూ' అని ఎలా చెప్పుకుంటాం? ఉదాహరణని అలా తీసుకోవడం ఈ సందర్భానికి పనికే రాదు.

వాడే శ్రమకీ, చేసే శ్రమకీ తేడా లేనిచోట, శ్రమ విలువ అయినా అదే; శ్రమ శక్తి విలువ అయినా అదే.

నూతన సమాజంలో, అందరూ శ్రమ చేస్తారు — అనే అవగాహనతోనే ఇక్కడ విషయాలన్నీ చూస్తాము.

ఈ సమాజానికి ప్రారంభంలో, కొత్తగా చేసుకోవలసిన అనేక పనులు ఉంటాయి. వాటిని కొన్ని రకాలుగా విభజించవచ్చు.

**(1)** రోజువారీగా వాడే ఉత్పత్తుల్ని పెంచుకోవడం కోసం: దీని కోసం ప్రతీ వ్యక్తీ గతం కన్నా ఎక్కువ శ్రమ చెయ్యాలి.

**(2)** సమాజంలో అంత వరకూ లేని కొత్త ఉపయోగపు విలువల కోసం: దీని కోసం కూడా ప్రతీ వ్యక్తి ఎక్కువ శ్రమ చెయ్యవలిసిందే.

**(3)** జనాభా పెరుగుదల వల్ల, ఉత్పత్తి స్థాయిని పెంచడం కోసం: దీని కోసం ఎవరూ ఎక్కువ శ్రమ చెయ్యనక్కరలేదు. ఎందుకంటే, పెరిగే జనాభా ఎవరి శ్రమ వాళ్ళే చేసుకుంటారు.

ఈ 3 విషయాల్లో, 1, 2 విషయాలే ఇక్కడ చూస్తాం. 3వది తర్వాత.

**(1) రోజువారీ పోషణ ఉత్పత్తుల్లో పెరుగుదల కోసం:** ఇందులో, ఇళ్ళ సమస్యని ప్రధాన సమస్యగా తీసుకోవచ్చు. నూతన సమాజపు ప్రారంభంలో, కార్మిక జనాభాకి, సుఖంగా నివసించే ఇళ్ళు ఉండవు. పెట్టుబడిదారీ జనాభా ఆధీనంలో అంత వరకూ ఉన్న ఇళ్ళని కార్మిక జనాభా కూడా పంచుకోదల్చినా, మొత్తం జనాభాకి ఆ ఇళ్ళు కూడా సరిపోవు. అనేక లక్షల కొత్త ఇళ్ళు నిర్మించుకుంటే తప్ప, మొత్తం సమాజానికి ఇళ్ళ సమస్య తీరదు. అలాగే సమాజానికి ఇంకా ఎన్నో వేల కొత్త స్కూళ్ళూ, కొత్త ఆస్పత్రులూ, కొత్త బస్సులూ, కొత్త రోడ్లూ, కొత్త రైళ్ళూ, కొత్త రైలు మార్గాలూ — వగైరా కొత్త ఉత్పత్తులు ఎన్నో కావాలి. కార్మిక జనాభా, పాత సమాజంలో ఏ యే అవసరాలైతే తీరకుండా గడిపిందో ఆ అవసరాలన్నీ తీరాలంటే, ఆ ఉత్పత్తులన్నీ ఇప్పుడు కొత్తగా కావాలి.

నూతన సమాజంలో మొత్తం జనాభా, అన్ని శాఖలలోనూ కలిసి, ఒక సంవత్సర కాలంలో, ఎన్ని ఉత్పత్తి సాధనాల్నీ, ఎన్ని పోషణ వస్తువుల్నీ ఖర్చుచేస్తారో, మళ్ళీ అన్నిటిని మాత్రమే ఉత్పత్తి చేసుకుంటే (సింపుల్ పునరుత్పత్తి మాత్రమే అయితే), ఆ సమాజంలో ఒక్క కొత్త నిర్మాణం కూడా సాధ్యం కాదు. గతం కన్నా ఎక్కువ శ్రమ జరిగితేనే ఎక్కువ ఉత్పత్తి ఉంటుంది. కాబట్టి, ఆ అవసరాలన్నీ తీరి, సమాజం ఒక స్థాయిలో స్థిరపడే వరకూ విస్తృత పునరుత్పత్తే తప్పనిసరి అవుతుంది. ఇది ఎల్లకాలమూ కాదు. అవసరమైనప్పుడే.

**(2) అంత వరకూ లేని కొత్త ఉపయోగపు విలువల కోసం:** ఎప్పుడూ కొత్త కొత్త అనుభవాల వల్ల, ప్రకృతి పదార్థాల్ని కొత్త రకాలుగా వాడుకోవడం తెలుస్తూ ఉంటుంది. దీని కోసం పరిశోధనలు కూడా అవసరమవుతాయి. కొత్త ఉత్పత్తులు కూడా జీవితాల్లోకి రావాలంటే, ప్రతి వ్యక్తీ కొంత ఎక్కువ శ్రమ చెయ్యవలిసిందే. దీన్ని గురించి ఇంకా కొన్ని విషయాలు తర్వాత చూస్తాం.

జనాభా పెరుగుదల వల్ల ఎక్కువ శ్రమ అవసరమా లేదా — అనే విషయం కూడా తర్వాత చూస్తాం.

ప్రస్తుతం ఇక్కడ, సింపుల్ — విస్తృత పునరుత్పత్తుల గురించి ఇంకా కొన్ని విషయాలు చూడాలి.

పెట్టుబడిదారీ విధానంలో సింపుల్ పునరుత్పత్తి ఎప్పుడూ ఉండదు. నూతన సమాజంలో కూడా ప్రారంభం లోగానీ, కొన్ని ప్రత్యేక అవసరాలు ఏర్పడినప్పుడు గానీ, సింపుల్ పునరుత్పత్తి ఉండదు. అయినప్పటికీ ప్రతీ సారీ సింపుల్ పునరుత్పత్తిని గురించి కూడా చూడాలి.

నూతన సమాజపు పునరుత్పత్తిని అర్థం చేసుకోవా లంటే, పెట్టుబడిదారీ పునరుత్పత్తిని గుర్తు చేసుకుంటూ, రెంటినీ కలిపి చూడాలి.

**పెట్టుబడిదారీ సింపుల్ పునరుత్పత్తి:**

రాసి విలువ = 80C + 20V + 20S = 120.

80C మీద, 40 సజీవశ్రమ అవసరమైందని అర్థం.

ఈ భాగాలు ఎలా పునరుత్పత్తి అవుతాయో మనకు తెలుసు. ఇందులో 80C సంగతి అనవసరం. దాని పున రుత్పత్తి కోసం కొత్త శ్రమ జరగదు కాబట్టి. ఈ 120 రాసి కోసం జరిగే కొత్త శ్రమ 20V + 20S = 40.

20V = జీతం. ఇది గత శ్రమకు బదులుగా జరిగిన కొత్త శ్రమ.

20S = అదనపు విలువ. గతంలో లేని కొత్త శ్రమ.

ఇది సింపుల్ పునరుత్పత్తి కాబట్టి, ఉత్పత్తి క్రమం ప్రతి సారీ ఇదే స్థాయిలో జరుగుతుంది.

**నూతన సమాజపు సింపుల్ పునరుత్పత్తి:**

ఇక్కడ కూడా ఉత్పత్తి రాసి విలువనీ, దాని లోపలి భాగాల్నీ, పెట్టుబడిదారీ ఉదాహరణలో లాగే తీసుకోవాలి. రాసి విలువ = 120. ఇక్కడ కూడా 80C మీద 40 సజీవ శ్రమ జరుగుతుంది. ఇక్కడ కూడా 80C సంగతి వదిలేసి మిగిలిన 40 సంగతే చూడాలి.

నూతన సమాజంలో, ఈ ఉదాహరణల్ని ఒక్క వ్యక్తి శ్రమకు సంబంధించినవిగా అయినా అనుకోవచ్చు. మొత్తం జనాభా శ్రమకు సంబంధించినవిగా అయినా అను కోవచ్చు. మనం ఇక్కడ మొదటి రకం గానే అను కుందాం. ఒక వ్యక్తి చేసిన శ్రమగా. ఒక వ్యక్తి విషయంలో చూసేది ప్రతీ వ్యక్తి విషయానికీ వర్తిస్తుంది. ఈ 40 విలువ, ఇక్కడ కూడా 2 భాగాలుగా చీలు తుంది.

(1) వ్యక్తి చేతికి అందే జీతం భాగం.

(2) 'సమాజ నిధి'గా వెళ్ళే భాగం.

ఇప్పుడు, నూతన సింపుల్ రాసి విలువని ఇలా చూడవచ్చు:

$80C + 30\,L_1 + 10\,L_2 = 120$

పెట్టుబడిదారీ విధానంలో అయినా, నూతన విధా నంలో అయినా, ఉత్పత్తి రాసి విలువ ఒక్క రకంగానే (120 గానే) ఉంటుంది. తేడాలు ఎక్కడంటే — ఆ శ్రమ ఎవరి ద్వారా జరిగిందీ — అనే విషయం లోనూ; ఆ శ్రమ 2 భాగాలుగా చీలేటప్పుడు ఆ భాగాలు ఎలాంటి సైజుల్లో ఉంటాయీ — అనే విషయం లోనూ.

మొత్తం 120 రాసిలో నించి 80C ని పక్కన పెడితే మిగిలిన 40 శ్రమ, ఒక వ్యక్తి ద్వారా, (లేదా, మొత్తం జనాభా ద్వారా) జరిగినది. ఆ వ్యక్తి ఇంటా బయటా కలిసి 40 శ్రమని ($L_1$, $L_2$లను) వాడుతూ, ఆ కాలంలో మళ్ళీ 40 శ్రమనే చేస్తాడు. ఇది సింపుల్ పునరుత్పత్తి కాబట్టి, ఖర్చయిన శ్రమకన్నా ఎక్కువ శ్రమ జరగదు.

| పెట్టుబడిదారీ సింపుల్ పునరుత్పత్తి | నూతన సమాజపు సింపుల్ పునరుత్పత్తి |
|---|---|
| (1) శ్రామికులు, తాము వాడుకునే శ్రమ కన్నా ఎక్కువ శ్రమ చేస్తారు. ఇక్కడ అదనపు శ్రమ ఉంటుంది. | (1) ఉత్పత్తిదారులు, తాము వాడుకునే శ్రమ కన్నా ఎక్కువ శ్రమ చెయ్యరు. ఇక్కడ 'అదనపు శ్రమ' ఉండదు. |
| (2) ఒక శ్రామికుడి శ్రమ గానీ, మొత్తం శ్రామిక వర్గం శ్రమ గానీ, 2 భాగాలుగా చీలుతుంది.<br>2 వ భాగం దోపిడీ వర్గం కోసం. | (2) ఒక వ్యక్తి శ్రమ గానీ, మొత్తం జనాభా శ్రమ గానీ, 2 భాగాలుగా చీలుతుంది.<br>2 వ భాగం కూడా ఆ జనాభా అవసరాల కోసమే. |
| (3) పెట్టుబడి పెరగదు. అది ఎప్పుడూ ఒకే స్థాయిలో ఉంటుంది. | (3) ఉత్పత్తి సాధనాలు పెరగవు. అవి ఎప్పుడూ ఒకే స్థాయిలో ఉంటాయి. |

ఇప్పుడు, నూతన సమాజపు విస్తృత పునరుత్పత్తిని చూసే ముందు, పెట్టుబడిదారీ విస్తృత పునరుత్పత్తిని గుర్తు చేసుకోవాలి.

**పెట్టుబడిదారీ విస్తృత పునరుత్పత్తి:**

రాసి విలువ: 80C + 20V + 30S = 130.

(ఇక్కడ, 'విషయం' మీదే దృష్టి పెట్టండి.
'సంఖ్యల' మీద కాదు)

ఇక్కడ 80C మీద 50 సజీవ శ్రమ అవసరమైందని అర్థం.

20V= గత శ్రమకు బదులుగా జరిగిన కొత్త శ్రమ.

30S= గతంలో లేని కొత్త శ్రమ.

ఈ S లో 4 రకాల ఉత్పత్తులు ఉంటాయి.

(1) పెట్టుబడిదారీ పోషణ, విలాస ఉత్పత్తులు. ఇవి, గతంలో ఖర్చయిన పరిమాణంతో సమానమైనవి.

(2) అదనపు C,

(3) అదనపు V,

(4) ఇది పెట్టుబడిదారీ పోషణే. గత పోషణ కన్నా ఎక్కువగా ఉన్నవి.

ఈ 130 ఉత్పత్తి రాసితో పునరుత్పత్తి జరగాలంటే, Sలో ఉన్న C, Vలు, కొత్త పెట్టుబడిగా మారతాయి. అలా పెరిగిన పెట్టుబడితో మళ్ళీ విస్తృత పునరుత్పత్తే జరుగుతుంది.

ఈ ఉత్పత్తి విధానంలో S ఉంటుంది కాబట్టీ, ఆ Sలో కొత్త C, Vలు ఉంటాయి కాబట్టీ, ఇక్కడ ప్రతీ ఉత్పత్తి క్రమమూ విస్తృత పునరుత్పత్తి గానే ఉంటుంది. ఒక విస్తృత పునరుత్పత్తి, ఇంకో విస్తృత పునరుత్పత్తికి, దారితీస్తూ ఉంటుంది.

పెట్టుబడి పెరిగినప్పుడు, ఎక్కువ పెట్టుబడితో పని చెయ్యడానికి ఎక్కువ మంది కార్మికులు కావాలి కాబట్టి, కార్మికుల సంఖ్య కూడా కొంత పెరుగుతుంది. ఈ కొత్త కార్మికులు, అప్పటికి నిరుద్యోగులుగా ఉన్న వారైనా కావచ్చు; లేదా, పనులు నేర్చుకోవడం పూర్తి చేసి, కొత్తగా ఉద్యోగాలలో ప్రవేసించే వారైనా కావచ్చు. ఈ పెరిగిన కార్మికులు, పెరిగిన Vని తమ జీతాలుగా తీసుకుంటూ కొత్తగా ఉద్యోగాలలోకి వస్తారు.

**నూతన సమాజపు విస్తృత పునరుత్పత్తి:**

వాడిన శ్రమ కన్నా ఎక్కువ శ్రమ చేయడం ఉంటుంది. కానీ ఆ ఎక్కువది కూడా తర్వాత ఆ జనాభాకే.

విస్తృత పునరుత్పత్తి అంటే, నూతన సమాజంలో కూడా పాత ఉత్పత్తి సాధనాలకు (MPకి) కొన్ని కొత్త ఉత్పత్తి సాధనాలు కూడా కలిసి ఉత్పత్తి క్రమం పెరిగిన స్థాయిలో జరగడమే. MP పెరగాలంటే, గతంలో కన్నా ఎక్కువ MP తయారయ్యేలాగ మొదట ప్లాన్ చెయ్యాలి. అలా పెరిగిన MPతో, ఉత్పత్తి క్రమం, పెరిగిన స్థాయిలో జరుగుతుంది. అది ఎక్కువ ఉత్పత్తుల్ని ఇస్తుంది.

కానీ, పెట్టుబడిదారీ విధానంలో ఒక విస్తృత పునరుత్పత్తి ఇంకో విస్తృత పునరుత్పత్తికి దారి తీసినట్టుగా, ఇక్కడ జరగదు.

ఇక్కడ S ఉండదు. కాబట్టి కొత్త MP కావాలంటే, దాని కోసం ప్రత్యేకంగా ప్లాన్ చేసినప్పుడే అది ఉత్పత్తి అవుతుంది. అవసరమైనప్పుడే విస్తృత పునరుత్పత్తి ఉంటుంది.

ప్రతీ ఉత్పత్తి క్రమమూ తప్పనిసరిగా విస్తృత పునరుత్పత్తిగా ఉండడం అంటే, అలా తయారయ్యే ఉత్పత్తి, అవసరాల లక్ష్యంతోగానీ, అవసరాల పరిమాణాలతో గానీ, ఉండదు. అది పెట్టుబడిదారీ విధానంలో జరిగే పని. నూతన విస్తృత పునరుత్పత్తి కూడా అలాగే వుంటే, అది నూతన సమాజం అవదు. అది నూతన సమాజానికి తగినది కాదు.

అవసరాల్ని బట్టి కావలసినంత శ్రమ చేసుకోవడమూ, చేసుకున్న శ్రమనంతా ఆ జనాభా వాడుకోవడమూ — అనే లక్షణాలతో చూస్తే, అలాంటి విస్తృత పునరుత్పత్తి కూడా సింపుల్ పునరుత్పత్తి లాంటిదే అవుతుంది. అందుకే అలాంటి ఉత్పత్తి క్రమం స్పైరల్ కాదు; సర్క్యులరే అవుతుంది.

నూతన సింపుల్ పునరుత్పత్తిలో, సజీవ శ్రమ భాగాల్ని $L_1$, $L_2$లుగా చెప్పుకున్నాం. నూతన విస్తృత పునరుత్పత్తిలో కూడా సజీవ శ్రమని అలాగే చెప్పుకోవచ్చు.

నూతన విస్తృత రాసి విలువ =

$80C + 40\,L_1 + 10\,L_2 = 130.$

ఇక్కడ కూడా 80C మీద 50 సజీవ శ్రమ అవసరమైంది. కానీ ఇక్కడ గత శ్రమ 40. కొత్త శ్రమ 10.

$40\,L_1$ = జీతం. గత శ్రమకు బదులుగా జరిగిన కొత్త శ్రమ.

$10\,L_2$ = గతంలో లేని కొత్త శ్రమ. ఎక్కువ శ్రమ.

ఎక్కువ శ్రమ వల్ల ఉత్పత్తుల పరిమాణాలు పెరుగుతాయి. ఆ పెరిగే ఉత్పత్తులు, గతంలో ఉన్నలాంటివే అయినా కావచ్చు; కొత్త రకాలు అయినా కావచ్చు. ఈ ఎక్కువ శ్రమ చేసుకోకపోతే, కొత్త అవసరాలు తీరవు.

లేదా, పాత అవసరాల్లో కొన్ని తగ్గిపోతే, ఎక్కువ శ్రమ లేకుండానే కొత్త అవసరాల కోసం కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు.

పెట్టుబడిదారీ విస్తృత పునరుత్పత్తిలో, పెట్టుబడిని పెంచాలంటే, అదనపు ఉత్పత్తి సాధనాలే గాక, అదనపు పోషణ వస్తువులు కూడా (అదనపు C, Vలు) ఉండాలి. కానీ నూతన విస్తృత పునరుత్పత్తిలో, 'ఉత్పత్తి స్థాయిని పెంచాలంటే అదనపు ఉత్పత్తి సాధనాలు ఉంటే చాలు. అదనపు పోషణ వస్తువులు అక్కరలేదు. ఎందుకంటే, ఇక్కడ, కొత్తగా ఉద్యోగాలలోకి వచ్చే అదనపు జనాభా ఉండదు. సమాజంలో ఉన్న జనాభా అంతా అప్పటికే ఉద్యోగాలలో ఉంటారు. ఉద్యోగాలు లేని నిరుద్యోగ జనాభా ఎవరూ ఉండరు. ఉద్యోగాలలో ఉన్న మొత్తం జనాభాకి పోషణ వస్తువులు అప్పటికే ఉంటాయి. కాబట్టి

నూతన సమాజంలో ఉత్పత్తి స్థాయి పెరగాలంటే, కొత్త శ్రమ కోసం కొత్త పోషణ వస్తువులు అవసరం లేదు.

నూతన సమాజంలో, ఏ శాఖలో అయినా ఎక్కువ ఉత్పత్తులతో అవసరం లేకపోతే, ఆ సంవత్సరంలో, ఆ శాఖలో పెట్టే శ్రమని తగ్గించుకోవచ్చు. రోజువారీ పోషణ వస్తువుల్ని కొంత పెంచుకోదలిస్తే, కొత్త శ్రమలో కొంత భాగాన్ని అటు పెట్టవచ్చు. ఒక దఫాలో ఉత్పత్తి అధిక మైనా, దాని వల్ల ఏ సమస్యా రాదు. ఈ సమాజంలో ఇదంతా ఎందుకు సాధ్యమవుతుందంటే, ఇక్కడ సమాజం మొత్తం మీద సమిష్టిగా ప్లాను చేసే అవకాశం ఉంటుంది కాబట్టి.

ఇక్కడ భూమీ, ఇతర ఉత్పత్తి సాధనాలూ విడి విడి వ్యక్తుల ఆస్తులుగా ఉండవు. ఇక్కడ శ్రమ చెయ్యకుండా దోపిడీ ఆస్తుల మీద వచ్చే ఆదాయాల ద్వారా జీవించే విధానం ఉండదు. దోపిడీ ఆస్తి విధానం లేని చోట సమిష్టి ప్లానులు సాధ్యమవుతాయి.

| పెట్టుబడిదారీ విస్తృత పునరుత్పత్తి | నూతన సమాజపు విస్తృత పునరుత్పత్తి |
|---|---|
| (1) 'అదనపు శ్రమ' ఉంటుంది. అది పెట్టుబడి దారీ వర్గానికే. | (1) 'ఉత్పత్తి క్రమం జరిగే సమయంలో వాడే శ్రమ కన్నా ఎక్కువ శ్రమ' ఉంటుంది. అది, ఆ శ్రమ చేసిన జనాభాకే. |
| (2) 'అదనపు శ్రమ'లో ఒక భాగం, పెట్టుబడిని పెంచు తుంది. | (2) ఎక్కువ శ్రమలో ఒక భాగం, అవసరమైతే ఉత్పత్తి సాధనాల్ని పెంచి ఉత్పత్తి స్థాయిని పెంచుతుంది. |
| (3) వేరు వేరు శాఖల మధ్య సమిష్టి ప్లాను సాధ్యం కాదు. | (3) సమిష్టి ప్లాను సాధ్యమవుతుంది. |

నూతన సమాజం ప్రారంభమైన కొత్తలోనే ఈ ప్లానులు ఒక స్పష్టత తోటీ ఖచ్చితత్వం తోటీ ఏర్పడవు. క్రమంగా దొరికే అనుభవాల వల్లా, శ్రమ సంబంధాలలో మెరుగవుతూ వచ్చే మార్పుల వల్లా, ఈ ప్లానులు కూడా మెరుగవుతూ ఉంటాయి.

నూతన సమాజం ప్రారంభమైన 10 సంవత్సరాలకు, ఆ సమాజంలో ఉన్న జనాభా అంతా ఆరోగ్యం గానూ సౌఖ్యం గానూ జీవించడానికి మొత్తం ఎలాంటి ఏర్పాట్లు ఉండాలో అవన్నీ పూర్తి అయ్యాయి — అనుకుందాం. ఇక అప్పటి నించీ జనాభాకి ఉండే బాధ్యత, సంవత్సరానికి మొత్తం ఎన్ని ఉత్పత్తులు ఖర్చవుతూ ఉంటాయో వాటిని పునరుత్పత్తి చేసుకుంటూ ఉండడమే. జనాభా అంతా కలిసి, ఖర్చయి పోయే ఉత్పత్తి సాధనాల్నీ, ఖర్చయి పోయే పోషణ వస్తువుల్నీ పునరుత్పత్తి చేసుకుంటూ ఉండాలి. విదేశీ కార్మిక ప్రజలకు చెయ్యవలసిన సహాయాలు కూడా.

# నూతన సమాజంలో జనాభా

'నూతన సమాజం'లో కూడా, జనాభా పెరుగుదల ఉంటుంది. ఈ సమాజంలో, ఒక రోజున, మొత్తం జనాభాని లెక్క చూడగా మొత్తం 1,000 మంది ఉన్నా రనుకుందాం. ఒక ఏడాది పూర్తి అయ్యేసరికి ఆ జనాభాలో 10 మంది వృద్ధులు చచ్చిపోయి, 20 మంది పిల్లలు పుట్టారనుకుందాం. అప్పుడు మళ్ళీ జనాభాని లెక్కచూస్తే, అప్పుడు జనాభా 1010 మంది ఉంటారు. అంటే, ఏడాదిలో జనాభా పెరుగుదల నూటికి ఒకటి. 1%. ఏటా ఇలాగే అనుకుందాం. ఏడాది నాటికి జనాభా 1% పెరిగింది కాబట్టి, ఆ ఏడాదిలో ఉత్పత్తి స్థాయి కూడా 1% పెరగాలి.

అంటే, ఇప్పుడు సమాజంలో ఉన్న ప్రతీ వ్యక్తీ అంతకు పూర్వం చేసే శ్రమ కన్నా 1% ఎక్కువ శ్రమ చెయ్యాలా? —అక్కరలేదు. ఎవ్వరూ, గతం కన్నా ఎక్కువ శ్రమ చెయ్యకుండానే ఉత్పత్తి స్థాయి పెరుగుతుంది. ఎలాగంటే: ఎక్కువ ఉత్పత్తి ఎవరి కోసం కావాలో, వాళ్ళే ఆ పని చేసుకుంటారు. అంటే, పెరిగే జనాభాయే, తన పని తనే చేసుకుంటుంది. ఈ ఏడాది పుట్టిన పిల్లలు ఈ ఏడాదే పనిలోకి వస్తారని కాదు. అంతకు ముందు సంవత్సరాలలో పుట్టి పెరుగుతోన్న పిల్లల్లోంచి కొందరు, ఈ ఏడాది నించి పనిలోకి వస్తారు.

ప్రతి పిల్లా, పిల్లవాడూ, ఫలానా వయసు నించి తేలిక పాటి పనుల్లోకి రావాలనుకుందాం. వాళ్ళ స్కూళ్ళలోనే, ఏదో ఒక పని, తక్కువ గంటలే, చేస్తారనుకుందాం. ఇలా పని ప్రారంభించిన పిల్లలూ, ఇంకా పని చెయ్యని చిన్న పిల్లలూ, పని చేసే పెద్దలూ, పని చెయ్యలేని వృద్ధులూ, తాత్కాలికంగా పని చెయ్యని రోగులూ — వీళ్ళందరూ కలిసిన మొత్తమే మొదట చెప్పుకున్న 'వెయ్యి జనాభా!'

పని చెయ్యలేని జనాభా కొంత ఉండడం, ఏ సంవత్సరం జనాభాకైనా వర్తిస్తుంది కాబట్టి, ఆ పని చెయ్యలేని జనాభా సంగతి పట్టించుకోము. ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, 'మొత్తం జనాభా అంతా పని చేస్తారు' అంటాము.

ఏటా 20 మంది పిల్లలు పుడతారనీ, ప్రతి పిల్లా పిల్ల వాడూ 8వ ఏట నించి చిన్న చిన్న పనుల్లోకి వస్తారనీ అనుకుంటే, 8 సం.ల క్రితం పుట్టిన 20 మంది పిల్లలు, ఈ ఏడాది నించి పనుల్లోకి వస్తారు. 7 సం.ల క్రితం పుట్టిన 20 మంది పిల్లలు, వచ్చే సంవత్సరం నించి పనుల్లోకి వస్తారు. ప్రతీ ఏటా ఇలాగే జరుగుతూ ఉంటుంది. ప్రతీ ఏటా పుట్టే పిల్లలు 20 మంది. ప్రతీ ఏటా పనిలోకి వచ్చే కొత్త జనం 20 మంది. అంటే, ఇది ఈ ఏడాది పుట్టే పిల్లలు ఈ ఏడాదే పనుల్లోకి రావడంతో సమానం. అంటే ఇది, సమాజంలో 'పెరిగే జనాభా', తన పని తను చేసుకోవడమే. మొత్తం జనాభా 1,000 మంది ఉన్నప్పుడు, ఆ జనాభా అంతా పని చేస్తారు. అలాగే, మొత్తం జనాభా, 1010 అయినప్పుడు కూడా, ఆ జనాభా అంతా పని చేస్తారు.

పెరిగే జనాభా ఒక సంవత్సరం 10 మందీ, ఇంకో సంవత్సరం 9 మందీ, ఇంకో సంవత్సరం 12 మందీ, ఇలా గతం కన్నా కొంత ఎక్కువ గానో, తక్కువ గానో ఉంటే ఉండవచ్చు. జనాభా పెరుగుదల ఎలా వున్నా, ఎప్పటి కప్పుడు పెరిగే జనాభా అంతా పనుల్లోకి వస్తూ ఉంటారు — అనేదే ఇక్కడ అసలు విషయం. పెరిగే జనాభా, తన పని తనే చేసుకుంటారు కాబట్టి, జనాభా పెరుగుదల అనే పేరుతో సమాజంలో ఒక వ్యక్తి చేసే శ్రమ పెరగనక్కర లేదు.

కానీ, సమాజంలో ఉండే 'మొత్తం ఉత్పత్తి'ని దృష్టి లోకి తీసుకుంటే, అది జనాభా పెరుగుదలతో పాటు పెరగవలసిందే. సమాజంలో వెయ్యి మంది జనాభా ఉన్నప్పటి కన్నా, 2 వేల మంది జనాభా ఉన్నప్పుడు ఉత్పత్తి రెట్టింపు అవ్వాలి. అయితే, ఇక్కడ, ఉత్పత్తి పెరగడం అంటే, ఒక మనిషి చేసే శ్రమ పెరగడం కాదు. శ్రమచేసే మనుషుల సంఖ్య పెరుగుతుంది కాబట్టే, ఉత్పత్తి పెరుగుతుంది.

ఈ విషయాన్ని ఇంకో కోణంలో కూడా అర్థం చేసుకోవాలి. జనాభా పెరగడం — అంటే, సమాజంలో ఉన్న జనాభాకి పిల్లలు పుట్టడమే. ఆ పిల్లల కోసం ఉత్పత్తి పెరగాలంటే, దానికి కావలసిన కొంత ఎక్కువ శ్రమ చెయ్యడం తల్లిదండ్రుల బాధ్యతే. రేపు, ఆ పిల్లలు పెద్ద వాళ్ళై వాళ్ళు కూడా అలాగే చేస్తారు. అంటే, సమాజంలో ఉండే జనాభాని, 'తల్లిదండ్రులూ, పిల్లలూ' అనే కుటుంబ సంబంధాలతో చూస్తే, మొత్తం జనాభాలో, కొందరు పిల్లలూ, కొందరు పెద్దలూ ఉండడం కనపడుతుంది. ఆ పిల్లల కోసం ఆ పెద్దలే శ్రమ చేస్తారు. కొంత కాలానికి ఆ పిల్లలు పెద్దవాళ్ళై మళ్ళీ తమ పిల్లల కోసం శ్రమ చేస్తారు. — ఇలా, ప్రతీ మనిషీ, చిన్నప్పుడు శ్రమ చెయ్యక పోవడమూ, పెద్దయ్యాక శ్రమ చెయ్యడమూ, జరుగుతాయి. ఈ జనాభానే, కుటుంబ సంబంధాలతో కాకుండా, కేవలం 'జనాభా సంఖ్య' గా చూస్తే, ఎవరి శ్రమ వాళ్ళే చేసుకోవటంగా కనపడుతుంది.

జనాభా పెరిగితే ఉత్పత్తి స్థాయి పెరగవలసిందే. 10 మందికి కావలసిన ఉత్పత్తి కన్నా, 11 మందికి కావలసిన ఉత్పత్తి ఎక్కువగా ఉండాలి. పెరిగే జనాభా అవసరాల్ని బట్టే, ఉత్పత్తి స్థాయి కూడా పెరుగుతుంది.

ఉత్పత్తి స్థాయిలో పెరుగుదల 'అవసరాల' లెక్కతోనే ఉన్నప్పుడు, అది పెరిగినా పెరగని దాని తోనే సమానం. తక్కువ జనాభా కోసం తక్కువ ఉత్పత్తి చెయ్యడం ఎలాంటిదో, ఎక్కువ జనాభా కోసం ఎక్కువ ఉత్పత్తి చెయ్యడం కూడా అలాంటిదే. పెరిగిన ఉత్పత్తిని, పెరిగిన జనాభాతో పోలిస్తే, ఉత్పత్తి స్థాయి పెరగలేదని అర్థం.

నూతన సమాజంలో, 'జనాభా పెరుగుదల' అనే కారణం వల్ల పెరిగే ఉత్పత్తి స్థాయి, ఏ సమస్యనీ సృష్టించదు. ఆ ఉత్పత్తి అంతా జనాభా అవసరాల కోసమే ఖర్చయి పోతూ వుంటుంది.

## జనాభా, పెరిగిపోతూనే ఉంటుందా?

'జనాభా పెరుగుదల' గురించి చూసేటప్పుడు, మన ముందుకి ఒక ప్రశ్న వస్తుంది. జనాభా ఇంకా ఇంకా ఎప్పుడూ పెరిగిపోతూ ఉండవలసిందేనా' అనే ప్రశ్న. నూతన సమాజాన్ని, వైరుధ్యాలు లేని సమాజంగా ఊహిస్తున్నాం. అలాంటి సమాజంలో అకాల మరణాలకు అవకాశాలు ఉండవు. 'పోషకాహార లోపం' అనే పరిస్తితి ఉండదు. 'వైద్యం అందుబాటులో లేకపోవడం' అనే పరిస్తితి ఉండదు. హత్యలూ ఆత్మహత్యలూ కరువు కాటకాలూ యుద్ధాలూ — వంటివి ఉండవు. అంటే, జనాభా త్వర త్వరగా నశించడం అనేది ఏ కారణాల తోనూ జరగదు. మరణించే జన సంఖ్య తక్కువ గానూ, పుట్టే జన సంఖ్య ఎక్కువ గానూ ఉన్నప్పుడు జనాభా పెరిగి పోతూనే ఉంటుంది కదా? దోపిడీ సమాజాలలో, ఆకలీ, జబ్బులూ, కరువులూ, యుద్ధాలూ వంటి అనేక కారణాలతో జనం ఎప్పటి కప్పుడు కుప్పలు కుప్పలుగా నశించిపోతూనే ఉన్నా కూడా, ఆ నశించడం కన్నా జనాభా పెరుగుదలే ఎక్కువ స్థాయిలో ఉంటుంది. దోపిడీ సమాజాలలోనే అలా జరిగినప్పుడు, ఇక నూతన సమాజంలో జనాభా పెరుగుదల, విపరీత స్థాయిలో ఉండదా? ఆ పెరుగుదల అలా సాగిపోతూనే ఉండదా? — ఇదీ ప్రశ్న! — దీనికి జవాబేమిటంటే, నూతన సమాజంలో జనాభా పెరుగుదలని విపరీత స్థాయిలో జరిగే విషయంగా ఊహించనక్కరలేదు. ఎందుకంటే, నూతన సమాజం, ఏ

సమస్యని అయినా, హేతుబద్ధంగా పరిష్కరించుకోవ డానికే ప్రయత్నిస్తుంది గనక.

ఈ నాడు దోపిడీ సమాజంలో కూడా చాలా మంది స్త్రీ పురుషులు, ఎవరి బలవంతమూ లేకుండానే, ఇద్దరు ముగ్గురు పిల్లల తోనే సంతృప్తిపడుతున్నారు. 'ఆ పిల్లలు ఆడ పిల్లలైనా, మొగ పిల్లలైనా ఒకటే' అనే సమానత్వ భావాలు ఏర్పర్చుకుంటున్నారు. రేపు ఈ పిల్లల సంఖ్య ఇంకా తగ్గవచ్చు. స్వంత పిల్లలు లేకపోయినా ఏమీ చింత పడని మనుషులు తయారుకావచ్చు. ఆ రకపు నూతన భావాలు అభివృద్ధి చెందవచ్చు.

దోపిడీ సమాజాలలో, ఎక్కువ పిల్లల్ని కనడానికి కారణం, కేవలం 'ప్రకృతి ఇచ్చింద'నే దృష్టి ఒక్కటే కాదు. అందులో అనేక రకాల సాంఘిక సమస్యలు ఉంటాయి. 'స్వంత ఆస్తి' విధానం వల్ల, ఆస్తుల్ని పిల్లలకే అప్పజెప్పాలి కాబట్టి, పిల్లలు ఉండి తీరాలి. వృద్ధాప్యంలో పోషించే, సంరక్షించే, ఇతర మార్గాలేవీ లేని చోట, తప్పనిసరిగా పిల్లలు ఉండాలి.

'మొగ పిల్లల వల్ల మోక్షం కలుగుతుంద'నే మత నమ్మకాలతో, మొగ పిల్లలు పుట్టే దాకా పిల్లల్ని కంటూ పోతారు. దోపిడీ సమాజంలో, అధిక జనాభా చదువు సంధ్యలు లేని అజ్ఞానంలోనే ఉండడం వల్ల, చాలా చిన్న వయసు నించే పిల్లల్ని కనడం మొదలు పెడతారు. తరాలు త్వర త్వరగా పెరిగిపోతాయి. పిల్లల్ని తగ్గించుకో వాలనుకున్నా మార్గాలు తెలీవు. అవి, అందుబాటులో ఉండవు. పిల్లల్ని కనని స్త్రీలను భర్తలు వదిలెయ్యడం గానీ, మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకోవడం గానీ జరుగుతుంది. ఇలాంటి అనేక పరిస్థితులు దోపిడీ సమాజాలలో ఉంటాయి. అందుకే అక్కడ ఎక్కువ మంది పిల్లల్ని కనడం, సాంఘికంగా తప్పనిసరి అవుతుంది. ఈ 'బల వంతాన్ని' తెచ్చిపెట్టే పరిస్థితులన్నీ పోయినప్పుడు, పిల్లల్ని చాలా తగ్గించుకోవడానికి పెద్దలు సంసిద్ధంగా ఉంటారు. స్త్రీ పురుష సంబంధాలు, బాల్య వివాహాల ద్వారా గాక తగిన వయసులోనే వుంటాయి. పిల్లల్ని వెంటనే కనాలనే దృష్టి వుండదు. అప్పుడు చాలా మంది మనుషులు పిల్లలు లేకపోవడాన్ని సమస్యగా భావించకపోవచ్చు కూడా. ఇతరుల పిల్లల్ని ప్రేమించే లక్షణం అలవర్చు కోవచ్చు. ఈ రకం మార్పులకు అవకాశం ఉంది కాబట్టి, నూతన సమాజంలో, జనాభా తప్పనిసరిగా పెద్ద స్థాయిలో పెరిగిపోతూనే ఉంటుందని నిర్ణయించడానికి వీలు లేదు.

## కొత్త ఉపయోగపు విలువలు:

'కొత్త ఉపయోగపు విలువలు ప్రవేశించడం' అనేది, 2 రకాలుగా ఉంటుంది. ఒక పాత ఉపయోగపు విలువ స్థానంలోకి అదే అవసరాన్ని తీర్చే కొత్త ఉపయోగపు విలువ రావడం, ఒక రకం. సమాజంలో అంత వరకూ లేని కొత్త అవసరాల్ని తీర్చే కొత్త ఉపయోగపు విలువ రావడం, రెండో రకం. రోజూ కావలసిన అనేక వస్తువుల్లో 'సబ్బు' ఒకటి. ఒక రకం సబ్బుకి సంబంధించిన ముడి పదార్థాల విషయం లోనూ, దాన్ని తయారు చేసే పద్ధతి లోనూ, గతం కన్నా నాణ్యం గానూ ఆరోగ్యకరం గానూ చేసుకోవడం తెలిసిందనుకుందాం. అప్పుడు పాత రకం సబ్బు ఉత్పత్తి ఆగిపోయి, కొత్త సబ్బు ఉత్పత్తే ఉంటుంది. ఈ కొత్త సబ్బు రావడం వల్ల, ఒక వ్యక్తి 'అవసరాల' సంఖ్యలో మార్పేమీ రాదు. పాత సబ్బుకి బదులు కొత్త సబ్బు వచ్చింది, అంతే. ఈ రకంగా, 'అవసరాల' సంఖ్య మారకుండానే పాత ఉత్పత్తుల స్థానం లోకి కొత్త ఉత్ప త్తులు వస్తూ ఉంటాయి. 'పెంకుటిళ్ళ'కు బదులు, అన్నిచోట్లా 'సిమ్మెంటు కప్పు' ఇళ్ళే కట్టడం జరుగుతూ ఉంటే, పెంకుల ఉత్పత్తి పూర్తిగా ఆగిపోతుంది. అలాగే, కొంత కాలానికి ఎడ్ల బళ్ళూ, ఎడ్లతో భూమిని దున్నడమూ, పూర్తిగా ఆగిపోవచ్చు. అప్పుడు నాగళ్ళ ఉత్పత్తీ, ఎడ్ల బళ్ళ ఉత్పత్తీ, వ్యవసాయం కోసం ఎడ్లని పెంచడమూ కూడా ఆగిపోతాయి. ఈ రకంగా, అప్పటికి వాడుతూ వున్న ఉప యోగపు విలువలలో గతం కన్నా నాణ్యమైనవి ప్రవేసించి నప్పుడు, పాతవి ఆగిపోతాయి.

ఇంకో వేపు, అంత వరకూ సమాజంలో లేని పూర్తిగా కొత్త ఉపయోగపు విలువలు ప్రారంభమవుతూ వుంటాయి. వాచీ, కెమేరా, సినిమా, టెలిఫోన్ లాంటివి ఒక నాడు లేని ఉపయోగపు విలువలు. ఈ కొత్తవి రావడం వల్ల ఒక వ్యక్తి వాడే ఉపయోగపు విలువల సంఖ్య పెరుగుతుంది. అంటే, వ్యక్తి 'అవసరాల' సంఖ్య పెరుగుతుంది. ఇలా, అవసరాలు పెరిగినప్పుడు, ఒక వ్యక్తి చెయ్యవలసిన శ్రమ కూడా పెరుగుతుంది.

కొత్త ఉపయోగపు విలువల కోసం శ్రమ పెరగడం అంటే, సమాజంలో 'ఉత్పత్తి స్థాయి' పెరగడమే. కానీ, 'నూతన సమాజం'లో, ఈ రకంగా ఉత్పత్తి స్థాయి పెర గడం కూడా వైరుధ్యాల్ని సృష్టించదు. ఎందుకంటే, ఆ పెరిగే ఉత్పత్తి కూడా ఆ శ్రమ చేసే మనుషుల 'అవస రాల' కోసమే ఖర్చయిపోతుంది కాబట్టి. తక్కువ అవస రాల కోసం తక్కువ ఉత్పత్తీ, ఎక్కువ అవసరాల కోసం ఎక్కువ ఉత్పత్తీ, రెండు పరిస్థితులూ ఒకటే. ఇక్కడ ఎక్కువ ఉత్పత్తి వల్ల తల ఎత్తే ప్రత్యేక సమస్య ఏదీ ఉండదు.

నూతన సమాజంలో ఉత్పత్తి స్థాయి ఏ యే కారణాల వల్ల పెరుగుతుందో గ్రహించడానికి, 3 రకాల పరిస్థితులు చూశాం. (రోజువారీ పోషణ వస్తువులూ, జనాభా పెరుగు దలా, కొత్త ఉపయోగపు విలువలూ.) ఇక్కడ చూడని

ఇంకే రకపు ఏ కొత్త పరిస్థితి అయినా, ఈ 3 రకాల లోనే ఏదో ఒక దాని లోకి చేరుతుంది.

నూతన సమాజంలో అన్ని శాఖల లోనూ సరైన ప్లానులూ, సమిష్టి ప్లానులూ చెయ్యగలిగే పరిస్థితులు ఉంటాయి కాబట్టి, ఇక్కడ ఖర్చుపెట్టలేనంత ఉత్పత్తి తయారై గుట్టలు గుట్టలుగా పడి వుండే పరిస్థితి ఏర్పడదు.

జన సంఖ్యని బట్టీ, వారి అవసరాల్ని బట్టీ, ఉత్పత్తి స్థాయిని ప్లాన్ చేస్తే అది, ఉపయోగపు విలువ దృష్టితో ప్లాన్ చెయ్యడం. ఇక్కడ, అదే జరుగుతుంది. ఇక్కడ ఉత్పత్తి స్థాయి పెరిగినా అవసరాల్ని బట్టే, తగ్గినా అవస రాల్ని బట్టే. కాబట్టి ఉత్పత్తి స్థాయి పెరగడమూ, పెరగక పోవడమూ ఒకే ఫలితాలతో ఉంటాయి. అంటే, ఇక్కడ 'సింపుల్ పునరుత్పత్తి' ఎలాంటి స్వభావంతో ఉంటుందో 'విస్తృత పునరుత్పత్తి' కూడా అలాంటి స్వభావం తోటే ఉంటుంది. అంటే, ఇక్కడ ఉత్పత్తి క్రమానికి, సింపుల్ పునరుత్పత్తా, విస్తృత పునరుత్పత్తా అనే ప్రత్యేకత పోయి, ఇక్కడ ఉత్పత్తి క్రమం, 'ఎప్పుడూ ఒకే స్థాయిలో ఉండడం'తో సమానం అయిపోతుంది.

'ఎప్పుడూ ఒకే స్థాయిలో' అంటే, 'ఎప్పుడూ అవసరా లకు తగిన స్థాయిలో' అని అర్థం. తక్కువ అవసరాలు ఉన్నప్పుడు తక్కువ ఉత్పత్తీ, ఎక్కువ అవసరాలు ఉన్న ప్పుడు ఎక్కువ ఉత్పత్తీ. తక్కువ జనాభా ఉన్నప్పుడు తక్కువ ఉత్పత్తీ, ఎక్కువ జనాభా ఉన్నప్పుడు ఎక్కువ ఉత్పత్తీ. నిజానికి, ఇక్కడ కూడా ఉత్పత్తి ఎప్పుడూ ఒకే స్థాయిలో ఉండకపోయినా, అది ఒకే స్థాయిలో ఉండ డంతో సమానంగా ఉంటుంది.

పెట్టుబడిదారీ విధానంలో జరిగే పెట్టుబడి విస్తరణ, నిజ అవసరాల దృష్టితో గాక, 'లాభ దృష్టి' తోనే జరుగు తుంది. వేరు వేరు పెట్టుబడిదారులు, ఎవరి మట్టుకు వాళ్ళు, తామే ఎక్కువ సరుకుని అమ్మాలనీ, తామే ఎక్కువ లాభాలు సంపాదించాలనీ, పోటీ పడుతూ ఉత్పత్తి స్థాయినీ, ఉత్పత్తి రాసుల్నీ పెంచి వేస్తూ ఉంటారు. అమ్మ లేనంత సరుకుల గుట్టలూ, విదేశీ మార్కెట్ల కోసం కూడా వేటలూ, అన్నీ ఒక దాని వెంట ఒకటి ప్రారంభమై పోతాయి. ఎన్ని చేసినా, సరుకుల్ని అమ్మలేని సంక్షోభాలు ముంచుకొస్తాయి. (2వ సంపుటంలో, 'సంక్షోభాలు' చాప్టర్లో ఈ విషయాలు వివరంగా చూస్తాము.)

సహజ అవసర పరిస్థితులతో సంబంధం లేకుండా ఒక సంవత్సరం కన్నా ఒక సంవత్సరం విస్తరిస్తూ పోయే స్వభావం గల పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని 'స్పైరల్'గా అనుకుంటే, ఎప్పుడూ ఒకే రకంగా, సహజ అవసర పరిస్థితుల్ని బట్టి మాత్రమే ఉండే స్వభావం గల నూతన ఉత్పత్తి విధానాన్ని 'సర్క్యులర్'గా అనుకోవచ్చు. స్పైరల్ ఉత్పత్తి విధానం సృష్టించే సమస్యల్ని, సర్క్యులర్ ఉత్పత్తి విధానం సృష్టించదు.

## 'సమిష్టి ప్లాను'కి జనరల్ సూత్రాలు

సమిష్టి ప్లాను అంటే, సమాజంలో ఉన్న అన్ని శాఖల ఉత్పత్తుల మధ్యా సమన్వయం ఉండేలాగ చేసే ప్లాను.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, విడి విడి పెట్టుబడి దారుల ఉత్పత్తి విధానం కాబట్టి, ఈ సమాజంలో 'సమిష్టి ప్లాను'కి అవకాశం ఉండదు — అని చెప్పుకుంటున్నాం. సమిష్టి ప్లాను అంటే ఎలా ఉండాలి? — ఈ విషయాలు ఇక్కడ చూస్తాం.

సమాజం, ఒక సంవత్సర కాలంలో, రక రకాల ఉత్ప త్తులతో కూడిన 'బ్రహ్మాండమైన రాసి'ని తయారుచేస్తుంది. అందులో కొంత కొంత భాగం ఒక్కొక్క విడి విడి పెట్టు బడిదారుల ఆధీనంలో ఉంటుంది. ప్రతి పెట్టుబడి దారుడూ మొదట తన ఉత్పత్తిని అమ్మేసి, మళ్ళీ వెంటనే పునరుత్పత్తికి కావలసిన ఉత్పత్తి సాధనాలు కొనాలి. తనకు పోషణ వస్తువులు (విలాస వస్తువులు కూడా) కొను క్కోవాలి. పెట్టుబడిదారులందరూ అలాగే చెయ్యాలి. మొత్తం కార్మికులందరూ కూడా తమ జీతాలతో 'పోషణ వస్తువులు' కొనుక్కోవాలి. అంటే, పెట్టుబడిదారులకూ పెట్టుబడిదారులకూ మధ్యా, పెట్టుబడిదారులకూ కార్మికు లకూ మధ్యా, రక రకాల మారకాలు జరగాలి. ఒక సంవ త్సరం పూర్తి అయ్యేటప్పటికి, పాత రాసి అంతా ఖర్చయి పోతూ, ఆ ఉత్పత్తుల తోనే రెండో సంవత్సరపు పునరుత్పత్తి క్రమం జరగాలి. మొదటి రాసి పూర్తిగా అమ్మకం అయితేనే పునరుత్పత్తి సవ్యంగా జరుగుతుంది. లేకపోతే, పున రుత్పత్తి, ఇబ్బందుల్లో పడుతుంది. నూతన సమాజంలో కూడా ఉత్పత్తుల పాళ్ళు తగిన విధంగా ఉంటేనే, పున రుత్పత్తి సవ్యంగా సాధ్యమవుతుంది.

సమాజంలో ఉన్న మొత్తం ఉత్పత్తి సంస్థలు 2 గ్రూపు లుగా ఉంటాయని ఇంతకు ముందే చూశాం. (1) 'ఉత్పత్తి సాధనాల్ని' ఉత్పత్తి చేసే సంస్థలూ (2) 'పోషణ వస్తువుల్ని' ఉత్పత్తిచేసే సంస్థలూ (విలాస వస్తువుల్ని ఉత్పత్తి చేసే సంస్థలు కూడా ఈ 2వ అంశంలో భాగమే).

కానీ ఒక్కోరకం ఉత్పత్తి అయితే, 'ఉత్పత్తి సాధనం' గానూ, 'పోషణ వస్తువు'గానూ కూడా ఉపయోగపడు తుంది. బొగ్గుని, ఉత్పత్తి స్థలంలో ఉపయోగిస్తే ఉత్పత్తి

సాధనం గానూ, ఇళ్ళల్లో ఉపయోగిస్తే పోషణ వస్తువు గానూ ఉంటుంది. అలాగే, బియ్యాన్ని హోటళ్ళలో ఉప యోగిస్తే ఉత్పత్తి సాధనం గానూ, ఇళ్ళలో ఉపయోగిస్తే పోషణ వస్తువు గానూ ఉంటుంది. అలాంటప్పుడు, ఈ బొగ్గునీ, బియ్యాన్నీ ఉత్పత్తిచేసే సంస్థల్ని ఏ గ్రూపుకి చెందినవిగా అనుకోవాలి? సమాజం ఉత్పత్తి చేసిన 'మొత్తం బొగ్గు'లో ఉత్పత్తి సాధనంగా ఖర్చయ్యే భాగాన్ని మొదటి గ్రూపుకి చెందినట్టూ, ఇళ్ళల్లో ఖర్చయ్యే భాగాన్ని 2వ గ్రూపుకి చెందినట్టూ — అనుకోవాలి. అంటే, బొగ్గుని ఉత్పత్తి చేసే సంస్థలు పూర్తిగా ఒకే గ్రూపుకి చెంది ఉండవు. సంవత్సరంలో మొత్తం 10 టన్నుల బొగ్గు తయారై, అందులో 8 టన్నులు ఉత్పత్తి స్థలాల లోనూ, 2 టన్నులు ఇళ్ళల్లోనూ ఖర్చు అవుతాయనుకుందాం. 8 టన్నులు బొగ్గుని 1వ గ్రూపులోనూ, 2 టన్నుల బొగ్గుని 2వ గ్రూపు లోనూ ఉన్నట్టుగా అనుకుంటాం. బియ్యం సంగతి అయినా అంతే, ఇంకే ఉత్పత్తి సంగతి అయినా అంతే. యంత్రాల్ని ఉత్పత్తి చేసే సంస్థలు పూర్తిగా 1వ గ్రూపులోకీ, హోటళ్ళ లాంటి సంస్థలు పూర్తిగా 2వ గ్రూపులోకీ వస్తాయి. చాలా సంస్థల ఉత్పత్తులు 2 రకాలు గానూ వాడకం అవుతాయి. సారాంశంలో, ఉత్పత్తి సాధనా లన్నీ 1వ గ్రూపూ, పోషణ వస్తువులన్నీ 2వ గ్రూపూ.

సమాజానికంతటికీ కావలసిన బట్టకోసం 10 టన్నుల దూది కావాలనుకుందాం. దాని విలువ 100 రూ.లు అను కుందాం. ఒక సంవత్సరంలో 5 టన్నుల దూదే పండిం దనుకుందాం. గతంలో 10 టన్నుల దూదికి 100 విలువ ఉంటే, ఇప్పుడు 5 టన్నుల దూదికే 100 విలువ ఉందను కుందాం. ఇక్కడ కేవలం 'విలువ' లెక్కల ప్రకారం చూస్తే, గతంలో 100 విలువ గల దూదికి బదులు మళ్ళీ 100 విలువ గల దూది ఉత్పత్తి అయినట్టే కనపడుతుంది. కానీ, దూది సైజుని చూస్తే, 10 టన్నులకు బదులు 5 టన్నులే ఉత్పత్తి అయింది. పరిస్థితి ఇలా ఉన్నప్పుడు, ఆ తక్కువ దూదితో సమాజానికి కావలసినంత బట్ట పునరుత్పత్తి అవదు. 5 టన్నుల దూది విలువ 200 అయినా, 500 అయినా, ఆ విలువ ఎన్ని రెట్లు పెరిగినా, కావలసినంత దూది లేనప్పుడు, కావలసినంత బట్ట పునరుత్పత్తి కాదు. ఇప్పుడు మనం చూడబోయే 'పునరుత్పత్తి పాళ్ళ'ని విలువ లెక్కల ద్వారానే చూస్తాం. అయితే ఆ విలువ లెక్కల వెనక 'ఉపయోగపు విలువ' లెక్కలన్నీ (ఉత్పత్తుల పరిమాణా లన్నీ), గతంలో లాగే, మార్పు లేకుండా ఉన్నట్టు గానే అనుకుంటాం. 10 టన్నుల దూది విలువ 100 రూ.లు అనుకున్నాం కాబట్టి, 100 రూ.ల దూదికి బదులు, మళ్ళీ 100 రూ.ల దూది పునరుత్పత్తి అయింది — అన్నప్పుడు, 10 టన్నుల దూదికి బదులు మళ్ళీ 10 టన్నుల దూది పునరుత్పత్తి అయింది — అనే అర్థాన్నే తీసుకోవాలి. ఈ షరతులన్నిటినీ దృష్టిలో పెట్టుకుని, ఈ 'పాళ్ళ సమస్య'ని చూడాలి. 1వ గ్రూపులో తయారయ్యే ఉత్పత్తి సాధ నాల్ని — 2 గ్రూపుల పెట్టుబడిదారులూ కొంటే; 2వ గ్రూపులో తయారయ్యే పోషణ వస్తువుల్ని — 2 గ్రూపుల పెట్టుబడిదారులూ + కార్మికులూ కొంటారు. ఈ ఉత్ప త్తుల కదిలికలన్నీ 'మారకాల ద్వారానే' జరుగుతాయి. పెట్టుబడిదారీ సమాజంలో, అమ్మకాలూ కొనుగోళ్ళూ లేకుండా సరుకులు కదలవు.

మొదట 'సింపుల్ పునరుత్పత్తి'కి సంబంధించిన సూత్రాలు చూస్తాం. 'విస్తృత పునరుత్పత్తి'లో సింపుల్ పునరుత్పత్తి కూడా ఒక భాగం గనక, మొదట సింపుల్ పునరుత్పత్తిని చూసి, దాని సూత్రాల ఆధారంతో తర్వాత విస్తృత పునరుత్పత్తి సూత్రాలు చూడాలి. అవసరమైన మార్పులు చేసుకోవాలి.

## సింపుల్ పునరుత్పత్తి సూత్రాలు:

ఇది పెట్టుబడిదారీ సింపుల్ పునరుత్పత్తా, నూతన సమాజపు సింపుల్ పునరుత్పత్తా — అనే వివరాలతో ఇక్కడ అవసరం లేదు. ఏ సమాజంలో అయినా, 'సింపుల్ పునరుత్పత్తి సూత్రాలు' ఒకే రకంగా ఉంటాయి. కాకపోతే పెట్టబడిదారీ సమాజంలో సజీవ శ్రమ V+S భాగాలుగా ఉంటే, నూతన సమాజంలో సజీవ శ్రమ $L_1$, $L_2$ భాగా లుగా ఉంటుంది. పెట్టుబడిదారీ సింపుల్ పునరుత్పత్తిలో S ఉంటే, నూతన సింపుల్ పునరుత్పత్తిలో S ఉండదు. అయినప్పటికీ ఈ తేడాల్ని పట్టించుకోనక్కరలేదు. ఎందు కంటే, ఉత్పత్తి విలువని, C+V+Sలుగా విభజించినా, లేదా $MP+L_1+L_2$ లుగా విభజించినా, పునరుత్పత్తి సూత్రాలలో తేడా రాదు. కాబట్టి ఉదాహరణలు తేలిగ్గా ఉండడం కోసం, ఉత్పత్తి విలువని ఇక్కడ C+V+S లు గానే (ఆ పేర్లతోనే) చూస్తాము.

ఇప్పుడు 2 గ్రూపుల్లోనూ ఉండే సంవత్సర ఉత్పత్తుల రాసుల్ని తీసుకోవాలి. గతంలో చూసిన ఉదాహరణలనే ఇక్కడ మళ్ళీ తీసుకుంటాము.

2 గ్రూపుల వివరాలూ ఇలా ఉన్నాయి:

(1) 400 C + 100 V + 100 S = 600. ఇవి, ఉత్పత్తి సాధనాలు.

(2) 200C + 50V + 50S = 300. ఇవి, పోషణ వస్తువులు.

ఇందులో, 400C + 200Cలు, పెట్టుబడిదారుల చేతుల్లో కేవలం 'పెట్టుబడులు'గా ఉండే భాగాలు.

1వ V + 2వ Vల్ని — పెట్టుబడిదారుల వేపు నించి చూస్తే, పెట్టుబడుల్లో భాగాలు గానూ; కార్మికుల వేపు

నించి చూస్తే, వారి ఆదాయాలు గానూ ఉంటాయి.

1వ S + 2వ S లు — పెట్టుబడుల్లో భాగాలు కానివి. ఇవి పెట్టుబడిదారుల ఆదాయాలు.

1వ గ్రూపులో ఉన్న ఉత్పత్తి సాధనాలు 2 గ్రూపులకూ అందాలి. అలాగే 2వ గ్రూపులో ఉన్న పోషణ వస్తువులు కూడా 2 గ్రూపులకూ అందాలి.

ఒక గ్రూపులో పునరుత్పత్తి క్రమం జరిగిందంటే, 2వ గ్రూపులో కూడా పునరుత్పత్తి క్రమం జరిగినట్టే అర్థం.

ఇది సింపుల్ పునరుత్పత్తి కాబట్టి, ఈ 2 గ్రూపుల మధ్యా పునరుత్పత్తి క్రమాలు పూర్తి అయిన తర్వాత చూస్తే, ఆ 2 గ్రూపులూ మళ్ళీ అలాగే, ఆ భాగాలతోనే ఉంటాయి. పెట్టుబడి పెరగదు కాబట్టి, ఆ భాగాలు ఎప్పుడూ అలాగే ఉంటాయి.

ఈ 2 గ్రూపుల ఉత్పత్తులూ, 2 గ్రూపుల మధ్యా 'మారకాలు' అవడంలో— కొన్ని సూత్రాలు కనపడతాయి.

2 గ్రూపుల ఉత్పత్తులూ, 'విలువ' విషయం లోనూ, 'పరిమాణాల' విషయం లోనూ కూడా పరస్పర సంబంధా లతో ఉండాలి. ఆ సంబంధాలు, ఎలా ఉండాలంటే:

**1)** 1వ గ్రూపులో కొత్తగా తయారయ్యే ఉత్పత్తి సాధ నాలు, 2 గ్రూపుల లోనూ ఖర్చయ్యే గత ఉత్పత్తి సాధనా లతో సమానంగా ఉండాలి.

$$\text{1వ}\ C + V + S = \text{1వ}\ C + \text{2వ}\ C$$
$$400 + 100 + 100 = 400 + 200$$
$$600 = 600$$

**2)** 2వ గ్రూపులో తయారయ్యే కొత్త పోషణ వస్తు వులు, 2 గ్రూపుల లోనూ ఖర్చయ్యే గత Vలూ, Sలూ కలిసిన మొత్తంలో సమానంగా ఉండాలి.

$$\text{2వ}\ C + V + S = \text{2వ}\ V, S + \text{1వ}\ V, S$$
$$200 + 50 + 50 = 50, 50 + 100, 100$$
$$300 = 300$$

**3)** 1వ గ్రూపులో కొత్త V, Sలు కలిసిన మొత్తం, 2వ గ్రూపులో ఖర్చయ్యే గత Cతో సమానంగా ఉండాలి.

$$\text{1వ}\ V + S = \text{2వ}\ C$$
$$100 + 100 = 200$$
$$200 = 200$$

ఒక సమాజంలో ఉత్పత్తి అంతా, దాదాపు ఈ సూత్రాల ప్రకారం ఉంటేనే, ఒక సంవత్సరపు ఉత్పత్తి రాసితో సింపుల్ పునరుత్పత్తి ఆటంకాలు లేకుండా, సవ్యంగా జరుగుతుంది.

కొందరు పెట్టుబడిదారులు, తమ గ్రూపు లోనే ఒక శాఖలో నించి ఇంకో శాఖలోకి గానీ; ఒక గ్రూపులో నించి ఇంకో గ్రూపులోకి గానీ, మారుతూ ఉంటారు. ఒక పెట్టుబడిదారుడు ఎక్కడి నించి ఎక్కడికి మారినా, వాడికి ఏదో ఒక రకం ఉత్పత్తి సాధనాలూ, పోషణ వస్తువులూ కావాలి. పెట్టుబడిదారులు ఖర్చుపెట్టేదీ, ఉత్పత్తి చేసేదీ ఒక దానితో ఒకటి సరిపోయే లాగ ఉంటే, ఎవడు ఎందులోంచి ఎందులోకి మారినా, ఆ మార్పుల ప్రభావం పునరుత్పత్తి క్రమం మీద ఉండదు.

## విస్తృత పునరుత్పత్తి సూత్రాలు:

ఈ ఉదాహరణలు, విస్తృత పునరుత్పత్తికి తగిన విధంగానే ఉండాలి. గతంలో విస్తృత పునరుత్పత్తి కోసం చూసిన ఉదాహరణలనే ఇక్కడ మళ్ళీ తీసుకుంటాము.

ఒక సంవత్సరపు ఉత్పత్తి రాసి 900.

1వ గ్రూపులో: 400C + 100V + 100S = 600

2వ గ్రూపులో: 150C + 75V + 75S = 300

550C + 175V + 175S = 900

ఈ విస్తృత పునరుత్పత్తి లెక్కల్ని గతంలో చూసిన వాటిని ఒక సారి గుర్తు చేసుకోవాలి.

1వ గ్రూపులో అదనంగా ఉన్న C-50

2వ గ్రూపులో అదనంగా ఉన్న పోషణ—15

ఇక్కడ Sలో కొంత భాగం పెట్టుబడికి కలుస్తుంది. కాబట్టి 2 గ్రూపుల మధ్యా పునరుత్పత్తి క్రమాలు జరిగిన తర్వాత చూస్తే, ఆ కొత్త రాసులు గతంలోలాగ ఉండవు. తేడాగా ఉంటాయి.

మొదటి ఉదాహరణలో 2 గ్రూపులు:

1) 400C + 100V + 100S = 600

2) 150C + 75V + 75S = 300

కొత్త విస్తృత పునరుత్పత్తి తర్వాత:

1) 440C + 110V + 110S = 660

2) 160C + 80V + 80S = 320

ఈ భాగాలతో మళ్ళీ తర్వాత కూడా విస్తృత పున రుత్పత్తి సాధ్యమవుతుంది.

విస్తృత పునరుత్పత్తి జరగాలంటే, 2 గ్రూపుల సంబం ధాలలోనూ ఈ సూత్రాలు కనపడతాయి.

**1)** 1వ గూపులో తయారయ్యే ఉత్పత్తి సాధనాలు, 2 గ్రూపులలోనూ కలిసి ఖర్చయ్యే ఉత్పత్తి సాధనాల కన్నా ఎక్కువగా ఉండాలి. అలా వుంటేనే, 2 గ్రూపులలోనూ

పునరుత్పత్తి క్రమాలు జరిగేటప్పుడు, గత ఉత్పత్తి క్రమంలో కన్నా ఎక్కువ ఉత్పత్తి సాధనాల్ని వాడడం సాధ్యమవుతుంది.

దీన్ని క్లుప్తంగా ఇలా చూడవచ్చు.

1వ C + V + S ల మొత్తం, 1వ C + 2వ C ల మొత్తం కన్నా ఎక్కువగా ఉండాలి.

మొదట ఖర్చయిన C:

1వ C + 2వ C

400 + 150 = 550C

కొత్తగా తయారైన C:

ఖర్చయిన C కన్నా, కొత్తగా తయారైన C ఎక్కువగానే ఉంది. అది ఈ ఉదాహరణలో 50 ఎక్కువగా ఉంది. అది ఎంత ఎక్కువగా ఉండాలో, అక్కడ ఉన్న అవసరాల్ని బట్టే ఉంటుంది.

**2)** 2వ గ్రూపులో కొత్తగా తయారయ్యే పోషణ వస్తువులు, 2 గ్రూపులలోనూ ఖర్చయ్యే V + S లు కలిసిన మొత్తం కన్నా, తక్కువగా ఉండాలి, 'తక్కువగా' ఎందుకు ఉండాలంటే, ఇంకా పునరుత్పత్తి జరగకముందు తయారై వున్న S లు, విస్తృత పునరుత్పత్తి జరిగేటప్పుడు, పూర్తిగా పోషణ ఉత్పత్తుల మీదే ఖర్చుకావు. 2 గ్రూపుల Sలలోనూ కొంత కొంత భాగాలతో, కొత్త C లను కూడా కొనవలసి ఉంటుంది. కాబట్టి, 2వ గ్రూపులో తయారయ్యే పోషణ వస్తువులు, 2 గ్రూపుల లోనూ ఉన్న V + S ల మొత్తం కన్నా తక్కువగా ఉంటేనే, ఆ పోషణ వస్తువుల అమ్మకాలు పూర్తిగా సాధ్యమవుతాయి.

దీన్ని క్లుప్తంగా ఇలా చూడవచ్చు.

2వ C + V + S ల మొత్తం, 1వ V, S + 2వ V, S ల కన్నా తక్కువగా ఉండాలి.

మొదటవున్న V, S లు:

1వ V, S + 2వ V, S

100, 100 + 75, 75 = 350

2వ గ్రూపులో తయారైన మొత్తం:

2వ C + V + S

150 + 75 + 75 = 300

విలువ భాగాలు ఇక్కడ కూడా కావలసిన విధంగానే ఉన్నాయి.

**3)** 1వ గ్రూపు V, Sలు కలిసి, 2వ గ్రూపు Cకన్నా ఎక్కువగా ఉండాలి. ఎందుకంటే, విస్తృత పునరుత్పత్తిలో, 1వ గ్రూపు S లో కొంత భాగం, 2వ గ్రూపులో కొత్త C గా ఉండాలి కాబట్టి.

దీన్ని ఇలా క్లుప్తంగా చూడవచ్చు.

2వ C కన్నా, 1వ V + S ల మొత్తం ఎక్కువే.

150 కన్నా, 100 + 100 = 200, ఎక్కువే.

సింపుల్ పునరుత్పత్తిలో గానీ, విస్తృత పునరుత్పత్తిలో గానీ, 2 గ్రూపుల ఉత్పత్తులూ ఒక 'సమిష్టి ప్లాను'తో ఉన్నట్టుగా ఊహిస్తూ, ఈ సూత్రాలు చూశాం. మొత్తం సమాజంలో అనేక వందల, వేల శాఖలతో నిండిన 2 గ్రూపుల మధ్యా 'మారకాలు' జరగాలంటే, ఆ పరిస్తితి, తప్పనిసరిగా ఒక 'సమిష్టి ప్లాను'ని అవసరం చేస్తుంది. కానీ, పెట్టుబడిదారీ విధానంలో పూర్తిగా అసాధ్యమైన విషయం అది. ఈ విధానంలో, ఒక శాఖలో ఉండే విడి విడి పెట్టుబడిదారులకు గానీ, పెట్టుబడిదారుల బృందాలకు గానీ, ఒకరితో ఒకరికి సంబంధాలు ఉండవు. ఎవరి ప్లాను వాళ్ళదిగా ఉంటుంది. ఒక బట్ట పెట్టుబడిదారుణ్ణి తీసుకుంటే, వాడికి, తన ఉత్పత్తిని గురించే ఏదో ఒక ప్లాను ఉంటుంది గానీ, అదే రకం బట్టని ఇతర పెట్టుబడిదారులు ఎంతెంత పరిమాణాల్లో తయారుచేస్తున్నారో వాడికి తెలీదు. ప్రతీ పెట్టుబడిదారుడి ప్లానూ, సమాజ అవసరాల్ని బట్టిగాక, వాడి 'ఉత్పాదక శక్తి' మీదే ఆధారపడి ఉంటుంది. ఈ రకంగా, పెట్టుబడిదారీ విధానంలో, 'సమిష్టి ప్లాను'ని ఏర్పరిచే పరిస్తితి, ఎవరి చేతుల్లోనూ ఉండదు. కాబట్టి, ఇక్కడ 2 గ్రూపులలోనూ ఉత్పత్తులన్నీ ఖచ్చితమైన లెక్కలు లేని, అస్తవ్యస్తపు పరిమాణాలతో తయారవుతూ ఉంటాయి.

అయితే మరి, పెట్టుబడిదారీ సమాజంలో 'పునరుత్పత్తి క్రమాలు' ఎలా సాధ్యమవుతున్నాయి? ఇక్కడ పెట్టుబడిదారులందరూ ఎవరి సరుకుని వాళ్ళు అమ్ముకుంటూనే ఉన్నారు కదా? ఎలా అమ్ముకోగలుగుతున్నారు? — ఎలాగంటే, పరస్పరం సరిపోని, సరుకుల 'సప్లయి — డిమాండ్ల' సమస్యని ఎదుర్కొంటూ, సరుకుల 'మార్కెట్ ధరలు', వాటి 'ఉత్పత్తి ధరల' కన్నా పైకో కిందకో పోవడాల ద్వారా మాత్రమే అమ్ముకోగలుగుతారు. సరుకునంతా సకాలంలో అమ్మలేకపోవడం కూడా జరుగుతూనే ఉంటుంది. (ఈ విషయాలు 2వ సంపుటంలో, 'పెట్టుబడిదారీ ధర' చాప్టర్‌లో వివరంగా చూస్తాం.)

పెట్టుబడిదారీ సమాజంలో, సరుకుని అమ్మడం అనేది, అనేక అపసవ్యపు మార్గాలలో అనేక మోసాలతో జరుగుతుంది. ఆ రకపు పద్ధతుల్లో కూడా అమ్మకాలు సాధ్యంకాని పరిస్తితి కూడా కొంత కాలానికోసారి ఏర్పడుతూ వుంటుంది. అప్పుడు అమ్మకాలు పూర్తిగా ఆగిపోయి, 'పునరుత్పత్తి' కూడా ఆగిపోయే పరిస్తితి ఏర్ప

డుతూ వుంటుంది. ఇది సమాజంలో అనేక సమస్యల్ని, ముఖ్యంగా, 'నిరుద్యోగ' సమస్యని, మరింత తీవ్ర స్థాయికి పెంచుతుంది. దీని ఫలితం, కార్మిక జనాభాలో బాధలూ, ఆకలి మరణాలూ తీవ్ర స్థాయికి పెరగడమే.

## 'నూతన సమాజం'లో పునరుత్పత్తి

పునరుత్పత్తి సూత్రాలు ఏ సమాజంలో అయినా ఒకటే. ఉత్పత్తి శక్తి ఒకే రకంగా ఉన్నట్టయితే, ఉత్పత్తి సాధనాలకూ సజీవ శ్రమకూ ఉండే పాళ్ళు, ఏ సమాజంలో అయినా ఒకే రకంగా ఉంటాయి. సింపుల్ పునరుత్పత్తిలో అయితే వేరు వేరు సమాజాలలో కూడా ఆ పాళ్ళు ఒకే రకంగా ఉంటాయి. విస్తృత పునరుత్పత్తి విషయం లోనే, నూతన సమాజంలో కొన్ని మార్పులు అవసరమవుతాయి. అయినప్పటికీ, ఉదాహరణలు తేలిగ్గా ఉండడం కోసం ఆ పాళ్ళని (ఉత్పత్తి సాధనాలకూ, సజీవ శ్రమకూ ఉండే పాళ్ళు) ఏ సమాజంలో అయినా ఒకే రకంగా ఉన్నట్టు చూస్తాము. 2 గ్రూపుల మధ్యా ఇంతకు ముందు చూసిన సంబంధాలు నూతన సమాజానికి కూడా వర్తిస్తాయి. నూతన సమాజపు గ్రూపుల్లో, ఉత్పత్తుల విలువల్ని C + V + S లుగా గాక, వేరే పేర్లతో, ప్రస్తావించుకుంటాం.

ఇక్కడ కూడా, ఉత్పత్తి సంస్థల్ని 2 గ్రూపులు గానే విభజిస్తాం. 'నూతన సమాజం' ప్రారంభమైన దగ్గిర నించి, కొంత కాలం వరకూ ఉత్పత్తుల 'అమ్మకాలు' ఉంటాయనీ, తర్వాత అమ్మకాలు ఉండవనీ అనుకుంటే, అమ్మకాలు ఉన్న దశ లోనూ, లేని దశ లోనూ కూడా, ఉత్పత్తి క్రమాలకు ఒక 'సమిష్టి ప్లాను' అవసరమవుతుంది. ఈ ప్లాను సూత్రాలు, ఇంతకు ముందు చూసిన 'పునరుత్పత్తి సూత్రాలే'.

మొదట 'సింపుల్ పునరుత్పత్తి'ని చూద్దాం. పెట్టుబడిదారీ సింపుల్ పునరుత్పత్తి ఉదాహరణనే మొదట తీసుకుందాం.

1వ గ్రూపు : 400C + 100V + 100S = 600.

2వ గ్రూపు : 200C + 50V + 50S = 300.

నూతన సమాజంలో, C ('స్థిర') అనే మాటకి బదులుగా MP ('ఉత్పత్తి సాధనాలు') అనే మాటని వాడాలి. V + Sలను కలిపేస్తే అది మొత్తం L ('సజీవ శ్రమ'). ఇక్కడ, Lని, 'సజీవ శ్రమ'కీ, తయారైన పోషణ వస్తువులకూ కూడా గుర్తుగా వాడవచ్చును. సింపుల్ పునరుత్పత్తిలో ఉండే సజీవ శ్రమ అంతా గత శ్రమకు బదులుగా వచ్చేదే కాబట్టి, (ఇక్కడ ఎక్కువ శ్రమ ఉండదు కాబట్టి), ఇక్కడ Lని, 2 భాగాలుగా విభజించకపోయినా ఫర్వాలేదు. Lని, — $L_1$, $L_2$ లుగా విభజిస్తే, జీతాలూ, సమాజ నిధీ వేరు వేరుగా ఉన్నట్టు అర్థం. లేదా, Lని, 2 భాగాలుగా విభజించకపోతే, జీతాలూ సమాజ నిధీ కలిసిపోయి ఉన్నాయని అర్థం. ఉదాహరణని ఎలా తీసుకున్నా ఒకటే. ఈ మారిన గుర్తులతో, ఈ సూత్రాల్ని నూతన పద్ధతిలో రాస్తే అవి ఇలా ఉంటాయి.

మొదటి 'ఉత్పత్తి క్రమం'లో:

1వ గ్రూపు : 400MP + 200L = 600MP. (ఉత్పత్తి సాధనాలు)

2వ గ్రూపు : 200MP + 100L = 300L. (పోషణ వస్తువులు)

ఈ గ్రూపుల మధ్య పునరుత్పత్తి క్రమం జరిగినప్పుడు, ఇది సింపుల్ పునరుత్పత్తి కాబట్టి, ఈ గ్రూపులు మళ్ళీ ఇలాగే ఉంటాయి.

ఇక్కడ కూడా గ్రూపుల సంబంధాలు గతంలో చూసినట్టే ఉంటాయి. మొదటి గ్రూపు — 2 గ్రూపులకూ MPల్ని అందిస్తే, 2వ గ్రూపు — 2 గ్రూపులకూ పోషణని అందిస్తుంది.

**నూతన సమాజపు 'సింపుల్ పునరుత్పత్తి' సూత్రాలు:**

**1)** 1వ MP + L = 1వ MP + 2వ MP
400 + 200 = 400 + 200
600 = 600

**2)** 2వ MP + L = 2వ L + 1వ L
200 + 100 = 100 + 200
300 = 300

**3)** 1వ L = 2వ MP
200 = 200

**నూతన సమాజపు విస్తృత పునరుత్పత్తి సూత్రాలు:**

ఇక్కడ గత శ్రమేగాక, ఎక్కువ శ్రమకూడా ఉంటుంది. ఈ భాగాల్ని $L_1$, $L_2$లుగా అందాం.

ఎక్కువ శ్రమ జరిగేటప్పుడు, 1వ గ్రూపు, 2 గ్రూపులకూ కావలసిన పాత MPల్నీ, కొంత కొత్త MPల్నీ కూడా ఉత్పత్తి చెయ్యాలి. 2వ గ్రూపు, 2 గ్రూపులకూ కావలసిన పాత పోషణని పునరుత్పత్తి చేస్తూ, కొత్త పోషణని కూడా ఉత్పత్తి చెయ్యాలా లేదా అనేది, ఆ సందర్భాల్ని బట్టి ఉంటుంది. ఈ గ్రూపుల సంబంధాలు, ఏ సమాజంలో అయినా ఈ విధంగా ఉండవలసిందే. పెట్టుబడిదారీ విస్తృత పునరుత్పత్తి సూత్రాల్ని యథాతథంగా పాటించకుండా, అవసరమైన మార్పులు చేసుకుంటూ, క్రమంగా దొరికే నూతనమైన అనుభవాల తోనే సరైన సూత్రాల్ని స్థిరం చేసుకోవాలి.

ప్రస్తుతానికి ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం పెట్టుబడిదారీ సూత్రాల ప్రకారమే వీటిని క్లుప్తంగా ఇలా చూడవచ్చు.

**నూతన విస్తృత పునరుత్పత్తి సూత్రాలు:**

**1**) 1 వ MP + $L_1$ + $L_2$ల మొత్తం,
1 వ MP + 2వ MPల మొత్తం కన్నా ఎక్కువగా ఉండాలి.

**2**) 2 వ MP + $L_1$ + $L_2$ల మొత్తం,
1వ $L_1$, $L_2$ + 2వ $L_1$, $L_2$ల మొత్తం కన్నా తక్కువగా ఉండాలి.

**3**) 1 వ $L_1$, $L_2$ల మొత్తం,
2 వ MP కన్నా ఎక్కువగా ఉండాలి.

ఏ సమాజపు విస్తృత పునరుత్పత్తిలో అయినా ఉండ వల్సిన ప్రాథమికమైన సూత్రాలు ఇవే.

ఈ పాళ్ళన్నీ 'విలువ'ల ద్వారా చూసేవే.

విలువ లెక్కలు లేని సమాజాన్ని ఊహిస్తే, అప్పుడు, 2 గ్రూపుల మధ్యా పునరుత్పత్తి సూత్రాలు ఎలా ఉండ వలసి ఉంటుంది? — నూతన సమాజంలో, కొన్ని దశల ద్వారా వచ్చే అనుభవాలే ఆ మార్గాన్ని సూచిస్తాయి. ఒక ఎకరం పొలం దున్నడానికి, ఇంత మంది మనుషులు కావాలి; ఇన్ని యంత్రాలు కావాలి — అంటూ ఇలా ఉత్పత్తి అంశాల మధ్య కొన్ని పాళ్ళని గ్రహించడం అసాధ్యమైన విషయం కాదు. కానీ, దీనికి అనేక అనుభ వాలు కావాలి.

# S లో ఇంత వరకూ చూడని ఇంకో భాగం!

**ఇ**ది, పెట్టుబడిదారుడు, ఇన్సూరెన్స్ కోసం కట్టే ప్రీమియమ్. ఇన్సూరెన్స్ కంపెనీ నడిపే వాడు కూడా ఒక పెట్టు బడిదారుడే.

ఉత్పాదక పెట్టుబడిదారుల దగ్గిర ఉత్పత్తి సాధనాలు ఉంటాయి కదా? వరదలూ తుఫానులూ అగ్ని ప్రమా దాలూ వంటి వాటి వల్ల పెట్టుబడిదారుడి ఉత్పత్తి సాధ నాల్లో కొన్ని నాశనం కావచ్చు. అలాంటి ప్రమాదాలు జరిగితే తను నష్టపోకుండా ఉండడం కోసం, పెట్టుబడి దారుడు, ఇన్సూ రెన్స్ కంపెనీకి వాయిదాల ప్రకారం డబ్బు కడుతూ వుంటాడు. వాడి ఆస్తికి ఏదైనా నష్టం జరిగితే, ఇన్సూరెన్స్ కంపెనీ, వాడు కట్టిన దాని కన్నా ఎక్కువ డబ్బు చెల్లిస్తుంది. ఏ నష్టమూ జరక్కపోతే, పెట్టుబడిదారుడు కట్టిన డబ్బు అంతా కొంత కాలానికి వడ్డీలతో సహా వెనక్కి వచ్చేస్తుంది.

ఇన్సూరెన్స్ కంపెనీ, తన కస్టమర్లకు ఆ డబ్బు ఎలా ఇవ్వగలుగుతుందంటే, వాళ్ళు కట్టే ప్రీమియమ్‌ల డబ్బు నంతా అది వడ్డీలకు ఇచ్చి, ఆ రకంగా వచ్చిన వడ్డీలలో నించే పెట్టుబడిదార్ల నష్టాలకు చెల్లించడమూ, ఆ పైన తను కూడా లాభం సంపాదించడమూ చెయ్యగలుగు తుంది. ఇన్సూరెన్స్ కంపెనీకి నూరు మంది కస్టమర్లు ఉన్నారనుకుంటే, ఆ నూరు మందీ నష్టపోవడం జరగదు. నష్టపోయే కేసులు, నూటికి ఐదో పదో మాత్రమే ఉంటాయి. నూరు మంది కట్టే ప్రీమియమ్‌ల ద్వారా వచ్చే వడ్డీలలోనించి, నష్టపోయే కేసులకు ఎక్కువ డబ్బు చెల్లిం చడం ఇన్సూరెన్స్ కంపెనీ తేలిగ్గానే చెయ్యగలుగుతుంది.

బట్ట పెట్టుబడిదారుడి దగ్గిర వెయ్యి రూపాయల దూది ఏదో ప్రమాదంలో తగలబడి పోయిందనుకుందాం. వాడు ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పటికి కట్టింది 200 లే అను కుందాం. అయినా వాడికి ఆ కంపెనీ నించి ఆ వెయ్యీ వచ్చేస్తుంది. దానితో వాడు, కొత్త దూది కొనేస్తాడు. వాడికి నష్టమే జరగనట్టు అవుతుంది.

కానీ, ఇక్కడ కొంత దూది నిజంగానే తగలబడింది కదా? ఇది నష్టమా, కాదా? ఈ నష్టం ఎవరికి జరిగినట్టు?

అది నష్టమే. ఆ నష్టం పెట్టుబడిదారీ వర్గానికి. ఇలాంటి నష్టాలే జరగకపోతే, ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియమ్‌లు కట్టాల్సిన అవసరం వాళ్ళకు ఉండదు. S లో ఆ భాగం కూడా, ఆ కట్టే వాళ్ళకే మిగులుతుంది. ప్రమాదాల్లో ఆస్తుల్ని నష్టపోయే పెట్టుబడిదారుల కోసం, ఆ వర్గం అంతా కలిసి, S లో కొంత భాగాన్ని సర్దుబాటు చేస్తుందన్న మాట!

వీళ్ళకి, ఆస్తి నష్టాలే కాదు, ప్రాణ నష్టాలు కూడా డబ్బు ద్వారానే తీరతాయి! ప్రాణాల కోసం కూడా ఇన్సూరెన్సులే! ఒక మనిషి పోగానే, దానికి బదులు డబ్బు వచ్చేస్తే, ఆ నష్టం తీరిపోతుంది!

కార్మికులు కూడా తమ జీతాల్లో నించి ఇన్సూరెన్సు లకు కట్టడమూ, ప్రాణ నష్టాలు జరిగితే, ఇన్సూరెన్సు కంపెనీలు చెల్లించే డబ్బు ద్వారా ఆ కుటుంబం తేరు కోవడమూ జరుగు తాయి. పూర్తిగా పెట్టుబడిదారీ మార్గంలోనే!

ఒక విడి పెట్టుబడిదారుడి విషయంలో గానీ, సమాజం మొత్తం మీద గానీ, S ని లెక్క చూడాలంటే, పెట్టుబడిదారులు కట్టే ఇన్సూరెన్స్ ప్రీమియముల్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి.

**మార్క్సు మాటల్లో:**

"బీమా (ఇన్స్యూరెన్స్) కంపెనీలు, వ్యక్తి పెట్టు బడిదారుల నష్టాలను పెట్టుబడిదారీ వర్గం మధ్య

పంపిణీ చేస్తాయి. కానీ, ఈ నష్టాలు ఇలా సమానంగా పంపిణీ అయినంత మాత్రాన, మొత్తం సామాజిక పెట్టుబడికి సంబంధించినంత వరకు, ఇవి నష్టాలు కాకపోవు" — (కాపిటల్-2, విశాలాంధ్ర అనువాదం, పే. 100)

"శ్రమ పరికరాల అరుగుదలని భర్తీ చేయడం, వాటిని మంచి స్థితిలో వుంచడం, మరమ్మత్తులూ వగైరాలకు పూర్తిగా భిన్నమైనది — బీమా. అది అసాధారణ సంఘటనల వల్ల జరిగే విధ్వంసనకు సంబంధించింది. దీన్ని అదనపు విలువ నుంచి భర్తీ చేయాలి. కాబట్టి అది అదనపు విలువలో కోత; లేదా మొత్తం సమాజం దృష్టి నుంచి చూస్తే, ఎప్పుడూ నిరంతరాయమైన అధికోత్పత్తి ఉండాలి. అంటే, ఉన్న సంపదను కేవలం భర్తీ చేయడానికి — అంటే పునరుత్పత్తి చేయడానికి — అవసరమైన దాని కన్నా ఎక్కువ స్థాయిలో ఉత్పత్తి జరగాలి. జనాభా పెరుగుదల మాట అటుంచి, దుర్ఘటనల వల్లా, ప్రకృతి ఉత్పాతాల వల్లా, అసాధారణమైన విధ్వంసన జరగవచ్చు. వాటి వల్ల వచ్చే నష్టాన్ని భర్తీ చేయడానికి కావలసిన ఉత్పత్తి సాధనాలు సమాజానికి ఉండేలా ఉత్పత్తి జరగాలి" (అదే పుస్తకం, విశాలాంధ్ర అనువాదం, పే. 134)

"మొత్తం లాభం లోని ఒక భాగం, అంటే అదనపు విలువ లోని ఒక భాగం, ఉత్పత్తి కోసం బీమా నిధిగా రూపొందాలి. అదనపు శ్రమలోని ఒక భాగం, ఈ బీమా నిధిని సృష్టిస్తుంది; ఆ మేరకు అది నేరుగా పెట్టుబడిని, అంటే పునరుత్పత్తికి ఉద్దేశించిన నిధిని సృష్టిస్తుంది." (అదే పుస్తకం, పేజీ. 300)

# పునరుత్పత్తిలో 'డబ్బు - రాసి' సమస్య!

'**డ**బ్బు' గురించి తెలుసుకోవలిసిన అనేక విషయాల్లో 3 విషయాలు చాలా ప్రధానం.

(1) 'డబ్బు' అంటే ఏమిటి? — దీన్ని 1వ భాగంలో చాలా వివరంగానే చూశాం. 'డబ్బు' అంటే, అది కూడా ఒక వస్తువే. అది కూడా శ్రమతో తయారయ్యే ఒక ఉత్పత్తే. దానికి కూడా విలువ ఉంటుంది. సమాజంలోవున్న సమస్త సరుకులతోటీ మారే పాత్రని నిర్వర్తించే ఏకైక వస్తువే — డబ్బు. 'జనరల్ ఈక్వివలెంటు'గా ఉండే వస్తువే — డబ్బు. వేల సంవత్సరాల నించీ బంగారమే డబ్బు సరుకుగా ఉంది. కొన్ని సందర్భాల్లో వెండి కూడా.

(2) పెట్టుబడిదారుడికి, తక్కువ డబ్బుతో ఎక్కువ డబ్బు ఎలా వస్తుంది? — దీన్ని కూడా 2వ భాగంలో వివరంగానే చూశాం. కార్మికుల అదనపు శ్రమ ద్వారానే, పెట్టుబడిదారుడి తక్కువ డబ్బు ఎక్కువ డబ్బుగా పెరుగుతుంది.

(3) చలామణీలో తిరగవలసిన డబ్బు రాసి ఎలా పెరుగుతూ ఉంటుంది? — ఇదే ఇప్పుడు చూడవలసిన విషయం. దీనికి మొదట క్లుప్తమైన జవాబు — ఎప్పటికప్పుడు కొత్త బంగారం డబ్బుగా మారడం ద్వారానే డబ్బు పరిమాణం పెరుగుతూ ఉంటుంది.

పెట్టుబడిదారుణ్ణీ, కార్మికుల్నీ తీసుకుంటే — 'డబ్బు' అనేది, మొదట ఎవరి దగ్గిర ఉంటుంది? అది మొదట ఎవరి ద్వారా చలామణీలోకి వస్తుంది? — ఆ ఇద్దర్నీ తీసుకుంటే, డబ్బు, మొదట పెట్టుబడిదారుడి దగ్గిరే వుంటుంది. (అది, వాడికి ఎలా వచ్చింది — అనేది వేరే సంగతి.) పెట్టుబడిదారుడు, కార్మికులకు జీతాలు ఇచ్చినప్పుడు మాత్రమే ఆ డబ్బు కార్మికుల చేతుల్లోకి వస్తుంది.

బట్ట పెట్టుబడిదారుడు, కొంత బట్ట తయారీకోసం, 100 డబ్బుని, $80C+20V$లుగా ఖర్చుపెట్టాడనుకుందాం. $80C$ కోసం పెట్టిన డబ్బు, ఉత్పత్తి సాధనాల్ని అమ్మే పెట్టుబడిదారుల చేతుల్లోకి పోయి, ఆ సాధనాలు, బట్ట వాడి దగ్గిరికి వస్తాయి. $20V$ మీద పెట్టిన డబ్బు, కార్మికుల చేతుల్లోకి జీతాలుగా వెళ్ళి, అక్కడి నించి, పోషణ వస్తువుల్ని అమ్మే పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్తుంది. ఆ రకంగా, బట్ట పెట్టుబడిదారుడు, తన చేతుల్లో నించి 100 డబ్బుని (నోట్లు గానీ, నాణాలు గానీ, రెండూ గానీ) చలామణీలోకి (బయటికి) వదిలాడన్నమాట.

తర్వాత, బట్ట తయారయింది. దాని కోసం పెట్టిన పెట్టుబడి 100 మాత్రమే అయినా, దానికి కార్మికుల $S$ కూడా కలిసి, దాని విలువ 120 అయిందనుకుందాం. బట్ట వాడు దాన్ని అమ్మకానికి పెట్టాడు.

అంటే, బట్టవాడు చలామణీలోకి మొదట 100 డబ్బుని వదిలి, తర్వాత 120 విలువ గల సరుకుని కూడా వదిలాడు. ఆ సరుకుతో మారడానికి, చలామణీలో, 120 డబ్బు ఉండాలి.

బట్టకి అమ్మకం జరిగింది. బట్ట వాడి చేతుల్లోకి 120 డబ్బు వచ్చింది!

బట్ట వాడు చలామణీలోకి మొదట వదిలింది 100 డబ్బే కదా? తర్వాత చలామణీలో నించి 120 డబ్బుని తీసుకున్నాడంటే, మొదట చలామణీలోకి వదలని ఇంకో 20 డబ్బు చలామణీలోకి ఎక్కడి నించి వచ్చింది?

ఇక్కడ ప్రశ్న — పెట్టుబడిదారుడు 100 పెట్టుబడి పెడితే అది 120గా ఎలా పెరిగింది — అని కాదు. ఆ విలువ పెరగడం ఎలా జరిగిందో మనకు ఎప్పుడోనే తెలుసు. ఇక్కడ ప్రశ్న, విలువ పెరగడం గురించి కాదు. ఆ పెరిగిన 20 విలువతో కూడా మారడానికి కావలసిన ఎక్కువ డబ్బు, చలామణీలోకి ఎక్కడి నించి వచ్చింది? — అని. ఇదీ ఇక్కడి ప్రశ్న! ఈ ప్రశ్న కూడా ఆర్థిక శాస్త్రంలో చర్చనీయాంశంగా ఉంది.

పెట్టుబడిదారుడు, తను మొదట ఖర్చుపెట్టిన డబ్బు కన్నా ఎక్కువ డబ్బుని వెనక్కి తీసుకుంటాడని ఆర్థిక వేత్తలకు తెలుసు — ఆ ఎక్కువ విలువ ఎలా వస్తుందో తెలియకపోయినా. 'విలువ ఎలా పెరుగుతుంది?' అనేది ఒక ప్రశ్న అయితే, 'ఆ పెరిగే విలువతో మారడానికి, చలామణీలో, డబ్బు ఎలా పెరుగుతుంది?' అనేది ఇంకో ప్రశ్న. ఇప్పుడు కావలసింది ఈ రెండో ప్రశ్న గురించే. ఇది, చలామణీ లోకి చేరే డబ్బు పరిమాణానికి సంబంధించిన విషయం.

ఇక్కడ ఒక విడి పెట్టుబడిదారుణ్ణి తీసుకుంటే, ఈ ప్రశ్నకి అసలు అర్థమే లేనట్టు కనపడుతుంది. ఎందుకంటే — చలామణీలో ఈ ఒక్క పెట్టుబడిదారుడి డబ్బే ఉండదు కదా? ఇంకా బోలెడు మంది పెట్టుబడిదారులు వదిలే డబ్బు ఉంటుంది. అలాంటప్పుడు, ఒక పెట్టుబడిదారుడి సరుకుతో మారడానికి చలామణీలో ఎక్కువ డబ్బు ఎక్కడిది — అనే ప్రశ్న ఏమిటి? — అని సందేహం వచ్చి, ఆ ప్రశ్న అర్థం లేనిదిగా కనపడుతుంది.

కానీ, చలామణీలో బోలెడు డబ్బు ఉన్నా, బోలెడు సరుకులూ ఉంటాయి. బట్ట వాడిలాగే ప్రతీ పెట్టుబడిదారుడూ చలామణీలోకి మొదట తక్కువ డబ్బుని వదిలి, తర్వాత దాని కన్నా ఎక్కువ విలువ గల సరుకుని వదులుతాడు. ఆ సరుకు విలువ కన్నా ఆ డబ్బు తక్కువగా ఉంటుంది. డబ్బుగా మారవలసింది ఒక్క బట్ట వాడి సరుకే కాదు, అందరి సరుకులూ మారాలి.

ప్రతీ పెట్టుబడిదారుడూ తన సరుకుని అమ్ముకున్నప్పుడు, చలామణీ లోకి తను మొదట వదిలిన పెట్టుబడి కన్నా చలామణీ నించి ఎక్కువ డబ్బుని తీసుకుంటాడు కాబట్టి, ఆ ఎక్కువ డబ్బు చలామణీ లోకి ఎలా వచ్చి వుంటుందనే ప్రశ్న, బట్ట వాడి విషయం లోనే కాదు, పెట్టుబడిదారులందరి విషయం లోనూ వస్తుంది. చలామణీలో 100 సరుకులు ఉంటే, 100 సరుకుల విషయం లోనూ వస్తుంది.

ఒకసారి పెట్టుబడిదారులందర్నీ కూడా కలిపి చూద్దాం. పెట్టుబడిదారులందరూ కలిసి చలామణీలోకి పెట్టుబడిగా, 100 డబ్బు వదిలారనుకుందాం. చలామణీలో ఎంత డబ్బు ఉంటుంది? ఆ 100 డబ్బే ఉంటుంది. తర్వాత ఆ పెట్టుబడిదారులందరి దగ్గిరా కొత్త ఉత్పత్తుల రాసి తయారైంది. దాని విలువ 120. అందరూ కలిసి దాన్ని అమ్మారు. అందరి చేతుల్లోకీ వచ్చిన డబ్బు 120. అందరూ కలిసి చలామణీ లోకి వదిలింది 100 డబ్బే అయితే, ఇంకో 20 డబ్బు ఎక్కడి నించి వచ్చింది? — ఇదీ ప్రశ్న!

'చలామణీలో బోలెడు డబ్బు ఉంటుందిగా?' అనే జవాబు ఇక్కడ పనికి రాదు. చలామణీలో బోలెడు డబ్బు ఉండదు. అందరూ కలిసి ఎంత డబ్బు వదిలారో అంత డబ్బే ఉంటుంది.

ఒక విడి పెట్టుబడిదారుడి విషయంలో కొంచెం కూడా అర్థం కాని ఈ ప్రశ్న, ఇప్పుడు కొంచెమైనా అర్థమవుతుంది.

అయితే, ప్రశ్న అర్థమైనా, ఇప్పుడు కూడా ఇది అర్థం లేనిది గానే కనపడుతుంది. ఎందుకంటే — చలామణీలో తక్కువ డబ్బే వున్నా, ఆ తక్కువ డబ్బే మళ్ళీ మళ్ళీ తిరుగుతూ సరుకులతో మారుతూ వుంటుంది కదా? పెట్టుబడిదారులందరూ తమ సరుకుల్ని ఒకేసారి అమ్ముకోరు కదా. అలాంటప్పుడు, 120 సరుకుల రాసితో మారడానికి 120 డబ్బు రాసి ఉండాలా? చలామణీలో వున్న 100 డబ్బే మళ్ళీ మళ్ళీ తిరుగుతూ 120 సరుకుల రాసిని డబ్బుగా మార్చగలదు కదా? ఇప్పుడు మాత్రం సమస్యేముంది?— ఇలా సందేహం వస్తుంది.

నిజమే, బ్రహ్మాండమైన సరుకుల రాసితో మారడానికి బ్రహ్మాండమైన డబ్బు రాసి అక్కరలేదు. ఆ పని తక్కువ డబ్బు ద్వారానే జరుగుతుంది. ఆ తక్కువ డబ్బే మళ్ళీ మళ్ళీ తిరుగుతూ ఆ బ్రహ్మాండమైన రాసిని డబ్బుగా మార్చగలదు. చలామణీలో తిరిగే పని చాలా తక్కువ డబ్బుతో జరిగిపోయే లాగ పెట్టుబడిదారీ విధానం రక రకాల మార్గాలు కనిపెడుతూనే ఉంటుంది. అదంతా నిజమే. కానీ, ఆ 'తక్కువ డబ్బు' కూడా కొన్ని నియమాల ప్రకారం ఉండాలి. ఆ డబ్బు, ఏక కాలంలో ఎన్ని సరుకులతో మారాలో ఆ సరుకుల విలువలతో సరిపోయే లాగ ఉండాలి.

'తక్కువ డబ్బు' అన్నప్పుడు, అది తక్కువ సరుకుతోనే మారుతుంది. ఆ డబ్బు, ఆ సరుకులో ఉన్న 'పెట్టుబడి' తోటీ, దాని పైన వున్న S తోటీ కూడా మారడానికి సరిపోయేదిగా ఉండాలి. ఆ తక్కువ డబ్బునీ, ఆ తక్కువ సరుకునీ తీసుకుంటే, మనం చూసే ప్రశ్న, ఆ తక్కువ సరుకు మీద కూడా ఉంటుంది. ఎంత చిన్న సరుకుని తీసుకున్నా, ఆ సరుకు మీద కూడా ఆ ప్రశ్న ఉంటుంది.

ఇక్కడ 2 వేరు వేరు విషయాలు ఉన్నాయి. (1) చలామణీలో తక్కువ డబ్బే మళ్ళీ మళ్ళీ తిరుగుతూ, సరుకులతో

మారుతూ ఉంటుంది — ఇది ఒక విషయం.

(2) కొంత డబ్బు కొంత సరుకుతో మారేటప్పుడు, ఆ సరుకులో వున్న పెట్టుబడి తోటీ, అదనపు విలువ తోటీ కూడా మారడానికి సరిపోయేదిగా ఉండాలి — ఇది ఇంకో విషయం.

ఇవి రెండూ వేరు వేరు విషయాలు. వీటిని గందరగోళ పరుచుకోకూడదు. రెంటినీ అర్థం చేసుకోవాలి. తర్వాత చూసే విషయాల వల్ల, ఇవి తేలిగ్గానే అర్థమవుతాయి.

చలామణీలోకి పెట్టుబడిదారుడు మొదట వదిలిన పెట్టుబడి కన్నా ఎక్కువ డబ్బు ఎలా వచ్చింది? — అనే ప్రశ్నకి జవాబు సింపుల్ పునరుత్పత్తిలో అయితే చాలా తేలికే. విస్తృత పునరుత్పత్తి లోనే ఇది కొంత యాతన పెడు తుంది.

మొదట సింపుల్ పునరుత్పత్తికి కావలసిన డబ్బు పరిమాణం గురించి చూద్దాం. బట్ట పెట్టుబడిదారుడు, తన సరుకుకోసం, 80C + 20Vల్ని చలామణీలోకి వదులు తాడని చెప్పుకున్నాం. కానీ, వాడు వదిలేది పెట్టుబడిగా వుండే 100 డబ్బుని మాత్రమే కాదు. తన కుటుంబ పోషణ వస్తువుల కోసం కూడా కొంత డబ్బుని చలామణీలోకి వదులుతాడు.

పెట్టుబడిదారుడు పోషణ కోసం వదిలే డబ్బు ఎంత ఉంటుంది? వాడి ఆదాయం ఎంత ఉంటుందో అంత! ఆదాయం, ఎంత ఉంటుంది? సరుకు ద్వారా వచ్చే S యే వాడి ఆదాయం కాబట్టి, S ఎంత ఉంటుందో ఆదాయం అంత!

S ని 20 అనుకుందాం. సింపుల్ పునరుత్పత్తిలో, S అంతా పోషణకే ఖర్చవుతుంది కాబట్టి, ఇక్కడ పెట్టుబడి దారుడు, తన పోషణ కోసం చలామణీ లోకి వదిలిన డబ్బుని 20 అనుకోవాలి.

( 20 S అంతా బట్టవాడు ఒక్కడే వాడడు. S ని ఎవరెవరు పంచుకుంటారో వాళ్ళందరూ కలిసే ఆ 20 ని వాడతారు. అందరికీ ప్రతినిధిగా బట్టవాడినే చూస్తాం.)

బట్ట వాడు చలామణీలోకి పెట్టుబడిగా 100 డబ్బునీ, తన పోషణ కోసం 20 డబ్బునీ వదులుతాడన్న మాట. వాడు పరిశ్రమని ప్రారంభించినప్పుడు ఇలా జరిగిందనుకుందాం. కానీ పెట్టుబడిదారుడి పోషణ కోసం చలామణిలోకి వచ్చిన 20 డబ్బు, వాడి సరుకు తయారీ కోసం ఖర్చయ్యేది కాదు. సరుకు ద్వారా మొదటి అదనపు విలువ వచ్చే వరకూ ఆ 20 డబ్బు వాడి పోషణ కోసం ఖర్చవుతూ వుంటుంది. తర్వాత జరిగేదంతా మనకు తెలిసిందే.

సరుకు తయారవుతుంది. దానికి 120 విలువ ఏర్పడు తుంది. ఆ సరుకు కూడా అమ్మకం కోసం చలామణీలోకి వెళ్తుంది. దానితో మారడానికి అక్కడ 120 డబ్బు ఉండాలి. అది అక్కడ సిద్ధం గానే ఉంటుంది. అది ఆ పెట్టుబడి దారుడు వదిలిందే. అంటే, బట్టవాడు చలామణీ లోకి మొదట వదిలిన 100 + 20 = 120 డబ్బుకీ, తర్వాత వదిలిన 120 సరుకుకీ సరిపోతుంది. వాడు వదిలిన డబ్బే వాడి సరుకుతో మారుతుంది. ప్రతీ పెట్టుబడిదారుడి సరుకు విషయం లోనూ ఇదే జరుగుతుంది.

పరిశ్రమ ప్రారంభించినప్పుడు బట్టవాడు, తన పోషణ వస్తువుల్ని కొనడం కోసం తన డబ్బునే వాడాడు — అను కుంటే, మొదటి అద నపు విలువ రావడం తోనే వాడి డబ్బు వాడికి వచ్చేస్తుందని అర్థం.

మనం మన అవసరం కోసం ఒక షాపులో 2 డబ్బుతో ఏదైనా వస్తువుని కొంటే, మన చేతిలో నించి ఆ డబ్బు వెళ్ళిపోతుంది. అది ఇక ఎప్పటికీ మన దగ్గిరికి రాదు. కానీ, ఆ వస్తువుని అమ్మిన మనిషి ఆ డబ్బుని కూడా మనకే ఇచ్చేస్తాడనుకుందాం. అలా జరిగితే, ఆ వస్తువు మనకు ఉచితంగా వచ్చినట్టు అర్థం. లేదా, ఆ డబ్బు అయినా, ఉచి తంగా వచ్చినట్టు! కానీ ఇలాంటి వింత మన విషయంలో ఎప్పుడూ జరగదు.

కానీ, పెట్టుబడిదారుడి విషయంలో అయితే ఇది ఎప్పుడూ జరుగుతూ ఉంటుంది. రోజా జరుగుతూ ఉంటుంది. వాడి పోషణ పదార్థాలన్నీ వాడికి రోజా ఉచితం గానే వస్తుంటాయి. ఎలాగంటే: పరిశ్రమ ప్రారంభించి నప్పుడు పెట్టుబడిదారుడు, పెట్టుబడి డబ్బునీ, తన పోషణ డబ్బునీ పెడతాడు కదా? తయారైన సరుకుని అమ్మి నప్పుడు, ఆ 2 రకాలూ వెనక్కి వచ్చేస్తాయి.

పెట్టుబడి అయితే, మళ్ళీ ఇంకోసారి కొత్త పెట్టుబడిగా వెళ్తుంది. ఇక అది అలా తిరుగుతూనే వుంటుంది.

పోషణ డబ్బు సంగతి చూస్తే, పెట్టుబడిదారుడు మొదట తన డబ్బు తోనే పోషణ వస్తువుల్ని కొని వాడుకున్నా డనుకుంటే, వాడు ఆ పదార్థాల్ని వాడేశాడు కాబట్టి వాడి డబ్బు ఖర్చయిపోయినట్టే అర్థం. కానీ, అదనపు విలువ రాగానే వాడి డబ్బు వాడికి వచ్చేస్తుంది. అది ఉచితంగా వచ్చినట్టే!

ఆ డబ్బుతో ఇంకోసారి పోషణ వస్తువుల్ని కొంటే, వాడిది కాని డబ్బుని వాడు ఉపయోగిస్తున్నాడని అర్థం. ఇంకో సారి అదనపు విలువ రాగానే ఆ డబ్బు మళ్ళీ వెనక్కి వచ్చేస్తుంది. పెట్టుబడిదారుడు ప్రతీ సారీ తన పోషణని ఏ డబ్బుతో కొంటాడో ఆ డబ్బు వెనక్కి వచ్చేస్తూనే వుంటుంది. అంటే, ఆ వస్తువులన్నీ ప్రతీ సారీ వాడికి S ద్వారా ఉచితంగానే అందుతూ వుంటాయి.

కానీ, ఇది పైకి ఎలా కనపడుతుందంటే, పెట్టుబడి దారుడు, తన ఆదాయం తోనే, తన స్వంత డబ్బు తోనే తన పోషణ వస్తువుల్ని కొనుక్కుంటున్నట్టు కనపడుతుంది. సరే!

సింపుల్ పునరుత్పత్తిలో, చలామణీలో తిరిగే డబ్బు పరిమాణం గురించి అర్థం చేసుకోవడం తేలికే అయినా, అది కూడా ఆర్థిక వేత్తల్లో చర్చనీయాంశంగా ఎందుకు అయిందంటే, సరుకులో S ఉంటుందనే సంగతి వారికి తెలియదు గనక. S గురించి తెలియనప్పుడు ఏమవుతుం దంటే, సరుకుని అమ్మినప్పుడు ఎక్కువ డబ్బు ఎందుకు వస్తుందో తెలీదు. పెట్టుబడిదారుడు, తన పోషణ కోసం చలామణీ లోకి వదిలేది ఆ S డబ్బునే — అని తెలీదు. Sయే తెలియనప్పుడు, ఇక ఏ సమస్యనీ అర్థం చేసుకోవ డానికి సాధ్యం కాదు.

ఇప్పుడు 'తక్కువ డబ్బు'తో చలామణీ జరగడానికి సంబంధించి కొన్ని ఉదాహరణలు చూడాలి.

ఒక సరుకుల రాసి విలువ 120.

అందులో, 100 పెట్టుబడీ, 20 అదనపు విలువా ఉన్నాయి. ఈ సరుకు అంతా ఒకే సమయంలో అమ్ముడు పోవాలనుకుందాం. ఇక్కడ ఏక కాలంలో చలామణీ అవ వలసిన సరుకు విలువ 120 కాబట్టి, దానితో మారడానికి ఇక్కడ అంత డబ్బూ ఉండవలసిందే. అంతే గానీ, అక్కడ 120 డబ్బు అవసరం లేదనీ, పెట్టుబడిగా వున్న 100 డబ్బే మళ్ళీ మళ్ళీ తిరిగి, 120 సరుకులతో మారి, ఆ రకంగా పెట్టుబడిదారులకు 120 డబ్బు అందుతుందనీ అర్థం కాదు.

తక్కువ డబ్బే మళ్ళీ మళ్ళీ తిరిగే ఉదాహరణ ఇంకో రకంగా ఉంటుంది. అది ఇలా ఉంటుంది: చలామణీ అవవలసిన సరుకుల రాసి 120. కానీ, అది అంతా ఒకేసారి అమ్ముడు పోనక్కరలేదు. అది 2 భాగాలుగా అమ్ముడుపోతే చాలు. అంటే, ఇప్పుడు ఏక కాలంలో అమ్ముడు పోవలసిన సరుకుల రాసి 60యే. అలాంటి రాసులు ఇప్పుడు 2 ఉంటాయి. అవి ఒక దాని తర్వాత ఒకటి కదలాలి.

ఒక రాసిలో పెట్టుబడి 50 + అదనపు విలువ 10. ఈ రాసికోసం, పెట్టుబడిదారులు, పెట్టుబడిగా 50 డబ్బునీ, తమ పోషణ కోసం 10 డబ్బునీ, వదులుతారు. ఈ రాసితో మారడానికి చలామణీలో 120 డబ్బు అక్కరలేదు, 60 డబ్బు చాలు. అది, 50 పెట్టుబడినీ, 10 S నీ చలామణీ చెయ్య డానికి సరిపోవాలి. సరిపోతుంది. ఈ 60 డబ్బే 2 సార్లు తిరిగి 120 సరుకుల రాసినంతా చలామణీ చేస్తుంది. అంటే, ఇక్కడ చలామణీలో తక్కువ డబ్బు తోనే పని జరుగుతుంది. అది పెట్టుబడిదారులు వదిలినదే.

ఇక్కడ గ్రహించవలసిన విషయరే: ఇక్కడ ఒకే సమయంలో మారవలసిన సరుకుల రాసి విలువ 60 కాబట్టి, దానితో మారడానికి చలామణీలో అంత డబ్బూ ఉండవలసిందే. అంతేగానీ, ఇక్కడ 60 డబ్బుతో అవసరం లేదనీ, పెట్టుబడిగా వున్న 50 డబ్బే మళ్ళీ మళ్ళీ తిరుగుతూ 60 సరుకుతో మారడానికి సరిపోతుందనీ అర్థం కాదు.

ఇప్పుడు, 60 సరుకుని, ఇంకా 2 చిన్న భాగాలుగా చూద్దాం. అంటే, 120 సరుకుని 4 భాగాలుగా. ఒక భాగం విలువ 30. ఇప్పుడు ఇదే ఏక కాలంలో అమ్ముడు పోవల సిన రాసి. ఇలాంటి రాసులు ఇప్పుడు 4 ఉంటాయి. ఒక రాసిలో పెట్టుబడి 25 + అదనపు విలువ 5.

ఈ రాసితో మారడానికి, చలామణీలో 120 డబ్బు గానీ, 60 డబ్బు గానీ, అవసరం లేదు. 30 డబ్బు చాలు. అదే 4 సార్లు తిరిగి 120 సరుకుల రాసిని చలామణీ చేస్తుంది. కానీ, ఒకే సమయంలో అమ్ముడు పోవలసిన 30 సరుకుతో మారడానికి 30 డబ్బూ ఉండవలసిందే. అంత డబ్బు అక్కరలేదనీ, అందులో పెట్టుబడిగా ఉన్న 25 డబ్బే మళ్ళీ మళ్ళీ తిరిగి ఆ రాసిని చలామణీ చేస్తుందని అర్థం కాదు.

తక్కువ డబ్బే చలామణీలో మళ్ళీ మళ్ళీ తిరుగుతూ ఎక్కువ సరుకుల్ని చలామణీ చేస్తుంది — అన్నప్పుడు, ఆ తక్కువ డబ్బు, ఎంత తక్కువ డబ్బుగా అయినా ఉండ వచ్చు — అని అర్థం కాదు.

ఒకే కాలంలో చలామణీ అవవలసిన సరుకుల పరిమాణాన్ని బట్టి, ఆ డబ్బు పరిమాణం ఉండాలి. అది, ఆ సరుకుల రాసిలో వున్న పెట్టుబడినీ, అదనపు విలువనీ కూడా చలామణీ చెయ్యడానికి సరిపోవాలి.

చలామణీలో ఉండవలసిన డబ్బు రాసి గురించి చూసేటప్పుడు, ఉదాహరణలోకి చిన్న సరుకుని తీసుకుం టున్నామా, పెద్ద సరుకుని తీసుకుంటున్నామా అనేది అనవసరం. ఎంత సరుకుని తీసుకుంటే అంత సరుకు మీదే డబ్బుకి సంబంధించిన ప్రశ్న ఉంటుంది.

120 సరుకుని తీసుకున్నప్పుడు: 'పెట్టుబడిదారుడు, చలామణీలోకి పెట్టుబడిగా 100 డబ్బునే వదిలితే, ఆ సరుకుతో మారడానికి చలామణీలో 120 డబ్బు ఎలా ఉంది?' — అనే ప్రశ్న వస్తుంది.

లేదా, 60 సరుకుని తీసుకుంటే: 'పెట్టుబడిదారుడు, చలామణీ లోకి పెట్టుబడిగా 50 డబ్బునే వదిలితే, ఆ సరుకుతో మారడానికి చలామణీ లోకి 60 డబ్బు ఎలా వచ్చింది?' — అనే ప్రశ్న వస్తుంది.

ఇలా, సరుకుని ఇంకా ఎంత చిన్న భాగాలుగా చూసినా, ఆ ప్రశ్న అలాగే ఉంటుంది. కాబట్టి, ఇక్కడ

సరుకు సైజుతో సంబంధం లేదు. చలామణీలో ఉండ వలసిన డబ్బు రాసి సమస్యని ఎంత సైజు సరుకు ద్వారా చూసినా ఒకటే.

సింపుల్ పునరుత్పత్తిలో, పెట్టుబడి పెరగదు. దానితో తయారయ్యే ఉత్పత్తుల రాసి పెరగదు. అందులో ఉండే S భాగం పెరగదు. కాబట్టి, ఆ సరుకుల రాసితో మారడానికి అవసరమయ్యే డబ్బు రాసి కూడా పెరగవలసిన అవసరం ఉండదు. ఒకసారి చలామణీలోకి వదిలిన డబ్బు, సరుకులతో మళ్ళీ మళ్ళీ మారుతూ ఎంత కాలమైనా తిరుగుతూ ఉంటుంది. అరిగిపోయిన నాణాల్నీ, చిరిగిపోయిన నోట్లనీ భర్తీ చెయ్యడం తప్ప డబ్బు రాసి గురించి ఏ సమస్యా ఉండదు.

ఈ ఉదాహరణ ప్రకారం, బట్ట పెట్టుబడిదారుడు ఒక్క సారి 120 డబ్బుని వదిలితే, ఇక అది ఆ పెట్టుబడిదారుడి చేతుల్లోకీ, మళ్ళీ చలామణీలోకీ తిరుగుతూనే ఉంటుంది. అది ప్రతీ సారీ 20 S ని తెచ్చి పెట్టుబడిదారుడికి అందిస్తూనే ఉంటుంది.

విస్తృత పునరుత్పత్తిలో ఈ వ్యవహారాన్ని ఇంత తేలిగ్గా అర్థం చేసుకోలేము. దానికి ఇంకా కొన్ని విషయాలు కావాలి. విస్తృత పునరుత్పత్తిలో, పెట్టుబడిదారీ వర్గం ఒక సంవత్సరంలో పోషణ కోసం వాడిన S కన్నా ఎక్కువ S, ఉత్పత్తి అవుతూ వుంటుంది.

విస్తృత పునరుత్పత్తిలో కూడా చలామణీ లోకి డబ్బుని వదిలేది పెట్టుబడిదారీ వర్గమే. ఆ విషయంలో కార్మిక వర్గానికేమీ సంబంధం ఉండదు.

( ఈ విషయాల గురించి మార్క్సు, 'కాపిటల్-2'లో 3 వ భాగంలో, 'మనీ మెటీరియల్ పునరుత్పత్తి' అనే విభాగంలో చెప్పాడు. ఆ విషయాలే దీని కోసం చూడాలి.)

## 'డబ్బు రాసి సమస్య'ని ఇంకా చూడాలి

**[** ఈ విషయాన్ని, ఈ మొదటి సంపుటంలో, మొదటి ముద్రణలో గానీ, 2 వ ముద్రణలో గానీ ఇవ్వలేదు. అప్పుడు ఇది, 2 వ సంపుటంలోనే చివర్లో వుంది. ఈ విషయం అసలు ఈ మొదటి సంపుటంలోనే, ఈ చాప్టరులోనే వుండాలి. అందుకే దీన్ని 2 వ సంపుటంలో నించి ఇక్కడికి మార్చుతున్నాము. ఈ పని, ఈ సంపుటంలో, 3 వ ముద్రణ సమయంలో జరిగింది.**]**

**ఈ** "పెట్టుబడి విస్తరణ" చాప్టరులో, 'డబ్బు రాసి సమస్య' గురించి, ఇప్పటి వరకూ 'సింపుల్ పునరుత్పత్తి' వరకే చూశాం. 'విస్తృత పునరుత్పత్తి'కి సంబంధించిన డబ్బు రాసి విషయాలు కూడా ఇంకా చూడాలి. వాటినే ఇప్పుడు ఇక్కడ చూస్తాం.

చలామణీలో తిరిగే డబ్బు ఎక్కడి నించి వస్తూ వుంటుంది? 'విస్తృత పునరుత్పత్తి' కోసం అది ఎలా పెరుగుతూ వుంటుంది? - ఇలాంటి ప్రశ్నలన్నిటికీ ఆర్థిక శాస్త్రం సరైన జవాబులు చెప్పగలగాలి.

' సింపుల్ పునరుత్పత్తి' కి సంబంధించిన డబ్బు రాసి విషయం మొదటి సంపుటం లోనే చూశాం. దాన్ని కొంచెం గుర్తు చేసుకుని, తర్వాత విస్తృత పునరుత్పత్తి విషయం ఇప్పుడు చూడాలి.

'డబ్బు' అనేది (అది బంగారం డబ్బు అయినా, కాయితం డబ్బు అయినా), మొదట పెట్టుబడి దారుడి చేతి నించే (ఆ వర్గం చేతి నించే) చలామణీ లోకి వెళ్తుంది. ఉత్పత్తి సాధనాల్ని కొనడం ద్వారానూ, కార్మికులకు జీతాలు ఇవ్వడం ద్వారానూ (C + V ల కోసం పెట్టుబడి పెట్టడం ద్వారా), ఆ డబ్బు, చలామణీలోకి వెళ్తుంది. అంతే గాక, పెట్టుబడిదారుడు, తన కుటుంబ పోషణకు కావలసిన ఉత్పత్తుల్ని కొనడం ద్వారా కూడా కొంత డబ్బు, చలామణీ లోకి వెళ్తుంది. పెట్టుబడిదారుడికి, ఆ పోషణ డబ్బు, గత S ద్వారా వచ్చిన డబ్బే. అదే, కొత్త పోషణ వస్తువుల కోసం, మళ్ళీ చలామణీ లోకి వెళ్తుంది. ఈ రకంగా డబ్బు అనేది, మొదట చలామణీ లోకి వెళ్ళేది పెట్టుబడి దారుడి ద్వారానే.

పెట్టుబడిదారుడు నిర్వహించే ఉత్పత్తి క్రమం, ప్రతీ సారీ 'సింపుల్ పునరుత్పత్తి' గానే సాగుతూ వుంటే, చలామణీ లోకి వెళ్ళే డబ్బు రాసి, ఎప్పుడూ ఒకే సైజుతో వుంటే చాలు. అది పెరగవలసిన అవసరం వుండదు. అరిగిపోయిన నాణాల్ని గానీ, చిరిగిపోయిన కాయితం డబ్బుని గానీ, మార్చవలసిన అవసరం తప్ప.

సింపుల్ పునరుత్పత్తి - అన్నప్పుడు, ఒక విషయం గుర్తు వుండాలి. S అంతా పెట్టుబడి దారుడి స్వంతా నికే ఖర్చవుతుంది - అని. ఆ S లో

నించి కొత్త పెట్టు బడిగా మారేదేమీ వుండదు - అని.

సింపుల్ పునరుత్పత్తిలో, పెట్టుబడిదారుడు, C + V ల కోసం 100 డబ్బునీ, తన కుటుంబ పోషణ కోసం 20 డబ్బునీ, మొత్తం 120 డబ్బుని చలామణీ లోకి వదిలితే, ఆ తర్వాత, 120 విలువ గల కొత్త సరుకుని కూడా చలామణీ లోకి వదులు తాడు. ఆ సరుకుతో మారడానికి, చలామణీలో వున్న ఆ డబ్బు సరిపోతుంది. పెట్టుబడిదారుడి చేతి నించి 120 విలువ గల కొత్త సరుకు వెళ్ళిపోయి, 120 డబ్బు వచ్చేస్తుంది. ఆ 120 లో నించి 100 పెట్టుబడిని వెనక్కి తీస్తే, ఆ పైన వున్నది 20S. ఆ 100 పెట్టుబడి డబ్బునీ, ఆ 20S డబ్బునీ, పెట్టుబడిదారుడు ఇంకో ఉత్పత్తి క్రమం కోసం మళ్ళీ చలామణీ లోకి వదులు తాడు. మళ్ళీ సింపుల్ పునరుత్పత్తే జరుగుతుంది. మళ్ళీ 120 విలువ గల సరుకు తయారై, అది మళ్ళీ 120 డబ్బుతో మారుతుంది.

పెట్టుబడిదారుడు, మొత్తం ఎంత డబ్బుని మొదట చలామణీ లోకి వదులుతాడో, తర్వాత అంతే విలువ గల సరుకుని చలామణీ లోకి వదిలితే, అది - సింపుల్ పునరుత్పత్తి. లేదా, వేరే మాటల్లో, పెట్టుబడి దారుడు చలామణీ లోకి మొదట వదిలే డబ్బు విలువా, ఆ తర్వాత వదిలే సరుకు విలువా, సమా నంగా వుంటే అది - సింపుల్ పునరుత్పత్తి. ఈ పున రుత్పత్తిలో, S అనేది, ప్రతీ సారీ పెట్టుబడిదారుడి స్వంతానికే ఖర్చయి పోతూ వుంటుంది. ఈ S లో నించి కొంత భాగం, కొత్త పెట్టుబడిగా మారడం అనేది జరగదు. ఇక్కడ, C + V + S లు, మొదట ఖర్చ యిన పరిమాణాల తోనే తర్వాత పునరుత్పత్తి అవుతాయి. అందుకే ఇక్కడ "డబ్బు రాసి ఎక్కడిది?" అనే ప్రశ్నకి జవాబు చాలా తేలిక. డబ్బు రాసి పెట్టుబడిదారుడు చలామణీ లోకి వదిలేదే. ఆ డబ్బే చలామణీ లోకి వెళ్ళిన సరుకుతో మారుతూ వుంటుంది.

కానీ, 'విస్తృత పునరుత్పత్తి' విషయం అలా వుండదు. ఈ పునరుత్పత్తిలో, S లో కొంత భాగం పెట్టుబడిదారుడి స్వంత పోషణ కోసమూ, మిగిలిన భాగం 'కొత్త పెట్టుబడి'గా మారడానికీ ఖర్చవుతుంది. దీని వల్ల ఏం జరుగుతుందంటే, పెట్టుబడిదారుడు చలామణీ లోకి మొదట వదిలే డబ్బు విలువ కన్నా, తర్వాత వదిలే సరుకు విలువ ఎక్కువగా వుంటుంది. ఆ ఎక్కువ విలువ కూడా డబ్బుగా మారాలి. అందుకే ఇక్కడ, 'ఆ ఎక్కువ విలువతో మారడానికి చలామణీ లోకి డబ్బు ఎలా వస్తుంది?" అనే ప్రశ్న తలెత్తుతుంది.

విస్తృత పునరుత్పత్తిలో, పెట్టుబడిదారుడు, చలా మణీ లోకి మొదట వదిలే డబ్బు విలువ కన్నా తర్వాత వదిలే సరుకు విలువ ఎక్కువగా వుండడం ఎలా జరుగుతుందో ఇక్కడ ఒక ఉదాహరణ చూద్దాం.

సింపుల్ పునరుత్పత్తిలో తీసుకున్న సంఖ్యలనే ఇక్కడ తీసుకోవాలనే నియమం లేదు. వేరే సంఖ్యలు తీసుకుంటాం.

ఇక్కడ మొదటి ఉత్పత్తి క్రమం ఇలా వుందను కుందాం:

$60_C + 40_V + 40_S = 140.$

ఈ 140 డబ్బు లో నించి, 100 పెట్టుబడి, మళ్ళీ పెట్టుబడి గానే పని చేస్తుంది. $40_S$ లో నించి పెట్టు బడిదారుడి స్వంత వాడకానికి 20, కొత్త పెట్టుబడిగా మారడానికి 20 - అనుకుందాం. కొత్త పెట్టుబడి కూడా పాత పెట్టుబడి కాంపొజిషన్ తోనే వుంటుంది. పాత కాంపొజిషన్ $60_C + 40_V = 3_C : 2_V$. ఈ లెక్కతో, $20_S$ ని పెట్టుబడిగా మారిస్తే, అది $12_C + 8_V$ అవుతుంది. అదనపు విలువ రేటుని వెనకటి లాగానే అనుకుంటే, కొత్త పెట్టుబడి ద్వారా, $8_V$ తో, $8_S$ వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| పాత పెట్టుబడి | $60_C$ + | $40_V$ = | 100 |
| కొత్త పెట్టుబడి | $12_C$ + | $8_V$ = | 20 |
| మొత్తం పెట్టుబడి | $72_C$ + | $48_V$ = | 120 |

ఇప్పుడు 120 పెట్టుబడితో, ఇంకో విస్తృత పున రుత్పత్తి క్రమం జరుగుతుంది. పెట్టుబడిదారుడు గతంలో లాగ పెట్టుబడిగా 100 డబ్బుని గాక, ఇప్పుడు 120 డబ్బుని చలామణీ లోకి వదిలాడని అర్థం.

అది మాత్రమే గాక, తన కుటుంబ అవసరాల కోసం $20_S$ ని వాడుకుంటాడు కాబట్టి, (ఆ 20 తో పోషణ వస్తువులు కొనాలి కాబట్టి) ఆ 20 డబ్బుని కూడా చలామణీ లోకి వదులుతాడు. ఈ రకంగా, చలామణీ లోకి వదిలిన మొత్తం డబ్బు = పెట్టుబడి 120 + తన కుటుంబ పోషణ 20 = 140. ఈ 140 డబ్బు, గత ఉత్పత్తి క్రమం ద్వారా వచ్చినదే. (గత పెట్టుబడి 100 + గత S 40 = 140).

కానీ మళ్ళీ విస్తృత పునరుత్పత్తి జరిగిన తర్వాత, చలామణీ లోకి వదిలే కొత్త సరుకు విలువ =

$72_C + 48_V + 48_S = 168.$

ఈ రకంగా, పెట్టుబడిదారుడు మొదట చలామణీ లోకి వదిలిన డబ్బు కన్నా, (140 కన్నా), తర్వాత వదిలిన సరుకు విలువ (168) ఎక్కువగా వుంటుంది. విస్తృత పునరుత్పత్తిలో ఇలాగే జరుగుతుంది.

సింపుల్ పునరుత్పత్తిలో అయితే, పెట్టుబడిదారుడు, చలామణీ లోకి వదిలే డబ్బూ, సరుకూ, సమాన విలువలతో వుంటాయి కదా? కానీ, విస్తృత పునరుత్పత్తిలో, డబ్బు కన్నా, సరుకు ఎక్కువ విలువతో ఎందుకు వుంటుంది? సింపుల్ పునరుత్పత్తిలో కన్నా ఇక్కడ తేడాగా ఎందుకు జరుగుతుంది? ఎందుకంటే, ఇక్కడ పెట్టుబడిదారుడు, తన స్వంతానికి వాడే S భాగమూ, తర్వాత పునరుత్పత్తి అయ్యే S భాగమూ, సమానంగా వుండవు. ఇక్కడ పెట్టుబడిదారుడు వాడే పోషణ S కన్నా, ఎక్కువ S ఉత్పత్తి అవుతుంది. అందుకే ఇక్కడ పెట్టుబడిదారుడి ద్వారా చలామణీలోకి వెళ్ళే సరుకు, చలామణీ లోకి వెళ్ళే డబ్బు కన్నా ఎక్కువ విలువతో వుంటుంది.

చలామణీ లోకి వెళ్ళే డబ్బు కన్నా సరుకే ఎక్కువ విలువతో వుంటే, ఆ ఎక్కువ సరుకు, చలామణీలో వున్న తక్కువ డబ్బు ద్వారా, ఒకే సమయంలో, డబ్బుగా ఎలా మారగలుగుతుంది? - ఇదే ఇక్కడ తలెత్తే ప్రశ్న.

ఫలానా కొంత సరుకు, ఒకే సమయంలో, డబ్బుగా మారాలంటే, ఆ సరుకు విలువతో సమానమైనంత డబ్బు, చలామణీలో వుండి తీరాలి. అలా లేకపోతే, ఆ సరుకులో కొంత భాగమే, డబ్బుగా మారి, మిగిలిన భాగం అదే సమయంలో డబ్బుగా మారడం జరగదు.

ఆ మిగిలిన సరుకు, తర్వాత క్రమ క్రమంగా ఆ చలామణీలో వున్న డబ్బు ద్వారానే డబ్బుగా మారుతుందనడానికి వీలు లేదు. ఎందుకంటే, చలామణీ లోకి ప్రతీ నిత్యమూ కొత్త సరుకు వెళ్తూనే వుంటుంది. సరుకు విలువ కు తగ్గ డబ్బు, చలామణీలో లేకపోతే, కొంత సరుకు ఎప్పుడూ డబ్బుగా మారకుండానే వుండి పోతుంది. కాబట్టి, సరుకుకి తగ్గ డబ్బు చలామణీలో ఎప్పుడూ వుండాలి. 168 విలువ గల సరుకు, చలా మణీ లోకి వచ్చినప్పుడు, అదే విలువ గల డబ్బు కూడా చలామణీలో వుండి వుంటుందని అర్థం.

కానీ, పెట్టుబడిదారుడు (ఆ వర్గం), చలామణీ లోకి వదిలింది 140 డబ్బే కదా? దాని కన్నా ఎక్కువ డబ్బు చలామణీ లోకి ఎలా వచ్చి వుంటుంది? - దీనికే జవాబు కావాలి.

దీనికి పరిష్కారం - గతంలో లేని కొత్త డబ్బు చలామణీ లోకి దిగడమే. చలామణీలో తిరిగే 'కనీస డబ్బు పరిమాణం' గతం కన్నా పెరగడమే. అది ఎలా జరుగుతుంది?

పెట్టుబడిదారీ వర్గంలో, బంగారాన్ని ఉత్పత్తి చేసే దంతా ఒక ప్రత్యేక శాఖ. లోహాలన్నీ 'ఉత్పత్తి సాధనాల గ్రూపు' లోకి చేరినట్టే, వెండి బంగారాల ఉత్పత్తి కూడా 1 వ గ్రూపు లోకే చేరుతుంది.

ధాన్యమూ, బట్టా - వంటి, మామూలు సరుకుల్లో అదనపు విలువ భాగం వున్నట్టే, 'బంగారం'లో కూడా, అదనపు విలువ భాగం వుంటుంది.

మామూలు సరుకుల పెట్టుబడిదారులు, చలామణీ లోకి, మొదట తక్కువ డబ్బుని వదిలి, తర్వాత ఎక్కువ విలువ గల సరుకుని (S తో నిండిన సరుకుని) వదిలినట్టే, బంగారం శాఖ పెట్టుబడిదారులు కూడా, చలామణీ లోకి, మొదట తక్కువ డబ్బుని వదిలి, తర్వాత ఎక్కువ విలువ గల సరుకుని ( S తో నిండిన బంగారాన్ని) వదులుతారు.

బంగారం శాఖలో ఒక సంవత్సరపు ఉత్పత్తి ని 30 అనుకుందాం. అది, $20_C + 5_V + 5_S$ గా వుందనుకుందాం. ఆ ఉత్పత్తి అంతా బంగారం ముద్ద గానే వుంటుంది. దీని విలువలో, $20_C + 5_V = 25_S$ వరకూ పాత విలువే. $5_S$ మాత్రం కొత్త విలువ. బంగారంలో ఇది, అదనపు ఉత్పత్తి.

ఈ 30 విలువ గల బంగారం ఉత్పత్తి కోసం ఆ శాఖలో పెట్టుబడిదారులు మొదట చలామణీ లోకి వదిలిన 25 డబ్బు, దేశంలో అప్పటికే వున్న పాత డబ్బు సప్లైలోదే. అది అలా వుండగా, బంగారం శాఖలో, కొత్త పునరుత్పత్తి జరిగి కొత్త బంగారం తయారైంది. అందులో వున్న 5 అదనపు ఉత్పత్తే, కొత్త డబ్బు సప్లైగా ఉపయోగపడుతుంది.

30 విలువ గల బంగారంలో నించి - 20C భాగం అంతా 1 గ్రూపు లోనే పెట్టుబడిదారుల మధ్య మారకాలవుతుంది. $5_V$ + $5_S$ భాగాలు, 2 వ గ్రూపుతో మారకాలవుతాయి.

ధాన్యమూ బట్టా వంటి మామూలు సరుకుల శాఖల్లో తయారైన కొత్త ఉత్పత్తిని డబ్బుగా మార్చు

కోవాలంటే, ఆ ఉత్పత్తిని తప్పకుండా అమ్మాలి. కానీ బంగారం శాఖలో తయారైన బంగారాన్ని, డబ్బుగా మార్చుకోవాలంటే, బంగారం ముద్దని అమ్మనక్కర లేదు. ఆ బంగారం ముద్దని ప్రభుత్వ టంకశాలలో, నాణాలుగా మార్పిస్తే చాలు. అదే డబ్బు (బంగారం డబ్బు).

మామూలు సరుకుల శాఖలకూ బంగారం శాఖకూ తేడా ఏమిటంటే: బట్ట పెట్టుబడిదారుడు, చలామణీ లోకి మొదట డబ్బుని వదిలి, తర్వాత సరుకుని వదిలి, మొదట వదిలిన డబ్బుని వెనక్కి తీసుకుంటాడు.

కానీ, బంగారం పెట్టుబడిదారుడు, మొదట చలామణీ లోకి డబ్బుని వదిలి, తన పునరుత్పత్తికి కావలసిన ఉత్పత్తి సాధనాలూ వగైరాల్ని కొంటాడు. తర్వాత కొత్త సరుకు (కొత్త బంగారం) తయారవు తుంది. బంగారం డబ్బే చలామణీ సాధనంగా వున్నట్టు యితే, ఆ కొత్త సరుకుని అమ్మకుండానే డబ్బుగా మార్చుకుంటాడు. అంటే, బంగారం పెట్టుబడి దారుడు, చలామణీ లోకి మొదట డబ్బుని వదిలినా, తర్వాత సరుకుని వదలడు. తన సరుకుని అమ్మే పని లేక పోవడం వల్ల, తను గతంలో చలామణీ లోకి వదిలిన పాత డబ్బుని వెనక్కి తీసుకోవడమూ, మళ్ళీ ఆ డబ్బునే ఇంకోసారి వాడ డమూ జరగవు.

బంగారం పెట్టుబడిదారుడు, పాత డబ్బుని వెనక్కి తీసుకోలేదంటే, దాని అర్థం, పాత డబ్బు నంతా పోగొట్టుకున్నాడని కాదు. ఆ పెట్టుబడిదారుడి చేతిలో వున్న కొత్త సరుకు అంతా (కొత్త బంగారం అంతా) - డబ్బే. ఆ బంగారం ముద్దని నాణాలుగా మార్పించినా, మార్పించక పోయినా, చేతిలో కొత్త బంగారం వున్న దంటే, దాన్ని ఉత్పత్తి చెయ్యడం కోసం పెట్టిన పెట్టు బడి అంతా $(20_C + 5_V)$ వెనక్కి వచ్చేసినట్టే అర్థం. అదే గాక, ఆ పెట్టుబడి మీద రావలసిన అదనపు విలువ కూడా $(5_S)$ వచ్చిందని అర్థం. - ఈ రకంగా, బంగారం పెట్టుబడిదారుడికి, తన దగ్గిర ఉత్పత్తి అయ్యే బంగారం ముద్దని అమ్మవలసిన అవసరం వుండదు కాబట్టి, తన కొత్త సరుకుని చలామణీ లోకి వదలడం వుండదు.

అయితే, బంగారం శాఖ ఒక ఉత్పత్తి క్రమం ప్రారంభించే ముందు, ఉత్పత్తి సాధనాల్ని కొనడానికి కొంత డబ్బుని (బంగారు నాణాల్ని) చలామణీ లోకి వదులుతుంది కదా? వాటిని వెనక్కి తీసుకోదు కదా? ఆ విధంగా ఆ శాఖ ద్వారా చలామణీ లోకి వెళ్ళే (వెనక్కి రాని) నాణాల మాట ఏమిటి? - ఆ నాణాలు చలామణీ లోనే వుంటాయి.

చలామణీలో వుండడం అంటే - ఆ నాణాలు, బంగారం ఉత్పత్తికి అవసరమయ్యే ఉత్పత్తి సాధనాల్ని అమ్మే శాఖల లోకీ, కార్మికుల చేతుల్లోకీ, వెళ్తాయి. అక్కణ్ణించి అవి రక రకాల ఇతర శాఖల్లోకి వెళ్తాయి. ఆ రకంగా అవి చలామణీ లోనే వుంటాయి. చలా మణీలో తిరిగే నాణాలన్నీ అరిగి పోతూనే వుంటాయి కాబట్టి, ఆ అరుగుదలని భర్తీ చెయ్యడానికి అవసర మైన బంగారంగా, ఆ నాణాల్ని ఊహించవచ్చు.

బంగారం శాఖలో, కొత్త పునరుత్పత్తి కోసం, మళ్ళీ కొత్త ఉత్పత్తి సాధనాలూ అవీ (C + V లు) కావాలి కాబట్టి, బంగారం పెట్టుబడిదారుడు, తన చేతిలో వున్న కొత్త బంగారాన్నే నాణాలుగా మార్చి చలామణీ లోకి వదులుతాడు. (ఆ నాణాలతో, మళ్ళీ C + V ల్ని కొంటాడు.) అంటే, ఆ శాఖ, గతంలో చలామణీ లోకి వదిలిన నాణాలు చలామణీలో వుండగానే, మళ్ళీ కొత్త నాణాలు చలామణీ లోకి వెళ్తాయి. అవి కూడా వెనక్కి రాకుండా చలామణీ లోనే వుంటాయి.

బంగారం డబ్బే చలామణీ సాధనంగా వున్నంత కాలమూ, బంగారం శాఖ ద్వారా, బంగారం నాణాలు చలామణీ లోకి చేరుతూనే వుంటాయి. కానీ, బంగారం డబ్బు విషయంలో 'చలామణీలో తిరిగే డబ్బు ఎక్కువై పోవడం అనేది వుండదు. ఒక పెట్టు బడిదారుడి చేతిలో ఎన్ని నాణాలు వున్నా, తను కొన వలసిన ఉత్పత్తుల ధరల కోసం చెల్లించవలసిన నాణాలను మాత్రమే చలామణీ లోకి వదులుతాడు. మిగిలిన నాణాల్ని నిల్వగా వుంచుకుంటాడు. లేదా, బంగారం ముద్దగా మార్చుకుంటాడు. చలామణీ లోకి బంగారం నాణాలు ఎక్కువగా చేరడం వల్ల, ఏ సమస్యా రాదు.

బంగారం శాఖలో, సింపుల్ పునరుత్పత్తిని గాక విస్తృత పునరుత్పత్తిని తీసుకుంటే, దాని ద్వారా వచ్చే అదనపు ఉత్పత్తే - అదనపు డబ్బు. అది, గతంలో లేని డబ్బు. బంగారం పెట్టుబడిదారుడు, ఆ అదనపు డబ్బులో కొంత భాగాన్ని కొత్త పెట్టుబడిగా మార్చ డానికి, దానితో కొత్త ఉత్పత్తి సాధనాలు కొంటాడు. కొత్త V కోసం కూడా కొత్త జీతాలు ఇస్తాడు. తన

స్వంత అవసరాల కోసం కొన్ని ఉత్పత్తులు కొంటాడు. ఆ రకంగా, ఆ అదనపు డబ్బుని (అదనపు బంగా రాన్ని) కూడా చలామణీ లోకి వదులుతాడు.

బంగారం శాఖలో తయారయ్యే అదనపు డబ్బు కూడా చలామణీ లోకి రావడం అంటే - బంగారం శాఖకీ, ఇతర శాఖలకూ మధ్య రక రకాల మారకాలు జరగడం ద్వారానే ఆ పని జరుగుతుంది. ఆ డబ్బుని చలామణీ లోకి వదిలేది - బంగారం శాఖే. ఇతర సరుకుల్ని వదిలేవి - ఇతర శాఖలు.

అంటే, ఇతర శాఖలు, మొదట తక్కువ డబ్బునీ, తర్వాత ఎక్కువ సరుకునీ చలామణీ లోకి వదులు తాయి కదా? ఆ సరుకుల్లో వుండే ఎక్కువ విలువని డబ్బుగా ఎలా మార్చుకోగలుగుతాయంటే, బంగారం శాఖ వదిలే అదనపు డబ్బు ద్వారా.

చలామణీ లోకి డబ్బు చేరడం అనేది, ఒక రోజులోనో, ఒక నెలలోనో జరగదు. క్రమ క్రమంగా జరుగుతుంది.

బంగారం శాఖలో జరిగే ప్రతీ ఉత్పత్తి క్రమమూ, అదనపు డబ్బుని ఉత్పత్తి చేస్తూ వుంటుంది. అది కూడా చలామణీ లోకి చేరుతూ వుంటుంది. చలా మణీలో వుండే డబ్బు రాసి పెరు గుతూ వుంటుంది.

సమాజంలో, ఉత్పత్తుల రాసి పెరుగుతూ వున్న ప్పుడు, దానికి తగినట్టుగా డబ్బు రాసి కూడా పెరగ డానికి మార్గం, బంగారం శాఖలో కూడా అదనపు ఉత్పత్తి జరగడమే.

'సమాజంలో వుండే డబ్బు రాసి ఎలా పెరుగుతూ వుంటుంది' అనే సమస్య గురించి, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు కేవలం పై పై జవాబులు చెపుతారు. 'ఏ పెట్టుబడిదారుడైనా, తన సరుకుని అమ్ముకున్న తర్వాత, ఆ డబ్బులో కొంత భాగంతో ఏమీ కొన కుండా దాన్ని నిల్వ చేస్తే, అతని డబ్బు పెరుగుతుంది. ఈ పద్ధతి లోనే సమాజంలో మొత్తం డబ్బు రాసి పెరుగుతుంది' అనే రకపు జవాబులు చెపుతారు.

కానీ, అలా చేస్తే, సమాజంలో అంతకు ముందు వున్న డబ్బే, వేరు వేరు చోట్ల కొత్త నిల్వ లుగా ఏర్పడుతుంది. పెట్టుబడిదారుల్లో కొందరి నిల్వలు పెరగవచ్చు. దాని వల్ల సమాజంలో గతంలో వుండే డబ్బు రాసి పెరగదు.

డబ్బు రాసి పెరగడం అంటే ఒక విడి పెట్టుబడి దారుడి డబ్బు రాసి పెరగడం - అని కాదు. సమా జంలో వుండే మొత్తం డబ్బు రాసి పెరగడం గురించి చూడాలి. అది ఎలా జరుగుతుందనేదే ప్రశ్న. అప్పటికే వున్న మొత్తం డబ్బు రాసికి, కొత్త డబ్బు వచ్చి చేరి నప్పుడే అది జరుగుతుంది. కొత్త బంగారం చేరుతుంది కాబట్టి.

దీన్ని పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ఎందుకు అర్థం చేసుకోలేక పోతారంటే, వారి అవగాహనలో 'అదనపు విలువ' అనే అంశమే వుండదు కాబట్టి. ప్రతీ శాఖ లోనూ 'అదనపు ఉత్పత్తి' వుంటుందనే గ్రహింపు వుంటే, బంగారం శాఖలో కూడా అదనపు ఉత్పత్తి వుంటుందనీ, అది వేరు వేరు పెట్టుబడిదారుల మధ్య మారకాల ద్వారా ప్రతీ సారీ చలామణీ లోకి కొంత కొంత కొత్త డబ్బు వస్తూ వుంటుందనీ, గ్రహించ డానికి అవకాశం వుంటుంది. కానీ, 'అదనపు ఉత్పత్తి' సంగతే తెలియనప్పుడు, ఆర్థిక శాస్త్రంలో ఎదురుపడే సమ స్యల్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాకుండా పోతుంది.

సమాజంలో 'కాయితం డబ్బు' ప్రారంభమై నప్పుడు, కాయితం నోట్లని విడుదల చేసే బాధ్యత ప్రభుత్వానిదే. ఆ పని చెయ్యడానికి విడి విడి వ్యక్తు లకు హక్కు వుండదు.

కాయితం డబ్బే చలామణీ సాధనంగా వున్న ప్పుడు, మామూలు సరుకుల్ని అమ్మకం ద్వారా డబ్బుగా మార్చినట్టే, బంగారాన్ని కూడా అమ్మకం ద్వారా డబ్బుగా మార్చవలసిందే. 1 గ్రాము బంగా రాన్ని అమ్మితే, కొన్ని కాయితం రూపాయలు వస్తాయి.

బంగారం పెట్టుబడిదారుడు, ప్రతీ సారీ తన కొత్త సరుకునంతా (కొత్త బంగారాన్నంతా) అమ్మి, ఆ కాయితం డబ్బుతో, కొత్త C + V ల్ని కొనాలి. అయితే, ఆ కాయితం డబ్బులో కూడా 'అదనపు డబ్బు' భాగం వుంటుంది. (కాయితం డబ్బుని పెంచే పని ప్రభుత్వం ద్వారా ఎలా జరుగుతుందో, ఈ 2 వ సంపుటం లోనే 'సహజ ఆర్థిక విధానం ...' చాప్టరులో, 'కేంద్ర బ్యాంకు' దగ్గిర చూశాం.)

కాయితం డబ్బు రాసిని కూడా కొంత కాలానికి ఒకసారి పెంచవలసి వుంటుంది. అలాంటప్పుడు, కాయితం డబ్బుకి వెనక సపోర్టుగా వుండవలసిన

బంగారం రాసిని కూడా పెంచవలసి వుంటుంది. 1 కాయితం నోటుకి వెనక సపోర్టుగా ఎంత బంగారం వుండాలీ - అనే పాళ్ళని చట్టం ఎలాగైనా నిర్ణయించ వచ్చు. ఆ నిర్ణయాన్ని చట్టం మళ్ళీ ఎలాగైనా మార్చ వచ్చు. ఆ పాళ్ళ సంగతి ఇక్కడ అనవసరం. ఆ పాళ్ళు ఎలా వున్నప్పటికీ, కాయితం డబ్బు పెరగాలంటే, బంగారం రాసి కూడా పెరిగి తీరాలి. అంటే, కాయితం నోట్లు చలామణీలో వున్నప్పుడు కూడా, డబ్బు రాసి పెరగడం అంటే బంగారం రాసి పెరగడమే. ఆ పెరిగే బంగారం, ఎప్పటికప్పుడు కొత్త సంవత్సర ఉత్పత్తి ద్వారా రావలసిందే.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం తగిన స్థాయిలో అభివృద్ధి చెందడానికి కావలసిన పరిస్తితుల్లో ఒక పరిస్తితి ఏమిటంటే, 'చలామణీ సాధనం' గా పని చేసే వెండి - బంగారు లోహాలు, తగిన స్థాయిలో ఉత్పత్తి కావడం. 16వ శతాబ్దం నించీ, ప్రపంచంలో వెండి బంగారాల కొత్త గనుల్ని కనిపెట్టడం వల్ల ఆ లోహాల ఉత్పత్తి పెరిగింది. ఆ ఉత్పత్తి, ప్రపంచంలో ఎక్కడ పెరిగినా ఒకటే. అది కావలసిన దేశాలు, తమ ఇతర ఉత్పత్తుల్లో కొంత భాగాన్ని ఇచ్చి, ఆ లోహాల్ని కొంటాయి. చలామణీ సాధనంగా పని చెయ్యడానికి తగినంత లోహాలు వుండడమూ, అందులో కొంత భాగాన్ని నిల్వగా కూడా వుంచు కోవడమూ పెట్టుబడి దారీ విధానం అభివృద్ధికి చారిత్రకంగా తోడ్పడిన అంశాలు. అంటే సమా జంలో, మొదటే తగినంత చలామణీ సాధనం ఏర్పడి, తర్వాత పెట్టుబడిదారీ విధానం ఏర్పడు తుందని అర్థం కాదు. ఆ రెండు విష యాలూ ఏక కాలం లోనే జరుగుతాయి. పెట్టుబడి దారీ ఉత్పత్తి గానీ, మరే చారిత్రక విషయం గానీ, తనకు అవసరమైన పరిస్తితుల్ని అభివృద్ధి చేసుకుంటూనే, తను అభివృద్ధి చెందుతుంది.

'కాయితం డబ్బు' ప్రారంభమైన తర్వాత, చలా మణీలో ఎంత డబ్బు వుండాలో అంత మాత్రమే గాక, ఎక్కువ డబ్బు చేరే సమస్య ఒకటి ప్రారంభమవు తుంది. ఈ కాయితం 'డబ్బు రాసి - సమస్య' ప్రధా నంగా 'ఉత్పత్తి విధానానికి' వుండే స్వభావాన్ని బట్టి ఏర్పడే విషయంగా వుంటుంది.

డబ్బు రాసి పెరుగుదలకు సంబంధించి మార్క్సు నించి కొన్ని మాటలు: ['కాపిటల్-2'లో, 'సింపుల్ పునరుత్పత్తి' చాప్టరులో, 'మనీ మెటీ రియల్ రిప్రొడక్షన్' భాగంలో.]

"ఎక్కువ విలువలు గల ఈ సరుకుల పెద్ద పరిమాణాన్ని చలామణీ చెయ్యడానికి అవసర మయ్యే అదనపు డబ్బుని ఎలా పొందాలీ అంటే - చలామణీ డబ్బు పరిమాణాన్ని ఎక్కువ పొదుపుగా ఉపయోగిం చడం ద్వారా గానీ (చెల్లింపులను బ్యాలెన్స్ చెయ్య డమూ, అవే నాణాల చలామణీని వేగవంతం చెయ్య డమూ వగైరాల ద్వారా); లేదా, డబ్బుని, నిల్వ రూపం నించి చలామణీ సాధనంగా మార్చడం ద్వారా గానీ. ... దీని అర్థం, స్తంభించి వున్న డబ్బు నిధుల్ని పొదు పుగా వాడడం - .... ఈ చర్యలు సరిపోనప్పుడు, అద నపు బంగారం ఉత్పత్తి అవసరం." [పేజీ. 349, 350]

" పెట్టుబడిదారీ వర్గపు సభ్యుల్లో, (వెండి బంగారాలలో అదనపు ఉత్పత్తిని మినహాయిస్తే), డబ్బు రూపంలో కూడిక (ఎక్యుమ్యులేషన్ జరగడం అనేది, ఒకే సమయంలో, అన్ని పాయింట్ల దగ్గిరా (పెట్టుబడి దారులందరి దగ్గిరా), ఎన్నడూ జరగదు". [ పేజీ. 353-354]

"ఇబ్బంది ఎక్కడ వస్తుందంటే, విడి పెట్టుబడి దారుడి దగ్గిర జరిగే డబ్బు పెట్టుబడి కూడిక గురించి ఊహించినప్పుడు కాదు. మొత్తం పెట్టుబడిదారీ వర్గంలో జరిగే డబ్బు పెట్టుబడి కూడిక గురించి ఊహించినప్పుడు." [ పేజీ. 352]

"విడి విడి పెట్టుబడిదారుల మధ్య ఏ పాళ్ళల్లో అయినా గానీ అదనంగా ప్రవేసించే విలువైన లోహాల (వెండి బంగారాల) పంపిణీని తప్ప, ఇక దేనినీ వ్యక్త పరచని డబ్బుకి సంబం ధించిన యూనివర్సల్ ఎక్యుములేషన్ జరిగే పరి స్తితిని అలా వుంచితే, ఒక ప్రశ్న. మొత్తం పెట్టు బడిదారీ వర్గం, డబ్బుని ఎలా ఎక్యుములేట్ చేస్తున్నట్టు భావించాలి?" [ పేజి. 352, 53]

(విలువైన లోహాల పెరుగుదల ద్వారా, చలా మణీలో డబ్బు రాసి పెరుగుతుంది - అనే విషయాన్ని లెక్కలోకి తీసుకోకపోతే, ఆ విషయం వదిలి వేస్తే, అది కాకపోతే, డబ్బు రాసి పెరగడానికి కారణం ఏమిటి? డబ్బు కూడిక పెరగడానికి కారణం, పెట్టుబడిదారుల మధ్య విలువైన లోహాలు అదనంగా ప్రవేశించడమే - అని చెపుతున్నాడు.)

"సరుకు రూపంలో ఉత్పత్తి అయిన అదనపు విలువ, తను డబ్బులోకి మారడానికి అవసరమైన డబ్బుని, చలామణీ క్రమంలో పొందుతుంది. ఎందు కంటే, చాలా సింపుల్ కారణం వల్ల. అవతలి వైపు అదనపు విలువ, బంగారం రూపంలో ఉత్పత్తి అవు తుంది." [ పేజీ. 342]

"మన ఊహ ప్రకారం, (సింపుల్ పునరుత్ప త్తిలో), బంగారం సంవత్సర ఉత్పత్తి, (ఏదైతే మార్కెట్ నించి శ్రమ శక్తినీ, ఉత్పత్తి సాధనల్నీ, నిరంతరం తీస్తూ వుంటుందో, వాటి కోసం చెల్లించిన డబ్బుని వెనక్కి తీసుకోకుండా ఏదైతే మార్కెట్‌కి తాజా డబ్బు పరి మాణాల్ని నిరంతరం చేరుస్తూ వుంటుందో ఆ బంగారం ఉత్పత్తి), సంవత్సర కాలంలో అరిగిపోయిన డబ్బుని భర్తీ చెయ్యడం మాత్రమే చేస్తుంది.' ఆ విధంగా సామాజిక డబ్బు పరిమాణాన్ని చెక్కు చెదర నివ్వకుండా వుంచడం మాత్రమే చేస్తుంది. ఈ సామా జిక డబ్బు పరిమాణం నిరంతరం రెండు రూపాల్లో, అంటే నిల్వ డబ్బు గానూ, చలామణీ లోని డబ్బు గానూ, వేరు వేరు పాళ్ళల్లోనే అయినప్పటికీ, ఉనికిలో వుంటుంది."
[ పేజీ. 333]

" ... సంవత్సర ఉత్పత్తిని చలామణీ చేసే డబ్బు పరిమాణం, క్రమంగా కూడడం ద్వారా సమా జంలో ఉనికిలో వుంటుంది. అది, ఒక ప్రత్యేక సం వత్సరంలా ఉత్పత్తి అయిన విలువకు చెందదు".
[ పేజీ. 482]

"బంగారం ఉత్పత్తిలో మాత్రమే ('అదనపు విలువ'కు నిధిగా వుండే అదనపు ఉత్పత్తిగా బంగారం వున్న మేరకు) కొత్త డబ్బు ఏర్పడుతుంది."
[ పేజీ. 495] ★

# ' నూతన సమాజం' గురించి ఒక స్పష్టత

నూతన సమాజపు పునరుత్పత్తిలో 'ఎవరి శ్రమ వారికే దక్కడం' గురించి ఒక స్పష్టత ఉండాలి.

ఒక వ్యక్తి శ్రమ 2 భాగాలుగా చీలుతుందని చెప్పుకున్నాం. అందులో 'జీతం' భాగం ఆ వ్యక్తి చేతికే అందుతుంది కాబట్టి, అది నిస్సందేహంగా ఆ వ్యక్తికి అందినట్టే అర్థం. 'సమాజ నిధి' భాగం ఆ వ్యక్తి చేతిలోకి రాదు. అయినా ఈ భాగం కూడా ఆ వ్యక్తికే అందుతుందని చెప్పుకోవాలంటే, అది నూతన సమాజ నిర్వ హణని బట్టే ఉంటుంది. ఈ నిర్వహణలో ఎన్నో అవక తవకలు ఉండవచ్చు. ఎన్నో అజ్ఞానాలూ, పెట్టుబడిదారీ సమాజ ప్రభావాలూ ఉండ వచ్చు.

'అందరూ శ్రమ చెయ్యాలి' అనే షరతు వున్నా,అది సవ్యంగా జరగడం లేదనుకుందాం.

'ఒక శారీరక శ్రమ విలువకీ, ఒక మేధాశ్రమ విలువకీ వుండే తేడా చాలా ఎక్కువగా ఉండ కూడదు' అనే షరతు వున్నా, అది కూడా సవ్యంగా జరగడం లేదనుకుందాం.

'దోపిడీ సమాజాల శ్రమ విభజన మారాలి' అనే షరతు వున్నా, అదీ జరగడం లేదను కుందాం.

జరగవలసిన మార్పులు సవ్యంగా జరగక పోతే, దాని ఫలితం ఎలా ఉంటుంది? 'సమాజ నిధి' అనేది, కొందరికి ఎక్కువ సౌఖ్యాలు సమ కూర్చే విధంగా ఖర్చవుతూ వుంటుంది.

ఇలాంటి తప్పులు జరుగుతూ వుంటే, అక్కడ ఎవరి శ్రమ వారికి దక్కడం లేదని అర్థం. ఎక్కువ శ్రమ చేసే వారి నించి కొంత శ్రమ, తక్కువ శ్రమ చేసే వారికి పోతున్నట్టు అర్థం. అంటే, అక్కడ కూడా దోపిడీ జరుగు తున్నట్టు అర్థం. అక్కడ కూడా వర్గాలు ఉన్నా యని అర్థం. అవి పాత రూపాల్లో గాక, ఇంకో రూపంలో ఏర్పడ్డాయని అర్థం. భూస్వాములూ పెట్టుబడిదారులూ కనపడనంత మాత్రాన, అక్కడ జరగవలసిన మార్పులన్నీ సవ్యంగా జరి గాయనే అర్థానికి రాకూడదు.

అంతే కాదు. వ్యక్తి చేతికి అందే 'జీతం' భాగం గురించి కూడా ఒక సమస్య ఉంది. దాన్ని మూఢ నమ్మకాల కోసమూ, విలాసాల కోసమూ, వ్యసనాల కోసమూ, ఖర్చు పెట్టడం జరగవచ్చు. నలుగురు మనుషులు ఒక ఇంట్లో చేరి పేకాట లాంటి ఏదో ఒక జూదం తోనో, మత కార్యక్రమాల తోనో గడిపితే, అది, హేతు బద్ధమైన మానవ జీవితం అవదు. అంటే, 'జీతం' భాగాన్ని గానీ, సమాజ నిధి భాగాన్ని గానీ దోపిడీ సమాజ ప్రభావాలు లేని పద్ధతుల్లో ఖర్చు పెట్టడం అనేది నూతన జ్ఞానం.

దోపిడీకి గురి అయ్యే వర్గం, దాని నించి బయట పడాలంటే, అదంతా ఆ వర్గానికి ఉండే సిద్ధాంత జ్ఞానం మీదే ఆధారపడి ఉంటుంది. ఆ సిద్ధాంత జ్ఞానం కోసమే, శ్రమ సంబంధాల్లో ఉండే ప్రతీ విషయాన్నీ సాధ్యమైనంత వివరంగా నేర్చుకోవడానికి ప్రయత్నించాలి.

# ప్రశ్నలూ - జవాబులూ

**1. పెట్టుబడి విస్తరణ — అంటే ఏమిటి? అది ఎలా జరుగుతుంది?**

**జ:** పెట్టుబడి విస్తరణ అంటే, పెట్టుబడి పెరగడం. అదనపు విలువలో నించి కొంత భాగం పెట్టుబడికి కలిస్తే పెట్టుబడి పెరుగుతుంది. పాత ఉత్పత్తి సాధనాలకు, కొన్ని కొత్త ఉత్పత్తి సాధనాలు కూడా కలవడమే పెట్టుబడి పెరగడం.

**2. పెట్టుబడి పెరగడంలో, పరిమాణాత్మకమైన మార్పూ గుణాత్మకమైన మార్పూ అంటే ఏమిటి?**

**జ:** పెట్టుబడికి వుండే ఉత్పాదక శక్తి పెరగకుండా పెట్టుబడి పెరిగితే, అది పెట్టుబడి పరిమాణంలో మార్పు. పెట్టుబడి పెరిగినప్పుడు, ఉత్పాదక శక్తి కూడా పెరిగి, C పెరిగి, V తగ్గితే, అది పెట్టుబడిలో గుణాత్మకమైన మార్పు. ఈ మార్పు సజీవ శ్రమతో అవసరాన్ని తగ్గించి, నిరుద్యోగాన్ని పెంచుతుంది.

**3. పెట్టుబడి ఎవరిది? ఏ రకంగా?**

**జ:** పెట్టుబడిదారీ చట్టాల ప్రకారం అయితే, పెట్టుబడి పెట్టుబడిదారులదే. కానీ, పెట్టుబడిగా ఉండేది ఉత్పత్తి సాధనాలే. అవి శ్రమ వల్లనే తయారవుతాయి. ఆ శ్రమ, గత కాలం నించీ ఎవరు చేశారో వారి వల్లనే ఉత్పత్తి సాధనాలన్నీ తయారయ్యాయని అర్థం. అంటే, సమాజంలో వున్న పెట్టుబడి అంతా (ఉత్పత్తి సాధనాలన్నీ) — గతంలోనూ, ప్రస్తుతంలోనూ శ్రమలు చేసిన, చేస్తూవున్న మనుషులదే.

**4. భూమి ఎవరిది?**

**జ:** భూమి ఎవరిదీ కాదు. అది ప్రకృతి సహజ పదార్థం. అది మనుషుల శ్రమతో తయారైనది కాదు. కాబట్టి, ప్రకృతి సహజంగా వున్న భూమి ఎవరిదీ కాదు. కానీ, భూమితో ఏదో ఒక అవసరం కోసం, దానిమీద ఎవరు స్వయంగా శ్రమ చేస్తారో ఆ శ్రమ జరిగినంత కాలమూ ఆ భూమి, ఆ మనుషులదే. కానీ అప్పటికీ అది వాళ్ళ స్వంత ఆస్తి కాదు. దాన్ని ఉపయోగించుకోవడానికి మాత్రమే ఆ మనుషులకు హక్కు ఉంటుంది.

**5. భూమి ఉత్పత్తి సాధనాల్లో భాగమా కాదా? పెట్టుబడిలో భాగమా కాదా?**

**జ:** భూమి మీద ఏదో ఒక శ్రమ జరగకపోతే, 'అది ఉత్పత్తి సాధనమా కాదా' అనే ప్రశ్న ఉండదు. ఏదైనా ఒక శ్రమ జరగడానికి, భూమి కూడా ఒక ఉత్పత్తి సాధనమే. కానీ, భూమి, పెట్టుబడిలో భాగం కాదు. ముడి భూమిని గానీ, అంతకు ముందు ఒక అవసరం కోసం ఉపయోగించిన భూమిని గానీ, మళ్ళీ ఒక కొత్త అవసరం కోసం ఉపయోగించాలంటే, ఆ భూమిని సిద్ధం చెయ్యడానికి అయ్యే ఖర్చులు, పెట్టుబడిలో భాగమే. కానీ, అది, ముడి భూమే పెట్టుబడిలో భాగం అవడం కాదు. క్లుప్తంగా చెప్పుకుంటే — భూమి, ఉత్పత్తి సాధనాల్లో భాగమే. కానీ పెట్టుబడిలో భాగం కాదు.

**6. భూమి లేకుండా పెట్టుబడి పనిచేస్తుందా?**

**జ:** చెయ్యదు. భూమితో సంబంధం లేకుండా ఏ ఉత్పత్తి క్రమమూ ఉండదు. మనిషి నిలబడ్డదే భూమి మీద. కాబట్టి, మనుషులు ఏ పని చేసినా భూమి పాత్ర ఉంటుంది.

**7. భూస్వామి, తన ఆస్తి గురించి 'మా తాతలు కష్టించి చెమటోడ్చి ఈ భూమిని సంపాదించి నాకు ఇచ్చారు' అని చెప్పుకుంటాడు. శ్రామికుల తాతలు కష్టించి చెమటోడ్చిన వాళ్ళు కారా?**

**జ:** అసలు కష్టించిన వాళ్ళు శ్రామికుల తాతలే. భూస్వామికి ఆ భూమిని ఇచ్చిన వాళ్ళు వాడి తాతలు కాదు, శ్రామికుల తాతలే. ఒక మనిషి నిజంగా శ్రమ చేస్తే, అది స్వంత పోషణకే ఖర్చయిపోతుంది. ఇతరుల నించి దోచుకున్న శ్రమ అయితేనే, అందులో కొంత భాగం ఆస్తిగా కూడుతుంది. భూస్వామికి, తన దోపిడీ గురించి తెలియనట్టే, తన తాతల దోపిడీ గురించి అసలే తెలియదు.

**8. ఒక నాటి గిల్డు పెట్టుబడిదారుడూ, ఈ నాటి ఆధునిక పెట్టుబడిదారుడూ ఒకటేనా?**

**జ:** కాదు. గిల్డు పెట్టుబడిదారుడు, శ్రమ చేస్తాడు. అతనికి వచ్చే S చాలా తక్కువగా ఉంటుంది. అతని అధికారం కూడా కార్మికుల మీద తక్కువగా ఉంటుంది. ఆధునిక పెట్టుబడిదారుడు శ్రమ చెయ్యడు. వీడు లాగే S చాలా ఎక్కువ. కార్మికుల మీద వీని అధికారం కూడా చాలా ఎక్కువ.

**9. ఆధునిక పెట్టుబడిదారుడి లక్ష్యం బతుకుదెరువేనా?**

**జ:** కాదు. లాభం, ఎక్కువ లాభం! డబ్బు, ఎక్కువ డబ్బు! ఆస్తి, ఎక్కువ ఆస్తి! అంటే, ఉత్పత్తి సాధనాల మీద పట్టూ, శ్రామికుల మీద యజమాని తనమూ! పెట్టుబడిదారుడిగా ఉండదల్చిన వాడి బతుకు దెరువు ఇదే. ఇది వాడికి తప్పనిసరి.

**10. పెట్టుబడిదారీ విధానాన్ని సింపుల్ పునరుత్పత్తే అను కుందాం. అందులో కూడా S ఉంటుంది కాబట్టి, ఆ S లో నించే కొంత భాగాన్ని పెట్టుబడిగా మారుస్తారని ఎందుకు అనుకోకూడదు?**

**జ:** S లో నించి కొంత భాగాన్ని పెట్టుబడిగా మార్చాలంటే, ఆ S లో, కొత్త C, Vలు వుండాలి. కానీ, సింపుల్ పునరుత్పత్తిలో S అంతా పెట్టుబడిదారీ పోషణ వస్తువులే. S లో ఉత్పత్తి సాధనాలు వుండవు కాబట్టి, S లో కొంత భాగాన్ని కొత్త పెట్టుబడిగా మార్చడం సాధ్యం కాదు. కాబట్టి, పెట్టుబడిదారీ విధానాన్ని విస్తృత పునరుత్పత్తిగానే చూడాలి.

**11. ఒక పెట్టుబడి 800. దాని C, Vల పాళ్ళు 7 : 1. అదనపు విలువ రేటు 200%. ఉత్పత్తి క్రమం వారానికి ఒకసారి జరుగుతుంది. ఇది సింపుల్ పునరుత్పత్తి క్రమం. ఈ పెట్టుబడితో సమానమైనంత విలువని పెట్టుబడిదారుడు వాడెయ్యడానికి ఎంత కాలం పడుతుంది?**

**జ:** పెట్టుబడి 800. అది, 700C + 100Vగా ఉంది. అదనపు విలువ రేటు 200% కాబట్టి, 100V ద్వారా వచ్చే అదనపు విలువ —200. ఇది సింపుల్ పునరుత్పత్తి కాబట్టి, S అంతా పెట్టుబడిదారుడి పోషణ కోసం, ఒక వారంలో ఖర్చయిపోతుంది. పెట్టుబడిదారుడు, వారానికి 200 S చొప్పున, 800 పెట్టుబడితో సమానమైనంత S ని వాడడానికి, 4 వారాలు పడుతుంది.

**12. ఒక వస్తువు తయారైంది. దాని ఉత్పత్తి సాధనాల ద్వారా చేరే శ్రమ 6, సజీవ శ్రమ 4. వస్తువుని అమ్మారు. 10 డబ్బు వచ్చింది. అందులో అదనపు విలువ ఉందా?**

**జ:** అలా చెప్పలేము. ఆ వస్తువు ఎలాంటి సంబంధాల్లో ఉత్పత్తి అయిందో తెలియాలి. అది స్వంత ఉత్పత్తిదారుడి ద్వారా తయారైనది అయితే, అదనపు శ్రమ లేకుండానే తయారై ఉండవచ్చు. ఆ వ్యక్తి తన కోసం 4 శ్రమని వాడుతూ, తిరిగి 4 శ్రమతో ఆ వస్తువుని చేసి ఉండవచ్చు. ఆ వస్తువు వేతన శ్రామికుడి ద్వారా తయారైనది అయితే, ఆ 4 సజీవ శ్రమలో ఎంతో కొంత అదనపు విలువ ఉండి తీరుతుంది.

**13. మీరు పనిచేసే 'పరిశ్రమ' ఎన్ని సంవత్సరాల కిందట, ఎంత పెట్టుబడితో ప్రారంభమైందో మీకు తెలుసా? పరిశ్రమ ప్రారంభమైన నాటికీ, ఈ నాటికీ, ఈ పరిశ్రమలో పెట్టుబడి ఎంత పెరిగింది? ఉద్యోగులు ఎంత పెరిగారు?**

**జ:** ఒక పెట్టుబడిదారుడి దగ్గిర పని చేసే కార్మికులు చెప్పవలసిన జవాబు ఇది. కానీ, ఒక పరిశ్రమలో పని చేసే కార్మికులకు, ఆ పరిశ్రమ గురించి ఏ వివరాలూ తెలియవు. ఆ వివరాలన్నీ పెట్టుబడిదారుడు, రహస్యంగా ఉంచుతాడు. అయినా, కార్మికులు వాటిని సేకరించవచ్చు.

**14. ఒక పెట్టుబడిలో స్థిర 2500: అస్థిర 500. ఒక్కొక్క కార్మికుడికీ ఒక రోజుకి జీతం 5. ఒక కార్మికుడు ఎంత విలువ గల ఉత్పత్తి సాధనాలతో పని చేస్తున్నాడు?**

**జ:** ఒక కార్మికుడికి జీతం 5. కార్మికుల సంఖ్య = 500 V ÷ 5 = 100. ఈ కార్మికులు 2,500C మీద పని చేస్తారు. ఒక కార్మికుడు = 2500 ÷ 100 = 25C మీద పని చేస్తాడు.

**15. పెట్టుబడిదారీ పునరుత్పత్తి క్రమం, 'వర్గ సంబంధాల్ని కూడా పునరుత్పత్తి చేస్తుంద' ని ఎలా చెప్పవచ్చు?**

**జ:** ఒక ఉత్పత్తి క్రమం పూర్తి అయినప్పుడు, కొత్త ఉత్పత్తుల రాసి వస్తుంది. అది, ఖర్చయి పోయిన ఉత్పత్తులన్నీ తిరిగి ఉత్పత్తి అవడం. (అదనపు ఉత్పత్తులు కూడా.) ఆ రాసిలో నించి కార్మిక వర్గానికి అందేది — జీతాలు. పెట్టుబడిదారీ వర్గానికి అందేవి — కౌళ్ళూ, వడ్డీ లాభాలూ. అంటే అదనపు విలువ. ఆ రాసిలోవున్న పెట్టుబడి, మళ్ళీ కొత్త పెట్టుబడిగా పని చేస్తుంది. కార్మికులు, మళ్ళీ శ్రమ చెయ్యవలసిన కార్మికులు గానూ, పెట్టుబడిదారులు ఏ శ్రమా చెయ్యనక్కర లేని యజమానులు గానూ ఉంటారు. యజమానీ శ్రామిక సంబంధాలు ఎప్పటి లాగే ఉంటాయి. యజమానుల ఆస్తి హక్కులు ఎప్పటి లాగే ఉంటాయి. శ్రమ దోపిడీ ఎప్పటి లాగే ఉంటుంది. అన్నీ ఎప్పటి లాగే. ఉత్పత్తి రాసిలో ఉన్న C, Vలు — కొత్త పెట్టుబడిగా పని చేసి, కొత్త S ని తెస్తాయి. కొత్త రాసిలో మళ్ళీ C, V, S లు ప్రత్యక్ష మవుతాయి. ప్రతీ సారీ ఇదే జరుగుతూ ఉంటుంది. అందుకే ఉత్పత్తి క్రమం ద్వారా జరిగేది — వస్తువుల పునరుత్పత్తే కాదు. వర్గ సంబంధాల పునరుత్పత్తి కూడా!

**16. వీటిలో — ఒక 200 సంవత్సరాల కన్నా వెనక కాలంలో లేని వస్తువులు ఏవి? — బట్టలు, రేడియో, కలము, చెప్పులు, వాచీ, తుపాకీ, ఫాను, సినిమా, పంచదార, ఇల్లు, రైలు, కరెంటు.**

**జ:** రేడియో, ఫాను, సినిమా, రైలు, కరెంటు — ఇవి 200 సంవత్సరాల కిందట లేనివి.

**17. మీకు తెలిసిన పెట్టుబడిదారుల్లో, మొదట ఒకే 'పరిశ్రమ'ని ప్రారంభించి, క్రమంగా నాలుగైదు రకాల పరిశ్రమలతో పెరిగిపోయిన వాళ్ళు ఉన్నారా?**

**జ:** బోలెడు మంది! ప్రతీ పెట్టుబడిదారుడూ పెరుగుతూనే ఉంటాడు. పెట్టుబడి లక్షణమే — రాత్రింబవళ్ళూ పెరగడం.

**18. ఒక సరుకు విలువ 5. అందులో అదనపు విలువ 2. ఆ**

**సరుకుతో మారడానికి ఎంత డబ్బు కావాలి? 5 డబ్బా, 7 డబ్బా? అది స్వతంత్ర ఉత్పత్తిదారుడి సరుకు అయితే, దానితో మారడానికి ఎంత డబ్బు కావాలి?**

**జ:** 5 విలువ గల సరుకుతో మారడానికి 5 డబ్బే కావాలి. ఆ సరుకు ఎవరు చేసినా ఒకటే. ఆ 5 లోనే అదనపు విలువ ఉంటుంది.

**19. ఉత్పత్తి సాధనాలుగా గానీ, పోషణ వస్తువులుగా గానీ, విలాస వస్తువులుగా గానీ, ఆఖరికి వ్యసనాల కోసం గానీ ఉపయోగపడని వస్తువులు ఏవి? అవి దేని కోసం?**

**జ:** ఆయుధాలన్నీ అలాంటివే. కానీ, దోపిడీ వర్గానికి అవి కూడా అత్యవసరమైన ఉత్పత్తులే. వాళ్ళు బతికేది దోపిడీ మీదే కాబట్టి, ఆస్తులు సంపాదించడానికీ, శ్రామిక వర్గాన్ని అణచడానికీ, ఆ వర్గానికి ఆయుధాలు తప్పనిసరే. రాజుల మధ్య భూమిని పెంచుకోవడానికి యుద్ధాలు జరుగుతాయి. ఇద్దరికీ ఆయుధాలు అవసరం. పెట్టుబడి దారుల మధ్య కూడా యుద్ధాల కోసం ఆయుధాలు అవసరం. శ్రామిక వర్గ తిరగబాట్లని అణచడం అన్నిటి కన్నా ముఖ్యావసరం. కాబట్టి, దోపిడీ సాగినంత కాలమూ ఆ వర్గానికి, ఆయుధాలు ఆహారం కన్నా ఎక్కువ అవసరం.

**20. యుద్ధాలు చెయ్యడాన్ని ఒక శ్రమగా అనుకుంటే, ఆయుధాలన్నీ ఆ శ్రమ జరగడానికి అవసరమయ్యే శ్రమ సాధనాలు కావా?**

**జ:** యుద్ధాలు చెయ్యడం ఒక శ్రమే అయితే ఆయుధాలన్నీ ఆ శ్రమ జరగడానికి సాధనాలే. కానీ, యుద్ధాలు చెయ్యడం ఒక శ్రమే కానప్పుడు, దాన్ని ఒక శ్రమగా ఎందుకు అనుకోవాలి?

**21. కార్మిక కుటుంబాల్లో తక్కువ మంది పిల్లలు ఉంటే, ఆ వర్గం, సమస్యల నించి విముక్తి అవుతుందా?**

**జ:** కార్మిక కుటుంబాల్లో ఇద్దరేసి పిల్లలే వున్నా, ఆ ఇద్దరు పిల్లలే పెద్ద వాళ్ళై కార్మికులు అవుతారు. వారి అదనపు శ్రమ పెట్టుబడిదారులకు పోతూ ఉంటుంది. దోపిడీ సమస్య ఎప్పటి లాగే ఉంటుంది.

**22. నిరుద్యోగ భృతితో జీవించడం అవమానకరం. ఏ విధంగా?**

**జ:** అది స్వంత శ్రమ కాదు. ఇతరుల శ్రమ. ఇతరుల శ్రమతో బతకడం అవమానకరమే కదా?

**23. కార్మిక దృష్టితో ఆలోచిస్తే, 'జనాభా ఎక్కువ అవడం' అనేది ఎప్పుడూ ఉండదా?**

**జ:** ఉండదు. ప్రతీ మనిషీ నోటి తోనే గాక, చేతుల తోటీ, కాళ్ళ తోటీ కూడా పుడతాడు. తన కోసం తనే శ్రమ చేసుకుంటాడు కాబట్టి, 'మనుషులు ఎక్కువై పోవడం' అనే అభిప్రాయం తార్కికంగా ఉండదు. అంతే గాక, స్త్రీ పురుషులకు, ఒక్క బిడ్డవల్ల కలిగే ఆనందం, ఇద్దరు బిడ్డల వల్ల రెట్టింపు అవుతుంది. అలాంటప్పుడు జనాభా ఎక్కువ అవడం ఏమిటి? కానీ ప్రకృతి విషయాల్లో, ప్రతీ ఒక్క దాన్నీ యధాతధంగా పాటించలేము. ప్రకృతి ప్రకారమే పాటిస్తే, ఒక ఆడ పిల్ల, 12, 13 సంవత్సరాల వయసు నించీ కూడా ఏటా బిడ్డల్ని కనగలుగుతుంది. అది ఆ తల్లీ బిడ్డల ఆరోగ్యాలకూ, ఆ స్త్రీ సామాజిక జీవితానికీ సరిపడని విషయం. ఆ దృష్టితో చూస్తే, బిడ్డల్ని కనడంలో, పరిమితులూ నియమాలూ నూతన సమాజంలో కూడా తప్పనిసరి అవుతాయి. కానీ, ఇది 'జనాభా ఎక్కువ అవుతారు' అనే దాని కోసం కాదు.

**24. కార్మిక దృష్టితో కూడా సంతానాన్ని పరిమితం చేసుకోవడం అవసరమే కదా? పిల్లలు ఎంత మంది ఉండడం బాగుంటుంది?**

**జ:** కనీసం ఇద్దరు పిల్లలైనా ఉండాలి. కానీ, అందరూ అలాగే చెయ్యాలని రూలేమీ లేదు. బిడ్డలు అసలు లేకుండా ఉండడానికి గానీ, ఒక్క బిడ్డ తోనే ఉండడానికి గానీ, అది ఆ తల్లిదండ్రుల ఇష్ట ప్రకారం ఉండాలి. ప్రతీ తల్లిదండ్రులకూ ఒక్క బిడ్డే ఉండడం అయితే, అక్క చెల్లెళ్ళూ, అన్న దమ్ములూ, మేనత్తలూ, పిన తల్లులూ వంటి సంబంధాలన్నీ అంతర్ధానమైపోతాయి. కొన్ని కుటుంబాల్లో అయినా ఇద్దరేసి పిల్లలు ఉంటే, అక్క చెల్లెళ్ళంటే, ఏమిటో, అన్నదమ్ము లంటే ఏమిటో ప్రతీ తరానికీ తెలుస్తుంది. మానవ సమాజంలో ఆ సంబంధాలు నిలిచి ఉండాలి.

**25. కార్మికుల్లో కొందరు పెట్టుబడిదారులయ్యారు. పెట్టుబడిదారుల్లో కొందరు కార్మికులయ్యారు. ఆ వర్గాల పరిస్తితులు మారిపోయినట్టు అర్ధమా?**

**జ:** కాదు. ఆ వ్యక్తుల పరిస్తితులు మారాయి. కార్మికులుగా ఎవరు ఉంటారో వాళ్ళు, అదనపు శ్రమని పోగొట్టుకుంటూ ఉంటారు. పెట్టుబడిదారులుగా ఎవరు ఉంటారో వాళ్ళు, అదనపు శ్రమని లాగుతూ ఉంటారు. వర్గాలు ఎప్పటి లాగే ఉంటాయి.

**26. శ్రమ శక్తి పునరుత్పత్తి లోకి చేరని ఉత్పత్తులు విలాస ఉత్పత్తులు అవుతాయి - అనే అర్ధం ప్రకారం, శారీరక శ్రమల సెక్షన్ల కార్మికులు వాడని పాలూ పెరుగూ వెన్నా నెయ్యీ వంటి ఉత్పత్తులు విలాస ఉత్పత్తులు అవుతాయా?**

**జ:** కార్మిక వర్గంలో, అనేక సెక్షన్ల కార్మికులకు కడుపు నిండా అన్నమే ఉండదు. అలాంటప్పుడు, అన్నం

విలాస వస్తువు అవుతుందా? అలా అవదు కదా? కార్మిక సెక్షన్లు, పోషణకు అవసరమైన వస్తువుల్ని కూడా వాడడం లేదంటే, వాటిని వాడే పరిస్తితులు లేవు కాబట్టి వాడడం లేదు. పోషణకు అవసరమైన వస్తువులేవీ విలాస వస్తువులు కావు.

**27. శ్రామికులు చుట్టలూ బీడీలూ సిగరెట్లూ తాగుతారు. కల్లూ సారాలూ తాగుతారు. కోళ్ళ పందాలూ గుర్రప్పందాలూ వంటి వాటితో గడుపుతారు. శ్రామికులు ఏ పనులు చేస్తే ఆ పనులన్నీ, వాటిని చేసేది శ్రామికులు కాబట్టి, అవన్నీ జీవితావసరాలేనా?**

**జ:** కాదు. అవన్నీ వ్యసనాలు. దోపిడీ సమాజంలో సాగే వర్తకం, తన లాభాల కోసం, జనాభాకి అనేక వ్యసనాల్ని అలవాటు చేస్తుంది. శ్రామికులు కూడా అనేక తప్పుడు విషయాలకు గత కాలాల నించీ అలవాటుపడి ఉంటారు. నూతన సమాజంలో, అలాంటి తప్పుడు విషయాలన్నిటినీ తీసి వెయ్యాలి. అలాంటి ఉత్పత్తులే ఉండకూడదు. కార్మికులు, తమని తాము సంస్కరించుకోవాలి. నూతన భావాలతో, నూతన సమాజ నిర్మాతలుగా, తమని తాము అభివృద్ధి పరుచుకోవాలి.

**28. సమాజం ఎలా ఉండాలో గత కాలం నించీ కూడా నిర్ణయిస్తున్నది ఎవరు?**

**జ:** దోపిడీ వర్గమే. దాన్ని మార్చడంలో శ్రామిక వర్గం జోక్యం ఉంది. గత కాలం నించీ శ్రామిక వర్గ పోరాటాల వల్ల ఆ సమాజం కొంత కొంత మారుతూ వుంది.

**29. కార్మికులు, తమ జీవిత విధానాన్ని తామే నిర్ణయించుకునే పరిస్తితులే ఏర్పడితే, ఎలాంటి జీవిత విధానం ఏర్పర్చుకోవాలి?**

జ: శ్రమ దోపిడీ లేని జీవిత విధానం ఏర్పర్చుకోవాలి. కల్తీలూ ఆడంబరాలూ విలాసాలూ వ్యసనాలూ లేని విధానం. పోలీసులూ, సైన్యాలూ, ఆయుధాలూ, యుద్ధాలూ, శత్రుత్వాలూ లేని విధానం. శ్రమ దోపిడీ గురించి తెలుసుకోగలిగే జ్ఞానమే ఏర్పడితే, ఆ జ్ఞానం, ఉత్తమమైన జీవిత విధానానికి మార్గం చూపిస్తుంది.

**30. 8 గంటలు పని దినంలో చేసే శ్రమ, 8 గంటల పోషణకు సరిపోవాలి. ఇది రైటా, తప్పా?**

**జ:** 'పని దినం ఇన్ని గంటలు' అని స్పష్టంగా వుంటే, అది యజమానీ శ్రామిక సంబంధం లోనే వుంటుంది. స్వతంత్ర ఉత్పత్తిదారుల విషయంలో అయితే, పని దినానికి 'ఇన్ని గంటలు' అని ఖచ్చితమైన హద్దు వుండదు. కార్మికులు పని చేసే చోట, 8 గంటలు పని చేస్తే, అది అంతా వాళ్ళ పోషణకే కాదు. అందులో కొంత భాగం అదనపు శ్రమే. కాబట్టి, ప్రశ్నలో చెప్పినది తప్పే. కానీ, దోపిడీ లేనట్టుగా అనుకుంటే, స్వతంత్ర ఉత్పత్తిదారుల విషయంలో 8 గంటల పనిని, 8 గంటల పోషణకు వాడుకోవడం సాధ్యమే.

| **31. ఇందులో ఏది రైటు? ఏది తప్పు?** | **జ:** |
|---|---|
| 1. 8 గంటల పనిదినంలో చేసే శ్రమ, 8 గంటల పోషణకు సరిపోవాలి. | × |
| 2. పెట్టుబడిదారీ సింపుల్ పునరుత్పత్తిలో S ఉండదు. | × |
| 3. S అంతా పెట్టుబడికి కలుస్తూ ఉంటుంది. | × |
| 4. జనాభా పెరిగితే సమాజానికి కావలసిన శ్రమ పెరగాలి. | ✓ |
| 5. జనాభా పెరిగితే, ఒక వ్యక్తి చేసే శ్రమ కూడా పెరగాలి. | × |
| 7. ఏ బానిసా నిరుద్యోగి కాడు. | ✓ |
| 8. శ్రమ దోపిడీ గత సమాజాల్లో కూడా వున్నా, అది పెట్టుబడిదారీ విధానంలో 'నిరుద్యోగం' లాంటి కొత్త సమస్యల్ని తెచ్చి పెడుతుంది. | ✓ |

**32. నూతన సమాజంలో, 'ఇంకా శ్రమ దోపిడీ జరుగుతోంది' అని ఎప్పుడు అనగలం?**

**జ:** 'సమాజ నిధి'లో ఎక్కువ భాగం, కొన్ని సెక్షన్ల ప్రత్యేక సౌఖ్యాల కోసమే ఖర్చవుతూ ఉంటే అలా అనవచ్చు.

# మొదటి సంపుటం పూర్తి అయింది!

## **2** వ సంపుటం కూడా పూర్తి చేస్తేనే 'కాపిటల్'లో మార్క్సు చెప్పిన విషయాలు కనీసంగా అయినా అర్థం చేసుకోగలం.

★

# ఇంతవరకూ చదివిన దాని సారాంశం క్లుప్తంగా

ఒక ' ఉత్పత్తి' ( ఒక వస్తువు) తయారవడానికి, ( లేదా, ఉత్పత్తి రూపంలో ఉండని ' బండి నడపడం' లాంటి ఏదైనా ఒక ' పని' జరగడానికి), (1) ఉత్పత్తి సాధనాలూ, (2) శ్రమ చేసే మనుషులూ - అనే 2 అంశాలు తప్ప, ఇంకే అంశమూ అవసరం లేదు. ఉత్పత్తి సాధనాలకు సంబంధించిన ' నిర్జీవ శ్రమ', ఆ సాధనాల్ని ఉపయోగిస్తూ మనుషులు చేసే ' సజీవ శ్రమా' కలిసి, ఆ ' ఉత్పత్తి' కోసం ( లేదా, ఆ ' పని' కోసం) ఖర్చయ్యే ' మొత్తం శ్రమ' అవుతుంది.

ఆ ' మొత్తం శ్రమే' - ఆ ఉత్పత్తికి ' విలువ.' ( లేదా, ఆ ' పని'కి విలువ.)

' ఉత్పత్తి' లో నించి, ' శ్రమ' అంశాన్నంతా ( నిర్జీవ, సజీవ శ్రమల మొత్తాన్నంతా) తీసి వేసినట్టుగా ఊహిస్తే, అప్పుడు మిగిలే అంశం - ' ప్రకృతి సహజ పదార్థం' ( లేదా, పదార్థాలు). అది ' శ్రమ'తో సంబంధం లేని పదార్థం. ఆ పదార్థం, ప్రకృతి ఏ రూపంతో ఇచ్చిందో ఆ రూపం తోనే ఉండే పదార్థం. ఆ సహజ పదార్థం, కొన్ని శ్రమ క్రమాల ద్వారా రూపం మారి, ప్రస్తుత ' ఉత్పత్తి' గా తయారై ఉంటుంది.

(1) సహజ పదార్థమూ, (2) శ్రమా - అనే 2 అంశాల్లో, ఏ అంశం లేక పోయినా 'ఉత్పత్తి' ఉండదు. 'సహజ పదార్థం' మీద ' శ్రమ' జరిగితేనే ' ఉత్పత్తి' తయారవుతుంది. అయితే, సహజ పదార్థానికి ' విలువ' ఉండదు. ' విలువ' అంతా శ్రమదే. అంటే, నిర్జీవ, సజీవ శ్రమల మొత్తానిది.

| | | | | |
|---|---|---|---|---|
| సహజ పదార్థమూ | + | నిర్జీవ, సజీవ శ్రమల మొత్తమూ | = | ఉత్పత్తి (వస్తువు). |
| మేటర్ | + | లేబర్ | = | థింగ్. |
| శ్రమ ఉండదు | + | మొత్తం శ్రమ | = | ఉత్పత్తి. |
| విలువ ఉండదు | + | మొత్తం విలువ | = | ఉత్పత్తి. |
| O | + | M P & L | = | ఉత్పత్తి |

'విలువ' గురించీ, అందులో భాగాల గురించీ మాట్లాడేటప్పుడు, నిర్జీవ - సజీవ శ్రమల విషయమే మాట్లాడు తున్నామని అర్థం. ' సహజ పదార్థం' సంగతి కాదు.

' ఉత్పత్తి సాధనాల' విలువా, ' సజీవ శ్రమ' విలువా కలిసిన మొత్తమే సరుకు విలువ కాబట్టి, ' సరుకు విలువ' లో నించి ఉత్పత్తి సాధనాల విలువని తీసివేస్తే మిగిలేది - సజీవ శ్రమ విలువే.

ఆ సరుకు, స్వతంత్ర ఉత్పత్తిదారుడి సరుకు కాకుండా, పెట్టుబడిదారుడి దగ్గిర వేతన కార్మికులు తయారు చేసిన సరుకు అయితే, దాని విలువ - C + V + S భాగాలుగా ఉంటుంది. L ( లేబర్) అనేది, ఇక్కడ V + S లుగా చీలుతుంది. V = జీతం. శ్రామికుడికి.

S = అదనపు విలువ. పెట్టుబడిదారుడికి. ఇది, శ్రమని దోచడం. ఇది, భూమి కౌలూ, వడ్డీ లాభాలూ, అనుత్పాదక ఖర్చులూ, పన్నులూ - వంటి కొన్ని భాగాలుగా చీలుతుంది.

శ్రామికుల శ్రమ విలువ అంతా, శ్రామికులకు అందక పోవడమే, శ్రామిక కుటుంబాల పేదతనానికి కారణం. స్వంత శ్రమతో సంబంధం లేని దోపిడీ ఆదాయాలు రావడమే, యజమానుల కుటుంబాల సిరి సంపదలకు కారణం.

ఒక ' ఉత్పత్తి క్రమం' జరిగేటప్పుడు, దాని కోసం ఖర్చయ్యే ' విలువ', ఎలా పునరుత్పత్తి అవుతుంది? ఖర్చయ్యే ' ఉత్పత్తులు' ఎలా పునరుత్పత్తి అవుతాయి?

# ' విలువ' పునరుత్పత్తి:

' ఉత్పత్తి క్రమం' లో ఏం జరుగుతుంది?

**1.** ఉత్పత్తి సాధనాలు ( C. నిర్జీవ శ్రమ) ఖర్చవుతాయి. దేని కోసం? - అక్కడ తయారవుతోన్న ' కొత్త సరుకు' కోసం! అంతే గానీ, అక్కడ ' శ్రమ చేసే మనుషుల' కోసం కాదు.

C విలువ, ఖర్చయ్యేది, శ్రమ చేసే మనుషుల కోసం కాదు కాబట్టి, ఈ విలువని పునరుత్పత్తి చెయ్యవలసిన అవసరం శ్రామికులకు ఉండదు. ఈ విలువ ( ఈ నిర్జీవ శ్రమ), ఈ ' ఉత్పత్తి క్రమం'లో పని చేసే శ్రామికులు ఇచ్చేది కాదు. గతంలో తయారై ఉన్న ఉత్పత్తులే ఇక్కడ ఖర్చవుతాయి. C విలువ, కొత్త సరుకుకి బదిలీ ద్వారా చేరుతుంది. అంతకు ముందు ఉన్నదే ఇక్కడికి చేరడం ద్వారా.

C విలువ, ' కొత్త సరుకు'కి చేరేటప్పుడు, అది అంతకు ముందు ఎంత ఉందో అంతే ఉంటుంది. అది అంత కన్నా ఎక్కువో తక్కువో అవదు. అంటే, ' ఉత్పత్తి సాధనాలు,' తమ ద్వారా ' కొత్త సరుకు'కి తమ విలువని మాత్రమే చేరుస్తాయి గానీ, తమ విలువ కన్నా ఎక్కువ విలువని చేర్చవు. - ఈ విషయాలు C కి సంబంధించినవి.

**2.** ' ఉత్పత్తి క్రమం' కోసం, ' జీతాలు'గా ( V గా), కొన్ని ఉత్పత్తులు ఖర్చవుతాయి. ఇవి దేని కోసం ఖర్చవుతాయి? - ' కొత్త సరుకు' కోసం కాదు, ' ఉత్పత్తి క్రమం'లో కాదు. ఇవి, ఉత్పత్తి క్రమానికి బయట శ్రామికుల ' పోషణ' కోసం ఖర్చవుతాయి. ఈ ఉత్పత్తుల్ని శ్రామికులే వాడతారు కాబట్టి, వాటి విలువకి ( V కి) సరిపోయినంత శ్రమని శ్రామికులు తప్పనిసరిగా చేసి తీరాలి. అంటే, V విలువ కూడా గతంలో ఉన్నదే అయినా, ఈ విలువ, ' బదిలీ' అయ్యే పద్ధతిలో గాక, మళ్ళీ ' కొత్తగా ఉత్పత్తి అవడం' ద్వారా ( అంత శ్రమ కొత్తగా జరగటం ద్వారా) సరుకుకి చేరుతుంది. శ్రామికులు - ఒక వేపు, ' ఉత్పత్తి క్రమానికి' బయట, V ఉత్పత్తుల్ని తమ కోసం ఖర్చు చేస్తూ, ఇంకో వేపు, ' ఉత్పత్తి క్రమం'లో ' V విలువ'ని ఉత్పత్తి చేస్తారు ( అంత శ్రమ చేస్తారు). ఈ రకంగా, గతంలో ఉన్న V విలువ, ఇక్కడ ' పునరుత్పత్తి' అవుతుంది. ( ఆ శ్రమ మళ్ళీ జరుగుతుంది.) ఈ రకంగా, శ్రామికులు, తాము ఖర్చు పెట్టే జీవితావసర వస్తువుల్ని తామే ఉత్పత్తి చేసుకుంటారు. తమ పోషణ కోసం కావలసిన శ్రమ తామే చేసుకుంటారు.

**3.** శ్రామికులు చేసే పని ' V విలువ ని పునరుత్పత్తి చెయ్యడం' మాత్రమే కాదు. ( అంత శ్రమ చెయ్యడం మాత్రమే కాదు.) అంత కన్నా ఎక్కువ శ్రమ చేస్తారు. నిజానికి V ని వాడే వాళ్ళు, V ని మాత్రమే పునరుత్పత్తి చేస్తే చాలు. కానీ శ్రామికులు, V ని మాత్రమే ' పునరుత్పత్తి' చేసి వూరుకుంటే, ఇక ' పెట్టుబడి కథ' ఆ క్షణం లోనే అంతమవుతుంది. V ని వాడే వాళ్ళు, V నీ, దాని కన్నా కొంత ఎక్కువనీ కూడా ఇస్తారు. ఆ ' ఎక్కువ'కి, S అని పేరు పెడితే, శ్రామికులు చేసే శ్రమ V + S లుగా ఉంటుంది. ఇందులో V వరకే చూస్తే, గతంలో ఉన్న విలువే ఖర్చయి పోయి, ఆ విలువే పునరుత్పత్తి అవుతుంది. S మాత్రం పూర్తిగా కొత్త శ్రమ. ఇది, తన కోసం ఏ పెట్టుబడీ ఖర్చవకుండా జరిగే శ్రమ. ఇది గతంలో లేని శ్రమ. ఇది V కన్నా అదనంగా జరిగే శ్రమ.

ఒక ' ఉత్పత్తి క్రమం' ముగిసి, అందులో తయారైన ' కొత్త సరుకు - విలువ'ని, C + V + S లుగా చూస్తే, అందులో V + S లు మాత్రమే, ఆ ఉత్పత్తి క్రమంలో శ్రామికులు ఉత్పత్తి చేసిన ' విలువ'. అది శ్రామికులు చేసిన ' సజీవ శ్రమ'. C యేమో, గతం నించీ ' బదిలీ' అయిన ' నిర్జీవ శ్రమ.' అది, గత శ్రమ.

' ఒక్క సరుకు' విషయం అయినా ఇంతే. ' సమాజంలో వున్న మొత్తం సరుకుల రాసి' విషయం అయినా ఇంతే.

మొత్తం సమాజంలో, 1 సంవత్సరంలో తయారైన మొత్తం సరుకుల రాసి విలువని C + V + S లుగా చూస్తే, అప్పుడు కూడా V + S లే శ్రామికుల శ్రమ. C యేమో గతం నించీ ' బదిలీ' అయినదే.

ప్రతీ విడి సరుకు విలువ లోనూ, C భాగం, గతం నించీ ' బదిలీ' ద్వారా చేరేదే కాబట్టి, మొత్తం అన్ని సరుకుల్నీ కలిపి చూసినప్పుడు కూడా వాటిలో ఉన్న C భాగాలన్నీ గతం నించీ బదిలీ అయినవే. అన్ని సరుకుల C లూ కలిసి, మొత్తం ' సరుకుల రాసి'కి - C.

అన్ని సరకుల V + S లూ కలిసి, మొత్తం సరుకుల రాసి కి - V + S.

ఒక్క సరుకు విషయం అయినా, మొత్తం ' రాసి' విషయం అయినా, సారాంశం ఇదీ:

C - ' బదిలీ' అవుతుంది.

V - ' పునరుత్పత్తి' అవుతుంది.

S - ' కొత్తగా ఉత్పత్తి' అవుతుంది.

- ఇది, ' విలువ' సంగతి!

## ఉత్పత్తుల పునరుత్పత్తి:

ఇది, ' విలువ' సంగతి కాదు, ఉత్పత్తుల శరీరాల సంగతి.

ఒక ఉత్పత్తిని, ఉదా: 10 మీటర్ల బట్టని, ఉత్పత్తి చేసేటప్పుడు, దాని కోసం పని స్తలంలో, C గా దారమూ, మగ్గమూ వంటి కొన్ని ఉత్పత్తులూ; శ్రమ చేసే మనుషుల

పోషణ వస్తువులుగా ఈ పని స్థలానికి బయట బియ్యమూ, మందులూ వంటి కొన్ని ఉత్పత్తులూ, ఖర్చయి పోతాయి. ( అంతే గాక, కిందటి ఉత్పత్తి క్రమంలో తయారై వున్న అదనపు ఉత్పత్తులు కూడా, పెట్టుబడిదారుడి పోషణ కోసం బయట ఖర్చవుతాయి. కానీ ఇవి, ఉత్పత్తి క్రమంలో తయారవుతోన్న కొత్త సరుకు కోసం అవసరమయ్యే ఖర్చు కాదు. దీన్ని ఉత్పత్తి కోసం అయ్యే ఖర్చుల్లో కలపకూడదు.) పని స్థలంలో ఉత్పత్తి కోసం C + V లే గాక , కొంత అదనపు శ్రమ కూడా ఖర్చవుతుంది. ఈ రకంగా, 3 రకాల ఖర్చులు జరిగి, ( (1) ఉత్పత్తి సాధనాలుగా C ఖర్చూ, (2) శ్రామికుల పోషణగా V ఖర్చూ, (3) కొత్త అదనపు శ్రమగా S ఖర్చూ), వాటికి బదులుగా ' బట్ట' ఒక్కటే తయారవుతుంది. ఆ బట్టని, దాని కోసం ఖర్చయిన C + V + S ల కోసం విభజిస్తే, ఆ 3 భాగాలకూ వాటి విలువ పాళ్ళని బట్టి, కొంత కొంత బట్ట వస్తుంది. C గా కొంత బట్టా, V గా కొంత బట్టా, S గా కొంత బట్టా. ఈ బట్ట తయారవడం కోసం, అనేక వేరు వేరు రకాల ఉత్పత్తులు ఖర్చయ్యి, మళ్ళీ ఆ వేరు వేరు రకాల ఉత్పత్తులు రాలేదు. ' బట్ట' వచ్చింది. ఖర్చయినవన్నీ వేరే రకాల ఉత్పత్తులు. తయారైనది - ఇంకో రకం ఉత్పత్తి. కొత్త ' బట్ట'ని చూస్తే, ' ఖర్చయి పోయిన ఉత్పత్తులన్నీ పునరుత్పత్తి అయ్యాయి' అనే సంగతి కనపడదు. నిజానికి, అక్కడ ఆ పని జరిగినట్టే. కానీ అది అక్కడ తెలియదు.

' బట్ట'నో, ' బొగ్గు'నో, ' పంచదార'నో, ఇలా ఒకే రకం ఉత్పత్తిని C + V + S లుగా విభజించి చూడటం వల్ల, ఏం జరుగుతుందంటే, ఆ 3 భాగాలూ ఒకే రకం ఉత్పత్తిగా ఉంటాయి కాబట్టి, ఖర్చయిన ఉత్పత్తులన్నీ మళ్ళీ తయారయ్యే విషయం అర్థం కాదు. కాబట్టి, ఒకే రకం ఉత్పత్తిని గాక, సమాజంలో అన్ని శాఖల్లోనూ ఒక సంవత్సరంలో తయారయ్యే ' మొత్తం ఉత్పత్తుల రాసి'ని, 3 భాగాలుగా చూస్తే, ఖర్చయి పోయిన విలువలే గాక, ఖర్చయి పోయిన ' ఉత్పత్తుల శరీరాలు' కూడా తిరిగి రావడం కనపడుతుంది.

మొత్తం వ్యవసాయ, పారిశ్రామిక శాఖలన్నిటి లోనూ ఉన్న ఉత్పత్తుల్ని C + V + S లుగా విభజించి చూస్తే, అప్పుడు ఆ 3 భాగాలూ ఒకే రకం ఉత్పత్తి గా ఉండవు. ఏ భాగానికి సంబంధించిన ఉత్పత్తులు ఆ భాగంలో ఉంటాయి. అలా చూసినప్పుడు, ఖర్చయిన ఉత్పత్తులన్నీ వెనక్కి రావడం కనపడుతుంది.

' మొత్తం ఉత్పత్తుల రాసి' తయారయ్యే ముందు, ఆ ' ఉత్పత్తి క్రమానికి' అవసరమయ్యే ఉత్పత్తి సాధనాలన్నీ ఒక సంచిలో ఉన్నట్టుగా ఊహిద్దాం. ఆ సంచి పేరు C. శ్రామికుల ' జీతాల' ఉత్పత్తులన్నీ ఇంకో సంచిలో ఉన్నట్టుగా ఊహిద్దాం. ఆ సంచి పేరు V. ఈ 2 సంచులూ ఖర్చయి పోతూ, అనేక వందల, వేల శాఖల్లో, ' సంవత్సర ఉత్పత్తి క్రమం' జరుగుతుంది. ఆ ఖర్చుతో, ఒక బ్రహ్మాండమైన ' కొత్త ఉత్పత్తుల రాసి' ప్రత్యక్ష మవుతుంది!

ఆ కొత్త రాసి - 2 సంచులు కాదు. 3 సంచులు! C సంచీ, V సంచీ, S సంచీ!

2 సంచుల ఖర్చుతో - 3 సంచులు!

C + V ల ఖర్చుతో, C + V + S లు!!

ఖర్చయి పోయిన C + V ఉత్పత్తులన్నీ వెనక్కి వస్తూ, వాటితో పాటు కొంత ' కొత్త ఉత్పత్తి' కూడా వస్తుంది.

( తక్కువ శరీరాల ఖర్చుతో ఎక్కువ శరీరాలు రావడం, 'వ్యవసాయ రంగం' ద్వారా సాధ్యమవుతుంది.)

' కొత్త ఉత్పత్తుల రాసి' లో, దాని కోసం ఖర్చయి పోయిన C + V లు ఉండడంలో ఆశ్చర్యం లేదు. ఒక ' ఉత్పత్తి' తయారైనప్పుడు, దాని కోసం ఖర్చయినదంతా దాని ద్వారానే వెనక్కి వచ్చి తీరాలి! అలాగే, ఒక ' రాసి' తయారైనప్పుడు కూడా, దాని కోసం ఖర్చయిన C + V లు, దాని ద్వారానే వెనక్కి రావాలి. ఆ విలువలే కాదు, ఆ శరీరాలు కూడా! అదే ఇక్కడ జరుగుతుంది. ఖర్చయి పోయిన C సంచికి బదులు, కొత్త C సంచి వస్తుంది. ఖర్చయి పోయిన V సంచికి బదులు, కొత్త V సంచి వస్తుంది. ఇందులో ఆశ్చర్యం లేదు. ( అసలు ఆశ్చర్యం S సంచిదే! ఇది, తర్వాత)

**కొత్త C సంచి సంగతి:** ఇందులో ఉన్న ఉత్పత్తులన్నీ కొత్తగా తయారైనవే. (ఇవి, తయారవుతూ ఉన్నప్పుడే, ఆ క్రమం లోనే ఇవి ఉత్పత్తి సాధనాలు కావు. ఇవి, తర్వాత జరగబోయే 'ఉత్పత్తి క్రమం'లో కొత్త ఉత్పత్తి సాధనాలుగా, కొత్త C గా, పని చేస్తాయి).

' బట్ట'ని తయారు చేసే శాఖలో, దారమూ మగ్గమూ వంటి ఉత్పత్తి సాధనాలు ఖర్చయి పోతూ, ' బట్ట' తయారవుతూ వుండగా, ఆ ఖర్చయి పోతోన్న దారమూ మగ్గమూ అదే సమయంలో, కొన్ని ఇతర శాఖల్లో తయారవుతూ వుంటాయి. ఆ ఇతర శాఖల్లో ఖర్చయి పోతోన్న ఉత్పత్తి సాధనాలు కూడా, అదే సమయంలో, వేరే కొన్ని శాఖల్లో తయారవుతూ ఉంటాయి. ' మొత్తం సమాజాన్ని' తీసుకుంటే, ప్రతీ శాఖ లోనూ ఖర్చయి పోతోన్న ఉత్పత్తి సాధనాలన్నీ, అదే సమయంలో, అనేక శాఖల్లో తయారవుతూ ఉంటాయి. కాబట్టి, ఒక ' సంవత్సర ఉత్పత్తి క్రమం' ముగిసి ' కొత్త రాసి' తయారయ్యేటప్పటికి ఏం జరుగుతుందంటే, ఆ ' ఉత్పత్తి క్రమం' కోసం ఖర్చయి పోయిన ఉత్పత్తి సాధనాలన్నీ, ఆ ఉత్పత్తి క్రమం లోనే తయారై, ఆ ' కొత్త రాసి'లో ఉంటాయి. అంటే, ఒక వేపు, పాత C సంచి ఖర్చయి పోతూ, ఇంకో వేపు కొత్త C సంచి తయారవుతూ ఉంటుంది. ఈ కొత్త C సంచి విలువ కూడా C + V + S లుగా వుంటుంది. ఈ ' విలువ'లో కూడా C భాగం ' బదిలీ' అయ్యేది గానూ, V + S భాగాలు పని స్థలాల్లో జరిగే ' సజీవ శ్రమ' గానూ ఉంటాయి.

ఈ కొత్త C సంచి ' విలువ' దేనితో సమానం అంటే, అన్ని శాఖల C విలువలూ కలిసిన మొత్తానికి సమానం.

ఈ కొత్త C సంచిలో ఉత్పత్తులు, తర్వాత కాలంలో జరిగే కొత్త ' ఉత్పత్తి క్రమం'లో ఉత్పత్తి సాధనాలుగా ఖర్చయి పోయినప్పుడు, వాటి విలువ అంతా ఆ కొత్త రాసికి C గా బదిలీ అవుతుంది.

' విలువ' గా చూస్తే, అన్ని శాఖల C విలువలూ కలిసి, C సంచి విలువ.

'ఉత్పత్తులు'గా చూస్తే, అన్ని శాఖల్లో ఖర్చయిన ఉత్పత్తి సాధనాలూ కలిసి, C సంచిలో ఉత్పత్తులు.

C సంచిలో ' ఉత్పత్తులు', ఎప్పుడూ ఖర్చయి పోతూనే, ' పునరుత్పత్తి' అవుతూనే ఉంటాయి. కానీ, C సంచి ' విలువ,' ఎప్పుడూ ఖర్చవదు; ఎప్పుడూ ' పునరుత్పత్తి' అవదు. ఈ విలువ, ఎప్పుడూ ఒక ' రాసి' నించి, ఇంకో ' రాసి'కి బదిలీ అవుతూనే ఉంటుంది.

**కొత్త V సంచి సంగతి:** V సంచి కూడా, ఒక వేపు ఖర్చయి పోతూనూ; అదే సమయంలో, ఇంకో వేపు మళ్ళీ తయారవుతూనూ ఉంటుంది. అంటే, పాత V ఉత్పత్తులు శ్రామికుల ఇళ్ళల్లో ఖర్చయి పోతూ వుంటే, అదే సమయంలో, కొత్త V ఉత్పత్తులు, కొన్ని శాఖల్లో తయారవుతూ వుంటాయి.

అన్ని శాఖల్లో ఖర్చయ్యే V విలువలూ కలిసి - V సంచి విలువ.

అన్ని శాఖల్లో ఖర్చయ్యే V ఉత్పత్తులూ కలిసి - V సంచిలో ఉత్పత్తులు.

V ఉత్పత్తులు ప్రతీ సారీ పునరుత్పత్తి అవుతాయి. V విలువ కూడా ప్రతీ సారీ పునరుత్పత్తి అవుతుంది. ( ఈ ' శ్రమ', ప్రతీ ' ఉత్పత్తి క్రమం' లోనూ మళ్ళీ జరుగుతూ వుంటుంది). ఈ రకంగా, ఒక కొత్త ఉత్పత్తి ( లేదా, ' ఉత్పత్తుల రాసి') తయారైనప్పుడల్లా, దాని కోసం ఖర్చయిన C + V లు, మళ్ళీ అందులో సిద్ధంగా ఉంటాయి.

కొత్త C రావడానికి కారణం, పాత C.

కొత్త V రావడానికి కారణం, పాత V.

**కొత్త S సంచి సంగతి:** ఈ ఉత్పత్తులు పూర్తిగా కొత్తవి. ఇవి, ఇప్పుడే తయారైనవి. ఈ ' విలువ' కూడా పూర్తిగా కొత్తది.

కొత్త C రావడానికి, పాత C కారణమైనట్టూ,

కొత్త V రావడానికి, పాత V కారణమైనట్టూ,

కొత్త S రావడానికి, పాత S కారణం కాదు.

కొత్త S రావడానికి కొత్త V కారణం. అంతే గానీ పాత S కారణం కాదు.

పెట్టుబడిదారీ విధానంలో, తక్కువ పెట్టుబడి ఖర్చుతో, ఎక్కువ విలువ వస్తుంది.

C + V ల ఖర్చుతో, C + V + S లు!

తక్కువ ఉత్పత్తుల ఖర్చుతో, ఎక్కువ ఉత్పత్తులు! C + V ఉత్పత్తుల ద్వారా, C + V + S ఉత్పత్తులు! తక్కువ ఉత్పత్తులతో, ఎక్కువ ఉత్పత్తులు రావడం, వ్యవసాయ రంగం ద్వారా సాధ్యం. ఈ రంగంలో, పిడికెడు విత్తనాలతో, అనేక వందల, వేల రెట్ల ఉత్పత్తి వస్తుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్ని రెంటినీ కలిపి చూసినా, ఆ 2 రంగాల్లోనూ కలిపి ఖర్చయిన తక్కువ ఉత్పత్తుల ద్వారా, ఎక్కువ ఉత్పత్తులు వస్తాయి.

పాత C + V లే, కొత్త C + V లు అవుతాయి. అంతే గాక, పాత S లో కొంత భాగం, కొత్త C + V లుగా, ( కొత్త పెట్టుబడిగా) మారుతుంది.

S అనేది, శ్రామికుల శ్రమ కాబట్టి, గత కాలపు ఉత్పత్తి సాధనాలు గానీ, గత

ఉత్పత్తి సాధనాల లోకి చేరే కొత్త ఉత్పత్తి సాధనాలు గానీ, అన్నీ శ్రమల ద్వారా వచ్చినవే.

గత పెట్టుబడి గానీ, పెరిగే పెట్టబడి గానీ, మొత్తం పెట్టుబడి అంతా, గత కాలపు, ప్రస్తుత కాలపు శ్రామిక వర్గానిదే.

ఏ సంవత్సరపు ఉత్పత్తుల రాసిని తీసుకున్నా, దాని కోసం ఖర్చయిన పెట్టుబడీ శ్రామికులదే; ఆ పెట్టుబడి ద్వారా వచ్చే అదనపు విలువా శ్రామికులదే.

ప్రతి ఏటా పాత పెట్టుబడికి, కొత్త పెట్టుబడి కలిసి, పెట్టుబడి పెరుగుతూ ఉంటుంది.

మొత్తం సమాజంలో, అన్ని శాఖల్లోనూ ఉన్న పెట్టుబడులన్నిటినీ కలిపితే, ఆ మొత్తం పెట్టుబడి అంతా ( ఆ ఉత్పత్తి సాధనాలన్నీ), బానిస సమాజం నాటి నించీ శ్రమ చేసిన వర్గానిదే.

యజమాని వర్గం కూడా ఎప్పుడైనా ఏదైనా శ్రమ చేసి ఉంటే, ఆ శ్రమ, దాని సుఖవంతమైన పోషణలో వెయ్యో వంతుకి కూడా చాలదు. ఆ వర్గానికి నిత్యం కడుపు నిండిన పోషణా, దాని మితిమీరిన విలాసాలూ, తరాల తరబడీ నిలువ వుండే ఆస్తులూ, దానికి సమకూరడం అంటే, అదంతా దాని స్వంత శ్రమ ఫలితం కాదు. అదంతా దాని శ్రమతో సాధ్యం కాదు.

బానిస సమాజం నాటి నించీ, యజమాని వర్గపు శ్రమ సంగతి పూర్తిగా అబద్ధం. బానిస సమాజ కాలం నించీ, యజమాని వర్గం, విలాసాలతో జీవించిందంతా బానిసల శ్రమ తోనే. భూస్వామ్య సమాజం లోనూ అదే జరిగింది; ఈ నాడు, పెట్టుబడి దారీ సమాజం లోనూ అదే జరుగుతోంది.

' డబ్బు' అనేది, అది ప్రారంభమైన కాలంలో, ఇంకా యజమాని తనాలు లేని కాలంలో, ఆ నాటి డబ్బు, ఆ నాటి ఉత్పత్తి దారుల శ్రమ ద్వారా వచ్చినదే. కానీ యజమాని తనాలు ప్రారంభమైన తర్వాత, ఆ యజమానుల ఆధీనం లోకి చేరిన డబ్బు అంతా శ్రామిక వర్గపు శ్రమదే.

( స్వతంత్ర ఉత్పత్తి దారుల శ్రమ ద్వారా వచ్చే డబ్బు కూడా ఈ సమాజంలో ఉంటుంది. దాని సంగతి వేరే లెక్క.)

పెట్టుబడిదారీ సమాజంలో వున్న ప్రైవేటు వ్యవసాయ క్షేత్రాలూ, ఫ్యాక్టరీలూ, గనులూ - వంటి ఉత్పత్తి సాధనాలన్నీ; భూస్వాముల, పెట్టుబడిదారుల భవనాలూ, ఆ భవనాల్లో సిరి సంపదలుగా వున్న ధన రాసులూ, బంగారాల కుప్పలూ - అన్నీ, శ్రామిక వర్గపు శ్రమల రాసులే. కాబట్టి, ఆ ప్రైవేటు ఆస్తులన్నిటినీ, శ్రామిక వర్గం, ఏ క్షణంలో అయినా తన వర్గాధీనంలోకి తీసుకోవడం పూర్తిగా నైతికమైన హక్కు! అది, దోపిడీ వర్గం విధించే చట్టాలతో సంబంధం లేని హక్కు!

ఇదీ ఈ సంపుటంలో ఇంత వరకూ చూసిన సారాంశం, చాలా క్లుప్తంగా.

## [ 2 వ సంపుటంలోకి వెళ్ళండి.]

# 2వ సంపుటంలో

## 1వ భాగం:
## పెట్టుబడిదారీ చలామణీ క్రమం

**1.** చలామణీ ఖర్చులు
**2.** పెట్టుబడిదారీ ధర
**3.** 'జీతాల' గురించి చలామణీ క్రమం
**4.** వేరు వేరు దేశాల డబ్బులు
**5.** 'జనరల్ లాభం రేటు' తగ్గుతూ పోయే ధోరణి

## 2వ భాగం:
## పెట్టుబడిదారీ పంపిణీ సంబంధాలు

**1.** వర్తక పెట్టుబడి
**2.** వడ్డీ పెట్టుబడి
**3.** వాటాలు (షేర్లు)
**4.** 'సహజ' ఆర్థిక విధానమూ
'డబ్బు' ఆర్థిక విధానమూ
'అప్పు' ఆర్థిక విధానమూ
**5.** భూమి కౌలు
**6.** సామ్రాజ్యవాదం
**7.** సంక్షోభాలు
**8.** వర్గాలు
**9.** కార్మికులకు మార్క్స్ ప్రశ్నలు

## 3వ భాగం:
## వర్గ రహిత సమాజం దిశగా

**1.** యుగ యుగాల మకిలతో వున్న కార్మిక వర్గం
**2.** నూతన సమాజంలో రద్దులు
**3.** నూతన సమాజపు ధర
**4.** మార్క్సిజం 'ఆర్థిక శాస్త్రమే కాదు 'తత్వ' శాస్త్రం కూడా!

## 4వ భాగం:
## కొన్ని విషయాలు

**1.** మార్క్సిజం మీద కొన్ని విమర్శలు
**2.** రష్యా, చైనాల మాటేమిటి?
**3.** మార్క్సిజం అంటే చాలదా?
**4.** కార్మిక జనాభా 'కాపిటల్'ని ఎలా నేర్చుకోవాలి?
**5.** ' కాపిటల్' చదవడం గురించి
**6.** మార్క్స్ ' కాపిటల్' లో చాప్టర్లు
**7.** మార్క్స్ పూర్వపు ఆర్థిక శాస్త్రం
**8.** ఊహా చిత్రం
**9.** మీరు మార్క్సిస్టు అయ్యారా?

**అనుబంధం:** మొదటి సంపుటంలో ఆగిన డబ్బు రాసి సమస్య.

★

# గత ముద్రణలకు ఆర్థిక 'సహాయం' గురించి

ఈ ' కాపిటల్ పరిచయం', గతంలో 5 భాగాలుగా వుంది. మొదటి భాగం మొదటి ముద్రణ 1978లో వచ్చింది. 2వ, 3వ, 4వ భాగాలు 1985 - 87 మధ్య వచ్చాయి. వీటితోపాటే మొదటి భాగం రెండవ ముద్రణ కూడా వచ్చింది. 5వ భాగం 1993లో వచ్చింది.

మొదటి 4 భాగాల్నీ ఒకే సారి ప్రింటు చెయ్యవలసి వచ్చింది. ఆ ఆర్థిక భారాన్నంతా **మాలెంపాటి శ్రీహరిరావు** గారు భరించారు. ఈ విషయం గురించి నేను 4వ భాగం మొదటి ముద్రణ 'ముందు మాట'లో ఇలా రాశాను:

"ఈ పుస్తకాల ప్రింటింగుకి సంబంధించిన ఆర్థిక భారాన్నంతా మాలెంపాటి శ్రీహరిరావు గారు భరించారు. ఈయన అమెరికాలో డాక్టరుగా పనిచేస్తున్నారు. కొన్ని సంవత్సరాల కిందట ఈయన నాకు రాసిన మొదటి ఉత్తరంలో - తను చాలా కాలం నించీ నా పుస్తకాలు చదువుతున్నాననీ, నా పుస్తకాలతో పాటే తన వెనకటి అభిప్రాయాలు మార్చుకుంటూ వస్తున్నాననీ, నా పుస్తకాలు తనకు మార్క్సిజాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడినాయనీ - రాశారు. తర్వాత కూడా ఆయన నాకు ఉత్తరాలు రాస్తూ, నాకు ఎప్పుడైనా అవసరమయితే తను 'ఆర్థిక సహాయం' చెయ్యగలనని రాశారు. అప్పట్లో, నేను అలాంటి సహాయమేదీ అవసరం లేదన్నాను. 'కాపిటల్ పరిచయం' పని ప్రారంభమైన తర్వాత దాని భాగాలన్నింటినీ ఒకే సారి ప్రింటు చెయ్యడానికి డబ్బు సమస్య వచ్చింది. ఈ అవసరం కోసం నేను శ్రీహరిరావు గార్ని 'వడ్డీ లేని అప్పు' అడిగాను. కానీ ఆయన, తను ఇచ్చే డబ్బు అప్పు కాదనీ, కాపిటల్ ప్రింటింగ్ ఖర్చు అంతా తన బాధ్యతగా తీసుకుంటాననీ అన్నారు. ఆయన ఈ సిద్ధాంతంతో ఏకీభవించే వ్యక్తి కాబట్టీ, ఈ ఖర్చుని భరించగలిగే ఆర్థిక పరిస్థితి కూడా వున్న వ్యక్తి కాబట్టీ, ఆయన నించి డబ్బు తీసుకోవడానికి అంగీకరించాను. ఈ డబ్బుని ఆయనకు తిరిగి చెల్లించవలసిన అవసరం లేకపోవడం వల్ల, ఈ పుస్తకాల్ని అమ్మగా తిరిగి వచ్చే డబ్బుని, ఈ పుస్తకాల రీ ప్రింట్ల కోసమే ఉపయోగించే ఏర్పాటు చేశాము. ఈ పుస్తకాల ధరల్ని కనీసపు ఖర్చుల కన్నా తక్కువకే నిర్ణయించాము.

ఏ వ్యక్తి అయినా తను ఏకీభవించే, ప్రేమించే సిద్ధాంతం కోసం తను చెయ్యగల ఏదో ఒక పని చెయ్యడంలో 'గొప్ప' ఏమీ లేదు. అది, తన బాధ్యతని తను నిర్వహించడమూ, తనకు ఇష్టమైన పని తను చేసుకోవడమూ మాత్రమే. కానీ 'డబ్బు' ముందు అన్ని బాధ్యతలూ, అన్ని విలువలూ బలాదూరయ్యే ప్రస్తుత సమాజంలో, ఎవరైనా ఒక మంచి పని కోసం కొంత డబ్బు ఖర్చుపెట్టగలిగితే, ఆ అర్థంలో, అది 'గొప్ప' విషయమే. అందుకే ఈ విషయం గురించి పాఠకుల ముందు ప్రస్తావించడం నా బాధ్యతగా అనుకుంటున్నాను." ★

# పదాల సూచిక (ఇండెక్స్)

## అ

అంతస్తులపై అంతస్తులు 299
అజమాయిషీ శ్రమ 466
అదనపు జనాభా 576
అదనపు విలువ: అదనపు ఉత్పత్తి 175, దాన్ని ఎవరెవరు పంచుకుంటారు? 176, అదనపు విలువ సిద్ధాంతానికి ముందూ, తర్వాతా 213, మేధాశ్రమనించీ అదనపు విలువ 236, నైపుణ్యంగల శ్రమనించీ అదనపు విలువ 236 అదనపు విలువ రేటు 307, అదనపు విలువ రాశి 310.
అదనపుశ్రమ: దాని రహస్యం 221
అదనపు శ్రమ కాలం 307,333
అదనపుశ్రమనిధి 257
అద్దెల పెట్టుబడిదారుడు 298
అనవసరపు ఉత్పత్తులు 374
అనుత్పాదక శ్రమ 450
అప్పు: అంటే ఏమిటి? శ్రామికుడే అప్పు ఇస్తే? 185
అమ్మకం ఖర్చు 177
అమ్మకాలూ, కొనుగోళ్ళూ 378
అరిస్టాటిల్: విలువ గురించి అతని అవగాహన 98
అరుగుదల 293
అర్ధ బానిసలు 244
అవసరశ్రమ కాలం 307,333
అసమానత్వం : అందరూ శ్రమచేస్తే పరిష్కారం అవుతుందా? 258

## ఆ

ఆగ్జిలరీ పదార్థాలు: వాటి స్వభావం 143, అవి తమ విలువకన్నా ఎక్కువ విలువని ఇస్తాయా? 148
ఆటల పోటీలు 377
ఆటోమేటిక్ యంత్రం 403
ఆడిటర్లు 471
ఆధునిక గృహపరిశ్రమ 433
ఆధునిక పరిశ్రమ 404
ఆధునిక మాన్యుఫాక్చర్ 433
ఆయుధాల ఉత్పత్తి 478
ఆర్థిక విధానం: సహజమైనదీ, విలువ దృష్టిగలదీ 280
ఆర్థిక శాస్త్రం 280

## ఇ

ఇంటి పనులు 483
ఇన్స్యూరెన్సు 606
ఇళ్ళసమస్య 583

## ఈ

ఈక్వివలెంట్ కోణం అభివృద్ధి 87
ఈజిప్టులో పిరమిడ్ల నిర్మాణం 558

## ఉ

ఉత్పత్తి క్రమం 267
ఉత్పత్తి రాసి: దానిలో ఉత్పత్తి సాధనాలు 517, దానిలో జీతాల భాగం 518, దానిలో అదనపు విలువ భాగం 519.
ఉత్పత్తి శక్తి: దానికి ఉపయోగపు విలువతోనూ, మారకం విలువతోనూ ఉండే సంబంధం 53, అది మారితే? 54, దానికీ సామాజిక శ్రమకాలానికీ సంబంధం 55, దాని కోసం పోరాటం 343, దానికీ అదనపుశ్రమ కాలానికీ సంబంధం 346, వేరువేరు వర్గాల మీద దాని ప్రభావం 348, దాని గురించి ఆర్థిక వేత్తల అవగాహన 354, అది పెరగడం మంచిదా,చెడ్డదా? 355, అది నూతన సమాజంలో ఎలా ఉంటుంది? 356, దాని చరిత్ర 403, దాని గురించి పెట్టుబడిదారుడి అవగాహన 406.
ఉత్పత్తి సంబంధాలు : అవి ఏవి? 267, వాటి పునరుత్పత్తి 574.
ఉత్పత్తి స్థలం: అక్కడ అంతస్తుల భేదం 396, అక్కడ అనుత్పాదక శ్రమలు 466
ఉత్పత్తులు: వాటి విలువ 326, వాటిల్లో కుత్రిమమూ, ఆడంబరమూ, అనారోగ్య కరమూ అయినవి 374
ఉత్పాదక అంశాలు 291
ఉత్పాదక - అనుత్పాదక శ్రమలు: వాటి అర్థం 450, వాటి సంబంధం 458,

ఉత్పాదకశ్రామికుల ఇళ్ళల్లో అనుత్పాదక శ్రామికులు 460, ఆ 2 రకాల శ్రమల మధ్యా విభజన 461, ఉత్పాదక శ్రామికుల విముక్తే అనుత్పాదక శ్రామికుల విముక్తి 462, ఆ శ్రమల గురించి పెట్టుబడి దారీ ఆర్థికవేత్తల అవగాహన 509, వాటిమీద ఒక వివరణ 531, మార్క్సు కొటేషన్లు కొన్ని 532-36, ఆ విభజన పెట్టుబడి దారీ సమాజానికి మాత్రమే ప్రత్యేకం 539 అది నూతన సమాజంలో ఉంటుందా? 540
ఉత్పాదక పెట్టుబడి 291
ఉత్పాదక లాభం 195
ఉపయోగపు విలువ 31-33, 49-50
ఉమ్మడి వంటిల్లు 542
ఉర్కుహర్ట్ 399

# ఎ

ఎబ్సల్యూట్ అదనపు విలువ 340

# ఏ

ఏడు జేబుల పెట్టుబడిదారుడు 210

# ఓ

ఓవర్‌టైమ్ 362

# క

కంప్లీట్ కో - ఆపరేషన్ 389
కల్తీ: దాని ఉత్పత్తి 375, దాని గురించి మార్క్సు ప్రస్తావనలు 376
కలెక్టర్లు 482
కళ: సహజశక్తీ, శ్రమ శక్తీ 497
కాంట్రాక్టులు 520
కాపలా శ్రమ 470
కాపిటల్ పరిచయం 24
కామన్ సెన్సూ, సైన్సూ 207
కార్మిక వర్గం: మెజారిటీ భాగం 506
కార్మికులు: ఎవరు? 245, వారు కొనేవారిగానూ, అమ్మేవారి గానూ ఉంటారు 252, వారి ఇళ్ళల్లో శ్రమలు 460
కాస్టుప్రైసు 290
కుటుంబశ్రమ: దాని స్వభావం 483, అది సమాజానికి అవసరమయ్యే మొత్తం శ్రమలో భాగమేనా, కాదా? 489
కుటుంబ సంబంధాలు: పెట్టుబడిదారీ విధానంలోనూ, ఆ తర్వాతా 430
కులాలు 400
కేరే 513
క్వెస్నే 511
కొత్త ఉపయోగపు విలువలు 595
కొనుగోళ్ళు 373
కౌలు రైతులు 244

# ఖ

ఖర్చయిన పెట్టుబడి 311

# గ

గతశ్రమ: దాని గురించి మార్క్సుమాటలు కొన్ని 558
గవర్నర్లు 482
గిల్డు 386
గుణాత్మక సమానత్వం 69
గృహ పరిశ్రమ 433
గ్రామమూ - పట్టణమూ: వాటి వైరుధ్యం, అది ఎలాపోతుంది? 436,586
గ్రాసూ, నెట్టూ 199

# చ

చలామణీ పెట్టుబడి 290
చలామణీ సాధనం 117
చిన్న పెట్టుబడిదారుడు: అతని పని స్థలంలో శ్రమలు 476
చిల్డ్రన్స్ ఎంప్లాయిమెంట్ కమిషన్ 431
చేతి పనిముట్టు 403
చేతి పనులు 403
చైనాగోడ 558

# జ

జడ్జీలు 481
జనరల్ ఈక్వివలెంట్ 77
జనరల్ విలువ రూపం 77

జనాభా: సిద్ధాంతం 576-583,
నూతన సమాజంలో ఎలా ఉంటుంది? 598
పెరిగిపోతూనే ఉంటుందా? 599
జర్నలిస్టులు 495
జాతీయ సంపద 303
జాన్‌వాట్ 404
జీతం: అది సృష్టించే భ్రమ 238, దాని గురించి పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ఏమంటారు? 238, జీతం కాదు, శ్రమశక్తి విలువ 242, ఎవరి కోసం? 247, జీతాలు అన్నీ అదనపు విలువని ఇస్తాయా? 258, జీతాల చెల్లింపులో వేరువేరు పద్ధతులు 361

# ట

టర్నోవరు కాలం 293
టూలు సరుకు 409
టౌన్‌సెండ్: పేదల గురించి అతను అన్నది 574
టైమ్‌వేజ్ 361
టైమ్ స్పృహ 275

# డ

డబ్బు: దాని రూపం 89, అది చేసే పనులు 112, ధరప్రమాణంగా 112, విలువ కొలతగా 112, దాని చలామణీ వేగం 119, దాన్ని కూడబెట్టడం 125, చెల్లింపు సాధనంగా పనిచెయ్యడం 127, దాన్ని ఉత్పత్తి చేసే శ్రమ విలువ 233, డబ్బుగా పని చెయ్యడం, పెట్టుబడిగా పనిచెయ్యడం 278, డబ్బురాసి సమస్య 607.
డబ్బు పెట్టుబడి 291
డాక్టరు శ్రమ 494
డాక్టర్ సైమన్ 585
డిప్రీసియేషన్ ఖర్చులు 289-293
డైరెక్టర్ శ్రమ 469

# త

తలసరి ఆదాయం 304

# ధ

దోపిడీ విలాసాలు 526
దోపిడీస్తాయి 307
ధనవంతుల ఆడంబరాలు 463
ధనికదేశం 303
ధనిక - పేదతేడాలు 303

# న

నటుల శ్రమ 496
నాచురల్ ఎకానమీ 280
నాణాలూ, విలువ చిహ్నాలూ 122
నాన్ - ఫిక్సెడ్ సాధనాలు 288
నిరుద్యోగం 426,508
నిత్య జీవితావసర వస్తువులు: వాటిని లెక్కకట్టడం ఎలా? 230
నిర్వహణశ్రమ 466
నూతన సమాజం: దానిలో శ్రమ విభజన 259, 407; దానిలో పనిదినం భాగాలు 379, సైనికశ్రమ 478, నేరవిచారణ శ్రమలు 480, కళలు 548, వ్యభిచార సమస్య 548, పునరుత్పత్తి 605.
నేర విచారణ శ్రమలు 480
నైపుణ్యం గల శ్రమ: దానినించీ వచ్చే అదనపు విలువ 236

# ప

పగటి షిప్టు 334
పనిదినం: దాని పొడవు 333,
అది ఎంత ఉంటే సహజంగా ఉంటుంది? 371,
నూతన సమాజంలో 2 భాగాలుగా ఉంటుందా? 379
పన్నులు 190, 519
పబ్లిక్ ఫిక్సెడ్ సాధనాలు 296
పరాయితనం: శ్రమసాధనాలతో 276,
నిర్ణయాలతో 277
పరిపాలన 519
పరిమాణాత్మక సమానత్వం 69
పరుగుపందాలు 377
పారిస్ కమ్యూన్ 340
పార్టుటైము 362
పిల్లపెట్టుబడిదారుడు 464
పిల్లల పెంపకం 542
పీస్‌రేట్ 364
పీస్ వేజ్ 364

పునరుత్పత్తి: అది నూతన సమాజంలో ఎలా ఉంటుంది? 605, పునరుత్పత్తిలో డబ్బు రాసి సమస్య 607
పెత్తనం శ్రమ 466
పెట్టుబడి: ఒక చారిత్రక సంబంధంగా 443; అది పెట్టుబడిదారీ సమాజంలోనే పెట్టుబడి, నూతన సమాజంలో పెట్టుబడి కాదు, ఉత్పత్తి సాధనాలు 446; అసలది ఎక్కడిది? 555
పెట్టుబడి కూడిక 526-529
పెట్టుబడి కేంద్రీకరణ 568
పెట్టుబడి విభజన 300
పెట్టుబడి విస్తరణ: స్థిర పెరిగి, అస్థిర తగ్గడం 571, అది సృష్టించే అదనపు జనాభా 576, అది సృష్టించే ఇళ్ళ సమస్య 583
పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు: జీతం గురించి ఏమంటారు? 238, పెట్టుబడి విభజన గురించి 300.
పెట్టుబడిదారీ విధానం: దాని ప్రధాన లక్షణాలు 278, దాని రూపాలు 386
పెట్టుబడిదారీ శ్రమక్రమం 267
పెట్టుబడిదారీ శ్రమ విభజన 399,407
పెట్టుబడిదారీ సహకారం 388
పెట్టుబడిదారుడు: వాడు అసలు శ్రమచేస్తాడా? 162, వాడి లెక్కలు 166, వాడి ఉత్పత్తి స్థలంలో జరిగే శ్రమలు 451, వాడి ఇంటిదగ్గిర శ్రమలు 453
పెట్టుబడిదారులూ, శ్రామికులూ: వాళ్ళమధ్య అసలు మారకమే లేదు 249, వాళ్ళిద్దరూ సమానులా? 253
పేద దేశం 303
పేద - ధనిక తేడాలు: దోపిడీదారులు చెప్పే కారణాలు 557
పోటీ 347, 358
పోలీసులు 537
ప్రకృతీ, సమాజమూ 27
ప్రధాన లాభం 170
ప్రపంచ ధనం 129
ప్రభుత్వం: దాని ఆధీనంలో శ్రమలు 477, అది నడిపే ఉత్పాదక సంస్థలు 477, అది నడిపే అనుత్పాదక సంస్థలు 478, దాని ఆదాయం 519, దాని అధికారుల గురించి మార్క్స్ మాటలు 538.
ప్రాథమిక విలువ రూపం 67
ప్రెసిడెంటు 482
ఫిక్సెడ్ పెట్టుబడి: సాధనాలు 288, వాటిమన్నిక 294, వాటి రిపేర్లు 295, వాటి సంరక్షణ 295.
ఫిజియోక్రాట్లు 511
ఫెర్గూసన్ 399
ఫ్యాక్టరీ చట్టాలు 428
ఫ్యాక్టరీ పరిశ్రమ 404
ఫ్యాక్టరీలాయరు శ్రమ 471
ఫ్యాక్టరీ స్కూళ్ళు 431

## బ

బస్సు క్లీనర్ 493
బస్సుడ్రైవర్‌శ్రమ 492
బస్సుమెకానిక్కులు 493
బానిసలు 244
బాలకార్మికులు 430
బ్యాంకు ఉద్యోగుల శ్రమ 502
బ్యాంకు పెట్టుబడిదారులు 502
బిచ్చగాళ్ళు 508
బిరుదులు 377
బీమాకంపెనీలు 606
బూర్జువా స్త్రీల అనాథసేవ 491
బెంథమ్ 254
బెకారియా 399
భారీ పరిశ్రమ 388,403
భార్యా భర్తలు: వారి మధ్య శ్రమసంబంధాలు 483
భూమి అద్దె 186
భూమి సారం: పెట్టుబడిదారీ విధానంలో అది ఎలా ధ్వంసం అవుతుంది? 437

## మ

మంత్రులు 482
మతసంస్థల్లో శ్రమలు 482
మనీ ఎకానమీ 280
మాన్యు ఫాక్చర్ 388,394
మార్క్స్: 'కాపిటల్' 14-22, మార్క్సిజం 16, అతని జీవితం 22, అతని పరిశోధన 209
మారకం విలువ 33

మార్కుస్ 582
మాల్తూస్: అతని సిద్ధాంతం 580, అతని గురించి మార్క్సు ఏంగెల్సుల మాటలు 583.
ముడి పదార్థాలు: అవి ఏవి? 143, అవి తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలవా? 146
మూఢనమ్మకాలు: వాటివల్ల అయ్యే ఖర్చు 378
మేధాశ్రమ: దాన్నించీ వచ్చే అదనపు విలువ 236
మేనేజరు 468
మొదట పెట్టిన పెట్టుబడి 292

# య

యంత్రాలు : భారీ పరిశ్రమలో వాటి వాడకం 404, వాటిగురించి పెట్టుబడి దారుడు ఏమనుకుంటాడు? 414, వాటినించీ సరుకులకు చేరే విలువ 408, యంత్రం సరుకు 408, వాటి వాడకం వల్ల ఫలితాలు 427, వాటితో కార్మికుల సంబంధం 422
యజమానులూ, సేవకులూ 243
యాడంఫెర్గూసన్ 399
యుద్ధాలు 478

# ర

రచయిత శ్రమ 495
రవాణా పెట్టుబడి దారుడు 492
రాజకీయ ఆర్థిక శాస్త్రం 14
రాత్రి పని 335
రాత్రి షిఫ్టు 335
రికార్డో 208,512
రిపేర్లు 295
రూపం ఉన్న శ్రమ 46
రూపంలేని శ్రమ 48
రెలెటివ్ అదనపు విలువ 340
రెలెటివ్ కోణంలో అభివృద్ధి 87

# ల

లంచాలు 521
లాంగ్‌డేస్కూలింగ్ 431
లాభం: అది ఏమిటి? 135, దానికి నిజమైనకారణం 141, అది ఏదశనించీ వస్తుందీ? 167, లాభం కాదు, అదనపు, విలువ 174
దాని గురించి పెట్టుబడిదారుడు ఏమంటాడు? 195, దానిరేటు 311
లోకజ్ఞానమూ, శాస్త్రమూ 207

# వ

వంట మనిషి : ఇంట్లోనూ, హోటల్లోనూ 453
వడ్డీ 181
వర్తక కమిషన్ : డబ్బుగా, ఉత్పత్తిగా 176
వర్తక పెట్టుబడి దారుడు 178
వస్తువు: దీనికీ సరుకుకీ ఉన్న సంబంధం 51, వస్తువుల్లో ధనిక - పేద తేడాలు 524
విలాస ఉత్పత్తులు 374,524,587.
విలువ: దానికొలత 37, విలువా - శ్రమా 51, దానిరూపం 62, దాని పరిమాణం 65, దాని గురించి పరిశోధన 98, అది చలామణీ దశలో పెరుగుతుందా? 169, విలువల్లోతేడాల గురించి మార్క్సు మాటలు 226, దాని ఉత్పత్తి 326.
విటుడు 506
విశ్రాంతి 335,379
విస్తృత పునరుత్పత్తి 563,603
విస్తృత విలువ రూపం 71
వేశ్యలు 504
వృధాని నివారించడం 374
వృద్ధుల విషయం 545
వైరుధ్యం 243
వ్యభిచారం 504
వ్యవసాయంలో భారీపరిశ్రమ 436

# శ

శారీరక శ్రమ: శారీరకశ్రమా, మేధాశ్రమా విడిపోవడం 399
శుభ్రత 378
శ్రమ: దాన్ని కొలిచే సాధనం 37, అది ఎక్కడ ఉంటుంది? 42,
శ్రమ క్రమం 267
శ్రమ చరిత్ర 333
శ్రమ తీవ్రత 345
శ్రమ నిధి 257
శ్రమ పరికరాలు 148,160,404

శ్రమ, పెట్టుబడికి లోనుకావడం 442
శ్రమ విభజన: మాన్యుఫాక్చర్‌కి ముందూ, తర్వాతా 398; దాని గురించి మార్క్స్ మాటలు 400; ఫ్యాక్టరీ విధానంలో 407, పాతదీ, కొత్తదీ 432.
శ్రమ విలువ: అది ఎలా ఏర్పడుతుంది?48,223; దాని గురించి మార్క్స్ మాటలు 226, దాని బాహ్యకారణం 254, శ్రమల విలువల్లో ఎక్కువ తక్కువలు 255.
శ్రమ శక్తి: దానివిలువ 219, దాని గురించి మార్క్స్ మాటలు 226, దాని ప్రత్యేకత 227, దాని విలువని ఏర్పరిచే అంశాలు 227, దాన్ని కొంటే తప్పేమిటి? 248 దానివిలువకి బాహ్యకారణం 254
శ్రమ సంబంధాలు: అవి ఏమిటి? 267, వాటి సూత్రీకరణలు 530
శ్రమ సాధనాలు: అవి శ్రమ చేస్తాయా? 160
శ్రామికులు: తమజీతాల విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వగలరా? 148, వారి శరీర పోషణ 228, వారి పునరుత్పత్తి 228, వారిని సప్లయ్ చేసే బిజినెస్ 523.

## ష

షిఫ్టు పద్ధతి 334

## స

సంఘసేవ 491
సంపూర్ణ సహకారం 388
సగటుశ్రమ 389
సగటుశ్రమకాలం 40
సజీవశ్రమ: అది నిర్వహించే 3 పాత్రలు 164, దాన్ని యంత్రం ఎలాతగ్గిస్తుంది? 414
సన్మానాలు 377
సమాజనిధి 382
సమిష్టిప్లాను 601
సమిష్టి వంటశాల 542
సమిష్టిస్వభావం 390
సరుకు: దానికి గల 2 లక్షణాలు 31, దాని మాయ 102, దాని చలామణీ 113, దాని పరిమాణం 119, దాని పరిమాణం భాగాలు 321, దాని విలువ భాగాలు 321
సరుకు ఉత్పత్తి విధానం 273
సర్క్యులర్ ఉత్పత్తి విధానం 591
సాంస్కృతిక కార్యక్రమాలు : వాటి మీద ప్రభుత్వం పెట్టే ఖర్చు 521
సహకారం 388
సహజ ఆర్థిక విధానం 280
సహాయక పదార్థాలు 148
సామాజిక పెట్టుబడి 301
సామాజిక శ్రమ 40
సామాజిక శ్రమ కాలం 40,55
సామాజిక సంపద 302
సామాన్య కో-ఆపరేషన్ 388
సింపుల్ కో - ఆపరేషన్ 388
సింపుల్ పునరుత్పత్తి 562
సినిమా: దాని ఉత్పత్తి 496, అది ఒక సరుకు 496
సీనియర్ ( ఆర్థికవేత్త) 570
సూపర్‌వైజర్ 467
సెకండరీ లాభం 170
సైన్యం: సైనికవిధి 478, సైనికుల గురించి మార్క్స్ మాటలు 537
సైన్స్: పెట్టుబడిదారీ విధానంలో దాని పాత్ర 432
సోషల్ ఫండ్ 382
స్థితిని బట్టి చైతన్యం 528
స్థిర పెట్టుబడి 286
స్త్రీలు: శ్రమవిభజనలో వారిపాత్ర 262, వాళ్ళు అన్ని రకాలపనుల్లోకీ రావడం 430, ఇంటాబైటా పనిచేసే వాళ్ళు 488 వాళ్ళు ఏవర్గం? 490.
స్పైరల్ ఉత్పత్తి విధానం 591
స్పెషలైజేషన్ 396
స్మిత్తు 399,512
స్వతంత్ర ఉత్పత్తిదారులు వాళ్ళ శ్రమలూ, అవగాహనా 174,205 473,475.
స్వార్థం 254

## హ

హైరార్కీ 397

★